శ్రీవేదవ్యాస విరచితం

# లింగమహాపురాణం

(తెలుగు అనువాదంతో)


తెలుగు అనువాదకులు

**డా॥ సిహెచ్.బాబావలిరావు,** ఎమ్.ఎ, పిహెచ్.డి.,

**విశ్రాంత ప్రధానాధ్యాపకులు**

**ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేమూరు**

సంపాదకులు


**డా॥ ఆకెళ్ల విభీషణ శర్మ**

ఎమ్.ఎ.(సంస్కృతం), ఎమ్.ఎ.(తెలుగు), పిహెచ్.డి.,

ప్రత్యేకాధికారి

**పురాణ ఇతిహాస ప్రాజెక్టు**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**



ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

**2023**

**SRI LINGAMAHAPURANAM**
(with Telugu Translation)

Translated by:
**Dr. Ch.Babavali Rao,M.A.Ph.D.**

Editor:
**Dr. Akella Vibheeshana Sharma**
**M.A.(Sanskrit) M.A.(Telugu) Ph.D.,**
**Special Officer, Purana Itihasa Project**
**T.T.Devasthanams, Tirupati.**

T.T.D. Religious Publications Series No.1434




First Print : 2023

Copies: 500

*Published by:*
**A.V.Dharma Reddy,** I.D.E.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.


*Cover Design & D.T.P. Type Setting:*
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

*Printed at:*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.



శ్రీపద్మావతిఅమ్మవారు

శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

# తిరుమల తిరుపతి దేవస్థానములు
## పురాణ ఇతిహాస ప్రాజెక్టు
## పండితపరిషత్తు
(సలహామండలి)

**అధ్యక్షులు**

**శ్రీ ఎ.వి.ధర్మారెడ్డి**గారు ఐ.డి.ఇ.యస్.

కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానములు.

**సభ్యులు**

**శ్రీమతి యస్.భార్గవి**గారు ఐ.ఏ.యస్.

సంయుక్తకార్యనిర్వహణాధికారిణి,తి.తి.దే.,తిరుపతి.

**డా॥ కందాడై రామానుజాచార్యులు**గారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృతకళాశాల
హైదరాబాద్

**డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంమూర్తి**గారు
విశ్రాంత ఉపకులపతి
రాష్ట్రియ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

**డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యం**గారు
విశ్రాంత సంచాలకులు,
ప్రభుత్వ ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ –
హైదరాబాద్

**డా॥ ధూళిపాళ మహాదేవమణి**గారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

**డా॥ సముద్రాల లక్ష్మణయ్య**గారు
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు, తి.తి.దేవస్థానములు.

**డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణ**గారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రియ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

**డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు**గారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాల – తిరుపతి

**డా॥ కె.ప్రతాప్**గారు
విశ్రాంత ఆచార్యులు, సంస్కృత విభాగం
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం – తిరుపతి

**కన్వీనర్**

**డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ**

ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

తిరుమల తిరుపతి దేవస్థానములు

**పురాణ ఇతిహాస ప్రాజెక్టు**

# పరిష్కరణ పరిషత్తు

**డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు**
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు, తి.తి.దేవస్థానములు.

**డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు**
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

**డా॥ ఆచార్య సూరం శ్రీనివాసులుగారు**
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీగోరంట్ల వెంకన్న ఓరియంటల్ కాలేజ్
తిమ్మసముద్రం

**డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తిగారు**
విశ్రాంత డిస్ట్రిక్ట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, నిడదవోలు

**డా॥ కలవకొలను కాశీ విశ్వేశ్వరశర్మగారు**
సంస్కృతోపన్యాసకులు,
కె.ఎస్.ఎన్.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
అనంతపురం

**డా॥ తూమాటి సంజీవరావుగారు**
మేనేజింగ్ ట్రస్టీ – చెన్నపురి తెలుగు అకాదమి
చెన్నై, తమిళనాడు.

**డా॥ వేదాల వేంకట సీతారామాచార్యులుగారు**
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.బి.ఎస్. సంస్కృతకళాశాల, పొన్నూరు

**డా॥ ధూళిపాళ మహదేవమణిగారు**
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

**డా॥ ధూళిపాళ అన్నపూర్ణగారు**
విశ్రాంత కళాశాలాధ్యాపకురాలు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

**డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు**
విశ్రాంత ఉపకులపతి
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

**డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు**
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్‌స్క్రిప్ట్స లైబ్రరీ, హైదరాబాద్

**డా॥ పి.పి.వి.డి. నాగత్రిశూలపాణిగారు**
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.ఎస్.బి.ఎన్ డిగ్రీ&పిజి కళాశాల, అనంతపురం

**శ్రీగార్లపాటి ప్రభాకరశర్మగారు**
విశ్రాంత ప్రిన్సిపాల్, ధర్మప్రబోధ కళాశాల
హిందూ ధర్మప్రచారపరిషత్, తి.తి.దే.

కన్వీనర్

**డా॥ ఆకెళ్ల విభీషణ శర్మ**

ప్రత్యేకాధికారి
పురాణేతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

## విషయానుక్రమణిక

లింగమహాపురాణం – ఉత్తరభాగం





# తొలిపలుకు

**"ఓం నమో వేంకటేశాయ"**

తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ఆలయాల ప్రధానకర్తవ్యం సంరక్షణ, ఆలయ పూజావిధులు ఆగమోక్తంగా జరపడం, ఆలయాల సందర్శకులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించడం లాంటి వాటితోబాటు, సనాతనమయిన ధార్మికసంరక్షణకోసం అసంఖ్యాకకార్యక్రమాలను నిర్వహించడం.

తిరుమల శ్రీవైష్ణవక్షేత్రమయినా, తి.తి.దే శైవవైష్ణవభేదాలను పాటించకుండా శైవాలయమైన కపిలేశ్వరాలయాన్ని సకలవిధాల అభివృద్ధిపరుస్తూ పూజాదికాలు సక్రమంగా జరిగేలా, ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నది. అలాగే పుస్తకప్రచురణలోను శైవసంబంధి తిరువెంబావై, నాయన్మార్ల చరిత్రలను ముద్రిస్తూ వున్నది. అలాగే పురాణేతిహాసప్రాజెక్టుద్వారా శైవాత్మకపురాణాలను సరళమయిన భాషలో పండితులచేత వ్రాయించి ఆస్తికలోకానికి అందిస్తున్నది. ఈ పంథాలోనే శైవాత్మకమయిన శ్రీలింగమహాపురాణాన్ని మూలంతోసహా సరళమయిన భాషలో ప్రస్తుతం అందిస్తున్నాం.

వ్యాసవిరచితమైన పదునెనిమిది పురాణాలలో లింగమహాపురాణం పదకొండవది. శివపారమ్యబోధకాలైన శివ, భవిష్య, మార్కండేయాదులైన పదిపురాణాలలో లింగపురాణం ప్రధానమైనది. ఇది పదకొండు వేల శ్లోకాలు గలదని మత్స్యపురాణం చెబుతున్నది.

"తదేకాదశసాహస్రం పరమాహాత్మ్యసూచకం" (మత్స్యపురాణం 53-37.) కాని నేడు 9185 శ్లోకాలు గల ప్రతులే ప్రచారంలో ఉన్నాయి. సుదీర్ఘకాలగమనంలో ఎన్నో మార్పులు చెంది ఉంటాయి. దానివల్లే ఈ విధమైన తగ్గుదల. ఇది పూర్వభాగం ఉత్తరభాగమని రెండువిభాగాలు. పూర్వభాగం 108 అధ్యాయాలతో ఉత్తరభాగం 55 అధ్యాయాలతో మొత్తం 9185 శ్లోకాలు కలిగి ఉన్నది.

శివలింగస్థాపనవిధి, లింగపూజావిధి, లింగమాహాత్మ్యకథనంవల్ల "లింగపురాణం" ఔచితీమంతంగా భాసిస్తున్నది.

"లింగస్య చరిత్రోక్తత్వాత్ పురాణం లింగముచ్యతే" అని శివపురాణం చెబుతున్నది. పురాణపురుషుడి అవయవాలుగా ఈ పదునెనిమిది పురాణాల్ని పెద్దలు వర్ణించారు. ఈ లింగపురాణం కుడిచీలమండ అట!

"లైంగం తు గుల్ఫకమ్"

ప్రభుసమ్మితంగా, శబ్దప్రధానంగా వేదాలు చెప్పిన అర్థాన్నే మిత్రసమ్మితంగా అర్థప్రధానంగా చెప్పేవే పురాణాలు. ఒకే కథ రెండుమూడు పురాణాల్లో కూడా ఉండడం మిత్రసమ్మితం కావడమే. మిత్రుడు ఇది మంచిది ఇది మంచిదికాదని పదేపదే చెవినిల్లుకట్టుకుని చెబుతాడు. దాంతో పునరుక్తి కన్పిస్తుంది. మానవులు వారి జీవితాల్ని ధర్మబద్ధంగా తీర్చిదిద్దుకోవడానికి ఈ కథలన్నీ ఎంతగానో ఉపయోగిస్తాయి. సంపూర్ణవ్యక్తిత్వవికాసం ఈ కథలవల్ల అబ్బుతుంది.

పినతల్లిచే అవమానింపబడిన ధ్రువుడు దీక్షతో ఎంతటి మహోన్నతస్థితిని పొందాడో ఈ ధ్రువుని కథ వల్ల తెలుస్తుంది. "అతి సర్వత్ర వర్జయేత్" అనే నానుడిని సార్థకపర్చే వృత్తాంతం నారసింహనిరోధగాథ.

యాగనిర్వహణనిరూపణం, అణిమాద్యష్టసిద్ధుల వివరణం నిరుపమానం. అష్టసిద్ధులలో ఒకటైన ఆకాశయానం సాధ్యమేనని నేటి పాశ్చాత్యశాస్త్రవేత్తల భావన. సాధనకై కృషి జరుగుతున్నది. మన పురాణేతిహాసాలలో సందేహాత్మకవిషయాలుగా భావింపబడుతున్నవి ఎన్నో నేడు శాస్త్రీయంగా నిరూపింపబడడం సంతోషదాయకం. ఇది భారతజాతికి గర్వకారణం.

తులాపురుషదానం దగ్గరనుంచి పలుపలుదానాలు వాటివల్ల ప్రయోజనాలు వివరంగా చెప్పబడ్డాయి. ఇది శివసంబంధిపురాణం కావున బ్రహ్మ విష్ణువుల్ని రెండుమూడు స్థానాలలో చూపించడం జరిగింది. వారి పురాణాల్లో శివుడిని కూడ అంతే! నిజానికి ముగ్గురూ ఒకటే. అభేదమే. ఎవరిని గూర్చి చెప్పేటప్పుడు వారికి కొంచెం మ్రొగ్గుచూపడం పురాణసంప్రదాయం.

సంస్కృతసాహిత్యంలోని పురాణవాఙ్మయం అతిప్రాచీనం. పురాణాలలో ధార్మికాంశాలేగాక, భూగోళ, ఖగోళాది అంశాలు, అలాగే అనేకశాస్త్రాంశాలున్నాయి. ప్రాచీనభారతజీవనాన్ని అవగాహన చేసుకోవడానికి పురాణాలుపకరిస్తాయని, అవి విజ్ఞానసర్వస్వాలని పాశ్చాత్యవిద్వాంసులే ప్రశంసించారు. వైజ్ఞానికంగా ఎన్నో కొత్త అంశాలను ప్రస్తుతం కనుగొన్నామనేవారు పురాణాలలోని అంశాలతో పోల్చుకొని విస్మయావహులవుతున్నారు. సామాన్యమానవులకు కూడా ప్రాచీన ఆర్షవాఙ్మయం అందించే ప్రయత్నంలో తి.తి.దే ప్రణాళికలో మరో ముందడుగు ఈ లింగపురాణప్రచురణ. ఈ విశిష్టపురాణాన్ని పాఠకులు చదవి వారి జీవితాల్ని భక్తిమయం కావించుకుని తరిస్తారని మా కోరిక. ఈ పురాణానికి అనువాదం సమకూర్చినవారు డాక్టర్ సి.హెచ్.బాబావలిరావుగారు. బృహత్తరమయిన ఈ కార్యక్రమం సాగడానికి కారకులైన పండిత, పరిష్కరణ పరిషత్తులకు, ప్రస్తుత ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మగారికి నా శుభాభినందనలు.

**ఆళ్ళ వేంకట ధర్మారెడ్డి ఐ.డి.ఇ.యస్.,**
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

# నివేదన

సనాతనధర్మ అవగాహనకు వేదవాఙ్మయం బొక్కసం లాంటిది. ఆ తరువాత పురాణవాఙ్మయం. ఈ వాఙ్మయంపట్ల అత్యంతానురక్తి పెంచుకొన్నవారు, ఆ వాఙ్మయాన్ని ఆబాలగోపాలానికి అందజేయాలని భావించిన భారతీయులలో తెలుగువారే ప్రథములు. సనాతనధార్మికసంస్కృతీపరిరక్షణకు మూలకందమయిన ఆలయాలలో పౌరాణికప్రవచనాలు కొనసాగించడానికి ప్రోత్సహించినవారు మొదట సంస్థానాధీశులు. తరువాత సంపన్న కుటుంబీకులు. అలాగే సంస్కృతపురాణవాఙ్మయాన్ని తెలుగువారికి అనువాదరూపంలో అందివ్వడానికి వివిధ సాహిత్యప్రక్రియలలో తహతహలాడినవారు తెలుగు కవివర్యులు.

తెలుగువారికున్న పురాణప్రీతికి ఆంధ్రుల ఇంటి పేర్లలో పురాణపండ, రామాయణంవారు, శ్రీమద్భాగవతుల వారు లాంటివి వుండడం ప్రత్యక్షసాక్ష్యం. వేదవాఙ్మయపరిరక్షణలోను ఋగ్వేద, సామవేద నామకులవారుండడం అందరికి తెలిసిన అంశం. వివిధపురాణాలను తెలుగులో కావ్యాలుగా, ప్రబంధాలుగా, మాహాకావ్యాలుగా రచించినవారెందరో. అయితే ఇవన్నీ సాహిత్యరంగంలో కాసంత ప్రావీణ్యం కలవారే గుర్తించదగ్గది. సంస్కృతంలోని పురాణవాఙ్మయాన్ని మూలంతో సహా సామాన్యునికి అందుబాటులో ఉండేలా సరళమయిన వాడుకభాషలో అందివ్వాలనే ఆకాంక్షతో తి.తి.దేవస్థానం పురాణేతిహాసప్రాజెక్టును స్థాపించింది. నిష్ణాతులయిన పండితులచే అనువాదాలు చేయించింది. నివేదనతోబాటు నిర్దిష్టపురాణసారం పేరుతో సింహద్వారప్రవేశం కల్పించింది. ఈ కోవలో లోగడ ఐదు పురాణాలు (1) కూర్మపురాణం (2) విష్ణుపురాణం (3) బ్రహ్మపురాణం (రెండు భాగాలు) (4) మత్స్యపురాణం (రెండు భాగాలు) (5) అగ్నిపురాణం (రెండుభాగాలు) ముద్రితాలయితే ప్రస్తుతం ముద్రణకు సిద్ధమయినది "లింగమహాపురాణం".

పురాణాలలో 'లింగపురాణానికి' చాల ప్రత్యేకతలున్నాయి. ఈ పురాణం ప్రధానంగా శివాధిక్యాన్ని, లింగపూజావిధానాన్ని అనేకకోణాలలో స్థాపితం చేయడానికి వీలుగా సంకలింపబడిందని విమర్శకుల సిద్ధాంతం. ఈ పురాణంలోని అనేకాంశాలపై సమగ్రంగా అధ్యయనం చేసి మదరాసు విశ్వవిద్యాలయం పిహెచ్.డి పట్టా పుచ్చుకొన్నవారు డా॥ఎన్.గంగాధరన్‌గారు. 1/8 డెమ్మీ సైజులో 300 పుటలతో 1980లో అజంతా పబ్లికేషన్స్ వారు ప్రకటించిన ఆంగ్లగ్రంథం.

లింగపురాణాలకు సంబంధించి వివిధగ్రంథాలయాల్లోని తాటాకుప్రతులు, అలాగే వివిధసంస్థలు ప్రకటించిన ముద్రితగ్రంథాలను డా॥ గంగాధరన్ గారు తన సిద్ధాంతగ్రంథంలో విపులంగా చర్చించారు. వారి పరిశోధనలో లింగపురాణం ఎ.డి. 2257, 2256 ప్రతులు, తెలుగులిపిలోని ప్రతులు కావడం విశేషం. అలాగే ఇండియా ఆఫీసు లైబ్రరీలోని 6804 సంఖ్యగల ప్రతి తెలుగులిపిలో వ్రాయబడివుండడం గుర్తింపదగ్గ అంశాలు. అలాగే కర్ణాటక, బెంగాల్ ప్రాంతాలలో అనువదితలింగపురాణాలకంటె తెలుగులోనే మొదట లింగపురాణం అనువదింపబడినదనడం ఆంధ్రులు హర్షింపదగ్గ అంశం. జర్మన్ భాషలో అనువదింపబడిన పురాణాలలో అనువాదాలలో లింగపురాణం ఒకటి (అనువాదకులు డబ్ల్యు జాన్ 1951)

సామాన్యపాఠకుల దృష్టిలో అవసరమయినంత వ్యాఖ్యానంతో మహాలింగపురాణం తెలుగులో 2003లో చక్కగా వెలువడిందనవచ్చు. ఈ పురాణప్రవేశకులు పబ్బా శివరామయ్య (శ్రీరామాపబ్లిషర్స్–హైదరాబాదు–500012). మూలాతిక్రమణంలేని స్వేచ్ఛానువాదంచేసినవారు శివశ్రీ నిర్మల శంకరశాస్త్రి ఆరాధ్యులు. వీరి వ్యాఖ్యానం నామం 'శివవిజ్ఞానవీచిక'. ఈ పురాణానికి ముందుమాట వ్రాసినవారు ముదిగొండ మార్కండేయగారు. సికింద్రాబాదు. పురాణపరిచయం చేసినవారు శ్రీమల్లేశ్వరమహిళా సంస్కృతాంధ్ర కళాశాల వరంగల్ ప్రధానాచార్యులు డా॥ అత్తలూరి మృత్యుంజయశర్మగారు. ఇంకా కొందరు అష్టాదశపురాణాలను జనసామాన్యులకందుబాటులో ఉండే రీతిలో సమకూర్చారు.

తిరుమల తిరుపతి దేవస్థానం వారు చౌఖాంబా పబ్లిషర్స్ / నాగ్ పబ్లిషర్స్ / మోతీలాల్ పబ్లిషర్స్ సంస్కృత ప్రతులను అనువాదానికి ప్రాధాన్యంగా గ్రహించారు. ఇవేగాక అవసరమయిన చోట్ల మరికొన్ని ప్రతులను కూడా పరిశీలించారు.

లింగపురాణం అష్టాదశపురాణాలలో ఒకటా లేదా అనడంలోను విమర్శకుల మధ్య అభిప్రాయభేదాలున్నాయి. ఈ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన డా॥గంగాధరన్ గారు As one of the 18 mahapuranas, the Linga is enumerated in some of the other maha puranas and some upapuranas అంటూ దేవీభాగవతం నుండి చాల మంది ఉటంకించే 'మద్వయం భద్వయం చ శ్లోకంలో' రెండవపాదం చాల చోట్ల భిన్నంగా ఉందని ఉదాహరిస్తూ పురాణాల సంఖ్యలోను తేడాలున్నాయని వాయుపురాణం మాత్రం 16 పురాణాలనే చెప్పిందని పేర్కొంటూ లింగపురాణాన్ని వదలిపెట్టిందన్నారు.

ఆస్తికమహాశయులు లింగపురాణాన్ని శ్రీమహావిష్ణువు 'కుడిచీలమండగా' భావిస్తారు. ఇందుకు "లైంగంతు గుల్ఫకం" అన్నది ప్రమాణం. ఇలాగే లింగపురాణం కాలం గురించి కూడా అభిప్రాయభేదాలున్నాయి. పాశ్చాత్యవిమర్శకులు పురాణాలలోని ఆంతరంగికసాక్ష్యాలబట్టి లింగపురాణం 7–9 శతాబ్దాల మధ్య రచితం కావచ్చని అన్నారు. ప్రతి పురాణంలోను ప్రక్షిప్తాలు, చేరికలున్నాయని వీటినంతా దృష్టిలో పెట్టుకొంటే లింగపురాణం 10వ శతాబ్దం నాటిది కావచ్చని కొందరు అభిప్రాయపడ్డారు. ఇలాంటి అభిప్రాయాలు విశ్వాసానికి, సత్యాన్వేషణకు మధ్య తరచూ జరిగేవే.

పురాణాలలో లింగపురాణాన్ని తామసపురాణంగా నిర్ధారించినవారున్నారు. దేవతలకనుగుణంగా విభజించిన పురాణవర్గంలో శైవపురాణాలలో లింగపురాణం నాల్గవది. హరిహరప్రసాద్‌గారు పురాణాంశాల ఆధారంగా లింగపురాణాన్ని sectrian purana అన్నారు. లింగపురాణంతోబాటు ప్రసాద్‌గారి దృష్టిలో వామన, మార్కండేయపురాణాలు sectrian purana లే.

శైవపురాణాలలో కూడా ఇతరాంశాలున్నా లింగపురాణం పూర్తిగా శివాధిక్యతను ప్రదర్శించే పురాణ మనడంలో సందేహమేమాత్రం లేదు. ఈ నిర్ధారణకు చాలా ఆధారాలున్నాయి.

## లింగపురాణంలో ఆరు కీలక అంశాలు

లింగపురాణంలోని శివగాథలు, ప్రారంభం, ముగింపు చక్కగా ఉన్నాయి. బ్రహ్మమానసపుత్రుడయిన నారదుడు శ్రీశైలాది శైవక్షేత్రాలను దర్శించి నైమిశారణ్యం చేరుకున్నాడు. అక్కడి శౌనకాది మునులు నారదులవారిని, సూతుని ఇద్దరిని గౌరవించారు. ఆ సమయంలో మునులు 'సూతమహాముసీ! మనమందరం శివభక్తులం. మాకు శివుని కథలను వినాలని వుంది. పుణ్యప్రదమయిన మహాపురాణం చెప్పండి' అని కోరారు. సూతుడు సరేనని 11000 (వేల) శ్లోకపరిమాణంగల పూర్వ, ఉత్తర అనే రెండు భాగాలుగల లింగపురాణం చెప్పాడు. ఇదొక చిక్కుముడి. ప్రస్తుతం లభ్యమవుతున్న ప్రతులలో 11000 శ్లోకాలు లేవు. 108+55 అధ్యాయాలలో లభించే లింగపురాణంలోని శ్లోకాలు 9185 మాత్రమే. దీనిబట్టి 11వేల శ్లోకాలుగల పూర్తి ప్రతి లభ్యం కాలేదని తెలుస్తున్నది. లింగపురాణం చివర ఐదురకాల యోగాలను శివుడు వివరించి మహాయోగం శ్రేష్ఠమన్నాడు. ఆ పై నందికేశ్వరుడు సనత్కుమారునికి శివజ్ఞానం బోధించిన వృత్తాంతముంది.

రెండవది ఋక్, యజు, సామ, అథర్వవేద, వాజసనేయ సంహిత, తైత్తిరీయసంహిత, మైత్రేయసంహిత, కఠ, ఆరణ్యక, తైత్తిరీయ, మహానారాయణోపనిషత్ నృసింహపూర్వతాపోపనిషత్, శ్వేతా శ్వతరోపనిషత్, తైత్తిరీయో పనిషత్, అశ్వలాయనగృహ్యసూత్ర, హిరణ్యకేశిగృహ్యసూత్రాది సూత్రాలు మంత్రాల ఉల్లేఖనం లింగపురాణంలో కనిపిస్తుంది. విశేషించి పూర్వార్ధంలోని 39 మంత్రాలు పైన చూపబడిన గ్రంథాలలోనివి కావడం గుర్తించదగ్గ అంశం. ఈ కారణంతో లింగపురాణం శివాధిక్యపురాణమనడానికి గట్టి పునాదులున్నాయని స్పష్టమయింది.

మూడవ అంశం త్రిమూర్తులలో శివుడే సర్వశ్రేష్ఠుడని నిరూపించడం కోసం త్రిమూర్తులలో మరో ఇద్దరు బ్రహ్మ, విష్ణుమూర్తులు శివాజ్ఞకోసం వేచినట్లు, శివుని వేనోళ్ళ కీర్తించినట్లు చెప్పడం. మచ్చుకు కొన్ని – లింగపురాణం 93వ అధ్యాయంలో నారాయణుడు ధరణిని ఉద్ధరించి, తరువాత వైకుంఠానికి వెళ్లిపోగా వరాహదంష్ట్రవలన, కలిగిన బరువు వల్ల భూమి కంపిస్తే, మహేశ్వరుడే కంపిస్తున్న భూమాతను ఆశ్వాసించి, ఆ దంష్ట్రను తాను స్వీకరించి భూషణంగా తన వక్షఃస్థలంలో ధరించాడట. అలాగే నారసింహరూపంతో విష్ణువు హిరణ్యకశిపుని వధించి అతిరౌద్రరూపుడయిన వేళ ఆ మూర్తిని శాంతింపచేసే స్థితిలో ఆశక్తులై దేవతలు మహేశ్వరుని శరణు వేడారట. అపుడా భక్తవత్సలుడు వీరభద్రేశ్వరుని ఆదేశించగా అతడు శరభావతారంలో ఉగ్రనారసింహరూపాన్ని శాంతింపజేశాడని 94వ అధ్యాయం సాక్ష్యమిస్తున్నది. ఇలాగే మహావిష్ణువు జలంధరవధకు తాను ఆశక్తుడనని చెబుతూ నియమానుసారిగా శివసహస్రనామాలు పఠించినట్లు 98వ అధ్యాయం వివరిస్తుంది. ఇంతేగాక శ్రీకృష్ణుడే ఉపమన్యుమహర్షివలన శైవదీక్ష స్వీకరించి శివుని ఆరాధించి సంతానవంతుడయ్యాడని 108వ అధ్యాయం విశదం చేస్తున్నది.

నాల్గవ అంశం. లింగపురాణంలోని లింగశబ్దార్థ నిర్వచనం. సద్యోజాత వామదేవ తత్పురుష, అఘోర, ఈశానాదుల ప్రాదుర్భావసన్నివేశాలలోను, శివపూజా విధానాలలోను, ఇతర సన్నివేశాలలోనూ శివాధిక్యం నిరూపితం. ఇక లింగపురాణం చివర మహేశ్వరుడే స్వయంగా చెప్పిన వివిధయోగాలలోను, అలాగే పాశుపతవ్రత, శివదీక్షా విధానంలోను శివాధిక్యమే నిరూపితం.

ఐదవఅంశం. శివుడే సర్వేశ్వరుడని నిరూపించే వాక్యాలు. శివలింగపీఠంలో బ్రహ్మదేవుడు, మధ్యభాగమయిన పానవట్టంలో విష్ణువు, దానిపై పిండరూపంలో సర్వేశ్వరుడు, పశుపతి సర్వదేవతా సార్వభౌముడయిన రుద్రుడు నివసిస్తున్నాడని విశదీకరించడం. అలాగే ప్రణవాత్మకం శివుడనడం విశేషమైన అంశం. ఋగ్వేదం ముఖంగా, సామవేదం నాలుకగా, యజుర్వేదం కంఠంగా, అథర్వవేదం హృదయమనడం. రజోగుణంతో బ్రహ్మ, సత్త్వగుణంతో విష్ణువు, తమోగుణంతో రుద్రుడు సృష్టిస్థితి లయాదికార్యాలను నిర్వహిస్తారని అనడం. అయితే ముగ్గురికి మూలమైన శుద్ధసత్త్వగుణభూయిష్ఠుడైనవాడు పరమశివుడనడం. ఆ పరమశివుని నిరాకారరూపం, "లింగం"కాగా సాకారరూపంగా కూడా ఉపాసకులకు శివుడు ఆరాధ్యుడనడం, మరో విశేషమైన అంశం.

ఆరవ అంశం లింగపురాణంలో శివకుటుంబసంబంధి అంశాలుండడం. సతీదేవి వృత్తాంతం, దక్షాధ్వరభంగం, పార్వతీదేవి కల్యాణం, వినాయకజననం లాంటివి. ప్రత్యేకించి శివపార్వతుల కల్యాణఘట్టంలో విష్ణువు శివపార్వతులకు చేసిన కైంకర్యం 103వ అధ్యాయంలో విస్తృతం. ఈ వృత్తాంతం కుతూహలం కలిగించేది.

## లింగపురాణంలోని శివాత్మకత

ఒకప్పుడు బ్రహ్మమానసపుత్రుడయిన నారదుడు శ్రీశైలాది శైవక్షేత్రాలను దర్శించి నైమిశారణ్యం చేరుకొన్నాడు. అపుడాసమయంలో శౌనకాదులు సూతమహర్షితో, మహామునీ! నీవు, మేము, నారదులవారు అందరం శివభక్తులమే. నారదమహర్షి సమక్షంలో పుణ్యఫలప్రదమయిన మహాపురాణం చెప్పరాదా' అని ప్రార్థించారట. అపుడా సూతుడు తన సమ్మతిని తెలియచెబుతూ ఇలా అన్నాడు.

మీకు ముందుగా లింగోద్భవం గురించి చెబుతాను. ఇది ప్రణవాత్మకం. ఇదే స్థూలం. సూక్ష్మం కూడా. పరాత్పరరూపమయిన లింగం. ఈ లింగం సామాన్యం కాదు. ఋగ్వేదమే ఈ లింగానికి ముఖం. సామవేదమే నాలుక. యజుర్వేదమే కంఠం. అథర్వవేదమే హృదయం. శివుడు రజోగుణంతో బ్రహ్మ, సత్త్వగుణంతో విష్ణువుగా, తమోగుణంతో రుద్రుడయి సృష్టి స్థితిలయాదులకు కారణభూతుడై ఉంటాడు. శివలింగం కొన్నివేళల తిరోధానమూర్తి. కొన్నివేళల అనుగ్రహమూర్తి. అంటూ ప్రవచనం మొదలెట్టాడు.

సూతుడు శౌనకాదిమునులకు శివారాధనవిధానం, విష్ణుకృత శివస్తోత్రం, మహావిష్ణువు నాభికమలం నుండి బ్రహ్మదేవుని పుట్టుక, లింగార్చన విధానం, మానసశివపూజ, బ్రహ్మదేవుడు తెలియజేసిన శివారాధనరీతి, యుగధర్మాలు, సప్తసముద్రాలు సప్తద్వీపాలవర్ణనలు, అష్టదిక్పాలకుల నగరాలు, వాటి నిర్మాణం. చంద్రునిరథవర్ణన, యయాతిచరిత్రం, సంక్షిప్తంగా శ్రీకృష్ణచరిత్ర, త్రిపురాసురసంహారం, శివభక్తిమాహాత్మ్యం, అహింసావ్రతప్రశంస, శివదర్శనఫలం, కైలాసవర్ణన, నరనారీమణులకు శుభప్రదమయిన ఉమామహేశ్వరమాహాత్మ్యం, సదాచారనిరూపణం, వారణాసిక్షేత్రమాహాత్మ్యం, నరసింహావతారవర్ణన, పార్వతీకల్యాణం, వినాయకజన్మవృత్తాంతం, శివదీక్షావైభవం లాంటి వాటిని సందర్భాలకనుగుణంగా జతచేస్తూ అనేకానేకశివభక్తుల కథలను, వృత్తాంతాలను శివాధిక్యతను అడుగడుగున సిద్ధాంతీకరిస్తూ, భక్తులకు తగినట్లు స్తుతులు, మంత్రాలు, శివపూజావిధానాలను విశదీకరిస్తూ లింగపురాణ విశేషాలను పూసగ్రుచ్చినట్లు చెప్పాడు.

పరమశివుని లీలలలో దారుకావనవిహారమొకటి. దారుకావనం మునుల ఆవాసం. అక్కడి వారు అగ్ని ఉపాసకులు. జపతపనిరతులు. అలాంటి వారిని శివుడు పరీక్షించాలనుకొన్నాడు. శివుడు దివ్యలావణ్య రూపసుందరుడయ్యాడు. ఆ రూపాన్ని చూడగానే మునిపత్నులు నివ్వెరపడ్డారు. తదేకదృష్టిలో చూడసాగారు. క్రమంగా మతి కోల్పోయారు. మోహావేశచిత్తులయ్యారు. చివరకు కొందరు తేరుకొని ఆ లావణ్యాకారుని 'ఎవరుమీరని' ప్రశ్నించారు. మమ్మల్ని అనుగ్రహించమని ఆ మహాపురుషుని కోరారు. భవునిలో ఉలుకూ పలుకూ లేదు. ఈ దృశ్యాలను చూస్తున్న మునులు తమ తపోబలగర్వంతో ఆగంతకుని దూషించసాగారు.అయినా చివరకు వారు కూడా శివమాయామోహితులయ్యారు. అంతలో శంకరుడు అంతర్ధానమయ్యాడు. మునులిక చేసేదేమిలేక బ్రహ్మను ఆశ్రయించారు. వారి గోడును విని 'మీరు పరమాత్ముని గుర్తింపలేని అశక్తులు. అతిథిమర్యాదలు తెలియనివారు. మీకు సుదర్శనుడనేమునికథ తెలియదా, 'ధర్మదేవత పెట్టిన పరీక్షలో నెగ్గి భార్యను కూడా ఆ దేవతకు వశురాలు కావలసిందే అన్నవాడు. ధర్మదేవత' నీ ఆతిథ్యధర్మం పరిశీలించాలని వచ్చాను. ధన్యుణ్ణి అన్నాడు. కాని మునులారా! మీరు సహజస్వభావమయిన మౌనం వీడారు. కోపోద్రిక్తులయ్యారు. మీ సతుల వికారాలకు కారణాలను తెలుసుకోవడానికి ఏ మాత్రమూ ప్రయత్నించలేదు. చివరకు మీ తపశ్శక్తి పోగొట్టుకొన్నారు. ఈ చేతకు శంకరానుగ్రహం కోసం ప్రయత్నించడమే నిష్కృతి అన్నాడు. శివారాధన ఫలితాలు అనంతం. పూర్వకాలంలో శివుని ఆరాధించి శ్వేతముని మృత్యువునే జయించాడని బ్రహ్మ చెబితే ఆ వృత్తాంతాన్ని మాకు చెప్పండన్నారు మునులు. బ్రహ్మ సరేనంటూ ఆ ముని కథ చెప్పాడు. ఈ శివలీల మునుల తపోగర్వాన్ని తొలగించింది.

## శ్వేతముని వృత్తాంతం

శ్వేతముని శివభక్తుడు. అనవరతం శివధ్యానైకమతి. అయినా జాతకం ప్రకారం తనకు ఆయుష్యం తక్కువ అని తెలుసుకొన్నాడు.ఎలాగయినా తాను చిరంజీవిత్వం సంపాదించుకోవాలనుకొన్నాడు. ఒక గిరిగుహలో ఏకాంతంగా తపస్సు మొదలెట్టాడు. అతనికి సదామహేశ్వరధ్యానమే. అయినా ఆయువు ముగిసే సమయం అతనికి రానే వచ్చింది. యముడు శ్వేతమునిని సమీపించాడు. ముని త్ర్యంబకమహామంత్రం జపించసాగాడు. యముడు తదేకంగా శ్వేతమునినే చూచాడు. 'నీకు ఆయువు తీరింది'. నాతో రమ్మన్నాడు. శ్వేతముని నమ్మలేదు. యమునికి కోపం వచ్చింది. శివలింగం ఏం చేస్తుందని తూలనాడాడు. కాని శ్వేతువు జంకలేదు. శివలగ్నమనస్కులను బ్రహ్మకూడా ఏమీ చేయలేడన్నాడు. ప్రాణం తీయబోతుండగా పరమశివుడు నంది మున్నగు ప్రమథగణంతో ప్రత్యక్షమయ్యాడు. శివుని ఘోరరూపం చూచి యముడు జడుసుకొని వణకిపోయాడు. నేలబడి ఆ సమవర్తి మరణించాడు. శ్వేతముని శంకర!శంకర! శరణు శరణు అన్నాడు. ఆ సమయంలో నందికేశ్వరుడు కూడా శివునితో విధ్యుక్తధర్మశీలి యముని బతికించమంటే పరమశివుడు కరుణించి యముని బతికించాడు. శ్వేతమునిని చిరంజీవిగా అనుగ్రహించాడు.

ఈ వృత్తాంతాన్ని చెప్పి బ్రహ్మ వేదాభ్యాసనయజ్ఞయాగాదుల వలన శివభక్తి కలుగదు. శివానుగ్రహం వలననే శివునిపై భక్తి అన్నాడు. ఆపై దారుకావనవాసులయిన మునులు తపస్సుతో శివుని ఆరాధించి ఆపై శివదర్శనభాగ్యమంది సంతోషపరవశులయ్యారు.

శివయోగులు ఎలాంటివారయినా వారిని పూజించాలి. అంతేకాదు శివునిపట్ల అత్యంతభక్తిగల బ్రాహ్మణులను శివస్వరూపులుగానే భావించాలని నందికేశ్వరుడు చెప్పాడు. అపుడు సనత్కుమారుడు నందికేశ్వరుని 'దధీచి' వృత్తాంతం చెప్పవలసిందిగా కోరాడు.

దేవతలు ఒకసారి ఒక గొప్ప సభ ఏర్పాటు చేశారు. ఆ సభకు అధ్యక్షస్థానం వహించవలసిందిగా బ్రహ్మను ప్రార్థించారు. బ్రహ్మ సరేనన్నాడు. సభాప్రారంభసమావేశానికి ముందు బ్రహ్మకు ఒక గొప్ప తుమ్ము వచ్చింది. కాస్త ఆగిచూచేసరికి ఆ తుమ్మునుండి 'క్షుపుడు' పుట్టాడు. క్షుపం అంటే తుమ్ము. బ్రహ్మ ఆనతి ప్రకారం క్షుపుడు రాజై పరిపాలన చేస్తున్నాడు. అతని మంత్రి దధీచి. వారి స్నేహం అనుపమానం. కాని ఒకసారి వారిమధ్య వివాదం చెలరేగింది.

'క్షుపుడు నేను క్షత్రియుణ్ణి. అష్టదిక్పాలకుల అంశలతో జన్మించినవాడు రాజు. కనుక నీవు నన్ను తిరస్కరించకూడదన్నాడు. దధీచి 'నేను విష్ణ్వంశసంజాతుణ్ణి', నేనే గొప్ప. నీవే నన్ను పూజించాలన్నాడు. చివరకు చిలికి చిలికి వాదవివాదాలు పెరిగాయి. దధీచి ఆగలేక క్షుపుని తన్నాడు. క్షుపునికి కోపం వచ్చింది. దేవేంద్రుడిచ్చిన వజ్రాయుధంతో దధీచిని దండించాడు. ఆ దెబ్బకు తాళలేక దధీచి కిందపడబోతూ శుక్రాచార్యుణ్ణి స్మరించాడు. శుక్రాచార్యులు యోగశక్తితో రెండుగా చీలిన దధీచి దేహం కలిసేలా చేసి మృతసంజీవని విద్యతో బ్రతికించాడు. ఆపై త్ర్యంబకమంత్రం ఉపదేశించి అదృశ్యమయ్యాడు. దధీచి ఆ మంత్రబలం వలన అవధ్యుడయ్యాడు. ఎన్నో వరాలను సంపాదించాడు. మరల వరగర్వంతో రాజును తన్నాడు. క్షుపుడు వజ్రాయుధం ప్రయోగించినా అది దధీచిలో లీనమయింది. ఇక లాభం లేదని క్షుపుడు నారాయణుని ఆరాధించాడు. క్షుపుడు దధీచి వ్యవహారమంతా చెప్పాడు. కాని నారాయణుడు తనకే 'దక్షాధ్వరధ్వంసమయంలో మూర్ఛావస్థ వచ్చింది. ఆపై కోలుకొన్నాను. అయినా నీ విజయానికి ప్రయత్నం చేస్తా'నన్నాడు. దధీచి దగ్గరకు వెళ్ళి తాను బ్రాహ్మణుడనన్నాడు. నాకు వరం ఇమ్మని కోరాడు.

దధీచికి 'వచ్చినవాడు బ్రాహ్మణుడు కాదని' అర్థమయింది. జనార్దనుడే వచ్చాడని అర్థమయ్యింది. నీకు క్షుపునిమీద ఆదరణ, వాత్సల్యం ఉన్నాయి. ఈ జగత్తులో దేవదానవ ద్విజులవల్ల నాకు భయంలేదన్నాడు. అలాగా! అయితే నీవల్ల భయంలేదని చెప్పు చాలన్నాడు. వెంటనే దధీచి నాకు శివానుగ్రహముంది. నేను నిర్భయుడనన్నాడు. అలాగా అంటూ విష్ణువు సుదర్శనచక్రం ప్రయోగించాడు. అపుడు దధీచి 'జనార్దనా! ఇదినీకు మహేశ్వరదత్తం. నన్నేమీ చేయలేదన్నాడు. అపుడు హరి అంతటితో ఆగక శస్త్రాస్త్రాలు ప్రయోగించాడు. అన్నీ వ్యర్థమయ్యాయి. దధీచి చివరకు దర్భముడిని దేవతలపై వేశాడు. అది త్రిశూలమై దేవాదులను కాల్చేసింది.

దేవేంద్రప్రయుక్తమైన అస్త్రశస్త్రాదులు వ్యర్థమయ్యాయి. అపుడు నారాయణుడు విష్ణుగణాన్ని ప్రేరేపించాడు. వాటిని కూడా దధీచి దహించేశాడు. ఇక లాభం లేదని విష్ణువు తన విరాడ్రూపం ప్రదర్శించాడు. ఆ విశ్వస్వరూపంతో దధీచికి మొక్కి వైకుంఠం వెళ్ళిపోయాడు. అపుడు క్షుపుడు కాళ్ళబేరానికి వచ్చాడు. నాలాంటివానికి శివభక్తి దుర్లభం కదా అంటే క్షుపుని దధీచి అనుగ్రహించాడు.

ఇలా శివభక్తిని, మహిమను విశ్లేషించే గాథలు లింగపురాణంలో అనేకం ఉన్నాయి వాటిలో 92వ అధ్యాయం ఒకటి. ఈ అధ్యాయంలో కాశీశ్రీశైలక్షేత్రమహిమాదులు వర్ణితం.

పరమశివుడు పార్వతిని వివాహమాడడానికి గణాధిపతులతో వారణాసి చేరుకొన్నాడు. పాశుపతదీక్షా స్వీకారానికి కాశి సముచిత క్షేత్రం. ఈ కాశికి దేవోద్యానమని, ఆనందకాననమని పేర్లు. ఈ క్షేత్రప్రశస్తిని పార్వతి అడుగగా పరమేశ్వరుడే విశదీకరించాడు.

పార్వతీ! ఈ క్షేత్రానికి అవిముక్తమని పేరు. కారణం నేను ఈ క్షేత్రాన్ని ఎపుడూ వదలను. అంతేకాదు. ఇది ముక్తిక్షేత్రం. ఇట మరణించినవారంతా సద్యోముక్తులవుతారు. ఇతర శైవక్షేత్రాలలో మరణం వల్ల లభించే స్వర్గం నిత్యం కాదు. కాని కాశీక్షేత్రమరణం వల్ల ముక్తి శాశ్వతం. బ్రాహ్మాదులు గుప్తరూపంలో ఇక్కడ నివసిస్తారు.

బ్రహ్మ ఆవుపాలతో సరితూగే ఉదకమండపాన్ని నిర్మించడం వల్ల ఇది నా నిత్యనివాసం. అందువల్ల నాకు వృషధ్వజుడని పేరు. నారాయణుడు ఇక్కడ శివలింగం స్థాపించడం వల్ల నాకు హిరణ్యగర్భేశ్వరుడని పేరు. అంతేగాదు వ్యాఘ్రరూపంతో ఒక దైత్యుడు జనులను పీడిస్తుంటే నేను ఆ రాక్షసుని సంహరించినందువల్ల నాకు వ్యాఘ్రేశ్వరనామం. అలాగే ఒక రాక్షసుడు జంబుకరూపంలో కాశీవాసులను పీడిస్తుంటే ఆ రాక్షసుని సంహరించడం వల్ల ఇక్కడ స్థాపితమయిన లింగానికి జంబూకేశ్వరలింగమని పేరు. నా భక్తులు విశ్వనాథుని దర్శించి బిందుమాధవుని అవలోకించి, ధుంఢి గణపతికి నమస్కరించి, దండపాణికి దండమిడి కాలభైరవునికి మొక్కి, కాశీగుహద్వారాన్ని చూచి గంగానదీజలాన్ని శిరస్సుపై చల్లుకొంటే జన్మజన్మాంతరార్జితదురితాలు దూరమవుతాయి. అన్ని పుణ్యక్షేత్రాలకన్న వారణాసీక్షేత్రం సర్వశ్రేష్ఠమన్నాడు. తరువాత శ్రీశైలక్షేత్రాన్ని చూపెట్టి ఆపై అజబిలం, సిద్ధవటం, క్షేత్రాలను దృశ్యమానం చేశాడు. ఆపై శ్రీదేవీప్రతిష్ఠిత శృంగాటాచలాన్ని, విష్ణుస్థాపిత శైలజేశ్వరుని, స్కందప్రతిష్ఠిత కదంబేశ్వరుని, శక్రాది దేవతల ప్రతిష్ఠితమైన శివలింగాన్ని, దేవి కంఠహారం పడగా లోకకల్యాణార్థం ఏర్పడిన హారకుండేశ్వరుని, హిమవంతునిచే ప్రతిష్ఠితమయిన అచలేశ్వరుని చండికానిర్మిత అంబికాతీర్థాన్ని, కపిలధారను చూపెట్టి పై శివ లింగరూపాలను దర్శించి భక్తితో పూజించేవారు చివరకు కైలాశంలో నాతో ఆనందిస్తారన్నాడు. ఆ పై శ్రీశైలంలో అభిషేకఫలాన్ని, ప్రసాదాలను సమర్పించే తీరును వర్ణించి శివప్రార్థనావిధాన్ని కూడా తెలియజేశాడు.

లోకకంటకుడయిన హిరణ్యకశిపుని మహావిష్ణువు నారసింహరూపంతో సంహరించాడు. కాని నారసింహుని ఉగ్రరూపం శమించలేదు. చివరకు దేవతల ప్రార్థనలు వ్యర్థమయ్యాయి. బ్రహ్మాదులు పరమేశ్వరుని శరణువేడారు. పరమశివుడు వీరభద్రుని స్మరించాడు. వీరభద్రుడు తానేమి చేయాలో తనకు ఆదేశమివ్వమని శివుని ప్రార్థించాడు. శివుడు కర్తవ్యముపదేశించాడు. వీరభద్రుడు ఉగ్రాకారుడయిన నృసింహుని శాంతిచమని కోరితే విష్ణువు గర్వోక్తులాడినాడట. అపుడు వీరభద్రుడు విధిలేక శరభావతారమెత్తాడు. నరసింహుడు అతని ధాటికి తట్టుకోలేక అష్టోత్తరశతం పఠించాడు. అయినా వీరభద్రుడు నృసింహుని మొండెమును విడదీసి ఎముకలతో నిండిన ముఖాన్ని చేత గ్రహించాడు. పాలలో పాలలాగా, ఉదకంలో ఉదకంగా, నేతిలో నేయిలాగా విష్ణువు శివునితో లీనమయ్యాడని లింగపురాణకథ, శివకేశవుల అభేదాన్ని వివరిస్తున్నది.

శౌకకాదిమునులు సతీదేవి వృత్తాంతం అడగగా సూతుడు వారి కోరిక మన్నించాడు.

'మునులారా! ఈ వృత్తాంతాన్ని బ్రహ్మ దండికి చెప్పినట్లు, సాంబశివుడు కుమారునికి బోధించినట్లు, వేదవ్యాసుడు నాకు విశదం చేసినట్లుగా. జగదంబ వృత్తాంతాన్ని మీకు చెబుతాను.

ఆ శివలింగమే భగవంతుడు. తపస్సు అనే మూలప్రకృతిని అధిష్ఠించిన శివుడే లింగమూర్తి. లింగం, వేదికల నిత్యసంబంధం వల్ల అర్ధనారీశ్వరతత్త్వం. అతడే చతుర్ముఖుని సృష్టికర్త. అతడే వేదాదివిద్యాబోధకుడు. అపుడు బ్రహ్మ 'దేవా! నీ స్త్రీ పురుషరూపాలను వేరుచేయమన్నాడు. అపుడు మహాదేవుడు తన వామాంగం నుండి ఆదిశక్తిని విడదీశాడు. ప్రకృతిగా పరిణమింపజేశాడు. ఆ ఆదిశక్తి సతీదేవిగా దక్ష ప్రజాపతికి జనించింది.

దక్షునికి శివుడంటే గౌరవం లేదు. అందువల్ల దక్షుడు తాను చేయనెంచిన యాగానికి శివుని పిలువలేదు. దేవతలందరు దక్షయాగానికి వెళుతుండడం చూసి సతి ఆహ్వానం లేకపోయినా యాగసందర్శనం చేయవచ్చని భర్తను ప్రేరేపించింది. కాని శివుడు అందుకు అంగీకరించలేదు. అయినా పుట్టింటి మమకారంతో సతి వెళ్ళింది. తండ్రి సంకల్పించిన యాగానికి దక్షునింట కనీసపుమర్యాదులు ఆవిడకు లేవు. మరి అక్కడి వాతావరణంలో శివనిందకే ఆధిక్యం కాగా సతివేదనలతో అగ్నిలో పడి తన దేహాన్ని పరిత్యజించి ఆపై హిమవంతుని తపస్సు ఫలితంగా తానే పార్వతిగా పుట్టింది.

సతీదేవి ఆత్మాహుతి శివుణ్ణి కలచివేసింది. తన తలమీది వెంట్రుకలతో వీరభద్రుడిని, గణాధిపతులను సృష్టించి శివుడు దక్షావాటికకు పంపాడు. వీరభద్రుడు తాను యజ్ఞవాటిక దహనార్థం వచ్చానని దక్షునితో చెప్పాడు. గణాధిపతులు విజృంభించారు. యూపస్తంభాలను పెరికివేశారు. ప్రస్తోతలను హోతలను కాల్చి గంగలో పడవేశారు. దేవేంద్రులను రకరకాలుగా హింసించి వీరభద్రుడు తన కసిని తీర్చుకొన్నాడు. వారందరు వికలాంగులయ్యారు.

ఈ దృశ్యం చూస్తున్న విష్ణువు వీరభద్రునితో తలపడ్డాడు. యోగశక్తితో గణాలను సృష్టించాడు. కాని వీరభద్రుడు ఆ గణాలను చిందరవందరచేశాడు. అపుడు వీరభద్రుడు విష్ణువు శిరస్సును గదతో కొట్టాడు. రొమ్ముపై గదను ప్రహరింపజేశాడు. శ్రీహరి తెలివి తప్పి కిందపడ్డాడు. కాసేపయ్యాక తెలివితెచ్చుకొని చక్రం ప్రయోగిస్తే వీరభద్రుడు ఆ చక్రాన్ని స్తంభింపజేశాడు. అంతేకాదు విష్ణువు వింటిని తునకలు చేశాడు. విష్ణువు తల తెగింది. వీరభద్రుని నిట్టూర్పుతో ఆహవనీయాగ్నిలో దగ్ధమయ్యాడు. ఈ బీభత్సాన్ని చూడలేక యజ్ఞం మృగరూపంలో పరిగిడుతుంటే వీరభద్రుడు అద్దానిని పట్టుకొని శిరసును తెగగొట్టాడు. ఆపై ధర్ముడనే ప్రజాపతిని, అరిష్టనేమిని, అంగీరసమహర్షిని, కృష్ణాశ్వుని శిక్షించి చివరకు దక్షుని శిరస్సుపై కాలితో తన్ని అతని తలకాయను ఛేదించి అగ్నితో దహింపజేశాడు. అపుడు బ్రహ్మ ప్రత్యక్షమై 'స్వామి శాంతించు శాంతించు' అంటే వీదభద్రస్వామి శాంతించాడు. ఈ దృశ్యాన్ని అంతరిక్షంనుండి వీక్షిస్తున్న మహాదేవుడు కరుణతో వారిని పూర్వరూపావతారాలుగా జేశాడు. సరస్వతీదేవికి నాసాగ్రం ప్రసాదించాడు. మరణించినవారినందరిని బతికించాడు. చివరకు శరణువేడిన దక్షునికి 'గణాధిపత్యం' అనుగ్రహించాడు. హరిని కరుణించాడు' అని చెప్పగా ఆపై పార్వతీవృత్తాంతం వినిపించవలసినదిగా మునులు కోరడంతో సూతుడు ఆ వృత్తాంతం చెప్పసాగాడు. హిమవంతుడు పార్వతిని అల్లారుముద్దుగా పెంచాడు. జాతకర్మాది సంస్కారాలు చేయించాడు. ఆ తల్లి చిననాడే వేదవేదాంగాలు నేర్చింది. పన్నెండేళ్ళప్రాయంలోనే అడవిలో పరమేశ్వరుడినుద్దేశించి తపస్సు చేయసాగింది. పర్వతస్థితులయిన మునులు ఆమె తపోవిధానానికి ఆశ్చర్యపడ్డారు. పరమశివుడు పార్వతిని కరుణించాలని భావించాడు.

సరిగ్గా ఇదేసమయంలో బ్రహ్మదత్తవరప్రభావంతో విఱ్ఱవీగుతున్న తారకాసురుని లోకోత్తరమయిన చేతలు తెలియవచ్చాయి. దేవతల్ని తారకాసురుడు ఓడించడమే కాదు విష్ణువుతో దివ్యసహస్రవర్షాలు పోరాడి ఆపై రథంతో సహా శ్రీహరిని శతయోజనదూరం పారద్రోలిన సంఘటనలు సంభవించాయి. అప్పుడు బృహస్పతితో ఇంద్రుడు కర్తవ్యమడిగాడు. బృహస్పతి బ్రహ్మనే వేడాడు. బ్రహ్మ మన్మథుని పార్వతిపై శంకరుని మనస్సు లగ్నమయ్యేలా చేయమన్నాడు. వారిరువురి శారీరకసంబంధం వలన స్కందుడుపుట్టి దేవసేనాధిపత్యం వహించి తారకాసురుని అణగద్రొక్కగలడని చెప్పాడు. బృహస్పత్యాదులు మన్మథుణ్ణి స్మరించారు. మదనుడు తానేమి చేయాలో ఆదేశించమన్నాడు. బృహస్పతి పరమేశ్వరుడు పార్వతిని మోహింపచేసేలా చేయమంటే మదనుడు సరేనన్నాడు. కాని ఆ ప్రయత్నం వ్యర్థం కాగా మదనుడు శివుని త్రినేత్రాగ్నిలో భస్మావశిష్టుడయ్యాడు. పార్వతి ఆ భయంకర దృశ్యవీక్షణంతో చలించింది. ఆపై పరమేశ్వరానుగ్రహం కోసం తానే తపశ్చర్యకు సిద్ధమయింది. పరమేశ్వరుడు బ్రహ్మదేవుని ప్రార్థనను ఆలకించి పార్వతితో విహరించి లోకకల్యాణార్థం వివాహవిధిని స్వీకరించాలనుకొన్నాడు. కానీముందుగా బ్రాహ్మణరూపంలో శివుడు ఆశ్రమానికి వచ్చి పార్వతి మనోభీష్టాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నంచేశాడు. సరిగ్గా ఇదే సమయంలో హిమవంతుడు స్వయంవర ఏర్పాట్లు చేయసాగాడు. ఎందరో పార్వతి తమ్ము వరిస్తుందనే ఆశతో విచ్చేశారు.  కానీ పార్వతి పరమశివుని పాదాలపై పూలమాలికనుంచి అర్పించింది.

ఆపై బ్రహ్మ శివునికి నమస్కరించి వివాహవిధినిర్వహణకు అనుమతిని అడిగాడు. పరమేశ్వరుడు అంగీకరించాడు. విశ్వకర్మ కల్యాణ మంటపనిర్మాణం చేశాడు. దేవమాతలు, దేవపత్నులు విచ్చేశారు. దేవతాలోకమే తరలివచ్చింది. పెళ్ళిసంబరాలు సాగుతుంటే కేశవుడు పార్వతీదేవిని అలంకరింపజేసి కల్యాణమంటపంలోకి ప్రవేశించాడు. అపుడు బ్రహ్మ నారాయణా! నీవు శివుని నుండి దేవితో సహ మొదట జన్మించావు.  నా ఆనతి మేరకు హిమమంతుడు నా అంశతో జన్మించాడు. పార్వతీదేవి ఆదిశక్తియే. వైవాహికవిధి నిర్వహణార్థినై నేను వచ్చాను. నీవు కన్యాదాతగా పార్వతిని పరమశివునికి సమర్పించు. ఈ కన్యాదానం వల్ల నీకు హిమవంతునితో చుట్టరికమన్నాడు.  పెళ్ళి తంతు ముగిసింది. పరమశివుడు తనకు పార్వతిని ప్రదానము చేసిన హరిని వరం వేడుకోమంటే, నీ యందే సదా భక్తి కలిగేవుండేలా వరం కోరుకొన్నాడు.

'పార్వతీపరిణయం  లోకకల్యాణదాయకమయింది'

శ్రీకృష్ణుడు స్వేచ్ఛావతారుడు, మానుష్యాన్ని తూలనాడినవాడు. దేహశుద్ధి గావించుకొని పుత్రార్థియై శివునుద్దేశించి తపం చేయాలనుకొన్నాడు. ఆ కారణంతో ఉపమన్యు మహర్షి ఆశ్రమం చేరుకొన్నాడు. మహర్షికి ప్రణామం చేసి ముమ్మారు ప్రదక్షిణం చేసి, బ్రహ్మరుద్రాక్షలు ధరించి శివషడక్షరీ మహామంత్రోపదేశం స్వీకరించి సంవత్సరకాలం నియమ నిష్ఠలతో జపించాడు. శ్రీకృష్ణుని తపనను గుర్తించిన మహేశ్వరుడు సంతోషించి సాంబుడనే పేరుగల కుమారుడు జన్మిస్తాడని వరప్రసాదం చేశాడు. అప్పటి నుండి పాశుపతులందరు శ్రీకృష్ణునిచుట్టు నిలబడి శివధ్యానం చేయడం వలన శివానుగ్రహపాత్రులయ్యారు.

ఈ మహాలింగపురాణంలోని స్తుతులు సామాన్యులకు ముక్తిమార్గపథాలు. ఇక చివరగా సామాన్యమానవులు ఆచరించవలసిన విధానాలను ఈ పురాణం విశదీకరిస్తుంది.

లింగపురాణం బహుళప్రయోజనాత్మకం. సామాన్యులకు శివాలయస్థాపనోద్దేశ్యం పెంచేది. మోక్షార్థులకు ఆరాధ్యమార్గం ప్రవచించేది. జ్ఞాన, కర్మ, భక్తి మార్గాలను ఆస్తికులకు సూచించేది. వివిధక్షేత్రదర్శనాకాంక్ష కలవారికి ఈ లింగపురాణం కరదీపిక.


ఈ పురాణంలోని లోకాలవర్ణన, వంశానుచరితం లాంటివి పురాణలక్షణాలను పాటించినవి కావడం. ఇందులో సామాన్యులు అన్వేషించే శివలీలా విగ్రహప్రతిష్ఠా విశేషాలు, శివమందిరనిర్మాణం, ఫలనిరూపణ, భక్తిమహిమ, అహింసావ్రత మహిమలు, వ్రతాదులున్నాయి. అన్నిటికన్న మించి భారతీయులు అమితంగా విశ్వసించే విస్తృతకాశీక్షేత్ర వర్ణనలున్నాయి.

ఈ లింగపురాణం తెలుగు అనువాద రచయిత కళారత్న, వ్యాసదాస డా॥ సిహెచ్.బాబావలిరావు, హైదరాబాదు వారికి నా అభినందనలు

ఈ గ్రంథాన్ని దోషరహితంగా ముద్రించాలనే తలంపుతో సవరణ, వివరణల సూచనలిచ్చి, ఆపై ముద్రణార్హమని తెలియజేసిన పండితపరిష్కరణపరిషత్ సభ్యులకు, పురాణేతిహాస ప్రాజెక్టు కార్యకలాపాలపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ప్రోత్సహిస్తున్న తి.తి.దే శ్రీకార్యనిర్వహణాధికారి, శ్రీమాన్.ఎ.వి.ధర్మారెడ్డి ఐ.డి.ఇ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీమతి సదా భార్గవి ఐ.ఎ.ఎస్ (విద్యా మరియు వైద్యం) మరియు శ్రీ వి.వీరబ్రహ్మం ఐ.ఎ.ఎస్, తిరుపతి గార్లకు, పండితపరిషత్తు సభ్యులకు, కార్యాలయంలో ఉద్యోగించిన ఆచార్య మంగిపూడి సాయిరామసుబ్రహ్మణ్యశర్మగారికి ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే పరిశోధకులుగా ఉద్యోగిస్తూ ప్రతిపురాణపరిష్కరణకు పెనుబలమైన డా॥దశరథగారికి, ఇతర కార్యాలయ సిబ్బందికి కృతజ్ఞతలు.

సదా శ్రీవారిసేవలో
డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ

# పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు




బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ । వైష్ణవం దక్షిణో బాహు: వాయుర్వామో మహేశితు: ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభి: స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రి: వామో హ్యాగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మన: । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృత: ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేధ: ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణు: పురాణావయవో హరి: ।

# పురాణప్రశస్తి

## (అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

**వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।**
**నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥**
**నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।**
**దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥**

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యల నిలా పేర్కొనడం జరిగింది.

**అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।**
**పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥**

శిక్ష,వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం–అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామా థర్వణము లనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం–అనేవే పదునాల్గు విద్యలు.

**'వేదోஉఖిలో ధర్మమూలం'** అన్నట్లు వేదమంతా ధర్మమూల మైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యం కాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీ సుతః** –అను ప్రమాణవచనం కూడా పదునెన్మిది పురాణాల రచయిత సత్యవతీ సుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

**ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।**
**బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥**

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలివుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

**యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానా చ్చిరం**
**యచ్చార్థ ప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।**

**కాన్తాసమ్మితయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా**
**కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్మై స్పృహాం కుర్మహే ॥** (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథా కథనం ద్వారా ధర్మ స్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణ కథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవి కావనీ, విజ్ఞానవైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

**కథా ఇమాస్తే కథితా మహీయసాం**
**వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।**
**విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!**
**వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥** (భాగవతం-12-3-14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

**'వేదాః ప్రతిష్ఠితా స్సర్వే పురాణే నాత్ర సంశయః'**

పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

## పురాణ ప్రాముఖ్యం

**యన్న దృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।**
**ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥**

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాలద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానా విధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక -చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతి సంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

## పురాణ శబ్దనిర్వచనం

**పురాణం అంటే –** పురా భవం ప్రాచీన కాలంలో రచించబడినది అని అర్థం.

**పురాఽపి నవం –** ప్రాచీనమైనా విషయ విశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

**పురా-అణతి-ఆగతానాగతే కథయతీతి పురాణం**-అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

**పురా-పూర్వస్మిన్ జాతమితి పురాణమ్**-పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.

**పురా**-అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.

**పురా-ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం** - పురాతన కాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.

ఇలా పురాణ శబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

## పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోచ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

**ఋచఃసామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।**
**ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥** అథర్వ సంహిత (11-7-24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేద సమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం

**"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేద స్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".**(2-4-10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతన ధర్మతత్త్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది-అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు,

శకున ఫలితాలు, కావ్యనాటక లక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

**విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।**
**పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥**

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూప నిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

**విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।**
**వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥**

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్యనివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

## విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెన్మిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూపనిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

**బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।**
**వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥**

**ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।**
**మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥**

**భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।**
**బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥**

**లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।**
**స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥**

**కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।**
**మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥**

**ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।**

దీని తాత్పర్యం ఇది–శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం–శిరస్సు, పద్మపురాణం–హృదయం, విష్ణుపురాణం–దక్షిణహస్తం, వాయుపురాణం–వామహస్తం, భాగవతపురాణం–తొడలు, నారదపురాణం–నాభి, మార్కేండయ పురాణం–దక్షిణపాదం, అగ్నిపురాణం–వామపాదం, భవిష్యపురాణం–కుడిమోకాలు, బ్రహ్మవైవర్త పురాణం–ఎడమ మోకాలు, లింగపురాణం–కుడి చీలమండ, వరాహపురాణం–ఎడమ చీలమండ, స్కాంద పురాణం–కేశాలు, వామనపురాణం–చర్మం, కూర్మపురాణం–వీపు, మత్స్యపురాణం–మెదడు, గరుడపురాణం–మజ్జ, బ్రహ్మాండపురాణం–ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

## పురాణ సంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆయా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

**మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయమ్ ।**
**అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥**

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు–(1) మత్స్య పురాణం (2) మార్కండేయ పురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు –(1) భాగవతం (2) భవిష్యపురాణం –'బ్ర'తో ప్రారంభమయ్యేవి –మూడు (1) బ్రహ్మ పురాణం (2) బ్రహ్మాండ పురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం –'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణు పురాణం (2) వాయు పురాణం (3) వామన పురాణం (4) వరాహ పురాణం –అ=అగ్నిపురాణం నా=నారదపురాణం–ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడ పురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెన్మిది.

## పురాణ విభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రింది విధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

**బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।**
**భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥**
**ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్త లింగకే ।**
**వారాహం చ తథా స్కాందం వామనం కూర్మ సంజ్ఞకమ్ ।**
**మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥**

ఈ పదునెన్మిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

**సాత్త్వికాలు–**

> **వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।**
> **గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥**

**రాజసాలు–**

> **బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।**
> **భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥**

**తామసాలు–**

> **మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।**
> **ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥**

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) వారాహం (6) పాద్మం –అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం–అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) అగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజస పురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామస పురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవత లందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతరదేవతల కంటే అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానానామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశం లేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది.–

> **ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।**
> **క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।**
> **అక్షరం తత్ పరం బ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥**

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడురూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

> **సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।**
> **స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥**

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం - అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెన్మిది ఉన్నాయని కూర్మ పురాణం పేర్కొంటున్నది.

**ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।**
**తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥**

**చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశ భాషితమ్ ।**
**దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతఃపరమ్ ॥**

**కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।**
**బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వయమేవ చ ॥**

**మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థ సంచయమ్ ।**
**పరాశరోక్త మపరే మారీచం భాస్కరాహ్వయమ్ ॥**

ఉపపురాణాలు-(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం (12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతంప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

## పురాణ లక్షణం

**సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।**
**వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥**

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం-అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం - అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం - మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం-ఆయా ఋషుల, రాజుల వంశాలు.

4. మన్వంతరాలు– మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆయా మన్వంతరాలలో సప్తఋషులు, మునులు మొదలగువారి వివరణ.

5. వంశానుచరితం–ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం.

పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణపురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పదిలక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

**అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।**
**మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥**

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం–అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది–

(1) సర్గం –భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్తత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:–విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:–వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:–భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:–కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:–మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:– భగవదవతారాలు, భక్తులు–వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:–జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:–వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:– అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

## పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశస్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆయా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥

దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశపఞ్చ చతుశ్శతమ్ ॥

చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చశతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥

చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥

కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సౌపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥

త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । **(భాగవతం-12-13-2--9)**

| | | | |
|---|---|---|---|
| 1. బ్రహ్మపురాణం | - | 10,000 | శ్లోకాలు |
| 2. పద్మపురాణం | - | 55,000 | ,, |
| 3. విష్ణుపురాణం | - | 23,000 | ,, |
| 4. వాయుపురాణం | - | 24,000 | ,, |
| 5. భాగవతపురాణం | - | 18,000 | ,, |
| 6. నారదపురాణం | - | 25,000 | ,, |
| 7. మార్కండేయపురాణం | - | 9,000 | ,, |
| 8. అగ్నిపురాణం | - | 15,400 | ,, |
| 9. భవిష్యపురాణం | - | 14,500 | ,, |
| 10. బ్రహ్మవైవర్తపురాణం | - | 18,000 | ,, |
| 11. లింగపురాణం | - | 11,000 | ,, |
| 12. వరాహపురాణం | - | 24,000 | ,, |
| 13. స్కందపురాణం | - | 81,100 | ,, |
| 14. వామనపురాణం | - | 10,000 | ,, |
| 15. కూర్మపురాణం | - | 17,000 | ,, |
| 16. మత్స్యపురాణం | - | 14,000 | ,, |
| 17. గరుడపురాణం | - | 19,000 | ,, |
| 18. బ్రహ్మాండపురాణం | - | 12,000 | ,, |
| **మొత్తం శ్లోకాలు** | - | **4,00,000** | |

## పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆయా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

## వర్ణనాశైలి

కవితా రూపంలో గల రచనలను కవులు ఆలంకారిక ప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకార ప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా కథనంలో ఉపమారూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

**ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।**
**బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥**

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణ వాఙ్మయానికి శోభావహ మైందనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

## పురాణ ప్రయోజనం

**యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।**
**తథా పురాణ శ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥**

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

## సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

**దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।**

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

**ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।**

సదాచారం లేనివాడిని వేదాలుగూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, -రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణ పఠనం కావించి అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచిత సంస్కారం కల్గించేది. తద్ద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

## కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణు పురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం-దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ 225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణ ప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ-ఆపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణ ప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

**"ఋగ్వేదం భగవోऽధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం"** (ఛాందో 7-1-2).

అందుచేత క్రీ.పూ 600 సం॥ పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

## పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీనకాలానికి చెందిన భారతీయసమాజస్వరూపస్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు- వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశంసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తినివృత్తిరూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకా లయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనా లయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడాని కవతరించిన శ్రీశంకరరామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ–భక్తి–ధ్యాన–జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

**"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః"** అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాదికథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగ నిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతాభావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోఽభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణవృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మ పరిజ్ఞానానికి గూడా పురాణసారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితా లని భావించరాదు. ప్రపంచజను లందరికీ ఉపయోగపడే శాశ్వతనైతికబోధ లందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతిప్రాచీనకాలంనుండీ నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతిపురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

తిరుపతి<br>
తేది. 10-01-2019

**సముద్రాల లక్ష్మణయ్య**<br>
పూర్వ ప్రత్యేకాధికారి<br>
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.



# అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

## 1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధపురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

10,000 శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్రసగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహాద్యవతారాలు–ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించడమయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కందు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమక్షేత్రమనే పూరీజగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటే బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

**ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।**
**యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥**

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

## 2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింప బడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం – ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగివున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్"** –సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడియుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాపనిర్ముక్తుడవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతిహేతువులైన, మానవజీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడివున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహం వల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

**యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।**
**లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥**

## 3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణు ధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం శ్లోకాలు 23,000. పరాశరమహర్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం–ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగరవంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తనప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణకర్మనామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో–

**"అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।**
**వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర!" ॥**

'అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు' అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

**యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।**
**తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥**

అన్నట్లు – భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

## 4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని 'శివపురాణ' మని కూడా పేర్కొంటారు. **'చతుర్వింశతి సాహస్రం పురాణం'** –అనుటవల్ల ఇందులో 24,000 శ్లోకాలున్నాయని గ్రహించాలి. కాని ఇపుడు మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం–అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ-ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

**యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।**
**న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥**

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేడని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం-అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ-కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

**ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।**
**కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥**

## 5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పండ్రెండు స్కంధాలు, 18,000 శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

**'నిగమకల్పతరోర్గళితం ఫలం'**-అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీచింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణకర్మనామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది-పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి అలసిపోయి తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతనిమాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవతశ్రవణమే అని చెప్పి భాగవతప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞానవైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతారప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ-ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలిస్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

**'విద్యావతాం భాగవతే పరీక్షా'** అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

**భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైః ।**
**శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైః కృతః ॥**

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

**మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్ ।**
**మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ ॥**

'నాకథలు పఠించేవాడు, వినేవాడు, నాకథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

## 6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో ఇరువదియైదువేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం–ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది–

**లోకే స ధన్యః స శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలః ।**
**జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥**

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక–ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న–వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం–మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరిసుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

**యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।**
**స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥**

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

## 7. మార్కండేయ పురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, తొమ్మిదివేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగిను లున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు–అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ–శేష–ప్రద్యుమ్న–అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు, పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు, పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడివున్నాయి.

**శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।**
**సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥**

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

## 8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్ష్ణపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

**రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।**
**అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥**

"రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు" అని భావం. ఇలా రామాయణభారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

**ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।**
**వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥**

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

**'ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్'**

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

## 9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన వివిధ వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ–

**"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।**
**ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥**

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు–

**యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।**
**అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥**

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగ ఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

## 10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది–

**అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।**
**పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాన్త్యపూజితాః ॥**

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత– ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు– ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది–

**నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।**
**ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥**

"ధర్మంకంటే శ్రేష్ఠుడైన బంధువు లేడు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి." అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

**శుభదం పుణ్యదం చైవ విఘ్ననిఘ్నకరం పరమ్ ।**
**హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥**

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విఘ్నవినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

## 11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్థమనీ, ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మజననం, లింగార్చనావిధానం, శివునికి చెందిన మానసపూజ, యుగ ధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగర వర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

**కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్నివివిధాః క్రియాః ।**
**అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥**

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి – అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం–

**భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।**
**తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥**

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది–

**యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।**
**స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥**

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

## 12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు, అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నామాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందు కాదేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

**శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహ సంజ్ఞితమ్ ।**

**సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమాప్రజేత్ ॥**

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

## 13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

**'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం'** – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,000 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతరపురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని వెండ్రుకలతో పోల్చబడిన ఈగ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల–జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాదికథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగరపరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత, అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తులవుతారని చెప్పడం విశేషం. **'కాశ్యాం తు మరణాన్ముక్తిః'** అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగివున్నాయి.

**సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।**
**గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥**

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలతో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

## 14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి శ్లోకాలు పదివేలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తి జనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నుత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు–ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు – శిష్యుడు–వీరిరువురిలో శ్రేష్ఠు డెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

**పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।**
**శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥**

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకలపాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

**యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।**

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

## 15. కూర్మపురాణం

17000 శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు–మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన–ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు–అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

**ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।**
**ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥**

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

**'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం'** అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు–ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

**ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।**
**పఠతాం శృణ్వతాం నృణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥**

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

## 16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14.000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి–మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ

తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలువ్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక వృత్తాంతం మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

**లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయే త్పౌరుషం నరః ।**
**జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥**

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1.భృగువు 2.అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5.మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12.నందీశుడు 13.శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల,లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమలమధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

**పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।**
**న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥**

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగినవారు.

ఇక ఫలశ్రుతి –
**అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।**
**నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥**

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

## 17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం, ఇందులో 19వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని "మజ్జ" గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు–వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

**అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।**
**రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాఙ్ముఖేన ॥**

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గలజ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

**'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్'** అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది.

## 18. బ్రహ్మాండ పురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. "బ్రహ్మాండం చాస్థి గీయతే" అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం, ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తర భాగంలో 44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషఙ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతోపాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళు ౣ, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూలకారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్నిపునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

**య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః ।**
**స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥**

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

**సముద్రాల లక్ష్మణయ్య**
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

# లింగపురాణ వైశిష్ట్యం

బ్రహ్మదేవుడు శతకోటిశ్లోకప్రవిస్తరమైన ఒకేఒక పురాణాన్ని మునులకు ప్రబోధించగా దానిని ద్వాపరయుగాంతంలో రాగల కలియుగంలో అల్పాయుష్కులు, చపలచంచలస్వభావులయిన మానవులు సులభంగా గ్రహించడానికై శ్రీవేదవ్యాసమునీంద్రులవారు పదునెనిమిది విభాగాలుగా నాలుగులక్షల శ్లోకాలలో సంగ్రహించి వ్రాశారు. శివ, భవిష్య, మార్కండేయ, లింగ, వరాహ, స్కాంద, మత్స్య, కూర్మ, వామన, బ్రహ్మాండ, విష్ణు, భాగవత, నారద, గరుడ, బ్రహ్మ, పద్మ, బ్రహ్మవైవర్త, అగ్ని నామధేయాలుగా విభజింపబడ్డాయి. ఇవి పదునెనిమిది మహాపురాణాలు. ఇవి కాక ఉపపురాణాలు, ఉపోపపురాణాలు కూడా ఉన్నాయి. ఇందు మొదటి పది శివసంబంధాలు. తరువాతి నాలుగు విష్ణుసంబంధులు. తర్వాత రెండు బ్రహ్మకు చెందినవి. తరువాతిది సవితృసంబంధమైనది. తుట్టతుదది అగ్నికి చెందినది. హరిహరబ్రహ్మాదుల ప్రాధాన్యాన్ని బట్టి ఈ విభాగం చేశారు. కాని అన్నింటిలోనూ అందరిగూర్చి చెప్పడం జరిగింది. అయితే కొంచెం ఎక్కువగా, కొంచెం తక్కువగా. శివపారమ్యాన్ని తెలిపే పది పురాణాలలో లింగమహాపురాణం ప్రముఖమైనది. అష్టాదశపురాణాల క్రమంలో ఇది పదకొండవది. ఇందులో పదకొండువేల శ్లోకాలున్నాయని మత్స్యపురాణంవల్ల తెలుస్తున్నది.

"తదేకాదశసాహస్రం పరమాహాత్మ్యసూచకమ్"–మత్స్య.పు.53–37. కాని యిపుడు 9185 శ్లోకాలుగల ప్రతులే ప్రచారంలో ఉన్నాయి. అయితే గీతాప్రెస్సువారు ప్రచురించిన ప్రతిలో చివర అనుబంధంగా పరిశిష్టరూపంలోగల పదహారు అధ్యాయాలలోనూ 919 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. రెంటినీ కలిపినా 10104 శ్లోకాలు మాత్రమే అవుతున్నాయి. ఇంకా 896 శ్లోకాలు తగ్గుతున్నాయి. సుదీర్ఘకాలగమనంలో ఎన్నో మార్పులు జరిగి ఉంటాయి. అందుచేతనే ఈ వ్యత్యాసం. ఈ పురాణం రెండు విభాగాలుగా ఉంది. పూర్వభాగం, ఉత్తరభాగం అని. పూర్వభాగంలో 108 అధ్యాయాలు, ఉత్తరభాగంలో 55 అధ్యాయాలు మొత్తం 163 అధ్యాయాలున్నాయి. శ్లోకాలు 9185.

లింగస్థాపన, లింగపూజ, లింగమాహాత్మ్యం మిక్కిలిగా వర్ణించి చెప్పడంవల్ల లింగమహాపురాణమనే సార్థకనామంతో పిలువబడుతున్నది. "లింగస్య చరిత్రోక్తత్వాత్ పురాణం లింగముచ్యతే" అని శివపురాణం చెబుతున్నది. పురాణపురుషుడియొక్క కుడి చీలమండగా కూడా దీనిని భావిస్తున్నారు. "లైంగం తు గుల్ఫకమ్" అని.

భారతీయధార్మికసంస్కృతి మొత్తానికి వేదాలే మూలాలు. అవి శబ్దప్రధానాలు. ప్రభుసమ్మితాలు. 'సత్యం వద, ధర్మం చర' – అని శాసిస్తాయి. స్వరపాఠపదక్రమాదివిశిష్టంగా జటిలంగా ఉండి సామాన్యులకు దురవగాహాలు అవుతున్నాయి. అందుచే వేదప్రతిపాదిత ధర్మాలనే పురాణేతిహాసాలు సులభతరం చేసి చెబుతున్నాయి. ఇవి అర్థ ప్రధానాలు. మిత్రసమ్మితాలు. స్నేహితుడి మాదిరి మాటిమాటికి చెవిలో ఇల్లుగట్టుకుని ధర్మాల్ని ఉపదేశిస్తాయి. పూర్వుల జీవనయానాల్ని కథలు కథలుగా అనునయంగా చెబుతాయి. దానితో శబ్దం కన్నా అర్థానికి ప్రాధాన్యం ఏర్పడింది. పురాణానికి ఇతిహాసానికి తేడా చాలా తక్కువ. పురా అపి నవం–పురాణం. "యస్మాత్ పురాహి అనతి ఇదం పురాణం అని వాయుపురాణం (1–103). ఇతి హ ఆస–ఇతిహాసం. రెండూ పూర్వచరిత్రనుగూర్చి చెప్పేవే.

కావున ఇవి పంచమవేదాలు. "ఇతిహాసపురాణాని పంచమం వేదమీశ్వరః" (3-12-39)" అని భాగవతపురాణం మాట. "ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్" వేదార్థాల్నే ఇవి భంగ్యంతరంగా వ్యక్తపరుస్తున్నాయి.

మానవులు సత్యశివసుందరంగా జీవించడానికి యోగ్యమైన ఆర్షధర్మాల్ని అన్నింటిని వివరిస్తాయి. ధర్మార్థకామమోక్షాలైన పురుషార్థాల్ని ఏవిధంగా సాధించుకోవాలో, ఏవిధంగా సాధించుకోరాదో పూర్వ దేవదానవ మానవచరిత్రలు తెలియజేస్తాయి.

పురాణం పంచలక్షణంగా ప్రసిద్ధి. సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం, వంశానుచరితం. ఇవి అంశాలుగా పురాణాలు సర్వవిషయాల సమాహారాలుగా నిలుస్తున్నాయి. ఈ పురాణంలో కూడా వ్యాసుడు ప్రాకృతవైకృతసృష్టులు, ప్రజాపతుల సృష్టి మొదలైన సృష్టిక్రమం చెప్పాడు. దక్షుడు, శిలాదుడు, దధీచి, వసిష్ఠుడు, పరాశరుడు, వ్యాసుడు, ఉపమన్యుడు మున్నగు ఋషులగూర్చి చెప్పడం జరిగింది. యయాతి మున్నగురాజుల చరిత్ర వర్ణింపబడింది. శ్రీకృష్ణజననం నుంచి నిర్యాణందాకా నిరూపితం. యుగాల కల్పాల కాలపరిమితి చెప్పాడు. లోకాలవర్ణనం, దీపాలవర్ణనం, నదీనదాల పర్వతాలవర్ణనం సాగింది. కాశీశ్రీశైలక్షేత్రాలు వర్ణింపబడ్డాయి. లింగస్థాపన, అర్చన, మాహాత్మ్యాలు మొదలైన విషయాలు రమ్యాతిరమ్యంగా వర్ణింపబడ్డాయి. ఆధ్యాత్మిక విషయాధిక్యంతోపాటు లౌకికవిషయప్రపంచంకూడా ప్రవిస్తరంగా ఉంది. బ్రహ్మవిష్ణువులు చేసిన శివస్తుతులు అధికంగా ఉన్నాయి. అయితే ఈ పురాణంలో ఇతరపురాణాలలో లేని భాషాకాఠిన్యం, అన్వయకాఠిన్యం ఉన్నదని పండితాభిప్రాయం. అది కొంత కష్టదాయకం.

సవతితల్లిచే అవమానింపబడి విశ్వామిత్రుడి సూచనతో విష్ణుభగవానుడిని ఆరాధించి ధ్రువుడు ధ్రువనక్షత్రంగా మారి గౌరవింపబడిన విధం మానవజాతికి స్ఫూర్తిదాయకం. విష్ణువు ఆ బాలుడిని ముద్దుపెట్టుకున్నాడట! తండ్రి ఉత్తానపాదచక్రవర్తి అంకం దొరకకపోయినా అంతకన్నా మిక్కిలి గ్రహకేంద్రస్థానం దొరికింది. అవమానమే అమృతమై బలాన్నిచ్చి విజయాన్ని యిస్తుంది. సన్మానమే ఒక్కొక్కసారి గర్వాన్నిచ్చి విషంగా మారి బాధిస్తుంది. దీన్నే వేరే ఒకచోట వ్యాసులవారు వచించారు.

మానావమానౌ ద్వావేతౌ తావేవాహుర్విషామృతే ।
అవమానోఽమృతం తత్ర సన్మానో విషముచ్యతే॥ (పూ.భా., 89-4)

బ్రాహ్మం-క్షాత్రం-ఈ రెంటిలో ఏది గొప్పదని వాదులాడి పోరాడిన క్షుపదధీచులవల్ల జ్ఞానమే గొప్పదని నిరూపింపబడింది. శివభక్తుడైన దధీచి నుండి విష్ణుదేవుడుకూడా అపజయం పొందాడు.

భార్యాభర్తల దాంపత్యస్వభావాన్ని కూడా వివరించాడు. విధ్యుక్తంగా సంగమించే స్త్రీపురుషులు బ్రహ్మచారులే. యోగులు, బ్రహ్మచారులు స్త్రీలకు దూరంగా ఉండాలి. మిథునక్రీడను అతిలోలత్వంతో సాగించరాదు. ఒకవిధమైన నిరాసక్తితో పూర్తిచేయాలి. మలమూత్రవిసర్జనసమయంలో ఎట్టిభావంతో స్త్రీపురుషులుంటారో అట్టి భావంతోనే సంగమసమయంలోనూ ఉండాలి. లేకుంటే అదే లోకమై దారితప్పి పతనం అవుతారు. మనసుకు జిడ్డంటితే ప్రమాదం. నేడు సమాజంలో ఆ అతివేలమోహమే పసికూనల్నికూడా చెరుస్తున్నది.

విణ్మూత్రోత్సర్గకాలేషు బహిర్భూమౌ యథామతిః ।
తథా కార్యా రతౌ చాపి స్వదారే చాన్యతః కుతః॥ (పూ.భా., 8-11)

స్త్రీపురుషులు ఒకరికొకరు ఇటువంటివారట.

"అంగారసదృశీ నారీ ఘృతకుంభసమః పుమాన్" మిక్కిలి గొప్పమాట. ఒకరు నిప్పు. మరొకరు నేతికుండ. ఎంతో నిగ్రహంగా దూరంగా ఉండడం మంచిది.

ఎక్కడెక్కడ సిగ్గుపడరాదో వివరించారు. మిథునక్రియలో, పాటపాడే సమయంలో జూదం ఆడేటప్పుడు, విషయాన్ని వివరించే సందర్భంలో, వ్యవహారపరిష్కార విషయంలో తినేటప్పుడు, సంపాదనలో, రాబడి-ఖర్చుల విషయంలో సిగ్గుపడరాదట! ప్రయత్నంలో మాంద్యం ఏర్పడి కార్యహాని కలుగుతుంది.

వసిష్ఠుడు బ్రహ్మకుమారుడు. మహాతపస్వి. బ్రహ్మర్షి. ఆయన భార్య అరుంధతి. శక్తిమొదలైనవారు నూర్గురు కుమారులు. రుధిరుడు అను పేరుగల రాక్షసుడు విశ్వామిత్రప్రేరితుడై శక్తితోకూడా నూర్గురిని తిన్నాడు. దానితో సర్వజ్ఞుడు, ఆత్మజ్ఞాని అయిన వసిష్ఠుడుకూడా దుఃఖాతిరేకంతో భార్య అరుంధతితో కలిసి పర్వతంపై నుండి దూకి ప్రాణత్యాగానికి ప్రయత్నించాడు. అయితే భూమి భామిని అయి పట్టి రక్షించింది. దుఃఖాతిశయం ఎంతటివారినైనా అవివేకులుగా మార్చగలదని తెల్పుతున్నదీ కథ.

నారదపర్వతులు ఊర్ధ్వరేతులైన మునులు, అంబరీషుడి కుమార్తె అయిన శ్రీమతిని చూచి మదనపరవశు లై భంగపడిన వృత్తాంతం పరమరమణీయంగా వ్యాసభగవానుడు చిత్రీకరించాడు. విష్ణువు మోసగించాడని తెలిసి విష్ణుభక్తులైనవారు మనసు మార్చుకుని శివభక్తులయ్యారట. గరుడధ్వజం దించి వృషభధ్వంజం ఎత్తారు. సుమశరుడి ప్రతాపం ఎంతటిదో నిరూపితం.

నారదుడు గానవిద్యలో తుంబురుడితో సమానుడవ్వడానికి ఎంత కష్టించాడో మనోరంజకంగా వర్ణింపబడింది. వేయి సంవత్సరాలు తపస్సు, తర్వాత గానబంధుడను ఉలూకశ్రేష్ఠుడి దగ్గర విద్య నేర్వడం, అప్పటికీ ప్రవీణుడుగాక ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడి నిర్దేశంతో జాంబవతి, సత్యభామ, రుక్మిణీదేవి శిక్షణ యివ్వడం, అప్పటికీ సర్వస్వరజ్ఞాని కాకపోవడంతో శ్రీకృష్ణుడే శిక్షించి తుంబురిడితో సమానుడిని చేసి నారదుడి వంత తీర్చటం జరిగింది.

హిరణ్యకశిపుడిని వధించికూడా శాంతించని నారసింహుడిని వీరభద్రుడు జయించి శాంతింపజేశాడు. శరీరంమీదగల చర్మాన్నిగూడా లాగివేశాడు. శివుడు ఆ చర్మాన్ని ధరించి కృత్తివసనుడయ్యాడు. పుఱ్ఱెనుగూడా కపాలమాలలో నాయకమణిగా కూర్చుకున్నాడు.

నృసింహకృత్తివసనస్తదా ప్రభృతి శంకరః ।
వక్త్రం తన్ముండమాలాయాం నాయకత్వేన కల్పితమ్ ॥ (పూ.భా.96-115)

ఈ పురాణం శివపారమ్యబోధకం కావున విష్ణువును, బ్రహ్మను కొంచెం తక్కువగా చూపడం జరిగింది. విష్ణుబ్రహ్మపురాణాలలో శివుడిని కొంచెం తక్కువగా చూపడం ఉంటుంది. అయితే ఆ ముగ్గురూ ఒకటే. భిన్నత్వంలో ఏకత్వం. ఒకటి సత్త్వగుణం. మరొకటి రజోగుణం. ఇంకొకటి తమోగుణం.

అన్యభక్తసహస్రేభ్యో విష్ణుభక్తో విశిష్యతే ।
విష్ణుభక్తసహస్రేభ్యో రుద్రభక్తో విశిష్యతే ।
రుద్రభక్తాత్పరతరో నాస్తి లోకే న సంశయః (ఉ.భా. 5-20)

కావున విష్ణుభక్తులైనా, శివభక్తులైనా ఎల్లప్పుడూ పూజనీయులు. శివభగవానుడిని పూజింపక నన్ను మాత్రమే పూజించే భక్తుడు నాకు ఇష్టుడుకాడని విష్ణువే స్వయంగా చెప్పాడు.

ఉత్తరభాగంలో చివరలో  తులాపురుషదానం నుంచి విష్ణుదానవిధివరకు షోడశదానాలు వర్ణింపబడ్డాయి. చేతులకు తొడవు దానమ"ని సుమతిశతకకర్త బద్దెనమహాకవి మాట. ధనవినిమయకారణాలు  మూడు. దానం, భోగం, నాశనం. మూడింటిలో ఉత్తమమైనది దానమే. అదే చిరకీర్తిదాయకం. మోక్షప్రాప్తికారకం. ఇటువంటి విశిష్టాంశాలు మానవుల్ని ఇహంలో సత్పథగాముల్ని చేసి  పరమపదాన్ని చేర్చగలవి ఎన్నో ఇందున్నాయి. వాటిని భక్తి ప్రపత్తులతో పఠించడమే మనకర్తవ్యం.

పురాణాలు కల్పితాలుకావని వాటిలో చారిత్రకసత్యాలెన్నో దాగి ఉన్నాయని పురావస్తు, శాసనపరిశోధనల ద్వారా చరిత్రకారులు అంగీకరిస్తున్నారు. వంశం, వంశానుచరితం అనే లక్షణాలద్వారా ప్రాచీనభారతం యొక్క నాగరకతాసంస్కృతులు ప్రతిబింబిస్తున్నాయని పండితులు భావిస్తున్నారు. ఋషులు సత్యమే చెబుతారు. అసత్యం చెప్పరు. కాలం అనే దూరం సత్యాన్ని అసత్యంగా భ్రమింపజేస్తుంది. ఐదారువందలయేళ్లనాటి సంగతుల్నే మనం నమ్మలేకున్నాం. వేల సంవత్సరాల క్రిందటివాటి విషయం వేరుగా చెప్పపనిలేదు. అందుచేతనే కాబోలు వ్యాసభగవానులవారు పదే పదే "న సంశయః, నాత్ర కార్యా విచారణా" అని  ఉటంకించారు.

ముఖ్యంగా పురాణాలలో భక్తి ప్రధానస్థానాన్ని ఆక్రమిస్తుంది. అందుచే ఇవి మార్జాలకిశోరన్యాయంతో భద్రంగా పాఠకులను గమ్యానికి చేర్చుతాయి. వ్యాసశిష్యుడైన రోమహర్షణుడనే సూతర్షి నైమిషారణ్యంలో సత్రయాగం నిర్వహిస్తున్న శౌనకాదిముని సంఘానికి నారదమహర్షి సన్నిధానంలో ఈ పురాణప్రవచనం చేసి ఋషులచేత అభివందింపబడి, నారదమునిచేత అభినందింపబడ్డాడు.

అనువాదకుడు
బుధజనవిధేయుడు
డా॥ సిహెచ్. బాబావలిరావు

## **లింగమహాపురాణమ్** – లింగమహాపురాణం

## **పూర్వభాగః** – పూర్వభాగం

## **ప్రథమోఽధ్యాయః** – మొదటి అధ్యాయం

## **లింగోద్భవప్రతిజ్ఞావర్ణనమ్** – లింగోద్భవప్రతిజ్ఞావర్ణనం

**నమో రుద్రాయ హరయే బ్రహ్మణే పరమాత్మనే ।**
**ప్రధానపురుషేశాయ సర్గస్థిత్యంతకారిణే ॥ 1 ॥**

రుద్రుడుకి, హరుడికి, బ్రహ్మకు నమస్కారం. పరమాత్మయూ, ప్రధానపురుషుడూ, సృష్టిస్థితిలయకారకుడైన ఈశ్వరుడికి నమస్కారం.

**నారదోఽ భ్యర్చ్య శైలేశే శంకరం సంగమేశ్వరే ।**
**హిరణ్యగర్భే స్వర్లీనే హ్యవిముక్తే మహాలయే ॥ 2 ॥**

**రౌద్రే గోప్రేక్షకే చైవ శ్రేష్ఠే పాశుపతే తథా ।**
**విఘ్నేశ్వరే చ కేదారే తథా గోమాయుకేశ్వరే ॥ 3 ॥**

**హిరణ్యగర్భే చంద్రేశే ఈశాన్యే చ త్రివిష్టపే ।**
**శుక్రేశ్వరే యథాన్యాయం నైమిషం ప్రయయౌ మునిః ॥ 4 ॥**

నారదమహర్షి శైలేశ, సంగమేశ్వర, హిరణ్యగర్భ, స్వర్లీన, అవిముక్త, మహాలయ, రౌద్ర, గోప్రేక్షక,శ్రేష్ఠమైన పాశుపత, విఘ్నేశ్వర, కేదార, గోమాయుకేశ్వర, హిరణ్యగర్భ, చంద్రేశ, ఈశాన్య, త్రివిష్టప, శుక్రేశ్వర మొదలైన పుణ్యతీర్థాలలో, పుణ్యస్థలాలలో భగవంతుడైన సదాశివుడిని యథోచితంగా పూజించి నైమిషారణ్యానికి వెళ్ళాడు.

**నైమిషేయాస్తదా దృష్ట్వా నారదం హృష్టమానసాః ।**
**సమభ్యర్చ్యాసనం తస్మై తద్యోగ్యం సమకల్పయన్ ॥ 5 ॥**

నైమిషారణ్యవాసులైన ఋషులు నారదమహర్షిని చూచి, సంతుష్టాంతరంగులై పూజించి ఆయనకు సముచితమైన ఆసనాన్ని సమకూర్చారు.

**సోఽపి హృష్టో మునివరైర్దత్తం భేజే తదాసనమ్ ।**
**సంపూజ్యమానో మునిభిః సుఖాసీనో వరాసనే ॥ 6 ॥**

**చక్రే కథాం విచిత్రార్థాం లింగమాహాత్మ్యమాశ్రితామ్ ।**
**ఏతస్మిన్నేవ కాలే తు సూతః పౌరాణికః స్వయమ్ ॥ 7 ॥**

**జగామ నైమిషం ధీమాన్ ప్రణామార్థం తపస్వినామ్ ।**
**తస్మై సామ చ పూజాఞ్చ యథావచ్చక్రిరే తదా ॥ 8 ॥**

మునుల సమర్చనకు సంతోషించిన నారదుడు వారు సమర్పించిన శ్రేష్ఠమైన ఆసనంలో సుఖాసీనుడై విచిత్రమూ, రహస్యార్థమూ కలిగిన లింగావిర్భావమాహాత్మ్యయుతమైన కథాంశాన్ని చెప్పదొడగినాడు. ఇంతలో పౌరాణిక శ్రేష్ఠుడైన సూతమహర్షి నైమిషారణ్యస్థితులైన మునిపుంగవుల్ని దర్శించి నమస్కరించుటకై అక్కడకు వచ్చాడు. అప్పుడు వారు యథోచితంగా సూతుడిని పూజించారు.

**నైమిషేయాస్తు శిష్యాయ కృష్ణద్వైపాయనస్య తు ।**
**అథ తేషాం పురాణస్య శుశ్రూషా సమపద్యత ॥ 9 ॥**

**దృష్ట్వా తమతివిశ్వస్తం విద్వాంసం రోమహర్షణమ్ ।**
**అపృచ్ఛంశ్చ తతః సూతం ఋషిం సర్వే తపోధనాః ॥ 10 ॥**

వేదవ్యాసుడి శిష్యుడూ, అత్యంతవిషయనిష్ణాతుడూ, రోమహర్షణుడనే పేరుగల సూతుడి వలన పురాణమాహాత్మ్య కథల్ని వినదలచి నైమిశారణ్యవాసులైన తపోధనులు ఆతడిని ప్రార్థించారు.

**నైమిషేయా ఊచుః** – నైమిషవాసులు పలికారు.

**పురాణసంహితాం పుణ్యాం లింగమాహాత్మ్యసంయుతామ్ ।**
**త్వయా సూత మహాబుద్ధే కృష్ణద్వైపాయనో మునిః ॥ 11 ॥**

**ఉపాసితః పురాణార్థం లబ్ధా తస్మాచ్చ సంహితా ।**
**తస్మాత్ భవంతం పృచ్ఛామః సూత పౌరాణికోత్తమ ॥ 12 ॥**

**పురాణసంహితాం దివ్యాం లింగమాహాత్మ్యసంయుతామ్ ।**
**నారదోఽ ప్యస్య దేవస్య రుద్రస్య పరమాత్మనః ॥ 13 ॥**

**క్షేత్రాణ్యాసాద్య చాఽ భ్యర్చ్య లింగాని మునిపుంగవః ।**
**ఇహ సన్నిహితః శ్రీమాన్ నారదో బ్రహ్మణః సుతః ॥ 14 ॥**

**భవ భక్తో భావాంశ్చైవ వయం వై నారదస్తథా ।**
**అస్యాగ్రతో మునేః పుణ్యం పురాణం వక్తుమర్హసి ॥ 15 ॥**

**సఫలం సాధితం సర్వం భవతా విదితం భవేత్ ।**
**ఏవం ఉక్తః స హృష్టాత్మా సూతః పౌరాణికోత్తమః ॥ 16 ॥**

**అభివాద్య అగ్రతో ధీమాన్ నారదం బ్రహ్మణః సుతమ్ ।**
**నైమిషేయాంశ్చ పుణ్యాత్మా పురాణం వ్యాజహార సః ॥ 17 ॥**

బుద్ధి కుశలతగల ఓ సూతమహర్షీ! వ్యాసమహర్షి నీచేత సేవింపబడి నీకు పురాణసంహితను ప్రసాదించాడు. కావున మేము నీ నుండి పుణ్యప్రదమైన, దివ్యమైన లింగపురాణ మాహాత్మ్యాన్ని వినగోరుతున్నాం. బ్రహ్మపుత్రుడైన నారదుడు బహుక్షేత్రాలలోగల లింగరూపుడైన పరమశివుడిని అర్చించి వచ్చియున్నాడు. అట్టి నారదుడి సన్నిధిలో లింగపురాణాన్ని మీరు చెప్పాలని కోరుతున్నాం.

నీవు, మేము, నారదుడు కూడా శివభక్తులం. ఈ పురాణశ్రవణం సర్వార్థసాధకమై సఫలం కాగలదని మునులు పలుకగా పరమపౌరాణికుడైన సూతుడు సంతోషించి ధీమంతుడు, బ్రహ్మమానసపుత్రుడూ అయిన నారదుడికి ముందుగా నమస్కరించి, శ్రవణకుతూహలురైన ఋషులకు అభివందనం చేసి లింగపురాణాన్ని చెప్పడం ప్రారంభించాడు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**నమస్కృత్య మహాదేవం బ్రహ్మాణం చ జనార్దనమ్ ।**
**మునీశ్వరం తథా వ్యాసం వక్తుం లింగం స్మరామ్యహమ్ ॥ 18 ॥**

బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు, వ్యాసమునీంద్రుడికి నమస్కరించి లింగపురాణంలో ప్రతిపాదిత విషయాల్ని స్మరించుకొంటున్నాను.

**శబ్దబ్రహ్మతనుం సాక్షాచ్ఛబ్దబ్రహ్మప్రకాశకమ్ ।**
**వర్ణావయవమవ్యక్తలక్షణం బహుధా స్థితమ్ ॥ 19 ॥**

**అకారోకారమకారం స్థూలం సూక్ష్మం పరాత్పరమ్ ।**
**ఓంకారరూపమృగ్వక్త్రం సామజిహ్వాసమన్వితమ్ ॥ 20 ॥**

**యజుర్వేదమహాగ్రీవమథర్వహృదయం విభుమ్ ।**
**ప్రధానపురుషాతీతం ప్రళయోత్పత్తివర్జితమ్ ॥ 21 ॥**

**తమసా కాలరుద్రాఖ్యం రజసా కనకాండజమ్ ।**
**సత్త్వేన సర్వగం విష్ణుం నిర్గుణత్వే మహేశ్వరమ్ ॥ 22 ॥**

**ప్రధానావయవం వ్యాప్య సప్తధాధిష్ఠితం క్రమాత్ ।**
**పునః షోడశధా చైవ షడ్వింశకమజోద్భవమ్ ॥ 23 ॥**

**సర్గప్రతిష్ఠాసంహారలీలార్థం లింగరూపిణమ్ ।**
**ప్రణమ్య చ యథాన్యాయం వక్ష్యే లింగోద్భవం శుభమ్ ॥ 24 ॥**

శబ్దబ్రహ్మమే శరీరమూ, అదియే ప్రకాశమూ, అకారం నుంచి క్షకారం వరకుగల వర్ణాలే అవయవాలుగా గలవాడూ, అనేకరూపాలు కలిగియూ అవ్యక్తలక్షణుడూ, స్థూలమూ సూక్ష్మమూ అయిన పరాత్పరుడూ, అకార

ఉకార మకారాల కలయిక అయిన ఓంకారరూపుడూ, ఋగ్వేదం ఆతడి ముఖం, సామవేదం ఆతడి నాలుక, యజుర్వేదం ఆతడి గ్రీవం(కంఠం) అథర్వవేదం ఆతడి హృదయం, సర్వవ్యాపకుడూ ప్రకృతికీ పురుషుడికీ అతీతుడూ, జన్మమృత్యురహితుడూ, తమోగుణంతో కాలరుద్రుడుగా, రజోగుణంతో హిరణ్యగర్భుడైన బ్రహ్మగా, సత్త్వగుణంతో సర్వవ్యాపియైన విష్ణువుగా, నిర్గుణత్వంలో మహేశ్వరుడుగ నిలుచువాడూ, ముందుగా శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను ఐదు విధాలుగా, తదుపరి ఏడు విధాలుగా తర్వాత పదహారు విధాలుగా అనంతరం ఇరవై ఆరు విధాలుగా తనను వ్యక్తపరచుకున్నవాడూ, బ్రహ్మకు తండ్రియైనవాడూ, సృష్టిస్థితిలయాలు లీలావినోదాలుగా కలిగినవాడూ అయిన లింగరూపుడైన పరమేశ్వరుడికి యథోచితంగా నమస్కరించి శుభదాయకమైన లింగమహాపురాణాన్ని చెబుతున్నాను.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే లింగోద్భవప్రతిజ్ఞావర్ణనం నామ ప్రథమోఽధ్యాయః ॥ 1 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని లింగోద్భవప్రతిజ్ఞావర్ణనమనే మొదటి అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయం
## అనుక్రమణికా వర్ణనమ్ - అనుక్రమణికా వర్ణనం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**ఈశానకల్పవృత్తాంతమధికృత్య మహాత్మనా ।**
**బ్రహ్మణా కల్పితం పూర్వం పురాణం లైంగముత్తమమ్ ॥ 1 ॥**

**గ్రంథకోటిప్రమాణం తు శతకోటిప్రవిస్తరే ।**
**చతుర్లక్షేణ సంక్షిప్తే వ్యాసైః సర్వాంతరేషు వై ॥ 2 ॥**

**వ్యస్తేఽష్టాదశధా చైవ బ్రహ్మాదౌ ద్వాపరాదిషు ।**
**లింగమేకాదశం ప్రోక్తం మయా వ్యాసాత్ శ్రుతం చ తత్ ॥ 3 ॥**

**అస్యైకాదశసాహస్రే గ్రంథమానమిహ ద్విజాః ।**
**తస్మాత్ సంక్షేపతో వక్ష్యే న శ్రుతం విస్తరేణ యత్ ॥ 4 ॥**

**చతుర్లక్షేణ సంక్షిప్తే కృష్ణద్వైపాయనేన తు ।**
**అత్రైకాదశసాహస్రైః కథితో లింగసంభవః ॥ 5 ॥**

ఈశానకల్పంలో లింగావిర్భావసందర్భంగా మహాత్ముడైన బ్రహ్మదేవుడు ఉత్తమమైన లింగపురాణాన్ని ప్రవచించినాడు. శతకోటిగ్రంథప్రవిస్తరమైన పురాణసంహితలో ఒక కోటిగ్రంథపరిమాణం కలది లింగపురాణం. తదుపరి మన్వంతరాలలో వ్యాసమహర్షులు ఆ శతకోటిగ్రంథాల్ని నాలుగులక్షల గ్రంథాలకు సంక్షిప్త పరిచారు. కాగా ద్వాపరయుగంలో బ్రహ్మాదులైన పదునెనిమిది పురాణాలుగా విభజన చేయబడినవాటిలో ఈ లింగపురాణం పదకొండవది. వాటిలో నేను వ్యాసుని ద్వారా విన్నది వ్యాసుడు చెప్పినదియైన ఈ లింగపురాణం పదకొండు వేల శ్లోకాలు కల్గినది. విప్రవర్యులారా! నేను సంక్షిప్తంగా విన్న పురాణాన్నే మీకు చెబుతున్నాను. నాలుగు లక్షల శ్లోకాలుగా సంక్షిప్తపర్చిన పురాణసముచ్చయంలో పదకొండువేల శ్లోకాలలో ఈ లింగోద్భవకథ వ్యాసుడిచే చెప్పబడింది.

**సర్గః ప్రాధానికః పశ్చాత్ ప్రాకృతో వైకృతాని చ ।**
**అండస్యాస్య చ సంభూతిరండస్యావరణాష్టకమ్ ॥ 6 ॥**

ఈ పురాణంలో ప్రధానసృష్టి తదుపరి ప్రాకృత వైకృత సృష్టులు, అండోద్భవం, దాన్ని ఆవరించిన ఆవరణాష్టకాలు వర్ణింపబడ్డాయి.

**అండోద్భవత్వం శర్వస్య రజోగుణసమాశ్రయాత్ ।**
**విష్ణుత్వం కాలరుద్రత్వం శయనం చాప్సు తస్య చ ॥ 7 ॥**

శివుడు రజోగుణాశ్రయంగా అండోద్భవుడైన బ్రహ్మగా, సత్త్వాశ్రితుడై విష్ణువుగా, తమోగుణాశ్రితుడై కాలరుద్రుడుగా, ప్రళయకాలంలో అనంతజలరాశిపై పవ్వళించే నారాయణుడుగా వర్ణింపబడినాడు.

**ప్రజాపతీనాం సర్గశ్చ పృథివ్యుద్ధరణం తథా ।**
**బ్రహ్మణశ్చ దివారాత్రమాయుషో గణనం పునః ॥ 8 ॥**

ప్రజాపతుల సృష్టి, విష్ణువు వరాహరూపంలో భూమిని ఉద్ధరించడం పగలు, రాత్రి రూపంగా బ్రహ్మ యొక్క ఆయుర్దాయగణనం ఇందు చెప్పబడ్డాయి.

**సవనం బ్రహ్మణశ్చైవ యుగకల్పశ్చ తస్య తు ।**
**దివ్యం చ మానుషం వర్షమార్షం వై ధ్రౌవ్యమేవ చ ॥ 9 ॥**

బ్రహ్మయొక్క ఉత్పత్తి, ఆతడి యుగం మరియు కల్పం యొక్క లెక్కలు, దివ్యమానుషవర్షాలు (సంవత్సరాలు) ఆర్షవర్షం, ధ్రువుని వర్షం లెక్కలు వర్ణింపబడ్డాయి.

**పిత్ర్యం పితౄణాం సంభూతిః ధర్మశ్చాశ్రమిణాం తథా ।**
**అవృద్ధిః జగతో భూయో దేవ్యాః శక్త్యుద్భవస్తథా ॥ 10 ॥**

పితృదేవతలవర్షం, వారి ఉత్పత్తి, ఆశ్రమవాసుల ధర్మాలు, జగత్తు యొక్క వికాసాభివృద్ధుల రాహిత్యం, శక్తిస్వరూపిణియైన మహాదేవి యొక్క ఆవిర్భావం వర్ణితమయ్యాయి.

**స్త్రీపుంభావో విరించస్య సర్గో మిథునసంభవః ।**
**ఆఖ్యాష్టకం హి రుద్రస్య కథితం రోదనాంతరే ॥ 11 ॥**

మనువు మరియు శతరూపల ఉత్పత్తి సమయంలో బ్రహ్మయొక్క స్త్రీ పురుషభావవర్ణనం, మైథున సృష్టివర్ణనం (దంపతుల సంభవం) రోదించుట వలన రుద్రునకు కల్గిన ఎనిమిది నామాల వర్ణనం (పంచభూతాలు సూర్యచంద్రులు మొదలైనవి) ఇందు నిరూపింపబడ్డాయి.

**బ్రహ్మవిష్ణువివాదశ్చ పునర్లింగస్య సంభవః ।**
**శిలాదస్య తపశ్చైవ వృత్రారేర్దర్శనం తథా ॥ 12 ॥**

బ్రహ్మవిష్ణుమూర్తుల వివాదం, లింగోద్భవం, శిలాదుని తపస్సు, ఆతడికైన ఇంద్రుని దర్శనం వర్ణింపబడ్డాయి.

**ప్రార్థనాయోనిజస్యాథ దుర్లభత్వం సుతస్య తు ।**
**శిలాదశక్రసంవాదః పద్మయోనిత్వమేవ చ ॥ 13 ॥**

శిలాదుడికి ఇంద్రుడికి జరిగిన సంవాదం, అయోనిజుడైన సుతుణ్ణి పొందడానికి శిలాదుడు ఇంద్రుణ్ణి ప్రార్థించడం, అది అసాధ్యమని ఇంద్రుడు చెప్పడం, పద్మంనుంచి బ్రహ్మదేవుడి పుట్టుక వర్ణింపబడ్డాయి.

**భవస్య దర్శనం చైవ తిష్యేష్వాచార్యశిష్యయోః ।**
**వ్యాసావతారశ్చ తథా కల్పమన్వంతరాణి చ ॥ 14 ॥**

గురువులకు శిష్యులకు కలియుగంలో ఈశ్వరుడి దర్శనం, వ్యాసభగవానుడి అవతారం, కల్పాలు, మన్వంతరాలు వాటి వర్ణనలు ఇందులో ఉన్నాయి.

**కల్పత్వం చైవ కల్పానామాఖ్యాభేదేష్వనుక్రమాత్ ।**
**కల్పేషు కల్పే వారాహే వరాహత్వం హరేస్తథా ॥ 15 ॥**

కల్పాల లక్షణాలు, వాటి పేర్లు, వరాహకల్పంలో శ్రీమహావిష్ణువు వరాహరూపాన్ని దాల్చడం వర్ణితం.

**మేఘవాహనకల్పస్య వృత్తాంతం రుద్రగౌరవమ్ ।**
**పునర్లింగోద్భవశ్చైవ ఋషి మధ్యే పినాకినః ॥ 16 ॥**

**లింగస్యారాధనం స్నానవిధానం శౌచలక్షణమ్ ।**
**వారాణస్యాశ్చ మాహాత్మ్యం క్షేత్రమాహాత్మ్యవర్ణనమ్ ॥ 17 ॥**

మేఘవాహనకల్పం యొక్క వృత్తాంతం, రుద్రుని మాహాత్మ్యం, మునుల మధ్యభాగంలో తిరిగి శివలింగోద్భవం, దాని ఆరాధన విధానం, అభిషేకపద్ధతి, శుచిత్వానికి చెందిన వివరాలు, వారణాసీ పుణ్యక్షేత్రమాహాత్మ్యం, మరియు ఇతరక్షేత్రాల మాహాత్మ్యాలు వర్ణితాలు.

**భువి రుద్రాలయానాం తు సంఖ్యా విష్ణోర్గృహస్య చ ।**
**అంతరిక్షే తథాండేఽస్మిన్ దేవాయతనవర్ణనమ్ ॥ 18 ॥**

భూమి మీద శివుడియొక్కయు విష్ణువుయొక్కయు ఆలయాల లెక్కలు, అట్లే అంతరిక్షంలోనూ, ఈ బ్రహ్మాండంలోనూ దేవాలయాల లెక్కలు వర్ణింపబడ్డాయి.

**దక్షస్య పతనం భూమౌ పునః స్వారోచిషేఽంతరే ।**
**దక్షశాపశ్చ దక్షస్య శాపమోక్షస్తథైవ చ ॥ 19 ॥**

స్వారోచిషమన్వంతరంలో దక్షప్రజాపతి భూమిపై పడుట, దక్షుడు శాపాన్ని పొందడం, తదుపరి ఆ శాపవిమోచనం వర్ణింపబడ్డాయి.

**కైలాసవర్ణనం చైవ యోగః పాశుపతస్తథా ।**
**చతుర్యుగప్రమాణం చ యుగధర్మః సవిస్తరః ॥ 20 ॥**

శివుడి నివాసమైన కైలాసం యొక్క వర్ణనం, పాశుపతయోగం, కృతత్రేతాదులైన నాలుగుయుగాల కాలప్రమాణం, ఆ యుగధర్మాలు విపులంగా చెప్పబడ్డాయి.

**సంధ్యాంశకప్రమాణం చ సంధ్యావృత్తం భవస్య చ ।**
**శ్మశాననిలయశ్చైవ చంద్రరేఖాసముద్భవః ॥ 21 ॥**

నాలుగుయుగాల యొక్క సంధ్యాకాల ప్రమాణవర్ణనం, శివుడి యొక్క సంధ్యాకాల తాండవనృత్యవర్ణనం, శంకరుని శ్మశానవాసిత్వం, చంద్రరేఖ యొక్క ఉత్పత్తివిధం వివరింపబడ్డాయి.

**ఉద్వాహః శంకరస్యాథ పుత్రోత్పాదనమేవ చ ।**
**మైథునాతిప్రసంగేన వినాశో జగతాం భయమ్ ॥ 22 ॥**

**శాపః సత్యా కృతో దేవాన్ పురా విష్ణుం చ పాలితమ్ ।**
**శుక్రోత్సర్గస్తు రుద్రస్య గాంగేయోద్భవ ఏవ చ ॥ 23 ॥**

శివుడి వివాహం, వినాయకరూపపుత్రోత్పత్తి, దీర్ఘకాలకామోపభోగం, దాని వల్ల విశ్వవినాశన భయం, సతీదేవిశాపం, తదుపరి శాపవిమోచనం, త్రిపురసంహారం చేసి దేవతల్ని, విష్ణువును రక్షించడం, రుద్రుడి వీర్యత్యాగం, కుమారస్వామి జననం వర్ణింపబడ్డాయి.

**గ్రహణాదిషు కాలేషు స్నాప్య లింగం ఫలం తథా ।**
**క్షుబ్ధధీచ వివాదశ్చ దధీచోపేంద్రయోస్తథా ॥ 24 ॥**

గ్రహణసమయాలలో లింగాభిషేకవిధానం, దాని ఫలితం, మాహాత్మ్యం, క్షుపుడు దధీచుల వివాదం, అట్లే విష్ణు దధీచుల వివాదం ఇందు వర్ణింపబడ్డాయి.

**ఉత్పత్తిర్నందినామ్నా తు దేవదేవస్య శూలినః ।**
**పతివ్రతాయాశ్చాఖ్యానం పశుపాశవిచారణా ॥ 25 ॥**

**ప్రవృత్తిలక్షణం జ్ఞానం నివృత్త్యధికృతా తథా ।**
**వసిష్ఠతనయోత్పత్తిః వాసిష్ఠానాం మహాత్మనామ్ ॥ 26 ॥**

**మునీనాం వంశవిస్తారో రాజ్ఞాం శక్తేర్వినాశనమ్ ।**
**దౌరాత్మ్యం కౌశికస్యాథ సురభేర్బంధనం తథా ॥ 27 ॥**

త్రిశూలధారి, దేవాధిదేవుడు అయిన శివుడు నందీశ్వరుడుగా జన్మించడం, పతివ్రతావృత్తాంతం, జీవుల బంధమీమాంస, ప్రవృత్తి నివృత్తుల లక్షణాలు, వసిష్ఠముని పుత్రోత్పత్తి, మహాత్ములైన వసిష్ఠపుత్రుల యొక్కయు, మునులయొక్కయు, రాజులయొక్కయు వంశవిస్తరణ, వసిష్ఠపుత్రుడైన శక్తియొక్క మృతి, విశ్వామిత్రుడి దుర్మార్గం, కామధేనువు అపహరణం వర్ణింపబడ్డాయి.

**సుతశోకో వసిష్ఠస్య అరుంధత్యాః ప్రలాపనమ్ ।**
**స్నుషాయాః ప్రేషణం చైవ గర్భస్థస్య వచస్తథా ॥ 28 ॥**

వసిష్ఠుడి పుత్రశోకం, అరుంధతీవిలాపం. వసిష్ఠుడి కోడలు, శక్తి భార్య యొక్క వృత్తాంతం. ఆమె గర్భస్థశిశువు మాట్లాడడం వర్ణింపబడ్డాయి.

**పరాశరస్యావతారో వ్యాసస్య చ శుకస్య చ ।**
**వినాశో రాక్షసానాం చ కృతో వై శక్తిసూనునా ॥ 29 ॥**

పరాశరవ్యాసశుకుల జన్మలు, శక్తి కుమారుడైన పరాశరుడి చేత జరిగిన రాక్షససంహారం వర్ణింపబడ్డాయి.

**దేవతాపరమార్థం తు విజ్ఞానం చ ప్రసాదతః ।**
**పురాణకరణం చైవ పులస్త్యస్యాజ్ఞయా గురోః ॥ 30 ॥**

దేవతల్ని గూర్చిన నిగూఢరహస్యరూపసత్యం, ఈశ్వరకృపతో పులస్త్యుడికి సంపూర్ణజ్ఞానం కల్గడం, ఆతడి ఆదేశంతో పురాణరచన సాగడం వర్ణింపబడ్డాయి.

**భువనానాం ప్రమాణం చ గ్రహాణాం జ్యోతిషాం గతిః ।**
**జీవచ్ఛ్రాద్ధవిధానం చ శ్రాద్ధార్హాః శ్రాద్ధమేవ చ ॥ 31 ॥**

లోకాలప్రమాణం, గ్రహనక్షత్రాల గమనాలు, సజీవుల శ్రాద్ధవిధానం, శ్రాద్ధనిర్వాహకుల అర్హతలు, శ్రాద్ధలక్షణాలు వర్ణింపబడ్డాయి.

**నాందీశ్రాద్ధవిధానం చ తథాధ్యయనలక్షణమ్ ।**
**పంచయజ్ఞప్రభావశ్చ పంచయజ్ఞవిధిస్తథా ॥ 32 ॥**

నాందీశ్రాద్ధపద్ధతి, వేదాధ్యయనవిధానం, బ్రహ్మయజ్ఞం, పితృయజ్ఞం మొదలైన పంచయజ్ఞాల ప్రభావం, వాటి ఆచరణవిధానం వర్ణితాలు.

**రజస్వలానాం వృత్తిశ్చ వృత్త్యా పుత్రవిశిష్టతా ।**
**మైథునస్య విధిశ్చైవ ప్రతివర్ణమనుక్రమాత్ ॥ 33 ॥**

రజస్వలలు అయిన స్త్రీల ప్రవర్తన అనగా పాటింపవలసిన సదాచారాలు. దాని వలన కలిగే సుపుత్రప్రాప్తి (సంతాన) ఆయా వర్ణాల వారు సంభోగంలో పాటింపవలసిన నియమాలు వర్ణింపబడ్డాయి.

**భోజ్యాభోజ్యవిధానం చ సర్వేషామేవ వర్ణినామ్ ।**
**ప్రాయశ్చిత్తమశేషస్య ప్రత్యేకం చైవ విస్తరాత్ ॥ 34 ॥**

సర్వవర్ణాల వారికి ఏవి తినదగినవో ఏవి తినరానివో చెప్పడం, సమస్తమైన సామాన్యవిశేష పాపాల పరిహారవిధానం వర్ణింపబడ్డాయి.

**నరకాణాం స్వరూపం చ దండః కర్మానురూపతః ।**
**స్వర్గినారకిణాం పుంసాం చిహ్నం జన్మాంతరేషు చ ॥ 35 ॥**

వివిధనరకాల స్వరూపాలు. అందుగల కర్మానుసారమైన దండనవిధానం పునర్జన్మలందు స్వర్గనరకప్రాప్తి పొందడానికి అర్హులగు వ్యక్తుల లక్షణాలు వర్ణింపబడ్డాయి.

**నానావిధాని దానాని ప్రేతరాజపురం తథా ।**
**కల్పం పంచాక్షరస్యాథ రుద్రమాహాత్మ్యమేవ చ ॥ 36 ॥**

చేయదగిన అనేకవిధాలైన దానాలు, యమపురవర్ణనం, పంచాక్షరీమంత్రానుష్ఠాన విచారణ, రుద్రుడి మాహాత్మ్యకథనం ఇందు వర్ణింపబడ్డాయి.

**వృత్రేంద్రయోః మహాయుద్ధం విశ్వరూపవిమర్దనమ్ ।**
**శ్వేతస్య మృత్యోః సంవాదః శ్వేతార్థే కాలనాశనమ్ ॥ 37 ॥**

ఇంద్రవృత్రాసురుల మహాసంగ్రామం, వృత్రుడి విశ్వవ్యాపకరూపహరణం, శ్వేతయమధర్మరాజుల సంవాదం. శ్వేతముని కోసం యముడిని సంహరించడం వర్ణించబడింది.

**దేవదారువనే శంభోః ప్రవేశః శంకరస్య తు ।**
**సుదర్శనస్య చాఖ్యానం క్రమసంన్యాసలక్షణమ్ ॥ 38 ॥**

మంగళకరుడైన శివుడియొక్క దేవదారువనప్రవేశం, సుదర్శనాఖ్యానం, క్రమసంన్యాసలక్షణం వర్ణితం.

**శ్రద్ధాసాధ్యోఽథ రుద్రస్తు కథితం బ్రహ్మణా తదా ।**
**మధునా కైటభేనైవ పురా హృతగతేర్విభోః ॥ 39 ॥**

రుద్రప్రాప్తి శ్రద్ధాసాధ్యమని బ్రహ్మ తెల్పుట, పూర్వం మధుకైటభులనే రాక్షసులచే బ్రహ్మ అపహరింపబడుట వర్ణితం.

**బ్రహ్మణః పరమం జ్ఞానమాదాతుం మీనతా హరేః ।**
**సర్వావస్థాసు విష్ణోశ్చ జననం లీలయైవ తు ॥ 40 ॥**

బ్రహ్మకు పూర్ణజ్ఞానోదయం కలగడానికై విష్ణువు మత్స్యావతారమెత్తుట, విష్ణువు అన్ని అవతారాలను లీలామాత్రంగానే ధరించడం వర్ణితం.

**రుద్రప్రాసాదాత్ విష్ణోశ్చ జిష్ణోశ్చైవ తు సంభవః ।**
**మంథానధారణార్థాయ హరేః కూర్మత్వమేవ చ ॥ 41 ॥**

శివుడి అనుగ్రహం వలనే జయశీలుడైన విష్ణువుకు (శ్రీకృష్ణుడికి) మన్మథరూపుడైన ప్రద్యుమ్నుడు జన్మించుట, సముద్రమథనసమయంలో మంథరపర్వతాన్ని విష్ణువు కూర్మరూపంలో ధరించుట వర్ణింపబడ్డాయి.

**సంకర్షణస్య చోత్పత్తిః కౌశిక్యాశ్చ పునర్భవః ।**
**యదూనాం చైవ సంభూతిర్యాదవత్వం హరేః స్వయమ్ ॥ 42 ॥**

సంకర్షణజననం, కౌశికీ(చండిక) పునర్జన్మ, యదుకులోత్పత్తి, స్వయంగా విష్ణువే యాదువుడై అనగా కృష్ణుడై జన్మించుట ఇందు వర్ణితాలు.

**భోజరాజస్య దౌరాత్మ్యం మాతులస్య హరేర్విభోః ।**
**బాలభావే హరేః క్రీడా పుత్రార్థం శంకరార్చనమ్ ॥ 43 ॥**

శ్రీకృష్ణుడి మేనమామ అయిన కంసుని దౌష్ట్యం, కృష్ణుడి బాల్యలీలలు, సంతానార్థియై శంకరుణ్ణి అర్చించడం ఇందు వర్ణింపబడ్డాయి.

**నారస్య చ తథోత్పత్తిః కపాలే వైష్ణవాత్ హరాత్ ।**
**భూభారనిగ్రహార్థే తు రుద్రస్యారాధనం హరేః ॥ 44 ॥**

విష్ణురూపంలో శివుని శిరస్సుపై జలం ఉద్భవించుట, భూభారాన్ని తగ్గించుటకొరకు విష్ణువు ద్వారా శివుడిని ఆరాధించడం ఇందు చెప్పబడ్డాయి.

**వైన్యేన పృథునా భూమేః పురా దోహప్రవర్తనమ్ ।**
**దేవాసురే పురా లబ్ధో భృగుశాపాశ్చ విష్ణునా ॥ 45 ॥**

వేనుడి పుత్రుడగు పృథువు భూదోహనం చేయుట (ఓషధులకై భూమిని గోవును చేసి పిదుకుట) దేవదానవయుద్ధానికై భృగుమహర్షి విష్ణువుకు శాపమిచ్చుట ఇందు వర్ణింపబడ్డాయి.

**కృష్ణత్వే ద్వారకాయాం తు నిలయో మాధవస్య తు ।**
**లబ్ధో హితాయ శాపస్తు దుర్వాసస్యాననాత్ హరేః ॥ 46 ॥**

కృష్ణావతారసమయంలో విష్ణువు ద్వారకానివాసం, లోకహితార్థమై కృష్ణుడికి దూర్వాసశాపం కలుగుట వర్ణింపబడ్డాయి.

**వృష్ణ్యంధకవినాశాయ శాపః పిండారవాసినామ్ ।**
**ఏరకస్య తథోత్పత్తిః తోమరస్యోద్భవస్తథా ॥ 47 ॥**

పిండారకవాసులైన వృష్ణి, అంధక వంశాల వినాశనం, ముసలం, జమ్ము(తుంగ) ఈటెల ఉత్పత్తి ఇందు వర్ణితాలు.

**ఏరకాలాభతోఽన్యోన్యం వివాదే వృష్ణివిగ్రహః ।**
**లీలయా చైవ కృష్ణేన స్వకులస్య చ సంహృతిః ॥ 48 ॥**

జమ్ము ఈటెలతో ఒకరినొకరు కొట్టుకుని యాదవులు నశించుట, కృష్ణుడి లీలలో భాగంగానే తన యొక్క యదువంశనాశనం జరగడం ఇందు వర్ణితాలు.

**ఏరకాస్త్రబలేనైవ గమనం స్వేచ్ఛయైవ తు ।**
**బ్రహ్మణశ్చైవ మోక్షస్య విజ్ఞానం తు సవిస్తరమ్ ॥ 49 ॥**

జమ్ము ఈటెలనెడి అస్త్రప్రభావంతోనే కృష్ణుడి ఐచ్ఛికమహాప్రస్థానం, మోక్షపూర్ణబ్రహ్మజ్ఞానం ఇందు విస్తారంగా వివరింపబడ్డాయి.

**పురాంధకాగ్నిదక్షాణాం శక్రేభమృగరూపిణామ్ ।**
**మదనస్యాదిదేవస్య బ్రహ్మణశ్చామరారిణామ్ ॥ 50 ॥**

**హలాహలస్య దైత్యస్య కృతావజ్ఞా పినాకినా ।**
**జాలంధరవధశ్చైవ సుదర్శనసముద్భవః ॥ 51 ॥**

**విష్ణోః వరాయుధావాప్తిస్తథా రుద్రస్య చేష్టితమ్ ।**
**తథాన్యాని చ రుద్రస్య చరితాని సహస్రశః ॥ 52 ॥**

ఇంద్రుడు హస్తిహరిణరూపాల్ని ధరించడం, అంధకాసురుడు అగ్ని, దక్షుల్ని లొంగదీసుకోవడం, మదనుడికి, ఆదిదేవుడైన బ్రహ్మకు, హలాహలుడు మొదలైన దానవులకు శివుడి వలన కలిగిన తిరస్కారం, జలంధరరాక్షసుడి వధ, సుదర్శనచక్రోత్పత్తి, విష్ణువుకు కలిగిన శ్రేష్ఠమైన చక్రాయుధప్రాప్తి, శివుడి క్రియా కలాపాలు, వేలకొలది అసాధారణకార్యాలు ఇందు వర్ణింపబడ్డాయి.

**హరేః పితామహస్యాథ శక్రస్య చ మహాత్మనః ।**
**ప్రభావానుభవశ్చైవ శివలోకస్య వర్ణనమ్ ॥ 53 ॥**

విష్ణువు యొక్కయు బ్రహ్మేంద్రుల యొక్కయు అనుభవప్రాభవాలు, శివలోకవర్ణనం ఇందు చేయబడ్డాయి.

**భూమౌ రుద్రస్య లోకం చ పాతాళే హాటకేశ్వరమ్ ।**
**తపసాం లక్షణశ్చైవ ద్విజానాం వైభవం తథా ॥ 54 ॥**

భూమిపై రుద్రలోకం, పాతాళమందు హాటకేశ్వరం, తపస్సుల యొక్క లక్షణం, విప్రప్రాభవం వర్ణితాలు.

**ఆధిక్యం సర్వమూర్తీనాం లింగమూర్తేః విశేషతః ।**
**లింగేఽస్మిన్ ఆనుపూర్వేణ విస్తరేణానుకీర్త్యతే ॥ 55 ॥**

ఇతర దైవాలు, విగ్రహాల కంటె శివలింగం యొక్క వైశిష్ట్యం, ఇంతకు ముందు చెప్పినవి అన్నియూ సక్రమవిధానంలో విస్తారంగా ఈ లింగపురాణమందు వర్ణితాలు.

**ఏతత్ జ్ఞాత్వా పురాణస్య సంక్షేపం కీర్తయేత్తు యః ।**
**సర్వపాపవినిర్ముక్తో బ్రహ్మలోకం స గచ్ఛతి ॥ 56 ॥**

సంక్షేపంగా చెప్పబడిన ఈ లింగమహాపురాణాన్ని ఎవడు పారాయణం(పఠించుట) చేస్తాడో ఆతడు అన్ని పాపాలనుండి విముక్తుడై బ్రహ్మలోకాన్ని పొందగలడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే అనుక్రమణికా వర్ణనం నామ ద్వితీయోఽధ్యాయః ॥ 2 ॥**

శ్రీ లింగమహాపురాణంలోని పూర్వభాగమందలి అనుక్రమణికా వర్ణనమనే రెండవ అధ్యాయం సమాప్తం.

## **తృతీయోఽధ్యాయః** – మూడవ అధ్యాయం

## **ప్రాకృతప్రాథమికసృష్టికథనమ్** – ప్రాకృతప్రాథమికసృష్టికథనం

**సూత ఉవాచ** – సూతమహర్షి పలికాడు.

**అలింగో లింగమూలం తు అవ్యక్తం లింగముచ్యతే ।**
**అలింగః శివ ఇత్యుక్తో లింగం శైవమితి స్మృతమ్ ॥ 1 ॥**

అలింగమనగా నిర్గుణం. అదే బ్రహ్మం, అదే శివం. లింగమనగా ప్రకృతి. ఇది సగుణం. దీనికి నిర్గుణమైన అలింగమే కారణం. కావున ఇది కూడా శివోద్భాసితమే.

**ప్రధానం ప్రకృతిశ్చేతి యదాహుర్లింగముత్తమమ్ ।**
**గంధవర్ణరసైర్హీనం శబ్దస్పర్శాదివర్జితమ్ ॥ 2 ॥**

ఈ సగుణాన్నే ప్రధానమని, ప్రకృతి అని అంటారు. కాని నిర్గుణుడైన శివుడు గంధ, రస, రూప, ధ్వని, స్పర్శాది గుణరహితుడై ఉంటాడు.

**అగుణం ధ్రువమక్షయ్యమలింగం శివలక్షణమ్ ।**
**గంధవర్ణరసైర్యుక్తం శబ్దస్పర్శాదిలక్షణమ్ ॥ 3 ॥**

అగుణమైన అలింగం స్థిరమైంది, శాశ్వతమైంది. సగుణం(లింగం) మాత్రం గంధ, రస, ధ్వని, స్పర్శాది గుణసహితమై ఉంటుంది.

**జగద్యోనిం మహాభూతం స్థూలం సూక్ష్మం ద్విజోత్తమాః ।**
**విగ్రహో జగతాం లింగమలింగాదభవత్స్వయమ్ ॥ 4 ॥**

విప్రోత్తములారా! ఈ ప్రకృతి విశ్వం ఆవిర్భవించడానికి మూలం. ఇది స్థూలం, సూక్ష్మం అని రెండు విధాలు. ఇది విశ్వంయొక్క భౌతికరూపం. (పాంచభౌతికం) ఇది అలింగం నుండే ఉద్భవించింది.

**సప్తధా అష్టధా చైవ తథైకాదశధా పునః ।**
**లింగాన్యలింగస్య తథా మాయయా వితతాని తు ॥ 5 ॥**

అలింగంనుంచి ఉద్భవించిన లింగమైన విశ్వం, ముందు ఏడువిధాలుగా, తదుపరి ఎనిమిది విధాలుగా, తదుపరి పదకొండు విధాలుగా విభజింపబడింది. ఇట్లు మాయవల్ల నిర్గుణం సగుణం అవుతున్నది.

**తేభ్యః ప్రధానదేవానాం త్రయమాసీత్ శివాత్మకమ్ ।**
**ఏకస్మాత్ త్రిష్వభూద్విశ్వమేకేన పరిరక్షితమ్ ॥ 6 ॥**

ఆ సగుణలింగాలనుండే రుద్రస్వరూపులైన బ్రహ్మావిష్ణుమహేశ్వరులు ఉద్భవించారు. వీరిలో ఒకరు సృష్టించగా మరొకరు పోషిస్తున్నారు.

**ఏకేనైవ హృతం విశ్వం వ్యాప్తం త్వేవం శివేన తు ।**
**అలింగం చైవ లింగం చ లింగాలింగాని మూర్తయః ॥ 7 ॥**

ఒకరిచేతనే సంహరింపబడుతున్నది. ఈవిధంగా బ్రహ్మాండమంతా పరబ్రహ్మమైన శివునిచే వ్యాపించి యున్నది. ఆ పరమాత్మ నిర్గుణుడూ, సగుణుడూ అయి ఉన్నాడు. వ్యక్తావ్యక్తరూపుడై ఉన్నాడు.

**యథావత్ కథితాశ్చైవ తస్మాత్ బ్రహ్మ స్వయం జగత్ ।**
**అలింగీ భగవాన్ బీజీ స ఏవ పరమేశ్వరః ॥ 8 ॥**

అందువల్ల బ్రహ్మయే జగత్తు. నిర్గుణుడగు భగవంతుడే బీజం. ఆతడే పరమేశ్వరుడు.

**బీజం యోనిశ్చ నిర్బీజం నిర్బీజో బీజముచ్యతే ।**
**బీజయోనిప్రధానానాం ఆత్మాఖ్యా వర్తతే త్విహ ॥ 9 ॥**

ఆతడే బీజం, గర్భం, అబీజం కూడా. బీజరహితుడైన ఆతడే బీజానికి బ్రహ్మాండానికి కారణమవుతున్నాడు. ఆత్మ అనేది ఇక్కడ బీజానికి గర్భానికి ప్రధానమైన అప్రకటితతత్త్వమవుతున్నది. ఇదే రూపరహితత్త్వం.

**పరమాత్మా మునిర్బ్రహ్మ నిత్యబుద్ధస్వభావతః ।**
**విశుద్ధోఽయం తథా రుద్రః పురాణే శివ ఉచ్యతే ॥ 10 ॥**

విశుద్ధమునిరూపపరబ్రహ్మ, పరమాత్మ అయిన రుద్రుడే నిత్యబుద్ధస్వభావకారణంగా పురాణాలలో శివుడనబడుతున్నాడు.

**శివేన దృష్టా ప్రకృతిః శైవీ సమభవత్ ద్విజాః ।**
**సర్గాదౌ సా గుణైర్యుక్తా పురా వ్యక్తా స్వభావతః ॥ 11 ॥**

శివుడిచే చూడబడిన అనగా పాలింపబడిన ప్రకృతి 'శైవి' అనబడుతున్నది. పూర్వం అవ్యక్తస్వభావం కల్గినది అయినను సృష్టిసమయంలో గుణవ్యక్త అగుతున్నది. అరూపమే సరూపమవుతున్నది.

**అవ్యక్తాదివిశేషాన్ తం విశ్వం తస్యాః సముచ్ఛ్రితమ్ ।**
**విశ్వధాత్రీ త్వజాఖ్యా చ శైవీ సా ప్రాకృతిఃస్మృతా ॥ 12 ॥**

అవ్యక్తమైన మహత్తత్త్వాదులతో కూడిన స్థూలమూ పాంచభౌతికమూ అయిన జగత్తు ఆ ప్రకృతియొక్క అధీనంలో ఉంటుంది. సమస్త విశ్వాన్ని ధరించే శైవీశక్తియే "అజా" అనే పేరుతో పిలువబడుతున్నది.

**తాం అజాం లోహితాం శుక్లాం కృష్ణామేకాం బహుప్రజామ్ ।**
**జనిత్రీమనుశేతే స్మ జుషమాణః స్వరూపిణీమ్ ॥ 13 ॥**

రక్తవర్ణుల్ని(రజోగుణం), శ్వేతవర్ణుల్ని(సత్త్వగుణం) నల్లటి దేహచ్ఛాయగలవారిని(తమోగుణం) సృష్టించే 'అజా' శక్తి ప్రకృతికి ప్రేమపూర్వకమైన సేవచేస్తున్నది. బద్ధజీవులు అనుసరిస్తున్నారు.

**తామేవాజామజోఽన్యస్తు భుక్తభోగాం జహాతి చ ।**
**అజా జనయిత్రీ జగతాం సాజేన సమధిష్ఠితా ॥ 14 ॥**

అబద్ధజీవులు క్షణభంగురాలైన భోగాల విషయమై అనాసక్తులు అవుతున్నారు. బ్రహ్మదేవుడిచేత అధిష్ఠితురాలైన 'అజా' శక్తి బ్రహ్మాండాన్ని సృష్టిస్తున్నది.

**ప్రాదుర్బభూవ స మహాన్ పురుషాధిష్ఠితస్య చ ।**
**అజాజ్ఞయా ప్రధానస్య సర్గకాలే గుణైఃత్రిభిః ॥ 15 ॥**

సృష్టిసమయంలో సత్వరజస్తమో గుణములతోకూడి అజునిచేత ఆదేశించబడిన (అధిష్ఠితురాలైన) 'మాయ' వలన 'మహత్' తత్త్వం ఉత్పన్నమయినది.

**సిసృక్షయా చోద్యమానః ప్రవిశ్యావ్యక్తమవ్యయమ్ ।**
**వ్యక్తసృష్టిం వికురుతే చాత్మనాధిష్ఠితో మహాన్ ॥ 16 ॥**

పురుషుడిచే ప్రేరేపింపబడ్డ మహత్తు సృష్టిచేయవలయుననే కోరికగలదై అవ్యయుడూ, అవ్యక్తుడూ అయిన పురుషుడిలో ప్రవేశించి వ్యక్తసృష్టిని విశేషముగా చేయుచున్నది.

**మహతస్తు తథా వృత్తిః సంకల్పాధ్యవసాయికా ।**
**మహతః త్రిగుణః తస్మాత్ అహంకారో రజోఽధికః ॥ 17 ॥**

**తేనైవ చావృతః సమ్యక్ అహంకారః తమోఽధికః ।**
**మహతో భూతతన్మాత్రం సర్గకృద్వై బభూవ చ ॥ 18 ॥**

మహత్తునుంచి, సంకల్పనిశ్చయగుణాలుగల సాత్త్వికాహంకారం ఉత్పన్నమయ్యింది. తర్వాత త్రిగుణాలతో రజస్సు ప్రధానముగా గలిగిన రాజసాహంకారం, తమోగుణాహంకారం ఉద్భవించాయి. ఈ అహంకారాల నుంచి సృష్టిని వ్యాపింపజేసే రూప, శబ్ద, స్పర్శాదులైన 'తన్మాత్ర'లు ఉత్పన్నమయ్యాయి.

**అహంకారాత్ శబ్దమాత్రం తస్మాత్ ఆకాశమవ్యయమ్ ।**
**సశబ్దమావృణోత్ పశ్చాత్ ఆకాశం శబ్దకారణమ్ ॥ 19 ॥**

**తన్మాత్రాద్భూతసర్గశ్చ ద్విజాస్త్వేవం ప్రకీర్తితః ।**
**స్పర్శమాత్రం తథాకాశాత్ తస్మాత్ వాయుర్మహాన్ మునే ॥ 20 ॥**

అహంకారం నుంచి సూక్ష్మ ఆకాశతత్త్వమైన శబ్దం కలిగినది. దానినుంచి అపరివర్తితమైన ఆకాశం కల్గినది. అనంతరం శబ్దానికి కారణమైన అహంకారం ఆకాశాన్ని చుట్టివేసింది. మహామునులారా! సూక్ష్మతత్త్వమైన స్పర్శ ఆకాశం నుంచి ఉద్భవించింది. దాని నుంచి వాయువు కలిగింది.

**తస్మాచ్చ రూపమాత్రం తు తతోఽగ్నిశ్చ రసస్తతః ।**
**రసాదాపః శుభాస్తాభ్యో గంధమాత్రం ధరా తతః ॥ 21 ॥**

వాయువునుంచి కలిగిన సూక్ష్మతత్త్వం రూపం కాగా, దాని నుంచి అగ్ని జన్మించింది. అగ్ని నుంచి రసం, అటు పిమ్మట రసం నుంచి జలం, దాని నుంచి సూక్ష్మతత్త్వమైన గంధం, దాని నుంచి పృథ్వి కలిగినాయి.

**ఆవృణోద్ధి తథాకాశం స్పర్శమాత్రం ద్విజోత్తమాః ।**
**ఆవృణోద్రూపమాత్రం తు వాయుర్వాతి క్రియాత్మకః ॥ 22 ॥**

విప్రోత్తములారా! ఆకాశం సూక్ష్మతత్త్వమైన స్పర్శను ఆక్రమించింది. వాయువు వీచుట అనే క్రియచేత సూక్ష్మతత్త్వమైన రూపాన్ని ఆక్రమించింది.

**ఆవృణోద్రసమాత్రం వై దేవః సాక్షాద్విభావసుః ।**
**ఆవృణ్వానా గంధమాత్రమాపః సర్వరసాత్మికాః ॥ 23 ॥**

స్వయంగా అగ్ని సూక్ష్మతత్త్వమైన రసాన్ని ఆక్రమించింది. జలం రసంయొక్క స్వభావాన్ని తానుధరిస్తూ సూక్ష్మతత్త్వమైన గంధాన్ని ఆక్రమించింది.

**క్ష్మా సా పంచగుణా తస్మాదేకోనా రససంభవాః ।**
**త్రిగుణో భగవాన్ వహ్నిః ద్విగుణః స్పర్శసంభవః ॥ 24 ॥**

**అవకాశస్తతో దేవ ఏకమాత్రస్తు నిష్కలః ।**
**తన్మాత్రాత్ భూతసర్గశ్చ విజ్ఞేయః పరస్పరమ్ ॥ 25 ॥**

పృథ్వి ఈవిధంగా పంచగుణాత్మకం అయ్యింది. (శబ్ద, స్పర్శ, రూప, రస గంధాలు) ఒకటి తగ్గి(గంధం) నాలుగుగుణాలతో జలం, రెండు తగ్గి మూడుగుణాలతో అగ్ని, మూడు తగ్గి రెండుగుణాలతో వాయువు, నాలుగు తగ్గి ఒకే ఒక్కగుణంతో ఆకాశం నిలుస్తున్నాయి. ఇట్లు సూక్ష్మతత్త్వాల పరస్పరాంతరక్రియల చేతనే భూతసృష్టి జరుగుతున్నదని తెలియాలి.

**వైకారికః సాత్త్వికో వై యుగపత్ సంప్రవర్తతే ।**
**సర్గః తథాప్యహంకారాదేవమత్ర ప్రకీర్తితః ॥ 26 ॥**

వైకారికసాత్త్వికసృష్టులు ఒకే సమయంలో కల్గినవి. సమస్తసృష్టి అహంకారం నుంచే కల్గినదని చెప్పబడుతున్నది.

**పంచ బుద్ధీంద్రియాణ్యస్య పంచ కర్మేంద్రియాణి తు ।**
**శబ్దాదీనాం అవాప్త్యర్థం మనశ్చైవోభయాత్మకమ్ ॥ 27 ॥**

శబ్దస్పర్శాదిగుణాల్ని గ్రహించడానికై ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు ఉన్నాయి. మనసు స్వయంగా ఇంద్రియమే. అది రెండింటిలోనూ ఉంటుంది.

**మహదాదివిశేషాంతా హ్యండముత్పాదయంతి చ ।**
**జలబుద్బుదవత్ తస్మాత్ అవతీర్ణః పితామహః ॥ 28 ॥**

**స ఏవ భగవాన్ రుద్రో విష్ణుర్విశ్వగతః ప్రభుః ।**
**తస్మిన్ అండే త్విమే లోకా అంతర్విశ్వమిదం జగత్ ॥ 29 ॥**

మహత్తు(బుద్ధి) నుంచి విశేషం(పృథ్వి) వరకుగల ఈ సృష్టి సంఘటక బ్రహ్మాండాన్ని సృష్టింపగా దానినుంచి బ్రహ్మ ఒక నీటి బుడగలాగా పుట్టాడు. ఆతడే విశ్వవ్యాపి అయిన రుద్రుడు, విష్ణువునూ అయి ఉన్నాడు. ఈ విశ్వంలో లోకాలన్నీ ఈ బ్రహ్మాండమందే ఉన్నాయి.

**అండం దశగుణేనైవ వారిణా ప్రావృతం బహిః ।**
**ఆపో దశగుణేనైవ తద్బాహ్యే తేజసా వృతాః ॥ 30 ॥**

ఈ బ్రహ్మాండం తన బాహ్యరూపానికి పదిరెట్లు నీటితో కప్పబడి ఉంది. ఆ జలం తనకు పదిరెట్లు అధికంగా బయటగా అగ్నిచే ఆవరింపబడి ఉంది.

**తేజో దశగుణేనైవ బాహ్యతో వాయునా వృతమ్ ।**
**వాయుర్దశగుణేనైవ బాహ్యతో నభసా వృతః ॥ 31 ॥**

అగ్ని తన పరిమాణానికి పదిరెట్లు అధికంగా బాహ్యంగా వాయువుతో కప్పబడి ఉంది. వాయువు తనకు పదిరెట్లు ఎక్కువగా బాహ్యంగా ఆకాశంతో కప్పబడి ఉంది.

**ఆకాశేనావృతో వాయురహంకారేణ శబ్దజః ।**
**మహతా శబ్దహేతుర్వై ప్రధానేన ఆవృతః స్వయమ్ ॥ 32 ॥**

ఆకాశం తన పరిణామానికి పదిరెట్లు శబ్దానికి కారణమైన అహంకారం చేత ఆవరింపబడి ఉంది. అహంకారం బుద్ధి(మహత్తు) చేత, బుద్ధి ప్రధానం చేత కప్పబడి ఉన్నాయి.

**సప్తాండావరణాన్యాహుస్తస్యాత్మా కమలాసనః ।**
**కోటికోటియుతాన్యత్ర చాండాని కథితాని తు ॥ 33 ॥**

ఈ బ్రహ్మాండం ఏడు ఆవరణాలతో కూడియున్నది. కమలాసనుడు దీనియొక్క ఆత్మ అయి ఉన్నాడు. ఇట్టి బ్రహ్మాండాలు కోటానుకోట్లు ఉన్నాయి.

**తత్ర తత్ర చతుర్వక్త్రా బ్రహ్మాణో హరయో భవాః ।**
**సృష్టాః ప్రధానేన తదా లబ్ధ్వా శంభోః తు సన్నిధిమ్ ॥ 34 ॥**

ఈ బ్రహ్మాండాలన్నింటిలోను ఒక్కొక్కదానిలో ఒక్కొక్క చతుర్ముఖుడైన బ్రహ్మ, విష్ణువు, రుద్రులు ఉంటారు. వీరు శివుడి సంపర్కంలోనికి వచ్చిన తర్వాత ప్రధానం చేత సృష్టింపబడినారు.

**లయశ్చైవ తథాన్యో౽ న్యమాద్యంతమితి కీర్తితమ్ ।**
**సర్గస్య ప్రతిసర్గస్య స్థితేః కర్తా మహేశ్వరః ॥ 35 ॥**

వీరియొక్క ఆద్యంతాలు, లయం పరస్పరం జరుగుతాయి. సృష్టిస్థితిలయాలకి మహేశ్వరుడే కారకుడు.

**సర్గే చ రజసా యుక్తః సత్త్వస్థః ప్రతిపాలనే ।**
**ప్రతిసర్గే తమోద్రిక్తః స ఏవ త్రివిధః క్రమాత్ ॥ 36 ॥**

ఆయన సృష్టియందు రజస్సుచేతను, పాలనలో సత్త్వగుణంచేతను, సంహారంలో తమస్సుచేతను కూడి ఉంటాడు. ఆతడే త్రివిధాలుగా ఉంటాడు.

**ఆదికర్తా చ భూతానాం సంహర్తా పరిపాలకః ।**
**తస్మాత్ మహేశ్వరో దేవో బ్రహ్మణో౽ ధిపతిః శివః ॥ 37 ॥**

ఆతడే సర్వపాణిస్రష్ట, మరియు రక్షకుడు అంతేకాక సంహారకుడు. అందువల్ల ఆతడే బ్రహ్మదేవుడికి అధిపతియైన శివుడు.

**సదాశివో భవో విష్ణుః బ్రహ్మా సర్వాత్మకో యతః ।**
**ఏతదండే తథా లోకా ఇమే కర్తా పితామహః ॥ 38 ॥**

సర్వాత్మకుడైన ఆయనే సదాశివుడని, భవుడని, విష్ణువని, బ్రహ్మ అని చెప్పబడుతున్నాడు. ఈ లోకాలన్నీ బ్రహ్మాండంలోనే ఉన్నాయి. సృష్టికర్త అయిన బ్రహ్మ అందే ఉన్నాడు.

**ప్రాకృతః కథితస్త్వేష పురుషాధిష్ఠితో మయా ।**
**సర్గశ్చాబుద్ధిపూర్వస్తు ద్విజాః ప్రాథమికః శుభః ॥ 39 ॥**

ఈ విధంగా ప్రకృతియొక్క స్వభావసృష్టి నాచేత మీ అందరికి తెలియజేయబడింది. ఈ సృష్టి పురుషునిచే నియంత్రించబడి ఉంది. మహర్షులారా! శుభకరమైన ఈ సృష్టిలో అబుద్ధి(మహత్తు) మిక్కిలి ప్రాథమికం మరియు సర్వోన్నతం.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే ప్రాకృతప్రాథమిక(సర్గ)కథనం నామ తృతీయో౽ ధ్యాయః ॥ 3 ॥**

శ్రీలింగమహాపురాణంలోని పూర్వభాగంలోని ప్రాకృతప్రాథమికసృష్టికథనమనే మూడవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## చతుర్థోఽధ్యాయః - నాలుగవ అధ్యాయం
## సృష్టిప్రారంభవర్ణనమ్ - సృష్టిప్రారంభవర్ణనం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**అథ ప్రాథమికస్యైవ యః కాలస్తదహః స్మృతమ్ ।**
**సర్గస్య తాదృశీ రాత్రిః ప్రాకృతస్య సమాసతః ॥ 1 ॥**

బ్రహ్మయొక్క ప్రాథమికసృష్టికి చెందిన కాలం పగలుగాను, ప్రాథమికసృష్టిసమాప్తికి చెందినకాలం రాత్రిగాను పిలువబడుతుంది.

**దివా సృష్టిం వికురుతే రజన్యాం ప్రళయం విభుః ।**
**ఔపచారికమస్యైతదహోరాత్రం న విద్యతే ॥ 2 ॥**

బ్రహ్మ పగటివేళ ప్రాకృతసృష్టి చేసి రాత్రివేళ లయమొందిస్తాడు. నిజానికి బ్రహ్మకు రాత్రింబవళ్లు ఉండవు. ఇది మనం అనుకోవడం మాత్రమే.

**దివావికృతయః సర్వే వికారా విశ్వదేవతాః ।**
**ప్రజానాం పతయః సర్వే తిష్ఠంత్యంతే మహర్షయః ॥ 3 ॥**

**రాత్రౌ సర్వే ప్రలీయంతే నిశాంతే సంభవంతి చ ।**
**అహస్తు తస్య వై కల్పో రాత్రిస్తాదృగ్విధా స్మృతా ॥ 4 ॥**

పగటికాలంలో సమస్తవికృతులు, సర్వదేవతలు, ప్రజాపతులందరూ, మహర్షులందరూ నిలిచి ఉంటారు. పై వారందరూ రాత్రివేళ లీనమై యుంటారు. రాత్రిముగిసిన తర్వాత మరల జన్మిస్తారు. బ్రహ్మయొక్క ఒక పగలు మనకు ఒక కల్పకాలం. అట్లే రాత్రియు వేరొక కల్పం.

**చతుర్యుగసహస్రాంతే మనవస్తు చతుర్దశ ।**
**చత్వారి తు సహస్రాణి వత్సరాణాం కృతం ద్విజాః ॥ 5 ॥**

**తావచ్ఛతీ చ వై సంధ్యా సంధ్యాంశశ్చ కృతస్య తు ।**
**త్రిశతీ ద్విశతీ సంధ్యా తథా చైకశతీ క్రమాత్ ॥ 6 ॥**

ద్విజులారా! కృతత్రేతాది నాల్గుయుగాలు వేయిసార్లు గడచిన తరువాత పద్నాలుగురు మనువులు జన్మిస్తారు. కృతయుగానికి నాల్గువేలదివ్యసంవత్సరాల కాలం. ప్రతియుగం యొక్క సమాప్తి మరియు ఆరంభంలో అనగా సంధికాలంలో క్రమంగా నాలుగు, మూడు, రెండు, వంద సంవత్సరాలకాలం సంక్రమణంగా ఏర్పడుతుంది.

**అంశకః షట్కృతం తస్మాత్ కృతసంధ్యాంశకం వినా ।**
**త్రిద్వ్యేకసాహస్రమితౌ వినా సంధ్యాంశకేన తు ॥ 7 ॥**

అందువలన కృతయుగం యొక్క సంక్రమణకాలాన్ని వదలి త్రేతాద్వాపరకలియుగాలు క్రమంగా మూడువేలు, రెండువేలు, ఒకవెయ్యి సంవత్సరాల కాలం గలవి అవుతాయి. ఇందులో కూడా అంశకాల కాలావధి చేర్చబడలేదు. అంశకమనగా యుగకాలంలో ఆరవభాగం.

**త్రేతాద్వాపరతిష్యాణాం కృతస్య కథయామి వః ।**
**నిమేషపంచదశకా కాష్ఠా స్వస్థస్య సువ్రతాః ॥ 8 ॥**

**మర్త్యస్య చాక్ష్ణోస్తస్యాశ్చ తతస్త్రింశతికా కళా ।**
**కళా త్రింశతికో విప్రా ముహూర్త ఇతి కల్పితః ॥ 9 ॥**

సువ్రతులైన ఋషులారా! కృతత్రేతాద్వాపరకలియుగాల యొక్క కాలమానాన్ని చెబుతున్నాను. ఆరోగ్యవంతుడైన మనుష్యుడి యొక్క పదిహేను(15) నిమిషాలు(రెప్పపాట్లు) కాష్ఠం అనబడుతుంది. అటువంటి ముప్పై కాష్ఠలు ఒక 'కళ' అవుతుంది. అటువంటి ముప్పై కళలు ఒక ముహూర్తం అవుతుంది.

**ముహూర్తపంచదశికా రజనీ తాదృశం త్వహః ।**
**పిత్ర్యే రాత్ర్యహనీ మాసః ప్రవిభాగస్తయో పునః ॥ 10 ॥**

**కృష్ణపక్ష స్త్వహస్తేషాం శుక్లః స్వప్నాయ శర్వరీ ।**
**త్రింశద్యే మానుషా మాసాః పిత్ర్యో మాసస్తు స స్మృతః ॥ 11 ॥**

అటువంటి పదిహేను ముహూర్తాలు ఒకరాత్రి, అట్లే మరో పదిహేను ముహూర్తాలు ఒక పగలు కాగలవు. పితరుల రాత్రింబవళ్ళ, మాసాలు వాటి విభాగాలు మరల ఇలా చేయబడ్డాయి. వారికి మానవ శుక్లపక్షం స్వప్నసంబంధమైన రాత్రిగాను, కృష్ణపక్షం పగలుగాను నిలుస్తాయి. ముప్పై మనుష్యమాసాలు పితరులకు ఒకమాసం అవుతుంది.

**శతాని త్రీణి మాసానాం షష్ట్యా చాప్యధికాని వై ।**
**పిత్ర్యః సంవత్సరో హ్యేష మానుషేణ విభావ్యతే ॥ 12 ॥**

మూడువందల అరవై మానవమాసాలు పితరులకు ఒక సంవత్సరం అవుతుంది.

**మానుషేణైవ మానేన వర్షాణాం యచ్ఛతం భవేత్ ।**
**పితృణాం త్రీణి వర్షాణి సంఖ్యాతానీహ తాని వై ॥ 13 ॥**

నూరు మానవసంవత్సరాలు పితరులకు మూడు సంవత్సరాలు అవుతాయి.

**దశ వై ద్వ్యధికా మాసాః పితృసంఖ్యేహ సంస్మృతా ।**
**లౌకికేనైవ మానేన అబ్దో యో మానుషః స్మృతః ॥ 14 ॥**

**ఏతద్దివ్యమహోరాత్రమితి లైంగేఽత్ర పఠ్యతే ।**
**దివ్యే రాత్ర్యహనీ వర్షం ప్రవిభాగస్తయోః పునః ॥ 15 ॥**

పితరులయొక్క పం(డెండు నెలలు ఒక పితృసంవత్సరమౌతుంది. ఇట్లే పం(డెండు మానవమాసాలు ఒక మనుష్యసంవత్సరం అవుతుంది. లింగపురాణంలో ఈ విధంగా అహోరాత్రాలు, అట్లే దివ్యవర్షం యొక్క విభాగాలు నిరూపింపబడ్డాయి.

**అహస్తత్రోదగయనం రాత్రిః స్యాద్దక్షిణాయనమ్ ।**
**ఏతే రాత్ర్యహనీ దివ్యే ప్రసంఖ్యాతే విశేషతః ॥ 16 ॥**

ఉత్తరాయణం పగలుగాను దక్షిణాయనం రాత్రిగాను దేవతలకు నిలుస్తాయి.(సూర్యుడు మకరరాశినుండి మిథునరాశి వరకు ప్రయాణించే కాలం ఉత్తరాయణం. ఇట్లే కర్కాటకరాశి నుంచి ధనూరాశి వరకు ప్రయాణించేకాలం దక్షిణాయనం అవుతుంది.) విశేషించి అవి దివ్యమైన అహోరాత్రాలు అవుతాయి.

**త్రింశద్యాని తు వర్షాణి దివ్యో మాసస్తు స స్మృతః ।**
**మానుషం తు శతం విప్రా దివ్యమాసాస్త్రయస్తు తే ॥ 17 ॥**

**దశ చైవ తథాహాని దివ్యో హ్యేష విధిః స్మృతః ।**
**త్రీణి వర్షశతాన్యేవ షష్టివర్షాణి యాని తు ॥ 18 ॥**

**దివ్యః సంవత్సరో హ్యేష మానుషాణి ప్రకీర్తితః ।**
**త్రీణి వర్షసహస్రాణి మానుషాణి ప్రమాణతః ॥ 19 ॥**

**త్రింశదన్యాని వర్షాణి మతః సప్తర్షివత్సరః ।**
**నవయాని సహస్రాణి వర్షాణాం మానుషాణి తు ॥ 20 ॥**

**అన్యాని నవతీశ్చైవ ధ్రౌవః సంవత్సరస్తు సః ।**
**షట్త్రింశత్తు సహస్రాణి వర్షాణాం మానుషాణి తు ॥ 21 ॥**

**వర్షాణాం తచ్ఛతం జ్ఞేయం దివ్యో హ్యేషవిధిః స్మృతః ।**

బ్రాహ్మణోత్తములారా! మానవులయొక్క ముప్పై సంవత్సరాలు ఒక దివ్యమాసం అవుతుంది. ఇట్లే మానవుల నూరు సంవత్సరాలు మూడు దివ్యమాసాలు మరియు పది దినాలు అవుతాయి. మూడువందల అరవై మానవసంవత్సరాలు ఒక దివ్య(దేవతల) సంవత్సరం అవుతుంది. మూడు వేల ముప్పై మానవసంవత్సరాలు ఒక సప్తర్షి వర్షమవుతుంది. మానవగణనాన్ని అనుసరించి తొమ్మిదివేల తొంబై సంవత్సరాలు ఒక ధ్రువసంవత్సరం అవుతుంది. ముప్పైఆరు వేల మానవసంవత్సరాలు ఒక దివ్య(దేవ) శతాబ్ది అవుతుంది.

**త్రీణ్యేవ నియుతాన్యాహుర్వర్షాణాం మానుషాణి తు ॥ 22 ॥**

**షష్టిశ్చైవ సహస్రాణి సంఖ్యాతాని తు సంఖ్యయా ।**
**దివ్యం వర్షసహస్రం తు ప్రాహుః సంఖ్యావిదో జనాః ॥ 23 ॥**

గణితశాస్త్రజ్ఞులు చెప్పిన ప్రకారం మూడువందల అరవైవేలమానవసంవత్సరాలు (మూడులక్షల అరవై వేలు– 3,60,000) వేయి దివ్యవర్షాలు కాగలవు.

**దివ్యేనైవ ప్రమాణేన యుగసంఖ్యా ప్రకల్పనమ్ ।**
**పూర్వం కృతయుగం నామ తతస్త్రేతా విధీయతే ॥ 24 ॥**

**ద్వాపరశ్చ కలిశ్చైవ యాన్యేతాని సువ్రతాః ।**
**అథ సంవత్సరా దృష్టా మానుషేణ ప్రమాణతః ॥ 25 ॥**

సువ్రతులైన మునులారా! ముందుగా యుగాల కాలావధిగణనం దివ్యమానంలో కల్పింపబడింది. మొదటిది కృతయుగం(సత్యయుగం) పిదప త్రేతాయుగం. తర్వాత ద్వాపరం. చివరిది కలియుగం. ఇప్పుడు మానవకాలమానం ప్రకారం వాటి కాలాలు నిర్ణయించడం జరుగుతుంది.

**కృతస్యాద్యస్య విప్రేంద్రా దివ్యమానేన కీర్తితమ్ ।**
**సహస్రాణాం శతాన్యాసంశ్చతుర్దశ చ సంఖ్యయా ॥ 26 ॥**

**చత్వారింశత్సహస్రాణి తథాన్యాని కృతం యుగమ్ ।**
**తథా దశసహస్రాణాం వర్షాణాం శతసంఖ్యయా ॥ 27 ॥**

**అశీతిశ్చ సహస్రాణి కాలస్త్రేతాయుగస్య చ ।**
**సప్తైవ నియుతాన్యాహుర్వర్షాణాం మానుషాణి తు ॥ 28 ॥**

**వింశతిశ్చ సహస్రాణి కాలస్తు ద్వాపరస్య చ ।**
**తథా శతసహస్రాణి వర్షాణాం త్రీణి సంఖ్యయా ॥ 29 ॥**

**షష్టిశ్చైవ సహస్రాణి కాలః కలియుగస్య తు ।**
**ఏవం చతుర్యుగః కాల ఋతే సంధ్యాంశకాత్ స్మృతః ॥ 30 ॥**

**నియుతాన్యేవ షట్ త్రింశన్నిరంశాని తు తాని వై ।**
**చత్వారింశత్తథా త్రీణి నియుతానీహ సంఖ్యయా ॥ 31 ॥**

**వింశతిశ్చ సహస్రాణి సంధ్యాంశశ్చ చతుర్యుగః ।**
**ఏవం చతుర్యుగాఖ్యానాం సాధికా హ్యేకసప్తతిః ॥ 32 ॥**

**కృతత్రేతాదియుక్తానాం మనోరంతరముచ్యతే ।**
**మన్వంతరస్య సంఖ్యా చ వర్షాగ్రేణ ప్రకీర్తితా ॥ 33 ॥**

**త్రింశత్కోట్యస్తు వర్షాణాం మానుషేణ ద్విజోత్తమాః ।**
**సప్తషష్టిస్తథాన్యాని నియుతాన్యధికాని తు ॥ 34 ॥**

**వింశతిశ్చ సహస్రాణి కాలోఽయమధికం వినా ।**
**మన్వంతరస్య సంఖ్యైషా లైంగేఽస్మిన్ కీర్తితా ద్విజాః ॥ 35 ॥**

విప్రశ్రేష్ఠులారా! కృతయుగానికి 14,40,000 మానవవర్షాలు. త్రేతాయుగానికి 10,80,000 మానవ సంవత్సరాలు. ద్వాపరానికి 7,20,000 మానవసంవత్సరాలు. కలియుగానికి 3,60,000 మానవసంవత్సరాలు. ఇలా సంధి సంక్రమణకాలాల్ని లెక్కించకుండా నాలుగు యుగాలకు మొత్తం కాలం 36,00,000(ముప్పై ఆరు లక్షలు) అవుతుంది. సంధ్యాసమయాన్ని కూడా కలిపి లెక్కించినచో నాల్గుయుగాలకు మొత్తం కాలం 43,20,000 అవుతుంది. నాలుగుయుగాల కాలానికి డెబ్బైరెట్లు ఒక మన్వంతరం అవుతుంది. ఒక మన్వంతరంలో 30,67,20,000 సంవత్సరాలు ఉంటాయి. ద్విజులారా! ఈ లింగమహాపురాణాన్ని అనుసరించి మన్వంతరకాలం ఇంతకన్నా ఎక్కువకాదు.

**చతుర్యుగస్య చ తథా వర్షసంఖ్యా ప్రకీర్తితా ।**
**చతుర్యుగసహస్రం వై కల్పశ్చైకో ద్విజోత్తమాః ॥ 36 ॥**

నాలుగుయుగాలయొక్క కాలావధి పైవిధంగా చెప్పబడింది. మహర్షులారా! అటువంటి కాలానికి వెయ్యిరెట్లకాలం ఒకకల్పం అవుతుంది.

**నిశాంతే సృజతే లోకాన్ నశ్యంతే నిశి జంతవః ।**
**తత్ర వైమానికానాం తు అష్టావింశతికోటయః ॥ 37 ॥**

పగటివేళ లోకాలు సృష్టింపబడతాయి. రాత్రిలో అవి నశిస్తాయి. అక్కడ ఇరవై ఎనిమిదికోట్ల దేవతలు విమానాలలో తిరుగుతుంటారు.

**మన్వంతరేషు వై సంఖ్యా సాంతరేషు యథా తథా ।**
**త్రీణికోటిశతాన్యాసన్ కోట్యో ద్వినవతిస్తథా ॥ 38 ॥**

**కల్పోఽతీతే తు వై విప్రాః సహస్రాణాం తు సప్తతిః ।**
**పునస్తథాష్టసాహస్రం సర్వత్రైవ సమానతః ॥ 39 ॥**

**కల్పావసానికాంస్త్యక్త్వా ప్రలయే సముపస్థితే ।**
**మహర్లోకాత్ ప్రయాంత్యేతే జనలోకం జనాస్తతః ॥ 40 ॥**

మన్వంతరకాలంలోనూ, వాటి మధ్యకాలంలోనూ వారి సంఖ్య 392 కోట్లు అవుతుంది. అంతిమ కల్పంలో కూడా వీరి సంఖ్య డెబ్బది ఎనిమిది వేలు కాగలదు. అన్ని కల్పాలలోను ఇంచుమించు ఇదే స్థితి ఉంటుంది. ప్రళయకాలంలో కల్పంలో అంతిమదినాలలో జనులు మహర్లోకాన్ని వదలి జనలోకానికి పోతారు.

**కోటీనాం ద్వే సహస్రే తు అష్టౌ కోటిశతాని తు ।**
**ద్విషష్టిశ్చ తథా కోట్యో నియుతాని చ సప్తతిః ॥ 41 ॥**

**కల్పార్ధసంఖ్యా దివ్యా వై కల్పమేవం తు కల్పయేత్ ।**
**కల్పానాం వై సహస్రం తు వర్షమేకమజస్య తు ॥ 42 ॥**

దేవగణనాన్ని అనుసరించి అర్ధకల్పంలో 2862,70,00,000 సంవత్సరాలు ఉంటాయి. ఇట్లే కల్పం యొక్క గణనం కూడా ఉంటుంది. వేయి కల్పాల కాలం బ్రహ్మకు ఒక సంవత్సరం.

**వర్షాణామష్టసాహస్రం బ్రాహ్మం వై బ్రహ్మణో యుగమ్ ।**
**సవనం యుగసాహస్రం సర్వదేవోద్భవస్య తు ॥ 43 ॥**

**సవనానాం సహస్రం తు త్రివిధం త్రిగుణం తథా ।**
**బ్రహ్మణస్తు తథా ప్రోక్తః కాలః కాలాత్మనః ప్రభోః ॥ 44 ॥**

ఎనిమిదివేల బ్రహ్మ సంవత్సరాలు ఒక బ్రహ్మయుగం అవుతుంది. బ్రహ్మయొక్క వేయియుగాలు ఒక సవనం అవుతుంది. అట్టి తొమ్మిదివేల బ్రహ్మసవనాలు బ్రహ్మస్వరూపుడు, కాలాత్మకుడు అయిన రుద్రుడికి ఒకరోజు అవుతుంది.

**భవోద్భవస్తపశ్చైవ భవ్యో రంభః క్రతుః పునః ।**
**ఋతుర్వహ్నిర్హవ్యవాహః సావిత్రః శుద్ధ ఏవ చ ॥ 45 ॥**

**ఉశికః కుశికశ్చైవ గాంధారో మునిసత్తమాః ।**
**ఋషభశ్చ తథా షడ్జో మజ్జాలీయశ్చ మధ్యమః ॥ 46 ॥**

**వైరాజో వై నిషాదశ్చ ముఖ్యో వై మేఘవాహనః ।**
**పంచమశ్చిత్రకశ్చైవ ఆకూతిర్జ్ఞాన ఏవ చ ॥ 47 ॥**

**మనః సుదర్శో బృంహశ్చ తథా వై శ్వేతలోహితః ।**
**రక్తశ్చ పీతవాసాశ్చ అసితః సర్వరూపకః ॥ 48 ॥**

**ఏవం కల్పాస్తు సంఖ్యాతా బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ।**
**కోటికోటిసహస్రాణి కల్పానాం మునిసత్తమాః ॥ 49 ॥**

మహర్షులారా! అవ్యక్తజన్ముడైన బ్రహ్మయొక్క కొన్ని కల్పాల పేర్లు ఇవి. భవోద్భవ, తప, భవ్య, రంభ, క్రతు, ఋతు, వహ్ని, హవ్యవాహ, సావిత్ర, శుద్ధ, ఉశిక, కుశిక, గాంధార, ఋషభ, షడ్జ, మజ్జాలీయ, మధ్యమ, వైరాజ, నిషాద, ముఖ్య, మేఘవాహన, పంచమ, చిత్రక, ఆకూతి, జ్ఞాన, మన, సుదర్శ, బృంహ, శ్వేతలోహిత, రక్త, పీతవాస, అసిత, సర్వరూపక. ఇట్టివి వేల కోట్ల కోట్ల కల్పాలు గతించాయి.

**గతాని తావచ్ఛేషాణి అహర్నిశ్యాని వై పునః ।**
**పరాంతే వై వికారాణి వికారం యాంతి విశ్వతః ॥ 50 ॥**

**వికారస్య శివస్యాజ్ఞావశేనైవ తు సంహృతిః ।**
**సంహృతే తు వికారే చ ప్రధానే చాత్మని స్థితే ॥ 51 ॥**

**సాధర్మ్యేణావతిష్ఠేతే ప్రధానపురుషావుభౌ ।**
**గుణానాం చైవ వైషమ్యే విప్రాః సృష్టిరితి స్మృతా ॥ 52 ॥**

కాలం సమాప్తి పొందేటప్పుడు పగలు రాత్రుల్లో మిగిలియున్న వస్తువులు సమస్తం లయమొందుతాయి. శివుడి ఆజ్ఞాప్రకారమే సృష్టి నశిస్తుంది. సృష్టి నశించినపుడు ప్రధానం తనయందు తానే కలసిపోయి ఉంటుంది. ప్రధానం, పురుషుడూ కూడా స్థిరంగా ఉంటారు. ఓ బ్రాహ్మణులారా! త్రిగుణాలు ఎప్పుడు సమానంగా ఉండవో అప్పుడు సృష్టి అని పిలవబడుతుంది.

**సామ్యే లయో గుణానాం తు తయోర్హేతుర్మహేశ్వరః ।**
**లీలయా దేవదేవేన సర్గాస్త్వీదృగ్విధాః కృతాః ॥ 53 ॥**

మహామునులారా! గుణాలు (సత్త్వాదులు) సంతులనస్థితిలో అంటే సామ్యంలో ఉన్నప్పుడు సృష్టి లయమొందుతుంది. వైషమ్యస్థితిలో (సంతులనస్థితి లేనప్పుడు) ఉన్నప్పుడు సృష్టి జరుగుతుంది. ఇందుకు మహేశ్వరుడే కారణం. ఈ విధంగా ఆయన లీలావినోదంగానే సృష్టి యొక్క నిర్మాణం జరుగుతుంది.

**అసంఖ్యాతాశ్చ సంక్షేపాత్ ప్రధానాదన్వధిష్ఠితాత్ ।**
**అసంఖ్యాతాశ్చ కల్పాఖ్యా హ్యసంఖ్యాతాః పితామహాః ॥ 54 ॥**

**హరయశ్చాప్యసంఖ్యాతాస్త్వేక ఏవ మహేశ్వరః ।**
**ప్రధానాదిప్రవృత్తాని లీలయా ప్రాకృతాని తు ॥ 55 ॥**

**గుణాత్మికా చ తద్వృత్తిస్తస్య దేవస్య వై త్రిధా ।**
**అప్రాకృతస్య తస్యాదిర్మధ్యాంతం నాస్తి చాత్మనః ॥ 56 ॥**

ప్రధానం ద్వారా చేసిన అనేకమైన సృష్టులు ఉన్నాయి. కల్పాలతోపాటుగా బ్రహ్మవిష్ణువులు కూడా అసంఖ్యాకంగా ఉన్నారు. కానీ మహేశ్వరుడు మాత్రం ఒక్కడే. ప్రధానం ద్వారా పుట్టిన ప్రకృతి యొక్క విధానాలన్నీ ఆ మహేశ్వరుడి లీలలే. ఆతని యొక్క వృత్తి గుణాత్మకంగా మూడు విధాలై ఉంటుంది. అప్రాకృతుడు ఆత్మస్వరూపుడు అయిన ఆయనకు ఆదిమధ్యాంతాలు ఉండవు.

**పితామహస్యాథ పరః పరార్ధద్వయ సమ్మితః ।**
**దివా సృష్టం తు యత్సర్వం నిశి నశ్యతి చాస్య తత్ ॥ 57 ॥**

బ్రహ్మ యొక్క ఆయువు రెండు భాగాలుగా ఉంటుంది. వీటిని పరార్ధాలంటారు. పగటిలో జరిగిన సృష్టి రాత్రిలో అంతమవుతుంది.

**భూర్భువః స్వర్మహస్తత్ర నశ్యతే చోర్ధ్వతో న చ ।**
**రాత్రౌ చైకార్ణవే బ్రహ్మ నష్టే స్థావరజంగమే ॥ 58 ॥**

భూర్, భువర్, స్వర్, మహోలోకాలు నశిస్తాయి. వాటికి పై నున్న లోకాలు నశించవు. రాత్రిలో స్థావరజంగమమైన సృష్టి అంతా నశించగా నీరు వ్యాపించి అంతా ఒకే సముద్రంగా మారుతుంది.

**సుష్వాపాంభసి యస్తస్మాన్నారాయణ ఇతి స్మృతః ।**
**శర్వర్యంతే ప్రబుద్ధో వై దృష్ట్వా శూన్యం చరాచరమ్ ॥ 59 ॥**

**స్రష్టుం తదా మతిం చక్రే బ్రహ్మ బ్రహ్మవిదాం వరః ।**
**ఉదకైరాప్లుతాం క్ష్మాం తాం సమాదాయ సనాతనః ॥ 60 ॥**

**పూర్వవత్ స్థాపయామాస వారాహం రూపమాస్థితః ।**
**నదీనదసముద్రాంశ్చ పూర్వవచ్చాకరోత్ప్రభుః ॥ 61 ॥**

ఆ జలరాశిలో బ్రహ్మ శయనించడం వల్ల నారాయణుడవుతున్నాడు. నారం అనగానీరు. దానిలో శయనించేవాడు నారాయణుడు. రాత్రి గడచిన తర్వాత నిద్రలేచినవాడై సకలచరాచరాలు శూన్యంగా ఉండడాన్ని చూచి బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైన ఆతడు సృష్టి చేయడానికి నిశ్చయించాడు. సనాతనుడైన ఆతడు వరాహరూపాన్ని ధరించి నీటిలో మునిగి యున్న భూమిని పైకెత్తి పూర్వంలాగా స్థాపించాడు. నదీనదాలను, సముద్రాలను పూర్వం మాదిరిగానే సృష్టించాడు.

**కృత్వా ధరాం ప్రయత్నేన నిమ్నోన్నతివివర్జితామ్ ।**
**ధరాయాం సోఽచినోత్ సర్వాన్ గిరీన్ దగ్ధాన్ పురాగ్నినా ॥ 62 ॥**

మిక్కిలి ప్రయత్నించి భూమిని సమతలం చేసి, భూమిపై ఇంతకు ముందుదగ్ధమైన పర్వతాలన్నింటిని మరల పూర్వంలా నిలిపాడు.

**భూరాద్యాంశ్చతురో లోకాన్ కల్పయామాస పూర్వవత్ ।**
**స్రష్టుం చ భగవాన్ చక్రే తదా స్రష్టా పునర్మతిమ్ ॥ 63 ॥**

భూః భవః స్వః మహః అనే ఈ నాల్గులోకాల్ని పూర్వం ఎలా ఉన్నాయో అలాగే సృష్టించడానికి బ్రహ్మ మరల సృష్టియందు బుద్ధిని నిల్పాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే సృష్టిప్రారంభవర్ణనం నామ చతుర్థోఽధ్యాయః ॥ 4 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని సృష్టిప్రారంభవర్ణనమనే నాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచమోఽధ్యాయః - ఐదవ అధ్యాయం

## ప్రజాసృష్టివర్ణనమ్ - ప్రజాసృష్టివర్ణనం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**యదా స్రష్టుం మతిం చక్రే మోహశ్చాసీన్మహాత్మనః ।**
**ద్విజాశ్చాబుద్ధిపూర్వం తు బ్రహ్మణోఽవ్యక్త జన్మనః ॥ 1 ॥**

బ్రాహ్మణోత్తములారా! బ్రహ్మ బుద్ధిని సక్రమంగా నిలపకుండా అంటే బాగుగా ఆలోచించకుండా సృష్టి రచన చేయదలచాడు. మహాత్ముడూ, అవ్యక్తజన్ముడూ అయిన బ్రహ్మకు మోహం ఆవహించింది.

**తమో మోహో మహామోహస్తామిస్రశ్చాంధసంజ్ఞితః ।**
**అవిద్యా పంచధా హ్యేషా ప్రాదుర్భూతా స్వయంభువః ॥ 2 ॥**

స్వయంభువుడైన బ్రహ్మలో అవిద్య అయిదు రకాలుగా ఉద్భవించింది. అవి యివి. 1. తమస్సు 2. మోహం 3. మహామోహం 4. తమిస్రం 5. అంధతమిస్రం.

**అవిద్యయా మునేర్గ్రస్తః సర్గో ముఖ్య ఇతి స్మృతః ।**
**అసాధక ఇతి స్మృత్వా సర్గో ముఖ్యః ప్రజాపతిః ॥ 3 ॥**

**అభ్యమన్యత సోఽయం వై నగా ముఖ్యోద్భవాః స్మృతాః ।**
**త్రిధా కంఠో మునేస్తస్య ధ్యాయతో వై హ్యవర్తత ॥ 4 ॥**

బ్రహ్మయొక్క ముఖ్యసృష్టి అంటే ప్రథమసృష్టి అవిద్యతో ఆక్రమింపబడింది. ఇది తెలిసి ప్రజాపతి ముఖ్యసర్గ విషయంగా దృష్టి నిలిపాడు. అదే అచరాలైన వృక్షగుల్మాదుల సృష్టి. తర్వాత ధ్యానపూర్వకమైన చింతనతో త్రిగుణాత్మమైన సృష్టి కావించాడు.

**ప్రథమం తస్య వై జజ్ఞే తిర్యక్స్రోతో మహాత్మనః ।**
**ఊర్ధ్వస్రోతః పరస్తస్య సాత్త్వికః స ఇతి స్మృతః ॥ 5 ॥**

**అర్వాక్స్రోతోఽనుగ్రహశ్చ తథా భూతాదికః పునః ।**
**బ్రహ్మణో మహతస్త్వాద్యో ద్వితీయో భౌతికస్తథా ॥ 6 ॥**

తర్వాత బ్రహ్మ తిర్యక్స్రోతం అనబడే పశుపక్ష్యాదుల్ని ఉత్పత్తి చేశాడు. అనంతరం ఊర్ధ్వస్రోతమనే సత్త్వగుణమైన దేవాదుల్ని సృష్టించాడు. తదుపరి అర్వాక్ స్రోతమనబడే క్రిందిగతిగల మానవులు మరియు అనుగ్రహం సృష్టింపబడ్డాయి. మరల సత్త్వరజస్తమప్రధానమైన అనుగ్రహరూపమైన ప్రాణుల్ని సృష్టించాడు. బ్రహ్మయొక్క మొదటిసృష్టి 'మహత్' అనబడుతుంది. రెండవది తన్మాత్రయుక్తమైన భౌతికం.

**సర్గస్తృతీయశ్చైంద్రియస్తురీయో ముఖ్య ఉచ్యతే ।**
**తిర్యగ్యోన్యః పంచమస్తు షష్ఠో దైవిక ఉచ్యతే ॥ 7 ॥**

**సప్తమో మానుషో విప్రా అష్టమోఽనుగ్రహః స్మృతః ।**
**నవమశ్చైవ కౌమారః ప్రాకృతా వై కృతాస్త్విమే ॥ 8 ॥**

మూడవది జ్ఞానేంద్రియాలతో కూడిన ఐంద్రికం. ఈ మూడు బుద్ధి పూర్వకంగా చేసిన ప్రాకృతసర్గం. నాల్గవది వృక్షాదికసంబంధి ముఖ్యసృష్టి. పశుపక్ష్యాదుల సృష్టి ఐదవది. ఆరవది దేవసంబంధి అయిన దైవికం. బ్రాహ్మణోత్తములారా! ఏడవది మనుష్యత్వంతో కూడిన మానుషం. ఎనిమిదవది భావనలతో కూడిన అనుగ్రహం. తొమ్మిదవది కుమారులతో కూడిన కౌమార్యం. ఇందులో ముందు చెప్పిన మూడు సృష్టులు ప్రాకృతాలు. తదుపరి ఐదు వైకృతాలు. చివరిది ప్రాకృతవైకృతం అవుతుంది.

**పురస్తాదసృజద్దేవః సనందం సనకం తథా ।**
**సనాతనం మునిశ్రేష్ఠా నైష్కర్మ్యేణ గతాః పరమ్ ॥ 9 ॥**

ముందుగా బ్రహ్మ సనంద, సనక, సనాతనులను సృష్టించాడు. మునిశ్రేష్ఠులైన వారు నిష్కామకర్మయోగంతో అనగా విషయసుఖవిరక్తులై బ్రహ్మపథాన్ని పొందారు.

**మరీచి భృగ్వంగిరసః పులస్త్యం పులహం క్రతుమ్ ।**
**దక్షమత్రిం వసిష్ఠంశ్చ సోఽసృజద్యోగవిద్యయా ॥ 10 ॥**

**నవైతే బ్రహ్మణః పుత్రా బ్రహ్మజ్ఞా బ్రాహ్మణోత్తమాః ।**
**బ్రహ్మవాదిన ఏవైతే బ్రహ్మణః సదృశాః స్మృతాః ॥ 11 ॥**

**సంకల్పశ్చైవ ధర్మశ్చ హ్యధర్మో ధర్మసన్నిధిః ।**
**ద్వాదశైవ ప్రజాస్త్వేతా బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ॥ 12 ॥**

తర్వాత బ్రహ్మ యోగవిద్యతో మరీచి, భృగు, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు అను ఈ తొమ్మిది మందిని సృష్టించాడు.

బ్రాహ్మణోత్తములారా! బ్రహ్మపుత్రులైన వీరందరూ పరమబ్రహ్మవేత్తలు, బ్రహ్మవాదులైన వీరు బ్రహ్మతో సమానులు. సంకల్పం, ధర్మం, అధర్మం, అనే ముగ్గురు కూడా బ్రహ్మకు పుత్రులే. అధర్మం ఎప్పుడూ ధర్మం యొక్క సమీపమందే ఉంటుంది. అవ్యక్తజన్ములైన ఈ పండ్రెండు మంది బ్రహ్మపుత్రులే.

**ఋభుం సనత్కుమారం చ ససర్జాదౌ సనాతనః ।**
**తావూర్ధ్వరేతసౌ దివ్యౌ చాగ్రజౌ బ్రహ్మవాదినౌ ॥ 13 ॥**

**కుమారౌ బ్రహ్మణస్తుల్యౌ సర్వజ్ఞౌ సర్వభావినౌ ।**
**వక్ష్యే భార్యాకులం తేషాం మునీనామగ్రజన్మనామ్ ॥ 14 ॥**

**సమాసతో మునిశ్రేష్ఠాః ప్రజాసంభూతిమేవ చ ।**
**శతరూపాం తు వై రాజ్ఞీ విరాజమసృజత్ ప్రభుః ॥ 15 ॥**

**స్వాయంభువాత్తు వై రాజ్ఞీ శతరూపా త్వయోనిజా ।**
**లేభే పుత్రద్వయం పుణ్యా తథా కన్యాద్వయం చ సా ॥ 16 ॥**

సనాతనుడైన బ్రహ్మ ఋభువు, సనత్కుమారుడనే దివ్యుల్ని, నైష్ఠికబ్రహ్మచారుల్ని, అగ్రజన్ముల్ని, బ్రహ్మవాదుల్ని, సర్వజ్ఞుల్ని, సర్వవ్యాపకుల్ని, తనకు సమానుల్ని సృష్టించాడు. మునిశ్రేష్ఠులారా! ముందుజన్మించిన పైన చెప్పిన మునులయొక్క భార్యల్నిగూర్చి వారి సంతానాన్ని గూర్చి చెబుతాను. బ్రహ్మ విరాట్ అనే స్వాయంభువమనువుని, అయోనిజ అయిన శతరూపరాణిని సృష్టించాడు. స్వాయంభువమనువువల్ల శతరూప ఇద్దరు పుత్రుల్ని, యిద్దరు పుత్రికల్ని పొందింది.

**ఉత్తానపాదో హ్యవరో ధీమాన్ జ్యేష్ఠః ప్రియవ్రతః ।**
**జ్యేష్ఠా వరిష్ఠా త్వాకూతిః ప్రసూతిశ్చానుజా స్మృతా ॥ 17 ॥**

పుత్రులలో పెద్దవాడు బుద్ధిమంతుడైన ప్రియవ్రతుడు, చిన్నవాడు ఉత్తానపాదుడు. కుమార్తెల్లో శ్రేష్ఠురాలు ఆకూతి పెద్దది. ప్రసూతి చిన్నది.

**ఉపయేమే తదాకూతిం రుచిర్నామ ప్రజాపతిః ।**
**ప్రసూతిం భగవాన్ దక్షో లోకధాత్రీం స యోగినీమ్ ॥ 18 ॥**

రుచి అనే పేరుగల ప్రజాపతి ఆకూతిని, యోగిని, జగద్ధాత్రి అయిన ప్రసూతిని దక్షుడు వివాహమాడినాడు.

**దక్షిణాసహితం యజ్ఞమాకూతిః సుషువే తథా ।**
**దక్షిణా జనయామాస దివ్యా ద్వాదశపుత్రికాః ॥ 19 ॥**

ఆకూతి యజ్ఞుడనే పుత్రుణ్ణి, దక్షిణ అనే కుమార్తెను ప్రసవించింది. దక్షిణ పండ్రెండుమంది దివ్యులైన కుమార్తెలకు జన్మనిచ్చింది.

**ప్రసూతిః సుషువే దక్షాచ్చతుర్వింశతి కన్యకాః ।**
**శ్రద్ధాం లక్ష్మీం ధృతిం పుష్టిం తుష్టిం మేధాం క్రియాం తథా ॥ 20 ॥**

**బుద్ధిం లజ్జాం వపుఃశాంతిం సిద్ధిం కీర్తిం మహాతపాః ।**
**ఖ్యాతిం శాంతిం చ సంభూతిం స్మృతిం ప్రీతిం క్షమాం తథా ॥ 21 ॥**

**సన్నతిం చానసూయాం చ ఊర్జాం స్వాహాం సురారణిమ్ ।**
**స్వధాం చైవ మహాభాగాం ప్రదదౌ చ యథాక్రమమ్ ॥ 22 ॥**

ప్రసూతి దక్షుడి వల్ల ఇరవై నాలుగుమంది కన్యల్ని ప్రసవించింది. మాననీయలైన, మహాత్మలైన వారే వీరు. శ్రద్ధ, లక్ష్మి, ధృతి, పుష్టి, తుష్టి, మేధ, క్రియ, బుద్ధి, లజ్జ, వపువు, శాంతి, సిద్ధి, కీర్తి, ఖ్యాతి, సంభూతి, స్మృతి, ప్రీతి, క్షమ, సన్నతి, అనసూయ, ఊర్జ, స్వాహ, సురారణి, స్వధా.

**శ్రద్ధాద్యాశ్చైవ కీర్త్యంతాస్త్రయోదశ సుదారికాః ।**
**ధర్మం ప్రజాపతిం జగ్ముః పతిం పరమదుర్లభాః ॥ 23 ॥**

**ఉపయేమే భృగుర్ధీమాన్ ఖ్యాతిం తాం భార్గవోరణిమ్ ।**
**సంభూతిశ్చ మరీచిస్తు స్మృతిం చైవాంగిరా మునిః ॥ 24 ॥**

శ్రద్ధ నుంచి కీర్తి వరకూ గల మొదటి పదమూడుమంది పరమదుర్లభులు, సుందరులు అయిన దక్షకన్యకల్ని ధర్ముడు వివాహమాడినాడు. భృగుడు ఖ్యాతిని, భార్గవుడు(శుక్రుడు) అరణిని, మరీచి సంభూతిని, అంగిరసుడు స్మృతిని భార్యలుగా పొందారు.

**ప్రీతిం పులస్త్యః పుణ్యాత్మా క్షమాం తాం పులహో మునిః ।**
**క్రతుశ్చ సన్నతిం ధీమాన్ అత్రిస్తాంచానుసూయకాం ॥ 25 ॥**

**ఊర్జాం వసిష్ఠో భగవాన్ వరిష్ఠో వారిజేక్షణామ్ ।**
**విభావసుస్తథా స్వాహాం స్వధాం వై పితరస్తథా ॥ 26 ॥**

మరియు పుణ్యాత్ముడైన పులస్త్యుడు ప్రీతిని, పులహుడు క్షమను, ధీశాలి అయిన క్రతువు సన్నతిని, అత్రి అనసూయను, శ్రేష్ఠుడైన వసిష్ఠుడు కమలానన అయిన ఊర్జను, అగ్ని స్వాహాదేవిని, పితరులు స్వధాదేవిని భార్యలుగా స్వీకరించారు.

**పుత్రీకృతా సతీ యా సా మానసీ శివసంభవా ।**
**దక్షేణ జగతాం ధాత్రీ రుద్రమేవాస్థితా పతిమ్ ॥ 27 ॥**

శివుని అంగం నుండి పుట్టిన, దక్షుడుకి మానసపుత్రి అయిన జగత్తుల్ని ధరించే సతీదేవి శివుణ్ణే పతిగా పొందింది.

**అర్ధనారీశ్వరం దృష్ట్వా సర్గాదౌ కనకాండజః ।**
**విభజస్వేతి చాహాదౌ యదాజాతా తదాఽభవత్ ॥ 28 ॥**

సృష్టి ప్రారంభసమయంలో హిరణ్యగర్భుడైన బ్రహ్మ అర్ధనారీశ్వరుడైన శివుణ్ణి చూచి నీవు స్త్రీ పురుషులుగా విభాగంకమ్మని చెప్పగా శివుడి దేహం నుండి సతీదేవీ విడివడ్డది.

**తస్యాశ్చైవాంశజాః సర్వాః స్త్రియస్త్రిభువనే తథా ।**
**ఏకాదశవిధా రుద్రాః తస్య చాంశోద్భవాస్తథా ॥ 29 ॥**

సతీదేవి అంశంనుంచే మూడులోకాలలోని స్త్రీలు ఉత్పన్నలయినారు. అట్లే శివాంశనుంచి ఏకాదశరుద్రులు ఉద్భవించారు.

**స్త్రీలింగమఖిలం సా వై పుంలింగం నీలలోహితః ।**
**తం దృష్ట్వా భగవాన్ బ్రహ్మ దక్షమాలోక్య సువ్రతామ్ ॥ 30 ॥**

**భజస్వ ధాత్రీం జగతాం మమాపి చ తవాపి చ ।**
**పున్నామ్నో నరకాత్త్రాతి ఇతి పుత్రేత్విహోక్తితః ॥ 31 ॥**

**ప్రశస్తా తవ కాంతేయం స్యాత్పుత్రీ విశ్వమాతృకా ।**
**తస్మాత్పుత్రీ సతీ నామ్నా తవైషా చ భవిష్యతి ॥ 32 ॥**

సతీదేవియే సమస్తమైన స్త్రీజాతిగా, నీలలోహితుడే సమస్తమైన పురుషజాతిగా స్వయంగా సృష్టిలో నిలిచారు. బ్రహ్మ భగవానుడు దక్షుణ్ణి చూచి అతడితో ఇలా పలికాడు. సువ్రతయైన ఈమె లోకాలకే గాక నీకు, నాకు కూడా తల్లియే. అందువలన నీవు ఈమెను సేవించు. పుంనామ నరకం నుండి కాపాడేది పుత్రుడని లోకోక్తి గదా! కావున లోకమాతగా ప్రశస్తయైన పుత్రిగా పిలువబడిన 'సతి' పేరుగల ఈ కన్య నీకు పుత్రి కాగలదు.

**ఏవముక్తస్తదా దక్షో నియోగాద్ బ్రహ్మణో మునిః ।**
**లబ్ధ్వా పుత్రీం దదౌ సాక్షాత్ సతీం రుద్రాయ సాదరమ్ ॥ 33 ॥**

పైవిధమైన బ్రహ్మనియోగం వల్ల దక్షుడు రక్షణార్థం సతిని పుత్రికగాపొంది తర్వాత సాదరంగా శివుడికి సమర్పించాడు.

**ధర్మస్య పత్న్యః శ్రద్ధాద్యాః కీర్తితాః వై త్రయోదశ ।**
**తాసు ధర్మప్రజాం వక్ష్యే యథాక్రమమనుత్తమమ్ ॥ 34 ॥**

ధర్ముడి భార్యలైన శ్రద్ధాదులు పదముగ్గురు గూర్చి ఇంతకు ముందే చెప్పాను. ఇప్పుడు ఆ భార్యల ద్వారా ధర్ముడికి కల్గిన ఉత్తమసంతానాన్ని గూర్చి యథాక్రమంగా చెబుతాను.

**కామో దర్పోఽథ నియమః సంతోషో లోభ ఏవ చ ।**
**శ్రుతస్తు దండః సమయో బోధశ్చైవ మహాద్యుతిః ॥ 35 ॥**

**అప్రమాదశ్చ వినయో వ్యవసాయో ద్విజోత్తమాః ।**
**క్షేమం సుఖం యశశ్చైవ ధర్మపుత్రాశ్చ తాసు వై ॥ 36 ॥**

**ధర్మస్య వై క్రియాయాం తు దండః సమయ ఏవ చ ।**
**అప్రమాదస్తథా బోధో బుద్ధేర్ధర్మస్య తౌ సుతౌ ॥ 37 ॥**

**తస్మాత్ పంచదశైవై తే తాసు ధర్మాత్మజాస్త్విహ ।**
**భృగుపత్నీ చ సుషువే ఖ్యాతిర్విష్ణోః ప్రియాం శ్రియమ్ ॥ 38 ॥**

ఓ బ్రాహ్మణోత్తములారా! కామ, దర్ప, నియమ, సంతోష, లోభ, శ్రుత, దండ, సమయ, బోధ, అప్రమాద, వినయ, వ్యవసాయ, క్షేమ, సుఖ, యశస్సులను వారు ధర్ముడి పుత్రులు. వీరిలో క్రియ అనే భార్యయందు దండుడు, సమయుడు అనేవారు, బుద్ధియందు అప్రమాదుడు, బోధుడు అనే యిద్దరు పుత్రులు కల్గినారు. ఆవిధంగా ధర్ముడికి పదముగ్గురు భార్యల వల్ల మొత్తం పదిహేనుమంది సంతానం కలిగినారు. భృగుమహర్షి భార్యయైన ఖ్యాతి శ్రీ(లక్ష్మి) అనే ఆమెను కన్నది. ఆమె విష్ణువుకు మిక్కిలి ఇష్టురాలు.

**ధాతారం చ విధాతారం మేరోర్జామాతరౌ సుతౌ ।**
**ప్రభూతిర్నామ యా పత్నీ మరీచేః సుషువే సుతౌ ॥ 39 ॥**

**పూర్ణమాసం తు మారీచం తతః కన్యాచతుష్టయమ్ ।**
**తుష్టిర్జ్యేష్ఠా చ వై దృష్టిః కృషిశ్చాపచితిస్తథా ॥ 40 ॥**

బ్రహ్మ ధాత, విధాత అనే యిద్దరు పుత్రుల్ని పొందాడు. వారు మేరుపర్వతానికి అల్లుళ్లు అయినారు. ప్రభూతి అనే మరీచి భార్య పూర్ణమాసుడు, మారీచుడు అనే యిద్దరు కుమారుల్ని, తుష్టి, దృష్టి, కృషి, అపచితి అనే నలుగురు కుమార్తెల్ని కన్నది. వారిలో తుష్టి పెద్దకుమార్తె.

**క్షమా చ సుషువే పుత్రాన్ పుత్రీం చ పులహాత్ శుభామ్ ।**
**కర్దమం చ వరీయాంసం సహిష్ణుం మునిసత్తమాః ॥ 41 ॥**

**తథా కనకపీతాం స పీవరీం పృథివీసమామ్ ।**
**ప్రీత్యాం పులస్త్యశ్చ తథా జనయామాస వై సుతాన్ ॥ 42 ॥**

**దత్తోర్ణం వేదబాహుం చ పుత్రీం చాన్యాం దృషద్వతీమ్ ।**
**పుత్రాణాం షష్టిసాహస్రం సన్నతిః సుషువే శుభా ॥ 43 ॥**

క్షమ పులహుని వల్ల కర్దముడు, వరీయాంసుడు, సహిష్ణువు అనే ముగ్గురు కుమారుల్ని, సువర్ణవర్ణ అయిన పృథ్వీసమాన, సహనశీల అయిన పీవరి అనే పేరుగల కుమార్తెను పొందింది. పులస్త్యుడికి భార్య అయిన ప్రీతివల్ల దత్తోర్ణ, వేదబాహులనే ఇద్దరు పుత్రులు, దృషద్వతి అనే కుమార్తె కల్గినారు. క్రతువు భార్య అయిన సన్నతి అరవైవేలమంది పుత్రులకు జన్మనిచ్చింది.

**క్రతోస్తు భార్యా సర్వే తే వాలఖిల్యా ఇతి శ్రుతాః ।**
**సినీవాలీం కుహూం చైవ రాకాం చానుమతిం తథా ॥ 44 ॥**

**స్మృతిశ్చ సుషువే పత్నీ మునేశ్చాంగిరసస్తథా ।**
**లబ్ధానుభావమగ్నిం చ కీర్తిమంతం చ సువ్రతాః ॥ 45 ॥**

వీరందరూ వాలఖిల్యులు అనబడుతున్నారు. సువ్రతులారా! అంగిరసుడు తన భార్య అయిన స్మృతివల్ల శుభకర్ములైన అనుభావ, అగ్ని, కీర్తిమానుడనే ముగ్గురు పుత్రుల్ని, సినీవాలి, కుహూ, రాకా, అనుభూతి అనే నలుగురు పుత్రికల్ని పొందాడు.

**అత్రేర్భార్యానసూయా వై సుషువే షట్ప్రజాస్తు యాః ।**
**తాస్వేకా కన్యకా నామ్నా శ్రుతిః సా సూనుపంచకమ్ ॥ 46 ॥**

**సత్యనేత్రో మునిర్భవ్యో మూర్తిరాపః శనైశ్చరః ।**
**సోమశ్చ వై శ్రుతిః షష్ఠీ పంచాత్రేయాస్తు సూనవః ॥ 47 ॥**

అత్రి భార్య అయిన అనసూయ ఆరుగురు సంతానాన్ని కన్నది. అందులో సత్యనేత్రుడు, భవ్యమూర్తి, ఆపుడు, శనైశ్చరుడు, సోముడు అనే అయిదుగురు కుమారులు. (పంచాత్రేయులు) ఆరవది శ్రుతి అనే కుమార్తె.

**ఊర్జా వసిష్ఠాద్వై లేభే సుతాం చ సుతవత్సలా ।**
**జ్యాయసీ పుండరీకాక్షాన్ వాసిష్ఠాన్ వామలోచనా ॥ 48 ॥**

**రజః సుహోత్రో బాహుశ్చ సవనశ్చానఘస్తథా ।**
**సుతపాః శుక్ర ఇత్యేతే మునేర్వై సప్తసూనవః ॥ 49 ॥**

వసిష్ఠుడు సుందరమైన కన్నులు కలదియు, పుత్రప్రేమికురాలు అయిన తన భార్య ఊర్జ వల్ల పుండరీకాక్షులైన రజుడు, సుహోత్రుడు, బాహు, సవనుడు, అనఘుడు, సుతపసి, శుక్రుడు అనే ఏడుగురు పుత్రసంతానాన్ని పొందింది.

**యశ్చాభిమానీ భగవాన్ భవాత్మా పైతామహో వహ్నిరసుః ప్రజానామ్ ।**
**స్వాహా చ తస్మాత్ సుషువే సుతానాం త్రయం త్రయాణాం జగతాం హితాయ ॥ 50 ॥**

అభిమాని, రుద్రస్వరూపుడు, జనులకు ప్రాణభూతుడగువాడు అయిన అగ్నిభగవానుని వల్ల అతని భార్యయైన స్వాహాదేవి మూడులోకాలకు హితాన్ని చేకూర్చడానికై ముగ్గురు పుత్రులకు జన్మనిచ్చింది.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే ప్రజాసృష్టివర్ణనం నామ పంచమోఽధ్యాయః ॥ 5 ॥**

శ్రీలింగమహాపురాణం, పూర్వభాగంలోని ప్రజాసృష్టివర్ణనం అనే ఐదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## షష్ఠోఽధ్యాయః - ఆరవ అధ్యాయం

## శంకరమాహాత్మ్యవర్ణనమ్ - శంకరమాహాత్మ్యవర్ణనం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికినాడు.

**పవమానః పావకశ్చ శుచిరగ్నిశ్చ తే స్మృతాః ।**
**నిర్మథ్యః పవమానస్తు వైద్యుతః పావకః స్మృతః ॥ 1 ॥**

**శుచిః సౌరస్తు విజ్ఞేయః స్వాహా పుత్రాస్త్రయస్తు తే ।**
**పుత్రైః పౌత్రైస్త్విహైతేషాం సంఖ్యా సంక్షేపతః స్మృతా ॥ 2 ॥**

**విసృజ్య సప్తకం చాదౌ చత్వారింశన్నవైవ చ ।**
**ఇత్యేతే వహ్నయః ప్రోక్తాః ప్రణీయంతేఽధ్వరేషు చ ॥ 3 ॥**

అగ్నికి పవమానుడు, పావకుడు, శుచి అనే ముగ్గురు కొడుకులున్నారు. అరణి, చకుముఖిరాయి మొదలైన వాటి ఘర్షణవల్ల పుట్టినవాడు పవమానుడు. మెరుపువల్ల కలిగినవాడు పావకుడు. సూర్యప్రకాశం వల్ల ఉత్పన్నమైనవాడు శుచి. ఈ ముగ్గురూ స్వాహాదేవి పుత్రులే. పుత్రపౌత్రులతో కలిపి అగ్నుల సంఖ్య 49. యజ్ఞాలలో వీరి ఉత్పత్తి జరుగుతుంది.

**సర్వే తపస్వినస్త్వేతే సర్వే వ్రతభృతః స్మృతాః ।**
**ప్రజానాం పతయః సర్వే సర్వే రుద్రాత్మకాః స్మృతాః ॥ 4 ॥**

వారందరూ తపస్సంపన్నులు. అంతేకాక శుభవ్రతానుష్ఠానపరులు. అందరూ ప్రజాపతులు. మరియూ రుద్రసమానులు.

**అయజ్వానశ్చ యజ్వానః పితరః ప్రీతిమానసాః ।**
**అగ్నిష్వాత్తాశ్చ యజ్వానః శేషా బర్హిషదః స్మృతాః ॥ 5 ॥**

ప్రసన్నమానసులైన పితరులు యజ్వలు, అయజ్వలు అని రెండురకాలు. యజ్వలను అగ్నిష్వాత్తులని, అయజ్వలను బర్హిషదులని పిలుస్తారు.

**మేనాం తు మానసీం తేషాం జనయామాస వై స్వధా ।**
**అగ్నిష్వాత్తాత్మజా మేనా మానసీ లోకవిశ్రుతా ॥ 6 ॥**

స్వధాదేవి తనమానసపుత్రి అయిన మేన అనే ఆమెను అగ్నిష్వాత్త పితరుల వల్ల పొందింది. ఈమె సర్వలోకాలలో విఖ్యాతురాలయింది.

**అసూత మేనా మైనాకం క్రౌంచం తస్యానుజాముమామ్ ।**
**గంగాం హైమవతీం జజ్ఞే భవాంగాశ్లేషపావనీమ్ ॥ 7 ॥**

మేనాదేవి మైనాకుడు, క్రౌంచుడు అనే పుత్రుల్ని, వారికి చెల్లెంద్రయిన ఉమాదేవిని, శివుడి శరీరస్పర్శ చేత పునీత అయిన గంగను హిమవంతుడివల్ల పొందింది.

**ధరణీం జనయామాస మానసీం యజ్ఞయాజినీమ్ ।**
**స్వధా సా మేరురాజస్య పత్నీ పద్మసమాననా ॥ 8 ॥**

పద్మముఖియు మేరువుయొక్క భార్యయు అయిన స్వధాదేవి మనస్సంకల్ప అయిన ధరణికి(పృథ్వి) జన్మ ఇచ్చింది. ఈ ధరణి యజ్ఞయాగాదుల అనుష్ఠానాలకు ఆధారమవుతున్నది.

**పితరోఽమృతపాః ప్రోక్తాస్తేషాం చైవేహ విస్తరః ।**
**ఋషీణాం చ కులం సర్వం శృణుధ్వం తత్సువిస్తరమ్ ॥ 9 ॥**

అమృతపానులైన పితరులయొక్కయు, ఋషులయొక్కయు వంశాలను గూర్చి విపులంగా వక్కాణిస్తాను. వినండి!

**వదామి పృథగధ్యాయ సంస్థితం వస్తదూర్ధ్వతః ।**
**దాక్షాయణీ సతీ యాతా పార్శ్వం రుద్రస్య పార్వతీ ॥ 10 ॥**

పూర్వం చెప్పిన విషయాన్నే మరల వేరుగా చెప్తుతున్నాను. దక్షుని దత్తపుత్రిక అయిన సతీదేవి శివుని వివాహమాడింది.

**పశ్చాద్దక్షం వినింద్యైషా పతిం లేభే భవం తథా ।**
**తాం ధ్యాత్వా హ్యసృజద్రుద్రాన్ అనేకాన్ నీలలోహితః॥ 11 ॥**

తర్వాత దక్షుడిని నిందించి, దేహత్యాగం చేసి, ఆమెయే పార్వతియై మరల శివుడిని వివాహమాడింది. అట్టి సతీదేవిని తలచుకుని నీలలోహితుడైన శివుడు అనేక రుద్రుల్ని సృష్టించాడు.

**ఆత్మనస్తు సమాన్ సర్వాన్ సర్వలోకనమస్కృతాన్ ।**
**యాచితో మునిశార్దూలా బ్రహ్మణా ప్రహసన్ క్షణాత్ ॥ 12 ॥**

**తైస్తు సంచ్ఛాదితం సర్వం చతుర్దశావధిం జగత్ ।**
**తాన్ దృష్ట్వా వివిధాన్ రుద్రాన్ నిర్మలాన్ నీలలోహితాన్ ॥ 13 ॥**

**జరామరణనిర్ముక్తాన్ ప్రాహ రుద్రాన్ పితామహః ।**
**నమోఽస్తు వో మహాదేవాస్త్రినేత్రా నీలలోహితాః ॥ 14 ॥**

మునిశ్రేష్ఠులారా! బ్రహ్మ ప్రార్థింపగా క్షణంలో శివుడి నవ్వునుంచి సర్వలోకపూజ్యులు, రుద్రసమానులు అయినవారు జన్మించారు. వారు చతుర్దశభువనాల్ని ఆక్రమించారు. నిర్మలులు, అనేకులు, జరామరణాలు లేనివారు, త్రినేత్రులు అయిన ఆ నీలలోహితుల్ని చూచి బ్రహ్మ యిలా పలికాడు. మహాదేవులారా! మీకు నమస్కారం.

**సర్వజ్ఞాః సర్వగా దీర్ఘా హ్రస్వా వామనకాః శుభాః ।**
**హిరణ్యకేశా దృష్టిఘ్నా నిత్యా బుద్ధాశ్చ నిర్మలాః ॥ 15 ॥**

**నిర్ద్వంద్వా వీతరాగాశ్చ విశ్వాత్మానో భవాత్మజాః ।**
**ఏవం స్తుత్వా తదా రుద్రాన్ రుద్రం చాహ భవం శివమ్ ।**
**ప్రదక్షిణీకృత్య తదా భగవాన్ కనకాండజః ॥ 16 ॥**

**నమోఽస్తు తే మహాదేవ ప్రజా నార్హసి శంకర ।**
**మృత్యుహీనా విభోః స్రష్టుం మృత్యుయుక్తాః సృజ ప్రభో ॥ 17 ॥**

"మీరు అన్నీ తెలిసినవారు. అన్ని ప్రదేశాలకు వెళ్లగలిగినవారు. మీలో కొందరు పొడవైనవారు. మరికొందరు పొట్టివారు. బంగారు రంగుగల కేశాలు గలవారు. మీరు దృష్టిఘ్నులు. అనగా మిమ్ముచూచుట మాకు కష్టతరమవుతున్నది. అంతటి తేజస్సు మీది. మీరు శాశ్వతులు, నిర్మలులు, మేధావులు, ద్వంద్వరహితులు, విరాగులు. రుద్రకుమారులైన మీరు సర్వాత్ములు" అని బ్రహ్మవారిని స్తుతించినాడు. రుద్రుడికి ప్రదక్షిణంచేసి నమస్కరించి ఇలా పలికినాడు. మరణం లేని ప్రజల్ని సృష్టించడం నీకు తగినదికాదు. కావున ప్రభూ! నీవు మరణంగలిగిన ప్రజల్ని సృష్టించాలి.

**తతస్తమాహ భగవాన్ న హి మే తాదృశీ స్థితిః ।**
**స త్వం సృజ యథాకామం మృత్యుయుక్తాః ప్రజాః ప్రభో ॥ 18 ॥**

తదుపరి శివభగవానుడు బ్రహ్మతో ఇలా పలికాడు. "ఓ బ్రహ్మదేవా! అటువంటి ప్రజల్ని నేను సృష్టించను. అట్టి స్థితి నాకు లేదు. కావున మరణశీలురైన ప్రజలను నీయిష్టానుసారం నీవే సృష్టించు" అని,

**లబ్ధ్వా ససర్జ సకలం శంకరాచ్చతురాననః ।**
**జరామరణసంయుక్తం జగదేతచ్చరాచరమ్ ॥ 19 ॥**

నలువ అయిన బ్రహ్మ శంకరుడినుంచి అనుమతిని పొంది జరామరణసహితమైన చరాచరజగత్తును సృష్టించాడు.

**శంకరోఽపి తదా రుద్రైర్నివృత్తాత్మా హ్యధిష్ఠితః ।**
**స్థాణుత్వం తస్య వై విప్రాః శంకరస్య మహాత్మనః ॥ 20 ॥**

ఓ బ్రాహ్మణులారా! శంకరుడు మర్త్యసృష్టిపై మనసులేనివాడై ఉండుట వల్ల అనగా స్థిరుడై అనగా చలనంలేనివాడైనందున స్థాణువు అనే పేరు పొందాడు.

**నిష్కలస్యాత్మనః శంభోః స్వేచ్ఛాధృతశరీరిణః ।**
**శం రుద్రః సర్వభూతానాం కరోతి ఘృణయా యతః ॥ 21 ॥**

స్థాణువు అని పిలవబడే శంకరుడు నిష్కలాత్ముడు తన ఇచ్ఛానుసారము ధరించిన శరీరముకలవాడు. ప్రాణులన్నింటికి రుద్రుడు శుభాన్ని కలిగిస్తాడు.

**శంకరశ్చాప్రయత్నేన తదాత్మా యోగవిద్యయా ।**
**వైరాగ్యస్థం విరక్తస్య విముక్తి ర్యచ్ఛముచ్యతే ॥ 22 ॥**

శంకరుడు ఎట్టి ప్రయత్నమూ లేకుండా కళ్యాణాన్ని కల్గిస్తాడు. ఆతడు ఎప్పుడూ యోగవిద్యలో వైరాగ్యంలో ఉంటాడు. విరక్తుడైన మానవుణ్ణి విముక్తుణ్ణి చేసి శుభం చేకూర్చుతాడు.

**అణోరస్తు విషయత్యాగః సంసారభయతః క్రమాత్ ।**
**వైరాగ్యాత్ జాయతే పుంసో విరాగో దర్శనాంతరే ॥ 23 ॥**

స్వల్పవిషయాల్ని త్యజించిన మానవుడు సాంసారికభీతినుంచి విముక్తిపొంది క్రమంగా వైరాగ్యం పొందుతాడు. విరాగి అయిన పురుషుడికి(నరుడికి) ఇతర అధికమైన విషయభోగమునందు వైరాగ్యము సిద్ధిస్తుంది.

**విముఖ్యో విగుణత్యాగో విజ్ఞానస్యావిచారతః ।**
**తస్య చాస్య చ సంధానం ప్రసాదాత్ పరమేష్ఠినః ॥ 24 ॥**

సంసారవైముఖ్యం, విగుణత్యాగం, ఆత్మానాత్మవివేకరూపవిశిష్టజ్ఞానంయొక్క విచారంలేనిది స్వల్ప విషయత్యాగమే అవుతుంది. సదసద్వస్తువివేకరూపవిచారం, సాంసారికవిషయత్యాగం రెండూ కూడా భగవంతుడైన సదాశివుని అనుగ్రహంవల్లనే కల్గుతాయి.

**ధర్మో జ్ఞానం చ వైరాగ్యమైశ్వర్యం శంకరాదిహ ।**
**స ఏవ శంకరః సాక్షాత్ పినాకీ నీలలోహితః ॥ 25 ॥**

ధర్మం, జ్ఞానం, వైరాగ్యం, ఐశ్వర్యం శంకరుడివల్లే కల్గుతాయి. ఆతడు శుభంకరుడు కావుననే శంకరుడవుతున్నాడు. ఆతడే నీలలోహితుడైన పినాకి.

**యే శంకరాశ్రితాః సర్వే ముచ్యంతే తే న సంశయః ।**
**న గచ్ఛంత్యేవ నరకం పాపిష్ఠా అపి దారుణమ్ ॥ 26 ॥**

శంకరుణ్ణి ఆశ్రయించినవారందరూ ముక్తి పొందుతారు. ఇందులో సందేహం లేదు. దారుణపాపాలు చేసినవారు కూడా నరకానికి వెళ్లరు.

**ఆశ్రితాః శంకరం తస్మాత్ ప్రాప్నువంతి చ శాశ్వతమ్ ।**

మహామునులారా! శివుణ్ణి ఆశ్రయించినవారు శాశ్వతమైన ముక్తిపథాన్ని పొందుతారు.

**ఋషయఊచుః –** ఋషులు పలికారు.

**మాయాంతాశ్చైవ ఘోరాద్యా హ్యష్టావింశతిరేవ చ ॥ 27 ॥**

**కోట్యో నరకాణాం తు పచ్యంతే తాసు పాపినః ।**
**అనాశ్రితాః శివం రుద్రం శంకరం నీలలోహితమ్ ॥ 28 ॥**

'ఘోర' అనే నరకం నుంచి 'మాయ' అనే నరకం వరకూ ఇరవై ఎనిమిదికోట్ల నరకాలున్నాయి. శివుడు, రుద్రుడు, శంకరుడు, నీలలోహితుడు అయిన పరమేశ్వరుని ఆశ్రయించనివారు ఈ నరకాలలో చిత్రహింసల్ని అనుభవిస్తారు.

**ఆశ్రయం సర్వభూతానాం అవ్యయం జగతాం పతిమ్ ।**
**పురుషం పరమాత్మానం పురుహూతం పురుష్టుతమ్ ॥ 29 ॥**

**తమసా కాలరుద్రాఖ్యం రజసా కనకాండజమ్ ।**
**సత్త్వేన సర్వగం విష్ణుం నిర్గుణత్వే మహేశ్వరమ్ ॥ 30 ॥**

శివుడే భూతపతి, జగత్పతి, అవ్యయుడు, విరాట్పురుషుడు, పరమాత్ముడు, ఇంద్రుడు మిక్కిలిగా స్తుతింపబడువాడు అయి ఉన్నాడు. తమోగుణప్రాధాన్యంతో కాలరుద్రుడుగాను, రజోగుణప్రాధాన్యంతో బ్రహ్మగాను, సత్త్వగుణప్రాధాన్యంతో సర్వవ్యాపి అయిన విష్ణువుగాను నిలుస్తాడు.

**కేన గచ్ఛంతి నరకం నరాః కేన మహామతే ।**
**కర్మణాకర్మణా వాపి శ్రోతుం కౌతూహలం హి నః ॥ 31 ॥**

మహామేధావి అయిన సూతమహర్షీ! నరులు ఏయే పనులు చేయడం వల్ల నరకానికి పోతారో, ఏయే పనులు చేయకుండడం వల్ల నరకానికి వెళ్లరో వినడానికి మేము అత్యంతకుతూహలంతో ఉన్నాం. (దయతో బోధించుటకై ప్రార్థిస్తున్నాం.)

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే శంకరమాహాత్మ్యవర్ణనం నామ షష్ఠోఽధ్యాయః ॥ 6 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని శంకరమహాత్మ్యవర్ణనమనే ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తమోఽధ్యాయః - ఏడవ అధ్యాయం

## మనువ్యాసయోగేశ్వరతచ్ఛిష్యకథనమ్ - మనువ్యాసయోగేశ్వరతచ్ఛిష్యకథనం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**రహస్యం వః ప్రవక్ష్యామి భవస్యామితతేజసః ।**
**ప్రభావం శంకరస్యాద్యం సంక్షేపాత్ సర్వదర్శినః ॥ 1 ॥**

మహామునులారా! మీకు నేను అనంతతేజోమయుడూ, సమస్తతత్త్వదర్శియునూ అయిన శంకరుడియొక్క ఆద్యమూ, పరమరహస్యమూ అయిన ప్రభావాన్ని గూర్చి చెబుతాను.

**యోగినః సర్వతత్త్వజ్ఞాః పరం వైరాగ్యమాస్థితాః ।**
**ప్రాణాయామాదిభిః చాష్టసాధనైః సహచారిణః ॥ 2 ॥**

**కరుణాదిగుణోపేతాః కృత్వాపి వివిధాని తే ।**
**కర్మాణి నరకం స్వర్గం గచ్ఛంత్యేవ స్వకర్మణా ॥ 3 ॥**

సమస్తతత్త్వజ్ఞానులు, సంపూర్ణవైరాగ్యులు, ప్రాణాయామమూ మొదలైన అష్టవిధయోగాంగబద్ధులూ, కరుణ మొదలైన సద్గుణోపేతులు అయిన యోగులు పలువిధాలైన కర్మల్ని చేసియూ తమతమ కర్మఫలాల్ని అనుసరించి స్వర్గనరకాల్ని పొందుతున్నారు.

**ప్రసాదాజ్జాయతే జ్ఞానం జ్ఞానాత్ యోగః ప్రవర్తతే ।**
**యోగేన జాయతే ముక్తిః ప్రసాదాదఖిలం తతః ॥ 4 ॥**

భగవంతుడైన శంకరుడి అనుగ్రహంవల్ల జ్ఞానం కలుగుతుంది. జ్ఞానంవల్ల యోగం సిద్ధిస్తుంది. ఆ యోగంవల్ల ముక్తి(మోక్షం) లభిస్తుంది. ఆ అనుకంపవల్లనే సమస్తం సిద్ధిస్తుంది.

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**ప్రసాదాత్ యది విజ్ఞానం స్వరూపం వక్తుమర్హసి ।**
**దివ్యం మాహేశ్వరం చైవ యోగం యోగవిదాం వర ॥ 5 ॥**

యోగవేత్తలందు శ్రేష్ఠుడవైన ఓ సూతమహర్షీ! అనుగ్రహం వల్లనే విజ్ఞానం సిద్ధిస్తున్నదైతే అటువంటి గొప్పదైన శివుడి యోగాన్ని తెలియజేయడానికి నీవే తగినవాడివి.

**కథం కరోతి భగవాన్ చింతయా రహితః శివః ।**
**ప్రసాదం యోగమార్గేణ కస్మిన్ కాలే నృణాం విభుః ॥ 6 ॥**

యోగమార్గంలో చింతారహితుడైన శివభగవానుడు నరులపై తన అనుగ్రహాన్ని ఏవిధంగా ఏకాలంలో ప్రసరింపజేస్తాడు.

**రోమహర్ష ఉవాచ –** రోమహర్షణమహర్షి పలికాడు.

**దేవానాం చ ఋషీణాం చ పితౄణాం సన్నిధౌ పురా ।**
**శైలాదినా తు కథితం శృణ్వంతు బ్రహ్మసూనవే ॥ 7 ॥**

పూర్వం దేవతలయొక్కయు, ఋషులయొక్కయు, పితృదేవతలయొక్కయు సన్నిధిలో శిలాదుడి పుత్రుడైన నందీశ్వరుడు బ్రహ్మమానసపుత్రుడైన సనత్కుమారుడికి చెప్పిన యోగవిషయాల్ని మీకు చెబుతున్నాను వినండి!

**వ్యాసావతారాణి తథా ద్వాపరాంతే చ సువ్రతాః ।**
**యోగాచార్యావతారాణి తథా తిష్యే తు శూలినః ॥ 8 ॥**

**తత్ర తత్ర విభోః శిష్యాశ్చత్వారః శమభాజనాః ।**
**ప్రశిష్యా బహవస్తేషాం ప్రసీదత్యేవమీశ్వరః ॥ 9 ॥**

**ఏవం క్రమాగతం జ్ఞానం ముఖాదేవ నృణాం విభోః ।**
**వైశ్యాంతం బ్రాహ్మణాద్యం హి ఘృణయా చానురూపతః ॥ 10 ॥**

సచ్చారిత్రులైన మునులార! ద్వాపరయుగాంతంలో వ్యాసుడియొక్క అవతారాల్ని, కలియుగంలో యోగాచార్యుడైన శంకరుడి అవతారాల్ని గూర్చి చెబుతున్నాను. వివిధప్రాంతాలలో మనోనియంత్రణగల మహేశ్వరుడియొక్క ఆ నలుగురుశిష్యులు, అనేకులైన వారి ప్రశిష్యులు. వారికై ఈశ్వరుడు ప్రసన్నుడైనాడు. ఈవిధంగా శిష్యపరంపరమాధ్యమంగా శివుడి ముఖంనుండే ఆ యోగజ్ఞానం బ్రహ్మక్షత్రవైశ్యవర్ణాల వారికి కృపతో ప్రాప్తించింది.

**ఋషయ ఊచుః –** మునులు పలికారు.

**ద్వాపరే ద్వాపరే వ్యాసాః కే వై కుత్రాంతరేషు వై ।**
**కల్పేషు కస్మిన్ కల్పే నో వక్తుమర్హసి చాత్ర తాన్ ॥ 11 ॥**

ప్రతిద్వాపరయుగంలోనూ, ప్రతికల్పంలోనూ, ప్రతిమన్వంతరంలోనూ అవతారం దాల్చు వ్యాసులనుగూర్చి మాకు చెప్పదగినవాడివి నీవే.

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**శృణ్వంతు కల్పే వారాహే ద్విజా వైవస్వతాంతరే ।**
**వ్యాసాంశ్చ సాంప్రతం రుద్రాంస్తథా సర్వాంతరేషు వై ॥ 12 ॥**

**వేదానాం చ పురాణానాం తథా జ్ఞానప్రదర్శకాన్ ।**
**యథాక్రమం ప్రవక్ష్యామి సర్వావర్తేషు సాంప్రతమ్ ॥ 13 ॥**

బ్రాహ్మణులారా ! వినండి ! వర్తమానవరాహకల్పంలోని వైవస్వతమన్వంతరంలోనూ, మరియు అన్ని మన్వంతరాలలోనూ గల వ్యాసులను గూర్చి రుద్రగణాల్ని గూర్చి క్రమంగా చెబుతున్నాను. వారందరూ సర్వయుగచక్రాలందునూ (నాలుగు యుగాలు కలిపి ఒక చక్రం) వేదపురాణాలలో పరిపూర్ణజ్ఞానం కలవారు. వారు మార్గదర్శకులైన ఉపదేశికులు.

**క్రతుః సత్యో భార్గవశ్చ అంగిరాః సవితా ద్విజాః ।**
**మృత్యుః శతక్రతుర్ధీమాన్ వసిష్ఠో మునిపుంగవః ॥ 14 ॥**

**సారస్వతస్త్రిధామా చ త్రివృతో మునిపుంగవః ।**
**శతతేజాః స్వయం ధర్మో నారాయణ ఇతి శ్రుతః ॥ 15 ॥**

**తరక్షుశ్చారుణిర్ధీమాంస్తథా దేవః కృతంజయః ।**
**ఋతంజయో భరద్వాజో గౌతమః కవిసత్తమః ॥ 16 ॥**

**వాచఃశ్రవాః మునిః సాక్షాత్తథా శుష్మాయణిః శుచిః ।**
**తృణబిందుర్మునీ రుక్షః శక్తిః శాక్తేయ ఉత్తరః ॥ 17 ॥**

**జాతూకర్ణ్యో హరిః సాక్షాత్ కృష్ణద్వైపాయనో మునిః ।**
**వ్యాసాస్త్వేతే చ శృణ్వంతు కలౌ యోగేశ్వరాన్ క్రమాత్ ॥ 18 ॥**

**అసంఖ్యాతా హి కల్పేషు విభోః సర్వాంతరేషు చ ।**
**కలౌ రుద్రావతారాణాం వ్యాసానాం కిల గౌరవాత్ ॥ 19 ॥**

**వైవస్వతాంతరే కల్పే వారాహే యే చ తాన్ పునః ।**
**అవతారాన్ ప్రవక్ష్యామి తథా సర్వాంతరేషు వై ॥ 20 ॥**

బ్రాహ్మణోత్తములారా! వినండి! క్రతువు, సత్య, భార్గవుడు, అంగిరసుడు, సవిత, మృత్యువు, శతక్రతువు, ధీమంతుడగు వసిష్ఠుడు, సారస్వతుడు, త్రిధాముడు, త్రివృతుడు, శతతేజుడు, నారాయణుడనబడే ధర్ముడు, తరక్షువు, ఆరుణి, కృతంజయుడు, ఋతంజయుడు, భరద్వాజుడు, గౌతముడు, వాచశ్రవుడు, శుష్మాయణి, శుచి, తృణబిందువు, రుక్షుడు, శక్తి, శక్తిపుత్రుడగు పరాశరుడు, జాతూకర్ణ్యుడు, కృష్ణద్వైపాయనుడు(ఈయన స్వయముగా విష్ణువే) అనువారు వ్యాసులు. కలియుగంలోని వ్యాసుల్ని గూర్చి చెబుతున్నాను వినండి!

కల్పాలలోను, మన్వంతరాలలోనూ వారి సంఖ్య అనంతం. కలియుగంలో రుద్రగణాల, వ్యాసగణాల అవతారాలు ఎన్నియో ఉన్నాయి. వరాహకల్పంలోని వైవస్వతమన్వంతరం తర్వాత జరిగిన మన్వంతరాలలోని అవతారాల్ని గూర్చి చెబుతాను.

**ఋషయ ఊచుః –** ఋషులు పలికారు.

**మన్వంతరాణి వారాహే వక్తుమర్హసి సాంప్రతమ్ ।**
**తథైవ చోర్ధ్వకల్పేషు సిద్ధాన్ వైవస్వతాంతరే ॥ 21 ॥**

ప్రస్తుతం వరాహకల్పం అందుగల మన్వంతరాల్ని గూర్చి చెప్పిన తర్వాత మిగిలిన కల్పాలు, వైవస్వతమన్వంతరంలోని సిద్ధుల విషయాల్ని నీవే చెప్పదగినవాడవు.

**రోమహర్షణ ఉవాచ –** రోమహర్షణుడు పలికాడు.

**మనుః స్వాయంభువస్త్వాద్యః స్వారోచిషో ద్విజాః ।**
**ఉత్తమస్తామసశ్చైవ రైవతశ్చాక్షుషస్తథా ॥ 22 ॥**

**వైవస్వతశ్చ సావర్ణిర్ధర్మః సావర్ణికః పునః ।**
**పిశంగశ్చాపిశంగాభః శబలో వర్ణకస్తథా ॥ 23 ॥**

ఓ బ్రాహ్మణులారా! బ్రహ్మపుత్రుడగు స్వాయంభువుడు మొదటిమనువు. తదుపరి స్వారోచిషుడు. ఇట్లే క్రమంగా ఉత్తమ, తామస, రైవత, చాక్షుష, వైవస్వత, సావర్ణి, ధర్మ, సావర్ణిక, పిశంగ, అపిశంగాభ, శబల, వర్ణకులనువారు మనువులు.

**ఔకారాంతా అకారాద్యా మనవః పరికీర్తితాః ।**
**శ్వేతః పాండుస్తథా రక్తస్తామ్రః పీతశ్చ కాపిలః ॥ 24 ॥**

**కృష్ణః శ్యామస్తథా ధూమ్రః సుధూమ్రశ్చ ద్విజోత్తమాః ।**
**అపిశంగః పిశంగశ్చ త్రివర్ణః శబలస్తథా ॥ 25 ॥**

**కాలంధురస్తు కథితా వర్ణతో మనవః శుభాః ।**
**నామతో వర్ణతశ్చైవ వర్ణతః పునరేవ చ ॥ 26 ॥**

బ్రాహ్మణోత్తములారా! మనుగణాలు అకారం నుంచి ఔకారం వరకు కలవిగా చెప్పబడుతున్నాయి. వారి రంగును బట్టి కూడా వర్గీకరణం జరిగింది. "శ్వేత, పాండు, రక్త, తామ్ర, పీత, కాపిల, కృష్ణ, శ్యామ, ధూమ్ర, సుధూమ్ర, అపిశంగ, పిశంగ, త్రివర్ణ, శబల, కాలంధుర" ఇట్లా మనువులు చెప్పబడినారు. ఇలా మనువులు స్వాయంభువాదులైన పేర్లతోను, అకారాది అక్షరాలతోను, శ్వేతాది వర్ణాలతోను (రంగులు) చెప్పబడినారు.

**స్వరాత్మానః సమాఖ్యాతాశ్చాంతరేశాః సమాసతః ।**
**వైవస్వత ఋకారస్తు మనుః కృష్ణః సురేశ్వరః ॥ 27 ॥**

**సప్తమస్తస్య వక్ష్యామి యుగవర్తేషు యోగినః ।**
**సమతీతేషు కల్పేషు తథా చానాగతేషు వై ॥ 28 ॥**

స్వరాల అచ్చులు సమరూపాల చేత ఆయా మన్వంతరాలలో అగ్రగణ్యులుగా చెప్పబడినారు. ఈ మనువులలో ఏడవవాడు వైవస్వతుడు, ఆతడు 'ఋ' స్వరంతోను, నల్లని రంగుతోను ఉంటాడు. ఇతడు దేవతలలో అగ్రగణ్యుడు. కల్పాలలోను, యుగచక్రాలలోను ఉద్భవించిన యోగుల్నిగూర్చి మరియు భవిష్యత్తులో రాబోవువార్నిగూర్చి కూడా చెబుతాను.

**వారాహః సాంప్రతం జ్ఞేయః సప్తమాంతరతః క్రమాత్ ।**
**యోగావతారాంశ్చ విభోః శిష్యాణాం సంతతిస్తథా ॥ 29 ॥**

ప్రస్తుతం ఏడవమన్వంతరంలోని వరాహకల్పం జరుగుతున్నది. అన్ని కల్పాలలోను మన్వంతరాలలోను పరమేశ్వరుడి యౌగిక అవతారాల్ని క్రమంగా వారి శిష్యపరంపరల్ని చెబుతున్నాను. వినండి!

**సంప్రేక్ష్య సర్వకాలేషు తథావర్తేషు యోగినామ్ ।**
**ఆద్యే శ్వేతః కలౌ రుద్రః సుతారో మదనస్తథా ॥ 30 ॥**

**సుహోత్రః కంకణశ్చైవ లోగాక్షిర్మునిసత్తమాః ।**
**జైగీషవ్యో మహాతేజా భగవాన్ దధివాహనః ॥ 31 ॥**

**ఋషభశ్చ మునిర్ధీమాన్ ఉగ్రశ్చాత్రిః సుబాలకః ।**
**గౌతమశ్చాథ భగవాన్ సర్వదేవనమస్కృతః ॥ 32 ॥**

**వేదశీర్షశ్చ గోకర్ణో గుహావాసీ శిఖండభృత్ ।**
**జటామాల్యట్టహాసశ్చ దారుకో లాంగలీ తథా ॥ 33 ॥**

**మహాకాయమునిః శూలీ దండీ ముండీశ్వరః స్వయమ్ ।**
**సహిష్ణుః సోమశర్మా చ నకులీశో జగద్గురుః ॥ 34 ॥**

శ్వేత, సుతార, మదన, సుహోత్ర, కంకణ, లోగాక్షి, జైగీషవ్య, దధివాహన, ఋషభ, ఉగ్ర, అత్రి, సుబాలక, గౌతమ, వేదశీర్ష, గోకర్ణ, గుహావాసి, శిఖండభృత్, జటామాలి, అట్టహాస, దారుక, లాంగలి, మహాకాయ, ముని,శూలీ, దండీ ముండీశ్వర, సహిష్ణు, సోమశర్మ, నకులీశులనువారు స్వాయంభువ మన్వంతరంలోని మొదటి కలియుగంలోని యౌగికావతారాలు.

**వైవస్వతేఽంతరే సమ్యక్ ప్రోక్తా హి పరమాత్మనః ।**
**యోగాచార్యావతారా యే సర్వావర్తేషు సువ్రతాః ॥ 35 ॥**

**వ్యాసాశ్చైవం మునిశ్రేష్ఠా ద్వాపరే ద్వాపరే త్విమే ।**
**యోగేశ్వరాణాం చత్వారః శిష్యాః ప్రత్యేకమవ్యయాః ॥ 36 ॥**

సువ్రతులారా! వైవస్వతమన్వంతరంలోని నాలుగుయుగచక్రాలన్నింటిలోను ఈశ్వరుడియోగాచార్యావతారాలు పైన చెప్పిన విధంగా ఇరవైఎనిమిది అవుతున్నవి. ఇదే విధంగా ప్రతిద్వాపరయుగంలోనూ వ్యాసగణనం ఉంటుంది. ప్రతియోగీశ్వరుడికి క్రిందతెల్పిన శిష్యులున్నారు. అంతేకాక వారికి ఒక్కొక్కరికి నల్గురేసి శిష్యులు ఉన్నారు.

**శ్వేతః శ్వేతశిఖండీ చ శ్వేతాశ్వః శ్వేతలోహితః ।**
**దుందుభిః శతరూపశ్చ ఋచీకః కేతుమాంస్తథా ॥ 37 ॥**

విశోకశ్చ వికేశశ్చ విపాశః పాపనాశనః ।
సుముఖో దుర్ముఖశ్చైవ దుర్దమో దురతిక్రమః ॥ 38 ॥

సనకశ్చ సనందశ్చ ప్రభుర్యశ్చ సనాతనః ।
ఋభుః సనత్కుమారశ్చ సుధామా విరజాస్తథా ॥ 39 ॥

శంఖపా ద్వైరజశ్చైవ మేఘః సారస్వతస్తథా ।
సువాహనో మునిశ్రేష్ఠో మేఘవాహో మహాద్యుతిః ॥ 40 ॥

కపిలశ్చాసురిశ్చైవ తథా పంచశిఖో మునిః ।
వాల్కలశ్చ మహాయోగీ ధర్మాత్మానో మహౌజసః ॥ 41 ॥

పరాశరశ్చ గర్గశ్చ భార్గవశ్చాంగిరాస్తథా ।
బలబంధుర్నిరామిత్రః కేతుశృంగస్తపోధనః ॥ 42 ॥

లంబోదరశ్చ లంబశ్చ లంబాక్షో లంబకేశకః ।
సర్వజ్ఞః సమబుద్ధిశ్చ సాధ్యః సర్వస్తథైవ చ ॥ 43 ॥

సుధామా కాశ్యపశ్చైవ వాసిష్ఠో విరజాస్తథా ।

అత్రిర్దేవసదశ్చైవ శ్రవణోఽథ శ్రవిష్ఠకః ।
కుణిశ్చ కుణిబాహుశ్చ కుశరీరః కునేత్రకః ॥44॥

కశ్యపోఽప్యుశనాశ్చైవ చ్యవనోఽథ బృహస్పతిః।
ఉతథ్యో వామదేవశ్చ మహాయోగో మహాబలః ॥ 45 ॥

వాచఃశ్రవా సుధీకశ్చ శ్యావాశ్వశ్చ యతీశ్వరః ।
హిరణ్యనాభః కౌశల్యో లోగాక్షిః కుథుమిస్తథా ॥ 46 ॥

సుమంతుర్బర్బరీ విద్వాన్ కబంధః కశికంధరః ।
ప్లక్షో దాల్భ్యాయణిశ్చైవ కేతుమాన్ గోపనస్తథా ॥ 47 ॥

భల్లావీ మధుపింగశ్చ శ్వేతకేతుస్తపోనిధిః ।
ఉశికో బృహదశ్వశ్చ దేవలః కవిరేవ చ ॥ 48 ॥

శాలిహోత్రోఽగ్నివేశశ్చ యువనాశ్వః శరద్వసుః ।
ఛగలః కుండకర్ణశ్చ కుంభశ్చైవ ప్రవాహకః ॥ 49 ॥
ఉలూకో విద్యుతశ్చైవ మండూకో హ్యాశ్వలాయనః ।
అక్షపాదః కుమారశ్చ ఉలూకో వత్స ఏవ చ ॥ 50 ॥

**కుశికశ్చైవ గర్భశ్చ మిత్రః కౌరుష్య ఏవ చ ।**
**శిష్యాస్త్వేతే మహాత్మానః సర్వావర్తేషు యోగినామ్ ॥ 51 ॥**

శ్వేత, శ్వేతఖండి, శ్వేతాశ్వ, శ్వేతలోహిత, దుందుభి, శతరూప, రుచీక, కేతుమాన్, విశోక, వికేశ, విపాశ, పాపనాశన, సుముఖ, దుర్ముఖ, దుర్దమ, దురతిక్రమ, సనక, సనంద, సనాతన, ఋభు, సనత్కుమార, సుధామ, విరజస్, శంఖపాద, వైరాజస, మేఘ, సారస్వత, సువాహన, మేఘవాహ, కపిల, ఆసురి, పంచశిఖ, వాల్కల, పరాశర, గర్గ, భార్గవ, అంగిర, బలబంధు, నిరామిత్ర, కేతుశృంగ, లంబోదర, లంబ, లంబాక్ష, లంబకేశక, సర్వజ్ఞ, సమబుద్ధి, సాధ్య, సర్వ, సుధామ, కాశ్యప, వాసిష్ఠ, విరజస్, అత్రి, దేవసద, శ్రవణ, శర్విష్ఠక, కుణి, కుణిబాహు, కుశరీర, కునేత్రక, కశ్యప, ఉశన, చ్యవన, బృహస్పతి, ఉతథ్య, వామదేవ, మహాయోగ, మహాబల, వాచశ్రవ, సుధీక, శ్యావాశ్వ, యతీశ్వర, హిరణ్యానాభ, కౌశల్య, లోగాక్షి, కుథుమి, సమంతు, బర్బరీ, కబంధ, కశికంధర, ప్లక్ష, దాల్భ్యాయణి, కేతుమాన్, గోపన, భల్లావి, మధుపింగ, శ్వేతకేతు, తపోనిధి, ఉశిక, బృహదశ్వ, దేవల, కవి, శాలిహోత్ర, అగ్నివేశ, యువనాశ్వ, శరద్వసు, ఛగల, కుండకర్ణ, కుంభ, ప్రవాహక, ఉలూక, విద్యుత, మండూక, ఆశ్వలాయన, అక్షపాద, కుమార, ఉలూక, వత్స, కుశిక, గర్భ, మిత్ర, కౌరుష్యులు అనువారువీరు. మహాత్ములైన వీరందరు నాల్గుయుగములందలి అన్ని చక్రాలలోని యోగులకు శిష్యులు.

**విమలా బ్రహ్మభూయిష్ఠా జ్ఞానయోగపరాయణాః ।**
**ఏతే పాశుపతాః సిద్ధా భస్మోద్ధూలితవిగ్రహాః ॥ 52 ॥**

**శిష్యాః ప్రశిష్యాశ్చైతేషాం శతశోఽథ సహస్రశః ।**
**ప్రాప్య పాశుపతం యోగం రుద్రలోకాయ సంస్థితాః ॥ 53 ॥**

వీరందరూ విమలురు. బ్రహ్మతో ఇంచుమించు సమానమైనవారు. జ్ఞానంలోను, యోగవిద్యలోను ప్రవీణులు. వీరు పశుపతియైన పరమేశ్వరుడిని పూజించే మహాసిద్ధులు. భస్మశరీరధారులు. ఈ శిష్యులకు వందలకొలది వేలకొలది ప్రశిష్యులు ఉన్నారు. వారందరూ పాశుపతయోగసిద్ధిని పొంది రుద్రలోకంలో ఉన్నారు.

**దేవాదయః పిశాచాంతాః పశవః పరికీర్తితాః ।**
**తేషాం పతిత్వాత్సర్వేశో భవః పశుపతిః స్మృతః ॥ 54 ॥**

**తేన ప్రణీతో రుద్రేణ పశూనాం పతినా ద్విజాః ।**
**యోగః పాశుపతో జ్ఞేయః పరావరవిభూతయే ॥ 55 ॥**

దేవతలనుంచి పిశాచాలవరకు ప్రాణులన్నియు పశువులే. వాటికి ప్రభువు(పతి) అగుటవల్ల రుద్రుడు పశుపతి అవుతున్నాడు. విప్రోత్తములారా! అందుచేత పశుపతియైన శివుడినుంచి వెలుపడిన ఈయోగం పాశు పతయోగం అవుతున్నది. ఇది అందరికీ మిక్కిలి శ్రేష్ఠమైన ఐశ్వర్యాన్ని ప్రసాదించగలుగుతుంది.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే మనువ్యాసయోగేశ్వరతచ్ఛిష్యకథనం నామ సప్తమోఽధ్యాయః ॥ 7 ॥**

శ్రీలింగమహాపురాణంలోని పూర్వభాగంలోని మనువ్యాసయోగేశ్వరతచ్ఛిష్యకథనమనే ఏడవ అధ్యాయం సమాప్తం.

## అష్టమోఽధ్యాయః - ఎనిమిదవ అధ్యాయం
## అష్టాంగయోగనిరూపణమ్ - అష్టాంగయోగనిరూపణం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**సంక్షేపతః ప్రవక్ష్యామి యోగస్థానాని సాంప్రతమ్ ।**
**కల్పితాని శివేనైవ హితాయ జగతాం ద్విజాః ॥ 1 ॥**

ఓ బ్రాహ్మణులారా! ప్రపంచంయొక్క శ్రేయస్సుకొరకు శివభగవానుడే చెప్పిన యోగస్థానాలను గూర్చి ప్రస్తుతం సంక్షిప్తంగా చెబుతాను.

**గలాదధో వితస్త్యా యన్నాభేరుపరి చోత్తమమ్ ।**
**యోగస్థానమధో నాభేరావర్తం మధ్యమం భ్రువోః ॥ 2 ॥**

కంఠానికి క్రింద బొడ్డుకు పైనగల 'వితస్తి' అనే స్థానం యోగానికి ఉత్తమమైంది. (ఇది 12 అంగుళాల పరిమాణం కలది. హృత్కమలమనే పేరు కలది) ఇట్లే నాభికి క్రింది భాగం(నూగారు ఉండే భాగం) మూలాధారమనే యోగస్థానం. రెండు భ్రుకుటులమధ్యభాగం ఆవర్తమనే యోగస్థానం. దీనినే ఆజ్ఞాచక్రం అని కూడా అంటారు.

**సర్వార్థజ్ఞాననిష్పత్తిరాత్మనో యోగ ఉచ్యతే ।**
**ఏకాగ్రతా భవేచ్చైవ సర్వదా తత్ప్రసాదతః ॥ 3 ॥**

ఆత్మలో ఉద్భవించే సమస్తమైన జ్ఞానవిషయాలు యోగమనే చెప్పబడతాయి. శివుడి అనుగ్రహంవల్లే మనస్సుకు ఏకాగ్రత లభిస్తుంది.

**ప్రసాదస్య స్వరూపం యత్ స్వసంవేద్యం ద్విజోత్తమాః ।**
**వక్తుం నశక్యం బ్రహ్మాద్యైః క్రమశో జాయతే నృణామ్ ॥ 4 ॥**

బ్రాహ్మణోత్తములారా! ఆ అనుగ్రహంయొక్క స్వభావం స్వానుభవంతో తెలియదగింది. బ్రహ్మాదులకు కూడా చెప్పనలవికానిది. ఇది మనుష్యులలో క్రమక్రమంగా ఉద్భవిస్తుంది.

**యోగశబ్దేన నిర్వాణం మాహేశం పదముచ్యతే ।**
**తస్యహేతుర్ఋషేర్జ్ఞానం జ్ఞానం తస్య ప్రసాదతః ॥ 5 ॥**

యోగాభ్యాసంతో సిద్ధించిన నిర్వాణం(ముక్తి) మహేశ్వరపదంతో చెప్పబడుతుంది. ఆ ముక్తికి కారణం రుద్రుడి యొక్క జ్ఞానమే. ఈ జ్ఞానం ఆయన అనుగ్రహం వల్లే కలుగుతుంది.

**జ్ఞానేన నిర్దహేత్పాపం నిరుధ్య విషయాన్ సదా ।**
**నిరుద్ధేంద్రియవృత్తేష యోగసిద్ధిర్భవిష్యతి ॥ 6 ॥**

జ్ఞానంతో విషయసుఖాల్ని నియంత్రించడంవల్ల పాపం దహింపబడుతుంది. ఇంద్రియవ్యాపారాల్ని నియంత్రించడం వల్లనే యోగసిద్ధి కల్గుతుంది.

**యోగో నిరోధో వృత్తేషు చిత్తస్య ద్విజసత్తమాః ।**
**సాధనాన్యష్టధా చాస్య కథితానీహ సిద్ధయే ॥ 7 ॥**

విప్రోత్తములారా! మానసికవ్యాపారాల నియంత్రణమే యోగం. అట్టి నియంత్రణసిద్ధికి ఎనిమిది సాధనాలు ఉన్నాయి. ఇక్కడ వాటిని గూర్చి చెప్పడం జరుగుతుంది.

**యమస్తు ప్రథమః ప్రోక్తో ద్వితీయో నియమస్తథా ।**
**తృతీయమాసనం ప్రోక్తం ప్రాణాయామస్తతః పరమ్ ॥ 8 ॥**

'యమం' అనేది మొదటిది. అట్లే రెండవది 'నియమం'. మూడవది 'ఆసనం'. నాల్గవది 'ప్రాణాయామం'.

**ప్రత్యాహారః పంచమో వై ధారణా చ తతః పరా ।**
**ధ్యానం సప్తమమిత్యుక్తం సమాధిస్త్వష్టమః స్మృతః ॥ 9 ॥**

అయిదవది 'ప్రత్యాహారం'. తరువాతిది అనగా ఆరవది 'ధారణ'. 'ధ్యానం' ఏడవది. 'సమాధి' ఎనిమిదవదిగా చెప్పబడింది.

**తపస్యుపరమశ్చైవ యమ ఇత్యభిధీయతే ।**
**అహింసా ప్రథమో హేతుర్యమస్య యమినాం వరాః ॥ 10 ॥**

తపస్సులో ప్రవృత్తులన్నియు నివృత్తి చెందుటే యమం అవుతుంది. యమిశ్రేష్ఠులైన బ్రాహ్మణులారా! అహింస యమంయొక్క ప్రథమలక్షణం.(ముఖ్యహేతువు)

**సత్యమస్తేయమపరం బ్రహ్మచర్యాపరిగ్రహౌ ।**
**నియమస్యాపి వై మూలం యమ ఏవ న సంశయః ॥ 11 ॥**

సత్యం, అస్తేయం(దొంగతనం చేయకుండడం) బ్రహ్మచర్యం, అపరిగ్రహం(తీసుకోకపోవడం – ప్రోగుల చేయక పోవడం) యమసాధనకారణాలు. నియమానికి కూడా యమమే మూలం. ఇందులో ఎటువంటి సందేహం లేదు.

**ఆత్మవత్సర్వభూతానాం హితాయైవ ప్రవర్తనమ్ ।**
**అహింసైషా సమాఖ్యాతా యా చాత్మజ్ఞానసిద్ధిదా ॥ 12 ॥**

సర్వప్రాణులు తనలాంటివే అనుకోవడం, వాటి హితానికై కృషిచేయడం అహింస అవుతుంది. ఈ అహింస ఆత్మజ్ఞానసిద్ధిని కల్గిస్తుంది.

**దృష్టం శ్రుతం చానుమితం స్వానుభూతం యథార్థతః ।**
**కథనం సత్యమిత్యుక్తం పరపీడావివర్జితమ్ ॥ 13 ॥**

చూచింది, విన్నది, అనుమానప్రమాణంతో తెలిసింది, స్వానుభవంతో గ్రహించింది, ఉన్నది ఉన్నట్లుగా చెప్పడమే సత్యం. అదీ పరులకు కష్టకారణంకానిది.

**నాశ్లీలం కీర్తయేదేవం బ్రాహ్మణానామితి శ్రుతిః ।**
**పరదోషాన్ పరిజ్ఞాయ న వదేదితి చాపరమ్ ॥ 14 ॥**

విప్రసన్నిధిలో ఎటువంటి అశ్లీలం పలుకరాదని వేదవచనం. ఇతరుల దోషాలు తెలిసికూడా వాటిని ఇతరుల దగ్గర పలుకరాదు.

**అనాదానం పరస్వానామాపద్యపి విచారతః ।**
**మనసా కర్మణా వాచా తదస్తేయం సమాసతః ॥ 15 ॥**

విపత్కాలమందున్ననూ ఇతరుల ద్రవ్యాన్ని త్రికరణశుద్ధిగా దొంగిలించకుండుట అస్తేయం అవుతుంది. (మనసులో, వాక్కులో, చేతలో ఆదానభావన రాకుండుట త్రికరణశుద్ధి).

**మైథునస్యాప్రవృత్తిర్హి మనోవాక్కాయకర్మణా ।**
**బ్రహ్మచర్యమితి ప్రోక్తం యతీనాం బ్రహ్మచారిణామ్ ॥ 16 ॥**

యతులకు, బ్రహ్మచారులకు మనోవాక్కాయకర్మలలో స్త్రీవాంఛ లేకుండుట బ్రహ్మచర్యం అవుతుంది. ఆ కోరిక మనసులోను, వాక్కులోను, చేతలలోను కల్గకుండడం.

**ఇహ వైఖానసానాం చ విదారాణాం విశేషతః ।**
**సదారాణాం గృహస్థానాం తథైవ చ వదామి వః ॥ 17 ॥**

ఏకాంతవాసులు, భార్యలేనివారు, వానప్రస్థులు అయినవారి విషయంలోను త్రికరణశుద్ధిగా స్త్రీవాంఛ ఉండరాదు. భార్యగల గృహస్థుల విషయం ఇప్పుడు చెబుతున్నాను.

**స్వదారే విధివత్కృత్వా నివృత్తిశ్చాన్యతః సదా ।**
**మనసా కర్మణా వాచా బ్రహ్మచర్యమితి స్మృతమ్ ॥ 18 ॥**

**మేధ్యా స్వనారీ సంభోగం కృత్వా స్నానం సమాచరేత్ ।**
**ఏవం గృహస్థో యుక్తాత్మా బ్రహ్మచారీ న సంశయః ॥ 19 ॥**

పరకాంతల విషయంలో త్రికరణశుద్ధిగా కోరికలేక స్వస్త్రీ విషయంలో అర్హమైన సంగమం కలిగియుండడం బ్రహ్మచర్యమనబడుతుంది. తన భార్యతో సంభోగం చేసిన తరువాత స్నానమాచరించాలి. ఈ విధంగా ప్రవర్తించిన గృహస్థు బ్రహ్మచారియే కాగలడు. ఇందులో సందేహం లేదు.

**అహింసాప్యేవమేవైషా ద్విజగుర్వగ్నిపూజనే ।**
**విధినా తాదృశీ హింసా సా త్వహింసా ఇతి స్మృతా ॥ 20 ॥**

విప్రవరుల, గురుదేవుల అగ్నిదేవుడి పూజానిమిత్తంగా శాస్త్రప్రకారంగా జరిగే హింస కూడా అహింసగానే పరిగణింపబడుతుంది.

**స్త్రియః సదా పరిత్యాజ్యాః సంగం నైవ చ కారయేత్ ।**
**కుణపేషు యథా చిత్తం తథా కుర్యాద్విచక్షణః ॥ 21 ॥**

స్త్రీలు సర్వదా త్యజింపదగినవారు. వారితో సాంగత్యం చేయరాదు. వివేకవంతుడు శవాల విషయంలో ఎలా ఉంటాడో స్త్రీలపట్లా అలాగే ఉండాలి.

**విణ్మూత్రోత్సర్గకాలేషు బహిర్భూమౌ యథామతిః ।**
**తథా కార్యా రతౌ చాపి స్వదారే అన్యతః కుతః ॥ 22 ॥**

పురుషుడు మలమూత్రవిసర్జనసమయంలో ఎలాంటి మానసికస్థితి కలిగి ఉంటాడో అలాంటి స్థితిలోనే స్వస్త్రీసంగమసమయంలోనూ ఉండాలి. (ఒకవిధమైన వైముఖ్యం) ఇక అన్యస్త్రీ విషయం చెప్పపనిలేదు.

**అంగారసదృశీ నారీ ఘృతకుంభసమః పుమాన్ ।**
**తస్మాన్నారీషు సంసర్గం దూరతః పరివర్జయేత్ ॥ 23 ॥**

స్త్రీ అగ్నిసమానురాలు. పురుషుడు నేతి కుండ వంటివాడు. అందుచేత పురుషుడు స్త్రీ సాంగత్యానికి దూరంగా ఉండాలి.

**భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।**
**తస్మాద్విరాగః కర్తవ్యో మనసా కర్మణా గిరా ॥ 24 ॥**

విషయసుఖాల్ని అనుభవించడంచేత సంతృప్తి కలుగదు. అందుచేత మనోవాక్కాయకర్మలతో వైరాగ్యాన్ని కలిగి ఉండాలి.

**న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి ।**
**హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥ 25 ॥**

కోరికల్ని అనుభవిచడంచేత అవి శమించవు. నేతివల్ల అగ్నిలాగా కోరికలు అనుభవించిన కొద్దీ వృద్ధి చెందుతూనే ఉంటాయి.

**తస్మాత్త్యాగః సదా కార్యస్త్వమృతత్వాయ యోగినా ।**
**అవిరక్తో యతో మర్త్యో నానాయోనిషు వర్తతే ॥ 26 ॥**

అమరత్వసిద్ధికై యోగి ఎల్లప్పుడూ విరక్తుడై(త్యాగి) ఉండాలి. విరక్తుడుకాని మానవుడు అనేకయోనులలో పుట్టవలసి ఉంటుంది.

**త్యాగేనైవామృతత్వం హి శ్రుతిస్మృతివిదాం వరాః ।**
**కర్మణా ప్రజయా నాస్తి ద్రవ్యేణ ద్విజసత్తమాః ॥ 27 ॥**

శ్రుతిస్మృతివిదుల్లో శ్రేష్ఠులైన ఋషులారా! విరక్తివల్లే అమృతత్త్వసిద్ధి. ఓ విప్రవరులారా! కర్మచేతను, సంతానంచేతను, ధనంచేతను అమృతత్త్వం సిద్ధించదు.

**తస్మాద్విరాగః కర్తవ్యో మనోవాక్కాయకర్మణా ।**
**ఋతౌ ఋతౌ నివృత్తిస్తు బ్రహ్మచర్యమితి స్మృతమ్ ॥ 28 ॥**

అందుచేత త్రికరణశుద్ధితో విరక్తిని పొందాలి. నిర్వర్తించవలసిన ఆయా కాలాలలో సంగమనివృత్తి కూడా బ్రహ్మచర్యమే అవుతుంది.

**యమాః సంక్షేపతః ప్రోక్తా నియమాంశ్చ వదామి వః ।**
**శౌచమిజ్యా తపో దానం స్వాధ్యాయోపస్థనిగ్రహః ॥ 29 ॥**

**వ్రతోపవాసమౌనం చ స్నానం చ నియమా దశ ।**
**నియమః స్యాదనీహా చ శౌచం తుష్టిస్తపస్తథా ॥ 30 ॥**

**జపః శివప్రణీధానం పద్మకాద్యం తథాసనమ్ ।**
**బాహ్యమాభ్యంతరం ప్రోక్తం శౌచమాభ్యంతరం వరమ్ ॥ 31 ॥**

'యమా'లను గూర్చి సంగ్రహంగా చెప్పాను. ఇప్పుడు నియమాలను గూర్చి చెబుతున్నాను. శౌచం, యజ్ఞం, తపస్సు, దానం, స్వాధ్యాయం, ఇంద్రియనిగ్రహం, వ్రతం, ఉపవాసం, మౌనం, స్నానం అనేవి పదినియమాలు. నిరీహ, శౌచం, సంతుష్టి, తపం, శివమంత్రజపం, శివధ్యానం, పద్మాసనం నియమ మనబడుతుందని వేరొకరి మతం. శౌచం బాహ్యమని, ఆభ్యంతరమని రెండు విధాలు. ఇందు ఆభ్యంతరం (ఆంతరంగికం) శ్రేష్ఠమైనది.

**బాహ్యశౌచేన యుక్తః సంస్తథా చాభ్యంతరం చరేత్ ।**
**ఆగ్నేయం వారుణం, బ్రాహ్మం కర్తవ్యం శివపూజకైః ॥ 32 ॥**

**స్నానం విధానతః సమ్యక్ పశ్చాదాభ్యంతరం చరేత్ ।**
**ఆదేహాంతం మృదాలిప్య తీర్థతోయేషు సర్వదా ॥ 33 ॥**

**అవగాహ్యాపి మలినో హ్యంతశ్శౌచ వివర్జితః ।**
**శైవలా ఝషకా మత్స్యాః సత్త్వా మత్స్యోపజీవినః ॥ 34 ॥**

**సదావగాహ్యాః సలిలే విశుద్ధాః కిం ద్విజోత్తమాః ।**
**తస్మాదాభ్యంతరం శౌచం సదా కార్యం విధానతః ॥ 35 ॥**

బాహ్యశౌచం కలిగినవారు ఆభ్యంతరశౌచాన్ని సాధించాలి. విధ్యుక్తంగా బాహ్యస్నానం ఆచరించాలి. దాని తరువాత ఆభ్యంతరస్నానం చేయాలి. స్నానవిధి మూడువిధాలు. శివుడిని పూజించేవారు ఆగ్నేయం, వారుణం, బ్రాహ్మ్యం అనే మూడు స్నానాలు ఆచరించాలి. శరీరానికి పూర్తిగా మట్టిని పూసుకుని తీర్థజలాలలో ఎల్లప్పుడూ మునిగినా ఆంతరంగికశౌచం కొరవడినచో మలినులుగానే ఉంటారు.

ద్విజోత్తములారా! నాచు, ఇషకలు, చేపలు, చేపల్ని తిని జీవించే జీవులు ఎల్లప్పుడూ నీటిలో మునిగి ఉన్నా అవి విశుద్ధాలు కావుగదా? అందుచేత బాహ్యశౌచంతోపాటు ఆంతరంగికశౌచం కలిగి ఉండాలి.

**ఆత్మజ్ఞానాంభసి స్నాత్వా సకృదాలిప్య భావతః ।**
**సువైరాగ్యమృదా శుద్ధః శౌచమేవం ప్రకీర్తితమ్ ॥ 36 ॥**

**శుద్ధస్య సిద్ధయో దృష్టా నైవాశుద్ధస్య సిద్ధయః ।**
**న్యాయేనాగతయా వృత్త్యా సంతుష్టో యస్తు సువ్రతః ॥ 37 ॥**

**సంతోషస్తస్య సతతమతీతార్థస్య చాస్మృతిః ।**
**చాంద్రాయణాదినిపుణస్తపాంసి సుశుభాని చ ॥ 38 ॥**

వైరాగ్యమనే మట్టిని శరీరానికి పూసుకుని ఆత్మజ్ఞానమనే నీటిలో స్నానం చేస్తే కలిగే శౌచమే ఆంతరింగికశౌచం అవుతుంది. ఇట్టి శుద్ధుడికే సిద్ధులు కలుగుతాయి. అశుద్ధుడికి సిద్ధులు కలగవు. సువ్రతుడైన పురుషుడు న్యాయమార్గంలో వచ్చిన జీవికతో(జీతంతో) సంతృప్తి పొందుతాడు. అట్టివాడికి ధననష్ట విషయంలో కూడా చింత ఉండదు. ఆతడు శుభకరాలైన చాంద్రాయణవ్రతాదుల్ని నిర్వహించడంలో నిపుణుడు.

**స్వాధ్యాయస్తు జపః ప్రోక్తః ప్రణవస్య త్రిధా స్మృతః ।**
**వాచికశ్చాధమో ముఖ్య ఉపాంశుశ్చోత్తమోత్తమః ॥ 39 ॥**

ఓంకారం యొక్క జపమే స్వాధ్యాయం అవుతుంది. అది మూడు విధాలు. మొదటిది వాచికం. ఇది అధమం. తక్కువస్థాయి కలది. రెండవది ఉపాంశువు. ఇది ఉత్తమమైనది. నెమ్మదిగా శబ్దం రాకుండా పెదవులతో ఉచ్చరించేది. మానసం మూడవది. ఇది ఉత్తమోత్తమం. కేవలం మనసులో అనుకోవడం.

**మానసో విస్తరేణైవ కల్పే పంచమాక్షరే స్మృతః ।**
**తథా శివప్రణీధానం మనోవాక్కాయకర్మణా ॥ 40 ॥**

మానసజపాన్ని గూర్చి విపులంగా పంచాక్షరకల్పంలో ఉంటుంది. మానసికంగా, శారీరకంగా, వాచికంగా శివుడిని ధ్యానించడం జ్ఞాన సిద్ధి అవుతుంది.

**శివజ్ఞానం గురోర్భక్తిరచలా సుప్రతిష్ఠితా ।**
**నిగ్రహో హ్యపహృత్యాశు ప్రసక్తానీంద్రియాణి చ ॥ 41 ॥**

**విషయేషు సమాసేన ప్రత్యాహారః ప్రకీర్తితః ।**
**చిత్తస్య ధారణా ప్రోక్తా స్థానబంధః సమాసతః ॥ 42 ॥**

గురుడి విషయంలో స్థిరమైన భక్తి ప్రతిష్ఠింపబడడం, శివుడి స్ఫూర్తి కలిగియుండుట, విషయసుఖాలపై ఇంద్రియాల ఆసక్తియొక్క నిగ్రహం, అంటే అనాసక్తి సంగ్రహంగా 'ప్రత్యాహారం' అవుతుంది. హృదయాది స్థానాలలో మనసుయొక్క నిలుపుదల సంక్షిప్తంగా ధారణ అవుతుంది.

**తస్యాః స్వాస్థేన ధ్యానం చ సమాధిశ్చ విచారతః ।**
**తత్రైకచిత్తతా ధ్యానం ప్రత్యయాంతరవర్జితమ్ ॥ 43 ॥**

ఆలోచించగా మనసు స్వస్థతచెందగా చేయు స్థిరధ్యానమే సమాధి అవుతుంది. అన్యవిషయప్రసక్తి రహితమైన చిత్తం యొక్క ఏకాగ్రతే ధ్యానం అవుతుంది.

**చిద్భాసమర్థమాత్రస్య దేహశూన్యమివ స్థితమ్ ।**
**సమాధిః సర్వహేతుశ్చ ప్రాణాయామ ఇతి స్మృతః ॥ 44 ॥**

సమాధిలో చైతన్యస్వరూపం సాక్షాత్కరింపబడి దేహం శూన్యస్థితిని పొందుతుంది. ధ్యానసమాధులకు ప్రాణాయామమే మూలం.

**ప్రాణః స్వదేహజో వాయుర్యమస్తస్య నిరోధనమ్ ।**
**త్రిధా ద్విజైర్యమః ప్రోక్తో మందో మధ్యోత్తమస్తథా ॥ 45 ॥**

దేహమందుగల వాయువే ప్రాణం. దాని నిరోధమే యమం. మందం, మధ్యమం, ఉత్తమం అని అది మూడు విధాలు.

**ప్రాణాపాననిరోధస్తు ప్రాణాయామః ప్రకీర్తితః ।**
**ప్రాణాయామస్య మానం తు మాత్రాద్వాదశకం స్మృతమ్ ॥ 46 ॥**

**నీచో ద్వాదశమాత్రస్తు ఉద్ఘాతో ద్వాదశః స్మృతః ।**
**మధ్యమస్తు ద్విరుద్ఘాతశ్చతుర్వింశతిమాత్రకః ॥ 47 ॥**

**ముఖ్యస్తు యస్త్రిరుద్ఘాతః షట్త్రింశన్మాత్ర ఉచ్యతే ।**
**ప్రస్వేదకంపనోత్థానజనకశ్చ యథాక్రమమ్ ॥ 48 ॥**

ప్రాణవాయువు అపానవాయువుయొక్క నిరోధమే ప్రాణాయామం. ప్రాణాయామంయొక్క ప్రమాణం(మానం) పండ్రెండుమాత్రలకాలం. మందం ద్వాదశమాత్రల కాలం అవుతూ ఒక ఉద్ఘాతం అవుతుంది. మధ్యమం రెండు ఉద్ఘాతాలు లేక ఇరవైనాలుగు మాత్రలు కాగలదు. ఉత్తమం మూడు ఉద్ఘాతాలు లేక ముప్పైఆరు మాత్రలు కలది అవుతుంది. ఈ మూడును క్రమంగా స్వేదానికి, కంపానికి(చలనం) పైకి లేవడానికి కారణాలు అవుతాయి.

**ఆనందోద్భవయోగార్థం నిద్రాఘూర్ణిస్తథైవ చ ।**
**రోమాంచధ్వనిసంవిద్ధస్వాంగమోటనకంపనమ్ ॥ 49 ॥**

**భ్రమణం స్వేదజన్యా సా సంవిన్మూర్ఛా భవేద్యదా ।**
**తదోత్తమోత్తమః ప్రోక్తః ప్రాణాయామః సుశోభనః ॥ 50 ॥**

ఆనందకారియైన యోగంలో నిద్ర, మైకం కమ్మటం, పలురకాలైన ధ్వనులు విన్పించడం, రోమాంచం, శరీరావయవాలలో కదలిక, తలతిరగడం, స్వేదం కమ్మడం, జ్ఞానమయమైన ఉన్మత్తత అనేవి కలుగుతాయి. శోభాకరమైన ఉత్తమోత్తమమైన ప్రాణాయామం యొక్క లక్షణమిది.

**సగర్భోఽగర్భ ఇత్యుక్తః సజపో విజపఃక్రమాత్ ।**
**ఇభో వా శరభో వాపి దురాధర్షోఽథ కేసరీ ॥ 51 ॥**

**గృహీతో దమ్యమానస్తు యథా స్వస్థస్తు జాయతే ।**
**తథా సమీరణోఽస్వస్థో దురాధర్షశ్చ యోగినామ్ ॥ 52 ॥**

ఈ ప్రాణాయామం రెండువిధాలు, ఒకటి సగర్భం. రెండు అగర్భం. జపంతో కలిపి చేసేది సగర్భం. జపరహితంగా చేసేది అగర్భం. ఏనుగు, సింహం, శరభం అనేవి ఎలా అస్వస్థలు అవుతాయో, అదేవిధంగా దుస్సాధ్యమైన ప్రాణవాయువు కూడా యోగులకు, వశమై అస్వస్థం అవుతుంది. అనగా అవ్యవస్థితం అవుతుంది.

**న్యాయతః సేవ్యమానస్తు స ఏవం స్వస్థతాం వ్రజేత్ ।**
**యథైవ మృగరాడ్ నాగః శరభో వాపి దుర్దమః ॥ 53 ॥**

**కాలాంతర వశాద్యోగాద్దమ్యతే పరమాదరాత్ ।**
**తథా పరిచయాత్స్వాస్థ్యం సమత్వం చాధిగచ్ఛతి ॥ 54 ॥**

నియమపూర్వకంగా యోగాభ్యాసాన్ని నిర్వహిస్తే ఆ వాయువు స్వాస్థ్యాన్ని పొందుతుంది. ఎట్లైతే మత్తిల్లిన సింహం, ఏనుగు, శరభం అభ్యాసపూర్వకమైన చేతలతో లొంగినట్లు, స్వాధీనాలు అయినట్లు, అట్లే నియమంగా నియంత్రణ చేయగా నెమ్మది నెమ్మదిగా ఆ సింహాదులు ఎలా వాటి ఉగ్రత్వాన్ని విడిచి మిక్కిలి ఆదరణతో వశం అవుతాయో అలాగే ప్రాణవాయువుకూడా నెమ్మదినెమ్మదిగా అభ్యాసంవల్ల దాని విషమత్వాన్ని విడిచి సమత్వాన్ని పొందుతుంది.

**యోగాదభ్యసతే యస్తు వ్యసనం నైవ జాయతే ।**
**ఏవమభ్యస్యమానస్తు మునేః ప్రాణో వినిర్దహేత్ ॥ 55 ॥**

**మనోవాక్కాయజాన్ దోషాన్ కర్తుర్దేహం చ రక్షతి ।**
**సంయుక్తస్య తథా సమ్యక్ప్రాణాయామేన ధీమతః ॥ 56 ॥**

**దోషాత్తస్మాచ్చ నశ్యంతి నిఃశ్వాసస్తేన జీర్యతే ।**
**ప్రాణాయామేన సిద్ధ్యంతి దివ్యాః శాంత్యాదయః క్రమాత్ ॥ 57 ॥**

యోగాన్ని అభ్యసించేవానికి కష్టాలు కలగవు. అటువంటి యోగియొక్క ప్రాణవాయువు వానియొక్క త్రికరణాత్మకమైన దోషాలను దగ్ధంచేస్తుంది. శ్వాస నియమింపబడడంవల్ల(తగ్గడంవల్ల) దోషాలు నశిస్తాయి. క్రమంగా ప్రాణాయామం వల్ల శాంతి, ప్రశాంతి మొదలైన సిద్ధులు లభిస్తాయి.

**శాంతిప్రశాంతిర్దీప్తిశ్చ ప్రసాదశ్చ తథా క్రమాత్ ।**
**ఆదౌ చతుష్టయస్యేహ ప్రోక్తా శాంతిరిహ ద్విజా ॥ 58 ॥**

శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం అనేవి ఆ సిద్ధులు. ఓ బ్రాహ్మణోత్తములారా! ఆ నాల్గింటిలో మొదటిదైన శాంతిని గూర్చి చెబుతాను.

**సహజాగంతుకానాం చ పాపానాం శాంతిరుచ్యతే ।**
**ప్రశాంతిః సంయమః సమ్యగ్వచసామితి సంస్మృతా ॥ 59 ॥**

సహజాతాలు మరియు ఆగన్తుకాలు అయిన పాపాలయొక్క నాశనమే శాంతి అనబడుతుంది. వాక్కుపై పూర్తినిరోధం ప్రశాంతి అవుతుంది.

**ప్రకాశో దీప్తిరిత్యుక్తః సర్వతః సర్వదా ద్విజాః ।**
**సర్వేంద్రియప్రసాదస్తు బుద్ధేర్వై మరుతామపి ॥ 60 ॥**

**ప్రాసాద ఇతి సంప్రోక్తః స్వాంతే త్విహ చతుష్టయే ।**
**ప్రాణోఽపానః సమానశ్చ ఉదానో వ్యాన ఏవ చ ॥ 61 ॥**

**నాగః కూర్మస్తు కృకలో దేవదత్తో ధనంజయః ।**
**ఏతేషాం యః ప్రసాదస్తు మరుతామితి సంస్మృతః ॥ 62 ॥**

ఓ బ్రాహ్మణులారా! ఎల్లప్పుడూ, ఎల్లయెడలా ఉండే వెలుగునే దీప్తి అంటారు. అన్ని యింద్రియాల యొక్కయు, బుద్ధియొక్కయు అట్లే ప్రాణవాయువు యొక్క ప్రసన్నతే ప్రసాదం అవుతుంది. ఇది శాంత్యాదిచతుష్టయంలో నాల్గవది కాగలదు. ప్రాణం, అపానం, సమానం, ఉదానం, వ్యానం, నాగం, కూర్మం, కృకలం, దేవదత్తం, మరియు ధనంజయం- ఇవి వాయువులు. ఈ వాయువుల యొక్క ప్రసన్నతే ప్రసాదం అవుతుంది.

**ప్రయాణం కురుతే తస్మాద్వాయుః ప్రాణ ఇతి స్మృతః ।**
**అపానయత్యపానస్తు ఆహారాదీన్ క్రమేణ చ ॥ 63 ॥**

దేహంలో పైకి ప్రయాణించే వాయువే ప్రాణవాయువు అవుతుంది. అన్నం, నీరు మొదలైనవాటిని క్రిందికి తెచ్చేది అపానం అవుతుంది.

**వ్యానో వ్యానామయత్యంగం వ్యాధ్యాదీనాం ప్రకోపకః ।**
**ఉద్వేజయతి మర్మాణి ఉదానోఽయం ప్రకీర్తితః ॥ 64 ॥**

శరీరావయవాల్ని వంగునట్లు చేసేది, మరియు వ్యాధుల్ని ప్రకోపింపచేసేది వ్యానం అవుతుంది. మర్మస్థానాల్ని ఉత్తేజ పరిచేది ఉదానం కాగలదు.

**సమం నయతి గాత్రాణి సమానః పంచవాయవః ।**
**ఉద్గారో నాగ ఆఖ్యాతః కూర్మ ఉన్మీలనే తు సః ॥ 65 ॥**

అన్ని శరీరావయవాల్ని సమన్వయ పరిచేది సమానం. ఇవే ఐదువిధాలైన వాయువులు. త్రేన్చుట(త్రేపు) అనే క్రియ నాగం అనే వాయువు వల్ల కలుగుతుంది. ఉద్గారమంటే త్రేపు. కన్నుల్ని తెరచుకొనునట్లు చేసేది కూర్మం.

**కృకలః క్షుతకాయైవ దేవదత్తో విజృంభణే ।**
**ధనంజయో మహాఘోషః సర్వగః స మృతేఽపి హి ॥ 66 ॥**

కృకలం తుమ్మును కలిగిస్తుంది. దేవదత్తం అనేది ఆవలించడాన్ని కలిగిస్తుంది. ధనంజయం అనేది పెద్దగా అరవడాన్ని కలిగిస్తుంది. ఇవి మరణించిన తర్వాత కూడా శరీరంలో ఉంటుంది.

**ఇతి యో దశవాయూనాం ప్రాణాయామేన సిద్ధ్యతి ।**
**ప్రసాదోఽస్య తురీయా తు సంజ్ఞా విప్రాశ్చతుష్టయే ॥ 67 ॥**

ఓ ఋషులారా! ప్రాణాయామం ఈ పదివాయువుల ప్రసన్నతనొందుటయే వల్ల శాంత్యాదులైన నాల్గింటిలో నాల్గవది ప్రసాదసిద్ధి.

**విస్వరస్తు మహాన్ ప్రజ్ఞా మనో బ్రహ్మా చితిః స్మృతిః ।**
**ఖ్యాతిః సంవిత్తతః పశ్చాదీశ్వరో మతిరేవచ ॥ 68 ॥**

**బుద్ధేరేతాః ద్విజాః సంజ్ఞా మహతః పరికీర్తితాః ।**
**అస్యా బుద్ధేః ప్రసాదస్తు ప్రాణాయామేన సిద్ధ్యతి ॥ 69 ॥**

విస్వరం, మహాన్, ప్రజ్ఞా, మనస్సు, బ్రహ్మా, చితి, స్మృతి, ఖ్యాతి, సంవిత్తు, ఈశ్వర, మతి– ఇవి అన్నీ మహత్తత్త్వస్వరూపమైన బుద్ధియొక్క పర్యాయపదాలు. బ్రాహ్మణోత్తములారా! ఈబుద్ధికి సంబంధించి ప్రసాదం మాత్రం ప్రాణాయామంతోనే సిద్ధిస్తుంది.

**విస్వరో విస్వరీభావో ద్వంద్వానాం మునిసత్తమాః ।**
**అగ్రజః సర్వతత్త్వానాం మహాన్ యః పరిణామతః ॥ 70 ॥**

ఓ మునిశ్రేష్ఠులారా! శీత, ఉష్ణాదిద్వంద్వభావాల్ని సమన్వయపర్చేది కావున విస్వరం అవుతుంది. ఇది ప్రకృతి నుంచి కలిగే అన్ని తత్త్వాలలోను మొదటిది మరియు గొప్పది. అందుచేతనే ఇది 'మహత్' అని పిలువబడుతుంది.

**యత్రప్రమాణగుహా ప్రజ్ఞా మనస్తు మనుతే యతః ।**
**బృహత్త్వాద్ బృంహణత్వాచ్చ బ్రహ్మ బ్రహ్మవిదాం వరాః ॥ 71 ॥**

ఓ బ్రాహ్మణోత్తములారా! ప్రమాణాలన్నింటికి ఆశ్రయం, ఆధారం(భాండాగారం) అవడం వల్ల ప్రజ్ఞ అవుతుంది. మననం పొందడంచేత మనసు అవుతుంది. పెద్దది అవటంచేత మరియు వృద్ధినిచ్చుటచేత బ్రహ్మ అవుతున్నది.

**సర్వకర్మాణి  భోగార్థం యచ్చినోతి చితిః స్మృతా ।**
**స్మరతే యత్స్మృతిః సర్వం సంవిద్వై విందతే యతః ॥ 72 ॥**

సమస్తకర్మల్ని అనుభవించడానికై ఒక్కచోటే సమన్వయం పర్చేది కాబట్టి 'చితి'(చిత్తం) అనబడుతున్నది.

సర్వవిషయాల్ని గుర్తు ఉంచుకోవడంవల్ల 'స్మృతి' అవుతున్నది. అన్ని విషయాల్ని పొందుతుంది కాబట్టి 'సంవిత్' అవుతున్నది.

**ఖ్యాయతే యత్త్వితి ఖ్యాతిర్జ్ఞానాదిభిరనేకశః ।**
**సర్వతత్త్వాధిపః సర్వం విజానాతి యదీశ్వరః ॥ 73 ॥**

వివిధ జ్ఞానములచే విశేషంగా ప్రకాశించునది (వ్యాఖ్యానింపబడునది) కావున ఖ్యాతి అవుతున్నది. సమస్తతత్త్వాలయొక్క ప్రభువు అయినందున 'ఈశ్వర' అవుతున్నది.

**మనుతే మన్యతే యస్మాన్మతిర్మతిమతాం వరాః ।**
**అర్థం బోధయతే యచ్చ బుధ్యతే బుద్ధిరుచ్యతే ॥ 74 ॥**

బుద్ధిమంతులలో శ్రేష్ఠులారా! మననకారణంగా(ఆలోచన) మతి అనబడుతున్నది. సర్వవిషయాలయొక్క అర్థాల్ని బోధపర్చేది మరియు బోధపడడానికి కారణం అయ్యేది బుద్ధికాగలదు.

**అస్యా బుద్ధేః ప్రసాదస్తు ప్రాణాయామేన సిద్ధ్యతి ।**
**దోషాన్ వినిర్దహేత్సర్వాన్ ప్రాణాయామాదసౌ యమీ ॥ 75 ॥**

ఈ బుద్ధికి ప్రాణాయామం వల్ల ప్రసాదం సిద్ధిస్తుంది. యోగి ఈ ప్రాణాయామం వల్ల సర్వదోషాల్ని దహింపచేసుకోగలడు.

**పాతకం ధారణాభిస్తు ప్రత్యాహారేణ నిర్దహేత్ ।**
**విషయాన్ విషవత్ ధ్యాత్వా ధ్యానేనానీశ్వరాన్ గుణాన్ ॥ 76 ॥**

ప్రత్యాహారం లేక ఇంద్రియనిరోధం చేత, ధారణలచేత పాపాలు దహనం చెందుతాయి. కామం, క్రోధం మొదలైన అనీశ్వరగుణాలైన సాంసారిక విషయాల్ని విషంలాగా భావించి ధ్యానం వల్ల యోగి వాటిని నశింపజేసుకుంటాడు.

**సమాధినా యతిశ్రేష్ఠాః ప్రజ్ఞావృద్ధిం వివర్ధయేత్ ।**
**స్థానం లబ్ధ్వైవ కుర్వీత యోగాష్టాంగాని వై క్రమాత్ ॥ 77 ॥**

**లబ్ధ్వాసనాని విధివద్యోగసిద్ధ్యర్థమాత్మవిత్ ।**
**ఆదేశకాలే యోగస్య దర్శనం హి న విద్యతే ॥ 78 ॥**

ఓ మునిశ్రేష్ఠులారా! సమాధివల్ల బుద్ధి వృద్ధిచెందుతుంది. ఉత్తమస్థానం, ఉచితాసనం సమకూర్చుకుని మాత్రమే యోగి శాస్త్రోక్తప్రకారంగా యోగాభ్యాసం చేయడం ద్వారా క్రమంగా అష్టాంగాల్ని సాధించాలి. తగిన స్థలం, యోగ్యసమయం లేక యోగసిద్ధి కలగదు.

**అగ్న్యభ్యాసే జలే వాపి శుష్కపర్ణచయే తథా ।**
**జంతువ్యాప్తే శ్మశానే చ జీర్ణగోష్ఠే చతుష్పథే ॥ 79 ॥**

**సశబ్దే సభయే వాపి చైత్యవల్మీకసంచయే ।**
**అశుభే దుర్జనాక్రాంతే మశకాదిసమన్వితే ॥ 80 ॥**

**నా చరేద్దేహబాధాయాం దౌర్మనస్యాదిసంభవే ।**
**సుగుప్తే తు శుభే రమ్యే గుహాయాం పర్వతస్య తు ॥ 81 ॥**

**భవక్షేత్రే సుగుప్తే వా భవారామే వనేఽపి వా ।**
**గృహే తు సుశుభే దేశే విజనే జంతువర్జితే ॥ 82 ॥**

**అత్యంతనిర్మలే సమ్యక్ సుప్రలిప్తే విచిత్రితే ।**
**దర్పణోదరసంకాశే కృష్ణాగరుసుధూపితే ॥ 83 ॥**

**నానాపుష్పసమాకీర్ణే వితానోపరి శోభితే ।**
**ఫలపల్లవమూలాఢ్యే కుశపుష్పసమన్వితే ॥ 84 ॥**

**సమాసనస్థో యోగాంగాన్యభ్యసేద్ధృషితః స్వయమ్ ।**
**ప్రణిపత్య గురుం పశ్చాద్భవం దేవీం వినాయకమ్ ॥ 85 ॥**

**యోగీశ్వరాన్ సశిష్యాం చ యోగం యుంజేత యోగవిత్ ।**
**ఆసనం స్వస్తికం బద్ధ్వా పద్మమర్ధాసనం తు వా ॥ 86 ॥**

అగ్నికి దగ్గరలో, నీటిలో, ఎండుటాకుల కుప్పపై, కీటకాలు ఎక్కువగా ఉన్నచోట, శ్మశానంలో, పాడుబడిన పశుశాలలో, రహదారుల కూడలిలో, కోలాహలంగా ఉండు ప్రదేశంలో, భయోత్పాతం కలిగించే ప్రదేశంలో,

దుష్టులు ఆక్రమించిన స్థలంలో, దోమలు ఎక్కువగా ఉన్నచోట యోగాభ్యాసం చేయరాదు. శరీరం అస్వస్థత చెందినపుడు, మనసువిచారగ్రస్తమై ఉన్నపుడూ యోగాభ్యాసం చేయరాదు. మిక్కిలి ఏకాంతం, పవిత్రం మరియు రమ్యం అయిన పర్వతగుహలో, శివాలయంలోను, వనంలోనూ, జంతువులు, మనుష్యులులేని మిక్కిలి పవిత్రమైన ఇంటిలోనూ యోగాన్ని అభ్యసించాలి, అయితే అది బాగా అలుకబడినదై అందంగా అమర్చబడి అద్దంలాగా స్వచ్ఛంగా ఉండాలి. పూలు చల్లబడి ఉండాలి. పలువిధాలైన పూలు, పల్లవాలు, ఫలాలతో అలంకరింపబడి ఉండాలి. దర్భలతో పై కప్పు నిర్మించాలి. ఇటువంటి దివ్యస్థలాల్లో అర్హమైన ఆసనంలో కూర్చుండి ప్రసన్నమైన మనస్సుతో యోగాంగాల్ని అభ్యసించాలి. గురువుకు, శివభగవానుడికి, పార్వతీమాతకు, గణపతికి, శిష్యగణంతో కూడిన యోగీశ్వరులకు నమస్కరించి పిమ్మట స్వస్తిక పద్మాసనం లేక అర్ధాసనంలో ఆసీనుడవ్వాలి.

**సమజానుస్తథా ధీమానేకజానురథాపి వా ।**
**సమం దృఢాసనో భూత్వా సంహృత్య చరణావుభౌ ॥ 87 ॥**

**సంవృతాస్యోపబద్ధాక్ష ఉరో విష్టభ్య చాగ్రతః ।**
**పార్ష్ణిభ్యాం వృషణౌ రక్షంస్తథా ప్రజననం పునః ॥ 88 ॥**

**కించిదున్నామితశిరా దంతైర్దంతాన్న సంస్పృశేత్ ।**
**సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ॥ 89 ॥**

**తమః ప్రచ్ఛాద్య రజసా రజః సత్త్వేన ఛాదయేత్ ।**
**తతః సత్త్వస్థితో భూత్వా శివధ్యానం సమభ్యసేత్ ॥ 90 ॥**

బుద్ధిమంతుడైన ఆ యోగి మోకాళ్లను ఒకే విధంగా, సమంగా, అనగా నిటారుగా ఉంచడంగాని లేక ఒక మోకాలును రెండవమోకాలిపై ఉంచటంగాని చేయాలి. మరియు నోటిని, కన్నుల్ని మూసుకుని ఉండాలి. వక్షఃస్థలాన్ని ముందుకు వచ్చునట్లు చేయాలి. జననాంగాన్ని, వృషాణాల్ని పిక్కలతో మూసి ఉంచాలి. శిరస్సును కొద్దిగా పైకి ఎత్తి, దంతాల్ని పరస్పరం తగలకుండా ఉంచాలి. దృష్టిని నాసిక చివరి భాగంపై ఉంచాలి. దృష్టిని అటుఇటూ కదిపి(త్రిప్పి) దిక్కులు చూడరాదు. తమోగుణాన్ని రజోగుణంతోను, రజోగుణాన్ని సత్త్వగుణంతోను కప్పివేసి తుదకు సత్త్వగుణస్థితినిపొంది శివధ్యానాన్ని బాగా అభ్యసించాలి.

**ఓంకారవాచ్యం పరమం శుద్ధం దీపశిఖాకృతిమ్ ।**
**ధ్యాయేద్వై పుండరీకస్య కర్ణికాయాం సమాహితః ॥ 91 ॥**

**నాభేరధస్తాద్వా విద్వాన్ ధ్యాత్వా కమలముత్తమమ్ ।**
**త్ర్యంగులే చాష్టకోణం వా పంచకోణమథాపి వా ॥ 92 ॥**

**త్రికోణం చ తథాగ్నేయం సౌమ్యం సౌరం స్వశక్తిభిః ।**
**సౌరం సౌమ్యం తథాగ్నేయమథవానుక్రమేణ తు ॥ 93 ॥**

**ఆగ్నేయం చ తతః సౌరం సౌమ్యమేనం విధానతః ।**
**అగ్నేరధః ప్రకల్ప్యైవం ధర్మాదీనాం చతుష్టయమ్ ॥ 94 ॥**

**గుణత్రయం క్రమేణైవ మండలోపరి భావయేత్ ।**
**సత్త్వస్థం చింతయేద్రుద్రం స్వశక్త్యాపరిమండితమ్ ॥ 95 ॥**

దీపశిఖాకృతికి సమానంగా పరమపవిత్రమైన పద్మపత్రాలపై నిలిచి ఉన్న ఓంకారరూపుడైన పరబ్రహ్మను ధ్యానించాలి. ఆ పండితుడు(సాధకుడు) తననాభికి మూడు అంగుళాలు క్రిందగల ఉత్తమమైన అష్టకోణ, త్రికోణ, పంచకోణాలు కేంద్రస్థానంలోగల పద్మాన్ని ధ్యానించాలి. సాధకుడు అగ్ని, చంద్రుడు, సూర్యుల్ని ఒకేసారి క్రమంగా ధ్యానించాలి. ముందుగా సూర్యుణ్ణి, తర్వాత చంద్రుణ్ణి, పిమ్మట అగ్నిని లేక ముందుగా అగ్నిని, పిమ్మట సూర్యుణ్ణి, తర్వాత చంద్రుణ్ణి శాస్త్రాలలో చెప్పిన విధంగా ఏవరుసలోనైనా ధ్యానింపవచ్చు. ఆతడు ధర్మార్థాదిపురుషార్థాల్ని అగ్నికి క్రిందగా భావించుకుని మండలంపై త్రిగుణాల్ని ధ్యానించాలి. పిమ్మట సత్త్వగుణోపేతుడైన శక్తిశోభితుడైన(పార్వతీదేవితో) రుద్రుణ్ణి ధ్యానించాలి.

**నాభౌ వాథ గలే వాపి భ్రూమధ్యే వా యథావిధి ।**
**లలాటఫలికాయాం వా మూర్ధ్ని ధ్యానం సమాచరేత్ ॥ 96 ॥**

నాభి, కంఠం, భ్రూమధ్యం, లలాటపట్టం లేక శిరస్సుమధ్యలోగాని దృష్టిని నిలిపి ధ్యానించాలి.

**ద్విదలే షోడశారే వా ద్వాదశారే క్రమేణ తు ।**
**దశారే వా షడస్రే వా చతురస్రే స్మరేచ్ఛివమ్ ॥ 97 ॥**

ఆతడు క్రమంగా రెండు, పదహారు, పంద్రెండు, పది, ఆరు లేక నాలుగు రేకులు గల పద్మంపై ఉపవిష్టుడై ఉన్న శివుణ్ణి ధ్యానించాలి.

**కనకాభే తథాంగారసన్నిభే సుసితేఽపి వా ।**
**ద్వాదశాదిత్యసంకాశే చంద్రబింబసమేఽపి వా ॥ 98 ॥**

**విద్యుత్కోటినిభే స్థానే చింతయేత్పరమేశ్వరమ్ ।**
**అగ్నివర్ణోఽథ వా విద్యుద్వలయాభే సమాహితః ॥ 99 ॥**

**వజ్రకోటిప్రభే స్థానే పద్మరాగనిభేఽపి వా ।**
**నీలలోహితబింబే వా యోగీ ధ్యానం సమభ్యసేత్ ॥ 100 ॥**

ఆతడు బంగారంతో సమానంగా, మండుతున్న అగ్నితో సమానంగా ప్రకాశిస్తున్న స్థానంలో ఉండిగాని లేక ద్వాదశాదిత్యులతో సమానంగా ప్రకాశిస్తున్న స్థానంలో ఉండిగాని, చంద్రుడితో సమానస్థానమందుండిగాని ధ్యానించాలి. కోటికోటి విద్యుత్కాంతులతో సమానమైన లేక అగ్నివలె ప్రకాశించే స్థానంలోగాని, విద్యుత్

చక్రసమాహితస్థానంతో సమానమైన స్థానంలోగాని, కోటికోటి వజ్రసన్నిభమైన లేక పద్మరాగమణులతో సమానకాంతిగల ప్రదేశంలోగాని, సూర్యబింబ స్థానంలోగాని స్వాస్థ్యం పొందిన చిత్తంతో పరమేశ్వరుణ్ణి ధ్యానించాలి.

**మహేశ్వరం హృది ధ్యాయేన్నాభిపద్మే సదాశివమ్ ।**
**చంద్రచూడం లలాటే తు భ్రూమధ్యే శంకరం స్వయమ్ ॥ 101 ॥**

**దివ్యే చ శాశ్వతస్థానే శివధ్యానం సమభ్యసేత్ ।**
**నిర్మలం నిష్కలం బ్రహ్మ సుశాంతం జ్ఞానరూపిణమ్ ॥ 102 ॥**

**అలక్షణమనిర్దేశ్యమణోరల్పతరం శుభమ్ ।**
**నిరాలంబమతర్క్యం చ వినాశోత్పత్తివర్జితమ్ ॥ 103 ॥**

**కైవల్యం చైవ నిర్వాణం నిఃశ్రేయసమనూపమమ్ ।**
**అమృతం చాక్షరం బ్రహ్మ హ్యపునర్భవమద్భుతమ్ ॥ 104 ॥**

**మహానందం పరానందం యోగానందమనామయమ్ ।**
**హేయోపాదేయరహితం సూక్ష్మాత్సూక్ష్మతరం శివమ్ ॥ 105 ॥**

**స్వయం వేద్యమవేద్యం తచ్ఛివం జ్ఞానమయం పరమ్ ।**
**అతీంద్రియమనాభాసం పరం తత్త్వం పరాత్పరమ్ ॥ 106 ॥**

**సర్వోపాధివినిర్ముక్తం ధ్యానగమ్యం విచారతః ।**
**అద్వయం తమసశ్చైవ పరస్తాత్సంస్థితం పరమ్ ॥ 107 ॥**

**మనస్యేవ మహాదేవం హృత్పద్మే వాపి చింతయేత్ ।**
**నాభౌ సదాశివం చాపి సర్వదేవాత్మకం విభుమ్ ॥ 108 ॥**

హృదయస్థానంలో మహేశ్వరుణ్ణి, నాభిపద్మంలో సదాశివుణ్ణి, లలాటస్థానంలో చంద్రచూడుణ్ణి, భ్రూమధ్యంలో శంకరుణ్ణి ధ్యానించాలి. అట్లే దివ్యమూ, శాశ్వతస్థానమైన మూర్ధమందు శివుణ్ణి ధ్యానించాలి. శివుడు నిర్మలుడు, నిష్కళంకుడు, బ్రహ్మస్వరూపుడు. ఆతడు శాంతి, జ్ఞానమూ కూడా. ఆతడు లక్షణరహితుడు. ఎవ్వరూ నిర్దేశించలేనివాడు. అణువుకంటే సూక్ష్మమైనవాడు. కళ్యాణకారకుడు. ఆశ్రయరహితుడు. తర్కానికి అందనివాడు. పుట్టుక మరియు చావు లేనివాడు. మోక్షస్వరూపుడు. పోలికలేనివాడు. అమృతస్వరూపుడు. కళ్యాణకారి. నశించనివాడు. పునర్భవంలేని బ్రహ్మస్వరూపుడు. ఆతడు అద్భుతమైనవాడు. గొప్ప ఆనందస్వరూపుడు. పరమానందుడు. యోగానందుడు. వ్యాధిరహితుడు. దాన, ఆదానరహితుడు. సూక్ష్మం కంటే సూక్ష్మమైనవాడు. కళ్యాణమయుడు. స్వయంగా తెలియదగినవాడు మరియు తెలియలేనివాడు. గొప్ప జ్ఞానమయుడు. ఇంద్రియాతీతుడు. ఆభాసంలేనివాడు.(లేనిది ఉన్నట్లు కన్పించడం ఆభాస)

పరతత్త్వం అయినవాడు. సర్వోపాధిరహితుడు. విచారపూర్వకధ్యానంచేత ప్రాప్తించువాడు. అద్వైతుడు. అంధకారంచే ఆవరింపబడికూడా పరమమైన రూపంగలవాడు. ఇలాంటి శివుణ్ణి హృదయకమలంలో ఉంచుకుని ధ్యానించాలి. అట్లే సర్వదేవాత్మకుడైన, ప్రభువైన సదాశివుణ్ణి నాభియందు నిల్పి ధ్యానించాలి.

**దేహమధ్యే శివం దేవం శుద్ధజ్ఞానమయం విభుమ్ ।**
**కన్యసేనైవ మార్గేణ చోద్ఘాతేనాపి శంకరమ్ ॥ 109 ॥**

**క్రమశః కన్యసేనైవ మధ్యమేనాపి సువ్రతః ।**
**ఉత్తమేనాపి వై విద్వాన్ కుంభకేన సమభ్యసేత్ ॥ 110 ॥**

సువ్రతుడైన సాధకుడు సుషుమ్నానాడితో పండ్రెండు మాత్రలతో కూడిన మందమైన(చిన్నదైన) కుంభకంతో గాని ఇరువదినాల్గు మాత్రాత్మకమైన మధ్యమకుంభకంతోగాని ముప్పైఆరు మాత్రాత్మకమైన ఉత్తమకుంభకంద్వారాగాని కళ్యాణప్రదుడు మరియు శుద్ధుడయిన శివుణ్ణి ధ్యానించాలి.

**ద్వాత్రింశద్రేచయేద్ధీమాన్ హృది నాభౌ సమాహితః ।**
**రేచకం పూరకం త్యక్త్వా కుంభకం చ ద్విజోత్తమాః ॥ 111 ॥**

**సాక్షాత్సమరసేనైవ దేహమధ్యే స్మరేచ్ఛివమ్ ।**
**ఏకీభావం సమేత్యైవం తత్ర యద్రససంభవమ్ ॥ 112 ॥**

**ఆనందం బ్రహ్మణో విద్వాన్ సాక్షాత్సమరసో స్థితః ।**
**ధారణా ద్వాదశాయామా ధ్యానం ద్వాదశ ధారణమ్ ॥ 113 ॥**

**ధ్యానం ద్వాదశకం యావత్సమాధిరభిధీయతే ।**
**అథవా జ్ఞానినాం విప్రాః సంపర్కాదేవ జాయతే ॥ 114 ॥**

ఓ బ్రాహ్మణోత్తములారా! హృదయకమలంలోగాని, నాభికమలంలోగాని ధ్యానాన్ని కేంద్రీకరించిన బుద్ధిమంతుడైన సాధకుడు ముప్పైరెండు మాత్రాత్మకమైన రేచకాన్ని ఆచరించాలి. లేదా రేచకాన్ని అలాగే పూరకాన్ని విడిచిపెట్టి కేవలం కుంభకమందే స్థిరుడై అభేదరూపమైన తన శరీరమధ్యంలో శివుణ్ణి ధ్యానించాలి.

ఈవిధంగా అభేదరూపంలో(సమరస) స్థిరుడైన పండితుడైన సాధకుడు ఈశ్వరుడికి జీవజాలానికి ఐక్యాన్ని పొంది దేహమధ్యమంలో ఉపయుక్తమైన సంతులావస్థలో బ్రహ్మానందాన్ని పొందుతాడు. (పూరకం– ఊపిరిపీల్చడం, రేచకం– ఊపిరివిడవడం, కుంభకం– ఊపిరి బిగబట్టడం)

పండ్రెండు ప్రాణాయామాలు ఒకధారణ అవుతుంది. అట్లే పండ్రెండు ధారణలు ఒకధ్యానం అవుతుంది. అలాంటి పండ్రెండు ధ్యానాలు ఒకసమాధి అవుతుంది.

**ప్రయత్నాద్వా తయోస్తుల్యం చిరాద్వా హ్యచిరాద్ ద్విజాః ।**
**యోగాంతరాయాస్తస్యాథ జాయంతే యుంజతః పునః ॥ 115 ॥**

**నశ్యంత్యభ్యాసతస్తేఽపి ప్రణిధానేన వై గురోః ।**

ఓ బ్రాహ్మణోత్తములారా! యోగసిద్ధి జ్ఞానులయొక్క సమాగమంతోగాని లేక ప్రయత్నంతోగాని ప్రాప్తిస్తుంది. బ్రాహ్మణులారా! ఈరెండు సాధనలు సమానాలే. ఇది కొందరికి త్వరగా మరికొందరికి ఆలస్యంగా సిద్ధిస్తుంది. వారి పూర్వజన్మకు చెందిన అభ్యాస, అనభ్యాసాలు ఇందుకు కారణం. యోగసాధనవిధిలో మాటిమాటికి విఘ్నాలు కలుగుతుంటాయి. అయితే అవి నిరంతరాభ్యాసంతో అట్లే గురువుయొక్క సామీప్యం వల్ల తొలగిపోతాయి

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే అష్టాంగయోగ నిరూపణం నామ అష్టమోఽధ్యాయః ॥ 8 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని అష్టాంగయోగ నిరూపణం అనే ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **నవమోఽధ్యాయః** – తొమ్మిదవ అధ్యాయం

## **యోగాంతరాయకథనమ్** – యోగాంతరాయకథనం

**సూత ఉవాచ** – సూతమహర్షి పలికాడు.

> **ఆలస్యం ప్రథమం పశ్చాత్ వ్యాధిపీడా ప్రజాయతే ।**
> **ప్రమాదః సంశయస్థానే చిత్తస్యేహానవస్థితిః ॥ 1 ॥**
>
> **అశ్రద్ధాదర్శనం భ్రాంతిర్దుఃఖం చ త్రివిధం తతః ।**
> **దౌర్మనస్యమయోగ్యేషు విషయేషు చ యోగతా ॥ 2 ॥**
>
> **దశధాభిప్రజాయంతే మునేర్యోగాంతరాయకాః ।**
> **ఆలస్యం చాప్రవృత్తిశ్చ గురుత్వాత్కాయచిత్తయోః ॥ 3 ॥**

ఓ మహర్షులారా! యోగికి ఈపది విధాలైన అంతరాయాలు కలుగుతాయి. మొదటిది ఆలస్యం. తర్వాత వ్యాధి వలన కలిగే బాధ. ఉపేక్ష, సంశయం, చిత్తచాంచల్యం, అశ్రద్ధ, భ్రాంతి, మూడు విధాలైన దుఃఖం, మనస్సులో చెడు మరియు వ్యతిరేకభావన. నిషిద్ధవిషయాలలో ఆసక్తి అనేవి పది ఆటంకాలు. శరీరం మరియు బుద్ధి భారం అవడంచేత కార్యాన్ని చేపట్టకుండడం 'ఆలస్యం' అవుతుంది.

> **వ్యాధయో ధాతువైషమ్యాత్ కర్మజా దోషజాస్తథా ।**
> **ప్రమాదస్తు సమాధేస్తు సాధనానామభావనమ్ ॥ 4 ॥**

వాతపిత్తాది ధాతువుల సంతులనస్థితి లేకుండుటే(ఎక్కువ తక్కువ అగుట) వ్యాధి. ఇది దోషకర్మల కారణంగా కలుగుతుంది. సమాధి యొక్క యోగాంగాల్ని సాధించడంలో ఏమరుపాటు కల్గియుండడాన్ని ప్రమాదం అంటారు. ఉపేక్షించడం ప్రమాదం.

> **ఇదం వేత్యుభయస్పృక్తం విజ్ఞానం స్థానసంశయః ।**
> **అనవస్థితచిత్తత్వమప్రతిష్ఠా హి యోగినః ॥ 5 ॥**

ఇది చేయడమా అది చేయడమా అనే ద్వైధీభావనే సంశయం అవుతుంది. యోగియొక్క మనస్సు స్థిరంగా ఉంచుకొనలేని అసామర్థ్యం అనవస్థితచిత్తం(చిత్తచాంచల్యం) కాగలదు.

> **లబ్ధాయామపి భూమౌ చ చిత్తస్య భవబంధనాత్ ।**
> **అశ్రద్ధాభావరహితా వృత్తిర్వై సాధనేషు చ ॥ 6 ॥**

యోగాభ్యాసానికి తగిన ప్రదేశం లభ్యమైననూ విషయసుఖాల మీద ఆసక్తితో మనసు ప్రవర్తించకుండా ఉండడమే, యోగం మీద ఆసక్తి లేకుండడమే అశ్రద్ధ.

**సాధ్యే చిత్తస్య హి గురౌ జ్ఞానాచారశివాదిషు ।**
**విపర్యయజ్ఞానమితి భ్రాంతిదర్శనముచ్యతే ॥ 7 ॥**

లక్ష్యం, గురువు, జ్ఞానం, ఆచారం, శివుడు మొదలైన విషయాలలో విపరీతభావనలే భ్రాంతి అనే విఘ్నం కాగలదు.

**అనాత్మన్యాత్మవిజ్ఞానమజ్ఞానాత్తస్య సన్నిధౌ ।**
**దుఃఖమాధ్యాత్మికం ప్రోక్తం తథా చైవాధిభౌతికమ్ ॥ 8 ॥**

**ఆధిదైవికమిత్యుక్తం త్రివిధం సహజం పునః ।**
**ఇచ్ఛావిఘాతాత్సంక్షోభశ్చేతసస్తదుదాహృతమ్ ॥ 9 ॥**

అజ్ఞానము వలన ఆత్మకానిది (అనాత్మ) ఆత్మగా గోచరిస్తుంది. అందుచే దుఃఖము. దుఃఖం అనేది ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధిదైవికం అని మూడువిధాలు. ఇట్లే తీరని కోరికలవలన కలిగే మానసికక్షోభవల్ల కూడా దుఃఖం కలుగుతుంది.

**దౌర్మనస్యం నిరోద్ధవ్యం వైరాగ్యేణ పరేణ తు ।**
**తమసా రజసా చైవ సంస్పృష్టం దుర్మనః స్మృతమ్ ॥ 10 ॥**

అధికమైన విరాగంవల్ల దుర్మతిని నిరోధింపవచ్చు. మనస్సు తమోగుణంచేత రజోగుణంచేత మిళితం అవ్వడంవల్ల దుర్మతి కలుగుతున్నది.

**తదా మనసి సంజాతం దౌర్మనస్యమితి స్మృతమ్ ।**
**హఠాత్స్వీకరణం కృత్వా యోగ్యాయోగ్యవివేకతః ॥ 11 ॥**

**విషయేషు విచిత్రేషు జంతోర్విషయలోలతా ।**
**అంతరాయా ఇతి ఖ్యాతా యోగస్యైతే హి యోగినామ్ ॥ 12 ॥**

**అత్యంతోత్సాహయుక్తస్య నశ్యంతి న చ సంశయః ।**
**ప్రనష్టేష్వంతరాయేషు ద్విజాః పశ్చాద్ధి యోగినః ॥ 13 ॥**
**ఉపసర్గాః ప్రవర్తంతే సర్వే తేఽసిద్ధి సూచకాః ।**
**ప్రతిభా ప్రథమా సిద్ధిర్ద్వితీయా శ్రవణా స్మృతా ॥ 14 ॥**
**వార్తా తృతీయా విప్రేంద్రాస్తురీయా చేహ దర్శనా ।**
**ఆస్వాదా పంచమీ ప్రోక్తా వేదనా షష్ఠికా స్మృతా ॥ 15 ॥**

ఇలా మనస్సులో ఉత్పన్నమయ్యే దోషభావాల వల్ల కలిగేది దుర్మతి అవుతున్నది. యోగ్యం, అయోగ్యం ఏదో తెలిసి కూడా అయోగ్యమైన చిత్రమైన విషయాలలో పట్టుదల గలిగి ఉండడమే విషయలోలత కాగలదు. యోగులకు యోగసాధనలో విఘ్నాలు కలుగుతాయి. మిక్కిలి ఉత్సాహవంతుడైన సాధకుడు వీటిని దాటగలదు. ఇందులో ఎలాంటి సందేహం లేదు.

ఓ బ్రాహ్మణులారా! విఘ్నాలు నశించిపోగా యోగులకు పలువిధాలైన ఉపద్రవాలు కలుగుతాయి. అవి అన్నీ అసిద్ధిని సూచించునట్టివే. మొదటిది 'ప్రతిభ' అనేది. రెండోసిద్ధి 'శ్రవణ' అనేది. మూడవది 'వార్త'. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! నాల్గవది 'దర్శనం' ఐదవది 'ఆస్వాదనం' ఆరవది 'వేదన' (అప్రధానాలైన ఈ అల్పసిద్ధులు ఉ పద్రవాలే)

**స్వల్పషట్సిద్ధిసంత్యాగాత్ సిద్ధిదాః సిద్ధయో మునేః ।**
**ప్రతిభా ప్రతిభావృత్తిః ప్రతిభావ ఇతి స్థితిః ॥ 16 ॥**

**బుద్ధిర్వివేచనా వేద్యం బుద్ధ్యతే బుద్ధిరుచ్యతే ।**
**సూక్ష్మే వ్యవహితేఽతీతే విప్రకృష్టేత్వనాగతే ॥ 17 ॥**

**సర్వత్ర సర్వదా జ్ఞానం ప్రతిభానుక్రమేణ తు ।**
**శ్రవణాత్సర్వశబ్దానామప్రయత్నేన యోగినః ॥ 18 ॥**

**హ్రస్వదీర్ఘప్లుతాదీనాం గుహ్యానాం శ్రవణాదపి ।**
**స్పర్శస్యాధిగమో యస్తు వేదనా తూపపాదితా ॥ 19 ॥**

ప్రతిభ మొదలైన ఉపద్రవసిద్ధుల్ని విడిచిపెట్టిన యోగికి అణిమాది అష్టసిద్ధులు కలుగుతాయి. పదార్థ సంబంధి విషయాన్ని అవగాహన చేసుకునే శక్తినే ప్రతిభ అంటారు. భూతభవిష్యద్వర్తమానాల యొక్కయు, సూక్ష్మమూ, అదృష్టమూ, దూరమందున్నట్టి పదార్థాల యొక్కయు, జ్ఞానాన్ని ఎల్లప్పుడూ, అన్ని చోట్ల పొందే ప్రతిభావంతమైన వృత్తే 'ప్రతిభ' అవుతుంది. వివేచనాపూర్వకంగా తెలియదగిన వస్తువును తెలిసికొనుటే బుద్ధి అంటారు. ప్రయత్నించకయే శ్రవణమాత్రమున హ్రస్వదీర్ఘ ప్లుతాత్మకమైన సర్వశబ్దాల్ని అట్లే దాగియున్న శబ్దాల్ని వినగలగడమే శ్రమణమనే సిద్ధి అవుతుంది. స్పర్శానుభూతియే 'వేదనా' సిద్ధికాగలదు.

**దర్శనాద్దివ్యరూపాణాం దర్శనం చాప్రయత్నతః ।**
**సంవిద్దివ్యరసే తస్మిన్నాస్వాదో హ్యప్రయత్నతః ॥ 20 ॥**

**వార్తా చ దివ్యగంధానాం తన్మాత్రా బుద్ధిసంవిదా ।**
**విందంతే యోగినస్తస్మాదాబ్రహ్మభవనం ద్విజాః ॥ 21 ॥**

**జగత్యస్మిన్ హి దేహస్థం చతుఃషష్టిగుణం సమమ్ ।**
**ఔపసర్గికమేతేషు గుణేషు గుణితం ద్విజాః ॥ 22 ॥**

ఎట్టి ప్రయత్నం లేకుండా దివ్యమైన రూపాల్ని చూడడమే దర్శనసిద్ధి. ఇట్లే ఎటువంటి ప్రయత్నం చేయకుండానే దివ్యరసాన్ని ఆస్వాదించే శక్తియే 'ఆస్వాదం' అవుతుంది. సూక్ష్మతత్త్వాల్ని, దివ్యగంధాల్ని గ్రహించే బుద్ధి యొక్క శక్తే 'వార్త' అనే సిద్ధి కాగలదు. ఓ బ్రాహ్మణులారా! యోగులైనవారు బ్రహ్మపర్యంతం సమస్తలోకాల్ని గూర్చిన జ్ఞానాన్ని పొందుతారు. ఈ విశ్వంలోని అరవైనాల్గు గుణాలు (64 కళలు) సక్రమంగా శరీరంలో నిలిచి ఉన్నాయి. ఓ బ్రాహ్మణులారా! యోగసాధకులు ఇలాంటి విఘ్నకారకాలైన ఔపసర్గికసిద్ధుల్ని పరిత్యజించాలి.

**సంత్యాజ్యం సర్వథా సర్వమౌపసర్గికమాత్మనః ।**
**పైశాచో పార్థివం చాప్యం రాక్షసానాం పురే ద్విజాః ॥ 23 ॥**

**యాక్షే తు తైజసం ప్రోక్తం గాంధర్వే శ్వసనాత్మకమ్ ।**
**ఐంద్రే వ్యోమాత్మకం సర్వం సౌమ్యే చైవ తు మానసమ్ ॥ 24 ॥**

**ప్రాజాపత్యే త్వహంకారం బ్రాహ్మే బోధమనుత్తమమ్ ।**
**ఆద్యే చాష్టౌ ద్వితీయే చ తథా షోడశరూపకమ్ ॥ 25 ॥**

**చతుర్వింశత్తృతీయే తు ద్వాత్రింశచ్చ చతుర్థకే ।**
**చత్వారింశత్ పంచమే తు భూతమాత్రాత్మకం స్మృతమ్ ॥ 26 ॥**

**గంధో రసస్తథా రూపం శబ్దః స్పర్శస్తథైవ చ ।**
**ప్రత్యేకమష్టధా సిద్ధం పంచమేతచ్ఛతక్రతోః ॥ 27 ॥**

పిశాచక్షేత్రంలో పృథ్వీసంబంధగుణాల్ని, రాక్షసక్షేత్రంలో జలసంబంధగుణాల్ని, యక్షులయొక్క క్షేత్రంలో అగ్నిసంబంధగుణాల్ని గంధర్వలోకంలో శ్వాసగుణాల్ని, ఇంద్రలోకంలో వ్యోమసంబంధగుణాల్ని, సోమునిలోకంలో మనస్సునకు చెందిన గుణాల్ని, ప్రజాపతిక్షేత్రంలో అహంకారగుణాల్ని, బ్రహ్మక్షేత్రంలో బుద్ధిసంబంధ గుణాల్ని యోగసాధకులు ఎల్లప్పుడూ పరిత్యజించాలి. మొదటిదైన పృథ్విలో ఎనిమిదిగుణాలు, రెండవదైన జలంలో పదహారుగుణాలు, మూడవదైన అగ్నిలో ఇరవైనాల్గు గుణాలు, నాలుగవదైన శ్వాసలో ముప్పైరెండు గుణాలు, అయిదవదైన వ్యోమంలో నలభైగుణాలు ఉంటాయి. ఇవి పంచభూతాలకు చెంది ఉన్నాయి. ఈ అయిదు సూక్ష్మతత్త్వాలైన గంధ, రస, రూప, స్పర్శ, శబ్దాలు ప్రత్యేకించి ఇంద్రసంబంధమై ఎనిమిది ప్రకారాలుగా సిద్ధిపొందుతున్నాయి.

**తథాష్టచత్వారింశచ్చ షట్పంచాశత్తథైవ చ ।**
**చతుః షష్టిగుణం బ్రాహ్మం లభతే ద్విజసత్తమాః ॥ 28 ॥**

ఓ బ్రాహ్మణోత్తములారా! తదుపరి మనస్సుకి చెందినవి నలభై ఎనిమిది గుణాలు, అహంకారానికి సంబంధించి యాభైఆరు గుణాలు, బ్రహ్మకుచెందిన బుద్ధికి సంబంధించి అరవైనాలుగు గుణాలు ఉన్నాయి.

**ఔపసర్గికమాబ్రహ్మభువనేషు పరిత్యజేత్ ।**
**లోకేష్వాలోక్య యోగేన యోగవిత్పరమం సుఖమ్ ॥ 29 ॥**

బ్రహ్మలోకం వరకు అన్నిలోకాలలోను యోగులు యోగం ద్వారా యోగవిఘ్నాల్ని గుర్తించి వాటిని విడిచిపెట్టి పరబ్రహ్మసాక్షాత్కారాన్ని పొందాలి.

**స్థూలతా హ్రస్వతా బాల్యం వార్ధక్యం యౌవనం తథా ।**
**నానాజాతిస్వరూపం చ చతుర్భిర్దేహధారణమ్ ॥ 30 ॥**

**పార్థివాంశం వినా నిత్యం సురభిర్గంధసంయుతః ।**
**ఏతదష్టగుణం ప్రోక్తమైశ్వర్యం పార్థివం మహత్ ॥ 31 ॥**

పార్థివయోగసిద్ధి భూమికి చెందింది. మహావైభవంగల యిది ఎనిమిదివిధాలు. స్థూలత, హ్రస్వత(తేలికతనం) బాల్యం, యౌవనం, వృద్ధాప్యం, అనేక జాతిరూపాల్ని ధరించడం, పృథ్వీతత్త్వాన్ని విడిచి మిగిలిన నాలుగు తత్త్వాలతో శరీరాన్ని ధరించడం, నిరంతరం సుగంధాలతో కూడి యుండడం.

**జలే నివసనం యద్వద్భూమ్యామివ వినిర్గమః ।**
**ఇచ్ఛేచ్ఛక్తః స్వయం పాతుం సముద్రమపి నాతురః ॥ 32 ॥**

**యత్రేచ్ఛతి జగత్యస్మిన్ తత్రాస్య జలదర్శనమ్ ।**
**యద్యద్వస్తు సమాదాయ భోక్తుమిచ్ఛతి కామతః ॥ 33 ॥**

**తత్తద్రసాన్వితం తస్య త్రయాణాం దేహధారణమ్ ।**
**భాండం వినాథ హస్తేన జలపిండస్య ధారణమ్ ॥ 34 ॥**

**అవ్రణత్వం శరీరస్య పార్థివేన సమన్వితమ్ ।**
**ఏతత్ షోడశకం ప్రోక్తమాప్యమైశ్వర్యముత్తమమ్ ॥ 35 ॥**

భూమి మీద లాగానే నీటిలో ఉండడం, ఇచ్ఛానుసారంగా నీటి నుంచి బయటకు రావడం, ఎలాంటి కష్టం లేకుండా సముద్రమంతటిని త్రాగివేయడం. ఎక్కడైతే జలం కావాలో అక్కడ నీటిని పుట్టించడం, తినదలచిన పదార్థాన్ని ఎట్టిదానినైనా రుచికరంగా మార్చడం, మూడు తత్త్వాలతోనే అనగా అగ్నివాయువు ఆకాశాలతోనే శరీరాన్ని ధరించటం, ఎట్టి పాత్ర లేకనే చేతులందే అధికజలరాశిని ధరించటం, ఎట్టి కోతలు, గాయాలులేకుండా శరీరాన్ని ఉంచటం అనే యీ ఎనిమిది సిద్ధులతోపాటు ఎనిమిది పార్థివసిద్ధులు కలసి పదహారూ ఉత్తమమైన జలసిద్ధులుగా నిలుస్తున్నవి. వీనినే ఐశ్వర్యమనీ చెప్పవచ్చు.

**దేహాదగ్నివినిర్మాణం తత్తాపభయవర్జితమ్ ।**
**లోకం దగ్ధమపీహాన్యదదగ్ధం స్వవిధానతః ॥ 36 ॥**

**జలమధ్యే హుతవహం చాధాయ పరిరక్షణమ్ ।**
**అగ్నినిగ్రహణం హస్తే స్మృతి మాత్రేణ చాగమః ॥ 37 ॥**

**భస్మీభూతవినిర్మాణం యథాపూర్వం సకామతః ।**
**ద్వాభ్యాం రూపనిష్పత్తిర్వినా తైస్త్రిభిరాత్మనః ॥ 38 ॥**

**చతుర్వింశాత్మకం హ్యేతత్తైజసం మునిపుంగవాః ।**
**మనోగతిత్వం భూతానామంతర్నివసనం తథా ॥ 39 ॥**

**పర్వతాదిమహాభారస్కంధేనోద్వహనం పునః ।**
**లఘుత్వం చ గురుత్వం చ పాణిభ్యాం వాయుధారణమ్ ॥ 40 ॥**

**అంగుల్యగ్రనిఘాతేన భూమేః సర్వత్ర కంపనమ్ ।**
**ఏకేన దేహనిష్పత్తిర్వాత్వైశ్వర్యం స్మృతం బుధైః ॥ 41 ॥**

శరీరంనుంచి అగ్నిని పుట్టించేశక్తి, అగ్నియొక్క వేడికి భయపడకుండడం, ప్రపంచమంతయు కాలిపోయినా కోరిన వస్తువును కాలిపోకుండా ఉంచటం, నీటిలో అగ్నిని నిలపడం, అగ్నిని అరచేతులలో ధరించడం, తలచినంతనే అగ్నిని పుట్టించడం, పూర్తిగా కాలిపోయిన తర్వాత కూడా ఆ బూడిద నుంచి మరల ఇష్టమైన ఆ వస్తువుని సృష్టించడం.

కేవలం రెండు తత్త్వాలతోనే అనగా వాయువు ఆకాశతత్త్వాలతో మిగిలిన మూడు తత్త్వాల్ని వదలి శరీరధారణం చేయడం అనేవి ఇరవైనాలుగు 'తైజసం' లేక అగ్నిసిద్ధులు.(పృథ్వీసిద్ధులు–8, జలసిద్ధులు–8, అగ్నిసిద్ధులు–8 మొత్తం ఇరవైనాలుగు)

మనోవేగంతో ప్రయాణించే శక్తి, ప్రాణుల శరీరాలలో ప్రవేశించేశక్తి, పరకాయప్రవేశం అని అర్థం. పర్వతం మొదలైన మిక్కిలి బరువైన వస్తువుల్ని భుజాలపై మోసి భరించేశక్తి. తేలికతనం, అతిభారం, చేతులతో గాలిని పట్టుకోవడం(ధరించడం) వ్రేలిచివరిభాగంతో భూమినంతటిని కంపింపజేయగలశక్తి, వాయువుతో వస్తువుల్ని సృజించగలశక్తి అనే యీఎనిమిది వాయుతత్త్వసిద్ధులు.

**ఛాయావిహీననిష్పత్తిరింద్రియాణాం చ దర్శనమ్ ।**
**ఆకాశగమనం నిత్యమింద్రియార్థైః సమన్వితమ్ ॥ 42 ॥**

**దూరే చ శబ్దగ్రహణం సర్వశబ్దావగాహనమ్ ।**
**తన్మాత్రలింగగ్రహణం సర్వప్రాణినిదర్శనమ్ ॥ 43 ॥**

**ఐంద్రమైశ్వర్యమిత్యుక్తమేతైరుక్తః పురాతనః ।**
**యథా కామోపలబ్ధిశ్చ యథాకామవినిర్గమః ॥ 44 ॥**

**సర్వత్రాభిభవశ్చైవ సర్వగుహ్య నిదర్శనమ్ ।**
**కామానురూపనిర్మాణం వశిత్వం ప్రియదర్శనమ్ ॥ 45 ॥**

**సంసారదర్శనం చైవ మానసం గుణలక్షణమ్ ।**
**ఛేదనం తాడనం బంధం సంసారపరివర్తనమ్ ॥ 46 ॥**

**సర్వభూతప్రసాదశ్చ మృత్యుకాలజయస్తథా ।**
**ప్రాజాపత్యమిదం ప్రోక్తమాహంకారికముత్తమమ్ ॥ 47 ॥**

నీడ లేకుండా ఉండగలశక్తి, ఇంద్రియాల్ని ప్రత్యక్షంగా చూడగల్గడం, ఆకాశమందు సంచారం, ఇంద్రియాలయొక్క అర్థజ్ఞానం, ఎంతదూరం నుంచి అయినా శబ్దాల్ని వినగలిగేశక్తి, ఎట్టి ధ్వనులనైనా గ్రహించగలశక్తి, సూక్ష్మతత్త్వాలచేత మాత్రమే శరీరాన్ని ధరించేశక్తి, సర్వప్రాణుల్ని ప్రత్యక్షంగా చూడగలశక్తి ఈ ఎనిమిదియు ఐంద్రసిద్ధులు. (ఇంద్రసంబంధసిద్ధులు) కోరిన వాటిని పొందగల్గు సామర్థ్యం, కోరుకొనిన చోటుకు పోగలిగేశక్తి,

అన్ని చోటులందు ఉండే సామర్థ్యం, సమస్తమైన గూఢవస్తువుల్ని తనవిగా చేసుకునే సమర్థత, ఇష్టమొచ్చినట్లు ఏవస్తువునైనా సృష్టించడం, ఇతరుల్ని వశపరచుకునేశక్తి, ఇష్టానుసారంగా వస్తువుల్ని చూచేశక్తి, సర్వప్రపంచాన్ని దర్శించే సమర్థత అనే ఈ అష్టసిద్ధులు మనసుకు చెందిన చంద్రునియొక్క ఐశ్వర్యాలు. గుణస్వభావాలు. నరికే సామర్థ్యం, కొట్టేశక్తి, బంధించే సమర్థత, విశ్వాన్ని సృష్టించగలశక్తి, నశింపచేయగలశక్తి, అన్ని ప్రాణుల్ని అనుగ్రహించే సామర్థ్యం, కాలాన్ని జయించే శక్తి, మృత్యువుని జయించే శక్తి అనే ఈ సిద్ధులు ప్రజాపతికి సంబంధించిన మహా అహంకారం నుండి ఉత్పన్నమైన ఉత్తమమైన ఐశ్వర్యాలు.

**అకారణజగత్సృష్టిస్తథానుగ్రహ ఏవ చ ।**
**ప్రళయశ్చాధికారశ్చ లోకవృత్తప్రవర్తనమ్ ॥ 48 ॥**

**అసాదృశ్యమిదం వ్యక్తం నిర్మాణం చ పృథక్ పృథక్ ।**
**సంసారస్య చ కర్తృత్వం బ్రాహ్మమేతదనుత్తమమ్ ॥ 49 ॥**

గట్టి కారణం లేకుండానే సంకల్పమాత్రంగానే విశ్వాన్ని సృష్టించడం, దాన్ని రక్షించడం, సంహరించడం, అధికారాన్ని కలిగిఉండడం, ప్రపంచాన్ని నిర్వహించడం, పోలికలేకుండా లేక భిన్నంగా నిల్పడం, ప్రతిదృశ్యవస్తువుని భిన్న భిన్నంగా సృష్టించడం, బ్రహ్మాండాన్ని సృష్టించడం అనేవి బ్రహ్మయొక్క శక్తులు.

**ఏతావత్తత్త్వమిత్యుక్తం ప్రాధాన్యం వైష్ణవం పదమ్ ।**
**బ్రహ్మణా తద్గుణం శక్యం వేత్తుమన్యైర్న శక్యతే ॥ 50 ॥**

ఈ బ్రహ్మశక్తుల కంటె ముఖ్యమైనవి, వేరైనవి విష్ణుశక్తులు. విష్ణుశక్తులు బ్రహ్మశక్తులకు మూలం. ఈ విషయం బ్రహ్మకు మాత్రమే తెలుసు. ఇతరులకు తెలియదు.

**విద్యతే తత్పరం శైవం విష్ణునా నావగమ్యతే ।**
**అసంఖ్యేయగుణం శుద్ధం కో జానీయాచ్ఛివాత్మకమ్ ॥ 51 ॥**

ఇంతకంటే గొప్పశక్తి శివుడికి చెందింది. అది విష్ణువుకు కూడా తెలియదు. లెక్కలేనన్ని గుణాలు కల్గినవాడు, శద్ధసత్త్వుడు అయిన శివభగవానుణ్ణి ఎవ్వడు తెలియగలడు?

**వృత్థానే సిద్ధయశ్చైతా హ్యుపసర్గాశ్చ కీర్తితాః ।**
**నిరోద్ధవ్యాః ప్రయత్నేన వైరాగ్యేణ పరేణ తు ॥ 52 ॥**

యోగాభ్యాసకాలంలో ఈవిధమైన సిద్ధులు కలుగుతాయి. అయితే ఇవి అన్నీ విఘ్నాలే. వీటిని గట్టి యత్నంతో సంపూర్ణవైరాగ్యభావంతో  నిరోధించాలి.

**నాశాతిశయతాం జ్ఞాత్వా విషయేషు భయేషు చ ।**
**అశ్రద్ధయా త్యజేత్సర్వం విరక్త ఇతి కీర్తితః ॥ 53 ॥**

పై సిద్ధులు అంత ఉన్నతమైనవి కావని గ్రహించి, వాటి విషయంగా భయపడనివాడై అశ్రద్ధతో అనగా అనాసక్తితో వాటి అన్నింటిని పరిత్యజించాలి. అప్పుడే ఆ సాధకుడు విరక్తుడని కీర్తింపబడతాడు.

**వైతృష్ణ్యం పురుషే ఖ్యాతం గుణవైతృష్ణ్యముచ్యతే ।**
**వైరాగ్యేణైవ సంత్యాజ్యాః సిద్ధయశ్చోపసర్గికాః ॥ 54 ॥**

సాధకుడికి గుణాలపై కాంక్ష లేకుండడం వితృష్ణగా చెప్పబడుతుంది. ఆ ఉపద్రవసిద్ధుల్ని, అంటే విఘ్నాల్ని వైరాగ్యంతోనే పరిత్యజించాలి.

**ఔపసర్గికమాబ్రహ్మభువనేషు పరిత్యజేత్ ।**
**నిరుద్ధ్యైవ త్యజేత్సర్వం ప్రసీదతి మహేశ్వరః ॥ 55 ॥**

**ప్రసన్నే విమలా ముక్తిర్వైరాగ్యేణ పరేణ వై ।**
**అథవానుగ్రహార్థం చ లీలార్థం వా తదా మునిః ॥ 56 ॥**

**అనిరుధ్య విచేష్టేద్యః సోఽప్యేవం హి సుఖీ భవేత్ ।**
**క్వచిద్భూమిం పరిత్యజ్య హ్యాకాశే క్రీడతే శ్రియా ॥ 57 ॥**

**ఉద్గిరేచ్చ క్వచిద్వేదాన్ సూక్ష్మానర్థాన్ సమాసతః ।**
**క్వచిచ్ఛ్రుతే తదర్థేన శ్లోకబంధం కరోతి సః ॥ 58 ॥**

**క్వచిద్దండకబంధం తు కుర్యాత్ బంధం సహస్రశః ।**
**మృగపక్షిసమూహస్య రుతజ్ఞానం చ విందతి ॥ 59 ॥**

**బ్రహ్మాద్యం స్థావరాంతం చ హస్తామలకవద్భవేత్ ।**
**బహునాత్ర కిముక్తేన విజ్ఞానాని సహస్రశః ॥ 60 ॥**

**ఉత్పద్యంతే మునిశ్రేష్ఠా మునేస్తస్య మహాత్మనః ।**
**అభ్యాసేనైవ విజ్ఞానం విశుద్ధం చ స్థిరం భవేత్ ॥ 61 ॥**

బ్రహ్మలోకం వరకు సర్వలోకాలలోని విఘ్నాల్ని తొలగించుకోవాలి. వాటి నన్నింటిని నిరోధించి విసర్జించాలి. అప్పుడే శివుడు ప్రసన్నుడవుతాడు. అత్యంత వైరాగ్యం వల్ల మహేశ్వరుడు ప్రసన్నుడు కావడం చేత స్వచ్ఛమైన ముక్తి కలుగుతుంది. పరమశివుడి కృప కల్గినందున అప్పుడప్పుడూ ముని సిద్ధుల్ని విడిచిపెట్టకయే ఇతరుల్ని ఆశీర్వదించడానికి, లీలగా పరిభ్రమించడానికి ఇష్టపడతాడు. (ప్రవర్తిస్తాడు) అప్పుడు కూడా అతడు సంతోషంగా ఉంటాడు. అప్పుడప్పుడూ భూమిని విడిచిపెట్టి ఆకాశంలో శోభాకరంగా సంచరిస్తాడు. కొన్ని సమయాలల్లో ఆతడు వేదాల్ని, వాటి సూక్ష్మార్థాల్ని సంక్షేపంగా చెప్తుతాడు. అట్లే వేదార్థ సంబంధవిషయాల్ని దండకాలుగాను, ఇతరచ్ఛందాలలోను వేయి విధాలుగా రచించగలుగుతాడు. మృగాలయొక్కయు పక్షులయొక్కయు కూజితాలలోని భాషాజ్ఞానాన్ని తెలియగలుగుతాడు. బ్రహ్మమొదలుకుని స్థావరజంగమప్రాణుల వరకు ప్రతివస్తువూ అరచేతిలోని ఉసిరికాయవలె స్పష్టంగా నిలిచి కన్పిస్తుంది. మహామునులారా! ఎక్కువగా చెప్పడం వల్ల లాభమేమిటి! మహాత్ముడైన ఆ మునిలో వేయి విధాలుగా జ్ఞానం కలుగుతుంది. అది కేవలం అభ్యాసంవల్లనే మిక్కిలి శుద్ధమూ, స్థిరమూ అవుతుంది.

**తేజోరూపాణి సర్వాణి సర్వం పశ్యతి యోగవిత్ ।**
**దేవబింబాన్యనేకాని విమానాని సహస్రశః ॥ 62 ॥**

యోగవిద్యానిపుణుడైన ఆతడు వేలకొలది దేవతల్ని, వారి విమానాల్ని అన్నింటిని చూస్తాడు.

**పశ్యతి బ్రహ్మ విష్ణ్వింద్ర యమాగ్ని వరుణాదికాన్ ।**
**గ్రహనక్షత్రతారాశ్చ భువనాని సహస్రశః ॥ 63 ॥**

బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు,యముడు, అగ్ని, వరుణుడు మొదలైన దేవతల్ని, వేలవేలగ్రహాల్ని, నక్షత్రాల్ని, తారల్ని, భువనభాండాల్ని చూస్తాడు.

**పాతాలతలసంస్థాశ్చ సమాధిస్థః స పశ్యతి ।**
**ఆత్మవిద్యాప్రదీపేన స్వస్థేనాచలనేన తు ॥ 64 ॥**

స్థిరమైన ఆత్మవిద్యాప్రకాశంతో ఆతడు సమాధిలో ఉండి పాతాళలోకనివాసుల్ని కూడా చూస్తాడు.

**ప్రసాదామృతపూర్ణేన సత్త్వపాత్రస్థితేన తు ।**
**తమో నిహత్య పురుషః పశ్యతి హ్యాత్మనీశ్వరమ్ ॥ 65 ॥**

అనుగ్రహం అనే అమృతంతో నిండిన సత్త్వజ్ఞాన పాత్రయందుగల ఆతడు తమస్సును తొలగించుకుని ఆత్మలో ఈశ్వరుణ్ణి చూస్తాడు.

**తస్య ప్రసాదాద్ధర్మశ్చ ఐశ్వర్యం జ్ఞానమేవ చ ।**
**వైరాగ్యమపవర్గశ్చ నాత్ర కార్యా విచారణా ॥ 66 ॥**

పరమేశ్వరుడి అనుగ్రహం వల్ల ధర్మం, ఐశ్వర్యం, జ్ఞానం, వైరాగ్యం, మోక్షం సిద్ధిస్తాయి. ఇందులో సందేహం లేదు.

**న శక్యో విస్తరో వక్తుం వర్షాణామయుతైరపి ।**
**యోగే పాశుపతే నిష్ఠా స్థాతవ్యం చ మునీశ్వరాః ॥ 67 ॥**

మహామునులారా! శివుడియొక్క మహిమను విపులంగా వర్ణించడం వేలకొలది సంవత్సరాలలో కూడా వీలుకాదు. అందుకే పాశుపతయోగనిష్ఠలో ఉండడమే అవశ్యకర్తవ్యం.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే యోగాంతరాయకథనం నామ నవమోఽధ్యాయః ॥ 9 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని యోగాంతరాయకథనమనే తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## దశమోఽధ్యాయః - పదవ అధ్యాయం

## భక్తిభావకథనమ్ - భక్తిభావకథనం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**సతాం జితాత్మనాం సాక్షాత్ ద్విజాతీనాం ద్విజోత్తమాః ।**
**ధర్మజ్ఞానాం చ సాధూనామాచార్యాణాం శివాత్మనామ్ ॥ 1 ॥**

**దయావతాం ద్విజశ్రేష్ఠాస్తథా చైవ తపస్వినామ్ ।**
**సంన్యాసినాం విరక్తానాం జ్ఞానినాం వశగాత్మనామ్ ॥ 2 ॥**

**దానినాం చైవ దాంతానాం త్రయాణాం సత్యవాదినామ్ ।**
**అలుబ్ధానాం సయోగానాం శ్రుతిస్మృతివిదాం ద్విజాః ॥ 3 ॥**

**శ్రౌతస్మార్తావిరుద్ధానాం ప్రసీదతి మహేశ్వరః ।**

ఓ ఉత్తమబ్రాహ్మణులారా! సజ్జనులు, జితేంద్రియులు, ద్విజులు(బ్రహ్మక్షత్రవైశ్యులు) ధర్మజ్ఞానులు, సాధుస్వరూపులు, ఆచార్యరూపులు, కృపాత్ములు, తాపసులు, సన్న్యాసులు, రాగరహితులు, జ్ఞానమూర్తులు, ఆత్మనియంత్రితులు, దానపరులు, ఉదారస్వభావులు, త్రికరణశుద్ధిగా సత్యవ్రతులు, లోభరహితులు, యోగపరాయణులు, వేదశాస్త్రవేత్తలు, శ్రుతిస్మృతుల్ని అనుసరించేవారు, వీరి విషయంలో విరోధం లేనివారిని మహేశ్వరుడు అనుగ్రహిస్తాడు.

**సదితి బ్రహ్మణః శబ్దస్తదంతే యే లభంత్యుత ॥ 4 ॥**

**సాయుజ్యం బ్రహ్మణో యాంతి తేన సంతః ప్రచక్షతే ।**
**దశాత్మకే యే విషయే సాధనే చాష్టలక్షణే ॥ 5 ॥**

**న క్రుధ్యంతి న హృష్యంతి జితాత్మనస్తు తే స్మృతాః ।**
**సామాన్యేషు చ ద్రవ్యేషు తథా వైశేషికేషు చ ॥ 6 ॥**

**బ్రహ్మక్షత్రవిశో యస్మాద్యుక్తాస్తస్మాత్ ద్విజాతయః ।**
**వర్ణాశ్రమేషు యుక్తస్య స్వర్గాదిసుఖకారిణః ॥ 7 ॥**

**శ్రౌతస్మార్తస్య ధర్మస్య జ్ఞానాద్ధర్మజ్ఞ ఉచ్యతే ।**
**విద్యాయాః సాధనాత్సాధుబ్రహ్మచారీ గురోర్హితః ॥ 8 ॥**

**క్రియాణాం సాధనాచ్చైవ గృహస్థః సాధురుచ్యతే ।**
**సాధనాత్తపసోఽరణ్యే సాధుర్వైఖానసః స్మృతః ॥ 9 ॥**

**యతమానో యతిః సాధుః స్మృతో యోగస్య సాధనాత్ ।**
**ఏవమాశ్రమధర్మాణాం సాధనాత్సాధవః స్మృతాః ॥ 10 ॥**

**గృహస్థో బ్రహ్మచారీ చ వానప్రస్థో యతిస్తథా ।**

'సత్' శబ్దానికి బ్రహ్మం అని అర్థం. చివరలో బ్రహ్మాన్ని ప్రాప్తింపజేసుకున్నవారు ముక్తులు అవుతారు. బ్రహ్మసాయుజ్యాన్ని పొందుతారు. ఇందుచేతనే వార్ని సంతులు అంటున్నారు. పది ఇంద్రియాల విషయంలోను, అష్టసిద్ధుల సాధన విషయంలోను, సామాన్యమైన మరియు విశేషపదార్థాల విషయంలోను క్రుద్ధులు, సంతోషంగాని కోపంగాని లేనివారు జితేంద్రియులని చెప్పబడతారు.

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులనే మూడు వర్ణాలవార్ని ద్విజులు అంటారు. ఉపనయనసంస్కారం రెండవజన్మ అవుతుంది. స్వర్గం మొదలైన సుఖకారణాలైన, శ్రుతిస్మృతులు ప్రతిపాదించిన వర్ణాశ్రమ ధర్మాలలో కూడిన ధర్మం యొక్క జ్ఞానం కలవాడే ధర్మజ్ఞుడనబడతాడు. విద్యాసాధనకై గురువుకు హితాన్ని కూర్చే బ్రహ్మచారి 'సాధువు' అవుతాడు. ఇట్లే విధివిహితకర్మల్ని సాధించే గృహస్థు 'సాధువు' అవుతాడు. అరణ్యంలో తపస్సును సాధించే వానప్రస్థుడు కూడా 'సాధువే'. యోగసాధనకై ప్రయత్నించే యతి  సాధువు అవుతాడు. ఇట్లు ఆశ్రమధర్మాల్ని సాధించడంవల్ల గృహస్థు, బ్రహ్మచారి, వానప్రస్థుడు, యతి అనే వీరు సాధువులు అవుతారు. సాధనవల్లే సాధువు అవుతున్నాడు.

**ధర్మాధర్మావిహ ప్రోక్తౌ శబ్దావేతౌ క్రియాత్మకౌ ॥ 11 ॥**

**కుశలాకుశలం కర్మ ధర్మాధర్మావితి స్మృతౌ ।**
**ధారణార్థే మహాన్ హ్యేష ధర్మశబ్దః ప్రకీర్తితః ॥ 12 ॥**

ధర్మం, అధర్మం అనే ఈ రెండు శబ్దాలు క్రియావాచకాలు. కుశలకర్మ ధర్మం. అకుశలకర్మ అధర్మం (కుశలం–క్షేమం) ధారణం చేసేది అనగా ధరించేది ధర్మం.

**అధారణే మహత్త్వే చ అధర్మ ఇతి చోచ్యతే ।**
**అత్రేష్టప్రాపకో ధర్మ ఆచార్యైరుపదిశ్యతే ॥ 13 ॥**

మహత్త్వకర్మల్ని ధరించనిది అధర్మంగా చెప్పబడుతుంది. గురువులచేత ఉపదేశించబడే ఇష్టార్థసిద్ధిని కలిగించే కార్యమే ధర్మం.

**అధర్మశ్చానిష్టఫలో హ్యాచార్యైరుపదిశ్యతే ।**
**వృద్ధాశ్చాలోలుపాశ్చైవ ఆత్మవంతో హ్యదాంభికా ॥ 14 ॥**

**సమ్యగ్వినీతా ఋజవస్తానాచార్యాన్ ప్రచక్షతే ।**
**స్వయం ఆచరతే యస్మాదాచారే స్థాపయత్యపి ॥ 15 ॥**

**ఆచినోతి చ శాస్త్రార్థానాచార్యస్తేన చోచ్యతే ।**

అనిష్టఫలదాయకం అధర్మమని గురువుల అభిభాషణం. వృద్ధులు, నిర్లిప్తులు, జితేంద్రియులు, దంభరహితులు, మిక్కిలి వినమ్రులు, సరళస్వభావులు అయినవారే ఆచార్యులగుదురు. స్వయంగా వారు ఆచరిస్తూ, ఇతరులతో ఆచరింపజేస్తూ, శాస్త్రార్థాల్ని పరిశీలిస్తూ ఉంటారు. కావున వారు ఆచార్యులనబడుతున్నారు.

**విజ్ఞేయం శ్రవణాచ్ఛ్రౌతం స్మరణాత్స్మార్తముచ్యతే ॥ 16 ॥**

**ఇజ్యా వేదాత్మకం శ్రౌతం స్మార్తం వర్ణాశ్రమాత్మకమ్ ।**
**దృష్ట్వానురూపమర్థం యః పృష్టో నైవాపి గూహతి ॥ 17 ॥**

**యథా దృష్టప్రవాదస్తు సత్యం లైంగేఽత్ర పఠ్యతే ।**
**బ్రహ్మచర్యం తథా మౌనం నిరాహారత్వమేవ చ ॥ 18 ॥**

**అహింసా సర్వతఃశాంతిస్తప ఇత్యభిధీయతే ।**
**ఆత్మవత్సర్వభూతేషు యో హితాయాహితాయ చ ॥ 19 ॥**

**వర్తతే త్వసకృద్వృత్తిః కృత్స్నా హ్యేషా దయా స్మృతా ।**

వేదాల్ని వినడంవల్ల శ్రౌతుడు, శాస్త్రార్థాల్ని స్మరించడం వల్ల స్మార్తుడగుచున్నాడు. వేదం చెప్పిన యజ్ఞాల్ని చేయటంవల్ల శ్రౌతం, భిన్నవర్ణాలవారికి, ఆశ్రమాలవారికి సంబంధించిన కర్మాచరణమే స్మార్తం అవుతుంది. ఈ విధంగా తెలిసిన అనురూపపరమార్థాన్ని ప్రదర్శించడం, అననురూప పరమార్థాన్ని దాచి పెట్టకుండుట సత్యంగా ఈ లింగమహాపురాణంలో చెప్పబడుతున్నది. బ్రహ్మచర్యం, మౌనం, నిరాహారం, అహింస, సమస్తప్రశాంతి తపమని చెప్పబడుతుంది.

అన్ని ప్రాణులను తనకు వలెనే భావించుట హితులయందును, అహితులయందును, అందరియందును ఒకే విధంగా ప్రవర్తించుటయే దయ అనబడుతుంది.

**యద్యదిష్టం ద్రవ్యం న్యాయేనైవాగతం క్రమాత్ ॥ 20 ॥**

**తత్తద్గుణవతే దేయం దాతుస్తద్దానలక్షణమ్ ।**
**దానం త్రివిధమిత్యేతత్కనిష్ఠజ్యేష్ఠమధ్యమమ్ ॥ 21 ॥**

క్రమంగా న్యాయమార్గంలో ఆర్జించిన ఇష్టధనాన్ని పాత్రతగలవానికి ఇవ్వడాన్నే దానం అంటారు. ఇది మూడురకాలు. ఉత్తమ, మధ్యమ కనిష్ఠాలు.

**కారుణ్యాత్సర్వభూతేభ్యః సంవిభాగస్తు మధ్యమః ।**
**శ్రుతిస్మృతిభ్యాం విహితో ధర్మో వర్ణాశ్రమాత్మకః ॥ 22 ॥**

సమస్తప్రాణుల విషయంలో దయతో సమానభాగం కలది మధ్యమం. శ్రుతిస్మృతుల వలన నిర్ధారింపబడినట్టి తనకు సంబంధించిన వర్ణాశ్రమాలకు చెందిన కర్మాచరణయే ధర్మం.

**శిష్టాచారావిరుద్ధశ్చ స ధర్మః సాధురుచ్యతే ।**
**మాయాకర్మఫలత్యాగీ శివాత్మా పరికీర్తితః ॥ 23 ॥**

శిష్టాచారాలకు వ్యతిరేకం కాని ధర్మాన్నే సాధుధర్మం అంటారు. మాయకర్మలతో సిద్ధించు ఫలితాల్ని త్యజించువాడే 'శివాత్మ'డవుతాడు.

**నివృత్తః సర్వసంగేభ్యో యుక్తో యోగీ ప్రకీర్తితః ।**
**అసక్తో భయతో యస్తు విషయేషు విచార్య చ ॥ 24 ॥**

సర్వసంగపరిత్యాగమే యోగం. ఆతడే యోగియని కీర్తింపబడతాడు. మరల మరల జన్మమరణాల విషయంలో ఆలోచనతో భయపడి విషయసుఖాలపై ఆసక్తుడు కాడు.

**అలుబ్ధః సంయమీ ప్రోక్తః ప్రార్థితోఽపి సమంతతః ।**
**ఆత్మార్థం వా పరార్థం వా ఇంద్రియాణీహ యస్య వై ॥ 25 ॥**

**న మిథ్యా సంప్రవర్తంతే శమస్యైవ తు లక్షణమ్ ।**

లోభరహితుడైన ఆతడు సంయమి అనబడతాడు. తనకోసం గాని ఇతరులకోసం గాని ఇంద్రియాలు మిథ్యాప్రవృత్తిని పొందకుండుటే 'శమం' యొక్క స్వరూపం అవుతుంది.

**అనుద్విగ్నో హ్యనిష్టేషు తథేష్టాన్నాభినందతి ॥ 26 ॥**

**ప్రీతితాపవిషాదేభ్యో వినివృత్తి ర్విరక్తతా ।**
**సంన్యాసః కర్మణాం న్యాసః కృతానామకృతైః సహ ॥ 27 ॥**

**కుశలాకుశలానాం తు ప్రహాణం న్యాస ఉచ్యతే ।**

అనిష్టం కలిగినప్పుడు వ్యాకులత చెందకపోవడం, ఇష్టప్రాప్తి కలిగినప్పుడు ఆనందింపకపోవడం, ఇష్టం, బాధ, విషాదం పొందకపోవడం విరక్తి కాగలదు. నిషిద్ధకర్మలందు, విహితకర్మలందునూ, సమస్తకర్మత్యాగమే సన్న్యాసం అవుతుంది. ఇష్టానిష్ట కర్మలఫలాన్ని అంతటినీ విడిచి పెట్టడమే న్యాసమౌతుంది.

**అవ్యక్తాద్యవిశేషాంతే వికారేఽస్మిన్నచేతనే ॥ 28 ॥**

**చేతనాచేతనాన్యత్వవిజ్ఞానం జ్ఞానముచ్యతే ।**
**ఏవంతు జ్ఞానయుక్తస్య శ్రద్ధాయుక్తస్య శంకరః ॥ 29 ॥**

**ప్రసీదతి న సందేహో ధర్మశ్చాయం ద్విజోత్తమాః ।**

బ్రాహ్మణోత్తములారా! వ్యక్తావ్యక్తమైన పరమాణుపర్యంతమైన ఈ ప్రకృతిలో చేతనాచేతన సంబంధమైన విజ్ఞానమే జ్ఞానం కాగలదు. ఇలాంటి జ్ఞానవంతుడైన, శ్రద్ధాపరుడైన యోగిని పరమశివుడు అనుగ్రహిస్తాడు. ఇందులో సందేహం లేదు. ఇదియే ధర్మం.

**కిం తు గుహ్యతమం వక్ష్యే సర్వత్ర పరమేశ్వరే ॥ 30 ॥**

**భవే భక్తిర్న సందేహస్తయా యుక్తో విముచ్యతే ।**
**అయోగ్యస్యాపి భగవాన్ భక్తస్య పరమేశ్వరః ॥ 31 ॥**

**ప్రసీదతి న సందేహో నిగృహ్య వివిధం తమః ।**

శివుడికి చెందిన పరమగోప్యమైన విషయాన్ని మీకు చెబుతాను. ఎల్లప్పుడూ శంకరుడిపై భక్తి భావయుక్తుడైనవాడు ముక్తి పొందుతాడు. అపాత్రుడైనవాడియొక్క అంధకారాన్ని కూడా తొలగించి ముక్తిని ఇస్తాడు. ఇందులో సందేహం లేదు.

**జ్ఞానమధ్యాపనం హోమో ధ్యానం యజ్ఞస్తపః శ్రుతమ్ ॥ 32 ॥**

**దానమధ్యయనం సర్వం భవభక్త్యై న సంశయః ।**
**చాంద్రాయణసహస్రైశ్చ ప్రాజాపత్యశతైస్తథా ॥ 33 ॥**

**మాసోపవాసైశ్చాన్యైర్వా భక్తిర్మునివరోత్తమాః ।**

ఓ మునిశ్రేష్ఠులారా! జ్ఞానం, అధ్యాపనం(విద్యాబోధన) హోమం, ధ్యానం, యాగం, తపస్సు వేదాధ్యయనం, దానం, అధ్యయనం– ఇవి అన్నీ శివభక్తి ప్రాప్తి సాధనాలు. ఇందులో సందేహం లేదు. వేయి చాంద్రాయణవ్రతాలు, వంద ప్రాజాపత్యవ్రతాలు, నెలలపర్యంతం ఉపవాసాలు చేయడం కంటె శివునియందు భక్తిని నిలుపుటే శ్రేష్ఠమైనది.

**అభక్తా భగవత్యస్మిన్‌లోకే గిరిగుహాశయే ॥ 34 ॥**

**పతంతి చాత్మభోగార్థం భక్తో భావేన ముచ్యతే ।**
**భక్తానాం దర్శనాదేవ నృణాం స్వర్గాదయో ద్విజాః ॥ 35 ॥**

**న దుర్లభా న సందేహో భక్తానాం కిం పునస్తథా ।**
**బ్రహ్మవిష్ణుసురేంద్రాణాం తథాన్యేషామపి స్థితిః ॥ 36 ॥**

శివభక్తిరహితులైన ప్రాణులు స్వర్గాదుల్ని పొందడానికై నానావిధాలైన కర్మల్ని నిర్వహిస్తూ మిక్కిలి గహనమైన మృత్యురూపాలైన కొండలలో, గుహలలో పడుతూ తిరుగుతూ ఉంటారు. కాని భక్తిపరుడైనవాడు మాత్రం ముక్తి పొందుతున్నాడు.

ఓ ద్విజులారా! శివభక్తుల దర్శనం వల్లనే నరులకు స్వర్గాదిసుఖాలు ప్రాప్తిస్తున్నాయి. బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు మరియు అన్యదేవతలు కూడా శివుడియందలి భక్తివల్లనే అట్టి స్థితి అందుకున్నారు. అటువంటప్పుడు శివభక్తులకు దుర్లభమేదీయుండదని చెప్పడంలో ఎట్టి సందేహమూ లేదు.

**భక్త్యా ఏవ మునీనాం చ బలసౌభాగ్యమేవ చ ।**
**భవేన చ తథా ప్రోక్తం సంప్రేక్ష్యేమాం పినాకినా ॥ 37 ॥**

**దేవ్యై దేవేన మధురం వారాణస్యాం పురా ద్విజాః ।**
**అవిముక్తే సమాసీనా రుద్రేణ పరమాత్మనా ॥ 38 ॥**

**రుద్రాణీ రుద్రమాహేదం లబ్ధ్వా వారాణసీం పురీమ్ ।**

భక్తి వల్లనే మునులకు అట్టి బలం, అలాంటి సౌభాగ్యం కలుగుతున్నాయి.

ఓ బ్రాహ్మణులారా! పూర్వకాలంలో పినాకపాణియైన మహాదేవుడు శివుడు పార్వతీదేవిని చూచి ఆమెనుద్దేశించి వారాణసి నగరంలో మధురంగా ఇలా మాట్లాడినాడు. అవిముక్తక్షేత్రమైన వారాణసిలో భగవంతుడైన శివుడిని సమీపించి పార్వతీదేవి ఇలా పలికింది.

**శ్రీదేవ్యువాచ –** పార్వతీదేవి పలికింది.

**కేన వశ్యో మహాదేవ పూజ్యో దృశ్యస్త్వమీశ్వరః ॥ 39 ॥**

**తపసా విద్యయా వాపి యోగేనేహ వద ప్రభో ।**

ఓ మహాదేవా! తపస్సు, విద్య, యోగం మొదలైన ఏ సాధనం వల్ల మీరు వశ్యులవుతారు? ఏవిధంగా పూజింపబడి దర్శనమిస్తున్నారు. ఓ ప్రభూ! నాకు చెప్పండి!

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**నిశమ్య వచనం తస్యాస్తథా హ్యాలోక్య పార్వతీమ్ ॥ 40 ॥**

**ఆహ బాలేందుతిలకః పూర్ణేందువదనాం హసన్ ।**

చంద్రచూడుడైన శివుడు పార్వతీదేవి మాటలు విని, ఆమెను చూచి నవ్వుతూ పూర్ణచంద్రవదనయైన ఆమెనుద్దేశించి ఇలా పలికాడు.

**స్మృత్వాథ మేనయా పత్న్యా గిరేర్గాం కథితాం పురా ॥ 41 ॥**

**చిరకాలస్థితిం ప్రేక్ష్య గిరౌ దేవ్యా మహాత్మనః ।**
**దేవి లబ్ధా పురీ రమ్యా త్వయా యత్రృష్టుమర్హసి ॥ 42 ॥**

**స్థానార్థం కథితం మాత్రా విస్మృతేహ విలాసిని ।**
**పురా పితామహేనాపి పృష్టః ప్రశ్నవతాం వరే ॥ 43 ॥**

**యథా త్వయాద్య వై పృష్టో ద్రష్టుం బ్రహ్మాత్మకం త్వహమ్ ।**

హిమవంతుడి భార్య అయిన మేనాదేవి అచ్చట ఎక్కువ సమయం నిలిచియున్న విషయాన్ని గుర్తుచేస్తూ ఇలా పలికాడు. దేవీ! విలాసవతీ! నీకు సుందరనగరం నివాసంగా లభ్యమైన వెంటనే నివాస సంబంధమైన

విషయాల్ని గూర్చి నీ తల్లి యిచ్చిన ఆదేశాల్ని మరచిపోయావా? కావున నీవు నిశ్చింతగా ప్రశ్నించవచ్చు. ప్రశ్నించేవారిలో శ్రేష్ఠమైన ఓ దేవీ! బ్రహ్మాత్మకతత్త్వాన్ని తెలియడానికి ఇప్పుడు నీవెట్లు ప్రశ్నించావో పూర్వం బ్రహ్మ కూడా నన్ను ఇట్లే ప్రశ్నించాడు.

**శ్వేతే శ్వేతేన వర్ణేన దృష్ట్వా కల్పే తు మాం శుభౌ ॥ 44 ॥**

**సద్యోజాతం తథా రక్తే రక్తం వామం పితామహః ।**
**పీతే తత్పురుషం పీతమఘోరే కృష్ణమీశ్వరమ్ ॥ 45 ॥**

**ఈశానం విశ్వరూపాఖ్యే విశ్వరూపం తదాహ మామ్ ।**

శ్వేతకల్పంలో బ్రహ్మ నన్ను శ్వేతవర్ణంతో కూడిన సద్యోజాతరూపంలో దర్శించాడు. రక్తకల్పంలో నన్ను రక్తవర్ణంతో కూడిన వామదేవుడి రూపంలో దర్శించాడు. పీతకల్పంలో నన్ను పసుపురంగులో తత్పురుషరూపంలో చూశాడు. కృష్ణకల్పంలో నలుపురంగులో అఘోరరూపంలో చూశాడు. విశ్వరూపకల్పంలో అనేకవర్ణాలలో ఈశానరూపంలో చూచి నన్ను మరల ఇలా అడిగాడు.

**పితామహ ఉవాచ –** పితామహుడైన బ్రహ్మ పలికాడు.

**వామ తత్పురుషాఘోర సద్యోజాత మహేశ్వర ॥ 46 ॥**

**దృష్టో మయా త్వం గాయత్ర్యా దేవదేవ మహేశ్వర ।**
**కేన వశ్యో మహాదేవ ధ్యేయః కుత్ర ఘృణానిధే ॥ 47 ॥**

**దృశ్యః పూజ్యస్తథా దేవ్యా వక్తుమర్హసి శంకర ।**

ఓ వామదేవా! ఓ తత్పురుషా! ఓ అఘోరా! ఓ సద్యోజాతా! ఓ మహేశ్వరా! ఓ దేవదేవా! నేను నిన్ను గాయత్రీ ఉపాసనతో చూశాను. ఓ మహాదేవా! నిన్ను ఎవరు ఏ విధంగా వశం చేసుకోగలరు? ఓ దయానిధీ! నీ యొక్క ధ్యానం ఎక్కడ చేయాలి? ఓ శంకరా! నీవు పార్వతీదేవికి తెలిపిన విధానం నాకు తెలియజేయుము.

**శ్రీభగవానువాచ –** శంకరభగవానుడు పలికాడు.

**అవోచం శ్రద్ధయైవేతి వశ్యో వారిజసంభవ ॥ 48 ॥**

**ధ్యేయో లింగే త్వయా దృష్టే విష్ణునా పయసాం నిధౌ ।**
**పూజ్యః పంచాస్యరూపేణ పవిత్రైః పంచభిర్ద్విజైః ॥ 49 ॥**

పద్మోద్భవా! పితామహా! నేను కేవలం శ్రద్ధకు మాత్రమే వశ్యుణ్ణి కాగలుగుతాను. నీవు, విష్ణువు కూడా సముద్రంలో లింగం యొక్క దర్శనం చేసుకొన్నారు. అట్లే లింగరూపంలోనే అందరూ నన్ను ధ్యానించాలి. ద్విజులైన బ్రహ్మక్షత్రవైశ్యులచేత సద్యోజాతం మొదలైన పవిత్రాలైన ఐదుమంత్రాలతో పంచముఖరూపుణ్ణి అయిన నన్ను పూజించాలి.

**భవభక్త్యాద్య దృష్టోఽహం త్వయాండజ జగద్గురో ।**
**సోఽపి మామాహ భావార్థం దత్తం తస్మై మయా పురా ॥ 50 ॥**

ఓ అండోద్భవా! జగద్గురూ! నీవు నన్ను భక్తి వల్లనే దర్శించావు. "నీవు నాకు పూర్వం అలాంటి భక్తినిచ్చావ"ని నాతో చెప్పావు.

**భావం భావేన దేవేశి దృష్టవాన్ మాం హృదీశ్వరమ్ ।**
**తస్మాత్తు శ్రద్ధయా వశ్యో దృశ్యః శ్రేష్ఠగిరేః సుతే ॥ 51 ॥**

**పూజ్యో లింగే న సందేహః సర్వదా శ్రద్ధయా ద్విజైః ।**
**శ్రద్ధా ధర్మః పరః సూక్ష్మః శ్రద్ధా జ్ఞానం హుతం తపః ॥ 52 ॥**

**శ్రద్ధా స్వర్గశ్చ మోక్షశ్చ దృశ్యోఽహం శ్రద్ధయా సదా।**

ఓ దేవీ! భక్తిభావంతో బ్రహ్మ నన్ను మనసులో నిలుపుకుని చూడగలిగాడు. పర్వతశ్రేష్ఠుడైన హిమవంతుని పుత్రికా! నేను శ్రద్ధకు వశ్యుణ్ణి. శ్రద్ధతో నన్ను చూడవచ్చు. పూజనీయమైన లింగరూపంలో చూడవచ్చు. ఇందులో సందేహం లేదు. ఎల్లప్పుడూ శ్రద్ధతో బ్రాహ్మణుల ద్వారా దర్శించవచ్చు. శ్రద్ధయే పరమసూక్ష్మమైన ధర్మం. శ్రద్ధయే జ్ఞానం, యజ్ఞం, తపస్సు. శ్రద్ధయే స్వర్గం, మోక్షం. ఎల్లప్పుడూ నన్ను శ్రద్ధతో మాత్రమే దర్శింపవీలు కల్గుతుంది.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే భక్తిభావకథనం నామ దశమోఽధ్యాయః ॥ 10 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని భక్తిభావకథనమనే పదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## ఏకాదశోఽధ్యాయః - పదకొండవ అధ్యాయం

## సద్యోజాతమాహాత్మ్యమ్ - సద్యోజాతమాహాత్మ్యం

**ఋషయ ఊచుః** - మహర్షులు పలికారు.

**కథం వై దృష్టవాన్ బ్రహ్మా సద్యోజాతం మహేశ్వరమ్ ।**
**వామదేవం మహాత్మానం పురాణపురుషోత్తమమ్ ॥ 1 ॥**

**అఘోరం చ తథేశానం యథావద్వక్తుమర్హసి ।**

శివుడి యొక్క సనాతనం మరియు పురుషోత్తమం అయిన సద్యోజాతం, వామదేవం, తత్పురుషం, అఘోర, ఈశాననామకాలైన రూపాల్ని బ్రహ్మదేవుడు ఎట్లు చూడగలిగాడు. ఉన్నది ఉన్నట్లుగా ఆ విషయం మాకు తెలపండి!

**ఏకోన త్రింశకః కల్పో విజ్ఞేయః శ్వేతలోహితః ॥ 2 ॥**

**తస్మింస్తత్పరం ధ్యానం ధ్యాయతో బ్రహ్మణస్తదా ।**
**ఉత్పన్నస్తు శిఖాయుక్తః కుమారః శ్వేతలోహితః ॥ 3 ॥**

ఇరవై తొమ్మిదో కల్పమే శ్వేతలోహితం. ఈ కల్పంలో బ్రహ్మ సమాధిస్థుడై శివుణ్ణి ధ్యానిస్తుండగా శ్వేతలోహితవర్ణుడైన శిఖాధారియైన ఒక బాలుడు ఉత్పన్నుడయ్యాడు.

**తం దృష్ట్వా పురుషం శ్రీమాన్ బ్రహ్మా వై విశ్వతోముఖః ।**
**హృది కృత్వా మహాత్మానం బ్రహ్మరూపిణమీశ్వరమ్ ॥ 4 ॥**

**సద్యోజాతం తతో బ్రహ్మా ధ్యానయోగపరోఽభవత్ ।**

శ్రీమంతుడు, సర్వతోముఖుడైన బ్రహ్మ సద్యోజాతుడైన ఆ కుమారుణ్ణి చూచి మహాత్ముడైన పర బ్రహ్మస్వరూపుడైన ఈశ్వరుణ్ణి మనసులో నిల్పి ధ్యానయోగతత్పరుడయ్యాడు.

**ధ్యానయోగాత్పరం జ్ఞాత్వా వవందే దేవమీశ్వరమ్ ॥ 5 ॥**

**సద్యోజాతం తతో బ్రహ్మా బ్రహ్మ వై సమచింతయత్ ।**
**తతోఽస్య పార్శ్వతః శ్వేతాః ప్రాదుర్భూతా మహాయశాః ॥ 6 ॥**

**సునందో నందనశ్చైవ విశ్వనందోపనందనౌ ।**
**శిష్యాస్తే వై మహాత్మానో యైస్తద్ బ్రహ్మ సదావృతమ్ ॥ 7 ॥**

ధ్యానయోగంలో పరదైవతమైన ఈశ్వరుణ్ణి చూచి నమస్కరించాడు. తర్వాత బ్రహ్మ సద్యోజాతుణ్ని బ్రహ్మ కల్పితుడుగా భావించాడు. అనంతరం ఆ కుమారుడి పార్శ్వాల నుంచి మహాయశులైన సునందుడు, నందనుడు, విశ్వనందుడు, ఉపనందుడు అనే నలుగురు శ్వేతవర్ణులైన శిష్యులు జన్మించారు. మహాత్ములైన ఆ శిష్యులు ఆ సద్యోజాతబ్రహ్మను సర్వదా సేవిస్తారు.

**తస్యాగ్రే శ్వేతవర్ణాభః శ్వేతో నామ మహామునిః ।**
**విజ్ఞేఽథ మహాతేజాస్తస్మాజ్జజ్ఞే హరస్త్వసౌ ॥ 8 ॥**

ఆతడి ముందు శ్వేతవర్ణుడు శ్వేతనాముడు అయిన ఒక మహర్షి ఉద్భవించాడు. ఆతడి నుంచి 'హరు'డనే పేరుతో ఒక మహాతేజస్సంపన్నుడు ఉద్భవించాడు.

**తత్ర తే మునయః సర్వే సద్యోజాతం మహేశ్వరమ్ ।**
**ప్రపన్నాః పరయా భక్త్యా గృణంతో బ్రహ్మ శాశ్వతమ్ ॥ 9 ॥**

అక్కడ ఆ మునులందరూ శాశ్వత బ్రహ్మస్వరూపుడైన సద్యోజాత మహేశ్వరుణ్ణి పరమభక్తితో స్తుతిస్తూ శరణాగతి పొందారు.

**తస్మాద్విశ్వేశ్వరం దేవం యే ప్రపద్యంతి వై ద్విజాః ।**
**ప్రాణాయామపరా భూత్వా బ్రహ్మతత్పరమానసాః ॥ 10 ॥**

**తే సర్వే పాపనిర్ముక్తా విమలా బ్రహ్మవర్చసః ।**
**విష్ణులోకమతిక్రమ్య రుద్రలోకం వ్రజంతి తే ॥ 11 ॥**

ఓ ద్విజులారా! అందుచేతనే ఎవ్వరైతే ప్రాణాయామపరాయణులై బ్రహ్మతత్పరచిత్తంతో ఆ విశ్వేశ్వరదేవుణ్ణి శరణాగతి పొందుతారో, వారందరూ పాపవిముక్తులై, విమలులై, బ్రహ్మతేజులై విష్ణులోకాన్ని కూడా దాటి రుద్రలోకాన్ని పొందుతారు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే సద్యోజాతమాహాత్మ్యం నామైకాదశోఽధ్యాయః ॥ 11 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని సద్యోజాతమాహాత్మ్యమనే పదకొండవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **ద్వాదశోఽధ్యాయః** – పంౖడెండవ అధ్యాయం

## **వామదేవమాహాత్మ్యమ్** – వామదేవమాహాత్మ్యం

**సూత ఉవాచ** – సూతమహర్షి పలికాడు.

**తతస్త్రింశత్తమః కల్పో రక్తో నామ ప్రకీర్తితః ।**
**బ్రహ్మా యత్ర మహాతేజా రక్తవర్ణమధారయత్ ॥ 1 ॥**

ముప్పదియవ కల్పం రక్తకల్పమనే పేరు కలది. మహాతేజస్వంతుడైన బ్రహ్మ ఈ కల్పంలో రక్తవర్ణాన్ని ధరించి ఉంటాడు.

**ధ్యాయతః పుత్రకామస్య బ్రహ్మణః పరమేష్ఠినః ।**
**ప్రాదుర్భూతో మహాతేజాః కుమారో రక్తభూషణః ॥ 2 ॥**

పరమేష్ఠి అయిన బ్రహ్మ, పుత్రుడి కోసం ధ్యానించగా గొప్ప కాంతిమంతుడైన ఎర్రటిరంగు ఆభరణాన్ని ధరించిన ఒక కుమారుడు జన్మించాడు.

**రక్తమాల్యాంబరధరో రక్తనేత్రః ప్రతాపవాన్ ।**
**స తం దృష్ట్వా మహాత్మానం కుమారం రక్తవాససమ్ ॥ 3 ॥**

**పరం ధ్యానం సమాశ్రిత్య బుబుధే దేవమీశ్వరమ్ ।**

ఆతడు రక్తమాల్యాలు, రక్తవస్త్రాలు ధరించి ఉన్నాడు. ఆతడి కన్నులు రక్తవర్ణం కలిగి ఉన్నాయి. ఆతడు మహాపరాక్రమవంతుడు. మహాత్ముడైన ఆ కుమారుణ్ణి చూచి బ్రహ్మ ఉత్తమమైన ధ్యానాన్ని ఆశ్రయించి ఆతడే ఈశ్వరుడని భావించాడు.

**స తం ప్రణమ్య భగవాన్ బ్రహ్మా పరమయంత్రితః ॥ 4 ॥**

**వామదేవం తతో బ్రహ్మా బ్రహ్మ వై సమచింతయత్ ।**
**తథా స్తుతో మహాదేవో బ్రహ్మణా పరమేశ్వరః ॥ 5 ॥**

**ప్రతీతహృదయః సర్వ ఇదమాహ పితామహమ్ ।**
**ధ్యాయతా పుత్రకామేన యస్మాత్తేఽహం పితామహ ॥ 6 ॥**

**దృష్టః పరమయా భక్త్యా స్తుతశ్చ బ్రహ్మపూర్వకమ్ ।**
**తస్మాత్ ధ్యానబలం ప్రాప్య కల్పే కల్పే ప్రయత్నతః ॥ 7 ॥**

**వేత్స్యసే మాం ప్రసంఖ్యాతం లోకధాతారమీశ్వరమ్ ।**
**తతస్తస్య మహాత్మానశ్చత్వారస్తే కుమారకాః ॥ 8 ॥**

**సంబభూవుర్మహాత్మానో విశుద్ధా బ్రహ్మవర్చసః ।**
**విరజాశ్చ విబాహుశ్చ విశోకో విశ్వభావనః ॥ 9 ॥**

మిక్కిలి నిగ్రహం కల్గిన బ్రహ్మదేవుడు ఆతడికి నమస్కరించి వామదేవనామకమైన ఈ పరమేశ్వరుడికి బ్రహ్మస్వరూపాన్ని కల్పించి పరమేశ్వరమహాదేవుణ్ణి స్తుతించాడు. అప్పుడు సంప్రీతుడైన పరమేశ్వరుడు బ్రహ్మను గూర్చి ఇలా పలికాడు. 'ఓ బ్రహ్మ! నీవు పుత్రుడిపై కోరికతో నన్ను పరమమైన భక్తితో ధ్యానించావు. నన్ను దర్శించావు. 'నమో బ్రహ్మణే వామదేవాయ' అని స్తుతించావు. అందుచేత నీవు ధ్యానశక్తిని పొంది ప్రతికల్పంలోనూ నన్ను సర్వశ్రేష్ఠుడైన లోకాధారస్వరూపుడుగా తెలియగలుగుతావు. తర్వాత బ్రహ్మకు నలుగురు పుత్రులు కలిగారు. వారందరూ పవిత్రులు, మహాత్ములు, బ్రహ్మతేజం గలవారు. వారే విరజుడు, విబాహుడు, విశోకుడు, విశ్వభానుడను పేర్లు గలవారు.

**బ్రహ్మణ్యా బ్రహ్మణస్తుల్యా వీరా అధ్యవసాయినః ।**
**తతో వర్షసహస్రాంతే బ్రహ్మత్వేఽధ్యవసాయినః ॥ 10 ॥**

వారు బ్రహ్మపథగాములు, బ్రహ్మతో సమానమైనవారు, వీరులు, నిశ్చయసంపన్నులు. తదుపరి వేయిసంవత్సరాలకు వారు బ్రహ్మత్వాన్ని పొందారు.

**గృణంతశ్చ మహాత్మానో బ్రహ్మ తద్వామదైవికమ్ ।**
**అనుగ్రహార్థం లోకానాం శిష్యాణాం హితకామ్యయా ॥ 12 ॥**

**ధర్మోపదేశమఖిలం కృత్వా తే బ్రహ్మణః ప్రియాః ।**
**పునరేవ మహాదేవం ప్రవిష్టా రుద్రమవ్యయమ్ ॥ 13 ॥**

మహాత్ములైనవారు వామదైవిక బ్రహ్మచింతన చేస్తూ ప్రజల్ని అనుగ్రహిస్తూ శిష్యుల శ్రేయస్సును కోరుతూ సంపూర్ణమైన ధర్మాన్ని ఉపదేశిస్తూ బ్రహ్మకు ప్రీతిపాత్రులైనారు. వారు తిరిగి అవ్యయుడైన మహాదేవరుద్రునిలో ఐక్యాన్ని పొందారు.

**యేఽపి చాన్యే ద్విజశ్రేష్ఠా యుంజానా వామమీశ్వరమ్ ।**
**ప్రపశ్యంతి మహాదేవం తద్భక్తాస్తత్పరాయణాః ॥ 14 ॥**

**తే సర్వే పాపనిర్ముక్తా విమలా బ్రహ్మచారిణః ।**
**రుద్రలోకం గమిష్యంతి పునరావృత్తిదుర్లభమ్ ॥ 15 ॥**

ఓ ద్విజోత్తములారా! ఈ విధంగానే పరమేశ్వరపరాయణులైన ఇతరభక్తులు కూడా సమాధిలో ధ్యానించి పరబ్రహ్మస్వరూపుడు పరమేశ్వరవామదేవుడిని దర్శిస్తారు. వారందరూ పరిశుద్ధులు, బ్రహ్మనిష్ఠులు పాపరహితులై రుద్రలోకాన్ని పొందుతారు. ఆ లోకం తిరిగి వెనుకకు పంపనట్టిది. శాశ్వతమైనది.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే వామదేవమాహాత్మ్యం నామ ద్వాదశోఽధ్యాయః ॥ 12 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని వామదేవమాహాత్మ్యమనే పంద్రెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయోదశోఽధ్యాయః – పదమూడవ అధ్యాయం

## తత్పురుషమాహాత్మ్యమ్ – తత్పురుషమాహాత్మ్యం

**సూత ఉవాచ** – సూతుడు చెప్పాడు.

**ఏకత్రింశత్తమః కల్పః పీతవాసా ఇతి స్మృతః ।**
**బ్రహ్మా యత్ర మహాభాగః పీతవాసా బభూవ హ ॥ 1 ॥**

బ్రహ్మ ఎక్కడ పీతవస్త్రధారియై ఉంటాడో అది పీతవాసకల్పం. అది పదమూడవ కల్పం.

**ధ్యాయతః పుత్రకామస్య బ్రహ్మణః పరమేష్ఠినః ।**
**ప్రాదుర్భూతో మహాతేజాః కుమారః పీతవస్త్రధృక్ ॥ 2 ॥**

పరమేష్ఠి అయిన బ్రహ్మ పుత్రుణ్ణి కోరి శివుణ్ణి ధ్యానించడం వల్ల పచ్చటి వస్త్రాల్ని ధరించిన, గొప్ప తేజస్సుతో కూడిన కుమారుడు జన్మించాడు.

**పీతగంధానులిప్తాంగః పీతమాల్యాంబరో యువా ।**
**హేమయజ్ఞోపవీతశ్చ పీతోష్ణీషో మహాభుజః ॥ 3 ॥**

మహాభుజుడు, యువకుడు అయిన ఆతడు పచ్చని గంధాన్ని అంగాలకు పూసుకున్నాడు. పచ్చని మాలల్ని, వస్త్రాల్ని ధరించాడు. బంగారంతో చేయబడిన యజ్ఞోపవీతాన్ని కలిగి ఉన్నాడు. పచ్చని తలపాగ ధరించి ఉన్నాడు.

**తం దృష్ట్వా ధ్యానసంయుక్తో బ్రహ్మా లోకమహేశ్వరమ్ ।**
**మనసా లోకధాతారం ప్రపేదే శరణం విభుమ్ ॥ 4 ॥**

ధ్యానమందున్న బ్రహ్మ, లోకేశ్వరుడు, లోకాధారుడు అయిన శివభగవానుణ్ణి మానసికంగా దర్శించి శరణుపొందినాడు.

**తతో ధ్యానగతస్తత్ర బ్రహ్మా మాహేశ్వరీం వరామ్ ।**
**గాం విశ్వరూపాం దదృశే మహేశ్వరముఖాచ్చ్యుతామ్ ॥ 5 ॥**

**చతుష్పదాం చతుర్వక్త్రాం చతుర్హస్తాం చతుఃస్తనీమ్ ।**
**చతుర్నేత్రాం చతుఃశృంగీం చతుర్దంష్ట్రాం చతుర్ముఖీమ్ ॥ 6 ॥**

**ద్వాత్రింశద్గుణసంయుక్తామీశ్వరీం సర్వతోముఖామ్ ।**

ధ్యానగతుడైన బ్రహ్మ నాలుగు కాళ్లు, నాలుగు నోరులు, నాలుగు చేతులు, నాలుగు రొమ్ములు, నాలుగు కండ్లు, నాలుగు కొమ్ములు, నాలుగు దంతాలు, నాలుగు ముఖాలు కలిగి ముప్పెరెండు గుణాలతో కూడినది సర్వతోముఖి, ఈశ్వరరూపిణి, విశ్వరూపిణి శివభగవానుడి ముఖం నుండి వచ్చిన శ్రేష్ఠమైన గోవును దర్శించాడు.

**స తాం దృష్ట్వా మహాతేజా మహాదేవీం మహేశ్వరీమ్ ॥ 7 ॥**

**పునరాహ మహాదేవః సర్వదేవనమస్కృతః ।**
**మతిః స్మృతిర్బుద్ధిరితి గాయమానః పునః పునః ॥ 8 ॥**

**ఏహ్యేహీతి మహాదేవి సాతిష్ఠత్ప్రాంజలిర్విభుమ్ ।**
**విశ్వమావృత్యయోగేన జగత్సర్వం వశీకురు ॥ 9 ॥**

మహేశ్వరియు, మహాదేవియు అయిన ఆమెను గూర్చి (ఆ గోవును) మహాతేజుడు సమస్తదేవతలచేత నమస్కరింపబడువాడును అయిన శివుడు మరల ఇలా పలికాడు. "ఓ మహాదేవీ! నీవు మతివి, నీవు బుద్ధివి, నీవు స్మృతివి" అని మాటిమాటికి కీర్తిస్తూ రారమ్మని పలికాడు. అప్పుడు ఆమె నమస్కరించి శివుడి ముందు నిలబడింది. "ఓ దేవీ నీవు ప్రపంచాన్ని యోగవిద్యతో ఆవరించి దాన్ని వశపరచుకో" అన్నాడు.

**అథ తామాహ దేవేశో రుద్రాణీ త్వం భవిష్యసి ।**
**బ్రాహ్మణానాం హితార్థాయ పరమార్థా భవిష్యసి ॥ 10 ॥**

తర్వాత దేవేశ్వరుడైన శివుడు ఆమెతో ఇలా పలికాడు. "నీవు రుద్రాణివి కాగలవు. (రుద్రుడి భార్య) బ్రాహ్మణుల హితం కోసం పరమార్థసాధికవు కాగలవు."

**తథైనాం పుత్రకామస్య ధ్యాయతః పరమేష్ఠినః ।**
**ప్రదదౌ దేవదేవేశః చతుష్పాదాం జగద్గురుః ॥ 11 ॥**

**తతస్తాం ధ్యానయోగేన విదిత్వా పరమేశ్వరీమ్ ।**
**బ్రహ్మా లోకగురోః సోఽథ ప్రతిపేదే మహేశ్వరీమ్ ॥ 12 ॥**

దేవాధిదేవుడు, జగద్గురువు అయిన పరమశివుడు ఆ ధేనువును పుత్రుడి కోసం ధ్యానిస్తున్న బ్రహ్మకు ఇచ్చాడు. ధ్యానయోగం ద్వారా ఆ ధేనువును పార్వతీదేవిగా తెలిసి జగద్గురువైన శివుడి నుండి ఆమెను పొందాడు.

**గాయత్రీం తు తతో రౌద్రీం ధ్యాత్వా బ్రహ్మానుయంత్రితః ।**
**ఇత్యేతాం వైదికీం విద్యాం రౌద్రీం గాయత్రిమీరితామ్ ॥ 13 ॥**

**జపిత్వా తు మహాదేవీం బ్రహ్మా లోకనమస్కృతామ్ ।**
**ప్రపన్నస్తు మహాదేవం ధ్యానయుక్తేన చేతసా ॥ 14 ॥**

బ్రహ్మ రుద్రగాయత్రిని ధ్యానించి తనను తాను నియంత్రించుకుని రుద్రగాయత్రి రూపంలో చెప్పబడిన వేదప్రతిపాదితజ్ఞాని, సర్వవిద్యాస్వరూపిణి, లోకవంద్య అయిన మహాదేవిని జపించి, ధ్యానసహితమైన మనస్సుతో శివుణ్ణి శరణు వేడినాడు.

**తతస్తస్య మహాదేవో దివ్యయోగం బహుశ్రుతమ్ ।**
**ఐశ్వర్యం జ్ఞానసంపత్తిం వైరాగ్యం చ దదౌ ప్రభుః ॥ 15 ॥**

తర్వాత ప్రభువు, మహాదేవుడైన శివుడు బ్రహ్మకు దివ్యయోగాన్ని, అధికజ్ఞానాన్ని, ఐశ్వర్యాన్ని, జ్ఞానసంపదను, వైరాగ్యాన్ని ప్రసాదించాడు.

**తతోఽస్య పార్శ్వతో దివ్యాః ప్రాదుర్భూతాః కుమారకాః ।**
**పీతమాల్యాంబరధరాః పీతస్రగనులేపనాః ॥ 16 ॥**

**పీతాభోష్ణీషశిరసః పీతాస్యాః పీతమూర్ధజాః ।**

పిదప ఆతడి పార్శ్వం నుండి పచ్చని మాలలు, వస్త్రాలు ధరించినవారు, పచ్చని దండలు, మైపూతలు కలిగినవారు, పచ్చని తలపాగలు, పచ్చని ముఖాలు, పచ్చని శిరోజాలు కలిగినవారు అయిన దివ్యకుమారులు పుట్టారు.

**తతో వర్షసహస్రాంత ఉషిత్వా విమలౌజసః ॥ 17 ॥**

**యోగాత్మానస్తపోహ్లాదాః బ్రాహ్మణానాం హితైషిణః ।**
**ధర్మయోగబలోపేతా మునీనాం దీర్ఘసత్రిణామ్ ॥ 18 ॥**

**ఉపదిశ్య మహాయోగం ప్రవిష్టాస్తే మహేశ్వరమ్ ।**

తర్వాత స్వచ్ఛతేజస్సులు, యోగాత్ములు, తపస్సుచేత ఆహ్లాదం పొందినవారు, బ్రాహ్మణుల హితం కోరువారు, ధర్మబలమూ, యోగబలమూ కలిగినవారు అయిన ఆ కుమారులు బహుకాలం యజ్ఞాల్ని నిర్వహించే మునులకు మహాయోగాన్ని ఉపదేశించి మహాదేవుడి సమీపంలో వేయి సంవత్సరాలు నివసించి మహేశ్వరునిలో ఐక్యం చెందారు.

**ఏవమేతేన విధినా యే ప్రపన్నా మహేశ్వరమ్ ॥ 19 ॥**

**అన్యేఽపి నియతాత్మానో ధ్యానయుక్తా జితేంద్రియాః ।**
**తే సర్వే పాపముత్సృజ్య విమలా బ్రహ్మవర్చసః ॥ 20 ॥**

**ప్రవిశంతి మహాదేవం రుద్రం తే త్వపునర్భవాః ॥ 21 ॥**

ఈ విధమైన పద్ధతిలో నియతాత్ములు, ధ్యానయుక్తులు, జితేంద్రియులూ అయిన ఇతరులు కూడా శివుణ్ణి శరణుజొచ్చి పాపవిముక్తులై, విమలులై, బ్రహ్మతేజులై, మహాదేవుడైన రుద్రుణ్ణి పొందుతారు. వారికి పునర్జన్మ ఉండదు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే తత్పురుషమాహాత్మ్యం నామ త్రయోదశోఽధ్యాయః ॥ 13 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని తత్పురుషమాహాత్మ్యమనే పదమూడవ అధ్యాయం సమాప్తం.

## **చతుర్దశోఽధ్యాయః** – పద్నాలుగవ అధ్యాయం

## **అఘోరోత్పత్తివర్ణనమ్** – అఘోరోత్పత్తివర్ణనం

**సూత ఉవాచ** – సూతమహర్షి పలికాడు.

**తతస్తస్మిన్ గతే కల్పే పీతవర్ణే స్వయంభువః ।**
**పునరన్యః ప్రవృత్తస్తు కల్పో నామ్నాసితస్తు సః ॥ 1 ॥**

పీతవర్ణకల్పం గతించగా బ్రహ్మకు 'అసితం' అనే మరొకకల్పం ఏర్పడింది.

**ఏకార్ణవే తదా వృత్తే దివ్యే వర్షసహస్రకే ।**
**స్రష్టుకామః ప్రజా బ్రహ్మ చింతయామాస దుఃఖితః ॥ 2 ॥**

విశ్వమంతా ఒకేసాగరమై ఉండగా వేయి సంవత్సరాలు గడచిపోయాయి. అందుకు దుఃఖితుడైన బ్రహ్మ ప్రజల్ని సృష్టించాలని ఆలోచించాడు.

**తస్య చింతయమానస్య పుత్రకామస్య వై ప్రభోః ।**
**కృష్ణః సమభవద్వర్ణో ధ్యాయతః పరమేష్ఠినః ॥ 3 ॥**

విచారగ్రస్తుడు, పుత్రుని కోరుకున్నవాడు, ప్రభువు, ధ్యానమగ్నుడైన బ్రహ్మకు నల్లని రంగు ఏర్పడింది.

**అథాపశ్యన్మహాతేజాః ప్రాదుర్భూతం కుమారకమ్ ।**
**కృష్ణవర్ణం మహావీర్యం దీప్యమానం స్వతేజసా ॥ 4 ॥**

**కృష్ణాంబరధరోష్ణీషం కృష్ణయజ్ఞోపవీతినమ్ ।**
**కృష్ణేన మౌలినా యుక్తం కృష్ణస్రగనులేపనమ్ ॥ 5 ॥**

మహాకాంతిమంతుడైన బ్రహ్మ నల్లటి శరీరవర్ణం కలవాడు. గొప్పబలవంతుడు. స్వప్రకాశంతో గొప్పగా వెలుగుతున్నవాడు. నల్లటివస్త్రాలు ధరించినవాడు. నల్లటి తలపాగగలవాడు. నల్లటి జందెము గలవాడు. నల్లటి శిరసుగలవాడు. నల్లని మాలలతో మైపూతద్రవ్యాలతో కూడినవాడై జన్మించిన కుమారుణ్ణి చూశాడు.

**స తం దృష్ట్వా మహాత్మానమఘోరం ఘోరవిక్రమమ్ ।**
**వవందే దేవదేవేశమద్భుతం కృష్ణపింగళమ్ ॥ 6 ॥**

మహాపరాక్రమవంతుడైన, మహాత్ముడైన, అద్భుతమైన, కృష్ణపింగళవర్ణశోభితుడైన, దేవాధిదేవుడైన ఆ అఘోరుడిని చూచి బ్రహ్మ నమస్కరించాడు.

**ప్రాణాయామపరః శ్రీమాన్ హృది కృత్వా మహేశ్వరమ్ ।**
**మనసా ధ్యానయుక్తేన ప్రపన్నస్తు తమీశ్వరమ్ ॥ 7 ॥**

**అఘోరం తు తతో బ్రహ్మా బ్రహ్మరూపం వ్యచింతయత్ ।**
**తథా వై ధ్యాయమానస్య బ్రహ్మణః పరమేష్ఠినః ॥ 8 ॥**

**ప్రదదౌ దర్శనం దేవో హ్యఘోరో ఘోరవిక్రమః ।**
**అథాస్య పార్శ్వతః కృష్ణాః కృష్ణస్రగనులేపనాః ॥ 9 ॥**

**చత్వారస్తు మహాత్మానః సంబభూవుః కుమారకాః ।**
**కృష్ణః కృష్ణశిఖశ్చైవ కృష్ణాస్యః కృష్ణవస్త్రధృక్ ॥ 10 ॥**

తదుపరి బ్రహ్మ ప్రాణాయామం చేయటంలో లగ్నమయ్యాడు. హృదయమందు శివుణ్ణి నిలిపి మనసులో ధ్యానిస్తూ ఈశ్వరుణ్ణి శరణాగతి పొందాడు. అంతేకాక ఆ అఘోరుణ్ణి పరబ్రహ్మ స్వరూపంగా తలచినాడు. అలా ధ్యానిస్తున్న బ్రహ్మకు మహాపరాక్రమవంతుడైన దేవాధిదేవుడైన అఘోరుడు దర్శనమిచ్చాడు. అనంతరం ఆతడి పార్శ్వం నుండి నలుగురు మహాత్ములు జన్మించారు. వారందరూ నల్లటిరంగు గలవారు. నల్లటిమాలలు, నల్లటి అనులేపనాలు కలవారు. వారే కృష్ణుడు, కృష్ణశిఖుడు, కృష్ణాస్యుడు, కృష్ణవస్త్రధృక్కులు.

**తతో వర్షసహస్రం తు యోగతః పరమేశ్వరమ్ ।**
**ఉపాసిత్వా మహాయోగం శిష్యేభ్యః ప్రదదుః పునః ॥ 11 ॥**

అనంతరం వేయి సంవత్సరాలు పరమేశ్వరుణ్ణి ఉపాసించి తమ శిష్యులకోసం మహాయోగవిద్యను మరల ప్రసాదించారు.

**యోగేన యోగసంపన్నాః ప్రవిశ్య మనసా శివమ్ ।**
**అమలం నిర్గుణం స్థానం ప్రవిష్టా విశ్వమీశ్వరమ్ ॥ 12 ॥**

యోగసంపద కలిగినవారు, యోగం ద్వారా మనసుతో స్వచ్ఛమూ, నిర్గుణమూ అయిన లోకాధినాథుడైన శివుడిస్థానంలోకి ప్రవేశించారు.

**ఏవమేతేన యోగేన యేఽపి చాన్యే మనీషిణః ।**
**చింతయంతి మహాదేవం గంతారో రుద్రమవ్యయమ్ ॥ 13 ॥**

ఈ విధంగా ఇతరులైన బుద్ధిమంతులు కూడా మహేశ్వరుణ్ణి ధ్యానించి వినాశం లేని శాశ్వతమైన రుద్రలోకానికి వెళతారు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే అఘోరోత్పత్తి వర్ణనం నామ చతుర్దశోఽధ్యాయః ॥ 14 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని అఘోరోత్పత్తి వర్ణనమనే పద్నాలుగవ అధ్యాయం సమాప్తం.

## పంచదశోఽధ్యాయః - పదిహేనవ అధ్యాయం

## అఘోరేశ్వరమాహాత్మ్యమ్ - అఘోరేశ్వరమాహాత్మ్యం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**తతస్తస్మిన్ గతే కల్పే కృష్ణవర్ణే భయానకే ।**
**తుష్టావ దేవదేవేశం బ్రహ్మా తం బ్రహ్మరూపిణమ్ ॥ 1 ॥**

భయావహమైన కృష్ణకల్పం పూర్తి అయిన తర్వాత బ్రహ్మ బ్రహ్మస్వరూపుడు, దేవాధిదేవుడు అయిన ఆ అఘోరుడిని స్తుతించాడు.

**అనుగృహ్య తతస్తుష్టో బ్రహ్మాణమవదద్ధరః ।**
**అనేనైవ తు రూపేణ సంహరామి న సంశయః ॥ 2 ॥**

**బ్రహ్మహత్యాదికాన్ ఘోరాంస్తథాన్యానపి పాతకాన్ ।**
**హీనాంశ్చైవ మహాభాగ తథైవ వివిధాన్యపి ॥ 3 ॥**

ఆ స్తుతివల్ల సంతోషించిన హరుడు బ్రహ్మను అనుగ్రహించి ఇలా చెప్పాడు. ఓ మహాత్మా! బ్రహ్మహత్య మొదలైన ఘోరమైన నానా విధాలైన పాపాలను, అవి చిన్నవైనా పెద్దవైనా ఈ అఘోరరూపంతో నశింపజేస్తాను. ఇందులో సందేహం లేదు.

**ఉపపాతకమప్యేవం తథా పాపాని సువ్రత ।**
**మానసాని సుతీక్ష్ణాని వాచికాని పితామహ ॥ 4 ॥**

**కాయికాని సుమిశ్రాణి తథా ప్రాసంగికాని చ ।**
**బుద్ధిపూర్వం కృతాన్యేవ సహజాగంతుకాని చ ॥ 5 ॥**

**మాతృదేహోత్థితాన్యేవం పితృదేహే చ పాతకమ్ ।**
**సంహరామి న సందేహః సర్వం పాతకజం విభో ॥ 6 ॥**

ఓ సువ్రతా! పితామహా! చిన్నవి పెద్దవి అయిన సర్వపాపాల్ని అనగా బాగా తీక్ష్ణములైన మానసికపాపాల్ని, వాచిక పాపాల్ని, సుమిశ్రితాలైన శారీరకపాపాల్ని, అట్లే ప్రాసంగిక పాపాల్ని, తెలిసి చేసినవాటిని సహజంగా సంక్రమించినవాటిని, తల్లిదండ్రుల దేహాలనుండి కలిగినవాటిని నాశనం చేస్తాను. ఓ ప్రభూ! ఇందులో సందేహం లేదు.

**లక్షం జప్త్వా హ్యఘోరేభ్యో బ్రహ్మహా ముచ్యతే ప్రభో ।**
**తదర్ధం వాచికే వత్స తదర్ధం మానసే పునః ॥ 7 ॥**

ఓ ప్రభూ! ఈ అఘోరమంత్రాన్ని లక్షసార్లు జపిస్తే బ్రహ్మహత్యనుంచి కూడా విముక్తి పొందవచ్చు. ఓ వత్సా! ఆ లక్షలో సగం జపంతో వాచికపాపాల్ని, అందులో మరల సగం జపంతో మానసిక పాపాల్ని నశింపజేయవచ్చు.

**చతుర్గుణం బుద్ధిపూర్వే క్రోధాదష్టగుణం స్మృతమ్ ।**
**వీరహా లక్షమాత్రేణ భ్రూణహా కోటిమభ్యసేత్ ॥ 8 ॥**

**మాతృహా నియుతం జప్త్వా శుధ్యతే నాత్ర సంశయః ।**

బుద్ధిపూర్వకంగా చేసిన పాతకాలు నాలుగు లక్షల జపంతోను, క్రోధం వల్ల చేసినవి ఎనిమిది లక్షల జపంతోను, వీరుల్ని చంపడంవల్ల కలిగిన పాపాలు లక్షజపంతోను, భ్రూణహత్య కోటి జపంతోను, తల్లిని చంపిన దోషపాపాలు పదిలక్షల జపంతోను నశిస్తాయి. (శుద్ధి పొందుతాయి) ఇందు సందేహం లేదు.

**గోఘ్నశ్చైవ కృతఘ్నశ్చ స్త్రీఘ్నః పాపయుతో నరః ॥ 9 ॥**

**అయుతాఘోరమభ్యస్య ముచ్యతే నాత్ర సంశయః ।**

గోవధ చేసినవాడు, చేసిన మేలును మరచినవాడు, స్త్రీని చంపినవాడు పదివేలసార్లు అఘోర మంత్రజపం చేసి విముక్తుడవుతాడు. ఇందులో సందేహం లేదు.

**సురాపో లక్షమాత్రేణ బుద్ధ్యాబుద్ధ్యాపి వై ప్రభో ॥ 10 ॥**

**ముచ్యతే నాత్ర సందేహస్తదర్ధేన చ వారుణీమ్ ।**

తెలిసో తెలియకో సుర సేవించినవాడు లక్షమంత్రజపంతో, అందులో సగం జపంతో మద్యాన్ని(కల్లు) త్రాగినవాడు విముక్తుడవుతాడు. ఇందులో సందేహం లేదు.

**అస్నాతాశీ సహస్రేణ అజపీ చ తథా ద్విజః ॥ 11 ॥**

**అహుతాశీ సహస్రేణ అదాతా చ విశుధ్యతి ।**

స్నానం చేయకుండానే భుజించువాడు, జపం చేయకయే భుజించు ద్విజుడు వేయిమార్లు, ఇట్లే అగ్నికి ఆహుతులివ్వకుండా, ఇతరులకు దానం ఇవ్వకుండా భుజించువాడు వేయిమార్లు జపంతో పరిశుద్ధులవుతారు.

**బ్రాహ్మణస్వాపహర్తా చ స్వర్ణస్తేయీ నరాధమః ॥ 12 ॥**

**నియుతం మానసం జప్త్వా ముచ్యతే నాత్రసంశయః ।**

బ్రాహ్మణుల ధనాన్ని దొంగిలించినవాడు, బంగారాన్ని దొంగిలించినవాడూ అయిన అధమ మానవుడు పదిలక్షల మానసజపంతో ముక్తుడవుతాడు. ఇందులో సందేహం లేదు.

**గురుతల్పపరో వాపి మాతృఘ్నోవా నరాధమః ॥ 13 ॥**

**బ్రహ్మఘ్నశ్చ జపేదేవం మానసం వై పితామహ ।**
**సంపర్కాత్పాపినాం పాపం తత్సమం పరిభాషితమ్ ॥ 14 ॥**

**తథాప్యయుతమాత్రేణ పాతకాద్వై ప్రముచ్యతే ।**

గురుపత్ని విషయంలో ఆసక్తి కలవాడు, తల్లిని చంపిన అల్పమానవుడూ, బ్రహ్మహత్య చేసినవాడూ పది లక్షల అఘోర మంత్రజపంతో ముక్తులవుతారు. పాపులతో కలయిక కలవారు కూడా వారితో సమానంగా పాపం చేసినవారుగా పరిగణింపబడతారు. అటువంటి వారు కూడా పదిలక్షల జపంతో విముక్తులవుతారు.

**సంసర్గాత్పాతకీ లక్షం జపేద్వై మానసం ధియా ॥ 15 ॥**

**ఉపాంశు యచ్చతుర్ధా వై వాచికం చాష్టధా జపేత్ ।**
**పాతకాదర్ధమేవ స్యాదుపపాతకినాం స్మృతమ్ ॥ 16 ॥**

**తదర్ధం కేవలే పాపే నాత్ర కార్యా విచారణా ।**

సాహచర్యం వల్ల పాతకులైనవారు బుద్ధితో లక్షసార్లు అఘోరమానసజపం చేయాలి. ఉపాంశుగా దానికి నాలుగురెట్ల జపంతోను, వాచికం అయిన ఎనిమిదిరెట్ల జపంతోను నశింపజేయాలి. ఉపపాతకాలు అందు సగం జపంతో నశిస్తాయి. సామాన్యపాపాలు అందు సగం జపంతో శమిస్తాయి. ఇందులో ఎటువంటి సందేహం లేదు.

**బ్రహ్మహత్యా సురాపానం సువర్ణస్తేయమేవ చ ॥ 17 ॥**

**కృత్వా చ గురుతల్పం చ పాపకృత్ బ్రాహ్మణో యది ।**
**రుద్రగాయత్రియా గ్రాహ్యం గోమూత్రం కాపిలం ద్విజాః ॥ 18 ॥**

**గంధద్వారేతి తస్యా వై గోమయం స్వస్థమాహరేత్ ।**
**తేజోఽసి శుక్రమిత్యాజ్యం కాపిలం సంహరేద్ బుధః ॥ 19 ॥**

**ఆప్యాయస్వేతి చ క్షీరం దధిక్రావ్ణోతి చాహరేత్ ।**
**గవ్యం దధి నవం సాక్షాత్కాపిలం వై పితామహః ॥ 20 ॥**

**దేవస్య త్వేతి మంత్రేణ సంగ్రహేద్వై కుశోదకమ్ ।**
**ఏకస్థం హేమపాత్రే వా కృత్వాఘోరేణ రాజతే ॥ 21 ॥**

**తామ్రే వా పద్మపత్రే వా పాలాశే వా దళే శుభే ।**
**సకూర్చం సర్వరత్నాఢ్యం క్షిప్త్వా తత్రైవ కాంచనమ్ ॥ 22 ॥**

ఓ బ్రాహ్మణులారా! బ్రహ్మహత్య, సురసేవించుట, బంగారాన్ని దొంగిలించడం, గురుపత్నీ సమాగమనం అనే పాపాల్ని చేసిన బ్రాహ్మణుడు రుద్రగాయత్రీ మంత్రాన్ని జపిస్తూ కపిలవర్ణగోవుయొక్క మూత్రాన్ని గ్రహించాలి. 'గంధద్వారా' అనే మంత్రాన్ని జపిస్తూ కపిలధేనువు (ఆవు) యొక్క పేడను వేస్తున్నప్పుడే క్రిందపడకుండా సంగ్రహించాలి. ఇట్లే 'తేజోఽసి శుక్రం' అనే మంత్రాన్ని ఉచ్చరిస్తూ కపిల గోవుయొక్క నేతిని స్వీకరించాలి. 'ఆప్యాయస్వ' అనే మంత్రాన్ని పఠిస్తూ పాలను, 'దధిక్రావ్ణ' అనే మంత్రాన్ని జపిస్తూ కపిలగోవుయొక్క తీపి పెరుగును స్వీకరించాలి. ఓ బ్రహ్మదేవా! 'దేవస్యత్వా' అనే మంత్రాన్ని జపిస్తూ దర్భలజలంతో అన్నింటిని కలిపి ఒకటిగా చేసి స్వర్ణపాత్రలోగాని, వెండిపాత్రలోగాని, రాగిపాత్రలోగాని, పద్మదళంలోగాని, మంగళకరమైన పలాశపత్రంలోగాని గ్రహించి అఘోరమంత్రాన్ని పఠిస్తూ స్వీకరించాలి. దాని మీద పలువిధాలైన రత్నాల్ని, బంగారురేకుల్ని ఉంచాలి.

**జపేల్లక్షమఘోరాఖ్యం హుత్వా చైవ ఘృతాదిభిః ।**
**ఘృతేన చరుణా చైవ సమిద్భిశ్చ తిలైస్తథా ॥ 23 ॥**

**యవైశ్చ వ్రీహిభిశ్చైవ జుహుయాద్వై పృథక్ పృథక్ ।**
**ప్రత్యేకం సప్తవారంతు ద్రవ్యాలాభే ఘృతేన తు ॥ 24 ॥**

తర్వాత ఘృతాదులతో ఆహుతులిస్తూ లక్షసార్లు అఘోరమంత్రాన్ని జపించాలి. నెయ్యి, చరువు, సమిధలు, తిలలు, యవలు మొదలగు ధాన్యాలతో వేరువేరుగా ఆహుతులివ్వాలి. ప్రతిదానితోను ఇలా ఏడు పర్యాయాలు చేయాలి. సమిధలు, తిలలు మొదలైన ద్రవ్యాలు దొరకనప్పుడు నేతితోనే ఆహుతులు నిర్వహించాలి.

**హుత్వాఘోరేణ దేవేశం స్నాత్వాఘోరేణ వై ద్విజాః ।**
**అష్టద్రోణఘృతేనైవ స్నాప్య పశ్చాద్విశోధ్య చ ॥ 25 ॥**

**అహోరాత్రోషితః స్నాతః పిబేత్కూర్చం శివాగ్రతః ।**
**బ్రాహ్మం బ్రహ్మజపం కుర్యాదాచమ్య చ యథావిధిః ॥ 26 ॥**

ఓ ద్విజులారా! ఈ విధంగా అఘోరమంత్రంతో జపం చేస్తూ అఘోరదేవుని విగ్రహాన్ని ఎనిమిది ఆఢకాలనేతితో (అడ్డెడునేతితో) స్నానం చేయించి తర్వాత శుభ్రపర్చాలి. అనంతరం ఒక పగలు ఒకరాత్రి ఉపవాసం చేయాలి. ప్రొద్దుటే స్నానం చేసి పంచగవ్యాల్ని పానం చేయాలి. శివుని ముందు కూర్చుండాలి. విధ్యనుసారంగా ఈ పనులన్నీ చేసిన తర్వాత ఆచమించి బ్రహ్మగాయత్రీజపాన్ని చేయాలి.

**ఏవం కృత్వా కృతఘ్నోఽపి బ్రహ్మహా భ్రూణహా తథా ।**
**వీరహా గురుఘాతీ చ మిత్రవిశ్వాసఘాతకః ॥ 27 ॥**

**స్తేయీ సువర్ణస్తేయీ చ గురుతల్పరతః సదా ।**
**మద్యపో వృషలీసక్తః పరదారవిధర్షకః ॥ 28 ॥**

**బ్రహ్మస్వహా తథా గోఘ్నో మాతృహా పితృహా తథా ।**
**దేవప్రచ్యావకశ్చైవ లింగప్రధ్వంసకస్తథా ॥ 29 ॥**

**తథాన్యాని చ పాపాని మానసాని ద్విజో యది ।**
**వాచికాని తథాన్యాని కాయికాని సహస్రశః ॥ 30 ॥**

**కృత్వా విముచ్యతే సద్యో జన్మాంతరశతైరపి ।**
**ఏతద్రహస్యం కథితమఘోరేశప్రసంగతః ॥ 31 ॥**

**తస్మాజ్జపేద్ ద్విజో నిత్యం సర్వపాపవిశుద్ధయే ।**

ఈ విధమైన జపం, హుతం నిర్వర్తించిన వ్యక్తి కృతఘ్నుడు, బ్రహ్మహత్యచేసినవాడు, భ్రూణహత్య చేసినవాడు, వీరుల్ని వధించినవాడు, గురువును వధించినవాడు, విశ్వాసఘాతకుడు, దొంగ, బంగారం దొంగిలించినవాడు, గురుపత్నితో రమించువాడు, ఎల్లప్పుడు మద్యాన్ని సేవించేవాడు, శూద్రస్త్రీల విషయమై ఆసక్తికలవాడు, ఇతరుల భార్యతో వ్యభిచరించువాడు, బ్రాహ్మణుల ధనాన్ని హరించేవాడు అట్లే గోహత్య చేసినవాడు, తల్లిని తండ్రిని చంపినవాడు, దేవతావిగ్రహాల్ని ముక్కలు చేసినవాడు, శివలింగధ్వంసకారకుడు ఇంకా ఇతరాలైన పాపాల్ని, అవి మానసికాలైనా, వాచికాలైనా, కాయకాలైనా విముక్తి పొందుతాడు. అవి పూర్వజన్మలో చేసినవైనా, వేలకు వేలు అయినా వెంటనే విముక్తమవుతాయి. అఘోరశివభగవానుడు సందర్భవశంగా నాతో ఈ రహస్యాల్ని చెప్పాడు. అందువలన ప్రతిరోజు మీరు సమస్తపాపవిమోచనానికై అఘోరమంత్రాన్ని జపించండి!

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగేఽఘోరేశ్వరమాహాత్మ్యం నామ పంచదశోఽధ్యాయః ॥ 15 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని అఘోరేశ్వరమాహాత్మ్యమనే పదిహేనవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **షోడశోఽధ్యాయః** - పదహారవ అధ్యాయం

## **ఈశానమాహాత్మ్యకథనమ్** - ఈశానుని మాహాత్మ్యాన్ని చెప్పుట

**అథాన్యో బ్రహ్మణః కల్పో వర్తతే మునిపుంగవాః ।**
**విశ్వరూప ఇతి ఖ్యాతో నామతః పరమాద్భుతః ॥ 1 ॥**

ఓ మునిశ్రేష్ఠులారా! కృష్ణకల్పానంతరం 'విశ్వరూపం' అనే పేరుతో ప్రసిద్ధిచెందిన మిక్కిలి ఆశ్చర్యకరమైన కల్పం బ్రహ్మకు ఏర్పడింది.

**వినివృత్తే తు సంహారే పునః సృష్టే చరాచరే ।**
**బ్రహ్మణః పుత్రకామస్య ధ్యాయతః పరమేష్ఠినః ॥ 2 ॥**

**ప్రాదుర్భూతా మహానాదా విశ్వరూపా సరస్వతీ ।**
**విశ్వమాల్యాంబరధరా విశ్వయజ్ఞోపవీతినీ ॥ 3 ॥**

**విశ్వోష్ణీషా విశ్వగంధా విశ్వమాతా మహోష్ఠికా ।**

సమస్త జగత్తు నశించిన తర్వాత మరల స్థావరజంగమప్రపంచ సృష్టి చేయదలచిన బ్రహ్మ పుత్రార్థియై ధ్యానమగ్నుడై ఉండగా ఆతడి ముందు పెద్దధ్వని గలదియై విశ్వరూపిణి సరస్వతీదేవి పుట్టింది. ఆమె విశ్వమాలల్ని, విశ్వాంబరాల్ని ధరించినది. విశ్వమే జందెంగా కలది, విశ్వమే తలపాగగా కలది. ఆమె విశ్వగంధవతి. ఆమె మహోష్ఠిక. ఆమె విశ్వజనని.

**తథావిధం స భగవానీశానం పరమేశ్వరమ్ ॥ 4 ॥**

**శుద్ధస్ఫటికసంకాశం సర్వాభరణభూషితమ్ ।**
**అథ తం మనసా ధ్యాత్వా యుక్తాత్మా వై పితామహః ॥ 5 ॥**

**వవందే దేవమీశానం సర్వేశం సర్వగం ప్రభుమ్ ।**

యుక్తాత్ముడు, భగవంతుడైన బ్రహ్మ స్వచ్ఛస్ఫటికం వంటి కాంతిగలవాడు. సమస్తాభరణాలతో అలంకృతుడు, సర్వేశ్వరుడు, సర్వవ్యాపి, మహాప్రభువు, దేవాధిదేవుడు, పరమేశ్వరుడు అయిన ఈశ్వరుడికి మనస్సుతో ధ్యానిస్తూ నమస్కరించాడు.

**ఓమీశాన నమస్తేఽస్తు మహాదేవ నమోఽస్తు తే ॥ 6 ॥**

**నమోఽస్తు సర్వవిద్యానామీశాన పరమేశ్వర ।**
**నమోఽస్తు సర్వభూతానామీశాన వృషవాహన ॥ 7 ॥**
**బ్రహ్మణోఽధిపతే తుభ్యం బ్రహ్మణే బ్రహ్మరూపిణే ।**
**నమో బ్రహ్మాధిపతయే శివం మేఽస్తు సదాశివ ॥ 8 ॥**

ఓ ఓంకార స్వరూపుడా! ఈశ్వరా! నమస్కారం. ఓ మహాదేవా! నమస్కారం! సమస్తవిద్యాధినాథుడా! ఈశ్వరుడా! పరమేశ్వరుడా! వందనం. సమస్తప్రాణులకు ప్రభువైనవాడా! వృషభవాహనా! నమస్కారం. ఓ బ్రహ్మాధిపతీ! ప్రణామం. బ్రహ్మస్వరూపుడా! సాక్షాత్ బ్రహ్మా! నీకు వందనం. బ్రహ్మాధిపతీ! నమస్కారం. ఓ సదాశివా! నాకు మంగళాన్ని అనుగ్రహించు.

**ఓంకారమూర్తే దేవేశ సద్యోజాత నమోనమః ।**
**ప్రపద్యే త్వాం ప్రపన్నోఽస్మి సద్యోజాతాయ వై నమః ॥ 9 ॥**

**అభవే చ భవే తుభ్యం తథా నాతిభవే నమః ।**
**భావోద్భవ భవేశాన మాం భజస్వ మహాద్యుతే ॥ 10 ॥**

ఓంకారస్వరూపుడా! దేవేశ్వరుడా! సద్యోజాతుడా! మాటిమాటికి అభివందనం. సద్యోజాతా! నమస్కారం. నిన్ను నేను శరణుజొచ్చాను. అభవుడవయ్యీ నీవు భవుడవు. నీకు ప్రణామం. భవోద్భవుడా! భవేశానుడా! మహాకాంతిమంతుడా! నన్ను రక్షించు.

**వామదేవ నమస్తుభ్యం జ్యేష్ఠాయ వరదాయ చ ।**
**నమో రుద్రాయ కాలాయ కలనాయ నమో నమః ॥ 11 ॥**

**నమో వికరణాయైవ కాలవర్ణాయ వర్ణినే ।**
**బలాయ బలినాం నిత్యం సదా వికరణాయ తే ॥ 12 ॥**

ఓ వామదేవా! నీకు నమస్కారం. ఓ జ్యేష్ఠుడా! వరదుడా! వందనం. ఓ రుద్రుడా! కాలస్వరూపుడా! కలనకారకుడా! (సంఖ్యారూపం) మాటి మాటికి వందనం. ఓ వికరణుడా! ఓ కాలవర్ణుడా! ఓ వర్ణీ! వందనం. బలవంతులకే బలవంతుడవగు ఓ వికరణుడా! ఎల్లప్పుడూ నీకు నమస్కారం.

**బలప్రమథనాయైవ బలినే బ్రహ్మరూపిణే ।**
**సర్వభూతేశ్వరేశాయ భూతానాం దమనాయ చ ॥ 13 ॥**

**మనోన్మనాయ దేవాయ నమస్తుభ్యం మహాద్యుతే ।**
**వామదేవాయ వామాయ నమస్తుభ్యం మహాత్మనే ॥ 14 ॥**
**జ్యేష్ఠాయ చైవ శ్రేష్ఠాయ రుద్రాయ వరదాయ చ ।**
**కాలహంత్రే నమస్తుభ్యం నమస్తుభ్యం మహాత్మనే ॥ 15 ॥**

ఓ బలవంతుడా! బలప్రమథనా! బ్రహ్మస్వరూపుడా! సమస్తప్రాణులకు ప్రభువైనవాడా! సర్వప్రాణుల్ని దమించువాడా! నమస్సులు. ఓ మనోన్మనుడా! మహాదేవా! మహాకాంతిమంతుడా! వామదేవా! ఓ వామాత్ముడా! మహాత్ముడా! నీకు నమస్కారం.

ఓ జ్యేష్ఠుడా! శ్రేష్ఠుడా! రుద్రుడా! వరదుడా! కాలహరణా! మహాత్మా! నీకు అభివందనం.

**ఇతి స్తవేన దేవేశం ననామ వృషభధ్వజమ్ ।**
**యః పఠేత్సకృదేవేహ బ్రహ్మలోకం గమిష్యతి ॥ 16 ॥**

**శ్రావయేద్వా ద్విజాన్ శ్రాద్ధే స యాతి పరమాం గతిమ్ ।**

ఈ విధంగా వృషభధ్వజుడైన ఈశ్వరుణ్ణి బ్రహ్మ స్తుతించి నమస్కరించాడు. ఒక్కసారి ఈ స్తవాన్ని పఠించినవాడు బ్రహ్మలోకానికి వెళ్లుతాడు. శ్రాద్ధసమయంలో ద్విజులకు విన్పించినవాడు కూడా పరమస్థితిని పొందుతాడు.

**ఏవం ధ్యానగతం తత్ర ప్రణమంతం పితామహమ్ ॥ 17 ॥**

**ఉవాచ భగవానీశః ప్రీతోఽహం తే కిమిచ్ఛసి ॥ 18 ॥**

**ఉవాచ భగవాన్ రుద్రం ప్రీతం ప్రీతేన చేతసా ।**

ఈ విధంగా ధ్యానమగ్నుడై నమస్కరిస్తున్న బ్రహ్మను గూర్చి ఈశ్వరుడిట్లు పలికాడు. "నేను సంతోషించాను. నీకు ఏమి కావాలి" అని. తర్వాత సంప్రీతమనస్కుడైన బ్రహ్మ మిక్కిలి నివేదనపూర్వకమైన పరిశుద్ధమైన వాక్కులతో పరమేశ్వరుడైన రుద్రుణ్ణి గూర్చి పలికాడు.

**యదిదం విశ్వరూపం తే విశ్వగౌః శ్రేయసీశ్వరీ ॥ 19 ॥**

**ఏతద్వేదితుమిచ్ఛామి యథేయం పరమేశ్వర ।**

ఓ పరమేశ్వరా! ఇదియంతా నీ విశ్వరూపమే. కళ్యాణకారి అయిన ఈ గోవు కూడా నీ విశ్వరూపమే. ఈ విషయాన్ని తెలుసుకొనగోరుతున్నాను.

**కైషా భగవతీ దేవీ చతుష్పాదా చతుర్ముఖీ ॥ 20 ॥**

**చతుఃశృంగీ చతుర్వక్త్రా చతుర్దంష్ట్రా చతుఃస్తనీ ।**
**చతుర్హస్తా చతుర్నేత్రా విశ్వరూపా కథం స్మృతా ॥ 21 ॥**
**కిం నామగోత్రా కస్యేయం కిం వీర్యా చాపి కర్మతః ।**
**తస్య తద్వచనం శ్రుత్వా దేవదేవో వృషధ్వజః ॥ 22 ॥**
**ప్రాహ దేవవృషం బ్రహ్మ బ్రహ్మాణం చాత్మసంభవమ్ ।**
**రహస్యం సర్వమంత్రాణాం పావనం పుష్టివర్ధనమ్ ॥ 23 ॥**

**శృణుష్వైతత్పరం గుహ్యమాదిసర్గే యథా తథా ।**
**ఏవం యో వర్తతే కల్పో విశ్వరూపస్త్వసౌ మతః ॥ 24 ॥**

**బ్రహ్మస్థానమిదం చాపి యత్ర ప్రాప్తం త్వయా ప్రభో ।**
**త్వత్తః పరతరం దేవ విష్ణునా తత్పదం శుభమ్ ॥ 25 ॥**

**వైకుంఠేన విశుద్ధేన మమ వామాంగజేన వై ।**
**తదా ప్రభృతి కల్పశ్చ త్రయస్త్రింశత్తమో హ్యాయమ్ ॥ 26 ॥**

**శతం శతసహస్రాణామతీతా యే స్వయంభువః ।**
**పురస్తాత్తవ దేవేశ తచ్ఛృణుష్వ మహామతే ॥ 27 ॥**

నాలుగుపాదాలు, నాలుగుముఖాలు, నాలుగుకొమ్ములు, నాలుగునోరులు, నాలుగుకోరలు, నాలుగుస్తనాలు, నాలుగుచేతులు, నాలుగు నేత్రాలు కలిగిన ఈమె ఎవరు? ఈమెకు ఈ విశ్వరూపం ఎలా కలిగింది. ఈమె పేరు మరియు గోత్రం ఏది? ఈమె ఎవ్వరికి చెందింది. ఈమె కార్యకరణ శక్తి ఎంతటిది? అని బ్రహ్మ బలికాడు.

బ్రహ్మ పలికిన ఆ మాటలు విని పరబ్రహ్మస్వరూపుడగు దేవదేవుడైన వృషధ్వజశివుడు దేవతలలో శ్రేష్ఠుడు, ఆత్మజుడు అయిన బ్రహ్మతో ఇలా పలికాడు. ప్రథమసృష్టిలో సర్వమంత్రాల రహస్యమూ, పవిత్రమూ, ఐశ్వర్యదాయకమూ, పరమగుహ్యమైన దానిని చెప్పుతున్నాను. వినుము. ప్రస్తుతం జరుగుతున్న విశ్వరూప కల్పంలో నేను నీకు బ్రహ్మపదాన్ని ప్రాప్తింపజేశాను. నా వామాంగం నుంచి ఉత్పన్నుడైన విష్ణువుచేత అధిష్ఠితమై విశుద్ధమైనది. వైకుంఠము. అది బ్రహ్మస్థానానికంటే శ్రేష్ఠమైంది. ఆ కాలంలోనే ముప్పై మూడో కల్పం ప్రారంభమయ్యింది. గొప్ప బుద్ధిమంతుడా! దేవేశ్వరా! పద్మయోని! నీకు ముందు వందలు, లక్షల కొలది బ్రహ్మలు గడచిపోయినారు. ఆ విషయాన్ని వినుము.

**ఆనందస్తు సవిజ్ఞేయ ఆనందత్వే వ్యవస్థితా ।**
**మాండవ్యగోత్రస్తపసా మమ పుత్రత్వమాగతః ॥ 28 ॥**

నీది మాండవ్యగోత్రం, తపస్సుతో నాకు పుత్రుడయినావు. అందుచేతనే ఆనందకరస్థితిని పొంది బ్రహ్మానందంగా తెలియబడుతుంది.

**త్వయి యోగం చ సాంఖ్యం చ తపో విద్యావిధిక్రియాః ।**
**ఋతం సత్యం దయా బ్రహ్మ అహింసా సన్మతిః క్షమా ॥ 29 ॥**

**ధ్యానం ధ్యేయం దమః శాంతిర్విద్యావిద్యామతిర్ధృతిః ।**
**కాంతిర్నీతిః ప్రథా మేధా లజ్జా దృష్టిః సరస్వతీ ॥ 30 ॥**

**తుష్టిః పుష్టిః క్రియా చైవ ప్రసాదశ్చ ప్రతిష్ఠితాః ।**
**ద్వాత్రింశత్సుగుణా హ్యేషా ద్వాత్రింశాక్షరసంజ్ఞయా ॥ 31 ॥**
**ప్రకృతిర్విహితా బ్రహ్మంస్త్వత్ప్రసూతిర్మహేశ్వరీ ।**
**విష్ణోర్భగవతశ్చాపి తథాన్యేషామపి ప్రభో ॥ 32 ॥**

**సైషా భగవతీ దేవీ మత్ప్రసూతిః ప్రతిష్ఠితా ।**
**చతుర్ముఖీ జగద్యోనిః ప్రకృతిర్గౌః ప్రతిష్ఠితా ॥ 33 ॥**
**గౌరీ మాయా చ విద్యా చ కృష్ణా హైమవతీతి చ ।**
**ప్రధానం ప్రకృతిశ్చైవ యామాహుస్తత్త్వచింతకాః ॥ 34 ॥**

యోగం, సాంఖ్యం, తపస్సు, విద్య, విధి (శాస్త్రవిధానం) క్రియ, ఋతం(ప్రియభాషణం), సత్యం, దయ, బ్రహ్మ, అహింస, స్థిరచిత్తం, క్షమ, ధ్యానం, ధ్యేయం, దమం, శాంతి, విద్య, అవిద్య, మతి, ధృతి, కాంతి, నీతి, ప్రథ (ఖ్యాతి) మేధ (ధారణాశక్తి గల బుద్ధి) లజ్జ, దృష్టి (దివ్యజ్ఞానం) సరస్వతి (వాక్కు) తుష్టి, పుష్టి, క్రియ (వేదవిహితకర్మ) ప్రసాదం (ప్రసన్నత) అనే ఈ ముప్పై రెండు గుణాలు నీలో ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఈ ముప్పై రెండు గుణాల వల్ల ముప్పై రెండు అక్షరసంజ్ఞలచే ఆమె తెలియబడుతుంది.

ఓ బ్రహ్మ! ప్రకృతి, నీ ఉత్పత్తికి తగినది అయిన దేవి నాచే సృష్టింపబడింది. దీనితో నీవు ఆ ముప్పది రెండు గుణాలతో కూడినవాడివి అయినావు. ఈమె విష్ణువు కంటె, ఇతర దేవతల కంటెను శ్రేష్ఠురాలు. వారందరూ ఈమె బిడ్డలే. జగత్తును సృష్టించే నాలుగుముఖాలుగలిగిన ఈమెను తత్త్వచింతనగలిగినవారు ప్రకృతి, గోవు, గౌరి, మాయ, విద్య, కృష్ణ, హైమవతి, ప్రకృతి ప్రధానం అనే పేర్లతో పిలుస్తారు.

**అజామేకాం లోహితాం శుక్లకృష్ణాం విశ్వప్రజాం సృజమానాం సరూపామ్ ।**
**అజోఽహం మాం విద్ధి తాం విశ్వరూపం గాయత్రీం గాం విశ్వరూపాం హి బుద్ధ్వా ॥ 35 ॥**

జన్మరహితమైంది. ఎరుపు, తెలుపు, నలుపు వర్ణాలు కలిగింది. అనేకరూపాలతో ఉండి ప్రజల్ని సృష్టిస్తుంది. నేను జన్మరహితుణ్ణే (అజ) అయినా విశ్వవ్యాపకుణ్ణి. "నీవు ఈ దేవిని బుద్ధిబలంతో విశ్వగాయత్రిగా తెలిసికో" అని పలికాడు ఈశ్వరుడు.

**ఏవముక్త్వా మహాదేవః ససర్జ పరమేశ్వరః ।**
**తతశ్చ పార్శ్వగా దేవ్యాః సర్వరూపకుమారకాః ॥ 36 ॥**

**జటీ ముండీ శిఖండీ చ అర్ధముండశ్చ జజ్ఞిరే ।**
**తతస్తేన యథోక్తేన యోగేన సమహౌజసః ॥ 37 ॥**

**దివ్యవర్ష సహస్రాంతే ఉపాసిత్వా మహేశ్వరమ్ ।**
**ధర్మోపదేశమఖిలం కృత్వా యోగమయం దృఢమ్ ॥ 38 ॥**

**శిష్టాశ్చ నియతాత్మానః ప్రవిష్టా రుద్రమీశ్వరమ్ ।**

ఈ విధంగా పలికిన మహాదేవుడైన పరమేశ్వరుడు ఈ దేవియొక్క పార్శ్వగులకు సర్వరూపులైన నలుగురు పుత్రుల్ని పుట్టించాడు. వారు జటి, ముండి, శిఖండి, అర్ధముండి అనే పేర్లతో ఉన్నారు. మహాతేజస్కులైన ఆ నలుగురు యోగాభ్యాసంలో దక్షతను పొంది వేయి దివ్యసంవత్సరాలు శివుణ్ణి సేవించి సంపూర్ణమైన ధర్మోపదేశాన్ని నిర్వహించారు. శిష్టులు, నియతాత్ములు అయిన ఆ నలుగురు రుద్రభగవానుడిలో లీనమయ్యారు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే ఈశానమాహాత్మ్యకథనం నామ షోడశోఽధ్యాయః ॥ 16 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని ఈశానమాహాత్మ్యకథనమనే పదహారవ అధ్యాయం సమాప్తం.

## **సప్తదశోఽధ్యాయః** – పదిహేడవ అధ్యాయం

## **లింగోద్భవవర్ణనమ్** – లింగోద్భవవర్ణనం

**సూత ఉవాచ** – సూతమహర్షి పలికాడు.

**ఏవం సంక్షేపతః ప్రోక్తః సద్యాదీనాం సముద్భవః ।**
**యః పఠేచ్ఛృణుయాద్వాపి శ్రావయేద్వా ద్విజోత్తమాః ॥ 1 ॥**

**స యాతి బ్రహ్మ సాయుజ్యం ప్రసాదాత్పరమేష్ఠినః ।**

ఓ ముని శ్రేష్ఠులారా! ఈ విధంగా శివభగవానుడియొక్క సద్యోజాతాదులైన అవతారాలయొక్క వర్ణనాన్ని సంగ్రహంగా చెప్పాను. ఇట్టి దీన్ని ఎవడు చదువుతాడో, ఎవడు వింటాడో, ఎవడు వినిపిస్తాడో వాడు శివుడి అనుగ్రహం వల్ల బ్రహ్మసాయుజ్యాన్ని పొందుతాడు.

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**కథం లింగమభూల్లింగే సమభ్యర్చ్య స శంకరః ॥ 2 ॥**

**కిం లింగం కస్తథా లింగీ సూత వక్తుమిహార్హసి ।**

ఓ సూతమహర్షీ! లింగోత్పత్తి ఎలా జరిగింది. ఆ లింగంలో శివుడిని ఎలా ఉపాసించాలి. లింగమనగానేమి? అట్లే లింగి అనగా ఎవ్వడు. మాకు చెప్పుటకు నీవు తగినవాడవు.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఏవం దేవాశ్చ ఋషయః ప్రణిపత్య పితామహమ్ ॥ 3 ॥**

**అపృచ్ఛన్ భగవల్లింగం కథమాసీదితి స్వయమ్ ।**
**లింగే మహేశ్వరో రుద్రః సమభ్యర్చ్యః కథం త్వితి ॥ 4 ॥**

**కిం లింగం కస్తథా లింగీ సోఽప్యాహ చ పితామహః ।**

ఇలా దేవతలు, ఋషులు, బ్రహ్మకు నమస్కరించి "భగవానుడా! శివుడు లింగంగా ఎట్లు ఉద్భవించాడు? లింగంగా ఉన్న రుద్రభగవానుడికి పూజ ఎలా చెయ్యాలి? లింగం అనగా ఏమిటి? లింగి అనగా ఎవ్వడు?" అని బ్రహ్మను అడిగారు.

**పితామహ ఉవాచ** – బ్రహ్మ పలికాడు.

**ప్రధానం లింగమాఖ్యాతం లింగీ చ పరమేశ్వరః ॥ 5 ॥**

**రక్షార్థమంబుధౌ మహ్యం విష్ణోస్త్వాసీత్సురోత్తమాః ।**
**వైమానికే గతే సర్గే జనలోకం సహర్షిభిః ॥ 6 ॥**

**స్థితికాలే తదా పూర్ణే తతః ప్రత్యాహృతే తథా ।**
**చతుర్యుగసహస్రాంతే సత్యలోకం గతే సురాః ॥ 7 ॥**

ప్రధానము (ప్రకృతి) లింగమే. భగవంతుడు, రుద్రుడు లింగి. ఓ దేవతలారా! నన్ను, విష్ణువును రక్షించడానికి సముద్రంలో లింగం ఉద్భవించింది.

అప్పటి స్థితికాలం సంపూర్ణం అవ్వడం చేత, సృష్టిమార్పు జరగడం చేత వేలకొలది చతుర్యుగకాలం అంతమైన పిమ్మట వారందరూ మహర్షులతో పాటు సర్వజనలోకమంతా విమానాలతో సత్యలోకానికి వెళ్లారు.

**వినాధిపత్యం సమతాం గతేఽంతే బ్రహ్మణో మమ ।**
**శుష్కే చ స్థావరే సర్వే త్వనావృష్ట్యా చ సర్వశః ॥ 8 ॥**

**పశవో మానుషా వృక్షాః పిశాచాః పిసితాశనాః ।**
**గంధర్వాద్యాః క్రమేణైవ నిర్దగ్ధా భానుభానుభిః ॥ 9 ॥**

అనంతరం అంతంలో వారికి అధిపతి లేకపోవడంచేత బ్రహ్మనైన నా అస్తిత్వం నశించడంచేత, వర్షాభావం వల్ల సమస్తస్థావరాలు కృశించిపోయాయి. అంతేకాక జంతువులు, మానవులు, వృక్షాలు, పిశాచాలు, రాక్షసులు, గంధర్వులు మొదలైన వారందరూ సూర్యకాంతివల్ల పూర్తిగా మండి క్రమంగా భస్మమైపోయారు.

**ఏకార్ణవే మహాఘోరే తమోభూతే సమంతతః ।**
**సుష్వాపాంభసి యోగాత్మా నిర్మలో నిరుపప్లవః ॥ 10 ॥**

**సహస్రశీర్షా విశ్వాత్మా సహస్రాక్షః సహస్రపాత్ ।**
**సహస్రబాహుః సర్వజ్ఞః సర్వదేవభవోద్భవః ॥ 11 ॥**

**హిరణ్యగర్భో రజసా తమసా శంకరః స్వయమ్ ।**
**సత్త్వేన సర్వగో విష్ణుః సర్వాత్మత్వే మహేశ్వరః ॥ 12 ॥**

**కాలాత్మా కాలనాభస్తు శుక్లం కృష్ణస్తు నిర్గుణః ।**
**నారాయణో మహాబాహుః సర్వాత్మా సదసన్మయః ॥ 13 ॥**

సమస్తజగాలు మండిపోయి ఒకే సముద్రమయ్యింది. అన్ని వైపుల నుంచి మహాభయంకరమైన అంధకారం వ్యాపించింది. యోగాత్ముడైన విష్ణువు ఎటువంటి ఉపద్రవాలు లేక ఆ నీటిపై నిద్రించాడు. ఆయనకు వేయి శిరస్సులు, వేయి కన్నులు, వేయి పాదాలు, వేయి బాహువులు ఉన్నాయి. విశ్వాత్ముడు, సర్వజ్ఞుడు, అయి సమస్తదేవతలతోపాటుగా ఈ ప్రపంచాన్ని సృష్టిస్తాడు. రజోగుణయుక్తుడవ్వడంతో బ్రహ్మగ, తమోగుణాన్ని

కలిగినవాడు అవడంచేత శంకరుడుగా, సత్త్వ గుణోపేతుడు అవడంవల్ల సర్వవ్యాపి విష్ణువుగా, సర్వాత్మత్వకారణంగా మహేశ్వరుడు అవుతాడు. కాలస్వరూపుడవడంచేత కాలుడవుతున్నాడు. ఆతడు తెలుపునలుపువర్ణాల మిశ్రితుడుగా ఉన్నాడు. ఆతడు గుణరహితుడు. ఆతడు మహాబాహువు, సర్వాత్మకుడు. సత్తు ఆయనే. అసత్తు ఆయనే. ఆయనే నారాయణుడు.

**తథాభూతమహం దృష్ట్వా శయానం పంకజేక్షణమ్ ।**
**మాయయా మోహితస్తస్య తమవోచమమర్షితః ॥ 14 ॥**

**కస్త్వం వదేతి హస్తేన సముత్థాప్య సనాతనమ్ ।**
**తదా హస్తప్రహారేణ తీవ్రేణ స దృఢేన తు ॥ 15 ॥**

**ప్రబుద్ధోఽహీయశయనాత్సమాసీనః క్షణం వశీ ।**

ఆ విధంగా నీటిలో నిద్రిస్తున్న పద్మనయనుడగు విష్ణువును చూచి నేను ఆతడి మాయవల్ల మోహితుడనై కోపంగా ఆయన్ని ఇలా అడిగాను. సనాతనుడైన ఆతణ్ణి చేతితో తట్టిలేపి నీవెవ్వడవు? చెప్పు? అని ప్రశ్నించాను. కఠినం మరియు దృఢమూ అయిన నా చేతిదెబ్బవల్ల శేషతల్పశాయి అయిన ఆతడు నిద్రలేచి ఒకక్షణకాలం నిశ్చలంగా కూర్చున్నాడు.

**దదర్శ నిద్రావిక్లిన్ననీరజామలలోచనః ॥ 16 ॥**

**మామగ్రే సంస్థితం భాసాధ్యాసితో భగవాన్ హరిః ।**
**ఆహ చోత్థాయ భగవాన్ హసన్మాం మధురం సకృత్ ॥ 17 ॥**

**స్వాగతం స్వాగతం వత్స పితామహ మహాద్యుతే ।**

నిద్రవల్ల ఆర్ద్రమూ, స్వచ్ఛమూ అయిన పద్మనయనుడైన హరి తనముందున్న నన్ను చూచి శయ్యమీద నుంచి లేచి నవ్వుతూ మధురమైన వాక్కులతో నన్ను ఉద్దేశించి పలికాడు. "గొప్పకాంతిమంతుడా! బ్రహ్మా! వత్సా!(పుత్రుడా!) నీకు స్వాగతం. నీకు స్వాగతం." అని.

**తస్య తద్వచనం శ్రుత్వా స్మితపూర్వం సురర్షభాః ॥ 18 ॥**

**రజసా బద్ధవైరశ్చ తమవోచం జనార్దనమ్ ।**
**భాషతే వత్స వత్సేతి సర్గసంహారకారణమ్ ॥ 19 ॥**

దేవతా శ్రేష్ఠులారా! స్మితపూర్వకమైన విష్ణువు యొక్క ఆ వాక్కును విని రజోగుణంచేత బద్ధుడనై ఉండడంచేత విష్ణువును గూర్చి ఇలా పలికాను. సృష్టిలయకారకుణ్ణి నన్ను వత్స! వత్స! అని పిలుస్తున్నావు.

**మామిహాంతః స్మితం కృత్వా గురుః శిష్యమివానఘ ।**
**కర్తారం జగతాం సాక్షాత్ప్రకృతేశ్చ ప్రవర్తకమ్ ॥ 20 ॥**

**సనాతనమజం విష్ణుం విరించిం విశ్వసంభవమ్ ।**
**విశ్వాత్మానం విధాతారం ధాతారం పంకజేక్షణమ్ ॥ 21 ॥**

**కిమర్థం భాషసే మోహాద్వక్తుమర్హసి సత్వరమ్ ।**

అనఘా! నేను సృష్టికర్తను, ప్రకృతిని నడపువానిని, సనాతనుణ్ణి, అజుణ్ణి, విష్ణువును, బ్రహ్మను, విశ్వసంభవుణ్ణి, విశ్వాత్మకుణ్ణి, ధాతను, విధాతను, పద్మనేత్రుణ్ణి. ఇటువంటి నన్ను నవ్వుతూ ఒక శిష్యుణ్ణి గురువు పిలిచినట్లు వత్సా! పుత్రా! అని ఎందుకు పిలుస్తున్నావు. మోహితుడవై పలుకుతున్నావా?

**సోఽపి మామాహ జగతాం కర్తాహమితి లోకయ ॥ 22 ॥**

**భర్తా హర్తా భవానంగాదవతీర్ణో మమావ్యయాత్ ।**
**విస్మృతోఽసి జన్నాథం నారాయణమనామయమ్ ॥ 23 ॥**

**పురుషం పరమాత్మానం పురుహూతం పురుష్టుతమ్ ।**
**విష్ణుమచ్యుతమీశానం విశ్వస్య ప్రభవోద్భవమ్ ॥ 24 ॥**

**తవాపరాధో నాస్త్యత్ర మమ మాయాకృతం త్విదమ్ ।**

అప్పుడు ఆతడు నేను జగత్కర్తనని తెలుసుకో. నేను భర్తను. హర్తను. నీవు నా శరీరం నుంచి జన్మించావు. నేను జగన్నాథుణ్ణి, అవ్యయుణ్ణి, అనామయుణ్ణి, నారాయణుణ్ణి. నీవు నన్ను మర్చిపోయావు. నేనే పురుషుణ్ణి, పరమాత్మను, పురుహూతుణ్ణి, పురుష్టుతుణ్ణి, విష్ణువును, అచ్యుతుణ్ణి. ఈ ప్రపంచాన్ని సృష్టించిన ఈశ్వరుణ్ణి. నన్ను మరుచుటలో నీ తప్పులేదు. నా మాయవల్ల ఇది జరిగింది.

**శృణు సత్యం చతుర్వక్త్ర సర్వదేవేశ్వరో హ్యహమ్ ॥ 25 ॥**

**కర్తా నేతా చ హర్తా చ న మయాస్తి సమో విభుః ।**
**అహమేవ పరం బ్రహ్మ పరం తత్త్వం పితామహ ॥ 26 ॥**

**అహమేవ పరం జ్యోతిః పరమాత్మా త్వహం విభుః ।**
**యద్యదృష్టం శ్రుతం సర్వం జగత్యస్మింశ్చరాచరమ్ ॥ 27 ॥**

**తత్తద్విద్ధి చతుర్వక్త్ర సర్వం మన్మయమిత్యథ ।**

చతురాననా! సత్యాన్ని విను. నేను సమస్త దేవతలకు నాయకుణ్ణి, నేనే కర్తను, నేనే నాయకుణ్ణి, నేనే హరించువాడిని. నాకు సమానుడైన ప్రభువు లేదు. నేనే పరబ్రహ్మను, నేనే పరతత్త్వాన్ని. ఓ పితామహా! నేనే పరంజ్యోతిని, నేనే పరమాత్మను. నీవు చూస్తున్న, వింటున్న సమస్త స్థావరజంగమమైన ప్రకృతి నేనే. ఓ నాల్గుమోములవాడా! సమస్తమూ నా వికారమేనని తెలుసుకో.

**మయా సృష్టం పురావ్యక్తం చతుర్వింశతికం స్వయమ్ ॥ 28 ॥**

**నిత్యాంతా హ్యణవో బద్ధాః సృష్టాః క్రోధోద్భవాదయః ।**
**ప్రసాదాద్ధి భవాండాన్యనేకానీహ లీలయా ॥ 29 ॥**

**సృష్టా బుద్ధిర్మయా తస్యామహంకారస్త్రిధా తతః ।**
**తన్మాత్రాపంచకం తస్మాన్మనః షష్ఠేంద్రియాణి చ ॥ 30 ॥**

**ఆకాశాదీని భూతాని భౌతికాని చ లీలయా ।**
**ఇత్యుక్తవతి తస్మింశ్చ మయి చాపి వచస్తథా ॥ 31 ॥**

పూర్వం అనగా ఆదిలో వ్యక్తమైన ప్రధానం ఇరువది నాలుగు తత్త్వాల నిత్యమైన అణువు నాచేతనే సృష్టింపబడింది. క్రోధం వల్ల అనుగ్రహంవల్ల నీతో కూడిన భువనభాండాలు అనేకాలు లీలార్థం సృష్టింపబడ్డాయి. నేను బుద్ధిని సృష్టించాను. మూడు విధాలైన అహంకారాలు సృష్టింపబడ్డాయి. తదుపరి ఐదు తన్మాత్రలు, మనస్సు, ఇంద్రియాలు, ఆకాశం మొదలైన పంచభూతాల్ని నేను విలాసంగా సృష్టించాను. ఇలా విష్ణువు నన్ను గూర్చి పలికాడు.

**ఆవయోశ్చాభవద్యుద్ధం సుఘోరం రోమహర్షణమ్ ।**
**ప్రళయార్ణవమధ్యే తు రజసా బద్ధవైరయోః ॥ 32 ॥**

ఆ విధంగా విష్ణువు పలికిన తర్వాత రజోగుణవృద్ధివల్ల మాలో వైరం పెరిగి ప్రళయసాగరం మధ్యలో రోమాంచకారకమూ, మహాభయంకరమూ అయిన యుద్ధం మాకు జరిగింది.

**ఏతస్మిన్ అంతరే లింగమభవచ్చావయోః పురః ।**
**వివాదశమనార్థం హి ప్రబోధార్థం చ భాస్వరమ్ ॥ 33 ॥**

**జ్వాలామాలా సహస్రాఢ్యం కాలానలశతోపమమ్ ।**
**క్షయవృద్ధివినిర్ముక్తమాదిమధ్యాంతవర్జితమ్ ॥ 34 ॥**

**అనౌపమ్యమనిర్దేశ్యమవ్యక్తం విశ్వసంభవమ్ ।**

ఈమధ్యలో మా వివాదాన్ని తొలగించడానికి, మాకు జ్ఞానోదయాన్ని కల్గించడానికి ప్రకాశవంతమైన ఒక లింగం మాముందు ప్రత్యక్షమయ్యింది. ఆలింగం నుంచి వెలువడే కాంతిపుంజాలు వేయి సూర్యులకు సమానం. మరియు నూరుకాలాగ్నికాంతులకు సమానం. క్షయమూ మరియు వృద్ధిలేనిది, ఆది, మధ్య, అంతమూ లేనిది ఆ లింగం. దానికి పోలికలేదు. అది వర్ణనాతీతం, అవ్యక్తం, విశ్వోత్పత్తికి కారణం.

**తస్య జ్వాలా సహస్రేణ మోహితో భగవాన్ హరిః ॥ 35 ॥**

**మోహితం ప్రాహ మామత్ర పరీక్షావోఽగ్నిసంభవమ్ ।**
**అధోగమిష్యామ్యనలస్తంభస్యానుపమస్య చ ॥ 36 ॥**

**భవానూర్ధ్వం ప్రయత్నేన గంతుమర్హసి సత్వరమ్ ।**

ఆ లింగంయొక్క సహస్రజ్వాలల ప్రభావంతో శ్రీహరి మోహితుడయ్యాడు. మోహితుడనైన నన్ను చూచి ఇలా చెప్పాడు. అగ్ని సంభవమైన ఈ లింగాన్ని మనం పరీక్షిద్దాం. పోలికేలేని ఈ అగ్నిస్తంభంయొక్క క్రిందిభాగానికి నేను వెళుతాను. నీవు పై భాగానికి త్వరగా వెళ్లు.

**ఏవం వ్యాహృత్య విశ్వాత్మా స్వరూపమకరోత్తదా ॥ 37 ॥**

**వారాహమహమప్యాశు హంసత్వం ప్రాప్తవాన్ సురాః ।**
**తదా ప్రభృతి మామాహుర్హంసం హంసో విరాడితి ॥ 38 ॥**

**హంసం హంసేతి యో బ్రూయాన్మాం హంసః భవిష్యతి ।**
**సుశ్వేతో హ్యనలాక్షశ్చ విశ్వతః పక్షసంయుతః ॥ 39 ॥**

**మనోఽనిలజవో భూత్వా గతోఽహం చోర్ధ్వతః సురాః ।**

ఈ విధంగా చెప్పి విశ్వాత్ముడైన విష్ణువు వరాహరూపాన్ని ధరించాడు. నేను కూడా వెంటనే హంసగా మారాను. సురలారా! అప్పటినుంచి నన్ను "హంసా!, హంసా!" అని పిలుస్తున్నారు. ఇలా నాకు హంసత్వం ప్రాప్తించింది. ఓ సురలారా! అప్పుడు నేను మిక్కిలి శ్వేతవర్ణుడనయ్యాను. దానితో వాయు, మనోవేగాల్ని కలిగి నేను పైకి వెళ్లాను.

**నారాయణోఽపి విశ్వాత్మా నీలాంజనచయోపమమ్ ॥ 40 ॥**

**దశయోజనవిస్తీర్ణం, శతయోజనమాయతమ్ ।**
**మేరుపర్వతవర్ష్మాణం గౌరతీక్ష్ణాగ్రదంష్ట్రిణమ్ ॥ 41 ॥**

**కాలాదిత్యసమాభాసం దీర్ఘఘోణం మహాస్వనమ్ ।**
**హ్రస్వపాదం విచిత్రాంగం జైత్రం దృఢమనౌపమమ్ ॥ 42 ॥**

**వారాహమసితం రూపమాస్థాయ గతవానధః ।**

విశ్వాత్ముడైన విష్ణువు కూడా నల్లని కాటుక సమూహంతో పోల్చదగినట్టిది, నూరుయోజనాల పొడవు, పదియోజనాల వెడల్పుగలదియు, మేరుపర్వతంతో సమానమైన శరీరంగలదియు, తెల్లగా, పదునుగా గల ముందు కోరలు గలదియు, ప్రళయకాలంలో సూర్యుడితో సమానమైన కాంతిగలదియు, పెద్ద ముక్కు గలదియు, పెద్ద అరుపులు గలదియు, పొట్టి పాదాలు గలదియు, విచిత్రమైన శరీరావయవాలు గలదియు, జయశీలమైనదియు, పోలికలేనిదియు, గట్టిశరీరం గలదియు అయిన నల్లని వరాహరూపాన్ని ధరించి ఆ లింగం యొక్క క్రింది భాగానికి వెళ్ళాడు.

**ఏవం వర్షసహస్రం తు త్వరన్ విష్ణురధోగతః ॥ 43 ॥**

**నాపశ్యదల్పమప్యస్య మూలం లింగస్య సూకరః ।**
**తావత్కాలం గతో హ్యూర్ధ్వమహమప్యరిసూదనః ॥ 44 ॥**

**సత్వరం సర్వయత్నేన తస్యాంతం జ్ఞాతుమిచ్ఛతా ।**
**శ్రాంతో హ్యదృష్ట్వా తస్యాంతమహంకారాదధోగతః ॥ 45 ॥**

**తథైవ భగవాన్ విష్ణుః శ్రాంతః సన్త్రస్తలోచనః ।**
**సర్వదేవభవస్తూర్ణముత్థితః స మహావపుః ॥ 46 ॥**

ఈ విధంగా వేయి సంవత్సరాలు వేగంగా విష్ణువు క్రిందికి వెళ్ళాడు. వరాహరూపుడైన ఆతడు ఆ లింగం యొక్క అంతాన్ని స్వల్పంగాకూడా చూడలేకపోయాడు. శత్రుసంహారినైన నేను అహంకారినై ఆ వేయి సంవత్సరాలు ఊర్ధ్వగమనాన్ని సాగించి త్వరగా ఆ లింగం యొక్క తుదిని తెలియవలననే కోరికతో అన్ని విధాల ప్రయత్నించి కూడా దాని అంతాన్ని చూడలేక పోయాను. మిక్కిలి అలిసిపోయాను. క్రిందికి వెళ్లిన విష్ణువు కూడా అలసిపోయినాడు. క్రింది నుండి పైకి వచ్చాడు. సమస్తదేవతల జన్మకారకుడు, మహాకాయుడు అయిన ఆతడి నేత్రాలలో భయం కన్పించింది.

**సమాగతో మయా సార్ధం ప్రణిపత్య మహామనాః ।**
**మాయయా మోహితః శంభోస్తస్థౌ సంవిగ్నమానసః ॥ 47 ॥**

**పృష్ఠతః పార్శ్వతశ్చైవ చాగ్రతః పరమేశ్వరమ్ ।**
**ప్రణిపత్య మయా సార్ధం సస్మార కిమిదం త్వితి ॥ 48 ॥**

మేధావి అయిన విష్ణువు శివుడి మాయవల్ల మోహితుడై నా దగ్గరకు వచ్చి, నాతోపాటు శివుడికి వ్యాకులచిత్తుడై నమస్కరించాడు. శివభగవానుడికి ముందు, వెనుక, ప్రక్కలలో ప్రదక్షిణం చేసి నాతో పాటు నమస్కరించాడు. ఆద్యంతరహితమైన ఇదేమిటని మేము అనుకున్నాము.

**తదా సమభవత్తత్ర నాదో వై శబ్దలక్షణః ।**
**ఓమోమితి సురశ్రేష్ఠాః సువ్యక్తః ప్లుతలక్షణః ॥ 49 ॥**

ఓ దేవతాశ్రేష్ఠులారా! ఆ సమయంలో ప్లుతస్వరయుక్తమైన 'ఓం' అనే స్పష్టమైన శబ్దరూపమైన ధ్వని కలిగింది.

**కిమిదంత్వితి సంచింత్య మయా తిష్ఠన్ మహాస్వనమ్ ।**
**లింగస్య దక్షిణే భాగే తదా పశ్యత్సనాతనమ్ ॥ 50 ॥**

**ఆద్యవర్ణమకారం తు ఉకారం చోత్తరే తతః ।**
**మకారం మధ్యతశ్చైవ నాదాంతం తస్య చోమితి ॥ 51 ॥**

'ఇది ఏమిటి' అని ఆ మహాధ్వనిని గూర్చి బాగా ఆలోచించాము. ఆ ధ్వని ముగియగానే ఆ లింగంయొక్క కుడిభాగంలో ఆదివర్ణమైన 'అ'కారం ఎడమభాగంలో 'ఉ'కారం, మధ్యభాగంలో 'మ'కారం దర్శనమిచ్చాయి.

**సూర్యమండలవద్ దృష్ట్వా వర్ణమాద్యం తు దక్షిణే ।**
**ఉత్తరే పావకప్రఖ్యముకారం పురుషర్షభః ॥ 52 ॥**

**శీతాంశుమండలప్రఖ్యం మకారం మధ్యమం తథా ।**
**తస్యోపరి తదాపశ్యచ్ఛుద్ధస్ఫటికవత్ప్రభుమ్ ॥ 53 ॥**

**తురీయాతీతమమృతం నిష్కలం నిరుపప్లవమ్ ।**
**నిర్ద్వంద్వం కేవలం శూన్యం బాహ్యాంభ్యంతరవర్జితమ్ ॥ 54 ॥**

**స బాహ్యాభ్యంతరం చైవ స బాహ్యాంభ్యంతరస్థితమ్ ।**
**ఆదిమధ్యాంతరహితమానందస్యాపి కారణమ్ ॥ 55 ॥**

కుడిభాగంలోగల సూర్యమండల సమానమైన కాంతిగల ఆదివర్ణమైన 'అ'కారాన్ని, ఎడమభాగంలో అగ్నిసమానకాంతిగల 'ఉ'కారాన్ని, మధ్యభాగంలో చంద్రసమానకాంతిగల 'మ'కారాన్ని దానిపైభాగంలో పురుషశ్రేష్ఠుడైన విష్ణుభగవానుడు శుద్ధస్ఫటికసమానమగు మహాప్రభువైన శివుడిని చూచినాడు. అది నాల్గవ దిశ. ఆయన అమృతమయుడు, నిష్కలుడు, ఉపద్రవరహితుడు. ద్వంద్వాతీతుడు. కేవలం శూన్యుడు. బాహ్యం మరియు ఆభ్యంతరం(వెలుపల, లోపల) లేనివాడు. కాని బాహ్యాభ్యంతరాలు కలిగినవి ఎట్లుండునో అట్లే లోపల, బయట కలిగి ఉన్నవాడు. ఆది, మధ్య, మరియు అంతము లేనివాడు. అతడే పరమానందానికి కూడా కారణం.

**మాత్రాస్త్రిస్త్వర్ధమాత్రం నాదాఖ్యం బ్రహ్మసంజ్ఞితమ్ ।**
**ఋగ్యజుఃసామవేదా వై మాత్రారూపేణ మాధవః ॥ 56 ॥**

అది మూడున్నర మాత్రలకాలంగల నాదం. అకార ఉకారమకారాలు మూడును మూడు మాత్రలు. బిందువు అర్ధమాత్ర. 'ఓమ్' ప్రణవం. అదే బ్రహ్మనామకం. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం అనే ఈ మూడు వేదాలు మూడుమాత్రల రూపం గలవి. మూడురూపాలలో విష్ణువు ఉన్నాడు.

**వేదశబ్దేభ్య ఏవేశం విశ్వాత్మానమచింతయత్ ।**
**తదాభవదృషిర్వేద ఋషేః సారతమం శుభమ్ ॥ 57 ॥**

**తేనైవ ఋషిణా విష్ణుర్జ్ఞాతవాన్ పరమేశ్వరమ్ ।**

విష్ణువు వేదశబ్దాల ద్వారా విశ్వాత్ముడు, ఈశ్వరుడు అయిన శివుడిని తలపోశాడు.అప్పుడు ఆతడు వేద ఋషి అయ్యాడు. విష్ణువు శుభకరమైన వేదసారాన్ని గ్రహించాడు. ఆ వేదర్షి ద్వారానే విష్ణువు పరమేశ్వరుడైన శివుణ్ణి తెలుసుకున్నాడు.

**దేవ ఉవాచ –** బ్రహ్మదేవుడు పలికాడు.

**చింతయా రహితో రుద్రో వాచో యన్మనసా సహ ॥ 58 ॥**

**అప్రాప్య తం నివర్తంతే వాచ్యస్త్వేకాక్షరేణ సః ।**
**ఏకాక్షరేణ తద్వాచ్యమృతం పరమకారణమ్ ॥ 59 ॥**

**సత్యమానందమమృతం పరం బ్రహ్మ పరాత్పరమ్ ।**
**ఏకాక్షరాదకారాఖ్యో భగవాన్ కనకాండజః ॥ 60 ॥**

**ఏకాక్షరాదుకారాఖ్యో హరిః పరమకారణమ్ ।**
**ఏకాక్షరాన్మకారాఖ్యో భగవాన్నీలలోహితః ॥ 61 ॥**

రుద్రుడు చింతారహితుడు. మనస్సుతోపాటు వాక్కులు కూడా అతనిని పొందుటలో అసమర్థమవుతాయి. ఏకాక్షరమైన 'ఓమ్'తో మాత్రమే తెలుపుటకు యోగ్యుడైయున్నాడు. ఆయనే సత్యం, ఆనందం, అమృతం, పరబ్రహ్మ, పరాత్పరుడు. ఏకాక్షరంతో చెప్పే సత్యానికి ఆయనే ఉత్తమమైన కారణం. ఏకాక్షరమైన అకారం వలన బ్రహ్మ అట్లే ఏకాక్షరమైన ఉకారం వల్ల హరి, ఏకాక్షరమైన మకారం వలన భగవంతుడైన శివుడు జన్మించారు.

**సర్గకర్తా త్వకారాఖ్యో హ్యుకారాఖ్యస్తు మోహకః ।**
**మకారాఖ్యస్తయోర్నిత్యమనుగ్రహకరోఽ భవత్ ॥ 62 ॥**

'అ'కారం సంజ్ఞగా గలిగిన బ్రహ్మ సృష్టికర్త. ఉకారం సంజ్ఞగా గలిగిన విష్ణువు మోహకర్త. మకారం సంజ్ఞగా గలిగిన శివుడు బ్రహ్మవిష్ణువుల అనుగ్రహకారకుడు.

**మకారాఖ్యో విభుర్బీజీ హ్యకారో బీజముచ్యతే ।**
**ఉకారాఖ్యో హరిర్యోనిః ప్రధానపురుషేశ్వరః ॥ 63 ॥**

మకారాఖ్యుడైన విభుడు శివుడు బీజి (బీజం కలవాడు). అకారాఖ్యుడైన బ్రహ్మ బీజం. ఉకారాఖ్యుడైన ప్రధానపురుషశ్రేష్ఠుడు హరి యోని.

**బీజీ చ బీజం తద్యోనిర్నాదాఖ్యశ్చ మహేశ్వరః ।**
**బీజీ విభజ్య చాత్మానం స్వేచ్ఛయా తు వ్యవస్థితః ॥ 64 ॥**

నాదస్వరూపుడైన మహేశ్వర శివుడు స్వయంగా బీజం, బీజీ మరియు యోనియు అయి ఉన్నాడు. బీజీరూపుడైన మహేశ్వరుడు ఇష్టానుసారం తనను విభజించుకుని మూడుగా వ్యవస్థితుడైనాడు.

**అస్య లింగాదభూద్బీజమకారో బీజినః ప్రభో ।**
**ఉకారయోనౌ నిక్షిప్తమవర్ధత సమంతతః ॥ 65 ॥**

**సౌవర్ణమభవచ్చాండమావేష్ట్యాద్యం తదక్షరమ్ ।**
**అనేకాబ్దం తథా చాప్సు దివ్యమండం వ్యవస్థితమ్ ॥ 66 ॥**

బీజీరూపుడైన శివుడు లింగంనుంచి అకారరూపబీజాన్ని ఉకారరూపమైన యోనిలో పడవేశాడు. అది ఆద్యక్షరమైన అకారాన్ని అంటిపెట్టుకుని అన్ని వైపుల అభివృద్ధి చెంది స్వర్ణాండంగా మారింది. ఆ దివ్యమైన బంగారం గ్రుడ్డు బహుసంవత్సరాలు నీటిలో నిలిచి ఉంది.

**తతో వర్షసహస్రాంతే ద్విధా కృతమజోద్భవమ్ ।**
**అండమప్సు స్థితం సాక్షాదాద్యాఖ్యేనేశ్వరేణ తు ॥ 67 ॥**

తర్వాత వేయి సంవత్సరాలు గడవగా సాక్షాత్తు ఆదిరూపపరమేశ్వరశివుడు నీటిలో ఉన్న బ్రహ్మనుండి పుట్టిన ఆ అండాన్ని రెండు భాగాలు చేశాడు.

**తస్యాండస్య శుభం హైమం కపాలం చోర్ధ్వసంస్థితమ్ ।**
**జజ్ఞే యద్ ద్యౌస్తదపరం పృథివీ పంచలక్షణా ॥ 68 ॥**

ఆ అండంయొక్క మంగళకరమూ, స్వర్ణమయమూ అయిన పైభాగమైన కపాలం(పెంకు) నుంచి ఆకాశం క్రింది భాగం నుంచి పంచలక్షణాలతో కూడిన భూమి ఉత్పన్నమయ్యాయి.

**తస్మాదండోద్భవో జజ్ఞే త్వకారాఖ్యశ్చతుర్ముఖః ।**
**స స్రష్టా సర్వలోకానాం స ఏవ త్రివిధః ప్రభుః ॥ 69 ॥**

ఆ అండం నుంచి అకారరూపుడు అయిన చతుర్ముఖబ్రహ్మ ఉత్పన్నుడయ్యాడు. ఆతడే సమస్తలోకాల్ని సృష్టించినవాడు. ఆతడే అకార, ఉకార మకారరూపులైన ముగ్గురికి ప్రభువు.

**ఏవమోమోమితి ప్రోక్తమిత్యాహుర్యజుషాం వరాః ।**
**యజుషాం వచనం శ్రుత్వా ఋచః సామాని సాదరమ్ ॥ 70 ॥**

**ఏవమేవ హరే బ్రహ్మన్నిత్యాహుః శ్రుతయస్తదా ।**

ఈవిధంగా ప్రణవరూపమైన ఓంకారాన్ని పఠించాడు. దానివల్ల యజుర్వేదవేత్తలైన మనీషులలో శ్రేష్ఠుడయ్యాడు. యజుర్వేద వచనాన్ని విని ఋగ్వేదాన్ని, దానినుండి సామవేదాన్ని సాదరంగా పొందాడు. ఈ విధంగా మూడు శ్రుతులు అనగా ఋగ్యజుస్సామాలు ప్రణవరూపమైన 'ఓం'కారరూపాలే. అవి ఓ హరీ! ఓ బ్రహ్మ! అని సంబోధిస్తుంటాయి.

**తతో విజ్ఞాయ దేవేశం యథావచ్ఛ్రుతిసంభవైః ॥ 71 ॥**

**మంత్రైః మహేశ్వరం దేవం తుష్టావ సుమహోదయమ్ ।**
**ఆవయోః స్తుతిసంతుష్టో లింగే తస్మిన్ నిరంజనః ॥ 72 ॥**

**దివ్యం శబ్దమయం రూపమాస్థాయ ప్రహసన్ స్థితః ।**

తర్వాత మూడువేదాల వాక్యాలతో దేవేశ్వరుడు, మహోదయుడు అయిన శివుణ్ణి యథార్థంగా తెలిసి మేమిద్దరం స్తుతించాం. మా స్తుతులకు సంతోషించి శివుడు ఆ లింగమందు దివ్యశబ్దమయమైన రూపాల్ని పొంది నవ్వుతూ నిలిచాడు.

**అకారస్తస్య మూర్ధా తు లలాటం దీర్ఘముచ్యతే ॥ 73 ॥**

**ఇకారో దక్షిణం నేత్రం ఈకారో వామలోచనమ్ ।**
**ఉకారో దక్షిణం శ్రోత్రమూకారో వామముచ్యతే ॥ 74 ॥**

**ఋకారో దక్షిణం తస్య కపోలం పరమేష్ఠినః ।**
**వామం కపోలం ౠకారో ల్ఋ ల్ౠ నాసాపుటే ఉభే ॥ 75 ॥**

**ఏకారమోష్ఠమూర్ధశ్చ ఐకారస్త్వధరో విభోః ।**
**ఓకారశ్చ తథౌకారో దంతపంక్తిద్వయం క్రమాత్ ॥ 76 ॥**

'అ'కారం ఆతడి శిరస్సు. 'ఆ' కారం ఆతడి నుదురు.

'ఇ'కారం కుడి కన్ను. 'ఈ' కారం ఎడమకన్ను.

'ఉ' కారం కుడి చెవి 'ఊ' కారం ఎడమచెవి.

'ఋ' కారం ఆతడి కుడి చెక్కిలి. 'ౠ' కారం ఎడమ చెక్కిలి.

' ఌౡ'లు రెండూ రెండు నాసికారంధ్రాలు.

'ఏ'కారం పై పెదవి. ఐకారం అధరం. (క్రింది పెదవి)

ఓకార ఔ కారాలు ఆతడి రెండు దంతపు బారులు. మొత్తం పళ్లు. క్రిందివి, పైవి.

**'అ'మస్తు తాలునీ తస్య దేవదేవస్య ధీమతః ।**
**కాదిపంచాక్షరాణ్యస్య పంచహస్తాని దక్షిణే ॥ 77 ॥**

**చాది పంచాక్షరాణ్యేవం పంచహస్తాని వామతః ।**
**టాదిపంచాక్షరం పాదస్తాదిపంచాక్షరం తథా ॥ 78 ॥**

'అం' కారం ధీమంతుడైన దేవదేవుడికి తాలువు.

కవర్గ కుడివైపునగల ఐదు చేతులు. చవర్గ ఎడమవైపునగల అయిదు చేతులు.
టవర్గ తవర్గలు ఆయన పాదద్వయం.

**'ప'కారముదరం తస్య 'ఫ' కారః పార్శ్వముచ్యతే ।**
**'బ'కారో వామపార్శ్వం వై భకారం స్కంధమస్య తత్ ॥ 79 ॥**

**మకారం హృదయం శంభోర్మహాదేవస్య యోగినః ।**
**యకారాది సకారాంతాః విభోర్వై సప్తధాతవః ॥ 80 ॥**

**'హ' కార ఆత్మరూపం వై క్షకారః క్రోధ ఉచ్యతే ॥ 81 ॥**

'ప'కారం ఆతడి ఉదరం. 'ఫ'కారం కుడి పార్శ్వం. 'బ'కారం ఎడమ పార్శ్వం. 'భ'కారం ఆయన స్కంధం. 'మ'కారం పరమయోగి, మహాదేవశంకరుడి హృదయం. 'య'కారం నుంచి 'స'కారం వరకు గల ఏడు అక్షరాలు శివప్రభువు యొక్క సప్తధాతువులు. 'హ'కారం ఆయన యొక్క ఆత్మ. 'క్ష' కారం ఆయన యొక్క కోపం.

**ప్రణమ్య భగవాన్ విష్ణుః పునశ్చాపశ్యదూర్ధ్వతః ।**
**ఓంకారప్రభవం మంత్రం కలాపం చ కసంయుతమ్ ॥ 82 ॥**

సర్వాక్షరస్వరూపుడైన ఆ పరమేశ్వరుణ్ణి పార్వతీదేవితో కూడా దర్శించి విష్ణుభగవానుడు ఆయనకు నమస్కరించి పై భాగంలో పంచకళాత్మకమైన ఓంకారం నుంచి పుట్టిన మంత్రాన్ని చూశాడు.

**శుద్ధస్ఫటికసంకాశం శుభాష్టత్రింశదక్షరమ్ ।**
**మేధాకరమభూద్భూయః సర్వధర్మార్థసాధకమ్ ॥ 83 ॥**

**గాయత్రీప్రభవం మంత్రం హరితం వశ్యకారకమ్ ।**
**చతుర్వింశతి వర్ణాఢ్యం చతుష్కలమనుత్తమమ్ ॥ 84 ॥**

**అథర్వమసితం మంత్రం కలాష్టకసమాయుతమ్ ।**
**అభిచారికమత్యర్థం త్రయస్త్రింశచ్ఛుభాక్షరమ్ ॥ 85 ॥**

**యజుర్వేదసమాయుక్తం పంచత్రింశచ్ఛుభాక్షరమ్ ।**
**కలాష్టకసమాయుక్తం సుశ్వేతం శాంతికం తథా ॥ 86 ॥**

**త్రయోదశకలాయుక్తం బాలాద్యైః సహలోహితమ్ ।**
**సామోద్భవం జగత్యాద్యం వృద్ధిసంహారకారణమ్ ॥ 87 ॥**

**వర్ణాః షడధికాః షష్టిరస్య మంత్రవరస్య తు ।**
**పంచమంత్రాంస్తథా లబ్ధ్వా జజాప భగవాన్ హరిః ॥ 88 ॥**

స్వచ్ఛస్ఫటికతో సమానమైన మంగళకరమైన ముప్పది ఎనిమిది అక్షరాలతో ఆ మంత్రం ఏర్పడింది. అది జ్ఞానవర్ధకం. అది సమస్తధర్మార్థాల్ని సాధిస్తుంది. (ఈశానః సర్వవిద్యానామ్) ఇది మొదటిది. గాయత్రి నుంచి ఉత్పన్నమయ్యింది, నాలుగు కళలతో కూడినది, ఇరవై నాల్గు అక్షరాలతో కూడినదియు, మరియు వశ్యకారకం హరితవర్ణంతో కూడినదియు అయిన అత్యుత్తమమంత్రమిది. (తత్పురుషాయ విద్మహే) ఇది రెండవ మంత్రం. అథర్వవేదం నుంచి పుట్టింది. ఎనిమిది కళల్ని కలిగింది, నల్లటి రంగు కలిగింది. అత్యంతం ఆభిచారికం.

ముప్పదిమూడు శుభాక్షరాలతో కూడింది అఘోరమంత్రం. (అఘోరేభ్యోఽథ ఘోరేభ్య) ఇది మూడవమంత్రం. యజుర్వేదంనుండి కలిగింది, ఎనిమిది కళల్ని కలిగింది, తెల్లటి వర్ణం కలిగింది. శాంతిదాయకం. ముప్పై అయిదు శుభాక్షరాలతో కూడినది. పవిత్రమైన సద్యోజాతమంత్రం. (సద్యోజాతం ప్రపద్యామి) ఇది నాల్గోది. సామవేదం నుంచి పుట్టింది, ఎర్రటి వర్ణం కలిగింది. బాలాదులైన పదమూడు కళలతో కూడుకున్నది, జగత్తునకు ఆదిభూతమైంది, అభివృద్ధి మరియు వినాశకారణం, అరవైఆరు శుభాక్షరాల్ని కల్గినది. ఉత్తమమైన వామదేవమంత్రం. (వామదేవాయ నమో) ఇది అయిదోది. ఈ అయిదు మంత్రాల్ని విష్ణువు పొందినవాడై వాటిని జపించసాగాడు.

**అథ దృష్ట్వా కళావర్ణమృగ్యజుః సామరూపిణమ్ ।**
**ఈశానమీశముకుటం పురుషాస్యం పురాతనమ్ ॥ 89 ॥**

**అఘోరహృదయం హృద్యం వామగుహ్యం సదాశివమ్ ।**
**సద్యః పాదం మహాదేవం మహాభోగీంద్రభూషణమ్ ॥ 90 ॥**

**విశ్వతః పాదవదనం విశ్వతోఽక్షికరం శివమ్ ।**
**బ్రహ్మణోఽధిపతిం సర్గస్థితిసంహారకారణమ్ ॥ 91 ॥**

**తుష్టావ పునరిష్టాభిర్వాగ్భిర్వరదమీశ్వరమ్ ।**

తర్వాత సమస్తకళలయొక్క కాంతితో కూడిన మూడువేదాల స్వరూపమైన ఈశానమంత్రరూపమైన మకుటం గలిగినవాడు, తత్పురుషమంత్రరూపమైన ముఖం గలిగినవాడు, అఘోరమంత్రరూపమైన రమ్యమైన హృదయం గలవాడు, వామదేవమంత్రరూపమైన, ఎల్లవేళల కళ్యాణకారణమైన మర్మస్థానం గలవాడు, సద్యోజాతమంత్ర రూపమైన పాదాలు గలిగినవాడు, మహాఫణీంద్రాలంకారుడు, అంతటా పాదాలు, ముఖమూ, మరియు అంతటా మంగళకరమైన నేత్రాలు ధరించినవాడు, బ్రహ్మాధిపతి, పురాతనుడు, సృష్టి స్థితిలయకారణుడు అయిన శివుణ్ణి విష్ణువు చూచినవాడై మరల ప్రియవాక్కులతో వరదాత అయిన పరమేశ్వరుణ్ణి స్తుతించాడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే లింగోద్భవం నామ సప్తదశోఽధ్యాయః ॥ 17 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని లింగోద్భవమనే పదిహేడవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## అష్టాదశోఽధ్యాయః - పద్దెనిమిదవ అధ్యాయం
## విష్ణుస్తవవర్ణనమ్ - విష్ణుస్తవవర్ణనం

**విష్ణురువాచ -** విష్ణువు పలికాడు.

**ఏకాక్షరాయ రుద్రాయ అకారాయాత్మరూపిణే ।**
**ఉకారాయాదిదేవాయ విద్యాదేహాయ వై నమః ॥ 1 ॥**

ప్రణవరూపమైన ఏకాక్షరరుద్రుడికి నమస్కారం. ఆత్మస్వరూపుడైన అకారరూపుడైన శివుడికి నమస్కారం. విద్యయే దేహమైన ఉకారాది ఆదిదేవుడికి నమస్కారం.

**తృతీయాయ మకారాయ శివాయ పరమాత్మనే ।**
**సూర్యాగ్నిసోమవర్ణాయ యజమానాయ వై నమః ॥ 2 ॥**

మూడవది అయిన మకారరూపుడైన పరమాత్మ శివుడికి నమస్కారం. సూర్యుడు, అగ్ని, చంద్రుల వంటి వర్ణంగల యజమానుడైన రుద్రుడికి నమస్కారం.

**అగ్నయే రుద్రరూపాయ రుద్రాణాం పతయే నమః ।**
**శివాయ శివమంత్రాయ సద్యోజాతాయ వేధసే ॥ 3 ॥**

రుద్రరూపుడైన అగ్నికి నమస్కారం. రుద్రులయొక్క నాథుడికి నమస్కారం. శివుడికి, శివమంత్రానికి, సద్యోజాతరూపుడైన వేధకు నమస్కారం.

**వామాయ వామదేవాయ వరదాయామృతాయ తే ।**
**అఘోరాయాతిఘోరాయ సద్యోజాతాయ రంహసే ॥ 4 ॥**

సుందరరూపవామదేవుడవు, వరదాతవు, అమృతమూర్తివి, అఘోరుడివి, అతిఘోరుడివి, సద్యోజాతుడివి, వేగరూపుడివి అయిన నీకు నమస్కారం.

**ఈశానాయ శ్మశానాయ అతివేగాయ వేగినే ।**
**నమోఽస్తు శ్రుతిపాదాయ ఊర్ధ్వలింగాయ లింగినే ॥ 5 ॥**

ఈశానుడికి, శ్మశాననిలయుడికి, అతివేగశాలికి, వేగవంతుడికి, శ్రుతులతో తెలియదగిన పాదాలు కలిగినవాడికి, ఊర్ధ్వలింగుడికి, లింగి అయినవాడికి నమస్కారం.

**హేమలింగాయ హేమాయ వారి లింగాయ చాంభసే ।**
**శివాయ శివలింగాయ వ్యాపినే వ్యోమవ్యాపినే ॥ 6 ॥**

స్వర్ణలింగుడికి, స్వర్ణమయుడికి, జల లింగుడికి, జలుడికి, శివుడికి, శివ లింగుడికి, వ్యాపశీలికి, ఆకాశాన్ని వ్యాపించినవాడికి నమస్కారం.

**వాయవే వాయువేగాయ నమస్తే వాయువ్యాపినే ।**
**తేజసే తేజసాం భర్త్రే నమస్తేజోఽధివ్యాపినే ॥ 7 ॥**

వాయురూపుడికి, వాయువేగుడికి, వాయువు వలే వ్యాపనశీలికి నమస్కారం. కాంతికే కాంతి అయినవాడికి, కాంతిని పరిపూర్ణంగా వ్యాపింపజేసినవాడికి, భరించువాడికి నమస్కారం.

**జలాయ జలభూతాయ నమస్తే జలవ్యాపినే ।**
**పృథివ్యై చాంతరిక్షాయ పృథివీవ్యాపినే నమః ॥ 8 ॥**

జలుడవు, జలరూపుడవు, జలంలో వ్యాపించి ఉన్నవాడివైన నీకు నమస్కారం. పృథివివి, అంతరిక్షానివి, సమస్తభూమిలో వ్యాపించియున్నవాడివి అయిన నీకు నమస్కారం.

**శబ్దస్పర్శస్వరూపాయ రసగంధాయ గంధినే ।**
**గణాధిపతయే తుభ్యం గుహ్యాత్ గుహ్యతమాయ తే ॥ 9 ॥**

శబ్దం మరియు స్పర్శరూపుడికి, రసం మరియు గంధరూపుడైన గంధికి, ప్రమథగణాధిపతికి, రహస్యానికే పరమరహస్యమైనవాడికి నమస్కారం.

**అనంతాయ విరూపాయ అనంతానామనంతాయ చ ।**
**శాశ్వతాయ వరిష్ఠాయ వారిగర్భాయ యోగినే ॥ 10 ॥**

ఆదిశేషరూపుడైన అనంతుడికి, గరుడరూపుడైన విరూపుడికి, అనంతానికే అనంతమైనవాడికి, శాశ్వతుడికి, సర్వశ్రేష్ఠుడికి, జలోదరుడికి, యోగి అయినవాడికి నమస్కారం.

**సంస్థితాయాంభసాం మధ్యే ఆవయోర్మధ్యవర్చసే ।**
**గోప్త్రే హర్త్రే సదా కర్త్రే నిధనాయేశ్వరాయ చ ॥ 11 ॥**

నీటి మధ్యలో ఉండేవాడును, మాయిద్దరి మధ్య (బ్రహ్మ, విష్ణువు) ప్రకాశించువాడును, సృష్టికర్తయును, పాలనకర్తయును, సంహారకర్తయును, మృత్యురూపుడును అయిన ఈశ్వరుడికి నమస్కారం.

**అచేతనాయ చింత్యాయ చేతనాయాసహారిణే ।**
**అరూపాయ సురూపాయ అనంగాయాంగహారిణే ॥ 12 ॥**

అచేతనుడైనవానికి, మిక్కిలి విచారించదగినవాడికి ప్రాణులయొక్క జన్మమరణరూపమైన కష్టాల్ని హరించేవాడికి, రూపరహితుడు మరియు సుందరరూపుడైనవాడికి అనంగుడూ మరియు అంగవినాశకరుడైనవాడికి నమస్కారం.

**భస్మదిగ్ధశరీరాయ భానుసోమాగ్నిహేతవే ।**
**శ్వేతాయ శ్వేతవర్ణాయ తుహినాద్రిచరాయ చ ॥ 13 ॥**

భస్మంతో భూషితమైన దేహుడికి, సూర్యచంద్రాగ్నులకు కారకుడికి, శ్వేతరూపుడు, శ్వేతవర్ణుడు అయినవాడికి హిమాలయం మీద సంచరించువాడికి నమస్కారం.

**సుశ్వేతాయ సువక్త్రాయ నమః శ్వేతశిఖాయ చ ।**
**శ్వేతాస్యాయ మహాస్యాయ నమస్తే శ్వేతలోహిత ॥ 14 ॥**

అతిశ్వేతరూపుడికి, సుందరమైన నోరుగలవాడికి, తెల్లనిశిఖను ధరించినవాడికి, శ్వేతముఖుడికి, మహాముఖుడికి, శ్వేతలోహితుడికి నమస్కారం.

**సుతారాయ విశిష్టాయ నమో దుందుభినే హర ।**
**శతరూపవిరూపాయ నమః కేతుమతే సదా ॥ 15 ॥**

మిక్కిలి కాంతిమంతుడికి, విశిష్టుడికి, దుందుభిని ధరించినవాడికి, శతరూపుడికి, రూపరహితుడికి, పతాకధారికి ఎల్లప్పుడూ నమస్కృతి.

**ఋద్ధిశోకవిశోకాయ పినాకాయ కపర్దినే ।**
**విపాశాయ సుపాశాయ నమస్తే పాశనాశినే ॥ 16 ॥**

సమృద్ధిపరుడికి, దుఃఖాదుఃఖుడికి, పినాకపాణికి, బంధవిముక్తుడికి,సుబంధుడికి, బంధహరుడికి నమస్కారం.

**సుహోత్రాయ హవిష్యాయ సుబ్రహ్మణ్యాయ సూరిణే ।**
**సుముఖాయ సువక్త్రాయ దుర్దమాయ దమాయ చ ॥ 17 ॥**

**కంకాయ కంకరూపాయ కంకణీకృతపన్నగః ।**
**సనకాయ నమస్తుభ్యం సనాతన సనందన ॥ 18 ॥**

**సనత్కుమార సారంగమారణాయ మహాత్మనే ।**
**లోకాక్షిణే త్రిధామాయ నమో విరజసే సదా ॥ 19 ॥**

సుహోత అయిన వాడికి, హవిస్స్వరూపుడికి, సుబ్రహ్మణ్యుడికి, మహాపండితుడికి, సుముఖునకు, సువక్త్రుడికి, దుర్దముడికి, దముడికి, కపటద్విజుడికి, యమస్వరూపుడికి, భుజంగభూషణుడికి సనక, సనాతన, సనందన, సనత్కుమార స్వరూపుడికి, లోకనేత్రుడికి, మృగహంతకు, త్రిధాముడికి, రజోగుణరహితుడికి నమస్కారం.

**శంఖపాలాయ శంఖాయ రజసే తమసే నమః ।**
**సారస్వతాయ మేధాయ మేఘవాహన తే నమః ॥ 20 ॥**

శంఖపాలకుడికి, శంఖుడికి, రజోగుణుడైనవాడికి, తమోగుణుడికి నమస్కారం. ఓ మేఘవాహన! సారస్వతరూపుడవైన, మేధావి అయిన నీకు నమస్కారం.

**సువాహాయ వివాహాయ వివాదవరదాయ చ ।**
**నమః శివాయ రుద్రాయ ప్రధానాయ నమో నమః ॥ 21 ॥**

సమస్తవిశ్వాన్ని బాగా వహించువాడు, వహించనివాడు, తర్కరహితభక్తులకు వరాలనిచ్చేవాడు, ప్రధానరూపుడు, మంగళకరుడు అయిన రుద్రుడికి వందనం.

**త్రిగుణాయ నమస్తుభ్యం చతుర్వ్యూహాత్మనే నమః ।**
**సంసారాయ నమస్తుభ్యం నమః సంసారహేతవే ॥ 22 ॥**

త్రిగుణాత్ముడవైన నీకు నమస్కారం. చతుర్వ్యూహాత్ముడవైన నీకు నమస్కారం. సంసారరూపుడికి సంసారకారణరూపుడికి మాటిమాటికి నమస్కారం.

**మోక్షాయ మోక్షరూపాయ మోక్షకర్త్రే నమో నమః ।**
**ఆత్మనే ఋషయే తుభ్యం స్వామినే విష్ణవే నమః ॥ 23 ॥**

మోక్షుడికి, మోక్షరూపుడికి, మోక్షప్రదానుడికి నమస్కారం. నమస్కారం. ఆత్మరూపుడికి, మహాఋషికి, స్వామికి, వ్యాపనశీలికి నమస్కారం.

**నమో భగవతే తుభ్యం నాగానాం పతయే నమః ।**
**ఓంకారాయ నమస్తుభ్యం సర్వజ్ఞాయ నమో నమః ॥ 24 ॥**

భగవంతుడికి నమస్కారం. పన్నగపతికి నమస్కారం. ఓంకారరూపుడికి నమస్కారం. సర్వజ్ఞుడికి మాటిమాటికి నమస్కారం.

**సర్వాయ నమస్తుభ్యం నమో నారాయణాయ చ ।**
**నమో హిరణ్యగర్భాయ ఆదిదేవాయ తే నమః ॥ 25 ॥**

సర్వుడికి నమస్కారం. నారాయణుడికి నమస్కారం. హిరణ్యగర్భుడైన దేవాధిదేవుడికి నమస్కారం.

**నమో స్త్వజాయ పతయే ప్రజానాం వ్యూహహేతవే ।**
**మహాదేవాయ దేవానామీశ్వరాయ నమో నమః ॥ 26 ॥**

అజుడికి, ప్రజాపతికి, వ్యూహకారకుడికి, దేవేశ్వరుడికి, మహాదేవుడికి నమస్కారం. నమస్కారం.

**శర్వాయ చ నమస్తుభ్యం సత్యాయ శమనాయ చ ।**
**బ్రహ్మణే చైవ భూతానాం సర్వజ్ఞాయ నమో నమః ॥ 27 ॥**

శర్వుడికి నమస్కారం. సత్యరూపుడికి, శాంతిరూపుడికి నమస్కారం. బ్రహ్మవైన నీకు, ప్రాణులలో సర్వవ్యాపివైన నీకు నమస్కారం.

**మహాత్మనే నమస్తుభ్యం ప్రజ్ఞారూపాయ వై నమః ।**
**చితయే చితిరూపాయ స్మృతిరూపాయ వై నమః ॥ 28 ॥**

మహాత్ముడవైన నీకు నమస్కారం. మేధావంతుడికి నమస్కారం. చితుడికి, చితిరూపుడికి, స్మృతిరూపుడికి నమస్కారం.

**జ్ఞానాయ జ్ఞానగమ్యాయ నమస్తే సంవిదే సదా ।**
**శిఖరాయ నమస్తుభ్యం నీలకంఠాయ వై నమః ॥ 29 ॥**

జ్ఞానరూపుడికి, జ్ఞానంతో తెలియదగినవాడికి, సంవిదుడికి ఎల్లప్పుడూ నమస్కారం. శిఖరుడికి, నీలకంఠుడికి నమస్కారం.

**అర్ధనారీశరీరాయ అవ్యక్తాయ నమో నమః ।**
**ఏకాదశవిభేదాయ స్థాణవే తే నమః సదా ॥ 30 ॥**

అర్ధనారీశరీరాన్ని ధరించినవాడికి, అవ్యక్తుడైనవాడికి నమస్కారం. ఏకాదశరుద్రభేదాలతో ప్రవర్తించువాడికి, స్థాణువైనవాడికి ఎల్లప్పుడూ నమస్కారం.

**నమః సోమాయ సూర్యాయ భవాయ భవహారిణే ।**
**యశస్కరాయ దేవాయ శంకరాయేశ్వరాయ చ ॥ 31 ॥**

చంద్రసూర్యస్వరూపుడికి, భవహరుడైన భవుడికి, యశస్కారకుడికి, దేవుడికి, మహేశ్వరశంకరుడికి నమస్కారం.

**నమో௨ంబికాధిపతయే ఉమాయాః పతయే నమః ।**
**హిరణ్యబాహవే తుభ్యం నమస్తే హేమరేతసే ॥ 32 ॥**

పార్వతీపతికి నమస్కారం. ఉమాపతికి నమస్కారం. హిరణ్యబాహువుకు, స్వర్ణవీర్యుడికి నమస్కారం.

**నీలకేశాయ విత్తాయ శితికంఠాయ వై నమః ।**
**కపర్దినే నమస్తుభ్యం నాగాంగాభరణాయ చ ॥ 33 ॥**

నల్లని కేశాలుగలవాడికి, విత్తస్వరూపుడికి, శితికంఠుడికి నమస్కారం. జటాజూటుడికి, భుజగభూషణుడికి నమస్కారం.

**వృషారూఢాయ సర్వస్య హర్త్రే కర్త్రే నమో నమః ।**
**వీరరామాతిరామాయ రామనాథాయ తే విభో ॥ 34 ॥**

నందివాహనుడవు, సమస్తానికి కారకుడవు, మరియు సంహారకుడవు అయిన నీకు నమస్కారం. వీరరాముడవు, అతిరాముడవు, రామనాథుడవు అయిన ఓ ప్రభూ! నీకు నమస్కారం.

**నమో రాజాధిరాజాయ రాజ్ఞామధిగతాయ తే ।**
**నమః పాలాధిపతయే పాలాశాకృంత తే నమః ॥ 35 ॥**

రాజాధిరాజుకు, రాజ్యప్రాప్తిని కల్గించువానికి, రక్షణాధిపతికి, దైత్యసంహారుడికి నమస్కారం.

**నమః కేయూరభూషాయ గోపతే తే నమో నమః ।**
**నమః శ్రీకంఠనాథాయ నమో లికుచపాణయే ॥ 36 ॥**

కేయూరాలంకారుడవు, గోపతివి అయిన నీకు నమస్కారం. శ్రీకంఠనాథుడికి నమస్కారం. శ్రీదండపాణికి నమస్కారం.

**భువనేశాయ దేవాయ వేదశాస్త్ర నమోఽస్తు తే ।**
**సారంగాయ నమస్తుభ్యం రాజహంసాయ తే నమః ॥ 37 ॥**

వేదశాస్త్రస్వరూపుడికి, భువనేశ్వరుడికి, దేవదేవుడికి నమస్కారం. సారంగపాణికి నమస్కారం. రాజహంసుడికి నమస్కారం.

**కనకాంగదహారాయ నమః సర్పోపవీతినే ।**
**సర్పకుండలమాలాయ కటిసూత్రీకృతాహినే ॥ 38 ॥**

స్వర్ణాంగదహారాలు గలవాడికి, సర్పం జందెంగా గలవాడికి, నాగకుండలములు గలవాడికి, సర్పాలనే మాలలుగా ధరించినవాడికి, నాగులే మొలనూలుగా గలవాడికి నమస్కారం.

**వేదగర్భాయ గర్భాయ విశ్వగర్భాయ తే శివ ।**

వేదగర్భుడవు, గర్భుడవు, విశ్వగర్భుడవు అయిన ఓ శివా! నీకు నమస్కారం.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మ పలికాడు.

**విరరామేతి సంస్తుత్వా బ్రహ్మణా సహితో హరిః ॥ 39 ॥**

బ్రహ్మతోకూడిన విష్ణువు ఈ విధంగా శివభగవానుణ్ణి బాగా స్తుతించి విరమించాడు.

**ఏతత్స్తోత్రవరం పుణ్యం సర్వపాపప్రణాశనమ్ ।**
**యః పఠేచ్ఛ్రావయేద్వాపి బాహ్మణాన్ వేదపారగాన్ ॥ 40 ॥**

**స యాతి బ్రహ్మణో లోకే పాపకర్మరతోఽపి వై ।**
**తస్మాజ్జపేత్పఠేన్నిత్యం శ్రావయేద్ బ్రాహ్మణాచ్ఛుభాన్ ॥ 41 ॥**

**సర్వపాపవిశుద్ధ్యర్థం విష్ణునా పరిభాషితమ్ ।**

సమస్తపాపాల్ని నశింపజేయడానికై మహావిష్ణువుతో పఠింపబడిన ఈ స్తోత్రం శ్రేష్ఠమైనది, పుణ్యమైనది. సమస్తపాపాల్ని నశింపజేసేది అయిన దీన్ని ఎవడు పఠిస్తాడో, వేదవేత్తలైన బ్రాహ్మణులవల్ల ఎవడు వింటాడో వాడు బ్రహ్మలోకానికి పోతాడు. ఆతడు పాపకర్మల్ని ప్రీతితో ఆచరించినవాడైనా ఫరవాలేదు. అందువల్ల ప్రతిరోజు ఈ స్తోత్రాన్ని జపించాలి. బ్రాహ్మణులవల్ల వినాలి.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే విష్ణుస్తవో నామ అష్టాదశోఽధ్యాయః ॥ 18 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని విష్ణుస్తవమనే పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనవింశోఽధ్యాయః – పందొమ్మిదవ అధ్యాయం

## విష్ణుప్రబోధః – విష్ణుప్రబోధం

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**అథోవాచ మహాదేవః ప్రీతోఽహం సురసత్తమౌ ।**
**పశ్యతాం మాం మహాదేవం భయం సర్వం విముచ్యతామ్ ॥1॥**

అప్పుడు మహాదేవుడు పలికాడు. ఓ దేవశ్రేష్ఠులారా! నేను సంతోషించాను. మహాదేవుణ్ణైన నన్ను చూడండి! భయమంతా వదలివేయండి!

**యువాం ప్రసూతౌ గాత్రాభ్యాం మమ పూర్వం మహాబలౌ ।**
**అయం మే దక్షిణే పార్శ్వే బ్రహ్మాలోకపితామహః ॥2॥**

**వామే పార్శ్వే చ మే విష్ణుర్విశ్వాత్మా హృదయోద్భవః ।**
**ప్రీతోఽహం యువయోః సమ్యగ్వరం దద్మి యథేప్సితమ్ ॥3॥**

పూర్వం మహాబలులైన మీ యిద్దరూ నా శరీరం నుండి జన్మించారు. సర్వలోక పితామహుడవై, బ్రహ్మవైన నీవు నా కుడి పార్శ్వం నుంచి, హృదయోద్భవుడు, విశ్వాత్ముడు అయిన ఈ విష్ణువు నా ఎడమప్రక్క నుండి పుట్టారు. నేను మీ విషయమై ప్రసన్నుణ్ణి అయ్యాను. మీకు ఇష్టమైన మంచి వరాన్ని కోరుకోండి! ఇస్తాను.

**ఏవముక్త్వా తు తం విష్ణుం కరాభ్యాం పరమేశ్వరః ।**
**పస్పర్శ సుభగాభ్యాం తు కృపయా తు కృపానిధిః ॥4॥**

ఇలా పలికి కృపానిధి పరమేశ్వరుడు దయతో శుభకరకరాలతో విష్ణువును స్పృశించాడు.

**తతః ప్రహృష్టమనసా ప్రణిపత్య మహేశ్వరమ్ ।**
**ప్రాహ నారాయణో నాథం లింగస్థం లింగవర్జితమ్ ॥5॥**

తర్వాత సంతోషించిన మనస్సుతో లింగస్థుడయ్యీ, లింగశూన్యుడైన, జగన్నాథుడైన శివుడికి నమస్కరించి విష్ణువు ఇలా పలికాడు.

**యది ప్రీతిః సముత్పన్నా యది దేయో వరశ్చ నౌ ।**
**భక్తిర్భవతు నౌ నిత్యం త్వయి చావ్యభిచారిణీ ॥6॥**

మా విషయమై మీకు సంప్రీతి కలిగినట్లైతే, మాకు మీరు వరాన్ని ఇవ్వదలచినట్లైతే మాకు నీయందు స్థిరమైన భక్తినివ్వు.

**దేవః ప్రదత్తవాన్ దేవాః స్వాత్మన్యవ్యభిచారిణీమ్ ।**
**బ్రహ్మణే విష్ణవే చైవ శ్రద్ధాం శీతాంశుభూషణః ॥7॥**

చంద్రమౌళి అయిన శివుడు బ్రహ్మకు, విష్ణువుకు వారి హృదయాలలో సుస్థిరమైన భక్తిని (శ్రద్ధ) ప్రసాదించాడు.

**జానుభ్యామవనీం గత్వా పునర్నారాయణః స్వయమ్ ।**
**ప్రణిపత్య చ విశ్వేశం ప్రాహ మందతరం వశీ ॥8॥**

ఇంద్రియాల్ని జయించిన విష్ణువు సాష్టాంగపడి శివుడికి నమస్కరించి మెల్లగా మరల పలికాడు.

**ఆవయోర్దేవదేవేశ వివాదమతిశోభనమ్ ।**
**ఇహాగతో భవాన్ యస్మాద్వివాదశమనాయ నౌ ॥9॥**

దేవాధిదేవా! మా యిద్దరి వివాదం అత్యంతం శుభకరమైంది. మాకై సాక్షాత్కరించిన నీవు మాయీ వివాదాన్ని (విరోధాన్ని) నశింపజేయి!

**తస్య తద్వచనం శ్రుత్వా పునః ప్రాహ హరో హరిమ్ ।**
**ప్రణిపత్య స్థితం మూర్ధ్నా కృతాంజలిపుటం స్వయమ్ ॥10॥**

శ్రీహరియొక్క ఆ మాటను విన్న హరుడు మరల తన ఎదుట శిరసువంచి చేతులు జోడించి నమస్కరించి నిలిచిన హరిని గూర్చి ఇలా పలికాడు.

**శ్రీ మహాదేవ ఉవాచ –** మహాదేవశివుడు పలికాడు.

**ప్రళయస్థితిసర్గాణాం కర్తా త్వం ధరణీపతే ।**
**వత్స వత్స హరే విష్ణో పాలయైతచ్చరాచరమ్ ॥11॥**

పృథ్వీపతీ! నీవు సృష్టి స్థితి లయకారకుడవు. పుత్రా! పుత్రా! హరీ! విష్ణూ! ఈ స్థావరజంగమ ప్రపంచాన్ని పరిపాలించు.

**త్రిధా భిన్నో హ్యహం విష్ణో బ్రహ్మవిష్ణుభవాఖ్యయా ।**
**సర్గరక్షాలయగుణైర్నిష్కలః పరమేశ్వరః ॥12॥**

శ్రీహరీ! సృష్టి, స్థితి, లయ, గుణాలచే బ్రహ్మవిష్ణుమహేశ్వరులుగా నేను మూడుగా విభజించుకున్నాను. గుణరహితుడైన పరమేశ్వరుణ్ణి.

**సమ్మోహం త్యజ భో విష్ణో పాలయైనం పితామహమ్ ।**
**పాద్మే భవిష్యతి సుతః కల్పే తవ పితామహః ॥13॥**

**తదా ద్రక్ష్యసి మాం చైవ సోఽపి ద్రక్ష్యతి పద్మజః ।**
**ఏవముక్త్వా స భగవాం స్తత్రైవాంతరధీయత ॥14॥**

శ్రీహరీ! గాఢతరమోహాన్ని విడిచిపెట్టి ఈ బ్రహ్మను రక్షించు. పద్మకల్పంలో నీకు ఈ బ్రహ్మ పుత్రుడుగా జన్మిస్తాడు. అప్పుడు నీవు నన్ను ఈ రూపమందే చూడగలవు. పద్మభవుడైన ఈ బ్రహ్మకూడా ఈ రూపాన్నే చూడగలడు. ఈ విధంగా పలికిన పరమేశ్వరుడు అక్కడే అంతర్ధానం చెందాడు.

**తదా ప్రభృతి లోకేషు లింగార్చా సుప్రతిష్ఠితా ।**
**లింగవేదీ మహాదేవీ లింగం సాక్షాన్మహేశ్వరః ॥15॥**

అప్పటినుంచి లోకాలలో లింగాల్ని పూజించడం ప్రసిద్ధి చెందింది. లింగవేదిగా పార్వతీదేవి నిలిచింది. ఈ లింగం సాక్షాత్తు మహాశివుడే.

**లయనాల్లింగమిత్యుక్తం తత్రైవ నిఖిలం సురాః ।**
**యస్తు లైంగం పఠేన్నిత్యమాఖ్యానం లింగసన్నిధౌ ॥16॥**

**స యాతి శివతాం విప్రో నాత్ర కార్యా విచారణా ।**

ఓ దేవతలారా! సమస్త జగత్తు ఈ లింగమందే లయం చెందుతుంది. కాబట్టి ఇది లింగం అవుతున్నది. లింగసన్నిధిలో ఈ లింగపురాణాన్ని చదివిన బ్రాహ్మణుడు శివుడిలో ఐక్యం అవుతాడు. ఇందులో ఏమాత్రం సందేహం లేదు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే విష్ణుప్రబోధో నామైకోనవింశోఽధ్యాయః ॥ 19 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని విష్ణుప్రబోధమనే పందొమ్మిదవ అధ్యాయం సమాప్తం

## వింశోఽధ్యాయః - ఇరవైయవ అధ్యాయం

## బ్రహ్మప్రబోధనమ్ - బ్రహ్మప్రబోధనం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**కథం పాద్మే పురా కల్పే బ్రహ్మా పద్మోద్భవోఽభవత్ ।**
**భవం చ దృష్టవాన్ తేన బ్రహ్మణా పురుషోత్తమః ॥1॥**

**ఏతత్సర్వం విశేషేణ సాంప్రతం వక్తుమర్హసి ।**

సూతమహర్షీ! పూర్వం పద్మకల్పంలో బ్రహ్మ పద్మంనుంచి ఎలా జన్మించాడు. బ్రహ్మతోపాటు విష్ణువు శివుణ్ణి ఎలా దర్శించాడు. ప్రస్తుతం ఈ విషయాన్ని విపులంగా చెప్పదగినవాడవు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఆసీదేకార్ణవం ఘోరమవిభాగం తమోమయమ్ ॥2॥**

**మధ్యే ఏకార్ణవే తస్మిన్ శంఖచక్రగదాధరః ।**
**జీమూతాంభోఽంబుజాక్షశ్చ కిరీటీ శ్రీపతిర్హరిః ॥3॥**

**నారాయణముఖోద్గీర్ణసర్వాత్మా పురుషోత్తమః ।**
**అష్టబాహుర్మహావక్షా లోకానాం యోనిరుచ్యతే ॥4॥**

**కిమప్యచింత్యం యోగాత్మా యోగమాస్థాయ యోగవిత్ ।**
**ఫణాసహస్రకలితం తమప్రతిమవర్చసమ్ ॥5॥**

**మహాభోగపతేర్భోగం సాధ్వాస్తీర్య మహోచ్ఛ్రయమ్ ।**
**తస్మిన్ మహతి పర్యంకే శేతే చైకార్ణవే ప్రభుః ॥6॥**

ఎలాంటి విభజనం లేకుండా భూమి అంతా ఒకే సముద్రంకాగా భయంకరమైన అంధకారం అలముకున్నది. ఆ అవిభాజ్యసముద్రం మధ్యలో శంఖచక్రగదల్ని ధరించినవాడు, మేఘసదృశవర్ణదేహుడు, పద్మనేత్రుడు, మకుటధారి, లక్ష్మీపతి, శ్రీహరి, నారాయణుడు, తనముఖంనుంచే ఉద్భవించిన సమస్తజీవులు గలవాడు, పురుషోత్తముడు, ఎనిమిదిబాహువులు గలవాడు, విశాలవక్షఃస్థలం గలవాడు, సర్వలోకాలకు జన్మస్థానమైనవాడు, యోగవిదుడు, యోగాత్ముడు, అనిర్వచనీయమైన మహాయోగాన్నిపొంది వేయిపడగలతోకూడిన, అసమానమైన తేజస్సుగల ఆదిశేషుడి పడగలనే ఉన్నతమైన శయ్యపై నిద్రిస్తున్నాడు.

**ఏవం తత్ర శయానేన విష్ణునా ప్రభవిష్ణునా ।**
**ఆత్మారామేణ క్రీడార్థం లీలయాక్లిష్టకర్మణా ॥7॥**

**శతయోజనవిస్తీర్ణం తరుణాదిత్యసన్నిభమ్ ।**
**వజ్రదండం మహోత్సేధం నాభ్యాం సృష్టం తు పుష్కరమ్ ॥8॥**

ఆవిధంగా శేషశయ్యపై శయనిస్తున్న ఆత్మారాముడు, ప్రభవిష్ణువు, అయిన విష్ణుమూర్తి వినోదార్థంగా నూరుయోజనాలవిస్తీర్ణంతో, బాలసూర్యసమానకాంతితో, మిక్కిలిపొడవై, వజ్రసమానమైన నాళముతో ఉన్న ఒకపద్మాన్ని లీలావిలాసంగా సృష్టించాడు.

**తస్యైవం క్రీడమానస్య సమీపం దేవమీఢుషః ।**
**హేమగర్భాండజో బ్రహ్మా రుక్మవర్ణో హ్యతీంద్రియః ॥9॥**

**చతుర్వక్త్రో విశాలాక్షః సమాగమ్య యదృచ్ఛయా ।**
**శ్రియాయుక్తేన దివ్యేన సుశుభేన సుగంధినా ॥10॥**

**క్రీడమానం చ పద్మేన దృష్ట్వా బ్రహ్మా శుభేక్షణమ్ ।**
**సవిస్మయమథాగమ్య సౌమ్యసంపన్నయా గిరా ॥11॥**

**ప్రోవాచ కో భవాన్ శేతే హ్యాశ్రితో మధ్యమంభసామ్ ।**

కమలంతో క్రీడిస్తున్న దేవశ్రేష్ఠుడైన విష్ణువును స్వర్ణాండంనుంచి జన్మించినవాడు, బంగారువర్ణంగలవాడు, ఇంద్రియాతీతుడు, నాలుగుముఖాలు గలవాడు, విశాలనేత్రుడు అయిన బ్రహ్మ స్వేచ్ఛగా సమీపించి, శోభాకరమైన సువాసనాభరితమైన, మంగళకరమైన, పద్మంతో ఆడుకుంటున్న సుందరనేత్రుడైన, విష్ణువును చూచి, ఆశ్చర్యాన్ని పొందినవాడై వినమ్రమైన వాక్కుతో ఇలా పలికాడు "ఈజలమధ్యాన్ని ఆశ్రయించి ఇలా పవ్వళించిన నీవు ఎవ్వడవు" అని.

**అథ తస్యాచ్యుతః శ్రుత్వా బ్రహ్మణస్తు శుభం వచః ॥12॥**

**ఉదతిష్ఠత పర్యంకాద్విస్మయోత్ఫుల్లలోచనః ।**
**ప్రత్యువాచోత్తరం చైవ కల్పే కల్పే ప్రతిశ్రియః ॥13॥**

అప్పుడు బ్రహ్మయొక్క శుభకరమైన వాక్కును విని పర్యంకం నుంచి లేచి ఆశ్చర్యంతో వికసించిననేత్రాలు గలవాడైన అచ్యుతుడు "నేను ప్రతికల్పంలోనూ ఇలా జలమధ్యంలో శయనిస్తా"నని సమాధానమిచ్చాడు.

**కర్తవ్యం చ కృతం చైవ క్రియతే యచ్చ కించన ।**
**ద్యౌరంతరిక్షం భూశ్చైవ పరం పదమహం భువః ॥14॥**

చేయదగినది, చేసినది, చేయవలసినది నేనే. స్వర్గం, ఆకాశం, పృథ్వి ఇట్లే భువర్లోకం అన్నింటికి పరమపదాన్ని నేనే.

**తమేవముక్త్వా భగవాన్ విష్ణుః పునరథాబ్రవీత్ ।**
**కస్త్వం ఖలు సమాయాతః సమీపం భగవాన్ కుతః ॥15॥**

**క్వ వా భూయశ్చ గంతవ్యం కశ్చ వా తే ప్రతిశ్రయః ।**
**కో భవాన్ విశ్వమూర్తిర్వై కర్తవ్యం కించ తే మయా ॥16॥**

**ఏవం బ్రువంతం వైకుంఠం ప్రత్యువాచ పితామహః ।**
**మాయయా మోహితః శంభోరవిజ్ఞాయ జనార్దనమ్ ॥17॥**

**మాయయా మోహితం దేవమవిజ్ఞాతం మహాత్మనః ।**
**యథా భవాన్ తథైవాహమాదికర్తా ప్రజాపతిః ॥18॥**

ఆవిధంగా విష్ణువు పలికినవాడై మరల ఇలా బ్రహ్మతో పలికాడు.

"నీవు ఎవ్వడవు? ఎచ్చటనుంచి నాదగ్గరకు వచ్చావు? ఇక్కడనుండి ఎక్కడికి వెళ్లతావు. నీవెక్కడ నివసిస్తావు? విశ్వాకృతివైన నీవు ఎవ్వడవు? నేను నీకు చేయవలసిన సహాయం ఏమిటి?" అని. ఇలా పలుకుతున్న వైకుంఠవాసియైన విష్ణువునుగూర్చి పితామహుడు బదులు పలికాడు. శివుడియొక్క మాయవల్ల మోహింపబడ్డ బ్రహ్మ, జనార్దనుణ్ణి, దేవదేవుణ్ణి గుర్తింపలేక "నీవెట్లు ఈజగత్తుకు ఆదికర్తవైన ప్రజాపతివో నేను అట్లే ఆదికర్తను, ప్రజాపతిని" అని.

**సవిస్మయం వచః శ్రుత్వా బ్రహ్మణో లోకతంత్రిణః ।**
**అనుజ్ఞాతశ్చ తే నాథ వైకుంఠో విశ్వసంభవః ॥19॥**

**కౌతూహలాన్మహాయోగీ ప్రవిష్టో బ్రహ్మణో ముఖమ్ ।**

జగత్తులను సృష్టించే బ్రహ్మయొక్క ఆశ్చర్యకారకాలైన ఆమాటల్ని విని, ఆతడి అనుమతిని పొంది విశ్వసృష్టికారకుడు, మహాయోగి, వైకుంఠవాసియైన విష్ణువు కుతూహలంతో బ్రహ్మయొక్క ముఖంలోకి ప్రవేశించాడు.

**ఇమానష్టాదశద్వీపాన్ ససముద్రాన్ సపర్వతాన్ ॥20॥**

**ప్రవిశ్య సుమహాతేజాశ్చాతుర్వర్ణ్యసమాకులాన్ ।**
**బ్రహ్మణస్తంబపర్యంతం సప్తలోకాన్ సనాతనాన్ ॥21॥**

**బ్రహ్మణస్తూదరే దృష్ట్వా సర్వాన్ విష్ణుర్మహాభుజః ।**
**అహోఽస్య తపసో వీర్యమిత్యుక్త్వా చ పునఃపునః ॥22॥**

**అటిత్వా వివిధాన్‌లోకాన్ విష్ణుః నానావిధాశ్రయాన్ ।**
**తతో వర్షసహస్రాంతే నాంతం హి దదృశే యదా ॥23॥**

**తదాస్య వక్త్రాన్నిష్క్రమ్య పన్నగేంద్రనికేతనః ।**
**నారాయణో జగద్ధాతా పితామహమథాబ్రవీత్ ॥24॥**

బ్రహ్మోదరంలో అష్టాదశద్వీపాల్ని, సముద్రాల్ని, పర్వతాల్ని, బ్రహ్మక్షత్రవైశ్యశూద్రచాతుర్వర్ణ్య ప్రజాసమూహాల్ని, అతిప్రాచీనమైన సప్తలోకాల్ని, బ్రహ్మనుంచి తృణపర్యంతమైన స్థావరజంగమజగత్తును, మహాబాహువైన విష్ణువు చూచి ఆశ్చర్యాన్ని పొందాడు. బ్రహ్మతపశ్శక్తి చాలా గొప్పదని మాటిమాటికి భావించాడు.

వివిధలోకాల్ని, అనేకవిధాలైన ఆ(శయాలు గలిగిన వాటిపై వేయిసంవత్సరాలు తిరిగికూడా వాటి అంతాన్ని చూడలేకపోయాడు. శేషశాయి, జగదాధారుడు అయిన విష్ణువు బ్రహ్మముఖంనుంచి బయటకు వచ్చి బ్రహ్మనుద్దేశించి పలికాడు.

**భగవానాదిరంతశ్చ మధ్యం కాలో దిశో నభః ।**
**నాహమంతం ప్రపశ్యామి ఉదరస్య తవానఘ ॥25॥**

పాపరహితుడా! నీవు భగవంతుడవు. ఆది, అంతం, మధ్యం, కాలం, దిక్కులు, ఆకాశం, నీలో ఉన్నాయి. నీ ఉదరంయొక్క అంతాన్ని చూడలేక పోయాను.

**ఏవముక్త్వాబ్రవీద్భూయః పితామహమిదం హరిః ।**
**భగవానేవమేవాహం శాశ్వతం హి మమోదరమ్ ॥26॥**

**ప్రవిశ్య లోకాన్ పశ్యైతాననౌపమ్యాన్ సురోత్తమ ।**

ఈవిధంగా పలికి, మరల విష్ణుభగవానుడు బ్రహ్మతో ఇలా అన్నాడు. ఓ సురశ్రేష్ఠా! నేనుకూడా ఇలాంటి భగవంతుణ్ణే. నీవు కూడా శాశ్వతమైన నాఉదరంలో ప్రవేశించి సాదృశ్యరహితమైన లోకాల్ని దర్శించు.

**తతః ప్రాహ్లాదినీం వాణీం శ్రుత్వా తస్యాభినంద్య చ ॥27॥**

**శ్రీపతేరుదరం భూయః ప్రవివేశ పితామహః ।**
**తానేవ లోకాన్ గర్భస్థానపశ్యత్సత్యవిక్రమః ॥28॥**

**పర్యటిత్వా తు దేవస్య దదృశేऽంతం న వై హరేః ॥**

అనంతరం విష్ణువుయొక్క ఆహ్లాదకారకమైన మాటను విని, ఆతడిని అభినందించి బ్రహ్మ, లక్ష్మీపతిఅయిన విష్ణువుయొక్క ఉదరంలోనికి ప్రవేశించాడు. సత్యపరాక్రముడైన బ్రహ్మదేవుడు విష్ణువు ఉదరంలోగల అన్నిలోకాల్ని చూశాడు. అందు బాగా తిరిగి కూడా అంతాన్ని చూడలేక పోయాడు.

**జ్ఞాత్వా గతిం తస్య పితామహస్య ద్వారాణి సర్వాణి పిధాయ విష్ణుః ॥**
**విభుర్మనః కర్తుమియేష చాశు సుఖం ప్రసుప్తోऽహమితి ప్రచింత్య ॥29॥**

విష్ణువు బ్రహ్మయొక్క గమనమార్గాన్ని తెలిసికొని అన్నిమార్గాల్ని నిరోధించి బ్రహ్మ మనసు తెలియదలచి బాగా ఆలోచించి తాను వెంటనే సుఖనిద్రను పొందాడు

**తతో ద్వారాణి సర్వాణి పిహితాని సమీక్ష్య వై ।**
**సూక్ష్మం కృత్వాత్మనో రూపం నాభ్యాం ద్వారమవిందత ॥30॥**

**పద్మసూత్రానుసారేణ చాన్వపశ్యత్పితామహః ।**
**ఉజ్జహారాత్మనో రూపం పుష్కరాచ్చతురాననః ॥31॥**

**విరరాజారవిందస్థః పద్మగర్భసమద్యుతిః ।**
**బ్రహ్మా స్వయంభూర్భగవాన్ జగద్యోనిః పితామహః ॥32॥**

వెలువడడానికి వీలైన అన్ని మార్గాలు మూసుకుని ఉండడం చూచి బ్రహ్మదేవుడు తన రూపాల్ని మిక్కిలి సూక్ష్మం చేసుకుని నాభిద్వారా వెలువడు మార్గాన్ని కనుక్కున్నాడు. పిమ్మట చతుర్ముఖుడగు బ్రహ్మ పద్మనాళం ద్వారా బయటబడి తన అసలురూపం ధరించాడు. పద్మసమానకాంతిమంతుడు, స్వయంభువుడు, జగత్కర్త అయిన బ్రహ్మ ఆ కమలమందే కూర్చుండి ప్రకాశించాడు.

**ఏతస్మిన్నంతరే తాభ్యామేకైకస్య తు కృత్స్నశః ।**
**వర్తమానే తు సంఘర్షే మధ్యే తస్యార్ణవస్య తు ॥33॥**

**కుతోఽ ప్యపరిమేయాత్మా భూతానాం ప్రభురీశ్వరః ।**
**శూలపాణిర్మహాదేవో హేమచీరాంబరచ్ఛదః ॥34॥**

**ఆగచ్ఛద్యత్ర సోఽ నంతో నాగభోగపతిర్హరిః ।**

తరువాత వారిద్దరిలో ఒకరితో ఒకరికి సముద్రమధ్యంలో సంఘర్షణ కలిగింది. ప్రాణులకు ప్రభువు, అమేయమైన ఆత్మగలవాడు, స్వర్ణవస్త్రధారి, శూలపాణి అయిన శివుడు ఎక్కడ అనంతుడు, శేషశాయి అయిన విష్ణువు కలడో అక్కడకు చేరుకున్నాడు.

**శీఘ్రం విక్రమతస్తస్య పద్భ్యామాక్రాంతపీడితాః ॥35॥**

**ఉద్భూతాస్తూర్ణమాకాశే పృథులాస్తోయబిందవః ।**
**అత్యుష్ణశ్చాతిశీతశ్చ వాయుస్తత్ర వవౌ పునః ॥36॥**

శ్రీహరియొక్క శీఘ్రచలనంవల్ల చరణాల తాకిడివల్ల పీడింపబడి సముద్రజలాలు పెద్దపెద్ద బిందువులుగామారి ఆకాశాన్ని వ్యాపిస్తున్నాయి. మరల మిక్కిలి చల్లని, మిక్కిలి వేడి అయిన వాయువు వీచింది.

**తద్దృష్ట్వా మహదాశ్చర్యం బ్రహ్మా విష్ణుమభాషత ।**
**అబ్బిందవశ్చ శీతోష్ణాః కంపయంత్యంబుజం భృశమ్ ॥37॥**

**ఏతన్మే సంశయం బ్రూహి కింవా త్వన్యచ్చికీర్షసి ।**
**ఏతదేవం విధం వాక్యం పితామహముఖోద్గతమ్ ॥38॥**

దానిని చూచి బ్రహ్మ మహావిస్మయాన్నిపొంది విష్ణువును గూర్చి ఇలా పలికాడు. చల్లని మరియు వేడినీటిబిందువులు మిక్కిలిగా పద్మాన్ని కంపింప చేస్తున్నాయి. ఈవిషయంలో నాకు సందేహముంది. దానిని దూరంచేసి నీవు ఇప్పుడు ఏమిచేయబోతున్నావో చెప్పు. ఈవిధమైన మాట పితామహుడి నోటి వెంట వచ్చింది.

**శ్రుత్వా ప్రతికర్మా హి భగవానసురాంతకృత్ ।**
**కిం ను ఖల్వత్ర మే నాభ్యాం భూతమన్యత్కృతాలయమ్ ॥39॥**

**వదతి ప్రియమత్యర్థం మన్యుశ్చాస్య మయాకృతః ।**
**ఇత్యేవం మనసా ధ్యాత్వా ప్రత్యువాచేదముత్తరమ్ ॥40॥**

బ్రహ్మ మాటను విని తిరుగులేకుండా కార్యాల్ని నిర్వర్తించేవాడు, రాక్షసాంతకుడు అయిన విష్ణుభగవానుడు ఇలా పలికాడు. నా నాభినుంచి జన్మించినవాడెవ్వడు. ఆతడు అధికారాన్ని చలాయిస్తున్నాడు. ఆతడు ఇష్టంగా పలుకుతున్నా ఆతని విషయమై నాకు క్రోధం కలిగింది. ఈవిధంగా మనసులో అనుకుని విష్ణువు సమాధానమిచ్చాడు.

**కిమత్ర భగవానద్య పుష్కరే జాతమంభసః ।**
**కిం మయా చ కృతం దేవ యన్మాం ప్రియమనుత్తమమ్ ॥41॥**

**భాషసే పురుషశ్రేష్ఠం కిమర్థం బ్రూహి తత్త్వతః ।**
**ఏవం బ్రువాణం దేవేశం లోకయాత్రానుగం తతః ॥42॥**

**ప్రత్యువాచాంబుజాభాక్షం బ్రహ్మా వేదనిధిః ప్రభుః ।**
**యోఽసౌ తవోదరం పూర్వం ప్రవిష్టోఽహం త్వదిచ్ఛయా ॥43॥**

**యథా మమోదరే లోకాః సర్వే దృష్టాస్త్వయా ప్రభో।**
**తథైవ దృష్టాః కార్త్స్న్యేన మయాలోకాస్తవోదరే ॥44॥**

ఓ భగవంతుడా! ఇప్పుడు నీవు నీటియందు కమలంలో ఉన్నావు. ఓ దేవా! నేను అచ్చట ఏమి చేశాను. ఓ శ్రేష్ఠపురుషుడా! ఎందుకిలా పలుకుతున్నావు. సత్యాన్ని వచించు. ఇలా పలుకుతున్నవాడు, ప్రపంచయాత్రను కొనసాగించేవాడు, పద్మనేత్రుడు, దేవేశ్వరుడైన విష్ణువుని గూర్చి వేదనిధి, ప్రభువు అయిన బ్రహ్మ బదులిచ్చాడు. పూర్వం నేను నీయిష్టప్రకారం నీఉదరంలోకి ప్రవేశించాను. నీవు నా ఉదరంలో అన్ని లోకాల్ని చూసినట్లే నేను నీ ఉదరంలో అన్ని లోకాలను సంపూర్ణంగా చూశాను.

**తతో వర్షసహస్రాత్తు ఉపావృత్తస్య మేఽనఘ ।**
**త్వయా మత్సరభావేన మాం వశీకర్తుమిచ్ఛతా ॥45॥**

**ఆశు ద్వారాణి సర్వాణి పిహితాని సమంతతః ।**
**తతో మయా మహాభాగ సంచింత్య స్వేన తేజసా ॥46॥**

**లబ్ధో నాభిప్రదేశేన పద్మసూత్రాద్వినిర్గమః ।**
**మాభూత్తే మనసోఽల్పోఽపి వ్యాఘాతోఽయం కథంచన ॥47॥**

ఓ అనఘా! తర్వాత నేను వేయిసంవత్సరాలు అక్కడే ఉన్నాను. నీవు ఈర్ష్యాభావంతో నన్ను వశీకరించుకోవాలనే కోరికతో వెంటనే అన్నివైపుల సమస్తద్వారాల్ని బంధించావు. ఓ మహాత్మా! తర్వాత నేను

బాగా ఆలోచించి నాతేజఃప్రభావంతో నీనాభిస్థానంలోగల కమలసూత్రంనుంచి బయటకు వచ్చాను. ఈవిషయంలో నీవు మనసులో కొంచెం కూడా వ్యధను చెందవద్దు.

**ఇత్యేషానుగతిర్విష్ణో కార్యాణామౌపసర్పిణీ ।**
**యన్మయానంతరం కార్యం బ్రూహి కిం కరవాణ్యహమ్ ॥48॥**

ఓ శ్రీహరీ! ఎందుకనగా ఇది నీ అభివృద్ధికి చెందిన పనులకు అనుక్రమం. దీని తర్వాత నేను చేయవలసిన పనిని గూర్చి చెప్పుము.

**తతః పరమమేయాత్మా హిరణ్యకశిపో రిపుః ।**
**అనవద్యాం ప్రియామిష్టాం శివాం వాణీం పితామహాత్ ॥49॥**

**శ్రుత్వా విగతమాత్సర్యం వాక్యమస్మై దదౌ హరిః ।**
**న హ్యేవమీదృశం కార్యం మయాధ్యవసితం తవ ॥50॥**

తర్వాత అప్రమేయమైన ఆత్మగలవాడు, హిరణ్యకశిపుశత్రువు అయిన విష్ణువు ప్రియమైన, మధురమైన, పవిత్రమైన, గొప్పదైన, మంగళకరమైన, బ్రహ్మమాటను విని ఈర్ష్యలేని మాటను బ్రహ్మగూర్చి పలికాడు. నీవు నాభికమలంనుంచి ఉద్భవించావు. ఈవిషయంలో నాకెట్టి ప్రయాసయు లేదు.

**త్వాం బోధయితుకామేన క్రీడాపూర్వం యదృచ్ఛయా ।**
**ఆశు ద్వారాణి సర్వాణి ఘటితాని మయాత్మనః ॥51॥**

**న తేఽన్యథావగంతవ్యం మాన్యః పూజ్యశ్చ మే భవాన్ ।**
**సర్వం మర్షయ కల్యాణ యన్మయాపకృతం తవ ॥52॥**

నేను నీకు నావిషయం తెలియజేయాలనే కోరికతోనే క్రీడగా స్వేచ్ఛగా వెంటనే అన్నిద్వారాల్ని మూసివేశాను. దీన్ని నీవు మరొకవిధంగా అనుకోవద్దు. నీవు నాకు మాన్యుడవు. పూజనీయుడవు. ఓ మంగళకారక! కావున నీకు నేను చేసిన మొత్తం అపకారాన్ని క్షమించు.

**అస్మాన్ మయోహ్యమానస్త్వం పద్మాదవతర ప్రభో ।**
**నాఽహం భవంతం శక్నోమి సోఢుం తేజోమయం గురుమ్ ॥53॥**

ఓ ప్రభూ! నేను భారాన్ని వహిస్తున్న పద్మంనుంచి దిగు. నీవు మిక్కిలి గురుతరం, తేజోమయం అవడంచేత నేను నిన్ను భరించడానికి శక్తిచాలకున్నాను.

**స హోవాచ వరం బ్రూహి పద్మాదవతర ప్రభో ।**
**పుత్రో భవ మమారిఘ్న ముదం ప్రాప్స్యసి శోభనమ్ ॥54॥**

విష్ణువుయొక్క ఆ మాటలకు సమాధానంగా నీవు ఏమి వరం కోరుతున్నావో చెప్పు అన్నాడు బ్రహ్మ. అప్పుడు విష్ణువు ఓ ప్రభూ! కమలంనుంచి దిగు. ఓశత్రుసంహారీ! నాకు పుత్రుడవు కమ్ము. దానితో నీవు మంగళకరమైన సంతోషాన్ని పొందుతావు.

**సద్భావవచనం బ్రూహి పద్మాదవతర ప్రభో ।**
**స త్వం చ నో మహాయోగీ త్వమాద్యః ప్రణవాత్మకః ॥55॥**

**అద్య ప్రభృతి సర్వేశః శ్వేతోష్ణీషవిభూషితః ।**
**పద్మయోనిరితి హ్యేవం ఖ్యాతో నామ్నా భవిష్యసి ॥56॥**

**పుత్రో మే త్వం భవ బ్రహ్మన్ సప్తలోకాధిపః ప్రభో ।**

ఓ ప్రభూ! స్నేహపూర్వకమైన మాటను పలుకు. పద్మంనుంచి దిగు. నీవు మహాయోగివి. ప్రణవస్వరూపుడవు. నాకు పూజ్యుడవు. ఇప్పటినుంచి నీవు తెల్లటి తలపాగతో అలంకరింపబడతావు. నీవు సమస్తానికి స్వామివి. 'పద్మయోని' అనే పేరుతో ప్రఖ్యాతి పొందుతావు. ఓ ప్రభూ! ఓ బ్రహ్మ! నీవు సమస్తలోకాధిపతివి. నీవు నాకు పుత్రుడవగుము.

**తతః స భగవాన్ దేవో వరం దత్వా కిరీటినే ॥57॥**

**ఏవం భవతు చేత్యుక్త్వా ప్రీతాత్మా గతమత్సరః ।**
**ప్రత్యాసన్నమథాయాంతం బాలార్కాభం మహాననమ్ ॥58॥**

**భవమత్యద్భుతం దృష్ట్వా నారాయణమథాబ్రవీత్ ।**

తర్వాత బ్రహ్మదేవుడు విష్ణువుకు నీవన్నట్లే జరుగుతుందనే వరాన్ని ఇచ్చి సంతోషించిన మనసుగలవాడై ద్వేషం విడచి పెట్టాడు. ఉదయభానుప్రకాశం కలవాడు, విశాలమైన ముఖంగలవాడు, అత్యద్భుతమైన రూపంగలవాడు, దగ్గరకు సమీపించువాడైన శివుణ్ణి చూచి బ్రహ్మ విష్ణువుతో ఇలా పలికాడు.

**అప్రమేయో మహావక్త్రో దంష్ట్రీ ధ్వస్తశిరోరుహః ॥59॥**

**దశబాహుస్త్రిశూలాంగో నయనైర్విశ్వతః స్థితః ।**
**లోకప్రభుః స్వయం సాక్షాద్వికృతో ముంజమేఖలీ ॥60॥**

**మేఢ్రేణోర్ధ్వేన మహతా నర్దమానోఽతిభైరవమ్ ।**
**కః ఖల్వేష పుమాన్ విష్ణో తేజోరాశిర్మహాద్యుతిః ॥61॥**

**వ్యాప్య సర్వా దిశో ద్యాం చ ఇత ఏవాభివర్తతే ।**

ఓ శ్రీహరీ! పోలికలేనివాడు, పెద్దనోరుగలవాడు, కోరలుగలవాడు, కేశాలులేనితలగలవాడు, పదిబాహువులుగలవాడు, త్రిశూలధారిఅయినవాడు, నేత్రాలతో నలుదిక్కులు చూస్తున్నవాడు, విశ్వనాయకుడు, వికృతరూపుడైనవాడు, దర్భలతో చేసిన మొలత్రాడు కలిగినవాడు. ఊర్ధ్వలింగుడైనవాడు, భయంకరంగా తీవ్రంగా గర్జించువాడు, తేజస్వంతుడు, మహాకాంతిమంతుడు అయినవాడు, సర్వదిక్కులందు, ఆకాశంలోను వ్యాపించినవాడు అయిన ఈపురుషుడెవడో ఇక్కడే తిరుగుతూ ఉన్నాడు.

**తేనైవ ముక్తో భగవాన్ విష్ణుర్బ్రహ్మాణమబ్రవీత్ ॥62॥**

**పద్భ్యాం తలనిపాతేన యస్య విక్రమతోఽర్ణవే ।**
**వేగేన మహతాకాశేఽపృథ్థితాశ్చ జలాశయాః ॥63॥**

**స్థూలాద్భిర్విశ్వతోఽత్యర్థం సిచ్యసే పద్మసంభవ ।**
**ఘ్రాణజేన చ వాతేన కంప్యమానం త్వయా సహ ॥64॥**

**దోధూయతే మహాపద్మం స్వచ్ఛందం మమ నాభిజమ్ ।**
**సమాగతో భవానీశో హ్యనాదిశ్చాంతకృత్ప్రభుః ॥65॥**

**భవానహం చ స్తోత్రేణ ఉపతిష్ఠావ గోధ్వజమ్ ।**

బ్రహ్మ ఈవిధంగా పలుకగా విష్ణువు బ్రహ్మనుగూర్చి ఇలా పలికాడు. ఇలా ఈ సముద్రం చలించడానికి కారణం రెండుపాదాలతో తన్నడమే. దానితో సముద్రం మహావేగంతో ఆకాశంలో పైకి లేస్తున్నది. ఇలా పైకి చిమ్ముతున్న అధికజలంతో నీవు తడిసిపోయావు. ఆ మహాపురుషుడి ముక్కుపుటాలనుండి వెలువడుతున్న వాయువువల్ల నీతోపాటు నా నాభినుంచి పుట్టిన మహాకమలం కూడా తీవ్రంగా కంపిస్తున్నది. మనను సమీపిస్తున్న ఆతడు శివుడు. ఆద్యంతరహితుడు. మనమిద్దరం వృషభధ్వజుడైన మహాదేవుడిని స్తుతిద్దాం.

**తతః క్రుద్ధోఽంబుజాభాక్షం బ్రహ్మా ప్రోవాచ కేశవమ్ ॥66॥**

**భవాన్న నూనమాత్మానం వేత్తి లోకప్రభుం విభుమ్ ।**
**బ్రహ్మాణం లోకకర్తారం మాం న వేత్సి సనాతనమ్ ॥67॥**

**కో హ్యసౌ శంకరో నామ ఆవయోర్వ్యతిరిచ్యతే ।**

తర్వాత బ్రహ్మదేవుడు కుపితుడై పద్మసమానకాంతిగలనేత్రాలున్న శ్రీహరినిగూర్చి పలికాడు. నీవు నన్ను లోకేశుడుగా లోకవిభుడుగా గుర్తించుట లేదు. సనాతనుణ్ణి, ప్రపంచసృష్టికర్తను, బ్రహ్మను అయిన నన్ను గుర్తించుట లేదు. మన యిద్దరికంటే భిన్నుడు ఈ శంకరుడెవ్వడు?

**తస్య తత్క్రోధజం వాక్యం శ్రుత్వా హరిరభాషత ॥68॥**

**మా మైవం వద కల్యాణ పరివాదం మహాత్మనః ।**
**మహాయోగేంధనో ధర్మో దురాధర్షో వరప్రదః ॥69॥**

**హేతురస్యాథ జగతః పురాణపురుషోఽవ్యయమ్ ।**
**బీజీ ఖల్వేష బీజానాం జ్యోతిరేకః ప్రకాశతే ॥70॥**

**బాలక్రీడనకైర్దేవః క్రీడతే శంకరః స్వయమ్ ।**

కోపంతో పుట్టిన బ్రహ్మ మాటను విని శ్రీమహావిష్ణువు ఇలా పలికాడు. ఓ కల్యాణకారీ! బ్రహ్మ! మహాత్ముడైన శివుడివిషయంలో ఈవిధంగా అపవాదవాక్యం పలుకవద్దు. ఆతడు ధర్మస్వరూపుడు, అత్యంతప్రచండుడు, మహాయోగమే ఇంధనంగాగలవాడు, వరదాయకుడు. ఈజగత్తుకు ఆతడే కారణం. అవ్యయుడైన సనాతనపురుషుడు. ఆతడు బీజాలకే బీజి. అనగా మూలబీజం. పరమబీజం. ముఖ్యమైన వెలుగై ప్రకాశిస్తున్నాడు. బొమ్మలతో ఆడునట్టి బాలురవలె మహాదేవశంకరుడు జగత్తుతో ఆడుకుంటాడు.

**ప్రధానమవ్యయో యోనిరవ్యక్తం ప్రకృతిస్తమః ॥71॥**

**మమ చైతాని నామాని నిత్యం ప్రసవధర్మిణః ।**
**యః కః స ఇతి దుఃఖార్తై ర్దృశ్యతే యతిభిః శివః ॥72॥**

**ఏష బీజీ భవాన్ బీజమహం యోనిః సనాతనః ।**

నాజన్మకారకుడైన ఆతడు ప్రధానం, అవ్యయం, యోని, అవ్యక్తం, ప్రకృతి, తమం అనేపేర్లు కలిగినవాడు. జననమరణదుఃఖాలబాధలతో కూడిన యోగులకు కన్పిస్తాడు. ఆతడెవడని నీవు ప్రశ్నించినవాడు శివుడే. ప్రాచీనుడైన ఆతడు బీజి. నీవు బీజానివి. నేను యోనిని.

**స ఏవముక్తో విశ్వాత్మా బ్రహ్మా విష్ణుమపృచ్ఛత ॥73॥**

**భవాన్ యోనిరహం బీజం కథం బీజీ మహేశ్వరః ।**
**ఏతన్మే సూక్ష్మమవ్యక్తం సంశయం ఛేత్తుమర్హసి ॥74॥**

విష్ణువు ఈప్రకారంగా పలకగా విశ్వాత్ముడైన బ్రహ్మ ఇలా పలికాడు. నీవు యోనివి, నేను బీజాన్ని, మహేశ్వరుడు బీజి ఏవిధంగా కాగలం. నీవు సూక్ష్మమూ అవ్యక్తమూ అయిన నా సందేహాన్ని పోగొట్టగలవు.

**జ్ఞాత్వా చ వివిధోత్పత్తిం బ్రహ్మణో లోకతంత్రిణః ।**
**ఇమం పరమసాదృశ్యం ప్రశ్నమభ్యవదద్ధరిః ॥75॥**

**అస్మాన్మహత్తరం భూతం గుహ్యమన్యన్న విద్యతే ।**
**మహతః పరమంధామ శివమధ్యాత్మినాం పదమ్ ॥76॥**

అనేకప్రకారాల లోకోత్పత్తి, లోకనియంత్రణగల బ్రహ్మస్థితిని విష్ణువు గుర్తించి ఆతడు అడిగిన మిక్కిలి సాటిలేని ప్రశ్నకు ఉత్తరమిచ్చాడు. ఈ మహాదేవుడి కంటె భిన్నంగా మరెవ్వడు గూఢతత్త్వంగలవాడు లేడు. ఆతడు మహత్తత్త్వానికి సర్వోత్కృష్టస్థానం. ఆధ్యాత్మికజ్ఞానులకు కళ్యాణమయపదం.

**ద్వివిధం చైవాత్మానం ప్రవిభజ్య వ్యవస్థితః ।**
**నిష్కలస్తత్ర యోఽ వ్యక్తః సకలశ్చ మహేశ్వరః ॥77॥**

తనను రెండుగా విభజించుకున్నాడు. సగుణనిర్గుణరూపాలవి. నిర్గుణమైనది అవ్యక్తరూపం. సగుణమైనది మహేశ్వరరూపం.

**యస్య మాయావిధిజ్ఞస్య అగమ్యగహనస్య చ ।**
**పురాలింగోద్భవం బీజం ప్రథమం త్వాదిసర్గికమ్ ॥78॥**

**మమ యోనౌ సమాయుక్తం తద్బీజం కాలపర్యయాత్ ।**
**హిరణ్మయమకూపారే యోన్యామండమజాయత ॥79॥**

ప్రాచీనకాలంలో సృష్ట్యాదిలో మాయాక్రియాకలాపాలు తెలిసినవాడు, అగమ్యుడు, దుర్బోధుడు, అయిన శివుని లింగం నుంచి పుట్టిన బీజం నాయోనిలో పడింది. ఆబీజం కొంతకాలానికి బంగారుగ్రుడ్డుగా మారింది.

**శతాని దశవర్షాణామండమప్సు ప్రతిష్ఠితమ్ ।**
**అంతే వర్షసహస్రస్య వాయునా తద్ ద్విధాకృతమ్ ॥80॥**

**కపాలమేకం ద్యౌర్జజ్ఞే కపాలమపరం క్షితిః ।**
**ఉల్బం తస్య మహోత్సేధో యోఽసౌ కనకపర్వతః ॥81॥**

వేయిసంవత్సరాలపాటు ఆ అండం నీటిలో ఉన్నది. ఈవేయిసంవత్సరాల చివరికాలంలో వాయువుచేత అది రెండుగా విభజింపబడింది. ఒకముక్క అనగా పైభాగం స్వర్గం అయ్యింది. రెండవది భూమిగా మారింది. అందులో మిగిలిన పెద్దభాగం ఎత్తైన బంగారుపర్వతం అయ్యింది. అదే మేరుపర్వతం. ఇది అండంయొక్క గర్భావరణంనుంచి కలిగింది.

**తతశ్చ ప్రతిసంధ్యాత్మా దేవదేవో వరః ప్రభుః ।**
**హిరణ్యగర్భో భగవాన్ త్వభిజజ్ఞే చతుర్ముఖః ॥82॥**

అనంతరం ప్రతిసంధ్యాత్ముడు, దేవదేవుడు, శ్రేష్ఠుడు, ప్రభువు, హిరణ్యగర్భుడు, భగవంతుడు, చతుర్ముఖుడు అయిన బ్రహ్మ జన్మించాడు.

**ఆతారార్కేందునక్షత్రం శూన్యం లోకమవేక్ష్య చ ।**
**కోఽహమిత్యపి చ ధ్యాతే కుమారస్తేఽభవన్ తదా ॥83॥**

**ప్రియదర్శనాస్తు యతయో యతీనాం పూర్వజాస్తవ ।**
**భూయో వర్షసహస్రాంతే తత ఏవాత్మజాస్తవ ॥84॥**

**భువనానలసంకాశాః పద్మపత్రాయతేక్షణాః ।**
**శ్రీమాన్ సనత్కుమారశ్చ ఋభుశ్చైవోర్ధ్వరేతసౌ ॥85॥**

**సనకః సనాతనశ్చైవ తథైవ చ సనందనః ।**
**ఉత్పన్నాః సమకాలం తే బుద్ధ్యాతీంద్రియదర్శనాః ॥86॥**

**ఉత్పన్నాః ప్రతిభాత్మానో జగతాం స్థితిహేతవః ।**
**నారప్స్యంతే చ కర్మాణి తాపత్రయవివర్జితాః ॥87॥**

తారలు, సూర్యచంద్రులు, నక్షత్రాలతోపాటు ఈలోకాన్ని శూన్యంగా ఉండడాన్ని చూచి "నేనెవడను" అని నీకైనీవు విచారించగా మరల వేయిసంవత్సరాల చివరగా పుత్రులు నీకు కలిగారు. వారందరూ ప్రియదర్శనులు. వారందరూ మునులందరికి పూర్వులు. పార్థివుడైన అగ్నిసమానతేజులు, పద్మంవలె విశాలమైన నేత్రాలుగలవారు, శ్రీమంతుడైన సనత్కుమారుడు, ఋభుడు బ్రహ్మచారులయ్యారు. సనక, సనాతన, సనందులు ముగ్గురూ ఒకేకాలంలో జన్మించారు. వారు జ్ఞానశక్తితో ఇంద్రియాతీతవస్తుదర్శనంకూడా చేయగలరు. వారు మహాబుద్ధిమంతులు. లోకస్థితికారకులు. వారు మూడువిధాలైన దైహిక, దైవిక, భౌతిక పాపాలనుంచి విముక్తులు. వారందరూ సాంసారిక కార్యకలాపాల్ని చేపట్టలేదు.

**అల్పసౌఖ్యం బహుక్లేశం జరాశోకసమన్వితమ్ ।**
**జీవనం మరణం చైవ సంభవశ్చ పునఃపునః ॥88॥**

**అల్పభూతం సుఖం స్వర్గే దుఃఖాని నరకే తథా ।**
**విదిత్వా చాగమం సర్వమవశ్యం భవితవ్యతామ్ ॥89॥**

**ఋభుం సనత్కుమారం చ దృష్ట్వా తవ వశే స్థితౌ ।**
**త్రయస్తు త్రీన్ గుణాన్ హిత్వా చాత్మజాః సనకాదయః ॥90॥**

**వైవర్తేన తు జ్ఞానేన ప్రవృత్తాస్తే మహౌజసః ।**

ఈజీవితం తక్కువ సుఖం కలది. ఎక్కువ కష్టం కలది. మరియు ముసలితనంతో, దుఃఖంతో కూడుకున్నది. మాటిమాటికి జన్మించడం, మరణించడం కలుగుతున్నది. స్వర్గం స్వల్పసుఖం కలది అని నరకం దుఃఖమయం అని తెలిసి మరియు భవిష్యత్తులో రానున్న సమస్తవిషయాల్ని శాస్త్రాలద్వారా గుర్తించి సనత్కుమారుణ్ణి, ఋభువుని నీ వశమందున్నవారినిగా నెరిగి, సనక, సనంద, సనాతనులు త్రిగుణాతీతులై, మహాతేజస్కులై ఆధ్యాత్మికజీవనాన్ని స్వీకరించారు.

**తతస్తేషు ప్రవృత్తేషు సనకాదిషు వై త్రిషు ॥91॥**

**భవిష్యసి విమూఢస్త్వం మాయయా శంకరస్య తు ।**
**ఏవం కల్పే తు వై వృత్తే సంజ్ఞా నశ్యతి తేఽనఘ ॥92॥**

అట్లు సనకాదులు ఆధ్యాత్మికజీవనప్రవృత్తులు కాగా మహాశివుడి మాయవల్ల నీవు మౌఢ్యాన్ని పొందావు. ఈవిధంగా ఆ కల్పం గతించగా ఓఅనఘుడా! నీకు ఆ జ్ఞానం నశించగలదు.

**కల్పే శేషాణి భూతాని సూక్ష్మాణి పార్థివాని చ ।**
**సర్వేషాం హ్యైశ్వరీ మాయా జాగృతిః సముదాహృతా ॥93॥**

పూర్వకల్పంలో మిగిలిపోయిన స్థూలసూక్ష్మప్రాణులన్నీకూడా ఈశ్వరమాయవల్ల చైతన్యం పొందుతాయి.

**యథైష పర్వతో మేరుర్దేవలోకో హ్యుదాహృతః ।**
**తస్య చేదం హి మాహాత్మ్యం విద్ధి దేవవరస్య హ ॥94॥**

ఈవిధంగా ఈమేరుపర్వతం దేవలోకంగా నిలిచింది. ఈప్రకారంగా దేవశ్రేష్ఠుడైన మహాశివుడి మాహాత్మ్యం తెలియాలి.

**జ్ఞాత్వా చేశ్వరసద్భావం జ్ఞాత్వా మామంబుజేక్షణమ్ ।**
**మహాదేవం మహాభూతం భూతానాం వరదం ప్రభుమ్ ॥95॥**

**ప్రణవేనాథ సామ్నా తు నమస్కృత్య జగద్గురుమ్ ।**
**త్వాం చ మాం చైవ సంక్రుద్ధో నిఃశ్వాసాన్నిర్దహేదయమ్ ॥96॥**

నన్ను పద్మనయనుణ్ణి అయిన శ్రీహరిగా గుర్తించి ఆయనను మహాదేవుడు ప్రాణులందు శ్రేష్ఠుడును, ప్రాణులన్నింటికి వరదాయకుడును, మహాప్రభువు అయిన శివుడుగా తెలిసి ప్రణవపూర్వకసామవేదమంత్రాలతో ఆయనను స్తుతిస్తూ నమస్కరించాలి. లేకుంటే అధికంగా కుపితుడైన ఆయన నిన్నూ నన్నూ నిశ్వాసతో దహించగలుగుతాడు.

**ఏవం జ్ఞాత్వా మహాయోగమభ్యుత్తిష్ఠన్మహాబలమ్ ।**
**అహం త్వామగ్రతః కృత్వా స్తోష్యామ్యనలసప్రభమ్ ॥97॥**

ఈవిధంగా మహాశివుడియొక్క యోగాన్ని, మహాశక్తిని గుర్తించి నిన్ను ముందుంచుకుని అగ్నిసమానుడైన ఆయన్ని స్తుతిస్తాను.

**ఇతి శ్రీమహాలింగపురాణే పూర్వభాగే బ్రహ్మాప్రబోధనం నామ వింశోఽధ్యాయః ॥ 20 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని బ్రహ్మాప్రబోధనమనే ఇరవైయవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **ఏకవింశోఽధ్యాయః - ఇరవై ఒకటవ అధ్యాయం**

## **బ్రహ్మవిష్ణుస్తుతిః - బ్రహ్మవిష్ణుస్తుతి**

**సూత ఉవాచ -** సూతర్షి పలికాడు.

**బ్రహ్మాణమగ్రతః కృత్వా తతః సగరుడధ్వజః ।**
**అతీతైశ్చ భవిష్యైశ్చ వర్తమానైస్తథైవ చ ॥1॥**

**నామభిశ్ఛాందసైశ్చైవ ఇదం స్తోత్రముదీరయత్ ।**

అనంతరం శ్రీహరి బ్రహ్మను ముందుంచుకుని గడచిన, రానున్న, జరుగుతున్న కల్పాలకు చెందిన వేదప్రతిపాదితాలైన నామాలతో శివుణ్ణి ఈవిధంగా స్తుతించాడు.

**నమస్తుభ్యం భగవతే సువ్రతానంతతేజసే ॥2॥**

**నమః క్షేత్రాధిపతయే బీజినే శూలినే నమః ।**
**సుమేంద్రాయార్చ్యమేంద్రాయ దండినే రూక్షతేజసే ॥3॥**

ఓ సువ్రతా! అనంతతేజోమయుడవై భగవంతుడవైన నీకు నమస్కారం. క్షేత్రాధిపతివి, బీజివి, శూలపాణివి అయిన నీకు వందనం. సుందరలింగం మరియు పూజనీయలింగం గలవాడివి, తీక్ష్ణవీర్యవంతుడవు, సర్వప్రాణుల్ని దండించువాడివి అయిన నీకు నమస్కారం.

**నమో జ్యేష్ఠాయ శ్రేష్ఠాయ పూర్వాయ ప్రథమాయ చ ।**
**నమో మాన్యాయ పూజ్యాయ సద్యోజాతాయ వై నమః ॥4॥**

**గహ్వరాయ ఘటేశాయ వ్యోమచీరాంబరాయ చ ।**
**నమస్తే హ్యస్మదాదీనాం భూతానాం ప్రభవే నమః ॥5॥**

జ్యేష్ఠుడవు, శ్రేష్ఠుడవు, ప్రాచీనుడవు, ఆద్యుడవు అయిన నీకు నమస్కారం. మాన్యుడవు, పూజ్యుడవు, సద్యోజాతుడవు అయిననీకు వందనం. అగమ్యుడవు, చైతన్యవంతమైనజీవులకు ప్రభుడవు, ఆకాశమనే నారచీర వస్త్రంగా ధరించినవాడవు (నగ్నుడు), మావంటి సర్వప్రాణులకు ఈశ్వరుడవు అయిన నీకు నమస్కారం.

**వేదానాం ప్రభవే చైవ స్మృతీనాం ప్రభవే నమః ।**
**ప్రభవే కర్మదానానాం ద్రవ్యాణాం ప్రభవే నమః ॥6॥**

వేదాధిపతివి, స్మృతుల అధిపతివి, సర్వకర్మలకు, సమస్తదానాలకు స్వామివి, సమస్తపదార్థాలకు స్వామివి అయిన నీకు అభివందనం.

**నమో యోగస్య ప్రభవే సాంఖ్యస్య ప్రభవే నమః ।**
**నమో ధ్రువనిబద్ధానామృషీణాం ప్రభవే నమః ॥7॥**

యోగానికి ప్రభుడవైన నీకు నమస్కారం. సాంఖ్యమునకు అధిపతివైన నీకు నమస్కారం. ధ్రువుడితో సంబంధంగల ఋషులయొక్క అనగా సప్తఋషుల అధిపతికి నమస్కారం.

**ఋక్షాణాం ప్రభవే తుభ్యం గ్రహాణాం ప్రభవే నమః ।**
**వైద్యుతాశనిమేఘానాం గర్జితప్రభవే నమః ॥8॥**

నక్షత్రాలకు, గ్రహాలకు ప్రభుడవు అయిన నీకు అభివందనం. మెరుపులు, ఉరుములు, పిడుగులతోకూడిన మేఘాలకు అధిపతివైన నీకు నమస్కారం.

**మహోదధీనాం ప్రభవే ద్వీపానాం ప్రభవే నమః ।**
**అద్రీణాం ప్రభవే చైవ వర్షాణాం ప్రభవే నమః ॥9॥**

**నమో నదీనాం ప్రభవే నదానాం ప్రభవే నమః ।**
**మహౌషధీనాం ప్రభవే వృక్షాణాం ప్రభవే నమః ॥10॥**

మహాసాగరాలకు, మహాద్వీపాలకు అధిపతివైన నీకు నమస్కారం. గిరులకు, భారతాదినవవర్షాలకు (భరతవర్షం మొ॥) నాథుడవైన నీకు వందనం. నదీనదాలకు అధిపతివైన నీకు నమస్కారం. గొప్పవైన ఔషధాలకు, వృక్షాలకు స్వామివి అయిన నీకు నమస్కారం.

**ధర్మవృక్షాయ ధర్మాయ స్థితీనాం ప్రభవే నమః ।**
**ప్రభవే చ పదార్థస్య పరస్య ప్రభవే నమః ॥11॥**

నానావిధధర్మాలకు కారణరూపమై ధర్మవృక్షానికి స్వామివైన నీకు నమస్కారం. ధర్మస్వరూపుడవైన నీకు నమస్కారం. స్థితిస్వరూపుడవైన నీకు నమస్కారం. పదార్థానికి, పరాత్పరానికి స్వామివి అయిన నీకు ప్రణతి.

**నమో రసానాం ప్రభవే రత్నానాం ప్రభవే నమః ।**
**క్షణానాం ప్రభవే చైవ లవానాం ప్రభవే నమః ॥12॥**

**అహోరాత్రార్ధమాసానాం మాసానాం ప్రభవే నమః ।**
**ఋతూనాం ప్రభవే తుభ్యం సంఖ్యాయాః ప్రభవే నమః ॥13॥**

రసాధిపతికి, రత్నాధిపతికి నమస్కారం. కాలాంతర్భాగాలైన క్షణాలకు, అట్లే ఆ క్షణాంశాలకు స్వామివి అయిన నీకు ప్రణతి. రాత్రింబవళ్లకు, పక్షాలకు, మాసాలకు అధిపతివైన నీకు ప్రణతి. ఆరు ఋతువులకు స్వామివి మరియు సర్వసంఖ్యలకు (1,2,3...) స్వామివి అయిన నీకు అభివందనం.

**ప్రభవే చాపరార్ధస్య పరార్ధప్రభవే నమః ।**
**నమః పురాణప్రభవే సర్గాణాం ప్రభవే నమః ॥14॥**

**మన్వంతరాణాం ప్రభవే యోగస్య ప్రభవే నమః ।**
**చతుర్విధస్య సర్గస్య ప్రభవేஉనంతచక్షుషే ॥15॥**

బ్రహ్మయొక్క దినంలోని మొదటి సగభాగానికి స్వామివైన మరియు ఆదినంలోని రెండవభాగానికి స్వామివైన నీకు వందనం. పురాణాలకు, సర్వసృష్టులకు స్వామివైన నీకు నమస్కారం. మన్వంతరాలకు ప్రభుడవు, యోగానికి ప్రభుడవు అయిన నీకు నమస్కారం. యోనిజ, అండజ, స్వేదజ, ఉద్భిజ్జాలయిన నాలుగురకాల సృష్టికి అధిపతికి, అనంతమైన నేత్రాలుగల నీకు నమస్కారం.

**కల్పోదయనిబంధానాం వార్తానాం ప్రభవే నమః ।**
**నమో విశ్వస్య ప్రభవే బ్రహ్మాధిపతయే నమః ॥16॥**

**విద్యానాం ప్రభవే చైవ విద్యాధిపతయే నమః ।**
**నమో వ్రతాధిపతియే వ్రతానాం ప్రభవే నమః ॥17॥**

కల్పంయొక్క పుట్టుకనుంచి సమస్తవస్తువులకు, సర్వవృత్తులకు స్వామివగు నీకు నమస్కారం. విశ్వనాథుడికి నమస్కారం. బ్రహ్మదేవుడికి స్వామి అయిన వాడికి నమస్కారం. విద్యలకు నిలయమై విద్యాధిపతివైన నీకు నమస్కారం. వ్రతాధిపతికి, వ్రతాలప్రభువుకు నమస్కారం.

**మంత్రాణాం ప్రభవే తుభ్యం మంత్రాధిపతయే నమః ।**
**పిత్రూణాం పతయే చైవ పశూనాం పతయే నమః ॥18॥**

**వాగ్వృషాయ నమస్తుభ్యం పురాణవృషభాయ చ ।**
**నమః పశూనాం పతయే గోవృషేంద్రధ్వజాయ చ ॥19॥**

మంత్రాలకు నిలయమై, మంత్రాధిపతివైన నీకు నమస్కారం. పితృదేవతల స్వామికి అట్లే పశుపతికి నమస్కారం. శ్రేష్ఠమైన వాక్కుగలవాడికి, పురాణశ్రేష్ఠుడైనవాడికి వందనం. పశుపతికి నమస్కారం. శ్రేష్ఠమైనగోవు, ఎద్దు టెక్కెంగా ఉన్నవాడికి నమస్కారం.

**ప్రజాపతీనాం పతయే సిద్ధీనాం పతయే నమః ।**
**దైత్యదానవసంఘానాం రక్షసాం పతయే నమః ॥20॥**

ప్రజాపతులకు నాథుడైనవానికి, సర్వసిద్ధులకు నాథుడైనవానికి వందనం. దైత్యులయొక్కయు, దానవులయొక్కయు రాక్షసులయొక్కయు సమూహాలకు స్వామివైన నీకు నమస్కారం.

**గంధర్వాణాం చ పతయే యక్షాణాం పతయే నమః ।**
**గరుడోరగసర్పాణాం పక్షిణాం పతయే నమః ॥21॥**

గంధర్వపతికి, యక్షనాథుడికి నమస్కారం. గరుడపక్షులకు, ఉరగులకు, సర్పాలకు అన్ని పక్షులకు నాథుడవైన నీకు అభివందనం.

**సర్వగుహ్యపిశాచానాం గుహ్యాధిపతయే నమః ।**
**గోకర్ణాయ చ గోప్త్రే చ శంకుకర్ణాయ వై నమః ॥22॥**

సమస్తగుహ్యులకు, పిశాచాలకు అధిపతికి, గుహ్యాధిపతికి వందనం. గోకర్ణుడికి, గోప్తుడికి, శంకుకర్ణుడికి అభివందనం.

**వరాహాయాప్రమేయాయ ఋక్షాయ విరజాయ చ ।**
**నమో సురాణాం పతయే గణానాం పతయే నమః ॥23॥**

వరాహరూపుడికి, అప్రమేయుడికి, ఋక్షుడికి, విరజుడికి, సురనాయకుడికి, గణనాయకుడికి నమస్కారం.

**అంభసాం పతయే చైవ ఓజసాం పతయే నమః ।**
**నమోఽస్తు లక్ష్మీపతయే శ్రీపాయ క్షితిపాయ నమః ॥24॥**

**బలాబలసమూహాయ అక్షోభ్యక్షోభణాయ చ ।**
**దీప్తశృంగైకశృంగాయ వృషభాయ కకుద్మినే ॥25॥**

జలనాథుడికి, తేజస్సులకు ప్రభువు అయినవాడికి నమస్కారం. లక్ష్మీపతికి, శ్రీదేవిభూదేవుల రక్షించువాడికి నమస్కారం. బలంగల, బలంలేనిప్రాణిసమూహాలుగలవాడికి, అక్షోభ్యక్షోభణుడికి నమస్కారం. ప్రకాశించుశృంగం, ఏకశృంగంగల వృషభుడికి నమస్కారం. కకుద్మిఅయినవాడికి వందనం.

**నమః స్థైర్యాయ వపుషే తేజసానువ్రతాయ చ ।**
**అతీతాయ భవిష్యాయ వర్తమానాయ వై నమః ॥26॥**

**సువర్చసే చ వీర్యాయ శూరాయ హ్యజితాయ చ ।**
**వరదాయ వరేణ్యాయ పురుషాయ మహాత్మనే ॥27॥**

స్థిరుడైనవాడికి, కాంతిగలదేహుడికి, అనువ్రతుడైనవాడికి నమస్కారం. భూతభవిష్యద్వర్తమానకాలరూపుడికి నమస్కారం. సువర్చస్వికి, వీర్యుడికి, శూరుడికి, అజితుడికి, వరదుడికి, వరేణ్యుడికి, పరమపురుషుడికి, మహాత్ముడైన శివుడికి నమస్కారం.

**నమో భూతాయ భవ్యాయ మహతే ప్రభవాయ చ ।**
**జనాయ చ నమస్తుభ్యం తపసే వరదాయ చ ॥28॥**

**అణవే మహతే చైవ నమః సర్వగతాయ చ ।**
**నమో బంధాయ మోక్షాయ స్వర్గాయ నరకాయ చ ॥29॥**

భూతరూపుడికి, భవ్యుడికి, మహత్తుఅయినవాడికి, ప్రభువుకు నమస్కారం. జనుడికి, తపస్స్వరూపుడికి, వరదుడికి నమస్కారం. పరమసూక్ష్మమైన అణుస్వరూపుడికి, స్థూలరూపుడికి, సర్వగమనుడికి నమస్కారం. జన్మమరణబంధసహితుడికి, విముక్తుడికి, స్వర్గమూ మరియు నరకమూ అయినవాడికి నమస్కారం.

**నమో భవాయ దేవాయ ఇజ్యాయ యాజకాయ చ ।**
**ప్రత్యుదీర్ణాయ దీప్తాయ తత్త్వాయాతిగుణాయ చ ॥30॥**

**నమః పాశాయ శస్త్రాయ నమస్త్వాభరణాయ చ ।**
**హుతాయ ఉపహోతాయ ప్రహుతప్రాశితాయ చ ॥31॥**

భవుడికి, దేవదేవుడికి, యజ్ఞమయుడికి, యాజకుడికి, ప్రత్యుదీర్ణుడికి, ప్రకాశవంతుడికి, మహాతత్త్వుడికి, గుణాతీతుడికి నమస్కారం. పాశహస్తుడికి, శస్త్రధరుడికి, అలంకారరూపుడికి వందనం. హవిస్స్వరూపుడికి, యజ్ఞంలో ఆవాహనచేయువానికి, హవిర్భోక్తకు నమస్కారం.

**నమోఽస్త్విష్టాయ పూర్తాయ అగ్నిష్టోమద్విజాయ చ ।**
**సదస్యాయ నభశ్చైవ దక్షిణావభృథాయ చ ॥32॥**

**అహింసాయాప్రలోభాయ పశుమంత్రౌషధాయ చ ।**
**నమః పుష్టిప్రదానాయ సుశీలాయ సుశీలినే ॥33॥**

కూపాలు, తటాకాలు నిర్మించడంలో ఇష్టుడికి, అగ్నిష్టోమం నిర్వర్తించిన బ్రాహ్మణుడికి, సదస్యుడికి, ఆకాశస్వరూపుడికి, యజ్ఞం ముగిసిన తర్వాత పుణ్యస్నానస్వరూపుడికి నమస్కారం.

అహింసారూపుడికి, ప్రలోభరహితుడికి, పశురూపుడికి, మంత్రస్వరూపుడికి, ఔషధరూపుడికి అభివందనం. పరిపుష్టినిచ్చువాడికి, సుశీలికి, సదాచారవంతుడికి నమస్కారం.

**అతీతాయ భవిష్యాయ వర్తమానాయ తే నమః ।**
**సువర్చసే చ వీర్యాయ శూరాయ హ్యజితాయ చ ॥34॥**

**వరదాయ వరేణ్యాయ పురుషాయ మహాత్మనే ।**
**నమో భూతాయ భవ్యాయ మహతే చాభయాయ చ ॥35॥**

భూతభవిష్యద్వర్తమానకాలస్వరూపుడికి నమస్కారం. కాంతిస్వరూపుడికి, వీర్యవంతుడికి, మహాశూరుడికి, అపజయరహితుడికి నమస్కారం. వరదుడికి, వరేణ్యుడికి, మహాపురుషుడికి, మహాత్ముడికి, భూతమయుడికి, భవ్యుడికి, మహత్స్వరూపుడికి, అభయరూపుడికి నమస్కారం.

**జరాసిద్ధ నమస్తుభ్యమయసే వరదాయ చ ।**
**అధరే మహతే చైవ నమః సస్తుపతాయ చ ॥36॥**

నిత్యయౌవనుడికి, సువర్ణరూపుడికి, వరదుడికి వందనం. అఘోరరూపుడు, మహత్స్వరూపుడు అయినవాడికి నమస్కారం. నిద్రితప్రాణులస్వామికి నమస్కారం.

**నమశ్చేంద్రియపత్రాణాం లేలిహానాయ స్రగ్విణే ।**
**విశ్వాయ విశ్వరూపాయ విశ్వతః శిరసే నమః ॥37॥**

**సర్వతః పాణిపాదాయ రుద్రాయాప్రతిమాయ చ ।**
**నమో హవ్యాయ కవ్యాయ హవ్యవాహాయ వై నమః ॥38॥**

ఇంద్రియాలనే పత్రాలను ఆస్వాదించే వానికి, హారాలు ధరించేవానికి నమస్కారం. విశ్వుడికి, విశ్వరూపుడికి, అన్నివైపుల శిరస్సులుగలవానికి నమస్కారం. అన్నివైపులచేతులు, పాదాలుగలవానికి పోలికలేనివాడైన రుద్రుడికి నమస్కారం. హవ్యరూపుడికి, కవ్యరూపుడికి(పితరులకు అర్పించే పదార్థాలు) హవ్యవాహనుడైనవానికి (అగ్నిరూపుడు) నమస్కారం.

**నమః సిద్ధాయ మేధ్యాయ ఇష్టాయేజ్యాపరాయ చ ।**
**సువీరాయ సుఘోరాయ అక్షోభ్యక్షోభణాయ చ ॥39॥**

**సుప్రజాయ సుమేధ్యాయ దీప్తాయ భాస్కరాయ చ ।**
**నమో బుద్ధాయ శుద్ధాయ విస్తృతాయ మతాయ చ ॥40॥**

సిద్ధరూపుడికి, పవిత్రుడికి, యజ్ఞరూపుడికి, యజ్ఞపరాయణుడికి నమస్కారం. మహావీరుడికి, మహాఘోరుడికి, అక్షోభ్యుడయ్యూ క్షోభకుకారణమైనవానికి నమస్కారం. సుప్రజుడైనవానికి, గొప్పమేధావి అయినవానికి, ప్రకాశవంతుడికి, సూర్యుడైనవానికి, బుద్ధి, శుద్ధి అయినవానికి, విస్తారుడైనవానికి, ఇష్టుడైనవాడికి నమస్కారం.

**నమః స్థూలాయ సూక్ష్మాయ దృశ్యాదృశ్యాయ సర్వశః ।**
**వర్షతే జ్వలతే చైవ వాయవే శిశిరాయ చ ॥41॥**

**నమస్తే వక్రకేశాయ ఊరువక్షఃశిఖాయ చ ।**
**నమోనమః సువర్ణాయ తపనీయనిభాయ చ ॥42॥**

స్థూలరూపుడు, సూక్ష్మస్వరూపుడు, అన్నివైపుల కన్పించియు కన్పించనివానికి నమస్కారం. వర్షమూ, తాపమూ, వాయువూ, శిశిరమూ అయినవానికి నమస్కారం. వక్రమైన కేశాలుకలిగినవాడికి, పొడవైన ఊరువులు, విశాలమైన వక్షఃస్థలమూ, పెద్దదైన శిఖయుగలవానికి నమస్కారం. హేమవర్ణుడు, అగ్నితో సమానమైన కాంతిగలవాడు అయిన శివుడికి నమస్కారం.

**విరూపాక్షాయ లింగాయ పింగళాయ మహౌజసే ।**
**వృష్టిఘ్నాయ నమశ్చైవ నమః సౌమ్యేక్షణాయ చ ॥43॥**

విరూపాలైన(మూడు) కన్నులుగలవానికి, లింగరూపుడికి, పింగళవర్ణుడికి, గొప్పకాంతిమంతుడికి, వర్షనాశకుడికి, అనుగ్రహదృష్టిగలవానికి నమస్కారం. నమస్కారం.

**నమో ధూమ్రాయ శ్వేతాయ కృష్ణాయ లోహితాయ చ ।**
**పిశితాయ పిశంగాయ పీతాయ చ నిషంగిణే ॥44॥**

**నమస్తే సవిశేషాయ నిర్విశేషాయ వై నమః ।**
**నమ ఈజ్యాయ పూజ్యాయ ఉపజీవ్యాయ వై నమః ॥45॥**

ధూమ్రమమూ, శ్వేతమూ, కృష్ణమూ, లోహితమూ, పిశితమూ, పిశంగమూ, పీతమూ అయిన అన్ని వర్ణములుగలవానికి, ధనుర్ధారికి నమస్కారం. సవిశేషుడికి, విశేషరహితుడుకి నమస్కారం. సర్వస్వదానయోగ్యునికి, పూజనీయుడికి, ఉపజీవి అయినవానికి నమస్కారం.

**నమ క్షేమ్యాయ వృద్ధాయ వత్సలాయ నమోనమః ।**
**నమో భూతాయ సత్యాయ సత్యాసత్యాయ వై నమః ॥46॥**

**నమో వై పద్మవర్ణాయ మృత్యుఘ్నాయ చ మృత్యవే ।**
**నమో గౌరాయ శ్యామాయ కద్రవే లోహితాయ చ ॥47॥**

క్షేమ్యుడైనవాడికి, మహావృద్ధుడికి, వాత్సల్యస్వభావుడికి నమస్కారం. ప్రాణిమయుడికి, సత్యస్వరూపుడికి మరియు సత్యమూ అసత్యమూ అయినవానికి నమస్కారం. పద్మప్రకాశుడికి, మరణనాశకుడికి, మృత్యుస్వరూపుడికి నమస్కారం. గౌరవర్ణుడికి, శ్యామలవర్ణుడికి, పిశంగవర్ణుడికి, లోహితవర్ణుడికి నమస్కారం.

**మహాసంధ్యాభ్రవర్ణాయ చారుదీప్తాయ దీక్షిణే ।**
**నమః కమలహస్తాయ దిగ్వాసాయ కపర్దినే ॥48॥**

**అప్రమాణాయ సర్వాయ అవ్యయాయామరాయ చ ।**
**నమో రూపాయ గంధాయ శాశ్వతాయాక్షతాయ చ ॥49॥**

గొప్పదైన సంధ్యాకాలంలో ఆకాశంయొక్క వర్ణంతో సమానమైన వర్ణంగలవాడికి, సుందరమైన కాంతిగలవాడికి, దీక్షల్ని ప్రదానంచేయువాడికి, పద్మహస్తుడికి, దిక్కులే (శూన్యమే) నివాసస్థలమైనవాడికి, జటాజూటంగలవాడికి నమస్కారం. ప్రమాణరహితుడికి, సమస్తమూ ఆతడే అయినవాడికి, మార్పులేనివాడికి, మరణరహితుడికి నమస్కారం. రూపముగలవానికి, గంధభరితునకు, శాశ్వతునకు, క్షతిలేనివానికి నమస్కారం.

**పురస్తాత్ బృంహతే చైవ విభ్రాంతాయ కృతాయ చ ।**
**దుర్గమాయ మహేశాయ క్రోధాయ కపిలాయ చ ॥50॥**

**తర్క్యాతర్క్యశరీరాయ బలినే రంహసాయ చ ।**
**సికత్యాయ ప్రవాహ్యాయ స్థితాయ ప్రసృతాయ చ ॥51॥**

ప్రాణులపాలనపోషణకర్తకు, విశేషమైన భ్రమకలిగినవానికి, కర్మస్వరూపుడికి, దుర్గముడికి, మహేశ్వరుడికి, క్రోధమూర్తికి, కపిలుడికి, చర్మలకు లొంగి లొంగని దేహంగలవానికి, బలవంతుడికి, వేగరూపుడికి, ఇసుకతోకూడిన భూమికిక్రిందగలదేవుడికి, జలప్రవాహస్వరూపుడికి, స్థిరుడైనవాడికి, వ్యాపకుడికి నమస్కారం.

**సుమేధసే కులాలాయ నమస్తే శశిఖండినే ।**
**చిత్రాయ చిత్రవేషాయ చిత్రవర్ణాయ మేధసే ॥52॥**

సుబుద్ధికి, పృథ్వియొక్క లాలన పాలన చేయువాడికి, చంద్రకళాధరుడికి, చిత్రరూపుడికి, విచిత్రవేషాలు ధరించేవాడికి, విచిత్రవర్ణాలుగలవాడికి, బుద్ధిమంతుడికి నమస్కారం.

**చేకితానాయ తుష్టాయ నమస్తే నిహితాయ చ ।**
**నమః క్షాంతాయ దాంతాయ వజ్రసంహననాయ చ ॥53॥**

విశిష్టజ్ఞానికి, సంతుష్టుడైనవాడికి, మిక్కిలి హితకారికి నమస్కారం. క్షమాశీలికి, ఇంద్రియజయుడికి, వజ్రసమానమైన దెబ్బతీయువాడికి నమస్కారం.

**రక్షోఘ్నాయ విషఘ్నాయ శితికంఠోర్ధ్వమన్యవే ।**
**లేలిహాయ కృతాంతాయ తిగ్మాయుధధరాయ చ ॥54॥**

**ప్రమోదాయ సమ్మోదాయ యతివేద్యాయ తే నమః ।**
**అనామయాయ సర్వాయ మహాకాలాయ వై నమః ॥55॥**

రాక్షసవినాశకారికి, విషాన్ని శమింపజేయువాడికి, నల్లనికంఠం గలవాడికి, క్రుద్ధుడయ్యీ, సౌమ్యుడైనవాడికి, సర్వస్వరూపుడికి, యమధర్మరాజస్వరూపుడికి, తీక్ష్ణమైన ఆయుధాలు ధరించువాడికి, ఆనందమయుడికి, సమ్మోద రూపుడికి, మునులచే తెలియబడువాడికి, ఆరోగ్యవంతుడికి, సర్వస్వరూపుడికి, మహాకాలుడికి నమస్కారం.

**ప్రణవప్రణవేశాయ భగనేత్రాంతకాయ చ ।**
**మృగవ్యాధాయ దక్షాయ దక్షయజ్ఞాంతకాయ చ ॥56॥**

**సర్వభూతాత్మభూతాయ సర్వేశాతిశయాయ చ ।**
**పురఘ్నాయ సుశస్త్రాయ ధన్వినేఽథ పరశ్వధే ॥57॥**

**పూషదంతవినాశాయ భగనేత్రాంతకాయ చ ।**
**కామదాయ వరిష్ఠాయ కామాంగదహనాయ చ ॥58॥**

**రంగే కరాలవక్త్రాయ నాగేంద్రవదనాయ చ ।**
**దైత్యానామంతకేశాయ దైత్యాక్రందకరాయ చ ॥59॥**

**హిమఘ్నాయ చ తీక్ష్ణాయ ఆర్ద్రచర్మధరాయ చ ।**
**శ్మశానరతినిత్యాయ నమోఽస్తూల్ముఖధారిణే ॥60॥**

ఓంకారరూపుడు, ఓంకారేశ్వరుడు అయినవాడికి, భగుడు అనే రాక్షసుడి నేత్రాల్ని నశింపజేసినవాడికి, మృగవ్యాధుడికి, దక్షుడికి, దక్షుడియజ్ఞాంతకారికి, సర్వప్రాణులయొక్క ఆత్మభూతుడికి, సర్వేశ్వరుడికి, అతిశయమైన స్వరూపుడికి, త్రిపురారికి, గొప్పఆయుధాలు గలవాడికి, ధనుర్ధారికి, పరశువు ధరించినవాడికి, దక్షయజ్ఞంలో పూషుడనుపేరుగల దేవతయొక్క దంతాలను నశింపజేసినవాడికి, భగనామదేవతయొక్క నేత్రాల్ని నశింపజేసినవాడికి, కోరికల్ని తీర్చువాడికి, శ్రేష్ఠుడికి, మన్మథశరీరాన్ని నశింపజేసినవాడికి, యుద్ధరంగంలో భయంకరమైన ముఖము కలవాడికి, గజాననరూపుడికి, రాక్షసాంతకుడికి, దైత్యులయొక్క ఆక్రందనలకారకుడికి, శీతలనివారణకారికి, తీక్ష్ణస్వభావుడికి, ఆర్ద్రమైనచర్మధారికి, నిత్యమూ శ్మశానవిషయంలో ఇష్టంగలవాడికి, విభూతిని ధరించువాడికి నమస్కారం.

**నమస్తే ప్రాణపాలాయ ముండమాలాధరాయ చ ।**
**ప్రహీణశోకైర్వివిధైర్భూతైః పరివృతాయ చ ॥61॥**

**నరనారీశరీరాయ దేవ్యాః ప్రియకరాయ చ ।**
**జటినే ముండినే చైవ వ్యాలయజ్ఞోపవీతినే ॥62॥**

**నమోఽస్తు నృత్యశీలాయ ఉపనృత్యప్రియాయ చ ।**
**మన్యవే గీతశీలాయ మునిభిర్గాయతే నమః ॥63॥**

ప్రాణప్రియులైన భక్తపాలకుడు, కపాలధారి, నశించినశోకంగల నానావిధ భూతాలమధ్య నివసించువాడు, అర్ధనారీశ్వరరూపుడు, పార్వతీదేవికి ప్రియకారి, జటాధరుడు, కేశరహితశిరస్సుగలవాడు, పాము జందెంగాగలవాడు, నాట్యశీలుడు, నృత్యప్రియుడు, క్రోధి, సంగీతప్రియుడు, యోగులచే స్తుతింపబడువాడవైన శివుడవైన నీకు నమస్కారం.

**కటంకటాయ తిగ్మాయ అప్రియాయ ప్రియాయ చ ।**
**విభీషణాయ భీష్మాయ భగప్రమథనాయ చ ॥64॥**

**సిద్ధసంగానుగీతాయ మహాభాగాయ వై నమః ।**
**నమో ముక్తాట్టహాసాయ క్ష్వేడితాస్ఫోటితాయ చ ॥65॥**

హస్తాలతో తలల్ని నరుకువాడు అనగా సింహస్వరూపుడికి, తీక్ష్ణుడైనవాడికి, ప్రియుడు మరియు అప్రియుడూ అయినవాడికి, అతిభయంకరుడు, ప్రచండుడూ, అయినవాడికి, భగనాశకుడికి, సిద్ధులసమూహం ద్వారా నిత్యం గీతాలాపనగల మహాభాగుడికి నమస్కారం. విముక్తరూపమైన అట్టహాసం చేయువాడికి, క్రోధావస్థలో సింహంవలె గర్జించువాడికి నమస్కారం.

**నర్దతే కూర్దతే చైవ నమః ప్రముదితాత్మనే ।**
**నమో మృడాయ శ్వసతే ధావతేఽధిష్ఠితే నమః ॥66॥**

**ధ్యాయతే జృంభతే చైవ రుదతే ద్రవతే నమః ।**
**వల్గతే క్రీడతే చైవ లంబోదరశరీరిణే ॥67॥**

తీవ్రమైన నాదం చేయువాడికి, త్రవ్వెడివాడికి, ప్రసన్నమైన ఆత్మగలవాడికి నమస్కారం. శ్వాసించువాడికి, పరుగెత్తువాడికి, సర్వాన్ని తనలో అధిష్ఠింపచేసుకున్నవాడికి, మృడుడికి నమస్కారం. ధ్యానించువాడికి, జపంచేసేవాడికి, విలపించువాడికి, పరుగెత్తెడివాడికి నమస్కారం. ఎగిరిగంతులు వేయువాడికి, క్రీడించువాడికి, పెద్దపొట్టతో కూడిన దేహంగలవాడికి నమస్కారం.

**నమోఽకృత్యాయ కృత్యాయ ముండాయ వికటాయ చ ।**
**నమ ఉన్మత్తదేహాయ కింకిణీకాయ వై నమః ॥68॥**

**నమో వికృతవేషాయ క్రూరాయామర్షణాయ చ ।**
**అప్రమేయాయ గోప్త్రే చ దీప్తాయానిర్గుణాయ చ ॥69॥**

విధినిషేధరూపంగా కృత్యాకృత్యస్వరూపుడికి, ముండుడికి, వికటుడుకి నమస్కారం. ఉన్మాదశరీరుడికి, చిన్నగంటలతో అలంకరింపబడిన దేహుడికి నమస్కారం. వికృతమైన వేషం గలవాడికి, క్రౌర్యరూపుడికి, కోపరూపుడికి, మిక్కిలి రక్షణకల్గించువాడికి, దీప్తిమంతుడికి, సగుణస్వరూపుడికి నమస్కారం.

**వామప్రియాయ వామాయ చూడామణిధరాయ చ ।**
**నమస్తోకాయ తనవే గుణైరప్రమితాయ చ ॥70॥**

ఎడమభాగంలో పార్వతీదేవితో ప్రకాశించువాడికి, సుందరుడైనవాడికి, చూడామణిని ధరించినవాడికి, బాలరూపుడికి, గుణసంపన్నుడికి నమస్కారం.

**నమో గుణ్యాయ గుహ్యాయ అగమ్యగమనాయ చ ।**
**లోకధాత్రీ త్వియం భూమిః పాదౌ సజ్జనసేవితా ॥71॥**

**సర్వేషాం సిద్ధియోగానామధిష్ఠానం తవోదరమ్ ।**
**మధ్యేఽంతరిక్షం విస్తీర్ణం తారాగణవిభూషితమ్ ॥72॥**

**స్వాతేః పథఇవాభాతి శ్రీమాన్ హారస్తవోరసి ।**
**దిశో దశభుజాస్తుభ్యం కేయూరాంగదభూషితాః ॥73॥**

గుణవంతుడికి, నిగూఢుడికి, తెలియనిగమనం గలవాడికి నమస్కారం. సదాచారులైన జనులచే సేవింపబడిన నీరెండు పాదాలు లోకమాత అయిన ఈభూమికి సమానం. సమస్తసిద్ధులకు, యోగాలకు ఆధారమైన మధ్యలోగల నీ ఉదరం తారాసమూహాలతో అలంకరింపబడిన విశాలమైన విశ్వానికి సమానం. నీయొక్క వక్షఃస్థలమందలి శోభాయమానాలైన శ్రీయుతాలైన హారాలు తారాసమూహాల మార్గం మాదిరిగా ప్రకాశిస్తున్నాయి. కేయూర, అంగద అలంకారాలతో అలంకరింపబడిన నీ పదిభుజాలు పదిదిక్కులతో సమానం.

**విస్తీర్ణపరిణాహశ్చ నీలాంజనచయోపమః ।**
**కంఠస్తే శోభతే శ్రీమాన్ హేమసూత్రవిభూషితః ॥74॥**

**దంష్ట్రా కరాలం దుర్ధర్షమనౌపమ్యం ముఖం తథా ।**
**పద్మమాలాకృతోష్ణీషం శిరో ద్యౌః శోభతేఽధికమ్ ॥75॥**

కాటుకతో పోల్చదగినది పొడవుమరియు విశాలమైనది అయిన నీగళం శోభాకరమైన బంగారుసూత్రాలతో ప్రకాశిస్తున్నది. నీముఖం నిరుపమం. వక్రమైన కోరలవల్ల భయాన్ని కల్గిస్తున్నది. కమలాలమాలలతో అలంకరింపబడిన తలపాగగల నీశిరస్సు ఆకాశంమాదిరిగా అందంగా ఉంది.

**దీప్తిః సూర్యే వసుశ్చంద్రే స్థైర్యం శైలేఽనిలే బలమ్ ।**
**ఔష్ణ్యమగ్నౌ తథా శైత్యమప్సు శబ్దోఽంబరే తథా ॥76॥**

**అక్షరాంతరనిష్పందాత్ గుణానేతాన్ విదుర్బుధాః ।**
**జపో జప్యో మహాదేవో మహాయోగో మహేశ్వరః ॥77॥**

**పురేశయో గుహావాసీ ఖేచరో రజనీచరః ।**
**తపోనిధిర్గుహగురుర్నందనో నందవర్ధనః ॥78॥**

**హయశీర్షా పయోధాతా విధాతా భూతభావనః ।**
**బోద్ధవ్యో బోధితా నేతా దుర్ధర్షో దుష్ప్రకంపనః ॥79॥**

**బృహద్రథో భీమకర్మా బృహత్కీర్తిర్ధనంజయః ।**
**ఘంటాప్రియో ధ్వజీ ఛత్రీ పినాకీ ధ్వజినీపతిః ॥80॥**

**కవచీ పట్టిశీ ఖడ్గీ ధనుర్హస్తః పరశ్వధీ ।**
**అఘస్మరోఽనఘః శూరో దేవరాజోఽరిమర్దనః ॥81॥**

సూర్యుడిలోని కాంతి, చంద్రుడిలోని ప్రకాశం, పర్వతంలోని స్థిరత్వం, వాయువులోని శక్తి, అగ్నిలోని వేడి, నీటిలోని చల్లదనం, ఆకాశంలోని శబ్దగుణం, ఇవి అన్నీ అవినాశకారుడైన శివుడియొక్క అల్పాంశాలతో ఉత్పన్నాలు అవుతున్నాయని పండితులు గుర్తిస్తారు.

జపరూపుడు, జప్యుడైనవాడు, మహాదేవుడు, మహాయోగుడు, మహేశ్వరుడు, పురేశయుడు, గుహలో నివసించువాడు, ఆకాశంలో పయనించువాడు, రాత్రించరుడు, తపోనిధి, కార్తికేయుడితండ్రి, ఆనందరూపుడు, ఆనందాన్ని అధికంచేయువాడు, హయ(గుర్రం)శీర్షుడు, జలధరుడు, విధాత, భూతభావనుడు, తెలియదగినవాడు, బోధించువాడు, నాయకుడు, పరాజయం లేనివాడు, చెడుకంపనాలు గలవాడు, పెద్దరథం గలవాడు, భయంకరమైన కర్మచేయువాడు, గొప్పకీర్తిగలవాడు, ధనంజయుడు, ఘంటానాదప్రియుడు, ధ్వజంగలవాడు, గొడుగు గలవాడు, పినాకహస్తుడు, సేనాపతి, కవచం గలవాడు, పట్టిశ అనే ఆయుధాన్ని ధరించినవాడు, ఖడ్గం కలవాడు, ధనుస్సు

హస్తమందున్నవాడు, పరశువు ధరించినవాడు, అందరి పాపాల్ని గుర్తెరిగినవాడు, పాపరహితుడు, శూరుడు, దేవతలకు రాజైనవాడు, శత్రునాశకుడు అనే ఈపేర్లన్నీ నీవే స్వామి.

**త్వాం ప్రసాద్య పురాస్మాభిర్ద్విషంతో నిహతా యుధి ।**
**అగ్నిః సదార్ణవాంభస్త్వం పిబన్నపి న తుష్యసే ॥82॥**

పూర్వం ఈపేర్లన్నీ జపించి నిన్ను ప్రసన్నుణ్ణి చేసుకుని మేము యుద్ధంలో శత్రువుల్ని సంహరించాం. అగ్నిరూపుడవైన నీవు ఎల్లప్పుడూ సాగరజలాన్ని త్రాగుతూ కూడా తృప్తుడవు కావు.

**క్రోధాకారః ప్రసన్నాత్మా కామదః కామగః ప్రియః ।**
**బ్రహ్మచారీ చాగాధశ్చ బ్రహ్మణ్యః శిష్టపూజితః ॥83॥**

**దేవానామక్షయః కోశస్త్వయా యజ్ఞః ప్రకల్పితః ।**
**హవ్యం తవేదం వహతి వేదోక్తం హవ్యవాహనః ॥84॥**

**ప్రీతే త్వయి మహాదేవ వయం ప్రీతా భవామహే ।**

క్రోధాకారుడవు, ప్రసన్నాత్ముడవు, కోరికల్ని ఇచ్చువాడవు, కామచరుడవు, అందరికి ఇష్టుడవు, బ్రహ్మచారివి, దుస్తరుడవు, బ్రహ్మవేత్తవు, సజ్జనపూజితుడవు, దేవతలకు తక్కువగాని నిధివి, యజ్ఞకల్పుడవు. నీకై అగ్నిదేవుడు వేదోక్తప్రకారం తనలో వేయబడిన హవ్యాన్ని కలిగియున్నాడు. నీవు సంతోషించినవాడివి అయితే మేమూ సంతోషించినవాళ్లం కాగలం.

**భవానీశోఽనాదిమాం స్త్వం చ సర్వలోకానాం త్వం బ్రహ్మకర్తాదిసర్గః ।**
**సాంఖ్యాః ప్రకృతేః పరమం త్వాం విదిత్వా క్షీణధ్యానాస్త్వామమృత్యుం విశంతి ॥85**

నీవు పార్వతీపతివి. నీవు అనాదివి. సమస్తలోకాల్ని సృష్టించిన బ్రహ్మవు. నీవే ఆదిసృష్టికర్తవు. సాంఖ్యదర్శనకారులు నిన్ను ప్రకృతికంటె పరుడిగా (భిన్నుడిగా) తెలుసుకుని, ధ్యానించి, ధ్యానానంతరం మృత్యురహితులై నిన్ను పొందుతున్నారు.

**యోగాచ్చ త్వాం ధ్యాయినో నిత్యసిద్ధం జ్ఞాత్వా యోగాన్ సంత్యజంతే పునస్తాన్ ।**
**యే చాప్యన్యే త్వాం ప్రసన్నా విశుద్ధాః స్వకర్మభిస్తే దివ్యభోగా భవంతి ॥86॥**

యోగంవల్ల నిన్ను ధ్యానించువారు నీవు నిత్యసిద్ధుడవని తెలిసినవారు యోగాల్ని విడిచి పెట్టుతున్నారు. ఇతరులైనవారు కొందరు విశుద్ధులు, ప్రసన్నులు అయి వారి ఉత్తమకర్మలద్వారా నిన్నుతెలిసి దివ్యభోగాల్ని పొందుతున్నారు.

**అప్రసంఖ్యేయ తత్త్వస్య యథా విద్మః స్వశక్తితః ।**
**కీర్తితం తవ మాహాత్మ్యమపారస్య మహాత్మనః ॥87॥**

**శివో నో భవ సర్వత్ర యోఽసి సోఽసి నమోస్తు తే ।**

మా శక్తిననుసరించి నీ తత్త్వం అసంఖ్యేయమని(లెక్కింపరానిదని) తెలిసికొన్నాం. మహాత్ముడవైన నీమహత్తు అపారమని కీర్తింపబడింది. మాకు అన్నిచోట్ల కళ్యాణకారివి కమ్ము. ఎట్లుంటివో అట్లే ఉండు. నీకు నమస్కారం.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**య ఇదం కీర్తయేద్భక్త్యా బ్రహ్మా నారాయణస్తవమ్ ॥88॥**

**శ్రావయేద్వా ద్విజాన్ విద్వాన్ శృణుయాద్వా సమాహితః ।**
**అశ్వమేధాయుతం కృత్వా యత్ఫలం తదవాప్నుయాత్ ॥89॥**

భక్తితో ఈ బ్రహ్మచేత మరియు శ్రీహరిచేత చేయబడిన ఈస్తుతిని పఠించినవాడు, విన్నవాడు, పండితులైన బ్రాహ్మణులకు వినిపించినవాడు పదివేల అశ్వమేధయజ్ఞాలు నిర్వహించిన ఫలితాన్ని పొందుతాడు.

**పాపాచారోఽపి యో మర్త్యః శృణయాచ్ఛివసన్నిధౌ ।**
**జపేద్వాపి వినిర్ముక్తో బ్రహ్మలోకం సగచ్ఛతి ॥90॥**

పాపకర్ముడైన మానవుడుకూడా శివుడిసన్నిధిలో ఈస్తవాన్ని విన్నా, చదివినా(జపించినా) పాపవిముక్తుడై బ్రహ్మలోకానికి వెళతాడు.

**శ్రాద్ధే వా దైవికే కార్యే యజ్ఞే వావభృథాంతికే ।**
**కీర్తయేద్వా సతాం మధ్యే సయాతి బ్రహ్మణోఽంతికమ్ ॥91॥**

శ్రాద్ధకర్మలలో, దేవకార్యాలలో, సజ్జనులమధ్యలో, యజ్ఞంలో, అవభృథస్నానం తర్వాత ఈ స్తవాన్ని పఠించినవాడు బ్రహ్మపదం పొందుతాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే బ్రహ్మవిష్ణుస్తుతిర్నామైకవింశోఽధ్యాయః ॥ 21 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని బ్రహ్మవిష్ణుస్తుతి అనే ఇరవై ఒకటవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## ద్వావింశతితమోఽధ్యాయః - ఇరవై రెండవ అధ్యాయం

## రుద్రోత్పత్తివర్ణనమ్ - రుద్రోత్పత్తివర్ణనం

**సూత ఉవాచ -** సూతమహర్షి పలికాడు.

**అత్యంతావనతౌ దృష్ట్వా మధుపింగాయతేక్షణః ।**
**ప్రహృష్ట వదనోఽత్యర్థమభవత్సత్యకీర్తనాత్ ॥1॥**

**ఉమాపతిర్విరూపాక్షో దక్షయజ్ఞవినాశనః ।**
**పినాకీ ఖండపరశుః సుప్రీతస్తు త్రిలోచనః ॥2॥**

బ్రహ్మావిష్ణువులు మిక్కిలి వినమ్రులై ఉండడాన్ని చూచి, తేనెవలె పింగళవర్ణనేత్రాలు గల శివుడు వారి సత్యస్తుతికి సంతోషించినవాడైనాడు. పార్వతీపతి, ముక్కంటి, దక్షాధ్వరధ్వంశి, పినాకి, ఖండపరశువు అయిన విరూపాక్షుడు మిక్కిలి సంప్రీతుడైనాడు.

**తతః సభగవాన్ దేవః శ్రుత్వా వాగమృతం తయోః ।**
**జానన్నపి మహాదేవః క్రీడాపూర్వమథాబ్రవీత్ ॥3॥**

**కౌ భవంతౌ మహాత్మానౌ పరస్పరహితైషిణౌ ।**
**సమేతావంబుజాభాక్షావస్మిన్ ఘోరే మహాప్లవే ॥4॥**

తర్వాత భగవంతుడైన శివుడు వారియొక్క అమృతాయమానాలైన వాక్కులు విని వారిని తెలిసికూడా లీలార్థంగా ఇలా పలికాడు. ఒకరికొరకు హితాన్ని కోరుకునేవారు, పద్మనేత్రులు, మహానుభావులు అయిన మీరెవ్వరు? ఇలా భయంకరమైన ఈమహాసాగరంలో ఎందుకున్నారు?

**తావూచతుర్మహాత్మానౌ సన్నిరీక్ష్య పరస్పరమ్ ।**
**భగవన్ కిం తు యత్తేఽద్య న విజ్ఞాతం త్వయా విభో ॥5॥**

**విభో రుద్ర మహామాయ ఇచ్ఛయా వాం కృతౌ త్వయా ।**

మహాత్ములైన బ్రహ్మావిష్ణువులు ఒకరినొకరు బాగాచూచుకుని శివుణ్ణి ఉద్దేశించి పలికారు. నీకు తెలియంది ఏదియు లేదు. ఓ ప్రభూ! ఓ రుద్రా! ఓ మహామాయతో నిండియున్నవాడా! నీవే మాయిద్దరిని కోరికతో సృష్టించావు.

**తయోర్వచనం శ్రుత్వా అభినంద్యాభిమాన్య చ ॥6॥**
**ఉవాచ భగవాన్ దేవో మధురం శ్లక్ష్ణయా గిరా ।**

వారియిద్దరి మాటలు విని అభిమానించి, అభినందించి శివభగవానుడు తియ్యని మాటలు పలికినాడు.

**భో భో హిరణ్యగర్భ త్వాం త్వాం చ కృష్ణ బ్రవీమ్యహమ్ ॥7॥**
**ప్రీతోఽహమనయా భక్త్యా శాశ్వతాక్షరయుక్తయా ।**

ఓ హిరణ్యగర్భుడవైన బ్రహ్మా! ఓ శ్రీహరీ! నేను మీయొక్క శాశ్వతమూ, సుదృఢమూ అయిన భక్తితో సంతుష్టిచెందాను.

**భవంతౌ హృదయస్యాస్య మమ హృద్యతరావుభౌ ॥8॥**

**యువాభ్యాం కిం దదామ్యద్య వరాణాం వరమీప్సితమ్ ।**
**అథోవాచ మహాభాగో విష్ణుర్భవమిదం వచః ॥9॥**

**సర్వం మమ కృతం దేవ పరితుష్టోఽసి మే యది ।**
**త్వయి మే సుప్రతిష్ఠా తు భక్తిర్భవతు శంకర ॥10॥**

నా యీ మనసులో మీయిద్దరూ ఇష్టులుగా నిలుస్తారు. ఇప్పుడు మీయిద్దరికి వరాలకే వరమైన అనగా సర్వశ్రేష్ఠమైన యిష్టమైన ఏ వరాన్ని ఇవ్వను? అపుడు మహాత్ముడైన విష్ణువు భవుణ్ణి గూర్చి ఈ మాటలు పలికాడు. ఓదేవాధిదేవా! శివా! సమస్తం మాకు ప్రసాదించావు. మాకై నీవు ప్రసన్నుడివి అయినట్లైతే నీయందు మాకు సుస్థిరమైన భక్తిని ప్రసాదించు.

**ఏవముక్తస్తు విజ్ఞాయ సంభావయత కేశవమ్ ।**
**ప్రదదౌ చ మహాదేవో భక్తిం నిజపదాంబుజే ॥11॥**

ఈవిధంగా శ్రీహరి పలుకగా శివుడు ఆతడిని సంభావించి తనపాదపద్మాలమీద స్థిరమైన భక్తిని కలిగించినాడు.

**భవాన్ సర్వస్య లోకస్య కర్తా త్వమధిదైవతమ్ ।**
**తదేవం స్వస్తి తే వత్స గమిష్యామ్యంబుజేక్షణ ॥12॥**

**ఏవముక్త్వా తు భగవాన్ బ్రహ్మాణం చాపి శంకరః ।**
**అనుగృహ్యాఽస్పృశద్దేవో బ్రహ్మాణం పరమేశ్వరః ॥13॥**

**కరాభ్యాం సుశుభాభ్యాం చ ప్రాహ హృష్టతరః స్వయమ్ ।**

తర్వాత శంకరభగవానుడు ఇలా పలికాడు. ఓ కమలనయనా! నీవు సమస్తప్రపంచానికి సృష్టికారకుడవు. నీవే ఈ లోకాన్ని పాలించే దేవుడవు. ఈ విధంగా ఓ పుత్రా! నీకు కళ్యాణం జరుగుతుంది. నేను అంతర్ధానం చెందుతున్నాను. శివుడు మంగళకరాలైన తనరెండుకరాలతో అనుగ్రహపూర్వకంగా బ్రహ్మను తాకి సంతుష్టుడై పలికాడు.

**మత్సమస్త్వం న సందేహో వత్స భక్తస్య మే భవాన్ ॥14॥**

**స్వస్త్యస్తు తే గమిష్యామి సంజ్ఞా భవతు సువ్రత ।**
**ఏవముక్త్వా తు భగవాన్ తతోఽన్తర్ధానమీశ్వరః ॥15॥**

నీవు నాకు సమానుడవు. ఇందులో సందేహంలేదు. ఓ పుత్రా! నీవు నా భక్తుడవు. నీకు శుభమగుగాక! నీకు సత్యజ్ఞానం(యథార్థజ్ఞానం) ప్రాప్తిస్తుంది. ఈవిధంగా పలికి ఈశ్వరభగవానుడు అదృశ్యమయినాడు.

**గతవాన్ గణపో దేవః సర్వదేవనమస్కృతః ।**
**అవాప్య సంజ్ఞాం గోవిందాత్ పద్మయోనిః పితామహః ॥16॥**

**ప్రజాః స్రష్టుమనాశ్చక్రే తప ఉగ్రం పితామహః ।**

సమస్తదేవతలచేత వంద్యమానుడైన, గణపతి అయిన శివుడు వెళ్లిపోగా పద్మగర్భుడైన బ్రహ్మ శ్రీహరినుండి సూచనననుపొంది, ప్రజల్ని సృష్టించు బుద్ధితో భయంకరమైన తపస్సు ఆచరించినాడు.

**తస్యైవం తప్యమానస్య న కించిత్సమవర్తత ॥17॥**

**తతో దీర్ఘేణ కాలేన దుఃఖాత్క్రోధో హ్యజాయత ।**
**క్రోధావిష్టస్య నేత్రాభ్యాం పాపతన్నశ్రుబిందవః ॥18॥**

ఆవిధంగా తపస్సుచేస్తున్న బ్రహ్మకు చాలా కాలానికికూడా ఏవిధమైన ఫలితం కలుగలేదు. అందుకు కలిగిన దుఃఖంనుంచి క్రోధం పుట్టింది. కోపయుక్తాలైన నేత్రాలనుంచి బాష్పజలం జారిపడింది.

**తతస్తేభ్యోఽశ్రుబిందుభ్యో వాతపిత్తకఫాత్మకాః ।**
**మహాభాగా మహాసత్త్వాః స్వస్తికైరప్యలంకృతాః ॥19॥**

**ప్రకీర్ణకేశాః సర్పాస్తే ప్రాదుర్భూతా మహావిషాః ।**
**సర్పాన్ తానగ్రజాన్ దృష్ట్వా బ్రహ్మాత్మానమనిందయత్ ॥20॥**

**అహో ధిక్ తపసో మహ్యం ఫలమీదృశకం యది ।**
**లోకవైనాశికీ జజ్ఞే ఆదావేవ ప్రజా మమ ॥21॥**

తర్వాత ఆ కన్నీటి చుక్కలనుంచి వాతపిత్తకఫాత్మకాలు, మహాత్ములు, మహాబలులు, మహావిషధరులు, చెదిరిన జుత్తుగలవారు, స్వస్తికచిహ్నాధారులు అయిన పాములు ఉద్భవించాయి. ప్రథమసృష్టి అయిన ఆ పాముల్ని చూచి బ్రహ్మ తనను తాను నిందించుకున్నాడు. అహో నాయొక్క తపస్సుకు ఇటువంటి ఫలితం దక్కింది కాబట్టి ఇది నాకు ధిక్కారమే. ఆదిలోనే లోకవినాశకులైన ఈ పాములు పుట్టినాయి.

**తస్య తీవ్రాభవన్మూర్ఛా క్రోధామర్షసముద్భవా ।**
**మూర్ఛాభిపరితాపేన జహౌ ప్రాణాన్ ప్రజాపతిః ॥22॥**

తర్వాత కోపం, ఈర్ష్యల కారణంగా బ్రహ్మకు అధికమైన మూర్ఛ కలిగింది. ఆ మూర్ఛవల్ల కలిగిన బాధవల్ల బ్రహ్మ ప్రాణాల్ని విడిచాడు.

**తస్యాప్రతిమవీర్యస్య దేహాత్కారుణ్యపూర్వకమ్ ।**
**అథైకాదశ తే రుద్రా రుదంతోఽభ్యక్రమం స్తథా ॥23॥**

**రోదనాత్ఖలు రుద్రత్వం తేషు వై సమజాయత ।**
**యే రుద్రాస్తే ఖలు ప్రాణాః యే ప్రాణాస్తే తదాత్మకాః ॥24॥**

**ప్రాణాః ప్రాణవతాం జ్ఞేయాః సర్వభూతేష్వవస్థితాః ।**

అసమానవీర్యవంతుడైన ఆబ్రహ్మ దేహంనుంచి జాలిగా ఏడ్చుచున్న పదకొండుమంది రుద్రులు వెలువడ్డారు. రోదిస్తున్న కారణంగా వారు రుద్రులయ్యారు. వారందరూ రుద్రరూపులే. వారందరూ ప్రణవస్వరూపులు. వారందరూ మహారుద్రుడికి ఆత్మస్వరూపులు. ప్రాణవంతులకు ప్రాణాలవి. సర్వప్రాణులందు ఇవి నిలిచి ఉన్నాయి.

**అత్యుగ్రస్య మహత్వస్య సాధురాచరితస్య చ ॥25॥**

**ప్రాణాన్ తస్య దదౌ భూయస్త్రిశూలీ నీలలోహితః ।**

భయంకరమైన తపస్సుచేయువాడు, గొప్పచరిత్రగలవాడు, మహాభాగుడు అయిన బ్రహ్మకు నీలలోహితుడైన శివుడు ప్రాణదానం చేశాడు.

**లబ్ధ్వాసూన్ భగవాన్ బ్రహ్మా దేవదేవముమాపతిమ్ ॥26॥**

**ప్రణమ్య సంస్థితోఽపశ్యద్ గాయత్ర్యా విశ్వమీశ్వరమ్ ।**
**సర్వలోకమయం దేవం దృష్ట్వా స్తుత్వా పితామహః ॥27॥**

**తతో విస్మయమాపన్నః ప్రణిపత్య ముహుర్ముహుః ।**
**ఉవాచ వచనం శర్వం సద్యాదిత్వం కథం విభో ॥28॥**

బ్రహ్మ బ్రతికి దేవదేవుడైన శివుడికి నమస్కరించి నిలిచి గ్రాయత్రీమంత్రంతో సర్వేశ్వరుణ్ణి దర్శించాడు. లోకేశ్వరుణ్ణి చూచి స్తుతించి బ్రహ్మ ఆశ్చర్యచకితుడై మాటిమాటికి నమస్కరిస్తూ ఓ ప్రభూ! నీవు సద్యోజాతాదిరూపాల్ని ఎట్లు ధరించావని పలికాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే రుద్రోత్పత్తివర్ణనం నామ ద్వావింశతితమోఽధ్యాయః ॥ 22 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని రుద్రోత్పత్తివర్ణనమనే ఇరవై రెండవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## త్రయోవింశోఽధ్యాయః - ఇరవై మూడవ అధ్యాయం

## వివిధకల్పవర్ణనమ్ - వివిధకల్పవర్ణనం

**సూత ఉవాచ** - సూతమహర్షి చెప్పాడు.

**తస్య తద్వచనం శ్రుత్వా బ్రహ్మణో భగవాన్ భవః ।**
**బ్రహ్మరూపీ ప్రబోధార్థం బ్రహ్మాణం ప్రాహ సస్మితమ్ ॥1॥**

బ్రహ్మదేవుడియొక్క ఆమాటను పరబ్రహ్మస్వరూపుడు, భగవంతుడైన ఈశ్వరుడు బ్రహ్మకు జ్ఞానోదయం కలిగించడానికి నవ్వుతూ పలికాడు.

**శ్వేతకల్పే యదా హ్యాసీదహమేవ తదాభవమ్ ।**
**శ్వేతోష్ణీషః శ్వేతమాల్యః శ్వేతాంబరధరః సితః ॥2॥**

**శ్వేతాస్థిః శ్వేతరోమా చ శ్వేతాసృక్ శ్వేతలోహితః ।**
**తేన నామ్నా చ విఖ్యాతః శ్వేతకల్పస్తదాహ్యసౌ ॥3॥**

శ్వేతకల్పంలో నేను ఉన్నాను. నా తలపాగ తెల్లనిది. నేను ధరించిన మాలలు తెల్లనివి. నేను తెల్లటి వస్త్రాలు మరియు తెల్లటి రంగుగలవాడిని. ఎముకలు తెల్లనివి. రోమాలు తెల్లనివి. రక్తమూ తెల్లనిది. చర్మం తెల్లనిది. అందుచేతనే ఆకల్పం శ్వేతకల్పమనే పేరుతో ప్రసిద్ధి పొందింది.

**మత్ప్రసూతా చ దేవేశా శ్వేతాంగా శ్వేతలోహితా ।**
**శ్వేతవర్ణా తదా హ్యాసీద్ గాయత్రీ బ్రహ్మసంజ్ఞితా ॥4॥**

దేవేశ్వరి, తెల్లని అవయవాలు కలది, తెల్లని చర్మము గలది, తెల్లని రంగు గలది అయిన గాయత్రి నానుండి పుట్టింది. ఆమె "బ్రహ్మం" అనే పేరుగలది.

**తస్మాదహం చ దేవేశ త్వయా గుహ్యేన వై పునః ।**
**విజ్ఞాతః స్వేన తపసా సద్యోజాతత్వమాగతః ॥5॥**

ఓ దేవదేవా! నీవు నన్ను గుహ్యుడనని భావించావు. నేను నా తపోబలంతో సద్యోజాతరూపాన్ని ధరించాను.

**సద్యోజాతేతి బ్రహ్మైతద్ గుహ్యం చైతత్ప్రకీర్తితమ్ ।**
**తస్మాద్ గుహ్యత్వమాపన్నం యే వేత్స్యంతి ద్విజాతయః ॥6॥**

**మత్సమీపం గమిష్యంతి పునరావృత్తిదుర్లభమ్ ।**

సద్యోజాతుడను ఈపేరు గుహ్యుడగు పరబ్రహ్మానికి చెందింది. అందువలన నా గుహ్యత్వాన్ని తెలిసిన ద్విజాతివారు(బ్రహ్మక్షత్రవైశ్యులు) మరల తిరిగిరాలేని నా సాన్నిధ్యాన్ని (ముక్తిని) పొందగలరు.

**యదా చైవ పునస్త్వాసీల్లోహితో నామ నామతః ॥7॥**

**మత్కృతేన చ వర్ణేన కల్పో వై లోహితః స్మృతః ।**
**తదా లోహితమాంసాస్థిలోహితక్షీరసంభవా ॥8॥**

**లోహితాక్షీ స్తనవతీ గాయత్రీ గౌః ప్రకీర్తితా ।**

తదుపరి 'లోహిత' అనే పేరుగల కల్పం వచ్చింది. అప్పటి నావర్ణం లోహితమయినందున ఆ కల్పానికి లోహితమనే పేరు కలిగింది. అప్పుడు గాయత్రీదేవి ఎర్రటి మాంసం, ఎముకలు, క్షీరము, కన్నులు, పాలిండ్లుగల ధేనువుగా నిలిచింది.

**తతోఽస్యా లోహితత్వేన వర్ణస్య చ విపర్యయాత్ ॥9॥**

**వామత్వాచ్చైవ దేవస్య వామదేవత్వమాగతః ।**
**తత్రాపి చ మహాసత్త్వ త్వయాహం నియతాత్మనా ॥10॥**

**విజ్ఞాతః స్వేన యోగేన తస్మిన్ వర్ణాంతరే స్థితః ।**
**తతశ్చ వామదేవేతి ఖ్యాతిం యాతోఽస్మి భూతలే ॥11॥**

తర్వాత ఆమెయొక్క రంగు ఎర్రగా మారినందువల్ల ఆ వ్యతిరేకం కారణంగా నాకు వామదేవత్వం కలిగింది. ఓ మహాశక్తిశాలీ! నేను వేరే రంగును కలిగిఉన్నప్పుడుకూడా నీవు నీయోగబలంతో నన్ను గుర్తించావు. అందువలన ఈభూమిలో 'వామదేవుడ'నే ప్రసిద్ధిని పొందాను.

**యే చాపి వామదేవత్వం జ్ఞాస్యంతీహ ద్విజాతయః ।**
**రుద్రలోకం గమిష్యంతి పునరావృత్తిదుర్లభమ్ ॥12॥**

బ్రహ్మక్షత్రవైశ్యులలో ఎవరు నావామదేవత్వాన్ని తెలుసుకొంటారో వారు జన్మమరణముక్తి పొంది మరల తిరిగిరాని రుద్రలోకాన్ని పొందుతారు.

**యదాహం పునరేవాహ పీతవర్ణో యుగక్రమాత్ ।**
**మత్కృతేన చ నామ్నా వై పీతకల్పోఽభవత్తదా ॥13॥**

తర్వాతి యుగక్రమంలో నేను పీతవర్ణుడనయ్యాను. నారంగునుబట్టి అది పీతకల్పం అయ్యింది.

**మత్ప్రసూతా చ దేవేశీ పీతాంగీ పీతలోహితా ।**
**పీతవర్ణా తదా హ్యాసీత్ గాయత్రీ బ్రహ్మసంజ్ఞికా ॥14॥**

నానుంచి జన్మించిన బ్రహ్మనామ్ని అయిన దేవేశ్వరి పచ్చని అవయవాలు, పచ్చని చర్మమూ, పచ్చనివర్ణమూగలది అయ్యింది.

**తత్రాపి చ మహాసత్త్వ యోగయుక్తేన చేతసా ।**
**యస్మాదహం తైర్విజ్ఞాతో యోగతత్పరమానసైః ॥15॥**

**తత్ర తత్పురుషత్వేన విజ్ఞాతోఽహం త్వయా పునః ।**
**తస్మాత్తత్పురుషత్వం వై మమైతత్కనకాండజ ॥16॥**

ఓ మహాబలుడా! ఈ కల్పంలోకూడా యోగపరాయణబుద్ధులైన ఆ ద్విజాతులు యోగబుద్ధితో నన్ను గుర్తించారు. నీవుకూడా ఇక్కడ నన్ను తత్పురుషత్వరూపంలో తెలుసుకున్నావు. ఓ స్వర్ణగర్భుడా! ఆ కారణంగా నేను తత్పురుషనామున్ణి అయ్యాను.

**యే మాం రుద్రం చ రుద్రాణీం గాయత్రీం వేదమాతరమ్ ।**
**వేత్స్యంతి తపసా యుక్తా విమలా బ్రహ్మసంగతా ॥17॥**

**రుద్రలోకం గమిష్యంతి పునరావృత్తిదుర్లభమ్ ।**

రుద్రుణ్ణిఅయిన నన్ను వేదమాత, రుద్రాణి అయిన గాయత్రిని తపస్సుతో తెలిసినవారు, స్వచ్ఛమైనవారు, బ్రహ్మపరాయణులైనవారు ఆ ద్విజులు శాశ్వతస్థితిగల రుద్రలోకాన్ని పొందుతారు.

**యదాహం పునరేవాసం కృష్ణవర్ణో భయానకః ॥18॥**

**మత్కృతేన చ వర్ణేన సంకల్పః కృష్ణ ఉచ్యతే ।**
**తత్రాహం కాలసంకాశః కాలో లోకప్రకాలకః ॥19॥**

**విజ్ఞాతోఽహం త్వయా బ్రహ్మన్ ఘోరే ఘోరపరాక్రమః ।**
**మత్ప్రసూతా చ గాయత్రీ కృష్ణాంగీ కృష్ణలోహితా ॥20॥**

**కృష్ణరూపా చ దేవేశ తదాసీత్ బ్రహ్మసంజ్ఞికా ।**

మరలా నేను భీతావహమైన నల్లటివర్ణాన్ని పొందాను. నా ఆ రంగుకారణంగా అది కృష్ణకల్పం అయ్యింది. ఓ బ్రహ్మా! ఈ కల్పంలో కూడా నీవు కాలసదృశుణ్ణి, కాలరూపుణ్ణి, లోకాలకు మహాకాలుణ్ణి, ఘోరమైన విక్రమంగల ఘోరుణ్ణిఅయిన నన్ను గుర్తించావు. నా పుత్రిక అయిన బ్రహ్మానామకగాయత్రి కూడా నల్లని అవయవాలు గలదిగా, కృష్ణచర్మం గలదిగా కృష్ణరూపగా అయ్యింది.

**తస్మాత్ ఘోరత్వమాపన్నం యే మాం వేత్స్యంతి భూతలే ॥21॥**

**తేషామఘోరః శాంతశ్చ భవిష్యామ్యహమవ్యయః ।**
**పునశ్చ విశ్వరూపత్వం యదా బ్రహ్మన్ మమాభవత్ ॥22॥**

**తదాప్యహం త్వయా జ్ఞాతః పరమేణ సమాధినా ।**
**విశ్వరూపా చ సంవృత్తా గాయత్రీ లోకధారిణీ ॥23॥**

ఈ భూమిలో ఎవరు ఘోరత్వాన్ని పొందిన నన్ను తెలుసుకుంటారో వారికై నేను అఘోరుణ్ణి అనగా సౌమ్యుణ్ణి, శాంతుణ్ణి, అవ్యయుణ్ణి(శాశ్వతుణ్ణి) కాగలుగుతున్నాను. నేను మరల విశ్వరూపత్వాన్ని పొందాను. ఓ బ్రహ్మా! అప్పుడుకూడా నీవు ఉత్కృష్టమైన సమాధివల్ల నన్ను తెలుసుకున్నావు. సమస్తలోకాల్ని ధరించే గాయత్రీదేవికూడా విశ్వరూప అయ్యింది.(అనేకవర్ణాలుగలది)

**తస్మిన్ విశ్వత్వమాపన్నం యే మాం వేత్స్యంతి భూతలే ।**
**తేషాం విశ్వశ్చ సౌమ్యశ్చ భవిష్యామి సదైవ హి ॥24॥**

ఈభూలోకంలో విశ్వరూపాన్ని పొందిన నన్ను ఎవరు తెలుసుకుంటారో వారికై నేను ఎల్లప్పుడూ విశ్వరూపుణ్ణి, సౌమ్యుణ్ణి కాగలను.

**యస్మాచ్చ విశ్వరూపో వై కల్పోఽహం సముదాహృతః ।**
**విశ్వరూపా తథా చేయం సావిత్రీ సముదాహృతా ॥25॥**

**సర్వరూపా తథా చేమే సంవృత్తా మమ పుత్రకాః ।**
**చత్వారస్తే మయా ఖ్యాతాః పుత్రా వై లోకసమ్మతాః ॥26॥**

ఈ కారణంగా ఈ కల్పం విశ్వరూపకల్పంగాను నేను విశ్వరూపుడుగాను, ఈ గాయత్రీదేవికూడా విశ్వరూపగాను అయినాము. ఈ నాలుగు రూపాలచేత నా పుత్రులు ఈ పేర్లలో అనగా సద్యోజాతాదులుగ ప్రసిద్ధులైనారు. వారు సర్వవర్ణులు. లోకసమ్మతులు.

**యస్మాచ్చ సర్వవర్ణత్వం ప్రజానాం చ ప్రభవిష్యతి ।**
**సర్వభక్షా చ మేధ్యా చ వర్ణతశ్చ భవిష్యతి ॥27॥**

**మోక్షో ధర్మస్తథార్థశ్చ కామశ్చేతి చతుష్టయమ్ ।**
**యస్మాద్వేదాశ్చ వేద్యం చ చతుర్ధా వై భవిష్యతి ॥28॥**

**భూతగ్రామాశ్చ చత్వార ఆశ్రమాశ్చ తథైవ చ ।**
**ధర్మస్య పాదాశ్చత్వారశ్చత్వారో మమ పుత్రకాః ॥29॥**

అందువల్లనే ప్రజలకు పలువిధాలైన రంగులు కలుగుతాయి. ఈ గాయత్రిదేవి సర్వపాపాల్ని భక్షించేది అనగా నశింపజేసేది అవుతుంది. అట్లే యజ్ఞయోగ్య అవుతుంది. అట్లే సర్వవర్ణ అవడంవల్ల చాతుర్వర్ణ్యవ్యవస్థ ప్రజలకు ఏర్పడగలుగుతుంది. అట్లే ధర్మార్థకామమోక్షాలనే నాలుగు పురుషార్థాలు మరియు నాల్గువేదాలు ఏర్పడగలుగుతాయి. ప్రాణిసమూహాలుకూడా నాలుగువిధాలుగా పుట్టగలుగుతాయి. అట్లే ఆశ్రమాలుకూడా నాలుగే (బ్రహ్మచర్యాదులు) ధర్మానికికూడా నాలుగుపాదాలు. (దయాదానాదులు) ఇట్లే నాకుమారులుకూడా నలుగురే.

**తస్మాచ్చతుర్యుగావస్థం జగద్వై సచరాచరమ్ ।**
**చతుర్ధావస్థితశ్చైవ చతుష్పదో భవిష్యతి ॥30॥**

ఈవిధంగా స్థావరజంగమాత్మకమైన ఈ లోకం నాలుగుయుగాలలో కాగలదు. ఈ లోకంకూడా నాలుగుపాదాలతో కూడినది కాగలదు.

**భూర్లోకోఽథ భువర్లోకః స్వర్లోకశ్చ మహస్తథా ।**
**జనస్తపశ్చ సత్యం చ విష్ణులోకస్తతః పరమ్ ॥31॥**

భూర్లోకం, భువర్లోకం, స్వర్లోకం, మహర్లోకం, తపోలోకం, జనలోకం, సత్యలోకం అనే ఈలోకాలపైన పరమపదమైన విష్ణులోకమున్నది.

**అష్టాక్షరస్థితో లోకః స్థానే స్థానే తదక్షరమ్ ।**
**భూర్భువః స్వర్మహశ్చైవ పాదాశ్చత్వార ఏవ చ ॥32॥**

**భూర్లోకః ప్రథమః పాదో భువర్లోకస్తతః పరమ్ ।**
**స్వర్లోకో వై తృతీయశ్చ చతుర్థస్తు మహస్తథా ॥33॥**

ఈ ఎనిమిది లోకాలు ఎనిమిది అక్షరాలతో తమ తమ స్థానాలలో నిలిచి ఉన్నాయి. భూలోకం, భువర్లోకం, స్వర్గలోకం, మహర్లోకం అనే ఈ నాలుగు లోకాలు నాలుగుపాదాలుగా నిలిచి ఉన్నాయి. వీటిలో భూలోకం మొదటిది. భువర్లోకం రెండవది. స్వర్గలోకం మూడవది. మహర్లోకం నాల్గవది.

**పంచమస్తు జనస్తత్ర షష్ఠశ్చ తప ఉచ్యతే ।**
**సత్యం తు సప్తమో లోకో హ్యపునర్భవగామినామ్ ॥34॥**

అయిదోది జనలోకం. ఆరోది తపోలోకం. ఏడోది పునర్జన్మనివ్వనట్టి సత్యలోకం.

**విష్ణులోకః స్మృతం స్థానం పునరావృత్తిదుర్లభమ్ ।**
**స్కాందభౌమం తథా స్థానం సర్వసిద్ధిసమన్వితమ్ ॥35॥**

అక్కడకు వెళ్లినవారు తిరిగిరానట్టి శాశ్వతస్థానమైనది విష్ణులోకం.దీని తర్వాత స్కందలోకం, దీని తర్వాత పార్వతీలోకాలున్నాయి. అవి సర్వవిధసిద్ధులతో కూడినట్టివి.

**రుద్రలోకం స్మృతస్తస్మాత్పదం తద్యోగినాం శుభమ్ ।**
**నిర్మమా నిరహంకారాః కామక్రోధవివర్జితాః ॥36॥**

**ద్రక్ష్యంతి తద్ ద్విజాః యుక్తా ధ్యానతత్పరమానసాః ।**

ఆపైని రుద్రలోకం ఉంది. ఆమార్గం యోగులకు శుభకరమయినది. నిర్మములు, నిరహంకారులు, కామక్రోధాదిదుర్గుణాల్ని విడిచి పెట్టినవారు, యోగతత్పరహృదయులు అయిన ద్విజులు ఈ రుద్రలోకాన్ని చూడగలుగుతారు.

**యస్మాచ్చతుష్పదా హ్యేషా త్వయా దృష్టా సరస్వతీ ॥37॥**

**పాదాంతం విష్ణులోకం వై కౌమారం శాంతముత్తమమ్ ।**
**ఔమం మాహేశ్వరం చైవ తస్మాద్ దృష్టా చతుష్పదా ॥38॥**

ఈ గాయత్రి నాల్గుపాదాలుగలదై నీకు కన్పించింది. ఆమెయొక్క నాలుగుపాదాల రూపంలో చరమపాదరూపమైన విష్ణులోకం, శాంతం మరియు ఉత్తమం అయిన స్కందలోకం, పార్వతీలోకం, రుద్రలోకం స్థితినిపొంది ఉన్నాయి.

**తస్మాత్తు పశవః సర్వే భవిష్యతి చతుష్పదాః ।**
**తతశ్చైషాం భవిష్యంతి చత్వారస్తే పయోధరాః ॥39॥**

**సోమశ్చ మంత్రసంయుక్తో యస్మాన్మమ ముఖాచ్చ్యుతః ।**
**జీవః ప్రాణభృతాం బ్రహ్మన్ పునః పీతస్తనాః స్మృతాః ॥40॥**

ధేనురూపమైన గాయత్రీదేవి నాలుగుపాదాలు కలిగిఉన్నందున పశువులన్నియు నాల్గుపాదాలుకలవి కాగలవు. అట్లే నాలుగుస్తనాలు కలవి అవుతాయి. నానోటినుంచి మంత్రయుక్తుడైన చంద్రుడు వెలువడినాడు. ఓ బ్రహ్మ! ప్రాణుల ప్రాణం ఆ పీతస్తనాలే.

**తస్మాత్సోమమయం చైవ అమృతం జీవసంజ్ఞితమ్ ।**
**చతుష్పదా భవిష్యంతి శ్వేతత్వం చాస్య తేన తత్ ॥41॥**

ఈకారణంగా సోమమయమైన అమృతం జీవసంజ్ఞిగా మారింది. ఆ పాలకు తెలుపురంగు ఆ సోమరూపత్వ కారణంగా ఏర్పడగలుగుతుంది. ఈగుణాలవల్ల అవి చతుష్పాదులు కాగలవు.

**యస్మాచ్చైవ క్రియా భూత్వా ద్విపదా చ మహేశ్వరీ ।**
**దృష్టా పునస్తథైవైషా సావిత్రీ లోకభావినీ ॥42॥**

**తస్మాచ్చ ద్విపదాః సర్వే ద్విస్తనాశ్చ నరాః శుభాః ।**
**తస్మాచ్చేయమజా భూత్వా సర్వవర్ణా మహేశ్వరీ ॥43॥**

**యా వై దృష్టా మహాసత్త్వా సర్వభూతధరా త్వయా ।**
**తస్మాచ్చ విశ్వరూపత్వం ప్రజానాం వై భవిష్యతి ॥44॥**

నీవు నాల్గుపాదాలతో చూచిన లోకభావిని, మహేశ్వరి అయిన గాయత్రి తర్వాత రెండుపాదాలు కలిగినదై ఉన్నది. అందువల్ల ద్విపాదులైన సర్వజంతువులు అనగా నరులు(స్త్రీపురుషులు) రెండుస్తనాలు కలవారు కాగలిగారు. సమస్తప్రాణుల్ని ధరించునట్టిది, గొప్పశక్తియుక్త అయిన ఆమెను నీవు చూశావు. ఆ మహేశ్వరి 'అజా'గా మారి సర్వవర్ణమయమైన విశ్వరూపధారణ చేస్తున్నది. కావుననే ప్రజలు అనేకవర్ణాలుగలవారుగా అవుతారు.

**అజశ్చైవ మహాతేజాః విశ్వరూపో భవిష్యతి ।**
**అమోఘరేతాః సర్వత్ర ముఖే చాస్య హుతాశనః ॥45॥**

**తస్మాత్సర్వగతో మేధ్యః పశురూపీ హుతాశనః ।**

గొప్పకాంతిమంతుడైన అజుడు విశ్వరూపుడవుతాడు. మహాశక్తియుక్తరేతస్సుగల ఆతడి ముఖంలో అగ్ని ప్రకాశిస్తాడు. ఈకారణంగా సర్వవ్యాపియు, పశురూపుడు అయిన అగ్ని పవిత్రుడు కాగలుగుతాడు.

**తపసా భావితాత్మానో యే మాం ద్రక్ష్యంతి వై ద్విజాః ॥46॥**

**ఈశిత్వే చ వశిత్వే చ సర్వగం సర్వతః స్థితమ్ ।**
**రజస్తమోభ్యాం నిర్ముక్తాస్త్యక్త్వా మానుష్యకం వపుః ॥47॥**

**మత్సమీపముపేష్యంతి పునరావృత్తిదుర్లభమ్ ।**

తపఃసంపన్నులైన ద్విజులు ఈశ్వరత్వం, యోగసిద్ధిత్వం, సర్వవ్యాపిత్వం, సర్వత్రస్థితిత్వంగల నన్ను చూస్తారు. తమోగుణం, రజోగుణం విడిచినవారై మానవశరీరాన్ని వదలినవారై పునరావృత్తిదుర్లభమైన నా సన్నిధిని పొందుతారు.

**ఇత్యేవముక్తో భగవాన్ బ్రహ్మా రుద్రేణ వై ద్విజాః ॥48॥**

**ప్రణమ్య ప్రయతో భూత్వా పునరాహ పితామహః ।**
**య ఏవం భగవాన్ విద్వాన్ గాయత్ర్యా వై మహేశ్వరమ్ ॥49॥**

**విశ్వాత్మానం హి సర్వం త్వాం గాయత్ర్యాస్తవ చేశ్వర ।**
**తస్య దేహి పరం స్థానం తథాస్త్వితి చ సోఽబ్రవీత్ ॥50॥**

సూతుడు చెప్పుతున్నాడు. ఓ ద్విజులారా! మహాశివుడు ఈవిధంగా పలికినవాడు కాగా బ్రహ్మభగవానుడు శివుడికి నమస్కరించి వినమ్రుడై మరల ఇట్లు పలికాడు. "ఓ భగవంతుడా! విద్వాంసుడవు, సర్వవ్యాపివి, విశ్వాత్ముడవు, మహేశ్వరుడవు అయిన నీవు గాయత్రీదేవితో అన్నిచోట్ల ఉండడాన్ని చూచాను. ఓ ఈశ్వరా! నేను గాయత్రియొక్క ఆరాధన చేస్తాను. అందుకై నాకు పరమపదాన్ని ప్రసాదించు" అని బ్రహ్మపలకగా "అట్లే అగుగాక" అని శివుడు పలికాడు.

**తస్మాద్విద్వాన్ హి విశ్వత్వమస్యాశ్చాస్య మహాత్మనః ।**
**స యాతి బ్రహ్మసాయుజ్యం వచనాత్ బ్రహ్మణః ప్రభో ॥51॥**

శివుడు బ్రహ్మకు చెప్పిన విధంగా ఏ విద్వాంసుడు గాయత్రియొక్క మరియు శివుడియొక్క విశ్వరూపత్వాన్ని తెలుసుకుంటాడో ఆతడు బ్రహ్మసాయుజ్యాన్ని పొందుతాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే వివిధకల్పవర్ణనం నామ త్రయోవింశోఽధ్యాయః ॥ 23 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని వివిధకల్పవర్ణనమనే ఇరవై మూడవ అధ్యాయం సమాప్తం.

## చతుర్వింశతితమోఽధ్యాయః - ఇరవై నాల్గవ అధ్యాయం

## వివిధవ్యాసావతారవర్ణనమ్ - వ్యాసుని వివిధావతారాలను వర్ణించుట

**శ్రుత్వైవమఖిలం బ్రహ్మా రుద్రేణ పరిభాషితమ్ ।**
**పునః ప్రణమ్య దేవేశం రుద్రమాహ ప్రజాపతిః ॥1॥**

రుద్రుడు చెప్పిన దానిని పూర్తిగా విన్న బ్రహ్మదేవుడు, శివుడికి నమస్కరించి మరల ఇలా పలికాడు.

**భగవన్ దేవదేవేశ విశ్వరూప మహేశ్వర ।**
**ఉమాధవ మహాదేవ నమో లోకాభివందిత ॥2॥**

ఓ భగవంతుడా! ఓ దేవేశ్వరా! ఓ విశ్వరూపుడా! ఓ మహేశ్వరా! ఓ పార్వతీపతీ! ఓ మహాదేవా! ఓ లోకవందితుడా! నీకు నమస్కారం.

**విశ్వరూప మహాభాగ కస్మిన్ కాలే మహేశ్వర ।**
**యా ఇమాస్తే మహాదేవ తనవో లోకవందితాః ॥3॥**

**కస్యాం వా యుగసంభూత్యాం ద్రక్ష్యంతీహ ద్విజాతయః ।**

ఓ విశ్వరూపుడా! ఓ మహాభాగుడా! ఓ మహేశ్వరా! ఓ మహాదేవా! లోకపూజితాలైన నీ సద్యోజాతాదిశరీరాలు ఏకాలంలో, ఏయుగంలో ద్విజులైన మానవులు చూడగలుగుతారు?

**కేన వా తపసా దేవ ధ్యానయోగేన కేన వా ॥4॥**

**నమస్తే వై మహాదేవ శక్యో ద్రష్టుం ద్విజాతిభిః ।**
**తస్య తద్వచనం శ్రుత్వా శర్వః సంప్రేక్ష్య తం పురః ॥5॥**

**స్మయన్ ప్రాహ మహాదేవో ఋుగ్యజుఃసామసంభవః ।**

ఓ దేవా! నీకు నమస్కారం. ఏవిధమైన తపస్సుతో, ఏవిధమైన ధ్యానయోగంతో ద్విజులు నిన్ను చూడడానికి సమర్థులవుతారు? బ్రహ్మయొక్క ఆమాటను విని, తనముందున్న ఆతడిని బాగా చూచి ఋుగ్వేదం, యజుర్వేదం, సామవేదంనుంచి పుట్టిన మహాదేవుడైన శర్వుడు నవ్వుతూ పలికాడు.

**శ్రీ భగవాన్ ఉవాచ -** శ్రీ శివభగవానుడు పలికాడు.

**తపసా నైవ వృత్తేన దానధర్మఫలేన చ ॥6॥**

**న తీర్థఫలయోగేన క్రతుభిర్వాప్తదక్షిణైః ।**
**న వేదాధ్యయనైర్వాపి న విత్తేన న వేదనైః ॥7॥**

**న శక్యం మానవైర్ద్రష్టుమృతే ధ్యానాదహం త్విహ ।**

తపస్సు, సదాచారాలు, దానాలు, ధర్మఫలం, తీర్థయాత్రలు, యోగం, పుష్కలంగా దక్షిణలిచ్చిన యాగాలు, వేదాధ్యయనం, ధనం, శాస్త్రజ్ఞానం– ఇవి మానవులకు నా దర్శనానికి యోగ్యాలు కావు. కేవలం ధ్యానాన్ని విడిచి నన్ను చూడలేరు.

**సప్తమే చైవ వారాహే తతస్తస్మిన్ పితామహ ॥8॥**

**కల్పేశ్వరోఽథ భగవాన్ సర్వలోకప్రకాశనః ।**
**మనుర్వైవస్వతశ్చైవ తవ పౌత్రో భవిష్యతి ॥9॥**

ఓ బ్రహ్మా! వారాహకల్పంలో ఏడవమన్వంతరంలో సమస్తలోకాల్ని ఉజ్జ్వలింపజేయువాడైన వైవస్వతమనువు నీకు పౌత్రుడు కాగలుగుతాడు.

**తదా చతుర్యుగావస్థే తస్మిన్ కల్పే యుగాంతికే ।**
**అనుగ్రహార్థం లోకానాం బ్రాహ్మణానాం హితాయ చ ॥10॥**

**ఉత్పత్స్యామి తదా బ్రహ్మన్ పునరస్మిన్ యుగాంతికే ।**
**యుగప్రవృత్త్యా చ తదా తస్మిన్ చ ప్రథమే యుగే ॥11॥**

**ద్వాపరే ప్రథమే బ్రహ్మన్ యదా వ్యాసః స్వయం ప్రభుః ।**
**తదాహం బ్రాహ్మణార్థాయ కలౌ తస్మిన్ యుగాంతికే ॥12॥**

**భవిష్యామి శిఖాయుక్తః శ్వేతో నామ మహామునిః ।**
**హిమవచ్ఛిఖరే రమ్యే ఛాగలే పర్వతోత్తమే ॥13॥**

వరాహకల్పంలో నాల్గుయుగాలు గడచిన తర్వాత మొదటి ద్వాపరయుగంలో సర్వలోకాలపై అనుగ్రహంతో, బ్రాహ్మణుల శ్రేయస్సు కోసం నేను అవతరించగలుగుతాను. ఓ బ్రహ్మా! యుగప్రవృత్తిని అనుసరించి ప్రథమద్వాపరయుగాంతంలో పరబ్రహ్మ స్వయంగా వ్యాసుడు కాగలడు. అప్పుడు నేను బ్రాహ్మణహితంకోసం కలియుగంలో శిఖకలిగియుండి శ్వేతుడనుపేరుగల మహర్షినై పర్వతశ్రేష్ఠమైన హిమవత్పర్వతం యొక్క అందమైన ఛాగలశిఖరంపైన జన్మిస్తాను.

**తత్ర శిష్యాః శిఖాయుక్తాః భవిష్యతి తదా మమ ।**
**శ్వేతః శ్వేతశిఖశ్చైవ శ్వేతాస్యః శ్వేతలోహితః ॥14॥**

**చత్వారస్తు మహాత్మానో బ్రాహ్మణా వేదపారగాః ।**
**తతస్తే బ్రహ్మభూయిష్ఠా దృష్ట్వా బ్రహ్మగతిం పరామ్ ॥15॥**

**మత్సమీపం గమిష్యంతి ధ్యానయోగపరాయణాః ।**

నాకు అక్కడ శిఖతో కూడినవారు శ్వేతుడు, శ్వేతశిఖుడు, శ్వేతముఖుడు, శ్వేతలోహితుడుఅనే నలుగురు శిష్యులు కలుగుతారు. వారు మహాత్ములు, వేదపారంగతులైన బ్రాహ్మణులు. వారు బ్రహ్మపదార్థయిష్టులై పరమోత్కృష్టమైన బ్రహ్మగతిని చూచి నాసన్నిధిని పొందుతారు. వారందరూ ధ్యానయోగతత్పరులు.

**తతః పునర్యదా బ్రహ్మన్ ద్వితీయే ద్వాపరే ప్రభుః ॥16॥**

**ప్రజాపతిర్యదా వ్యాసః సద్యోనామ భవిష్యతి ।**
**తదా లోకహితార్థాయ సుతారో నామ నామతః ॥17॥**

**భవిష్యామి కలౌ తస్మిన్ శిష్యానుగ్రహకామ్యయా ।**

ఓ బ్రహ్మా! తర్వాత రెండవద్వాపరయుగంయొక్క చివరలో మరల 'సద్యుడు' అనే పేరుగల ప్రజాపతి వ్యాసుడు కాగలడు. తర్వాత కలియుగంలో నా శిష్యుల్ని అనుగ్రహించే కోరికతో, అట్లే లోకకళ్యాణార్థం 'సుతారుడ'నే పేరుగలవాడిగా అవతరిస్తాను.

**తత్రాపి మమ తే శిష్యా నామతః పరికీర్తితాః ॥18॥**

**దుందుభిః శతరూపశ్చ ఋచీకః కేతుమాంస్తదా ।**
**ప్రాప్యయోగం తథా ధ్యానం స్థాప్య బ్రహ్మ చ భూతలే ॥19॥**

**రుద్రలోకం గమిష్యంతి సహచారిత్వమేవ చ ।**

నాశిష్యులు దుందుభి, శతరూపుడు, ఋచీకుడు, కేతుమంతుడు అనే పేర్లతో పిలువబడతారు. వాళ్లు యోగాన్ని ధ్యానాన్ని పొంది భూలోకంలో బ్రహ్మజ్ఞానాన్ని స్థాపించి రుద్రలోకానికి వెళ్లగలరు. వారందరూ నాసహచరులవుతారు. (సన్నిధిలోఉంటారు)

**తృతీయే ద్వాపరే చైవ యదా వ్యాసస్తు భార్గవః ॥20॥**

**తదాప్యహం భవిష్యామి దమనస్తు యుగాంతికే ।**
**తత్రాపి చ భవిష్యంతి చత్వారో మమ పుత్రకాః ॥21॥**

**వికోశశ్చ వికేశశ్చ విపాశః శాపనాశనః ।**
**తేఽపి తేనైవ మార్గేణ యోగోక్తేన మహౌజసః ॥22॥**

**రుద్రలోకం గమిష్యంతి పునరావృత్తిదుర్లభమ్ ।**

మూడవద్వాపరయుగంయొక్క చివరలో 'భార్గవుడు' అనే పేరుగల వ్యాసుడు కలుగుతాడు. అప్పుడు నేను 'దమనుడు' అనే పేరుతో ఉంటాను. అప్పుడు కూడా వికోశుడు, వికేశుడు, విశాపుడు, శాపనాశనుడు అనే పేర్లతో

నాకు నలుగురు శిష్యులు కలుగుతారు. మహాకాంతిమంతులైనవాళ్లు పూర్వం చెప్పిన యోగమార్గంద్వారా పునరావృత్తిదుర్లభమైన రుద్రలోకాన్ని పొందుతారు.

**చతుర్థే ద్వాపరే చైవ యదా వ్యాసోఽంగిరాః స్మృతః ॥23॥**

**తదాప్యహం భవిష్యామి సుహోత్రో నామ నామతః ।**
**తత్రాపి మమ తే పుత్రాశ్చత్వారోఽపి తపోధనాః ॥24॥**

**ద్విజశ్రేష్ఠా భవిష్యంతి యోగాత్మానో దృఢవ్రతాః ।**
**సుముఖో దుర్ముఖశ్చైవ దుర్దరో దురితక్రమః ॥25॥**

నాల్గవద్వాపరాంతలో 'అంగిరుడు' అనే పేరుగల వ్యాసుడు ఉంటాడు. అప్పుడు నేను 'సుహోత్రుడ'నే పేరుతో అవతరిస్తాను. అప్పుడుకూడా నాకు తపోధనులైన నలుగురుపుత్రులు (శిష్యులు) కలుగుతారు. వాళ్లు బ్రాహ్మణశ్రేష్ఠులు. దృఢవ్రతులు. యోగాత్ములు. సుముఖుడు, దుర్ముఖుడు, దుర్దరుడు, దురితక్రముడు అనే వాళ్లు.

**ప్రాప్య యోగగతిం సూక్ష్మాం విమలా దిగ్ధకిల్బిషాః ।**
**తేపి తేనైవ మార్గేణ యోగయుక్తా మహౌజసః ॥26॥**

**రుద్రలోకం గమిష్యంతి పునరావృత్తిదుర్లభమ్ ।**

సూక్ష్మమైన యోగమార్గాన్ని పొంది మాలిన్యరహితులూ, దహింపబడిన పాపంగలవారు, మహాకాంతి మంతులూ, యోగాసక్తులూ అయినవాళ్లు పునరావృత్తిదుర్లభమైన రుద్రలోకాన్ని చేరుతారు.

**పంచమే ద్వాపరే చైవ వ్యాసస్తు సవితా యదా ॥27॥**

**తదా చాపి భవిష్యామి కంకోనామ మహాతపాః ।**
**అనుగ్రహార్థం లోకానాం యోగాత్మైక కళాగతిః ॥28॥**

**చత్వారస్తు మహాభాగా విమలాః శుద్ధయోనయః ।**
**శిష్యా మమ భవిష్యంతి యోగాత్మానో దృఢవ్రతాః ॥29॥**

**సనకః సనందనశ్చైవ ప్రభుర్యశ్చ సనాతనః ।**
**విభుః సనత్కుమారశ్చ నిర్మమా నిరహంకృతాః ॥30॥**

**మత్సమీపముపేష్యంతి పునరావృత్తిదుర్లభమ్ ।**

అయిదవ ద్వాపరం చివరలో 'సవితృడ'నే పేరుగలవాడు వ్యాసుడు అవుతాడు. అప్పుడు కూడా లోకాల్ని అనుగ్రహించటానికి యోగాత్ముడిని, ఏకకళాగతిగలవాడిని, మహాతపఃసంపన్నుణ్ణి అయిన నేను 'కంకు'డనే పేరుతో అవతరించగలను. అప్పుడు నాకు సనకసనందసనాతన సనత్కుమారులనే నలుగురు శిష్యులు కలుగుతారు.

వాళ్లందరూ మహాత్ములు, నిర్మలలు, దృఢమైనవ్రతదీక్షగలవారు, మమకారరహితులు, అహంకారశూన్యులు, పునర్జన్మరహితమైన నా సాన్నిధ్యాన్ని పొందుతారు.

**పరివర్తే పునః షష్ఠే మృత్యుర్వ్యాసో యదా విభుః ॥31॥**

**తదాప్యహం భవిష్యామి లోగాక్షిర్నామ నామతః ।**
**తత్రాపి మమ తే శిష్యా యోగాత్మానో దృఢవ్రతాః ॥32॥**

**భవిష్యంతి మహాభాగాశ్చత్వారో లోకసమ్మతాః ।**
**సుధామా విరజాశ్చైవ శంఖపాద్రజ ఏవ చ ॥33॥**

ఆరవద్వాపరాంతంలో మహావిభూతితో 'మృత్యువు'అనే పేరుతో వ్యాసుడు అవతరిస్తాడు. నేను అప్పుడు 'లోగాక్షి'అనే పేరుతో ఉండగలను. అప్పుడుకూడా నాకు నలుగురుశిష్యులు కలుగుతారు. సుధాముడు, విరజుడు, శంఖపాదుడు, రజుడు అయినవారు యోగాత్ములు. దృఢవ్రతులు. మహాత్ములు. లోకసమ్మతులు.

**యోగాత్మానో మహాత్మానః సర్వే వై దగ్ధకిల్బిషాః ।**
**తేఽపి తేనైవ మార్గేణ ధ్యానయోగసమన్వితాః ॥34॥**

**మత్సమీపం గమిష్యంతి పునరావృత్తి దుర్లభమ్ ।**

యోగాత్ములు, మహాత్ములు, నశించినపాపంగలవారు, ధ్యానయోగయుక్తులు అయినవారందరూ యోగమార్గంద్వారా నాసన్నిధిని పొందుతారు. అది శాశ్వతమైన ముక్తిస్థానం. పునర్జన్మ లేనట్టిది.

**సప్తమే పరివర్తే తు తదా వ్యాసః శతక్రతుః ॥35॥**

**విభునామా మహాతేజాః ప్రథితః పూర్వజన్మని ।**
**తదాప్యహం భవిష్యామి కలౌ తస్మిన్ యుగాంతికే ॥36॥**

**జైగీషవ్యో విభుః ఖ్యాతః సర్వేషాం యోగినాం వరః ।**
**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి యుగే తథా ॥37॥**

**సారస్వతశ్చ మేఘశ్చ మేఘవాహః సువాహనః ।**
**తేఽపి తేనైవ మార్గేణ ధ్యానయోగపరాయణాః ॥38॥**

**గమిష్యంతి మహాత్మానో రుద్రలోకం నిరామయమ్ ।**

పూర్వజన్మలో విభుడనే పేరుతో ప్రసిద్ధుడైన మహాకాంతిమంతుడైన వాడే 'శతక్రతువ'నే పేర ఏడవద్వాపరంచివర వ్యాసుడవుతాడు. అప్పుడు ఆ కలియుగంలోప్రభువును, సమస్తయోగిశ్రేష్ఠుడనైన నేను 'జైగీషవ్యుడ'నే పేర ప్రసిద్ధి చెందుతాను.

ఈయుగంలో కూడా నాకు సారస్వతుడు, మేఘుడు, మేఘవాహుడు, సువాహనుడు అనే పేర్లుగల నలుగురు శిష్యులు కలుగుతారు. మహాత్ములు ధ్యానయోగతత్పరులైన వారు ఆయోగమార్గంద్వారా నిర్వికారమైన రుద్రలోకానికి వెళ్లగలరు.

**వసిష్ఠశ్చాష్టమే వ్యాసః పరివర్తే భవిష్యతి ॥39॥**

**యదా తదా భవిష్యామి నామ్నాహం దధివాహనః ।**
**తత్రాపి మమ తే పుత్రా యోగాత్మానో దృఢవ్రతాః ॥40॥**

**భవిష్యంతి మహాయోగాః యేషాం నాస్తి సమో భువి ।**
**కల్పితశ్చాసురిశ్చైవ తథా పంచశిఖో మునిః ॥41॥**

**బాష్కలశ్చ మహాయోగీ ధర్మాత్మానో మహౌజసః ।**
**ప్రాప్య మాహేశ్వరం యోగం జ్ఞానినో దగ్ధకిల్బిషాః ॥42॥**

**మత్సమీపం గమిష్యంతి పునరావృత్తిదుర్లభమ్ ।**

ఎనిమిదో ద్వాపరం చివర 'వసిష్ఠుడ'నే పేరుతో వ్యాసుడు ఉంటాడు. అప్పుడు నేను 'దధివాహనుడ'నే పేర ఉండగలను. ఆ సమయంలో కూడా నాకు యోగాత్ములు, దృఢవ్రతులు అయిన కల్పితుడు, ఆసురి, పంచశిఖముని, మహాయోగియైన బాష్కలుడు అను వారు నలుగురు పుత్రులవుతారు. మహాయోగులైన వారికి సమానమైన వారు ఈభూమిపై ఉండరు. ధర్మాత్ములు, మిక్కిలి కాంతిమంతులు, జ్ఞానులు, నశించినపాపంగలవారు అయిన వారు మహేశ్వరయోగంద్వారా తిరిగివెనకకురావడం కష్టమైన నా సాన్నిధ్యాన్ని పొందుతారు.

**పరివర్తే తు నవమే వ్యాసః సారస్వతో యదా ॥43॥**

**తదాప్యహం భవిష్యామి ఋషభో నామ నామతః ।**
**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి మహౌజసః ॥44॥**

**పరాశరశ్చ గర్గశ్చ భార్గవాంగిరసౌ తదా ।**
**భవిష్యంతి మహాత్మానో బ్రాహ్మణా వేదపారగాః ॥45॥**

**ధ్యానమార్గం సమాసాద్య గమిష్యంతి తథైవ తే ।**
**సర్వే తపోబలోత్కృష్టాః శాపానుగ్రహకోవిదాః ॥46॥**

**తేఽపి తేనైవ మార్గేణ యోగోక్తేన తపస్వినః ।**
**రుద్రలోకం గమిష్యంతి పునరావృత్తిదుర్లభమ్ ॥47॥**

నవమద్వాపరాంతంలో సారస్వతుడనే పేరుగలవాడు వ్యాసుడు కాగలడు. అప్పుడు నేను ఋషభుడు అనే పేరుతో అవతరిస్తాను. అప్పుడు నాకు పరాశరుడు, గర్గుడు, భార్గవుడు, అంగిరసుడు అనే నలుగురు పుత్రులు

ఉంటారు. వీరు మిక్కిలి కాంతిమంతులు, మహాత్ములు, బ్రాహ్మణులు, వేదవిదులు, అధికతపోబల సంపన్నులు, నిగ్రహానుగ్రహదక్షులు, ఆ తపస్వులందరూ ధ్యానమార్గాన్ని పొంది ఆ యోగమార్గంద్వారా పునరావృత్తి దుర్లభమైన రుద్రలోకానికి వెళ్లగలరు.

**దశమే ద్వాపరే వ్యాసః త్రిపాద్వై నామ నామతః ।**
**యదా భవిష్యతే విప్రస్తదాహం భవితామునిః ॥48॥**

**హిమవచ్ఛిఖరే రమ్యే భృగుతుంగే నగోత్తమే ।**
**నామ్నా భృగోస్తు శిఖరం ప్రథితం దేవపూజితమ్ ॥49॥**

పదోద్వాపరాంతంలో త్రిపాదుడనే పేరుతో వ్యాసుడు ఉంటాడు. ఆతడు విప్రరూపుడు. నేను అప్పుడు భృగుమునిరూపంలో పర్వతశ్రేష్ఠమైన హిమగిరిపై మనోహరమైన భృగుతుంగమనే శిఖరంమీద అవతరిస్తాను. ఆ శిఖరం నాపేరుతో 'భృగుతుంగ'గా ప్రసిద్ధిచెంది దేవతలతో పూజింపబడుతుంది.

**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి దృఢవ్రతాః ।**
**బలబంధుర్నిరామిత్రః కేతుశృంగస్తపోధనః ॥50॥**

**యోగాత్మానో మహాత్మానస్తపోయోగసమన్వితాః ।**
**రుద్రలోకం గమిష్యంతి తపసా దగ్ధకిల్బిషాః ॥51॥**

అక్కడకూడా నాకు బలబంధువు, నిరామిత్రుడు, కేతుశృంగుడు, తపోధనుడనే నలుగురు పుత్రులు కలుగుతారు. వీరు దృఢవ్రతులు, యోగాత్ములు, మహాత్ములు, తపస్సు మరియు యోగసిద్ధికలవారు, తపస్సుతో దగ్ధపాపులుగా ఉండి రుద్రలోకాన్ని పొందుతారు.

**ఏకాదశే ద్వాపరే తు వ్యాసస్తు త్రివ్రతో యదా ।**
**తదాప్యహం భవిష్యామి గంగాద్వారే కలౌ యదా ॥52॥**

**ఉగ్రో నామ మహాతేజాః సర్వలోకేషు విశ్రుతః ।**
**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి మహౌజసః ॥53॥**

**లంబోదరశ్చ లంబాక్షో లంబకేశః ప్రలంబకః ।**
**ప్రాప్య మాహేశ్వరం యోగం రుద్రలోకం గతా హి తే ॥54॥**

పదకొండో ద్వాపరాంతంలో త్రివ్రతుడు వ్యాసుడు. అప్పుడు నేను కలియుగంలో గంగాద్వారక్షేత్రంలో మహాకాంతిమంతుణ్ణి అయి 'ఉగ్రుడు' అనే పేరుతో అవతరించి సర్వలోకాలలో విఖ్యాతి పొందుతాను. ఆ సమయంలో కూడా నాకు లంబోదరుడు, లంబాక్షుడు, లంబకేశుడు, ప్రలంబకులనే మహాతేజస్వంతులైన నలుగురు పుత్రులు కాగలరు. వారు మాహేశ్వరయోగాన్ని పొందినవారై రుద్రలోకాన్ని చేరతారు.

**ద్వాదశే పరివర్తే తు శతతేజా యదా మునిః ।**
**భవిష్యంతి మహాతేజా వ్యాసస్తు కవిసత్తమః ॥55॥**

**తదాప్యహం భవిష్యామి కలావిహ యుగాంతికే ।**
**హైతుకం వనమాసాద్య అత్రిర్నామ్నా పరిశ్రుతః ॥56॥**

పండ్రెండో ద్వాపరయుగం చివర 'శతతేజు'డనే ముని వ్యాసుడవుతాడు. ఆతడు మహాతేజుడు మరియు కవిశ్రేష్ఠుడు కూడా. అప్పుడు కూడా నేను యుగాంతకాలంలో హైతుకవనంలో 'అత్రి' అనే పేరుతో ప్రసిద్ధి పొందుతాను.

**తత్రాపి మమ తే పుత్రా భస్మస్నానానులేపనాః ।**
**భవిష్యంతి మహాయోగా రుద్రలోకపరాయణాః ॥57॥**

**సర్వజ్ఞః సమబుద్ధిశ్చ సాధ్యః సర్వస్తథైవ చ ।**
**ప్రాప్య మాహేశ్వరం యోగం రుద్రలోకం గతా హి తే ॥58॥**

అప్పుడు కూడా నాకు భస్మమే స్నానంగా అనులేపనంగా గలవారు, మహాయోగులు, శివలోకతత్పరులు అయిన సర్వజ్ఞుడు, సమబుద్ధి, సాధ్యుడు, సర్వుడు అనే నలుగురు పుత్రులు కలుగుతారు. వారు మాహేశ్వరయోగసిద్ధిని పొంది రుద్రలోకానికి చేరతారు.

**త్రయోదశే పునః ప్రాప్తే పరివర్తే క్రమేణ తు ।**
**ధర్మో నారాయణో నామ వ్యాసస్తు భవితా యదా ॥59॥**

**తదాప్యహం భవిష్యామి బాలిర్నామ మహామునిః ।**
**బాలఖిల్యాశ్రమే పుణ్యే పర్వతే గంధమాదనే ॥60॥**

పదమూడవద్వాపరంచివర ధర్మపరుడు 'నారాయణుడ'నువాడు వ్యాసుడు కాగలడు. అప్పుడు కూడా నేను గంధమాదనపర్వతంమీద పవిత్రమైన వాలఖిల్యాశ్రంలో మహాముని 'బాలి' అనే పేరుతో అవతరిస్తాను.

**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి తపోధనాః ।**
**సుధామా కాశ్యపశ్చైవ వాసిష్ఠో విరజాస్తథా ॥61॥**

**మహాయోగబలోపేతా విమలా ఊర్ధ్వరేతసః ।**
**ప్రాప్య మాహేశ్వరం యోగం రుద్రలోకం గతా హి తే ॥62॥**

అక్కడ కూడా నాకు తపోధనులు, మహాయోగబలం కలవారు, పవిత్రులు, అస్ఖలితబ్రహ్మచారులు అయిన సుధాముడు, కశ్యపుడు, వాసిష్ఠుడు, విరజుడు అనే నలుగురు పుత్రులు కలుగుతారు. వారు మాహేశ్వరయోగం పొంది రుద్రలోకం వెళ్లగలుగుతారు.

**యదా వ్యాసస్తరక్షుస్తు పర్యాయే తు చతుర్దశే ।**
**తత్రాపి పునరేవాహం భవిష్యామి యుగాంతికే ॥63॥**

**వంశే త్వంగిరసాం శ్రేష్ఠే గౌతమో నామ నామతః ।**
**భవిష్యతి మహాపుణ్యం గౌతమం నామ తద్వనమ్ ॥64॥**

**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి కలౌ తదా ।**
**అత్రిర్దేవసదశ్చైవ శ్రవణోఽథ శ్రవిష్ఠకః ॥65॥**

**యోగాత్మానో మహాత్మానః సర్వే యోగసమన్వితాః ।**
**ప్రాప్య మాహేశ్వరం యోగం రుద్రలోకాయ తే గతాః ॥66॥**

పద్నాలుగో ద్వాపరం చివర తరక్షుడు వ్యాసుడు. అప్పుడు నేను ఉత్తమమైన అంగిరసవంశంలో 'గౌతముడ'నే పేర అవతరిస్తాను. దానితో అది మహాపుణ్యస్థానం 'గౌతమవనం' అవుతుంది. అప్పుడుకూడా నాకు అత్రి, దేవసదుడు, శ్రవణుడు, శ్రవిష్ఠకుడుఅనే పుత్రులు కలుగుతారు. యోగాత్ములు, మహాత్ములు, యోగయుక్తులైన వారందరు మాహేశ్వరయోగాన్ని పొంది రుద్రలోకాన్ని చేరతారు.

**తతః పంచదశే ప్రాప్తే పరివర్తే క్రమాగతే ।**
**త్రైయ్యారుణిర్యదా వ్యాసో ద్వాపరే సమపద్యత ॥67॥**

**తదాప్యహం భవిష్యామి నామ్నా వేదశిరా ద్విజః ।**
**తత్ర వేదశిరో నామ అస్త్రం తత్పారమేశ్వరమ్ ॥68॥**

**భవిష్యతి మహావీర్యం వేదశీర్షశ్చ పర్వతః ।**
**హిమవత్పృష్ఠమాసాద్య సరస్వత్యాం నగోత్తమే ॥69॥**

క్రమానుసారంగా పదిహేనో ద్వాపరం చివరిలో 'త్రైయ్యారుణి' వ్యాసుడవుతాడు. అప్పుడు నేను బ్రాహ్మణరూపుణ్ణై 'వేదశిరుడ'నే పేరుతో అవతరిస్తాను. అప్పుడు వేదశిరమనే పేరుగల దివ్యాస్త్రం ప్రకటింపబడుతుంది.

పర్వతరాజమైన హిమగిరియొక్క క్రిందిభాగంలో సరస్వతీనదీతటంలో వేదశీర్షమనే పర్వతం నా ఆశ్రమం అవుతుంది.

**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి తపోధనాః ।**
**కుణిశ్చ కుణిబాహుశ్చ కుశరీరః కునేత్రకః ॥70॥**

**యోగాత్మానో మహాత్మానః సర్వే తే హ్యూర్ధ్వరేతసః ।**
**ప్రాప్య మాహేశ్వరం యోగం రుద్రలోకాయ తే గతాః ॥71॥**

అప్పుడు కూడా నాకు నలుగురు పుత్రులు కలుగుతారు. కుణి, కుణిబాహువు, కుశరీరుడు, కునేత్రుడు అను ఆ నలుగురు తపోధనులు కాగలరు.

యోగాత్ములు, మహాత్ములు, బ్రహ్మచారులు, అయిన వారందరూ మాహేశ్వరయోగాన్ని పొందినవారై రుద్రలోకాన్ని పొందుతారు.

**వ్యాసో యుగే షోడశే తు యదా దేవో భవిష్యతి ।**
**తత్ర యోగప్రదానాయ భక్తానాం చ యతాత్మనామ్ ॥72॥**

**తదాప్యహం భవిష్యామి గోకర్ణో నామ నామతః ।**
**భవిష్యతి సుపుణ్యం చ గోకర్ణం నామ తద్వనమ్ ॥73॥**

పదహారవద్వాపరంచివర వ్యాసుడు 'దేవుడ'నే పేర ఉంటాడు. అప్పుడు నేను నియంత్రితాత్ములైన భక్తులకు యోగవిద్యను దానం చేయడానికై గోకర్ణుడనే పేరుతో అవతరిస్తాను. దానితో ఆ వనానికి గోకర్ణమనే పేరు కలుగుతుంది. అది విశేషపుణ్యస్థలి అవుతుంది.

**తత్రాపి మమ తే పుత్రాః భవిష్యంతి చ యోగినః ।**
**కాశ్యపో హ్యుశనాశ్చైవ చ్యవనోఽథ బృహస్పతిః ॥74॥**

**తేఽపి తేనైవ మార్గేణ ధ్యానయోగసమన్వితాః ।**
**ప్రాప్య మాహేశ్వరం యోగం గంతారో రుద్రమేవ హి ॥75॥**

ఆ సమయంలో కూడా నాకు మహాయోగులైన కాశ్యపుడు, ఉశనుడు, చ్యవనుడు, బృహస్పతి అనే నలుగురు పుత్రులు కలుగుతారు. వారందరూ ధ్యానయోగంతో కూడి ఆ యోగమార్గంద్వారా మాహేశ్వరయోగప్రాప్తితో రుద్రలోకానికి వెళ్లగలుగుతారు.

**తతః సప్తదశే చైవ పరివర్తే క్రమాగతే ।**
**యదా భవిష్యతి వ్యాసో నామ్నా దేవకృతంజయః ॥76॥**

**తదాప్యహం భవిష్యామి గుహావాసీతి నామతః ।**
**హిమవచ్ఛిఖరే రమ్యే మహోత్తుంగే మహాలయే ॥77॥**

**సిద్ధక్షేత్రం మహాపుణ్యం భవిష్యతి మహాలయమ్ ।**
**తత్రాపి మమ తే పుత్రా యోగజ్ఞా బ్రహ్మవాదినః ॥78॥**

**భవిష్యంతి మహాత్మానో నిర్మమా నిరహంకృతాః ।**
**ఉతథ్యో వామదేవశ్చ మహాయోగో మహాబలః ॥79॥**

క్రమపూర్వకంగా సప్తదశద్వాపరంచివర వ్యాసుడు 'దేవకృతంజయుడ'నే పేరుగలవాడవుతాడు. అప్పుడు నేను హిమవత్పర్వతంయొక్క మిక్కిలి ఎత్తైన 'మహాలయ'మనే పేరుగల రమణీయమైన శిఖరంమీద 'గుహావాసి' అనే పేరుతో అవతరిస్తాను. ఆ మహాలయస్థలం పుణ్యస్థలంగా, సిద్ధక్షేత్రంగా నిలుస్తుంది. అప్పుడుకూడా నాకు యోగజ్ఞతగలవాళ్లు, బ్రహ్మవేత్తలు, నిర్మములు, నిరహంకారులు మహాత్ములైన నలుగురు పుత్రులు కలుగుతారు. వారికి ఉతథ్యుడు, వామదేవుడు, మహాయోగుడు, మహాబలుడని పేర్లుంటాయి.

**తేషాం శతసహస్రం తు శిష్యాణాం ధ్యానయోగినామ్ ।**
**భవిష్యంతి తదా కాలే సర్వే తే ధ్యానయుంజకాః ॥80॥**

**యోగాభ్యాసరతాశ్చైవ హృది కృత్వా మహేశ్వరమ్ ।**
**మహాలయే పదం న్యస్తం దృష్ట్వా యాంతి శివం పదమ్ ॥81॥**

వాళ్లకు ధ్యానయోగంలో వందలకొలది వేలకొలది శిష్యులుంటారు. ఆ విధంగా కలియుగంలో వాళ్లు అందరూ ధ్యానయుక్తులవుతారు. యోగాభ్యాసమే ఇష్టంగాగలవాళ్లు శివుణ్ణి మనసున నిల్పి మహాలయంలో ఉన్న శివుడి చరణాల్ని చూచి శివపదమును పొందుతారు.

**యే చాఽన్యేపి మహాత్మానః కలౌ తస్మిన్ యుగాంతికే ।**
**ధ్యానే మనః సమాధాయ విమలాః శుద్ధబుద్ధయః ॥82॥**

**మమ ప్రసాదాద్యాస్యంతి రుద్రలోకం గతజ్వరాః ।**
**గత్వా మహాలయం పుణ్యం దృష్ట్వా మాహేశ్వరం పదమ్ ॥83॥**

**తీర్ణస్తారయతే జంతుర్దశ పూర్వాన్ దశోత్తరాన్ ।**
**ఆత్మానమేకవింశం తు తారయిత్వా మహాలయే ॥84॥**

**మమ ప్రసాదాద్యాస్యంతి రుద్రలోకం గతజ్వరాః ।**

ద్వాపరయుగాంతంలో కలియుగం ఆరంభంలో మహాలయపుణ్యక్షేత్రానికి వెళ్లిన నిర్మలులు, పరిశుద్ధమైన బుద్ధిగల మహాభాగులైన వాళ్లు ధ్యానంలో మనస్సునిలిపి నాఅనుగ్రహంవల్ల రుద్రలోకమును పొందుతారు. ఇలా శివపాదదర్శనం పొందిన ప్రాణుల పది పూర్వతరములవారు, తరువాతి పదితరములవారు మరియు ఆప్రాణితో కలిపి మొత్తము ఇరవది యొక్క తరములవారు సమస్త బాధలనుండి ఉద్ధరింపబడగలరు. ఈ విధంగా మహాలయక్షేత్రాన్ని పొందినవారు నాకృపవల్ల రుద్రలోకమును పొందగలుగుతారు.

**తతోఽష్టాదశమే చైవ పరివర్తే యదా విభో ॥85॥**

**తదా ఋతంజయో నామ వ్యాసస్తు భవితా మునిః ।**
**తదాప్యహం భవిష్యామి శిఖండీ నామనామతః ॥86॥**

**సిద్ధక్షేత్రే మహాపుణ్యే దేవదానవపూజితే ।**
**హిమవచ్ఛికరే రమ్యే శిఖండీ నామ పర్వతః ॥87॥**

**శిఖండినో వనం చాపి యత్ర సిద్ధనిషేవితమ్ ।**
**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి తపోధనాః ॥88॥**

**వాచశ్రవా ఋచీకశ్చ శ్యావాశ్వశ్చ యతీశ్వరః ।**
**యోగాత్మానో మహాత్మానః సర్వే తే వేదపారగాః ॥89॥**

**ప్రాప్య మాహేశ్వరం యోగం రుద్రలోకాయ సంవృతాః ।**

ఓ ప్రభూ! అష్టాదశద్వాపరయుగం అంతంలో ఋతంజయుడు వ్యాసుడవుతాడు. అప్పుడు నేను సిద్ధిప్రదాయకమూ, పుణ్యప్రదమూ, దేవదానవులచేత పూజింపబడేది అయిన హిమగిరిలో రమణీయమైన పర్వతశిఖరం మీద 'శిఖండి' అనే పేరుతో అవతరిస్తాను. ఆ శిఖరం నాపేరుతో శిఖండివనంగా పిలువబడుతుంది.

అది మహాత్ములైన సిద్ధుల నివాసం కాగలదు. అప్పుడుకూడా నాకు వాచశ్రవుడు, ఋచీకుడు, శ్యావాశ్వుడు, యతీశ్వరుడు అనే నలుగురు పుత్రులు కలుగుతారు. వాళ్లందరూ తపోధనులు, యోగాత్ములు, మహాత్ములు, వేదపారంగతులు. వాళ్లు మాహేశ్వరయోగాన్ని పొంది రుద్రలోకాన్ని చేరతారు.

**అథ ఏకోనవింశే తు పరివర్తే క్రమాగతే ॥90॥**

**వ్యాసస్తు భవితా నామ్నా భరద్వాజో మహామునిః ।**
**తదాప్యహం భవిష్యామి జటామావీ చ నామతః ॥91॥**

**హిమవచ్ఛిఖరే రమ్యే జటాయుర్యత్ర పర్వతః ।**
**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి మహౌజసః ॥92॥**

**హిరణ్యనాభః కౌశల్యో లోకాక్షీ కుథుమిస్తథా ।**
**ఈశ్వరా యోగధర్మాణః సర్వే తే హ్యూర్ధ్వరేతసః ॥93॥**

**ప్రాప్య మాహేశ్వరం యోగం రుద్రలోకాయ సంస్థితాః ।**

క్రమానుసారంగా పందొమ్మిదో ద్వాపరంచివర భరద్వాజ మహాముని వ్యాసుడు అవుతాడు. అప్పుడు నేను హిమవత్పర్వతం పైన రమణీయమైన జటాయుపర్వతంపైన 'జటామాలి' అనే పేరుతో అవతరిస్తాను. అప్పుడు కూడా నాకు హిరణ్యనాభుడు, కౌశల్యుడు, లోకాక్షుడు, కుథుమి అను పేర్లుగల నలుగురుపుత్రులు కలుగుతారు. వాళ్లందరూ యోగధర్మస్వరూపులు. నైష్ఠికబ్రహ్మచారులు. మహాప్రతాపులు. ఐశ్వర్యవంతులు. వాళ్లందరూ మాహేశ్వరయోగాన్ని సిద్ధించుకుని రుద్రలోకంలో ఉండగలుగుతారు.

**తతో వింశతిమశ్చైవ పరివర్తో యదా తదా ॥94॥**

**గౌతమస్తు తదా వ్యాసో భవిష్యతి మహామునిః ।**
**తదాప్యహం భవిష్యామి అట్టహాసస్తు నామతః ॥95॥**

**అట్టహాసప్రియాశ్చైవ భవిష్యంతి తదా నరాః ।**
**తత్రైవ హిమవత్పృష్ఠే అట్టహాసో మహాగిరిః ॥96॥**

**దేవదానవయక్షేంద్రసిద్ధచారణసేవితః ।**
**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి మహౌజసః ॥97॥**

**యోగాత్మానో మహాత్మానో ధ్యాయినో నియతవ్రతాః ।**
**సుమంతుర్బర్బరీ విద్వాన్ కబంధః కుశికంధరః ॥98॥**

**ప్రాప్య మాహేశ్వరం యోగం రుద్రలోకాయ తే గతాః ।**

ఇరవైయవద్వాపరయుగం చివర మహాముని గౌతముడు వ్యాసుడు. అప్పుడు నేను 'అట్టహాసుడ'నే పేర అవతరిస్తాను. అప్పుడు ప్రజలందరూ అట్టహాసప్రియులు కాగలరు. హిమవత్పర్వతంయొక్క క్రిందిభాగంలో అట్టహాసమనే గొప్పకొండ ఉన్నది. అది దేవదానవులచేత, యక్షులచేత, సిద్ధచారణుల చేత సేవింపబడుతుంది. అక్కడ కూడా నాకు యోగాత్ములు, మహాత్ములు, నియతవ్రతులు అయిన సుమంతుడు, బర్బరి, విద్వాంసుడైన కబంధుడు, కుశికంధరుడు అనే నలుగురు పుత్రులు కలుగుతారు. వాళ్లు మాహేశ్వరయోగయుక్తులై రుద్రలోకాన్ని చేరతారు.

**ఏకవింశే పునః ప్రాప్తే పరివర్తే క్రమాగతే ॥99॥**

**వాచశ్రవాః స్మృతో వ్యాసో యదా స ఋషిసత్తమః ।**
**తదాప్యహం భవిష్యామి దారుకో నామ నామతః ॥100॥**

**తస్మాద్భవిష్యతే పుణ్యం దేవదారువనం శుభమ్ ।**
**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి మహౌజసః ॥101॥**

**ప్లక్షో దార్భాయణిశ్చైవ కేతుమాన్ గౌతమస్తథా ।**
**యోగాత్మానో మహాత్మానో నియతా ఊర్ధ్వరేతసః ॥102॥**

**నైష్ఠికం వ్రతమాస్థాయ రుద్రలోకాయ తే గతాః ।**

క్రమానుగతంగా ఇరవైఒకటోద్వాపరం చివర ఋషిశ్రేష్ఠుడైన వాచశ్రవుడు వ్యాసుడు కాగలడు. నేను ఆసమయంలో 'దారకుడు' అనే పేరుతో పుణ్యస్థానమైన, మంగళకరమైన దేవదారువనంలో అవతరిస్తాను. నా పేర అది దేవదారువనంగా ప్రసిద్ధి చెందుతుంది. అక్కడ కూడా ప్లక్షుడు, దార్భాయణి, కేతుమంతుడు, గౌతముడు అనే నలుగురు పుత్రులు కలుగుతారు. వాళ్లు యోగాత్ములు, మహాత్ములు, నియతాత్ములు, నైష్ఠికబ్రహ్మచారులు. వాళ్లు నిష్ఠాపూర్వకంగా యోగవ్రతమాచరించి రుద్రలోకాన్ని పొందుతారు.

**ద్వావింశే పరివర్తే తు వ్యాసః శుష్మాయణో యదా ॥103॥**

**తదాప్యహం భవిష్యామి వారాణస్యాం మహామునిః ।**
**నామ్నా వై లాంగలీ భీమో యత్ర దేవాః సవాసవాః ॥104॥**

**ద్రక్ష్యంతి మాం కలౌ తస్మిన్ భవం చైవ హలాయుధమ్ ।**

ఇరవైరెండోద్వాపరంచివరిలో 'శుష్మాయణుడ'నే పేరుతో వ్యాసుడుంటాడు. అప్పుడు కూడా నేను కాశీనగరంలో మహాముని అయిన 'భీముడ'నే పేరుతో హలాన్ని ధరించి అవతరిస్తాను. ఆ కలియుగంలో హలాయుధుణ్ణి అయిన నన్ను ఇంద్రసహితులైన దేవతలందరూ చూడగలుగుతారు.

**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి సుధార్మికాః ॥105॥**

**భల్లవీ మధుపింగశ్చ శ్వేతకేతుః కుశస్తథా ।**
**ప్రాప్య మాహేశ్వరం యోగం తేఽపి ధ్యానపరాయణాః ॥106॥**

**విమలా బ్రహ్మభూయిష్ఠా రుద్రలోకాయ సంస్థితాః ॥107॥**

అక్కడకూడా నాకు మహాధర్మపరులు అయిన భల్లవి, మధుపింగుడు, శ్వేతకేతువు, కుశుడనువాళ్ళు నలుగురు పుత్రులు కలుగుతారు. ధ్యానపరాయణులు, విమలులు, బ్రహ్మమానసులు రుద్రలోకానికి వెళుతారు.

**పరివర్తే త్రయోవింశే తృణబిందుర్యదా మునిః ।**

**వ్యాసో హి భవితా బ్రహ్మన్ తదాహం భవితా పునః ।**
**శ్వేతో నామ మహాకాయో మునిపుత్రస్తు ధార్మికః ॥108॥**

**తత్ర కాలం జరిష్యామి తదా గిరివరోత్తమే ।**
**తేన కాలంజరో నామ భవిష్యతి స పర్వతః ॥109॥**

**తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపస్వినః ।**
**ఉశికో బృహదశ్వశ్చ దేవలః కవిరేవ చ ॥110॥**

**ప్రాప్య మాహేశ్వరం యోగం రుద్రలోకాయ తే గతాః ।**

ఓ పితామహా! ఇరవైమూడోద్వాపరాంతంలో ముని తృణబిందువు వ్యాసుడవుతాడు. అప్పుడు నేను మునిపుత్రుణ్ణి, ధార్మికుణ్ణి, మహాకాయుణ్ణి అయి 'శ్వేతు'డనే పేరుతో అవతరిస్తాను. పర్వతశ్రేష్ఠంమీద కాలం గడుపుతాను. అందుచేత ఆపర్వతం 'కాలంజరం'గా ప్రసిద్ధి పొందుతుంది. అక్కడ కూడా నాకు మహాతపస్వులైన ఉశికుడు, బృహదశ్వుడు, దేవలుడు, కవిఅనే నలుగురు శిష్యులు కలుగుతారు. వాళ్లు మాహేశ్వరయోగం పొంది రుద్రలోకానికి వెళ్లుతారు.

**పరివర్తే చతుర్వింశే వ్యాసో ఋక్షో యదా విభో ॥111॥**

**తదాప్యహం భవిష్యామి కలౌ తస్మిన్ యుగాంతికే ।**
**శూలీ నామ మహాయోగీ నైమిషే దేవవందితే ॥112॥**

**తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపోధనాః ।**
**శాలిహోత్రోఽగ్ని వేశశ్చ యవనాశ్వః శరద్వసుః ॥113॥**

**తేఽపి తేనైవ మార్గేణ రుద్రలోకాయ సంస్థితాః ।**

ఓ బ్రహ్మా! ఇరవైనాలుగోద్వాపరం చివర ఋక్షుడనే పేరుతో వ్యాసుడుంటాడు. ఆ యుగాంతంలో కలియుగ ప్రారంభంలో దేవతలచే పూజింపబడే నైమిషారణ్యంలో మహాయోగినై 'శూలి' అనే పేరుతో అవతరిస్తాను. అక్కడకూడా

నాకు తపోధనులైన శాలిహోత్రుడు, అగ్నివేశుడు, యవనాశ్వుడు, శరద్వసుడు అనే పేర్లుగల నలుగురు శిష్యులు కలుగుతారు.

**పంచవింశే పునః ప్రాప్తే పరివర్తే క్రమాగతే ॥114॥**

**వాసిష్ఠస్తు యదా వ్యాసః శక్తిర్నామ్నా భవిష్యతి ।**
**తదాప్యహం భవిష్యామి దండీ ముండీశ్వరః ప్రభుః ॥115॥**

**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి తపోధనాః ।**
**ఛగలః కుండకర్ణశ్చ కుభాండశ్చ ప్రవాహకః ॥116॥**

**ప్రాప్య మాహేశ్వరం యోగమమృతాయ తే గతాః ।**

క్రమానుగుణ్యంగా మరల ఇరవైఅయిదో ద్వాపరాంతంలో వసిష్ఠమహర్షి పుత్రుడైన 'శక్తి' అనే పేరుగలవాడు వ్యాసుడు అవుతాడు. అప్పుడు జగత్ప్రభువునైన నేను దండధారినై ముండీశ్వరుడనే పేర అవతరిస్తాను. అక్కడ కూడా నాకు తపోధనులైన ఛగలుడు, కుండకర్ణుడు, కుభాండుడు, ప్రవాహకుడు అనే నలుగురు పుత్రులు కలుగుతారు. మాహేశ్వరయోగసిద్ధిని పొంది వారు అమరత్వాన్ని పొందుతారు.

**షడ్వింశే పరివర్తే తు యదా వ్యాసః పరాశరః ॥117॥**

**తదాప్యహం భవిష్యామి సహిష్ణుర్నామ నామతః ।**
**పురం భద్రవటం ప్రాప్య కలౌ తస్మిన్ యుగాంతికే ॥118॥**

**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి సుధార్మికాః ।**
**ఉలూకో విద్యుతశ్చైవ శంబూకో హ్యాశ్వలాయనః ॥119॥**

**ప్రాప్య మాహేశ్వరం యోగం రుద్రలోకాయ తే గతాః ।**

ఇరవైఆరో ద్వాపరాంతంలో పరాశరుడునే పేరుతో వ్యాసుడు ఉంటాడు. కలియుగప్రారంభంలో భద్రవటపురంలో సహిష్ణువు అనే పేరుతో అవతరిస్తాను. అక్కడ కూడా నాకు ఉలూకుడు, విద్యుతుడు, శంబూకుడు, ఆశ్వలాయనుడు అనే పేర్లుగల నలుగురు పుత్రులు కలుగుతారు. వారు మహేశ్వరయోగాన్ని పొంది రుద్రలోకానికి చేరతారు.

**సప్తవింశే పునః ప్రాప్తే పరివర్తే క్రమాగతే ॥120॥**

**జాతూకర్ణ్యో యదా వ్యాసో భవిష్యతి తపోధనః ।**
**తదాప్యహం భవిష్యామి సోమశర్మా ద్విజోత్తమః ॥121॥**

**ప్రభాసతీర్థమాసాద్య యోగాత్మా యోగవిశ్రుతః ।**
**తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపోధనాః ॥122॥**

**అక్షపాదః కుమారశ్చ ఉలూకో వత్స ఏవ చ ।**
**యోగాత్మానో మహాత్మానో విమలాః శుద్ధబుద్ధయః ॥123॥**

**ప్రాప్య మహేశ్వరం యోగం రుద్రలోకం తతో గతాః ।**

మరల క్రమంగా వచ్చిన ఇరవైఏడోద్వాపరం చివర తపోధనుడైన జాతూకర్ణ్యుడు వ్యాసుడవుతాడు. అప్పుడు కూడా నేను తపోధనుడు, యోగాత్ముడు, యోగంవల్లప్రసిద్ధుడైన 'సోమశర్మ'గా ప్రభాసమనేపేరుగల తీర్థంలో అవతరిస్తాను. అక్కడ కూడా తపోధనులు, యోగాత్ములు, మహాత్ములు, అమలులు, పరిశుభ్రమైనబుద్ధికలిగినవారైన అక్షపాదుడు, కుమారుడు, ఉలూకుడు, వత్సుడు అనే వారు నలుగురు శిష్యులు కాగలరు. తర్వాత వారు మహేశ్వరయోగాన్ని పొంది రుద్రలోకానికి వెళ్లగలరు.

**అష్టావింశే పునః ప్రాప్తే పరివర్తే క్రమాగతే ॥124॥**

**పరాశరస్తు శ్రీమాన్ విష్ణుర్లోకపితామహః ।**
**యదా భవిష్యతి వ్యాసో నామ్నా ద్వైపాయనః ప్రభుః ॥125॥**

**తదా షష్ఠేన చాంశేన కృష్ణః పురుషసత్తమః ।**
**వసుదేవాద్యదుశ్రేష్ఠో వాసుదేవో భవిష్యతి ॥126॥**

క్రమానుసారంగా వచ్చిన ద్వాపరయుగంలో శ్రీమంతుడు, లోకపితామహుడు, విష్ణుభగవానుడు తన ఆరవఅంశలో పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడనే పేరుతో వ్యాసుడు ఉంటాడు. అప్పుడు యదుశ్రేష్ఠుడు, పురుషోత్తముడు, వసుదేవసుతుడు అయిన కృష్ణుడు వాసుదేవుడై అవతరిస్తాడు.

**తదాప్యహం భవిష్యామి యోగాత్మా యోగమాయయా ।**
**లోకవిస్మయనార్థాయ బ్రహ్మచారిశరీరకః ॥127॥**

**శ్మశానే మృతముత్సృష్టం దృష్ట్వా కాయమనాథకమ్ ।**
**బ్రాహ్మణానాం హితార్థాయ ప్రవిష్టో యోగమాయయా ॥128॥**

**దివ్యాం మేరుగుహాం పుణ్యాం త్వయా సార్ధం చ విష్ణునా ।**
**భవిష్యామి తదా బ్రహ్మన్ లకులీ నామ నామతః ॥129॥**

**కాయావతార ఇత్యేవం సిద్ధక్షేత్రం చ వై తదా ।**
**భవిష్యతి సువిఖ్యాతం యావద్భూమిర్ధరిష్యతి ॥130॥**

అప్పుడు కూడా నేను యోగాత్ముణ్ణి అయి యోగమాయతో లోకాల్ని ఆశ్చర్యపర్చడానికై బ్రహ్మచారిరూపాన్ని పొందుతాను. మరియు యోగమాయవలన బ్రాహ్మణుల శ్రేయస్సుకై శ్మశానంలో ఒక అనామకబ్రాహ్మణమృతశరీరాన్ని చూచి దానిలోనికి ప్రవేశిస్తాను. ఓ బ్రహ్మా! అప్పుడు విష్ణువుతో నీతో కలిసి దివ్యమూ, పుణ్యప్రదమూ అయిన

మేరుపర్వతగుహలో నివసిస్తాను. అప్పుడు నేను 'లకులి' అనే పేరుతో విఖ్యాతి పొందుతాను. అప్పటినుంచి నేను అవతరించిన ఆ స్థలం 'కాయావతారం' అనే సిద్ధక్షేత్రంగా యావత్ప్రపంచంలో ప్రసిద్ధి పొందుతుంది.

**తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి తపస్వినః ।**
**కుశికశ్చైవ గర్గశ్చ మిత్రః కౌరుష్య ఏవ చ ॥131॥**

**యోగాత్మానో మహాత్మానో బ్రాహ్మణా వేదపారగాః ।**
**ప్రాప్య మాహేశ్వరం యోగం విమలా హ్యూర్ధ్వరేతసః ॥132॥**

**రుద్రలోకం గమిష్యంతి పునరావృత్తిదుర్లభమ్ ।**
**ఏతే పాశుపతాః సిద్ధా భస్మోద్ధూలితవిగ్రహాః ॥133॥**

**లింగార్చనరతా నిత్యం బాహ్యాభ్యంతరతః స్థితాః ।**
**భక్త్యా మయి చ యోగేన ధ్యాననిష్ఠా జితేంద్రియాః ॥134॥**

అక్కడకూడా నాకు కుశికుడు, గర్గుడు, మిత్రుడు, కౌరుష్యుడు అనే పేర్లుగల నలుగురు, తపస్వులు, యోగాత్ములు, బ్రహ్మజ్ఞానులు, వేదపారంగతులు అయిన పుత్రులు కలుగుతారు. విశుద్ధులు, నైష్ఠికబ్రహ్మచారులు అయిన వారు మహేశ్వరయోగాన్ని పొంది పునరావృత్తిదుర్లభమైన రుద్రలోకానికి వెళ్లుతారు. వాళ్లందరూ పాశుపతవ్రతదీక్షితులు, భస్మాలంకృతశరీరులు, మహాసిద్ధులు నిత్యం లింగార్చనరతిగలవారు, బయట లోపల నాయందు భక్తిగలవారు, ధ్యాననిష్ఠులు, జితేంద్రియులు.

**సంసారబంధచ్ఛేదార్థం జ్ఞానమార్గప్రకాశకమ్ ।**
**స్వరూపజ్ఞానసిద్ధ్యర్థం యోగం పాశుపతం మహత్ ॥135॥**

సాంసారికబంధాల్ని త్రుంచడానికి, ఆత్మజ్ఞానప్రాప్తికి జ్ఞానమార్గాన్ని ప్రకాశింపజేయు పాశుపతయోగం గొప్పది.

**యోగమార్గా అనేకాశ్చ జ్ఞానమార్గాస్త్వనేకశః ।**
**న నివృత్తిముపాయంతి వినా పంచాక్షరీం క్వచిత్ ॥136॥**

అనేకయోగమార్గాలున్నాయి. అట్లే అనేకజ్ఞానమార్గాలున్నాయి. 'నమఃశివాయ' అనే పంచాక్షరీమంత్రంకాక ఏమార్గమూ సాంసారికబంధవిముక్తినివ్వదు.

**యదా చరేత్తపశ్చాయం సర్వద్వంద్వవివర్జితమ్ ।**
**తదా స ముక్తో మంతవ్యః పక్వం ఫలమివ స్థితః ॥137॥**

సమస్తమైన ద్వంద్వాల్ని విడిచిపెట్టడానికై తపస్సును ఆచరించాలి. అప్పుడు పండినపండుగా ఉన్న ఆతడు ముక్తుడుగా భావించాలి.

**ఏకాహం యః పుమాన్ సమ్యక్ చరేత్పాశుపతవ్రతమ్ ।**
**న సాంఖ్యే పంచరాత్రే వా న ప్రాప్నోతి గతిం కదా ॥138॥**

ఏపురుషుడు ఒకరోజు పాశుపతదీక్షను బాగా ఆచరిస్తాడో ఆతడు బంధవిముక్తి పొందుతాడు. ఈ సిద్ధి సాంఖ్యాచరణవల్లగాని, పాంచరాత్రవ్రతాచరణంవల్లగాని సిద్ధించదు.

**ఇత్యేతద్వై మయా ప్రోక్తమవతారేషు లక్షణమ్ ।**
**మన్వాదికృష్ణపర్యంతమష్టావింశద్యుగక్రమాత్ ॥139॥**

**తత్ర శ్రుతిసమూహానాం విభాగో ధర్మలక్షణః ।**
**భవిష్యతి తదా కల్పే కృష్ణద్వైపాయనో యదా ॥140॥**

ఈవిధంగా యుగక్రమాన్ని అనుసరించి మనువునుంచి కృష్ణద్వైపాయనుడి వరకు ఇరవైఎనిమిది అవతారాల వర్ణనం కావించాను. ఈ కల్పంలో ధర్మస్వరూపుడు కృష్ణద్వైపాయనుడు వ్యాసుడు. ఆతడు వేదసమూహాన్ని విభాగింపగలుగుతాడు.

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**నిశమ్యైవం మహాతేజా మహాదేవేన కీర్తితమ్ ।**
**రుద్రావతారం భగవాన్ ప్రణిపత్య మహేశ్వరమ్ ॥141॥**

**తుష్టావ వాగ్భిరిష్టాభిః పునః ప్రాహ చ శంకరమ్ ॥142॥**

ఈవిధంగా మహాశివుడివల్ల రుద్రావతారవర్ణనను విని మహాకాంతిమంతుడు భగవంతుడైన బ్రహ్మ శివుడికి నమస్కరించి ప్రియభాషణాలతో ఆయనను స్తుతించి ఇలా పలికాడు.

**పితామహ ఉవాచ –** బ్రహ్మ పలికాడు.

**సర్వే విష్ణుసమా కాచిత్ గతిరన్యా విధీయతే ।**
**ఇత్యేవం సతతం వేదా గాయంతి నాత్ర సంశయః ॥143॥**

సమస్తదేవతలు, సమస్తగణాలు విష్ణుమయులు. విష్ణువుకు సమానమైనవాళ్లు ఇతరులెవ్వరూ లేరు. ఈవిషయాన్ని ఎల్లవేళలా వేదాలు కీర్తిస్తున్నాయి. ఇందు ఏమాత్రం సందేహం లేదు.

**స దేవదేవో భగవాంస్తవ లింగార్చనే రతః ।**
**తవ ప్రణామపరమః కథం దేవో హ్యభూత్ప్రభుః ॥144॥**

ఆతడు దేవదేవుడైన విష్ణుభగవానుడు నీలింగార్చనలో ప్రీతిగలిగి ఉన్నాడు. నీకు నమస్కరించడంలో మిక్కిలి ఇష్టుడై ఎందుకు ఉన్నాడు?

**సూత ఉవాచ –** సూతర్షి పలికాడు.

**నిశమ్య వచనం తస్య బ్రహ్మణః పరమేష్ఠినః ।**
**ప్రపిబన్నివ చక్షుర్భ్యాం ప్రీతస్తత్ప్రశ్నగౌరవాత్ ॥145॥**

**పూజాప్రకరణం తస్మై తమాలోక్యాహ శంకరః ।**
**భవాన్నారాయణశ్చైవ శక్రః సాక్షాత్సురోత్తమః ॥146॥**

**మునయశ్చ సదాలింగం సంపూజ్య విధిపూర్వకమ్ ।**
**స్వం స్వం పదం విభో ప్రాప్తాస్తస్మాత్సంపూజయంతి తే ॥147॥**

పరమేష్ఠి అయిన బ్రహ్మయొక్క ఆమాట విని ఆనందాతిరేకంతో కూడిన కన్నులతో చూస్తూ ఆప్రశ్నయొక్క గొప్పతనానికి ప్రసన్నుడై లింగపూజలోని ప్రకరణాన్ని బ్రహ్మకై చెప్పాడు. విష్ణుభగవానుడు సాక్షాత్తూ ఇంద్రుడే. మునులుకూడా ఎల్లప్పుడూ విధిపూర్వకంగా లింగాన్ని పూజించి వాళ్ళవాళ్ళపదవుల్ని పొందారు. అందుకే వాళ్లు లింగాన్ని బాగా పూజిస్తున్నారు.

**లింగార్చనం వినా నిష్ఠా నాస్తి తస్మాజ్జనార్దనః ।**
**ఆత్మనో యజతే నిత్యం శ్రద్ధయా భగవాన్ ప్రభుః ॥148॥**

లింగార్చనంకన్నా భిన్నమైన వ్రతనిష్ఠ మరొకటి లేదు. అందుకే ప్రభువైన విష్ణుభగవానుడు శ్రద్ధగా ప్రతిరోజు నా లింగాల్ని పూజిస్తున్నాడు.

**ఇత్యేవముక్త్వా బ్రహ్మాణమనుగృహ్య మహేశ్వరః ।**
**పునః సంప్రేక్ష్య దేవేశం తత్రైవాంతరధీయత ॥149॥**

ఈవిధంగా మహేశ్వరుడు పలికి బ్రహ్మను అనుగ్రహించి, మరల దేవాధిదేవుణ్ణి బ్రహ్మను కృపతో చూచి అక్కడే అంతర్హితుడయ్యాడు.

**తముద్దిశ్య తదా బ్రహ్మా నమస్కృత్య కృతాంజలిః ।**
**స్రష్టుం త్వశేషం భగవాన్ లబ్ధసంజ్ఞస్తు శంకరాత్ ॥150॥**

అప్పుడు బ్రహ్మ చేతులు జోడించి శివుడికి నమస్కరించి, ఆయననుంచి ఆజ్ఞను పొంది అశేషసృష్టిచేయడానికి ఉపక్రమించాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే వివిధవ్యాసావతారవర్ణనం నామ చతుర్వింశతితమోఽధ్యాయః ॥ 24 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని వివిధవ్యాసావతారవర్ణనమనే ఇరవై నాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచవింశతితమోఽధ్యాయః - ఇరవై అయిదవ అధ్యాయం

## స్నానవిధివర్ణనమ్ - స్నానవిధివర్ణనం

**ఋషయః ఊచుః** - ఋషులు పలికారు.

**కథం పూజ్యో మహాదేవో లింగమూర్తిర్మహేశ్వరః ।**
**వక్తుమర్హసి చాస్మాకం రోమహర్షణ సాంప్రతమ్ ॥1॥**

ఓ రోమహర్షణా! సూతమహర్షీ! మహాదేవుడు, మహేశ్వరుడు, లింగమూర్తి అయిన శివుడు ఎలా పూజింపబడతాడు. నీవు మాకు ప్రస్తుతం చెప్పదగినవాడవు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**దేవ్యా పృష్టో మహాదేవః కైలాసే తాం నగాత్మజామ్ ।**
**అంకస్థామాహ దేవేశో లింగార్చనవిధిం క్రమాత్ ॥2॥**

కైలాసంలో పార్వతీదేవిచే ఈవిషయమై అడగబడినవాడైన మహాదేవుడు, దేవేశ్వరుడు తన అంకపీఠాన్ని అధిష్ఠించిన శైలసుతను ఉద్దేశించి లింగార్చనవిధానక్రమాన్ని గూర్చి పలికాడు.

**తదా పార్శ్వే స్థితో నందీ శాలంకాయనకాత్మజః ।**
**శ్రుత్వాఖిలం పురా ప్రాహ బ్రహ్మపుత్రాయ సువ్రతాః ॥3॥**

**సనత్కుమారాయ శుభం లింగార్చనవిధిం పరమ్ ।**
**తస్మాత్ వ్యాసో మహాతేజాః శ్రుతవాన్ శ్రుతిసమ్మితమ్ ॥4॥**

ఓ సువ్రతులైన మునులారా! అప్పుడు శివుడి ప్రక్కనే ఉన్న శాలంకాయన పుత్రుడైన నందీశ్వరుడు ఉత్తమమైన ఆ విధివిధానాన్ని పూర్తిగా విని బ్రహ్మమానసపుత్రుడైన సనత్కుమారుడికి పూర్వకాలంలో చెప్పాడు. ఆ సనత్కుమారుడివల్ల మహాతేజస్వి అయిన వ్యాసుడు వేదసమానమై మంగళకరమై లింగార్చనక్రమాన్ని విన్నాడు.

**స్నానయోగోపచారం చ యథా శైలాదినో ముఖాత్ ।**
**శ్రుతవాన్ తత్ప్రవక్ష్యామి స్నానాద్యం చార్చనావిధిమ్ ॥5॥**

నందీశ్వరుడి ద్వారా నేను విన్న స్నానయోగోపచారాన్నీ, స్నానం మొదలయిన అర్చనావిధానాన్నీ చెప్తాను.

**శైలాదిరువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**అథ స్నానవిధిం వక్ష్యే బ్రాహ్మణానాం హితాయ చ ।**
**సర్వపాపహరం సాక్షాచ్ఛివేన కథితం పురా ॥6॥**

ఇప్పుడు విప్రుల శ్రేయస్సుకై స్నానవిధానాన్ని చెబుతున్నాను. ఇది సమస్తపాపాల్ని హరిస్తుంది. పూర్వం శివుడే స్వయంగా చెప్పింది.

**అనేన విధినా స్నాత్వా సకృత్పూజ్య చ శంకరమ్ ।**
**బ్రహ్మకూర్చం చ పీత్వా తు సర్వపాపైః ప్రముచ్యతే ॥7॥**

ఈవిధమైన విధితో స్నానం చేసి శంకరుణ్ణి ఒకసారి పూజించి పంచగవ్యాన్ని త్రాగితే సమస్తపాపాలనుంచి విముక్తి కలుగుతుంది. (పంచగవ్యం – ఆవుపేడ, ఆవుపంచితం, ఆవుపాలు, ఆవుపెరుగు, ఆవునెయ్యి)

**త్రివిధం స్నానమాఖ్యాతం దేవదేవేన శంభునా ।**
**హితాయ బ్రాహ్మణాద్యానాం చతుర్ముఖసుతోత్తమ ॥8॥**

బ్రహ్మపుత్రశ్రేష్ఠా! బ్రహ్మ క్షత్ర వైశ్యజనుల శ్రేయస్సుకై దేవేశ్వరుడైన శివుడిచేత మూడువిధాలైన స్నానాలు చెప్పబడ్డాయి.

**వారుణం పురతః కృత్వా తతశ్చాగ్నేయముత్తమమ్ ।**
**మంత్రస్నానం తతః కృత్వా పూజయేత్పరమేశ్వరమ్ ॥9॥**

ముందుగా నీటితో స్నానంచేసి తర్వాత మేలైనభస్మంతో స్నానంచేసి, తర్వాత మర్జనరూపమైన మంత్రస్నానంచేసి పరమేశ్వరుణ్ణి పూజించాలి.

**భావదుష్టోఽమ్భసి స్నాత్వా భస్మనా చ న శుధ్యతి ।**
**భావశుద్ధశ్చరేచ్ఛౌచమన్యథా న సమాచరేత్ ॥10॥**

ఆలోచనాదుష్టుడైనవాడు నీటితో స్నానంచేసినా, భస్మంతో స్నానం చేసినా పరిశుద్ధుడు కాలేడు. సదాలోచనతో ఉండడమే శుచిత్వం అవుతుంది. దీనికన్నా భిన్నంగా ఏదీ ఆచరించపనిలేదు.

**సరిత్సరస్తటాకేషు సర్వేష్వాప్రళయం నరః ।**
**స్నాత్వాపి భావదుష్టశ్చేన్న శుధ్యతి న సంశయః ॥11॥**

భావదుష్టుడైన నరుడు ప్రళయపర్యంతం సమస్తమైన నదులలోను, సరస్సులలోను, చెరువులలోను స్నానం చేసినా శుద్ధుడు కాలేడు. ఇందులో సందేహం లేదు.

**నృణాం హి చిత్తకమలం ప్రబుద్ధమభవద్యదా ।**
**ప్రసుప్తం తమసా జ్ఞానభానోర్భాసా తదా శుచిః ॥12॥**

అజ్ఞానాంధకారంవల్ల నిద్రించిన మానవుల బుద్ధిపద్మం జ్ఞానభానుడి ప్రకాశంతో వికసించినప్పుడు శుచిత్వాన్ని పొందుతుంది.

**మృచ్ఛకృత్తిలపుష్పం చ స్నానార్థం భసితం తథా ।**
**ఆదాయ తీరే నిఃక్షిప్య స్నానతీర్థే కుశాని చ ॥13॥**

**ప్రక్షాల్యాచమ్య పాదౌ చ మలం దేహాద్విశోధ్య చ ।**
**ద్రవ్యైస్తు తీరదేశస్థైస్తతః స్నానం సమాచరేత్ ॥14॥**

మట్టి, ఆవుపేడ, నూవులు, పూలు, భస్మం అనే వాటిని స్నానంకోసం తీసుకువచ్చి ఒడ్డున దర్భలమీద ఉంచి, స్నానం చేయవలసిన ఆ తీర్థంలో పాదాల్ని కడుక్కుని, ఆచమించి తీరంలో ఉంచిన ద్రవ్యాలతో శరీరాన్ని శుభ్రపర్చుకుని అనంతరం స్నానం చెయ్యాలి.

**ఉద్ధృతాసీతి మంత్రేణ పునర్దేహం విశోధయేత్ ।**
**మృదాదాయ తతశ్చాన్యద్వస్త్రం స్నాత్వా హ్యనుల్బణమ్ ॥15॥**

"ఉద్ధృతాసి వరాహేణ" అనే మంత్రాన్ని జపిస్తూ మట్టిని తీసుకుని దానితో మరల శరీరాన్ని శుభ్రపర్చుకుని, స్నానంచేసి మరొకపెద్దవస్త్రాన్ని ధరించాలి.

**గంధద్వారాం దురాధర్షామితి మంత్రేణ మంత్రవిత్ ।**
**కపిలాగోమయేనైవ ఖస్థేనైవ తు లేపయేత్ ॥16॥**

మంత్రవిదుడైన పురుషుడు "గంధద్వారాం దురాధర్షాం" అనే మంత్రాన్ని జపిస్తూ క్రిందపడని కపిల అయిన ఆవుపేడను శరీరానికి పూసుకోవాలి.

**పునః స్నాత్వా పరిత్యజ్య తద్వస్త్రం మలినం తతః ।**
**శుక్లవస్త్ర పరీధానో భూత్వా స్నానం సమాచరేత్ ॥17॥**

మరల స్నానం చేసి, మలినమైన ఆ వస్త్రాన్ని విడిచిపెట్టి, తెల్లటివస్త్రాన్ని ధరించి మరల స్నానం బాగా చెయ్యాలి.

**సర్వపాపవిశుద్ధ్యర్థమావాహ్య వరుణం తథా ।**
**సంపూజ్య మనసా దేవం ధ్యానయజ్ఞేన వై భవమ్ ॥18॥**

**ఆచమ్య త్రిస్తదా తీర్థే హ్యవగాహ్య భవం స్మరన్ ।**
**పునరాచమ్య విధివదభిమంత్ర్య మహాజలమ్ ॥19॥**

**అవగాహ్య పునస్తస్మిన్ జపేద్వై చాఘమర్షణమ్ ।**
**తత్తోయే భానుసోమాగ్నిమండలం చ స్మరేద్వశీ ॥20॥**

సమస్తపాపాల శుద్ధికోసం వరుణదేవుణ్ణి ఆవాహనంచేసి, ధ్యానయజ్ఞంవల్ల కలిగినమనసుతో శివుణ్ణి పూజించి, మూడుసార్లు ఆచమించి, శివుణ్ణి స్మరిస్తూ నీటిలో మునిగి, శాస్త్రప్రకారంగా ఆనీటిని బాగామంత్రించి మరల ఆ నీటిని ఆచమించి, మరల ఆనీటిలో మునిగి, "ఋతం చ సత్యం చ" అనే పాపహరకారకమైన జపాన్ని నిర్వహించాలి. ఆ నీటిలో యోగి సూర్యచంద్రాగ్నిమండలాల్ని స్మరిస్తాడు.

**ఆచమ్య చ పునస్తస్మాజ్జలాదుత్తీర్య మంత్రవిత్ ।**
**ప్రవిశ్య తీర్థమధ్యే తు పునః పుణ్యవివృద్ధయే ॥21॥**

మరల ఆచమించి, ఆ జలంనుంచి బయటకు వచ్చి, మంత్రవేత్తఅయిన ఆతడు పుణ్యాన్ని అధికం చేసుకోవడానికై మరల ఆ జలంమధ్యకు ప్రవేశించాలి.

**శృంగేణ పర్ణపుటకైః పాలాశైః క్షాలితైస్తథా ।**
**సుకుశేన సపుష్పేణ జలేనైవాభిషేచయేత్ ॥22॥**

**రుద్రేణ పవమానేన త్వరితాఖ్యేన మంత్రవిత్ ।**
**తరత్సమందీవర్గాద్యైస్తథా శాంతిద్వయేన చ ॥23॥**

**శాంతిధర్మేణ చైకేన పంచబ్రహ్మపవిత్రకైః ।**
**తత్తన్మంత్రాధిదేవానాం స్వరూపం చ ఋషీన్ స్మరన్ ॥24॥**

మంత్రవేత్త అయిన నరుడు గోవుకొమ్మునుండిగాని, శుభ్రపరిచిన పలాశపత్రాలతో తయారుచేసిన దొప్పద్వారాగాని, దర్భలచేతగాని, పూలచేతగాని నీటిని తీసుకుని 'నమస్తే రుద్ర' అనే రుద్రసూక్తాన్ని, పవమానసూక్తాన్ని "యో రుద్ర" మొదలైన త్వరితసంజ్ఞగలమంత్రాన్ని 'తరత్సమందీ' మొదలైన ఆద్యాక్షరమంత్రాన్ని, 'శంనోమిత్ర' ఆదిగాగల రెండు మంత్రాల్ని, శాంతిధర్మకమైన 'శంనో దేవీ' అనే ఏకమంత్రాన్ని, పంచబ్రహ్మపవిత్రకాలైన సద్యోజాతాదులైన మంత్రపంచకాన్ని జపిస్తూ ఆయామంత్రాధిష్ఠానదేవతలయొక్క ఆకృతుల్ని, ఋషులస్వరూపాల్ని స్మరిస్తూ ఆత్మాభిషేచన చేసుకోవాలి.

**ఏవం హి అభిషిచ్యాథ స్వమూర్ధ్ని పయసా ద్విజాః ।**
**ధ్యాయేచ్చ త్ర్యంబకం దేవం హృది పంచాస్యమీశ్వరమ్ ॥25॥**

ఓ ద్విజులారా! ఈవిధంగా నీటితో తనశిరసుమీద అభిషేకించుకుని, ముక్కంటి మరియు పంచముఖుడైన ఈశ్వరుణ్ణి మనసులో ధ్యానించాలి.

**ఆచమ్యాచమనం కుర్యాత్స్వసూత్రోక్తం సమీక్ష్య చ ।**
**పవిత్రహస్తః స్వాసీనః శుచౌ దేశే యథావిధి ॥26॥**

తర్వాత గృహ్యసూక్తంలో చెప్పబడిన రీతిగా ఆచమనం చేసి, పరిశుభ్రమైనప్రదేశంలో పవిత్రహస్తుడై విధ్యుక్తంగా ఆసీనుడు కావాలి.

**అభ్యుక్ష్య సకుశం చాపి దక్షిణేన కరేణ తు ।**
**పిబేత్ప్రక్షిప్య త్రిస్తోయం చక్రీ భూత్వా హ్యతంద్రితః ॥27॥**

**ప్రదక్షిణం తతః కుర్యాద్ధింసాపాప ప్రశాంతయే ।**
**ఏవం సంక్షేపతః ప్రోక్తం స్నానాచమనముత్తమమ్ ॥28॥**

కుడిచేతితో దర్భలు పట్టుకుని, ఆ దర్భలద్వారా జలాన్ని చల్లుకుని, మూడుసార్లు జలాన్ని ఆచమించి, సమస్తహింసలు, సర్వపాపాలు నశించడానికై త్వరితగతితో తిరుగుతూ ప్రదక్షిణ చేయాలి. ఓ బ్రాహ్మణోత్తములారా! ఈవిధంగా బ్రాహ్మణుల శ్రేయస్సుకై సంగ్రహంగా స్నానాచమనవిధానాన్ని చెప్పాను.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే స్నానవిధిర్నామ పంచవింశతితమోఽధ్యాయః ॥ 25 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని స్నానవిధి అనే పేరుగల ఇరవైఅయిదవ అధ్యాయం సమాప్తం.

## షడ్వింశతితమోஉధ్యాయః - ఇరవై ఆరవ అధ్యాయం

## పంచయజ్ఞవిధానమ్ - పంచయజ్ఞవిధానం

**నంద్యువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఆవాహయేత్తతో దేవీం గాయత్రీం వేదమాతరమ్ ।**
**ఆయాతు వరదా దేవీత్యనేనైవ మహేశ్వరీమ్ ॥1॥**

**పాద్యమాచమనీయం చ తస్యాశ్చార్ఘ్యం ప్రదాపయేత్ ।**
**ప్రాణాయామత్రయం కృత్వా సమాసీనః స్థితోஉపి వా ॥2॥**

**సహస్రం వా తదర్ధం వా శతమష్టోత్తరం తు వా ।**
**గాయత్రీం ప్రణవేనైవ త్రివిధేష్వేకమాచరేత్ ॥3॥**

ఓ సనత్సకుమారా! ఈవిధంగా స్నానం చేసిన తర్వాత 'ఆయాతు వరదా దేవీ' అనే మంత్రంతో వేదమాత, వరదాయిని, మహేశ్వరి అయిన గాయత్రీదేవిని ఆవాహనచేయాలి. ఆమెకు పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయం సమర్పించాలి. తర్వాత మూడుసార్లు ప్రాణాయామం చేసి కూర్చునిగాని, నిలబడిగాని వేయిసార్లుగాని, ఐదువందలసార్లుగాని లేక నూట ఎనిమిదిసార్లుగాని ప్రణవపూర్వకమైన గాయత్రీమంత్రాన్ని పై మూడు విధాలలో ఏదో ఒకవిధంగా జపించాలి.

**అర్ఘ్యం దత్త్వా సమభ్యర్చ్య ప్రణమ్య శిరసా స్వయమ్ ।**
**ఉత్తమే శిఖరే దేవీత్యుక్త్వోద్వాస్య చ మాతరమ్ ॥4॥**

**ప్రాచ్యాలోక్యాభివంద్యేశాం గాయత్రీం వేదమాతరమ్ ।**
**కృతాంజలిపుటో భూత్వా ప్రార్థయేద్భాస్కరం తథా ॥5॥**

**ఉదుత్యం చ తథా చిత్రం జాతవేదసమేవ చ ।**
**అభివంద్య పునః సూర్యం బ్రహ్మాణం చ విధానతః ॥6॥**

**తథా సౌరాని సూక్తాని ఋగ్యజుఃసామజాని చ ।**
**జప్త్వా ప్రదక్షిణం పశ్చాత్త్రిః కృత్వా చ విభావసోః ॥7॥**

అర్ఘ్యాన్ని యిచ్చి, బాగా అర్చించి, శిరసువంచి నమస్కరించి, "ఉత్తమే శిఖరేదేవీ" అని ఉచ్చరిస్తూ తూర్పుకు తిరిగి వేదమాత అయిన గాయత్రీమాతకు నమస్కరించాలి. చేతులుజోడించి సూర్యుణ్ణి ప్రార్థించాలి. "ఉదుత్యం జాతవేదసమ్" "చిత్రం దేవానాం" అనే మంత్రాలతో సూర్యుడికి, బ్రహ్మకు నమస్కరించి ఋగ్యజుఃసామాదుల్లో సూర్యసంబంధమైన సూక్తుల్ని విధ్యుక్తంగా పఠిస్తూ, మూడుసార్లు సూర్యుడికి ప్రదక్షిణం చేయాలి.

**ఆత్మానం చాంతరాత్మానం పరమాత్మానమేవ చ ।**
**అభివంద్య పునః సూర్యం బ్రహ్మాణం చ విభావసుమ్ ॥8॥**

**మునీన్ పిత్రూన్ యథాన్యాయం స్వనామ్నావాహయేత్తతః ॥9॥**

**తర్పయేద్విధినా పశ్చాత్ప్రాఙ్ముఖో వా హ్యుదఙ్ముఖః ।**
**ధ్యాత్వా స్వరూపం తత్తత్త్వమభివంద్య యథాక్రమమ్ ॥10॥**

తర్వాత ఆత్మ, అంతరాత్మ, పరమాత్మల్ని ధ్యానించి, సూర్యుడు, బ్రహ్మ మరియు అగ్నికి నమస్కరించి మునుల్ని, పితృదేవతల్ని, దేవతల్ని వారివారి పేర్లతో క్రమంగా ఆవాహన చేయాలి. అందర్ని ఆవాహన చేసిన తర్వాత తూర్పుముఖంగా గాని, ఉత్తరముఖంగా గాని నిలిచి, వాళ్లయొక్క తత్త్వాన్ని, స్వరూపాల్ని ధ్యానించి, యథావిధిగా తర్పణలిచ్చి నమస్కరించాలి.

**దేవానాం పుష్పతోయేన ఋషీణాం తు కుశాంభసా ।**
**పితౄణాం తిలతోయేన గంధయుక్తేన సర్వతః ॥11॥**

పుష్పాలతో కూడిన నీటితో దేవతలకు, దర్భలతో కూడిన నీటితో ఋషులకు, నువ్వులతోకూడిన జలంతో పితృదేవతలకు తర్పణలివ్వాలి. అయితే అన్నిటికి గంధం మాత్రం కలపాలి.

**యజ్ఞోపవీతీ దేవానాం నివీతీ ఋషితర్పణమ్ ।**
**ప్రాచీనావీతీ విప్రేంద్ర పితౄణాం తర్పయేత్ క్రమాత్ ॥12॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! సనత్కుమారా! యజ్ఞోపవీతి అనగా జంధ్యాన్ని సవ్యంగాధరించి దేవతలకి, నివీతుడై అనగా దానిని కంఠంలో ధరించి ఋషులకి, ప్రాచీనావీతుడై అనగా దాన్ని అపసవ్యం చేసుకుని పితృదేవతలకి క్రమంగా తర్పణలివ్వాలి. (ఎడమభుజం మీది నుండి కుడిచేతి క్రిందకు ధరించటం సాధారణ యజ్ఞోపవీతధారణ. అది సవ్యం. కుడిభుజం మీది నుండి ఎడమ చేతి క్రిందికి అపసవ్యం. మెడలో దండలా వేసుకొన్నవాడు నివీతి)

**అంగుళ్యగ్రేణ వై ధీమాంస్తర్పయే ద్దేవతర్పణమ్ ।**
**ఋషీన్ కనిష్ఠాంగుళినా శ్రోత్రియః సర్వసిద్ధయే ॥13॥**

**పితౄంస్తు తర్పయేద్విద్వాన్ దక్షిణాంగుష్ఠకేన తు ।**
**తథైవం మునిశార్దూల బ్రహ్మయజ్ఞం యజేద్ ద్విజః ॥14॥**

**దేవయజ్ఞం చ మానుష్యం భూతయజ్ఞం తథైవ చ ।**
**పితృయజ్ఞం చ పూతాత్మా యజ్ఞకర్మపరాయణః ॥15॥**

సర్వశుభాల్ని పొందడానికై విద్వాంసుడు, శ్రోత్రియుడు, బుద్ధిమంతుడు అయినవాడు మునివ్రేళ్లతో దేవతలకి, చివరి చిన్నవ్రేలితో (కనిష్ఠిక) ఋషులకు, కుడిబొటనవ్రేలితో పితృదేవతలకి తర్పణలివ్వాలి. ఓ మునిశ్రేష్ఠా! ఈ

విధంగా యజ్ఞకర్మపరాయణుడు, పవిత్రాత్ముడైన ద్విజుడు బ్రహ్మయజ్ఞం, దేవయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం అట్లే పితృయజ్ఞం నిర్వహించాలి.

**స్వశాఖాధ్యయనం విప్రా బ్రహ్మయజ్ఞ ఇతి స్మృతః ।**
**అగ్నౌ జుహోతి యచ్చాన్నం దేవయజ్ఞ ఇతి స్మృతః ॥16॥**

**సర్వేషామేవ భూతానాం బలిదానం విధానతః ।**
**భూతయజ్ఞ ఇతి ప్రోక్తో భూతిదః సర్వదేహినామ్ ॥17॥**

**సదారాన్ సర్వతత్త్వజ్ఞాన్ బ్రాహ్మణాన్ వేదపరాయణాన్ ।**
**ప్రణమ్య తేభ్యో యద్దత్తమన్నం మానుష ఉచ్యతే ॥18॥**

**పితౄనుద్దిశ్య యద్దత్తం పితృయజ్ఞః స ఉచ్యతే ।**
**ఏవం పంచమహాయజ్ఞాన్ కుర్యాత్సర్వార్థసిద్ధయే ॥19॥**

ఓ విప్రులారా! వేదసంబంధమైన తనశాఖను అధ్యయనం చేయడమే బ్రహ్మయజ్ఞం అవుతుంది. అగ్నిలో అన్నాన్ని ఆహుతి ఇవ్వడమే దేవయజ్ఞం అవుతుంది. సమస్తప్రాణులకు విధ్యుక్తంగా బలిని అనగా ఆహారాన్ని ఇవ్వడాన్నే భూతయజ్ఞం అవుతుంది. ఈభూతయజ్ఞం సమస్తప్రాణులకు ఐశ్వర్యదాయకం కాగలుగుతుంది. వేదవేత్తలు, తత్త్వజ్ఞులు అయిన బ్రాహ్మణులకు భార్యలతోకూడా ఉన్నవారికి (దంపతులకు కావచ్చు. భార్య బ్రతికియున్నవానికి అయినా కావచ్చు) నమస్కరించి ఇచ్చిన అన్నమే మానుషయజ్ఞం అవుతుంది. పితృదేవతలకి చేసే పిండప్రదానమే పితృయజ్ఞం అవుతుంది. సర్వార్థసిద్ధికై ఈవిధంగా పంచమహాయజ్ఞాలను నిర్వహించాలి.

**సర్వేషాం శృణు యజ్ఞానాం బ్రహ్మయజ్ఞః పరః స్మృతః ।**
**బ్రహ్మయజ్ఞరతో మర్త్యో బ్రహ్మలోకే మహీయతే ॥20॥**

**బ్రహ్మయజ్ఞేన తుష్యంతి సర్వే దేవాః సవాసవాః ।**
**బ్రహ్మా చ భగవాన్ విష్ణుః శంకరో నీలలోహితః ॥21॥**

**వేదాశ్చ పితరః సర్వే నాత్ర కార్యా విచారణా ।**

ఋషులారా! వినండి! అన్ని యజ్ఞాలలో బ్రహ్మయజ్ఞం శ్రేష్ఠం అయ్యింది. ఈ యజ్ఞకర్త బ్రహ్మలోకవాసి అయి బ్రహ్మానందాన్ని అనుభవిస్తాడు. ఈయజ్ఞం వల్ల ఇంద్రుడితో సహా అందరు దేవతలు సంతోషిస్తారు. బ్రహ్మదేవుడు, విష్ణుభగవానుడు, నీలలోహితుడైన శంకరుడు, వేదాలు, పితృదేవతలు అందరూ సంతోషిస్తారు. ఇందులో ఎటువంటి ఆలోచన అవసరం లేదు.

**గ్రామాద్ బహిర్గతో భూత్వా బ్రాహ్మణో బ్రహ్మయజ్ఞవిత్ ॥22॥**

**యావత్త్వదృష్టమభవదుటజానాం ఛదం నరః ।**
**ప్రాచ్యాముదీచ్యాం చ తథా ప్రాగుదీచ్యామథాపి వా ॥23॥**

**పుణ్యమాచమనం కుర్యాద్ బ్రహ్మయజ్ఞార్థమేవ తత్ ।**

బ్రహ్మయజ్ఞాన్ని తెలిసిన బ్రాహ్మణుడు ఆ బ్రహ్మయజ్ఞాన్ని నిర్వహించడానికి గ్రామంనుంచి వెలుపలికి వచ్చి పూరిండ్ల తర్వాత అదృశ్యుడై తూర్పు, పడమర, ఈశాన్యం దిక్కులకు తిరిగి బ్రహ్మయజ్ఞనిర్వహణకై పుణ్యప్రదమైన ఆచమనం చెయ్యాలి.

**ప్రీత్యర్థం చ ఋచాం విప్రాః త్రిః పీత్వా ప్లావ్య ప్లావ్య చ ॥24॥**

**యజుషాం పరిమృజ్యైవం ద్విః ప్రక్షాళ్య చ వారిణా ।**
**ప్రీత్యర్థం సామవేదానాముపస్పృశ్య చ మూర్ధని ॥25॥**

**స్పృశేదథర్వవేదానాం నేత్రే చాంగిరసాం తథా ।**
**నాసికే బ్రాహ్మణోఽఙ్గానాం క్షాళ్య క్షాళ్య చ వారిణా ॥26॥**

**అష్టాదశపురాణానాం బ్రహ్మాద్యానాం తథైవ చ ।**
**తథా చోపపురాణానాం సౌరాదీనాం యథాక్రమమ్ ॥27॥**

**పుణ్యానామితిహాసానాం శైవాదీనాం తథైవ చ ।**
**శ్రోత్రే స్పృశేద్ధి తుష్ట్యర్థం హృద్దేశ్యం తు తతః స్పృశేత్ ॥28॥**

**కల్పాదీనాం తు సర్వేషాం కల్పవిత్కల్పవిత్తమాః ।**

ఓ బ్రాహ్మణులారా! ఋగ్వేదఋక్కుల ప్రీతికోసం బ్రహ్మయజ్ఞకర్త మూడుసార్లు నీటిని త్రాగి, యజుర్వేద ప్రీతికోసం ఆతడు తన చేతుల్ని రెండుసార్లు కడుక్కుని, సామవేద ప్రీతికోసం ఆతడు తన శిరసును తాకి, అంగిరస్సంబంధమైన అథర్వవేద ప్రసన్నతకై నేత్రాల్ని స్పృశించుకుని, బ్రాహ్మణ గ్రంథాలైన కల్పం, శిక్ష మొదలైన వేదాంగాల ప్రీతికోసం ముక్కును ప్రక్షాళించుకుని, బ్రహ్మాదులైన అష్టాదశపురాణాలయొక్కయు, సౌరాదులైన ఉపపురాణాలయొక్కయు, శైవాదులై పుణ్యకారకాలైన ఇతిహాసాలయొక్కయు సంతుష్టికోసం చెవిని తాకాలి. హృదయాన్ని స్పృశించాలి. ఓ కల్పవేత్తలారా! సమస్తకల్పగ్రంథాల సంప్రీతికై పూర్వోక్తప్రకారంగా అన్నిక్రియలు బ్రాహ్మణుడు నిర్వహించాలి.

**ఏవమాచమ్య చాస్తీర్య దర్భపింజూలమాత్మనః ॥29॥**

**కృత్వా పాణితలే ధీమానాత్మనో దక్షిణోత్తరమ్ ।**
**హేమాంగులీయ సంయుక్తో బ్రహ్మబంధయుతోఽపి వా ॥30॥**

**విధివత్ బ్రహ్మయజ్ఞం చ కుర్యాత్సూత్రీ సమాహితః ।**
**అకృత్వా చ మునిః పంచమహాయజ్ఞాన్ ద్విజోత్తమః ॥31॥**
**భుక్త్వా చ సూకరాణాం తు యోనౌ వై జాయతే నరః ।**
**తస్మాత్సర్వప్రయత్నేన కర్తవ్యాః శుభమిచ్ఛతా ॥32॥**

ఈవిధంగా నిర్వహించి, ఆచమించి, దర్భల్ని పరిచి, వాటిపై కూర్చుని, తన వామహస్తతలం మీద బంగారపు ఉంగరంగాని, పవిత్రాన్ని గాని ధరించిన దక్షిణహస్తముంచి విధ్యుక్తంగా బ్రహ్మయజ్ఞాన్ని ఏకాగ్రతతో నిర్వహించాలి. ద్విజోత్తముడైన ఋషి ఈ పంచమహాయజ్ఞాల్ని నిర్వహించకుండా భుజించినవాడైతే ఆతడు పందిగర్భంలో జన్మిస్తాడు. శుభాన్ని కోరేవాడు తప్పక అన్ని ప్రయత్నాలలో ఈ యజ్ఞాల్ని నిర్వర్తించాలి.

**బ్రహ్మయజ్ఞాదథ స్నానం కృత్వాదౌ సర్వథాత్మనః ।**
**తీర్థం సంగృహ్య విధివత్ప్రవిశేచ్ఛివిరం వశీ ॥33॥**

**బహిరేవ గృహాత్పాదౌ హస్తౌ ప్రక్షాళ్య వారిణా ।**
**భస్మస్నానం తతః కుర్యాద్విధివద్దేహశుద్ధయే ॥34॥**

**శోధ్య భస్మ యథాన్యాయం ప్రణవేనాగ్నిహోత్రజమ్ ।**
**జ్యోతిః సూర్య ఇతి ప్రాతర్జుహుయాదుదితే యతః ॥35॥**

**జ్యోతిరగ్నిస్తథా సాయం సమ్యక్ చానుదితే మృషా ।**
**తస్మాదుదితహోమస్థం భసితం పావనం శుభమ్ ॥36॥**

బ్రహ్మయజ్ఞం చేసిన తర్వాత జలాన్ని తీసుకుని, గృహప్రవేశం చేసి, ఇంద్రియాల్ని నియంత్రించుకున్న ఆతడు స్నానమాచరించాలి. ఇంటిబయటే నీటితో కాళ్ళుచేతులు కడుక్కోవాలి. ప్రణవపూర్వకంగా అగ్నిహోత్రాన్ని మండింపగా ఏర్పడిన భస్మంతో దేహాన్ని శుద్ధి చేసుకోవాలి. ప్రాతఃకాలంలో సూర్యోదయం తర్వాత "జ్యోతిః సూర్య" అనే మంత్రంతోనూ, సాయంకాలంలో "జ్యోతిరగ్ని" అనే మంత్రంతోనూ ఆహుతులివ్వాలి. సూర్యోదయం కాకుండా నిర్వహించిన అగ్నికార్యం వ్యర్థం అవుతుంది. అందువల్ల సూర్యోదయం తర్వాత చేసిన ఆహుతులుగల భస్మమే పవిత్రమైంది. శుభకారకమైంది.

**నాస్తి సత్యసమం యస్మాదసత్యం పాతకం చ తత్ ।**
**ఈశానేన శిరోదేశం ముఖం తత్పురుషేణ చ ॥37॥**

**ఉరోదేశమఘోరేణ గుహ్యం వామేన సువ్రతాః ।**
**సద్యేన పాదౌ సర్వాంగం ప్రణవేనాభిషేచయేత్ ॥38॥**

సత్యానికి సమానమైనది ఏదీ లేదు. అలాగే అసత్యంవంటి పాపం ఏదీ లేదు. ఓ సువ్రతులారా! ఈశానమంత్రంతో శిరస్సును, తత్పురుషమంత్రంతో ముఖాన్ని, అఘోరమంత్రంతో వక్షఃస్థలాన్ని, వామదేవమంత్రంతో రహస్యభాగాల్ని, సద్యోజాతమంత్రంతో కాళ్లను, ప్రణవనాదంతో సర్వావయాల్ని భస్మంతో అభిషేకించాలి.

**తతఃప్రక్షాళయేత్పాదం హస్తం బ్రహ్మవిదాం వరః ।**
**వ్యపోహ్య భస్మ చాదాయ దేవదేవమనుస్మరన్ ॥39॥**

**మంత్రస్నానం తతః కుర్యాదాపో హి ష్ఠాదిభిః క్రమాత్ ।**
**పుణ్యైశ్చైవ తథా మంత్రర్యగ్యజుఃసామసంభవైః ॥40॥**

బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైన ఆతడు కాళ్లను చేతుల్ని కడుక్కుని, భస్మాన్ని తుడుచుకుని దేవదేవుడైన ఈశ్వరుణ్ణి ధ్యానిస్తూ "ఆపోహిష్ఠా" అనే ఋగ్యజుఃసామాదులకు చెందిన పుణ్యమంత్రాన్ని జపిస్తూ మంత్రస్నానాన్ని చేయాలి.

**ద్విజానాం తు హితాయైవ కథితం స్నానమద్య తే ।**
**సంక్షిప్య యః సకృత్కుర్యాత్సయాతి పరమం పదమ్ ॥41॥**

ద్విజుల శ్రేయస్సుకై సంగ్రహంగా ఈ స్నానవిధి చెప్పబడింది. ఏమానవుడైనా ఒకసారి ఈవిధమైన స్నానాన్ని ఆచరిస్తే పరమపదాన్ని పొందుతాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే పంచయజ్ఞవిధానం నామ షడ్వింశతితమోఽధ్యాయః ॥ 26 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని పంచయజ్ఞవిధానమనే ఇరవై ఆరవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## సప్తవింశతితమోఽధ్యాయః - ఇరవై ఏడవ అధ్యాయం

## లింగార్చనవిధిః - లింగార్చనవిధి

**శైలాదిరువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**వక్ష్యామి శృణు సంక్షేపాల్లింగార్చనవిధిక్రమమ్ ।**
**వక్తుం వర్షశతేనాపి న శక్యం విస్తరేణ యత్ ॥1॥**

ఓ సనత్కుమారమహర్షీ! లింగార్చనవిధిని నేను సంగ్రహంగా(క్లుప్తంగా) చెబుతాను. విందువుగాక! విపులంగా చెప్పడానికి నూరేండ్లు కూడా చాలవు.

**ఏవం స్నాత్వా యథాన్యాయం పూజాస్థానం ప్రవిశ్య చ ।**
**ప్రాణాయామత్రయం కృత్వా ధ్యాయేద్దేవం త్రియంబకమ్ ॥2॥**

**పంచవక్త్రం దశభుజం శుద్ధస్ఫటికసన్నిభమ్ ।**
**సర్వాభరణసంయుక్తం చిత్రాంబరవిభూషితమ్ ॥3॥**

ఈవిధంగా స్నానం చేసి, అనగా జలభస్మమంత్రాత్మకాలైన త్రివిధస్నానాలు ఆచరించి, పూజాస్థానానికి వెళ్లి మూడుసార్లు ప్రాణాయామం చేసి, ఐదుముఖాలుగలవాడు, పదిభుజాలుగలవాడు స్వచ్ఛమైన స్ఫటికంవలె ప్రకాశించువాడు, సమస్తాభరణాలతో అలంకరింపబడినవాడు అయిన దేవాధిదేవుడైన ముక్కంటిని ధ్యానించాలి.

**తస్యరూపం సమాశ్రిత్య దాహనప్లావనాదిభిః ।**
**శైవీం తనుం సమాస్థాయ పూజయేత్పరమేశ్వరమ్ ॥4॥**

శివుణ్ణి ఆ రూపంలో ధ్యానించి దాహనప్లావనాది తాంత్రికవిధులచేత శివసంబంధమైన ఆ రూపాన్ని పొంది శైవీదేహాన్ని హృదయంలో నిలుపుకుని పరమేశ్వరుణ్ణి పూజించాలి.

**దేహశుద్ధిం చ కృత్వైవ మూలమంత్రం న్యసేత్క్రమాత్ ।**
**సర్వత్ర ప్రణవేనైవ బ్రహ్మాణి చ యథాక్రమమ్ ॥5॥**

తన శరీరాన్ని శుద్ధి చేసుకుని, మూలమంత్రాలద్వారా దేహంలో అన్ని అంగాలలోను న్యాసం చేయాలి. అన్నింట ప్రణవంద్వారా సద్యోజాతాది పంచబ్రహ్మల్ని వరుసగా స్థాపింపజేయాలి.

**సూత్రే నమః శివాయేతి ఛందాంసి పరమే శుభే ।**
**మంత్రాణి సూక్ష్మరూపేణ సంస్థితాని యతస్తతః ॥6॥**

**న్యగ్రోధబీజే న్యగ్రోధస్తథా సూత్రే తు శోభనే ।**
**మహత్యపి మహత్బ్రహ్మ సంస్థితం సూక్ష్మవత్స్వయమ్ ॥7॥**

'నమఃశివాయ' అనే ఈ మంత్రంలోనే సర్వవేదాలు, మిక్కిలి శుభకరాలైన సమస్తమంత్రాలు సూక్ష్మరూపంలో సుస్థితినిపొంది ఉంటాయి. వటబీజంలో పెద్దదైన వటవృక్షం ఎలా ఉంటుందో అట్లే శుభకరమైన ఈ మంత్రంలో సూక్ష్మరూపంలో మహద్బ్రహ్మం ఉంటాడు.

**సేచయేదర్చనస్థానం గంధచందనవారిణా ।**
**ద్రవ్యాణి శోధయేత్పశ్చాత్ క్షాళనప్రోక్షణాదిభిః ॥8॥**

**క్షాళనం ప్రోక్షణం చైవ ప్రణవేన విధీయతే ।**

పూజాస్థానాన్ని సుగంధపూరితమైన చందనజలంతో తడపాలి (చల్లాలి). తర్వాత పూజాసామాగ్రిని కడగడం, సంప్రోక్షించడం ద్వారా శుభ్రపర్చాలి. ఈ తోమడం అనేది ప్రణవనాదోచ్చారణపూర్వకంగా జరగాలి.

**ప్రోక్షణీ చార్ఘ్యపాత్రం చ పాద్యపాత్రమనుక్రమాత్ ॥9॥**

**తథా హ్యాచమనీయార్థం కల్పితం పాత్రమేవ చ ।**
**స్థాపయేద్విధినా ధీమానవగుంఠ్య యథావిధి ॥10॥**

**దర్భైరాచ్ఛాదయేచ్చైవ ప్రోక్షయేచ్ఛుద్ధవారిణా ।**
**తేషు తేష్వథ సర్వేషు క్షిపేత్తోయం సుశీతలమ్ ॥11॥**

వివేకి అయిన ఆతడు అర్ఘ్యపాత్రను, పాద్యపాత్రను, ఆచమనీయపాత్రను తుడిచి క్రమానుసారంగా నిలపాలి. వాటిపై దర్భలు కప్పాలి. శుద్ధజలంతో దర్భల్ని తడపాలి. తర్వాత ఆ పాత్రలన్నింటిని చల్లని నీటితో నింపాలి.

**ప్రణవేన క్షిపేత్తేషు ద్రవ్యాణ్యాలోక్య బుద్ధిమాన్ ।**
**ఉశీరం చందనం చైవ పాద్యే తు పరికల్పయేత్ ॥12॥**

**జాతి కంకోల కర్పూర బహుమూల తమాలకమ్ ।**
**చూర్ణయిత్వా యథాన్యాయం క్షిపేదాచమనీయకే ॥13॥**

**ఏవం సర్వేషు పాత్రేషు దాపయేచ్చందనం తథా ।**
**కర్పూరం చ యథాన్యాయం పుష్పాణి వివిధాని చ ॥14॥**

బుద్ధిమంతుడైన ఆతడు ఓంకారనాదోచ్చారణపూర్వకంగా ఆ పాత్రల్ని ద్రవ్యాలతో నింపాలి. పాద్యపాత్రలో చందనం, అగరుతో నింపాలి. మల్లె, అశోకం, బహుమూలం, తమాలం ఈ మొక్కల బీజాల్ని, కర్పూరాన్ని చూర్ణంచేసి ఆచమనీయపాత్రను నింపాలి. ఈవిధంగా అన్నిపాత్రల్ని చందనం, కర్పూరం, పలురకాలైన పుష్పాలతో యథాక్రమంగా నింపాలి.

**కుశాగ్రమక్షతాంశ్చైవ యవవ్రీహితిలాని చ ।**
**ఆజ్యసిద్ధార్థపుష్పాణి భాసితం చార్ఘ్యపాత్రకే ॥15॥**

**కుశపుష్పయవవ్రీహిబహుమూలతమాలకమ్ ।**
**దాపయేత్ప్రోక్షణీపాత్రే భసితం ప్రణవేన చ ॥16॥**

దర్భల చిగుళ్లను, అక్షతలను, యవవ్రీహిధాన్యాల్ని, నూవుల్ని, నేతితో తడిపిన పూలను, భస్మాన్ని అర్ఘ్యపాత్రలో, ఇట్లే దర్భలు, పుష్పాలు, యవవ్రీహిధాన్యాలు, వట్టివేరు, తమాలకవిత్తనాలు, భస్మం ప్రోక్షణీయపాత్రలో ఉంచాలి.(నింపాలి) ఈ పనులు చేసేటపుడు ఓంకారనాదోచ్చారణ చేస్తూ ఉండాలి.

**న్యసేత్పంచాక్షరం చైవ గాయత్రీం రుద్రదేవతామ్ ।**
**కేవలం ప్రణవం వాపి వేదసారమనుత్తమమ్ ॥17॥**

తర్వాత పంచాక్షరమంత్రాన్ని, రుద్రగాయత్రిని వేదసారం, సర్వోత్తమం అయిన ప్రణవనాదాన్ని గాని పఠిస్తూ ఆ పాత్రలపై అభిమంత్రించాలి.

**అథ సంప్రోక్షయేత్పశ్చాత్ ద్రవ్యాణి ప్రణవేన తు ।**
**ప్రోక్షణీపాత్రసంస్థేన ఈశానాద్యైశ్చ పంచభిః ॥18॥**

తర్వాత ఓంకారసహితమైన (ఓం ఈశానః సర్వవిద్యానాం) ఈశాన ఆదిగాగల ఐదు యాజుషమంత్రాలతో ప్రోక్షణీయపాత్రలోగల జలంతో పూజాద్రవ్యాల్ని తడపాలి.

**పార్శ్వతో దేవదేవస్య నందనం మాం సమర్చయేత్ ।**
**దీప్తానలాయుతప్రఖ్యం త్రినేత్రం త్రిదశేశ్వరమ్ ॥19॥**

**బాలేందుముకుటం చైవ హరివక్త్రం చతుర్భుజమ్ ।**
**పుష్పమాలాధరం సౌమ్యం సర్వాభరణభూషితమ్ ॥20॥**

**ఉత్తరే చాత్మనః పుణ్యాం భార్యాం చ మరుతాం శుభామ్ ।**
**సుయశాం సువ్రతాం చాంబాపాదమండనతత్పరామ్ ॥21॥**

దేవదేవుడైన శివుడియొక్క దక్షిణభాగంలో ప్రకాశిస్తున్న వేయిసూర్యుల కాంతితో సమానమైన కాంతిగలవాడిని, త్రినేత్రుడిని, త్రిదశేశ్వరుణ్ణి, బాలచంద్రుణ్ణి కిరీటంగా ధరించినవాడిని, వానరముఖుణ్ణి, నాలుగుబాహువులు కలవాణ్ణి, పూలమాలలు ధరించినవాడిని, సమస్తాలంకారాలతో అలంకరింపబడినవాడిని, సౌమ్యస్వభావుణ్ణి, నందీశ్వరుడను అయిన నన్ను పూజించాలి. తర్వాత నాకు ఉత్తరభాగంలో ఉన్నదీ, పుణ్యవతి, సుశోభిత, సుయశ, సవ్రత మరియు పార్వతీదేవి పాదాల్ని అలంకరించుటలో తత్పరతగలదీ మరుత్తుల పుత్రిక అయిన నాభార్యను పూజించాలి.

**ఏవం పూజ్య ప్రవిశ్యాంతర్భవనం పరమేష్ఠినః ।**
**దత్వా పుష్పాంజలిం భక్త్యా పంచమూర్ధసు పంచభిః ॥22॥**

**గంధపుష్పైస్తథా ధూపైర్వివిధైః పూజ్య శంకరమ్ ।**
**స్కందం వినాయకం దేవీం లింగశుద్ధిం చ కారయేత్ ॥23॥**

మాయిద్దర్ని ఈవిధంగా పూజించి, శివుడియొక్క మందిరంలోపలికి వెళ్లి, సద్యోజాతాదులైన అయిదుమంత్రాలతో అయిదుశిరసులపై భక్తితో పుష్పాంజలిని సమర్పించి, తర్వాత గంధం, పుష్పం, ధూపం మొదలైన వివిధోపచారాలతో శంకరుణ్ణి, కార్తికేయుణ్ణి, గణపతిని, పార్వతీదేవిని పూజించాలి. తర్వాత లింగంపైనగల నిర్మాల్యాన్ని తొలగించి లింగాన్ని శుద్ధి చేయాలి.

**జప్త్వా సర్వాణి మంత్రాణి ప్రణవాదినమోఽంతకమ్ ।**
**కల్పయేదాసనం పశ్చాత్పద్మాఖ్యం ప్రణవేన తత్ ॥24॥**

ఓం ఆదిగా నమః అంతంగా ఉన్న అన్ని మంత్రాల్ని జపించి, తర్వాత శివభగవానుడికి పద్మాలతోకూర్చిన పద్మనామకమైన ఆసనాన్ని ఓంకారోచ్చారణ పూర్వకంగా కల్పించాలి.

**తస్య పూర్వదళం సాక్షాదణిమామయమక్షరమ్ ।**
**లఘిమా దక్షిణం చైవ మహిమా పశ్చిమం తథా ॥25॥**

**ప్రాప్తిస్తథోత్తరం పత్రం ప్రకామ్యం పావకస్య తు ।**
**ఈశిత్వం నైరృతం పత్రం వశిత్వం వాయుగోచరే ॥26॥**

**సర్వజ్ఞత్వం తథైశాన్యం కర్ణికా సోమ ఉచ్యతే ।**
**సోమస్యాధస్తథా సూర్యస్తస్యాధః పావకః స్వయమ్ ॥27॥**

ఆ పద్మాసనంయొక్క తూర్పునగల దళం నాశరహితమైన స్వయంగా అణిమాసిద్ధి స్వరూపం. దక్షిణదళం లఘిమాసిద్ధి. పడమరదిక్కులోగల దళం మహిమాసిద్ధి. ఉత్తరదళం ప్రాప్తిసిద్ధి. ఆగ్నేయమందలి దళం ప్రాకామ్యసిద్ధి. నైరృతి దళం ఈశిత్వసిద్ధి. వాయవ్యదళం వశిత్వసిద్ధి. ఈశాన్యమందలి దళం సర్వజ్ఞత్వసిద్ధి. ఆసనంయొక్క కర్ణిక అనగా మధ్యభాగం సోమమండలం. దానిక్రిందది సూర్యమండలం. దానిక్రిందది సాక్షాత్తు అగ్నిమండలం.

**ధర్మాదయో విదిక్ష్వేతే త్వనంతం కల్పయేత్క్రమాత్ ।**
**అవ్యక్తాది చతుర్దిక్షు సోమస్యాంతే గుణత్రయమ్ ॥28॥**

**ఆత్మత్రయం తతశ్చోర్ధ్వం తస్యాంతే శివపీఠికా ।**

ఆగ్నేయం, నైరృతి, వాయవ్య, ఈశాన్యాలైన విదిక్కులలో ధర్మజ్ఞాన వైరాగ్య ఐశ్వర్యాలు; తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం అనే ఈ నాల్గు దిక్కులలో అవ్యక్తం, మహత్తత్త్వం, అహంకారం, చిత్తం అనే అవ్యక్తాదులు; సోమమండలం మీద సత్త్వరజస్తమాలైన మూడుగుణాలు, వీటిపైభాగంలో విశ్వతైజసప్రాజ్ఞ అనే ఆత్మత్రయం, వీటిపైభాగంలో చివరిలో శివపీఠం ఉన్నాయి. ఈవిధంగా అనంతస్వరూపం ఆసనంగా కల్పింపబడాలి.

**సద్యోజాతం ప్రపద్యామిత్యావాహ్య పరమేశ్వరమ్ ॥29॥**

**వామదేవేన మంత్రేణ స్థాపయేదాసనోపరి ।**
**సాన్నిధ్యం రుద్రగాయత్ర్యా అఘోరేణ నిరుధ్య చ ॥30॥**

**ఈశానః సర్వవిద్యానామితి మంత్రేణ పూజయేత్ ।**
**పాద్యమాచమనీయం చ విభోశ్చార్ఘ్యం ప్రదాపయేత్ ॥31॥**

**స్నాపయేద్విధినా రుద్రం గంధచందనవారిణా ।**

'సద్యోజాతప్రపద్యామి' అనే మంత్రంతో పరమేశ్వరుడైన శివుణ్ణి ఆవాహనచేసి వామదేవమంత్రంతో ఆసనం పైభాగంలో స్థాపించాలి. రుద్రగాయత్రీమంత్రంతో సాన్నిధ్యాన్ని, అఘోరమంత్రంతో నిరోధించి 'ఈశానః సర్వవిద్యానాం' అనే ఈ మంత్రంతో శివుణ్ణి పూజించాలి. పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయం శివభగవానుడికి సమర్పించాలి. గంధంతోను, చందనంతోనూ కూడిన నీటితో రుద్రుడికి స్నానం చేయించాలి.

**పంచగవ్యం విధానేన గృహ్య పాత్రేఒభిమంత్ర్య చ ॥32॥**

**ప్రణవేనైవ గావ్యైస్తు స్నాపయేచ్చ యథావిధి ।**
**ఆజ్యేన మధునా చైవ తథా చేక్షురసేన చ ॥33॥**

**పుణ్యైర్ద్రవ్యైర్మహాదేవం ప్రణవేనాభిషేచయేత్ ।**
**జలభాండైః పవిత్రైస్తు మంత్రైస్తోయం క్షిపేత్తతః ॥34॥**

విధివిధానంగా పాత్రలో పంచగవ్యాన్ని తయారుచేసి, ప్రణవనాదపూర్వకంగా అభిమంత్రించి, తర్వాత ఆపంచగవ్యాలతో శివుడికి యథావిధిగా స్నానం చేయించాలి. తర్వాత ఓంకారనాదాన్ని పలుకుతూ నేతితో, తేనెతో, చెరుకురసంతో, పవిత్రద్రవ్యాలతో మహాదేవుణ్ణి అభిషేకించాలి. వేదమంత్రాల్ని పఠిస్తూ పవిత్రమైన పాత్రలలోని నీటితో మరల స్వామికి శుద్ధిస్నానం చేయించాలి.

**శుద్ధిం కృత్వా యథాన్యాయం సితవస్త్రేణ సాధకః ।**
**కుశాపామార్గకర్పూరజాతిపుష్పకచంపకైః ॥35॥**

**కరవీరైః సితైశ్చైవ మల్లికా కమలోత్పలైః ।**
**ఆపూర్య పుష్పైః సుశుభైః చందనాద్యైశ్చ తజ్జలమ్ ॥36॥**

**తామ్రేణ పద్మపత్రేణ పాలాశేన దలేన వా ।**
**శంఖేన మృణ్మయేనాథ శోధితేన శుభేన వా ॥37॥**

**సకూర్చేన సపుష్పేణ స్నాపయేన్మంత్రపూర్వకమ్ ।**

తర్వాత తెల్లటి వస్త్రంతో సాధకుడు యథావిధిగా నీటితో కడిగి తుడిచిన బంగారుపాత్రగాని, వెండిపాత్రగాని, రాగిపాత్రగాని, పరిశుభ్రపర్చిన అందమైన మట్టిపాత్రగాని లేకపోతే పలాశపత్రాలుగాని, తామరాకులుగాని, శంఖపత్రాలుగాని గ్రహించి వాటిని పరిశుభ్రమైన నీటితో నింపి, అందులో దర్భలు, ఉత్తరేణి ఆకులు, మంచికర్పూరం, జాతిపుష్పం, చంపకపుష్పం, ఉత్పలపుష్పం, శ్వేతకరవీరపుష్పం, మల్లెపూవు, పద్మం మొదలైన పూలను, మంచి గంధాన్ని చందనాన్ని ఆ నీటిలో వేసి సద్యోజాతాదిమంత్రాలతో అభిమంత్రించి, వివిధమంత్రాల్ని పఠిస్తూ, ఆ నీటితో పరమశివుణ్ణి అభిషేకించాలి.

**మంత్రాణి తే ప్రవక్ష్యామి శృణు సర్వార్థసిద్ధయే ॥39॥**
**యైర్లింగం సకృదప్యేవం స్నాప్య ముచ్యేత మానవః ।**

ఓ సనత్కుమారా! సమస్తమనోరథసాధకాలైన మంత్రాన్ని చెప్పుతాను విను. ఆ మంత్రజపంచేస్తూ మానవుడు ఒకసారి అయినా ఈవిధంగా శివభగవానుణ్ణి అభిషేకిస్తే భవబంధవిముక్తుడవుతాడు.

**పవమానేన మంత్రజ్ఞాః తథా వామీయకేన చ ॥40॥**

**రుద్రేణ నీలరుద్రేణ శ్రీసూక్తేన శుభేన చ ।**
**రజనీసూక్తకేనైవ చమకేన శుభేన చ ॥41॥**

**హోతారేణాథ శిరసా అథర్వేణ శుభేన చ ।**
**శాంత్యా చాథ పునః శాంత్యా భారుండకేనారుణేన చ ॥42॥**

**వారుణేన చ జ్యేష్ఠేన తథా వేదవ్రతేన చ ।**
**తథాంతరేణ పుణ్యేన సూక్తేన పురుషేణ చ ॥43॥**

**త్వరితేనైవ రుద్రేణ కపినా చ కపర్దినా ।**
**ఆవోరాజేతి సామ్నా తు బృహచ్చంద్రేణ విష్ణునా ॥44॥**

**విరూపాక్షేణ స్కందేన శతఋగ్భిః శివైస్తథా ।**
**పంచబ్రహ్మైశ్చ సూత్రేణ కేవలప్రణవేన చ ॥45॥**

**స్నాపయేద్దేవదేవేశం సర్వపాపప్రశాంతయే ।**

మంత్రవేత్తలైన ఋషులారా? పవమాన, వామ, రుద్ర, నీలరుద్ర, శ్రీసూక్త, రాత్రిసూక్త, చమక, హోతార, అథర్వశీర్ష, శాంతి, భారుండ, అరుణ, వారుణ, జ్యేష్ఠ, వేదవ్రత, అంతర, పురుష, త్వరితరుద్ర, కపి, కపర్ది, ఆవోరాజ, బృహచ్చంద్ర, విష్ణు, విరూపాక్ష, స్కంద, శతఋక్, పంచబ్రహ్మ, పంచాక్షర మంత్రాలతోనేకాక, కేవలం ఓంకారనాదంతోనే సమస్తపాప శాంతికై దేవదేవుణ్ణి అభిషేకించాలి అని సూతుడు పలికాడు.

**వస్త్రం శివోపవీతం చ తథా హ్యాచమనీయకమ్ ॥46॥**

**గంధం పుష్పం తథా ధూపం దీపమన్నం క్రమేణ తు ।**
**తోయం సుగంధితం చైవ పునరాచమనీయకమ్ ॥47॥**

**ముకుటం చ శుభం ఛత్రం తథా వై భూషణాని చ ।**
**దాపయేత్ప్రణవేనైవ ముఖవాసాదికాని చ ॥48॥**

తర్వాత వస్త్రం, యజ్ఞోపవీతం, ఆచమనీయం, గంధం, పుష్పం, ధూపం, దీపం, ప్రసాదం(అన్నం) సువాసనాభరితమైన జలం, మరల ఆచమనీయం, తలపాగ, సుందరమైన గొడుగు, అట్లే అలంకారాలు, తాంబూలం మొదలైనవి శివభగవానుడికి అర్పించాలి.

**తతః స్ఫటికసంకాశం దేవం నిష్కలమక్షరమ్ ।**
**కారణం సర్వదేవానాం సర్వలోకమయం పరమ్ ॥49॥**

**బ్రహ్మేంద్రవిష్ణురుద్రాద్యైరృషిదేవైరగోచరమ్ ।**
**వేదవిద్భిర్హి వేదాంతైస్త్వగోచరమితి శ్రుతిః ॥50॥**

**ఆదిమధ్యాంతరహితం భేషజం భవరోగిణామ్ ।**
**శివతత్త్వమితి ఖ్యాతం శివలింగే వ్యవస్థితమ్ ॥51॥**

తర్వాత స్ఫటిక సమానమైన దేహవర్ణం కలది, కళారహితమైనది, అవినాశి అయినది, సమస్తదేవతలకు, కారణమైనది, సమస్తలోకవ్యాప్తమైనది, పరాత్పరమైనది, బ్రహ్మకు, ఇంద్రుడికి, విష్ణువుకు, రుద్రాదిదేవతలకు, దేవర్షులకు అగోచరమైనది, వేదవేదాంతవేద్యులకి కూడా అగోచరమైనదని చెప్పబడేది, ఆది మధ్య అంతమూ లేనిది, భవరోగాలకు ఔషధమైనది శివతత్త్వంగా ప్రసిద్ధిచెందింది. ఇది శివలింగంలో ప్రతిష్ఠితమై ఉంది.

**ప్రణవేనైవ మంత్రేణ పూజయేల్లింగమూర్ధని ।**
**స్తోత్రం జపేచ్చ విధినా నమస్కారం ప్రదక్షిణమ్ ॥52॥**

**అర్ఘ్యం దత్త్వాథ పుష్పాణి పాదయోస్తు వికీర్య చ ।**
**ప్రణిపత్య చ దేవేశమాత్మన్యారోపయేచ్ఛివమ్ ॥53॥**

లింగంయొక్క శిరసుపై ప్రణవమంత్రాన్ని జపిస్తూ పూజించాలి. విధ్యుక్తంగా స్తోత్రాన్ని పఠిస్తూ ప్రదక్షిణం చేస్తూ నమస్కరించాలి. అర్ఘ్యాన్ని ఇచ్చి పాదాలకు పుష్పాల్ని సమర్పించి, నమస్కరించి దేవాధిదేవుడు అయిన శివుణ్ణి తనయందు ఆరోపించుకోవాలి.

**ఏవం సంక్షిప్య కథితం లింగార్చనమనుత్తమమ్ ।**
**ఆభ్యంతరం ప్రవక్ష్యామి లింగార్చనమిహాద్య తే ॥54॥**

ఓ సనత్కుమారా! ఈవిధంగా శివలింగంయొక్క ఉత్తమమైన పూజావిధానం సంగ్రహంగా చెప్పబడింది. ఇప్పుడు ఆభ్యంతరమైన లింగార్చనవిధిని చెపుతాను.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే లింగార్చనవిధిర్నామ సప్తవింశతితమోఽధ్యాయః ॥ 27 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని లింగార్చనవిధి అనే ఇరవై ఏడవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## అష్టావింశతితమోఽధ్యాయః - ఇరవై ఎనిమిదవ అధ్యాయం
## శివార్చనతత్త్వసంఖ్యాదివర్ణనమ్ - శివార్చనతత్త్వసంఖ్యాదివర్ణనం

**శైలాదిరువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఆగ్నేయం సౌరమమృతం బింబం భావ్యం తతోపరి ।**
**గుణత్రయం చ హృదయే తథా చాత్మత్రయం క్రమాత్ ॥1॥**

**తస్యోపరి మహాదేవం నిష్కలం సకలాకృతిమ్ ।**
**కాంతార్ధరూఢదేహం చ పూజయేద్ ధ్యానవిద్యయా ॥2॥**

హృదయంలో అగ్నిమండలాన్ని, సూర్యమండలాన్ని, చంద్రమండలాన్ని ధ్యానించాలి. తర్వాత క్రమంగా త్రిగుణాన్ని, ఆత్మత్రయాన్ని భావించాలి. తర్వాత కళారహితుడు, సమస్తకళాయుక్తశరీరం గలవాడు, అర్ధనారీశ్వరుడు అయిన శివుణ్ణి ధ్యానయోగంతో పూజించాలి.

**తతో బహువిధం ప్రోక్తం చింత్యం తత్రాస్తి చేద్యతః ।**
**చింతకస్య తతశ్చింతా అన్యథా నోపపద్యతే ॥3॥**

చింతకుడి ధ్యానస్థితిలోగల చిత్తంలో చింతించదగిన తత్త్వం అనేకరూపాలలో ప్రాప్తించినా వాటి అన్నింటిలో అభేదబుద్ధితో చింతించవలసిన పనిలేదు.

**తస్మాద్ధ్యేయం తథా ధ్యానం యజమానః ప్రయోజనమ్ ।**
**స్మరేత్తన్నాన్యథా జాతు బుధ్యతే పురుషస్య హ ॥4॥**

కావున యజమానుడికి ధ్యేయరూపుడైన సదాశివుడే పరమప్రయోజనం. ఆతడినే ధ్యానించాలి. ఇతరుణ్ణి ధ్యానించరాదు. ఏ ఇతరపురుషుడు యజమానుడి బుద్ధిలో నిలువరాదు.

**పురే శేతే పురం దేహం తస్మాత్పురుష ఉచ్యతే ।**
**యాజ్యం యజ్ఞేన యజతే యజమానస్తు స స్మృతః ॥5॥**

దేహమే పురం. అందు శయనించడం వల్ల జీవుడు పురుషుడుగా చెప్పబడుతున్నాడు. యజ్ఞంతో యాజ్యాన్ని యజించడంతో ఆతడు యజమానుడవుతున్నాడు.

**ధ్యేయో మహేశ్వరో ధ్యానం చింతనం నిర్వృతిః ఫలమ్ ।**
**ప్రధానపురుషేశానం యాథాతథ్యం ప్రపద్యతే ॥6॥**

మహేశ్వరుడు ధ్యేయం. ఆతడి చింతన ధ్యానం. మోక్షమే జీవనం యొక్క ప్రయోజనం. ఈ యథార్థస్థితిని తెలిసినవారు ప్రధానపురుషుడైన ఈశ్వరుణ్ణి పొందగలుగుతారు.

**ఇహ షడ్వింశకో ధ్యేయో ధ్యాతా వై పంచవింశకః ।**
**చతుర్వింశకమవ్యక్తం మహదాద్యాస్తు సప్త చ ॥7॥**

**మహాంస్తథా త్వహంకారం తన్మాత్రం పంచకం పునః ।**
**కర్మేంద్రియాణి పంచైవ తథా బుద్ధీంద్రియాణి చ ॥8॥**

**మనశ్చ పంచభూతాని శివః షడ్వింశకస్తతః ।**
**స ఏవ భర్తా కర్తా చ విధేరపి మహేశ్వరః ॥9॥**

ఇరవైఆరవతత్త్వమైన పరమాత్మ ధ్యానింపతగినవాడు. ఇరవై అయిదవ తత్త్వమైన జీవుడు ధ్యానము చేయువాడు. ఇరవై నాలుగుతత్త్వాలు అవ్యక్తమయిన ప్రకృతివి. మహదాదులవి ఏడు తత్త్వాలు. మహత్తత్త్వం, అహంకారం ఐదు తన్మాత్రలు అవి. ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు. మనస్సు, పంచభూతాలు ఇవి, శివుడు ఇరవై ఆరవవాడు. ఆతడే భరించేవాడు. ఆతడే విధిని రచించేవాడు.

**హిరణ్యగర్భం రుద్రోఽసౌ జనయామాస శంకరః ।**
**విశ్వాధికశ్చ విశ్వాత్మా విశ్వరూప ఇతి స్మృతః ॥10॥**

ఈ రుద్రుడే బ్రహ్మకు తండ్రి. ఈ శంకరుడే ఈ జగత్తుకు అధిపతి. ఆతడే విశ్వాత్ముడు. విశ్వరూపుడు కూడా.

**వినా యథా హి పితరం మాతరం తనయాస్త్విహ ।**
**న జాయంతే తథా సోమం వినా నాస్తి జగత్త్రయమ్ ॥11॥**

ఏవిధంగా తల్లిదండ్రులు లేక బిడ్డలు కలగరో అదే విధంగా శివుడులేక మూడులోకాలు లేవు.

**సనత్కుమార ఉవాచ –** సనత్కుమారుడు పలికాడు.

**కర్తా యది మహాదేవః పరమాత్మా మహేశ్వరః ।**
**తథా కారయితా చైవ కుర్వతోఽ ల్పాత్మనస్తథా ॥12॥**

**నిత్యో విశుద్ధో బుద్ధశ్చ నిష్కలః పరమేశ్వరః ।**
**త్వయోక్తో ముక్తిదః కిం వా నిష్కలశ్చేత్కరోతి కిమ్ ॥13॥**

పరమాత్ముడు, మహాదేవుడు అయిన మహేశ్వరుడు నిత్యుడు, విశుద్ధుడు, చైతన్యుడు, బుద్ధుడు అల్పజీవులకి ముక్తి ప్రదాత, విశ్వకర్త అయిఉండీ నిష్క్రియుడు ఎలా కాగలుగుతున్నాడు?

**శైలాదిరువాచ –** నందీశ్వరుడు పలికాడు.

**కాలః కరోతి సకలం కాలం కలయతే సదా ।**
**నిష్కలం చ మనః సర్వం మన్యతే సోఽపి నిష్కలః ॥14॥**

కాలం సంపూర్ణమైన జగత్తును సృష్టిస్తున్నది. ఎల్లప్పుడు కాలాన్ని పరమేశ్వరుడు ప్రేరేపిస్తాడు. అనగా కాలమనే మాధ్యమం ద్వారా శివుడు ప్రాణుల్ని బంధముక్తుల్ని చేస్తాడు. నిష్కలమైన మనస్సు శివుణ్ణి ధ్యానిస్తుంది. అతడునూ నిష్కలుడే.

**కర్మణా తస్య చైవేహ జగత్సర్వం ప్రతిష్ఠితమ్ ।**
**కిమత్ర దేవదేవస్య మూర్త్యష్టకమిదం జగత్ ॥15॥**

**వినాకాశం జగన్నైవ వినా క్ష్మాం వాయునా వినా ।**
**తేజసా వారిణా చైవ యజమానం తథా వినా ॥16॥**

**భానునా శశినా లోకస్తస్యైతాస్తనవః ప్రభోః ।**
**విచారతస్తు రుద్రస్య స్థూలమేతచ్చరాచరమ్ ॥17॥**

శివుడియొక్క కర్మచేతనే సమస్తజగత్తు ప్రతిష్ఠితమవుతున్నది. ఈ విశ్వం పరమేశ్వరుడియొక్క ఎనిమిదిమూర్తుల వికారమే. ఆకాశం, భూమి, వాయువు, అగ్ని, జలం, యజమానుడు సూర్యచంద్రులు లేకుండా ఈ జగత్తులేదు. ఈ ఎనిమిది శివుడుయొక్క స్వరూపాలు. ఆలోచించగా ఈ స్థావరజంగమ జగత్తు సమస్తమూ రుద్రభగవానుడియొక్క స్థూలస్వరూపమే అవుతుంది.

**సూక్ష్మం వదంతి ఋషయో యన్న వాచ్యం ద్విజోత్తమాః ।**
**యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ ॥18॥**

ఓ బ్రాహ్మణోత్తములారా! శివుడియొక్క సూక్ష్మతనువు ఇట్టిదని చెప్పలేమని ఋషులు పలుకుతున్నారు. అది వాచామగోచరం. మనస్సునకూ అందనట్టిది.

**ఆనందం బ్రహ్మణో విద్వాన్నబిభేతి కుతశ్చన ।**
**న భేతవ్యం తథా తస్మాత్ జ్ఞాత్వానందం పినాకినః ॥19॥**

ఆనందమే రుద్రస్వరూపం(ఇక్కడ బ్రహ్మ అనగా శివుడే). అట్టి ఆనందాన్ని అనుభవించే సమయంలో పండితుడు(యోగి) ఏవిధంగాను భయపడడు. అందువల్ల పినాకి అయిన శివుడి ఆనందమయ స్వరూపాన్ని తెలిసికొని ఎవ్వరూ భయపడపనిలేదు.

**విభూతయశ్చ రుద్రస్య మత్వా సర్వత్ర భావతః ।**
**సర్వం రుద్ర ఇతి ప్రాహుర్మునయస్తత్త్వదర్శినః ॥20॥**

భావింపగా అంతటా రుద్రుడియొక్క సంపదలే ఉన్నవని తెలిసి, తత్త్వవేత్తలయిన ఋషులు సమస్తమూ రుద్రభగవానుడనే చెప్పుతున్నారు.

**నమస్కారేణ సతతం గౌరవాత్పరమేష్ఠినః ।**
**సర్వం తు ఖల్విదం బ్రహ్మ సర్వో వై రుద్ర ఈశ్వరః ॥21॥**

**పురుషో వై మహాదేవో మహేశానః పరః శివః ।**
**ఏవం విభుర్వినిర్దిష్టో ధ్యానం తత్రైవ చింతనమ్ ॥22॥**

బ్రహ్మదేవుడు శివుడి గౌరవాన్ని అనగా మహిమను గుర్తించి ఎల్లప్పుడూ నమస్కరిస్తాడు. ఈ సమస్తజగత్తూ శివస్వరూపమే. రుద్రుడు, ఈశ్వరుడు, పురుషుడు, మహాదేవుడు, మహేశానుడు, పరాత్పరుడు, శివుడు అందరూ ఆతడేనని తెలిసి ఆ విభుణ్ణి ధ్యానించాలి. చింతించాలి.

**చతుర్వ్యూహేణ మార్గేణ విచార్యాలోక్య సువ్రత ।**
**సంసారహేతుః సంసారో మోక్షహేతుశ్చ నిర్వృతిః ॥23॥**

**చతుర్వ్యూహః సమాఖ్యాతః చింతకస్యేహ యోగినః ।**
**చింతా బహుర్విధా ఖ్యాతా సైకత్ర పరమేష్ఠినా ॥24॥**

**సునిష్ఠేత్యత్ర కథితా రుద్రం రౌద్రీ న సంశయః ।**

ఓ సువ్రతులారా! ధ్యేయం, ధ్యానం, యజమానుడు, ప్రయోజనం అనే నాలుగు వ్యూహాల ద్వారా ఆలోచించి, సందర్శించి పరమేశ్వరుణ్ణి తెలియాలి. సంసర్గానికి కారణం మమతే. విరాగమే ముక్తి కారణం. చింతకుడైన యోగికి ఈ నాల్గువ్యూహమార్గాలు సర్వశ్రేష్ఠమైనవి. బ్రహ్మదేవుడు అనేకవిధాలైన చింతనమార్గాల్ని తెలియజేశాడు. అయితే రుద్రధ్యానమే శ్రేష్ఠమైనది. ఇందులో ఎటువంటి సందేశంలేదు. కావున అందులోనే సునిష్ఠితులు కావాలి.

**ఐంద్రీ చైంద్రీ తథా సౌమ్యా సోమో నారాయణే తథా ॥25॥**

**సూర్యే వహ్నౌ చ సర్వేషాం సర్వత్రైవం విచారతః ।**
**సైవాహం సోఽహమిత్యేవం ద్విధా సంస్థాప్య భావతః ॥26॥**

**భక్తోఽసౌ నాస్తి యస్తస్మాచ్చింతా బ్రాహ్మీ న సంశయః ।**

ఇంద్రసంబంధమైన ఐంద్రీచింత, సోముడికి చెందిన సౌమ్యచింత, నారాయణ, సూర్యాగ్నిచింతలు అన్నీ ఆలోచించగా రుద్రచింతలే అవుతాయి. ఆ చింతన నేనే, ఆ శివుణ్ణి నేనే అనే ఈ రెండు భావాల్ని మనసులో స్థిరపర్చుకున్న భక్తుడు పరమేశ్వరుడి కంటె భిన్నుడుకాడు. ఈవిధమైన చింతన బ్రాహ్మీ అనబడుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు.

**చరాచరవిభాగం చ త్యజేదభిమతం స్మరన్ ।**
**త్యాజ్యం గ్రాహ్యమలభ్యం చ కృత్యం చాకృత్యమేవ చ ॥28॥**

**యస్య నాస్తి సుతృప్తస్య తస్య బ్రాహ్మీ న చాన్యథా ।**

ఓ బ్రాహ్మణుడా! ముందుగా ఈ ప్రకారంగా చింతనచేసి స్థావరజంగమమైన ఈ జగత్తు అంతయు బ్రహ్మమయంగా తెలియాలి. తర్వాత బ్రహ్మస్వరూపుడైన శివుణ్ణి స్మరిస్తూ చరాచర విభాగబుద్ధికూడా విడిచిపెట్టాలి.

అనగా ఇది స్థావరం, ఇది జంగమం. ఇది యోగికి విడిచిపెట్టదగింది, గ్రహింపదగింది, పొందలేనిది, చేయదగినది, చేయరానిది ఉండదు. ఇట్టి పరమతుష్టుడైన యోగియొక్క చింతన బ్రాహ్మీచింతన కాగలదు. ఇది వేరొకటి కాదు.

**ఆభ్యంతరం సమాఖ్యాతమేవమభ్యర్చనం క్రమాత్ ॥29॥**

**ఆభ్యంతరార్చకాః పూజ్యా నమస్కారాదిభిస్తథా ।**
**విరూపా వికృతాశ్చాపి న నింద్యా బ్రహ్మవాదినః ॥30॥**

ఈవిధంగా ఆభ్యంతరార్చన క్రమాన్ని (విధానాన్ని) తెలియజేశాను. ఈవిధమైన ఆభ్యంతరపూజకులైన యోగులు నమస్కరించుట మొదలైన పనులతో పూజింపదగినవారు. వికారరూపులుగా ఉన్నా, వికృతమైన పనులు చేస్తున్నా బ్రహ్మవాదులైన వారు అనింద్యులు.

**ఆభ్యంతరార్చకాః సర్వే న పరీక్ష్యా విజానతా ।**
**నిందకా ఏవ దుఃఖార్తా భవిష్యంత్యల్పచేతసః ॥31॥**

**యథా దారువనే రుద్రం వినింద్య మునయః పురా ।**
**తస్మాత్సేవ్యా నమస్కార్యాః సదా బ్రహ్మవిదస్తథా ॥32॥**

**వర్ణాశ్రమవినిర్ముక్తా వర్ణాశ్రమపరాయణైః ॥33॥**

బుద్ధిమంతులైన మానవులు ఆభ్యంతరపూజాపరులైన యోగుల్ని ఎటువంటి పరీక్షలకు గురిచేయరాదు. దూషించిన ఆ అల్పబుద్ధులైన మానవులు దుఃఖపీడితులవుతారు, పూర్వం దారుకావనంలో రుద్రుణ్ణి నిందించిన ఋషులమాదిరిగా. అందువల్ల వర్ణాశ్రమరహితులు బ్రహ్మవేత్తలయిన వారు ఎల్లప్పుడూ వర్ణాశ్రమసంస్థితులైనవారికి నమస్కరింపదగినవారు. పూజింపదగినవారు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే శివార్చనతత్త్వ సంఖ్యాదివర్ణనం నామ అష్టావింశతితమోఽధ్యాయః ॥ 28॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని శివార్చనతత్త్వ సంఖ్యాది వర్ణనమనే ఇరవై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## ఏకోనత్రింశత్తమో௨ధ్యాయః - ఇరవై తొమ్మిదవ అధ్యాయం

## దేవదారు వనవృత్తాంతవర్ణనమ్ - దేవదారు వనవృత్తాంతవర్ణనం

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**ఇదానీం శ్రోతుమిచ్ఛామి పురా దారువనే విభో ।**
**ప్రవృత్తం తద్వనస్థానం తపసా భావితాత్మనామ్ ॥1॥**

ఓ నందీశ్వరా! ప్రాచీనకాలంలో దారువనంలో ఋషులవల్ల జరిగిన సంఘటనను ఇప్పుడు వినదలచాను.

**కథం దారువనం ప్రాప్తో భగవాన్నీలలోహితః ।**
**వికృతం రూపమాస్థాయ చోర్ధ్వరేతా దిగంబరః ॥2॥**

**కిం ప్రవృత్తం వనే తస్మిన్ రుద్రస్య పరమాత్మనః ।**
**వక్తుమర్హసి తత్త్వేన దేవదేవస్య చేష్టితమ్ ॥3॥**

ఊర్ధ్వరేతస్కుడు, దిగంబరుడు, నీలలోహితుడైన శివభగవానుడు వికృతరూపాల్ని ధరించి దారుకావనానికి ఎలా వెళ్లాడు? పరమాత్ముడైన రుద్రభగవానుడు అక్కడ ఏమి చేశాడు. దేవదేవుడి పనులను యథాతథంగా చెప్పదగినవాడవు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**తస్య తద్వచనం శ్రుత్వా శ్రుతిసారవిదాం వరః ।**
**శిలాదసూనుర్భగవాన్ ప్రాహ కించిద్భవం హసన్ ॥4॥**

ఓ ఋషులారా! ఆ సనత్కుమారుడి మాటనువిని వేదవేత్తలలో శ్రేష్ఠుడు, శిలాదునిపుత్రుడు అయిన నందీశ్వరుడు శివుణ్ణి స్మరిస్తూ చిరునవ్వుతో ఇలా చెప్పాడు.

**శైలాది రువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**మునయో దారుగహనే తపస్తేపుః సుదారుణమ్ ।**
**తుష్ట్యర్థం దేవదేవస్య సదారతనయాగ్నయః ॥5॥**

**తుష్టోరుద్రో జగన్నాథశ్చేకితానో వృషధ్వజః ।**
**ధూర్జటిః పరమేశానో భగవాన్నీలలోహితః ॥6॥**

**ప్రవృత్తిలక్షణం జ్ఞానం జ్ఞాతుం దారువనౌకసామ్ ।**
**పరీక్షార్థం జగన్నాథః శ్రద్ధయా క్రీడయా చ సః ॥7॥**

**నివృత్తిలక్షణజ్ఞానప్రతిష్ఠార్థం చ శంకరః ।**
**దేవదారువనస్థానాం ప్రవృత్తిజ్ఞానచేతసామ్ ॥8॥**

**వికృతం రూపమాస్థాయ దిగ్వాసా విషమేక్షణః ।**
**ముగ్ధో ద్విహస్తః కృష్ణాంగో దివ్యం దారువనం యయౌ ॥9॥**

ఒకప్పుడు దేవదారువనంలో దేవదేవుణ్ణి సంతోషింపజేయటానికై ఋషులు భార్యాపుత్రసమేతంగా అగ్నిని సేవిస్తూ కఠినతపస్సు చేశారు. వారి ఆ తపస్సుకు సంతుష్టుడైన జగన్నాథుడు, చేకితానుడు, వృషధ్వజుడు, ధూర్జటి, పరమేశ్వరుడు, నీలలోహితుడు, రుద్రుడు, దిగంబరుడు, ద్విబాహువు అయిన ముక్కంటి దేవదారువనంలో నివసించే మునులయొక్క ప్రవృత్తి లక్షణాల్ని, జ్ఞానాన్ని తెలియదలచి వారిలోని శ్రద్ధావిషయాన్ని పరీక్షించడానికి, వారిలో నివృత్తి లక్షణాన్ని, జ్ఞానాన్ని స్థాపించడానికై, నల్లటి శరీరావయవాలు గలవాడై ముగ్ధుడై శంకరుడు వికృతరూపాన్ని ధరించి దారువనానికి వెళ్లినాడు.

**మందస్మితం చ భగవాన్ స్త్రీణాం మనసిజోద్భవమ్ ।**
**భ్రూవిలాసం చ గానం చ చకారాతీవ సుందరః ॥10॥**

మిక్కిలి అందగాడైన శివుడు మన్మథవికారంగల చిరునవ్వును, కనుసన్నను, (కన్నుకొట్టడం) గీతాలను ఆలపిస్తూ స్త్రీలకు కామభావన కల్గించినాడు.

**సంప్రేక్ష్య నారీబృందం వై ముహుర్ముహురనంగహా ।**
**అనంగవృద్ధిమకరోదతీవ మధురాకృతిః ॥11॥**

రమణీయరూపుడు, మన్మథసంహారి అయిన శివుడు ఆ స్త్రీసమూహాన్ని మాటమాటికి బాగా చూచి మిక్కిలిగా కామవాంఛను వృద్ధిచేశాడు.

**వనే తం పురుషం దృష్ట్వా వికృతం నీలలోహితమ్ ।**
**స్త్రియః పతివ్రతాశ్చాపి తమేవాన్వయురాదరాత్ ॥12॥**

ఆ వనంలో వికృతాకారుడు, నీలలోహితుడు అయిన ఆ పురుషుణ్ణి చూచి పతివ్రతలైన స్త్రీలు కూడా ఆతడినే అభిమానిస్తూ, వెనుక వెనుక తిరిగారు.

**వనోటజద్వారగతాశ్చ నార్యో విస్రస్తవస్త్రాభరణా విచేష్టాః ।**
**లబ్ధ్వా స్మితం తస్య ముఖారవిందాత్ ద్రుమాలయస్థాస్తమథాన్వయుస్తాః ॥13॥**

అరణ్యంలోని కుటీరద్వారాలలో నిలిచిన స్త్రీల వస్త్రాభరణాలు జారిపోయాయి. వారు చేష్టలు ఉడిగి నిలిచారు. ఆ పురుషుడియొక్క వదనకమలంనుంచి వెలువడిన నవ్వును పొంది వృక్షాశ్రయులైన స్త్రీలుకూడా ఆతడి వెనుక బడినారు.

**దృష్ట్వా కాశ్చిద్ధ్రువం నార్యో మదఘూర్ణితలోచనాః ।**
**విలాసబాహ్యాస్తాశ్చాపి భ్రూవిలాసం ప్రచక్రిరే ॥14॥**

ప్రౌఢస్త్రీలు కూడా ఆ శివుడిని చూచి మదమత్తలోచనలై విలాసంగా కనుసన్నలు చేసినారు.

**అథ దృష్ట్వా పరనార్యః కించిత్ప్రహసితాననాః ।**
**కించిద్విస్రస్తవసనాః స్రస్తకాంచీగుణా జగుః ॥15॥**

తర్వాత ఇతరవనితలుకూడా శివుణ్ణి చూచి బాగా నవ్వారు. వారి వస్త్రాలు కొద్దిగా జారిపోయాయి. మొలనూళ్లు(వడ్డాణాలు) జారిపోయాయి. వారందరూ గానం చేశారు.

**కాశ్చిత్తదా తం విపినే తు దృష్ట్వా విప్రాంగనాః స్రస్తనవాంశుకం వా ।**
**స్వాన్ స్వాన్ విచిత్రాన్ వలయాన్ ప్రవిధ్య మదాన్వితా బంధుజనాంశ్చ జగ్ముః ॥16॥**

దారుకావనంలో శివుణ్ణి చూచిన కొందరు బ్రాహ్మణస్త్రీలు కూడా జారిన నూతనవస్త్రాలు కలవారై, వారు ధరించిన వివిధవర్ణాలతో కూడిన వలయాలను తీసివేసి, మదనపరవశలై తమ బంధుజనాన్ని చేరినారు.

**కాచిత్తదా తం న వివేద దృష్ట్వా వివాసనా స్రస్తమహాంశుకా చ ।**
**శాఖావిచిత్రాన్ విటపాన్ ప్రసిద్ధాన్ మదాన్వితా బంధుజనాంస్తథాన్యాః ॥17॥**

అప్పుడు ఆ శివుణ్ణి చూచినవారిలో కొందరు స్త్రీలు వస్త్రహీనలైనారు. కొందరు జారిన మంచి వస్త్రాలుగలవారైనారు. మదనపరవశలైనవాళ్లు తమబంధువుల్ని గుర్తించలేదు. చెట్లకొమ్మలు విరిగిపోవటాన్ని కూడా తెలియకపోయారు.

**కాశ్చిజ్జగుస్తం ననృతుర్నిపేతుశ్చ ధరాతలే ।**
**నిషేదుర్గజవచ్చాన్యా ప్రోవాచ ద్విజపుంగవాః ॥18॥**

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! కొందరు స్త్రీలు ఆతడి దగ్గరకు వెళ్లి పాడారు. కొందరు నాట్యం చేశారు. కొందరు భూమిపై దొర్లారు. కొందరు ఏనుగువలె భూమిపై కూర్చుని పెద్దగా అరచారు.

**అన్యోన్యం సస్మితం ప్రేక్ష్య చాలిలింగుః సమంతతః ।**
**నిరుధ్య మార్గం రుద్రస్య నైపుణాని ప్రచక్రిరే ॥19॥**

నవ్వుతూ ఒకరినొకరు చూచుకుని బాగా ఆలింగనం చేసికొన్నారు. రుద్రభగవానుణ్ణి నిలిపి బహువిధాలైన హావభావనైపుణ్యాన్ని ప్రదర్శించారు.

**కో భవానితి చాహుస్తమాస్యతామితి చాపరాః ।**
**కుత్రేత్యథ ప్రసీదేతి జజల్పుః ప్రీతమానసాః ॥20॥**

నీవెవ్వడవని కొందరు ప్రశ్నించారు. ఇక్కడ కూర్చోమని మరికొందరు పలికారు. సంతోషించిన హృదయంగలవారై కొందరు నీవు ఎక్కడకు వెళ్లుతున్నావు? మమ్మల్ని అనుగ్రహించమని పలికినారు.

**విపరీతా నిపేతుర్వై విస్రస్తాంశుమూర్ధజాః ।**
**పతివ్రతాః పతీనాం తు సన్నిధౌ భవమాయయా ॥21॥**

భగవంతుడైన శివుడి మాయవల్ల పతివ్రతలైన ఆ స్త్రీలు వారి భర్తల ఎదుటనే చెదరిన వస్త్రాలు, శిరోజాలు గలవారై విపరీతప్రవర్తన గలవారై పడిపోయారు.

**దృష్ట్వా శ్రుత్వా భవస్తాసాం చేష్టావాక్యాని చావ్యయః ।**
**శుభం వాప్యశుభం వాపి నోక్తవాన్ పరమేశ్వరః ॥22॥**

ఆస్త్రీలయొక్క పనుల్ని, పలుకుల్ని చూచి, విని నిర్వికారుడై శివుడు మంగళకరమైన మాటను గాని అమంగళకరమైన మాటను గాని పలకలేదు.

**దృష్ట్వా నారీ కులం విప్రాస్తథాభూతం చ శంకరమ్ ।**
**అతీవపరుషం వాక్యం జజల్పుస్తే మునీశ్వరాః ॥23॥**

ఋషిశ్రేష్ఠులు ఆ స్త్రీసమూహాన్నీ ఆవిధంగా ఉన్న శంకరుణ్ణీ చూచి ఆతణ్ణి ఉద్దేశించి మిక్కిలి కాఠిన్యంతోకూడిన మాటల్ని పలికారు.

**తపాంసి తేషాం సర్వేషాం ప్రత్యాహన్యంత శంకరే ।**
**యథాదిత్యప్రకాశేన తారకా నభసి స్థితాః ॥24॥**

వారి అందరియొక్క తపశ్శక్తి అనగాశాపప్రభావం శివుడి విషయంలో ప్రతిహతమైనది. ఏవిధంగా సూర్యప్రకాశంవల్ల నక్షత్రాలు ఆకాశంలో నిస్తేజాలు అవుతాయో ఆవిధంగా.

**శ్రూయతే ఋషిశాపేన బ్రహ్మణస్తు మహాత్మనః ।**
**సమృద్ధశ్రేయసాం యోనిర్యజ్ఞో వై నాశమాప్తవాన్ ॥25॥**

ఆ విధమైన ఋషులశాపాన్ని మహాత్ముడైన బ్రహ్మ విన్నాడు. సమస్తాభివృద్ధికి, కళ్యాణాలకు ఉత్పత్తిస్థానమైన యజ్ఞం నాశనాన్ని పొందింది.

**భృగోరపి చ శాపేన విష్ణుః పరమవీర్యవాన్ ।**
**ప్రాదుర్భావాన్ దశ ప్రాప్తో దుఃఖితశ్చ సదా కృతః ॥26॥**

మిక్కిలి బలవంతుడైన విష్ణుమూర్తి భృగుమహర్షియొక్క శాపంచేత పది అవతారాలు ఎత్తి, ఎల్లప్పుడూ దుఃఖాన్ని పొందాడు.

**ఇంద్రస్యాపి చ ధర్మజ్ఞ భిన్నం సవృషణం పురా ।**
**ఋషిణా గౌతమేనోర్వ్యాం క్రుద్ధేన వినిపాతితమ్ ॥27॥**

ఓ ధర్మవేత్తా! సనత్కుమారా! పూర్వం కుపితుడైన గౌతమమునివల్ల ఇంద్రునియొక్క వృషణంతోకూడిన గోప్యాంగం తెగి భూమిపై పడింది.

**గర్భవాసో వసూనాం చ శాపేన విహితస్తథా ।**
**ఋషీణాం చైవ శాపేన నహుషః సర్పతాం గతః ॥28॥**

వసిష్ఠముని శాపకారణంగా అష్టవసువులు గంగాదేవియొక్క గర్భంలో ఉండవలసి వచ్చింది. అగస్త్యుడు మొదలుగాగల మునుల శాపం చేతనే నహుష మహారాజు సర్పం అయ్యాడు.

**క్షీరోదశ్చ సముద్రోஉసౌ నివాసః సర్వదా హరేః ।**
**ద్వితీయశ్చామృతాధారో హ్యపేయో బ్రాహ్మణైః కృతః ॥29॥**

విష్ణుదేవుడికి ఎల్లప్పుడూ నివాసమైన అమృతానికి ఆధారస్థానమైన పాలసముద్రం కూడా బ్రాహ్మణమునులచేత త్రాగడానికి  పనికిరాని రెండవదిగా చేయబడింది.

**అవిముక్తేశ్వరం ప్రాప్య వారాణస్యాం జనార్దనః ।**
**క్షీరేణ చాభిషిచ్యేశం దేవదేవం త్రియంబకమ్ ॥30॥**

**శ్రద్ధయా పరయా యుక్తో దేహోశ్లేషామృతేన వై ।**
**నిషిక్తేన స్వయం దేవః క్షీరేణ మధుసూదనః ॥31॥**

**సేచయిత్వాథ భగవాన్ బ్రహ్మణా మునిభిః సమమ్ ।**
**క్షీరోదం పూర్వవచ్చక్రే నివాసం చాత్మనః ప్రభుః ॥32॥**

భగవంతుడు, జనార్దనుడు అయిన విష్ణుమూర్తి వారణాసి క్షేత్రంలోగల అవిముక్తేశ్వరానికి వెళ్లి దేవదేవుడు, త్రినేత్రుడయిన శివుడిని పాలతో అభిషేకించాడు. పరమశ్రద్ధాళువై దేవసంస్పర్శజన్యమై అమృతప్రాయమైన పాలతో స్వయంగా మధుసూదనుడైన విష్ణువు బ్రహ్మ మరియు మునులతో కూడి భగవంతుడైన శివుడికి అభిషేకంచేసి పూర్వంమాదిరిగానే క్షీరసాగరమందే తన నివాసాన్ని ఏర్పరచుకున్నాడు.

**ధర్మశ్చైవ తథాశప్తో మాండవ్యేన మహాత్మనా ।**
**వృష్ణయశ్చైవ కృష్ణేన దుర్వాసాద్యైర్మహాత్మభిః ॥33॥**

మహాభాగుడైన మాండవ్యమహర్షిచేత యమధర్మరాజు శపింపబడినాడు. మహాత్ములైన దుర్వాసుడు మొదలైన ఋషులచేత శ్రీకృష్ణుడుతోకూడి యాదవులు శపింపబడ్డారు.

**రాఘవః సానుజశ్చాపి దుర్వాసేన మహాత్మనా ।**
**శ్రీవత్సశ్చ మునేః పాదపతనాత్తస్య ధీమతః ॥34॥**

**ఏతే చాన్యే చ బహవో విప్రాణాం వశమాగతాః ।**
**వర్జయిత్వా విరూపాక్షం దేవదేవముమాపతిమ్ ॥35॥**

మహాత్ముడైన దుర్వాసుడి చేత సోదరసహితుడైన రాముడు శపింపబడ్డాడు. ధీమంతుడైన భృగువు చేత శ్రీయుక్తమైన అనగా లక్ష్మీదేవితో కూడిన వక్షఃస్థలం మీద విష్ణువు పాదతాడనం పొందాడు. ఇవీ, ఇంకా కొన్ని చాలా ఉదంతాలు విప్రులైన ఋషుల వశమై ఉన్నాయి. ఒక్క దేవదేవుడైన పార్వతీపతికి మాత్రం ఈ శాపస్థితి విడిచిపెట్టడం జరిగింది.

**ఏవం హి మోహితాస్తేన నావబుధ్యంత శంకరమ్ ।**
**అత్యుగ్రవచనం ప్రోచుశ్చోగ్రోఽప్యంతరధీయత ॥36॥**

ఈవిధంగా మోహితులైన ఋషులు శివుణ్ణి గుర్తించలేదు. మిక్కిలి కఠినమైన మాటను పలికారు. శివుడును అంతర్ధానం చెందాడు.

**తేఽపి దారువనాత్తస్మాత్ప్రాతః సంవిగ్నమానసాః ।**
**పితామహం మహాత్మానమాసీనం పరమాసనే ॥37॥**

**గత్వా విజ్ఞాపయామాసుః ప్రవృత్తమఖిలం విభోః ।**
**శుభే దారువనే తస్మిన్ మునయః క్షీణచేతసః ॥38॥**

తర్వాత ప్రాతః కాలంలో బలహీనమనస్కులు, వ్యాకులచిత్తులైన ఆ మునులు దారుకావనం నుంచి ఉన్నతాసనం పైనున్న బ్రహ్మ దగ్గరకు వెళ్లి, మంగళప్రదమైన దారువనంలో జరిగిన పూర్తి విషయాలను తెలియజేశారు.

**సోఽపి సంచింత్య మనసా క్షణాదేవ పితామహః ।**
**తేషాం ప్రవృత్తమఖిలం పుణ్యే దారువనే పురా ॥39॥**

బ్రహ్మదేవుడు క్షణకాలం మనసుతో బాగా ఆలోచించి, పుణ్యప్రదమైన దారుకావనంతో ఇంతకుముందు ఆ ఋషులకు జరిగిన సమస్తవిషయాల్ని తెలుసుకొన్నాడు.

**ఉత్థాయ ప్రాంజలిర్భూత్వా ప్రణిపత్య భవాయ చ ।**
**ఉవాచ సత్వరం బ్రహ్మ మునీన్ దారువనాలయాన్ ॥40॥**

**ధిగ్యుష్మాన్ ప్రాప్తనిధనాన్ మహానిధిమనుత్తమమ్ ।**
**వృథాకృతం యతో విప్రా యుష్మాభిర్భాగ్యవర్జితైః ॥41॥**

ఆసనంనుంచి లేచి, అంజలిఘటించి, శివుడికి నమస్కరించి, దారువననివాసులైన మునులను గూర్చి బ్రహ్మదేవుడు త్వరగా ఇలా పలికాడు. ఓ బ్రాహ్మణులారా! వినాశము ప్రాప్తించిన మిమ్ము నిందించాలి. భాగ్యరహితులైన మీరు సర్వోత్తమనిధిని వ్యర్థపర్చారు.

**యస్తు దారువనే తస్మిన్ లింగీ దృష్టోఽప్యలింగిభిః ।**
**యుష్మాభిర్వికృతాకారః స ఏవ పరమేశ్వరః ॥42॥**

అలింగులైన మీరు దారువనంలో చూచిన లింగుడు, వికృతాకారుడు అయిన ఆతడు పరమేశ్వరుడే.

**గృహస్థైశ్చ న నింద్యాస్తు సదా హ్యతిథయో ద్విజాః ।**
**విరూపాశ్చ సరూపాశ్చ మలినాశ్చాప్యపండితాః ॥43॥**

**సుదర్శనేన మునినా కాలమృత్యురపి స్వయమ్ ।**
**పురాభూయౌ ద్విజాగ్రేణ జితో హ్యతిథిపూజయా ॥44॥**

ఓ బ్రాహ్మణులారా! కుటుంబీకులచేత అతిథులు ఎల్లప్పుడు నిందింపగినవారు కాదు. వారు వికృతాకారులు అయినా సుందరాకారులైనా మలినదేహులైనా పామరులైనా కూడా. పూర్వకాలంలో భూమిపై విప్రశ్రేష్ఠుడైన సుదర్శనఋషిచేత అతిథిపూజవల్ల సాక్షాత్తు కాలయముడే జయింపబడినాడు.

**అన్యథా నాస్తి సంతర్తుం గృహస్థైశ్చ ద్విజోత్తమైః ।**
**త్యక్త్వా చాతిథిపూజాం తామాత్మనో భువి శోధనమ్ ॥45॥**

భవసాగరాన్ని ఈదడానికి, ఆత్మను శుద్ధిపర్చుకోవడానికి గృహస్థబ్రాహ్మణులకు ఈలోకంలో అతిథిపూజను మించిన సాధనం మరొకటి లేదు.

**గృహస్థోఽపి పురా జేతుం సుదర్శన ఇతి శ్రుతః ।**
**ప్రతిజ్ఞామకరోజ్జాయాం భార్యామాహ పతివ్రతామ్ ॥46॥**

**సువ్రతే సుభ్రు సుభగే శృణు సర్వం ప్రయత్నతః ।**
**త్వయా వై నావమంతవ్యా గృహే హ్యతిథయః సదా ॥47॥**

పూర్వకాలంలో సుదర్శనుడనే గృహస్థుడైన ముని పతివ్రతయైన తన భార్యకు ప్రతిజ్ఞ చేసినాడు.

ఓ సువ్రతీ! ఓ సుందరమైన భ్రుకుటికలదానా! ఓ సౌభాగ్యవతీ! ఈ మాట విను. ఎల్లప్పుడూ నీచేత మన గృహంలో అతిథులు నిరాదరింపబడరాదు. ఇది అంతా గట్టి ప్రయత్నంగా నిర్వహించాలి.

**సర్వ ఏవ స్వయం సాక్షాదతిథిర్యత్పినాకధృక్ ।**
**తస్మాదతిథయే దత్త్వా ఆత్మానమపి పూజయ ॥48॥**

**ఏవముక్త్వాథ సంతప్తా వివశా సా పతివ్రతా ।**
**పతిమాహ రుదంతీ చ కిముక్తం భవతా ప్రభో ॥49॥**

**తస్యాస్తద్వచనం శ్రుత్వా పునః ప్రాహ సుదర్శనః ।**
**దేయం సర్వం శివాయార్యే శివ ఏవాతిథిః స్వయమ్ ॥50॥**

**తస్మాత్సర్వే పూజనీయాః సర్వేఽప్యతిథయః సదా ।**

అతిథి సాక్షాత్తు స్వయంగా పినాకపాణియే. అందుచేత తనను కూడా అర్పించుకుని అతిథిని పూజించాలి. ఈవిధంగా పతి పలకగా మిక్కిలి బాధపడి, వివశురాలైన ఆ పతివ్రత దుఃఖిస్తూ మీరేమిచెప్పుతున్నారని భర్తనుగూర్చి పలికింది. ఆమెయొక్క ఆ మాటను విని సుదర్శనుడు మరల పలికాడు. ఓ ఆర్యా! శివుడి కోసం సమస్తం ఇవ్వాలి. అతిథి సాక్షాత్తు శివుడే. అందువల్ల అందరు అతిథులు ఎల్లప్పుడూ శివుడి మాదిరిగా పూజింపదగినవారు.

**ఏవముక్త్వా తథా భర్తా భార్యా తస్య పతివ్రతా ॥51॥**

**శేషామివాజ్ఞామాదాయ మూర్ధ్నా సా ప్రాచరత్తదా ।**
**పరీక్షితుం తథా శ్రద్ధాం తయోః సాక్షాద్ ద్విజోత్తమాః ॥52॥**

**ధర్మో ద్విజోత్తమో భూత్వా జగామాథ మునేర్గృహమ్ ।**
**తం దృష్ట్వా చార్చయామాస సార్ఘాద్యైరనఘా ద్విజమ్ ॥53॥**

భర్త ఆవిధంగా చెప్పగా ఆ పతివ్రతాతిలకం శేష పుష్పాదికంమాదిరిగా భర్త ఆనతిని శిరసావహించి ప్రవర్తించింది. ఓ శ్రేష్ఠ బ్రాహ్మణులారా! స్వయంగా యమధర్మరాజే బ్రాహ్మణవేషాన్ని ధరించి, వారిశ్రద్ధను పరీక్షించడానికై వారి గృహానికి వెళ్లాడు. అతిథియైన ఆ బ్రాహ్మణుణ్ణి చూచి పాపరహితయైన ఆమె అర్ఘ్యాదులతో ఆతణ్ణి పూజించింది.

**సంపూజితస్తయా తాం తు ప్రాహ ధర్మో ద్విజః స్వయమ్ ।**
**భద్రే కుతః పతిర్ధీమాంస్తవ భర్తా సుదర్శనః ॥54॥**

**అన్నాద్యైరలమద్యార్యే స్వం దాతుమిహ చార్హసి ।**
**సా చ లజ్జావృతా నారీ స్మరంతీ కథితం పురా ॥55॥**

**భర్త్రా న్యమీలయన్నేత్రే చచాల చ పతివ్రతా ।**
**కిం చైత్యాహ పునస్తం వై ధర్మే చక్రే చ సా మతిమ్ ॥56॥**

**నివేదితుం కిలాత్మానం తస్మై పత్యురిహాజ్ఞయా ।**

యమధర్మరాజు ఆమెచేత బాగా పూజింపబడి ఆమెతో ఇలా పలికాడు. 'ఓ కళ్యాణీ! బుద్ధిమంతుడైన నీ భర్త సుదర్శనుడెక్కడ? నీవు ఇచ్చిన అన్నము మొదలైనవి సరిపోయినాయి. సంతృప్తినిచ్చాయి. ఇప్పుడు నిన్ను నీవు సమర్పించుకోవడానికి అర్హురాలవు'. సిగ్గును పొందిన ఆమె పూర్వం భర్త చెప్పిన మాటల్ని గుర్తుచేసుకుంటూ నిమీలితనేత్రయై చలించింది. ఆ ధర్ముడియందు మనసును లగ్నపరిచింది. భర్త ఆజ్ఞమేరకు తనను సమర్పించుకోవడానికి సిద్ధపడింది. కొన్ని అడుగులు ముందుకు నడిచింది.

**ఏతస్మిన్నంతరే భర్తా తస్యా నార్యాః సుదర్శనః ॥57॥**

**గృహద్వారం గతో ధీమాంస్తామువాచ మహామునిః ।**
**ఏహ్యేహి క్వ గతా భద్రే తమువాచాతిథిః స్వయమ్ ॥58॥**

**భార్యయా త్వనయా సార్ధం మైథునస్థోఽహమద్య వై ।**
**సుదర్శన మహాభాగ కింకర్తవ్యమిహోచ్యతామ్ ॥59॥**

**సురతాంతస్తు విప్రేంద్ర సంతుష్టోఽహం ద్విజోత్తమ ।**
**సుదర్శనస్తతః ప్రాహ సుప్రహృష్టో ద్విజోత్తమః ॥60॥**

**భుంక్ష్వ చైనాం యథాకామం గమిష్యేఽహం ద్విజోత్తమ ।**

ఈ మధ్యలో ఆ స్త్రీయొక్క భర్త, బుద్ధిమంతుడైన మహర్షి అయిన సుదర్శనుడు ఆయింటి తలుపు దగ్గరకు వచ్చాడు. "ఇటు రా! ఎక్కడికి వెళ్లావు" అని పలికాడు. అప్పుడు ఆ అతిథి సుదర్శనుణ్ణి గూర్చి ఇలా పలికాడు. "నీ భార్యతో నేను ఇప్పుడు రతి సల్పుచున్నాను. ఓ మహాభాగా! సుదర్శనా! ఏమిచేయాలో చెప్పు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! మైథునాంతంలో నేను సంతుష్టుణ్ని అయినాను" అని. తర్వాత మిక్కిలి సంతోషించిన సుదర్శనుడు ఇలా పలికాడు. 'ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! మీయిష్టానుసారంగా ఆమెను అనుభవించండి. నేను వెళ్లుతున్నాను.'

**హృష్టోఽథ దర్శయామాస స్వాత్మానం ధర్మరాట్ స్వయమ్ ॥61॥**

**ప్రదదౌ చేప్సితం సర్వం తమాహ చ మహాద్యుతిః ।**
**ఏషా న భుక్తా విప్రేంద్ర మనసాపి సుశోభనా ॥62॥**

**మయా చైషా న సందేహః శ్రద్ధాం జ్ఞాతుమిహాగతః ।**
**జితో వై యస్త్వయా మృత్యుర్ధర్మేణైకేన సువ్రత ॥63॥**

సంతుష్టుడైన యమధర్మరాజు తన నిజస్వరూపాన్ని ప్రదర్శించారు. మహాతేజస్వి అయిన యముడు ఆ సుదర్శనవిప్రుడికి కోరినవరాలనన్నింటిని ప్రసాదించాడు. అప్పుడు ఆతణ్ణి గూర్చి ఇలా పలికాడు. "ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! సుమంగళిఅయిన ఈమెను మానసికంగా కూడా నేను అనుభవించలేదు. ఇందులో సందేహం లేదు. నీ వ్రతమందలి శ్రద్ధను పరీక్షించడానికి వచ్చాను. ఓ సువ్రతుడా! నీవు అతిథిపూజాధర్మంతో మృత్యువును జయించావు."

**అహోఽస్య తపసో వీర్యమిత్యుక్త్వా ప్రయయౌ చ సః ।**
**తస్మాత్తథా పూజనీయాః సర్వే హ్యతిథయః సదా ॥64॥**

**బహునాత్ర కిముక్తేన భాగ్యహీనా ద్విజోత్తమాః ।**
**తమేవ శరణం తూర్ణం గంతుమర్హథ శంకరమ్ ॥65॥**

"ఈ తపస్సుయొక్క శక్తి ఎంత గొప్పది" అని ఆశ్చర్యపడుతూ యముడు అంతర్ధానం చెందాడు. అందుచేత ఓ మునులారా! అతిథులందరూ ఎల్లప్పుడూ ఆరాధనీయులు. ఓ అభాగ్యులైన మునులారా! ఎక్కువ మాటలతో పనిలేదు. త్వరగా ఆ శంకరుణ్ణి శరణు పొందండి.

**తస్య తద్వచనం శ్రుత్వా బ్రహ్మణో బ్రాహ్మణర్షభాః ।**
**బ్రహ్మాణమభివంద్యార్తాః ప్రోచురాకులితేక్షణాః ॥66॥**

బ్రహ్మయొక్క ఆ మాటను విన్న విప్రర్షులు బ్రహ్మకు నమస్కరించి దుఃఖార్తులు, వ్యాకులితనయనులై ఇలా పలికారు.

**బ్రాహ్మణా ఊచుః –** బ్రాహ్మణులు పలికారు.

**నాపేక్షితం మహాభాగ జీవితం వికృతాః స్త్రియః ।**
**దృష్టోఽస్మాభిర్మహాదేవో నిందితో యస్త్వనిందితః ॥67॥**

ఓ మహాత్మా! మేము మా స్త్రీలకు కలిగిన వికారంవల్ల జీవితాపేక్ష కూడా పోయింది. నిందింపదగని మహాశివుడు మావల్ల నిందితుడై కన్పించాడు.

**శప్తశ్చ సర్వగః శూలీ పినాకీ నీలలోహితః ।**
**అజ్ఞానాచ్ఛాపజా శక్తిః కుంఠితాస్య నిరీక్షణాత్ ॥68॥**

సర్వవ్యాపి, శూలి, పినాకి, నీలలోహితుడైన శివుడు మా అజ్ఞానంవల్ల శపింపబడినాడు. ఆయన చూపుతో మేమిచ్చిన శాపంయొక్క శక్తి నిర్వీర్యమైంది.

**వక్తుమర్హసి దేవేన సంన్యాసం వై క్రమేణ తు ।**
**ద్రష్టుం వై దేవదేవేశముగ్రం భీమం కపర్దినమ్ ॥69॥**

ఓ దేవాధిదేవా! మీరిప్పుడు భయంకరుడు, కపర్ది, ఉగ్రుడు అయిన సర్వేశ్వరుడిని దర్శింపగల సంన్యాసయోగాన్ని గురించి చెప్పండి.

**పితామహ ఉవాచ –** పితామహుడు పలికాడు.

**ఆదౌ వేదానధీత్యైవ శ్రద్ధయా చ గురోః సదా ।**
**విచార్యార్థం మునేర్ధర్మాన్ ప్రతిజ్ఞాయ ద్విజోత్తమాః ॥70॥**

ఓ బ్రాహ్మణోత్తములారా! ముందుగా గురువువల్ల శ్రద్ధగా వేదాల్ని అభ్యసించి, వాటియొక్క అర్థాన్ని ఆలోచించి మునులయొక్క ధర్మాల్ని తెలుసుకోవాలి.

**గ్రహణాంతం హి వా విద్వానథ ద్వాదశవార్షికమ్ ।**
**స్నాత్వాహృత్య చ దారాన్ వై పుత్రానుత్పాద్య సువ్రతాన్ ॥71॥**

**వృత్తిభిశ్చానురూపాభిస్తాన్ విభజ్య సుతాన్ మునిః ।**
**అగ్నిష్టోమాదిభిశ్చేష్ట్వా యజ్ఞైర్యజ్ఞేశ్వరం విభుమ్ ॥72॥**

**పూజయేత్పరమాత్మానం ప్రాప్యారణ్యం విభావసౌ ।**

ఈవిధంగా పంద్రెండు సంవత్సరాలు వేదాధ్యయనం చేసిన తర్వాత విద్యముగిసినవాడై, వివాహమాడి సువ్రతులైన పుత్రుల్ని కని, అనుకూలమైన పనులను వారికి అప్పగించి, ఋషిఅయినవాడు అగ్నిష్టోమాదియజ్ఞాల ద్వారా యజ్ఞేశ్వరుడైన శివుడిని యజించి, తదుపరి అరణ్యవాసి అయి, అగ్నిపూర్వకంగా పరమాత్మ అయిన శివుణ్ణి పూజించాలి.

**మునిర్ద్వాదశవర్షం వా వర్షమాత్రమథాపి వా ॥73॥**

**పక్షద్వాదశకం వాపి దినద్వాదశకం తు వా ।**
**క్షీరభుక్ సంయతః శాంతః సర్వాన్ సంపూజయేత్సురాన్ ॥74॥**

ఋషి పంద్రెండు సంవత్సరాలు లేక ఒక సంవత్సరం లేక ఆరుమాసాలు లేక పంద్రెండురోజులు పాలను త్రాగుతూ శాంతుడై, సంయముడై సమస్తదేవతల్ని బాగా పూజించాలి.

**ఇష్ట్వైవం జుహుయాదగ్నౌ యజ్ఞపాత్రాణి మంత్రతః ।**
**అప్సు వై పార్థివం న్యస్య గురవే తైజసాని తు ॥75॥**

**స్వధనం సకలం చైవ బ్రాహ్మణేభ్యో విశంకయా ।**
**ప్రణిపత్య గురుం భూమౌ విరక్తః సంన్యసేత్యతిః ॥76॥**

ఈవిధంగా యజించి, పూజించిన తర్వాత యజ్ఞసంబంధమైన చెక్కపాత్రల్ని అగ్నిలో ఆహుతిచేసి, మట్టిపాత్రల్ని నీటిలో కలిపి, లోహపాత్రల్ని గురువుకు సమర్పించి, తన సమస్తధనాన్ని ఎట్టి అనుమానం లేకుండా బ్రాహ్మణులకిచ్చి, సాష్టాంగపడి, గురుడికి నమస్కరించి విరక్తుడైన ముని సంన్యాసధర్మాన్ని ఆచరించాలి.

**నికృత్య కేశాన్ సశిఖానుపవీతం విసృజ్య చ ।**
**పంచభిర్జుహుయాదప్సు భూః స్వాహేతి విచక్షణః ॥77॥**

వివేకి అయిన ఆ ఋషి కేశాలతోపాటు శిఖారూపకేశాల్ని కత్తిరించుకుని, జందెమును పరిత్యజించి, నీటిలో ఐదుసార్లు ఆహుతులివ్వాలి.

**తతశ్చోర్ధ్వం చరేదేవం యతిః శివవిముక్తయే ।**
**వ్రతేనానశనేనాపి తోయవృత్త్యాపి వా పునః ॥78॥**

**పర్ణవృత్త్యా పయోవృత్త్యా ఫలవృత్త్యాపి వా యతిః ।**
**ఏవం జీవన్మృతో నో చేత్షణ్మాసాద్వత్సరాత్తు వా ॥79॥**

**ప్రస్థానాదికమాయాసం స్వదేహస్య చరేద్యతిః ।**
**శివసాయుజ్యమాప్నోతి కర్మణాప్యేవమాచరన్ ॥80॥**

తదుపరి ముని శివసాయుజ్యరూపమైన విముక్తికై ప్రయత్నించాలి. నిరాహారంగా గాని, నీటిని త్రాగుతూ గాని, ఆకులను తింటూ గాని, పాలను త్రాగుతూ గాని, ఫలాలను తింటూ గాని, ఆరుమాసాలు గాని సంవత్సరం గాని మృత్యువును పొందకుండా జీవిస్తూ స్థూల శరీరత్యాగానికై ఆయాసపడతాడు. ఇలాంటి కర్మాచరణవల్ల ముని శివసాయుజ్యాన్ని పొందగలుగుతాడు.

**సద్యోఽపి లభతే ముక్తిం భక్తియుతో దృఢవ్రతాః ॥81॥**

**త్యాగేన వా కిం విధినాప్యనేన భక్తస్య రుద్రస్య శుభైర్వ్రతైశ్చ ।**
**యజ్ఞైశ్చ దానైర్వివిధైశ్చ హోమై ర్లబ్ధైశ్చ శాస్త్రై ర్వివిధైశ్చ వేదైః ॥82॥**

**శ్వేతేనైవం జితో మృత్యుర్భవభక్త్యా మహాత్మనా ।**
**వోఽస్తు భక్తిర్మహాదేవే శంకరే పరమాత్మని ॥83॥**

ఓ దృఢవ్రతులైన మునులారా! శివుడియెడల భక్తి కలిగినవారు వెంటనే ముక్తి పొందగలుగుతారు. శివభక్తిలేక మంగళకరాలైన వ్రతాలతోగాని, యాగాలతోగాని, వివిధదానాలతోగాని, హోమాలతోగాని, వివిధశాస్త్రాలతోగాని, వేదాలతోగాని ఏమిప్రయోజనం ఉండదు. మహాత్ముడైన శ్వేతముని శివభక్తితో మృత్యువును జయించాడు. కావున మీరును పరమాత్ముడైన శివుడిలో భక్తిని కలిగిఉండండి.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే దేవదారువనవృత్తాంతవర్ణనం నామైకోనత్రింశత్తమోఽధ్యాయః ॥ 29 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని దేవదారువనవృత్తాంత వర్ణనమనే ఇరవై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## త్రింశత్తమోఽధ్యాయః - ముప్పైయవ అధ్యాయం
## శివారాధనమహిమవర్ణనమ్ - శివారాధనమహిమవర్ణనం

**శైలాదిరువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఏవముక్తాస్తదా తేన బ్రహ్మణా బ్రాహ్మణర్షభాః ।**
**శ్వేతస్య చ కథాం పుణ్యామపృచ్ఛన్ పరమర్షయః ॥1॥**

ఈ విధంగా బ్రహ్మ చెప్పగా ఆ దారువన బ్రాహ్మణమునులు పుణ్యప్రదమైన శ్వేతఋషి యొక్క కథను చెప్పమని బ్రహ్మదేవుణ్ణి కోరారు.

**పితామహ ఉవాచ** - పితామహుడు పలికాడు.

**శ్వేతో నామ మునిః శ్రీమాన్ గతాయుర్గిరి గహ్వరే ।**
**సక్తో హ్యభ్యర్చ్య యద్భక్త్యా తుష్టావ చ మహేశ్వరమ్ ॥2॥**

**రుద్రాధ్యాయేన పుణ్యేన నమస్తేత్యాదినా ద్విజాః ।**
**తతః కాలో మహాతేజాః కాలప్రాప్తం ద్విజోత్తమమ్ ॥3॥**

**నేతుం సంచింత్య విప్రేంద్రాః సాన్నిధ్యమకరోన్మునేః ।**

శ్రీమంతుడైన శ్వేతనామకుడైన ముని జీవితచరమదశలో కొండగుహలో ఉండి, భక్తితో శివుణ్ణి "నమస్తే రుద్ర మన్యవే" మొదలుగాగల రుద్రుడికి చెందిన అధ్యాయాలతో పూజించి, ఆయన్ని సంతుష్టుణ్ణి చేసుకొన్నాడు. మునిశ్రేష్ఠులారా! మహాకాంతిమంతుడైన యముడు అంత్యకాలం దగ్గరైన ఆ మునిని తీసుకుపోవడానికి అతడి దగ్గరకు వచ్చాడు.

**శ్వేతోఽపి దృష్ట్వా తం కాలం కాలప్రాప్తోఽపి శంకరమ్ ॥4॥**

**పూజయామాస పుణ్యాత్మా త్రియంబకమనుస్మరన్ ।**
**త్రయంబకం యజే దేవం సుగంధిం పుష్టివర్ధనమ్ ॥5॥**

**కిం కరిష్యతి మే మృత్యుర్మృత్యోర్మృత్యురహం యతః ।**

మృత్యువు సమీపించిన ఆ శ్వేతముని తనను సమీపించిన యముణ్ణి చూచి, శివుణ్ణి స్మరిస్తూ పూజించినాడు. "నేను ముక్కంటికి సుగంధి పూజచేస్తున్నాను. అది శక్తిని వృద్ధిపర్చేది. కావున యముడు నన్నేమిచేయగలుగుతాడు. నేను మృత్యువుకే మృత్యువును" అని భావించాడు.

**తం దృష్ట్వా సస్మితం ప్రాహ శ్వేతం లోకభయంకరః ॥6॥**

**ఏహ్యేహి శ్వేత చానేన విధినా కిం ఫలం తవ ।**
**రుద్రో వా భగవాన్ విష్ణుర్బ్రహ్మా వా జగదీశ్వరః ॥7॥**

**కః సమర్థః పరిత్రాతుం మయా గ్రస్తం ద్విజోత్తమ ।**
**అనేన మమ కిం విప్ర రౌద్రేణ విధినా ప్రభోః ॥8॥**

**నేతుం యస్యోత్థితశ్చాహం యమలోకం క్షణేన వై ।**
**యస్మాత్ గతాయుస్త్వం తస్మాన్మునే నేతుమిహోద్యతః ॥9॥**

లోకభయంకరుడైన యముడు ఆ మునిని చూచి నవ్వుతూ ఇలా పలికాడు. "ఓ మునీ! రా! రా! ఈవిధంగా రుద్రుణ్ణి పూజించడం వల్ల ఏమి ప్రయోజనం? ఓ బ్రాహ్మణ శ్రేష్ఠుడా! నావశానికి వచ్చిన ఏప్రాణిని రక్షించడానికి బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ఎవ్వరూ సమర్థులు కారు. నీవు చేస్తున్న రుద్రార్చనవల్ల నాకేమిటి అవుతుంది. దగ్గరపడిన ఆయువుగల నిన్ను తీసుకువెళ్లడానికి వచ్చిన నేను క్షణకాలంలో యమలోకానికి తీసుకుపోతాను"

**తస్య తద్వచనం శ్రుత్వా భైరవం ధర్మమిశ్రితమ్ ।**
**హా రుద్ర రుద్ర రుద్రేతి లలాప మునిపుంగవః ॥10॥**

**తం ప్రాహ చ మహాదేవం కాలం సంప్రేక్ష్య వై దృశా ।**
**నేత్రేణ బాష్పమిశ్రేణ సంభ్రాంతేన సమాకులః ॥11॥**

కాలధర్మంతో కలిసి భయంకరమైన ఆయముడి మాటలు విని, మునిశ్రేష్ఠుడైన శ్వేతుడు ఓ రుద్రా! ఓ రుద్రా! ఓ రుద్రా! అంటూ విలపించాడు. సమాకులచిత్తుడు, భ్రాంతియుతుడు, బాష్పపూరిత లోచనుడు అయిన ఆ శ్వేతుడు మహాదేవుడైన యముణ్ణి చూచి ఇలా పలికాడు.

**శ్వేత ఉవాచ –** శ్వేతుడు పలికాడు.

**త్వయా కిం కాల నో నాథశ్చాస్తి చేద్ధి వృషధ్వజః ।**
**లింగేఽస్మిన్ శంకరో రుద్రః సర్వదేవభవోద్భవః ॥12॥**

ఓ యమధర్మరాజా! నీ వల్ల నాకు ఏమవుతుంది. సమస్తదేవతల ఉత్పత్తి కారకుడు, వృషధ్వజుడైన రుద్రుడు, శంకరుడు నా స్వామి ఈ లింగమందున్నాడు.

**అతీవ భవభక్తానాం మద్విధానాం మహాత్మనామ్ ।**
**విధినా కిం మహాబాహో గచ్ఛ గచ్ఛ యథాగతమ్ ॥13॥**

విధ్యుక్తంగా అర్చించే నాలాంటి మహాత్ములైన శివుడి యొక్క భక్తుల్ని నీవేమి చేయగలవు? ఓ మహాబాహూ! ఎలా వచ్చావో అలా వెళ్లు. వెళ్లు.

**తతో నిశమ్య కుపితస్తీక్ష్ణదంష్ట్రో భయంకరః ।**
**శ్రుత్వా శ్వేతస్య స తద్వాక్యం పాశహస్తో భయావహః ॥14॥**

**సింహనాదం మహత్కృత్వా చాస్ఫోట్య చ ముహుర్ముహుః ।**
**బబంధ చ మునిం కాలః కాలప్రాప్తం తమాహ చ ॥15॥**

తర్వాత ఆ శ్వేతమునియొక్క ఆ మాటలువిని పదునైన కోరలు గలవాడు, భయంకరుడు, పాశహస్తుడు, భయావహుడు, కుపితుడూ అయిన యముడు సింహంలాగా గర్జించి మాటిమాటికి పాశాన్ని వదిలి ఆతడిని బంధించి ప్రాప్తాయుష్కుడైన ఆ మునితో ఇలా పలికాడు.

**మయా బద్ధోఽసి విప్రర్షే శ్వేతం నేతుం యమాలయమ్ ।**
**అద్య వై దేవదేవేన తవ రుద్రేణ కిం కృతమ్ ॥16॥**

**క్వ శర్వస్తవ భక్తిశ్చ క్వ పూజా పూజయా ఫలమ్ ।**
**క్వ చాహం క్వ చ మే భీతిః శ్వేత బద్ధోఽసి వై మయా ॥17॥**

**లింగేఽస్మిన్ సంస్థితః శ్వేత తవ రుద్రో మహేశ్వరః ।**
**నిశ్చేష్టోఽసౌ మహాదేవః కథం పూజ్యో మహేశ్వరః ॥18॥**

ఓ బ్రాహ్మణ ఋషీ! నిన్ను నేను బంధించాను. నిన్ను నేను యమలోకానికి తీసుకు వెళతాను. ఇప్పుడు మహాదేవుడైన రుద్రుడివల్ల నీకేమి జరిగింది. రుద్రుడెక్కడ? నీ భక్తి ఎక్కడ? పూజ ఎక్కడ? పూజాఫలమేది? నేను ఎక్కడ ఉన్నాను. నావల్ల కలిగే భయమేది? ఓ శ్వేతఋషీ నిన్ను నేను బంధించాను. నీ మహేశ్వరరుద్ర భగవానుడు ఈ లింగమందు ఉన్నాడా? అట్లైతే ఆతడు క్రియారహితుడే. కాగా ఆతడు పూజార్హుడెట్లుకాగలడు?

**తతః సదాశివః స్వయం ద్విజం నిహంతుమాగతమ్ ।**
**నిహంతుమంతకం స్మయన్ స్మరారి యజ్ఞహా హరః ॥19॥**

**త్వరన్ వినిర్గతః పరః శివః స్వయం త్రిలోచనః ।**
**త్రియంబకోఽంబయా సమం సనందినా గణేశ్వరైః ॥20॥**

**ససర్జ జీవితం క్షణాద్భవం నిరీక్ష్య వై భయాత్ ।**
**పపాత చాశు వై బలీ మునేస్తు సన్నిధౌ ద్విజాః ॥21॥**

**ననాద చోర్ధ్వముచ్చధీర్నిరీక్ష్య చాంతకాంతకమ్ ।**
**నిరీక్షణేన వై మృతం భవస్య విప్రపుంగవాః ॥22॥**

తర్వాత కామారి, యజ్ఞధ్వంసకుడు, ముక్కంటి అయిన పరమశివుడు శ్వేతఋషిని చంపడానికి వచ్చిన యముడిని చంపడానికై చిరునగవుతో నందీశ్వరుడితో, ప్రమథగణాలతో, పార్వతీదేవితో త్వరగా ప్రత్యక్షమైనాడు. శంకరుణ్ణిచూచి భయపడి యముడు శ్వేతుడి సమీపంలో పడిపోయాడు. యముణ్ణి అంతమొందించిన శివుణ్ణి చూచి శ్వేతఋషి బిగ్గరగా నినదించాడు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! రుద్రుడి యొక్క చూపుతోనే యముడు మృతి చెందాడు.

**వినేదురుచ్చమీశ్వరాః సురేశ్వరా మహేశ్వరమ్ ।**
**ప్రణేమురంబికాముమాం మునీశ్వరాస్తు హర్షితాః ॥23॥**

**ససర్జురస్య మూర్ధ్ని వై మునేర్భవస్య ఖేచరాః ।**
**సుశోభనం సుశీతలం సుపుష్పవర్షమంబరాత్ ॥24॥**

దేవతాగణాలు, మునిగణాలు సంతోషించినవారై శివుడికి అట్లే పార్వతీదేవికి నమస్కరించారు. ఆకాశసంచారులైన వారందరూ శివుడి శిరసుపైన, శ్వేతుడి శిరసుపైన సుందరాలు, సుగంధభరితాలు అయిన చల్లటి పుష్పాల్ని ఆకాశం నుంచి వర్షింపజేశారు.

**అహో నిరీక్ష్య చాంతకం మృతం తదా సువిస్మితః ।**
**శిలాశనాత్మజోఽవ్యయం శివం ప్రణమ్య శంకరమ్ ॥25॥**

**ఉవాచ బాలధీర్మృతః ప్రసీద చేతి వై మునేః ।**
**మహేశ్వరం మహేశ్వరస్య చానుగో గణేశ్వరః ॥26॥**

శిలాదపుత్రుడు, శివుడి అనుచరుడు, గణనాయకుడు అయిన నందీశ్వరుడు ఆశ్చర్యచకితుడై మృతుడైన యముడిని చూచి అవినాశి అయిన శంకరుడికి నమస్కరించి అల్పబుద్ధి అయిన యముడిని, మునిశ్వేతుడిని అనుగ్రహించమని కోరాడు.

**తతో వివేశ భగవాననుగృహ్య ద్విజోత్తమమ్ ।**
**క్షణాద్ గూఢశరీరం హి ధ్వస్తం దృష్ట్వాంతకం క్షణాత్ ॥27॥**

తర్వాత వెంటనే శివభగవానుడు బ్రాహ్మణోత్తముడైన శ్వేతుణ్ణి, మృతుడైన యముణ్ణి చూచి వారిద్దర్ని అనుగ్రహించి మాయమయ్యాడు.

**తస్మాన్మృత్యుంజయం చైవ భక్త్యా సంపూజయేద్ ద్విజాః ।**
**ముక్తిదం భక్తిదం చైవ సర్వేషామపి శంకరమ్ ॥28॥**

ఓ ద్విజులారా! అందువల్ల అందరూ ముక్తిని, భక్తిని ప్రసాదించే మృత్యుంజయుడైన శంకరుణ్ణి నిశ్చలభక్తితో బాగా పూజించాలి.

**బహునా కిం ప్రలాపేన సంన్యస్యాభ్యర్చ్య వై భవమ్ ।**
**భక్త్యాచాపరయా తస్మిన్ విశోకా వై భవిష్యథ ॥29॥**

ఓ మునులారా! అధిక ప్రసంగమేల? సర్వసంగపరిత్యాగులై మీరు శివుణ్ణి అపారమైన భక్తితో పూజించి శోకరహితులుకండి.

**శైలాదిరువాచ** – నందీశ్వరుడు పలికాడు.

**ఏవముక్తాస్తదా తేన బ్రహ్మణా బ్రహ్మవాదినః ।**
**ప్రసీద భక్తిర్దేవేశే భవేద్రుద్రే పినాకిని ॥30॥**

బ్రహ్మ ఈవిధంగా పలకగా బ్రహ్మవేత్తలయిన మునులు ఓ బ్రహ్మదేవా! భవుడు, రుద్రుడు, పినాకి, దేవదేవుడు అయిన శివుడి విషయంలో మాకు భక్తిని అనుగ్రహించండి అని కోరారు.

**కేన వా తపసా దేవయజ్ఞేనాప్యథ కేన వా ।**
**వ్రతైర్వా భగవద్భక్తా భవిష్యంతి ద్విజాతయః ॥31॥**

ఓ బ్రహ్మదేవా! ఎలాంటి తపసుతో, ఎటువంటి యాగంతో, ఎలాంటి పుణ్యవ్రతాలతో ద్విజులు భగవద్భక్తులు అవుతారు?

**పితామహ ఉవాచ –** పితామహుడు పలికాడు.

**న దానేన మునిశ్రేష్ఠాస్తపసా చ న విద్యయా ।**
**యజ్ఞైర్హోమైర్వ్రతైర్వేదైర్యోగశాస్త్రైర్నిరోధనైః ॥32॥**
**ప్రసాదేనైవ సా భక్తిః శివే పరమకారణే ।**

ఓ ముని సత్తములారా! దానం, తపస్సు, విద్య, యజ్ఞం, హోమం, వ్రతం, వేదాధ్యయనం, యోగసాధనం, శాస్త్రాధ్యయనం, ఇంద్రియనియంత్రణం– వీటివల్ల శివభక్తి కలుగదు. కేవలం ఆయన యొక్క అనుగ్రహం వల్లే జగత్తుకు ఉన్నతహేతువైన శివునిలో భక్తి కలుగుతుంది.

**అథ తస్య వచః శ్రుత్వా సర్వే తే పరమర్షయః ॥33॥**
**సదారతనయాః శ్రాంతాః ప్రణేముశ్చ పితామహమ్ ।**

అప్పుడు బ్రహ్మయొక్క ఆ మాటలు విన్న కష్టపడిన మరియు భార్యబిడ్డలతో కలసియున్న ఆ ఋషులందరూ బ్రహ్మదేవుడికి నమస్కరించారు.

**తస్మాత్పాశుపతీ భక్తిర్ధర్మకామార్థసిద్ధిదా ॥34॥**

**మునేర్విజయదా చైవ సర్వమృత్యుజయప్రదా ।**
**దధీచస్తు పురా భక్త్యా హరిం జిత్వామరైర్విభుమ్ ॥35॥**

**క్షుపం జఘాన పాదేన వజ్రాస్థిత్వం చ లబ్ధవాన్ ।**
**మయాపి నిర్జితో మృత్యుర్మహాదేవస్య కీర్తనాత్ ॥36॥**

**శ్వేతేనాపి గతేనాస్యం మృత్యోర్మునివరేణ తు ।**
**మహాదేవప్రసాదేన జితో మృత్యుర్యథా మయా ॥37॥**

అందువల్ల శివభక్తి ధర్మార్థకామాల్ని, అట్లే సర్వసిద్ధుల్ని ఇస్తుంది. విజయాన్ని యిస్తుంది. అన్నివిధాల మృత్యుంజయాన్ని ప్రసాదిస్తుంది. దధీచి ఋషి పూర్వం శివభక్తి వల్ల దేవతలతో సహా విష్ణువును జయించి, క్షుపమహారాజును కాలిలో తన్నాడు. తన ఎముకలకు వజ్రతుల్యత్వాన్ని పొందాడు. నేను కూడా శివుణ్ణి కీర్తించి యముడిని నిర్జించాను. నా మాదిరిగానే మృత్యుముఖగతుడైనా శ్వేతముని మహాదేవుడి అనుగ్రహంతో మృత్యువును జయించాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే శివారాధనమహిమవర్ణనం నామ త్రింశత్తమోఽధ్యాయః ॥ 30 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని శివారాధనమహిమవర్ణనమనే ముప్పైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకత్రింశత్తమోఽధ్యాయః - ముప్పైఒకటవ అధ్యాయం

## శివస్తోత్రవర్ణనమ్ - శివస్తోత్రవర్ణనం

**సనత్కుమార ఉవాచ -** సనత్కుమారుడు పలికాడు.

**కథం భవప్రసాదేన దేవదారువనౌకసః ।**
**ప్రసన్నాః శరణం దేవం వక్తుమర్హసి మే ప్రభో ॥1॥**

ఓ దేవా! దేవదారువనమందలి మహామునులు ఏవిధంగా శివానుగ్రహం వల్ల మహాదేవుణ్ణి శరణుపొందారో నాకు చెప్పవలసినది.

**శైలాదిరువాచ -** నందీశ్వరుడు పలికాడు.

**తానువాచ మహాభాగాన్ భగవానాత్మభూః స్వయమ్ ।**
**దేవదారువనస్థాంస్తు తపసా పావకప్రభాన్ ॥2॥**

స్వయంభువుడైన బ్రహ్మదేవుడు మహాత్ములు, తపస్సువల్ల అగ్నితుల్యకాంతిమంతులు అయిన దేవదారు వనమునులను గూర్చి స్వయంగా పలికాడు.

**పితామహ ఉవాచ -** పితామహుడు పలికాడు.

**ఏష దేవో మహాదేవో విజ్ఞేయస్తు మహేశ్వరః ।**
**న తస్మాత్పరమం కించత్పదం సమధిగమ్యతే ॥3॥**

ఈతడే దేవుడు, మహాదేవుడు అయిన మహేశ్వరుడుగా తెలుసుకోవాలి. ఇంతకంటే ఉన్నతమైన స్థానం ఏదీలేదు. దాన్ని పొందగలగాలి.

**దేవానాం చ ఋషీణాం చ పితౄణాం చైవ స ప్రభుః ।**
**సహస్రయుగపర్యంతే ప్రలయే సర్వదేహినః ॥4॥**

**సంహరత్యేష భగవాన్ కాలో భూత్వా మహేశ్వరః ।**
**ఏష చైవ ప్రజాః సర్వాః సృజత్యేకః స్వతేజసా ॥5॥**

ఆతడు దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు ప్రభువు. వేలయుగాల వరకు ప్రళయ సమయంలో భగవంతుడు ఈశ్వరుడు మహాకాలుడై సమస్తప్రాణుల్ని సంహరిస్తాడు. ఆతడు ఒక్కడే తనకాంతితో సమస్తప్రజల్ని సృష్టిస్తాడు.

**ఏష చక్రీ వజ్రీ చ శ్రీవత్స కృతలక్షణః ।**
**యోగీ కృతయుగే చైవ త్రేతాయాం క్రతురుచ్యతే ॥6॥**

**ద్వాపరే చైవ కాలాగ్ని ర్ధర్మకేతుః కలౌ స్మృతః ।**
**రుద్రస్య మూర్తయస్త్వేతా యేఽభిధ్యాయంతి పండితాః ॥7॥**

ఆయన వక్షఃస్థలంలో శ్రీ చిహ్నాంగలవాడు, చక్రధారి, విష్ణువు వజ్రధారి ఇంద్రుడు కృతయుగంలో యోగి, త్రేతాయుగంలో క్రతువు అయి ఉన్నాడు. ద్వాపరంలో కాలాగ్నిగా కలియుగంలో ధర్మకేతువు అయి ఉన్నాడు. ఇవన్నీ రుద్రుడి వివిధరూపాలు. విద్వాంసులు వాటిని ధ్యానిస్తారు.

**చతురస్రం బహిశ్చాంతరష్టాస్రం పిండికాశ్రయే ।**
**వృత్తం సుదర్శనం యోగ్యమేవం లింగం ప్రపూజయేత్ ॥8॥**

వెలుపల చతురస్రంగాను, లోపల అష్టకోణాత్మకంగాను, పిండికాశ్రయస్థానంలో వృత్తాకారంగాను ఉండి మిక్కిలి ఆకర్షణీయంగా ఉన్న శ్రేష్ఠమైన లింగాన్నే అర్చించాలి.

**తమో హ్యగ్నీ రజో బ్రహ్మా సత్త్వం విష్ణుః ప్రకాశకమ్ ।**
**మూర్తిరేకా స్థితా చాస్య మూర్తయః పరికీర్తితాః ॥9॥**

తమస్సు అగ్నిదేవుడు. రజస్సు బ్రహ్మదేవుడు. తేజోభరితమైన సత్త్వం విష్ణుమూర్తి. ఈమూడును మూలరూపంలో ఒకే ఆకారంగలవి. ఇవి అన్నీ శివుడి రూపాలుగానే చెప్పబడుతున్నాయి.

**యత్ర తిష్ఠతి తద్ బ్రహ్మ యోగేన తు సమన్వితమ్ ।**
**తస్మాద్ధి దేవదేవేశమీశానం ప్రభుమవ్యయమ్ ॥10॥**

**ఆరాధయంతి విప్రేంద్రా జితక్రోధా జితేంద్రియాః ।**
**లింగం కృత్వా యథాన్యాయం సర్వలక్షణసంయుతమ్ ॥11॥**

బ్రహ్మ తనయోగశక్తితో ఆ లింగమందే ఉంటాడు. క్రోధాన్ని, ఇంద్రియాల్ని జయించిన బ్రాహ్మణశ్రేష్ఠులు సమస్తమైన మంగళకరలక్షణాలుగల లింగాన్ని తయారు చేసి విధివిధాన పూర్వకంగా దేవాధిదేవుడు, సర్వేశ్వరుడు, అవినాశి అయిన శివుణ్ణి పూజిస్తున్నారు.

**అంగుష్ఠమాత్రం సుశుభం సువృత్తం సర్వసమ్మతమ్ ।**
**సమనాభం తథాష్టాస్రం షోడశాస్రమథాపి వా ॥12॥**

**సువృత్తం మండలం దివ్యం సర్వకామఫలప్రదమ్ ।**

ఆ లింగం అంగుష్ఠమాత్రపరిమాణం గలదై, మిక్కిలి సుందరంగా, వృత్తాకారంలో సర్వశాస్త్రసమ్మతమైనదిగా ఉండాలి. దాని మండలం సమానమైన నాభిగలదై, ఎనిమిది గాని పదహారుగాని కోణాలతో గోళాకారంలో దివ్యమైనదై ఉండాలి. అట్టి ఆ లింగం సమస్తమైన కోరికల్ని తీర్చుతుంది.

**వేదికా ద్విగుణా తస్య సమా వా సర్వసమ్మతా ॥13॥**

**గోముఖీ చ త్రిభాగైకా వేద్యా లక్షణసంయుతా ।**
**పట్టికా చ సమంతాద్వై యవమాత్రా ద్విజోత్తమాః ॥14॥**

**సౌవర్ణం రాజతం శైలం కృత్వా తామ్రమయం తథా ।**
**వేదికాయాశ్చ విస్తారం త్రిగుణం వై సమంతతః ॥15॥**

**వర్తులం చతురస్రం వా షడస్రం వా త్రిరస్రకమ్ ।**
**సమంతాన్నిర్వ్రణం శుభం లక్షణైస్తత్సులక్షితమ్ ॥16॥**

**ప్రతిష్ఠాప్య యథాన్యాయం పూజాలక్షణసంయుతమ్ ।**
**కలశం స్థాపయేత్తస్య వేదిమధ్యే తథా ద్విజాః ॥17॥**

**సహిరణ్యం సబీజం చ బ్రహ్మభిశ్చాభిమంత్రితమ్ ।**
**సేచయేచ్చ తతో లింగం పవిత్రైః పంచభిః శుభైః ॥18॥**

**పూజయేచ్చ యథాలాభం తతః సిద్ధిమవాప్స్యథ ।**
**సమాహితాః పూజయధ్వం సపుత్రా సహ బంధుభిః ॥19॥**

**సర్వే ప్రాంజలయో భూత్వా శూలపాణిం ప్రపద్యత ।**
**తతో ద్రక్ష్యథ దేవేశం దుర్దర్శమకృతాత్మభిః ॥20॥**

**యం దృష్ట్వా సర్వమజ్ఞానమధర్మశ్చ ప్రణశ్యతి ।**

వేదిక లింగానికి రెండింతలుగాని సమానంగాగాని శాస్త్రానుసారంగా నిర్మించాలి. గోముఖాకారంతో సర్వలక్షణాలతో కూడినదై ఆకారంలో మూడో వంతు ఉండాలి. ఓ బ్రాహ్మణోత్తములారా! వేదిక యొక్క అంచుల చివరలు(పట్టిక) నాలుగువైపుల ఒక యవమాత్రపు వెడల్పు కలిగి ఉండాలి. అది బంగారంతోగాని, వెండితోగాని, రాతితోగాని, రాగితోగాని నిర్మించాలి. దాని విస్తీర్ణం నాలుగువైపులా మూడురెట్లు ఉండాలి. అది వృత్తాకారంగాగాని, చతుర్భుజిగాగాని, షడ్భుజిగాగాని ఉండాలి. అన్నివైపులా ఎక్కడా పగులు ఉండరాదు. సర్వశుభలక్షణాలలో కూడినదై ఉండాలి. ఓ బ్రాహ్మణులారా! పూజార్హమైన ఈ వేదిక యొక్క మధ్యభాగంలో శాస్త్రానుసారంగా కలశాన్ని స్థాపించాలి. దానిలో బంగారపు ముక్కల్ని పంచాక్షరమంత్రసహితంగా వేయాలి. తర్వాత సద్యోజాత పవిత్రమంత్రంతో లింగాన్ని అభిమంత్రించాలి. తదుపరి పవిత్రాలు, శుభాలు అయిన పంచాక్షరమంత్రాలతో లింగాన్ని జలంతో అభిషేకించాలి. తర్వాత దొరికిన ద్రవ్యాలతో పూజించి ఇష్టసిద్ధిని పొందాలి. నరుడు సపుత్ర బాంధవంగా ఏకాగ్రచిత్తంతో పూజించాలి. అందరూ అంజలి ఘటించి శివుడిని శరణుజొచ్చాలి. అప్పుడు దుర్లభదర్శనుడైన శివుడు అసంయతాత్ములైన వారికి దర్శనమిస్తాడు. అట్టి మహాదేవుణ్ణి చూడడం వల్ల సమస్తమైన అజ్ఞానమూ, అధర్మమూ నశిస్తుంది.

**తతః ప్రదక్షిణం కృత్వా బ్రహ్మాణమమితౌజసమ్ ॥21॥**

**సంప్రస్థితా వనౌకాస్తే దేవదారువనం తతః ।**
**ఆరాధయితుమారబ్ధా బ్రహ్మణా కథితం యథా ॥22॥**

తర్వాత అమితకాంతిమంతుడైన బ్రహ్మకు ప్రదక్షిణం చేసి ఆ వనవాసులు దేవదారువనానికి వెళ్లారు. బ్రహ్మదేవుడు చెప్పిన ప్రకారం శివుణ్ణి ఆరాధించడం ప్రారంభించారు.

**స్థండిలేషు విచిత్రేషు పర్వతానాం గుహాసు చ ।**
**నదీనాం చ వివిక్తేషు పులినేషు శుభేషు చ ॥23॥**

**శైవాలశోభనాః కేచిత్కేచిదంతర్జలేశయాః ।**
**కేచిత్ దర్భావకాశాస్తు పాదాంగుష్ఠాగ్రాధిష్ఠితాః ॥24॥**

**దంతోలూఖలినస్త్వన్యే అశ్మకుట్టాస్తథాపరే ।**
**స్థానవీరాసనాస్త్వన్యే మృగచర్యారతాః పరే ॥25॥**

**కాలం నయంతి తపసా పూజయా చ మహాధియః ।**

మహాబుద్ధిమంతులైన ఆ మునులలో కొందరు విచిత్ర ప్రదేశాలలో, పర్వతగుహలలో కొందరు, నదులయొక్క మంగళకరాలైన నిర్మానుష్యమైన ఇసుకతిన్నెలపైన కొందరు, నీటిలోపల పరుండి నాచువలె శోభిస్తూ కొందరు, కొందరు దర్భలను పరిచిన భూమిపై, కాలియొక్క బొటనివ్రేలికొనపై నిలచి కొందరు, దంతాలే రుబ్బురోలుగా అనగా నోటిలో వెలువడే లాలాజలాన్ని ఆహారంగా గ్రహిస్తూ కొందరు, కొందరు రాతి పొడిని ఆహారంగా తీసుకుంటూ, కొందరు వీరాసనస్థులై, మరికొందరు మృగచర్యాసక్తులై అనగా చేతుల్ని కూడా కాళ్లుగా చేసి పూజలతో, తపస్సుతో కాలాన్ని గడుపుతున్నారు.

**ఏవం సంవత్సరే పూర్ణే వసంతే సముపస్థితే ॥26॥**

**తతస్తేషాం ప్రసారార్థం భక్తానామనుకంపయా ।**
**దేవః కృతయుగే తస్మిన్ గిరౌ హిమవతః శుభే ॥27॥**

**దేవదారువనం ప్రాప్తః ప్రసన్నః పరమేశ్వరః ।**

ఈవిధంగా మునులు తపస్సు చేయుచుండగా ఒక సంవత్సరకాలం గడవగా వసంతఋతువు వచ్చింది. అప్పుడు భక్తులైన ఆ మునులపై దయతో వారిని అనుగ్రహించడానికై పరమేశ్వరుడు కృతయుగంలో మంగళకరమైన హిమవత్పర్వతంలో గల దేవదారువనానికి సుప్రసన్నుడై వచ్చాడు.

**భస్మపాంసూపదిగ్ధాంగో నగ్నో వికృతలక్షణః ॥28॥**

**ఉల్ముకవ్యగ్రహస్తశ్చ రక్తపింగళలోచనః ।**
**క్వచిచ్చ హసతే రౌద్రం క్వచిద్ గాయతి విస్మితః ॥29॥**

**క్వచిన్నృత్యతి శృంగారం క్వచిద్రౌతి ముహుర్ముహుః ।**
**ఆశ్రమే హ్యటతే భైక్ష్యం యాచతే చ పునః పునః ॥30॥**

**మాయాం కృత్వా తథారూపాం దేవస్తద్వనమాగతః ।**

ఆసమయంలో శివుడు భస్మాలంకృతదేహుడు, దిగంబరుడు, వికారస్వరూపుడై, చేతిలో కాగడా ధరించి, ఎర్రటి పచ్చటి కళ్ళతో ఒక్కొక్కసారి భయంకరంగా నవ్వుతున్నాడు. ఒక్కొక్కసారి ఆశ్చర్యంగా పాడుతున్నాడు. ఒక్కొక్కసారి శృంగారాన్ని ప్రకటిస్తూ నాట్యం చేస్తున్నాడు. ఒక్కొక్కసారి మాటిమాటికి ఏడుస్తున్నాడు. ఆశ్రమంలో మాటిమాటికి తిరుగుతూ భిక్షను యాచిస్తున్నాడు. మాయను ప్రకటిస్తూ, ఆ యా రూపాలను ధరిస్తూ శివభగవానుడు దేవదారువనానికి వచ్చాడు.

**తతస్తే మునయః సర్వే తుష్టువుశ్చ సమాహితాః ॥31॥**

**అద్భిర్వివిధమాల్యైశ్చ ధూపైర్గంధైస్తథైవ చ ।**
**సపత్నీకా మహాభాగాః సపుత్రాః సపరిచ్ఛదాః ॥32॥**

**మునయస్తే తథా వాగ్భిరీశ్వరం చేదమబ్రువన్ ।**

అప్పుడు మహానుభావులైన ఆ మునులందరూ సంతోషించి ఏకాగ్రచిత్తంతో జలంతో, పలురకాల పూలమాలలతో, ధూపాలతో, సుగంధాలతో పత్నీపుత్ర బంధుసహితులై పూజించి, శివుడితో ఇలా పలికారు.

**అజ్ఞానాద్దేవదేవేశ యదస్మాభిరనుష్ఠితమ్ ॥33॥**

**కర్మణా మనసా వాచా తత్సర్వం క్షంతుమర్హసి ।**

ఓ దేవాధిదేవా! అజ్ఞానం వల్ల మేము అలా ప్రవర్తించాం. మనోవాక్కాయకర్మలతో ఆ సమస్తాపరాధాన్ని మన్నింపదగినవాడవు.

**చరితాని విచిత్రాణి గుహ్యాని గహనాని చ ॥34॥**

**బ్రహ్మాదీనాం చ దేవానాం దుర్విజ్ఞేయాని తే హర ।**
**అగతిం తేన జానీమో గతిం నైవ చ నైవ చ ॥35॥**

**విశ్వేశ్వర మహాదేవ యోఽసి సోఽసి నమోఽస్తు తే ।**
**స్తువంతి త్వాం మహాత్మానో దేవదేవం మహేశ్వరమ్ ॥36॥**

ఓ హరుడా! నీ వృత్తాంతాలు మిక్కిలి అద్భుతాలు. పరమరహస్యాలు. మిక్కిలి కఠినాలు. బ్రహ్మమొదలైన దేవతలకు కష్టంమీద కూడా తెలియదగనట్టివి. మేము నీయొక్క గతి, అగతుల్ని తెలియని వాళ్లం. ఓ విశ్వేశ్వరా! మహాదేవా! నీవు ఎట్లుండవలెనో అట్లే ఉంటావు. నీకు మా నమస్కారం. మహాత్ములు దేవాధిదేవుడవు, మహేశ్వరుడవైన నిన్ను స్తుతిస్తున్నారు.

**నమో భవాయ భవ్యాయ భావనాయోద్భవాయ చ ।**
**అనంతబలవీర్యాయ భూతానాం పతయే నమః ॥37॥**

భవుడికి, భవ్యుడికి, భావనుడికి, ఉద్భవుడికి నమస్కారం. అనంతబలపరాక్రముడికి, భూతపతికి నమస్కారం.

**సంహర్త్రే చ పిశంగాయ అవ్యయాయ వ్యయాయ చ ।**
**గంగాసలిలధారాయ ఆధారాయ గుణాత్మనే ॥38॥**

**త్ర్యంబకాయ త్రినేత్రాయ త్రిశూలవరధారిణే ।**
**కందర్పాయ హుతాశాయ నమోఽస్తు పరమాత్మనే ॥39॥**

లయకారుడికి, పిశంగవర్ణుడికి, అవినాశికి, వినాశికి, గంగాధరుడికి, సర్వాధారుడికి, గుణాత్ముడికి, త్ర్యంబకుడికి, ముక్కంటికి, శ్రేష్ఠశూలధారికి, కందర్పుడికి, అగ్నిరూపుడికి, మహాత్ముడికి నమస్కారం.

**శంకరాయ వృషాంకాయ గణానాం పతయే నమః ।**
**దండహస్తాయ కాలాయ పాశహస్తాయ వై నమః ॥40॥**

**వేదమంత్రప్రధానాయ శతజిహ్వాయ వై నమః ।**
**భూతం భవ్యం భవిష్యం చ స్థావరం జంగమం చ యత్ ॥41॥**

**తవ దేహాత్సముత్పన్నం దేవ సర్వమిదం జగత్ ।**
**పాసి హంసి చ భద్రం తే ప్రసీద భగవంస్తతః ॥42॥**

**అజ్ఞానాద్యది విజ్ఞానాద్యత్కించిత్కురుతే నరః ।**
**తత్సర్వం భగవానేవ కురుతే యోగమాయయా ॥43॥**

పాశదండాలు హస్తమందుగలవాడికి, వృషధ్వజుడికి, ప్రమథగణనాథుడికి, కాలస్వరూపుడికి శంకరుడికి నమస్కారం. వేదమంత్రాలచే ముఖ్యంగా నిరూపింపబడినవాడికి, శతజిహ్వుడికి నమస్కారం. భూత భవిష్యద్వర్తమానకాల స్వరూపుడికీ, చరాచరజగత్స్వరూపుడికీ నమస్కారం. ఓ దేవాధిదేవా! ఈ సమస్త ప్రపంచం నీ దేహంనుంచే ఉత్పన్నమైంది. దీన్ని నీవే రక్షిస్తున్నావు. సంహరిస్తున్నావు. అందుచే నీకు మంగళమవుగాక! మమ్మల్ని అనుగ్రహించు. తెలిసి తెలియక నరుడు చేసేది అంతా నీవే యోగమాయవల్ల కల్పిస్తున్నావు.

**ఏవం స్తుత్వా తు మునయః ప్రహృష్టైరంతరాత్మభిః ।**
**యాచంత తపసా యుక్తాః పశ్యామస్త్వాం యథా పురా ॥44॥**

సంతుష్టాత్ములై తపోధనులైన మునులు ఈవిధంగా కీర్తించి, నిన్ను పూర్వమంగళకరరూపంలో చూడదలచామని పలికారు.

**తతో దేవః ప్రసన్నాత్మా స్వయమాస్థాయ శంకరః ।**
**రూపం త్ర్యక్షం చ సంద్రష్టుం దివ్యం చక్షురదాత్ప్రభుః ॥45॥**

మునుల స్తుతికి సంతసించిన శివభగవానుడు తనయొక్క ముక్కంటి రూపాన్ని బాగా చూడడానికి వారికి దివ్యదృష్టిని ప్రసాదించాడు.

**లబ్ధదృష్ట్యా తయా దృష్ట్వా దేవదేవం త్రియంబకమ్ ।**

**పునస్తుష్టువురీశానం దేవదారువనౌకసః ॥46॥**

దేవదారువననివాసులైన మునులు దివ్యదృష్టిని పొంది, దానితో త్రినేత్రుడైన దేవాధిదేవుడైన శివుణ్ణి సందర్శించి, మరల శివుణ్ణి స్తుతించారు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే మునికృతం శివస్తోత్రవర్ణనం నామైకత్రింశత్తమోఽధ్యాయః ॥ 31 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని మునులు చేసిన శివస్తోత్రవర్ణనమనే ముప్పైఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్వాత్రింశత్తమోఽధ్యాయః - ముప్పైరెండవ అధ్యాయం

## శివస్తుతివర్ణనమ్ - శివస్తుతివర్ణనం

**ఋషయః ఊచుః -** మునులు పలికారు.

**నమో దిగ్వాససే నిత్యం కృతాంతాయ త్రిశూలినే ।**
**వికటాయ కరాలాయ కరాలవదనాయ చ ॥1॥**

దిగంబరుడికి, నిత్యుడికి, ప్రళయకారుడికి, త్రిశూలధారికి, వికటస్వరూపుడికి, కుఠారస్వరూపుడికి, భీషణమైన ముఖంగల శివుడికి నమస్కారం.

**అరూపాయ సురూపాయ విశ్వరూపాయ తే నమః ।**
**కటంకటాయ రుద్రాయ స్వాహాకారాయ వై నమః ॥2॥**

రూపరహితుడికి, సుందరరూపుడికి, విశ్వరూపుడికి నీకు నమస్కారం. గజానన ప్రీతికరునికి, స్వాహా అని పలికెడి యజమాన స్వరూపుడికి, రుద్రుడికి నమస్కారం.

**సర్వప్రణతదేవాయ స్వయం చ ప్రణతాత్మనే ।**
**నిత్యం నీలశిఖండాయ శ్రీకంఠాయ నమో నమః ॥3॥**

**నీలకంఠాయ దేవాయ చితాభస్మాంగధారిణే ।**
**త్వం బ్రహ్మా సర్వదేవానాం రుద్రాణాం నీలలోహితః ॥4॥**

సమస్తదేవతలూ నమస్కరించేవాడికి, సాక్షాత్తు వినీతాత్ముడికి, ఎల్లప్పుడూ నీలజటాజూటంగలవాడికి, గరళకంఠుడికి, నీలకంఠుడికి, చితాభస్మధారికి, మహాదేవుడికి నమస్కారం. నమస్కారం. సమస్తదేవతలలో నీవు బ్రహ్మవు. రుద్రులలో నీలలోహిత రుద్రుడివి.

**ఆత్మా చ సర్వభూతానాం సాంఖ్యైః పురుష ఉచ్యతే ।**
**పర్వతానాం మహామేరుర్నక్షత్రాణాం చ చంద్రమాః ॥5॥**

నీవు సమస్తభూతాలకు ఆత్మవు. సాంఖ్యులు నిన్ను పురుషుడు అంటున్నారు. నీవు పర్వతాలలో విశాలమైన మేరుపర్వతానివి. నక్షత్రాలలో చంద్రుడివి.

**ఋషీణాం చ వసిష్ఠస్త్వం దేవానాం వాసవస్తథా ।**
**ఓంకారః సర్వవేదానాం శ్రేష్ఠం సామ చ సామసు ॥6॥**

ఋషులలో నీవు వసిష్ఠుడివి. దేవతలలో ఇంద్రుడివి. సర్వవేదసారమైన ఓంకారానివి. సామములలో శ్రేష్ఠమైన సామం నీవు.

**ఆరణ్యానాం పశూనాం చ సింహస్త్వం పరమేశ్వరః ।**
**గ్రామ్యాణామృషభశ్చాసి భగవాన్ లోకపూజితః ॥7॥**

పరమేశ్వరుడవైన నీవు వనజంతువులలో సింహానివి. జనావాసజంతువులలో జనులు పూజించే గోవువు నీవే.

**సర్వథా వర్తమానోఽపి యో యో భావో భవిష్యతి ।**
**త్వామేవ తత్ర పశ్యామో బ్రహ్మణా కథితం తథా ॥8॥**

ఇట్లు వర్తమానంలో ఉండీ ఏయే రూపాలలో ఉన్నా బ్రహ్మచేత చెప్పబడిన విధిచేత నిన్ను మేము చూడగలుగుతున్నాం.

**కామః క్రోధశ్చ లోభశ్చ విషాదో మద ఏవ చ ।**
**ఏతదిచ్ఛామహే బోద్ధుం ప్రసీద పరమేశ్వర ॥9॥**

కామం, క్రోధం, లోభం, విషాదం, మదం ఈ అయిదింటిని మేం తెలిసికోదలచాం. ఓ పరమేశ్వరుడా! మాకు ప్రసన్నుడవుకమ్ము.

**మహాసంహరణే ప్రాప్తే త్వయా దేవ కృతాత్మనా ।**
**కరం లలాటే సంవిధ్య వహ్నిరుత్పాదితస్త్వయా ॥10॥**

ప్రళయం ప్రాప్తించగా స్థిరచిత్తుడవై ఫాలభాగంలో చేతిని రుద్ది అగ్నిని నీవు పుట్టించావు.

**తేనాగ్నినా తదా లోకా అర్చిభిః సర్వతో వృతాః ।**
**తస్మాదగ్నిసమా హ్యేతే బహవో వికృతాగ్నయః ॥11॥**

**కామః క్రోధశ్చ లోభశ్చ మోహో దంభ ఉపద్రవః ।**
**యాని చాన్యాని భూతాని స్థావరాణి చరాణి చ ॥12॥**

**దహ్యంతే ప్రాణినస్తే తు త్వత్సముత్థేన వహ్నినా ।**
**అస్మాకం దహ్యమానానాం త్రాతా భవ సురేశ్వర ॥13॥**

ఆ అగ్నికాంతులవల్ల లోకాలన్నీ ఆక్రమించాయి. అందువల్ల ఆ అగ్నితో సమానమైన అనేకాలైన వికృతులు అగ్నితుల్యాలు జనించాయి. కామం క్రోధం, లోభం, మోహం, దంభం అనే ఈ కష్టాలు అన్నీ అగ్ని సమానాలే. చరాచరాత్మకమైన ప్రాణులన్నీ నీవు ఉత్పాదించిన అగ్నిచే దహింపబడుతున్నాయి. ఓ దేవేశ్వరా! దహింపబడుతున్న మమ్ము నీవు రక్షించాలి.

**త్వం చ లోకహితార్థాయ భూతాని పరిషించసి ।**
**మహేశ్వర మహాభాగ ప్రభో శుభనిరీక్షక ॥14॥**

**ఆజ్ఞాపయ వయం నాథ కర్తారో వచనం తవ ।**
**భూతకోటి సహస్రేషు రూపకోటిశతేషు చ ॥15॥**

**అంతం గంతుం న శక్తాః స్మ దేవదేవ నమోఽస్తు తే ॥16॥**

ఓ మహేశ్వరా! ఓ మహాత్మా! ఓ ప్రభూ! ఓ మంగళనిరీక్షకా! నీవు లోకహితం కోసం సమస్తప్రాణుల్ని బాగా తడుపుతున్నావు. (అమృతరూప జలాలతో) ఓ ప్రభూ! నీవు మమ్మల్ని ఆజ్ఞాపించు. నీమాటను నిర్వహిస్తాం.

వేలకోట్ల ప్రాణులలో, వందలకోట్ల రూపాలలో నీ అంతాన్ని పొందలేని (చూడలేని) అసమర్థులం.

ఓ దేవాధిదేవా నీకు నమస్కారం.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే 'శివస్తుతివర్ణనం' నామ ద్వాత్రింశత్తమోఽధ్యాయః ॥ 32 ॥**

శ్రీలింగమహాపురాణం, పూర్వభాగంలోని 'శివస్తుతివర్ణనం' అనే ముప్పైరెండవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## త్రయస్త్రింశత్తమోఽధ్యాయః - ముప్పైమూడవ అధ్యాయం

## ఋషివాక్యమ్ - ఋషివాక్యం

**నంద్యువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**తతస్తుతోష భగవాననుగృహ్య మహేశ్వరః ।**
**స్తుతా శ్రుత్వా స్తుతస్తేషామిదం వచనమబ్రవీత్ ॥1॥**

మునులచేత స్తుతింపబడిన శివభగవానుడు వారి స్తుతిని విని, సంతుష్టుడై వారిని అనుగ్రహించి, వారితో ఇలా పలికాడు.

**యః పఠేచ్ఛృణుయాద్వాపి యుష్మాభిః కీర్తితం స్తవమ్ ।**
**శ్రావయేద్వా ద్విజాన్ విప్రో గాణపత్యమవాప్నుయాత్ ॥2॥**

మీచేత కీర్తింపబడిన ఈ స్తుతిని పఠించువాడు, వినేవారు, ద్విజులకు వినిపించేవాడు నా ప్రమథగణాలలో ముఖ్యస్థానాన్ని పొందుతాడు.

**వక్ష్యామి వో హితం పుణ్యం భక్తానాం మునిపుంగవాః ।**

**స్త్రీలింగమఖిలం దేవీ ప్రకృతిర్మమ దేహజాః ॥3॥**
**పుంలింగం పురుషో విప్రా మమ దేహసముద్భవః ।**

**ఉభాభ్యామేవ వై సృష్టిర్మమ విప్రా న సంశయః ॥4॥**

ఓ మునిశ్రేష్ఠులారా! భక్తులకు హితమైనదానిని, పుణ్యమైనదానిని చెప్తున్నాను. స్త్రీలింగరూపంలో గల ప్రతివస్తువు నాదేహం నుంచి ఉత్పత్తి అయిన ప్రకృతియే. అట్లే పుంలింగరూపంలోగల ప్రతివస్తువు నాదేహంనుండి ఉత్పన్నమైన పురుషుడే. ఓ బ్రాహ్మణులారా! ఈ రెండింటివల్ల అనగా ప్రకృతి పురుషులతో ఏర్పడినదే నా యీ సృష్టి. ఇందు సందేహం లేదు.

**న నిందేద్యతినం తస్మాద్దిగ్వాససమనుత్తమమ్ ।**
**బాలోన్మత్తవిచేష్టం తు మత్పరం బ్రహ్మవాదినమ్ ॥5॥**

అన్నీ శివరూపాలే. కాబట్టి దేన్నీ నిందించరాదు. ఉత్తమం, దిగంబరం, బ్రహ్మవాది, యతి, బాలస్వభావచేష్ట, ఉన్మత్తచేష్ట అన్నియు నాసంబంధాలే. కావున దేనిని నిందించరాదు.

**యే హి మాం భస్మనిరతా భస్మనా దగ్ధకిల్బిషాః ।**
**యథోక్తకారిణో దాంతా విప్రా ధ్యానపరాయణాః ॥6॥**

**మహాదేవపరా నిత్యం చరంతో హ్యూర్ధ్వరేతసః ।**
**అర్చయతి మహాదేవం వాఙ్మనఃకాయసంయతాః ॥7॥**

**రుద్రలోకమనుప్రాప్య న నివర్తంతి తే పునః ।**
**తస్మాదేతద్ వ్రతం దివ్యమవ్యక్తం వ్యక్తలింగినః ॥8॥**

భస్మభూషితులై, ఆ భస్మంతో పాపాలు తొలగిపోయినవారు, ఇంద్రియాలను జయించినవారు, విధ్యుక్తంగా నిత్యనైష్ఠిక కర్మల్ని అనుసరించేవారు, నిరంతరం ధ్యానతత్పరులు, ఎల్లప్పుడూ దేవాధిదేవుడి భక్తితో చరించువారు, ఊర్ధ్వరేతస్కులు, మనోవాక్కాయకర్మలతో మహాదేవుణ్ణి అయిన నన్ను అర్చించు విప్రులు రుద్రలోకాన్ని పొందినవారై మరల వెనుదిరిగిరారు. పునర్జన్మ ఉండదు. అందుచేతనే లింగస్వరూపం తెలిసిన భక్తులకు దివ్యమైన, అవ్యక్తమైన ఈ పాశుపతవ్రతం తగినట్టిది.

**భస్మవ్రతాశ్చ ముండాశ్చ వ్రతినో విశ్వరూపిణః ।**
**న తాన్ పరివదేద్విద్వాన్న చైతాన్నాభిలంఘయేత్ ॥9॥**

**న హసేన్నా ప్రియం బ్రూయాదముత్రేహ హితార్థవాన్ ।**
**యస్మాన్నిందతి మూఢాత్మా మహాదేవం స నిందతి ॥10॥**

**యస్త్వేతాన్ పూజయేన్నిత్యం స పూజయతి శంకరమ్ ।**

భస్మాలంకారులు, ముండీకృతశిరస్కులు, వ్రతాన్ని ఆచరించువారు, వివిధరూపాలలో కన్పించు ఈ పాశుపతులను నిందించరాదు. వారి మాటల్ని ఉల్లంఘించరాదు. వారిని పరిహసించరాదు. పరుష వాక్యాలు పలకరాదు. ఇహపరాలలో హితార్థులైనవారు వార్ని నిందించరాదు. వార్ని నిందించిన మూర్ఖుడు శివుణ్ణి నిందించినవాడే. ఎవడు ఇట్టి వీర్ని నిత్యం పూజిస్తాడో ఆతడు శివుణ్ణి పూజించినవాడే అవుతాడు.

**ఏవమేష మహాదేవో లోకానాం హితకామ్యయా ॥11॥**

**యుగే యుగే మహాయోగీ క్రీడతే భస్మగుంఠితః ।**
**ఏవం చరత భద్రం వస్తతః సిద్ధిమవాప్స్యథ ॥12॥**

ఈ విధంగా దేవాధిదేవుడైన శివుడు ప్రపంచం యొక్క శ్రేయస్సును కోరి ప్రతియుగంలోనూ భస్మభూషిత దేహుడైన మహాయోగి అయి క్రీడిస్తాడు. మీరు కూడా ఈవిధంగా ఆచరించండి. అందువల్ల మీకు శుభం కల్గుతుంది. సిద్ధి ప్రాప్తిస్తుంది.

**అతులమిహ మహాభయప్రణాశహేతుం శివకథితం పరం పదం విదిత్వా ।**
**వ్యపగతభవలోభమోహచిత్తాః ప్రణిపతితాః సహసా శిరోభిరుగ్రమ్ ॥13॥**

మహాశివుడిచేత చెప్పబడి మహాభయనివారకకారణమై సాటిలేని పరమపదప్రాప్తిదాయకమైన జ్ఞానాన్ని తెలిసిన మునులు లోభమోహాలు తొలగి వెంటనే శివుడి పాదాలపై శిరసులుంచి నమస్కరించారు.

**తతః ప్రముదితా విప్రాః శ్రుత్వైతం కథితం తదా ।**
**గంధోదకైః సుశుద్ధైశ్చ కుశపుష్పవిమిశ్రితైః ॥14॥**

**స్నాపయంతి మహాకుంభైరద్భిరేవ మహేశ్వరమ్ ।**
**గాయంతి వివిధైర్గుహ్యైర్హుంకారైశ్చాపి సుస్వరైః ॥15॥**

శివభగవానుడు చెప్పిన ఆవిషయాన్ని విన్న అనంతరం సంతోషించిన ఆ మునులు పరిశుభ్రమైన, కుశలతో, పుష్పాలతో కూడిన సుగంధయుక్తమైన నీటితో నిండిన మహాకుంభాలతో మహేశ్వరుణ్ణి అభిషేకిస్తున్నారు. సుస్వరాలతో కూడిన హుంకారధ్వనులు చేస్తూ పలురకాల నిగూఢార్థాలుగల గీతాల్ని పాడుతున్నారు.

**నమో దేవాధిదేవాయ మహాదేవాయ వై నమః ।**
**అర్ధనారీశరీరాయ సాంఖ్యయోగప్రవర్తినే ॥16॥**

**మేఘవాహనకృష్ణాయ గజచర్మనివాసినే ।**
**కృష్ణాజినోత్తరీయాయ వ్యాలయజ్ఞోపవీతినే ॥17॥**

దేవాధిదేవుడైన మహాదేవశివుడికి నమస్కారం. అర్ధనారీశ్వరస్వరూపుడికి నమస్కారం. సాంఖ్యయోగ ప్రవర్తకుడైన శివుడికి నమస్కారం. మేఘవాహనమునకు సమానమైన నల్లని శరీరంగలవాడికి, గజచర్మాన్ని అంగవస్త్రంగా ధరించినవాడికి, జింకచర్మం ఉత్తరీయంగా గలవాడికి, సర్పం జందెంగా గలవాడికి నమస్కారం. (మేఘవాహనమన్నది ఒక కల్పం పేరు. ఆ కల్పంలో శివుడు నీలివర్ణుడు. వివరాలకై చూ: లింగపురాణం 37వ అధ్యాయం- 16-18 శ్లోకాలు,)

**సురచిత సువిచిత్ర కుండలాయ సురచితమాల్యవిభూషణాయ తుభ్యమ్ ।**
**మృగపతివరచర్మవాససే ప్రథితయశసే నమోఽస్తు శంకరాయ ॥18॥**

చక్కగా తయారు చేసిన, అతివిచిత్రమైన కుండలాల్ని ధరించిన వాడికి; బాగా కట్టిన మాలలు అలంకారాలుగా గలవాడికి నీకు నమస్కారం. సింహశ్రేష్ఠచర్మధారికి, ప్రకటితయశస్సుగలవాడికి, శంకరుడికి నమస్కారం.

**తతస్తాన్ స మునీన్ ప్రీతః ప్రత్యువాచ మహేశ్వరః ।**
**ప్రీతోఽస్మి తపసా యుష్మాన్ వరం వృణుత సువ్రతాః ॥19॥**

ఆ మునుల స్తుతివల్ల సంతుష్టుడైన శివుడు వారినుద్దేశించి మరల పలికాడు. 'మీయొక్క తపస్సుకు సంతోషించాను. ఓ సువ్రతులైన మునులారా! వరాన్ని కోరండి!'

**తతస్తే మునయః సర్వే ప్రణిపత్య మహేశ్వరమ్ ।**
**భృగ్వంగిరా వసిష్ఠశ్చ విశ్వామిత్రస్తథైవ చ ॥20॥**

**గౌతమోఽత్రిః సుకేశశ్చ పులస్త్యః పులహః క్రతుః ।**
**మరీచిః కశ్యపః కణ్వః సంవర్తశ్చ మహాతపాః ॥21॥**

**తే ప్రణమ్య మహాదేవమిదం వచనమబ్రువన్ ।**

**భస్మస్నానం చ నగ్నత్వం వామత్వం ప్రతిలోమతా ॥22॥**

**సేవ్యాసేవ్యత్వమేవ చ హ్యేతదిచ్ఛామ వేదితమ్ ।**

మహాదేవుడి ఆ మాటను విని భృగువు, అంగిరసుడు, వసిష్ఠుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, అత్రి, సుకేశుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, మరీచి, కశ్యపుడు, కణ్వుడు, సంవర్తుడు అనే మహాతపస్వులైన ఆ మునులందరూ శివుడికి నమస్కరించి ఇలా పలికారు. భస్మస్నానం, నగ్నత్వం, వామత్వం, ప్రతిలోమత్వం(కామ్య కర్మసాధన విషయంలో ప్రవృత్తి), సేవింపదగినవీ, సేవింపదగనివీ... వీటి గురించి తెలుసుకోవాలనుకుంటున్నాం.

**తతస్తేషాం వచః శ్రుత్వా భగవాన్ పరమేశ్వరః ॥23॥**

**సస్మితం ప్రాహ సంక్షేప్య సర్వాన్ మునివరాంస్తదా ॥24॥**

అప్పుడు వారి మాటల్ని విన్న శివుడు నవ్వుతూ, క్లుప్తంగా అన్ని విషయాల్ని ఆ మునిశ్రేష్ఠుల్ని ఉద్దేశించి చెప్పాడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే ఋషివాక్యం నామ త్రయస్త్రింశత్తమోఽధ్యాయః ॥ 33 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని ఋషివాక్యమనే ముప్పైమూడవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **చతుస్త్రింశత్తమోఽధ్యాయః** - ముప్పైనాలుగవ అధ్యాయం

## **యోగిప్రశంసా** - యోగిప్రశంస

**శ్రీభగవానువాచ** - శ్రీ శివభగవానుడు చెప్పాడు.

**ఏతద్వః సంప్రవక్ష్యామి కథాసర్వస్వమద్య వై ।**
**అగ్నిర్వ్యహం సోమకర్తా సోమశ్చాగ్నిముపాశ్రితః ॥1॥**

నేడు నేను మీకు సర్వవృత్తాంతాన్ని బాగా చెప్తాను. నేను అగ్నిదేవుణ్ణి. నేను సోమకర్తను. నేనే అగ్నికి ఆశ్రయమైన సోముణ్ణి.

**కృతమేతద్వహత్యగ్నిర్భూయో లోకసమాశ్రయాత్ ।**
**అసకృత్త్వగ్నినా దగ్ధం జగత్స్థావరజంగమమ్ ॥2॥**

**భస్మసాద్విహితం సర్వం పవిత్రమిదముత్తమమ్ ।**
**భస్మనా వీర్యమాస్థాయ భూతాని పరిషించతి ॥3॥**

ఈ లోకాన్ని ఆశ్రయించి ఉండడంచే అన్ని కర్మలకు ఫలం అగ్నిద్వారానే జరుగుతోంది. అగ్నిచేత పలుమార్లు చరాచరజగత్తు దహింపబడింది. భస్మీభూతమైన ఈ సంపూర్ణజగత్తు పవిత్రమూ మరియు ఉత్తమమూ అవుతుంది. ఈ భస్మం నుంచి శక్తిని పొంది సోముడు ప్రాణుల్ని సజీవుల్ని చేస్తున్నాడు.

**అగ్నికార్యం చ యః కృత్వా కరిష్యతి త్రియాయుషమ్ ।**
**భస్మనా మమ వీర్యేణ ముచ్యతే సర్వకిల్బిషైః ॥4॥**

అగ్ని కార్యాన్ని ఆరంభించి వేదోక్తమైన ఆయుస్సు ఉన్నంతవరకు కొనసాగించినవాడు, నా భస్మశక్తితో పాపవిముక్తినందగలడు.

**భాసతేత్యేవ యద్భస్మ శుభం భావయతే చ యత్ ।**
**భక్షణాత్సర్వపాపానాం భస్మేతి పరికీర్తితమ్ ॥5॥**

ఈ భస్మం ప్రకాశాన్ని ఇస్తుంది. మంగళాల్ని కలిగిస్తుంది. సమస్తపాపాల్ని ఆరగించడం వల్ల అనగా నశింపజేయడంవల్ల భస్మమని చెప్పబడుతుంది.

**ఊష్మపాః పితరో జ్ఞేయా దేవా వై సోమసంభవాః ।**
**అగ్నీసోమాత్మకం సర్వం జగత్స్థావరజంగమమ్ ॥6॥**

పితృదేవతలు ఊష్మం(ఉమ్మ) త్రాగుతారు. దేవతలు చంద్రుడినుండి పుట్టారు. ఈ చరాచరజగత్తు అగ్ని - సోమాత్మకమైంది.

**అహమగ్నిర్మహాతేజాః సోమశ్చైషా మహాంబికా ।**
**అహమగ్నిశ్చ సోమశ్చ ప్రకృత్యా పురుషః స్వయమ్ ॥7॥**

నేను గొప్పకాంతిమంతమైన అగ్నిని. ఈ మహిమాన్విత అయిన పార్వతీదేవి సోమస్వరూపిణి. ప్రకృతిపరంగా పురుషుణ్ణి అయిన నేను అగ్నిని, సోముణ్ణి కూడా.

**తస్మాద్భస్మ మహాభాగా మద్వీర్యమితి చోచ్యతే ।**
**స్వవీర్యం వపుషా చైవ ధారయామీతి వై స్థితిః ॥8॥**

**తదాప్రభృతి లోకేషు రక్షార్థమశుభేషు చ ।**
**భస్మనా క్రియతే రక్షా సూతికానాం గృహేషు చ ॥9॥**

ఓ మహాత్ములైన ఋషులారా! అందువల్లనే భస్మం నాశక్తిగా చెప్పబడుతున్నది. నా శక్తిని నాశరీరంతోనే ధరిస్తున్నాను. అప్పటినుంచి ఆ భస్మం లోకాలను అశుభాలనుంచి రక్షిస్తున్నది. ప్రసూతికాగృహాలు కూడా ఈ భస్మంచేతనే రక్షింపబడుతున్నాయి.

**భస్మస్నానవిశుద్ధాత్మా జితక్రోధో జితేంద్రియః ।**
**మత్సమీపం సమాగమ్య న భూయో వినివర్తతే ॥10॥**

భస్మస్నానంతో పవిత్రుడై క్రోధాన్నీ, ఇంద్రియాలనూ జయించినవాడు నన్ను చేరుతాడు. తిరిగి వెళ్ళడు. ముక్తుడవుతాడు.

**వ్రతం పాశుపతం యోగం కాపిలం చైవ నిర్మితమ్ ।**
**పూర్వం పాశుపతం హ్యేతన్నిర్మితం తదనుత్తమమ్ ॥11॥**

పాశుపతవ్రతదీక్ష, యోగశాస్త్రం, సాంఖ్యశాస్త్రం వీటిని నేనే రచించాను. ఇందులో పాశుపతీవ్రతం పూర్వమే రచించబడిఉంది. అందుచేతనే అది ఉత్తమమైనది.

**శేషాశ్చాశ్రమిణః సర్వే పశ్చాత్సృష్టాః స్వయంభువా ।**
**సృష్టిరేషా మయా సృష్టా లజ్జామోహభయాత్మికాః ॥12॥**

తదుపరి బ్రహ్మచర్యాది నాలుగు ఆశ్రమాలు స్వయంభువుడైన బ్రహ్మ సృష్టించాడు. సిగ్గు, మోహం, భయం- వీటితో కూడిన సమస్త సృష్టిని నేను రచించాను.

**నగ్నా ఏవ హి జాయంతే దేవాశ్చ మునయస్తథా ।**
**యే చాన్యే మానవా లోక సర్వే జాయంత్యవాససః ॥13॥**

**ఇంద్రియై రజితైర్నగ్నో దుకూలేనాపి సంవృతః ।**
**తైరేవ సంవృతైర్గుప్తో న వస్త్రం కారణం స్మృతమ్ ॥14॥**

దేవతలు, మునులు నగ్నంగానే జన్మిస్తున్నారు. మిగిలిన మానవులందరూ ఈలోకంలో వస్త్రవిహీనులుగానే పుడుతున్నారు. వస్త్రాచ్ఛాదన కలిగీ ఇంద్రియజయం లేకపోతే నగ్నత్వమే. ఇంద్రియజయం కల్గినవారు నగ్నులైనా వస్త్రాలు ధరించినవారే. కావున నగ్నత, అనగ్నతలకు వస్త్రం హేతువుకాదు. ఇంద్రియనిగ్రహమే హేతువు.

**క్షమా ధృతిరహింసా చ వైరాగ్యం చైవ సర్వశః ।**
**తుల్యౌ మానావమానౌ చ తదావరణముత్తమమ్ ॥15॥**

ఓర్పు, ధైర్యం, అహింస, విరక్తి, మానం, అవమానం – వీటి అన్నింటిని సమానంగా గ్రహించడమే ఉత్తమమైన ఆచ్ఛాదనం అవుతుంది.

**భస్మస్నానేన దిగ్ధాంగో ధ్యాయతే మనసా భవమ్ ।**
**యద్యకార్యసహస్రాణి కృత్వా యః స్నాతి భస్మనా ॥16॥**

**తత్సర్వం దహతే భస్మ యథాగ్నిస్తేజసా వనమ్ ।**
**తస్మాద్యత్నపరో భూత్వా త్రికాలమపి యః సదా ॥17॥**

**భస్మనా కురుతే స్నానం గాణపత్యం స గచ్ఛతి ।**

భస్మంతో స్నానం చేయడంతో భస్మానులేపనంగల శరీరం మనస్సుతో శివుణ్ణి ధ్యానిస్తుంది. భస్మ స్నానం చేసినవాడు వేలకొలది అకృత్యాలు చేసినా అవి అన్నీ భస్మంతో దహింపబడతాయి, అగ్నితో అరణ్యం దహింపబడునట్లు అందువల్ల ప్రయత్నపూర్వకంగా ఎవడు మూడు కాలాలలో భస్మస్నానం చేస్తాడో ఆతడు ప్రమథగణపతి అవుతున్నాడు.

**సమాహృత్య క్రతూన్ సర్వాన్ గృహీత్వా వ్రతముత్తమమ్ ॥18॥**

**ధ్యాయంతి యే మహాదేవం లీలాసద్భావభావితాః ।**
**ఉత్తరేణార్యపంథానం తేఽమృతత్వమవాప్నుయుః ॥19॥**

ఏమానవులు ఉత్తమవ్రతదీక్షల్ని స్వీకరించి యజ్ఞాల్ని నిర్వహించి, లీలావిగ్రహచింతనపరులై మహాదేవశివుణ్ణి ధ్యానిస్తారో వారు అమృతత్వాన్ని పొందుతారు. ఇది ఉత్తమమైన రెండోమార్గం.

**దక్షిణేన చ పంథానం యే శ్మశానాని భేజిరే ।**
**అణిమా గరిమా చైవ లఘిమా ప్రాప్తిరేవ చ ॥20॥**

**ఇచ్ఛాకామావసాయిత్వం తథా ప్రాకామ్యమేవ చ ।**
**ఈశిత్వం చ వశిత్వం చ అమరత్వం చ తే గతాః ॥21॥**

ఎవరు దక్షిణమార్గం ద్వారా నశ్వరాలైన కామ్యకర్మల ద్వారా శివారాధన చేస్తారో వాళ్లు అణిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ఇచ్ఛాకామావసాయిత్వం, ప్రాకామ్యం, ఈశిత్వం, వశిత్వం అనే అష్టసిద్ధుల్ని పొంది అమరులవుతారు.

**ఇంద్రాదయస్తథా దేవాః కామికవ్రతమాస్థితాః ।**
**ఐశ్వర్యం పరమం ప్రాప్య సర్వే ప్రథితతేజసః ॥22॥**

ఇంద్రుడు మొదలైన దేవతలు అందరూ కామ్యవ్రతాన్ని ఆచరించి అనంతమైన ఐశ్వర్యాన్ని పొంది అపరిమితకాంతిమంతులయ్యారు.

**వ్యపగతమదమోహముక్తరాగస్తమరజదోషవివర్జితస్వభావః ।**
**పరిభవమిదముత్తమం విదిత్వా పశుపతియోగపరో భవేత్సదైవ ॥23॥**

మదమోహాలు తొలగి, రాగాన్ని వీడి, తమోగుణరజోగుణ దోషాలను విడిచి, సంసారంపై ఏవగింపు కలిగి పాశుపతయోగమే గొప్పదని తెలిసినవారు ఎల్లప్పుడూ పాశుపతయోగపరాయణులవుతారు.

**ఇమం పాశుపతం ధ్యాయన్ సర్వపాపప్రణాశనమ్ ।**
**యః పఠేచ్చ శుచిర్భూత్వా శ్రద్దధానో జితేంద్రియః ॥24॥**

**సర్వపాపవిశుద్ధాత్మా రుద్రలోకం స గచ్ఛతి ।**

సమస్తపాపాల్ని సంపూర్ణంగా నశింపజేసే ఈ పాశుపతయోగాన్ని ధ్యానించి శ్రద్ధావంతుడు, జితేంద్రియుడు అయినవాడు ఎవడు పరిశుద్ధుడై పఠిస్తాడో ఆతడు సర్వపాపవిముక్తాత్ముడై రుద్రలోకం వెళుతున్నాడు.

**తే సర్వే మునయః శ్రుత్వా వసిష్ఠాద్యా ద్విజోత్తమాః ॥25॥**

**భస్మపాండురదిగ్ధాంగా బభూవుర్విగతస్పృహాః ।**
**రుద్రలోకాయ కల్పాంతే సంస్థితాః శివతేజసా ॥26॥**

వసిష్ఠుడు మొదలైన ఆ బ్రాహ్మణమునులు అందరు శివభగవానుడి ఆ వాక్యాలు విని, భస్మావలేపనం వల్ల తెల్లటి అవయవాలుగలిగి, ఇచ్ఛారహితులై కల్పాంతంలో శివుడితో సమానమైన తేజస్సుగలవారై రుద్రలోకానికి ప్రయాణించారు.

**తస్మాన్న నింద్యాః పూజ్యాశ్చ వికృతా మలినా అపి ।**
**రూపాన్వితాశ్చ విప్రేంద్రాః సదా యోగీంద్రశంకయా ॥27॥**

అందువల్ల విప్రశ్రేష్ఠులైన శివభక్తులు వికృతాకారులైనా, సుందరరూపులైనా, మలినదేహులైనా వారు మహాయోగులనే అనుమానంతో ఎల్లప్పుడూ పూజనీయులే, నిందిపదగినవారు కాదు.

**బహునా కిం ప్రలాపేన భవభక్తా ద్విజోత్తమాః ।**
**సంపూజ్యాః సర్వయత్నేన శివవన్నాత్ర సంశయః ॥28॥**

**మలినాశ్చైవ విప్రేంద్రా భవభక్తా దృఢవ్రతాః ।**

పలుమాటలేల? బ్రాహ్మణశ్రేష్ఠులైన శివభక్తులు అన్నివిధాల బాగా పూజింపదగినవారు. స్థిరవ్రతులైన ఆ విప్రశ్రేష్ఠులు, శివభక్తులు మలినులైనా శివుడివంటివారే. ఇందులో సందేహం లేదు.

**దధీచస్తు యథా దేవదేవం జిత్వా వ్యవస్థితః ॥29॥**

**నారాయణం తథా లోకే రుద్రభక్త్యా న సంశయః ।**

ముని దధీచి శివభక్తితో దేవాధిదేవుడైన విష్ణుమూర్తిని జయించి, లోకంలో ప్రతిష్ఠితుడైనాడు. ఇందులో సందేహం లేదు.

**తస్మాత్సర్వప్రయత్నేన భస్మదిగ్ధతనూరుహాః ॥30॥**

**జటినో ముండినశ్చైవ నగ్నా నానాప్రకారిణః ।**
**సంపూజ్యాః శివవన్నిత్యం మనసా కర్మణా గిరా ॥31॥**

అందువల్ల సమస్తయత్నాలలో భస్మస్నానరతులు, జటాధారులు, ముండితశిరస్కులు, నగ్నాకారులు, పలువిధాల చరించువారు అయిన శివభక్తులు మనోవాక్కాయకర్మలతో నిత్యం శివుడిమాదిరిగానే పూజింపదగినవారు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే యోగిప్రశంసా నామ చతుస్త్రింశత్తమోఽధ్యాయః ॥ 34 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని యోగిప్రశంస అనే ముప్పైనాలుగవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## పంచత్రింశత్తమోఽధ్యాయః - ముప్పైఅయిదవ అధ్యాయం

## క్షుపాభిధనృపపరాభవవర్ణనమ్ - క్షుపమహారాజు పరాభవవర్ణనం

**సనత్కుమార ఉవాచ -** సనత్కుమారుడు పలికాడు.

**కథం జఘాన రాజానం క్షుపం పాదేన సువ్రత ।**
**దధీచః సమరే జిత్వా దేవదేవం జనార్దనమ్ ॥1॥**

**వజ్రాస్థిత్వం కథం లేభే మహాదేవాన్ మహాతపాః ।**
**వక్తుమర్హసి శైలాదే జితో మృత్యుస్త్వయా యథా ॥2॥**

ఓ సువ్రతా! దధీచి యుద్ధంలో దేవాధిదేవుడైన విష్ణువును జయించి, క్షుపుడనే రాజును పాదంతో ఎలా తన్నాడు? ఆ మహాముని మహాదేవశివుడి ద్వారా అస్థిరూపమైన వజ్రాయుధాన్ని ఎలా పొందాడు. ఓ నందీశ్వరా! నీవు మృత్యువును ఏవిధంగా జయించావో చెప్పు.

**శైలాదిరువాచ -** నందీశ్వరుడు పలికాడు.

**బ్రహ్మపుత్రో మహాతేజాః రాజా క్షుప ఇతి స్మృతః ।**
**అభూన్మిత్రో దధీచస్య మునీంద్రస్య జనేశ్వరః ॥3॥**

బ్రహ్మకుమారుడు మహాకాంతిమంతుడు క్షుపుడనే రాజు ఉన్నాడు. ఆ రాజుకు మునీంద్రుడైన దధీచి మిత్రుడయ్యాడు.

**చిరాత్తయోః ప్రసంగాద్వై వాదః క్షుపదధీచయోః ।**
**అభవత్ క్షత్రియశ్రేష్ఠో విప్ర ఏవేతి విశ్రుతః ॥4॥**

అనంతరం చాలా కాలానికి క్షుపదధీచులకు మాటల సందర్భంగా వివాదం కలిగింది. క్షత్రియుడు శ్రేష్ఠుడనీ, కాదు బ్రాహ్మణుడే శ్రేష్ఠుడని.

**అష్టానాం లోకపాలానాం వపుర్ధారయతే నృపః ।**
**తస్మాదింద్రో హ్యహం వహ్నిర్యమశ్చ నిరృతిస్తథా ॥5॥**

**వరుణశ్చైవ వాయుశ్చ సోమో ధనద ఏవ చ ।**
**ఈశ్వరోఽహం న సందేహో నావమంతవ్య ఏవ చ ॥6॥**

రాజు అష్టదిక్పతుల విగ్రహస్వరూపుడు. కావున నేను ఇంద్రుణ్ణి. అగ్ని యమ నిరృతి వరుణ వాయు కుబేర రూపుణ్ణి కాబట్టి నేను ఈశ్వరుణ్ణి. ఇందులో సందేహం లేదు. కాబట్టి నీవు నన్ను తిరస్కారభావంతో చూడవద్దు. అనాదరణీయుణ్ణి కాను.

**మహతీ దేవతా యా సా మహతశ్చాపి సువ్రత ।**
**తస్మాత్త్వయా మహాభాగ చ్యావనేయ సదా హ్యహమ్ ॥7॥**

**నావమంతవ్య ఏవేహ పూజనీయశ్చ సర్వథా ।**

ఓ శ్రేష్ఠవ్రతుడా! కావున రాజు మహాదేవుడు. అందుచేత ఓ చ్యవనకుమారా! మహాత్ముడా! నన్ను నీవు ఎల్లప్పుడూ అవమానింపదగదు. ఎల్లప్పుడూ నీకు నేను పూజింపదగినవాడను.

**శ్రుత్వా తథా మతం తస్య క్షుపస్య మునిసత్తమః ॥8॥**

**దధీచశ్చ్యావనిశ్చోగ్రో గౌరవాదాత్మనో ద్విజః ।**
**అతాడయత్క్షుపం మూర్ధ్ని దధీచో వామముష్టినా ।**
**చిచ్ఛేద వజ్రేణ చ తం దధీచం బలవాన్ క్షుపః ॥9॥**

**బ్రహ్మలోకే పురాసౌ హి బ్రహ్మణః క్షుతసంభవః ।**
**లబ్ధం వజ్రం చ కార్యార్థం వజ్రిణా చోదితః ప్రభుః ॥10॥**

చ్యవనపుత్రుడు, బ్రాహ్మణుడు, మునిశ్రేష్ఠుడు అయిన దధీచుడు క్షుపుని మాటలువిని, ఆత్మగౌరవార్థం క్షుపుడియొక్క శిరసుపై ఎడమచేతితో ముష్టిఘాతం చేశాడు. బలవంతుడైన క్షుపుడు వజ్రాయుధంతో దధీచుణ్ణి నరికాడు. పూర్వం బ్రహ్మలోకంలో బ్రహ్మయొక్క తుమ్మునుంచి క్షుపుడు జన్మించాడు. క్షుపుడు ఇంద్రుడిచే ప్రేరేపింపబడి దేవకార్యనిర్వహణకై వజ్రాయుధాన్ని పొందాడు.

**స్వేచ్ఛయైవ నరో భూత్వా నరపాలో బభూవ సః ।**
**తస్మాద్రాజా స విప్రేంద్రమజయద్వై మహాబలః ॥11॥**

**యథా వజ్రధరః శ్రీమాన్ బలవాంస్తమసాన్వితః ।**

తన ఇష్టపూర్వకంగా మానవుడై క్షుపుడు ప్రభువు అయినాడు. మహాబలుడు, తమోగుణయుతుడు, శ్రీమంతుడు, వజ్రధరుడు అయిన ఇంద్రుడి వలె బలవంతుడైన క్షుపుడు విప్రశ్రేష్ఠుణ్ణి జయించాడు.

**పపాత భూమౌ నిహతో వజ్రేణ ద్విజపుంగవః ॥12॥**

**సస్మార చ తదా తత్ర దుఃఖాద్వై భార్గవం మునిమ్ ।**
**శుక్రోఽపి సంధయామాస తాడితం కులిశేన తమ్ ॥13॥**

**యోగాదేత్య దధీచస్య దేహం దేహభృతాం వరః ।**

క్షుపుడిద్వారా వజ్రాయుధం దెబ్బ తిన్న బ్రాహ్మణశ్రేష్ఠుడైన దధీచి భూమిపై పడిపోయాడు. అప్పుడు అక్కడ దుఃఖితుడై దధీచి శుక్రాచార్యుడిని స్మరించాడు. దేహధారులలో శ్రేష్ఠుడైన శుక్రుడు యోగబలంతోవచ్చి వజ్రాయధంతో నరకబడిన దధీచుడి శరీరాన్ని కలిపినాడు.

**సంధాయ పూర్వవద్దేహం దధీచస్యాహ భార్గవః ॥14॥**

**భో దధీచ మహాభాగ దేవదేవముపాపతిమ్ ।**
**సంపూజ్య పూజ్యం బ్రహ్మాద్యైర్దేవదేవం నిరంజనమ్ ॥15॥**

**అవధ్యో భవ విప్రర్షే ప్రసాదాత్ర్యంబకస్య తు ।**

దధీచియొక్క శరీరాన్ని ఇంతకుముందు ఎలా ఉందో అలాగా సంధించి శుక్రుడు ఆతడితో ఇలా పలికాడు. 'ఓ మహాత్మా! దధీచా! బ్రహ్మాదిదేవతల చేత పూజింపబడిన నిరంజనుడు దేవదేవుడు అయిన మహాదేవుడిని పూజించి ముక్కంటి అయిన ఆయన అనుగ్రహంతో అవధ్యుడవు' కమ్ము.

**మృతసంజీవనం తస్మాల్లబ్ధమేతన్మయా ద్విజ ॥16॥**

**నాస్తి మృత్యుభయం శంభోర్భక్తానామిహ సర్వతః ।**
**మృతసంజీవనం చాపి శైవమద్య వదామి తే ॥17॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! శివుడి నుంచి ఈ మృతసంజీవనిని నేను పొందాను. శివభక్తుడికి ఎటువంటి మృత్యుభయమూ ఎప్పుడూ, ఎక్కడా ఉండదు. శివసంబంధమైన ఈ మృతసంజీవని గూర్చి ఇప్పుడు చెబుతున్నాను.

**త్రియంబకం యజామహే త్రైలోక్యపితరం ప్రభుమ్ ।**
**త్రిమండలస్య పితరం త్రిగుణస్య మహేశ్వరమ్ ॥18॥**

**త్రితత్త్వస్య త్రివహ్నేశ్చ త్రిధాభూతస్య సర్వతః ।**
**త్రివేదస్య మహాదేవం సుగంధిం పుష్టివర్ధనమ్ ॥19॥**

ముల్లోకాలకు తండ్రి, సోమ, చంద్ర, అగ్ని అనే మూడు మండలాలకూ జనకుడు; సత్త్వరజస్తమస్సులనే త్రిగుణాలకి ప్రభువు; బుద్ధి, అహంకారం, మనస్సుఅనే మూడు తత్త్వాలకి; గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్ని అనే మూడు అగ్నులకి; మూడువేదాలకూ అధిపతి; బ్రహ్మవిష్ణుమహేశ్వరులుగా ఉన్నటువంటివాడు, సుగంధిరూపుడు, పుష్టివర్ధనుడు అయిన ముక్కంటిని పూజించాలి.

**సర్వభూతేషు సర్వత్ర త్రిగుణే ప్రకృతౌ తథా ।**
**ఇంద్రియేషు యథాన్యేషు దేవేషు చ గణేషు చ ॥20॥**

**పుష్పేషు గంధవత్సూక్ష్మః సుగంధిః పరమేశ్వరః ।**

సుగంధరూపుడైన పరమేశ్వరుడు సమస్తప్రాణులలోనూ, త్రిగుణాలలోనూ, సమస్తప్రకృతిలోనూ, ఇంద్రియాలలోనూ, ఇతరదేవతలలోనూ, గణాలలోనూ, పుష్పాలలో వాసన ఎలా సూక్ష్మంగా ఉంటుందో అలా ఉన్నాడు.

**పుష్టిశ్చ ప్రకృతిర్యస్మాత్పురుషస్య ద్విజోత్తమ ॥21॥**

**మహదాదివిశేషాంతవికల్పస్యాపి సువ్రత ।**
**విష్ణోః పితామహస్యాపి మునీనాం చ మహామునే ॥22॥**

**ఇంద్రస్యాపి చ దేవానాం తస్మాద్వై పుష్టివర్ధనః ।**

ఓ బ్రాహ్మణోత్తమా! పురుషరూపుడైన పరమేశ్వరుడియొక్క బలం ప్రకృతిరూపమే. ఓ సువ్రతుడా! ఓ మహర్షీ! అందుచేతనే ఆ పరమేశ్వరుడు మహదాదుల్ని గ్రహించి విశేషపర్యంతమైన సంపూర్ణజగత్తుకు, బ్రహ్మవిష్ణువులకు, మునులకు, అట్లే ఇంద్రాదిదేవతలకు పుష్టివర్ధనుడు అవుతున్నాడు.

**తం దేవమమృతం రుద్రం కర్మణా తపసా తథా ॥23॥**

**స్వాధ్యాయేన చ యోగేన ధ్యానేన చ యజామహే ।**
**సత్యేనానేన ముక్షీయాన్మృత్యుపాశాద్భవః స్వయమ్ ॥24॥**

**బంధమోక్షకరో యస్మాదుర్వారుకమివ ప్రభుః ।**

బహువిధ కర్మలతో, తపస్సుతో, స్వాధ్యాయంతో, యోగంతో, ధ్యానంతో అమృతరూపుడైన మహాదేవశివుణ్ణి పూజించాలి. ఈ సత్యంచేత శివుడు స్వయంగా మృత్యుబంధనాలనుంచి విముక్తిని కలిగిస్తాడు. ఉర్వారుకం (దోసకాయలు) మాదిరిగా ఆతడు సాంసారికబంధాల నుంచి కూడా ముక్తి కలిగిస్తాడు.

**మృతసంజీవనమంత్రో మయా లబ్ధస్తు శంకరాత్ ॥25॥**

**జప్త్వా హుత్వాభిమంత్రైవం జలం పీత్వా దివానిశమ్ ।**
**లింగస్య సన్నిధౌ ధ్యాత్వా నాస్తి మృత్యుభయం ద్విజ ॥26॥**

నేను శివభగవానుడి నుంచి మృతసంజీవని అనే మంత్రాన్ని పొందాను. ఓ బ్రాహ్మణుడా! జపం చేసి, హవిస్సులు ఇచ్చి, మంత్రించిన జలాన్ని త్రాగి, రాత్రింబవళ్లు శివలింగం యొక్క సన్నిధానంలో ధ్యానిస్తే మృత్యుభయముండదు.

**తస్య తద్వచనం శ్రుత్వా తపసారాధ్య శంకరమ్ ।**
**వజ్రాస్థిత్వమవధ్యత్వమదీనత్వం చ లబ్ధవాన్ ॥27॥**

శుక్రాచార్యుడి యొక్క ఆ మాటలు విని, దధీచి మహర్షి తపస్సుతో శివుణ్ణి ఆరాధించి, వజ్రరూపమైన ఎముకల్ని వాటికి అఖండితస్థితిని, అదీనస్థితిని కూడా పొందాడు.

**ఏవమారాధ్య దేవేశం దధీచో మునిసత్తమః ।**
**ప్రాప్యావధ్యత్వమన్యైశ్చ వజ్రాస్థిత్వం ప్రయత్నతః ॥28॥**

**అతాడయచ్చ రాజేంద్రం పాదమూలేన మూర్ధని ।**
**క్షుపో దధీచం వజ్రేణ జఘానోరసి చ ప్రభుః ॥29॥**

మునిశ్రేష్ఠుడైన దధీచి శివుణ్ణి ఆ విధంగా పూజించి ఇతరులచేత అవధ్యత్వాన్ని, వజ్రతుల్యమైన ఎముకల్ని పొంది, మిక్కిలి యత్నపూర్వకంగా క్షుపమహారాజు యొక్క శిరసుపై తన కాలి మడమతో తన్నాడు. క్షుపమహారాజు కూడా దధీచి వక్షఃస్థలంపై వజ్రాయుధంతో కొట్టాడు.

**నాభూన్నాశాయ తద్వజ్రం దధీచస్య మహాత్మనః ।**
**ప్రభావాత్పరమేశస్య వజ్రబద్ధశరీరిణః ॥30॥**

శివుడి యొక్క అనుగ్రహం చేత వజ్రసమానదేహుడై మహాభాగుడైన దధీచి విషయంలో ఆ వజ్రప్రహారం ఎలాంటి నష్టాన్ని కల్గించలేదు.

**దృష్ట్వాప్యవధ్యత్వమదీనతాం చ క్షుపో దధీచస్య తదా ప్రభావమ్ ।**
**ఆరాధయామాస హరిం ముకుందమింద్రానుజం ప్రేక్ష్య తదాంబుజాక్షమ్ ॥31॥**

మహారాజు క్షుపుడు దధీచియొక్క అవధ్యతనూ, అదీనతనూ, తపఃప్రభావాన్ని చూచినవాడై పద్మాక్షుడు, ఉపేంద్రుడు, ముకుందుడు అయిన విష్ణుభగవానుణ్ణి ఆరాధించాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే క్షుపాభిధనృపపరాభవవర్ణనం నామ పంచత్రింశత్తమోఽధ్యాయః ॥ 35 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని క్షుపమహారాజు పరాభవవర్ణనమనే ముప్పైఅయిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **షట్త్రింశత్తమోఽధ్యాయః** - ముప్పైఆరవ అధ్యాయం
## **క్షుపదధీచసంవాదః** - క్షుపదధీచసంవాదం

**నంద్యువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**పూజయా తస్య సంతుష్టో భగవాన్ పురుషోత్తమః ।**
**శ్రీభూమిసహితః శ్రీమాన్ శంఖచక్రగదాధరః ॥1॥**

**కిరీటీ పద్మహస్తశ్చ సర్వాభరణభూషితః ।**
**పీతాంబరశ్చ భగవాన్ దేవైర్దైత్యైశ్చ సంవృతః ॥2॥**

**ప్రదదౌ దర్శనం తస్మై దివ్యం వై గరుడధ్వజః ।**

క్షుపమహారాజు యొక్క పూజకు సంతోషించి శ్రీమంతుడైన విష్ణుభగవానుడు శంఖచక్రగదాధరుడు, పద్మహస్తుడు, కిరీటి, సమస్తాభరణాలంకృతుడు, పీతాంబరుడు, దేవదానవపరివృతుడు, గరుడధ్వజుడు, శ్రీదేవిభూదేవి సహితుడయి దివ్యమైన దర్శనాన్ని క్షుపుడికి ప్రసాదించినాడు.

**దివ్యేన దర్శనేనైవ దృష్ట్వా దేవం జనార్దనమ్ ॥3॥**

**తుష్టావ వాగ్భిరిష్టాభిః ప్రణమ్య గరుడధ్వజమ్ ।**

గరుడధ్వజుడు, దేవదేవుడైన పురుషోత్తముణ్ణి ఆ దివ్యరూపంలో చూచి, క్షుపుడు నమస్కరించి మధురవాక్కులతో స్తుతించాడు.

**త్వమాదిస్త్వమనాదిశ్చ ప్రకృతిస్త్వం జనార్దనః ॥4॥**

**పురుషస్త్వం జగన్నాథో విష్ణుర్విశ్వేశ్వరో భవాన్ ।**
**యోఽయం బ్రహ్మాసి పురుషో విశ్వమూర్తిః పితామహః ॥5॥**

నీవు ఆదివి. నీవే అనాదివి కూడా. నీవు ప్రకృతివి. నీవు జనార్దనుడవు. నీవు పురుషుడవు. నీవు జగన్నాథుడవు. నీవు విష్ణుడవు. నీవు విశ్వేశ్వరుడవు. నీవు పురుషరూపవిశ్వమూర్తిబ్రహ్మవు.

**తత్త్వమాద్యం భవానేవ పరం జ్యోతిర్జనార్దన ।**
**పరమాత్మా పరంధామ శ్రీపతే భూపతే ప్రభో ॥6॥**

ఓ జనార్దనా! నీవు మొదటిదైన పరంజ్యోతివి. ఓ లక్ష్మీపతీ! ఓ ప్రభూ! నీవు పరంధాముడవు. పరమాత్మవు.

**త్వత్క్రోధసంభవో రుద్రస్తమసా చ సమావృతః ।**
**త్వత్ప్రసాదాజ్జగద్ధాతా రజసా చ పితామహః ॥7॥**

**త్వత్ప్రసాదాత్స్వయం విష్ణుః సత్త్వేన పురుషోత్తమః ।**
**కాలమూర్తే హరే విష్ణో నారాయణ జగన్మయ ॥8॥**

తమోగుణంతో కూడిన రుద్రుడు నీ క్రోధం నుంచి జన్మించాడు. నీ అనుగ్రహంవల్లే రజోగుణభరితుడైన బ్రహ్మ జగత్కర్త అయినాడు. ఓ కాలమూర్తీ! ఓహరీ! ఓ విష్ణూ! ఓ నారాయణా! ఓ జగన్మయుడా! నీ అనుగ్రహంవల్లనే స్వయంగా విష్ణువు సత్త్వగుణప్రధానుడై పురుషోత్తముడు అయినాడు.

**మహాంస్తథా భూతాదిస్తన్మాత్రాణీంద్రియాణి చ ।**
**త్వయైవాధిష్ఠితాన్యేవ విశ్వమూర్తే మహేశ్వర ॥9॥**

ఓ విశ్వాకారా! ఓ మహేశ్వరా! మిక్కిలిగొప్పవైన పంచమహాభూతాలు, బుద్ధి, అహంకారాదులైన పంచతన్మాత్రలు పంచకర్మేంద్రియాలు, పంచజ్ఞానేంద్రియాలు నీచే అధిష్ఠింపబడి ఉన్నాయి.

**మహాదేవ జగన్నాథ పితామహ జగద్గురో ।**
**ప్రసీద దేవదేవేశ ప్రసీద పరమేశ్వర ॥10॥**

ఓ మహాదేవా! ఓ జగన్నాథా! ఓ పితామహా! ఓ జగద్గురూ! ఓ దేవదేశ్వరా! ఓ పరమేశ్వరా! నీవు ప్రసన్నుడవు కమ్ము! ప్రసన్నుడవు కమ్ము!

**ప్రసీద త్వం జగన్నాథ శరణ్యం శరణం గతః ।**
**వైకుంఠ శౌరే సర్వజ్ఞ వాసుదేవ మహాభుజ ॥11॥**

శరణుజొచ్చినవాడిని రక్షించే ఓ జగన్నాథా! ఓ వైకుంఠా! ఓ శౌరీ! ఓ వాసుదేవా! ఓ మహాప్రభూ! నీవు నన్ను అనుగ్రహించు.

**సంకర్షణ మహాభాగ ప్రద్యుమ్న పురుషోత్తమ ।**
**అనిరుద్ధ మహావిష్ణో సదా విష్ణో నమోఽస్తు తే ॥12॥**

ఓ సంకర్షణా! ఓ మహానుభావా! ఓ ప్రద్యుమ్నా! ఓ పురుషోత్తమా! ఓ అనిరుద్ధా! ఓ మహావిష్ణూ! ఓ విష్ణుమూర్తీ! నీకు ఎల్లప్పుడూ నమస్కారం.

**విష్ణో తవాసనం దివ్యమవ్యక్తం మధ్యతో విభుః ।**
**సహస్రఫణసంయుక్తస్తమోమూర్తిర్ధరాధరః ॥13॥**

ఓ శ్రీహరీ! సహస్రఫణి, తమస్స్వరూపుడు, భూధరుడు, ఐశ్వర్యసంపన్నుడు అయిన ఆదిశేషుడు నీకు దివ్యమూ, అవ్యక్తమూ అయిన ఆసనమై ఉన్నాడు.

**అధశ్చ ధర్మో దేవేశ జ్ఞానం వైరాగ్యమేవ చ ।**
**ఐశ్వర్యమాసనస్యాస్య పాదరూపేణ సువ్రత ॥14॥**

ఓ దేవేశ్వరా! ఓ సువ్రతుడా! ఈ ఆసనంయొక్క క్రిందభాగంలో పాదరూపంలో ధర్మం, జ్ఞానం, వైరాగ్యం, ఐశ్వర్యం అనే యీ నాలుగు ఉన్నాయి.

**సప్తపాతాళపాదస్త్వం ధరాజఘనమేవ చ ।**
**వాసాంసి సాగరాః సప్త దిశశ్చైవ మహాభుజాః ॥15॥**

**ద్యౌర్మూర్ధా తే విభో నాభిః ఖం వాయుర్నాసికాం గతః ।**
**నేత్రే సోమశ్చ సూర్యశ్చ కేశా వై పుష్కరాదయః ॥16॥**

**నక్షత్రతారకా ద్యౌశ్చ గ్రైవేయకవిభూషణమ్ ।**
**కథం స్తోష్యామి దేవేశం పూజ్యశ్చ పురుషోత్తమః ॥17॥**

**శ్రద్ధయా చ కృతం దివ్యం యచ్ఛ్రుతం యచ్చ కీర్తితమ్ ।**
**యదిష్టం తత్ క్షమస్వేశ నారాయణ నమోஉస్తు తే ॥18॥**

ఓ సువ్రతుడా! పాతాళలోకాలు ఏడును నీపాదాలు. భూమి నీ జఘనభాగము. సముద్రాలు నీ వస్త్రాలు. దిక్కులు నీ మహాభుజాలు. ఓ ప్రభూ! ద్యులోకము నీ శిరస్సు. ఆకాశం నీ నాభి. వాయువు నీ ముక్కు. నీ రెండు నేత్రాలు సూర్యచంద్రులు. నీ శిరోజాలు పుష్కలావర్తాది మేఘాలు. నక్షత్రాలు, తారకలు సమస్తగగనమండలం నీయొక్క కంఠాభరణాలు. నీవు పురుషోత్తముడవు. నీవు పరమపూజ్యుడవు. దేవాధిదేవుడవైన నిన్ను నేనెట్లు కీర్తించాలి? నీ విషయం ఎలావింటినో అలాగే శ్రద్ధతో దివ్యంగా స్తుతింపబడింది. ఓ ఈశ్వరా! ఓ నారాయణా! నన్ను మన్నించు. ఓ నారాయణా! నీకు అభివందనం.

**శైలాదిరువాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఇదం తు వైష్ణవం స్తోత్రం సర్వపాపప్రణాశనమ్ ।**
**యః పఠేచ్ఛృణుయాద్వాపి క్షుపేణ పరికీర్తితమ్ ॥19॥**

**శ్రావయేద్వా ద్విజాన్ భక్త్యా విష్ణులోకం స గచ్ఛతి ॥20॥**

క్షుపమహారాజు స్తుతించిన సమస్తపాపవినాశకరమైన ఈ విష్ణుస్తుతి ఎవడు పఠిస్తాడో, ఎవడు వింటాడో ఎవడు భక్తితో బ్రాహ్మణులకు విన్పిస్తాడో ఆతడు వైకుంఠానికి వెళ్తున్నాడు.

**సంపూజ్య చైవం త్రిదశేశ్వరాద్యైః స్తుత్వా స్తుతం దేవమజేయమీశమ్ ।**
**విజ్ఞాపయామాస నిరీక్ష్య భక్త్యా జనార్దనాయ ప్రణిపత్య మూర్ధ్నా ॥21॥**

ఇంద్రాది దేవతలతో స్తుతింపబడిన అజేయుడు, దేవేశ్వరుడు అయిన శ్రీమహావిష్ణువును క్షుపుడు పైవిధంగా భక్తితో స్తుతించి, ఆ జనార్దనుడికి శిరసువంచి నమస్కరించి, ఆయనను చూస్తూ తన విషయాన్ని ఇలా విన్నవించుకున్నాడు.

**రాజోవాచ –** రాజు పలికాడు.

> **భగవన్ బ్రాహ్మణః కశ్చిద్దధీచ ఇతి విశ్రుతః ।**
> **ధర్మవేత్తా వినీతాత్మా సఖా మమ పురాఽభవత్ ॥22॥**
>
> **అవధ్యః సర్వదా సర్వైః శంకరార్చనతత్పరః ।**
> **సావజ్ఞం వామపాదేన స మాం మూర్ధ్ని సదస్యథ ॥23॥**
>
> **తాడయామాస దేవేశ విష్ణో విశ్వజగత్పతే ।**
> **ఉవాచ చ మదావిష్టో న బిభేమీతి సర్వతః ॥24॥**
>
> **జేతుమిచ్ఛామి తం విప్రం దధీచం జగదీశ్వర ।**
> **యథా హి తం తథా కర్తుం త్వమర్హసి జనార్దన ॥25॥**

ఓ భగవంతుడా! దధీచి అనేపేరుగల సుప్రసిద్ధుడైన ఒక బ్రాహ్మణుడు ఉన్నాడు. ఆతడు ధర్మజ్ఞుడు. వినీతాత్ముడూను. పూర్వం ఆతడు నాస్నేహితుడు కూడా. శివారాధనతత్పరుడైన ఆతడు ఎవ్వరిచేత ఎల్లప్పుడూ వధింపబడనివాడు. ఆతడు నన్ను సభలో ఎడమకాలితో తలపై తన్ని అవమానించాడు. ఓ దేవేశ్వరా! సమస్త జగత్తుకు ప్రభువైన ఓ విష్ణుదేవా! మదోన్మత్తుడైన ఆతడు నేనెక్కడా భయపడనని పలికాడు. ఓ జగన్నాథా! ఆ దధీచి అనే బ్రాహ్మణుణ్ణి నేను జయింపగోరుతున్నాను. ఓ జనార్దనా! ఆతడిని జయించే విధంగా నీవే నన్ను చేయగలవు.

**శైలాదిరువాచ –** నందీశ్వరుడు పలికాడు.

> **జ్ఞాత్వా సోఽపి దధీచస్య హ్యవధ్యత్వం మహాత్మనః ।**
> **సస్మార చ మహేశస్య ప్రభావమతులం హరిః ॥26॥**
>
> **ఏవం స్మృత్వా హరిః ప్రాహ బ్రహ్మణః క్షుతసంభవమ్ ।**
> **విప్రాణాం నాస్తి రాజేంద్ర భయమేత్య మహేశ్వరమ్ ॥27॥**
>
> **విశేషాద్రుద్ర భక్తానామభయం సర్వదా నృప ।**
> **నీచానామపి సర్వత్ర దధీచస్యాస్య కిం పునః ॥28॥**

మహాత్ముడైన దధీచి ఋషియొక్క అవధ్యత్వాన్ని శ్రీహరి తెలుసుకుని, పరమేశ్వరుడియొక్క సాటిలేని శక్తిని స్మరించాడు. ఈవిధంగా దధీచి విషయాన్ని స్మరించుకుని బ్రహ్మయొక్క తుమ్మునుంచి పుట్టిన క్షుపుడితో విష్ణువు పలికాడు. "ఓ మహారాజా! సదాశివుణ్ణి పొందిన విప్రులకు భయంలేదు. విశేషించి శివభక్తులకు ఎప్పుడూ భయరాహిత్యమే. ఓ రాజా! నీచులైన భక్తులకూ అన్నిచోట్ల అభయమే అయినప్పుడు, ఇక దధీచి విషయం మరలా చెప్పాలా?"

> **తస్మాత్తవ మహాభాగ విజయో నాస్తి భూపతే ।**
> **దుఃఖం కరోమి విప్రస్య శాపార్థం ససురస్య మే ॥29॥**

ఓ మహాత్మా! ఓ మహారాజా! కావున నీకు ఈవిషయంలో విజయం సిద్ధించదు. ఒకవేళ సిద్ధపడినా దేవతలతోపాటు నేనూ విప్రశాపాన్ని పొందవలసి వస్తుంది.

**భవితా తస్య శాపేన దక్షయజ్ఞే సురైః సమమ్ ।**
**వినాశో మమ రాజేంద్ర పునరుత్థానమేవ చ ॥30॥**

**తస్మాత్సమేత్య విప్రేంద్రం సర్వయత్నేన భూపతే ।**
**కరోమి యత్నం రాజేంద్ర దధీచ విజయాయ తే ॥31॥**

ఆయన శాపంవలన సురలతోపాటు నాకూ వినాశమూ, పునరుత్థానమూ జరిగాయి. ఓ మహారాజా! అందుచేత బాగా విచారించి విప్రశ్రేష్ఠుడైన దధీచిపై నీ విజయానికై నేను అన్నివిధాల ప్రయత్నం చేస్తాను.

**శైలాదిరువాచ –** నందీశ్వరుడు పలికాడు.

**శ్రుత్వా వాక్యం క్షుపః ప్రాహ తథాఽస్త్వితి జనార్దనమ్ ।**
**భగవానపి విప్రస్య దధీచస్యాశ్రమం యయౌ ॥32॥**

**ఆస్థాయ రూపం విప్రస్య భగవాన్ భక్తవత్సలః ।**
**దధీచమాహ బ్రహర్షిమభివంద్య జగద్గురుః ॥33॥**

మహావిష్ణువు యొక్క ఆ మాటను విన్న క్షుపుడు ఆయన్ని గూర్చి అలాగే అగు గాక అని పలికాడు. విష్ణువుకూడా బ్రాహ్మణుడైన దధీచి ఆశ్రమానికి వెళ్లాడు. భక్తవత్సలుడు, జగద్గురువు అయిన విష్ణుభగవానుడు బ్రాహ్మణరూపాన్ని పొందినవాడై బ్రహ్మర్షి అయిన దధీచికి నమస్కరించి ఇలా పలికాడు.

**శ్రీభగవానువాచ –** శ్రీవిష్ణుభగవానుడు పలికాడు.

**భోభో దధీచ బ్రహ్మర్షే భవార్చనరతావ్యయ ।**
**వరమేకం వృణే త్వత్తస్తం భవాన్ దాతుమర్హసి ॥34॥**

ఈశ్వరార్చనలో సుస్థిరతత్పరతగల ఓ బ్రహ్మర్షీ! దధీచా! నేను నిన్ను ఒకవరం కోరుతున్నాను. నీవు దాన్ని ఇవ్వదగినవాడవు.

**యాచితో దేవదేవేన దధీచః ప్రాహ విష్ణునా ।**
**జ్ఞాతం తవేప్సితం సర్వం న బిభేమి తవాప్యహమ్ ॥35॥**

దేవాధిదేవుడైన విష్ణువుతో యాచింపబడిన దధీచి ఆతణ్ణి ఉద్దేశించి పలికాడు. నీయొక్క పూర్తి అభిమతం తెలిసింది. నీకు కూడా నేను భయపడను.

**భవాన్ విప్రస్య రూపేణ ఆగతోఽసి జనార్దన ।**
**భూతం భవిష్యం దేవేశ వర్తమానం జనార్దన ॥36॥**

**జ్ఞాతం ప్రసాదాద్ రుద్రస్య ద్విజత్వం త్యజ సువ్రత ।**
**ఆరాధితోఽసి దేవేశ క్షుపేణ మధుసూదన ॥37॥**

ఓ విష్ణూ! నీవు బ్రాహ్మణవేషంతో వచ్చావు. ఓ జనార్దనా! శివుడి అనుగ్రహం వల్ల భూతభవిష్యద్వర్తమానాలు తెలిశాయి. ఓ సువ్రతుడా! ఇక విప్రరూపాన్ని విడిచిపెట్టు. ఓ మధుసూదనా! దేవదేవా! క్షుపమహారాజుచేత ఆరాధింపబడ్డావు.

**జానే తవైనాం భగవన్ భక్తవత్సలతాం హరే ।**
**స్థానే తవైషా భగవన్ భక్తవాత్సల్యతా హరే ॥38॥**

ఓ విష్ణుభగవానుడా! నీయొక్క భక్తవాత్సల్యం నాకు తెలుసు. ఓ శ్రీహరీ! అది ఇప్పుడు ప్రకటింపబడింది.

**అస్తి చేద్భగవన్ భీతిర్భవార్చనరతస్య మే ।**
**వక్తుమర్హసి యత్నేన వరదాంబుజలోచన ॥39॥**

ఓ భగవంతుడా! ఓ వరదుడా! ఓ పద్మనయనా! శివార్చనరతుడైన నాకు భయముందునా? ప్రయత్నించి చెప్పదగినవాడవు.

**వదామి న మృషా తస్మాన్న బిభేమి జనార్దన ।**
**న బిభేమి జగత్యస్మిన్ దేవదైత్యద్విజాదపి ॥40॥**

నేను అనృతం చెప్పను. ఓ జనార్దనా! అందుచేత అనగా శివభక్తుడను అయినందున నేను భయపడను. ఈ ప్రపంచంలో దేవదానవబ్రాహ్మణుల వలన కూడా నేను భయపడను.

**నంద్యువాచ** – నందీశ్వరుడు పలికాడు.

**శ్రుత్వా వాక్యం దధీచస్య తదాస్థాయ జనార్దనః ।**
**స్వరూపం సస్మితం ప్రాహ సన్త్యజ్య ద్విజతాం క్షణాత్ ॥41॥**

దధీచి యొక్క ఆమాట విని శ్రీహరి వెంటనే బ్రాహ్మణరూపాన్ని విడిచిపెట్టి నిజరూపాన్ని ధరించి ఆతణ్ణి గూర్చి నవ్వుతూ ఇలా పలికాడు.

**శ్రీభగవానువాచ** – శ్రీహరి పలికాడు.

**భయం దధీచ సర్వత్ర నాస్త్యేవ తవ సువ్రత ।**
**భవార్చనరతో యస్మాద్భవాన్ సర్వజ్ఞ ఏవ చ ॥42॥**

ఓ సువ్రతుడా! ఓ దధీచీ! శివార్చనశీలుడవైన నీవు సర్వజ్ఞుడవు. కావున ఎక్కడా నీకు భయముండదు.

**బిభేమీతి సకృద్వక్తుం త్వమర్హసి నమస్తవ ।**
**నియోగాన్మమ విప్రేంద్ర క్షుపం ప్రతి సదస్యథ ॥43॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! నీకు నమస్కారం. నా నిర్దేశానుసారం ఒకసారి క్షుపుడి సభలో ఆతడికై భయపడితివని చెప్పాలి.

**ఏవం శ్రుత్వాపి తద్వాక్యం సాన్త్వం విష్ణోర్మహామునిః ।**
**న బిభేమీతి తం ప్రాహ దధీచో దేవసత్తమమ్ ॥44॥**

**ప్రభావాద్దేవదేవస్య శంభోః సాక్షాత్పినాకినః ।**
**శర్వస్య శంకరస్యాస్య సర్వజ్ఞస్య మహామునిః ॥45॥**

శ్రీహరియొక్క వినయపూర్వకమైన ఆమాటను విని కూడా మహర్షి దధీచి దేవశ్రేష్ఠుడైన శ్రీహరిని గూర్చి దేవదేవుడు, శంభుడు, పినాకపాణి, శర్వుడు, శంకరుడు, సర్వజ్ఞుడు అయిన సదాశివుడి ప్రభావంవల్ల నేను భయపడనని పలికాడు.

**తతస్తస్య మునేఃశ్రుత్వా వచనం కుపితో హరిః ।**
**చక్రముద్యమ్య భగవాన్ దిధక్షుర్మునిసత్తమమ్ ॥46॥**

తర్వాత ఆ మునియొక్క వాక్కును విన్న శ్రీహరి కుపితుడై మునిశ్రేష్ఠుడైన దధీచిని కాల్చుటకై సుదర్శన చక్రాన్ని ఎత్తినాడు.

**అభవత్కుంఠితాగ్రం హి విష్ణోశ్చక్రం సుదర్శనమ్ ।**
**ప్రభావాద్ధి దధీచస్య క్షుపస్యైవ హి సన్నిధౌ ॥47॥**

క్షుపమహారాజు యొక్క సన్నిధిలోనే విష్ణువుయొక్క సుదర్శనచక్రం యొక్క అగ్రభాగం దధీచి ఋషి ప్రభావం వల్ల మొక్కబోయింది.

**దృష్ట్వా తత్కుంఠితాగ్రం హి చక్రం చక్రిణమాహ సః ।**
**దధీచః సస్మితం సాక్షాత్సదసద్వ్యక్తికారణమ్ ॥48॥**

**భగవాన్ భవతా లబ్ధం పురాతీవ సుదారుణమ్ ।**
**సుదర్శనమితి ఖ్యాతం చక్రం విష్ణో ప్రయత్నతః ॥49॥**

**భవస్యైతచ్ఛుభం చక్రం న జిఘాంసతి మామిహ ।**
**బ్రహ్మాస్త్రాద్యై స్తథాన్యైర్హి ప్రయత్నం కర్తుమర్హసి ॥50॥**

ఓ విష్ణుభగవానుడా! మిక్కిలి భయానకమైన సుదర్శనమనే ఈ చక్రాయుధాన్ని మిక్కిలి ప్రయత్నంతో శివుడి వల్లనే పొందావు. అందువల్లనే మంగళకరమైన ఈ చక్రం శివభక్తుడనైన నన్ను చంపలేదు. ఇతరాలైన బ్రహ్మాస్త్రాల్ని ప్రయోగించే ప్రయత్నం చేయవలసింది.

**శైలాదిరువాచ –** నందీశ్వరుడు పలికాడు.

**తస్య తద్వచనం శ్రుత్వా దృష్ట్వా నిర్వీర్యమాయుధమ్ ।**
**ససర్జ చ పునస్తస్మై సర్వాస్త్రాణి సమంతతః ॥51॥**

దధీచి యొక్క ఆ మాటను విని దుర్బలమైన చక్రాయుధాన్ని చూచి, తనయొక్క సర్వాస్త్రాల్ని సృష్టించి అన్నివైపులనుంచి ఆతడిపై వాటిని ప్రయోగించాడు.

**చక్రుర్దేవాస్తతస్తస్య విష్ణోః సాహాయ్యమవ్యయాః ।**
**ద్విజేనైకేన యోద్ధుం హి ప్రవృత్తస్య మహాబలాః ॥52॥**

మహాబలవంతులు, శాశ్వతులు అయిన దేవతలు ఒకానొక బ్రాహ్మణుడిపై యుద్ధం చేస్తున్న విష్ణుమూర్తికి సహాయం చేశారు.

**కుశముష్టిం తదాదాయ దధీచః సంస్మరన్ భవమ్ ।**
**ససర్జ సర్వదేవేభ్యో వజ్రాస్థిః సర్వతో వశీ ॥53॥**

జితేంద్రియుడై, వజ్రతుల్యమైన ఎముకలుగల దధీచి పిడికిలితో దర్భను తీసుకుని భవుని స్మరిస్తూ దేవతలందరిపై విడిచినాడు.

**దివ్యం త్రిశూలమభవత్కాలాగ్నిసదృశప్రభమ్ ।**
**దగ్ధుం దేవాన్ మతిం చక్రే యుగాంతాగ్నిరివాపరః ॥54॥**

ఆ దర్భ ప్రళయకాలాగ్నిసమానమైన కాంతిగల దివ్య త్రిశూలమయ్యింది. మరో కాలాగ్నివలెనున్న ఆ ఋషి దేవతల్ని దహించడానికై నిశ్చయించాడు.

**ఇంద్రనారాయణాద్యైశ్చ దేవైస్త్యక్తాని యాని తు ।**
**ఆయుధాని సమస్తాని ప్రణేముస్త్రిశిఖం మునే ॥55॥**

ఓ సనత్కుమారమునివరా! విష్ణువు, ఇంద్రుడు మొదలైన దేవతలచేత ప్రయోగించిన ఆయుధాలన్నీ త్రిశూలానికి నమస్కరించాయి.

**దేవాశ్చ దుద్రువుః సర్వే ధ్వస్తవీర్యా ద్విజోత్తమ ।**
**ససర్జ భగవాన్ విష్ణుః స్వదేహాత్పురుషోత్తమః ॥56॥**

**ఆత్మనః సదృశాన్ దివ్యాన్ లక్షలక్షాయుతాన్ గణాన్ ।**
**తాని సర్వాణి సహసా దదాహ మునిసత్తమః ॥57॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! పరాక్రమహీనులైన సమస్తదేవతులు పారిపోయారు. పురుషోత్తముడైన విష్ణువు తన శరీరంనుంచి తనకు సమానులైన దివ్యగణాలను లక్షలకొలది సృష్టించాడు. వారినందరిని ఆ మునిశ్రేష్ఠుడు వెంటనే దహించాడు.

**తతో విస్మయనార్థాయ విశ్వమూర్తిరభూద్ధరిః ।**
**తస్య దేహే హరేః సాక్షాదపశ్యత్ ద్విజసత్తమః ॥58॥**

**దధీచో భగవాన్ విప్రః దేవతానాం గణాన్ పృథక్ ।**
**రుద్రాణాం కోటయశ్చైవ గణానాం కోటయస్తదా ॥59॥**

**అండానాం కోటయశ్చైవ విశ్వమూర్తేస్తనౌ తదా ।**

దధీచిని విస్మయపర్చడానికై విష్ణువు విశ్వరూపాన్ని ధరించాడు. ద్విజశ్రేష్ఠుడైన దధీచి విశ్వరూపుడైన శ్రీహరియొక్క దేహంలో సాక్షాత్ దేవతాగణాలు, కోట్లకొలది రుద్రులు, కోట్లకొలది రుద్రగణాలు, (ప్రమథగణాలు) కోట్లకొలది బ్రహ్మాండాలు చూశాడు.

**దృష్ట్వైతదఖిలం తత్ర చ్యావనిర్విస్మితం తదా ॥60॥**

**విష్ణుమాహ జగన్నాథం జగన్మయమజం విభుమ్ ।**
**అంభసాభ్యుక్ష్య తం విష్ణుం విశ్వరూపం మహామునిః ॥61॥**

అప్పుడు చ్యవనపుత్రుడైన దధీచి ఆ సమస్తాన్ని చూచి ఆశ్చర్యచకితుడయ్యాడు. జగన్నాథుడు, జగన్మయుడు, విశ్వరూపుడు, జన్మరహితుడు ప్రభువు అయిన శ్రీహరిపైన నీటిని చల్లి ఇలా పలికాడు.

**మాయాం త్యజ మహాబాహో ప్రతిభాసా విచారతః ।**
**విజ్ఞానానాం సహస్రాణి దుర్విజ్ఞేయాని మాధవ ॥62॥**

ఓ మహాబాహూ! మాయను పరిత్యజించు... ఓ మాధవా! పదార్థాల విషయంలో భ్రమను కల్పించే స్థితి ఆలోచింపదగింది. ఈవిధమైన మాయతో వేలకొలది తెలియదగిన విజ్ఞాన విషయాల్ని అతికష్టంమీద కల్పించవచ్చు.

**మయి పశ్య జగత్సర్వం త్వయా సార్థమనిందిత ।**
**బ్రహ్మాణం చ తథా రుద్రం దివ్యాం దృష్టిం దదామి తే ॥63॥**

ఓ స్తుతిపాత్రుడా! నాలో నీతో కూడా బ్రహ్మదేవుణ్ణి, రుద్రభగవానుణ్ణి మొత్తం ప్రపంచాన్ని చూడు, నీకు దివ్యదృష్టిని ఇస్తున్నాను.

**ఇత్యుక్త్వా దర్శయామాస స్వతనౌ నిఖిలం మునిః ।**
**తం ప్రాహ చ హరిం దేవం సర్వదేవభవోద్భవమ్ ॥64॥**

ఈవిధంగా దధీచి మహర్షి తన దేహంలో సమస్తజగత్తును ప్రదర్శించాడు. సమస్తదేవతల సృష్టికి కారణభూతుడైన భగవానుడైన శ్రీహరి నుద్దేశించి ఇలా పలికాడు.

**మాయయా హ్యనయా కిం వా మంత్రశక్త్యాథవా ప్రభో ।**
**వస్తుశక్త్యాథ వా విష్ణో ధ్యానశక్త్యాథ వా పునః ॥65॥**

**త్యక్త్వా మాయామిమాం తస్మాద్యోద్ధుమర్హసి యత్నతః ।**

ఓ ప్రభూ! ఓ విష్ణుదేవా! ఈ మాయతోగాని, ఈ మంత్రశక్తితోగాని, పదార్థశక్తితోగాని, ధ్యానశక్తితోగాని ఏమి లాభం? కావున మాయను పరిత్యజించి ప్రయత్నపూర్వకంగా యుద్ధం చెయ్యి.

**ఏవం తస్య వచః శ్రుత్వా దృష్ట్వా మాహాత్మ్యమద్భుతమ్ ॥66॥**

**దేవాశ్చ దుద్రువుర్భూయో దేవం నారాయణం చ తమ్ ।**
**వారయామాస నిశ్చేష్టం పద్మయోనిర్జగద్గురుః ॥67॥**

ఈవిధంగా ఆ ఋషియొక్క మాటను విని మిక్కిలి అద్భుతమైన ప్రభావాన్ని చూచి దేవతలందరూ మరలా పరుగెత్తారు. పద్మభవుడు, జగద్గురువు అయిన బ్రహ్మదేవుడు చేష్టలుడిగిన భగవానుడైన శ్రీహరిని యుద్ధం చేయవద్దని వారించాడు.

**నిశమ్య వచనం తస్య బ్రహ్మణస్తేన నిర్జితః ।**
**జగామ భగవాన్ విష్ణుః ప్రణిపత్య మహామునిమ్ ॥68॥**

ఆ ఋషిచేత జయింపబడిన విష్ణుభగవానుడు బ్రహ్మమాట విని, ఆతడికి నమస్కరించి, తనలోకానికి వెళ్లాడు.

**క్షుపో దుఃఖాతురో భూత్వా సంపూజ్య చ మునీశ్వరమ్ ।**
**దధీచమభివంద్యాశు ప్రార్థయామాస విక్లవః ॥69॥**

క్షుపమహారాజు వ్యాకుల చిత్తుడు, మిక్కిలి దుఃఖితుడై దధీచి మునిశ్రేష్ఠుడికి నమస్కరించి, ఆతడిని పూజించి ప్రార్థించినాడు.

**దధీచ క్షమ్యతాం దేవ మయాజ్ఞానాత్కృతం సఖే ।**
**విష్ణునా హి సురైర్వాపి రుద్రభక్తస్య కిమ్ తవ ॥70॥**

ఓ దధీచిఋషీ! ఓ దేవా! అజ్ఞానంవల్ల నేను చేసిన అపరాధాన్ని క్షమించు. ఓ స్నేహితుడా! శివభక్తుడవైన నీకు విష్ణువుచేత గాని, దేవతలచేత గాని ఏమియు కాదు.

**ప్రసీద పరమేశానే దుర్లభా దుర్జనైర్ద్విజ ।**
**భక్తిర్భక్తిమతాం శ్రేష్ఠ మద్విధైః క్షత్రియాధమైః ॥71॥**

ఓ విప్రుడా! నీవు నాయెడల ప్రసన్నుడవు కమ్ము. ఓ భక్తశ్రేష్ఠా! నావంటి దుర్జనులైన నీచక్షత్రియులకు పరమేశ్వరుడైన శివుడియందు భక్తికుదరడం జరగదు.

**శ్రుత్వానుగృహ్య తం విప్రో దధీచస్తపసాం వరః ।**
**రాజానం మునిశార్దూలః శశాప చ సురోత్తమాన్ ॥72॥**

**రుద్రకోపాగ్నినా దేవాః సదేవేంద్రా మునీశ్వరైః ।**
**ధ్వస్తా భవంతు దేవేన విష్ణునా చ సమన్వితాః ॥73॥**

**ప్రజాపతేర్మఖే పుణ్యే దక్షస్య సుమహాత్మనః ।**

మునిశ్రేష్ఠుడైన దధీచి ఆ క్షుపుడి ప్రార్థన విని అతడిని అనుగ్రహించి, దేవశ్రేష్ఠుల్ని శపించాడు. "శివుడి కోపాగ్నిచే దేవేంద్రుడితో సహా దేవతలందరూ, మునిశ్రేష్ఠులు మహాదేవుడైన విష్ణువు, మహాత్ముడైన దక్షప్రజాపతియొక్క పుణ్యయజ్ఞంలో దగ్ధం కాగలరు" అని.

**ఏవం శప్త్వా క్షుపం ప్రేక్ష్య పునరాహ ద్విజోత్తమః ॥74॥**

**దేవైశ్చ పూజ్యా రాజేంద్ర నృపైశ్చ వివిధైర్గణైః ।**
**బ్రాహ్మణా ఏవ రాజేంద్ర బలినః ప్రభవిష్ణవః ॥75॥**

ఈవిధంగా అందర్నీ శపించి, క్షుపుణ్ణి చూచి, మరల ఇలా బ్రాహ్మణశ్రేష్ఠుడైన దధీచి పలికాడు. ఓ మహారాజా! దేవతలతోను, రాజులతోను, వివిధగణాలతోను పూజింపబడే విప్రులే బలవంతులు. ఐశ్వర్యసంపన్నులునూ.

**ఇత్యుక్త్వా స్వోటజం విప్రః ప్రవివేశ మహాద్యుతిః ।**
**దధీచమభివంద్యైవ జగామ స్వం నృపః క్షయమ్ ॥76॥**

ఈవిధంగా పలికి మహాకాంతిమంతుడైన బ్రాహ్మణుడు తన కుటీరంలోనికి వెళ్లాడు. దధీచికి నమస్కరించి క్షుపుడు తన గృహానికి వెళ్లాడు.

**తదేవ తీర్థమభవత్స్థానేశ్వరమితి స్మృతమ్ ।**
**స్థానేశ్వరమనుప్రాప్య శివసాయుజ్యమాప్నుయాత్ ॥77॥**

ఆ యుద్ధస్థానం స్థానేశ్వరమనే తీర్థమయ్యింది. ఈ స్థానేశ్వరతీర్థాన్ని సేవించిన మానవుడు శివసాయుజ్యాన్ని పొందుతాడు.

**కథితస్తవ సంక్షేపాద్వివాదః క్షుబ్ధధీచయోః ।**
**ప్రభావశ్చ దధీచస్య భవస్య చ మహామునే ॥78॥**

ఓ మహామునీ! సనత్కుమారా! క్షుపమహారాజు దధీచిమహర్షుల యొక్క పోట్లాట (తగాద), శివదధీచుల శక్తి చెప్పబడింది.

**య ఇదం కీర్తయేద్దివ్యం వివాదం క్షుబ్ధధీచయోః ।**
**జిత్వాపమృత్యుం దేహాంతే బ్రహ్మలోకం ప్రయాతి సః ॥79॥**

ఏ మానవుడు క్షుపదధీచుల దివ్యమైన ఈ వివాదాన్ని పఠిస్తాడో ఆతడు అకాలమరణాన్ని జయించి సకాలమరణం, తర్వాత సత్యలోకాన్ని చేరతాడు.

**య ఇదం కీర్త్య సంగ్రామం ప్రవిశేత్తస్య సర్వదా ।**
**నాస్తి మృత్యుభయం చైవ విజయీ చ భవిష్యతి ॥80॥**

ఎవడు ఈ వివాదాన్ని పఠిస్తూ యుద్ధానికి వెళతాడో ఆతడికి ఎప్పుడూ మృత్యుభయముండదు. విజయుడూ కాగలడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే క్షుపదధీచసంవాదో నామ షట్త్రింశత్తమోఽధ్యాయః ॥ 36 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని క్షుపదధీచి సంవాదమనే ముప్పైఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తత్రింశత్తమోఽధ్యాయః - ముప్పైఏడవ అధ్యాయం
## బ్రహ్మణో వరప్రదానమ్ - బ్రహ్మకు వరప్రదానం

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**భగవాన్ కథమనుప్రాప్తో మహాదేవముమాపతిమ్ ।**
**శ్రోతుమిచ్ఛామి తత్సర్వం వక్తుమర్హసి మే ప్రభో ॥1॥**

ఓ నందీశ్వరా! నీవు మహాదేవుడైన పార్వతీపతి యొక్క సాన్నిధ్యాన్ని ఎలా పొందావు. ఆ విషయమంతా వినదలచాను. ఓ ప్రభూ! నాకు ఆ విషయాన్ని చెప్పవలసినది.

**శైలాదిరువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ప్రజాకామః శిలాదోఽభూత్పితా మమ మహామునే ।**
**సోఽప్యంధః సుచిరం కాలం తపస్తేపే సుదుశ్చరమ్ ॥2॥**

ఓ సనత్కుమారా! మునిశ్రేష్ఠా! నా తండ్రి శిలాదుడు పుత్రార్థం అంధుడయి ఉండి కూడా కఠోరమైన తపస్సు బహుకాలం చేశాడు.

**తపతస్తస్య తపసా సంతుష్టో వజ్రధృక్ ప్రభుః ।**
**శిలాదమాహ తుష్టోఽస్మి వరయస్వ వరానితి ॥3॥**

తపోధనుడైన శిలాదుని యొక్క తపస్సుతో వజ్రధారి ఇంద్రుడు సంతోషించాడు. నేను సంతుష్టుణ్ణి అయ్యాను. వరాలను కోరుకో అన్నాడు.

**తతః ప్రణమ్య దేవేశం సహస్రాక్షం సహామరైః ।**
**ప్రోవాచ మునిశార్దూల కృతాంజలిపుటో హరిమ్ ॥4॥**

అనంతరం మునిశ్రేష్ఠుడైన శిలాదుడు సహస్రనేత్రుడైన దేవతలతోకూడిన దేవేంద్రుడికి నమస్కరించి అంజలి ఘటించి మిక్కిలిగా పలికాడు.

**శిలాద ఉవాచ** - శిలాదుడు పలికాడు.

**భగవన్ దేవతారిఘ్న సహస్రాక్ష వరప్రద ।**
**అయోనిజం మృత్యుహీనం పుత్రమిచ్ఛామి సువ్రత ॥5॥**

ఓ భగవానుడా! ఓ అసురదమనా! ఓ సహస్రాక్షా! ఓ వరదాయీ! ఓ సువ్రతుడా! మృత్యురహితుడు, అయోనిజుడు అయిన కుమారుణ్ణి కోరుతున్నాను.

**శక్ర ఉవాచ –** ఇంద్రుడు పలికాడు.

**పుత్రం దాస్యామి విప్రర్షే యోనిజం మృత్యుసంయుతమ్ ।**
**అన్యథా తే న దాస్యామి మృత్యుహీనా న సంతి వై ॥6॥**

ఓ బ్రాహ్మణఋషీ! మరణంతో కూడిన యోనిజుడైన పుత్రుణ్ణి ఇస్తాను. వేరేవిధంగా నీకు మరణరహితుడైన పుత్రుణ్ణి ఇవ్వను. ఎందుకంటే మృత్యురహితులు ఎవ్వరూ లేరు.

**న దాస్యతి సుతం తేఽత్ర మృత్యుహీనమయోనిజమ్ ।**
**పితామహోఽపి భగవాన్ కిముతాన్యే మహామునే ॥7॥**

ఓ మహర్షీ! బ్రహ్మదేవుడు కూడా మృత్యురహితుడు, అయోనిజుడు అయిన పుత్రుణ్ణి ఇవ్వడు. ఇక ఇతరుల విషయం ఏమని చెప్పాలి.

**సోఽపి దేవః స్వయం బ్రహ్మ మృత్యుహీనో న చేశ్వరః ।**
**యోనిజశ్చ మహాతేజాశ్చాండజః పద్మసంభవః ॥8॥**

సాక్షాత్తు పరమేష్ఠి అయిన బ్రహ్మదేవుడు కూడా మృత్యురహితుడు కాడు. మహాతేజస్వంతుడైన ఆతడు యోనిజుడే. అండము నుంచి పుట్టినవాడే. పద్మం నుంచి పుట్టినవాడే.

**మహేశ్వరాంగజశ్చైవ భవాన్యాస్తనయః ప్రభుః ।**
**తస్యాప్యాయుః సమాఖ్యాతం పరార్ధద్వయసమ్మితమ్ ॥9॥**

బ్రహ్మదేవుడు శివుడియొక్క అంగం నుంచి జన్మించడంచేత పార్వతీపుత్రుడే. ఆయన యొక్క ఆయువు కూడా రెండు పరార్ధాలతో సమానమైనదిగా చెప్పబడింది.

**కోటికోటి సహస్రాణి అహర్భూతాని యాని వై ।**
**సమతీతాని కల్పానాం తావచ్ఛేషాః పరత్ర యే ॥10॥**

బ్రహ్మకు మొదటి పరార్ధంలో వేలకోట్ల కల్పాలు దినాలుగా గడచిపోయాయి. రెండవపరార్ధంలో మాత్రం కొన్ని కల్పాలు మిగిలి ఉన్నాయి.

**తస్మాదయోనిజే పుత్రే మృత్యుహీనే ప్రయత్నతః ।**
**పరిత్యజాశాం విప్రేంద్ర గృహాణాత్మసమం సుతమ్ ॥11॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! అందుచేత అయోనిజుడు, మరణరహితుడు అయిన పుత్రుడివిషయంలో కోరికను ప్రయత్నపూర్వకంగా విడిచిపెట్టు. నీకు సమానమైన కుమారుణ్ణి గ్రహించు.

**శైలాదిరువాచ –** శైలాది (నందీశ్వరుదు) పలికాడు.

**తస్య తద్వచనం శ్రుత్వా పితా మే లోకవిశ్రుతః ।**
**శిలాద ఇతి పుణ్యాత్మా పునః ప్రాహ శచీపతిమ్ ॥12॥**

ఇంద్రుడి యొక్క ఆమాటను విని శిలాదుడనే పేరుతో లోకంలో ప్రసిద్ధుడై పుణ్యాత్ముడైన నా తండ్రి మరల ఇంద్రుడితో ఇలా పలికాడు.

**శిలాద ఉవాచ –** శిలాదుడు పలికాడు.

**భగవన్నండయోనిత్వం పద్మయోనిత్వమేవ చ ।**
**మహేశ్వరాంగయోనిత్వం శ్రుతం వై బ్రహ్మణో మయా ॥13॥**

**పురా మహేంద్ర దాయాదాత్ గదతశ్చాస్య పూర్వజాత్ ।**
**నారదాద్వై మహాబాహో కథమత్రాశు నో వద ॥14॥**

**దాక్షాయణీ సా దక్షోఽపి దేవః పద్మోద్భవాత్మజః ।**
**పౌత్రీ కనకగర్భస్య కథం తస్యాః సుతో విభుః ॥15॥**

ఓ భగవానుడా! ఇంద్రా! బ్రహ్మదేవుడికి అండం, పద్మం, శివుడి శరీరం యోనిగా ఉండడం అనే విషయం నా అగ్రజుడైన నారదుడి వల్ల విన్నాను. అది ఎలా జరిగిందో చెప్పు. దాక్షాయణి దక్షుడి కుమార్తె. బ్రహ్మకు మనుమరాలు. కాగా కమలగర్భుడైన బ్రహ్మకు దక్షుడు కుమారుడు. కావున బ్రహ్మదేవుడు పార్వతీదేవి పుత్రుడు ఎలా అయ్యాడు?

**శక్ర ఉవాచ –** శక్రుడు పలికాడు.

**స్థానే సంశయితుం విప్ర తవ వక్ష్యామి కారణమ్ ।**
**కల్పే తత్పురుషే వృత్తం బ్రహ్మణః పరమేష్ఠినః ॥16॥**

**ససర్జ సకలం ధ్యాత్వా బ్రహ్మాణం పరమేశ్వరః ।**
**జనార్దనో జగన్నాథః కల్పే వై మేఘవాహనే ॥17॥**

**దివ్యం వర్ష సహస్రం తు మేఘో భూత్వావహద్ధరమ్ ।**
**నారాయణో మహాదేవం బహుమానేన సాదరమ్ ॥18॥**

ఓ విప్రుడా! ఈ విషయంగా నీకు సందేహం కలగడం తగియున్నది. ఇందుకు కారణం తత్పురుషకల్పంలో పరమేష్ఠి అయిన బ్రహ్మకు జరిగింది నీకు చెప్పగలను. సర్వవిషయాల్ని స్మరిస్తూ శివుడు బ్రహ్మను సృష్టించాడు. జగత్పతి అయిన విష్ణువు మేఘవాహన కల్పంలో వేయి దివ్య సంవత్సరాలు మేఘమై హరుని వహించాడు. విష్ణువు మహాదేవ శివుడి ఆదరాన్ని పొందాడు.

**దృష్ట్వా భావం మహాదేవో హరేః స్వాత్మని శంకరః ।**
**ప్రదదౌ తస్య సకలం స్రష్టుం వై బ్రహ్మణా సహ ॥19॥**

మహాదేవశివుడు విష్ణువుకు తనయందుగల భక్తిభావాన్ని చూచి బ్రహ్మతో కూడి సమస్తాన్ని సృష్టించడానికి ఆజ్ఞ ఇచ్చాడు.

**తదా తం కల్పమాహుర్వై మేఘవాహన సంజ్ఞయా ।**
**హిరణ్యగర్భస్తం దృష్ట్వా తస్య దేహోద్భవస్తదా ॥20॥**

**జనార్దనసుతః ప్రాహ తపసా ప్రాప్య శంకరమ్ ।**

అందువల్ల ఈ కల్పాన్ని మేఘవాహన కల్పమని అంటారు. ఆ విష్ణుశరీరం నుండి పుట్టిన హిరణ్యగర్భుడు తపస్సుతో శంకరుని చేరి ఇలా చెప్పాడు.

**తవ వామాంగజో విష్ణుర్దక్షిణాంగభవో హ్యహమ్ ॥21॥**

**మయా సహ జగత్సర్వం తథాప్యసృజదచ్యుతః ।**

విష్ణువు నీ ఎడమభాగంనుంచి జన్మించాడు. నేను నీకుడి శరీరభాగంనుంచి పుట్టాను. అయినప్పటికి విష్ణువు నాతోపాటుగా సకలజగత్తును సృష్టించాడు.

**జగన్మయోఽవహద్యస్మాన్మేఘో భూత్వా దివానిశమ్ ॥22॥**

**భవంతమవహద్విష్ణుర్దేవదేవం జగద్గురుమ్ ।**
**నారాయణాదపి విభో భక్తోఽహం తవ శంకర ॥23॥**

**ప్రసీద దేహి మే సర్వం సర్వాత్మత్వం తవ ప్రభో ।**

జగన్మయుడైన విష్ణువు మేఘమై రాత్రింబవళ్లు జగద్గురువైన నిన్ను మోశాడు. ఓ శివా! నేను విష్ణువుకంటే కూడా నీ భక్తుణ్ణి. నన్ను అనుగ్రహించు. నాకు నీ సమస్త సర్వాత్మ తత్త్వాన్ని ప్రసాదించు.

**తదాథ లబ్ధ్వా భగవాన్ భవాత్సర్వాత్మతాం క్షణాత్ ॥24॥**

**త్వరమాణోఽథ సంగమ్య దదర్శ పురుషోత్తమమ్ ।**
**ఏకార్ణవాలయే శుభ్రే త్వంధకారే సుదారుణే ॥25॥**

**హేమరత్నచితే దివ్యే మనసా చ వినిర్మితే ।**
**దుష్ప్రాప్యే దుర్జనైః పుణ్యైః సనకాద్యైరగోచరే ॥26॥**

తర్వాత బ్రహ్మదేవుడు శివుడివల్ల సర్వాత్మతను పొంది, త్వరగా క్షీరసాగరానికి వెళ్లి, భయంకరమైన చీకటితో నిండియున్న పరిశుభ్రమైన మనసుతో నిర్మింపబడిన బంగారమూ మరియు రత్నాలతో తాపింపబడిన దుర్మార్గులకు పొందశక్యంగానిదీ, పుణ్యాత్ములైన సనకాదులకు కూడా కన్పించనిదీ అయిన ఆ మహాసాగరంలో దివ్యమైన భవనంలో విష్ణువును దర్శించాడు.

**జగదావాసహృదయం దదర్శ పురుషం త్వజః ।**
**అనంతభోగశయ్యాయాం శాయినం పంకజేక్షణమ్ ॥27॥**

**శంఖచక్రగదాపద్మం ధారయంతం చతుర్భుజమ్ ।**
**సర్వాభరణసంయుక్తం శశిమండలసన్నిభమ్ ॥28॥**

**శ్రీవత్సలక్షణం దేవం ప్రసన్నాస్యం జనార్దనమ్ ।**
**రమామృదుకరాంభోజస్పర్శకర్శపదాంబుజమ్ ॥29॥**

**పరమాత్మానమీశానం తమసా కాలరూపిణమ్ ।**
**రజసా సర్వలోకానాం సర్గలీలాప్రవర్తకమ్ ॥30॥**

**సత్త్వేన సర్వభూతానాం స్థాపకం పరమేశ్వరమ్ ।**
**సర్వాత్మానం మహాత్మానం పరమాత్మానమీశ్వరమ్ ॥31॥**

**క్షీరార్ణవేఽ మృతమయే శాయినం యోగనిద్రయా ।**
**తం దృష్ట్వా ప్రాహ వై బ్రహ్మా భగవంతం జనార్దనమ్ ॥32॥**

జగత్తును తన హృదయంలో ధరించినవాడిని, నాల్గు చేతులతో శంఖచక్రగదాపద్మాల్ని ధరించినవాడిని, వక్షఃస్థలంలో 'శ్రీ' చిహ్నాన్ని ధరించినవాడిని, తమోగుణయుక్తుడై కాలరూపుడు గాను, రజోగుణభరితుడై సమస్తలోకాల్ని సృష్టించు లీలలో ప్రవర్తించువాడు గాను సత్త్వగుణశోభితుడై సమస్తప్రాణులకు స్థితి కారకుడైన పరమేశ్వరుడిని సర్వాత్ముడు, మహాత్ముడు, పరమాత్ముడు అయిన ఈశ్వరుడిని, సమస్తాభరణాలతో అలంకృతుని, చంద్రముఖుడు, ప్రసన్నముఖుడు అయినవాడిని లక్ష్మీదేవి యొక్క పద్మాలవంటి చేతుల స్పర్శతో ఎఱ్ఱటి పాదపద్మాలుగలిగినవాడిని, పరమపురుషుడు పరమేశ్వరుడు అయిన విష్ణువును యోగనిద్రలో అమృతమయమైన పాలసముద్రంలో పవ్వళించి ఉండగా బ్రహ్మ చూశాడు. భగవంతుడైన, జనార్దనుని చూచి బ్రహ్మ పలికాడు.

**గ్రసామి త్వాం ప్రసాదేన యథాపూర్వం భవానహమ్ ।**
**స్మయమానస్తు భగవాన్ ప్రతిబుద్ధ్య పితామహమ్ ॥33॥**

**ఉదైక్షత మహాబాహుః స్మితమీషచ్చకార సః ।**
**వివేశ చాండజం తం తు గ్రస్తస్తేన మహాత్మనా ॥34॥**

పూర్వం నన్ను నీవు మ్రింగినట్లే శివానుగ్రహంతో నిన్ను మ్రింగుతున్నాను. ఆజానుబాహుడైన విష్ణుభగవానుడు మేల్కొని బ్రహ్మను చూచి మందస్మితుడైనాడు. మహాత్ముడైన బ్రహ్మచేత మ్రింగివేయబడి అండజుడైన బ్రహ్మశరీరంలోనికి ప్రవేశించాడు.

**తతస్తం చాసృజద్ బ్రహ్మా భ్రువోర్మధ్యేన చాచ్యుతమ్ ।**
**సృష్టస్తేన హరిః ప్రేక్ష్య స్థితస్తస్యాథ సన్నిధౌ ॥35॥**

అప్పుడు బ్రహ్మ విష్ణువును తన భ్రూమధ్యం నుంచి సృష్టించాడు. బ్రహ్మచే సృష్టింపబడిన విష్ణువు ఆతణ్ణి చూచి, ఆతడి సమీపంలో నిలిచాడు.

**ఏతస్మిన్నంతరే రుద్రః సర్వదేవభవోద్భవః ।**
**వికృతం రూపమాస్థాయ పురాదత్తవరస్తయోః ॥36॥**

**ఆగచ్ఛద్యత్ర వై విష్ణుర్విశ్వాత్మా పరమేశ్వరః ।**
**ప్రసాదమతులం కర్తుం బ్రహ్మణశ్చ హరేః ప్రభుః ॥37॥**

ఈమధ్యకాలంలో పూర్వంవారికి వరదానంచేసిన సమస్తదేవతా సృష్టికర్తఅయిన రుద్రుడు వికృతమైన రూపాన్ని ధరించి బ్రహ్మను, విష్ణువును అనుగ్రహించడానికి అక్కడకు వచ్చాడు.

**తతః సమేత్య తౌ దేవౌ సర్వదేవభవోద్భవమ్ ।**
**అపశ్యతాం భవం దేవం కాలాగ్నిసదృశం ప్రభుమ్ ॥38॥**

ఆ బ్రహ్మదేవుడూ, విష్ణుభగవానుడూ శివుడిని సమీపించి సమస్తదేవతల పుట్టుకకు కారకుడు, కాలాగ్ని సమానతేజుడు, ప్రభువు, భవుడు, దేవదేవుడు అయిన శివుణ్ణి చూశారు.

**తౌ తం తుష్టువతుశ్చైవ శర్వముగ్రం కపర్దినమ్ ।**
**ప్రణేమతుశ్చ వరదం బహుమానేన దూరతః ॥39॥**

వారిద్దరూ దూరంనుంచే సన్మానపూర్వకంగా శర్వుడు, ఉగ్రుడు, కపర్ది, వరదుడు అయిన శివుణ్ణి స్తుతిస్తూ నమస్కరించారు.

**భవోఽపి భగవాన్ దేవమనుగృహ్య పితామహమ్ ।**
**జనార్దనం జగన్నాథస్తత్రైవాంతరధీయత ॥40॥**

భగవంతుడు, జగన్నాథుడు అయిన భవుడు పితామహుణ్ణి, విష్ణుమూర్తిని అనుగ్రహించి, అక్కడే అంతర్ధానం చెందాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే బ్రహ్మణో వరప్రదానం నామ సప్తత్రింశత్తమోఽధ్యాయః ॥ 37 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని బ్రహ్మకు వరప్రదానమనే ముప్పైఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టత్రింశోఽధ్యాయః** - ముప్పైఎనిమిదవ అధ్యాయం

## **వైష్ణవకథనమ్** - వైష్ణవకథనం

**శైలాదిరువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**గతే మహేశ్వరే దేవే తముద్దిశ్య జనార్దనః ।**
**ప్రణమ్య భగవాన్ ప్రాహ పద్మయోనిమజోద్భవః ॥1॥**

మహాదేవుడైన శివుడు అంతర్ధానం చెందగా బ్రహ్మనుంచి పుట్టిన విష్ణుభగవానుడు బ్రహ్మకు నమస్కరించి ఇలా పలికాడు.

**శ్రీవిష్ణురువాచ** - శ్రీ మహావిష్ణువు పలికాడు.

**పరమేశో జగన్నాథః శంకరస్త్వేష సర్వగః ।**
**ఆవయోరఖిలస్యేశః శరణం చ మహేశ్వరః ॥2॥**

పరమేశ్వరుడు జగత్పతి. అన్నిచోట్లకు వెళ్లగలిగినవాడు. శంకరుడు, మహేశ్వరుడు సమస్తప్రపంచానికీ, మనయిద్దరకూ కూడా శరణుజొచ్చదగినవాడు.

**అహం వామాంగజో బ్రహ్మన్ శంకరస్య మహాత్మనః ।**
**భవాన్ భవస్య దేవస్య దక్షిణాంగభవః స్వయమ్ ॥3॥**

**మామాహుర్ఋషయః ప్రేక్ష్య ప్రధానం ప్రకృతిం తథా ।**
**అవ్యక్తమజమిత్యేవం భవంతం పురుషస్త్వితి ॥4॥**

ఓ బ్రహ్మదేవుడా! నేను మహాత్ముడైన శంకరుడియొక్క ఎడమ శరీరభాగం నుంచి జన్మించాను. నీవు శివభగవానుడియొక్క కుడిశరీరభాగం నుంచి సాక్షాత్తు జన్మించావు. మహర్షులు విచారించి నన్ను ప్రధానప్రకృతి, అవ్యక్తరూపుడు, అజుడు అని, నిన్ను పురుషుడని పలుకుతున్నారు.

**ఏవమాహుర్మహాదేవమావయోరపి కారణమ్ ।**
**ఈశం సర్వస్య జగతః ప్రభుమవ్యయమీశ్వరమ్ ॥5॥**

మనయిద్దరికి మరియు ఈ సమస్తజగత్తుకు మహాప్రభువు, మహాదేవుడు, అవ్యయుడు అయిన పరమేశ్వరుడు కారణభూతుడని చెప్తున్నారు.

**సోఽపి తస్యామరేశస్య వచనాద్వారిజోద్భవః ।**
**వరేణ్యం వరదం రుద్రమస్తువత్ప్రణనామ చ ॥6॥**

పద్మభవుడైన బ్రహ్మదేవుడునూ, దేవేశ్వరుడైన విష్ణువు, వరదుడునూ, ఆశ్రయించదగినవాడు అయిన రుద్రుడిని కీర్తిస్తూ, నమస్కరించారు.

**అథాంభసా ప్లుతాం భూమిం సమాదాయ జనార్దనః ।**
**పూర్వవత్స్థాపయామాస వారాహం రూపమాస్థితః ॥7॥**

శ్రీమహావిష్ణువు వరాహరూపాన్ని ధరించి, నీటిపై తేలుతున్న భూమిని పట్టుకుని, యథాపూర్వకంగా నిలిపాడు.

**నదీనదసముద్రాంశ్చ పూర్వవచ్చాకరోత్ప్రభుః ।**
**కృత్వా చోర్వీం ప్రయత్నేన నిమ్నోన్నతవివర్జితామ్ ॥8॥**

**ధరాయాం సోఽచినోత్సర్వాన్ భూధరాన్ భూధరాకృతిః ।**
**భూరాద్యాంశ్చతురో లోకాన్ కల్పయామాస పూర్వవత్ ॥9॥**

భూమిని మెట్టపల్లాలు లేనిదానిగా ప్రయత్నపూర్వకంగా నిర్వహించి, నదీనదాల్ని, సముద్రాల్ని, యథాపూర్వంగా ఉండే విధంగా విష్ణువు చేశాడు. భూధరుడైన విష్ణువు భూమిమీద సమస్త పర్వతాల్ని స్థాపింపజేశాడు. భూలోకం మొదలుగాగల నాలుగులోకాల్ని యథాపూర్వంగా సృష్టించాడు.

**స్రష్టుం చ భగవాన్ చక్రే మతిం మతిమతాం వరః ।**
**ముఖ్యం చ తైర్యగ్యోన్యం చ దైవికం మానుషం తథా ॥10॥**

**విభుశ్చానుగ్రహం తత్ర కౌమారకమదీనధీః ।**

సమున్నత ధీమంతుడు, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన విష్ణువు ముఖ్యాన్ని, (వృక్షాదుల్ని) పశుపక్ష్యాదుల్ని, దేవతల్ని, మానవుల్ని, అనుగ్రహాన్ని, కుమారుల్ని సృష్టించడానికి బుద్ధిని సన్నద్ధ పర్చాడు.

**పురస్తాదసృజద్దేవః సనందం సనకం తథా ॥11॥**

**సనాతనం సతాం శ్రేష్ఠం నైష్కర్మ్యేణ గతాః పరమ్ ।**
**మరీచిభృగ్వంగిరసం పులస్త్యం పులహం క్రతుమ్ ॥12॥**

**దక్షమత్రిం వసిష్ఠం చ సోఽసృజద్యోగవిద్యయా ।**
**సంకల్పం చైవ ధర్మం చ హ్యధర్మం భగవాన్ ప్రభుః ॥13॥**

**ద్వాదశైవ ప్రజాస్త్వేతా బ్రహ్మణోఽ వ్యక్తజన్మనః ।**

ముందుగా (ప్రారంభంలో) విష్ణువు సనందుడిని, సనకుడిని, సజ్జనశ్రేష్ఠుడైన సనాతనుడిని సృష్టించాడు. వాళ్లు క్రియారహితులైనారు. తర్వాత విష్ణువు మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు, సంకల్పుడు, ధర్ముడు, అధర్ముడు అనువీరిని యోగవిద్యద్వారా సృష్టించాడు. ఈ పండ్రెండు మంది పుట్టుక తెలియని బ్రహ్మకు పుత్రులు.

**ఋభుం సనత్కుమారం చ ససర్జాదౌ సనాతనః ॥14॥**

**తౌ చోర్ధ్వరేతసౌ దివ్యౌ చాగ్రజౌ బ్రహ్మవాదినౌ ।**
**కుమారౌ బ్రహ్మణస్తుల్యౌ సర్వజ్ఞౌ సర్వభావినౌ ॥15॥**

సనాతనుడైన బ్రహ్మ ముందుగా ఋభుడిని, సనత్కుమారుడిని సృష్టించాడు. వారిద్దరూ బ్రహ్మచారులు, బ్రహ్మజ్ఞానులు, దివ్యులు. సర్వజ్ఞులు, సమస్తమూ తెలిసినవారు. బ్రహ్మతో సమానులు.

**ఏవం ముఖ్యాదికాన్ సృష్ట్వా పద్మయోనిః శిలాశన ।**
**యుగధర్మానశేషాంశ్చ కల్పయామాస విశ్వసృక్ ॥16॥**

ఓ శిలాదా! ఈవిధంగా ముఖ్యమాదిగాగల వాటిని సృష్టించి విశ్వస్రష్ట విష్ణువు అసంఖ్యాకాలైన యుగధర్మాల్ని కల్పించాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే వైష్ణవకథనం నామాష్టత్రింశత్తమోఽధ్యాయః ॥38 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని వైష్ణవకథనమనే ముప్పైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనచత్వారింశోఽధ్యాయః - ముప్పైతొమ్మిదవ అధ్యాయం

## చతుర్యుగధర్మవర్ణనమ్ - చతుర్యుగధర్మవర్ణనం

**శైలాదిరువాచ** - నందీశ్వరుడు పలికాడు.

> **శ్రుత్వా శక్రేణ కథితం పితా మమ మహామునిః ।**
> **పునః పప్రచ్ఛ దేవేశం ప్రణమ్య రచితాంజలిః ॥1॥**

ఓ సనత్కుమారా! ఇంద్రుడు చెప్పినదానిని విని, మహర్షి అయిన నాతండ్రి శిలాదుడు చేతులు జోడించి, దేవేంద్రుడికి నమస్కరించి మరలా ఇలా పలికాడు.

**శిలాద ఉవాచ** - శిలాదుడు పలికాడు.

> **భగవన్ శక్ర సర్వజ్ఞ దేవదేవనమస్కృత ।**
> **శచీపతే జగన్నాథ సహస్రాక్ష మహేశ్వర ॥2॥**

> **యుగధర్మాన్ కథం చక్రే భగవాన్ పద్మసంభవః ।**
> **వక్తుమర్హసి మే సర్వం సాంప్రతం ప్రణతాయ మే ॥3॥**

ఓ భగవానుడా! ఓ శక్రుడా! ఓ సర్వజ్ఞుడా! ఓ సమస్తదేవతలచే నమస్కరింపబడువాడా! ఓ శచీపతీ! ఓ జగన్నాథుడా! వేయికన్నులుగలవాడా! ఓ మహేశ్వరుడా! పద్మసంభవుడైన బ్రహ్మ యుగధర్మాల్ని ఎలా ఏర్పరచాడో చెప్పు. నీకు నమస్కారం.

**శైలాదిరువాచ** - నందీశ్వరుడు పలికాడు.

> **తస్య తద్వచనం శ్రుత్వా శిలాదస్య మహాత్మనః ।**
> **వ్యాజహార యథా దృష్టం యుగధర్మం సువిస్తరమ్ ॥4॥**

మహాత్ముడైన శిలాదుని ఆ మాటవిని ఇంద్రుడు యుగధర్మాన్ని ఎలా దర్శించాడో అలా మిక్కిలి వివరంగా పలికాడు.

**శక్ర ఉవాచ** - ఇంద్రుడు పలికాడు.

> **ఆద్యం కృతయుగం విద్ధి తతస్త్రేతాయుగం మునే ।**
> **ద్వాపరం తిష్యమిత్యేతే చత్వారస్తు సమాసతః ॥5॥**

ఓ శిలాదర్షీ! మొదటిది కృతయుగం. తర్వాతిది త్రేతాయుగం. తదుపరి ద్వాపరం. తర్వాత కలియుగం. సంక్షిప్తంగా నాలుగుయుగాలని తెలిసికో.

**సత్త్వం కృతం రజస్త్రేతా ద్వాపరం చ రజస్తమః ।**
**కలిస్తమశ్చ విజ్ఞేయం యుగవృత్తిర్యుగేషు చ ॥6॥**

కృతయుగం సత్త్వగుణం కలదిగా, త్రేతాయుగం రజోగుణంకలదిగా, ద్వాపరయుగం రజోగుణమూ మరియు తమోగుణము కలదిగా, కలియుగం తమోగుణము కలదిగా తెలియాలి. ప్రతియుగంలోనూ ఇవి యుగధర్మాలు.

**ధ్యానం పరం కృతయుగే త్రేతాయాం యజ్ఞ ఉచ్యతే ।**
**భజనం ద్వాపరే శుద్ధం దానమేవ కలౌ యుగే ॥7॥**

కృతయుగంలో ఉత్తమమైన ధ్యానం, త్రేతాయుగంలో యజ్ఞం, ద్వాపరయుగంలో అర్చన (సేవ), కలియుగంలో నిర్మలదానం నిర్వహింపవలసిన విధులుగా చెప్పబడ్డాయి.

**చత్వారి చ సహస్రాణి వర్షాణాం తత్కృతం యుగమ్ ।**
**తస్య తావచ్ఛతీ సంధ్యా సంధ్యాంశశ్చ తథావిధః ॥8॥**

కృతయుగం నాలుగువేల దివ్యవర్షప్రమాణం కలది. దానియొక్క సంధ్య నాలుగువందల దివ్యవర్షాలు. అట్లే సంధ్యాంశ కూడా నాలుగువందల దివ్యవర్షాలే.

**చత్వారి చ సహస్రాణి మానుషాణి శిలాశన ।**
**ఆయుః కృతయుగే విద్ధి ప్రజానామిహ సువ్రత ॥9॥**

ఓ శిలాదుడా! ఓ సువ్రతుడా! ఈ కృతయుగంలో ప్రజలయొక్క ఆయువు నాలుగువేల మనుష్యవర్షాలకు సమానమని తెలిసికో.

**తతః కృతయుగే తస్మిన్ సంధ్యాంశే చ గతే తు వై ।**
**పాదావశిష్టో భవతి యుగధర్మస్తు సర్వతః ॥10॥**

**చతుర్భాగైకహీనం తు త్రేతాయుగమనుత్తమమ్ ।**
**కృతార్ధం ద్వాపరం విద్ధి తదర్ధం తిష్యముచ్యతే ॥11॥**

**త్రిశతీ ద్విశతీ సంధ్యా తథా చైకశతీ మునే ।**
**సంధ్యాంశకం తథాప్యేవం కల్పేష్వేవం యుగే యుగే ॥12॥**

తర్వాత కృతయుగం తన సంధ్యాంశాలతో కలిపి గడచిపోయిన తర్వాత అంతటా యుగధర్మం నాల్గోవంతు తగ్గిపోతుంది. ఉత్తమమైన త్రేతాయుగం కృతయుగం కంటే నాల్గోభాగం తగ్గుతుంది. ద్వాపరం ప్రమాణం కృతయుగంలో సగం. అందులో సగం కలియుగం. ఓ ఋషీ! సంధ్యాకాలం క్రమంగా మూడువేలు, రెండువేలూ, ఒక వేయి సంవత్సరాలుగా ఉంటుంది. సంధ్యాంశకాలం కూడా అట్లే ఉంటుంది. ఈ విధంగానే అన్ని కల్పాలలోనూ యుగాలలోనూ కాలప్రమాణముంటుంది.

**ఆద్యే కృతయుగే ధర్మశ్చతుష్పాదః సనాతనః ।**
**త్రేతాయుగే త్రిపాదస్తు ద్విపాదో ద్వాపరే స్థితః ॥13॥**

**త్రిపాదహీనస్తిష్యే తు సత్తామాత్రేణ ధిష్ఠితః ।**

కృతయుగంలో సనాతనధర్మం నాలుగుపాదాలుగలదై, త్రేతాయుగంలో మూడుపాదాలుగలదై, ద్వాపరయుగంలో రెండుపాదాలుగలదై, కలియుగంలో ఒకపాదంగలదై ఉంటుంది.

**కృతే తు మిథునోత్పత్తిః వృత్తిః సాక్షాద్రసోల్లసా ॥14॥**

**ప్రజాస్తృప్తాః సదా సర్వాః సర్వానందాశ్చ భోగినః ।**
**అధమోత్తమతా తాసాం న విశేషాః ప్రజాః శుభాః ॥15॥**

కృతయుగంలో స్త్రీపురుషసంయోగంతో ఉత్పత్తి జరుగుతుంది. ఆ వ్యాపారం మధురరసభరితమై ఉంటుంది. ప్రజలందరూ సమస్తసంతోషాలతో, భోగాలతో సంతృప్తులై ఉంటారు. వారిలో ఉత్తమాధమతారతమ్యాలు లేవు. ప్రజలందరూ శుభలక్షణలక్షితులు.

**తుల్యమాయుః సుఖం రూపం తాసాం తస్మిన్ కృతే యుగే ।**
**తాసాం ప్రీతిర్న చ ద్వంద్వం న ద్వేషో నాస్తి చ క్లమః ॥16॥**

ఆ కృతయుగంలో ప్రజలరూపం, ఆయుస్సు, సుఖం సమానం. వారికి ప్రీతి, సుఖదుఃఖాదిద్వంద్వాలు, ఒకరిపై మరొకరికి ద్వేషం ఉండవు. క్లేశముండదు.

**పర్వతోదధివాసిన్యో హ్యనికేతాశ్రయాస్తు తాః ।**
**విశోకాః సత్త్వబహులా ఏకాంతబహులాస్తథా ॥17॥**

వారు కృతయుగంలో గృహాలలో గాక పర్వతాలపై సముద్రాల దగ్గర నివసిస్తారు. శోకరహితులై సత్త్వగుణాధిక్యంతో మిక్కిలి ఏకాంతాన్ని కలిగి ఉంటారు.

**తావై నిష్కామచారిణ్యో నిత్యం ముదితమానసాః ।**
**అప్రవృత్తిః కృతయుగే కర్మణోః శుభపాపయోః ॥18॥**

**వర్ణాశ్రమవ్యవస్థా చ తదాసీన్న చ సంకరః ।**

కృతయుగప్రజలు కామకర్మరహితులై ఎల్లప్పుడూ సంతోషంతో ఉంటారు. పుణ్యాపాపకర్మలపై ప్రవృత్తి ఉండదు. బ్రహ్మక్షత్రవైశ్యశూద్రవిధమైన వర్ణాశ్రమవ్యవస్థ ఉన్నది. వర్ణసాంకర్యమనేది లేదు.

**రసోల్లాసః కాలయోగాత్ త్రేతాఖ్యే నశ్యతే ద్విజ ॥19॥**

**తస్యాం సిద్ధౌ ప్రనష్టాయామన్యా సిద్ధిః ప్రజాయతే ।**
**అపాం సౌక్ష్మ్యే ప్రతిగతే తదా మేఘాత్మనా తు వై ॥20॥**

**మేఘేభ్యః స్తనయిత్నుభ్యః ప్రవృత్తం వృష్టిసర్జనమ్ ।**
**సకృదేవ తయా వృష్ట్యా సంయుక్తే పృథివీతలే ॥21॥**

**ప్రాదురాసంస్తదా తాసాం వృక్షాస్తే గృహ సంహితాః ।**
**సర్వవృత్త్యుపభోగస్తు తాసాం తేభ్యః ప్రజాయతే ॥22॥**

**వర్తయంతిస్మ తేభ్యస్తాస్త్రేతాయుగముఖే ప్రజాః ।**

ఓ బ్రాహ్మణుడా! కాలప్రభావంవల్ల త్రేతాయుగంలో రసప్రాదుర్భావం నశిస్తుంది. ఈ యుగంలో ఉన్న సిద్ధి నశింపగా వేరొక సిద్ధి జనిస్తుంది. నీరు సూక్ష్మమైనప్పుడు మేఘాలుగా మారుతుంది. గర్జించు (ఉరిమే) మేఘాలనుంచి వర్షం కురుస్తుంది. భూమిపై ఒకసారి వాన కురిస్తే వృక్షాలు పుడతాయి. ఆ వృక్షాలే వారికి నివాసాలవుతాయి. ఆ వృక్షాల్ని ఆశ్రయించే ప్రజలు సమస్త కార్యాల్ని, చేపడుతూ, సుఖాల్ని అనుభవిస్తారు. ఈ విధంగా త్రేతాయుగప్రారంభంలో ప్రజలజీవనవిధానం వృక్షాశ్రితంగా జరుగుతుంది.

**తతః కాలేన మహతా తాసామేవ విపర్యయాత్ ॥23॥**

**రాగలోభాత్మకో భావస్తదా హ్యాకస్మికోఽ భవత్ ।**
**విపర్యయేణ తాసాం తు తేన తత్కాలభావినా ॥24॥**

**ప్రణశ్యంతి తతః సర్వే వృక్షాస్తే గృహసంజ్ఞితాః ।**

చాలాకాలం గడిచిన తర్వాత హఠాత్తుగా వారి బుద్ధిలో మార్పు కలిగి, రాగలోభాలతో కూడిన భావం ఏర్పడింది. ఆ ప్రజలలో ఆ కాలంలో కలిగిన మార్పుకు కారణం ఆవాసాలయిన వృక్షాలన్నీ నశించడమే.

**తతస్తేషు ప్రనష్టేషు విభ్రాంతా మైథునోద్భవాః ॥25॥**

**అపి ధ్యాయంతి తాం సిద్ధిం సత్యాభిధ్యాయినస్తదా ।**

ఆ వృక్షాలు బాగా నశించిపోగా స్త్రీపురుషసంయోగంతో జన్మించిన ఆ ప్రజలు మిక్కిలి భ్రాంతిపొందారు. అప్పుడు సత్యచింతనపరులై అది సిద్ధించాలని ధ్యానించారు.

**ప్రాదుర్బభూవుస్తాసాంతు వృక్షాస్తే గృహసంజ్ఞితా ॥26॥**

**వస్త్రాణి తే ప్రసూయంతే ఫలాన్యాభరణాని చ ।**
**తేష్వేవ జాయతే తాసాం గంధవర్ణరసాన్వితమ్ ॥27॥**

**అమాక్షికం మహావీర్యం పుటకే పుటకే మధు ।**

ధ్యానఫలంగా గృహనామకాలైన ఆ వృక్షాలు పుట్టాయి. వస్త్రాలను, పండ్లను, ఆభరణాలను అవి ఉత్పత్తి చేస్తున్నాయి. ఆ వృక్షాలనుంచే ప్రతిపర్ణమందు రంగు, వాసన, రుచిగల గొప్పబలకరమైన తేనె పుడుతుంది. దానికి ఈగలుండవు.

**తేన తా వర్తయంతి స్మ సుఖమాయుః సదైవ హి ॥28॥**

**హృష్టపుష్టాస్తయా సిద్ధ్యా ప్రజా వై విగతజ్వరాః ।**

ఆ మధువు వల్ల ఆ ప్రజలు ఎల్లప్పుడూ సంతోషపూర్వకమైన జీవనాన్ని గడుపుతున్నారు. ఆ సిద్ధివల్ల ప్రజలు జ్వరాదిరోగరహితులై బలంగా, సంతోషంగా ఉండేవారు.

**తతః కాలాంతరేణైవ పునర్లోభావృతాస్తు తాః ॥29॥**

**వృక్షాంస్తాన్ పర్యగృహ్ణంతి మధు వా మాక్షికం బలాత్ ।**
**తాసాం తేనోపచారేణ పునర్లోభకృతేన వై ॥30॥**

**ప్రనష్టా మధునా సార్ధం కల్పవృక్షాః క్వచిత్క్వచిత్ ।**

తర్వాతికాలంలో మరల లోభగ్రస్తులైన ఆ ప్రజలు ఆ వృక్షాలనుంచి బలవంతంగా తేనెటీగలతో కూడిన మధువును హరిస్తున్నారు. వారియొక్క లోభపూర్వకమైన ఆ కార్యంవల్ల తేనెతో సహా కొన్నికొన్ని కల్పవృక్షాలు పూర్తిగా నశించాయి.

**తస్యామేవాల్పశిష్టాయాం సిద్ధ్యాం కాలవశాత్తదా ॥31॥**

**ఆవర్తనాస్తు త్రేతాయాం ద్వంద్వాన్యభ్యుత్థితాని వై ।**
**శీతవర్షాతపైస్తీవ్రైస్తతస్తా దుఃఖితా భృశమ్ ॥32॥**

**ద్వంద్వైః సంపీడ్యమానాశ్చ చక్రురావరణాని తు ।**

కాలప్రభావకారణంగా కొద్దిగా మిగిలిన ఆ సిద్ధిలో ఆవృత్తి ఏర్పడడం వల్ల త్రేతాయుగంలో సుఖదుఃఖాదిద్వంద్వాలు ఉత్పన్నమయ్యాయి. ప్రబలమైన చలి, వాన, ఎండవల్ల వాళ్లు మిక్కిలి దుఃఖితులయ్యారు. ద్వంద్వాలవల్ల పీడింపబడి ఆచ్ఛాదనలను నిర్మించుకున్నారు.

**కృతద్వంద్వ ప్రతీఘాతాః కేతనాని గిరౌ తతః ॥33॥**

**పూర్వం నికామచారాస్తా హ్యనికేతా అథావసన్ ।**
**యథా యోగం యథా ప్రీతి నికేతేష్వవసన్ పునః ॥34॥**

శీతవాతాదిద్వంద్వాల్ని నివారించే గృహాల్ని కొండలపై ప్రజలు నిర్మించారు. ఇంతకుముందు గృహాలు లేక స్వేచ్ఛాసంచారులైన వాళ్లు గృహాలలో నివసిస్తున్నారు. తమకు అనుకూలమై ప్రీతికరమైన గృహాలలో నివసిస్తున్నారు.

**కృత్వా ద్వంద్వోపఘాతాంస్తాన్ వృత్త్యుపాయమచింతయన్ ।**
**నష్టేషు మధునా సార్ధం కల్పవృక్షేషు వై తదా ॥35॥**

అప్పుడు మధువుతో కూడా కల్పవృక్షాలు నశించగా ద్వంద్వాలను నివారించగల జీవనోపాయాన్ని ఆలోచించారు.

**వివాదవ్యాకులాస్తాః వై ప్రజాస్తృష్ణాక్షుధార్దితాః ।**
**తతః ప్రాదుర్బభౌ తాసాం సిద్ధిస్త్రేతాయుగే పునః ॥36॥**

ఆ ప్రజలు ఆకలిదప్పికలతో దుఃఖితులైరి. పరస్పరం కల్గిన వివాదంవల్ల మనస్సులు ఆందోళనకు లోనయ్యాయి. మరల త్రేతాయుగంలో వారికి ఆ సిద్ధి కలిగింది.

**వార్తాయాః సాధికాప్యన్యా వృష్టిస్తాసాం నికామతః ।**
**తాసాం వృష్ట్యుదకాదీని హ్యభవన్నిమ్నగాని తు ॥37॥**

ఆ వృక్షాల ఉత్పత్తికి ఎంత వర్షం అవసరమో అంతకంటే అధికవర్షం కలగడంవల్ల పల్లాలన్నీ వర్షోదకాలతో నిండాయి.

**అభవన్ వృష్టిసంతత్యా స్రోతస్థానాని నిమ్నగాః ।**
**ఏవం నద్యః ప్రవృత్తాస్తు ద్వితీయే వృష్టిసర్జనే ॥38॥**

ఎల్లప్పుడూ వర్షం కురియడంతో నదులు మరో ఉద్గమనస్థానాన్ని పొందాయి. జలాశయాలు పల్లాలవైపు సాగాయి. ఈవిధంగా ద్వితీయవర్షసృష్టివల్ల నదులు ఏర్పడ్డాయి.

**యే పునస్తదపాం స్తోకాః పతితాః పృథివీతలే ।**
**అపాం భూమేశ్చ సంయోగాదోషధ్యస్తాస్తదాభవన్ ॥39॥**

**అథాల్పకృష్టాశ్చానుప్తా గ్రామ్యారణ్యాశ్చతుర్దశ ।**
**ఋతుపుష్పఫలాశ్చైవ వృక్షగుల్మాశ్చ జజ్ఞిరే ॥40॥**

**ప్రాదుర్భూతాని చైతాని వృక్షజాత్యౌషధాని చ ।**
**తేనౌషధేన వర్తంతే ప్రజాస్త్రేతాయుగే తదా ॥41॥**

ఈ విధంగా మరల ఆ వర్షబిందువులు భూమిపై పడ్డాయి. నీరు, భూమి కలయికవల్ల ఓషధులు అపుడు పుట్టాయి. వనగ్రామాలకు చెందిన పధ్నాలుగు రకాలైన తృణధాన్యాలు ఉత్పన్నమయ్యాయి. ఋతుసమయానికి తగిన పుష్పాలు, ఫలాలు, వృక్షాలు, పొదలు ఉద్భవించాయి. త్రేతాయుగంలో వృక్షజాతులు, ఓషధులు ఉద్భవించాయి. ఈ యుగంలో ప్రజలు ఈ ఓషధులతోనే జీవనం సాగిస్తున్నారు.

**తతః పునరభూత్తాసాం రాగో లోభశ్చ సర్వశః ।**
**అవశ్యం భావినార్థేన త్రేతాయుగవశేన చ ॥42॥**

**తతస్తాః పర్యగృహ్ణంత నదీక్షేత్రాణి పర్వతాన్ ।**
**వృక్షగుల్మౌషధీశ్చైవ ప్రసహ్య తు యథా బలమ్ ॥43॥**

**విపర్యయేణ చౌషధ్యః ప్రనష్టాస్తాశ్చతుర్దశ ।**

తర్వాత ఆ ప్రజలలో రాగం లోభం అన్నిచోట్ల ఏర్పడ్డాయి. త్రేతాయుగంలో తప్పక జరుగగల ప్రయోజనంతో ఆ ప్రజలు నదుల్ని, పర్వతాల్ని అతిక్రమించారు. వృక్షాల్ని గుల్మాల్ని, ఔషధుల్ని బలానికి తగినట్లుగా హరించారు. ఈ అతిక్రమణంచేత పధ్నాలుగు ఓషధులు నశించాయి.

**మత్వాధరాం ప్రవిష్టాస్తా ఇత్యౌషధ్యః పితామహః ॥44॥**

**దుదోహ గాం ప్రయత్నేన సర్వభూతహితాయ వై ।**
**తదాప్రభృతి చౌషధ్యః ఫాలకృష్టాస్త్విత్తస్తతః ॥45॥**

ఓషధులు భూమిలోనికి చొచ్చుకునిపోయాయి అని తలచి విష్ణుభగవానుడు పృథుమహారాజురూపంలో సమస్తప్రాణిశ్రేయస్సుకై ప్రయత్నపడి గోరూపంలోని భూమిని పితికాడు. (సాగుచేశాడు.) అప్పటినుంచి ఓషధులు నాగలిచాళ్లుగల నేలమీద అక్కడక్కడ పుట్టుతున్నాయి.

**వార్తా కృషిం సమాయాతా వర్తుకామాః ప్రయత్నతః ।**
**వార్తావృత్తిః సమాఖ్యాతా కృషికామప్రయత్నతః ॥46॥**

ప్రయత్నపూర్వకంగా వ్యవసాయాన్ని జీవనోపాధి చేసుకొన్నారు. ప్రయత్నపూర్వకంగా వ్యవసాయాన్ని ఇష్టపడడంవల్ల దాన్ని 'వార్తావృత్తి' అన్నారు.

**అన్యథా జీవితం తాసాం నాస్తి త్రేతాయుగాత్యయే ।**
**హస్తోద్భవా హ్యపశ్చైవ భవంతి బహుశస్తదా ॥47॥**

ఆ ప్రజలకు త్రేతాయుగాంతంలో వ్యవసాయానికంటె ఇతరమైన జీవనవిధి లేదు. ఈ సమయంలో చేతులతో పనిముట్ల సహాయంతో పుట్టించిన నీటితో జీవనం జరుగుతోంది.

**తత్రాపి జగృహుః సర్వే చాన్యోన్యం క్రోధమూర్ఛితాః ।**
**సుతదారాధనాద్యాంస్తు బలాద్యుగబలేన తు ॥48॥**

ఆ సమయంలో ప్రజలందరూ యుగప్రభావంవల్ల పరస్పరం కోపంవల్ల అవశులై బలవంతంగా ఇతరులపుత్రుల్ని, భార్యల్ని, ధనం మొదలైన వాటిని హరించారు.

**మర్యాదాయాః ప్రతిష్ఠార్థం జ్ఞాత్వా తదఖిలం విభుః ।**
**ససర్జ క్షత్రియాంస్త్రాతుం క్షతాత్కమలసంభవః ॥49॥**

ఆ సమస్తస్థితిని ప్రభువైన పద్మభవుడు తెలిసి హద్దుల పరిరక్షణ కోసం క్షతాలనుంచి అనగా ఇతరులవల్ల కలిగే దెబ్బలనుంచి రక్షించడానికై క్షత్రియుల్ని సృష్టించాడు.

**వర్ణాశ్రమప్రతిష్ఠాం చ చకార స్వేన తేజసా ।**
**వృత్తేన వృత్తినా వృత్తం విశ్వాత్మా నిర్మమే స్వయమ్ ॥50॥**

విశ్వాత్ముడైన భగవానుడు తన తేజస్సుతో అనగా శక్తితో బ్రహ్మ క్షత్ర వైశ్య శూద్రరూపమైన వర్ణాశ్రమస్థితిని సృష్టించాడు. వారియొక్క స్వధర్మానుసారమైన జీవికద్వారా జీవననిర్మాణాన్ని స్వయంగా నిర్మించాడు. అనగా ప్రతి వర్ణానికి వృత్తుల్ని నిర్ధారించాడు.

**యజ్ఞప్రవర్తనం చైవ త్రేతాయామభవత్క్రమాత్ ।**
**పశుయజ్ఞం న సేవంతే కేచిత్తత్రాపి సువ్రతాః ॥51॥**

క్రమంగా త్రేతాయుగంలో యజ్ఞయాగాదుల్ని నిర్వహించడం జరిగింది. ఈ యజ్ఞనిర్వహణంలో కొందరు సువ్రతులై పశుయజ్ఞాన్ని నిర్వహించడంలేదు.

**బలాద్విష్ణుస్తదా యజ్ఞమకరోత్సర్వదృక్ క్రమాత్ ।**
**ద్విజాస్తదా ప్రశంసంతి తతస్త్వాహింసకం మునే ॥52॥**

సమస్తాన్ని చూచిన విష్ణువు బలవంతంగా యజ్ఞాన్ని నిర్వహించాడు. ఓ మహర్షీ! బ్రాహ్మణులు హింసారహితమైన ఆ యజ్ఞాన్ని పొగిడారు.

**ద్వాపరేష్వపి వర్తంతే మతిభేదాస్తదా నృణామ్ ।**
**మనసా కర్మణా వాచా కృచ్ఛ్రాద్వార్తా ప్రసిధ్యతి ॥53॥**

ద్వాపరయుగంలోనూ నరుల మనస్సులలో, కర్మలలో, వాక్కులలో బుద్ధిభేదం కల్గియుంది. కష్టపూర్వకమైన కృషికార్యం కూడా ప్రసిద్ధి పొందింది.

**తదా తు సర్వభూతానాం కాయక్లేశవశాత్క్రమాత్ ।**
**లోభో భృతి ర్వణిగ్యుద్ధం తత్త్వానామవినిశ్చయః ॥54॥**

అప్పుడు సమస్తప్రాణులకు శారీరకకష్టంకారణంగా క్రమంగా లోభం, భృతి, వాణిజ్యం, యుద్ధం, తత్త్వం మొదలైన విషయాలలో నిర్ణయం లేకపోయింది.

**వేదశాఖాప్రణయనం ధర్మాణాం సంకరస్తథా ।**
**వర్ణాశ్రమపరిధ్వంసః కామద్వేషౌ తథైవ చ ॥55॥**

ఆ సమయంలో వేదాలు శాఖలుగా విభాగం అయ్యాయి. వర్ణధర్మాల సాంకర్యం. అంటే ఒకరు మరొకరి ధర్మాన్ని ఆచరించడం. అనగా బ్రహ్మక్షత్రవైశ్యశూద్రవర్ణాల ధర్మాలు మరియు బ్రహ్మచర్యం మొదలైన ఆశ్రమాల స్థితి విధ్వంసం జరిగింది. కామం, అసూయ ఏర్పడ్డాయి.

**ద్వాపరే తు ప్రవర్తంతే రాగో లోభో మదస్తథా ।**
**వేదో వ్యాసైశ్చతుర్ధా తు వ్యస్యతే ద్వాపరాదిషు ॥56॥**

**ఏకో వేదశ్చతుష్పాదస్త్రేతాస్విహ విధీయతే ।**
**సంక్షయాదాయుషశ్చైవ వ్యస్యతే ద్వాపరేషు సః ॥57॥**

ఈ ద్వాపరకాలంలో రాగం, లోభం, మదం అనే దుర్గుణాలు ప్రారంభమైనాయి. ఇప్పుడే వ్యాసఋషిచేత ఒకే వేదం నాల్గుభాగాలుగా విభజింపబడింది. ఋగాదిగా నాల్గుపాదాలుగా ఉన్న ఒకే వేదం సంహితగ అధ్యయనం చేయబడుతున్నది. ద్వాపరాదులలో ఆయువు క్షీణించడంవల్ల వేదం విభాగింపబడుతున్నది.

**ఋషిపుత్రైః పునర్భేదా భిద్యంతే దృష్టివిభ్రమైః ।**
**మంత్రబ్రాహ్మణవిన్యాసైః స్వరవర్ణవిపర్యయైః ॥58॥**

**సంహితా ఋగ్యజుః సామ్నాం సంహన్యంతే మనీషిభిః ।**
**సామాన్యా వైకృతాశ్చైవ దృష్టిభిస్తైః పృథక్ పృథక్ ॥59॥**

ఋషిపుత్రుల దృష్టి విభ్రమాలచేత వేదాలు మరల విభాగింపబడ్డాయి. అవి స్వరవర్ణవ్యత్యాసం వల్ల మంత్రబ్రాహ్మణాలుగా విడిపోయాయి. మనీషులచేత వేదసంహిత ఋగ్యజుఃసామాలుగా విడగొట్టబడింది. సమానమైన వైకృతమైన దృష్టికారణంగా అవి వేరువేరుగా విభజింపబడ్డాయి.

**బ్రాహ్మణం కల్పసూత్రాణి మంత్రప్రవచానాని చ ।**
**అన్యేతు ప్రస్థితాస్తాన్ వై కేచిత్తాన్ ప్రత్యవస్థితాః ॥60॥**

బ్రాహ్మణాలు, కల్పసూత్రాలు, మంత్రప్రవచనాలుగా విభజింపబడ్డాయి. కొందరు ఈమాత్రవిభాగం పర్యాప్తమైనదిగాను (సమగ్రం) మరికొందరు అపర్యాప్తంగాను (అసమగ్రం) భావించారు.

**ఇతిహాసపురాణాని భిద్యంతే కాలగౌరవాత్ ।**
**బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ శైవం భాగవతం తథా ॥61॥**

**భవిష్యం నారదీయం చ మార్కండేయమతః పరమ్ ।**
**ఆగ్నేయం బ్రహ్మవైవర్తం లైంగం వారాహమేవ చ ॥62॥**

**వామనాఖ్యం తతః కూర్మం మాత్స్యం గారుడమేవ చ ।**
**స్కాందం తథా చ బ్రహ్మాండం తేషాం భేదః ప్రకథ్యతే ॥63॥**

**లైంగమేకాదశవిధం ప్రభిన్నం ద్వాపరే శుభమ్ ।**

అనేక కల్పయుగకాలభేదాలవల్ల ఇతిహాసాలు, పురాణాలుగా వేరు అయినాయి. బ్రహ్మపురాణం, పద్మపురాణం, విష్ణుపురాణం, శివపురాణం, భాగవతపురాణం, భవిష్యపురాణం, నారదీయపురాణం, మార్కండేయపురాణం, అగ్నిపురాణం, బ్రహ్మవైవర్తపురాణం, లింగపురాణం, వరాహపురాణం, వామనపురాణం, కూర్మపురాణం, మత్స్యపురాణం, గరుడపురాణం, స్కాందపురాణం, బ్రహ్మాండపురాణం అనేవి పురాణభేదాలుగా చెప్పబడుతున్నాయి. ఇందులో పదకొండోది అయిన పవిత్రమైన లింగపురాణం ద్వాపరయుగంలో విభజింపబడింది.

**మన్వత్రివిష్ణుహారీతయాజ్ఞవల్క్యోశనోఽఙ్గిరాః ॥64॥**

**యమాపస్తంబసంవర్తాః కాత్యాయనబృహస్పతీ ।**
**పరాశరవ్యాసశంఖలిఖితా దక్షగౌతమౌ ॥65॥**

**శాతాతపో వసిష్ఠశ్చ ఏవమాద్యైః సహస్రశః ।**

మనువు, అత్రి, విష్ణువు, హారీతుడు, యాజ్ఞల్క్యుడు, ఉశనుడు, అంగిరుడు, యముడు, ఆపస్తంబుడు, సంవర్తుడు, కాత్యాయనుడు, బృహస్పతి, పరాశరుడు, వ్యాసుడు, శంఖుడు, లిఖితుడు, దక్షుడు, గౌతముడు, శాతాతపుడు, వసిష్ఠుడు మొదలైన వేలకొలది మునులు ధర్మశాస్త్రాల విషయాల్ని విస్తరింపజేశారు.

**అవృష్టిర్మరణం చైవ తథా వ్యాధ్యాద్యుపద్రవాః ॥66॥**

**వాఙ్మనఃకర్మజైర్దుఃఖైర్నిర్వేదో జాయతే తతః ।**
**నిర్వేదాజ్జాయతే తేషాం దుఃఖమోక్షవిచారణా ॥67॥**

**విచారణాచ్చ వైరాగ్యం వైరాగ్యాద్దోషదర్శనమ్ ।**
**దోషాణాం దర్శనాచ్చైవ ద్వాపరే జ్ఞానసంభవః ॥68॥**

వర్షాభావం, అకాలమరణం, వ్యాధులు మొదలైన కష్టాలు అప్పుడు కలిగాయి. తర్వాత మనోవాక్కాయ కర్మలవల్ల కల్గిన దుఃఖాలవల్ల నిర్వేదం జనిస్తున్నది. అటువంటి నిర్వేదం వల్ల వారికి ఆ దుఃఖాలనుంచి తప్పించుకునే ఆలోచన కల్గుతున్నది. ఆ ఆలోచనవల్ల వైరాగ్యం, ఆ వైరాగ్యంవల్ల దోషజ్ఞానం, ఆ దోషాల్ని గుర్తించడం వల్ల ఈ ద్వాపరయుగంలో జ్ఞానం కల్గుతున్నది.

**ఏషా రజస్తమోయుక్తా వృత్తిర్వై ద్వాపరే స్మృతా ।**
**ఆద్యే కృతే తు ధర్మోఽస్తి స త్రేతాయాం ప్రవర్తతే ॥69॥**

**ద్వాపరే వ్యాకులీభూత్వా ప్రణశ్యతి కలౌ యుగే ॥70॥**

ద్వాపరయుగంలో ఈవిధమైన రజోగుణం మరియు తమోగుణం కలిసిన మిశ్రమవృత్తి (జీవనం) ఉంది. మొదటిదైన కృతయుగంలో ధర్మం ఉన్నది. అది త్రేతాయుగంలో ప్రేరణవల్ల ప్రవృత్తమైనది. అది ద్వాపరంలో వ్యాకుల పడింది. కలియుగంలో నశిస్తున్నది.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే చతుర్యుగధర్మాణాం వర్ణనం నామైకోనచత్వారింశత్తమోఽధ్యాయః ॥ 39 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని చతుర్యుగధర్మాలవర్ణనం అనే ముప్పైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **చత్వారింశత్తమోఽధ్యాయః** – నలబైయవ అధ్యాయం

## **చతుర్యుగపరిమాణమ్** – చతుర్యుగపరిమాణం

**శక్ర ఉవాచ** – ఇంద్రుడు పలికాడు.

**తిష్యే మాయామసూయాం చ వధం చైవ తపస్వినామ్ ।**
**సాధయంతి నరాస్తత్ర తమసా వ్యాకులేంద్రియాః ॥1॥**

ఓ శిలాదుడా! కలియుగంలో తమోగుణంతో వ్యాకులపడిన ఇంద్రియజాతంగల మానవులు మాయను పన్నుతారు, అసూయపడతారు. మునులను వధిస్తారు. ఇటువంటి అవగుణాల్ని సాధిస్తారు.

**కలౌ ప్రమాదకో రోగః సతతం క్షుద్భయాని చ ।**
**అనావృష్టిభయం ఘోరం దేశానాం చ విపర్యయః ॥2॥**

కలియుగంలో ప్రమాదం, రోగం, ఎల్లప్పుడూ ఆకలిభయాలు, ఘోరమైన వర్షాభావభయం దేశాలయొక్క వినాశం అన్నీ ఉంటాయి.

**న ప్రామాణ్యం శ్రుతేరస్తి నృణాం చాధర్మసేవనమ్ ।**
**అధార్మికాస్త్వనాచారా మహాకోపాల్పచేతసః ॥3॥**

ప్రజలకు వేదాలందు ప్రామాణికత ఉండదు. వాళ్లు అధర్మాల్ని ఆచరిస్తారు. వాళ్లు ధర్మరహితులు, అనాచారులు, మహాకోపయుతులు, అల్పమనస్కులు అవుతారు.

**అనృతం బ్రువతే లుబ్ధాస్తిష్యే జాతాశ్చ దుష్ప్రజాః ।**
**దురిష్టై ర్దురధీతైశ్చ దురాచారైర్దురాగమైః ॥4॥**

**విప్రాణాం కర్మదోషేణ ప్రజానాం జాయతే భయమ్ ।**
**నాధీయంతే తదా వేదాన్న యజంతి ద్విజాతయః ॥5॥**

కలియుగంలో పుట్టిన దుర్జనులు అబద్ధం పలుకుతారు. లోభపరాయణులవుతారు. దుష్టమైన ఇష్టాలు గలవారు, చెడ్డవాటిని అధ్యయనం చేస్తారు. మలినమైన ఆచారాలు కలిగి ఉంటారు. చెడు ఆగమాల్ని అనుసరిస్తారు. బ్రాహ్మణుల యజ్ఞకర్మ ఆచారకర్మలయందలి దోషాలవల్ల ప్రజలకు భయం కలుగుతుంది. వాళ్లు వేదాధ్యయనం చెయ్యరు. ద్విజులు యజ్ఞాలు నిర్వహించరు.

**ఉత్సీదంతి నరాశ్చైవ క్షత్రియాశ్చ విశః క్రమాత్ ।**
**శూద్రాణాం మంత్రయోగేన సంబంధో బ్రాహ్మణైః సహ ॥6॥**

**భవతీహ కలౌ తస్మిన్ శయనాసనభోజనైః ।**
**రాజానః శూద్రభూయిష్ఠా బ్రాహ్మణాన్ బాధయంతి తే ॥7॥**

క్షత్రియులు, వైశ్యులు అయిన నరులు క్రమంగా నష్టపడుతున్నారు. శూద్రులకు మంత్రోపదేశ సంబంధంవల్ల బ్రాహ్మణులతో సంబంధం ఏర్పడుతున్నది. కలియుగంలో బ్రాహ్మణులు శయనం, ఆసనం, భోజనంఅనే వాటివల్ల శూద్రులతో సంబంధం కలిగి ఉంటున్నారు. రాజులు శూద్రప్రాయులయి బ్రాహ్మణులను బాధిస్తున్నారు.

**భ్రూణహత్యా వీరహత్యా ప్రజాయంతే ప్రజాసు వై ।**
**శూద్రాశ్చ బ్రాహ్మణాచారాః శూద్రాచారాశ్చ బ్రాహ్మణాః ॥8॥**

ప్రజలలో గర్భస్థశిశుహత్య, వీరుల్ని వధించుట కలుగుతున్నది. శూద్రజనులు బ్రాహ్మణుల ఆచారాల్ని, బ్రాహ్మణులు శూద్రాచారాల్ని నిర్వహిస్తారు.

**రాజవృత్తిస్థితాశ్చౌరా శ్చౌరాచారాశ్చ పార్థివాః ।**
**ఏకపత్న్యో న శిష్యంతి వర్ధిష్యంత్యభిసారికాః ॥9॥**

చోరులు రాజులవ్యవహారాల్ని, రాజులు చోరుల వ్యవహారాల్ని నిర్వహిస్తారు. ఏకపత్నీవ్రతంగల మగవారు మిగలరు. అభిసారికలు వృద్ధి చెందుచున్నారు.

**వర్ణాశ్రమప్రతిష్ఠా నో జాయతే నృషు సర్వతః ।**
**తదా స్వల్పఫలా భూమిః క్వచిచ్చాపి మహాఫలా ॥10॥**

మానవులందు చాతుర్వర్ణ్య, బ్రహ్మచర్య వర్ణాశ్రమప్రతిష్ఠ ఎక్కడా కన్పించదు. అప్పుడు భూమి కొన్నిచోట్ల తక్కువ ఫలితాన్ని, మరికొన్నిచోట్ల అధికఫలితాన్ని ఇస్తున్నది.

**అరక్షితారో హర్తారః పార్థివాశ్చ శిలాశన ।**
**శూద్రా వై జ్ఞానినః సర్వే బ్రాహ్మణైరభివందితాః ॥11॥**

ఓ శిలాదమునివరా! రాజులు ప్రజల్ని రక్షించని వినాశనకారులు అవుతారు. శూద్రులందరూ జ్ఞానవంతులై విప్రులచేత నమస్కరింపబడతారు.

**అక్షత్రియాశ్చ రాజానో విప్రాః శూద్రోపజీవినః ।**
**ఆసనస్థా ద్విజాన్ దృష్ట్వా న చలంత్యల్పబుద్ధయః ॥12॥**

క్షత్రియేతరులు రాజులు అవుతారు. బ్రాహ్మణులు శూద్రాశ్రిత జీవులవుతారు. అల్పమనస్కులైన శూద్రులు బ్రాహ్మణుల్ని చూచి ఆసనాలనుంచి లేవరు.

**తాడయంతి ద్విజేంద్రాంశ్చ శూద్రా వై స్వల్పబుద్ధయః ।**
**ఆస్యే నిధాయ వై హస్తం కర్ణం శూద్రస్య వై ద్విజాః ॥13॥**

**నీచస్యైవ తదా వాక్యం వదంతి వినయేన తమ్ ।**

అత్యల్పమనస్కులైన శూద్రులు బ్రాహ్మణశ్రేష్ఠుల్ని తంతారు. ద్విజులు వాళ్ల నోళ్లమీద చేతులుంచుకుని శూద్రుల చెవులలో నీచుడైన వ్యక్తి పలికే మాటను వినయంగా పలుకుతారు.

**ఉచ్చాసనస్థాన్ శూద్రాంశ్చ ద్విజమధ్యే ద్విజర్షభ ॥14॥**

**జ్ఞాత్వా న హింసతే రాజా కలౌ కాలవశేన తు ।**
**పుష్పైశ్చ వాసితశ్చైవ యథాన్యైర్మంగళైః శుభైః ॥15॥**

**శూద్రానభ్యర్చయంత్యల్పశ్రుతభాగ్యబలాన్వితాః ।**
**న ప్రేక్షంతే గర్వితాశ్చ శూద్రా ద్విజవరాన్ ద్విజ ॥16॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! శిలాశనా! బ్రాహ్మణులమధ్యలో ఉన్నతాసనాలలో కూర్చున్న శూద్రుల్ని రాజు గుర్తించినా కాలప్రభావంతో కలియుగంలో దండించడు. ఓ విప్రా! పుష్పాలతోను, సుగంధాలతోను ఇతర మంగళద్రవ్యాలతోను శూద్రుల్ని పూజిస్తున్నారు. అల్పశాస్త్రజ్ఞానమూ, అల్పసౌభాగ్యమూ అట్లే అల్పబలమూ గల శూద్రులు గర్వితులై బ్రాహ్మణశ్రేష్ఠుల్ని చూడరు.

**సేవావసరమాలోక్య ద్వారే తిష్ఠంతి వై ద్విజాః ।**
**వాహనస్థాన్ సమావృత్య శూద్రాన్ శూద్రోపజీవినః ॥17॥**

**సేవంతే బ్రాహ్మణాస్తత్ర స్తువంతి స్తుతిభిః కలౌ ।**
**తపోయజ్ఞఫలానాం చ విక్రేతారో ద్విజోత్తమాః ॥18॥**

శూద్రులపై ఆధారపడిన జీవితంగల బ్రాహ్మణులు సేవకుగల అవకాశాన్ని ఎరిగి, వాళ్ల గృహద్వారాలవద్ద నిలుస్తున్నారు. వాహనాలపై తిరుగుతున్న శూద్రుల్ని సమీపించి బ్రాహ్మణులు స్తుతులతో పొగడుతున్నారు. సేవిస్తున్నారు. ద్విజశ్రేష్ఠులు వాళ్ల తపఃఫలాన్ని యజ్ఞఫలాన్ని అమ్ముకొంటారు.

**యతయశ్చ భవిష్యంతి బహవోఽస్మిన్ కలౌ యుగే ।**
**పురుషాల్పం బహుస్త్రీకం యుగాంతే సముపస్థితే ॥19॥**

**నిందంతి వేదవిద్యాం చ ద్విజాః కర్మాణి వై కలౌ ।**

ఈ కలియుగంలో అనేకులు మునులు కాగలరు. యుగాంతంలో స్త్రీబాహుళ్యం, పురుషాల్పత్వం కాగలదు. ద్విజులు వేదవిద్యను, వైదికకర్మల్ని దూషిస్తారు.

**కలౌ దేవో మహాదేవః శంకరో నీలలోహితః ॥20॥**

**ప్రకాశతే ప్రతిష్ఠార్థం ధర్మస్య వికృతాకృతిః ।**

ఈ కలియుగంలో మహాదేవుడు, నీలలోహితుడు, ప్రభువు అయిన శంకరుడు ధర్మాన్ని స్థాపించడానికి వికారరూపంతో అనగా నగ్నరూపంలో (లింగస్వరూపంలో) ప్రకాశిస్తాడు.

**యే తం విప్రా నిషేవంతే యేన కేనాపి శంకరమ్ ॥21॥**

**కలిదోషాన్ వినిర్జిత్య ప్రయాంతి పరమం పదమ్ ।**

ఎవరైతే ఏదో ఒకరూపంలో ఆ శివుణ్ణి ఆరాధిస్తారో వాళ్లు కలియుగదోషాల్ని జయించి, పరమపదాన్ని పొందుతున్నారు.

**శ్వాపదప్రబలత్వం చ గవాం చైవ పరిక్షయః ॥22॥**
**సాధూనాం వినివృత్తిశ్చ వేద్యా తస్మిన్ యుగక్షయే ।**

ఈ యుగాంతంలో క్రూరజంతువుల ఆధిక్యం, గోవుల క్షీణత, ఉత్తములు లోపించడం తెలియవలసింది.

**తదా సూక్ష్మే మహోదర్కో దుర్లభో దానమూలవాన్ ॥23॥**
**చాతురాశ్రమశైథిల్యే ధర్మః ప్రతిచలిష్యతి ।**
**అరక్షితారో హర్తారో బలిభాగస్య పార్థివాః ॥24॥**

అప్పుడు దానకారణమైన సూక్ష్మమైన మహోదర్కం దుర్లభం అవుతుంది. బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే నాలుగు ఆశ్రమాల విచలనం వల్ల ధర్మం భ్రష్టం కాగలదు. దేవతలకు అర్పించిన పదార్థాల్ని రక్షించువారుకాక వాటిని హరించువారు అవుతారు రాజులు.

**యాగాంతేషు భవిష్యంతి స్వరక్షణపరాయణాః ।**
**అట్టశూలా జనపదాః శివశూలాశ్చతుష్పథాః ॥25॥**

**ప్రమదాః కేశశూలిన్యో భవిష్యంతి కలౌ యుగే ।**
**చిత్రవర్షీ తదా దేవో యదా ప్రాహుర్యుగక్షయమ్ ॥26॥**

ఈయుగాంతకాలంలో ప్రజలరక్షణ మాని రాజులు ఆత్మరక్షాతత్పరులవుతారు. గ్రామాలు అట్ట శూలలు అవుతాయి. అనగా పదార్థాల్ని అమ్మెడివి (అట్ట = పదార్థం, శూల = అమ్మకం). నాల్గుమార్గాల కూడళ్లు మంగళకరాలైన వేదాలు ఇతర పవిత్రసాహిత్యం అమ్మెడివి అవుతాయి. స్త్రీలు కేశశూలినులు అవుతారు. కలియుగం నష్టమయ్యేకాలంలో ఇంద్రుడు చిత్రమైన వర్షాలనిస్తాడు. అనగా ఖండవృష్టి కురుస్తుంది. (చుక్కలు చుక్కలుగా స్వల్పంగా వర్షం పడుతుంది)

**సర్వే వణిగ్జనాశ్చాపి భవిష్యంత్యధమే యుగే ।**
**కుశీలచర్యాః పాఖండైర్వృథారూపైః సమావృతాః ॥27॥**

ఈ అధమకలియుగంలో సమస్తవైశ్యజనులు దుష్టశీలచేష్టలుగలవారు కాగలరు. కపటమైన ఆచరణం, అవైదికమార్గాచరణం అలవడుతుంది.

**బహుయాజనకో లోకో భవిష్యంతి పరస్పరమ్ ।**
**నావ్యాహృతక్రూరవాక్యో నార్జవీ నానసూయకః ॥28॥**

**న కృతే ప్రతికర్తా చ యుగక్షీణే భవిష్యతి ।**
**నిందకాశ్చైవ పతితా యుగాంతస్య చ లక్షణమ్ ॥29॥**

కలియుగంలో యజ్ఞనిర్వాహకులు ఎక్కువ అవుతారు. క్రూరవాక్యాల్ని పలకనివారు లేరు. ఋజుప్రవర్తన గలవారు లేరు. అసూయలేనివారు లేరు. యుగక్షయకాలంలో ప్రత్యుపకారం చేయువారు లేరు. అందరూ నింద్యులే. పతితులే. ఇది యుగాంతలక్షణం.

**నృపశూన్యా వసుమతీ న చ ధాన్యధనావృతా ।**
**మండలాని భవిష్యంతి దేశేషు నగరేషు చ ॥30॥**

భూమిపై రాజులుండరు. ధనధాన్యాలుండవు. దేశాలలోను, నగరాలలోను మండలాలు ఏర్పడగలవు.

**అల్పోదకా చాల్పఫలా భవిష్యతి వసుంధరా ।**
**గోప్తారశ్చాప్యగోప్తారః సంభవిష్యంత్యశాసనాః ॥31॥**

భూమి స్వల్పజలంగలది, స్వల్పఫలంగలది కాగలదు. రక్షకులు, భక్షకులు అయిన జనులు కూడా స్వేచ్ఛాచారులవుతారు. (శాసనాన్ని అతిక్రమిస్తారు)

**హర్తారః పరవిత్తానాం పరదారప్రధర్షకాః ।**
**కామాత్మానో దురాత్మానో హ్యధమాః సాహసప్రియాః ॥32॥**

**ప్రనష్టచేష్టనాః పుంసో ముక్తకేశాశ్చ శూలినః ।**
**జనాః షోడశవర్షాశ్చ ప్రజాయంతే యుగక్షయే ॥33॥**

యుగాంతకాలంలో ప్రజలందరూ ఇతరులధనాల్ని హరిస్తారు, ఇతరులభార్యల శీలాన్ని నష్టపరుస్తారు, కాముకులు, దురాత్ములు, అధములు, ఇష్టసాహసులు, చేష్టలుడిగినవారు, పురుషులు ముడవనికేశాలుగలవారు అవుతారు. ప్రజలు పదహారు సంవత్సరాల ఆయుస్సు కలవారుగా జన్మిస్తారు.

**శుక్లదంతాజినాక్షాశ్చ ముండాః కాషాయవాసజః ।**
**శూద్రా ధర్మం చరిష్యంతి యుగాంతే సముపస్థితే ॥34॥**

యుగాంతం దగ్గరపడగా శూద్రజనులు తెల్లనిదంతాలు, మృగచర్మం, రుద్రాక్షలు ధరిస్తారు. శిరోముండనం చేయిస్తారు. కాషాయవస్త్రధారులు అయి ధర్మాన్ని ఆచరిస్తారు.

**సస్యచౌరా భవిష్యంతి దృఢచైలాభిలాషిణః ।**
**చౌరాశ్చోరస్వహర్తారో హర్తుర్హర్తా తథాపరః ॥35॥**

**యోగ్యకర్మణ్యుపరతే లోకే నిష్క్రియతాం గతే ।**
**కీటమూషకసర్పాశ్చ ధర్షయిష్యంతి మానవాన్ ॥36॥**

ప్రజలు ధాన్యాల్ని దొంగిలించగలుగుతారు. విచిత్రవస్త్రాభిలాషులు దొంగలు దొంగల ధనాన్ని దొంగిలిస్తారు. హరించువాడిని మరొకడు హరిస్తాడు. మానవులు విధిసమ్మతకార్యాల్ని విడిచిపెట్టడంవల్ల ప్రపంచం నిష్క్రియత చెంది కీటకాలు, ఎలుకలు, పాములు మానవుల్ని పీడించగలుగుతాయి.

**సుభిక్షం క్షేమమారోగ్యం సామర్థ్యం దుర్లభం తదా ।**
**కౌశికీం ప్రతిపత్స్యంతే దేశాన్ క్షుద్భయపీడితాః ॥37॥**

**దుఃఖేనాభిప్లుతానాం చ పరమాయుః శతం తదా ।**
**దృశ్యంతే న చ దృశ్యంతే వేదాః కలియుగేఽఖిలాః ॥38॥**

**ఉత్సీదంతి తదా యజ్ఞా కేవలాధర్మపీడితాః ।**

సమృద్ధి, కళ్యాణం, ఆరోగ్యం, సమర్థత ఆ సమయంలో దూరమవుతాయి. ప్రజలు ఆకలితో పీడింపబడినవారై వాళ్ల దేశాల్ని వదలి కౌశికీనదీ పరీవాహప్రాంతాల్లో నివసిస్తారు. అధికదుఃఖమగ్నులై నూరుసంవత్సరాల పూర్ణ ఆయుర్దాయాన్ని చూడకున్నారు. సమస్తవేదాలు కలియుగంలో కన్పించవు. యజ్ఞాలన్నీ అధర్మాలతో పీడింపబడి ఆకాలంలో నశిస్తున్నాయి.

**కాషాయిణోఽప్యనిర్గ్రంథాః కాపాలీబహులాస్త్విహ ॥39॥**
**వేదవిక్రయిణశ్చాన్యే తీర్థవిక్రయిణః పరే ।**
**వర్ణాశ్రమాణాం యేచాన్యే పాషండాః పరిపంథినః ॥40॥**
**ఉత్పద్యంతే తదా తే వై సంప్రాప్తే తు కలౌ యుగే ।**

సన్న్యాసులు కూడా శాస్త్రగ్రంథజ్ఞానరహితులవుతారు. కాపాలికులు ఎక్కువవుతారు. కొందరు ప్రజలు వేదాల్ని విక్రయిస్తారు. పరులు తీర్థాల్ని అమ్ముకుంటారు. పవిత్రతీర్థజలాల్ని కూడా అమ్ముకుని లాభాన్ని పొందుతారన్నమాట. కలియుగ ప్రారంభంలోనే వర్ణధర్మాలకి, ఆశ్రమధర్మాలకి శత్రువులైన పాషండులు జన్మిస్తారు.

**అధీయంతే తదా వేదాన్ శూద్రా ధర్మార్థకోవిదాః ॥41॥**

**యజంతే చాశ్వమేధేన రాజానః శూద్రయోనయః ।**
**స్త్రీబాలగోవధం కృత్వా హత్వా చైవ పరస్పరమ్ ॥42॥**

**ఉపద్రవాంస్తథాన్యోన్యం సాధయంతి తదా ప్రజాః ।**

ధర్మార్థప్రవీణులైన శూద్రజనులు వేదాల్ని అభ్యసిస్తారు. శూద్రులకు పుట్టిన రాజులు అశ్వమేధయజ్ఞాన్ని నిర్వహిస్తారు. ఆ సమయంలో స్త్రీలను, బాలల్ని, గోవుల్ని వధిస్తారు. అప్పుడు ప్రజలు పరస్పరం ఒకరినొకరు చంపుకుని పలువిధాలైన ఉపద్రవాల్ని సృష్టిస్తారు.

**దుఃఖప్రభూతమల్పాయుర్దేహోత్సాదః సరోగతా ॥43॥**
**అధర్మాభినివేశిత్వాత్తమోవృత్తం కలౌ స్మృతమ్ ।**
**ప్రజాసు బ్రహ్మహత్యాది తదా వై సంప్రవర్తతే ॥44॥**

ఆకాలంలో ప్రజలకు అపారదుఃఖం, అల్పాయుర్దాయం, శారీరకకష్టాలు, వ్యాధిగ్రస్తత కలుగుతాయి. ప్రజలకు అధర్మంపై ఆసక్తి కల్గడంచేత తమోగుణప్రధానమై కలియుగం ఉంటుంది. ఆ సమయంలో ప్రజల్లో బ్రహ్మహత్య మొదలైన వాటి విషయంలో ఆసక్తి ఏర్పడుతుంది.

**తస్మాదాయుర్బలం రూపం కలిం ప్రాప్య ప్రహీయతే ।**
**తదా త్వల్పేన కాలేన సిద్ధిం గచ్ఛంతి మానవాః ॥45॥**

ఆకారణంచేతనే కలియుగప్రాప్తిసమయంలో ప్రజల ఆయుస్సు, బలం, రూపం క్షీణిస్తాయి. ఆ కాలంలో తక్కువకాలంలోనే మానవులు సిద్ధిని పొందుతున్నారు.

**ధన్యా ధర్మం చరిష్యంతి యుగాంతే ద్విజసత్తమాః ।**
**శ్రుతిస్మృత్యుదితం ధర్మం యే చరంత్యనసూయకాః ॥46॥**

ఈ కలియుగాంతంలో బ్రాహ్మణశ్రేష్ఠులు ధర్మాన్ని ఆచరిస్తున్నారు. అందుచేత ధన్యులవుతారు. శ్రుతిస్మృతులచేత చెప్పబడిన ధర్మాన్ని అసూయారహితులై వారు ఆచరిస్తారు.

**త్రేతాయాం వార్షికో ధర్మో ద్వాపరే మాసికఃస్మృతః ।**
**యథాక్లేశం చరన్ ప్రాజ్ఞస్తదహ్నా ప్రాప్నుతే కలౌ ॥47॥**

త్రేతాయుగంలో సంవత్సరపర్యంతం, ద్వాపరయుగంలో మాసపర్యంతం ధర్మాచరణంవల్ల కల్గిన ఫలాన్ని, కలియుగంలో జ్ఞానవంతుడు ఒకరోజు ధర్మాచరణంవల్లే పొందగలుగుతాడు.

**ఏషా కలియుగావస్థా సంధ్యాంశం తు నిబోధ మే ।**
**యుగేయుగే చ హీయంతే త్రీం స్త్రీన్ పాదాంస్తు సిద్ధయః ॥48॥**

ఇది కలియుగధర్మస్థితి. మీరు కలియుగం యొక్క సంధ్యాంశం నానుంచి తెలుసుకోండి. ప్రతియుగంలోనూ సిద్ధుల యొక్క ఫలితాలు మూడుమూడు పాదాలు తగ్గుతున్నాయి.

**యుగస్వభావాః సంధ్యాస్తు తిష్ఠంతీహ తు పాదశః ।**
**సంధ్యాస్వభావాః స్వాంశేషు పాదశస్తే ప్రతిష్ఠితా ॥49॥**

యుగాల స్వభావం, నాల్గవవంతు ఆయుగం యొక్క సంధ్యగా ఉంటుంది. సంధ్యాస్వభావాలు కూడా వాటియొక్క సంధ్యాంశాలలో నాల్గవవంతుగా ఉంటాయి.

**ఏవం సంధ్యాంశకే కాలే సంప్రాప్తే తు యుగాంతికే ।**
**తేషాం శాస్తా హ్యసాధూనాం భూతానాం నిధనోత్థితః ॥50॥**

ఈవిధంగా యుగాంతంలో సంధ్యాంశకాలం ఏర్పడినప్పుడు దుష్టప్రాణుల్ని సంహరించడానికై ఒకశాసకుడు ఉత్పన్నుడవుతాడు.

**గోత్రేఽస్మిన్ వై చంద్రమసో నామ్నా ప్రమితిరుచ్యతే ।**
**మానవస్య తు సోఽంశేన పూర్వం స్వాయంభువేఽంతరే ॥51॥**

పూర్వకాలంలో స్వాయంభువమన్వంతరంలో 'ప్రమితి' అనే పేరుతో పిలువబడిన ఆతడు మనుపుత్రుడియొక్క అంశతో ఈ కలియుగాంతంలో చంద్రగోత్రంలో సోమశర్మఅనే పేరుతో ఉత్పన్నుడవుతాడు.

**సమాః స వింశతిః పూర్ణా పర్యటన్ వై వసుంధరామ్ ।**
**అనుకర్షన్ స వై సేనాం సవాజిరథకుంజరామ్ ॥52॥**

**ప్రగృహీతాయుధైర్విప్రైః శతశోఽథ సహస్రశః ।**
**స తదా తైః పరివృతో మ్లేచ్ఛాన్ హంతి సహస్రశః ॥53॥**

ఆతడు ఇరవైసంవత్సరాలవరకు భూమిపై సంచరిస్తూ అశ్వాలు, రథాలు, ఏనుగులుగల సైన్యాన్ని సమకూర్చుకుంటూ వందలకొద్ది వేలకొద్ది ఆయుధధారులైన బ్రాహ్మణులతో చుట్టబడి, వేలసంఖ్యలో నీచుల్ని చంపుతాడు.

**సహత్వా సర్వశశ్చైవ రాజ్ఞస్తాన్ శూద్రయోనిజాన్ ।**
**పాఖండాంస్తు తతః సర్వాన్నిఃశేషం కృతవాన్ ప్రభుః ॥54॥**

ఆశాసకుడు శూద్రయోనిజులు దంభాచారులు అయిన రాజులందరిని చంపి భూమిని నిశ్శేషమొనరిస్తాడు.

**నాత్యర్థం ధార్మికా యే చ తాన్ సర్వాన్ హంతి సర్వతః ।**
**వర్ణవ్యత్యాసజాతాశ్చ యే చ తాననుజీవినః ॥55॥**

మిక్కిలి అధర్మాచరణ కల్గినవారిని, వర్ణసాంకర్యంవల్ల పుట్టినవారిని, వారిపై ఆధారపడి జీవించువారిని వధిస్తాడు.

**ప్రవృత్తచక్రో బలవాన్ మ్లేచ్ఛానామంతకృత్ స తు ।**
**అధృష్యః సర్వభూతానాం చచారాథ వసుంధరామ్ ॥56॥**

మ్లేచ్ఛులను అంతమొందించిన బలవంతుడైన ఆతడు సమస్తప్రాణికోటికి అజేయుడై పాటింపబడిన ఆజ్ఞావిశేషంగలవాడై భూమిపై సంచరించాడు.

**మానవస్య తు సోఽంశేన దేవస్యేహ విజజ్ఞివాన్ ।**
**పూర్వజన్మని విష్ణోస్తు ప్రమితిర్నామ వీర్యవాన్ ॥57॥**

**గోత్రతో వై చంద్రమసః పూర్ణే కలియుగే ప్రభుః ।**
**ద్వాత్రింశేఽభ్యుదితే వర్షే ప్రక్రాంతో వింశతిః సమాః ॥58॥**

**వినిఘ్నన్ సర్వభూతాని శతశోఽథ సహస్రశః ।**
**కృత్వా బీజావశేషాం తు పృథివీం క్రూరకర్మణః ॥59॥**

**పరస్పరనిమిత్తేన కోపేనాకస్మికేన తు ।**
**స సాధయిత్వా వృషలాన్ ప్రాయశస్తానధార్మికాన్ ॥60॥**

**గంగాయమునయోర్మధ్యే స్థితిం ప్రాప్తః సహానుగః ।**
**తతో వ్యతీతే కాలే తు సామాత్యః సహ సైనికః ॥61॥**

పూర్వజన్మలో బలవంతుడైన ప్రమతి అనే పేరుగల ఆతడు ఈ కలియుగంలో మనువు కుమారుడు విష్ణుదేవుడి అంశలో సోమగోత్రంలో కలియుగాన్ని సంపూర్ణం చేయడానికై జన్మిస్తాడు. ముప్పది రెండు సంవత్సరాలలో ఇరవది సంవత్సరాలు వందలకొలది వేలకొలది, జనాన్ని చంపి, భూమిని క్రూరకర్ములనుంచి నిర్బీజమొందిస్తాడు. హఠాత్తుగా పరస్పర హేతుకంగా కల్గిన క్రోధంతో ధర్మేతరులైన ఆ శూద్రుల్ని జయించి, గడచినకాలంలో తనతోగల సహచరులతో, మంత్రులతో, సైనికులతో గంగాయమున నదులమధ్యలో తన స్థితిని స్థాపించాడు. అనగా రాజ్యాన్ని స్థాపించాడు.

**ఉత్సాద్య పార్థివాన్ సర్వాన్ మ్లేచ్ఛాంశ్చైవ సహస్రశః ।**
**తత్ర సంధ్యాంశకే కాలే సంప్రాప్తే తు యుగాంతికే ॥62॥**

**స్థితా స్వల్పావశిష్టాసు ప్రజాస్విహ క్వచిత్క్వచిత్ ।**
**అప్రగ్రహాస్తతస్తా వై లోభావిష్టాస్తు కృత్స్నశః ॥63॥**

**ఉపహింసంతి చాన్యోన్యం ప్రణిపత్య పరస్పరమ్ ।**

కలియుగాంతంలో, సంధ్యాంశకకాలంలో ధర్మచ్యుతిని పొందిన వేలకొలది మ్లేచ్ఛరాజుల్ని నశింపజేశాడు. కొద్దిగా మిగిలియున్న ప్రజలలో కొందరు పూర్తిగా లోభంవల్ల ఆక్రమింపబడినవారై ఒకరిపట్ల మరొకరు కృత్రిమంగా వినమ్రులై (నమస్కరిస్తూ) హింసిస్తున్నారు.

**అరాజకే యుగవశాత్సంశయే సముపస్థితే ॥64॥**

**ప్రజాస్తా వై తతః సర్వాః పరస్పరభయార్దితాః ।**
**వ్యాకులాశ్చ పరిభ్రాంతాస్త్యక్త్వా దారాన్ గృహాణి చ ॥65॥**

**స్వాన్ ప్రాణాననపేక్షంతో నిష్కారుణ్యాః సుదుఃఖితాః ।**

యుగప్రభావంవల్ల రాజులేనిస్థితి కల్గినందున ఆ ప్రజలందరూ పరస్పరం భయపడినవారు, వ్యాకులచిత్తులు, కరుణారహితులు, అధికదుఃఖితులు, భ్రాంతియుతమనస్కులై భార్యల్ని, గృహాల్ని విడిచిపెట్టారు. వాళ్లు ప్రాణాల్ని కూడా లెక్కచేయనివారైనారు.

**నష్టే శ్రౌతే స్మార్తధర్మే పరస్పరహతాస్తదా ॥66॥**
**నిర్మర్యాదా నిరాక్రాంతా నిఃస్నేహా నిరపత్రపాః ।**

శ్రుతిస్మృతిధర్మాలు నశించినవికాగా అప్పుడు ప్రజలు మర్యాదలేనివారు, అత్యంతక్రూరులు, స్నేహరహితులు, సిగ్గులేనివారు అయి ఒకరినొకరు చంపుకొంటారు.

**నష్టే ధర్మే ప్రతిహతాః హ్రస్వకాః పంచవింశకాః ॥67॥**
**హిత్వా పుత్రాంశ్చ దారాంశ్చ వివాదవ్యాకులేంద్రియాః ।**

ధర్మం లోపించి ప్రజలు పతనంచెంది పొట్టివారుగా ఇరవైఅయిదు సంవత్సరాలే ఆయువుగలవారుగా అవుతారు. పరస్పర వివాదకారణంగా వ్యాకులపడిన ఇంద్రియసమూహం కలవారై వారి బిడ్డల్ని, భార్యల్ని త్యాగం చేస్తారు.

**అనావృష్టిహతాశ్చైవ వార్తాముత్సృజ్య దూరతః ॥68॥**
**ప్రత్యంతానుపసేవంతే హిత్వా జనపదాన్ స్వకాన్ ।**
**సరిత్సాగరకూపాంస్తే సేవంతే పర్వతాంస్తథా ॥69॥**

వర్షాభావహతులై ప్రజలు వ్యవసాయాన్ని వదలి, వారి ఊళ్లను వదలి, దూరంగాఉన్న మ్లేచ్ఛదేశాల్ని పొందుతున్నారు. నదుల్ని, సముద్రాల్ని, బావుల్ని, పర్వతాల్ని ఆశ్రయిస్తారు.

**మధుమాంసైర్మూలఫలైర్వర్తయంతి సుదుఃఖితాః ।**
**చీరపత్రాజినధరాః నిష్క్రియా నిష్పరిగ్రహాః ॥70॥**

అధికదుఃఖార్తులైనవాళ్లు మద్యంతో, మాంసంతో, కందమూలాలతో, పండ్లతో జీవిస్తున్నారు. వాళ్లు క్రియారహితులు. దేనికీ చేయిచాపరు. చెట్ల బెరడుల్ని, ఆకుల్ని, చర్మాల్ని వస్త్రాలుగా ధరిస్తున్నారు.

**వర్ణాశ్రమపరిభ్రష్టా సంకటం ఘోరమాస్థితాః ।**
**ఏవం కష్టమనుప్రాప్తా అల్పశేషాః ప్రజాస్తదా ॥71॥**

వర్ణాశ్రమధర్మభ్రష్టులై కొద్దిగా మిగిలిన ఆ ప్రజలు భయంకరమైన కష్టాల్ని పొంది దుఃఖాన్ని అనుభవిస్తారు.

**జరావ్యాధిక్షుధావిష్టా దుఃఖాన్నిర్వేదమానసాః ।**
**విచారణా తు నిర్వేదాత్సామ్యావస్థా విచారణా ॥72॥**

**సామ్యావస్థాత్మకో బోధః సంబోధాద్ధర్మశీలతా ।**
**అరూపశమయుక్తాస్తు కలిశిష్టా హి వై స్వయమ్ ॥73॥**

ముసలితనం, వ్యాధులు, ఆకలి – వీటితో పీడింపబడిన మనస్సుగల ఆ ప్రజలకు దుఃఖంవల్ల నిర్వేదం కలిగింది. ఆ నిర్వేదంవల్ల సామ్యావస్థారూపమైన అనగా సదసద్రూపమైన విచారణ ఏర్పడింది. ఆ విచారణవల్ల సామ్యావస్థాత్మకమైన జ్ఞానం కలిగింది. ఆ జ్ఞానంవల్ల ధర్మశీలత్వం ఏర్పడింది. అనగా ధర్మాచరణ విషయమై మనసు లగ్నమైంది. ఇలా కలియుగంలో మిగిలిన ఆ ప్రజలు స్వయంగా శక్తిహీనులై శాంతియుతులవుతారు.

**అహోరాత్రాత్తదా తాసాం యుగం తు పరివర్తతే ।**
**చిత్తసమ్మోహనం కృత్వా తాసాం వై సుప్తమత్తవత్ ॥74॥**

సుప్తులు మరియు మత్తుల మాదిరి ఆ ప్రజల మనస్సులు సమ్మోహనం చెందగా ఒక పగలు– ఒక రాత్రి కాలంలో కలియుగం మారుతుంది.

**భావినోఽర్థస్య చ బలాత్తతః కృతమవర్తత ।**
**ప్రవృత్తే తు తతస్తస్మిన్ పునః కృతయుగే తు వై ॥75॥**

**ఉత్పన్నాః కలిశిష్టాస్తు ప్రజాః కార్తయుగాస్తదా ।**
**తిష్ఠంతి చేహ యే సిద్ధా అదృష్టా విచరంతి చ ॥76॥**

**సప్తసప్తర్షిభిశ్చైవ తత్ర తే తు వ్యవస్థితాః ॥77॥**

ఈవిధంగా రానున్న ప్రయోజనం యొక్క బలంచేత అనగా కాలధర్మానుసారం కలియుగం గడచిపోగా కృతయుగం వచ్చింది. అనంతరం కృతయుగం ప్రారంభంకాగా కలియుగంలో మిగిలియున్న ప్రజలలో కృతయుగం ఆచారాలు, విచారాలు ఉత్పన్నమయ్యాయి. ఈ కాలంలో సిద్ధులుగల ప్రజలు ఉన్నారు. (సప్తసిద్ధులు– మంత్రజ్ఞుడు, మంత్రవిత్తు, ప్రాజ్ఞుడు, మంత్రరాట్టు, సిద్ధపూజితుడు, సిద్ధవంతుడు, పరమసిద్ధి) వాళ్లు అదృశ్యరూపులై సప్తర్షులతోపాటు ఉంటున్నారు.

**కలిజైః సహ తే సర్వే నిర్విశేషాస్తదాభవన్ ।**

బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రులు ఇక్కడ అనగా కృతయుగంలో బీజరూపాలుగా ఉన్నారు. వాళ్లు కలియుగంలో జన్మించిన వారితోపాటుగ ఎటువంటి ప్రత్యేకతలేకుండా అయ్యారు (ఉన్నారు).

**తేషాం సప్తర్షయో ధర్మం కథయంతీతరేఽపి చ ॥78॥**

**వర్ణాశ్రమాచారయుతం శ్రౌతం స్మార్తం ద్విధా తు యమ్ ।**
**తతస్తేషు క్రియావత్సు వర్ధం తే వై ప్రజాః కృతే ॥79॥**

వర్ణాశ్రమాచారయుక్తమైన శ్రుతి విధుల్ని, స్మృతివిధుల్ని వాళ్లకోసం సప్తర్షులు, ఇతరులైన సప్తసిద్ధిమంతులు చెబుతున్నారు. ఇలా క్రియావంతులై అనగా ఆ రెండు కర్మలలో ప్రవృత్తిగల ఆ ప్రజలు కృతయుగంలో వృద్ధి చెందుతున్నారు.

**శ్రౌతస్మార్త కృతానాం చ ధర్మే సప్తర్షిదర్శితే ।**
**కేచిద్ధర్మవ్యవస్థార్థం తిష్ఠంతీహ యుగక్షయే ॥80॥**

సప్తర్షులు చెప్పిన శ్రుతిస్మృతినిర్దేశిత ధర్మాల్ని ఉపదేశించడానికి కొంతమంది జనులు యుగం నశించే సమయంలో ఈ భూలోకంలో ధర్మస్థితి కొనసాగించడం కోసం ఉంటారు.

**మన్వంతరాధికారేషు తిష్ఠంతి మునయస్తు వై ।**
**యథా దావప్రదగ్ధేషు తృణేష్విహ తతః క్షితౌ ॥81॥**

**వనానాం ప్రథమం వృష్ట్యా తేషాం మూలేషు సంభవః ।**
**తథా కార్తయుగానాం తు కలిజేష్విహ సంభవః ॥82॥**

మునిగణాలు మన్వంతరం యొక్క అధికారాలలో నిలిచి ఉంటారు. ఈ పృథ్వీమీద దావాగ్ని అరణ్యంలోని గడ్డిని దహించినా, ప్రథమవర్షంవల్ల ఆ గడ్డి మరల ఎట్లు అంకురిస్తుందో అట్లే కలియుగంలో పుట్టిన మానవులతోనే కృతయుగ మానవుల ఉత్పత్తి జరుగుతున్నది.

**ఏవం యుగాద్యుగస్యేహ సంతానం తు పరస్పరమ్ ।**
**వర్తతే హ్యవ్యవచ్ఛేదాద్యావన్మన్వంతరక్షయః ॥83॥**

ఈవిధంగా అవిచ్ఛిన్నంగా మన్వంతరసమాప్తివరకు ఒకయుగంనుంచి మరొకయుగానికి జనసంతతి పరస్పరంగా నిలుస్తుంది.

**సుఖమాయుర్బలం రూపం ధర్మోఽర్థః కామ ఏవ చ ।**
**యుగేష్వేతాని హీయంతే త్రీంస్త్రీన్ పాదాన్ క్రమేణ చ ॥84॥**

సుఖం, ఆయుస్సు, బలం, రూపం, ధర్మం, అర్థం, కామం అనే ఇవి క్రమంగా యుగాలలో మూడుమూడు పాదాలచొప్పున తగ్గుతున్నాయి. అనగా ఒక్కొక్కయుగం యొక్క చివరలో ఒక్కొక్క పాదం తగ్గుతుంది.

**ససంధ్యాంశేషు హీయంతే యుగానాం ధర్మసిద్ధయః ।**
**ఇత్యేషా ప్రతిసిద్ధిర్వై కీర్తితైషా క్రమేణ తు ॥85॥**

సంధ్యాంశాలలోనూ యుగాలయొక్క ధర్మసిద్ధులు కూడా తగ్గుతున్నాయి. ఈ విధంగా క్రమంగా ఈ ప్రతిసిద్ధి కీర్తింపబడింది.

**చతుర్యుగానాం సర్వేషామనేనైవ తు సాధనమ్ ।**
**ఏషా చతుర్యుగావృత్తిరాసహస్రాద్గుణీకృతా ॥86॥**

**బ్రహ్మణస్తదహః ప్రోక్తం రాత్రిశ్చైతావతీ స్మృతా ।**

ఈవిధంగా నాల్గుయుగాలయొక్క స్థితి ఏర్పడింది. ఈ చతుర్యుగాలయొక్క ఆవృత్తి వేయిపర్యాయాలు జరిగినచో అవి బ్రహ్మకు ఒకపగలు, అట్లే మరో వేయిపర్యాయాలు జరిగితే అది రాత్రిగా చెప్పబడుతుంది.

**అనార్జవం జడీభావో భూతానామాయుగక్షయాత్ ॥87॥**
**ఏతదేవ తు సర్వేషాం యుగానాం లక్షణం స్మృతమ్ ।**

యుగనాశనం వరకు ప్రాణులకు జడత్వం, భావసారళ్యం లేకపోవడం అన్నియుగాల లక్షణంగా తెలియదగింది.

**ఏషాం చతుర్యుగాణాం చ గుణితా హ్యేకసప్తతిః ॥88॥**

**క్రమేణ పరివృత్తా తు మనోరంతరముచ్యతే ।**
**చతుర్యుగే యథైకస్మిన్ భవతీహ యదా తు యత్ ॥89॥**

**తథా చాన్యేషు భవతి పునస్తద్వై యథాక్రమమ్ ।**

ఈ నాల్గుయుగాలయొక్క డెబ్బది ఒక్కసార్లు ఆవృత్తి ఒకమన్వంతరంగా చెప్పబడుతుంది. మొదటి నాలుగుయుగాలలో ఎలాంటి సంఘటనలు జరుగుతాయో రాబోయే నాలుగుయుగాలలోను జరుగుతాయి.

**సర్గే సర్గే యథా భేదా ఉత్పద్యంతే తథైవ తు ॥90॥**

**పంచవింశత్పరిమితా న న్యూనా నాధికాస్తథా ।**
**తథా కల్పా యుగైః సార్ధం భవంతి సహ లక్షణైః ॥91॥**

**మన్వంతరాణాం సర్వేషామేతదేవ తు లక్షణమ్ ॥92॥**

ప్రతిసృష్టిలోనూ ఇరవైఅయిదుకు ఎక్కువతక్కువకాని భేదాలు (మహదాదులు) సృష్టింపబడతాయి. యుగాలలో జరిగినట్లే కల్పాలలోను అట్టి పద్ధతులే జరుగుతాయి. అన్ని మన్వంతరాలలోనూ ఈ ధర్మమే ఉంటుంది.

**యథా యుగానాం పరివర్తనాని చిరప్రవృత్తాని యుగస్వభావాత్ ।**
**తథా తు సంతిష్ఠతి జీవలోకః క్షయోదయాభ్యాం పరివర్తమానః ॥93॥**

యుగస్వభావంచేత ఏవిధంగా చిరకాలప్రవృత్తాలైన పరివర్తనాలు (మార్పులు) జరుగుతాయో అదేవిధంగా ప్రాణిసమూహం క్షీణించడం, అభ్యుదయం పొందడం అనే మార్పుల్ని పొందుతూ నిలుస్తుంది.

**ఇత్యేతల్లక్షణం ప్రోక్తం యుగానాం వై సమాసతః ।**
**అతీతానాగతానాం హి సర్వమన్వంతరేషు వై ॥94॥**

సంక్షిప్తంగా ఈ పద్ధతే యుగధర్మం. జరిగిన, జరగనున్న అన్ని మన్వంతరాలలోను ఇదే లక్షణం ఉంటుంది.

**మన్వంతరేణ చైకేన సర్వాణ్యేవాంతరాణి చ ।**
**వ్యాఖ్యాతాని న సందేహః కల్పః కల్పేన చైవ హి ॥95॥**

ఒక మన్వంతరంలో జరిగిన సమస్తాంతరాలు ప్రతి కల్పంలోనూ జరుగుతాయి. ఇందులో ఎటువంటి సందేహంలేదు.

**అనాగతేషు తద్వచ్చ తర్కః కార్యో విజానతా ।**
**మన్వంతరేషు సర్వేషు అతీతానాగతేష్విహ ॥96॥**

జరిగిన మన్వంతరాల మాదిరిగానే రానున్న మన్వంతరాల విషయంలోనూ ఈవిధమైన ఆలోచనే చేయదగిందని తెలియాలి.

**తుల్యాభిమానినః సర్వే నామరూపైర్భవంత్యుత ।**
**దేవా హ్యష్టవిధా యే చ యే చ మన్వంతరేశ్వరాః ॥97॥**

భూతభవిష్యన్మన్వంతరాలలో అష్టవిధదేవతలు, ఆ ఆ మన్వంతరాధిపతులు అందరూ సమానమైన చిత్తవృత్తులు, పేర్లు, రూపాలు కలిగి ఉంటారు.

**ఋషయో మనవశ్చైవ సర్వే తుల్యప్రయోజనాః ।**
**ఏవం వర్ణాశ్రమాణాం తు ప్రవిభాగో యుగే యుగే ॥98॥**

ప్రతియుగంలోనూ ఋషులు, మనువులు సమానమైన ఉపయోగం కలవారై ఉంటారు. ఈవిధంగానే వర్ణాశ్రమాల ధర్మాలు, విభాగాలు సమానాలే.

**యుగస్వభావశ్చ తథా విధత్తే వై తదా ప్రభుః ।**
**వర్ణాశ్రమవిభాగాశ్చ యుగాని యుగసిద్ధయః ॥99॥**

**యుగానాం పరిమాణం తే కథితం హి ప్రసంగతః ।**
**వదామి దేవీపుత్రత్వం పద్మయోనేః సమాసతః ॥100॥**

యుగస్వభావం, వర్ణాశ్రమవిభాగం, యుగాలు, యుగసిద్ధులు అన్నీ ప్రభువు విష్ణువుచే నిర్ణయింపబడ్డాయి. మీకు యుగాలపరిమాణాల గూర్చి చెప్పబడింది. ఇక బ్రహ్మ పార్వతీపుత్రుడెట్లయ్యాడో సంగ్రహంగా చెప్తున్నాను.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే చతుర్యుగపరిమాణం నామ చత్వారింశత్తమోఽధ్యాయః ॥ 40 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని చతుర్యుగపరిమాణమనే నలబైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకచత్వారింశత్తమోఽధ్యాయః - నలభై ఒకటవ అధ్యాయం

## ఇంద్రవాక్యమ్ - ఇంద్రవాక్యం

**ఇంద్ర ఉవాచ** - ఇంద్రుడు పలికాడు.

**పునః ససర్జ భగవాన్ ప్రభ్రష్టాః పూర్వవత్ప్రజాః ।**
**సహస్రయుగపర్యంతే ప్రభాతే తు పితామహః ॥1॥**

**ఏవం పరార్ధే విప్రేంద్ర ద్విగుణే తు తథా గతే ।**
**తదా ధరాంభసి వ్యాప్తా హ్యాపో వహ్నౌ సమీరణే ॥2॥**

**వహ్నిః సమీరణశ్చైవ వ్యోమ్ని తన్మాత్రసంయుతః ।**
**ఇంద్రియాణి దశైకం చ తన్మాత్రాణి ద్విజోత్తమ ॥3॥**

**అహంకారమనుప్రాప్య ప్రలీనాస్తత్ క్షణాదహో ।**
**అభిమానస్తదా తత్ర మహాంతం వ్యాప్య వై క్షణాత్ ॥4॥**

**మహానపి తథా వ్యక్తం ప్రాప్య లీనోఽభవద్ద్విజ ।**
**అవ్యక్తం స్వగుణైః సార్ధం ప్రలీనమభవద్భవే ॥5॥**

**తతః సృష్టిరభూత్తస్మాత్పూర్వవత్పురుషాచ్ఛివాత్ ।**

అనంతరం వేయి నాల్గుయుగాలు గడచిపోగా ఒక ప్రాతఃకాలంలో బ్రహ్మదేవుడు పూర్తిగా నశించిన ప్రజలను మరల పూర్వం మాదిరిగా సృష్టించాడు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! ఈ విధంగా బ్రహ్మకు రెండు పరార్ధాలు గడచిపోగా భూమి జలంలో, జలం అగ్నిలో, అగ్ని వాయువులో, వాయువు ఆకాశంలో తన్మాత్రసహితంగా విలీనాలయినాయి. ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! ఇంద్రియాలు పది అట్లే మనస్సు అహంకారంలో విలీనమై పోయాయి. అహంకారం ఆ క్షణంలోనే మహత్తులో విలీనమయ్యింది. ఓ బ్రాహ్మణా! మహత్తు అవ్యక్తంలో లీనమయింది. అవ్యక్తం తన గుణాలతో కలిసి భవునిలో లీనమైనది. తర్వాత పురుషుడగు శివుడి నుంచి పూర్వంలాగా సృష్టి ఉత్పన్నమైనది.

**అథ సృష్టాస్తదా తస్య మనసా తేన మానసాః ॥6॥**
**న వ్యవర్ధంత లోకేఽస్మిన్ ప్రజాః కమలయోనినా ।**
**వృద్ధ్యర్థం భగవాన్ బ్రహ్మా పుత్రైర్వై మానసైః సహ ॥7॥**
**దుశ్చరం విచచారేశం సముద్దిశ్య తపః స్వయమ్ ।**
**తుష్టస్తు తపసా తస్య భవో జ్ఞాత్వా స వాంఛితమ్ ॥8॥**
**లలాటమధ్యం నిర్భిద్య బ్రహ్మణః పురుషస్య తు ।**
**పుత్రస్నేహమితి ప్రోచ్య స్త్రీపుంరూపోఽభవత్తదా ॥9॥**

**తస్య పుత్రో మహాదేవో హ్యర్ధనారీశ్వరోఽ భవత్ ।**
**దదాహ భగవాన్ సర్వం బ్రహ్మాణం చ జగద్గురుమ్ ॥10॥**

పిమ్మట పద్మభవుడైన బ్రహ్మదేవుడు తన మనసునుంచి మానసపుత్రుల్ని సృష్టించాడు. కమలయోనిచే సృష్టింపబడిన ఈ మానసజుల వల్ల సృష్టి అభివృద్ధి చెందలేదు. అప్పుడు ప్రజావృద్ధికై బ్రహ్మదేవుడు తన మానస పుత్రులతో కలిసి శివుడిని గూర్చి కఠినమైన తపస్సు చేశాడు. పరమాత్ముడైన శివుడు ఆయన తపస్సుచేత ప్రసన్నుడై అతడి అభీష్టాన్ని తెలిసికొని నేను నీ పుత్రుణ్ణి అంటూ పురుషరూపుడైన బ్రహ్మయొక్క లలాటభాగాన్ని ఛేదించాడు. దాంతో మహాదేవ శివుడు స్త్రీపుంరూపాన్ని ధరించాడు. ఆ బ్రహ్మపుత్రుడైన శివుడు అర్ధనారీశ్వరుడయ్యాడు. జగద్గురువైన బ్రహ్మను శివుడు ఆతడితో కూడా సమస్తాన్ని దహించాడు.

**అథార్ధమాత్రాం కల్యాణీమాత్మనః పరమేశ్వరీమ్ ।**
**బుభుజే యోగమార్గేణ వృద్ధ్యర్థం జగతాం శివః ॥11॥**

**తస్యాం హరిం చ బ్రహ్మాణం ససర్జ పరమేశ్వరః ।**
**విశ్వేశ్వరస్తు విశ్వాత్మా చాస్త్రం పాశుపతం తథా ॥12॥**

**తస్మాద్ బ్రహ్మ మహాదేవ్యాశ్చాంశజశ్చ హరిస్తథా ।**
**అండజః పద్మజశ్చైవ భవాంగభవ ఏవ చ ॥13॥**

**ఏతత్తే కథితం సర్వమితిహాసం పురాతనమ్ ।**
**పరార్ధం బ్రహ్మణో యావత్తావద్భూతిః సమాసతః ॥14॥**

**వైరాగ్యం బ్రహ్మణో వక్ష్యే తమోద్భూతం సమాసతః ।**

తర్వాత శివుడు సమగ్ర జగత్తు యొక్క వృద్ధికోసం కళ్యాణమయీ, అర్ధమాత్రాస్వరూపిణి, తన యొక్క అర్ధాంగి అయిన పరమేశ్వరితో యోగమార్గంలో సంసర్గాన్ని పొందాడు. విశ్వాత్ముడు, విశ్వేశ్వరుడు అయిన పరమేశ్వర శివభగవానుడు తన అర్ధాంగి నుంచి విష్ణువును, బ్రహ్మను, పాశుపతాన్ని సృష్టించాడు. ఈవిధంగా బ్రహ్మ మరియు విష్ణువు శివుడి యొక్క అంశవలన ఉత్పన్నులయ్యారు. అంతేకాక, బ్రహ్మ అండజుడు, పద్మజుడు మరియు భవాంగభవుడు అని పిలవబడతాడు. ఇది పురాతనమైన ఇతిహాసం మీకు చెప్పబడింది. అప్పటి నుంచి బ్రహ్మకు పరార్ధపర్యంతం ఐశ్వర్యం, తమోగుణోద్భూతమైన వైరాగ్యం కలిగాయి. వాటిని గూర్చి చెప్తాను.

**నారాయణోఽపి భగవాన్ ద్విధా కృత్వాత్మనస్తనుమ్ ॥15॥**

**ససర్జ సకలం తస్మాత్స్వాంగాదేవ చరాచరమ్ ।**
**తతో బ్రహ్మాణమసృజద్ బ్రహ్మ రుద్రం పితామహః ॥16॥**

**మునే కల్పాంతరే రుద్రో హరిం బ్రహ్మాణమీశ్వరమ్ ।**
**తతో బ్రహ్మాణమసృజన్మునే కల్పాంతరే హరిః ॥17॥**

**నారాయణం పునర్బ్రహ్మా బ్రహ్మాణం చ పునర్భవః ।**
**తదా విచార్య వై బ్రహ్మా దుఃఖం సంసార ఇత్యజః ॥18॥**

**సర్గం విసృజ్య చాత్మానమాత్మన్యేవ నియోజ్య చ ।**
**సంహృత్య ప్రాణసంచారం పాషాణ ఇవ నిశ్చలః ॥19॥**

**దశవర్షసహస్రాణి సమాధిస్థితోఽభవత్ప్రభుః ।**

భగవంతుడగు విష్ణువు కూడా తన శరీరాన్ని రెండుగా విభాగించి, తన శరీరం నుంచే సమస్త స్థావర జంగమాత్మకమైన జగత్తును సృష్టించాడు. తర్వాత విష్ణువు బ్రహ్మను, బ్రహ్మ రుద్రుణ్ణి సృష్టించారు. ఓ ఋషీ! వేరే కల్పంలో రుద్రుడినుంచి విష్ణువు, బ్రహ్మ, శివుడు పుట్టారు. ఓ ఋషీ! తర్వాత మరో కల్పంలో హరి(విష్ణువు)బ్రహ్మను సృష్టించాడు. మరలా వేరే కల్పంలో బ్రహ్మ విష్ణువును, భవుణ్ణి(శివుణ్ణి) సృష్టించాడు. తర్వాత అజన్ముడైన (అజుడు) బ్రహ్మ 'సంసారం దుఃఖ' ప్రాయమని ఆలోచించి, సృష్టికార్యాన్ని విరమించి, తనను తనయందే నియోగించి,ప్రాణ సంచారాన్ని అనగా శ్వాసను నిరోధించి, రాయివలె నిశ్చలుడై పదివేల సంవత్సరాలు సమాధిస్థితిలో ఉన్నాడు.

**అధోముఖం తు యత్పద్మం హృది సంస్థం సుశోభనమ్ ॥20॥**

**పూరితం పూరకేణైవ ప్రబుద్ధం చాభవత్తదా ।**
**తదూర్ధ్వవక్త్రమభవత్కుంభకేన నిరోధితమ్ ॥21॥**

**తత్పద్మకర్ణికామధ్యే స్థాపయామాస చేశ్వరమ్ ।**
**తదోమితి శివం దేవమర్ధమాత్రాపరం పరమ్ ॥22॥**

**మృణాలతంతుభాగైకశతభాగే వ్యవస్థితమ్ ।**
**యమీ యమవిశుద్ధాత్మా నియమ్యైవం హృదీశ్వరమ్ ॥23॥**

**యమపుష్పాదిభిః పూజ్యం యాజ్యో హ్యాయజదవ్యయమ్ ।**

అప్పుడు బ్రహ్మహృదయంలో క్రిందికి వంగిన ముఖంగల సుందరపద్మం వికసించింది. అప్పుడాతడు పూరకమనే ప్రాణాయామం ద్వారా వాయువును నిరోధించి ఊర్ధ్వముఖుడయ్యాడు. అపుడాతడు ఆ కమలం కర్ణికయొక్క మధ్య భాగంలో శివుణ్ణి స్థాపించాడు. ఆ స్థానం ఎంత చిన్నదనగా తామరతూడు యొక్క దారంలో నూరవవంతుతో సమానం. ఆయన పూజ్యుడు మరియు అవినాశి అయిన శివుడిని అర్ధమాత్రాత్మకమైన 'ఓం' అనే మంత్రంతో యమ, నియమాది యోగాంగాలనే పుష్పాలతో తన హృదయంలో ధ్యానావస్థితుణ్ణి చేసి విశు ద్ధాత్ముడై పూజించాడు.

**తస్య హృత్కమలస్థస్య నియోగాచ్చాంశజో విభుః ॥24॥**

**లలాటమస్య నిర్భిద్య ప్రాదురాశీత్పితామహాత్ ।**
**లోహితోఽభూత్స్వయం నీలః శివస్య హృదయోద్భవః ॥25॥**

**వహ్నేశ్చైవ తు సంయోగా త్ప్రకృత్యా పురుషః ప్రభుః ।**
**నీలశ్చ లోహితశ్చైవ యతః కాలాకృతిః పుమాన్ ॥26॥**

**నీలలోహిత ఇత్యుక్తస్తేన దేవేన వై ప్రభుః ।**
**బ్రహ్మణా భగవాన్ కాలః ప్రీతాత్మా చాభవద్విభుః ॥27॥**

**సుప్రీతమనసం దేవం తుష్టావ చ పితామహః ।**
**నామాష్టకేన విశ్వాత్మా విశ్వాత్మానం మహామునే ॥28॥**

ఆ బ్రహ్మయొక్క హృదయకమలంలో ఉంటున్న బ్రహ్మాంశజుడు, సర్వవ్యాపి అయిన శివుడు ఆతడి నుదుటి భాగాన్ని ఛేదించుకుని బ్రహ్మవలన ఉత్పన్నుడైనాడు. శివుడి హృదయం నుంచి తనంతటతానై పుట్టిన పురుషుడు, రుద్రుడు స్వభావంచేత నీలవర్ణుడైనా అగ్నిసంయోగం వల్ల లోహితుడు(రక్త) కూడా అయినాడు. ఈ కారణంగా కాలాకృతి అయిన పురుషుడు రుద్రుడు నీలలోహితుడైనాడు. అందుచేతనే బ్రహ్మదేవుడు రుద్రభగవానుణ్ణి 'నీలలోహితుడని' పిలిచాడు. కాలస్వరూపుడైన రుద్రభగవానుడు బ్రహ్మవిషయంలో మిక్కిలి సంతోషించాడు. ఓ మునిశ్రేష్ఠా! తర్వాత విశ్వాత్ముడైన బ్రహ్మదేవుడు, ప్రీతాత్ముడు, విశ్వాత్ముడు అయిన శివభగవానుణ్ణి నామాష్టకస్తోత్రంతో స్తుతించాడు.

**పితామహ ఉవాచ –** బ్రహ్మ పలికాడు.

**నమస్తే భగవన్ రుద్ర భాస్కరామితతేజసే ।**
**నమో భవాయ దేవాయ రసాయాంబుమయాయ తే ॥29॥**

**శర్వాయ క్షితిరూపాయ సదా సురభిణే నమః ।**
**ఈశాయ వాయవే తుభ్యం సంస్పర్శాయ నమో నమః ॥30॥**

**పశూనాం పతయే చైవ పావకాయాతితేజసే ।**
**భీమాయ వ్యోమరూపాయ శబ్దమాత్రాయ తే నమః ॥31॥**

**మహాదేవాయ సోమాయ అమృతాయ నమోఽస్తు తే ।**
**ఉగ్రాయ యజమానాయ నమస్తే కర్మయోగినే ॥32॥**

**యః పఠేచ్ఛృణుయాద్వాపి పైతామహమిమం స్తవమ్ ।**
**రుద్రాయ కథితం విప్రాన్ శ్రావయేద్వా సమాహితః ॥33॥**

**అష్టమూర్తేస్తు సాయుజ్యం వర్షాదేకాదవాప్నుయాత్ ।**

ఓ భగవంతుడా! రుద్రుడా! సూర్యుణ్ణి మించిన తేజస్వంతుడా! నీకు నమస్కారం. అంబుమయుడవు, రసస్వరూపుడవు, భవుడవు, దేవాధిదేవుడవు అయిన నీకు నమస్కారం. గంధమయపృథ్వీరూపుడవు, శంకరుడవు అయిన నీకు నిత్యాభివందనం. స్పర్శగుణయుక్తమైన, వాయుస్వరూపుడవైన ఈశ్వరా! నీకు నమస్కారం. అమితకాంతిమంతుడవు, అగ్ని స్వరూపుడవు పశుపతివీ అయిన నీకు నమస్కారం. శబ్దగుణసంబంధి ఆకాశ

స్వరూపుడవై భీముడవైన నీకు నమస్కారం. అమృతమయ చంద్రస్వరూపుడవైన మహాదేవా! నీకు నమస్కారం. కర్మయోగివి, యజమాన స్వరూపుడవు, ఉగ్రుడవు అయిన నీకు అభివందనం. బ్రహ్మచేత రుద్రుణ్ణి గూర్చి స్తుతించబడిన దీనిని ఏకాగ్రచిత్తంతో ఎవడు పఠిస్తాడో, వింటాడో లేక విప్రులకు విన్పిస్తాడో ఆతడు ఒక సంవత్సరకాలంలోనే అష్టమూర్తి స్వరూపుడైన శివభగవానుడి సాయుజ్యాన్ని పొందుతాడు.

**ఏవం స్తుత్వా మహాదేవమవైక్షత పితామహః ॥34॥**

**తదాష్టధా మహాదేవః సమాతిష్ఠత్సమంతతః ।**
**తదా ప్రకాశతే భానుః కృష్ణవర్త్మా నిశాకరః ॥35॥**

**క్షితిర్వాయుః పుమానంభః సుషిరం సర్వగం తథా ।**
**తదాప్రభృతి తం ప్రాహురష్టమూర్తిరితీశ్వరమ్ ॥36॥**

ఈ విధంగా బ్రహ్మ శివుణ్ణి స్తుతించి ఆతణ్ణి చూశాడు. అప్పుడు ఎనిమిది విధాలుగా శివుడు అన్ని వైపుల నిలిచాడు. అప్పుడు సూర్యుడు చంద్రుడు అగ్ని ప్రకాశించారు. అట్లే భూమి, గాలి, నీరు, ఆకాశం, యజమాన రూపపురుషుడు ప్రకాశించారు. అప్పటి నుంచి ఈశ్వరుణ్ణి 'అష్టమూర్తి' అనే పేరుతో పిలిచారు.

**అష్టమూర్తేః ప్రసాదేన విరంచిశ్చాసృజత్పునః ।**
**సృష్ట్వైతదఖిలం బ్రహ్మా పునః కల్పాంతరే ప్రభుః ॥37॥**

**సహస్రయుగపర్యంతం సంసుప్తే చ చరాచరే ।**
**ప్రజాః స్రష్టుమనాస్తేపే తత ఉగ్రం తపో మహత్ ॥38॥**

**తస్యైవం తప్యమానస్య న కించిత్సమవర్తత ।**
**తతో దీర్ఘేణ కాలేన దుఃఖాత్క్రోధో వ్యజాయత ॥39॥**

ఆ అష్టమూర్తి అయిన శివుడియొక్క అనుగ్రహం వల్ల బ్రహ్మ మరల సృష్టికార్యాన్ని నిర్వహించాడు. ఈ సమస్త జగత్తును వేరే కల్పాలలో బ్రహ్మదేవుడు సృష్టించి, వేయియుగాల వరకు నిద్రించాడు. మరల ప్రజల్ని సృష్టించాలనే మనస్సుతో భయంకరమైన తపస్సు ఆచరించాడు. ఆ విధంగా తపస్సు చేస్తున్న ఆయనకి ఏ విధమైన ఫలితం దక్కలేదు. ఎక్కువ కాలం చేసిన తపస్సు వల్ల కలిగిన దుఃఖంతో క్రోధం జనించింది.

**క్రోధావిష్టస్య నేత్రాభ్యాం ప్రాపతన్నశ్రుబిందవః ।**
**తతస్తేభ్యోఽశ్రుబిందుభ్యో భూతాః ప్రేతాస్తదాభవన్ ॥40॥**

క్రోధంతో నిండిన ఆయన నేత్రాలనుంచి బాష్పకణాలు రాలినాయి. తర్వాత ఆ బాష్పబిందువుల నుంచి భూతప్రేతపిశాచాలు ఉత్పన్నమయ్యాయి.

**సర్వాంస్తానగ్రజాన్ దృష్ట్వా భూతప్రేతనిశాచరాన్ ।**
**అనిందత తదా దేవో బ్రహ్మాత్మానమజో విభుః ॥41॥**

**జహౌ ప్రాణాంశ్చ భగవాన్ క్రోధావిష్టః ప్రజాపతిః ।**
**తతః ప్రాణమయో రుద్రః ప్రాదురాసీత్ప్రభోర్ముఖాత్ ॥ 42 ॥**

ముందుగా పుట్టిన ఆ భూతప్రేతరాక్షసులనందరినీ చూచి ప్రభువైన, అజుడైన బ్రహ్మ తనను నిందించుకున్నాడు. ప్రజాపతి అయిన బ్రహ్మ కోపావిష్టుడై తన ప్రాణాల్ని త్యజించాడు. ప్రభువైన బ్రహ్మముఖం నుంచి ప్రాణరూపుడై రుద్రుడు ఉత్పన్నుడయ్యాడు.

**అర్ధనారీశ్వరో భూత్వా బాలార్కసదృశద్యుతిః ।**
**తదైకాదశధాత్మానం ప్రవిభజ్య వ్యవస్థితః ॥43॥**

**అర్ధేనాంశేన సర్వాత్మా ససర్జాసౌ శివాముమామ్ ।**

ఉదయసూర్యసమాన కాంతిమంతుడైన ఆతడు అర్ధనారీశ్వరుడై పదకొండు విధాలుగా తనను విభజించుకుని నిలిచాడు. సర్వాత్ముడైన ఆతడు తన సగభాగం నుంచి ఉమాదేవిని సృష్టించాడు.

**సా చాసృజత్తదా లక్ష్మీం దుర్గాం శ్రేష్ఠాం సరస్వతీమ్ ॥44॥**

**వామాం రౌద్రీం మహామాయాం వైష్ణవీం వారిజేక్షణామ్ ।**
**కలాం వికరిణీం చైవ కాళీం కమలవాసినీమ్ ॥45॥**

**బలవికరిణీం దేవీం బలప్రమథినీం తథా ।**
**సర్వభూతస్య దమనీం ససృజే చ మనోన్మనీమ్ ॥46॥**

**తథాన్యా బహవః సృష్టాస్తయా నార్యః సహస్రశః ।**

తర్వాత ఉమాదేవి లక్ష్మీదేవిని,దుర్గాదేవిని సర్వశ్రేష్ఠ అయిన సరస్వతీదేవిని సృష్టించింది. వామ,రౌద్రి, మహామాయ,కమలనయని,వైష్ణవీదేవి,కళావికరిణి,కమలవాసిని,కాళి,బలవికరిణీదేవి,బలప్రమథిని, సర్వభూతదమని, మనోన్మని అనే వారిని ఉమాదేవి సృష్టించింది. అదేవిధంగా ఆమె వేలకొలది ఇతర స్త్రీలను సృష్టించింది.

**రుద్రైశ్చైవ మహాదేవస్తాభిస్త్రిభువనేశ్వరః ॥47॥**

**సర్వాత్మనశ్చ తస్యాగ్రే హ్యతిష్ఠత్పరమేశ్వరః ।**
**మృతస్య తస్య దేవస్య బ్రహ్మణః పరమేష్ఠినః ॥48॥**

**ఘృణీ దదౌ పునః ప్రాణాన్ బ్రహ్మపుత్రో మహేశ్వరః ।**
**బ్రహ్మణః ప్రదదౌ ప్రాణానాత్మస్థాంస్తు తదా ప్రభుః ॥49॥**

**ప్రహృష్టోఽభూత్తతో రుద్రః కించిత్ప్రత్యాగతాసవమ్ ।**
**అభ్యభాషత దేవేశో బ్రహ్మాణం పరమం వచః ॥50॥**

**మా భైర్దేవ మహాభాగ విరించ జగతాం గురో ।**
**మయేహ స్థాపితాః ప్రాణాస్తస్మాదుత్తిష్ఠ వై ప్రభో ॥51॥**

తదనంతరం లోకనాథుడు, పరమేశ్వరుడు సమస్తరుద్రులతో, ఆ స్త్రీలతో సర్వాత్ముడైన బ్రహ్మకు, బ్రహ్మపుత్రుడు, దయాళువు అయిన శివుడు మరల ప్రాణదానం చేశాడు. అప్పుడు శివుడు తనయందుగల ప్రాణాలను బ్రహ్మకు ఇచ్చాడు. బ్రహ్మకు తిరిగివచ్చిన ఆ కొద్ది జీవాన్ని(చలనాన్ని) చూసి సంతోషించి దేవదేవుడు బ్రహ్మను గూర్చి శ్రేష్ఠవాక్కులు పలికాడు. ఓ మహాత్మా! ఓ విరించి! ఓ జగద్గురూ! నీవు దుఃఖించవద్దు. నాచేత నీయందు ప్రాణప్రతిష్ఠ చేయబడింది. ఓ ప్రభూ! అందుచేత నీవిక లెమ్ము.

**శ్రుత్వా వచస్తతస్తస్య స్వప్నభూతం మనోగతమ్ ।**
**పితామహః ప్రసన్నాత్మా నేత్రైః ఫుల్లాంబుజప్రభైః ॥52॥**

**తతః ప్రత్యాగతప్రాణః సముద్వైక్షన్మహేశ్వరమ్ ।**
**స ఉద్వీక్ష్య చిరం కాలం స్నిగ్ధగంభీరయా గిరా ॥53॥**

**ఉవాచ భగవాన్ బ్రహ్మా సముత్థాయ కృతాంజలిః ।**
**భోభో వద మహాభాగ ఆనందయసి మే మనః ॥54॥**

**కో భవానష్టమూర్తిర్వై స్థిత ఏకాదశాత్మకః ।**

తర్వాత కలగా మనస్సులో తోచిన ఆ శివుడి యొక్క వాక్యాన్ని విన్న బ్రహ్మదేవుడు తిరిగి ప్రాణం పొంది సంతుష్టాత్ముడై వికసించిన పద్మపత్రకాంతిమంతాలైన నేత్రాలతో సంతోషంతో శివుణ్ణి చూశాడు. అట్లు చాలా సమయం బాగా చూచిన బ్రహ్మదేవుడు లేచి, నిలిచినవాడై అంజలి ఘటించి, స్నేహగంభీరమైన వాక్కులు పలికాడు. ఓ మహాత్మా! నీవు నా మనస్సును ఆనందింపజేస్తున్నావు. ఏకాదశరూపుడవై అష్టమూర్తిగా స్థితుడవైన నీవు ఎవ్వడవో చెప్పు.

**ఇంద్ర ఉవాచ –** ఇంద్రుడు పలికాడు.

**తస్య తద్వచనం శ్రుత్వా వ్యాజహార మహేశ్వరః ॥55॥**

**స్పృశన్ కరాభ్యాం బ్రహ్మాణం సుఖాభ్యాం స సురారిహా ।**

సురారిసంహారి అయిన ఆ శివుడు బ్రహ్మమాట విని సుఖప్రదాలైన తన చేతులతో బ్రహ్మను తాకుతూ ఇలా పలికాడు.

**శ్రీ శంకర ఉవాచ –** శ్రీశంకరుడు పలికాడు.

**మాం విద్ధి పరమాత్మానమేనాం మాయామజామితి ॥56॥**

**ఏతే వై సంస్థితా రుద్రాస్త్వాం రక్షితుమిహాగతాః ।**

నన్ను పరమాత్మగా, దీనిని జన్మరహితమైన మాయగా తెలిసికో. ఇక్కడున్న వీళ్లు రుద్రులు. నిన్ను రక్షించడానికి వచ్చారు.

**తతః ప్రణమ్య తం బ్రహ్మా దేవదేవమువాచ హ ॥57॥**

**కృతాంజలిపుటో భూత్వా హర్షగద్గయా గిరా ।**
**భగవన్ దేవదేవేశ దుఃఖైరాకులితో హ్యహమ్ ॥58॥**

**సంసారాన్మోక్తుమీశాన మామిహార్హసి శంకర ।**

తర్వాత బ్రహ్మ శివభగవానుడికి అంజలి ఘటించి నమస్కరించి, సంతోషంవల్ల గద్గపడిన వాక్కుతో ఇలా పలికాడు. 'ఓ భగవానుడా! ఓ దేవేశ్వరా! నేను దుఃఖం వల్ల వ్యాకులపడ్డాను. ఓ ఈశ్వరా! శంకరా! నన్ను ఈ సంసారం నుంచి విముక్తుణ్ణి చేయవలసినది.'

**తతః ప్రహస్య భగవాన్ పితామహముమాపతిః ॥59॥**

**తదా రుద్రైర్జగన్నాథస్తయా చాంతర్దధే విభుః ।**

అనంతరం బ్రహ్మను ఉద్దేశించి పెద్దగా నవ్వి, రుద్రులతో పార్వతీదేవితో సహా ప్రభువైన జగన్నాథశివుడు అంతర్ధానం చెందాడు.

**ఇంద్ర ఉవాచ –** ఇంద్రుడు పలికాడు.

**తస్మాచ్ఛిలాద లోకేషు దుర్లభో వై త్వయోనిజః ॥60॥**

**మృత్యుహీనః పుమాన్ విద్ధి సమృత్యుః పద్మజోఽపి సః ।**
**కింతు దేవేశ్వరో రుద్రః ప్రసీదతి యదీశ్వరః ॥61॥**

**న దుర్లభో మృత్యుహీనస్తవ పుత్రో హ్యయోనిజః**
**మయా చ విష్ణునా చైవ బ్రహ్మణా చ మహాత్మనా ॥62॥**

**అయోనిజం మృత్యుహీనమసమర్థం నివేదితుమ్।**

ఓ శిలాద! అందువల్ల సమస్తలోకాలలో అయోనిజుడు, మరణరహితుడు అయిన పురుషుడు దుర్లభుడని తెలిసికో. పద్మజుడైన బ్రహ్మకూడా మరణించేవాడే. అయితే, దేవాధిదేవుడైన శివభగవానుడు ప్రసన్నుడైతే అయోనిజుడు, మృత్యురహితుడూ అయిన పుత్రుడు కల్గడం దుర్లభం కాదు. నేను గాని, విష్ణుదేవుడు గాని మహాత్ముడైన బ్రహ్మదేవుడు గాని అయోనిజుడై, మరణరహితుడైన పుత్రుణ్ణి ప్రసాదించడానికి అసమర్థులం.

**శైలాది రువాచ –** నందీశ్వరుడు పలికాడు.

**ఏవం వ్యాహృత్య విప్రేంద్రమనుగృహ్య చ తం ఘృణీ ॥63॥**

**దేవైర్వృతో యయౌ దేవః సితేనేభేన వై ప్రభుః ।**

దయాళువైన దేవేంద్రుడు ఈ విధంగా పలికి ఆ బ్రాహ్మణశ్రేష్ఠుణ్ణి అనుగ్రహించి దేవతలతోకూడి తెల్లటి ఐరావతాన్ని అధిరోహించి వెళ్ళాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని ఇంద్రవాక్యం నామైకచత్వారింశత్తమోఽధ్యాయః ॥ 41 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని ఇంద్రవాక్యమనే నలభై ఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్విచత్వారింశత్తమోఽధ్యాయః - నలభై రెండవ అధ్యాయం

## నందికేశ్వరోత్పత్తిః - నందికేశ్వరోత్పత్తి

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**గతే పుణ్యే చ వరదే సహస్రాక్షే శిలాశనః ।**
**ఆరాధయన్ మహాదేవం తపసా తోషయద్భవమ్ ॥1॥**

వరదుడు, పుణ్యాత్ముడు అయిన ఇంద్రుడు వెళ్లిన తర్వాత శిలాదుడు మహాదేవుని పూజిస్తూ తపస్సుతో ఆయన్ని సంతుష్టుణ్ణి చేశాడు.

**అథ తస్యైవమనిశం తత్పరస్య ద్విజస్య తు ।**
**దివ్యం వర్షసహస్రం తు గతం క్షణమివాద్భుతమ్ ॥2॥**

ఈ విధంగా నిరంతరం తపస్సులో సంలగ్నుడైన ఆ విప్రుడికి దివ్యమైన వేయి సంవత్సరాలు ఆశ్చర్యకరంగా క్షణకాలంగా గడచిపోయాయి.

**వల్మీకేనావృతాంగశ్చ లక్ష్యః కీటగణైర్మునిః ।**
**వజ్రసూచీముఖైశ్చాన్యై రక్తకీటైశ్చ సర్వతః ॥3॥**

**నిర్మాంసరుధిరత్వగ్వై నిర్లేపః కుడ్యవత్స్థితః ।**
**అస్థిశేషోఽభవత్పశ్చాత్తమమన్యత శంకరః ॥4॥**

**యదా స్పృష్టో మునిస్తేన కరేణ చ స్మరారిణా ।**
**తదైవ మునిశార్దూలశ్చోత్ససర్జ క్లమం ద్విజః ॥5॥**

ఆతడి శరీరం పుట్టచే కప్పబడింది. సూదులవంటి ముఖాలు గలిగి, రక్తాన్ని త్రాగే క్రిమికీటకాలకు లక్ష్యమైంది. రక్తం, మాంసం, చర్మం లేక, ఎముకలు మాత్రమే మిగిలి గోడవలె నిలిచాడు. అప్పుడు మదనసంహారి అయిన శంకరుడు ఆతణ్ణి గుర్తించి తన చేతితో తాకాడు. దానితో ఆమునిశ్రేష్ఠుడు అంతకాలం పడిన శ్రమను విడిచిపెట్టాడు.

**తపతస్తస్య తపసా ప్రభుస్తుష్టోఽథ శంకరః ।**
**తుష్టస్తవేత్యథోవాచ సగణశ్చోమయా సహ ॥6॥**

**తపసానేన కిం కార్యం భవతస్తే మహామతే ।**
**దదామి పుత్రం సర్వజ్ఞం సర్వశాస్త్రార్థపారగమ్ ॥7॥**

తర్వాత తపస్సుచేస్తున్న ఆ ముని తపస్సునకు సంతుష్టుడైన శంకరుడు ఇలా పలికాడు. 'పార్వతీదేవితో, ప్రథమగణాలతో సహా నేను నీవిషయంలో సంతోషించా. ఓ సుబుద్ధీ! ఈ తపస్సుతో నీకు ఏమి ప్రయోజనం? నీకు సమస్తశాస్త్రార్థపారంగతుడై మహాజ్ఞాని అయిన పుత్రుణ్ణి ఇస్తున్నాను.

**తతః ప్రణమ్య దేవేశం స్తుత్వోవాచ శిలాశనః ।**
**హర్షగద్గదయా వాచా సోమం సోమవిభూషణమ్ ॥8॥**

అప్పుడు శిలాదముని శివుడికి నమస్కరించి, స్తుతించి, ఆనందంతో గద్గదమైన మాటలతో చంద్రచూడుడైన శివుణ్ణి గూర్చి పలికాడు.

**శిలాద ఉవాచ –** శిలాదుడు పలికాడు.

**భగవన్ దేవదేవేశ త్రిపురార్దన శంకర ।**
**అయోనిజం మృత్యుహీనం పుత్రమిచ్ఛామి సత్తమ ॥9॥**

ఓ భగవంతుడా! ఓ దేవదేవుడా! ఓ త్రిపురారీ! ఓ మహోన్నతా! నేను మాతృగర్భం నుంచి జన్మించనివాడూ, మరణరహితుడూ అయిన పుత్రుణ్ణి కోరుతున్నాను.

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**పూర్వమారాధితః ప్రాహ తపసా పరమేశ్వరః ।**
**శిలాదం బ్రహ్మణా రుద్రః ప్రీత్యా పరమయా పునః ॥10॥**

ఇంతకు ముందు బ్రహ్మచేత ఆరాధింపబడిన పరమేశ్వరరుద్రుడు పరమప్రీతితో శిలాదుడితో పలికాడు.

**శ్రీదేవదేవ ఉవాచ –** శ్రీశంకరుడు పలికాడు.

**పూర్వమారాధితో విప్ర బ్రహ్మణాహం తపోధన ।**
**తపసా చావతారార్థం మునిభిశ్చ సురోత్తమైః ॥11॥**

**తవ పుత్రో భవిష్యామి నందినామ్నా త్వయోనిజః ।**
**పితా భవిష్యసి మమ పితుర్వై జగతాం మునే ॥12॥**

ఓ విప్రుడా! ఓ తపోధనా! మునులతో, దేవతాశ్రేష్ఠులతో కలిసి బ్రహ్మ నన్ను ఇంతకు ముందే నా అవతరణకై తపస్సుతో ఆరాధించాడు. కాగా నంది అనే పేరుతో అయోనిజుడనై నీ పుత్రుణ్ణి కాగలుగుతాను. ఓ ఋషీ! జగత్తుకే తండ్రినైన నాకు నీవు తండ్రివి కాగలవు.

**ఏవముక్త్వా మునిం ప్రేక్ష్య ప్రణిపత్య స్థితం ఘృణీ ।**
**సోమః సోమోపమః ప్రీతస్తత్రైవాంతరధీయత ॥13॥**

నమస్కరించి, నిలిచిన శిలాదమునిని చూచి పైవిధంగా పలికి, చంద్రసమానుడై, ఉమాదేవిసహితుడైన శివుడు సంప్రీతుడై అంతర్ధానం చెందాడు.

**లబ్ధపుత్రః పితా రుద్రాత్ప్రీతో మమ మహామునే ।**
**యజ్ఞాంగణం మహత్ప్రాప్య యజ్ఞార్థం యజ్ఞవిత్తమః ॥14॥**

**తదంగణాదహం శంభోస్తనుజస్తస్య చాజ్ఞయా ।**
**సంజాతః పూర్వమేవాహం యుగాంతాగ్నిసమప్రభః ॥15॥**

ఓ మునిశ్రేష్ఠా! శివుడివల్ల పుత్రప్రాప్తివరాన్ని పొందిన నా తండ్రి శిలాదుడు యజ్ఞవిశారదుడై, యజ్ఞనిర్వహణకై గొప్పయజ్ఞవాటికను చేరాడు. అంతకుముందే నేను శివుడి ఆనతితో ఆయన శరీరం నుంచి, ఆ యజ్ఞవాటిక నుంచి జన్మించాను. ఆసమయంలో నేను ప్రళయాగ్నిసమానమైన కాంతితో ప్రకాశించాను.

**వవర్షుస్తదా పుష్కరావర్తకాద్యా జగుః ఖేచరాః కిన్నరాః సిద్ధసాధ్యాః ।**
**శిలాదాత్మజత్వం గతే మయ్యుపేంద్రః ససర్జాథ వృష్టిం సుపుష్పౌఘమిశ్రామ్ ॥16॥**

శిలాదమునికి నేను పుత్రరూపంలో జన్మించిన సమయంలో పుష్కర, ఆవర్తకాది మేఘాలు వర్షించాయి. ఆకాశసంచారులైన (దేవతలు) కిన్నరులు, సిద్ధులు, సాధ్యులు గానం చేశారు. విష్ణువు కూడా కుసుమాలతో కూడిన వృష్టిని కురిపించాడు.

**మాం దృష్ట్వా కాలసూర్యాభం జటామకుటధారిణమ్ ।**
**త్ర్యక్షం చతుర్భుజం బాలం శూలటంకగదాధరమ్ ॥17॥**

**వజ్రిణం వజ్రదంష్ట్రం చ వజ్రిణారాధితం శిశుమ్ ।**
**వజ్రకుండలినం ఘోరం నీరదోపమనిఃస్వనమ్ ॥18॥**

**బ్రహ్మాద్యాస్తుష్టువుః సర్వే సురేంద్రశ్చ మునీశ్వరాః ।**
**నేదుః సమంతతః సర్వే ననృతుశ్చాప్సరోగుణాః ॥19॥**

ఆసమయంలో ప్రళయకాల సూర్యకాంతితో సమానమైన కాంతిగలవాడిని, జటలమకుటాన్ని ధరించిన వాడిని, త్రినేత్రుణ్ణి, చతుర్భుజుణ్ణి, శూలం, పట్టిస, గదలను ధరించినవాడిని, వజ్రంవంటివాడిని, వజ్రసమానమైన దంతాలు గలవాడిని, వజ్రాలు కుండలాలుగా గలవాడిని, భయంకరాకారుణ్ణి, మేఘంలాగా గంభీరమైన కంఠస్వరంగలవాడిని, చిన్నవాడినీ ఐన నన్ను బ్రహ్మేంద్రాదిదేవతలు, మునిశ్రేష్ఠులందరూ స్తుతించారు. అప్సరసలందరూ అన్నిదిక్కులా వాద్యాల్ని వాయిస్తూ నృత్యం చేశారు.

**ఋషయో మునిశార్దూల ఋగ్యజుఃసామసంభవైః ।**
**మంత్రైర్మాహేశ్వరైః స్తుత్వా సంప్రణేముర్ముదాన్వితాః ॥20॥**

ఓ మునిశ్రేష్ఠా! ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం – వీటికి చెందిన శివమంత్రాలతో నన్ను స్తుతించి ఋషులు సంతోషించి నమస్కరించారు.

**బ్రహ్మా హరిశ్చ రుద్రశ్చ శక్రః సాక్షాచ్ఛివాంబికా ।**
**జీవశ్చేందుర్మహాతేజా భాస్కరః పవనోఽనలః ॥21॥**

**ఈశానో నిరృతిర్యక్షో యమో వరుణ ఏవ చ ।**
**విశ్వేదేవాస్తథా రుద్రా వసవశ్చ మహాబలాః ॥22॥**

**లక్ష్మీః సాక్షాచ్ఛచీ జ్యేష్ఠా దేవీ చైవ సరస్వతీ ।**
**అదితిశ్చ దితిశ్చైవ శ్రద్ధా లజ్జా ధృతిస్తథా ॥23॥**

**నందా భద్రా చ సురభీ సుశీలా సుమనాస్తథా ।**
**వృషేంద్రశ్చ మహాతేజా ధర్మో ధర్మాత్మజస్తథా ॥24॥**

**ఆవృత్య మాం తథాలింగ్య తుష్టువుర్మునిసత్తమ ।**
**శిలాదోఽపి మునిర్దృష్ట్వా పితా మే తాదృశం తదా ॥25॥**

**ప్రీత్యా ప్రణమ్య పుణ్యాత్మా తుష్టావేష్టప్రదం సుతమ్ ।**

ఓ మునీంద్రా! అప్పుడు బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఇంద్రుడు, సాక్షాత్తు భవానీదేవి, దేవగురువు బృహస్పతి, చంద్రుడు, మహాతేజస్వి సూర్యుడు, వాయువు, అగ్ని, ఈశానుడు, నిరృతి, యక్షుడు, యముడు, వరుణుడు, విశ్వేదేవులు, ఏకాదశ రుద్రులు, మహాబలులైన అష్ట వసువులు, సాక్షాత్తుగా లక్ష్మీదేవి, శచీదేవి, జ్యేష్ఠాదేవి, సరస్వతీదేవి, దేవమాత అదితి, దానవమాత దితి, శ్రద్ధాదేవి, లజ్జ, ధృతి, నంద, భద్ర, సురభి, సుశీల, సుమన, వృషేంద్ర, మహాతేజస్వి ధర్ముడు, ధర్మపుత్రుడు అనే వీరు నన్ను చుట్టుముట్టి కౌగిలించుకుని సంతోషించారు. అప్పుడు పుణ్యాత్ముడైన నా తండ్రి శిలాదముని ఆవిధమైన రూపంలో ఉన్న ఇష్టప్రదుడైన పుత్రుణ్ణి చూచి, ప్రేమపూర్వకంగా నమస్కరించి నన్ను స్తుతించాడు.

**శిలాద ఉవాచ –** శిలాదుడు పలికాడు.

**భగవన్ దేవదేవేశ త్రియంబక మమావ్యయ ॥26॥**

**పుత్రోఽసి జగతాం యస్మాత్త్రాతా దుఃఖాద్ధి కిం పునః ।**
**రక్షకో జగతాం యస్మాత్పితా మే పుత్ర సర్వగః ॥27॥**

**అయోనిజ నమస్తుభ్యం జగద్యోనే పితామహ ।**
**పితా పుత్ర మహేశాన జగతాం చ జగద్గురో ॥28॥**

**వత్స వత్స మహాభాగ పాహి మాం పరమేశ్వర ।**
**త్వయాహం నందితో యస్మాన్నందీ నామ్నా సురేశ్వర ॥29॥**

**తస్మాన్నందయ మాం నందిన్నమామి జగదీశ్వరమ్ ।**

ఓ భగవంతుడా! ఓ దేవేశ్వరా! ఓ ముక్కంటీ! ఓ అవినాశీ! నీవు నాపుత్రుడ వయ్యావు. నీవు జగద్రక్షకుడవు. కాబట్టి నాకు దుఃఖ మెక్కడిది? కావున నాకు నీవు తండ్రివి. ఓ పుత్రా! ఓ సర్వవ్యాపీ! ఓ అయోనిజా! ఓ జగద్యోనీ! ఓ పితామహా! నీకు నమస్కారం. ఓ పుత్రా! ఓ మహేశానా! ఓ జగద్గురూ! నీవు జగత్తుకు తండ్రివి. ఓ కుమారా! ఓ కుమారా! ఓ మహాభాగా! ఓ పరమేశ్వరా! నన్ను రక్షించు! ఓ సురేశ్వరుడా! నీ చేత నేను ఆనందింపబడ్డాను. కావున నీవు 'నందీ' అనే పేరుతో ప్రఖ్యాతుడవు అవుతావు. ఓ నందీ! నన్ను అనందింపజేయి. జగదధీశ్వరుడవైన నీకు నమస్కారం.

**ప్రసీద పితరౌ మేఽద్య రుద్రలోకం గతౌ విభో ॥30॥**

**పితామహశ్చ భో నందిన్నవతీర్ణో మహేశ్వరే ।**
**మమైవ సఫలం లోకే జన్మ వై జగతాం ప్రభో ॥31॥**

**అవతీర్ణే సుతే నందిన్ రక్షార్థం మహ్యమీశ్వర ।**
**తుభ్యం మనః సురేశాన నందీశ్వర నమోఽస్తు తే ॥32॥**

**పుత్ర పాహి మహాబాహో దేవదేవ జగద్గురో ।**
**పుత్రత్వమేవ నందీశ మత్వా యత్కీర్తితం మయా ॥33॥**

**త్వయా తత్క్షమ్యతాం వత్స స్తవస్తవ్య సురాసురైః ।**
**యః పఠేచ్ఛృణుయాద్వాపి మమ పుత్ర ప్రభాషితమ్ ॥34॥**

**శ్రావయేద్వా ద్విజాన్ భక్త్యా మయా సార్ధం స మోదతే ।**

ఓ ప్రభూ! రుద్రలోకగతులైన నా తల్లిదండ్రులను పితామహులను అనుగ్రహించు. ఓ నందీ! మహేశ్వరుడవైన నీవు ఇలా అవతరించగా ఈలోకంలో నా జన్మ సఫలమైంది. ఓ జగత్ప్రభూ! నా రక్షణకై నీవు నా పుత్రరూపంలో అవతరించావు. ఓ సురేశానా! నీకు నమస్కారం. ఓ నందీశ్వరా! నీకు నమస్కారం. ఓ పుత్రా! ఓ మహాబాహూ! ఓ దేవదేవా! ఓ జగద్గురూ! నన్ను రక్షించు. ఓ నందీశ్వరా! దేవదానవులచేత స్తుతియోగ్యుడవైన నిన్ను పుత్రభావంతో పలికిన మాటల్ని నీవు మన్నించు. ఓ పుత్రా! నేను పలికిన ఈ స్తవాన్ని ఎవడు పఠిస్తాడో, ఎవడు వింటాడో, భక్తితో ఎవడు బ్రాహ్మణులకు వినిపిస్తాడో వాడు నాతోపాటు ఆనందిస్తాడు.

**ఏవం స్తుత్వా సుతం బాలం ప్రణమ్య బహుమానతః ॥35॥**

**మునీశ్వరాంశ్చ సంప్రేక్ష్య శిలాదోవాచ సువ్రతః ।**
**పశ్యధ్వం మునయః సర్వే మహాభాగ్యం మమావ్యయః ॥36॥**

**నందీ యజ్ఞాంగణే దేవశ్చావతీర్ణో యతః ప్రభుః ।**
**మత్సమః కః పుమాన్ లోకే దేవో వా దానవోఽపి వా ॥37॥**

**ఏష నందీ యతో జాతో యజ్ఞభూమౌ హితాయ మే ।**

ఈ విధంగా శివభగవానుణ్ణి స్తుతించి బాలుడైన పుత్రుడికి గౌరవపూర్వకంగా నమస్కరించి మునీశ్వరుల్ని చూచి శిలాదుడు ఇలా పలికాడు. 'ఓ మునులారా! మీరందరూ అవినాశి అయిన నా యీ మహైశ్వర్యాన్ని చూడండి. ప్రభువు, శివుడు ఈ యజ్ఞశాలలో నాపుత్రుడై నంది రూపంలో అవతరించడం. ఈ నందీశ్వరుడు యజ్ఞభూమిలో నాహితార్థం జన్మించిన కారణంగా ఈ లోకంలో నాకు సమానమైన వాడు దేవదానవుల్లో ఎవడూ లేడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే నందికేశ్వరోత్పత్తిర్నామ ద్విచత్వారింశత్తమోఽధ్యాయః ॥42 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని నందికేశ్వరోత్పత్తి అనే నలభై రెండవ అధ్యాయం సమాప్తం.

## **త్రిచత్వారింశోఽధ్యాయః** – నలబై మూడవ అధ్యాయం

## **నందికేశ్వరాభిషేకమంత్రమ్** – నందికేశ్వరాభిషేకమంత్రం

**నందికేశ్వర ఉవాచ** – నందికేశ్వరుడు పలికాడు.

**మయా సహ పితా హృష్టః ప్రణమ్య చ మహేశ్వరమ్ ।**
**ఉటజం స్వం జగామాశు నిధిం లబ్ధ్వేవ నిర్ధనః ॥1॥**

పరమేశ్వరుడికి నమస్కరించి సంతుష్టుడైన నా తండ్రి శిలాదుడు ధనహీనుడు ధననిధిని పొందినవాడిలాగా త్వరగా నాతో కూడా తన కుటీరంలోనికి ప్రవేశించాడు.

**యదాగతోఽహముటజం శిలాదస్య మహామునే ।**
**తదా వై దైవికం రూపం త్యక్త్వా మానుష్యమాస్థితః ॥2॥**

ఓ మునీశ్వరా! నేను ఎప్పుడైతే శిలాదుడి కుటీరంలోనికి వెళ్లానో, అప్పుడే నా దివ్యరూపాన్ని విడిచి మానవరూపాన్ని పొందాను.

**నష్టా చైవ స్మృతిర్దివ్యా యేన కేనాపి కారణాత్ ।**
**మానుష్యమాస్థితం దృష్ట్వా పితా మే లోకపూజితః ॥3॥**

**విలలాపాతి దుఃఖార్తః స్వజనైశ్చ సమావృతః ।**
**జాతకర్మాదికాశ్చైవ చకార మమ సర్వవిత్ ॥4॥**

**శాలంకాయనపుత్రో వై శిలాదః పుత్రవత్సలః ।**

ఏదో ఒక కారణంచేత నా దివ్యమైన స్మరణం నశించింది. లోకమాన్యుడైన నా తండ్రి నా మానవరూపాన్ని చూసి అధికదుఃఖార్తుడై విలపించాడు. శాలంకాయనపుత్రుడు, సమస్తం తెలిసినవాడు, పుత్రవాత్సల్యంగల శిలాదుడు బంధువులతో కూడినవాడై నాకు జాతకర్మాదిసంస్కారాలు నిర్వహించాడు.

**ఉపదిష్టా హి తేనైవ ఋక్శాఖా యజుషస్తథా ॥5॥**

**సామశాఖాసహస్రం చ సాంగోపాంగం మహామునే ।**
**ఆయుర్వేదం ధనుర్వేదం గాంధర్వం చాశ్వలక్షణమ్ ॥6॥**

**హస్తినాం చరితం చైవ నరాణాం చైవ లక్షణమ్ ।**

ఆయన ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదంకు చెందిన సహస్రశాఖలు, సాంగోపాంగంగా నాకు ఉపదేశించారు. ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంధర్వం, అశ్వశాస్త్రం, గజశాస్త్రం, మానవలక్షణాలు– వీటి శిక్షణ గరపాడు.

**సంపూర్ణే సప్తమే వర్షే తతో౽ థ మునిసత్తమౌ ॥7॥**

**మిత్రావరుణనామానౌ తపోయోగబలాన్వితౌ ।**
**తస్యాశ్రమం గతౌ దివ్యౌ ద్రష్టుం మాం చాజ్ఞయా విభోః ॥8॥**

నాకు ఏడు సంవత్సరాలు నిండగా తపస్సు మరియు యోగశక్తిగల మిత్రావరుణులు అనే పేర్లుగల మునిశ్రేష్ఠులు శివభగవానుడి ఆనతితో నన్ను చూడడానికి నా తండ్రి శిలాదుని ఆశ్రమానికి వచ్చారు.

**ఊచతుశ్చ మహాత్మానౌ మాం నిరీక్ష్య ముహుర్ముహుః ।**
**తాత నంద్యయమల్పాయుః సర్వశాస్త్రార్థపారగః ॥9॥**

**న దృష్టమేవమాశ్చర్యమాయుర్వర్షాదతః పరమ్ ।**

మహాభాగులైన ఆ మిత్రావరుణమునులు మాటిమాటికి నన్ను చూచి ఇలా పలికారు. ఓ తండ్రీ! సర్వశాస్త్రార్థవిశారదుడైన ఈ నంది అల్పమైన ఆయువు కలిగినవాడు. ఇలాంటి అచ్చెరువును మేమెప్పుడూ చూడలేదు. ఈతడి ఆయువు ఒక సంవత్సరం మాత్రమే.

**ఇత్యుక్తవతి విప్రేంద్రః శిలాదః పుత్రవత్సలః ॥10॥**

**సమాలింగ్య చ దుఃఖార్తో రురోదాతీవ విస్వరమ్ ।**
**హా పుత్ర హా పుత్ర పుత్రే పపాత చ సమంతతః ॥11॥**

**అహో బలం దైవవిధేర్విధాతుశ్చేతి దుఃఖితః ।**

ఆ ఇద్దరు మునివర్యులు ఈవిధంగా పలుకగా బ్రాహ్మణశ్రేష్ఠుడైన శిలాదుడు నన్ను బాగా కౌగిలించినవాడై దుఃఖవ్యాకులుడై, గద్గదకంఠుడై మిక్కిలిగా రోదించాడు. ఓ పుత్రా! ఓపుత్రా! ఓపుత్రా! అంటూ. దైవనిర్ణయం, అట్లే బ్రహ్మవ్రాత ఎంత బలమైనదో అని దుఃఖిస్తూ భూమిపై పడ్డాడు.

**తస్య చార్తస్వరం శ్రుత్వా తదాశ్రమనివాసినః ॥12॥**

**నిపేతుర్విహ్వలాత్యర్థం రక్షాశ్చక్రుశ్చ మంగలమ్ ।**
**తుష్టువుశ్చ మహాదేవం త్రియంబకముమాపతిమ్ ॥13॥**

**హుత్వా త్రియంబకేనైవ మధునైవ చ సంప్లుతామ్ ।**
**దూర్వామయుతసంఖ్యాతాం సర్వద్రవ్యసమన్వితామ్ ॥14॥**

శిలాదుడి విహ్వలవాక్కును ఆశ్రమనివాసులైన మునులు విని, అక్కడకు వచ్చి అమంగళనివారణార్థం శుభకరాలైన రక్షణకృత్యాల్ని నిర్వహించారు. ముక్కంటి, పార్వతీపతి అయిన శివుణ్ణి స్తుతించారు. ముక్కంటి కోసం తేనెతో బాగా తడిపిన, అన్ని హోమద్రవ్యాలతో కూడిన పదివేల దర్భల్ని శివమంత్రాలతో ఆహుతి చేస్తూ శివుణ్ణి సంతుష్టుణ్ణి చేశారు.

**పితా విగతసంజ్ఞశ్చ తథా చైవ పితామహః ।**
**విచేష్టశ్చ లలాపాసౌ మృతవన్నిపపాత చ ॥15॥**

తండ్రి శిలాదుడు స్పృహ కోల్పోయాడు. అట్లే తాత కూడా దుఃఖించాడు. చేష్టాశూన్యుడై చనిపోయినవాడిలాగా పడిపోయాడు.

**మృత్యోర్భీతోఽహమచిరాచ్ఛిరసా చాభివంద్య తమ్ ।**
**మృతవత్పతితం సాక్షాత్పితరం చ పితామహమ్ ॥16॥**

**ప్రదక్షిణీకృత్య చ తం రుద్రజాప్యరతోఽభవమ్ ।**
**హృత్పుండరీకే సుషిరే ధ్యాత్వా దేవం త్రియంబకమ్ ॥17॥**

**త్ర్యక్షం దశభుజం శాంతం పంచవక్త్రం సదాశివమ్ ।**
**సరితశ్చాంతరే పుణ్యే స్థితం మాం పరమేశ్వరః ॥18॥**

**తుష్టోఽబ్రవీన్మహాదేవః సోమః సోమార్ధభూషణః ।**

మృత్యుభయం కలిగిన నేను చనిపోయినవాడిలాగా భూమిపై పడియున్న తండ్రికి తాతకు నమస్కరించి, వారికి ప్రదక్షిణ చేసి నా హృదయకమలంలో ప్రకాశిస్తున్న త్రినేత్రుడు, దశభుజుడు, పరమశాంతుడు, పంచముఖుడు అయిన సదాశివుణ్ణి ధ్యానించి శివజపంలో లగ్నమయ్యాను. పవిత్రమైన నది ఒడ్డున ఉన్న నన్ను గూర్చి చంద్రభూషణుడైన పరమేశ్వరుడు, మహాదేవుడు సంతుష్టుడై ఇలా పలికాడు.

**వత్స నందిన్ మహాబాహో మృత్యోర్భీతిః కుతస్తవ ॥19॥**

**మయైవ ప్రేషితౌ విప్రౌ మత్సమస్త్వం న సంశయః ।**
**వత్సైతత్తవ దేహం చ లౌకికం పరమార్థతః ॥20॥**

**నాస్త్యేవ దైవికం దృష్టం శిలాదేన పురా తవ ।**
**దేవైశ్చ మునిభిః సిద్ధైర్గంధర్వైర్దానవోత్తమైః ॥21॥**

**పూజితం యత్పురా వత్స దైవికం నందికేశ్వర ।**
**సంసారస్య స్వభావోఽయం సుఖం దుఃఖం పునఃపునః ॥22॥**

**నృణాం యోనిపరిత్యాగః సర్వథైవ వివేకినః ।**

ఓ వత్సా! ఓ నందీ! ఓ మహాబాహూ! మృత్యుభయం నీకెక్కడిది? ఆ ఇద్దరు బ్రాహ్మణులను నేనే పంపాను. నీవు నాకు సమానుడవు. ఇందులో సందేహం లేదు. ఓ పుత్రా! వాస్తవానికి నీ ఈ శరీరం లౌకికమైనది పరమార్థమైనది కాదు. పూర్వం శిలాదుడు, దేవతలు, మునులు, సిద్ధులు, గంధర్వులు, దానవశ్రేష్ఠులు నీదివ్యదేహాన్ని చూచి పూజించారు. ఓ నందికేశ్వరా! సుఖదుఃఖాలు మాటిమాటికి పర్యాయంగా రావడం సంసారస్వభావం. మానవులకు పుట్టుక పరిత్యజించదగింది. వివేకులైన పురుషులు ఇదే చెప్పారు.

**ఏవముక్త్వా తు మాం సాక్షాత్సర్వదేవమహేశ్వరః ॥23॥**

**కరాభ్యాం సుశుభాభ్యాం చ ఉభాభ్యాం పరమేశ్వరః ।**
**పస్పర్శ భగవాన్ రుద్రః పరమార్తిహరో హరః ॥24॥**

**ఉవాచ చ మహాదేవః తుష్టాత్మా వృషభధ్వజః ।**
**నిరీక్ష్య గణపాంశ్చైవ దేవీం హిమవతః సుతామ్ ॥25॥**

**సమాలోక్య చ తుష్టాత్మా మహాదేవః సురేశ్వరః ।**

ఈ విధంగా పలికి సర్వదేవదేవుడు, పరమేశ్వరుడు, రుద్రభగవానుడు పరమదుఃఖహరుడు అయిన శివుడు మంగళదాయకాలైన తన రెండు చేతులతో స్వయంగా నన్ను స్పృశించాడు. సంతోషించిన హృదయంకలవాడైన వృషభధ్వజుడు, మహాదేవుడు ప్రమథగణాల్ని, హిమవంతుడి కుమార్తె అయిన పార్వతిని చూసి ఇలా పలికాడు.

**అజరో జరయా త్యక్తో నిత్యం దుఃఖవివర్జితః ॥26॥**

**అక్షయశ్చావ్యయశ్చైవ సపితా స సుహృజ్జనః ।**
**మమేష్టో గణపశ్చైవ మద్వీర్యో మత్పరాక్రమః ॥27॥**

**ఇష్టో మమ సదా చైవ మమ పార్శ్వగతః సదా ।**
**మద్బలశ్చైవ భవితా మహాయోగబలాన్వితః ॥28॥**

నీవు నీ తండ్రితో, మిత్రజనంతో కూడా దుఃఖరహితుడవై ముసలితనం లేకుండా, నాశనం లేకుండా ఎల్లప్పుడూ నాకు ఇష్టకార్యాలు చేస్తూ నా ప్రక్కనే ఉండు. నీవు నాలాంటి బలశాలివి మరియు యోగబలంతో కూడినవాడివి.

**ఏవముక్త్వా చ మాం దేవో భగవాన్ సగణస్తదా ।**
**కుశేశయమయీం మాలాం సమున్ముచ్యాత్మనస్తదా ॥29॥**

**ఆబబంధ మహాతేజా మమ దేవో వృషధ్వజః ।**
**తయాహం మాలయా జాతః శుభయా కంఠసక్తయా ॥30॥**

**త్ర్యక్షో దశభుజశ్చైవ ద్వితీయ ఇవ శంకరః ।**

ఈ విధంగా నన్ను గూర్చి పలికి ప్రమథులతో కూడిన వృషభధ్వజుడూ, మహాతేజుడూ ఐన, శంకరభగవానుడు శతదళపద్మ నిర్మితమైన తన కంఠమందలి మాలను తీసి నా కంఠమందు వేసినాడు. మంగళకరమైన కంఠమందుగల ఆమాలతో నేను ముక్కంటిని, దశభుజుణ్ణి అయి రెండో శంకరుడి మాదిరిగా కన్పించాను.

**తత ఏవ సమాదాయ హస్తేన పరమేశ్వరః ॥31॥**

**ఉవాచ బ్రూహి కిం తేఽద్య దదామి వరముత్తమమ్ ।**
**తతో జటాశ్రితం వారి గృహీత్వా చాతినిర్మలమ్ ॥32॥**

**ఉక్త్వా నదీ భవస్వేతి ఉత్ససర్జ వృషధ్వజమ్ ।**
**తతః సా దివ్యతోయా చ పూర్ణాసితజలా శుభా ॥33॥**

**పద్మోత్పలవనోపేతా ప్రావర్తత మహానదీ ।**

తర్వాత పరమేశ్వరుడు నన్ను తన హస్తాలతో స్పర్శించి దగ్గరకు తీసుకుని ఇలా పలికాడు. ఇప్పుడు నీకు ఉత్తమమైన ఏ వరాన్ని ఇవ్వాలో చెప్పు. తర్వాత తన జటాజూటమందుగల స్వచ్ఛమైన నీటిని చేతిలోనికి తీసుకుని శంకరుడు 'నదివి కమ్మ'ని పలికి ఆ నీటిని నందిపై చల్లాడు. తర్వాత మంగళకరాలు, శ్యామలవర్ణాలు, పరిపూర్ణాలు అయిన ఆ దివ్యజలాలు, పద్మాలు మరియు ఉత్పలాలు గల మహానదిగా ఏర్పడ్డాయి.

**తామాహ చ మహాదేవో నదీం పరమశోభనామ్ ॥34॥**

**యస్మాజ్జటోదకాదేవ ప్రవృత్తా త్వం మహానదీ ।**
**తస్మాజ్జటోదకా పుణ్యా భవిష్యసి సరిద్వరా ॥35॥**

**త్వయి స్నాత్వా నరః కశ్చిత్సర్వపాపైః ప్రముచ్యతే ।**

అత్యంతసుందరమైన ఆ నదినుద్దేశించి శివభగవానుడు ఇలా పలికాడు. జటలలోని ఉదకం నుంచి పుట్టిన కారణంగా నీవు 'జటోదక' అనే పేరుగల పుణ్య నదీ శ్రేష్ఠవు కాగలవు. నీయందు స్నానం చేసిన మనుష్యుడు ఎవ్వడైనా సమస్తపాపాలనుంచి విముక్తుడు కాగలడు.

**తతో దేవ్యా మహాదేవః శిలాదతనయం ప్రభుః ॥36॥**

**పుత్రస్తేఽయమితి ప్రోచ్య పాదయోః సంన్యపాతయత్ ।**
**సా మామాఘ్రాయ శిరసి పాణిభ్యాం పరిమార్జతీ ॥37॥**

**పుత్రప్రేమ్ణాభ్యషించచ్చ స్రోతోభిస్తనయైస్త్రిభిః ।**
**పయసా శంఖగౌరేణ దేవదేవం నిరీక్ష్య సా ॥38॥**

**తాని స్రోతాంసి త్రీణ్యస్యాః స్రోతస్విన్యోఽభవంస్తదా ।**
**నదీం త్రిస్రోతసం దేవో భగవానవదద్భవః ॥39॥**

తర్వాత శివుడు శిలాద పుత్రుణ్ణి అయిన నన్ను తీసుకుని ఈతడు నీ పుత్రుడు అని పలికి పార్వతీదేవి పాదాలపై పడవేసినాడు. ఆమె నా మూర్ధాన్ని ఆఘ్రాణించి చేతులతో తాకింది. శివుణ్ణి చూచి పార్వతీదేవి పుత్రప్రేమతో శంఖంవలె తెల్లనైన మూడు స్తన్యధారలతో నన్ను అభిషేకించింది. ఆమె జార్చిన ఆ మూడు పాలబిందువులు మూడు నదులయ్యాయి. భగవంతుడు శివుడు ఆ మూడు నదులకు 'త్రిస్రోతస్సు' అనే పేరు పెట్టినాడు.

**త్రిస్రోతసం నదీం దృష్ట్వా వృషః పరమహర్షితః ।**
**ననాద నాదాత్తస్మాచ్చ సరిదన్యా తతోఽభవత్ ॥40॥**

**వృషధ్వనిరితి ఖ్యాతా దేవదేవేన సా నదీ ।**

ఆ త్రిస్రోతస్సు నదిని చూచి నంది మిక్కిలి సంతోషించినవాడై ధ్వని చేశాడు. ఆ ధ్వని నుంచి మరో నది పుట్టింది. ఆ నదికిప్పుడు దేవదేవుడైన శివుడు 'వృషధ్వని' అని పేరు పెట్టాడు.

**జాంబూనదమయం చిత్రం సర్వరత్నమయం శుభమ్ ॥41॥**

**స్వం దేవశ్చాద్భుతం దివ్యం నిర్మితం విశ్వకర్మణా ।**
**ముకుటం చాబబంధేశో మమ మూర్ధ్ని వృషధ్వజః ॥42॥**

**కుండలే చ శుభే దివ్యే వజ్రవైదూర్యభూషితే ।**
**ఆబబంధ మహాదేవః స్వయమేవ మహేశ్వరః ॥43॥**

అప్పుడు శివభగవానుడు విశ్వకర్మచేత నిర్మింపబడినది, అద్భుతమైనది అయిన తన బంగారు కిరీటాన్ని నాశిరసున అలంకరించాడు. అట్లే వజ్రవైదూర్యాలతో అలంకరించిన మంగళకరాలైన దివ్య కుండలాలను మహాదేవ మహేశ్వరుడు స్వయంగా నా చెవులకు అలంకరించాడు.

**మాం తథాభ్యర్చితం వ్యోమ్ని దృష్ట్వా మేఘైః ప్రభాకరః ।**
**మేఘాంబసా చాభ్యషించచ్ఛిలాదనమథో మునే ॥44॥**

**తస్యాభిషిక్తస్య తదా ప్రవృత్తా స్రోతసా భృశమ్ ।**
**యస్మాత్సువర్ణాన్నిఃసృజ్య నద్యేషా సంప్రవర్తతే ॥45॥**

**స్వర్ణోదకేతి తామాహ దేవదేవస్త్రియంబకః ।**
**జాంబూనదమయాద్యస్మాద్ ద్వితీయా ముకుటాచ్ఛుభా ॥46॥**

**ప్రావర్తత నదీ పుణ్యా ఊచుర్జాంబూనదీతి తామ్ ।**
**ఏతత్పంచనదం నామ జప్యేశ్వరసమీపగమ్ ॥47॥**

**యః పంచనదమాసాద్య స్నాత్వా జప్యేశ్వరేశ్వరమ్ ।**
**పూజయేచ్ఛివసాయుజ్యం ప్రయాత్యేవ న సంశయః ॥48॥**

ఈ విధంగా పూజింపబడిన నన్ను చూచి సూర్యుడు ఆకాశంలోని మేఘాల యొక్క జలంతో నన్ను అభిషేకించాడు. అధికమైన ఆ అభిషేకజలాలతో నది ఏర్పడింది. సువర్ణమకుటంనుంచి జాలువారి నదిగా ప్రవర్తిల్లడంవలన దానిని త్రియంబకశివుడు 'స్వర్ణోదక' అని పిలిచాడు. జాంబూనదవికారమైన కిరీటం నుంచి ఉత్పన్నమైనది కావున ఆ పుణ్యనదిని జంబూనది అని పిలుస్తున్నారు. ఈ అయిదునదులు జప్యేశ్వర సమీపంలో

ప్రవహిస్తాయి. ఈ పంచనదులకు వెళ్లి వాటిలో స్నానం చేసి, జప్యేశ్వరుణ్ణి పూజించిన వాడు శివసాయుజ్యాన్ని పొందుతాడు. ఇందుకు ఎలాంటి సందేహం లేదు.

**అథ దేవో మహాదేవః సర్వభూతపతిర్భవః ।**
**దేవీమువాచ శర్వాణీముమాం గిరిసుతామజామ్ ॥49॥**

**దేవి నందీశ్వరం దేవమభిషించామి భూతపమ్ ।**
**గణేంద్రం వ్యాహరిష్యామి కిం వా త్వం మన్యసేఽవ్యయే ॥50॥**

అప్పుడు సమస్తభూతనాథుడైన మహాదేవుడు అజన్మ, గిరిసుత, శర్వాణి అయిన ఉమాదేవిని గూర్చి ఇలా పలికాడు. ఓ దేవీ! నేను నందీశ్వరుణ్ణి భూతాలకు అధినాథుడుగా అభిషేకిస్తున్నాను. గణనాథుడుగా పిలుస్తున్నాను. అవ్యయమైన దేవీ! నీవు ఏమని తలుస్తున్నావు?

**తస్య తద్వచనం శ్రుత్వా భవానీ హర్షితాననా ।**
**స్మయంతీ వరదం ప్రాహ భవం భూతపతిం పతిమ్ ॥51॥**

**సర్వలోకాధిపత్యం చ గణేశత్వం తథైవ చ ।**
**దాతుమర్హసి దేవేశ శైలాదిస్తనయో మమ ॥52॥**

శివుడు పలికిన ఆ మాటను విన్న పార్వతీదేవి ప్రసన్నముఖి అయి వరదుడు, భూతపతి మరియు తన పతి అయిన శివుడిని గూర్చి నవ్వుతూ ఇలా పలికింది.

ఓ దేవదేవా! ఈతడికి సర్వలోకాధిపత్యాన్ని, ప్రమథగణనాయకత్వాన్ని నీవు ఇవ్వదగినవాడవు. ఈ నందీశ్వరుడు నాకునూ పుత్రుడే.

**తతః సభగవాన్ శర్వః సర్వలోకేశ్వరేశ్వరః ।**
**సస్మార గణపాన్ దివ్యాన్ దేవదేవో వృషధ్వజః ॥53॥**

తర్వాత సమస్తలోకనాథులకు నాథుడైన శర్వుడు దేవదేవవృషధ్వజశివభగవానుడు దివ్యప్రమథగణాల్ని స్మరించాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే నందికేశ్వరప్రాదుర్భావనందికేశ్వరాభిషేకమంత్రో నామ త్రిచత్వారింశోఽధ్యాయః ॥ 43 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని నందికేశ్వరప్రాదుర్భావ నందికేశ్వరాభిషేకమంత్రమనే నలభై మూడవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **చతుశ్చత్వారింశోఽధ్యాయః** – నలభై నాల్గవ అధ్యాయం
## **నందికేశ్వరాభిషేకవర్ణనమ్** – నందికేశ్వరాభిషేకవర్ణనం

**శైలాదిరువాచ** – శైలాదుడు పలికాడు.

**స్మరణాదేవ రుద్రస్య సంప్రాప్తాశ్చ గణేశ్వరాః ।**
**సర్వే సహస్రహస్తాశ్చ సహస్రాయుధపాణయః ॥1॥**

**త్రినేత్రాశ్చ మహాత్మాన స్త్రిదశైరపి వందితాః ।**
**కోటికాలాగ్నిసంకాశాః జటాముకుటధారిణః ॥2॥**

**దంష్ట్రాకరాలవదనా నిత్యా బుద్ధాశ్చ నిర్మలాః ।**
**కోటికోటిగణైస్తుల్యైరాత్మనా చ గణేశ్వరాః ॥3॥**

**అసంఖ్యాతా మహాత్మానస్తత్రాజగ్ముర్ముదా యుతాః ॥**

శివుడు స్మరించగానే ప్రమథగణం అక్కడకు వచ్చింది. వాళ్లందరూ వేయి హస్తాలు గలవాళ్లు. వేల ఆయుధాల్ని చేతులందు ధరించి ఉన్నారు. వారందరూ ముక్కంటులే. వాళ్లు అందరూ మహాత్ములు. దేవతలచేత కూడా నమస్కరింపబడిన వాళ్లు. ప్రళయకాలంలో కోటి అగ్నుల ప్రకాశంతో సమానమైన కాంతి గల్గిన వాళ్లు. జటలనే మకుటాలుగా ధరించిన వాళ్లు. కోరలతో కరాళముఖులుగా ఉన్నారు. వాళ్లు నిత్యులు. ప్రబుద్ధులు. నిర్మలులు. తమతో సమానులైన కోట్లకొలది అనుచర గణాలతో కూడినవాళ్లు. మహాత్ములైన ఆ ప్రమథులు అసంఖ్యాకంగా సంతోషంగా అక్కడకు వచ్చారు.

**గాయంతశ్చ ద్రవంతశ్చ నృత్యంతశ్చ మహాబలాః ।**
**ముఖాడంబరవాద్యాని వాదయంతస్తథైవ చ ॥4॥**

**రథైర్నాగైర్హయైశ్చైవ సింహమర్కటవాహనాః ।**
**విమానేషు తథారూఢా హేమచిత్రేషు వై గణాః ॥5॥**

**భేరీమృదంగకాద్యైశ్చ పణవానకగోముఖైః ।**
**వాదిత్రైర్వివిధైశ్చాన్యైః పటహైరేకపుష్కరైః ॥6॥**

**భేరీమురజసంనాదైరాడంబరకడిండిమైః ।**
**మర్దలైర్వేణువీణాభిర్వివిధైస్తాలనిఃస్వనైః ॥7॥**

**దర్దురైస్తలఘాతైశ్చ కచ్ఛపైః పణవైరపి ।**
**వాద్యమానైర్మహాయోగా ఆజగ్ముర్దేవసంసదమ్ ॥8॥**

మహాబలవంతులైన ఆ ప్రమథగణాలు పాడుతూ, నాట్యం చేస్తూ, పరిగెత్తుతూ ముఖాలతో అనేకవాద్యాలను వాయిస్తూ అక్కడకు వచ్చారు. వారు రథాల్ని, ఏనుగుల్ని, గుఱ్ఱాల్ని, సింహాల్ని, కోతుల్ని అధిరోహించారు. కొందరు స్వర్ణాలంకృతవిమానాల్ని ఎక్కారు. గొప్పయోగబలసంపన్నులైన ఆ గణాలు భేరులు, మృదంగాలు, పణవాలు, ఆనకాలు, గోముఖాలు, పటహాలు, ఏకపుష్కరాలు, మురజాలు, ఆడంబరాలు, డిండిమాలు, మర్దలలు, వేణువులు, వీణలు, దర్దురాలు, తలఘాతలు, కచ్ఛపాలు మొదలైన వాద్యాల్ని వాయిస్తూ పలువిధాలైన తాళధ్వనుల్ని పలికిస్తూ శివభగవానుడి సభకు విచ్చేశారు.

**తే గణేశా మహాసత్త్వాః సర్వదేవేశ్వరేశ్వరాః ।**
**ప్రణమ్య దేవం దేవీం చ ఇదం వచనమబ్రువన్ ॥9॥**

**భగవన్ దేవదేవేశ త్రియంబక వృషధ్వజ ।**
**కిమర్థం చ స్మృతా దేవ ఆజ్ఞాపయ మహాద్యుతే ॥10॥**

సమస్త దేవాధిపతులకు అధిపతులు మహాబలవంతులైన ఆ గణేశ్వరులు శివుడికి, పార్వతికి నమస్కరించి ఈ విధంగా పలికారు. భగవంతుడా! దేవదేవుడా! ముక్కంటీ! వృషభధ్వజా! మమ్మల్ని ఎందుకు స్మరించారు. దేవా! మహాకాంతిమంతుడా! ఆదేశించండి!

**కిం సాగరాన్ శోషయామో యమం వా సహ కింకరైః ।**
**హన్మో మృత్యుసుతాం మృత్యుం పశువద్ధన్మ పద్మజమ్ ॥11॥**

**బద్ధ్వేంద్రం సహ దేవైశ్చ సహ విష్ణుం చ వాయునా ।**
**ఆనయామః సుసంక్రుద్ధా దైత్యాన్ వా సహదానవైః ॥12॥**

**కస్యాద్య వ్యసనం ఘోరం కరిష్యామస్తవాజ్ఞయా ।**
**కస్య వాద్యోత్సవో దేవ సర్వకామసమృద్ధయే ॥13॥**

మేము సముద్రాల్ని ఎండింపజేయాలా? భటులతో పాటు యముణ్ణి చంపాలా? మృత్యువును, ఆతడి కుమార్తెను (జరను) చంపాలా? బ్రహ్మను పశువుమాదిరిగా వధించాలా? దేవతలతో కూడిన ఇంద్రుణ్ణి, వాయువుతో కూడిన విష్ణువును బంధించి తీసుకు రావాలా? మహాకోపం కలవారమై దానవులతోపాటుగా దైత్యుల్ని మీ సన్నిధికి బంధించి తేవాలా? మేము మీ ఆజ్ఞతో ఇప్పుడు ఏ ఘోరమైన అనర్థకార్యాన్ని నిర్వహించాలి? దేవా! ఇపుడు ఎవడి కోరికల్ని తీర్చడానికి ఈ ఉత్సవం జరుగుతున్నది.

**తాంస్తథా వాదినః సర్వాన్ గణేశాన్ సర్వసమ్మతాన్ ।**
**ఉవాచ దేవః సంపూజ్య కోటికోటిశతాన్ ప్రభుః ॥14॥**

**శృణుధ్వం యత్కృతే యూయమిహాహూతా జగద్ధితాః ।**
**శ్రుత్వా చ ప్రయతాత్మానః కురుధ్వం తదశంకితాః ॥15॥**

**నందీశ్వరోఽయం పుత్రో నః సర్వేషామీశ్వరేశ్వరః ।**
**విప్రోఽయం నాయకశ్చైవ సేనానీర్వః సమృద్ధిమాన్ ॥16॥**

**తమిమం మమ సందేశాద్యూయం సర్వేఽపి సమ్మతాః ।**
**సేనాన్యమభిషించధ్వం మహాయోగపతిం పతిమ్ ॥17॥**

ఆ విధంగా మాట్లాడుతున్న వందలకోట్ల సంఖ్యలైన అందరికి ఇష్టులైన ఆ గణేశ్వరుల్ని పూజించి శివభగవానుడు ఇలా పలికాడు. లోకహితకారకులైన మిమ్మల్ని ఏకారణంగా పిలిచానో వినండి! ఆ కారణాన్ని విని శుద్ధాత్ములైన మీరు అనుమానరహితులై ఆ పనిని చేయండి! ఈతడు నందీశ్వరుడు. మాకు పుత్రుడు. అందరికి ప్రభువు. సమృద్ధిశాలి అయిన ఈ విప్రుడు మీకు నాయకుడు. సేనాపతి కూడా. నా ఆదేశానుసారంగా మీరందరూ ఈతణ్ణి మీస్వామిగా, సేనానిగా భావించి మహాయోగపతి అయిన ఈతణ్ణి అభిషేకించండి!

**ఏవముక్తా భగవతా గణపాః సర్వ ఏవ తే ।**
**ఏవమస్త్వితి సమ్మంత్ర్య సంభారానాహరంస్తతః ॥18॥**

ఈ విధంగా శివభగవానుడు పలుకగా ఆ సమస్తగణేశ్వరులు తమలోతాము సంప్రదించుకుని 'అది అట్లే అగుగాక' అని పలికి అభిషేకసామాగ్రిని సంగ్రహించి తెచ్చారు.

**తస్య సర్వాశ్రయం దివ్యం జాంబూనదమయం శుభమ్ ।**
**ఆసనం మేరుసంకాశం మనోహరముపాహరన్ ॥19॥**

**నైకస్తంభమయం చాపి చామీకరవరప్రభమ్ ।**
**ముక్తాదామావలంబం చ మణిరత్నావభాసితమ్ ॥20॥**

**స్తంభైశ్చ వైదూర్యమయైః కింకిణీజాలసంవృతమ్ ।**
**చారురత్నకసంయుక్తం మండపం విశ్వతోముఖమ్ ॥21॥**

**కృత్వా విన్యస్య తన్మధ్యే తదాసనవరం శుభమ్ ।**
**తస్యాగ్రతః పాదపీఠం నీలవజ్రావభాసితమ్ ॥22॥**

**చక్రుః పాదప్రతిష్ఠార్థం కలశౌ చాస్య పార్శ్వగౌ ।**
**సంపూర్ణౌ పరమాంభోభిరరవిందావృతాననౌ ॥23॥**

**కలశానాం సహస్రం తు సౌవర్ణం రాజతం తథా ।**
**తామ్రజం మృన్మయం చైవ సర్వతీర్థాంబుపూరితమ్ ॥24॥**

వాళ్లు దివ్యమూ, సుందరమూ, మనోహరమూ, మేరుసమానమూ అయిన బంగారు సింహాసనాన్ని తీసుకువచ్చారు. వాళ్లు బంగారుకాంతులతో ప్రకాశిస్తున్న అనేకస్తంభాలతో కూడిన మండపాన్ని నిర్మించారు. మణులు, రత్నాలు, ముత్యాల దండల జాలర్లతో దానిని అలంకరించారు. దాని మధ్యలో మంగళకరమైన ఆ సింహాసనశ్రేష్ఠాన్ని ఉంచారు. దాని ముందుభాగంలో నీలాలతో, వజ్రాలతో పొదగబడిన పాదాల్ని ఉంచుకోవడానికి పాదపీఠాన్ని ఉంచారు. దానికి రెండువైపులా రెండుజలకలశాల్ని ఉంచారు. అవి సుగంధజలాలతో నింపబడ్డాయి.

వాటి ముఖాలను పద్మమాలికలతో అలంకరించారు. అట్లే బంగారం, వెండి, రాగి మట్టివి అయిన వేయి కలశాలను సమస్త తీర్థజలాలతో నింపి వాటిని అక్కడ నిలిపారు.

**వాసోయుగం తథా దివ్యం గంధం దివ్యం తథైవ చ ।**
**కేయూరే కుండలే చైవ ముకుటం హారమేవ చ ॥25॥**

**ఛత్రం శతశాలకం చ బాలవ్యజనమేవ చ ।**
**దత్తం మహాత్మనా తేన బ్రహ్మణా పరమేష్ఠినా ॥26॥**

మహాత్ముడగు పరమేష్ఠి బ్రహ్మదేవుడు ఒక జతవస్త్రాల్ని, దివ్యమైన గంధాన్ని, రెండు స్వర్ణకంకణాల్ని, రెండు కుండలాల్ని, కిరీటాన్ని, హారాన్ని, వందతీగలతో కూర్చబడిన గొడుగును, చిన్న విసనకర్రను ఒసగాడు.

**శంఖహారాంగగౌరేణ పృష్ఠేనాపి విరాజితమ్ ।**
**వ్యజనం చంద్రశుభ్రం చ హేమదండం సుచామరమ్ ॥27॥**

**ఐరావతః సుప్రతీకో గజావేతౌ సుపూజితౌ ।**
**ముకుటం కాంచనం చైవ నిర్మితం విశ్వకర్మణా ॥28॥**

**కుండలే చామరే దివ్యే వజ్రం చైవ వరాయుధమ్ ।**
**జాంబూనదమయం సూత్రం కేయూరద్వయమేవ చ ॥29॥**

**సంభారాణి తథాన్యాని వివిధాని బహూన్యపి ।**
**సమంతాన్నిన్యురవ్యగ్రా గణపా దేవసమ్మతాః ॥30॥**

శంఖంతోను, ముత్యాలహారాలతోను సమానమైన తెల్లదనం గల వెనుక భాగంతో ప్రకాశించేది, చంద్రుడివలె పరిశుభ్రమైనది, స్వర్ణదండం గలది అయిన ఒక వింజామరాన్ని, పూజింపబడిన ఐరావతసుప్రతీములనే ఏనుగుల్ని విశ్వకర్మచేత తయారు చేయబడిన స్వర్ణకిరీటాన్ని, దివ్యాలూ, స్వచ్ఛాలూ అయిన రెండు కుండలాలు, శ్రేష్ఠవజ్రాయుధం, బంగారు యజ్ఞోపవీతం, రెండు దండకడియాలు అట్లే వివిధాలైన ఇతర సంభారసామగ్రిని దేవపూజితులైన ఆ గణేశ్వరులు స్తిమితులై సిద్ధం చేశారు.

**తతో దేవాశ్చ సేంద్రాశ్చ నారాయణముఖాస్తథా ।**
**మునయో భగవాన్ బ్రహ్మ నవబ్రహ్మాణ ఏవ చ ॥31॥**

**దేవైశ్చ లోకాః సర్వే తే తతో జగ్ముర్ముదా యుతాః ।**
**తేష్వాగతేషు సర్వేషు భగవాన్ పరమేశ్వరః ॥32॥**

**సర్వకార్యవిధిం కర్తుమాదిదేశ పితామహమ్ ।**

తర్వాత విష్ణువు, ఇంద్రుడితో కూడిన దేవతలు, మహామునులు, బ్రహ్మదేవుడు, మరీచి భృగ్వాదులైన నవబ్రహ్మలు, లోకపాలకులు అందరూ సంతోషంతో అక్కడకు వచ్చారు. వాళ్లందరూ అలా రాగా శివభగవానుడు సమస్తసంస్కారవిధుల్ని నిర్వహించడానికి బ్రహ్మను ఆదేశించాడు.

**పితామహోఽపి భగవాన్ నియోగాదేవ తస్య తు ॥33॥**

**చకార సర్వం భగవానభిషేకం సమాహితః ।**
**అర్చయిత్వా తతో బ్రహ్మా స్వయమేవాభ్యషేచయత్ ॥34॥**

**తతో విష్ణుస్తతః శక్రో లోకపాలాస్తథైవ చ ।**
**అభ్యషించంత విధివత్ గణేంద్రం శివశాసనాత్ ॥35॥**

శివుడి ఆదేశంమేరకు బ్రహ్మ కూడా అభిషేకవిధిని సమస్తాన్ని నిర్వహించాడు. నందీశ్వరుణ్ణి పూజించి తానే అభిషేకించాడు. తర్వాత విష్ణువు, ఇంద్రుడు, లోకపాలకులు శివుడి ఆదేశానుసారం యథావిధిగా అభిషేకించారు.

**ఋషయస్తుష్టువుశ్చైవ పితామహపురోగమాః ।**
**స్తుతవత్సు తతస్తేషు విష్ణుః సర్వజగత్పతిః ॥36॥**

**శిరస్యంజలిమాదాయ తుష్టావ చ సమాహితః ।**
**ప్రాంజలిః ప్రణతో భూత్వా జయశబ్దం చకార చ ॥37॥**

**తతో గణాధిపాః సర్వే తతో దేవాస్తతోఽసురాః ।**

బ్రహ్మ మొదలైనవారు మరియు మునులు ఆతణ్ణి స్తుతించారు. వాళ్లు స్తుతిచేస్తుండగా జగన్నాథుడైన విష్ణువు శిరసుపై అంజలుంచి ఏకాగ్రచిత్తుడై ఆతణ్ణి స్తుతించి ముకుళితహస్తుడై నమస్కరిస్తూ జయజయ ధ్వనులు చేశాడు. తదుపరి గణేశ్వరులు, సమస్తదేవతలు, రాక్షసులు అందరూ జయజయధ్వానాలు చేశారు.

**ఏవం స్తుతశ్చాభిషిక్తో దేవైః సబ్రహ్మకైస్తదా ॥38॥**

**ఉద్వాహశ్చ కృతస్తత్ర నియోగాత్పరమేష్ఠినః ।**
**మరుతాం చ సుతా దేవీ సుయశాఖ్యా బభూవ యా ॥39॥**

**లబ్ధం శశిప్రభం ఛత్రం తయా తత్ర విభూషితమ్ ।**
**చామరే చామరాసక్తహస్తాగ్రైః స్త్రీగణైర్యుతా ॥40॥**

**సింహాసనం చ పరమం తయా చాధిష్ఠితం మయా ।**
**అలంకృతా మహాలక్ష్మ్యా ముకుటాద్యైః సుభూషణైః ॥41॥**

ఈ విధంగా బ్రహ్మతో కూడిన సమస్తదేవతలచేత నందీశ్వరుడియొక్క అభిషేకం మరియు స్తుతి జరిగిన తర్వాత బ్రహ్మయొక్క ఆజ్ఞ వలన ఆతడికి వివాహం చేయబడింది. "సుయశ" అనే పేరుగల మరుత్తుని పుత్రిక ఆతడికి భార్య అయ్యింది. చంద్రుడి కాంతితో సమానమైన కాంతిగల, విశేషంగా అలంకరింపబడినది అయిన ఒక గొడుగు ఆమెకు లభించింది. చామరాలు చేతులందు ధరించిన స్త్రీ సమూహాలతో కూడియున్న సుయశకు రెండు చామరాలు ఇవ్వబడ్డాయి. నాతోపాటు(నంది) ఆమె కూడా మహోన్నతమైన ఆ సింహాసనాన్ని అధిష్ఠించింది. లక్ష్మీదేవి సుయశను కిరీటంతోను, సుందరాభరణాలతోను అలంకరించింది.

**లబ్ధో హారశ్చ పరమో దేవ్యాః కంఠగతస్తథా ।**
**వృషేంద్రశ్చ సితో నాగః సింహః సింహధ్వజస్తథా ॥42॥**

**రథశ్చ హేమచ్ఛత్రం చ చంద్రబింబసమప్రభమ్ ।**
**అద్యాపి సదృశః కశ్చిన్మయా నాస్తి విభుః క్వచిత్ ॥43॥**

దేవి సుయశ కంఠం ఉన్నతమైన హారాన్ని పొందింది. వృషేంద్రులు, తెల్లటి ఏనుగు, సింహం, సింహధ్వజం, రథం, చంద్రసమకాంతియుత స్వర్ణచ్ఛత్రం లభించాయి. అప్పుడు నాకు సమానమైన ప్రభువు ఎవ్వడూ ఎక్కడా కనపడలేదు.

**సాన్వయం చ గృహీత్వేశస్తథా సంబంధిబాంధవైః ।**
**ఆరుహ్య వృషమీశానో మయా దేవ్యా గతః శివః ॥44॥**

సపరివారబంధుగణాలతో కూడిన నన్ను ఈశ్వరభగవానుడు తీసుకుని వృషభాన్ని అధిరోహించి నాతోనూ పార్వతీదేవితోను అక్కడ నుంచి వెళ్లాడు.

**తదా దేవీం భవం దృష్ట్వా మయా చ ప్రార్థయన్ గణైః ।**
**మునిదేవర్షయః సిద్ధా ఆజ్ఞాం పాశుపతీం ద్విజాః ॥45॥**

అప్పుడు నాతోను గణాలతోను ఉన్న పార్వతీపరమేశ్వరుల్ని చూచి మహామునులు, దేవర్షులు, సిద్ధులు మరియు విప్రులు శివాజ్ఞకై ప్రార్థించారు.

**అథాజ్ఞాం ప్రదదౌ తేషామర్చ్యాణామాజ్ఞయా విభోః ।**
**నందికో నగజాభర్తుస్తేషాం పాశుపతీం శుభామ్ ॥46॥**

పార్వతీపతి అయిన శివుడి ఆజ్ఞచే పూజార్హులైన వారందరికి నంది మంగళకరమైన పాశుపత ఆజ్ఞను (దీక్షను) ప్రదానం చేశాడు.

**తస్మాద్ధి మునయో లబ్ధ్వా తదాజ్ఞాం మునిపుంగవాత్ ।**
**భవభక్తాస్తదా చాసంస్తస్మాదేవం సమర్చయేత్ ॥47॥**

మునిశ్రేష్ఠుడైన నంది నుండి వాళ్లు శివదీక్షనుపొంది ఆమునులంతా శివభక్తులయ్యారు. అందుచేత అందరూ శివుణ్ణి పూజించాలి.

**నమస్కారవిహీనస్తు నామ ఉద్గిరయేద్భవే ।**
**బ్రహ్మఘ్నదశసంతుల్యం తస్య పాపం గరీయసమ్ ॥48॥**

**తస్మాత్సర్వప్రకారేణ నమస్కారాదిముచ్చరేత్ ।**
**ఆదౌ కుర్యాన్నమస్కారం తదంతే శివతాం వ్రజేత్ ॥49॥**

ఎవడు నమస్కారరహితంగా శివనామాన్ని ఉచ్చరిస్తాడో ఆతడు పదిమంది బ్రాహ్మణుల్ని వధించిన పాపంతో సమానమైన పెద్దపాపాన్ని పొందుతాడు. అందువల్ల అన్నివిధాల 'నమః' అనుదాన్ని ముందుగా ఉచ్చరించాలి."నమఃశివాయ" అని జపించాలి. నమఃశివాయ మంత్రాన్ని జపించినవాడు మరణించిన తరువాత శివసాయుజ్యాన్ని పొందుతాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే నందికేశ్వరాభిషేకో నామ చతుశ్చత్వారింశోఽధ్యాయః ॥ 44 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగం "నందికేశ్వరాభిషేకమ"నే నలభై నాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచచత్వారింశోఽధ్యాయః - నలభై అయిదవ అధ్యాయం

## పాతాలవర్ణనమ్ - పాతాళవర్ణనం

**ఋషయః ఊచుః -** ఋషులు పలికారు.

**సూత సువ్యక్తమఖిలం కథితం శంకరస్య తు ।**
**సర్వాత్మభావం రుద్రస్య స్వరూపం వక్తుమర్హసి ॥1॥**

ఓ సూతమహర్షీ! నీవు శివుడి విషయాలన్నీ మాకు స్పష్టంగా తెలియజేశావు. ఇప్పుడు నీవు శివుడి సర్వాత్మభావం మరియు స్వరూపం తెల్పదగినవాడవు.

**సూత ఉవాచ -** సూతర్షి పలికాడు.

**భూర్భువః స్వర్మహశ్చైవ జనః సాక్షాత్తపస్తథా ।**
**సత్యలోకశ్చ పాతాలం నరకార్ణవకోటయః ॥2॥**

**తారకాగ్రహసోమార్కా ధ్రువః సప్తర్షయస్తథా ।**
**వైమానికాస్తథాన్యే చ తిష్ఠంత్యస్య ప్రసాదతః ॥3॥**

ఓ మహర్షులారా! భూర్లోకం, భువర్లోకం, స్వర్లోకం, మహర్లోకం, జనోలోకం, తపోలోకం, సత్యలోకం-పాతాళం, కోటినరకాలు, కోటిసముద్రాలు, తారాగణాలు, గ్రహగణాలు, సూర్యచంద్రులు, ధ్రువుడు, సప్తర్షులు, విమానయానంగల దేవగణాలు అట్లే మిగిలినవన్నీ శివుడి అనుగ్రహంవల్ల నిలిచి ఉన్నాయి.

**అనేన నిర్మితాస్త్వేవం తదాత్మానో ద్విజర్షభాః ।**
**సమష్టిరూపః సర్వాత్మా సంస్థితః సర్వదా శివః ॥4॥**

ఇవన్నీ శివుడిచే నిర్మింపబడ్డాయి. ఓ ద్విజశ్రేష్ఠులారా! ఇవన్నీ ఆయన ఆత్మస్వరూపాలే. సర్వాత్ముడైన శివుడు వీటి అన్నింటిలో ఎల్లప్పుడూ సమష్టిరూపంలో నిలిచి ఉన్నాడు.

**సర్వాత్మానం మహాత్మానం మహాదేవం మహేశ్వరమ్ ।**
**న విజానంతి సమ్మూఢా మాయయా తస్య మోహితాః ॥5॥**

**తస్య దేవస్య రుద్రస్య శరీరం వై జగత్రయమ్ ।**
**తస్మాత్ప్రణమ్య తం వక్ష్యే జగతాం నిర్ణయం శుభమ్ ॥6॥**

ఆయన మాయచేత మోహితులై మహామూఢులైన జనులు సర్వాత్ముణ్ణి, మహాత్ముణ్ణి మహాదేవమహేశ్వరుణ్ణి తెలియలేకున్నారు. ఈ మూడులోకాలు రుద్రదేవుడి శరీరమే. అందుచేత ఆయనకు నమస్కరించి లోకానికి మంగళకరమైన విస్తారవర్ణన చేస్తాను.

**పురా వః కథితం సర్వం మయాండస్య యథా కృతిః ।**
**భువనానాం స్వరూపం చ బ్రహ్మాండే కథయామ్యహమ్ ॥7॥**

**పృథివీ చాంతరిక్షం చ స్వర్మహర్జన ఏవ చ ।**
**తపః సత్యం చ సప్తైతే లోకాస్త్వండోద్భవాః శుభాః ॥8॥**

**అధస్తాదత్ర చైతేషాం ద్విజాః సప్త తలాని తు ।**
**మహాతలాదయస్తేషాం అధస్తాన్నరకాః క్రమాత్ ॥9॥**

పూర్వం నేను మీకోసం సమస్తం చెప్పాను. అండం ఆకారం, మరియు బ్రహ్మాండంలోని భువనాల స్వరూపం చెప్పుతున్నాను. పృథ్వి, అంతరిక్షం, భువర్లోకం, స్వర్లోకం, మహర్లోకం, జనోలోకం, తపోలోకం ఈ ఏడు మంగళకరలోకాలు అండం నుంచి ఉద్భవించాయి. బ్రాహ్మణులారా! వీటి క్రింద మహాతలాదులు ఏడు తలాలు ఉన్నాయి. వీటి క్రింద క్రమంగా నరకాలు ఉన్నాయి.

**మహాతలం హేమతలం సర్వరత్నోపశోభితమ్ ।**
**ప్రసాదైశ్చ విచిత్రైశ్చ భవస్యాయతనైస్తథా ॥10॥**

**అనంతేన చ సంయుక్తం ముచుకుందేన ధీమతా ।**
**నృపేణ బలినా చైవ పాతాలస్వర్గవాసినా ॥11॥**

మహాతలలోకం స్వర్ణమయం. సమస్తరత్నాలంకృతప్రకాశితం. అద్భుతసౌధాలతోను శివుడి మందిరాలతోను కూడియున్నట్టిది. అనంతుడితోను, బుద్ధిమంతుడైన ముచుకుందుడితోను, పాతాళస్వర్గనివాసి అయిన బలిమహారాజుతోను కూడినట్టిది.

**శైలం రసాతలం విప్రాః శార్కరం హి తలాతలమ్ ।**
**పీతం సుతలమిత్యుక్తం వితలం విద్రుమప్రభమ్ ॥12॥**

**సితం హి అతలం తచ్చ తలం యచ్చ సితేతరమ్ ।**
**క్ష్మాయాస్తు యావద్విస్తారో హ్యధస్తేషాం చ సువ్రతాః ॥13॥**

**తలానాం చైవ సర్వేషాం తావత్సంఖ్యా సమాహితా ।**
**సహస్రయోజనం వ్యోమ దశసాహస్రమేవ చ ॥14॥**

**లక్షం సప్త సహస్రం హి తలానాం సఘనస్యతు ।**
**వ్యోమ్నః ప్రమాణం మూలం తు త్రింశత్సాహస్రకేణ తు ॥15॥**

బ్రాహ్మణులారా! రసాతలం శిలామయం. తలాతలం చెక్కరతో నిండియుండును. సుతలం పచ్చని రంగు కలది. వితలం పగడపుకాంతులు గలది. అతలం తెల్లనిది. తలమనేది నల్లనిది. శ్రేష్ఠవ్రతులారా! క్రిందగల ఈలోకాల వైశాల్యం పృథ్వీ వైశాల్యంతో సమానం. వేయి యోజనములు. ప్రత్యేకతలంలో పైనగల ఆకాశం పదివేలయోజనముల విస్తీర్ణం కలది. ఈ ఏడు పాతాళాల ఘనవిస్తీర్ణము ఏడు లక్షల యోజనములు. చివరి మూడు పాతాళాముల యొక్క ప్రమాణము ముప్పైవేల యోజనములు.

**సువర్ణేన మునిశ్రేష్ఠాస్తథా వాసుకినా శుభమ్ ।**
**రసాతలమితి ఖ్యాతం తథాన్యైశ్చ నిషేవితమ్ ॥16॥**

**విరోచన హిరణ్యాక్షనరకాద్యైశ్చ సేవితమ్ ।**
**తలాతలమితి ఖ్యాతం సర్వశోభాసమన్వితమ్ ॥17॥**

మహర్షులారా! మంగళకరమైన రసాతలం సువర్ణవాసుకితోను అట్లే అన్యసర్పాలతోను కూడియుంటుంది. విరోచనుడు, హిరణ్యాక్షుడు, నరకుడు మొదలైన వారితో నిండినది, సమస్త కాంతులతో కూడినది తలాతలంగా ఖ్యాతి చెందింది.

**వైనావకాదిభిశ్చైవ కాలనేమిపురోగమైః ।**
**పూర్వదేవైః సమాకీర్ణం సుతలం చ తథాపరైః ॥18॥**

**వితలం దానవాద్యైశ్చ తారకాగ్నిముఖైస్తథా ।**
**మహాంతకాద్యైర్నాగైశ్చ ప్రహ్లాదేనాసురేణ చ ॥19॥**

వైనావకులనే పేరుగల దైత్యులచేత కాలనేమి మొదలుగాగల ఇతర రాక్షసులచేత నిండియున్నది సుతలం. తారకుడు, అగ్ని మొదలగు ముఖ్య దానవులచేత, మహాంతకుడు మొదలైన నాగులచేత అసురుడైన ప్రహ్లాదుడితో కూడియున్నది వితలలోకం.

**వితలం చాత్ర విఖ్యాతం కంబలాశ్వనిషేవితమ్ ।**
**మహాకుంభేన వీరేణ హయగ్రీవేణ ధీమతా ॥20॥**

**శంకుకర్ణేన సంభిన్నం తథా నముచిపూర్వకైః ।**
**తథాన్యైర్వివిధైర్వీరై స్తలం చైవ సుశోభితమ్ ॥21॥**

కంబలుడు, అశ్వతరుడు, వీరుడైన మహాకుంభుడు, బుద్ధిమంతుడైన హయగ్రీవుడు–వీరితో కూడి ప్రసిద్ధి చెందింది వితలలోకం. శంకుకర్ణుడు, నముచి మొదలైన ఇతరులైన వివిధవీరులతో శోభిల్లునది తలమనేలోకం.

**తలేషు తేషు సర్వేషు చాంబయా పరమేశ్వరః ।**
**స్కందేన నందినా సార్ధం గణపైః సర్వతో వృతః ॥22॥**

**తలానాంచైవ సర్వేషామూర్ధ్వతః సప్త సత్తమాః ।**
**క్ష్మాతలాని ధరా చాపి సప్తధా కథయామి వః ॥23॥**

ఈ అన్ని తలాల్లో (లోకాల్లో) పరమేశ్వరుడు పార్వతీదేవితోను, కుమారస్వామితోను, నందీశ్వరుడితోను, ప్రమథగణాలతోను అన్నిచోట్ల ఉంటాడు. ఈ ఏడులోకాలపై పృథ్వీతలం ఉన్నది. ఈ భూతలం కూడా ఏడు ఖండాలుగా విభాగింపబడింది. మీకు వాటి వివరాలు చెబుతున్నాను.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే పాతాలవర్ణనం నామ పంచచత్వారింశోఽధ్యాయః ॥ 45 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని పాతాళవర్ణనమనే నలభై అయిదవ అధ్యాయం సమాప్తం.

## షట్చత్వారింశోఽధ్యాయః - నలభైఆరవఅధ్యాయం
## ద్వీపద్వీపేశ్వరకథనమ్ - ద్వీపద్వీపేశ్వరకథనం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**సప్తద్వీపా తథా పృథ్వీ నదీపర్వతసంకులా ।**
**సముద్రైః సప్తభిశ్చైవ సర్వతః సమలంకృతా ॥1॥**

ఈ పృథ్వీతలం సప్తద్వీపాత్మకం. నదులతోను పర్వతాలతోను నిండియున్నది. ఏడుసముద్రాలతో అంతటా శోభిల్లుతున్నది.

**జంబూః ప్లక్షః శాల్మలిశ్చ కుశః క్రౌంచస్తథైవ చ ।**
**శాకః పుష్కరనామా చ ద్వీపాస్త్వభ్యంతరే క్రమాత్ ॥2॥**

ఈ భూతలంలోపల క్రమంగా "జంబూ, ప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, శాక, పుష్కర" అనే పేర్లుగల ద్వీపాలున్నాయి.

**సప్తద్వీపేషు సర్వేషు సాంబః సర్వగణైర్వృతః ।**
**నానావేషధరో భూత్వా సాన్నిధ్యం కురుతే హరః ॥3॥**

ఈ ఏడు ద్వీపాలలోను శివుడు పార్వతీసమేతంగా సమస్తప్రమథగణాలతోను కూడినవాడై పలువిధాలైన మూర్తుల్ని ధరించి నివసిస్తాడు.

**క్షారోదేక్షురసోదశ్చ సురోదశ్చ ఘృతోదధిః ।**
**దధ్యర్ణవశ్చ క్షీరోదః స్వాదూదశ్చాప్యనుక్రమాత్ ॥4॥**

**సముద్రేష్విహ సర్వేషు సర్వదా సగణః శివః ।**
**జలరూపీ భవః శ్రీమాన్ క్రీడతే చోర్మిబాహుభిః ॥5॥**

"క్షారోదము, ఇక్షురసోదము, సురోదము, ఘృతోదధి, దధ్యర్ణవము, క్షీరోదము, స్వాదూదము" అనేవి క్రమంగా సప్తసముద్రాలు. శ్రీమంతుడైన శివుడు ఎల్లప్పుడూ ఈ అన్ని సముద్రాలలోను గణాలతో కూడినవాడై జలరూపంలో ఉండి అలలు అనే బాహువులతో క్రీడిస్తుంటాడు.

**క్షీరార్ణవామృతమివ సదా క్షీరార్ణవే హరిః ।**
**శేతే శివజ్ఞానధియా సాక్షాద్వై యోగనిద్రయా ॥6॥**

**యదా ప్రబుద్ధో భగవాన్ ప్రబుద్ధమఖిలం జగత్ ।**
**యదా సుప్తస్తదా సుప్తం తన్మయం చ చరాచరమ్ ॥7॥**

క్షీరసముద్రం అమృతసమానం. ఈ పాలసముద్రంలో శ్రీహరి శివజ్ఞానచింతనతో స్వయంగా యోగనిద్రలో పవ్వళిస్తాడు. భగవంతుడు శివుడు ఎప్పుడు మేల్కొంటాడో అప్పుడు జగత్తు నిద్రిస్తుంది. ఈ చరాచరజగత్తు అంతా శివస్వరూపమే.

**తేనైవ సృష్టమఖిలం ధృతం రక్షితమేవ చ ।**
**సంహృతం దేవదేవస్య ప్రసాదాత్పరమేష్ఠినః ॥8॥**

పరమేష్ఠి, దేవదేవుడు అయిన శివుడి అనుగ్రహం వల్ల విష్ణువు ద్వారా సమస్త జగత్తు సృష్టింపబడింది. ధరింపబడి రక్షింపబడింది. నశించింది.

**సుషేణా ఇతి విఖ్యాతా యజంతే పురుషర్షభమ్ ।**
**అనిరుద్ధం మునిశ్రేష్ఠాః శంఖచక్రగదాధరమ్ ॥9॥**

ఓ మునిశ్రేష్ఠులారా! 'సుషేణ' అనే పేరుతో ప్రసిద్ధులైన ప్రజలు, శంఖం, చక్రం, గద– అనే ఆయుధాల్ని ధరించిన పురుషశ్రేష్ఠుడైన అనిరుద్ధుని పూజిస్తారు.

**యే చానిరుద్ధం పురుషం ధ్యాయంత్యాత్మవిదాం వరాః ।**
**నారాయణసమాః సర్వే సర్వసంపత్సమన్వితాః ॥10॥**

**సనందనశ్చ భగవాన్ సనకశ్చ సనాతనః ।**
**వాలఖిల్యాశ్చ సిద్ధాశ్చ మిత్రావరుణకౌ తథా ॥11॥**

**యజంతి సతతం తత్ర విశ్వస్య ప్రభవం హరిమ్ ।**

ఆత్మజ్ఞానం కలవారిలో శ్రేష్ఠులారా! ఎవ్వరు అనిరుద్ధుణ్ణి ధ్యానిస్తారో వాళ్లందరూ నారాయణుడితో సమానమైనవారు. సమస్తసంపదలు కలిగి ఉంటారు. సనందనుడు, సనకుడు, సనాతనుడు, వాలఖిల్యులు, సిద్ధులు, మిత్రావరుణులు ఎల్లప్పుడూ విశ్వోత్పత్తికారకుడైన విష్ణువును పూజిస్తున్నారు.

**సప్తద్వీపేషు తిష్ఠంతి నానాశృంగాః మహోదయాః ॥12॥**

**ఆసముద్రాయతాః కేచిత్ గిరయో గహ్వరైస్తథా ।**
**ధరాయాః పతయశ్చాసన్ బహవః కాలగౌరవాత్ ॥13॥**

**సామర్థ్యాత్పరమేశానాః క్రౌంచారేర్జనకాత్ప్రభోః ।**

ఈ సప్తద్వీపాలలో అనేకశిఖరాలుగల మహోన్నతాలైన పర్వతాలు ఉన్నాయి. కొన్ని పర్వతాలు గుహలు కలిగి సముద్రాల వరకు వ్యాపించి ఉన్నాయి. కాల ప్రభావం వల్ల అనేకులు భూపతులయ్యారు. వారు క్రౌంచపర్వతానికి శత్రువైన కుమారస్వామియొక్క తండ్రి అయిన శివభగవానుడి కృపవల్ల సమర్థులు పరమైశ్వర్యసంపన్నులయినారు.

**మన్వంతరేషు సర్వేషు అతీతానాగతేష్విహ ॥14॥**

**ప్రవక్ష్యామి ధరేశాన్ వో వక్ష్యే స్వాయంభువేఽంతరే ।**
**మన్వంతరేషు సర్వేషు అతీతానాగతేషు చ ॥15॥**

**తుల్యాభిమానినశ్చైవ సర్వే తుల్యప్రయోజనాః ।**
**స్వాయంభువస్య చ మనోః పౌత్రాస్త్వాసన్మహాబలాః ॥16॥**

**ప్రియవ్రతాత్మజా వీరాస్తే దశేహ ప్రకీర్తితాః ।**
**ఆగ్నీధ్రశ్చాగ్నిబాహుశ్చ మేధా మేధాతిథిర్వసుః ॥17॥**

**జ్యోతిష్మాన్ ద్యుతిమాన్ హవ్యః సవనః పుత్ర ఏవ చ ।**

ఋషులారా! ఇప్పుడు నేను స్వాయంభువమన్వంతరం నుంచి ప్రారంభించి కడచిన మరియు రానున్న అన్ని మన్వంతరాలలోని రాజుల గూర్చి చెబుతాను. భూతభవిష్యన్మన్వంతరాలు అన్నింటిలోను రాజులు సమానమైన అభిమానంగలవారు, మరియు సమానమైన ప్రయోజనం గలవారు. స్వాయంభువమనువుయొక్క పౌత్రులందరూ మహాబలవంతులు. ప్రియవ్రతుడి పుత్రులు వీరులు పదిమంది కలరు. వారు ఈ విధమైన పేర్లతో పిలువబడుతున్నారు. ఆగ్నీధ్రుడు, అగ్నిబాహుడు, మేధుడు, మేధాతిథి, వసువు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, హవ్యుడు, సవనుడు మరియు పుత్రుడు అనేవి ఆపేర్లు.

**ప్రియవ్రతోఽభ్యషించత్తాన్ సప్త సప్తసు పార్థివాన్ ॥18॥**
**జంబూద్వీపేశ్వరం చక్రే ఆగ్నీధ్రం సుమహాబలమ్ ।**
**ప్లక్షద్వీపేశ్వరశ్చాపి తేన మేఘాతిథిః కృతః ॥19॥**

**శాల్మలేశ్చ వపుష్మంతం రాజానమభిషిక్తవాన్ ।**
**జ్యోతిష్మంతం కుశద్వీపే రాజానం కృతవాన్నృపః ॥20॥**

**ద్యుతిమంతం చ రాజానం క్రౌంచద్వీపే సమాదిశత్ ।**
**శాకాద్వీపేశ్వరం చాపి హవ్యం చక్రే ప్రియవ్రతః ॥21॥**

**పుష్కరాధిపం చక్రే సవనం చాపి సువ్రతాః ।**

ప్రియవ్రతుడు తన ఏడుగురు కొడుకుల్ని ఏడు ద్వీపాలకు రాజులుగా అభిషిక్తుల్ని చేశాడు. వీరిలో మహాబలవంతుడైన ఆగ్నీధ్రుణ్ణి జంబూద్వీపానికి రాజును చేశాడు. మేధాతిథి ప్లక్షద్వీపానికి రాజు అయ్యాడు. వపుష్మంతుడు శాల్మలీద్వీపానికి రాజుగా అభిషిక్తుడయ్యాడు. ప్రియవ్రతుడు జ్యోతిష్మంతుణ్ణి కుశద్వీపానికి రాజును చేశాడు. క్రౌంచద్వీపానికి ద్యుతిమంతుణ్ణి ప్రభువును చేశాడు. శాకద్వీపప్రభువుగా హవ్యుణ్ణి ప్రియవ్రతుడు నియమించాడు. ఓ సువ్రతులారా! సవనుణ్ణి పుష్కరద్వీపాధిపతిని చేశాడు.

**పుష్కరే సవనస్యాపి మహావీతః సుతోఽభవత్ ॥22॥**
**ధాతకీచైవ ద్వావేతౌ పుత్రౌ పుత్రవతాంవరౌ ।**
**మహావీతం స్మృతం వర్షం తస్య నామ్నా మహాత్మనః ॥23॥**

**నామ్నా తు ధాతకేశ్చైవ ధాతకీఖండముచ్యతే ।**
**హవ్యోఽ ప్యజనయత్పుత్రాన్ శాకద్వీపేశ్వరః ప్రభుః ॥24॥**

**జలదం చ కుమారం చ సుకుమారం మణీచకమ్ ।**
**కుసుమోత్తరమోదాకీ సప్తమస్తు మహాద్రుమః ॥25॥**

**జలదం జలదస్యాథ వర్షం ప్రథమముచ్యతే ।**
**కుమారస్యతు కౌమారం ద్వితీయం పరికీర్తితమ్ ॥26॥**

**సుకుమారం తృతీయం తు సుకుమారస్య కీర్త్యతే ।**
**మణీచకం చతుర్థం తు మాణీచకమిహోచ్యతే ॥27॥**

**కుసుమోత్తరస్య వై వర్షం పంచమం కుసుమోత్తరమ్ ।**
**మోదకం చాపి మోదాకేర్వర్షం షష్ఠం ప్రకీర్తితమ్ ॥28॥**

**మహాద్రుమస్య నామ్నా తు సప్తమం తన్మహాద్రుమమ్ ।**
**తేషాం తు నామభిస్తాని సప్త వర్షాణి తత్ర వై ॥29॥**

పుష్కరద్వీపంలో సవనమహారాజుకు "మహావీతుడు, ధాతకి" అనే ఇద్దరు పుత్రులు కలిగారు. మహావీతుడి పేరుతో మహావీతవర్షం ఏర్పడింది. ధాతకి పేరుతో ధాతకీఖండం ఏర్పడింది. శాకద్వీపమహారాజు అయిన హవ్యుడునూ జలదుడు, కుమారుడు, సుకుమారుడు, మణీచకుడు, కుసుమోత్తరం, మోదకి ఏడవవాడైన మహాద్రుముడు అనే పుత్రులకు జన్మనిచ్చాడు. జలదుడి పేరుతో జలదమనే పేరుగల మొదటి వర్షమేర్పడింది. కుమారుడి పేరుతో రెండోది కౌమారవర్షం ఏర్పడింది. సుకుమారుడి పేరుతో మూడోది సుకుమార వర్షం ఏర్పడింది. మణీచకం పేరుతో మణీచకమనే నాల్గో వర్షం ఏర్పడింది. కుసుమోత్తరం పేరు మీద కుసుమోత్తరం అనే అయిదో వర్షం ఏర్పడింది. మోదకి పేరుతో 'మోదాకం' అనే ఆరో వర్షం ఏర్పడింది. మహాద్రుముడనే పేరుతో మహాద్రుమమనే ఏడో వర్షం ఏర్పడింది. వాళ్ల పేర్లమీద ఈ విధంగా ఏడు వర్షాలు (ఖండాలు) ఏర్పడ్డాయి.

**క్రౌంచద్వీపేశ్వరస్యాపి పుత్రా ద్యుతిమతస్తు వై ।**
**కుశలో మనుగశ్చోష్ణః పీవరశ్చాంధకారకః ॥30॥**

**మునిశ్చ దుఃదుభిశ్చైవ సుతా ద్యుతిమతస్తు వై ।**
**తేషాం స్వనామభిర్దేశాః క్రౌంచద్వీపాశ్రయాః శుభాః ॥31॥**

క్రౌంచద్వీపప్రభువైన ద్యుతిమంతుడికి కూడా కుశలుడు, మనుగుడు, ఉష్ణుడు, పీవరుడు, అంధకారుడు, ముని, దుందుభి అనే పుత్రులు కలిగారు. వాళ్లవాళ్లపేర్లతో క్రౌంచద్వీపాశ్రయంగా ఉన్న మంగళకరాలైన దేశాలు ప్రసిద్ధిపొందాయి.

**కుశలదేశః కుశలో మనుగస్య మనోఽనుగః ।**
**ఉష్ణస్యోష్ణః స్మృతో దేశః పీవరః పీవరస్య చ ॥32॥**

**అంధకారస్య కథితో దేశో నామ్నాంధకారకః ।**
**మునేర్దేశో మునిః ప్రోక్తో దుందుభేర్దుందుభిః స్మృతః ॥33**
**ఏతే జనపదాః సప్త క్రౌంచద్వీపేషు భాస్వరాః ।**

కుశలుడిది కుశలదేశం, మనుగుడిది మనుగదేశం, ఉష్ణుడిది ఉష్ణదేశం, పీవరుడిది పీవరదేశంగా పిలుస్తున్నారు. అట్లే అంధకారుడిది అంధకారదేశం, మునిది మునిదేశంగా, దుఃదుభిది దుఃదుభిదేశంగా చెప్పబడుతున్నాయి. క్రౌంచద్వీపంలో ఈ ఏడు మహోజ్జ్వలజనపదాలు.

**జ్యోతిష్మంతః కుశద్వీపే సప్త చాసన్మహౌజసః ॥34॥**

**ఉద్భిదో వేణుమాంశ్చైవ ద్వైరథో లవణో ధృతిః॥**
**షష్ఠ ప్రభాకరశ్చాపి సప్తమః కపిలః స్మృతః ॥35॥**

**ఉద్భిదం ప్రథమం వర్షం ద్వితీయం వేణుమండలమ్ ।**
**తృతీయం ద్వైరథం చైవ చతుర్థం లవణం స్మృతమ్ ॥36॥**

**పంచమం ధృతిమత్షష్ఠం ప్రభాకరమనుత్తమమ్ ।**
**సప్తమం కపిలం నామ కపిలస్య ప్రకీర్తితమ్ ॥37॥**

కుశద్వీపాధిపతి జ్యోతిష్మంతుడికి మహాతేజశ్శాలులు ఏడుగురు పుత్రులు కలిగారు. ఉద్భిదుడు, వేణుమంతుడు, ద్వైరథుడు, లవణుడు, ధృతి, ఆరవవాడు ప్రభాకరుడు, ఏడవవాడు కపిలుడు. ఉద్భిదుడి పేర మొదటి వర్షం ఉద్భిదమని, వేణుమంతుడి పేర వేణువర్షం రెండోది, ద్వైరథుడి పేర ద్వైరథవర్షం మూడోది, లవణుడి పేర నాల్గోది లవణవర్షం, ధృతిపేర ధృతిమత్‌వర్షం అయిదోది, ప్రభాకరుడి పేరుతో ఆరోది ప్రభాకరవర్షం, కపిలుడిపేర ఏడోది కపిలవర్షం– ప్రసిద్ధిచెందాయి.

**శాల్మలస్యేశ్వరాః సప్త సుతాస్తే వై వపుష్మతః ।**
**శ్వేతశ్చ హరితశ్చైవ జీమూతో రోహితస్తథా ॥38॥**
**వైద్యుతో మానసశ్చైవ సుప్రభః సప్తమస్తథా ।**
**శ్వేతస్య దేశః శ్వేతస్తు హరితస్య చ హారితః ॥39॥**
**జీమూతస్య చ జీమూతో రోహితస్య చ రోహితః ।**
**వైద్యుతో వైద్యుతస్యాపి మానసస్య చ మానసః ॥40॥**
**సుప్రభః సుప్రభస్యాపి సప్త వై దేశలాంఛకాః ।**

శాల్మలద్వీపం యొక్క మహారాజు వపుష్మంతుడికి ఏడుగురు పుత్రులు. వారందరూ ఆయాదేశాలకు రాజులయ్యారు. శ్వేతుడు, హరితుడు, జీమూతుడు, రోహితుడు, వైద్యుతుడు, మానసుడు ఏడవవాడు సుప్రభుడు. శ్వేతుడియొక్క దేశం శ్వేతమని, హరితుడుయొక్క దేశం హారితమని, జీమూతుడిది జీమూతదేశమని, రోహితుడిది రోహితదేశమని, వైద్యుతుడిది వైద్యుతదేశమని, మానసుడిది మానసదేశమని, సుప్రభుడిది సుప్రభదేశమని పిలువబడుతున్నాయి. ఈవిధంగా ఆరాజుల పేర్లతో ఏడు దేశాలు అయినాయి.

**ప్లక్షద్వీపే తు వక్ష్యామి జంబూద్వీపాదనంతరమ్ ॥41॥**
**సప్త మేధాతిథేః పుత్రాః ప్లక్షద్వీపేశ్వరాః నృపాః ।**
**జ్యేష్ఠః శాంతభయస్తేషాం సప్తవర్షాణి తాని వై ॥42॥**
**తస్మాచ్ఛాంతభయాశ్చైవ శిశిరస్తు సుఖోదయః ।**
**ఆనందశ్చ శివశ్చైవ క్షేమకశ్చ ధ్రువస్తథా ॥43॥**

**తాని తేషాం తు నామాని సప్తవర్షాణి భాగశః ।**
**నివేశితాని తైస్తాని పూర్వం స్వాయంభువేఽంతరే ॥44॥**

జంబూద్వీపానికి వెలుపలగల ప్లక్షద్వీపాన్ని గూర్చి చెబుతున్నాను. మేధాతిథి ఏడుగురు కుమారులు. ప్లక్షద్వీపరాజులు. వారిలో పెద్దవాడు శాంతభయుడు. ఈ ద్వీపంలో ఏడు దేశాలున్నాయి. శాంతభయుడు తర్వాత శిశిరుడు, సుఖోదయుడు, అనందుడు, శివుడు, క్షేమకుడు, ధ్రువుడు అనే వారు మేధాతిథిపుత్రులు. వారి పేర్ల మీద ఏడు దేశాలుగా విభాగింపబడ్డాయి. స్వాయంభువ మన్వంతరంలో వారిపేర్లతో ఏడు వర్షాలు నిలిచాయి.

**మేధాతిథేస్తు పుత్రైస్తైః ప్లక్షద్వీపనివాసిభిః ।**
**వర్ణాశ్రమాచారయుతాః ప్రజాస్తత్ర నివేశితాః ॥45॥**

**ప్లక్షద్వీపాదివర్షేషు శాకద్వీపాంతికేషు వై ।**
**జ్ఞేయః పంచసు ధర్మో వై వర్ణాశ్రమవిభాగశః ॥46॥**

**సుఖమాయుః స్వరూపం చ బలం ధర్మో ద్విజోత్తమాః ।**
**పంచస్వేతేషు ద్వీపేషు సర్వసాధారణం స్మృతమ్ ॥47॥**
**రుద్రార్చనరతా నిత్యం మహేశ్వరపరాయణాః ।**
**అన్యే చ పుష్కరద్వీపే ప్రజాతాశ్చ ప్రజేశ్వరాః ॥48॥**

**ప్రజాపతేశ్చ రుద్రస్య భావామృతసుఖోత్కటాః ॥49॥**

ప్లక్షద్వీపనివాసులైన మేధాతిథిపుత్రులచేత ప్రజలు వర్ణాశ్రమసంబంధి ఆచారాల్ని కలిగిన వారైయున్నారు. ప్లక్షద్వీపం నుంచి శాకద్వీపంవరకు గల ఐదు ద్వీపాలదేశాలలో నాలుగువర్ణాల, నాలుగు ఆశ్రమాల ధర్మాలు పాటింపబడుతున్నాయి. బ్రాహ్మణులారా! ఈ ఐదుద్వీపాలలో సుఖం, ఆయుస్సు, స్వరూపం, బలం, ధర్మం అన్నింటా సమానంగా ఉన్నాయి. ప్రజలందరూ ఎల్లప్పుడూ శివార్చనరతులై ఉన్నారు. ఈశ్వరభక్తితత్పరులై ఉన్నారు. పుష్కరద్వీపంలో కూడా రాజులు, ప్రజలు కూడా ప్రజాపాలకుడైన శివుడియొక్క భావనామృతంవల్ల కలిగే సుఖేచ్ఛగలవారై ఉన్నారు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే భువనకోశే ద్వీపద్వీపేశ్వరకథనం నామ షట్చత్వారింశోఽధ్యాయః ॥ 46 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని "భువనకోశంలో ద్వీపద్వీపేశ్వరకథనం" అనే నలభై ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తచత్వారింశోఽధ్యాయః - నలబై ఏడవ అధ్యాయం

## భరతవర్షకథనమ్ - భరతవర్షకథనం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**ఆగ్నీధ్రం జ్యేష్ఠదాయాదం కామ్యపుత్రం మహాబలమ్ ।**
**ప్రియవ్రతోఽభ్యషించద్వై జంబూద్వీపేశ్వరం నృపః ॥1॥**

మహారాజైన ప్రియవ్రతుడు తన ఉత్తరాధికారి, జ్యేష్ఠుడు ప్రియపుత్రుడు మరియు మహాబలుడు అయిన ఆగ్నీధ్రుణ్ణి జంబూద్వీపానికి రాజుగా అభిషేకించాడు.

**సోఽతీవ భవభక్తశ్చ తపస్వీ తరుణః సదా ।**
**భవార్చనరతః శ్రీమాన్ గోమాన్ ధీమాన్ ద్విజర్షభాః ॥2॥**

బ్రాహ్మణశ్రేష్ఠులారా! ఆతడు శివభక్తుడు. తపస్వి, యువకుడు, ఎల్లప్పుడూ శివార్చనశీలుడు. సంపన్నుడు, బుద్ధిమంతుడు, గోసంపదగలవాడు.

**తస్య పుత్రా బభూవుస్తే ప్రజాపతిసమా నవ ।**
**సర్వే మాహేశ్వరాశ్చైవ మహాదేవపరాయణాః ॥3॥**

ఆ ఆగ్నీధ్రుడికి ప్రజాపతికి సమానులైన తొమ్మిదిమంది కుమారులు కలిగారు. వారందరూ శివభక్తులు, శివపరాయణులు.

**జ్యేష్ఠో నాభిరితి ఖ్యాతస్తస్య కింపురుషోఽనుజః ।**
**హరివర్షస్తృతీయస్తు చతుర్థో వై త్విలావృతః ॥4॥**

**రమ్యస్తు పంచమస్తత్ర హిరణ్మాన్ షష్ఠ ఉచ్యతే ।**
**కురుస్తు సప్తమస్తేషాం భద్రాశ్వస్త్వష్టమః స్మృతః ॥5॥**

**నవమః కేతుమాలస్తు తేషాం దేశాన్నిబోధత ।**

వారిలో పెద్దవాడు(జ్యేష్ఠుడు) 'నాభి' అనే పేరుగలవాడు. ఆతడి తరువాతివాడు కింపురుషుడు. హరివర్షుడు మూడోవాడు. ఇలావృతుడు నాల్గోవాడు. ఐదోవాడు రమ్యుడు. హిరణ్మంతుడు ఆరోవాడు. కురువు ఏడోవాడు. భద్రాశ్వుడు ఎనిమిదోవాడు. కేతుమాలుడు తొమ్మిదోవాడు. వారికి ఆయాదేశాల్ని అప్పగించాడు.

**నాభేస్తు దక్షిణం వర్షం హేమాఖ్యం తు పితా దదౌ ॥6॥**

**హేమకూటం తు యద్వర్షం దదౌ కింపురుషాయ సః ।**
**నైషధం యత్స్మృతం వర్షం హరయే తత్పితా దదౌ ॥7॥**

ఆగ్నీధ్రుడు 'నాభి' అనే పెద్దకుమారుడికి 'హేమం' అనే పేరుగల దక్షిణదేశాన్ని, కింపురుషుడికి హేమకూటాన్ని ఇచ్చాడు. నైషధమని చెప్పబడే దేశాన్ని హరికి ఇచ్చాడు.

**ఇలావృతాయ ప్రదదౌ మేరుర్యత్ర తు మధ్యమః ।**
**నీలాచలాశ్రితం వర్షం రమ్యాయ ప్రదదౌ పితా ॥8॥**

**శ్వేతం యదుత్తరం తస్మాత్పిత్రా దత్తం హిరణ్మతే ।**
**యదుత్తరం శృంగవర్షం పితా తత్కురవే దదౌ ॥9॥**

**వర్షం మాల్యవతం చాపి భద్రాశ్వస్య న్యవేదయత్ ।**
**గంధమాదనవర్షం తు కేతుమాలాయ దత్తవాన్ ॥10॥**

మేరుపర్వతంతో ఆవృతమైన మధ్యదేశాన్ని ఇలావృతుడికి ఇచ్చాడు. నీలాచలాన్ని ఆశ్రయించి ఉన్న దేశాన్ని రమ్యుడికి ఇచ్చాడు. ఉత్తరదిక్కునగల శ్వేతవర్షాన్ని హిరణ్మతుడికి ఇచ్చాడు. ఉత్తరదిక్కులోనే శృంగవర్షం ఉంది. దాన్ని కురువుకు ఇచ్చాడు. మాల్యవంతదేశాన్ని భద్రాశ్వుడికి ఇచ్చాడు. గంధమాదనవర్షాన్ని కేతుమాలుడికిచ్చాడు.

**ఇత్యేతాని మహాంతీహ నవ వర్షాణి భాగశః ।**
**ఆగ్నీధ్రస్తేషు వర్షేషు పుత్రాంస్తానభిషిచ్య వై ॥11॥**

**యథాక్రమం స ధర్మాత్మా తతస్తు తపసి స్థితః ।**
**తపసా భావితశ్చైవ స్వాధ్యాయనిరతస్త్వభూత్ ॥12॥**

**స్వాధ్యాయనిరతః పశ్చాచ్ఛివధ్యానరతస్త్వభూత్ ।**

ఈ విధంగా విభాగింపబడిన హేమ, హేమకూటాదులు పెద్దదేశాలు అయ్యాయి. ధర్మాత్ముడైన ఆగ్నీధ్రుడు క్రమంగా ఆయాదేశాలకు తన కుమారుల్ని రాజులుగా అభిషేకించి తాను తపస్సు చేయటంలో నిమగ్నమైనాడు. తపస్సువల్ల శుద్ధుడైన పిమ్మట వేదాధ్యయనరతుడయ్యాడు. సాధ్యాయనిరతిపొందిన తర్వాత శివుడిని ధ్యానించటంలో నిమగ్నుడైనాడు.

**యాని కింపురుషాద్యాని వర్షాణ్యష్టౌ శుభాని చ ॥13॥**

**తేషాం స్వభావతః సిద్ధిః సుఖప్రాయా హ్యయత్నతః ।**
**విపర్యయో న తేష్వస్తి జరామృత్యుభయం న చ ॥14॥**

**ధర్మాధర్మౌ న తేష్వాస్తాం నోత్తమాధమమధ్యమాః ।**
**న తేష్వస్తి యుగావస్థా క్షేత్రేష్వష్టసు సర్వతః ॥15॥**

కింపురుషం మొదలైన ఎనిమిది వర్షాలు మంగళకరాలు. వీటిలో సహజంగా ఎలాంటి గట్టిప్రయత్నం లేకుండానే సుఖమయసిద్ధి కల్గుతుంది. వీటిలో ఎటువంటి విపరీతభావాలు కలుగవు. ముసలితనం, మరణం–

అనే భయం ఉండదు. ధర్మాధర్మాలు ఉండవు. ఉత్తమ, మధ్యమ, అధమ భేదాలు ఉండవు. ఈ అష్టవర్షాలలో యుగధర్మాలు కూడా ప్రవర్తిల్లవు.

**రుద్రక్షేత్రే మృతాశ్చైవ జంగమాః స్థావరాస్తథా ।**
**భక్తాః ప్రాసంగికాశ్చాపి తేషు క్షేత్రేషు యాంతి తే ॥16॥**

**తేషాం హితాయ రుద్రేణ చాష్టక్షేత్రం వినిర్మితమ్ ।**
**తత్ర తేషాం మహాదేవః సాన్నిధ్యం కురుతే సదా ॥17॥**

రుద్రక్షేత్రంలో మృతిచెందినవారు కానీ, చరాచరప్రాణులుగాని, ఇక్కడ ఉన్న భక్తులుగాని లేక వచ్చిన భక్తులుగాని, ఆ క్షేత్రాలను గూర్చి చెప్పుకొనేవారు కానీ ఈ అష్టవర్షాల్ని పొందుతున్నారు. వీరి శుభం కోసం శివుడు ఈ అష్టక్షేత్రాల్ని నిర్మించాడు. ఎల్లప్పుడు వీటిలో మహాదేవుడు నివసిస్తాడు.

**దృష్ట్వా హృది మహాదేవమష్టక్షేత్రనివాసినః ।**
**సుఖినః సర్వదా తేషాం స ఏవేహ పరా గతిః ॥18॥**

ఈ అష్టక్షేత్రనివాసులు హృదయంలో శివభగవానుణ్ణి దర్శించి ఎల్లప్పుడూ సుఖులై ఉంటారు. వారికి అదే ఉత్తమగతి.

**నాభేర్నిసర్గం వక్ష్యామి హిమాంకేఽస్మిన్నిబోధత ।**
**నాభిస్త్వజనయత్పుత్రం మేరుదేవ్యాం మహామతిః ॥19॥**

**ఋషభం పార్థివశ్రేష్ఠం సర్వక్షత్రస్య పూజితమ్ ।**
**ఋషభాద్భరతో జజ్ఞే వీరః పుత్రశతాగ్రజః ॥**

హిమవర్షానికి రాజుగా నియమితుడైన నాభి వంశాన్ని గూర్చి చెప్తున్నాను. బుద్ధిమంతుడైన నాభి మేరుదేవియందు 'ఋషభుడ'నే పుత్రుణ్ణి పొందాడు. ఆతడు రాజశ్రేష్ఠుడు. సమస్త రాజ పూజితుడు. ఋషభుడికి వీరుడైన భరతుడు కలిగాడు. ఆతడు నూర్గురుకుమారుల్లో పెద్దవాడు.

**సోఽభిషిచ్యాథ ఋషభో భరతం పుత్రవత్సలః ।**
**జ్ఞానవైరాగ్యమాశ్రిత్య జిత్వేంద్రియమహోరగాన్ ॥21॥**

**సర్వాత్మనాత్మని స్థాప్య పరమాత్మానమీశ్వరమ్ ।**
**నగ్నో జటీ నిరాహారో చీరీ ధ్వాంతగతో హి సః ॥22॥**

**నిరాశస్త్యక్తసందేహః శైవమాప పరం పదమ్ ।**

పుత్రప్రియుడైన ఋషభుడు భరతుణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి చేసి, జ్ఞానవైరాగ్యాల్ని ఆశ్రయించి మహాసర్పాలవంటి ఇంద్రియజాతాన్ని జయించినవాడై, పరమాత్ముడైన ఈశ్వరుణ్ణి పూర్ణరూపంగా తనలో నిలుపుకుని, దిగంబరుడై,

జడధారియై, నిరాహారి అయి, వల్కలధారిఅయి వనవాసి అయినాడు. ఆశలు నశించినవాడై, సందేహాలు విడిచి శివుడి పరమపదాన్ని పొందాడు.

**హిమాద్రేర్దక్షిణం వర్షం భరతాయ న్యవేదయత్ ॥23॥**

**తస్మాత్తు భారతం వర్షం తస్య నామ్నా విదుర్బుధాః ।**
**భరతస్యాత్మజో విద్వాన్ సుమతిర్నామ ధార్మికః ॥24॥**

**బభూవ తస్మింస్తద్రాజ్యం భరతః సంన్యవేశయత్ ।**
**పుత్రసంక్రామితశ్రీకో వనం రాజా వివేశ సః ॥25॥**

హిమాలయానికి దక్షిణ దిక్కులోగల దేశాన్ని భరతుడికి ఋషభుడు ఇచ్చాడు. ఆకారణంగా పండితులు దానిని ఆతడిపేరుతో "భరతవర్షం" అంటున్నారు. భరతుడికి పండితుడు, ధార్మికుడు అయిన సుమతి అనే పుత్రుడు కలిగాడు. భరతుడు ఆతడికి ఆ రాజ్యాన్ని అప్పగించాడు. పుత్రుడికి సంపదలు సంక్రమింపజేసినవాడై ఆ భరతుడు వనానికి వెళ్లాడు. వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే భరతవర్షకథనం నామ సప్తచత్వారింశోఽధ్యాయః ॥ 47 ॥**

శ్రీలింగమహాపురాణం, పూర్వభాగంలోని భరతవర్షకథనమనే నలభై ఏడవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## అష్టచత్వారింశోఽధ్యాయః - నలభై ఎనిమిదవ అధ్యాయం

## మేరుగిరివర్ణనమ్ - మేరుగిరివర్ణనం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**అస్య ద్వీపస్య మధ్యే తు మేరుర్నామ మహాగిరిః ।**
**నానారత్నమయైః శృంగైః స్థితః స్థితిమతాం వరః ॥1॥**

ఈ ద్వీపం (జంబూ) మధ్యభాగంలో 'మేరువు' అనే పేరుగల గొప్పపర్వతం ఉంది. పర్వతశ్రేష్ఠమైన ఆ మేరువు బహువిధాలైన రత్నాలతో నిండిన శిఖరాలతో కూడి ఉన్నది.

**చతురాశీతిసాహస్రముత్సేధేన ప్రకీర్తితః ।**
**ప్రవిష్టః షోడశాధస్తాద్విస్తృతః షోడశైవ తు ॥2॥**

**శరావవత్సంస్థితత్వాద్ ద్వాత్రింశన్మూర్ధ్ని విస్తృతః ।**
**విస్తారాత్త్రిగుణశ్చాస్య పరిణాహోఽనుమండలః ॥3॥**

ఈ పర్వతం ఎనభైనాలుగు వేల యోజనాల ఎత్తుగలిగి ప్రసిద్ధిచెందింది. ఇది పదహారు వేల యోజనాలు భూమిలోపలికి నిలిచి ఉంది. దీని వ్యాపనం పదహారువేల యోజనాలు. ఇది ఒక విశాలతలం లాగా ఉండడం వల్ల ముప్పైరెండువేల యోజనాల విస్తారంగల ఉపరితలం కలిగి ఉంటుంది. దీని చుట్టుకొలత పై విస్తారంకంటె మూడురెట్లు అధికంగా ఉంటుంది.

**హైమీకృతో మహేశస్య శుభాంగస్పర్శనేన చ ।**
**ధత్తూరపుష్పసంకాశః సర్వదేవనికేతనః ॥4॥**

**క్రీడాభూమిశ్చ దేవానామనేకాశ్చర్యసంయుతః ।**

ఈ పర్వతం శివుడి మంగళకరమైన శరీరస్పర్శచేత సువర్ణమయం అయింది. ఉమ్మెత్త పుష్పంతో సమానమైన కాంతిగలది. సమస్తదేవతలకు నివాసం. దేవతలకు క్రీడాస్థలి. బహువిధాలైన అద్భుతాలకు నిలయం.

**లక్షయోజన ఆయామస్తస్యైవం తు మహాగిరేః ॥5॥**

**తతః షోడశసాహస్రం యోజనాని క్షితేరధః ।**
**శేషం చోపరి విప్రేంద్రా ధరాయాస్తస్య శృంగిణః ॥6॥**
**మూలాయామప్రమాణం తు విస్తారాన్మూలతో గిరేః ।**
**ఊచుర్విస్తారమస్యైవ ద్విగుణం మూలతో గిరేః ॥7॥**

ఈ మహాపర్వతం వెడల్పు విస్తారం లక్షయోజనాలు. మహర్షులారా! ఇది భూమిక్రింద పదహారువేల యోజనాలు విస్తరించి ఉన్నది. మిగిలినది భూమిపై ఉన్నది. దీని మూలవిస్తారం దానికి రెండురెట్లు అధికంగా ఉన్నదని చెప్పారు.

**పూర్వతః పద్మరాగాభో దక్షిణే హేమసన్నిభః ।**
**పశ్చిమే నీలసంకాశ ఉత్తరే విద్రుమప్రభః ॥8॥**

ఈ పర్వతం తూర్పువైపున పద్మరాగమణుల కాంతులతోను, దక్షిణదిశలో బంగారుకాంతులతోను పడమటి వైపు ఇంద్రనీలమణి ప్రభలతోను ఉత్తరదిక్కులో పగడపుకాంతులతోను నిండి ఉంటుంది.

**అమరావతీ పూర్వభాగే నానాప్రాసాదసంకులా ।**
**నానాదేవగణైః కీర్ణా మణిజాలసమావృతా ॥9॥**

**గోపురైర్వివిధాకారైర్హేమరత్నవిభూషితైః ।**
**తోరణైర్హేమచిత్రైస్తు మణిక్లుప్తైః పథి స్థితైః ॥10॥**

**సల్లాపాలాపకుశలైః సర్వాభరణభూషితైః ।**
**స్తనభారవినమ్రైశ్చ మదఘూర్ణితలోచనైః ॥11॥**

**స్త్రీసహస్రైః సమాకీర్ణా చాప్సరోభిః సమంతతః ।**
**దీర్ఘికాభిర్విచిత్రాభిః ఫుల్లాంభోరుహసంకులైః ॥12॥**

**హేమసోపాన సంయుక్తై ర్హేమసైకతరాశిభిః ।**
**నీలోత్పలైశ్శ్వేతోత్పలైశ్చ హేమైశ్చాపి సుగంధిభిః ॥13॥**

**ఏవంవిధైస్తటాకైశ్చ నదీభిశ్చ నదైర్యుతా ।**
**విరాజతే పురీ శుభ్రా తయాసౌ పర్వతః శుభః ॥14॥**

ఈ మేరుపర్వతం యొక్క తూర్పుదిక్కున అమరావతి పట్టణమున్నది. అది అనేకభవనసమాకీర్ణం. పెక్కుదేవగణాలతో ఉంటుంది. మణిసమూహసమన్వితం. బంగారంతోను రత్నాలతోను అలంకరింపబడిన వివిధాకృతులుగల గోపురాలతో కూడియున్నది. మణులను కూర్చిన సువర్ణచిత్రాలుగల తోరణాలు గల మార్గాలు గలది. ప్రియభాషిణులు, సమస్తభూషణాలంకృతలు, ఘనస్తనభారవినమ్రలు, మత్తిల్లిన కన్నులుగలవారు అయిన అప్సరసలతోను, వేల సంఖ్యగల ఇతర స్త్రీలతోను అన్ని వైపుల నిండి ఉన్నది. వికసించిన పద్మాలతోను, బంగారపు మెట్లతోను, బంగారపు ఇసుకతిన్నెలతోను కూడియున్న విచిత్రాలైన దిగుడు బావులుగలది. పరిమళభరితాలైన కలువలతోను నల్లకలువలతోను స్వర్ణవర్ణోత్పలాలతోను నిండిన సరస్సులు, నదీనదాలతోను కూడియున్నది. పైవాటి అన్నింటితోను కూడినదై అమరావతినగరం పరిశుభ్రంగా ప్రకాశిస్తున్నది. ఆనగరంతోకూడిన మేరువుకూడా శోభిల్లుతున్నది.

**తేజస్వినీ నామ పురీ ఆగ్నేయ్యాం పావకస్య తు ।**
**అమరావతీసమా దివ్యా సర్వభోగసమన్వితా ॥15॥**

ఈ మేరువుకు ఆగ్నేయదిక్కులో "తేజస్విని" అనే పేరుగల అగ్నిదేవుడియొక్క పట్టణముంది. అది ఇంద్రపురి అమరావతితో తుల్యమైంది. దివ్యమైంది. సమస్తభోగాలతో కూడినట్టిది.

**వైవస్వతీ దక్షిణే తు యమస్య యమినాం వరాః ।**
**భవనైరావృతా దివ్యైర్జాంబూనదమయైః శుభైః ॥16॥**

మునిశ్రేష్ఠులారా! మేరువుకు దక్షిణభాగంలో వైవస్వతి అనే పేరుగల యమధర్మరాజు పురమున్నది. మంగళకరాలు, స్వర్ణమయాలు, దివ్యాలు అయిన భవనాలతో నిండియున్నది ఆ యమపురి.

**నైరృతే కృష్ణవర్ణా చ తథా శుద్ధవతీ శుభా ।**
**తాదృశీ గంధవంతీ చ వాయవ్యాం దిశి శోభనా ॥17॥**

**మహోదయా చోత్తరే చ ఐశాన్యాం తు యశోవతీ ।**
**పర్వతస్య దిగంతేషు శోభతే దివి సర్వదా ॥18॥**

నైరృతి దిక్కులో నీలవర్ణశోభితమై శుభకరమైన శుద్ధవతి పురం కలదు. వాయవ్యదిశలో శుద్ధవతి లాగా సుందరమైన గంధవంతి నగరం కలదు. ఉత్తరదిక్కులో మహోదయనగరం ఉంది. ఈశాన్యభాగంలో యశోవతి అనే పురముంది. మేరువుకు అన్ని దిక్కులలో స్వర్గలోకం శోభిస్తున్నది.

**బ్రహ్మ విష్ణు మహేశానాం తథాన్యేషాం నికేతనమ్ ।**
**సర్వభోగయుతం పుణ్యం దీర్ఘికాభిర్నగోత్తమమ్ ॥19॥**

**సిద్ధైర్యక్షైస్తు సంపూర్ణం గంధర్వైర్మునిపుంగవైః ।**
**తథాన్యైర్వివిధాకారైర్భూతసంఘైశ్చతుర్విధైః ॥20॥**

ఈ పర్వతం బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు అట్లే ఇతరదేవతలకు నివాసస్థానం. ఇది పుణ్యప్రదమైన సమస్త సుఖసాధనాలతోను దిగుడుబావులతోను కూడిన ఉత్తమపర్వతం. సిద్ధులు, యక్షులు, గంధర్వులు, మునిశ్రేష్ఠులు, అట్లే ఇతరాలైన బహువిధాలైన ఆకృతులుగల నాల్గువిధాలైన భూతసమూహాలతోను పరిపూర్ణమైనది.

**గిరేరుపరి విప్రేంద్రాః శుద్ధస్ఫటికసన్నిభమ్ ।**
**సహస్రభౌమం విస్తీర్ణం విమానం వామతః స్థితమ్ ॥21॥**

**తస్మిన్ మహాభుజః శర్వః సోమసూర్యాగ్నిలోచనః ।**
**సింహాసనే మణిమయే దేవ్యాస్తే షణ్ముఖేన చ ॥22॥**

బ్రాహ్మణశ్రేష్ఠులరా! ఈ పర్వతంయొక్క పైభాగంలో స్వచ్ఛస్ఫటికతో సమానమైన కాంతిగల వేయి మండపాలతో కూడిన విశాలవిమానాలు గల భవనాలు ఎడమభాగంలో కలవు. ఆ భవనాలలో మహాబాహువు సూర్యచంద్రులు, అగ్ని కన్నులుగా గలవాడు అయిన శివుడు మణులతో నిర్మించిన సింహాసనంలో పార్వతీదేవితో మరియు కార్తికేయుడితోను ప్రకాశిస్తూ ఉంటాడు.

**హరేస్తదర్ధం విస్తీర్ణం విమానం తత్ర సోఽపి చ ।**
**పద్మరాగమయం దివ్యం పద్మజస్య చ దక్షిణే ॥23॥**

అక్కడ విష్ణువుకు కూడా భవనముంది. అది శివభగవానుడి విమానంలో సగం విస్తీర్ణం కలది. దక్షిణభాగంలో పద్మభవుడు బ్రహ్మకు కూడా పద్మరాగమణి నిర్మితమైన దివ్యమందిరం ఉంది.

**తస్మిన్ శక్రస్య విపులం పురం రమ్యం యమస్య చ ।**
**సోమస్య వరుణస్యాథ నిరృతేః పావకస్య చ ॥24॥**

**వాయోశ్చైవ తు రుద్రస్య సర్వాలయసమంతతః ।**
**తేషాం తేషాం విమానేషు దివ్యేషు వివిధేషు చ ॥25॥**

**ఈశాన్యామీశ్వరక్షేత్రే నిత్యార్చా చ వ్యవస్థితా ।**
**సిద్ధేశ్వరైశ్చ భగవాంచ్ఛైలాదిః శిష్యసమ్మతః ॥26॥**

**సనత్కుమారః సిద్ధైస్తు సుఖాసీనః సురేశ్వరః ।**
**సనకశ్చ సనందశ్చ సదృశాశ్చ సహస్రశః ॥27॥**

ఆ పర్వతంలో ఇంద్రుడికి, యముడికి, సోముడికి, వరుణుడికి, నిర్ళతికి, అగ్నికి, వాయువుకు, రుద్రుడికి విశాలమైన సుందరమైన పురాలు అంతటా ఉన్నాయి. ఆయాదివ్యమైన వివిధమందిరాలలో ఇతరులు నివసిస్తున్నారు. ఈశ్వర (శివుడివిమానం) క్షేత్రంలో ఈశాన్యదిక్కులో నిత్యం పూజ నిర్వహింపబడుతున్నది. వాటిల్లో భగవానుడు నందీశ్వరుడు సిద్ధేశ్వరులతో కూడి ఉంటాడు. సురేశ్వరుడైన సనత్కుమారుడు శిష్యసహితుడై సిద్ధులతో కూడి సుఖంగా ఉంటాడు. ఈవిధంగా సనక, సనందనులు వాళ్లతో సమానమైన వేలకొలది ఋషులు అక్కడ ఉంటారు.

**యోగభూమిః క్వచిత్తస్మిన్ భోగభూమిః క్వచిత్క్వచిత్ ।**
**బాలసూర్యప్రతీకాశం విమానం తత్ర శోభనమ్ ॥28॥**

**శైలాదినః శుభం చాస్తి తస్మిన్నాస్తే గణేశ్వరః ।**
**షణ్ముఖస్య గణేశస్య గణానాంతు సహస్రశః ॥29॥**

**సుయశాయాః సునేత్రాయాః మాతౄణాం మదనస్య చ ।**
**తస్య జంబూనదీ నామ మూలమావేష్ట్య సంస్థితా ॥ 30 ॥**

ఈ పర్వతం మీద కొంత యోగభూమి మరికొంత భోగభూమి ఉన్నది. ఇక్కడ ఉదయకాలపుసూర్య సమానకాంతిగల సుందరమైన, మంగళకరాలైన విమానాలు ఉన్నాయి. వాటిల్లో గణనాథుడు నందీశ్వరుడు గణాలతో ఉంటాడు. అక్కడ గణేశ్వరుడైన కార్తికేయుడికి, వేలాది గణాలకు, సుయశలు, సునేత్రలు అయిన సప్తమాతృకలకు మన్మథుడికి మందిరాలున్నాయి. ఆ పర్వతమూలాన్ని జంబూనది చుట్టియున్నది.

**తస్య దక్షిణపార్శ్వే తు జంబూవృక్షః సుశోభనః ।**
**అత్యుచ్ఛ్రితః సువిస్తీర్ణః సర్వకాలఫలప్రదః ॥31॥**

ఈ పర్వతంయొక్క దక్షిణభాగంలో మిక్కిలి సుందరమైన మిక్కిలి ఎత్తైన, మిక్కిలి విస్తారమైన ఎల్లవేళల ఫలదాయిని అయిన జంబూవృక్షం ఉంది.

**మేరోః సమంతాద్విస్తీర్ణం శుభం వర్షమిలావృతమ్ ।**
**తత్ర జంబూఫలాహారాః కేచిచ్చామృతభోజనాః ॥32॥**

**జాంబూనదసమప్రఖ్యా నానావర్ణాశ్చ భోగినః ।**
**మేరుపాదాశ్రితో విప్రా ద్వీపోఽయం మధ్యమః శుభః ॥33॥**

**నవవర్షాన్వితశ్చైవ నదీనదగిరీశ్వరైః ।**
**నవవర్షం తు వక్ష్యామి జంబూద్వీపం యథాతథమ్ ॥34॥**

**విస్తారాన్మండలాచ్చైవ యోజనైశ్చ నిబోధత ।**

ఈ మేరువుకు నాల్గువైపుల ఇలావృతమనే విశాలవర్షమున్నది. అచ్చట జంబూఫలాల్ని, అమృతాన్ని ఆహారంగా స్వీకరించే వాళ్లు ఉంటారు. వాళ్ళు కొందరు బంగారురంగుగలవాళ్లు, మరికొందరు వివిధవర్ణాలు గలవారు.వాళ్లు సుఖభోగులు. విప్రులారా! ఇది మేరు పర్వతం యొక్క ఉపత్యకల్ని(క్రిందిభాగాల్ని) ఆశ్రయించి మధ్యలో ఉన్న ద్వీపం. ఇది కూడా తొమ్మిది వర్షాలు(దేశాలు) కలిగి ఉంది. నదీనదపర్వతాలతో కూడియున్నది. తొమ్మిది దేశాలతో కూడిన జంబూద్వీపంయొక్క వర్ణన యథాతథంగా చేస్తాను. యోజనపర్యంతవిస్తారంగల దీనిమండలాది విషయాల్ని మీరు వినండి!

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే మేరుగిరివర్ణనం నామాష్టచత్వారింశోఽధ్యాయః ॥ 48 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని మేరుగిరివర్ణనమనే నలభై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## ఏకోన పంచాశత్తమోఽధ్యాయః - నలబై తొమ్మిదవ అధ్యాయం

## జంబూద్వీపవర్ణనమ్ - జంబూద్వీపవర్ణనం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**శతమేకం సహస్రాణాం యోజనానాం స తు స్మృతః ।**
**అనుద్వీపం సహస్రాణాం ద్విగుణం ద్విగుణోత్తరమ్ ॥1॥**

ఈ ద్వీపం ఒక లక్షయోజనాలవిస్తారం కలది. దీని తర్వాతిది దీనికి రెట్టింపు కలది. దానికి తర్వాతిది దానికి రెట్టింపు విస్తారం కలది.

**పంచాశత్కోటివిస్తీర్ణా ససముద్రా ధరా స్మృతా ।**
**ద్వీపైశ్చ సప్తభిర్యుక్తా లోకాలోకావృతా శుభా ॥2॥**

సముద్రాలతో నిండిన ఈ భూమి ఏభైకోట్లయోజనాల విస్తీర్ణం కలది. సప్తద్వీపాలతోనూ కూడి సుందరమై యున్నది. ఇది లోకాలోక పర్వతం భూమి చుట్టూ ఆవరించి ఉంటుంది.

**నీలస్తథోత్తరే మేరోః శ్వేతస్తస్యోత్తరే పునః ।**
**శృంగీ తస్యోత్తరే విప్రాస్త్రయస్తే వర్షపర్వతాః ॥3॥**

బ్రహ్మణులారా! ఈ మేరువుకు ఉత్తరంగా నీల పర్వతం, దానికి ఉత్తరంగా శ్వేతపర్వతం, దానికి ఉత్తరంగా శృంగి పర్వతం ఉన్నాయి. ఈ మూడు వర్షపర్వతాలు.

**జఠరో దేవకూటశ్చ పూర్వస్యాం దిశి పర్వతౌ ।**

**నిషధో దక్షిణే మేరోస్తస్య దక్షిణతో గిరిః ।**
**హేమకూట ఇతి ఖ్యాతో హిమవాంస్తస్య దక్షిణే ॥4॥**

**మేరోః పశ్చిమతశ్చైవ పర్వతౌ ద్వౌ ధరాధరౌ ।**
**మాల్యవాన్ గంధమాదశ్చ ద్వావేతావుదగాయతౌ ॥5॥**

దీనికి పూర్వదిక్కులో జఠర పర్వతం, మరియు దేవకూట పర్వతమూ కలవు. దక్షిణ దిక్కులో నిషధ పర్వతం ఉంది. దీనికి దక్షిణంగా హిమవత్పర్వతం ఉంది. మేరువుకు పడమటి భాగంలో మాల్యవంతం మరియు గంధమాదన పర్వతాలున్నాయి. ఈ రెండు పర్వతాలు ఉత్తరదిశగా వ్యాపించి ఉన్నాయి.

**ఏతే పర్వతరాజానః సిద్ధచారణసేవితాః ।**
**తేషామంతరవిష్కంభో నవసాహస్రమేకశః ॥6॥**

**ఇదం హైమవతం వర్షం భారతం నామ విశ్రుతమ్ ।**
**హేమకూటం పరం తస్మాన్నామ్నా కిమ్పురుషం స్మృతమ్ ॥7॥**

**నైషధం హేమకూటాత్తు హరివర్షం తదుచ్యతే ।**
**హరి వర్షాత్పరం చైవ మేరోః శుభమిలావృతమ్ ॥8॥**

**ఇలావృతాత్పరం నీలం రమ్యకం నామ విశ్రుతమ్ ।**
**రమ్యాత్పరతరం శ్వేతం విఖ్యాతం తద్ధిరణ్మయమ్ ॥9॥**

**హిరణ్మయాత్ పరం చాపి శృంగీ చైవ కురుః స్మృతః ।**
**ధనుఃసంస్థే తు విజ్ఞేయే ద్వే వర్షే దక్షిణోత్తరే ॥10॥**

ఈ శ్రేష్ఠముగా చెప్పబడుతున్న పర్వతాలు సిద్ధులచేత, చారణులచేత సేవింపబడుతున్నాయి. వీటి మధ్యభాగంలో తొమ్మిదివేల యోజనాల అంతరం ఉన్నది. హిమవత్పర్వతవర్షం భారతవర్షంగా ప్రసిద్ధి చెందింది. దాని తర్వాతిది హేమకూటం. కింపురుషవర్షంగా ప్రసిద్ధి చెందింది. హేమకూటానికి అవతల నైషధముంది. దీని తర్వాత హరివర్షముంది. హరివర్షానికి మేరువుకు అవతల సుందరమైన ఇలావృతముంది. ఇలావృతం తర్వాత నీలవర్షం. ఇది రమ్యకవర్షంగా ప్రసిద్ధిపొందింది. రమ్యకవర్షానంతరం శ్వేతవర్షముంది. ఇది హిరణ్మయవర్షంగా విఖ్యాతి గాంచింది. తర్వాత శృంగిపర్వతం ఉన్నది. ఇది కురువర్షముగా స్మరింపబడుచున్నది. హిరణ్మయకురువర్షాలు రెండూ ధనువుయొక్క ఆకారంలో దక్షిణోత్తరదిశలుగా వ్యాపించి ఉన్నాయి.

**దీర్ఘాణి తత్ర చత్వారి మధ్యతస్తదిలావృతమ్ ।**
**మేరోః పశ్చిమపూర్వేణ ద్వే తు దీర్ఘతరే స్మృతే ॥11॥**

**అర్వాక్తు నిషధస్యాథ వేద్యర్ధం చోత్తరం స్మృతమ్ ।**
**వేద్యర్ధే దక్షిణే త్రీణి వర్షాణి త్రీణి చోత్తరే ॥12॥**

ఇలావృతం మధ్యలో గల నాలుగు వర్షాలు దీర్ఘమయినవి. మేరువుకు పడమటి దిక్కులోను పూర్వదిక్కులోనూ గల రెండు వర్షాలు, పైవాటికంటే ఎక్కువ నిడివికలవి. నిషధవర్షానికి ఉత్తరంగా ఉన్నదాన్ని వేద్యర్ధంగా చెబుతారు. దీనికి దక్షిణంగా మూడు వర్షాలు, ఉత్తరంగా మూడు వర్షాలున్నాయి.

**తయోర్మధ్యే చ విజ్ఞేయం మేరుమధ్యమిలావృతమ్ ।**
**దక్షిణేన తు నీలస్య నిషధస్యోత్తరేణ తు ॥13॥**

**ఉదగాయతో మహాశైలో మాల్యవాన్నామ పర్వతః ।**
**యోజనానాం సహస్రే ద్వే ఉపరిష్టాత్తు విస్తృతః ॥14॥**

**ఆయామతశ్చతుస్త్రింశత్సహస్రాణి ప్రకీర్తితః ।**

నీలవర్షానికి దక్షిణంగా నిషధవర్షానికి ఉత్తరంగా ఈరెండింటికి మధ్యలోను మేరువుకు మధ్యలోను ఇలా వృతవర్షముంది. మాల్యవంతమహాపర్వతం ఉత్తరదిశగా ఉన్నది. దాని పైభాగం రెండువేల యోజనవిస్తారం కలది. దీని వెడల్పు ముప్పైనాలుగు వేల యోజనాలుగా చెప్పబడింది.

**తస్య ప్రతీచ్యాం విజ్ఞేయః పర్వతో గంధమాదనః ॥15॥**

**ఆయామతః స విజ్ఞేయో మాల్యవానివ విస్తృతః ।**
**జంబూదీపస్య విస్తారాత్సమేన తు సమంతతః ॥16॥**

**ప్రాగాయతాః సుపర్వాణః షడేతే వర్షపర్వతాః ।**
**అవగాఢాశ్చోభయతః సముద్రౌ పూర్వపశ్చిమౌ ॥17॥**

మాల్యవంతానికి పడమరగా గంధమాదనపర్వతముంది. ఇది వెడల్పువిషయంగా మాల్యవంతానికి సమానమైనది. ఇది జంబూద్వీపవిస్తారంతో సమానమైంది. చక్కని సంధులుగల ఈ ఆరువర్షపర్వతాలు పూర్వదిక్కుగా వ్యాపించి ఉన్నాయి. తూర్పు పడమరలలోని సముద్రాలు (పూర్వపశ్చిమసాగరాల్ని) రెంటిని కలుపుతున్నాయి.

**హిమప్రాయస్తు హిమవాన్ హేమకూటస్తు హేమవాన్ ।**
**తరుణాదిత్యసంకాశో హైరణ్యో నిషధః స్మృతః ॥18॥**

**చతుర్వర్ణః స సౌవర్ణో మేరుశ్చోర్ధ్వాయతః స్మృతః ।**
**వృత్తాకృతిపరిణాహశ్చతురస్రః సముత్థితః ॥19॥**

**నీలశ్చ వైడూర్యమయః శ్వేతః శుక్లో హిరణ్మయః ।**
**మయూరబర్హవర్ణస్తు శాతకుంభస్త్రిశృంగవాన్ ॥20॥**

హిమవత్పర్వతం ఎల్లప్పుడూ మంచుతో కప్పబడి ఉంటుంది. హేమకూటపర్వతం స్వర్ణమయమే. నిషధపర్వతం ఉదయసూర్యసమాన కాంతిగలిగి సువర్ణమయమై ఉంటుంది. నాలుగుప్రక్కల నాలుగు రంగులుగల మేరుపర్వతం ఊర్ధ్వదిశగా వ్యాపించి ఉంటుంది. పరిధిలో వృత్తాకారంలో ఉండి నాల్గువైపులా ఎత్తుగా నిలిచి ఉంటుంది. నీల పర్వతం వైడూర్యమయమై ఉంటుంది. శ్వేతపర్వతం తెల్లగా స్వర్ణమయమై ఉంటుంది. శృంగిపర్వతం మూడుశృంగాలు కలది అయి ఉండి మొనదేలినశిఖరాలతో నెమలిపింఛంయొక్క వర్ణాన్ని కలిగి ఉంటుంది.

**ఏవం సంక్షేపతః ప్రోక్తాః పునః శృణు గిరీశ్వరాన్ ।**
**మందరో దేవకూటశ్చ పూర్వస్యాం దిశి పర్వతౌ ॥21॥**

**కైలాసో గంధమాదశ్చ హేమవాంశ్చైవ పర్వతౌ ।**
**పూర్వతశ్చాయతావేతావర్ణవాంతర్వ్యవస్థితౌ ॥22॥**

**నిషధః పారియాత్రశ్చ ద్వావేతౌ వరపర్వతౌ ।**

**యథా పూర్వౌ తథా యామ్యావేతౌ పశ్చిమతః శ్రితౌ ॥23॥**

**త్రిశృంగో జారుచిశ్చైవ ఉత్తరౌ వరపర్వతౌ ।**
**పూర్వతశ్చాయతావేతావర్ణవాంతర్వ్యవస్థితౌ ॥24॥**

**మర్యాదా పర్వతానేతానష్టావాహుర్మనీషిణః ।**

ఈ విధంగా పర్వతాలవర్ణనం సంగ్రహంగా చేశాను. మరల శ్రేష్ఠమైన పర్వతాలవిషయం వినండి. మందరం, దేవకూటం అనే పర్వతాలు తూర్పుదిక్కులో ఉన్నాయి. కైలాసం అట్లే స్వర్ణమయమైన గంధమాదన పర్వతాలు– ఈ రెండూ పూర్వదిశనుంచి దక్షిణానికి వ్యాపించి ఉన్నాయి. వాటి చివరిభాగాలు సముద్రాంతర్భాగం వరకూ వ్యాపించి ఉన్నాయి. నిషధపర్వతం, పారియాత్రపర్వతం రెండూ శ్రేష్ఠమైనవి. పడమరనుంచి తూర్పుకు, మరియు దక్షిణానికి వ్యాపించి ఉన్నాయి. త్రిశృంగం మరియు జారుచి అనే రెండు ఉత్తరంలోగల మహాపర్వతాలు పూర్వదిక్కుకు వ్యాపించి (తూర్పు) సముద్రగర్భంలోనికి చొచ్చుకుని ఉన్నాయి. పండితులు ఈ ఎనిమిది పర్వతాల్ని మర్యాదాపర్వతాలంటారు.

**యోఽసౌ మేరుర్ద్విజశ్రేష్ఠాః ప్రాంశుః కనకపర్వతః ॥25॥**

**తస్య పాదాస్తు చత్వారశ్చతుర్దిక్షు నగోత్తమాః ।**
**యైర్విష్టబ్ధా న చలతి సప్తద్వీపవతీ మహీ ॥26॥**

**దశయోజనసాహస్రమాయామస్తేషు పఠ్యతే ।**

బ్రాహ్మణశ్రేష్ఠులారా! 'మేరువు' అనే ఎత్తైన స్వర్ణపర్వతముంది. దాని నాల్గు పాదాల రూపంలో నాల్గుదిక్కులలో నాలుగు పెద్ద పెద్ద పర్వతాలున్నాయి. వీటి ఆధారంవల్ల ఏడుద్వీపాలు గల భూమి కదలకుండా ఉంది. వాటి పొడవు పదివేలయోజనాలు ఉంటుంది.

**పూర్వే తు మందరో నామ దక్షిణే గంధమాదనః ॥27॥**

**విపులః పశ్చిమే పార్శ్వే సుపార్శ్వోత్తరే స్మృతః ।**
**మహావృక్షాః సముత్పన్నాశ్చత్వారో ద్వీపకేతవః ॥28॥**

**మందరస్య గిరేః శృంగే మహావృక్షః స కేతురాట్ ।**
**ప్రలంబశాఖాశిఖరః కదంబశ్చైత్యపాదపః ॥29॥**

తూర్పులో మందరం, దక్షిణంలో గంధమాదనం, పడమరలో విపులం, ఉత్తరంలో సుపార్శ్వం అనే పర్వతాలున్నాయి. వీటిలో నాలుగు మహావృక్షాలు పుట్టాయి. అవి ఆ ద్వీపాలకు పతాకలు(టెక్కేలు)లాగా ఉన్నాయి. మందరపర్వతంయొక్క శిఖరం మీద మహాకదంబవృక్షమున్నది. అది పతాకలకు ప్రభువువలే ఉంటుంది. దానికి వ్రేలాడుశాఖలున్నాయి. ఆ కదంబవృక్షం చైత్యపాదపం అనగా దేవతావృక్షం.

**దక్షిణస్యాపి శైలస్య శిఖరే దేవసేవితా ।**
**జంబూః సదా పుణ్యఫలా సదా మాల్యోపశోభితా ॥30॥**

**సకేతుర్దక్షిణే ద్వీపే జంబూర్లోకేషు విశ్రుతా ।**

దక్షిణదిక్కులో గల గంధమాదన పర్వతశిఖరం మీద ఎల్లప్పుడూ దేవతలచేత పూజింపబడే జంబూవృక్షం ఉంది. అది ఎల్లప్పుడూ పవిత్రపుష్పాలతోను, ఫలాలతోనూ నిండి ఉంటుంది. అది దక్షిణద్వీపానికి టెక్కెంగా ప్రసిద్ధిచెందింది.

**విపులస్యాపి శైలశ్చ పశ్చిమే చ మహాత్మనః ॥31॥**

**సంజాతః శిఖరేఽశ్వత్థః స మహాన్ చైత్యపాదపః ।**
**సుపార్శ్వస్యోత్తరస్యాపి శృంగే జాతో మహాద్రుమః ॥32॥**

**న్యగ్రోధో విపులస్కంధోఽనేకయోజనమండలః ।**

పశ్చిమంలోగల విపుల మహాపర్వతశిఖరం మీద దేవతావృక్షమైన రావిచెట్టు పుట్టింది. ఉత్తరదిక్కులోగల సుపార్శ్వపర్వతశిఖరం మీద కూడా గొప్పమఱ్ఱిచెట్టు పుట్టింది. అది విశాలమైన శాఖలు కలిగి బహుయోజనాల పరిధిలో ఉంటుంది.

**తేషాం చతుర్ణాం వక్ష్యామి శైలేంద్రాణాం యథాక్రమమ్ ॥33॥**

**అమానుష్యాణి రమ్యాణి సర్వకాలర్తుకాని చ ।**
**మనోహరాణి చత్వారి దేవక్రీడనకాని చ ॥34॥**

**వనాని వై చతుర్దిక్షు నామతస్తు నిబోధత ।**
**పూర్వే చైత్రరథం నామ దక్షిణే గంధమాదనమ్ ॥35॥**

**వైభ్రాజం పశ్చిమే విద్యాదుత్తరే సవితుర్వనమ్ ।**
**మిత్రేశ్వరం తు పూర్వే తు షష్ఠేశ్వరమతః పరమ్ ॥36॥**

**వర్యేశ్వరం పశ్చిమే తు ఉత్తరే చామ్రకేశ్వరమ్ ।**

ఆ నాల్గుపర్వతాలకు చెందిన దేవతలు క్రీడించు స్థలముల గూర్చి క్రమంగా చెబుతున్నాను. అవి మనుష్యరహితాలు, సుందరాలు. అన్నికాలాలలో అన్ని ఋతువులలో, మనోహరాలు అయిన నాలుగు దిక్కులందుగల ఉద్యానవనాల్ని గూర్చి, వాటిపేర్లతోకూడా చెప్తున్నాను. తూర్పులో చైత్రరథం, దక్షిణంలో గంధమాదనం, పడమరలో వైభ్రాజం, ఉత్తరంలో సవితువు అనే వనాలున్నాయి. తూర్పులో మిత్రేశ్వరం, షష్ఠేశ్వరం, పడమరలో వర్యేశ్వరం, ఉత్తరంలో ఆమ్రకేశ్వరం అనే శివక్షేత్రాలున్నాయి.

**మహాసరాంసి చ తథా చత్వారి మునిపుంగవాః ॥37॥**

**యత్ర క్రీడంతి మునయః పర్వతేషు వనేషు చ ।**
**అరుణోదం సరః పూర్వం దక్షిణం మానసం స్మృతమ్ ॥38॥**

**సితోదం పశ్చిమసరో మహాభద్రం తథోత్తరమ్ ।**
**శాఖస్య దక్షిణే క్షేత్రం విశాఖస్య చ పశ్చిమే ॥39॥**

**ఉత్తరే నైగమేయస్య కుమారస్య చ పూర్వతః ।**

ఓ మునిశ్రేష్ఠులారా! ఏ పర్వతాలమీద, ఏ వనాలలోను మునిసమూహాలు క్రీడిస్తుంటారో వాటి మీద నాలుగు పెద్ద సరోవరాలున్నాయి. తూర్పులో అరుణోదసరస్సు, దక్షిణంలో మానససరస్సు, పడమరలో సితోదసరస్సు, ఉత్తరంలో మహాభద్రసరస్సు ఉన్నాయి. దక్షిణంలో శాఖాక్షేత్రం, పశ్చిమంలో విశాఖ క్షేత్రం, ఉత్తరంలో నైగమేయ క్షేత్రం, పూర్వదిక్కులో కుమార క్షేత్రం ఉన్నాయి.

**అరుణోదస్య పూర్వేణ శైలేంద్రా నామతః స్మృతాః ॥40॥**

**తాంస్తు సంక్షేపతో వక్ష్యే న శక్యం విస్తరేణ తు ।**
**సితాంతశ్చ కురండశ్చ కురరశ్చాచలోత్తమః ॥41॥**

**వికరో మణిశైలశ్చ వృక్షవాంశ్చాచలోత్తమః ।**
**మహానీలోఽథ రుచకః సబిందుర్దర్దురస్తథా ॥42॥**

**వేణుమాంశ్చ సమేఘశ్చ నిషధో దేవపర్వతః ।**
**ఇత్యేతే పర్వతవరా హ్యన్యే చ గిరయస్తథా ॥43॥**

**పూర్వేణ మందరస్యైతే సిద్ధావాసా ఉదాహృతాః ।**
**తేషు తేషు గిరీంద్రేషు గుహాసు చ వనేషు చ ॥44॥**

**రుద్రక్షేత్రాణి దివ్యాని విష్ణోర్నారాయణస్య చ ।**

"అరుణోద" సరోవరానికి తూర్పునగల పర్వతాల్ని వాటి పేర్లతో సంగ్రహంగా చెబుతాను. విస్తరించి చెప్పడం అలవి గానిది. సితాంతం, కురండం, పర్వతశ్రేష్ఠమైన కురరం, వికరం, మణిశైలం, పర్వతశ్రేష్ఠం వృక్షవంతం, మహానీలం, రుచకం, సవిందు, దర్దురం, వేణుమంతం, సమేధం, నిషధం, దేవపర్వతం అనే యివి మహాపర్వతాలు. ఈ విధంగా ఇతరపర్వతాలు ఉన్నాయి. మందరపర్వతానికి తూర్పునగల ఈ పర్వతాలు సిద్ధుల నివాసస్థానాలు. ఆయా శ్రేష్ఠపర్వతాలలో, గుహలలో, వనాలలో దివ్యాలైన శివక్షేత్రాలు, విష్ణుక్షేత్రాలు ఉన్నాయి.

**సరసో మానసస్యేహ దక్షిణేన మహాచలాః ॥45॥**

**యే కీర్త్యమానాస్తాన్ సర్వాన్ సంక్షిప్య ప్రవదామ్యహమ్ ।**
**శైలశ్చ విశిరాశ్చైవ శిఖరశ్చాచలోత్తమః ॥46॥**

**ఏకశృంగో మహాశూలో గజశైలః పిశాచకః ।**
**పంచశైలోఽథ కైలాసో హిమవాంశ్చాచలోత్తమః ॥47॥**

**ఇత్యేతే దేవచరితా ఉత్కటాః పర్వతోత్తమాః ।**
**తేషు తేషు చ సర్వేషు పర్వతేషు వనేషు చ ॥48॥**

**రుద్రక్షేత్రాణి దివ్యాని స్థాపితాని సురోత్తమైః ।**
**దిగ్భాగే దక్షిణే ప్రోక్తాః పశ్చిమే చ వదామి వః ॥49॥**

మానస సరోవరానికి దక్షిణంగా మహాపర్వతాలు ఉన్నాయి. వాటి అన్నింటిని గూర్చి సంగ్రహంగా మీకు చెబుతున్నాను. శైలం, విశిరం, పర్వతశ్రేష్ఠం అయిన శిఖరం, ఏకశృంగం, మహాశూలం, గజశైలం, పిశాచకం, పంచశైలం, కైలాసం, పర్వతశ్రేష్ఠమైన హిమవంతం– ఇవి అన్నీ దేవసంచారం గలవి. ఉత్కటాలైన ఉత్తమపర్వతాలు. ఈ సమస్తపర్వతాలలోను, వనాలలోను సురశ్రేష్ఠులచేత దివ్యాలైన శివక్షేత్రాలు స్థాపింపబడ్డాయి. దక్షిణదిక్కులో ఉన్న వాటి విషయం చెప్పాను. ఇపుడు మీకు పడమరలో గల వాటిని గూర్చి చెప్పుతున్నాను.

**అపరేణ సితోదశ్చ సురపశ్చ మహాబలః ।**
**కుముదో మధుమాంశ్చైవ హ్యంజనో ముకుటస్తథా ॥50॥**

**కృష్ణశ్చ పాండురశ్చైవ సహస్రశిఖరశ్చ యః ।**
**పారిజాతశ్చ శైలేంద్రః శ్రీ శృంగశ్చాచలోత్తమః ॥51॥**

**ఇత్యేతే దేవచరితా ఉత్కటాః పర్వతోత్తమాః ।**
**సర్వే పశ్చిమదిగ్భాగే రుద్రక్షేత్రసమన్వితాః ॥52॥**

సితోద సరోవరానికి పశ్చిమదిక్కులో సురపం, మహాబలం, కుముదం, మధుమంతం, అంజలం, ముకుటం, కృష్ణం, పాండురం, సహస్రశిఖరం, పారిజాతం, పర్వతశ్రేష్ఠమైన శ్రీ శృంగం అనే పర్వతాలు ఉన్నాయి. ఇవి అన్నీ దేవతలు సంచరించే ఉత్కటాలు అయిన ఉత్తమపర్వతాలు. ఇవన్నీ పడమరలో శివక్షేత్రాలతో కూడియున్నవి.

**మహాభద్రస్య సరసశ్చోత్తరే చ మహాబలాః ।**
**యే స్థితాః కీర్త్యమానాంస్తాన్ సంక్షిప్యేహ నిబోధత ॥53॥**

**శంఖకూటో మహాశైలో వృషభో హంసపర్వతః ।**
**నాగశ్చ కపిలశ్చైవ ఇంద్రశైలశ్చ సానుమాన్ ॥54॥**

**నీలః కంటకశృంగశ్చ శతశృంగశ్చ పర్వతః ।**
**పుష్పకోశః ప్రశైలశ్చ విరజశ్చాచలోత్తమః ॥55॥**

**వరాహపర్వతశ్చైవ మయూరశ్చాచలోత్తమః ।**

**జారుధిశ్చైవ శైలేంద్ర ఏత ఉత్తరసంస్థితాః ॥56॥**

**తేషు శైలేషు దివ్యేషు దేవదేవస్య శూలినః ।**
**అసంఖ్యాతాని దివ్యాని విమానాని సహస్రశః ॥57॥**

మహాభద్ర సరస్సునకు ఉత్తరంగా శక్తిమంతాలైన పర్వతాలున్నాయి. వర్ణింపదగిన వాటిని గూర్చి సంగ్రహంగా చెబుతున్నాను. శంఖకూటం, మహాశైలం, వృషభం, హంసపర్వతం, నాగం, కపిలం, ఇంద్రశైలం, సానుమంతం, నీలం, కంటకశృంగం, శతశృంగం, పుష్పకోశం, ప్రశైలం, పర్వతశ్రేష్ఠమైన విరజం, వరాహపర్వతం, పర్వతశ్రేష్ఠమైన మయూరం అట్లే శైలరాజమైన జారుధి అనే ఇవి అన్నీ ఉత్తరంగా ఉన్న పర్వతాలు, ఈ దివ్యపర్వతాలపైన దేవదేవుడైన శివభగవానుడి భవనాలు వేలసంఖ్యలో ఉన్నాయి.

**ఏతేషాం శైలముఖ్యానామంతరేషు యథాక్రమమ్ ।**
**సంతి చైవాంతరద్రోణ్యః సరాంస్యుపవనాని చ ॥58॥**

**వసంతి దేవా మునయః సిద్ధాశ్చ శివభావితాః ।**
**కృతవాసా సపత్నీకాః ప్రసాదాత్పరమేష్ఠినః ॥59॥**

**లక్ష్మ్యాద్యానాం బిల్వవనే కకుభే కశ్యపాదయః ।**
**తథా తాలవనే ప్రోక్తమింద్రోపేంద్రోరగాత్మనామ్ ॥60॥**

**ఉదుంబరే కర్దమశ్చ తథాన్యేషాం మహాత్మనామ్ ।**
**విద్యాధరాణాం సిద్ధానాం పుణ్యే త్వామ్రవనే శుభే ॥61॥**

**నాగానాం సిద్ధసంఘానాం తథా నింబవనే స్థితిః ।**
**సూర్యస్య కింశుకవనే తథా రుద్రగణస్య చ ॥62॥**

**బీజపూరవనే పుణ్యే దేవాచార్యో వ్యవస్థితః ।**
**కౌముదే తు వనే విష్ణుప్రముఖానాం మహాత్మనామ్ ॥63॥**

ఈ విధమైన పర్వతశ్రేష్ఠాలయొక్క అంతర్భాగంలో సెలయేళ్లు, సరస్సులు, ఉపవనాలు ఉన్నాయి. వాటిలో పరమేష్ఠి శివుడియొక్క కృపవల్ల దేవతలు, మునులు అట్లే సిద్ధులు శివభక్తులై అక్కడ నివాసాలు ఏర్పరచుకుని సతీసమేతంగా ఉంటున్నారు. లక్ష్మీ మొదలైనవారు మారేడువనంలో, కశ్యపాదిమునులు అర్జునవృక్ష (మద్దిచెట్లు) వనంలో, అట్లే ఇంద్రుడు, ఉపేంద్రుడు, మహాసర్పాలు తాటిచెట్లవనంలో, కర్దమాది ఇతర మహాత్ములు మేడిచెట్లువనంలో, విద్యాధరులు, సిద్ధులు పవిత్రమూ సుందరమూ అయిన మామిడివనంలో, నాగులు మరియు సిద్ధగణాలు వేపచెట్లవనంలో, సూర్యుడు మరియు రుద్రగణాలు మోదుగువనంలో, దేవగురువు బృహస్పతి దానిమ్మవనంలో నివసిస్తున్నారు. మహాత్ములైన విష్ణువు మొదలగు ముఖ్యులు కలువలవనంలో నివసిస్తున్నారు.

**స్థలపద్మవనాంతస్థన్యగ్రోధేఽ శేషభోగినః ।**
**శేషస్త్వశేషజగతాం పతిరాస్తేఽ తిగర్వితః ॥64॥**

**స ఏవ జగతాం కాలః పాతాలే చ వ్యవస్థితః ।**
**విష్ణోర్విశ్వగురోర్మూర్తిర్దివ్యః సాక్షాద్ధలాయుధః ॥65॥**

**శయనం దేవదేవస్య స హరేః కంకణం విభోః ।**

సర్పసమూహాలు స్థలపద్మవనం మధ్యలో గల మఱ్ఱి లేదా జమ్మివనంలో ఉంటున్నాయి. ఎంతో గర్వంగల శేషుడు సమస్తజగత్తుకు పతి. ఆతడే జగత్తుకు లయకారకుడు. ఆతడు పాతాళలోకంలో ఉంటాడు. ఆతడు విశ్వగురుడైన విష్ణు భగవానుడి దివ్యరూపం. ఆతనికి స్వయంగా నాగలి ఆయుధం. దేవదేవుడైన విష్ణువుకు శేషుడు తల్పం. శివభగవానుడికి చేతికి కంకణాలంకారం.

**వనే పనసవృక్షాణాం సశుక్రా దానవాదయః ॥66॥**

**కిన్నరైరురగాశ్చైవ విశాఖకవనే స్థితాః ।**
**మనోహరవనే వృక్షాః సర్వకోటిసమన్వితాః ॥67॥**

**నందీశ్వరో గణవరైః స్తూయమానో వ్యవస్థితః ।**
**సంతానకస్థలీమధ్యే సాక్షాద్దేవీ సరస్వతీ ॥68॥**

దానవులు, రాక్షసులు మొదలైనవారు శుక్రాచార్యుడితో కలిసి పనసవృక్షవనంలో, కిన్నరులు, ఉరగులు విశాఖక(కాకర)వనంలో ఉంటారు. మనోహరవనంలో నానాజాతి వృక్షసమూహం ఉంది. ఇందులో గణశ్రేష్ఠులతో కీర్తింపబడుతూ నందీశ్వరుడు ఉన్నాడు. స్వయంగా సరస్వతీమాత కల్పవృక్షక్షేత్రం మధ్యలో ఉంటున్నది.

**ఏవం సంక్షేపతః ప్రోక్తా వనేషు నివాసినః ।**
**అసంఖ్యాతా మయాప్యత్ర వక్తుం నో విస్తరేణ తు ॥69॥**

బ్రాహ్మణులారా! ఈ విధంగా ఆయావనాలలో నివసించేవారిని గూర్చి సంక్షిప్తంగా చెప్పాను. అవి అసంఖ్యాకాలు. విపులంగా చెప్పడానికి నేను సమర్థుణ్ణి కాను.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే జంబూద్వీపవర్ణనం నామైకోనపంచాశత్తమోఽధ్యాయః ॥ 49 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగం జంబూద్వీపవర్ణనమనే నలభై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **పంచాశత్తమోఽధ్యాయః** – ఏబైయవ అధ్యాయం

## **భవనవిన్యాసోద్దేశస్థాపనవర్ణనమ్** – భవనవిన్యాసోద్దేశస్థాపనవర్ణనం

**సూత ఉవాచ** – సూతమహర్షి పలికాడు.

**శితాంతశిఖరే శక్రః పారిజాతవనే శుభే ।**
**తస్య ప్రాచ్యాం కుముదాద్రికూటోఽసౌ బహువిస్తరః ॥1॥**

**అష్టౌ పురాణ్యుదీర్ణాని దానవానాం ద్విజోత్తమాః ।**
**సువర్ణకోటరే పుణ్యే రాక్షసానాం మహాత్మనామ్ ॥2॥**

**నీలకానాం పురాణ్యాహురష్టషష్టిర్ద్విజోత్తమాః ।**

ఇంద్రుడు శితాంతశిఖరం మీద ఉన్న సుందరమైన పారిజాతవనంలో ఉంటాడు. దీనికి తూర్పుగా కుముదాద్రిశిఖరం ఉంది. అది చాలా విశాలమైంది. ఓ బ్రాహ్మణోత్తములారా! అక్కడ దానవులకు ఎనిమిది పురాలున్నాయి. ఓ ఉత్తమబ్రాహ్మణులారా! పవిత్రమైన సువర్ణకోటరంలో రాక్షసులకు నీలకమనే పేరుతో అరవై ఎనిమిది గొప్ప నగరాలున్నాయి.

**మహానీలేఽపి శైలేంద్రే పురాణి దశపంచ చ ॥3॥**

**హయాననానాం ముఖ్యానాం కిన్నరాణాం చ సువ్రతాః।**
**వేణుసౌధే మహాశైలే విద్యాధరపురత్రయమ్ ॥4॥**

ఓ సువ్రతులారా! పర్వతరాజం మహానీలం మీద కూడా హయముఖులైన కిన్నరముఖ్యులకు పదిహేను నగరాలున్నాయి. పర్వతశ్రేష్ఠమైన వేణుసౌధం మీద విద్యాధరులకు మూడు నగరాలున్నాయి.

**వైకుంఠే గరుడః శ్రీమాన్ కరంజే నీలలోహితః ।**
**వసుధారే వసూనాం తు నివాసః పరికీర్తితః ॥5॥**

**రత్నధారే గిరివరే సప్తర్షీణాం మహాత్మనామ్ ।**
**సప్తస్థానాని పుణ్యాని సిద్ధావాసయుతాని చ ॥6॥**

శ్రీమంతుడైన గరుత్మంతుడు వైకుంఠపర్వతంమీద మరియు శివుడు కరంజపర్వతంమీద ఉంటారు. అష్టవసువులు వసుధారపర్వతం మీద నివసిస్తారు. పర్వతశ్రేష్ఠమైన రత్నధారమందు మహాభాగులైన సప్తర్షులకు పవిత్రాలైన ఏడు నివాసస్థానాలున్నాయి. అవి సిద్ధుల నివాసాలు కూడా.

**మహాప్రజాపతేః స్థానమేకశృంగే నగోత్తమే ।**
**గజశైలే తు దుర్గాద్యాః సుమేధే వసవస్తథా ॥7॥**

**ఆదిత్యాశ్చ తథా రుద్రాః కృతావాసాస్తథాశ్వినౌ ।**
**అశీతిర్దేవపుర్యస్తు హేమకక్షే నగోత్తమే ॥8॥**

నగరాజం అయిన ఏకశృంగం మీద ప్రజాపతికి గొప్పనివాసముంది. గజశైలం మీద దుర్గాదులు, సుమేధపర్వతం మీద వసువులు ఉంటారు. పర్వతోత్తమమైన హేమకక్షపర్వతంమీద ఎనభై దేవనగరాలున్నాయి. వాటిల్లో ఆదిత్యగణాలు, రుద్రగణాలు, అట్లే అశ్వినీదేవతలిద్దరు నివసిస్తున్నారు.

**సునీలే రక్షసాం వాసాః పంచకోటిశతాని చ ।**
**పంచకూటే పురాణ్యాసన్ పంచకోటిప్రమాణతః ॥9॥**

**శతశృంగే పురశతం యక్షాణామమితౌజసామ్ ।**
**తామ్రాభే కాద్రవేయాణాం విశాఖే తు గుహస్య వై ॥10॥**

సునీలపర్వతంమీద రాక్షసులకు ఐదువందలకోట్ల నివాసస్థానాలున్నాయి. పంచకూటపర్వతంలోనూ ఐదుకోట్ల నగరాలున్నాయి. శతశృంగపర్వతం మీద మిక్కిలి తేజస్వంతులైన యక్షులకు నూరునగరాలున్నాయి. తామ్రాభపర్వతం మీద కద్రువసంతానాలైన సర్పాలకు, విశాఖపర్వతం మీద గుహుడికి నివాసాలున్నాయి.

**శ్వేతోదరే మునిశ్రేష్ఠాః సువర్ణస్య మహాత్మనః ।**
**పిశాచకే కుబేరస్య హరికూటే హరేర్గృహమ్ ॥11॥**

ఓ మునివరులారా! శ్వేతోదరపర్వతం మీద మహాత్ముడైన సువర్ణుడికి, పిశాచకపర్వతం మీద కుబేరుడికి హరికూటపర్వతం మీద శ్రీహరికి గృహాలున్నాయి.

**కుముదే కిన్నరావాసస్త్వంజనే చారణాలయః ।**
**కృష్ణే గంధర్వనిలయః పాండురే పురసప్తకమ్ ॥12॥**

**విద్యాధరాణాం విప్రేంద్రా విశ్వభోగసమన్వితమ్ ।**
**సహస్రశిఖరే శైలే దైత్యానాముగ్రకర్మణామ్ ॥13॥**

**పురాణాం తు సహస్రాణి సప్తశక్రారిణాం ద్విజాః ।**
**ముకుటే పన్నగావాసః పుష్పకేతౌ మునీశ్వరాః ॥14॥**

**వైవస్వతస్య సోమస్య వాయోర్నాగాధిపస్య చ ।**
**తక్షకే చైవ శైలేంద్రే చత్వార్యాయతనాని చ ॥15॥**

కుముదపర్వతం మీద కిన్నరుల నివాసస్థానం ఉంది. అంజనపర్వతంమీద చారణుల నివాసస్థానముంది. కృష్ణపర్వతం మీద గంధర్వుల నివాసముంది. ఓ శ్రేష్ఠవిప్రులారా! పాండురపర్వతంమీద విద్యాధరులకు ఏడునగరాలున్నాయి. ఇవి అన్నీ అనేకభోగసమన్వితాలు. ఓ ద్విజులారా! సహస్రశిఖరపర్వతంమీద భయానకకర్ములు

ఇంద్రుడికి శత్రువులు అయిన దైత్యులకు ఏడువేల పురాలున్నాయి. ఓ మునీశ్వరులారా! పుష్పకేతుముకుటపర్వతం మీద పన్నగుల ఆవాసముంది. సూర్యపుత్రుడైన శనికి, సోమునకు, వాయువుకి, నాగాధిపతికి గిరిశ్రేష్ఠమైన తక్షక పర్వతం మీద నివాసస్థానాలున్నాయి.

**బ్రహ్మేంద్రవిష్ణురుద్రాణాం గుహస్య చ మహాత్మనః ।**
**కుబేరస్య చ సోమస్య తథాన్యేషాం మహాత్మనామ్ ॥16॥**

**సంత్యాయతనముఖ్యాని మర్యాదా పర్వతేష్వపి ।**
**శ్రీకంఠాద్రిగుహావాసీ సర్వావాసః సహోమయా ॥17॥**

**శ్రీకంఠస్యాధిపత్యం వై సర్వదేవేశ్వరస్య చ ।**
**అండస్యాస్య ప్రవృత్తిస్తు శ్రీకంఠేన న సంశయః ॥18॥**

మహాత్ములు, బ్రహ్మవిష్ణుమహేశ్వరులు, ఇంద్రుడు, గుహుడు, కుబేరుడు, సోముడు, ఇట్లే ఇతరులైన పెద్దలకు మర్యాదాపర్వతాలలో కూడా ముఖ్యమైన నివాసభవనాలున్నాయి. సర్వవ్యాపి శివభగవానుడు పార్వతీదేవితో కలిసి శ్రీకంఠపర్వతగుహలో నివాసముంటున్నాడు. సమస్తదేవతలకు ప్రభువైన శివుడి ఉత్పత్తి శ్రీకంఠపర్వతం నుంచే జరిగింది. ఇందులో సందేహంలేదు.

**అనంతేశాదయస్త్వేవం ప్రత్యేకం చాండపాలకాః ।**
**చక్రవర్తిన ఇత్యుక్తాస్తతో విద్యేశ్వరాస్త్విహ ॥19॥**

**శ్రీకంఠాధిష్ఠితాన్యత్ర స్థానాని చ సమాసతః ।**
**మర్యాదాపర్వతేష్వద్య శృణ్వంతు ప్రవదామ్యహమ్ ॥20॥**

**శ్రీకంఠాధిష్ఠితం విశ్వం చరాచరమిదం జగత్ ।**
**కాలాగ్నిశివపర్యంతం కథం వక్ష్యే సవిస్తరమ్ ॥21॥**

అనంతుడు, ఈశాదులు అయిన ప్రత్యేక దేవతలు బ్రహ్మాండపరిరక్షకులు. అందువల్ల వాళ్లు చక్రవర్తులు, విద్యేశ్వరులు. మర్యాదాపర్వతంపైన శ్రీకంఠంలో ఉన్న స్థానాల్ని గూర్చి సంగ్రహంగా చెబుతున్నాను. మీరు వినండి! శ్రీకంఠాధిష్ఠితమైన కాలాగ్నిశివపర్యంతంగాగల స్థావరజంగమజగత్తును విస్తారంగా ఎట్లుచెప్పగలను?

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే భవనవిన్యాసోద్దేశస్థానవర్ణనం నామ పంచాశత్తమోఽధ్యాయః ॥50॥**

శ్రీలింగమహాపురాణం, పూర్వభాగంలోని భవనవిన్యాసోద్దేశస్థానవర్ణనమనే ఏబైయవ అధ్యాయం సమాప్తం.

## ఏక పంచాశత్తమోఽధ్యాయః - ఏబై ఒకటవ అధ్యాయం

## వివిధద్వీపశోభావర్ణనమ్ - వివిధద్వీపశోభావర్ణనం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**దేవకూటే గిరౌ మధ్యే మహాకూటే సుశోభితే ।**
**హేమవైదూర్యమాణిక్యనీలగోమేదకాంతిభిః ॥1॥**

**తథాన్యైర్మణిముఖ్యైశ్చ నిర్మితే నిర్మలే శుభే ।**
**శాఖాశతసహస్రాఢ్యే సర్వద్రుమవిభూషితే ॥2॥**

**చంపకాశోకపున్నాగవకుళాసనమండితే ।**
**పారిజాతకసంపూర్ణే నానాపక్షిగణాన్వితే ॥3॥**

**నైకధా తు శతైశ్చిత్రే విచిత్రకుసుమాకులే ।**
**నితంబపుష్పసాలంబే నైకసత్త్వగణాన్వితే ॥4॥**

**విమలస్వాదుపానీయే నైకప్రస్రవణైర్యుతే ।**
**నిర్ఝరైః కుసుమాకీర్ణైరనేకైశ్చ విభూషితే ॥5॥**

**పుష్పోడుపవహాభిశ్చ స్రవంతీభిరలంకృతే ।**
**స్నిగ్ధవర్ణం మహామూలమనేకస్కంధపాదపమ్ ॥6॥**

**రమ్యం హ్యవిరళచ్ఛాయం దశయోజనమండలమ్ ।**
**తత్ర భూతవనం నామ నానాభూతగణాలయమ్ ॥7॥**

సుందరమైన ఉన్నత శిఖరాలుగల దేవకూటపర్వతమధ్యభాగంలో భూతవనం అనేపేరుగల వనం ఉంది. ఆ పర్వతశిఖరాలు అత్యంతమూ సుందరమైన బంగారం, వైదూర్యం, మాణిక్యం, నీలం, గోమేదకం అట్లే ఇతరాలైన ప్రధానమణులకాంతులతో స్వచ్ఛంగా ఉంటాయి. ఆ దేవకూటపర్వతం వేలశాఖలు గలిగిన బహువృక్షాలతో అలంకరింపబడి ఉన్నది. చంపకం, అశోకం, పున్నాగం, వకుళం, ఆసనం అనే వృక్షాలతో. పారిజాతవృక్షాలతో పూర్తిగా నిండి ఉంటుది. పలువిధాలైన పక్షిసమూహాలుగలది. ఆ పర్వతం బహువిధ గైరికాదిధాతువులతో చిత్రితమైంది, విచిత్రాలైన పుష్పాలతో కూడిన నితంబవృక్షాలు గలది, అనేకమృగపశుగణాలుగలది, స్వచ్ఛమూ, స్వాదువు అయిన నీటి ప్రవాహాలనూ సెలయేళ్లను గలిగినట్టిది, అనేకవిధాలైన పుష్పాలతో కూడిన ప్రవాహాలు, వాటిలో తిరుగుతున్న పుష్పగుచ్ఛాలనే తెప్పలు గలది, బలమైన మూలాలుగల అనేకశాఖలుగల వృక్షాలతో నిండినది, రమ్యమైన వర్ణంతో కూడినట్టిది, దట్టమైన నీడగలిగినట్టిది, పదియోజనాల పరిధిగలిగినట్టిది, అనేక భూతసమూహాలకు నివాసమైనట్టిది.

**మహాదేవస్య దేవస్య శంకరస్య మహాత్మనః ।**
**దీప్తమాయతనం తత్ర మహామణివిభూషితమ్ ॥8॥**

హేమప్రాకారసంయుక్తం మణితోరణమండితమ్ ।
స్ఫాటికైశ్చ విచిత్రైశ్చ గోపురైశ్చ సమన్వితమ్ ॥9॥

సింహాసనైర్మణిమయైః శుభాస్తరణసంయుతైః ।
క్షితావితస్తతః సమ్యక్ శర్వేణాధిష్ఠితైః శుభైః ॥10॥

అమ్లానమాలానిచితైర్నానావర్ణైర్మహోత్తమైః ।
మండపైః సువిచిత్రైస్తు స్ఫాటికస్తంభసంయుతైః ॥11॥

సంయుతం సర్వభూతేంద్రైర్బ్రహ్మేంద్రోపేంద్రపూజితైః ।
వరాహగజసింహర్క్షశార్దూలకరభాననైః ॥12॥

గృధ్రోలూకముఖైశ్చాన్యైర్మృగోష్ట్రాజముఖైరపి ।
ప్రమథైర్వివిధైః స్థూలైర్గిరికూటోపమైః శుభైః ॥13॥

కరాలైర్హరికేశైశ్చ రోమశైశ్చ మహాభుజైః ।
నానావర్ణాకృతిధరైర్నానాసంస్థానసంస్థితైః ॥14॥

దీప్తాస్యైర్దీప్తచరితైర్నందీశ్వరముఖైః శుభైః ।
బ్రహ్మేంద్రవిష్ణుసంకాశైరణిమాదిగుణాన్వితైః ॥15॥

అశూన్యమమరైర్నిత్యం మహాపరిషదైస్తథా ।
తత్ర భూతపతేర్దేవాః పూజాం నిత్యం ప్రయుంజతే ॥16॥

అక్కడ మహాదేవుడూ, మహాత్ముడూ భగవానుడైన శంకరుడికి కాంతిమంతమైన నివాసస్థానముంది. అది గొప్పమణులతో అలంకరింపబడింది. బంగారంతో నిర్మించిన ప్రాకారాలు గలది. మణులతోకూర్చబడిన తోరణాలు గలది. శుభ్రస్ఫటికలతో నిర్మించిన చిత్రమైన గోపురాలు గలది. శివభగవానుడు అధిష్ఠించే సుందరమైన భూమి వరకు ఆచ్ఛాదనలుగల మణిమయసింహాసనాలుగలది. బహువర్ణాలతో కూడిన వాడనిపూలమాలలతో నిండిన ఉన్నతగృహాలు గలది. చిత్రాతిచిత్రాలైన స్ఫటికస్తంభాలుగల మండపాలు గలది. సమస్తభూతశ్రేష్ఠులు, బ్రహ్మ, ఇంద్రుడు, ఉపేంద్రుడు పూజించేది. వరాహం, గజం, సింహం, ఋక్షం, శార్దూలం, కరభం, గృధ్రం, ఉలూకం, మృగం, ఉష్ట్రం, అజ మొదలైన పశువులయొక్కయు, పక్షులయొక్కయు ముఖాలతో సమానమైన ముఖాలుగల ప్రమథగణాలతో నిండినట్టిది. పర్వతశిఖరాలతో సమానమైన కేశరోమాలుగలవారితో, నానావిధవర్ణాలు, ఆకారాలుగలవారితోను, వివిధాసనస్థితులు, కాంతియుతముఖులు అయిన వారితోను, భవ్యచారిత్రులతోను కూడిన నందీశ్వరుడు మొదలైనవారితో కూడినట్టిది. వాళ్లు అణిమాది అష్టసిద్ధులుగలగి బ్రహ్మావిష్ణుమహేంద్రులతో సమానమైనవాళ్లు. నిత్యం దేవతలైన గొప్పసభ్యులతో పరిపూర్ణంగా ఆ నివాసం ఉంటుంది. అక్కడ దేవతలందరూ శివభగవానుడిని పూజిస్తారు.

**ఝర్ఝరైః శంఖపటహైర్భేరీడిండిమగోముఖైః ।**
**లలితావసితోద్గీతైర్నృత్తవల్గితగర్జితైః ॥17॥**

**పూజితో వై మహాదేవః ప్రమథైః ప్రమథేశ్వరః ।**
**సిద్ధర్షిదేవగంధర్వైర్బ్రహ్మణా చ మహాత్మనా ॥18॥**

**ఉపేంద్రప్రముఖైశ్చాన్యైః పూజితస్తత్ర శంకరః ।**
**విభక్తచారుశిఖరం యత్ర తచ్ఛంఖవర్చసమ్ ॥19॥**

ప్రమథగణనాథుడైన మహాదేవశివుణ్ణి ప్రమథగణాలు ఝర్ఝరం, శంఖం, పటహం, భేరి, డిండిమం గోముఖం మున్నగు వాద్యాల్ని పలికిస్తూ లలితమధురాలైన గీతాలను, మరియు వలయాకారంగా తిరుగుతూ చేసే గర్జనధ్వనుల్ని విన్పిస్తూ పూజిస్తారు. సిద్ధులు, ఋషులు, దేవతలు, గంధర్వులు, మహాత్ముడైన బ్రహ్మదేవుడు, ఉపేంద్రుడు మొదలైన ముఖ్యులు శంకరుణ్ణి పూజిస్తారు. శంకరుడు ఉండే ఆ శిఖరం రెండుగా విభజింపబడి శంఖతుల్యకాంతిగలదిగా ఉంటుంది.

**కైలాసో యక్షరాజస్య కుబేరస్య మహాత్మనః ।**
**నివాసః కోటియక్షాణాం తథాన్యేషాం మహాత్మనామ్ ॥20॥**

**తత్రాపి దేవదేవస్య భవస్యాయతనం మహత్ ।**
**తస్మిన్నాయతనే సోమః సదాస్తే సగణో హరః ॥21॥**

**యత్ర మందాకినీ నామ నలినీ విపులోదకా ।**
**సువర్ణమణిసోపానా కుబేరశిఖరే శుభే ॥22॥**

**జాంబూనదమయైః పద్మగంధస్పర్శగుణాన్వితైః ।**
**నీలవైడూర్యపత్రైశ్చ గంధోపేతైర్మహోత్పలైః ॥23॥**

**తథా కుముదఖండైశ్చ మహాపద్మైరలంకృతా ।**
**యక్షగంధర్వనారీభి రప్సరోభిశ్చ సేవితా ॥24॥**

**దేవదానవగంధర్వైర్యక్షరాక్షసకిన్నరైః ।**
**ఉపస్పృష్టజలా పుణ్యా నదీ మందాకినీ శుభా ॥25॥**

యక్షేశ్వరుడు, మహాత్ముడూ అయిన కుబేరునికి మరియు కోట్లకొలది యక్షులకు, అట్లే ఇతరమహాత్ములకు కైలాసపర్వతం నివాసస్థానం. అక్కడ కూడా దేవదేవుడైన భవుడికి విశాలమైన భవనమున్నది. ఆ మందిరంలో పార్వతీదేవితోను, గణాలతోను కూడి శివుడుంటాడు. అక్కడ సుందరమైన కుబేరపర్వతశిఖరం మీద అధికజలసమన్వితమూ, స్వర్ణమణిమయసోపానపంక్తిగలది, సుగంధభరిత స్వర్ణచ్ఛాయగల పద్మాలుగలది, నీలాల,

వైదూర్యాల కాంతివంటి కాంతిగల దళాలుగల సుగంధభరితాలైన కలువలుగలది, కుముదాలతోను పద్మాలతోను అలంకృతమూ అయిన గంగానది కలదు. ఆ నది గంధర్వస్త్రీలచేతను, అప్సరసలచేతను సేవింపబడుతున్నది. అట్లే ఆమందాకినీ పవిత్రజలాన్ని దేవదానవులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, కిన్నరులు స్నానపానాదులకై ఉపయోగిస్తారు.

**తస్యాశ్చోత్తరపార్శ్వే తు భవస్యాయతనం శుభమ్ ।**
**వైదూర్యమణిసంపన్నం తత్రాస్తే శంకరోఽవ్యయః ॥26॥**

**ద్విజాః కనకనందాయాస్తీరే వై ప్రాచిదక్షిణే ।**
**వనం ద్విజసహస్రాఢ్యం మృగపక్షిసమాకులమ్ ॥27॥**

**తత్రాపి సగణః సాంబః క్రీడతేఽద్రిసమే గృహే ।**

ఆ మందాకినీనదియొక్క ఉత్తరభాగంలో వైదూర్యమణి నిర్మితమైన సుందరమైన శివుడి భవనముంది. అందులో అవినాశియైన శంకరుడు నివసిస్తాడు. ఓ బ్రాహ్మణులారా! దీనికి పూర్వదక్షిణంగా అనగా ఆగ్నేయంగా కనకనందయొక్క ఒడ్డున వేలకొలదిబ్రాహ్మణులతోను, మృగాలతోను, పక్షిగణాలతోను నిండియున్న ఒక వనముంది. అక్కడ కూడా కైలాసపర్వతంతో సమానమైన భవనంలో పార్వతీదేవితో, మరియు గణాలతోను కూడినవాడై శివుడు క్రీడిస్తాడు.

**నందాయాః పశ్చిమే తీరే కించిద్వై దక్షిణాశ్రితే ॥28॥**

**పురం రుద్రపురీ నామ నానాప్రాసాదసంకులమ్ ।**
**తత్రాపి శతధా కృత్వా హ్యాత్మానం చాంబయా సహ ॥29॥**

**క్రీడతే సగణః సాంబస్తచ్ఛివాలయముచ్యతే ।**
**ఏవం శతసహస్రాణి శర్వస్యాయతనాని తు ॥30॥**

**ప్రతిద్వీపే మునిశ్రేష్ఠాః పర్వతేషు వనేషు చ ।**
**నదీనదతటాకానాం తీరేష్వర్ణవసంధిషు ॥31॥**

నందకు పడమరతీరంలో కొద్దిదక్షిణభాగంలో రుద్రపురమనే పేరుగల నగరముంది. అది బహువిధభవన సముదాయంతో కూడినట్టిది. అక్కడ కూడా శివుడు శతవిధరూపాల్ని ధరించి పార్వతీదేవితో కలసి క్రీడిస్తాడు. దానిని శివాలయమంటారు. ఓ మునివరులారా! ప్రతిద్వీపంలోను పర్వతాలపైన, వనాలలో, నదీనదాల ఒడ్డున, సరస్సుల ఒడ్డున, నదీసముద్రసంగమస్థానాలలో లక్షసంఖ్యలో శివుడి భవనాలున్నాయి.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే వివిధ ద్వీపశోభావర్ణనం నామైక పంచాశత్తమోఽధ్యాయః ॥ 51 ॥**

శ్రీలింగమహాపురాణం, పూర్వభాగంలోని వివిధద్వీపశోభావర్ణనమనే యాబై ఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్విపంచాశత్తమోఽధ్యాయః - ఏబై రెండవ అధ్యాయం
## భువనకోశస్వభావవర్ణనమ్ - భువనకోశస్వభావవర్ణనం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**నద్యశ్చ బహవః ప్రోక్తాః సదా బహుజలాః శుభాః ।**
**సరోవరేభ్యః సంభూతాస్త్వసంఖ్యాతా ద్విజోత్తమాః ॥1॥**

**ప్రాఙ్ముఖా దక్షిణాయాస్తు చోత్తరప్రభవాః శుభాః ।**
**పశ్చిమాగ్రాః పవిత్రాశ్చ ప్రతివర్షం ప్రకీర్తితాః ॥2॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! ఎల్లప్పుడూ అధికజలయుతాలు, సుందరాలు అయిన సరోవరాలనుంచి పుట్టిన లెక్కకుమించిన అనేక నదులగూర్చి చెప్పాను. అవి ప్రతివర్షంలోనూ కొన్ని తూర్పుముఖంగాను, మరికొన్ని దక్షిణముఖంగాను, ఇంకాకొన్ని ఉత్తరముఖంగాను ఇంకా కొన్ని పడమరదిక్కుగాను ప్రవహిస్తున్నాయి.

**ఆకాశాంభోనిధిర్యోఽసౌ సోమ ఇత్యభిధీయతే ।**
**ఆధారః సర్వభూతానాం దేవానామమృతాకరః ॥3॥**

**అస్మాత్ప్రవృత్తా పుణ్యోదా నదీ త్వాకాశగామినీ ।**
**సప్తమేనానిలపథా ప్రవృత్తా చామృతోదకా ॥4॥**

**సా జ్యోతీంష్యనువర్తంతీ జ్యోతిర్గణనిషేవితా ।**
**తారాకోటి సహస్రాణాం నభసశ్చ సమాయుతా ॥5॥**

**పరివర్తత్యహరహో యథా సోమస్తథైవ సా ।**

ఆకాశంలో జలసాగరముంది. దాన్ని 'సోమ' అంటారు. అది సర్వప్రాణులకు ఆధారం. అట్లే దేవతలకు అమృతభాండారం. దీని నుండి వెలువడి పవిత్రజలాలతో కూడిన ఆకాశసంచారియగు నది ఉన్నది. అది ఏడవవాయుమార్గంగుండా ప్రవహిస్తూ అమృతప్రాయమైన జలం గలదై జ్యోతిస్సులననుసరిస్తూ, జ్యోతిర్గణ సేవితయై, వేలకోట్లు నక్షత్రాలతో నిండియున్న ఆకాశంగలదై ప్రవహిస్తూ, 'సోమ' ముతో సమానమై ఉన్నది.

**చత్వార్యశీతిశ్చ తథా సహస్రాణాం సముచ్ఛ్రితః ॥6॥**

**యోజనానాం మహామేరుః శ్రీకంఠాక్రీడకోమలః ।**
**తత్రాసీనో యతః శర్వః సాంబః సహ గణేశ్వరైః ॥7॥**

**క్రీడతే సుచిరం కాలం తస్మాత్పుణ్యజలా శివా ।**
**గిరిం మేరుం నదీ పుణ్యా సా ప్రయాతి ప్రదక్షిణమ్ ॥8॥**

మేరుపర్వతం ఎనభైనాలుగువేల యోజనాల ఎత్తైనది. అది భగవంతుడు శ్రీకంఠుడి కోమలక్రీడాస్థలం. అక్కడ శివుడు పార్వతీదేవితో, గణేశ్వరులతో కూడి ఉంటాడు. అక్కడే ఎక్కువకాలం క్రీడిస్తాడు. అందుచేత అది పవిత్రజలం గలది అయి శుభకారి అవుతున్నది. పుణ్యప్రదాయిని అయిన ఆ నది మేరు పర్వతానికి ప్రదక్షిణ చేస్తున్నది.

**విభజ్యమానసలిలా సా జవేనానిలేన చ ।**
**మేరోరంతరకూటేషు నిపపాత చతుర్ష్వపి ॥9॥**

**సమంతాత్సమతిక్రమ్య సర్వాద్రీన్ ప్రవిభాగశః ।**
**నియోగాద్దేవదేవస్య ప్రవిష్టా సా మహార్ణవమ్ ॥10॥**

**అస్యా వినిర్గతా నద్యః శతశోఽథ సహస్రశః ।**
**సర్వద్వీపాద్రివర్షేషు బహవః పరికీర్తితాః ॥11॥**

**క్షుద్రనద్యస్త్వసంఖ్యాతా గంగా యద్గాం గతాంబరాత్ ।**

వాయువు యొక్క వేగకారణంగా విభజింపబడిన నీరుగల ఆ నది మేరుపర్వతం యొక్క లోపలి నాల్గుశిఖరాలపై ప్రవహిస్తున్నది. అన్ని పర్వతాల్ని విభాగపూర్వకంగా అన్నిదిక్కులా అతిక్రమించిన ఆ నది శివభగవానుడి నిర్దేశం చేత మహాసాగరాన్ని చేరుతున్నది. దాని నుంచి బయటబడిన నదులు వందలూ వేలూ ఉన్నాయి. అవి అన్ని ద్వీపాలలోను, పర్వతాలలోను, వర్షాలలోను అనేకంగా ఉన్నాయి. చిన్నచిన్ననదులు కూడా లెక్కలేనన్ని ఉన్నాయి. ఆకాశం నుంచి భూమిని చేరడం వల్ల ఆ నదికి గంగ అనే పేరు కలిగింది.

**కేతుమాలే నరాః కాలాః సర్వే పనసభోజనాః ॥12॥**

**స్త్రియశ్చోత్పలవర్ణాభా జీవితం చాయుతం స్మృతమ్ ।**
**భద్రాశ్వే శుక్లవర్ణాశ్చ స్త్రియశ్చంద్రాంశుసన్నిభాః ॥13॥**

**కాలామ్రభోజనాః సర్వే నిరాతంకా రతిప్రియాః ।**
**దశవర్షసహస్రాణి జీవంతి శివభావితాః ॥14॥**

**హిరణ్మయా ఇవాత్యర్థమీశ్వరార్పితచేతసః ।**

కేతుమాలవర్షంలోని నరులు అందరూ నల్లటి వర్ణం కలవారు. వాళ్లు పనసపండ్లను తింటారు. స్త్రీలు నల్లకలువవర్ణం కలవారు. వాళ్లు పదివేల సంవత్సరాలు జీవిస్తారు. భద్రాశ్వవర్షంలో జనులందరూ తెల్లటివర్ణం కలవారు. అక్కడి స్త్రీలు చంద్రకిరణసమానదేహవర్ణం కలవారు. వారి ఆహారం నల్లటి ఆమ్రఫలాలు. అందరూ ఎటువంటి ఆటంకాలు లేనివారు. ఇష్టరతులు. శివధ్యాననిష్ఠులైనవాళ్లు. పదివేల సంవత్సరాలు జీవిస్తున్నారు. హిరణ్మయ వర్షంలోనివాళ్లతో సమానంగా వీళ్లు మిక్కిలిగా శివుడిలో లగ్నం చేసిన మనసుగలవాళ్లు.

**తథా రమణకే జీవా న్యగ్రోధఫలభోజనాః ॥15॥**

**దశవర్షసహస్రాణి శతాని దశపంచ చ ।**
**జీవంతి శుక్లాస్తే సర్వే శివధ్యానపరాయణాః ॥16॥**

**హైరణ్మయా మహాభాగా హిరణ్మయవనాశ్రయాః ।**
**ఏకాదశసహస్రాణి శతాని దశపంచ చ ॥17॥**

**వర్షాణాం తత్ర జీవంతి అశ్వత్థాశనజీవనాః ।**
**హిరణ్మయా ఇవాత్యర్థమీశ్వరార్పితమానసాః ॥18॥**

రమణకవర్షంలోని జనులు మఱ్ఱిపండ్లు ఆహారంగా కలవారు. వాళ్లు పదకొండు వేల ఐదువందల సంవత్సరాలు జీవిస్తారు. వాళ్లు అందరూ తెల్లటి రంగుగలవారు. శివధ్యానతత్పరులు. హిరణ్మయవర్షంలో హిరణ్మయవనాన్ని ఆశ్రయించిన మహాభాగ్యశాలురైన జనులున్నారు. వాళ్లు పండ్రెండు వేల ఐదువందల సంవత్సరాలు జీనిస్తారు. వాళ్లు అశ్వత్థఫలాల్ని తిని జీవిస్తారు. వాళ్లు హిరణ్మయవాసులవలె మిక్కిలి ఈశ్వరలగ్నహృదయులై ఉంటారు.

**కురువర్షే తు కురవః స్వర్గలోకాత్పరిచ్యుతాః ।**
**సర్వే మైథునజాతాశ్చ క్షీరిణః క్షీరభోజనాః ॥19॥**

**అన్యోన్యమనురక్తాశ్చ చక్రవాకసధర్మిణః ।**
**ఆనామయా హ్యశోకాశ్చ నిత్యం సుఖనిషేవిణః ॥20॥**

**త్రయోదశసహస్రాణి శతాని దశపంచ చ ।**
**జీవంతి తే మహావీర్యా న చాన్యస్త్రీనిషేవిణః ॥21॥**

**సహైవ మరణం తేషాం కురూణాం స్వర్గవాసినామ్ ।**
**హృష్టానాం సుప్రవృద్ధానాం సర్వాన్నామృతభోజినామ్ ॥22॥**

**సదా తు చంద్రకాంతానాం సదా యౌవనశాలినామ్ ।**
**శ్యామాంగానాం సదా సర్వభూషణాస్పదదేహినామ్ ॥23॥**

**జంబూద్వీపే తు తత్రాపి కురువర్షం సుశోభనమ్ ।**
**తత్ర చంద్రప్రభం శంభోర్విమానం చంద్రమౌళినః ॥24॥**

కురువర్షంలోని కురుజనులు స్వర్గం నుంచి పతనం చెంది ఇచ్చట నివసిస్తున్నారు. అందరూ సంభోగ క్రియవల్ల జన్మించిన వాళ్లే. వాళ్లు పాలుత్రాగుతూ పాలే ఆహారంగా జీవిస్తారు. ఒకరినొకరు ప్రేమిస్తారు. చక్రవాకపక్షిధర్మంగలవారు. వాళ్లు రోగరహితులు. శోకరహితులు. ఎల్లప్పుడూ సుఖభోగులు. మహాబలులు.

పరస్త్రీవిముఖులు. పధ్నాలుగు వేల ఐదువందల సంవత్సరాలు జీవిస్తున్నారు. సంతుష్టులు, పరిపుష్టులు, అన్నివిధాల అన్నమూ, అమృతమూ భుజించువారు, ఎల్లప్పుడూ చంద్రసమానకాంతిమంతులు, నిత్యయౌవనవంతులు, శ్యామవర్ణులు, సర్వాలంకారశోభితదేహులు అయిన వీళ్లకు స్వర్గవాసులమాదిరిగానే మరణం ఉంటుంది. ఇట్లే జంబూద్వీపంలోనూ అత్యంతసుందరమైన కురువర్షముంది. అక్కడ చంద్రమౌళికి చంద్రకాంతితుల్యభవనముంది.

**వర్షేతు భారతే మర్త్యాః పుణ్యాః కర్మవశాయుషః ।**
**శతాయుషః సమాఖ్యాతా నానావర్ణాల్పదేహినః ॥25॥**

**నానాదేవార్చనే యుక్తా నానాకర్మఫలాశినః ।**
**నానాజ్ఞానార్థసంపన్నా దుర్బలాశ్చాల్పభోగినః ॥26॥**

భారతవర్షంలో మానవులు పుణ్యశాలులు. కర్మాధీనాయుష్కులు. నూరుసంవత్సరాలు ఆయుర్దాయం కలవారు. పలురంగులతో బలహీనమైన శరీరంగలవారు. అనేకదేవతల్ని పూజిస్తారు. పలురకాల కర్మఫలాన్ని అనుభవిస్తారు. బహువిధ జ్ఞానసంపద, అర్థసంపద కలిగినవారు. బలహీనులు. అల్పసుఖభోక్తలు.

**ఇంద్రద్వీపే తథా కేచిత్తథైవ చ కసేరుకే ।**
**తామ్రద్వీపం గతాః కేచిత్కేచిద్దేశం గభస్తిమత్ ॥27॥**

**నాగద్వీపం తథా సౌమ్యం గాంధర్వం వారుణం గతాః ।**
**కేచిన్మ్లేచ్ఛాః పులిందాశ్చ నానాజాతి సముద్భవాః ॥28॥**

**పూర్వే కిరాతాస్తస్యాంతే పశ్చిమే యవనాః స్మృతాః ।**
**బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా మధ్యే శూద్రాశ్చ సర్వశః ॥29॥**

**ఇజ్యాయుద్ధవణిజ్యాభిర్వర్తయంతో వ్యవస్థితాః ।**
**తేషాం సంవ్యవహారోఽయం వర్తతేఽత్ర పరస్పరమ్ ॥30॥**

**ధర్మార్థకామసంయుక్తో వర్ణానాం తు స్వకర్మసు ।**
**సంకల్పశ్చాభిమానశ్చ ఆశ్రమాణాం యథావిధి ॥31॥**

**ఇహ స్వర్గాపవర్గార్థం ప్రవృత్తిర్యత్ర మానుషీ ।**
**తేషాంచ యుగకర్మాణి నాన్యత్ర మునిపుంగవాః ॥32॥**

వీళ్లల్లో కొందరు ఇంద్రద్వీపానికి, కొందరు కసేరుకద్వీపానికి, కొందరు తామ్రద్వీపానికి కొందరు గభస్తిదేశానికి వెళ్లారు. కొందరు నాగద్వీపానికి, కొందరు సోమద్వీపానికి, కొందరు గంధర్వద్వీపానికి, కొందరు వరుణద్వీపానికి వెళ్లారు. కొందరు వివిధజాతులనుంచి పుట్టిన మ్లేచ్ఛులు మరియు పుళిందులు. ఈ ద్వీపం యొక్క ముందుభాగంలో (తూర్పు) కిరాతులు, చివరిదైన పడమర భాగంలో యవనులు ఉన్నారు. దీని మధ్యభాగంలో అన్నిచోట్ల బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు ఉన్నారు. వాళ్లు పూజ, (యజ్ఞం) యుద్ధం, వాణిజ్యం ద్వారా జీవిస్తారు. ఆ

విధమైన జీవిక నిర్ణయింపబడింది. ఆ నాలుగు వర్ణాలకు వాళ్ల కర్మలకు పరస్పరసంబంధముంది. వాళ్లకర్మలు ధర్మ అర్థ కామ సంబంధాలు. బ్రహ్మచర్యాది ఆశ్రమాల విషయంలో వాళ్లకు సంకల్పం మరియు అభిమానం ఉచితరూపంగా (తగినవిధంగా) ఉంది. ఈ మానవులకు స్వర్గం మరియు మోక్షం కోసం ప్రయత్నం ఉంటుంది. ఓ మునిశ్రేష్ఠులారా! వీరికి యుగకర్మలున్నాయి. ఇటువంటివి మరి ఎక్కడా లేవు.

**దశవర్ష సహస్రాణి స్థితిః కింపురుషే నృణామ్ ।**
**సువర్ణవర్ణాశ్చ నరా స్త్రియశ్చాప్సరసోపమాః ॥33॥**

**అనామయా హ్యశోకాశ్చ సర్వే తే శివభావితాః ।**
**శుద్ధసత్త్వాశ్చ హేమాభాః సదారాః ప్లక్షభోజనాః ॥34॥**

కింపురుషవర్షంలో నరుల జీవితకాలం పదివేల సంవత్సరాలు. ఆ ప్రజలు బంగారు రంగుగలవారు. స్త్రీలు కూడా అప్సరసలతో సమానులు. వాళ్లు అందరూ రోగాలు లేనివాళ్ళు. దుఃఖరహితులు, శివభక్తిపరులు. పవిత్రసత్త్వగుణసంపన్నులు. స్వర్ణసమానకాంతిమంతులు. భార్యాసహితులు. మేడిపండ్లను భుజిస్తారు.

**మహారజతసంకాశా హరితవర్షేఽపి మానవాః ।**
**దేవలోకాచ్చ్యుతాః సర్వే దేవాకారాశ్చ సర్వశః ॥35॥**

**హరం యజంతి సర్వేశం పిబంతీక్షురసం శుభమ్ ।**
**న జరా బాధతే తేన న చ జీర్యంతి తే నరాః ॥36॥**

**దశవర్షసహస్రాణి తత్ర జీవంతి మానవాః ।**

హరితవర్షమందలి మానవులు మహారజతసమానవర్ణం కలవాళ్లు. వాళ్లు అందరూ దేవలోకంనుంచి పతనం చెందారు. అందుచే అన్నివిధాల వాళ్లు దేవతల ఆకారంలోనే ఉంటారు. సర్వేశ్వరుడైన శివుణ్ణి పూజిస్తారు. పవిత్రమైన చెరుకురసాన్ని త్రాగుతారు. దానివల్ల వాళ్లను ముసలితనం బాధించదు. అందుచే వాళ్లు ముసలి వాళ్లుకారు. వాళ్లు పదివేల సంవత్సరాలు జీవిస్తారు.

**మధ్యమం యన్మయా ప్రోక్తం నామ్నా వర్షమిలావృతమ్ ॥37॥**

**న తత్ర సూర్యస్తపతి న తే జీర్యంతి మానవాః ।**
**చంద్రసూర్యౌ న నక్షత్రం న ప్రకాశమిలావృతే ॥38॥**

**పద్మప్రభాః పద్మముఖాః పద్మపత్రనిభేక్షణాః ।**
**పద్మపత్రసుగంధాశ్చ జాయంతే భవభావితాః ॥39॥**

**జంబూఫలరసాహారా అనిష్పందాః సుగంధినః ।**
**దేవలోకాగతాస్తత్ర జాయంతే హ్యజరామరాః ॥40॥**

**త్రయోదశసహస్రాణి వర్షాణాం తే నరోత్తమాః ।**
**ఆయుః ప్రమాణం జీవంతి వర్షే దివ్యే త్విలావృతే ॥41॥**

**జంబూఫలరసం పీత్వా న జరా బాధతే త్విమాన్ ।**
**న క్షుధా న క్లమశ్చాపి న జనో మృత్యుమాంస్తథా ॥42॥**

**తత్ర జంబూనదం నామ కనకం దేవభూషణమ్ ।**
**ఇంద్రగోపప్రతీకాశం జాయతే భాస్వరం తు తత్ ॥43॥**

మధ్యలోగలదాన్ని నేను ఇలావృతవర్షంగా చెప్పాను. అక్కడ సూర్యతాపముండదు. అక్కడి వాళ్లకు ముసలితనం ఉండదు. ఇలావృతంలో సూర్యచంద్రులు, నక్షత్రాలు ఉండవు. దానితో వెలుగు ఉండదు. అక్కడి వాళ్లు పద్మసమానకాంతిమంతులు. పద్మంవంటిముఖంగలవారు. పద్మదళసమాననేత్రులు. పద్మపత్రసుగంధ యుతులు. శివభక్తిపరతంత్రులు. వాళ్లు జంబూఫలరసాన్ని ఆహారంగా తీసుకుంటారు. ధూపప్రభావదూరులు. సుగంధయుక్తులు. దేవలోకంనుంచి వచ్చిన వాళ్లు అవడంచేత ముసలితనం, మరణంలేనివాళ్లు. ఈ దివ్యమైన ఇలావృతంలోని మానవశ్రేష్ఠులు పదమూడువేల సంవత్సరాల ఆయుర్దాయం గలవాళ్లై జీవిస్తారు. జంబూఫలరసం త్రాగడంవల్ల వీళ్లను ముసలితనం బాధించదు. ఆకలి, దప్పికలు ఉండవు. అకాలమరణముండదు. అక్కడ జంబూనదం అనే పేరుగల సువర్ణం ఉంటుంది. అది దేవతలకు అలంకారం. అది ఇంద్రగోపమనే కీటవిశేషంతో సమానమైన కాంతి గలిగి ఉంటుంది.

**ఏవం మయా సమాఖ్యాతా నవవర్షానువర్తినః ।**
**వర్ణాయుర్భోజనాద్యాని సంక్షిప్య న తు విస్తరాత్ ॥44॥**

ఈ విధంగా నేను తొమ్మిది వర్షాలలో నివసించే జనుల విషయాలు చెప్పాను. వారి వర్ణం, ఆయుర్దాయం, ఆహారం మొదలైన విషయాలు సంగ్రహంగా చెప్పాను. విస్తారంగా చెప్పలేదు.

**హేమకూటే తు గంధర్వా విజ్ఞేయాశ్చాప్సరోగణాః ।**
**సర్వే నాగాశ్చ నిషధే శేషవాసుకితక్షకాః ॥45॥**

**మహాబలాస్త్రయస్త్రింశద్రమంతే యాజ్ఞికాః సురాః ।**
**నీలే తు వైదూర్యమయే సిద్ధాః బ్రహ్మర్షయోఽమలాః ॥46॥**

హేమకూటపర్వతం మీద గంధర్వులు, మరియు అప్సరసలు ఉంటారని తెలియాలి. నిషధపర్వతంమీద శేషుడు, వాసుకి, తక్షకుడు మరియు అందరు నాగులు ఉంటారు. ముప్పైమూడువేల మహాబలులైన యాజ్ఞికులైన దేవతలు, సిద్ధులసమూహం, పవిత్రాత్ములైన బ్రహ్మర్షిగణం వైదూర్యమయమైన నీలపర్వతంపై ఉంటారు.

**దైత్యానాం దానవానాం చ శ్వేతః పర్వత ఉచ్యతే ।**
**శృంగవాన్ పర్వతశ్చైవ పిత్రూణాం నిలయః సదా ॥47॥**

**హిమవాన్ యక్షముఖ్యానాం భూతానామీశ్వరస్య చ ।**
**సర్వాద్రిషు మహాదేవో హరిణా బ్రహ్మణాంబయా ॥48॥**

**నందినా చ గణైశ్చైవ వర్షేషు చ వనేషు చ ।**
**నీలశ్వేతత్రిశృంగే చ భగవాన్నీలలోహితః ॥49॥**

**సిద్ధైర్దేవైశ్చ పితృభిర్దృష్టో నిత్యం విశేషతః ।**
**నీలశ్చ వైడూర్యమయః శ్వేతః శుక్లో హిరణ్మయః ॥50॥**

**మయూరబర్హవర్ణస్తు శాతకుంభస్త్రిశృంగవాన్ ।**
**ఏతే పర్వతరాజానో జంబూద్వీపే వ్యవస్థితాః ॥51॥**

దైత్యులకు దానవులకు శ్వేతపర్వతం నివాసస్థానం. పితృదేవతలకు శృంగవంతపర్వతం నిలయస్థానం. హిమవత్పర్వతం యక్షులకు, భూతగణాలకు, శివుడికి నివాసస్థలం. మహాదేవశివుడు విష్ణువుతో, బ్రహ్మతో, పార్వతీదేవితో, నందీశ్వరుడితో, ప్రమథగణాలతో కూడినవాడై వివిధవర్షాలలో, వనాలలో నివసిస్తాడు. భగవంతుడు నీలలోహితశివుడు నీల, శ్వేత, త్రిశృంగపర్వతాల మీద విశేషరూపాలతో సిద్ధులతో, దేవతలతో, పితృదేవతలతో కలిసి నిత్యం కన్పిస్తాడు. నీలపర్వతం వైడూర్యమయంగా, శ్వేతపర్వతం బంగారువర్ణంలోను ఉంటాయి. నెమలిపింఛకాంతులీనుచూ బంగారు కుంభములతో త్రిశృంగపర్వతముంటుంది. ఈ పర్వతశ్రేష్ఠాలన్నీ జంబూద్వీపమందున్నాయి.

**ఇతి శ్రీలింగమహాపురాణే పుర్వభాగే భువనకోశస్వభావవర్ణనం నామ ద్విపంచాశత్తమోఽధ్యాయః ॥ 52 ॥**

శ్రీలింగమహాపురాణం, పూర్వభాగంలోని భువనకోశస్వభావవర్ణనమనే ఏభై రెండవ అధ్యాయం సమాప్తం.

## త్రిపంచాశత్తమోఽధ్యాయః - ఏబై మూడవ అధ్యాయం

## భువనకోశవిన్యాసనిర్ణయః - భువనకోశవిన్యాసనిర్ణయం

**సూత ఉవాచ** - సూత మహర్షి పలికాడు.

**ప్లక్షద్వీపాది ద్వీపేషు సప్త సప్తసు పర్వతాః ।**
**ఋజ్వాయతాః ప్రతిదిశం నివిష్టా వర్షపర్వతాః ॥1॥**

ప్లక్షం మొదలైన ఏడు ద్వీపాలలో ప్రతిద్వీపంలోను ఏడు పర్వతాలున్నాయి. అవి సూటిగా, పొడవుగా ప్రత్యేకదిశలలో వ్యాపించి ఉన్నాయి. అవి అన్నీ వర్షపర్వతాలుగా నిలిచి ఉన్నాయి.

**ప్లక్షద్వీపే తు వక్ష్యామి సప్త దివ్యాన్ మహాచలాన్ ।**
**గోమేదకోఽత్ర ప్రథమో ద్వితీయశ్చాంద్ర ఉచ్యతే ॥2॥**

**తృతీయో నారదో నామ చతుర్థో దుందుభిః స్మృతః ।**
**పంచమః సోమకో నామ సుమనాః షష్ఠ ఉచ్యతే ॥3॥**

**స ఏవ వైభవః ప్రోక్తో వైభ్రాజః సప్తమః స్మృతః ।**
**సప్తైతే గిరయః ప్రోక్తాః ప్లక్షద్వీపే విశేషతః ॥4॥**

ప్లక్షద్వీపంలో గల ఏడు దివ్యమహాపర్వతాల్ని గూర్చి చెబుతాను.

మొదటిపర్వతం గోమేదకం. రెండోది చంద్రపర్వతం. మూడోది నారదం. నాల్గోది దుందుభి. అయిదోది సోమకం. ఆరోది సుమనం. దీన్నే వైభవం అనీ అంటారు. ఏడోది వైభ్రాజ పర్వతం. ఈ ఏడు పర్వతాలు విశిష్టరూపాలు గలవి.

**సప్త వై శాల్మలిద్వీపే తాంస్తు వక్ష్యామ్యనుక్రమాత్ ।**
**కుముదశ్చోత్తమశ్చైవ పర్వతశ్చ బలాహకః ॥5॥**

**ద్రోణః కంకశ్చ మహిషః కకుద్మాన్ సప్తమః స్మృతాః ।**
**కుశద్వీపే తు సప్తైవ ద్వీపాశ్చ కులపర్వతాః ॥6॥**

**తాంస్తు సంక్షేపతో వక్ష్యే నామమాత్రేణ వై క్రమాత్ ।**
**విద్రుమః ప్రథమః ప్రోక్తో ద్వితీయో హేమపర్వతః ॥7॥**

**తృతీయో ద్యుతిమాన్నామ చతుర్థః పుష్పితః స్మృతః ।**
**కుశేశయః పంచమస్తు షష్ఠో హరిగిరిః స్మృతః ॥8॥**

**సప్తమో మందరః శ్రీమాన్ మహాదేవనికేతనమ్ ।**
**మందా ఇతి హ్యపాం నామ మందరో ధారణాదపామ్ ॥9॥**

శాల్మలిద్వీపంలోని ఏడు పర్వతాల గూర్చి క్రమంగా చెప్పుతాను. కుముదం, ఉత్తమం, బలాహకం, ద్రోణం, కంకం, మహిషం మరియు ఏడోది కకుద్మంతం అనేవి. కుశద్వీపంలో ఏడు కులపర్వతాలున్నాయి. వాటిని గూర్చి సంగ్రహంగా కేవలం పేర్లను మాత్రమే చెప్పుతాను. మొదటిది విద్రుమం. రెండోది హేమపర్వతం. మూడోది ద్యుతిమంతం. పుష్పితం నాల్గోది. కుశేశయం అయిదోది. హరిగిరి ఆరోది. ఏడోది మందరం. శోభాకరమైన అది శివభగవానుడి నివాసం. నీటికి (జలమునకు) మందమనే పేరుంది. నీటిని ధరించడం వల్ల మందరం అవుతున్నది.

**తత్ర సాక్షాత్ వృషాంకస్తు విశ్వేశో విమలః శివః ।**
**సోమః సనందీ భగవానాస్తే హేమగృహోత్తమే ॥10॥**

**తపసా తోషితః పూర్వం మందరేణ మహేశ్వరః ।**
**అవిముక్తే మహాక్షేత్రే లేభే స పరమం వరమ్ ॥11॥**

అక్కడ వృషభధ్వజుడు, విశ్వేశ్వరుడు, విమలుడు అయిన శివుడు పార్వతీదేవితో, నందీశ్వరుడితో కూడిన వాడై స్వర్ణమయోత్తమగృహంలో స్వయంగా ఉంటాడు. పూర్వకాలంలో అవిముక్తమహాక్షేత్రంలో మందరుడి తపస్సువల్ల పరమేశ్వరుడు సంతోషించాడు. మందరుడు గొప్పవరాన్ని మహేశ్వరుడి నుంచి పొందాడు.

**ప్రార్థితశ్చ మహాదేవో నివాసార్థం సహాంబయా ।**
**అవిముక్తాదుపాగమ్య చక్రే వాసం స మందరే ॥12॥**

**సనందీ సగణః సోమస్తేనాసౌ తన్న ముంచతి ।**

మహాదేవుడు తన మీద నివసించడానికై మందరుడిచే ప్రార్థింపబడి అవిముక్త క్షేత్రంనుంచి వచ్చినవాడై మందరంమీద నందితో, గణాలతో, పార్వతీదేవితో కలిసి నివసిస్తున్నాడు. ఈ కారణంగా శివుడు మందరాన్ని విడిచిపెట్టడం లేదు.

**క్రౌంచద్వీపే తు సప్తేహ క్రౌంచాద్యాః కులపర్వతాః ॥13॥**

**క్రౌంచో వామనకః పశ్చాత్తృతీయశ్చాంధకారకః ।**
**అంధకారాత్పరశ్చాపి దివావృన్నామ పర్వతః ॥14॥**

**దివావృతః పరశ్చాపి వివిందో గిరిరుచ్యతే ।**
**వివిందాత్పరతశ్చాపి పుండరీకో మహాగిరిః ॥15॥**

**పుండరీకాత్పరశ్చాపి ప్రోచ్యతే దుందుభిస్వనః ।**
**ఏతే రత్నమయాః సప్త క్రౌంచద్వీపస్య పర్వతాః ॥16॥**

క్రౌంచం, వామనకం, మూడోది అంధకారపర్వతం. అంధకారం తర్వాత నాల్గోది దివావృత్తు అనే పేరుగల పర్వతం. దివావృత్తు తర్వాత వివింద పర్వతం. వివిందం తర్వాత పుండరీకమహాపర్వతం. దాని తర్వాత దుందుభిస్వనపర్వతం. ఈ ఏడూ క్రౌంచద్వీపంలోని రత్నమయకులపర్వతాలు.

**శాకాద్వీపే చ గిరయః సప్త తాంస్తు నిబోధత ।**
**ఉదయో రైవతశ్చాపి శ్యామకో మునిసత్తమాః ॥17॥**

**రాజతశ్చ గిరిః శ్రీమానాంబికేయః సుశోభనః ।**
**ఆంబికేయాత్పరో రమ్యః సర్వౌషధిసమన్వితః ॥18॥**

**తథైవ కేసరీయుక్తో యతో వాయుః ప్రజాయతే ।**

శాకద్వీపంలోను ఏడు పర్వతాలున్నాయి. వాటిని తెలియండి! ఓ మునిశ్రేష్ఠులారా! ఉదయం, రైవతం, శ్యామకం, శోభాసంపన్నమైన రాజతపర్వతం, అట్లే అత్యంతసుందరమైన ఆంబికేయపర్వతం, దీని తర్వాత సమస్తౌషధినిలయం రమ్యపర్వతం, దీని తర్వాత కేసరీపర్వతం ఉన్నాయి. ఈ పర్వతాలనుంచి వాయువు పుట్టుతున్నది.

**పుష్కరే పర్వతః శ్రీమాన్నేక ఏవ మహాశిలః ॥19॥**

**చిత్రైర్మణిమయైః కూటైః శిలాజాలైః సముచ్ఛ్రితైః ।**
**ద్వీపస్య తస్య పూర్వార్ధే చిత్రసానుస్థితో మహాన్ ॥20॥**

**యోజనానాం సహస్రాణి ఊర్ధ్వం పంచాశదుచ్ఛ్రితః ।**
**అధశ్చైవ చతుస్త్రింశత్సహస్రాణి మహాచలః ॥21॥**

**ద్వీపస్యార్ధే పరిక్షిప్తః పర్వతో మానసోత్తరః ।**
**స్థితో వేలాసమీపే తు నవచంద్ర ఇవోదితః ॥22॥**

పుష్కరద్వీపంలో మహాశిల అనే పేరుగల శోభాసంపన్నమైన ఒకే పర్వతం ఉంది. అది అద్భుతమణిమయ శిఖరాలతోను ఎత్తైన శిలాజాలంతో కూడి ఉంటుంది. ఈ ద్వీపమందలి పూర్వార్ధభాగంలో ఆశ్చర్యకరమైన గొప్పసానువు ఉంది. ఈ పర్వతం భూమినుంచి పైకి ఏభైవేలయోజనాల ఎత్తు ఉంది. భూమి క్రిందకి ముప్పైవేల యోజనాల లోతును కలిగి ఉంది. ఈ పర్వతం దీపంయొక్క సగభాగంలో ఉత్తరదిశలో మానసపర్వతశృంఖలం మీదకు వ్యాపించి ఉంది. సముద్రసమీపంలో ఉన్న ఇది నూతనచంద్రుడిలాగా ప్రకాశిస్తుంది.

**యోజనానాం సహస్రాణి ఊర్ధ్వం పంచాశదుచ్ఛ్రితః ।**
**తావదేవ తు విస్తీర్ణః పార్శ్వతః పరిమండలః ॥23॥**

**స ఏవ ద్వీపపశ్చార్ధే మానసః పృథివీధరః ।**
**ఏక ఏవ మహాసానుః సన్నివేశాద్ ద్విధా కృతః ॥24॥**

భూమిపైనుంచి ఇది ఏభైవేలయోజనాల ఎత్తుకు లేచి ఉంది. దీని వైశాల్యం అన్ని వైపుల కలుపుకుని ఏభైవేలయోజనాలు ఉంటుంది. ఈ ద్వీపంయొక్క పడమటి భాగంలో ఈ పర్వతమే 'మానసం' అనే పేరుతో పిలువబడుతుంది. ఈ మహాపర్వతం ఒకటే అయినప్పటికి సన్నివేశకారణంగా రెండుగా విభాగింపబడి ఉంది.

**తస్మిన్ ద్వీపే స్మృతౌ ద్వౌ తు పుణ్యౌ జనపదౌ శుభౌ ।**
**రాజతా మానసస్యాథ పర్వతస్యానుమండలౌ ॥25॥**

**మహావీతం తు యద్వర్షం బాహ్యతో మానసస్య తు ।**
**తస్యైవాభ్యంతరో యస్తు ధాతకీఖండ ఉచ్యతే ॥26॥**

ఈ ద్వీపంలో పవిత్రాలు, మంగళకారకాలు రజతసమానమైన కాంతిగల రెండు జనావాసాలున్నాయి. ఇవి మానసపర్వతం క్రింది సానువులందున్నాయి. మానసపర్వతానికి వెలుపల మహావీతం అనే వర్షం ఉంది. దీని మధ్యభాగంలో ధాతకీఖండమనే జనపదముంది.

**స్వాదూదకేనోదధినా పుష్కరః పరివారితః ।**
**పుష్కరద్వీపవిస్తారవిస్తీర్ణోఽసౌ సమంతతః ॥27॥**

**విస్తారాన్మండలాచ్చైవ పుష్కరస్య సమేన తు ।**
**ఏవం ద్వీపాః సముద్రైస్తు సప్తసప్తభిరావృతాః ॥28॥**

**ద్వీపస్యానంతరో యస్తు సముద్రః సప్తమస్తు వై ।**
**ఏవం ద్వీపసముద్రాణాం వృద్ధిర్జ్ఞేయా పరస్పరమ్ ॥29॥**

పుష్కరద్వీపం తియ్యటి జలంతో కూడిన సముద్రంతో చుట్టబడి ఉంది. ఈ సముద్రంయొక్క విస్తారవిస్తీర్ణాలు అన్నిరకాల పుష్కరద్వీపంతో సమానాలు. విస్తారంలోనూ పరిధిలోనూ పుష్కరద్వీపంతో సమానం. ఈ విధంగా ఏడుద్వీపాలు ఏడు సముద్రాలతో చుట్టబడి ఉన్నాయి. ద్వీపం యొక్క మధ్యలో ఉన్న సముద్రాలు కూడా ఏడే. ఈ విధంగా ద్వీపాల మరియు సముద్రాల పరస్పరాభివృద్ధి తెలియాలి.

**పరేణ పుష్కరస్యాథ అనువృత్య స్థితో మహాన్ ।**
**స్వాదూదకసముద్రస్తు సమంతాత్పరివేష్ట్య చ ॥30॥**

**పరేణ తస్య మహతీ దృశ్యతే లోకసంస్థితిః ।**
**కాంచనీ ద్విగుణా భూమిః సర్వా చైకశిలోపమా ॥31॥**

**తస్యా పరేణ శైలస్తు మర్యాదాపరమండలః ।**
**ప్రకాశశ్చాప్రకాశశ్చ లోకాలోకః స ఉచ్యతే ॥32॥**

**దృశ్యాదృశ్యగిరిర్యావత్తావదేషా ధరా ద్విజాః ।**
**యోజనానాం సహస్రాణి దశ తస్యోచ్ఛ్రయః స్మృతః ॥33॥**

**తావాంశ్చ విస్తరస్తస్య లోకాలోకమహాగిరేః ।**
**అర్వాచీనే తు తస్యార్ధే చరంతి రవిరశ్మయః ॥34॥**

**పరార్ధే తు తమో నిత్యం లోకాలోకస్తతః స్మృతః ।**
**ఏవం సంక్షేపతః ప్రోక్తో భూర్లోకస్య చ విస్తరః ॥35॥**

పుష్కరద్వీపం వెలుపల దాని నాలుగు దిక్కుల స్వాదిష్టజలంతో కూడిన పెద్ద సముద్రముంది. దీనికి వెలుపల మహాలోకస్థితి ఉంది. అక్కడ భూమి స్వర్ణమయం. విస్తృతిలో రెట్టింపు గలిగి భూమిమొత్తం ఒకే శిలమాదిరిగా ఉంది. దాని తర్వాత మర్యాదామండలరూపమైన ఒక పర్వతం ఉంది. దీనిలో కొంతభాగం వెలుగుతోను, మరికొంతభాగం అంధకారంతోను నిండి ఉంటుంది. అందుకే అది లోకాలోక (లోక–అలోక) మని చెప్పబడుతున్నది. ఓ ద్విజులారా! ఇది దృశ్యాదృశ్య (దృశ్య–అదృశ్య) పర్వతం. ఇదే ధరామండలం. ఈ పర్వతం యొక్క ఎత్తు పదివేలయోజనాలు. ఈ లోకాలోకమనే మహాపర్వతం యొక్క విస్తారం కూడా అంతే ఉంటుంది. దీనిలో సగభాగం సూర్యరశ్మితో, మరో సగభాగం ఎల్లప్పుడూ చీకటితో నిండి ఉంటుంది. ఈ విధంగా ఈ లోకాలోకం గూర్చి చెప్పాను. ఓ ద్విజులారా! ఈ విధంగా సంగ్రహంగా భూలోకవిస్తారాన్ని వివరించాను.

**ఆభానోర్వై భువః స్వస్తు ఆధ్రువాన్మునిసత్తమాః ।**
**ఆవహాద్యా నివిష్టాస్తు వాయోర్వై సప్త నేమయః ॥36॥**

**ఆవహః ప్రవహశ్చైవ తతశ్చానువహస్తథా ।**
**సంవహో వివహశ్చాథ తతశ్చోర్ధ్వం పరావహః ॥37॥**

**ద్విజాః పరివహశ్చేతి వాయోర్వై సప్తనేమయః ।**
**బలాహకాస్తథా భానుశ్చంద్రో నక్షత్రరాశయః ॥38॥**

**గ్రహాణి ఋషయః సప్త ధ్రువో విప్రాః క్రమాదిహ ।**

ఓ మునిశ్రేష్ఠులారా! భానుమండలపర్యంతం భూలోకం, ధ్రువపర్యంతం స్వర్గలోకం ఉన్నాయి. 'ఆవహ' మొదలైన పేర్లతో వాయువులు ఏడు విధాలు. ఓ ద్విజులారా! ఆవహం, ప్రవహం, అనువహం, సంవహం, వివహం, పరావహం, మరియు పరివహం ఇవి వాయువులకు గల ఏడు వలయాలు. మేఘాలు, సూర్యచంద్రులు, నక్షత్రాలు, రాశులు, సప్తర్షులు, ధ్రువుడు క్రమంగా వ్యవస్థితులై ఉన్నారు.

**యోజనానాం మహీపృష్ఠాదూర్ధ్వం పంచదశాధ్రువాత్ ॥39॥**

**నియుతాన్యేకనియుతం భూపృష్ఠాద్భానుమండలమ్ ।**
**రథః షోడశసాహస్రో భాస్కరస్య తథోపరి ॥40॥**

**చతురాశీతిసాహస్రో మేరుశ్చోపరి భూతలాత్ ।**
**కోటియోజనమాక్రమ్య మహర్లోకో ధ్రువాద్ ధ్రువః ॥41॥**

**జనలోకో మహర్లోకాత్తథా కోటిద్వయం ద్విజాః ।**
**జనలోకాత్తపోలోకశ్చతస్రః కోటయో మతః ॥42॥**

**ప్రాజాపత్యాద్ బ్రహ్మలోకః కోటిషట్కం విసృజ్య తు ।**
**పుణ్యలోకాస్తు సప్తైతే హ్యండేఽస్మిన్ కథితా ద్విజాః ॥43॥**

భూమిపైభాగంలో ధ్రువలోకం వరకు పదిహేనువేల యోజనాల దూరమున్నది. భూతలం నుంచి సూర్యమండలం ఒకవేయియోజనాల దూరమున్నది. దీనిపైన సూర్యరథం పదహారువేల యోజనాల దూరంలో ఉంది. మేరుపర్వతం పృథ్వీతలంనుంచి ఎనభైనాల్గుయోజనాలపైన ఉంది. ధ్రువలోకం నుంచి ఒక కోటియోజనాలపైన మహర్లోకముంది. అది ధ్రువమైనది. (ప్రళయములేనిది.) ఓ ద్విజులారా! ఈ మహర్లోకం పైన రెండుకోట్లయోజనాల దూరంలో జనలోకం ఉంది. జనలోకం నుంచి నాల్గుకోట్లయోజనాల దూరంలో తపోలోకం ఉంది. ఈ తపోలోకం (ప్రాజాపత్యలోకం) నుంచి ఆరుకోట్లయోజనాల దూరం విడిచి బ్రహ్మలోకం ఉంది. ఓ ద్విజులారా! ఈ విధంగా బ్రహ్మాండంలో ఈ ఏడు ఊర్ధ్వపుణ్యలోకాల్ని గూర్చి చెప్పాను.

**అధః సప్తతలానాం తు నరకాణాం హి కోటయః ।**
**మాయాంతాశ్చైవ ఘోరాద్యా అష్టావింశతిరేవ తు ॥44॥**

**పాపినస్తేషు పచ్యంతే స్వస్వకర్మానురూపతః ।**
**అవీచ్యంతాని సర్వాణి రౌరవాద్యాని తేషు చ ॥45॥**

**ప్రత్యేకం పంచకాన్యాహుర్నరకాణి విశేషతః ।**
**అండమాదౌ మయా ప్రోక్తమండస్యావరణాని చ ॥46॥**

**హిరణ్యగర్భసర్గశ్చ ప్రసంగాద్బహువిస్తరాత్ ।**
**అండానామీదృశానాం తు కోట్యో జ్ఞేయః సహస్రశః ॥47॥**

ఏడు తలాలకు (పాతాళానికి) క్రింద ఘోరం అనే దాని నుంచి మాయ అనేదాని వరకు ఇరవైఎనిమిది కోట్ల నరకాలు ఉన్నాయి. ఈ నరకాలలో పాపకర్ములైన జనులు వాళ్లవాళ్ల పాపాల్ని అనుసరించి దుఃఖాన్ని అనుభవిస్తారు. వీటిలో ప్రత్యేకంగా రౌరవంనుంచి అవీచి వరకు ఐదు నరకాలు విశేషరూపాల్లో ఉంటాయి. నేను ఆదిలో బ్రహ్మాండం యొక్క వర్ణన చేశాను. అట్లే ప్రసంగవశంగా బ్రహ్మసృష్టిని గూర్చి కూడా విపులంగా చెప్పాను. ఇట్లే వేల కొలది, కోట్లకొలది బ్రహ్మాండాల విషయాలు తెలియాలి.

**సర్వగత్వాత్ప్రధానస్య తిర్యగూర్ధ్వమధస్తథా ।**
**అండేష్వేతేషు సర్వేషు భువనాని చతుర్దశ ॥48॥**

**ప్రత్యండం ద్విజశార్దూలాస్తేషాం హేతుర్మహేశ్వరః ।**
**అండేషు చాండబాహ్యేషు తథాండావరణేషు చ ॥49॥**

**తమోఽంతే చ తమఃపారే చాష్టమూర్తిర్వ్యవస్థితః ।**
**అస్యాత్మనో మహేశస్య మహాదేవస్య ధీమతః ॥50॥**

**అదేహినస్త్వహో దేహమఖిలం పరమాత్మనః ।**
**అస్యాష్టమూర్తేః శర్వస్య శివస్య గృహమేధినః ॥51॥**

**గృహిణీ ప్రకృతిర్దివ్యాప్రజాశ్చ మహదాదయః ।**
**పశవః కింకరాస్తస్య సర్వే దేహాభిమానినః ॥52॥**

ప్రతి బ్రహ్మాండంలోను ప్రధానముంటుంది. ఇందుకు కారణం అన్నిదిశల పైభాగం, అట్లే క్రిందిభాగం మరియు అడ్డం అనగా మధ్యభాగంలో పధ్నాలుగులోకాలు ఉండడమే. ఓ ద్విజులారా! వాటిల్లో విశిష్టమైన అండసృష్టికి మహేశ్వరుడే కారణం. అష్టమూర్తి అయిన శివుడు అండాలలోను, అండాలకు వెలుపల, అండావరణాలలో గల అంధకారం అవతల కూడా ఉన్నాడు. సంపూర్ణవిశ్వం మహేశ్వరుడు, మహాదేవుడు, ధీమంతుడు, దేహరహితుడు, పరమాత్ముడు అయిన శివుడి శరీరమే. యజమానరూపుడైన అష్టమూర్తి అయిన శర్వుడి గృహిణి దివ్యప్రకృతియే. మహదాదులన్నీ ఆమె సంతానమే. మరియు దేహాభిమానంగల సమస్తప్రాణులు (పశువులు) ఆయనకు సేవకులే.

**ఆద్యంతహీనో భగవాననంతః పుమాన్ ప్రధానప్రముఖాశ్చ సప్త ।**
**ప్రధానమూర్తిస్త్వథ షోడశాంగో మహేశ్వరశ్చాష్టతనుః స ఏవ ॥53॥**

**ఆజ్ఞాబలాత్తస్య ధరా స్థితేహ ధరాధరా వారిధరాః సముద్రాః ।**
**జ్యోతిర్గణః శక్రముఖ్యాః సురాశ్చ వైమానికాః స్థావరజంగమాశ్చ ॥54॥**

**దృష్ట్వా యక్షం లక్షణైర్హీనమీశం దృష్ట్వా సేంద్రాస్తే కిమేతత్త్విహేతి ।**
**యక్షం గత్వా నిశ్చయాత్పావకాద్యాః శక్తిక్షీణాశ్చాభవన్యత్తతోఽపి ॥55॥**

ఆ శివుడు ఆద్యంతరహితుడు, భగవంతుడు, అనంతుడు, పురుషుడు, ప్రధానంమొదలైన ఏడు తత్త్వాలు (బుద్ధి, అహంకారం మొ॥) గల ప్రధానమూర్తి, పదహారు అంగాలుగలవాడు (పంచభూతాలు, పది ఇంద్రియాలు, మనసు) అష్టమూర్తులుగల మహేశ్వరుడు. ఆయన ఆజ్ఞా ప్రభావం వల్ల పృథ్వీ, పర్వతాలు, మేఘాలు, సముద్రాలు, తారాగణాలు, ఇంద్రాది వైమానిక దేవతలు, చరాచరజగత్తు స్థితి పొంది ఉన్నాయి. లక్షణరహితుడైన యక్షుడి రూపంలోగల శివుణ్ణి చూచి ఇంద్రాది దేవతలు 'ఇది ఇక్కడ ఏమిటి' అని ఆలోచించి అది ఏదో నిశ్చయించలేనివారై అక్కడకు వెళ్లి శక్తిహీనులయ్యారు.

**దగ్ధుం తృణం వాపి సమక్షమస్య యక్షస్య వహ్నిర్నిశశాక విప్రాః ।**
**వాయుస్తృణం చాలయితుం తథాన్యే స్వాన్ స్వాన్ ప్రభావాన్ సకలామరేంద్రాః ॥56॥**

**తదా స్వయం వృత్రరిపుః సురేంద్రైః సురేశ్వరః సర్వ సమృద్ధిహేతుః ।**
**సురేశ్వరం యక్షమువాచ కో వా భవానితీత్థం సకుతూహలాత్మా ॥57॥**

ఓ విప్రులారా! అగ్నిదేవుడు అయక్షుడి సమక్షంలో గడ్డిపరకను కూడా దహించశక్తిలేనివాడయినాడు. వాయుదేవుడు ఆ తృణాన్ని కదపలేకపోయాడు. ఇట్లే ఇతరదేవతలు ఇంద్రుడితో కూడా అందరూ వాళ్ల వాళ్ల శక్తిని ప్రదర్శించడానికి అశక్తులయ్యారు. సమస్త దేవతలలోకూడినవాడు, సమస్త అభివృద్ధికారకుడైన వాడు, వృత్రుడి శత్రువు అయిన దేవేంద్రుడు ఉత్కంఠభరితుడై యక్షరూపుడైన ఆదేవేశ్వరుణ్ణి 'నీవెవ్వడవు' అని ప్రశ్నించాడు.

**తదా హ్యదృశ్యం గత ఏవ యక్షస్తదాంబికా హైమవతీ శుభాస్యా ।**
**ఉమా శుభైరాభరణైరనేకైః సుశోభమానా త్వను చావిరాసీత్ ॥58॥**

అపుడు యక్షుడు అదృశ్యుడయ్యాడు. అపుడు సుందరముఖి, హైమవతి, అంబిక, అనేక సుందరాభరణాలంకృత అయిన ఉమాదేవి ప్రత్యక్షమైంది.

**తాం శక్రముఖ్యా బహుశోభమానాముమామజాం హైమవతీమపృచ్ఛన్ ।**
**కిమేతదీశే బహుశోభమానే కోవాంబికే యక్షవపుశ్చకాస్తి ॥59॥**

ఇంద్రుడు మొదలైన దేవతలు మిక్కిలి సుందరమైనట్టి 'అజ' అయిన పార్వతీదేవిని అడిగారు. ఓ ఈశ్వరీ! ఓ పరమశోభాయమానమైన ఓ అంబికా! ఈ యక్షదేహధారి అయిన ఈతడెవడు? అని.

**నిశమ్య తద్యక్షమమాంబికాహ త్వగోచరశ్చేతి సురాః సశక్రాః ।**
**ప్రణేమురేనాం మృగరాజగామినీముమామజాం లోహితశుక్లకృష్ణామ్ ॥60॥**

వాళ్ల మాటలు విన్న ఉమాదేవి, అంబికాదేవి అతడు అగోచరుడు అన్నది. అప్పుడు ఇంద్రుడితో కూడిన దేవతలందరూ ఆయక్షుడికి, సింహగమన మరియు ఎరుపు, తెలుపు, నలుపు రంగులుగలది అయిన అజకు, ఉమకు నమస్కరించారు.

**సంభావితా సా సకలామరేంద్రైః సర్వప్రవృత్తిస్తు సురాసురాణామ్ ।**
**అహం పురాసం ప్రకృతిశ్చ పుంసో యక్షస్య చాజ్ఞావశగేత్యథాహ ॥61॥**

సమస్త దేవతలచేత సత్కరింపబడి దేవతలకు మరియు దానవులకు సమస్తప్రవృత్తి రూపమైన ఆమె ఇలా పలికింది. నేను పూర్వకాలంలో ఈయక్షరూపుడైన పురుషుడియొక్క ఆజ్ఞాబద్ధనైన ప్రకృతిని.

**తస్మాత్ ద్విజాః సర్వమజస్య తస్య నియోగతశ్చాండమభూదజాద్వై ।**
**అజశ్చ అండాదఖిలం చ తస్మాత్ జ్యోతిర్గణైర్లోకమజాత్మకం తత్ ॥62॥**

ఓ ద్విజులారా! అందువల్ల ఈ అజుడి(శివుడి) నియోగం వల్ల బ్రహ్మ పుట్టాడు. ఆ బ్రహ్మనుంచి అండం పుట్టింది. ఆ అండం నుంచి జ్యోతిర్గణసహితమైన విశ్వం పుట్టింది. ఈ విధంగా సమస్తం శివాత్మకమే.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే భువనకోశవిన్యాసనిర్ణయో నామ త్రిపంచాశత్తమోఽధ్యాయః ॥ 53॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని భువనకోశవిన్యాస నిర్ణయమనే ఏభై మూడవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **చతుఃపంచాశత్తమోఽధ్యాయః** – ఏబై నాల్గవ అధ్యాయం
## **జ్యోతిశ్చక్రసూర్యగత్యాదికథనమ్** – జ్యోతిశ్చక్రసూర్యగత్యాదికథనం

**సూత ఉవాచ** – సూతర్షి పలికాడు.

**జ్యోతిర్గణప్రచారం వై సంక్షిప్యాండే బ్రవీమ్యహమ్ ।**
**దేవక్షేత్రాణి చాలోక్య గ్రహచారప్రసిద్ధయే ॥1॥**

ఓ ఋషులారా! దేవక్షేత్రాల్ని దర్శించి, గ్రహగతి జ్ఞానాన్ని తెలిసి బ్రహ్మాండంలో వాటి గతిని సంగ్రహంగా నేను వర్ణిస్తున్నాను.

**మానసోపరి మాహేంద్రీ ప్రాచ్యాం మేరోః పురీ స్థితా ।**
**దక్షిణే భానుపుత్రస్య వరుణస్య చ వారుణీ ॥2॥**

**సౌమ్యే సోమస్య విపులా తాసు దిగ్దేవతాః స్థితాః ।**
**అమరావతీ సంయమనీ సుఖా చైవ విభా క్రమాత్ ॥3॥**

మేరుపర్వతానికి తూర్పులో మానసపర్వతం మీద మహేంద్ర నగరం ఉంది. దక్షిణదిక్కులో సూర్యుడి కుమారుడైన యముడికి, పడమటిదిక్కులో వరుణదేవుడికి, మరియు ఉత్తరదిక్కులో సోముడికి విశాలనగరాలున్నాయి. వాటిల్లో దిక్పాలకులు ఉంటారు. క్రమంగా వాటిపేర్లు అమరావతి, సంయమని, సుఖ మరియు విభ అనేవి.

**లోకపాలోపరిష్టాత్తు సర్వతో దక్షిణాయనే ।**
**కాష్ఠాం గతస్య సూర్యస్య గతిర్యా తాం నిబోధత ॥4॥**

**దక్షిణప్రక్రమే భానుః క్షిప్తేషురివ ధావతి ।**
**జ్యోతిషాం చక్రమాదాయ సతతం పరిగచ్ఛతి ॥5॥**

లోకపాలకుల పురాలపైభాగంలో అన్ని దిక్కుల దక్షిణాయనంలో సూర్యుడి గమనం విడిచిన బాణగమనంతో సమానంగా ఉంటుందని తెలియాలి. దక్షిణాయనంలో సూర్యుడు ప్రయోగించిన బాణంలా పరుగెత్తుతాడు. ఆతడు నక్షత్రచక్రాన్ని కూడా వెంటతీసుకుని ఎల్లప్పుడూ పరిభ్రమిస్తాడు.

**పురాంతగో యదా భానుః శక్రస్య భవతి ప్రభుః ।**
**సర్వైః సాయమనైః సౌరో హ్యుదయో దృశ్యతే ద్విజాః ॥6॥**

**స ఏవ సుఖవత్యాం తు నిశాంతస్థః ప్రదృశ్యతే ।**
**అస్తమేతి పునః సూర్యో విభాయాం విశ్వదృగ్విభుః ॥7॥**

ఓ ద్విజులారా! ఎప్పుడు సూర్యభగవానుడు ఇంద్రుడి పురాన్ని ప్రవేశిస్తాడో అప్పుడు సంయమనపురమందలి జనులందరూ సూర్యోదయాన్ని చూస్తారు. ఆతడు సంయమనపురంలో ఉండగా సుఖవతికి ప్రాతఃకాలం అవుతుంది. విశ్వనేత్రుడైన సూర్యుడు ఆసమయంలో విభాపురంలో అస్తమిస్తాడు.

**మయా ప్రోక్తోఽమరావత్యాం యథాసౌ వారితస్కరః ।**
**తథా సంయమనీం ప్రాప్య సుఖాంచైవ విభాం ఖగః ॥8॥**

ఈ విధంగా నేను అమరావతిలో సూర్యుడు (నీటిదొంగ) ఉండడాన్ని చెప్పాను. ఇలాగే సూర్యుడు సంయమనిని, సుఖవతిని, విభాపురిని పొందుతాడు.

**యదాపరాహ్ణస్త్వాగ్నేయ్యాం పూర్వాహ్ణో నైరృతే ద్విజాః ।**
**తదా త్వపరరాత్రశ్చ వాయుభాగే సుదారుణః ॥9॥**

**ఈశాన్యాం పూర్వరాత్రస్తు గతిరేషా చ సర్వతః ।**
**ఏవం పుష్కరమధ్యే తు యదా సర్పతి వారిపః ॥10॥**

**త్రింశాంశుకం తు మేదిన్యాం ముహూర్తేనైవ గచ్ఛతి ।**
**యోజనానాం ముహూర్తస్య ఇమాం సంఖ్యాం నిబోధత ॥11॥**

ఓ ద్విజులారా! ఎప్పుడు ఆగ్నేయంలో అపరాహ్ణం అవుతుందో అపుడు నైరృతిలో పూర్వాహ్ణం అవుతుంది. అదే సమయంలో వాయవ్యంలో భయానకమైన రాత్రియొక్క రెండవభాగం, ఈశాన్యంలో రాత్రియొక్క మొదటిభాగం ప్రవర్తిల్లుతున్నాయి. ఈ విధంగా గమనం అంతటా ఉంటుంది. ఈ విధంగా జలాన్ని శోషింపజేసే సూర్యుడు ఆకాశమధ్యభాగంలో సంచరిస్తాడు. అక్కడ ఒక ముహూర్తకాలం భూమిపై ముప్పై అంశలు అవుతుంది. ఒక ముహూర్తంలో సూర్యుడు తిరిగే దూరాన్నే యోజనాలుగా తెలియాలి. ముహూర్తమనగా నలభై ఎనిమిది నిమిషాలు కావున నలభై ఎనిమిది యోజనాలు చలిస్తాడని తెలియాలి.

**పూర్ణా శతసహస్రాణామేకత్రింశత్తు సా స్మృతా ।**
**పంచాశచ్చ తథాన్యాని సహస్రాణ్యధికాని తు ॥12॥**

**మూహూర్తికీ గతిర్హ్యేషా భాస్కరస్య మహాత్మనః ।**
**ఏతేన గతి యోగేన యదా కాష్ఠాం తు దక్షిణామ్ ॥13॥**

**పర్యపృచ్ఛేత్పతంగోఽపి సౌమ్యాశాం చోత్తరేఽహని ।**
**మధ్యే తు పుష్కరస్యాథ భ్రమతే దక్షిణాయనే ॥14॥**

**మానసోత్తరశైలే తు మహాతేజా విభావసుః ।**
**మండలానాం శతం పూర్ణం తదశీత్యధికం విభుః ॥15॥**

**బాహ్యం చాభ్యంతరం ప్రోక్తముత్తరాయణదక్షిణే ।**
**ప్రత్యహం చరతే తాని సూర్యో వై మండలాని తు ॥16॥**

**కులాలచక్రపర్యంతో యథా శీఘ్రం ప్రవర్తతే ।**
**దక్షిణప్రక్రమే దేవస్తథా శీఘ్రం ప్రవర్తతే ॥17॥**

**తస్మాత్ప్రకృష్టాం భూమిం తు కాలేనాల్పేన గచ్ఛతి ।**
**సూర్యో ద్వాదశభిః శీఘ్రం ముహూర్తైర్దక్షిణాయనే ॥18॥**

**త్రయోదశార్ధమృక్షాణామహ్నా తు చరతే రవిః ।**
**ముహూర్తై స్తావదృక్షాణి నక్తమష్టాదశైశ్చరన్ ॥19॥**

అది ముప్పైయొక్కలక్షల ఏభైవేల యోజనాలు అవుతుంది. ఇది మహాత్ముడు సూర్యుడి యొక్క ఒక మూహూర్తగమనం. సూర్యుడు ఈ గమనవేగంలో దక్షిణదశయొక్క ధ్రువానికి వెళతాడు. అక్కడ ఆరుమాసాలు కడచిన తర్వాత మరలా ఉత్తరాయణకాలంలో ఉత్తరదిశ ధ్రువానికి వెళతాడు. దక్షిణాయన సమయంలో మహాతేజస్వి సూర్యుడు మానసోత్తరపర్వతం మీద పుష్కరమధ్యభాగంలో తిరుగుతాడు. సూర్యుడు నూట ఎనభై మండలాలు చలిస్తాడు. ఉత్తరాయణం అట్లే దక్షిణాయనం యొక్క బాహ్యాలను ఆభ్యంతరాలని చెబుతారు. సూర్యుడు ప్రతిరోజు ఈ మండలాలలో తిరుగుతాడు. కుమ్మరిచక్రం యొక్క వెలుపలి భాగంవలె శీఘ్రగమనంతో అన్ని దిక్కులలో తిరుగుతాడు. ఈ విధంగా సూర్యభగవానుడు దక్షిణాయనంలో వేగంతో కూడిన భ్రమణంలో ఉంటాడు. ఈ కారణంగా సూర్యుడు తక్కువసమయంలో భూమికి చేరుతాడు. దక్షిణాయనంలో సూర్యుడు పండ్రెండు ముహూర్తాలలో ఒక రోజులో పదమూడున్నర నక్షత్రాల్ని తిరుగుతాడు. రాత్రివేళలో ఆ నక్షత్రాల్ని పద్దెనిమిది ముహూర్తాలలో తిరుగుతాడు.

**కులాలచక్రమధ్యం తు యథా మందం ప్రసర్పతి ।**
**తథోదగయనే సూర్యః సర్పతే మందవిక్రమః ॥20॥**

**తస్మాద్దీర్ఘేణ కాలేన భూమిమల్పాం తు గచ్ఛతి ।**
**సరథోఽధిష్ఠితో భానోరాదిత్యైర్మునిభిస్తథా ॥21॥**

**గంధర్వైరప్సరోభిశ్చ గ్రామణీ సర్పరాక్షసైః ।**
**ప్రదీపయన్ సహస్రాంశురగ్రతః పృష్ఠతోఽప్యధః ॥22॥**

**ఊర్ధ్వతశ్చ కరం త్యక్త్వా సభాం బ్రాహ్మీమనుత్తమామ్ ।**
**అంభోభిర్మునిభిస్త్యక్తైః సంధ్యాయాం తు నిశాచరాన్ ॥23॥**

**హత్వా హత్వా తు సంప్రాప్తాన్ బ్రాహ్మణైశ్చరతే రవిః ।**

కుమ్మరిచక్రం మధ్యభాగం ఏవిధంగా నెమ్మదిగా తిరుగుతుందో అదే విధంగా ఉత్తరాయణంలో సూర్యుడు మందగతితో తిరుగుతాడు. ఈ కారణంగా ఎక్కువ కాలం భూమిపై ఉంటాడు. ఆ సూర్యరథాన్ని దేవతలు, మునులు, గంధర్వులు, అప్సరసలు, గ్రామణులు, సర్పాలు, రాక్షసులు అధిష్ఠించి ఉంటారు. సహస్రకిరణుడైన సూర్యుడు ముందువెనుకల, పైభాగంలోను క్రిందిభాగంలోను తన కిరణాల్ని ప్రసరింపజేసి అత్యున్నతమైన బ్రహ్మసభను కూడా ప్రకాశింపజేస్తున్నాడు. సంధ్యావందనసమయంలో మునులు, బ్రాహ్మణులు సమర్పించిన అర్ఘ్యజలాలతో తనను సమీపించే రాక్షసుల్ని సంహరిస్తూ సూర్యుడు తిరుగుతున్నాడు.

**అష్టాదశ ముహూర్తం తు ఉత్తరాయణపశ్చిమమ్ ॥24॥**

**అహర్భవతి తచ్చాపి చరతే మందవిక్రమః ।**
**త్రయోదశార్ధమృక్షాణి నక్తం ద్వాదశభీ రవిః ।**
**ముహూర్తైస్తావదృక్షాణి దివాష్టాదశభిశ్చరన్ ॥25॥**

ఉత్తరాయణంలో చివరి భాగంలో పగలు పద్దెనిమిది ముహూర్తకాలం గలదిగా ఉంటుంది. ఈ కాలంలో సూర్యుడు మందగమనం గలవాడు అవుతాడు. ఆతడు పదమూడున్నర ముహూర్తాల దూరాన్ని రాత్రియందు పండ్రెండు ముహూర్తాల కాలంలో పూర్తిచేస్తాడు. పగటియందు చలిస్తూ పద్దెనిమిది మూహూర్తాల కాలంలో పదమూడు నక్షత్రాల స్థానాన్ని పూర్తి చేస్తాడు.

**తతో మందతరం నాభ్యాం చక్రం భ్రమతి వై యథా ।**
**మృత్పిండ ఇవ మధ్యస్థో ధ్రువో భ్రమతి వై తథా ॥26॥**

**త్రింశన్ముహూర్తై రేవాహురహోరాత్రం పురావిదః ।**
**ఉభయోః కాష్ఠయోర్మధ్యేభ్రమతో మండలాని తు ॥27॥**

**కులాలచక్రనాభిస్తు యథా తత్రైవ వర్తతే ।**
**ఔత్తానపాదో భ్రమతి గ్రహైః సార్ధం గ్రహాగ్రణీః ॥28॥**

**గణో మునిజ్యోతిషాం తు మనసా తస్య సర్పతి ।**
**అధిష్ఠితః పునస్తేన భానుస్త్వాదాయ తిష్ఠతి ॥29॥**

**కిరణైః సర్వతస్తోయం దేవోవై స సమీరణః ।**
**ఔత్తానపాదస్య సదా ధ్రువత్వం వై ప్రసాదతః ॥30॥**

**విష్ణోరౌత్తానపాదేన చాప్తం తాతస్య హేతునా ।**

నాభియందు చక్రం మిక్కిలి నెమ్మదిగా తిరుగుతున్నది. ఈవిధంగా దాని మధ్యలో గల మట్టిగడ్డమాదిరి ధ్రువుడు తిరుగుతున్నాడు. పూర్వవిద్వాంసులు రాత్రింబవళ్లకాలం ముప్పైమూహూర్తాల కాలమనే చెబుతున్నారు. ఈ రెండు దిశలమధ్యగల మండలాలలో సూర్యుడు భ్రమిస్తాడు. కుమ్మరిచక్రం యొక్క నాభి ఉన్నచోటనే ఉండి తిరుగుతున్నది. ఈ విధంగా గ్రహశ్రేష్ఠుడైన ధ్రువుడు కూడా ఇతరగ్రహాలతో పాటు తిరుగుతున్నాడు. మునిగణాలు, నక్షత్రసమూహాలు వాళ్ల ఇచ్ఛప్రకారం తిరుగుతున్నాయి. ధ్రువుడి ద్వారా గ్రహాల్ని అధిష్ఠించి సూర్యభగవానుడు వాయువుతో కూడి తనకిరణాల్ని అన్ని దిక్కులకు ప్రసరింపజేసి జలాన్ని గ్రహిస్తున్నాడు. ఉత్తానపాదపుత్రుడికి ధ్రువస్థానం విష్ణుభగవానుడి కృపవల్ల కలిగింది. ధ్రువుడు తన తండ్రి కారణంగా ఆ స్థానాన్ని పొందాడు.

**ఆపః పీతాస్తు సూర్యేణ క్రమంతే శశినః క్రమాత్ ॥31॥**

**నిశాకరాన్నిస్రవంతే జీమూతాన్ ప్రత్యపః క్రమాత్ ।**
**వృందం జలముచాం చైవ శ్వసనేనాభితాడితమ్ ॥32॥**

**క్ష్మాయాం వృష్టిం విసృజతేఽ భాసయత్తేన భాస్కరః ।**
**తోయస్య నాస్తి వై నాశః తదైవ పరివర్తతే ॥33॥**

**హితాయ సర్వజంతూనాం గతిః శర్వేణ నిర్మితా ।**
**భూర్భువః స్వస్తథా హ్యాపో హ్యన్నం చామృతమేవ చ ॥34॥**

**ప్రాణా వై జగతామాపో భూతాని భువనాని చ ।**
**బహునాత్ర కిముక్తేన చరాచరమిదం జగత్ ॥35॥**

**అపాం శివస్య భగవానాధిపత్యే వ్యవస్థితః ।**
**అపాం త్వధిపతిర్దేవో భవ ఇత్యేవ కీర్తితః ॥36॥**

**భవాత్మకం జగత్సర్వమితి కిం చేహ చాద్భుతమ్ ।**
**నారాయణత్వం దేవస్య హరేశ్చాద్భిః కృతం విభోః ।**
**జగతామాలయో విష్ణుస్త్వాపస్తస్యాలయాని తు ॥37॥**

సూర్యుడు గ్రహించిన ఆజలం క్రమంగా చంద్రుణ్ణి చేరుతుంది. అది మరల చంద్రుడి నుంచి మేఘాలకు చేరుతుంది. తర్వాత వాయువుచేత కొట్టబడిన మేఘాలు భూమిపై వర్షిస్తున్నాయి. సూర్యుడు ఈ విధంగా వెలుగుతున్నాడు. అందుకే భాస్కరుడు అంటారు. జలం ఎప్పుడూ నశించదు. అది మరల పరిణామం చెందుతుంది. శివభగవానుడు ప్రాణులందరి శుభాన్ని ఆశించి నీటికి ఇలాంటి స్థితిని కల్పించాడు. జలమే భూలోకం, భువర్లోకం, స్వర్గలోకం. జలమే అన్నం, అమృతం. జలమే జీవుల ప్రాణం. ఎక్కువగా చెప్పి ఏమి ప్రయోజనం. ప్రాణులందరూ, భువనాలన్నీ ఈ జలంతో నిర్మింపబడ్డాయి. జలం శివభగవానుడి ఆధిపత్యమందే ఉంది. శివుడు జలాధిపతి. ఈ సమస్తవిశ్వం శివమయమే. ఇందులో ఆశ్చర్యం లేదు. సర్వవ్యాపి అయిన విష్ణుమూర్తికి నారాయణపదం జలంవల్లనే కలిగింది. విష్ణువు సంపూర్ణజగత్తుకు ఆవాసస్థానం. ఆతడికి జలమే నివాసస్థానం.

**దందహ్యమానేషు చరాచరేషు గోధూమభూతాస్త్వథ నిష్క్రమంతి ।**
**యా యా ఊర్ధ్వం మారుతేనేరితా వై తాస్తాస్త్వభ్రాణ్యగ్నినా వాయునా చ ॥38॥**

**అతో ధూమాగ్నివాతానాం సంయోగస్త్వభ్రముచ్యతే ।**
**వారీణి వర్షతీత్యభ్రమభ్రస్యేశః సహస్రదృక్ ॥39॥**

సమస్తచరాచరజగత్తు వాయువుద్వారా ఉత్తేజితమైన అగ్నిద్వారా మండింపబడుతుంది. అప్పుడు ధూమం కలుగుతుంది. అది వాయువుద్వారా పైకి వెళుతుంది. అందుకే అది అభ్రమవుతున్నది. కాగా ధూమం అగ్ని వాయువుల కలయికే అభ్రమవుతున్నది. అది నీటిని కురుస్తుంది. అందుకే అది అభ్రం. సహస్రాక్షుడైన ఇంద్రుడు అభ్రాధిపతి.

**యజ్ఞధూమోద్భవం చాపి ద్విజానాం హితకృత్సదా ।**
**దావాగ్నిధూమసంభూతమభ్రం వనహితం స్మృతమ్ ॥40॥**

మృతధూమోద్భవం త్వభ్రమశుభాయ భవిష్యతి
అభిచారాగ్నిధూమోత్థం భూతనాశాయ వై ద్విజాః ॥41॥

ఏవం ధూమవిశేషేణ జగతాం వై హితాహితమ్ ।
తస్మాదాచ్ఛాదయేద్ధూమమభిచారకృతం నరః ॥42॥

అనాచ్ఛాద్య ద్విజః కుర్యాద్ధూమం యశ్చాభిచారికమ్ ।
ఏవముద్దిశ్య లోకస్య క్షయకృచ్చ భవిష్యతి ॥43॥

బ్రాహ్మణులయజ్ఞనిర్వహణంవల్ల కల్గిన ధూమం సర్వదా హితకరం. దావాగ్ని వల్ల కలిగిన ధూమాభ్రం వనానికి హితాన్ని కల్గిస్తుంది. మృతజీవుల్ని దహించడం వల్ల పుట్టిన ధూమంతో ఏర్పడిన మేఘం అమంగళకరం. ఓ ద్విజులారా! అభిచారయజ్ఞాల నుంచి పుట్టిన ధూమమేఘాలు ప్రాణుల్ని నశింపజేస్తాయి. ఈ విధంగా ధూమాలయొక్క వైశిష్ట్యాలవల్ల జగత్తుకు మంచిచెడులు కలుగుతున్నాయి. అందుచే ప్రజలు అభిచారధూమాన్ని కప్పివేయాలి. ఏ ద్విజుడు ఆభిచారికధూమాన్ని నిరోధించక సృష్టిస్తాడో ఆతడు లోకనాశకారకుడు కాగలడు.

అపాం నిధానం జీమూతాః షణ్మాసానిహ సువ్రతాః ।
వర్షయంత్యేవ జగతాం హితాయ పవనాజ్ఞయా ॥44॥

స్తనితం చేహ వాయవ్యం వైద్యుతం పావకోద్భవమ్ ।
త్రిధా తేషామిహోత్పత్తిరభ్రాణాం మునిపుంగవాః ॥45॥

న భ్రశ్యంతి యతోఽభ్రాణి మేహనాన్మేఘ ఉచ్యతే ।
కాష్ఠా వాహ్నేశ్చ వైరించ్యాః పక్షాశ్చైవ పృథగ్విధాః ॥46॥

ఆజ్యానాం కాష్ఠసంయోగాదగ్నేర్ధూమః ప్రవర్తితః ।
ద్వితీయానాం చ సంభూతిర్విరించోచ్ఛ్వాసవాయునా ॥47॥

భూభృతాం త్వథ పక్షైస్తు మఘవచ్ఛేదితైస్తతః ।
వాహ్నేయాస్త్వథ జీమూతాస్త్వావహస్థానగాః శుభాః ॥48॥

విరించోచ్ఛ్వాసజాః సర్వే ప్రవహస్కంధజాస్తతః ।
పక్షజాః పుష్కరాద్యాశ్చ వర్షంతి చ యదా జలమ్ ॥49॥

మూకాః సశబ్దదుష్టాశాస్త్రైతైః కృత్యం యథాక్రమమ్ ।
క్షామవృష్టిప్రదా దీర్ఘకాలం శీతసమీరిణః ॥50॥

జీవకాశ్చ తథా క్షీణా విద్యుద్ధ్వనివివర్జితాః ।
తిష్ఠంత్యాక్రోశమాత్రం తు ధరాపృష్ఠాదితస్తతః ॥51॥

అర్ధక్రోశే తు సర్వే వై జీమూతా గిరివాసినః ।
మేఘా యోజనమాత్రం తు సాధ్యత్వాద్బహుతోయదాః ॥52॥

**ధరాపృష్ఠాద్ ద్విజాః క్ష్మాయాం విద్యుద్గుణసమన్వితాః ।**
**తేషాం తేషాం వృష్టిసర్గం త్రేధా కథితమత్ర తు ॥53॥**

ఓ సువ్రతులారా! జలనిధులైన మేఘాలు వాయువు ఆజ్ఞచేత జగత్తు హితంకోసం ఈలోకంలో ఆరు మాసాలు వర్షిస్తాయి. మేఘాల ఉరుములు వాయువు, విద్యుత్తు, అగ్నులద్వారా కలుగుతాయి. ఓ మునిశ్రేష్ఠులారా! ఈ మేఘాల ఉత్పత్తి మూడురకాల కలుగుతుంది. నష్టము లేనివి అభ్రాలు అవుతాయి. మేహన శబ్దం నుంచి మేఘశబ్దం వచ్చింది. కాష్ఠాలు, వాహ్నాలు, వైరించ్యాలు, పక్షాలు (పుష్కరాలు) అని మేఘాలు నాలుగు విధాలు. నెయ్యితోకూడిన కట్టెలనుంచి కలిగిన అగ్నివల్ల పుట్టిన ధూమంచేత ఏర్పడినవి మొదటి రకాలైన కాష్ఠమేఘాలు. రెండో విధాలైన వాహ్నమేఘాలు బ్రహ్మయొక్క శ్వాసవాయువువల్ల ఏర్పడతాయి. ఇంద్రుడు పర్వతాల రెక్కల్ని నరకడం వల్ల ఏర్పడిన మేఘాలు మూడోవిధమైన వైరించ్యమేఘాలు. అగ్నివలన కలిగిన పొగవలన పుట్టింది నాల్గవవిధమైన పక్షమేఘాలు. అవే పుష్కరమేఘాలు. ఇవి శుభకరాలు. వానకు ఆవాహనం అనే పేరుగల వాయుమండలం జన్మస్థానం. బ్రహ్మశ్వాసవల్ల పుట్టిన అన్ని మేఘాలు ప్రవహమనే వాయుస్కంధంలో ఉంటాయి. పుష్కరమేఘాలు పక్షాలనుంచి పుట్టి జలాన్ని కురుస్తాయి. అవి క్రమంగా ఒక్కొక్కసారి ధ్వనిరహితంగా శాంతంగా ఒక్కొక్కసారి ధ్వనిస్తూ వినాశనకారిగా వర్షిస్తూ ఉంటాయి. వివిధవిధాలైన ఆ మేఘాలు వివిధరకాలుగా వర్షిస్తాయి. కొన్ని అల్పవృష్టిని ఇస్తాయి. కొన్ని క్షీణిస్తాయి. వీటిల్లో విద్యుత్తు (మెరుపు) మరియు ధ్వని ఉండవు. కొన్ని మేఘాలు భూతలంనుంచి ఒక క్రోసెడు దూరంలో ఆకాశంలో ఉంటాయి. పర్వతాలమీద ఉండే మేఘాలు అర్ధక్రోసెడు దూరంలో ఉంటాయి. ఓ ద్విజులారా! భూతలంనుంచి యోజనమాత్రదూరంలో ఉన్న ప్రకాశంగల మేఘాలు సాధ్యాలు అనగా ఫలప్రదాలు కావడానికి కారణం అవి భూమిపైన అధికవర్షాన్ని కలిగించడమే. ఈ మేఘాలయొక్క మూడురకాల వర్షవిధానం మీకు చెప్పడం జరిగింది.

**పక్షజాః కల్పజాః సర్వే పర్వతానాం మహత్తమాః ।**
**కల్పాంతే తే చ వర్షంతి రాత్రౌ నాశాయ శారదాః ॥54॥**

**పక్షజాః పుష్కరాద్యాశ్చ వర్షంతి చ యదా జలమ్ ।**
**తదార్ణవమభూత్సర్వం తత్ర శేతే నిశీశ్వరః ॥55॥**

**ఆగ్నేయానాం శ్వాసజానాం పక్షజానాం ద్విజర్షభాః ।**
**జలదానాం సదా ధూమో హ్యాప్యాయన ఇతిస్మృతః ॥56॥**

పర్వతాల రెక్కలనుంచి పుట్టిన మేఘాలను కల్పజాలు అంటారు. అవి మిక్కిలి పెద్దవి. అవి కల్పాంతంలో వినాశం కోసం రాత్రివేళల్లో కురుస్తాయి. పక్షజనితపుష్కరమేఘాలు కురవడంవల్ల లోకం సమస్తం సాగరమయం అవుతుంది. ఆ సముద్రంలో ఈశ్వరుడు రాత్రుళ్లు శయనిస్తాడు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! అగ్నినుంచి, బ్రహ్మశ్వాసనుంచి, పర్వతపక్షాలనుంచి పుట్టిన మేఘాల ధూమం ఆప్యాయనమని చెప్పబడుతుంది.

**పౌండ్రాస్తు వృష్టయః సర్వా వైద్యుతాః శీతసస్యదాః ।**
**పుండ్రదేశేషు పతితా నాగానాం శీకరా హిమాః ॥57॥**

**గాంగా గంగాంబుసంభూతా పర్జన్యేన పరావహైః ।**
**నగానాం చ నదీనాం చ దిగ్గజానాం సమాకులమ్ ॥58॥**

**మేఘానాం చ పృథగ్భూతం జలం ప్రాయాదగాదగమ్ ।**
**పరావహో యః శ్వసనశ్చానయత్యంబికాగురుమ్ ॥59॥**

**మేనాపతిమతిక్రమ్య వృష్టిశేషం ద్విజాః పరమ్ ।**
**అభ్యేతి భారతే వర్షే త్వపరాంతవివృద్ధయే ॥60॥**

క్రౌంచ్రకదేశంలోగల అన్నిమేఘాల వర్షం విద్యున్మయంగా, శీతలంగా, సస్యప్రదానంగా ఉంటుంది. మంచులాగా చల్లగా ఉంటుంది. ఏనుగుతొండంనుంచి పడే జలంయొక్క తుంపరలవలె ఉంటుంది. గాంగమనే పేరుగల మేఘాలు గంగాజలంనుంచి పుడతాయి. అవి పారవహమనే పేరుగల వాయువుద్వారా పర్వతాల్ని, నదుల్ని మరియు దిగ్గజాల్ని వ్యాకులపరుస్తాయి. మేఘాలనుంచి వేరుపడిన జలం అనగా వర్షించిన నీరు ఒక పర్వతంనుంచి మరోపర్వతంపైకి ప్రవహిస్తుంది. పరావహమనే వాయువు మేఘాల్ని హిమవత్పర్వతంపైకి పంపుతుంది. ఓ ద్విజులారా! ఈ మేఘాలు మేనాదేవి భర్త అయిన హిమవత్పర్వతాన్ని దాటి సముద్రం మధ్యలో గల దేశాల అభివృద్ధికై భారతవర్షంలో అధికంగా వర్షిస్తాయి.

**వృష్టయః కథితా హ్యద్య ద్విధా వస్తువివృద్ధయే ।**
**సస్యద్వయస్య సంక్షేపాత్త్వబ్రవీమి యథామతి ॥61॥**

**స్రష్టా భానుర్మహాతేజా వృష్టీనాం విశ్వదృగ్విభుః ।**
**సోఽపి సాక్షాద్ ద్విజశ్రేష్ఠాశ్చేశానః పరమః శివః ॥62॥**

**స ఏవ తేజస్త్వోజస్తు బలం విప్రా యశః స్వయమ్ ।**
**చక్షుః శ్రోత్రం మనో మృత్యురాత్మా మన్యుర్విదిగ్దిశః ॥63॥**

**సత్యం ఋతం తథా వాయురంబరం ఖచరశ్చ సః।**
**లోకపాలో హరిర్బ్రహ్మా రుద్రః సాక్షాన్మహేశ్వరః ॥64॥**

**సహస్రకిరణః శ్రీమానష్టహస్తః సుమంగళః ।**
**అర్ధనారీవపుః సాక్షాత్త్రినేత్రస్త్రిదశాధిపః ॥65॥**

వస్తుసముదాయాన్ని వృద్ధిపరిచే వర్షాలు రెండురకాలు. సస్యాల్ని ఇచ్చే ఆ వర్షాల్నిగూర్చి నా బుద్ధ్యనుసారం సంగ్రహంగా చెబుతున్నాను. విశ్వనేత్రస్వరూపుడు, మహాతేజోవిరాజితుడు, సూర్యభగవానుడు వర్షాల్ని సృష్టిస్తాడు. ఓ ద్విజశ్రేష్ఠులారా! ఆతడే సాక్షాత్తుగా ఈశానుడు, పరమేశ్వరుడు అయిన శివుడు. ఓ విప్రులారా! ఆతడే తేజస్సు, ఓజస్సు, బలం, యశస్సు, నేత్రం, క్షేత్రం, మనస్సు, మృత్యువు, ఆత్మ, క్రోధం, దిశలు మరియు విదిశలు. ఆతడే సత్యం, ఋతం, వాయువు, ఆకాశం, గ్రహాలు, లోకపాలకులు, విష్ణువు, బ్రహ్మ, రుద్రుడు, సాక్షాత్తు మహేశ్వరుడు. ఆతడే సహస్రకిరణుడు, శ్రీమంతుడు, అష్టహస్తుడు, కళ్యాణకరుడు, అర్ధనారీశ్వరుడు, ముక్కంటి, దేవాధిదేవుడు.

**అస్యైవేహ ప్రసాదాత్తు వృష్టిర్నానాభవద్ ద్విజాః ।**
**సహస్రగుణముత్స్రష్టుమాదత్తే కిరణైర్జలమ్ ॥66॥**

**జలస్య నాశో వృద్ధిర్వా నాస్త్యేవాస్య విచారతః ।**
**ధ్రువేణాధిష్ఠితో వాయుర్వృష్టిం సంహరతే పునః ॥67॥**

**గ్రహాన్నిఃసృజ్య సూర్యాత్తు కృత్స్నే నక్షత్రమండలే ।**
**చారస్యాంతే విశత్యర్కే ధ్రువేణ సమధిష్ఠితా ॥68॥**

ఓ ద్విజులారా! ఈతడి అనుగ్రహంవల్లే పలువిధాలైన వృష్టి కలుగుతున్నది. అతడు వేయిరెట్లు జలాన్ని ఇవ్వడానికై తనకిరణాలతో నీటిని గ్రహిస్తున్నాడు. విచారించగా నీటికి నాశమూ అభివృద్ధీ రెండూ లేవు. ధ్రువుడిచేత అధిష్ఠితుడైన వాయువు వర్షాన్ని హరిస్తున్నాడు. అది తర్వాత సూర్యగ్రహంనుంచి వెలువడి అచ్చటనుంచి నక్షత్రమండలానికి వ్యాపిస్తుంది. అంతంలో అది మరల ధ్రువుడిచే అధిష్ఠింపబడి సూర్యుడిలో చేరుతుంది.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే జ్యోతిశ్చక్రే సూర్యగత్యాదికథనం నామ చతుఃపంచాశత్తమోఽధ్యాయః॥ 54॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని జ్యోతిశ్చక్రంలోని సూర్యగత్యాదికథనమనే ఏబై నాల్గవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## పంచ పంచాశత్తమోఽధ్యాయః - ఏబై అయిదవ అధ్యాయం

## సూర్యరథనిర్ణయః - సూర్యరథనిర్ణయం

**సూత ఉవాచ -** సూతమహర్షి పలికాడు.

**సౌరం సంక్షేపతో వక్ష్యే రథం శశిన ఏవ చ ।**
**గ్రహాణామితరేషాం చ యథా గచ్ఛతి చాంబుపః ॥1॥**

ఓ ఋషులారా! నేను సంగ్రహంగా సూర్యుడియొక్క రథాన్ని గూర్చి మరియు చంద్రుడు, ఇతరగ్రహాలయొక్క విషయాలు చెప్తూతాను. అట్లే వీటిని గ్రహించే సూర్యుడు ఏవిధంగా చలిస్తాడో కూడా మీకు చెబుతాను.

**సౌరస్తు బ్రహ్మణా సృష్టో రథస్త్వర్థవశేన సః ।**
**సంవత్సరస్యావయవైః కల్పితశ్చ ద్విజర్షభాః ॥2॥**

**త్రిణాభినా తు చక్రేణ పంచారేణ సమన్వితః ।**
**సౌవర్ణః సర్వదేవానామావాసో భాస్కరస్య తు ॥3॥**

**నవయోజనసాహస్రో విస్తారాయామతః స్మృతః ।**
**ద్విగుణోఽపి రథోపస్థాదీషాదండః ప్రమాణతః ॥4॥**

**అసంగైస్తు హయైర్యుక్తో యతశ్చక్రం తతః స్థితైః ।**
**వాజినస్తస్య వై సప్త ఛందోభిర్నిర్మితాస్తు తే ॥5॥**

**చక్రపక్షే నిబద్ధాస్తు ధ్రువే చాక్షః సమర్పితః ।**
**సహాశ్వచక్రో భ్రమతే సహాక్షో భ్రమతే ధ్రువః ॥6॥**

ఓ ద్విజశ్రేష్ఠులారా! బ్రహ్మ విశేషప్రయోజనాలకోసం సంవత్సరంయొక్క అవయవాలతో సూర్యరథాన్ని సృష్టించాడు. మూడు బండికంటినడిమితూములతోను ఐదు ఆకులుగల చక్రంతో కూడిన ఈ రథం స్వర్ణమయమైనది. ఇది సూర్యుడితోపాటు దేవతలందరికి నివాసస్థానం. దాని పొడవు వెడల్పులు తొమ్మిదివేలయోజనాలు కలిగి ఉన్నాయి. ఇందుకు రెట్టింపు రథానికి వెంట ఉండే కఱ్ఱలు, స్తంభాల్ని కలిపే దండేలు ఉంటాయి. రథచక్రానికి ప్రక్కగా గుఱ్ఱాలకు స్థానం ఉంటుంది. గుఱ్ఱాలు అంతరిక్షంలో ఏ ఆధారం లేకుండగా కదులుతూంటాయి. ఏడు గుఱ్ఱాలు ఉంటాయి. అవి వేదం యొక్క ఛందాలతో ఏర్పరచబడ్డాయి. గుఱ్ఱాలు చక్రంయొక్క ప్రక్కభాగానికి కట్టబడి ఉండి చక్రంఇరుసు ధ్రువమండలానికి అమర్చబడి ఉంటుంది. రథచక్రం గుఱ్ఱాలతోకూడా తిరుగుతుంది. మరియు గుర్రాలతో, రథచక్రంతో ఇరుసుతోబాటు ధ్రువమండలం తిరుగుతూ ఉంటుంది.

**అక్షః సహైకచక్రేణ భ్రమతేఽసౌ ధ్రువేరితః ।**
**ప్రేరకో జ్యోతిషాం ధీమాన్ ధ్రువో వై వాతరశ్మిభిః ॥7॥**

**యుగాక్షకోటిసంబద్ధౌ ద్వౌ రశ్మీ స్యందనస్య తు ।**
**ధ్రువేణ భ్రమతే రశ్మినిబద్ధః స యుగాక్షయోః ॥8॥**

ఆ అక్షం ధ్రువం వల్ల ప్రేరేపింపబడి ఏకచక్రంతోపాటు తిరుగుతున్నది. బుద్ధిమంతుడైన ధ్రువుడు వాయుకిరణాలద్వారా గ్రహనక్షత్రాదుల్ని ప్రేరేపిస్తున్నాడు. రథానికి రెండు పగ్గాలున్నాయి. అవి కాడికి, బండికన్నుకి చివరి భాగంలో కట్టబడి ఉన్నాయి. అవి బండికన్నులో కట్టబడ్డాయి. ఆ కాడికి ఇరుసుకి త్రాళ్ళతో కట్టబడిన ఆ సూర్యరథం ధ్రువుడిద్వారా చలిస్తున్నది.

**భ్రమతో మండలాని స్యుః ఖేచరస్య రథస్య తు ।**
**యుగాక్షకోటీ తే తస్య దక్షిణే స్యందనస్య హి ॥9॥**

**ధ్రువేణ ప్రగృహీతే వై విచక్రాశ్వే చ రజ్జుభిః ।**
**భ్రమంతమనుగచ్ఛంతి ధ్రువం రశ్మీ చ తావుభౌ ॥10॥**

ఈ విధంగా తిరుగుతున్న ఆకాశంలో చరిస్తున్న రథానికి పలుమండలాలు ఉన్నాయి. త్రాళ్ళతో రథానికి కట్టబడిన కాడి, ఇరుసు రథానికి కుడివైపున ఉంటాయి. త్రాళ్ళతో ధ్రువునికి అనుసంధింపబడిన అరుణుడు, చక్రం, ఆ అశ్వాలు తిరిగే ధ్రువునితో బాటు తిరుగుతూ ఉంటాయి.

**యుగాక్షకోటిస్త్వేతస్య వాతోర్మిస్యందనస్య తు ।**
**కీలే సక్తా యథా రజ్జుర్భ్రమతే సర్వతోదిశమ్ ॥11॥**

**భ్రామ్యతస్య రశ్మీ తు మండలేషూత్తరాయణే ।**
**వర్ధేతే దక్షిణే చైవ భ్రమతో మండలాని తు ॥12॥**

**ఆకృష్యేతే యదా తే వై ధ్రువేణాధిష్ఠితే తదా ।**
**ఆభ్యంతరస్థః సూర్యోఽథ భ్రమతే మండలాని తు ॥13॥**

**అశీతిమండలశతం కాష్ఠయోరంతరం ద్వయోః ।**
**ధ్రువేణ ముచ్యమానాభ్యాం రశ్మిభ్యాం పునరేవ తు ॥14॥**

**తథైవ బాహ్యతః సూర్యో భ్రమతే మండలాని తు ।**
**ఉద్వేష్టయన్ స వేగేన మండలాని తు గచ్ఛతి ॥15॥**

ఈ రథానికి వాయుతరంగరూపమైన యుగాక్షకోటులు కొక్కానికి తగుల్కొని ఉన్నాయి. త్రాడులు అన్ని వైపుల తిరుగుతున్నాయి. ఉత్తరాయణంలో మండలాలలో తిరుగుతున్న రథంయొక్క త్రాళ్ళు పెరుగుతాయి. దక్షిణాయనంలో మండలాలలో తిరుగుతున్న సూర్యుడి కాంతి తగ్గుతున్నది. ఆకాంతులు రెండూ ధ్రువుడి వల్ల ప్రేరేపింపబడుతున్నాయి. ఆ రథం మధ్యలోగల సూర్యుడు వలయంగా తిరుగుతుంటాడు. ఈ సమయంలో సూర్యుడు రెండు కాష్ఠలకు మధ్యదూరం ఎనిమిదివందల వలయాలు. మరల ధ్రువుడిద్వారా కిరణాల్ని విడిచిపెట్టే సమయంలో ఆ కాంతి సూర్యమండలానికి వెలుపల తిరుగుతుంటుంది. ఆతడు వలయాలలో వేగంగా తిరుగుతాడు.

**దేవాశ్చైవ తథానిత్యం మునయశ్చ దివానిశమ్ ।**
**యజంతి సతతం దేవం భాస్కరం భవమీశ్వరమ్ ॥16॥**

**స రథోఽధిష్ఠితో దేవైరాదిత్యైర్మునిభిస్తథా ।**
**గంధర్వైరప్సరోభిశ్చ గ్రామణీసర్పరాక్షసైః ॥17॥**

**ఏతే వసంతి వై సూర్యే ద్వౌ ద్వౌ మాసౌ క్రమేణ తు ।**
**ఆప్యాయయంతి చాదిత్యం తేజోభిర్భాస్కరం శివమ్ ॥18॥**

దేవతలు, మునులు నిత్యమూ రాత్రింబవళ్లు శివస్వరూపుడు, ఈశ్వరస్వరూపుడు అయిన సూర్యభగవానుణ్ణి నిరంతరం పూజిస్తున్నారు. ఆరథాన్ని దేవతలు ఆదిత్యులు, మునులు, గంధర్వులు, అప్సరసలు, గ్రామదేవతలు, సర్పాలు, రాక్షసులు అధిష్ఠించి ఉంటారు. వాళ్లందరూ సూర్యుడిమీద రెండురెండు మాసాలు క్రమంగా నివసిస్తారు. కళ్యాణకరుడైన సూర్యుణ్ణి వాళ్ల వాళ్ల కాంతులతో సంతృప్తుణ్ణి చేస్తారు.

**గ్రథితైః స్వైర్వచోభిస్తు స్తువంతి మునయో రవిమ్ ।**
**గంధర్వాప్సరసశ్చైవ నృత్యగేయైరుపాసతే ॥19॥**

**గ్రామణీయక్షభూతాని కుర్వతేఽభీషుసంగ్రహమ్ ।**
**సర్పా వహంతి వై సూర్యం యాతుధానానుయాంతి చ ॥20॥**

**వాలఖిల్యా నయంత్యస్తం పరివార్యోదయాద్రవిమ్ ।**
**ఇత్యేతే వై వసంతీహ ద్వౌ ద్వౌ మాసౌ దివాకరే ॥21॥**

మునులు తమవాక్కులతో కూర్చబడిన స్తుతులతో కీర్తిస్తున్నారు. గంధర్వులు, అప్సరసలు నాట్యగానాల ద్వారా సూర్యుణ్ణి ఉపాసిస్తున్నారు. గ్రామదేవతలు, యక్షులు, భూతగణాలు కిరణాల్ని సంగ్రహిస్తున్నారు. సర్పసమూహాలు సూర్యుణ్ణి వహిస్తున్నవి. యాతుధానులు (రాక్షసులు) ఆతడి వెనుక నడుస్తున్నారు. వాలఖిల్యమునులు ఉదయంనుంచి నాల్గుదిక్కులకు త్రిప్పి సూర్యుణ్ణి సాయంకాలానికి అస్త్రాద్రికి తీసుకువెళుతున్నారు. వీళ్లందరూ సూర్యుడి మీద రెండు రెండు నెలలు నివసిస్తారు.

**మధుశ్చ మాధవశ్చైవ శుక్రశ్చ శుచిరేవ చ ।**
**నభోనభస్యౌ విప్రేంద్రా ఇషశ్చోర్జస్తథైవ చ ॥22॥**

**సహః సహస్యౌ చ తథా తపస్యశ్చ తపః పునః ।**
**ఏతే ద్వాదశమాసాస్తు వర్షం వై మానుషం ద్విజాః ॥23॥**

**వాసంతికస్తథా గ్రైష్మః శుభో వై వార్షికస్తథా ।**
**శారదశ్చ హిమశ్చైవ శైశిరో ఋతవః స్మృతాః ॥24॥**

ఓ విప్రవరులారా! మధువు (చైత్రం) మాధవం (వైశాఖం) శుక్రం (జ్యేష్ఠం) శుచి (ఆషాఢం) నభం (శ్రావణం) నభస్య (భాద్రపదం) ఇష (ఆశ్వయుజం) ఊర్జ (కార్తీకం) సహ (మార్గశీర్షం) సహస్య (పుష్యం) తపస్య (మాఘం)

మరియు తపం (ఫాల్గుణం) అనే యీ పండ్రెండు నెలలు మానవసంవత్సరం. ఓ ఋషులారా! వసంతం, గ్రీష్మం, శుభకరమైన వర్షం, శరత్తు, హేమంతం అట్లే శిశిరం అనే యీ ఆరు ఋతువులు.

**ధాతార్యమాథ మిత్రశ్చ వరుణశ్చేంద్ర ఏవ చ ।**
**వివస్వాంశ్చైవ పూషా చ పర్జన్యోంశుర్భగస్తథా ॥25॥**

**త్వష్టా విష్ణుః పులస్త్యశ్చ పులహశ్చాత్రిరేవ చ ।**
**వసిష్ఠశ్చాంగిరాశ్చైవ భృగుర్బుద్ధిమతాం వరః ॥26॥**

**భారద్వాజో గౌతమశ్చ కశ్యపశ్చ క్రతుస్తథా ।**
**జమదగ్నిః కౌశికశ్చ వాసుకిః కంకణీకరః ॥27॥**

**తక్షకశ్చ తథా నాగ ఏలాపత్రస్తథా ద్విజాః ।**
**శంఖపాలస్తథా చాన్యస్త్వైరావత ఇతి స్మృతః ॥28॥**

**ధనంజయో మహాపద్మస్తథా కర్కోటకః స్మృతః ।**
**కంబలోఽశ్వతరశ్చైవ తుంబురుర్నారదస్తథా ॥29॥**

**హాహా హూహూర్మునిశ్రేష్ఠా విశ్వావసురనుత్తమః ।**
**ఉగ్రసేనోఽథ సురుచిరన్యశ్చైవ పరావసుః ॥30॥**

**చిత్రసేనో మహాతేజాశ్చోర్ణాయుశ్చైవ సువ్రతాః ।**
**ధృతరాష్ట్రః సూర్యవర్చా దేవీ సాక్షాత్కృతస్థలా ॥31॥**

**శుభాననా శుభశ్రోణిర్దివ్యా వై పుంజికస్థలా ।**
**మేనకా సహజన్యా చ ప్రమ్లోచాథ శుచిస్మితా ॥32॥**

**అనుమ్లోచా ఘృతాచీ చ విశ్వాచీ చోర్వశీ తథా ।**
**పూర్వచిత్తిరితి ఖ్యాతా దేవీ సాక్షాత్తిలోత్తమా ॥33॥**

**రంభా చాంభోజవదనా రథకృద్ గ్రామణీః శుభః ।**
**రథౌజా రథచిత్రశ్చ సుబాహుర్వై రథస్వనః ॥34॥**

**వరుణశ్చ తథైవాన్యః సుషేణః సేనజిచ్ఛుభః ।**
**తార్క్ష్యశ్చారిష్టనేమిశ్చ క్షతజిత్సత్యజిత్తథా ॥35॥**

**రక్షో హేతిః ప్రహేతిశ్చ పౌరుషేయోవధస్తథా ।**
**సర్పో వ్యాఘ్రః పునశ్చాపో వాతో విద్యుద్దివాకరః ॥36॥**

**పద్మోపేతశ్చ రక్షేంద్రో యజ్ఞోపేతస్తథైవ చ ।**
**ఏతే దేవాదయః సర్వే వసంత్యర్కే క్రమేణ తు ॥37॥**

**స్థానాభిమానినో హ్యేతే గణా ద్వాదశ సప్తకాః ।**

ధాత, అర్యమ, మిత్ర, వరుణ, ఇంద్ర, వివస్వంతులు, పూష, పర్జన్య, అంశు, భగ, త్వష్ట, విష్ణువులనే ఈ పంద్రెండు మంది ఆదిత్యులు. పులస్త్యుడు, పులహుడు, అత్రి, వసిష్ఠుడు, అంగిరసుడు, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు భృగుడు, భారద్వాజుడు, గౌతముడు, కశ్యపుడు, క్రతువు, జమదగ్ని అట్లే కౌశికుడు ఈ పంద్రెండుమంది మహర్షులు. ఓ ద్విజులారా! వాసుకి, కంకణీకరుడు, తక్షకుడు, నాగుడు, ఏలాపుత్రుడు, శంఖపాలుడు, ఐరావతుడు, ధనంజయుడు, మహాపద్ముడు, కర్కోటకుడు, కంబలుడు అట్లే అశ్వతరుడు ఈ పంద్రెండుగురు మహాసర్పాలు. ఓ మునిశ్రేష్ఠులారా! తుంబురుడు, నారదుడు, హాహా, హూహూ, శ్రేష్ఠుడైన విశ్వావసుడు, ఉగ్రసేనుడు, సురుచి, పరావసు, చిత్రసేనుడు, మహాతేజస్వి ఊర్ణాయువు, ధృతరాష్ట్రుడు అట్లే సూర్యవర్చుడు ఈ పంద్రెండుగురు గంధర్వులు. ఓ సువ్రతులారా! దేవి కృతస్థల, సుందరముఖి, ఉన్నతశ్రోణి, దివ్య అయిన పుంజికస్థల, మేనక, సహజన్య, పవిత్రమందస్మిత ప్రమ్లోచ, అనుమ్లోచ, ఘృతాచి, విశ్వాచి, ఊర్వశి, పూర్వచిత్తి, దేవి తిలోత్తమ అట్లే కమలనయన రంభ, ఈ పంద్రెండుగురు అప్సరసలు. రథకృతుడు, శుభారథౌజుడు, రథచిత్రుడు, సుబాహువు, రథస్వనుడు, వరుణుడు, సుషేనుడు, శుభసేనజిత్తు, తార్క్ష్యుడు, అరిష్టనేమి, క్షతజిత్తు, అట్లే సత్యజిత్తు ఈ పంద్రెండుమంది గ్రామణులు. హేతి, ప్రహేతి, పౌరుషేయుడు, వధుడు, సర్పుడు, వ్యాఘ్రుడు, ఆపుడు, వాతుడు, విద్యుతుడు, దివాకరుడు, బ్రహ్మోపేతుడు మరియు రాక్షసరాజు యజ్ఞోపేతుడు ఈ పంద్రెండుగురు యాతుధానులు (రాక్షసులు), దేవతలు మొదలైన వీరందరూ క్రమంగా సూర్యుడిమీద నివసిస్తారు. పంద్రెండు సంఖ్యలోగల ఈ ఏడుగణాలు వారి స్థానాలలో ఇష్టులై ఉంటారు.

**ధాత్రాది విష్ణుపర్యంతా దేవా ద్వాదశ కీర్తితాః ॥38॥**

**ఆదిత్యం పరం భానుం భాభిరాప్యాయయంతి తే ।**
**పులస్త్యాద్యాః కౌశికాంతా మునయో మునిసత్తమాః ॥39॥**

**ద్వాదశైవ స్తవైర్భానుం స్తువంతి చ యథాక్రమమ్ ।**
**నాగాశ్చాశ్వతరాంతాస్తు వాసుకిప్రముఖా శుభాః ॥40॥**

**ద్వాదశైవ మహాదేవం వహంత్యేవం యథాక్రమమ్ ।**
**క్రమేణ సూర్యవర్చాంతాస్తుంబురుప్రముఖాంబుజమ్ ॥41॥**

**గీతైరేనముపాసంతే గంధర్వా ద్వాదశోత్తమాః ।**
**కృతస్థలాద్యా రంభాంతా దివ్యాశ్చాప్సరసో రవిమ్ ॥42॥**

**తాండవైస్సరసైః సర్వాశ్చోపాసంతే యథాక్రమమ్ ।**
**దివ్యాః సత్యజిదంతాశ్చ గ్రామణ్యో రథకృన్ముఖాః ॥43॥**

**ద్వాదశాస్య క్రమేణైవ కుర్వతే భీషుసంగ్రహమ్ ।**
**ప్రయాంతి యజ్ఞోపేతాంతా రక్షోహేతిముఖాః సహ ॥44॥**

**సాయుధా ద్వాదశైవైతే రాక్షసాశ్చ యథాక్రమమ్ ।**

ధాత నుంచి విష్ణువు వరకూ గల పండ్రెండుగురు దేవతలు (ఆదిత్యులు). వారందరూ వారి తేజస్సులచేత సూర్యుడికి మిక్కిలి సంతృప్తి కలిగిస్తున్నారు. ఓ మునిశ్రేష్ఠులారా! పులస్త్యుడి నుంచి కౌశికుడి వరకూగల ఋషులు సూర్యుణ్ణి స్తోత్రాలతో స్తుతిస్తున్నారు. ఈ విధంగా వాసుకి నుంచి అశ్వతరుడి వరకూగల శుభకరులైన నాగులు యథాక్రమంగా సూర్యుణ్ణి మోస్తున్నాయి. తుంబురుడి నుంచి సూర్యవర్చుడి వరకు ఈ పండ్రెండుగురు ఉత్తమగంధర్వులు గీతాలు ఆలపించి సూర్యుణ్ణి ఉపాసిస్తున్నారు. కృతస్థల నుంచి రంభవరకూగల అందరు అప్సరసలు తాండవనృత్యాలతోనూ లాస్యనృత్యాలలోనూ సూర్యుణ్ణి ఉపాసిస్తున్నారు. రథకృత్తు నుంచి సత్యజిత్తువరకూ ఈ పండ్రెండుగురు దివ్యగ్రామణులు క్రమంగా సూర్యరథాశ్వాలకళ్ళెములను సంగ్రహిస్తున్నారు. రాక్షసులైన హేతి నుంచి యజ్ఞోపేతుడి వరకూగల ప్రసిద్ధరాక్షసులు శస్త్రధారులై సూర్యుడి వెనుకగ తిరుగుతున్నారు.

**ధాతార్యమా పులస్త్యశ్చ పులహశ్చ ప్రజాపతిః ॥45॥**

**ఉరగో వాసుకిశ్చైవ కంకణీకశ్చ తావుభౌ ।**
**తుంబురుర్నారదశ్చైవ గంధర్వౌ గాయతాం వరౌ ॥46॥**

**కృతస్థలాప్సరాశ్చైవ తథా వై పుంజకస్థలా ।**
**గ్రామణీ రథకృచ్చైవ రథౌజాశ్చైవ తావుభౌ॥47॥**

**రక్షో హేతిః ప్రహేతిశ్చ యాతుధానావుదాహృతౌ ।**
**మధుమాధవయోరేష గణో వసతి భాస్కరే ॥48॥**

ధాత, అర్యముడు అనే ఈ ఇద్దరు ఆదిత్యులు, పులస్త్యుడు, పులహుడు అనే యీ యిద్దరు ఋషులు, వాసుకి, కంకణీకుడనే ఈ యిద్దరు సర్పాలు, తుంబురుడు, నారదుడు అనే ఈ యిద్దరు గాయకశ్రేష్ఠులైన గంధర్వులు, కృతస్థల అట్లే పుంజకస్థల అనే యిద్దరు అప్సరసలు, రథకృత్తు, రథౌజుడు అనే ఈ యిద్దరు గ్రామణులు, హేతి, ప్రహేతి అనే ఈ ఇద్దరు యాతుధానులైన రాక్షసులు అయిన వీరు చైత్రవైశాఖమాసాలల్లో సూర్యుడి మీద నివసిస్తారు.

**వసతి గ్రీష్మకౌ మాసౌ మిత్రశ్చ వరుణశ్చ హ ।**
**ఋషిరత్రిర్వసిష్ఠశ్చ తక్షకో నాగ ఏవ చ ॥49॥**

**మేనకా సహజన్యా చ గంధర్వౌ చ హహా హుహూ ।**
**సుబాహునామా గ్రామణ్యౌ రథచిత్రశ్చ తావుభౌ ॥50॥**

**పౌరుషేయో వధశ్చైవ యాతుధానావుదాహృతౌ ।**
**ఏతే వసంతి వై సూర్యే మాసయోః శుచిశుక్రయోః ॥51॥**

గ్రీష్మఋతుసంబంధమైన రెండుమాసాలలోనూ ఈ జనులు నివసిస్తున్నారు. మిత్రావరుణులనే ఆదిత్యులు, అత్రివసిష్ఠులు ఋషులు, తక్షకనాగులనే సర్పాలు, మేనక మరియు సహజన్య అనే అప్సరసలు, హాహా హూహూ

అనే గంధర్వులు, రథచిత్రుడు, సుబాహుడు అనే గ్రామణులు, పౌరుషేయుడు, వధుడు అనే యాతుధానులు– వీరందరూ జ్యేష్ఠం, ఆషాఢం అనే ఈ మాసాలలో సూర్యుడి మీది నివసిస్తున్నారు.

**తతః సూర్యే పునశ్చాన్యా నివసంతీహ దేవతాః ।**
**ఇంద్రశ్చైవ వివస్వాంశ్చ అంగిరా భృగురేవ చ ॥52॥**

**ఏలాపత్రస్తథా సర్పః శంఖపాలశ్చ తావుభౌ ।**
**విశ్వావసూగ్రసేనౌ చ వరుణశ్చ రథస్వనః ॥53॥**

**ప్రమ్లోచా చైవ విఖ్యాతా అనుమ్లోచా చ తే ఉభే ।**
**యాతుధానాస్తథా సర్పో వ్యాఘ్రశ్చైవ తు తావుభౌ ॥54॥**

**నభోనభస్యయోరేష గణో వసతి భాస్కరే ।**

తర్వాత సూర్యుడిమీద ఇతరదేవతలుకూడా నివసిస్తున్నారు. ఇంద్రుడు, వివస్వంతుడు అనే ఆదిత్యులు, అంగిరసుడు, భృగువు అనే ఋషులు, ఏలాపత్రుడు, శంఖపాలుడు అనే సర్పాలు, విశ్వావసువు, ఉగ్రసేనుడనే గంధర్వులు, వరుణుడు, రథస్వనుడు అనే గ్రామణులు, ప్రసిద్ధులైన ప్రమ్లోచ, అనుమ్లోచ అనే ఇద్దరు అప్సరసలు, సర్పుడు, వ్యాఘ్రుడనే యిద్దరు యాతుధానులు శ్రావణభాద్రపదమాసాలలో సూర్యుడి మీద నివసిస్తున్నారు.

**పర్జన్యశ్చైవ పూషా చ భరద్వాజోఽథ గౌతమః ॥55॥**

**ధనంజయ ఇరావాంశ్చ సురుచిః స పరావసుః ।**
**ఘృతాచీ చాప్సరః శ్రేష్ఠా విశ్వాచీ చాతిశోభనా ॥56॥**

**సేనజిచ్చ సుషేణశ్చ సేనానీర్గ్రామణీశ్చ తౌ ।**
**ఆపో వాతశ్చ తావేతౌ యాతుధానావుభౌ స్మృతౌ ॥57॥**

**వసంత్యేతే తు వై సూర్యే మాస ఊర్జ ఇషే చ హ ।**

పర్జన్యుడు, పూషుడు అనే ఆదిత్యులు, భరద్వాజుడు, గౌతముడు అనే ఋషులు, ధనంజయుడు, ఐరావతుడు అనే సర్పాలు, సురుచి, పరావసువు అనే గంధర్వులు, అప్సరసలలో శ్రేష్ఠ అయిన ఘృతాచి, పరమసుందరి విశ్వాచి అనే అప్సరసలు, సేనాని అయిన సేనజిత్, సుషేణుడు అనే గ్రామణులు, ఆపుడు, వాతుడు అనే యాతుధానులు– వీరందరూ ఆశ్వయుజకార్తికమాసాలలో సూర్యుడి మీద నివసిస్తున్నారు.

**హైమంతికౌ తు ద్వౌ మాసౌ వసంతి చ దివాకరే ॥58॥**

**అంశుర్భగశ్చ ద్వావేతౌ కస్యపశ్చ క్రతుః సహ ।**
**భుజంగశ్చ మహాపద్మః సర్పః కర్కోటకస్తథా ॥59॥**

**చిత్రసేనశ్చ గంధర్వ ఊర్ణాయుశ్చైవ తావుభౌ ।**
**ఊర్వశీ పూర్వచిత్తిశ్చ తథైవాప్సరసావుభే ॥60॥**

**తార్క్ష్యశ్చారిష్టనేమిశ్చ సేనానీగ్రామణీశ్చ తౌ ।**
**విద్యుద్దివాకరశ్చోభౌ యాతుధానావుదాహృతౌ ॥61॥**

**సహే చైవ సహస్యే చ వసంత్యేతే దివాకరే ।**

హేమంతఋతువుకుచెందిన రెండుమాసాలలోనూ ఈ జనులు నివసిస్తున్నారు. అంశుడు, భగుడనే ఆదిత్యులు, కశ్యపుడు క్రతువు అనే ఋషులు, మహాపద్ముడనే భుజంగుడు, కర్కోటకుడు అనే సర్పమూ,చిత్రసేనుడు, ఊర్ణాయువు అనే ఇద్దరు గంధర్వులు, ఊర్వశి, పూర్వచిత్తి అనే ఇద్దరు అప్సరసలు, సేనాని అయిన తార్క్ష్యుడు, అరిష్టనేమి అనే యాతుధానులు వీరందరూ హేమంతఋతువుకు చెందిన మార్గశీర్ష, పుష్యమాసాలలో సూర్యుడిపైన నివసిస్తున్నారు.

**తతః శైశిరయోశ్చాపి మాసయోర్నివసంతి వై ॥62॥**

**త్వష్టా విష్ణుర్జమదగ్నిర్విశ్వామిత్రస్తథైవ చ ।**
**కాద్రవేయౌ తథా నాగౌ కంబలాశ్వతరావుభౌ ॥63॥**

**ధృతరాష్ట్రః సగంధర్వః సూర్యవర్చాస్తథైవ చ ।**
**తిలోత్తమాప్సరాశ్చైవ దేవీ రంభా మనోహరా ॥64॥**

**రథజిత్సత్యజిచ్చైవ గ్రామణ్యౌ లోకవిశ్రుతౌ ।**
**బ్రహ్మోపేతస్తథా రక్షో యజ్ఞోపేతశ్చ యః స్మృతః ॥65॥**

తర్వాత త్వష్ట, విష్ణువు అనే ఆదిత్యులు, జమదగ్ని విశ్వామిత్రులనే ఋషులు, కద్రువు కుమారులైన కంబల, అశ్వతరులనే నాగులు, ధృతరాష్ట్రుడు, సూర్యవర్చుడు అనే గంధర్వులు, మనోహరలైన రంభాతిలోత్తమలనే అప్సరసలు, లోకప్రసిద్ధులు రథజిత్తు, సత్యజిత్తనే గ్రామణులు, బ్రహ్మోపేతుడు, యజ్ఞోపేతుడనే యాతుధానులు– అందరూ శిశిరఋతువుకు చెందిన మాఘఫాల్గుణమాసాలలో సూర్యుడిపైన నివసిస్తున్నారు.

**ఏతే దేవా వసంత్యర్కే ద్వౌ ద్వౌ మాసౌ క్రమేణ తు ।**
**స్థానాభిమానినో హ్యేతే గణా ద్వాదశ సప్తకాః ॥66॥**

**సూర్యమాప్యాయయంత్యేతే తేజసా తేజ ఉత్తమమ్ ।**
**గ్రథితైః స్వైర్వచోభిస్తు స్తువంతి మునయో రవిమ్ ॥67॥**

**గంధర్వాప్సరసశ్చైవ నృత్యగేయైరుపాసతే ।**
**గ్రామణీయక్షభూతాని కుర్వతేఽభీషుసంగ్రహమ్ ॥68॥**

**సర్పా వహంతి వై సూర్యం యాతుధానానుయాంతి వై ।**
**వాలఖిల్యా నయంత్యస్తం పరివార్యోదయాద్రవిమ్ ॥69॥**

ఈ దేవతాగణాలు క్రమంగా రెండురెండు మాసాలు సూర్యుడిలో నివసిస్తున్నాయి. స్థానాభిమానం కల ఆ పన్నెండుగురు పన్నెండుగురు ఉన్న ఏడుగణాలు తమతమ కాంతులతో ఉన్నత కాంతిమంతుడైన సూర్యుడిని సంతృప్తుణ్ణి చేస్తున్నాయి. మునులు తాము కూర్చిన స్తుతులతో సూర్యుణ్ణి స్తుతిస్తున్నారు. గంధర్వులు గానంతోను, అప్సరసలు నాట్యాలతోను సూర్యుణ్ణి ఉపాసిస్తున్నారు. గ్రామణులైన యక్షులు, భూతాలు రథం పగ్గాలను (త్రాళ్లను) పట్టుకుంటున్నారు. సర్పసమూహాలు సూర్యుణ్ణి మోస్తున్నాయి. యాతుధానులు వెనుకగా, వెనుకగా వస్తున్నారు. వాలఖిల్యమునులు నాల్గు దిక్కులను చుట్టుకుని సూర్యుడిని ఉదయం నుంచి అస్తమయందాకా త్రిప్పుతున్నారు.

**ఏతేషామేవ దేవానాం యథాతేజో యథాతపః ।**
**యథాయోగం యథామంత్రం యథాధర్మం యథాబలమ్ ॥70॥**

**యథా తపత్యసౌ సూర్యస్తేషామిద్ధస్తు తేజసా ।**
**ఇత్యేతే వై వసంతీహ ద్వౌ ద్వౌ మాసౌ దివాకరే ॥71॥**

**ఋషయో దేవగంధర్వపన్నగాప్సరసాం గణాః ।**
**గ్రామణ్యశ్చ తథా యక్షా యాతుధానాశ్చ ముఖ్యతః ॥72॥**

**ఏతే తపంతి వర్షంతి భాంతి వాంతి సృజంతి చ ।**
**భూతానామశుభం కర్మ వ్యపోహంతీహ కీర్తితాః ॥73॥**

**మానవానాం శుభం హ్యేతే హరంతి చ దురాత్మనామ్ ।**
**దురితం సుప్రచారాణాం వ్యపోహంతి క్వచిత్క్వచిత్ ॥74॥**

ఈ దేవతలయొక్క తేజస్సు, తపస్సు, యోగం, మంత్రం, ధర్మం, బలం– వీటిని పొంది సూర్యుడు సమృద్ధుడై మిక్కిలిగా ప్రకాశిస్తున్నాడు. వీళ్లందరూ సూర్యుడిపైన రెండు రెండు నెలలు నివసిస్తున్నారు. ఋషులు, దేవతలు, గంధర్వులు, సర్పాలు, అప్సరసలు, గ్రామణులు, యక్షులు, యాతుధానులు ముఖ్యరూపులై తపిస్తున్నారు. వర్షిస్తున్నారు. ప్రకాశిస్తున్నారు. సృజిస్తున్నారు. ఆరాధిస్తున్నారు. ప్రాణుల అమంగళకర్మల్ని నశింపజేస్తున్నారు. వీళ్లందరూ దురాత్ములైన మానవుల శుభాల్ని నశింపజేస్తున్నారు. అప్పుడప్పుడూ సజ్జనుల పాపాల్ని హరిస్తున్నారు.

**విమానే చ స్థితా దివ్యే కామగే వాతరంహసి ।**
**ఏతే సహైవ సూర్యేణ భ్రమంతి దివసానుగాః ॥75॥**

**వర్షంతశ్చ తపంతశ్చ హ్లాదయంతశ్చ వై ద్విజాః ।**
**గోపాయంతీహ భూతాని సర్వాణి హ్యామనుక్షయాత్ ॥76॥**

కామగమనం గలది, వాయువేగంగలది దివ్యమైనది అయిన విమానంలో ఉండి వీరందరూ సూర్యుడితో కూడా పగలంతా తిరుగుతున్నారు. ఓ మునులారా! వీళ్లు వర్షిస్తున్నారు. తపిస్తున్నారు. ఆహ్లాదపరుస్తున్నారు. సమస్తప్రాణుల్ని మన్వంతరపర్యంతం వినాశంనుంచి కాపాడతారు.

**స్థానాభిమానినామేతత్స్థానం మన్వంతరేషు వై ।**
**అతీతానాగతానాం వై వర్తంతే సాంప్రతం చ యే ॥77॥**

**ఏతే వసంతి వై సూర్యే సప్తకాస్తే చతుర్దశ ।**
**చతుర్దశసు సర్వేషు గణా మన్వంతరేష్విహ ॥78॥**

ప్రస్తుతం వీళ్లందరూ ఏ స్థానాల్ని అభిమానించి నిలుస్తున్నారో జరిగిన జరగనున్న మన్వంతరాలలోను ఆయాస్థానాలలోనే నిలుస్తారు. ఈ పధ్నాలుగు గణాలు ఏడు ఏడు సమూహాలుగా పధ్నాలుగు మన్వంతరాలలోనూ సూర్యుడిపై నివసిస్తారు.

**సంక్షేపాద్విస్తరాచ్చైవ యథావృత్తం యథాశ్రుతమ్ ।**
**కథితం మునిశార్దూలా దేవ దేవస్య ధీమతః ॥79॥**

**ఏతే దేవా వసంత్యర్కే ద్వౌ ద్వౌ మాసౌ క్రమేణ తు ।**
**స్థానాభిమానినో హ్యేతే గణా ద్వాదశ సప్తకాః ॥80॥**

ఓ మునిశ్రేష్ఠులారా! సంగ్రహంగా మరియు విపులంగా ఎలా జరిగిందో, ఎలా వింటినో అలాగే ధీమంతుడైన దేవదేవుడి క్రియాకలాపాన్ని చెప్పాను. స్థానాభిమానులైన ఈ దేవతలందరూ రెండు రెండు నెలలు క్రమంగా ఏడు జంటలు పన్నెండుగణాలకు సంబంధించినవి సూర్యుడిమీద నివసిస్తున్నారు.

**ఇత్యేష ఏకచక్రేణ సూర్యస్తూర్ణం రథేన తు ।**
**హరితైరక్షరైరశ్వైః సర్పతేఽసౌ దివాకరః ॥81॥**

**అహోరాత్రం రథేనాసావేకచక్రేణ తు భ్రమన్ ।**
**సప్తద్వీపసముద్రాం గాం సప్తభిః సర్పతే దివి ॥82॥**

సూర్యుడు ఈ విధంగా అవినాశులు, హరితవర్ణాలు గల అశ్వాలు కట్టిన ఏకచక్రరథంతో ప్రయాణిస్తున్నాడు. సూర్యుడు ఏకచక్రరథంతో రాత్రింబవళ్లు తిరుగుతూ సప్తద్వీపాలు సప్తసముద్రాలు గల భూమిపైన ఆకాశంలో తిరుగుతున్నాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే సూర్యరథనిర్ణయో నామ పంచ పంచాశత్తమోఽధ్యాయః ॥ 55 ॥**

శ్రీలింగమహాపురాణం, పూర్వభాగంలోని సూర్యరథవర్ణనమనే ఏబై అయిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **షట్ పంచాశత్తమోఽ ధ్యాయః** – ఏబై ఆరవ అధ్యాయం

## **సోమవర్ణనమ్** – సోమవర్ణనం

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**వీథ్యాశ్రయాణి చరతి నక్షత్రాణి నిశాకరః ।**
**త్రిచక్రోభయతోఽ శ్వశ్చ విజ్ఞేయస్తస్య వై రథః ॥1॥**

**శాతారైశ్చ త్రిభిశ్చక్రైర్యుక్తః శుక్లై ర్హయోత్తమైః ।**
**దశభిస్త్వకృశైర్దివ్యైరసంగైస్తైర్మనోజవైః ॥2॥**

**రథేనానేన దేవైశ్చ పితృభిశ్చైవ గచ్ఛతి ।**
**సోమో హ్యంబుమయైర్గోభిః శుక్లైః శుక్లగభస్తిమాన్ ॥3॥**

ఆకాశవీథిని ఆశ్రయించియున్న నక్షత్రాలలో చంద్రుడు తిరుగుతూ ఉంటాడు. ఆయన రథానికి మూడు చక్రాలుంటాయి. రెండువైపుల అశ్వాలుంటాయి. రథం మూడుచక్రాలమీద బిగించబడి ఉంటుంది. అది తెల్లని పదిగుఱ్ఱాలతో కూడి ఉంటుంది. ఆ గుఱ్ఱాలు తెల్లనివి. పుష్టిగలిగినవి. కాడికికట్టబడి ఉండనట్టివి. మనోవేగం గలవి. చంద్రుడు ఆ రథాన్ని అధిష్ఠించి దేవతలతో, పితృదేవతలతో తిరుగుతుంటాడు. నీటివలె తెల్లని రంగుగల గుఱ్ఱాలతో తెల్లటికాంతికిరణాలుగల చంద్రుడు భ్రమణం చేస్తుంటాడు.

**క్రమతే శుక్లపక్షాదౌ భాస్కరాత్పరమాస్థితః ।**
**ఆపూర్యతే పరస్యాంతః సతతం దివసక్రమాత్ ॥4॥**

**దేవైః పీతం క్షయే సోమమాప్యాయయతి నిత్యశః ।**
**పీతం పంచదశాహం తు రశ్మినైకేన భాస్కరః ॥5॥**

**ఆపూరయన్ సుషుమ్నేన భాగం భాగమనుక్రమాత్ ।**
**ఇత్యేషా సూర్యవీర్యేణ చంద్రస్యాప్యాయితా తనుః ॥6॥**

**స పౌర్ణమాస్యాం దృశ్యేత శుక్లః సంపూర్ణమండలః ।**
**ఏవమాప్యాయితం సోమం శుక్లపక్షే దినక్రమాత్ ॥॥7॥**

చంద్రుడు సూర్యుడికి దూరమందు నిలిచి, ఉండి శుక్లపక్షం మొదటినుంచి క్రమంగా వృద్ధిపొందుతాడు. క్రమంగా ప్రతిదినం చంద్రుడు శుక్లపక్షాంతం వరకు వృద్ధి పొందుతాడు. కృష్ణపక్షంలో దేవతలు చంద్రకిరణాల్ని త్రాగుతారు. పదిహేనురోజుల వరకు త్రాగుతారు. సూర్యుడు ఒకానొక సుషుమ్నా కిరణంతో క్రమంగా ప్రతిభాగాన్ని పూరిస్తాడు. ఈ విధంగా సూర్యుడియొక్క తేజస్సుతో చంద్రుడి శరీరం వికసితమవుతుంది. చంద్రుడు పూర్ణిమనాడు తెల్లనిరంగుతో నిండైన మండలంతో కన్పిస్తాడు. ఈ శుక్లపక్షంలో ఆతడు ప్రతిదినం వృద్ధి చెందుతాడు.

**తతో ద్వితీయాప్రభృతి బహులస్య చతుర్దశీమ్ ।**
**పిబంత్యంబుమయం దేవా మధు సౌమ్యం సుధామృతమ్ ॥8॥**

**సంభూతం త్వర్ధమాసేన హ్యమృతం సూర్యతేజసా ।**
**పానార్థమమృతం సోమం పౌర్ణమాస్యాముపాసతే ॥9॥**

**ఏకరాత్రిం సురాః సర్వే పితృభిస్త్వృషిభిః సహ ।**
**సోమస్య కృష్ణపక్షాదౌ భాస్కరాభిముఖస్య తు ॥10॥**

**ప్రక్షీయంతే పరస్యాంతః పీయమానాః కలాః క్రమాత్ ।**
**త్రయస్త్రింశచ్ఛతాశ్చైవ త్రయస్త్రింశత్తథైవ చ ॥11॥**

**త్రయస్త్రింశత్సహస్రాణి దేవాః సోమం పిబంతి వై ।**

తర్వాత కృష్ణపక్షంయొక్క విదియ తిథిదగ్గరనుంచి చతుర్దశివరకు దేవతలు చంద్రుడికి చెందిన నీటివంటి అమృతసుధను త్రాగుతున్నారు. సూర్యుడి తేజస్సుతో సగం మాసానికే మరల అమృతం సిద్ధిస్తుంది. అమృతసేవనంకోసం దేవతలందరూ ఒకే రాత్రి పితృదేవతలతోనూ, ఋషిగణాలతోనూ చంద్రుణ్ణి చేరుతారు. కృష్ణపక్షం మొదటిలో సూర్యుడికి ఎదురుగాగల చంద్రుడు క్రమంగా కళలన్నీ త్రాగబడడం వల్ల బాగా క్షీణిస్తాడు. ముప్పై మూడువేల మూడువందల ముప్పైమూడు సంఖ్యగల దేవగణాలు చంద్రునియందుగల అమృతాన్ని త్రాగుతుంటారు.

**ఏవం దినక్రమాత్పీతే విబుధైస్తు నిశాకరే ॥12॥**

**పీత్వార్ధమాసం గచ్ఛంతి అమావాస్యాం సురోత్తమాః ।**
**పితరశ్చోపతిష్ఠంతి అమావాస్యాం నిశాకరమ్ ॥13॥**

**తతః పంచదశే భాగే కించిచ్ఛిష్టే కళాత్మకే ।**
**అపరాహ్ణే పితృగణా జఘన్యం పర్యుపాసతే ॥14॥**

ఈ విధంగా దేవతలచేత ప్రతిదినం చంద్రుడు త్రాగబడగా సగమాసానికి ఆదేవతలందరూ అమావాస్యతిథికి చేరుతున్నారు. ఇట్లే పితృదేవతలు కూడా అమావాస్యతిథికి చంద్రుడిపై ఉంటున్నారు. తర్వాత పదిహేనవ కళాభాగం కొద్దిగా శేషించింది కాగా, అపరాహ్ణంలో పితృగణాలు చంద్రుణ్ణి చేరుతున్నారు.

**పిబంతి ద్వికలం కాలం శిష్టా తస్య కళా తు యా ।**
**నిఃసృతం తదమావాస్యాం గభస్తిభ్యః స్వధామృతమ్ ॥15॥**

**మాసతృప్తిమవాప్యాగ్ర్యాం పీత్వా గచ్ఛంతి తేఽమృతమ్ ।**
**పితృభిః పీయమానస్య పంచదశ్యాం కళా తు యా ॥16॥**

**యావత్తు క్షీయతే తస్య భాగః పంచదశస్తు సః ।**
**అమావాస్యాం తతస్తస్యా అంతరాపూర్యతే పునః ॥17॥**

**వృద్ధిక్షయౌ వై పక్షాదౌ షోడశ్యాం శశినః స్మృతౌ ।**
**ఏవం సూర్యనిమిత్తైషా పక్షవృద్ధిర్నిశాకరే ॥18॥**

మిగిలియున్న అమృతాన్ని రెండుకళలవరకు పితృగణాలు త్రాగివేస్తారు. అంతేకాక అమావాస్యనాడు కిరణాలనుంచి వెలువడే 'స్వధ' అనే అమృతాన్ని కూడా పానం చేస్తారు. ఆ అమృతపానం చేసిన తర్వాత పూర్తినెల అంతా పూర్ణసంతుష్టులై అక్కడ నుంచి వెళ్లిపోతారు. పితృగణాలతో త్రాగబడిన తర్వాత మిగిలియున్న చంద్రకళ కరిగిపోతుంది. చంద్రుడి వృద్ధిక్షయాలు ప్రతిపక్షారంభంలోనూ పదహారవదినంలో జరుగుతాయి. ఈ విధంగా చంద్రుడి వృద్ధి సూర్యుడివల్ల జరుగుతుంది.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే సోమవర్ణనం నామ షట్ పంచాశత్తమోఽధ్యాయః ॥ 56 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని సోమవర్ణనమనే ఏభై ఆరవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## సప్తపంచాశత్తమోఽధ్యాయః - ఏబై ఏడవ అధ్యాయం

## జ్యోతిశ్చక్రగ్రహచారకథనమ్ - జ్యోతిశ్చక్రగ్రహచారకథనం

**సూత ఉవాచ** - సూతఋషి పలికాడు.

> **అష్టభిశ్చ హయైర్యుక్తః సోమపుత్రస్య వై రథః ।**
> **వారితేజోమయశ్చాథ పిశంగైశ్చైవ శోభనైః ॥1॥**

> **దశభిశ్చాకృశైరశ్వైర్నానావర్ణో రథః స్మృతః ।**
> **శుక్రస్య క్ష్మామయైర్యుక్తో దైత్యాచార్యస్య ధీమతః ॥2॥**

> **అష్టాశ్వశ్చాథ భౌమస్య రథో హేమః సుశోభనః ।**
> **జీవస్య హైమశ్చాష్టాశ్వో మందస్యాయసనిర్మితః ॥3॥**

> **రథ ఆపోమయైరశ్వైర్దశభిస్తు సితేతరైః ।**
> **స్వర్భానోర్భాస్కరారేశ్చ తథా చాష్టహయః స్మృతః ॥4॥**

ఓ ఋషులారా! చంద్రుడిపుత్రుడైన బుధుడిరథం జలాగ్నిస్వభావం గలది. కపిలవర్ణంగల అందమైన ఎనిమిదిగుఱ్ఱాలతో కూడియున్నది. ధీశాలి అయిన దైత్యగురువు శుక్రుడియొక్క రథం బలమైన పలువర్ణాలతోకూడిన పదిగుఱ్ఱాలతో కూడి యున్నది. ఆ గుఱ్ఱాలు భూస్వరూపాలు గలవి. అంగారకుడి రథం మిక్కిలి అందంగా బంగారంతో నిర్మింపబడినదై ఎనిమిది గుఱ్ఱాలు గలియుంటుంది. బృహస్పతిరథంకూడా బంగారంతో నిర్మింపబడినదే. ఎనిమిది గుఱ్ఱాలుగలదే. శనీశ్వరుడి రథం ఇనుముచే తయారుచేయబడి, నల్లని పది అశ్వాలు గలిగి ఉంటుంది. అవి నీటిస్వభావంగలవి. సూర్యుడికి శత్రువులైన రాహుకేతువుల రథాలు ఎనిమిది గుఱ్ఱాలు పూన్చినవిగా ఉంటాయి.

> **సర్వే ధ్రువనిబద్ధా వై గ్రహాస్తే వాతరశ్మిభిః ।**
> **ఏతేన భ్రామ్యమాణాశ్చ యథాయోగం వ్రజంతి వై ॥5॥**

> **యావంత్యశ్చైవ తారాశ్చ తావంతశ్చైవ రశ్మయః ।**
> **సర్వే ధ్రువనిబద్ధాశ్చ భ్రమంతో భ్రామయంతి తమ్ ॥6॥**

> **అలాతచక్రవద్యాంతి వాతచక్రేరితాని తు ।**
> **యస్మాద్వహతి జ్యోతీంషి ప్రవహస్తేన స స్మృతః ॥7॥**

ఈ గ్రహాలన్నీ వాయురూపంలోగల ధ్రువుడి కిరణాలతో బంధింపబడి ఉంటాయి. యథాక్రమంగా ధ్రువుడిచే నియమింపబడుతూ తిరుగుతుంటాయి. ఎన్ని తారాగణాలు ఉంటాయో అన్ని వాతరశ్ములుంటాయి. అవి అన్నీ ధ్రువుడితో కలపబడి తాము తిరుగుతూ ధ్రువుణ్ణి త్రిప్పుతాయి. వాతచక్రంవల్ల ప్రేరేపింపబడే తారాగణం, గ్రహగణాలు

అంగారకచక్రంతో సమానంగా పరిభ్రమిస్తున్నాయి. ఇవి అన్నీ వాయువుచేత చలింపజేయబడేవిగాన వాటిని 'ప్రవహ'ములని పిలుస్తారు.

**నక్షత్రసూర్యాశ్చ తథా గ్రహతారాగణైః సహ ।**
**ఉన్ముఖాభిముఖాః సర్వే చక్రభూతాః శ్రితా దివి ॥8॥**

**ధ్రువేణాధిష్ఠితాశ్చైవ ధ్రువమేవ ప్రదక్షిణమ్ ।**
**ప్రయాంతి చేశ్వరం ద్రష్టుం మేఢీభూతం ధ్రువం దివి ॥9॥**

గ్రహాలు, తారాగణాలతోపాటు నక్షత్రాలు, సూర్యుడు అన్నీ ఆకాశంలో చక్రాకారంలో పైకి, ప్రక్కకు చలిస్తూ ఉంటాయి. ధ్రువుడిచే నియంత్రించబడినవి అన్నీ ధ్రువుడికి ప్రదక్షిణం చేస్తున్నాయి. అవి అన్నీ ధ్రువరూపుడైన ఈశ్వరుణ్ణి చూడడానికై ఆకాశంలో భ్రమిస్తున్నాయి.

**నవయోజనసాహస్రో విష్కంభః సవితుః స్మృతః ।**
**త్రిగుణస్తస్య విస్తారో మండలస్య ప్రమాణతః ॥10॥**

**ద్విగుణః సూర్యవిస్తారాద్విస్తారః శశినః స్మృతః ।**
**తుల్యస్తయోస్తు స్వర్భానుర్భూత్వాధస్తాత్ప్రసర్పతి ॥11॥**

**ఉద్ధృత్య పృథివీఛాయాం నిర్మితాం మండలాకృతిమ్ ।**
**స్వర్భానోస్తు బృహత్స్థానం తృతీయం యత్తమోమయమ్ ॥12॥**

సూర్యగోళవ్యాసం తొమ్మిదివేల యోజనాలు. దీనికి మూడురెట్లుగా దానిమండలం విస్తరించి ఉంటుంది. చంద్రమండలం విస్తారం సూర్యమండలం విస్తారానికి రెండు రెట్లుంటుంది. ఈ రెంటికి సమానదూరంలో రాహువు క్రిందిగా చలిస్తూంటుంది. పృథివియొక్క ఛాయ మండలాకృతిగ ఏర్పడడంచేత రాహువుకు పైన సంపూర్ణంగా అంధకారం వ్యాపించి ఉంటుంది. అది మూడో ఉన్నతస్థానంగా ఉంది.

**చంద్రస్య షోడశో భాగో భార్గవస్య విధీయతే ।**
**విష్కంభాన్మండలాచ్చైవ యోజనాచ్చ ప్రమాణతః ॥13॥**

**భార్గవాత్పాదహీనస్తు విజ్ఞేయో వై బృహస్పతిః ।**
**పాదహీనౌ వక్రసౌరీ తథాయామప్రమాణతః ॥14॥**

**విస్తారాన్మండలాచ్చైవ పాదహీనస్తయోర్బుధః ।**
**తారానక్షత్రరూపాణి వపుష్మంతీహ యాని వై ॥15॥**

**బుధేన తాని తుల్యాని విస్తారాన్మండలాదపి ।**
**ప్రాయశశ్చంద్రయోగీని విద్యాదృక్షాణి తత్త్వవిత్ ॥16॥**

యోజనప్రమాణాలలో చంద్రుడియొక్క పదహారవభాగం శుక్రుడియొక్క విస్తరణం, మండలం ఉంటాయి. బృహస్పతి శుక్రుడికి నాల్గింట ఒకవంతు తక్కువగా ఉంటాడు. అనగా మూడు వంతులు ఉంటాడు. బృహస్పతికి ఒకవంతు తక్కువగా రాహువు, శనిగ్రహాలు ఉంటాయి. అంటే మూడు వంతులుంటారు. బుధుడు విస్తారంలోనూ మండలంలోనూ వారిద్దరికంటె ఒకవంతు తక్కువగా అనగా మూడువంతులుంటాడు. తారానక్షత్రరూపాలయిన అవి పిండాలవుతాయి. అవి విస్తారంలోనూ మండలంలోనూ బుధుడితో సమానమైనవి. తత్త్వవేత్తలు చంద్రుడితోకూడిన వాటిని 'ఋక్ష' అనే పేరుతో తెలియవలసి ఉంది.

**తారానక్షత్రరూపాణి హీనాని తు పరస్పరమ్ ।**
**శతాని పంచ చత్వారి త్రీణి ద్వే చైవ యోజనే ॥17॥**

**సర్వోపరి నికృష్టాని తారకామండలాని తు ।**
**యోజనద్వయమాత్రాణి తేభ్యో హ్రస్వం న విద్యతే ॥18॥**

**ఉపరిష్టాత్త్రయస్తేషాం గ్రహా యే దూరసర్పిణః ।**
**సౌరోఽంగిరాశ్చ వక్రశ్చ జ్ఞేయా మందవిచారిణః ॥19॥**

**తేభ్యోఽధస్తాత్తు చత్వారః పునరన్యే మహాగ్రహాః ।**
**సూర్యః సోమో బుధశ్చైవ భార్గవశ్చైవ శీఘ్రగాః ॥20॥**

చిన్న చిన్నవి అయిన తారానక్షత్రాలు పరస్పరం అయిదు, నాలుగు, మూడు, రెండు యోజనాల దూరంలో ఉన్నాయి. వీటి అన్నింటి పైభాగంలో మిక్కిలి చిన్నదైన తారామండలం ఉంది. అది కేవలం రెండుయోజనాల విస్తారం కలిగి ఉంది. అందులో చిన్నవైన తారలు లేవు. వీటికి పైభాగంలో ఉన్న శని, బృహస్పతి, అంగారకం అనే మూడుగ్రహాలు అధికదూరం ప్రయాణించేవి. ఇవి మందగమనం గలవి. వాటికి క్రిందిభాగంలో నాలుగు పెద్దగ్రహాలున్నాయి. అవి సూర్యుడు, చంద్రుడు, బుధుడు అట్లే శుక్రుడు అనే గ్రహాలు. అవి వేగంగా చలించేవి.

**తావంత్యస్తారకాః కోట్యో యావంత్యృక్షాణి సర్వశః ।**
**ధ్రువాత్తు నియమాచ్చైషామృక్షమార్గే వ్యవస్థితిః ॥21॥**

**సప్తాశ్వస్యైవ సూర్యస్య నీచోచ్చత్వమనుక్రమాత్ ।**
**ఉత్తరాయణమార్గస్థో యదా పర్వసు చంద్రమాః ॥22॥**

**ఉచ్చత్వాద్ దృశ్యతే శీఘ్రం నాతివ్యక్తైర్గభస్తిభిః ।**
**తదా దక్షిణమార్గస్థో నీచాం వీథీముపాశ్రితః ॥23॥**

**భూమిరేఖావృతః సూర్యః పౌర్ణిమావాస్యయోస్తదా ।**
**దదృశే చ యథాకాలం శీఘ్రమస్తముపైతి చ ॥24॥**

**తస్మాదుత్తరమార్గస్థో హ్యమావాస్యాం నిశాకరః ।**
**దదృశే దక్షిణే మార్గే నియమాత్ దృశ్యతే న చ ॥25॥**

**జ్యోతిషాం గతియోగేన సూర్యస్య తమసావృతః ।**

తారాగణాలు ఎన్నికోట్లు ఉన్నవో అన్ని ఋక్షాలు అనగా నక్షత్రాలు ఉన్నాయి. వాటియొక్క స్థితి నక్షత్రమార్గంలో ధ్రువనియంత్రణవల్ల ఏర్పడింది. ఏడుగుఱ్ఱాలుగల సూర్యుడినుంచి క్రమానుసారంగా ఉచ్చనీచస్థితుల్ని పొందుతాయి. ఎప్పుడు సూర్యుడు ఉత్తరాయణమార్గంలో ఉంటాడో, చంద్రుడు అప్పుడు పూర్ణమండలంతో ఉంటాడో. అప్పుడు సూర్యుడు కొద్దిగా అస్పష్టకిరణాలతో ఉంటాడు. అందుకు కారణం ఆతడు పైభాగంలో ఉండడమే. వేగంలో కూడా శీఘ్రత ఉండడమే. సూర్యుడు దక్షిణాయణమార్గస్థుడు కాగానే క్రిందిమార్గాన్ని పొందుతాడు. పృథివీరేఖద్వారా ఆవృతుడైన సూర్యుడు దాని క్రిందకు వస్తాడు. పౌర్ణమి అమావాస్యదినాలలో సామాన్యకాలాలలో కన్పిస్తాడు. ఆతడు త్వరగా అస్తమించడమే ఇందుకు కారణం. అందుచే నవచంద్రుడి తిథి(అమావాస్య) ఉత్తరమార్గంలో జరుగుతుంది. ఇది దక్షిణమార్గంలో కన్పించదు. నక్షత్రాల గతియోగకారణంగా చంద్రుడు సూర్యుడియొక్క అంధకారంచేత ఆవృతుడవుతాడు.

**సమానకాలాస్తమయౌ విషువత్సు సమోదయౌ ။26။**

**ఉత్తరాసు చ వీథీషు వ్యంతరాస్తమయోదయౌ ।**
**పౌర్ణిమావాస్యయోర్జ్ఞేయౌ జ్యోతిశ్చక్రానువర్తినౌ ။27။**

**దక్షిణాయనమార్గస్థో యదా చరతి రశ్మివాన్ ।**
**గ్రహాణాం చైవ సర్వేషాం సూర్యోఽధస్తాత్ప్రసర్పతి ။28။**

**విస్తీర్ణం మండలం కృత్వా తస్యోర్ధ్వం చరతే శశీ ।**
**నక్షత్రమండలం కృత్స్నం సోమాదూర్ధ్వం ప్రసర్పతి ။29။**

**నక్షత్రేభ్యో బుధశ్చోర్ధ్వం బుధాదూర్ధ్వం తు భార్గవః ।**
**వక్రస్తు భార్గవాదూర్ధ్వం వక్రాదూర్ధ్వం బృహస్పతిః ။30။**

**తస్మాచ్ఛనైశ్చరశ్చోర్ధ్వం తస్మాత్సప్తర్షిమండలమ్ ।**
**ఋషీణాం చైవ సప్తానాం ధ్రువస్యోర్ధ్వం వ్యవస్థితిః ။31။**

**తం విష్ణులోకం పరమం జ్ఞాత్వా ముచ్యేత కిల్బిషాత్ ।**

సూర్యచంద్రులిరువురూ విషువత్స్థానాలలో ఉన్నప్పుడు ఆ కాలంలో అస్తమించడం ఉదయించడం సమంగా జరుగుతుంది. ఉత్తరాయణంలో పౌర్ణమి అమావాస్యల తిథులలో సూర్యచంద్రులు జ్యోతిచక్రాన్ని అనుసరిస్తారు. వీరి ఉదయాస్తమయాలు సమానంగా ఉండవు. ఎప్పుడు సూర్యుడు దక్షిణాయనమార్గంలో ఉండి చలిస్తాడో అప్పుడాతడు అన్ని గ్రహాలకంటె క్రిందగా ఉంటాడు. ఈ సమయంలో చంద్రుడు తనమండలాన్ని విస్తృతపర్చుకుని సూర్యుడిపైన తిరుగుతాడు. అట్లే సంపూర్ణనక్షత్రమండలమంతా చంద్రుడిపైభాగంలో భ్రమణం చెందుతుంటుంది. నక్షత్రాలకుపైన బుధుడు, బుధుడిపైన శుక్రుడు, శుక్రుడిపైన అంగారకుడు, అంగారకుడిపైన బృహస్పతి, బృహస్పతిపైన శని, శనిపైన సప్తర్షిమండలం ఉన్నది. సప్తర్షిమండలంపైన ధ్రువుడు ఉంటాడు. దానికిపైన విష్ణులోకం ఉంది. దాన్ని తెలిసి, అనగా పొంది మానవుడు పాపవిముక్తుడవుతాడు.

**ద్విగుణేషు సహస్రేషు యోజనానాం శతేషు చ ॥32॥**

**గ్రహనక్షత్ర తారాసు ఉపరిష్టాద్యథాక్రమమ్ ।**
**గ్రహాశ్చ చంద్రసూర్యౌ చ యుతౌ దివ్యేన తేజసా ॥33॥**

**నిత్యమృక్షేషు యుజ్యంతే గచ్ఛంతోఽహర్నిశం క్రమాత్ ।**
**గ్రహనక్షత్రసూర్యాస్తే నీచోచ్చఋజుసంస్థితాః ॥34॥**

**సమాగమే చ భేదే చ పశ్యంతి యుగపత్ప్రజాః ।**
**ఋతవః షట్ స్మృతాః సర్వే సమాగచ్ఛంతి పంచధా ॥35॥**

**పరస్పరాస్థితా హ్యేతే యుజ్యంతే చ పరస్పరమ్ ।**
**అసంగరేణ విజ్ఞేయస్తేషాం యోగస్తు వై బుధైః ॥36॥**

రెండులక్షలయోజనాలదూరంలో గ్రహనక్షత్రతారలపైభాగంలో దివ్యతేజస్సుతో కూడిన సూర్యచంద్రులు మరియు కొన్ని గ్రహాలు క్రమపద్ధతిననుసరించి రాత్రింబవళ్లు పరిభ్రమిస్తాయి. వాళ్లు ప్రతిదినం నక్షత్రగణసంపర్కంలో వస్తారు. అందుచేత వాళ్లు ఒకప్పుడు క్రిందగా, ఒకప్పుడు పైగా అప్పుడప్పుడూ సమానరేఖపై ఉంటారు. సమాగమం అట్లే భేదం అనే రెండు స్థితులందు వాళ్లు ఒకేసారి ప్రజల్ని చూస్తారు. ఆరు ఋతువులు ఏర్పడతాయి. అవి అన్నీ ఐదురకాలుగానే కలుస్తాయి. అవి ఒకటి మరొకదాన్ని ఆశ్రయించడంచేత అవి పరస్పరం కలిసి ఉంటాయి. ఈ కలయిక అనగా ఒకదానిపై మరొకటి మిశ్రితం కాకుండా కూడా ఉంటాయి. దీన్ని విద్వాంసులు బాగా తెలియాలి.

**ఏవం సంక్షిప్య కథితం గ్రహాణాం గమనం ద్విజాః ।**
**భాస్కరప్రముఖానాం చ యథాదృష్టం యథాశ్రుతమ్ ॥37॥**

**గ్రహాధిపత్యే భగవాన్ బ్రహ్మణా పద్మయోనినా ।**
**అభిషిక్తః సహస్రాంశూ రుద్రేణ తు యథా గుహః ॥38॥**

**తస్మాద్ గ్రహార్చనా కార్యా అగ్నౌ చోద్యం యథావిధి ।**
**ఆదిత్యగ్రహపీడాయాం సద్భిః కార్యార్థసిద్ధయే ॥39॥**

ఓ ద్విజులారా! ఈ విధంగా నేను మీకు ఏవిధంగా చూచానో ఏవిధంగా విన్నానో అదే విధంగా సూర్యుడు మొదలైన గ్రహగతుల్ని సంగ్రహంగా వర్ణించాను. పద్మభవుడు బ్రహ్మదేవుడు సహస్రకిరణుడైన సూర్యుణ్ణి గ్రహాధిపతిగా అభిషేకించాడు– రుద్రుడు కుమారస్వామిని అభిషేకించినట్లు. అందుచేత సజ్జనులు సూర్యాదిగ్రహపీడ తొలగడానికై శాస్త్రానుసారంగా అగ్నిద్వారా ఆయాగ్రహాల్ని పూజించాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే జ్యోతిశ్చక్రే గ్రహచారకథనం నామ సప్తపంచాశత్తమోఽధ్యాయః ॥ 57 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని జ్యోతిచక్రంలోని గ్రహచారకథనమనే ఏబై ఏడవ అధ్యాయం సమాప్తం.

:

## అష్టపంచాశత్తమోఽధ్యాయః – ఏబై ఎనిమిదవ అధ్యాయం

## సూర్యాద్యభిషేకకథనమ్ – సూర్యాద్యభిషేకకథనం

**ఋషయః ఊచుః** – ఋషులు పలికారు.

**అభ్యషించత్కథం బ్రహ్మా చాధిపత్యే ప్రజాపతిః ।**
**దేవదైత్యముఖాన్ సర్వాన్ సర్వాత్మా వద సాంప్రతమ్ ॥1॥**

ఓ సూతమహర్షీ! సర్వాత్ముడు, ప్రజాపతి అయిన బ్రహ్మదేవుడు ప్రముఖదేవదానవుల్ని ఏవిధంగా అధిపతులుగా అభిషిక్తుల్ని చేశాడో ప్రస్తుతం మాకు చెప్పండి!

**సూత ఉవాచ** – సూతర్షి పలికాడు.

**గ్రహాధిపత్యే భగవానభిషించద్దివాకరమ్ ।**
**ఋక్షాణామోషధీనాం చ సోమం బ్రహ్మా ప్రజాపతిః ॥2॥**

ఓ మునులారా! భగవానుడు, ప్రజాపతియు అయిన బ్రహ్మదేవుడు గ్రహాలకు అధిపతిగా సూర్యుణ్ణి, నక్షత్రాలకు ఓషధులకు అధిపతిగా చంద్రుణ్ణి అభిషేకించాడు.

**అపాం చ వరుణం దేవం ధనానాం యక్షపుంగవమ్ ।**
**ఆదిత్యానాం తథా విష్ణుం వసూనాం పావకం తథా ॥3॥**

**ప్రజాపతీనాం దక్షం చ మరుతాం శక్రమేవ చ ।**
**దైత్యానాం దానవానాం చ ప్రహ్లాదం దైత్యపుంగవమ్ ॥4॥**

**ధర్మం పితౄణామధిపం నిరృతిం పిశితాశినామ్ ।**
**రుద్రం పశూనాం భూతానాం నందినాం గణనాయకమ్ ॥5॥**

**వీరాణాం వీరభద్రం చ పిశాచానాం భయంకరమ్ ।**
**మాతౄణాం చైవ చాముండాం సర్వదేవనమస్కృతాం ॥6॥**

**రుద్రాణాం దేవదేవేశం నీలలోహితమీశ్వరమ్ ।**
**విఘ్నానాం వ్యోమజం దేవం గజాస్యం తు వినాయకమ్ ॥7॥**

**స్త్రీణాం దేవీముమాదేవీం వచసాం చ సరస్వతీమ్ ।**
**విష్ణుం మాయావినాం చైవ స్వాత్మానం జగతాం తథా ॥8॥**
**హిమవంతం గిరీణాం తు నదీనాం చైవ జాహ్నవీమ్ ।**
**సముద్రాణాం చ సర్వేషామధిపం పయసాం నిధిమ్ ॥9॥**

**వృక్షాణాం చైవ చాశ్వత్థం ప్లక్షం చ ప్రపితామహః ॥10॥**

**గంధర్వవిద్యాధరకిన్నరాణామీశం పునశ్చిత్రరథం చకార ।**
**నాగాధిపం వాసుకిముగ్రవీర్యం సర్పాధిపం తక్షకముగ్రవీర్యం ॥11॥**

పితామహుడు బ్రహ్మదేవుడు వరుణదేవుణ్ణి జలానికి, యక్షశ్రేష్ఠుడైన కుబేరుణ్ణి ధనాలకు, విష్ణువును ఆదిత్యులకు, వసువులకు అగ్నిని, ప్రజాపతులకు దక్షుణ్ణి, ఇంద్రుణ్ణి వాయువులకు, దైత్యశ్రేష్ఠుడు ప్రహ్లాదుణ్ణి దైత్యులకు మరియు దానవులకు, పితృగణాలకు యమధర్మరాజును, నిర్బతిని మాంసభక్షకులైన రాక్షసులకు, రుద్రుణ్ణి పశుగణాలకు, గణనాయకుడు నందీశ్వరుణ్ణి భూతగణాలకు, భయంకరుడైన వీరభద్రుణ్ణి వీరపిశాచగణాలకు, సమస్తదేవతలచేత నమస్కరింపబడే చాముండిక మాతృగణాలకు, వ్యోమోద్భవుడు, గజముఖుడు అయిన వినాయకుడు విఘ్నాలకు, ఉమాదేవి స్త్రీలకు, సరస్వతీదేవి వాక్కులకు, మహావిష్ణువు మాయావులకు, మరియు సాక్షాత్తు సమస్త జగత్తుకు, హిమాలయుణ్ణి పర్వతాలకు, గంగను నదులకు, నీరనిధిని అనగా మహాసాగరాన్ని అన్ని సముద్రాలకు, అశ్వత్థాన్ని సమస్తవృక్షాలకు, చిత్రరథుణ్ణి గంధర్వులకు, విద్యాధరులకు, కిన్నరులకు, నాగులకు ఉగ్రమైన తేజస్సుగల వాసుకిని, సర్పాలకు ఉగ్రతేజస్సుడైన తక్షకుణ్ణి అధిపతులుగా చేశాడు.

**దిగ్వారణానామధిపం చకార గజేంద్రమైరావతముగ్రవీర్యమ్ ।**
**సుపర్ణమీశం పతతామథాశ్వ రాజానముచ్చైఃశ్రవసం చకార ॥12॥**

భయంకరపరాక్రమంగల ఐరావతం అనే గజశ్రేష్ఠాన్ని దిగ్గజాలకు అధిపుణ్ణి చేశాడు. పక్షులకు స్వామిగా గరుత్మంతుణ్ణి, అశ్వాలకు రాజుగా ఉచ్చైఃశ్రవాన్ని చేశాడు.

**సింహం మృగాణాం వృషభం గవాంచ మృగాధిపానాం శరభం చకార ।**
**సేనాధిపానాం గుహమప్రమేయం శ్రుతిస్మృతీనాం లకులీశమీశమ్ ॥13॥**

మృగాలకు సింహాన్ని, గోవులకు వృషభాన్ని (ఎద్దును) సింహాలకు శరభాన్ని, సేనాధిపతులకు సాటిలేని మేటి అయిన గుహుణ్ణి (కుమారస్వామి), లకులీశుణ్ణి శ్రుతిస్మృతులకు ప్రభువులుగా నియమించాడు.

**అభ్యషించత్సుధర్మాణం తథా శంఖపదం దిశామ్ ।**
**కేతుమంతం క్రమైణెవ హేమరోమాణమేవ చ ॥14॥**

**పృథివ్యాం పృథుమీశానం సర్వేషాం తు మహేశ్వరమ్ ।**
**చతుర్మూర్తిషు సర్వజ్ఞం శంకరం వృషభధ్వజమ్ ॥15॥**

సుధర్ముణ్ణి, శంకపదుణ్ణి, కేతుమంతుణ్ణి, హేమరోముణ్ణి క్రమంగా దిక్కులకు అధిపతులుగా అభిషేకించాడు. పృథుణ్ణి పృథివికి ప్రభువుగా, మహేశ్వరుణ్ణి సమస్తానికి అధిపతిగా, వృషభధ్వజుడగు శంకరుణ్ణి నాలుగుమూర్తులకు (విశ్వ, ప్రాజ్ఞ, తైజస, తురీయాలు నాలుగుమూర్తులు) స్వామిగా చేశాడు.

**ప్రసాదాద్భగవాన్ శంభోభ్యషించద్యథాక్రమమ్ ।**
**పురాభిషిచ్య పుణ్యాత్మా రరాజ భువనేశ్వరః ॥16॥**

ఈ విధంగా భగవంతుడు బ్రహ్మదేవుడు శంకరుడి కృపచేత పూర్వకాలంలో వీళ్లందర్ని క్రమంగా అభిషేకించాడు. వీళ్లను అభిషేకించి లోకేశ్వరుడు, పుణ్యాత్ముడూ అయిన బ్రహ్మ మిక్కిలి సంతుష్టుడయ్యాడు.

**ఏతద్వో విస్తరేణైవ కథితం మునిపుంగవాః ।**
**అభిషిక్తాస్తతస్త్వేతే విశిష్టా విశ్వయోనినా ॥17॥**

ఓ మునిశ్రేష్ఠులారా! నేను మీకు ఈవిషయాలు విపులంగా చెప్పాను. విశ్వాన్ని సృష్టించే బ్రహ్మ ఈవిధంగా విశిష్టగుణాలంకారులైన వీళ్లందర్ని అభిషేకించాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే సూర్యాద్యభిషేకకథనం నామాష్టపంచాశత్తమోஉధ్యాయః ॥ 58 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని సూర్యాద్యభిషేకకథనమనే ఏభై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## ఏకోన షష్టితమో௨ధ్యాయః – ఏభై తొమ్మిదవ అధ్యాయం

## సూర్యరశ్మిస్వరూపకథనమ్ – సూర్యరశ్మిస్వరూపకథనం

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఏతచ్ఛ్రుత్వా తు మునయః పునస్తం సంశయాన్వితాః ।**
**పప్రచ్ఛురుత్తరం భూయస్తదా తే రోమహర్షణమ్ ॥1॥**

ఇది అంతా విన్న మునులు అనుమానం గలిగి రోమహర్షణుడైన సూతుణ్ణి ప్రశ్నించారు. అందుకు సూతుడు సమాధానం చెప్పాడు.

**ఋషయః ఊచుః** – మునులు పలికారు.

**యదేతదుక్తం భవతా సూతేహ వదతాం వర ।**
**ఏతద్విస్తరతో బ్రూహి జ్యోతిషాం చ వినిర్ణయమ్ ॥2॥**

ఓ వక్తృశ్రేష్ఠా! సూతమహర్షీ! మీరు చెప్పిన దానిని అనగా గ్రహాలవినిర్ణయాన్ని విపులంగా చెప్పండి!

**శ్రుత్వా తు వచనం తేషాం తదా సూతః సమాహితః ।**
**ఉవాచ పరమం వాక్యం తేషాం సంశయనిర్ణయే ॥3॥**

ఆ మునుల మాటను విని అప్పుడు సూతర్షి వాళ్ల సందేహాన్ని నివృత్తిచేయడానికై ఏకాగ్రచిత్తుడై ఉన్నతవాక్యాన్ని పలికాడు.

**అస్మిన్నర్థే మహాప్రాజ్ఞైర్యదుక్తం శాంతబుద్ధిభిః ।**
**ఏతద్వో௨హం ప్రవక్ష్యామి సూర్యచంద్రమసోర్గతిమ్ ॥4॥**

**యథా దేవగృహాణీహ సూర్యచంద్రాదయో గ్రహాః ।**
**అతః పరం తు త్రివిధమగ్నేర్వక్ష్యే సముద్భవమ్ ॥5॥**

**దివ్యస్య భౌతికస్యాగ్నే రథో௨గ్నేః పార్థివస్య చ ।**

ఈ విషయంలో ఇంతకుముందు మహాబుద్ధిమంతులు, ప్రశాంతచిత్తులు అయిన మహాత్ములు ఏమి చెప్పారో దానినే మీకు నేను వివరిస్తాను. సూర్యచంద్రుల గతివివరాల్ని, సూర్యచంద్రాదులైన గ్రహాలు ఎట్లు దేవనివాసాలు అయ్యాయో తెలియజేస్తాను. అంతేకాక దివ్యాగ్ని, భౌతికాగ్ని, పార్థివాగ్నులనే మూడు విధాలైన అగ్నులు మరియు వాటి ఉత్పత్తి చెప్పుతాను. వాటిని గూర్చి వివరిస్తాను.

**వ్యుష్టాయాం తు రజన్యాం చ బ్రహ్మణో௨వ్యక్తజన్మనః ॥6॥**

**అవ్యాకృతమిదం త్వాసీన్నైశేన తమసా వృతమ్ ।**
**చతుర్భాగావశిష్టేఽస్మిన్ లోకే నష్టే విశేషతః ॥7॥**

**స్వయంభూర్భగవాంస్తత్ర లోకసర్వార్థసాధకః ।**
**ఖద్యోతవత్స వ్యచరదావిర్భావచికీర్షయా ॥8॥**

అవ్యక్తంనుంచి పుట్టిన బ్రహ్మదేవుడుకి రాత్రి గడచిన తర్వాత ఈ దృశ్యజగత్తు అంతయు అస్పష్టమైందిగా ఘోరమైన అంధకారంచేత కప్పబడినదిగా ఉంది. ఈలోకం విశేషంగా నష్టపడి మూడువంతులు పోయి నాల్గోవంతు మిగిలింది కాగా సర్వలోక సర్వకార్యభారనిర్వాహకుడైన అజుడు తనను తాను వ్యక్తపర్చుకొనే ఇచ్ఛచేత మిణుగురు పురుగువలె పరిభ్రమించాడు.

**సోఽగ్నిం సృష్ట్వాథ లోకాదౌ పృథివీజలసంశ్రితః ।**
**సంహృత్య తత్ప్రకాశార్థం త్రిధా వ్యభజదీశ్వరః ॥9॥**

**పవనో యస్తు లోకేఽస్మిన్ పార్థివో వహ్నిరుచ్యతే ।**
**యశ్చాసౌ తపతే సూర్యే శుచిరగ్నిస్తు స స్మృతః ॥10॥**

**వైద్యుతోఽబ్జస్తు విజ్ఞేయస్తేషాం వక్ష్యే తు లక్షణమ్ ।**
**వైద్యుతో జాఠరః సౌరో వారిగర్భాస్త్రయోఽగ్నయః ॥11॥**

తర్వాత భూమి జలమూ సమ్మిశ్రంకాగా జగదీశ్వరుడు ఆదికాలంలో అగ్నిని సృష్టించి పృథివి, మీదగల జలాన్ని సంహరించి దాని ప్రకాశంకోసం అగ్నిని మూడువిధాలుగా విభజించాడు. ఈ లోకంలో వాయువు ఉంది. దానినుంచి పుట్టే అగ్నిని పార్థివాగ్ని అంటారు. సూర్యుడిలో తపింపబడే అగ్నిని శుచి అగ్ని అంటారు. మెరుపునుంచి కలిగే అగ్ని అబ్జాగ్ని. ఈ విధంగా జలగర్భంనుంచి పుట్టిన అగ్నులు మూడు. అవి వైద్యుత, జాఠర, సౌరాలు అనేవి. నేను వాటి లక్షణాల్ని చెప్పుతాను.

**తస్మాదపః పిబన్ సూర్యో గోభిర్దీప్యత్యసౌ విభుః ।**
**జలే చాబ్జః సమావిష్టో నాద్భిరగ్నిః ప్రశామ్యతి ॥12॥**

**మానవానాం చ కుక్షిస్థో నాద్భిః శామ్యతి పావకః ।**
**అర్చిష్మాన్ పవనః సోఽగ్నిర్నిష్ప్రభో జాఠరః స్మృతః ॥13॥**

**యశ్చాయం మండలీ శుక్లీ నిరూష్మా సంప్రజాయతే ।**
**ప్రభా సౌరీ తు పాదేన హ్యస్తం యాతే దివాకరే ॥14॥**

**అగ్నిమావిశతే రాత్రౌ తస్మాద్దూరాత్ప్రకాశతే ।**
**ఉద్యంతం చ పునః సూర్యమౌష్ణ్యమగ్నేః సమావిశేత్ ॥15॥**

**పాదేన పార్థివస్యాగ్నేస్తస్మాదగ్నిస్తపత్యసౌ ।**

సూర్యభగవానుడు తనకిరణాలతో నీటిని త్రాగి ప్రకాశిస్తాడు. జలంనుంచి పుట్టిన అగ్ని జలంచేత తడపబడ్డా ఆరిపోదు. మానవులయొక్క కడుపులో గల అగ్ని జలంతో శాంతించదు. ఈ పవనం అగ్నిజ్వాలతో కూడి ఉన్నప్పటికి కాంతిరహితంగా ఉంటుంది. దీన్నే జఠరాగ్ని అంటారు. సూర్యుడు ప్రకాశిస్తున్నప్పుడు ఆయననుంచి వెలువడిన కాంతి మండలరూపంలో గోళాకారంలో ఉంటుంది. తెల్లగా ఉన్న దానిలో ఉష్ణం ఉండదు. సూర్యుడు అస్తమించినా ఆతడి సంపూర్ణకాంతిలో ఒకపాలు ఉంటుంది. ఆ కాంతి రాత్రిలో అగ్నిలో ప్రవేశిస్తుంది. ఈ కారణంగా అగ్ని దూరంనుంచి కూడా ప్రకాశిస్తుంది. సూర్యుడు ఉదయించిన తర్వాత ఆ పార్థివాగ్నిలో గల వేడి ఒకపాదం సూర్యుడిలో ప్రవేశిస్తుంది. అందుచేతనే అగ్ని ప్రకాశిస్తూనే ఉంటుంది.

**ప్రకాశోష్ణస్వరూపే చ సౌరాగ్నేయే తు తేజసీ ॥16॥**

**పరస్పరానుప్రవేశాదాప్యాయేతే పరస్పరమ్ ।**
**ఉత్తరే చైవ భూమ్యర్ధే తథా హ్యగ్నిశ్చ దక్షిణే ॥17॥**

**ఉత్తిష్ఠతి పునః సూర్యః పునర్వై ప్రవిశత్యపః ।**
**తస్మాత్తామ్రా భవంత్యాపో దివారాత్రిప్రవేశనాత్ ॥18॥**

**అస్తంయాతి పునః సూర్యో అహర్వై ప్రవిశత్యపః ।**
**తస్మాన్నక్తం పునః శుక్లా ఆపో దృశ్యంతి భాస్వరాః ॥19॥**

**ఏతేన క్రమయోగేన భూమ్యర్ధే దక్షిణోత్తరే ।**
**ఉదయాస్తమనే నిత్యమహోరాత్రం విశత్యపః ॥20॥**

సూర్యుడు అట్లే అగ్నియొక్క తేజ: ప్రకాశాలు ఉష్ణంయొక్క గుణస్వరూపాలుగా ఉంటాయి. ఈ రెండింటిలో ఉష్ణం పరస్పరం ప్రవేశిస్తూ ఉంటుంది. అంతేకాక తమలో తాము ఒకదానినొకటి ప్రకాశింపజేసుకుంటాయి. భూమి ఉత్తరార్ధంలోనూ దక్షిణార్ధంలోనూ సూర్యుడు ఉదయిస్తాడు. సూర్యుడు జలం నుంచి పైకి లేచి తిరిగి జలంలో ప్రవేశిస్తాడు. ప్రతిదినం జలంనుంచి రావడంచేత ప్రతిరాత్రి జలం తామ్రవర్ణంలోకి మారుతున్నది. మరల సూర్యుడు జలంలోనికి మునిగినప్పుడు పగటి ప్రకాశం జలంలో ప్రవేశిస్తుంది. అందుచేత జలం రాత్రిలో తెల్లనిరంగులో ప్రకాశిస్తూ కన్పిస్తుంది. ఈ క్రమవిధానంలో జరిగే క్రియాకలాపంచేత సూర్యోదయ సూర్యాస్తమయాల మధ్యకాలంలో రాత్రింబవళ్లలో భూమియొక్క ఉత్తరార్ధభాగంలో (ఉత్తరాయణ దక్షిణాయనకాలాలు) సూర్యుడు జలంలో ప్రవేశిస్తాడు.

**యశ్చాసౌ తపతే సూర్యః పిబన్నంభో గభస్తిభిః ।**
**పార్థివాగ్నివిమిశ్రోఽసౌ దివ్యః శుచిరితి స్మృతః ॥21॥**

**సహస్రపాదసౌ వహ్నిర్వృత్తకుంభనిభః స్మృతః ।**
**ఆదత్తే స తు నాడీనాం సహస్రేణ సమంతతః ॥22॥**

**నాదేయాశ్చైవ సాముద్రీః కూపాశ్చైవ తథా ఘనాః ।**
**స్థావరా జంగమాశ్చైవ వాపీకుల్యాదికా అపః ॥23॥**

**తస్య రశ్మిసహస్రం తచ్ఛీతవర్షోష్ణనిఃస్రవమ్ ।**
**తాసాం చతుఃశతా నాడ్యో వర్షంతే చిత్రమూర్తయః ॥24॥**

**భజనాశ్చైవ మాల్యాశ్చ కేతనాః పతనాస్తథా ।**
**అమృతా నామతః సర్వా రశ్మయో వృష్టిసర్జనాః ॥25॥**

ఈ సూర్యుడు తనకిరణాలతో జలాన్ని త్రాగి తపిస్తున్నాడు. సూర్యుడు పృథ్వి మరియు అగ్నులతో కలిసి ఉన్నాడు. దీనినే దివ్యాగ్ని లేక శుచి అని చెప్తుతారు. వేయికిరణాలుగల ఈ అగ్ని కుంభగోళంతో సమానంగా ఉంటుంది. ఆ అగ్ని తన వేయికిరణాలద్వారా తనవైపుగల నదుల, సముద్రాల, బావుల మరియు చరాచరాలైన కాలువల, చెరువులనుంచి నీటిని స్వీకరిస్తున్నది. దాని సహస్రకిరణాలు శీత, వర్ష, ఉష్ణాల్ని ఇముడ్చుకున్నవి. ఆ కిరణాలు విచిత్రరూపాలుగ వర్షిస్తున్నాయి. అవి "భజన, మాల్య, కేతన, పతన" అనే పేర్లు గలవి. ఆ కిరణాలు అన్నీ 'అమృత' అనే పేరు గలిగి వర్షిస్తున్నాయి.

**హిమోద్వహాశ్చ తా నాడ్యో రశ్మయస్త్రిశతాః పునః ।**
**రేశా మేఘాశ్చ వాత్స్యాశ్చ హ్లాదిన్యో హిమసర్జనాః ॥26॥**

**చంద్రభా నామతః సర్వాః పీతాభాశ్చ గభస్తయః ।**
**శుక్లాశ్చ కకుభాశ్చైవ గావో విశ్వభృతస్తథా ॥27॥**

**శుక్లాస్తాః నామతః సర్వాస్త్రిశతీర్ఘర్మసర్జనాః ।**
**సోమో బిభర్తి తాభిస్తు మనుష్యపితృదేవతాః ॥28॥**

**మనుష్యానౌషధేనేహ స్వధయా చ పితౄనపి ।**
**అమృతేన సురాన్ సర్వాంస్తిసృభిస్తర్పయత్యసౌ ॥29॥**

మరల వాటిలో మూడువందలకిరణాలు హిమవాహిని కిరణాలుగా ఉన్నాయి. అవి రేశ, మేఘ, వాత్స్య, హ్లాదిని పేర్లుగలవి. చంద్రభ అనే పేరుగల ఇవి అన్నీ హిమాన్ని సృష్టిస్తున్నాయి. అవి పసుపుపచ్చని వర్ణం గలవి. శుక్ల, కకుభ్, గౌ, విశ్వభృత్ అనే ఈ కిరణాలు శుక్లమనే పేరుగలవి. ఈ మూడువందలకిరణాలు వేడిని కల్గిస్తాయి. చంద్రుడు ఈ మూడువిధాలకిరణాలతో మానవుల్ని, పితృదేవతల్ని, దేవతల్ని భరిస్తున్నాడు. అవి మానవుల్ని ఔషధాలతోను, పితృగణాల్ని 'స్వధ'తోను దేవతలందర్ని అమృతంతోను సంతృప్తుల్ని చేస్తున్నాయి.

**వసంతే చైవ గ్రీష్మే చ శతైః స తపతే త్రిభిః ।**
**వర్షాస్వథో శరది చ చతుర్భిః సంప్రవర్షతి ॥30॥**

**హేమంతే శిశిరే చైవ హిమముత్సృజతే త్రిభిః ।**
**ఇంద్రో ధాతా భగః పూషా మిత్రోఽథ వరుణోఽర్యమా ॥31॥**

**అంశుర్వివస్వాంస్త్వష్టా చ పర్జన్యో విష్ణురేవ చ ।**
**వరుణో మాఘమాసే తు సూర్య ఏవ తు ఫాల్గునే ॥32॥**

**చైత్రే మాసి భవేదంశుర్ధాతా వైశాఖతాపనః ।**
**జ్యేష్ఠే మాసి భవేదింద్ర ఆషాఢే చార్యమా రవిః ॥33॥**

**వివస్వాన్ శ్రావణే మాసి ప్రోష్ఠపాదే భగః స్మృతః ।**
**పర్జన్యోఽ శ్వయుజే మాసి త్వష్టా వై కార్తికే రవిః ॥34॥**

**మార్గశీర్షే భవేన్మిత్రః పౌషే విష్ణుః సనాతనః ।**

సూర్యుడు వసంతఋతువులోను, గ్రీష్మఋతువులోను మూడువందలకిరణాలతో తపిస్తాడు. వర్షర్తువులోను, శరదృతువులోనూ నాల్గువందలకిరణాలతో వర్షిస్తాడు. హేమంతఋతువులోను, శిశిరఋతువులోను మూడువందల కిరణాలతో మంచును కురిపిస్తాడు. ఇంద్రుడు, ధాత, భగుడు, పూషుడు, మిత్రుడు, వరుణుడు, అర్యముడు, అంశుడు, వివస్వంతుడు, త్వష్ట, పర్జన్యుడు, విష్ణువు అనే వీరు ద్వాదశాదిత్యులు. వరుణుడు మాఘమాసంలో సూర్యుడు. ఇట్లే పూషుడు ఫాల్గుణంలోను, అంశువు చైత్రమాసంలోను, ధాత వైశాఖంలోను, ఇంద్రుడు జ్యేష్ఠమాసంలోను, అర్యముడు ఆషాఢంలోనూ, వివస్వంతుడు శ్రావణంలోనూ, భగుడు భాద్రపదంలోను, పర్జన్యుడు ఆశ్వయుజంలోను, త్వష్ట కార్తీకంలోను, మిత్రుడు మార్గశిరంలోను సనాతనుడైన విష్ణువు పుష్యమాసంలోను సూర్యులు అవుతున్నారు.

**పంచరశ్మిసహస్రాణి వరుణస్యార్కకర్మణి ॥35॥**

**షడ్భిః సహస్రైః పూషా తు దేవోంశుః సప్తభిస్తథా ।**
**ధాతాష్టభిః సహస్రైస్తు నవభిస్తు శతక్రతుః ॥36॥**

**వివస్వాన్ దశభిర్యాతి యాత్యేకాదశభిర్భగః ।**
**సప్తభిస్తపతే మిత్రస్త్వష్టా చైవాష్టభిః స్మృతః ॥37॥**

**అర్యమా దశభిర్యాతి పర్జన్యో నవభిస్తథా ।**
**షడ్భీ రశ్మిసహస్రైస్తు విష్ణుస్తపతి మేదినీమ్ ॥38॥**

సూర్యుడి కార్యాన్ని వరుణుడు ఐదువేలకిరణాలతో నిర్వర్తిస్తాడు. పూషుడు అరువేలకిరణాలతో, అంశువు ఏడువేలకిరణాలతో, ధాత ఎనిమిదివేలకిరణాలతో, ఇంద్రుడు తొమ్మిదివేలకిరణాలతో, వివస్వంతుడు పదివేల కిరణాలతో, త్వష్ట ఎనిమిదివేలకిరణాలతో, అర్యముడు పదివేలకిరణాలతో, పర్జన్యుడు తొమ్మిదివేలకిరణాలతో విష్ణువు ఆరువేలకిరణాలతో భూమిని తపింపచేస్తున్నారు. భూమిమీదకు ప్రసరిస్తున్నారు.

**వసంతే కపిలః సూర్యో గ్రీష్మే కాంచనసప్రభః ।**
**శ్వేతో వర్షాసు వర్ణేన పాండుః శరది భాస్కరః ॥39॥**

**హేమంతే తామ్రవర్ణస్తు శిశిరే లోహితో రవిః ।**
**ఇతి వర్ణాః సమాఖ్యాతా మయా సూర్యసముద్భవాః ॥40॥**

సూర్యుడు వసంతఋతువులో కపిలవర్ణంలోను, గ్రీష్మంలో బంగారంవర్ణంలోను, వర్షర్తువులో శ్వేతవర్ణంలోను, శిశిరంలో లోహితవర్ణంలోను ఉంటాడు. ఈ విధంగా ఆయా ఋతువులందు సూర్యుడి వర్ణాల్ని గూర్చి చెప్పాను.

**ఓషధీషు బలం ధత్తే స్వధయా చ పితృష్వపి ।**
**సూర్యోఽమరేష్వప్యమృతం త్రయం త్రిషు నియచ్ఛతి ॥41॥**

**ఏవం రశ్మిసహస్రం తత్సౌరం లోకార్థసాధకమ్ ।**
**భిద్యతే లోకమాసాద్య జలశీతోష్ణనిఃస్రవమ్ ॥42॥**

సూర్యుడు ఓషధులకు బలాన్ని ఇస్తున్నాడు. స్వధతో పితృదేవలకు తృప్తినిస్తున్నాడు. దేవతలకు అమృతాన్ని ఇస్తున్నాడు. ఈ విధంగా ఆ ముగ్గురికి బలాదులు మూడింటిని ఒసగుతున్నాడు. ఈ విధంగా సూర్యుడి వేలకిరణాలు లోకకళ్యాణాన్ని కల్గిస్తున్నాయి. జలాన్ని, శీతాన్ని, వేడిని కలిగించే ఆ కిరణాలు భూమిని చేరి విభిన్నరూపాల్ని ధరిస్తున్నాయి.

**ఇత్యేతన్మండలం శుక్లం భాస్కరం సూర్యసంజ్ఞితమ్ ।**
**నక్షత్రగ్రహసోమానాం ప్రతిష్ఠాయోనిరేవ చ ॥43॥**

**చంద్రఋక్షగ్రహాః సర్వే విజ్ఞేయాః సూర్యసంభవాః ।**
**నక్షత్రాధిపతిః సోమో నయనం వామమీశితుః ॥44॥**

**నయనం చైవమీశస్య దక్షిణం భాస్కరః స్వయమ్ ।**
**తేషాం జనానాం లోకేఽస్మిన్నయనం నయతే యతః ॥45॥**

శుక్లవర్ణంతో ప్రకాశిస్తున్న ఈ మండలం 'సూర్య' సంజ్ఞగలది. నక్షత్రాలకు, గ్రహాలకు, చంద్రుడికి పుట్టుకకు కారణం. చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు అన్నీ సూర్యుడినుంచి పుట్టినవే అని తెలియాలి. నక్షత్రాలకు రాజైన చంద్రుడు శివుడికి వామనేత్రం. సూర్యుడు కుడికన్ను. సూర్యుడు ఈ దేవమనుష్యపితృదేవతలకు చక్షురింద్రియాన్ని కలిగిస్తున్నాడు. కావున ఆయన 'నయనం'గా పిలువబడుతున్నాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే సూర్యరశ్మిస్వరూపకథనం నామైకోన షష్టితమోఽధ్యాయః ॥ 59 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని సూర్యరశ్మిస్వరూపకథనమనే ఏబై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## **షష్టితమోఽధ్యాయః** - అరవైయవ అధ్యాయం

## **సూర్యప్రభావవర్ణనమ్** - సూర్యప్రభావవర్ణనం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**శేషాః పంచగ్రహా జ్ఞేయా ఈశ్వరాః కామచారిణః ।**
**పఠ్యతే చాగ్నిరాదిత్య ఉదకం చంద్రమాః స్మృతః ॥1॥**

సూర్యుడు అగ్నిరూపుడుగాను చంద్రుడు ఉదకరూపుడుగాను ఉంటారు. మిగిలిన ఐదు గ్రహాలు భౌమాదులు (అంగారకుడు మున్నగునవి) స్వయంసమర్థాలు, స్వేచ్ఛాసంచారంకలవి.

**శేషాణాం ప్రకృతిం సమ్యగ్ వక్ష్యమాణాం నిబోధత ।**
**సురసేనాపతిః స్కందః పఠ్యతేఽంగారకో గ్రహః ॥2॥**

**నారాయణం బుధం ప్రాహుర్దేవం జ్ఞానవిదో జనాః ।**
**సర్వలోకప్రభుః సాక్షాద్యమో లోకప్రభుః స్వయమ్ ॥3॥**

**మహాగ్రహో ద్విజశ్రేష్ఠా మందగామీ శనైశ్చరః ।**
**దేవాసురగురు ద్వౌ తు భానుమంతౌ మహాగ్రహౌ ॥4॥**

**ప్రజాపతిసుతావుక్తౌ తతః శుక్రబృహస్పతీ ।**
**ఆదిత్యమూలమఖిలం త్రైలోక్యం నాత్ర సంశయః ॥5॥**

ఓ మునులారా! నేను మిగిలిన ఐదుగ్రహాలయొక్క స్వభావ విశేషాల్ని చెబుతున్నాను. వినండి! అంగారకగ్రహం (భౌమ) దేవసేనాని స్కందుడని తెలియాలి. జ్ఞానవేత్తలైన జనులు బుధుణ్ణి స్వయంగా దేవదేవుడైన నారాయణుడుగా చెబుతున్నారు. ఓ ద్విజశ్రేష్ఠులారా! మందగమనుడు, మహాగ్రహం అయిన శనీశ్వరుడు సమస్తలోకాలకు స్వామి లోకనాయకుడు అయిన సాక్షాత్తు యమధర్మరాజే. కాంతిమంతులై, మహాగ్రహాలైన దేవతలగురువు బృహస్పతి, రాక్షసగురువు శుక్రుడు ప్రజాపతికి పుత్రులే. ఆదిత్యుడే మూడులోకాలకు మూలం. ఇందులో ఎలాంటి సందేహంలేదు.

**భవత్యస్మాజ్జగత్కృత్స్నం సదేవాసురమానుషమ్ ।**
**రుద్రేంద్రోపేంద్రచంద్రాణాం విప్రేంద్రాగ్నిదివౌకసామ్ ॥6॥**

**ద్యుతిర్ద్యుతిమతాం కృత్స్నం యత్తేజః సార్వలౌకికమ్ ।**
**సర్వాత్మా సర్వలోకేశో మహాదేవః ప్రజాపతిః ॥7॥**

**సూర్య ఏవ త్రిలోకేశో మూలం పరమదైవతమ్ ।**
**తతః సంజాయతే సర్వం తత్రైవ ప్రవిలీయతే ॥8॥**

దేవదానవమానవులతో కూడిన ఈ సమస్తలోకం సూర్యుడినుంచే జన్మిస్తున్నది. ఈ సూర్యుడే కాంతిమంతులైన రుద్రుడు, ఇంద్రుడు, ఉపేంద్రుడు, చంద్రుడు– వీరియొక్కయు, బ్రహ్మణశ్రేష్ఠుల, అగ్ని, మరియు దేవతలయొక్కయు కాంతి. ఈతడి ఈ తేజం సంపూర్ణమైంది. మరియు ఇది సార్వజనీనమైంది. ఇది అందరియొక్క ఆత్మస్వరూపం. సర్వలోకప్రభువు. మహాదేవుడైన ప్రజాపతి. సూర్యుడినుంచే సర్వమూ జనిస్తున్నది. సూర్యునిలోనే సర్వమూ విలీనమౌతున్నది.

**భావాభావౌ హి లోకానామాదిత్యాన్నిఃసృతౌ పురా ।**
**అవిజ్ఞేయో గ్రహో విప్రా దీప్తిమాన్ సుప్రభో రవిః ॥9॥**

ఓ బ్రాహ్మణులారా! పూర్వం లోకాలయొక్క అస్తిత్వం, నాస్తిత్వం (ఉండుట, లేకుండుట) సూర్యుడినుంచే సంభవించాయి. కాంతిమంతమూ, మిక్కిలి ప్రభావవంతమూ అయిన ఈ సూర్యగ్రహాన్ని తెలియడం అసాధ్యం

**అత్ర గచ్ఛంతి నిధనం జాయంతే చ పునః పునః ।**
**క్షణా ముహూర్తా దివసా నిశాః పక్షాశ్చ కృత్స్నశః ॥10॥**

**మాసాః సంవత్సరాశ్చైవ ఋతవోఽథ యుగాని చ ।**
**తదాదిత్యాదృతే హ్యేషా కాలసంఖ్యా న విద్యతే ॥11॥**

**కాలాదృతే న నియమో న దీక్షా నాహ్నికక్రమః ।**
**ఋతూనాం చ విభాగశ్చ పుష్పం మూలం ఫలం కుతః ॥12॥**

**కుతః సస్యవినిష్పత్తిస్తృణౌషధిగణోఽపి చ ।**
**అభావో వ్యవహారాణాం జంతూనాం దివి చేహ చ ॥13॥**

**జగత్ప్రతాపనమృతే భాస్కరం రుద్రరూపిణమ్ ।**
**స ఏష కాలశ్చాగ్నిశ్చ ద్వాదశాత్మా ప్రజాపతిః ॥14॥**

క్షణాలు, ముహూర్తాలు, రాత్రింబవళ్లు, పక్షాలు, మాసాలు, సంవత్సరాలు, ఋతువులు, యుగాలు సమస్తమూ ఈ సూర్యుడినుండే మాటిమాటికి ఉత్పన్నమవుతున్నాయి. అట్లే నశిస్తున్నాయి. కాగా సూర్యుడు లేక ఈ కాలగణనం లేదు. కాలం లేక నియమం ఉండదు. దీక్ష ఉండదు. దినచర్య ఉండదు. కాలం లేక ఋతువుల విభాగం పుష్పాలు, ఫలాలు, కందమూలాలు ఎక్కడివి? ధాన్యంయొక్క ఉత్పత్తి, తృణాల మరియు ఔషధసమూహం ఉత్పత్తి ఎలా జరుగుతుంది? జగత్తును తపించే రుద్రరూపుడైన సూర్యుడు లేకుండా స్వర్గంలోను, భూమిపైన గల ప్రాణులయొక్క స్థితి గతులు నశిస్తాయి. ఈతడే కాలం, అగ్ని మరియు ద్వాదశాత్ముడైన ప్రజాపతి.

**తపత్యేష ద్విజశ్రేష్ఠాస్త్రైలోక్యం సచరాచరమ్ ।**
**స ఏష తేజసాం రాశిః సమస్తః సార్వలౌకికమ్ ॥15॥**

**ఉత్తమం మార్గమాస్థాయ రాత్ర్యహోభిరిదం జగత్ ।**
**పార్శ్వతోర్ధ్వమధశ్చైవ తాపయత్యేష సర్వశః ॥16॥**

**యథా ప్రభాకరో దీపో గృహమధ్యేఽ వలంబితః ।**
**పార్శ్వతోర్ధ్వమధశ్చైవ తమో నాశయతే సమమ్ ॥17॥**

**తద్వత్సహస్రకిరణో గ్రహరాజో జగత్ప్రభుః ।**
**సూర్యో గోభిర్జగత్సర్వమాదీపయతి సర్వతః ॥18॥**

ఓ శ్రేష్ఠబ్రాహ్మణులారా! ఈ సూర్యుడే స్థావరజంగమాత్మకమైన మూడులోకాల్ని ప్రకాశింపజేస్తున్నాడు. ఈతడే రాశీభూతమైన తేజస్సు. సర్వలోకాలకు హితం కలిగించేవాడు. సర్వలోకాలయందు ప్రసిద్ధుడైనవాడు. ఈతడు ఉత్తమమార్గాన్ని అధిష్ఠించి జగత్తుయొక్క పైభాగాన్ని, రెండువైపుల, అన్ని దిక్కులను రాత్రింబవళ్ళతో తపింపజేస్తున్నాడు. ఏ విధంగా గృహమధ్యభాగంలో గల దీపకాంతి ప్రక్కలందు, పైన మరియు క్రిందలోను గల చీకటిని సమానంగా రూపుమాపుతుందో ఆవిధంగానే వేలకిరణాలుగల గ్రహరాజు, జగత్తునకు ప్రభువు అయిన సూర్యుడు తన కిరణాలతో సమస్తజగత్తును అన్ని వైపుల ప్రకాశింపజేస్తున్నాడు.

**రవే రశ్మిసహస్రం యత్ప్రాజ్మయా సముదాహృతమ్ ।**
**తేషాం శ్రేష్ఠాః పునః సప్త రశ్మయో గ్రహయోనయః ॥19॥**

**సుషమ్నో హరికేశశ్చ విశ్వకర్మా తథైవ చ ।**
**విశ్వవ్యచాః పునశ్చాద్యః సన్నద్ధశ్చ తతః పరః ॥20॥**

**సర్వావసుః పునశ్చాన్యః స్వరాడన్యః ప్రకీర్తితః ।**
**సుషమ్నః సూర్యరశ్మిస్తు దక్షిణాం రాశిమైధయత్ ॥21॥**

**న్యగూర్ధ్వాధః ప్రచారోఽ స్య సుషమ్నః పరికీర్తితః ।**
**హరికేశః పురస్తాద్యో ఋక్షయోనిః ప్రకీర్త్యతే ॥22॥**

**దక్షిణే విశ్వకర్మా చ రశ్మిర్వర్ధయతే బుధమ్ ।**
**విశ్వవ్యచాస్తు యః పశ్చాచ్ఛుక్రయోనిః స్మృతో బుధైః ॥23॥**

**సన్నద్ధశ్చ తు యో రశ్మిః స యోనిర్లోహితస్య తు ।**
**షష్ఠః సర్వావసూ రశ్మిః స యోనిస్తు బృహస్పతేః ॥24॥**

**శనైశ్చరం పునశ్చాపి రశ్మిరాప్యాయతే స్వరాట్ ।**
**ఏవం సూర్యప్రభావేన నక్షత్రగ్రహతారకాః ॥25॥**

**దృశ్యంతే దివి తాః సర్వాః విశ్వం చేదం పునర్జగత్ ।**
**న క్షీయంతే యతస్తాని తస్మాన్నక్షత్రతా స్మృతా ॥26॥**

నేను ఇంతకుముందు సూర్యుని సహస్రకిరణాల్ని గూర్చి చెప్పాను. వాటిల్లో శ్రేష్ఠమైన ఏడు కిరణాలు గ్రహాల్ని ఉత్పన్నం చేస్తున్నాయి. అవి సుషుమ్న, హరికేశ, విశ్వకర్మ, విశ్వవచ, సన్నద్ధ, సర్వావసు మరియు స్వరాట్ అనే పేర్లుగలవి. సూర్యుడి ఈ సుషుమ్న అనే కిరణం దక్షిణరాశిని వృద్ధిపరుస్తున్నది. దీని గమనం పార్శ్వాలలోను, పైభాగంలోను, క్రిందిభాగంలోను అన్ని వైపులందును ఉంటుంది. తూర్పున ముందుండేది హరికేశ కిరణం. ఇది నక్షత్రాల జన్మస్థానంగా చెప్పబడుతున్నది. విశ్వకర్మ అనే ఈ కిరణం దక్షిణంలోని బుధుణ్ణి వికసింపజేస్తున్నది. వెనుకభాగంలో ఉండేది విశ్వవ్య అనే కిరణం. ఇది శుక్రుడికి జన్మస్థానం. సన్నద్ధకిరణం అంగారకుడికి జన్మస్థానం. ఆరవది అయిన సర్వావసుకిరణం బృహస్పతికి జన్మస్థానం. స్వరాట్ అనేది శనిని వృద్ధిచేస్తుంది. ఈ విధంగా సూర్యుడి ప్రభావకారణంగానే నక్షత్రాలు, గ్రహాలు, తారకలు అంతరిక్షంలో కన్పిస్తున్నాయి. అవి సంపూర్ణవిశ్వాన్ని ప్రకాశింపజేస్తున్నాయి. ఏవి క్షీణించవో అవి నక్షత్రాలు అవుతాయి.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే సూర్యప్రభావర్ణనం నామ షష్టితమోఽధ్యాయః ॥ 60 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని సూర్యప్రభావర్ణనమనే అరవైయవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

**ఏకషష్టితమో౽ధ్యాయః** - అరవై ఒకటవ అధ్యాయం

**గ్రహసంఖ్యావర్ణనమ్** - గ్రహసంఖ్యావర్ణనం

**సూత ఉవాచ** - సూతర్షి పలికాడు.

**క్షేత్రాణ్యేతాని సర్వాణి ఆతపంతి గభస్తిభిః ।**
**తేషాం క్షేత్రాణ్యథాదత్తే సూర్యో నక్షత్ర తారకాః ॥1॥**

**చీర్ణేన సుకృతేనేహ సుకృతాంతే గ్రహాశ్రయాః ।**
**తారణాత్తారకా హ్యేతాః శుక్లత్వాచ్చైవ తారకాః ॥2॥**

ఓ ఋషులారా! సూర్యకిరణాలచేత అన్ని ప్రాంతాలు మిక్కిలి ప్రకాశిస్తున్నాయి. సూర్యుడు, నక్షత్రాలకు, తారలకు, ఆయా క్షేత్రాల్ని నియమించాడు. ఈ లోకంలో సంపాదించిన పుణ్యకర్మలవల్ల ఆ పుణ్యకర్మాంతంలో గ్రహాల్ని ఆశ్రయించడం జరుగుతుంది. అనగా గ్రహనివాసం కల్గుతుంది. తరింపచేసేవి కావడం చేత తారకలు అవుతున్నాయి. తెల్లగా ఉండడం వల్లనూ తారకలు.

**దివ్యానాం పార్థివానాం చ నైశానాం చైవ సర్వశః ।**
**ఆదానాన్నిత్యమాదిత్యస్తేజసాం తమసామపి ॥3॥**

**సవనే స్యందనే౽ర్థే చ ధాతురేష విభాష్యతే ।**
**సవనాత్తేజసో౽పాం చ తేనాసౌ సవితా మతః ॥4॥**

**బహులశ్చంద్ర ఇత్యేష హ్లాదనే ధాతురుచ్యతే ।**
**శుక్లత్వే చామృతత్వే చ శీతత్వే చ విభావ్యతే ॥5॥**

దివ్యలోకంలోని, భూమిపైని కాంతిని రాత్రులందు చీకటిని గ్రహించటంచేత సూర్యుడు ఆదిత్యుడవుతున్నాడు. తేజస్సులను ప్రోగుపెట్టుట, జలమును వర్షించుటచేత సూర్యుడు సవిత అనబడుతున్నాడు. ఆ ధాతువుకి (సవనము, పిండుట=ప్రోగుపెట్టుట, స్యందనం ప్రవహింపచేయుట=వర్షించుట) అని అర్థాలు. చంద్రశబ్దానికి మూలమైన "చది" ధాతువుకి హ్లాదనం=సంతోషపెట్టుట అని అర్థం. ఇంకా తెల్లతనం, అమృతత్వం=అమృతమయంగా ఉండడం, చల్లదనం అని కూడా అర్థాలు.

**సూర్యాచంద్రమసోర్దివ్యే మండలే భాస్వరే ఖగే ।**
**జలతేజోమయే శుక్లే వృత్తకుంభనిభే శుభే ॥6॥**

**ఘనతోయాత్మకం తత్ర మండలం శశినః స్మృతమ్ ।**
**ఘనతేజోమయం శుక్లం మండలం భాస్కరస్య తు ॥7॥**

సూర్యచంద్రుల మండలాలు దివ్యాలు. ప్రకాశవంతాలు. ఆకాశగాములు. జలంతోనూ, తేజస్సుతోను కూడి ఉన్నాయి. మంగళకరాలు. తెల్లనివర్ణంతో గుండ్రనికుండవలే ఉన్నాయి. చంద్రమండలం అధికజలంతో కూడి ఉంటుంది. అధిక ప్రకాశంతో కూడి తెల్లగా ఉంటుంది సూర్యమండలం.

**వసంతి సర్వదేవాశ్చ స్థానాన్యేతాని సర్వశః ।**
**మన్వంతరేషు సర్వేషు ఋక్షసూర్యగ్రహాశ్రయాః ॥8॥**

**తేన గ్రహా గృహాణ్యేవ తదాఖ్యాస్తే భవంతి చ ।**
**సౌరం సూర్యోఽవిశత్స్థానం సౌమ్యం సోమస్తథైవ చ ॥9॥**

**శౌక్రం శుక్రోఽవిశత్స్థానం షోడశార్చిః ప్రతాపవాన్ ।**
**బృహద్ బృహస్పతిశ్చైవ లోహితశ్చైవ లోహితమ్ ॥10॥**

**శనైశ్చరం తథా స్థానం దేవశ్చాపి శనైశ్చరః ।**
**బౌధం బుధస్తు స్వర్భానుః స్వర్భానుస్థానమాశ్రితః ॥11॥**

**నక్షత్రాణి చ సర్వాణి నక్షత్రాణి విశంతి చ ।**
**గృహాణ్యేతాని సర్వాణి జ్యోతీంషి సుకృతాత్మనామ్ ॥12॥**

**కల్పాదౌ సంప్రవృత్తాని నిర్మితాని స్వయంభువా ।**
**స్థానాన్యేతాని తిష్ఠంతి యావదాభూతసంప్లవమ్ ॥13॥**

**మన్వంతరేషు సర్వేషు దేవస్థానాని తాని వై ।**
**అభిమానినోఽవతిష్ఠంతే దేవా స్థానం పునః పునః ॥14॥**

**అతీతైస్తు సహైతాని భావ్యాభావ్యైః సురైః సహ ।**
**వర్తంతే వర్తమానైశ్చ స్థానిభిస్తైః సురైః సహ ॥15॥**

దేవతలందరూ ఈ సూర్యచంద్రమండలాదిస్థానాల్ని ఆశ్రయించి నివసిస్తున్నారు. అన్ని మన్వంతరాలలోనూ నక్షత్రాల్ని, సూర్యుణ్ణి, గ్రహాల్ని ఆశ్రయిస్తున్నారు. ఈ విధంగా గ్రహాలు గృహాలనే పేరు పొందుతున్నాయి. సూర్యుడు సౌరస్థానంలోను, సోముడు (చంద్రుడు) సౌమ్యస్థానంలోను ప్రవేశిస్తున్నారు. పదహారు కిరణాలుగల పరాక్రమవంతుడైన శుక్రుడు శౌక్రస్థానంలో ప్రవేశించాడు. బృహస్పతి బృహత్స్థానంలోను, లోహితుడు (అంగారకుడు, భౌముడు) లోహితస్థానంలో ఉన్నారు. శనైశ్చరుడు (శని) శనైశ్చరస్థానంలోను, బుధుడు బుధస్థానంలోనూ స్వర్భానువు (రాహువు) స్వర్భానుస్థానంలోను స్థితులై ఉన్నారు. నక్షత్రాలన్నీ వాటి వాటి నక్షత్రస్థానాలల్లో ప్రవేశించి ఉన్నాయి. ఈ నక్షత్రాలన్నీ పుణ్యాత్ములకి నివాసస్థానాలు (గృహాలు). బ్రహ్మదేవుడు ఈ స్థానాల్ని నిర్మించాడు. ఇవి కల్పం యొక్క ఆదిలో నిర్మితాలై ప్రళయంవరకూ ఉంటాయి. ఇవి అన్నీ మన్వంతరాలలో దేవతలకు నివాసస్థానాలు

అవుతున్నాయి. ఇది నాచోటు అనే అభిమానం కలిగి దేవతలు వీటిలో మాటిమాటికి నివసిస్తున్నారు. ఈ నివాసస్థానాలు భూతభవిష్యద్వర్తమానకాలాలలోని దేవతలందరికి అందుబాటులో ఉంటాయి.

**అస్మిన్ మన్వంతరే చైవ గ్రహా వైమానికాః స్మృతాః ।**
**వివస్వానదితేః పుత్రః సూర్యో వైవస్వతేఽంతరే ॥16॥**

**ద్యుతిమానృషిపుత్రస్తు సోమో దేవో వసుః స్మృతః ।**
**శుక్రో దేవస్తు విజ్ఞేయో భార్గవోఽసురయాజకః ॥17॥**

**బృహత్తేజాః స్మృతో దేవో దేవాచార్యోఽంగిరాసుతః ।**
**బుధో మనోహరశ్చైవ ఋషిపుత్రస్తు స స్మృతః ॥18॥**

**శనైశ్చరో విరూపస్తు సంజ్ఞాపుత్రో వివస్వతః ।**
**అగ్నిర్వికేశ్యాం జజ్ఞే తు యువాసౌ లోహితార్చిషః ॥19॥**

**నక్షత్ర ఋక్షనామిన్యో దాక్షాయణ్యస్తు తాః స్మృతాః ।**
**స్వర్భానుః సింహికాపుత్రో భూతసంతాపనోఽసురః ॥20॥**

**సోమర్క్షగ్రహసూర్యేషు కీర్తితాస్త్వభిమానినః ।**
**స్థానాన్యేతాన్యథోక్తాని స్థానిన్యశ్చైవ దేవతాః ॥21॥**

ఈ మన్వంతరాలలో గ్రహాలు విమానాలలో తిరుగుతాయి. వైవస్వతమన్వంతరంలో సూర్యుడు అదితి పుత్రుడు. ఋషిపుత్రుడు, కాంతిమంతుడు దేవత అయిన వసువే. సోముడు (చంద్రుడు)గా చెప్పబడుతున్నాడు. అసురాచార్యుడు అయిన శుక్రుడు భృగుమహర్షిపుత్రుడు. మిక్కిలి కాంతిమంతుడైన దేవాచార్యుడు బృహస్పతి ఋషి ఐన అంగిరసుని కుమారుడు. సుందరుడైన బుధుడుకూడా ఋషిపుత్రుడే. వికృతాకారుడు శనిదేవుడు సంజ్ఞాదేవి కుమారుడు. ఆతడు సూర్యుడివల్ల కలిగాడు. లోహితకిరణుడు, యువకుడు అయిన అంగారకుడు (భౌముడు) అగ్నిరూపుడైన రుద్రుడికి ఆతడి భార్య వికేశికి జన్మించాడు. నక్షత్రాలు, ఋక్షగణాలు దక్షుడి కుమార్తెలు. ప్రాణులకు కష్టాల్ని కల్పించే అసురుడైన రాహువు సింహికకుమారుడు. ఈ విధంగా సూర్యచంద్రనక్షత్రగ్రహాలమీద వారి వారి నివాస స్థానాలున్నాయి. ఈ స్థానాల వర్ణన చేశాను. ఈ స్థానాలలో ఏయే దేవతలు ఈస్థానం నాది, నేనే ఇది అనే అభిమానం కలిగి నివసిస్తారో కూడా చెప్పాను.

**సౌరమగ్నిమయం స్థానం సహస్రాంశోర్వివస్వతః ।**
**హిమాంశోస్తు స్మృతం స్థానమమ్మయం శుక్లమేవచ ॥22॥**

**ఆప్యం శ్యామం మనోజ్ఞం బుధరశ్మిగృహం స్మృతమ్ ।**
**శుక్రస్యాప్యమ్మయం శుక్లం పదం షోడశరశ్మివత్ ॥23॥**

**నవరశ్మి తు భౌమస్య లోహితం స్థానముత్తమమ్ ।**
**హరిద్రాభం బృహచ్చాపి షోడశార్చిర్బృహస్పతేః ॥24॥**

**అష్టరశ్మిగృహం చాపి ప్రోక్తం కృష్ణం శనైశ్చరే ।**
**స్వర్భానోస్తామసం స్థానం భూతసంతాపనాలయమ్ ॥25॥**

**విజ్ఞేయాస్తారకాః సర్వాస్త్వృషయస్త్వేకరశ్మయః ।**
**ఆశ్రయాః పుణ్యకీర్తీనాం శుక్లాశ్చాపి స్వవర్ణతః ॥26॥**

**ఘనతోయాత్మికాః జ్ఞేయాః కల్పాదావేవ నిర్మితాః ।**
**ఆదిత్యరశ్మిసంయోగాత్సంప్రకాశాత్మికాః స్మృతాః ॥27॥**

సహస్రకిరణుడు సూర్యుడికి అగ్నిమయమైన సౌరస్థానం నివాసస్థానమై ఉంది. శీతాంశుడైన చంద్రుడి స్థానం జలమయం మరియు తెల్లటివర్ణం కలది. బుధుడియొక్క నివాసస్థానం జలమయమూ శ్యామవర్ణమూ మరియు మనోహరమై ఉంది. శుక్రుడినివాసం కూడా జలమయమై తెల్లటిరంగు కలిగి పదహారుకిరణాలతో కూడి ఉంది. అంగారకుడిస్థానం ఉన్నతం మరియు లోహితవర్ణం కల్గియుండి తొమ్మిదికిరణాలతో కూడి ఉంది. బృహస్పతియొక్క స్థానం పసుపువర్ణంగలదియై విశాలంగానూ పదహారుకిరణాలతో కూడి ఉంది. శనిదేవుడి యొక్క స్థానం నల్లనిదై ఎనిమిదికిరణాలుగలది అయి ఉంది. రాహువుయొక్క స్థానం అంధకారంతో నిండినదై ప్రాణులకు కష్టకారకమై ఉంది. ఋషుల నివాసాలన్నీ తారాగణస్థానాలే. అవి అన్నీ ఒకేకిరణం గలవి. తెల్లని వర్ణం గలిగి ఉత్తమకర్మానుష్ఠానంగల ఋషులకు, వాసస్థానాలై ఉన్నాయి. ఇవి అధికజలస్వరూపాలు. ఇవి అన్నీ కల్పం యొక్క ప్రారంభంలోనే నిర్మింపబడ్డాయి. ఇవి సూర్యుడి కిరణజాలంతో సంయోగం ఉన్న కారణంగా కాంతిస్వరూపాలుగా చెప్పబడుతున్నాయి.

**నవయోజనసాహస్రో విష్కంభః సవితుః స్మృతః ।**
**త్రిగుణస్తస్య విస్తారో మండలస్య ప్రమాణతః ॥28॥**

**ద్విగుణః సూర్యవిస్తారాద్విస్తారః శశినః స్మృతః ।**
**తుల్యస్తయోస్తు స్వర్భానుర్భూత్వాధస్తాత్ప్రసర్పతి ॥29॥**

**ఉద్ధృత్య పృథివీఛాయాం నిర్మితాం మండలాకృతిమ్ ।**
**స్వర్భానోస్తు బృహత్స్థానం తృతీయం యత్తమోమయమ్ ॥30॥**

**ఆదిత్యాత్తచ్చ నిష్క్రమ్య సోమం గచ్ఛతి పర్వసు ।**
**ఆదిత్యమేతి సోమాచ్చ పునః సౌరేషు పర్వసు ॥31॥**

**స్వర్భానుం నుదతే యస్మాత్తస్మాత్స్వర్భానురుచ్యతే ।**

సూర్యుడి యొక్క వ్యాసం తొమ్మిదివేల యోజనాలు. సూర్యుడివృత్తం ఆతడివిస్తారం కంటె (వ్యాసం) మూడురెట్లు ఎక్కువ. చంద్రుడివిస్తారం సూర్యుడివిస్తారంకంటె రెండురెట్లు అధికం. ఈ యిద్దరియొక్క విస్తారానికిసమానమైన విస్తారం గలిగి రాహువు వాళ్లయొక్క క్రిందిభాగంలో సంచరిస్తున్నాడు. మండలాకారాన్ని గ్రహించి, భూమిఛాయను స్వీకరించి రాహువు మూడో పెద్దస్థానాన్ని పొందాడు. అంతయు అంధకారంతో నిండి ఉంటుంది. చంద్రపర్వదినాల్లో రాహువు సూర్యుడినుండి విడిపోయి చంద్రుడివైపుకు వెళుతాడు. సూర్యుడి పర్వదినాల్లో చంద్రుడినుండి విడిపోయి సూర్యుడివైపుకు వెళుతాడు. ఈతడు అంతరిక్షంలో సూర్యుడిని ప్రేరేపించడంవల్ల ఈతడు 'స్వర్భానువ'ని చెప్పబడుతున్నాడు.

**చంద్రస్య షోడశో భాగో భార్గవస్య విధీయతే ॥32॥**

**విష్కంభాన్మండలాచ్చైవ యోజనాగ్రాత్ప్రమాణతః ।**
**భార్గవాత్పాదహీనస్తు విజ్ఞేయో వై బృహస్పతిః ॥33॥**

**బృహస్పతేః పాదహీనౌ వక్రసౌరీ ఉభౌ స్మృతౌ ।**
**విస్తారాన్మండలాచ్చైవ పాదహీనస్తయోర్బుధః ॥34॥**

**తారానక్షత్రరూపాణి వపుష్మంతీహ యాని వై ।**
**బుధేన తాని తుల్యాని విస్తారాన్మండలాచ్చ వై ॥35॥**

**ప్రాయశశ్చంద్రయోగీని విద్యాదృక్షాణి తత్త్వవిత్ ।**
**తారానక్షత్రరూపాణి హీనాని తు పరస్పరమ్ ॥36॥**

**శతాని పంచ చత్వారి త్రీణి ద్వే చైవ యోజనే ।**
**సర్వోపరి నికృష్టాని తారకామండలాని తు ॥37॥**

**యోజనాన్యర్ధమాత్రాణి తేభ్యో హ్రస్వం న విద్యతే ।**
**ఉపరిష్టాత్త్రయస్తేషాం గ్రహాస్తే దూరసర్పిణః ॥38॥**

**సౌరోఽంగిరాశ్చ వక్రశ్చ జ్ఞేయా మందవిచారిణః ।**
**పూర్వమేవ సమాఖ్యాతా గతిస్తేషాం యథాక్రమమ్ ॥39॥**

శుక్రుని వైశాల్యం, మండలం యోజనాల ప్రమాణంలో చంద్రునివైశాల్యంలో చంద్రుని మండలంలో పదహారోవంతు ఉంటుంది. అదేవిధంగా భార్గవుని వైశాల్యంలో మూడువంతుల వైశాల్యం కలవాడు బృహస్పతి. బృహస్పతి కంటె వైశాల్యంలో ఒకనాల్గోవంతుభాగం తక్కువవాడు కుజుడు, శని, కాంతికలిగిన తారలు. నక్షత్రాల వైశాల్యంలో మండలంలో బుధునితో సమానాలు. తత్త్వవేత్తలు ఈ మొత్తం నక్షత్రాలన్నీ చంద్రుడికి సంబంధించినవిగా చెబుతున్నారు. ఈ తారా నక్షత్రాలు అన్నీ పరస్పరం మిక్కిలి చిన్నవి. చిన్నవైన ఆ తారలు అయిదు, నాలుగు, మూడు, రెండు యోజనాల విస్తారం గలవి. వీటి అన్నింటికి పై భాగంలో మిక్కిలి చిన్నదైన తారామండలం ఉంది.

అది కేవలం అర్ధయోజన విస్తారం కలది. దీనికంటే ఏ నక్షత్రమూ చిన్నది కాదు. దీనిపైన మూడు గ్రహాలు ఉన్నాయి. అవి దూరదూరంగా తిరుగుతున్నాయి. అవి సౌరగ్రహము, బృహస్పతి, అంగారకుడు. ఇవి మందగమనం గలవి. వీటి గమనవిషయాన్ని గూర్చి ఇంతకుముందే చెప్పాను.

**ఏతేష్వేవ గ్రహాః సర్వే నక్షత్రేషు సముత్థితాః ।**
**వివస్వానదితేః పుత్రః సూర్యో వై మునిసత్తమాః ॥40॥**

**విశాఖాసు సముత్పన్నో గ్రహాణాం ప్రథమో గ్రహః ।**
**త్విషిమాన్ ధర్మపుత్రస్తు సోమో దేవో వసుస్తు సః ॥41॥**

**శీతరశ్మిః సముత్పన్నః కృత్తికాసు నిశాకరః ।**
**షోడశార్చిర్భృగోః పుత్రః శుక్రః సూర్యాదనంతరమ్ ॥42॥**

**తారాగ్రహాణాం ప్రవరస్తిష్యే క్షేత్రే సముత్థితః ।**
**గ్రహశ్చాంగిరసః పుత్రో ద్వాదశార్చిర్బృహస్పతిః ॥43॥**

**ఫాల్గునీషు సముత్పన్నః పూర్వాఖ్యాసు జగద్గురుః ।**
**నవార్చిర్లోహితాంగశ్చ ప్రజాపతిసుతో గ్రహః ॥44॥**

**ఆషాఢాస్విహ పూర్వాసు సముత్పన్న ఇతి స్మృతః ।**
**రేవతీష్వేవ సప్తార్చిః స్థానే సౌరిః శనైశ్చరః ॥45॥**

**సౌమ్యో బుధో ధనిష్ఠాసు పంచార్చిరుదితో గ్రహః ।**
**తమోమయో మృత్యుసుతః ప్రజాక్షయకరః శిఖీ ॥46॥**

**ఆశ్లేషాసు సముత్పన్నః సర్వహారీ మహాగ్రహః ।**
**తథా స్వనామధేయేషు దాక్షాయణ్యః సముత్థితాః ॥47॥**

**తమోవీర్యమయో రాహుః ప్రకృత్యా కృష్ణమండలః ।**
**భరణీషు సముత్పన్నో గ్రహశ్చంద్రార్కమర్దనః ॥48॥**

గ్రహాలన్నీ ఈ నక్షత్రాలనుంచి పుట్టినాయి. ఓ మునిశ్రేష్ఠులారా ! అదితి పుత్రుడు వివస్వంతుడైన సూర్యుడు గ్రహాలలో ప్రథముడు. విశాఖనక్షత్రంలో పుట్టాడు. తేజశ్శాలి ధర్మదేవతపుత్రుడు చంద్రుడు. వసువు అనే దేవత కూడా. శీతకిరణుడైన ఈ చంద్రుడు కృత్తికా నక్షత్రంలో జన్మించాడు. పదహారు కిరణాలు గల భృగుమహర్షి కుమారుడైన శుక్రుడు సూర్యుని తరవాత తారాగ్రహాలలో శ్రేష్ఠుడు. పుష్యనక్షత్రంలో జన్మించాడు. పండ్రెండు కిరణాలుగల అంగీరసునిపుత్రుడైన లోకగురువు బృహస్పతి పూర్వఫల్గునీనక్షత్రంలో జన్మించాడు. తొమ్మిది కిరణాలుగల లోహితవర్ణుడైన అంగారకుడు ప్రజాపతిపుత్రుడు. పూర్వాషాఢనక్షత్రంలో జన్మించాడు. ఏడుకిరణాలుగల

సూర్యుడికుమారుడైన శని రేవతీనక్షత్రంలో పుట్టాడు. ఐదుకిరణాలుగల చంద్రుడికుమారుడైన బుధుడు ధనిష్ఠానక్షత్రంలో జన్మించాడు. అంధకారమయుడు, ప్రజాక్షయకరుడు, అందరి నాశకారకుడు మృత్యుదేవత కుమారుడు కేతువు ఆశ్లేషానక్షత్రంలో జన్మించాడు. దక్షుడిపుత్రికలైన మిగిలినవారు వారి వారి పేర్లుగల నక్షత్రాలనుంచి జన్మించారు. తమోగుణశక్తిమయుడు నల్లనిబింబంకలవాడు సూర్యచంద్రుల్ని మర్దించువాడు అయిన రాహువు భరణీనక్షత్రంలో జన్మించాడు.

**ఏతే తారా గ్రహాశ్చాపి బోద్ధవ్యా భార్గవాదయః ।**
**జన్మనక్షత్రపీడాసు యాంతి వైగుణ్యతాం యతః ॥49॥**

**ముచ్యతే తేన దోషేణ తతస్తద్ గ్రహభక్తితః ।**
**సర్వగ్రహాణామేతేషామాదిరాదిత్య ఉచ్యతే ॥50॥**

**తారాగ్రహాణాం శుక్రస్తు కేతూనాం చాపి ధూమవాన్ ।**
**ధ్రువః కిల గ్రహాణాంతు విభక్తానాం చతుర్దిశమ్ ॥51॥**

**నక్షత్రాణాం శ్రవిష్ఠా స్యాదయనానాం తథోత్తరమ్ ।**
**వర్షాణాం చైవ పంచానామాద్యః సంవత్సరః స్మృతః ॥52॥**

**ఋతూనాం శిశిరశ్చాపి మాసానాం మాఘ ఉచ్యతే ।**
**పక్షాణాం శుక్లపక్షస్తు తిథీనాం ప్రతిపత్తథా ॥53॥**

**అహోరాత్రవిభాగానామహశ్చాదిః ప్రకీర్తితః ।**
**ముహూర్తానాం తథైవాదిర్ముహూర్తో రుద్రదేవతః ॥54॥**

ఈ శుక్రుడు మొదలైన గ్రహాలు నక్షత్రాలుగా కూడా పిలువబడుతాయి. జీవుల జన్మనక్షత్రాలకు దోషాలుంటే పైన చెప్పిన గ్రహాలు ప్రతికూలం అవుతాయి. ఆ నక్షత్రజాతులైన మానవులు ఆ గ్రహాల్ని పూజించడంవల్ల ఆ దోషాలనుంచి విముక్తులవుతున్నారు. ఈ గ్రహాలన్నింటిలో సూర్యుడు ప్రధానగ్రహం. తారాగ్రహాలలో శుక్రుడు, ధూమవంతుడైన కేతువు, నాల్గు దిక్కులలో వ్యాపించియున్న గ్రహాలలో ధ్రువుడు ప్రధానమైన వాళ్లు. నక్షత్రాల్లో ధనిష్ఠ, ఆయనాలలో ఉత్తరాయణం ప్రధానమైనవి. పంచవర్షాలలో సంవత్సరం మొదటిది. ఋతువులలో శిశిరం, మాసాలలో మాఘం మొదటివి. పక్షాలలో శుక్లపక్షం, తిథులలో పాడ్యమి మొదటివి. పగలు రాత్రి విభాగాలలో పగలు మొదటిది. ముహూర్తాల్లో రుద్రదైవతం అయిన ముహూర్తం మొదటిది.

**క్షణశ్చాపి నిమేషాదిః కాలః కాలవిదాం వరాః ।**
**శ్రవణాంతం ధనిష్ఠాది యుగం స్యాత్పంచవార్షికమ్ ॥55॥**

**భానోర్గతివిశేషేణ చక్రవత్పరివర్తతే ।**
**దివాకరః స్మృతస్తస్మాత్కాలకృద్విభురీశ్వరః ॥56॥**

**చతుర్విధానాం భూతానాం ప్రవర్తకనివర్తకః ।**
**తస్యాపి భగవాన్ రుద్రః సాక్షాద్దేవః ప్రవర్తకః ॥57॥**

**ఇత్యేష జ్యోతిషామేవం సన్నివేశో$\text{ఽ}$ర్థనిశ్చయః ।**
**లోకసంవ్యవహారార్థం మహాదేవేన నిర్మితః ॥58॥**

**బుద్ధిపూర్వం భగవతా కల్పాదౌ సంప్రవర్తితః ।**
**స ఆశ్రయోఽభిమానీ చ సర్వస్య జ్యోతిరాత్మకః ॥59॥**

ఓ కాలవేత్తలలో శ్రేష్ఠులైన మునులారా! క్షణాలలో నిమేషం మొదటి కాలమానం. ధనిష్ఠ నుంచి శ్రవణం వరకూ పంచవర్షయుగం అవుతుంది. సూర్యుడి యొక్క విశేషగమన కారణంగా ఈ జగత్తు చక్రం మాదిరి తిరుగుతున్నది. ఈ కారణంగా సూర్యుడు కాలకారకుడు, కాలవ్యాపకుడు అట్లే ఈశ్వరుడు అవుతున్నాడు. సూర్యుడు నాల్గువిధాలైన ప్రాణుల సృష్టికర్త మరియు లయకారుడు. రుద్రభగవానుడే సూర్యుడి సృష్టికర్త. లోకవ్యవహారానికై శివభగవానుడు జ్యోతిర్గణాన్ని అనగా గ్రహనక్షత్రాల్ని ఏర్పరచాడు. ఆతడే కల్పం ప్రారంభంలో బుద్ధిపూర్వకంగా పై వాటినన్నింటిని సృష్టించాడు. వాటి అన్నింటికీ ఆతడే ఆశ్రయుడు. అభిమానపాత్రుడు. ఆయనే జ్యోతిస్స్వరూపుడు.

**ఏకరూపప్రధానస్య పరిణామోఽయమద్భుతః ।**
**నైష శక్యః ప్రసంఖ్యాతుం యథాతథ్యేన కేనచిత్ ॥60॥**

**గతాగతం మనుష్యేణ జ్యోతిషాం మాంసచక్షుషా ।**
**ఆగమాదనుమానాచ్చ ప్రత్యక్షాదుపపత్తితః ॥61॥**

**పరీక్ష్య నిపుణం బుద్ధ్యా శ్రద్ధాతవ్యం విపశ్చితా ।**
**చక్షుః శాస్త్రం జలం లేఖ్యం గణితం మునిసత్తమాః ॥62॥**

**పంచైతే హేతవో జ్ఞేయా జ్యోతిర్మానవినిర్ణయే ॥63॥**

ఏకరూపమైన ప్రధానంయొక్క పరిణామమే ఈ అద్భుతసృష్టి. దీని యథార్థతత్త్వాన్ని ఎవరూ గుర్తించలేరు. ఈ గ్రహనక్షత్రాల గతిని విద్వాంసుడైన మానవుడు తన సాధారణనేత్రంతో (మాంసలమైన), వేదశాస్త్రాదిపరిజ్ఞానంతో, ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలతో, నిపుణమైన బుద్ధితో, మిక్కుటమైన శ్రద్ధతో పరీక్షించి తెలియాలి. నేత్రం, శాస్త్రం, జలం, లేఖ్యం, గణితం ఈ అయిదింటిని గ్రహనక్షత్రాదుల ప్రమాణవిషయంలో నిర్ణాయక హేతువులుగా గ్రహించాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే గ్రహసంఖ్యావర్ణనం నామైకషష్టితమోఽధ్యాయః ॥ 61 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని గ్రహసంఖ్యావర్ణనమనే పేరుగల అరవై ఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్విషష్టితమోఽధ్యాయః - అరవై రెండవ అధ్యాయం
## భువనకోశే ధ్రువసంస్థానవర్ణనమ్ - భువనకోశంలో ధ్రువసంస్థానవర్ణనం

**ఋషయ ఉవాచ -** ఋషులు పలికారు.

> **కథం విష్ణోః ప్రసాదాద్వై ధ్రువో బుద్ధిమతాం వరః ।**
> **మేఢీభూతో గ్రహాణాం వై వక్తుమర్హసి సాంప్రతమ్ ॥1॥**

ఓ సూతర్షీ ! బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన ధ్రువుడు విష్ణుభగవానుడి అనుగ్రహంవల్ల గ్రహాలమధ్య కేంద్ర స్థానాన్ని ఎట్లు పొందాడో ప్రస్తుతం మీరు చెప్పండి!

**సూత ఉవాచ -** సూతమహర్షి పలికాడు.

> **ఏతమర్థం మయా పృష్టో నానాశాస్త్రవిశారదః ।**
> **మార్కండేయః పురా ప్రాహ మహ్యం శుశ్రూషవే ద్విజాః ॥2॥**

ఓ ద్విజులారా! బహుశాస్త్రకోవిదుడైన మార్కండేయమహర్షిని ఈ విషయాన్నిగూర్చి నేను అడిగాను. ఆయనను సేవించిన నాకు ఆయనే పూర్వమిలా చెప్పాడు.

**మార్కండేయ ఉవాచ -** మార్కండేయుడు పలికాడు.

> **సార్వభౌమో మహాతేజాః సర్వశాస్త్రభృతాం వరః ।**
> **ఉత్తానపాదో రాజా వై పాలయామాస మేదినీమ్ ॥3॥**

> **తస్య భార్యాద్వయమభూత్సునీతిః సురుచిస్తథా ।**
> **అగ్రజాయామభూత్పుత్రః సునీత్యాం తు మహాయశాః ॥4॥**

> **ధ్రువో నామ మహాప్రాజ్ఞః కులదీపో మహామతిః ।**
> **కదాచిత్సప్తవర్షోఽపి పితురంకముపావిశత్ ॥5॥**

> **సురుచిస్తం వినిర్ధూయ స్వపుత్రం ప్రీతమానసా ।**
> **న్యవేశయత్తం విప్రేంద్రా హ్యంకం రూపేణ మానితా ॥6॥**

చక్రవర్తి, మహాకాంతిమంతుడు, సమస్తశాస్త్రవిదులలో శ్రేష్ఠుడు అయిన ఉత్తానపాదుడనే రాజు భూమిని పరిపాలించాడు. ఆతడికి సునీతి, సురుచి అనే ఇద్దరు భార్యలున్నారు. పెద్దభార్య అయిన సునీతికి ధ్రువుడనే పుత్రుడు కలిగాడు. ఆతడు మహాయశస్వి. మహాజ్ఞాని. కులదీపకుడు. మహాబుద్ధిమంతుడు. అప్పుడాతడు ఏడు సంవత్సరాల వయసు కలవాడు. ఒకనాడు ఆతడు తన తండ్రి ఒడిలో కూర్చున్నాడు. ఓ ఋషులారా! అపుడు సౌందర్యగర్వంగల రెండో భార్య సురుచి ధ్రువుడ్ని ఒడినుంచి లాగివేసి తన పుత్రుణ్ణి రాజు ఒడిలో ఆనందంగా కూర్చుండజేసింది.

**అలబ్ధ్వా స పితుర్ధీమానంకం దుఃఖితమానసః ।**
**మాతుః సమీపమాగమ్య రురోద స పునః పునః ॥7॥**

బుద్ధిమంతుడైన ఆ ధ్రువుడు తండ్రి ఒడిని పొందలేనివాడై ఎంతో దుఃఖించి తల్లి దగ్గరకు వెళ్లి మాటిమాటికి శోకించాడు.

**రుదంతం పుత్రమాహేదం మాతా శోకపరిప్లుతా ।**
**సురుచిర్దయితా భర్తుస్తస్యాఃపుత్రోఽపి తాదృశః ॥8॥**

**మమ త్వం మందభాగ్యాయా జాతః పుత్రోఽప్యభాగ్యవాన్ ।**
**కిం శోచసి కిమర్థం త్వం రోదమానః పునః పునః ॥9॥**

**సంతప్తహృదయో భూత్వా మమ శోకం కరిష్యసి ।**
**స్వస్థస్థానం ధ్రువం పుత్ర స్వశక్త్యా త్వం సమాప్నుయాః ॥10॥**

ఏడుస్తున్న పుత్రుడితో శోకంతో నిండిన ఆ సునీతి ఇలా పలికింది. సురుచి రాజుకు ప్రియపత్ని. ఆ కారణంగా ఆమె బిడ్డ కూడా ఇష్టుడే. అదృష్టహీనవైన నాకు నీవు జన్మించావు. అందుకే నీవు దురదృష్టవంతుడివి. నీవు ఎందుకు మాటిమాటికి రోదిస్తున్నావు? ఎందుకు విచారిస్తున్నావు? హృదయసంతాపం నీవు పొంది నాకూ దుఃఖం కల్గిస్తున్నావు. నీవు నీ శక్తితో ప్రశాంతం మరియు స్థిరమైన స్థానాన్ని సంపాదించుకో.

**ఇత్యుక్తః స తు మాత్రా వై నిర్జగామ తదా వనమ్ ।**
**విశ్వామిత్రం తతో దృష్ట్వా ప్రణిపత్య యథావిధి ॥11॥**

**ఉవాచ ప్రాంజలిర్భూత్వా భగవాన్ వక్తుమర్హసి ।**
**సర్వేషాముపరిస్థానం కేన ప్రాప్స్యామి సత్తమ ॥12॥**

**పితురంకే సమాసీనం మాతా మాం సురుచిర్మునే ।**
**వ్యధూనయత్స తాం రాజా పితా నోవాచ కించన ॥13॥**

**ఏతస్మాత్కారణాద్ బ్రహ్మంస్త్రస్తోఽహం మాతరం గతః ।**
**సునీతిరాహ మే మాతా మా కృథాః శోకముత్తమమ్ ॥14॥**

**స్వకర్మణా పరం స్థానం ప్రాప్తుమర్హసి పుత్రక ।**
**తస్యా హి వచనం శ్రుత్వా స్థానం తవ మహామునే ॥15॥**

**ప్రాప్తో వనమిదం బ్రహ్మన్నద్య త్వాం దృష్టవాన్ ప్రభో ।**
**తవ ప్రసాదాత్ప్రాప్స్యేఽహం స్థానమద్భుతముత్తమమ్ ॥16॥**

తల్లి ఈ విధంగా పలుకగా అపుడాతడు అరణ్యానికి వెళ్లాడు. తర్వాత అక్కడ విశ్వామిత్రమహర్షిని చూచి విధ్యుక్తంగా నమస్కరించి, అన్నింటికంటే ఉన్నతస్థానాన్ని ఏ ఉపాయంతో పొందగలనో, ఓ భగవంతుడా!

ఓమునిపుంగవా! మీరు చెప్పండని చేతులు జోడించి పలికాడు. తండ్రి ఒడిలో కూర్చున్న నన్ను పినతల్లి సురుచి ఆయన ఒడి నుంచి తొలగించింది. రాజైన నా తండ్రి ఏమీ మాట్లాడలేదు. ఈ కారణంగా దుఃఖించిన నేను నా తల్లి సునీతి దగ్గరకు వెళ్లాను. అప్పుడు నా తల్లి ఓ కుమార! అధికశోకాన్ని పొందవద్దని చెప్పింది. నీ కృషితో ఉన్నతస్థానాన్ని పొందమని పలికింది. ఆమె ఆ మాట విని నేనీ అరణ్యానికి వచ్చాను. ఓ బ్రహ్మర్షీ! ఇప్పుడిక్కడ నిన్ను దర్శించాను. నీ దయతో ఉన్నతం మరియు ఆశ్చర్యకరం అయిన స్థానాన్ని పొందుతాను.

**ఇత్యుక్తః స మునిః శ్రీమాన్ ప్రహసన్నిదమబ్రవీత్ ।**
**రాజపుత్ర శృణుష్వేదం స్థానముత్తమమాప్స్యసి ॥17॥**

**ఆరాధ్య జగతామీశం కేశవం క్లేశనాశనమ్ ।**
**దక్షిణాంగభవం శంభోర్మహాదేవస్య ధీమతః ॥18॥**

**జప నిత్యం మహాప్రాజ్ఞ సర్వపాపవినాశనమ్ ।**
**ఇష్టదం పరమం శుద్ధం పవిత్రమమలం పరమ్ ॥19॥**

**బ్రూహి మంత్రమిమం దివ్యం ప్రణవేన సమన్వితమ్ ।**
**నమోఽస్తు వాసుదేవాయ ఇత్యేవం నియతేంద్రియః ॥20॥**

**ధ్యాయన్ సనాతనం విష్ణుం జపహోమపరాయణః ।**

ఈవిధంగా ధ్రువుడు పలుకగా శ్రీమంతుడైన విశ్వామిత్రమహర్షి నవ్వుతూ ఇలా పలికాడు. ఓ రాజకుమార! విను ! జగన్నాథుడు, కష్టవినాశకుడు శివభగవానుడి దక్షిణాంగంనుంచి పుట్టినవాడైన విష్ణుదేవుడిని ఆరాధించి ఆ ఉన్నతస్థానాన్ని పొందుతావు. ఓ మహాబుద్ధిశాలి ! నీవు సర్వపాపహరం, అభీష్టాల్ని తీర్చేది, పరమపవిత్రం, శుద్ధం, దోషరహితం అయిన ఈ మంత్రాన్ని నిత్యం జపించు. నీవు ఇంద్రియాల్ని వశపర్చుకుని ప్రణవపూర్వకమైన వాసుదేవమంత్రాన్ని 'ఓం నమోఽస్తు వాసుదేవాయ' అనే దివ్యమంత్రాన్ని జపించు. సనాతనుడైన విష్ణుభగవానుణ్ణి ధ్యానిస్తూ జపహోమలగ్నమనస్కుడవు కమ్ము.

**ఇత్యుక్తః ప్రణిపత్యైవం విశ్వామిత్రం మహాయశాః ॥21॥**

**ప్రాఙ్ముఖో నియతో భూత్వా జజాప ప్రీతమానసః ।**
**శాకమూలఫలాహారః సంవత్సరమతంద్రితః ॥22॥**

**జజాప మంత్రమనిశమజస్రం స పునఃపునః ।**
**వేతాలా రాక్షసా ఘోరాః సింహాద్యాశ్చ మహామృగాః ॥23॥**

**తమభ్యయుర్మహాత్మానం బుద్ధిమోహాయ భీషణాః ।**
**జపన్ స వాసుదేవేతి న కించిత్ప్రత్యపద్యత ॥24॥**

ఈ విధంగా విశ్వామిత్రుడు చెప్పగా మహాకీర్తిమంతుడైన ధ్రువుడు ఆ ఋషికి నమస్కరించి తూర్పు దిక్కుకు అభిముఖుడు సంతుష్టచేతస్కుడు నియమధారి అయి ఆ మంత్రాన్ని జపించాడు. కందమూలాల్ని, ఫలాల్ని,

శాకాన్ని ఆహారంగా గ్రహిస్తూ, ఆలసించక రాత్రింబవళ్ళు, ఎల్లప్పుడు ఒకసంవత్సరం ఆ మంత్రాన్ని మాటి మాటికి జపించాడు. భేతాళులు, రాక్షసులు, సింహశరభాది ఘోరమృగాలు బుద్ధిని మోహింపడానికి, భయపెట్టడానికి మహాత్ముడైన ఆ బాలుడుని సమీపించాయి. ఆతడు వాసుదేవమంత్రాన్నే జపిస్తూ కొద్దిగా కూడా విచలించలేదు.

**సునీతిరస్య యా మాతా తస్యా రూపేణ సంవృతా ।**
**పిశాచీ సమనుప్రాప్తా రురోద భృశదుఃఖితా ॥25॥**

**మమ త్వమేకః పుత్రోஉసి కిమర్థం క్లిశ్యతే భవాన్ ।**
**మామనాథామపహాయ తప ఆస్థితవానసి ॥26॥**

**ఏవమాదీని వాక్యాని భాషమాణాం మహాతపాః ।**
**అనిరీక్ష్యైవ హృష్టాత్మా హరేర్నామ జజాప సః ॥27॥**

ధ్రువుడి తల్లి అయిన సునీతియొక్క రూపాన్ని ధరించి ఒక పిశాచి ఆతడిని సమీపించి మిక్కిలి దుఃఖపడుతూ ఇలా రోదించింది. "నీవు నాకు ఒకే ఒక్క పుత్రుడవు. నీవు ఎందుకు ఇలా కష్టపడుతున్నావు. నన్ను అనాథను చేసి ఇలా ఇక్కడ ఎందుకు తపస్సు చేస్తున్నావు" అని. ఈ విధమైన మాటల్ని పలుకుతున్న ఆ స్త్రీ వైపు చూడకుండా మహాతపోధనుడు, సంతుష్టాంతరంగుడు అయిన ఆ బాలుడు హరి నామజపాన్నే చేశాడు.

**తతః ప్రశేముః సర్వత్ర విఘ్నరూపాణి తత్ర వై ।**
**తతో గరుడమారుహ్య కాలమేఘసమద్యుతిః ॥28॥**

**సర్వదేవైః పరివృతః స్తూయమానో మహర్షిభిః ।**
**ఆయయౌ భగవాన్ విష్ణుః ధ్రువాంతికమరాతిహా ॥29॥**

తర్వాత అక్కడ అన్ని విఘ్నాలు పూర్తిగా నశించాయి. అనంతరం కాలమేఘసమానదేహకాంతిగలవాడు, శత్రుసంహారకుడైన విష్ణువు గరుత్మంతుణ్ణి అధిరోహించి సమస్తదేవతలు వెంటరాగా మహామునులతో కీర్తింపబడుతూ ధ్రువుడి దగ్గరకు వచ్చాడు.

**సమాగతం విలోక్యాథ కోஉసావిత్యేవ చింతయన్ ।**
**పిబన్నివ హృషీకేశం నయనాభ్యాం జగత్పతిమ్ ॥30॥**

**జపన్ స వాసుదేవేతి ధ్రువస్తస్థౌ మహాద్యుతిః ।**
**శంఖప్రాంతేన గోవిందః పస్పర్శాస్యం హి తస్య వై ॥31॥**

సమీపించిన విష్ణువును చూచి ఎవరీతడని ఆలోచిస్తూ, జగన్నాథుడైన విష్ణువును నేత్రాలతో త్రాగుతున్నట్లుగా చూస్తూ "వాసుదేవాయ నమః" అని జపిస్తూ ఉన్న మహాకాంతిమంతుడైన ధ్రువుడి ముందు విష్ణువు నిలిచి తన శంఖం యొక్క ముందు భాగంతో ఆతడి ముఖాన్ని తాకాడు.

**తతః స పరమం జ్ఞానమవాప్య పురుషోత్తమమ్ ।**
**తుష్టావ ప్రాంజలిర్భూత్వా సర్వలోకేశ్వరం హరిమ్ ॥32॥**

**ప్రసీద దేవదేవేశ శంఖచక్రగదాధర ।**
**లోకాత్మన్ వేదగుహ్యాత్మన్ త్వాం ప్రపన్నోఽస్మి కేశవ ॥33॥**

**న విదుస్త్వాం మహాత్మానం సనకాద్యా మహర్షయః ।**
**తత్కథం త్వామహం విద్యాం నమస్తే భువనేశ్వర ॥34॥**

తర్వాత ధ్రువుడు ఉత్కృష్టమైన జ్ఞానాన్ని పొంది, అంజలి ఘటించి సమస్తలోకనాథుడు పురుషోత్తముడైన శ్రీహరిని స్తుతించాడు. ఓ దేవేశ్వరా ! ఓ శంఖచక్రగదాధారి ! ఓ లోకాత్ముడా ! ఓ వేదాలవల్ల తెలియదగిన రహస్యస్వభావం గలవాడా! ప్రసన్నుడవు కమ్ము ! ఓ కేశవా ! సనకసనందనాదులైన మహామునులు కూడా మహాత్ముడవైన నిన్ను తెలియలేరు. కాగా నేను నిన్నెట్లు తెలియగలను? ఓ భువనపతీ ! నీకు నమస్కారం.

**తమాహ ప్రహసన్ విష్ణురేహి వత్స ధ్రువో భవాన్ ।**
**స్థానం ధ్రువం సమాసాద్య జ్యోతిషామగ్రభుగ్భవ ॥35॥**

**మాత్రా త్వం సహితస్తత్ర జ్యోతిషాం స్థానమాప్నుహి ।**
**మత్స్థానమేతత్పరం ధ్రువం నిత్యం సుశోభనమ్ ॥36॥**

**తపసారాధ్య దేవేశం పురా లబ్ధం హి శంకరాత్ ।**
**వాసుదేవేతి యో నిత్యం ప్రణవేన సమన్వితమ్ ॥37॥**

**నమస్కారసమాయుక్తం భగవచ్ఛబ్దసంయుతమ్ ।**
**జపేదేవం హి యో విద్వాన్ ధ్రువం స్థానం ప్రపద్యతే ॥38॥**

తర్వాత విష్ణుభగవానుడు నవ్వుతూ ధ్రువుణ్ణి ఉద్దేశించి ఇలా పలికాడు. ఓ కుమార! రమ్ము! నీవు ధ్రువుడవు. నీవు ధ్రువ స్థానాన్ని పొంది నక్షత్రాలలో అగ్రస్థానంలో నిలువు. నీవు నీ తల్లితో కలిసి ఆ గ్రహాలలో స్థానాన్ని ప్రాప్తించుకో. అది నా యొక్క స్థానం. అది ఉత్కృష్టమైనది. స్థిరమైనది. శాశ్వతమైనది. బహుసుందరమైనది కూడా. పూర్వం నేను తపస్సు చేసి శంకరభగవానుడిని ఆరాధించి ఆతడివల్ల దానిని పొందాను. ప్రణవంతో అనగా ఓంకారంతో, నమస్కారంతో కూడిన భగవచ్ఛబ్దంగల వాసుదేవమంత్రంతో అనగా "ఓం నమో భగవతే వాసుదేవాయ" అని ఏ విద్వాంసుడు జపిస్తాడో ఆతడు ఈ ధ్రువస్థానాన్ని పొందుతాడు.

**తతో దేవాః సగంధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః ।**
**మాత్రా సహ ధ్రువం సర్వే తస్మిన్ స్థానే న్యవేశయన్ ॥39॥**

**విష్ణోరాజ్ఞాం పురస్కృత్య జ్యోతిషాం స్థానమాప్తవాన్ ।**
**ఏవం ధ్రువో మహాతేజా ద్వాదశాక్షరవిద్యయా ॥40॥**

**అవాప మహతీం సిద్ధిమేతత్తే కథితం మయా ॥41॥**

అనంతరం దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహామునులు అందరూ తల్లితో కూడా ధ్రువుణ్ణి జ్యోతిఃస్థానంలో నిలిపారు. విష్ణుమూర్తియొక్క ఆజ్ఞను పురస్కరించుకుని ధ్రువుడు జ్యోతిఃస్థితిని పొందాడు. ఈ విధంగా మహాకాంతిమంతుడైన ధ్రువుడు పండ్రెండు అక్షరాలు గల "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే మంత్రజపవిద్యామహిమతో ఉన్నతమైన సిద్ధిని పొందాడు. ఓ ఋషులారా! అదంతయు మీకు చెప్పాను.

**సూత ఉవాచ –** సూతర్షి పలికాడు.

**తస్మాద్యో వాసుదేవాయ ప్రణామం కురుతే నరః ।**
**స యాతి ధ్రువసాలోక్యం ధ్రువత్వం తస్య తత్తథా ॥42॥**

ఆరకంగా ఏ మానవుడు వాసుదేవుడికి నమస్కరిస్తాడో ఆతడు ధ్రువలోకానికి వెళతాడు. ఆతడు కూడా ధ్రువత్వం పొందుతాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే భువనకోశే ధ్రుసంస్థాపనవర్ణనం నామ ద్విషష్టితమోఽధ్యాయః ॥62 ॥**

శ్రీ లింగమహాపురాణే పూర్వభాగంలోని భువనకోశమందలి ధ్రువసంస్థానవర్ణనమనే అరవై రెండవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## త్రిషష్టితమోఽధ్యాయః - అరవై మూడవ అధ్యాయం

## దేవాదిసృష్టికథనమ్ - దేవాదిసృష్టికథనం

**ఋషయ ఊచుః** - మునులు పలికారు.

**దేవానాం దానవానాం చ గంధర్వోరగరక్షసామ్ ।**
**ఉత్పత్తిం బ్రూహి సూతాద్య యథాక్రమమనుత్తమమ్ ॥1॥**

ఓ సూతమహర్షీ ! ఇప్పుడు దేవదానవుల గంధర్వోరగరాక్షసుల జన్మను ఉత్తమవిధి రూపంగా క్రమానుసారంగా చెప్పండి !

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**సంకల్పాద్దర్శనాత్స్పర్శాత్పూర్వేషాం సృష్టిరుచ్యతే ।**
**దక్షాత్ప్రాచేతసాదూర్ధ్వం సృష్టిర్మైథునసంభవా ॥2॥**

**యదా తు సృజతస్తస్య దేవర్షిగణపన్నగాన్ ।**
**నవృద్ధిమగమల్లోకస్తదా మైథునయోగతః ॥3॥**

**దక్షః పుత్రసహస్రాణి పంచ సూత్యామజీజనత్ ।**
**తాంస్తు దృష్ట్వా మహాభాగాన్ సిసృక్షుర్వివిధాః ప్రజాః ॥4॥**

పూర్వం సృష్టి అంతా సంకల్ప, దర్శన, స్పర్శలవల్ల జరిగింది. ప్రచేతసుడి పుత్రుడైన దక్షుడి తర్వాత స్త్రీపురుషసంయోగసంబంధమైన సృష్టి సంభవించింది. దేవతల ఋషుల పన్నగాల సృష్టి జరిగినా దానివల్ల లోకవృద్ధి జరగలేదు. అప్పుడు దక్షుడు మైథునక్రియద్వారా తన భార్య సూతియందు ఐదువేలమంది పుత్రుల్ని కన్నాడు. మహానుభావులైన వాళ్లను అనేకులైన జనుల్ని సృష్టించే ఇచ్ఛగలవార్నిగా చేశాడు.

**నారదః ప్రాహ హర్యశ్వాన్ దక్షపుత్రాన్ సమాగతాన్ ।**
**భువః ప్రమాణం సర్వం తు జ్ఞాత్వోర్ధ్వమధ ఏవ చ ॥5॥**

**తతః సృష్టిం విశేషేణ కురుధ్వం మునిసత్తమాః ।**
**తే తు తద్వచనం శ్రుత్వా ప్రయాతాః సర్వతో దిశమ్ ॥6॥**

**అద్యాపి న నివర్తంతే సముద్రాదివ సింధవః ।**

తనను సమీపించిన దక్షకుమారులైన హర్యశ్వాదుల్ని గూర్చి నారదుడిలా పలికాడు. "భూమి పైభాగం, క్రిందిభాగంయొక్క పరిమాణాన్ని తెలిసికొన్న తర్వాత విశేషంగా సృష్టిని నిర్వహించండి" అని. ఓ మునిశ్రేష్ఠులారా! వాళ్లు ఆతడి మాట విని అన్ని దిక్కులకు వెళ్లారు. సముద్రాన్ని చేరిన నదులలాగా ఇప్పటికి తిరిగి రాలేదు.

**హర్యశ్వేషు చ నష్టేషు పునర్దక్షః ప్రజాపతిః ॥7॥**

**సూత్యామేవ చ పుత్రాణాం సహస్రమసృజత్ప్రభుః ।**
**శబలా నామ తే విప్రాః సమేతాః సృష్టిహేతవః ॥8॥**

**నారదోఽనుగతాన్ ప్రాహ పునస్తాన్ సూర్యవర్చసః ।**
**భువః ప్రమాణం సర్వంతు జ్ఞాత్వా భ్రాతౄన్ పునః పునః ॥9॥**

**ఆగత్య వాథ సృష్టిం వై కరిష్యథ విశేషతః ।**
**తేఽపి తేనైవ మార్గేణ జగ్ముర్భ్రాతృగతిం తథా ॥10॥**

హర్యశ్వనామకులైన పుత్రులు నశించినవారు కాగా సమర్థుడైన దక్షప్రజాపతి తన భార్య సూతియందు వేయిమంది పుత్రుల్ని సృష్టించాడు. ఓ విప్రులారా ! శబలనామకులు వారు. సూర్యసమానకాంతిమంతులైన వాళ్లు సృష్టికార్యానికి సమకట్టారు. అపుడు నారదుడు వారితోనూ ఇలా పలికాడు "భూమియొక్క సమస్తమైన విస్తారాన్ని, మీ సోదరుల ఉనికిని తెలిసివచ్చి విశేషసృష్టిని కావించండి" అని. వాళ్లందరూ ఆ మార్గంగా వెళ్లి తమ సోదరుల గతిని పొందారు.

**తతస్తేష్వపి నష్టేషు షష్టికన్యాః ప్రజాపతిః ।**
**వైరిణ్యాం జనయామాస దక్షః ప్రాచేతస్తదా ॥11॥**

**ప్రాదాత్స దశకం ధర్మే కశ్యపాయ త్రయోదశ ।**
**వింశత్సప్త చ సోమాయ చతస్రోఽరిష్టనేమయే ॥12॥**

**ద్వే చైవ భృగుపుత్రాయ ద్వే కృశాశ్వాయ ధీమతే ।**
**ద్వే చైవాంగిరసే తద్వత్తాసాం నామాని విస్తరాత్ ॥13॥**

**శృణుధ్వం దేవమాతౄణాం ప్రజావిస్తారమాదితః ।**

తర్వాత ప్రచేతసపుత్రుడైన దక్షప్రజాపతి శబలాదులు నశించగా వైరిణి అనే తనభార్యయందు అరవైమంది కన్యల్ని పుట్టించాడు. ఆతడు ధర్ముడికి పదిమందిని, కశ్యపుడికి పదముగ్గురిని, సోముడికి ఇరవైఏడు మందిని, అరిష్టనేమికి నలుగురిని, భార్గవుడికి ఇద్దరిని, బుద్ధిమంతుడైన కృశాశ్వుడికి ఇద్దర్ని అంగిరసుడికి ఇద్దర్ని ప్రదానం చేశాడు. దేవమాతలైన వాళ్ల పేర్లను, వాళ్ల ప్రజాభివృద్ధి క్రమాన్ని వినండి.

**మరుత్వతీ వసూర్యామిర్లంబా భానురరుంధతీ ॥14॥**
**సంకల్పా చ ముహూర్తా చ సాధ్యా విశ్వా చ భామినీ ।**
**ధర్మపత్న్యః సమాఖ్యాతాస్తాసాం పుత్రాన్ వదామి వః ॥15॥**

**విశ్వేదేవాస్తు విశ్వాయాః సాధ్యా సాధ్యానజీజనత్ ।**
**మరుత్వత్యాం మరుత్వంతో వాసోస్తు వసవస్తథా ॥16॥**

**భానోస్తు భానవః ప్రోక్తా ముహూర్తాయా ముహూర్తకాః ।**
**లంబాయా ఘోషనామానో నాగవీథీస్తు యామిజః ॥17॥**

**సంకల్పాయాస్తు సంకల్పో వసుసర్గం వదామి వః ।**

మరుత్వతి, వసు, యామి, లంబ, భాను, అరుంధతి, సంకల్ప, ముహూర్త, సాధ్య, విశ్వ అనేవారు. విశ్వధర్ముడి భార్యలు. ఇక వారి కుమారుల్ని గూర్చి చెబుతున్నాను. విశ్వకు విశ్వేదేవులు, సాధ్యకు సాధ్యులు జన్మించారు. మరుత్వతికి మరుత్వంతుడు, వసుకి వసువులు, భానుకు భానువులు, ముహూర్తకు ముహూర్తకులు, లంబకు ఘోషులు, యామికి నాగవీథి, సంకల్పకు సంకల్పుడు జన్మించారు. ఇక వసువుల యొక్క సృష్టిని గూర్చి చెప్పుతున్నాను.

**జ్యోతిష్మంతస్తు యే దేవా వ్యాపకాః సర్వతోదిశమ్ ॥18॥**

**వసవస్తే సమాఖ్యాతాః సర్వభూతహితైషిణః ।**
**ఆపో ధ్రువశ్చ సోమశ్చ ధరశ్చైవానిలోఽనలః ॥19॥**

**ప్రత్యూషశ్చప్రభాసశ్చ వసవోఽష్టౌ ప్రకీర్తితాః ।**
**అజైకపాదహిర్బుధ్న్యో విరూపాక్షః సభైరవః ॥20॥**

**హరశ్చ బహురూపశ్చ త్ర్యంబకశ్చ సురేశ్వరః ।**
**సావిత్రశ్చ జయంతశ్చ పినాకీ చాపరాజితః ॥21॥**

**ఏతే రుద్రా సమాఖ్యాతా ఏకాదశ గణేశ్వరాః ।**

కాంతిమంతులైన దేవతలందరూ అన్ని దిక్కులకు వ్యాపకులైనారు. వసువులందరూ సమస్తప్రాణికోటికి హితాభిలాషులు. ఆపుడు, ధ్రువుడు, సోముడు, ధరుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు మరియు ప్రభాసుడు అనే ఈ ఎనిమిది మంది వసువులుగా చెప్పబడ్డారు. అజైకపాత్తు, అహిర్బుధ్న్యుడు, విరూపాక్షుడు, భైరవుడు, హరుడు, బహురూపుడు, సురేశ్వరుడైన త్ర్యంబకుడు (ముక్కంటి) సావిత్రుడు, జయంతుడు, పినాకి, అపరాజితుడు అనే ఈ గణనాయకులు ఏకాదశరుద్రులు.

**కశ్యపస్య ప్రవక్ష్యామి పత్నీభ్యః పుత్రపౌత్రకమ్ ॥22॥**

**అదితిశ్చ దితిశ్చైవ అరిష్టా సురసా మునిః ।**
**సురభిర్వినతా తామ్రా తద్వత్ క్రోధవశా ఇళా ॥23॥**

**కద్రూస్త్విషా దనుస్తద్వత్తాసాం పుత్రాన్ వదామి వః ।**
**తుషితా నామ యే దేవాశ్చాక్షుషస్యాంతరే మనోః ॥24॥**

**వైవస్వతాంతరే తే వై ఆదిత్యా ద్వాదశ స్మృతాః ।**
**ఇంద్రో ధాతా భగస్త్వష్టా మిత్రోఽథ వరుణోఽర్యమా ॥25॥**

**వివస్వాన్ సవితా పూషా అంశుమాన్ విష్ణురేవ చ ।**
**ఏతే సహస్రకిరణా ఆదిత్యా ద్వాదశ స్మృతాః ॥26॥**

కశ్యపుడికి తన భార్యలద్వారా కలిగిన పుత్రుల్ని, పౌత్రుల్ని గూర్చి చెబుతాను. అదితి, దితి, అరిష్ట, సురస, ముని, సురభి, వినత, తామ్ర, క్రోధవశ, ఇళ, కద్రూ, త్విష మరియు దనువు అను వీళ్లు కశ్యపుడి భార్యలు. ఇక వారి పుత్రుల్ని గూర్చి చెబుతున్నాను. చాక్షుషమన్వంతరంలో తుషితనామకులు దేవతలు. వాళ్లు వైవస్వతమన్వంతరంలో ద్వాదశాదిత్యులుగా చెప్పబడుతున్నారు. ఇంద్రుడు, ధాత, భగుడు, త్వష్టుడు, మిత్రుడు, వరుణుడు, అర్యముడు, వివస్వంతుడు, సవితుడు, పూషుడు, అంశుమంతుడు మరియు విష్ణువు సహస్రకిరణాలుగల వీళ్లు ద్వాదశాదిత్యులు.

**దితిః పుత్రద్వయం లేభే కశ్యపాదితి నః శ్రుతమ్ ।**
**హిరణ్యకశిపుం చైవ హిరణ్యాక్షం తథైవ చ ॥27॥**

**దనుః పుత్రశతం లేభే కశ్యపాద్ బలదర్పితమ్ ।**
**విప్రచిత్తిః ప్రధానోఽభూత్తేషాం మధ్యే ద్విజోత్తమాః ॥28॥**

**తామ్రా చ జనయామాస షట్ కన్యా ద్విజపుంగవాః ।**
**శుకీం శ్యేనీం చ భాసీం చ సుగ్రీవీం గృధ్రికాం శుచిమ్ ॥29॥**

**శుకీ శుకానులూకాంశ్చ జనయామాస ధర్మతః ।**
**శ్యేనీ శ్యేనాంస్తథా భాసీ కురంగాంశ్చ వ్యజీజనత్ ॥30॥**

**గృధ్రీ గృధ్రాన్ కపోతాంశ్చ పారావతవిహంగమాన్ ।**
**హంససారసకారండ ప్లవాంశ్చుచిరజీజనత్ ॥31॥**

**అజాశ్వమేషోష్ట్ర ఖరాన్ సుగ్రీవీ చాప్యజీజనత్ ।**

దితి కశ్యపుడి వల్ల హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు అనే ఇద్దరు పుత్రుల్ని పొందిందని మనం విన్నాం. దనువు కశ్యపుడి వల్ల బలగర్వితులైన నూర్గురు పుత్రుల్ని పొందింది. ఓ మునిశ్రేష్ఠులారా! వాళ్లల్లో విప్రచిత్తి అనే అతడు ముఖ్యుడు. ఓ ద్విజశ్రేష్ఠులారా! తామ్ర అనేది శుకి, శ్యేని, భాసి, సుగ్రీవి, గృధ్రిక మరియు శుచి ఈ ఆరుగురు పుత్రికల్ని కన్నది. శుకి ధర్మిడి వల్ల శుకగణానికి, ఉలూక వర్గానికి జన్మ యిచ్చింది. శ్యేని శ్యేనాలకు, భాసి కురంగాలకు జన్మనిచ్చారు. గృధ్రి రాబందులకు, కపోతాలకు మరియు పారావతాలకు జన్మనిచ్చింది. శుచి హంసలకు, సారసాలకు (చాతకాలు) అట్లే కారండ పక్షులకు జన్మనిచ్చింది. సుగ్రీవి మేకలకు, గొర్రెలకు, అశ్వాలకు, ఒంటెలకు, గాడిదలకు జన్మనిచ్చింది.

**వినతా జనయామాస గరుడం చారుణం శుభా ॥32॥**

**సౌదామినీం తథా కన్యాం సర్వలోకభయంకరీమ్ ।**
**సురసాయాః సహస్రం తు సర్పాణామభవత్పురా ॥33॥**

**కద్రూః సహస్రశిరసాం సహస్రం ప్రాప సువ్రతా ।**
**ప్రధానాస్తేషు విఖ్యాతాః షడ్వింశతిరనుత్తమాః ॥34॥**

**శేషవాసుకికర్కోటశంఖైరావతకంబలాః ।**
**ధనంజయమహానీలపద్మాశ్వతరతక్షకాః ॥35॥**

**ఐలాపత్రమహాపద్మధృతరాష్ట్రబలాహకాః ।**
**శంఖపాలమహాశంఖపుష్పదంష్ట్రశుభాననాః ॥36॥**

**శంఖలోమా చ నహుషో వామనః ఫణితస్తథా ।**
**కపిలో దుర్ముఖశ్చాపి పతంజలిరితి స్మృతః ॥37॥**

వినత కశ్యపుడి వల్ల గరుత్మంతుణ్ణి, అరుణుణ్ణి మరియు సర్వలోకభయకారిణి అయిన సౌదామిని అనే పేరుగల పుత్రికను కన్నది. సురస అనే కశ్యపుడి భార్య వెయ్యిపాములకు జన్మనిచ్చింది. సువ్రతురాలైన కద్రువ సహస్రశీర్షులైన వేయిసర్పాల్ని కన్నది. వాళ్లలో ఇరవై ఆరుగురు ప్రధానమైనవారు. ఉన్నతులూనూ. శేషుడు,వాసుకి, శంఖుడు, ఐరావతుడు, కంబలుడు, ధనంజయుడు, మహానీలుడు, పద్మడు, అశ్వతరుడు, తక్షకుడు, ఐలాపత్రుడు, మహాపద్మడు, ధృతరాష్ట్రుడు, వలాహకుడు, శంఖపాలుడు, మహాశంఖుడు, పుష్పదంష్ట్రుడు, శుభాననుడు, శంఖలోముడు, నహుషుడు, వామనుడు, ఫణితుడు, కపిలుడు, దుర్ముఖుడు అట్లే పతంజలి అనేవాళ్లు.

**రక్షోగణం క్రోధవశా మహామాయం వ్యజీజనత్ ।**
**రుద్రాణాం చ గణం తద్వద్ గోమహిష్యౌ వరాంగనా ॥38॥**

**సురభిర్జనయామాస కశ్యపాదితి నః శ్రుతమ్ ।**
**మునిర్మునీనాం చ గణం గణమప్సరసాం తథా ॥39॥**

**తథా కిన్నరగంధర్వానరిష్టా జనయద్ బహూన్ ।**
**తృణవృక్షలతాగుల్మమిలా సర్వమజీజనత్ ॥40॥**

**త్విషా తు యక్షరక్షాంసి జనయామాస కోటిశః ।**
**ఏతే తు కాశ్యపేయాశ్చ సంక్షేపాత్పరికీర్తితా ॥41॥**

**ఏతేషాం పుత్రపౌత్రాదివంశాశ్చ బహవః స్మృతాః ।**

క్రోధవశ అయిన మహామాయావి రాక్షసులకు, అట్లే రుద్రగణాలకు జన్మనిచ్చింది. సుందరస్త్రీ సురభి కశ్యపుడి వల్ల గోవుల్ని, వృషభాల్ని కన్నదని మనం విన్నాం. ముని అనే పేరుగల కశ్యపుడి భార్య మునుల్ని అప్సరసల్ని కన్నది. అరిష్ట కిన్నరులకు గంధర్వులకు జన్మనిచ్చింది. ఇళ అనే కశ్యపుడి భార్య సమస్తతృణాలకు, వృక్షాలకు, లతలకు, గుల్మాలకు జన్మనిచ్చింది. త్విష కూడా కోట్ల కొలది యక్షులకు, రాక్షసులకు తల్లి అయ్యింది. వీరందరూ కశ్యపుడి సంతానంగా (కాశ్యపేయులు) సంగ్రహంగా చెప్పబడుతున్నారు. వీళ్ల పుత్రపౌత్రాదికమైన వంశం అనేకంగా చెప్పబడింది.

**ఏవం ప్రజాసు సృష్టాసు కశ్యపేన మహాత్మనా ॥42॥**

**ప్రతిష్ఠాసు సర్వాసు చరాసు స్థావరాసు చ ।**
**అభిషించ్యాధిపత్యేషు తేషాం ముఖ్యాన్ ప్రజాపతిః ॥43॥**

**తతో మనుష్యాధిపతిం చక్రే వైవస్వతం మనుమ్ ।**
**స్వాయంభువేఽ ంతరే పూర్వం బ్రహ్మణా యేఽ భిషేచితాః ॥44॥**

**తైరియం పృథివీ సర్వా సప్తద్వీపా సపర్వతా ।**
**యథోపదేశమద్యాపి ధర్మేణ ప్రతిపాల్యతే ॥45॥**

**స్వాయంభువేఽ ంతరే పూర్వే బ్రహ్మణా యేఽ భిషేచితాః ।**
**తే హ్యేతే చాభిషిచ్యంతే మనవశ్చ భవంతి తే ॥46॥**

**మన్వంతరేష్వతీతేషు గతా హ్యేతేషు పార్థివాః ।**
**ఏవమన్యేఽ భిషిచ్యంతే ప్రాప్తే మన్వంతరే తతః ॥47॥**

**అతీతానాగతాః సర్వే నృపా మన్వంతరే తతః ।**

ఈ విధంగా మహాత్ముడైన కశ్యపుడు ప్రజల్ని సృష్టించి వాళ్లలో ముఖ్యుల్ని స్థావరజంగమస్థానాలకు అధిపతులుగా అభిషేకించాడు. తర్వాత వైవస్వత మనువును మనుష్యులకు అధిపతిని చేశాడు. స్వాయంభువ మన్వంతరంలో బ్రహ్మదేవుడిచేత ఎవరు అభిషేకించబడ్డారో, వారిచేతనే సప్తద్వీపాలతో, కులపర్వతాలతో కూడిన సమస్తభూమండలం ఎలా ఆదేశింపబడిందో, అలా ఇప్పటికీ ధర్మమార్గంలో పరిపాలింపబడుతోంది. బ్రహ్మదేవుడు పూర్వస్వాయంభువమన్వంతరాలలో ఎవర్ని అభిషేకించాడో వారే మరల ఇక్కడ అభిషిక్తులవుతున్నారు. మనువులు అవుతున్నారు. ఈ మన్వంతరాలు జరిగిపోగా రాజులు మారిపోతున్నారు. తదుపరిమన్వంతరాలలో ఇతరులు అభిషిక్తులవుతున్నారు. గడచిన మరియు రానున్న రాజులు ఆయా మన్వంతరాలలో ఉంటారు.

**ఏతానుత్పాద్య పుత్రాంస్తు ప్రజా సంతానకారణాత్ ॥48॥**

**కశ్యపో గోత్రకామస్తు చచార స పునస్తపః ।**
**పుత్రో గోత్రకరో మహ్యం భవతాదితి చింతయన్ ॥49॥**

**తస్యైవం ధ్యాయమానస్య కశ్యపస్య మహాత్మనః ।**
**బ్రహ్మయోగాత్సుతౌ పశ్చాత్ప్రాదుర్భూతౌ మహౌజసౌ ॥50॥**

**వత్సరశ్చాసితశ్చైవ తావుభౌ బ్రహ్మవాదినౌ ।**
**వత్సరాన్నైధ్రువో జజ్ఞే రైభ్యశ్చ సుమహాయశాః ॥51॥**

**రైభస్య రైభ్యా విజ్ఞేయా నైధ్రువస్య వదామి వః ।**
**చ్యవనస్య తు కన్యాయాం సుమేధాః సమపద్యత ॥52॥**

**నైధ్రువస్య తు సా పత్నీ మాతా వై కుండపాయినామ్ ।**
**అసితస్యైకపర్ణాయాం బ్రహ్మిష్ఠః సమపద్యత ॥53॥**

**శాండిల్యానాం వరః శ్రీమాన్ దేవలః సుమహాతపాః ।**
**శాండిల్యా నైధ్రువా రైభ్యాస్త్రయః పక్షాస్తు కాశ్యపాః ॥54॥**

కశ్యపుడు ప్రజాభివృద్ధికై పైవారినందర్ని ఉత్పత్తి చేసినవాడైనా, తన వంశాన్ని నిలిపే కోరికతో మరల తపస్సును ఆచరించాడు. నాకు గోత్రకారకుడైన పుత్రుడు కలుగుగాక అని ఆలోచిస్తూ దానినే ధ్యానిస్తున్న, మహానుభావుడైన కశ్యపుడికి బ్రహ్మయోగంవల్ల మహాకాంతిమంతులైన ఇద్దరుపుత్రులు కలిగారు. వత్సరుడు, అసితుడు అను ఆ యిద్దరు బ్రహ్మవాదులు. వత్సరుడికి మహాయశస్వంతులు నైధ్రువుడు, రైభ్యుడు కలిగారు. రైభ్యుడి పుత్రులుకూడా రైభ్యులుగానే పిలువబడుతున్నారు. ఓ ఋషులారా! నేనిప్పుడు నైధ్రువుడి పుత్రులగూర్చి చెబుతున్నాను. చ్యవనుడి కన్యయందు సుమేధ పుట్టింది. ఆమె నైధ్రువుడి భార్య. కుండపాయినికి తల్లి. అసితుడికి ఏకపర్ణయందు శాండిల్యులలో శ్రేష్ఠుడు, బ్రహ్మిష్ఠి, శ్రీమంతుడు, మహాతపస్వి దేవలుడు పుట్టాడు. ఈ విధంగా శాండిల్యుడు, నైధ్రువుడు అట్లే రైభ్యుడు ఈ ముగ్గురు కాశ్యపుడి పక్షం వాళ్లు.

**నవప్రకృతయోஉదేవాః పులస్త్యస్య వదామి వః ।**
**చతుర్యుగే హ్యతిక్రాంతే మనోరేకాదశే ప్రభోః ॥55॥**

**అర్ధావశిష్టే తస్మింస్తు ద్వాపరే సంప్రవర్తితే ।**
**మానవస్య నరిష్యంతః పుత్ర ఆసీద్దమః కిల ॥56॥**

**దమస్య తస్య దాయాదస్తృణబిందురితి స్మృతః ।**
**త్రేతాయుగముఖే రాజా తృతీయే సంబభూవ హ ॥57॥**

**తస్య కన్యా త్విలవిలా రూపేణాప్రతిమాభవత్ ।**
**పులస్త్యాయ స రాజర్షిస్తాం కన్యాం ప్రత్యపాదయత్ ॥58॥**

**ఋషిరైరవిలో యస్యాం విశ్రవాః సమపద్యత ।**
**తస్య పత్న్యశ్చతస్రస్తు పౌలస్త్యకులవర్ధనాః ॥59॥**

**బృహస్పతేః శుభా కన్యా నామ్నా వై దేవవర్ణినీ ।**
**పుష్పోత్కటా బలాకా చ సుతే మాల్యవతః స్మృతే ॥60॥**

**కైకసీ మాలినః కన్యా తాసాం వై శృణుత ప్రజాః ।**

ఇప్పుడు పులస్త్యుడి యొక్క దేవభిన్నులైన అనగా రాక్షసులైన తొమ్మిదిమంది కుమారుల్ని గూర్చి చెబుతున్నాను. పదకొండవ మనువు కాలంలో నాల్గుయుగాలు గడచిపోగా వాటి సగభాగం జరుగుతుండగా అప్పుడు ద్వాపరయుగం ప్రారంభమయ్యింది. అప్పుడు మనువంశంలో నిరిష్యంతుడికి దముడనే పుత్రుడు కలిగాడు. దముడి దాయాది అనగా జ్ఞాతి (ఉత్తరాధికారి) తృణబిందువు. ఆతడు త్రేతాయుగంలో మూడువంతులకాలంలో రాజైనాడు. ఆతడి కుమార్తె ఇళవిల సుందరరూపవతి. తృణబిందువు చేత ఆ కన్య పులస్త్యుడికి ఇవ్వబడింది. ఆమెకు ఋషి విశ్రవుడు పుట్టాడు. పౌలస్త్యవంశాన్ని వృద్ధిపర్చే ఆతడికి నలుగురు భార్యలు. మొదటిది దేవవర్ణిని అనే పేరుగలది. అందమైన ఆమె బృహస్పతి కుమార్తె. తర్వాతి ఇద్దరు పుష్పోత్కట, బలాక అనువారు మాల్యవానుడి పుత్రికలు. కైకసి మాలి యొక్క పుత్రిక. ఇక వారి సంతానాన్ని గూర్చి వినండి.

జ్యేష్ఠం వై(శ్రవణం తస్మాత్సుషువే దేవవర్ణినీ ॥**61**॥

కైకసీ చాప్యజనయద్రావణం రాక్షసాధిపమ్ ।
కుంభకర్ణం శూర్పణఖాం ధీమంతం చ విభీషణమ్ ॥**62**॥

పుష్పోత్కటా హ్యజనయత్పుత్రాంస్తస్మాద్ ద్విజోత్తమాః ।
మహోదరం ప్రహస్తం చ మహాపార్శ్వం ఖరం తథా ॥**63**॥

కుంభీనసీం తథా కన్యాం బలాయాః శృణుత ప్రజాః ।
త్రిశిరా దూషణశ్చైవ విద్యుజ్జిహ్వశ్చ రక్షసః ॥**64**॥

కన్యా వై మాలికా చాపి బలాయాః ప్రసవః స్మృతః ।
ఇత్యేతే క్రూరకర్మాణః పౌలస్త్యా రాక్షసా నవ ॥**65**॥

విభీషణోఽతిశుద్ధాత్మా ధర్మజ్ఞః పరికీర్తితః ।
పులస్త్యస్య మృగాః పుత్రాః సర్వే వ్యాఘ్రాశ్చ దంష్ట్రిణః ॥**66**॥

భూతాః పిశాచాః సర్పాశ్చ సూకరా హస్తినస్తథా ।
వానరాః కిన్నరాశ్చైవ యే చ కింపురుషా స్తథా ॥**67**॥

దేవవర్ణిని విశ్రవుడివల్ల జ్యేష్ఠుడైన కుబేరుణ్ణి కన్నది. కైకసి దేవతలరాజైన రావణుణ్ణి, కుంభకర్ణుణ్ణి, శూర్పణఖను, బుద్ధిమంతుడైన విభీషణుణ్ణి కన్నది. పుష్పోత్కట విశ్రవుడివల్ల మహోదరుడు, ప్రహస్తుడు, మహాపార్శ్వుడు, ఖరుడు అనే పుత్రుల్ని, కుంభీనస అనే పుత్రికను కన్నది. ఇప్పుడు బలాకి యొక్క సంతానాన్ని గూర్చి వినండి. త్రిశరుడు, దూషణుడు, విద్యుజ్జిహ్వుడు అనే రాక్షసపుత్రులు, మాలిక అనే కుమార్తె బలాకికి కలిగారు. పులస్త్యుడికి ఈ తొమ్మిదిమంది క్రూరకర్ములైన రాక్షసులు మనుమలు. విభీషణుడు మిక్కిలి పవిత్రాత్ముడు, ధర్మజ్ఞుడు. పులస్త్యుడికి మృగాలు, కోరలు గలిగిన వ్యాఘ్రాదిక్రూరజంతువులు, పశువులు, భూతాలు, పిశాచాలు, సర్పాలు, సూకరాలు, ఏనుగులు, వానరాలు, కిన్నరులు, కింపురుషులు సమస్తమూ సంతానమే.

అనపత్యః క్రతుస్తస్మిన్ స్మృతో వైవస్వతేఽంతరే ।
అత్రేః పత్న్యో దశైవాసన్ సుందర్యశ్చ పతివ్రతాః ॥**68**॥

భద్రాశ్వస్య ఘృతాచ్యాం వై దశాప్సరసి సూనవః ।
భద్రాభద్రా చ జలదా మందా నందా తథైవ చ ॥**69**॥

బలాబలా చ విప్రేంద్రా యా చ గోపాబలా స్మృతా ।
తథా తామరసా చైవ వరక్రీడా చ వై దశ ॥**70**॥

ఆత్రేయవంశప్రభవాస్తాసాం భర్తా ప్రభాకరః ।
స్వర్భానుపిహితే సూర్యే పతితేఽస్మిన్ దివో మహీమ్ ॥**71**॥

**తమోऽభిభూతే లోకేऽస్మిన్ ప్రభా యేన ప్రవర్తితా ।**
**స్వస్త్యస్తు హి తవేత్యుక్తే పతన్నిహ దివాకరః ॥72॥**

**బ్రహ్మర్షేర్వచనాత్తస్య పపాత న విభుర్దివః ।**
**తతః ప్రభాకరేత్యుక్తః ప్రభురత్రిర్మహర్షిభిః ॥73॥**

ఈ వైవస్వతమన్వంతరంలో క్రతువు సంతానంలేనివాడు. అత్రి మహర్షికి సుందరులు, పతివ్రతలు అయిన పదిమంది భార్యలు. ఘృతాచి అనే అప్సరసవల్ల భద్రాశ్వుడికి పదిమంది కుమార్తెలు కలిగారు. ఓ మునులారా! భద్ర, అభద్ర, జలద, మంద, నంద, బల, అబల, గోపాబల, తామరస, మరియు వరక్రీడ అనేవాళ్లు. వీళ్లందరూ అత్రి వంశంలో పుట్టారు. ఈ వంశానికి ప్రభువు ప్రభాకరుడు. ఎప్పుడు సూర్యుడు రాహువు వల్ల కప్పబడినాడో, మరియు దివి నుంచి భువికి జారాడో అప్పుడు ఈ లోకం చీకటితో నిండింది. అప్పుడు అత్రి మహర్షి వల్ల కాంతి ప్రవర్తిల్లింది. "నీకు శుభమగుగాక" అని ఋషి సూర్యుణ్ణి ఆశీర్వదించగా క్రిందకు పడుతున్న ప్రభువైన సూర్యుడు స్వర్గం నుంచి భూమిపై పడలేదు. అప్పుడు ప్రభువైన అత్రిని గూర్చి సూర్యుడు ఇలా పలికాడు.

**భద్రాయాం జనయామాస సోమం పుత్రం యశస్వినమ్ ।**
**స తాసు జనయామాస పునః పుత్రాంస్తపోధనః ॥74॥**

**స్వస్త్యాత్రేయా ఇతి ఖ్యాతా ఋషయో వేదపారగాః ।**
**తేషాం ద్వౌ ఖ్యాతయశసౌ బ్రహ్మిష్ఠౌ చ మహౌజసౌ ॥75॥**

**దత్తో హ్యాత్రివరో జ్యేష్ఠో దుర్వాసస్తస్య చానుజః ।**
**యవీయసీ స్వసా తేషామమలా బ్రహ్మవాదినీ ॥76॥**

**తస్య గోత్రద్వయే జాతాశ్చత్వారః ప్రథితా భువి ।**
**శ్యావశ్చ ప్రత్వసశ్చైవ వవల్గుశ్చాథ గహ్వరః ॥77॥**

**ఆత్రేయాణాం చ చత్వారః స్మృతాః పక్షా మహాత్మనామ్ ।**
**కశ్యపో నారదశ్చైవ పర్వతోऽనుద్ధతస్తథా ॥78॥**

**జజ్ఞిరే మానసా హ్యేతే అరుంధత్యా నిబోధత ।**

అత్రిఋషి భద్రయందు యశస్వంతుడైన సోముణ్ణి పుత్రుడిగా పొందాడు. తపోధనుడైన ఆతడు మరల ఆమె వల్ల పుత్రులకు జన్మనిచ్చాడు. వాళ్లందరూ 'స్వస్త్యాత్రేయులు'గా వేదవిదులుగా ప్రసిద్ధి చెందారు. వాళ్లలో ఇద్దరు ప్రఖ్యాత యశస్వులు, బ్రహ్మవేత్తలు, మహాకాంతిమంతులు. దత్తుడు అత్రికి జ్యేష్ఠ కుమారుడు. దూర్వాసుడు ఆతడి తమ్ముడు. అమల వాళ్ల చెల్లెలు. ఆమె బ్రహ్మవేత్త. వాళ్ల రెండు వంశాలలో శ్యావుడు, ప్రత్వసుడు, వవల్గుడు మరియు గహ్వరుడు అనే ఈ నలుగురు కలిగారు. వాళ్లు భూలోకంలో ప్రసిద్ధులయ్యారు. మహాత్ములైన వీళ్లు ఆత్రేయగోత్రీకులైన నాల్గువర్గాల వాళ్లు. కాశ్యపుడు, నారదుడు, పర్వతుడు, అనుద్ధతుడు మానసపుత్రులు. ఇక అరుంధతిసంతానాన్ని గూర్చి వినండి!

**నారదస్తు వసిష్ఠాయారుంధతీం ప్రత్యపాదయత్ ॥79॥**

**ఊర్ధ్వరేతా మహాతేజా దక్షశాపాత్తు నారదః ।**
**పురా దేవాసురే యుద్ధే ఘోరే వై తారకామయే ॥80॥**

**అనావృష్ట్యా హతే లోకే హ్యుగ్రే లోకేశ్వరైః సహ ।**
**వసిష్ఠస్తపసా ధీమాన్ ధారయామాస వై ప్రజాః ॥81॥**

**అన్నోదకం మూలఫలం ఓషధీశ్చ ప్రవర్తయన్ ।**
**తానేతాన్ జీవయామాస కారుణ్యాదౌషధేన చ ॥82॥**

**అరుంధత్యాం వసిష్ఠస్తు సుతానుత్పాదయచ్ఛతమ్ ।**
**జ్యాయసోఽజనయచ్ఛక్తేరదృశ్యంతీ పరాశరమ్ ॥83॥**

మహర్షి నారదుడు అరుంధతీదేవిని వసిష్ఠుడికి ప్రదానం చేశాడు. దక్షుడి శాపం వల్ల మహాతేజస్వంతుడైన నారదుడు బ్రహ్మచారి అయినాడు. పూర్వం తారకుడి కారణంగా భయంకరమైన దేవదానవయుద్ధంతో అనావృష్టి వల్ల జనం హతులై లోకం భయంకరంకాగా, బుద్ధిమంతుడైన వసిష్ఠుడు లోకనాయకులతో కూడా ప్రజల్ని పోషించాడు. అన్నం, ఉదకం, కందమూలం, ఫలం అట్లే ఓషధులు ఉత్పత్తి చేసి దయతో వాళ్లందర్ని జీవింపచేశాడు. వసిష్ఠుడు అరుంధతి యందు నూర్గురు కొడుకుల్ని కన్నాడు. వాళ్లల్లో జ్యేష్ఠుడైన శక్తివల్ల అదృశ్యంతి పరాశరుణ్ణి కన్నది.

**రక్షసా భక్షితే శక్తౌ రుధిరేణ తు వై తదా ।**
**కాళీ పరాశరాజ్జజ్ఞే కృష్ణద్వైపాయనం ప్రభుమ్ ॥84॥**

**ద్వైపాయనో హ్యరణ్యాం వై శుకముత్పాదయత్సుతమ్ ।**
**ఉపమన్యుం చ పీవర్యాం విద్ధీమే శుకసూనవః ॥85॥**

**భూరిశ్రవాః ప్రభుః శంభుః కృష్ణో గౌరస్తు పంచమః ।**
**కన్యా కీర్తిమతీ చైవ యోగమాతా ధృతవ్రతా ॥86॥**

**జననీ బ్రహ్మదత్తస్య పత్నీ సా త్వనుహస్య చ ।**
**శ్వేతః కృష్ణశ్చ గౌరశ్చ శ్యామో ధూమ్ర స్తథారుణః ॥87॥**

**నీలో బాదరికశ్చైవ సర్వే చైతే పరాశరాః ।**
**పరాశరాణామష్టౌ తే పక్షాః ప్రోక్తా మహాత్మనామ్ ॥88॥**

రాక్షసుడైన రుధిరుడుచే శక్తి భక్షింపబడ్డాడు. కాళీదేవి పరాశరుడి వల్ల కృష్ణద్వైపాయనుణ్ణి అనగా వ్యాసుణ్ణి పొందింది. తర్వాత వ్యాసుడు అరణివల్ల శుకుణ్ణి, ఉపమన్యుణ్ణి పొందాడు. పీవరి వల్ల శుకుడికి కల్గిన పుత్రులు వీళ్లు. భూరిశ్రవుడు, ప్రభువు, శంభువు, కృష్ణుడు. అట్లే ఐదవవాడు గౌరుడు. శుకుడికి కీర్తమల అనే పుత్రిక కూడా కలదు. ఆమె యోగవేత్త మరియు వ్రతధారిణి. ఆమె బ్రహ్మదత్తుడికి తల్లి. అనుహకుడికి భార్య. శ్వేతుడు, కృష్ణుడు,

గౌరుడు, శ్యాముడు, ధూమ్రుడు, అరుణుడు, నీలుడు అట్లే బాదరికుడు అనే వీళ్లు పరాశరుడి వంశస్థులు. ఈ ప్రకారంగా మహాత్ముడైన పరాశరుడి వంశజులు ఎనిమిది వర్గాలవారని తెలియాలి.

**అత ఊర్ధ్వం నిబోధధ్వమింద్రప్రమితిసంభవమ్ ।**
**వసిష్ఠస్య కపింజల్యో ఘృతాచ్యాముదపద్యత ॥89॥**

**త్రిమూర్తిర్యః సమాఖ్యాత ఇంద్రప్రమితిరుచ్యతే ।**
**పృథోః సుతాయాం సంభూతో భద్రస్తస్యాభవద్వసుః ॥90॥**

**ఉపమన్యుః సుతస్తస్య బహవో హ్యౌపమన్యవః ।**
**మిత్రావరుణయోశ్చైవ కౌండిన్యా యే పరిశ్రుతాః ॥91॥**

**ఏకార్షేయాస్తథా చాన్యే వాసిష్ఠా నామ విశ్రుతాః ।**
**ఏతే పక్షా వసిష్ఠానాం స్మృతా దశ మహాత్మనామ్ ॥92॥**

ఓ ఋషులారా! దీనికి ముందు మనం ఇంద్రప్రమితి ఉత్పత్తినిగూర్చి తెలియాలి. వసిష్ఠుడి కుమారుడు కపింజల్యుడు ఘృతాచివల్ల ఇంద్రప్రమితిని పొందాడు. ఆతడు 'త్రిమూర్తి' అనే పేరుతో కూడా ప్రఖ్యాతి పొందాడు. పృథువు సుతకు భద్రుడు పుట్టాడు. భద్రుడి పుత్రుడు వసువు. ఆతడి పుత్రుడు ఉపమన్యువు. ఆతడికి అనేక పుత్రులు కలిగారు. వాళ్ళలో మిత్రుడు, వరుణుడు అనేవాళ్లు శ్రేష్ఠులు. కౌండిన్యులు అనే పేరుతో వాళ్లందరూ ప్రసిద్ధులు. వాళ్లు మిత్రావరుణులకు ఉత్తరాధికారులు. మరికొందరు ఏకార్షేయులు కూడా వాసిష్ఠగోత్రీకులుగా ప్రసిద్ధులు. మహాత్ముడైన వసిష్ఠుడి వంశం ఇలా పది వర్గాలుగా విస్తరించింది.

**ఇత్యేతే బ్రహ్మణః పుత్రా మానసా విశ్రుతా భువి ।**
**భర్తారశ్చ మహాభాగా ఏషాం వంశాః ప్రకీర్తితాః ॥93॥**

**త్రిలోకధారణే శక్తా దేవర్షికులసంభవాః ।**
**తేషాం పుత్రాశ్చ పౌత్రాశ్చ శతశోఽథ సహస్రశః ॥94॥**

**యైస్తు వ్యాప్తాస్త్రయో లోకాః సూర్యస్యేవ గభస్తిభిః ॥95॥**

వీళ్లందరూ బ్రహ్మమానసపుత్రులుగా ఈ భూమిపై విఖ్యాతులయ్యారు. వీళ్లందరూ సమస్తలోకాల్ని భరించేవాళ్లు. నేను వీళ్ల వంశాల్ని గూర్చి పలికాను. దేవర్షివంశంలో పుట్టిన వీళ్లు మూడు లోకాల్ని ధరించగలరు. వీళ్ల పుత్రులు, పౌత్రులు వందల్లో, వేలల్లో ఉన్నారు. వీళ్లు సూర్యకిరణాల మాదిరిగా మూడు లోకాల్ని వ్యాపించి ఉన్నారు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే దేవాదిసృష్టి కథనంనామ త్రిషష్టితమోఽధ్యాయః ॥ 63 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని దేవాదిసృష్టికథనమనే అరవై మూడవ అధ్యాయం సమాప్తం.

## **చతుష్షష్టితమోఽధ్యాయః** - అరవై నాల్గవఅధ్యాయం

## **వాసిష్ఠకథనమ్** - వాసిష్ఠకథనం

**ఋషయః ఊచుః** - మునులు పలికారు.

> **కథం హి రక్షసా శక్తిర్భక్షితః సోఽనుజైః సహ ।**
> **వాసిష్ఠో వదతాం శ్రేష్ఠ సూత వక్తుమిహార్హసి ॥1॥**

ఓ వక్తృశ్రేష్ఠ! సూతమహర్షీ! వసిష్ఠుడి పుత్రుడైన శక్తి తమ్ములతో కూడా రుధిరరాక్షసుడిచేత ఏ విధంగా తినబడ్డాడో చెప్పండి!

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

> **రాక్షసో రుధిరో నామ వసిష్ఠస్య సుతం పురా ।**
> **శక్తిం స భక్షయామాస శక్తేః శాపాత్ సహానుజైః ॥2॥**

> **వసిష్ఠయాజ్యం విప్రేంద్రాస్తదావిశ్యైవ భూపతిమ్ ।**
> **కల్మాషపాదం రుధిరో విశ్వామిత్రేణ చోదితః ॥3॥**

వసిష్ఠకుమారుడైన శక్తికిగల శాపకారణంగా రుధిరుడు అనే పేరుగల రాక్షసుడు పూర్వం శక్తిని, శక్తి తమ్ముళ్ళనూ కూడా తిన్నాడు. ఓ భూసురశ్రేష్ఠులారా! ఆ రుధిరుడు విశ్వామిత్రప్రేరితుడై, వసిష్ఠుడికి యజమానుడైన, కల్మాషపాదుడనే రాజు శరీరంలోనికి ప్రవేశించి వాళ్లను భక్షించాడు.

> **భక్షితః స ఇతి శ్రుత్వా వసిష్ఠస్తేన రక్షసా ।**
> **శక్తిః శక్తిమతాం శ్రేష్ఠో భ్రాతృభిః సహ ధర్మవిత్ ॥4॥**

> **హా పుత్ర పుత్ర పుత్రేతి క్రందమానో ముహుర్ముహుః ।**
> **అరుంధత్యా సహ మునిః పపాత భువి దుఃఖితః ॥5॥**

ధర్మవేత్త, శక్తిమంతులలో శ్రేష్ఠుడు అయిన శక్తి తమ్ములతో కూడా రుధిరరాక్షసుడిచే భక్షింపబడ్డాడని విన్న ఋషి వసిష్ఠుడు ఓ పుత్రా! ఓ పుత్రా! ఓ పుత్రా! అంటూ కేకలు పెడుతూ, దుఃఖితుడై అరుంధతితో కూడా నేలపై పడిపోయాడు.

> **నష్టం కులమితి శ్రుత్వా మర్తుం చక్రే మతిం తదా ।**
> **స్మరన్ పుత్రశతం చైవ శక్తిజ్యేష్ఠం చ శక్తిమాన్ ॥6॥**

> **న తం వినాహం జీవిష్యే ఇతి నిశ్చిత్య దుఃఖితః ॥7॥**

నా వంశం నశించింది, జ్యేష్ఠుడైన శక్తితో కూడా నూర్గురు కుమారులు మరణించారు, వాళ్లు లేక నేను జీవించలేనని నిశ్చయించి దుఃఖితుడై మరణించడానికై నిశ్చయించాడు.

**ఆరుహ్య మూర్ధానమజాత్మజోఽసౌ తయాత్మవాన్ సర్వవిదాత్మవిచ్చ ।**
**ధరాధరస్యైవ తదా ధరాయాం పపాత పత్న్యా సహసాస్రుదృష్టిః ॥8॥**

బ్రహ్మమానసపుత్రుడు, ఆత్మవంతుడు, సర్వమూ తెలిసినవాడు, మరియు ఆత్మవేత్త అయిన వసిష్ఠుడు సాస్రులోచనుడై గిరిశిఖరాన్ని అధిరోహించి భార్య అరుంధతితో కూడా క్రిందకు దూకాడు.

**ధరాధరాత్తం పతితం ధరా తదా దధార తత్రాపి విచిత్రకంఠీ ।**
**కరాంబుజాభ్యాం కరిఖేలగామినీ రుదంతమాదాయ రురోద సా చ ॥9॥**

కొండమీదనుంచి పడిన వసిష్ఠుడిని భూదేవి తన కరకమలాలతో పట్టుకున్నది. విచిత్రమైన కంఠహారముగలది, గజం మాదిరి క్రీడాయుక్తురాలు అయిన ధరాదేవి దుఃఖిస్తున్న వసిష్ఠుడిని పట్టుకుని తానూ రోదించింది.

**తదా తస్య స్నుషా ప్రాహ పత్నీ శక్తేర్మహామునిమ్ ।**
**వసిష్ఠం వదతాం శ్రేష్ఠం రుదంతీ భయవిహ్వలా ॥10॥**

**భగవాన్ బ్రాహ్మణశ్రేష్ఠ తవ దేహమిదం శుభమ్ ।**
**పాలయస్వ విభో ద్రష్టుం తవ పౌత్రం మహాత్మజమ్ ॥11॥**

**న త్యాజ్యం తవ విప్రేంద్ర దేహమేతత్సుశోభనమ్ ।**
**గర్భస్థో మమ సర్వార్థసాధకః శక్తిజో యతః ॥12॥**

అప్పుడు వక్తృశ్రేష్ఠుడు, మహాముని అయిన వసిష్ఠుడి కోడలు, శక్తి భార్య భయవ్యాకుల అయి ఏడుస్తూ వసిష్ఠుడితో ఇలా పలికింది. ఓ భగవంతుడా! ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! ఓ ప్రభూ! నా పుత్రుణ్ణి మీ మనుమణ్ణి చూడడానికై శుభకరమైన మీ దేహాన్ని రక్షించుకోండి! ఓ బ్రాహ్మణశ్రేష్ఠ! సుందరమైన మీ యీ శరీరాన్ని విడిచిపెట్టవద్దు. ఎందుకంటే సమస్తకార్యసిద్ధికారకుడు శక్తిపుత్రుడు నా గర్భమందున్నాడు కాబట్టి.

**ఏవముక్త్వాథ ధర్మజ్ఞా కరాభ్యాం కమలేక్షణా ।**
**ఉత్థాప్య శ్వశురం నత్వా నేత్రే సమ్మృజ్యవారిణా ॥13॥**

**దుఃఖితాపి పరిత్రాతుం శ్వశురం దుఃఖితం తదా ।**
**అరుంధతీం చ కళ్యాణీం ప్రార్థయామాస దుఃఖితామ్ ॥14॥**

ధర్మవేత్త, పద్మేక్షణ అయిన శక్తి భార్య ఆ విధంగా పలికి మామను పైకి లేపి, నమస్కరించి, నీటిలో నేత్రాల్ని కడిగి, తాను దుఃఖిత అయి కూడా, దుఃఖితుడైన మామను మరియు అత్త అయిన కళ్యాణి అరుంధతిని ప్రార్థించి రక్షించడానికి ప్రయత్నించింది.

**స్నుషావాక్యం తతః శ్రుత్వా వసిష్ఠోత్థాయ భూతలాత్ ।**
**సంజ్ఞామవాప్య చాలింగ్య సా పపాత సుదుఃఖితా ॥15॥**

**అరుంధతీ కరాభ్యాం తాం సంస్పృశ్యాస్రాకులేక్షణామ్ ।**

**రురోద మునిశార్దూలో భార్యయా సుతవత్సలః ॥16॥**

తర్వాత కోడలి మాట విని చైతన్యాన్ని పొంది పుత్రవత్సలుడు, మునిశ్రేష్ఠుడూ అయిన వసిష్ఠుడు నేలపై నుంచి లేచి అరుంధతిని కౌగలించుకుని, అశ్రుపూరితనేత్ర కోడలైన అదృశ్యంతిని చేతులతో స్పృశించిన భార్యతో కలిసి దుఃఖించాడు. అదృశ్యంతి కూడా దుఃఖిస్తూ నేలమీద పడిపోయింది.

**అథ నాభ్యంబుజే విష్ణోర్యథా తస్యాశ్చతుర్ముఖః ।**
**ఆసీనో గర్భశయ్యాయాం కుమార ఋచమాహ సః ॥17॥**

**తతో నిశమ్య భగవాన్ వసిష్ఠ ఋచమాదరాత్ ।**
**కేనోక్తమితి సంచింత్య తదాతిష్ఠత్సమాహితః ॥18॥**

తర్వాత విష్ణువుయొక్క నాభికమలమందు బ్రహ్మ ఎలా ఆసీనుడయ్యాడో అట్లు ఆమె గర్భశయ్యమీద ఆసీనుడైన పుత్రుడు ఋక్కును పలికాడు. వసిష్ఠభగవానుడు ఆ ఋక్కును ఆదరంగా విని దీన్ని ఎవరు పలికారోనని ఆలోచించి ఏకాగ్రచిత్తుడయ్యాడు.

**వ్యోమాంగణస్థోఽథ హరిః పుండరీకనిభేక్షణః ।**
**వసిష్ఠమాహ విశ్వాత్మా ఘృణయా స ఘృణానిధిః ॥19॥**

**భో వత్స వత్స విప్రేంద్ర వసిష్ఠ సుతవత్సల ।**
**తవ పౌత్రముఖాంభోజాదృగేషాద్య వినిఃసృతా ॥20॥**

**మత్సమస్తవ పౌత్రోఽసౌ శక్తిజఃశక్తిమాన్ మునే ।**
**తస్మాదుత్తిష్ఠ సంత్యజ్య శోకం బ్రహ్మసుతోత్తమ ॥21॥**

**రుద్రభక్తశ్చ గర్భస్థో రుద్రపూజాపరాయణః ।**
**రుద్రదేవప్రభావేణ కులం తే సంతరిష్యతి ॥22॥**

**ఏవముక్త్వా ఘృణీ విప్రం భగవాన్ పురుషోత్తమః ।**
**వసిష్ఠం మునిశార్దూలం తత్రైవాంతరధీయత ॥23॥**

కమలసమాననేత్రుడు, విశ్వాత్ముడు, కృపానిధి అయిన విష్ణువు ఆకాశమార్గంలో నిలిచి దయాపూర్వకంగా వసిష్ఠుడితో ఇలా పలికాడు. "ఓ వత్స! ఓ వత్స! ఓ విప్రశ్రేష్ఠ! ఓ వసిష్ఠ! ఓ పుత్రవత్సల! నీ పౌత్రుడి ముఖపద్మంనుంచే ఆ ఋక్కు బయటకు వచ్చింది. ఓ మునీ! శక్తియొక్క ఈ పుత్రుడు మరియు నీకు మనుమడు నాకు సమానమైన శక్తిమంతుడు అవుతాడు. అందువల్ల, ఓ బ్రహ్మపుత్రుల్లో శ్రేష్ఠుడా! దుఃఖాన్ని పూర్తిగా విడిచిపెట్టి నిలిచి ఉండు. గర్భస్థుడైన ఈతడు రుద్రదేవుని భక్తుడు. శివపూజాపరతంత్రుడు. శివభగవానుడి ప్రభావంవల్ల నీకులం పూర్తిగా తరించగలదు" ఈ విధంగా మునిశ్రేష్ఠుడైన వసిష్ఠుణ్ణి గూర్చి పలికి కృపానిధి, భగవంతుడు నారాయణుడు అక్కడే అంతర్ధానం చెందాడు.

**తతః ప్రణమ్య శిరసా వసిష్ఠో వారిజేక్షణమ్ ।**
**అదృశంత్యా మహాతేజాః పస్పర్శోదరమాదరాత్ ॥24॥**

**హా పుత్ర పుత్ర పుత్రేతి పపాత చ సుదుఃఖితః ।**
**లలాపారుంధతీం ప్రేక్ష్య తదాసౌ రుదితీం ద్విజాః ॥25॥**

**స్వపుత్రం చ స్మరన్ దుఃఖాత్పునరేహ్యేహి పుత్రక ।**
**తవ పుత్రమిమం దృష్ట్వా భో శక్తే కులధారణమ్ ॥26॥**

**తవాంతికం గమిష్యామి తవ మాత్రా న సంశయః ॥27॥**

అనంతరం మహాకాంతిమంతుడు అయిన వసిష్ఠుడు, కమలనేత్రుడైన విష్ణువుకు శిరసు వంచి నమస్కరించి కోడలి ఉదరాన్ని సాదరంగా బాగా స్పృశించాడు. మిక్కిలి దుఃఖితుడై పుత్రా! పుత్రా! పుత్రా! అంటూ క్రింద పడ్డాడు. అప్పుడు ఏడుస్తున్న అరుంధతిని చూచి తానూ విలపించాడు. తన పుత్రుణ్ణి స్మరిస్తూ ఓ పుత్రకా! రమ్ము రమ్మని పిలుస్తూ దుఃఖించాడు. ఓ శక్తీ! కులవర్ధనుడైన నీ పుత్రుణ్ణి చూచి, నేను నీ తల్లితో కూడా నీ దగ్గరకు రాగలను. ఇందులో సందేహం లేదు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఏవముక్త్వా రుదన్ విప్ర ఆలింగ్యారుంధతీం తదా ।**
**పపాత తాడయంతీవ స్వస్య కుక్షిం కరేణ వై ।**
**అదృశ్యంతీ జఘానాథ శక్తిజస్యాలయం శుభా ॥28॥**

**స్వోదరం దుఃఖితా భూమౌ లలాప చ పపాత చ ।**
**అరుంధతీ తదా భీతా వసిష్ఠశ్చ మహామతిః ॥29॥**

**సముత్థాప్య స్నుషాం బాలామూచతుర్భయవిహ్వలౌ ॥30॥**

ఈవిధంగా పలికి విప్రుడైన వసిష్ఠుడు అరుంధతిని కౌగిలించుకుని ఏడుస్తూ భూమిపై పడ్డాడు. అదృశ్యంతి తన చేతులతో తన కడుపును కొట్టుకుంటున్నది. శక్తి కుమారుడికి నిలయమైన తన కడుపును పీడించుకుంటున్నది. దుఃఖితయై విలపించింది, భూమిమీద పడ్డది. మహాబుద్ధిమంతుడైన వసిష్ఠుడు, అరుంధతి కూడా భయపడ్డారు. భయవిచలితులైన ఆ దంపతులు కోడల్ని పైకి లేపినవారై ఆమెనుద్దేశించి ఇలా పలికారు.

**విచార ముగ్ధే తవ గర్భమండలం కరాంబుజాభ్యాం వినిహత్య దుర్లభమ్ ।**
**కులం వసిష్ఠస్య సమస్తమప్యహో నిహంతుమార్యే కథముద్యతా వద ॥31॥**

**తవాత్మజం శక్తిసుతం చ దృష్ట్వా చాస్వాద్య వక్త్రామృతమార్యసూనోః ।**
**త్రాతుం యతో దేహమిమం మునీంద్రః సునిశ్చితః పాహి తతః శరీరమ్॥32॥**

ఓ ఆలోచనాముగ్ధా! ఓ ఆర్యా! కరకమలాలతో దుర్లభమైన నీ గర్భమండలాన్ని పీడించి, వసిష్ఠుడి యొక్క సర్వవంశాన్ని చంపడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నావో చెప్పు. నీ కుమారుడు మరియు శక్తిపుత్రుణ్ణి చూచి,

ఆర్యపుత్రుడైన ఆతడి ముఖామృతాన్ని ఆస్వాదించేందుకు, మునీంద్రుడనైన నేను ఈ శరీరాన్ని రక్షించుకోవడానికి గట్టి నిర్ణయం తీసుకున్నాను. అందుచే నీవు నీ శరీరాన్ని రక్షించుకో.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఏవం స్నుషాముపాలభ్య మునిం చారుంధతీ స్థితా ।**
**అరుంధతీ వసిష్ఠస్య ప్రాహ చార్తేతి విహ్వలా ॥33॥**

**త్వయ్యేవ జీవితం చాస్య మునేర్యత్సువ్రతే మమ ।**
**జీవితం రక్ష దేహస్య ధాత్రీ చ కురు యద్ధితమ్ ॥34॥**

అరుంధతి దుఃఖంతో వ్యాకులచిత్త అయి కూడా ఈ విధంగా కోడలిని గూర్చి పలికింది. ఓ సువ్రతీ! నాయొక్కయు ఈ మునియొక్కయు జీవితం నీమీద ఆధారపడి ఉంది. కావున నీవు భూమి వలె నీ దేహాన్ని రక్షించుకో. ఏది శ్రేయస్సో అది నిర్వహించు.

**అదృశ్యంతీ ఉవాచ –** అదృశ్యంతి పలికింది.

**మయా యది మునిశ్రేష్ఠః త్రాతుం వై నిశ్చితం స్వకమ్ ।**
**మమాశుభం శుభం దేహం కథంచిత్ పాలయామ్యహమ్ ॥35॥**

**ప్రియదుఃఖమహం ప్రాప్తా హ్యాసతీ నాత్ర సంశయః ।**
**మునే దుఃఖాదహం దగ్ధా యతః పుత్రీ మునే తవ ॥36॥**

**అహోఽద్భుతం మయా దృష్టం దుఃఖపాత్రీ హ్యాహం విభో ।**
**దుఃఖత్రాతా భవ బ్రహ్మన్ బ్రహ్మసూనో జగద్గురో ॥37॥**

**తథాపి భర్తృరహితా దీనా నారీ భవేదిహ ।**
**పాహి మాం తత ఆర్యేంద్ర పరిభూతా భవిష్యతి ॥38॥**

**పితా మాతా చ పుత్రాశ్చ పౌత్రాః శ్వశుర ఏవ చ ।**
**ఏతే న బాంధవాః స్త్రీణాం భర్తా బంధుః పరా గతిః ॥39॥**

మునిశ్రేష్ఠుడు వసిష్ఠుడు తన జీవితాన్ని రక్షించుకోవడానికి నిర్ణయించుకున్నట్లైతే నేను కూడా శుభాశుభమైన నాయీదేహాన్ని ఏదో ఒక విధంగా రక్షించుకోగలను. భర్త వియోగదుఃఖాన్ని నేను పొందుతున్నాను. ఇందులో సందేహం లేదు. ఓ మునీ! దుఃఖంవల్ల నేను తగలబడ్డాను. ఓ మునీ! నేను నీ కుమార్తెను. ఓ విభుడా! నేను మహాద్భుతాన్ని చూశాను. నేను దుఃఖపాత్రను. ఓ బ్రహ్మా! ఓ బ్రహ్మపుత్రా! ఓ జగద్గురూ! ఈ దుఃఖం నుంచి నన్ను రక్షించు. భర్తలేని స్త్రీ ఈ లోకంలో దీనురాలు మరియు అవమానిత కాగలదు. ఓ ఆర్యశ్రేష్ఠ! నన్ను రక్షించు. తల్లిదండ్రులు, పుత్రుడు, పౌత్రుడు, మామ – వీళ్లెవ్వరూ స్త్రీకి బంధువులు కారు. స్త్రీలకు భర్తయే బంధువు. పరమమైన గతి.

**ఆత్మనో యద్ధి కథితమప్యర్థమితి పండితైః ।**
**తదప్యత్ర మృషా హ్యాసీత్ గతః శక్తిరహం స్థితా ॥40॥**

**అహో మమాత్ర కాఠిన్యం మనసో మునిపుంగవ ।**
**పతిం ప్రాణసమం త్యక్త్వా స్థితా యత్ర క్షణం యతః ॥41॥**

**వసిష్ఠాశ్వత్థమాశ్రిత్య హ్యమృతా తు యథా లతా ।**
**నిర్మూలాప్యమృతా భర్త్రా త్యక్తా దీనా స్థితాప్యహమ్ ॥42॥**

విద్వాంసులు ఏది చెప్పారో 'భార్య భర్తలో సగభాగమ'ని అది అబద్ధం. నా భర్త శక్తి మరణించగా నేను బ్రతికి ఉంటిని కాబట్టి. ఓ మునిశ్రేష్ఠ! నా మనసు మిక్కిలి కఠినమైనది. ఎందుకంటే ప్రాణసముడైన భర్తను వీడి క్షణమైనా ఇక్కడ నిలిచి ఉన్నది గనుక. ఓ వసిష్ఠా! ఏ విధంగా అశ్వత్థవృక్షాన్ని ఆశ్రయించి జీవించి యున్న తీగ ఆ వృక్షం నరకబడ్డా కూడా జీవించే ఉంటున్నది. అట్లే నేనూ భర్త లేకున్నా దీనురాలినై ఉన్నాను.

**స్నుషావాక్యం నిశమ్యైవ వసిష్ఠో భార్యయా సహ ।**
**తదా చక్రే మతిం ధీమాన్ యాతుం స్వాశ్రమమాశ్రమీ ॥43॥**

**కృచ్ఛ్రాత్సభార్యో భగవాన్ వాసిష్ఠః స్వాశ్రమం క్షణాత్ ।**
**అదృశ్యంత్యా చ పుణ్యాత్మా సంవివేశ స చింతయన్ ॥44॥**

గృహస్థాశ్రమవాసి అయిన వసిష్ఠుడు కోడలిమాటలు విని భార్యతో కూడా తన ఆశ్రమానికి వెళ్లడానికి అపుడు సిద్ధపడ్డాడు. పుణ్యాత్ముడైన భగవాన్ వసిష్ఠుడు సభార్యుడై, కోడలు అదృశ్యంతితో కూడా తన ఆశ్రమానికి ఆ వృత్తాంతాన్ని తలపోస్తూ మిక్కిలి కష్టంగా వచ్చాడు.

**సా గర్భం పాలయామాస కథంచిన్మునిపుంగవాః ।**
**కులసంధారణార్థాయ శక్తిపత్నీ పతివ్రతా ॥45॥**

**తతః సాసూత తనయం దశమే మాసి సుప్రభమ్ ।**
**శక్తిపత్నీ యథా శక్తిం శక్తిమంతమరుంధతీ ॥46॥**

**అసూత సా దితిర్విష్ణుం యథా స్వాహా గుహం సుతమ్ ।**
**అగ్నిం యథారణిః పత్నీ శక్తేః సాక్షాత్పరాశరమ్ ॥47॥**

ఓ మునిశ్రేష్ఠులారా! పతివ్రత అయిన శక్తి భార్య అదృశ్యంతి వంశసంరక్షణార్థం తన గర్భాన్ని రక్షించుకున్నది. తర్వాత పదో నెలలో ఆమె మిక్కిలి కాంతిమంతుడైన పుత్రుణ్ణి కన్నది. అరుంధతి శక్తిశాలి అయిన శక్తికి జన్మనిచ్చినట్లు. ఏవిధంగా అదితి విష్ణువును, స్వాహాదేవి గుహుణ్ణి, అరణి అగ్నిని కన్నారో ఆ విధంగా శక్తి భార్య పరాశరుణ్ణి కన్నది.

**యదా తదా శక్తిసూనురవతీర్ణో మహీతలే ।**
**శక్తిస్త్యక్త్వా తదా దుఃఖం పితౄణాం సమతాం యయౌ ॥48॥**

**భ్రాతృభిః సహ పుణ్యాత్మా ఆదిత్త్యైరివ భాస్కరః ।**
**రరాజ పితృలోకస్థో వాసిష్ఠో మునిపుంగవాః॥49॥**

భూమిపై ఎప్పుడు శక్తికుమారుడు అవతరించాడో అప్పుడు శక్తి దుఃఖాన్ని త్యజించి పితృదేవతల సమక్షానికి వెళ్లాడు. ఓ మునిశ్రేష్ఠులారా! వసిష్ఠపుత్రుడు పుణ్యాత్ముడు అయిన ఆ శక్తి తన తమ్ములతో కలిసి పితృలోకస్థుడై సూర్యుడు ఆదిత్యులతో కూడి ఎలా ప్రకాశిస్తాడో అలా ప్రకాశించాడు.

**జగుస్తదా చ పితరో ననృతుశ్చ పితామహాః ।**
**ప్రపితామహాశ్చ విప్రేంద్రా హ్యవతీర్ణే పరాశరే ॥50॥**

**యే బ్రహ్మవాదినో భూమౌ ననృతుర్దివి దేవతాః ।**
**పుష్కరాద్యాశ్చ ససృజుః పుష్పవర్షం చ ఖేచరాః ॥51॥**

**పురేషు రాక్షసానాం చ ప్రణాదం విషమం ద్విజాః ।**
**ఆశ్రమస్థాశ్చ మునయః సమూహుర్హర్షసంతతిమ్॥52॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! శక్తికుమారుడైన పరాశరుడు జన్మించగా పితరులు, పితామహులు, ప్రపితామహులు (ముత్తాతలు) ఆడిపాడారు. భూమిపై గల బ్రహ్మవేత్తలు, స్వర్గంలో దేవతలు నర్తించారు. పుష్కరావర్తకాదులైన మేఘాలు వర్షించాయి. గగనచరులు పుష్పవర్షం కురిపించారు. రాక్షసుల నగరాలలో అమంగళ ధ్వనులు (గ్రద్దలు మొదలగు పక్షి ధ్వనులు) విన్పించాయి. ఆశ్రమవాసులైన ఋషులు అపారసంతోషాన్ని పొందారు.

**అవతీర్ణో యథా హ్యండాద్భానుః సోఽపి పరాశరః ।**
**అదృశ్యంత్యాశ్చతుర్వక్త్రో మేఘజాలాద్దివాకరః ॥53॥**

**సుఖం చ దుఃఖమభవదదృశ్యంత్యాస్తథా ద్విజాః ।**
**దృష్ట్వా పుత్రం పతిం స్మృత్వా అరుంధత్యా మునేస్తథా ॥54॥**

**దృష్ట్వా చ తనయం బాలా పరాశరమతిద్యుతిమ్ ।**
**లలాప విహ్వలా బాలా సన్నకంఠీ పపాత చ ॥55॥**

ఏవిధంగా అండంనుంచి చతుర్ముఖుడు అయిన బ్రహ్మదేవుడు, మేఘసమూహాలనుంచి సూర్యుడు వెలువడ్డారో అదే విధంగా అదృశ్యంతినుంచి పరాశరుడు అవతరించాడు. అపుడు అదృశ్యంతి పుత్రుణ్ణి చూచి భర్తను తలంచి సుఖాన్ని దుఃఖాన్ని రెంటిని ఏకకాలంలో అనుభవించింది. అట్లే ముని వసిష్ఠుడు మరియు అరుంధతి కూడా సుఖదుఃఖాల్ని పొందారు. అధికకాంతిమంతుడైన పరాశరకుమారుణ్ణి చూచిన పిన్నదియైన అదృశ్యంతి గద్గదకంఠియై విలపిస్తూ వ్యాకులచిత్త అయి భూమిపై పడింది.

**సా పరాశరమహో మహామతిం దేవదానవగణైశ్చ పూజితమ్ ।**
**జాతమాత్రమనఘం శుచిస్మితా బుధ్య సాశ్రునయనా లలాప చ ॥56॥**

**హా వసిష్ఠసుత కుత్రచిద్ గతః పశ్య పుత్రమనఘం తవాత్మజమ్ ।**
**త్యజ్య దీనవదనాం వనాంతరే పుత్రదర్శనపరామిమాం ప్రభో ॥57॥**

**శక్తే స్వం చ సుతం పశ్య భ్రాతృభిః సహ షణ్ముఖమ్ ।**
**యథా మహేశ్వరోఽపశ్యత్సగణో హృషితాననః ॥58॥**

పవిత్రమైన చిరునవ్వుగల అదృశ్యంతి మహాబుద్ధిమంతుడు, దేవరాక్షససమూహాలతో పూజింపబడినవాడు, పాపరహితుడు అయి పుట్టిన పరాశరుణ్ణి కన్నీళ్ళు పెట్టుకుంటూ చూచి విలపించింది. ఓ వసిష్ఠుడి పుత్రుడా! ఓ ప్రభూ! పాపరహితుడైన నీ బిడ్డను చూడు. పుత్రుణ్ణి దర్శించాలనే తత్పరత గల నన్ను ఈ అరణ్యం మధ్యలో వదలి ఎక్కడకు వెళ్లావు? ప్రసన్నముఖుడై శివుడు గణసహితుడైన కుమారస్వామిని ఎలా చూశాడో నీవు నీ పుత్రుణ్ణి నీ తమ్ముళ్లతో కలిసి అలా వీక్షించు.

**అథ తస్యా స్తదాలాపం వసిష్ఠో మునిసత్తమః ।**
**శ్రుత్వా స్నుషాముచాచేదం మా రోదీరితి దుఃఖితః ॥59॥**

తర్వాత అదృశ్యంతి విలాపాన్ని విని వసిష్ఠుడు దుఃఖితుడై కోడలితో దుఃఖించవద్దని పలికాడు.

**ఆజ్ఞయా తస్య సా శోకం వసిష్ఠస్య కులాంగనా ।**
**త్యక్త్వా హ్యపాలయత్ బాలం బాలా బాలమృగేక్షణా ॥60॥**

వసిష్ఠుడి కోడలు (వంశంయొక్క స్త్రీ) అయిన అదృశ్యంతి ఆతడి ఆదేశంతో శోకాన్ని విడిచి కూనలేడి చూపులు గల ఆ చిన్నది ఆ చిన్నవాడిని ఆదరించింది.

**దృష్ట్వా తామబలాం ప్రాహ మంగళాభరణైర్వినా ।**
**ఆసీనామాకులాం సాధ్వీం బాష్పపర్యాకులేక్షణామ్ ॥61॥**

మంగళాభరణాలు లేకుండగా, దుఃఖిస్తూ, కన్నీళ్ళు కారుస్తూ కూర్చున్న ఆ పతివ్రతయైన అబలను చూచి ఇలా పరాశరుడు పలికాడు.

**శాక్తేయ ఉవాచ –** శక్తిపుత్రుడు పరాశరుడు పలికాడు.

**అంబ మంగళవిభూషణైర్వినా దేహయష్టిరనఘే న శోభతే ।**
**వక్తుమర్హసి తవాద్య కారణం చంద్రబింబరహితేవ శర్వరీ ॥62॥**

**మాతర్మాతః కథం త్యక్త్వా మంగళాభరణాని వై ।**
**ఆసీనా భర్తృహీనేవ వక్తుమర్హసి శోభనే ॥63॥**

ఓ తల్లీ! ఓ అనఘా! ఏ విధంగా చంద్రుడు లేని రాత్రి శోభిల్లదో మంగళాభరణశూన్య అయిన నీశరీరం శోభించటం లేదు. నేవిపుడు ఇందుకు హేతువు చెప్పవలసి ఉంది. ఓ మాతా! ఓ మాతా! మంగళాభరణాల్ని విడిచిపెట్టి విధవ మాదిరి ఎందుకిలా కూర్చున్నావు. ఓ శుభాకృతీ! కారణం చెప్పు.

**అదృశ్యంతీ తదా వాక్యం శ్రుత్వా తస్య సుతస్య చ ।**
**న కించిదబ్రవీత్పుత్రం శుభం వా యది వేతరమ్॥64॥**

అప్పుడు తన పుత్రుడి ఆ మాటను విని అదృశ్యంతి ఆతడికి శుభంగాని అశుభంగాని చెప్పలేదు.

**అదృశ్యంతీం పునః ప్రాహ శాక్తేయో భగవాన్ మమ ।**
**మాతః కుత్ర మహాతేజాః పితా వద వదేతి తామ్ ॥65॥**

భగవాన్ పరాశరుడు తల్లినుద్దేశించి మరల పలికాడు. "ఓ తల్లీ! మహాతేజస్వి అయిన నా తండ్రి ఎక్కడ? నాకు చెప్పు, చెప్పు" అని.

**శ్రుత్వా రురోద సా వాక్యం పుత్రస్యాతీవ విహ్వలా ।**
**భక్షితో రక్షసా తాతస్తవేతి నిపపాత చ ॥66॥**

అప్పుడు పుత్రుడి మాట విని మిక్కిలి వ్యాకుల అయి నీ తండ్రి రాక్షసుడిచేత తినబడ్డాడని చెప్పి పూర్తిగా క్రింద పడిపోయింది.

**శ్రుత్వా వసిష్ఠోపి పపాత భూమౌ పౌత్రస్య వాక్యం స రుదన్ దయాళుః ।**
**అరుంధతీ చాశ్రమవాసినస్తదా మునేర్వసిష్ఠస్య మునీశ్వరాశ్చ ॥67॥**

మనుమడి ఆమాట విని దయాశీలుడైన వసిష్ఠుడు కూడా ఏడుస్తూ భూమిపై పడ్డాడు. వసిష్ఠమునియొక్క ఆశ్రమవాసులైన మునులు మరియు అరుంధతి కూడా విలపిస్తూ క్రింద పడిపోయారు.

**భక్షితో రక్షసా మాతుః పితా తవ ముఖాదితి ।**
**శ్రుత్వా పరాశరో ధీమాన్ ప్రాహ చాస్రావిలేక్షణః ॥68॥**

నీ తండ్రి రాక్షసుడి చేత తినబడ్డాడని తల్లి ముఖంనుంచి విని, సాశ్రునయనుడు బుద్ధిమంతుడైన పరాశరుడు ఇలా పలికాడు.

**పరాశర ఉవాచ –** పరాశరుడు పలికాడు.

**అభ్యర్చ్య దేవదేవేశం త్రైలోక్యం సచరాచరమ్ ।**
**క్షణేన మాతః పితరం దర్శయామీతి మే మతిః ॥69॥**

ఓ మాతా! దేవాధిదేవుడైన శివుణ్ణి పూజించి స్థావర జంగమాత్మకమైన మూడు లోకాల్ని దహించి క్షణకాలంలో తండ్రిని చూడాలని నా ఆలోచన.

**సా నిశమ్య వచనం తదా శుభం సస్మితా తనయమాహ విస్మితా ।**
**తథ్యమేతదితి తం నిరీక్ష్య సా పుత్ర పుత్ర భవమర్చయేతి చ ॥70॥**

అప్పుడు కుమారుడి ఆ శుభవచనాన్ని విని, ఆశ్చర్యచకిత అయి చిరునవ్వుతో కూడినదై పుత్రుడితో పలికింది. ఆమె ఆతణ్ణి చూచి నీవు చెప్పింది సత్యమే. ఓ కుమారా! ఓ కుమారా! శివుణ్ణి అర్చించు.

**శ్రుత్వా శక్తిసుతస్యాస్య సంకల్పం మునిపుంగవః ।**
**వసిష్ఠో భగవాన్ ప్రాహ పౌత్రం ధీమాన్ ఘృణానిధిః ॥71॥**

**స్థానే పౌత్ర మునిశ్రేష్ఠ సంకల్పస్తవ సువ్రత ।**
**తథాపి శృణు లోకస్య క్షయం కర్తుం న చార్హసి ॥72॥**

**రాక్షసానామభావాయ కురు సర్వేశ్వరార్చనమ్ ।**
**త్రైలోక్యం శృణు శాక్తేయ అపరాధ్యతి కిం తవ ॥73॥**

తర్వాత శక్తిసుతుడు పరాశరుడి ప్రయత్నాన్ని విని, మునిశ్రేష్ఠుడు, దయాళువు, బుద్ధిమంతుడు అయిన భగవాన్ వసిష్ఠుడు మనుమణ్ణి గూర్చి పలికాడు. ఓ మనుమడా! ఓమునివర్యా! ఓ సువ్రతుడా! నీ సంకల్పం తగినదే. అయితే విను! త్రిలోకాల్ని నశింపజేయడానికి నీవు తగవు. నీవు రాక్షస నాశనానికై శివార్చన చెయ్యి. ఓ పరాశర! విను! మూడులోకాలు నీకేమి అపరాధం చేశాయి?

**తతస్తస్య వసిష్ఠస్య నియోగాచ్ఛక్తినందనః ।**
**రాక్షసానామభావాయ మతిం చక్రే మహామతిః ॥74॥**

తర్వాత తాత వసిష్ఠుడి యొక్క ఆజ్ఞవల్ల మహామతిమంతుడైన పరాశరుడు రాక్షసకులవినాశనానికై ఆలోచించాడు.

**అదృశ్యంతీం వసిష్ఠం చ ప్రణమ్యారుంధతీం తతః ।**
**కృత్వైకలింగం క్షణికం పాంసునా మునిసన్నిధౌ ॥75॥**

**సంపూజ్య శివసూక్తేన త్ర్యంబకేన శుభేన చ ।**
**జప్త్వా త్వరితరుద్రం చ శివసంకల్పమేవచ ॥76॥**

**నీలరుద్రం చ శాక్తేయస్తథా రుద్రం చ శోభనమ్ ।**
**వామీయం పవమానం చ పంచబ్రహ్మ తథైవ చ ॥77॥**

**హోతారం లింగసూక్తం చ అథర్వశిర ఏవ చ ।**
**అష్టాంగమర్ఘ్యం రుద్రాయ దత్త్వాభ్యర్చ్యయథావిధిః ॥78॥**

తర్వాత తల్లి అదృశ్యంతికి, తాత వసిష్ఠుడికి, నాయనమ్మ అరుంధతికి నమస్కరించి, ముని, సమీపంలోని మట్టితో ఒక క్షణికలింగాన్ని చేసి, శుభకరమైన శివసూక్తంతో అట్లే త్ర్యంబకమంత్రంతో ఆలింగాన్ని పూజించి, త్వరితరుద్రం, శివసంకల్పసూక్తం, నీలరుద్రం, ఉత్తమరుద్రం, వామీయం, పవమానం, పంచబ్రహ్మం (సద్యోజాతాది పంచమంత్రాలు) హోతృసూక్తం, లింగసూక్తం మరియు అథర్వశీర్షం – అనే మంత్రాల్ని జపించాడు. రుద్రుడికి అష్టాంగాలకు అర్ఘ్యాన్ని సమర్పించి యథావిధి ఆతడు ప్రార్థించాడు.

**పరాశర ఉవాచ :–** పరాశరుడు పలికాడు.

**భగవన్ రక్షసా రుద్ర భక్షితో రుధిరేణ వై ।**
**పితా మమ మహాతేజా భ్రాతృభిః సహ శంకర ॥79॥**

**ద్రష్టు మిచ్ఛామి భగవన్ పితరం భ్రాతృభిః సహ ।**
**ఏవం విజ్ఞాపయంల్లింగం ప్రణిపత్య ముహుర్ముహుః ॥80॥**

**హారుద్ర రుద్రరుద్రేతి రురోద నిపపాత చ ।**

ఓ భగవాన్! ఓ రుద్రదేవ! రుధిరుడనే రాక్షసుడిచే మహాకాంతిమంతుడైన నా తండ్రి తమ్ములతో కూడా భక్షింపబడ్డాడు. ఓ శంకర! అనుజసహితుడైన తండ్రిని చూడాలని ఉంది. ఈ విధంగా అభ్యర్థిస్తూ మాటి మాటికి లింగానికి నమస్కరిస్తూ హా రుద్రదేవ! హా రుద్రదేవ! హా రుద్రదేవా! అంటూ రోదించాడు. భూమిపై పడ్డాడు.

**తం దృష్ట్వా భగవాన్ రుద్రో దేవీమాహ చ శంకరః ॥81॥**

**పశ్య బాలం మహాభాగే బాష్పపర్యాకులేక్షణమ్ ।**
**మమానుస్మరణే యుక్తం మదారాధనతత్పరమ్ ॥82॥**

ఆ శక్తి పుత్రుణ్ణి చూచి రుద్రభగవానుడు, శంకరుడు పార్వతీదేవితో ఇలా పలికాడు. ఓ మహాభాగ! అశ్రు వ్యాకులితనేత్రుడు, నాపూజలో ఏకాగ్రచిత్తుడు, నన్ను స్మరించుచున్నవాడు అయిన ఆ బాలుడిని చూడు.

**సా చ దృష్ట్వా మహాదేవీ పరాశరమనిందితా ।**
**దుఃఖాత్సంక్లిన్నసర్వాంగమస్రాకులవిలోచనమ్ ॥83॥**

**లింగార్చనవిధౌ సక్తం హర రుద్రేతి వాదినమ్ ।**
**ప్రాహ భర్తారమీశానం శంకరం జగతాముమా ॥84॥**

**ఈప్సితం యచ్ఛ సకలం ప్రసీద పరమేశ్వర ।**

అప్పుడు నిష్కళంక అయిన మహాదేవి పార్వతి, దుఃఖంవల్ల దుర్బలమైన సర్వావయవాలు గలవాడు, అశ్రుపూరితనేత్రుడు, లింగపూజావిధిలో లగ్నమైనవాడు, ఓ హర! ఓ రుద్ర! అని పలుకుతున్నవాడు అయిన ఆ పరాశరుణ్ణి చూచి సంపూర్ణలోకాలకు స్వామి అయిన తన భర్త శంకరుడితో ఇలా అన్నది. "ఓ పరమేశ్వరా! మీరు ప్రసన్నులయి ఆతడికి సకలాభీష్టాలు కలుగచేయండి!" అని.

**నిశమ్య వచనం తస్యాః శంకరః పరమేశ్వరః ॥85॥**

**భార్యామార్యాముమాం ప్రాహ తతో హాలాహలాశనః ।**
**రక్షామ్యేనం ద్విజం బాలం ఫుల్లేందీవరలోచనమ్ ॥86॥**

**దదామి దృష్టిం మద్రూపదర్శనక్షమ ఏష వై ।**

తర్వాత విషాన్ని ఆహారంగా స్వీకరించిన శంకరుడు పార్వతీదేవి మాట విని, భార్య, ఆర్య అయిన ఉమాదేవితో ఇలా పలికాడు. వికసించిన పద్మసమాన నేత్రాలుగల ఈ ద్విజుడైన బాలకుణ్ణి రక్షిస్తున్నాను. నేను ఈతడికి దివ్యదృష్టి ఇస్తున్నాను. దాంతో నా దివ్యరూపాన్ని చూడడానికి ఈతడు సమర్థుడవుతాడు.

**ఏవముక్త్వా గణైర్దివ్యైర్భగవాన్నీలలోహితః ॥87॥**

**బ్రహ్మేంద్రవిష్ణురుద్రాద్యైః సంవృతః పరమేశ్వరః ।**
**దదౌ చ దర్శనం తస్మై మునిపుత్రాయ ధీమతే ॥88॥**

ఈ విధంగా పలికి దివ్యగణాలతో, బ్రహ్మ, ఇంద్రుడు, విష్ణువు, ఏకాదశరుద్రులు మొదలైన వారితో పరివృతుడై నీలలోహితుడైన ఈశ్వరభగవానుడు బుద్ధిమంతుడైన ఆమునికుమారుడికి దర్శనమిచ్చాడు.

**సోఽపి దృష్ట్వా మహాదేవమానందాస్రావిలేక్షణః ।**
**నిపపాత చ హృష్టాత్మా పాదయోస్తస్య సాదరమ్ ॥89॥**

**పునర్భవాన్యాః పాదౌ చ నందినశ్చ మహాత్మనః ।**
**సఫలం జీవితం మేఽద్య బ్రహ్మాద్యాంస్తాం స్తదాహ సః ॥90॥**

**రక్షార్థమాగతస్త్వద్య మమ బాలేందుభూషణః ।**
**కోఽన్యః సమో మయా లోకే దేవో వా దానవోఽపి వా ॥91॥**

శంకరభగవానుణ్ణి చూచి ఆతడు ప్రసన్నచిత్తుడై, ఆనందబాష్పాలతో కూడిన నేత్రాలు గలవాడై భక్తితో శివుడిపాదాలపై, మరియు పార్వతీదేవియొక్కయు మహాత్ముడైన నందీశ్వరుడియొక్కయు పాదాలపై పడినాడు. బ్రహ్మాదుల్నిగూర్చి ఇలా పలికాడు. "నా జీవితం సఫలమైంది. బాలచంద్రశేఖరుడు నారక్షణార్థం ఇప్పుడు వచ్చాడు. నాతో సమానుడు ఈలోకంలో దేవతల్లోగాని దానవుల్లోగాని ఎవ్వడూ లేడు.

**అథ తస్మిన్ క్షణాదేవ దదర్శ దివి సంస్థితమ్ ।**
**పితరం భ్రాతృభిః సార్ధం శాక్తేయస్తు పరాశరః ॥92॥**

**సూర్యమండలసంకాశే విమానే విశ్వతోముఖే ।**
**భ్రాతృభిః సహితం దృష్ట్వా ననామ చ జహర్ష చ ॥93॥**

శక్తిపుత్రుడైన పరాశరుడు ఆ క్షణమందే అంతరిక్షంలో తమ్ములతో కూడియున్న తండ్రిని దర్శించాడు. సూర్యమండలంతో సమానమైన కాంతిగలది, అన్ని దిక్కులకు ముఖం గలది అయిన విమానంలో తమ్ములతో కూడిన తండ్రిని చూచి నమస్కరించాడు. సంతోషించాడు.

**తదా వృషధ్వజో దేవః సభార్యః సగణేశ్వరః ।**
**వసిష్ఠపుత్రం ప్రాహేదం పుత్రదర్శనతత్పరమ్ ॥94॥**

అప్పుడు వృషధ్వజుడైన శంకరుడు భార్యతోను, గణనాథులతోనూ కూడినవాడై, పుత్రుణ్ణి దర్శించాలనే తత్పరతతో ఉన్న శక్తితో ఇలా పలికాడు.

**శ్రీదేవ ఉవాచ –** శంకరుడు పలికాడు.

> **శక్తే పశ్య సుతం బాలమానందాస్రావిలేక్షణమ్ ।**
> **అదృశ్యంతీం చ విప్రేంద్ర వసిష్ఠం పితరం తవ ॥95॥**
>
> **అరుంధతీం మహాభాగాం కల్యాణీం దేవతోపమామ్ ।**
> **మాతరం పితరం చోభౌ నమస్కురు మహామతే ॥96॥**

ఓ శక్తీ! ఓ విప్రశ్రేష్ఠ! ఆనందాశ్రువిలోచనుడు, బాలుడు అయిన నీ బిడ్డను, నీ భార్య అదృశ్యంతిని తండ్రి వసిష్ఠుని, మహాభాగ, కళ్యాణి, దేవసమ నీ తల్లి అరుంధతిని దర్శించు. ఓ మహాబుద్ధిమంతుడా! తల్లిదండ్రులిద్దరికి నమస్కరించు.

> **తదాహరం ప్రణమ్యాశు దేవదేవముమాం తథా ।**
> **వసిష్ఠం చ తదా శ్రేష్ఠం శక్తిర్వై శంకరాజ్ఞయా ॥97॥**
>
> **మాతరం చ మహాభాగాం కల్యాణీం పతిదేవతామ్ ।**
> **అరుంధతీం జగన్నాథనియోగాత్ప్రాహ శక్తిమాన్ ॥98॥**

అప్పుడు వెంటనే దేవదేవుడైన శంకరుడికి, పార్వతీదేవికి, శ్రేష్ఠుడైన వసిష్ఠుడికి, మహాభాగ, కళ్యాణి, పతియే దైవంగా గలది అయిన తల్లి అరుంధతికి నమస్కరించాడు. శక్తిమంతుడైన ఆశక్తి శంకరుడి ఆజ్ఞ మేరకు పలికాడు.

**వాసిష్ఠ ఉవాచ –** శక్తి పలికాడు.

> **భో వత్స వత్స విప్రేంద్ర పరాశర మహాద్యుతే ।**
> **రక్షితోఽహం త్వయా తాత గర్భస్థేన మహాత్మనా ॥99॥**
>
> **అణిమాదిగుణైశ్వర్యం మయా వత్స పరాశర ।**
> **లబ్ధమద్యాననం దృష్టం తవ బాల మమాజ్ఞయా ॥100॥**
>
> **అదృశ్యంతీం మహాభాగాం రక్ష వత్స మహామతే ।**
> **అరుంధతీం చ పితరం వసిష్ఠం మమ సర్వదా ॥101॥**
>
> **అన్వయః సకలో వత్స మమ సంతారితస్త్వయా ।**
> **పుత్రేణ లోకాన్ జయతీత్యుక్తం సద్భిః సదైవ హి ॥102॥**
>
> **ఈప్సితం వరయేశానం జగతాం ప్రభవం ప్రభుమ్ ।**
> **గమిష్యామ్యభివంద్యేశం భాతృభిః సహ శంకరమ్ ॥103॥**

ఓ వత్స! ఓ వత్స! ఓ విప్రశ్రేష్ఠ! ఓ మహాకాంతిమంతుడా! ఓ తండ్రీ! మహాత్ముడవైన నీవు గర్భమందుండి కూడా నన్ను రక్షించావు. అణిమాది అష్టసిద్ధుల్ని నేను పొందాను. అవి నీ ముఖమందు నేడు చూస్తున్నాను. ఓ

కుమార! ఓ మహాబుద్ధిమంతుడా! మహాభాగ అయిన నీ జనని అదృశ్యంతిని, నా తండ్రి వసిష్ఠుణ్ణి, నా తల్లి అరుంధతిని ఎల్లప్పుడూ రక్షించు. నీవు నా సమస్తవంశాన్ని ఉద్ధరించావు. పుత్రుడితో లోకాల్ని జయించమని పెద్దలు ఎప్పుడూ చెబుతారు. ఇపుడు నీవు సర్వలోకసృష్టికర్త, ప్రభువు అయిన ఈశ్వరుడిని నీ అభిష్టాన్ని తీర్చమని వరం అడుగు. ఈశ్వరుడికి నమస్కరించి తమ్ములతో కూడి వెళుతున్నాను.

**ఏవం పుత్రముపామంత్ర్య ప్రణమ్య చ మహేశ్వరమ్ ।**
**నిరీక్ష్య భార్యాం సదసి జగామ పితరం వశీ ॥104॥**

**గతం దృష్ట్వాథ పితరం తదాభ్యర్చ్యైవ శంకరమ్ ।**
**తుష్టావ వాగ్భిరిష్టాభిః శాక్తేయః శశిభూషణమ్ ॥105॥**

ఈ విధంగా పుత్రుణ్ణి పరామర్శించి శివుడికి, తండ్రి వసిష్ఠుడికి నమస్కరించి సభలో గల తన భార్యను చూచి జితేంద్రియుడైన శక్తి వెళ్ళిపోయాడు. తర్వాత తండ్రి వెళ్లడం చూచి శక్తికుమారుడైన పరాశరుడు చంద్రచూడుడైన శివుణ్ణి పూజించి ప్రియమైన వాక్కులతో స్తుతించాడు.

**తతస్తుష్టో మహాదేవో మన్మథాంధకమర్దనః ।**
**అనుగృహ్యాథ శాక్తేయం తత్రైవాంతరధీయత ॥106॥**

మన్మథుణ్ణి, అంధకాసురుణ్ణి అంతమొందించిన మహాదేవశివుడు ఆ స్తుతికి సంతుష్టుడై శక్తిపుత్రుణ్ణి అనుగ్రహించి అక్కడే అంతర్హితుడయ్యాడు.

**గతే మహేశ్వరే సాంబే ప్రణమ్య చ మహేశ్వరమ్ ।**
**దదాహ రక్షసానాం తు కులం మంత్రేణ మంత్రవిత్ ॥107॥**

పార్వతీదేవితో కలసి శివుడు అంతర్ధానం కాగా ఆయనకు నమస్కరించి మంత్రవిదుడైన పరాశరుడు రాక్షససమూహాన్ని దహించాడు.

**తదాహ పౌత్రం ధర్మజ్ఞో వసిష్ఠో మునిభిర్వృతః ।**
**అలమత్యంతకోపేన తాత మన్యుమిమం జహి ॥108॥**

**రాక్షసా నాపరాధ్యంతి పితుస్తే విహితం తథా ।**
**మూఢానామేవ భవతి క్రోధో బుద్ధిమతాం న హి ॥109॥**

**హన్యతే తాత కః కేన యతః స్వకృతభుక్పుమాన్ ।**
**సంచితస్యాతిమహతా వత్స క్లేశేన మానవైః ॥110॥**

**యశసస్తపసశ్చైవ క్రోధో నాశకరః స్మృతః ।**
**అలం హి రాక్షసైర్దగ్ధైర్దీనైరనపరాధిభిః ॥111॥**

**సత్రం తే విరమ త్వేతత్ క్షమాసారా హి సాధవః ।**

అపుడు మునులతో పరివృతుడై ఉన్న, ధర్మవేత్త అయిన వసిష్ఠుడు మనుమడితో ఇలా అన్నాడు. ఓ తండ్రీ! కోపం వద్దు. ఈ క్రోధాన్ని జయించు. రాక్షసులు అపకృత్యం చేయలేదు. నీ తండ్రికి వ్రాసిన విధి అది. మూర్ఖులకే క్రోధం కలుగుతుంది. బుద్ధిమంతులకు క్రోధం కలగదు. ఓ మనుమడా! ఎవడు ఎవడివల్ల చంపబడతాడు? మానవుడు స్వకర్మను అనుభవిస్తాడు. ఓ కుమార! మానవులు కష్టంతో సంపాదించిన యశస్సును, తపస్సును కూడా క్రోధం నశింపజేస్తుంది. దీనులు, దగ్ధులు, నిరపరాధులు అయిన రాక్షసులతో ఇక చాలు. ఈ యజ్ఞాన్ని విరమించు. సాధుజనులకు ఓర్పే స్వభావం.

**ఏవం వసిష్ఠవాక్యేన శాక్తేయో మునిపుంగవః ॥112॥**

**ఉపసంహృతవాన్ సత్రం సద్యస్తద్వాక్యగౌరవాత్ ।**
**తతః ప్రీతశ్చ భగవాన్ వసిష్ఠో మునిసత్తమః ॥113॥**

ఈ విధమైన వసిష్ఠుడి మాటవల్ల వెంటనే ఆ యజ్ఞాన్ని మునిపుంగవుడైన పరాశరుడు ఉపసంహరించాడు. అపుడు మునిశ్రేష్ఠుడైన వసిష్ఠుడు తనపై ఆతడికి గల గౌరవానికి సంతుష్టుడయ్యాడు.

**సంప్రాప్తశ్చ తదా సత్రం పులస్త్యో బ్రహ్మణః సుతః ।**
**వసిష్ఠేన తు దత్తార్ఘ్యః కృతాసనపరిగ్రహః ॥114॥**

**పరాశరం ఉవాచేదం ప్రణిపత్య స్థితం మునిః ।**
**వైరే మహతి యద్వాక్యాత్ గురోరద్యాశ్రితా క్షమా ॥115॥**

**త్వయా తస్మాత్సమస్తాని భవాన్ శాస్త్రాణి వేత్స్యసి ।**
**సంతతేర్మమ న చ్ఛేదః క్రుద్ధేనాపి యతః కృతః ॥116॥**

**త్వయా తస్మాన్మహాభాగ దదామ్యహం మహావరమ్ ।**
**పురాణసంహితాకర్తా భవాన్ వత్స భవిష్యతి ॥117॥**

**దేవతాపరమార్థం చ యథావద్వేత్స్యతే భవాన్ ।**
**ప్రవృత్తౌ వా నివృత్తౌ వా కర్మణస్తేఽమలా మతిః ॥118॥**

**తతశ్చ ప్రాహ భగవాన్ వసిష్ఠో వదతాం వరః ।**

ఆ సమయంలో పులస్త్యుడు యజ్ఞప్రదేశానికి వచ్చాడు. వసిష్ఠుడు ఆతడికి అర్ఘ్యాన్ని ఇచ్చి ఆసనాన్ని చూపి ఆసీనుణ్ణి చేశాడు. తనకు నమస్కరించి నిలిచిన పరాశరుడితో పులస్త్యుడు పలికాడు. నీవు నీ తండ్రి ఆజ్ఞ చేత మిక్కిలి క్రోధితుడవయ్యీ క్షమను ఆశ్రయించావు. కావున నీవు సమస్తశాస్త్రాల్ని తెలియగలుగుతావు. కుపితుడవయ్యీ నా వంశాన్ని నీవు నశింపజేయలేదు. అందుచేత నేను నీకు గొప్ప వరాన్ని ఇస్తున్నాను. ఓ వత్సా! నీవు పురాణసంహితలన్నింటికీ కర్తవు కాగలవు. దేవతల పరమరహస్యాల్ని కూడా తెలియగలుగుతావు. ఓ కుమారా! నా అనుగ్రహంతో నీయొక్క ప్రవృత్తి నివృత్తి కర్మల విషయంలో నీబుద్ధి విశుద్ధమూ సందేహరహితమూ కాగలుగుతుంది.

**తతశ్చ ప్రాహ భగవాన్ వసిష్ఠో వదతాం వరః ॥119॥**

**పులస్త్యేన యదుక్తం తే సర్వమేతద్భవిష్యతి ।**
**అథ తస్య పులస్త్యస్య వసిష్ఠస్య చ ధీమతః ॥120॥**

**ప్రసాదాద్వైష్ణవం చక్రే పురాణం వై పరాశరః ।**
**షట్ప్రకారం సమస్తార్థసాధకం జ్ఞానసంచయమ్ ॥121॥**

**షట్సాహస్రమితం సర్వం వేదార్థేన చ సంయుతమ్ ॥122॥**

వక్తృశ్రేష్ఠుడైన భగవాన్ వసిష్ఠుడు అప్పుడు పలికాడు. "పులస్త్యఋషి చెప్పినదంతా నీకు జరుగుతుంది" అని. పులస్త్యవసిష్ఠుల కృపవల్ల పరాశరుడు విష్ణుపురాణాన్ని వ్రాశాడు. అది ఆరు అంశాలు గలది. సమస్తమైన కోరికల్ని తీర్చునట్టిది. జ్ఞానభాండారం. ఆరువేల శ్లోకాలతో కూడినట్టిది. వేదార్థసమన్వితమైంది. పురాణసంహితలలో నాల్గోది. పరమసుందరమైనది.

**ఏష వః కథితః సర్వో వాసిష్ఠానాం సమాసతః ।**
**ప్రభవః శక్తిసూనోశ్చ ప్రభావో మునిపుంగవాః॥123॥**

ఓ మునిశ్రేష్ఠులారా! నేను మీకు సంగ్రహంగా వసిష్ఠకుమారుల ఉత్పత్తిని అట్లే శక్తి పుత్రుడైన పరాశరుడి ప్రభావాన్ని గూర్చి చెప్పాను.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే వాసిష్ఠకథనం నామ చతుష్షష్టితమోఽధ్యాయః ॥ 64 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని వాసిష్ఠకథనమనే అరవై నాల్గవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## పంచషష్టితమోఽధ్యాయః - అరవై అయిదవ అధ్యాయం

## రుద్రసహస్రనామకథనమ్ - రుద్రసహస్రనామకథనం

**ఋషయః ఊచుః** - మునులు పలికారు.

**ఆదిత్యవంశం సోమస్య వంశం వంశవిదాం వర ।**
**వక్తుమర్హసి చాస్మాకం సంక్షేపాద్రోమహర్షణ ॥1॥**

ఓ వంశవిదులలో శ్రేష్ఠుడా! ఓ రోమహర్షణా! మీరు సంగ్రహంగా సూర్యచంద్రుల వంశాల్నిగూర్చి మాకు చెప్పండి!

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**అదితిః సుషువే పుత్రమాదిత్యం కశ్యపాద్ ద్విజాః ।**
**తస్యాదిత్యస్య చైవాసీద్భార్యాత్రయమథాపరమ్ ॥2॥**

**సంజ్ఞా రాజ్ఞీ ప్రభా ఛాయా పుత్రాంస్తాసాం వదామి వః ।**
**సంజ్ఞా త్వాష్ట్రీ చ సుషువే సూర్యాన్మనుమనుత్తమమ్ ॥3॥**

**యమంచ యమునాత్చైవ రాజ్ఞీ రేవతమేవ చ ।**
**ప్రభా ప్రభాతమాదిత్యాచ్ఛాయాం సంజ్ఞాప్యకల్పయత్ ॥4॥**

ఓ ద్విజులారా! కశ్యపఋషివల్ల అతిది ఆదిత్యుడనే పుత్రుణ్ణి కన్నది. ఈ ఆదిత్యుడికి ముగ్గురు భార్యలు. మరొక ముఖ్యమైన భార్య ఉంది. సంజ్ఞి, రాజ్ఞి, ప్రభ, ఛాయ అనేవారు. వారి పుత్రులగూర్చి చెప్తున్నాను. త్వష్ట కుమార్తె అయిన సంజ్ఞ సూర్యుడి వల్ల ఉత్తముడైన మనువును కన్నది. రాజ్ఞి యముణ్ణి, యమునను, రేవతకుణ్ణి కన్నది. ప్రభ సూర్యుడివల్ల ప్రభాతాన్ని కన్నది. సంజ్ఞ ఆదిత్యుడి నుంచి ఛాయను కల్పించింది.

**ఛాయా చ తస్మాత్సుషువే సావర్ణిం భాస్కరాద్ ద్విజాః ।**
**తతః శనిం చ తపతీం విష్టిం చైవ యథాక్రమమ్ ॥5॥**

**ఛాయా స్వపుత్రాభ్యధికం స్నేహం చక్రే మనౌ తదా ।**
**పూర్వో మనుర్న చక్షామ యమస్తు క్రోధమూర్ఛితః ॥6॥**

**సంతాడయామాస రుషా పాదముద్యమ్య దక్షిణమ్ ।**
**యమేన తాడితా సా తు ఛాయా వై దుఃఖితాభవత్ ॥7॥**

ఓ ద్విజులారా! ఛాయాదేవి సూర్యుడివల్ల సావర్ణిమనువును, శనిని, తపతిని, విష్టిని వరుసగా కన్నది. ఛాయ తన పుత్రులకంటె ఎక్కువగా వైవస్వతమనువు ఎడల ప్రేమను కలిగి ఉంది. వైవస్వతమనువు మాత్రం దీన్ని సహించలేదు. యముడైతే క్రోధంవల్ల వ్యాకులమనస్కుడై దక్షిణపాదమెత్తి ఆమెను తన్నాడు. అప్పుడామె దుఃఖించింది.

**ఛాయాశాపాత్పదం చైకం యమస్య క్లిన్నముత్తమమ్ ।**
**పూయశోణితసంపూర్ణం కృమిణాం నిచయాన్వితమ్ ॥8॥**

**సోఽపి గోకర్ణమాశ్రిత్య ఫలకేనానిలాశనః ।**
**ఆరాధయన్ మహాదేవం యావద్వర్షాయుతాయుతమ్ ॥9॥**

**భవప్రసాదాదాగత్య లోకపాలత్వముత్తమమ్ ।**
**పితౄణామాధిపత్యం తు శాపమోక్షం తథైవ చ ॥10॥**

**లబ్ధవాన్ దేవదేవస్య ప్రభావాచ్ఛూలపాణినః ।**

అప్పుడు ఛాయ శాపంవల్ల యముడి సుందరమైన పాదం రక్తంతో చీముతో, క్రిమిసముదాయంతో పూర్తిగా నిండి చెడిపోయింది. తర్వాత యముడు గోకర్ణక్షేత్రానికి వెళ్లి ఒక ఫలకం మీద కూర్చుని వాయువును మాత్రం పీల్చుతూ పదివేల సంవత్సరాలు మహాదేవశివుణ్ణి ఆరాధిస్తున్నాడు. దేవదేవుడు, శూలపాణి అయిన శివుడి అనుగ్రహంవల్ల ఉత్తమమైన లోకపాలకత్వం మరియు పితృదేవతలపై అధికారం మరియు శాపవిమోచనం పొందాడు.

**అసహంతీ పురా భానోస్తేజోమయమనిందితా ॥11॥**

**రూపం త్వాష్ట్రీ స్వదేహాత్తు ఛాయాఖ్యాం సా త్వకల్పయత్ ।**
**బడబారూపమాస్థాయ తపస్తేపే తు సువ్రతా ॥12॥**

**కాలాత్ప్రయత్నతో జ్ఞాత్వా ఛాయాం ఛాయాపతిః ప్రభుః ।**
**బడబామగమత్సంజ్ఞామశ్వరూపేణ భాస్కరః ॥13॥**

**బడబా చ తదా త్వాష్ట్రీ సంజ్ఞా తస్మాద్దివాకరాత్ ।**
**సుషువే చాశ్వినౌ దేవౌ దేవానాం తు భిషగ్వరౌ ॥14॥**

పూర్వం సూర్యుడియొక్క అధికమైన తేజస్సును సహింపలేక త్వష్టకుమార్తె సంజ్ఞ తన శరీరంనుంచి మరో ఛాయను కల్పించింది. తాను గుఱ్ఱం రూపాన్ని దాల్చి సువ్రతురాలై తపస్సు చేస్తోంది. ఛాయాపతి, ప్రభువు అయిన సూర్యుడు కొంత కాలం తర్వాత విషయం తెలిసి తానూ అశ్వాకారాన్ని ధరించి అదే ఆకారంలో ఉన్న ఛాయతో రమించాడు. అప్పుడు త్వాష్ట్రి అయిన ఆమె దేవతావైద్యశ్రేష్ఠులైన ఇద్దరు అశ్వినీదేవతల్ని కన్నది.

**లిఖితో భాస్కరః పశ్చాత్సంజ్ఞా పిత్రా మహాత్మనా ।**
**విష్ణోశ్చక్రం తు యద్ ఘోరం మండలాద్భాస్కరస్య తు ॥15॥**

**నిర్మమే భగవాంస్త్వష్టా ప్రధానం దివ్యమాయుధమ్ ।**
**రుద్రప్రసాదాచ్చ శుభం సుదర్శనమితి స్మృతమ్ ॥16॥**

**లబ్ధవాన్ భగవాంశ్చక్రం కృష్ణః కాలాగ్నిసన్నిభమ్ ।**

తర్వాత మహాత్ముడైన సంజ్ఞయొక్క తండ్రి అయిన త్వష్ట సూర్యుణ్ణి తరణి పట్టాడు. త్వష్ట భగవానుడు శివుడి కృపవల్ల సూర్యమండలంనుంచి విష్ణువుయొక్క చక్రాన్ని తయారు చేశాడు. అది మిక్కిలి భయంకరమైంది. అది ప్రధానం మరియు దివ్యమైన ఆయుధం. అది సుందరమైనందున సుదర్శనమైంది. కాలాగ్ని సమానమైన ఆ చక్రాన్ని శ్రీకృష్ణుడు పొందాడు.

**మనోస్తు ప్రథమస్యాసన్నవ పుత్రాస్తు తత్సమాః ॥17॥**

**ఇక్ష్వాకుర్నభగశ్చైవ ధృష్ణుః శర్యాతి రేవచ ।**
**నిరిష్యంతశ్చ వై ధీమాన్ నాభాగోఽరిష్ట ఏవచ ॥18॥**

**కరూషశ్చ పృషధ్రశ్చ నవైతే మానవాఃస్మృతాః ।**
**ఇలా జ్యేష్ఠా వరిష్ఠా చ పుంస్త్వం ప్రాప చ యా పురా ॥19॥**

**సుద్యుమ్న ఇతి విఖ్యాతా పుంస్త్వం ప్రాప్తా త్విలా పురా ।**
**మిత్రావరుణయోస్త్వత్ర ప్రసాదాన్మునిపుంగవాః ॥20॥**

**పునః శరవణం ప్రాప్య స్త్రీత్వం ప్రాప్తో భవాజ్ఞయా ।**
**సుద్యుమ్నో మానవః శ్రీమాన్ సోమవంశప్రవృద్ధయే ॥21॥**

**ఇక్ష్వాకోరశ్వమేధేన ఇలా కింపురుషోఽభవత్ ।**
**ఇలా కింపురుషత్వే చ సుద్యుమ్న ఇతి చోచ్యతే ॥22॥**

మొదటి మనువైన వైవస్వతుడికి ఆతడితో సమానులైన తొమ్మిదిమంది పుత్రులు కలిగారు. ఇక్ష్వాకుడు, నభగుడు, ధృష్ణుడు, శర్యాతి, నిరిష్యంతుడు, ధీమంతుడు నాభాగుడు, అరిష్టుడు, కరూషుడు, పృషధ్రుడు ఈ ఏడుగురు మానవులు. అనగా మను సంతానం. వీళ్లకంటే పెద్దది మరియు శ్రేష్ఠ అయిన 'ఇల' అనే కుమార్తె పూర్వం పురుషుడుగా మారింది. అపుడామె సుద్యుమ్నుడనే పేర ప్రసిద్ధి చెందింది. ఓ శ్రేష్ఠమునులారా! మిత్రావరుణుల కృపచేత ఆమె పూర్వకాలంలో పురుషత్వాన్ని పొందింది. మళ్ళీ శివుడి ఆజ్ఞమేరకు శరవణమనే వనాన్ని చేరి సోముడి వంశాన్ని వృద్ధి చేయడానికై ఆ మనుపుత్రుడు శ్రీమంతుడు సుద్యుమ్నుడు స్త్రీత్వాన్ని పొందాడు. మళ్ళీ ఇక్ష్వాకుడి అశ్వమేధ సమయంలో ఆ 'ఇల' కింపురుషుడయ్యింది. కింపురుషుడయి 'సుద్యుమ్నుడ'నే పేరుతోనే పిలువబడింది.

**మాసమేకం పుమాన్ వీరః స్త్రీత్వం మాసమభూత్పునః ।**
**ఇలా బుధస్య భవనం సోమపుత్రస్య చాశ్రితా ॥23॥**

**బుధేనాంతరమాసాద్య మైథునాయ ప్రవర్తితా ।**
**సోమపుత్రాద్ బుధాచ్చాపి రేలో జజ్ఞే పురూరవాః ॥24॥**

**సోమవంశాగ్రజో ధీమాన్ భవభక్తః ప్రతాపవాన్ ।**
**ఇక్ష్వాకోర్వంశవిస్తారం పశ్చాద్వక్ష్యే తపోధనాః ॥25॥**

'ఇల' ఒకనెల వీరపురుషుడి రూపంలో మళ్ళీ మరోమాసంలో స్త్రీరూపంలో ఉంటుంది. ఆమె చంద్రుడి కుమారుడు బుధుడి భవనంలో ఉంటుంది. అవసరాన్ని చూచి ఆమె బుధుడితో మైథునం జరుపుతుంది. అప్పుడు ఇలాబుధులకు పురూరవుడు జన్మించాడు. ఆతడు సోమవంశంలో ముందుగా జన్మించినవాడు. ఆతడు బుద్ధిమంతుడు. పరాక్రమమంతుడు. శివభక్తుడు. ఓ తపోధనులారా! ఇపుడు నేను ఇక్ష్వాకువంశాన్ని విస్తరపరుస్తాను.

**పుత్రత్రయమభూత్తస్య సుద్యుమ్నస్య ద్విజోత్తమాః ।**
**ఉత్కళశ్చ గయశ్చైవ వినతాశ్వస్తథైవ చ ॥26॥**

**ఉత్కళస్యోత్కళం రాష్ట్రం వినతాశ్వస్య పశ్చిమమ్ ।**
**గయా గయస్య చాఖ్యాతా పురీ పరమశోభనా ॥27॥**

**సురాణాం సంస్థితిర్యస్యాం పితౄణాం చ సదా స్థితిః ।**

ఓ ఉత్తమద్విజులారా! ఆ సుద్యుమ్నుడికి ముగ్గురు కుమారులు కలిగారు. ఉత్కళుడు, గయుడు, వినతాశ్వుడు. ఉత్కళుడికి ఉత్కళమనే పేరు గల రాష్ట్రం, వినతాశ్వుడికి పశ్చిమప్రాంతం, గయుడికి 'గయ' అనే పేరుగల సుందరపురం ఇవ్వబడ్డాయి. వీటిల్లో ఎల్లప్పుడూ దేవతలు, పితృదేవతలు ఉంటారు.

**ఇక్ష్వాకుజ్యేష్ఠదాయాదో మధ్యదేశమవాప్తవాన్ ॥28॥**

**కన్యాభావాచ్చ సుద్యుమ్నో నైవ భాగమవాప్తవాన్ ।**
**వసిష్ఠవచనాత్త్వాసీత్ప్రతిష్ఠానే మహాద్యుతిః ॥29॥**

**ప్రతిష్ఠా ధర్మరాజస్య సుద్యుమ్నస్య మహాత్మనః ।**
**తత్పురూరవసే ప్రాదాద్రాజ్యం ప్రాప్య మహాయశాః ॥30॥**

**మానవేయో మహాభాగః స్త్రీపుంసోర్లక్షణాన్వితః ।**

ఇక్ష్వాకుడి పెద్ద కుమారుడికి మధ్యప్రాంతం దక్కింది. స్త్రీత్వప్రకృతి కారణంగా మహాకాంతిమంతుడు సుద్యుమ్నుడు తనవంతు రాజ్యాన్ని పొందలేదు. వసిష్ఠమహర్షి ఆదేశంతో ధర్మరాజు మహాత్ముడైన సుద్యుమ్నుణ్ణి ప్రతిష్ఠానపురంలో ప్రతిష్ఠించాడు. మహాయశస్వి మరియు మహాభాగ్యశాలియు అయిన స్త్రీపురుషలక్షణాలతో కూడియున్న సుద్యుమ్నుడు రాజ్యాన్ని పొంది దాన్ని పురూరవుడికి ఇచ్చాడు.

**ఇక్ష్వాకోరభవద్వీరో వికుక్షిర్ధర్మవిత్తమః ॥31॥**

**జ్యేష్ఠః పుత్రశతస్యాసీద్దశ పంచ చ తత్సుతా ।**
**అభూజ్జ్యేష్ఠః కకుత్థశ్చ కకుత్థాత్తు సుయోధనః ॥32॥**

**తతః పృథుర్మునిశ్రేష్ఠా విశ్వకః పార్థివస్తథా ।**
**విశ్వకస్యార్ద్రకో ధీమాన్ యువనాశ్వస్తు తత్సుతః ॥33॥**

**శాబస్తిశ్చ మహాతేజా వంశకస్తు తతోఽభవత్ ।**
**నిర్మితా యేన శాబస్తీ గౌడదేశే ద్విజోత్తమాః ॥34॥**

**వంశాచ్చ బృహదశ్వోஉభూత్కువలాశ్వస్తు తత్సుతః ।**
**ధుంధుమారత్వమాపన్నో ధుంధుం హత్వా మహాబలమ్ ॥35॥**

**ధుంధుమారస్య తనయాస్త్రయస్త్రైలోక్యవిశ్రుతాః ।**
**దృఢాశ్వశ్చైవ చండాశ్వః కపిలాశ్వశ్చ తే స్మృతాః ॥36॥**

**దృఢాశ్వస్య ప్రమోదస్తు హర్యశ్వస్తస్య వై సుతః ।**
**హర్యశ్వస్య నికుంభస్తు సంహతాశ్వస్తు తత్సుతః ॥37॥**

**కృశాశ్వోஉథ రణాశ్వశ్చ సంహతాశ్వాత్మజావుభౌ ।**
**యువనాశ్వో రణాశ్వస్య మాంధాతా తస్య వై సుతః ॥38॥**

**మాంధాతుః పురుకుత్సోஉభూదంబరీషశ్చ వీర్యవాన్ ।**
**ముచుకుందశ్చ పుణ్యాత్మా త్రయస్త్రైలోక్యవిశ్రుతాః ॥39॥**

**అంబరీషస్య దాయాదో యువనాశ్వోஉపరః స్మృతః ।**
**హరితో యువనాశ్వస్య హరితాస్తు యతః స్మృతాః ॥40॥**

**ఏతే హ్యంగిరసః పక్షే క్షత్రోపేతా ద్విజాతయః ।**

నూర్గురు పుత్రులుగల ఇక్ష్వాకుడికి వికుక్షి జ్యేష్ఠపుత్రుడు. ఆతడు మిక్కిలి ధర్మవేత్త. ఆతడికి పదిహేనుమంది కుమారులు. వీరిలో కకుత్థుడు పెద్దవాడు. కకుత్థుడికి సుయోధనుడు పుట్టాడు. ఓ శ్రేష్ఠమునులారా! ఈ సుయోధనుడికి పృథువు, పృథువుకు విశ్వకుడు కలిగారు. విశ్వకుడి కుమారుడు బుద్ధిమంతుడైన ఆర్ద్రకుడు. ఆతడి కుమారుడు యువనాశ్వుడు. ఓ మునిశ్రేష్ఠులారా! ఆతడి పుత్రుడు మహాతేజస్వంతుడైన శాబస్తి. ఆతడు గౌడదేశంలో శాబస్తి అనే పేరుతో ఒక నగరం నిర్మించాడు. ఆతడికి వంశకుడనే పుత్రుడు కలిగాడు. వంశకుడికి బృహదశ్వుడు పుట్టాడు. ఆతడికి కువలాశ్వుడు కలిగాడు. ఆతడు మహాబలవంతుడైన 'ధుంధు'వును చంపి ధుంధుమారుడుగా పిలువబడ్డాడు. ధుంధుమారుడికి ముగ్గురు పుత్రులు. వాళ్లు మూడులోకాల్లో ప్రసిద్ధులు. దృఢాశ్వుడు, చండాశ్వుడు, కపిలాశ్వుడనే వాళ్లు. దృఢాశ్వుడి కుమారుడు ప్రమోదుడు. ప్రమోదుడి కుమారుడు హర్యశ్వుడు. ఆతడి పుత్రుడు నికుంభుడు. ఆతడి కుమారుడు సంహతాశ్వుడు. ఆతడికి కృశాశ్వుడు, రణాశ్వుడు అనే యిద్దరు పుత్రులు. రణాశ్వుడి కుమారుడు యువనాశ్వుడు. ఆతడి కుమారుడు మాంధాత. మాంధాతకు ముగ్గురు కుమారులు. పురుకుత్సుడు, పరాక్రమవంతుడు అంబరీషుడు, అట్లే పుణ్యాత్ముడు ముచుకుందుడు. వీళ్లు మూడులోకాల్లో ప్రసిద్ధులు. అంబరీషుడి జ్ఞాతి యువనాశ్వుడు అనేవాడు మరొకడు ఉన్నాడు. ఆయువనాశ్వుడి పుత్రుడు హరితుడు. ఆతడికి కలిగిన బిడ్డలందరూ 'హరితుల'నే పిలువబడ్డారు. వీళ్లందరూ అంగిరుడి వంశంలో క్షత్రియ స్వభావంగల బ్రాహ్మణులు.

**పురుకుత్సస్య దాయాదస్త్రసద్దస్యుర్మహాయశాః ॥41॥**
**నర్మదాయాం సముత్పన్నః సంభూతిస్తస్య చాత్మనః ।**
**విష్ణువృద్ధః సుతస్తస్య విష్ణువృద్ధా యతః స్మృతా ॥42॥**

**ఏతే హ్యంగిరసః పక్షే క్షత్రోపేతాః సమాశ్రితాః ।**
**సంభూతిరపరం పుత్రమనరణ్యమజీజనత్ ॥43॥**

**రావణేన హతో యోఽసౌ త్రైలోక్యవిజయే ద్విజాః ।**
**బృహదశ్వోఽనరణ్యస్య హర్యశ్వస్తస్య చాత్మజః ॥44॥**

**హర్యశ్వాత్తు దృషద్వత్యాం జజ్ఞే వసుమనా నృపః ।**
**తస్య పుత్రోఽభవద్రాజా త్రిధన్వా భవభావితః ॥45॥**

**ప్రసాదాద్ బ్రహ్మసూనోర్వై తండినః ప్రాప్య శిష్యతామ్ ।**
**అశ్వమేధసహస్రస్య ఫలం ప్రాప్య తదాజ్ఞయా ॥46॥**

**గణైశ్వర్యమనుప్రాప్తో భవభక్తః ప్రతాపవాన్ ।**
**కథం చైవాశ్వమేధంవై కరోమీతి విచింతయన్ ॥47॥**

**ధనహీనశ్చ ధర్మాత్మా దృష్టవాన్ బ్రహ్మణః సుతమ్ ।**
**తండిసంజ్ఞం ద్విజం తస్మాల్లబ్ధవాన్ ద్విజసత్తమాః ॥48॥**

**నామ్నాం సహస్రం రుద్రస్య బ్రహ్మణా కథితం పురా ।**
**తేన నామ్నాం సహస్రేణ స్తుత్వా తండిర్మహేశ్వరమ్ ॥49॥**

**లబ్ధవాన్ గాణపత్యం చ బ్రహ్మయోనిర్ద్విజోత్తమః ।**
**తతస్తస్మాన్నృపో లబ్ధ్వా తండినా కథితం పురా ॥50॥**

**నామ్నాం సహస్రం జప్త్వా వై గాణపత్యమవాప్తవాన్ ।**

పురుకుత్సుడి పుత్రుడు మహాకీర్తిమంతుడైన త్రసద్దస్యుడు. ఆతడి పుత్రుడు సంభూతి. ఆతడు నర్మదవల్ల పుట్టాడు. సంభూతి పుత్రుడు విష్ణువృద్ధుడు. విష్ణువృద్ధుడి సంతానమంతా విష్ణువృద్ధులుగానే ప్రసిద్ధులు. వీళ్లందరూ అంగిరసుడి క్షత్రియస్వభావంగల వంశస్థులే. ఓ ద్విజులారా! సంభూతి అనరణ్యుడనే మరో పుత్రుణ్ణి కన్నాడు. ఆతడు త్రిలోక విజయసమయంలో రావణాసురుడిచే చంపబడ్డాడు. అనరణ్యుడి పుత్రుడు బృహదశ్వుడు, ఆతడి పుత్రుడు హర్యశ్వుడు. హర్యశ్వుడికి దృషద్వతి అనే భార్యవల్ల వసుమనుడు పుట్టాడు. ఆతడికి త్రిధన్వుడనే పుత్రుడు కలిగాడు. ఆతడు శివభక్తుడు. పరాక్రమవంతుడు, త్రిధన్వుడు బ్రహ్మపుత్రుడైన తండి దయతో ఆతడికి శిష్యుడై ఆతడి ఆజ్ఞవల్ల వేయి అశ్వమేధాల ఫలాన్ని పొంది గణనాథపదవిని చేపట్టాడు. "నేను అశ్వమేధాన్ని ఎలా చేయగలుగుతాను" అని ధనహీనుడు, ధర్మాత్ముడు అయిన త్రిధన్వుడు ఆలోచిస్తూ బ్రహ్మపుత్రుడైన తండి అనే బ్రాహ్మణుణ్ణి దర్శించాడు. ఓ ద్విజశ్రేష్ఠులారా! అతడి నుంచి రుద్రసహస్రనామాన్ని గ్రహించాడు. పూర్వం బ్రహ్మ ఈ రుద్రసహస్రనామాన్ని తండికి చెప్పాడు. ఈ నామసహస్రాన్ని జపించి బ్రహ్మపుత్రుడు తండి గణాధిపత్యాన్ని పొందాడు. తర్వాత రాజు త్రిధన్వుడు ఆ నామసహస్రాన్ని తండి నుంచి పొంది గణాధిపత్యాన్ని ప్రాప్తించుకున్నాడు.

**ఋషయ ఊచుః :–** మునులు పలికారు.

**నామ్నాం సహస్రం రుద్రస్య తండినా బ్రహ్మయోనినా ॥51॥**

**కథితం సర్వవేదార్థసంచయం సూత సువ్రత ।**
**నామ్నాం సహస్రం విప్రాణాం వక్తుమర్హసి శోభనమ్ ॥52॥**

బ్రహ్మపుత్రుడైన తండి ద్వారా చెప్పబడిన రుద్రసహస్రనామం సమస్తవేదార్థంతో కూడియుంది. ఓ సూతఋషీ! ఓ సువ్రతుడా! మంగళదాయకమైన ఆ రుద్రనామాలు విప్రులమైన మాకు నీవు చెప్పాలి.

**సూత ఉవాచ :–** సూతర్షి పలికాడు.

**సర్వభూతాత్మభూతస్య హరస్యామితతేజసః ।**
**అష్టోత్తరసహస్రం నామ్నాం శృణుత సువ్రతాః ॥53॥**

**యజ్జప్త్వా తు మునిశ్రేష్ఠా గాణపత్యమవాప్తవాన్ ।**

ఓ సువ్రతులారా! ఓ మునివరులారా! సర్వప్రాణులయొక్క ఆత్మస్వరూపుడు, మహాతేజస్వంతుడు అయిన శివుడి ఒక వెయ్యి ఎనిమిది నామాల్ని అనగా వేటిని జపించి తండి గణాధిపత్యాన్ని పొందాడో వాటిని వినండి.

**ఓం స్థిరః స్థాణుః ప్రభుర్భానుః ప్రవరో వరదో వరః ॥54॥**

**సర్వాత్మా సర్వవిఖ్యాతః సర్వః సర్వకరో భవః ।**
**జటీ దండీ శిఖండీ చ సర్వగః సర్వభావనః ॥55॥**

**హరిశ్చ హరిణాక్షశ్చ సర్వభూతహరః స్మృతః ।**
**ప్రవృత్తిశ్చ నివృత్తిశ్చ శాంతాత్మా శాశ్వతో ధ్రువః ॥56॥**

**శ్మశానవాసీ భగవాన్ ఖచరో గోచరోఽర్దనః ।**
**అభివాద్యో మహాకర్మా తపస్వీ భూతధారణః ॥57॥**

**ఉన్మత్తవేషః ప్రచ్ఛన్నః సర్వలోకః ప్రజాపతిః ।**
**మహారూపో మహాకాయః సర్వరూపో మహాయశాః ॥58॥**

ఓం స్థిరుడు, స్థాణువు, ప్రభువు, భానువు, ప్రవరుడు, వరదుడు, వరుడు, సర్వాత్ముడు, సర్వవిఖ్యాతుడు, సర్వుడు, సర్వకరుడు, భవుడు, జటి, దండి, శిఖండి, సర్వగుడు, సర్వభావనుడు, హరి, హరిణాక్షుడు, సర్వభూతహరుడు, స్మృతుడు, ప్రవృత్తుడు, నివృత్తుడు, శాంతాత్ముడు, శాశ్వతుడు, ధ్రువుడు, శ్మశానవాసి, భగవానుడు, ఖచరుడు, గోచరుడు, అర్దనుడు, అభివాద్యుడు, మహాకర్ముడు, తపస్వి, భూతధారణుడు, ఉన్మత్తవేషుడు, ప్రచ్ఛన్నుడు, సర్వలోకుడు, ప్రజాపతి, మహారూపుడు, మహాకాయుడు, సర్వరూపుడు, మహాయశుడు.

**మహాత్మా సర్వభూతశ్చ విరూపో వామనో నరః ।**
**లోకపాలోఽంతర్హితాత్మా ప్రసాదోఽభయదో విభుః ॥59॥**

**ప్రవిత్రశ్చ మహాంశ్చైవ నియతో నియతాశ్రయః ।**
**స్వయంభూః సర్వకర్మా చ ఆదిరాదికరో నిధిః ॥60॥**

**సహస్రాక్షో విశాలాక్షః సోమో నక్షత్రసాధకః ।**
**చంద్రః సూర్యః శనిః కేతుర్గ్రహో గ్రహపతిర్మతః ॥61॥**

**రాజా రాజ్యోదయః కర్తా మృగబాణార్పణో ఘనః ।**
**మహాతపా దీర్ఘతపా అదృశ్యో ధనసాధకః ॥62॥**

మహాత్ముడు, సర్వభూతుడు, విరూపుడు, వామనుడు, నరుడు, లోకపాలుడు, అంతర్హితాత్ముడు, ప్రసాదుడు, అభయదుడు, విభుడు, పవిత్రుడు, మహానుడు, నియతుడు, నియతాశ్రయుడు, స్వయంభువుడు, సర్వకర్ముడు, ఆది, ఆదికరుడు, నిధి, సహస్రాక్షుడు, విశాలాక్షుడు, సోముడు, నక్షత్రసాధకుడు, చంద్రుడు, సూర్యుడు, శని, కేతువు, గ్రహుడు (మంగళుడు) గ్రహపతి (బృహస్పతి) మతుడు (బుధుడు) రాజు (శుక్రుడు), రాజ్యోదయుడు (రాహువు) కర్త, మృగబాణార్పణుడు, ఘనుడు, మహాతపుడు, దీర్ఘతపుడు, అదృశ్యుడు, ధనసాధకుడు.

**సంవత్సరః కృతో మంత్రః ప్రాణాయామః పరంతపః ।**
**యోగీ యోగో మహాబీజో మహారేతా మహాబలః ॥63॥**

**సువర్ణరేతాః సర్వజ్ఞః సుబీజో వృషవాహనః ।**
**దశబాహుస్త్వనిమిషో నీలకంఠ ఉమాపతిః ॥64॥**

**విశ్వరూపః స్వయంశ్రేష్ఠో బలవీరో బలాగ్రణీ ।**
**గణకర్తా గణపతిర్దిగ్వాసాః కామ్య ఏవచ ॥65॥**

**మంత్రవిత్పరమో మంత్రః సర్వభావకరో హరః ।**
**కమండలుధరో ధన్వీ బాణహస్తః కలాపవాన్ ॥66॥**

సంవత్సరుడు, కృతుడు, మంత్రుడు, ప్రాణాయాముడు, పరంతపుడు, యోగి, యోగుడు, మహాబీజుడు, మహారేతసుడు, మహాబలుడు, సువర్ణరేతుడు, సర్వజ్ఞుడు, సుబీజుడు, వృషవాహనుడు, దశబాహువు, అనిమిషుడు, నీలకంఠుడు, ఉమాపతి, విశ్వరూపుడు, స్వయంశ్రేష్ఠుడు, బలవీరుడు, బలాగ్రణి, గణకర్త, గణపతి, దిగ్వాసుడు, కామ్యుడు, మంత్రవిదుడు, పరముడు, మంత్రుడు, సర్వభావకరుడు, హరుడు, కమండలుధరుడు, ధన్వి, బాణహస్తుడు, కపాలవంతుడు.

**శరీ శతఘ్నీ, ఖడ్గీ చ పట్టిశీ చాయుధీ మహాన్ ।**
**అజశ్చ మృగరూపశ్చ తేజస్తేజస్కరో విధిః ॥67॥**

**ఉష్ణీషీ చ సువక్త్రశ్చ ఉదగ్రో వినతస్తథా ।**
**దీర్ఘశ్చ హరికేశశ్చ సుతీర్థఃకృష్ణ ఏవచ ॥68॥**

**శృగాలరూపః సర్వార్థో ముండః సర్వశుభంకరః ।**
**సింహశార్దూలరూపశ్చ గంధకారీ కపర్ద్యపి ॥69॥**

శరి, శతఘ్ని, ఖడ్గి, పట్టిశి, ఆయుధి, మహానుడు, అజుడు, మృగరూపుడు, తేజుడు, తేజస్కరుడు, విధి, ఉష్ణీషి, సువక్త్రుడు, ఉదగ్రుడు, వినతుడు, దీర్ఘుడు, హరికేశుడు, సుతీర్థుడు, కృష్ణుడు, శృగాలరూపుడు, సర్వార్థుడు, ముండుడు, సర్వశుభంకరుడు, సింహశార్దూలరూపుడు, గంధకారి, కపర్ది.

**ఊర్ధ్వరేతోర్ధ్వలింగీ చ ఊర్ధ్వశాయీ నభస్తలః ।**
**త్రిజటీ చీరవాసాశ్చ రుద్రః సేనాపతిర్విభుః ॥70॥**

**అహోరాత్రం చ నక్తం చ తిగ్మమన్యుః సువర్చసః ।**
**గజహా దైత్యహా కాలో లోకధాతా గుణాకరః ॥71॥**

**సింహశార్దూలరూపాణామార్ద్రచర్మాంబరంధరః ।**
**కాలయోగీ మహానాదః సర్వావాసశ్చతుష్పథః ॥72॥**

ఊర్ధ్వరేతుడు, ఊర్ధ్వలింగి, ఊర్ధ్వశాయి, నభుడు, తలుడు, త్రిజటి, చీరవాసనుడు, రుద్రుడు, సేనుడు, పతి, విభుడు, అహోరాత్రుడు, నక్తుడు, తిగ్మమన్యుడు, సువర్చసుడు, గజహనుడు, దైత్యహనుడు, కాలుడు, లోకధాత, గుణాకరుడు, సింహశార్దూలరూపులయిన తనభక్తుల తడిచర్మమునే వస్త్రముగా ధరించేవాడు, కాలయోగి, మహానాదుడు, సమస్తప్రపంచానికి నిలయమైనవాడు, ధర్మాదిచతుర్విధపురుషార్థాలకు మార్గమైనవాడు.

**నిశాచరః ప్రేతచారీ సర్వదర్శీ మహేశ్వరః ।**
**బహుభూతో బహుధనః సర్వసారోఽమృతేశ్వరః ॥73॥**

**నృత్యప్రియో నిత్యనృత్యో నర్తనః సర్వసాధకః ।**
**సకార్ముకో మహాబాహుర్మహాఘోరో మహాతపాః ॥74॥**

**మహాశరో మహాపాశో నిత్యో గిరిచరోఽమతః ।**
**సహస్రహస్తో విజయో వ్యవసాయో హ్యనిందితః ॥75॥**

**అమర్షణో మర్షణాత్మా యజ్ఞహా కామనాశనః ।**
**దక్షహా పరిచారీ చ ప్రహసో మధ్యమస్తథా ॥76॥**

నిశాచరుడు, ప్రేతచారి, సర్వదర్శి, మహేశ్వరుడు, బహుభూతుడు, బహుధనుడు, సర్వసారుడు, అమృతేశ్వరుడు, నృత్యప్రియుడు, నిత్యనృత్యుడు, నర్తనుడు, సర్వసాధకుడు, సకార్ముకుడు, మహాబాహువు, మహాఘోరుడు, మహాతపుడు, మహాశరుడు, మహాపాశుడు, నిత్యుడు, గిరిచరుడు, అమతుడు, సహస్రహస్తుడు, విజయుడు, వ్యవసాయుడు, అనిందితుడు, అమర్షణుడు, మర్షణాత్ముడు, యజ్ఞహా(యజ్ఞధ్వంసకుడు), కామనాశనుడు, దక్షహా(దక్షధ్వంసకుడు), పరిచారి, ప్రహసుడు, మధ్యముడు.

**తేజోఽపహారీ బలవాన్ విదితోఽభ్యుదితోఽబహుః ।**
**గంభీర ఘోషో యోగాత్మా యజ్ఞహా కామనాశనః ॥77॥**

**గంభీరరోషో గంభీరో గంభీరబలవాహనః ।**
**న్యగ్రోధరూపో న్యగోధో విశ్వకర్మా చ విశ్వభుక్ ॥78॥**

**తీక్ష్ణోపాయశ్చ హర్యశ్వః సహాయః కర్మ కాలవిత్ ।**
**విష్ణుః ప్రసాదితో యజ్ఞః సముద్రో బడబాముఖః ॥79॥**

**హుతాశనసహాయశ్చ ప్రశాంతాత్మా హుతాశనః ।**
**ఉగ్రతేజా మహాతేజా జయో విజయకాలవిత్ ॥80॥**

తేజుడు, అపహారి, బలవంతుడు, విదితుడు, అభ్యుదితుడు, అబహువు, గంభీరఘోషుడు, యోగాత్ముడు, యజ్ఞహంత, కామనుడు, అశనుడు, గంభీరరోషుడు, గంభీరుడు, గంభీరబలవాహనుడు, న్యగ్రోధరూపుడు, న్యగ్రోధుడు, విశ్వకర్ముడు, విశ్వభుక్కు, తీక్ష్ణోపాయుడు, హర్యశ్వుడు, సహాయుడు, కర్ముడు, కాలవిదుడు. విష్ణువు, ప్రసాదితుడు, యజ్ఞుడు, సముద్రుడు, బడబాముఖుడు, హుతాశనసహాయుడు, ప్రశాంతాత్ముడు, హుతాశనుడు, ఉగ్రతేజుడు, మహాతేజుడు, జయుడు, విజయుడు, కాలవిదుడు.

**జ్యోతిషామయనం సిద్ధిః సంధిర్విగ్రహ ఏవ చ ।**
**ఖడ్గీ శంఖీ జటీ జ్వాలీ ఖచరో ద్యుచరో బలీ ॥81॥**

**వైణవీ పణవీ కాలః కాలకంఠః కటంకటః ।**
**నక్షత్రవిగ్రహో భావో నిభావః సర్వతోముఖః ॥82॥**

**విమోచనస్తు శరణో హిరణ్యకవచోద్భవః ।**
**మేఖలా కృతిరూపశ్చ చలాచారః స్తుతస్తథా ॥83॥**

**వీణీ చ పణవీ తాలీ నాలీ కలికటుస్తథా ।**
**సర్వతూర్యనినాదీ చ సర్వవ్యాప్య పరిగ్రహః ॥84॥**

జ్యోతిస్సులకు స్థానమైనవాడు, సిద్ధి, సంధి, విగ్రహుడు, ఖడ్గి, శంఖి, జటి, జ్వాలి, ఖచరుడు, ద్యుచరుడు, బలి, వైణవి, పణవి, కాలుడు, కాలకంఠుడు, కటంకటుడు, నక్షత్రవిగ్రహుడు, భావుడు, నిభావుడు, సర్వతోముఖుడు, విమోచనుడు, శరణుడు, హిరణ్యకవచోద్భవుడు, మేఖలుడు, కృతిరూపుడు, చలాచారుడు, స్తుతుడు, వీణి, పణవి, తాలి, నాళి, కలికటుడు, సర్వతూర్యనినాది, సర్వవ్యాప్యపరిగ్రహుడు.

**వ్యాళరూపీ బిలావాసీ గుహావాసీ తరంగవిత్ ।**
**వృక్షః శ్రీమాలకర్మా సర్వబంధవిమోచనః ॥85॥**

**బంధనస్తు సురేంద్రాణాం యుధి శత్రువినాశనః ।**
**సఖా ప్రవాసో దుర్వాపః సర్వసాధువిషేవితాః ॥86॥**

**ప్రస్కందోఽ ప్యవిభావశ్చ తుల్యో యజ్ఞవిభాగవిత్ ।**
**సర్వవాసః సర్వచారీ దుర్వాసా వాసవో మతః ॥87॥**

**హైమో హేమకరో యజ్ఞ సర్వధారీ ధరోత్తమః ।**
**ఆకాశో నిర్విరూపశ్చ వివాసా ఉరగః ఖగః ॥88॥**

**భిక్షుశ్చ బిక్షురూపీ చ రౌద్రరూపః సురూపవాన్ ।**
**వసురేతాః సువర్చస్వీ వసువేగో మహాబలః ॥89॥**

**మనో వేగో నిశాచరః సర్వలోకశుభప్రదః ।**
**సర్వావాసీ త్రయీవాసీ ఉపదేశకరో ధరః ॥90॥**

వ్యాళరూపి, బిలావాసి, గుహావాసి, తరంగవిదుడు, వృక్షుడు, శ్రీమాలకర్ముడు, సర్వబంధవిమోచనుడు, బంధనుడు, యుద్ధంలో దేవతల శత్రువులను సంహరించేవాడు, సఖుడు, ప్రవాసుడు, దుర్వాపుడు, సర్వసాధునిషేవితుడు, ప్రస్కందుడు, అవిభావుడు, తుల్యుడు, యజ్ఞవిభాగవిదుడు, సర్వవాసుడు, సర్వచారి, దుర్వాసుడు, వాసవుడు, మతుడు, హైముడు, హేమకరుడు, యజ్ఞుడు, సర్వధారి, ధరోత్తముడు, ఆకాశుడు, నిర్విరూపుడు, వివాసుడు, ఉరగుడు, ఖగుడు, భిక్షుడు, భిక్షురూపి, రౌద్రరూపుడు, సురూపవంతుడు, వసురేతసుడు, సువర్చస్వి, వసువేగుడు, మహాబలుడు, మనుడు, వేగుడు, నిశాచరుడు, సర్వలోకశుభప్రదుడు, సర్వావాసి, త్రయీవాసి, ఉపదేశకరుడు, ధరుడు.

**మునిరాత్మా మునిర్లోకః సభాగ్యశ్చ సహస్రభుక్ ।**
**పక్షీ చ పక్షరూపశ్చ అతిదీప్తో నిశాకరః ॥91॥**

**సమీరో దమనాకారో హ్యర్థో హ్యర్థకరో వశః ।**
**వాసుదేవశ్చ దేవశ్చ వామదేవశ్చ వామనః ॥92॥**

**సిద్ధియోగాపహారీ చ సిద్ధః సర్వార్థసాధకః ।**
**అక్షుణ్ణః క్షుణ్ణరూపశ్చ వృషణో మృదురవ్యయః ॥93॥**

**మహాసేనో విశాఖశ్చ షష్టిభాగో గవాంపతిః ।**
**చక్రహస్తస్తు విష్టంభీ మూలస్తంభన ఏవ చ ॥94॥**

**ఋతుర్ఋతుకరస్తాలో మధుర్మధుకరో వరః ।**
**వానస్పత్యో వాజసనో నిత్యమాశ్రమపూజితః ॥95॥**

**బ్రహ్మచారీ లోకచారీ సర్వచారీ సుచారవిత్ ।**
**ఈశాన ఈశ్వరః కాలో నిశాచారీ హ్యనేకదృక్ ॥96॥**

ముని, ఆత్ముడు, ముని, (అగస్తి వృక్షరూపుడు) లోకుడు, సభాగ్యుడు, సహస్రభుక్కు, పక్షి, పక్షరూపుడు, అతిదీప్తుడు, నిశాకరుడు, సమీరుడు, దమనాకారుడు, అర్థుడు, అర్థకరుడు, వశుడు, వాసుదేవుడు, దేవుడు,

వామదేవుడు, వామనుడు, సిద్ధియోగాపహారి, సిద్ధుడు, సర్వార్థసాధకుడు, అక్షుణ్ణుడు, క్షుణ్ణరూపుడు, వృషణుడు, మృదుడు, అవ్యయుడు, మహాసేనుడు, విశాఖుడు, షష్టిభాగుడు, గవాంపతి, చక్రహస్తుడు, విష్టంభి, మూలస్తంభుడు, ఋతుడు, ఋతుకరుడు, తాలుడు, మధుడు, మధుకరుడు, వరుడు, వానస్పత్యుడు, వాజసనుడు, నిత్యుడు, ఆశ్రమపూజితుడు, బ్రహ్మచారి, లోకచారి, సర్వచారి, సుచారవిదుడు, ఈశానుడు, ఈశ్వరుడు, కాలుడు, నిశాచారి, అనేకదృక్కు.

**నిమిత్తస్థో నిమిత్తంచ నందిర్నందికరో హరః ।**
**నందీశ్వరః సునందీ చ నందనో విషమర్దనః ॥97॥**

**భగహారీ నియంతా చ కాలో లోకపితామహః ।**
**చతుర్ముఖో మహాలింగశ్చారులింగస్తథైవ చ ॥98॥**

**లింగాధ్యక్షః సురాధ్యక్షః కాలాధ్యక్షో యుగావహః ।**
**బీజాధ్యక్షో బీజకర్తా అధ్యాత్మానుగతో బలః ॥99॥**

**ఇతిహాసశ్చ కల్పశ్చ దమనో జగదీశ్వరః ।**
**దంభో దంభకరో దాతా వంశో వంశకరః కలిః ॥100॥**

నిమిత్తస్థుడు,నిమిత్తుడు, నంది, నందికరుడు, హరుడు, నందీశ్వరుడు, సునంది, నందనుడు, విషమర్దనుడు, భగహారి, నియంత, కాలుడు, లోకపితామహుడు, చతుర్ముఖుడు, మహాలింగుడు, చారులింగుడు, లింగాధ్యక్షుడు, సురాధ్యక్షుడు, కాలాధ్యక్షుడు, యుగావహుడు, బీజాధ్యక్షుడు, బీజకర్త, అధ్యాత్ముడు, అనుగతుడు, బలుడు, ఇతిహాసుడు, కల్పుడు, దమనుడు, జగదీశ్వరుడు, దంభుడు, దంభకరుడు, దాత, వంశుడు, వంశకరుడు, కలి.

**లోకకర్తా పశుపతిర్మహాకర్తా హ్యధోక్షజః ।**
**అక్షరం పరమం బ్రహ్మ బలవాన్ శుక్ర ఏవ చ ॥101॥**

**నిత్యో హ్యనీశః శుద్ధాత్మా శుద్ధో మానోగతిర్హవిః ।**
**ప్రాసాదస్తు బలదర్పో దర్పణో హవ్య ఇంద్రజిత్ ॥102॥**

**వేదకారః సూత్రకారో విద్వాంశ్చ పరమర్దనః ।**
**మహామేఘనివాసీ చ మహాఘోరో వశీ కరః ॥103॥**

**అగ్నిజ్వాలో మహాజ్వాలః పరిధూమ్రావృతో రవిః ।**
**ధిషణః శంకరోఽనిత్యో వర్చస్వీ ధూమ్రలోచనః ॥104॥**

**నీలస్తథాంగలుప్తశ్చ శోభనో నరవిగ్రహః ।**
**స్వస్తి స్వస్తి స్వభావశ్చ భోగీ భోగకరో లఘుః ॥105॥**

**ఉత్సంగశ్చ మహాంగశ్చ మహాగర్భః ప్రతాపవాన్ ।**
**కృష్ణవర్ణః సువర్ణశ్చ ఇంద్రియః సర్వవర్ణికః ॥106॥**

**మహాపాదో మహాహస్తో మహాకాయో మహాయశాః ।**
**మహామూర్ధా మహామాత్రో మహామిత్రో నగాలయః ॥107॥**

**మహాస్కంధో మహాకర్ణో మహోష్ఠశ్చ మహాహనుః ।**
**మహానాసో మహాకంఠో మహాగ్రీవఃశ్మశానవాన్ ॥108॥**

లోకకర్త, పశుపతి, మహాకర్త, అధోక్షజుడు, అక్షరుడు, పరముడు, బ్రహ్మ, బలవంతుడు, శుక్రుడు, నిత్యుడు, అనీశుడు, శుద్ధాత్ముడు, శుద్ధుడు, మానుడు, గతి, హవి, ప్రాసాదుడు, బలుడు, దర్పుడు, దర్పణుడు, హవ్యుడు, ఇంద్రజిత్తు, వేదకారుడు, సూత్రకారుడు, విద్వాంసుడు, పరమర్దనుడు, మహామేఘనివాసుడు, మహాఘోరుడు, వశి, కరుడు, అగ్నిజ్వాలుడు, మహాజ్వాలుడు, పరిధూమ్రావృతుడు, రవి, ధిషణుడు, శంకరుడు, అనిత్యుడు, వర్చస్వి, ధూమ్రలోచనుడు, నీలుడు, అంగలుప్తుడు, శోభనుడు, నరవిగ్రహుడు, స్వస్తి, స్వస్తిస్వభావుడు, భోగి, భోగకరుడు, లఘువు, ఉత్సంగుడు, మహాంగుడు, మహాగర్భుడు, ప్రతాపవంతుడు, కృష్ణవర్ణుడు, సువర్ణుడు, ఇంద్రియుడు, సర్వవర్ణికుడు, మహాపాదుడు, మహాహస్తుడు, మహాకాయుడు, మహాయశుడు, మహామూర్ధుడు, మహామాత్రుడు, మహామిత్రుడు, నగాలయుడు, మహాస్కంధుడు, మహాకర్ణుడు, మహోష్ఠుడు, మహాహనుడు, మహానాసుడు, మహాకంఠుడు, మహాగ్రీవుడు, శ్మశానవంతుడు.

**మహాబలో మహాతేజా హ్యంతరాత్మా మృగాలయః ।**
**లంబితోష్ఠశ్చ నిష్ఠశ్చ మహామాయః పయోనిధిః ॥109॥**

**మహాదంతో మహాదంష్ట్రో మహాజిహ్వో మహాముఖః ।**
**మహానఖో మహారోమా మహాకేశో మహాజటః ॥110॥**

**అసపత్నః ప్రసాదశ్చ ప్రత్యయో గీతసాధకః ।**
**ప్రస్వేదనోఽ స్వహేనశ్చ ఆదికశ్చ మహామునిః ॥111॥**

**వృషకో వృషకేతుశ్చ అనలో వాయువాహనః ।**
**మండలీ మేరువాసశ్చ దేవవాహన ఏవచ ॥112॥**

**అధర్వశీర్షః సామాస్య ఋక్ సహస్రోర్జితేక్షణః ।**
**యజుః పాదభుజో గుహ్యః ప్రకాశౌజాస్తథైవ చ ॥113॥**

**అమోఘార్థప్రసాదశ్చ అంతర్భావ్యః సుదర్శనః ।**
**ఉపహారః ప్రియః సర్వః కనకః కాంచనస్థితః ॥114॥**

**నాభిర్నందకరో హర్మ్యః పుష్కరః స్థపతిః స్థితః ।**
**సర్వశాస్త్రో ధనశ్చాద్యో యజ్ఞో యజ్వా సమాహితః ॥115॥**

**నగో నీలః కవిః కాలో మకరః కాలపూజితః ।**
**సగణో గణకారశ్చ భూతభావనసారథిః॥116॥**

మహాబలుడు, మహాతేజస్వంతుడు, అంతరాత్ముడు, మృగాలయుడు, లంబితోష్ఠుడు, నిష్ఠుడు, మహామాయుడు, పయోనిధి, మహాదంతుడు, మహాదంష్ట్రుడు, మహాజిహ్వుడు, మహాముఖుడు, మహానఖుడు, మహారోముడు, మహాకేశుడు, మహాజటుడు, అసపత్నుడు, ప్రసాదుడు, ప్రత్యయుడు, గీతసాధకుడు, ప్రస్వేదనుడు, అస్వహేనుడు, ఆదికుడు, మహాముని, వృషకుడు, వృషకేతుడు, అనలుడు, వాయువాహనుడు, మండలి, మేరువాసుడు, దేవవాహనుడు, అథర్వశీర్షుడు, సామాస్యుడు, ఋక్సహస్రోర్జితేక్షణుడు, యజుఃపాదభుజుడు, గుహ్యుడు, ప్రకాశౌజుడు, అమోఘార్థప్రసాదుడు, అంతర్భావ్యుడు, సుదర్శనుడు, ఉపహారుడు, ప్రియుడు, సర్వుడు, కనకుడు, కాంచనస్థితుడు, నాభి, నందికరుడు, హర్ష్యుడు, పుష్కరుడు, స్థపతి, స్థితుడు, సర్వశాస్త్రుడు, ధనుడు, ఆద్యుడు, యక్షుడు, యజ్వుడు, సమాహితుడు, నగుడు, నీలుడు, కవి, కాలుడు, మకరుడు, కాలపూజితుడు, సగణుడు, గణకారుడు, భూతభావనసారథి.

**భస్మశాయీ భస్మగోప్తా భస్మభూతతనుర్గణః ।**
**ఆగమశ్చ విలోపశ్చ మహాత్మా సర్వపూజితః ॥117॥**

**శుక్లః స్త్రీరూపసంపన్నః శుచిర్భూతనిషేవితః ।**
**ఆశ్రమస్థః కపోతస్థో విశ్వకర్మా పతిర్విరాట్ ॥118॥**

**విశాలశాఖస్తామ్రోష్ఠో హ్యంబుజాలః సునిశ్చితః ।**
**కపిలః కలశః స్థూల ఆయుధశ్చైవ రోమశః ॥119॥**

**గంధర్వో హ్యదితిస్తార్క్ష్యో హ్యవిజ్ఞేయః సుశారదః ।**
**పరశ్వధాయుధో దేవో హ్యర్థకారీ సుబాంధవః ॥120॥**

భస్మశాయి, భస్మగోప్తుడు, భస్మభూతతనుడు, గణుడు, ఆగముడు, విలోపుడు, మహాత్ముడు, సర్వపూజితుడు, శుక్లుడు, స్త్రీరూపసంపన్నుడు, శుచి, భూతనిషేవితుడు, ఆశ్రమస్థుడు, కపోతస్థుడు, విశ్వకర్ముడు, పతి, విరాటుడు, విశాలశాఖుడు, తామ్రోష్ఠుడు, అంబుజాలుడు, సునిశ్చితుడు, కపిలుడు, కలశుడు, స్థూలుడు, ఆయుధుడు, రోమశుడు, గంధర్వుడు, అదితి, తార్క్ష్యుడు, అవిజ్ఞేయుడు, సుశారదుడు, పరశ్వధాయుధుడు, దేవుడు, అర్థకారి, సుబాంధవుడు.

**తుంబవీణో మహాకోప ఊర్ధ్వరేతా జలేశయః ।**
**ఉగ్రో వంశకరో వంశో వంశవాదీ హ్యనిందితః ॥121॥**

**సర్వాంగరూపీ మాయావీ సుహృదో హ్యనితో బలః ।**
**బంధనో బంధకర్తా చ సుబంధనవిమోచనః ॥122॥**

**రాక్షసఘ్నోఽథ కామారిర్మహాదంష్ట్రో మహాయుధః ।**
**లంబితో లంబితోష్ఠశ్చ లంబహస్తో వరప్రదః ॥123॥**

**బాహుస్త్వనిందితః సర్వః శంకరోఽథాప్యకోపనః ।**
**అమరేశో మహాఘోరో విశ్వదేవః సురారిహా ॥124॥**

తుంబవీణుడు, మహాకోపుడు, ఊర్ధ్వరేతసుడు, జలేశయుడు, ఉగ్రుడు, వంశకరుడు, వంశుడు, వంశవాది, అనిందితుడు, సర్వాంగరూపి, మాయావి, సుహృదుడు, అనిలుడు, బలుడు, బంధనుడు, బంధకర్త, సుబంధనవిమోచనుడు, రాక్షసఘ్నుడు, కామారి, మహాదంష్ట్రుడు, మహాయుధుడు, లంబితుడు, లంబితోష్ఠుడు, లంబహస్తుడు, వరప్రదుడు, బాహువు, అనిందితుడు, సర్వుడు, శంకరుడు, అకోపనుడు, అమరేశుడు, మహాఘోరుడు, విశ్వదేవుడు, సురారిహనుడు.

**అహిర్బుధ్న్యో నిరృతిశ్చ చేకితానో హలీ తథా ।**
**అజైకపాచ్చ కాపాలీ శం కుమారో మహాగిరిః ॥125॥**

**ధన్వంతరిర్ధూమకేతుః సూర్యో వైశ్రవణస్తథా ।**
**ధాతా విష్ణుశ్చ శక్రశ్చ మిత్రస్త్వష్టా ధరో ధ్రువః ॥126॥**

**ప్రభాసః సర్వతో వాయురర్యమా సవితా రవిః ।**
**ధృతిశ్చైవ విధాతా చ మాంధాతా భూతవాహనః ॥127॥**

**నీరస్తీర్థశ్చ భీమశ్చ సర్వకర్మా గుణోద్వహః ।**
**పద్మగర్భో మహాగర్భశ్చంద్రవక్త్రో నభోஉనఘః ॥128॥**

అహిర్బుధ్న్యుడు, నిరృతి, చేకితానుడు, హలి, అజైకపాత్తు, కపాలి, శముడు, కుమారుడు, మహాగిరి, ధన్వంతరి, ధూమకేతువు, సూర్యుడు, వైశ్రవణుడు, ధాతా, విష్ణువు, శక్రుడు, మిత్రుడు, త్వష్టుడు, ధరుడు, ధ్రువుడు, ప్రభాసుడు, పర్వతుడు, వాయువు, అర్యముడు, సవితృడు, రవి, ధృతి, విధాత, మాంధాత, భూతభావనుడు, నీరుడు, తీర్థుడు, భీముడు, సర్వకర్ముడు, గుణోద్వహుడు, పద్మగర్భుడు, మహాగర్భుడు, చంద్రవక్త్రుడు, నభుడు, అనఘుడు.

**బలవాంశ్చోపశాంతశ్చ పురాణః పుణ్యకృత్తమః ।**
**క్రూరకర్తా క్రూరవాసీ తనురాత్మా మహౌషధః ॥129॥**

**సర్వాశయః సర్వచారీ ప్రాణేశః ప్రాణినాంపతిః ।**
**దేవదేవః సుఖోత్సిక్తః సదసత్సర్వరత్నవిత్ ॥130॥**

**కైలాసస్థో గుహావాసీ హిమవద్గిరిసంశ్రయః ।**
**కులహారీ కులాకర్తా బహువిత్తో బహుప్రజః ॥131॥**

**ప్రాణేశో బంధకీ వృక్షో నకులశ్చాద్రికస్తథా ।**
**హ్రస్వగ్రీవో మహాజానురలోలశ్చ మహౌషధిః ॥132॥**

బలవంతుడు, ఉపశాంతుడు, పురాణుడు, పుణ్యకృత్తముడు, క్రూరకర్త, క్రూరవాసి, తనుడు, ఆత్ముడు, మహౌషధుడు, సర్వాశయుడు, సర్వచారి, ప్రాణేశుడు, ప్రాణినాంపతి, దేవదేవుడు, సుఖోత్సిక్తుడు, సత్తుడు, అసత్తుడు, సర్వరత్నవిదుడు, కైలాసస్థుడు, గుహావాసి, హిమవద్గిరిసంశ్రయుడు, కులహారి, కులాకర్త, బహువిత్తుడు,

బహుప్రజుడు, ప్రాణేశుడు, బంధకి, వృక్షుడు, నకులుడు, అద్రికుడు, హ్రస్వగ్రీవుడు, మహాజానువు, అలోలుడు, మహౌషధి.

**సిద్ధాంతకారీ సిద్ధార్థశ్ఛందోవ్యాకరణోద్భవః ।**
**సింహనాదః సింహదంష్ట్రః సింహాస్యః సింహవాహనః ॥133॥**

**ప్రభావాత్మా జగత్కాలః కాలః కంపీ తరుస్తనుః ।**
**సారంగో భూతచక్రాంకః కేతుమాలీ సువేధకః ॥134॥**

**భూతాలయో భూతపతిరహోరాత్రో మలోఽమలః ।**
**వసుభృత్సర్వభూతాత్మా నిశ్చలః సువిదుర్బుధః ॥135॥**

**అసుహృత్సర్వభూతానాం నిశ్చలశ్చలవిద్ బుధః ।**
**అమోఘః సంయమో హృష్టో భోజనః ప్రాణధారణః ॥136॥**

సిద్ధాంతకారి, సిద్ధార్థుడు, ఛందోవ్యాకరణోద్భవుడు, సింహనాదుడు, సింహదంష్ట్రుడు, సింహాస్యుడు, సింహవాహనుడు, ప్రభావాత్ముడు, జగత్కాలుడు, కాలుడు, కంపి, తరుడు, తనుడు, సారంగుడు, భూతచక్రాంకుడు, కేతుమాలి, సువేధకుడు, భూతాలయుడు, భూతపతి, అహోరాత్రుడు, మలుడు, అమలుడు, వసుభృత్తుడు, సర్వభూతాత్ముడు, నిశ్చలుడు, సువిదుడు, బుధుడు, సర్వభూతాల ఆసువుల అపహరించేవాడు, నిశ్చలుడు, చలవిదుడు, బుధుడు, అమోఘుడు, సంయముడు, హృష్టుడు, భోజనుడు, ప్రాణధారణుడు.

**ధృతిమాన్ మతిమాంస్త్ర్యక్షః సుకృతస్తు యుధాంపతిః ।**
**గోపాలో గోపతిర్గ్రామో గోచర్మవసనో హరః ॥137॥**

**హిరణ్యబాహుశ్చ తథా గుహావాసః ప్రవేశనః ।**
**మహామనా మహాకామో చిత్తకామో జితేంద్రియః ॥138॥**

**గాంధారశ్చ సురాపశ్చ తాపకర్మరతో హితః ।**
**మహాభూతో భూతవృతో హ్యప్సరో గణసేవితః ॥139॥**

**మహాకేతుర్ధరాధాతా నైకతానరతః స్వరః ।**
**అవేదనీయ ఆవేద్యః సర్వగశ్చ సుఖావహః ॥140॥**

ధృతిమంతుడు, మతిమంతుడు, త్ర్యక్షుడు, సుకృతుడు, యుధాంపతి, గోపాలుడు, గోపతి, గ్రాముడు, గోచర్మవసనుడు, హరుడు, హిరణ్యబాహువు, గుహావాసుడు, ప్రవేశనుడు, మహామనుడు, మహాకాముడు, చిత్తకాముడు, జితేంద్రియుడు, గాంధారుడు, సురాపుడు, తాపకర్మరతుడు, హితుడు, మహాభూతుడు, భూతవృతుడు, అప్సరుడు, గణసేవితుడు, మహాకేతువు, ధరాధాత, నైకతానరతుడు, స్వరుడు, అవేదనీయుడు, ఆవేద్యుడు, సర్వగుడు, సుఖావహుడు.

**తారణశ్చారణో ధాతా పరిధా పరిపూజితః ।**
**సంయోగీ వర్ధనో వృద్ధో గణికోఽథ గణాధిపః ॥141॥**

**నిత్యో ధాతా సహాయశ్చ దేవాసురపతిః పతిః ।**
**యుక్తశ్చ యుక్తబాహుశ్చ సుదేవో௨పి సుపర్వణః ॥142॥**

**ఆషాఢశ్చ సుషాఢశ్చ స్కంధదో హరితో హరః ।**
**వపురావర్తమానో௨న్యో వపుః శ్రేష్ఠో మహావపుః ॥143॥**

**శిరో విమర్శనః సర్వలక్ష్యలక్షణభూషితః ।**
**అక్షయో రథగీతశ్చ సర్వభోగీ మహాబలః ॥144॥**

**సామ్నాయో௨థ మహామ్నాయస్తీర్థదేవో మహాయశాః ।**
**నిర్జీవో జీవనో మంత్రః సుభగో బహుకర్కశః ॥145॥**

**రత్నభూతో௨థ రత్నాంగో మహార్ణవనిపాతవిత్ ।**
**మూలం విశాలో హ్యమృతం వ్యక్తావ్యక్తస్తపోనిధిః ॥146॥**

**ఆరోహణో௨ధిరోహశ్చ శీలధారీ మహాతపాః ।**
**మహాకంఠో మహాయోగీ యుగో యుగకరో హరిః ॥147॥**

**యుగరూపో మహారూపో వహనో గహనో నగః ।**
**న్యాయో నిర్వాపణో௨ పాదః పండితో హ్యచలోపమః ॥148॥**

**బహుమాలో మహామాలః శిపివిష్టః సులోచనః ।**
**విస్తారో లవణః కూపః కుసుమాంగః ఫలోదయః ॥149॥**

**ఋషభో వృషభో భంగో మణిబింబజటాధరః ।**
**ఇందుర్విసర్గః సుముఖః శూరః సర్వాయుధః సహః ॥150॥**

తారణుడు, చరణుడు, ధాత, పరిధ, పరిపూజితుడు, సంయోగి, వర్ధనుడు, వృద్ధుడు, గణికుడు, గణాధిపుడు, నిత్యుడు, ధాత, సహాయుడు, దేవాసురపతి, పతి, యుక్తుడు, యుక్తబాహువు, సుదేవుడు, సుపర్వణుడు, ఆషాఢుడు, సుషాఢుడు, స్కంధదుడు, హరితుడు, హరుడు, వపువు, ఆవర్తమానుడు, అన్యుడు, వపుశ్రేష్ఠుడు, మహావపువు, శిరుడు, విమర్శనుడు, సర్వలక్ష్యలక్షణభూషితుడు, అక్షయుడు, రథగీతుడు, సర్వభోగి, మహాబలుడు, సామ్నాయుడు, మహామ్నాయుడు, తీర్థదేవుడు, మహాయశుడు, నిర్జీవుడు, జీవనుడు, మంత్రుడు, సుభగుడు, బహుకర్కశుడు, రత్నభూతుడు, రత్నాంగుడు, మహార్ణవనిపాతవిదుడు, మూలుడు, విశాలుడు, అమృతుడు, వ్యక్తావ్యక్తుడు, తపోనిధి, ఆరోహణుడు, అధిరోహణుడు, శీలధారి, మహాతపుడు, మహాకంఠుడు, మహాయోగి, యుగుడు, యుగకరుడు, హరి, యుగరూపుడు, మహారూపుడు, వహనుడు, గహనుడు, నగుడు, న్యాయుడు, నిర్వాపణుడు, అపాదుడు, పండితుడు, అచలోపముడు, బహుమాలుడు, మహామాలుడు, శిపివిష్టుడు, సులోచనుడు, విస్తారుడు, లవణుడు, కూపుడు, కుసుమాంగుడు, ఫలోదయుడు, ఋషభుడు, వృషభుడు, భంగుడు, మణిబింబజటాధరుడు, ఇందుడు, విసర్గుడు, సుముఖుడు, శూరుడు, సర్వాయుధుడు, సహుడు.

**నివేదనః సుధాజాతః స్వర్గద్వారో మహోధనుః ।**
**గిరావాసో విసర్గశ్చ సర్వలక్షణలక్షవిత్ ॥151॥**

**గంధమాలీ చ భగవాననంతః సర్వలక్షణః ।**
**సంతానో బహులో బాహుః సకలః సర్వపావనః ॥152॥**

నివేదనుడు, సుధాజాతుడు, స్వర్గద్వారుడు, మహోధనుడు, గిరావాసుడు, విసర్గుడు, సర్వలక్షణ లక్షితుడు, గంధమాలి, భగవానుడు, అనంతుడు, సర్వలక్షణుడు, సంతానుడు, బహుళుడు, బాహువు, సకలుడు, సర్వపావనుడు.

**కరస్థాలీ కపాలీ చ ఊర్ధ్వ సంహననో యువా ।**
**యంతతంత్రసువిఖ్యాతో లోకః సర్వాశ్రయో మృదుః ॥153॥**

**ముండో విరూపో వికృతో దండీ కుండీ వికుర్వణః ।**
**వార్యక్షః కకుభో వజ్రీ దీప్తతేజాః సహస్రపాత్ ॥154॥**

**సహస్రమూర్ధా దేవేంద్రః సర్వదేవమయో గురుః ।**
**సహస్రబాహుః సర్వాంగః శరణ్యః సర్వలోకకృత్ ॥155॥**

**పవిత్రం త్రిమధుర్మంత్రః కనిష్ఠః కృష్ణపింగళః ।**
**బ్రహ్మదండవినిర్మాతా శతఘ్నః శతపాశధృక్ ॥156॥**

కరస్థాలీ, కలాపి, ఊర్ధ్వసంహననుడు, యువకుడు, యంత్రమంత్రసువిఖ్యాతుడు, లోకుడు, సర్వాశ్రయుడు, మృదువు, ముండుడు, విరూపుడు, వికృతుడు, దండి, కుండి, వికుర్వణుడు, వార్యక్షుడు, కకుభుడు, వజ్రి, దీప్తతేజుడు, సహస్రపాదుడు, సహస్రమూర్ధుడు, దేవేంద్రుడు, సర్వదేవమయుడు, గురుడు, సహస్రబాహువు, సర్వాంగుడు, శరణ్యుడు, సర్వలోకకృత్తు, పవిత్రుడు, త్రిమధుడు, మంత్రుడు, కనిష్ఠుడు, కృష్ణపింగళుడు, బ్రహ్మదండవినిర్మాత, శతఘ్నుడు, శతపాశధృక్కు.

**కాలా కాష్ఠా లవో మాత్రా ముహూర్తోఽహః క్షపా క్షణః ।**
**విశ్వక్షేత్రప్రదో బీజం లింగమాద్యస్తు నిర్ముఖః ॥157॥**

**సదసద్ వ్యక్తమవ్యక్తం పితా మాతా పితామహః ।**
**స్వర్గద్వారం మోక్షద్వారం ప్రజాద్వారం త్రివిష్టపః ॥158॥**

**నిర్వాణం హృదయశ్చైవ బ్రహ్మలోకః పరాగతిః ।**
**దేవాసురవినిర్మాతా దేవాసురపరాయణః ॥159॥**

**దేవాసురగురుర్దేవో దేవాసురనమస్కృతః ।**
**దేవాసురమహామాత్రో దేవాసురగణాశ్రయః ॥160॥**

కలుడు, కాష్ఠుడు, లవుడు, మాత్రుడు, ముహూర్తుడు, అహుడు, క్షపుడు, క్షణుడు, విశ్వక్షేత్రప్రదుడు, బీజుడు, లింగుడు, ఆద్యుడు, నిర్ముఖుడు, సదసదుడు, వ్యక్తుడు, అవ్యక్తుడు, పిత, మాత, పితామహుడు,

స్వర్గద్వారుడు, మోక్షద్వారుడు, ప్రజాద్వారుడు, త్రివిష్టపుడు, నిర్వాణుడు, హృదయుడు, బ్రహ్మలోకుడు, పరాగతుడు, దేవాసురవినిర్మాతుడు, దేవాసురపరాయణుడు, దేవాసురగురుడు, దేవుడు, దేవాసురనమస్కృతుడు, దేవాసురమహామాత్రుడు, దేవాసురగణాశ్రయుడు.

**దేవాసురగణాధ్యక్షో దేవాసురగణాగ్రణీః ।**
**దేవాధిదేవో దేవర్షిర్దేవాసురవరప్రదః ॥161॥**

**దేవాసురేశ్వరో విష్ణుర్దేవాసురమహేశ్వరః ।**
**సర్వదేవమయోఽచింత్యో దేవతాత్మా స్వయంభవః ॥162॥**

**ఉద్గతస్త్రిక్రమో వైద్యో వరదోఽవరజోఽంబరః ।**
**ఇజ్యో హస్తీ తథా వ్యాఘ్రో దేవసింహో మహర్షభః ॥163॥**

**విబుధాగ్ర్యః సురః శ్రేష్ఠః స్వర్గదేవస్తథోత్తమః ।**
**సంయుక్తః శోభనో వక్తా ఆశానాం ప్రభవోఽవ్యయః ॥164॥**

దేవాసురగణాధ్యక్షుడు, దేవాసురగణాగ్రణి, దేవాధిదేవుడు, దేవర్షి, దేవాసురవరప్రదుడు, దేవాసురేశ్వరుడు, విష్ణువు, దేవాసురమహేశ్వరుడు, సర్వదేవమయుడు, అచింత్యుడు, దేవతాత్ముడు, స్వయంభవుడు, ఉద్గతుడు, త్రివిక్రముడు, వైద్యుడు, వరదుడు, అవరజుడు, అంబరుడు, ఇజ్యుడు, హస్తి, వ్యాఘ్రుడు, దేవసింహుడు, మహర్షభుడు, విబుధాగ్ర్యుడు, సురుడు, శ్రేష్ఠుడు, సర్వదేవుడు, ఉత్తముడు, సంయుక్తుడు, శోభనుడు, వక్త, ఆశానాంప్రభవుడు, అవ్యయుడు.

**గురుః కాంతో నిజః సర్గః పవిత్రః సర్వవాహనః ।**
**శృంగీ శృంగప్రియో బభ్రూ రాజరాజో నిరామయః ॥165॥**

**అభిరామః సుశరణో నిరామః సర్వసాధనః ।**
**లలాటాక్షో విశ్వదేహో హరిణో బ్రహ్మవర్చసః ॥166॥**

**స్థావరాణాం పతిశ్చైవ నియతేంద్రియవర్తనః ।**
**సిద్ధార్థః సర్వభూతార్థోఽచింత్యః సత్యః శుచివ్రతః ॥167॥**

**వ్రతాధిపః పరంబ్రహ్మ ముక్తానాం పరమాగతిః ।**
**విముక్తో ముక్తకేశశ్చ శ్రీమాన్ శ్రీవర్ధనో జగత్ ॥168॥**

గురువు, కాంతుడు, నిజుడు, సర్గుడు, పవిత్రుడు, సర్వవాహనుడు, శృంగి, శృంగప్రియుడు, బభ్రువు, రాజరాజు, నిరామయుడు, అభిరాముడు, సుశరణుడు, నిరాముడు, సర్వసాధనుడు, లలాటాక్షుడు, విశ్వదేహుడు, హరిణుడు, బ్రహ్మవర్చసుడు, స్థావరాణాంపతి, నియతేంద్రియవర్తనుడు, సిద్ధార్థుడు, సర్వభూతార్థుడు, అచింత్యుడు, సత్యుడు, శుచివ్రతుడు, వ్రతాధిపుడు, పరబ్రహ్మ, ముక్తానాంపరమాగతి, విముక్తుడు, ముక్తకేశుడు, శ్రీమంతుడు, శ్రీవర్ధనుడు, జగత్తు అయినవాడు.

**యథాప్రధానం భగవానితి భక్త్యా స్మృతో మయా ।**
**భక్తిరేవం పురస్కృత్య మయా యజ్ఞపతిర్విభుః ॥169॥**

**తతో హ్యనుజ్ఞాం ప్రాప్యైవం స్తుతో భక్తిమతాం గతిః ।**
**తస్మాల్లబ్ధ్వా స్తవం శంభోర్నృపస్త్రైలోక్యవిశ్రుతః ॥170॥**

**అశ్వమేధసహస్రస్య ఫలం ప్రాప్య మహాయశాః ।**
**గణాధిపత్యం సంప్రాప్తస్తండినస్తేజసా ప్రభోః ॥171॥**

ఈ నామాల్ని ప్రాధాన్యాన్ని బట్టి నేను భక్తిపూర్వకంగా ఏకాగ్రచిత్తంతో భగవంతుడు, యజ్ఞపతి అయిన శివుణ్ణి స్తుతించాను. ఈ విధంగా ఆతడి ఆదేశానుసారం భక్తులకు గతి ఐన శివుణ్ణి స్తుతించాను. ఆ తండి శివుడి స్తోత్రాన్ని పొంది మూడు లోకాలలో ప్రసిద్ధుడయ్యాడు. తండి ప్రభావంవల్ల మహాయశస్వంతుడైన త్రిధన్వుడు వేయి అశ్వమేధయజ్ఞనిర్వహణ ఫలాన్ని పొంది గణాధిపత్యాన్ని ప్రాప్తింపజేసుకున్నాడు.

**యః పఠేచ్ఛృణుయాద్వాపి శ్రావయేద్ బ్రాహ్మణానపి ।**
**అశ్వమేధ సహస్రస్య ఫలం ప్రాప్నోతి వై ద్విజాః ॥172॥**

**బ్రహ్మఘ్నశ్చ సురాపశ్చ స్తేయీ చ గురుతల్పగః ।**
**శరణాగతఘాతీ చ మిత్రవిశ్వాసఘాతకః ॥173॥**

**మాతృహా, పితృహా చైవ వీరహా భ్రూణహా తథా ।**
**సంవత్సరం క్రమాజ్జప్త్వా త్రిసంధ్యం శంకరాశ్రమే ॥174॥**

**దేవమిష్ట్వా త్రిసంధ్యం చ సర్వపాపైః ప్రముచ్యతే ॥175॥**

ఓ ద్విజులారా! ఈ స్తోత్రాన్ని ఎవడు పఠిస్తాడో, ఎవడు వింటాడో, ఎవడు బ్రాహ్మణులకు వినిపిస్తాడో ఆతడు వేయి అశ్వమేధయాగాల ఫలాన్ని పొందుతాడు. బ్రాహ్మణుల్ని చంపినవాడు, సురాపానం చేసినవాడు, దొంగతనం చేసినవాడు, గురువు భార్యను పొందినవాడు, శరణుజొచ్చిన వాడిని చంపినవాడు, మిత్రుడి నమ్మకాల్ని వమ్ము చేసినవాడు, తల్లిని చంపినవాడు, తండ్రిని చంపినవాడు, వీరుణ్ణి చంపినవాడు, గర్భస్థ శిశువును హత్య చేసినవాడు అయినా శివాలయంలో ఒక సంవత్సరం కాలం మూడు సంధ్యల్లో, ఈ స్తోత్రాన్ని జపించి, అట్లే మూడు సంధ్యల్లో శివుణ్ణి పూజిస్తే సమస్తపాపవిముక్తుడవుతాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే రుద్రసహస్రనామకథనం నామ పంచషష్టితమోఽధ్యాయః ॥ 65 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని రుద్రసహస్రనామకథనమనే అరవై అయిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## షట్షష్టితమోఽధ్యాయః - అరవై ఆరవ అధ్యాయం

## ఇక్ష్వాకువంశవర్ణనమ్ - ఇక్ష్వాకువంశవర్ణనం

**సూత ఉవాచ :-** సూతుడు పలికాడు.

**త్రిధన్వా దేవదేవస్య ప్రసాదాత్తండినస్తథా ।**
**అశ్వమేధసహస్రస్య ఫలం ప్రాప్య ప్రయత్నతః ॥1॥**

**గాణపత్యం దృఢం ప్రాప్తః సర్వదేవనమస్కృతః ।**
**ఆసీత్త్రిధన్వనశ్చాపి విద్వాంస్త్రయ్యారుణో నృపః ॥2॥**

**తస్య సత్యవ్రతో నామ కుమారోఽభూన్మహాబలః ।**
**తేన భార్యా విదర్భస్య హృతా హత్వామితౌజసమ్ ॥3॥**

**పాణిగ్రహణమంత్రేషు నిష్ఠామప్రాపితేష్విహ ।**
**తేనాధర్మేణ సంయుక్తం రాజా త్రయ్యారుణోఽత్యజత్ ॥4॥**

ఓ ద్విజులారా! త్రిధన్వుడు దేవదేవుడైన తండియొక్క కృపతో ప్రయత్నపూర్వకంగా వేయి అశ్వమేధయాగాల ఫలాన్ని పొంది, దేవతలందరిచేత నమస్కరింపబడి గొప్పదైన గణాధిపత్యాన్ని సంపాదించుకున్నాడు. ఆ త్రిధన్వుడి కుమారుడు విద్వాంసుడైన త్రయ్యారుణుడు. ఆతడికి సత్యవ్రతుడనే మహాబలవంతుడైన పుత్రుడు కలిగాడు. ఆతడు మహాకాంతిమంతుడైన విదర్భరాజును చంపి వివాహమంత్రాలు పూర్తికాక ముందే ఆతడి భార్యను అపహరించాడు. అప్పుడు రాజు త్రయ్యారుణుడు అధర్మపరుడైన పుత్రుణ్ణి పరిత్యజించాడు.

**పితరం సోఽబ్రవీత్త్యక్తః క్వ గచ్ఛామీతి వై ద్విజాః ।**
**పితా త్వేనమథోవాచ శ్వపాకైః సహ వర్తయ ॥5॥**

ఓ ద్విజులారా! తండ్రిచే విడువబడిన సత్యవ్రతుడు నేను ఎక్కడకు వెళ్ళాలి? అని తండ్రిని అడుగగా చండాలురతో కలిసి జీవించమని త్రయ్యారుణుడు తన పుత్రునితో చెప్పాడు.

**ఇత్యుక్తః స విచక్రామ నగరాద్వచనాత్పితుః ।**
**స తు సత్యవ్రతో ధీమాన్ శ్వపాకావసథాంతికే ॥6॥**

**పిత్రా త్యక్తోఽవసద్వీరః పితా చాస్య వనం యయౌ ।**
**సర్వలోకేషు విఖ్యాతస్త్రిశంకురితి వీర్యవాన్ ॥7॥**

**వసిష్ఠకోపాత్పుణ్యాత్మా రాజా సత్యవ్రతః పురా ।**
**విశ్వామిత్రో మహాతేజా వరం దత్వా త్రిశంకవే ॥8॥**

**రాజ్యేఽభిషించ్య తం పిత్ర్యే యాజయామాస తం మునిః ।**
**మిషతాం దేవతానాం చ వసిష్ఠస్య చ కౌశికః ॥9॥**

**సశరీరం తదా తం వై దివమారోపయద్విభుః ।**

ఆ విధంగా తండ్రిచేత ఆదేశింపబడిన బుద్ధిమంతుడైన సత్యవ్రతుడు నగరాన్ని విడిచి చండాలుర యొక్క నివాసానికి దగ్గర్లో నివసించాడు. తర్వాత ఆతడి తండ్రి వానప్రస్థాశ్రమం స్వీకరించాడు. అనంతరం సత్యవ్రతుడు సమస్తలోకాలలో పరాక్రమవంతుడు, త్రిశంకుడుగా ప్రసిద్ధిగాంచాడు. పూర్వం పుణ్యాత్ముడైన సత్యవ్రతుడు వసిష్ఠుని కోపానికి పాత్రుడుకాగా అమితతేజశ్శాలియైన విశ్వామిత్రుడు త్రిశంకువునకు (సత్యవ్రతుడు) వరమిచ్చి రాజ్యాభిషిక్తుని గావించాడు. ఆతడితో యజ్ఞం చేయించాడు. దేవతలు ఆ యాగాన్ని విరోధించినా విశ్వామిత్రుడు ఆతణ్ణి సశరీరంగా స్వర్గానికి పంపాడు.

**తస్య సత్యవ్రతా నామ భార్యా కైకయవంశజా ॥10॥**

**కుమారం జనయామాస హరిశ్చంద్రమకల్మషమ్ ।**
**హరిశ్చంద్రస్య చ సుతో రోహితో నామ వీర్యవాన్ ॥11॥**

**హరితో రోహితస్యాథ ధుంధుర్హారిత ఉచ్యతే ।**
**విజయశ్చ సుతేజాశ్చ ధుంధుపుత్రౌ బభూవతుః ॥12॥**

**జేతా క్షత్రస్య సర్వత్ర విజయస్తేన స స్మృతః ।**
**రుచకస్తస్య తనయో రాజా పరమధార్మికః॥13॥**

**రుచకస్య వృకః పుత్రస్తస్మాద్ బాహుశ్చ జజ్ఞివాన్ ।**
**సగరస్తస్య పుత్రోఽభూద్రాజా పరమధార్మికః॥14॥**

కైకయవంశంలో పుట్టిన సత్యవ్రత అనే పేరుగల భార్యయందు ఆతడు (సత్యవ్రత- త్రిశంకుడు) హరిశ్చంద్రుడనే పాపరహితుడైన పుత్రుణ్ణి కన్నాడు. ఆతడికి రోహితుడనే (లోహితుడు) పరాక్రమశాలి అయిన పుత్రుడు కలిగాడు. రోహితుడి పుత్రుడు హరితుడు. హరితుడి కుమారుడు ధుంధువు. ధుంధువుకు ఇద్దరు పుత్రులు. విజయుడు మరియు సుతేజుడు. విజయుడు సమస్త క్షత్రియుల్ని జయించాడు. అందుకే విజయుడని పిలువబడ్డాడు. ఆతడి కుమారుడు రుచకుడు మహాధర్మపరుడైన రాజు. రుచకుడి కుమారుడు వృకుడు. ఆతడికి బాహువు పుట్టాడు. బాహువు పుత్రుడు సగరుడు. ఆతడు పరమధార్మికుడైన రాజు.

**ద్వే భార్యే సగరస్యాపి ప్రభా భానుమతీ తథా ।**
**తాభ్యామారాధితః పూర్వమౌర్వోఽగ్నిః పుత్రకామ్యయా॥15॥**

**ఔర్వస్తుష్టస్తయోః ప్రాదాద్యథేష్టం వరముత్తమమ్ ।**
**ఏకా షష్టిసహస్రాణి సుతమేకం పరా తథా॥16॥**

**అగృహ్ణాద్వంశకర్తారం ప్రభా గృహ్ణాత్సుతాన్ బహూన్ ।**
**ఏకం భానుమతిః పుత్రమగృహ్ణాదసమంజసమ్ ॥17॥**

**తతః షష్టిసహస్రాణి సుషువే సా తు వై ప్రభా ।**
**ఖనంతః పృథివీం దగ్ధా విష్ణుహుంకారమార్గణైః ॥18॥**

సగరుడికి ప్రభ మరియు భానుమతి అనే ఇద్దరు భార్యలు. వాళ్లు ఇద్దరూ పూర్వకాలంలో అగ్ని సదృశుడైన ఔర్వఋషిని ఆరాధించారు. ఆ ఋషి ప్రసన్నుడై వాళ్లకు వాళ్ల అభిమతం మేరకు ఉత్తమమైన వరాల్ని యిచ్చాడు. వాళ్లల్లో ఒక రాణి (ప్రభ) అరవై వేలమంది పుత్రుల్ని, రెండో రాణి (భానుమతి) వంశకర్త అయిన ఒక పుత్రుణ్ణి కోరుకున్నారు. ప్రభ అనేకులైన కుమారుల్ని పొందింది. భానుమతి అసమంజసుడనే ఒక పుత్రుణ్ణి పొందింది. వాళ్లు భూమిని త్రవ్వుతూ కపిలరూపుడైన విష్ణువు యొక్క హుంకారరూపమైన బాణాలకు తగులబడ్డారు.

**అసమంజస్య తనయః సోఽంశుమాన్నామ విశ్రుతః ।**
**తస్య పుత్రో దిలీపస్తు దిలీపాత్తు భగీరథః ॥19॥**

**యేన భాగీరథీ గంగా తపః కృత్వావతారితా ।**
**భగీరథ సుతశ్చాపి శ్రుతో నామ బభూవ హ ॥20॥**

**నాభాగస్తస్య దాయాదో భవభక్తః ప్రతాపవాన్ ।**
**అంబరీషః సుతస్తస్య సింధుద్వీపస్తతోఽభవత్ ॥21॥**

**నాభాగేనాంబరీషేణ భుజాభ్యాం పరిపాలితా ।**
**బభూవ వసుధాత్యర్థం తాపత్రయవివర్జితా ॥22॥**

అసమంజసుడి పుత్రుడు అంశుమంతుడనే పేరుతో ప్రసిద్ధుడు. ఆతడి కుమారుడు దిలీపుడు. దిలీపుడి కుమారుడు భగీరథుడు. ఆతడు తపస్సు చేసి గంగను అవతరింపజేశాడు. అందువల్ల గంగ భాగీరథి అయ్యింది. భగీరథుడికి శ్రుతుడు పుత్రుడు. శ్రుతుడికి నాభాగుడు పుత్రుడు. ఆతడు ప్రతాపశాలి మరియు శివభక్తుడు. ఆతడి పుత్రుడు అంబరీషుడు. అంబరీషుడికి సింధుద్వీపుడు కలిగాడు. నాభాగపుత్రుడైన అంబరీషుడిచే పరిపాలించబడిన వసుధ మూడు విధాలైన తాపాలను మిక్కిలిగా విడిచి పెట్టింది. (దైహిక, దైవిక, భౌతికాలు మూడు తాపాలు)

**ఆయుతాయుః సుతస్తస్య సింధుద్వీపస్య వీర్యవాన్ ।**
**పుత్రోఽయుతాయుషో ధీమానృతుపర్ణో మహాయశాః ॥23॥**

**దివ్యాక్షహృదయజ్ఞో వై రాజా నలసఖో బలీ ।**
**నలౌ ద్వావేవ విఖ్యాతౌ పురాణేషు దృఢవ్రతౌ ॥24॥**

**వీరసేనసుతశ్చాన్యో యశ్చేక్ష్వాకుకులోద్భవః ।**
**ఋతుపర్ణస్య పుత్రోఽభూత్సార్వభౌమః ప్రజేశ్వరః ॥25॥**

**సుదాసస్తస్య తనయో రాజా త్వింద్రసమోఽభవత్ ।**
**సుదాసస్య సుతః ప్రోక్తః సౌదాసో నామ పార్థివః ॥26॥**

ఖ్యాతః కల్మాషపాదో వై నామ్నా మిత్రసహశ్చ సః ।
వసిష్ఠస్తు మహాతేజాః క్షేత్రే కల్మాషపాదకే ॥27॥

అశ్మకం జనయామాస ఇక్ష్వాకుకులవర్ధనమ్ ।
అశ్మకస్యోత్తరాయాం తు మూలకస్తు సుతోఽభవత్ ॥28॥

స హి రామభయాద్రాజా స్త్రీభిః పరివృతో వనే ।
బిభర్తి త్రాణమిచ్ఛన్ వై నారీకవచముత్తమమ్ ॥29॥

మూలకస్యాపి ధర్మాత్మా రాజా శతరథః సుతః ।
తస్మాచ్ఛతరథాజ్జజ్ఞే రాజా త్విలవిలో బలీ ॥30॥

ఆసీత్త్వైలవిలిః శ్రీమాన్ వృద్ధశర్మా ప్రతాపవాన్ ।
పుత్రో విశ్వసహస్తస్య పితృకన్యా వ్యజీజనత్ ॥31॥

దిలీపస్తస్య పుత్రోఽభూత్ఖట్వాంగ ఇతి విశ్రుతః ।
యేన స్వర్గాదిహాగత్య ముహూర్తం ప్రాప్య జీవితమ్ ॥32॥

త్రయోఽగ్నయస్త్రయో లోకా బుద్ధ్యా సత్యేన వై జితాః ।
దీర్ఘబాహుః సుతస్తస్య రఘుస్తస్మాదజాయత ॥33॥

అజః పుత్రో రఘోశ్చాపి తస్మాజ్జజ్ఞే చ వీర్యవాన్ ।
రాజా దశరథస్తస్మాచ్ఛ్రీమానిక్ష్వాకువంశకృత్॥34॥

రామో దశరథాద్వీరో ధర్మజ్ఞో లోకవిశ్రుతః ।
భరతో లక్ష్మణశ్చైవ శత్రుఘ్నశ్చ మహాబలః ॥35॥

ఆ సింధుద్వీపకుడికి అయుతాయుడనే పరాక్రమవంతుడైన పుత్రుడు పుట్టాడు. అయుతాయుడి పుత్రుడు ఋతుపర్ణుడు. ఆతడు బుద్ధిమంతుడు. మహాకీర్తిమంతుడు. ఆతడు నలమహారాజుకు స్నేహితుడు. మరియు ద్యూతక్రీడామర్మజ్ఞుడు. పురాణాలలో దృఢవ్రతులైన ఇద్దరు నలులున్నారు. ఒకడు వీరసేన పుత్రుడు. మరొకడు ఇక్ష్వాకువంశోద్భవుడు. ఋతుపర్ణుడి కుమారుడు సార్వభౌముడు. మహారాజు. ఆతడి కుమారుడు సుదాసుడు. ఆతడు ఇంద్రుడితో సమానమైనవాడు. సుదాసుడి పుత్రుడు సౌదాసుడు. ఆతడి పేరు మిత్రసహుడు. అయితే ఆతడు కల్మాషపాదుడనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. మహాతేజస్వి వసిష్ఠుడు కల్మాషపాదుడిభార్య ద్వారా ఇక్ష్వాకుకులవృద్ధికై అశ్మకుడను కుమారుణ్ణి పొందాడు. భార్య అయిన ఉత్తర గర్భమందు అశ్మకుడికి మూలకుడను పుత్రుడు కలిగాడు. ఆ మూలకుడు పరశురాముడివల్ల భయంతో స్త్రీ పరివృతుడై ఉండేవాడు. అరణ్యంలో తనను తాను రక్షించుకోవడానికై ఉత్తమమైన నారీ కవచాన్ని ధరించి ఉండేవాడు. ఆ మూలకుడికి శతరథుడను పుత్రుడు కలిగాడు. ఆతడు ధర్మాత్ముడైన రాజు. ఆతడికి బలశాలి అయిన ఇలవిలుడు కలిగాడు. ఇలవిలుడి కుమారుడు వృద్ధశర్మ. ఆతడు పరాక్రమశాలి మరియు ఐశ్వర్యసంపన్నుడును. ఆతడి పుత్రుడు విశ్వసహుడు. ఆతడు పితృకన్యకు

జన్మనిచ్చాడు. ఆతని పుత్రుడు దిలీపుడు. ఆతడు ఖట్వాంగుడనే పేరుతో ప్రసిద్ధుడు. అతడు స్వర్గం నుంచి ఈ బూలోకానికి వచ్చి జీవించిన వెఇఽటనే ఒక మురూర్తకాలంలోనే, తన బుద్ధితో మరియు సత్యంతో మూడు అగ్నుల్ని మూడులోకాన్ని జయించాడు. ఆతడు ఒక ముహూర్తకాలం జీవించిన వెంటనే స్వర్గం నుంచి ఈ భూలోకానికి వచ్చి తన బుద్ధితో మరియు సత్యంతో మూడు అగ్నుల్ని మూడు లోకాల్ని జయించాడు. ఆతడి పుత్రుడు దీర్ఘబాహుడు. ఆతడి పుత్రుడు రఘుమహారాజు. రఘువు పుత్రుడు అజుడు. అజుడికి పరాక్రమవంతుడైన దశరథుడు కలిగాడు. ఆ దశరథుడికి ఐశ్వర్యశాలి, ఇక్ష్వాకువంశవర్ధనుడు, మహావీరుడు, ధర్మవేత్త మరియు లోకప్రసిద్ధుడు అయిన రాముడు కలిగాడు. భరతుడు, లక్ష్మణుడు మరియు మహాబలవంతుడైన శత్రుఘ్నుడు కలిగారు.

**తేషాం శ్రేష్ఠో మహాతేజా రామః పరమవీర్యవాన్ ।**
**రావణం సమరే హత్వా యజ్ఞైరిష్ట్వా చ ధర్మవిత్ ॥36॥**

**దశవర్షసహస్రాణి రామో రాజ్యం చకార సః ।**
**రామస్య తనయో జజ్ఞే కుశ ఇత్యభివిశ్రుతః ॥37॥**

**లవశ్చ సుమహాభాగః సత్యవానభవత్సుధీః ।**
**అతిథిస్తు కుశాజ్జజ్ఞే నిషధస్తస్య చాత్మజః ॥38॥**

**నలస్తు నిషధాజ్జాతో నభస్తస్మాదజాయత ।**
**నభసః పుండరీకాఖ్యః క్షేమధన్వా తతః స్మృతః ॥39॥**

**తస్య పుత్రోఽభవద్వీరో దేవానీకః ప్రతాపవాన్ ।**
**అహీనరః సుతస్తస్య సహస్రాశ్వస్తతః పరః ॥40॥**

**శుభశ్చంద్రావలోకశ్చ తారాపీడస్తతోఽభవత్ ।**
**తస్యాత్మజశ్చంద్రగిరిర్భానుచంద్రస్తతోఽభవత్ ॥41॥**

**శ్రుతాయురభవత్తస్మాద్ బృహద్బల ఇతి స్మృతః ।**
**భారతే యో మహాతేజా సౌభద్రేణ నిపాతితః ॥42॥**

**ఏతే ఇక్ష్వాకుదాయాదా రాజానః ప్రాయశః స్మృతాః ।**
**వంశే ప్రధానా ఏతస్మిన్ ప్రాధాన్యేన ప్రకీర్తితాః ॥43॥**

**సర్వే పాశుపతే జ్ఞానమధీత్య పరమేశ్వరమ్ ।**
**సమభ్యర్చ్య యథాజ్ఞానమిష్ట్వా యజ్ఞైర్యథావిధి ॥44॥**

**దివం గతా మహాత్మానః కేచిన్ముక్తాత్మయోగినః ।**
**నృగో బ్రాహ్మణశాపేన కృకలాసత్వమాగతః ॥45॥**

వారిలో రాముడు ఉత్తముడు. మహాతేజస్వి, మహాబలవంతుడు. ధర్మజ్ఞుడైన రాముడు రావణుణ్ణి యుద్ధంలో ఓడించి, యాగాలు నిర్వహించి పదివేల సంవత్సరాలు రాజ్యం చేశాడు. రాముడికి కుశుడనే ఒక ప్రసిద్ధుడైన

పుత్రుడు కలిగాడు. అట్లే రెండో కుమారుడు లవుడు. లవుడు సుమహాత్ముడు. సత్యవంతుడు. సుబుద్ధి. కుశుడికి అతిథి, అతిథికి నిషధుడు, నిషధుడికి నలుడు కలిగారు. నలుడికి నభుడు కలిగాడు. నభుడికి పుండరీకుడనే పుత్రుడు కలిగాడు. పుండరీకుడికి క్షేమధన్వుడు కలిగాడు. ఆతడికి దేవానీకుడనే వీరుడు, ప్రతాపవంతుడు అనే పుత్రుడు పుట్టాడు. ఆతడి కుమారుడు అహీనరుడు. ఆతడి పుత్రుడు సహస్రాశ్వుడు. ఆతడికి కళ్యాణమయుడు అయిన చంద్రావలోకుడు, ఆతడికి తారాపీడుడు కలిగారు. తారాపీడుడి కుమారుడు చంద్రగిరి. ఆతడి కుమారుడు భానుచంద్రుడు. ఆతడికి శ్రుతాయువు, ఆతడికి బృహద్బలుడు కలిగారు. ఈతడు మహాతేజస్వి. మహాభారతయుద్ధంలో సుభద్రాపుత్రుడైన అభిమన్యుడి చేత ఈతడు చంపబడ్డాడు. వీళ్లందరూ ప్రాయికంగా ఇక్ష్వాకు వంశంలో ఉత్తరాధికారులైన రాజులు. ఈ వంశంలో ముఖ్యంగా ప్రధానమైన వాళ్లను గూర్చే చెప్పాను. వీళ్లందరూ శివతత్త్వాన్ని తెలిసి, పరమేశ్వరుణ్ణి అర్చించి, వాళ్ల జ్ఞానాన్ని అనుసరించి యథావిధి యాగాలు చేసి స్వర్గాన్ని పొందారు. వీళ్లలో కొందరు ముక్తాత్ములైన యోగులు. నృగుడనే రాజు బ్రాహ్మణశాపకారణంగా ఊసరవెల్లి కడుపున జన్మించాడు.

**ధృష్టస్య ధృష్టకేతుశ్చ యమబాలిశ్చ వీర్యవాన్ ।**
**రణధృష్టశ్చ తే పుత్రాస్త్రయః పరమధార్మికాః ॥46॥**

ధృష్టుడికి ముగ్గురు కుమారులు. ధృష్టకేతువు, యమబాలి, పరాక్రమవంతుడైన రణధృష్టుడనే వాళ్లు. వీళ్లందరూ పరమధార్మికులు.

**ఆనర్తో నామ శర్యాతేః సుకన్యా నామ దారికా ।**
**ఆనర్తస్యాభవత్పుత్రో రోచమానః ప్రతాపవాన్ ॥47॥**

**రోచమానస్య రేవోஉభూద్రేవాద్రైవత ఏవ చ ।**
**కకుద్మీ చాపరో జ్యేష్ఠపుత్రః పుత్రశతస్య తు ॥48॥**

**రేవతీ యస్య సా కన్యా పత్నీ రామస్య విశ్రుతా ।**
**నరిష్యంతస్య పుత్రోஉభూజ్జితాత్మా తు మహాబలీ ॥49॥**

**నాభాగాదంబరీషస్తు విష్ణుభక్తః ప్రతాపవాన్ ।**
**ఋతస్తస్య సుతః శ్రీమాన్ సర్వధర్మవిదాంవరః ॥50॥**

**కృతస్తస్య సుధర్మాభూత్పృషితో నామ విశ్రుతః ।**
**కరూషస్య తు కారూషాః సర్వే ప్రఖ్యాతకీర్తయః ॥51॥**

**పృషితో హింసయిత్వా గాం గురోః ప్రాప సుకల్మషమ్ ।**
**శాపాచ్ఛూద్రత్వమాపన్నశ్చ్యవనస్యేతి విశ్రుతః ॥52॥**

**దిష్టపుత్రస్తు నాభాగస్తస్మాదపి భలందనః ।**
**భలందనస్య విక్రాంతో రాజాసీదజవాహనః ॥53॥**

**ఏతే సమాసతః ప్రోక్తా మనుపుత్రా మహాభుజాః ।**
**ఇక్ష్వాకోః పుత్రపౌత్రాద్యా ఐలస్యాథ వదామి వః ॥54॥**

శర్యాతికి ఆనర్తుడనే పేరుగల పుత్రుడు, సుకన్య అనే పుత్రిక ఉన్నారు. ఆనర్తుడికి ప్రతాపశాలి అయిన రోచమానుడు కలిగాడు. ఆతడికి రేవుడు, ఆతడికి రైవతుడు కలిగారు. రైవతుడు కకుద్మి అనే మరో పేరుతో ప్రసిద్ధుడు. ఆతడికి నూర్గురు పుత్రులు. అందులో రేవకుడు పెద్దవాడు. ఆతడి కూతురు రేవతి. ఆమె బలరాముడి భార్య. నరిష్యంతుడికి జితాత్ముడు, మహాబలుడు అయిన పుత్రుడు కలడు. నాభాగుడికి అంబరీషుడు కలిగాడు. ఆతడు విష్ణుభక్తుడు. ప్రతాపశాలి. అంబరీషుడి పుత్రుడు ఋతుడు. ఆతడు శ్రీమంతులలోను ధర్మవేత్తలలోను శ్రేష్ఠుడు. ఆతడి పుత్రుడు కృతుడు. ఆతడి పుత్రుడు సుధర్ముడు. ఆతడు పృషితుడనే పేరుతో విఖ్యాతుడు. కరూషుడి పుత్రులు కారూషులు. వాళ్లందరూ ప్రసిద్ధులు. కీర్తిమంతులు. పృషితుడు గురువు యొక్క గోవును చంపి పెద్ద పాపం చేశాడు. గురువు చ్యవనుడి శాపంతో శూద్రత్వాన్ని పొందాడు. ఇది ప్రసిద్ధమైన విషయమే. దిష్టి పుత్రుడు నాభాగుడు. ఆతడికి భలందనుడు కలిగాడు. అతడి పుత్రుడు అజవాహనుడు. ఆతడు పరాక్రమవంతుడైన రాజు. ఓ ఋషులారా! నేను మీకు సంగ్రహంగా విశాలభుజులైన మనువు పుత్రుల యొక్కయు అట్లే ఇక్ష్వాకుడి యొక్క పుత్రుల, పౌత్రుల వివరాలు చెప్పాను. నేను ఇప్పుడు మీకు ఐలుడి వంశ వర్ణనం చేస్తాను.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఐలః పురూరవా నామ రుద్రభక్తః ప్రతాపవాన్ ।**
**చక్రే త్వకంటకం రాజ్యం దేశే పుణ్యతమే ద్విజాః ॥55॥**

**ఉత్తరే యమునాతీరే ప్రయాగే మునిసేవితే ।**
**ప్రతిష్ఠానాధిపః శ్రీమాన్ ప్రతిష్ఠానే ప్రతిష్ఠితః ॥56॥**

**తస్య పుత్రాః సప్త భవన్సర్వే వితతతేజసః ।**
**గంధర్వలోకవిదితా భవభక్తా మహాబలాః ॥57॥**

**ఆయుర్మాయురమాయుశ్చ విశ్వాయుశ్చైవ వీర్యవాన్ ।**
**శ్రుతాయుశ్చ శతాయుశ్చ దివ్యాశ్చైవోర్వశీసుతాః ॥58॥**

**ఆయుషస్తనయా వీరాః పంచైవాసన్ మహౌజసః ।**
**స్వర్భానుతనయాయాం తే ప్రభాయాం జజ్ఞిరే నృపాః ॥59॥**

**నహుషః ప్రథమస్తేషాం ధర్మజ్ఞో లోకవిశ్రుతః ।**
**నహుషస్య తు దాయాదాః షడింద్రోపమతేజసః ॥60॥**

**ఉత్పన్నాః పితృకన్యాయాం విరజాయాం మహౌజసః ।**
**యతిర్యయాతిః సంయాతిరాయాతిః పంచమోఽంధకః॥61॥**

**విజాతిశ్చేతి షడిమే సర్వే ప్రఖ్యాతకీర్తయః ।**
**యతిర్జ్యేష్ఠశ్చ తేషాం వై యయాతిస్తు తతోఽవరః॥62॥**

**జ్యేష్ఠస్తు యతిర్మోక్షార్థీ బ్రహ్మభూతోఽభవత్ప్రభుః ।**
**తేషాం యయాతిః పంచానాం మహాబలపరాక్రమః॥63॥**

**దేవయానీముశనసః సుతాం భార్యామవాప సః ।**
**శర్మిష్ఠామాసురీం చైవ తనయాం వృషపర్వణః॥64॥**

ఓ ద్విజులారా! ఐలుడికి శివభక్తుడు, ప్రతాపశాలి అయిన పురూరవుడనే పేరుగల పుత్రుడున్నాడు. ఆతడు ఉత్తరదిక్కులో యమునాతటంలో మునిసేవితం, అత్యంతపవిత్రం అయిన ప్రయాగలో నిష్కంటకంగా రాజ్యం చేశాడు. ఆతడు ప్రతిష్ఠానపురంలో ప్రతిష్ఠితుడై శ్రీమంతుడై ప్రతిష్ఠానపురాధిపతి అయ్యాడు. ఆతడికి ఏడుగురు కుమారులు. వాళ్లు అందరూ మహాకాంతిమంతులు. గంధర్వలోకంలో ప్రసిద్ధులు. శివభక్తిపరులు. మహాబలవంతులు. ఆయువు, మాయువు, అమాయువు, విశ్వాయువు, వీర్యవంతుడు, శ్రుతాయువు, శతాయువు అనే వీళ్లు ఊర్వశియొక్క దివ్య కుమారులు. ఆయువుకు వీర్యవంతులైన, తేజస్వంతులైన ఐదుగురు పుత్రులు కలిగారు. స్వర్భానువుయొక్క కుమార్తె ప్రభ వల్ల ఆయువుకు వీళ్లు కలిగారు. వీళ్లలో పెద్దవాడు నహుషుడు. ఆతడు ధర్మజ్ఞుడు. లోకప్రసిద్ధుడు. ఆతడికి ఆరుగురు కుమారులు. ఇంద్రుడితో సమానమైన తేజస్సుగలవాళ్లు మరియు వీర్యవంతులు. వీళ్లందరూ పితృకన్య అయిన విరజ యొక్క బిడ్డలు. యాతి, యయాతి, సంయాతి, ఆయాతి, అంధకుడు, విజాతి అనే ఆరుగురు వీళ్లు. వీళ్లందరూ సుప్రసిద్ధులు. కీర్తిమంతులు. వీళ్లల్లో యతి జ్యేష్ఠుడు. యయాతి కనిష్ఠుడు. జ్యేష్ఠుడైన యతి మోక్షేచ్ఛ గలవాడు. దాంతో ఆతడు బ్రహ్మస్వరూపుడయ్యాడు. మిగిలిన అయిదుగురిలో యయాతి మహాబలవంతుడు, పరాక్రమవంతుడు కూడా. ఆతడు శుక్రాచార్యుడి కుమార్తె దేవయానిని, వృషపర్ణుడి కుమార్తె దానవస్త్రీ అయిన శర్మిష్ఠను భార్యలుగా పొందాడు.

**యదుం చ తుర్వసుం చైవ దేవయానీ వ్యజాయత ।**
**తావుభౌ శుభకర్మాణౌ స్తుతౌ విద్యావిశారదౌ ॥65॥**

యదువును తుర్వసుణ్ణి దేవయాని కన్నది. ఆ యిద్దరు పుత్రులు మంగళకర్మాచరణులు, విద్యాప్రవీణులు. స్తుతింపదగినవారు.

**ద్రుహ్యం చానుం చ పూరుం చ శర్మిష్ఠా వార్షపర్వణీ ।**
**యయాతయే రథం తస్మై దదౌ శుక్రః ప్రతాపవాన్ ॥66॥**

**తోషితస్తేన విప్రేంద్రః ప్రీతః పరమభాస్వరమ్ ।**
**సుసంగం కాంచనం దివ్యమక్షయే చ మహేషుధీ ॥67॥**

**యుక్తం మనోజవైరశ్వైర్యేన కన్యాం సముద్వహన్ ।**
**స తేన రథముఖ్యేన షణ్మాసేనాజయన్మహీమ్ ॥68॥**

**యయాతిర్యుధి దుర్ధర్షో దేవదానవమానుషైః ।**

వృషపర్వుడి పుత్రిక అయిన శర్మిష్ఠ ద్రుహ్యుణ్ణి, అనుణ్ణి, పూరుణ్ణి కన్నది. యయాతి వల్ల సంతుష్టుడైన విప్రశ్రేష్ఠుడు, ప్రతాపవంతుడు శుక్రుడు ప్రసన్నుడై యయాతికి అక్షయతూణీరాన్ని, మిక్కిలి కాంతిమంతమైన సుందరంగా బంగారంతో నిర్మించిన మనోవేగంతో సమానమైన వేగం గల గుర్రాలతో పూన్చిన దివ్యరథాన్ని కానుకగా ఇచ్చాడు. ఆరథం మీదనే దేవయానిని యయాతి అంతఃపురానికి తెచ్చాడు. ఆ రథాన్ని అధిరోహించి పూర్తిగా భూమినంతటిని ఆరు మాసాలలో జయించాడు. యయాతి యుద్ధంలో దేవతలకు, దానవులకు, మానవులకు అజేయుడయ్యాడు.

**భవభక్తస్తు పుణ్యాత్మా ధర్మనిష్ఠః సమంజసః ॥69॥**

**యజ్ఞయాజీ జితక్రోధః సర్వభూతానుకంపనః ।**
**కౌరవాణాం చ సర్వేషాం స భవద్రథ ఉత్తమః ॥70॥**

**యావన్నరేంద్రప్రవరః కౌరవో జనమేజయః ।**
**పూరోర్వంశస్య రాజ్ఞస్తు రాజ్ఞః పరీక్షితస్య తు ॥71॥**

**జగామ స రథో నాశం శాపాద్ గర్గస్య ధీమతః ।**
**గర్గస్య హి సుతం బాలం స రాజా జనమేజయః ॥72॥**

**అక్రూరం హింసయామాస బ్రహ్మహత్యామవాప సః ।**
**స లోహగంధీ రాజర్షిః పరిధావన్నితస్తతః ॥73॥**

**పౌరజానపదైస్త్యక్తో న లేభే శర్మకర్హిచిత్ ।**
**తతః స దుఃఖసంతప్తో న లేభే సంవిదం క్వచిత్ ॥74॥**

**జగామ శౌనకమృషిం శరణ్యం వ్యథితస్తదా ।**
**ఇంద్రేతిర్నామ విఖ్యాతో యోఽసౌ మునిరుదారధీః ॥75॥**

**యాజయామాస చేంద్రేతిస్తం నృపం జనమేజయం ।**
**అశ్వమేధేన రాజానం పావనార్థం ద్విజోత్తమాః ॥76॥**

ఆతడు శివభక్తుడు. పుణ్యాత్ముడు. ధర్మనిష్ఠుడు. సమంజసం కలవాడు. యజ్ఞాలు నిర్వహించేవాడు. క్రోధరహితుడు మరియు అన్ని ప్రాణుల ఎడ దయగలవాడు. ఆ రథం అప్పటి నుంచి రాజశ్రేష్ఠుడు జనమేజయుడి వరకూ కౌరవులందరికి ఉత్తమమైన రథం అయ్యింది. బుద్ధిమంతుడైన గర్గఋషి శాపకారణంగా జనమేజయుడి ఆ రథం నశించింది. జనమేజయుడు కౌరవవంశజుడైన పరీక్షిన్మహారాజు పుత్రుడు. జనమేజయుడు గర్గుడి కుమారుడు బాలకుడు అయిన అక్రూరుణ్ణి చంపాడు. దానివల్ల ఆతడికి బ్రహ్మహత్యా పాపం అంటింది. రక్తవాసనతో కూడిన ఆ రాజర్షి జనమేజయుడు అటు ఇటూ తిరుగజొచ్చాడు. పురజనుల చేతను జానపదుల చేతను ఆతడు పరిత్యజింపబడి ఏ విధమైన శాంతి లేకున్నాడు. దుఃఖార్తుడైన ఆతడికి ఏ విధమైన జ్ఞానం కల్గలేదు. ఆ స్థితిలోగల

ఆతడు శౌనకఋషిని శరణుజొచ్చాడు. ఉదారమనస్కుడైన ఆ ఋషి 'ఇంద్రేతి' అనే పేరుతో ప్రసిద్ధుడు. ఓ ద్విజశ్రేష్ఠులారా! జనమేజయుణ్ణి పవిత్రీకరించడానికి ఇంద్రేతి ఋషి ఆతడితో అశ్వమేధ యాగం చేయించాడు.

**స లోహగంధాన్నిర్ముక్త ఏనసా చ మహాయశాః ।**
**యజ్ఞస్యావభృథే మధ్యే యాతో దివ్యో రథః శుభః ॥77॥**

**తస్మాద్వంశాత్పరిభ్రష్టో వసోశ్చేదిపతేః పునః ।**
**దత్తః శక్రేణ తుష్టేన లేభే తస్మాద్ బృహద్రథః ॥78॥**

**తతో హత్వా జరాసంధం భీమస్తం రథముత్తమమ్ ।**
**ప్రదదౌ వాసుదేవాయ ప్రీత్యా కౌరవనందనః ॥79॥**

తర్వాత మహాయశస్వి జనమేజయుడు రక్తపువాసన నుంచి మరియు బ్రహ్మహత్యాపాపం నుంచి విముక్తుడయ్యాడు. యజ్ఞావభృథస్నానసమయంలో దివ్యమైన, ఉత్తమమైన మరియు నష్టపడిన ఆ రథం అదృశ్యమయ్యింది. కురువంశం నుంచి పరిభ్రష్టమైన ఆ రథాన్ని ప్రసన్నుడైన ఇంద్రుడు చేది దేశాధీశుడైన వసుమహారాజుకు ఇచ్చాడు. మరల వసువు నుంచి బృహద్రథుడు దాన్ని పొందాడు. తర్వాత కురుకుమారుడు భీముడు జరాసంధుణ్ణి చంపి ఆ ఉత్తమరథాన్ని ప్రేమపూర్వకంగా శ్రీకృష్ణుడికి బహూకరించాడు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**అభ్యషించత్పురుం పుత్రం యయాతిర్నాహుషః ప్రభుః ।**
**కృతోపకారస్తేనైవ పురుణా ద్విజసత్తమాః ॥80॥**

**అభిషేక్తుకామం చ నృపం పురుం పుత్రం కనీయసమ్ ।**
**బ్రాహ్మణప్రముఖా వర్ణా ఇదం వచనమబ్రువన్ ॥81॥**

**కథం శుక్రస్య నప్తారం దేవయాన్యాః సుతం ప్రభో ।**
**జ్యేష్ఠం యదుమతిక్రమ్య కనీయాన్రాజ్యమర్హతి ॥82॥**

**ఏతే సంబోధయామస్త్వాం ధర్మం చ అనుపాలయ ॥83॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! నహుషుడి పుత్రుడు యయాతి తన పుత్రుడైన పూరుడిని రాజ్యాభిషిక్తుణ్ణి చేశాడు. ఏకారణంగా పూరుడికి ఆ విధమైన ఉపకారం జరిగింది. కనిష్ఠుడైన పూరుడిని రాజ్యాభిషిక్తుణ్ణి చేయదలచిన యయాతిని గూర్చి బ్రాహ్మణప్రముఖవర్ణములవారు "ఓ రాజా! శుక్రాచార్యుడి మనుమడు, దేవయాని కుమారుడు మరియు అందరిలో జ్యేష్ఠుడు అయిన యదువును తప్పించి చిన్నవాడైన పూరువు ఏ విధంగా రాజ్యాధికారి కాగలడు?" మేం నీనుంచి ఈ విషయం తెలియదలచాం. నీవు ధర్మాన్ని పాటించు! అని పలికారు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే ఇక్ష్వాకువంశవర్ణనం నామ షట్షష్టితమోఽధ్యాయః ॥ 66 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని ఇక్ష్వాకువంశవర్ణనమనే అరవై ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తషష్టితమోఽధ్యాయః - అరవై ఏడవ అధ్యాయం

## సోమవంశే యయాతి చరితమ్ - సోమవంశయయాతి చరితం

**యయాతిరువాచ :-** యయాతి మహారాజు పలికాడు.

**బ్రాహ్మణప్రముఖా వర్ణాః సర్వే శృణ్వంతు మే వచః ।**
**జ్యేష్ఠం ప్రతి యథా రాజ్యం న దేయం మే కథంచన ॥1॥**

**మమ జ్యేష్ఠేన యదునా నియోగో నానుపాలితః ।**
**ప్రతికూలమతిశ్చైవ న స పుత్రః సతాం మతః ॥2॥**

**మాతాపిత్రోర్వచనకృత్సద్భిః పుత్రః ప్రశస్యతే ।**
**స పుత్రః పుత్రవద్యస్తు వర్తతే మాతృపితృషు ॥3॥**

**యదునాహమవజ్ఞాతస్తథా తుర్వసునాపి చ ।**
**ద్రుహ్యేన చానునా చైవ మయ్యవజ్ఞా కృతా భృశమ్ ॥4॥**

**పురుణా చ కృతం వాక్యం మానితశ్చ విశేషతః ।**
**కనీయాన్ మమ దాయాదో జరా యేన ధృతా మమ ॥5॥**

**శుక్రేణ మే సమాదిష్టా దేవయాన్యాః కృతే జరా ।**
**ప్రార్థితేన పునస్తేన జరా సంచారిణీ కృతా ॥6॥**

**శుక్రేణ చ వరో దత్తః కావ్యేనోశనసా స్వయమ్ ।**
**పుత్రో యస్త్వానువర్తేత స తే రాజ్యధరస్త్వితి ॥7॥**

**భవంతోఽప్యనుజానంతు పూరూ రాజ్యేఽభిషిచ్యతే ।**

బ్రాహ్మణులు మొదలైన అన్నివర్ణాల ప్రజలారా! నామాట వినండి! నేను నా జ్యేష్ఠ పుత్రుడికి ఎందుకు రాజ్యమీయలేదో చెబుతాను. నా జ్యేష్ఠపుత్రుడైన యదువు నా ఆజ్ఞను పాటించలేదు. ఎవడు తండ్రి విషయంలో విపరీతమైన బుద్ధిగలవాడవుతాడో ఆతడు సజ్జనుల చేత పుత్రుడనిపించుకోడు. సజ్జనులు మాతాపితరుల యొక్క వాక్యాల్ని గౌరవించిన వాళ్లనే పుత్రులని కొనియాడుతారు. ఎవరు మాతాపితరులతో పాటుగా పుత్రభావంగా ఉండి కార్యాల్ని నిర్వహిస్తారో వాళ్లే పుత్రులు. యదువు నన్ను అవమానించాడు. ఆ విధంగానే తుర్వసుడు, ద్రుహ్యుడు, అనుడు నన్ను మిక్కిలి అవహేళన చేశారు. పూరువు నా మాటను పాటించాడు. అంతేకాక విశిష్టంగా నన్ను గౌరవించాడు. నా ముసలితనాన్ని స్వీకరించిన నా చిన్న కుమారుడే నా ఉత్తరాధికారి. దేవయానికోసం శుక్రాచార్యుడు నాకు ముసలితనాన్ని ప్రాప్తింపజేశాడు. అప్పుడు నేను ఆయన్ని ప్రార్థించాను. అప్పుడు ఆతడు ముసలితనానికి

విమోచనం చెప్పాడు. కావ్యుడు, ఉశనుడు అనే పేర్లుగల ఆతడు స్వయంగా నాకు వరాన్ని ప్రసాదించాడు. "ఏ పుత్రుడు నీకు అనుకూలంగా ఈ ముసలితనాన్ని ధరిస్తాడో ఆతడే రాజ్యాధికారి కాగలడని" అందుకే మీరందరూ అంగీకరించి పూరువును రాజ్యాభిషిక్తుణ్ణి చేయండి!

**యః పుత్రో గుణసంపన్నో మాతాపిత్రోర్హితః సదా ॥8॥**

**సర్వమర్హతి కల్యాణం కనీయానపి స ప్రభుః ।**
**అర్హః పూరురిదం రాజ్యం యః సుతో వాక్యకృత్తవ ॥9॥**

**వరదానేన శుక్రస్య న శక్యం కర్తుమన్యథా ।**

ఏ పుత్రుడు గుణసంపన్నుడై ఎల్లప్పుడూ తల్లిదండ్రులకు హితకారి అవుతాడో ఆతడే సమస్తశుభాలకు అర్హుడవుతాడు. చిన్నవాడైనా ఆతడే ప్రభువు. ఉత్తరాధికారి. అందుచేత ఈ రాజ్యానికి పూరువే తగినవాడు. ఆతడే నీ మాటను సమ్మతించాడు కాబట్టి. శుక్రుడి వరదానానికి వ్యతిరేకంగా ఏమి చేయవీలుకాదు.

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**ఏవం జానపదైస్తుష్టైరిత్యుక్తో నాహుషస్తదా ॥10॥**

**అభిషించ్య తతో రాజ్యే పూరుం స సుతమాత్మనః ।**
**దిశి దక్షిణపూర్వస్యాం తుర్వసుం పుత్రమాదిశత్ ॥11॥**

**దక్షిణాయామథో రాజా యదుం జ్యేష్ఠం న్యయోజయత్ ।**
**ప్రతీచ్యాముత్తరస్యాం తు ద్రుహ్యం చానుం చ తావుభౌ ॥12॥**

**సప్తద్వీపాం యయాతిస్తు జిత్వా పృథ్వీం ససాగరామ్ ।**
**వ్యభజచ్చ త్రిధా రాజ్యం పుత్రేభ్యో నాహుషస్తదా ॥13॥**

**పుత్రసంక్రామితశ్రీస్తు హర్షనిర్భరమానసః ।**
**ప్రీతిమానభవద్రాజా భారమావేశ్య బంధుషు ॥14॥**

ఆ విధంగా సంతుష్టులైన ప్రజలు యయాతితో పలికినవారు కాగా యయాతి తన కుమారుణ్ణి పూరుణ్ణి రాజ్యాధికారిగా అభిషేకించి, తుర్వసుడికి దక్షిణ పూర్వ దిక్కులందు ఉండడానికి ఆజ్ఞ ఇచ్చాడు. తర్వాత జ్యేష్ఠుడైన యదువును దక్షిణదిక్కులో నియోగించాడు. మిగిలిన ద్రుహ్యుణ్ణి, అనుణ్ణి క్రమంగా పశ్చిమోత్తర దిక్కులందు నియోగించాడు. నహుషుడి కుమారుడైన యయాతి సప్తద్వీపాత్మకం, సాగరసమేతమైన సమస్తభూమిని జయించి పుత్రుల కొరకై రాజ్యాన్ని మూడుగా విభజించాడు. ఆ విధంగా పుత్రులకై రాజ్యాన్ని సంక్రమింపజేసి సంతుష్టాంతరంగుడై, వారిపై రాజ్యభారాన్ని మోపి ప్రసన్నుడయ్యాడు.

**అత్ర గాథా మహారాజ్ఞా పురా గీతా యయాతినా ।**
**యాభిః ప్రత్యాహరేత్కామాన్ సర్వతోఽంగాని కూర్మవత్ ॥15॥**

**తాభిరేవ నరః శ్రీమాన్నాన్యథా కర్మకోటికృత్ ।**
**న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి ॥16॥**

**హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ।**
**యత్పృథివ్యాం వ్రీహియవం హిరణ్యం పశవః స్త్రియః ॥17॥**

**నాలమేకస్య తత్సర్వమితి మత్వా శమం వ్రజేత్ ।**
**యదా న కురుతే భావం సర్వభూతేషు పాపకమ్ ॥18॥**

**కర్మణా మనసా వాచా బ్రహ్మ సంపద్యతే తదా ।**
**యదా పరాన్న బిభేతి పరే చాస్మాన్న బిభ్యతి ॥19॥**

**యదా న నిందేన్న ద్వేష్టి బ్రహ్మ సంపద్యతే తదా ।**
**యా దుస్త్యజా దుర్మతిభిర్యా న జీర్యతి జీర్యతః ॥20॥**

**యోఽసౌ ప్రాణాంతికో రోగస్తాం తృష్ణాం త్యజతః సుఖమ్ ।**
**జీర్యంతి జీర్యతః కేశా దంతా జీర్యంతి జీర్యతః ॥21॥**

**చక్షుః శ్రోత్రే చ జీర్యతే తృష్ణైకా నిరుపద్రవా।**
**జీర్యంతి దేహినః సర్వే స్వభావాదేవ నాన్యథా ॥22॥**

**జీవితాశా ధనాశా చ జీర్యతోఽపి న జీర్యతే ।**
**యచ్చ కామసుఖం లోకే యచ్చ దివ్యం మహత్సుఖమ్ ॥23**

**తృష్ణాక్షయసుఖస్యైతత్కలాం నార్హతి షోడశీమ్ ।**

మహారాజు యయాతిద్వారా ఈ విషయంలో ముందుగా ఈ గాథ పూర్వం కీర్తింపబడింది. తాబేలు తన సర్వాంగాల్ని తన పెంకునందే ఇముడ్చుకొనే విధంగా కోరికలన్నింటిని తనయందే అణచి పెట్టుకోగలిగిన మానవుడే శ్రీమంతుడు కాగలడు. అన్యుడు కాలేడు. కోట్ల కొలది శుభకర్మల్ని చేసి కూడా ఎప్పుడూ వాటిని తన పనులకు ఉపయోగించుకోవడం వల్ల అగ్నిలో ఆజ్యం పడి అగ్ని అభివృద్ధి చెందినట్లు తన కోరికల్ని అదుపు చేసుకోలేనివాడు శాంతుడు కాలేడు. భూమిమీదగల వ్రీహి, యవలు, బంగారం, జంతువులు, స్త్రీలు మొదలైనవి అన్నీ ఒకే వ్యక్తి కోరికలకే పర్యాప్తం కావు. అది తెలిసి మానవుడు కోరికలనుంచి విముక్తుడు కావాలి. ఏ మానవుడు సమస్త ప్రాణుల విషయంలో మనోవాక్కాయ కర్మలతో పాపమయభావం కలిగి ఉండడో ఆతడు బ్రహ్మత్వాన్ని పొందుతాడు. ఇతరుల వల్ల భయపడనప్పుడు ఇతరులు కూడా ఆతడి వల్ల భయపడరు. ఇతరుల్ని నిందించక వాళ్ల విషయంలో

ద్వేషం కలిగి ఉండనివాడు బ్రహ్మను పొందుతాడు. ఎవడు ఆశ, దుష్టబుద్ధి కలిగి ఉంటాడో వాడు త్యజింపదగినవాడు. ఎవడు వృద్ధుడయ్యీ వృద్ధుడుకాడో ఆతడే మనుష్యుడు. తృష్ణను త్యాగం చేసినవాడు సుఖపడతాడు. వృద్ధుడి యొక్క కేశాలు నెరసిపోతాయి. దంతాలు ఊడిపోతాయి. నేత్రాలు చెవులు జీర్ణాలవుతాయి. కాని తృష్ణకు శైథిల్యము లేదు. ప్రాణులందరూ సహజంగా వృద్ధులవుతారు. ఇందులో సందేహం లేదు. వృద్ధుడయినప్పటికి జీవితమందు ధనమందు ఆశ పోవడంలేదు. పేరాస (తృష్ణ) నశించడం వల్ల కలిగే సుఖము, లౌకికమగు ఏ సుఖమునకు సాటిరాదు.

**ఏవముక్త్వా స రాజర్షిః సదారః ప్రావిశద్వనమ్ ॥24॥**

**భృగుతుంగే తపస్తప్త్వా తత్రైవ చ మహాయశాః ।**
**సాధయిత్వా త్వనశనం సదారః స్వర్గమవాప్తవాన్ ॥25॥**

**తస్య వంశాస్తు పంచైతే పుణ్యా దేవర్షిసత్కృతాః ।**
**యైర్వ్యాప్తా పృథివీ కృత్స్నా సూర్యస్యేవ మరీచిభిః ॥26॥**

**ధనీ ప్రజావానాయుష్మాన్ కీర్తిమాంశ్చ భవేన్నరః ।**
**యయాతిచరితం పుణ్యం పఠన్ శృణ్వంశ్చ బుద్ధిమాన్ ॥27॥**

**సర్వపాపవినిర్ముక్తః శివలోకే మహీయతే ॥28॥**

ఆ విధంగా పలికి యయాతిమహారాజు భార్యా సహితుడై అరణ్యానికి వెళ్లాడు. మహాయశస్వి అయిన యయాతి భృగుతుంగపర్వత శిఖరంపైన నిరాహారుడై తపస్సు చేసి సభార్యుడై స్వర్గాన్ని చేరాడు. దేవమునిగణాలతో సత్కరింపబడిన పుణ్యప్రదాలైన యయాతి వంశాలు ఐదున్నాయి. సూర్యకాంతి భూమియంతా వ్యాపించినట్లు ఈ ఐదు వంశాలు భూమండలమంతా వ్యాపించాయి. యయాతి యొక్క పుణ్యప్రదమైన ఈ చరిత్రను విన్నట్టి, చదివినట్టి మానవుడు ధనవంతుడు, సంతానవంతుడు, ఆయుష్మంతుడు, కీర్తిమంతుడు, బుద్ధిమంతుడు కాగలడు. అంతేకాక అన్ని పాపాల నుంచి ముక్తుడై శివలోకంలో గొప్పవాడౌతాడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే సోమవంశే యయాతిచరితం నామ సప్తషష్టితమోఽధ్యాయః ॥ 67 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగం సోమవంశంలో యయాతిచరితమనే అరవై ఏడవ అధ్యాయం సమాప్తం.

## అష్టషష్టితమోஉధ్యాయః - అరవై ఎనిమిదవ అధ్యాయం

## వంశానువర్ణనమ్ - వంశానువర్ణనం

**సూత ఉవాచ :-** సూతుడు పలికాడు.

**యదోర్వంశం ప్రవక్ష్యామి జ్యేష్ఠస్యోత్తమతేజసః ।
సంక్షేపేణానుపూర్వ్యాచ్చ గదతో మే నిబోధత ॥1॥**

**యదోః పుత్రా బభూవుర్హి పంచ దేవసుతోపమాః ।
సహస్రజిత్సుతో జ్యేష్ఠో క్రోష్టుర్నీలోஉజకో లఘుః ॥2॥**

**సహస్రజిత్సుతస్తద్వచ్ఛతజిన్నామ పార్థివః ।
సుతాః శతజితః ఖ్యాతాస్త్రయః పరమకీర్తయః ॥3॥**

**హైహయశ్చ హయశ్చైవ రాజా వేణుహయశ్చ యః ।
హైహయస్య తు దాయాదో ధర్మ ఇత్యభివిశ్రుతః ॥4॥**

**తస్య పుత్రోஉభవద్విప్రా ధర్మనేత్ర ఇతి శ్రుతః ।
ధర్మనేత్రస్య కీర్తిస్తు సంజయస్తస్య చాత్మజః ॥5॥**

**సంజయస్య తు దాయాదో మహిష్మాన్నామ ధార్మికః ।
ఆసీన్మహిష్మతః పుత్రో భద్రశ్రేణ్యః ప్రతాపవాన్ ॥6॥**

**భద్రశ్రేణ్యస్య దాయాదో దుర్దమో నామ పార్థివః ।
దుర్దమస్య సుతో ధీమాన్ ధనకో నామ విశ్రుతః ॥7॥**

నేను ఇప్పుడు యయాతికి జ్యేష్ఠపుత్రుడు, మహాతేజస్వంతుడు అయిన యదువు యొక్క వంశాన్ని క్రమానుసారంగా సంక్షేపంగా వర్ణిస్తాను. మీరు వినండి! యదువుకు దేవకుమారసములు అయిన ఐదుగురు పుత్రులు కలిగారు. సహస్రజిత్తు అనేవాడు జ్యేష్ఠుడైన సుతుడు. క్రోష్టుడు, నీలుడు, అజకుడు, లఘువు అనేవాళ్లు మిగిలిన నలుగురు. సహస్రజిత్ కుమారుడు ఆతడితో సమానుడు శతజిత్. శతజిత్తుకు మహాకీర్తిమంతులు ముగ్గురు పుత్రులు. వాళ్లు హైహయుడు, హయుడు, వేణుహయుడు. హైహయుడి కుమారుడు ధర్ముడనే పేరుతో ప్రసిద్ధుడు. ఓ విప్రులారా! ఆతడికి ధర్మనేత్రుడనే పుత్రుడు కలిగాడు. ఆతడి పుత్రుడు కీర్తి, ఆతడి పుత్రుడు సంజయుడు. సంజయుడికి ధార్మికుడైన మహిష్మంతుడు పుత్రుడు. ఆతడికి భద్రశ్రేణ్యుడు. ఆతడు ప్రతాపశాలి. ఆతడి పుత్రుడు దుర్దముడు. ఆతడికి బుద్ధిమంతుడైన ధనకుడు కుమారుడు.

**ధనకస్యతు దాయాదాశ్చత్వారో లోకసమ్మతాః ।
కృతవీర్యః కృతాగ్నిశ్చ కృతవర్మా తథైవ చ ॥8॥**

**కృతౌజాశ్చ చతుర్థోఽ భూత్కార్తవీర్యస్తతోఽర్జునః ।**
**జజ్ఞే బాహుసహస్రేణ సప్తద్వీపేశ్వరోత్తమః ॥9॥**

**తస్య రామస్తదా త్వాసీన్మృత్యుర్నారాయణాత్మకః ।**
**తస్య పుత్రశతాన్యాసన్ పంచ తత్ర మహారథాః ॥10॥**

**కృతాస్త్రా బలినః శూరా ధర్మాత్మానో మనస్వినః ।**
**శూరశ్చ శూరసేనశ్చ ధృష్టః కృష్ణస్తథైవ చ ॥11॥**

**జయధ్వజశ్చ రాజాసీదావంతీనాం విశాం పతిః ।**
**జయధ్వజస్య పుత్రోఽభూత్తాలజంఘో మహాబలః ॥12॥**

**శతం పుత్రాస్తు తస్యేహ తాలజంఘాః ప్రకీర్తితాః ।**
**తేషాం జ్యేష్ఠో మహావీర్యో వీతిహోత్రోఽభవన్నృపః ॥13॥**

**వృషప్రభృతయశ్చాన్యే తత్సుతాః పుణ్యకర్మణః ।**
**వృషో వంశకరస్తేషాం తస్య పుత్రోఽభవన్మధుః ॥14॥**

**మధోః పుత్రశతం చాసీద్ వృష్ణిస్తస్య వంశభాక్ ।**
**వృష్ణేస్తు వృష్ణయః సర్వే మధోర్వై మాధవాః స్మృతాః ॥15॥**

**యాదవా యదువంశేన నిరుచ్యంతే తు హైహయాః ।**

ధనకుడికి కృతవీర్యుడు, కృతాగ్ని, కృతవర్మ, కృతౌజుడు అనే పుత్రులు కలిగారు. వారు లోకమాన్యులు. కృతవీర్యుడికి కార్తవీర్యార్జునుడు కలిగాడు. ఆతడు తన వేయి చేతుల వల్ల సప్తద్వీపాలలో శ్రేష్ఠుడైన రాజుగా నిలిచాడు. నారాయణావతారుడు పరశురాముడు ఆ సమయంలో ఆతడి మృత్యువుకు కారణం అయ్యాడు. ఆతడికి నూర్గురు కుమారులు. వాళ్లలో అయిదుగురు మహారథులు. అస్త్రవేత్తలు. బలశాలురు అయిన వీరులు. ధర్మాత్ములు. మనస్వినులు. శూరుడు, శూరసేనుడు, ధృష్టుడు, కృష్ణుడు, జయధ్వజుడు అనే పేర్లు వారివి. జయధ్వజుడనే రాజు అవంతికి ప్రభువు. ఆతడికి తాలజంఘుడు అనే పేరుగలవాడు, మహాబలుడు పుత్రుడు. ఆతడికి నూర్గురు కుమారులు. వాళ్లందరూ తాలజంఘులు అనే పేరుతో ప్రసిద్ధులు. వాళ్లలో పెద్దవాడు మహాపరాక్రమవంతుడైన రాజు వీతిహోత్రుడు. వృషుడు మొదలైనవాళ్లు మిగిలిన పుత్రులు. వాళ్లు పుణ్యకర్ములు. వాళ్లల్లో వృషుడు వంశకర్త. ఆతడి కుమారుడు మధుడు. మధుడికి వందమంది కుమారులు. వాళ్లలో వృష్ణి వంశప్రవర్తకుడు. వృష్ణి వంశంలో పుట్టిన వాళ్లందరూ వృష్ణులు, మధువంశజులు మాధవులుగా చెప్పబడుతున్నారు. యదువంశానికి చెందిన యాదవులంతా హైహయులని పిలువబడుతున్నారు.

**తేషాం పంచగణా హ్యేతే హైహయానాం మహాత్మనామ్ ॥16॥**

**వీతిహోత్రాశ్చ హర్యాతా భోజాశ్చావంతయస్తథా ।**
**శూరసేనాస్తు విఖ్యాతాస్తాలజంఘాస్తథైవ చ ॥17॥**

**శూరశ్చ శూరసేనశ్చ వృషః కృష్ణస్తథైవ చ ।**
**జయధ్వజః పంచమస్తు విఖ్యాతా హైహయోత్తమాః ॥18॥**

**శూరశ్చ శూరవీరశ్చ శూరసేనస్య చానఘాః ।**
**శూరసేనా ఇతి ఖ్యాతా దేశాస్తేషాం మహాత్మనామ్ ॥19॥**

**వీతహోత్రసుతశ్చాపి విశ్రుతోఽనర్త ఇత్యుత ।**
**దుర్జయః కృష్ణపుత్రస్తు బభూవామిత్రకర్షణః ॥20॥**
**క్రోష్టుశ్చ శృణు రాజర్షేర్వంశముత్తమపౌరుషమ్ ।**
**యస్యాన్వయే తు సంభూతో విష్ణుర్వృష్ణికులోద్భవః ॥21॥**
**క్రోష్టోరేకోఽభవత్పుత్రో వృజినీవాన్ మహాయశాః ।**
**తస్య పుత్రోఽభవత్స్వాతీ కుశంకుస్తత్సుతోఽభవత్ ॥22॥**

మహాత్ములైన హైహయుల యొక్క ఐదువంశాలివి. వీతిహోత్రం, హర్యాతం, భోజ, అవంతి, శూరసేన అనేవి. వాటిని 'తాలజంఘు'లు అని కూడా అంటారు. శూరుడు, శూరసేనుడు, వృషుడు, కృష్ణుడు, ఐదవవాడు జయధ్వజుడు. వాళ్లు ఉత్తములైన హైహయులు. శూరసేనుడి యొక్క వంశంలో పుట్టిన వాళ్లు శూరుడు, శూరవీరుడు. ఓ అనఘులైన ఋషులారా! మహాత్ములైన వాళ్ల దేశం కూడా 'శూరసేన'మనే పిలువబడుతున్నది. వీతహోత్రుడి పుత్రుడు అనర్తుడనే పేరుతో ప్రసిద్ధుడు. కృష్ణుడికి దుర్జయుడు కుమారుడు. ఆతడు శత్రుమర్దనుడు. రాజర్షి క్రోష్టుడి యొక్క ఉత్తమమైన పౌరుషానికి నిలయమైన వంశాన్ని గూర్చి వినండి! వృష్ణి వంశాన్ని అభివృద్ధిపర్చే విష్ణువు (కృష్ణుడు) ఇందు పుట్టాడు. క్రోష్టుడికి మహాయశస్వి అయిన వృజినీవంతుడనే ఒకానొక పుత్రుడు కలిగాడు. ఆతడి పుత్రుడు స్వాతి. స్వాతి పుత్రుడు కుశంకుడు.

**అథ ప్రసూతిమిచ్ఛన్ వై కుశంకుః సుమహాబలః ।**
**మహాక్రతుభిరీజేఽసౌ వివిధైరాప్తదక్షిణైః ॥23॥**

**యజ్ఞే చిత్రరథస్తస్య పుత్రః కర్మభిరన్వితః ।**
**అథ చైత్రరథో వీరో యజ్వా విపులదక్షిణః ॥24॥**

**శశబిందుస్తు వై రాజా అన్వయాద్ వ్రతముత్తమమ్ ।**
**చక్రవర్తీ మహాసత్త్వో మహావీర్యో బహుప్రజః ॥25॥**

మహాబలి అయిన కుశంకుడు సంతానకాంక్ష కలవాడై యథోచితంగా దక్షిణలిస్తూ అనేక విధాలైన యజ్ఞాల్ని నిర్వహించాడు. వాటి ఫలితంగా చిత్రరథుడనే పుత్రుడు కలిగాడు. చిత్రరథుడి కుమారుడు పరాక్రమశాలి అయిన శశబిందువు. ఆతడు విపులదక్షిణలిచ్చి యజ్ఞాల్ని నిర్వహించాడు. స్వభావంచే ధార్మిక ప్రవృత్తి కలవాడు. ఆతడు మహాజ్ఞాని, మహాపరాక్రమవంతుడు బహుసంతతి కలవాడు.

**శశబిందోస్తు పుత్రాణాం సహస్రాణామభూచ్ఛతమ్ ।**
**శంసంతి తస్య పుత్రాణామనంతకమనుత్తమమ్ ॥26॥**

**అనంతకాత్సుతో యజ్ఞో యజ్ఞస్య తనయో ధృతిః ।**
**ఉశనాస్తస్య తనయః సంప్రాప్య తు మహీమిమామ్ ॥27॥**

**ఆజహారాశ్వమేధానాం శతముత్తమధార్మికః ।**
**స్మృతశ్చోశనసః పుత్రః సితేషుర్నామ పార్థివః ॥28॥**

**మరుతస్తస్య తనయో రాజర్షిర్వంశవర్ధనః ।**
**వీరః కంబలబర్హిస్తు మరుతస్యాత్మజః స్మృతః ॥29॥**

**పుత్రస్తు రుక్మకవచో విద్వాన్ కంబలబర్హిషః ।**
**నిహత్య రుక్మకవచో వీరాన్ కవచినో రణే ॥30॥**

**ధన్వినో నిశితైర్బాణైరవాప శ్రియముత్తమామ్ ।**
**అశ్వమేధే తు ధర్మాత్మా ఋత్విగ్భ్యః పృథివీం దదౌ॥31॥**

శశబిందువుకు వేయిమంది పుత్రులు కలిగారు. శశబిందువు యొక్క సంతానంలో అనంతకుడిని అనుత్తముడుగా చెప్పుతున్నారు. ఆతడికి యజ్ఞుడు అనే పుత్రుడు కలిగాడు. ఆతడి కుమారుడు ధృతి. ఆతడి పుత్రుడు ఉశనుడు. పరమధార్మికుడు. అతడు రాజ్యమునుపొంది నూరు అశ్వమేధాల్ని నిర్వహించాడు. ఆతడి కుమారుడు సితేషుడనే రాజు. ఆతడి పుత్రుడు మరుత్తు. ఆతడు వంశవృద్ధికరుడైన రాజర్షి. పరాక్రమశాలి అయిన కంబలబర్హి మరుత్తు కుమారుడు. ఆతడి కుమారుడు రుక్మకవచుడు. ఆతడు విద్వాంసుడు. యుద్ధంలో కవచాన్ని, ధనుస్సును ధరించి శత్రువీరుల్ని తీక్ష్ణబాణాలతో వధించి ఉత్తమమైన సంపదల్ని పొందాడు. ధర్మాత్ముడైన ఆతడు అశ్వమేధయజ్ఞంలో ఋత్విక్కులకు భూమిని దానం చేశాడు.

**జజ్ఞే తు రుక్మకవచాత్పరావృత్పరవీరహా ।**
**జజ్ఞిరే పంచ పుత్రాస్తు మహాసత్త్వాః పరావృతః ॥32॥**

**రుక్మేషుః పృథురుక్మశ్చ జ్యామఘః పరిఘో హరిః ।**
**పరిఘం చ హరిం చైవ విదేహేషు పితా న్యసత్ ॥33॥**

**రుక్మేషురభవద్రాజా పృథురుక్మస్తదాశ్రయాత్ ।**
**తైస్తు ప్రవ్రాజితో రాజా జ్యామఘోఽవసదాశ్రమే ॥34॥**

**ప్రశాంతః స వనస్థోఽపి బ్రాహ్మణైరేవ బోధితః ।**
**జగామ ధనురాదాయ దేశమన్యం ధ్వజీ రథీ ॥35॥**

**నర్మదాతీరమేకాకీ కేవలం భార్యయా యుతః ।**
**ఋక్షవంతం గిరిం గత్వా త్యక్తమన్యైరువాస సః ॥36॥**

రుక్మకవచుడికి శత్రువీరసంహారకుడైన పరావృత్తుడు పుత్రుడు. ఆతడికి ఐదురుగు శక్తిశాలురు పుత్రులు కలిగారు. రుక్మేషుడు, పృథురుక్ముడు, జ్యామఘుడు, పరిఘుడు, హరి అనేవాళ్లు. ఈ పరిఘుణ్ణి, హరిని, తండ్రి

విదేహదేశానికి అధిపతుల్ని చేశాడు. రుక్మేషుడు రాజు అయ్యాడు. పృథురుక్ముడు ఆతడి ఆశ్రయంలో ఉన్నాడు. జ్యామఘుడు తన సోదరులవల్ల రాజ్యం నుంచి తొలగింపబడి ఆశ్రమంలో నివసించాడు. వనవాసంలో కూడా అతడు ప్రశాంతంగానే ఉన్నాడు. బ్రాహ్మణులవల్ల జ్ఞానాన్ని పొందాడు. తర్వాత రథియై, ధ్వజియై, ధనుర్ధారియై అన్యదేశానికి వెళ్లాడు. ఇతరులందర్ని పరిత్యజించి నర్మదానదీతీరంలో ఋక్షవంతపర్వతాన్ని చేరి ఏకాకిగా కేవలం భార్యతో మాత్రమే కూడినవాడై నివసించాడు.

**జ్యామఘస్యాభవద్భార్యా శైబ్యా శీలవతీ సతీ ।**
**సాచైవ తపసోఽగ్రేణ శైబ్యావై సంప్రసూయత ॥37॥**

**సుతం విదర్భం సుభగా వయః పరిణతా సతీ ।**
**రాజపుత్రసుతాయాం తు విద్వాంసౌ క్రథకైశికౌ ॥38॥**

**పుత్రౌ విదర్భరాజస్య శూరౌ రణవిశారదౌ ।**
**రోమపాదస్తృతీయశ్చ బభ్రుస్తస్యాత్మజఃస్మృతః ॥39॥**

**సుధృతిస్తనయస్తస్య విద్వాన్ పరమధార్మికః ।**
**కైశికస్తనయస్తస్మాత్తస్మాచ్చైద్యాన్వయః స్మృతః ॥40॥**

**క్రథో విదర్భస్య సుతః కుంతిస్తస్యాత్మజోఽభవత్ ।**
**కుంతేర్వృతస్తతో జజ్ఞే రణధృష్టః ప్రతాపవాన్ ॥41॥**

జ్యామఘుడి భార్య పతివ్రత, శీలసంపన్న అయిన శైబ్య. సౌభాగ్యశాలిని అయిన ఆమె కఠోరమైన తపస్సుచేసి వార్ధకంలో విదర్భుడనే పుత్రుణ్ణి కన్నది. విదర్భరాజునకు క్రథుడు, కౌశికుడను వాళ్లు ఇద్దరు పుత్రులు. వాళ్లు విద్వాంసులు, పరాక్రమవంతులు, యుద్ధతంత్రప్రవీణులు. విదర్భుడి మూడో కుమారుడు రోమపాదుడు. ఆతడి పుత్రుడు బభ్రువు. బభ్రువు పుత్రుడు సుధృతి. ఆతడు విద్వాంసుడు, పరమధార్మికుడు. విదర్భుడికి కైశికుడనే పేరుగల పుత్రుడు కలడు. ఆతడి వల్లే చైద్యవంశం నిలిచింది. విదర్భుడి పుత్రుడైన క్రథుడి పుత్రుడు కుంతి. కుంతి కుమారుడు వృతుడు. వృతుడికి ప్రతాపి అయిన రణధృష్టుడు కలిగాడు.

**రణధృష్టస్య చ సుతో నిధృతిః పరవీరహా ।**
**దశార్హో నైధృతో నామ్నా మహారిగణసూదనః ॥42॥**

**దశార్హస్య సుతో వ్యాప్తో జీమూత ఇతి తత్సుతః ।**
**జీమూతపుత్రో వికృతిస్తస్య భీమరథః సుతః ॥43॥**

**అథ భీమరథస్యాసీత్పుత్రో నవరథః కిల ।**
**దానధర్మరతో నిత్యం సత్యశీలపరాయణః ॥44॥**

**తస్య చాసీద్ దృఢరథః శకునిస్తస్య చాత్మజః ।**
**తస్మాత్కరంభః సంభూతో దేవరాతోఽభవత్తతః ॥45॥**

రణధృష్టుడి పుత్రుడు నిధృతి. ఆతడు శత్రువీరసంహారకుడు. ఆతడి కుమారుడు దశార్హుడు. ఎంతటి శత్రువునైనను మట్టుబెట్టగలవాడు. ఆతడి పుత్రుడు వ్యాప్తుడు. ఆతడి పుత్రుడు జీమూతుడు. జీమూతుడి కుమారుడు వికృతి. వికృతి పుత్రుడు భీమరథుడు. ఆతడి పుత్రుడు నవరథుడు. ఆతడు ఎల్లప్పుడూ దానధర్మరతుడు. సత్యసదాచారపరాయణుడు. ఆతడి పుత్రుడు దృఢరథుడు. ఆతడి పుత్రుడు శకుని. శకునికి కరంభుడు పుట్టాడు. ఆతడికి దేవరాతుడు కలిగాడు.

**దేవరాతాదభూద్రాజా దేవరాతిర్మహాయశాః ।**
**దేవగర్భోపమో జజ్ఞే యో దేవక్షత్రనామకః ॥46॥**

**దేవక్షత్రసుతః శ్రీమాన్ మధుర్నామ మహాయశాః ।**
**మధూనాం వంశకృద్రాజా మధోస్తు కురువంశకః ॥47॥**

**కురువంశాదనుస్తస్మాత్పురుత్వాన్ పురుషోత్తమః ।**
**అంశుర్జజ్ఞే చ వైదర్భ్యాం భద్రవత్యాం పురుత్వతః ॥48॥**

**ఐక్ష్వాకీమవహచ్చాంశుః సత్త్వస్తస్మాదజాయత ।**
**సత్త్వాత్సర్వగుణోపేతః సాత్త్వతః కులవర్ధనః ॥49॥**

దేవరాతుడికి దేవరాతి కలిగాడు. ఆతడు మహాకీర్తిమంతుడైన రాజు. ఆతడికి దేవపుత్ర సమానుడైన దేవక్షత్రుడనే పుత్రుడు కలిగాడు. ఆతడికి మధువు అనే పుత్రుడు పుట్టాడు. ఆతడు ఐశ్వర్యశాలి, మహాయశస్వి, మధువంశవర్ధనుడు. మధువుకు కురువంశుడనే కుమారుడు కలిగాడు. ఆతడికి అనువు కలిగాడు. ఆతడికి పురుషశ్రేష్ఠుడైన పురుత్వతుడు కలిగాడు. ఆతడికి విదర్భదేశీయురాలైన భద్రవతి వల్ల అంశువు జన్మించాడు. అంశువు ఐక్ష్వాకిని పెండ్లాడాడు. ఆతడికి సత్త్వుడు కలిగాడు. ఆతడికి సాత్త్వతుడు కలిగాడు. ఆతడు సర్వగుణసంపన్నుడు, కులవర్ధనుడు.

**జ్యామఘస్య మయా ప్రోక్తా సృష్టిర్వై విస్తరేణ వః ।**
**యః పఠేచ్ఛృణుయాద్వాపి నిసృష్టిం జ్యామఘస్య తు ॥50॥**

**ప్రజీవత్యేతి వై స్వర్గం రాజ్యం సౌఖ్యం చ విందతి ॥51॥**

ఓ ఋషులారా! నేను మీకు జ్యామఘుడి సంతానాన్ని గూర్చి విస్తారంగా వివరించాను. ఎవడు జ్యామఘుడి చరితాన్ని పఠిస్తాడో, వింటాడో ఆతడు దీర్ఘకాలం బ్రతుకుతాడు. రాజ్యాన్ని సుఖాన్ని పొందుతాడు. స్వర్గప్రాప్తి కలుగుతుంది.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే వంశానువర్ణనం నామాష్టషష్టితమోఽధ్యాయః ॥ 68 ॥**

శ్రీ లింగమహాపురాణం, పూర్వభాగంలోని వంశానువర్ణనమనే అరవై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనసప్తతితమోఽధ్యాయః - అరవై తొమ్మిదవ అధ్యాయం

## సోమవంశానుకీర్తనమ్ - సోమవంశానుకీర్తనం

**సూత ఉవాచ -** సూతమహర్షి పలికాడు.

**సాత్త్వతః సత్యసంపన్నః ప్రజజ్ఞే చతురః సుతాన్ ।**
**భజనం భ్రాజమానం చ దివ్యం దేవావృధం నృపమ్ ॥1॥**

**అంధకం చ మహాభాగం వృష్టిం చ యదునందనమ్ ।**
**తేషాం నిసర్గాంశ్చతురః శృణుధ్వం విస్తరేణ వై ॥2॥**

ఓ ఋషులారా! సత్యసంపన్నుడు సాత్త్వతుడు నలుగురు పుత్రుల్ని కన్నాడు. తేజస్వి అయిన భజనుడు, దివ్యుడు, రాజైన దేవావృధుడు, మహాభాగ్యశాలియైన అంధకుడు, యదునందనుడు, వృష్టి అనేవాళ్లు నలుగురు కుమారులు. ఈ నాల్గువంశాల వివరాలు విపులంగా చెప్తాను వినండి!

**సృంజయ్యాం భజనాచ్చైవ భ్రాజమానాద్విజజ్ఞిరే ।**
**అయుతాయుః శతాయుశ్చ బలవాన్ హర్షకృత్స్మృతః ॥3॥**

తేజస్వి భజనుడు, సృంజయ యందు అయుతాయువు, శతాయువు, బలవంతుడైన హర్షకృత్తు అనే పుత్రుల్ని పొందాడు.

**తేషాం దేవవృధో రాజా చచార పరమం తపః ।**
**పుత్రః సర్వగుణోపేతో మమ భూయాదితి స్మరన్ ॥4॥**

**తస్య బభ్రురితి ఖ్యాతః పుణ్యశ్లోకో నృపోత్తమః ।**
**అనువంశపురాణజ్ఞా గాయంతీతి పరిశ్రుతమ్ ॥5॥**

**గుణాన్ దేవావృధస్యాథ కీర్తయంతో మహాత్మనః ।**
**యథైవ శృణుమో దూరాత్ సంపశ్యామస్తథాంతికాత్ ॥6॥**

**బభ్రుః శ్రేష్ఠో మనుష్యాణాం దేవైర్దేవావృధః సమః ।**
**పురుషాః పంచషష్టిస్తు షట్ సహస్రాణి చాష్ట చ ॥7॥**

**యేఽమృతత్వమనుప్రాప్తా బభ్రోర్దేవావృధాదపి ।**
**యజ్వా దానమతిర్వీరో బ్రహ్మణ్యస్తు దృఢవ్రతః ॥8॥**

**కీర్తిమాంశ్చ మహాతేజాః సాత్త్వతానాం మహారథః ।**
**తస్యాన్వవాయే సంభూతా భోజా వై దైవతోపమాః ॥9॥**

సాత్త్వతుడి పుత్రులు నలుగురిలో రాజైన దేవావృధుడు నాకు సర్వగుణసంపన్నుడైన పుత్రుడు కలుగుగాక అని స్మరిస్తూ ఉత్తమమైన తపస్సు చేశాడు. అప్పుడు ఆతడికి బభ్రువను పుత్రుడు కలిగాడు. ఆతడు పుణ్యశ్లోకుడు, ఉత్తముడైన రాజు. పూర్వవంశచరిత్ర తెలిసిన మహాత్ములు దేవావృధుడి కథలు పాడుతూ గుణకీర్తనం చేస్తున్నారు. దూరంగా ఎలా వింటున్నామో దగ్గరగా కూడా అదే చూస్తున్నాం. అనగా ఆ గుణకీర్తనం అక్షరసత్యమన్నమాట. దేవసముడైన దేవావృధుడి మాదిరిగా బభ్రువు మనుష్యశ్రేష్ఠుడైన రాజు. ఈ ఇద్దరి వల్ల పద్నాలుగు వేల అరవై ఐదుమంది ప్రజలు అమృతత్వాన్ని పొందారు. బభ్రువు యజనశీలి. దానరతుడు. పరాక్రమవంతుడు. బ్రాహ్మణరక్షకుడు, దృఢవ్రతుడు, మహాతేజస్వి, సాత్త్వతులందరిలో మహారథుడు. అతడి వంశంలో దేవతుల్యులైన భోజులు పుట్టారు.

**గాంధారీ చైవ మాద్రీ చ వృష్ణే భార్యే బభూవతుః ।**
**గాంధారీ జనయామాస సుమిత్రం మిత్రనందనమ్ ॥10॥**

**మాద్రీ లేభే చ తం పుత్రం తతః సా దేవమీఢుషమ్ ।**
**అనమిత్రం శినిం చైవ తావుభౌ పురుషోత్తమౌ ॥11॥**

గాంధారి, మాద్రి అను యిద్దరు వృష్ణి యొక్క భార్యలు. గాంధారి సుమిత్రుణ్ణి, మిత్రనందనుణ్ణి కన్నది. మాద్రి దేవమీఢుషుడు అనే పుత్రుణ్ణి పొందింది. తర్వాత ఆతడు అనమిత్రుణ్ణి, శినిని పొందాడు. ఆ యిద్దరు పురుషశ్రేష్ఠులు.

**అనమిత్రసుతో నిఘ్నో నిఘ్నస్య ద్వౌ బభూవతుః ।**
**ప్రసేనశ్చ మహాభాగః సత్రాజిచ్చ సుతావుభౌ ॥12॥**

**తస్య సత్రాజితః సూర్యః సఖా ప్రాణసమోऽభవత్ ।**
**స్యమంతకో నామ మణిర్దత్తస్తస్మై వివస్వతా ॥13॥**

**పృథివ్యాం సర్వరత్నానామసౌ రాజాభవన్మణిః ।**
**కదాచిన్మృగయాం యాతః ప్రసేనేన సహైవ సః ॥14॥**

**వధం ప్రాప్తోऽసహాయశ్చ సింహాదేవ సుదారుణాత్ ।**

అనుమిత్రుడి పుత్రుడు నిఘ్నుడు. ఆతడికి ప్రసేనుడు మరియు మహాభాగ్యశాలియైన సత్రాజిత్తు అనువాళ్లు ఇద్దరు కుమారులు. సత్రాజిత్తు సూర్యుడికి ప్రాణతుల్యుడైన స్నేహితుడు. సూర్యుడు ఆతడికి స్యమంతకమనే మణిని బహూకరించాడు. భూమిలో అది సమస్తరత్నాలలో శ్రేష్ఠమైంది. ఒకసారి ప్రసేనుడు ఆ రత్నాన్ని ధరించి అడవికి వేటకు వెళ్లాడు. అక్కడ అసహాయుడైన ఆతడు మహాభయంకరమైన సింహం వల్ల వధింపబడ్డాడు.

**అథ పుత్రః శినేర్జజ్ఞే కనిష్ఠాద్ వృష్ణినందనాత్ ॥15॥**

**సత్యవాక్ సత్యసంపన్నః సత్యకస్తస్య చాత్మజః ।**
**సాత్యకిర్యుయుధానస్తు శినేర్నప్తా ప్రతాపవాన్ ॥16॥**

**అసంగో యుయుధానస్య కుణిస్తస్య సుతోఽభవత్ ।**
**కుణేర్యుగంధరః పుత్రః శైనేయా ఇతి కీర్తితాః ॥17॥**

వృష్ణి పుత్రుల్లో చివరివాడైన శినికి సత్యవాది, సత్యనిష్ఠుడైన సత్యకుడు అనే పుత్రుడు కలిగాడు. ఆతడి కుమారుడు యుయుధానుడు. ఆతడు సాత్యకి అనే పేరుతో ప్రసిద్ధుడు. ఆతడు శినికి మనుమడు. ప్రతాపశాలి. యుయుధానుడి కుమారుడు అసంగుడు. ఆతడి పుత్రుడు కుణి. కుణి కుమారుడు యుగంధరుడు. వీళ్లు శైనేయులని (శిని సంతతి) చెప్పబడుతున్నారు.

**మాద్ర్యాః సుతస్య సంజజ్ఞే సుతో వార్ష్ణిర్యుధాజితః ।**
**శ్వఫల్క ఇతి విఖ్యాతస్త్రైలోక్యహితకారకః ॥18॥**

**శ్వఫల్కశ్చ మహారాజో ధర్మాత్మా యత్ర వర్తతే ।**
**నాస్తి వ్యాధిభయం తత్ర నావృష్టిభయమప్యుత ॥19॥**

**శ్వఫల్కః కాశిరాజస్య సుతాం భార్యామవాప సః ।**
**గాందినీం నామ కాశ్యో హి దదౌ తస్మై స్వకన్యకామ్ ॥20॥**

మాద్రీ పుత్రుడైన యుధాజిత్తు. శ్వఫల్కుడు అనే పేరుతో ప్రసిద్ధుడై మూడు లోకాలకు హితకారుడయిన వృష్ణికులావతంసుడైన కొడుకు పుట్టాడు. మహారాజు, ధర్మాత్ముడు, శ్వఫల్కుడు ఎక్కడ ఉంటాడో అక్కడ వ్యాధిభయం, అనావృష్టి భయం ఉండవు. ఆతడికి కాశీరాజు కుమార్తె భార్య అయ్యింది. కాశీరాజు గాందిని అనే పేరుగల తన కన్యను ఆతడికి ప్రదానం చేశాడు.

**సా మాతురుదరస్థా వై బహూన్ వర్షగణాన్ కిల ।**
**వసంతీ న చ సంజజ్ఞే గర్భస్థాం తాం పితాఽబ్రవీత్ ॥21॥**

**జాయస్వ శీఘ్రం భద్రం తే కిమర్థం చాభితిష్ఠసి ।**
**ప్రోవాచ చైనం గర్భస్థా సా కన్యా గాందినీ తదా ॥22॥**

**వర్షత్రయం ప్రతిదినం గామేకాం బ్రాహ్మణాయ తు ।**
**యది దద్యాస్తతః కుక్షేర్నిర్గమిష్యామ్యహం పితః ॥23॥**

**తథేత్యువాచ తస్యా వై పితా కామమపూరయత్ ।**
**దాతా శూరశ్చ యజ్వా చ శ్రుతవానతిథిప్రియః ॥24॥**

**తస్యాః పుత్రః స్మృతోఽక్రూరః శ్వఫల్కాద్భూరిదక్షిణః ।**
**రత్నా కన్యా చ శైవస్య హ్యక్రూరస్తామవాప్తవాన్ ॥25॥**

**అస్యాముద్పాదయామాస తనయాంస్తాన్నిబోధత ।**
**ఉపమన్యుస్తథా మాగుర్వృతస్తు జనమేజయః ॥26॥**

**గిరిరక్షస్తథోపేక్షః శత్రుఘ్నో యో౽రిమర్దనః ।**
**ధర్మభృద్ దృష్టధర్మా చ గోధనో౽థ వరస్తథా ॥27॥**

**ఆవాహప్రతివాహౌ చ సుధారా చ వరాంగనా ।**
**అక్రూరస్యోగ్రసేన్యాం తు పుత్రౌ ద్వౌ కులనందనౌ ॥28॥**

**దేవవానుపదేవశ్చ జజ్ఞాతే దేవసమ్మతౌ ।**

ఆ గాందిని మాతృగర్భంలో బహుకాలం నిలిచి ఉంటూ జన్మించలేదు. గర్భస్థ అయిన ఆమెతో తండ్రి ఇలా పలికాడు. "నీవు త్వరగా జన్మించు! నీకు శుభమగుగాక! నీవు గర్భంలోనే ఎందుకు ఉంటున్నావు?" అని. అప్పుడు మాతృగర్భస్థ గాందిని తండ్రితో "ఓ తండ్రీ! నీవు ప్రతిదినం మూడేళ్ల ఒక గోవును బ్రాహ్మణుడికి దానమివ్వు. అప్పుడు నేను గర్భం నుంచి వెలువడతాను" అని పలికింది. అట్లేనని తండ్రి పలికి ఆమె కోరికను తీర్చాడు. ఆమె వల్లనే శ్వఫల్కుడికి అక్రూరుడు జన్మించాడు. ఆతడు దానవీరుడు. పరాక్రమవంతుడు. యాజ్ఞికుడు. విద్వాంసుడు. అతిథిప్రియుడు. విస్తారంగా దక్షిణలిచ్చేవాడు. ఆతడు శైవుడనే రాజు యొక్క కుమార్తెను వివాహమాడాడు. ఆమె పేరు రత్న. ఆతడు రత్నవల్ల పుత్రుల్ని కన్నాడు. ఋషులారా! వాళ్లను గూర్చి వినండి! ఉపమన్యుడు, మాగుడు, వృతుడు, జనమేజయుడు, గిరిరక్షుడు, ఉపేక్షుడు, శత్రుఘ్నుడు, అరిమర్దనుడు, ధర్మభృత్తు, దుష్టధర్ముడు, గోధనుడు, వరుడు, ఆవాహుడు, మరియు ప్రతివాహుడు అనే పేర్లుగల పుత్రులు మరియు సుధార అనే సుందరమైన కన్య ఆతడి సంతానం. అక్రూరుడికి ఉగ్రసేనుడి కుమార్తెవల్ల దేవవానుడు, ఉపదేవుడు అనే యిద్దరు పుత్రులు కలిగారు. వాళ్లు వంశానందకరులు, దేవసములు.

**సుమిత్రస్య సుతో జజ్ఞే చిత్రకశ్చ మహాయశాః ॥29॥**

**చిత్రకస్యాభవన్ పుత్రా విపృథుః పృథురేవ చ ।**
**అశ్వగ్రీవః సుబాహుశ్చ సుధాసూకగవేక్షణౌ ॥30॥**

**అరిష్టనేమిరశ్వశ్చ ధర్మో ధర్మభృదేవ చ ।**
**సుభూమిర్బహుభూమిశ్చ శ్రవిష్ఠాశ్రవణే స్త్రియౌ ॥31॥**

**అంధకాత్కాశ్యదుహితా లేభే చ చతురః సుతాన్ ।**
**కుకురం భజమానం చ శుచిం కంబలబర్హిషమ్ ॥32॥**

**కుకురస్య సుతో వృష్టి ర్వృష్ణేః శూరస్తతో౽భవత్ ।**
**కపోతరోమాతిబలస్తస్య పుత్రో విలోమకః ॥33॥**

**తస్యాసీత్తుంబురుసఖో విద్వాన్ పుత్రో నలః కిల ।**
**ఖ్యాయతే స సునామ్నా తు చందనానకదుందుభిః ॥34॥**

సుమిత్రకుడికి చిత్రకుడనే మహాయశస్వి పుత్రుడు కలిగాడు. చిత్రకుడికి విపృథువు, పృథువు, అశ్వగ్రీవుడు, సుబాహువు, సుధాసూకుడు, గవేక్షణుడు, అరిష్టనేమి, అశ్వుడు, ధర్ముడు, ధర్మభృత్తు, సుభూమి, బహుభూమి

అనే కుమారులు, శ్రవిష్ఠ మరియు శ్రవణ అనే కుమార్తెలు కలిగారు. కాశీరాజు పుత్రిక వల్ల అంధకుడికి కుకురుడు, భజమానుడు, శుచి మరియు కంబలబర్హి అనే నలుగురు కుమారులు కలిగారు. కుకురుడికి వృష్టి, వృష్టికి శూరుడు కలిగారు. శూరుడి కుమారుడు కపోతరోముడు. ఆతడు మహాబలవంతుడు. ఆతడి కుమారుడు విలోమకుడు. ఆతడి కుమారుడు నలుడు. ఆతడు తుంబురుడి మిత్రుడు మరియు విద్వాంసుడు. ఆతడు చందనానకదుందుభి పేరుతో ప్రసిద్ధుడు.

**తస్మాదప్యభిజిత్పుత్ర ఉత్పన్నోఽస్య పునర్వసుః ।**
**అశ్వమేధం స పుత్రార్థమాజహార నరోత్తమః ॥35॥**

**తస్య మధ్యేఽతిరాత్రస్య సదోమధ్యాత్సముత్థితః ।**
**తతస్తు విద్వాన్ సర్వజ్ఞో దాతా యజ్వా పునర్వసుః ॥36॥**

**తస్యాపి పుత్రమిథునం బభూవాభిజితః కిల ।**
**ఆహుకశ్చాహుకే చైవ ఖ్యాతౌ కీర్తిమతాం వరౌ ॥37॥**

**ఆహుకాత్కాశ్యదుహితుర్ద్వౌ పుత్రౌ సంబభూవతుః ।**
**దేవకశ్చోగ్రసేనశ్చ దేవగర్భ సమావుభౌ ॥38॥**

**దేవకస్య సుతా రాజ్ఞో జజ్ఞిరే త్రిదశోపమాః ।**
**దేవవానుపదేవశ్చ సుదేవో దేవరక్షితః ॥39॥**

**తేషాం స్వసారః సప్తాసన్ వసుదేవాయ తా దదౌ ।**
**వృషదేవోపదేవా చ తథాన్యా దేవరక్షితా ॥40॥**

**శ్రీదేవా శాంతిదేవా చ సహదేవా తథాపరా ।**
**దేవకీ చాపి తాసాం చ వరిష్ఠాఽభూత్సుమధ్యమా ॥41॥**

ఆతడికి అభిజిత్తు అనే పుత్రుడు కలిగాడు. ఆతడి పుత్రుడు పునర్వసు. ఆ రాజన్యుడు పుత్రార్థం అశ్వమేధయాగం చేశాడు. ఆ యజ్ఞంలో మంత్రోచ్చారణ జరుగుతుండగా యాజకుల మధ్యలో పునర్వసు జన్మించాడు. ఆతడు విద్వాంసుడు, సర్వజ్ఞుడు, దాత, యాజకుడు. అభిజిత్తుకి ఇద్దరు కవలలు పుత్రులుగా పుట్టారు. కీర్తిమంతులలో శ్రేష్ఠులైన వాళ్లిద్దరు ఆహుకుడు, ఆహుకి అనే పేర్లు గలవాళ్లు. ఆహుకుడికి కాశ్య పుత్రిక యందు దేవకుడు, ఉగ్రసేనుడు పుట్టారు. వాళ్లిద్దరూ దేవతాపుత్రసమానులు. దేవకుడికి దేవవానుడు, ఉపదేవుడు, సుదేవుడు, అట్లే దేవరక్షితుడు అనే పుత్రులు కలిగారు. వాళ్లు దేవసమానులు. వాళ్లకు ఏడుగురు సోదరీమణులు ఉన్నారు. దేవకుడు వాళ్లను వసుదేవుడికిచ్చాడు. వృషదేవ, ఉపదేవ, దేవరక్షిత, శ్రీదేవ, శాంతిదేవ, సహదేవ, దేవకి అనేవి వాళ్ల పేర్లు. వాళ్లల్లో దేవకి శ్రేష్ఠ మరియు పరమసుందరి.

**నవోగ్రసేనస్య సుతాస్తేషాం కంసస్తు పూర్వజః ।**
**తేషాం పుత్రాశ్చ పౌత్రాశ్చ శతశోఽథ సహస్రశః ॥42॥**

**దేవకస్య సుతా పత్నీ వసుదేవస్య ధీమతః ।**
**బభూవ వంద్యా పూజ్యా చ దేవైరపి పతివ్రతా ॥43॥**

**రోహిణీ చ మహాభాగా పత్నీ చానకదుందుభేః ।**
**పౌరవీ బాహ్లికసుతా సంపూజ్యాసీత్సురైరపి ॥44॥**

ఉగ్రసేనుడికి తొమ్మిదిమంది కుమారులు. అందులో కంసుడు పెద్దవాడు. వీళ్లందరికి వందలకొలది వేలకొలది కొడుకులు మరియు మనుమలు. దేవకుడి కుమార్తె బుద్ధిమతి దేవకి వసుదేవుడి భార్య. ఆమె దేవతలు కూడా నమస్కరించి పూజించదగింది. మహాపతివ్రత. బాహ్లికుడి కుమార్తె పౌరవి, మహాభాగ్యశాలిని అయిన రోహిణి వసుదేవుడి (ఆనకదుందుభి) యొక్క భార్యే. ఆమె దేవతలచేత కూడా పూజింపదగింది.

**అసూత రోహిణీ రామం బలశ్రేష్ఠం హలాయుధమ్ ।**
**ఆశ్రితం కంసభీత్యా చ స్వాత్మానం శాంత తేజసమ్ ॥45॥**

**జాతే రామేఽథ నిహతే షడ్గర్భే చాతిదక్షిణే ।**
**వసుదేవో హరిం ధీమాన్ దేవక్యాముదపాదయత్ ॥46॥**

**స ఏవ పరమాత్మాసౌ దేవదేవో జనార్దనః ।**
**హలాయుధశ్చ భగవాననంతో రజతప్రభః ॥47॥**

**భృగుశాపచ్ఛలేనైవ మానయన్ మానుషీం తనుమ్ ।**
**బభూవ తస్యాం దేవక్యాం వాసుదేవో జనార్దనః ॥48॥**

కంసుడి భయం వల్ల దేవకి యొక్క గర్భం నుంచి వెలువడి రోహిణి యొక్క గర్భాన్ని ఆశ్రయించినవాడు. బలశాలురలో శ్రేష్ఠుడు, హలాయుధుడు, శాంతుడు, తేజస్వంతుడు అయిన బలరాముడు రోహిణికి పుట్టాడు. రజతవర్ణదేహుడు, హలాయుధుడు అయిన బలరాముడు భగవానుడైన అనంతుడే. తన ఆరుగురు పుత్రుల్ని కంసుడు వధించిన తర్వాత, మరియు బలరాముడు పుట్టిన తర్వాత బుద్ధిమంతుడు వసుదేవుడు దేవకియందు శ్రీకృష్ణుణ్ణి కన్నాడు. ఆతడు పరమాత్ముడు. దేవదేవుడు. జనార్దనుడు. ఆ జనార్దనుడు భృగుశాపాన్ని అనుభవించడానికై మానవశరీరాన్ని స్వీకరించి దేవకి వల్ల వసుదేవుడికి పుత్రుడయ్యాడు.

**ఉమాదేహసముద్భూతా యోగనిద్రా చ కౌశికీ ।**
**నియోగాద్దేవదేవస్య యశోదాతనయా హ్యభూత్ ॥49॥**

**సా చైవ ప్రకృతిః సాక్షాత్సర్వదేవ నమస్కృతా ।**
**పురుషో భగవాన్ కృష్ణో ధర్మమోక్షఫలప్రదః ॥50॥**

ఆకాలంలోనే జనార్దనుడి ఆజ్ఞ వల్ల పార్వతీదేవి యొక్క దేహం నుంచి పుట్టిన యోగనిద్ర కౌశికి యశోదకు కుమార్తె అయ్యింది. ఆమె సమస్త దేవతలచే నమస్కరింపబడే స్వయంగా ప్రకృతి. ధర్మమోక్షఫలసిద్ధి కారకుడు, భగవంతుడైన శ్రీకృష్ణుడు పురుషుడు.

**తాం కన్యాం జగృహే రక్షన్ కంసాత్స్వాత్మజం తదా ।**
**చతుర్భుజం విశాలాక్షం శ్రీవత్సకృతలాంఛనమ్ ॥51॥**

**శంఖచక్రగదాపద్మం ధారయంతం జనార్దనమ్ ।**
**యశోదాయై ప్రదత్వా తు వసుదేవశ్చ బుద్ధిమాన్ ॥52॥**

**దత్వైనం నందగోపస్య రక్షతామితి చాబ్రవీత్ ।**
**రక్షకం జగతాం విష్ణుం స్వేచ్ఛయా ధృతవిగ్రహమ్ ॥53॥**

**ప్రసాదాచ్చైవ దేవస్య శివస్యామితతేజసః ।**
**రామేణ సార్ధం తం దత్వా వరదం పరమేశ్వరమ్ ॥54॥**

**భూభారనిగ్రహార్థం చ హ్యవతీర్ణం జగద్గురుమ్ ।**
**అతో వై సర్వకల్యాణం యాదవానాం భవిష్యతి ॥55॥**

**అయం సగర్భో దేవక్యా యో నః క్లేశ్యాన్ హరిష్యతి ।**

కంసుడి నుంచి తన పుత్రుణ్ణి రక్షించుకోవడానికి బుద్ధిమంతుడైన వసుదేవుడు చతుర్భుజుడు, విశాలనేత్రుడు శ్రీవత్సచిహ్నితుడు, శంఖచక్రగదాపద్మధరుడు, తన పుత్రుడుఅయిన జనార్దనుణ్ణి యశోదకు ఇచ్చి, ఆమెకు పుట్టిన కన్యను తీసుకున్నాడు. లోకరక్షకుడు, తన ఇష్టానుసారం మానవశరీరం ధరించిన విష్ణువును నందగోపుడికిచ్చి ఆతడితో వసుదేవుడు ఇలా పలికాడు. “ఈతణ్ణి రక్షించు” అని. అమితకాంతిమంతుడు దేవదేవుడైన శివుని కృపవల్ల బలరాముడితో కూడి వరదాయకుడు, పరమేశ్వరుడు అయిన విష్ణువు భూభారాన్ని తగ్గించడానికి అవతరించాడు. ఈతడి వల్ల యాదవులకు అన్ని విధాల శుభం జరుగుతుంది. అతడు దేవకీ సుతుడు. ఆతడు మన ప్రజల కష్టాల్ని దూరం చేస్తాడు.

**ఉగ్రసేనాత్మజాయాథ కంసాయానకదుందుభిః ॥56॥**

**నివేదయామాస తదా జాతాం కన్యాం సులక్షణామ్ ।**
**అస్యాస్తవాష్టమో గర్భో దేవక్యాః కంస సువ్రత ॥57॥**

**మృత్యురేవ న సందేహ ఇతి వాణీ పురాతనీ ।**
**తతస్తాం హంతుమారేభే కంసః సోల్లంఘ్య చాంబరమ్ ॥58॥**

**ఉవాచాష్టభుజా దేవీ మేఘగంభీరయా గిరా ।**
**రక్షస్వ తత్స్వకం దేహమాయాతో మృత్యురేవ తే ॥59॥**
**రక్షమాణస్య దేహస్య మాయావీ కంసరూపిణః ।**
**కిం కృతం దుష్కృతం మూర్ఖ జాతః ఖలు తవాంతకృత్ ॥60॥**

**దేవక్యాః స భయాత్కంసో జఘానైవాష్టమం త్వితి ।**
**స్మరంతి విహితో మృత్యుర్దేవక్యాస్తనయోఽష్టమః ॥61॥**

**యస్తత్ప్రతికృతౌ యత్నో భోజస్యాసీత్ వృథా హరేః ।**
**ప్రభావాన్మునిశార్దూలాస్తయా చైవ జడీకృతః ॥62॥**

**కంసోఽపి నిహతస్తేన కృష్ణేనాక్లిష్టకర్మణా ।**
**నిహతా బహవశ్చాన్యే దేవబ్రాహ్మణఘాతినః ॥63॥**

తర్వాత వసుదేవుడు ఉగ్రసేనుడి పుత్రుడైన కంసుడికి సుందరలక్షణాన్వితయైన ఆ కన్యను ఇచ్చి ఇలా పలికాడు. ఓ కంసుడా! ఓ సువ్రతుడా! ఈమె దేవకి యొక్క అష్టమ గర్భం. నీ మృత్యురూపం. ఇందు సందేహం లేదు. ఇది పురాతనమైన వాక్యమే గదా! అని. అప్పుడు కంసుడు ఆమెను చంపడానికి ప్రయత్నించాడు. అయితే అష్టబాహువులు కలిగిన ఆమె ఆతడి చేతుల నుంచి తప్పించుకుని ఆకాశంలో నిలచి మేఘగంభీరవాక్కులతో ఇలా పలికింది. కంసుడా! ఇప్పుడు నీవు నీ దేహాన్ని రక్షించుకో, మాయావియైన కంసునిరూపంలో రక్షింపబడుతున్న నీదేహానికి మృత్యువు వచ్చింది. ఓ మూర్ఖుడా నీవెన్ని అపరాధాలు చేశావు? నిన్ను వధించేవాడు పుట్టాడు. కంసుడు దేవకి యొక్క అష్టమగర్భం వల్ల మరణం కలుగుతుందనే భయంతో ఆమెను చంప ప్రయత్నించాడు. ఆ విధంగా ఆతడి మృత్యువు నిర్ధారింపబడింది. ఆతడు దేవకీదేవి యొక్క ఎనిమిదో పుత్రుడు. ఓ మునిశ్రేష్ఠులారా! ప్రతీకారానికై కంసుడు చాలా ప్రయాస పడ్డాడు. అది వ్యర్థమయ్యింది. శ్రీహరి ప్రభావం వల్ల ఆ ఆకాశవాణి ద్వారా కంసుడు నిశ్చేష్టుడయ్యాడు. అక్లేశకర్ముడైన శ్రీకృష్ణుడు చివరిలో కంసుణ్ణి చంపాడు. అట్లే దేవతల్ని బ్రాహ్మణుల్ని వధించే అనేకులైన ఇతర దుష్టుల్ని కూడా కృష్ణుడు సంహరించాడు.

**తస్య కృష్ణస్య తనయాః ప్రద్యుమ్నప్రముఖాస్తథా ।**
**బహవః పరిసంఖ్యాతాః సర్వే యుద్ధవిశారదాః ॥64॥**

**కృష్ణపుత్రాః సమాఖ్యాతాః కృష్ణేణ సదృశాః సుతాః ।**
**పుత్రేష్వేతేషు సర్వేషు చారుదేష్ణాదయో హరేః ॥65॥**

**విశిష్టా బలవంతశ్చ రౌక్మిణేయారిసూదనాః ।**
**షోడశస్త్రీసహస్రాణి శతమేకం తథాధికమ్ ॥66॥**

**కృష్ణస్య తాసు సర్వాసు ప్రియా జ్యేష్ఠా చ రుక్మిణీ।**
**తయా ద్వాదశవర్షాణి కృష్ణేణాక్లిష్టకర్మణా ॥67॥**

**ఉష్యతా వాయుభక్షేణ పుత్రార్థం పూజితో హరః ।**
**చారుదేష్ణః సుచారుశ్చ చారువేషో యశోధరః ॥68॥**

**చారుశ్రవాశ్చారుయశాః ప్రద్యుమ్నః సాంబ ఏవ చ ।**
**ఏతే లబ్ధాస్తు కృష్ణేణ శూలపాణిప్రసాదతః ॥69॥**

శ్రీకృష్ణుడికి ప్రద్యుమ్నాదులు అనేకులు పుత్రులు కలిగారు. వాళ్లంతా యుద్ధప్రవీణులు. కృష్ణుడి కుమారులందరూ కృష్ణుడితో సమానులు. కృష్ణుడి యొక్క అందరి పుత్రుల్లో చారుదేష్ణుడు మొదలైనవాళ్లు విశిష్టులు.

బలవంతులు. వాళ్లు రుక్మిణీదేవి కుమారులు. శత్రువినాశకరులు. కృష్ణుడికి పదహారువేల నూర్గురు భార్యలు. వాళ్లందరిలో రుక్మిణి పెద్ద భార్య. కృష్ణుడికి మిక్కిలి ప్రియమైనది. అక్లిష్టకర్ముడైన కృష్ణుడు రుక్మిణీదేవితో కలిసి పండ్రెండు సంవత్సరాలు ఉపవసించి కేవలవాయుభక్షణతో సంతానార్థం శివుణ్ణి పూజించాడు. శివుడి అనుగ్రహం వల్ల చారుదేష్ణుడు, సుచారుడు, చారువేషుడు, యశోధరుడు, చారుశ్రవుడు, చారుయశుడు, ప్రద్యుమ్నుడు, సాంబుడు అనే పుత్రులు కలిగారు.

**తాన్ దృష్ట్వా తనయాన్ వీరాన్ రౌక్మిణేయాంశ్చ రుక్మిణీమ్ ।**
**జాంబవత్యబ్రవీత్కృష్ణం భార్యా కృష్ణస్య ధీమతః ॥70॥**

**మమ త్వం పుండరీకాక్ష విశిష్టం గుణవత్తరమ్ ।**
**సురేశ సమ్మితం పుత్రం ప్రసన్నో దాతుమర్హసి ॥71॥**

**జాంబవత్యాః వచః శ్రుత్వా జగన్నాథస్తతో హరిః ।**
**తపస్తప్తుం సమారేభే తపోనిధిరనాదితః ॥72॥**

**సోఽథ నారాయణః కృష్ణః శంఖచక్రగదాధరః ।**
**వ్యాఘ్రపాదస్య చ మునేర్గత్వా చైవాశ్రమోత్తమమ్ ॥73॥**

**ఋషిం దృష్ట్వా త్వంగిరసం ప్రణిపత్య జనార్దనః ।**
**దివ్యం పాశుపతం యోగం లబ్ధవాంస్తస్య చాజ్ఞయా ॥74॥**

రుక్మిణియొక్క వీరులైన పుత్రుల్ని, వారితో కూడిన రుక్మిణిని, బుద్ధిమంతుడైన కృష్ణుడి భార్యయైన జాంబవతి చూచి కృష్ణుడితో ఇలా పలికింది. "ఓ కమలనయనా! నీవు నాకు ప్రసన్నుడవై విశిష్టుడు, ఉత్తమగుణుడు, ఇంద్రసమానుడు అయిన పుత్రుణ్ణి ఇమ్ము" అని. ఆ మాటలు వినిన పూజనీయుడు, తపోనిధి, జగన్నాథుడైన కృష్ణుడు తపస్సు చేయడానికి ఆరంభించాడు. శంఖచక్రగదాధరుడు, జనార్దనుడు, నారాయణుడు అయిన శ్రీకృష్ణుడు వ్యాఘ్రపాదుడి ఉత్తమాశ్రమానికి వెళ్లి ఆ ఋషిని చూచి ఆతడికి నమస్కరించి ఆ అంగిరసుడి ఆజ్ఞ మేరకు దివ్యమైన పాశుపతయోగాన్ని స్వీకరించాడు.

**ప్రలుప్తశ్మశ్రుకేశశ్చ ఘృతాక్తో ముంజమేఖలీ ।**
**దీక్షితో భగవాన్ కృష్ణస్తతాప చ పరంతపః ॥75॥**

**ఊర్ధ్వబాహుర్నిరాలంబః పాదాంగుష్ఠాగ్రధిష్ఠితః ।**
**ఫలాంబ్వనిలభోజీ చ ఋతుత్రయమధోక్షజః ॥76॥**

గడ్డం మరియు శిరోజాలు తీయించుకొని, శరీరాన్ని నేతితో అనులిప్తం చేసుకుని, దర్భల మొలనూలును ధరించి శత్రువులను నశింపజేయువాడు, భగవానుడు అయిన శ్రీకృష్ణుడు వ్రతదీక్షితుడై తపస్సు చేయసాగాడు.

చేతులు పైకెత్తి, ఏ ఆధారం లేకుండా, కాలియొక్క బొటనివ్రేలిపై నిలిచి క్రమంగా ఫలాలు, నీరు, వాయువుల్ని ఆహారంగా గ్రహిస్తూ మూడు ఋతువుల కాలం తపస్సు చేసాడు.

**తపసా తస్య సంతుష్టో దదౌ రుద్రో బహూన్ వరాన్ ।**
**సాంబం జాంబవతీపుత్రం కృష్ణాయ చ మహాత్మనే ॥77॥**

**తథా జాంబవతీ చైవ సాంబం భార్యా హరేః సుతమ్ ।**
**ప్రహర్షమతులం లేభే లబ్ధ్వాదిత్యం యథా దితిః ॥78॥**

మహాభాగుడైన కృష్ణుడి తపస్సుకు సంతోషించి రుద్రభగవానుడు అనేక వరాల్ని ఇచ్చాడు. సాంబుడనేవాడిని జాంబవతికి పుత్రుడిగా ప్రసాదించాడు. శ్రీకృష్ణుడి భార్య అయిన జాంబవతి సాంబుణ్ణి సుతుడుగా పొంది అదితి ఆదిత్యుణ్ణి పుత్రుడుగా పొంది ఏ విధంగా సంతోషించిందో ఆ విధంగా సాటిలేని సంతోషాన్ని పొందింది.

**బాణస్య చ తదా తేన ఛ్ఛేదితం మునిపుంగవాః ।**
**భుజానాం చైవ సాహస్రం శాపాద్రుద్రస్య ధీమతః ॥79॥**

**అథ దైత్యవధం చక్రే హలాయుధసహాయవాన్ ।**
**తథా దుష్టక్షితీశానాం లీలయైవ రణాజిరే ॥80॥**

మునిశ్రేష్ఠులారా! బుద్ధిమంతుడైన రుద్రుడి శాపం వల్ల బాణాసురుడి యొక్క వేయి చేతుల్ని కృష్ణుడు ఖండించాడు. బలరాముడి సహాయంతో రాక్షసుల్ని సంహరించాడు. యుద్ధక్షేత్రంలో లీలాపూర్వకంగా దుష్టులైన రాజుల్ని వధించాడు.

**స హత్వా దేవసంభూతం నరకం దైత్యపుంగవమ్ ।**
**బ్రాహ్మణస్యోర్ధ్వచక్రస్య వరదానాన్మహాత్మనః ॥81॥**

**స్వోపభోగ్యాని కన్యానాం షోడశాతులవిక్రమః ।**
**శతాధికాని జగ్రాహ సహస్రాణి మహాబలః ॥82॥**

ఊర్ధ్వగమనుడైన వాయుదేవుడిచేత, మహాత్ముడు బ్రహ్మపుత్రుడు అయిన నారదుడి చేత వరాల్ని పొంది యజ్ఞవరాహం వల్ల (దేవసంభూతం) పుట్టిన దైత్యశ్రేష్ఠుడైన నరకాసురుణ్ణి వధించి, నరకుడి చెరలోనున్న పదహారు వేల నూర్గురు కన్యలను కృష్ణుడు స్వీకరించాడు.

**శాపవ్యాజేన విప్రాణాముపసంహృతవాన్ కులమ్ ।**
**సంహృత్య తత్కులం చైవ ప్రభాసేఽతిష్ఠదచ్యుతః ॥83॥**

**తదా తస్యైవ తు గతం వర్షాణామధికం శతమ్ ।**
**కృష్ణస్య ద్వారకాయాం వై జరాక్లేశాపహారిణః ॥84॥**

బ్రాహ్మణశాపం కారణంగా కృష్ణుడు తన వంశాన్ని సంహరించాడు. ఆ వృష్ణి కులాన్ని సంహరించి ప్రభాసక్షేత్రంలో నివసించాడు. తర్వాత వార్ధకం వల్ల కలిగే కష్టాల్ని తొలగించుకోవడానికై ద్వారకలో వంద సంవత్సరాలు ఉన్నాడు.

**విశ్వామిత్రస్య కణ్వస్య నారదస్య చ ధీమతః ।**
**శాపం పిండారకేఽ రక్షర్వచో దుర్వాససస్తదా ॥85॥**

**త్యక్త్వా చ మానుషం రూపం జరకాస్త్రచ్ఛలేనతు ।**
**అనుగృహ్య చ కృష్ణోఽ పి లుబ్ధకం ప్రయయౌ దివమ్ ॥86॥**

పిండారకక్షేత్ర నివాసులైన ఋషులు, విశ్వామిత్రుడు, కణ్వుడు, ధీమంతుడైన నారదుడు, అట్లే దూర్వాసుడు-వీళ్ల యొక్క శాపాలకు, మాటలకు రక్షణ కల్పించాడు. జరకాస్త్రమిషతో తన మానుషరూపాన్ని విడిచిపెట్టి వ్యాధుణ్ణి అనుగ్రహించి కృష్ణుడు వైకుంఠ ధామానికి వెళ్లాడు.

**అష్టావక్రస్య శాపేన భార్యాః కృష్ణస్య ధీమతః ।**
**చోరశ్చాపహృతాః సర్వాస్తస్య మాయాబలేన చ ॥87॥**

**బలభద్రోఽ పి సంత్యజ్య నాగో భూత్వా జగామ చ ।**
**మహిష్యస్తస్య కృష్ణస్య రుక్మిణీప్రముఖాః శుభాః ॥88॥**

**సహాగ్నిం వివిశుః సర్వాః కృష్ణేనాక్లిష్టకర్మణా ।**
**రేవతీ చ తథా దేవీ బలభద్రేణ ధీమతా ॥89॥**

**ప్రవిష్టా పావకం విప్రాః సా చ భర్తృపథం గతా ।**

అష్టావక్రముని శాపం చేత ధీమంతుడైన కృష్ణుడి భార్యలందరూ ఆతడి మాయాప్రభావంతో దొంగల చేత అపహరింపబడ్డారు. బలరాముడు కూడా తన శరీరాన్ని త్యజించి ఆదిశేషుడై వెళ్లిపోయాడు. రుక్మిణీ సత్యాదేవి జాంబవతి మొదలైన పట్టపురాణులు అక్లిష్టకర్ముడైన కృష్ణుడితోపాటు అగ్నిప్రవేశం చేశారు. రేవతీదేవి కూడా ధీమంతుడైన బలరాముడితో పాటు అగ్ని ప్రవేశం చేసి తన పతిని అనుగమించింది.

**ప్రేతకార్యం హరేః కృత్వా పార్థః పరమవీర్యవాన్ ॥90॥**

**రామస్య చ తథాన్యేషాం వృష్ణీనామపి సువ్రతః ।**
**కందమూలఫలైస్తస్య బలికార్యం చకార సః ॥91॥**

**ద్రవ్యాభావాత్స్వయం పార్థో భ్రాతృభిశ్చ దివం గతః ।**

అనంతరం మహాశక్తిశాలి, ఉత్తమవ్రతుడు అయిన అర్జునుడు శ్రీకృష్ణుడు, బలరాముడు, ఇతర వృష్ణివంశీయులకు పితృకార్యాన్ని పదార్థాల కొరత కారణంగా కందమూలఫలాదులచేతనే పిండప్రదానం (బలికార్యం) నిర్వహించాడు. తర్వాత అర్జునుడు కూడా తన సోదరులతో కలిసి స్వయంగా స్వర్గలోకానికి వెళ్లాడు.

**ఏవం సంక్షేపతః ప్రోక్తః కృష్ణస్యాక్లిష్టకర్మణః ॥92॥**

**ప్రభావో విలయశ్చైవ స్వేచ్ఛయైవ మహాత్మనః ।**
**ఇత్యేతత్సోమవంశానాం నృపాణాం చరితం ద్విజాః ॥93॥**

**యః పఠేచ్ఛృణు యాద్వాపి బ్రాహ్మణాన్ శ్రావయేదపి ।**
**సయాతి వైష్ణవం లోకం నాత్రకార్యా విచారణా ॥94॥**

ఈ ప్రకారంగా నేను మీకు అక్లిష్టకర్ముడైన మహాత్ముడైన కృష్ణుడి ప్రభావాన్ని, తన యిష్టప్రకారమే పూర్తయిన తిరోధానాన్ని సంగ్రహంగా చెప్పాను. ఓ ద్విజులారా! ఏ మానవుడు సోమవంశరాజుల యొక్క ఈ చరిత్రను వింటాడో, చదువుతాడో, బ్రాహ్మణులకు వినిపిస్తాడో ఆ మానవుడు విష్ణులోకాన్ని పొందుతాడు. ఇందులో సందేహం ఏమాత్రం లేదు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే సోమవంశానుకీర్తనం నామైకోనసప్తతితమోఽధ్యాయః ॥ 69 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని సోమవంశానుకీర్తనమనే అరవైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## **సప్తతితమోऽధ్యాయః - డెబ్బైయవ అధ్యాయం**

## **సృష్టివిస్తారః - సృష్టివిస్తారం**

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**ఆదిసర్గస్త్వయా సూత సూచితో న ప్రకాశితః ।**
**సాంప్రతం విస్తరేణైవ వక్తుమర్హసి సువ్రత ॥1॥**

ఓ సూతమహర్షీ! ఓ సువ్రతుడా! నీవు ఆదిసృష్టియొక్క పరిచయం మాత్రమే చేశావు. విస్తరించి చెప్పలేదు. ఇపుడు విపులంగా చెప్పవలసినదిగా కోరుచున్నాము.

**సూత ఉవాచ** – సూతమహర్షి పలికాడు.

**మహేశ్వరో మహాదేవః ప్రకృతేః పురుషస్య చ ।**
**పరత్వే సంస్థితో దేవః పరమాత్మా మునీశ్వరాః ॥2॥**

**అవ్యక్తం చేశ్వరాత్తస్మాదభవత్కారణం పరమ్ ।**
**ప్రధానం ప్రకృతిశ్చేతి యదాహుస్తత్త్వచింతకాః ॥3॥**

**గంధవర్ణరసైర్హీనం శబ్దస్పర్శవివర్జితమ్ ।**
**అజరం ధ్రువమక్షయ్యం నిత్యం స్వాత్మన్యవస్థితమ్ ॥4॥**

**జగద్యోనిం మహాభూతం పరంబ్రహ్మ సనాతనమ్ ।**
**విగ్రహః సర్వభూతానామీశ్వరాజ్ఞా ప్రచోదితమ్ ॥5॥**

**అనాద్యంతమజం సూక్ష్మం త్రిగుణం ప్రభవావ్యయమ్ ।**
**అప్రకాశమవిజ్ఞేయం బ్రహ్మాగ్రే సమవర్తత ॥6॥**

**అస్యాత్మనా సర్వమిదం వ్యాప్తం త్వాసీచ్ఛివేచ్ఛయా ।**
**గుణసామ్యే తదా తస్మిన్నవిభాగే తమోమయే ॥7॥**

ఓ ఋషీశ్వరులారా! మహేశ్వరుడగు మహాదేవుడు ప్రకృతి పురుషుల కంటె భిన్నమైనవాడు. ఆతడే పరమాత్ముడు. ఆ మహేశ్వరుడి నుంచే మహాకారణమగు అవ్యక్తం ఉద్భవించింది. తత్త్వచింతకులైన విద్వాంసులు ఆ అవ్యక్తమహాకారణాన్నే ప్రధానం అని ప్రకృతి అని పిలుస్తారు. పరమాత్మతత్త్వం గంధవర్ణరసరహితమైనది. శబ్దస్పర్శలు లేనట్టిది. ముసలితనంలేనిది. స్థిరమైనది. నిత్యమైనది. నాశనం లేనిది. స్వాత్మలో స్థితి చెంది ఉంటుంది. ఇది జగదుత్పత్తికి మూలం. ఇదే సనాతనబ్రహ్మం. ఇదే మహాభూతం. సర్వప్రాణుల యొక్క భౌతికశరీరం. ఇదే ఈశ్వరాజ్ఞచే ప్రేరితం. ఆద్యంతాలు లేనిదీ. జన్మలేనిదీ. సూక్ష్మమైనదీ. త్రిగుణాత్మకమూ, ఉత్పత్తికి మూలమూ, నాశనములేనిదీ, సృష్టి యొక్క ఆదికాలంలో అవ్యక్తమూ అవిజ్ఞేయమూ అయినదీ అయిన పరబ్రహ్మ స్వరూపంగా

భావింపబడింది. సూక్ష్మమైన సమభావం కలిగి ఉంటుంది. ఇది తమోమయంగా ఉండి ఎట్టి విభాగాలు లేనప్పుడు శివుడి ఇచ్ఛవల్ల ప్రత్యక్షంగా కన్పించేదిగా అస్తిత్వం చెందింది. సంపూర్ణ జగత్తును వ్యాపించింది.

**సర్గకాలే ప్రధానస్య క్షేత్రజ్ఞాధిష్ఠితస్య వై ।**
**గుణభావాద్ వ్యజ్యమానో మహాన్ ప్రాదుర్బభూవ హ ॥8॥**

**సూక్ష్మేణ మహతా చాథ అవ్యక్తేన సమావృతమ్ ।**
**సత్త్వోద్రిక్తో మహానగ్రే సత్తామాత్రప్రకాశకః ॥9॥**

**మనో మహాంస్తు విజ్ఞేయమేకం తత్కారణం స్మృతమ్ ।**
**సముత్పన్నం లింగమాత్రం క్షేత్రజ్ఞాధిష్ఠితం హి తత్ ॥10॥**

సృష్టికాలంలో క్షేత్రజ్ఞుడి అనగా పురుషుడి ద్వారా అధిష్ఠింపబడిన ప్రధానం గుణభావాలతో ప్రేరింప బడుతుంది. మహత్తత్త్వం ఉత్పత్తి అవుతుంది. ముందు ఈ జగత్తు సూక్ష్మమూ అట్లే మహత్తు అయిన అవ్యక్తం చేత ఆచ్ఛాదింపబడి ఉంటుంది. తర్వాత సత్తామాత్రకమైన ప్రకాశం సత్త్వగుణ ప్రధానం అనే మహత్తత్త్వం ప్రకటింపబడింది. మహత్తత్త్వాన్ని సమిష్టిగా మనస్సుగా తెలియాలి. ఈ సృష్టి కారణం అది. దానినుండి వ్యష్టిలింగము (అంతఃకరణము) ఉద్భవించింది. అది క్షేత్రజ్ఞుడిచే (జీవునిచే) అధిష్ఠితమై (కూడి) యున్నది.

**ధర్మాదీని చ రూపాణి లోకతత్త్వార్థహేతవః ।**
**మహాన్ సృష్టిం వికురుతే చోద్యమానః సిసృక్షయా ॥11॥**

ఈ మహత్తత్త్వ సృష్టి ఈశ్వరేచ్ఛ కారణంగా ప్రేరేపింపబడి, సృష్టికి అట్లే సృష్టింపబడిన జీవులకు వేదాలు, ధర్మశాస్త్రాలు పరమార్థబోధకారణాలు అవుతున్నాయి.

**మనో మహాన్ మతిర్బ్రహ్మ పూర్బుద్ధిః ఖ్యాతిరీశ్వరః ।**
**ప్రజ్ఞా చితిః స్మృతిః సంవిద్విశ్వేశశ్చేతి స స్మృతః ॥12॥**

ఆ మహేశ్వరుడు మనస్సు, మహత్తు, మతి, బ్రహ్మ, పూః(సమస్తదేవతలను పరిపూర్ణులను చేయువాడు), బుద్ధి, ఖ్యాతి, ఈశ్వరుడు, ప్రజ్ఞ, చితి, స్మృతి, సంవిత్తు అట్లే విశ్వేశుడు అనే పేర్లతో చెప్పబడ్డాడు.

**మనుతే సర్వభూతానాం యస్మాచ్చేష్టా ఫలం తతః ।**
**సౌక్ష్మ్యాత్తేన విభక్తం తు యేన తన్మన ఉచ్యతే ॥13॥**

ఏది సమస్తజీవులయొక్క కర్మఫలాన్ని తెలుసుకుంటున్నదో, దేనిచే సూక్ష్మతారూపకారణంగా కర్మఫలాన్ని అనుసరించి జగత్తు విభజింపబడుచున్నదో అది 'మనస్సు' అని చెప్పబడుతున్నది.

**తత్త్వానామగ్రజో యస్మాన్మహాంశ్చ పరిమాణతః ।**
**విశేషేభ్యో గుణేభ్యోఽపి మహానితి తతః స్మృతః ॥14॥**

అన్ని తత్త్వాల కంటె ముందు పుట్టింది. మరియు పరిణామంలో సత్త్వాది గుణాలకంటే కూడా మిక్కిలి పెద్దది ఈ కారణంగా అది 'మహాన్' అని చెప్పబడింది.

**బిభర్తి మానం మనుతే విభాగం మన్యతేఽపి చ ।**
**పురుషో భోగసంబంధాత్తేన చాసౌ మతిః స్మృతః ॥15॥**

ఆ పురుషుడు భోగసంబంధకారణంగా అన్నింటి యొక్క పోషణ చేస్తున్నాడు. సంపూర్ణప్రమాణాన్ని తెలియజేస్తున్నాడు. అట్లా సమస్తభేదాల్ని తెలియజేస్తున్నాడు. ఈ కారణం చేత అది 'మతి' అని చెప్పబడింది.

**బృహత్త్వాత్బృంహణత్వాచ్చ భావానాం సకలాశ్రయాత్ ।**
**యస్మాద్ధారయతే భావాన్ బ్రహ్మా తేన నిరుచ్యతే ॥16॥**

ఆ మహేశ్వరుడు బృహత్తు అవుతున్నాడు. అందర్ని పోషిస్తున్నాడు. అట్లే భావాలకు సంపూర్ణమైన ఆశ్రయం అవుతున్నాడు. ఈ కారణంగా భావాల్ని ధరిస్తున్నాడు. అందుచేత ఆతడు 'బ్రహ్మ' అని చెప్పబడ్డాడు.

**యః పూరయతి యస్మాచ్చ కృత్స్నాన్ దేవాననుగ్రహైః ।**
**నయతే తత్త్వభావం చ తేన పూరితి చోచ్యతే ॥17॥**

ఆ మహేశ్వరుడు దేవతలందర్ని తన అనుగ్రహంతో పరిపూర్ణుల్ని చేస్తున్నాడు. అందువల్ల ఆతడికి తత్త్వభావం ప్రాప్తిస్తున్నది. అందుచేత ఆతడు 'పూః' అని చెప్పబడ్డాడు.

**బుధ్యతే పురుషశ్చాత్ర సర్వాన్ భావాన్ హితం తథా ।**
**యస్మాద్ బోధయతే చైవ బుద్ధిస్తేన నిరుచ్యతే ॥18॥**

ఆ పరమేశ్వరుడు ఈ బ్రహ్మాండంలో సమస్తభావాలు, అట్లే హితాలు (ధర్మాలు) తెలియజేస్తున్నాడు. అలా జీవులకు బోధ కలిగిస్తున్నాడు ఈ కారణంగా ఆతడు 'బుద్ధి' అని చెప్పబడ్డాడు.

**ఖ్యాతిః ప్రత్యుపభోగశ్చ యస్మాత్సంవర్తతే తతః ।**
**భోగస్య జ్ఞాననిష్ఠత్వాత్తేన ఖ్యాతిరితి స్మృతః ॥19॥**

**ఖ్యాయతే తద్గుణైర్వాపి జ్ఞానాదిభిరనేకశః ।**
**తస్మాచ్చ మహతః సంజ్ఞా ఖ్యాతి రిత్యభిధీయతే ॥20॥**

జ్ఞాననిష్ఠ కారణంగా విషయసంబంధమైన సుఖం యొక్క ఖ్యాతి, అట్లే భోగం యొక్క ప్రాప్తి ఈశ్వరుడిలో పరివర్తితమవుతున్నాయి. అందుచేత ఆతడు 'ఖ్యాతి'గా చెప్పబడ్డాడు. సత్పురుషులు ఆకాశాదులు శబ్దాది గుణాల ద్వారా, అట్లే జ్ఞానాదుల ద్వారా ఆతణ్ణి ప్రశంసిస్తున్నారు. ఈ కారణం చేత కూడా ఈశ్వరుణ్ణి 'ఖ్యాతి' అని చెప్పడం జరిగింది.

**సాక్షాత్సర్వం విజానాతి మహాత్మా తేన చేశ్వరః ।**
**యస్మాత్ జ్ఞానానుగశ్చైవ ప్రజ్ఞా తేన స ఉచ్యతే ॥21॥**

మహాత్ముడైన ఆ శివుడు సంపూర్ణ జగత్తు యొక్క ప్రత్యక్షరూపం. అందుచేత ఈశ్వరుడు అనడం. ఆతడే స్వయంగా జ్ఞానరూపుడు. అందుచే "ప్రజ్ఞ" అనబడుతున్నాడు.

**జ్ఞానాదీని చ రూపాణి బహుకర్మఫలాని చ ।**
**చినోతి యస్మాద్భోగార్థం తేనాసౌ చితిరుచ్యతే ॥22॥**

ఆతడు జీవులయొక్క ప్రాప్తిననుసరించి జ్ఞానాదుల రూపంగా అట్లే అనేకమైన కర్మఫలాల్ని విస్తరిస్తున్నాడు. అందుచేత "చితి" అని పిలువబడుతున్నాడు.

**వర్తమానవ్యతీతాని తథైవానాగతాన్యపి ।**
**స్మరతే సర్వకార్యాణి తేనాసౌ స్మృతిరుచ్యతే ॥23॥**

మహేశ్వరుడు వర్తమాన, భూత, భవిష్యత్కాలాలకు చెందిన సమస్తకార్యాల యొక్క స్మరణ కల్గి యుండడం చేత ఆతడిని 'స్మృతి' అని పిలుస్తున్నారు.

**కృత్స్నం చ విందతే జ్ఞానం యస్మాన్మాహాత్మ్యముత్తమమ్ ।**
**తస్మాద్విందేర్విదేశ్చైవ సంవిదిత్యభిధీయతే ॥24॥**

**విద్యతేఽపి చ సర్వత్ర తస్మిన్ సర్వం చ విందతి ।**
**తస్మాత్సంవిదితి ప్రోక్తో మహద్భిర్మునిసత్తమాః ॥25॥**

ఆతడు సంపూర్ణజ్ఞానాన్ని ఉత్తమమైన మాహాత్మ్యాన్ని కలిగినవాడు. అందుచేత ఆతణ్ణి 'వింద్', విదధాతువు నుంచి ఉత్పన్నమైన 'సంవిద్' శబ్దముచే పిలుస్తున్నారు. ఓ శ్రేష్ఠమునులారా! ఆతడు సర్వత్ర ఉంటున్నాడు. ఆతడి నుంచే భక్తులు సర్వమూ పొందుతున్నారు. అందుచేత ఆయన్ని మహాత్ములు 'సంవిద్' అంటున్నారు.

**జానాతేర్జ్ఞానమిత్యాహుర్భగవాన్ జ్ఞానసన్నిధిః ।**
**బంధనాదిపరీభావాదీశ్వరః ప్రోచ్యతే బుధైః ॥26॥**

'జ్ఞా' ధాతువునుంచి 'జ్ఞాన' శబ్దం వచ్చింది. జ్ఞానసముద్రుడు శివభగవానుడు. బంధనాదులన్నింటిని తిరస్కరించడం చేత విద్వాంసులు ఆయన్ని 'ఈశ్వరుడం'టున్నారు.

**పర్యాయవాచకైః శబ్దై స్తత్త్వమాద్యమనుత్తమమ్ ।**
**వ్యాఖ్యాతం తత్త్వభావజ్ఞై ర్దేవసద్భావ చింతకైః ॥27॥**

ఈ విధంగా మహేశ్వరుడి యొక్క ఉత్తమభావాల్ని చింతన చేసే తత్త్వవేత్తలు అనేకార్థాల్ని ప్రతిపాదించే శబ్దాల ద్వారా ఆదిరూపుడైన సర్వోత్తముడి శివనామం యొక్క తత్త్వాన్ని వర్ణిస్తున్నారు.

**మహాన్ సృష్టిం వికురుతే చోద్యమానః సిసృక్షయా ।**
**సంకల్పోఽధ్యవసాయశ్చ తస్య వృత్తిద్వయం స్మృతమ్ ॥28॥**

సృష్టి చేయాలనే కోరికచే ప్రేరేపించి 'మహత్' సృష్టి కార్యాన్ని నిర్వహిస్తున్నాడు. సంకల్పం మరియు అధ్యవసాయం అనే ఈ రెండూ ఆతడి రెండు వృత్తులు.

**త్రిగుణాద్రజసోద్రిక్తాదహంకారస్తతోఽభవత్ ।**
**మహతా చ వృతః సర్గో భూతాదిర్బాహ్యతస్తు సః ॥29॥**

**తస్మాదేవ తమోద్రిక్తాదహంకారాదజాయత ।**
**భూతతన్మాత్రసర్గస్తు భూతాదిస్తామసస్తు సః ॥30॥**

**భూతాదిస్తు వికుర్వాణః శబ్దమాత్రం ససర్జ హ ।**
**ఆకాశం సుషిరం తస్మాదుత్పన్నం శబ్దలక్షణమ్ ॥31॥**

**ఆకాశం శబ్దమాత్రం తు స్పర్శమాత్రం సమావృణోత్ ।**
**వాయుశ్చాపి వికుర్వాణో రూపమాత్రం ససర్జ హ ॥32॥**

**జ్యోతిరుత్పద్యతే వాయోస్తద్రూప గుణముచ్యతే ।**
**స్పర్శమాత్రస్తు వై వాయూ రూపమాత్రం సమావృణోత్ ॥33॥**

**జ్యోతిశ్చాపి వికుర్వాణం రసమాత్రం ససర్జ హ ।**
**సంభవంతి తతో హ్యాపస్తా వై సర్వరసాత్మికాః ॥34॥**

**రసమాత్రాస్తు తా హ్యాపో రూపమాత్రోఽగ్నిరావృణోత్ ।**
**ఆపశ్చాపి వికుర్వత్యో గంధమాత్రం ససర్జిరే ॥35॥**

**సంఘాతో జాయతే తస్మాత్తస్య గంధో గుణో మతః ।**
**తస్మింస్తస్మింశ్చ తన్మాత్రం తేన తన్మాత్రతా స్మృతా ॥36॥**

రజోగుణప్రధానమూ త్రిగుణాత్మకమూ అయిన భూతాదులు మరియు అహంకారం మహత్తు ద్వారా మూయబడుతున్నాయి. ఈ తమోగుణప్రధానమైన అహంకారం నుంచి శబ్ద, స్పర్శాది తన్మాత్రల చేత ఆకాశాదితామస సృష్టి జరిగింది. సృష్టి విస్తారం జరిగేటప్పుడు భూతాదులలో శబ్దమాత్రమైన ఆకాశం యొక్క సృష్టి జరిగింది. దీని నుంచి శబ్ద లక్షణమైన సుషిరాకాశం ఉత్పన్నమయ్యింది (పుష్కరాకాశం) శబ్దమే తన్మాత్రగాగల ఆకాశం వల్ల స్పర్శతన్మాత్రగాగల వాయువు ఆచ్ఛాదింపబడింది. సృష్టి ముందుకు సాగుతున్నప్పుడు వాయువు వల్ల రూపతన్మాత్రాత్మకమైన అగ్ని ఉత్పన్నమైంది. వాయువువల్ల జ్యోతి (అగ్ని) పుట్టింది. రూపం గుణం కలిగిందిగా చెప్పబడింది. ఈ విధంగా స్పర్శతన్మాత్రాత్మకమైన వాయువు వల్ల రూపతన్మాత్రాత్మకమైన అగ్ని ఆచ్ఛాదింపబడింది. సృష్టి విస్తరించే కాలంలో జ్యోతి (అగ్ని) వల్ల రసతన్మాత్రకమైనది పుట్టింది. దానినుంచి సమస్త రసమయమైన జలం ఉత్పన్నమైంది. రూపతన్మాత్రాత్మకమైన అగ్నిచే రసతన్మాత్రాత్మకమైన జలం ఆచ్ఛాదించబడింది. మరల సృష్టి ముందుకు సాగే సమయంలో జలం గంధతన్మాత్రను సృష్టించింది. దాని నుంచి పృథ్వి పుట్టింది. దాని గుణం గంధం అయ్యింది. ఆ శబ్దాది గుణాలు వాటి వాటి ధర్మలందు మాత్రమే స్థిరంగా ఉన్నాయి. అందుచేత వాటిని తన్మాత్రలనడం జరుగుతోంది.

**అవిశేషవాచకత్వాదవిశేషాస్తతస్తు తే ।**
**ప్రశాంతఘోరమూఢత్వాదవిశేషాస్తతః పునః ॥37॥**

**భూతతన్మాత్ర సర్గోఽయం విజ్ఞేయస్తు పరస్పరమ్ ।**
**వైకారికాదహంకారాత్సత్త్వోద్రిక్తాత్తు సాత్త్వికాత్ ॥38॥**

**వైకారికః స సర్గస్తు యుగపత్సంప్రవర్తతే ।**

ఆ శబ్దాదులు అవిశేషవాచకాలు కావడం చేత అవిశేషకాలు అవుతున్నాయి. శబ్దాల యొక్క తన్మాత్రలు ఆవిధంగా ప్రతిపాదింపబడిన కారణంగా అనగా ప్రశాంతం (సాత్త్విక) ఘోరం (రాజసం) మరియు మూఢం (తామసం) అయిన కారణంగా అవి అవిశేషాలు అవుతున్నాయి. ఈ అవిశేషాల పరస్పరసహకారం వల్ల పంచభూతాలయొక్క తన్మాత్రల యొక్క సృష్టి జరిగిందని తెలియాలి. వైకారికమైన అహంకారం వల్ల అనగా రాజసాహంకారం వల్ల, సత్త్వప్రధానమైన సాత్త్వికాహంకారంవల్ల ఈ వైకారికసృష్టి ఒకేసారి జరుగుతున్నది.

**బుద్ధీంద్రియాణి పంచైవ పంచకర్మేంద్రియాణి చ ॥39॥**

**సాధకానీంద్రియాణి స్యుర్దేవా వైకారికా దశ ।**
**ఏకాదశం మనస్తత్ర స్వగుణేనోభయాత్మకమ్ ॥40॥**

**శ్రోత్రం త్వక్ చక్షుషీ జిహ్వా నాసికా చైవ పంచమీ ।**
**శబ్దాదీనామవాప్త్యర్థం బుద్ధియుక్తాని తాని వై ॥41॥**

**పాదౌ పాయురుపస్థశ్చ హస్తౌ వాగ్దశమీ భవేత్ ।**
**గతిర్విసర్గో హ్యానందః శిల్పం వాక్యం చ కర్మ తత్ ॥42॥**

ఐదు జ్ఞానేంద్రియాలు అట్లే అయిదు కర్మేంద్రియాలు. అవి సాధనస్వరూపాలు. వాటిలో రజస్స్వరూపులైన పదిమంది దేవతలు అధిష్ఠించి ఉంటారు. పదకొండో ఇంద్రియం మనస్సు. అది తన గుణం వల్ల ఉభయాత్మకం. అనగా జ్ఞానేంద్రియం మరియు కర్మేంద్రియం అవుతుంది. చెవి, చర్మం, కన్ను, నాలుక అయిదవది ముక్కు. ఈ ఇంద్రియాలు శబ్దాదుల్ని గ్రహించడంలో జ్ఞానం కలవి. రెండు పాదాలు, గుదం (ఆసనం), జననేంద్రియం, రెండు చేతులు, అట్లే పదవది వాక్కు – క్రమంగా గమనం, విసర్జనం, ఆనందం, శిల్పం, మాట వాటి యొక్క కర్మలు.

**ఆకాశం శబ్దమాత్రం చ స్పర్శమాత్రం సమావిశత్ ।**
**ద్విగుణస్తు తతో వాయుః శబ్దస్పర్శాత్మకోఽభవత్ ॥43॥**

**రూపం తథైవ విశతః శబ్దస్పర్శగుణావుభౌ ।**
**త్రిగుణస్తు తతస్త్వగ్నిః సశబ్దస్పర్శరూపవాన్ ॥44॥**

**సశబ్దస్పర్శరూపం చ రసమాత్రం సమావిశత్ ।**
**తస్మాచ్చతుర్గుణా ఆపోవిజ్ఞేయాస్తు రసాత్మికాః ॥45॥**

**శబ్దస్పర్శం చ రూపం చ రసో వై గంధమావిశత్ ।**
**సంగతా గంధమాత్రేణ ఆవిశంతో మహీమిమామ్ ॥46॥**

**తస్మాత్పంచగుణా భూమిః స్థూలా భూతేషు శస్యతే ।**
**శాంతా ఘోరాశ్చ మూఢాశ్చ విశేషాస్తేన తే స్మృతాః ॥47॥**

**పరస్పరానుప్రవేశాద్ధారయంతి పరస్పరమ్ ।**
**భూమేరంతస్త్విదం సర్వం లోకాలోకాచలావృతమ్ ॥48॥**

శబ్దతన్మాత్రాత్మకమైన ఆకాశం స్పర్శతన్మాత్రలోనికి ప్రవేశించింది. అందుచేత వాయువు శబ్దం మరియు స్పర్శగుణం కలది అయ్యింది. శబ్దం మరియు స్పర్శ అనే యీ రెండు గుణాలు రూపతన్మాత్రలోనికి ప్రవేశించాయి. అందుచేత శబ్దస్పర్శరూపాలైన మూడు గుణాలు కలిసి అగ్ని అయ్యింది. శబ్దస్పర్శరూపాలు గల అగ్ని రసతన్మాత్రలోనికి ప్రవేశించింది. దీనివల్ల రసమయజలం నాల్గుగుణాలు కలిగింది అయ్యింది. శబ్దస్పర్శరూపరసాలు గంధతన్మాత్రలోనికి ప్రవేశించాయి. అందువల్ల గంధతన్మాత్రతో పాటు పైనాలుగు తన్మాత్రలు కూడా ప్రవేశించడంతో పృథ్వి పంచగుణాలు కలిగింది అయ్యింది. అందుచేత ఈ స్థూలరూపమైన భూమి పంచభూతాల్లో శ్రేష్ఠమైనది అయ్యింది. అధికగుణాలైన ఆ శబ్దాదిగుణాలు శాంతం, ఘోరం అట్లే మూఢం అనే మూడు గుణాలు కల్గినవి అయ్యాయి. అందువల్లనే అవి విశేషగుణాలు అయ్యాయి. పరస్పరం ఒకదానిలో మరొకటి ప్రవేశించిన కారణంగా అవి ఒకదానిని మరొకటి ధరిస్తున్నాయి. భూమిపైభాగంలో ఆభూతాలన్నీ లోకాలోకపర్వతాలపైన ఆవృతమయి ఉన్నాయి.

**విశేషాశ్చేంద్రియగ్రాహ్యా నియతత్వాచ్చ తే స్మృతాః ।**
**గుణం పూర్వస్య సర్గస్య ప్రాప్నువంత్యుత్తరోత్తరాః ॥49॥**

**తేషాం యావచ్చ తద్యచ్చ యచ్చ తావద్ గుణం స్మృతమ్ ।**
**ఉపలభ్యాప్సు వై గంధం కేచిత్ బ్రూయురపాం గుణమ్ ॥50॥**

**పృథివ్యామేవ తం విద్యాదపాం వాయోశ్చ సంశ్రయాత్ ।**
**ఏతే సప్త మహాత్మానో హ్యన్యోన్యస్య సమాశ్రయాత్ ॥51॥**

**పురుషాధిష్ఠితత్వాచ్చ అవ్యక్తానుగ్రహేణ చ ।**
**మహాదయో విశేషాంతా హ్యండముత్పాదయంతి తే ॥52॥**

ఆ విశేషాలు నియతత్వకారణంగా ఇంద్రియగ్రాహ్యాలుగా చెప్పబడ్డాయి. పూర్వసృష్టి (ఆకాశాదులు) గుణాలు ఉత్తరోత్తరాలైన వాయువు మొదలైనవి పొందుతున్నాయి. ఈ శబ్దాదులలో ఎన్ని మాత్రల్లో ఆ గుణాలు ఉంటాయో ఆ మాత్రల ప్రకారంగానే అవి చెప్పబడ్డాయి. జలంలో గంధం ఉండడం అనుభవంలోకి రాగానే అది జలం యొక్క గుణమని కొందరు అంటున్నారు. అది సరికాదు. భూగుణమైన గంధమునకే జలవాయువులు సంయోగం అని తెలియాలి. మహదాత్మలైన ఈ ఏడు ఒకదానిపై ఒకటి ఆశ్రయిస్తున్నాయి. మహదాది విశేషాలు పురుషుడితో అధిష్ఠించిన కారణంగా అవ్యక్తుడైన పరమేశ్వరుడి అనుగ్రహం వల్ల బ్రహ్మాండం ఉత్పన్నమవుతున్నది.

**ఏకకాలసముత్పన్నం జలబుద్బుదవచ్చ తత్ ।**
**విశేషేభ్యోఽండమభవన్మహత్తదుదకేశయమ్ ॥53॥**

**అద్భిర్దశగుణాభిస్తు బాహ్యతోఽండం సమావృతమ్ ।**
**ఆపో దశగుణేనైతాస్తేజసా బాహ్యతో వృతాః ॥54॥**

**తేజో దశగుణేనైవ వాయునా బాహ్యతో వృతమ్ ।**
**వాయుర్దశగుణేనైవ బాహ్యతో నభసా వృతః ॥55॥**

**ఆకాశేనావృతో వాయుః ఖం తు భూతాదినావృతమ్ ।**
**భూతాదిర్మహతా చాపి అవ్యక్తేనావృతో మహాన్ ॥56॥**

నీటిలో బుడగవలె ఒక విశాలమైన అండం ఆ విశేషాలనుంచి ఒకేసారి ఉత్పన్నమైంది. అది జలమందు నిలిచి ఉంది. ఆ అండం దశగుణాలతో విస్తరించి యున్న నీటిచే వెలుపల ఆవరించి ఉంది. ఆ జలం దశగుణాలతో విస్తరించియున్న అగ్నిచే వెలుపల ఆవరించి ఉంది. ఆ అగ్ని దశగుణ విస్తారం గల వాయువుచే వెలుపల ఆవరించి ఉంది. ఆ వాయువు కూడా దశగుణవిస్తారంగల ఆకాశంచే వెలుపల ఆవరించి ఉంది. ఈ ఆకాశంతో వాయువు ఆవృతమై ఉంది. ఆ ఆకాశం భూతాదులతో ఆవరించి ఉంది. భూతాదులు మహత్తత్త్వం చేత ఆవరించబడి ఉన్నాయి. ఈ మహత్తత్త్వం అవ్యక్తం చేత ఆవరించబడి ఉంది.

**శర్వశ్చాండకపాలస్థో భవచ్చాంభసి సువ్రతాః ।**
**రుద్రోఽగ్ని మధ్యే భగవానుగ్రో వాయౌ పునఃస్మృతః ॥57॥**

**భీమశ్చావనిమధ్యస్థో హ్యహంకారే మహేశ్వరః ।**
**బుద్ధౌ చ భగవానీశః సర్వతః పరమేశ్వరః ॥58॥**

ఓ సువ్రతులారా! శర్వుడు అండం యొక్క కపాలం మీద ఉన్నాడు. భవుడు జలంలో ఉన్నాడు. రుద్రుడు అగ్నిలో, భగవంతుడు ఉగ్రుడు వాయువులో స్థితి పొంది ఉన్నాడు. భీముడు భూమి మధ్యభాగంలో నిలిచి ఉన్నాడు. మహేశ్వరుడు అహంకారంలో ఉన్నాడు. భగవంతుడు ఈశ్వరుడు బుద్ధిలో ఉన్నాడు. పరమేశ్వరుడు అన్నిచోట్ల ఉన్నాడు.

**ఏతైరావరణైరండం సప్తభిః ప్రాకృతైర్వృతమ్ ।**
**ఏతా ఆవృత్య చాన్యోన్యమష్టౌ ప్రకృతయః స్థితాః ॥59॥**

**ప్రసర్గకాలే స్థిత్వా తు గ్రసంత్యేతాః పరస్పరమ్ ।**
**ఏవం పరస్పరోత్పన్నా ధారయంతి పరస్పరమ్ ॥60॥**

**ఆధారాధేయభావేన వికారాస్తే వికారిషు ।**
**మహేశ్వరః పరోఽవ్యక్తాదండమవ్యక్తసంభవమ్ ॥61॥**

**అండాజ్జజ్ఞే స ఏవేశః పురుషోఽర్కసమప్రభః ।**
**తస్మిన్ కార్యస్య కరణం సంసిద్ధం స్వేచ్ఛయైవ తు ॥62॥**

**స వై శరీరీ ప్రథమః స వై పురుష ఉచ్యతే ।**
**తస్య వామాంగజో విష్ణుః సర్వదేవనమస్కృతః ॥63॥**

**లక్ష్మ్యా దేవ్యా హ్యభూద్దేవ ఇచ్ఛయా పరమేష్ఠినః ।**
**దక్షిణాంగభవో బ్రహ్మా సరస్వత్యా జగద్గురుః ॥64॥**

అండం ఈ సప్తప్రాకృతావరణలచేత ఆవరింపబడి ఉంది. అవి ఒక దానిని మరొకటి ఆవరించి ఉండడం చేత అవి ఎనిమిది ప్రకృతులు (మూర్తులు)గా ఉన్నాయి. ఈ విధంగా నిలిచియున్న ఈ ఆవరణాలు ప్రసర్గకాలంలో ఒకదానిని మరొకటి గ్రహిస్తున్నాయి. ఒకదాన్ని మరొకటి ధరిస్తున్నాయి. ఆ వికారాధారాలు ఆధేయభావంగా 'వికారు'లందు ఉంటున్నాయి. మహేశ్వరుడు అవ్యక్తం కన్నా ఇతరుడై ఉంటాడు. అండం అవ్యక్తం నుంచి ఉత్పన్నం అవుతుంది. సూర్యసమానకాంతిమంతుడైన పురుషుడు, పరమేశ్వరుడు అండం నుంచే ఉత్పన్నుడైనాడు. ఆ పురుషుడి నుంచి పుట్టిన సృష్టి యొక్క ఉత్పత్తి ఆతడి ఇచ్ఛానుసారమే కలిగింది. ఆతడే ప్రథమశరీరధారి. ఆతడే పురుషుడని చెప్పబడుతున్నాడు. సర్వదేవనమస్కృతుడైన విష్ణువు మరియు లక్ష్మీదేవి కూడా శివుడి యొక్క ఇచ్ఛానుసారమే ఆయన యొక్క వామాంగం నుంచి పుట్టారు. జగద్గురువు బ్రహ్మ మరియు సరస్వతీదేవి కూడా ఆయన దక్షిణాంగం నుంచి పుట్టారు.

**తస్మిన్నండే ఇమే లోకా అంతర్విశ్వమిదం జగత్ ।**
**చంద్రాదిత్యౌ సనక్షత్రౌ సగ్రహౌ సహ వాయునా ॥65॥**

**లోకాలోకద్వయం కించిదండే హ్యస్మిన్ సమర్పితమ్ ।**
**యత్తు సృష్టౌ ప్రసంఖ్యాతం మయా కాలాంతరం ద్విజాః ॥66॥**

**ఏతత్కాలాంతరం జ్ఞేయమహర్వై పారమేశ్వరమ్ ।**
**రాత్రిశ్చైతావతీ జ్ఞేయా పరమేశస్య కృత్స్నశః ॥67॥**

**అహస్తస్య తు యా సృష్టిః రాత్రిశ్చ ప్రలయః స్మృతః ।**
**నాహస్తు విద్యతే తస్య న రాత్రిరితి ధారయేత్ ॥68॥**

**ఉపచారస్తు క్రియతే లోకానాం హితకామ్యయా ।**

ఆ అండంలో ఈ లోకాలన్నీ మరియు సంపూర్ణ జగత్తు నిలిచి ఉంది. సూర్యచంద్రులు, నక్షత్రాలు, గ్రహాలు, వాయువు – ఇవన్నీ ఆ అండమందే ఉన్నాయి. రెండు లోకాలు మరియు సమస్తమూ ఆ అండమందే ఉంది. ఓ ద్విజులారా! సృష్టి స్థితిని మీకు చెప్పాను. ఈ కాలాంతరం పరమేశ్వరుడి యొక్క పగలని తెలియాలి. సృష్టికాలాంతరమంతే పరమేశ్వరుడి రాత్రి అని తెలియాలి. సృష్టి కాలం ఆతడికి పగలు. లయకాలం ఆతడికి రాత్రి. ఆయనకు పగలు లేదు, రాత్రీ లేదు. కేవలం లోకహితం కోసం ఆయన ద్వారా రాత్రి నుంచి పగలు విభాగింపబడింది.

**ఇంద్రియాణీంద్రియార్థాశ్చ మహాభూతాని పంచ చ ॥69॥**

**తస్మాత్సర్వాణి భూతాని బుద్ధిశ్చ సహ దైవతైః ।**
**అహస్తిష్ఠంతి సర్వాణి పరమేశస్య ధీమతః ॥70॥**

**అహరంతే ప్రలీయంతే రాత్ర్యంతే విశ్వ సంభవః ।**
**స్వాత్మన్యవస్థితే యుక్తే వికారే ప్రతిసంహృతే ॥71॥**

**సాధర్మ్యేణావతిష్ఠేతే ప్రధానపురుషావుభౌ ।**
**తమః సత్త్వరజోపేతౌ సమత్వేన వ్యవస్థితౌ ॥72॥**

**అనుపృక్తావభూతాం తావోతప్రోతౌ పరస్పరమ్ ।**
**గుణసామ్యే లయో జ్ఞేయో వైషమ్యే సృష్టిరుచ్యతే ॥73॥**

**తిలే యథా భవేత్తైలం ఘృతం పయసి వా స్థితమ్ ।**
**తథా తమసి సత్త్వే చ రజస్యనుసృతం జగత్ ॥74॥**

ఇంద్రియాలు, ఇంద్రియ విషయాలు, పంచమహాభూతాలు, సర్వప్రాణులు మరియు బుద్ధి ఇవి అన్నీ దేవతలతో కూడి బుద్ధిమంతుడైన పరమేశ్వరుడి యొక్క పగటి కాలంలో నిలుస్తున్నాయి. పగటి చివరలో నశిస్తున్నాయి. రాత్రి అంతమందు మరల మొత్తం విశ్వం ఉత్పన్నమవుతున్నది. అవ్యక్తం తన ఆత్మలో స్థితమై ఉన్నప్పుడు ఎప్పుడు వికారం లీనమవుతున్నదో, ప్రధానం, ప్రకృతి శాంతమవుతున్నదో అప్పుడు విశ్వోత్పత్తి జరుగుతున్నది. అప్పుడు అవ్యక్తం తన ఆత్మచేత స్థితమవుతున్నది. అప్పుడే వికారాలు విలీనమవుతున్నాయి. సత్త్వరజస్తమోగుణాలు సమత్వస్థితిలో ఉండడం చేత, అవి ఒకదానితో మరొకటి కలసి ఓత – ప్రోతలుగా (పడుగుపేకలు) నిలుస్తున్నాయి. గుణాల సమానస్థితిలో లయం, విషమస్థితిలో సృష్టి జరుగుతున్నది. ఎలా తిలల్లో తైలం, పాలలో నెయ్యి ఉంటుందో అలా సత్త్వరజస్తమోగుణాలలో జగత్తు నిలుస్తున్నది.

**ఉపాస్య రజనీం కృత్స్నాం పరాం మాహేశ్వరీం తథా ।**
**అహర్ముఖే ప్రవృత్తశ్చ పరః ప్రకృతిసంభవః ॥75॥**

**క్షోభయామాస యోగేన పరేణ పరమేశ్వరః ।**
**ప్రధానం పురుషశ్చైవ ప్రవిశ్య స మహేశ్వరః ॥76॥**

**మహేశ్వరాత్ త్రయో దేవా జజ్ఞిరే జగదీశ్వరాత్ ।**
**శాశ్వతాః పరమా గుహ్యాః సర్వాత్మానః శరీరిణః ॥77॥**

రాత్రి పూర్తిగా పరాత్పర అయిన మాహేశ్వరిని ఉపాసించి దినారంభంలో ప్రకృతి సంభవుడైన పరమేశ్వరుడు సృష్టికై సన్నద్ధుడవుతున్నాడు. ఆ పరమేశ్వరమహేశ్వరుడైన శివుడు ప్రధానంలోను పురుషుడిలోను ప్రవేశించి శ్రేష్ఠమైన యోగం వల్ల క్షోభాన్ని కలిగిస్తున్నాడు. అప్పుడు శాశ్వతులు, పరమగుహ్యులు, సర్వాత్ములు అయిన ముగ్గురు దేవతలు జగదీశ్వరుడైన మహేశ్వరుడి నుంచి ఉత్పన్నమవుతున్నారు.

**ఏత ఏవ త్రయో దేవా ఏత ఏవ త్రయో గుణాః ।**
**ఏత ఏవ త్రయో లోకా ఏత ఏవ త్రయోఽగ్నయః ॥78॥**

**పరస్పరాశ్రితా హ్యేతే పరస్పరమనువ్రతాః ।**
**పరస్పరేణ వర్తంతే ధారయంతి పరస్పరమ్ ॥79॥**

**అన్యోన్యమిథునా హ్యేతే అన్యోన్యముపజీవినః ।**
**క్షణం వియోగో న హ్యేషాం న త్యజంతి పరస్పరమ్ ॥80॥**

ఆ ముగ్గురే (బ్రహ్మ విష్ణు మహేశ్వరులు) దేవతలు. ఆ మూడే గుణాలు (సత్త్వాదులు) ఆ మూడే లోకాలు (భూలోకాదులు) ఆ మూడే అగ్నులు (గార్హపత్యాదులు) ఆ దేవతలు ముగ్గురు ఒకరు మరియొకరి ఆశ్రయాన్ని పొంది ఒకరు మరియొకర్ని అనుసరిస్తున్నారు. ఒకరు మరియొకర్ని వ్యవహరిస్తున్నారు. ఒకరు మరియొకర్ని ధరిస్తున్నారు. వారు పరస్పరం మిథునమై (జంట, సంయోగం) యున్నారు. వాళ్లు పరస్పరం ఉపజీవినులు. క్షణం కాలం కూడా వాళ్లకు ఎడబాటు ఉండదు. వాళ్లు ఒకర్ని మరొకరు త్యజించరు.

**ఈశ్వరస్తు పరో దేవో విష్ణుశ్చ మహతః పరః ।**
**బ్రహ్మా చ రజసా యుక్తః సర్గాదౌ హి ప్రవర్తతే ॥81॥**

**పరః సః పురుషో జ్ఞేయః ప్రకృతిః సా పరా స్మృతా ॥82॥**

పరమేశ్వరుడు సర్వశ్రేష్ఠుడైన దైవం. విష్ణువు కూడా అట్టివాడే. బ్రహ్మ రజోగుణోపేతుడై సృష్టికార్యాన్ని నిర్వహిస్తున్నాడు. పురుషుణ్ణి 'పరుడు'గా ప్రకృతిని 'పరా'గా గుర్తించాలి.

**అధిష్ఠితా సా హి మహేశ్వరేణ ప్రవర్తతే చోద్యమనే సమంతాత్ ।**
**అనుప్రవృత్తస్తు మాహాంస్తదేనాం చిరస్థిరత్వాద్విషయం శ్రియః స్వయమ్ ॥83॥**

మహేశ్వరుడు అధిష్ఠించిన ఆ ప్రకృతి అంతటా సృష్టికార్యంలో ప్రవర్తిస్తున్నది. దానిని మహత్తత్త్వం అనుసరిస్తున్నది. అది చిరము మరియు స్థిరము అయినందున విషయజ్ఞానము స్వయముగా కలిగినదగుచున్నది.

**ప్రధానగుణవైషమ్యాత్సర్గకాలఃప్రవర్తతే ।**
**ఈశ్వరాధిష్ఠితాత్పూర్వం తస్మాత్సదసదాత్మకాత్ ॥84॥**

**సంసిద్ధః కార్యకరణే రుద్రశ్చాగ్రే హ్యవర్తత ।**
**తేజసాప్రతిమో ధీమానవ్యక్తః సంప్రకాశకః ॥85॥**

**స వై శారీరీ ప్రథమః స వై పురుష ఉచ్యతే ।**
**బ్రహ్మా చ భగవాంస్తస్మాచ్చతుర్వక్త్రః ప్రజాపతిః ॥86॥**

**సంసిద్ధః కార్యకరణే తథా వై సమవర్తత ।**
**ఏక ఏవ మహాదేవస్త్రిధైవం స వ్యవస్థితః ॥87॥**

**అప్రతీపేన జ్ఞానేన ఐశ్వర్యేణ సమన్వితః ।**
**ధర్మేణ చాప్రతీపేన వైరాగ్యేణ చ తేఽన్వితాః ॥88॥**

అన్నింటికంటే ముందు ఈశ్వరాధిష్ఠితమైన సదసద్రూపమైన ప్రకృతి గుణవైరుధ్యకారణంగా సృష్టి యొక్క కాలం నిర్ణయం అవుతుంది. అసమానతేజస్వంతుడు, బుద్ధిమంతుడు, అవ్యక్తుడు, సంప్రకాశకుడు అయిన రుద్రుడు ముందుగానే కార్యకరణతత్పరుడైనాడు. ఆతడే ప్రథమశరీరధారి. ఆతడే పురుషుడు. ప్రజాపతి, చతుర్ముఖబ్రహ్మ కూడా ఆతడి నుంచే పుట్టి సృష్టి కార్యాన్ని నిర్వహించడానికి సమర్థుడయ్యాడు. మహాదేవుడొక్కడే మూడు రూపాలుగా వ్యవస్థితుడయ్యాడు. ఆతడు సాటిలేని జ్ఞానాన్ని అట్లే ఐశ్వర్యాన్ని కలిగినవాడు. ఆ ముగ్గురు దేవతలు కూడా సాటిలేని ధర్మాన్ని, వైరాగ్యాన్ని కల్గినవాళ్లు.

**అవ్యక్తాజ్జాయతే తేషాం మనసా యద్యదీహితమ్ ।**
**వశీకృతత్వాత్త్రైగుణ్యం సాపేక్షత్వాత్స్వభావతః ॥89॥**

ఆ ముగ్గురు దేవతలు వశీభూతులు, సాపేక్షకులు అయిన కారణంగా వీరి మనసులలో, త్రిగుణాత్మకమైన సృష్టి విషయంలో అభిలాష కలిగింది. అది సహజంగా అవ్యక్తం నుంచి పుట్టింది.

**చతుర్ముఖస్తు బ్రహ్మత్వే కాలత్వే చాంతికః స్మృతః ।**
**సహస్రమూర్ధా పురుషస్త్రిస్రోఽవస్థాః స్వయంభువః ॥90॥**

**బ్రహ్మత్వే సృజతే లోకాన్ కాలత్వే సంక్షిపత్యపి ।**
**పురుషత్వే హ్యుదాసీనస్తిస్రోఽవస్థాః ప్రజాపతేః ॥91॥**

**బ్రహ్మా కమలగర్భాభో రుద్రః కాలాగ్నిసన్నిభ ।**
**పురుషః పుండరీకాక్షో రూపం తత్పరమాత్మనః ॥92॥**

ఆ పరమేశ్వరుడు బ్రహ్మరూపంలో చతుర్ముఖుడు, కాలుడిరూపంలో సంహారకుడు. ఆతడే సహస్రశీర్షుడైన విష్ణువు కూడా. ఈ విధంగా స్వయంభువుడైన పరమేశ్వరుడు మూడు మూర్తులు గలవాడు. బ్రహ్మగా లోకాల్ని సృష్టిస్తూ, కాలుడై సంహరిస్తూ, విష్ణువై ఉదాసీనుడుగా ఉన్నాడు. ఆతడు ప్రజాపతి యొక్క మూడు రూపాలు. బ్రహ్మ కమల గర్భసమానకాంతి గలవాడు. రుద్రుడు కాలాగ్ని సమానుడు. విష్ణువు కమలనేత్రుడు. ఈ మూడు రూపాల సమాహారమే పరమాత్మ.

**ఏకథా స ద్విధా చైవ త్రిధా చ బహుధా పునః ।**
**మహేశ్వరః శరీరాణి కరోతి వికరోతి చ ॥93॥**

**నానాకృతి క్రియారూపనామవంతి స్వలీలయా ।**
**మహేశ్వరః శరీరాణి కరోతి వికరోతి చ ॥94॥**

మహేశ్వరుడు ఒకటి, రెండు, మూడు, అనేకాలుగా శరీరాల్ని ధరిస్తున్నాడు. తిరిగి వాటిని నశింపజేస్తున్నాడు. మహేశ్వరుడు తన లీలతో అనేకాకృతులు, పలుక్రియలు, వివిధరూపాలు, బహునామాలు గల శరీరాల్ని ధరిస్తాడు మళ్లీ విడిచి పెడతాడు.

**త్రిధా యద్వర్తతే లోకే తస్మాత్త్రిగుణ ఉచ్యతే ।**
**చతుర్ధా ప్రవిభక్తత్వాచ్చతుర్వ్యూహః ప్రకీర్తితః ॥95॥**

ఆతడు ఈ లోకంలో మూడు రకాలుగా ప్రవర్తించడం చేత ఆతడు త్రిగుణాత్ముడుగా చెప్పబడుతున్నాడు. నాల్గుభాగాలుగా విభక్తుడైన కారణంగా "చతుర్వ్యూహుడు" అవుతున్నాడు.

**యదాప్నోతి యదాదత్తే యచ్చాత్తి విషయానయమ్ ।**
**యచ్చాస్య సతతం భావస్తస్మాదాత్మా నిరుచ్యతే ॥96॥**

ఆతడు విషయాల్ని పొందుతాడు. తీసుకుంటాడు. వాటిని భక్షిస్తాడు. ఈ కారణంగా ఆతడు శాశ్వతభావం కలవాడు. దానివల్ల ఆతడు 'ఆత్మ' అవుతున్నాడు.

**ఋషిః సర్వగతత్వాచ్చ శరీరీ సోఽస్య యత్ప్రభుః ।**
**స్వామిత్వమస్య యత్సర్వం విష్ణుః సర్వప్రవేశనాత్ ॥97॥**

అన్నిచోట్లకు వెళ్లగలగడం వల్ల ఆతడు ఋషి అవుతున్నాడు. పరమేశ్వరుడు ఈ శరీరానికి ప్రభువు అవుతున్నాడు. అందువల్ల ఆతడికి ఈ శరీరం మీద అధికారముంటుంది. అందుచేత ఆతడు శరీరి. అన్నింటికి ప్రభువగుట చేత అన్నింటా ప్రవేశించగలగడం చేత విష్ణువు అవుతున్నాడు.

**భగవాన్ భగవద్భావాన్నిర్మలత్వాచ్ఛివః స్మృతః ।**
**పరమః సంప్రకృష్టత్వాదవనాదోమితి స్మృతః ॥98॥**

**సర్వజ్ఞః సర్వవిజ్ఞానాత్సర్వః సర్వమయో యతః ।**
**త్రిధా విభజ్య చాత్మానం త్రైలోక్యం సంప్రవర్తతే ॥99॥**

**సృజతే గ్రసతే చైవ రక్షతే చ త్రిభిః స్వయమ్ ।**

ఆతడు ఐశ్వర్యమయభావకుడవడం వల్ల భగవానుడు అవుతున్నాడు. నిర్మలత్వం వల్ల శివుడు అవుతున్నాడు. విశిష్టుడైన కారణంగా పరముడు, రక్షించడం వల్ల 'ఓం' అని చెప్పబడుతున్నాడు. అన్నింటిని తెలిసినవాడు కావడం చేత సర్వజ్ఞుడవుతున్నాడు. సర్వమయుడు అవడంచేత సర్వుడు అవుతున్నాడు. తనను మూడు విధాలుగా విభజించుకుని మూడులోకాల్ని పరిపాలిస్తున్నాడు. ఆతడు మూడు రూపాలతో జగత్తును సృష్టించడం, పాలించడం, సంహరించడం చేస్తున్నాడు.

**ఆదిత్వాదాదిదేవోఽసావజాతత్వాదజః స్మృతః ॥100॥**

**పాతి యస్మాత్ప్రజాః సర్వాః ప్రజాపతిరితి స్మృతః ।**
**దేవేషు చ మహాన్ దేవో మహాదేవస్తతః స్మృతః ॥101॥**

**సర్వగత్వాచ్చ దేవనామవశ్యత్వాచ్చ ఈశ్వరః ।**
**బృహత్త్వాచ్చ స్మృతో బ్రహ్మా భూతత్వాద్భూత ఉచ్యతే ॥102॥**

**క్షేత్రజ్ఞః క్షేత్రవిజ్ఞానాదేకత్వాత్కేవలః స్మృతః ।**
**యస్మాత్పుర్యాం స శేతే చ తస్మాత్పూరుష ఉచ్యతే ॥103॥**

**అనాదిత్వాచ్చ పూర్వత్వా త్స్వయం భూరితి సంస్మృతః ।**
**యాజ్యత్వాదుచ్యతే యజ్ఞః కవిర్విక్రాంతదర్శనాత్ ॥104॥**

ఆది అవడం చేత ఆదిదేవుడు, అజన్ముడు (పుట్టుకలేనివాడు) కావడం చేత అజుడు అవుతున్నాడు. సమస్తప్రజల్ని రక్షించడం చేత ప్రజాపతి అవుతున్నాడు. దేవతలందరిలో గొప్పవాడు కావడం చేత మహాదేవుడు. సర్వవ్యాపి మరియు ఎవరికి వశ్యుడు కాకపోవడం వల్ల దేవతలకు కూడా ఈశ్వరుడు అవుతున్నాడు. బృహద్రూపుడు కావున బ్రహ్మ అని, భూతత్త్వం (అస్తిత్వం) కారణంగా భూతుడని చెప్పడం. క్షేత్రజ్ఞాని కావున క్షేత్రజ్ఞుడు, ఏకమాత్రుడు అవడం చేత కేవలుడు అవుతున్నాడు. పురిలో (శరీరం) శయనించడం చేత పురుషుడు. అనాది మరియు అందరి కంటె ముందుగా ఉండడం చేత స్వయంభువుడు, యజనయోగ్యుడు అవడం చేత యజ్ఞుడు, విశేషమైన క్రాంత దర్శనం గలవాడు అవడం చేత కవి అవుతున్నాడు.

**క్రమణః క్రమణీయత్వాత్పాలకశ్చాపి పాలనాత్ ।**
**ఆదిత్యసంజ్ఞః కపిలో హ్యగ్రజోఽగ్నిరితి స్మృతః ॥105॥**

చేరగలవాడు అవడంచేత క్రమణుడని, అందర్ని పాలించడం వల్ల పాలకుడని, కపిలవర్ణం కలవాడు అవడం చేత ఆదిత్యుడని, అందరికంటే ముందుగా ఉత్పన్నుడు అవడం చేత అగ్ని అని పిలువబడుతున్నాడు.

**హిరణ్యమస్య గర్భోఽభూద్ధిరణ్యస్యాపి గర్భజః ।**
**తస్మాద్ధిరణ్యగర్భత్వం పురాణేఽస్మిన్నిరుచ్యతే ॥106॥**

హిరణ్యమయమైన అండం ఈతడి నుంచి ఉత్పన్నం అవడం చేత, మరియు ఈతడు హిరణ్యమయమైన అండం నుంచే పుట్టినవాడు అవడం వల్ల ఈ పురాణంలో హిరణ్యగర్భుడని చెప్పబడుతున్నాడు.

**స్వయంభువోఽపి వృత్తస్య కాలో విశ్వాత్మనస్తు యః ।**
**న శక్యః పరిసంఖ్యాతుమపి వర్షశతైరపి ॥107॥**

**కాలసంఖ్యావివృత్తస్య పరార్ధో బ్రహ్మణః స్మృతః ।**
**తావచ్ఛేషోఽస్య కాలోఽన్యస్తస్యాంతే ప్రతిసృజ్యతే ॥108॥**

**కోటికోటి సహస్రాణి అహర్భూతాని యానివై ।**
**సమతీతాని కల్పానాం తావచ్ఛేషాః పరే తు యే ।**

స్వయంభువుడు, విశ్వాత్ముడు అయిన శివుడి యొక్క గడచిన కాలాన్ని లెక్కించడానికి నూరు సంవత్సరాల కాలం కూడా సరిపోదు. ప్రస్తుతబ్రహ్మ యొక్క కాలం పరార్ధంగా చెప్పబడుచున్నది. దానికి సమానమైన రెండవ సగం ఇప్పుడు మిగిలి ఉన్నది. ఈ పరార్ధకాలం (రెండో సగం) యొక్క అంతంలో విశ్వవినాశనం జరుగుతుంది. వేలవేలకోట్ల దినాలు ఈ కల్పాలలో గడచిపోయాయి. ఇంకా అన్ని దినాలే మిగిలి ఉన్నాయి.

**యస్త్వయం వర్తతే కల్పో వారాహస్తం నిబోధత ॥109॥**

**ప్రథమః సాంప్రతస్తేషాం కల్పోఽయం వర్తతే ద్విజాః ।**
**యస్మిన్ స్వాయంభువాద్యాస్తు మనవస్తే చతుర్దశ ॥110॥**

**అతీతా వర్తమానాశ్చ భవిష్యా యే చ వై పునః ।**
**తైరియం పృథివీ సర్వా సప్తద్వీపా సపర్వతా ॥111॥**

**పూర్ణం యుగసహస్రం వై పరిపాల్యా మహేశ్వరైః ।**
**ప్రజాభిస్తపసా చైవ తేషాం శృణుత విస్తరమ్ ॥112॥**

ప్రస్తుతం వరాహకల్పం జరుగుతున్నది. దాని విషయాన్ని తెలియండి!

ఓ ఋషులారా! ఇది ప్రథమకల్పం. ఇందులో స్వాయంభువుడు మొదలైన పధ్నాలుగుమంది మనువులు ఉన్నారు. భూతభవిష్యద్వర్తమానాలలో వారే మనువులు. మాహేశ్వరులైన ఆ మనువుల చేత సప్తద్వీపాత్మకమూ, అన్నింటితోకూడినదీ అయిన భూమి ప్రజలతో కూడా వేయి యుగాలు నిండుగా పరిపాలింపబడుతుంది. ఇది వారి తపస్సుచే కూడి యున్నది. మీరు దాని విస్తృతమైన వర్ణనం వినండి!

**మన్వంతరేణ చైకేన సర్వాణ్యేవాంతరాణి చ ।**
**కథితాని భవిష్యంతి కల్పః కల్పేన చైవ హి ॥113॥**

**అతీతాని చ కల్పాని సోదర్కాణి సహాన్వయైః ।**
**అనాగతేషు తద్వచ్చ తర్కః కార్యో విజానతా ॥114॥**

ఓ ఋషులారా ! ఒక మన్వంతార్ని గూర్చి చెప్పితే అన్ని మన్వంతరాల్ని గూర్చి చెప్పినట్లే. అట్లే ఒక కల్పాన్ని గూర్చి వర్ణిస్తే అన్ని కల్పాల్ని గూర్చి వర్ణించినట్లే. గడచిపోయిన కల్పాలలో తన వంశానికి చెందిన రాజుల యొక్క క్రమాలు (వరుసలు) రాబోవు కల్పాలలోను మారక అట్లే ఉంటాయి. విద్వాంసుల యొక్క తర్కం కూడా రానున్న కల్పాలను గురించి అదే విధంగా ఉంటుంది.

**ఆపో హ్యగ్రే సమభవన్నష్టే చ పృథివీతలే ।**
**శాంతతారైకనీరేఽస్మిన్న ప్రాజ్ఞాయత కించన ॥115॥**

**ఏకార్ణవే తదా తస్మిన్నష్టే స్థావరజంగమే ।**
**తదా భవతి వై బ్రహ్మా సహస్రాక్షః సహస్రపాత్ ॥116॥**

**సహస్రశీర్షా పురుషో రుక్మవర్ణస్త్వతీంద్రియః ।**
**బ్రహ్మా నారాయణాఖ్యస్తు సుష్వాప సలిలే తదా ॥117॥**

**సత్త్వోద్రేకాత్ప్రబుద్ధస్తు శూన్యం లోకముదైక్షత ।**
**ఇమం చోదాహరంత్యత్ర శ్లోకం నారాయణం ప్రతి ॥118॥**

**ఆపో నారాశ్చ సూనవ ఇత్యపాం నామ శుశ్రుమః ।**
**ఆపూర్యతాభిరయనం కృతవానాత్మనో యతః॥119॥**

**అప్సు శేతే యతస్తస్మాత్తతో నారాయణః స్మృతః ।**

భూమి నశించిన తర్వాత ముందుగా నీరు ఏర్పడుతుంది. నక్షత్రాల కాంతి ఉపశమించిన తరువాత (కాంతి) విస్తారమైన ఆ నీటితో కూడిన బ్రహ్మాండంలో ఏదీ గుర్తింపబడదు. స్థావర జంగమాత్మకమైన సృష్టి అంతా ఆ ఏకసముద్రంలో నశించిపోగా వేయి కన్నులవాడు, వేయి పాదాలవాడు, వేయి శిరసులవాడు, స్వర్ణవర్ణుడు, అతీంద్రియుడు అయిన బ్రహ్మ పురుషరూపంలో అవతరిస్తాడు. ఆ సమయంలో బ్రహ్మ నారాయణనామకుడై ఆ జలంలో నిద్రిస్తాడు. మరల సత్త్వగుణం ఉద్రేకించిన కారణంగా బ్రహ్మ నిద్రలేచి లోకం శూన్యంగా ఉండడాన్ని చూస్తాడు. ప్రజలు ఆ నారాయణుణ్ణి గూర్చి "ఆపో నారాశ్చ" అనే శ్లోకాన్ని ఉదహరిస్తారు. నారా శబ్దానికి అర్థం "నీరు" మరియు "సూనువు" అని వింటున్నాం. ఈ జలంలో ఆతడు నివాసమేర్పరచుకుని నిద్రిస్తాడు కావున ఆతణ్ణి నారాయణుడు అంటున్నారు.

**చతుర్యుగసహస్రస్య నైశం కాలముపాస్యతః ॥120॥**

**శర్వర్యంతే ప్రకురుతే బ్రహ్మత్వం సర్గకారణాత్ ।**
**బ్రహ్మాతు సలిలే తస్మిన్ వాయుర్భూత్వా సమాచరత్ ॥121॥**

**నిశాయామివ ఖద్యోతః పావృట్కాలే తతస్తు సః ।**
**తతస్తు సలిలే తస్మిన్ విజ్ఞాయాంతర్గతాం మహీమ్ ॥122॥**

**అనుమానాదసమ్మూఢో భూమేరుద్ధరణం పునః ।**
**అకరోత్స తనూమన్యాం కల్పాదిషు యథాపురా ॥123॥**

**తతో మహాత్మా భగవాన్ దివ్యరూపమచింతయత్ ।**
**సలిలేనాప్లుతాం భూమిం దృష్ట్వా స తు సమంతతః ॥124॥**

**కిన్ను రూపమహం కృత్వా ఉద్ధరేయం మహీమిమామ్ ।**

నాల్గువేలయుగాలు గడిచిన తర్వాత జలంలో నివసించిన వెనుక, రాత్రి వెళ్లిన అనంతరం ఆతడు సృష్టి చేయదలచి బ్రహ్మరూపాన్ని ధరించాడు. బ్రహ్మ వాయు రూపుడై ఆ జలం మీద తిరిగాడు. అప్పుడాతడు వర్షఋతువులో రాత్రిపూట మిణుగురులు తిరిగినట్లున్నాడు. తర్వాత ఆతడు భూమి ఆ నీటిలో మునిగి ఉన్న విషయాన్ని తెలుసుకుని ముందు కల్పాలలో ఎలాంటి రూపం ధరించాడో దానికంటే భిన్నమైన దివ్యరూపాన్ని ధరించి భూమిని పైకి లేపడానికి నిశ్చయించాడు. తర్వాత ఆతడు ఆ దివ్యరూపాన్ని చింతించాడు. అన్నివైపులా జలంలో మునిగిన భూమిని చూచి నేను ఏ రూపాన్ని ధరించి దీన్ని పైకి తీయగలను అని తలచాడు.

**జలక్రీడానుసదృశం వారాహం రూపమావిశత్ ॥125॥**

**అధృష్యం సర్వభూతానాం వాఙ్మయం బ్రహ్మసంజ్ఞితమ్ ।**
**పృథివ్యుద్ధరణార్థాయ ప్రవివేశ రసాతలమ్ ॥126॥**

**అద్భిః సంఛాదితాం భూమిం స తామాశు ప్రజాపతిః ।**
**ఉపగమ్యోజ్జహారైనామాపశ్చాపి సమావిశత్ ॥127॥**

**సాముద్రా వై సముద్రేషు నాదేయాశ్చ నదీషు చ ।**
**రసాతలతలే మగ్నాం రసాతలపుటే గతామ్ ॥128॥**

**ప్రభుర్లోకహితార్థాయ దంష్ట్రయాభ్యుజ్జహార గామ్ ।**
**తతః స్వస్థానమానీయ పృథివీం పృథివీధరః ॥129॥**

**ముమోచ పూర్వవదసౌ ధారయిత్వా ధరాధరః ।**
**తస్యోపరి జలౌఘస్య మహతీ నౌరివ స్థితా ॥130॥**

**తత్సమాహ్యురుదేహత్వాన్న మహీ యాతి సంప్లవమ్ ।**

నీటిలో సంచరించడానికి అనుకూలమైన ప్రాణులన్నింటికి అజేయమైనట్టిది, వేదమయమైనట్టిది, బ్రహ్మనామకమైనది అయిన వరాహరూపాన్ని బ్రహ్మ ధరించి భూమిని ఉద్ధరించడానికై రసాతలానికి వెళ్లాడు. బ్రహ్మ జలాలలో కలియ తిరిగి పృథ్వి దగ్గరకు వెళ్లి దాన్ని పైకి ఎత్తాడు. అప్పుడు ఎగసిన సముద్రజలాన్ని సముద్రంలోను, నదుల నీటిని నదులలోను ప్రవేశింపజేశాడు. ఈ విధంగా బ్రహ్మదేవుడు లోక కల్యాణార్థం రసాతలంలోనికి వెళ్లి సముద్రజలంలో మునిగి ఉన్న భూమిని తన కోరతో పైకి లేపాడు. తర్వాత ఆ ధరాధరుడు భూమిని పూర్వం మాదిరిగానే దాని మూలస్థానంలో నిలిపాడు. భూమి అపుడు నీటిపై విశాలమైన నౌక మాదిరిగా కన్పించింది. నీటికి సమానమైన విశాలమైన దేహం కలదిగా ఉండడం వల్ల మరల నీటిలో మునగలేదు.

**తత ఉత్క్షిప్య తాం దేవో జగతః స్థాపనేచ్ఛయా ॥131॥**

**పృథివ్యాః ప్రవిభాగాయ మనశ్చక్రేఽంబుజేక్షణః ।**
**పృథివీం చ సమాం కృత్వా పృథివ్యాం సోఽచినోద్ గిరీమ్ ॥132॥**

**ప్రాక్సర్గే దహ్యమానే తు తదా సంవర్తకాగ్నినా ।**
**తేనాగ్నినా విశీర్ణాస్తే పర్వతా భూరి విస్తరాః ॥133॥**

**శైత్యాదేకార్ణవే తస్మిన్ వాయునా తేన సంహతాః ।**
**నిషిక్తా యత్ర యత్రాసంస్తత్రతత్రాచలాభవన్ ॥134॥**

**తదాచలత్వాదచలాః పర్వభిః పర్వతాః స్మృతాః ।**
**గిరయో హి నిగీర్ణత్వాచ్ఛయానత్వా చ్ఛిలోచ్చయాః ॥135॥**

**తతస్తేషు వికీర్ణేషు కోటిశో హి గిరిష్వథ ।**
**విశ్వకర్మా విభజతే కల్పాదిషు పునః పునః ॥136॥**

అనంతరం కమలదళాక్షుడైన బ్రహ్మ భూమిని పైకి లేపి విశ్వస్థాపనలో కోరిక కలవాడై పృథ్విని విభాగించే విషయంలో మనసు లగ్నపర్చాడు. ఆయన భూమిని సమతల పరిచి పర్వతాల్ని సంగ్రహించాడు. పూర్వసృష్టియొక్క ప్రళయకాలంలో అగ్నిద్వారా కాలిపోయిన మిక్కిలి విస్తారాలైన పర్వతాల్ని, మరల అదే విధంగా సంగ్రహించాడు. వాయు ప్రసరణం కారణంగా పర్వతాల ముక్కలు ఒకచోట చేరి పూర్వస్థితిని పొందాయి. అవి చలించవు కావున 'అచలాలు' అయ్యాయి. పెద్దశిలలు ఉండడం చేత పర్వతాలు అయ్యాయి. విశీర్ణాలు అయిననందున 'గిరులు' అయ్యాయి. భూమి మీద శయనించినవి కావున శిలోచ్చయాలు అయ్యాయి. తర్వాత కోట్లకొలది పర్వతాలు భూమిపై చెల్లాచెదురుగా పడి ఉన్న కారణంగా దేవశిల్పి విశ్వకర్మ వాటిని ప్రతి కల్పంలోనూ మరల మరల విభాగించాడు.

**స సముద్రామిమాం పృథ్వీం సప్తద్వీపాం స పర్వతామ్ ।**
**భూరాద్యాంశ్చతురో లోకాన్ పునః సోఽథ వ్యకల్పయత్ ॥137॥**

**లోకాన్ ప్రకల్పయిత్వాథ ప్రజాసర్గం ససర్జ హ ।**
**బ్రహ్మా స్వయంభూర్భగవాన్ సిసృక్షుర్వివిధాః ప్రజాః ॥138॥**

**ససర్జ సృష్టిం తద్రూపం కల్పాదిషు యథాపురా ।**
**తస్యాభిధ్యాయతః సర్గం తదా వై బుద్ధిపూర్వకమ్ ॥139॥**

**బుద్ధ్యాశ్చ సమకాలే వై ప్రాదుర్భూతస్తమోమయః ।**
**తమోమోహో మహామోహస్తామిస్రశ్చాంధసంజ్ఞితః ॥140॥**

**అవిద్యా పంచపర్వైషా ప్రాదుర్భూతా మహాత్మనః ।**
**పంచధావస్థితః సర్గో ధ్యాయతఃసోఽభిమానినః ॥141॥**

**సంవృతస్తమసా చైవ బీజాంకురవదావృతః ।**
**బహిరంతశ్చాప్రకాశస్తబ్ధో నిఃసంజ్ఞ ఏవ చ ॥142॥**

తర్వాత ఆతడు సప్తద్వీపాత్మకం, పర్వతసహితం, సముద్రభరితం అయిన పృథ్విని భూలోకం మొదలైన నాల్గులోకాలుగా విభాగించాడు. లోకాల్ని కల్పించి ప్రజలను సృష్టించాడు. బహువిధాలైన ప్రజల్ని సృష్టించే కోరికగల బ్రహ్మదేవుడు ముందు కల్పాలలో ఎలాంటి సృష్టి కలదో అటువంటి సృష్టిని కావించాడు. సృష్టిసమయంలో బుద్ధి పూర్వకమైన సృష్టిని చింతించేటప్పుడు బ్రహ్మబుద్ధి తమోమయమైన అనగా అవిద్యాత్మకమైన సృష్టి కలిగింది. అది తమం, మోహం, మహామోహం, తామిస్రం అట్లే అంధం అనే పేర్లుగలది. మహాత్ముడైన బ్రహ్మ నుంచి అయిదు విధాలైన అవిద్య ఉత్పన్నమయ్యింది. ధ్యానించుచున్న స్వాభిమాని అయిన బ్రహ్మచేత ఆ సృష్టి అయిదు రకాలుగా నిలుపబడింది. మొదటిది తమస్సు చేత ఆవరింపబడినది. బీజం నుంచి అంకురం కల్గిన విధంగా ఉన్నది రెండోది. బాహ్యాభ్యంతరాలలో వెలుగులేనిది మూడోది. స్తబ్ధంగా నిలిచేది నాలుగోది. నిఃసంజ్ఞ అయినది (చేతనాశూన్యమైనది) ఐదోది.

**యస్మాత్తేషాం వృతా బుద్ధిర్దుఃఖాని కరణాని చ ।**
**తస్మాత్తే సంవృతాత్మానో నగా ముఖ్యాః ప్రకీర్తితాః ॥143॥**

బుద్ధి ఆవరించుకొని ఉండడం చేత అది సంవృతావస్థ అవుతుంది. కాగా దాని దుఃఖం మరియు క్రియాకలాపం కూడా ఆవరింపబడి ఉంది. అందుచేత సంవృతాత్మలైన పర్వతాలు ప్రథమసృష్టి అయినాయి.

**ముఖ్యసర్గం తథాభూతం దృష్ట్వా బ్రహ్మాహ్యసాధకమ్ ।**
**అప్రసన్నమనాః సోఽథ తతోఽన్యం సోఽహ్యమన్యత ॥144॥**

**తస్యాభిధ్యాయతశ్చైవ తిర్యక్ స్రోతా హ్యవర్తత ।**
**యస్మాత్తిర్యక్ ప్రవృత్తః స తిర్యక్ స్రోతాస్తతః స్మృతః ॥145॥**

**పశ్వాదయస్తే విఖ్యాతా ఉత్పథగ్రాహిణో ద్విజాః ।**
**తస్యాభిధ్యాయతోఽన్యం వై సాత్త్వికః సమవర్తత ॥146॥**

**ఊర్ధ్వస్రోతాస్తృతీయస్తు స వై చోర్ధ్వం వ్యవస్థితః ।**
**యస్మాత్ప్రవర్తతే చోర్ధ్వమూర్ధ్వస్రోతాస్తతః స్మృతః ॥147॥**

**తే సుఖప్రీతిబహులా బహిరంతశ్చ సంవృతాః ।**
**ప్రకాశా బహిరంతశ్చ ఊర్ధ్వస్రోతోభవాః స్మృతాః ॥148॥**

**తే సత్త్వస్య చ యోగేన సృష్టాః సత్త్వోద్భవాః స్మృతాః ।**
**ఊర్ధ్వస్రోతాస్తృతీయో వై దేవసర్గస్తు స స్మృతః ॥149॥**

**ప్రకాశాద్బహిరంతశ్చ ఊర్ధ్వస్రోతోద్భవాః స్మృతాః ।**
**తే ఊర్ధ్వస్రోతసో జ్ఞేయాస్తుష్టాత్మనో బుధైః స్మృతాః ॥150॥**

ఆ విధంగా ప్రథమసృష్టి వ్యర్థమైన విషయం తెలిసికొని బ్రహ్మదేవుడు అప్రసన్నచిత్తుడయ్యాడు. తర్వాత మరో సృష్టికై ఆలోచన చేశాడు. ఈ విధమైన ఆలోచన చేస్తున్న ఆ బ్రహ్మ నుంచి తిర్యక్ స్రోతసృష్టి ఉత్పన్నమయ్యింది. తిర్యక్ స్రోతమనగా బహిర్ముఖంగా ఇంద్రియప్రవాహం గలది. ఆ సృష్టి తిర్యక్ ప్రవృత్తి కల్గింది. అందుచేత అది తిర్యక్ స్రోతమనబడింది. ఓ ద్విజులారా! అడ్డంగా తిరిగే పశువులు, పక్షులు ఈ తిర్యక్ రూపసృష్టికి చెందినవి. తర్వాత ఇతర సర్గవిషయమై ధ్యానం చేస్తున్న బ్రహ్మ నుంచి ఊర్ధ్వస్రోతమనే మూడోది అయిన సాత్త్విక సృష్టి జరిగింది. అది ఊర్ధ్వరూపంగా నిలిచింది. అది ఊర్ధ్వభావంతో పని చేస్తుంది. అందుచే దాన్ని ఊర్ధ్వస్రోతం అంటున్నాం. అది సుఖం, ప్రీతి అధికంగా కలది. బాహ్యాభ్యంతరాలను ఆవరించక ఉండడం చేత బాహ్యాభ్యంతరాలు ప్రకాశమయాలు అవుతున్నాయి. దీని కారణంగా అవి ఊర్ధ్వస్రోతం వల్ల ఉత్పన్నాలు అయ్యాయి. అవి సత్త్వగుణం యొక్క యోగం వలన సృష్టింపబడ్డాయి. దానివల్ల వాటిని సత్త్వోద్భవాలు అంటున్నాం. ఊర్ధ్వస్రోతమనే ఈ మూడో సృష్టి దేవసృష్టిగా చెప్పబడుతోంది. లోపల వెలుపల ప్రకాశం కల్గి యుండడం చేత ఊర్ధ్వస్రోతంగా ఉత్పన్నమైనది. ఊర్ధ్వస్రోతం వల్ల కల్గినవారు సంతుష్టాత్ములని విద్వాంసులంటారు.

**ఊర్ధ్వస్రోతస్తు సృష్టేషు దేవేషు వరదః ప్రభుః ।**
**ప్రీతిమానభవద్ బ్రహ్మా తతోఽయం సోఽభ్యమన్యత ॥151॥**

**ససర్జ సర్గమన్యం హి సాధకం ప్రభురీశ్వరః ।**
**తతోఽభిధ్యాయతస్తస్య సత్యాభిధ్యాయినస్తదా ॥152॥**

**ప్రాదురాసీత్తదా వ్యక్తా దర్వాక్ స్రోతాస్తు సాధకః ।**
**యస్మాదర్వాక్ న్యవర్తంత తతోఽర్వాక్ స్రోతసస్తు తే॥153॥**

**తే చ ప్రకాశబహులాస్తమః పృక్తా రజోఽధికాః ।**
**తస్మాత్తే దుఃఖబహులా భూయోభూయశ్చ కారిణః ॥154॥**

**సంవృతా బహిరంతశ్చ మనుష్యాః సాధకాశ్చ తే ।**
**లక్షణైస్తారకాద్యైస్తే హ్యష్టధా తు వ్యవస్థితాః ॥155॥**

**సిద్ధాత్మానో మనుష్యాస్తే గంధర్వసహధర్మిణః ।**
**ఇత్యేష తైజసః సర్గో హ్యర్వాక్ స్రోతః ప్రకీర్తితః ॥156॥**

ఊర్ధ్వస్రోతం వారైన దేవతల సృష్టి తర్వాత వరప్రదాత బ్రహ్మ ప్రసన్నుడైనాడు. తర్వాత మరో సృష్టికై ఆలోచించాడు. అప్పుడు బ్రహ్మ వేరొక సాధకసృష్టి చేశాడు. ఆ సమయంలో ధ్యానమందుగల బ్రహ్మకు సత్యాభిధ్యానం వ్యక్తమయ్యింది. అప్పుడు అర్వాక్ స్రోతమనే సాధక సృష్టి జరిగింది. ఈ సృష్టి మానవులు అర్వాగ్రూపంలో కార్యాల్ని నిర్వహిస్తారు. అందుచేత వార్ని అర్వాక్ స్రోతసృష్టికి చెందినవారంటారు. వారు అధికప్రకాశం గలవారు. తమోగుణంతో కూడిన వారైనా రజోగుణం అధికంగా గలవారుగా ఉంటారు. ఈ కారణంగా వీరు అధిక దుఃఖితులు. మాటి మాటికి కార్యాల్ని నిర్వహిస్తారు. బాహ్యాభ్యంతరాలు ఆవృతమైన వీళ్లు సాధకమానవులు. అనగా కార్యసాధన తత్పరులు. వాళ్లు తారకాదిలక్షణాల ద్వారా ఎనిమిది విధాలుగా విభాగింపబడ్డారు. సిద్ధాత్ములైన ఆ మానవులు గంధర్వులతో సమానమైన గుణధర్మాలు గలవారు. ఈ అర్వాక్ స్రోతం సృష్టిని "తైజస" సృష్టి అంటారు.

**పంచమోఽనుగ్రహః సర్గశ్చతుర్ధా తు వ్యవస్థితః ।**
**విపర్యయేణ శక్త్యా చ సిద్ధ్యా తుష్ట్యా తథైవ చ ॥157॥**

**స్థావరేషు విపర్యాసస్తిర్యగ్యోనిషు శక్తితః ।**
**సిద్ధాత్మనో మనుష్యాస్తు ఋషిదేవేషు కృత్స్నశః ॥158॥**

**ఇత్యేష ప్రాకృతః సర్గో వైకృతోఽనవమః స్మృతః ।**

ఐదవసృష్టి 'అనుగ్రహం' అనే పేరుగలది. అది విపర్యయం, శక్తి, సిద్ధి, తుష్టి అని నాల్గు విధాలు. స్థావరాలలో విపర్యయం చేత, తిర్యక్కులందు శక్తి చేతను, మనుష్యులలో సిద్ధి చేతను దేవతలందు, ఋషులందు సంపూర్ణ తుష్టి చేతను నాల్గుగా విభజింపబడింది. నాల్గు విధాలైన ఈ ప్రాకృతసృష్టి వికారాల్ని పొంది అనుగ్రహమనే పేరుగల సృష్టి శ్రేష్ఠమైన సృష్టిగా చెప్పబడుతోంది.

**భూతాదికానాం భూతానాం షష్ఠః సర్గః స ఉచ్యతే ॥159॥**

**నివృత్తం వర్తమానం చ తేషాం జానంతి వై పునః ।**
**భూతాదికానాం భూతానాం సప్తమః సర్గ ఏవ చ ॥160॥**

**తేఽ పరిగ్రాహిణః సర్వే సంవిభాగరతాః పునః ।**
**స్వాదనాశ్చాప్యశీలాశ్చ జ్ఞేయా భూతాదికాశ్చ తే ॥161॥**

**విపర్యయేణ భూతాదిరశక్త్యా చ వ్యవస్థితః ।**

మన్వాదుల సృష్టి భూతాల యొక్క ఆరో సృష్టి అవుతున్నది. వారు భూతభవిష్యద్వర్తమానములు తెలిసినవారు. భూతాదికమైన భూతాల యొక్క (మనుష్యులు) సర్గం ఏడవది. మన్వాదులు పరిగ్రహం లేనివారు, దానశీలురు, కర్మఫలానుభోక్తలు మరియు ఫలాపేక్షరహితులు అని తెలియాలి. భూతాదులు విపర్యయంగా శక్తిహీనులుగానూ ఉంటారు.

**ప్రథమో మహతః సర్గో విజ్ఞేయో బ్రహ్మణః స్మృతః ॥162॥**

**తన్మాత్రాణాం ద్వితీయస్తు భూతసర్గః స ఉచ్యతే ।**
**వైకారికస్తృతీయస్తు సర్గ ఐంద్రియకః స్మృతః ॥163॥**

**ఇత్యేష ప్రాకృతః సర్గః సంభూతో బుద్ధిపూర్వకః ।**
**ముఖ్యసర్గశ్చతుర్థశ్చ ముఖ్యా వై స్థావరాః స్మృతాః ॥164॥**

**తతోఽ ర్వాక్ స్రోతసాం సర్గః సప్తమః స తు మానుషః ।**
**అష్టమోఽ నుగ్రహః సర్గః సాత్త్వికస్తామసశ్చ సః ॥165॥**

**పంచైతే వైకృతాః సర్గాః ప్రాకృతాస్తు త్రయః స్మృతాః ।**
**ప్రాకృతో వైకృతశ్చైవ కౌమారో నవమః స్మృతః ॥166॥**

**అబుద్ధిపూర్వకాః సర్గాః ప్రాకృతాస్తు త్రయః స్మృతాః ।**
**బుద్ధిపూర్వం ప్రవర్తంతే షట్ పునర్బ్రహ్మణస్తు తే ॥167॥**

మహత్తత్వం బ్రహ్మ యొక్క ప్రథమసృష్టి. తన్మాత్రల యొక్క సృష్టి రెండోది. దాన్ని భూతసృష్టి అంటారు. వైకారిక సృష్టి మూడోది. దీన్ని 'ఐంద్రియసర్గం' అంటారు. ఇవి అన్నీ ప్రాకృతసృష్టులు. ఇవి బుద్ధిపూర్వకాలు. నాల్గోది ముఖ్యసృష్టి. అన్ని స్థావరాల సృష్టియిది. అర్వాక్ స్రోతమనే సృష్టి. ఏడోది ఈ అర్వాక్ స్రోతసృష్టి మానుష సృష్టి. ఎనిమిదోది అనుగ్రహసృష్టి. ఇది సాత్త్వికమూ, తామసమూ. రాజసమూ కూడాను. (సాత్త్వికం – దేవతలు, తామసం – పశువులు, రాజసం – మనుష్యులు) ఈ విధంగా ఐదు వైకృతసృష్టులు, మూడు ప్రాకృతసృష్టులు. ప్రాకృతవైకృతాలు రెండూ కలది – కౌమారమనే తొమ్మిదో సృష్టి, అబుద్ధిపూర్వకాలు మూడు ప్రాకృతసృష్టులు. మిగిలిన ఆరు సృష్టులు బుద్ధిపూర్వకాలు.

**విస్తరానుగ్రహః సర్గః కీర్త్యమానో నిబోధత ।**
**చతుర్థావస్థితః సోఽథ సర్వభూతేషు కృత్స్నశః ॥168॥**

**ఇత్యేతే ప్రాకృతాశ్చైవ వైకృతాశ్చ నవ స్మృతాః ।**
**పరస్పరానురక్తాశ్చ కారణైశ్చ బుధైః స్మృతాః ॥169॥**

ఓ ఋషులారా! నేను ఇప్పుడు వివరంగా అనుగ్రహసర్గాన్ని గూర్చి చెబుతాను. మీరు దాన్ని తెలుసుకోండి! అది అన్ని భూతాల్లోనూ సంపూర్ణంగా నాల్గు విధాలుగా ఉన్నది. ప్రాకృతసృష్టులు మూడు, వైకృతసృష్టులు ఐదు, వివిధకారణాలచే, ప్రాకృత వైకృతసృష్టుల పరస్పరానురక్తమైన సృష్టి ఒకటి, కాగా మొత్తం మీద తొమ్మిది విధములైన సృష్టులని విద్వాంసులు భావిస్తున్నారు.

**అగ్రే ససర్జ వై బ్రహ్మా మానసానాత్మనః సమాన్ ।**
**ఋభుః సనత్కుమారశ్చ ద్వావేతావూర్ధ్వరేతసౌ ॥170॥**

**పూర్వోత్పన్నౌ పురా తేభ్యః సర్వేషామపి పూర్వజౌ ।**
**వ్యతీతే త్వష్టమే కల్పే పురాణౌ లోకసాక్షిణౌ ॥171॥**

**తౌ వారాహే తు భూర్లోకే తేజః సంక్షిప్య ధిష్ఠితౌ।**
**తావుభౌ మోక్షకర్మాణావారోగ్యాత్మానమాత్మని ॥172॥**

**ప్రజాం ధర్మంచ కామంచ త్యక్త్వా వైరాగ్యమాస్థితౌ ।**
**యథోత్పన్నస్తథైవేహ కుమారః స ఇహోచ్యతే ॥173॥**

**తస్మాత్ సనత్కుమారేతి నామాస్యేహ ప్రకీర్తితం ।**
**సనందం సనకం చైవ విద్వాంసంచ సనాతనమ్ ॥174॥**

**విజ్ఞానేన నివృత్తాస్తే వ్యవర్తంత మహౌజసః ।**
**సంబుద్ధాశ్చైవ నానాత్వే అగ్రవృత్తాశ్చ యోగినః ॥175॥**

**అసృష్ట్వైవ ప్రజాసర్గం ప్రతిసర్గం గతాః పునః ।**

ప్రారంభంలో బ్రహ్మ ఆత్మసమానులైన మానసపుత్రుల్ని సృష్టించాడు. వారిలో ఋభువు, సనత్కుమారుడు అందరికన్నా ముందు కలిగారు. అందరిలో వీరు పెద్దవారు ఊర్ధ్వరేతస్కులు. (అస్ఖలిత బ్రహ్మచారులు) ఎనిమిదో కల్పం పూర్తికాగా లోకసాక్షులు, ప్రాచీనులు అయిన వారిద్దరు వరాహకల్పంలో వారి తేజస్సును తగ్గించుకుని భూలోకంలో అధిష్ఠితులయ్యారు. మోక్షార్థులైన వారు కర్మపరాయణులై ఆత్మలలో ఆత్మల్ని స్థిరపరచి ప్రజల్ని, ధర్మాన్ని, కామాన్ని త్యజించి వైరాగ్యాన్ని పొందారు. సనత్కుమారుడు ఏ బాలుని రూపంలో జన్మించాడో ఆ విధమైన బాలకునిరూపంలోనే ఉన్నాడు. అందువల్ల ఆతడు సనత్కుమారుడుగా ప్రసిద్ధుడయ్యాడు. ఈ విధంగానే బ్రహ్మదేవుడు సనందుణ్ణి, సనకుణ్ణి, విద్వాంసుడైన సనాతనుణ్ణి ఉత్పత్తి చేశాడు.

వారు విశేషజ్ఞానులై సంసార విషయవిముఖులయ్యారు. మహాకాంతిమంతులైనవారు నలుగురు యోగివరులై అవిద్యాపరికల్పితభేదాన్ని బాగా గ్రహించి, దాన్ని మిథ్యగా తలంచి సంసారకార్యకలాపాన్ని ప్రవృత్తిని విడిచి పెట్టారు. సంతానం లేకయే వాళ్లు మోక్షాన్ని పొందారు.

**తతస్తేషు వ్యతీతేషు తతోఽన్యాన్ సాధకాన్ సుతాన్ ॥176॥**

**మానసానసృజద్ బ్రహ్మా పునః స్థానాభిమానినః ।**
**ఆభూతసంప్లవావస్థాయిరియం విధృతా మహీ ॥177॥**

**ఆపోఽగ్నిం పృథివీం వాయుమంతరిక్షం దివం తథా ।**
**సముద్రాంశ్చ నదీశ్చైవ తథా శైలవనస్పతీన్ ॥178॥**

**ఓషధీనాం తథాత్మానో వల్లీనాం వృక్షవీరుధామ్ ।**
**లతాః కాష్ఠాః కలాశ్చైవ ముహూర్తాః సంధిరాత్ర్యహాన్ ॥179॥**

**అర్ధమాసాంశ్చ మాసాంశ్చ అయనాబ్దయుగాని చ ।**
**స్థానాభిమానినః సర్వే స్థానాఖ్యాశ్చైవ తే స్మృతాః ॥180॥**

వాళ్లందరూ మోక్షాన్ని పొందగా స్థానాభిమానులు, కార్యసాధకులు అయిన మానసపుత్రుల్ని బ్రహ్మ తిరిగి సృష్టించాడు. ప్రళయపర్యంతం వీరు భూమిని ధరించారు. తర్వాత బ్రహ్మదేవుడు నీటిని, అగ్నిని, భూమిని, వాయువును, అంతరిక్షాన్ని, స్వర్గాన్ని, సముద్రాల్ని, నదుల్ని, పర్వతాల్ని, వనస్పతుల్ని, ఓషధుల్ని, తీగల్ని, వృక్షాల్ని, పొదల్ని, లతల్ని, కాష్ఠాల్ని, కళల్ని, ముహూర్తాల్ని, సంధుల్ని, రాత్రుల్ని, పగళ్లను, పక్షాల్ని, మాసాల్ని, ఆయనాల్ని, వర్షాల్ని, యుగాల్ని సృష్టించాడు. స్థానాభిమానులైన వారు వారి స్థానాలే పేర్లుగల వారైనారు.

**దేవానృషీంశ్చ మహతో జగతస్తాన్నిబోధత ।**
**మరీచిభృగ్వంగిరసం పులస్త్యం పులహం క్రతుమ్ ॥181॥**

**దక్షమత్రిం వసిష్ఠంచ సోఽసృజన్మానసాన్నవ ।**
**నవ బ్రహ్మాణ ఇత్యేతే పురాణే నిశ్చయం గతాః ॥182॥**

**తేషాం బ్రహ్మాత్మకానాం వై సర్వేషాం బ్రహ్మవాదినామ్ ।**
**స్థానాని కల్పయామాస పూర్వవత్పద్మసంభవః ॥183॥**

**తతోఽసృజచ్చ సంకల్పం ధర్మం చైవ సుఖావహమ్ ।**
**సోఽసృజద్వ్యవసాయాత్తు ధర్మం దేవో మహేశ్వరః ॥184॥**

**సంకల్పం చైవ సంకల్పాత్సర్వలోకపితామహః ।**
**మానసశ్చ రుచిర్నామ విజజ్ఞే బ్రహ్మణః ప్రభోః ॥185॥**

నేనిప్పుడు మహాత్ములైన దేవతలయొక్క ఋషుల యొక్క విషయాల్ని చెబుతాను. మీరు ఆ విషయాల్ని తెలియండి! బ్రహ్మదేవుడు మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి,

వసిష్ఠుడు అనే తొమ్మిది మంది మానసపుత్రుల్ని సృష్టించాడు. వారు నవబ్రహ్మలుగా నిర్ధారింపబడి పురాణ ప్రసిద్ధులయ్యారు. బ్రహ్మదేవుడు బ్రహ్మవాదులు, బ్రహ్మస్వరూపులు అయిన వారికి పూర్వకల్పంలో మాదిరిగానే ఆయా స్థానాల్ని కల్పించాడు. తర్వాత వారికి సుఖాన్ని ఇవ్వడానికై ధర్మణ్ణి, సంకల్పుణ్ణి సృష్టించాడు. మహేశ్వరుడు, ప్రభువు అయిన బ్రహ్మ కృషి వల్ల (వ్యవసాయం) ధర్మణ్ణి, సంకల్పం వల్లనే సంకల్పుణ్ణి సృష్టించాడు. బ్రహ్మ మనసు నుంచి రుచి అనే మానసపుత్రుడు కలిగాడు.

**ప్రాణాద్ బ్రహ్మాసృజద్దక్షం చక్షుర్భ్యాం చ మరీచినమ్ ।**
**భృగుస్తు హృదయాజ్జజ్ఞే ఋషిః సలిలజన్మనః ॥186॥**

**శిరసోఽంగిరసశ్చైవ శ్రోత్రాదత్రిం తథాసృజత్ ।**
**పులస్త్యం చ తథోదానాద్వ్యానాచ్చ పులహం పునః ॥187॥**

**సమానజో వసిష్ఠశ్చ అపానాన్నిర్మమే క్రతుమ్ ।**
**ఇత్యేతే బ్రహ్మణః పుత్రా దివ్యా ఏకాదశ స్మృతాః ॥188॥**

బ్రహ్మదేవుడు ప్రాణం వల్ల దక్షుణ్ణి, రెండు నేత్రాల వల్ల మరీచిని సృష్టించాడు. జలజన్ముడైన భృగుమహర్షి బ్రహ్మ హృదయం నుంచి పుట్టాడు. శిరసు నుంచి అంగిరసుడు, కర్ణాల నుంచి అత్రి కలిగారు. ఉదానవాయువు నుంచి పులస్త్యుడు, వ్యానవాయువునుంచి పులహుడు, సమానవాయువు నుంచి వసిష్ఠుడు అపానవాయువు నుంచి క్రతువు పుట్టారు. ఈ పదకొండు మంది బ్రహ్మయొక్క దివ్య పుత్రులు. సంకల్పుడు, ధర్ముడుతో కలిపి.

**ధర్మాదయః ప్రథమజాః సర్వే తే బ్రహ్మణః స్మృతాః ।**
**భృగ్వాదయస్తు తే సృష్టా నవైతే బ్రహ్మవాదినః ॥189॥**

**గృహమేధినః పురాణాస్తే ధర్మస్తైః సంప్రవర్తితః ।**
**తేషాం ద్వాదశ తే వంశా దివ్యా దేవగుణాన్వితాః ॥190॥**

**క్రియావంతః ప్రజావంతో మహర్షిభిరలంకృతాః ।**

మొదటిగా కలిగిన ధర్మాదులు బ్రహ్మకుమారులు. వాళ్లు భృగువు మొదలైనవారు తొమ్మిది మంది. వాళ్లందరూ బ్రహ్మవాదులు. వాళ్లు ప్రాచీనమైన గృహస్థులు. వాళ్ల వలన ధర్మం ప్రవర్తితమవుతున్నది. వారు దివ్యులు. దేవగుణసంపన్నులు. క్రియావంతులు. సంతానవంతులు. మహర్షుల చేత అలంకృతాలైన పంద్రెండు వంశాలివి.

**ఋభుః సనత్కుమారశ్చ ద్వావేతావూర్ధ్వరేతసౌ ॥191॥**

**పూర్వోత్పన్నౌ పరం తేభ్యః సర్వేషామపి పూర్వజౌ ।**
**వ్యతీతే త్వష్టమే కల్పే పురాణౌ లోకసాక్షిణౌ ॥192॥**

**విరాజేతాముభౌ లోకే తేజః సంక్షిప్య ధిష్ఠితౌ ।**
**తావుభౌ యోగకర్మాణావారోప్యాత్మానమాత్మని ॥193॥**

**ప్రజాం ధర్మం చ కామంచ త్యక్త్వా వైరాగ్యమాస్థితౌ ।**
**యథోత్పన్నః స ఏవేహ కుమారః స ఇహోచ్యతే ॥194॥**

**తస్మాత్సనత్కుమారేతి నామాస్యేహ ప్రతిష్ఠితమ్ ।**

ఋభువు, సనత్కుమారులు అనే వీళ్లు ఇద్దరూ బ్రహ్మచారులు. ముందు పుట్టినవారు. అందరికి అగ్రజులు. ఎనిమిదో కల్పం గడచిపోగా వాళ్లిద్దరూ ప్రాచీనులు మరియు లోకసాక్షీభూతులు. వాళ్లు వాళ్ల తేజస్సును సంక్షిప్త పరచుకుని లోకంలో ప్రతిష్ఠితులై ప్రకాశిస్తున్నారు. యోగపరాయణులైన వాళ్లు ఆత్మల్ని వాళ్లయందే ఆరోపించుకుని ప్రజల్ని, ధర్మాన్ని, కామాన్ని త్యజించి వైరాగ్యాన్ని పొందారు. ఆ సనాతుడు ఎలా పుట్టాడో అలాగే ఉన్నకారణంగా ఆతణ్ణి కుమారుడు అంటున్నారు. ఈ కారణం చేతనే ఆతడు సనత్కుమారుడుగా ప్రసిద్ధుడయ్యాడు.

**తతోఽభిధ్యాయతస్తస్య జజ్ఞిరే మానసాః ప్రజాః ॥195॥**

**తచ్ఛరీరసముత్పన్నైః కార్యైస్తైః కారణైః సహ ।**
**క్షేత్రజ్ఞాః సమవర్తంత గాత్రేభ్యస్తస్య ధీమతః ॥196॥**

**తతో దేవాసురపితౄన్ మానుషాంశ్చ చతుష్టయమ్ ।**
**సిసృక్షురంభాంస్యేతాని స్వమాత్మానమయూయుజత్ ॥197॥**

**తతస్తు యుంజతస్తస్య తమోమాత్ర సముద్భవమ్ ।**
**సమభిధ్యాయతః సర్గం ప్రయత్నేన ప్రజాపతేః ॥198॥**

**తతోఽస్య జఘనాత్పూర్వమసురా జజ్ఞిరే సుతాః ।**
**అసుః ప్రాణః స్మృతో విప్రాస్తజ్జన్మానస్తతోఽసురాః ॥199॥**

**యయా సృష్టాసురాః సర్వే తాం తనుం స వ్యపోహత ।**
**సాపవిద్ధా తనుస్తేన సద్యో రాత్రిరజాయత ॥200॥**

**సా తమో బహులా యస్మాత్తతో రాత్రిర్నియామకః ।**
**ఆవృతాస్తమసా రాత్రౌ ప్రజాస్తస్మాత్స్వపన్త్యుత ॥201॥**

తర్వాత ధ్యానిస్తున్న బ్రహ్మకు, మానసపుత్రులు కలిగారు. బుద్ధిమంతుడైన బ్రహ్మయొక్క దేహం నుంచి క్షేత్రజ్ఞులు జన్మించారు. తర్వాత దేవతల్ని, అసురుల్ని, పితరుల్ని, మనుష్యుల్ని, సృష్టించాలని బ్రహ్మ మనసులో అనుకొన్నాడు. పిదప సృష్టిపై ధ్యానం ఉంచగా తమస్సు ఏర్పడినది. అప్పుడాతడి పిక్కల నుంచి ప్రథమ సృష్టిగా అసురులు జన్మించారు. ఓ బ్రాహ్మణులారా! అసువు అనగా ప్రాణం. ఈ కారణంగా జన్మించారు కావున అసురులు అయ్యారు. ఏ శరీరం నుంచి అసురులందర్ని ఉత్పత్తి చేశాడో ఆ శరీరాన్ని విడిచి పెట్టాడు. విడిచిన తనువు వల్ల వెంటనే రాత్రి ఏర్పడింది. ఆ రాత్రి ఎక్కువ చీకటితో కూడి ఉంది. అందువల్ల రాత్రి నియామక అవుతున్నది (శయనింపజేసేది). ప్రజలు రాత్రులందు అంధకారంతో ఆవృతులవుతున్నారు. అందుచేత వారు నిద్రిస్తున్నారు.

**సృష్ట్వా సురాంస్తతః సో వై తనుమన్యామగృహ్ణత ।**
**అవ్యక్తాం సత్త్వబహులాం తతస్తాం సోఽభ్యపూజయత్ ॥202॥**

**తతస్తాం యుంజతస్తస్య ప్రియమాసీత్ప్రజాపతేః ।**
**తతో ముఖాత్సముత్పన్నా దీవ్యతస్తస్య దేవతాః ॥203॥**

**యతోఽస్య దీవ్యతో జాతాస్తేన దేవాః ప్రకీర్తితాః ।**
**ధాతుర్దివితి యః ప్రోక్తః క్రీడాయాం స విభావ్యతే ॥204॥**

**యస్మాత్తస్య తు దీవ్యంతో జజ్ఞిరే తేన దేవతాః ।**
**దేవాన్ సృష్ట్వాథ దేవేశస్తనుమన్యామపద్యత ॥205॥**

అసురుల్ని సృష్టించిన తర్వాత బ్రహ్మ అవ్యక్తమూ, సత్త్వాధికమూ అయిన మరో శరీరాన్ని ధరించాడు. అందుచేత ఆతడు ఆ శరీరాన్ని గౌరవించాడు. ఆ శరీరాన్ని ధరించిన బ్రహ్మ ప్రసన్నుడయ్యాడు. ప్రకాశిస్తున్న బ్రహ్మముఖం నుంచి దేవతలు పుట్టారు. ప్రకాశిస్తున్న (దీవ్య) బ్రహ్మ నుంచి కల్గినవారు కావున వారు దేవతలయ్యారు. 'దివ్' ధాతువు యొక్క అర్థం ప్రకాశం. బ్రహ్మ క్రీడిస్తుండగా పుట్టినవారు కావున దేవతలుగా చెప్పబడుతున్నారు. దేవతల్ని సృష్టించిన తర్వాత బ్రహ్మ మరొక తనువును పొందాడు.

**ఉత్సృష్టా సా తనుస్తేన సద్యోఽహః సమజాయత ।**
**తస్మాదహో ధర్మయుక్తం దేవతాః సముపాసతే ॥206॥**

**సత్త్వమాత్రాత్మికామేవ తతోఽన్యాం సోఽభ్యమన్యత ।**
**పితృవన్మన్యమానస్య పుత్రాంస్తాన్ ధ్యాయతః ప్రభో ॥207॥**

**పితరో హ్యుపపక్షాభ్యాం రాత్ర్యహ్నోరంతరేఽభవన్ ।**
**తస్మాత్తే పితరో దేవాః పితృత్వం తేన తేషు తత్ ॥208॥**

బ్రహ్మ ఆ శరీరంతో పగటిని నిర్మించాడు. అందుచేత దేవతలు ధర్మయుక్తమైన పగటిని ఉపాసిస్తున్నారు. సత్త్వగుణోపేతమైన ఈ శరీరాన్ని కూడా బ్రహ్మ గౌరవిస్తున్నాడు. తండ్రి మాదిరిగా చూడబడుతున్న బ్రహ్మ ఆ పుత్రులకై ధ్యానిస్తున్నాడు. అటువంటి బ్రహ్మ యొక్క రెండు పార్శ్వ (కుడి ఎడమ) భాగాల నుంచి దివారాత్రాల మధ్యలో పితరులు కలిగారు. ఈ కారణంగా వాళ్లు పితృదేవతలయ్యారు. వారిలో పితృత్వముంది.

**యయా సృష్టాస్తు పితరస్తనుం తాం స వ్యపోహత ।**
**సాపవిద్ధా తనుస్తేన సద్యః సంధ్యా వ్యజాయత ॥209॥**

**యస్మాదహర్దేవతానాం రాత్రిర్యా సాసురీ స్మృతా ।**
**తయోర్మధ్యే తు పైత్రీ యా తనుః సా తు గరీయసీ ॥210॥**

**తస్మాద్దేవాసురాః సర్వే ఋషయో మానవాస్తథా ।**
**ఉపాసంతే ముదాయుక్తా రాత్ర్యహ్నోర్మధ్యమాం తనుమ్ ॥211॥**

బ్రహ్మ ఏ శరీరంతో పితరుల సృష్టి చేశాడో ఆ శరీరాన్ని త్యజించాడు. విడిచిపెట్టిన ఆతనువు వల్ల వెంటనే సంధ్యాకాలం ఏర్పడింది. దేవతలకు పగలు, అసురులకు రాత్రి చెందినట్టివి. ఈ రెండికి మధ్యది పితరులకు చెందింది. అది అన్నిటికంటే శ్రేష్ఠమైనది. అందుచేతనే దేవతలు, అసురులు, ఋషులు, మానవులు ప్రసన్నాత్ములై రాత్రింబవళ్లకు మధ్యకాలాన్ని అనగా సంధ్యాకాలాన్ని ఉపాసిస్తున్నారు.

**తతో హ్యన్యాం పునర్బ్రహ్మా తనుంవై సమగృహ్ణత ।**
**రజోమాత్రాత్మికాయాం తు మనసా సోఽసృజత్ప్రభుః ॥212॥**

**రజఃప్రియాంస్తతః సోఽథ మానసానసృజత్సుతాన్ ।**
**మనస్వినస్తతస్తస్య మానవా జజ్ఞిరే సుతాః ॥213॥**

**సృష్ట్వా పునః ప్రజాశ్చాపి స్వాం తనుం తామపోహత ।**
**సాపవిద్ధా తనుస్తేన జ్యోత్స్నా సద్యస్త్వజాయత ॥214॥**

**యస్మాద్భవంతి సంహృష్టా జ్యోత్స్నాయా ఉద్భవే ప్రజాః ।**

తర్వాత బ్రహ్మదేవుడు మరో శరీరాన్ని ధరించాడు. ప్రభువైన బ్రహ్మదేవుడు రజోగుణమయమైన శరీరాన్ని మనసుతో సృష్టించాడు. తర్వాత ఆతడు రజోగుణప్రియులైన మానసపుత్రుల్ని సృష్టించాడు. అందువల్ల ఆయనకు మనస్వినులైన మానవపుత్రులు కలిగారు. ప్రజల్ని సృష్టించిన తర్వాత ఆ తన శరీరాన్ని త్యజించాడు. విడిచిన ఆ శరీరం వల్ల జ్యోత్స్న జనించింది. కలిగిన ఆ జ్యోత్స్న వల్ల ప్రజలు ప్రసన్నులవుతున్నారు.

**ఇత్యేతాస్తనవస్తేన హ్యపవిద్ధా మహాత్మనా ॥215॥**

**సద్యో రాత్ర్యహనీ చైవ సంధ్యా జ్యోత్స్నా చ జజ్ఞిరే ।**
**జ్యోత్స్నా సంధ్యా అహశ్చైవ సత్త్వమాత్రాత్మకం త్రయమ్ ॥216॥**

**తమోమాత్రాత్మికా రాత్రిః సావై తస్మాన్నిశాత్మికా ।**
**తస్మాదేవ దివా తన్వా తుష్ట్యా సృష్టా ముఖాస్తువై ॥217॥**

**యస్మాత్తేషాం దివా జన్మ బలినస్తేన వై దివా ।**
**తన్వా యయాసురాన్ రాత్రౌ జఘనాదసృజత్ప్రభుః ॥218॥**

**ప్రాణేభ్యో నిశిజన్మానో బలినో నిశి తేన తే ।**
**ఏతాన్యేవ భవిష్యాణాం దేవానామసురైః సహ ॥219॥**

**పితౄణాం మానవానాం చ అతీతా సంగతేషు వై ।**
**మన్వంతరేషు సర్వేషు నిమిత్తాని భవంతి హి ॥220॥**

**జ్యోత్స్నా రాత్ర్యహనీ సంధ్యా చత్వార్యంభాంసి తాని వై ।**
**భాంతి యస్మాత్తతోఽంభాంసి శబ్దోఽయం సుమనీషిభిః ॥221॥**

**భాతిర్దీప్తౌ నిగదితః పునశ్చాథ ప్రజాపతిః ।**
**సోఽంభాంస్యేతాని సృష్ట్వా తు దేవమానుషదానవాన్ ॥222॥**

**పితౄంశ్చైవాసృజత్తన్వా ఆత్మనా వివిధాన్ పునః ।**

ఈ విధంగా మహాత్ముడైన బ్రహ్మ త్యజించిన శరీరాలవల్ల వెంటనే రాత్రి, పగలు సంధ్య, జ్యోత్స్నలు ఉత్పన్నాలయ్యాయి. జ్యోత్స్న, సంధ్య, దినం అనే యీ మూడు సత్త్వగుణాత్మకాలు. రాత్రి తమోగుణాత్మకం. అందుచేత రాత్రి నిశాస్వరూపిణి అవుతున్నది. దేవతలు దినాత్మకమైన తనువువల్ల బ్రహ్మముఖం నుంచి సుఖపూర్వకంగా సృష్టింపబడ్డారు. అందువల్ల వాళ్ల జన్మ పగటియందు జరిగింది. అందుచేత వాళ్లు పగటియందు బలశాలులు. బ్రహ్మ తన శరీరమందలి జఘనాల నుంచి అసురుల్ని రాత్రియందు ఉత్పన్నుల్ని చేశాడు. అందువల్ల రాత్రివేళ జన్మించిన అసురులు రాత్రివేళ బలవంతులు. తర్వాత రానున్న అన్ని మన్వంతరాలలోనూ ఉండే దేవతల, అసురుల, పితరుల, మానవుల జన్మకారణాలు అవే అయి ఉంటాయి. జ్యోత్స్న, రాత్రి, దినం, సంధ్య అనే నాలుగు అంభస్స్వరూపాలు. అవి భాసిస్తున్నాయి కావున 'అంభస్" అవుతున్నాయి. విద్వాంసులు భా ధాతువునకు అర్థం 'దీప్తి' అని చెప్పారు. దాని నుంచి 'అంభ' శబ్దం ఉత్పన్నమైంది. బ్రహ్మ 'అంభస్'ను సృష్టించి కూడా మరల తన శరీరం నుంచి వివిధ దేవతల్ని, మనుష్యుల్ని, పితరుల్ని, అసురుల్ని సృష్టించాడు.

**తాముత్సృజ్య తనుం జ్యోత్స్నాం తతోఽన్యాం ప్రాప్య స ప్రభుః ॥223॥**

**మూర్తిం తమోరజః ప్రాయాం పునరేవాభ్యపూజయత్ ।**
**అంధకారే క్షుధావిష్టాంస్తతోఽన్యాన్ సోఽ సృజత్ప్రభుః ॥224॥**

**తేన సృష్టాః క్షుధాత్మానో అంభాంస్యాదాతుముద్యతాః ।**
**అంభాంస్యేతాని రక్షామ ఉక్తవంతస్తు తేషు యే ॥225॥**

**రాక్షసా నామ తే యస్మాత్ క్షుధావిష్టా నిశాచరాః ।**
**యేఽబ్రువన్యక్షమోఽంభాంసి తేషాం హృష్టాః పరస్పరమ్ ॥226॥**

**తేన తే కర్మణా యక్షా గుహ్యకా గూఢకర్మణా ।**

**రక్షేతి పాలనే చాపి ధాతురేష విభాష్యతే ॥227॥**

**ఏవం చ యక్షతిర్ధాతుర్భక్షణే స నిరుచ్యతే ।**

తర్వాత బ్రహ్మదేవుడు ఆ జ్యోత్స్నామయమైన శరీరాన్ని విడిచిపెట్టి తమోమయం మరియు రజోమయం శరీరాల్ని ధరించి వాటిని గౌరవించాడు. బ్రహ్మ అంధకారంలో ఆకలితో పీడింపబడే వేరే ప్రజల్ని సృష్టించాడు. ఆయన సృష్టించిన ఆ ఆకలితోకూడిన ప్రజలు అంభస్సును గ్రహించడానికి ఉద్యుక్తులయ్యారు. ఈ అంభస్సును మేము రక్షిస్తామని చెప్పినందువల్ల వారు రాక్షసులు అనే పేరుగలవారయ్యారు. వాళ్లు క్షుధా పీడితులు మరియు రాత్రించరులు. అంభస్సును భక్షిస్తున్న కారణంగా యక్షులు, గూఢకర్మకారణంగా గుహ్యకులు అవుతున్నారు. యక్షధాతువు పాలనం అనే అర్థం కలిగి ఉంది. ఈ కారణంగా 'యక్షతి' ధాతువు భక్షణార్థం కలదిగా చెప్పబడుతున్నది.

**తం దృష్ట్వా హ్యప్రియేణాస్య కేశాః శీర్ణాస్తు ధీమతః ॥228॥**

**తే శీర్ణాశ్చోత్థితా హ్యూర్ధ్వం తే చైవారురుధుః ప్రభుమ్ ।**
**హీనాస్తచ్ఛిరసో బాలా యస్మాచ్చైవావసర్పిణః ॥229॥**

**వ్యాలాత్మానః స్మృతా బాలా హీనత్వాదహయః స్మృతాః ।**
**పతత్వాత్పన్నగాశ్చైవ సర్పాశ్చైవావసర్పణాత్ ॥230॥**

**తస్య క్రోధోద్భవో యోఽసౌ అగ్నిగర్భః సుదారుణః ।**
**స తు సర్పాన్ సహోత్పన్నానావివేశ విషాత్మకః ॥231॥**

ఆ సృష్టిని చూచిన అప్రసన్నుడైన బ్రహ్మయొక్క కేశాలు శిథిలమయ్యాయి. ఆవిధంగా శిథిలమైన కేశాలు పైకిలేచి బ్రహ్మకు అవరోధం కలిగించాయి. అవి శిరస్సును హీనపరిచాయి. బ్రహ్మ శిరస్సునుండి శిరోజాలు ఊడిపోయి క్రిందపడ్డాయి. అవి సర్పరూపాలుగా మారాయి. శిరస్సును హీనంచేయడం వల్ల 'అహి'యని, రాలిపడిన కారణంగా 'పన్నగ'మని, ప్రాకడం వల్ల 'సర్ప'మని పాములు పిలవబడుతున్నాయి. వాటి యొక్క క్రోధం వల్ల ఉత్పన్నమైన మహాభయంకరమైన అగ్ని విషం అయ్యింది. అది సర్పాలలో ప్రవేశించడం చేత అవి విషంతో పాటు జన్మిస్తున్నాయి.

**సర్పాన్ సృష్ట్వా తతః క్రుద్ధః క్రోధాత్మానో వినిర్మమే ।**
**వర్ణేన కపిశేనోగ్రాస్తే భూతాః పిశితాశనాః ॥232॥**

**భూతత్వాత్తే స్మృతా భూతాః పిశాచాః పిశితాశనాత్ ।**
**ప్రసన్నం గాయతస్తస్య గంధర్వా జజ్ఞిరే యదా ॥233॥**

**ధయతీత్యేష వై ధాతుః గానత్వే పరిపఠ్యతే ।**
**ధయంతో జజ్ఞిరే వాచం గంధర్వాస్తేన తే స్మృతాః ॥234॥**

బ్రహ్మ సర్పాల్ని సృష్టించిన తర్వాత వాటిని గూర్చి కుపితుడయ్యాడు. అంతేకాక వాటికోసం క్రోధమయ స్వరూపాల్ని సృష్టించాడు. అవి కపిశవర్ణంతో (పసుపు మీరిన ఎరుపురంగుతో) మిక్కలి ఉగ్రంగా మాంసభక్షణ చేసే జీవులు. అవి భూతత్వం కలిగి ఉండడం చేత 'భూతాలు'గా మాంసభక్షణ కారణంగా 'పిశాచాలు'గా పిలువబడుతున్నాయి. ప్రసన్నతాపూర్వకమైన గానం చేస్తున్న బ్రహ్మనుంచి గంధర్వులు కలిగారు. 'ధయతి' అనే ఈ ధాతువు గానం అనే అర్థంలో ఉంది. వారు వాణీదేవిని గానం చేస్తూ పుట్టారు కావున గంధర్వులయ్యారు.

**అష్టస్వేతాసు సృష్టాసు దేవయోనిషు స ప్రభుః ।**
**తతః స్వచ్ఛందతోఽన్యాని వయాంసి వయసాసృజత్ ॥235॥**

**స్వచ్ఛందతః స్వచ్ఛందాంసి వయసా చ వయాంసి చ ।**
**పశూన్ సృష్ట్వా స దేవేశోఽసృజత్పక్షిగణానపి ॥236॥**

ఎనిమిది విధాలైన దేవయోనుల్ని సృష్టించిన తర్వాత బ్రహ్మ తన వయసుచేత స్వచ్ఛందంగా ఇతరాలైన పక్షుల్ని సృష్టించాడు. మరల అతడు స్వచ్ఛందంగా స్వేచ్ఛతో ఎగురగలిగిన పక్షి గణాల్ని సృష్టించాడు. ఈ విధంగా పశువుల్ని మరియు పక్షిసముదాయాన్ని సృష్టించాడు.

**ముఖతోఽజాః ససర్జాథ వక్షసశ్చావయోఽసృజత్ ।**
**గాశ్చైవాఽథోదరాద్ బ్రహ్మా పార్శ్వాభ్యాం చ వినిర్మమే ॥237॥**

**పద్భ్యాం చాశ్వాన్ సమాతంగాన్ రాసభానావయాన్ మృగాన్ ।**
**ఉష్ట్రానశ్వతరాంశ్చైవ తథాన్యాశ్చైవ జాతయః ॥238॥**

**ఓషధ్యః ఫలమూలిన్యో రోమభ్యస్తస్య జజ్ఞిరే ।**
**ఏవం పశ్వోషధీః సృష్ట్వా యూయుజత్సోఽధ్వరే ప్రభుః ॥239॥**

బ్రహ్మ తన ముఖము నుంచి మేకలను, వక్షము నుంచి గొఱ్ఱెల్ని ఉదరం నుంచి గోవుల్ని, పార్శ్వాల నుంచి వృషభాల్ని సృష్టించాడు. పాదాల నుంచి గుఱ్ఱాల్ని, ఏనుగుల్ని, గాడిదల్ని, మృగాల్ని, ఒంటెల్ని, చారగుఱ్ఱాల్ని, అట్లే వివిధాలైన వన్యమృగాల్ని సృష్టించాడు. ఆతడు తన రోమాల నుంచి ఫలవృక్షాల్ని, కందమూలాల్ని, ఓషధుల్ని సృష్టించాడు. ఈ విధంగా పశువుల్ని ఓషధుల్ని సృష్టించిన బ్రహ్మ యజ్ఞం చేయడంలో మునిగిపోయాడు.

**గౌరజః పురుషో మేషో హ్యశ్వోఽశ్వతరగర్దభౌ ।**
**ఏతాన్ గ్రామ్యాన్ పశూనాహురారణ్యాన్వై నిబోధత ॥240॥**

**శ్వాపదో ద్వీఖురో హస్తీ వానరాః పక్షిపంచమాః ।**
**ఆదకాః పశవః షష్ఠాః సప్తమాస్తు సరీసృపాః ॥241॥**

**మహిషా గవయాక్షాశ్చ ప్లవంగాః శరభా వృకాః ।**
**సింహాస్తు సప్తమస్తేషామారణ్యాః పశవః స్మృతాః ॥242॥**

గోవు, ఆవు, మనుష్యుడు, మేషం, అశ్వం, కంచరగాడిద, గాడిద ఇవి అన్నీ గ్రామ్యపశువులు. ఇక వన్యపశువుల్ని గూర్చి తెలియాలి. వేటకుక్కలు, రెండు గిట్టలు గల గవయమృగాలు, ఏనుగులు, వానరాలు, అయిదు పక్షులు, ఆరుమాంసాహారులైన పశువులు, ఏడు సరీసృపాలు. మహిషాలు, గవయమృగాలు, హరిణాలు, ప్లవంగాలు, శరభాలు, తోడేళ్లు ఏడవవి అయిన సింహాలు ఇవన్నీ వన్యమృగాలు.

**గాయత్రం చ ఋచం చైవ త్రివృత్సామ రథంతరమ్ ।**
**అగ్నిష్టోమం చ యజ్ఞానాం నిర్మమే ప్రథమాన్ముఖాత్ ॥243॥**

**యజూంషి త్రైష్టుభం ఛందస్తోమం పంచదశం తథా ।**
**బృహత్సామ తథోక్థ్యం చ దక్షిణాదసృజన్ముఖాత్ ॥244॥**

**సామాని జగతీచ్ఛందస్తోమం సప్తదశం తథా ।**
**వైరూపమతిరాత్రం చ పశ్చిమాదసృజన్ముఖాత్ ॥245॥**

**ఏకవింశమథర్వాణమాప్తోర్యామాణమేవ చ।**
**అనుష్టుభం సవైరాజముత్తరాదసృజన్ముఖాత్ ॥246॥**

**విద్యుతోశనిమేఘాంశ్చ రోహితేంద్రధనూంషి చ ।**
**తేజాంసి చ ససర్జాదౌ కల్పస్య భగవాన్ ప్రభుః ॥247॥**

**ఉచ్చావచాని భూతాని గాత్రేభ్యస్తస్య జజ్ఞిరే ।**
**బ్రహ్మణస్తు ప్రజాసర్గం సృజతో హి ప్రజాపతేః ॥248॥**

బ్రహ్మయొక్క ప్రథమముఖం నుంచి అనగా తూర్పుముఖం నుంచి గాయత్రీచ్ఛందం, ఋగ్వేదం, త్రివృత్‌సామం, రథంతరసామం అట్లే యజ్ఞాలలో ముఖ్యమైన అగ్నిష్టోమాన్ని సృష్టించాడు. ఆయన దక్షిణముఖం నుంచి యజుర్వేదం, త్రిష్టుప్‌ఛందం, పంచదశావృతసామం, బృహత్సామం, ఉక్థ్యం (సోమయాగానంతరం చేయవలసిన ఆరుయాగాలలో ఒకటి, దానికి సంబంధించిన పాత్ర సామగ్రిలో ఒకటి) – వీటిని సృష్టించాడు. పడమటి ముఖం నుంచి సామవేదం, జగతీచ్ఛందం, సప్తదశావృతస్తోమం, వైరూపసామం అట్లే అతిరాత్రమనే యజ్ఞాన్ని సృష్టించాడు. ఉత్తరముఖం నుంచి ఇరవై ఒకటి అథర్వవేద ప్రార్థనామంత్రాలు, ఆప్తోర్యామాణం, అనుష్టుప్‌ఛందం అట్లే వైరాజఛందాన్ని సృష్టించాడు. బ్రహ్మదేవుడు కల్పప్రారంభంలో విద్యుత్తు (మెరుపు), వజ్రం (పిడుగు) మేఘం, రోహితవర్ణం గల ఇంద్రధనుస్సు అట్లే కాంతి (తేజస్సు)ను సృష్టించాడు. ప్రజల్ని సృష్టిస్తున్న ప్రజాపతియైన బ్రహ్మ అంగాల నుంచి ఉన్నతాలు మరియు నిమ్నాలు అయిన ప్రాణులు పుట్టాయి.

**సృష్ట్వా చతుష్టయం పూర్వం దేవాసురనరాన్ పితౄన్ ।**
**తతోఽసృజత్స భూతాని స్థావరాణి చరాణి చ ॥249॥**

**యక్షాన్ పిశాచాన్ గంధర్వాంస్తథైవాప్సరసాం గణాన్ ।**
**నరకిన్నరరక్షాంసి వయః పశుమృగోరగాన్ ॥250॥**

**అవ్యయం చ వ్యయం చాపి యదిదం స్థాణుసంగమమ్ ।**
**తేషాం వై యాని కర్మాణి ప్రాక్‌సృష్ట్యాం ప్రతిపేదిరే ॥251॥**

**తాన్యేవ ప్రతిపద్యంతే సృజ్యమానాః పునః పునః ।**
**హింస్రాహింస్రే మృదుక్రూరే ధర్మాధర్మే నృతానృతే ॥252॥**

**తద్భావితాః ప్రపద్యంతే తస్మాత్తత్తస్య రోచతే ।**
**మహాభూతేషు సృష్టేషు ఇంద్రియార్థేషు మూర్తిషు ॥253॥**

**వినియోగంచ భూతానాం ధాతైవ వ్యదధాత్స్వయమ్ ।**

ముందుగా దేవతల్ని, అసురుల్ని, మనుష్యుల్ని అట్లే పితరుల్ని – ఈ నాలుగు విధాల వార్ని సృష్టించిన తర్వాత స్థావరజంగమభూతాల్ని సృష్టించాడు. యక్షులు, పిశాచులు, గంధర్వులు, అప్సరసగణాలు, మనుష్యులు, కిన్నరులు, రాక్షసులు, పక్షులు, పశువులు, మృగాలు, సర్పాలు అట్లే అవ్యయాలు, వ్యయాలు – అన్ని స్థావర

జంగమాలు – వీటి అన్నింటిని బ్రహ్మ సృష్టించాడు. పూర్వసృష్టిలో అవి ఏయే కర్మలు కలిగి ఉన్నాయో మాటిమాటికి ఆయా కర్మలనే పొందుతాయి. అవి తమకు అనుకూలంగా హింసాహింసల్ని, మృదుత్వాన్ని – క్రౌర్యాన్ని, ధర్మాధర్మాల్ని, సత్యాసత్యాల్ని ప్రాప్తిస్తూ ఉంటాయి. ఈ కారణంగా అవి ఆనందానుభవాన్ని పొందుతున్నాయి. మహాభూతాలయొక్క ఇంద్రియ విషయంలోను, వాటి రూపాలు విషయంలోనూ సృష్టికర్త అయిన బ్రహ్మ ప్రవర్తిస్తాడు.

**కేచిత్పురుషకారం తు ప్రాహుః కర్మ సుమానవాః ॥254॥**

**దైవమిత్యపరే విప్రాః స్వభావం భూతచింతకాః ।**
**పౌరుషం కర్మదైవం చ ఫలవృత్తిస్వభావతః ॥255॥**

**న చైకం న పృథగ్భావమధికం న తతో విదుః ।**
**ఏతదేవం చ నైకం చ నామభేదేన నాప్యుభే ॥256॥**

**కర్మస్థా విషమం బ్రూయుః సత్త్వస్థాః సమదర్శనాః ।**

కొందరు మనుష్యులు జరుగుతున్న సంఘటనలకు వారి వారి పురుషకారమే కారణం అంటున్నారు. మరి కొందరు ఉత్తమమానవులు వారి వారి కర్మలే ఇందుకు కారణమంటున్నారు. ఓ విప్రులారా! మరికొందరు దైవమే కారణమంటున్నారు. మరికొందరు తత్త్వచింతనులు (భౌతిక వాదులు) వారి స్వభావమే అందుకు కారణమంటున్నారు. ఈ విధంగా కర్మ, దైవం, స్వభావం అనేవి ప్రవర్తమాన సంఘటనలకు కారణాంగాలుగా పరిగణింపబడ్డాయి. కర్మమార్గాన్ని అనుసరించేవారు జగత్తుయొక్క విషమత్వానికి కారణం ఇంతకు ముందు చెప్పిన కారణాలలో ఏ ఒక్కటీ మాత్రమే కాదనియు వాటి సమూహం అనగా వాటి యొక్క సమష్టిరూపం కారణమని తలుస్తున్నారు. ఎవ్వరు కూడా ఈ కారణాలకంటే వేరైన సకలనియంతయైన పరమేశ్వరుణ్ణి కారణంగా తెలియడం లేదు. సత్త్వగుణయుక్తులు, సమదర్శులు అయిన మానవులు జగత్తు మాయామయం కావడానికి కారణం ఆ నాల్గుకారణాలు అని, అవి నామభేదాలతో ఒకటి మరొక దానికి వేరైనది కాదని చెబుతున్నారు.

**నామ రూపం చ భూతానాం కృతానాం చ ప్రపంచనమ్ ॥257॥**

**వేదశబ్దేభ్య ఏవాదౌ నిర్మమే స మహేశ్వరః ।**
**ఋషీణాం నామధేయాని యాశ్చ వేదేషు వృత్తయః ॥258॥**

**శర్వర్యంతే ప్రసూతానాం తాన్యేవైభ్యో దదాత్యజః ।**
**ఏవం విధాః సృష్టయస్తు బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ॥259॥**

**శర్వర్యంతే ప్రదృశ్యంతే సిద్ధిమాశ్రిత్య మానసీమ్ ।**
**ఏవం భూతాని సృష్టాని స్థావరాణి చరాణి చ ॥260॥**

మహేశ్వరరూపుడైన బ్రహ్మ పూర్వకల్పాలలో ఈ విశ్వం యొక్క సృష్ట్యాదిలో భూతాలకు వేదానికి చెందిన శబ్దాలతోనే పేర్లు, రూపాలు కల్పించాడు. రాత్రి గడిచి పోగా అనగా ప్రళయం పూర్తికాగా జన్మించిన ఋషుల పేర్లు, వృత్తులు వేదాలలోనే ఉన్నాయి. వాటిని వారందరికి అప్పగిస్తున్నాడు. అవ్యక్తజన్ముడైన బ్రహ్మ కూడా ఈ

ప్రకారమైన సృష్టే చేస్తాడు. రాత్రి ముగిసినది కాగా బ్రహ్మ మానసిక సిద్ధిని పొంది స్థావరజంగమ ప్రాణుల్ని సృష్టించాడు.

**యదాస్య తాః ప్రజాః సృష్టా న వ్యవర్ధంత సత్తమాః ।**
**తమో మాత్రావృతో బ్రహ్మా తదా శోకేన దుఃఖితః ॥261॥**

**తతః స విదధే బుద్ధిమర్థనిశ్చయగామినీమ్ ।**
**అథాత్మని సమద్రాక్షీత్తమోమాత్రాం నియామికామ్ ॥262॥**

**రజః సత్త్వం పరిత్యజ్య వర్తమానాం స్వధర్మతః ।**
**తతః స తేన దుఃఖేన దుఃఖం చక్రే జగత్పతిః ॥263॥**

ఓ ఉత్తమ ఋషులారా! బ్రహ్మ సృష్టించిన ఆ ప్రజలకు వృద్ధి కలగలేదు. అప్పుడు తమోగుణావృతుడైన ఆతడు శోకార్తుడయ్యాడు. తర్వాత ఆతడు అర్థనిశ్చయకారిణి అయిన బుద్ధిని నిశ్చితపర్చుకున్నాడు. సత్త్వరజోగుణాల్ని పరిత్యజించాడు. తమోమాత్రాత్మకంగా బుద్ధిని నియమించుకుని జగత్పతి బ్రహ్మ అధికంగా దుఃఖించాడు.

**తమశ్చ వ్యనుదత్పశ్చాద్రజః సత్త్వం తమావృణోత్ ।**
**తత్తమః ప్రతినున్నం వై మిథునం సమజాయత ॥264॥**

తర్వాత ఆతడు తమోగుణాన్ని ప్రేరేపించాడు. ఆ తమోగుణంతో రజోగుణం, సత్త్వగుణం ఆవరింపబడ్డాయి. ఈ విధంగా ప్రేరేపింపబడిన ఆ తమోగుణం రెండు రూపాలు పొందింది.

**అధర్మస్తమసో జజ్ఞే హింసాశోకాదజాయత ।**
**తతస్తస్మిన్ సముద్భూతే మిథునే దారుణాత్మికే ॥265॥**

**గతాసుర్భగవానాసీత్ప్రీతిశ్చైనమశిశ్రియత్ ।**
**స్వాం తనుం స తతో బ్రహ్మా తామపోహత భాస్వరమ్ ॥266॥**

**ద్విధా కృత్వా స్వకం దేహమర్ధేన పురుషోఽభవత్ ।**
**అర్ధేన నారీ సా తస్య శతరూపా వ్యజాయత ॥267॥**

**ప్రకృతిం భూతధాత్రీం తాం కామాద్వై సృష్టవాన్ ప్రభుః ।**
**సా దివం పృథివీం చైవ మహిమ్నా వ్యాప్యధిష్ఠితా ॥268॥**

**బ్రహ్మణః సా తనుః పూర్వా దివమావృత్య తిష్ఠతి ।**
**యా త్వర్ధాత్సృజతో నారీ శతరూపా వ్యజాయత ॥269॥**

**సా దేవీ నియుతం తప్త్వా తపః పరమదుశ్చరమ్ ।**
**భర్తారం దీప్తయశసం పురుషం ప్రత్యపద్యత ॥270॥**

తమస్సు వల్ల అధర్మం, శోకం వల్ల హింస పుట్టినాయి. భయానకరూపాలుగల ఆ అధర్మహింసల జంట పుట్టగానే బ్రహ్మభగవానుడు మృతప్రాయుడై తిరిగి ప్రసన్నుడయ్యాడు. అనంతరం తన ప్రకాశవంతమైన శరీరాన్ని

కనబడకుండా చేసుకొని రెండుగా విభజించుకున్నాడు. సగం శరీరం నుంచి పురుషుడు కలిగాడు. మరో సగం నుంచి స్త్రీ కలిగింది. ఆమె శతరూప. సర్వప్రాణులకు మాతృమూర్తి అయిన ప్రకృతిని బ్రహ్మ ప్రేమతో సృష్టించాడు. ఆ ప్రకృతి తన శక్తితో భూమిని, స్వర్గాన్ని అధిష్ఠించింది. బ్రహ్మ యొక్క పూర్వశరీరం స్వర్గాన్ని ఆవరించింది. బ్రహ్మ యొక్క ఆ రెండో శరీరం వల్ల శతరూప అనే స్త్రీ పుట్టింది. ఆమె పది లక్షల సంవత్సరాలు తపస్సు చేసి కీర్తిమంతుడైన పురుషుణ్ణి వివాహమాడింది.

**స వై స్వాయంభువః పూర్వం పురుషో మనురుచ్యతే ।**
**తస్యైవ సప్తతియుగం మన్వంతరమిహోచ్యతే ॥271॥**

**లేభే స పురుషః పత్నీం శతరూపామయోనిజామ్ ।**
**తయా సార్ధం స రమతే తస్మాత్సా రతిరుచ్యతే ॥272॥**

**ప్రథమః సంప్రయోగాత్మా కల్పాదౌ సమపద్యత ।**
**విరాజమసృజద్ బ్రహ్మే సోఽభవత్పురుషో విరాట్ ॥273॥**

**సమ్రాట్ శతరూపా వై వైరాజః స మనుః స్మృతః ।**
**స వైరాజః ప్రజాసర్గం ససర్జ పురుషో మనుః ॥274॥**

**వైరాజాత్పురుషాద్వీరాచ్ఛతరూపా వ్యజాయత ।**
**ప్రియవ్రతోత్తానపాదౌ పుత్రౌ ద్వౌ లోకసమ్మతౌ ॥275॥**

**కన్యే ద్వే చ మహాభాగే యాభ్యాం జాతా ఇమాః ప్రజాః ।**
**దేవీ నామ తథాకూతిః ప్రసూతిశ్చైవ తే ఉభే ॥276॥**

ఆ పూర్వపురుషుణ్ణి స్వాయంభువమనువుగా చెబుతున్నారు. ఆయనకు నాల్గుయుగాలు డెబ్బదిమార్లు మన్వంతరాలు జరిగాయి. ఈ పురుషుడు అయోనిజ అయిన శతరూపను భార్యగా పొందాడు. ఆమె ఆయనతో కలిసి రమిస్తున్నది. అందుచేతనే ఆమె 'రతి' అని పిలువబడుతున్నది. కల్పాదిలో ప్రథమ సమాగమం జరిగింది. బ్రహ్మ విరాటుణ్ణి సృష్టించాడు. ఆతడే విరాట్పురుషుడయ్యాడు. శతరూప మరియు విరాట్పుత్రుడు మనువును సమ్రాట్టు అన్నారు. ఆ విరాట్పుత్రుడు మనువును ప్రజలను సృష్టించాడు. శతరూప వీరుడైన విరాటపుత్రుడి వల్ల (వైరాజు) ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే లోకమాన్యులైన ఇద్దరు పుత్రుల్ని కన్నది. ఆమె మహాభాగ్యశాలినులైన ఇద్దరు పుత్రికల్ని కూడా కన్నది. వారి వల్లే ప్రజలు కలిగారు. ఇద్దరి పేర్లు ఆకూతి మరియు ప్రసూతి.

**స్వాయంభువః ప్రసూతిం తు దక్షాయ ప్రదదౌ ప్రభుః ।**
**ప్రాణో దక్ష ఇతి జ్ఞేయః సంకల్పో మనురుచ్యతే ॥277॥**

**రుచేః ప్రజాపతేః సోఽథ ఆకూతిం ప్రత్యపాదయత్ ।**
**ఆకూత్యాం మిథునం జజ్ఞే మానసస్య రుచేః శుభమ్ ॥278॥**

**యజ్ఞశ్చ దక్షిణా చైవ యమలౌ సంబభూవతుః ।**
**యజ్ఞస్య దక్షిణాయాం తు పుత్రా ద్వాదశ జజ్ఞిరే ॥279॥**

**యామా ఇతి సమాఖ్యాతా దేవాః స్వాయంభువేఽ౨ంతరే ।**
**ఏతస్య పుత్రా యజ్ఞస్య తస్మాద్యామాశ్చ తే స్మృతాః ॥280॥**

**అజితశ్చైవ శుక్రశ్చ గణౌ ద్వౌ బ్రహ్మణా కృతౌ ।**
**యామాః పూర్వం ప్రజాతా యే తేఽ౨భవంస్తు దివౌకసః ॥281॥**

ప్రభువైన స్వాయంభువమనువు ప్రసూతిని దక్షునకిచ్చి వివాహం చేశాడు. దక్షుడు 'ప్రాణం' అనే పేరుతో కూడా గుర్తింపబడ్డాడు. సంకల్పమనువు అని కూడా అంటారు. ఆకూతిని రుచి అనే ప్రజాపతికి ఇచ్చాడు. బ్రహ్మమానసపుత్రుడైన రుచికి ఆకూతివల్ల కవలలు కలిగారు. వాళ్లు యజ్ఞుడు మరియు దక్షిణలు. దక్షిణకు యజ్ఞుడివల్ల పంద్రెండుగురు పుత్రులు కలిగారు. వాళ్లు దేవగణాలు. స్వాయంభువమన్వంతరంలో వాళ్లు 'యామ్' అనే పేరుతో ప్రసిద్ధులయ్యారు. వాళ్లు యజ్ఞుడి పుత్రులవడం వల్ల 'యాము'లయ్యారు. బ్రహ్మదేవుడు అజితులు, శుక్రులు అనే రెండు గణాల్ని సృష్టించాడు. ఇంతకుముందే పుట్టిన 'యాములు' దేవతలయ్యారు.

**స్వాయంభువసుతాయాం తు ప్రసూత్యాం లోకమాతరః ।**
**తస్యాం కన్యాశ్చతుర్వింశద్దక్షస్త్వజనయత్ప్రభుః ॥282॥**

స్వాయంభువమనువు యొక్క కుమార్తె అయిన ప్రసూతి యందు దక్షుడు ఇరవై నలుగురు పుత్రికల్ని పొందాడు. వాళ్లు లోకమాతలు.

**సర్వాస్తాశ్చ మహాభాగాః సర్వాః కమలలోచనాః ।**
**భోగవత్యశ్చ తాః సర్వాః సర్వాస్తా యోగమాతరః ॥283॥**

వాళ్లు అందరూ మహాభాగ్యశాలినులు. పద్మనయనలు. భోగవతులు. యోగమాతలు.

**సర్వాశ్చ బ్రహ్మవాదిన్యః సర్వా విశ్వస్య మాతరః ।**
**శ్రద్ధా లక్ష్మీర్ధృతిస్తుష్టిః పుష్టిర్మేధా క్రియా తథా ॥284॥**

**బుద్ధిర్లజ్జా వపుః శాంతిః సిద్ధిః కీర్తిస్త్రయోదశ ।**
**పత్న్యర్థం ప్రతిజగ్రాహ ధర్మో దాక్షాయణీః ప్రభుః ॥285॥**

**దారాణ్యేతాని వై తస్య విహితాని స్వయంభువా ।**
**తాభ్యః శిష్టా యవీయస్య ఏకాదశ సులోచనాః ॥286॥**

**సతీ ఖ్యాత్యథ సంభూతిః స్మృతిః ప్రీతిః క్షమా తథా ।**
**సంనతిశ్చానసూయా చ ఊర్జా స్వాహా స్వధా తథా ॥287॥**

**తాస్తథా ప్రత్యపద్యంత పునరన్యే మహర్షయః ।**
**రుద్రో భృగుర్మరీచిశ్చ అంగిరా పులహః క్రతుః ॥288॥**

**పులస్త్యోఽ౨త్రిర్వసిష్ఠశ్చ పితరోఽ౨గ్ని స్తథైవ చ ।**

వాళ్లు అందరూ బ్రహ్మవాదినులు. అందరూ విశ్వమాతలు. వారిలో శ్రద్ధ, లక్ష్మి, ధృతి, తుష్టి, పుష్టి, మేధ, క్రియ, బుద్ధి, లజ్జ, వపువు, శాంతి, సిద్ధి, కీర్తి అనే పదమూడు మందిని ధర్ముడు భార్యలుగా పొందాడు. స్వాయంభువుడు వీరినందర్నీ ధర్ముడికి భార్యలుగా చేశాడు. మిగిలిన పదకొండుమంది చిన్నవారు అందరూ సుందరనేత్రలు. సతి, ఖ్యాతి, సంభూతి, ప్రీతి, క్షమ, సన్నతి, అనసూయ, ఊర్జ, స్వాహ, స్వధ అనే వార్ని ఇతర ఋషులకిచ్చాడు. ఆ ఋషులు. రుద్రుడు, భృగువు, మరీచి, అంగిరసుడు, పులహుడు, క్రతువు, పులస్త్యుడు, అత్రి, వసిష్ఠుడు, పితరుడు, అగ్ని అని చెబుతారు.

**సతీం భవాయ ప్రాయచ్ఛత్ ఖ్యాతించ భృగవే తతః ॥289॥**

**మరీచయే చ సంభూతిం స్మృతిమంగిరసే దదౌ ।**
**ప్రీతించైవ పులస్త్యాయ క్షమాం వై పులహాయ చ ॥290॥**

**క్రతవే సన్నితిం నామ అనసూయాం తథాత్రయే ।**
**ఊర్జాం దదౌ వసిష్ఠాయ స్వాహామగ్నయే దదౌ ॥291॥**

**స్వధాం చైవ పితృభ్యస్తు తాస్వపత్యాని బోధత ।**

శివుడికి సతీదేవిని ఇచ్చాడు. ఖ్యాతిని భృగువుకు, సంభూతిని మరీచికి, అంగిరసుడికి స్మృతిని ఇచ్చాడు. పులస్త్యుడికి ప్రీతిని, పులహుడికి క్షమను, క్రతువుకు సన్నితిని, అనసూయను అత్రికి భార్యల్ని చేశాడు. ఊర్జను వసిష్ఠుడికి, స్వాహాను అగ్నికి, స్వధాను పితరుడికి అర్పించాడు. వీరికి కల్గిన సంతానాన్ని గూర్చి తెలియాలి.

**ఏతాః సర్వా మహాభాగాః ప్రజాస్వనుసృతాః స్థితాః ॥292॥**

**మన్వంతరేషు సర్వేషు యావదాభూతసంప్లవమ్ ।**
**శ్రద్ధా కామం విజజ్ఞే వై దర్పో లక్ష్మీసుతః స్మృతః ॥293॥**

**ధృత్యాస్తు నియమః పుత్రస్తుష్ట్యాః సంతోష ఏవ చ ।**
**పుష్ట్యా లోభః సుతశ్చాపి మేధాపుత్రః శ్రుతస్తథా ॥294॥**

**క్రియాయామభవత్పుత్రో దండః సమయ ఏవ చ ।**
**బుద్ధ్యాం బోధః సుతస్తద్వత్ప్రమాదోఽప్యపజాయత ॥295॥**

**లజ్జాయాం వినయః పుత్రో వ్యవసాయో వసోః సుతః ।**
**క్షేమః శాంతిసుతశ్చాపి సుఖం సిద్ధేర్వ్యజాయత ॥296॥**

**యశః కీర్తిసుతశ్చాపి ఇత్యేతే ధర్మసూనవః ।**
**కామస్య హర్షః పుత్రో వై దేవ్యాం ప్రీత్యాం వ్యజాయత ॥297॥**

**ఇత్యేష వై సుతోదర్కః సర్గో ధర్మస్య కీర్తితః ।**

ఈ మహాసౌభాగ్యవతులందరూ అన్ని మన్వంతరాలలోనూ ప్రళయకాలం వరకూ సంతానాన్ని పొందారు. శ్రద్ధ కాముణ్ణి కన్నది. దర్పుడు లక్ష్మి యొక్క పుత్రుడు. నియముడు ధృతి యొక్క కుమారుడు. సంతోషుడు తుష్టి యొక్క సుతుడు. పుష్టి యొక్క పుత్రుడు లోభుడు. శ్రుతుడు మేధ యొక్క కుమారుడు. క్రియకు దండుడు మరియు సమయుడు అనే యిద్దరు పుత్రులు కలిగారు. బుద్ధికి బోధుడు మరియు ప్రమాదుడు అనే బిడ్డలిద్దరు పుట్టారు. లజ్జకు వినయుడు కలిగాడు. వసువు యొక్క పుత్రుడు వ్యవసాయుడు. శాంతి పుత్రుడు క్షేముడు. సిద్ధికి సుఖుడనే సుతుడు కలిగాడు. కీర్తి యొక్క పుత్రుడు యశుడు. వీరందరూ ధర్ముడి కుమారులు. కాముడికి భార్య ప్రీతి వలన హర్షుడు కలిగాడు. ధర్ముడు ఈ విధంగా పుత్రోదయాన్ని పొందాడు.

**జజ్ఞే హింసా త్వధర్మాద్వై నికృతిం చానృతం సుతమ్ ॥298॥**

**నికృత్యాం తు ద్వయం జజ్ఞే భయం నరక ఏవ చ ।**
**మాయా చ వేదనా చాపి మిథునద్వయమేతయోః ॥299॥**

**భూయో జజ్ఞేఽథ వై మాయా మృత్యుం భూతాపహారిణమ్ ।**
**వేదనాయాః సుతశ్చాపి దుఃఖం జజ్ఞే చ రౌరవః ॥300॥**

**మృత్యోర్వ్యాధిజరాశోకక్రోధాసూయాశ్చ జజ్ఞిరే ।**
**దుఃఖోత్తరాః సుతాహ్యేతే సర్వే చాధర్మలక్షణాః ॥301॥**

**నైషాం భార్యాస్తు పుత్రాశ్చ సర్వే హ్యేతే పరిగ్రహాః ।**
**ఇత్యేష తామసః సర్గో జజ్ఞే ధర్మనియామకః ॥302॥**

హింస అధర్మం వల్ల నికృతి మరియు అనృతులనే పుత్రుల్ని కన్నాడు. నికృతికి భయం, నరకం అనే యిద్దరు పుత్రులు కలిగారు. వారికి మాయ మరియు వేదన అనే కవలలు కలిగారు. మాయ ప్రాణహర్త అయిన మృత్యువును కన్నది. వేదన రౌరవుడి వల్ల దుఃఖం అనే పుత్రుణ్ణి కన్నది. మృత్యువు వలన వ్యాధి, జర, శోకం, క్రోధం, అసూయ అనేవారు కలిగారు. ఒకరి తర్వాత ఒకరు దుఃఖకారకులైన వీరందరూ అధర్మలక్షణాల్ని కల్గి యున్నారు. వీరికి భార్యలు లేరు, బిడ్డలు లేరు. వీళ్లంతా నియమం కలిగినవారు. ఈ విధంగా ధర్మనియామకమైన తామససృష్టి ఏర్పడింది.

**ప్రజాః సృజేతి వ్యాదిష్టో బ్రహ్మణా నీలలోహితః ।**
**సోఽభిధ్యాయ సతీం భార్యాం నిర్మమే హ్యాత్మసంభవాన్ ॥303॥**

**నాధికాన్న చ హీనాంస్తాన్ మానసానాత్మనః సమాన్ ।**
**సహస్రం హి సహస్రాణాం సోఽసృజత్కృత్తివాససః ॥304॥**

**తుల్యానేవాత్మనః సర్వాన్ రూపతేజోబలశ్రుతైః ।**
**పింగళాన్ సనిషంగాంశ్చ సకపర్దాన్ సలోహితాన్ ॥305॥**

**విశిష్టాన్ హరికేశాంశ్చ దృష్టిఘ్నాంశ్చ కపాలినః ।**
**మహారూపాన్ విరూపాంశ్చ విశ్వరూపాన్ స్వరూపిణః ॥306॥**

**రథినశ్చర్మిణశ్చైవ వర్మిణశ్చ వరూథినః ।**
**సహస్రశతబాహూంశ్చ దివ్యాన్ భౌమాంతరిక్షగాన్ ॥307॥**
**స్థూలశీర్షానష్టదంష్ట్రాన్ద్విజిహ్వాంస్త్రాంస్త్రిలోచనాన్ ।**
**అన్నాదాన్ పిశితాశాంశ్చ ఆజ్యపాన్ సోమపానపి ॥308॥**
**మీఢుషోஉతికపాలాశ్చ శితికంఠోర్ధ్వరేతసః ।**
**హవ్యాదాన్ శ్రుతధర్మాంశ్చ ధర్మిణో హ్యథ బర్హిణః ॥309॥**
**ఆసీనాన్ ధావతశ్చైవ పంచభూతాన్ సహస్రశః ।**
**అధ్యాపినోஉధ్యాయినశ్చ జపతో యుంజతస్తథా ॥310॥**
**ధూమవంతో జ్వలంతశ్చ నదీమంతోஉతిదీప్తినః ।**
**వృద్ధాన్ బుద్ధిమతశ్చైవ బ్రహ్మిష్ఠాన్ శుభదర్శనాన్ ॥311॥**
**నీలగ్రీవాన్ సహస్రాక్షాన్ సర్వాంశ్చాథ క్షమాకరాన్ ।**
**అదృశ్యాన్ సర్వభూతానాం మహాయోగాన్ మహౌజసః ॥312॥**
**భ్రమంతోஉభిద్రవంతశ్చ ప్లవంతశ్చ సహస్రశః ।**
**అయాతయామానసృజద్రుద్రానేతాన్ సురోత్తమాన్ ॥313॥**

బ్రహ్మదేవుడు నీలలోహితుడైన శివుడితో పలికాడు. సంతాన సృష్టి చేయండి! అని. అతడు భార్య అయిన సతీదేవిని ధ్యానిస్తూ పుత్రుల్ని సృష్టించాడు. కాగా శివుడు మిక్కిలి ఎక్కువ కాకుండా మరీ తక్కువ కాకుండా మధ్యస్థంగా బిడ్డల్ని తనతో సమానమైన వార్ని పొందాడు. వ్యాఘ్రచర్మాన్ని ధరించినవాళ్లు. రూపంలోను తేజస్సులోనూ బలజ్ఞానాలలో తనతో సమానులు. పింగళవర్ణులు. నిషంగధారులు (కత్తి– ఆయుధం) జటాజూటం కలవారు. లోహితవర్ణులు. విశిష్టులు. హరితకేశాలు గలవారు. దృష్టితోనే నశింపజేయువారు. కపాలాల్ని ధరించినవారు. విశాలరూపులు. వికృతరూపులు. విశ్వరూపులు. స్వరూపవంతులు. రథారూఢులు. డాలు, కవచం ధరించినవారు. సైన్యం గలవారు. లక్షబాహువులు గలవారు. దివ్యులు. భూమ్యాకాశాలలో చరించువారు. స్థూలశిరసులుగలవారు. ఎనిమిది దంష్ట్రలు గలవారు. రెండు నాల్కలు గలవారు. ముక్కంటులు. అన్నాన్ని తినేవారు. మాంసభక్షకులు. ఘృతాన్ని త్రాగేవారు. సోమపానం చేసేవారు. సుందరాకారులు. పెద్ద పెద్ద కపాలధారులు. నీలకంఠులు. బ్రహ్మచారులు. హవిస్సును స్వీకరించేవారు. వేదపారాయణులు. ధార్మికులు. నెమలి పింఛాన్ని ధరించి శోభిల్లేవారు. కూర్చున్నవారు. పరుగెత్తెడివారు. పంచభూతాత్మకులు. అధ్యాపకులు. అధ్యయనకారులు. జపించువారు. యోగాభ్యాసులు. ధూమయుక్తులు. ప్రకాశవంతులు. గంగాధరులు. మిక్కిలి కాంతిమంతులు. పెద్దలు. బుద్ధిమంతులు. బ్రహ్మిష్ఠులు. శుభదర్శనులు. నీలగ్రీవులు (కంఠులు) సహస్రాక్షులు. క్షమానిధులు. సర్వభూతాలలోనూ అదృశ్యులై ఉండువారు. మహాయోగులు. మహాతేజస్వులు. భ్రమణశీలురు. పరుగెత్తెడివారు. అటు ఇటూ తిరుగువారు. దుముకెడివారు. అయాతయాములు. సురశ్రేష్ఠులైన వేలకొలది రుద్రుల్ని శివుడు సృష్టించాడు.

**బ్రహ్మా దృష్ట్వాబ్రవీదేనం మాస్రాక్షీరీదృశీః ప్రజాః ।**
**స్రష్టవ్యా నాత్మనస్తుల్యాః ప్రజా దేవ నమోఽస్తు తే ॥314॥**

**అన్యాః సృజ త్వం భద్రం తే ప్రజా వై మృత్యుసంయుతాః ।**
**నారప్స్యంతే హి కర్మాణి ప్రజా విగతమృత్యవః ॥315॥**

ఆ సంతానాన్ని చూచి బ్రహ్మ శివుడితో ఇలా పలికాడు. ఇటువంటి సంతానసృష్టి అవసరం లేదు. నీకు సమానులైన ప్రజల సృష్టి నీవు చేయనవసరం లేదు. ఓ దేవాధిదేవా! నీకు నమస్కారం. నీకు మంగళమగుగాక! మృత్యుసహితులైన ఇతర ప్రజల్ని సృష్టించండి! మృత్యురహితులైన ప్రజలు కర్మాచరణపరులు కారు.

**ఏవముక్తోఽబ్రవీదేనం నాహం మృత్యుజరాన్వితాః ।**
**ప్రజాః స్రక్ష్యామి భద్రం తే స్థితోఽహం త్వం సృజ ప్రజాః ॥316॥**

**ఏతే యే వై మయా సృష్టా విరూపా నీలలోహితాః ।**
**సహస్రాణాం సహస్రం తు ఆత్మానో నిఃసృతాః ప్రజాః ॥317॥**

**ఏతే దేవా భవిష్యంతి రుద్రా నామ మహాబలాః ।**
**పృథివ్యామంతరిక్షే చ దిక్షు చైవ పరిశ్రితాః ॥318॥**

**శతరుద్రాః సమాత్మానో భవిష్యంతీతి యాజ్ఞికాః ।**
**యజ్ఞభాజో భవిష్యంతి సర్వదేవగణైః సహ ॥319॥**

**మన్వంతరేషు యే దేవా భవిష్యంతీహ భేదతః ।**
**సార్ధం తైరీజ్యమానాస్తే స్థాస్యంతీహాయుగక్షయాత్ ॥320॥**

బ్రహ్మ ఆవిధంగా పలుకగా రుద్రుడు ఆతడితో ఇలా అన్నాడు. నేను జరామరణాలు గల ప్రజల్ని సృష్టించను. నీకు మంగళమగుగాక! నేను ప్రశాంతంగా నిలువగలను. నీవే సృష్టించు. నేను సృష్టించిన ఈ వేలకొలది నీలలోహితరుద్రులు నా ఆత్మజులై ఉంటారు. వాళ్లు రుద్రులనే పేరుతో మహాబలవంతులైన దేవతలు అవుతారు. వాళ్లు భూమ్యాకాశాలలో మరియు అన్ని దిక్కులలోను వ్యాపించి ఉంటారు. వీరిలో నూర్గురు యాజ్ఞికులవుతారు. వీళ్లందరూ దేవతలతో పాటు యజ్ఞభాగాల్ని గ్రహిస్తారు. అన్ని మన్వంతరాలలోను దేవతలందు ఒక భేదంగా నిలుస్తారు. వాళ్లతో పాటుగా పూజింపబడతారు. ఈ రుద్రులందరూ యుగాంతం వరకూ ఇక్కడే ఉంటారు.

**ఏవముక్తస్తదా బ్రహ్మా మహాదేవేన ధీమతా ।**
**ప్రత్యువాచ నమస్కృత్య హృష్యమాణః ప్రజాపతిః ॥321॥**

**ఏవం భవతు భద్రం తే యథా తే వ్యాహృతం విభో ।**
**బ్రహ్మణా సమనుజ్ఞాతే తథా సర్వమభూత్కిల ॥322॥**

బుద్ధిమంతుడైన శివభగవానుడు ఇలా పలుకగా ప్రజాపతియైన బ్రహ్మ ప్రసన్నచిత్తుడై నమస్కరించి ఇలా పలికాడు. ఓ ప్రభూ! నీవు ఏమి చెప్పావో అదే జరుగుతుంది. నీకు శుభమగుగాక! బ్రహ్మ అలా పల్కిన తర్వాత అంతా అదే విధంగా జరిగింది.

తతః ప్రభృతి దేవేశో న చాసూయత వై ప్రజాః ।
ఊర్ధ్వరేతాః స్థితః స్థాణుర్యావదాభూతసంప్లవమ్ ॥**323**॥

యస్మాదుక్తః స్థితోఽస్మీతి తస్మాత్స్థాణురితి స్మృతః ।
ఏష దేవో మహాదేవః పురుషోఽర్కసమద్యుతిః ॥**324**॥

అర్ధనారీనరవపుస్తేజసా జ్వలనోపమః ।
స్వేచ్ఛయాసౌ ద్విధాభూతః పృథక్ స్త్రీపురుషః పృథక్ ॥**325**॥

స ఏవైకాదశార్ధేన స్థితోఽసౌ పరమేశ్వరః ।
తత్ర యా సా మహాభాగా శంకరస్యార్ధకాయినీ ॥**326**॥

ప్రాగుక్తా తు మహాదేవీ స్త్రీ సైవేహ సతీ హ్యభూత్ ।
హితాయ జగతాం దేవీ దక్షేణారాధితా పురా ॥**327**॥

కార్యార్థం దక్షిణం తస్యాః శుక్లం వామం తథాసితమ్ ।
ఆత్మానం విభజస్వేతి ప్రోక్తా దేవేన శంభునా ॥**328**॥

సా తథోక్తా ద్విధాభూతా శుక్లా కృష్ణా చ వై ద్విజాః ।
తస్యా నామాని వక్ష్యామి శృణ్వంతు చ సమాహితాః ॥**329**॥

అప్పటి నుంచి దేవతల ప్రభువు శివుడు ప్రజల్ని సృష్టించలేదు. ప్రళయపర్యంతం ఆతడు స్థాణువు వలె ఉన్నాడు. బ్రహ్మచారిగా ఉన్నాడు. ఆతడు ముందు నేను 'స్థితుణ్ణి' అవుతానని చెప్పినట్లే స్థాణువు అయినాడు. మహాదేవుడు పురుషస్వరూపుడు, సూర్యసమానతేజుడు, అగ్నితుల్యతేజస్వంతుడు అయిన ఆతడు సగభాగం పురుషుడుగా మరో సగభాగం స్త్రీగా నిలిచాడు. తన ఇష్టానుసారంగా అప్పుడప్పుడూ రెండుగా అనగా స్త్రీగా, పురుషుడుగా విభజింపబడతాడు. పరమేశ్వరుడు సగభాగంలో ఏకాదశరూపాలతో ఉంటాడు. రెండో సగభాగం ఆయన అర్ధాంగి మహాభాగ్యశాలిని మహాదేవి. ఆమె పూర్వం జగద్ధితానికై దక్షునిచేత కుమార్తెగా ఆరాధింపబడిన సతీదేవియే. సృష్టికార్యార్థం శివుడు కుడిభాగం తెల్లగా ఎడమభాగం నల్లగా ఉండునట్లుగా దేనిని విభజించుకొన్నాడు. ఓ విప్రులారా! శివుడు అలా పలుకగా ఆమె శరీరం తెల్లగా, నల్లగా రెండుగా విభజించబడ్డది. నేను మీకిప్పుడు ఆమె పేర్లు చెబుతాను. ఏకాగ్రచిత్తులై వినండి!

స్వాహా స్వధా మహావిద్యా మేధా లక్ష్మీః సరస్వతీ ।
సతీ దాక్షాయణీ విద్యా ఇచ్ఛాశక్తిః క్రియాత్మికా ॥**330**॥

అపర్ణా చైకపర్ణా చ తథా చైవైకపాటలా ।
ఉమా హైమవతీ చైవ కల్యాణీ చైకమాతృకా ॥**331**॥

ఖ్యాతిః ప్రజ్ఞా మహాభాగా లోకే గౌరీతి విశ్రుతా ।
గణాంబికా మహాదేవీ నందినీ జాతవేదసీ ॥**332**॥

**ఏకరూపమథైతస్యాః పృథగ్దేహవిభావనాత్ ।**
**సావిత్రీ వరదా పుణ్యా పావనీ లోక విశ్రుతా ॥333॥**

**ఆజ్ఞా ఆవేశనీ కృష్ణా తామసీ సాత్త్వికీ శివా ।**
**ప్రకృతిర్వికృతా రౌద్రీ దుర్గా భద్రా ప్రమాథినీ ॥334॥**

**కాళరాత్రిర్మహామాయా రేవతీ భూతనాయికా ।**
**ద్వాపరాంతవిభాగే చ నామానీమాని సువ్రతాః ॥335॥**

స్వాహ, స్వధ, మహావిద్య, మేధ, లక్ష్మి, సరస్వతి, సతి, దాక్షాయణి, విద్య, ఇచ్ఛాశక్తి, క్రియాత్మిక, అపర్ణ, ఏకపర్ణ, ఏకపాటల, ఉమ, హైమవతి, కళ్యాణి, ఏకమాతృక, ఖ్యాతి, ప్రజ్ఞ, మహాభాగ, లోకప్రసిద్ధి అయిన గౌరి, గణాంబిక, మహాదేవి, నందిని, జాతవేదసి అనేవి ఆమె పేర్లు. ఇవన్నియు ఒకటిగా ఉన్నప్పటి పేర్లు. సావిత్రి, వరద, పుణ్య, పావని, లోకవిశ్రుత, ఆజ్ఞ, ఆవేశని, కృష్ణ, తామసి, సాత్త్వికి, శివ, ప్రకృతి, వికృత, రౌద్రి, దుర్గ, భద్ర, ప్రమాథిని, కాళరాత్రి, మహామాయ, రేవతి, భూతనాయిక. ఓ ఋషులారా! ద్వాపరయుగాంతంలో ఇవి ఆమె నామాలు.

**గౌతమీ కౌశికీ చార్యా చండీ కాత్యాయనీ సతీ ।**
**కుమారీ యాదవీ దేవీ వరదా కృష్ణపింగలా ॥336॥**

**బర్హిర్ధ్వజా శూలధరా పరమా బ్రహ్మచారిణీ ।**
**మహేంద్రోపేంద్రభగినీ దృషద్వత్యేకశూలధృక్ ॥337॥**

**అపరాజితా బహుభుజా ప్రగల్భా సింహవాహినీ ।**
**శుంభాదిదైత్యహంత్రీ చ మహామహిషమర్దినీ ॥338॥**

**అమోఘా వింధ్యనిలయా విక్రాంతా గణనాయికా ।**
**దేవ్యా నామవికారాణి ఇత్యేతాని యథాక్రమమ్ ॥339॥**

**భద్రకాల్యా మయోక్తాని సమ్యక్ఫలప్రదాని చ ।**
**యే పఠంతి నరాస్తేషాం విద్యతే న చ పాతకమ్ ॥340॥**

ఇట్లే గౌతమి, కౌశికి, ఆర్య, చండి, కాత్యాయని, సతి, కుమారి, యాదవి, దేవి, వరద, కృష్ణపింగళ, బర్హిర్ధ్వజ, శూలధర, పరమ, బ్రహ్మచారిణి, మహేంద్రోపేంద్రభగిని, దృషద్వతి, ఏకశూలధృక్, అపరాజిత, బహుభుజ, ప్రగల్భ, సింహవాహిని, శుంభాదిదైత్యహంత్రి, మహామహిషమర్దిని, అమోఘ, వింధ్యనిలయ, విక్రాంత, గణనాయిక, నేను మీకు దేవి భద్రకాళి నామాల్ని యథాక్రమంగా చెప్పాను. అవి అన్నీ ఫలప్రదానకారులే. ఎవరు ఈ నామాల్ని పఠిస్తారో వారి పాపాలు నిశ్శేషంగా నశిస్తాయి.

**అరణ్యే పర్వతే వాపి పురే వాప్యథవా గృహే ।**
**రక్షామేతాం ప్రయుంజేత జలే వాథ స్థలేఽపి వా ॥341॥**

**వ్యాఘ్రకుంభీనచోరేభ్యో భయస్థానే విశేషతః ।**
**ఆపత్స్వపి చ సర్వాసు దేవ్యా నామాని కీర్తయేత్ ॥342॥**

**ఆర్యకగ్రహభూతైశ్చ పూతనామాతృభిస్తథా ।**
**అభ్యర్దితానాం బాలానాం రక్షామేతాం ప్రయోజయేత్ ॥343॥**

అరణ్యంలోను, పర్వతంమీద, నగరంలో, గృహంలో, నీటిలో భూమిపై రక్షణకై ఈ నామాల్ని జపించాలి. పెద్దపులులు, ఏనుగులు, దొంగల వల్ల భయం కల్గినప్పుడుగాని, ఏ విధమైన ఆపద సంభవించినపుడుగాని మహాదేవి యొక్క ఈ నామాలు పఠించాలి. గ్రహదోషాలు ఏర్పడినపుడు, భూతపిశాచాలు పట్టినపుడు, పూతన మరియు మాతల యొక్క పీడ బాలలకు కలిగినప్పుడు కూడా మహాకాళి యొక్క నామాల్ని రక్షణార్థం పఠించాలి.

**మహాదేవీ కలే ద్వే తు ప్రజ్ఞా శ్రీశ్చ ప్రకీర్తితే ।**
**ఆభ్యాం దేవీ సహస్రాణి యైర్వ్యాప్తమఖిలం జగత్ ॥344॥**

**అనయా దేవదేవోఽసౌ సత్యా రుద్రో మహేశ్వరః ।**
**ఆతిష్ఠత్సర్వలోకానాం హితాయ పరమేశ్వరః ॥345॥**

**రుద్రః పశుపతిశ్చాసీత్పురా దగ్ధం పురత్రయమ్ ।**
**దేవాశ్చ పశవః సర్వే బభూవుస్తస్య తేజసా ॥346॥**

**యః పఠేత్ శృణుయాద్వాపి ఆదిసర్గక్రమం శుభమ్ ।**
**స యాతి బ్రహ్మణో లోకం శ్రావయేద్వా ద్విజోత్తమాన్ ॥347॥**

మహాదేవి అయిన ఆమె ప్రజ్ఞ మరియు శ్రీ అనే కళలతో పిలువబడుతుంది. ఈ రెండింటి వల్ల వేలకొలది దేవీరూపాలు కల్గుతాయి. వాళ్ల ద్వారా సంపూర్ణజగత్తు వ్యాపించి ఉన్నది. దేవదేవుడు, మహేశ్వరుడు, పరమేశ్వరుడు మహారుద్రుడు సమస్తలోకాల శ్రేయస్సుకై ఎల్లప్పుడూ సతీదేవితో కలిసి ఉంటాడు. రుద్రుడు, పశుపతి పూర్వం త్రిపురాలను దహించాడు. ఈతడి తేజస్సుముందు సమస్తదేవతలు పశుతుల్యులే. ఎవడు శుభప్రదమైన ఈ ఆదిసృష్టిక్రమాన్ని పఠిస్తాడో, వింటాడో, ఉత్తమ ద్విజులకు వినిపిస్తాడో ఆతడు బ్రహ్మలోకానికి వెళతాడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే సృష్టివిస్తారో నామ సప్తతితమోఽధ్యాయః ॥ 70 ॥**

శ్రీ లింగమహాపురాణం, పూర్వభాగంలోని సృష్టి విస్తారమనే డెబ్బైయవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## ఏక సప్తతితమోऽధ్యాయః - డెబ్బై ఒకటవ అధ్యాయం

## పురదాహే నందికేశ్వరవాక్యమ్ - పురదాహంలో నందికేశ్వరవాక్యం

**ఋషయః ఊచుః** - ఋషులు పలికారు.

**సమాసాద్విస్తరాచ్చైవ సర్గః ప్రోక్తస్త్వయా శుభః ।**
**కథం పశుపతిశ్చాసీత్పురం దగ్ధుం మహేశ్వరః ॥1॥**

**కథం చ పశవశ్చాసన్ దేవాః సబ్రహ్మకాః ప్రభోః ।**
**మయస్య తపసా పూర్వం సుదుర్గం నిర్మితం పురమ్ ॥2॥**

**హైమం చ రాజతం దివ్యమయస్మయమనుత్తమమ్ ।**
**సుదుర్గం దేవదేవేన దగ్ధమిత్యేవ నః శ్రుతమ్ ॥3॥**

**కథం దదాహ భగవాన్ భగనేత్రనిపాతనః ।**
**ఏకేనేషునిపాతేన దివ్యేనాపి తదా కథమ్ ॥4॥**

**విష్ణునోత్పాదితైర్భూతైర్న దగ్ధం తత్పురత్రయమ్ ।**
**పురస్య సంభవః సర్వో వరలాభః పురా శ్రుతః ॥5॥**

**ఇదానీం దహనం సర్వం వక్తుమర్హసి సువ్రత ।**

ఓ సూతమహర్షీ! నీవు సంగ్రహంగా మరియు విస్తారంగా మంగళకరమైన సృష్టినిరూపణ చేశావు. పశుపతి శివుడి వల్ల పురాలు ఎట్లు దహింపబడ్డాయి. బ్రహ్మతో సహా దేవతలందరూ శివుడి విషయంలో పశువులు ఎలా అయ్యారు? మయుడు తపస్సుతో పూర్వకాలంలో ఉత్తమాలైన, దుర్గమాలైన పురాల్ని నిర్మించాడని మేము విన్నాం. బంగారంతో, వెండితో, ఇనుముతో నిర్మింపబడిన సుందరనగరాలు అవి. భగుడి నేత్రాల్ని నశింపజేసిన శివుడు ఒకే బాణంతో వాటిని ఎలా దహించాడు? విష్ణుభగవానుడిచే సృష్టించబడిన భూతగణాలు వాటిని ఎందుకు దహించలేక పోయాయి. మేము అందరం ఆ త్రిపురాల ఉత్పత్తి, వరప్రాప్తిని గూర్చి ఇంతకుముందే విని ఉన్నాము. ఓ సువ్రతుడా! ఇప్పుడు పురాల దహనాన్ని గూర్చి సంపూర్ణంగా వినదలచాం. కనికరించి మాకు వినిపించండి.

**తేషాం తద్వచనం శ్రుత్వా సూతః పౌరాణికోత్తమః ॥6॥**

**యథా శ్రుతం తథా ప్రాహ వ్యాసాద్విశ్వార్థసూచకాత్ ।**

అప్పుడు వాళ్ల వాక్యాల్ని విన్న పౌరాణిక శ్రేష్ఠుడైన సూతుడు సమస్తార్థాల్ని సూచించిన వ్యాసుడు ఎట్లు చెప్పాడో అట్లే చెప్పాడు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**త్రైలోక్యస్యాస్య శాపాద్ధి మనోవాక్కాయ సంభవాత్ ॥7॥**

**నిహతే తారకే దైత్యే తారపుత్రే సబాంధవే ।**
**స్కందేన వా ప్రయత్నేన తస్య పుత్రా మహాబలాః ॥8॥**

**విద్యున్మాలీ తారకాక్షః కమలాక్షశ్చ వీర్యవాన్ ।**
**తపస్తేపుర్మహాత్మానో మహాబలపరాక్రమాః ॥9॥**

**తప ఉగ్రం సమాస్థాయ నియమే పరమే స్థితాః ।**
**తపసా కర్శయామాసుర్దేహాన్ స్వాన్ దానవోత్తమాః ॥10॥**

**తేషాం పితామహః ప్రీతో వరదః ప్రదదౌ వరమ్ ।**

ఓ ఋషులారా! మూడులోకాలయొక్క త్రికరణాలవల్ల కల్గిన శాపకారణంగా కార్తికేయుడి (కుమారస్వామి) గట్టిప్రయత్నం వల్ల తారాపుత్రుడైన తారకాసురుడు బంధుసహితంగా మరణించాడు. మహాబలులైన ఆతడి పుత్రులు విద్యున్మాలి, తారకాక్షుడు, కమలాక్షుడు అనువారు ఉగ్రమైన తపస్సు చేశారు. మహాత్ములు, పరాక్రమవంతులు అయిన, వాళ్లు పరమనియతితో తపస్సు చేశారు. తమ శరీరాల్ని తపస్సు ద్వారా కృశింపజేసుకున్నారు. ప్రీతుడైన పితామహుడు వీళ్లకు వరాన్ని యిచ్చాడు.

**దైత్యా ఊచుః –** దైత్యులు పలికారు.

**అవధ్యత్వం చ సర్వేషాం సర్వభూతేషు సర్వదా ॥11॥**

**సహితా వరయామాసుః సర్వలోక పితామహమ్ ।**
**తానబ్రవీత్తదా దేవో లోకానాం ప్రభురవ్యయః ॥12॥**

**నాస్తి సర్వామరత్వం వై నివర్తధ్వమతోఽసురాః ।**
**అన్యం వరం వృణీధ్వం వై యాదృశం సంప్రరోచతే ॥13॥**

అన్ని ప్రాణుల వల్ల ఎల్లప్పుడూ మాకు మరణం లేకుండా ఉండాలి. వాళ్లందరూ ఒకేసారి బ్రహ్మను ఆ విధమైన వరం కోరారు. అప్పుడు లోకనాథుడు, అవ్యయుడు, బ్రహ్మదేవుడు వారితో ఇలా అన్నాడు. "ఓ అసురులారా! ఎవ్వరికి అమరత్వం సాధ్యం కాదు. అందుచేత దానిని వదలి మీకిష్టమైన మరో వరం కోరుకోండి!" అని.

**తతస్తే సహితా దైత్యాః సంప్రధార్య పరస్పరమ్ ।**
**బ్రహ్మాణమబ్రువన్ దైత్యాః ప్రణిపత్య జగద్గురుమ్ ॥14॥**

తర్వాత ఆ రాక్షసులు పరస్పరం చర్చించుకుని లోకగురువు అయిన బ్రహ్మకు నమస్కరించి ఇలా పలికారు.

**వయం పురాణి త్రీణ్యేవ సమాస్థాయ మహీమిమామ్ ।**
**విచరిష్యామ లోకేశ త్వత్ప్రసాదాచ్చ జగద్గురో ॥15॥**

**తథా వర్షసహస్రేషు సమేష్యామః పరస్పరమ్ ।**
**ఏకీభావం గమిష్యంతి పురాణ్యేతాని చానఘ ॥16॥**

**సమాగతాని చైతాని యో హన్యాద్భగవంస్తదా ।**
**ఏకేనైవేషుణా దేవః స నో మృత్యుర్భవిష్యతి ॥17॥**

ఓ లోకేశ్వరా! ఓ జగద్గురూ! మూడు పురాల్ని స్థాపించుకుని మేము నీ అనుగ్రహం వల్ల వాటితో భూమిపై తిరుగుతాము. మేము వేయి సంవత్సరాలకు ఒకసారి కలుస్తాము. ఓ అనఘుడా! ఆ మూడు పురాలు అప్పుడే ఒకటి కాగలవు. ఓ భగవంతుడా! ఆ పురాలు మూడు ఒక చోట నిల్చినపుడు ఎవడు ఒకే బాణంతో వాటిని రూపుమాపుతాడో ఆతడే మాయొక్క మృత్యువు కాగలడు.

**ఏవమస్త్వితి తాన్ దేవః ప్రత్యుక్త్వా ప్రావిశద్దివమ్ ।**
**తతో మయః స్వతపసా చక్రే వీరః పురాణ్యథ ॥18॥**

**కాంచనం దివి తత్రాసీదంతరిక్షే చ రాజతమ్ ।**
**ఆయసం చాభవద్భూమౌ పురం తేషాం మహాత్మనామ్ ॥19॥**

**ఏకైకం యోజనశతం విస్తారాయామతః సమమ్ ।**
**కాంచనం తారకాక్షస్య కమలాక్షస్య రాజతమ్ ॥20॥**

**విద్యున్మాలేశ్చాయసం వై త్రివిధం దుర్గముత్తమమ్ ।**
**మయశ్చ బలవాంస్తత్ర దైత్యదానవపూజితః ॥21॥**

**హైరణ్యే రాజతే చైవ కృష్ణాయసమయే తథా ।**
**ఆలయం చాత్మనః కృత్వా తత్రాస్తే బలవాంస్తదా ॥22॥**

'అట్లే అగుగాక' అని వారినుద్దేశించి పలికి బ్రహ్మ స్వర్గానికి వెళ్లాడు. తర్వాత వీరుడైన మయుడు తన తపోబలంతో మూడు పురాల్ని నిర్మించాడు. ఆ మహాత్ములకై బంగారుపురం స్వర్గంలో, వెండి నగరం అంతరిక్షంలో లోహమయ (ఇనుము) పురం భూమి మీద నిర్మించాడు. ప్రతి నగరం నూరు యోజనాల పొడవు మరియు నూరు యోజనాల వెడల్పుగలదై అన్నీ సమానంగా ఉన్నాయి. స్వర్ణపురం తారకాక్షుడికి, రజతపురం కమలాక్షుడికి, లోహపురం విద్యున్మాలికి చెందినవి. మూడూ ఉత్తమ దుర్గాలు. బలవంతుడైన మయుడు రాక్షసులకు దానవులకు పూజనీయుడు. ఆ స్వర్ణరజతలోహపురాలలో తనకు మందిరాన్ని నిర్మించుకుని బలవంతుడైన మయుడు నివసిస్తాడు.

**ఏవం బభూవుర్దైత్యానామతిదుర్గాణి సువ్రతాః ।**
**పురాణి త్రీణి విప్రేంద్రాస్త్రైలోక్యమివ చాపరమ్ ॥23॥**

**పురత్రయే తదా జాతే సర్వే దైత్యా జగత్త్రయే ।**
**పురత్రయం ప్రవిశ్యైవ బభూవుస్తే బలాధికాః ॥24॥**

ఓ సువ్రతులారా! ఓ విప్రశ్రేష్ఠులారా! ఈ విధంగా దానవులకు ఏర్పడిన సుదృఢపురాలు త్రిలోకాలతో సమానంగా ఉన్నాయి. ఈ మూడు పురాలు నిర్మితాలయినాయని తెలిసిన దానవులందరూ ఈ మూడు పురాలలో ప్రవేశించి మూడు లోకాలలో అత్యధికబలవంతులయ్యారు.

కల్పద్రుమసమాకీర్ణం గజవాజిసమాకులమ్ ।
నానాప్రాసాదసంకీర్ణం మణిజాలైః సమావృతమ్ ॥25॥

సూర్యమండలసంకాశైర్విమానైర్విశ్వతోముఖైః ।
పద్మరాగమయైః శుభ్రైః శోభితం చంద్రసన్నిభైః ॥26॥

ప్రాసాదైర్గోపురైర్దివ్యైః కైలాసశిఖరోపమైః ।
శోభితం త్రిపురం తేషాం పృథక్ పృథగనుత్తమైః ॥27॥

దివ్యస్త్రీభిః సుసంపూర్ణం గంధర్వైః సిద్ధచారణైః ।
రుద్రాలయైః ప్రతిగృహం సాగ్నిహోత్రైర్ద్విజోత్తమాః ॥28॥

వాపీకూపతడాగైశ్చ దీర్ఘికాభిస్తు సర్వతః ।
మత్తమాతంగయూథైశ్చ తురంగైశ్చ సుశోభనైః ॥29॥

రథైశ్చ వివిధాకారైర్విచిత్రైర్విశ్వతోముఖైః ।
సభాప్రపాదిభిశ్చైవ క్రీడాస్థానైః పృథక్ పృథక్ ॥30॥

వేదాధ్యయనశాలాభిర్వివిధాభిః సమంతతః ।
అధృష్యం మనసాప్యన్యైర్మయస్యైవ చ మాయయా ॥31॥

పతివ్రతాభిః సర్వత్ర సేవితం మునిపుంగవాః ।
కృత్వాపి సుమహత్పాపమపాపైః శంకరార్చనాత్ ॥32॥

దైత్యేశ్వరైర్మహాభాగైః సదారైః ససుతైర్ద్విజాః ।
శ్రౌతస్మార్తార్థధర్మజ్ఞైస్తద్ధర్మనిరతైః సదా ॥33॥

మహాదేవేతరం త్యక్త్వా దేవం తస్యార్చనం స్థితౌ ।
వ్యూఢోరస్కైర్వృషస్కంధైః సర్వాయుధధరైః సదా ॥34॥

సర్వదా క్షుభితైశ్చైవ దావాగ్నిసదృశేక్షణైః ।
ప్రశాంతైః కుపితైశ్చైవ కుబ్జైర్వామనకైస్తథా ॥35॥

నీలోత్పలదళప్రఖ్యైర్నీలకుంచితమూర్ధజైః ।
నీలాద్రిమేరుసంకాశైర్నీరదోపమనిఃస్వనైః ।

మయేన రక్షితైః సర్వైః శిక్షితైర్యుద్ధలాలసైః ॥36॥
అథ సమరరతైః సదాసమంతాచ్ఛివపదపూజనయా సులబ్ధవీర్యైః ।

రవిమరుదమరేంద్రసన్నికాశైః సురమథనైః సుదృఢైః సుసేవితం తత్ ॥37॥

ఆ మూడు పురాలు కల్పవృక్షాలతోను, ఏనుగులతోను, గుఱ్ఱాలతోను నిండి యున్నాయి. అనేక భవనాలతో శోభిస్తున్నాయి. మణిసమూహాలతో కూడి ఉన్నాయి. పెద్దద్వారబంధాలతోనూ, సూర్యమండల సమానమైన విమానాలతోను కూడి ఉన్నాయి. చంద్రకాంతితో సమానమైన కాంతితోను, మంగళకరమైన పద్మరాగమణులతోను శోభిస్తున్నాయి. కైలాసశిఖరాలతో పోల్చదగిన దివ్యాలైన భవనాలతోనూ, గోపురాలతోనూ కూడి ఆ మూడు పురాలు వేరువేరుగా అలంకరింపబడి ఉన్నాయి. ఓ ద్విజశ్రేష్ఠులారా! దివ్యులైన గంధర్వులు, సిద్ధులు, చారణులు అయిన స్త్రీలతో నిండి ఉన్నాయి. ప్రతిగృహం కూడా శివాలయాలతోనూ, అగ్నిహోత్రాలతోనూ కూడి ఉన్నాయి. నూతులతోనూ బావులతోనూ, సరస్సులతోనూ నిండి యున్నాయి. అందమైన అశ్వాలతో, మదగజాలతో నిండియున్నాయి. విచిత్రాలైన వివిధాకారాలుగల విశాలమైన రథాలతో కూడి యున్నాయి. సభామందిరాలతో మంచినీటి శాలలు, ఆటస్థలాలతో వేరువేరుగా నిండి యున్నాయి. అన్ని పురాలలోనూ వివిధ వేదాధ్యయనశాలలున్నాయి. మయుడి మాయవల్ల ఇతరులకి మానసికంగా కూడా చేరరానివి ఆనగరాలు. ఓ మునిశ్రేష్ఠులారా! అన్ని చోట్ల పతివ్రతలచేత సేవింపబడుతున్నాయి. ఓ ద్విజులారా! పెద్ద పెద్ద పాపాలు చేసినవారు కూడా శివార్చనవల్ల పాపరహితులవుతున్నారు. ఎల్లప్పుడూ దానవేశ్వరులందరూ మహాభాగులు, శ్రౌతస్మార్తధర్మజ్ఞానులు, ధర్మంలో నిరతిగలవారై భార్యలతో, సుతులతో కూడి ఉంటారు. శివుడికన్నా భిన్నమైన దేవుడిని విడిచి ఆయననే అర్చిస్తారు. అంటే శివుణ్ణి మాత్రమే పూజిస్తారు. విశాల వక్షఃస్థలాలు, వృషభాల యొక్క మూపురాలతో సమాన భుజాలుగలవారు అక్కడి జనులు. ఎల్లప్పుడూ సమస్తాయుధధారులు కూడా. ఎల్లప్పుడూ ఆకలిగలవారు. అనగా ఉపవాసవ్రతులు. కాలాగ్నిసమాననేత్రులు. వీరిలో కొందరు శాంతులు. కొందరు కుపితులు. కొందరు గూనిగలవారు. కొందరు పొట్టివారు. కొందరు నల్లకలువరేకుల కాంతివంటి కాంతిగలవారు. నల్లని మరియు వక్రమైన (రింగులు) కేశపాశం గలవారు. కొందరు నీలాద్రి సమానులు. కొందరు మేరుపర్వతసములు. మేఘగర్జనవంటి గర్జనలు గలవారు. మయుడి వలన రక్షితులు. మరియు శిక్షితులు. యుద్ధప్రీతిగలవారు. ఆ నగరాలు ఎల్లప్పుడూ శివార్చనవల్ల బాగా లభించిన బలవంతులతోను, సమరరతిగలవారితోను, సూర్యుడు, వాయువు, ఇంద్రుడు మరి వీరితో సమానమైన ఇతర దేవతల్ని మథించే సుదృఢులైన రాక్షసులతోను కూడి యున్నవి.

**సేంద్రా దేవా ద్విజశ్రేష్ఠా ద్రుమా దావాగ్నినా యథా ।**
**పురత్రయాగ్నినా దగ్ధా హ్యభవన్ దైత్యవైభవాత్ ॥38॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! దావాగ్ని వల్ల ఎలా వృక్షాలు తగలబడతాయో అట్లే త్రిపురాల అగ్నివల్ల దేవతలు ఇంద్రుడితో సహా దహింపబడ్డారు. దైత్యుల వైభవానికి కారణమిదే.

**అథైవం తే తదా దగ్ధా దేవా దేవేశ్వరం హరిమ్ ।**
**అభివంద్య తదా ప్రాహుస్తమప్రతిమవర్చసమ్ ॥39॥**

ఆ విధంగా దగ్ధులైన దేవతలందరూ సాటిలేని వర్చస్సుగల దేవాధిదేవుడైన విష్ణువుకు నమస్కరించి ఇలా పలికారు.

**సోఽపి నారాయణః శ్రీమాన్ చింతయామాస చేతసా ।**
**కిం కార్యం దేవకార్యేషు భగవానితి సప్రభుః ॥40॥**

భగవానుడు, ప్రభువు, శ్రీమన్నారాయణుడు దేవతల విషయంగా ఏమి చేయాలనేది మనుసుతో ఆలోచించాడు.

**తదా సస్మార వై యజ్ఞం యజ్ఞమూర్తిర్జనార్దనః ।**
**యజ్వాయజ్ఞభుగీశానో యజ్వనాం ఫలదః ప్రభుః ॥41॥**

అప్పుడు యజ్ఞఫలభోక్త, యజ్ఞకర్త, యజ్ఞకర్తలకు ఫలప్రదాత అయిన యజ్ఞమూర్తి విష్ణుదేవుడు, యజ్ఞదేవుణ్ణి స్మరించాడు.

**తతో యజ్ఞః స్మృతస్తేన దేవకార్యార్థసిద్ధయే ।**
**దేవం తే పురుషం చైవ ప్రణేముస్తుష్టువుస్తదా ॥42॥**

**భగవానపి తం దృష్ట్వా యజ్ఞం ప్రాహ సనాతనమ్ ।**
**సనాతనస్తదా సేంద్రాన్ దేవానాలోక్య చాచ్యుతః ॥43॥**

దేవకార్యసిద్ధికై విష్ణుదేవుడివల్ల స్మరింపబడిన యజ్ఞదేవుడు వచ్చి విష్ణువుకు నమస్కరించి స్తుతించాడు. సనాతనుడైన విష్ణుభగవానుడు సనాతనుడైన యజ్ఞదేవుణ్ణి చూచి, ఇంద్రసహితదేవతల్ని చూచి యజ్ఞుడితో ఇలా పలికాడు.

**శ్రీవిష్ణురువాచ :–** శ్రీ మహావిష్ణువు పలికాడు.

**అనేనోపసదా దేవా యజధ్వం పరమేశ్వరమ్।**
**పురత్రయవినాశాయ జగత్త్రయవిభూతయే ॥44॥**

ఓ దేవతలారా! త్రిపురాల వినాశనం కోసం, మూడు లోకాల సమృద్ధికోసం ఈ ఉపసదుడనే యజ్ఞపురుషుడి ద్వారా పరమేశ్వరుణ్ణి సేవించండి.

**సూత ఉవాచ :–** సూతుడు పలికాడు.

**అథ తస్య వచః శ్రుత్వా దేవదేవస్య ధీమతః।**
**సింహనాదం మహత్కృత్వా యజ్ఞేశం తుష్టువుః సురాః ॥45॥**

బుద్ధిమంతుడు దేవదేవుడు అయిన విష్ణువు మాటలు విని దేవతలు గొప్పగా సింహనాదం చేసి విష్ణువును స్తుతించారు.

**తతః సంచింత్య భగవాన్ స్వయమేవ జనార్దనః।**
**పునః ప్రాహ స సర్వాంస్తాంస్త్రిదశాంస్త్రిదశేశ్వరః ॥46॥**

**హత్వా దగ్ధ్వా చ భూతాని భుక్త్వా చాన్యాయతోఽపి వా।**
**యజేద్యది మహాదేవమపాపో నాత్ర సంశయః ॥47॥**

తర్వాత దేవాధిదేవుడైన విష్ణుభగవానుడు స్వయంగా ఆలోచించి దేవతలందర్నీ ఉద్దేశించి ఇలా పలికాడు. ప్రాణుల్ని వధించినవారైనా దహించినవారైనా అన్యాయపూర్వకమైన భోగాల్ని, విలాసాల్ని అనుభవించినవారైనా మహాదేవశివుణ్ణి పూజించినచో పాపవిముక్తులవుతారు. ఇందులో సందేహం లేదు.

**అపాపా నైవ హంతవ్యాః పాపా ఏవ న సంశయః ।**
**హంతవ్యాః సర్వయత్నేన కథం వధ్యాః సురోత్తమాః ॥48॥**

**అసురా దుర్మదాః పాపా అపి దేవైర్మహాబలైః ।**
**తస్మాన్న వధ్యా రుద్రస్య ప్రభావాత్పరమేష్ఠినః ॥49॥**

**కోఽహం బ్రహ్మాథవా దేవా దైత్యా దేవారిసూదనాః ।**
**మునయశ్చ మహాత్మానః ప్రసాదేన వినా ప్రభోః ॥50॥**

పాపరహితుల్ని చంపరాదు. పాపుల్ని మాత్రం ప్రయత్నపూర్వకంగా చంపాలి. ఇందులో సందేహం లేదు. ఓ దేవతాశ్రేష్ఠులారా! రాక్షసులు పాపులైన దుర్మదులు. దేవతలు మహాబలులైనా రాక్షసవధ వారికి ఎలా సాధ్యం అవుతుంది? రుద్రభగవానుడి ప్రభావం వల్ల వాళ్లు చంపబడరు. ఓ దేవతలారా! శివభగవానుడి దయలేనిచో నేను ఎవడిని? బ్రహ్మ ఎవడు? దానవులెవరు? దేవతలెవ్వరు? దేవశత్రువుల వినాశకులెవరు? మహాత్ములైన మునిగణాలెవరు?

**యః సప్తవింశకో నిత్యః పరాత్పరతరః ప్రభుః ।**
**విశ్వామరేశ్వరో వంద్యో విశ్వాధారో మహేశ్వరః ॥51॥**

**స ఏవ సర్వదేవేశః సర్వేషామపి శంకరః ।**
**లీలయా దేవదైత్యేంద్ర విభాగమకరోద్ధరః ॥52॥**

ఇరవైఏడు తత్త్వాలతో కూడినవాడు ఆయన. శాశ్వతుడు, మహాత్ములందు మహాత్ముడు, ప్రభుతాసంపన్నుడు, దేవతలందరికీ ప్రభువు, అందరికీ వందనీయుడు, సమస్తవిశ్వానికి ఆధారభూతుడు, సమస్తదేవతేశ్వరుడు, అందరికీ స్వామి ఆ శంకరుడే. ఆతడే విలాసార్థం దేవతలని, రాక్షసులని, ఇంద్రుడని విభాగాలు చేశాడు.

**తస్యాంశమేకం సంపూజ్య దేవా దేవత్వమాగతాః ।**
**బ్రహ్మా బ్రహ్మత్వమాపన్నః హ్యహం విష్ణుత్వమేవ చ ॥53॥**

ఆయన యొక్క ఏకాంశను బాగా పూజించి దేవతలు దేవత్వాన్ని పొందారు. బ్రహ్మ బ్రహ్మత్వాన్ని పొందాడు. నేను విష్ణుత్వాన్ని పొందాను.

**తమపూజ్య జగత్యస్మిన్ కః పుమాన్ సిద్ధిమిచ్ఛతి ।**
**తస్మాత్తేనైవ హంతవ్యా లింగార్చనవిధేర్బలాత్ ॥54॥**

**ధర్మనిష్ఠాశ్చ తే సర్వే శ్రౌతస్మార్తవిధౌ స్థితాః ।**
**తథాపి యజమానేన రౌద్రేణోపసదా ప్రభుమ్ ।**
**రుద్రమిష్ట్వా యథాన్యాయం జేష్యామో దైత్యసత్తమాన్ ॥55॥**

**సతారకాక్షేణ మయేన గుప్తం స్వస్థం చ గుప్తం స్ఫటికాభమేకమ్ ।**
**కో నామ హంతుం త్రిపురం సమర్థో ముక్త్వా త్రినేత్రం భగవంతమేకమ్ ॥56॥**

శివుడిని పూజించకుండా ఈ జగత్తులో ఏ వ్యక్తి సిద్ధిని పొందాలనుకుంటాడు? అందువల్ల లింగార్చన విధి బలంతో, ఆయన వల్లే రాక్షసులు చంపదగినవారు. అయినప్పటికి వారందరూ ధర్మనిష్ఠులు. అందరూ శ్రుతిస్మార్త విధి నిర్వహణలో స్థితులై ఉన్నారు. అయినా 'ఉపసద' మనే పేరుగల రుద్రయాగాన్ని యజమానుడి ద్వారా విధిపూర్వకంగా చేయించి రుద్రదేవుణ్ణి యజించి మనం ఆ దానవశ్రేష్ఠుల్ని జయించాలి. తారకాక్షుడితో కూడినది, మయుడి వల్ల రక్షింపబడినది, స్వస్థత కల్గినది, గుప్తమైనది, స్ఫటికతో సమానమైన కాంతి కలది, మూడును ఒకటిగా నిలచినది అయిన త్రిపురాన్ని నశింపజేయడానికి భగవంతుడైన శివుడు కాక మరెవడు సమర్థుడు?

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఏవముక్త్వా హరిశ్చేష్ట్వా యజ్ఞేనోపసదా ప్రభుమ్ ।**
**ఉపవిష్టో దదర్శాథ భూతసంఘాన్ సహస్రశః ॥57॥**

**శూలశక్తిగదాహస్తాన్ టంకోపలశిలాయుధాన్ ।**
**నానా ప్రహరణోపేతాన్నానావేషధరాంస్తదా ॥58॥**

**కాలాగ్ని రుద్రసంకాశాన్ కాలరుద్రోపమాంస్తదా ।**
**ప్రాహ దేవో హరిః సాక్షాత్ ప్రణిపత్య స్థితాన్ ప్రభుః ॥59॥**

ఈ విధంగా పలికి విష్ణువు 'ఉపసద' అనే పేరుగల యజ్ఞంతో శివుణ్ణి యజించి స్థితుడై ఉండి వేలసంఖ్యతో భూతగాణాల్ని దర్శించాడు. వాళ్ళ శూలం, శక్తి, గదలు ధరించిన హస్తాలుగలవారు, టంకం, ఉపలం, శిలలు ఆయుధాలుగా గలవారు, అనేకవిధాలైన ప్రహారయోగ్యాలైన ఆయుధాలతో కూడినవారు, అనేకాలైన వేషాలు ధరించినవారు. మరియు వాళ్ళ ప్రళయాగ్నికి, రుద్రుడికి, సమానమైనవారు. కాలరుద్రుడితో పోల్చదగినవారై నిల్చిన ఆ భూతగణాలకు సాక్షాత్తు ప్రభువైన విష్ణువు నమస్కరించి ఇలా పలికాడు.

**విష్ణురువాచ –** విష్ణువు పలికాడు.

**దగ్ధ్వా భిత్త్వా చ భుక్త్వా చ గత్వా దైత్యపురత్రయమ్ ।**
**పునర్యథాగతం వీరా గంతుమర్హథ భూతలే ॥60॥**

ఓ వీరులారా! దానవుల ఆ మూడు పురాలకు వెళ్లి అన్నింటిని దహించి, ఛిన్నాభిన్నం చేసి, వాటిని భక్షించి మీరు ఎలా అయితే వచ్చారో, అలాగే భూమిపైకి వెళ్లండి!

**తతః ప్రణమ్య దేవేశం భూతసంఘాః పురత్రయమ్ ।**
**ప్రవిశ్య నష్టాస్తే సర్వే శలభా ఇవ పావకమ్ ॥61॥**

తర్వాత ఆ భూతగణాలు విష్ణువుకు నమస్కరించి ఆమూడు పురాలలోనికి వెళ్లి అందరూ అగ్నికి ఆహుతి అయిన మిడతల వలె నశించారు.

**తతస్తు నష్టాస్తే సర్వే భూతా దేవేశ్వరాజ్ఞయా ।**
**ననృతుర్ముముదుశ్చైవ జగుర్దైత్యాః సహస్రశః ॥62॥**

**తుష్టువుర్దేవ దేవేశం పరమాత్మానమీశ్వరమ్ ।**

దేవేశ్వరుడి ఆజ్ఞవల్ల ఆ భూతాలన్నీ త్రిపురాలలో ప్రవేశించి నశించిన తర్వాత వేలసంఖ్యలో గల దానవులు సంతోషించారు. నర్తించారు. గానం చేశారు. పరమాత్మ, దేవాధిదేవుడు అయిన శంకరుణ్ణి స్తుతించారు.

**తతః పరాజితా దేవా ధ్వస్తవీర్యాః క్షణేన తు ॥63॥**

**సేంద్రాః సంగమ్య దేవేశముపేంద్రం ధిష్ఠితా భయాత్ ।**
**తాన్ దృష్ట్వా చింతయామాస భగవాన్ పురుషోత్తమః ॥64॥**

**కిం కృత్యమితి సంతప్తః సంతప్తాన్ సేంద్రకాన్ క్షణమ్ ।**
**కథం తు తేషాం దైత్యానం బలం హత్వా ప్రయత్నతః ॥65॥**

**దేవకార్యం కరిష్యామి ప్రసాదాత్పరమేష్ఠినః ।**
**పాపం విచారయతో నాస్తి ధర్మిష్ఠానాం న సంశయః ॥66॥**

**తస్మాద్దైత్యా న వధ్యాస్తే భూతైశ్చోపసదోద్భవైః ।**
**పాపం నుదతి ధర్మేణ ధర్మే సర్వం ప్రతిష్ఠితమ్ ॥67॥**

**ధర్మాదైశ్వర్యమిత్యేషా శ్రుతిరేషా సనాతనీ ।**
**దైత్యాశ్చైతే హి ధర్మిష్ఠాః సర్వే త్రిపురవాసినః ॥68॥**

**తస్మాదవధ్యతాం ప్రాప్తా నాన్యథా ద్విజపుంగవాః ।**
**కృత్వాపి సుమహత్పాపం రుద్రమభ్యర్చయంతి యే ॥69॥**

**ముచ్యంతే పాతకైః సర్వైః పద్మపత్రమివాంభసా ।**
**పూజయా భోగసంపత్తిరవశ్యం జాయతే ద్విజాః ॥70॥**

**తస్మాత్తే భోగినో దైత్యా లింగార్చనపరాయణాః ।**
**తస్మాత్కృత్వా ధర్మవిఘ్నమహం దేవాః స్వమాయయా ॥71॥**

**దైత్యానాం దేవకార్యార్థం జేష్యేఽహం త్రిపురం క్షణాత్ ।**

తర్వాత క్షణకాలంలోనే హీనపరాక్రములు, ఓడినవారు అయి దుఃఖితులైన ఇంద్రుడితో కూడిన దేవతలు దేవేశ్వరుడైన విష్ణువును సమీపించి భయంతో నిలిచారు. పురుషోత్తమ భగవానుడు దుఃఖితులైన వారిని చూచి తాను క్షణకాలం దుఃఖించినవాడై ఏమి చేయాలని ఆలోచించాడు. ఏవిధంగా ప్రయత్నించి దానవుల బలాన్ని హరించి దేవకార్యాన్ని నిర్వర్తించాలి? విచారించగా శివభగవానుడి యొక్క అనుగ్రహం వల్ల ధర్మనిష్ఠులైన దైత్యులకు పాపం అంటడం లేదు. ఇందులో సందేహం లేదు. పాపం ధర్మంవల్ల నశిస్తుంది. ధర్మమందే సర్వం నిలిచి ఉంటుంది. ధర్మం వల్లనే సంపద కల్గుతుంది. ఇది సనాతనవాక్యం. సూతుడు అన్నాడు. ఓ ద్విజశ్రేష్ఠులారా!

త్రిపురాలలో నివసించే దైత్యులందరూ ధర్మనిష్ఠులు. అందుకే చంప వీలుకాలేదు. అంతకంటే మరొకటి కాదు. అధికమైన పాపాన్ని చేసి కూడా ఎవరు రుద్రుణ్ణి మిక్కిలిగా అర్చిస్తారో వారు సర్వపాపాలనుంచి విముక్తులవుతారు – పద్మదళాలు ముక్తమవుతున్నట్లు. ఓ బ్రాహ్మణులారా! శివుణ్ణి పూజించటం వల్ల భోగభాగ్యాలు తప్పక కలుగుతాయి. శివార్చన పరులయినందువల్లనే దైత్యులు భోగులయ్యారు. విష్ణువు అన్నాడు, ఓ దేవతలారా! నేను మీ కార్యార్థం నా మాయతో దైత్యుల యొక్క ధర్మాన్ని విఘ్నపరచి క్షణకాలంలో త్రిపురాల్ని జయిస్తానని.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**విచార్యైవం తతస్తేషాం భగవాన్ పురుషోత్తమః ।**
**కర్తుం వ్యవసితశ్చాభూద్ధర్మవిఘ్నం సురారిణామ్ ॥72॥**

**అసృజచ్చ మహాతేజాః పురుషం చాత్మసంభవమ్ ।**
**మాయీ మాయామయం తేషాం ధర్మవిఘ్నార్థమచ్యుతః ॥73॥**

**శాస్త్రం చ శాస్తా సర్వేషామకరోత్కామరూపధృక్ ।**
**సర్వసమ్మోహనం మాయీ దృష్టప్రత్యయసంయుతమ్ ॥74॥**

**ఏతత్స్వాంగభవాయైవ పురుషాయోపదిశ్య తు ।**
**మాయీ మాయామయం శాస్త్రం గ్రంథషోడశ లక్షకమ్ ॥75॥**

**శ్రౌతస్మార్తవిరుద్ధం చ వర్ణాశ్రమ వివర్జితమ్ ।**
**ఇహైవ స్వర్గనరకం ప్రత్యయం నాన్యథా పునః ॥76॥**

**తచ్ఛాస్త్రముపదిశ్యైవ పురుషాయాచ్యుతః స్వయమ్ ।**
**పురత్రయవినాశాయ ప్రాహైనం పురుషం హరిః ॥77॥**

**గంతుమర్హసి నాశాయ భో తూర్ణ పురవాసినామ్ ।**
**ధర్మాస్తథా ప్రణశ్యంతు శ్రౌతస్మార్తా న సంశయః ॥78॥**

ఆ విధంగా ఆలోచించి భగవానుడు పురుషోత్తముడు దానవుల యొక్క ధర్మాన్ని విఘ్నపర్చడానికి ఉద్యుక్తుడయ్యాడు. మాయాతేజస్వి, మాయావి అయిన విష్ణువు తన శరీరం నుంచి మాయామయపురుషుణ్ణి ధర్మవిఘ్నార్థం సృష్టించాడు. అందర్నీ శాసించువాడు, కామ్యరూపధారుడు, మాయాపతి అయిన విష్ణువు, చూచినంతనే నమ్మకం కల్గించేది, అందర్ని మోహింపజేసేది అయిన శాస్త్రగ్రంథాన్ని రచించాడు. అది పదహారు లక్షల శ్లోక పరిమితిగలది. అనగా చాలా విస్తృతమైనది. ఇది శ్రుతిస్మృతులకు విరుద్ధమైనది. వర్ణాశ్రమధర్మరహితమైనది. స్వర్గనరకాలు ఎక్కడోలేవు ఇక్కడే ఉన్నాయి అనే నమ్మకం కలిగించేది. దీనికి భిన్నమైనది ఏదీ లేదు. తన నుంచి పుట్టిన ఆ మాయామయ పురుషుడికి స్వయంగా ఆ శాస్త్రాన్ని ఉపదేశించి త్రిపురవినాశానికై ఆతణ్ణి ఉద్దేశించి ఇలా పలికాడు. ఓ పురుషుడా! త్రిపురవాసుల వినాశనానికై త్వరగా వెళ్లు. త్రిపురవాసులలో శ్రుతిస్మృతి ధర్మాలు నశిస్తాయి. ఇందులో సందేహం లేదు.

**తతః ప్రణమ్య తం మాయీ మాయాశాస్త్రవిశారదః ।**
**ప్రవిశ్య తత్పురం తూర్ణం మునిర్మాయాం తదాకరోత్ ॥79॥**

తర్వాత మాయాశాస్త్రప్రవీణుడైన ఆ మాయాముని విష్ణువునకు నమస్కరించి త్వరగా ఆపురాలలోనికి వెళ్లి మాయాశాస్త్రాన్ని అక్కడ వ్యాపింపజేశాడు.

**మాయయా తస్య తే దైత్యాః పురత్రయనివాసినః ।**
**శ్రౌతం స్మార్తంచ సంత్యజ్య తస్య శిష్యాస్తదాభవన్ ॥80॥**

**తత్యజుశ్చ మహాదేవం శంకరం పరమేశ్వరం ।**

ఆముని మాయవల్ల త్రిపురవాసులైన దానవులు శ్రుతిస్మార్తవిధుల్ని వదలినారు. ఆమునికి శిష్యులై మహాదేవుడు, పరమేశ్వరుడు అయిన శివుణ్ణి కూడా విడిచిపెట్టారు.

**నారదోఽపి తదా మాయీ నియోగాన్మాయినః ప్రభోః ॥81॥**

**ప్రవిశ్య తత్పురం తేన మాయినా సహ దీక్షితః ।**
**మునిః శిష్యైః ప్రశిష్యైశ్చ సంవృతః సర్వతః స్వయమ్ ॥82॥**

**స్త్రీధర్మం చాకరోత్స్త్రీణాం దుశ్చారఫలసిద్ధిదమ్ ।**
**చక్రుస్తాః సర్వదా లబ్ధ్వా సద్య ఏవ ఫలం స్త్రియః ॥83॥**

**జనాసక్తా బభూవుస్తా వినింద్య పతిదేవతాః ।**
**అద్యాపి గౌరవాత్తస్య నారదస్య కలౌ మునేః ॥84॥**

**నార్యశ్చరంతి సంత్యజ్య భర్తౄన్ స్వైరం వృథాధమాః ।**

తర్వాత మాయావి అయిన విష్ణువు నియోగంతో మాయాపురుషుడు ఆపురాలలోని అన్ని దిక్కుల్ని తన శిష్యప్రశిష్య గణాలతో తిరిగాడు. మాయావి అయిన నారదుడు కూడా ఆ పురాలకు చేరి విష్ణువు యొక్క ఆజ్ఞవలన ఆతడివల్ల దీక్ష పొందాడు. దానవుల్లో స్త్రీలకు దురాచారఫలసిద్ధి కోసం ధర్మోపదేశం చేశారు. ఆధర్మాన్ని వాళ్లు ఎల్లప్పుడూ పాటించారు. దానివల్ల వెంటనే స్త్రీలు ఫలాల్ని పొందారు. భర్తల్ని అవహేళన పర్చి ఇతర పురుషాసక్తలయ్యారు. నారదముని మీద గౌరవంతో ఇప్పుడు కూడా (కలియుగంలో) అధమస్త్రీలు భర్తల్ని పరిత్యజించి వ్యర్థంగా స్వేచ్ఛాచారిణులవుతున్నారు. (వ్యభిచరిస్తున్నారు)

**స్త్రీణాం మాతా పితా బంధుః సఖా మిత్రంచ బాంధవః ॥85॥**

**భర్తా ఏవ న సందేహస్తథాప్యాసహమాయయా ।**
**కృత్వాపి సుమహత్పాపం యా భర్తుః ప్రేమసంయుతా ॥86॥**

**ప్రాప్నుయాత్పరమం స్వర్గం నరకం చ విపర్యయాత్ ।**
**పురైకా మునిశార్దూలాః సర్వధర్మాన్ సదా పతిమ్ ॥87॥**

**సంత్యజ్యాపూజయన్ సాధ్వ్యో దేవానన్యాన్ జగద్గురూన్ ।**
**తాః సర్వలోకమాసాద్య మోదంతే విగతజ్వరాః ॥88॥**

**నరకం చ జగామాన్యా తస్మాద్భర్తా పరా గతిః ।**
**తథాపి భర్తృన్ స్వాంస్త్యక్త్వా బభూవుః స్వైరవృత్తయః ॥89॥**

**మాయయా దేవదేవస్య విష్ణోస్తస్యాజ్ఞయా ప్రభోః ।**
**అలక్ష్మీశ్చ స్వయం తస్య నియోగాత్త్రిపురం గతా ॥90॥**

**యా లక్ష్మీస్తపసా తేషాం లబ్ధా దేవేశ్వరాదజాత్ ।**
**బహిర్గతా పరిత్యజ్య నియోగాత్ బ్రహ్మణః ప్రభో ॥91॥**

**బుద్ధిమోహం తథాభూతం విష్ణుమాయావినిర్మితమ్ ।**
**తేషాం దత్త్వా క్షణం దేవస్తాసాం మాయీ చ నారదః ॥92॥**

**సుఖాసీనౌ హ్యసంభ్రాంతౌ ధర్మవిఘ్నార్థమవ్యయౌ ।**

స్త్రీలకు పతియే మాతాపితలు. బంధువు, సఖుడు, మిత్రుడు, బంధువు. ఇందులో సందేహం లేదు. కాని విష్ణువు యొక్క క్రూరమైన మాయవల్ల ఆ స్త్రీలు అలా ప్రవర్తించారు. పెద్ద పెద్ద పాపాలు చేసినవారైనా భర్తల్ని ప్రేమించినవారైతే ఉన్నత స్వర్గాన్ని పొందుతున్నారు. ఇందుకు భిన్నంగా ఉన్నవారు, నరకాన్ని పొందుతున్నారు. ఓ మునిశ్రేష్ఠులారా! పూర్వం స్త్రీలు అన్ని ధర్మాల్ని, ఇతర దేవతల్ని, జగద్గురువుల్ని త్యజించి పతిని పూజించారు. దాంతో వారు స్వర్గలోకాన్ని పొంది, నశించిన బాధలు గలవారై ఆనందించేవారు. అందుచేత స్త్రీలకు పతియే పరమగతి. దేవదేవుడు, ప్రభువు అయిన విష్ణువు మాయవల్ల, ఆజ్ఞవల్ల వాళ్లు భర్తల్ని వదలి వ్యభిచరించారు. విష్ణుదేవుడి యొక్క ఆజ్ఞ వల్ల 'అలక్ష్మి' మూడు పురాలలోకి వచ్చింది. రాక్షసులు బ్రహ్మను గూర్చి తపస్సు చేయడం వల్ల ప్రాప్తించిన లక్ష్మీదేవి ఇపుడు ఆతడి ఆజ్ఞవల్లనే వెడలిపోయింది. ధర్మాన్ని విఘ్నపరచడానికై ఆ యిరువురు (మాయాముని, నారదుడు) దానవులకు విష్ణుమాయా కల్పితమైన బుద్ధిమోహాన్ని కల్గించారు. స్త్రీలకు విపరీతాచారాల్ని బోధించారు. మాయాపురుషుడు మరియు నారదుడు అవ్యయులై, నిరాకులతతో సుఖాసీనులయ్యారు.

**ఏవం నష్టే తదా ధర్మే శ్రౌతస్మార్తే సుశోభనే ॥93॥**

**పాషండే ఖ్యాపితే తేన విష్ణునా విశ్వయోనినా ।**
**త్యక్తే మహేశ్వరే దైత్యైస్త్యక్తే లింగార్చనే తథా ॥94॥**

**స్త్రీ ధర్మే నిఖిలే నష్టే దురాచారే వ్యవస్థితే ।**
**కృతార్థ ఇవ దేవేశో దేవైః సార్ధముమాపతిమ్ ॥95॥**

**తపసా ప్రాప్య సర్వజ్ఞం తుష్టావ పురుషోత్తమః ।**

ఈ విధంగా పరమోత్తమమైన శ్రుతిస్మృతిధర్మం నశించగా, విశ్వకర్త అయిన తన ద్వారా పాషండవాదం స్థాపింపబడగా, దానవులు శంకరుణ్ణి త్యజించి, లింగపూజను పరిత్యజించారు, అందువల్ల స్త్రీ ధర్మం సంపూర్ణంగా

నశించి దురాచారం స్థాపించబడగా విష్ణుదేవుడు కృతార్థుడయ్యాడు. విష్ణువు దేవతలందరితో కలిసి తపస్సు చేసి సర్వజ్ఞుడైన ఉమాపతిని పొందినవాడై ఆయన్ని విష్ణువు ఇలా స్తుతిస్తున్నాడు.

**శ్రీభగవాన్ ఉవాచ :-** శ్రీ భగవంతుడు పలికాడు.

**మహేశ్వరాయ దేవాయ నమస్తే పరమాత్మనే ॥96॥**

**నారాయణాయ శర్వాయ బ్రహ్మణే బ్రహ్మరూపిణే ।**
**శాశ్వతాయ హ్యనంతాయ అవ్యక్తాయ చ తే నమః ॥97॥**

మహేశ్వరా! దేవా! పరమాత్మా! నీకు నమస్కారం. నారాయణా! శర్వా! బ్రహ్మా! బ్రహ్మరూపా! శాశ్వతా! అనంతా! అవ్యక్తా! నీకు అభివందనం.

**సూత ఉవాచ :-** సూతుడు పలికాడు.

**ఏవం స్తుత్వా మహాదేవం దండవత్ప్రణిపత్య చ ।**
**జజాప రుద్రం భగవాన్ కోటివారం జలే స్థితః ॥98॥**

**దేవాశ్చ సర్వే తే దేవం తుష్టువుః పరమేశ్వరమ్ ।**
**సేంద్రాః ససాధ్యాః సయమాః సరుద్రాః సమరుద్గణాః ॥99॥**

ఈ విధంగా విష్ణుభగవానుడు మహాదేవుణ్ణి స్తుతించి దండం వలె సాగిలబడి నమస్కరించి, నీటిలో నిలిచి ఒక కోటిసార్లు రుద్రమంత్రాన్ని జపించాడు. తర్వాత దేవతలందరితో అనగా ఇంద్రుడూ, సాధ్యులు, యముడు, రుద్రగణం, మరుద్గణాలతో కలిసి విష్ణుదేవుడు పరమేశ్వరుణ్ణి ఇలా స్తుతిస్తున్నారు.

**దేవా ఊచుః :-** దేవతలు పలికారు.

**నమః సర్వాత్మనే తుభ్యం శంకరాయార్తిహారిణే ।**
**రుద్రాయ నీలరుద్రాయ కద్రుద్రాయ ప్రచేతసే ॥100॥**

**గతిర్నః సర్వదాస్మాభిర్వంద్యో దేవారిమర్దనః ।**
**త్వమాదిస్త్వమనంతశ్చ అనంతశ్చాక్షయః ప్రభుః ॥101॥**

**ప్రకృతిః పురుషః సాక్షాత్స్రష్టా హర్తా జగద్గురో ।**
**త్రాతా నేతా జగత్యస్మిన్ ద్విజానాం ద్విజవత్సలః ॥102॥**

**వరదో వాఙ్మయో వాచ్యో వాచ్యవాచకవర్జితః ।**
**యాజ్యో ముక్త్యర్థమీశానో యోగిభిర్యోగవిభ్రమైః ॥103॥**

**హృత్పుండరీకసుషిరే యోగినాం సంస్థితః సదా ।**
**వదంతి సూరయః సంతం పరం బ్రహ్మస్వరూపిణమ్ ॥104॥**

**భవంతం తత్త్వమిత్యార్యాస్తేజోరాశిం పరాత్పరమ్ ।**
**పరమాత్మాన మిత్యాహురస్మిఞ్జగతి తద్విభో ॥105॥**

**దృష్టం శ్రుతం స్థితం సర్వం జాయమానం జగద్గురో ।**
**అణోరల్పతరం ప్రాహుర్మహతోఽపి మహత్తరమ్ ॥106॥**

**సర్వతః పాణిపాదం త్వాం సర్వతోఽక్షి శిరోముఖమ్ ।**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠసి ॥107॥**

సర్వాత్ముడవు, శంకరుడవు, దుఃఖనాశకుడవు, రుద్రుడవు, నీలరుద్రుడవు, కద్రుద్రువుడవు (ప్రశస్తరుద్రుడు) ప్రచేతసుడవు అయిన నీకు నమస్కారం. నీవు ఈ మా జనానికి గతివి. దైత్యనాశకుడవైన నీవు ఎల్లప్పుడూ మాకు వంద్యుడవు. నీవు ఆదివి. అంతరహితుడవు. నీవు అనంతరూపుడవు (శేషరూపుడు) అక్షయుడవు. ప్రభుత కల్గినవాడవు. జగద్గురూ! నీవు ప్రకృతివి. పురుషుడివి. సాక్షాత్తు స్రష్టవు. రక్షకుడవు. లయకారుడవు. ఓ ద్విజవత్సలా! నీవు ఈ జగత్తులో ద్విజులనాయకుడివి. నీవు వరదుడవు. వాఙ్మయుడవు. వాచ్యుడవు, వాచ్యవాచక రహితుడవు. ఈశ్వరుడవు. మోక్షార్థులై యోగపరాయణులైన యోగులచేత పూజితుడవు. యోగుల యొక్క హృదయకమలరంధ్ర మందు ఎల్లప్పుడూ ఉండెడివాడవు. పండితులు సర్వవ్యాపివని, శ్రేష్ఠుడవని, బ్రహ్మస్వరూపుడవని పలుకుతున్నారు. ఓ ప్రభూ! ఋషిగణాలు నిన్ను ఈ జగత్తులో తత్త్వస్వరూపుడవని, తేజోరాశివని, పరాత్పరుడవని, పరమాత్ముడవని చెబుతున్నారు. ఓ జగద్గురూ! నీవు దృష్టివి, శ్రుతివి. స్థితుడవు. జన్మించినవాడవు. నీవు అణువుకంటె సూక్ష్మమైన వాడవు. మహత్తు కంటే మహత్తరమైనవాడవు. నీవు అన్నివైపుల చేతులు, కాళ్లు కలవాడివి. అన్నివైపుల నేత్రాలు, శిరస్సులు, ముఖాలు గలవాడివి. అన్నివైపుల చెవులు గలవాడివి. ఈలోకమందు నీవు అంతటిని ఆవరించి ఉన్నావు.

**మహాదేవమనిర్దేశ్యం సర్వజ్ఞం త్వామనామయమ్ ।**
**విశ్వరూపం విరూపాక్షం సదాశివమనామయమ్ ॥108॥**

**కోటిభాస్కరసంకాశం కోటిశీతాంశుసన్నిభమ్ ।**
**కోటి కాలాగ్ని సంకాశం షడ్వింశకమనీశ్వరమ్ ॥109॥**

**ప్రవర్తకం జగత్యస్మిన్ ప్రకృతేః ప్రపితామహమ్ ।**
**వదంతి వరదం దేవం సర్వావాసం స్వయంభువమ్ ॥110॥**

**శ్రుతయః శ్రుతిసారం త్వాం శ్రుతిసారవిదో జనాః ॥111॥**

లోకులు నిన్ను "మహాదేవుడు, అనిర్దేశ్యుడు, సర్వజ్ఞుడు, అనామయుడు, విశ్వరూపుడు, విరూపాక్షుడు, సదాశివుడు, నిర్వికారుడు, కోటిసూర్యప్రకాశసమానప్రకాశవంతుడు, కోటిచంద్రుల కాంతితో సమానమైన కాంతిమంతుడు, కోటి కాలాగ్ని తేజస్సులతో సమానమైన తేజస్సుగలవాడు, ఇరవై ఆరుతత్త్వాలతో కూడినవాడు, అనీశ్వరుడు, ఈ జగత్తులో ప్రకృతిరూపంలో ప్రవర్తించువాడు, ప్రపితామహుడు, అన్నింటికి ఆవాసస్వరూపుడు,

స్వయంభువుడు, వరాలిచ్చువాడు" అని కీర్తిస్తున్నారు. శ్రుతులు, శ్రుతితత్త్వాలు తెలిసిన జనులు నిన్ను వేదసారమని చెబుతున్నారు.

**అదృష్టమస్మాభిరనేకమూర్తే వినా కృతం యద్భవతాథ లోకే ।**
**త్వమేవ దైత్యాన్ సురభూతసంఘాన్ దేవాన్నరాన్స్థావరజంగమాంశ్చ ॥112॥**

అనేకరూపీ! ఈ లోకంలో నీవు తప్ప వేరే దేనిని మేము చూడలేదు. నీకంటే భిన్నుడెవడూ ఈ విశ్వాన్ని రచించలేదు. నీవే దైత్యుల్ని, సురల్ని, భూతగణాల్ని, దేవతల్ని, మానవుల్ని, చరాచరాల్ని సృష్టించావు.

**పాహి చాన్యా గతిః శంభో వినిహత్యాసురోత్తమాన్ ।**
**మాయయా మోహితాః సర్వే భవతః పరమేశ్వర ॥113॥**

ఓ శంకరా! మాకు మరెవ్వరూ అండ కాలేరు. నీవే మాకు గతివి. ఈ దానవశ్రేష్ఠుల్ని వధించి మాకు రక్ష కల్పించు. ఓ పరమేశ్వరుడా! జనులందరూ నీమాయతో మోహితులయ్యారు.

**యథా తరంగా లహరీసమూహా యుధ్యంతి చాన్యోన్యమపాంనిధౌ చ ।**
**జలాశ్రయాదేవ జడీకృతాశ్చ సురాసురాస్తద్వదజస్య సర్వమ్ ॥114॥**

సముద్రతరంగాలు, లహరులు ఒకదానితో ఒకటి కొట్టుకొని మరల ఆ జలాశ్రయమందే జడీభూతాలై విలీనం చెందుతున్నాయో, ఆ విధంగానే బ్రహ్మసృష్టిలో దేవదానవులు మరియు ఇతరులు విరోధించుకుని చివరిలో జడీభూతులై నీలో విలీనం చెందుతున్నారు.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**య ఇదం ప్రాతరుత్థాయ శుచిర్భూత్వా జపేన్నరః ।**
**శృణుయాద్వా స్తవం పుణ్యం సర్వకామమవాప్నుయాత్ ॥115॥**

ఏ మానవుడు ప్రాతఃకాలంలో నిద్రలేచి స్నానాదులతో పరిశుద్ధుడై, ఈ పవిత్రమైన స్తుతిని పఠిస్తాడో, వింటాడో ఆతడు అన్ని ఇష్టసిద్ధుల్ని పొందుతాడు.

**స్తుతస్త్వేవం సురైర్విష్ణోర్జపేన చ మహేశ్వరః ।**
**సోమః సోమామథాలింగ్య నందిదత్తకరః స్వయమ్ ॥116॥**

**ప్రాహ గంభీరయా వాచా దేవానాలోక్య శంకరః ।**
**జ్ఞాతం మయేదమధునా దేవకార్యం సురేశ్వరాః ॥117॥**

**విష్ణోర్మాయాబలం చైవ నారదస్య చ ధీమతః ।**
**తేషామధర్మనిష్ఠానాం దైత్యానాం దేవసత్తమాః ॥118॥**

**పురత్రయవినాశం చ కరిష్యేఽహం సురోత్తమాః ।**

ఈ విధంగా సురలచేత స్తుతింపబడి, మరియు విష్ణువుచేత జపింపబడి, శివుడు ప్రసన్నుడై ఉమాదేవిని కౌగిలించుకుని, నందీశ్వరుడి మీద చేయివేసి దేవతలవైపు చూచి గంభీరంగా ఇలా పలికాడు. ఓ దేవతలారా! నేనిప్పుడు దేవకార్యాన్ని తెలుసుకున్నాను. బుద్ధిమంతుడైన విష్ణువు యొక్కయు నారదుడి యొక్కయు మాయాబలాన్ని గుర్తించాను. ఓ శ్రేష్ఠదేవతలారా! నేను అధర్మనిష్ఠులైన ఆ దానవుల యొక్క త్రిపురాల్ని నశింపజేస్తాను.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**అథ సబ్రహ్మకా దేవాః సేంద్రోపేంద్రాః సమాగతాః ॥119॥**

**శ్రుత్వా ప్రభోస్తదా వాక్యం ప్రణేముస్తుష్టువుశ్చ తే।**
**అప్యేతదంతరం దేవీ దేవమాలోక్య విస్మితా ॥120॥**

**లీలాంబుజేన చాహత్య కలమాహ వృషధ్వజమ్।**

దగ్గరకు చేరిన బ్రహ్మ విష్ణువులు, దేవతలు ప్రభువు శివుడి యొక్క వచనాలు విని, ఆయనకు నమస్కరించి, స్తుతించారు. తర్వాత విస్మిత అయిన ఉమాదేవి శివుణ్ణి చూచి తన లీలాకమలంతో శివుణ్ణి తాకి ఈ విధంగా పలికింది.

**దేవ్యువాచ** – ఉమాదేవి పలికింది.

**క్రీడమానం విభో పశ్య షణ్ముఖం రవిసన్నిభమ్ ॥121॥**

**పుత్రం పుత్రవతాం శ్రేష్ఠం భూషితం భూషణైః శుభైః ।**
**ముకుటైః కటకైశ్చైవ కుండలైర్వలయైః శుభైః ॥122॥**

**నూపురైశ్ఛన్నవారైశ్చ తథా హ్యుదరబంధనైః ।**
**కింకిణీభిరనేకాభిర్హేమైరశ్వత్థపత్రకైః ॥123॥**

**కల్పకద్రుమజైః పుష్పైః శోభితైరలకైః శుభైః ।**
**హారైర్వారీజరాగాది మణిచిత్రై స్తథాంగదైః ॥124॥**

**ముక్తాఫలమయైర్హారైః పూర్ణచంద్రసమప్రభైః ।**
**తిలకైశ్చ మహాదేవ పశ్య పుత్రం సుశోభనమ్ ॥125॥**

**అంకితం కుంకుమాద్యైశ్చ వృత్తం భసితనిర్మితమ్ ।**
**వక్త్రవృందం చ పశ్యేశ వృందం కామలకం యథా ॥126॥**

**నేత్రాణి చ విభో పశ్య శుభాని త్వం శుభాని చ ।**
**అంజనాని విచిత్రాణి మంగలార్థం చ మాతృభిః ॥127॥**

**గంగాదిభిః కృత్తికాద్యైః స్వాహయా చ విశేషితః ।**

ఓ ప్రభూ! పుత్రవంతులలో శ్రేష్ఠుడు, ఉత్తమ భూషణాలతో ప్రకాశించువాడూ, సూర్యసమానతేజస్కుడూ అయిన ఆటలాడుతున్న షణ్ముఖుణ్ణి చూడు. ఓ మహాదేవుడా! మకుటాలతోనూ, కటకాలతోనూ, కుండలాలతోను, సుందరమైన గాజులతోనూ, నూపురాలతోనూ, ఛన్నవారాలతోను, ఒడ్డాణాలతోను, అనేకాలైన కింకిణులతోనూ, స్వర్ణమయాలైన అశ్వత్థపత్రాలతోను, కల్పవృక్షపుష్పాలతో ప్రకాశిస్తున్న అందమైన ముంగురులతోను, పద్మరాగమణులతో కూర్చిన హారాలతోనూ, అంగదాలతోనూ, పూర్ణచంద్రుడితో సమానమైన కాంతిగల ముత్యాలహారాలతోనూ, తిలకాలతోనూ(బొట్టు) అలంకరింపబడిన పుత్రుణ్ని చూడు. ఓ ఈశ్వరుడా! కుంకుమాదులతో కూడిన భస్మంతో విరచించిన వృత్తాకారంలోగల బొట్టుతో కూడిన పద్మసదృశమైన ఆతడి ముఖాన్ని చూడు. ఓ ప్రభూ! ఆతడి అత్యంత సుందరమైన నేత్రాల్ని చూడు. గంగాదులు, మరియు కృత్తికాదులు మరియు విశేషరూపంగల స్వాహాదేవి అనే మాతల ద్వారా మంగళార్థం ధరింపజేసిన కాటుకమున్నగువాటిని చూడు.

**ఇత్యేవం లోకమాతుశ్చ వాగ్భిః సంబోధితః శివః ॥128॥**

**న యయౌ తృప్తిమీశానః పిబన్ స్కందాననామృతమ్ ।**
**న సస్మార చ తాన్ దేవాన్ దైత్యశస్త్ర నిపీడితాన్ ॥129॥**

**స్కందమాలింగ్య చాఘ్రాయ నృత్య పుత్రేత్యువాచ హ ।**
**సోఽపి లీలాలసో బాలో ననర్తార్తిహరః ప్రభుః ॥130॥**

**సహైవ ననృతుశ్చాన్యే సహ తేన గణేశ్వరాః ।**
**త్రైలోక్యమఖిలం తత్ర ననర్తేశాజ్ఞయా క్షణమ్ ॥131॥**

**నాగాశ్చ ననృతుః సర్వే దేవాః సేంద్రపురోగమాః ।**
**తుష్టువుర్గణపాః స్కందం ముమోదాంబా చ మాతరః ॥132॥**

**ససృజుః పుష్పవర్షాణి జగుర్గంధర్వకిన్నరాః ।**
**నృత్యామృతం తదా పీత్వా పార్వతీపరమేశ్వరౌ ।**
**అవాపతుస్తదా తృప్తిం నందినా చ గణేశ్వరాః ॥133॥**

ఈ విధంగా జగజ్జనని ఉమాదేవి పలుకగా శివుడు కార్తికేయుడి యొక్క ముఖారవిందామృతపానం చేసినా తృప్తి చెందలేదు. దానవుల శస్త్రాలతో పీడింపబడిన దేవతల్ని శివుడు స్మరించలేదు. శివుడు స్కందుణ్ణి కౌగిలించుకుని శిరసును ఆఘ్రాణించాడు. పుత్రా! నాట్యం చేయమని పలికాడు. కష్టాల్ని దూరం చేసే ఆ కార్తికేయుడు లీలలు చూపుతూ నర్తించాడు. ఆతడితో పాటే ఇతర గణనాథులందరూ నృత్యం చేశారు. క్షణకాలం ఈశ్వరుడి ఆజ్ఞవల్ల త్రిలోకాలు నర్తించాయి. నాగులు, ఇంద్రుడితో కూడిన దేవతలందరూ నర్తించారు. గణనాథులు స్కందుణ్ణి స్తుతించారు. అపుడు పార్వతీదేవి మరియు ఇతర మాతలు ఆనందించారు. గంధర్వులు, కిన్నరులు గానం చేస్తూ పుష్పవృష్టి కురిపించారు. నాట్యామృతాన్ని పానం చేసి పార్వతీపరమేశ్వరులు సంతృప్తులయ్యారు. నందితో కూడిన గణనాథులంతా సంతృప్తులయ్యారు.

**తతః స నందీ సహ షణ్ముఖేన తథా చ సార్థం గిరిరాజపుత్ర్యా ।**
**వివేశ దివ్యం భవనం భవోఽపి యథాంబుదోఽన్యాంబుదమంబుదాభః ॥134॥**

తర్వాత సూర్యసమాన తేజస్సుగల శివుడు, నందీశ్వరుడు, స్కందుడు పార్వతీదేవితో కలిసి – ఒక మేఘం మరో మేఘంతో కలిసినట్లు భవనప్రవేశం చేశారు.

**ద్వారస్య పార్శ్వే తే తస్థుర్దేవా దేవస్య ధీమతః ।**
**తుష్టువుశ్చ మహాదేవం కించిదుద్విగ్నచేతసః ॥135॥**

**కింతు కింత్వితి చాన్యోన్యం ప్రేక్ష్య చైతత్సమాకులాః ।**
**పాపా వయమితి హ్యన్యే అభాగ్యాశ్చేతి చాపరే ॥136॥**

**భాగ్యవంతశ్చ దైత్యేంద్రా ఇతి చాన్యే సురేశ్వరాః ।**
**పూజాఫలమిమం తేషామిత్యన్యే నేతి చాపరే ॥137॥**

దేవతలు బుద్ధిమంతుడైన శివుడి భవనద్వారం ప్రక్కన నిలిచినవారై కొద్దిగా వ్యాకులచిత్తులై మహాదేవుణ్ణి స్తుతించారు. వ్యాకులపడి ఒకరినొకరు చూచుకుంటూ ఏమిటిది ఏమిటిది అని మాట్లాడుకున్నారు. మనం పాపులం అని ఒకడు. మనం అభాగ్యులం అని మరొకడు, దైత్యులు భాగ్యవంతులని ఇంకొకడు అన్నారు. ఇంకొకడు అది వారి పూజాఫలమన్నాడు. మరొకడు అది కాదన్నాడు.

**ఏతస్మిన్నంతరే తేషాం శ్రుత్వా శబ్దాననేకశః ।**
**కుంభోదరో మహాతేజాః దండేనాతాడయత్సురాన్ ॥138॥**

**దుద్రువుస్తే భయావిష్టా దేవా ఆహేతివాదినః ।**
**అపతన్ మునయశ్చాన్యే దేవాశ్చ ధరణీతలే ॥139॥**

ఈ మధ్యలో అనేకాలైన వీరి మాటల్ని విని మహాకాంతిమంతుడైన కుంభోదరుడు దేవతల్ని దండంతో కొట్టాడు. అప్పుడు ఆ దేవతలందరూ భయపడినవారై హాహాకారాలు చేశారు. మునులు, దేవతలు కొందరు భూమిపై పడి దొర్లారు.

**అహో విధేర్బలం చేతి మునయః కశ్యపాదయః ।**
**దృష్ట్వాపి దేవదేవేశః దేవానాం చాసురద్విషామ్ ॥140॥**

**అభాగ్యాన్న సమాప్తం తు కార్యమిత్యపరే ద్విజాః ।**
**ప్రోచుర్నమఃశివాయేతి పూజ్య చాల్పతరం హృది ॥141॥**

కశ్యపాది మునులు ఇలాఅన్నారు. విధి యొక్క బలం ఇంతటి అద్భుతమని. ఓ ద్విజులారా! ఇతరులు ఇలా అన్నారు. దేవాధిదేవుడైన శివుణ్ణి దర్శించి కూడా రాక్షసవిరోధులైన దేవతల అభాగ్యంవల్ల కార్యం పరిపూర్ణం కాలేదు. తర్వాత వారు హృదయంలో శివుణ్ణి మిక్కిలిగా పూజించి "శివుడికి నమస్కార"మని పలికారు.

**తతః కపర్దీ నందీశో మహాదేవప్రియో మునిః ।**
**శూలీ మాలీ తథా హాలీ కుండలీ వలయీ గదీ ॥142॥**

**వృషమారుహ్య సుశ్వేతం యయౌ తస్యాజ్ఞయా తదా ।**
**తతో వై నందినం దృష్ట్వా గణః కుంభోదరోఽపి సః ॥143॥**

**ప్రణమ్య నందినం మూర్ధ్నా సహ తేన త్వరన్ యయౌ ।**
**నందీ భాతి మహాతేజా వృషపృష్ఠే వృషధ్వజః ॥144॥**

**సగణో గణసేనానీర్మేఘపృష్ఠే యథా భవః ।**
**దశయోజనవిస్తీర్ణం ముక్తాజాలైరలంకృతమ్ ॥145॥**

**సితాతపత్రం శైలాదేరాకాశమివ భాతి తత్ ।**
**తత్రాంతర్బద్ధమాలా సా ముక్తాఫలమయీ శుభా ॥146॥**

**గంగాకాశాన్నిపతితా భాతి మూర్ధ్ని విభోర్యథా ।**

తర్వాత జటాజూటి, త్రిశూలి, మాలాధారి, హలధారి, కుండలధారి, కంకణధారి అయిన శివుడికి ఇష్టుడైన నందీశ్వరుడు అందమైన, తెల్లనిదైన వృషభాన్ని అధిరోహించి శివుడి ఆజ్ఞ ప్రకారం బయటకు వచ్చాడు. నందిని చూచిన గణనాథులు కుంభోదరుడితో కూడా శిరసులతో ఆతడికి నమస్కరించి త్వరపడుతున్న ఆతడి దగ్గరకు వెళ్లారు. గణసహితుడైన ఆ మహాతేజస్వి, గణనాథుడు అయిన నందీశ్వరుడు వృషభంపై కూర్చుండి వృషధ్వజుడైన శివుడు మాదిరిగానే కన్పించాడు– మేఘం వెనుకలోని శివుడు మాదిరిగా నందీశ్వరుడు దశయోజనాల వైశాల్యంగల శ్వేతఛత్రాన్ని పట్టుకున్నాడు. అది ఆకాశం మాదిరిగా ఉన్నది. ముత్యాలపేరులతో అలంకరింపబడి ఉంది. దాని లోపల ఏర్పరచిన మంగళకరమైన ఆ ముత్యాలమాల శివుడి శిరస్సుపై ఆకాశం నుండి జారే గంగాజలంలాగా ఉంది.

**అథ దృష్ట్వా గణాధ్యక్షం దేవదుందుభయః శుభాః ॥147॥**

**నియోగాద్వజ్రిణః సర్వే వినేదుర్ముని పుంగవాః ।**
**తుష్టువుశ్చ గణేశానం వాగ్భిరిష్టప్రదం శుభమ్ ॥148॥**

**యథా దేవా భవం దృష్ట్వా ప్రీతి కంటకితత్వచః ।**

ఓ మునిశ్రేష్ఠులారా! తర్వాత గణాధ్యక్షుడైన నందిని చూచి ఇంద్రుడి ఆజ్ఞతో దివ్యమైన దేవదుందుభులు మ్రోగాయి. దేవతలందరు శుభంకరుడు, వాంఛితసిద్ధి కారకుడగు గణనాథుణ్ణి స్తుతించారు. ఇంతలో శివుణ్ణి చూచి దేవతలందరు సంప్రీతిని పొంది పులకితదేహులై ఆయన్ని స్తుతించారు.

**నియోగాద్వజ్రిణో మూర్ధ్ని పుష్పవర్షం చ ఖేచరాః ॥149॥**

**వవృషుశ్చ సుగంధాఢ్యం నందినో గగనోదితమ్ ।**
**వృష్ట్యా తుష్టస్తదా రేజే తుష్ట్యా పుష్ట్యా యథార్థయా ॥150॥**

**నందీ భవశ్చాంద్రయా తు స్నాతయా గంధవారిణా ।**
**పుష్పై ర్నానావిధైస్తత్ర భాతి పృష్ఠం వృషస్య తత్ ॥151॥**

**సంకీర్ణం తు దివః పృష్ఠం నక్షత్రైరివ సువ్రతాః ।**
**కుసుమైః సంవృతో నందీ వృషపృష్ఠే రరాజ సః ॥152॥**

**దివః పృష్ఠే యథా చంద్రో నక్షత్రైరివ సువ్రతాః ।**

ఆకాశసంచారులైన దేవగణాలు ఇంద్రుడి ఆజ్ఞతో నందీశ్వరుడి శిరసుపైన ఆకాశం నుంచి సుగంధభరితమైన పుష్పవర్షాన్ని కురిపించారు. తుష్టి మరియు పుష్టియు గలిగిన యథార్థ వృష్టి వలన నంది ప్రసన్నుడై ప్రకాశించాడు. అట్లే శివుడు కూడా సుగంధజలంతో తడిసిన చంద్రరేఖతో శోభించాడు. వృషభం యొక్క పృష్ఠభాగం అనేక పుష్పప్రకరాలతో ప్రకాశించింది. ఆ పుష్పాలు ఆయన శిరసుపై ఆకాశంలో వ్యాపించిన తారాగణాల మాదిరిగా ప్రకాశించాయి. పుష్పాలతో నిండిన నంది వృషభం యొక్క వెనుకభాగంలో కూర్చుండి – పగటి యొక్క చివరిలో నక్షత్రాలతో కూడిన చంద్రుడి మాదిరిగా ప్రకాశించాడు.

**తం దృష్ట్వా నందినం దేవాః సేంద్రోపేంద్రాస్తథావిధమ్ ॥153॥**

**తుష్టువుర్గణపేశానం దేవదేవమివాపరమ్ ।**

పై విధంగా ప్రకాశిస్తున్న నందీశ్వరుణ్ణి, ఇంద్రుడు, ఉపేంద్రుడైన విష్ణువుతో కూడిన దేవతలు చూచి రెండో దేవాధిదేవుడైన శివుడు మాదిరిగా భావించి స్తుతించారు.

**దేవాః ఊచుః** – దేవతలు పలికారు.

**నమస్తే రుద్రభక్తాయ రుద్రజాప్యరతాయ చ ॥154॥**

**రుద్రభక్తార్తినాశాయ రౌద్రకర్మరతాయ తే ।**
**కూష్మాండ గణనాథాయ యోగినాం పతయే నమః ॥155॥**

**సర్వదాయ శరణ్యాయ సర్వజ్ఞాయార్తిహారిణే ।**
**వేదానాం పతయే చైవ వేదవేద్యాయ తే నమః ॥156॥**

**వజ్రిణే వజ్రదంష్ట్రాయ వజ్రి వజ్ర నివారిణే ।**
**వజ్రాలంకృతదేహాయ వజ్రిణారాధితాయ తే ॥157॥**

**రక్తాయ రక్తనేత్రాయ రక్తాంబరధరాయ తే ।**
**రక్తానాం భవపాదాబ్జే రుద్రలోకప్రదాయినే ॥158॥**

**నమః సేనాధిపతయే రుద్రాణాం పతయే నమః ।**
**భూతానాం భువనేశానాం పతయే పాపహారిణే ॥159॥**

**రుద్రాయ రుద్రపతయే రౌద్రపాపహరాయ తే ।**
**నమః శివాయ సౌమ్యాయ రుద్రభక్తాయ తే నమః ॥160॥**

రుద్రుడి భక్తుడికి, రుద్రజపపరాయణుడికి నమస్కారం. శివభక్తుల దుఃఖనాశకారకుడికి, భీకరమైన కర్మలు చేయువాడికి, కూష్మాండగణనాథుడికి, యోగుల ప్రభువు అయినవాడికి నమస్కారం. సర్వస్వాన్ని ఇచ్చువాడికి, శరణుజొచ్చిన వారిని రక్షించువాడికి, అన్నింటిని తెలిసినవాడికి, దుఃఖనాశకుడికి, వేదపతికి, వేదవేద్యుడికి నమస్కారం. వజ్రధారికి, వజ్రసమానమైన దంష్ట్రలు గలవాడికి, ఇంద్రుడి వజ్రాయుధాన్ని నివారించేవాడికి, వజ్రాలంకృతదేహుడికి, ఇంద్రుడి చేత కొలవబడిన వాడికి నమస్కారం. రక్తవర్ణంగలవాడికి, రక్తాక్షుడికి, రక్తవస్త్రధారికి శివుడి పాదాలయందు అనురక్తులైన వారికి శివలోకాన్ని ఇచ్చువాడికి నమస్కారం. సేనాధిపతికి, రుద్రగణాధ్యక్షుడికి, భూతపతికి, భువనేశ్వర ప్రభువుకు, పాపపరిహర్తకు నమస్కారం. రుద్రుడికి, రుద్రపతికి, భయంకరపాపహర్తకు నమస్కారం. శివుడికి, సౌమ్యుడికి, రుద్రభక్తుడికి నమస్కారం.

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**తతః ప్రీతో గణాధ్యక్షః ప్రాహ దేవాంశ్శిలాత్మజః ।**
**రథంచ సారథిం శంభోః కార్ముకం శరముత్తమమ్ ॥161॥**

**కర్తుమర్హథ యత్నేన నష్టం మత్వా పురత్రయమ్ ।**
**అథ తే బ్రహ్మణా సార్థం తథా వై విశ్వకర్మణా ॥162॥**

**రథం చక్రుః సుసంరబ్ధాః దేవదేవస్య ధీమతః ॥163॥**

అనంతరం ప్రసన్నాత్ముడైన శిలాదపుత్రుడు గణేశ్వరుడు నందీశ్వరుడు దేవతలతో ఇలా పలికాడు. త్రిపురాల నాశనం కోసం, మీరు శివుడి కోసం రథాన్ని, సారథిని, వింటిని, బాణాల్ని ప్రయత్నపూర్వకంగా నిర్మించండి. తర్వాత దేవతలు త్వరగా బ్రహ్మతో కూడిన విశ్వకర్మచేత ధీమంతుడైన శివభగవానుడికి రథాన్ని నిర్మింపజేశారు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే పురదాహే నందికేశ్వరవాక్యం నామైకసప్తతితమోఽధ్యాయః ॥71॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని పురదాహంలోని నందికేశ్వరవాక్యమనే డెబ్బై ఒకటవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## ద్విసప్తతితమోఽధ్యాయః - డెబ్బై రెండవ అధ్యాయం

## త్రిపురదాహే బ్రహ్మస్తవః - త్రిపురదాహం బ్రహ్మస్తవం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**అథ రుద్రస్య దేవస్య నిర్మితో విశ్వకర్మణా ।**
**సర్వలోకమయో దివ్యో రథో యత్నేన సాదరమ్ ॥1॥**

**సర్వభూతమయశ్చైవ సర్వదేవనమస్కృతః ।**
**సర్వేదేవమయశ్చైవ సౌవర్ణః సర్వసమ్మతః ॥2॥**

**రథాంగం దక్షిణం సూర్యో వామాంగం సోమ ఏవ చ ।**
**దక్షిణం ద్వాదశారం హి షోడశారం తథోత్తరమ్ ॥3॥**

**అరేషు తేషు విప్రేంద్రాశ్చాదిత్యా ద్వాదశైవ తు ।**
**శశినః షోడశారేషు కలా వామస్య సువ్రతాః ॥4॥**

**ఋక్షాణి చ తదా తస్య వామస్యైవ తు భూషణమ్ ।**
**నేమ్యః షడృతవశ్చైవ తయోర్వై విప్రపుంగవాః ॥5॥**

**పుష్కరం చాంతరిక్షం వై రథనీడశ్చ మందరః ।**
**అస్తాద్రిరుదయాద్రిశ్చ ఉభౌ తౌ కూబరౌ స్మృతౌ ॥6॥**

**అధిష్ఠానం మహామేరురాశ్రయాః కేసరాచలాః ।**
**వేగః సంవత్సరస్తస్య అయనే చక్రసంగమౌ ॥7॥**

**ముహూర్తా బంధురాస్తస్య శామ్యాశ్చైవ కలాః స్మృతాః ।**
**తస్య కాష్ఠాః స్మృతా ఘోణా చాక్షదండాః క్షణాశ్చ వై ॥8॥**

**నిమేషాశ్చానుకర్షాశ్చ ఈషా చాస్య లవాః స్మృతాః ।**

ఓ ఋషులారా! విశ్వకర్మ ప్రయత్నపూర్వకంగా ఆదరంగా రుద్రభగవానుడికి రథాన్ని నిర్మించాడు. ఆ రథం సమస్తలోకమయం. దివ్యం. సమస్తభూతమయం. దేవతలందరిచేత నమస్కరింపబడింది. దేవతలందరితోనూ కూడి యున్నది. అన్ని విధాల అనుకూలమైన సువర్ణరథం. ఆ రథం యొక్క కుడివైపు చక్రం సూర్యుడు. ఎడమవైపు చక్రం చంద్రుడు. కుడివైపు చక్రం పండ్రెండు ఆకులు గలది. ఎడమవైపుది పదహారు ఆకులు గలది. ఓ విప్రశ్రేష్ఠులారా! ఓ సువ్రతులారా! కుడి చక్రంలోని పండ్రెండు ఆకులు ద్వాదశాదిత్యులే. ఎడమచక్రమందలి 16 ఆకులు చంద్రుడి పదహారు కళలే. నక్షత్రాలు అన్నీ ఎడమచక్రానికి గల అలంకారాలు. ఆరు ఋతువులు రెండు చక్రాలకు ఏర్పరచిన పట్టాలు. పైకప్పు ఆకాశం. రథసారథి మందర పర్వతం. ఉదయాద్రి, అస్తాద్రులు దానికి ఇరువైపుల గల స్తంభాలు.

మేరు పర్వతం దాని అధిష్ఠానం. పీఠభాగం. (ముఖ్యమైన మధ్యస్థానం) కేసరపర్వతం మేరు పర్వతానికి ఆధారమై ఉన్నది. సంవత్సరం దాని వేగం. ఉత్తరాయణ దక్షిణాయనాలు ఇరుసులు. ముహూర్తం దాని యొక్క తల్పం. కళలు శమ్యలు. (గుండ్రని పట్టికలు) కాష్ఠలు దాని నాసిక. క్షణాలు దాని అక్షదండాలు. నిమిషాలు దాని క్రింది భాగం. నిమేషం కన్నా తక్కువ కాలవ్యవధి దానియొక్క ఈష. (రెండు అక్షాల్ని కలిపే కఱ్ఱ).

**ద్యౌర్వరూథం రథస్యాస్య స్వర్గమోక్షావుభౌ ధ్వజౌ ॥9॥**

**ధర్మో విరాగో దండోఽస్య యజ్ఞా దండాశ్రయాః స్మృతాః ।**
**దక్షిణాః సంధయస్తస్య లోహాః పంచాశదగ్నయః ॥10॥**

**యుగాంతకోటీ తౌ తస్య ధర్మకామావుభౌ స్మృతౌ ।**
**ఈషా దండస్తథావ్యక్తం బుద్ధిస్తస్యైవ నడ్వలః ॥11॥**

**కోణస్తథా హ్యహంకారో భూతాని చ బలం స్మృతమ్ ।**
**ఇంద్రియాణి చ తస్యైవ భూషణాని సమంతతః ॥12॥**

**శ్రద్ధా చ గతిరస్యైవ వేదాస్తస్య హయాః స్మృతాః ।**
**పదాని భూషణాన్యేవ షడంగాన్యుపభూషణమ్ ॥13॥**

**పురాణన్యాయమీమాంసాధర్మశాస్త్రాణి సువ్రతాః ।**
**వాలాశ్రయాః పటాశ్చైవ సర్వలక్షణ సంయుతాః ॥14॥**

**మంత్రా ఘంటాః స్మృతాస్తేషాం వర్ణాః పాదాస్తథాశ్రమాః ।**
**అవచ్ఛేదో హ్యనంతస్తు సహస్రఫణ భూషితః ॥15॥**

అంతరిక్షం ఈ రథం యొక్క కవచం. స్వర్గం, మోక్షం ఈ రెండూ ఈ రథానికి ధ్వజాలు. ధర్మం, మరియు విరాగం దీనియొక్క దండం. యజ్ఞం ఈ దండానికి ఆధారం. దక్షిణలు దీని సంధులు. (కూర్పులు) ఏబది అగ్నులు దీని సంధుల్ని బిగించే మేకులు. ధర్మం, కామం దాని కాడిమాను యొక్క చివరలు. అవ్యక్తతత్త్వం దాని ఈషదండం (మేడికోల). బుద్ధి దాని అక్షాన్ని మెత్తపరిచే తైలపాత్ర. అహంకారం దాని కోణం. పంచమహాభూతాలు దాని బలం. పంచేంద్రియాలు దానికి అన్నివైపుల అలంకరింపబడిన ఆభరణాలు. శ్రద్ధ దాని గమనం. నాల్గువేదాలు దానికి పూన్చిన గుఱ్ఱాలు. వేదపదవిభాగాలు దానికి ప్రధానమైన అలంకారాలు. శిక్ష మొదలైన షడంగాలు దాని ఉపాభరణాలు. ఓ సువ్రతులారా! పురాణాలు, న్యాయమీమాంసా శాస్త్రాలు, మరియు మన్వాది ధర్మశాస్త్రాలు అన్ని హంగులు గలిగిన వాలాశ్రయాలైన వస్త్రవిశేషాలు. గాయత్రి మొదలైన మంత్రాలు, వాటిలోని వర్ణాలు (అకార కకారాదులు) పాదాలు (ఛందస్సులోని నాల్గోభాగం) బ్రహ్మచర్యం మొదలైన ఆశ్రమాలు ఆ వస్త్రాల మీద అలంకరించిన చిరుగంటలు. వేయి తలల ఆదిశేషువు దానిని బంధించే త్రాడు.

**దిశః పాదా రథస్యాస్య తథా చోపదిశశ్చ హ ।**
**పుష్కరాద్యాః పతాకాశ్చ సౌవర్ణా రత్నభూషితాః ॥16॥**

**సముద్రాస్తస్య చత్వారో రథకంబలికాః స్మృతాః ।**
**గంగాద్యాః సరితః శ్రేష్ఠాః సర్వాభరణభూషితాః ॥17॥**

**చామరాసక్తహస్తాగ్రాః సర్వాః స్త్రీరూపశోభితాః ।**
**తత్ర తత్ర కృతస్థానాః శోభయాఞ్చక్రిరే రథమ్ ॥18॥**

దిక్కులు, విదిక్కులు ఈ రథానికి పాదాలు. పుష్కరాది మేఘాలు రత్నాలంకృతస్వర్ణపతాకలు. నాల్గు సముద్రాలు దాని వెలుపల అలంకరించిన కంబళులు. గంగ మొదలైన అన్ని నదులు సాలంకృతలై హస్తాలలో వింజామరలు దాల్చిన స్త్రీల మాదిరి అక్కడక్కడ నిలిచి రథానికి శోభను చేకూర్చాయి.

**ఆవహాద్యాస్తథా సప్త సోపానం హైమముత్తమమ్ ।**
**సారథిర్భగవాన్ బ్రహ్మా దేవాభీషుధరాః స్మృతాః ॥19॥**

**ప్రతోదో బ్రహ్మణస్తస్య ప్రణవో బ్రహ్మ దైవతమ్ ।**
**లోకాలోకాచలస్తస్య ససోపానః సమంతతః ॥20॥**

**విషమశ్చ తదా బాహ్యే మానసాద్రిః సుశోభనః ।**
**నాసాః సమంతతస్తస్య సర్వ ఏవాచలాః స్మృతాః ॥21॥**

ఆవహం మొదలైన ఏడు వాయువులు దీనియొక్క ఉత్తమమైన బంగారపు మెట్లు. బ్రహ్మదేవుడు సారథి. దేవతలు రథం యొక్క త్రాడుల్ని పట్టుకునేవారు. బ్రహ్మదైవతమైన ప్రణవం (ఓంకారం) బ్రహ్మ చేతులందలి కొరడా అయ్యింది. అన్ని లోకాలలోని పర్వతాలు ఈ రథానికి అన్నివైపుల దిగుటకు మెట్లు అయినవి. సుందరమైన మానసపర్వతం దిగడానికి ఉపయోగించే పాదపీఠి అయ్యింది. అన్ని పర్వతాలు అన్ని దిక్కులందూ ఈ రథానికి నాసికలు అయినాయి.

**లతాః కపోతాః కాపోతాః సర్వే తలనివాసినః ।**
**మేరురేవ మహాఛత్రం మందరః పార్శ్వడిండిమః ॥22॥**

**శైలేంద్రః కార్ముకం చైవ జ్యాభుజంగాధిపః స్వయమ్ ।**
**కాలరాత్ర్యా తథైవేహ తథేంద్రధనుషా పునః ॥23॥**

**ఘంటా సరస్వతీ దేవీ ధనుషః శ్రుతిరూపిణీ ।**
**ఇషుర్విష్ణుర్మహాతేజాః శల్యం సోమః శరస్య చ ॥24॥**

**కాలాగ్ని స్తచ్ఛరస్యైవ సాక్షాత్తీక్ష్ణః సుదారుణః ।**
**అనీకం విషసంభూతం వాయవో వాజకాః స్మృతాః ॥25॥**

తలాదులైన క్రింది ఏడులోకాలు దీనికి స్నానసాధనం. ఆలోకాలలో నివసించే ప్రజలందరూ కపోతపక్షులతో సమానం.

మేరుపర్వతం రథం యొక్క మేలిమిగొడుగు. మందర పర్వతం ప్రక్కవాద్యం. పర్వతరాజు హిమవంతుడు ధనువు. సర్పరాజు వాసుకి కాలరాత్రితో, ఇంద్రధనుస్సుతో పాటు వింటి త్రాడు అయ్యాడు. శ్రుతి స్వరూపిణి అయిన సరస్వతీదేవి ధనుస్సుకు చిరుగంట అయినది. మహాకాంతిమంతుడైన విష్ణువు బాణం. బాణపు ములికి చంద్రుడయ్యాడు. ప్రళయాగ్ని స్వయంగా ఆ బాణపు ములికికి పూసిన తీక్ష్ణమైన అతిభయంకరమైన విషమయమైన బలం అయ్యింది. ఆవహాది వాయువులు ఆ బాణానికి రెక్కలు అయ్యాయి.

**ఏవం కృత్వా రథం దివ్యం కార్ముకం చ శరం తథా ।**
**సారథిం జగతాం చైవ బ్రహ్మాణం ప్రభుమీశ్వరమ్ ॥26॥**

**ఆథారోహ రథం దివ్యం రణమండనధృగ్భవః ।**
**సర్వదేవగణైర్యుక్తం కంపయన్నివ రోదసీ ॥27॥**

ఈ విధంగా దివ్యరథాన్ని, ధనుస్సును, బాణాన్ని, లోకాలకు ప్రభువైన బ్రహ్మను సారథిగా చేసుకుని యుద్ధానికి అనువైన కవచం, కిరీటం మొదలైన ఆభరాణాల్ని ధరించి శివుడు సమస్త దేవగణాలతో కూడినవాడై ఆకాశం కంపించే విధంగా ఆ దివ్యరథాన్ని అధిరోహించాడు.

**ఋషిభిః స్తూయమానశ్చ వంద్యమానశ్చ వందిభిః ।**
**ఉపనృత్యశ్చాప్సరసాం గణైర్నృత్యవిశారదైః ॥28॥**

**సుశోభమానో వరదః సంప్రేక్షైవ చ సారథిమ్ ।**
**తస్మిన్నారోహతి రథం కల్పితం లోకసంభృతమ్ ॥29॥**

**శిరోభిః పతితా భూమిం తురగా వేదసంభవాః ।**
**అథాధస్తాద్రథస్యాస్య భగవాన్ ధరణీధరః ॥30॥**

**వృషేంద్రరూపీ చోత్థాప్య స్థాపయామాస వై క్షణమ్ ।**
**క్షణాంతరే వృషేంద్రోఽపి జానుభ్యామగమద్ధరామ్ ॥31॥**

**అభీషుహస్తో భగవానుద్యమ్య చ హయాన్ విభుః ।**
**స్థాపయామాస దేవస్య వచనాద్వై రథం శుభమ్ ॥32॥**

**తతోఽశ్వాంశ్చోదయామాస మనోమారుతరంహసః ।**
**పురాణ్యుద్దిశ్య స్వస్థాని దానవానాం తరస్వినామ్ ॥33॥**

ఋషుల చేత స్తుతింపబడినవాడు, నమస్కరింపదగినవారి చేత నమస్కరింపబడినవాడు, నాట్యకళాప్రవీణలైన అప్సరసలచేత నృత్యం ప్రదర్శింపబడినవాడు, మిక్కిలి శోభిల్లుతున్నవాడైన వరదాత, శివభగవానుడు సారథిని చూచి ప్రసిద్ధ లోకవస్తు సముదాయంతో నిర్మించిన ఆరథాన్ని ఎక్కగా వేదస్వరూపాలైన అశ్వాల శిరస్సులు భూమిపై వాలినవి. తర్వాత వృషభేంద్రరూపధారి అయిన శేషుడు రథం క్రిందకు చేరి క్షణకాలంలో పైకి లేపి యథాస్థితికి తెచ్చాడు. క్షణకాలం తర్వాత శేషుడు కూడా మోకాళ్లమీద భూమిపై పడ్డాడు. పగ్గాల్ని

చేతబూనిన సర్వవ్యాపనుడైన బ్రహ్మ శివుడి ఆదేశానుసారం గుఱ్ఱాల్ని ఉత్సాహపర్చి ఆ శుభకరమైన రథాన్ని యథాస్థితికి తెచ్చాడు. తర్వాత బ్రహ్మ వాయువేగ మనోవేగంతో గుఱ్ఱాల్ని ఆకాశంలోగల సాహసవంతులైన దానవుల యొక్క పురాలవైపుకు నడిపాడు.

**అథాహ భగవాన్ రుద్రో దేవానాలోక్య శంకరః ।**
**పశూనామాధిపత్యం మే దత్తం హన్మి తతోఽసురాన్ ॥34॥**

**పృథక్ పశుత్వం దేవానాం తథాన్యేషాం సురోత్తమాః ।**
**కల్పయిత్వైవ వధ్యాస్తే నాన్యథా నైవ సత్తమాః ॥35॥**

తర్వాత రుద్రభగవానుడైన శంకరుడు దేవతలను చూచి "నాకు పశుపతిత్వం ఇవ్వబడింది. కావున నేను దానవుల్ని చంపుతాను" అన్నాడు. ఓ దేవశ్రేష్ఠులారా! దేవతలకు రాక్షసులకు పశుత్వం వేరువేరుగా సిద్ధించిన కారణంగా ఆ రాక్షసులు వధార్హులయ్యారు. ఇందుకు భిన్నంగా జరుగదు.

**ఇతి శ్రుత్వా వచః సర్వం దేవదేవస్య ధీమతః ।**
**విషాదమగమన్ సర్వే పశుత్వం ప్రతి శంకితాః ॥36॥**

బుద్ధిమంతుడు, దేవదేవుడు అయిన శివుడు పల్కిన మాటలన్నింటిని విన్న దేవతలు పశుత్వాన్ని గూర్చి శంకగలవారై విషాదగ్రస్తులయ్యారు.

**తేషాం భావం తతో జ్ఞాత్వా దేవస్తానిదమబ్రవీత్ ।**
**మా వోఽస్తు పశుభావోఽస్మిన్ భయం విబుధసత్తమాః ॥37॥**

**శ్రూయతాం పశుభావస్య విమోక్షః క్రియతాం చ సః ।**
**యో వై పాశుపతం దివ్యం చరిష్యతి స మోక్ష్యతి ॥38॥**

**పశుత్వాదితి సత్యం చ ప్రతిజ్ఞాతం సమాహితాః ।**
**యే చాప్యన్యే చరిష్యంతి వ్రతం పాశుపతం మమ ॥39॥**

**మోక్ష్యంతి తే న సందేహః పశుత్వాత్సురసత్తమాః ।**
**నైష్ఠికం ద్వాదశాబ్దం వా తదర్థం వర్షకత్రయమ్ ॥40॥**

**శుశ్రూషాం కారయేద్యస్తు స పశుత్వాద్విముచ్యతే ।**
**తస్మాత్పరమిదం దివ్యం చరిష్యథ సురోత్తమాః ॥41॥**

వారి ఆలోచనను గుర్తించిన శివుడు వారితో ఇలా పలికాడు. "ఓ దేవశ్రేష్ఠులారా! ఈ పశుత్వభావన విషయంలో మీకు భయం అవసరంలేదు. పశుభావవిమోచనకు సంబంధించిన ఉపాయాన్ని వినండి! దాన్ని నిర్వర్తించండి! దివ్యపాశుపతవ్రతాన్ని ఆచరించండి. అపుడు పశుత్వం దూరం అవుతుంది. ఇది సత్యం అని తెలియండి!

ఓ శ్రేష్ఠదేవతలారా! ఏకాగ్రచిత్తంతో ఇతరులెవరైనా నా యీ పాశుపతవ్రతాన్ని చేస్తారో వాళ్లు పశుత్వం నుంచి ముక్తులవుతారు. ఇందుకు సందేహం లేదు. ఎవరు పండ్రెండు సంవత్సరాలుగాని, అందులో సగమైన ఆరు సంవత్సరాలుగాని కనీసం మూడు సంవత్సరాలుగాని నన్ను నిష్ఠాపూర్వకంగా సేవిస్తారో వారు పశుత్వం నుంచి ముక్తులవుతారు. ఓ దేవతాశ్రేష్ఠులారా! మీరు పరమదివ్యవ్రతాన్ని ఆచరించండి!

**తథేతి చాబ్రువన్ దేవాః శివే లోకనమస్కృతే ।**
**తస్మాద్వై పశవః సర్వే దేవాసురనరాః ప్రభోః ॥42॥**

**రుద్రః పశుపతిశ్చైవ పశుపాశవిమోచకః ।**
**యః పశుస్తత్పశుత్వం చ వ్రతేనానేన సంత్యజేత్ ॥43॥**

**తత్కృత్వా న చ పాపీయానితి శాస్త్రస్య నిశ్చయః ।**

లోకాలచేత నమస్కృతులందుకొనే శివుడు ఆవిధంగా పలకగా దేవతలు అట్లే ఆచరించగలమని పలికారు. దేవతలు, దానవులు, మానవులు అందరూ శివుడి యొక్క పశువులే. ఆతడే పశుపతి. మరియు ఆతడే ఆ పశు పాశం నుంచి విముక్తిని కలిగించేవాడు. పశుత్వం ఈ వ్రతాచరణతో పరిత్యజింపబడుతుంది. దీన్ని నిర్వహించినవాడు పాపి కాదు. ఇది శాస్త్ర నిర్ణయం.

**తతో వినాయకః సాక్షాద్ బాలోఽబాలపరాక్రమః ॥44॥**

**ఆపూజితస్తదా దేవైః ప్రాహ దేవాన్నివారయన్ ।**

తర్వాత అమితపరాక్రమవంతుడు బాలకరూపుడు వినాయకుడు దేవతలతో పూజింపబడని కారణంగా వార్ని నిరోధిస్తూ పలికాడు.

**శ్రీ వినాయక ఉవాచ -** శ్రీ వినాయకుడు పలికాడు.

**మామపూజ్య జగత్యస్మిన్ భక్ష్యభోజ్యాదిభిః శుభైః ॥45॥**

**కః పుమాన్ సిద్ధిమాప్నోతి దేవో వా దానవోఽపి వా ।**
**తతస్తస్మిన్ క్షణాదేవ దేవకార్యే సురేశ్వరాః ॥46॥**

**విఘ్నం కరిష్యే దేవేశః కథం కర్తుం సముద్యతాః ।**

రుచికరాలైన భక్ష్యభోజ్యాదులతో నన్ను పూజింపక ఈ లోకంలో మానవుడుగాని, దేవతగాని, దానవుడుగాని సిద్ధిని పొందగలడా?

ఓ ఇంద్రా! దేవేశ్వరుడవైన నీవు నన్ను పూజింపని కారణంగా క్షణకాలంలో మీ దేవకార్యానికి విఘ్నం కలిగిస్తాను. నన్ను పూజింపక మీరు మీ పనిలో ఎలా నిమగ్నులయ్యారు?

**తతః సేంద్రాః సురాః సర్వే భీతాః సంపూజ్య తం ప్రభుమ్ ॥47॥**

**భక్ష్యభోజ్యాదిభిశ్చైవ ఉండరైశ్చైవ మోదకైః ।**
**అబ్రువంస్తే గణేశానం నిర్విఘ్నం చాస్తు నః సదా ॥48॥**

తర్వాత ఇంద్రసహితులైన దేవతలందరూ భయభీతులై భక్ష్యభోజ్యాదులైన పదార్థాలతో, లడ్డులతోను, కుడుములతోను వినాయకుణ్ణి విధ్యుక్తంగా పూజించి మా కార్యక్రమం నిర్విఘ్నంగా సంపన్నం చేయమని పలికారు.

**భవోఽ పృనేకైః కుసుమైర్గణేశం భక్ష్యైశ్చ భోజ్యైః సురసైః సుగంధైః ।**
**ఆలింగ్య చాఘ్రాయ సుతం తదానీమపూజయత్సర్వసురేంద్రముఖ్యః ॥49॥**

అపుడు సర్వసురశ్రేష్ఠుడైన శివుడు కూడా కుమారవినాయకుణ్ణి కౌగిలించుకుని, శిరసును ఆఘ్రాణించి, అనేకవిధాలైన సుగంధకుసుమాలతో, భక్ష్య, భోజ్యాది పదార్థాలతో రుచికరమైన రసాలతో ఆతణ్ణి సంతుష్టిడిని చేశాడు.

**సంపూజ్య పూజ్యం సహదేవసంఘైః వినాయకం నాయకమీశ్వరాణామ్ ।**
**గణేశ్వరైరేవ నగేంద్రధన్వా పురత్రయం దగ్ధుమసౌ జగామ ॥50॥**

తర్వాత పర్వతరాజు ధనుస్సుగాగల శివుడు దేవతలతో కలిసి గణనాయకుడు, పూజనీయుడు అయిన వినాయకుణ్ణి పూజించి త్రిపురాల్ని దహించడానికై గణనాథులతో కలిసి వెళ్లాడు.

**తం దేవదేవం సురసిద్ధసంఘాః మహేశ్వరం భూతగణాశ్చ సర్వే ।**
**గణేశ్వరా నందిముఖాస్తదానీం స్వవాహనైరన్వయురీశమీశాః ॥51॥**

అప్పుడు దేవతలు, సిద్ధులు, భూతగణాలు, నంది మొదలైన గణనాథులు అట్లే ఇతరులైన ఈశ్వరులు వారివారి వాహనాల్ని ఎక్కి దేవదేవుడు, మహేశ్వరుడు అయిన శివుడి వెనుక వెళ్లారు.

**అగ్రే సురాణాం చ గణేశ్వరాణాం తదాథ నందీ గిరిరాజకల్పమ్ ।**
**విమానమారుహ్య పురం ప్రహర్తుం జగామ మృత్యుం భగవానివేశః ॥52॥**

హిమాలయంతో సమానమైన విమానం మీద ఎక్కి నందీశ్వరుడు దేవతలకు, గణేశ్వరులకు ముందు భాగంలో నిలవగా – శివభగవానుడు మృత్యుదేవతను సంహరించడానికి వెళ్లినట్లుగా త్రిపురాల్ని నశింపజేయడానికి వెళ్లాడు.

**యాంతం తదానీం తు శిలాదపుత్రమారుహ్య నాగేంద్రవృషాశ్వవర్యాన్ ।**
**దేవాస్తదానీం గణపాశ్చ సర్వే గణా యయుః స్వాయుధచిహ్నహస్తాః ॥53॥**

అపుడు వెళుతున్న శిలాదపుత్రుడైన నందీశ్వరుణ్ణి అనుసరించి వెనుకగా దేవతలందరూ, గణేశ్వరుడు, గణాలు ఏనుగుల్ని, వృషభాల్ని, గుఱ్ఱాల్ని ఎక్కి ఆయుధపాణులై వెళ్లారు.

**ఖగేంద్రమారుహ్య నగేంద్రకల్పం ఖగధ్వజో వామత ఏవ శంభోః ।**
**జగామ తూర్ణం జగతాం హితాయ పురత్రయం దగ్ధుమలుప్తశక్తిః ॥54॥**

మహాశక్తిశాలి, గరుడధ్వజుడు అయిన విష్ణువు పర్వతరాజుతో సమానమైన పక్షీంద్రుణ్ణి (గరుత్మంతుణ్ణి) అధిరోహించి లోకహితార్థం త్రిపురాల్ని దహించడానికై శివభగవానుడి ఎడమవైపుగా ఉండి వేగంగా వెళ్లాడు.

**తం సర్వదేవాః సురలోకనాథం సమంతతశ్చాన్వయురప్రమేయమ్ ।**
**సురాసురేశం శతశక్తిటంకగదాత్రిశూలాసివరాయుధైశ్చ ॥55॥**

దేవతలందరూ శక్తి, టంకం, గద, త్రిశూలం, ఖడ్గం మొదలైన పదునైన శ్రేష్ఠమైన ఆయుధాల్ని ధరించి, దేవలోకప్రభువు, దేవదానవులకు స్వామి మరియు అప్రమేయుడు అయిన శివుడి వెనుకగా అన్ని వైపుల నిల్చి వెళ్లారు.

**రరాజ మధ్యే భగవాన్ సురాణాం వివాహనో వారిజపత్రవర్ణః ।**
**యథా సుమేరోః శిఖరాధిరూఢః సహస్రరశ్మిర్భగవాన్ సుతీక్ష్ణః ॥56॥**

కమలపత్రవర్ణగాత్రుడు, గరుడవాహనుడు అయిన విష్ణుభగవానుడు దేవతల మధ్య ఏవిధంగా శోభిస్తున్నాడంటే మేరుపర్వతశిఖరం మీద ఆరూఢుడైన సహస్రకిరణుడైన సూర్యుడు మాదిరిగా శోభిల్లుతున్నాడు.

**సహస్రనేత్రః ప్రథమః సురాణాం గజేంద్రమారుహ్య చ దక్షిణేఽస్య ।**
**జగామ రుద్రస్య పురం నిహంతుం యథోరగాంస్తత్ర తు వైనతేయః ॥57॥**

ఐరావతాన్ని అధిరోహించి సురప్రముఖుడు, సహస్రనేత్రుడు అయిన ఇంద్రుడు శివుడికి కుడివైపుగా ఉండి త్రిపురాల్ని నశింపజేయడానికి సర్పాల్ని హతమార్చడానికి వెళుతున్న గరుత్మంతుడు వలె వెళ్లాడు.

**తం సిద్ధగంధర్వసురేంద్రవీరాః సురేంద్రబృందాధిపమింద్రమీశమ్ ।**
**సమంతతస్తుష్టువురిష్టదం తే జయేతి శక్రం వరపుష్పవృష్ట్యా ॥58॥**

సిద్ధులు, గంధర్వులు, దేవతాశ్రేష్ఠులు మరియు ఇతర వీరులు ప్రభువైన ఇంద్రుణ్ణి స్తుతించి ఇష్టార్థాన్ని సాధించమని పుష్పవృష్టి కురిపించి జయజయధ్వానాలు చేశారు.

**తదా హ్యహల్యోపపతిం సురేశం జగత్పతిం దేవపతిం దివిష్ఠాః ।**
**ప్రణేమురాలోక్య సహస్రనేత్రం సలీలమంబాతనయం యథేంద్రమ్ ॥59॥**

ఆ సమయంలో త్రివిష్ఠపులైన దేవతలు, అహల్యాజారుడు, దేవేశ్వరుడు, జగత్పతి, దేవతలకు ప్రభువు, సహస్రాక్షుడైన ఇంద్రుణ్ణి చూచి లీలాపూర్వకంగా పార్వతీపుత్రుడైన కుమారస్వామికి నమస్కరించినట్లు నమస్కరించారు.

**యమపావకవిత్తేశా వాయుర్నిరృతిరేవ చ ।**
**అపాంపతిస్తథేశానో భవం చానుసమాగతాః ॥60॥**

యముడు, అగ్ని, కుబేరుడు, వాయువు, నిరృతి, వరుణుడు అట్లే ఈశానుడు అయిన దిక్పతులు కూడా ఈశ్వరుడి వెనుక వెళ్లారు.

**వీరభద్రో రణే భద్రో నైరృత్యాం వై రథస్య తు ।**
**వృషభేంద్రం సమారుహ్య రోమజైశ్చ సమావృతః ॥61॥**

**సేవాం చక్రే పురం హంతుం దేవదేవం త్రియంబకమ్ ।**
**మహాకాలో మహాతేజా మహాదేవ ఇవాపరః ॥62॥**

**వాయవ్యాం సగణైః సార్ధం సేవాః చక్రే రథస్య తు ॥63॥**

యుద్ధప్రవీణుడు వీరభద్రుడు వృషభేంద్రాన్ని అధిరోహించి శివుడి రథం యొక్క నైరృతి దిక్కున ఉండి త్రిపురాల్ని నశింపజేయడానికి వెళ్లాడు. తన రోమాల నుంచి పుట్టిన బాణసమూహాలతో కూడినవాడై దేవదేవుడైన శివుడికి సేవ చేశాడు. రెండో మహాదేవుడు (శివుడు) లాగా కన్పించే మహాకాంతిమంతుడు, మహాకాలుడు (యముడు) రథానికి వాయవ్యదిక్కున నిలిచి గణాలతో కూడి రథానికి సేవ చేశాడు.

**షణ్ముఖోఽపి సహ సిద్ధచారణైః సేనయా చ గిరిరాజసన్నిభః ।**
**దేవనాథ గణబృందసంవృతో వారణేన చ తథాగ్నిసంభవః ॥64॥**

అగ్నిసంభవుడు, షణ్ముఖుడు అయిన గిరిరాజసమానుడు కుమారస్వామి సిద్ధచారణులు, దేవతలు, గణసమూహాలు గల దేవసేనతో కూడినవాడై గజారూఢుడై వెళ్లాడు.

**విఘ్నం గణేశోఽప్యసురేశ్వరాణాం కృత్వా సురాణాం భగవానవిఘ్నమ్ ।**
**విఘ్నేశ్వరో విఘ్నగణైశ్చ సార్ధం తం దేశమీశానపదం జగామ ॥65॥**

విఘ్నేశ్వరుడు, భగవానుడు అయిన వినాయకుడు రాక్షసులకు విఘ్నాల్ని, దేవతలకు అవిఘ్నాల్ని కలిగిస్తూ విఘ్నగణాలతో కూడి త్రిపురాలవైపు శివుడి వెనుక వెళ్లాడు.

**కాళీ తదా కాలనిశాప్రకాశం శూలం కపాలాభరణా కరేణ ।**
**ప్రకంపయంతీ చ తదా సురేంద్రాన్ మహాసురాసృఙ్మధుపానమత్తా ॥66॥**

**మత్తేభగామీ మదలోలనేత్రా మత్తైః పిశాచైశ్చైవ గణైశ్చ మత్తైః ।**
**మత్తేభచర్మాంబరవేష్టితాంగీ యయౌ పురస్తాచ్చ గణేశ్వరస్య ॥67॥**

అప్పుడు కాళరాత్రితో సమానమైన ప్రకాశంగల శూలాన్ని హస్తమందు ధరించినది, కపాలం ఆభరణంగా గలది, పెద్ద పెద్ద రాక్షసుల రక్తమనే మధువును సేవించుటచే మత్తురాలైనది, మదగజంతో సమానమైన నడక గలిగినది, మధుపానమత్తచంచలనేత్ర అయినది, మత్తగజచర్మాన్ని వస్త్రంగా ధరించినది అయిన కాళికాదేవి దేవతల్ని కంపింపజేస్తూ మత్తపిశాచాలతో, మత్తిల్లిన గణాలతో కూడినదై గణేశ్వరుడికి ముందుగా వెళ్లింది.

**తాం సిద్ధగంధర్వపిశాచయక్షవిద్యాధరాహీంద్రసురేంద్రముఖ్యాః ।**
**ప్రణేమురుచ్చైరభితుష్టువుశ్చ జయేతి దేవీం హిమశైలపుత్రీమ్ ॥68॥**

సిద్ధులు, గంధర్వులు, పిశాచాలు, యక్షులు, విద్యాధరులు, సర్పాలు, ప్రముఖదేవతలు పార్వతీదేవికి నమస్కరించారు. జయజయధ్వానాలు చేసి కీర్తించారు.

**మాతరః సురవరారిసూదనాః సాదరం సురగణైః సుపూజితాః ।**
**మాతరం యయురథ స్వవాహనైః స్వైర్గణైర్ధ్వజధరైః సమంతతః ॥69॥**

ఈ విధంగా దేవతల శత్రువుల్ని సంహరించినవారు, దేవతాగణాలతో అత్యంతాదరంగా సేవింపబడినవారు అయిన దేవమాతలు అన్ని వైపుల ధ్వజాలు ధరించిన తమతమ గణాలతో కూడి తమతమ వాహనారూఢులై పార్వతీమాతకు వెనుకగా వెళ్ళారు.

**దుర్గారూఢమృగాధిపా దురతిగా దోర్దండబృందైః శివా**
**బిభ్రాణాంకుశశూలపాశపరశుం చక్రాసిశంఖాయుధమ్ ।**
**ప్రౌఢాదిత్యసహస్రవహ్నిసదృశైర్నేత్రైర్దహంతీ పథం**
**బాలాబాలపరాక్రమా భగవతీ దైత్యాన్ ప్రహర్తుం యయౌ ॥70॥**

బాల అయ్యీ అమితపరాక్రమశాలి అయిన భగవతి దుర్గాదేవి సింహాన్ని అధిరోహించి తన భుజాలతో అంకుశం, శూలం, పాశం, పరశువు, చక్రం, ఖడ్గం, శంఖం మొదలైన ఆయుధాల్ని ధరించినదై మధ్యాహ్నకాల సూర్యుడి కాంతితోనూ మరియు సహస్రాగ్ని సమానకాంతితో ప్రకాశించే నేత్రాలతోనూ మార్గాన్ని ప్రకాశింపజేస్తూ దైత్యుల్ని సంహరించడానికి వెళ్లింది.

**తం దేవమీశం త్రిపురం నిహంతుం తదా తు దేవేంద్రరవిప్రకాశాః ।**
**గజైర్హయైః సింహవరైరథైశ్చ వృషైర్యయుస్తే గణరాజముఖ్యాః ॥71॥**

అపుడు ఇంద్రుడితోను సూర్యుడితోను సమానమైన తేజస్సుల ముఖ్యగణేశ్వరులు త్రిపురాల్ని నశింపజేయడానికి ఏనుగుల్ని, గుఱ్ఱాల్ని, సింహాల్ని, శ్రేష్ఠరథాల్ని అధిరోహించి శివభగవానుణ్ణి అనుసరించి వెనుకగా వెళ్లారు.

**హలైశ్చ ఫాలైర్ముసలైర్భుశుండైర్గిరీంద్రకూటైర్గిరిసన్నిభాస్తే ।**
**యయుః పురస్తాద్ధి మహేశ్వరస్య సురేశ్వరా భూతగణేశ్వరాశ్చ ॥72॥**

పర్వతసమానులైన దేవతాముఖ్యులు భూతగణముఖ్యులు నాగళ్లు, ఫారలు, రోకళ్లు, గదలు, గిరిశిఖరాలు ఆయుధాలుగా ధరించినవారై శివభగవానుడి అగ్రభాగమందు కదిలారు.

**తథేంద్రపద్మోద్భవవిష్ణుముఖ్యాః సురా గణేశాశ్చ గణేశమీశమ్ ।**
**జయేతి వాగ్భిర్భగవంతమూచుః కిరీటదత్తాంజలయః సమంతాత్ ॥73॥**

అప్పుడు ఇంద్రుడు, బ్రహ్మదేవుడు, విష్ణుమూర్తి మొదలైన ప్రధానదేవగణాలు తమ కిరీటాలందు చేతులుంచి అనగా అంజలి ఘటించి నమస్కరించి అన్ని దిక్కుల నుంచి జయధ్వానాలు పలికారు.

**ననృతర్మునయః సర్వే దండహస్తా జటాధరాః ।**
**వవృషుః పుష్పవర్షాణి ఖేచరాః సిద్ధచారణాః ॥**
**పురత్రయం చ విప్రేంద్రాః ప్రాణదత్సర్వతస్తథా ॥74॥**

జటాధరులు, దండహస్తులైన మునులు అందరూ నర్తించారు. ఆకాశచారులైన సిద్ధులు, చారణులు పూలవానను కురిపించారు. ఓ విప్రశ్రేష్ఠులారా! త్రిపురాలు అన్నివైపులా ప్రతిధ్వనించాయి.

**గణేశ్వరైర్దేవగణైశ్చ భృంగీ సమావృతః సర్వగణేంద్రవర్యః ।**
**జగామ యోగీ త్రిపురం నిహంతుం విమానమారుహ్య యథా మహేంద్రః ॥75॥**

గణేశ్వరులందరిలో ముఖ్యుడైన యోగీశ్వరుడు, భృంగీశ్వరుడు గణేశ్వరులతో, దేవగణాలతో కూడి ఇంద్రుడిలాగా విమానమెక్కి త్రిపురాల్ని నశింపజేయడానికి వెళ్లాడు.

**కేశో విగతవాసాశ్చ మహాకేశో మహాజ్వరః ।**
**సోమవల్లీ సవర్ణశ్చ సోమపః సేనకస్తథా ॥76॥**

**సోమధృక్ సూర్యవాచశ్చ సూర్యపేషణకస్తథా ।**
**సూర్యాక్షః సూరినామా చ సురః సుందర ఏవ చ ॥77॥**

**ప్రకుదః కకుదంతశ్చ కంపనశ్చ ప్రకంపనః ।**
**ఇంద్రశ్చేంద్రజయశ్చైవ మహాభీర్భీమకస్తథా ॥78॥**

**శతాక్షశ్చైవ పంచాక్షః సహస్రాక్షో మహోదరః ।**
**యమజిహ్వః శతాశ్వశ్చ కంఠనః కంఠపూజనః ॥79॥**

**ద్విశిఖస్త్రిశిఖశ్చైవ తథా పంచశిఖో ద్విజాః ।**
**ముండోఽర్ధముండో దీర్ఘశ్చ పిశాచాస్యః పినాకధృక్ ॥80॥**

**పిప్పలాయతనశ్చైవ తథా హ్యంగారకాశనః ।**
**శిథిలః శిథిలాస్యశ్చ అక్షపాదో హ్యజః కుజః ॥81॥**

**అజవక్త్రో హయవక్త్రో గజవక్త్రోర్ధ్వవక్త్రకః ।**
**ఇత్యాద్యాః పరివార్యేశం లక్ష్యలక్షణవర్జితాః ॥82॥**

**వృందశస్తం సమావృత్య జగ్ముః సోమం గణైర్వృతాః ।**
**సహస్రాణాం సహస్రాణి రుద్రాణామూర్ధ్వరేతసామ్ ॥83॥**

**సమావృత్య మహాదేవం దేవదేవం మహేశ్వరమ్ ।**
**దగ్ధుం పురత్రయం జగ్ముః కోటికోటిగుణైర్వృతాః ॥84॥**

ఓ ద్విజులారా! కేశుడు, విగతవాసుడు, మహాకేశుడు, మహాజ్వరుడు, సోమవల్లి, సవర్ణుడు, సోమపుడు, సేనకుడు, సోమధృక్కు, సూర్యవాచుడు, సూర్యపేషణుడు, సూర్యాక్షుడు, సూరినాముడు, సురుడు, సుందరుడు, ప్రకుదుడు, కకుదంతుడు, కంపనుడు, ప్రకంపనుడు, ఇంద్రుడు, ఇంద్రజయుడు, మహాభి, భీమకుడు, శతాక్షుడు, పంచాక్షుడు, సహస్రాక్షుడు, మహోదరుడు, యమజిహ్వుడు, శతాక్షుడు, కంఠనుడు, కంఠపూజనుడు, ద్విశిఖుడు,

త్రిశిఖుడు, పంచశిఖుడు, ముండుడు, అర్ధముండుడు, దీర్ఘుడు, పిశాచాస్యుడు, పినాకధృక్, పిప్పలాయతనుడు, అంగారకాశనుడు, శిథిలుడు, శిథిలాస్యుడు, అక్షపాదుడు, అజుడు, కుజుడు, అజవక్త్రుడు, హయవక్త్రుడు, గజవక్త్రుడు, ఊర్ధ్వవక్త్రుడు, ఇతర లక్ష్యలక్షణవర్జితులైన గణనాయకులందరూ ఒకటిగా కలిసి వారి వారి గణసముదాయాలతో కూడి శివభగవానుణ్ణి చుట్టుకుని కదిలారు. ఈవిధంగా కోటానుకోట్ల గణాలతో కూడిన వేలవేల గణనాథులు, రుద్రులు త్రిపురాల్ని దహించడానికి మహాదేవ శివభగవానుణ్ణి చుట్టుకుని వెళ్లారు.

**త్రయస్త్రింశత్సురశ్చైవ త్రయశ్చ త్రిశతాస్తథా ।**
**త్రయశ్చ త్రిసహస్రాణి జగ్ముర్దేవాః సమంతతః ॥85॥**

ముప్ఫైమూడువేల మూడువందల ముప్ఫైమూడు మంది దేవతలు రథం వెనుక నాల్గు దిక్కులందూ కూడి నడిచారు.

**మాతరః సర్వలోకానాం గణానాం చైవ మాతరః ।**
**భూతానాం మాతరశ్చైవ జగ్ముర్దేవస్య పృష్ఠతః ॥86॥**

సమస్తలోకమాతలు, గణాలమాతలు, భూతగణమాతలు అందరూ దేవదేవుడి వెనుక వెళ్లారు.

**భాతి మధ్యే గణానాం చ రథమధ్యే గణేశ్వరః ।**
**నభస్యమలనక్షత్రే తారామధ్య ఇవోడురాట్ ॥87॥**

రథం మధ్యలో గణేశ్వరుడైన శివుడు సమస్తగణాల మధ్యలో నిర్మలమైన నక్షత్రాలుగల ఆకాశమందలి తారకల మధ్యలో చంద్రుడు ఉన్నట్లు ఉన్నాడు.

**రరాజ దేవీ దేవస్య గిరిజా పార్శ్వసంస్థితా ।**
**తదా ప్రభావతో గౌరీ భవస్యేవ జగన్మయీ ॥88॥**

**శుభావతీ తదా దేవీ పార్శ్వసంస్థా విభాతి సా ।**
**చామరాసక్తహస్తాగ్రా సా హేమాంబుజవర్ణికా ॥89॥**

జగన్మాత, హిమవంతుని పుత్రి అయిన గౌరీదేవి శివుడి ఎడమభాగంలో కూర్చుండి శివుడి దేహకాంతుల వలన ప్రకాశించింది. సువర్ణకమలంతో సమానమైన కాంతిగల శుభావతిదేవి హస్తములందు చామరం గలిగినదిఅయి ప్రకాశించింది.

**అథ విభాతి విభోర్విశదం వపు ర్భసితభాసితమంబికయా తయా ।**
**సితమివాభ్రమహో ఇహ విద్యుతా నభసి దేవపతేః పరమేష్ఠినః ॥90॥**

దేవపతి పరమేశ్వరుడి భస్మంతో ప్రకాశించే దేహకాంతి, పార్వతీదేవితో కూడి, ఆకాశంలో మెరుపుతీగతో కూడిన తెల్లటి మేఘం మాదిరిగా ప్రకాశించింది.

**భాతీంద్రధనుషాకాశం మేరుణా చ యథా జగత్ ।**
**హిరణ్యధనుషా సౌమ్యం వపుః శంభోః శశిద్యుతిః ॥91॥**

సువర్ణవికారధనుస్సుతో, చంద్రకళాకాంతితో కూడిన శంకరుడి తెల్లని శరీరం ఇంద్రధనుస్సుతో కూడిన ఆకాశం వలె గాని మేరుపర్వంతో కూడిన జగత్తువలె గాని ఉన్నది.

**సితాతపత్రం రత్నాంశుమిశ్రితం పరమేష్ఠినః ।**
**యథోదయే శశాంకస్య భాత్యఖండం హి మండలమ్ ॥92॥**

శివభగవానుడి శ్వేతచ్ఛత్రం రత్నకాంతులతో కూడినదై ఉదయకాలంలో చంద్రుడి యొక్క పూర్ణమండలం వలె ప్రకాశిస్తున్నది.

**సదుకూలా శివే రక్తాలంబితా భాతి మాలికా ।**
**ఛత్రాంతా రత్నజాకాశాత్పతంతీవ సరిద్వరా ॥93॥**

శివుడి కంఠమందు ఎఱ్ఱటి మేలి వస్త్రం వ్రేలాడుచుండగా, మరియు ఛత్రం చివరనుంచి రత్నమయమైన ముత్యాలహారం వ్రేలాడగా అది ఆకాశము నుండి జాలువారే గంగానదితో సమానంగా శోభిల్లుచున్నది.

**అథ మహేంద్రవిరించివిభావసుప్రభృతిభిర్నతపాదసరోరుహః ।**
**సహ తదా చ జగామ తయాంబయా సకలలోకహితాయ పురత్రయమ్ ॥94॥**

అప్పుడు ఇంద్రుడు, బ్రహ్మ, అగ్ని మొదలైన దేవతలచేత నమస్కరింపబడిన చరణకమలాలుగల శివభగవానుడు సమస్తలోక హితం కోసం పార్వతీదేవితో కలిసి త్రిపురాలవైపు వెళ్లాడు.

**దగ్ధుం సమర్థో మనసా క్షణేన చరాచరం సర్వమిదం త్రిశూలీ ।**
**కిమత్ర దగ్ధుం త్రిపురం పినాకీ స్వయం గతశ్చాత్ర గణైశ్చ సార్ధమ్ ॥95॥**

**రథేన కిం చేషువరేణ తస్య గణైశ్చ కిం దేవగణైశ్చ శంభోః ।**
**పురత్రయం దగ్ధుమలుప్తశక్తేః కిమేతదిత్యాహురజేంద్రముఖ్యాః ॥96॥**

**మన్యామ నూనం భగవాన్ పినాకీ లీలార్థమేతత్సకలం ప్రవర్తుమ్ ।**
**వ్యవస్థితశ్చేతి తథాన్యథా చేదాడంబరేణాస్య ఫలం కిమన్యత్ ॥97॥**

త్రిశూలధారి, పినాకి అయిన శివుడు మనస్సుతోనే క్షణకాలంలో ఈ సంపూర్ణచరాచరజగత్తును దహింప సమర్థుడు. ఎందుకిలా గణాలతో కలిసి త్రిపురాల్ని దహించడానికి స్వయంగా వెళ్లాడు. అసామాన్యశక్తిశాలి అయిన శంకరుడికి త్రిపురాల్ని దహించడానికి రథమెందుకు? ఉత్తమమైన బాణమెందుకు? గణాలెందుకు? దేవతలెందుకు? అని బ్రహ్మేంద్రాదులు పలికారు. శివభగవానుడు లీలార్థంగా ఇదంతా నిర్వహించాడని మేము భావించాం. లేకుంటే ఇంతటి ఆడంబరకృత్యంతో మరో ప్రయోజనం ఏమి ఉంటుంది?

**పురత్రయస్యాస్య సమీపవర్తీ సురేశ్వరైర్నందిముఖైశ్చ నందీ ।**
**గణైర్గణేశస్తు రరాజ దేవ్యా జగద్రథో మేరురివాష్టశృంగైః ॥98॥**

త్రిపురాలకు సమీపమందుగల నందీశ్వరుడు, నందికేశ్వరుడు మొదలుగాగల సురేశ్వరులతో కూడి ఉండి, గణేశ్వరుడు గణాలతో కూడి ఉండి, మేరుపర్వతం తన అష్టశృంగాలతో కూడి ఉన్నట్లు శోభించారు. అట్లే జగద్రథుడైన శివుడు పార్వతీదేవితో కలిసి శోభించాడు.

**అథ నిరీక్ష్య సురేశ్వరమీశ్వరం సగణమద్రిసుతాసహితం తదా ।**
**త్రిపురరంగతలోపరిసంస్థితః సురగణోఽనుజగామ స్వయం తథా ॥99॥**

అప్పుడు గణాలతోను, పార్వతీదేవితోను కూడియున్న సురేశ్వరుడైన శివభగవానుణ్ణి చూచి త్రిపురయుద్ధ రంగంలో నిలిచియున్న దేవగణం స్వయంగా ఆయన దగ్గరకు చేరింది (అనుగమించింది)

**జగత్త్రయం సర్వమివాపరం తత్ పురత్రయం తత్ర విభాతి సమ్యక్ ।**
**నరేశ్వరైశ్చైవ గణైశ్చ దేవ్యైః సురేతరైశ్చ త్రివిధైర్మునీంద్రాః ॥100॥**

ఓ మునిశ్రేష్ఠులారా! ఈ త్రిపురాలు మానవేంద్రులతో, దేవగణాలతో, రాక్షసులతో నిండిన మరో మూడు లోకాలవలె ప్రకాశిస్తున్నాయి.

**అథ సజ్యం ధనుః కృత్వా శర్వః సంధాయ తం శరమ్ ।**
**యుక్త్వా పాశుపతాస్త్రేణ త్రిపురం సమచింతయత్ ॥101॥**

అనంతరం వింటికి నారిని కలిపి దానికి బాణాన్ని చేర్చి దానిని పాశుపతాస్త్రంగా మంత్రించి ఆ మూడు పురాల్ని గూర్చి బాగా ఆలోచించాడు.

**తస్మింస్థితే మహాదేవే రుద్రే వితతకార్ముకే ।**
**పురాణి తేన కాలేన జగ్మురేకత్వమాశు వై ॥102॥**

**ఏకీభావం గతే చైవ త్రిపురే సముపాగతే ।**
**బభూవ తుములో హర్షో దేవతానాం మహాత్మనామ్ ॥103॥**

ధనుస్సును ఎక్కుపెట్టి ధరించి ఆవిధంగా మహాదేవుడైన శివుడు నిలువగా అపుడు ఆ మూడు పురాలు వెంటనే ఏకత్వాన్ని పొందాయి. ఆ పురాలు దగ్గరై ఏకీభావం పొందగా మహాత్ములైన దేవతలకు మిక్కిలి సంతోషం కల్గింది.

**తతో దేవగణాః సర్వే సిద్ధాశ్చ పరమర్షయః ।**
**జయేతి వాచో ముముచుః సంస్తువంతోఽష్టమూర్తినమ్ ॥104॥**

అనంతరం దేవగణాలు, సిద్ధులు, మహర్షిసమూహాలు అందరూ అష్టమూర్తి అయిన శివుణ్ణి స్తుతిస్తూ జయవచనాలు పలికారు.

**అథాహ భగవాన్ బ్రహ్మా భగనేత్రనిపాతనమ్ ।**
**పుష్యయోగేఽపి సంప్రాప్తో లీలావశముమాపతిమ్ ॥105॥**

**స్థానే తవ మహాదేవ చేష్టేయం పరమేశ్వర ।**
**పూర్వదేవాశ్చ దేవాశ్చ సమాస్తవ యతః ప్రభో ॥106॥**

**తథాపి దేవా ధర్మిష్ఠాః పూర్వదేవాశ్చ పాపినః ।**
**యతస్తస్మాజ్జగన్నాథ లీలాం త్యక్తుమిహార్హసి ॥107॥**

**కిం రథేన ధ్వజేనేశ తవ దగ్ధుం పురత్రయమ్ ।**
**ఇషుణా భూతసంఘైశ్చ విష్ణునా చ మయా ప్రభో ॥108॥**

**పుష్యయోగే త్వనుప్రాప్తే పురం దుగ్ధమిహార్హసి ।**
**యావన్న యాంతి దేవేశ వియోగం తావదేవ తు ॥109॥**

**దగ్ధుమర్హసి శీఘ్రం త్వం త్రీణ్యేతాని పురాణి వై ।**

తర్వాత పుష్యమీ నక్షత్రం రాగానే (పుణ్యకాలం – తిథి) భగుడి నేత్రాన్ని నశింపజేసి లీలాసక్తుడై నిలిచిన శివుడిని గూర్చి బ్రహ్మ ఇలా పలికాడు. ఓ మహాదేవా! ఓ పరమేశ్వరా! ఓ ప్రభూ! దేవతలు పూర్వదేవతలైన రాక్షసులు నీకు సమానులే. అయినా దేవతలు ధర్మనిష్ఠులు. దానవులు పాపులు. అందుచేత త్రిపురసంహారచేష్ట నీకు తగినట్టిదే. ఓ జగత్ప్రభూ! నీవు లీలను త్యజింప అర్హుడవు. ఓ ఈశ్వరుడా! ఓ ప్రభూ! నీకు త్రిపురాల్ని దహించడానికి రథమెందుకు? ధ్వజమెందుకు? బాణమెందుకు? భూతగణాలు, విష్ణువు, నేను ఎందుకు? పుష్యమీ నక్షత్రయోగంలో నీవు త్రిపురాల్ని దహించుటెందుకు? ఎపుడా పురాలు వేరు వేరుగా నుండవో అపుడే వాటిని దహింప సమర్థుడవు కదా!

**అథ దేవో మహాదేవః సర్వజ్ఞస్తదవైక్షత ॥110॥**

**పురత్రయం విరూపాక్షస్తత్క్షణాద్భస్మ వై కృతమ్ ।**
**సోమశ్చ భగవాన్ విష్ణుః కాలాగ్నిర్వాయురేవ చ ॥111॥**

**శరే వ్యవస్థితాః సర్వే దేవమూచుః ప్రణమ్య తమ్ ।**
**దగ్ధమప్యథ దేవేశ వీక్షణేన పురత్రయమ్ ॥112॥**

**అస్మద్ధితార్థం దేవేశ శరం మోక్తుమిహార్హసి ।**
**అథ సమ్మృజ్య ధనుషో జ్యాం హసన్ త్రిపురార్దనః ॥113॥**

**ముమోచ బాణం విప్రేంద్రా వ్యాకృష్యాకర్ణమీశ్వరః ।**
**తత్క్షణాత్ త్రిపురం దగ్ధ్వా త్రిపురాంతకరః శరః ॥114॥**

**దేవదేవం సమాసాద్య నమస్కృత్య వ్యవస్థితః ।**

అనంతరం త్రినేత్రుడు సర్వజ్ఞుడైన శివభగవానుడు ఆ త్రిపురాలవైపు చూచి వాటిని క్షణకాలంలో దహించాడు. అపుడు శివుడి బాణం యొక్క శిరసుపై ఉన్న సోముడు, విష్ణుభగవానుడు, కాలాగ్ని వాయుదేవులు ఆయనకు నమస్కరించి ఇలా పలికారు. ఓ దేవేశ్వరా! మీ చూపువల్లనే త్రిపురాలు దహింపబడ్డాయి. ఓ దేవేశ్వరా! మాహితం కోసం బాణాన్ని ఇపుడు విడువుము. ఓ విప్రశ్రేష్ఠులారా! అపుడు త్రిపురాల్ని నశింపజేసే శివుడు వింటినారిని ఆకర్ణాంతం లాగి నవ్వుతూ బాణాన్ని విడిచి పెట్టాడు. వెంటనే త్రిపురాల్ని దహించిన ఆ బాణం తిరిగి శివభగవానుణ్ణి చేరి నమస్కరించి నిలిచింది.

**రేజే పురత్రయం దగ్ధం దైత్యకోటిశతైర్వృతమ్ ॥115॥**

**ఇషుణా తేన కల్పాంతే రుద్రేణేవ జగత్త్రయమ్ ।**
**యే పూజయంతి తత్రాపి దైత్యా రుద్రం సబాంధవాః ॥116॥**

**గాణపత్యం తదా శంభోర్యయుః పూజావిధేర్బలాత్ ।**

ఆ బాణం చేత దహింపబడిన నూరుకోట్ల దానవులతో కూడిన త్రిపురాలు కల్పాంతంలో రుద్రభగవానుడిచే దహింపబడే ముల్లోకాల్లాగా ప్రకాశించాయి. త్రిపురాలలోనూ బంధుగణసహితులై ఎవరైతే రుద్రభగవానుణ్ణి పూజించారో వారు శివపూజాబలంతో గణపతిపదాన్ని పొందారు.

**న కించిదబ్రువన్ దేవాః సేంద్రోపేంద్రా గణేశ్వరాః ॥117॥**

**భయాద్దేవం నిరీక్ష్యైవ దేవీం హిమవతః సుతామ్ ।**
**దృష్ట్వా భీతం తదానీకం దేవానాం దేవపుంగవః ॥118॥**

**కిం చేత్యాహ తదా దేవాన్ ప్రణేముస్తం సమంతతః ॥119॥**

**వవందిరే నందినమిందుభూషణం వవందిరే పర్వతరాజసంభవామ్ ।**
**వవందిరే చాద్రిసుతాసుతం ప్రభుం వవందిరే దేవగణా మహేశ్వరమ్ ॥120॥**

**తుష్టావ హృదయే బ్రహ్మా దేవైః సహ సమాహితః ।**
**విష్ణునా చ భవం దేవం త్రిపురారాతిమీశ్వరమ్ ॥121॥**

ఇంద్రుడు, విష్ణువుతో కూడిన అందరు దేవతలు గణేశ్వరుడైన శివుడిని, పార్వతీదేవిని చూచి భయవశులై నిరుత్తరులయ్యారు. అపుడు దేవతల సేన యొక్క భయాన్ని చూచిన దేవశ్రేష్ఠుడు శివుడు దేవతలను గూర్చి ఇలా పలికాడు. ఏమిటిది? అని. అపుడు వారు అన్నివైపుల నుంచి శివభగవానుడికి కేవలం నమస్కరించినవారైనారు. దేవతలు చంద్రభూషణుడికి, నందికి నమస్కరించారు. పార్వతీదేవికి నమస్కరించారు. పార్వతీపుత్రుడైన గణనాథుడు వినాయకుడికి నమస్కరించారు. అట్లే శివభగవానుడికి నమస్కరించారు. అపుడు బ్రహ్మదేవుడు ఏకాగ్రచిత్తుడై దేవతలతోనూ, విష్ణువుతోనూ కూడినవాడై త్రిపురారి శివభగవానుడిని హృదయంలో స్తుతించసాగాడు.

**శ్రీ పితామహ ఉవాచ –** శ్రీ పితామహుడు పలికాడు.

**ప్రసీద దేవదేవేశ ప్రసీద పరమేశ్వర ।**
**ప్రసీద జగతాంనాథ ప్రసీదానందదావ్యయ ॥122॥**

**పంచాస్య రుద్రరుద్రాయ పంచాశత్కోటిమూర్తయే ।**
**ఆత్మత్రయోపవిష్టాయ విద్యాతత్త్వాయ తే నమః ॥123॥**

**శివాయ శివతత్త్వాయ అఘోరాయ నమో నమః ।**
**అఘోరాష్టకతత్త్వాయ ద్వాదశాత్మస్వరూపిణే ॥124॥**

ఓ దేవదేవేశ్వరుడా! ప్రసన్నుడవు కమ్ము! ఓ పరమేశ్వరా! ప్రసన్నుడవుకమ్ము! ఓ జగన్నాథుడా! ప్రసన్నుడవు అగుము! ఓ ఆనందప్రదాతా! ఓ అవ్యయా! ఓ పంచముఖుడా! ప్రసన్నుడవు కమ్ము! రుద్రులకే రుద్రుడైన వాడివి, ఏబదికోట్ల మూర్తులు గలవాడివి, విశ్వ, ప్రాజ్ఞ, తైజసత్రిరూపాలలో ఉన్నవాడివి, విద్యలలో ముఖ్యకారణస్వరూపుడివి అయిన నీకు నమస్కారం. శివుడవు, శివతత్త్వస్వరూపుడవు, అఘోరుడవు, భైరవాష్టకానికి కారణరూపుడవు, ద్వాదశాత్మక స్వరూపుడవు, అయిన నీకు మాటిమాటికి నమస్కారం.

**విద్యుత్కోటిప్రతీకాశమష్టకాశం సుశోభనమ్ ।**
**రూపమాస్థాయ లోకేఽస్మిన్ సంస్థితాయ శివాత్మనే ॥125॥**

**అగ్నివర్ణాయ రౌద్రాయ అంబికార్ధశరీరిణే ।**
**ధవళశ్యామరక్తానాం ముక్తిదాయామరాయ చ ॥126॥**

**జ్యేష్ఠాయ రుద్రరూపాయ సోమాయ వరదాయ చ ।**
**త్రిలోకాయ త్రిదేవాయ వషట్కారాయ వై నమః ॥127॥**

కోటివిద్యుత్కాంతుల సమానుడవు, అష్టమూర్తులైన పృథివి మొదలైన వాటిచే సుందరమైన రూపాన్ని ధరించి ఈ లోకంలో విరాజమానమైన విశ్వస్వరూపుడవైన నీకు నమస్కారం. అగ్ని సమానవర్ణుడికి, భయానకుడికి, పార్వతీదేవిని తన శరీరార్ధంలో ధరించినవాడికి, బ్రహ్మవిష్ణురుద్రులకు ముక్తిదాత అయినవాడికి, మృత్యువు లేనివాడికి, జ్యేష్ఠుడికి, భయంకరరూపుడికి, సోమస్వరూపుడికి, వరప్రదాతకు, త్రిలోకస్వరూపుడికి, త్రిదేవస్వరూపుడికి, వషట్కారస్వరూపుడికి శివభగవానుడికి నమస్కారం.

**మధ్యే గగనరూపాయ గగనస్థాయ తే నమః ।**
**అష్టక్షేత్రాష్టరూపాయ అష్టతత్త్వాయ తే నమః ॥128॥**

**చతుర్ధా చ చతుర్ధా చ చతుర్ధా సంస్థితాయ చ ।**
**పంచధా పంచధా చైవ పంచమంత్రశరీరిణే ॥129॥**

హృదయకమలం మధ్యలో ఆకాశసమానరూపుడికి, అట్లే గగనస్థుడికి నమస్కారం. సూర్యుడు మొదలైన అష్టస్థానాలు, రుద్రుడు మొదలైన ఎనిమిది రూపాలలో, పృథ్వి మొదలైన ఎనిమిది తత్త్వాలు కలిగిన నీకు నమస్కారం. నాల్గు వేదాల రూపంలో, నాల్గు ఆశ్రమాలరూపంలో, నాల్గు వ్యూహాల స్వరూపంలో స్థితుడైనవానికి నమస్కారం. ఆకాశం మొదలైన పంచభూతాత్ముడికి, సద్యోజాతాదులైన పంచరూపాలలో స్థితుడైన వాడికి, సద్యోజాతాది పంచమంత్ర రూపశరీరంగలవాడు అయిన శివుడికి నమస్కారం.

**చతుఃషష్టి ప్రకారాయ అకారాయ నమో నమః ।**
**ద్వాత్రింశత్తత్త్వరూపాయ ఉకారాయ నమో నమః ॥130॥**

**షోడశాత్మస్వరూపాయ మకారాయ నమో నమః ।**
**అష్టధాత్మస్వరూపాయ అర్ధమాత్రాత్మనే నమః ॥131॥**

**ఓంకారాయ నమస్తుభ్యం చతుర్ధా సంస్థితాయ చ ।**
**గగనేశాయ దేవాయ స్వర్గేశాయ నమో నమః ॥132॥**

**సప్తలోకాయ పాతాళనరకేశాయ వై నమః ।**
**అష్టక్షేత్రాష్టరూపాయ పరాత్పరతరాయ చ ॥133॥**

అరవైనాల్గు కళలందు నిరూపింపబడిన రూపం గలవాడికి, అకారస్వరూపుడికి నమస్కారం. ముప్పైరెండు మాతృకాస్వరూపుడికి, ఉకార స్వరూపుడికి నమస్కారం. షోడశకళాస్వరూపుడికి, మకారస్వరూపుడికి నమస్కారం. అష్టవిధాలైన ఆత్మస్వరూపుడికి, అర్ధమాత్రాత్మకనాదస్వరూపుడికి నమస్కారం. (అకార, ఉకార, మకారాలు అర్ధమాత్రాత్మకాలైన నాదరూపాలు) నాల్గు విధాలుగా స్థితుడవు, ఓంకారస్వరూపుడవు అయిన నీకు నమస్కారం. ఆకాశానికి స్వామి, స్వర్గానికి స్వామి అయిన శివుడికి మాటిమాటికి నమస్కారం. సప్తలోకాలకు ఈశ్వరుడు, పాతాళానికి, నరకానికి ప్రభువు, అష్టరూపాత్మకుడు, మరియు సర్వోత్కృష్టుడు అయిన శివుడికి నమస్కారం.

**సహస్రశిరసే తుభ్యం సహస్రాయ చ తే నమః ।**
**సహస్రపాదయుక్తాయ శర్వాయ పరమేష్ఠినే ॥134॥**

**నవాత్మతత్త్వరూపాయ నవాష్టాత్మాత్మశక్తయే ।**
**పునరష్టప్రకాశాయ తథాష్టాష్టకమూర్తయే ॥135॥**

**చతుః షష్ట్యాత్మతత్త్వాయ పునరష్టవిధాయ తే ।**
**గుణాష్టకవృతాయైవ గుణినే నిర్గుణాయ తే ॥136॥**

వేయి శిరసులవాడివి, వేయి రూపాలవాడివి, వేయి పాదాలవాడివి పరమేష్ఠివి మరియు శర్వుడవు అయిన నీకు నమస్కారం. పురుష ప్రకృతులు, అహంకారం, ఆకాశం, వాయువు మొదలైన తొమ్మిది ఆత్మతత్త్వస్వరూపుడివి, డెబ్బది రెండు గుణాలు గల ఆత్మశక్తి రూపుడివి, అష్టగుణాలతో ప్రకాశించువాడివి, ఆరవైనాల్గుమూర్తులు గలవాడివి,

అరవైనాల్గు ఆత్మతత్త్వ స్వరూపుడివి, అష్టవిధ రూపుడివి, అష్ట గుణాలతో కూడిన వాడివి, గుణి అయిన వాడివి, నిర్గుణుడైన వాడివి అయిన నీకు నమస్కారం.

**మూలస్థాయ నమస్తుభ్యం శాశ్వతస్థానవాసినే ।**
**నాభిమండలసంస్థాయ హృది నిఃస్వనకారిణే ॥137॥**

**కంధరే చ స్థితాయైవ తాలురంధ్రస్థితాయ చ ।**
**భ్రూమధ్యే సంస్థితాయైవ నాదమధ్యే స్థితాయ చ ॥138॥**

**చంద్రబింబస్థితాయైవ శివాయ శివరూపిణే ।**
**వహ్నిసోమార్కరూపాయ షట్త్రింశచ్ఛక్తిరూపిణే ॥139॥**

**త్రిధా సంవృత్య లోకాన్ వై ప్రసుప్తభుజగాత్మనే ।**
**త్రిప్రకారం స్థితాయైవ త్రేతాగ్నిమయరూపిణే ॥140॥**

**సదాశివాయ శాంతాయ మహేశాయ పినాకినే ।**
**సర్వజ్ఞాయ శరణ్యాయ సద్యోజాతాయ వై నమః ॥141॥**

**అఘోరాయ నమస్తుభ్యం వామదేవాయ తే నమః ।**
**తత్పురుషాయ నమస్తుభ్యం ఈశానాయ నమో నమః ॥142॥**

మూలాధారచక్రమందుండు మీకు నమస్కారం. శాశ్వతసాధనాలలో నివసించువాడివి, నాభిమండల మందుండువాడివి, హృదయంలో ప్రాణవాయుధ్వనిచేయువాడివగు నీకు నమస్కారం. గ్రీవమందు స్థితుడైనవానివి, తాలురంధ్రాలలో స్థితుడైనవానివి, భ్రూమధ్యమందుండువానివి, నాదమధ్యమందుండువాడివి, చంద్రబింబం మధ్యలో ఉండువానివి, కళ్యాణకారివి, శివస్వరూపుడివి, సూర్యచంద్రాగ్ని స్వరూపుడివి, ముప్పైఆరుశక్తుల స్వరూపివి, సత్త్వరజస్తమాలనే మూడు గుణాలతో లోకాన్ని చుట్టియున్నవాడివి, నిద్రిస్తున్న సర్పస్వరూపివి (కుండలినీశక్తి) మూడు విధాల రూపాలతో కూడిన త్రేతాగ్నిరూపుడివి, సదాశివుడివి, శాంతస్వభావుడవు, మహేశ్వరుడివి, పినాకివి, సర్వజ్ఞుడివి, శరణ్యుడివి, సద్యోజాతుడివియగు నీకు నమస్కారం. అఘోరరూపుడివి, వామదేవుడివియైన నీకు నమస్కారం. తత్పురుషస్వరూపుడివి, ఈశ్వరుడివియైన నీకు నమస్కారం.

**నమస్త్రింశత్ప్రకాశాయ శాంతాతీతాయ వై నమః ।**
**అనంతేశాయ సూక్ష్మాయ ఉత్తమాయ నమోఽస్తుతే ॥143॥**

**ఏకాక్షాయ నమస్తుభ్యమేకరుద్రాయ తే నమః ।**
**నమస్త్రిమూర్తయే తుభ్యం శ్రీకంఠాయ శిఖండినే ॥144॥**

ముప్పై ముహూర్తాలలో ప్రకాశించువాడివివైన నీకు నమస్కారం. అతీతశాంతుడివైన నీకు నమస్కారం. అనంతేశుడివి, సూక్ష్ముడివి, ఉత్తముడివియైన నీకు నమస్కారం. ఏకాక్షుడివియైన నీకు (ఒకే ఒక జ్ఞాననేత్రం) నమస్కారం. అద్వితీయరుద్రుడవైన నీకు నమస్కారం. త్రిమూర్తివి, శ్రీకంఠుడివి, శిఖండివియైన నీకు నమస్కారం.

**అనంతాసనసంస్థాయ అనంతాయాంతకారిణే ।**
**విమలాయ విశాలాయ విమలాంగాయ తే నమః ॥145॥**

**విమలాసనసంస్థాయ విమలార్థార్థరూపిణే ।**
**యోగపీఠాంతరస్థాయ యోగినే యోగదాయినే ॥146॥**

**యోగినాం హృది సంస్థాయ సదా నీవారశూకవత్ ।**
**ప్రత్యాహారాయ తే నిత్యం ప్రత్యాహారరతాయ తే ॥147॥**

**ప్రత్యాహారరతానాం చ ప్రతిస్థానస్థితాయ చ ।**
**ధారణాయై నమస్తుభ్యం ధారణాభిరతాయ తే ॥148॥**

అనంతుడనే (శేషుడు) ఆసనమందున్నవాడివి, అనంతస్వరూపుడివి, అంతమొందించువాడివి, విశుద్ధివి, విశాలుడివి, పరిశుభ్రాంగివియైన నీకు నమస్కారం. విమలమైన ఆసనమందున్నవాడివి, విమలార్థజ్ఞాన స్వరూపుడివియైన నీకు నమస్కారం. యోగపీఠంమధ్యలో నిలిచియుండు యోగివి, యోగప్రదాతవు, ఎల్లప్పుడూ నీవారధాన్యం యొక్క కొనభాగం (ముక్కు) మాదిరిగా యోగుల హృదయాలలో ఉండేవాడివియైన నీకు నమస్కారం. ప్రత్యాహారస్వరూపుడివి, నిత్యం ప్రత్యాహారనిరతుడివి, ప్రత్యాహారప్రీతులైన జనుల హృదయాలలో స్థిరుడైనవాడివి, ధారణాస్వరూపుడివి, ధారణాభిరతుడివియైన నీకు నమస్కారం.

**ధారణాభ్యాసయుక్తానాం పురస్తాత్సంస్థితాయ చ ।**
**ధ్యానాయ ధ్యానరూపాయ ధ్యానగమ్యాయ తే నమః ॥149॥**

**ధ్యేయాయ ధ్యేయగమ్యాయ ధ్యేయధ్యానాయ తే నమః ।**
**ధ్యేయానామపి ధ్యేయాయ నమో ధ్యేయతమాయ తే ॥150॥**

**సమాధానాభిగమ్యాయ సమాధానాయ తే నమః ।**
**సమాధానరతానాం తు నిర్వికల్పార్థరూపిణే ॥151॥**

ధారణ మరియు అభ్యాసంతో కూడిన జనులకు ముందుగా ఉండువాడివి, ధ్యానుడివి, ధ్యానరూపుడివి, ధ్యానం వల్ల తెలియదగినవాడివియైన నీకు నమస్కారం. ధ్యేయుడివి, ధ్యేయగమ్యుడివి, ధ్యేయధ్యానుడివియైన నీకు నమస్కారం. ధ్యేయులైన వారికి కూడా ధ్యేయుడవు, ధ్యేయతముడవు – నీకు నమస్కారం. సమాధానం వల్ల తెలియదగినవాడివి, సమాధానం అయినవాడివియైన నీకు నమస్కారం. సమాధానరతులైన ప్రజలకు నిర్వికల్పార్థస్వరూపుడివైన నీకు నమస్కారం.

**దగ్ధోద్ధృతం సర్వమిదం త్వయాద్య జగత్త్రయం రుద్ర పురత్రయం హి ।**
**కః స్తోతుమిచ్ఛేత్కథమీదృశం త్వాం స్తోష్యేహి తుష్టాయ శివాయ తుభ్యమ్ ॥152॥**

ఓ రుద్రభగవానుడా! నీ చేత త్రిపురాలు దహింపబడిన కారణంగా మూడులోకాలు ఉద్ధరింపబడ్డాయి. ఈ విధమైన నిన్ను ఏ విధంగా స్తుతించాలి. అయినా స్వయంగా సంతుష్టుడవైన నిన్ను నేను స్తుతిస్తున్నాను.

**భక్త్యాచ తుష్ట్యాద్భుతదర్శనాచ్చ మర్త్యా అమర్త్యా అపి దేవదేవ ।**
**ఏతే గణాః సిద్ధగణైః ప్రణామం కుర్వంతి దేవేశ గణేశ తుభ్యం ॥153॥**

ఓ దేవదేవేశ్వరుడా! గణేశ్వరా! మీ మీద భక్తి వలన, సంతుష్టి వలన, మీ అద్భుతదర్శనం వలన ఈ మానవులు, దేవతలు, సిద్ధగణాలతో కూడిన అన్ని గణాలు మీకు నమస్కరిస్తున్నాయి.

**నిరీక్షణాదేవ విభోఽపి దగ్ధుం పురత్రయం చైవ జగత్త్రయం చ ।**
**లీలాలసేనాంబికయా క్షణేన దగ్ధం కిలేషుశ్చ తదాథ ముక్తః ॥154॥**

ఓ ప్రభూ! దర్శనం వల్లే త్రిపురాల్ని, త్రిలోకాల్ని దహింపగలవు. పార్వతీదేవితోపాటు లీలాసక్తుడవైన నీవు క్షణకాలంలో దహించావు. ఆ సమయంలో బాణం కూడా విడువబడింది.

**కృతో రథశ్చేషువరశ్చ శుభ్రం శరాసనం తే త్రిపురక్షయాయ ।**
**అనేకయత్నైశ్చ మయాథ తుభ్యం ఫలం న దృష్టం సురసిద్ధసంఘైః ॥155॥**

త్రిపురాల నాశనం కోసం నీకు రథం, శ్రేష్ఠమైన బాణం, సుందరమైన విల్లు అనేకమైన గట్టి ప్రయత్నాలతో నాచే నిర్మింపబడ్డాయి. అయితే వాటి ఫలితాన్ని మాత్రం దేవతలు, సిద్ధసమూహాలు చూడలేదు. ఎందుచేతననగా క్షణకాలంలో నీవు దహించడం చేత.

**రథో రథీ దేవవరో హరిశ్చ రుద్రః స్వయం శక్రపితామహౌ చ ।**
**త్వమేవ సర్వే భగవన్ కథం తు స్తోష్యే హ్యతోష్యం ప్రణిపత్య మూర్ధ్నా ॥156॥**

రథమూ, రథి, దేవశ్రేష్ఠుడు విష్ణువు, స్వయంగా రుద్రుడు, ఇంద్రుడు, బ్రహ్మ వీళ్లందరూ నీవే. స్తుతింపలేని నిన్ను నేను ఎలా స్తుతించగలను. శిరసుతో నమస్కరిస్తున్నాను.

**అనంతపాదస్త్వమనంతబాహురనంతమూర్ధాంతకరః శివశ్చ ।**
**అనంతమూర్తిః కథమీదృశం త్వాం తోష్యే హ్యతోష్యం కథమీదృశం త్వామ్ ॥157॥**

నీవు అనేక పాదాలు గలవాడవు. అనేక హస్తాలు గలవాడవు. అనేక శిరస్సులు గలవాడవు, అనంతరూపాలు గలవాడవు, లయకారుడవు మరియు శివంకరుడవు. ఇటువంటి ప్రభావశాలివైన నిన్ను ఎలా స్తుతించేది? నీవు అతోష్యుడవు నిన్ను ఎలా స్తుతించేది?

**నమో నమః సర్వవిదే శివాయ రుద్రాయ శర్వాయ భవాయ తుభ్యమ్ ।**
**స్థూలాయ సూక్ష్మాయ సుసూక్ష్మసూక్ష్మసూక్ష్మాయ సూక్ష్మార్థవిదే విధాత్రే ॥158॥**
**నేత్రే సురాణామసురేశ్వరాణాం దాత్రే ప్రశాస్త్రే మమ సర్వశాస్త్రే ॥159॥**

శివుడవు, రుద్రుడవు, శర్వుడవు, భవుడవు, సమస్తమూ తెలిసినవాడివైన నీకు నమస్కారం. స్థూలుడవు, సూక్ష్ముడవు, మిక్కిలి సూక్ష్ముడవు, సూక్ష్మానికే సూక్ష్ముడవు, సూక్ష్మార్థవిదుడవు, విధాతవు అయిన నీకు నమస్కారం. సమస్తదేవదానవులను సృష్టించినవాడవు. లోకాల్ని సృష్టించి భరించేవాడవు. హరించేవాడవు. దేవదానవులకు నాయకుడవు. సమస్తాన్ని ఇచ్చేవాడవు. నాకు మరియు అందరికి ప్రశాసనుడవు – నీకు నమస్కారం.

**వేదాంతవేద్యాయ సునిర్మలాయ వేదార్థవిద్భిః సతతం స్తుతాయ ।**
**వేదాత్మరూపాయ భవాయ తుభ్యమంతాయ మధ్యాయ సుమధ్యమాయ ॥160॥**

వేదాంతవేత్తవు, పరమపరిశుద్ధుడవు, వేదాంతవేత్తలచేత ఎల్లప్పుడూ స్తుతింపబడేవాడవు. వేదాల ఆత్మస్వరూపుడవు, భవుడవు, అంతానివి. మధ్యమానివి. సుమధ్యమానివి. నీకు నమస్కారం.

**ఆద్యంతశూన్యాయ చ సంస్థితాయ తథా త్వశూన్యాయ చ లింగినే చ ।**
**అలింగినే లింగమయాయ తుభ్యం లింగాయ వేదాదిమయాయ సాక్షాత్ ॥161॥**

ఆద్యంతరహితుడవు, అంతటా ఉన్నవాడవు, శూన్యత లేనివాడవు, లింగివి, అలింగివి, లింగమయుడవు, లింగస్వరూపుడవు, సాక్షాత్తు ప్రణవస్వరూపుడవు అయిన నీకు నమస్కారం.

**రుద్రాయ మూర్ధానికృంతనాయ మమాదిదేవస్య చ యజ్ఞమూర్తేః ।**
**విధ్వాంతభంగం మమ కర్తుమీశ దృష్ట్వైవ భూమౌ కరజాగ్రకోట్యా ॥162॥**

నా యొక్కయు, యజ్ఞస్వరూపుడు ఆదిదేవుడు అయిన విష్ణువు యొక్క శిరసుల్ని ఖండించిన రుద్రుడికి నమస్కారం. అజ్ఞానాంధకారాన్ని నాశనం చేయడం కోసం చేతిగోటిమొనతో నా మస్తకాన్ని ఛేదించినవాడికి నమస్కారం.

**అహో విచిత్రం తవ దేవదేవ విచేష్టితం సర్వసురాసురేశ ।**
**దేహీవ దేవైః సహ దేవకార్యం కరిష్యసే నిర్గుణరూపతత్త్వ ॥163॥**

ఓ దేవదేవా! ఓ సమస్తదేవతలకు రాక్షసులకు ప్రభువా! నీ క్రియాకలాపాలు విచిత్రాలు. ఓ నిర్గుణస్వరూపతత్త్వుడా! నీవు దేవతలతో కూడి దేహధారి విధంగా దేవకార్యాలు చేస్తున్నావు.

**ఏకం స్థూలం సూక్ష్మమేకం సుసూక్ష్మం మూర్తామూర్తం మూర్తమేకం హ్యమూర్తమ్ ।**
**ఏకం దృష్టం వాఙ్మయం చైకమీశం ధ్యేయం చైకం తత్త్వమత్రాద్భుతం తే ॥164॥**

నీ రూపమొకటి స్థూలమై (పృథ్వి) ఉంది. ఒకటి సూక్ష్మం (జలం). ఒకటి మిక్కిలి సూక్ష్మమైంది (అగ్ని). మూర్తామూర్తరూపం (చంద్రుడు). ఒకటి మూర్తం (సూర్యుడు). ఒకటి అమూర్తరూపం (వాయువు). ఒకటి కన్పించే వాఙ్మయరూపం (శబ్దగుణంగల ఆకాశం). ఒకటి ధ్యేయమైన అద్భుతరూపం అయిన ఈశ్వరరూపం.

**స్వప్నే దృష్టం యత్పదార్థం హ్యలక్ష్యం దృష్టం నూనం భాతి మన్యే న చాపి ।**
**మూర్తిర్నో వై దేవమీశానదేవైర్లక్ష్యా యత్నైరప్యలక్ష్యం కథం తు ॥165॥**

కలలో చూచిన వస్తువు అలక్ష్యం. నిశ్చితరూపంగా కళ్లకు కనిపించింది కూడా కనిపించనిదిగా భావిస్తున్నాను. అట్లే ఓ ఈశ్వరుడా! దేవతల ద్వారా ప్రయత్నపూర్వకంగా కన్పించిన నీ విగ్రహం మాకు నిర్గుణం. కాగా అది అలక్ష్యమెట్లు అవుతుంది?

**దివ్యః క్వ దేవేశ భవత్ప్రభావో వయం క్వ భక్తిః క్వ చ తే స్తుతిశ్చ ।**
**తథాపి భక్త్యా విలపంతమీశ పితామహం మాం భగవాన్ క్షమస్వ ॥166॥**

ఓ దేవేశ్వరా! నీ దివ్యప్రభావమెక్కడ? మేమెక్కడ? మా భక్తి ఎంత! మాస్తుతి ఎంత! అయినా భక్తితో దుఃఖిస్తున్న బ్రహ్మనైన నన్ను క్షమించు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**య ఇమం శృణుయాద్ ద్విజోత్తమా భువి దేవం ప్రణిపత్య వా పఠేత్।**
**స చ ముంచతి పాపబంధనం భవభక్త్యా పురశాసితుః స్తవమ్ ॥167॥**

ఓ ద్విజశ్రేష్ఠులారా! ఎవడు ఈ భువిలో దేవాధిదేవుడు త్రిపురనాశనుడు అయిన శివుడికి నమస్కరించి ఈ స్తోత్రాన్ని వింటాడో, లేక పఠిస్తాడో వాడు శివభక్తివలన పాపబంధాల నుంచి విముక్తుడవుతాడు.

**శ్రుత్వా చ భక్త్యా చతురాననేన స్తుతో హసన్ శైలసుతాం నిరీక్ష్య ।**
**స్తవం తదా ప్రాహ మహానుభావం మహాభుజో మందరశృంగవాసీ ॥168॥**

అపుడు బ్రహ్మ భక్తితో చేసిన ఆ స్తుతిని విని మహాభుజుడు, మందరపర్వతశృంగనివాసియైన శివుడు నవ్వుతూ పార్వతీదేవిని చూచి మహానుభావుడైన బ్రహ్మను గూర్చి ఇలా పలికాడు.

**శివ ఉవాచ –** శివుడు పలికాడు.

**స్తవేనానేన తుష్టోఽస్మి తవ భక్త్యా చ పద్మజ।**
**వరాన్ వరయ భద్రం తే దేవానాం చ యథేప్సితాన్ ॥169॥**

ఓ పద్మసంభవా! భక్తితో నీవు చేసిన ఈ స్తవంతో నేను సంతుష్టుణ్ణి అయ్యాను. ఇష్టమైన వరాల్ని కోరుకో. నీకు, ఈ దేవతలకు శుభమగుగాక!

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**తతః ప్రణమ్య దేవేశం భగవాన్ పద్మసంభవః।**
**కృతాంజలిపుటో భూత్వా ప్రాహేదం ప్రీతమానసః ॥170॥**

తర్వాత పద్మజుడైన బ్రహ్మ సంప్రీతహృదయుడై శివభగవానుడికి అంజలి ఘటించి నమస్కరించి ఇలా చెప్పాడు.

**శ్రీ పితామహ ఉవాచ –** శ్రీ బ్రహ్మదేవుడు పలికాడు.

**భగవన్ దేవదేవేశ త్రిపురాంతక శంకర ।**
**త్వయి భక్తిం పరాం మేఽద్య ప్రసీద పరమేశ్వర ॥171॥**

**దేవానాం చైవ సర్వేషాం త్వయి సర్వార్థదేశ్వర ।**
**ప్రసీద భక్తియోగేన సారథ్యేన చ సర్వదా ॥172॥**

ఓ భగవాన్! ఓ దేవదేవేశ! ఓ త్రిపురాంతక! ఓ శంకర! నాకు మీయందు అత్యంత భక్తి కలిగి ఉండే విధంగా వరాన్ని అనుగ్రహించండి! ఓ పరమేశ్వరుడా! నీవు ప్రసన్నుడవు కమ్ము. సమస్త ప్రయోజనాల్ని ప్రసాదించే ఓ శంకర! నీయందు దేవతలందరికి భక్తి ఉంది. నాయొక్క భక్తియోగం వల్ల సారథిరూపంగా నీకు ఎల్లప్పుడూ ఉండడానికి నాకు అనుగ్రహమిమ్ము.

**జనార్దనోఽపి భగవాన్నమస్కృత్య మహేశ్వరమ్ ।**
**కృతాంజలిపుటో భూత్వా ప్రాహ సాంబం త్రియంబకమ్ ॥173॥**

**వాహనత్వం తవేశాన నిత్యమీహే ప్రసీద మే ।**
**త్వయి భక్తించ దేవేశ దేవదేవ నమోఽస్తు తే ॥174॥**

**సామర్థ్యం చ సదా మహ్యం భవంతం వోఢుమీశ్వరమ్ ।**
**సర్వజ్ఞత్వం చ వరద సర్వగత్వం చ శంకర ॥175॥**

విష్ణుభగవానుడు కూడా పార్వతీసహితుడైన శివుడికి చేతులు జోడించి నమస్కరించి ఇలా పలికాడు. ఓ ఈశ్వరుడా! నేను వృషభాదిరూపంగా ఎల్లప్పుడూ నీకు వాహనంగా ఉండడానికి అభిలషిస్తున్నాను. నీయందు నాకు భక్తి కలదు. ఓ దేవాధిదేవ! నీకు నమస్కారం. ఓ వరదా! ఓ శంకరా! నిన్ను ఎల్లప్పుడూ మోసే సామర్థ్యం, సర్వగతత్వం, సర్వజ్ఞత్వం నాకు ప్రదానం చెయ్యవలసింది.

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**తయోః శ్రుత్వా మహాదేవో విజ్ఞప్తిం పరమేశ్వరః ।**
**సారథ్యే వాహనత్వే చ కల్పయామాస వైభవః ॥176॥**

**దత్త్వా తస్మై బ్రహ్మణే విష్ణవే చ దగ్ధ్వా దైత్యాన్ దేవదేవో మహాత్మా ।**
**సార్ధం దేవ్యా నందినా భూతసంఘైరంతర్ధానం కారయామాస శర్వః ॥177॥**

ఆ యిద్దరి ప్రార్థన విని మహాదేవుడైన పరమేశ్వరుడు వారిని సారథిగా, వాహనంగా ఉండడానికి అంగీకరించాడు. బ్రహ్మకు, విష్ణువుకు వరాల్ని యిచ్చి దానవుల్ని దహించి దేవదేవుడైన శివుడు పార్వతీదేవితో, నందితో, భూతగణాలతో కూడినవాడై అంతర్హితుడయ్యాడు.

**తతస్తదా మహేశ్వరే గతే రణాద్ గణైః సహ ।**
**సురేశ్వరాః సువిస్మితా భవం ప్రణమ్య పార్వతీమ్ ॥178॥**

**యయుశ్చ దుఃఖవర్జితాః స్వవాహనైర్దివం తతః ।**
**సురేశ్వరా మునీశ్వరా గణేశ్వరాశ్చ భాస్కరాః ॥179॥**

తర్వాత శివభగవానుడు ఆ రణభూమి నుండి గణాలతో కూడా వెళ్లినవాడు కాగా ముఖ్య దేవతలు ఆశ్చర్యపడిరి. శివుడికి, పార్వతీదేవికి నమస్కరించి దుఃఖరహితులై సురేశ్వరులు, మునీశ్వరులు, గణేశ్వరులు, ఆదిత్యులు వాళ్ల వాళ్ల వాహనాల మీద స్వర్గానికి వెళ్లారు.

**త్రిపురారేరిమం పుణ్యం నిర్మితం బ్రహ్మణా పురా ।**
**యః పఠేచ్ఛ్రాద్ధకాలే వా దైవే కర్మణి చ ద్విజాః ॥180॥**

**శ్రావయేద్వా ద్విజాన్ భక్త్యా బ్రహ్మలోకం స గచ్ఛతి ।**
**మానసైర్వాచికైః పాపైస్తథా వై కాయికైః పునః ॥181॥**

**స్థూలైః సూక్ష్మైః సుసూక్ష్మైశ్చ మహాపాతకసంభవైః ।**
**పాతకైశ్చ ద్విజశ్రేష్ఠా ఉపపాతకసంభవైః ॥182॥**

**పాపైశ్చ ముచ్యతే జంతుః శ్రుత్వాధ్యాయమిమం శుభమ్ ।**
**శత్రవో నాశమాయాంతి సంగ్రామే విజయీ భవేత్ ॥183॥**

**సర్వరోగైర్న బాధ్యేత ఆపదో న స్పృశంతి తమ్ ।**
**ధనమాయుర్యశో విద్యాం ప్రభావమతులం లభేత్ ॥184॥**

ఓ ద్విజులారా! ఎవడు పూర్వకాలంలో బ్రహ్మ రచించిన త్రిపురశత్రువైన శివుడి యొక్క ఈ పవిత్ర స్తోత్రం శ్రాద్ధ సమయంలోగాని, దైవకార్యసమయంలోగాని భక్తితో పఠిస్తాడో లేక ద్విజులకు వినిపిస్తాడో ఆతడు బ్రహ్మలోకానికి వెళతాడు. ఓ ద్విజశ్రేష్ఠులారా! శుభకరమైన ఈ అధ్యాయాన్ని విన్న జనుడు మానసికమైన, వాచికమైన, అట్లే శారీరకమైన పాపాల నుంచి, స్థూల, సూక్ష్మ, అతిసూక్ష్మ పాపాల నుంచి, ఘోరమైన అపరాధాలు కలిగిన వాళ్లు ఆ పాపాల నుంచి, మరియు అల్పమైన అపరాధాలు కల్గినవారు ఆ పాపాల నుంచి ముక్తులు అవుతారు. దీనివల్ల శత్రునష్టం కల్గుతుంది. సంగ్రామంలో విజయం సిద్ధిస్తుంది. సర్వరోగపీడ తొలగుతుంది. ఆపదలు కలగవు. ధనం, ఆయువు, యశస్సు, విద్య, అట్లే అధికప్రభావం కల్గుతుంది.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే త్రిపురదాహే బ్రహ్మస్తవో నామ ద్విసప్తతితమోఽధ్యాయః ॥72॥**

శ్రీ లింగమహాపురాణం, పూర్వభాగంలోని త్రిపురదాహమందలి బ్రహ్మస్తుతి అనే డెబ్బై రెండవ అధ్యాయం సమాప్తం.

## త్రిసప్తతితమోఽధ్యాయః - డెబ్బై మూడవ అధ్యాయం
## బ్రహ్మప్రోక్తలింగార్చనవిధిః - బ్రహ్మచే చెప్పబడిన లింగార్చనవిధి

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**గతే మహేశ్వరే దేవే దగ్ధ్వా చ త్రిపురం క్షణాత్ ।**
**సదస్యాహ సురేంద్రాణాం భగవాన్ పద్మసంభవః ॥1॥**

క్షణకాలంలో త్రిపురాల్ని దహించి దేవదేవుడైన మహేశ్వరుడు అంతర్ధానం చెందగా బ్రహ్మదేవుడు శ్రేష్ఠదేవతల యొక్క సభలో ఈ విధంగా పలికాడు.

**పితామహ ఉవాచ** - పితామహుడు పలికాడు.

**సంత్యజ్య దేవదేవేశం లింగమూర్తిం మహేశ్వరమ్ ।**
**తారపౌత్రో మహాతేజాస్తారకస్య సుతో బలీ ॥2॥**

**తారకాక్షోఽపి దితిజః కమలాక్షశ్చ వీర్యవాన్ ।**
**విద్యున్మాలీ చ దైత్యేశః అన్యే చాపి సబాంధవాః ॥3॥**

**త్యక్త్వా దేవం మహాదేవం మాయయా చ హరేః ప్రభోః ।**
**సర్వే వినష్టాః ప్రధ్వస్తాః స్వపురైః పురసంభవైః ॥4॥**

విష్ణువు మాయవలన లింగమూర్తి దేవాధిదేవుడు అయిన మహేశ్వరుణ్ణి విడిచిన కారణంగా దితి సంతానము మహాతేజస్వి తార యొక్క మనుమడు, తారకుని కుమారులు బలవంతులు అయిన తారకాక్షుడు మరియు కమలాక్షుడు, విద్యున్మాలి, తదితర దానవరాజులందరూ, బంధువులతోను వారి నగరాలతోను, అందలి ప్రజలతోను ప్రధ్వంసమై నశించారు.

**తస్మాత్సదా పూజనీయో లింగమూర్తిః సదాశివః ।**
**యావత్పూజా సురేశానాం తావదేవ స్థితిర్యతః ॥5॥**

**పూజనీయః శివో నిత్యం శ్రద్ధయా దేవపుంగవైః ।**
**సర్వలింగమయో లోకః సర్వం లింగే ప్రతిష్ఠితమ్ ॥6॥**

**తస్మాత్ సంపూజయేల్లింగం య ఇచ్ఛేత్సిద్ధిమాత్మనః ।**

అందుచేత లింగమూర్తి అయిన సదాశివుడి యొక్క పూజ అన్నివేళలా చేయాలి. ఎంతవరకు దేవతాముఖ్యులు శివుణ్ణి పూజిస్తారో అంతవరకే వారి ఉన్నతి నిలుస్తుంది. దేవతాశ్రేష్ఠుల చేత శివుడు నిత్యం శ్రద్ధతో పూజింపదగినవాడు. ఈ సమస్తలోకం లింగమయం. అంతయు లింగమందే ప్రతిష్ఠింపబడి ఉన్నది. ఆత్మసిద్ధి కోరువాడు అధికంగా లింగాన్ని పూజించాలి.

**సర్వే లింగార్చనాదేవ దేవా దైత్యాశ్చ దానవాః ॥7॥**

**యక్షా విద్యాధరాః సిద్ధా రాక్షసాః పిశితాశనాః ।**
**పితరో మునయశ్చాపి పిశాచాః కిన్నరాదయః ॥8॥**

**అర్చయిత్వా లింగమూర్తిం సంసిద్ధా నాత్ర సంశయః ।**

దేవతలు, దైత్యులు, దానవులు, యక్షులు, విద్యాధరులు, సిద్ధులు, మాంసభక్షకులైన రాక్షసులు, పితృదేవతలు, మునులు, పిశాచులు, కిన్నరులు అందరూ లింగమూర్తిని అర్చించడంచేతనే సిద్ధిని పొందారు. ఇందులో సందేహం లేదు.

**తస్మాల్లింగం యజేన్నిత్యం యేన కేనాపి వా సురాః ॥9॥**

**పశవశ్చ వయం తస్య దేవదేవస్య ధీమతః ।**
**పశుత్వం చ పరిత్యజ్య కృత్వా పాశుపతం తతః ॥10॥**

**పూజనీయో మహాదేవో లింగమూర్తిః సనాతనః ।**
**విశోధ్య చైవ భూతాని పంచభిః ప్రణవైః సమమ్ ॥11॥**

**ప్రాణాయామైః సమాయుక్తైః పంచభిః సురపుంగవాః ।**
**చతుర్భిః ప్రణవైశ్చైవ ప్రాణాయామపరాయణైః ॥12॥**

**త్రిభిశ్చ ప్రణవైర్దేవాః ప్రాణాయామైస్తథావిధైః ।**
**ద్విధా న్యస్య తథోంకారం ప్రాణాయామపరాయణః ॥13॥**

**తతశ్చోంకారముచ్చార్య ప్రాణాపానౌ నియమ్య చ ।**
**జ్ఞానామృతేన సర్వాంగాన్యాపూర్య ప్రణవేన చ ॥14॥**

**గుణత్రయం చతుర్థాఖ్యమహంకారం చ సువ్రతాః ।**
**తన్మాత్రాణి చ భూతాని తథా బుద్ధీంద్రియాణి చ ॥15॥**

**కర్మేంద్రియాణి సంశోధ్య పురుషం యుగలం తథా ।**
**చిదాత్మానం తనుం కృత్వా చాగ్నిర్భస్మేతి సంస్పృశేత్ ॥16॥**

**వాయుర్భస్మేతి చ వ్యోమ తథాంభః పృథివీ తథా ।**
**త్రియాయుషం త్రిసంధ్యం చ ధూలయేద్భసితేన యః ॥17॥**

**స యోగీ సర్వతత్త్వజ్ఞో వ్రతం పాశుపతం త్విదమ్ ।**
**భవేన పాశమోక్షార్థం కథితం దేవసత్తమాః ॥18॥**

ఓ దేవతలారా! అందువల్ల ఏదో విధంగా లింగమూర్తిని నిత్యం పూజించాలి. బుద్ధిమంతుడైన ఆ దేవాధిదేవుడికి మనం పశువులం. అందుచేత పాశుపతవ్రతాన్ని ఆచరించి పశుత్వాన్ని త్యజించి ప్రాక్తనుడైన

మహాదేవుణ్ణి పూజించాలి. పంచ ప్రణవాల చేత కూడి పంచ ప్రాణాయామాలు చేసి పంచభూతాల్ని శోధించి, నాల్గు ప్రణవాలతో నాల్గు ప్రాణాయామాలు నిర్వహించి తిరిగి మూడు ప్రణవాలద్వారా మూడు ప్రాణాయామాలు నిర్వహించి, మరల రెండు ప్రణవాల ద్వారా రెండు ప్రాణాయామాల ద్వారా శోధించి ప్రాణాయామ పరాయణత్వాన్ని పొంది ఓంకారాన్ని న్యాసం చేసికొని తర్వాత ఓంకారాన్ని ఉచ్చరించి ప్రాణవాయువుకు, అపానవాయువును నియంత్రించుకుని జ్ఞానామృతరూపప్రణవంతో సర్వాంగాలు తడిసినట్లు భావించుకొని మూడుగుణాల్ని, నాల్గు అహంకారాల్ని అయిదు తన్మాత్రల్ని, అయిదు భూతాల్ని అయిదు జ్ఞానేంద్రియాల్ని, అయిదు కర్మేంద్రియాల్ని శోధించుకుని మరల యుగళపురుషుడి శోధన చేసి మన శరీరాన్ని చిదాత్మస్వరూపంగా భావించి ఇది అగ్నిభస్మం, ఇది వాయుభస్మం, ఇది ఆకాశభస్మం (వ్యోమ) ఇది జలభస్మం, ఇది పృథ్వీభస్మం అని చెప్పుకుని శరీరానికి భస్మాన్ని అలముకోవాలి. ఎవడు త్రిసంధ్యల్లో భస్మస్నానం చేస్తాడో ఆతడు యోగి. అన్ని తత్త్వాలు తెలిసినవాడు. ఓ దేవశ్రేష్ఠులారా! స్వయంగా శివభగవానుడి చేతనే సంసారపాశబంధనాలనుంచి ముక్తి కొరకై ఈ పాశుపతవ్రతం చెప్పబడింది.

**ఏవం పాశుపతం కృత్వా సంపూజ్య పరమేశ్వరమ్ ।**
**లింగే పురా మయా దృష్టే విష్ణునా చ మహాత్మనా ॥19॥**

**పశవో నైవ జాయంతే వర్షమాత్రేణ దేవతాః ।**
**అస్మాభిః సర్వకార్యాణాం దేవమభ్యర్చ్య యత్నతః ॥20॥**

**బాహ్యే చాభ్యంతరే చైవ మన్యే కర్తవ్యమీశ్వరమ్ ।**
**ప్రతిజ్ఞా మమ విష్ణోశ్చ దివ్యైషా సురసత్తమాః ॥21॥**

**మునీనాం చ న సందేహస్తస్మాత్సంపూజయేచ్ఛివమ్ ।**

ఓ దేవతలారా! ఈ విధంగా పాశుపతవ్రతాన్ని చేసి శివభగవానుణ్ణి పూజించి నేను మహాత్ముడైన విష్ణువు సర్వం దర్శించాం. పాశుపతదీక్ష సల్పినవారు పశుత్వం నుంచి ముక్తులవుతారు. మనం అన్ని కర్మల విషయంలోనూ మహేశ్వరుణ్ణి ప్రయత్నపూర్వకంగా బాహ్యాభ్యంతర విధులతో పూజించాలని నేను భావిస్తున్నాను. ఓ దేవతా శ్రేష్ఠులారా! ఇది నాయొక్కయు విష్ణుదేవుడి యొక్కయూ, మునులయొక్కయూ దివ్యమైన ప్రతిజ్ఞ. ఇందులో సందేహం లేదు. అందుచేత శివుణ్ణి పూజించాలి.

**సా హానిస్తన్మహచ్ఛిద్రం స మోహః సా చ మూకతా ॥22॥**

**యత్క్షణం వా ముహూర్తం వా శివమేకం న చింతయేత్ ।**
**భవభక్తిపరా యే చ భవప్రణతచేతసః ॥23॥**

**భవసంస్మరణోద్యుక్తా న తే దుఃఖస్య భాజనమ్ ।**
**భవనాని మనోజ్ఞాని దివ్యమాభరణం స్త్రియః ॥24॥**

**ధనం వా తుష్టిపర్యంతం శివపూజావిధేః ఫలమ్ ।**
**యే వాంఛంతి మహాభోగాన్ రాజ్యం చ త్రిదశాలయే ।**
**తేఽర్చయంతు సదా కాలం లింగమూర్తిం మహేశ్వరమ్ ॥25॥**

**హత్వా భిత్వా చ భూతాని దగ్ధ్వా సర్వమిదం జగత్ ॥26॥**

**యజేదేకం విరూపాక్షం న పాపైః స ప్రలిప్యతే ।**
**శైలం లింగం మదీయం హి సర్వదేవనమస్కృతమ్ ॥27॥**

ఎవడు ఒకక్షణం కాని ఒక ముహూర్తంకాని శివుణ్ణి స్మరించడో అది ఆతడికి కష్టం, దోషం, అజ్ఞానం అంతేకాక మూగతనమౌతుంది. ఎవడు శివుడి భక్తిలో బాగా లగ్నమవుతాడో, అంతఃకరణమందు శివుడికి నమస్కరిస్తాడో శివుడి స్మరణ కలిగి ఉంటాడో ఆతడు దుఃఖపాత్రుడు కాడు. సుందరభవనాలు, దివ్యాభరణాలు, స్త్రీలు, సంతృప్తికరమైన ధనం మొదలైనవి అన్నీ శివపూజావిధికి ఫలాలు. ఎవడు మహాభోగాలు, స్వర్గరాజ్యం కోరుకొంటాడో ఆతడు అన్ని కాలాల్లో లింగమూర్తియైన శివుడి అర్చన చెయ్యాలి. ప్రాణుల్ని చంపి, నరికి, మరియు సమస్త జగత్తును కాల్చి కూడా ఎవడు విరూపాక్షుణ్ణి పూజిస్తాడో వాడికి పాపాలు అంటవు. నేను పూజించిన శిలారూపమైన ఈ లింగం దేవతలందరి చేత నమస్కరింపబడినది.

**ఇత్యుక్త్వా పూర్వమభ్యర్చ్య రుద్రం త్రిభువనేశ్వరమ్ ।**
**తుష్టావ వాగ్భిరిష్టాభిర్దేవదేవం త్రియంబకమ్ ॥28॥**

**తదా ప్రభృతి శక్రాద్యాః పూజయామాసురీశ్వరమ్ ।**
**సాక్షాత్పాశుపతం కృత్వా భస్మోద్ధూలితవిగ్రహాః ॥29॥**

ఈ విధంగా పలికిన బ్రహ్మ ముందుగా త్రిలోక ప్రభువు, దేవాధిదేవుడు, ముక్కంటి అయిన శివుణ్ణి పూజించి ప్రియవచనాలతో స్తుతించాడు. అప్పటినుంచి ఇంద్రాది దేవతలు సాక్షాత్తూ భస్మధారితదేహులై పాశు పతవ్రతాన్ని నిర్వహించి పూజించారు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే బ్రహ్మప్రోక్త లింగార్చనవిధిర్నామ త్రిసప్తతితమోఽధ్యాయః ॥73॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని బ్రహ్మచే చెప్పబడిన లింగార్చనవిధానమనే డెబ్బై మూడవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **చతుఃసప్తతితమోఽధ్యాయః** - డెబ్బై నాల్గవ అధ్యాయం

## **శివలింగభేదసంస్థాపనాదివర్ణనమ్** - శివలింగభేదాలు-వాటి స్థాపనాదివర్ణనం

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**లింగాని కల్పయిత్వైవం సాధికారానురూపతః ।**
**విశ్వకర్మా దదౌ తేషాం నియోగాద్ బ్రహ్మణః ప్రభోః ॥1॥**

బ్రహ్మదేవుడి ఆజ్ఞమేరకు విశ్వకర్మ వాళ్ల అధికారాన్ని అనుసరించి లింగాల్ని నిర్మించి దేవతలకు వాటిని ఇచ్చాడు.

**ఇంద్రనీలమయం లింగం విష్ణునా పూజితం సదా ।**
**పద్మరాగమయం శక్రో హైమం విశ్రవసః స్మృతః ॥2॥**

**విశ్వేదేవాస్తథా రౌప్యం వసవః కాంతికం శుభమ్ ।**
**ఆరకూటమయం వాయురశ్వినౌ పార్థివం సదా ॥3॥**

విష్ణు భగవానుడు ఇంద్రనీలమణినిర్మిత లింగాన్ని, ఇంద్రుడు పద్మరాగమణినిర్మిత లింగాన్ని, విశ్రవసుకుమారుడు కుబేరుడు బంగారంతో నిర్మించిన లింగాన్ని, విశ్వేదేవతలు వెండితో చేసిన లింగాన్ని, వసువులు చంద్రకాంత శిలలతో చెక్కిన సుందరమైన లింగాల్ని, వాయువు ఇత్తడి లింగాన్ని, అశ్వనీదేవతలిద్దరూ మృణ్మయ లింగాల్ని ఎల్లప్పుడూ పూజించారు.

**స్ఫాటికం వరుణో రాజా ఆదిత్యాస్తామ్రనిర్మితమ్ ।**
**మౌక్తికం సోమరాడ్ ధీమాంస్తథా లింగమనుత్తమమ్ ॥4॥**

**అనంతాద్యా మహానాగాః ప్రవాలకమయం శుభమ్ ।**
**దైత్యా హ్యయోమయం లింగం రాక్షసాశ్చ మహాత్మనః ॥5॥**

వరుణదేవుడు స్ఫటికలింగాన్ని, ఆదిత్యులు రాగిలింగాన్ని, బుద్ధిమంతుడైన చంద్రుడు ఉత్తమమైన ముత్యాలలింగాన్ని, అనంతుడు మొదలైన సర్పముఖ్యులు మంగళకరమైన పగడంతో చేసిన లింగాల్ని, మహాత్ములైన దానవులు, రాక్షసులు ఇనుపలింగాల్ని పూజించారు.

**త్రైలోహికం గుహ్యకాశ్చ సర్వలోహమయం గణాః ।**
**చాముండా సైకతం సాక్షాన్మాతరశ్చ ద్విజోత్తమాః ॥6॥**

**దారుజం నైరృతిర్భక్త్యా యమో మారకతం శుభమ్ ।**
**నీలాద్యాశ్చ తథా రుద్రాః శుద్ధం భస్మమయం శుభమ్ ॥7॥**

ఓ ద్విజోత్తములారా! గుహ్యకులు మూడు లోహాలు కలిసిన లింగాల్ని, గణాలు అన్ని లోహాలు కలిపి చేసిన లింగాల్ని, చాముండాదేవి మరియు మాతలందరూ సైకత లింగాన్ని పూజించారు. నైరృతి భక్తితో దారులింగాన్ని, యముడు శుభకరమైన మరకతలింగాన్ని, నీలుడు మొదలైన రుద్రులు భస్మంతో నిర్మించిన శుద్ధశుభ్రలింగాల్ని పూజించారు.

**లక్ష్మీర్వృక్షమయం లక్ష్మీర్గుహో వై గోమయాత్మకమ్ ।**
**మునయో మునిశార్దూలాః కుశాగ్రమయముత్తమమ్ ॥8॥**

**వామాద్యాః పుష్పలింగం తు గంధలింగం మనోన్మనీ ।**
**సరస్వతీ చ రత్నేన కృతం రుద్రస్య వాంభసా ॥9॥**

**దుర్గా హైమం మహాదేవం సవేదికమనుత్తమమ్ ।**
**ఉగ్రా పిష్టమయం సర్వే మంత్రా హ్యాజ్యమయం శుభమ్ ॥10॥**

**వేదాః సర్వే దధిమయం పిశాచాః సీసనిర్మితమ్ ।**
**లేభిరే చ యథాయోగ్యం ప్రసాదాద్ బ్రహ్మణః పదమ్ ॥11॥**

**బహునాత్ర కిముక్తేన చరాచరమిదం జగత్ ।**
**శివలింగం సమభ్యర్చ్య స్థితమత్ర న సంశయః ॥12॥**

ఓ మునిశ్రేష్ఠులారా! లక్ష్మీదేవి లక్ష్మీవృక్షమయ లింగాన్ని (బిల్వవృక్షం) గుహుడు గోమయలింగాన్ని, మునులు కుశాగ్రాలతో నిర్మించిన లింగాల్ని, వామదేవాదులు పుష్పలింగాల్ని, మనోన్మని గంధలింగాన్ని పూజించారు. సరస్వతీదేవి రత్నలింగాన్నిగాని రుద్రజలంతో నిర్మించిన లింగాన్నిగాని పూజించింది. దుర్గాదేవి వేదికతో కూడిన సువర్ణమయమైన అత్యుత్తమ లింగాన్ని, ఉగ్రులు పిండితో చేసిన లింగాల్ని, మంత్రాలు శుభకరాలైన నేతిలింగాల్ని, అన్ని వేదాలు దధినిర్మితలింగాల్ని, పిశాచాలు సీసంతో నిర్మించిన లింగాల్ని పూజించారు. వీళ్లందరూ పూజచేసి బ్రహ్మకృపవలన యోగ్యమైన పదవులు పొందారు. ఈ విషయంలో ఎక్కువగా చెప్పుటెందుకు? శివలింగార్చన చేయడం చేతనే సర్వజగత్తు స్థితి చెంది ఉన్నది. ఇందులో సందేహం లేదు.

**షడ్విధం లింగమిత్యాహుర్ద్రవ్యాణాం చ ప్రభేదతః ।**
**తేషాం భేదాశ్చతుర్యుక్త చత్వారింశదితి స్మృతాః ॥13॥**

**శైలజం ప్రథమం ప్రోక్తం తద్ధి సాక్షాచ్చతుర్విధమ్ ।**
**ద్వితీయం రత్నజం తచ్చ సప్తధా మునిసత్తమాః ॥14॥**

**తృతీయం ధాతుజం లింగమష్టధా పరమేష్ఠినః ।**
**తురీయం దారుజం లింగం తత్తు షోడశధోచ్యతే ॥15॥**

**మృన్మయం పంచమం లింగం ద్విధా భిన్నం ద్విజోత్తమాః ।**
**షష్ఠం తు క్షణికం లింగం సప్తధా పరికీర్తితమ్ ॥16॥**

ద్రవ్యభేదాలతో లింగం ఆరువిధాలు. వాటిలో అంతర్భేదాలవల్ల నలభై విధాలుగా లింగాలు ఉన్నాయి. మొదటిది పాషాణనిర్మితం. ఇది నాల్గు విధాలు. రెండోది రత్ననిర్మితం. అది కూడా ఏడువిధాలు. ఓ మునులారా! మూడోది ధాతునిర్మితం. ఇది ఎనిమిది విధాలు. నాల్గోది దారునిర్మితం. ఇది పదహారు రకాలు. ఐదోది మృణ్మయం. ఓ మునులారా! ఇది కూడా రెండు విధాలు. ఆరోది క్షణికమైనది. ఇది ఏడు విధాలు.

**శ్రీప్రదం రత్నజం లింగం శైలజం సర్వసిద్ధిదమ్ ।**
**ధాతుజం ధనదం సాక్షాద్దారుజం భోగసిద్ధిదమ్ ॥17॥**

**మృణ్మయం చైవ విప్రేంద్రాః సర్వసిద్ధికరం శుభమ్ ।**
**శైలజం చోత్తమం ప్రోక్తం మధ్యమం చైవ ధాతుజమ్ ॥18॥**

రత్ననిర్మితలింగపూజ లక్ష్మీప్రదాయిని. శైలనిర్మితం సమస్తసిద్ధుల్ని యిస్తుంది. ధాతుజనిర్మితం ధనాన్ని యిస్తుంది. దారు నిర్మితం భోగాన్ని యిస్తుంది. ఓ ఋషులారా! మృణ్మయం శుభకరమైన సర్వసిద్ధుల్ని యిస్తుంది. అన్నింటిలోకి శైలజలింగం ఉత్తమమైనది. ధాతుజం మధ్యమమైనది.

**బహుధా లింగభేదాశ్చ నవ చైవ సమాసతః ।**
**మూలే బ్రహ్మా తథా మధ్యే విష్ణుస్త్రిభువనేశ్వరః ॥19॥**

**రుద్రోపరి మహాదేవః ప్రణవాఖ్యః సదాశివః ।**
**లింగవేదీ మహాదేవీ త్రిగుణా త్రిమయాంబికా ॥20॥**

**తయా చ పూజయేద్యస్తు దేవీ దేవశ్చ పూజితౌ ।**
**శైలజం రత్నజం వాపి ధాతుజం వాపి దారుజమ్ ॥21॥**

**మృణ్మయం క్షణికం వాపి భక్త్యా స్థాప్య ఫలంశుభమ్ ।**

లింగభేదాలు అనేకాలున్నాయి. సంక్షిప్తంగా తొమ్మిదిగా చెప్పవచ్చు. లింగం యొక్క మూలమందు బ్రహ్మ, మధ్యలో త్రిలోకనాథుడు విష్ణువు, పైభాగంలో ప్రణవరూపుడు మహాదేవుడు అయిన రుద్రుడు అధిష్ఠించి ఉంటారు. లింగాన్ని తెలిసినది మహాదేవి అంబికమాత్రమే. ఆమె త్రిగుణాలతోనూ, త్రిదేవులతోను కూడి ఉంటుంది. ఎవడు దేవితో కూడిన లింగానికి పూజ చేస్తాడో ఆతడు శివుణ్ణి పార్వతీదేవిని పూజించినవాడవుతాడు. పాషాణనిర్మితమైనను, రత్ననిర్మితమైనను, ధాతునిర్మితమైనను, కాష్ఠనిర్మితమైనను, పార్థివనిర్మితమైనను, క్షణిక లింగమైనను భక్తితో స్థాపించుకుని పూజించినవాడు శుభఫలితాన్ని పొందుతాడు.

**సురేంద్రాంభోజగర్భాగ్నియమాంబుపధనేశ్వరైః ॥22॥**

**సిద్ధవిద్యాధరాహీంద్రైర్యక్షదానవకిన్నరైః ।**
**స్తూయమానః సుపుణ్యాత్మా దేవదుందుభినిఃస్వనైః ॥23॥**

**భూర్భువః స్వర్మహర్లోకాన్ క్రమాద్వై జనతః పరమ్ ।**
**తపః సత్యం పరాక్రమ్య భాసయన్ స్వేన తేజసా ॥24॥**

**లింగస్థాపనసన్మార్గనిహితస్వాయతాసినా ।**
**ఆశు బ్రహ్మాండముద్భిద్య నిర్గచ్ఛేన్నిర్విశంకయా ॥25॥**

పరమపుణ్యాత్ముడైన ఆతడు ఇంద్రుడు, బ్రహ్మ, అగ్ని, యముడు, వరుణుడు, కుబేరుడు, సిద్ధులు, విద్యాధరులు, నాగరాజులు, యక్షులు, దానవులు, కిన్నరులు – వీరిచేత దేవదుందుభుల ధ్వనులచేత స్తుతింపబడుతూ క్రమంగా భూలోకం, భువర్లోకం, స్వర్గలోకం, మహర్లోకం, జనోలోకం, తపోలోకం అట్లే సత్యలోకం ఈ ఏడులోకాల్ని దాటి తన తేజస్సుతో ప్రకాశిస్తాడు. లింగస్థాపనం మొదలైన సన్మార్గం వల్ల స్వాధీనమైన ఖడ్గంతో త్వరగా బ్రహ్మాండాన్ని భేదించి శంకారహితభావంతో ముక్తుడవుతాడు.

**శైలజం రజతం వాపి ధాతుజం వాపి దారుజమ్ ।**
**మృణ్మయం క్షణికం త్యక్త్వా స్థాపయేత్ సకలం వపుః ॥26॥**

**విధినా చైవ కృత్వా తు స్కందోమాసహితం శుభమ్ ।**
**కుందగోక్షీరసంకాశం లింగం యః స్థాపయేన్నరః ॥27॥**

**నృణాం తనుం సమాస్థాయ స్థితో రుద్రో న సంశయః ।**
**దర్శనాత్స్పర్శనాత్తస్య లభంతే నిర్వృతిం నరాః ॥28॥**

**తస్య పుణ్యం మయా వక్తుం సమ్యగ్యుగశతైరపి ।**
**శక్యతే నైవ విప్రేంద్రాస్తస్మాద్వై స్థాపయేత్తథా ॥29॥**

**సర్వేషామేవ మర్త్యానాం విభోర్దివ్యం వపుః శుభమ్ ।**
**సకలం భావనాయోగ్యం యోగినామేవ నిష్కలమ్ ॥30॥**

ఎవడు, శైలజం, రాజతం, ధాతుజం, దారుజం మృణ్మయం మరియు క్షణికం, అనగా ఈ ఆరు విధాలైన లింగాల్ని వదలి తన శరీరాన్నే లింగంగా మార్చుకుని అనగా స్థాపించుకుని, విధిపూర్వకంగా కార్తికేయుడు, దేవి పార్వతితో కూడిన మల్లెలవలె, గోక్షీరంవలె ఉన్న తెల్లటి లింగభావనతో పూజిస్తాడో ఆతడు శరీరాన్ని ధరించి ఉండి కూడా రుద్రుడి రూపాన్ని వహించి ఉంటాడు. ఇందులో సందేహం లేదు. ఆతడి దర్శనం వల్ల స్పర్శవల్ల మానవులు ముక్తి పొందుతారు. ఓ విప్రశ్రేష్ఠులారా! నేను ఆతడి పుణ్యాన్ని దర్శించడానికి యుగాలు కూడా చాలవు. అందుచేత విధ్యుక్తప్రకారంగా లింగాన్ని స్థాపించాలి. మానవులందరూ శివభగవానుడి దివ్యం మరియు శుభకరమైన సగుణవిగ్రహాన్ని భావించడానికి యోగ్యులవుతారు. యోగులు మాత్రం నిర్గుణవిగ్రహాన్ని భావించ యోగ్యులు కాగలరు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే శివలింగభేదసంస్థాపనాదివర్ణనంనామ చతుఃసప్తతితమోఽధ్యాయః ॥74॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని శివలింగభేదాలు – వాటిస్థాపనాదివర్ణనమనే డెబ్బైనాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచసప్తతితమోஉధ్యాయః - డెబ్బై అయిదవ అధ్యాయం

## శివాద్వైతకథనమ్ - శివుడు అద్వైతుడని చెప్పుట

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**నిష్కలో నిర్మలో నిత్యః సకలత్వం కథం గతః ।**
**వక్తుమర్హసి చాస్మాకం యథాపూర్వం యథాశ్రుతమ్ ॥1॥**

నిర్గుణుడు, నిర్మలుడు, శాశ్వతుడు అయిన శివభగవానుడు సగుణత్వాన్ని ఎలా పొందాడు. ఈ విషయం ఇంతకుముందు నీవు ఎలా విన్నావో అలా చెప్పు.

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**పరమార్థవిదః కేచిదూచుః ప్రణవరూపిణమ్ ।**
**విజ్ఞానమితి విప్రేంద్రాః శ్రుత్వా శ్రుతిశిరస్యజమ్ ॥2॥**

**శబ్దాదివిషయం జ్ఞానం జ్ఞానమిత్యభిధీయతే ।**
**తత్ జ్ఞానం భ్రాంతిరహితమిత్యన్యే నేతి చాపరే ॥3॥**

ఓ విప్రశ్రేష్ఠులారా! కొందరు తత్త్వజ్ఞానులు ఉపనిషత్తుల్లో శివుడి యొక్క జన్మలేకపోవడాన్ని విని ఆతణ్ణి ప్రణవరూపవిజ్ఞానుడుగా చెబుతున్నారు. శబ్దాదివిషయాలలో ఏ జ్ఞానం (తెలిసినతనం) ఉన్నదో దాన్నే జ్ఞానమంటున్నారు. ఇతరులు భ్రాంతిరాహిత్యాన్ని జ్ఞానమంటున్నారు. వేరే వారు కాదంటున్నారు.

**యత్ జ్ఞానం నిర్మలం శుద్ధం నిర్వికల్పం నిరాశ్రయమ్ ।**
**గురుప్రకాశకం జ్ఞానమిత్యన్యే మునయో ద్విజాః ॥4॥**

ఓ ద్విజులారా! ఇతరులైన మునులు నిర్మలం, పరిశుద్ధం, వికల్పరహితం, ఆశ్రయరహితం, గురువు మూలంగా ప్రకాశింపబడేది జ్ఞానమంటున్నారు. అదే వాస్తవికమైన జ్ఞానం.

**జ్ఞానేనైవ భవేన్ముక్తిః ప్రసాదో జ్ఞానసిద్ధయే ।**
**ఉభాభ్యాం ముచ్యతే యోగీ తత్రానందమయో భవేత్ ॥5॥**

**వదంతి మునయః కేచిత్కర్మణా తస్య సంగతిమ్ ।**
**కల్పనాకల్పితం రూపం సంహృత్య స్వేచ్ఛయైవ హి ॥6॥**

జ్ఞానం వల్లే ముక్తి కలుగుతుంది. ఆ జ్ఞానసిద్ధికి ఈశ్వరుడి అనుగ్రహం కావాలి. రెండింటి మూలంగా యోగి ముక్తుడవుతాడు. ఆతడు అపుడు ఆనందమయుడవుతాడు. స్వేచ్ఛగా కల్పనవలన కల్పించిన రూపాన్ని హృదయమందు భావించి విధ్యుక్తనిష్కామకర్మల ద్వారా ఆ జ్ఞానాన్ని పొందాలని కొందరు మునులు చెబుతున్నారు.

**ద్యౌర్మూర్ధా తు విభోస్తస్య ఖం నాభిః పరమేష్ఠినః ।**
**సోమసూర్యాగ్నయో నేత్రం దిశః శ్రోత్రం మహాత్మనః ॥7॥**

**చరణౌ చైవ పాతాలం సముద్రస్తస్య చాంబరమ్ ।**
**దేవాస్తస్య భుజాః సర్వే నక్షత్రాణి చ భూషణమ్ ॥8॥**

**ప్రకృతిస్తస్య పత్నీ చ పురుషో లింగముచ్యతే ।**
**వక్త్రాద్వై బ్రాహ్మణాః సర్వే బ్రహ్మ చ భగవాన్ ప్రభుః ॥9॥**

**ఇంద్రోపేంద్రౌ భుజాభ్యాం తు క్షత్రియాశ్చ మహాత్మనః ।**
**వైశ్యాశ్చోరుప్రదేశాత్తు శూద్రాః పాదాత్పినాకినః ॥10॥**

**పుష్కరావర్తకాద్యాస్తు కేశాస్తస్య ప్రకీర్తితాః ।**
**వాయవో ఘ్రాణజాస్తస్య గతిః శ్రౌతం స్మృతిస్తథా ॥11॥**

స్వర్గం ఆయన యొక్క శిరస్సు. ఆకాశం ఆ పరమేశ్వరుడి నాభి. చంద్రుడు, సూర్యుడు, అగ్ని ఆయన నేత్రాలు. దిక్కులు ఆ మహాత్ముడి యొక్క చెవులు. పాతాళం ఆయన రెండు పాదాలు. సముద్రం ఆయన వస్త్రం. దేవతలందరూ ఆయన భుజాలు. అన్ని నక్షత్రాలు ఆయన భూషణాలు. ప్రకృతి ఆయన భార్య. ఆయన లింగ పురుషుడు. బ్రాహ్మణులందరు, బ్రహ్మ, విష్ణు భగవానుడు, ఇంద్రుడు, ఉపేంద్రుడు ఆయన ముఖం నుంచి, మహాత్ములైన క్షత్రియులు ఆయన బాహువుల నుంచి, వైశ్యులు ఊరువుల నుంచి, పినాకి అయిన ఆయన పాదాల నుంచి శూద్రులు పుట్టారు. పుష్కరం, ఆవర్తం మొదలైన మేఘాలు ఆయన కేశపాశం. వాయువంతా ఆయన నాసికనుంచి ఉత్పన్నమయ్యింది. శ్రుతిస్మృతులు చెప్పిన కర్మ ఆ శివభగవానుడి యొక్క గతి అయి ఉన్నది.

**అథానేనైవ కర్మాత్మా ప్రకృతేస్తు ప్రవర్తకః ।**
**పుంసాం తు పురుషః శ్రీమాన్ జ్ఞానగమ్యో న చాన్యథా ॥12॥**

**కర్మయజ్ఞసహస్రేభ్యస్తపోయజ్ఞో విశిష్యతే ।**
**తపోయజ్ఞసహస్రేభ్యో జపయజ్ఞో విశిష్యతే ॥13॥**

**జపయజ్ఞసహస్రేభ్యో ధ్యానయజ్ఞో విశిష్యతే ।**
**ధ్యానయజ్ఞాత్పరో నాస్తి ధ్యానం జ్ఞానస్య సాధనమ్ ॥14॥**

**యదా సమరసే నిష్ఠో యోగీ ధ్యానేన పశ్యతి ।**
**ధ్యానయజ్ఞరతస్యాస్య తదా సన్నిహితః శివః ॥15॥**

ఈ విధమైన శరీరంతో పరమాత్మ అయిన శివుడు కర్మరూపుడై ఉండి ప్రకృతి ప్రవర్తకుడవుతున్నాడు. శ్రీమంతుడైన ఆతడు (శివుడు) మనుష్యులకు జ్ఞానగమ్యుడు, ఇందుకు వేరే మార్గం లేదు. వేయి కర్మయజ్ఞాలకన్న ఒక తపోయజ్ఞం విశేషమయినది. వేయి తపోయజ్ఞాల కన్న ఒక జపయజ్ఞం విశేషమయినది. వేయి జపయజ్ఞాల కన్న ఒక ధ్యానయజ్ఞం విశేషమైనది. ధ్యానయజ్ఞం కన్న విశేషమైనది లేదు. ధ్యానమే జ్ఞానసాధనం. యోగి సమరసస్థితిలో నిలిచి ధ్యానంతో శివుణ్ణి చూస్తున్నాడు. ధ్యానయజ్ఞరతుడైన అట్టి యోగికి అపుడు శివుడు ప్రత్యక్షదర్శనమిస్తాడు.

**నాస్తి విజ్ఞానినాం శౌచం ప్రాయశ్చిత్తాదిచోదనా ।**
**విశుద్ధా విద్యయా సర్వే బ్రహ్మవిద్యావిదో జనాః ॥16॥**

**నాస్తి క్రియా చ లోకేషు సుఖం దుఃఖం విచారతః ।**
**ధర్మాధర్మౌ జపో హోమో ధ్యానినాం సన్నిధిః సదా ॥17॥**

**పరానందాత్మకం లింగం విశుద్ధం శివమక్షరమ్ ।**
**నిష్కలం సర్వగం జ్ఞేయం యోగినాం హృది సంస్థితమ్ ॥18॥**

విశేషమైన జ్ఞానంగల వారికి శుద్ధి, ప్రాయశ్చిత్తం మొదలైన కర్మలు అవసరం లేదు. బ్రహ్మవిద్యను తెలిసినవారందరూ ఆ బ్రహ్మవిద్యతో సంపూర్ణంగా శుద్ధులౌతారు. విచారించగా ధ్యానయోగులకు లోకంలో క్రియలు, సుఖం, దుఃఖం, ధర్మం, అధర్మం, జపహోమాలు మొదలైన ఆవశ్యకాలు ఏవీ అవసరం లేవు. వాళ్లకు శివుడి సన్నిధే ముఖ్యం. పరమానందమయం, విశుద్ధం, కళ్యాణకారి, నాశనం లేని నిర్గుణం, సర్వవ్యాపి అయినదిగా యోగుల హృదయస్థమైన లింగాన్ని తెలియాలి.

**లింగం తు ద్వివిధం ప్రాహు ర్బాహ్యమాభ్యంతరం ద్విజాః ।**
**బాహ్యం స్థూలం మునిశ్రేష్ఠాః సూక్ష్మమాభ్యంతరం ద్విజాః ॥19॥**

ఓ ద్విజులారా! లింగం రెండు విధాలు. ఒకటి బాహ్యం. రెండు ఆభ్యంతరం. ఓ మునులారా! స్థూలమైనది బాహ్యం. సూక్ష్మమైనది ఆభ్యంతరం.

**కర్మయజ్ఞరతాః స్థూలాః స్థూలలింగార్చనే రతాః ।**
**అసతాం భావనార్థాయ నాన్యథా స్థూలవిగ్రహః ॥20॥**

**ఆధ్యాత్మికం చ యల్లింగం ప్రత్యక్షం యస్య నో భవేత్ ।**
**అసౌ మూఢో బహిః సర్వం కల్పయిత్వైవ నాన్యథా ॥21॥**

**జ్ఞానినాం సూక్ష్మమమలం భవేత్ప్రత్యక్షమవ్యయమ్ ।**
**యథా స్థూలమయుక్తానాం మృత్కాష్ఠాద్యైః ప్రకల్పితమ్ ॥22॥**

**అర్థో విచారయతో నాస్తీత్యంతే తత్త్వార్థవేదినః ।**
**నిష్కలః సకలశ్చేతి సర్వం శివమయం తతః ॥23॥**

కర్మయజ్ఞనిరతులు, స్థూలశరీరధారులు స్థూలలింగార్చనతో ప్రీతులవుతారు. అజ్ఞానజనుల భావనాసిద్ధికై స్థూలవిగ్రహం నిలుస్తుంది. మరో విధం కాదు. ఆధ్యాత్మిక లింగంలో ప్రత్యక్షదర్శనముండదు. అజ్ఞాని అయినవాడు మొత్తం బాహ్యప్రవృత్తి కలవాడే. అందుకే స్థూలవిగ్రహాన్ని కల్పించుకుని పూజిస్తున్నాడు. ఇందులో వేరే విధం లేదు. జ్ఞానులకు ప్రత్యక్షరూపంగా సూక్ష్మం, నిర్మలం, అవినాశి అయిన లింగం కల్పింపబడింది. సామాన్యులైనవారికి మట్టి, చెక్క మొదలైన వానితో స్థూలలింగం నిర్మించడం జరిగింది. విచారించగా నిరవయవం సావయవం రెండూ శివమయాలే. మోక్షరూపమైన పురుషార్థం కూడా లేదని ఇతరులైన తత్త్వవేత్తల మాట.

**వ్యోమైకమపి దృష్టం హి శరావం ప్రతి సువ్రతాః ।**
**పృథక్త్వం చాపృథక్త్వం చ శంకరస్యేతి చాపరే ॥24॥**

**ప్రత్యయార్థం హి జగతామేకస్థోఽపి దివాకరః ।**
**ఏకోఽపి బహుధా దృష్టో జలాధారేషు సువ్రతాః ॥25॥**

ఆకాశం ఒకటే అయినా ఉపాధులు అయిన పాత్రలు అనేక రూపాలతో ఉండడం వల్ల వేరువేరుగా కన్పించినట్లే ఒకడే అయిన శివుడు ఒక్కడే అయినా అనేకంగా కన్పిస్తున్నాడు. ఈవిధంగా వేరే జనులు చెప్తుతున్నారు. ఓ సువ్రతులారా! సూర్యుడు ఒక స్థానంలో ఒకడుగానే ఉన్నా ఆశ్రయభూతమైన వివిధ పాత్రలలోని జలంలో అనేక రూపాలుగా కన్పిస్తున్నాడు. ఈ పోలిక ప్రజల నమ్మకం కొరకు మాత్రమే.

**జంతవో దివి భూమౌ చ సర్వే వై పాంచభౌతికాః ।**
**తథాపి బహులా దృష్టా జాతివ్యక్తివిభేదతః ॥26॥**

**దృశ్యతే శ్రూయతే యద్యత్తత్తద్విద్ధి శివాత్మకమ్ ।**
**భేదో జనానాం లోకేఽస్మిన్ ప్రతిభాసో విచారతః ॥27॥**

స్వర్గంలో గాని భూమిపైగాని అన్ని ప్రాణులు పాంచభౌతికాలే. అయినా అవి జాతి మరియు వ్యక్తి భేదాలవల్ల అనేకరూపాలలో కన్పిస్తున్నాయి. కన్పించేది, విన్పించేది అయిన వైవిధ్యం అంతా శివాత్మకమనే తెలియాలి. విచారించగా ఈ లోకంలో గల జనులలో ఉన్న భేదం అంతా భ్రమరూపమే.

**స్వప్నే చ విపులాన్ భోగాన్ భుక్త్వా మర్త్యః సుఖీ భవేత్ ।**
**దుఃఖీ చ భోగం దుఃఖం చ నానుభూతం విచారతః ॥28॥**

**ఏవమాహుస్తథాన్యే చ సర్వే వేదార్థతత్త్వగాః ।**
**హృది సంసారిణాం సాక్షాత్సకలః పరమేశ్వరః ॥29॥**

**యోగినాం నిష్కలో దేవో జ్ఞానినాం చ జగన్మయః ।**

కలలో అనేక భోగాల్ని అనుభవించిన మానవుడు సంతోషిస్తాడు మరియు దుఃఖిస్తాడు. ఆలోచించగా ఆ సుఖదుఃఖాలు వాస్తవానుభూతాలు కావు. ఈ విధంగా వేదార్థతత్త్వజ్ఞానబంధనాలు, అట్లే మోక్షం కూడా స్వప్నం వంటిదే. పరమేశ్వరుడైన శివుడు సంసారులైన జనుల హృదయాలలో సాక్షాత్తుగా సగుణరూపుడుగా (సకలుడుగా) ప్రకాశిస్తూంటాడు. అట్లే జగన్మయుడు, దేవాధిదేవుడు అయిన శివుడు యోగుల యొక్క, జ్ఞానులయొక్క హృదయాలలో నిష్కలుడుగా (నిర్గుణుడుగా) ప్రకాశిస్తుంటాడు.

**త్రివిధం పరమేశస్య వపుర్లోకే ప్రశస్యతే ॥30॥**

**నిష్కలం ప్రథమం చైకం తతః సకలనిష్కలమ్ ।**
**తృతీయం సకలం చైవ నాన్యథేతి ద్విజోత్తమాః ॥31॥**

పరమేశ్వరుడి యొక్క మూడు విధాలైన రూపాలు పూజింపబడుతున్నాయి. ఓ ద్విజశ్రేష్ఠులారా! మొదటిరూపం నిష్కలం (నిర్గుణం) రెండోది సకలనిష్కలం (సగుణ నిర్గుణం) మూడోది సకలం (సగుణం) వేరే మరొకటి లేదు.

**అర్చయంతి ముహుః కేచిత్సదా సకలనిష్కలమ్ ।**
**సర్వజ్ఞం హృదయే కేచిచ్ఛివలింగే విభావసౌ ॥ 32 ॥**
**సకలం మునయః కేచిత్ సదా సంసారవర్తినః ।**
**ఏవమభ్యర్చయంత్యేవ సదారాః ససుతాః నరాః ॥33॥**

కొందరు నరులు ఎల్లప్పుడూ మాటిమాటికి సకల నిష్కలరూపాన్ని అర్చిస్తున్నారు. కొందరు జనులు శివుణ్ణి హృదయమందు, కొందరు శివలింగమందు, కొందరు అగ్నిలో పూజిస్తున్నారు. ఓ మునులారా! గృహస్థులైన కొందరు జనులు భార్యబిడ్డలతో కలిసి సగుణరూపుణ్ణి ఎల్లప్పుడూ పూజిస్తున్నారు.

**యథా శివస్తథా దేవీ యథా దేవీ తథా శివః ।**
**తస్మాదభేదబుద్ధ్యైవ సప్తవింశత్ప్రభేదతః ॥34॥**
**యజంతి దేహే బాహ్యే చ చతుష్కోణే షడస్రకే ।**
**దశారే ద్వాదశారే చ షోడశారే త్రిరస్రకే ॥35॥**

ఏ విధంగా శివుడు ఉంటాడో ఆ విధంగా పార్వతీదేవి ఉంటుంది. అట్లే ఏవిధంగా దేవి పార్వతి ఉంటుందో అదే విధంగా శివుడు ఉంటాడు. అందుచేత జనులు ఇరవైఏడు ప్రభేదాలతో అభేదబుద్ధితో, బాహ్యశరీరం లోపల చతుష్కోణంలో (మూలాధారం) షడస్రంతో (స్వాధిష్ఠానం) దశారంలో (మూర్ధం) ద్వాదశారంలో (హృదయం) షోడశారంలో (కంఠం) అట్లే త్రిరస్రకంలో (భ్రూమధ్య) శివుణ్ణి పూజిస్తున్నారు.

**స స్వేచ్ఛయా శివః సాక్షాద్దేవ్యా సార్ధం స్థితః ప్రభుః ।**
**సంతారణార్థం చ శివః సదసద్వ్యక్తివర్జితః ॥36॥**

సదసద్వ్యక్తిత్వవర్జితుడైన అనగా విలక్షణుడైన శివభగవానుడు జగత్తును ఉద్ధరించడానికై తన ఇష్టానుసారంగా పార్వతీదేవితో కలిసి ఉన్నాడు.

**తమేకమాహుర్ద్విగుణం చ కేచిత్ కేచిత్తమాహుస్త్రిగుణాత్మకం చ ।**
**ఊచుస్తథా తం చ శివం తథాన్యే సంసారిణం వేదవిదో వదంతి ॥37॥**

కొందరు జనులు అద్వితీయుడైన శివుణ్ణి ద్విగుణుడుగా (ప్రకృతి పురుషరూపుడు) చెబుతున్నారు. కొందరు త్రిగుణాత్ముడుగా (బ్రహ్మవిష్ణురుద్రరూపుడుగా) చెప్పారు. మరికొందరు వేదవేత్తలు సంసారకారణుడుగా చెప్పారు.

**భక్త్యా చ యోగేన శుభేన యుక్తా విప్రాః సదా ధర్మరతా విశిష్టాః ।**
**యజంతి యోగేశమశేషమూర్తిం షడస్రమధ్యే భగవంతమేవ ॥38॥**

భక్తిని, శుభయోగాన్ని కలిగినవారు, ధర్మపరాయణులైన వారు, విప్రులు, విశిష్టులైన వారు, యోగేశ్వరుడు, అశేషమూర్తి అయిన శివభగవానుడి యొక్క పూజ షడస్రమధ్యలో చేస్తున్నారు.

**యే తత్ర పశ్యంతి శివం త్రిరస్రే త్రితత్త్వమధ్యే త్రిగుణం త్రియక్షమ్ ।**
**తే యాంతి చైనం న చ యోగినోఽన్యే తయా చ దేవ్యా పురుషం పురాణమ్ ॥39॥**

ఎవరు త్రిరస్రంలో (భ్రూమధ్యం) మూడు తత్త్వాల మధ్యలో, త్రిగుణుడు, త్రినేత్రుడు అయిన శివుడి దర్శనం పొందుతున్నారో వాళ్లే ఆ దేవితో పాటు ఈ పురాతనపురుషుడైన శివుణ్ణి పొందుతున్నారు. ఇతరుడైన వాడెవ్వడూ పొందలేడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే శివాద్వైతకథనం నామ పంచసప్తతితమోఽధ్యాయః ॥ 75 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని శివాద్వైతకథనమనే డెబ్బై అయిదవ అధ్యాయం సమాప్తం.

## షట్సప్తతితమోఽధ్యాయః – డెబ్బై ఆరవ అధ్యాయం

## శివమూర్తిప్రతిష్ఠాఫలకథనమ్ – శివమూర్తిప్రతిష్ఠాఫలకథనం

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**అతః పరం ప్రవక్ష్యామి స్వేచ్ఛావిగ్రహసంభవమ్ ।**
**ప్రతిష్ఠాయాః ఫలం సర్వం సర్వలోకహితాయ వై ॥1॥**

ఓ ఋషులారా! నేను ప్రజలందరి శ్రేయస్సుకై ఆయన ఇచ్ఛకారణంగా కలిగిన విగ్రహం పుట్టుక, మరియు ప్రతిష్ఠ యొక్క సంపూర్ణఫలితాన్ని ఇక మీదట చెప్పగలను.

**స్కందోమాసహితం దేవమాసీనం పరమాసనే ।**
**కృత్వా భక్త్యా ప్రతిష్ఠాప్య సర్వాన్ కామానవాప్నుయాత్ ॥2॥**

కుమారస్వామి, మరియు పార్వతీదేవి సహితుడైన శివుడి మూర్తిని నిర్మించి దాన్ని ఉత్తమాసనంపై నిలిపి భక్తిపూర్వకంగా ఆ మూర్తిని ప్రతిష్ఠించినవాడు అన్ని కోరికల్ని పొందుతాడు.

**స్కందోమాసహితం దేవం సంపూజ్య విధినా సకృత్ ।**
**యత్ఫలం లభతే మర్త్యస్తద్వదామి యథా శ్రుతమ్ ॥3॥**

పార్వతి మరియు కుమారస్వామితో కూడిన శివుణ్ణి శాస్త్ర విధానంగా ఒకసారి పూజిస్తే మానవుడు ఏ ఫలాన్ని పొందుతాడో దాన్ని నేను విన్న విధంగా చెపుతున్నా.

**సూర్యకోటి ప్రతీకాశైర్విమానైః సార్వకామికైః ।**
**రుద్రకన్యాసమాకీర్ణైర్గేయనాట్యసమన్వితైః ॥4॥**

**శివవత్క్రీడతే యోగీ యావదాభూతసంప్లవమ్ ।**
**తత్ర భుక్త్వా మహాభోగాన్ విమానైః సార్వకామికైః ॥5॥**

**ఔమం కౌమారమైశానం వైష్ణవం బ్రాహ్మమేవ చ ।**
**ప్రాజాపత్యం మహాతేజా జనలోకం మహస్తథా ॥6॥**

**ఐంద్రమాసాద్య చైంద్రత్వం కృత్వా వర్షాయుతం పునః ।**
**భుక్త్వా చైవ భువర్లోకే భోగాన్ దివ్యాన్ సుశోభనాన్ ॥7॥**

**మేరుమాసాద్య దేవానాం భవనేషు ప్రమోదతే ।**

ఆ యోగి కోటిసూర్యుల కాంతితో సమానమైన కాంతికలవాడై, అన్ని ఇష్టవస్తువులతో సంపన్నుడై, రుద్రకన్యకలతో కూడినవాడై, నృత్యగానాదులతో నిండిన విమానంలో శివభగవానుడి మాదిరిగా ప్రళయకాలం వరకు విహరించగలడు. మహాభోగాల్ని అనుభవించి ఆ యోగి సమస్తమైన కోరికల్ని తీర్చే విమానంలో ఉమాలోకం,

కుమారలోకం, ఈశానలోకం, విష్ణులోకం, బ్రహ్మలోకం, ప్రజాపతిలోకం, జనలోకం, మహర్లోకం చేరుతాడు. మరల ఇంద్రలోకం చేరి అక్కడ పదివేల సంవత్సరాలు ఇంద్రత్వాన్ని పొంది ఆ భోగాలు అనుభవించి తర్వాత భువర్లోకంలో దివ్యాలు మంగళకరాలు అయిన గొప్ప భోగాలను అనుభవించి మేరు పర్వతాన్ని చేరి దేవతల యొక్క భవనాలలో ఆనందాన్ని పొందుతాడు.

**ఏకపాదం చతుర్బాహుం త్రినేత్రం శూలసంయుతమ్ ॥8॥**

**సృష్ట్వా స్థితం హరిం వామే దక్షిణే చతురాననమ్ ।**
**అష్టావింశతి రుద్రాణాం కోటిః సర్వాంగసుప్రభమ్ ॥9॥**

**పంచవింశతికం సాక్షాత్పురుషం హృదయాత్తథా ।**
**ప్రకృతిం వామతశ్చైవ బుద్ధిం వై బుద్ధిదేశతః ॥10॥**

**అహంకారమహంకారాత్తన్మాత్రాణి తు తత్ర వై ।**
**ఇంద్రియాణీంద్రియాదేవ లీలయా పరమేశ్వరమ్ ॥11॥**

**పృథివీం పాదమూలాత్తు గుహ్యదేశాజ్జలం తథా ।**
**నాభిదేశాత్తథా వహ్నిం హృదయాద్భాస్కరం తథా ॥12॥**

**కంఠాత్సోమం తథాత్మానం భ్రూమధ్యాన్మస్తకాద్దివమ్ ।**
**సృష్ట్వైవం సంస్థితం సాక్షాజ్జగత్సర్వం చరాచరమ్ ॥13॥**

**సర్వజ్ఞం సర్వగం దేవం కృత్వా విద్యావిధానతః ।**
**ప్రతిష్ఠాప్య యథాన్యాయం శివసాయుజ్యమాప్నుయాత్ ॥14॥**

ఎవడు ఏకపాదంతో, నాల్గుభుజాలతో, మూడు నేత్రాలతో, త్రిశూలంతో కూడి ఉంటాడో, ఎవడు తన వామభాగంలో విష్ణువును, కుడిభాగంలో బ్రహ్మను సృష్టించుకుని ప్రకాశిస్తాడో, ఎవడి నుంచి ఇరవై ఎనిమిది కోట్ల రుద్రులు ఉత్పన్నులయ్యారో, ఎవడి అన్ని అంగాల నుంచి మిక్కిలి ప్రభావశీలురు ఇరవై అయిదు తత్త్వాల జీవాత్మలు పుట్టారో, ఎవడు సాక్షాత్తు హృదయం నుంచి పురుషుణ్ణి, తన ఎడమభాగం నుంచి ప్రకృతిని, బుద్ధిదేశం నుంచి బుద్ధిని, అహంకారం నుంచి అహంకారాన్ని, తన్మాత్రలనుంచి తన్మాత్రల్ని, తన ఇంద్రియాల నుంచి లీలాపూర్వకాలైన ఇంద్రియాల్ని, పాదాల మూలాల నుంచి పృథ్విని, గుహ్యదేశం నుంచి జలాన్ని, నాభిస్థలం నుంచి అగ్నిని, హృదయదేశం నుంచి సూర్యుణ్ణి, కంఠం నుంచి చంద్రుణ్ణి, భ్రూమధ్యభాగం నుంచి ఆత్మను (రుద్రుడిని) మస్తకం నుంచి స్వర్గాన్ని – ఈ విధంగా చరాచరజగత్తును ఉత్పన్నం చేశాడో ఆతడే ఆశివుడే సాక్షాత్తు ప్రకాశిస్తున్నాడు. అటువంటి సర్వజ్ఞుడు, సర్వవ్యాపి అయిన పరమేశ్వరుడి మూర్తిని విద్యావిధానానుసారం నిర్మించి విధ్యుక్తంగా ఆమూర్తిని ప్రతిష్ఠించి మానవుడు శివసాయుజ్యాన్ని పొందుతాడు.

**త్రిపాదం సప్తహస్తం చ చతుఃశృంగం ద్విశీర్షకమ్ ।**
**కృత్వా యజ్ఞేశమీశానం విష్ణులోకే మహీయతే ॥15॥**

**తత్ర భుక్త్వా మహాభోగాన్ కల్పలక్షం సుఖీ నరః ।**
**క్రమాదాగత్య లోకేఽస్మిన్ సర్వయజ్ఞాంతగో భవేత్ ॥16॥**

మూడుపాదాలుగల,ఏడు చేతులుగల, నాల్గుకొమ్ములుగల, రెండు తలలుగల యజ్ఞేశ్వరుడు, అగ్నిస్వరూపుడు అయిన ఈశ్వరుణ్ణి స్థాపించి మానవుడు విష్ణులోకాన్ని పొందుతాడు. అక్కడ ఒక లక్ష కల్పాలవరకు మహాభోగాల్ని అనుభవించి మానవుడు సుఖి అవుతాడు. మరల ఈ భూలోకానికి వచ్చి అన్ని యజ్ఞాల్ని సుసంపన్నం చేస్తాడు.

**వృషారూఢం తు యః కుర్యాత్సోమం సోమార్ధభూషణమ్ ।**
**హయమేధాయుతం కృత్వా యత్పుణ్యం తదవాప్య సః ॥17॥**

**కాంచనేన విమానేన కింకిణీజాలమాలినా ।**
**గత్వా శివపురం దివ్యం తత్రైవ స విముచ్యతే ॥18॥**

ఏ మానవుడు పార్వతీదేవితో కూడా వృషభాధిరూఢుడైన అర్ధచంద్రధారి అయిన శివుడి మూర్తిని స్థాపిస్తాడో ఆతడు పదివేల అశ్వమేధాలు నిర్వహించిన పుణ్యం పొంది కింకిణీమాలికలతో కూడిన బంగారు విమానంలో దివ్యమైన శివలోకానికి వెళ్లి ముక్తిని పొందుతాడు.

**నందినా సహితం దేవం సాంబం సర్వగణైర్వృతామ్ ।**
**కృత్వా యత్ఫలమాప్నోతి వక్ష్యే తద్వై యథాశ్రుతమ్ ॥19॥**

**సూర్యమండలసంకాశైర్విమానైర్వృషసంయుతైః ।**
**అప్సరోగణసంకీర్ణైర్దేవదానవదుర్లభైః ॥20॥**

**నృత్యద్భిరప్సరఃసంఘైః సర్వతః సర్వశోభితైః ।**
**గత్వా శివపురం దివ్యం గాణపత్యమవాప్నుయాత్ ॥21॥**

నందీశ్వరుడితో ఉమాదేవితో మరియు సమస్తగణాలతో కూడిన మహాదేవుణ్ణి ప్రతిష్ఠించిన మానవుడు ఏ ఫలితాన్ని పొందుతాడో, దాన్ని నేను విన్న ప్రకారం చెపుతున్నాను. ఆతడు సూర్యమండలంతో సమానమైన దేదీప్యమానమైన వృషభాలతో కూడి ఉండి, అప్సరలతో కూడి ఉండి, దేవదానవులకు కూడా దుర్లభమైనది, నాల్గు దిక్కుల్లో నృత్యం చేస్తున్న అప్సరసలతో నిండి యున్నది అయిన సుశోభాయమానమైన విమానంలో దివ్యమైన శివలోకానికి వెళ్లి గణాధిపత్య పదవిని పొందుతాడు.

**నృత్యంతం దేవదేవేశం శైలజాసహితం ప్రభుమ్ ।**
**సహస్రబాహుం సర్వజ్ఞం చతుర్బాహుమథాపి వా ॥22॥**

**భృగ్వాద్యైర్భూతసంఘైశ్చ సంవృతం పరమేశ్వరమ్ ।**
**శైలజాసహితం సాక్షాత్ వృషభధ్వజమీశ్వరమ్ ॥23॥**

**బ్రహ్మేంద్ర విష్ణుసోమాద్యైః సదా సర్వైర్నమస్కృతమ్ ।**
**మాతృభిర్మునిభిశ్చైవ సంవృతం పరమేశ్వరమ్ ॥24॥**

**కృత్వా భక్త్యా ప్రతిష్ఠాప్య యత్ఫలం తద్వదామ్యహమ్ ।**
**సర్వయజ్ఞతపోదానతీర్థదేవేషు యత్ ఫలమ్ ॥25॥**

**తత్ఫలం కోటిగుణితం లబ్ధ్వా యాతి శివం పదమ్ ।**
**తత్ర భుక్త్వా మహాభోగాన్ యావదాభూతసంప్లవమ్ ॥26॥**

**సృష్ట్యంతరే పునః ప్రాప్తే మానవం పదమాప్నుయాత్ ।**

పార్వతీదేవితో కలిసి నాట్యం చేస్తున్నవాడు, వేయిబాహువులు, లేకుంటే నాల్గుబాహువులు కలిగిన సర్వజ్ఞుడు, భృగువు మొదలైన భూతగణాలతో పరివేష్ఠితుడు, పార్వతీదేవితో కూడిన సాక్షాత్తు వృషభధ్వజుడు, ఈశ్వరుడు, బ్రహ్మ, ఇంద్రుడు, విష్ణువు, చంద్రుడు మొదలైన దేవగణాల చేత ఎల్లప్పుడు నమస్కరింపబడేవాడు, మాతృగణాలతో, మునిసమూహాలతో పరివేష్ఠింపబడినవాడు అయిన శివభగవానుణ్ణి నిర్మించి, భక్తితో ప్రతిష్ఠించినవాడికి ఎంత ఫలం వస్తుందో చెబుతాను. "సమస్తమైన యజ్ఞాలు, తపస్సులు, దానాలు, తీర్థసేవనం, దేవదర్శనం చేయడం వల్ల ఎంత ఫలమైతే దక్కుతుందో దానికి కోటిరెట్లు ఫలం దక్కుతుంది". అట్టి ఆతడు శివలోకానికి వెళతాడు మరియు ప్రళయకాలం వరకూ మహాభోగాల్ని అనుభవించి మరల రెండో సృష్టి ప్రారంభంలో మనుపదవిని పొందుతాడు.

**నగ్నం చతుర్భుజం శ్వేతం త్రినేత్రం సర్పమేఖలమ్ ॥27॥**

**కపాలహస్తం దేవేశం కృష్ణకుంచితమూర్ధజమ్ ।**
**కృత్వా భక్త్యా ప్రతిష్ఠాప్య శివసాయుజ్యమాప్నుయాత్ ॥28॥**

దిగంబరుడు, నాల్గుభుజాలుగలవాడు, శ్వేతవర్ణుడు, ముక్కంటి, సర్పమే మొలనూలుగా గలవాడు, కపాలం హస్తమందు ధరించినవాడు నల్లగా, వక్రంగా ఉన్న కేశాలుగలవాడు అయిన మహాదేవుణ్ణి మూర్తిగా నిర్మించి భక్తిపూర్వకంగా స్థాపించినవాడు శివుడి సాయుజ్యాన్ని పొందుతాడు.

**ఇభేంద్రదారకం దేవం సాంబం సిద్ధార్థదం ప్రభుమ్ ।**
**సుధూమ్రవర్ణం రక్తాక్షం త్రినేత్రం చంద్రభూషణమ్ ॥29॥**

**కాకపక్షధరం మూర్ధ్నా నాగటంకధరం హరమ్ ।**
**సింహాజినోత్తరీయం చ మృగచర్మాంబరం ప్రభుమ్ ॥30॥**

**తీక్ష్ణదంష్ట్రం గదాహస్తం కపాలోద్యతపాణినమ్ ।**
**హుంఫట్కారే మహాశబ్దశబ్దితాఖిలదిఙ్ముఖమ్ ॥31॥**

**పుండరీకాజినం దోర్భ్యాం బిభ్రంతం కంబుకం తథా ।**
**హసంతం చ నదంతం చ పిబంతం కృష్ణసాగరమ్ ॥32॥**

**నృత్యంతం భూతసంఘైశ్చ గణసంఘైస్త్వలంకృతమ్ ।**
**కృత్వా భక్త్యా ప్రతిష్ఠాప్య యథావిభవవిస్తరమ్ ॥33॥**

**సర్వవిఘ్నానతిక్రమ్య శివలోకే మహీయతే ।**
**తత్ర భుక్త్వా మహాభోగాన్ యావదాభూతసంప్లవమ్ ॥34॥**

**జ్ఞానం విచారయతో లబ్ధ్వా రుద్రేభ్యస్తత్ర ముచ్యతే ।**

గజాసురసంహారి, పార్వతీసమేతదేవాధిదేవుడు, కామితార్థప్రదాయి, కృష్ణవర్ణుడు, లలాటనేత్రుడు, ముక్కంటి, చంద్రుణ్ణి ఆభరణంగా ధరించినవాడు, శిరసుమీద కాకపక్షాన్ని ధరించిన వాడు, నాగటంకాన్ని ధరించినవాడు, సింహం చర్మాన్ని ఉత్తరీయంగా కప్పుకున్నవాడు, మృగచర్మాన్ని వస్త్రంగా ధరించినవాడు, పదునైన దంతాలు గలవాడు, హస్తమందు గద గలవాడు, హస్తమందు కపాలం గలవాడు, హుంఫట్ అనే శబ్దంతో అన్ని దిక్కుల్ని కంపింపజేసేవాడు, రెండు చేతులతో పులితోలును కమండాలాన్ని ధరించినవాడు, నవ్వుతున్నవాడు, గర్జిస్తున్నవాడు, తమస్సముద్రాన్ని త్రాగుతున్నవాడు, భూతగణాలతోకూడి నాట్యం చేస్తున్నవాడు, గణసముదాయాలతో శోభిస్తున్నవాడైన దేవేశ్వరుడు, శివుణ్ణి మూర్తి రూపంలో శక్త్యనుసారంగా నిర్మించి, ప్రతిష్ఠించిన మానవుడు విఘ్నాలన్నీ తొలగి శివలోకంలో వెలుగుతాడు. అక్కడ ప్రళయపర్యంతం మహాసుఖాల్ని అనుభవించి, శివుడివల్ల విచారజ్ఞానాన్ని పొంది ముక్తుడవుతాడు.

**అర్ధనారీశ్వరం దేవం చతుర్భుజమనుత్తమమ్ ॥35॥**

**వరదాభయహస్తం చ శూలపద్మధరం ప్రభుమ్ ।**
**స్త్రీపుంభావేన సంస్థానం సర్వాభరణభూషితమ్ ॥36॥**

**కృత్వా భక్త్యా ప్రతిష్ఠాయ శివలోకే మహీయతే ।**
**తత్ర భుక్త్వా మహాభోగానణిమాదిగుణైర్యుతః ॥37॥**

**ఆచంద్రతారకం జ్ఞానం తతో లబ్ధ్వా విముచ్యతే ।**

అర్ధనారీశ్వరుడు, చతుర్భుజుడు, వరముద్ర అభయముద్రలు గల హస్తాలవాడు, త్రిశూలధారి, పద్మహస్తుడు, స్త్రీ పురుషభావస్థితుడు, సమస్తాభరణాలతో ప్రకాశితుడు అయిన శివభగవానుణ్ణి మూర్తిరూపంలో నిర్మించి, భక్తితో ప్రతిష్ఠించిన మానవుడు శివలోకాన్ని పొందుతాడు. అక్కడ ఆతడు చంద్రుడు, తారకలు నిలిచి ఉన్నంతకాలం మహాసుఖాల్ని అనుభవించి అణిమాది అష్టసిద్ధుల్ని పొంది, జ్ఞానాన్ని పొంది ముక్తుడవుతాడు.

**యః కుర్యాద్దేవదేవేశం సర్వజ్ఞం లకులీశ్వరమ్ ॥38॥**

**వృతం శిష్యప్రశిష్యైశ్చ వ్యాఖ్యానోద్యతపాణినమ్ ।**
**కృత్వా భక్త్యా ప్రతిష్ఠాప్య శివలోకం స గచ్ఛతి ॥39॥**

**భుక్త్వా తు విపులాంస్తత్ర భోగాన్ యుగశతం నరః ।**
**జ్ఞానయోగం సమాసాద్య తత్రైవ చ విముచ్యతే ॥40॥**

**పూర్వదేవామరాణాం చ యత్స్థానం సకలేప్సితామ్ ।**

శిష్యప్రశిష్యులతో పరివేష్ఠించి ఉన్నటువంటి, ఉపదేశముద్రతో పైకెత్తిన హస్తాలవాడు, త్రిశూలధారి, పద్మహస్తుడు, స్త్రీపురుషభావస్థితుడు, సమస్తాభరణాలతో ప్రకాశితుడు అయిన శివభగవానుణ్ణి మూర్తిరూపంలో నిర్మించి, భక్తితో ప్రతిష్ఠించిన మానవుడు శివలోకాన్ని పొందుతాడు. అక్కడ ఆతడు చంద్రుడు, తారకలు నిలిచి ఉన్నంతకాలం మహాసుఖాల్ని అనుభవించి అణిమాదులైన అష్టసిద్ధుల్ని పొంది, జ్ఞానాన్ని పొంది ముక్తుడవుతాడు. అది దేవదానవులకు సర్వాభీష్టాన్ని తీర్చే స్థానం.

**కృతముద్రస్య దేవస్య చితాభస్మానులేపినః ॥41॥**

**త్రిపుంద్రధారిణస్తేషాం శిరోమాలాధరస్య చ ।**
**బ్రహ్మణః కేశకేనైకముపవీతం చ బిభ్రతః ॥42॥**

**బిభ్రతో వామహస్తేన కపాలం బ్రహ్మణో వరమ్ ।**
**విష్ణోః కలేవరం చైవ బిభ్రతః పరమేష్ఠినః ॥43॥**

**కృత్వా భక్త్యా ప్రతిష్ఠాప్య ముచ్యతే భవసాగరాత్ ।**
**ఓం నమో నీలకంఠాయ ఇతి పుణ్యాక్షరాష్టకమ్ ॥44॥**

**మంత్రమాహ సకృద్వా యః పాతకైః స విముచ్యతే ।**
**మంత్రేణానేన గంధాద్యైర్భక్త్యా విత్తానుసారతః ॥45॥**

**సంపూజ్య దేవదేవేశం శివలోకే మహీయతే ।**

ధ్యానముద్రయందున్నటువంటి, చితాభస్మాన్ని శరీరానికి అలముకున్నటువంటి, మెడలో శిరసుమాలను ధరించినటువంటి, బ్రహ్మ కేశాలతో నిర్మించిన యజ్ఞోపవీతాన్ని ధరించినటువంటి, ఎడమ చేతితో బ్రహ్మకపాలాన్ని ధరించినటువంటి, మరియు విష్ణువు యొక్క శరీరాన్ని ధరించినటువంటి మహాదేవుడి మూర్తిని నిర్మించి, భక్తిపూర్వకంగా స్థాపించిన మానవుడు భవసాగరాన్ని దాటుతాడు. ఎవడు ఒకసారి “ఓం నమో నీలకంఠాయ” అనే పుణ్యప్రదమైన అష్టాక్షరీమంత్రాన్ని ఉచ్చరిస్తాడో ఆతడు పాపవిముక్తుడవుతాడు. మరియు ఆతడు తన శక్త్యనుసారం గంధం, పుష్పాలు మొదలైన పూజాద్రవ్యాలతో ఈ మంత్రాన్ని జపిస్తూ విధ్యుక్తంగా పూజ చేయగా కైలాసాన్ని పొందుతాడు.

**జాలంధరాంతకం దేవం సుదర్శనధరం ప్రభుమ్ ॥46॥**

**కృత్వా భక్త్యా ప్రతిష్ఠాప్య ద్విధాభూతం జలంధరమ్ ।**
**ప్రయాతి శివసాయుజ్యం నాత్ర కార్యా విచారణా ॥47॥**

**సుదర్శనప్రదం దేవం సాక్షాత్పూర్వోక్తలక్షణమ్ ।**
**అర్చమానేన దేవేన చార్చితం నేత్రపూజయా ॥48॥**

**కృత్వా భక్త్యా ప్రతిష్ఠాప్య శివలోకే మహీయతే ।**

సుదర్శనచక్రాన్ని ధరించినటువంటి, జలంధరుణ్ణి రెండుగా ఖండించినటువంటి, జలంధరాంతక రూపుడైనటువంటి దేవదేవుడి మూర్తిని నిర్మించి, భక్తితో ప్రతిష్ఠించిన మానవుడు శివసాయుజ్యాన్ని పొందుతాడు. ఇందులో సందేహం లేదు. ఇంతకుముందు చెప్పిన లక్షణాలుగలవాడు, సుదర్శనచక్రాన్ని దానం చేసినవాడు, పూజార్హుడైన విష్ణువుచేత నేత్రదాన పూర్వకంగా అర్చింపబడిన శివరూపాన్ని నిర్మించి భక్తితో ప్రతిష్ఠించినవాడు కైలాసాన్ని పొందుతాడు.

**తిష్ఠతోఽథ నికుంభస్య పృష్ఠతశ్చరణాంబుజమ్ ॥49॥**

**వామేతరం సువిన్యస్య వామే చాలింగ్య చాద్రిజామ్ ।**
**శూలాగ్రే కూర్పరం స్థాప్య కింకిణీకృతపన్నగమ్ ॥50॥**

**సంప్రేక్ష్య చాంధకం పార్శ్వే కృతాంజలిపుటం స్థితమ్ ।**
**రూపం కృత్వా యథాన్యాయం శివసాయుజ్యమాప్నుయాత్ ॥51॥**

నికుంభమనే పీఠంపై నిలిచి ఉండి, దక్షిణపాదపద్మాన్ని ఆపీఠం వెనుక భాగంపై బాగుగా ఉంచి, వామభాగంలో పార్వతీదేవిని కూర్చుండజేసి, కౌగిలించుకుని ఉన్నటువంటిని, చిరుగంటగా చెయ్యబడిన సర్పముగల మోచేతిని శూలాగ్రమునందుంచి సమీపంలో అంజలి ఘటించి నిలిచియున్న అంధకుణ్ణి చూస్తున్న శివభగవానుడి మూర్తిని నిర్మించి భక్తితో స్థాపించిన నరుడు శివసాయుజ్యాన్ని పొందుతాడు.

**యః కుర్యాద్దేవదేవేశం త్రిపురాంతకమీశ్వరమ్ ।**
**ధనుర్బాణసమాయుక్తం సోమం సోమార్ధభూషణమ్ ॥52॥**

**రథే సంస్థితం దేవం చతురాననసారథిమ్ ।**
**తదాకారతయా సోఽపి గత్వా శివపురం సుఖీ ॥53॥**

**క్రీడతే నాత్ర సందేహో ద్వితీయ ఇవ శంకరః ।**
**తత్ర భుక్త్వా మహాభోగాన్ యావదిచ్ఛా ద్విజోత్తమాః ॥54॥**

**జ్ఞానం విచారితం లబ్ధ్వా తత్రైవ స విముచ్యతే ।**

ధనుస్సు బాణాలు ధరించినవాడు. అర్ధచంద్రచూడుడైనవాడు. పార్వతీదేవితో రథారూఢుడైనవాడు, బ్రహ్మసారథిగా గలవాడు అయిన త్రిపురవినాశకుడి రూపంలో దేవదేవశివుణ్ణి నిర్మించి స్థాపించినవాడు ఆ ఆకారంతోనే కైలాసానికి వెళ్లి రెండో శివుడువలె వినోదిస్తాడు. ఇందులో సందేహం లేదు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! ఆతడు తన ఇచ్ఛానుసారంగా అనేక మహాభోగాల్ని అనుభవించి, ఉత్తమ జ్ఞానాన్ని పొంది ముక్తి పొందుతాడు.

**గంగాధరం సుఖాసీనం చంద్రశేఖరమేవ చ ॥55॥**

**గంగయా సహితం చైవ వామోత్సంగేఽంబికాన్వితమ్ ।**
**వినాయకం తథా స్కందం జ్యేష్ఠదుర్గాం సుశోభనమ్ ॥56॥**

**భాస్కరం చ తథా సోమం బ్రహ్మాణీం చ మహేశ్వరమ్ ।**
**కౌమారీం వైష్ణవీం దేవీం వారాహీం వరదాం తథా ॥57॥**

**ఇంద్రాణీం చైవ చాముండాం వీరభద్రసమన్వితామ్ ।**
**విఘ్నేశేన చ యో ధీమాన్ శివసాయుజ్యమాప్నుయాత్ ॥58॥**

గంగాధరుడు, చంద్రశేఖరుడు, సుఖాసీనుడు, గంగాదేవి సహితుడు, వామాంకమందు పార్వతీదేవిగలవాడు, వినాయకుడు, కార్తికేయుడు సుందరి అయిన దుర్గ, సూర్యచంద్రులు, బ్రహ్మాణి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవీదేవి వరదాయిని అయిన వారాహి, ఇంద్రాణి, చాముండి, వీరభద్రుడు, విఘ్నేశ్వరుడితో కూడిన పరమశివుణ్ణి నిర్మించి, స్థాపించి పూజించిన నరుడు శివసాయుజ్యాన్ని పొందుతాడు.

**లింగమూర్తిం మహాజ్వాలామాలాసంవృతమవ్యయమ్ ।**
**లింగస్య మధ్యే వై కృత్వా చంద్రశేఖరమీశ్వరమ్ ॥59॥**

**వ్యోమ్ని కుర్యాత్తథా లింగం బ్రహ్మాణం సింహరూపిణమ్ ।**
**విష్ణుం వరాహరూపేణ లింగస్యాధస్త్వధోముఖమ్ ॥60॥**

**బ్రహ్మాణం దక్షిణే తస్య కృతాంజలిపుటం స్థితమ్ ।**
**మధ్యే లింగం మహాఘోరం మహాంభసి చ సంస్థితమ్ ॥61॥**

**కృత్వా భక్త్యా ప్రతిష్ఠాప్య శివసాయుజ్యమాప్నుయాత్ ।**
**క్షేత్రసంరక్షకం దేవం తథా పాశుపతం ప్రభుమ్ ॥62॥**

**కృత్వా భక్త్యా యథాన్యాయం శివలోకే మహీయతే ॥63॥**

పెద్ద పెద్ద జ్వాలామాలలతో చుట్టబడినవాడు, లింగం యొక్క మధ్యలో చంద్రుణ్ణి ధరించినవాడు, హంసరూపుడైన బ్రహ్మ, ఆయన దక్షిణభాగంలో అంజలి ఘటించి ఉన్నటువంటివాడును, వరాహరూపధారియైన విష్ణువు లింగం యొక్క క్రిందభాగంలో అధోముఖం గలిగి ఉన్నటువంటివాడును, మహాఘోరమైన లింగం మహాజలంలో ఉన్నటువంటివాడు అయిన శివుడి మూర్తిని నిర్మించి భక్తితో స్థాపించిన భక్తుడు శివసాయుజ్యాన్ని పొందుతాడు. క్షేత్రరక్షకుడై క్షేత్రపాలుడైన పశుపతి శివభగవానుణ్ణి నిర్మించి భక్తిపూర్వకంగా స్థాపించిన నరుడు శివలోకాన్ని పొందుతాడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే శివమూర్తి ప్రతిష్ఠాఫలకథనం నామ షట్సప్తతితమోఽధ్యాయః ॥76॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని శివమూర్తిప్రతిష్ఠాఫలకథనమనే డెబ్బై ఆరవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## సప్తసప్తతితమోఽధ్యాయః - డెబ్బై ఏడవ అధ్యాయం
## ఉపలేపనాదికథనమ్ - ఉపలేపనాదికథనం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**లింగప్రతిష్ఠాపుణ్యం చ లింగస్థాపనమేవచ ।**
**లింగానాం చైవ భేదాశ్చ శ్రుతం తవ ముఖాదిహ ॥1॥**

**మృదాదిరత్నపర్యంతైర్ద్రవ్యైః కృత్వా శివాలయమ్ ।**
**యత్ఫలం లభతే మర్త్యస్తత్ఫలం వక్తుమర్హసి ॥2॥**

మేము నీముఖంగా లింగస్థాపన, లింగప్రతిష్ఠ యొక్క ఫలాన్ని, లింగభేదాల్ని విన్నాం. ఇపుడు నీవు మట్టినుంచి రత్నం వరకూ గల ద్రవ్యాలతో శివాలయాల్ని నిర్మించి నరుడు ఎటువంటి ఫలాన్ని పొందుతాడో ఆ విషయాన్ని కృపతో చెప్పండి!

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**యస్య భక్తోఽపి లోకేఽస్మిన్ పుత్రదారగృహాదిభిః ।**
**బాధ్యతే జ్ఞానయుక్తశ్చేన్న చ తస్య గృహైస్తు కిమ్ ॥3॥**

**తథాపి భక్తాః పరమేశ్వరస్య కృత్వేష్టలోష్టైరపి రుద్రలోకమ్ ।**
**ప్రయాంతి దివ్యం హి విమానవర్యం సురేంద్రపద్మోద్భవవందితస్య ॥4॥**

ఈ భూలోకమునందు ఏ శివునియొక్క భక్తుడు జ్ఞానంగలవాడై భార్యాపుత్రగృహాలలో బాధింపబడడో అట్టి జ్ఞానంగలవానికి గృహాలు మొదలగు వాటివల్ల ప్రయోజనమేమున్నది.అయినప్పటికీ బ్రహ్మేంద్రులచేత నమస్కరింపబడిన పరమేశ్వరుని యొక్క భక్తులు ఇటుకలు మరియు రాళ్ళతో ఆలయాలను నిర్మించి దివ్యమైన శివలోకాన్ని పొందుతున్నారు.

**బాల్యాత్తు లోష్టేన శివం చ కృత్వా మృదాపి వా పాంసుభిరాదిదేవమ్ ।**
**గృహంచ తాదృగ్విధమస్య శంభోః సంపూజ్య రుద్రత్వమవాప్నువంతి ॥5॥**

బాలభావం చేత కూడా రాళ్లు, మట్టి, దుమ్ము - వీటితో శివుడి ఆలయాల్ని నిర్మించి ఆదిదేవుడు శివుడియొక్క పూజ బాగా చేసి రుద్రత్వాన్ని పొందుతున్నారు.

**తస్మాత్సర్వప్రయత్నేన భక్త్యా భక్తైః శివాలయమ్ ।**
**కర్తవ్యం సర్వయత్నేన ధర్మకామార్థసిద్ధయే ॥6॥**

అందువల్ల భక్తులు భక్తితో సంపూర్ణప్రయత్నంతో ధర్మార్థకామసిద్ధికోసం శివాలయనిర్మాణం చెయ్యాలి.

**కేసరం నాగరం వాపి ద్రావిడం వా యథాపరమ్ ।**
**కృత్వా రుద్రాలయం భక్త్యా శివలోకే మహీయతే ॥7॥**

కేసరం, నాగరం, ద్రావిడం లేక మరోవిధంగా గాని భక్తిపూర్వకంగా శివాలయనిర్మాణం చేసిన నరుడు కైలాసాన్ని పొందుతున్నాడు. (కేసరం, నాగరం, ద్రావిడం అనేవి శిల్పశాస్త్రంలో చెప్పిన దేవాలయ నిర్మాణ భేదాలు)

**కైలాసాఖ్యం చ యః కుర్యాత్ప్రాసాదం పరమేష్ఠినః ।**
**కైలాసశిఖరాకారైర్విమానైర్మోదతే సుఖీ ॥8॥**

ఏ భక్తుడు కైలాసమనే పేరుగల శివాలయాన్ని నిర్మిస్తాడో ఆతడు కైలాసశిఖరాకారంలో గల విమానంలో సుఖంగా ఆనందంగా ఉంటాడు.

**సుందరం వా ప్రకుర్వీత శివాయ విధిపూర్వకమ్ ।**
**భక్త్యా విత్తానుసారేణ ఉత్తమాధమమధ్యమమ్ ॥9॥**

**మందరాద్రిప్రతీకాశైర్విమానైర్విశ్వతోముఖైః ।**
**అప్సరోగణసంకీర్ణైర్దేవదానవదుర్లభైః ॥10॥**

**గత్వా శివపురం రమ్యం భుక్త్వా భోగాన్ యథేప్సితాన్ ।**
**జ్ఞానయోగం సమాసాద్య గాణపత్యం లభేన్నరః ॥11॥**

శివుని కోసం భక్తుడు తనకున్న ధనం ప్రకారం శక్త్యానుసారం ఉత్తమ మధ్యమ అధమభేదాలలో శాస్త్రవిధానంగా అందంగా శివాలయాన్ని నిర్మించాలి. అలా నిర్మించిన భక్తుడు దేవదానవులకు దుర్లభమైన అప్సరస గణాలతో కూడివున్న మందరపర్వతంతో సమానంగా అన్నివైపులా వ్యాపించివున్న విమానాలలో అందమైన కైలాసానికి వెళ్ళి కోరిన సుఖాలననుభవించి జ్ఞానయోగాన్ని పొంది ప్రమథగణాధిపత్యాన్ని పొందుతాడు.

**యః కుర్యాన్మేరునామానం ప్రాసాదం పరమేష్ఠినః ।**
**స యత్ఫలమవాప్నోతి న తత్సర్వైర్మహామఖైః ॥12॥**

**సర్వయజ్ఞతపోదానతీర్థవేదేషు యత్ఫలమ్ ।**
**తత్ఫలం సకలం లబ్ధ్వా శివవన్మోదతే చిరమ్ ॥13॥**

ఎవడు 'మేరు' అనే పేరుగల శివాలయాన్ని నిర్మిస్తాడో దానివల్ల అతడు పొందే గొప్పఫలం ఎన్ని మహాయజ్ఞాలు చేసినా పొందలేడు. వేదాధ్యయన, యజ్ఞ, తపోదానతీర్థయాత్రాదులన్నిటివల్ల ఏ ఫలాన్ని పొందుతాడో ఆ మొత్తం ఫలాన్ని మేరు అనే పేరుగల శివాలయనిర్మాణంవల్ల వాడు పొంది చాలాకాలం శివునివలే ఆనందంలో వుంటాడు.

**నిషధం నామ యః కుర్యాత్ప్రాసాదం భక్తితః సుధీః ।**
**శివలోకమనుప్రాప్య శివవన్మోదతే చిరమ్ ॥14॥**

ఏ బుద్ధిమంతుడు 'నిషధ'మనే పేరుగల శివమందిరాన్ని భక్తితో నిర్మిస్తున్నాడో ఆతడు శివలోకాన్ని పొంది శివుడి మాదిరిగా చిరకాలం ఆనందిస్తున్నాడు.

**కుర్యాద్వా యః శుభం విప్రా హిమశైలమనుత్తమమ్ ।**
**హిమశైలోపమైర్యానైర్గత్వా శివపురం శుభమ్ ॥15॥**

**జ్ఞానయోగం సమాసాద్య గాణపత్యమవాప్నుయాత్ ।**

ఓ విప్రులారా! ఎవడు హిమశైలమనే పేరుగల అత్యుత్తమశుభశివాలయాన్ని నిర్మిస్తున్నాడో ఆతడు హిమగిరితో సమానమైన దివ్యవిమానాలలో కైలాసాన్ని పొంది జ్ఞానయోగాన్ని ప్రాప్తించుకుని గణాధిపతిపదవి పొందుతున్నాడు.

**నీలాద్రిశిఖరాఖ్యం వా ప్రాసాదం యః సుశోభనమ్ ॥16॥**

**కృత్వా విత్తానుసారేణ భక్త్యా రుద్రాయ శంభవే ।**
**యత్ఫలం లభతే మర్త్యస్తత్ఫలం ప్రవదామ్యహమ్ ॥17॥**

**హిమశైలే కృతే భక్త్యా యత్ఫలం ప్రాక్తవోదితమ్ ।**
**తత్ఫలం సకలం లబ్ధ్వా సర్వదేవనమస్కృతః ॥18॥**

**రుద్రలోకమనుప్రాప్య రుద్రైః సార్ధం ప్రమోదతే ।**

ఏ మానవుడు తన శక్తి మేరకు శివుడి కోసం భక్తితో నీలాద్రి శిఖరంతో సమానమైన పరమసుందరమైన ఆలయం నిర్మిస్తాడో ఆతడు ఏ ఫలాన్ని పొందగలడో ఆ ఫలాన్ని గూర్చి చెబుతున్నాను. హిమశైల సదృశమైన ఆలయాన్ని నిర్మించినవాడు ఎటువంటి ఫలాన్ని పొందుతాడని ఇంతకు ముందు చెప్పానో అలాంటి సమస్త ఫలితాన్ని పొంది సమస్తదేవతలతో నమస్కరింపబడి శివలోకానికి వెళ్లి రుద్రులతో కూడి ఆనందిస్తాడు.

**మహేంద్రశైలనామానం ప్రాసాదం రుద్రసమ్మతమ్ ॥19॥**

**కృత్వా యత్ఫలమాప్నోతి తత్ఫలం ప్రవదామ్యహమ్ ।**
**మహేంద్రపర్వతాకారైర్విమానై ర్వృషసంయుతైః ॥20॥**

**గత్వా శివపురం దివ్యం భుక్త్వా భోగాన్యథేప్సితాన్ ।**
**జ్ఞానం విచారితం రుద్రైః సంప్రాప్య మునిపుంగవాః ॥21॥**

**విషయాన్ విషవత్త్యక్త్వా శివసాయుజ్యమాప్నుయాత్ ।**

మహాదేవశివుడికి అత్యంత ప్రియమైన మహేంద్రశైలమనే ఆలయాన్ని నిర్మించిన మానవుడు ఏ ఫలాన్ని పొందుతాడో ఆ ఫలాన్ని నేను చెప్పుతున్నాను. ఓ మునిశ్రేష్ఠులారా! ఆ మానవుడు మహేంద్రపర్వతం వంటి ఆకారంగల, వృషభాలతో కూడినట్టి విమానాలలో దివ్యశివలోకానికి వెళ్లి ఇష్టానుసారంగా భోగాల్ని అనుభవించి, రుద్రులవలన సంపూర్ణజ్ఞానాన్ని పొంది విషయసుఖాల్ని విషం మాదిరిగా త్యజించి శివసాయుజ్యాన్ని పొందగలుగుతాడు.

**హేమ్నా యస్తు ప్రకుర్వీత ప్రాసాదం రత్నశోభితమ్ ॥22॥**

**ద్రావిడం నాగరం వాపి కేసరం వా విధానతః ।**
**కూటం వా మండపం వాపి సమం వా దీర్ఘమేవ వా ॥23॥**

**న తస్య శక్యతే వక్తుం పుణ్యం శతయుగైరపి ।**
**జీర్ణం వా పతితం వాపి ఖండితం స్ఫుటితం తథా ॥24॥**

**పూర్వవత్కారయేద్యస్తు ద్వారాద్యైః సుశుభం ద్విజాః ।**
**ప్రాసాదం మండపం వాపి ప్రాకారం గోపురం తు వా ॥25॥**

**కర్తురప్యధికం పుణ్యం లభతే నాత్ర సంశయః ।**

రత్నాలతో అందంగా పొదగబడిన బంగారంతో ఎవడు ఆలయాన్ని, అది ద్రావిడమైనా, నాగరమైనా, కేసరమైనా, అది కూటమైనా చతురస్రమైనా, దీర్ఘచతురస్రమైనా విధ్యనుసారంగా నిర్మిస్తాడో ఆతడు పొందే పుణ్యం నూరు యుగాలలో కూడా చెప్పనలవి కానిది. ఓ ద్విజులారా! ఎవడు జీర్ణమైన, పడిపోయిన, ఖండితమైన, చిట్లిపోయిన (బీటలు వారిన) శివాలయాన్ని గాని ముఖమండపాన్నిగాని, ప్రహరీగోడనుగాని, గోపురాన్నిగాని ద్వారం మొదలైన వాటితో సుందరంగా తీర్చిదిద్దుతాడో ఆతడు మూలనిర్మాతకంటె అధికపుణ్యాన్ని పొందుతాడు. ఇందులో సందేహం లేదు.

**వృత్త్యర్థం వా ప్రకుర్వీత నరః కర్మ శివాలయే ॥26॥**

**యః స యాతి న సందేహః స్వర్గలోకం సబాంధవః ।**
**యశ్చాత్మభోగసిద్ధ్యర్థమపి రుద్రాలయే సకృత్ ॥27॥**

**కర్మ కుర్యాద్యది సుఖం లబ్ధ్వా చాపి ప్రమోదతే ।**

ఏ మానవుడు వృత్తిపరంగా శివాలయంలో పని చేస్తాడో ఆతడు బంధువులతో కూడి స్వర్గలోకానికి వెళతాడు. ఇందులో సందేహం లేదు. ఎవడు తన యొక్క సుఖసిద్ధికోసం శివాలయంలో ఒకసారి పని చేసినా ఆతడు సుఖాన్ని పొంది ప్రసన్నుడవుతాడు.

**తస్మాదాయతనం భక్త్యా యః కుర్యాన్మునిసత్తమాః ॥28॥**

**కాష్ఠేష్టకాదిభిర్మనుష్యః శివలోకే మహీయతే ।**
**ప్రసాదార్థం మహేశస్య ప్రాసాదో మునిపుంగవాః ॥29॥**

**కర్తవ్యః సర్వయత్నేన ధర్మకామార్థముక్తయే ।**

ఓ మునిశ్రేష్ఠులారా! ఎవడు భక్తితో కఱ్ఱలతో, ఇటుకలతో మరియు ఇతర ద్రవ్యాలతో శివాలయం నిర్మిస్తాడో ఆతడు శివలోకాన్ని చేరతాడు. ఓ మునిశ్రేష్ఠులారా! మహేశ్వరుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకోవడానికై ధర్మార్థకామమోక్షసాధనకై సంపూర్ణప్రయత్నం చేయడంతో పాటు శివాలయనిర్మాణం చేపట్టాలి.

**అశక్తశ్చేన్మునిశ్రేష్ఠాః ప్రాసాదం కర్తుముత్తమమ్ ॥30॥**

**సమ్మార్జనాదిభిర్వాపి సర్వాన్ కామానవాప్నుయాత్ ।**
**సమ్మార్జనం యః కుర్యాన్మార్జన్యా మృదుసూక్ష్మయా ॥31॥**

**చాంద్రాయణసహస్రస్య ఫలం మాసేన లభ్యతే ।**
**యః కుర్యాద్వస్త్రపూతేన గంధగోమయవారిణా ॥32॥**

**ఆలేపనం యథా న్యాయం వర్షచాంద్రాయణం లభేత్ ।**

ఓ మునిశ్రేష్ఠులారా! ఎవడైనా ఉత్తమ శివాలయాన్ని నిర్మించడానికి శక్తిలేనివాడైతే సమ్మార్జనం మొదలైన ఉపచారాలద్వారా వాంఛితసర్వఫలసిద్ధిని పొందుతాడు. ఎవడు మెత్తని చిన్నవి అయిన చీపుళ్లతో పరిశుభ్రం చేస్తాడో ఆతడు వేయిచాంద్రాయణాల వ్రతఫలాన్ని ఒక మాసంలో పొందుతాడు. ఎవడు పవిత్రవస్త్రంతో వడకొట్టబడిన గంధజలంతో, గోమయజలంతో విధ్యుక్తంగా ఆలయాన్ని అలుకుతాడో ఆతడు ఒక సంవత్సరకాలం చాంద్రాయణవ్రతం చేసిన ఫలాన్ని పొందుతాడు.

**అర్ధక్రోశం శివక్షేత్రం శివలింగాత్సమంతతః ॥33॥**

**యస్త్యజేద్దుస్త్యజాన్ ప్రాణాన్ శివసాయుజ్యమాప్నుయాత్ ।**
**స్వాయంభువస్య మానం హి తథా బాణస్య సువ్రతాః ॥34॥**

**స్వాయంభువే తదర్ధం స్యాత్స్యాదార్షే చ తదర్ధకమ్ ।**
**మానుషే చ తదర్ధం స్యాత్ క్షేత్రమానం ద్విజోత్తమాః ॥35॥**

**ఏవం యతీనామావాసే క్షేత్రమానం ద్విజోత్తమాః ।**
**రుద్రావతారే చాద్యం యచ్ఛిష్యే చైవ ప్రశిష్యతే ॥36॥**

**నరావతారే తచ్ఛిష్యే తచ్ఛిష్యే చ ప్రశిష్యతే ।**

శివలింగానికి అన్ని దిక్కులా అర్ధక్రోశం (ఒక మైలు) వరకూ గల భూభాగం శివక్షేత్రం అవుతుంది. ఎవడు అక్కడ త్యజింపరాని అనగా బలమైన తన ప్రాణాల్ని త్యజిస్తాడో ఆతడు శివసాయుజ్యాన్ని పొందుతాడు. ఓ సువ్రతులారా! ఈ క్షేత్రం యొక్క లెక్కింపు కేవలం స్వయంభువు అయిన బాణలింగాన్ని అనగా జ్యోతిర్లింగానికి చెందియుంది. ఇతర స్వయంభూలింగాల విషయంలో శివక్షేత్రమానం అందులో సగం పావుక్రోశం (అరమైలు) అవుతుంది. ఋషులు ప్రతిష్ఠించిన లింగం యొక్క శివక్షేత్రం అందులో సగం అనగా పావుక్రోశంలో సగం (క్రోశంలో 8వవంతు) అవుతుంది. మనుష్యులు ప్రతిష్ఠించిన లింగం యొక్క క్షేత్రం అందులో అనగా ఎనిమిదవవంతు క్రోశంలో సగం అనగా పదహారవ వంతు అవుతుంది. ఓ ద్విజోత్తములారా! ఈ విధంగానే మునివాటికలందు క్రోశంలో పదహారో వంతే శివక్షేత్రం అవుతుంది. రుద్రుల జన్మస్థానస్థలం, వాళ్ల శిష్యప్రశిష్యుల అవతారస్థలం, యోగాచార్యుల అవతారస్థలం వారి శిష్యుల అవతారస్థలం – ఇలా వీరియొక్క శిష్యప్రశిష్యుల అవతార స్థలాల విషయంలో అర్ధక్రోశ మండలమే (చుట్టుకొలత) శివక్షేత్రం అవుతుంది.

**శ్రీ పర్వతే మహాపుణ్యే తస్య ప్రాంతే చ వా ద్విజాః ॥37॥**

**తస్మిన్ వా యస్త్యజేత్ప్రాణాన్ శివసాయుజ్యమాప్నుయాత్ ।**
**వారాణస్యాం తథాప్యేవమవిముక్తే విశేషతః ॥38॥**

**కేదారే చ మహాక్షేత్రే ప్రయాగే చ విశేషతః ।**
**కురుక్షేత్రే చ యః ప్రాణాన్ సంత్యజేద్యాతి నిర్వృతిమ్ ॥39॥**

**ప్రభాసే పుష్కరేఽవంత్యాం తథా చైవామరేశ్వరే ।**
**వణీశేలాకులే చైవ మృతో యాతి శివాత్మతామ్ ॥40॥**

**వారణాస్యాం మృతో జంతుర్న జాతు జంతుతాం వ్రజేత్ ।**
**త్రివిష్టపే విముక్తే చ కేదారే సంగమేశ్వరే ॥41॥**

**శాలకే వా త్యజేత్ప్రాణాంస్తథా వై జంబుకేశ్వరే ।**
**శుక్రేశ్వరే వా గోకర్ణే భాస్కరేశే గుహేశ్వరే ॥42॥**

**హిరణ్యగర్భే నందీశే స యాతి పరమాం గతిమ్ ।**
**నియమైః శోష్య యో దేహం త్యజేత్ క్షేత్రే శివస్య తు ॥43॥**

**స యాతి శివతాం యోగీ మానుషే దైవికేఽపి వా ।**
**ఆర్షే వాపి మునిశ్రేష్ఠాస్తథా స్వాయంభువేఽపి వా ॥44॥**

**స్వయంభూతే తథా దేవే నాత్ర కార్యా విచారణా ।**

ఓ ద్విజులారా! మహాపుణ్యప్రదమైన శ్రీ పర్వతం మీద దాని ప్రాంతభాగంలో గాని శివక్షేత్రంలో ఎవడు ప్రాణాల్ని విడుస్తాడో ఆతడు శివసాయుజ్యాన్ని పొందుతాడు. ఎవడు వారణాసిలో విశేషమైన అవిముక్తక్షేత్రంలో, కేదారక్షేత్రంలో విశేషమోక్షదాయకమైన ప్రయాగలో, కురుక్షేత్రంలోనూ ప్రాణత్యాగం చేస్తాడో ఆతడు మోక్షాన్ని పొందుతాడు. ప్రభాసం, పుష్కరం, అవంతి, అమరేశ్వరం, వణీశేలాకులం – వీటిలో మృతి చెందిన ప్రాణి శివాత్మత పొందుతుంది. వారణాసిలో మరణించిన ప్రాణికి పునర్జన్మ లేదు. ఏ ప్రాణి త్రివిష్టపం, విముక్తం, కేదారక్షేత్రం, సంగమేశ్వరం, శాకలం, జంబుకేశ్వరం, శుక్రేశ్వరం, గోకర్ణం, భాస్కరేశం, గుహేశ్వరం, హిరణ్యగర్భం నందీశక్షేత్రం – వీటిలో ప్రాణాలు విడుస్తుందో అది పరమగతిని పొందుతుంది. ఓ మునిశ్రేష్ఠులారా! శరీరసుఖాల్ని నియమానుసారంగా అనుభవించిన ఏ యోగి మానుషశివక్షేత్రంలో, దైవికశివక్షేత్రంలో, ఆర్షశివక్షేత్రంలో స్వయంభూశివక్షేత్రంలో ప్రాణత్యాగం చేస్తాడో ఆతడు శివత్వాన్ని పొందుతాడు. జ్యోతిర్లింగక్షేత్రం (స్వయంభూ) మరియు దేవక్షేత్రవిషయికంగా ఎటువంటి సందేహం అవసరం లేదు.

**ఆధాయాగ్నిం శివక్షేత్రే సంపూజ్య పరమేశ్వరమ్ ॥45॥**

**స్వదేహపిండం జుహుయాద్యః స యాతి పరాం గతిమ్ ।**
**యావత్తావన్నిరాహారో భూత్వా ప్రాణాన్ పరిత్యజేత్ ॥46॥**

**శివక్షేత్రే మునిశ్రేష్ఠాః శివసాయుజ్యమాప్నుయాత్ ।**
**ఛిత్త్వా పాదద్వయం చాపి శివక్షేత్రే వసేత్తు యః ॥47॥**

**స యాతి శివతాం చైవ నాత్ర కార్యా విచారణా ।**

శివక్షేత్రంలో బాగా శివుణ్ణి పూజించి అగ్నిని మండించి తన శరీరాన్ని ఆ అగ్నిలో హోమం చేస్తాడో ఆతడు పరమగతిని పొందుతాడు. ఏ మానవుడు నిరాహారంగా ఉండి శివక్షేత్రంలో ప్రాణత్యాగం చేస్తాడో ఆతడు శివసాయుజ్యాన్ని పొందుతాడు. ఎవడు తన రెండు పాదాల్ని ఖండించుకుని శివక్షేత్రంలో నివసిస్తాడో ఆతడు శివత్వాన్ని పొందుతాడు. ఇందుకు సందేహించ పనిలేదు.

**క్షేత్రస్య దర్శనం పుణ్యం ప్రవేశస్తచ్ఛతాధికః ॥48॥**

**తస్మాచ్ఛతగుణం పుణ్యం స్పర్శనం చ ప్రదక్షిణమ్ ।**
**తస్మాచ్ఛతగుణం పుణ్యం జలస్నానమతః పరమ్ ॥49॥**

**క్షీరస్నానం తతో విప్రాః శతాధికమనుత్తమమ్ ।**
**దధ్నా సహస్రమాఖ్యాతం మధునా తచ్ఛతాధికమ్ ॥50॥**

**ఘృతస్నానేన చానంతం శార్కరే తచ్ఛతాధికమ్ ।**

శివక్షేత్రదర్శనం పుణ్యప్రదమైనది. అందులోనికి ప్రవేశించడం, చూచిన దానికన్నా వందరెట్లు అధికపుణ్యదాయకం అవుతుంది. దానికంటె (ప్రవేశం) తాకటం మరియు ప్రదక్షిణం చేయడం వందరెట్లు అధికపుణ్యం. దానికంటె లింగానికి జలాభిషేకం చేయడం వందరెట్లు అధికఫలం. ఓ విప్రులారా! జలస్నానం కన్నా ఉత్తమమైన క్షీరస్నానం (అభిషేకం) వందరెట్లు అధికపుణ్యం. పెరుగుతో అభిషేకం క్షీరాభిషేకం కన్నా వేయి రెట్లు మిన్న. మధువుతో అభిషేకం పెరుగు అభిషేకం కన్నా వందరెట్లు మిన్న. ఘృతస్నానం మధుస్నానం కన్నా వందరెట్లు, దానికన్నా పంచదారతో అభిషేకం మరి వందరెట్లు అధిక పుణ్యాన్ని ఇస్తుంది.

**శివక్షేత్రసమీపస్థాం నదీం ప్రాప్యావగాహ్య చ ॥51॥**

**త్యజేద్దేహం విహాయాన్నం శివలోకే మహీయతే ।**
**శివక్షేత్రసమీపస్థాః నద్యః సర్వాః సుశోభనాః ॥52॥**

**వాపీకూపతడాగాశ్చ శివతీర్థా ఇతి స్మృతాః ।**
**స్నాత్వా తేషు నరో భక్త్యా తీర్థేషు ద్విజసత్తమాః ॥53॥**

**బ్రహ్మహత్యాదిభిః పాపైర్ముచ్యతే నాత్ర సంశయః ।**

శివక్షేత్రాలకు సమీపంలోగల నదికి వెళ్లి స్నానం చేసి అన్నాన్ని విడిచి ఎవడు దేహాన్ని విడిచి పెడతాడో ఆతడు శివలోకాన్ని చేరతాడు. శివక్షేత్రాలకు సమీపంలోగల అన్ని నదులు సుందరములైనవే. వాపీకూపతటాకాలు అన్నీ శివతీర్థాలే. (శివజలాలే) వాటిల్లో శ్రద్ధతో స్నానం చేసిన నరుడు బ్రహ్మహత్య మొదలైన పాపాల నుంచి విముక్తి పొందుతాడు. ఇందులో సందేహం లేదు.

**ప్రాతః స్నాత్వా మునిశ్రేష్ఠా శివతీర్థేషు మానవః ॥54॥**

**అశ్వమేధఫలం ప్రాప్య రుద్రలోకం స గచ్ఛతి ।**
**మధ్యాహ్నే శివతీర్థేషు స్నాత్వా భక్త్యా సకృన్నరః ॥55॥**

**గంగాస్నానసమం పుణ్యం లభతే నాత్ర సంశయః ।**
**అస్తం గతే తథా చార్కే స్నాత్వా గచ్ఛేచ్ఛివం పదమ్ ॥56॥**

**పాపకంచుకముత్సృజ్య శివతీర్థేషు మానవః ।**
**ద్విజాస్త్రిషవణం స్నాత్వా శివతీర్థే సకృన్నరః ॥57॥**

**శివసాయుజ్యమవాప్నోతి నాత్ర కార్యా విచారణా ।**
**పురాథ సూకరః కశ్చిత్ శ్వానం దృష్ట్వా భయాత్పథి ॥58॥**

**ప్రసంగాద్వారమేకం తు శివతీర్థేஉవగాహ్య చ ।**
**మృతః స్వయం ద్విజశ్రేష్ఠా గాణపత్యమవాప్తవాన్ ॥59॥**

ఓ మునిపుంగవులారా! ప్రాతః కాలంలో శివతీర్థాలల్లో స్నానం చేసిన నరుడు అశ్వమేధయజ్ఞం చేసిన ఫలాన్ని పొంది రుద్రలోకానికి వెళుతున్నాడు. మధ్యాహ్నకాలంలో శివతీర్థాలలో స్నానం చేసిన నరుడు గంగాస్నానం వల్ల కలిగిన పుణ్యఫలాన్ని పొందుతున్నాడు. ఇందులో సందేహం లేదు. సూర్యాస్తమయం తర్వాత స్నానం చేసిన నరుడు పాపదేహత్రాణాల్ని వదలి శివపదాన్ని పొందుతున్నాడు. శివతీర్థాలలో ఒకసారి త్రికాలాలలో స్నానం చేసిన మానవుడు శివసాయుజ్యాన్ని పొందుతున్నాడు. ఇందుకు ఎలాంటి సందేహం లేదు. పూర్వం ఒక సూకరం (పంది) మార్గంలో కుక్కను చూచి భయంతో తన ఇచ్ఛలేకుండానే శివతీర్థంలో పడి ఒకసారి మునిగి తనంతట తానే చనిపోయింది. ఆ తీర్థంలో మునిగిన కారణంగా ప్రమథగణాధిపతి పదవి పొందింది.

**యః ప్రాతర్దేవదేవేశం శివం లింగస్వరూపిణమ్ ।**
**పశ్యేత్స యాతి సర్వస్మాదధికాం గతిమేవ చ ॥60॥**

**మధ్యాహ్నే చ మహాదేవం దృష్ట్వా యజ్ఞఫలం లభేత్ ।**
**సాయాహ్నే సర్వయజ్ఞానాం ఫలం ప్రాప్య విముచ్యతే ॥61॥**

**మానసైర్వాచికైః పాపైః కాయికైశ్చ మహత్తరైః ।**
**తథోపపాతకశ్చైవ పాపైశ్చైవానుపాతకైః ॥62॥**

**సంక్రమే దేవమీశానం దృష్ట్వా లింగాకృతిం ప్రభుమ్ ।**
**మాసేన యత్కృతం పాపం త్యక్త్వా యాతి శివం పదమ్ ॥63॥**

**అయనే చార్ధమాసేన దక్షిణే చోత్తరాయణే ।**
**విషువే చైవ సంపూజ్య ప్రయాతి పరమాం గతిమ్ ॥64॥**

ఎవడు ప్రాతఃకాలంలో లింగస్వరూపి అయిన దేవదేవేశ్వర శివుణ్ణి దర్శిస్తాడో ఆతడు అన్నింటికన్నా ఉత్తమగతిని పొందుతున్నాడు. మధ్యాహ్నకాలంలో శివభగవానుడిని దర్శించి యజ్ఞఫలాన్ని పొందుతున్నాడు. మరియు సాయంకాలంలో దర్శించి సమస్తయజ్ఞాలఫలాన్ని పొంది మానసికమైన, వాచికమైన పెద్దవైన శారీరక పాపాల నుంచి మరియు ఉపపాతకాలనుంచి మరియు అనుపాతకాలనుంచి కూడా ముక్తుడవుతున్నాడు.

సూర్యసంక్రమణ సమయంలో లింగాకారుడైన శివుణ్ణి దర్శించిన మానవుడు ఒక మాసంలో చేసిన పాపాలన్నింటి నుంచి విముక్తుడై శివలోకాన్ని పొందుతున్నాడు. కర్కాటక సంక్రాంతికి (దక్షిణాయనం) మకర సంక్రాంతికి (ఉత్తరాయణం) మేష, తులా సంక్రాంతులకు (విషువత్) యథావిధి శివుణ్ణి పూజించి అర్ధమాసంలో చేసిన పాపాలనుంచి విముక్తుడై మానవుడు పరమగతిని పొందుతున్నాడు.

**ప్రదక్షిణాత్రయం కుర్యాద్యః ప్రాసాదం సమంతతః ।**
**సవ్యాపసవ్యన్యాయేన మృదుగత్యా శుచిర్నరః ॥65॥**

**పదే పదేఽ శ్వమేధస్య యజ్ఞస్య ఫలమాప్నుయాత్ ।**
**వాచా యస్తు శివం నిత్యం సంరౌతి పరమేశ్వరమ్ ॥66॥**

**సోఽ పి యాతి శివం స్థానం ప్రాప్య కిం పునరేవ చ ।**

పవిత్రుడైన ఏ నరుడు సవ్యాపసవ్యమార్గాలలో శివాలయం చుట్టూ మూడుసార్లు నెమ్మదిగా ప్రదక్షిణం చేస్తున్నాడో ఆతడు మాటిమాటికి అశ్వమేధయాగఫలాన్ని పొందుతున్నాడు. ఏ మానవుడు నిత్యం శివుణ్ణి వాక్కులతో జపిస్తున్నాడో ఆతడు కైలాసాన్ని చేరుతున్నాడు. ఇంకా ఆతడికి మిగిలి ఏమున్నది?

**కృత్వా మండలకం క్షేత్రం గంధగోమయవారిణా ॥67॥**

**ముక్తాఫలమయైశ్చూర్ణైరింద్రనీలమయైస్తథా ।**
**పద్మరాగమయైశ్చైవ స్ఫాటికైశ్చ సుశోభనైః ॥68॥**

**తథా మారకతైశ్చైవ సౌవర్ణై రాజతైస్తథా ।**
**తద్వర్ణైర్లౌకికైశ్చైవ చూర్ణైర్విత్తవివర్జితైః ॥69॥**

**ఆలిఖ్య కమలం భద్రం దశహస్తప్రమాణతః ।**
**సకర్ణికం మహాభాగా మహాదేవసమీపతః ॥70॥**

**తత్రావాహ్య మహాదేవం నవశక్తిసమన్వితమ్ ।**
**పంచభిశ్చ తథా షడ్భిరష్టాభిశ్చేష్టదం పరమ్ ॥71॥**

**పునరష్టాభిరీశానం దశారే దశభిస్తథా ।**
**పునర్వాహ్యే చ దశభిః సంపూజ్య ప్రణిపత్య చ ॥72॥**

**నివేద్య దేవదేవాయ క్షితిదానఫలం లభేత్ ।**
**శాలిపిష్టాదిభిర్వాపి పద్మమాలిఖ్య నిర్ధనః ॥73॥**

**పూర్వోక్తమఖిలం పుణ్యం లభతే నాత్ర సంశయః ।**

ఓ మహానుభావులారా! గంధం గోమయం మిశ్రితమైన నీటితో మండలాకారంగా క్షేత్రాన్ని నిర్మించి అందులో ముత్యాలు, ఇంద్రనీలాలు, పద్మరాగాలు, స్ఫటికాలు, మరకతాలు, బంగారం, వెండి – వీటి యొక్క అతిసుందరమైన

చూర్ణం ద్వారా, ఒకవేళ ధనం లేకపోయినచో ఈ రంగుల్ని వేరు విధమైన సామాన్యచూర్ణాలద్వారా మహాదేవుడి సమీపంలో కర్ణికతో కూడిన పదిహస్తాల పరిమాణం గల మంగళకరమైన కమలాన్ని నిర్మించి అందులో ఐదు, ఆరు, ఎనిమిది అట్లే తొమ్మిది, వామం మొదలైన శక్తులతో కూడిన పరమమైన ఇష్టాన్ని ప్రదానం చేసే మహాదేవశివుణ్ణి ఆవాహనం చేసి మరల ఎనిమిది శక్తులతో కూడిన ఈశ్వరుణ్ణి ఆవాహనం చేసి, పదికోణాలలో పది శక్తులతో కూడిన అట్లే దానికి వెలుపల పది శక్తులతో కూడిన శివుడిని పూజించి అట్లే నమస్కరించి దేవదేవుడికి ఆ కమలాన్ని అర్పించడం వల్ల భూదానం యొక్క ఫలం ప్రాప్తిస్తున్నది. నిర్ధనుడైన భక్తుడు శాలిధాన్యంతో చేసిన అనగా బియ్యం యొక్క చూర్ణం మొదలైన వాటితో కమలాన్ని తీర్చిదిద్ది, పూజించినవాడు పూర్వం చెప్పిన మొత్తం ఫలాన్ని పొందుతాడు. ఇందులో సందేహం లేదు.

**ద్వాదశారం తథాలిఖ్య మండలే పద్మముత్తమమ్ ॥74॥**

**రత్నచూర్ణాదిభిశ్చూర్ణైస్తథా ద్వాదశమూర్తిభిః ।**
**మండలస్య చ మధ్యే తు భాస్కరం స్థాప్య పూజయేత్ ॥75॥**

**గ్రహైశ్చ సంవృతం వాపి సూర్యసాయుజ్యముత్తమమ్ ।**

మండలంలో రత్నాదిచూర్ణాలతో గాని ఇతర చూర్ణాలతోగాని పండ్రెండు దళాల ఉత్తమకమలాన్ని రచించి మండలం మధ్యలో పండ్రెండు మూర్తులతో పాటు సూర్యుణ్ణి స్థాపించుకుని గ్రహాలతో పరివేష్టించియున్న సూర్యుణ్ణి పూజించాలి. దీనివల్ల ఆ భక్తుడు సూర్యుడితో సాయుజ్యాన్ని పొందుతాడు.

**ఏవం ప్రాకృతమప్యార్యాం షడస్రం పరికల్ప్య చ ॥76॥**

**మధ్యదేశే చ దేవేశీం ప్రకృతిం బ్రహ్మరూపిణీమ్ ।**
**దక్షిణే సత్త్వమూర్తిం చ వామతశ్చ రజోగుణమ్ ॥77॥**

**అగ్రతస్తు తమోమూర్తిం మధ్యే దేవీం తథాంబికామ్ ।**
**పంచభూతాని తన్మాత్రాపంచకం చైవ దక్షిణే ॥78॥**

**కర్మేంద్రియాణి పంచైవ తథా బుద్ధీంద్రియాణి చ ।**
**ఉత్తరే విధివత్పూజ్య షడస్రే చైవ పూజయేత్ ॥79॥**

**ఆత్మానం చాంతరాత్మానం యుగలం బుద్ధిమేవ చ ।**
**అహంకారం చ మహతా సర్వయజ్ఞఫలం లభేత్ ॥80॥**

**ఏవం వః కథితం సర్వం ప్రాకృతం మండలం పరమ్ ।**

ఈ విధంగా ప్రాకృతమైన మండలాన్ని రచించి అందులో ఆరుదళాల కమలాన్ని గీచి దాని మధ్యభాగంలో ఆర్య, బ్రహ్మరూపిణి మరియు దేవేశ్వరి అయిన ప్రకృతిని, కుడివైపున సత్త్వమూర్తిని, ఎడమవైపున రజోగుణాన్ని, ముందుభాగంలో తమోమూర్తిని, మధ్యలో అంబికాదేవిని, దక్షిణంలో పంచభూతాల్ని అట్లే పంచతన్మాత్రల్ని, ఉత్తరంలో పంచకర్మేంద్రియజ్ఞానేంద్రియాల్ని, యథావిధి పూజించి ఆ ఆరుదళాల పద్మంలో ఆత్మ–పరమాత్మలు

అయిన రెంటిని, బుద్ధికి అట్లే మహత్తుతో కూడిన అహంకారానికి పూజ చేయాలి. దీనివల్ల భక్తుడు సమస్తయాగఫలాన్ని పొందుతున్నాడు. ఈ విధంగా నేను మీకు సంపూర్ణంగా ఉత్తమమైన ప్రాకృతమండలాన్ని గూర్చి చెప్పాను.

**అతో వక్ష్యామి విప్రేంద్రాః సర్వకామార్థసాధనమ్ ॥81॥**

**గోచర్మమాత్రమాలిఖ్యం మండలం గోమయేన తు ।**
**చతురస్రం విధానేన చాద్భిరభ్యుక్ష్య మంత్రవిత్ ॥82॥**

**అలంకృత్య వితానాద్యైః ఛత్రైర్వాపి మనోరమైః ।**
**బుద్బుదైరర్ధచంద్రైశ్చ హైమైరశ్వత్థపత్రకైః ॥83॥**

**సితైర్వికసితైః పద్మై రక్తైర్నీలోత్పలైస్తథా ।**
**ముక్తాదామైర్వితానాంతే లంబితైస్తు సితైర్ధ్వజైః ॥84॥**

**సితమృత్పాత్రకైశ్చైవ సుశ్లక్ష్ణైః పూర్ణకుంభకైః ।**
**ఫలపల్లవమాలాభిర్వైజయంతీభిరంశుకైః ॥85॥**

**పంచాశద్దీపమాలాభిర్ధూపైః పంచవిధైస్తథా ।**
**పంచాశద్దలసంయుక్తమాలిఖేత్పద్మముత్తమమ్ ॥86॥**

**తత్తద్వర్ణైస్తథా చూర్ణైః శ్వేతచూర్ణైరథాపి వా ।**
**ఏకహస్తప్రమాణేన కృత్వా పద్మం విధానతః ॥87॥**

**కర్ణికాయాం న్యసేద్దేవం దేవ్యా దేవేశ్వరం భవమ్ ।**
**వర్ణాని చ న్యసేత్పత్రే రుద్రైః ప్రాగాద్యనుక్రమాత్ ॥88॥**

**ప్రణవాదినమోఽంతాని సర్వవర్ణాని సువ్రతాః ।**
**సంపూజ్యైవం మునిశ్రేష్ఠా గంధపుష్పాదిభిః క్రమాత్ ॥89॥**

**బ్రాహ్మణాన్ భోజయేత్తత్ర పంచాశద్విధిపూర్వకమ్ ।**
**అక్షమాలోపవీతం చ కుండలం చ కమండలుమ్ ॥90॥**

**ఆసనం చ తథా దండముష్ణీషం వస్త్రమేవ చ ।**
**దత్త్వా తేషాం మునీంద్రాణాం దేవదేవాయ శంభవే ॥91॥**

**మహాచరుం నివేద్యైవం కృష్ణం గోమిథునం తథా ।**
**అంతే చ దేవదేవాయ దాపయేచ్చూర్ణమండలమ్ ॥92॥**

**యాగోపయోగద్రవ్యాణి శివాయ వినివేదయేత్ ।**
**ఓంకారాద్యం జపేద్ధీమాన్ ప్రతివర్ణమనుక్రమాత్ ॥93॥**

ఓ విప్రశ్రేష్ఠులారా! ఇప్పుడు నేను సర్వకామనల్ని సిద్ధిపొందించే సాధనసంపత్తిని వర్ణిస్తాను. మంత్రాలు తెలిసిన భక్తుడు యథావిధి భూమిపై ఆవుపేడతో అలికి గోచర్మంతో సమానమైన నాలుగుకోణాలుగల మండలాన్ని నిర్మించి దానిపై నీళ్లను చల్లి దానిమీద పందిరివేసి లేకుంటే అందమైన గొడుగులతోనూ బంగారంతో తయారుచేసిన అర్ధచంద్రాకారంలోగల నీటిబుడగలతోనూ, బంగారంతో చేయబడిన రావి ఆకులతోనూ అలంకరించాలి. పందిరి యొక్క శ్వేతధ్వజాల్ని, ముత్యాలమాలల్ని కొనభాగాలకు తెల్లటి పద్మాల్ని, ఎఱ్ఱటి పద్మాల్ని, నల్లటి పద్మాల్ని, వ్రేలాడదీయాలి. మనోహరమైన జలంతో నిండిన తెల్లటి మట్టిపాత్రలు, ఘటాలు, పండ్లు, చిగురుటాకులు, మాలలు, వైజయంతి దండలు అక్కడ ఉండాలి. ఏభై దీపాల్ని వెలిగించాలి. ఐదు రకాల ధూపాల్ని వేయాలి. వివిధవర్ణచూర్ణాలతో లేక తెల్లటి చూర్ణంతో యథావిధి ఒక హస్తపరిమాణంగల ఏభై దళాలుగల పద్మాన్ని రచించాలి. దానిమధ్యలో పార్వతీసమేతుడైన శివుణ్ణి స్థాపించాలి. ఓ సువ్రతులారా! కమలపత్రాలలో తూర్పునుంచి క్రమంగా రుద్రపత్రాలతో కలిసి అకారాది వర్ణాల్ని స్థాపించాలి. అవి ఆదిలో "ఓం"తోను అంతంలో "నమః"తోనూ కూడి ఉండాలి. ఓ మునిశ్రేష్ఠులారా! ఈ విధంగా భక్తుడు వరుసగా గంధం, పుష్పాదులతో పూజించి ఏభైమంది బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. తర్వాత ఆ విప్రులకు జపమాలలు, యజ్ఞోపవీతాలు, కుండలాలు, కమండలాలు, ఆసనాలు, యోగదండాలు, మకుటాలు మరియు వస్త్రాలు దానం చేసి, దేవదేవుడు శివభగవానుడికి మహాచరువును నైవేద్యరూపంలో నివేదించి ఒక నల్లని గోవును, ఒక నల్లని వృషభాన్ని శివుడికి సమర్పించాలి. చివరిగా చూర్ణాలతో నిర్మించిన మండలాన్ని, పూజకు ఉపయోగించిన ద్రవ్యాల్ని ఆయనకు సమర్పించాలి. ఆదిలో 'ఓం'కారాన్ని జోడించి బుద్ధిమంతుడైన ఆ భక్తుడు ప్రతి అక్షరాన్ని క్రమంగా జపించాలి.

**ఏవమాలిఖ్య యో భక్త్యా సర్వమండలముత్తమమ్ ।**
**యత్ఫలం లభతే మర్త్యస్తద్వదామి సమాసతః ॥94॥**

**సాంగాన్ వేదాన్ యథాన్యాయమధీత్య విధిపూర్వకమ్ ।**
**ఇష్ట్వా యజ్ఞైర్యథాన్యాయం జ్యోతిష్టోమాదిభిః క్రమాత్ ॥95॥**

**తతో విశ్వజిదంతైశ్చ పుత్రానుత్పాద్య తాదృశాన్ ।**
**వానప్రస్థాశ్రమం గత్వా సదారః సాగ్నిరేవ చ ॥96॥**

**చాంద్రాయణాదికాః సర్వాః కృత్వా న్యస్య క్రియా ద్విజాః ।**
**బ్రహ్మవిద్యామధీత్యైవ జ్ఞానమాసాద్య యత్నతః ॥97॥**

**జ్ఞానేన జ్ఞేయమాలోక్య యోగీ యత్కామమాప్నుయాత్ ।**
**తత్ఫలం లభతే సర్వం వర్ణమండలదర్శనాత్ ॥98॥**

ఈ విధంగా శ్రద్ధాపూర్వకంగా ఉత్తమమైన సంపూర్ణమైన మండలాన్ని విరచించి ఏ ఫలాన్ని పొందుతున్నాడో దాన్ని నేను సంగ్రహంగా చెప్తున్నాను. యథావిధి అంగసహితంగా వేదాల్ని సముచితరూపంగా అధ్యయనం చేసి, విధ్యుక్తంగా క్రమంగా జ్యోతిష్టోమం నుంచి విశ్వజిత్తు వరకుగల అన్ని యాగాల్ని చేసి, తనకు సమానమైన బిడ్డల్ని కని, భార్యతో కూడి వానప్రస్థాశ్రమానికి వెళ్లి అగ్నికార్యాన్ని నిర్వహించి మరల చాంద్రాయణం మొదలైన అన్ని వ్రతాల్ని నిర్వహించి తర్వాత అన్ని పనుల్ని త్యజించి బ్రహ్మవిద్యను అభ్యసించి, ప్రయత్నపూర్వకంగా జ్ఞానాన్ని

ఆర్జించి, ఆ జ్ఞానం వల్ల జ్ఞేయాన్ని దర్శించి యోగియైన మానవుడు ఏ ఫలాన్ని పొందుతున్నాడో అట్టి ఫలాన్ని సంపూర్ణవర్ణమండలదర్శనం చేసిన మానవుడు పొందుతున్నాడు.

**యేన కేనాపి వా మర్త్యః ప్రలిప్యాయతనాగ్రతః ।**
**ఉత్తరే దక్షిణే వాపి పృష్ఠతో వా ద్విజోత్తమాః ॥99॥**

**చతుష్కోణం తు వా చూర్ణైరలంకృత్య సమంతతః ।**
**పుష్పాక్షతాదిభిః పూజ్య సర్వపాపైః ప్రముచ్యతే ॥100॥**

**యస్తు గర్భగృహం భక్త్యా సకృదాలిప్య సర్వతః ।**
**చందనాద్యైః స కర్పూరైర్గంధద్రవ్యైః సమంతతః ॥101॥**

**వికీర్య గంధకుసుమైర్ధూపైర్ధూప్య చతుర్విధైః ।**
**ప్రార్థయేద్దేవమీశానం శివలోకం స గచ్ఛతి ॥102॥**

**తత్ర భుక్త్వా మహాభోగాన్ కల్పకోటిశతం నరః ।**
**స్వదేహగంధకుసుమైః పూరయన్ శివమందిరమ్ ॥103॥**

**క్రమాత్ గాంధర్వమాసాద్య గాంధర్వైశ్చ సుపూజితః ।**
**క్రమాదాగత్య లోకేఽస్మిన్ రాజా భవతి వీర్యవాన్ ॥104॥**

ఓ ద్విజశ్రేష్ఠులారా! ఏదో ఒక విధంగా మానవుడు శివాలయాన్ని అలికి శుభ్రపరచి దాన్ని ముందు, వెనుక, ఉత్తరదక్షిణాలలో నాల్గుకోణాల మండలాన్ని నిర్మించి దాని యొక్క నాల్గువైపుల చూర్ణాలతో అలంకరించి, పుష్పాలు, అక్షతలు, మొదలైన వాటితో పూజించి మానవుడు అన్ని పాపాలనుంచి విముక్తుడవుతున్నాడు. మానవుడు ఒకసారి అయినా గర్భమందిరాన్ని భక్తితో చందనాదులతో, కర్పూరంతో, సుగంధద్రవ్యాలతో అన్నివైపుల అలికి, అన్నివైపుల సుగంధపుష్పాలను వెదజల్లి, నాల్గువిధాలైన ధూపాలతో నింపి భగవానుణ్ణి ప్రార్థిస్తున్నాడో ఆతడు శివలోకానికి వెళుతున్నాడు. ఆతడు అక్కడ నూరుకోట్ల కల్పాల వరకు మహాసుఖాల్ని అనుభవించి తన దేహమనే సుగంధకుసుమాలతో శివాలయాన్ని పూరిస్తూ నింపుతూ క్రమంగా గంధర్వలోకానికి వెళ్లి అక్కడ గంధర్వులతో పూజింపబడుతున్నాడు. మరల భూలోకానికి వచ్చి పరాక్రమవంతుడైన రాజు అవుతున్నాడు.

**ఆదిదేవో మహాదేవః ప్రళయస్థితికారకః ।**
**సర్గశ్చ భువనాధీశః సర్వవ్యాపీ సదాశివః ।**
**శివబ్రహ్మామృతం గ్రాహ్యం మోక్షసాధనమనుత్తమమ్ ॥105॥**

**వ్యక్తావ్యక్తం సదా నిత్యమచింత్యమర్చయేత్ప్రభుమ్ ॥106॥**

ఆయన ఆదిదేవుడు, మహాదేవుడు, సదాశివుడు, సృష్టిస్థితిలయకారకుడు, జగన్నాథుడు, సర్వవ్యాపి అయి ఉన్నాడు. శివరూపంలోగల బ్రహ్మవల్ల మోక్షరూపమైన అమృతాన్ని గ్రహించాలి. అట్లే ఉత్తమం, వ్యక్తం, అవ్యక్తం, నిత్యం, అచింత్యం మరియు మోక్షసాధనస్వరూపమైన శివభగవానుడి అర్చన ఎల్లప్పుడు నిర్వహించాలి.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే ఉపలేపనాదికథనం నామ సప్తసప్తతితమోఽధ్యాయః ॥ 77 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని ఉపలేపనాదికథనమనే డెబ్బై ఏడవ అధ్యాయం సమాప్తం.

## అష్టసప్తతితమోఽధ్యాయః - డెబ్బై ఎనిమిదవ అధ్యాయం

## భక్తిమహిమావర్ణనమ్ - భక్తిమహిమావర్ణనం

**సూత ఉవాచ -** సూతమహర్షి పలికాడు.

**వస్త్రపూతేన తోయేన కార్యం చైవోపలేపనమ్ ।**
**శివక్షేత్రే మునిశ్రేష్ఠా నాన్యథా సిద్ధిరిష్యతే ॥1॥**

**ఆపఃపూతా భవంత్యేతా వస్త్రపూతాః సముద్ధృతాః ।**
**అఫేనా మునిశార్దూలా నాదేయాశ్చ విశేషతః ॥2॥**

ఓ మునిశ్రేష్ఠులారా! శివక్షేత్రంలో వస్త్రంతో వడకొట్టబడిన పవిత్రజలంతోనే ఉపలేపనాన్ని నిర్వహించాలి. ఇందుకు భిన్నంగా చేసిన ఉపలేపనం సిద్ధినివ్వదు. ఓ మునిశ్రేష్ఠులారా! విశేషంగా నదినుంచి గ్రహించిన నురగలేని నీటిని వస్త్రంతో వడకొట్టినచో అది పవిత్ర జలమవుతుంది.

**తస్మాద్వై సర్వకార్యాణి దైవికాని ద్విజోత్తమాః ।**
**అద్భిః కార్యాణి పూతాభిః సర్వకార్యప్రసిద్ధయే ॥3॥**

**జంతుభిర్మిశ్రితా హ్యాపః సూక్ష్మాభిస్తాన్నిహత్య తు ।**
**యత్పాపం సకలం చాద్భిరపూతాభిశ్చిరం లభేత్ ॥4॥**

**సమ్మార్జనే తథా నృణాం మార్జనే చ విశేషతః ।**
**అగ్నౌ కండనకే చైవ పేషణే తోయసంగ్రహే ॥5॥**

**హింసా సదా గృహస్థానాం తస్మాద్ధింసాం వివర్జయేత్ ।**
**అహింసేయం పరో ధర్మః సర్వేషాం ప్రాణినాం ద్విజాః ॥6॥**

**తస్మాత్సర్వప్రయత్నేన వస్త్రపూతం సమాచరేత్ ।**
**తద్దానమభయం పుణ్యం సర్వదానోత్తమోత్తమమ్ ॥7॥**

ఓ ద్విజోత్తములారా! కావున సర్వకార్యసిద్ధికై అన్ని దేవకార్యాల్ని పవిత్రజలంతో నిర్వహించాలి. నీరు సూక్ష్మజీవులతో నిండి ఉంటుంది. అపవిత్రజలంతో దేవకార్యాల్ని నిర్వహించినచో అందుగల జీవుల్ని చంపడం వల్ల పాపం లభిస్తుంది. చీపురుతో ఊడ్చునప్పుడు, పరిశుభ్రం చేసేటప్పుడు, విశేషించి చేసే అగ్నికార్యంలో, దంచుట వల్ల, విసరుట, రుబ్బుటవల్ల, మరియు నీటిని తీసుకువచ్చుట వల్ల గృహస్థమానవులికి హింస కల్గుతున్నది. అందుచేత హింసను ఎల్లప్పుడూ విడిచి పెట్టాలి. ఓ బ్రాహ్మణులారా! ప్రాణులందరికి ఈ అహింసయే పరమధర్మం. అందువల్ల గట్టి ప్రయత్నంతో జలాన్ని వస్త్రంతో వడకొట్టి పవిత్రం చేయాలి. కనుక ఎలాంటి భయంలేని ప్రాణప్రదమైన శ్రేష్ఠమైన అలాంటి జలదానంగూడా అన్ని దానాలకంటె ఉత్తమోత్తమమైనది.

**తస్మాత్తు పరిహర్తవ్యా హింసా సర్వత్ర సర్వదా ।**
**మనసా కర్మణా వాచా సర్వదా హింసకం నరమ్ ॥8॥**

**రక్షంతి జంతవః సర్వే హింసకం బాధయంతి చ ।**
**త్రైలోక్యమఖిలం దత్వా యత్ఫలం వేదపారగే ॥9॥**

**తత్ఫలం కోటిగుణితం లభతేఽహింసకో నరః ।**

అందువల్ల ఎల్లప్పుడు, అన్నిచోట్ల హింసను త్యజించాలి. మనోవాక్కాయకర్మలతో ఎల్లప్పుడూ అహింసను పాటించే నరుడుని అన్ని ప్రాణులు రక్షిస్తాయి. హింసించేవాడిని బాధిస్తాయి. వేదపారంగతుడైన విద్వాంసుడికి సంపూర్ణంగా మూడు లోకాల్ని దానం చేస్తే వచ్చే పుణ్యం కంటే కోటిరెట్లు అధికపుణ్యాన్ని అహింసావ్రతుడైన మానవుడు పొందుతున్నాడు.

**మనసా కర్మణా వాచా సర్వభూతహితే రతాః ॥10॥**

**దయాదర్శితపంథానో రుద్రలోకం వ్రజంతి చ ।**
**స్వామివత్పరిరక్షంతి బహూని వివిధాని చ ॥11॥**

**యే పుత్రపౌత్రవత్స్నేహాద్రుద్రలోకం వ్రజంతి తే ।**
**తస్మాత్సర్వప్రయత్నేన వస్త్రపూతేన వారిణా ॥12॥**

**కార్యమభ్యుక్షణం నిత్యం స్నపనం చ విశేషతః ।**
**త్రైలోక్యమఖిలం హత్వా యత్ఫలం పరికీర్త్యతే ॥13॥**

**శివాలయే నిహత్యైకమపి తత్సకలం లభేత్ ।**

త్రికరణశుద్ధిగా ఎవరు సమస్తభూతహితరతులు అవుతారో, దయాదృష్టిగల మార్గంలో నడుస్తారో వారు శివలోకాల్ని పొందుతున్నారు. ఆ మానవులు స్వామి అయిన శివుడితో సమానంగా విభిన్నప్రాణుల్ని కుమారులు, మనుమలు మాదిరిగా భావించి స్నేహపూర్వకంగా రక్షిస్తారు. వారు రుద్రలోకానికి వెళుతున్నారు. అందుచేత గట్టి ప్రయత్నంతో వస్త్రపూతమైన జలంతోనే విశేషమైన అభిషేకం, నిత్యస్నానం చేయించాలి. సమస్తజగత్తును సంహరించిన వ్యక్తి ఎలాంటి ఫలం పొందుతాడో శివాలయంలో ఒక ప్రాణిని చంపి కూడా అటువంటి ఫలాన్ని పొందుతాడు.

**శివార్థం సర్వదా కార్యా పుష్పహింసా ద్విజోత్తమాః ॥14॥**

**యజ్ఞార్థం పశుహింసా చ క్షత్రియైర్దుష్టశాసనమ్ ।**
**విహితావిహితం నాస్తి యోగినాం బ్రహ్మవాదినామ్ ॥15॥**

**యతస్తస్మాన్న హంతవ్యా నిషిద్ధానాం నిషేవణాత్ ।**
**సర్వకర్మాణి విన్యస్య సంన్యస్తా బ్రహ్మవాదినః ॥16॥**

**న హంతవ్యాః సదా పూజ్యాః పాపకర్మరతా అపి ।**

ఓ మునిశ్రేష్ఠులారా! శివపూజ కోసం చేసే పుష్పహింస చేయదగిందే. యజ్ఞానికైన పశుహింస దుష్టమైనా రాజశాసనమే. బ్రహ్మవాదులైన యోగుల విషయంలో విధినిషేధాలు లేవు. అందువల్ల నిషేధించిన వాటిని వాడే సమయంలో కూడా చంపటం తగదు. అన్ని కర్మల్ని త్యాగం చేసి సంన్యస్తులవుతున్న బ్రహ్మవాదుల్ని వధించరాదు. పాపకర్మల్ని చేసేవాళ్లను కూడా చంపరాదు. వాళ్లు ఎల్లప్పుడూ పూజ్యులే.

**పవిత్రాస్తు స్త్రియః సర్వా అత్రేశ్చ కులసంభవాః ॥17॥**

**బ్రహ్మహత్యాసమం పాపమాత్రేయీం వినిహత్య చ ।**
**స్త్రియః సర్వా న హంతవ్యాః పాపకర్మరతా అపి ॥18॥**

**న యజ్ఞార్థం స్త్రియో గ్రాహ్యాః సర్వైః సర్వత్ర సర్వదా ।**
**సర్వవర్ణేషు విప్రేంద్రాః పాపకర్మరతా అపి ॥19॥**

**మలినా రూపవత్యశ్చ విరూపా మలినాంబరాః ।**
**న హంతవ్యాః సదా మర్త్యైః శివవచ్ఛంకయా తథా ॥20॥**

అత్రికుల సంభవులయిన స్త్రీలందరూ పవిత్రలే. అత్రివంశస్త్రీహత్య బ్రహ్మహత్యతో సమానమైన పాపాన్ని ఇస్తున్నది. అందువల్ల పాపకర్మరతులైన ఆ అందరి స్త్రీలను చంపరాదు. యజ్ఞం కోసం స్త్రీలను ఎవ్వరూ ఎప్పుడూ ఎక్కడా పరిగ్రహించరాదు. ఓ మునిశ్రేష్ఠులారా! అన్ని వర్ణాల వార్ని మరియు పాపకర్మరతులైన వార్ని కూడా చంపరాదు. వాళ్లు మలిన దేహులు కావచ్చు. రూపవతులు కావచ్చు. కురూపులు కావచ్చు. మలిన వస్త్రాల్ని ధరించినవారు కావచ్చు. వార్ని మానవులు ఎప్పుడూ చంపరాదు. వార్ని శివస్వరూపులుగా చూడాలి.

**వేదబాహ్యవ్రతాచారాః శ్రౌతస్మార్తబహిష్కృతాః ।**
**పాషండిన ఇతి ఖ్యాతా న సంభాష్యా ద్విజాతిభిః ॥21॥**

**న స్ప్రష్టవ్యా న ద్రష్టవ్యా దృష్ట్వా భానుం సమీక్షతే ।**
**తథాపి తే న వధ్యాశ్చ నృపైరన్యైశ్చ జంతుభిః ॥22॥**

వేదవిరుద్ధవ్రతాచారులు, శ్రుతిస్మృతివిముఖులైన వాళ్లు పాషండులనబడతారు. ద్విజులు వాళ్లతో పలుకరాదు. వాళ్లను తాకరాదు. చూడరాదు. ఒకవేళ వాళ్లను చూస్తే వెంటనే సూర్యుణ్ణి చూడాలి. అయినప్పటికి వాళ్లను ఇతర జనులు, రాజులు కూడా చంపరాదు.

**ప్రసంగాద్వాపి యో మర్త్యః సతాం సకృదహో ద్విజాః ।**
**రుద్రలోకమవాప్నోతి సమభ్యర్చ్య మహేశ్వరమ్ ॥23॥**

**భవంతి దుఃఖితాః సర్వే నిర్దయా మునిసత్తమాః ।**
**భక్తిహీనా నరాః సర్వే భవే పరమకారణే ॥24॥**

**యే భక్తా దేవదేవస్య శివస్య పరమేష్ఠినః ।**
**భాగ్యవంతో విముచ్యంతే భుక్త్వా భోగానిహైవ తే ॥25॥**

ఓ ద్విజులారా! మానవుడు సజ్జనసాంగత్యం గలవాడు ఒకసారి శివుణ్ణి అర్చించినా శివలోకాన్ని పొందుతున్నాడు. ఓ మునిశ్రేష్ఠులారా! నిర్దయగల మానవులందరూ మరియు పరమకారణుడైన శివుడి యందు భక్తిలేని వారందరూ దుఃఖితులవుతున్నారు. పరమేష్ఠి అయిన శివుడి యందు భక్తి కల్గినవాళ్లు భాగ్యశాలురు. ఈ లోకంలో సుఖాల్ని అనుభవించి తర్వాత ముక్తి పొందుతున్నారు.

**పుత్రేషు దారేషు గృహేషు నృణాం భక్తం యథా చిత్తమథాదిదేవే ।**
**సకృత్ప్రసంగాద్యతితాపసానాం తేషాం న దూరః పరమేశలోకః ॥26॥**

ఏ గృహస్థుల యొక్క మనసు పుత్రులందు, భార్యలందు, గృహాలందు ఎలా ఆసక్తమై ఉంటుందో అట్లే వాళ్ల మనసు ఒకసారి యతులయందు, తాపసులయందు, ఆదిదేవుడైన శివుడి యందు సంలగ్నమయినదవుతుందో వాళ్లకు శివలోకం దూరమైనది కాదు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే భక్తిమహిమావర్ణనం నామాష్టసప్తతితమోఽధ్యాయః ॥ 78 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని భక్తిమహిమావర్ణనమనే డెబ్బై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## ఏకోనాశీతితమోఽధ్యాయః - డెబ్బై తొమ్మిదవ అధ్యాయం

## శివార్చనవిధిః - శివార్చనవిధి

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**కథం పూజ్యో మహాదేవో మర్త్యైర్మందైర్మహామతే ।**
**అల్పాయుష్కైరల్పవీర్యైరల్పసత్త్వైః ప్రజాపతిః ॥1॥**

**సంవత్సరసహస్రైశ్చ తపసా పూజ్య శంకరమ్ ।**
**న పశ్యంతి సురాశ్చాపి కథం దేవం యజంతి తే ॥2॥**

ఓ మహాబుద్ధిమంతుడా! మందమతులు, అల్పాయుష్కులు, అల్పపరాక్రములు, అసమర్థులు అయిన మానవులు ప్రజాపతి అయిన మహాదేవుడి పూజ ఏవిధంగా నిర్వహించాలి. వేల సంవత్సరాలు తపస్సుచేసి పూజించిన దేవతలు కూడా ఆయన్ని దర్శించలేరు. కావున మానవులు ఎలా పూజించాలో చెప్పండి!

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**కథితం తథ్యమేవాత్ర యుష్మాభిర్మునిపుంగవాః ।**
**తథాపి శ్రద్ధయా దృశ్యః పూజ్యః సంభాష్య ఏవ చ ॥3॥**

**ప్రసంగాచ్చైవ సంపూజ్య భక్తిహీనైరపి ద్విజాః ।**
**భావానురూపఫలదో భగవానితి కీర్తితః ॥4॥**

ఓ మునిశ్రేష్ఠులారా! మీరు చెప్పింది యథార్థం. అయినప్పటికీ శ్రద్ధాపూర్వకంగా ఆయన్ని పూజిస్తే ఆయన దర్శనం మరియు సంభాషణం దొరుకుతుంది. ఓ ద్విజులారా! ఏదో ఒక సందర్భంగా భక్తిరహితుడైన మానవుడు పూజించినా శివభగవానుడు ఆతడి కోరిక మేరకు ఫలాన్ని ఇస్తాడు.

**ఉచ్ఛిష్టః పూజయన్ యాతి పైశాచం తు ద్విజాధమః ।**
**సంక్రుద్ధో రాక్షసం స్థానం ప్రాప్నుయాన్మూఢధీర్ద్విజాః ॥5॥**

**అభక్ష్యభక్షీ సంపూజ్య యాక్షం ప్రాప్నోతి దుర్జనః ।**
**గానశీలశ్చ గాంధర్వం నృత్యశీలస్తథైవ చ ॥6॥**

**ఖ్యాతిశీలస్తథా చాంద్రం స్త్రీషు సక్తో నరాధమః ।**
**మదార్తః పూజయన్ రుద్రం సోమస్థానమవాప్నుయాత్ ॥7॥**

ఓ ద్విజులారా! ఉచ్ఛిష్టాన్ని తినే అధమబ్రాహ్మణుడు శివుణ్ణి పూజించి పిశాచలోకాన్ని పొందుతున్నాడు. తినరాని దాన్ని తినే దుష్టమానవుడు ఆయన్ని పూజించి యక్షలోకానికి వెళుతున్నాడు. నృత్యాన్ని, గానాన్ని చేసేవాడు

ఆయన్ని పూజించి గంధర్వలోకానికి వెళుతున్నాడు. కీర్తికాంక్షగలవాడు మరియు కాంతాసక్తుడు అయిన నరాధముడు శివుణ్ణి పూజించి బుధలోకానికి వెళుతున్నాడు. మదోన్మత్తుడైన మానవుడు రుద్రభగవానుణ్ణి పూజించి సోమలోకానికి వెళుతున్నాడు.

**గాయత్ర్యా దేవమభ్యర్చ్య ప్రాజాపత్యమవాప్నుయాత్ ।**
**బ్రాహ్మం హి ప్రణవేనైవ వైష్ణవం చాభినంద్య చ ॥8॥**

**శ్రద్ధయా సకృదేవాపి సమభ్యర్చ్య మహేశ్వరమ్ ।**
**రుద్రలోకమనుప్రాప్య రుద్రైః సార్ధం ప్రమోదతే ॥9॥**

రుద్రగాయత్రి మంత్రంద్వారా శివుణ్ణి అర్చించినవాడు ప్రజాపతిలోకాన్ని పొందుతున్నాడు. ప్రణవం ఓంకారం ద్వారా అర్చించినవాడు బ్రహ్మలోకానికి మరియు విష్ణులోకానికి వెళుతున్నాడు. శ్రద్ధాపూర్వకంగా ఒకసారి అయినా మహేశ్వరుణ్ణి పూజించిన మానవుడు రుద్రలోకానికి వెళ్లి రుద్రులతో కలిసి ఆనందిస్తున్నాడు.

**సంశోధ్య చ శుభం లింగమమరాసురపూజితమ్ ।**
**జలైః పూతైస్తథా పీఠే దేవమావాహ్య భక్తితః ॥10॥**

**దృష్ట్వా దేవం యథాన్యాయం ప్రణిపత్య చ శంకరమ్ ।**
**కల్పితే ఆసనే స్థాప్య ధర్మజ్ఞానమయే శుభే ॥11॥**

**వైరాగ్యైశ్వర్యసంపన్నే సర్వలోకనమస్కృతే ।**
**ఓంకారపద్మమధ్యే తు సోమసూర్యాగ్నిసంభవే ॥12॥**

**పాద్యమాచమనం చార్ఘ్యం దత్త్వా రుద్రాయ శంభవే ।**
**స్నాపయేద్దివ్యతోయైశ్చ ఘృతేన పయసా తథా ॥13॥**

**దధ్నా చ స్నాపయేద్ రుద్రం శోధయేచ్చ యథావిధి ।**
**తతః శుద్ధాంబునా స్నాప్య చందనాద్యైశ్చ పూజయేత్ ॥14॥**

**రోచనాద్యైశ్చ సంపూజ్య దివ్యపుష్పైశ్చ పూజయేత్ ।**
**బిల్వపత్రైరఖండైశ్చ పద్మైర్నానావిధైస్తథా ॥15॥**

**నీలోత్పలైశ్చ రాజీవైర్నంద్యావర్తైశ్చ మల్లికైః ।**
**చంపకైర్జాతిపుష్పైశ్చ బకులైః కరవీరకైః ॥16॥**

**శమీపుష్పైర్బృహత్పుష్పైరున్మత్తాగస్త్యజైరపి ।**
**అపామార్గకదంబైశ్చ భూషణైరపి శోభనైః ॥17॥**

**దత్త్వా పంచవిధం ధూపం పాయసం చ నివేదయేత్ ।**
**దధిభక్తం చ మధ్వాజ్యపరిప్లుతమతః పరమ్ ॥18॥**

**శుద్ధాన్నం చైవ ముద్గాన్నం షడ్విధం చ నివేదయేత్ ।**
**అథ పంచవిధం వాపి సఘృతం వినివేదయేత్ ॥19॥**

**కేవలం చాపి శుద్ధాన్నమాఢకం తండులం పచేత్ ।**
**కృత్వా ప్రదక్షిణం చాంతే నమస్కృత్య ముహుర్ముహుః ॥20॥**

**స్తుత్వా చ దేవమీశానం పునః సంపూజ్య శంకరమ్ ।**
**ఈశానం పురుషం చైవ అఘోరం వామమేవ చ ॥21॥**

**సద్యోజాతం జపంశ్చాపి పంచభిః పూజయేచ్ఛివమ్ ।**
**అనేన విధినా దేవః ప్రసీదతి మహేశ్వరః ॥22॥**

దేవదానవులచేత పూజింపబడిన లింగాన్ని పవిత్రజలంతో శుభ్రపర్చి భక్తితో పీఠం మీద శివుణ్ణి ఆవాహన చేసి దాన్ని చూస్తూ విధ్యుక్తంగా నమస్కరించి, ధర్మజ్ఞానమయమూ, ఉత్తరమూ, వైరాగ్యం మరియు ఐశ్వర్యంతో సుసంపన్నమూ, జనులందరిచేత నమస్కరింపబడినట్టిదీ, ఓంకారపద్మంతో కూడిన మధ్యభాగం కలదియు అయిన లింగాన్ని చంద్రసూర్యాగ్నుల నుంచి పుట్టిన కల్పితమైన ఆసనంమీద స్థాపించి, మహారుద్రుడైన శంకరుడికి పాద్యం, ఆచమనం, అర్ఘ్యం సమర్పించి దాన్ని దివ్యజలాలతో స్నానం చేయించాలి. మరల నేతితో, పాలతో, పెరుగుతో స్నానం చేయించాలి. ఈ విధంగా విధ్యుక్తంగా పరిశుభ్రం చేయాలి. తర్వాత శుద్ధజలంతో స్నానం చేయించి చందనాదిసుగంధద్రవ్యాలతో పూజించాలి. రోచనాదులతో పూజించి దివ్యపుష్పాలతో, అఖండ బిల్వపత్రాలతో, అనేక విధాలైన పద్మాలతో, నీలోత్పల రక్తోత్పలాలతో, నదీతీరాలతో దొరికే పుష్పాలతో, మల్లెలు, చంపకాలు, జాజులు, వకుళాలు, గన్నేరులు, శమీపుష్పాలు, బృహత్పుష్పాలు, ఉమ్మెత్తపుష్పాలు, అవిశపూలు, ఉత్తరేణుకదంబాలు, అగస్త్యోదయంతో ఉదయించే పుష్పాలు– వీటితో పూజించి అట్లే అందమైన ఆభరణాలతో అలంకరించి ఐదువిధాలైన ధూపాల్ని వేసి పాయసాన్ని నివేదించాలి. తర్వాత పెరుగుతో కలిపిన అన్నం, తేనె, నెయ్యితో కలిపిన అన్నం, వండిన అన్నం, పెసరపప్పుతో కూడిన పులగ అన్నం మొదలైన ఆరురకాలైన అన్నాల్ని లేక ఐదువిధాలైన నేయి కలిపిన అన్నాన్ని నివేదించాలి. లేక ఆఢకం పరిమాణం గల పరిశుభ్రమైన ధాన్యాన్ని వండి నివేదించాలి. చివరగా ప్రదక్షిణం చేసి మాటిమాటికి నమస్కరించి, ఈశ్వరుణ్ణి స్తుతించి మరల శంకరుణ్ణి విధ్యుక్తంగా పూజించి, ఈశాన, తత్పురుష, అఘోర, వామదేవ, సద్యోజాత మంత్రాల్ని జపించి, ఈ ఐదుమంత్రాలతో శివుణ్ణి పూజించాలి. ఈ విధంగా పూజించడం వల్ల దేవదేవుడు ప్రసన్నం అవుతున్నాడు.

**వృక్షాః పుష్పాదిపత్రాద్యైరుపయుక్తాః శివార్చనే ।**
**గావశ్చైవ ద్విజశ్రేష్ఠాః ప్రయాంతి పరమాం గతిమ్ ॥23॥**

**పూజయేద్యః శివం రుద్రం శర్వం భవమజం సకృత్ ।**
**స యాతి శివసాయుజ్యం పునరావృత్తివర్జితమ్ ॥24॥**

**అర్చితం పరమేశానం భవం శర్వముమాపతిమ్ ।**
**సకృత్ప్రసంగాద్వా దృష్ట్వా సర్వపాపైః ప్రముచ్యతే ॥25॥**

**పూజితం వా మహాదేవం పూజ్యమానమథాపి వా ।**
**దృష్ట్వా ప్రయాతి వై మర్త్యో బ్రహ్మలోకం న సంశయః ॥26॥**

ఓ ద్విజశ్రేష్ఠులారా! శివపూజలో ఉపయోగించే పుష్పాలు, బిల్వాదిపత్రాలు, మొదలైన వాటిని ఇచ్చే వృక్షాలు, గోవులు - ఇవన్నీ పరమగతిని పొందుతున్నాయి. ఎవడు ఒకసారి శివుణ్ణి, రుద్రుణ్ణి, శర్వుణ్ణి, భవుణ్ణి, అజుణ్ణి పూజిస్తాడో ఆతడు పునర్జన్మలేని శివసాయుజ్యాన్ని పొందుతున్నాడు. ఒకసారి లేక ప్రాసంగికంగా అయినా శివుణ్ణి, పరమేశ్వరుణ్ణి, భవుణ్ణి, ఉమాపతిని పూజించినవాడు ఆయన దర్శనం పొంది పాపాలన్నింటినుంచి విముక్తి పొందుతున్నాడు. పూజించిన లేక పూజింపబడే మహాదేవుణ్ణి దర్శించిన మానవుడు బ్రహ్మలోకానికి వెళుతున్నాడు. ఇందులో సందేహం లేదు.

**శ్రుత్వానుమోదయేచ్చాపి స యాతి పరమాం గతిమ్ ।**
**యో దద్యాద్ ఘృతదీపం చ సకృల్లింగస్య చాగ్రతః ॥27॥**

**స తాం గతిమాప్నోతి స్వాశ్రమైర్దుర్లభాం స్థిరామ్ ।**
**దీపవృక్షం పార్థివం వా దారవం వా శివాలయే ॥28॥**

**దత్త్వా కులశతం సాగ్రం శివలోకే మహీయతే ।**
**ఆయసం తామ్రజం వాపి రౌప్యం సౌవర్ణికం తథా ॥29॥**

**శివాయ దీపం యో దద్యాద్విధినా వాపి భక్తితః ।**
**సూర్యాయుతసమైః శ్లక్ష్ణైర్యానైః శివపురం వ్రజేత్ ॥30॥**

**కార్తికే మాసి యో దద్యాద్ ఘృతదీపం శివాగ్రతః ।**
**సంపూజ్యమానం వా పశ్యేద్విధినా పరమేశ్వరమ్ ॥31॥**

**స యాతి బ్రహ్మణో లోకం శ్రద్ధయా మునిసత్తమాః ।**

శివుడి మహావైభవాన్ని విని దాన్ని ఆమోదించినవాడు పరమగతిని పొందుతున్నాడు. ఎవడు శివుడి సమక్షంలో ఒకసారి నేతితో దీపాన్ని వెలిగిస్తాడో వాడు వర్ణాశ్రమధర్మాచరణలచేతకూడా లభించని స్థిరమైన ఉత్తమగతిని పొందుతున్నాడు. శివాలయంలో మట్టితోగాని చెక్కతోగాని చేయబడిన దీపవృక్షాన్ని (దివిటి) ప్రదానం చేసిన జనుడు వందమంది తన కులసభ్యులతో కలిసి శివలోక ప్రతిష్ఠ ప్రాప్తించుకుంటున్నాడు. ఎవడు విధివిధానపూర్వకంగా భక్తితో ఇనుపదీపాన్నిగాని, రాగిదీపాన్నిగాని, వెండిదీపాన్నిగాని, బంగారుదీపాన్నిగాని సమర్పిస్తాడో ఆతడు పదివేలసూర్యులతో సమానమైన కాంతిగల విమానంలో శివలోకానికి వెళుతున్నాడు. ఓ మునివరులారా! ఎవడు కార్తికమాసంలో శివుడి దగ్గర ఘృతదీపాన్ని వెలిగించి సమర్పిస్తాడో లేక విధివిధానంగా పూజిస్తాడో శ్రద్ధగా పరమేశ్వరుడి దర్శనం చేస్తాడో ఆతడు బ్రహ్మలోకానికి వెళుతున్నాడు.

**ఆవాహనం సుసాన్నిధ్యం స్థాపనం పూజనం తథా ॥32॥**

**సంప్రోక్తం రుద్రగాయత్ర్యా ఆసనం ప్రణవేన వై ।**
**పంచభిః స్నపనం ప్రోక్తం రుద్రాద్యైశ్చ విశేషతః ॥33॥**

**ఏవం సంపూజయేన్నిత్యం దేవదేవముమాపతిమ్ ।**
**బ్రహ్మాణం దక్షిణే తస్య ప్రణవేన సమర్చయేత్ ॥34॥**

**ఉత్తరే దేవదేవేశం విష్ణుం గాయత్రియా యజేత్ ।**
**వహ్నౌ హుత్వా యథాన్యాయం పంచభిః ప్రణవేన చ ॥35॥**

**స యాతి శివసాయుజ్యమేవం సంపూజ్య శంకరమ్ ।**
**ఇతి సంక్షేపతః ప్రోక్తో లింగార్చనవిధిక్రమః ॥36॥**

శివుడిని ఆహ్వానించి, స్థాపించి, ఉత్తమసాన్నిహిత్యం పొందించి రుద్రగాయత్రి పఠనం ద్వారా పూజించి, ప్రణవం ద్వారా ఆసనాన్ని కల్పించాలి. సద్యోజాతాది అయిదు మంత్రాలతో, విశేషరూపాలైన రుద్రమంత్రాలతో ఆయనకు స్నానం చేయించాలి. ఈ విధంగా దేవదేవుడైన ఉమాపతికి నిత్యం పూజచేయాలి. ఆయనకు దక్షిణ భాగంలో ప్రణవంతో బ్రహ్మను పూజించాలి. ఉత్తరంలో దేవదేవుడైన విష్ణువును గాయత్రీమంత్రంతో పూజించాలి. విధ్యుక్తంగా సద్యోజాతాదులైన ఐదు మంత్రాలతో అట్లే ప్రణవంతో అగ్నిలో హోమం చేయాలి. ఈ విధంగా శంకరుణ్ణి మిక్కిలిగా అర్చించిన నరుడు శివసాయుజ్యాన్ని పొందుతున్నాడు. ఓ ఋషులారా! నేను సంగ్రహంగా లింగార్చనవిధిని చెప్పాను. ఇంతకుముందు సాక్షాత్తు శివుడి ముఖం నుంచి విన్న వేదవ్యాసుడు నాకు చెప్పాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే శివార్చనవిధిర్నామైకోనాశీతి తమోఽధ్యాయః ॥ 79 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని శివార్చనవిధి అనే డెబ్బై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **అశీతితమోऽధ్యాయః** - ఎనభైయవ అధ్యాయం

## **పాశుపతవ్రతమాహాత్మ్యమ్** - పాశుపతవ్రతమాహాత్మ్యం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**కథం పశుపతిం దృష్ట్వా పశుపాశవిమోక్షణమ్ ।**
**పశుత్వం తత్యజుర్దేవాస్తన్నో వక్తుమిహార్హసి ॥1॥**

పశుపతిని దర్శించి పశుపాశం నుంచి విముక్తి ఎలా పొందుతాం? దేవతలు పశుత్వాన్ని ఎలా త్యజించారు. ఈ విషయం మాకు చెప్పవలసింది.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**పురా కైలాసశిఖరే భోగ్యాఖ్యే స్వపురే స్థితమ్ ।**
**సమేత్య దేవాః సర్వజ్ఞమాజగ్ముస్తత్ప్రసాదతః ॥2॥**

**హితాయ సర్వదేవానాం బ్రహ్మణా చ జనార్దనః ।**
**గరుడస్య తథా స్కంధమారుహ్యా పురుషోత్తమః ॥3॥**

**జగామ దేవతాభిర్వై దేవదేవాంతికం హరిః ।**

పూర్వం కైలాసశిఖరం మీద భోగ్యమనే పేరుగల తన నగరంలో ఉన్నటువంటి సర్వజ్ఞుడైన శివుడి దగ్గరకు ఆయన కృపతో దేవతలందరూ కలసి వచ్చారు. దేవతల హితం కోసం జనార్దనుడు పురుషోత్తముడు అయిన శ్రీహరి బ్రహ్మతో, దేవతలతో కలిసి గరుత్మంతుణ్ణి అధిరోహించి దేవదేవుడైన శివుడి దగ్గరకు వచ్చాడు.

**సర్వే సంప్రాప్య దేవస్య సార్ధం గిరివరం శుభమ్ ॥4॥**

**సేంద్రాః ససాధ్యాః సయమాః ప్రణేముర్గిరిముత్తమమ్ ।**
**భగవాన్ వాసుదేవోऽసౌ గరుడాద్ గరుడధ్వజః ।**
**అవతీర్య గిరిం మేరుమారురోహ సురోత్తమైః ॥5॥**

**సకలదురితహీనం సర్వదం భోగముఖ్యం ముదితకురరబృందం నాదితం నాగబృందైః ।**
**మధురరణితగీతం సానుకూలాంధకారం పదరచితవనాంతం కాంతవాతాంతతోయమ్ ॥6॥**

**భవనశతసహస్రైర్జుష్టమాదిత్యకల్పైర్లలితగతివిదగ్ధైర్హంసబృందైశ్చ భిన్నమ్ ।**
**ధవఖదిరపలాశైశ్చందనాద్యైశ్చ వృక్షైర్ద్విజవరగణబృందైః కోకిలాద్యైర్ద్విరేఫైః ॥7॥**

**క్వచిదశేషసురద్రుమసంకులం కురబకైః ప్రియకైస్తిలకైస్తథా ।**
**బహుకదంబతమాలలతావృతం గిరివరం శిఖరైర్వివిధైస్తథా ॥8॥**

ఇంద్రుడు, సాధ్యగణాలు యముడితో కూడిన దేవతలందరూ ఒకటిగా వచ్చి శివుడికి, శుభకరమూ, ఉత్తమమూ అయిన పర్వతానికి నమస్కరించారు. గరుడధ్వజుడైన భగవాన్ వాసుదేవుడు గరుత్మంతుడి మీద నుంచి దిగి ఉత్తములైన దేవతలతో కలిసి మేరుపర్వతాన్ని అధిరోహించాడు. మేరుగిరి సర్వపాపహారి. అన్ని కోరికల్ని తీర్చునట్టిది. సమస్తభోగాలతో కూడినట్టిది. ఆనందించుచున్న మృగాలు, పక్షులు కలది. ఏనుగుల ఘీంకారాలతో నిండినది. మధురగీతాలాపనగలది. అచ్చట అంధకారం కూడా ఎట్టి ఇబ్బందిని కలిగించక అనుకూలవర్తిగా ఉంటుంది. పాదచిహ్నాలతో కూడిన వనప్రదేశాలు గలది. అచ్చట సుందరమైన జలమూ, మందమారుతమూ ఉంటుంది. అచ్చట భవనాలు వందల, వేల సూర్యుల కాంతితో సమానమైన కాంతిగలవి ఉన్నాయి. సుందరగమనాలు గల హంసలతో కూడి ఉన్నది. ఆ పర్వతం పలాస, చందన, దవన, కదిర వృక్షాలతో నిండి ఉంది. ఉత్తమపక్షి సమూహాలతో కూడి ఉంది. కోకిలలతో, భ్రమరాలతో శోభిల్లుతున్నది. అనేకాలైన గొప్ప గొప్ప దేవద్రుమాలతో నిండి ఉంది. కురవకం, ప్రియకం, తిలకం – పుష్పవృక్షాలతో కూడి ఉంది. అనేకాలైన కదంబ, తమాల లతలతో చుట్టబడి ఉంది. పలు విధాలైన శిఖరాలతో కూడి ఉన్న శ్రేష్ఠపర్వతమది.

**గిరేః పృష్ఠే పురం శార్వం కల్పితం విశ్వకర్మణా ।**
**క్రీడార్థం దేవదేవస్య భవస్య పరమేష్ఠినః ॥9॥**

**అపశ్యంస్తత్పురం దేవాః సేంద్రోపేంద్రాః సమాహితాః ।**
**ప్రణేముర్దూరతశ్చైవ ప్రభావాదేవ శూలినః ॥10॥**

ఈ పర్వతం యొక్క క్రింది భాగంలో పరమేష్ఠి, దేవదేవుడు అయిన శివుడి యొక్క క్రీడార్థంగా విశ్వకర్మ ఒక శివనగరాన్ని నిర్మించాడు. ఇంద్రుడితో, ఉపేంద్రుడైన విష్ణువుతో కూడిన దేవతలందరూ ధ్యానపూర్వకంగా చూచినవారై శివుడి ప్రభావం వల్ల దూరం నుంచే ఆ పురానికి నమస్కరించారు.

**సహస్రసూర్యప్రతిమం మహాంతం సహస్రశః సర్వగుణైశ్చ భిన్నమ్ ।**
**జగామ కైలాసగిరిం మహాత్మా మేరుప్రభాగే పురమాదిదేవః ॥11॥**

**తతో౽థ నారీగజవాజిసంకులం రథైరనేకైరమరారిసూదనః ।**
**గణైర్గణేశైశ్చ గిరీంద్రసన్నిభం మహాపురద్వారమజో హరిశ్చ ॥12॥**

మహాత్ముడు, దేవదేవుడు అయిన విష్ణువు మేరుపర్వతంలో ఒక భాగంలో ఉన్నటువంటి, వేయి సూర్యులకాంతితో ప్రకాశిస్తున్నటువంటిని, వేయి విధాల గొప్పదైనటువంటిని, సమస్తగుణయుక్తమూ అయిన కైలాసగిరిపైనగల శివపురానికి వెళ్లాడు. తర్వాత బ్రహ్మదేవుడు దేవతలకు శత్రువులైన వారిని నాశనం చేసే విష్ణువు ఆ గొప్ప పురద్వారాన్ని చేరారు. అది స్త్రీలతో ఏనుగులతో, గుఱ్ఱాలతో, అనేక రథాలతో, గణాలు మరియు గణేశ్వరులతో నిండియున్నది.

**అథ జాంబూనదమయైర్భవనైర్మణిభూషితైః ।**
**విమానైర్వివిధాకారైః ప్రాకారైశ్చ సమావృతమ్ ॥13॥**

**దృష్ట్వా శంభోః పురం బాహ్యం దేవైః సబ్రహ్మకైర్హరిః ।**
**ప్రహృష్టవదనో భూత్వా ప్రవివేశ తతః పురమ్ ॥14॥**

**హర్మ్యప్రాసాదసంబాధం మహాట్టాలసమన్వితమ్ ।**
**ద్వితీయం దేవదేవస్య చతుర్ద్వారం సుశోభనమ్ ॥15॥**

**వజ్రవైదూర్యమాణిక్యమణిజాలైః సమావృతమ్ ।**
**దోలావిక్షేపసంయుక్తం ఘంటాచామరభూషితమ్ ॥16॥**

**మృదంగమురజైర్జుష్టం వీణావేణునినాదితమ్ ।**
**నృత్యద్భిరప్సరఃసంఘైర్భూతసంఘైశ్చ సంవృతమ్ ।**
**దేవేంద్రభవనాకారైర్భవనైర్దృష్టిమోహనైః ॥17॥**

తర్వాత బంగారుభవనాలు, మణులతో అలంకరింపబడిన విమానాలు, బహువిధాలైన ఆకృతులుగల ప్రాకారాలు గల శివుడి యొక్క వెలుపలి నగరాన్ని చూచిన విష్ణువు ప్రసన్నముఖుడై, బ్రహ్మతోను, దేవతలందరితోనూ కలిసి శివుడియొక్క నగరం లోపలికి వెళ్లాడు. దేవదేవుడైన శివుడి లోపలి భవనం కూడా నాల్గుద్వారాలు కలదియై మిక్కిలి రమ్యంగా ఉంది. హర్మ్యాలతో, ప్రాసాదాలతో కూడి ఉంది. అనేకమైన అంతస్థులతో విశాలమైన గదులతో నిండి ఉంది. వజ్రవైఢూర్యాలతోను, మణిమాణిక్యాలతోను కూడి ఉంది. వ్రేలాడుచున్న పాలికలతోను, కంపించుచున్న చిరుగంటలతోనూ, చామరాలతోనూ శోభిస్తున్నది. మృదంగం, మురజ మొదలైన వాద్యాల యొక్క నాదంతోను, వీణల, వేణువుల యొక్క నాదాలతోకూడి నృత్యం చేస్తున్న అప్సరసలతో అలాగే భూతసంఘాలతోకూడి ఉన్నది. చూపుల్ని మోహపరిచే దేవేంద్రుడి భవనం యొక్క ఆకారం గల వివిధ భవనాలతో కూడి యుంది.

**ప్రాసాదశృంగేష్వథ పౌరనార్యః - సహస్రశః పుష్పఫలాక్షతాద్యైః ।**
**స్థితాః కరైస్తస్య హరేః సమంతాత్ - ప్రచిక్షిపుర్మూర్ధ్ని యథా భవస్య ॥18॥**

**దృష్ట్వా నార్యస్తదా విష్ణుం మదఘూర్ణితలోచనాః ॥19॥**

**విశాలజఘనాః సద్యో ననృతుర్ముముదుర్జగుః ।**
**కాశ్చిద్ దృష్ట్వా హరిం నార్యః కించిత్ప్రహసితాననాః ॥20॥**

**కించిద్విస్రస్తవస్త్రాశ్చ స్రస్తకాంచీగుణాః జగుః ।**

తర్వాత భవనాల పైభాగాలపై నిలిచిన వేలకొలది పురస్త్రీలు చేతులందు పుష్పాలు, ఫలాలు, అక్షతలు గలవారై వాళ్ళు శివుని శిరస్సు మీద ఎలా వాటిని చల్లుతారో అలా విష్ణువు మీద చల్లారు. అప్పుడు విష్ణుభగవానుణ్ణి చూచిన మత్తిల్లిన నేత్రాలు గలవారైన, విశాలజఘనాలుగలవారైన ఆ స్త్రీలు వెంటనే ఆనందభరితలయ్యారు. నర్తించారు. గీతాలాపన చేశారు. శ్రీహరిని చూచిన వారిలో కొందరు మందస్మితవదనలు అయ్యారు. కొందరు జారిన వస్త్రాలుగల వారైనారు. కొందరు జారిన ఒడ్డాణాలు గలవారైనారు. అందరూ గీతాలు పాడారు.

**చతుర్థం పంచమం చైవ షష్ఠం చ సప్తమం తథా ॥21॥**

అష్టమం నవమం చైవ దశమం చ పురోత్తమమ్ ।
అతీత్యాసాద్య దేవస్య పురం శంభోః సుశోభనమ్ ॥22॥

సువృత్తం సుతరాం శుభ్రం కైలాసశిఖరే శుభే ।
సూర్యమండలసంకాశైర్విమానైశ్చ విభూషితమ్ ॥23॥

స్ఫాటికైర్మండపైః శుభ్రైర్జాంబూనదమయైస్తదా ।
నానారత్నమయైశ్చైవ దిగ్విదిక్షువిభూషితమ్ ॥24॥

గోపురైర్గోపతేః శంభోర్నానాభూషణభూషితైః ।
అనేకైః సర్వతోభద్రైః సర్వరత్నమయైస్తథా ॥25॥

ప్రాకారైర్వివిధాకారైరష్టవింశతిభిర్వృతమ్ ।
ఉపద్వారైర్మహాద్వారైర్విదిక్షు వివిధైర్వృతైః ॥26॥

గుహ్యాలయైర్గుహ్యగుహైర్వృషస్య భవనైః శుభైః ।
గ్రామ్యైరన్యైర్మహాభాగా మౌక్తికైర్దృష్టిమోహనైః ॥27॥

గణేశాయతనైర్దివ్యైః పద్మరాగమయైస్తథా ।
చందనైర్వివిధాకారైః పుష్పోద్యానైశ్చ శోభనైః ॥28॥

తడాకైర్దీర్ఘికాభిశ్చ హేమసోపానపంక్తిభిః ।
స్త్రీణాం గతిజితైర్హంసైః సేవితాభిః సమంతతః ॥29॥

మయూరైశ్చైవ కారండైః కోకిలైశ్చక్రవాకకైః ।
శోభితాభిశ్చ వాపీభిర్దివ్యామృతజలైస్తథా ॥30॥

సంలాపాలాపకుశలైః సర్వాభరణభూషితైః ।
స్తనభారావనమ్రైశ్చ మదాఘూర్ణితలోచనైః ॥31॥

గేయనాదరతైర్దివ్యై రుద్రకన్యాసహస్రకైః ।
నృత్యద్భిరప్సరఃసంఘైరమరైరపి దుర్లభైః ॥32॥

ప్రఫుల్లాంబుజవృందాద్యైస్తథా ద్విజవరైరపి ।
రుద్రస్త్రీగణసంకీర్ణైర్జలక్రీడారతైస్తథా ॥33॥

రతోత్సవరతైశ్చైవ లలితైశ్చ పదే పదే ।
గ్రామరాగానురక్తైశ్చ పద్మరాగసమప్రభైః ॥34॥

స్త్రీసంఘైర్దేవదేవస్య భవస్య పరమాత్మనః ।
దృష్ట్వా విస్మయమాపన్నాస్తస్థుర్దేవాః సమంతతః ॥35॥

ఓ మహాభాగులారా! తర్వాత నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది అయిన ఉత్తమపురాల్ని క్రమంగా దాటి మంగళకరమైన కైలాసపర్వతశిఖరంపైగల గోపతి అయిన శివుడి సుశోభితమైన పురాన్ని చూచి దేవతలు విస్మయచకితులై నిలిచారు. ఆ పదకొండవ నగరం ఇలా ఉంది. అది సంపూర్ణంగా గోళాకారంలో ఉంది. సూర్యమండలంతో సమానమైన కాంతిగల భవనాలతో అలంకరింపబడి ఉంది. స్ఫటికతో మరియు బంగారంతో నిర్మితాలైన పరిశుభ్రమైన మండపాలతో కూడి యున్నది. అన్ని దిక్కులలోను సువర్ణమయాలు, వివిధ రత్నమయాలు అయిన సింహద్వారాలు గలది. వివిధాలంకారాలతో నిండిన గోపురాలతో కూడి ఉంది. అనేకాలైన సర్వతోభద్రాలు, సమస్త రత్నమయాలు వివిధాకారాలు గల ఇరవై ఎనిమిది ప్రాకారాలతో చుట్టబడి ఉంది. మూలలందు కూడా పలువిధాలైన దృఢాలైన ఉపద్వారాలు, మహాద్వారాలు కలిగి ఉంది. కుమారస్వామి యొక్క భవనం శుభకరాలైన రహస్యమందిరాలతో, రహస్యగృహాలతో కూడి ఉంది. ఇతరగ్రామ్యభవనాలు కూడా ముత్యాలసరాలతో దృష్టిమోహకారకాలై ఒప్పుతున్నాయి. గణేశ్వరుల దివ్య భవనాలు కూడా పద్మరాగమణిమయనిర్మితాలు. చందనవృక్షాలతోను, వివిధాలైన ఆకారాలుగల పుష్పాలతో కూడిన ఉద్యానవనాలతో శోభిల్లుతున్నది. బంగారపు మెట్లుగల తటాకాలతోను, దిగుడు బావులతోను కూడి ఉంది. అవి స్త్రీల యొక్క సుందరగమనాన్ని అతిగమించిన హంసలతో అంతటా అలరారుతున్నవి. మరియు నెమళ్లు, కారండకాలు, కోకిలలు, చక్రవాకాలతో శోభిల్లుతున్నాయి. దివ్యమైన అమృతతుల్యమైన నీటితో బావులు నిండి ఉన్నాయి. చతురవచోవిలాసినులు, సమస్తాభరణభూషితలు, స్తనభారం వల్ల కొద్దిగా వంగినవారు, మత్తిల్లిన చూపులుగల కన్నులుగలవారు, గేయనాదాలలో ప్రీతిగలవారును అయిన వేలవేలు రుద్రకన్యకలు గలది. దేవతలకు కూడా దుర్లభమైన నర్తిస్తున్న అప్సరససమూహాలు కలది. వికసించిన పద్మాలతో కూడినది. పక్షిశ్రేష్ఠులతో నిండినది. జలక్రీడాప్రీతిగల రుద్రస్త్రీసమూహాలతో కూడినది. రతోత్సవరతులు, పదపదంలో లాలిత్యయుక్తలు, సంగీతాసక్తలు, పద్మరాగమణులతో సమానమైన కాంతిగలవారు అయిన స్త్రీ సమూహాలు గలది.

**తత్రైవ దదృశుర్దేవా వృందం రుద్రగణస్య చ ।**
**గణేశ్వరాణాం వీరాణామపి వృందం సహస్రశః ॥36॥**

**సువర్ణకృతసోపానాన్ వజ్రవైదూర్యభూషితాన్ ।**
**స్ఫాటికాన్ దేవదేవస్య దదృశుస్తే విమానకాన్ ॥37॥**

అక్కడే దేవతాసమూహాలు వేలవేలు రుద్రగణాల్ని, వీరులైన రుద్రేశ్వరుల్ని చూశారు. బంగారంతో నిర్మించిన మెట్లతోను, వజ్రవైదూర్యాలతోనూ అలంకరింపబడిన స్ఫటికలతో నిర్మించిన శివుడి యొక్క విమానాల్ని దేవతలు దర్శించారు.

**తేషాం శృంగేషు హృష్టాశ్చ నార్యః కమలలోచనాః।**
**విశాలజఘనా యక్షా గంధర్వాప్సరసస్తథా ॥38॥**

**కిన్నర్యః కిన్నరాశ్చైవ భుజంగాః సిద్ధకన్యకాః ।**
**నానావేషధరాశ్చాన్యా నానాభూషణభూషితాః ॥39॥**

**నానాప్రభావసంయుక్తా నానాభోగరతిప్రియాః ।**
**నీలోత్పలదళప్రఖ్యాః పద్మపత్రాయతేక్షణాః ॥40॥**

**పద్మకింజల్కసంకాశైరంశుకైరతిశోభనాః ।**
**వలయైర్నూపురైః ఛత్రైశ్చిత్రైస్తథాంశుకైః ।**
**భూషితా భూషితైశ్చాన్యైర్మండితా మండనప్రియాః ॥41॥**

వాటి శృంగాలలో సంతుష్టలైన కమలనేత్రలు, విశాలజఘనలు అయిన స్త్రీలు, యక్షగంధర్వులు, అప్సరసలు, కిన్నరీకిన్నరులు, నాగులు, సిద్ధగణాల కన్యకలు అట్లే ఇతరస్త్రీలు విరాజమానలై ఉన్నారు. వారందరూ వివిధ వేషధారణ కలిగి ఉన్నారు. అనేకాలైన భూషణాలతో అలంకరింపబడి ఉన్నారు. పలు విధాలైన హావభావాలు కలిగినవారు. అనేక భోగాలలోను, రతియందూ ప్రేమ కలవారు. నీలకమలదళనిభకాంతియుతులు. పద్మపత్రాలవంటి వెడల్పైన నేత్రాలు గలవారు. పద్మాల యొక్క పుప్పొడితో సమానమైన కోమల వస్త్రాలు ధరించి శోభిల్లువారు. కంకణాలతో, నూపురాలతో, హారాలతో, చిత్రాలతో, వస్త్రాలతో అలంకరింపబడినవారు. అలంకారప్రియులైన వారు ఇతరాలంకారాలతో అలంకరింపబడి ఉన్నారు.

**దృష్ట్వాథ బృందం సురసుందరీణాం గణేశ్వరాణాం సురసుందరీణామ్ ।**
**జగ్ముర్గణేశస్య పురం సురేశాః పురద్విషః శక్రపురోగమాశ్చ ॥42॥**

**దృష్ట్వా చ తస్థుః సురసిద్ధసంఘాః పురస్య మధ్యే పురుహూతపూర్వాః ।**
**భవస్య బాలార్కసహస్రవర్ణం విమానమాద్యం పరమేశ్వరస్య ॥43॥**

దేవతల యొక్క సుందరస్త్రీలను, గణేశ్వరుల యొక్క సుందరస్త్రీలను చూచిన ఇంద్రాదిప్రముఖదేవతలు త్రిపురారి, గణేశ్వరుడైన శివుడి పురాన్ని చొచ్చారు. పురం మధ్యలోగల పరమేశ్వరశివుడి యొక్క సహస్రబాలార్కసమాన తేజస్సుగల భవనవిమానాన్ని చూచి ఇంద్రాది దేవతలు, సిద్ధగణాలు అక్కడే నిలిచారు.

**అథ తస్య విమానస్య ద్వారి సంస్థం గణేశ్వరం ।**
**నందినం దదృశుః సర్వే దేవాః శక్రపురోగమాః ॥44॥**

ఆ విమానం యొక్క ద్వారంలో ఉన్న గణేశ్వరుడైన నందీశ్వరుణ్ణి ఇంద్రసహితదేవతలు దర్శించారు.

**తం దృష్ట్వా నందినం సర్వే ప్రణమ్యాహుర్గణేశ్వరమ్ ।**
**జయేతి దేవాస్తం దృష్ట్వా సోఽప్యాహ చ గణేశ్వరః ॥45॥**

**భో భో దేవా మహాభాగాః సర్వే నిర్ధూతకల్మషాః ।**
**సంప్రాప్తాః సర్వలోకేశా వక్తుమర్హథ సువ్రతాః ॥46॥**

ఆ నందీశ్వరుణ్ణి చూచి దేవతలందరూ నమస్కరించి 'జయమగుగాక' అని పలికారు. నందికూడా వారిని చూచి ఇలా పలికాడు. ఓ భాగ్యశాలురైన దేవతలారా! సువ్రతులారా! విగతకల్మషులారా! సమస్తలోకేశ్వరులారా! మీరందరూ ఎందుకు వచ్చారో చెప్పండి!

**తమాహుర్వరదం దేవం వారణేంద్రసభప్రభమ్ ।**
**పశుపాశవిమోక్షార్థం దర్శయాస్మాన్ మహేశ్వరమ్ ॥47॥**

వరదుడు, ఐరావతసమప్రభకలవాడు అయిన నందిని గూర్చి దేవతలు ఇలా పలికారు. పశు పాశవిమోక్షార్థంగా మాకు పరమేశ్వరుణ్ణి దర్శింపజేయి.

**పురా పురత్రయం దగ్ధుం పశుత్వం పరిభాషితమ్ ।**
**శంకితాశ్చ వయం తత్ర పశుత్వం ప్రతి సువ్రత ॥48॥**

ఓ సువ్రతుడా! పూర్వం త్రిపురాల దగ్ధకాలంలో మేము పశుత్వాన్ని స్వీకరించాం. ఈ పశుత్వవిషయంలో మేము శంకగలిగి ఉన్నాము.

**వ్రతం పాశుపతం ప్రోక్తం భవేన పరమేష్ఠినా ।**
**వ్రతేనానేన భూతేశ పశుత్వం నైవ విద్యతే ॥49॥**

**అథ ద్వాదశవర్షం వా మాసద్వాదశకం తు వా ।**
**దినద్వాదశకం వాపి కృత్వా తద్ వ్రతముత్తమమ్ ॥50॥**

**ముచ్యంతే పశవః సర్వే పశుపాశైర్భవస్య తు ।**

పరమేశ్వరశివుడు పాశుపతవ్రతాన్ని గూర్చి చెప్పాడు. ఓ భూతేశ్వరుడా! ఈ వ్రతాన్ని నిర్వహించడం వల్ల పశుత్వం పోతుంది. పంద్రెండు సంవత్సరాలు గాని పంద్రెండు మాసాలుగాని, పంద్రెండు రోజులుగాని ఈ ఉత్తమవ్రతాన్ని నిర్వహించినచో సర్వపశువులు శివుడి పశుపాశవిముక్తిని పొందుతాయి.

**దర్శయామాస తాన్ దేవాన్నారాయణపురోగమాన్ ॥51॥**

**నందీ శిలాదతనయః సర్వభూతగణాగ్రణీః ।**
**తం దృష్ట్వా దేవమీశానం సాంబం సగణమవ్యయమ్ ॥52॥**

**ప్రణేముస్తుష్టువుశ్చైవ ప్రీతికంటకితత్వచః ।**
**విజ్ఞాప్య శితికంఠాయ పశుపాశవిమోక్షణమ్ ॥53॥**

**తస్థుస్తదాగ్రతః శంభోః ప్రణిపత్య పునః పునః ।**

తర్వాత శిలాదపుత్రుడు, సమస్తభూతగణాలలో అగ్రేసరుడు అయిన నందీశ్వరుడు విష్ణువు మొదలైన దేవతలకు శివుడి దర్శనాన్ని కలిగించాడు. పార్వతీదేవి మరియు గణాలతో కూడియున్న సనాతనుడు, మహాప్రభువు అయిన ఈశ్వరుణ్ణి చూచిన కారణంగా ఏర్పడిన ప్రీతివల్ల రోమాంచితులైన దేవతలు ఆయనకు నమస్కరించి, స్తుతించారు. గరళకంఠుడైన శివుడి నుంచి పశుపాశవిముక్తికై ప్రార్థించి మాటిమాటికి నమస్కరిస్తూ ఆయన సమీపంలో నిలిచారు.

**తతః సంప్రేక్ష్య తాన్ సర్వాన్ దేవదేవో వృషధ్వజః ॥54॥**

**విశోధ్య తేషాం దేవానాం పశుత్వం పరమేశ్వరః**
**వ్రతం పాశుపతం చైవ స్వయం దేవో మహేశ్వరః ॥55॥**

**ఉపదిశ్య మునీనాంచ సహాస్తే చాంబయా భవః।**
**తదా ప్రభృతి తే దేవాః సర్వే పాశుపతాః స్మృతాః ॥56॥**

**పశూనాం చ పతిర్యస్మాత్తేషాం సాక్షాద్ధి దేవతాః।**
**తస్మాత్పాశుపతాః ప్రోక్తాస్తపస్తేపుశ్చ తే పునః ॥57॥**

**తతో ద్వాదశవర్షాంతే ముక్తపాశాః సురోత్తమాః।**
**యయుర్యథాగతం సర్వే బ్రహ్మణా సహ విష్ణునా ॥58॥**

అనంతరం శివభగవానుడు వారి అందరివైపు చూచి, వృషభధ్వజుడు, పరమేశ్వరుడు, మహేశ్వరుడు దేవతలయొక్కయు అట్లే మునులయొక్కయు పశుత్వభావనను శోధించి, వారికి పాశుపతవ్రతాన్ని స్వయంగా తానే ఉపదేశించి పార్వతీమాతతో కలిసి కూర్చున్నాడు. అప్పటినుంచి దేవతలు పాశుపతులయ్యారు. ఆ శివుడు ఆ పశువులకు సాక్షాత్తుగా పతి అయినాడు. అందుచేత దేవతలు పాశుపతులుగా చెప్పబడుతున్నారు. తర్వాత వారందరూ మరల తపస్సు చేశారు. తర్వాత పండ్రెండు సంవత్సరాల చివరిలో శ్రేష్ఠదేవతలందరూ పశుపాశం నుంచి ముక్తులయ్యారు. తర్వాత వాళ్లు ఎలా వచ్చారో అలాగే బ్రహ్మతో, విష్ణువుతో కలిసి తిరిగి వెళ్లారు.

**ఏతద్వః కథితం సర్వం పితామహముఖాచ్ఛ్రుతమ్ ।**
**పురా సనత్కుమారేణ తస్మాద్ వ్యాసేన ధీమతా ॥59॥**

**యః శ్రావయేచ్ఛుచిర్విప్రాన్ శృణుయాద్వాశుచిర్నరః ।**
**స దేహభేదమాసాద్య పశుపాశైః ప్రముచ్యతే ॥60॥**

ఓ మునులారా! నేను మీకు చెప్పినదంతా పూర్వకాలంలో బ్రహ్మముఖంగా సనత్కుమారుడు విన్నది, సనత్కుమారుడి వల్ల బుద్ధిమంతుడైన వ్యాసుడు విన్నది మాత్రమే. ఏ నరుడు శుచి అయి దీన్ని బ్రాహ్మణులకు వినిపిస్తాడో, లేక పరిశుద్ధుడై తానే వింటాడో ఆతడు మరో శరీరాన్ని పొంది పశుపాశం నుంచి ముక్తుడవుతాడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే, పూర్వభాగే పాశుపతవ్రతమాహాత్మ్యం నామాశీతితమోఽధ్యాయః ॥ 80 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని పాశుపతవ్రతమాహాత్మ్యమనే పేరుగల ఎనభైయవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **ఏకాశీతితమోఽధ్యాయః** – ఎనభై ఒకటవ అధ్యాయం

## **పశుపాశవిమోచనలింగపూజాదికథనమ్** – పశుపాశవిమోచనలింగపూజాదికథనం

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**వ్రతమేతత్త్వయా ప్రోక్తం పశుపాశవిమోక్షణమ్।**
**వ్రతం పాశుపతం లైంగం పురా దేవైరనుష్ఠితమ్ ॥1॥**

**వక్తుమర్హసి చాస్మాకం యథాపూర్వం త్వయా శ్రుతమ్।**

ఓ సూతమహర్షీ! నీవు పశుపాశవిముక్తికి చెందిన వ్రతాన్ని చెప్పావు. పూర్వం దేవతలు లింగసంబంధమైన పాశుపతానుష్ఠానం నిర్వహించారు. కాగా మీనుండి ముందుగా ఆ అనుష్ఠానాన్ని గూర్చి వినదలచాం. దాన్ని మాకు వినిపించండి!

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**పురా సనత్కుమారేణ పృష్టః శైలాదిరాదరాత్ ॥2॥**

**నందీ ప్రాహ వచస్తస్మై ప్రవదామి సమాసతః।**
**దేవైర్దైత్యైస్తథా సిద్ధైర్గంధర్వైః సిద్ధచారణైః ॥3॥**

**మునిభిశ్చ మహాభాగైరనుష్ఠితమనుత్తమమ్।**
**వ్రతం ద్వాదశలింగాఖ్యం పశుపాశవిమోక్షణమ్ ॥4॥**

**భోగదం యోగదం చైవ కామదం ముక్తిదం శుభమ్।**
**అవియోగకరం పుణ్యం భక్తానాం భయనాశనమ్ ॥5॥**

**షడంగసహితాన్ వేదాన్ మథిత్వా తేన నిర్మితమ్।**
**సర్వదానోత్తమం పుణ్యమశ్వమేధాయుతాధికమ్ ॥6॥**

**సర్వమంగళదం పుణ్యం సర్వశత్రువినాశనమ్।**
**సంసారార్ణవమగ్నానాం జంతూనామపి మోక్షదమ్ ॥7॥**

**సర్వవ్యాధిహరం చైవ సర్వజ్వరవినాశనమ్ ।**
**దేవైరనుష్ఠితం పూర్వం బ్రహ్మణా విష్ణునా తథా ॥8॥**

ఓ ఋషులారా! పూర్వం శిలాదపుత్రుడైన నందీశ్వరుడు ఈ వ్రతవిషయాన్ని సనత్కుమారుడికి ఆదరపూర్వకంగా చెప్పాడు. నంది ఏమి చెప్పాడో అదే మీకు సంగ్రహంగా చెబుతాను. దేవతలు, దైత్యులు, సిద్ధులు, గంధర్వులు, చారణులు అట్లే మహాభాగ్యశాలురైన మునులు పశుపాశంవల్ల ముక్తులు కావాలనుకునే

వాళ్లు ఈ అత్యుత్తమమైన ద్వాదశలింగమనే పేరుగల వ్రతాన్ని నిర్వహించాలి. ఈ వ్రతం భోగాన్ని యిస్తుంది. యోగాన్ని యిస్తుంది. మనోరథసిద్ధినిస్తుంది. ముక్తినిస్తుంది. శివుడి యొక్క అవియోగాన్ని ఇస్తుంది. పుణ్యాన్ని ఇస్తుంది. భక్తుల భయాన్ని నశింపజేస్తుంది. షడంగసహితమైన వేదాల్ని మథింపజేసి, దానివల్ల కలిగే ఫలితాన్ని యిస్తుంది. సమస్తదానాలలో ఉత్తమమైన ఫలితాన్ని ఇస్తుంది. పదివేల అశ్వమేధాల వలన కలిగే పుణ్యం కంటే అధికపుణ్యాన్ని ఇస్తుంది. సమస్తమంగళాల్ని ప్రసాదిస్తుంది. పవిత్రతను ఇస్తుంది. సమస్తశత్రువినాశనాన్ని కలిగిస్తుంది. సంసారసాగరమందు మగ్నులైన ప్రాణులకు మోక్షాన్ని ఇస్తుంది. సమస్తరోగాల్ని, జ్వరాన్ని నివారిస్తుంది. దీన్ని పూర్వం బ్రహ్మ విష్ణువులు, దేవతలు అనుష్ఠించారు.

**కృత్వాఽ కనీయసం లింగం స్నాప్య చందనవారిణా ।**
**చైత్రమాసాది విప్రేంద్రాః శివలింగవ్రతం చరేత్ ॥9॥**

**కృత్వా హైమం శుభం పద్మం కర్ణికాకేసరాన్వితమ్ ।**
**నవరత్నైశ్చ ఖచితమష్టపత్రం యథావిధి ॥10॥**

**కర్ణికాయాం న్యసేల్లింగం స్ఫాటికం పీఠసంయుతమ్ ।**
**తత్ర భక్త్యా యథాన్యాయమర్చయేద్ బిల్వపత్రకైః ॥11॥**

**సితైః సహస్రకమలై రక్తైర్నీలోత్పలైరపి ।**
**శ్వేతార్కకర్ణికారైశ్చ కరవీరైర్బకైరపి ॥12॥**

**ఏతైరన్యైర్యథాలాభం గాయత్ర్యా తస్య సువ్రతాః ।**
**సంపూజ్య చైవ గంధాద్యై ర్ధూపైర్దీపైశ్చ మంగళైః ॥13॥**

**నీరాజనాద్యైశ్చాన్యైశ్చ లింగమూర్తిం మహేశ్వరమ్ ।**
**అగరుం దక్షిణే దద్యాదఘోరేణ ద్విజోత్తమాః ॥14॥**

**పశ్చిమే సద్యమంత్రేణ దివ్యాం చైవ మనఃశిలామ్ ।**
**ఉత్తరే వామదేవేన చందనం వాపి దాపయేత్ ॥15॥**

**పురుషేణ మునిశ్రేష్ఠా హరితాలం చ పూర్వతః ।**
**సితాగరూద్భవం విప్రాస్తథా కృష్ణాగరూద్భవమ్ ॥16॥**

**తథా గుగ్గులధూపం సౌగంధికమనుత్తమమ్ ।**
**సితారం నామధూపం దద్యాదీశాయభక్తితః ॥17॥**

**మహాచరునివేద్యః స్యాదాఢకాన్నమథాపి వా ।**
**ఏతద్వః కథితం పుణ్యం శివలింగమహావ్రతమ్ ॥18॥**

ఓ విప్రశ్రేష్ఠులారా! ఒక పెద్ద లింగాన్ని నిర్మించుకుని, దానిని చందనంతో కలిపిన నీటితో స్నానం చేయించి చైత్రమాసప్రారంభం నుంచి ఈ శివలింగవ్రతాన్ని నిర్వహించాలి. కేసరాలతో కూడిన కర్ణికలు గలదియు, తొమ్మిది రత్నాలతో అమర్చబడిన మరియు ఎనిమిది దళాలతో కూడిన ఒక అందమైన బంగారుకమలాన్ని తయారుచేసి, దాని కర్ణికలో విధ్యనుసారంగా స్ఫటికవేదికపై లింగాన్ని స్థాపించాలి. దాన్ని (లింగాన్ని) భక్తిపూర్వకంగా విధ్యనుసారంగా మారేడు దళాలతోను, వేలకొలది తెల్లని, నల్లని, ఎఱ్ఱని పద్మాలతోను, తెల్లని జిల్లేడుపూలతోను, గన్నేరుపూలతోను, కురవకకుసుమాలతోను, మరియు దొరికే యితర పుష్పాలతోను రుద్రగాయత్రీమంత్రం ద్వారా అర్చించాలి. ఓ ద్విజశ్రేష్ఠులారా! గంధం, ధూపం, దీపం, నీరాజనం మొదలైన ఉపచారాలతో లింగమూర్తి అయిన మహేశ్వరుణ్ణి పూజించి అఘోరమంత్రంతో దక్షిణ భాగంలో సుగంధపరిమళాన్ని కలిగించాలి. సద్యోజాతమంత్రంతో పడమటి భాగంలో దివ్యమనశ్శిలను (సుగంధద్రవ్యం) ఉంచాలి. వామదేవమంత్రంతో ఉత్తరభాగంలో చందనాన్ని ఉంచాలి. ఓ మునిశ్రేష్ఠులారా! పూర్వభాగంలో (తూర్పు) తత్పురుషమంత్రంతో హరితాళాన్ని సమర్పించాలి. ఓ విప్రులారా! తెల్లటి అగరుతోను, నల్లటి అగరుతోను కల్పించిన ధూపాన్ని, సుగంధభరితమైన, ఉత్తమమైన గుగ్గులధూపాన్ని మరియు 'సితార'మనే పేరుగల ధూపాన్ని భక్తితో మహాదేవుడికి అర్పించాలి. అనంతరం మహాచరుకాన్ని నైవేద్యరూపంగా, లేకుంటే ఆఢకం (18మానికలు) బియ్యంతో వండిన అన్నాన్ని గాని సమర్పించాలి. ఓ ఋషులారా! నేను మీకు పుణ్యదాయకమైన శివలింగమహావ్రతాన్ని తెలియజేశాను.

**సర్వమాసేషు సామాన్యం విశేషోఽపి చ కీర్త్యతే ।**
**వైశాఖే వజ్రలింగం చ జ్యేష్ఠే మారకతం తథా ॥19॥**

**ఆషాఢే మౌక్తికం లింగం శ్రావణే నీలనిర్మితమ్ ।**
**మాసి భాద్రపదే లింగం పద్మరాగమయం శుభమ్ ॥20॥**

**ఆశ్వినే చైవ విప్రేంద్రాః గోమేదకమయం శుభమ్ ।**
**ప్రవాలేనైవ కార్తిక్యాం తథా వై మార్గశీర్షకే ॥21॥**

**వైదూర్యనిర్మితం లింగం పుష్పరాగేణ పుష్యకే ।**
**మాఘే చ సూర్యకాంతేన ఫాల్గుణే స్ఫాటికేన చ ॥22॥**

ఇంతకుముందు చెప్పింది అన్ని మాసాలలోను సామాన్యమైన శివలింగవ్రతం. ఇపుడు విశేషవ్రతాన్ని గూర్చి చెబుతున్నాను. ఓ విప్రశ్రేష్ఠులారా! వైశాఖమాసంలో వజ్రంతో తయారు చేసిన లింగాన్ని, జ్యేష్ఠమాసంలో మరకతనిర్మిత లింగాన్ని, ఆషాఢమాసంలో ముత్యాలతో కూర్చిన లింగాన్ని, శ్రావణమాసంలో ఇంద్రనీలంతో నిర్మించిన లింగాన్ని, భాద్రపదంలో పద్మరాగమణితో నిర్మించిన సుందర లింగాన్ని, ఆశ్వయుజమాసంలో గోమేదికంతో నిర్మించిన శుభప్రదమైన లింగాన్ని, కార్తికమాసంలో ప్రవాళాలతో నిర్మించినదాన్ని, మార్గశిరంలో వైదూర్యనిర్మితలింగాన్ని, పుష్యమాసంలో పుష్పరాగనిర్మితలింగాన్ని, మాఘమాసంలో సూర్యకాంతమణులతో నిర్మించినదాన్ని, ఫాల్గుణమాసంలో స్ఫటికలింగాన్ని పూజించాలి.

**సర్వమాసేషు కమలం హైమమేకం విధీయతే ।**
**అలాభే రాజతం వాపి కేవలం కమలం తు వా ॥23॥**

**రత్నానామప్యలాభే తు హేమ్నా వా రాజతేన వా ।**
**రజతస్యాప్యలాభే తు తామ్రలోహేన కారయేత్ ॥24॥**

**శైలం వా దారుజం వాపి మృన్మయం వా సవేదికమ్ ।**
**సర్వగంధమయం వాపి క్షణికం పరికల్పయేత్ ॥25॥**

అన్ని మాసాలలోనూ బంగారంతో చేసిన ఒక కమలం ఉండడం విధివిధానం. బంగారం దొరకనప్పుడు వెండికమలాన్ని తయారు చేసుకోవాలి. రత్నాలు దొరకనప్పుడు బంగారంతోగాని లేక వెండితోగాని నిర్మించుకోవాలి. వెండి కూడా లేనిచో రాగితో గాని ఇతర లోహంతోగాని నిర్మించాలి. వేదికతో కూడిన లింగాన్ని శిలతోగాని, చెక్కతోగాని, మట్టితోగాని సుగంధభరితంగా నిర్మించుకోవాలి. లేకుంటే క్షణికలింగాన్ని (తాత్కాలికం) రచించుకోవాలి.

**హైమంతికే మహాదేవం శ్రీపత్రేణైవ పూజయేత్ ।**
**సర్వమాసేషు కమలం హైమమేకమథాపి వా ॥26॥**

**రాజతం వాపి కమలం హైమకర్ణికముత్తమమ్ ।**
**రాజతస్యాప్యభావే తు బిల్వపత్రైః సమర్చయేత్ ॥27॥**

**సహస్రకమలాలాభే తదర్ధేనాపి పూజయేత్ ।**
**తదర్ధేన వా రుద్రమష్టోత్తరశతేన వా ॥28॥**

హేమంతఋతువులో మారేడు దళాలతో శివుణ్ణి పూజించాలి. అన్ని మాసాలలో ఒక సువర్ణకమలాన్ని నిర్మించుకోవాలి. లేకుంటే సువర్ణకర్ణికతో కూడిన వెండికమలాన్ని ఉత్తమమైన దాన్ని నిర్మించుకోవాలి. వెండి కూడా దొరకనప్పుడు బిల్వపత్రాలతో శివుణ్ణి పూజించాలి. వెయ్యి కమలాలు దొరకనప్పుడు అందులో సగం, అవి దొరకనప్పుడు అందులో సగం, లేకుంటే కనీసం నూట ఎనిమిది కమలాలతోనైనా పూజించాలి.

**బిల్వపత్రే స్థితా లక్ష్మీర్దేవీ లక్షణసంయుతా ।**
**నీలోత్పలేఽంబికా సాక్షాదుత్పలే షణ్ముఖః స్వయమ్ ॥29॥**

**పద్మాశ్రితో మహాదేవః సర్వదేవపతిః శివః ।**
**తస్మాత్సర్వప్రయత్నేన శ్రీపత్రం న త్యజేద్ బుధః ॥30॥**

**నీలోత్పలం చోత్పలం చ కమలం చ విశేషతః ।**
**సర్వవశ్యకరం పద్మం శిలా సర్వార్థసిద్ధిదా ॥31॥**

**కృష్ణాగరుసముద్భూతం సర్వపాపనికృంతనమ్ ।**
**గుగ్గులుప్రభృతీనాం చ దీపానాం చ నివేదనమ్ ॥32॥**

**సర్వరోగక్షయం చైవ చందనం సర్వసిద్ధిదమ్ ।**
**సౌగంధికం తథా ధూపం సర్వకామార్థసాధకమ్ ॥33॥**

**శ్వేతాగరూద్భవం చైవ తథా కృష్ణాగరూద్భవమ్ ।**
**సౌమ్యం సీతారిధూపం చ సాక్షాన్నిర్వాణసిద్ధిదమ్ ॥34॥**

మారేడు దళాలలో సర్వలక్షణలక్షిత లక్ష్మీదేవి, నల్లకలువలలో స్వయంగా పార్వతీదేవి, కలువలలో సాక్షాత్తు కుమారస్వామి కొలువై ఉంటారు. సమస్త దేవతలకు స్వామి అయిన పరమేశ్వరశివుడు పద్మాలలో నివసిస్తాడు. అందుచేత బుద్ధిమంతుడైన మానవుడు గట్టి ప్రయత్నం చేసి బిల్వపత్రాన్ని సంపాదించి పూజించాలి. దాన్ని విడువరాదు. నల్లకలువల్ని, కలువల్ని, విశేషించి కమలాల్ని విడిచి పెట్టరాదు. పద్మం అన్నింటిని తన వశం చేసుకుంటుంది. శిల (మనఃశిల) సర్వసిద్ధుల్ని ఇస్తుంది. కృష్ణాగరునుంచి పుట్టే ధూపం సర్వపాపనివారిణి. గుగ్గులం మొదలైన వాటి దీపనివేదనం సర్వరోగనివారణం. చందనసమర్పణం సర్వసిద్ధిప్రదాయకం. సుగంధపూరితాలైన సర్వధూపాలు సర్వకామనల్ని, సమస్తార్థాల్ని సాధిస్తాయి. శ్వేతాగరు మరియు కృష్ణాగరు నుంచి పుట్టే ధూపం మరియు 'సౌమ్యం, సితారి' అనే పేరుగల ధూపాలు  నిర్వాణసిద్ధిప్రదాయకాలు.

**శ్వేతార్కకుసుమే సాక్షాచ్చతుర్వక్త్రః ప్రజాపతిః ।**
**కర్ణికారస్య కుసుమే మేధా సాక్షాద్ వ్యవస్థితాః ॥35॥**

**కరవీరే గణాధ్యక్షో బకే నారాయణః స్వయమ్ ।**
**సుగంధిషు చ సర్వేషు కుసుమేషు నగాత్మజా ॥36॥**

**తస్మాద్దేవైర్యథాలాభం పుష్పధూపాదిభిః శుభైః ।**
**పూజయేద్దేవదేవేశం భక్త్యా విత్తానుసాగరః ॥37॥**

తెల్లజిల్లేడు పూలలో సమంగా చతురాననుడై బ్రహ్మదేవుడు కొలువుంటాడు. గన్నేరుపూలలో స్వయంగా మేధాదేవి నివసిస్తుంది. కరవీరపుష్పంలో గణాధ్యక్షులు, కురవకపుష్పంలో స్వయంగా నారాయణుడే ఉంటాడు. సమస్త సుగంధ కుసుమాలలో పార్వతీదేవి విరాజమానురాలై ఉంటుంది. వారి వారి ధనలబ్ధిని బట్టి భక్తితో దొరికినంతటి శుభకరాలైన పుష్పాలతో ధూపాలతో దేవదేవుణ్ణి పూజించాలి.

**నివేదయేత్తతో భక్త్యా పాయసం చ మహాచరుమ్ ।**
**సఘృతం సోపదంశం చ సర్వద్రవ్యసమన్వితమ్ ॥38॥**

**శుద్ధాన్నం వాపి ముద్గాన్నమాఢకం చార్ధకం తు వా ।**
**చామరం తాలవృంతం చ తస్మై భక్త్యా నివేదయేత్ ॥39॥**

**ఉపహారాణి పుణ్యాని న్యాయేనైవార్జితాన్యపి ।**
**నానావిధాని చార్వాణి ప్రోక్షితాన్యంభసా పునః ॥40॥**

**నివేదయేచ్చ రుద్రాయ భక్తియుక్తేన చేతసా ।**

తర్వాత భక్తిపూర్వకంగా పాయసం అట్లే మహాచరువు నివేదించాలి. నేతితో కూడిన, ఇతరాలైన వ్యంజనాలతో కూడిన ఇతరద్రవ్యాలతో కూడిన అన్నాన్నిగాని లేక పెసలతో కూడిన (పులగం) ఆఢకం (18మానికలు) అన్నాన్నిగాని లేక అందులో సగం గాని సమర్పించాలి. తర్వాత చామరంతో మరియు వింజామరతోను (విసనకఱ్ఱ) భక్తితో వీచాలి. ఈ విధంగా న్యాయార్జితవిత్తంతో సముపార్జించిన బహువిధాలైన పవిత్ర పూజాసామగ్రిని నీటితో శుద్ధిచేసి భక్తిభరితచిత్తంతో శివుడికి సమర్పించాలి.

**క్షీరాద్వై సర్వదేవానాం స్థిత్యర్థమమృతం ధ్రువమ్ ॥41॥**

**విష్ణునా జిష్ణునా సాక్షాదన్నే సర్వం ప్రతిష్ఠితమ్ ।**
**భూతానాం అన్నదానేన ప్రీతిర్భవతి శంకరే ॥42॥**

**తస్మాత్సంపూజయే ద్దేవమన్నే ప్రాణాః ప్రతిష్ఠితాః ।**
**ఉపహారే తథా తుష్టిర్వ్యజనే పవనః స్వయమ్ ॥43॥**

**సర్వాత్మకో మహాదేవో గంధతోయే హ్యపాంపతిః ।**
**పీఠే వై ప్రకృతిః సాక్షాన్మహదాద్యైర్వ్యవస్థితా ॥44॥**

**తస్మాద్దేవం యజేద్భక్త్యా ప్రతిమాసం యథావిధి ।**
**పౌర్ణమాస్యాం వ్రతం కార్యం సర్వకామార్థసిద్ధయే ॥45॥**

**సత్యం శౌచం దయా శాంతిః సంతోషో దానమేవ చ ।**
**పౌర్ణమాస్యామమావాస్యాముపవాసం చ కారయేత్ ॥46॥**

జయశీలుడైన విష్ణువు క్షీరసాగరం నుంచి సర్వదేవతలకు స్థితికారకమైన అమృతాన్ని సంతరించి సాక్షాత్తు అన్నమందే ప్రతిష్ఠించాడు. ప్రాణులకు అన్నదానం చేయడం వల్ల శంకరుడికి ప్రీతి కలుగుతుంది. అందుచేత అన్నంతో శివుణ్ణి పూజించాలి. అన్నమందే ప్రాణం నిలిచి ఉంటుంది. ఉపాహారాలతో తృప్తి కలుగుతుంది. విసనకఱ్ఱలో స్వయంగా వాయుదేవుడు నివసిస్తున్నాడు. మహాదేవుడు ప్రతివస్తువులోను విరాజమానుడయి ఉన్నాడు. వరుణదేవుడు సుగంధజలాలలో ఉన్నాడు. వేదికమీద మహదాదికాలతో కలిసి సాక్షాత్ ప్రకృతి నిలుస్తున్నది. అందుచేత ప్రతిమాసంలోనూ విధ్యనుసారం భక్తితో శివుణ్ణి పూజించాలి. సర్వకార్యార్థసిద్ధికై పౌర్ణమినాడు తప్పక వ్రతం చేయాలి. వ్రతసమయంలో సత్యం, దయ, శుద్ధి, శాంతి, సంతోషం, దానం – వీటిని పాటించాలి. పూర్ణిమా, అమావాస్య దినాలలో ఉపవసించాలి.

**సంవత్సరాంతే గోదానం వృషోత్సర్గం విశేషతః ।**
**భోజయేద్ బ్రాహ్మణాన్ భక్త్యా శ్రోత్రియాన్ వేదపారగాన్ ॥47॥**

**తల్లింగం పూజితం తేన సర్వద్రవ్యసమన్వితమ్ ।**
**స్థాపయేద్వా శివక్షేత్రే దాపయేత్ బ్రాహ్మణాయ వా ॥48॥**

సంవత్సరం చివరలో అనగా ఫాల్గుణమాసంలో గోదానం మరియు విశేషంగా ఆబోతును విడిచి పెట్టడం చేయాలి. శ్రోత్రియులు, వేదపారగులు అయిన బ్రాహ్మణులకు భక్తితో భోజనాన్ని పెట్టాలి. పూజించిన ఆలింగాన్ని సమస్తపూజాద్రవ్యాలతో కలిపి శివాలయంలో ఉంచాలి. లేకుంటే ఉత్తమబ్రాహ్మణునికి ఇవ్వాలి.

**య ఏవం సర్వమాసేషు శివలింగమహావ్రతమ్ ।**
**కుర్యాద్భక్త్యా మునిశ్రేష్ఠాః స ఏవ తపసాం వరః ॥49॥**

**సూర్యకోటిప్రతీకాశైర్విమానై రత్నభూషితైః ।**
**గత్వా శివపురం దివ్యం నేహాయాతి కదాచన ॥50॥**

**అథవా హ్యేకమాసం వా చరేదేవం వ్రతోత్తమమ్ ।**
**శివలోకమవాప్నోతి నాత్ర కార్యా విచారణా ॥51॥**

**అథవా సక్తచిత్తశ్చేద్యాన్యాన్ సంచింతయేద్వరాన్ ।**
**వర్షమేకం చరేదేవం తాంస్తాన్ ప్రాప్య శివం వ్రజేత్ ॥52॥**

**దేవత్వం వా పితృత్వం వా దేవరాజత్వమేవ చ ।**
**గాణపత్యపదం వాపి సక్తోఽపి లభతే నరః ॥53॥**

ఓ శ్రేష్ఠమునులారా! ఎవడు ఈ ప్రకారంగా అన్ని మాసాలలో శివలింగమహావ్రతాన్ని నిర్వహిస్తాడో ఆతడు తాపసులలో శ్రేష్ఠుడు అవుతాడు. ఆతడు కోటి సూర్యప్రభలతో సమానమైన, దేదీప్యమానమైన, రత్నశోభితమైన విమానాలలో శివలోకాన్ని పొందుతాడు. ఎప్పుడూ కూడా ఈ భూలోకానికి రాడు. ఒక నెల వ్రతం చేసినవాడు కూడా శివలోకాన్ని పొందుతాడు. ఇందుకు ఏమాత్రం సందేహం లేదు. సాంసారిక భోగాలలో ఆసక్తచిత్తం గల మానవుడు కూడా ఒక సంవత్సరం వ్రతం చేసినచో ఆతడు ఏయే కోరికలు కోరుకుంటాడో వాటిని అన్నింటిని పొంది శివలోకానికి వెళుతున్నాడు. సుఖాసక్తుడైన మానవుడు కూడా ఈ వ్రతాచరణ వల్ల దేవత్వాన్ని, పితృత్వాన్ని, ఇంద్రత్వాన్ని, గణాధిపత్యాన్ని పొందుతున్నాడు.

**విద్యార్థీ లభతే విద్యాం భోగార్థీ భోగమాప్నుయాత్ ।**
**ద్రవ్యార్థీ చ నిధిం పశ్యేదాయుః కామశ్చిరాయుషమ్ ॥54॥**

**యాన్యాంశ్చింతయతే కామాంస్తాంస్తాన్ప్రాప్యేహ మోదతే ।**
**ఏకమాసవ్రతాదేవ సోఽంతే రుద్రత్వమాప్నుయాత్ ॥55॥**

ఈ వ్రతాచరణంతో విద్యార్థి విద్యను పొందుతున్నాడు. భోగాల్ని కోరుకునేవాడు భోగాల్ని పొందుతున్నాడు. ధనాన్ని కోరుకునేవాడు ధనాన్ని పొందుతున్నాడు. ఆయువు కోరుకునేవాడు దీర్ఘాయువు పొందుతున్నాడు. మానవుడు ఏయే కోరికలు కావాలనుకుంటున్నాడో వాటినన్నింటిని ఒక మాసవ్రతాచరణవల్ల కూడా ఈ లోకంలో పొంది, అనుభవించి చివరిగా రుద్రత్వాన్ని పొందుతున్నాడు.

**ఇదం పవిత్రం పరమం రహస్యం తత్రోత్తమం విశ్వసృజాపి సృష్టమ్ ।**
**హితాయ దేవాసురసిద్ధమర్త్యవిద్యాధరాణాం పరమం శివేన ॥56॥**

**సంపూజ్య పూజ్యం విధినైవమీశం ప్రణమ్య మూర్ధ్నా సహ భృత్యపుత్రైః ।**
**వ్యపోహనం నామ జపేత్స్తవం చ ప్రదక్షిణం కృత్య శివం ప్రయత్నాత్ ॥57॥**

**పురాకృతం విశ్వసృజా స్తవం చ హితాయ దేవేన జగత్త్రయస్య ।**
**పితామహేనైవ సురైశ్చ సార్ధం మహానుభావేన మహార్థ్యమేతత్ ॥58॥**

విశ్వసృష్టికర్త అయిన శివభగవానుడు దేవతలకు, రాక్షసులకు, సిద్ధులకు, మానవులకు, విద్యాధరులకు హితం చేకూర్చడానికై ఈ విధమైన పరమపవిత్రమూ, పరమరహస్యమూ, పరమోత్తమమూ అయిన వ్రతాన్ని సృష్టించాడు. ఈ విధంగా విధిపూర్వకంగా ఈశ్వరుణ్ణి పూజించిన సేవకుడు, పుత్రులతోకూడా శిరసు వంచి నమస్కరించి ప్రయత్నపూర్వకంగా ప్రదక్షిణ చేసి "వ్యపోహనం" అనే స్తవాన్ని పఠించాలి. పూర్వం విశ్వరచన చేసే బ్రహ్మదేవుడు దేవతలందరితో కూడి మూడు లోకాల హితాన్ని కోరి మహాప్రయోజనకారి అయిన ఈ స్తవాన్ని రచించాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే పశుపాశవిమోచనలింగపూజాదికథనం నామైకాశీతితమోఽధ్యాయః ॥81॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని పశుపాశవిమోచన లింగపూజాదికథనమనే ఎనబై ఒకటవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## ద్వ్యశీతితమోఽధ్యాయః - ఎనబై రెండవ అధ్యాయం

## వ్యపోహనస్తవనిరూపణమ్ - వ్యపోహనస్తవనిరూపణం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**వ్యపోహనస్తవం వక్ష్యే సర్వసిద్ధిప్రదం శుభమ్ ।**
**నందినశ్చ ముఖాచ్ఛ్రుత్వా కుమారేణ మహాత్మనా ॥1॥**

**వ్యాసాయ కథితం తస్మాత్ బహుమానేన వై మయా ।**
**నమఃశివాయ శుద్ధాయ నిర్మలాయ యశస్వినే ॥2॥**

**దుష్టాంతకాయ సర్వాయ భవాయ పరమాత్మనే ।**
**పంచవక్త్రో దశభుజో హ్యక్షపంచదశైర్యుతః ॥3॥**

**శుద్ధస్ఫటికసంకాశః సర్వాభరణభూషితః ।**
**సర్వజ్ఞః సర్వగః శాంతః సర్వోపరి సంస్థితః ॥4॥**

**పద్మాసనస్థః సోమేశః పాపమాశు వ్యపోహతు ।**

ఓ మహర్షులారా! నేను మీకు సర్వసిద్ధిదాయకమైన శుభకరమైన వ్యపోహనస్తవాన్ని చెబుతాను. దీన్ని నందీశ్వరుడి ముఖం నుంచి విన్న సనత్కుమారుడు వ్యాసుడికి చెప్పాడు. వ్యాసుడి నుంచి నేను పరమాదరపూర్వకంగా విన్నాను. కల్యాణకరుడు, పరిశుద్ధుడు, నిర్మలుడు, యశస్వి, దుష్టుల్ని నశింపజేయువాడు, సర్వజ్ఞుడు, భవుడు మరియు పరమాత్ముడు అయిన శివుడికి నమస్కారం. పంచముఖుడు, దశభుజుడు, పంచదశాక్షుడు, శుద్ధస్ఫటిక సమానప్రభగలవాడు, సర్వాభరణభూషితుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, శాంతుడు, అందరికంటే పైన ఉన్నవాడు, పద్మాసనస్థుడు పార్వతీసమేతుడూ అయిన శివుడు పాపాల్ని త్వరగా దూరం చేయుగాక.

**ఈశానః పురుషశ్చైవ అఘోరః సద్య ఏవ చ ॥5॥**

**వామదేవశ్చ భగవాన్ పాపమాశు వ్యపోహతు ।**
**అనంతః సర్వవిద్యేశః సర్వజ్ఞః సర్వదః ప్రభుః ॥6॥**

**శివధ్యానైకసంపన్నః స మే పాపం వ్యపోహతు ।**
**సూక్ష్మః సురాసురేశానో విశ్వేశో గణపూజితః ॥7॥**

**శివధ్యానైకసంపన్నః స మే పాపం వ్యపోహతు ।**
**శివోత్తమో మహాపూజ్యః శివధ్యానపరాయణః ॥8॥**

**సర్వగః సర్వదః శాంతః స మే పాపం వ్యపోహతు ।**
**ఏకాక్షో భగవానీశః శివార్చనపరాయణః ॥9॥**

**శివధ్యానైకసంపన్నః స మే పాపం వ్యపోహతు ।**

ఈశానుడు, తత్పురుషుడు, అఘోరుడు, సద్యోజాతుడు, భగవానుడు, వామదేవుడు నా పాపాన్ని దూరం చేయుగాక. అనంతుడు, సర్వవిద్యేశుడు, సర్వజ్ఞుడు, సర్వదుడు, ప్రభువు అట్లే శివధ్యానైక సంపన్నుడు నా పాపాన్ని దూరం చేయుగాక. సూక్ష్ముడు, సురాసురేశ్వరుడు, విశ్వేశుడు, గణపూజితుడు అట్లే విశ్వధ్యానైకసంపన్నుడు నా పాపాన్ని దూరం చేయుగాక. శివోత్తముడు, మహాపూజ్యుడు, శివధ్యానైకపరాయణుడు, సర్వగుడు, సర్వదుడు అట్లే శాంతుడు నా పాపాన్ని దూరం చేయుగాక. ఏకాక్షుడు, భగవానుడు, ఈశుడు, శివార్చనపరాయణుడు అట్లే శివధ్యానైకసంపన్నుడు ఎల్లప్పుడు నా పాపాల్ని దూరం చేయుగాక.

**త్రిమూర్తిర్భగవానీశః శివభక్తిప్రబోధకః ॥10॥**

**శివధ్యానైకసంపన్నః స మే పాపం వ్యపోహతు ।**
**శ్రీకంఠః శ్రీపతిః శ్రీమాన్ శివధ్యానరతః సదా ॥11॥**

**శివార్చనరతః సాక్షాత్ స మే పాపం వ్యపోహతు ।**
**శిఖండీ భగవాన్ శాంతః శవభస్మానులేపనః ॥12॥**

**శివార్చనరతః శ్రీమాన్ స మే పాపం వ్యపోహతు ।**

త్రిమూర్తి, భగవానుడు, ఈశుడు, శివభక్తిప్రబోధకుడు, అట్లే శివధ్యానైకసంపన్నుడు నా పాపాల్ని దూరం చేయుగాక. శ్రీకంఠుడు, శ్రీపతి, శ్రీమంతుడు ఎల్లప్పుడు శివధ్యానరతుడు, అట్లే శివార్చనరతుడు నా పాపాల్ని దూరం చేయుగాక. శిఖండి, భగవానుడు, శాంతుడు, శవభస్మాన్ని అనులేపనంగా గలవాడు, శివార్చనరతుడు అట్లే శ్రీమంతుడు నా పాపాల్ని దూరం చేయుగాక.

**త్రైలోక్యనమితా దేవీ సోల్కాకారా పురాతనీ ॥13॥**

**దాక్షాయణీ మహాదేవీ గౌరీ హైమవతీ శుభా ।**
**ఏకపర్ణాగ్రజా సౌమ్యా తథావై చైకపాటలా ॥14॥**

**అపర్ణా వరదా దేవీ వరదానైకతత్పరా ।**
**ఉమాసురహరా సాక్షాత్కౌశికీ వా కపర్దినీ ॥15॥**

**ఖట్వాంగధారిణీ దివ్యా కరాగ్రతరుపల్లవా ।**
**నైగమేయాదిభిర్దివ్యైశ్చతుర్భిః పుత్రకైర్వృతా ॥16॥**

**మేనాయా నందినీ దేవీ వారిజా వారిజేక్షణా ।**
**అంబా యా వీతశోకస్య నందినశ్చ మహాత్మనః ॥17॥**

**శుభావత్యాః సఖీ శాంతా పంచచూడా వరప్రదా ।**
**సృష్ట్యర్థం సర్వభూతానాం ప్రకృతిత్వం గతావ్యయా ॥18॥**

**త్రయోవింశతిభిస్తత్త్వైర్మహదాద్యైర్విజృంభితా ।**
**లక్ష్మ్యాదిశక్తిభిర్నిత్యం నమితా నందనందినీ ॥19॥**

**మనోన్మనీ మహాదేవీ మాయావీ మండనప్రియా ।**
**మాయయా యా జగత్సర్వం బ్రహ్మాద్యం సచరాచరమ్ ॥20॥**

**క్షోభిణీ మోహినీ నిత్యం యోగినాం హృది సంస్థితా ।**
**ఏకానేకస్థితా లోకే ఇందీవరనిభేక్షణా ॥21॥**

**భక్త్యా పరమయా నిత్యం సర్వదేవైరభిష్టుతా ।**
**గణేంద్రాంభోజ గర్భేంద్రయమవిత్తేశపూర్వకైః ॥22॥**

**సంస్తుతా జననీ తేషాం సర్వోపద్రవనాశినీ ।**
**భక్తానామార్తిహా భవ్యా భవభావవినాశనీ ॥23॥**

**భక్తిముక్తిప్రదా దివ్యా భక్తానామప్రయత్నతః ।**
**సా మే సాక్షాన్మహాదేవీ పాపమాశు వ్యపోహతు ॥24॥**

మూడులోకాలచేత నమస్కృత, ఉల్కయొక్క ఆకారంగలది, సనాతని అయిన దేవి, దక్షుడి కుమార్తె, మహాదేవి, గౌరి, హిమవంతుడి కుమార్తె, కల్యాణమయి, ఏకవర్ణ, అగ్రజ, సౌమ్య, ఏకపాటల, అపర్ణ, వరదాయిని, వరప్రదానతత్పర, ఉమ, అసురనాశని, స్వయంగా కౌశికి, కపర్దిని, ఖట్వాంగం ధరించినట్టిది, దివ్య, వృక్షపల్లవాగ్రహస్త, నైఘమేయుడు మరియు ఇతరులైన నలుగురు పుత్రులచే చుట్టబడినది, మేనాదేవి కుమార్తె, జలమందు పుట్టినది, కమలనేత్ర, శోకరహితుడైన నందీశ్వరుడికి తల్లి, శుభావతికి స్నేహితురాలు, శాంతస్వభావ, పంచచూడ, వరప్రదాయని, సర్వప్రాణిసృష్టినిమిత్తం ప్రకృతిస్వరూపగా నిలిచినట్టిది, అవ్యయి, మహదాది తత్త్వాలతో సంపన్న, లక్ష్మి మొదలైన శక్తులతో నమస్కరింపబడినది, నందనందిని, మహాదేవి మనోన్మని, మాయామయి, అలంకారప్రియ, తన మాయతో బ్రహ్మ మొదలైన చరాచర సంపూర్ణజగత్తును క్షోభింపజేయునది మరియు మోహింపజేయునది, యోగుల హృదయంలో ఎల్లప్పుడూ ప్రకాశించునట్టిది, సంసారంలో ఏకంగా మరియు అనేకంగా నిలుచునట్టిది, నల్లకలువల కాంతివంటి కాంతిగల కన్నులుగలది, గణేశ్వరులచేత, బ్రహ్మేంద్రులచేత, యముడు, కుబేరుడు మొదలుగాగల దేవతలతో నిత్యం పరమభక్తితో స్తుతింపబడునట్టిది. వారిచేత స్తుతింపబడి వారికి తల్లి రూపంలో అన్ని విపత్తుల్ని నశింపజేయునది, భక్తుల కష్టాల్ని హరించేది, భవ్య అయినట్టిది, సంసారలంపటాల్ని (భావాల్ని) నష్టపర్చేది, దివ్యంగా, ప్రయాసరహితంగా భక్తులకు భోగాల్ని తదుపరి మోక్షాన్ని ప్రదానం చేయునట్టిది – సాక్షాత్తు మహాదేవి పార్వతి నా పాపాన్ని దూరం చేయుగాక.

**చండః సర్వగణేశానో ముఖాచ్ఛంభోర్వినిర్మితః ।**
**శివార్చనరతః శ్రీమాన్ స మే పాపం వ్యపోహతు ॥25॥**

**శాలంకాయనపుత్రస్తు హలమార్గోత్థితః ప్రభుః ।**
**జామాతా మరుతాం దేవః సర్వభూతమహేశ్వరః ॥26॥**

**సర్వగః సర్వదృక్ శర్వః సర్వేశసదృశః ప్రభుః ।**
**సనారాయణకైర్దేవైః సేంద్రచంద్రదివాకరైః ॥27॥**

**సిద్ధైశ్చ యక్షగంధర్వైర్భూతైర్భూతవిధాయకైః ।**
**ఉరగైరృషిభిశ్చైవ బ్రహ్మణా చ మహాత్మనా ॥28॥**

**స్తుతస్త్రైలోక్యనాథస్తు మునిరంతఃపురం స్థితః ।**
**సర్వదా పూజితః సర్వైర్నందీ పాపం వ్యపోహతు ॥29॥**

సర్వగణనాథుడు, శివుడి ముఖం నుంచి పుట్టినవాడు, శివార్చనంలో లీనమైనవాడు, శ్రీయుతుడు అయిన చండుడు నా పాపాన్ని దూరం చేయుగాక. శాలంకాయనపుత్రుడు, హలమార్గమందు పుట్టినవాడు, ఐశ్వర్యశాలి, మరుత్తులకు జామాత, దేవత, సర్వభూతేశ్వరుడు, సర్వవ్యాపి, సర్వాన్ని చూచునట్టివాడు, శర్వుడు, సర్వేశ్వరుడైన శివుడితో సమానమైన ప్రభుత్వంతో సంపన్నుడు, నారాయణుడు, ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు మొదలైన దేవతల చేతను, సిద్ధులచేత, యక్షులచేత, గంధర్వులచేత, భూతాలు, భూతాల్ని సృష్టించేవాళ్లచేత, ఉరగులచేత, ఋషులచేత, మహాత్ముడైన బ్రహ్మచేత స్తుతింపబడువాడు, త్రిలోకనాథుడు, మునిహృదయాలలో విరాజమానుడు, అందరిచేత ఎల్లప్పుడూ పూజింపబడే నందీశ్వరుడు నా పాపాన్ని దూరం చేయుగాక.

**మహాకాయో మహాతేజా మహాదేవ ఇవాపరః ।**
**శివార్చనరతః శ్రీమాన్ స మే పాపం వ్యపోహతు ॥30॥**

**మేరుమందారకైలాసతటకూటప్రభేదనః ।**
**ఐరావతాదిభిర్దివ్యైర్దిగ్గజైశ్చ సుపూజితః ॥31॥**

**సప్తపాతాలపాదశ్చ సప్తద్వీపోరుజంఘకః ।**
**సప్తార్ణవాంకుశశ్చైవ సర్వతీర్థోదరః శివః ॥32॥**

**ఆకాశదేహో దిగ్బాహుః సోమసూర్యాగ్నిలోచనః ।**
**హతాసురమహావృక్షో బ్రహ్మవిద్యామహోత్కటః ॥33॥**

**బ్రహ్మాద్యాధోరణైర్దివ్యైర్యోగపాశసమన్వితైః ।**
**బద్ధో హృత్పుండరీకాఖ్యే స్తంభే వృత్తిం నిరుధ్య చ ॥34॥**

**నాగేంద్రవక్త్రో యః సాక్షాద్ గణకోటిశతైర్వృతః ।**
**శివధ్యానైకసంపన్నః స మే పాపం వ్యపోహతు ॥35॥**

మహాతేజస్వి, అపరమహాదేవుడి వంటివాడు, శ్రీయుతుడు, శివార్చనలో లీనమైనవాడు, మహాకాయుడు నా పాపాన్ని దూరం చేయుగాక. మేరు, మందర, కైలాసగిరుల తటకూటాల్ని భేదించువాడు, ఐరావతాది దిగ్గజాలతో బాగా పూజింపబడువాడు, సప్తపాతాళాలు పాదాలుగా గలవాడు, సప్తద్వీపాలు ఊరువులుగా, జంఘలుగా గలవాడు, సప్తసముద్రాలు అంకుశాలుగా గలవాడు, అన్ని తీర్థాలు ఉదరంగా గలవాడు, కల్యాణకారకుడు, ఆకాశం

శరీరంగాగలవాడు, దిక్కులు భుజాలుగాగలవాడు, చంద్రసూర్యాగ్నులు నేత్రాలైనవాడు, అసురరూపమహావృక్షాన్ని ఖండించినవాడు, బ్రహ్మవిద్యచేత పరమోత్కటుడైనవాడు, తన చిత్తవృత్తిని నిరోధించి, దివ్యమైన యోగపాశంతో బ్రహ్మ మొదలైన దివ్యమావటులచేత హృదయకమలరూపస్తంభంలో ఆబద్ధమై ఉన్నవాడు, గజేంద్రం వంటి ముఖంగలవాడు (గజముఖుడు), సహస్రగణపరివృతుడు, శివధ్యానైకసంపన్నుడు అయిన వినాయకుడు నా పాపాన్ని దూరం చేయుగాక.

**భృంగీశః పింగళాక్షోఽసౌ భసితాశస్తు దేహయుక్ ।**
**శివార్చనరతః శ్రీమాన్ స మే పాపం వ్యపోహతు ॥36॥**

**చతుర్భిస్తనుభిర్నిత్యం సర్వాసురనిబర్హణః ।**
**స్కందః శక్తిధరః శాంతః సేనానీః శిఖివాహనః ॥37॥**

**దేవసేనాపతిః శ్రీమాన్ స మే పాపం వ్యపోహతు ।**
**భవః శర్వస్తథేశానో రుద్రః పశుపతిస్తథా ॥38॥**

**ఉగ్రో భీమో మహాదేవః శివార్చనరతః సదా ।**
**ఏతాః పాపం వ్యపోహంతు మూర్తయః పరమేష్ఠినః ॥39॥**

పింగళాక్షుడు, భస్మాన్ని గ్రహించువాడు, విశిష్టదేహాన్నిగలిగినవాడు, శివార్చనంలో లీనమైనవాడు, శ్రీయుతుడు అయిన భృంగీశ్వరుడు నా పాపాన్ని దూరం చేయుగాక, నాల్గుదేహాలతో ఎల్లప్పుడూ అసురులందర్ని సంహరించేవాడు, శక్తిధరుడు, శాంతస్వభావుడు, సేనాని, మయూరవాహనుడు, దేవసేనాపతి, శ్రీసంపన్నుడు అయిన కుమారస్వామి నా పాపాన్ని దూరం చేయుగాక. శివార్చనలో ఎల్లప్పుడు సంలగ్నుడు, భవుడు, శర్వుడు, ఈశానుడు, రుద్రుడు, పశుపతి, ఉగ్రుడు, భీముడు, అట్లే మహాదేవుడు, పరమేష్ఠి అయిన శివుడి మూర్తులన్నియు నా పాపాన్ని దూరం చేయుగాక.

**మహాదేవః శివో రుద్రః శంకరో నీలలోహితః ।**
**ఈశానో విజయో భీమో దేవదేవో భవోద్భవః ॥40॥**

**కపాలీశశ్చ విజ్ఞేయో రుద్రా రుద్రాంశసంభవాః ।**
**శివప్రణామసంపన్నా వ్యపోహంతు మలం మమ ॥41॥**

మహాదేవుడు, శివుడు, రుద్రుడు, శంకరుడు, నీలలోహితుడు, ఈశానుడు, విజయుడు, భీముడు, దేవదేవుడు, భవోద్భవుడు, కపాలి, అట్లే ఈశుడు – ఏవి రుద్రాంశతో సంభవించాయో, వేటివల్ల రుద్రుణ్ణి తెలుసుకుంటున్నామో, ఎవరు శివుడికి నమస్కారం చేయడంలో తత్పరత కలిగి ఉంటారో వారు నా పాపాన్ని దూరం చేయుగాక.

**వికర్తనో వివస్వాంశ్చ మార్తండో భాస్కరో రవిః ।**
**లోకప్రకాశకశ్చైవ లోకసాక్షీ త్రివిక్రమః ॥42॥**

**ఆదిత్యశ్చ తథా సూర్యశ్చాంశుమాంశ్చ దివాకరః ।**
**ఏతే వై ద్వాదశాదిత్యా వ్యపోహంతు మలం మమ ॥43॥**

వికర్తనుడు, వివస్వంతుడు, మార్తండుడు, భాస్కరుడు, రవి, లోకప్రకాశకుడు, లోకసాక్షి, త్రివిక్రముడు, ఆదిత్యుడు, సూర్యుడు, అంశుమంతుడు అట్లే దివాకరుడు – ఈ పంద్రెండుగురు సూర్యులు (ద్వాదశాదిత్యులు) నా పాపాన్ని దూరం చేయుదురుగాక.

**గగనం స్పర్శనం తేజో రసశ్చ పృథివీ తథా ।**
**చంద్రః సూర్యస్తథాత్మా చ తనవః శివభాషితాః ॥44॥**

**పాపం వ్యపోహంతు మమ భయం నిర్నాశయంతు మే ।**
**వాసవః పావకశ్చైవ యమో నిరృతిరేవ చ ॥45॥**

**వరుణో వాయుసోమౌ చ ఈశానో భగవాన్ హరిః ।**
**పితామహశ్చ భగవాన్ శివధ్యానపరాయణః ॥46॥**

**ఏతే పాపం వ్యపోహంతు మనసా కర్మణా కృతమ్ ।**

ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథ్వి, చంద్రుడు, సూర్యుడు అట్లే ఆత్మ – ఇవి శివుడి యొక్క అష్టవిధమూర్తులు. ఇవి నా పాపాన్ని, దూరం చేయుగాక. నా భయాన్ని నశింపజేయుగాక. ఇంద్రుడు, అగ్ని, యముడు, నిర్బతి, వరుణుడు, వాయువు, సోముడు, ఈశానుడు, భగవానుడైన శ్రీహరి, అట్లే శివధ్యానలీనుడైన బ్రహ్మదేవుడు – వీరు నా యొక్క మానసికమైన మరియు శారీరకమైన కర్మ ద్వారా చేసిన నా పాపాన్ని దూరం చేయుదురుగాక.

**నభస్వాన్ స్పర్శనో వాయురనిలో మారుతస్తథా ॥47॥**

**ప్రాణః ప్రాణేశజీవేశౌ మారుతః శివభాషితాః ।**
**శివార్చనరతాః సర్వే వ్యపోహంతు మలం మమ ॥48॥**

**ఖేచరీ వసుచారీ చ బ్రహ్మేశో బ్రహ్మ బ్రహ్మధీః ।**
**సుషేణః శాశ్వతః పుష్టః సుపుష్టశ్చ మహాబలః ॥49॥**

**ఏతే వై చారణాః శంభోః పూజయామీవ భావితాః ।**
**వ్యపోహంతు మలం సర్వం పాపం చైవ మయా కృతం ॥50॥**

నభస్వంతుడు, స్పర్శనుడు, వాయువు, అనిలుడు, మారుతుడు, ప్రాణుడు, (ప్రాణం) ప్రాణేశుడు, మరియు జీవేశుడు – ఈ వాయు రూపాలన్నీ శివభాషితాలే. శివార్చన పరాయణాలే. ఇవన్నీ నా పాపాన్ని దూరం చేయుగాక. ఆకాశచారుడు, భూచారుడు, బ్రహ్మేశుడు, బ్రహ్మ, బ్రహ్మధి, సుషేణుడు, శాశ్వతుడు, పుష్టుడు, సుపుష్టుడు, మహాబలుడు– ఇవి చారణాలు. ఇవి శివుడి పూజలో అత్యంతపవిత్రాలయ్యాయి. నేను చేసిన సమస్తపాపాల్ని ఇవి దూరం చేయుగాక.

**మంత్రజ్ఞో మంత్రవిత్ప్రాజ్ఞో మంత్రరాట్ సిద్ధపూజితః ।**
**సిద్ధివత్పరమః సిద్ధః సర్వసిద్ధిప్రదాయినః ॥51॥**

**వ్యపోహంతు మలం సర్వే సిద్ధాః శివపదార్చకాః ।**
**యక్షో యక్షేశ ధనదో జృంభకో మణిభద్రకః ॥52॥**

**పూర్ణభద్రేశ్వరో మాలీ శితికుండలిరేవ చ ।**
**నరేంద్రశ్చైవ యక్షేశా వ్యపోహంతు మలం మమ ॥53॥**

మంత్రజ్ఞుడు, మంత్రవిదుడు, ప్రాజ్ఞుడు, మంత్రరాట్టు, సిద్ధపూజితుడు, సిద్ధిమంతుడు, మరియు పరమసిద్ధి– వీళ్లందరూ సిద్ధగణాలు. వీళ్లందరూ సర్వసిద్ధిప్రదాత శివుడి చరణోపాసకులు. వీళ్లు నా పాపాన్ని దూరం చేయుదురుగాక. యక్షుడు, యక్షేశుడు, ధనుదుడు, జృంభకుడు, మణిభద్రుడు, పూర్ణభద్రేశ్వరుడు, మాలి, శితికుండలి మరియు నరేంద్రుడు– వీళ్లందరూ యక్షుల స్వాములు. వీళ్లు నా పాపాన్ని దూరం చేయాలి.

**అనంతః కులికశ్చైవ వాసుకిస్తక్షకస్తథా ।**
**కర్కోటకో మహాపద్మః శంఖపాలో మహాబలః ॥54॥**

**శివప్రణామసంపన్నాః శివదేహప్రభూషణాః ।**
**మమ పాపం వ్యపోహంతు విషం స్థావర జంగమమ్ ॥55॥**

శివుడికి నమస్కరించడంలో ప్రీతిగలిగినవారు, శివుడి శరీరాలంకారాలు అయిన అనంతుడు, కులికుడు, వాసుకి, తక్షకుడు, కర్కోటకుడు, మహాపద్ముడు, శంఖపాలుడు మరియు మహాబలుడు – ఈ సర్పశ్రేష్ఠులు నా పాపాన్ని, స్థావరజంగమమైన ప్రాపంచిక విషయాల్ని దూరం చేయాలి.

**వీణాజ్ఞః కిన్నరశ్చైవ సురసేనః ప్రమర్దనః ।**
**అతీశయః సప్రయోగీ గీతజ్ఞశ్చైవ కిన్నరాః ॥56॥**

**శివప్రణామసంపన్నాః వ్యపోహంతు మలం మమ ।**
**విద్యాధరశ్చ విబుధో విద్యారాశిర్విదాం వరః ॥57॥**

**విబుద్ధో విబుధః శ్రీమాన్ కృతజ్ఞశ్చ మహాయశాః ।**
**ఏతే విద్యాధరాః సర్వే శివధ్యానపరాయణాః ॥58॥**

**వ్యపోహంతు మలం ఘోరం మహాదేవప్రసాదతః ।**

శివుడికి నమస్కరించడంలో ప్రీతిగలవారు, వీణావాదననిపుణులు, కిన్నరుడు, సురసేనుడు, ప్రమర్దనుడు, అతీశయుడు, సప్రయోగి మరియు గీతజ్ఞుడు – ఈ కిన్నరగణాలు, నా పాపాన్ని దూరం చేయాలి. విద్యాధరుడు, విబుధుడు, విద్యారాశి, విదాంవరుడు, విబుధుడు, శ్రీమంతుడు, కృతజ్ఞుడు మరియు మహాయశుడు – వీళ్లందరూ శివధ్యానతత్పరులైన విద్యాధరులు. వీళ్లు మహాదేవుడి కృపతో నా పాపాన్ని దూరం చేయాలి.

**వామదేవీ మహాజంభః కాలనేమిర్మహాబలః ॥59॥**

**సుగ్రీవో మర్దకశ్చైవ పింగళో దేవమర్దనః ।**
**ప్రహ్లాదశ్చాప్యనుహ్లాదః సంహ్లాదః కిల బాష్కలౌ ॥60॥**

**జంభః కుంభశ్చ మాయావీ కార్తవీర్యః కృతంజయః ।**
**ఏతేఽ సురాః మహాత్మానో మహాదేవపరాయణాః ॥61॥**

**వ్యపోహంతు భయం ఘోరమాసురం భావమేవ చ ।**
**గరుత్మాన్ ఖగతిశ్చైవ పక్షిరాట్ నాగమర్దనః ॥62॥**

**నాగశత్రుర్హిరణ్యాంగో వైనతేయః ప్రభంజనః ।**
**నాగాశీర్విషనాశశ్చ విష్ణువాహన ఏవ చ ॥63॥**

**ఏతే హిరణ్యవర్ణాభా గరుడా విష్ణువాహనాః ।**
**నానాభరణసంపన్నా వ్యపోహంతు మలం మమ ॥64॥**

వామదేవి, మహాజంభుడు, కాలనేమి, మహాబలుడు, సుగ్రీవుడు, మర్దకుడు, పింగళుడు, దేవమర్దనుడు, ప్రహ్లాదుడు, అనుహ్లాదుడు, సంహ్లాదుడు, బాష్కలద్వయుడు, జంభుడు, కుంభుడు, మాయావి, కార్తవీర్యుడు, కృతంజయుడు – వీళ్లు మహాదేవపరాయణులైన రాక్షసులు. వీళ్లు నా యొక్క ఘోరమైన భయాన్ని, రాక్షసభావాన్ని దూరం చేయాలి. గరుత్మంతుడు, ఖగతి, పక్షిరాట్, నాగమర్దనుడు, నాగశత్రువు, హిరణ్యాంగుడు, వైనతేయుడు, ప్రభంజనుడు, నాగులను తినెడివాడు, నాగుల విషాన్ని నశింపజేయువాడు, విష్ణువాహనుడు, బంగారపు వర్ణంగలవాడు, నానావిధాలంకారాలు గలవాడు అయిన గరుత్మంతుడు నా పాపాన్ని దూరం చేయాలి.

**అగస్త్యశ్చ వసిష్ఠశ్చ అంగిరా భృగురేవ చ ।**
**కాశ్యపో నారదశ్చైవ దధీచః చ్యవనస్తథా ॥65॥**

**ఉపమన్యుస్తథాన్యే చ ఋషయః శివభావితాః ।**
**శివార్చనరతాః సర్వే వ్యపోహంతు మలం మమ ॥66॥**

అగస్త్యుడు, వసిష్ఠుడు, అంగిరుడు, భృగుడు, కాశ్యపుడు, నారదుడు, దధీచుడు, చ్యవనుడు, ఉపమన్యుడు, వీళ్లు మరియు ఇతర శివభక్తులైన ఋషులు అందరూ నా పాపాన్ని దూరం చేయాలి.

**పితరః పితామహాశ్చ తథైవ ప్రపితామహాః ।**
**అగ్నిష్వాత్తా బర్హిషదస్తథా మాతామహాదయః ॥67॥**

**వ్యపోహంతు భయం పాపం శివధ్యానపరాయణాః ।**
**లక్ష్మీశ్చ ధరణీ చైవ గాయత్రీ చ సరస్వతీ ॥68॥**

**దుర్గా ఉషా శచీ జ్యేష్ఠా మాతరః సురపూజితాః ।**
**దేవానాం మాతరశ్చైవ గణానాం మాతరస్తథా ॥69॥**

**భూతానాం మాతరః సర్వా యత్ర యా గణమాతరః ।**
**ప్రసాదాద్దేవదేవస్య వ్యపోహంతు మలం మమ ॥70॥**

శివధ్యానతత్పరులైన పితలు, పితామహులు, ప్రపితామహులు అగ్నిష్వాత్తులు, బర్హిషదులు అట్లే మాతామహులు మొదలైనవారు నా పాపాన్ని భయాన్ని దూరం చేయాలి. లక్ష్మీదేవి, ధరణి, గాయత్రి, సరస్వతీదేవి, దుర్గ, ఉషోదేవి, శచి, అట్లే జ్యేష్ఠాదేవి – వీళ్లు దేవతలచే పూజింపబడే మాతృమూర్తులు. దేవతలకు మాతలు. గణాలకు మాతలు, భూతాలకు మాతలు, అట్లే ఇతర గణాల మాతలందరూ దేవదేవశివుడి అనుగ్రహం వల్ల నా పాపాన్ని దూరం చేయాలి.

**ఊర్వశీ మేనకా చైవ రంభారతితిలోత్తమాః ।**
**సుముఖీ దుర్ముఖీ చైవ కాముకీ కామవర్ధనీ ॥71॥**

**తథాన్యాః సర్వలోకేషు దివ్యాశ్చాప్సరసస్తథా ।**
**శివాయ తాండవం నిత్యం కుర్వంత్యోఽతీవ భావితాః ॥72॥**

**దేవ్యః శివార్చనరతా వ్యపోహంతు మలం మమ ।**

అత్యంతభక్తియుక్తలై శివుడికై నిత్యం తాండవనృత్యం చేసేవాళ్లు, శివార్చనరతలైనవాళ్లు అయిన ఊర్వశి, మేనక, రంభ, రతి, తిలోత్తమలు, సుముఖి, దుర్ముఖి, కాముకి, కామవర్ధనులు, అన్ని లోకాలకు ఇతర దివ్యాప్సరసలు అయినవాళ్లు – దేవతలు అయినవాళ్లు నా పాపాన్ని దూరం చేయాలి.

**అర్కః సోమోఽంగారకశ్చ బుధశ్చైవ బృహస్పతిః ॥73॥**

**శుక్రః శనైశ్చరశ్చైవ రాహుః కేతుస్తథైవ చ ।**
**వ్యపోహంతు భయం ఘోరం గ్రహపీడాం శివార్చకాః ॥74॥**

శివార్చనపరులైన సూర్యుడు, చంద్రుడు, అంగారకుడు, బుధుడు, బృహస్పతి, శుక్రుడు, శని, రాహుకేతువులు నా భయంకరమైన భయాన్ని, గ్రహపీడని దూరం చేయాలి.

**మేషో వృషోఽథ మిథునస్తథా కర్కటకః శుభః ।**
**సింహశ్చ కన్యా విపులా తులా వై వృశ్చికస్తథా ॥75॥**

**ధనుశ్చ మకరశ్చైవ కుంభో మీనస్తథైవ చ ।**
**రాశయో ద్వాదశ హ్యేతే శివపూజాపరాయణాః ॥76॥**

**వ్యపోహంతు భయం పాపం ప్రసాదాత్పరమేష్ఠినః ।**

మేషం, వృషభం, మిథునం, శుభమైన కర్కాటకం, సింహం, కన్య, విశదమైన తుల, వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం అట్లే మీనం – ఈ శివపూజాపరాయణాలైన పండ్రెండు రాశులు శివుడి కృపవల్ల నా భయాన్ని, పాపాన్ని దూరం చేయాలి.

**అశ్వినీ, భరణీచైవ కృత్తికా రోహిణీ తథా ॥77॥**

**శ్రీమన్మృగశిరశ్చార్ద్రా పునర్వసుపుష్యసార్పకాః ।**
**మఘా వై పూర్వఫాల్గున్య ఉత్తరాఫాల్గునీ తథా ॥78॥**

**హస్తశ్చిత్రా తథా స్వాతీ విశాఖా చానురాధికా ।**
**జ్యేష్ఠా మూలం మహాభాగా పూర్వాషాఢా తథైవ చ ॥79॥**

**ఉత్తరాషాఢికా చైవ శ్రవణం చ శ్రవిష్ఠికా ।**
**శతభిషక్పూర్వభద్రా చ తథా ప్రోష్ఠపదా తథా ॥80॥**

**పౌష్ణం చ దేవ్యః సతతం వ్యపోహంతు మలం మమ ।**
**జ్వరః కుంభోదరశ్చైవ శంకుకర్ణో మహాబలః ॥81॥**

**మహాకర్ణః ప్రభాతశ్చ మహాభూతప్రమర్దనః ।**
**శ్యేనజిచ్ఛివదూతశ్చ ప్రమథా ప్రీతివర్ధనాః ॥82॥**

**కోటికోటిశతైశ్చైవ భూతానాం మాతరః సదా ।**
**వ్యపోహంతు భయం పాపం మహాదేవప్రసాదతః ॥83॥**

జ్వరుడు, కుంభోదరుడు, శంకుకర్ణుడు, మహాబలుడు, మహాకర్ణుడు, ప్రభాతుడు, మహాభూతప్రమర్దనుడు, శ్యేనజిత్తు, శివదూతుడు అనే ప్రీతివర్ధక ప్రమథులు మరియు కోటానుకోట్ల భూతాలతోకూడిన మాతృదేవతలు మహాదేవశివుడి కృపతో నా పాపాన్ని, భయాన్ని దూరం చేయాలి. అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి, శ్రీయుత అయిన మృగశిర, ఆర్ద్ర, పునర్వసు, పుష్య, ఆశ్లేష, మఘ, పూర్వాఫాల్గుని, ఉత్తరాఫాల్గుని, హస్త, చిత్ర, స్వాతి, విశాఖ, అనూరాధ, జ్యేష్ఠ, మూల, మహాభాగ అయిన పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రవణం, ధనిష్ఠ, శతభిష, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర అట్లే రేవతి ఈ నక్షత్రదేవతలు నా పాపాన్ని దూరం చేయాలి.

**శివధ్యానైకసంపన్నో హిమరాడంబుసన్నిభః ।**
**కుందేందుసదృశాకారః కుంభకుందేందుభూషణః ॥84॥**

**బడబానలశత్రుర్యో బడబాముఖభేదనః ।**
**చతుష్పాదసమాయుక్తః క్షీరోద ఇవ పాండురః ॥85॥**

**రుద్రలోకే స్థితో నిత్యం రుద్రైః సార్ధం గణేశ్వరైః ।**
**వృషేంద్రో విశ్వధృగ్దేవో విశ్వస్య జగతః పితా ॥86॥**

**వృతో నందాదిభిర్నిత్యం మాతృభిర్మఖమర్దనః ।**
**శివార్చనరతో నిత్యం స మే పాపం వ్యపోహంతు ॥87॥**

శివధ్యానైకసంపన్నుడు, హిమాలయం మీద పుట్టిన గంగాజలంతో సమానంగా పాపాన్ని నశింపజేసేవాడు, మల్లెపూవు, మరియు చంద్రుడితో సమానమైన ఆకారంగలవాడు, కుంభం, కుందపుష్పం, చంద్రుణ్ణి అలంకారరూపంగా ధరించేవాడు, బడబాగ్నివిరోధి, బడబయొక్క ముఖాన్ని భేదించేవాడు, చతుష్పాదుడు, పాలసముద్రంతో సమానమైన కాంతిగలవాడు, రుద్రులతోను, గణేశ్వరులతోను కలిసి ఎల్లప్పుడూ రుద్రలోకంలో ఉండేవాడు, విశ్వాన్ని ధరించేవాడు, సంపూర్ణజగత్తునకు తండ్రి అయినవాడు, నంద మొదలైన మాతలతో చుట్టుకుని

ఉండేవాడు. యజ్ఞవినాశకుడు అట్లే శివార్చనపరాయణుడు అయిన వృషేంద్రుడు నా పాపాన్ని సదా దూరం చేయాలి.

**గంగా మాతా జగన్మాతా రుద్రలోకే వ్యవస్థితా ।**
**శివభక్తా తు యా నందా సా మే పాపం వ్యపోహతు ॥88॥**

**భద్రా భద్రపదా దేవీ శివలోకే వ్యవస్థితా ।**
**మాతా గవాం మహాభాగా సా మే పాపం వ్యపోహతు ॥89॥**

శివలోకంలో ఉన్నటువంటి జగజ్జనని గంగామాత నా పాపాన్ని దూరం చేయాలి. శివభక్తురాలైన నందా అనే పేరుగల గోవు నా పాపాన్ని దూరం చేయాలి. భద్రపద, శివలోకస్థిత, గోవులకు తల్లి, మహాభాగ్యశాలిని అయిన భద్రఅనే పేరుగల గోవు నా పాపాల్ని దూరం చేయాలి.

**సురభిః సర్వతోభద్రా సర్వపాపప్రణాశనీ ।**
**రుద్రపూజరతా నిత్యం సా మే పాపం వ్యపోహతు ॥90॥**

అన్నివిధాల కల్యాణకారి, సర్వపాపసంహారిణి, నిత్యం శివపూజాతత్పర, అయిన సురభి అనే గోవు నా పాపాన్ని దూరం చేయాలి.

**సుశీలా శీలసంపన్నా శ్రీప్రదా శివభావితా ।**
**శివలోకే స్థితా నిత్యం సా మే పాపం వ్యపోహతు ॥91॥**

శీలసంపన్న, ఐశ్వర్యప్రదాయని, శివభక్తురాలు, నిత్యం శివలోకనివాసిని, అయిన సుశీల అనే పేరుగల ఆవు నా పాపాన్ని దూరం చేయాలి.

**వేదశాస్త్రార్థతత్త్వజ్ఞః సర్వకార్యాభిచింతకః ।**
**సమస్తగుణసంపన్నః సర్వదేవేశ్వరాత్మజః ॥92॥**

**జ్యేష్ఠః సర్వేశ్వరః సౌమ్యో మహావిష్ణుతనుః స్వయమ్ ।**
**ఆర్యః సేనాపతిః సాక్షాద్ గహనో మఖమర్దనః ॥93॥**

**ఐరావతగజారూఢః కృష్ణకుంచితమూర్ధజః ।**
**కృష్ణాంగో రక్తనయనః శశిపన్నగభూషణః ॥94॥**

**భూతైః ప్రేతైః పిశాచైశ్చ కూష్మాండైశ్చ సమావృతః ।**
**శివార్చనరతః సాక్షాత్ స మే పాపం వ్యపోహతు ॥95॥**

వేదశాస్త్రార్థాలు, తత్త్వాలు తెలిసినవాడు, సమస్తకార్యాల్ని గూర్చి ఆలోచించేవాడు, సర్వసుగుణ సముపేతుడు, సర్వదేవేశ్వరుడైనవాడి కుమారుడు, శ్రేష్ఠుడు, సర్వేశ్వరుడు, సౌమ్యుడు, స్వయంగా మహావిష్ణువు యొక్క విగ్రహస్వరూపుడు, దేవతలసేనాపతి, గంభీరస్వరూపుడు, యజ్ఞవినాశకుడు, ఐరావతగజాధిరూఢుడు, నల్లటి,

ఉంగరాల వంటి జుట్టుగలవాడు, నల్లటిశరీరాంగాలు గలవాడు, రక్తనేత్రుడు, చంద్రుడు, సర్పాలు ఆభరణాలుగా గలవాడు, భూతప్రేతాదులతో, పిశాచాలతో, కూష్మాండాలతో చుట్టియున్నవాడు, శివార్చనతత్పరుడు అయిన కాలభైరవస్వామి నా పాపాన్ని దూరం చేయాలి.

**బ్రహ్మాణీ చైవ మాహేశీ కౌమారీ వైష్ణవీ తథా ।**
**వారాహీ చైవ మాహేంద్రీ చాముండాగ్నేయికా తథా ॥96॥**

**ఏతా వై మాతరః సర్వాః సర్వలోకప్రపూజితాః ।**
**యోగినీభిర్మహాపాపం వ్యపోహంతు సమాహితాః ॥97॥**

సమస్తలోక పూజితలు మరియు యోగినుల చేత చుట్టుకొనియున్న బ్రహ్మాణి, మాహేశీ, కౌమారీ, వైష్ణవీ, వారాహి, మాహేంద్రి, చాముండ, ఆగ్నేయిక అనే మహామాతలందరూ నా పాపాన్ని దూరం చేయాలి.

**వీరభద్రో మహాతేజా హిమకుందేందుసన్నిభః ।**
**రుద్రస్య తనయో రౌద్రః శూలాసక్తమహాకరః ॥98॥**

**సహస్రబాహుః సర్వజ్ఞః సర్వాయుధధరః స్వయమ్ ।**
**త్రేతాగ్నినయనో దేవస్త్రైలోక్యాభయదః ప్రభుః ॥99॥**

**మాతౄణాం రక్షకో నిత్యం మహావృషభవాహనః ।**
**త్రైలోక్యనమితః శ్రీమాన్ శివపాదార్చనే రతః ॥100॥**

**యజ్ఞస్య చ శిరశ్ఛేత్తా పూష్ణో దంతవినాశనః ।**
**వహ్నేర్హస్తహరః సాక్షాద్ భగనేత్రనిపాతనః ॥101॥**

**పాదాంగుష్ఠేన సోమాంగపేషకః ప్రభుసంజ్ఞకః ।**
**ఉపేంద్రేంద్రయమాదీనాం దేవానామంగరక్షకః ॥102॥**

**సర్వస్వత్యా మహాదేవ్యా నాసికోష్ఠావకర్తనః ।**
**గణేశ్వరో యః సేనానీః స మే పాపం వ్యపోహతు ॥103॥**

మహాతేజస్వంతుడు, హిమంతో, మల్లెపూవుతో, చంద్రుడితో సమానమైనవాడు, రుద్రుని పుత్రుడు, భయానకుడు, శూలాన్ని ధరించిన విశాలమైన భుజాలు గలవాడు, సహస్రభుజుడు, సర్వజ్ఞుడు, సమస్తమైన ఆయుధాల్ని ధరించినవాడు, త్రేతాగ్నిరూపనేత్రుడు, దేవస్వరూపుడు, ముల్లోకాలకు అభయప్రదాత, ఐశ్వర్యశాలి, ఎల్లప్పుడు మాతల్ని రక్షించువాడు, మహావృషభాన్ని వాహనంగా గలవాడు త్రిలోకవందితుడు, శ్రీమంతుడు, శివపదార్చనరతుడు, యజ్ఞంలో శిరస్సు ఖండించినవాడు, పూషుడి దంతాలు ఊడగొట్టినవాడు, అగ్నిదేవుడి చేతిని విరిచినవాడు, భగుడి యొక్క కంటిని క్రిందపడవేసివాడు, తనకాలి బొటని వ్రేలితో చంద్రుడి అంగాల్ని పీడించినవాడు, ప్రభువు అనే పేరుగలవాడు, ఉపేంద్రుడు, ఇంద్రుడు, యముడు మొదలైన దేవతలయొక్క అంగరక్షకుడు, మహాదేవి సరస్వతియొక్క పెదవుల్ని, ముక్కును కోసినవాడు, గణనాథుడు అట్లే సేనానాయకుడు అయిన వీరభద్రస్వామి నా పాపాన్ని దూరం చేయాలి.

**జ్యేష్ఠా వరిష్ఠా వరదా వరాభరణభూషితా ।**
**మహాలక్ష్మీర్జగన్మాతా సా మే పాపం వ్యపోహతు ॥104॥**

**మహామోహా మహాభాగా మహాభూతగణైర్వృతా ।**
**శివార్చనరతా నిత్యం స మే పాపం వ్యపోహతు ॥105॥**

**లక్ష్మీః సర్వగుణోపేతా సర్వలక్షణసంయుతా ।**
**సర్వదా సర్వగా దేవీ సా మే పాపం వ్యపోహతు ॥106॥**

**సింహారూఢా మహాదేవీ పార్వత్యాస్తనయావ్యయా ।**
**విష్ణోర్నిద్రా మహామాయా వైష్ణవీ సురపూజితా ॥107॥**

**త్రినేత్రా వరదా దేవీ మహిషాసురమర్దినీ ।**
**శివార్చనరతా దుర్గా సా మే పాపం వ్యపోహతు ॥108॥**

జ్యేష్ఠురాలు, వరిష్ఠురాలు, వరదాయిని, మంచి అలంకారాలు ధరించినది, అట్లే జగజ్జనని అయిన మహాలక్ష్మి నా పాపాన్ని దూరం చేయాలి. మహాభాగ్యవతి, పెద్ద పెద్ద భూతగణాలతో కూడియున్నట్టిది, ఎల్లప్పుడూ శివార్చనరత, మహామోహంగలది అనగా మహామాయ – ఆమె నా పాపాన్ని దూరం చేయాలి. సర్వగుణసంపన్న, సర్వలక్షణలక్షిత, సర్వాన్ని ఇచ్చేది, ఎక్కడికైనా వెళ్లేది అయిన లక్ష్మీదేవి నా పాపాన్ని దూరం చేయాలి. సింహం వాహనంగా గలది, పార్వతీదేవి యొక్క కుమార్తె, శాశ్వతమైనది, విష్ణువు యొక్క నిద్రారూప, మహామాయ, వైష్ణవి, దేవతలచేత పూజింపబడేది, త్రినేత్రి, వరాలనిచ్చేది మహిషాసురమర్దిని, శివార్చన తత్పర, మహాదేవి, భగవతి, దుర్గాదేవి నా పాపాన్ని దూరం చేయాలి.

**బ్రహ్మాండధారకా రుద్రాః సర్వలోకప్రపూజితాః ।**
**సత్యాశ్చ మానసాః సర్వే వ్యపోహంతు భయం మమ ॥109॥**

బ్రహ్మాండాల్ని ధరించేవాళ్ళు, సమస్తలోకాలతో పూజింపబడేవాళ్లు సత్యమూ మరియు మానసస్వరూపులూ అయిన రుద్రులు నా పాపాన్ని దూరం చేయాలి.

**భూతాఃప్రేతాః పిశాచాశ్చ కూష్మాండగణనాయకాః ।**
**కూష్మాండకాశ్చ తే పాపం వ్యపోహంతు సమాహితాః ॥110॥**

భూతాలు, ప్రేతాలు, పిశాచాలు, కూష్మాండగణాలకు నాయకులు, కూష్మాండులు వీళ్లు సమాహితచిత్తులై నా పాపాన్ని దూరం చేయాలి.

**అనేన దేవం స్తుత్వా తు చాంతే సర్వం సమాపయేత్ ।**
**ప్రణమ్య శిరసా భూమౌ ప్రతిమాసే ద్విజోత్తమాః ॥111॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! ప్రతిమాసంలో ఈ వ్యపోహనస్తోత్రంతో శివభగవానుణ్ణి స్తుతించి శిరసును భూమికి తాకించి నమస్కరించి చివరిగా సంపూర్ణమైన అనుష్ఠానాన్ని ముగించాలి.

**వ్యపోహనస్తవం దివ్యం యః పఠేచ్ఛృణుయాదపి ।**
**విధూయ సర్వపాపాని రుద్రలోకే మహీయతే ॥112॥**

ఈ దివ్యమైన వ్యపోహనస్తవాన్ని పఠించినవాడు, విన్నవాడూ సర్వపాపవిముక్తులై శివలోకాన్ని పొందుతారు.

**కన్యార్థీ లభతే కన్యాం జయకామో జయం లభేత్ ।**
**అర్థకామో లభేదర్థం పుత్రకామో బహూన్ సుతాన్ ॥113॥**
**విద్యార్థీ లభతే విద్యాం భోగార్థీ భోగమాప్నుయాత్ ।**
**యాన్యాన్ ప్రార్థయతే కామాన్ మానవః శ్రవణాదిహ ॥114॥**

**తాన్ సర్వాన్ శీఘ్రమాప్నోతి దేవానాం చ ప్రియో భవేత్ ।**
**పఠ్యమానమిదం పుణ్యం యముద్దిశ్య తు పఠ్యతే ॥115॥**

**తస్య రోగా న బాధంతే వాతపిత్తాదిసంభవాః ।**
**నాకాలే మరణం తస్య న సర్పైరపి దంశ్యతే ॥116॥**

కన్యాభిలాషి కన్యను పొందుతాడు. విజయాభిలాషి విజయాన్ని పొందుతాడు. అర్థాభిలాషి అర్థాన్ని పొందుతాడు. పుత్రాభిలాషి బహుపుత్రుల్ని పొందుతాడు. విద్యార్థి విద్యను, భోగార్థి భోగాల్ని పొందుతాడు. మానవుడు ఏఏ కోరికల్ని కోరుతున్నాడో ఈ స్తోత్రాన్ని వినడం వల్ల ఈ లోకంలో వాటినన్నింటిని త్వరగా పొందుతాడు మరియు దేవతలకు ప్రియుడవుతాడు. ఎవడు ఈ పుణ్యస్తవాన్ని పఠిస్తాడో వాడిని వాతం, పిత్తం మొదలైన వాటివల్ల కలిగే రోగాలు బాధించవు. అకాలమరణం రాదు. సర్పాలు కాటు వేయవు.

**యత్పుణ్యం చైవ తీర్థానాం యజ్ఞానాం చైవ యత్ఫలమ్ ।**
**దానానాం చైవ యత్పుణ్యం వ్రతానాం చ విశేషతః ॥117॥**
**తత్పుణ్యం కోటిగుణితం జప్త్వా చాప్నోతి మానవః ।**
**గోఘ్నశ్చైవ కృతఘ్నశ్చ వీరహా బ్రహ్మహా భవేత్ ॥118॥**

**శరణాగతఘాతీ చ మిత్రవిశ్వాసఘాతకః ।**
**దుష్టః పాపసమాచారో మాతృహా పితృహా తథా ॥119॥**

**వ్యపోహ్య సర్వపాపాని శివలోకే మహీయతే ॥120॥**

తీర్థయాత్రలు చేయడంవల్ల, యజ్ఞాలు చేయడం వల్ల, దానాలు చేయడంవల్ల విశేషవ్రతాచారణం వల్ల ఏ ఫలం, పుణ్యం వస్తుందో దానికి కోటిరెట్లు పుణ్యం, ఫలం ఈ స్తోత్రం పఠించడం వల్ల మానవుడికి వస్తున్నది. గోహంతకుడు, చేసిన మేలు మరచినవాడు, వీరుణ్ణి చంపినవాడు, బ్రహ్మ హత్య చేసినవాడు, శరణుజొచ్చినవాణ్ణి వధించినవాడు, మిత్రుడి విషయంలో విశ్వాసాన్ని నశింపజేసినవాడు, దుష్టుడు, పాపమయమైన ఆచారాలు చేసేవాడు, మరియు మాతాపితృఘాతకుడు కూడా ఈ స్తవం పఠించడంవల్ల సర్వపాపాలనుంచి విముక్తుడై శివలోకాన్ని పొందుతున్నాడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే వ్యపోహనస్తవనిరూపణం నామ ద్వ్యశీతితమోఽధ్యాయః ॥82॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని వ్యపోహనస్తవనిరూపణమనే ఎనభై రెండవ అధ్యాయం సమాప్తం.

## **త్ర్యశీతితమోఽధ్యాయః** – ఎనబై మూడవ అధ్యాయం

## **శివవ్రతకథనమ్** – శివవ్రతకథనం

**ఋషయ ఊచుః** – మునులు పలికారు.

**వ్యపోహనస్తవం పుణ్యం శ్రుతమస్మాభిరాదరాత్ ।**
**ప్రసంగాల్లింగదానస్య వ్రతాన్యపి వదస్వ నః ॥1॥**

ఓ సూతమహర్షీ! మేము ఆదరంగా పవిత్రమైన వ్యపోహనస్తవాన్ని విన్నాం. ఇపుడు నీవు మాకు లింగసంబంధమైన దానవ్రతాన్ని గూర్చి చెప్పండి!

**వ్రతాని వః ప్రవక్ష్యామి శుభాని మునిసత్తమాః ।**
**నందినా కథితానీహ బ్రహ్మపుత్రాయ ధీమతే ॥2॥**

**తాని వ్యాసాదుపశ్రుత్య యుష్మాకం వదామ్యహమ్ ।**

ఓ మునిశ్రేష్ఠులారా! నేను మీకు శుభవ్రతాల్ని చెప్పుతాను. బుద్ధిమంతుడు బ్రహ్మకుమారుడు అయిన సనత్కుమారుడికి నంది చెప్పిన వ్రతాల్ని నేను వ్యాసుడి వల్ల విన్నవాటిని మీకు చెప్పుతున్నాను.

**అష్టమ్యాం చ చతుర్దశ్యాం పక్షయోర్యుభయోరపి ॥3॥**

**వర్షమేకం తు భుంజానో నక్తం యః పూజయేచ్ఛివమ్ ।**
**సర్వయజ్ఞఫలం ప్రాప్య స యాతి పరమాం గతిమ్ ॥4॥**

**పృథివీం భాజనం కృత్వా భుక్త్వా పర్వసు మానవః ।**
**అహోరాత్రేణ చైకేన త్రిరాత్రఫలమశ్నుతే ॥5॥**

ఒక సంవత్సరకాలం రెండుపక్షాలలో (శుక్లకృష్ణపక్షాలు) అష్టమి, అట్లే చతుర్దశి తిథుల్లో కేవలం రాత్రిపూటమాత్రమే ఆహారం తీసుకుంటూ ఏ మానవుడు శివుణ్ణి పూజిస్తాడో ఆతడు సర్వయజ్ఞఫలాన్ని పొంది పరమపదాన్ని పొందుతున్నాడు. పర్వాలల్లో ఒకరోజు రాత్రి ఈ వ్రతాన్ని చేసి మరియు భూమినే ఆహారస్వీకారానికి ఉపయోగించే పళ్లెంగా చేసుకుని (అనగా నేలమీదనే) భోజనం చేసిన మానవుడు మూడు రాత్రుళ్ల ఫలాన్ని పొందుతున్నాడు.

**ద్వయోర్మాసస్య పంచమ్యోర్ద్వయోః ప్రతిపదోర్నరః ।**
**క్షీరధారావ్రతం కుర్యాత్సోఽశ్వమేధఫలం లభేత్ ॥6॥**

**కృష్ణాష్టమ్యాం తు నక్తేన యావత్కృష్ణచతుర్దశీ ।**
**భుంజన్ భోగానవాప్నోతి బ్రహ్మలోకం చ గచ్ఛతి ॥7॥**

ఏ మానవుడు నెలలో పంచమి అట్లే ప్రతిపత్తు (పాడ్యమి) తిథులలో క్షీరధారావ్రతాన్ని నిర్వహిస్తాడో అనగా కేవలం పాలనే ఆహారంగా తీసుకుంటాడో ఆతడు అశ్వమేధయజ్ఞఫలాన్ని పొందుతున్నాడు. కృష్ణపక్షం యొక్క అష్టమి నుంచి కృష్ణపక్షం చతుర్దశి వరకు రాత్రులందు మాత్రమే భోజనం చేస్తాడో ఆతడు భోగాలు పొందుతున్నాడు. చివరకు బ్రహ్మలోకాన్ని పొందుతున్నాడు.

**యో౽బ్దమేకం ప్రకుర్వీత నక్తం పర్వసు పర్వసు ।**
**బ్రహ్మచారీ జితక్రోధః శివధ్యానపరాయణః ॥8॥**

**సంవత్సరాంతే విప్రేంద్రాన్ భోజయేద్విధిపూర్వకమ్ ।**
**స యాతి శాంకరం లోకం నాత్ర కార్యా విచారణా ॥9॥**

బ్రహ్మచారి అయిన ఏమానవుడు, క్రోధాన్ని జయించినవాడై, శివధ్యానపరాయణుడై ఒక సంవత్సరకాలం అన్ని పర్వాలలోను రాత్రి వ్రతాన్ని చేస్తాడో మరియు సంవత్సరాంతంలో శ్రేష్ఠవిప్రులకు విధిపూర్వకంగా భోజనం పెడతాడో ఆతడు శివలోకానికి వెళుతున్నాడు. ఇందుకు సందేహించ పనిలేదు.

**ఉపవాసాత్పరం భైక్ష్యం భైక్ష్యాత్పరమయాచితమ్ ।**
**అయాచితాత్పరం నక్తం తస్మాన్నక్తేన వర్తయేత్ ॥10॥**

ఉపవాసం చేయకుండా భిక్ష తెచ్చుకుని తినడం మంచిది. భిక్షకై యాచన చేయకుండా లభించిన భోజనాన్ని తినడం మంచిది. అయాచితంగా లభించిన భోజనాన్ని తినడం కంటే రాత్రి మాత్రమే భోజనం తినడం ఉత్తమం. అందుచే రాత్రి వ్రతాన్ని ఆచరించాలి.

**దేవైర్భుక్తం తు పూర్వాహ్ణే మధ్యాహ్నే ఋషిభిస్తథా ।**
**అపరాహ్ణే చ పితృభిః సంధ్యాయాం గుహ్యకాదిభిః ॥11॥**

**సర్వవేలామతిక్రమ్య నక్తభోజనముత్తమమ్ ।**
**హవిష్యభోజనం స్నానం సత్యమాహారలాఘవమ్ ॥12॥**

**అగ్నికార్యమధః శయ్యాం నక్తభోజీ సమాచరేత్ ।**

పూర్వాహ్ణంలో చేసే భోజనం దేవతలకు, మధ్యాహ్నంలో ఋషులకు, అపరాహ్ణంలో పితరులకు మరియు సంధ్యాసమయంలో గుహ్యకులకు చెందుతుంది. అందుచే అన్ని కాలాలకంటే భిన్నమైన రాత్రియందు చేసే భోజనం ఉత్తమమైంది. రాత్రి భోజనం చేసేవాళ్లు హవిష్యాన్నాన్ని గ్రహించాలి. స్నానం చెయ్యాలి. సత్యపాలన చేయాలి, తక్కువగా తినాలి. అగ్నికార్యం చేయాలి. భూమిమీద పడుకోవాలి.

**ప్రతిమాసం ప్రవక్ష్యామి శివవ్రతమనుత్తమమ్ ॥13॥**
**ధర్మకామార్థమోక్షార్థం సర్వపాపవిశుద్ధయే ।**

నేనిపుడు ప్రతిమాసంలోనూ నిర్వహించే ఉత్తమమైన శివవ్రతాన్ని గూర్చి చెబుతాను. ఏది ధర్మార్థకామమోక్ష సాధకమో మరియు ఏది సర్వపాపహరమో దాన్ని గూర్చి వివరిస్తాను.

**పుష్యమాసే చ సంపూజ్య యః కుర్యాన్నక్తభోజనమ్ ॥14॥**

**సత్యవాదీ జితక్రోధః శాలిగోధూమగోరసైః ।**
**పక్షయోరష్టమీం యత్నాదుపవాసేన వర్తయేత్ ॥15॥**

**భూమిశయ్యాం చ మాసాంతే పౌర్ణమాస్యాం ఘృతాదిభిః ।**
**స్నాప్య రుద్రం మహాదేవం సంపూజ్య విధిపూర్వకమ్ ॥16॥**

**యావకం చౌదనం దత్త్వా సక్షీరం సఘృతం ద్విజాః ।**
**భోజయేద్ బ్రాహ్మణాన్ శిష్టాన్ జపేచ్ఛాంతిం విశేషతః ॥17॥**

**తథా గోమిథునం చైవ కపిలం వినివేదయేత్ ।**
**భవాయ దేవదేవాయ శివాయ పరమేష్ఠినే ॥18॥**

**స యాతి మునిశార్దూల వాహ్నేయం లోకముత్తమమ్ ।**
**భుక్త్వా స విపులాన్ లోకాన్ తత్రైవ స విముచ్యతే ॥19॥**

సత్యవాది, జితక్రోధుడు అయిన మానవుడు పుష్యమాసంలో శివుణ్ణి విధ్యనుసారంగా పూజించి, బియ్యంతో, గోధుమలతో, ఆవుపాలతో చేసిన భోజనాన్ని కేవలం రాత్రిపూట గ్రహిస్తాడో, రెండు పక్షాలలో ప్రయత్నపూర్వకంగా అష్టమితిథిలో ఉపవాసం చేస్తాడో, భూమిపై శయనిస్తాడో, మాసాంతంలో పూర్ణిమనాడు నెయ్యి మొదలైనవాటితో రుద్రభగవానుడికి స్నానం చేయించి, విధ్యనుసారంగా ఆయన్ని పూజించి, ఉత్తమబ్రాహ్మణులకు పాలతో, నేతితో వండిన యవలు లేక బియ్యంతో చేసిన భోజనాన్ని సమర్పిస్తాడో, ఇట్లే విశేషరూపంగా శాంతిమంత్రాన్ని జపిస్తాడో మరియు దేవదేవుడు, భవుడు, పరమేశ్వరశివుడికి కపిలవర్ణగోవులజంటను (ఆవును- ఎద్దును) సమర్పిస్తాడో ఆతడు ఉత్తమమైన అగ్నిలోకానికి వెళుతున్నాడు. మరియు అనేకలోకసుఖభోగాల్ని అనుభవించి అచ్చటనే విముక్తుడవుతున్నాడు.

**మాఘమాసే తు సంపూజ్య యః కుర్యాన్నక్తభోజనమ్ ।**
**కృశరం ఘృతసంయుక్తం భుంజానః సంయతేంద్రియః ॥20॥**

**సోపవాసం చతుర్దశ్యాం భవేదుభయపక్షయోః ।**
**రుద్రాయ పౌర్ణమాస్యాం తు దద్యాద్వై ఘృతకంబలమ్ ॥21॥**

**కృష్ణం గోమిథునం దద్యాత్పూజయేచ్చైవ శంకరమ్ ।**
**భోజయేత్ బ్రాహ్మణాంశ్చైవ యథావిభవవిస్తరమ్ ॥22॥**

**యామ్యమాసాద్య వై లోకం యమేన సహ మోదతే ।**

ఏ మానవుడు మాఘమాసంలో శివుణ్ణి పూజించి కేవలం రాత్రి భోజనం చేస్తున్నాడో, నేతితోకూడిన స్వల్పాహారాన్ని తీసుకుంటున్నాడో, ఇంద్రియాల్ని తన వశమందు ఉంచుకుంటున్నాడో, రెండు పక్షాలలోనూ చతుర్దశినాడు ఉపవసిస్తున్నాడో పౌర్ణమినాడు శివుడికి ఘృతకంబళిని సమర్పిస్తున్నాడో, నల్లటి గోమిథునాన్ని

దానం చేస్తున్నాడో, శివుణ్ణి పూజిస్తున్నాడో, శక్త్యనుసారంగా బ్రాహ్మణులకు భోజనం సమకూర్చుతున్నాడో ఆ మానవుడు యమలోకాన్ని పొంది యముడితోపాటు ఆనందిస్తున్నాడు.

**ఫాల్గునే చైవ సంప్రాప్తే కుర్యాద్వై నక్తభోజనమ్ ॥23॥**

**శ్యామాకాన్నఘృతక్షీరైర్జితక్రోధో జితేంద్రియః ।**
**చతుర్దశ్యామథాష్టమ్యాముపవాసం చ కారయేత్ ॥24॥**

**పౌర్ణమాస్యాం మహాదేవం స్నాప్య సంపూజ్య శంకరమ్ ।**
**దద్యాద్ గోమిథునం వాపి తామ్రాభం శూలపాణయే ॥25॥**

**బ్రాహ్మణాన్ భోజయిత్వా తు ప్రార్థయేత్పరమేశ్వరమ్ ।**
**స యాతి చంద్రసాయుజ్యం నాత్ర కార్యా విచారణా ॥26॥**

ఫాల్గునమాసం రాగానే పాలతో, నేతితో వండిన శ్యామకధాన్యం యొక్క అన్నాన్ని రాత్రిపూట ఎవడు తింటున్నాడో, ఇంద్రియాల్ని, క్రోధాన్ని వశపర్చుకుంటున్నాడో, అష్టమి, చతుర్దశి తిథుల్లో ఉపవసిస్తున్నాడో, పూర్ణిమ దినంలో మహాదేవుడికి స్నానం చేయించి, శూలపాణి అయిన ఆయన్ని పూజించి, బ్రాహ్మణులకు భోజనం కల్పించి పరమేశ్వరుడిని ప్రార్థిస్తాడో ఆతడు చంద్రుడి సాయుజ్యాన్ని పొందుతున్నాడు. ఇందుకు ఎటువంటి సందేహం లేదు.

**చైత్రేఽపి రుద్రమభ్యర్చ్య కుర్యాద్వై నక్తభోజనమ్ ।**
**శాల్యన్నం పయసా యుక్తం ఘృతేన చ యథా సుఖమ్ ॥27॥**

**గోష్ఠశాయీ మునిశ్రేష్ఠాః క్షితౌ నిశి భవం స్మరేత్ ।**
**పౌర్ణమాస్యాం శివం స్నాప్య దద్యాద్ గోమిథునం సితమ్ ॥28॥**

**బ్రాహ్మణాన్ భోజయేచ్చైవ నిరృతేః స్థానమాప్నుయాత్ ।**

ఓ శ్రేష్ఠమునులారా! చైత్రమాసంలో కూడా రుద్రుణ్ణి పూజించి రాత్రిపూట శాలిధాన్యం యొక్క బియ్యాన్ని పాలతో నేతితో రుచిగా వండిన ఆ భోజనం చెయ్యాలి. రాత్రిపూట గోశాలలో భూమిపై పడుకుని రుద్రుణ్ణి స్మరించాలి. పూర్ణిమనాడు శివుడికి స్నానం చేయించి తెల్లటి గోమిథునాన్ని సమర్పించాలి. బ్రాహ్మణులకు భోజనం ఏర్పాటు చేయాలి. అపుడు ఆతడు నిరృతిలోకాన్ని పొందుతాడు.

**వైశాఖే చ తథా మాసే కృత్వా వై నక్తభోజనమ్ ॥29॥**

**పౌర్ణమాస్యాం భవం స్నాప్య పంచగవ్యఘృతాదిభిః ।**
**శ్వేతం గోమిథునం దత్త్వా సోఽశ్వమేధఫలం లభేత్ ॥30॥**

వైశాఖమాసమందు కూడా రాత్రిభోజనం చేసి, పూర్ణిమనాడు పాలు, పెరుగు మొదలైన పంచగవ్యాలతోను, నేతితోను శివుడికి స్నానం చేయించి, తెల్లటి గోమిథునాన్ని దానం చేసి అశ్వమేధయజ్ఞఫలాన్ని పొందాలి.

**జ్యేష్ఠే మాసే చ దేవేశం శర్వముమాపతిమ్ ।**
**సంపూజ్య శ్రద్ధయా భక్త్యా కృత్వా వై నక్తభోజనమ్ ॥31॥**

**రక్తశాల్యన్నమధ్వా చ అద్భిః పూతం ఘృతాదిభిః ।**
**వీరాసనీ నిశార్ధం చ గవాం శుశ్రూషణే రతః ॥32॥**

**పౌర్ణమాస్యాం తు సంపూజ్య దేవదేవముమాపతిమ్ ।**
**స్నాప్య శక్త్యా యథాన్యాయం చరుం దద్యాచ్చ శూలినే ॥33॥**

**బ్రాహ్మణాన్ భోజయిత్వా చ యథా విభవవిస్తరమ్ ।**
**ధూమ్రం గోమిథునం దత్త్వా వాయులోకే మహీయతే ॥34॥**

జ్యేష్ఠమాసంలో దేవేశ్వరుడు, శర్వుడు, ఉమాపతి అయిన శివుణ్ణి శ్రద్ధతో, భక్తితో, బాగా పూజించి తేనె, నీరు, నేయితో కూడిన పరిశుభ్రమైన శాలి బియ్యపు అన్నాన్ని రాత్రికి భుజించి, వీరాసనమందుండి అర్ధరాత్రివరకు గోసేవలో ప్రీతితో ఉండాలి. పూర్ణిమనాడు ఉమాపతి దేవదేవుడికి స్నానం చేయించి పూజించాలి. విధ్యనుసారంగా శూలపాణికి 'చరువును' సమర్పించాలి. ఐశ్వర్యానికి తగిన విధంగా బ్రాహ్మణులకు భోజనం ఏర్పాటు చేసి, ధూమ్రవర్ణంగల గోమిథునాన్ని శివుడికి దానమిస్తే వాయులోకంలో ప్రతిష్ఠ పొందుతారు.

**ఆషాఢే మాసి చాప్యేవం నక్తభోజనతత్పరః ।**
**భూరిఖండాజ్యసమ్మిశ్రం సక్తుభిశ్చైవ గోరసమ్ ॥35॥**

**పౌర్ణమాస్యాం ఘృతాద్యైస్తు స్నాప్య పూజ్య యథావిధి ।**
**బ్రాహ్మణాన్ భోజయిత్వా శ్రోత్రియాన్ వేదపారగాన్ ॥36॥**

**దద్యాద్ గోమిథునం గౌరం వారుణం లోకమాప్నుయాత్ ।**

ఆషాఢమాసమందు కూడా అధికమైన పంచదారతో, నేతితో, పాలతో, పెరుగుతో సమ్మిశ్రితమైన పేలపిండిని నక్తభోజనరతుడు భుజించాలి. పూర్ణిమనాడు ఘృతాదులతో శివుడికి అభిషేకం చేసి యథావిధి పూజించి, వేదవిదులు, శ్రోత్రియులు అయిన బ్రాహ్మణులకు భోజనం ఏర్పాటు చేసి, శివుడికి గౌరగోమిథునాన్ని దానం చెయ్యాలి. అపుడాతడు వరుణలోకాన్ని పొందుతాడు.

**శ్రావణే చ ద్విజా మాసే కృత్వా వై నక్తభోజనమ్ ॥37॥**

**క్షీరషష్టికభక్తేన సంపూజ్య వృషభధ్వజమ్ ।**
**పౌర్ణమాస్యాం ఘృతాద్యైస్తు స్నాప్య పూజ్య యథావిధి ॥38॥**

**బ్రాహ్మణాన్ భోజయిత్వా చ శ్రోత్రియాన్ వేదపారగాన్ ।**
**శ్వేతాగ్రపాదం పౌండ్రం చ దద్యాద్ గోమిథునం పునః ॥39॥**

**స యాతి వాయుసాయుజ్యం వాయువత్సర్వగో భవేత్ ।**

ఓ బ్రాహ్మణులారా! శ్రావణమాసంలో పాలతో కలిపిన అరవైరోజుల్లో పండిన శాలిబియ్యంతో వండిన దాన్ని రాత్రికి భుజించి, వృషభధ్వజుడైన శివుణ్ణి పూజించి, చివరిగా పూర్ణిమరోజు శివుడికి ఘృతాదులతో స్నానం చేయించి, విధిపూర్వకంగా పూజించి, వేదపారంగతులు, శ్రోత్రియులు అయిన బ్రాహ్మణులకు భోజనం పెట్టి, శివుడికి ఒక చెరుకుగడను, తెల్లటి ముందు పాదం గల గోమిథునాన్ని దానం చెయ్యాలి. అపుడాతడు వాయువు యొక్క సాయుజ్యం పొంది వాయువువలె సర్వగమనుడు కాగలడు.

**ప్రాప్తే భాద్రపదే మాసే కృత్వైవం నక్తభోజనమ్ ॥40॥**

**హుతశేషం చ విప్రేంద్రాన్ వృక్షమూలాశ్రితో దివా ।**
**పౌర్ణమాస్యాం తు దేవేశం స్నాప్య సంపూజ్య శంకరమ్ ॥41॥**

**నీలస్కంధం వృషం గాం చ దత్త్వా భక్త్యా యథావిధి ।**
**బ్రాహ్మణాన్ భోజయిత్వా చ వేదవేదాంగపారగాన్ ॥42॥**

**యక్షలోకమనుప్రాప్య యక్షరాజో భవేన్నరః ।**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! భాద్రపదమాసం రాగానే హోమం చేయగా మిగిలిన పదార్థాన్ని రాత్రిభోజనంగా తీసుకుని, పగటిపూట వృక్షమూలాన్నే ఆశ్రయించి, విశ్రమించి, పూర్ణిమనాడు శంకరుణ్ణి అభిషేకించి, పూజించి, నల్లని భుజాలుగల గోమిథునాన్ని శివుడికి భక్తితో సమర్పించి, వేదవేదాంగపారగులైన విప్రులికి భోజనం పెట్టిన మానవుడు యక్షలోకాన్ని పొంది యక్షరాజు కాగలడు.

**తతశ్చాశ్వయుజే మాసి కృత్వైవం నక్తభోజనమ్ ॥43॥**

**సఘృతం శంకరం పూజ్య పౌర్ణమాస్యాం చ పూర్వవత్ ।**
**బ్రాహ్మణాన్ భోజయిత్వా చ శివభక్తాన్ సదా శుచీన్ ॥44॥**

**వృషభం నీలవర్ణాభమురోదేశసమున్నతమ్ ।**
**గాం చ దత్త్వా యథాన్యాయమైశానం లోకమాప్నుయాత్ ॥45॥**

తర్వాత ఆశ్వయుజమాసంలో ఘృతాదులతో కూడిన రాత్రిభోజనాన్ని చేసి, పూర్ణిమనాడు ఇంతకుముందు విధంగానే శివుణ్ణి పూజించి ఎల్లప్పుడు శుచిమంతులు, శివభక్తులు అయిన బ్రాహ్మణులకు భోజనం పెట్టి, నల్లని రంగుగల, ఎత్తైన ఉరోభాగంగల ఎద్దును, ఆవును విధిపూర్వకంగా శివుడికి సమర్పించి మానవుడు ఈశానలోకాన్ని పొందుతాడు.

**కార్తికే చ తథా మాసే కృత్వా వై నక్తభోజనమ్ ।**
**క్షీరోదనేన సాజ్యేన సంపూజ్య చ భవం ప్రభుమ్ ॥46॥**

**పౌర్ణమాస్యాం చ విధివత్స్నాప్య దత్త్వా చరుం పునః ।**
**బ్రాహ్మణాన్ భోజయిత్వా చ యథావిభవవిస్తరమ్ ॥47॥**

**దత్త్వా గోమిథునం చైవ కాపిలం పూర్వవద్ ద్విజాః ।**
**సూర్యసాయుజ్యమాప్నోతి నాత్ర కార్యా విచారణా ॥48॥**

ఓ ద్విజులారా! కార్తికమాసంలో రాత్రిపూట నేతితో కూడిన పాలాన్నాన్ని భుజించి, భగవంతుడైన శివుణ్ణి పూజించి, చివరలో పూర్ణిమరోజున శివుడికి స్నానం చేయించి మరల ఆయనకు 'చరువు'ను నివేదించి, అర్పించి, శక్త్యనుసారం బ్రాహ్మణులకు భోజనం పెట్టి, పూర్వంలాగానే శివుడికి కపిలగోమిథునాన్ని సమర్పించి మానవుడు సూర్యసాయుజ్యాన్ని పొందుతాడు. ఇందులో ఎట్టి సందేహం లేదు.

**మార్గశీర్షే చ మాసేఽపి కృత్వైవం నక్తభోజనమ్ ।**
**యవాన్నేన యథాన్యాయమాజ్యక్షీరాదిభిః సమమ్ ॥49॥**

**పౌర్ణమాస్యాం చ పూర్వోక్తం కృత్వా శర్వాయ శంభవే ।**
**బ్రాహ్మణాన్ భోజయిత్వా చ దరిద్రాన్ వేదపారగాన్ ॥50॥**

**దత్త్వా గోమిథునం చైవ పాండురం విధిపూర్వకమ్ ।**
**సోమలోకమనుప్రాప్య సోమేన సహ మోదతే ॥51॥**

మార్గశిరమాసంలో కూడా విధిపూర్వకంగా సమంగా పాలతోను నేతితోను వండిన యవల బియ్యం అన్నాన్ని రాత్రి భోజనంగా స్వీకరించి చివరలో పూర్ణిమ రోజున పూర్వంలాగానే శివుడికి స్నానాన్ని చేయించి, పూజించి, వేదపారంగతులు, బీదలు అయిన బ్రాహ్మణులకు భోజనం పెట్టి, విధిపూర్వకంగా శివుడికి తెల్లటి గోమిథునాన్ని సమర్పించి మానవుడు సోమలోకాన్ని పొంది సోముడితోపాటు ఆనందిస్తాడు.

**అహింసా సత్యమస్తేయం బ్రహ్మచర్యం క్షమా దయా ।**
**త్రిఃస్నానం చాగ్నిహోత్రం చ భూశయ్యా నక్తభోజనమ్ ॥52॥**

**పక్షయోరుపవాసం చ చతుర్దశ్యష్టమీషు చ ।**
**ఇత్యేతదఖిలం ప్రోక్తం ప్రతిమాసం శివవ్రతమ్ ॥53॥**

**కుర్యాద్వర్షం క్రమేణైవ వ్యుత్క్రమేణాపి వా ద్విజాః ।**
**స యాతి శివసాయుజ్యం జ్ఞానయోగమవాప్నుయాత్ ॥54॥**

అహింస, సత్యం, అచౌర్యం, బ్రహ్మచర్యం, క్షమ, దయ, త్రికాలస్నానం, అగ్నికార్యం, భూశయనం, రాత్రిభోజనం మరియు రెండు పక్షాలలో అష్టమిరోజున చతుర్దశిలోను ఉపవాసం – ఇవన్నీ, అట్లే ప్రత్యేకమాసాలలో నేను చెప్పిన శివవ్రతాన్ని క్రమంగా గాని, విపరీతంగా గాని ఒక సంవత్సరం నిర్వహించిన మానవుడు శివసాయుజ్యాన్ని, జ్ఞానయోగాన్ని పొందుతాడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే శివవ్రతకథనం నామ త్ర్యశీతితమోఽధ్యాయః ॥ 83 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని శివవ్రతకథనమనే ఎనబైమూడవఅధ్యాయం సమాప్తం.

## చతురశీతితమోఽధ్యాయః – ఎనబై నాల్గవ అధ్యాయం

## ఉమామహేశ్వరవ్రతమ్ – ఉమామహేశ్వరవ్రతం

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఉమామహేశ్వరం వక్ష్యే వ్రతమీశ్వరభాషితమ్ ।**
**నరనార్యాదిజంతూనాం హితాయ మునిసత్తమాః ॥1॥**

**పౌర్ణమాస్యామమావాస్యాం చతుర్దశ్యష్టమీషు చ ।**
**నక్తమబ్దం ప్రకుర్వీత హవిష్యం పూజయేద్ధ్రువమ్ ॥2॥**

ఓ మునిశ్రేష్ఠులారా! నేనిపుడు స్త్రీ పురుషమానవులకు, సర్వప్రాణులకు హితకారి అయిన స్వయంగా ఈశ్వరుడే చెప్పిన ఉమామహేశ్వరవ్రతాన్ని గూర్చి చెబుతాను. సంవత్సరంలో అష్టమి, చతుర్దశి, పూర్ణిమ, అమావాస్య రాత్రులందు హవిస్సును తీసుకుని శివుణ్ణి అర్చించాలి.

**శైలాదిరువాచ** – శైలాదుడు (నంది) పలికాడు.

**ఉమామహేశ్వరప్రతిమాం హేమ్నా కృత్వా సుశోభనామ్ ।**
**రాజతీం వాథ వర్షాంతే ప్రతిష్ఠాప్య యథావిధి ॥3॥**

**బ్రాహ్మణాన్ భోజయిత్వా చ దత్త్వా శక్త్యా చ దక్షిణామ్ ।**
**రథాద్యైర్వాపి దేవేశం నీత్వా రుద్రాలయం ప్రతి ॥4॥**

**సర్వాతిశయసంయుక్తైః ఛత్రచామరభూషణైః ।**
**నివేదయేత్ వ్రతం చైవ శివాయ పరమేష్ఠినే ॥5॥**

**స యాతి శివసాయుజ్యం నారీ దేవ్యా యది ప్రభో ।**

ఓ ప్రభూ! సనత్కుమార! బంగారం లేక వెండితో ఉమామహేశ్వరుల యొక్క పరమసుందరమైన ప్రతిమను తయారుచేసి సంవత్సరం చివర విధ్యనుసారం ఆ ప్రతిమను ప్రతిష్ఠించి, బ్రాహ్మణులకు భోజనం పెట్టి, వాళ్లకు యథాశక్తి దక్షిణలిచ్చి, మిక్కిలి సుందరమైన ఛత్రచామరాలంకారాలతో నిండిన రథం మొదలైన వాహనాల మీద శివాలయానికి తీసుకుని పోయి ఈ వ్రతాన్ని పరమేశ్వరశివుడికి నివేదించాలి. అపుడాతడు శివుడి సాయుజ్యాన్ని పొందుతాడు. స్త్రీ అయితే ఉమాదేవి సాయుజ్యాన్ని పొందుతుంది.

**అష్టమ్యాంచ చతుర్దశ్యాం నియతా బ్రహ్మచారిణీ ॥6॥**

**వర్షమేకం న భుంజీత కన్యా వా విధవాపి వా ।**
**వర్షాంతే ప్రతిమాం కృత్వా పూర్వోక్తవిధినా తతః ॥7॥**

**ప్రతిష్ఠాప్య యథాన్యాయం దత్త్వా రుద్రాలయే పునః ।**
**బ్రాహ్మణాన్ భోజయిత్వా చ భవాన్యా సహ మోదతే ॥8॥**

**యా నార్యేవం చరేదబ్దం కృష్ణామేకాం చతుర్దశీమ్ ।**
**వర్షాంతే ప్రతిమాం కృత్వా యేన కేనాపి వా ద్విజాః ॥9॥**

**పూర్వోక్తమఖిలం కృత్వా భవాన్యా సహ మోదతే ।**

కన్యగాని లేక విధవగాని, ఒక సంవత్సరంపాటు అష్టమిలోను అట్లే చతుర్దశిలోను నియమపూర్వకంగా బ్రహ్మచారిణి అయి ఉండి భోజనం చేయరాదు. సంవత్సరం చివర పూర్వం చెప్పినట్లుగా విధ్యనుసారంగా ప్రతిమను నిర్మించి, దానిని ప్రతిష్ఠించి దాన్ని శివాలయానికి దానం చేయాలి. బ్రాహ్మణులకు భోజనం ఏర్పాటు చేయాలి. అటువంటి స్త్రీ పార్వతీదేవితో కలిసి ఆనందిస్తుంది. ఓ బ్రాహ్మణులురా! ఆ స్త్రీ వర్షపర్యంతం కేవలం కృష్ణపక్షంలో చతుర్దశినాడు మాత్రమే ఈ వ్రతాన్ని చేసి, సంవత్సరం చివర ఏదో ఒక లోహంతో (పదార్థంతో) ప్రతిమను నిర్మించి ఇంతకుముందు చెప్పిన విధంగా అన్ని కార్యాలు చేసి పార్వతీదేవితో కలిసి ఆనందాన్ని పొందుతుంది.

**అమావాస్యాం నిరాహారా భవేదబ్దం సుయంత్రితా ॥10॥**

**శూలం చ విధినా కృత్వా వర్షాంతే వినివేదయేత్ ।**
**స్నాప్యేశానం యజేద్ భక్త్యా సహస్రైః కమలైః సితైః ॥11॥**

**రాజతం కమలం చైవ జాంబూనదసుకర్ణికమ్ ।**
**దత్త్వా భవాయ విప్రేభ్యః ప్రదద్యాద్దక్షిణామపి ॥12॥**

**కామతోఽపి కృతం పాపం భ్రూణహత్యాదికం చ యత్ ।**
**తత్సర్వం శూలదానేన భింద్యాన్నారీ న సంశయః ॥13॥**

**సాయుజ్యం చైవమాప్నోతి భవాన్యా ద్విజసత్తమాః ।**
**కుర్యాద్యద్వా నరః సోఽపి రుద్రసాయుజ్యమాప్నుయాత్ ॥14॥**

స్త్రీ అమావాస్యనాడు నిరాహారంగా నిగ్రహంగా ఒక సంవత్సరం ఉండి, విధిప్రకారంగా శూలాన్ని తయారుచేసి సంవత్సరం చివర శివుడికి నివేదించాలి. శివుడికి స్నానం చేయించి తెల్లటి వేయి కమలాలతో అర్చించాలి. బంగారు కర్ణికగల వెండి కమలాన్ని కూడా భక్తితో సమర్పించాలి. బ్రాహ్మణులకు బాగా దక్షిణలు సమర్పించాలి. ఇష్టపూర్వకంగా చేసిన పాపం, మరియు భ్రూణహత్య మొదలైన వాటి వల్ల కల్గిన పాపమైనా శూలదానం వల్ల నశిస్తుంది. అందులో సందేహం లేదు. ఓ బ్రాహ్మణోత్తములారా! ఆమె పార్వతీదేవితో సాయుజ్యాన్ని పొందుతున్నది. పురుషుడు ఈ వ్రతాన్ని చేసి కూడా శివుడి సాయుజ్యాన్ని పొందగలుగుతాడు.

**పౌర్ణమాస్యామమావాస్యాం వర్షమేకమతంద్రితా ।**
**ఉపవాసరతా నారీ నరోఽపి ద్విజసత్తమాః ॥15॥**

**నియోగాదేవ తత్కార్యం భర్తృణాం ద్విజసత్తమాః ।**
**జపం దానం తపః సర్వమస్వతంత్రాః యతః స్త్రియః ॥16॥**

**వర్షాంతే సర్వగంధాఢ్యాం ప్రతిమాం సన్నివేదయేత్ ।**
**సా భవాన్యాశ్చ సాయుజ్యం సారూప్యం చాపి సువ్రతా ॥17॥**

**లభతే నాత్ర సందేహః సత్యం సత్యం వదామ్యహమ్ ।**

ఓ శ్రేష్ఠద్విజులారా! ఒక సంవత్సరం నిరాటంకంగా పూర్ణిమలోను, అమావాస్యలోను స్త్రీ పురుషులు ఉపవాసరతులు కావాలి. ఓ మునిసత్తములారా! పతి ఆజ్ఞ మేరకే స్త్రీ ఈ వ్రతాన్ని, జపాన్ని, దానాన్ని, తపస్సును గాని నిర్వహించాలి. వ్రతం విషయంలో స్త్రీలు ఒంటరిగా చేయరాదు. ఓ సువ్రతులారా! సంవత్సరం చివరిలో అన్ని రకాల సుగంధాలతో అలంకరించిన ఆ ప్రతిమను శివుడికి నివేదించాలి. ఇలా చేసిన స్త్రీ పార్వతీదేవి సాయుజ్యాన్ని, సారూప్యాన్ని పొందుతున్నది. ఇందులో సందేహం లేదు. సత్యాన్నే చెప్తుతున్నాను.

**కార్తిక్యాం వా తు యా నారీ ఏకభక్తేన వర్తతే ॥18॥**

**క్షమాహింసాదినియమైః సంయుక్తా బ్రహ్మచారిణీ ।**
**దద్యాత్కృష్ణతిలానాం చ భారమేకమతంద్రితా ॥19॥**

**సఘృతం సగుడం చైవ ఓదనం పరమేష్ఠినే ।**
**దత్త్వా చ బ్రాహ్మణేభ్యశ్చ యథావిభవవిస్తరమ్ ॥20॥**

**అష్టమ్యాం చ చతుర్దశ్యాముపవాసరతా చ సా ।**
**భవాన్యా మోదతే సార్ధం సారూప్యం ప్రాప్య సువ్రతా ॥21॥**

కార్తీకమాసంలో ఒకసారి భోజనం చేసి, క్షమ, అహింస మొదలైన నియమాలు కలిగి ఉండి, బ్రహ్మచర్యాన్ని అవలంబించి, ఎటువంటి ఆలస్యం లేకుండా నేయి, బెల్లం కలిపిన ఒక 'భార' పరిమాణంగల నల్లనూవుల అన్నాన్ని శివుడికి సమర్పించి, బ్రాహ్మణులకు శక్తికొలది దానమిచ్చి, అష్టమిలోను, చతుర్దశిలోను ఉపవసించిన స్త్రీ, ఆ ఉత్తమవ్రతురాలు పార్వతిదేవి సారూప్యాన్ని పొంది, ఆమెతోపాటు ఆనందాన్ని పొందుతున్నది.

**క్షమా సత్యం దయా దానం శౌచమింద్రియనిగ్రహః ।**
**సర్వవ్రతేష్వయం ధర్మః సామాన్యో రుద్రపూజనమ్ ॥22॥**

క్షమ, సత్యం, దయ, దానం, పరిశుభ్రం, ఇంద్రియనిగ్రహం, శివపూజకు ఇవి సర్వవ్రతసామాన్యధర్మాలు.

**సమాసాద్వః ప్రవక్ష్యామి ప్రతిమాసమనుక్రమాత్ ।**
**మార్గశీర్షేకమాసాది కార్తిక్యాంతం యథాక్రమమ్ ॥23॥**

**వ్రతం సువిపులం పుణ్యం నందినా పరిభాషితమ్ ।**

ఇప్పుడు నేను సంక్షేపంగా క్రమంగా మార్గశీర్షం నుంచి కార్తికం వరకు ప్రత్యేక మాసాల వ్రతాన్ని గూర్చి చెప్పాను. ఈ పరమ పుణ్యప్రదమైన వ్రతాన్ని నంది స్వయంగా చెప్పింది.

**మార్గశీర్షకమాసేఽథ వృషం పూర్ణాంగముత్తమమ్ ॥24॥**

**అలంకృత్య యథాన్యాయం శివాయ వినివేదయేత్ ।**
**సా చ సార్ధం భవాన్యా వై మోదతే నాత్ర సంశయః ॥25॥**

మార్గశిరమాసంలో అంగవైకల్యంలేని ఉత్తమమైన ఎద్దును అలంకరించి విధ్యనుసారం శివుడికి సమర్పించిన స్త్రీ పార్వతీదేవితో పాటు ఆనందిస్తుంది. ఇందులో సందేహం లేదు.

**పుష్యమాసే తు వై శూలం ప్రతిష్ఠాప్య నివేదయేత్ ।**
**పూర్వోక్తమఖిలం కృత్వా భవాన్యా సహ మోదతే ॥26॥**

పుష్యమాసంలో త్రిశూలాన్ని ప్రతిష్ఠించి పూర్వం చెప్పినట్లుగా మొత్తం నిర్వహించి శివుడికి సమర్పించిన ఆమె పార్వతీదేవితో కూడా ఆనందిస్తుంది.

**మాఘమాసే రథం కృత్వా సర్వలక్షణలక్షితమ్ ।**
**దద్యాత్సంపూజ్య దేవేశం బ్రాహ్మణాంశ్చైవ భోజయేత్ ॥27॥**

**సా చ దేవ్యా మహాభాగా మోదతే నాత్ర సంశయః ।**

మాఘమాసంలో సమస్తలక్షణయుక్తమైన రథాన్ని నిర్మించి, బ్రాహ్మణులకు భోజనం పెట్టి శివుణ్ణి పూజించి ఆ రథాన్ని ఆయనకు సమర్పించిన పుణ్యాత్మ అయిన ఆ స్త్రీ పార్వతీదేవితో కలిసి సంతోషిస్తుంది. ఇందులో సందేహం లేదు.

**ఫాల్గునే ప్రతిమాం కృత్వా హిరణ్యేన యథావిధి ॥28॥**

**రాజతేనాపి తామ్రేణ యథావిభవవిస్తరమ్ ।**
**ప్రతిష్ఠాప్య సమభ్యర్చ్య స్థాపయేచ్ఛంకరాలయే ॥29॥**

**సా చ సార్ధం మహాదేవ్యా మోదతే నాత్ర సంశయః ।**

ఫాల్గునమాసంలో ప్రతిమను సంపదననుసరించి బంగారంతోగాని, వెండితోగాని, రాగితోగాని విధి పూర్వంగా ప్రతిష్ఠించి, పూజించి తిరిగి శివాలయంలో స్థాపించాలి. అట్టి స్త్రీ పార్వతీదేవితో పాటుగా సంతోషిస్తుంది. ఇందులో సంశయం లేదు.

**చైత్రే భవం కుమారం చ భవానీం చ యథావిధి ॥30॥**

**తామ్రాద్యైర్విధివత్కృత్వా ప్రతిష్ఠాప్య యథావిధి ।**
**భవాన్యా మోదతే సార్ధం దత్త్వా రుద్రాయ శంభవే ॥31॥**

చైత్రమాసంలో రాగి మొదలైన లోహాలతో శివుడు, కుమారస్వామి, పార్వతీదేవి యొక్క ప్రతిమల్ని విధ్యుక్తంగా నిర్మించి, విధిపూర్వంగా వాటిని ప్రతిష్ఠించి, వాటిని శివుడికి సమర్పించిన స్త్రీ పార్వతీదేవితోపాటు ఆనందిస్తుంది.

**కృత్వాలయం హి కౌబేరం రాజతం రజతేన వై ।**
**ఈశ్వరోమాసమాయుక్తం గణేశైశ్చ సమంతతః ॥32॥**

**సర్వరత్నసమాయుక్తం ప్రతిష్ఠాప్య యథావిధి ।**
**స్థాపయేత్పరమేశస్య భవస్యాయతనే శుభే ॥33॥**

**వైశాఖే వై చరేదేవం కైలాసాఖ్యం వ్రతోత్తమమ్ ।**
**కైలాసపర్వతం ప్రాప్య భవాన్యా సహ మోదతే ॥34॥**

వెండితో కుబేరమనే కైలాసాలయాన్ని నిర్మించి, దాని నాల్గుదిక్కులందు సమస్తరత్నాల్ని పొదిగి, దానిలో శివుడు, పార్వతి, అట్లే గణేశ్వరుల వెండి మూర్తుల్ని ఉంచి, వాటిని యథావిధిగా ప్రతిష్ఠించి, దానిలో పరమేశ్వర శివుణ్ణి సుందరమందిరంలో స్థాపించాలి. వైశాఖమాసంలో ఈ విధమైన కైలాసమనే పేరుగల ఉత్తమ వ్రతాన్ని నిర్వహించే స్త్రీ కైలాసపర్వతాన్ని పొంది పార్వతీదేవితో పాటు ఆనందాన్ని అనుభవిస్తుంది.

**జ్యేష్ఠే మాసి మహాదేవం లింగమూర్తిముమాపతిమ్ ।**
**కృతాంజలిపుటేనైవ బ్రహ్మణా విష్ణునా తథా ॥35॥**

**మధ్యే భవేన సంయుక్తం లింగమూర్తిం ద్విజోత్తమాః ।**
**హంసేన చ వరాహేణ కృత్వా తామ్రాదిభిః శుభామ్ ॥36॥**

**ప్రతిష్ఠాప్య యథాన్యాయం బ్రాహ్మణాన్ భోజయేత్తతః ।**
**శివాయ శివమాసాద్య శివస్థానే యథావిధి ॥37॥**

ఓ బ్రాహ్మణోత్తములారా! జ్యేష్ఠమాసంలో ఉమాపతి మహాదేవుడి శుభప్రతిమను తామ్రాది లోహాలతో నిర్మించి, హస్తాలు జోడించి హంసను అధిరోహించిన బ్రహ్మ, అట్లే వరాహారూఢుడైన విష్ణువు మధ్యలో లింగమూర్తిగా శివుడు ఉండునట్లు నిర్మించి, విధిపూర్వకంగా వాటిని ప్రతిష్ఠించాలి. తర్వాత బ్రాహ్మణులకు భోజనం పెట్టి, కళ్యాణార్థం శివుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకుని బ్రాహ్మణులతోకూడా ఆ ప్రతిమల్ని శివాలయంలో విధిపూర్వకంగా స్థాపించాలి. అపుడా స్త్రీ పార్వతీదేవియొక్క సాయుజ్యాన్ని పొందుతుంది.

**బ్రాహ్మణైః సహితాం స్థాప్య దేవ్యాః సాయుజ్యమాప్నుయాత్ ।**
**ఆషాఢే చ శుభే మాసే గృహం కృత్వా సుశోభనమ్ ॥38॥**

**పక్వేష్టకాభిర్విధివద్యథావిభవవిస్తరమ్ ।**
**సర్వబీజరసైశ్చాపి సంపూర్ణం సర్వశోభనైః ॥39॥**

**గృహోపకరణైశ్చైవ ముసలోలూఖలాదిభిః ।**
**దాసీదాసాదిభిశ్చైవ శయనైరశనాదిభిః ॥40॥**

**సంపూర్ణైశ్చ గృహం వస్త్రైరాచ్ఛాద్య చ సమంతతః ।**
**దేవం ఘృతాదిభిః స్నాప్య మహాదేవముమాపతిమ్ ॥41॥**

**బ్రాహ్మణానాం సహస్రం చ భోజయిత్వా యథావిధి ।**
**విద్యావినయసంపన్నం బ్రాహ్మణం వేదపారగమ్ ॥42॥**

**ప్రథమాశ్రమిణం భక్త్యా సంపూజ్య చ యథావిధి ।**
**కన్యాం సుమధ్యమాం యావత్కాలజీవనసంయుతామ్ ॥43॥**

**క్షేత్రం గోమిథునం చైవ తద్గృహే చ నివేదయేత్ ।**
**సాయనైర్వివిధైర్దివ్యైర్మేరుపర్వతసన్నిభైః ॥44॥**

**గోలోకం సమనుప్రాప్య భవాన్యా సహ మోదతే ।**
**భవాన్యా సదృశీ భూత్వా సర్వకల్పేషు సావ్యయా ॥45॥**

**భవాన్యాశ్చైవ సాయుజ్యం లభతే నాత్ర సంశయః ।**

శుభకరమైన ఆషాఢమాసంలో తన సామర్థ్యానుసారంగా కాల్చిన ఇటుకలతో విధ్యనుసారం గృహాన్ని నిర్మించి, దానిని అన్నిరకాలైన బీజాలతో రసాలతో, మిక్కిలి అందమైన రోకలి, రోలు మొదలైన గృహోపయోగకరాలైన సామగ్రితో, దాసదాసీజనాలతో, తల్పాలతో, ఆహారపదార్థాలతో నింపాలి. అన్నివైపుల ఆ వస్తువుల్ని పదార్థాల్ని వస్త్రాలతో కప్పి ఉమాపతి శివుణ్ణి నేయి మొదలైనవానితో స్నానం చేయించి, విధ్యుక్తంగా వేయిమంది బ్రాహ్మణులకు భోజనం పెట్టి, విద్యావినయసంపన్నుడు, వేదపారగుడు అయిన ఒక బ్రాహ్మణబ్రహ్మచారిని భక్తితో పూజించి పరిపూర్ణజీవనం కోసం ఒక పరమసుందరి అయిన కన్యకను, క్షేత్రాన్ని, గోమిథునాన్ని మరియు మేరుపర్వతంతో సమానమైన ఎత్తుగా రాశిపోసిన అనేకవిధాలైన దివ్యవస్తుసముదాయంతో కూడిన ఆగృహాన్ని సమర్పించాలి. ఈ విధంగా చేసిన స్త్రీ గోలోకాన్ని పొంది పార్వతీదేవితో కూడి ఆనందిస్తుంది. పార్వతీదేవి రూపాన్ని పొంది అన్ని కల్పాలలో శాశ్వతంగా నిలుస్తుంది. చివరకు పార్వతీదేవి సాయుజ్యాన్ని పొందుతుంది. ఇందులో సందేహం లేదు.

**సర్వధాతుసమాకీర్ణాం విచిత్రధ్వజశోభితమ్ ॥46॥**

**నివేదయీత శర్వాయ శ్రావణే తిలపర్వతమ్ ।**
**వితానధ్వజవస్త్రాద్యైర్ధాతుభిశ్చ నివేదయేత్ ॥47॥**

**బ్రాహ్మణాన్ భోజయిత్వా చ పూర్వోక్తమఖిలం భవేత్ ।**

శ్రావణమాసంలో అన్ని ధాతువులతో కూడిన మరియు విచిత్రధాతువులతో శోభిల్లుతున్న తిలపర్వతాన్ని నిర్మించి శివుడికి సమర్పించాలి. ఏ స్త్రీ వితానం, ధ్వజం, వస్త్రం, ధాతువు మొదలైన వాటితో కూడిన తిలపర్వతాన్ని శివుడికి నివేదిస్తుందో మరియు బ్రాహ్మణులకు భోజనం పెడుతుందో ఆమెకు పూర్వోక్తాలైన అన్ని ఫలాలు దక్కుతాయి.

**కృత్వా భాద్రపదే మాసి శోభనం శాలిపర్వతమ్ ॥48॥**

**వితానధ్వజవస్త్రాద్యైర్ధాతుభిశ్చ నివేదయేత్ ।**
**బ్రాహ్మణాన్ భోజయిత్వా చ దాపయేచ్చ యథావిధి ॥49॥**
**సా చ సూర్యాంశుసంకాశా భవాన్యా సహ మోదతే ।**

భాద్రపదమాసంలో సుందరమైన శాలిధాన్యం యొక్క పర్వతాన్ని వితానం, ధ్వజం, వస్త్రం మొదలైన వాటితోను, ధాతువులతోను నిర్మించాలి, బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. దానాలు ఇవ్వాలి. ఇవి చేసిన ఆమె సూర్యకిరణాలతో సమానమైన కాంతిగలదై పార్వతీదేవితో కలిసి ఆనందిస్తున్నది.

**కృత్వా చాశ్వయుజే మాసి విపులం ధాన్యపర్వతమ్ ॥50॥**

**సువర్ణవస్త్రసంయుక్తం దత్త్వా సంపూజ్య శంకరమ్ ।**
**బ్రాహ్మణాన్ భోజయిత్వా చ పూర్వోక్తమఖిలం భవేత్ ॥51॥**

**సర్వధాన్యసమాయుక్తం సర్వబీజరసాదిభిః ।**
**సర్వధాతుసమాయుక్తం సర్వరత్నోపశోభితమ్ ॥52॥**

**శృంగైశ్చతుర్భిః సంయుక్తం వితానచ్ఛత్రశోభితమ్ ।**
**గంధమాల్యైస్తథా ధూపైశ్చిత్రైశ్చాపి సుశోభితమ్ ॥53॥**

**విచిత్రైర్నృత్యగేయైశ్చ శంఖవీణాదిభిస్తథా ।**
**బ్రహ్మఘోషైర్మహాపుణ్యం మంగలైశ్చ విశేషతః ॥54॥**

**మహాధ్వజాష్టసంయుక్తం విచిత్రకుసుమోజ్జ్వలమ్ ।**
**నగేంద్రం మేరునామానం త్రైలోక్యాధారముత్తమమ్ ॥55॥**

**తస్య మూర్ధ్ని శివం కుర్యాన్మధ్యతో ధాతునైవ తు ।**
**దక్షిణే చ యథాన్యాయం బ్రహ్మాణం చ చతుర్ముఖమ్ ॥56॥**

**ఉత్తరే దేవదేవేశం నారాయణమనామయమ్ ।**
**ఇంద్రాదిలోకపాలాంశ్చ కృత్వా భక్త్యా యథావిధి ॥57॥**

**ప్రతిష్ఠాప్య తతః స్నాప్య సమభ్యర్చ్య మహేశ్వరమ్ ।**
**దేవస్య దక్షిణే హస్తే శూలం త్రిదశపూజితమ్ ॥58॥**

**వామే పాశం భవాన్యాశ్చ కమలం హేమభూషితమ్ ।**
**విష్ణోశ్చ శంఖం చక్రం చ గదామబ్జం ప్రయత్నతః ॥59॥**

**బ్రహ్మణశ్చాక్షసూత్రం చ కమండలుమనుత్తమమ్ ।**
**ఇంద్రస్య వజ్రమగ్నేశ్చ శక్త్యాఖ్యం పరమాయుధమ్ ॥60॥**

**యమస్య దండం నిరృతేః ఖడ్గం నిశిచరస్య తు ।**
**వరుణస్య మహాపాశం నాగాఖ్యం రుద్రమద్భుతమ్ ॥61॥**

**వాయోర్యష్టిం కుబేరస్య గదాం లోకపూజితామ్ ।**
**టంకం చేశానదేవస్య నివేద్యైవం క్రమేణ చ ॥62॥**

**శివస్య మహతీం పూజాం కృత్వా చరుసమన్వితామ్ ।
పూజయేత్సర్వదేవాంశ్చ యథావిభవవిస్తరమ్ ॥63॥**

**బ్రాహ్మణాన్ భోజయిత్వా చ పూజాం కృత్వా ప్రయత్నతః ।
మహామేరువ్రతం కృత్వా మహాదేవాయ దాపయేత్ ॥64॥**

**మహామేరుమనుప్రాప్య మహాదేవ్యా ప్రమోదతే ।
చిరం సాయుజ్యమాప్నోతి మహాదేవ్యా న సంశయః ॥65॥**

ఆశ్వయుజమాసంలో బంగారం మరియు వస్త్రంతోనూ కూడిన ఒక విశాలమైన ధాన్యపర్వతాన్ని నిర్మించి దాన్ని శివుడికి అర్పించి, ఆయన్ని విధ్యనుసారంగా పూజించి బ్రాహ్మణులకు భోజనం పెట్టి పూర్వం చెప్పిన అన్ని ఫలాలు పొందవచ్చు. మూడు లోకాలకు ఆధారభూతమైన మేరువు అనే పేరుగల ఉన్నత పర్వతరాజాన్ని నిర్మించాలి. అది అన్ని ధాన్యాలతోను, అన్ని బీజాలు, రసాలతోనూ పరిపూర్ణం కావాలి. అన్ని ధాతువులతో కూడినది కావాలి. అన్ని రత్నాలతోను బాగా శోభిల్లాలి. నాల్గుశృంగాలు కలిగి ఉండాలి. వితానంతోను ఛత్రంతోను శోభిల్లాలి. సురభిళపుష్పాలతో, అద్భుతధూపాలతో శోభిల్లాలి. విచిత్రనృత్యాలతో, గానాలతో శోభిల్లాలి. శంఖధ్వనులతో వీణాధ్వనులతో కూడి ఉండాలి. వేదధ్వనులతో, విశేషమైన మంగళసూచకమైన ప్రార్థనలతో అత్యంత పవిత్రమైంది కావాలి. ఎనిమిది మిక్కిలి పెద్దవైన ధ్వజాలతో, విచిత్ర పుష్పాలతో శోభిల్లాలి. ఈ పర్వతం యొక్క శిఖరం మీద మధ్యలో ధాతు నిర్మితమైన శివుణ్ణి నిలపాలి. ఆయనకు దక్షిణంలో బ్రహ్మను, ఉత్తరంలో నిర్వికారుడు, దేవదేవుడు అయిన నారాయణుణ్ణి, ఇంద్రాదిలోకపాలకుల్ని భక్తిపూర్వకంగా, విధ్యనుసారంగా విరాజమానుల్ని చేసి ప్రతిష్ఠించాలి. తర్వాత స్నానం చేయించాలి. మహాదేవ శివుణ్ణి పూజించాలి. శివుడి యొక్క కుడిచేతిలో దేవతల పూజలందుకున్న త్రిశూలాన్ని, అట్లే ఎడమచేతిలో పాశాన్ని, పార్వతీదేవి హస్తంలో బంగారంతో అలంకరింపబడిన పద్మాన్ని, విష్ణువు చేతిలో శంఖం, చక్రం, గద, పద్మాల్ని, బ్రహ్మ చేతిలో అక్షమాలను, అట్లే ఉత్తమ కమండలాన్ని, ఇంద్రుడి చేతిలో వజ్రాయుధాన్ని, అగ్ని చేతిలో శక్తి అనే పేరుగల పెద్ద ఆయుధాన్ని, యముడి చేతిలో దండాన్ని, నిశాచరుడు నిర్భతి చేతిలో ఖడ్గాన్ని, వరుణుడి చేతిలో నాగమనే పేరుగల భయంకరమైన అద్భుతమైన మహాపాశాన్ని, వాయువు చేతిలో యష్టిని, కుబేరుడి చేతిలో లోకపూజితమైన గదను, ఈశానుడి చేతిలో టంకను ఉంచి, నివేదించి, శివుడికి చరువుతో కూడిన మహాపూజను నిర్వహించి, శక్త్యనుసారం దేవతలందర్ని పూజించాలి. తర్వాత బ్రాహ్మణులకు భోజనం పెట్టి, ప్రయత్నపూర్వకంగా వాళ్లను సన్మానించి మహామేరువ్రతాన్ని సుసంపన్నం చేసి శివుడికి సమర్పించాలి. ఇలా చేసిన స్త్రీ మహామేరు పర్వతానికి వెళ్లి మహాదేవుడితో కూడా ఆనందిస్తున్నది. చిరకాలం తర్వాత మహాదేవుడి సాయుజ్యం పొందుతున్నది. ఇందులో సందేహం లేదు.

**కార్తిక్యామపి యా నారీ కృత్వా దేవీముమాం శుభామ్ ।
సర్వాభరణ సంపూర్ణాం సర్వలక్షణలక్షితామ్ ॥66॥**

**హేమతామ్రాదిభిశ్చైవ ప్రతిష్ఠాప్య విధానతః ।
దేవం చ కృత్వా దేవేశం సర్వలక్షణసంయుతామ్ ॥67॥**

**తయోరగ్రే హుతాశం చ స్రువహస్తం పితామహమ్ ।**
**నారాయణం చ దాతారం సర్వాభరణభూషితమ్ ॥68॥**

**లోకపాలైస్తథా సిద్ధైః సంవృతం స్థాప్య యత్నతః ।**
**రుద్రాలయే వ్రతం తస్మై దాపయేద్భక్తిపూర్వకమ్ ॥69॥**

**సా భవాన్యాస్తనుం గత్వా భవేన సహ మోదతే ।**

కార్తికమాసంలో బంగారం లేక తామ్రం మొదలైన లోహాలతో సర్వాభరణశోభితగా, సర్వలక్షణలక్షితగా పార్వతీదేవి సుందరప్రతిమను తయారుచేసి, అట్లే సర్వలక్షణయుక్తమైన శివభగవానుడు మూర్తిని నిర్మించి విధివిధానంగా వాటిని ప్రతిష్ఠించి వాళ్ల ముందర అగ్నిని, హస్తంలో స్రువం గలిగిన బ్రహ్మను మరియు లోకపాలకులచేత, సిద్ధులచేత చుట్టబడినవాడు, సర్వాభరణభూషితుడు అయిన మహాదాతయు అయిన నారాయణుణ్ణి ప్రయత్నపూర్వకంగా స్థాపించి, శివాలయంలో భక్తిపూర్వకంగా ఈ వ్రతాన్ని శివుడికి సమర్పించాలి. ఇలా చేసిన స్త్రీ పార్వతీరూపాన్ని పొంది శివుడితో కూడా ఆనందిస్తున్నది.

**ఏకభక్తవ్రతం పుణ్యం ప్రతిమాసమనుక్రమాత్ ॥70॥**

**మార్గశీర్షకమాసాదికార్తికాంతం ప్రవర్తితమ్ ।**
**నరనార్యాదిజంతూనాం హితాయ మునిసత్తమాః ॥71॥**

**నరః కృత్వా వ్రతం చైవ శివసాయుజ్యమాప్నుయాత్ ।**
**నారీ దేవ్యా న సందేహః శివేన పరిభాషితమ్ ॥72॥**

రోజుకు ఒకసారి భోజనం చేస్తూ ప్రతిమాసంలోనూ ఈ పుణ్యప్రదమైన వ్రతాన్ని చేయాలి. ఓ శ్రేష్ఠమునులారా! స్త్రీ పురుషులు, ఇతరప్రాణుల శ్రేయస్సుకొరకై మార్గశిరం నుండి కార్తీకం వరకు ఈ వ్రతాన్ని నిర్వహించాలి. నరుడు వ్రతాన్ని ఆచరించి శివసాయుజ్యాన్ని పొందుతాడు. నారి వ్రతాన్ని ఆచరించి పార్వతీదేవి సాయుజ్యాన్ని పొందుతుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఇది స్వయంగా పరమశివుడు చెప్పినట్టిది.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే ఉమామహేశ్వరవ్రతం నామ చతురశీతితమోఽధ్యాయః ॥ 84 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని ఉమామహేశ్వరవ్రతమనే ఎనబై నాల్గవ అధ్యాయం సమాప్తం.

## **పంచాశీతితమోఽధ్యాయః** – ఎనభై అయిదవ అధ్యాయం

## **పంచాక్షరమాహాత్మ్యమ్** – పంచాక్షరమాహాత్మ్యం

**సూత ఉవాచ** – సూతుడు పలికాదు.

**సర్వవ్రతేషు సంపూజ్య దేవదేవముమాపతిమ్ ।**
**జపేత్పంచాక్షరీం విద్యాం విధినైవ ద్విజోత్తమాః ॥1॥**

**జపాదేవ న సందేహో వ్రతానాం వై విశేషతః ।**
**సమాప్తిర్నాన్యథా తస్మాజ్జపేత్పంచాక్షరీం శుభమ్ ॥2॥**

ఓ ఋషిశ్రేష్ఠులారా! సమస్తవ్రతాలతో దేవదేవశివుణ్ణి ఉమాపతిని పూజించి విధిపూర్వకంగా పంచాక్షరీ మంత్రాన్ని జపించాలి. ఈ మంత్రజపంవల్లనే వ్రతాలకు పూర్ణత్వం లభిస్తుంది. లేకుంటే సమాప్తి అయినట్లు కాదు. అందువల్ల శుభకరమైన పంచాక్షరీ మంత్రాన్ని జపించాలి.

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**కథం పంచాక్షరీవిద్యా ప్రభావో వా కథం వద ।**
**క్రమోపాయం మహాభాగ శ్రోతుం కౌతూహలం హి నః ॥3॥**

పంచాక్షరీవిద్య (మంత్రం) అంటే ఏమిటి? దాని ప్రభావం ఎట్టిది? ఓ మహాభాగ! సూతర్షీ! క్రమంగా దాని విధానం చెప్పండి! దీన్ని వినాలనే ఉత్సుకత మాకున్నది.

**సూత ఉవాచ** – సూతుడు పలికాదు.

**పురా దేవేన రుద్రేణ దేవదేవేన శంభునా ।**
**పార్వత్యాః కథితం పుణ్యం ప్రవదామి సమాసతః ॥4॥**

పూర్వం దేవదేవుడైన రుద్రభగవానుడు పార్వతీదేవికి చెప్పిన పుణ్యమైన పంచాక్షరీవిద్యను గూర్చి సంగ్రహంగా మీకు బాగా చెబుతున్నాను.

**శ్రీ దేవ్యువాచ** – పార్వతీదేవి పలికింది.

**భగవన్ దేవదేవేశ సర్వలోకమహేశ్వర ।**
**పంచాక్షరస్య మాహాత్మ్యం శ్రోతుమిచ్ఛామి తత్త్వతః ॥5॥**

ఓ దేవదేవా! ఓ సమస్తలోకమహేశ్వరుడా! ఓ శివభగవానుడా! నేను యథార్థరూపంగా పంచాక్షరి యొక్క మాహాత్మ్యాన్ని వినాలని కోరుతున్నాను.

**శ్రీ భగవాన్ ఉవాచ –** శివభగవానుడు చెప్పాడు.

**పంచాక్షరస్య మాహాత్మ్యం వర్షకోటిశతైరపి ।**
**న శక్యం కథితుం దేవి తస్మాత్సంక్షేపతః శృణు ॥6॥**

పార్వతీ! నూరుకోట్లసంవత్సరాలకాలంలో కూడా పంచాక్షరీమంత్రం యొక్క మాహాత్మ్యం చెప్పనలవికాదు. అందుకే సంగ్రహంగా విను.

**ప్రళయే సమనుప్రాప్తే నష్టే స్థావరజంగమే ।**
**నష్టే దేవాసురే చైవ నష్టే చోరగరాక్షసే ॥7॥**

**సర్వం ప్రకృతిమాపన్నం త్వయా ప్రళయమేష్యతి ।**
**ఏకోఽహం సంస్థితో దేవి న ద్వితీయోఽస్తి కుత్రచిత్ ॥8॥**

**తస్మిన్ వేదాశ్చ శాస్త్రాణి మంత్రే పంచాక్షరే స్థితాః ।**
**తే నాశం నైవ సంప్రాప్తా మచ్ఛక్త్యా హ్యనుపాలితాః ॥9॥**

దేవి! ప్రళయం సంభవించినపుడు సమస్తమైన చరాచరజగత్తు, దేవతలు, దానవులు, నాగులు, రాక్షసులు అందరూ నశిస్తారు. నీతోపాటు సమస్తమూ ప్రకృతియందు లీనమైపోతుంది. నేను ఒక్కడినే నిలిచి ఉంటాను. ఎక్కడా రెండో వాడు ఉండడు. అపుడు వేదాలు, శాస్త్రాలు పంచాక్షరీమంత్రంలో నిలుస్తాయి. నాశక్తి వల్ల రక్షింపబడుట చేత అవి నష్టం చెందకుండా ఉంటాయి.

**అహమేకో ద్విధాభ్యాసం ప్రకృత్యాత్మప్రభేదతః ।**
**స తు నారాయణః శేతే దేవో మాయామయీం తనుమ్ ॥ 10॥**

**ఆస్థాయ యోగపర్యంకశయనే తోయమధ్యగః ।**
**తన్నాభిపంకజాజ్జాతః పంచవక్త్రః పితామహః ॥11॥**

**సిసృక్షమాణో లోకాన్ వై త్రీనశక్తోఽసహాయవాన్ ।**
**దశబ్రహ్మ ససర్జాదౌ మానసానమితౌజసః ॥12॥**

ఆ సమయంలో నేను ఒక్కడిగా ఉన్నా ప్రకృతి, ఆత్మ అనే భేదంతో రెండు రూపాలలో ఉంటాను. నారాయణుడు మాయామయమైన శరీరాన్ని ధరించి జలంమధ్యలో యోగరూపమైన పర్యంకం పైన (శయ్య) శయనిస్తాడు. ఆతడి నాభి కమలం నుంచి ఐదు ముఖాలుగల బ్రహ్మ పుడతాడు. మూడు లోకాల్ని సృష్టించే కోరిక గలిగిన బ్రహ్మ సృష్టి కార్యంలో అసమర్థుడు అవడం వల్లా, మరియు నిస్సహాయుడు అవడం వల్లా ముందుగా పదిమంది అమిత తేజస్కుల్ని మానసపుత్రుల్ని సృష్టించాడు.

**తేషాం సృష్టిప్రసిద్ధ్యర్థం మాం ప్రోవాచ పితామహః ।**
**మత్పుత్రాణాం మహాదేవ శక్తిం దేహి మహేశ్వర ॥13॥**

**ఇతి తేన సమాదిష్టః పంచవక్త్రధరో హ్యహమ్ ।**
**పంచాక్షరాన్ పంచముఖైః ప్రోక్తవాన్ పద్మయోనయే ॥14॥**

**తాన్ పంచవదనైర్గృహ్ణన్ బ్రహ్మ లోకపితామహః ।**
**వాచ్యవాచకభావేన జ్ఞాతవాన్ పరమేశ్వరమ్ ॥15॥**

**వాచ్యః పంచాక్షరైర్దేవి శివస్త్రైలోక్యపూజితః ।**
**వాచకః పరమో మంత్రస్తస్య పంచాక్షరః స్థితః ॥16॥**

తమ సృష్టి యొక్క అభివృద్ధి కోసం బ్రహ్మ నన్ను అడిగాడు. "ఓ మహాదేవా! ఓ మహేశ్వరా! నా పుత్రులకు శక్తిని ప్రదానం చెయ్యండి!" అని. ఆతడు అలా పలకగా పంచముఖాల్ని ధరించిన నేను బ్రహ్మనుద్దేశించి పంచముఖాల నుంచి పంచాక్షరాల్ని ఉచ్చరించాను. తన పంచముఖాలతో ఆ అక్షరాల్ని గ్రహించిన లోకపితామహుడు అయిన బ్రహ్మ వాచ్యవాచకభావంతో పరమేశ్వరుణ్ణి గ్రహించాడు. త్రిలోకపూజ్యుడగు శివుడు పంచాక్షరాల ద్వారా వాచ్యం అవుతాడు. మరియు ఆ పరమపంచాక్షరమంత్రం ఆతడి వాచకరూపంగా నిలుస్తుంది.

**జ్ఞాత్వా ప్రయోగం విధినా చ సిద్ధిం లబ్ధ్వా తథా పంచముఖో మహాత్మా ।**
**ప్రోవాచ పుత్రేషు జగద్ధితాయ మంత్రం మహార్థం కిల పంచవర్ణమ్ ॥17॥**

పంచముఖుడు, మహాత్ముడు అయిన బ్రహ్మ విధిపూర్వకంగా ఈ ప్రయోగాన్ని తెలిసి అట్లే దాని సిద్ధిని పొంది లోకకళ్యాణార్థం తన పుత్రులకు మహార్థభరితమైన పంచాక్షరీ మంత్రాన్ని ఉపదేశించాడు.

**తే లబ్ధ్వా మంత్రరత్నం తు సాక్షాల్లోకపితామహాత్ ।**
**తమారాధయితుం దేవం పరాత్పరతరం శివమ్ ॥18॥**

తర్వాత ఆ పుత్రులు దేవదేవుడు, పరాత్పరుడు అయిన శివుడిని ఆరాధించడంలో లీనమయ్యారు.

**తతస్తుతోష భగవాన్ త్రిమూర్తీనాం పరఃశివః ।**
**దత్తవానఖిలం జ్ఞానమణిమాదిగుణాష్టకమ్ ॥19॥**

అపుడు త్రిమూర్తులలో శ్రేష్ఠుడైన శివుడు ప్రసన్నుడై వాళ్లకు సంపూర్ణ జ్ఞానాన్ని అట్లే అణిమాది అష్టసిద్ధుల్ని ప్రదానం చేశాడు.

**తేపి లబ్ధ్వా వరాన్ విప్రాస్తదారాధనకాంక్షిణః ।**
**మేరోస్తు శిఖరే రమ్యే ముంజవాన్నామ పర్వతః ॥20॥**

**మత్ప్రియః సతతం శ్రీమాన్ మద్భూతై పరిరక్షితః ।**
**తస్యాభ్యాసే తపస్తీవ్రం లోకసృష్టిసముత్సుకాః ॥21॥**

**దివ్యవర్ష సహస్రం తు వాయుభక్షాః సమాచరన్ ।**
**తిష్ఠంతోఽనుగ్రహార్థాయ దేవి తే ఋషయః పురా ॥22॥**

ఆ విప్రులు నా వరాల్ని పొంది నన్ను ఆరాధించాలనే కోరిక గలవారైనారు. మేరుపర్వతంలో అందమైన ఒక శిఖరం మీద ముంజవాన్ అనే పర్వతం ఉన్నది. శోభాసంపన్నమైన ఆ పర్వతం నాకు ఇష్టమైనది. మరియు నా భూతాలవల్ల ఎల్లప్పుడూ మిక్కిలిగా రక్షింపబడుతున్నది. ఓ పార్వతీదేవీ! లోకసృష్టిలో ఔత్సుక్యంగలవాళ్లు వాయుభక్షకులై వేయి దివ్యవర్షాలు నా అనుగ్రహం కోసం తీవ్రమైన తపస్సు చేస్తూ ఉన్నారు.

**తేషాం భక్తిమహం దృష్ట్వా సద్యః ప్రత్యక్షతామియామ్ ।**
**పంచాక్షరమృషిచ్ఛందో దైవతం శక్తిబీజవత్ ॥23॥**

**న్యాసం షడంగం దిగ్బంధం వినియోగమశేషతః ।**
**ప్రోక్తవానహమార్యాణాం లోకానాం హితకామ్యయా ॥24॥**

వాళ్ల భక్తిని చూచి నేను త్వరగానే వారికి సాక్షాత్కరించాను. నేను లోక కళ్యాణేచ్ఛతో ఆ మహాత్ములకి పంచాక్షరీ మంత్రాన్ని, దానికి సంబంధించి ఋషిని, ఛందస్సును, దేవతను, శక్తిని, బీజసహితషడంగన్యాసాన్ని, దిగ్బంధాన్ని, వినియోగాన్ని సంపూర్ణంగా చెప్పాను.

**తచ్ఛ్రుత్వా మంత్రమాహాత్మ్యమృషయస్తే తపోధనాః ।**
**మంత్రస్య వినియోగం చ కృత్వా సర్వమనుష్ఠితాః ॥25॥**

**తన్మాహాత్మ్యాత్తదా లోకాన్ సదేవాసురమానుషాన్ ।**
**వర్గాన్ వర్ణవిభాగాంశ్చ సర్వధర్మాంశ్చ శోభనాన్ ॥26॥**

**పూర్వకల్పసముద్భూతాన్ శ్రుతవంతో యథా పురా ।**
**పంచాక్షరప్రభావాచ్చ లోకా వేదా మహర్షయః ॥27॥**

**తిష్ఠంతి శాశ్వతా ధర్మా దేవాః సర్వమిదం జగత్ ।**
**తదిదానీం ప్రవక్ష్యామి శృణు చావహితాఖిలమ్ ॥28॥**

ఆ మంత్రం యొక్క మాహాత్మ్యాన్ని విని ఆ తపోధనులైన ఋషులు మంత్ర వినియోగం కోసం అన్ని అనుష్ఠానాల్ని పూర్తి చేశారు. తర్వాత వాళ్లకు ఆ మంత్రప్రభావం వల్ల లోకాలు, దేవతలు, అసురులు, మానవులు, వర్ణాలు, వర్ణవిభాగాలు, అట్లే సమస్తమైన ఉత్తమధర్మాలు – పూర్వకల్పాలలో సంభవించిన వాటిని ప్రళయానికి ముందువలె విన్నారు. పంచాక్షరమంత్ర ప్రభావం చేతనే లోకాలు, వేదాలు, మహర్షిగణాలు, శాశ్వతధర్మాలు, దేవతలు, అట్లే సంపూర్ణమైన జగత్తు స్థితి పొంది ఉన్నవి. ఆ విషయాలన్నీ మీకు చెబుతాను. సావధానులై వినండి!

**అల్పాక్షరం మహార్థం చ వేదసారం విముక్తిదమ్ ।**
**ఆజ్ఞాసిద్ధమసందిగ్ధం వాక్యమేతచ్ఛివాత్మకమ్ ॥29॥**

ఈ మంత్రం అల్పాక్షరయుక్తమైంది. గొప్ప అర్థం కలది. వేదసారమైంది. ముక్తి ప్రదమైంది. ఆజ్ఞాసిద్ధి, అసందిగ్ధత కలది. అట్లే శివుడే ఆత్మగాగలది. (శివమయం)

**నానాసిద్ధియుతం దివ్యం లోకచిత్తానురంజకమ్ ।**
**సునిశ్చితార్థం గంభీరం వాక్యం మే పారమేశ్వరమ్ ॥30॥**

ఈ నా పంచాక్షరీ మంత్రం పలుసిద్ధులతో కూడినట్టిది. దివ్యమైనది. ప్రజల హృదయాలని రంజింపచేసేది. బాగా నిర్ధారింపబడిన అర్థం కలది, గంభీరమైనది. పరమాత్మసంబంధమైనది.

**మంత్రం ముఖసుఖోచ్చార్యమశేషార్థప్రసాధకమ్ ।**
**తద్బీజం సర్వవిద్యానాం మంత్రమాద్యం సుశోభనమ్ ॥31॥**

**అతిసూక్ష్మం మహార్థం చ జ్ఞేయం తద్వటబీజవత్ ।**
**వేదః స త్రిగుణాతీతః సర్వజ్ఞః సర్వకృత్ప్రభుః ॥32॥**

ఈ మంత్రం సుఖంగా ముఖంతో ఉచ్చరింపతగినది. ప్రయోజనాలని సిద్ధింపచేసేది. సమస్త విద్యలకు ఇది బీజ స్వరూపం. ఇది అన్ని మంత్రాల కన్న ముందుది. పరమ సుందరం. శబ్దాన్నిబట్టి సూక్ష్మం అయినది. విస్తారమైన అర్థంగలది. ఈ మంత్రాన్ని మఱ్ఱిచెట్టుకి విత్తనంవలె తెలిసికోవాలి. ఇది వేద స్వరూపం. సత్త్వము రజస్సు తమస్సు అనే మూడుగుణాలని దాటినది.(సోకనిది) సర్వజ్ఞత గలది. అన్నింటిని నిర్వహిస్తుంది. సర్వసమర్థమైనది. (ప్రభువు)

**ఓమిత్యేకాక్షరం మంత్రం స్థితః సర్వగతః శివః ।**
**మంత్రే షడక్షరే సూక్ష్మే పంచాక్షరతనుః శివః ॥33॥**

**వాచ్యవాచకభావేన స్థితః సాక్షాత్స్వభావతః ।**
**వాచ్యః శివః ప్రమేయత్వాన్మంత్రస్తద్వాచకః స్మృతః ॥34॥**

**వాచ్యవాచకభావోఽయమనాదిః సంస్థితస్తయోః ।**
**వేదే శివాగమే వాపి యత్ర యత్ర షడక్షరః ॥35॥**

**మంత్రః స్థితః సదా ముఖ్యో లోకే పంచాక్షరో మతః ।**
**కిం తస్య బహుభిర్మంత్రైః శాస్త్రైర్వా బహువిస్తృతైః ॥36॥**

**యస్యైవం హృది సంస్థోఽయం మంత్రః స్యాత్పరమేశ్వరః ।**
**తేనాధీతం శ్రుతం తేన తేన సర్వమనుష్ఠితమ్ ॥37॥**

**యో విద్వాన్ వై జపేత్సమ్యగధీత్యైవ విధానతః ।**
**ఏతావద్ధి శివజ్ఞానమేతావత్పరమం పదమ్ ॥38॥**

**ఏతావద్ బ్రహ్మవిద్యా చ తస్మాన్నిత్యం జపేద్ బుధః ।**
**పంచాక్షరైః సప్రణవో మంత్రోఽయం హృదయం మమ ॥39॥**

**గుహ్యాద్ గుహ్యతరం సాక్షాన్మోక్షజ్ఞానమనుత్తమమ్ ।**

'ఓం' ఇది ఒకే అక్షరం గల మంత్రం. సర్వవ్యాపి అయిన శివభగవానుడు ఈ మంత్రంలో స్థిరంగా ఉంటాడు. పంచాక్షరరూపమైన శరీరంగల శివుడు సహజంగా సూక్ష్మమైన షడక్షరమంత్రంలో వాచ్యవాచక భావంతో ప్రకాశిస్తుంటాడు. ప్రమేయత్వకారణంగా శివుడు వాచ్యమవుతాడు. అప్పుడామంత్రం ఆయనకు వాచకం అవుతుంది. ఈ వాచ్యవాచక భావం ఈ రెండింటికి అనాదిది. వేదాలలోను, శివాగమంలోనూ యెక్కడెక్కడ షడక్షరమంత్రం ఉన్నదో అక్కడల్లా ఈ వాచ్యవాచకభావం ఉంటుంది. అయినప్పటికి లోకంలో పంచాక్షరమంత్రాన్నే ముఖ్యమైనదిగా చెప్పబడింది. ఈ మంత్రం నిలిచి ఉంది. ఇది ఉండగా బహుమంత్రాల వల్ల, అనేకానేక శాస్త్రాలవల్ల ప్రయోజనం ఏముంది? ఏ విద్వాంసుడు విధిపూర్వకంగా దీని జ్ఞానాన్ని పొంది సక్రమంగా జపిస్తాడో ఆతడు వేదాధ్యయనం చేసినట్లే, అన్నింటిని అనుష్ఠించినట్లే. ఈ మంత్రమే శివజ్ఞానం. ఈ మంత్రమే పరమపదం. ఇదే బ్రహ్మవిద్య. కావున విద్వాంసుడు నిత్యం దీన్ని జపించాలి. ప్రణవంతో (ఓం) పంచాక్షరాలతో కూడిన (ఓం నమఃశివాయ) ఈ మంత్రమే నా హృదయం. ఇది రహస్యం కన్నా మిక్కిలి రహస్యం. మరియు ఇది సాక్షాత్తుగా ఉత్తమోత్తమమైనమోక్షజ్ఞానం.

**అస్య మంత్రస్య వక్ష్యామి ఋషిచ్ఛందోఽధిదైవతమ్ ॥40॥**

**బీజం శక్తిం స్వరం వర్ణం స్థానం చైవాక్షరం ప్రతి ।**
**వామదేవో నామ ఋషిః పంక్తిశ్ఛంద ఉదాహృతః ॥41॥**

**దేవతా శివ ఏవాహం మంత్రస్యాస్య వరాననే ।**
**నకారాదీని బీజాని పంచభూతాత్మకాని చ ॥42॥**

**ఆత్మానం ప్రణవం విద్ధి సర్వవ్యాపినమవ్యయమ్ ।**
**శక్తి స్త్వమేవ దేవేశి సర్వదేవ నమస్కృతే ॥43॥**

**త్వదీయం ప్రణవం కించిన్మదీయం ప్రణవం తథా ।**
**త్వదీయం దేవి మంత్రాణాం శక్తిభూతం న సంశయః ॥44॥**

ఓ పార్వతీదేవీ! ఇప్పుడు నేను ఈ మంత్రం యొక్క అక్షరాలనుగూర్చి ఋషి, ఛందస్సు, దేవత, బీజం, శక్తి, స్వరం, వర్ణం, అట్లే స్థానం – వీటి యొక్క వర్ణన చేస్తాను. ఈ మంత్రం యొక్క ఋషి వామదేవుడు. ఛందస్సు పంక్తి. ఓ వరాననా! పార్వతీ! ఈ మంత్రం యొక్క దేవత శివుణ్ణి అయిన నేనే. పంచభూతస్వరూపాలైన 'న' కారాది అక్షరాలు దీనికి బీజాలు. సర్వవ్యాపి మరియు శాశ్వతమైన నేనే ప్రణవాన్ని అని తెలుసుకో. సమస్తదేవతలందరి చేత నమస్కరింపబడే ఓ దేవేశీ! నీవే దీనికి శక్తివి. నీ ప్రణవానికీ నా ప్రణవానికి కొద్దిపాటి భేదం ఉన్నది. ఓ దేవి! నీ ప్రణవం అన్ని మంత్రాలకు శక్తి స్వరూపం. ఇందుకు సందేహం లేదు.

**అకారోకారమకారా మదీయే ప్రణవే స్థితాః ।**
**ఉకారం చ మకారం చ అకారం చ క్రమేణ వై ॥45॥**

**త్వదీయం ప్రణవం విద్ధి త్రిమాత్రం ప్లుతముత్తమమ్ ।**
**ఓంకారస్య స్వరోదాత్త ఋషిర్బ్రహ్మా సితం వపుః ॥46॥**

**ఛందో దేవీ చ గాయత్రీ పరమాత్మాధిదేవతా ।**
**ఉదాత్తః ప్రథమస్తద్వచ్చతుర్థశ్చ ద్వితీయకః ॥47॥**

**పంచమః స్వరితశ్చైవ మధ్యమో నిషధస్స్మృతః ।**

ఓ పార్వతీ! 'అ'కార, 'ఉ'కార, 'మ్' కారాలు నా ప్రణవంలో ఉంటాయి. (అ+ఉ=ఓ+మ్=ఓమ్) 'ఉ'కార 'మ్'కార 'అ'కారాలు నీ యొక్క ప్రణవంలో ఉంటాయి. నీవు ఈ ఉత్తమ ప్రణవం యొక్క అనగా 'ఓమ్' యొక్క మూడుమాత్రల ఉచ్చారణగల ప్లుతానివి. 'ఓమ్'కారం యొక్క స్వరం ఉదాత్తం. దీని ఋషి బ్రహ్మ. దీని శరీరం తెల్లన. ఛందస్సు దేవి గాయత్రి. దీని అధిదేవత పరమాత్మ. దీని మొదటిది, రెండోది అట్లే నాల్గోది అయిన వర్ణాలు ఉదాత్తం. ఐదోవర్ణం స్వరితం. మరియు మధ్య వర్ణం నిషధం. (నిషాదస్వరం)

**నకారః పీతవర్ణశ్చ స్థానం పూర్వముఖం స్మృతమ్ ॥48॥**

**ఇంద్రోఽధిదైవతం ఛందో గాయత్రీ గౌతమో ఋషిః ।**
**మకారః కృష్ణవర్ణోఽస్య స్థానం వై దక్షిణాముఖమ్ ॥49॥**

**ఛందోఽనుష్టుప్ ఋషిశ్చాత్రీ రుద్రో దైవతముచ్యతే ।**
**శికారో ధూమ్రవర్ణోఽస్య స్థానం వై పశ్చిమం ముఖమ్ ॥50॥**

**విశ్వామిత్ర ఋషిస్త్రిష్టుప్ ఛందో విష్ణుస్తు దైవతమ్ ।**
**వకారో హేమవర్ణోఽస్య స్థానం చైవోత్తరం ముఖమ్ ॥51॥**

**బ్రహ్మాధిదైవతం ఛందో బృహతీ చాంగిరా ఋషి ।**
**యకారో రక్తవర్ణశ్చ స్థానమూర్ధ్వం ముఖం విరాట్ ॥52॥**

**ఛందో ఋషిర్భరద్వాజః స్కందో దైవతముచ్యతే ।**

'న'కారం పీతవర్ణం కలది. దీని స్థానం తూర్పు ముఖం. దీని అధిదేవత ఇంద్రుడు. దీని ఛందస్సు గాయత్రి. దీని ఋషి గౌతముడు. 'మ'కారం కృష్ణవర్ణం కలది. దీని స్థానం దక్షిణముఖం. దీని ఛందస్సు అనుష్టుప్పు. ఋషి అత్రిమహర్షి. అధిదేవత రుద్రుడు. 'శి'కారం ధూమ్రవర్ణం కలది. దీని స్థానం పశ్చిమ ముఖం. దీని ఋషి విశ్వామిత్రుడు. ఛందస్సు త్రిష్టుప్పు. దేవత విష్ణువు. 'వా'కారం బంగారువర్ణం కలది. దీని స్థానం ఉత్తరముఖం. దీని దేవత బ్రహ్మ. ఛందస్సు బృహతి. ఋషి అంగిరసుడు. 'య'కారం రక్తవర్ణం కలది. దీని స్థానం ఊర్ధ్వముఖం. ఛందస్సు విరాట్. భరద్వాజుడు ఋషి. స్కందుడు అధిదేవత.

**న్యాసమస్య ప్రవక్ష్యామి సర్వసిద్ధికరం శుభమ్ ॥53॥**

**సర్వపాపహరం చైవ త్రివిధో న్యాస ఉచ్యతే ।**
**ఉత్పత్తిస్థితిసంహారభేదతస్త్రివిధః స్మృతః ॥54॥**

**బ్రహ్మచారిగృహస్థానాం యతీనాం క్రమశో భవేత్ ।**
**ఉత్పత్తిర్బ్రహ్మచారిణాం గృహస్థానాం స్థితిః సదా ॥55॥**

**యతీనాం సంహృతిన్యాసః సిద్ధిర్భవతి నాన్యథా ।**

ఓ పార్వతీదేవీ! ఇపుడు నేను సర్వసిద్ధుల్ని ప్రదానం చేసేది మంగళకరం అయినదీ, అట్లే సమస్తపాపాల్ని నశింపజేసేది అయిన న్యాసాన్ని గూర్చి చెబుతాను. ఈ న్యాసం మూడు విధాలు. అవి ఉత్పత్తి, స్థితి, సంహారకాలు అనేవి. ఇవి మూడు క్రమంగా బ్రహ్మచారులకు, గృహస్థులకు, యతులకు చెంది ఉంటాయి. ఉత్పత్తి న్యాసం బ్రహ్మచారులకు, స్థితిన్యాసం గృహస్థులకు, సంహారన్యాసం యతులకు సంబంధించినవి. ఈ మూడింటికి మించి మరో సిద్ధి లేదు.

**అంగన్యాసః కరన్యాసో దేహన్యాస ఇతి త్రిధా ॥56॥**

**ఉత్పత్త్యాదిత్రిభేదేన వక్ష్యతే తే వరాననే ।**
**న్యసేత్పూర్వం కరన్యాసం దేహన్యాసమనంతరమ్ ॥57॥**

**అంగన్యాసం తతః పశ్చాదక్షరాణాం విధిక్రమాత్ ।**
**మూర్ధాదిపాదపర్యంతముత్పత్తిన్యాస ఉచ్యతే ॥58॥**

**పాదాదిమూర్ధపర్యంతం సంహారో భవతి ప్రియే ।**
**హృదయాస్యగళన్యాసః స్థితిన్యాస ఉదాహృతః ॥59॥**

**బ్రహ్మచారిగృహస్థానాం యతీనాం చైవ శోభనే ।**

అంగన్యాసం, కరన్యాసం, దేహన్యాసమని న్యాసం మూడు విధాలు. ఓ వరాననా! పార్వతీ! ఇప్పుడు నేను ఉత్పత్తి మొదలైన మూడు భేదాల్ని వీటిల్లోకూడా నీకు చెబుతాను. ముందుగా కరన్యాసాన్ని, తర్వాత దేహన్యాసం, మరల అంగన్యాసం మంత్రంలోని అక్షరాల క్రమంలో గ్రహించాలి. శిరసు నుంచి ప్రారంభించి పాదాల వరకు గల న్యాసం ఉత్పత్తిన్యాసం అవుతుంది. ఓ ప్రియురాలా! పాదాలనుంచి ప్రారంభించి శిరస్సు వరకు గల న్యాసం సంహారం అవుతుంది. హృదయం, ముఖం, కంఠం యొక్క న్యాసం స్థితిన్యాసమవుతుంది. ఈ న్యాసాలు మూడు క్రమంగా బ్రహ్మచారులకు, గృహస్థులకు, యతులకు సంబంధించినవి.

**స శిరస్కం తతో దేహం సర్వమంత్రేణ సంస్పృశేత్ ॥60॥**

**స దేహన్యాస ఇత్యుక్తః సర్వేషాం సమ ఏవ సః ।**
**దక్షిణాంగుష్ఠమారభ్య వామాంగుష్ఠాంత ఏవ హి ॥61॥**

**న్యస్యతే యత్తదుత్పత్తిర్విపరీతం తు సంహృతిః ।**
**అంగుష్ఠాదికనిష్ఠాంతం న్యస్యతే హస్తయోర్ద్వయోః ॥62॥**

**అతీవ భోగదో దేవి స్థితిన్యాసః కుటుంబినామ్ ।**
**కరన్యాసం పురా కృత్వా దేహన్యాసమనంతరమ్ ॥63॥**

**అంగన్యాసం న్యసేత్పశ్చాదేష సాధారణో విధిః ।**

తర్వాత సంపూర్ణమంత్రంతో శిరసుతో కూడిన దేహంతో స్పర్శ పొందించాలి. అది దేహన్యాసం అవుతుంది. అది అన్ని న్యాసాలతో సమానమైంది. కుడిచేతి బొటనిత్రేలుతో ప్రారంభించి ఎడమచేతి బొటనిత్రేలు వరకు ఈ న్యాసం చెయ్యాలి. ఇది ఉత్పత్తి న్యాసం అవుతుంది. దీనికి వ్యతిరేకంగాచేసినన్యాసం సంహృతి (సంహార) న్యాసం. రెండు చేతుల అంగుష్ఠాల నుంచి ప్రారంభించి కనిష్ఠిక వరకు చేసిన న్యాసం స్థితిన్యాసం అవుతుంది. ఓ దేవీ! ఇది గృహస్థులకు పరమ సుఖాల్ని ఇస్తుంది. ప్రప్రథమంగా కరన్యాసం చేసి దేహన్యాసం చేయాలి. తర్వాత అంగన్యాసం నిర్వర్తించాలి. ఇది సామాన్యమైన విధి.

**ఓంకారం సంపుటీకృత్య సర్వాంగేషు చ విన్యసేత్ ॥64॥**

**కరయోరుభయోశ్చైవ దశాగ్రాంగులిషు క్రమాత్ ।**
**ప్రక్షాల్య పాదావాచమ్య శుచిర్భూత్వా సమాహితః ॥65॥**

**ప్రాఙ్ముఖోదఙ్ముఖో వాపి న్యాసకర్మ సమాచరేత్ ।**

ప్రత్యేకంగా మంత్రానికి ఓంకారాన్ని కలిపి అన్ని అంగాలలో, రెండు చేతులలో అట్లే పదిమునిత్రేళ్లల్లో క్రమంగా న్యాసం చేయాలి. రెండు కాళ్లను కడుక్కొని, ఆచమించి పరిశుభ్రంగా ఏకాగ్ర చిత్తంతో తూర్పుదిక్కుకు గాని ఉత్తరదిక్కుకుగాని ముఖాన్ని ఉంచి మంత్రన్యాసకర్మను చేయాలి.

**స్మరేత్పూర్వమృషిం ఛందో దైవతం బీజమేవ చ ॥66॥**

**శక్తిం చ పరమాత్మానం గురుం చైవ వరాననే ।**
**మంత్రేణ పాణీ సమ్మృజ్య తలయోః ప్రణవం న్యసేత్ ॥67॥**

**అంగులీనాం చ సర్వేషాం తథా చాద్యంతపర్వసు ।**
**సబిందుకాని బీజాని పంచమధ్యమపర్వసు ॥68॥**
**ఉత్పత్త్యాదిత్రిభేదేన న్యసేదాశ్రమతః క్రమాత్ ।**
**ఉభాభ్యామేవ పాణిభ్యామాపాదతలమస్తకమ్ ॥69॥**

**మంత్రేణ సంస్పృశేద్దేహం ప్రణవేనైవ సంపుటమ్ ।**
**మూర్ధ్ని వక్త్రే చ కంఠే చ హృదయే గుహ్యకే తథా ॥70॥**
**పాదయోరుభయోశ్చైవ గుహ్యే చ హృదయే తథా ।**
**కంఠే చ ముఖమధ్యే చ మూర్ధ్నిచ ప్రణవాదికమ్ ॥71॥**
**హృదయే గుహ్యకే చైవ పాదయోర్మూర్ధ్నివాపి చ ।**
**కంఠే చైవ న్యసేదేవ ప్రణవాదిత్రిభేదతః ॥72॥**

**కృత్వాంగన్యాసమేవం హి ముఖాని పరికల్పయేత్ ।**
**పూర్వాది చోర్ధ్వపర్యంతం నకారాది యథాక్రమమ్ ॥73॥**

**షడంగాని న్యసేత్పశ్చాద్యథాస్థానం చ శోభనమ్ ।**
**నమః స్వాహా వషడ్ఢుం చ వౌషట్ఫట్కారకైః సహ ॥74॥**

ఓ వరాననా! దేవీ! పార్వతీ! ప్రారంభంలో ఋషిని, ఛందస్సుని, దేవత, బీజాన్ని, శక్తినీ, పరమాత్మనీ అట్లే గురువును స్మరించాలి. మంత్రోచ్చారణతో పాటు రెండు చేతుల్ని కడుక్కొని రెండు అరచేతుల్లో ప్రణవాన్ని న్యాసం చేయాలి. అన్ని అంగుళుల యొక్క ఆది, అంతాల కణుపులలో, ఐదు మధ్య కణుపులలో బిందువుతో కూడిన ఐదు బీజాల్ని, ఉత్పత్తి మొదలైన మూడు భేదాల్ని అట్లే బ్రహ్మచర్యాదుల్ని క్రమంగా న్యాసం చేయాలి. రెండు చేతుల్ని శిరస్సుపై ఉంచి కాళ్ల వరకు ప్రణవం కలిపిన మంత్రం చేత దేహానికి స్పర్శ కలిగించాలి. ప్రణవంతో కూడిన మంత్రంతో శిరసు, ముఖం, కంఠం, హృదయం, మర్మస్థానం, అట్లే రెండు కాళ్లపైన, గుహ్యాస్థానం, హృదయం, కంఠం, ముఖం అట్లే శిరసుపైన మరల హృదయం, గుహ్యాస్థానం, రెండు కాళ్లు, శిరసు, ముఖం అట్లే కంఠం మీద మూడు విధాల న్యాసం చేయాలి. ఈ విధంగా అంగన్యాసం చేసి ప్రణవసహితమైన 'న'కారంతో ప్రారంభించి 'య'కారంతో సంపూర్ణం చేసే వ్యక్తి ఈ 'న'కారం, మొదలైన వర్ణాల్ని క్రమంగా తన శరీరం మీద భావించాలి. తర్వాత మంత్రంతో నమః, స్వాహా, వషట్, హుమ్, వౌషట్, అట్లే ఫట్‌తో కలిపి యథాస్థానంలో ఆరు అంగాలలో ఉత్తమరీతిగా న్యాసం ఉంచాలి.

**ప్రణవం హృదయం విద్యాన్నకారః శిర ఉచ్యతే ।**
**శిఖా మకార ఆఖ్యాతః శికారః కవచం తథా ॥75॥**

**వకారో నేత్రమస్త్రం తు యకారః పరికీర్తితః ।**
**ఇత్థమంగాని విన్యస్య తతో వై బంధయేద్దిశః ॥76॥**

**విఘ్నేశో మాతరో దుర్గా క్షేత్రజ్ఞో దేవతా దిశః ।**
**ఆగ్నేయాదిషు కోణేషు చతుర్ష్వపి యథాక్రమమ్ ॥77॥**

**అంగుష్ఠతర్జన్యగ్రాభ్యాం సంస్థాప్య సుముఖం శుభమ్ ।**
**రక్షధ్వమితి చోక్త్వా తు నమస్కుర్యాత్పృథక్ పృథక్ ॥78॥**

ప్రణవాన్ని హృదయంగా తెలిసికోవాలి. 'న' కారం శిరస్సు. 'మ'కారం శిఖ. 'శి'కారం కవచం. 'వా'కారం నేత్రం. 'య'కారం అస్త్రం. ఈ విధంగా అంగాలలో న్యాసం చేసిన తర్వాత దిక్కులను బంధించాలి. ఆగ్నేయాదులైన నాల్గు విదిక్కులకు క్రమంగా వినాయకుడు, మాతలు, దుర్గాదేవి, అట్లే క్షేత్రజ్ఞుడు దేవతలు. బొటనిప్రేలు చూపుడప్రేలు యొక్క కొసలని తాకుతూ ప్రసన్నముఖాలు కలిగి శుభాలని కలిగించే వినాయకుడు మాతలు (ఏడుగురు మాతృకలు) దుర్గ క్షేత్రజ్ఞ దేవతలని స్థాపించి రక్షించమని చెప్పి మరలమరల నమస్కరించాలి. కళ్యాణప్రదం అట్లే సుందర ముఖాలుగల గణేశాదుల్ని దిక్కుల్లో స్థాపించాలి. రక్షణ కల్పించమని కోరాలి. ఈ విధంగా పలికి మాటిమాటికి నమస్కరించాలి.

**గళే మధ్యే తథాంగుష్ఠే తర్జన్యాద్యంగుళీషుచ ।**
**అంగుష్ఠేన కరన్యాసం కుర్యాదేవ విచక్షణః ॥79॥**

**ఏవం న్యాసమిమం ప్రోక్తం సర్వపాపహరం శుభమ్ ।**
**సర్వసిద్ధికరం పుణ్యం సర్వరక్షాకరం శివమ్ ॥80॥**

**న్యస్తే మంత్రేఽథ సుభగే శంకరప్రతిమో భవేత్ ।**
**జన్మాంతరకృతం పాపమపి నశ్యతి తత్క్షణాత్ ॥81॥**

**ఏవం విన్యస్య మేధావీ శుద్ధకాయో దృఢవ్రతః ।**
**జపేత్పంచాక్షరం మంత్రం లబ్ధ్వాచార్యప్రసాదతః ॥82॥**

బుద్ధిమంతుడు కంఠంలో, మధ్యలో, అంగుష్ఠంలో, తర్జని మొదలైన అంగుళులలో, అంగుష్ఠంతో కరన్యాసం చేయాలి. ఈ విధమైన ఈ న్యాసం సర్వపాపహరం, శుభం మరియు సర్వసిద్ధి ప్రదాయకం. పుణ్యప్రదం. అన్నివిధాల రక్షించేది, అట్లే కళ్యాణకారి అయినది. మంత్రన్యాసం చేసినతర్వాత సాధకుడు శివుడితో సమానుడు అవుతాడు. ఆతడు పూర్వజన్మలోచేసిన సమస్తపాపం కూడా ఆక్షణంలో నశిస్తున్నది. ఈవిధంగా మంత్రన్యాసం చేసిన మేధావి అయిన సాధకుడు పరిశుద్ధశరీరుడు, దృఢవ్రతుడు అయి గురుకృపవల్ల పంచాక్షరీ మంత్రోపదేశాన్ని పొంది జపం చెయ్యాలి.

**అతః పరం ప్రవక్ష్యామి మంత్రసంగ్రహణం శుభే ।**
**యం వినా నిష్ఫలం నిత్యం యేన వా సఫలం భవేత్ ॥83॥**

**ఆజ్ఞాహీనం క్రియాహీనం శ్రద్ధాహీనమమానసమ్ ।**
**ఆజ్ఞప్తం దక్షిణాహీనం సదా జప్తం చ నిష్ఫలమ్ ॥84॥**

**ఆజ్ఞాసిద్ధం క్రియాసిద్ధం శ్రద్ధాసిద్ధం సుమానసమ్ ।**
**ఏవంచ దక్షిణాసిద్ధం మంత్రం సిద్ధం యతస్తతః ॥85॥**

ఓ పార్వతీ! నేనిప్పుడు ఈ మంత్రాన్నిగ్రహించే విధానం చెబుతున్నాను. ఈ మంత్రం లేక అంతా నిష్ఫలమే. దీనివల్లే అంతా సఫలం. జపానికి గురువు ఆజ్ఞ లేనిదీ, జపానికి తగిన క్రియలేనిదీ, శ్రద్ధలేనిదీ స్థిరమైన మనస్సులేనిదీ ఇతరులచేత ఆజ్ఞాపించబడినదీ, ఉత్తమదక్షిణలేనిదైన జపాన్ని ఎల్లవేళలా చేసినా అది నిష్ఫలం. వ్యర్థమే. ప్రతిరోజూ గురువుచేత ఆజ్ఞాపించబడినది, క్రియతో సిద్ధమైనది, శ్రద్ధతో సిద్ధించినదీ, నిశ్చలస్థిరమనస్సుగలదీ దక్షిణాసిద్ధిగల మంత్రం ఎలా చేసినా సిద్ధిని ఫలితాన్ని ఇస్తుంది.

**ఉపగమ్య గురుం విప్రం మంత్రతత్త్వార్థవేదినమ్ ।**
**జ్ఞానినం సద్గుణోపేతం ధ్యానయోగపరాయణమ్ ॥86॥**

**తోషయేత్తం ప్రయత్నేన భావశుద్ధిసమన్వితః ।**
**వాచా చ మనసా చైవ కాయేన ద్రవిణేన చ ॥87॥**

**ఆచార్యం పూజయేచ్ఛిష్యః సర్వదాఽతిప్రయత్నతః ।**
**హస్త్యశ్వరథరత్నాని క్షేత్రాణి చ గృహాణిచ ॥88॥**

**భూషణాని చ వాసాంసి ధాన్యాని వివిధాని చ ।**
**ఏతాని గురవే దద్యాద్భక్త్యా చ విభవే సతి ॥89॥**

**విత్తశాఠ్యం న కుర్వీత యదీచ్ఛేత్సిద్ధిమాత్మనః ।**
**పశ్చాన్నివేదయేద్దేవి ఆత్మానం సపరిచ్ఛదమ్ ॥90॥**

**ఏవం సంపూజ్య విధివద్యథాశక్తి త్వవంచయన్ ।**
**ఆదదీత గురోర్మంత్రం జ్ఞానం చైవ క్రమేణ తు ॥91॥**

మంత్రతత్త్వం బాగా తెలిసినవాడు, జ్ఞానసంపన్నుడు, సద్గుణోపేతుడు, ధ్యానయోగపరాయణుడు, విప్రుడు అయిన గురువును చేరి, భావశుద్ధితో కూడిన మనసుతో వాక్కుతో, శరీరంతో (కర్మతో) అట్లే ధనంతో ఆయన్ని ప్రయత్నపూర్వకంగా సంతుష్టుణ్ణి చేయాలి. మరియు గొప్ప ప్రయత్నంతో ఆ ఆచార్యుణ్ణి ఎల్లప్పుడూ పూజించాలి. శిష్యుడు సంపన్నుడైనచో ఏనుగులు, అశ్వాలు, రథాలు, రత్నాలు, క్షేత్రాలు, గృహాలు, భూషణాలు వస్త్రాలు, వివిధ ధాన్యాలు - ఇవన్నీ ఆచార్యుడికి భక్తితో సమర్పించాలి. సిద్ధిని కోరేవాడికి ధనవిషయంలో కపటం తగదు. ఓ పార్వతీదేవి! తర్వాత తన వస్తువులను, తననుకూడా సమర్పించుకోవాలి. ఈ విధంగా విధ్యుక్తంగా యథాశక్తి గురువును పూజిస్తూ, నిష్కపటభావంతో ఉండి గురువునుంచి జ్ఞానాన్ని, మంత్రాన్ని గ్రహించాలి.

**ఏవం తుష్టో గురుః శిష్యం పూజితం వత్సరోషితమ్ ।**
**శుశ్రూషమనహంకారముపవాసకృతం శుచిమ్ ॥92॥**

**స్నాపయిత్వా తు శిష్యాయ బ్రాహ్మణానపి పూజ్య చ ।**
**సముద్రతీరే నాద్యాం చ గోష్ఠే దేవాలయేఽపి వా ॥93॥**

**శుచౌ దేశే గృహే వాపి కాలే సిద్ధికరే తిథౌ ।**
**నక్షత్రే శుభయోగే చ సర్వదా దోషవర్జితే ॥94॥**

**అనుగృహ్య తతో దద్యాచ్ఛివజ్ఞానమనుత్తమమ్ ।**
**స్వరేణోచ్చారయేత్సమ్యగేకాంతేఽపి ప్రసన్నధీః ॥95॥**

**ఉచ్చార్యోచ్చారయిత్వా తు ఆచార్యః సిద్ధిదః స్వయమ్ ।**
**శివం చాస్తు శుభం చాస్తు శోభనోఽస్తు ప్రియోఽస్త్వితి ॥96॥**

ఈ విధంగా సంతోషించిన గురువు ఒక సంవత్సరకాలం తనవద్దఉండి సేవాపరాయణుడు, అహంకారంలేనివాడూ, ఉపవాసాలతో దుర్బలశరీరుడు, పరిశుద్ధుడు అయి పూజించిన శిష్యుడికి స్నానం చేయించి, బ్రాహ్మణ పూజచేసి సముద్రతీరంలోగాని, నదీతీరంలోగానీ, గోశాలలోగానీ, దేవాలయంలోగాని, ఇంటిలో పవిత్రస్థానంలోగాని, సిద్ధికారకమైనకాలంలో, ఉత్తమమైనతిథిలో, దోషరహితమైననక్షత్రంలో - ఈవిధమైన

శుభయోగంలో శిష్యుడి మీద అనుగ్రహంతో ఆతడికి అత్యుత్తమమైన శివజ్ఞానాన్ని ప్రదానం చేయాలి. దాంతోపాటు ప్రసన్నచిత్తంతో ఏకాంతంలో స్వరయుక్తంగా మంత్రాన్ని బాగా ఉచ్చరించాలి. తాను స్వయంగా ఉచ్చరించి, అట్లే శిష్యుడితో ఉచ్చరింపజేసి, మంత్రదాత అయిన ఆచార్యుడు ఇలా దీవించాలి. "నీకు కళ్యాణమగుగాక! కుశలమగుగాక! శుభమగుగాక! ప్రియమగుగాక" అని.

**ఏవం లబ్ధ్వా పరం మంత్రం జ్ఞానం చైవ గురోస్తతః ।**
**జపేన్నిత్యం ససంకల్పం పురశ్చరణమేవ చ ॥97॥**

**యావజ్జీవం జపేన్నిత్యమష్టోత్తరసహస్రకమ్ ।**
**అనశ్నంస్తత్పరో భూత్వా స యాతి పరమాం గతిమ్ ॥98॥**

ఈ విధంగా గురువువల్ల శ్రేష్ఠమైన మంత్రాన్ని, జ్ఞానాన్ని పొంది నిత్యం సంకల్పంతో మంత్రాన్ని జపించాలి. మరియు పునశ్చరణ కూడా చేయాలి. నిరాహారతత్పరుడై, జీవితాంతం నిత్యం ఒక వెయ్యి ఎనిమిదిసార్లు జపించాలి. అట్టివాడు పరమగతిని పొందుతాడు.

**జపేదక్షరలక్షం వై చతుర్గుణితమాదరాత్ ।**
**నక్తాశీ సంయమీ యశ్చ పౌరశ్చరణికః స్మృతః ॥99॥**

**పురశ్చరణజాపీ వా అపి వా నిత్యజాపకః ।**
**అచిరాత్సిద్ధికాంక్షీ తు తయోరన్యతరో భవేత్ ॥100॥**

రాత్రి ఉపవాసవ్రతం చేస్తూ, నియమాలు పాటిస్తూ శ్రద్ధాపూర్వకంగా ఈ మంత్రాన్ని అక్షరలక్షనిగానీ నాల్గులక్షలసార్లుగానీ జపిస్తే దాన్ని పురశ్చరణ చేయువాడు అనబడతాడు. పురశ్చరణ చేయువాడూ, అట్లే నిత్యజపం చేయువాడూ త్వరగానే సిద్ధిని పొందుతారు. రెంటిలో ఏదో ఒకదానిని అవశ్యంగా నిర్వహించాలి.

**యః పురశ్చరణం కృత్వా నిత్యజాపీ భవేన్నరః ।**
**తస్య నాస్తి సమో లోకే స సిద్ధః సిద్ధిదో వశీ ॥101॥**

ఎవడు పురశ్చరణ చేస్తూ నిత్యజపం చేస్తాడో ఆతడితో సమానమైనవాడు లోకంలో ఎవ్వడూ లేడు. ఆతడు సిద్ధుడు, సిద్ధిదాత, మరియు జితేంద్రియుడు.

**ఆసనం రుచిరం బద్ధ్వా మౌనీ చైకాగ్రమానసః ।**
**ప్రాఙ్ముఖోదఙ్ముఖో వాపి జపేన్మంత్రమనుత్తమమ్ ॥102॥**

సుఖకరమైన ఆసనాన్ని వేసి మౌనంలో ఉన్నవాడై ప్రధానలక్ష్యంపైన మనస్సుని నిలిపినవాడై మహామంత్రాన్ని జపించాలి. ఏకాగ్రతగలవాడై తూర్పు ముఖుడైగాని,ఉత్తరముఖుడైగాని కూర్చుండి ఈ సర్వోత్తమమంత్రాన్ని జపించాలి.

**ఆద్యంతయోర్జపస్యాపి కుర్యాద్వై ప్రాణసంయమాన్ ।**
**తథా చాంతే జపేద్బీజం శతమష్టోత్తరం శుభమ్ ॥103॥**

**చత్వారింశత్సమావృత్తి ప్రాణానాయమ్య సంస్మరేత్ ।**
**పంచాక్షరస్య మంత్రస్య ప్రాణాయామ ఉదాహృతః ॥104॥**

**ప్రాణాయామాద్భవేత్ క్షిప్రం సర్వపాపపరిక్షయః ।**
**ఇంద్రియాణాం వశిత్వం చ తస్మాత్ప్రాణాంశ్చ సంయమేత్ ॥105॥**

జపప్రారంభంలోనూ అంతంలోనూ ప్రాణాయామాలని చేయాలి. చివరలో నూట ఎనిమిది సార్లు బీజమంత్రాన్ని జపించాలి. శ్వాసను నిరోధించి నలభైసార్లు బీజమంత్రాన్ని జపించాలి. ఇది పంచాక్షరమంత్రం యొక్క ప్రాణాయామం అవుతున్నది. ప్రాణాయామం వల్ల త్వరగా అన్ని పాపాల నాశనం మరియు ఇంద్రియనిగ్రహం కలుగుతున్నది. అందుచే తప్పక ప్రాణాయామం చేయాలి.

**గృహే జపః సమం విద్యాత్ గోష్ఠే శతగుణం భవేత్ ।**
**నద్యాం శతసహస్రం తు అనంతః శివసన్నిధౌ ॥106॥**

**సముద్రతీరే దేవహ్రదే గిరౌ దేవాలయేషు చ ।**
**పుణ్యాశ్రమేషు సర్వేషు జపః కోటిగుణో భవేత్ ॥107॥**

**శివస్య సన్నిధానే చ సూర్యస్యాగ్రే గురోరపి ।**
**దీపస్య గోర్జలస్యాపి జపకర్మ ప్రశస్యతే ॥108॥**

ఇంటిలో చేసే జపాన్ని సామాన్యజపంగా తెలిసికోవాలి. గోశాలలో చేసే జపం దీనికి వందరెట్లు ఫలదాయకం అవుతుంది. నదీతటంలో చేసేది లక్ష రెట్లు, మరియు శివసన్నిధిలో చేసేది అనంతగుణఫలదాయకం అవుతుంది. సముద్రతీరంలో, దేవతల సరోవరతీరాల్లో, పర్వతాలమీద, దేవాలయాలలో అట్లే అన్నిపుణ్యాశ్రమాలలోచేసే జపం కోటిరెట్లు ఫలదాయకం అవుతుంది. శివసన్నిధిలో, సూర్యుడు, గురువు, దీపం, గోవు లేక జలసన్నిధిలో చేసే జపం శ్రేష్ఠమైంది అవుతుంది.

**అంగులీజపసంఖ్యానమేకమేకం శుభాననే ।**
**రేఖైరష్టగుణం ప్రోక్తం పుత్రజీవఫలైర్దశ ॥109॥**

**శతం వై శంఖమణిభిః ప్రవాలైశ్చ సహస్రకమ్ ।**
**స్ఫాటికైర్దశసాహస్రం మౌక్తికైర్లక్షముచ్యతే ॥110॥**

**పద్మాక్షైర్దశలక్షం తు సౌవర్ణైః కోటిరుచ్యతే ।**
**కుశగ్రంథ్యా చ రుద్రాక్షైరనంతగుణముచ్యతే ॥111॥**

ఓ శుభాననా! పార్వతీ! ఒకటిఒకటిగా వ్రేళ్ల కణుపుల మీద జపాన్ని లెక్కించేపద్ధతి సామాన్యఫలదాయకం అవుతున్నది. రేఖలమీద లెక్కించేవిధానం వ్రేళ్లమీద లెక్కించేదానికంటే ఎనిమిదిరెట్లు అధికఫలదాయకం అవుతుంది. పుత్రజీవఫలాలతో జపంచేస్తే అదిపదిరెట్లు, శంఖాలతో మణులతో అయితే అదివందరెట్లు, ప్రవాళాలతో లెక్కిస్తే అది వేయిరెట్లు, స్ఫటికాలతో అయితే పదివేల రెట్లు, ముత్యాలతో అయితే లక్ష రెట్లు ఫలదాయకం అవుతుంది.

పద్మాల గింజలతో లెక్కిస్తే పదిలక్షల రెట్లు, బంగారు శకలాలతో లెక్కిస్తే కోటిరెట్లు అవుతుంది. కుశగ్రంథులతో అట్లే రుద్రాక్షలతో లెక్కించే జపం అనంతగుణఫలదాయకం అవుతుంది.

**పంచవింశతి మోక్షార్థం సప్తవింశతి పౌష్టికమ్ ।**
**త్రింశచ్చ ధనసంపత్త్యై పంచాశచ్చాభిచారికమ్ ॥112॥**

**తత్పూర్వాభిముఖం వశ్యం దక్షిణం చాభిచారికమ్ ।**
**పశ్చిమం ధనదం విద్యాదుత్తరం శాంతికం భవేత్ ॥113॥**

ఇరవై అయిదు రుద్రాక్షలు గల జపమాలను మోక్షంకొరకూ, ఇరవైఏడు కలిగినట్టిదానిని పుష్టికోసమూ, ముప్పై కలిగినట్టి దానిని ధన సంపదకోసం, ఏబది కలిగినట్టిదానిని క్షుద్రపూజా ఫలితం కోసం వాడుకోవాలి. పూర్వ దిక్కునకు ముఖాన్ని ఉంచి చేసే జపం వశీకరణశక్తిని ఇస్తుంది. దక్షిణ దిక్కునకు తిరిగి చేసే జపం చేతబడి కర్మశక్తిని ఇచ్చేదిగా, పడమరవైపు ముఖముంచి చేసే జపం ధనాన్ని ప్రదానం చేసేదిగా, ఉత్తరం వైపు ముఖం ఉంచి చేసే జపం శాంతి ప్రదాయికంగా గ్రహించాలి.

**అంగుష్ఠం మోక్షదం విద్యాత్తర్జనీ శత్రునాశనీ ।**
**మాధ్యమా ధనదా శాంతిం కరోత్యేషాహ్యనామికా ॥114॥**

**కనిష్ఠా రక్షణీయా సా జపకర్మణి శోభనే ।**
**అంగుష్ఠేన జపేజ్జప్యమన్యైరంగులిభిః సహ ॥115॥**

**అంగుష్ఠేన వినా కర్మ కృతం తదఫలం యతః ।**

బొటనవ్రేలితో చేసే జపం మోక్షాన్ని ఇస్తుందని తెలియాలి. తర్జని అంగులితో చేసే జపం శత్రునాశాన్ని కలిగిస్తుంది. మధ్యమాంగులితో చేసేది ధనాన్ని ప్రదానం చేస్తుంది. అనామిక (ఉంగరం వ్రేలు) శాంతిని ప్రదానం చేస్తుంది. ఓ పార్వతీ! కనిష్ఠిక రక్షణ కల్పిస్తుంది. అంగుష్ఠాన్ని ఇతరాలైన తర్జన్యాదులతో కలిసి లెక్కిస్తూ మంత్రజపం చేయాలి. అంగుష్ఠాన్ని ఇతరాలైన అంగుళాలతో కలపని జపం నిష్ఫలం అవుతుంది.

**శృణుష్వ సర్వయజ్ఞేభ్యో జపయజ్ఞో విశిష్యతే ॥116॥**

**హింసయా తే ప్రవర్తంతే జపయజ్ఞో న హింసయా ।**
**యావంతః కర్మయజ్ఞాః స్యుః ప్రదానాని తపాంసి చ ॥117॥**

**సర్వే తే జపయజ్ఞస్య కలాం నార్హంతి షోడశీమ్ ।**

ఓ దేవీ! విను! జపయజ్ఞం అన్ని యజ్ఞాల కన్నా శ్రేష్ఠమైంది. ఇతర యజ్ఞాలన్నీ హింసతో కలిసి ఉంటాయి. జపయజ్ఞమే హింస లేక ఉంటుంది. కర్మయజ్ఞాలూ, దానాలూ, తపస్సులూ ఎన్నికలవో అవి అన్నీ ఈ జపయజ్ఞం యొక్క పదహారో కళతో కూడా సమానం కావు.

**మాహాత్మ్యం వాచికస్యైవ జపయజ్ఞస్య కీర్తితమ్ ॥118॥**

**తస్మాచ్ఛతగుణోపాంశుః సహస్రో మానసః స్మృతః ।**
**యదుచ్చనీచస్వరితైః శబ్దైః స్పష్టపదాక్షరైః ॥119॥**

**మంత్రముచ్చారయేద్వాచా జపయజ్ఞః స వాచికః ।**
**శనైరుచ్చారయేన్మంత్రమీషదోష్ఠౌ తు చాలయేత్ ॥120॥**

**కించిత్కర్ణాంతరం విద్యాదుపాంశుః స జపః స్మృతః ।**
**ధియా యదక్షరశ్రేణ్యా వర్ణాద్వర్ణం పదాత్పదమ్ ॥121॥**

**శబ్దార్థం చింతయేద్భూయః స తూక్తో మానసో జపః ।**
**త్రయాణాం జపయజ్ఞానాం శ్రేయాన్ స్యాదుత్తరోత్తరః ॥122॥**

**భవేద్యజ్ఞవిశేషేణ వైశిష్ట్యం తత్ఫలస్య చ ।**

వాచిక జపయజ్ఞానికి ఏ మాహాత్మ్యం చెప్పబడిందో దానికి నూరురెట్లుగా ఉపాంశుయజ్ఞమూ, మరియు మానస యజ్ఞం వేయిరెట్లుగా చెప్పబడింది. స్పష్టంగా పదాల్ని, అక్షరాల్ని పలకగలిగిన ఏ సాధుకుడు శబ్దాలతో పాటు ఉదాత్త, అనుదాత్త, స్వరితస్వరాలతో కూడిన వాణితో మంత్రోచ్చారణ చేస్తాడో ఆతడు జపయజ్ఞవాచికుడు అవుతాడు. ఏ సాధకుడు బుద్ధిలో స్వరాలతో మంత్రోచ్చారణ చేస్తూ, కొద్ది కొద్దిగా పెదవుల్ని కదిలిస్తూ అట్లే కొద్దికొద్దిగా చెవులతో ఆ మంత్రాన్ని వింటూ ఉంటాడో ఆతడి జపం ఉపాంశుజపం అవుతుంది. ఏ సాధకుడు మనసులో అక్షరసమూహాన్ని వర్ణం నుంచి వర్ణం, పదం నుంచి పదం శబ్దార్థాల్ని మాటిమాటికి చింతిస్తూ ఉంటాడో ఆతడి జపాన్ని మానసజపం అంటారు. ఈ మూడు జపయజ్ఞాలలో ఉత్తరోత్తరం శ్రేష్ఠమైనది. (అనగా మొదటిదానికన్నా రెండోది, రెండోదాని కన్నా మూడోది) యజ్ఞవిశేషాన్నిబట్టి దాని ఫలము దానియొక్క ప్రత్యేకతా ఉంటుంది.

**జపేన దేవతా నిత్యం స్తూయమానా ప్రసీదతి ॥123॥**

**ప్రసన్నా విపులాన్ భోగాన్ దద్యాన్ముక్తిం చ శాశ్వతీమ్ ।**
**యక్షరక్షఃపిశాచాశ్చ గ్రహాః సర్వే చ భీషణాః ।**

**జాపినం నోపసర్పంతి భయభీతాః సమంతతః ॥124॥**

జపం ద్వారా నిత్యం స్తుతింపబడే దేవత ప్రసన్నమవుతుంది. ప్రసన్నమైన దేవత అత్యధికభోగాల్ని అట్లే చిరస్థాయి అయిన ముక్తిని ప్రదానం చేస్తుంది. యక్షులు, రాక్షసులు, పిశాచాలు, అట్లే భయంకర గ్రహాలు జపం చేసే వ్యక్తి దగ్గరకు వెళ్లవు. ఆతడి నుంచి సంపూర్ణంగా భయభీతులవుతాయి.

**జపేన పాపం శమయేదశేషం యత్తత్కృతం జన్మపరంపరాసు ।**
**జపేన భోగాన్ జయతే చ మృత్యుం జపేన సిద్ధిం లభతే చ ముక్తిమ్ ॥125॥**

మానవుడు జన్మజన్మాంతరాలల్లో చేసిన పాపం కూడా ఈ జపంతో పూర్తిగా నశిస్తున్నది. జపం ద్వారా భోగాలు ప్రాప్తిస్తున్నాయి. మృత్యువు జయింపబడుతున్నది. జపం వల్ల సిద్ధి మరియు ముక్తి ప్రాప్తిస్తున్నాయి.

**ఏవం లబ్ధ్వా శివం జ్ఞానం జ్ఞాత్వా జపవిధిక్రమమ్ ॥126॥**

**సదాచారీ జపన్నిత్యం ధ్యాయన్ భద్రం సమశ్నుతే ।**

ఈ విధంగా శివజ్ఞానాన్ని పొంది, జపవిధి క్రమాన్ని తెలిసి సదాచారుడైన మానవుడు నిత్యం జపం చేస్తూ, అట్లే శివుణ్ణి ధ్యానిస్తూ కళ్యాణాన్ని పొందుతున్నాడు.

**సదాచారం ప్రవక్ష్యామి సమ్యక్ ధర్మస్య సాధనమ్ ॥127॥**

**యస్మాదాచారహీనస్య సాధనం నిష్ఫలం భవేత్ ।**
**ఆచారః పరమో ధర్మ ఆచారః పరమం తపః ॥128॥**

**ఆచారః పరమా విద్యా ఆచారః పరమా గతిః ।**
**సదాచారవతాం పుంసాం సర్వత్రాప్యభయం భవేత్ ॥129॥**

**తద్వదాచారహీనానాం సర్వత్రైవ భయం భవేత్ ।**

ఓ పార్వతీ! నేను ఇపుడు ధర్మసాధనరూపమైన సదాచారం గురించి వివరంగా చెబుతాను. ఆచారహీనుడైన వ్యక్తి సాధనం నిష్ఫలం కాగలదు. ఆచారమే పరమధర్మం. ఆచారమే పరమమైన తపస్సు. ఆచారమే శ్రేష్ఠమైన విద్య. ఆచారమే పరమమైన గతి. సదాచారమానవుడికి ఎక్కడైన భయరాహిత్యం కలుగుతుంది. అట్లే ఆచారరహితుడికి అన్నిచోట్ల భయం కలుగుతుంది.

**సదాచారేణ దేవత్వమృషిత్వం చ వరాననే ॥130॥**

**ఉపయాంతి కుయోనిత్వం తద్వదాచారలంఘనాత్ ।**
**ఆచారహీనః పురుషో లోకే భవతి నిందితః ॥131॥**

**తస్మాత్సంసిద్ధిమన్విచ్ఛన్ సమ్యగాచారవాన్ భవేత్ ।**
**దుర్వృత్తో శుద్ధిభూయిష్ఠో పాపీయాన్ జ్ఞానదూషకః ॥132॥**

ఓ వరాననా! పార్వతీ! ఎవడు సదాచారాన్ని పాటిస్తాడో ఆతడికి దేవత్వం ఋషిత్వం ప్రాప్తిస్తుంది. ఎవడు ఆచారాన్ని ఉల్లంఘిస్తాడో ఆతడికి నీచజన్మ లభిస్తుంది. ఆచారదూరుడైన పురుషుడు లోకంలో నిందితుడు అవుతాడు. కావున సిద్ధిని పొందగోరేవాడు సంపూర్ణంగా ఆచారవంతుడు కావాలి. మహాశుద్ధిమంతుడు కూడా దురాచారి అయితే పాపి మరియు జ్ఞానదూషకుడు అవుతున్నాడు.

**వర్ణాశ్రమవిధానోక్తం ధర్మం కుర్వీత యత్నతః ॥133॥**

**యస్య యద్విహితం కర్మ తత్కుర్వన్ మత్ప్రియః సదా ।**
**సంధ్యోపాసనశీలః స్యాత్సాయం ప్రాతః ప్రసన్నధీః ॥134॥**
**ఉదయాస్తమయపూర్వమారభ్య విధినా శుచిః ।**
**కామాన్మోహాద్భయాల్లోభాత్సంధ్యాం నాతిక్రమేద్ ద్విజః ॥135॥**

**సంధ్యాతిక్రమణాద్విప్రో బ్రాహ్మణ్యాత్పతతే యతః ।**

వర్ణాశ్రమవిధానానుసారంగా చెప్పబడిన ధర్మాన్ని ప్రయత్నపూర్వకంగా పాటించాలి. తనకు ఏ కర్మ అయితే విహితమయిందో ఆ కర్మను నిర్వర్తించేవాడే ఎల్లప్పుడూ నాకు ఇష్టుడు. ప్రసన్నచిత్తుడై ప్రాతఃకాలంలో సాయంకాలంలో సంధ్యోపాసన నిర్వర్తించాలి. ద్విజుడు సూర్యోదయానికి ముందు, అట్లే సూర్యాస్తమయానికి ముందు మొదలుపెట్టి పవిత్రుడై విధిపూర్వకంగా సంధ్యావందనం చేయకుండా ఉండరాదు. ఎందుకంటే సంధ్యను ఉల్లంఘించిన విప్రుడు బ్రాహ్మణత్వం కోల్పోతాడు.

**అసత్యం న వదేత్కించిన్న సత్యం చ పరిత్యజేత్ ॥136॥**

**యత్సత్యం బ్రహ్మ ఇత్యాహురసత్యం బ్రహ్మదూషణమ్ ।**
**అనృతం పరుషం శాఠ్యం పైశున్యం పాపహేతుకమ్ ॥137॥**

**పరదారాన్ పరద్రవ్యం పరహింసాం చ సర్వదా ।**
**క్వచిచ్చాపి న కుర్వీత వాచా చ మనసా తథా ॥138॥**

స్వల్పంగా కూడా అసత్యం పలకరాదు. సత్యాన్ని పరిత్యజించరాదు. సత్యమే బ్రహ్మమంటున్నారు. అసత్యం పలికేవాడు బ్రహ్మను నిందించేవాడు. అసత్యం, పారుష్యం, మోసం, పిసినారితనం పాపకారణాలు. వాక్కుతోను, మనసుతోనూ ఇతరులభార్యలను, ఇతరుల ధనాన్ని హరించడం, అట్లే పరులను హింసించడం చేయరాదు.

**శూద్రాన్నం యాతయామాన్నం, నైవేద్యం, శ్రాద్ధమేవ చ ।**
**గణాన్నం, సముదాయాన్నం, రాజాన్నం చ వివర్జయేత్ ॥139॥**

**అన్నశుద్ధౌ సత్త్వశుద్ధిర్న మృదా న జలేన వై ।**
**సత్త్వశుద్ధౌ భవేత్సిద్ధిస్తతోఽన్నం పరిశోధయేత్ ॥140॥**

శూద్రాన్నం, చద్దిఅన్నం, శివుడి నైవేద్యం, శ్రాద్ధాన్నం, ఎక్కువమంది అధికారంతో వండిన అన్నం, జన సమూహవిశేషానికి ప్రత్యేకించిన అన్నం, రాజుల అన్నం విడిచిపెట్టాలి. అన్నశుద్ధిలోనే అంతఃకరణశుద్ధిఉంది. మట్టితోను, నీటితోను శుద్ధి కలుగదు. అంతఃకరణ పవిత్రత వల్లే సిద్ధి కలుగుతున్నది. అందువల్ల అన్నంయొక్క పరిశీలన చేయాలి. పవిత్రాన్నాన్ని మాత్రమే తినాలి.

**రాజప్రతిగ్రహైర్దగ్ధాన్ బ్రాహ్మణాన్ బ్రహ్మవాదినః ।**
**స్విన్నానామపి బీజానాం పునర్జన్మ న విద్యతే ॥141॥**

**రాజప్రతిగ్రహో ఘోరో బుద్ధ్వా చాదౌ విషోపమః ।**
**బుధేన పరిహర్తవ్యః శ్వమాంసం చాపి వర్జయేత్ ॥142॥**

స్విన్నమైన (వేయించిన) విత్తనాలు ఎలా మొలకలు ఎత్తవో అట్లే బ్రహ్మవాది అయిన బ్రాహ్మణుడు రాజుల నుంచి దానాలు తీసికున్న బ్రాహ్మణులను పాపంతో దగ్ధమైన వారినిగా తెలిసికోవాలి. వారికి పునర్జన్మఉండదు.

(పరిగ్రహిస్తే బ్రాహ్మణత్వచ్యుతి కలుగుతుందని అర్థం) రాజుల నుంచి పరిగ్రహం వల్ల కలిగిన పాపం ఘోరమైన విషంతో సమానం. దీన్ని ముందుగానే తెలిసి బుద్ధిమంతుడు దాన్ని పరిహరించాలి. కుక్కమాసం కూడా వర్జించాలి.

**అస్నాత్వా న చ భుంజీయాదజపోఽగ్నిమపూజ్య చ ।**
**పర్ణపృష్ఠే న భుంజీయాద్రాత్రౌ దీపం వినా తథా ॥143॥**

**భిన్నభాండే చ రథ్యాయాం పతితానాం చ సన్నిధౌ ।**
**శూద్రశేషం న భుంజీయాత్సహాన్నం శిశుకైరపి ॥144॥**

స్నానం చేయకుండా, జపం చేయకుండా, అగ్నిని వ్రేల్చకుండా భోజనం చేయరాదు. ఆకుల వెనుక భాగంలో భోజనం చేయరాదు. దీపం లేకుండా తినరాదు. పగిలిన పాత్రలో, మార్గంలో, పతితుల సమీపంలో భోజనం చేయరాదు. శూద్రులు తినగా మిగిలిన అన్నాన్ని తినరాదు. మరియు శిశువులతో కలసి కూర్చుండి భోజనం చేయరాదు.

**శుద్ధాన్నం స్నిగ్ధమశ్నీయాత్సంస్కృతం చాభిమంత్రితమ్ ।**
**భోక్తా శివ ఇతి స్మృత్వా మౌనీ చైకాగ్రమానసః ॥145॥**

**ఆస్యేన న పిబేత్తోయం తిష్ఠన్నాంజలినాపి వా ।**
**వామహస్తేన శయ్యాయాం తథైవాన్యకరేణ వా ॥146॥**

నిర్మలమూ పవిత్రమూ అయినదీ మృదువై నెయ్యి కలిసినదీ సమానంగా ఉడికినదీ మంత్రంతో అభిమంత్రించబడినదైన అన్నాన్ని గ్రహించాలి. భోజనం చేయువాడు శివుడు అనే భావనతో మౌనంగా ఏకాగ్రచిత్తంతో భోజనం చేయాలి. నీటిని ముఖంతో త్రాగరాదు. నిలిచియుండి మరియు దోసిలి పట్టి కూడా త్రాగరాదు. ఎడం చేతితో, శయ్యమీద కూర్చుండి కుడి చేతితో కూడా నీరు త్రాగరాదు.

**విభీతకార్కకారంజస్నుహిచ్ఛాయాం న చాశ్రయేత్ ।**
**స్తంభదీపమనుష్యాణామన్యేషాం ప్రాణినాం తథా ॥147॥**

చింతచెట్టు, జిల్లేడు చెట్టు, గానుగచెట్టు, మందారచెట్టు నీడలో విశ్రాంతి తీసుకోరాదు. స్తంభం, దీపస్తంభం, మానవుడు, ఇతర ప్రాణుల నీడను ఆశ్రయించరాదు.

**ఏకో న గచ్ఛేదధ్వానం బాహుభ్యాం నోత్తరేన్నదీమ్ ।**
**నావరోహేత కూపాది నారోహేదుచ్ఛపాదపాన్ ॥148॥**

బాటలో ఒక్కడే ప్రయాణం చేయరాదు. నదిని చేతులతో ఈది దాటరాదు. బావులు మొదలైన వాటిలో దిగరాదు. ఎత్తైన చెట్లను ఎక్కరాదు.

**సూర్యాగ్నిజలదేవానాం గురూణాం విముఖః శుభే ।**
**న కుర్యాదిహ కార్యాణి జపకర్మ శుభాని వా ॥149॥**

ఓ పార్వతీదేవి! సూర్యుడు, అగ్ని, జలం, దేవతలు, అట్లే గురుజనులు – వీరికి విముఖుడై అనగా వెన్నుచూపి జపాన్నిగాని ఇతర శుభకర్మనుగాని చేయరాదు.

**అగ్నౌ న తాపయేత్పాదౌ హస్తం పద్భ్యాం న సంస్పృశేత్ ।**
**అగ్నేర్నోచ్ఛ్రయాసీత నాగ్నౌ కించిన్మలం త్యజేత్ ॥150॥**

అగ్నిలో పాదాల్ని తపింప చేయరాదు. పాదాలను చేతులతో స్పర్శించరాదు. అగ్నికి పైభాగంలో ఆసనాన్ని నిర్మించరాదు. అగ్నిలో ఏ విధమైన మలాన్ని వేయరాదు.

**న జలం తాడయేత్పద్భ్యాం నాంభస్యంగమలం త్యజేత్ ।**
**మలం ప్రక్షాలయేత్తీరే ప్రక్షాల్య స్నానమాచరేత్ ॥151॥**

పాదాలతో నీటిని తన్నరాదు. శారీరకమలాన్ని జలంలో విడిచి పెట్టరాదు. ఆ మలాన్ని ఒడ్డునే కడుక్కుని శుద్ధి పర్చుకోవాలి. అలా మలాన్ని శుద్ధిపర్చుకుని మాత్రమే స్నానం చేయాలి.

**నఖాగ్రకేశనిర్ధూతస్నానవస్త్రఘటోదకమ్ ।**
**అశ్రీకరం మనుష్యాణామశుద్ధం సంస్పృశేద్యది ॥152॥**

గోళ్లపైభాగాలు, వెంట్రుకలు, స్నానవస్త్రంతో కూడిన పాత్రలోగల జలం మానవులకు శ్రేయస్కరం కాదు. ఎవరైనా ఆ జలాన్ని తాకితే అపరిశుభ్రులు అవుతారు.

**అజాశ్వానఖరోష్ట్రాణాం మార్జనాత్తుపరేణుకాన్ ।**
**సంస్పృశేద్యది మూఢాత్మా శ్రియం హంతి హరేరపి ॥153॥**

మేకలు, కుక్కలు, గాడిదలు, ఒంటెలు తొక్కడం వల్ల లేచిన దుమ్ము, ఊడవడం వల్ల రేగిన ధూళిని ఏ మూఢుడు తాకుతాడో వాడి యొక్క లక్ష్మి నశిస్తున్నది. ఆతడు విష్ణువు అయినను తిరుగులేదు.

**మార్జారశ్చ గృహే యస్య సోఽప్యంత్యజసమో నరః ।**
**భోజయేద్యస్తు విప్రేంద్రాన్ మార్జారాన్ సన్నిధౌ యది ॥154॥**

**తచ్చాండాలసమం జ్ఞేయం నాత్ర కార్యా విచారణా ।**

ఎవడిగృహంలో పిల్లిఉంటుందో ఆతడు చండాలుడితోసమానం. పిల్లిసన్నిధిలో విప్రశ్రేష్ఠుల్ని భుజింప జేయువాడు కూడా చండాలసముడే. ఇందులో సందేహం లేదు.

**స్ఫిగ్వాతం శూర్పవాతంచ వాతం ప్రాణముఖానిలమ్ ॥155॥**

**సుకృతాని హరంత్యేతే సంస్పృష్టాః పురుషస్య తు ।**
**ఉష్ణీషీ కంచుకీ నగ్నో ముక్తకేశో మలావృతః ॥156॥**

**అపవిత్రకరోఽశుద్ధః ప్రలపంత జపేత్క్వచిత్ ।**

అపానవాయువు, చేటనుంచివచ్చేవాయువు, ప్రాణులముఖంనుంచివచ్చే వాయువును స్పర్శించిన వ్యక్తి యొక్క పుణ్యాలు నశించి పోతాయి. తలపాగగాని, కంచుకము ధరించిగాని, నగ్నంగాగాని, కేశాలు విరబోసుకునిగాని మురికితోకూడిగాని, అపరిశుభ్రమైన చేతులతో, అశుద్ధమైన మాటలు పలుకుతూ జపం చేయరాదు.

**క్రోధో మదః క్షుధా తంద్రా నిష్ఠీవనవిజృంభణే ॥157॥**

**శ్వనీచదర్శనం నిద్రా ప్రలాపాస్తే జపద్విషః ।**
**ఏతేషాం సంభవే వాపి కుర్యాత్సూర్యాదిదర్శనమ్ ॥158॥**

**ఆచమ్య వా జపేచ్ఛేషం కృత్వా వా ప్రాణసంయమమ్ ।**
**సూర్యోఽగ్నిశ్చంద్రమాశ్చైవ గ్రహనక్షత్రతారకాః ॥159॥**

**ఏతే జ్యోతీంషి ప్రోక్తాని విద్వద్భిర్బ్రాహ్మణైస్తథా ।**

క్రోధం, మదం, ఆకలి, ఆలస్యం, ఉమ్మడం, ఆవలింత మొదలైనవి, కుక్క, నీచుడి దర్శనం, నిద్ర, ఎక్కువగా మాటలాడడం – ఇవి అన్నీ జపానికి శత్రువులు. ఇవి కల్గినపుడు సూర్యాదుల్ని చూడాలి. తిరిగి ఆచమించిగాని, ప్రాణాయామం చేసిగాని మిగిలిన జపాన్ని పూర్తి చేయాలి. సూర్యుడు, అగ్ని, చంద్రుడు, గ్రహాలు, నక్షత్రాలు, తారలు – వీటిని విద్వాంసులైన బ్రాహ్మణులు జ్యోతిర్గణాలన్నారు.

**ప్రసార్య పాదౌ న జపేత్కుక్కుటాసన ఏవ చ ॥160॥**

**అనాసనః శయానో వా రథ్యాయాం శూద్రసన్నిధౌ ।**
**రక్తభూమ్యాం చ ఖట్వాయాం న జపేజ్జాపకస్తథా ॥161॥**

**ఆసనస్థో జపేత్సమ్యక్ మంత్రార్థగతమానసః ।**
**కౌశేయం వ్యాఘ్రచర్మం వా చైలం తౌలమథాపి వా ॥162॥**

**దారవం తాలపర్ణం వా ఆసనం పరికల్పయేత్ ।**

కాళ్ళు చాపుకునిగాని, కుక్కుటాసనంలో కూర్చునిగాని జపం చేయరాదు. ఆసనం మీద లేనివాడు, పడుకుని ఉన్నవాడు, మార్గంలో ఉన్నవాడు, శూద్రుడి సన్నిధిలో ఉన్నవాడు జపం చేయరాదు. అట్లే రక్తభూమిమీద, చాపమీద జపం చేయరాదు. ఆసనమందున్నవాడై, మంత్రం యొక్క అర్థంలో మనసును లగ్నపర్చినవాడై బాగా జపించాలి. పట్టువస్త్రం, పులితోలు, వస్త్రంతో దూదితో కుట్టిన ఆసనం, చెక్క ఆసనం, తాటి ఆకులతో చేసిన ఆసనం వీటిలో ఏదో ఒకటి తయారు చేసుకోవాలి.

**త్రిసంధ్యం తు గురోః పూజా కర్తవ్యా హితమిచ్ఛతా ॥163॥**

**యో గురుః స శివః ప్రోక్తో యః శివః స గురుః స్మృతః ।**
**యథా శివస్తథా విద్యా యథా విద్యా తథా గురుః ॥164॥**

**శివవిద్యా గురోస్తస్మాద్భక్త్యా చ సదృశం ఫలమ్ ।**
**సర్వదేవమయో దేవి సర్వశక్తిమయో హి సః ॥165॥**

**సగుణో నిర్గుణో వాపి తస్యాజ్ఞాం శిరసా భవేత్ ।**
**శ్రేయోఽర్థీ యస్తు గుర్వాజ్ఞాం మనసాపి న లంఘయేత్ ॥166॥**

**గుర్వాజ్ఞాపాలకః సమ్యక్ జ్ఞానసంపత్తిమశ్నుతే ।**
**గచ్ఛంస్తిష్ఠన్ స్వపన్ భుంజన్ యద్యత్కర్మ సమాచరేత్ ॥167॥**

**సమక్షం యది తత్సర్వం కర్తవ్యం గుర్వనుజ్ఞయా ।**

తన హితాన్ని అభిలషించే శిష్యుడు మూడు సంధ్యల్లోనూ గురువును పూజించాలి. ఎవడు గురువో ఆతడే శివుడు. ఎవడు శివుడో ఆతడే గురువు. ఎక్కడ శివుడుంటాడో అక్కడ విద్య ఉంటుంది. ఎక్కడ విద్య ఉంటుందో అక్కడ గురువు ఉంటాడు. శివవిద్య గురువు నుంచే గ్రహించాలి. భక్తితో కూడా సమానమైన ఫలం దక్కుతుంది. ఓ దేవీ! పార్వతీ! గురువు సర్వదేవస్వరూపుడు, సర్వశక్తిస్వరూపుడు. గురువు సగుణుడైనా లేక నిర్గుణుడైనా ఆతడి ఆజ్ఞను శిరసా వహించాలి. కళ్యాణేచ్ఛ కలిగినవాడు మనసులో కూడా గుర్వాజ్ఞను ఉల్లంఘించరాదు. సంపూర్ణంగా గుర్వాజ్ఞను పాటించేవాడికి జ్ఞానసంపద దక్కుతుంది. తిరగటం, కూర్చోవడం, నిద్రించడం, తినడం అనే కర్మలు అన్నీ ఆయన సమక్షమందే నిర్వహించాలి. ఆ కర్మలన్నీ ఆయన ఆజ్ఞవల్లే జరగాలి.

**గురోర్దేవసమక్షం వా న యథేష్టాసనో భవేత్ ॥168॥**

**గురుర్దేవో యతః సాక్షాత్తద్గృహం దేవమందిరమ్ ।**
**పాపినాం చ యథా సంగాత్తత్పాపైః పతనం భవేత్ ॥169॥**

**తద్వదాచార్యసంగేన తద్ధర్మఫలభాగ్భవేత్ ।**
**యథైవ వహ్నిసంపర్కాన్మలం త్యజతి కాంచనమ్ ॥170॥**

**తథైవ గురుసంపర్కాత్పాపం త్యజతి మానవః ।**
**యథా వహ్నిసమీపస్థో ఘృతకుంభో విలీయతే ॥171॥**

**తథా పాపం విలీయేత ఆచార్యస్య సమీపతః ।**
**యథా ప్రజ్వలితో వహ్నిర్విష్ఠాం కాష్ఠంచ నిర్దహేత్ ॥172॥**

**గురుస్తుష్టో దహత్యేవం పాపం తన్మంత్రతేజసా ।**

గురుదేవుడి సమక్షంలో ఇష్టానుసారంగా కూర్చోరాదు. ఎందుకంటే గురువు సాక్షాత్తు దేవత కాబట్టి. ఆయన యిల్లు దేవమందిరం కాబట్టి. పాపుల యొక్క సంగతి వల్ల ఆ పాపాలలో పడడం జరుగుతుంది. గురుసంగతితో ఆతడి ధర్మఫలాన్ని పొందవచ్చు. ఎలా బంగారం అగ్ని సంపర్కం వల్ల తనలోగల మాలిన్యాన్ని తొలగించుకుంటుందో అలాగే గురుసంపర్కంలో శిష్యుడు తన పాపాల్ని తొలగించుకుంటాడు. ఎలా అగ్ని సమీపంలో పాత్రలో ఉన్న నేయి కరుగుతుందో అట్లే ఆచార్యుడి సాంగత్యం వల్ల శిష్యుడి పాపం విలీనం అవుతుంది.

ఏ విధంగా ప్రజ్వలింపబడిన అగ్ని మలినాన్ని, కట్టెను దహిస్తుందో, అదే విధంగా ప్రసన్నుడైన గురువు తన మంత్రం యొక్క తేజస్సుతో పాపాల్ని భస్మం చేస్తాడు.

**బ్రహ్మా హరిస్తథా రుద్రో దేవాశ్చ మునయస్తథా ॥173॥**

**కుర్వంత్యనుగ్రహం తుష్టా గురౌ తుష్టే న సంశయః ।**
**కర్మణా మనసా వాచా గురోః క్రోధం న కారయేత్ ॥174॥**

**తస్య క్రోధేన దహ్యంతే ఆయుః శ్రీర్జ్ఞానసత్క్రియాః ।**
**తత్క్రోధం యే కరిష్యంతి తేషాం యజ్ఞాశ్చ నిష్ఫలాః ॥175॥**

**జపాన్యనియమాశ్చైవ నాత్ర కార్యా విచారణా ।**

గురువు ప్రసన్నుడైనచో బ్రహ్మవిష్ణుమహేశ్వరులు, మునులు ప్రసన్నులై దయచూపుతారు. ఇందులో సందేహం లేదు. మనోవాక్కాయకర్మలతో గురువుకు కోపంవచ్చే యేపనినీ చేయరాదు. ఆతడి క్రోధంతో ఆయువు, లక్ష్మి, జ్ఞానం మరియు సత్కర్మ దగ్ధం అవుతాయి. ఎవడు ఆయన విషయంలో కుపితుడవుతాడో, ఆతడి యజ్ఞం, జపం అట్లే ఇతరానుష్ఠానాలు వ్యర్థమవుతాయి. ఇందుకు సందేహించ పనిలేదు.

**గురోర్విరుద్ధం యద్వాక్యం న వదేత్సర్వయత్నతః ॥176॥**

**వదేద్యది మహామోహాద్రౌరవం నరకం వ్రజేత్ ।**
**చిత్తేనైవ చ విత్తేన తథా వాచా చ సువ్రతాః ॥177॥**

**మిథ్యా న కారయేద్దేవి క్రియయా చ గురోః సదా ।**
**దుర్గుణే ఖ్యాపితే తస్య నైర్గుణ్యశతభాగ్భవేత్ ॥178॥**

**గుణే తు ఖ్యాపితే తస్య సార్వగుణ్యఫలం భవేత్ ।**
**గురోర్హితం ప్రియం కుర్యాదిష్టో వా న వా సదా ॥179॥**

**అసమక్షం సమక్షం వా గురోః కార్యం సమాచరేత్ ।**
**గురోర్హితం ప్రియం కుర్యాన్మనోవాక్కాయకర్మభిః ॥180॥**

**కుర్వన్ పతద్యధో గత్వా తత్రైవ పరివర్తతే ।**
**తస్మాత్స సర్వదోపాస్యో వందనీయశ్చ సర్వదా ॥181॥**

**సమీపస్థోఽప్యనుజ్ఞాప్య వదేత్తద్విముఖో గురుమ్ ।**
**ఏవమాచారవాన్ భక్తో నిత్యం జపపరాయణః ॥182॥**

**గురుప్రియకరో మంత్రం వినియోక్తుం తతోఽర్హతి ।**

ప్రయత్నపూర్వకంగా గురువుకు వ్యతిరేకంగా ఏమాత్రం కూడా పలకరాదు. అజ్ఞాని ఎవడైన ఆవిధంగా పలికితే ఆతడు రౌరవనరకంలో పడతాడు. ఓ దేవీ! పార్వతీ! మనసుతో, ధనంతో, వాక్కుతో, కర్మతో గురువుకు

(కపట) మిథ్యాసిద్ధిని కలిగించరాదు. గురుడి దుర్గుణాల్ని చెప్పేటప్పుడు శిష్యుడు నూరు దుర్గుణాలు కలవాడవుతాడు. ఆయన గుణాల్ని చెప్పేటప్పుడు అన్ని గుణాల ఫలం దొరుకుతుంది. గురువు ఆదేశించినా లేకపోయినా ఎల్లప్పుడూ ఆయనకు హితమూ, ప్రియమూ చేయాలి. ప్రత్యక్షంలోగాని, పరోక్షంలోగాని గురుకార్యం నిర్వర్తించాలి. త్రికరణశుద్ధితో (మనసు, వాక్కు, కాయకర్మ) గురువుకు హితమూ, ప్రియమూ చేయాలి. అలా చేయని వ్యక్తి నరకంలో పడి అక్కడే తిరుగుతూ ఉంటాడు. పైకి రాలేడు. అందుచేత ఎల్లప్పుడూ ఆయన్ని ఉపాసించాలి. సర్వదా నమస్కరించాలి. గురువు సమీపమందున్నా అనుమతి పొందే శిష్యుడు ఆయన వైపుకు తిరక్కుండా మాట్లాడాలి. ఈ విధంగా ఆచారవంతుడు, భక్తిసంపన్నుడు, నిత్యజపతత్పరుడు, గురుప్రియకార్యకర్త అయిన శిష్యుడు ఈ పంచాక్షరీమంత్రాన్ని వినియోగించుకోవడానికి యోగ్యుడవుతున్నాడు.

**వినియోగం ప్రవక్ష్యామి సిద్ధమంత్రప్రయోజనమ్ ॥183॥**

**దౌర్బల్యం యాతి తన్మంత్రం వినియోగమజానతః ।**
**యస్య యేన వియుంజీత కార్యేణ తు విశేషతః ॥184॥**

**వినియోగః స విజ్ఞేయ ఐహికాముష్మికం ఫలమ్ ।**
**వినియోగజమాయుష్యమారోగ్యం తనునిత్యతా ॥185॥**

**రాజ్యైశ్వర్యం చ విజ్ఞానం స్వర్గో నిర్వాణ ఏవ చ ।**

ఓ పార్వతీదేవి! నేనిపుడు సిద్ధమంత్రం యొక్క వినియోగం యొక్క ప్రయోజనాన్ని చెబుతాను. వినియోగం (ప్రయోగం) తెలియనివాడికి ఈ మంత్రం ప్రభావరహితం అవుతుంది. దేనిచేత క్రియలు, దానివలన కలుగు ప్రయోజనం పొందటానికి వీలు కలుగుతుందో దానినే వినియోగం అంటారు. వినియోగం ఇహపరలోకాలలో ఫలాన్ని ఇస్తుంది. వినియోగం వల్ల ఆయువు, ఆరోగ్యం, శాశ్వతశరీరం, రాజ్యం, ఐశ్వర్యం, ఉత్తమజ్ఞానం, స్వర్గం, అట్లే మోక్షం – ఇవి అన్నీ ప్రాప్తిస్తాయి.

**ప్రోక్షణం చాభిషేకం చ అఘమర్షణమేవ చ ॥186॥**

**స్నానే చ సంధ్యయోశ్చైవ కుర్యాదేకాదశేన వై ।**
**శుచిః పర్వతమారుహ్య జపేల్లక్షమతంద్రితః ॥187॥**

**మహానద్యాం ద్విలక్షంతు దీర్ఘమాయురవాప్నుయాత్ ।**

స్నానంలోనూ, ఉభయసంధ్యలందునూ పదకొండుసార్లు పంచాక్షరీమంత్రంతో, ప్రోక్షణం, అభిషేకం, అఘమర్షణం చేయాలి. శుద్ధుడైనవాడు పర్వతం మీదికి వెళ్లి ఆలస్యం లేకుండా (మధ్యలో విరామం లేకుండా) ఒక లక్షసార్లు మంత్రాన్ని జపిస్తాడో లేక ఏదో ఒక మహానది ఒడ్డున రెండు లక్షలసార్లు మంత్రాన్ని జపిస్తాడో వాడు దీర్ఘాయుష్మంతుడవుతాడు.

**దూర్వాంకురాస్తిలా వాణీ గుడూచీ ఘుటికా తథా ॥188॥**

**తేషాం తు దశసాహస్రం హోమమాయుష్యవర్ధనమ్ ।**
**అశ్వత్థవృక్షమాశ్రిత్య జపేల్లక్షద్వయం సుధీః ॥189॥**

**శనైశ్చరదినే స్పృష్ట్వా దీర్ఘాయుష్యం లభేన్నరః ।**
**శనైశ్చరదినేఽశ్వత్థం పాణిభ్యాం సంస్పృశేత్సుధీః ॥190॥**

**జపేదష్టోత్తరశతం సోఽపమృత్యుహరో భవేత్ ।**

గరిక, తిలలు, వాణి, తిప్పతీగ మరియు గడెమ్రాను – వీటితో పదివేలసార్లు హోమం చేస్తే ఆయువు వృద్ధి చెందుతుంది. బుద్ధిమంతుడు అశ్వత్థవృక్షాన్ని ఆశ్రయించి రెండు లక్షలసార్లు జపం చేయాలి. శనివారంనాడు మానవుడు అశ్వత్థవృక్షాన్ని తాకి దీర్ఘాయుస్సును పొందాలి. బుద్ధిమంతుడు శనివారం నాడు అశ్వత్థాన్ని తన రెండు చేతులతో తాకాలి. మరియు నూటఎనిమిదిసార్లు మంత్రజపం చేయాలి. ఆ విధంగా చేసినవాడు అకాలమృత్యువును పొందదు.

**ఆదిత్యాభిముఖో భూత్వా జపేల్లక్షమనన్యధీః ॥191॥**

**అర్కైరష్టశతం నిత్యం జుహ్వన్ వ్యాధేర్విముచ్యతే ।**
**సమస్తవ్యాధిశాంత్యర్థం పలాశసమిధైర్నరః ॥192॥**

**హుత్వా దశసహస్రం తు నీరోగీ మనుజో భవేత్ ।**
**నిత్యమష్టశతం జప్త్వా పిబేదంభోఽర్కసన్నిధౌ ॥193॥**

**ఔదర్యైర్వ్యాధిభిః సర్వైర్మాసేనైకేన ముచ్యతే ।**

సూర్యుడికి అభిముఖంగా తిరిగి ఏకాగ్రచిత్తంతో ఒక లక్ష జపం చేయాలి. సూర్యుడికి ప్రతిరోజు అర్క సమిధలతో నూట ఎనిమిదిసార్లు హోమం చేసినవాడు రోగవిముక్తుడవుతాడు. మానవుడు సర్వరోగనివారణార్థం పలాశసమిధలతో హోమం చేయాలి. ఈ విధంగా పదివేలసార్లు హోమం చేసిన మానవుడు రోగరహితుడు అవుతున్నాడు. ప్రతిరోజూ నూట ఎనిమిదిసార్లు జపం చేసి సూర్యుడి సమక్షంలో (ఎండలో) నీరు త్రాగాలి. ఈ విధంగా చేసే మానవుడు ఒక నెలరోజులలోనే అన్ని రకాల ఉదరసంబంధమైన రోగాల నుంచి విముక్తుడవుతున్నాడు.

**ఏకాదశేన భుంజీయాదన్నం చైవాభిమంత్రితమ్ ॥194॥**

**భక్ష్యం చాన్యత్తథా పేయం విషమప్యమృతం భవేత్ ।**
**జపేల్లక్షం తు పూర్వాహ్ణే హుత్వాచాష్టశతేన వై ॥195॥**

**సూర్యం నిత్యముపస్థాయ సమ్యగారోగ్యమాప్నుయాత్ ।**
**నదీతోయేన సంపూర్ణం ఘటం సంస్పృశ్య శోభనమ్ ॥196॥**

**జప్త్వాయుతంచ తత్స్నానాద్రోగాణాం భేషజం భవేత్ ।**

పదకొండుసార్లు మంత్రంతో అభిమంత్రించిన అన్నాన్ని, ఇతరాలైన భక్ష్యాల్ని, పేయపదార్థాల్ని స్వీకరించాలి. దానివల్ల విషం కూడా అమృతమవుతున్నది. ప్రతిదినం పూర్వాహ్ణమందు నూటఎనిమిది సార్లు ఆహుతులిచ్చి తర్వాత సూర్యుడిఎండలో ఒక లక్ష జపం చేయాలి. ఆ విధంగా చేసేవాడికి సంపూర్ణమైన ఆరోగ్యం ప్రాప్తిస్తున్నది. నదీజలంతో నిండిన సుందరఘటాన్ని తాకినా, పదివేలమార్లు జపంచేసినా, ఆ జలంతో స్నానంచేసినా సమస్త రోగాలకు అది మంచి చికిత్స అవుతున్నది.

**అష్టావింశజ్జపిత్వాన్నమశ్నీయాదన్వహం శుచిః ॥197॥**

**హుత్వా చ తావత్పాలాశైరేవం వాఽరోగ్యమశ్నుతే ।**
**చంద్రసూర్యగ్రహే పూర్వముపోష్య విధినా శుచిః ॥198॥**

**యావద్గ్రహణమోక్షం తు తావన్నద్యాం సమాహితః ।**
**జపేత్సముద్రగామిన్యాం విమోక్షే గ్రహణస్య తు ॥199॥**

**అష్టోత్తరసహస్రేణ పిబేద్ బ్రాహ్మీరసం ద్విజాః ।**
**ఐహికాం లభతే మేధాం సర్వశాస్త్రధరాం శుభామ్ ॥200॥**

**సారస్వతీ భవేద్దేవీ తస్య వా గతిమానుషీ ।**

పవిత్రుడై ప్రతిదినం ఇరవైఎనిమిదిసార్లు మంత్రాన్ని జపించి అన్నాన్ని తినాలి. పలాశసమిధలచేత ఆహుతులిచ్చినచో ఆరోగ్యం ప్రాప్తిస్తుంది. చంద్రగ్రహణం అట్లే సూర్యగ్రహణం కాలంలో పవిత్రుడై విధ్యుక్తంగా ఉపవాసం చేసి, గ్రహణం విడిచే సమయంలో సముద్రగామిని అయిన నదిలో ఏకాగ్రచిత్తుడై జపించాలి. ఓ ద్విజులారా! గ్రహణం పూర్తి అయిన తర్వాత పదివందల ఎనిమిదిసార్లు మంత్ర జపం చేసి బ్రాహ్మీరసాన్ని త్రాగాలి. ఈ విధంగా చేసేవాడికి సర్వశాస్త్రధారణం చేసే కళ్యాణకారి అయిన లౌకికప్రతిభ ప్రాప్తిస్తున్నది. మరియు ఆతడి మాట అతిమానుషమై సరస్వతీదేవి యొక్క మాటతో తుల్యం అవుతున్నది.

**గ్రహనక్షత్రపీడాసు జపేద్భక్త్యాఽయుతం నరః ॥201॥**

**హుత్వా చాష్టసహస్రం తు గ్రహపీడాం వ్యపోహతి ।**
**దుఃస్వప్నదర్శనే స్నాత్వా జపేద్వై చాయుతం నరః ॥202॥**

**ఘృతేనాష్టశతం హుత్వా సద్యః శాంతిర్భవిష్యతి ।**

గ్రహాలవల్ల నక్షత్రాలవల్ల కష్టం కలిగినప్పుడు మానవుడు భక్తిపూర్వకంగా పదివేల జపం చేసి, అట్లే ఎనిమిది వేలసార్లు ఆహుతులిచ్చి గ్రహపీడల నుంచి దూరం అవుతున్నాడు. దుస్స్వప్నాన్ని చూచినచో స్నానం చేసి మానవుడు పదివేలసార్లు జపం చేయాలి. తర్వాత నేతితో నూటఎనిమిదిసార్లు ఆహుతులిస్తే ఆదుస్స్వప్నప్రభావం త్వరగా శాంతిస్తుంది.

**చంద్రసూర్యగ్రహే లింగం సమభ్యర్చ్య యథావిధి ॥203॥**

**యత్కించిత్ప్రార్థయేద్దేవి జపేదయుతమాదరాత్ ।**
**సన్నిధావస్య దేవస్య శుచిః సంయతమానసః ॥204॥**

**సర్వాన్ కామానవాప్నోతి పురుషో నాత్ర సంశయః ।**

చంద్రగ్రహణం మరియు సూర్యగ్రహణం యొక్క సమయంలో విధిపూర్వకంగా శివలింగాన్ని పూజించి దేనినైనా ప్రార్థించాలి. పరిశుద్ధుడు,ఏకాగ్రచిత్తుడు అయి మహాదేవుడి సమీపంలో ఆదరంగా పదివేల జపం చేయాలి. ఓ దేవీ! పార్వతీ! మానవుడు తన కోరికల్ని అన్నింటిని పొందుతాడు. ఇందులో ఏమాత్రం సందేహం లేదు.

**గజానాం తురగాణాం తు గోజాతీనాం విశేషతః ॥205॥**

**వ్యాధ్యాగమే శుచిర్భూత్వా జుహుయాత్సమిధాహుతిమ్ ।**
**మాసమభ్యర్చ్య విధినాఽ యుతం భక్తిసమన్వితః ॥206॥**

**తేషామృద్ధిశ్చ శాంతిశ్చ భవిష్యతి న సంశయః ।**

ఏనుగులకు, గుఱ్ఱాలకు, గోజాతికి మొదలగు పశువులకు విశేషమైన రోగాలు వచ్చినప్పుడు శుద్ధుడై, భక్తియుక్తుడై విధిపూర్వకంగా ఒక నెలరోజులు శివుణ్ణి పూజించి సమిధలతో పదివేలసార్లు ఆహుతులిస్తే ఆ పశువులకు రోగశాంతి కలిగి వాటికి అభివృద్ధి కలుగుతున్నది. ఇందులో సందేహం లేదు.

**ఉత్పాతే శత్రుబాధాయాం జుహుయాదయుతం శుచిః ॥207॥**

**పలాశసమిధైర్దేవి తస్య శాంతిర్భవిష్యతి ।**
**అభిచారికబాధాయామేతద్దేవి సమాచరేత్ ॥208॥**

**ప్రత్యగ్భవతి తచ్ఛక్తిః శత్రోః పీడా భవిష్యతి ।**
**విద్వేషణార్థం జుహుయాద్ వైభీతసమిధాష్టకమ్ ॥209॥**

**అక్షరప్రతిలోభ్యేన ఆర్ద్రేణ రుధిరేణ వా ।**
**విషేణ రుధిరాభ్యక్తో విద్వేషకరం నృణామ్ ॥210॥**

ఓ దేవీ! పార్వతీ! ఉపద్రవం కాని శత్రువువల్ల బాధ కలిగినప్పుడు ఆ వ్యక్తి పవిత్రుడై పలాశసమిధలచేత పదివేల హోమం చేయాలి. అపుడు ఆతడికి ఆపీడవల్ల శాంతి కలుగుతుంది. అభిచారికబాధ విషయంలోనూ ఈ విధంగానే చేయాలి. ఈ విధంగా చేయడం వల్ల ఆతడికి శక్తి కలిగి శత్రువుకి పీడ కలుగుతుంది. విద్వేషణ కోసం తాండ్ర చెట్టు సమిధలతో ఎనిమిది ఆహుతులివ్వాలి. లేకుంటే తడి రక్తస్నానం చేసి మంత్రాన్ని తిరగవేసి జపించాలి. తడి రక్తంతో విషంతో హోమం చేయాలి. అప్పుడది మానవవిద్వేషకారి అవుతుంది.

**ప్రాయశ్చిత్తం ప్రవక్ష్యామి సర్వపాపవిశుద్ధయే ।**
**పాపశుద్ధిర్యథా సమ్యక్ కర్తుమభ్యుద్యతే నరః ॥211॥**

**పాపశుద్ధిర్యతః సమ్యగ్జ్ఞానసంపత్తిహైతుకీ ।**
**పాపశుద్ధిర్న చేత్పుంసః క్రియాః సర్వాశ్చ నిష్ఫలాః ॥212॥**

**జ్ఞానం చ హీయతే తస్మాత్కర్తవ్యం పాపశోధనమ్ ।**

ఓ పార్వతీదేవీ! నేనిప్పుడు సమస్తపాపశుద్ధికై ప్రాయశ్చిత్తం యొక్క వర్ణన చేస్తున్నాను. మానవుడు పాపశుద్ధికై పరిపూర్ణంగా ప్రయత్నశీలుడు కావాలి. ఎందుకంటే బాగా పాపశుద్ధి అయితే అది జ్ఞాన సంపదకు మూల కారణం అవుతుంది. పాపశుద్ధికాకుంటే మానవుడి అన్నిక్రియలు వ్యర్థమవుతాయి. ఆతడి జ్ఞానం క్షీణిస్తూ ఉంటుంది. అందుచేత పాపశోధనం అవశ్యం చేయవలసి ఉంది.

**విద్యాలక్ష్మీ విశుద్ధ్యర్థం మాం ధ్యాత్వాఽఞ్జలినా శుభే ॥213॥**

**శివేనైకాదశేనాద్భిరభిషించేత్సమంతతః ।**
**అష్టోత్తరశతేనైవ స్నాయాత్పాపవిశుద్ధయే ॥214॥**

**సర్వతీర్థఫలం తచ్చ సర్వపాపహరం శుభమ్ ।**
**సంధ్యోపాసనవిచ్ఛేదే జపేదష్టశతం నరః ॥215॥**

**విడ్వరాహైశ్చ చాండాలైర్దుర్జనైః కుక్కుటైరపి ।**
**స్పృష్టమన్నం న భుంజీత భుక్త్వా చాష్టశతం జపేత్ ॥216॥**

ఓ శుభకరీ! పార్వతీ! విద్య యొక్కయు లక్ష్మియొక్కయు విశుద్ధి కోసం దోసిలిలో నీటిని తీసుకుని నన్ను ధ్యానించి, పదకొండుసార్లు శివమంత్రాన్ని జపించి ఆ జలంతో నన్ను అభిషేకించాలి. పాపశోధనకై నూటఎనిమిదిసార్లు మంత్రాన్ని జపించి స్నానం చేయాలి. అది సకలతీర్థాటనఫలాన్ని, సర్వపాపప్రముక్తిని ఇస్తుంది. కళ్యాణకారకం అవుతుంది. సంధ్యోపాసనకు అంతరాయం కలిగితే మానవుడు నూట ఎనిమిదిసార్లు జపం చేయాలి. పందులు, చండాలురు, దుర్జనులు, అట్లే కుక్కుటాలుతాకిన అన్నం తినరాదు. తినడానికిముందు నూట ఎనిమిదిసార్లు మంత్రాన్ని జపించాలి.

**బ్రహ్మహత్యావిశుద్ధ్యర్థం జపేల్లక్షాఽయుతం నరః ।**
**పాతకానాం తదర్ధం స్యాన్నాత్ర కార్యా విచారణా ॥217॥**

**ఉపపాతకదుష్టానాం తదర్ధం పరికీర్తితమ్ ।**
**శేషాణామపి పాపానాం జపేత్పంచసహస్రకమ్ ॥218॥**

బ్రహ్మహత్యయొక్కవిశుద్ధికై నూరువేలకోట్లసార్లు (లక్షకోట్లు) మంత్రజపం చేయాలి. ఇతరమైన పెద్ద పాపాల విషయంలో అందులో సగం (ఏభైకోట్లు) జపం చేయాలి. ఇందులో ఎటువంటిసందేహానికి తావులేదు. ఉపపాపాల విషయంలో అందులో సగం (ఇరవై ఐదు కోట్లు) జపం చేయాలి. మిగిలిన చిన్న పాపాల విషయంలో ఐదువేలసార్లు జపించాలి.

**ఆత్మబోధపరం గుహ్యం శివబోధప్రకాశకమ్ ।**
**శివః స్యాత్సః జపేన్మంత్రం పంచలక్షమనాకులః ॥219॥**

**పంచవాయుజయం భద్రే ప్రాపోన్తి మనుజః సుఖమ్ ।**
**జపేచ్చ పంచలక్షం తు విగృహీతేంద్రియః శుచిః ॥220॥**

**పంచేంద్రియాణాం విజయో భవిష్యతి వరాననే ।**
**ధ్యానయుక్తో జపేద్యస్తు పంచలక్షమనాకులః ॥221॥**

**విషయాణాం చ పంచానాం జయం ప్రాపోన్తి మానవః ।**
**చతుర్థం పంచలక్షం తు యో జపేద్భక్తిసంయుతః ॥222॥**

**భూతానామిహ పంచానాం విజయం మనుజో లభేత్ ।**

ఆత్మజ్ఞానం ప్రధానంగా కలిగినదీ రహస్యమైనదీ శివతత్త్వాన్ని ప్రకాశింపచేసేదీ అయిన పంచాక్షరీమంత్రాన్ని నిశ్చలమనస్సుతో అయిదులక్షలు జపంచేసినవాడు శివుడవుతాడు. "ఓ పార్వతీ! ఆతడు తేలికగా పంచవాయు విజయాన్ని పొందుతున్నాడు. ఓ సుముఖీ! ఎవడు శుద్ధుడై, ఇంద్రియాన్ని వశీకరించుకుని అయిదులక్షలసార్లు మంత్రాన్ని జపిస్తాడో ఆతడు పంచేంద్రియాల మీద విజయం పొందుతున్నాడు. ఎవడు భక్తియుక్తుడై నాలుగుసార్లు ఈ మంత్రాన్ని అయిదులక్షలసార్లు జపిస్తాడో ఆతడు ఈ భూమిపై పంచభూతాల మీద విజయం సాధిస్తున్నాడు.

**చతుర్లక్షం జపేద్యస్తు మనః సంయమ్య యత్నతః ॥223॥**

**సమ్యగ్విజయమాపోన్తి కరణానాం వరాననే ।**
**పంచవింశతి లక్షాణాం జపేన కమలాననే ॥224॥**

**పంచవింశతి తత్త్వానాం విజయం మనుజో లభేత్ ।**
**మధ్యరాత్రేతి నిర్వాతే జపేదయుతమాదరాత్ ॥225॥**

**బ్రహ్మసిద్ధిమవాపోన్తి వ్రతేనానేన సుందరి ।**
**జపేల్లక్షమనాలస్యో నిర్వాతే ధ్వనివర్జితే ॥226॥**

**మధ్యరాత్రే చ శివయోః పశ్యత్యేవ న సంశయః ।**
**అంధకారవినాశశ్చ దీపస్యేవ ప్రకాశనమ్ ॥227॥**

**హృదయాంతర్బహిర్వాపి భవిష్యతి న సంశయః ।**
**సర్వసంపత్సమృద్ధ్యర్థం జపేదయుతమాత్మవాన్ ॥228॥**

**సబీజసంపుష్టం మంత్రం శతలక్షం జపేచ్ఛుచిః ।**
**మత్సాయుజ్యమవాపోన్తి భక్తిమాన్ కిమతః పరమ్ ॥229॥**

ఓ వరాననా! పార్వతీ! ఎవడు మనస్సును నియంత్రించుకుని ప్రయత్నపూర్వకంగా నాల్గు లక్షలసార్లు మంత్ర జపం చేస్తాడో ఆతడు అంతఃకరణాల మీద (మనసు, బుద్ధి) సంపూర్ణ విజయాన్ని పొందుతున్నాడు. ఓ కమలముఖి! ఇరవై అయిదు లక్షలసార్లు ఈ మంత్రాన్ని జపించినవాడు ఇరవై అయిదు తత్త్వాల మీద విజయుడవుతున్నాడు. ఓ సుందరీ! పార్వతీ! అర్ధరాత్రిలో వాయురహిత స్థానంలో ఆదరపూర్వకంగా పదివేలసార్లు ఎవడు జపిస్తాడో ఆతడు ఈ వ్రతం ద్వారా బ్రహ్మస్థితిని పొందుతున్నాడు. ఎవడు ఆలసించకుండా అర్ధరాత్రిలో వాయురహితం మరియు ధ్వనిరహితం అయిన స్థానంలో ఒక లక్షసార్లు జపం చేస్తాడో ఆతడు శివపార్వతుల దర్శనం పొందుతున్నాడు. ఇందుకు సందేహం లేదు. అపుడు అంధకారం నశిస్తున్నది. అట్లే హృదయంలో బహిరంతరాలల్లో దీపం మాదిరి ప్రకాశం కలుగుతున్నది. ఇందులో సందేహం లేదు. ఆత్మజ్ఞుడైనవాడు సమస్త సంపదలకై మరియు సమృద్ధికై ఈ మంత్రాన్ని పదివేలసార్లు జపించాలి. ఓ దేవీ! ఎవడు పవిత్రుడు, భక్తియుక్తుడు అయి బీజంతో కూడిన మంత్రాన్ని ఒక కోటిసార్లు జపిస్తాడో ఆతడు నా సాయుజ్యాన్ని పొందుతున్నాడు. ఇంతకంటే గొప్ప ఫలం ఏముంటుంది?

**ఇతి తే సర్వమాఖ్యాతం పంచాక్షరవిధిక్రమమ్ ।**
**యః పఠేచ్ఛృణుయాద్వాపి స యాతి పరమాం గతిమ్ ॥230॥**

**శ్రావయేచ్చ ద్విజాన్ శుద్ధాన్ పంచాక్షరవిధిక్రమమ్ ।**
**దైవే కర్మణి పిత్ర్యే వా శివలోకే మహీయతే ॥231॥**

ఓ పార్వతీ! నేను నీకు పంచాక్షరమంత్రం యొక్క జపవిధిని గూర్చి సంపూర్ణంగా చెప్పాను. ఎవడు దీన్ని పఠిస్తున్నాడో, లేక వింటున్నాడో ఆతడు పరమగతికి వెళుతున్నాడు. ఎవడు దైవకార్యాల్లో లేక పితృకార్యాల్లో ఎవడు శుద్ధులైన బ్రాహ్మణుల కోసం ఈ పంచాక్షరవిధిక్రమాన్ని వినిపిస్తాడో ఆతడు శివలోకంలో విరాజమానుడవుతున్నాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే పంచాక్షరమాహాత్మ్యం నామ పంచాశీతితమోఽధ్యాయః ॥ 85 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని పంచాక్షరమాహాత్మ్యమనే ఎనభై అయిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **షడశీతితమోఽధ్యాయః** - ఎనబై ఆరవ అధ్యాయం

## **సంసారవిషయకథనమ్** - సంసారవిషయకథనం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**జపాచ్ఛ్రేష్ఠతమం ప్రాహుర్బ్రాహ్మణా దగ్ధకిల్బిషాః ।**
**విరక్తానాం ప్రబుద్ధానాం ధ్యానయజ్ఞం సుశోభనమ్ ॥1॥**

**తస్మాద్వదస్వ సూతాద్య ధ్యానయజ్ఞమశేషతః ।**
**విస్తరాత్సర్వయత్నేన విరక్తానాం మహాత్మనామ్ ॥2॥**

**తేషాం తద్వచనం శ్రుత్వా మునీనాం దీర్ఘసత్రిణామ్ ।**
**రుద్రేణ కథితం ప్రాహ గుహాం ప్రాప్య మహాత్మనామ్ ॥3॥**

**సంహృత్య కాలకూటాఖ్యం విషం వై విశ్వకర్మణా ।**

తమ పాపాలు దహించిన బ్రాహ్మణులు విరక్తులు జ్ఞానులు అయినవారికి ఉత్తమమైన ధ్యానయజ్ఞం జపం కంటే మిక్కిలి శ్రేష్ఠమైనదని చెప్పారు. ఓ సూతర్షీ! ఇపుడు నీవు విరక్తమహాత్ములకు ధ్యానయజ్ఞవిషయం సంపూర్ణంగా, సవిస్తరంగా, గట్టిప్రయత్నంతో మాకు చెప్పండి. దీర్ఘకాలం నుంచి యజ్ఞాలు చేస్తున్న ఆ ఋషుల మాటలను విన్న సూతమహర్షి ఆ వృత్తాంతమంతా చెప్పాడు. ఈ విశ్వాన్ని సృష్టించే రుద్రుడు కాలకూటమనే పేరుగల విషాన్ని నిర్వీర్యపర్చి మేరుపర్వతగుహకు చేరి మహాత్ములకు చెప్పిన ధ్యానయజ్ఞాన్ని గూర్చి చెప్పాడు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**గుహాం ప్రాప్య సుఖాసీనం భవాన్యా సహ శంకరమ్ ॥4॥**

**మునయః సంశితాత్మానః ప్రణేముస్తం గుహాశ్రయమ్ ।**
**అస్తువంశ్చ తతః సర్వే నీలకంఠముమాపతిమ్ ॥5॥**

**అత్యుగ్రం కాలకూటాఖ్యం సంహృతం భగవంస్త్వయా ।**
**అతః ప్రతిష్ఠితం సర్వం త్వయా దేవ వృషధ్వజ ॥6॥**

ఓ ఋషులారా! పార్వతీదేవితోపాటు గుహలో సుఖంగా కూర్చున్న శివుడికి మహాత్ములైన మునులు నమస్కరించారు. తర్వాత వాళ్లందరూ గుహలో ప్రకాశిస్తున్న ఉమాపతి నీలకంఠుణ్ణి స్తుతించి మరియు ఇలా పలికారు. ఓ భగవంతుడా! నీవు కాలకూటమనే పేరుగల విషాన్ని నిర్వీర్యపరిచావు. ఓ దేవా! ఓ వృషధ్వజ! నీ ద్వారానే సమస్తమూ ప్రతిష్ఠితమై ఉంది.

**తేషాం తద్వచనం శ్రుత్వా భగవాన్నీలలోహితః ।**
**ప్రహసన్ ప్రాహ విశ్వాత్మా సనందనపురోగమాన్ ॥7॥**

**కిమనేన ద్విజశ్రేష్ఠా విషం వక్ష్యే సుదారుణమ్ ।**
**సంహరేత్తద్విషం యస్తు స సమర్థో హ్యనేన కిమ్ ॥8॥**

**న విషం కాలకూటాఖ్యం సంసారో విషముచ్యతే ।**
**తస్మాత్సర్వప్రయత్నేన సంహరేత సుదారుణమ్ ॥9॥**

వాళ్ల మాటలు విని విశ్వాత్ముడైన నీలలోహితశివభగవానుడు సనందనాదులైన మునులతో నవ్వుతూ ఇలా పలికాడు. ఓ శ్రేష్ఠద్విజులారా! ఈ విషంతో పనియేముంది? నేను అతిభయంకరమైనవిషాన్ని గూర్చి చెబుతున్నాను. ఆ విషాన్ని చంపాలి. దాన్ని చంపినవాడు సమర్థుడు. దీనితో ఏమి లాభం? కాలకూటమనేది విషం కాదు. సంసారమే విషం. కావున గట్టి ప్రయత్నంతో భయంకరమైన సంసారవిషాన్ని సంహరించాలి.

**సంసారో ద్వివిధః ప్రోక్తః స్వాధికారానురూపతః ।**
**పుంసాం సమ్మూఢచిత్తానామసంక్షీణః సుదారుణః ॥10॥**

**ఈషణారాగదోషేణ సర్గో జ్ఞానేన సువ్రతాః ।**
**తద్వశాదేవ సర్వేషాం ధర్మాధర్మౌ న సంశయః ॥11॥**

మన యొక్క అధికారానుసారంగా ఈ సంసారం రెండు విధాలు. మూఢచిత్తులైన మనుష్యులకు సంసారులకు 'అసంక్షీణం' (క్షయం లేనిది). అట్లే అత్యంత భయంకరం. ఓ సువ్రతులారా! ఈ సృష్టి ఇచ్ఛ రాగజనితదోషాల కారణంగా జరుగుతుంది. ఈ జ్ఞానం పొందే సమయంలో సంసారం బాధిస్తున్నది. ఈ ఇచ్ఛారాగదోషాల వశంలో ఉన్నట్లైతే ప్రజలందరికి ధర్మం అధర్మం ప్రవృత్తి కలుగుతున్నది. ఇందుకు సందేహం లేదు.

**అసన్నికృష్టే త్వర్థేఽపి శాస్త్రం తచ్ఛ్రవణాత్సతామ్ ।**
**బుద్ధిముత్పాదయత్యేవ సంసారే విదుషాం ద్విజాః ॥12॥**

**తస్మాద్ దృష్టానుశ్రవికం దుష్టమిత్యుభయాత్మకమ్ ।**
**సంత్యజేత్ససర్వయత్నేన విరక్తః సోఽభిధీయతే ॥13॥**

ఓ బ్రాహ్మణులారా! పారలౌకికమనేది ప్రత్యక్షమైనది కాకపోయినా శాస్త్రం ద్వారా దాని విషయాన్ని వినడం వల్ల దాని విషయంలో సజ్జనులకు, విద్వాంసులకు నమ్మకం కల్గుతున్నది. అందువల్ల ఎవడు ఇహలోక పరలోక విషయాలలో అసహ్యాన్ని పొంది గట్టి ప్రయత్నంతో వాటిని పరిత్యజిస్తున్నాడో ఆతడు 'విరక్తుడు' అవుతున్నాడు.

**శాస్త్రమిత్యుచ్యతే భాగం శ్రుతేః కర్మసు తద్ ద్విజాః ।**
**మూర్ధానం బ్రహ్మణః సారం ఋషీణాం కర్మణః ఫలమ్ ॥14॥**

ఓ మునులారా! వేదాలలోని కర్మకాండకు సంబంధించని భాగం శాస్త్రంగా చెప్పబడుతున్నది. ఇది వేదాలకు శిరసువంటిది. మంత్రద్రష్టలైన ఋషులచేత సారభూతమైన నిష్కామకర్మను ప్రతిపాదించునట్టిది ఆధ్యాత్మికశాస్త్రం అవుతుంది. ఆ శాస్త్రం చెప్పబడుతున్నది.

**నను స్వభావః సర్వేషాం కామో దృష్టో న చాన్యథా ।**
**శ్రుతిః ప్రవర్తికా తేషామితి కర్మణ్యతద్విదః ॥15॥**

ఎవరు శ్రుతియొక్క (వేదం) రహస్యాన్ని తెలియలేకున్నారో వాళ్ళే అలా చెబుతున్నారు. ఎందుకంటే జనులందరి స్వభావం కోరికల్ని తీర్చుకోవడం మీదే ఉంటుంది కాబట్టి. అందువల్ల శ్రుతి సకామకర్మల్ని ప్రవర్తింపచేసేదే అవుతున్నది.

**నివృత్తిలక్షణో ధర్మః సమర్థానామిహోచ్యతే ।**
**తస్మాదజ్ఞానమూలో హి సంసారః సర్వదేహినామ్ ॥16॥**

**కలా సంశోషమాయాతి కర్మణాన్యస్వభావతః ।**
**సకలస్త్రివిధో జీవో జ్ఞానహీనస్త్వవిద్యయా ॥17॥**

వాస్తవజగత్తు విషయంలో విరక్తులైన జనుల విషయంలోనే నిష్కామకర్మను ప్రతిపాదించడం శ్రుతి యొక్క తాత్పర్యం. అందువల్ల దేహధారులైన అందరి విషయంలో సంసారం అజ్ఞానమూలకమైనదే. వేదంలో చెప్పిన నిష్కామకర్మవల్ల జీవభావం క్షీణిస్తుంది. అవిద్యవల్ల కల్గిన అజ్ఞానం, దీనికి హేతువైన సకామకర్మను వశీకరించుకునే మూడు విధాల చేత జీవభావం దృఢమవుతున్నది.

**నారకీ పాపకృత్స్వర్గీ పుణ్యకృత్పుణ్యగౌరవాత్ ।**
**వ్యతిమిశ్రేణ వై జీవశ్చతుర్ధా సంవ్యవస్థితః ॥18॥**

**ఉద్భిజః స్వేదజశ్చైవ అండజో వై జరాయుజః ।**
**ఏవం వ్యవస్థితో దేహీ కర్మణాऽజ్ఞో హ్యనిర్వృతః ॥19॥**

పాపకర్మలు చేసేవారికి నరకం కలుగుతున్నది. పుణ్యకర్మచేసేవాళ్లకి ఆ పుణ్యమహిమవల్ల స్వర్గం కలుగుతున్నది. పాపాలు పుణ్యాలు మిశ్రమంగా చేసే జీవులు ఉద్భిజులు, స్వేదజులు, అండజులు అట్లే జరాయుజులు అనే నాల్గు విధాలుగా వ్యవస్థితమై ఉన్నాయి. ఈ విధంగా వ్యవస్థితమైన అజ్ఞానజీవులు తమ మిశ్రమకర్మల కారణంగా ముక్తిని పొందడం లేదు.

**ప్రజయా కర్మణా ముక్తిర్ధనేన చ సతాం న హి ।**
**త్యాగేనైకేన ముక్తిః స్యాత్తదభావాద్ భ్రమత్యసౌ ॥20॥**

సంతానం వల్లగాని, పనులవల్లగాని, ధనంవల్లగాని సజ్జనులకు ముక్తి కలగకున్నది. త్యాగమనే ఒకే ఒక మార్గం ద్వారా ముక్తి కలుగుతున్నది. ముక్తిలేని కారణంగా జీవి భ్రమణం చెందుతున్నది.

**ఏవమజ్ఞానదోషేణ నానాకర్మవశేన చ ।**
**షట్కౌశికం సముద్భూతం భవత్యేష కలేబరమ్ ॥21॥**

ఈ విధంగా అజ్ఞానదోష కారణంగా, అట్లే అనేకకర్మల వశంగా జీవి షట్కోశయుక్తంగా అనగా స్నాయువు, అస్థి, మజ్జా, త్వక్కు, మాంసం, రక్తం అనే ఈ ఆరింటితో శరీరాన్ని ధరిస్తున్నది.

**గర్భే దుఃఖాన్యనేకాని యోనిమార్గే చ భూతలే ।**
**కౌమారే యౌవనే చైవ వార్ధకే మరణేఽపి వా ॥22॥**

**విచారతః సతాం దుఃఖం స్త్రీసంసర్గాదిభిర్ద్విజాః ।**
**దుఃఖేనైకేన వై దుఃఖం ప్రశామ్యంతీహ దుఃఖినః ॥23॥**

**న జాతుకామః కామానాముపభోగేన శామ్యతి ।**
**హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥24॥**

తల్లి గర్భంలో, జన్మించే సమయంలో యోనిమార్గంలో, భూమిమీద, కౌమారావస్థలో, యౌవనావస్థలో, వృద్ధాప్యంలో అట్లే మరణకాలంలో ప్రాణులకు అనేకాలైన దుఃఖాలు కలుగుతున్నాయి. ఓ ద్విజులారా! విచారించగా సజ్జనులకు స్త్రీ సంపర్కం మొదలైన వాటివల్లా దుఃఖం కలుగుతున్నది. వాళ్లు ఒక దుఃఖంతో మరో దుఃఖాన్ని శాంతింపజేసుకుంటున్నారు. అందువల్ల దుఃఖం మిగిలే ఉంటున్నది. విషయసుఖాన్ని అనుభవించడం వల్ల కోరికలు శాంతించటంలేదు. హవిస్సువల్ల అగ్ని తిరిగి జ్వలించినట్లే కామనలు నిరంతరం అధికం అవుతున్నాయి.

**తస్మాద్విచారతో నాస్తి సంయోగాదపి వై నృణామ్ ।**
**అర్థానామర్జనేఽప్యేవం పాలనే చ వ్యయే తథా ॥25॥**

**పైశాచే రాక్షసే దుఃఖం యాక్షే చైవ విచారతః ।**
**గాంధర్వే చ తథా చాంద్రే సౌమ్యలోకే ద్విజోత్తమాః ॥26॥**

**ప్రాజాపత్యే తథా బ్రాహ్మే ప్రాకృతే పౌరుషే తథా ।**
**క్షయసాతిశయాద్యైస్తు దుఃఖైర్దుఃఖాని సువ్రతాః ॥27॥**

**తాని భాగ్యాన్యశుద్ధాని సంత్యజేచ్చ ధనాని చ ।**
**తస్మాదష్టగుణం భోగం తథా షోడశధా స్థితమ్ ॥28॥**

**చతుర్వింశత్ప్రకారేణ సంస్థితం చాపి సువ్రతాః ।**
**ద్వాత్రింశద్భేదమనఘాశ్చత్వారింశద్గుణం పునః ॥29॥**

**తథాష్టచత్వారింశచ్చ షట్పంచాశత్ప్రకారతః ।**
**చతుఃషష్టివిధం చైవ దుఃఖమేవ వివేకినః ॥30॥**

విచారించగా మానవులు విషయసుఖాల్ని పొంది కూడా సుఖాన్ని పొందటం లేదు. ధనార్జన విషయంలో దానిని రక్షించడంలోను, ఖర్చు చేయడంలోనూ దుఃఖం ఉంది. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! విచారించి చూడగా పిశాచలోకం, రాక్షసలోకం, యక్షలోకం, గంధర్వలోకం, చంద్రలోకం, బుధలోకం, ప్రజాపతిలోకం, బ్రహ్మలోకం అట్లే ప్రకృతిపురుషలోకాలు – వీటిల్లో కూడా భోగాల్ని నశింపజేసే ఉద్దేశంతో ఒకటి మరొకదానికంటే గొప్పది అయిన కారణంగా ఈర్ష్యవల్ల కల్గిన దుఃఖం వల్ల కూడా అవి దుఃఖాన్ని కలిగి ఉన్నాయి. ఓ సువ్రతులారా! అందుచేత సంపద వల్ల కలిగిన అపవిత్రభోగాల్ని అట్లే అపవిత్రధనాన్ని త్యాగం చేయాలి. ఓ సువ్రతులారా! ఆ

భోగాలు ఎనిమిది విధాలు. లేకుంటే పదహారు విధాలు, ఇరవైనాలుగు రకాలు. లేకపోతే ముప్పైరెండు విధాలు. లేకపోతే నలభైవిధాలు, ఏభైఆరు, అరవైనాల్గు- ఎన్ని విధాలభోగాలైనా వివేకవంతుడికి దుఃఖరూపాలే.

**పార్థివం చ తథాప్యం చ తైజసం చ విచారతః ।**
**వాయవ్యం చ తథా వ్యోమ మానసం చ యథాక్రమ్ ॥31॥**

**ఆభిమానికమప్యేవం బౌద్ధం ప్రాకృతమేవ చ ।**
**దుఃఖమేవ న సందేహో యోగినాం బ్రహ్మవాదినామ్ ॥32॥**

**గౌణం గణేశ్వరాణాం చ దుఃఖమేవ విచారతః ।**
**ఆదౌ మధ్యే తథా చాంతే సర్వలోకేషు సర్వదా ॥33॥**

**వర్తమానాని దుఃఖాని భవిష్యాణి యథాతథమ్ ।**
**దోషదుష్టేషు దేవేషు దుఃఖాని వివిధాని చ ॥34॥**

**న భావయంత్యతీతాని హ్యజ్ఞానే జ్ఞానమానినః ।**
**క్షుద్వ్యాధేః పరిహారార్థం న సుఖాయాన్నముచ్యతే ॥35॥**

**తథేతరేషాం రోగాణామౌషధం న సుఖాయ తత్ ।**
**శీతోష్ణవాతవర్షాద్యైస్తత్తత్కాలేషు దేహినామ్ ॥36॥**

**దుఃఖమేవ న సందేహో న జానంతి హ్యపండితాః ।**

ఆలోచింపగా భూమి సంబంధమైన, జలసంబంధమైన, అగ్ని సంబంధమైన, వాయుసంబంధమైన, ఆకాశ సంబంధమైన, మనసుకు సంబంధించిన, అహంకార సంబంధమైన, బుద్ధి సంబంధమైన అట్లే ప్రకృతికి సంబంధించిన భోగాలు కూడా బ్రహ్మవాదులైన యోగులకు దుఃఖకారణాలే. ఇందులో సందేహం లేదు. ఆలోచించగా గణేశ్వరులలోగల గుణం కూడా దుఃఖమే. ప్రజలందరికీ ఆదిలో మధ్యలో అంతంలో ఎప్పుడూ దుఃఖమే. వాస్తవానికి వర్తమానంలోనూ దుఃఖం ఉంది. భవిష్యత్తులోనూ దుఃఖం ఉంది. దోషాలతో దుష్టులైన దేవతలలో అనేక విధాలైన దుఃఖాలున్నాయి. తనను తాను జ్ఞానిగా భావించుకునే జనులు అజ్ఞానకారణంగా భూతకాలాన్ని గుర్తించడం లేదు. ఆకలి అనే వ్యాధిని శమింప చెయ్యటానికే అన్నం చెప్పబడింది. సుఖంకోసంగాదు. అలాగే ఇతర వ్యాధులు తగ్గటానికే మందులుగాని సుఖంకోసంగాదు. శీతోష్ణాలు, వాయువర్షాలు మొదలైనవాటి వల్ల ఆయాకాలాలలో శరీరధారులకు దుఃఖమే కల్గుతున్నది. ఇందులో సందేహం లేదు. అజ్ఞానులైన జనులు దీన్ని గుర్తించడం లేదు.

**స్వర్గేఽప్యేవం మునిశ్రేష్ఠా హ్యవిశుద్ధక్షయాదిభిః ॥37॥**

**రోగైర్నానావిధైర్గ్రస్తా రాగద్వేషభయాదిభిః ।**
**ఛిన్నమూలతరుర్యద్వదవశః పతతి క్షితౌ ॥38॥**

**పుణ్యవృక్షక్షయాత్తద్వద్ గాం పతంతి దివౌకసః ।**
**దుఃఖాభిలాషనిష్ఠానాం దుఃఖభోగాదిసంపదామ్ ॥39॥**

**అస్మాత్తు పతతాం దుఃఖం కష్టం స్వర్గాద్దివౌకసామ్ ।**
**నరకే దుఃఖమేవాత్ర నరకాణాం నిషేవణాత్ ॥40॥**

**విహితాకరణాచ్చైవ వర్ణినాం మునిపుంగవాః ॥41॥**

ఓ మునిసత్తములారా! ఈ విధంగా స్వర్గమందలి జనులు కూడా పుణ్యం క్షీణించడం మొదలైన దుఃఖాలతో, అట్లే రాగద్వేషాలు, భయం మొదలైన పలువిధాలైన రోగగ్రస్తులవుతున్నారు. మూలం నరకబడిన వృక్షం ఏవిధంగా వివశ అయి భూమిమీదపడుతుందో ఆవిధంగానే స్వర్గస్థులైనజనులు పుణ్యరూపమైన వృక్షం క్షీణించగా భూమిపైకి తిరిగి వస్తున్నారు. దుఃఖమయకామనలతో కూడినవారు, దుఃఖమయభోగసంపదలతో పరిపూర్ణులైన స్వర్గవాసులైన దేవతలు కూడా ఆ స్వర్గం నుంచి పడిపోయినవాళ్లై దుఃఖాన్ని, కష్టాన్ని పొందుతున్నారు. ఓ మునిశ్రేష్ఠులారా! శాస్త్రోచితాలైన కర్మల్ని చేయని కారణంగా విభిన్నవర్ణ జనులు నరకానికి వెళుతున్నారు. దుఃఖాన్ని అనుభవిస్తున్నారు.

**యథా మృగో మృత్యుభయస్య భీతో ఉచ్ఛిన్నవాసో న లభేత నిద్రామ్ ।**
**ఏవం యతిర్ధ్యానపరో మహాత్మా సంసారభీతో న లభేత నిద్రామ్ ॥42॥**

బాగా ఛిద్రమైన నివాసంగల మృగం మృత్యుభయం వల్ల నిద్రపోనట్లే, మహాత్ముడు, ధ్యానపరుడు అయిన ముని సంసారవిషయంగా భయం గలవాడై నిద్రపోడు.

**కీటపక్షిమృగాణాం చ పశూనాం గజవాజినామ్ ।**
**దుష్టమేవాసుఖం తస్మాత్త్యజతః సుఖముత్తమమ్ ॥43॥**

**వైమానికానామప్యేవం దుఃఖం కల్పాధికారిణామ్ ।**
**స్థానాభిమానినాం చైవ మన్వాదీనాం చ సువ్రతాః ॥44॥**

**దేవానాం చైవ దైత్యానామన్యోన్యవిజిగీషయా ।**
**దుఃఖమేవ నృపాణాం చ రాక్షసానాం జగత్త్రయే ॥45॥**

కీటకాలు, పక్షులు, మృగాలు, అశ్వాలు, ఏనుగులు మొదలైన పశువులలోకూడ పాపంవల్లే దుఃఖం కన్పిస్తున్నది. కావున భోగాల్ని త్యాగం చేసేవారికే ఉత్తమమైన సుఖం ప్రాప్తిస్తున్నది. ఓ సువ్రతులారా! వైమానికులైన దేవతలకు, మరియు కల్పాలకుఅధికారులు, తమ పదవులకు గౌరవభాజనులు అయిన మన్వాదులకు కూడా దుఃఖం ప్రాప్తిస్తున్నది. త్రిలోకాలలో ఒకరిని మరొకరు జయించాలనే కోరికతో దేవతలకు దానవులకు, రాజులకు, అట్లే రాక్షసులకు కూడా దుఃఖం ప్రాప్తిస్తున్నది.

**శ్రమార్థమాశ్రమశ్చాపి వర్ణానాం పరమార్థతః ।**
**ఆశ్రమైర్న చ దేవైశ్చ యజ్ఞైః సాంఖ్యైర్వ్రతైస్తథా ॥46॥**

**ఉగ్రైస్తపోభిర్వివిధైర్దానైర్నానావిధైరపి ।**
**న లభంతే తథాత్మానం లభంతే జ్ఞానినః స్వయమ్ ॥47॥**

**తస్మాత్సర్వప్రయత్నేన చరేత్పాశుపతవ్రతమ్ ।**
**భస్మశాయీ భవేన్నిత్యం వ్రతే పాశుపతే బుధః ॥48॥**

**పంచార్థజ్ఞానసంపన్నః శివతత్త్వే సమాహితః ।**
**కైవల్యకరణం యోగవిధికర్మచ్ఛిదం బుధః ॥49॥**

**పంచార్థయోగసంపన్నో దుఃఖాంతం వ్రజతే సుధీః ।**

వాస్తవానికి నాల్గువర్ణాల వాళ్లకి వాళ్ల ఆశ్రమధర్మాలు శ్రమకారణాలు అయి దుఃఖాన్ని ఇస్తున్నాయి. ఆశ్రమధర్మాచరణలచేత దేవతలచేత యజ్ఞంచేత సాంఖ్యతత్త్వజ్ఞానంచేత వ్రతాలచేత అనేకవిధాలైన కఠోరతపస్సులచేత అనేకవిధాలైన దానాలచేతగానీ ఆత్మజ్ఞానాన్నిపొందలేరు. అయినా జ్ఞానవంతులు స్వయంగా ఆత్మతత్త్వాన్ని తెలుసుకుంటున్నారు. అందుచేత గట్టి ప్రయత్నంతో పాశుపతవ్రతాన్ని నిర్వహించాలి. బుద్ధిమంతులు పాశు పతవ్రతస్థులై నిత్యం భస్మశయనులు కావాలి. సద్యోజాతాదులైన అయిదు మంత్రాల యొక్క అర్థజ్ఞానంతో సంపన్నుడైన, శివతత్త్వంలో లగ్నమైన బుద్ధిమంతుడైన వ్యక్తి ముక్తిదాయకం, కర్మవినాశకం అయిన పాశుపతయోగాన్ని ఆశ్రయించాలి. పంచార్థయోగాలతో సంయుక్తుడైన విద్వాంసుడు దుఃఖం యొక్క అంతాన్ని పొందుతున్నాడు.

**పరయా విద్యయా వేద్యం విదంత్యపరయా న హి ॥50॥**

**ద్వే విద్యే వేదితవ్యే హి పరా చైవాపరా తథా ।**
**అపరా తత్ర ఋగ్వేదో యజుర్వేదో ద్విజోత్తమాః ॥51॥**

**సామవేదస్తథాథర్వో వేదః సర్వార్థసాధకః ।**
**శిక్షా కల్పో వ్యాకరణం నిరుక్తం ఛంద ఏవ చ ॥52॥**

**జ్యోతిషం చాపరా విద్యా పరాక్షరమితి స్థితమ్ ।**
**తదదృశ్యం తదగ్రాహ్యమగోత్రం తదవర్ణకమ్ ॥53॥**

**తదచక్షుస్తదశ్రోత్రం తదపాణి అపాదకమ్ ।**
**తదజాతమభూతం చ తదశబ్దం ద్విజోత్తమాః ॥54॥**

**అస్పర్శం తదరూపం చ రసగంధవివర్జితమ్ ।**
**అవ్యయం చాప్రతిష్ఠం చ తన్నిత్యం సర్వగం విభుమ్ ॥55॥**

**మహాంతం తద్ బృహంతం చ తదజం చిన్మయం ద్విజాః ।**
**అప్రాణమమనస్కం చ తదస్నిగ్ధమలోహితమ్ ॥56॥**

**అప్రమేయం తదస్థూలమదీర్ఘం తదనుల్బణమ్ ।**
**అహ్రస్వం తదపారం చ తదానందం తదచ్యుతమ్ ॥57॥**

**అనపావృతమద్వైతం తదనంతమగోచరమ్ ।**
**అసంవృతం తదాత్మైకం పరా విద్యా న చాన్యథా ॥58॥**

భక్తజనులు పరావిద్యతో జ్ఞానం పొందుతున్నారు. అపరవిద్యవల్ల పొందటం లేదు. 'పరా' 'అపరా' అనేవి రెండు విద్యలుగా చెప్పబడ్డాయి. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, సర్వార్థసిద్ధిదాయకమైన అథర్వవేదం పరావిద్యలు. శిక్ష, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందం మరియు జ్యోతిషం – ఇవి అన్నీ 'అపరా' విద్యలు. 'పరా' విద్య అక్షరరూపంలో స్థితి చెంది ఉంది. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! 'పరా' విద్య క్షయంకానిది. కన్నులు, చెవులు, చేతులు, కాళ్ళు, జననం, సంకుచితమైన నిలకడ, శబ్దం, లేనిది. ఇంకా స్పర్శరూపం, రసం, గంధం, లేనిది. క్షీణంకానిది. ఒకేచోట నిలవనిది. నిత్యం, అన్నిచోట్లకు వెళ్ళగలిగేది. సమస్తద్రవ్యాలతో కలిసేది. మహాపరిమాణంగలది. విస్తరించేది. పుట్టుకలేనిది. చైతన్యం, ప్రాణంకానిది. మనసులేనిది. దట్టముకానిది. ఎరుపుగానిది. ప్రమాణాతీతం. స్థూలం, దీర్ఘం, ప్రకాశవంతం, హ్రస్వమూగాదు. ఒడ్డులులేనిది. ఆనందం అచ్యుతం. తప్పుకొననిది. ద్వైతంకానిది. అద్వైతం. అనంతం. ఇంద్రియాలకి అందదు. ఆదరణంలేనిది. పరావిద్య ఏకాత్మజ్ఞానమే. వేరొకటిగాదు. ఓ ద్విజులారా! అది స్పర్శలేనిది, రూపరహితమైనది. రసం, గంధం లేనిది. అవ్యయం మరియు ఆధారరహితమైనది. నిత్యమైనది. సర్వగమనం కలది. సర్వశక్తిశాలి అయినది. మిక్కిలి పెద్దది, మిక్కిలి బరువైనది. జన్మలేనిది. చిత్స్వరూపమైనది. ప్రాణం లేనిది. మనసు లేనిది. స్నేహం లేనిది. అలోహితమైనది. అది అప్రమేయం, అస్థూలం, అదీర్ఘం, అట్లే అనుల్బణం అయినది. హ్రస్వం కానిది. అపారమైనది. ఆనందమయం అట్లే అచ్యుతమైనది. అది అనపావృతం, అద్వైతం, అనంతం, అగోచరం, ఆవరణరహితం, ఆత్మస్వరూపం అయినది. ఇది పరావిద్య. ఇది వేరొకటి కాదు.

**పరాపరేతి కథితే నైవేహ పరమార్థతః ।**
**అహమేవ జగత్సర్వం మయ్యేవ సకలం జగత్ ॥59॥**

**మత్త ఉత్పద్యతే తిష్ఠన్మయి మయ్యేవ లీయతే ।**
**మత్తో నాన్యదితీక్షేత మనోవాక్పాణిభిస్తథా ॥60॥**

**సర్వమాత్మని సంపశ్యేత్సచ్చాసచ్చ సమాహితః ।**
**సర్వం హ్యాత్మని సంపశ్యన్న బాహ్యే కురుతే మనః ॥61॥**

'పరా' 'అపరా' అని రెండు విద్యలుగా చెప్పబడుతున్నవి పరమార్థ దృష్టిలో లేవు. వాస్తవానికి నేనే సంపూర్ణమైన జగత్తును. నాలోనే ఈ సంపూర్ణ జగత్తు స్థితి చెంది ఉంది. నానుండే ఈ జగత్తు పుట్టుతున్నది. నాలోనే నిలిచి ఉంటున్నది. నాలోనే విలీనం అవుతున్నది. నాకంటే వేరుగా ఏదీ లేదు. ఈ విషయాన్ని మనోవాక్కాయకర్మల చేత అనుభవం పొందాలి. ఏకాగ్రచిత్తంతో సత్తును అట్లే అసత్తును ఆత్మలోనే చూడాలి. ఆత్మలోనే అన్నింటిని చూచే సాధకుడు తన మనసుకంటే బాహ్యజగత్తు విషయంలో ఆసక్తి చూపకుంటాడు.

**అధో దృష్ట్యా వితస్త్యాం తే నాభ్యాముపరి తిష్ఠతి ।**
**హృదయం తద్విజానీయాద్విశ్వస్యాయతనం మహత్ ॥62॥**

**హృదయస్యాస్య మధ్యే తు పుండరీకమవస్థితమ్ ।**
**ధర్మకందసముద్భూతం జ్ఞాననాలం సుశోభనమ్ ॥63॥**

**ఐశ్వర్యాష్టదలం శ్వేతం పరం వైరాగ్యకర్ణికమ్ ।**
**ఛిద్రాణి చ దిశో యస్య ప్రాణాద్యాశ్చ ప్రతిష్ఠితాః ॥64॥**

నాభికి పంద్రెండు అంగుణాలకుపైన అధోముఖమైన హృదయకమలమున్నది. అది విశ్వంయొక్క మహామందిరం అని గ్రహించాలి. ఈ హృదయంయొక్క మధ్యలో కమలం ఉన్నది. అది ధర్మరూపమైన కందం నుంచి పుట్టింది. జ్ఞానమే దాని నాళం (తూడు) అది మిక్కిలి సుందరమైనది. అష్టసిద్ధులు, అష్టదళాలు కలది. అది తెల్లనిది. ఉత్తమమైన వైరాగ్యరూపమైన కర్ణిక కలది. దాని రంధ్రాలు ప్రాణవాయురూపాలైన దిక్కుల రూపంగా నిలుస్తున్నాయి.

**ప్రాణాద్యైశ్చైవ సంయుక్తః పశ్యతే బహుధా క్రమాత్ ।**
**దశప్రాణవహా నాడ్యః ప్రత్యేకం మునిపుంగవాః ॥65॥**

**ద్విసప్తతిసహస్రాణి నాడ్యః సంపరికీర్తితాః ।**
**నేత్రస్థం జాగ్రతం విద్యాత్కంఠే స్వప్నం సమాదిశేత్ ॥66॥**

**సుషుప్తం హృదయస్థం తు తురీయం మూర్ధని స్థితమ్ ।**
**జాగ్రే బ్రహ్మా చ విష్ణుశ్చ స్వప్నే చైవ యథాక్రమాత్ ॥67॥**

**ఈశ్వరస్తు సుషుప్తే తు తురీయేచ మహేశ్వరః ।**
**వదత్యేవమథాన్యేఽపి సమస్తకరణైః పుమాన్ ॥68॥**

**వర్తమానస్తదా తస్య జాగ్రదిత్యభిధీయతే ।**
**మనోబుద్ధిరహంకారం చిత్తం చేతి చతుష్టయమ్ ॥69॥**

**యదా వ్యవస్థితస్తైస్తైః స్వప్న ఇత్యభిధీయతే ।**
**కారణాని విలీనాని యదా స్వాత్మని సువ్రతాః ॥70॥**

**సుషుప్తః కరణైర్భిన్నస్తురీయః పరికీర్త్యతే ।**
**పరస్తురీయాతీతోఽసౌ శివః పరమకారణమ్ ॥71॥**

ప్రాణాయామాదులతోకూడిన సాధకుడు అనేకరూపాలలో ఈవిధంగా క్రమంగా చూస్తున్నాడు. ఓ మునిశ్రేష్ఠులారా! ప్రత్యేకంగా ప్రతినాడి పదిప్రాణాల్ని కలిగి ఉంటుంది. మొత్తం డెబ్బదిరెండువేలనాడులు ఉన్నాయి. ప్రాణం జాగ్రదవస్థలో కండ్లలోను, స్వప్నావస్థలో కంఠంలోను ఉంటుందని తెలియాలి. ఈ విధంగా సుషుప్తి అవస్థలో హృదయంలోనూ తురీయావస్థలో (4వ అవస్థలో) శిరస్సులోనూ ప్రాణం ఉంటుందని తెలియాలి. జాగ్రదవస్థలో బ్రహ్మదేవుడు, స్వప్నావస్థలో విష్ణువు, సుషుప్తిలో శివుడు, తురీయావస్థలో మహేశ్వరుడు నిలిచి ఉంటారు. ఇతరజనులుకూడా ఈవిధంగానే చెబుతున్నారు. మానవుడు అన్నియింద్రియాలతోనూ కలిసిఉంటే

అది ఆతడి జాగ్రదవస్థ అవుతున్నది. మనసు, బుద్ధి, అహంకారం, చిత్తం ఈ అంతఃకరణచతుష్టయంతో మానవుడు కలిసిఉంటే అపుడది స్వప్నావస్థ అవుతున్నది. ఓ సువ్రతులారా! ఎపుడు మానవుడి ఇంద్రియాలు కరణాలు ఆతడి ఆత్మలో విలీనం అవుతున్నాయో అపుడది ఆతడి సుషుప్తి అవుతున్నది. ఇంద్రియాతీతుడైన మానవుడు తురీయావస్థకు చెందినవాడు. జగత్తుకు పరమకారకుడు, పరస్వరూపుడు అయిన శివుడు తురీయావస్థకన్నా అతీతుడు.

**జాగ్రత్స్వప్నసుషుప్తిశ్చ తురీయం చాధిభౌతికమ్ ।**
**ఆధ్యాత్మికం చ విప్రేంద్రాశ్చాధిదైవికముచ్యతే ॥72॥**

**తత్సర్వమహమేవేతి వేదితవ్యం విజానతా ।**
**బుద్ధీంద్రియాణి విప్రేంద్రాస్తథా కర్మేంద్రియాణి చ ॥73॥**

**మనోబుద్ధిరహంకారశ్చిత్తం చేతి చతుష్టయమ్ ।**
**అధ్యాత్మం పృథగేవేదం చతుర్దశవిధం స్మృతమ్ ॥74॥**

**ద్రష్టవ్యం చైవ శ్రోతవ్యం ఘ్రాతవ్యం చ యథాక్రమమ్ ।**
**రసితవ్యం మునిశ్రేష్ఠాః స్పర్శితవ్యం తథైవ చ ॥75॥**

**మంతవ్యం చైవ బోద్ధవ్యమహంకర్తవ్యమేవ చ ।**
**తథా చేతయితవ్యం చ వక్తవ్యం మునిపుంగవాః ॥76॥**

**ఆదాతవ్యం చ గంతవ్యం విసర్గాయితమేవ చ ।**
**ఆనందితవ్యమిత్యేతే హ్యధిభూతమనుక్రమాత్ ॥77॥**

**ఆదిత్యోఽపి దిశశ్చైవ పృథివీ వరుణస్తథా ।**
**వాయుశ్చంద్రస్తథా బ్రహ్మా రుద్రః క్షేత్రజ్ఞ ఏవ చ ॥78॥**

**అగ్నిరింద్రస్తథా విష్ణుర్మిత్రో దేవః ప్రజాపతిః ।**
**ఆధిదైవికమేవం హి చతుర్దశవిధం క్రమాత్ ॥79॥**

ఓ విప్రశ్రేష్ఠులారా! జాగ్రత్, స్వప్న, సుషుప్తులు మరియు తురీయం వీటి వివరణ తర్వాత ఇపుడు నేను మీకు అధిభౌతికం, ఆధ్యాత్మికం, ఆధిదౌవికం – వీటియొక్క స్వరూపాన్ని వివరిస్తున్నాను. బుద్ధిశాలురయిన వాళ్లు ఇవి అన్నీ నేనే అని తెలుసుకోవాలి. మనసు, బుద్ధి, అహంకారం, చిత్తం – ఈ చతుర్వర్గాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు – ఇవి వేరు రూపాలుగా పధ్నాలుగు ఆధ్యాత్మిక పదార్థాలుగా చెప్పబడ్డాయి. ఓ మునిశ్రేష్ఠులారా! ఓ మునిపుంగవులారా! చూడదగినవి, వినదగినవి, వాసన చూడదగినవి, రుచి చూచుటకు తగినవి, స్వీకరించదగినవి, స్పర్శయోగ్యాలు, ఆలోచనాయోగ్యాలు, తెలిసికోదగినవి, గర్వింపదగినవి, ఇష్టపడడానికి తగినవి, మాట్లాడడానికి తగినవి, ఎచ్చటకు కావలయునన్న అచ్చటకు వెళ్లేవి, విడిచిపెట్టడానికి తగినవి, ఆనందయోగ్యాలు – ఇవి అన్నీ క్రమంగా అధిభౌతికాలు. సూర్యుడు, దిక్కులు, భూమి, వరుణుడు, వాయువు, చంద్రుడు, బ్రహ్మ, రుద్రుడు, క్షేత్రజ్ఞుడు, అగ్ని, ఇంద్రుడు, విష్ణువు, మిత్రుడు, ప్రజాపతి – ఈ పద్నాలుగు క్రమంగా అధిదైవికాలు.

**రాజ్ఞీ సుదర్శనా చైవ జితా సౌమ్యా యథాక్రమమ్ ।**
**మోఘా రుద్రామృతా సత్యా మధ్యమా చ ద్విజోత్తమాః ॥80॥**

**నాడీ రాశిశుకా చైవ అసురా చైవ కృత్తికా ।**
**భాస్వతీ నాడయశ్చైతాశ్చతుర్దశ నిబంధనాః ॥81॥**

**వాయవో నాడిమధ్యస్థా వాహకాశ్చ చతుర్దశ ।**
**ప్రాణో వ్యానస్త్వపానశ్చ ఉదానశ్చ సమానకః ॥82॥**

**వైరంభశ్చ తథా ముఖ్యో హ్యంతర్యామః ప్రభంజనః ।**
**కూర్మకశ్చ తథా శ్యేనః శ్వేతః కృష్ణస్తథానిలః ॥83॥**

**నాగ ఇత్యేవ కథితా వాయవశ్చ చతుర్దశ ।**

శ్రేష్ఠబ్రాహ్మణులారా! రాణి, సుదర్శన, జిత, సౌమ్య, మేధ, రుద్ర, అమృత, సత్య, మధ్యమ, నాడి, రాశిశుక, అసుర, కృత్తిక మరియు భాస్వతి– ఈ పధ్నాలుగు నిబంధననాడులు. నాడుల మధ్యలో పధ్నాలుగు వాహకవాయువులుంటాయి. ప్రాణం, వ్యానం, అపానం, ఉదానం, సమానం, వైరంభం, ముఖ్యాంతర్యామం, ప్రభంజనం, కూర్మం, శ్యేనం, శ్వేతం, కృష్ణం, అనిలం అట్లే నాగం ఈ పధ్నాలుగు వాయువులు.

**యశ్చక్షుష్యథ ద్రష్టవ్యే తథాదిత్యే చ సువ్రతాః ॥84॥**

**నాడ్యాం ప్రాణే చ విజ్ఞానే త్వానందే చ యథాక్రమమ్ ।**
**హృద్యాకాశే య ఏతస్మిన్ సర్వస్మిన్నంతరే పరః ॥85॥**

**ఆత్మా ఏకశ్చ చరతి తముపాసీత మాం ప్రభుమ్ ।**
**అజరం తమనంతం చ అశోకమమృతం ధ్రువమ్ ॥86॥**

**చతుర్దశవిధేష్వేవ సంచరత్యేక ఏవ సః ।**
**లీయంతే తాని తత్రైవ యదన్యం నాస్తి వై ద్విజాః ॥87॥**

**ఏక ఏవ హి సర్వజ్ఞః సర్వేశస్త్వేక ఏవ సః ।**
**ఏష సర్వాధిపో దేవస్త్వంతర్యామీ మహాద్యుతిః ॥88॥**

**ఉపాస్యమానః సర్వస్య సర్వసౌఖ్యం సనాతనః ।**
**ఉపాస్యతి న చైవేహ సర్వసౌఖ్యం ద్విజోత్తమాః ॥89॥**

**ఉపాస్యమానో వేదైశ్చ శాస్త్రైర్నానావిధైరపి ।**
**న వైష వేదశాస్త్రాణి సర్వజ్ఞో యాస్యతి ప్రభుః ॥90॥**

నేత్రాలలో, చూడదగిన పదార్థాలలో, సూర్యుడిలో, నాడులలో, ప్రాణాలలో, విజ్ఞానంలో, ఆనందంలో, హృదయాకాశంలో, అట్లే ఈ సంపూర్ణ బ్రహ్మాండంలో ఏది ఏకమాత్రమైన ఆత్మరూపంలో సంచరిస్తున్నదో అది నా

యొక్క అజరం, అనంతం, శోకరహితం, అమృతస్వరూపం. అట్లే అచల స్వరూపమే అయి ఉన్నది. అట్టి దాన్ని ఉపాసించాలి. ఏకరూపంలో ఈ పద్నాలుగు నాడుల్లో సంచారం జరుగుతున్నది. ఓ ద్విజులారా! ఇవి అన్నీ దానిలో లీనం అవుతున్నాయి. ఎందుకంటే దానికంటే భిన్నంగా ఇతరమైనది ఏదీ లేదు కాబట్టి. ఆ ఏకమాత్రమే సర్వజ్ఞుడు. ఆ ఏకమాత్రమే సర్వేశ్వరుడు. అది అందరికి ప్రభువు, దేవత, అంతర్యామి అయి ఉన్నది. మహాజ్యోతితో కూడి ఉన్నది. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! అన్ని విధాలైన సుఖాలనిచ్చే సనాతనుడైన పరమాత్మ అందరి చేత ఉపాసింపబడడం తెలిసిన తర్వాత స్వయంగా సమస్తసౌఖ్యాల అపేక్ష చేయడం కుదరదు. వేదాలచేత, నానావిధశాస్త్రాలచేత ఉపాసింపబడిన ఆ సర్వజ్ఞుడైన ప్రభువుకు వేదశాస్త్రాల అపేక్ష అవసరం లేదు.

**అస్యైవాన్నమిదం సర్వం న సోఽన్నం భవతి స్వయమ్ ।**
**స్వాత్మనా రక్షితం చాద్యాదన్నభూతం న కుత్రచిత్ ॥91॥**

**సర్వత్ర ప్రాణినామన్నం ప్రాణినాం గ్రంథిరస్మ్యహమ్ ।**
**ప్రశాస్తా నయనశ్చైవ పంచాత్మా స విభాగశః ॥92॥**

**అన్నమయోఽసౌ భూతాత్మా చాద్యతే హ్యన్నముచ్యతే ।**
**ప్రాణమయశ్చేంద్రియాత్మా సంకల్పాత్మా మనోమయః ॥93॥**

**కాలాత్మా సోమ ఏవేహ విజ్ఞానమయ ఉచ్యతే ।**
**సదానందమయో భూత్వా మహేశః పరమేశ్వరః ॥94॥**

**సోఽహమేవం జగత్సర్వం మయ్యేవ సకలం స్థితమ్ ।**
**పరతంత్రం స్వతంత్రేఽపి తదభావాద్విచారతః ॥95॥**

ఈ సమస్తప్రపంచం ఆ ఆత్మయొక్క అన్నం (భోగ్యం) అయితే ఆత్మ స్వయంగా అన్నం కాదు. కావున అది భోక్త మాత్రమే. తన ద్వారా రక్షింపబడిన అన్నానికి (భోగ్యానికి) ఇది భోక్త. జీవుల భోగ్యానికి ఏదీ భోక్త కాదు. నేనే ప్రాణుల అన్నాన్ని. నేను ప్రాణులకు ప్రాణాపానరూపమైన గ్రంథిని. నేనే అందర్ని శాసించువాడిని. అందరికీ కన్నుఅయినవాడిని. పంచకోశరూపవిభాగాలతో కూడిన పంచాత్మను. ఏది గ్రహించబడుతున్నదో అది అన్నం అవుతున్నది. ఆ భూతాత్మ అన్నమయకోశం. ఇంద్రియాత్మ ప్రాణమయకోశం. సంకల్పాత్మ మనోమయకోశం. మరియు సోమస్వరూపమైన కాలాత్మ విజ్ఞానమయకోశం అవుతుంది. ఎల్లప్పుడూ ఆనందంలో మునిగి మహేశ్వర పరమేశ్వరుడు ఆనందమయకోశ రూపంగా నిలుస్తాడు. ఆ పంచకోశాలు నేనే. ఆలోచించి చూడగా ఈ జగత్తు యొక్క అభావకారణం పరతంత్రతే. సంపూర్ణజగత్తు ఈ స్వతంత్రతలో నిలుస్తున్నది.

**ఏకత్వమపి నాస్త్యేవ ద్వైతం తత్ర కుతస్త్వహో ।**
**ఏవం నాస్త్యథ మర్త్యంచ కుతోఽమృతమజోద్భవః ॥96॥**

**నాంతఃప్రజ్ఞో బహిఃప్రజ్ఞో న చోభయగతస్తథా ।**
**న ప్రజ్ఞానఘనస్త్వేవం న ప్రాజ్ఞో జ్ఞానపూర్వకః ॥97॥**

**విదితం నాస్తి వేద్యం చ నిర్వాణం పరమార్థతః ।**
**నిర్వాణం చైవ కైవల్యం నిఃశ్రేయసమనామయమ్ ॥98॥**

**అమృతం చాక్షరం బ్రహ్మ పరమాత్మా పరాపరమ్ ।**
**నిర్వికల్పం నిరాభాసం జ్ఞానం పర్యాయవాచకమ్ ॥99॥**

**ప్రసన్నం చ యదేకాగ్రం తదా జ్ఞానమితి స్మృతమ్ ।**
**అజ్ఞానమితరత్సర్వం నాత్ర కార్యా విచారణా ॥100॥**

ఏకత్వం కూడా లేదు. అలాంటప్పుడు ద్వైతం ఎలా ఉంటుంది? ఈ కారణంగా ఎవ్వడూ మర్త్యుడు కాడు. అప్పుడు అజోద్భవుడు కూడా (బ్రహ్మకూడా) అమరుడు ఎలా అవుతాడు? ఆతడు అంతఃప్రజ్ఞుడు కాడు. బహిః ప్రజ్ఞుడును కాడు. ఉభయప్రజ్ఞావంతుడునుకాడు. ఆతడు ప్రజ్ఞానఘనుడు కాడు. జ్ఞానసంపన్నుడు, ప్రాజ్ఞుడూకాడు. ఆతడు విదితుడు కాడు. వేద్యుడూ (తెలియదగినవాడు) కాడు. నిర్వాణస్వరూపుడూ కాడు. నిర్వాణం, కైవల్యం, నిఃశ్రేయసం, అనామయం, అమృతం, అక్షరం, బ్రహ్మం, పరమాత్మా, పరాపరుడు, నిర్వికల్పుడు, నిరాభాసుడు మరియు జ్ఞాని – ఇవి అన్నీ పరస్పరం పర్యాయపదాలు. ఎప్పుడు చిత్తము ప్రసన్నము, ఏకాగ్రము అవుతుందో అప్పుడది జ్ఞానరూపాన్ని చెందుతుంది. దీనికి వ్యతిరేకమైనదంతా అజ్ఞానమే. ఇందుకు సందేహించ పనిలేదు.

**ఇత్థం ప్రసన్నం విజ్ఞానం గురుసంపర్కజం ధ్రువమ్ ।**
**రాగద్వేషానృతక్రోధకామతృష్ణాదిభిః సదా ॥101॥**

**అపరామృష్టమద్వైవ విజ్ఞేయం ముక్తిదం త్విదమ్ ।**
**అజ్ఞానమలపూర్వత్వాత్పురుషో మలినః స్మృతః ॥102॥**

**తత్క్షయాద్ధి భవేన్ముక్తిర్నాన్యథా జన్మకోటిభిః ।**

ఈ విధంగా పూర్ణజ్ఞానం గురుసాన్నిధ్యం వల్ల కల్గుతున్నది. అది రాగద్వేషాలు, మిథ్య, క్రోధం, కామం, తృష్ణ మొదలైనవాటితో ఎల్లప్పుడూ కూడి ఉండదు. దానినే ముక్తినిచ్చుదానిగా గుర్తించాలి. అజ్ఞానమనే మలినంతో కూడిన మానవుడు 'మలినుడు' అవుతున్నాడు. ఆ అజ్ఞానమలినం నశిస్తే ముక్తి కలుగుతున్నది. మరో విధంగా కోట్లజన్మలలో కూడా ముక్తి లభించదు.

**జ్ఞానమేకం వినా నాస్తి పుణ్యపాపపరిక్షయః ॥103॥**
**జ్ఞానమేవాభ్యసేత్తస్మాన్ముక్త్యర్థం బ్రహ్మవిత్తమాః ।**
**జ్ఞానాభ్యాసాద్ధి వై పుంసాం బుద్ధిర్భవతి నిర్మలా ॥104॥**

**తస్మాత్సదాభ్యసేత్ జ్ఞానం తన్నిష్ఠస్తత్పరాయణః ।**
**జ్ఞానేనైకేన తృప్తస్య త్యక్తసంఘస్య యోగినః ॥105॥**

**కర్తవ్యం నాస్తి విప్రేంద్రా అస్తి చేత్తత్త్వవిన్న చ ।**
**ఇహ లోకే పరే చాపి కర్తవ్యం నాస్తి తస్య వై ॥106॥**

**జీవన్ముక్తో యతస్తస్మాద్ బ్రహ్మవిత్పరమార్థతః ।**
**జ్ఞానాభ్యాసరతో నిత్యం జ్ఞానతత్త్వార్థవిత్స్వయమ్ ॥107॥**

**కర్తవ్యాభ్యాసముత్సృజ్య జ్ఞానమేవాధిగచ్ఛతి ।**

ఒక్క జ్ఞానంమాత్రమే లేకుండా పుణ్యపాపాలనాశనం జరగదు. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! కావున ముక్తికోసం జ్ఞానాభ్యాసాన్ని ఎల్లప్పుడూ చేయాలి. జ్ఞానాభ్యాసంవల్ల మానవులబుద్ధి నిర్మలమవుతున్నది. జ్ఞాననిష్ఠాతత్పరుడై మానవుడు ఎల్లప్పుడూ జ్ఞానాన్ని సముపార్జించాలి. ఓ విప్రవరులారా! ఏకమాత్రజ్ఞానం వల్ల సంతుష్టుడైన మరియు ముక్తసంగుడైన యోగికి చేయదగింది ఏదీలేదు. ఏదైనాఉంటే ఆతడుతత్త్వజ్ఞానికాడు. ఈలోకంలోగాని పరలోకంలోగాని ఆతడు చెయ్యవలసినది ఏదీ లేదు. ఎందుకంటే ఆతడు జీవన్ముక్తుడు. ఆతడు వాస్తవంగా బ్రహ్మవేత్త. జ్ఞానసముపార్జనంలో మునిగి ఉన్నాడు. అట్లే జ్ఞానతత్త్వార్థవిదుడు అయినవాడు స్వయంగా కర్తవ్యాల్ని త్యాగం చేసి జ్ఞానాన్నే పొందుతున్నాడు.

**వర్ణాశ్రమాభిమానీ యస్త్యక్తక్రోధో ద్విజోత్తమాః ॥108॥**

**అన్యత్ర రమతే మూఢః సోఽజ్ఞానీ నాత్ర సంశయః ।**
**సంసారహేతురజ్ఞానం సంసారస్తనుసంగ్రహః ॥109॥**

**మోక్షహేతుస్తథా జ్ఞానం ముక్తః స్వాత్మన్యవస్థితః ।**

ఓ ద్విజశ్రేష్ఠులారా! ఎవడు వర్ణాశ్రమధర్మంలో అభిమానం కలిగి ఉండి, అట్లే క్రోధాన్ని త్యజించి కూడా మూఢుడై జ్ఞానం కన్నా భిన్నమైన ఇతర సాధనాలద్వారా సుఖానుభవం పొందుతున్నాడో వాడు అజ్ఞాని. ఇందులో సందేహం లేదు. అజ్ఞానమే సంసార హేతువు. శరీరాన్ని ధరించడమే సంసారం. జ్ఞానం మోక్ష హేతువు. ముక్తుడు తనలోనే వ్యవస్థితుడై ఉంటాడు.

**అజ్ఞానే సతి విప్రేంద్రాః క్రోధాద్యా నాత్ర సంశయః ॥110॥**

**క్రోధో హర్షస్తథా లోభో మోహో దంభో ద్విజోత్తమాః ।**
**ధర్మాధర్మౌ హి తేషాం చ తద్వశాత్తనుసంగ్రహః ॥111॥**

**శరీరే సతి వై క్లేశః సోఽవిద్యాం సంత్యజేద్ బుధః ।**
**అవిద్యాం విద్యయా హిత్వా స్థితస్యైవ చ యోగినః ॥112॥**

**క్రోధాద్యా నాశమాయాంతి ధర్మాధర్మౌ చ వై ద్విజాః ।**
**తత్క్షయాచ్చ శరీరేణ న పునః సంప్రయుజ్యతే ॥113॥**

**స ఏవ ముక్తః సంసారాద్దుఃఖత్రయవివర్జితః ।**

ఓ విప్రవరులారా! అజ్ఞానం వల్ల క్రోధాదులు ఉత్పన్నమవుతాయి. ఇందులో సందేహం లేదు. ఓ ద్విజోత్తములారా! క్రోధం, హర్షం, లోభం, మోహం, దంభం, ధర్మం, అధర్మం మానవులలోఉంటాయి. వీటి

కారణంగా శరీరధారణ చేయవలసి వస్తున్నది. శరీరం ఉండడం వల్ల క్లేశం అవశ్యంగా కలుగుతున్నది. అందుచేత బుద్ధిమంతుడు అజ్ఞానాన్ని విడిచిపెట్టాలి. ఓ బ్రాహ్మణులారా! విద్య (జ్ఞానం) వల్ల అవిద్యను (అజ్ఞానం) నశింపజేసిన యోగికి క్రోధాదులు, ధర్మాధర్మాలు వాటంతట అవే నశిస్తున్నాయి. అవి నశించినతర్వాత ప్రాణులకు శరీర సంయోగం అవసరంలేదు. ఆతడు సంసారం నుంచి ముక్తుడవుతున్నాడు. మూడువిధాలైన తాపాలు లేని వాడవుతున్నాడు.

**ఏవం జ్ఞానం వినా నాస్తి ధ్యానం ధ్యాతుర్ద్విజర్షభాః ॥114॥**

**జ్ఞానం గురోర్హి సంపర్కాన్న వాచా పరమార్థతః ।**
**చతుర్వ్యూహమితి జ్ఞాత్వా ధ్యాతా ధ్యానం సమభ్యసేత్ ॥115॥**

**సహజాగంతుకం పాపమస్థివాగుద్భవమ్ తథా ।**
**జ్ఞానాగ్నిర్దహతే క్షిప్రం శుష్కేంధనమివానలః ॥116॥**

ఓ శ్రేష్ఠద్విజులారా! ఈ విధంగా జ్ఞానంలేకుండా ధ్యానియొక్క ధ్యానం సిద్ధి పొందకున్నది. నిజానికి జ్ఞానం గురుసంపర్కంవల్ల కలుగుతున్నది. కేవలం శబ్దంవల్ల కాదు. చతుర్వ్యూహజ్ఞానాన్ని అభ్యసించిన తర్వాతే ధ్యానం చేయువాడు ధ్యానాన్ని అభ్యసించాలి. (తైజస, విశ్వ, ప్రాజ్ఞ, తురీయాలు చతుర్వ్యూహజ్ఞానాలు) జ్ఞానరూపమైన అగ్ని సహజపాపాల్ని, ఆగంతుకపాపాల్ని, శారీరకవాచకపాపాల్ని త్వరగా దహిస్తుంది. ఏవిధంగా అగ్ని జీర్ణించిన కట్టెను కాల్చుతుందో ఆ విధంగా.

**జ్ఞానాత్పరతరం నాస్తి సర్వపాపవినాశనమ్ ।**
**అభ్యసేచ్చ సదా జ్ఞానం సర్వసంగవివర్జితః ॥117॥**

**జ్ఞానినః సర్వపాపాని జీర్యంతే నాత్ర సంశయః ।**
**క్రీడన్నపి న లిప్యేత పాపైర్నానావిధైరపి ॥118॥**

సమస్తపాపవినాశకరమైనది జ్ఞానం. దానికంటె గొప్పది మరేదీ లేదు. అందుచేత సంసారమందు ఆసక్తి విడిచి జ్ఞానాన్ని అభ్యసించాలి. జ్ఞానికి సమస్తపాపాలు నశించిపోతున్నాయి. ఇందులో సందేహం లేదు. ఆమోద, ప్రమోదాత్మకమైన క్రీడలో ఆతడున్నా పలువిధాలైన పాపాల్ని పొందకున్నాడు.

**జ్ఞానం యథా తథా ధ్యానం తస్మాద్ధ్యానం సమభ్యసేత్ ।**
**ధ్యానం నిర్విషయం ప్రోక్తమాదౌ సవిషయం తథా ॥119॥**

**షట్ప్రకాశం సమభ్యస్య చతుఃషట్దశభిస్తథా ।**
**తథా ద్వాదశధా చైవ పునః షోడశధా క్రమాత్ ॥120॥**

**ద్విధాభ్యస్య చ యోగీంద్రో ముచ్యతే నాత్ర సంశయః ।**
**శుద్ధజాంబూనదాకారం విధూమాంగారసన్నిభమ్ ॥121॥**

**పీతం రక్తసితం విద్యుత్కోటికోటిసమప్రభమ్ ।**
**అథవా బ్రహ్మరంధ్రస్థం చిత్తం కృత్వా ప్రయత్నతః ॥122॥**

**న సితం వాసితం పీతం న స్మరేద్ బ్రహ్మవిద్భవేత్ ।**

ఏ విధంగా జ్ఞానముందో అదేవిధంగా ధ్యానంకూడా ఉంది. అందుచేత ధ్యానంయొక్క అభ్యాసమూ చేయాలి. ధ్యానం విషయరహితమైనది. అయితే ప్రారంభంలో సవిషయకమే. నాలుగు, ఆరు, పది, పండ్రెండు అట్లే పదహారు సార్లు మరియు మరల రెండు విధాలుగా ఆరు రూపాలుగా క్రమంగా అభ్యాసం చేసిన యోగిశ్రేష్ఠుడు ముక్తుడవుతున్నాడు. ఇందులో సందేహం లేదు. సాధకుడు మేలిమి బంగారం ఆకారం కలవాడు, పొగలేని నిప్పులాంటివాడు, పచ్చని, ఎఱ్ఱని, తెల్లని రంగు గలవాడు, కోటివిద్యుత్తులతో సమానమైన కాంతిగలవాడు అయి ధ్యానించాలి. లేకుంటే చిత్తాన్ని ప్రయత్నపూర్వకంగా బ్రహ్మరంధ్రంలో నిలిపి తెల్లని, నల్లని లేకుంటే పచ్చని రంగులు లేని బ్రహ్మను స్మరించాలి. ఈ విధంగా ధ్యానించేవాడు బ్రహ్మవేత్త అవుతున్నాడు.

**అహింసకః సత్యవాదీ అస్తేయీ సర్వయత్నతః ॥123॥**

**పరిగ్రహవినిర్ముక్తో బ్రహ్మచారీ దృఢవ్రతః ।**
**సంతుష్టః శౌచసంపన్నః స్వాధ్యాయనిరతః సదా ॥124॥**

**మద్భక్తశ్చాభ్యసేద్ధ్యానం గురుసంపర్కజం ధ్రువమ్ ।**
**న బుధ్యతి తథా ధ్యాతా స్థాప్య చిత్తం ద్విజోత్తమాః ॥125॥**

**న చాభిమన్యతే యోగీ న పశ్యతి సమంతతః ।**
**న ఘ్రాతి న శృణోత్యేవ లీనః స్వాత్మని యః స్వయమ్ ॥126॥**

**న చ స్పర్శం విజానాతి స వై సమరసః స్మృతః ।**

గట్టి ప్రయత్నంతో అహింసకుడు, సత్యవచనుడు, చోరవృత్తిరహితుడు, పరిగ్రహరహితుడు, బ్రహ్మచారి, దృఢవ్రతుడు, సంతుష్టుడు, పరిశుద్ధుడు, ఎల్లప్పుడూ స్వాధ్యాయపరాయణుడు మరియు నా భక్తుడై గురుసాన్నిధ్యంలో ధ్యానాన్ని నిరంతరం అభ్యసించాలి. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! ధ్యానసాధన నిర్వహించే యోగి తన చిత్తాన్ని స్థిరపర్చుకుని ఏ యితర వస్తుబుద్ధి లేక ఉంటాడు. దేనిని అభిమానించడు. అతడు నాలుగు దిక్కులను చూడడు. వాసన చూడడు. వినడు. స్పర్శానుభవాన్ని పొందడు. ఈ విధంగా స్వయంగా అన్నింటిని తన ఆత్మలో లీనపర్చుతాడు. అట్టి ఆతడే సమరసుడవుతాడు.

**పార్థివే పటలే బ్రహ్మా వారితత్త్వే హరిః స్వయమ్ ॥127॥**

**వాహ్నేయే కాలరుద్రాఖ్యో వాయుతత్త్వే మహేశ్వరః ।**
**సుషిరే స శివః సాక్షాత్పరమాదేవం విచింతయేత్ ॥128॥**

**క్షితౌ శర్వః స్మృతో దేవోహ్యపాం భవ ఇతి స్మృతః ।**
**రుద్ర ఏవ తథా వహ్నౌ ఉగ్రో వాయౌ వ్యవస్థితః ॥129॥**

**భీమః సుషిరనాకేఽసౌ భాస్కరే మండలే స్థితః ।**
**ఈశానః సోమబింబే చ మహాదేవ ఇతి స్మృతః ॥130॥**

**పుంసాం పశుపతిర్దేవశ్చాష్టధాహం వ్యవస్థితః ।**

భూతలంపై బ్రహ్మదేవుడు, జలతత్త్వంలో సాక్షాత్తు విష్ణువు, అగ్నితత్త్వంలో కాలరుద్రుడు, వాయుతత్త్వంలో మహేశ్వరుడు, ఆకాశతత్త్వంలో సాక్షాత్తుగా శివుడు ఉంటున్నారు. ఈ విధంగా క్రమంగా చింతించాలి. శర్వుడు పృథ్విలో, నీటిలో భవదేవుడు, అగ్నిలో రుద్రుడు, ఉగ్రుడు వాయువులో ప్రతిష్ఠితులై ఉన్నారు. భీముడు ఆకాశంలోనూ, ఈశానుడు సూర్యమండలంలోను స్థితులై ఉన్నారు. మహాదేవుడు చంద్రమండలంలో స్థితి చెంది యున్నాడు. పురుషుల్లో భగవానుడైన పశుపతి నిలకడగా ఉన్నాడు. ఈ విధంగా నేను (శివుడు) ఎనిమిది రూపాలలో వ్యవస్థితుణ్ణై ఉన్నాను.

**కాఠిన్యం యత్తనౌ సర్వం పార్థివం పరిగీయతే ॥131॥**

**ఆప్యం ద్రవమితి ప్రోక్తం వర్ణాఖ్యో వహ్నిరుచ్యతే ।**
**యత్సంచరతి తద్వాయుః సుషిరం యత్ ద్విజోత్తమాః ॥132॥**

**తదాకాశం చ విజ్ఞానం శబ్దజం వ్యోమసంభవమ్ ।**
**తథైవ విప్రా విజ్ఞానం స్పర్శాఖ్యం వాయుసంభవమ్ ॥133॥**

**రూపం వాహ్నేయమిత్యుక్తమాప్యం రసమయం ద్విజాః ।**
**గంధాఖ్యం పార్థివం భూయశ్చింతయేద్భాస్కరం క్రమాత్ ॥134॥**

**నేత్రే చ దక్షిణే వామే సోమం హృది విభుం ద్విజాః ।**
**ఆజాను పృథివీతత్త్వమానాభేర్వారిమండలమ్ ॥135॥**

**ఆకంఠం వహ్నితత్త్వం స్యాల్లలాటాంతం ద్విజోత్తమాః ।**
**వాయవ్యం వై లలాటాద్యం వ్యోమాఖ్యం వా శిఖాగ్రకమ్ ॥136॥**

**హంసాఖ్యం చ తతో బ్రహ్మ వ్యోమ్నశ్చోర్ధ్వం తతః పరమ్ ।**
**వ్యోమాఖ్యో వ్యోమమధ్యస్థో హ్యయం ప్రాథమికః స్మరేత్ ॥137॥**

శరీరంలో మిక్కిలి కాఠిన్యం ఉంది. అది పృథ్వీతత్త్వమయం. నీటి సంబంధమైన పదార్థం జలతత్త్వంతో కూడిఉన్నది. వర్ణం అగ్నికి సంబంధించినది. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! శరీరంలో తిరుగుతున్నాయి. అవి వాయువుకు సంబంధించినవి. ఈ శరీరంలో అవకాశం (శూన్యం) ఉంది. అది ఆకాశతత్త్వం. శబ్దజ్ఞానం ఆకాశం నుంచి ఉత్పన్నమవుతున్నది. ఓ విప్రులారా! ఈవిధంగానే స్పర్శకు సంబంధించిన జ్ఞానం వాయువు వల్ల కలుగుతున్నది. ఓ ద్విజులారా! రూపజ్ఞానం అగ్నివలన కలుగుచున్నది. గంధజ్ఞానం పృథివి వల్ల కలుగుతున్నది. ఓ విప్రులారా! కుడి కంటిలో సూర్యుణ్ణి, ఎడమ కంటిలో చంద్రుణ్ణి, హృదయంలో సర్వవ్యాపకుడైన పురుషుణ్ణి చింతించాలి. ఓ ఉత్తమబ్రాహ్మణులారా! జానువులవరకు పృథ్వీతత్త్వం, నాభిపర్యంతం జలతత్త్వం, కంఠపర్యంతం అగ్నితత్త్వం,

లలాట పర్యంతం వాయుతత్త్వం, లలాటాగ్రం లేక శిఖాగ్రపర్యంతం ఆకాశతత్త్వం, దాని తర్వాత ఆకాశంలో పైన హంసనామకమైన బ్రహ్మ, వ్యోమం మధ్యలో వ్యోమమనే పేరుగల శివుడు ఉన్నారు. ప్రారంభధ్యాత వీరిని ధ్యానించాలి.

**న జీవః ప్రకృతిః సత్త్వం రజశ్చాథ తమః పునః ।**
**మహాంస్తథాభిమానశ్చ తన్మాత్రాణీంద్రియాణి చ ॥138॥**

**వ్యోమాదీని చ భూతాని నైవేహ పరమార్థతః ।**
**వ్యాప్య తిష్ఠద్యతో విశ్వం స్థాణురిత్యభిధీయతే ॥139॥**

**ఉదేతి సూర్యో భీతశ్చ పవతే వాత ఏవ చ ।**
**ద్యోతతే చంద్రమా వహ్నిర్జ్వలయత్యాపో వహంతి చ ॥140॥**

**దధాతి భూమిరాకాశమవకాశం దదాతి చ ।**
**తదాజ్ఞయా తతం సర్వం తస్మాద్వై చింతయేద్ ద్విజాః ॥141॥**

**తేనైవాధిష్ఠితం తస్మాదేతత్సర్వం ద్విజోత్తమాః ।**
**సర్వరూపమయః శర్వ ఇతి మత్వా స్మరేద్భవమ్ ॥142॥**

జీవం, ప్రకృతి, సత్త్వం, రజస్సు, తమస్సు, మహత్తు (బుద్ధి) అహంకారం, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, ఆకాశాదిపంచభూతాలు వాస్తవంగాలేవు. ఎందుకనగా విశ్వాన్నంతటినీ వ్యాపించిస్థాణువు ఉన్నాడని చెప్పబడుతున్నది. ఆతడి ఆజ్ఞ వల్లే భీతుడై సూర్యుడు ఉదయిస్తున్నాడు. గాలి వీస్తున్నది. చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. అగ్ని మండుతున్నది. జలం ప్రవహిస్తున్నది. భూమి అన్నింటిని ధరిస్తున్నది. ఆకాశం అవకాశాన్ని ఇస్తున్నది. అన్నీ ఆతడిలోనే వ్యాప్తి చెంది ఉన్నాయి. ఓ ద్విజులారా! అందుకే ఆతణ్ణి గూర్చి చింతించాలి. ఓ మునులారా! ఆయనలోనే సంపూర్ణజగత్తు అధిష్ఠించి ఉన్నది. అందుచే శర్వుడు సర్వరూపమయుడు. ఈ విధంగా భావించుకుని భవుడిని స్మరించుకోవాలి.

**సంసారవిషతప్తానాం జ్ఞానధ్యానామృతేన వై ।**
**ప్రతీకారః సమాఖ్యాతో నాన్యథా ద్విజసత్తమాః ॥143॥**

**జ్ఞానం ధర్మోద్భవం సాక్షాత్ జ్ఞానాత్ వైరాగ్యసంభవః ।**
**వైరాగ్యాత్పరమం జ్ఞానం పరమార్థప్రకాశకమ్ ॥144॥**

ఓ ద్విజశ్రేష్ఠులారా! సంసారవిషంతో తపించుతున్నవారికి జ్ఞానము ధ్యానము అనే అమృతంతోనే విరుగుడు జరుగుతుంది. వేరొకదాని వల్ల కాదు. ధర్మంవల్ల జ్ఞానం కల్గుతున్నది. సాక్షాత్తూ జ్ఞానం వల్ల వైరాగ్యం కల్గుతున్నది. వైరాగ్యంవల్ల పరమార్థప్రకాశకమైన పరమజ్ఞానం ఉత్పన్నమవుతున్నది.

**జ్ఞానవైరాగ్యయుక్తస్య యోగసిద్ధిర్ద్విజోత్తమాః ।**
**యోగసిద్ధ్యా విముక్తిః స్యాత్సత్త్వనిష్ఠస్య నాన్యథా ॥145॥**

**తమోఽవిద్యాపదచ్ఛన్నం చిత్రం యత్పదమవ్యయమ్ ।**
**సత్త్వశక్తిం సమాస్థాయ శివమభ్యర్చయేద్ ద్విజాః ॥146॥**

ఓ శ్రేష్ఠద్విజులారా! జ్ఞానవైరాగ్యాలతో కూడిన సాధకుడికి యోగసిద్ధి కలుగుతున్నది. వేరొకదాని వల్ల ముక్తి కలుగదు. ఓ ద్విజులారా! వినాశనంలేని ఆశ్చర్యకరం అయిన శివపదం (స్థానం) తమస్సుఅనే అజ్ఞానంచేత కప్పివేయబడింది. ఓ బ్రాహ్మణులారా! అందువలన సత్త్వగుణశక్తిని ఊతంగా పట్టుకుని శివుని పూజించాలి.

**యః సత్త్వనిష్ఠో మద్భక్తో మదర్చనపరాయణః ।**
**సర్వతో ధర్మనిష్ఠశ్చ సదోత్సాహీ సమాహితః ॥147॥**

**సర్వద్వంద్వసహో ధీరః సర్వభూతహితే రతః ।**
**ఋజుస్వభావః సతతం స్వస్థచిత్తో మృదుః సదా ॥148॥**

**అమానీ బుద్ధిమాన్ శాంతస్త్యక్తస్పర్ధో ద్విజోత్తమాః ।**
**సదా ముముక్షుర్ధర్మజ్ఞః స్వాత్మలక్షణలక్షణః ॥149॥**

**ఋణత్రయవినిర్ముక్తః పూర్వజన్మని పుణ్యభాక్ ।**
**జరాయుక్తో ద్విజో భూత్వా శ్రద్ధయా చ గురోః క్రమాత్ ॥150॥**

**అన్యథా వాపి శుశ్రూషాం కృత్వా కృత్రిమవర్జితః ।**
**స్వర్గలోకమనుప్రాప్య భుక్త్వా భోగాననుక్రమాత్ ॥151॥**

**ఆసాద్య భారతం వర్షం బ్రహ్మ విజ్ఞాయతే ద్విజాః ।**
**సంపర్కాత్ జ్ఞానమాసాద్య జ్ఞానినో యోగవిద్భవేత్ ॥152॥**

**క్రమోఽయం మలపూర్ణస్య జ్ఞానప్రాప్తేర్ద్విజోత్తమాః ।**
**తస్మాదనేన మార్గేణ త్యక్తసంగో దృఢవ్రతః ॥153॥**

**సంసారకాలకూటాఖ్యాన్ముచ్యతే మునిపుంగవాః ।**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! సత్త్వనిష్ఠుడు, నా పూజలో లీనమైనవాడు, అన్ని విధాల ధర్మనిష్ఠగలవాడు, ఎల్లప్పుడు ఉత్సాహవంతుడు, ఏకాగ్రచిత్తుడు, అన్ని ద్వంద్వాల్ని సహించేవాడు, ధైర్యశాలి, సర్వప్రాణిహితరతుడు, సరళస్వభావం కలవాడు, ఎల్లప్పుడూ స్వస్థతగల మనసుగలవాడు, కోమలచిత్తుడు, అభిమానరహితుడు, బుద్ధిమంతుడు, శాంతుడు, శత్రుభావం లేనివాడు, ఎల్లప్పుడూ ముక్తికాంక్షగలవాడు, ధర్మజ్ఞుడు, ఆత్మలక్షణలక్షితుడు, మూడు ఋణాల నుంచి విముక్తుడు, పూర్వజన్మలోనూ పుణ్యశాలి అయిన నా బ్రాహ్మణభక్తుడు, శ్రద్ధ గలిగి, నాస్తికభావం లేక గురువును సేవించి, వృద్ధుడై స్వర్గాన్ని పొంది, అక్కడ సుఖించి మరల భరతవర్షంలో జన్మించి బ్రహ్మవేత్త అవుతున్నాడు. ఓద్విజులారా! జ్ఞాని యొక్క సంపర్కంవల్ల జ్ఞానం ప్రాప్తించి యోగవేత్త అవుతున్నాడు. అజ్ఞానివిషయంలో కూడా జ్ఞానప్రాప్తికి ఇదేమార్గం. ఓ మునిశ్రేష్ఠులారా! ఈ మార్గంలో నిరాసక్తుడైన మరియు దృఢవ్రతుడైన వ్యక్తి సంసారరూపమైన కాలకూటం (విషం) నుంచి విముక్తుడవుతున్నాడు.

**ఏవం సంక్షేపతః ప్రోక్తం మయా యుష్మాకమచ్యుతమ్ ॥154॥**

**జ్ఞానస్యైవేహ మాహాత్మ్యం ప్రసంగాదిహ శోభనమ్ ।**
**ఏవం పాశుపతం యోగం కథితం త్వీశ్వరేణ తు ॥155॥**

**న దేయం యస్య కస్యాపి శివోక్తం మునిపుంగవాః ।**
**దాతవ్యం యోగినే నిత్యం భస్మనిష్ఠాయ సుప్రియమ్ ॥156॥**

**యః పఠేత్ శృణుయాద్వాపి సంసారశమనం నరః ।**
**స యాతి బ్రహ్మసాయుజ్యం నాత్ర కార్యా విచారణా ॥157॥**

ఈ ప్రకారంగా నేను మీకు సంక్షేపంగా ప్రసంగవశంగా జ్ఞానం యొక్క అచలమూ, ఉత్తమమూ అయిన మాహాత్మ్యాన్ని చెప్పాను. ఈ పాశుపతయోగం స్వయంగా శివభగవానుడే చెప్పాడు. ఓ శ్రేష్ఠమునులారా! శివుడి ద్వారా చెప్పబడిన ఈ యోగం ఎవ్వరికీ తెలియజేయరాదు. అయినప్పటికి భస్మనిష్ఠుడైన అనగా శివతత్త్వనిష్ఠుడైన యోగికి ఈ మిక్కిలి ప్రియమైన యోగాన్ని ఉపదేశించాలి. ఎవడు సంసారరూపమైన విషాన్ని నశింపజేసే ఈ ఆఖ్యానాన్ని చదువుతాడో లేక వింటాడో ఆతడు బ్రహ్మసాయుజ్యాన్ని పొందుతున్నాడు. ఇందుకై సందేహించపనిలేదు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే సంసారవిషకథనం నామ షడశీతితమోఽధ్యాయః ॥ 86 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని సంసారవిషకథనమనే ఎనభై ఆరవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **సప్తాశీతితమోఽధ్యాయః** – ఎనభై ఏడవ అధ్యాయం

## **మునిమోహశమనమ్** – మునిమోహశమనం

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

> **నిశమ్య తే మహాప్రాజ్ఞాః కుమారాద్యాః పినాకినమ్ ।**
> **ప్రోచుః ప్రణమ్య వై భీతాః ప్రసన్నం పరమేశ్వరమ్ ॥1॥**

> **ఏవం చేదనయా దేవ్యా హైమవత్యా మహేశ్వర ।**
> **క్రీడసే వివిధైర్భోగైః కథం వక్తుమిహార్హసి ॥2॥**

ధ్యానజ్ఞానమాహాత్మ్యాన్ని విని సనత్కుమారాదులైన, బుద్ధిమంతులైన మునులు భయభీతులై ప్రసన్నుడు అయిన, పినాకధారి పరమేశ్వరుడికి నమస్కరించి ఆయన గూర్చి పలికారు. ఓ పరమేశ్వరా! వైరాగ్యం ముఖ్యంగా ధ్యానజ్ఞానాలైనప్పుడు నీవు పార్వతీదేవితో కలిసి అనేకవిధాలైన భోగాల అనుభవక్రీడ ఎలా చేస్తున్నావు. దయతో ఆ విషయం చెప్పవలసింది.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

> **ఏవముక్తః ప్రహస్యేశః పినాకీ నీలలోహితః ।**
> **ప్రాహ తామంబికాం ప్రేక్ష్య ప్రణిపత్య స్థితాన్ ద్విజాన్ ॥3॥**

> **బంధమోక్షౌ న చైవేహ మమ స్వేచ్ఛాశరీరిణః ।**
> **అకర్తాజ్ఞః పశుర్జీవో ప్రభుర్భోక్తా హ్యణుః పుమాన్ ॥4॥**

> **మాయీ చ మాయయా బద్ధః కర్మభిర్యుజ్యతే తు సః ।**
> **జ్ఞానం ధ్యానం బంధశ్చ మోక్షో నాస్త్యాత్మనో ద్విజాః ॥5॥**

> **యదైవం మయి విద్వాన్ యస్తస్యాపి న చ సర్వతః ।**
> **ఏషా విద్యా హ్యహం వేద్యః ప్రజ్ఞైషా చ శ్రుతిః స్మృతిః ॥6॥**

> **ధృతిరేషా మయా నిష్ఠా జ్ఞానశక్తిః క్రియా తథా ।**
> **ఇచ్ఛాఖ్యా చ తథా హ్యాజ్ఞా ద్వే విద్యే న చ సంశయః ॥7॥**

> **న హ్యేషా ప్రకృతిర్దైవీ వికృతిశ్చ విచారతః ।**
> **వికారో నైవ మాయైషా సదసద్వ్యక్తివర్జితా ॥8॥**

> **పురా మమాజ్ఞా మద్వక్త్రాత్సముత్పన్నా సనాతనీ ।**
> **పంచవక్త్రా మహాభాగా జగతామభయప్రదా ॥9॥**

**తామాజ్ఞాం సంప్రవిశ్యాహం చింతయన్ జగతాం హితమ్ ।**
**సప్తవింశత్ప్రకారేణ సర్వం వ్యాప్యనయా శివః ॥10॥**

**తదా ప్రభృతి వై మోక్షప్రవృత్తిర్ద్విజసత్తమాః ।**

ఓ ఋషులారా! అలా వాళ్లు పలకగా పినాకధరుడు నీలలోహితశివుడు నవ్వి పార్వతీదేవి వైపు చూచి తనకు నమస్కరించి నిలిచిఉన్న బ్రాహ్మణులను ఉద్దేశించి ఇలా చెప్పాడు. నా ఇష్టానుసారంగా శరీరధారణచేసే నాకు బంధనం ఉండదు. మోక్షమూ లేదు. నేను సర్వవ్యాపిని. కర్తృత్వరహితుణ్ణి, సర్వజ్ఞుణ్ణి. జీవులు, పశువులు, అజ్ఞానులు. పురుషుడు, విభుడు భోక్త. మాయకలవాడు కూడా మాయచేత బంధించబడుతున్నాడు. అతడు కర్మలతో సంబంధించుతున్నాడు. ఓ ద్విజులారా! ఆత్మకు జ్ఞానం, ధ్యానం, బంధనం, మోక్షం లేవు. ఏ విద్వాంసుడు నాయందు ఇలాంటి అనుభవం పొందుతాడో ఆతడికి కూడా జ్ఞానధ్యానబంధనాదులు ఉండవు. ఈ పార్వతీదేవి విద్య. నేను వేద్యుణ్ణి. ఈ ఆమె ప్రజ్ఞ, శ్రుతి, అట్లే స్మృతి. ఈమె నా మూలంగా ప్రతిష్ఠింపబడిన ధృతి, నిష్ఠ, జ్ఞానశక్తి, క్రియ, ఇచ్ఛ అట్లే ఆజ్ఞ అయి ఉన్నది. ఈమె పరా – అపరా ద్వివిద్యారూప. ఇందులో సందేహం లేదు. ఈమె జీవసంబంధమైన ప్రకృతి కాదు. వికృతి కూడా కాదు. ఈమె మాయ. సదసద్రహితమైన అనిర్వచనీయ. పూర్వజనులకు అభయప్రదాయిని, మహాభాగ్యవతి. పంచముఖి. ఈ సనాతని నా ఆజ్ఞతో నా ముఖం నుంచి జన్మించింది. జగత్తు యొక్క కళ్యాణచింతన కలది. శివుణ్ణి అయిన నేను ఆమె ఆజ్ఞతో ఆమెలో ప్రవేశించి ఆమెతో కూడా ఇరవై ఏడు తత్త్వాలతో అంతటా వ్యాపించి ఉన్నాను. ఓ ద్విజశ్రేష్ఠులారా! అప్పటి నుంచే మోక్షాన్ని పొందటానికి ప్రవృత్తి మొదలైంది.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**ఏవముక్త్వా తదా పశ్యద్భవానీం పరమేశ్వరః ॥11॥**

**భవానీ చ తమాలోక్య మాయామహరదవ్యయా ।**
**తే మాయామలనిర్ముక్తా మునయః ప్రేక్ష్య పార్వతీమ్ ॥12॥**

**ప్రీతా బభూవుర్ముక్తాశ్చ తస్మాదేషా పరా గతిః ।**
**ఉమాశంకరయోర్భేదో నాస్త్యేవ పరమార్థతః ॥13॥**

**ద్విధాసౌ రూపమాస్థాయ స్థిత ఏవ న సంశయః ।**

ఓ ఋషులారా! ఈ విధంగా పలికి పరమేశ్వరుడు పార్వతీదేవి వైపు చూశాడు. సనాతని, భవాని కూడా శివుడి వైపు చూచి మాయను తొలగించింది. అప్పుడు మాయామలం నుంచి ముక్తులైన మునిగణం పార్వతీదేవిని చూచి ప్రసన్నులై ముక్తులైనారు. పార్వతికూడా పరాగతి అయినది. నిజానికి ఉమాశంకరులకు భేదం లేదు. శివుడే రెండు రూపాల్ని ధరించి ఉన్నాడు. ఇందులో సందేహం లేదు.

**యదా విద్వానసంగః స్యాదాజ్ఞయా పరమేష్ఠినః ॥14॥**

**తదా ముక్తిః క్షణాదేవ నాన్యథా కర్మకోటిభిః ।**
**క్రమోఽ వివక్షతో భూతవివృద్ధః పరమేష్ఠినః ॥15॥**

**ప్రసాదేన క్షణాన్ముక్తిః ప్రతిజ్ఞైషా న సంశయః ।**
**గర్భస్థో జాయమానో వా బాలో వా తరుణోఽపి వా ॥16॥**

**వృద్ధో వా ముచ్యతే జంతుః ప్రసాదాత్పరమేష్ఠినః ।**
**అండజశ్చోద్భిజో వాపి స్వేదజో వాపి ముచ్యతే ॥17॥**

**ప్రసాదాద్దేవదేవస్య నాత్ర కార్యా విచారణా ।**

శివుడి మాయవల్ల ఏ విద్వాంసుడు అనాసక్తుడు అవుతున్నాడో ఆతడు క్షణకాలంలోనే ముక్తిని పొందుతున్నాడు. మరో విధంగా కోట్ల కర్మలవల్ల కూడా ముక్తి కలుగదు. పూర్వం ఋషుల వలన తెల్పిన ముక్తి క్రమం శివుడికి ప్రధానం కాదు. అది భూతవివృద్ధి కోసం కలిగినదే. శివుడి కృపవల్ల క్షణకాలంలోనే ముక్తి కలుగుతున్నది. ఇది ఆయన యొక్క ప్రతిజ్ఞ. ఇందులో సందేహం లేదు. పరమేష్ఠి అయిన శివుడి అనుగ్రహంతో జీవుడు ముక్తి పొందుతున్నాడు. ఆతడు గర్భస్థుడైనా, జన్మించినవాడైనా, బాలకుడైనా, తరుణుడైనా లేక వృద్ధుడైనా ఇబ్బంది లేదు. దేవాధిదేవుడైన శివుడి అనుగ్రహం వల్ల అండజాలు, ఉద్భిజాలు అట్లే స్వేదజాలుకూడా ముక్తిని పొందుతున్నాయి. ఇందులో ఎట్టి సందేహమూ లేదు.

**ఏష ఏవ జగన్నాథో బంధమోక్షకరః శివః ॥18॥**

**భూర్భువఃస్వర్మహశ్చైవ జనః సాక్షాత్తపః స్వయమ్ ।**
**సత్యలోకస్తథాండానాం కోటికోటిశతాని చ ॥19॥**

**విగ్రహం దేవదేవస్య తథాండావరణాష్టకమ్ ।**
**సప్తద్వీపేషు సర్వేషు పర్వతేషు వనేషు చ ॥20॥**

**సముద్రేషు చ సర్వేషు వాయుస్కంధేషు సర్వతః ।**
**తథాన్యేషు చ లోకేషు వసంతి చ చరాచరాః ॥21॥**

**సర్వే భవాంశజా మానం గతిస్త్వేషాం స ఏవ వై ।**
**సర్వో రుద్రో నమస్తస్మై పురుషాయ మహాత్మనే ॥22॥**

జగత్పతి శివుడే బంధనాన్ని గాని మోక్షాన్నిగాని ఇవ్వగలవాడు. భూలోకం, భువర్లోకం, స్వర్లోకం, మహర్లోకం, జనోలోకం, తపోలోకం, అట్లే సత్యలోకం – ఈ లోకాలు, మరియు కోట్లకొలది బ్రహ్మాండాలు. అండాలమీది ఎనిమిది ఆవరణాలు – ఇవన్నీ ఆ దేవదేవుడి యొక్క శరీరం (విగ్రహం). సప్తద్వీపాలలో, అన్ని పర్వతాలలో, అన్ని వనాల్లో, అన్ని సముద్రాలలో, అన్ని వాయుస్కంధాలలో, అట్లే అన్యలోకాలలో చరాచరజీవులు నివసిస్తున్నాయో

అవి అన్నీ శివుడి అంశం నుంచి పుట్టినవే. నిశ్చయంగా వాటి గతి ఆతడే. అవి అన్నీ రుద్రులే. ఆ మహాత్ముడైన పురుషుడికి నమస్కారం.

**విశ్వం భూతం తథా జాతం బహుధా రుద్ర ఏవ సః ।**
**రుద్రాజ్ఞైషా స్థితా దేవీ హ్యనయా ముక్తిరంబికా ॥23॥**

**ఇత్యేవం ఖేచరాః సిద్ధాః జజల్పుః ప్రీతమానసాః ।**
**యదావలోక్య తాన్ సర్వాన్ ప్రసాదాదనయాంబికా ॥24॥**

**తదా తిష్ఠంతి సాయుజ్యం ప్రాప్తాస్తే ఖేచరాః ప్రభోః ॥25॥**

అనేకవిధాలుగా పుట్టి ఈవిధంగా కనిపించుతున్న సృష్టి అంతా ఆరుద్రుడే. ఈ అంబిక రుద్రుని ఆజ్ఞగా నిలిచి ఉన్నది. ఈ అంబికవల్లనే ముక్తి లభించుతున్నది అని సంతోషపడిన మనస్సుగలవారై దేవతలు వారిలోవారు మాట్లాడుకున్నారు. ఈ అంబికదయతో వారిని అందరినీ చూడగానే దేవతలందరు పరమశివుని సాయుజ్యాన్ని పొందినవారై శివస్థానంలో ఉన్నారు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే మునిమోహశమనం నామ సప్తాశీతితమోఽధ్యాయః ॥ 87 ॥**

శ్రీ లింగమహాపురాణం, పూర్వభాగంలోని మునిమోహశమనం అనే ఎనబై ఏడవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## అష్టాశీతితమోఽధ్యాయః - ఎనబై ఎనిమిదవ అధ్యాయం

## అణిమాద్యష్టసిద్ధిత్రిగుణసంసారప్రాణాగ్నౌ హోమాది వర్ణనమ్ -

అణిమాద్యష్టసిద్ధిత్రిగుణసంసారప్రాణాగ్నిహోమాదివర్ణనం

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

> **కేన యోగేన వై సూత గుణప్రాప్తిః సతామిహ ।**
> **అణిమాదిగుణోపేతా భవంత్యేవేహ యోగినః ।**
> **తత్సర్వం విస్తరాత్సూత వక్తుమర్హసి సాంప్రతమ్ ॥1॥**

ఓ సూతమహర్షీ! ఏ యోగంతో సజ్జనులకు ఈ లోకంలో మోక్షప్రాప్తి కలుగుతున్నది, మరియు యోగులు అణిమాద్యష్టసిద్ధుల్ని పొందుతున్నారు. నీవు విపులంగా ఇపుడా విషయం చెప్పదగినవాడవు.

**సూత ఉవాచ :-** సూతర్షి పలికాడు.

> **అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి యోగం పరమదుర్లభమ్ ।**
> **పంచధా సంస్మరేదాదౌ స్థాప్య చిత్తే సనాతనమ్ ॥2॥**
>
> **కల్పయేచ్చాసనం పద్మం సోమసూర్యాగ్నిసంయుతమ్ ।**
> **షడ్వింశచ్ఛక్తిసంయుక్తమష్టధా చ ద్విజోత్తమాః ॥3॥**
>
> **తతః షోడశధా చైవ పునర్ద్వాదశధా ద్విజాః ।**
> **స్మరేచ్చ తత్తథా మధ్యే దేవ్యా దేవముమాపతిమ్ ॥4॥**
>
> **అష్టశక్తిసమాయుక్తమష్టమూర్తిమజం ప్రభుమ్ ।**
> **తాభిశ్చాష్టవిధా రుద్రాశ్చతుఃషష్టివిధాః పునః ॥5॥**
>
> **శక్తయశ్చ తథా సర్వా గుణాష్టకసమన్వితాః ।**
> **ఏవం స్మరేత్క్రమేణైవ లబ్ధ్వా జ్ఞానమనుత్తమమ్ ॥6॥**
>
> **ఏవం పాశుపతం యోగం మోక్షసిద్ధిప్రదాయకమ్ ।**
> **తస్యాణిమాదయో విప్రా నాన్యథా కర్మకోటిభిః ॥7॥**

ఓ మునులారా! ఇప్పుడు నేను పరమదుర్లభమైన యోగం యొక్క వర్ణన చేస్తాను. అందరూ ముందుగా చిత్తంలో సనాతనశివుణ్ణి నిల్పుకుని ఆయన యొక్క అయిదు విధాలైన సద్యోజాతమంత్రాల్ని జపించుకోవాలి. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! సూర్యచంద్రాగ్నులతో కూడిన, మరియు ఇరవై ఆరు శక్తులతో కూడిన అష్టదళకమలాన్ని, దానిపైన పదహారు దళాల కమలాన్ని, మరల దానిపైన ద్వాదశదళకమలం రూపంలోగల ఆసనాన్ని భావించుకోవాలి. ఓ ద్విజులారా! తర్వాత దాని మధ్యలో పార్వతీదేవితో కలిపి అష్టశక్తులతో కూడిన అష్టమూర్తిని, జన్మరహితుణ్ణి,

ఐశ్వర్యమయుణ్ణి, భగవంతుడైన ఉమాపతిని స్మరించాలి. ఈ శక్తులతోపాటు ఎనిమిది రుద్రుడి మూర్తులు, మరియు అష్టసిద్ధులతో సంపన్నమైన అరవైనాల్గు శక్తులు ప్రతిష్ఠితాలు కావాలి. ఈ విధంగా క్రమంగా స్మరించాలి. ఈ విధంగా ఉత్తమజ్ఞానాన్ని, సంపాదించి, మోక్షసిద్ధిప్రదాత అయిన పాశుపతయోగాన్ని అభ్యసించాలి. దానివల్ల అణిమాది అష్టసిద్ధులు ప్రాప్తిస్తాయి. ఇందుకు భిన్నంగా కోటి ఉపాయాలవల్ల కూడా ఈ సిద్ధులు లభించకున్నాయి.

**తత్రాష్టగుణమైశ్వర్యం యోగినాం సముదాహృతమ్ ।**
**తత్సర్వం క్రమయోగేన హ్యుచ్యమానం నిబోధత ॥8॥**

**అణిమా లఘిమాచైవ మహిమా ప్రాప్తిరేవ చ ।**
**ప్రాకామ్యం చైవ సర్వత్ర ఈశిత్వం చైవ సర్వతః ॥9॥**

**వశిత్వమథ సర్వత్ర యత్ర కామావసాయితా ।**
**తచ్చాపి త్రివిధం జ్ఞేయమైశ్వర్యం సార్వకామికమ్ ॥10॥**

**సావద్యం నిరవద్యం చ సూక్ష్మం చైవ ప్రవర్తతే ।**
**సావద్యం నామ యత్తత్ర పంచభూతాత్మకం స్మృతమ్ ॥11॥**

**ఇంద్రియాణి మనశ్చైవ అహంకారశ్చ యః స్మృతః ।**
**తత్ర సూక్ష్మప్రవృత్తిస్తు పంచభూతాత్మికా పునః ॥12॥**

**ఇంద్రియాణి మనశ్చిత్తబుద్ధ్యహంకారసంజ్ఞితమ్ ।**
**తథా సర్వమయం చైవ ఆత్మస్థా ఖ్యాతిరేవచ ॥13॥**

**సంయోగ ఏవ త్రివిధః సూక్ష్మేష్వేవ ప్రవర్తతే ।**
**పునరష్టగుణశ్చాపి సూక్ష్మేష్వేవ విధీయతే ॥14॥**

**తస్య రూపం ప్రవక్ష్యామి యథాహ భగవాన్ ప్రభుః ।**
**త్రైలోక్యే సర్వభూతేషు యథాస్య నియమః స్మృతః ॥15॥**

**అణిమాద్యం తథా వ్యక్తం సర్వత్రైవ ప్రతిష్ఠితమ్ ।**
**త్రైలోక్యే సర్వభూతానాం దుష్ప్రాప్యం సముదాహృతమ్ ॥16॥**

**తత్తస్య భవతి ప్రాప్యం ప్రథమం యోగినాం బలమ్ ।**
**లంఘనం ప్లవనం లోకే రూపమస్య సదా భవేత్ ॥17॥**

ఓ మునులారా! యోగులయొక్క అష్టగుణైశ్వర్యం చెప్పబడింది. దాన్ని అంతటిని క్రమంగా చెబుతున్నాను. మీరు వినండి! అణిమ, లఘిమ, మహిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశిత్వం, వశిత్వం అట్లే కామావాసాయిత్వం – ఇవి అష్టసిద్ధులు. అన్ని కామనల్ని సంపూర్ణంగా సిద్ధి పొందాలనుకునేవాడు ఈ ఐశ్వర్యాల్ని మూడు విధాలుగా తెలియాలి. సావద్యం, (దోషంకలది) నిరవద్యం, అట్లే సూక్ష్మం అని మూడు విధాలు. వీటిలో సావద్యమనేది పంచభూతాత్మకమైనది. ఇంద్రియాలు, మనసు అట్లే అహంకారం అనేవి నిరవద్యాలు. ఆత్మలో, పంచభూతాలలో

తన్మాత్రరూపమైన సూక్ష్మప్రవృత్తి ఉంది. అది 'సూక్ష్మ' ఐశ్వర్యం. ఈ విధంగా ఇంద్రియాలు, మనసు, చిత్తం, బుద్ధి అట్లే అహంకారం "నిరవద్య" ఐశ్వర్యాలు. పంచభూతమయమైన ఐశ్వర్యం సావద్యం అవుతుంది. శబ్దాది విషయరూపమైన ఐశ్వర్యం 'సూక్ష్మం'. ఈ మూడు భేదాలు 'సూక్ష్మ' ఐశ్వర్యమందూ ఉంటాయి. మరల అష్టగుణభేదాలు కూడా 'సూక్ష్మ' ఐశ్వర్యంలో ఉంటాయి. మూడు లోకాలలోని అన్ని ప్రాణుల్లోనూ అన్నిచోట్ల ఈ అణిమాదులైన అవ్యక్తమైన ఐశ్వర్యాలు ఈ ప్రకారంగా నిలిచి ఉన్నాయి. ఈ విధంగా నియమాలు చెప్పబడ్డాయి. శివభగవానుడు వీటిని గూర్చి ఇలా చెప్పాడు. దాని స్వరూపాన్ని నేను చెప్తున్నాను. ఈ ఐశ్వర్యం మూడు లోకాలలో అన్ని ప్రాణులకు దుర్లభమైనదిగా చెప్పబడింది. వీటిని ప్రాప్తించుకునే యోగులు ముందుగా బలవంతులు అవుతున్నారు. లోకంలో వీటి స్వరూపం 'లంఘనం, ప్లవనం' చేసే విధంగా ఉంటున్నాయి.

**శీఘ్రత్వం సర్వభూతేషు ద్వితీయం తు పదం స్మృతమ్ ।**
**త్రైలోక్యే సర్వభూతానాం మహిమ్నా చైవ వందితమ్ ॥18॥**

**మహిత్వం చాపి లోకేఽస్మింస్తృతీయో యోగ ఉచ్యతే ।**
**త్రైలోక్యే సర్వభూతేషు యథేష్టగమనం స్మృతమ్ ॥19॥**

ప్రాణులందరి కంటే త్వరగా సిద్ధిపొందడం 'లఘిమ' అనే సిద్ధి అవుతుంది. మూడు లోకాలలో ప్రాణులందరూ మాహాత్మ్యబలంతో నమస్కరించడం, పూజించడం ఈ లోకంలో 'మహిమ' అనే మూడో సిద్ధి. త్రిలోకాలలో అన్ని భూతాలలోకి స్వేచ్ఛతో ప్రవేశించడమే 'ప్రాప్తి' సిద్ధి అవుతుంది.

**ప్రకామాన్ విషయాన్ భుంక్తే తథా ప్రతిహతః క్వచిత్ ।**
**త్రైలోక్యే సర్వభూతానాం సుఖదుఃఖం ప్రవర్తతే ॥20॥**

**ఈశో భవతి సర్వత్ర ప్రవిభాగేన యోగవిత్ ।**
**వశ్యాని చాస్య భూతాని త్రైలోక్యే సచరాచరే ॥21॥**

**ఇచ్ఛయా తస్య రూపాణి భవంతి న భవంతి చ ।**
**యత్ర కామావసాయిత్వం త్రైలోక్యే సచరాచరే ॥22॥**

**శబ్దః స్పర్శో రసో గంధో రూపం చైవ మనస్తథా ।**
**ప్రవర్తంతేఽస్య చేచ్ఛాతో న భవంతి యథేచ్ఛయా ॥23॥**

**న జాయతే న మ్రియతే ఛిద్యతే న చ భిద్యతే ।**
**న దహ్యతే న ముహ్యేత లీయతే న చ లిప్యతే ॥24॥**

**న క్షీయతే న క్షరతి ఖిద్యతే న కదాచన ।**
**క్రియతే వా న సర్వత్ర తథా విక్రీయతే న చ ॥25॥**

**అగంధరసరూపస్తు అస్పర్శః శబ్దవర్జితః ।**
**అవర్ణో హ్యస్వరశ్చైవ అసవర్ణస్తు కర్హిచిత్ ॥26॥**

ప్రకామ్యమనే ఐశ్వర్యంతో కూడిన వ్యక్తి మూడు లోకాలలో ఏ బాధ లేకుండా విషయభోగాల్ని అనుభవిస్తాడు. మరియు అన్ని ప్రాణుల యొక్క సుఖదుఃఖాలలో ప్రవర్తించగలడు. 'ఈశిత్వ' ఐశ్వర్యాన్ని కలిగిన యోగి ఇష్టానుసారంగా దేహధారణ చేసి సమస్తజగత్తుకు స్వామి అవుతున్నాడు. వశిత్వంచేత మూడు లోకాలలో స్థావరజంగమప్రాణులు ఆతడివశం అవుతున్నాయి. ఎవరిదగ్గర 'కామావసిత్వ' మనే ఐశ్వర్యం ఉంటుందో ఆతడు మూడు లోకాలలో చరాచరజగత్తులో తన రూపాన్ని తన యిష్టానుసారంగా నిర్మించుకుంటాడు. నిర్మించుకోడు కూడా. శబ్ద, స్పర్శ, రస, గంధ, రూపాలు అట్లే మనసు ఆతడి ఇచ్ఛానుసారంగా ఉంటాయి. ఆతడి ఇచ్ఛానుసారంగా కూడా ఉండవు. అవి ఏవీ పుట్టుట లేదు. మరణించుటలేదు. ఛేదింపబడుటలేదు. భేదింపబడుటలేదు. ఆసక్తి పొందుట లేదు. వాటికి క్షయంలేదు. వాటికి నష్టంలేదు. అవి ఖిన్నమైనవి కావడం లేదు. ఎక్కడా ఏమి చేయడం లేదు. వికృతాలు అవడం లేదు. అవి శబ్ద స్పర్శ గంధ, రస, రూపరహితాలు అవుతున్నాయి. అవి ఎల్లప్పుడు అవర్ణాలు, స్వరరహితాలు అట్లే అసవర్ణాలు అవుతున్నాయి. అవి విషయభోగాల్ని పొందుతున్నాయి.

**స భుంక్తే విషయాంశ్చైవ విషయైర్న చ యుజ్యతే ।**
**అణుత్వాత్తు పరః సూక్ష్మః సూక్ష్మత్వాదపవర్గికః ॥27॥**

**వ్యాపకస్త్వపవర్గాచ్చ వ్యాపకత్వాత్పురుషః స్మృతః ।**
**పురుషః సూక్ష్మభావాత్తు ఐశ్వర్యే పరమే స్థితః ॥28॥**

**గుణోత్తరమథైశ్వర్యే సర్వతః సూక్ష్మముచ్యతే ।**
**ఐశ్వర్యం చాప్రతీఘాతం ప్రాప్య యోగమనుత్తమమ్ ॥29॥**

**అపవర్గం తతో గచ్ఛేత్సూక్ష్మం తత్పరమం పదమ్ ।**

ఆతడు విషయసుఖాల్ని అనుభవిస్తూ కూడా వాటియందు లంపటుడు కాడు. ఆతడు అణువు కన్న సూక్ష్మమైనవాడు. సూక్ష్మమైన కారణం చేతనే ముక్తి పొందుచున్నాడు. ముక్తి పొందే కారణం వల్ల ఆతడు సర్వవ్యాపకుడు అవుతున్నాడు. సర్వవ్యాపకత్వం వల్ల పురుషుడు అవుతున్నాడు. సూక్ష్మమైనవాడు అవడం చేతనే పురుషుడు పరమమైన ఐశ్వర్యమందు స్థితుడయ్యాడు. ఐశ్వర్యం క్రమంగా సూక్ష్మతరం, మహత్తరం అవుతుంది. ఉత్తమయోగాన్ని, అబాధితమైన ఐశ్వర్యాన్ని పొందిన వ్యక్తి ముక్తిని పొందుతాడు. అదే సూక్ష్మమైన పరమపదం.

**ఏవం పాశుపతం యోగం జ్ఞాతవ్యం మునిపుంగవాః ॥30॥**

**స్వర్గాపవర్గఫలదం శివసాయుజ్యకారణమ్ ।**
**అథవా గతవిజ్ఞానో రాగాత్కర్మ సమాచరేత్ ॥31॥**

**రాజసం తామసం వాపి భుక్త్వా తత్రైవ ముచ్యతే ।**
**తథా సుకృతకర్మా తు ఫలం స్వర్గే సమశ్నుతే ॥32॥**

**తస్మాత్స్థానాత్పునః శ్రేష్ఠో మానుష్యముపపద్యతే ।**
**తస్మాద్ బ్రహ్మ పరం సౌఖ్యం బ్రహ్మశాశ్వతముత్తమమ్ ॥33॥**

**బ్రహ్మ ఏవ హి సేవేత బ్రహ్మైవ హి పరం సుఖమ్ ।**

ఓ మునిశ్రేష్ఠులారా! ఈ విధంగా పాశుపతయోగాన్ని తెలియాలి. ఇది స్వర్గాన్ని అట్లే మోక్షాన్ని ప్రదానం చేసేది మరియు శివసాయుజ్యానికి కారణమైంది. జ్ఞానరహితుడైనవాడు రాగకారణంతో కర్మ చేస్తాడు. మరియు రాజసం మరియు తామసం అయిన భోగాల్ని అనుభవించి ఇక్కడే ముక్తుడవుతున్నాడు. పుణ్యకర్మ చేయువాడు స్వర్గఫలప్రాప్తి పొందుతున్నాడు. తర్వాత ఆ శ్రేష్ఠయోగి పుణ్యం క్షీణించగా మరల మానవలోకానికి తిరిగి వస్తున్నాడు. కావున బ్రహ్మ పదమే పరమసుఖం. అదే శాశ్వతం. ఉత్తమం. అందుచేత బ్రహ్మనే ఉపాసించాలి. ఎందుకంటే బ్రహ్మే పరమానందస్వరూపం.

**పరిశ్రమో హి యజ్ఞానాం మహతార్థేన వర్తతే ॥34॥**

**భూయో మృత్యువశం యాతి తస్మాన్మోక్షః పరం సుఖమ్ ।**
**అథవా ధ్యానసంయుక్తో బ్రహ్మతత్త్వపరాయణః ॥35॥**

**న తు చ్యావయితుం శక్యో మన్వంతరశతైరపి ।**
**దృష్ట్వా తు పురుషం దివ్యం విశ్వాఖ్యం విశ్వతోముఖమ్ ॥36॥**

**విశ్వపాదశిరోగ్రీవం విశ్వేశం విశ్వరూపిణమ్ ।**
**విశ్వగంధం విశ్వమాల్యం విశ్వాంబరధరం ప్రభుమ్ ॥37॥**

యజ్ఞాలలో ఎక్కువ ధనవ్యయంతోపాటు ఎంతో పరిశ్రమ ఉంటుంది. యజ్ఞాలు చేసిన తర్వాత కూడా మానవుడు మృత్యువశుడు అవుతున్నాడు. అందుచేత మోక్షమే పరమానందదాయకం. విశ్వనాయకుడు, అన్ని దిక్కులలో ముఖం, పాదాలు, శిరసు, కంఠం కలవాడు, విశ్వేశ్వరుడు, సర్వాకారుడు, సర్వగంధసక్తుడు, సమస్తవిశ్వాన్ని మాలగా అట్లే ముఖరూపంగా ధరించినవాడు అయిన సర్వవ్యాపక భగవానుడి దివ్యరూపాన్ని దర్శించిన ధ్యాని, అట్లే బ్రహ్మతత్త్వపరాయణుడైన వ్యక్తి మన్వంతరాలకైనా పరమపదం నుంచి చ్యుతుడు కాకున్నాడు.

**గోభిర్మహీం సంపతతే పతత్రిణో నైవం భూయో జనయత్యేవమేవ ।**
**కవిం పురాణమనుశాసితారం సూక్ష్మాచ్చ సూక్ష్మం మహతో మహాంతమ్ ॥38॥**

**యోగేన పశ్యేన్న చ చక్షుషా పునర్నిరింద్రియం పురుషం రుక్మవర్ణమ్ ।**
**ఆలింగినం నిర్గుణం చేతనం చ నిత్యం సదా సర్వగం సర్వసారమ్ ॥39॥**

**పశ్యంతి యుక్త్యా హ్యచలప్రకాశం తద్భావితాస్తేజసా దీప్యమానమ్ ।**
**అపాణిపాదోదరపార్శ్వజిహ్వో హ్యతీంద్రియో వాపి సుసూక్ష్మ ఏకః ॥40॥**

**పశ్యత్యచక్షుః స శృణోత్యకర్ణో న చాస్త్యబుద్ధం న చ బుద్ధిరస్తి ।**
**స వేద సర్వం న చ సర్వవేద్యం తమాహురగ్ర్యం పురుషం మహాంతమ్ ॥41॥**

పరమపురుషుడైనఈశ్వరుడు సూర్యకిరణాలరూపంలో భూమిపై నిలుస్తున్నాడు. మరియు ఎల్లప్పుడూ పూర్వం మాదిరిగానే జగత్తును సృష్టిస్తున్నాడు. అయితే ప్రళయకాలంలో సృష్టించుట లేదు. యోగి అయినవాడు

కవి, పురాతనుడు, సర్వాన్ని శాసించేవాడు, సూక్ష్మం కన్నా సూక్ష్మమైనవాడు, మహత్తు కన్నా మహత్తు అయినవాడు, ఇంద్రియరహితుడు, బంగారువన్నెగలవాడు, సర్వస్వరూపుడు, నిర్గుణుడు, చైతన్యస్వరూపుడు, నిత్యుడు, సర్వగమనుడు అట్లే సర్వసారస్వరూప పురుషుణ్ణి యోగం ద్వారా చూస్తున్నాడు. కన్నులతో కాదు. బ్రహ్మ పదార్థంలో లీనమయ్యే స్థిరప్రకాశవంతుడైన సాధకుడు తన ప్రకాశంతో ప్రకాశించే ప్రభువును యోగంతో చూస్తున్నాడు. ఆతడికి చేతులు, కాళ్లు, ఉదరం, పార్శ్వాలు, నాలుక ఉండవు. ఇంద్రీయాతీతుడు. అత్యంతసూక్ష్ముడు. అద్వితీయుడు. కన్నులు లేనివాడయినా చూస్తున్నాడు. చెవులులేనివాడైనా వింటున్నాడు. బుద్ధిరహితుడయ్యీ అన్నింటిని తెలుసుకుంటున్నాడు. ఆతడు అన్నింటిని తెలుసుకుంటాడుగాని తానెవ్వరికి తెలియడు. దానితో ఆతడు ఆదిమహాపురుషుడుగా చెప్పబడ్డాడు.

**అచేతనాం సర్వగతాం సూక్ష్మాం ప్రసవధర్మిణీమ్ ।**
**ప్రకృతిం సర్వభూతానాం యుక్తాః పశ్యంతి యోగినః ॥42॥**

ఈయనతో కలిసి ఉండే యోగిజనులు ఆయన్ని సర్వప్రాణులకు ప్రకృతిగను, అచేతనుడుగను, సూక్ష్ముడుగను, సర్వవ్యాపిగను, సృష్టించు ధర్మంగలవాడుగను చూస్తున్నారు.

**సర్వతః పాణిపాదం తత్సర్వతోఽ క్షిశిరోముఖమ్ ।**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥43॥**

**యుక్తో యోగేన చేశానం సర్వతశ్చ సనాతనమ్ ।**
**పురుషం సర్వభూతానాం తం విద్వాన్న విముహ్యతి ॥44॥**

**భూతాత్మానం మహాత్మానం పరమాత్మానమవ్యయం ।**
**సర్వాత్మానం పరం బ్రహ్మ తద్వై ధ్యాతా న ముహ్యతి ॥45॥**

ఆతడు అన్ని దిక్కులలోను చేతులు, పాదాలు కలవాడు. ఆతడు అన్ని వైపుల కన్నులు, శిరసులు, అట్లే ముఖాలు గలవాడు. అట్లే చెవులు కలిగి ఉన్నాడు. విశ్వంలో అన్నింటిని వ్యాపించి ఉన్నాడు. యోగి అయిన విద్వాంసుడు ఈశ్వరుడు, సనాతనుడు అట్లే ప్రాణులందరికి పరమపురుషుడైన ఆయన విషయమై మోహం కల్గినవాడు కాదు. ఆ సాధకుడు అన్ని ప్రాణులకు ఆత్మ అయినవాడు, మహాత్ముడు, పరమాత్ముడు, శాశ్వతుడు అట్లే సర్వాత్ముడు అయిన పరబ్రహ్మను ధ్యానిస్తున్నాడు. ఆతడు మోహాన్ని పొందకున్నాడు.

**పవనో హి యథాఽగ్రాహ్యో విచరన్ సర్వమూర్తిషు ।**
**పురి శేతే సుదుర్గ్రాహ్యస్తస్మాత్పురుష ఉచ్యతే ॥46॥**

అన్ని ప్రాణులందూ వాయువు బాగా చరిస్తున్నా అది ఎట్లు అగ్రాహ్యమో, అదే విధంగా దేహంలో స్థితుడై ఉన్న పరమాత్మకూడా మిక్కిలిదుర్గ్రాహ్యుడు. ఆతడు దేహరూపమైనపురంలో శయనిస్తుండడంవల్ల పురుషుడవుతున్నాడు.

**అథ చేల్లుప్తధర్మా తు సావశేషైః స్వకర్మభిః ।**
**తతస్తు బ్రహ్మగర్భే వై శుక్రశోణితసంయుతే ॥47॥**

**స్త్రీపుంసోః సంప్రయోగే హి జాయతే హి తతః ప్రభుః ।**
**తతస్తు గర్భకాలేన కలలం నామ జాయతే ॥48॥**

**కాలేన కలలం చాపి బుద్బుదం సంప్రజాయతే ।**
**మృత్పిండస్తు యథా చక్రే చక్రావర్తేన పీడితః ॥49॥**

**హస్తాభ్యాం క్రియమాణస్తు బింబత్వమనుగచ్ఛతి ।**
**ఏవమాధ్యాత్మికైర్యుక్తో వాయునా సంప్రపూరితః ॥50॥**

పుణ్యఫలం అనుభవించిన తర్వాత లుప్తధర్ముడైన జీవుడు మిగిలిన తన కర్మలతోపాటుగ మరల బ్రాహ్మణయోనిలో జన్మిస్తున్నాడు. స్త్రీ పురుషుల సంయోగం తర్వాత శుక్రశోణితాల కలయికవల్ల గర్భోత్పత్తి జరుగుతున్నది. ఆ గర్భం కొంతకాలానికి కలల రూపాన్ని పొందుతున్నది. అనంతరం కలలు బుద్బుద (బుడగ) రూపాన్ని పొందుతున్నవి. మట్టిముద్ద సారె మీద కుమ్మరి చేతుల మీదుగా ఎలా ఆకారాన్ని పొందుతుందో అదే విధంగా ఆ జీవం పంచమహాభూతాలతో కూడినదై అట్లే వాయువుతో నిండినదై ఆకారాన్ని పొందుతున్నది.

**యది యోనిం విముంచామి తత్ప్రపద్యే మహేశ్వరమ్ ।**
**యావద్ధి వైష్ణవో వాయుర్జాతమాత్రం న సంస్పృశేత్ ॥51॥**

**తావత్కాలం మహాదేవమర్చయామీతి చింతయేత్ ।**
**జాయతే మానుషస్తత్ర యథారూపం యథావయః ॥52॥**

గర్భంలో జీవుడు ఇలా దుఃఖిస్తాడు. "నేను గర్భం నుంచి బయటపడగానే మహేశ్వరుడి శరణుకై వెళతాను. పుట్టిన వాడిని వైష్ణవమాయ (వాయువు) ఎంతవరకు తాకదో అంతవరకు నేను మహాదేవుణ్ణి అర్చిస్తాను" అని. ఈ విధంగా జీవుడు తన రూపాన్ని వయసును ప్రారబ్ధానుసారంగా పొంది మానవుడు అవుతున్నాడు.

**వాయుః సంభవతే ఖాత్తు వాతాద్భవతి వై జలమ్ ।**
**జలాత్సంభవతి ప్రాణః ప్రాణాచ్ఛుక్రం వివర్ధతే ॥53॥**

**రక్తభాగాస్త్రయ స్త్రింశద్రేతోభాగాశ్చతుర్దశ ।**
**భాగతోఽర్ధఫలం కృత్వా తతో గర్భే నిషిచ్యతే ॥54॥**

**తతస్తు గర్భసంయుక్తః పంచభిర్వాయుభిర్వృతః ।**
**పితుః శరీరాత్ప్రత్యంగం రూపమస్యోపజాయతే ॥55॥**

**తతోఽస్య మాతురాహారాత్పీతలీఢప్రవేశనాత్ ।**
**నాభిదేశేన వై ప్రాణాస్తే హ్యాధారా హి దేహినామ్ ॥56॥**

ఆకాశం నుంచి వాయువు ఉత్పత్తి అవుతున్నది. వాయువు నుంచి నీరు, నీటి నుంచి ప్రాణం, ప్రాణం నుంచి శుక్రం వృద్ధి చెందుతున్నది. రక్తం (శోణితం) నుంచి ముప్ఫైమూడు భాగాలు, శుక్రం నుంచి పద్నాలుగు భాగాలు కలుస్తున్నాయి. ఈ రెండుభాగాలయొక్క సంగంవల్ల దేహం కల్గుతున్నది. గర్భం కూడా వృద్ధి చెందుతున్నది.

తర్వాత గర్భంలోగల జీవుడు ఐదు వాయువులతో చుట్టబడుతున్నాడు. తండ్రి యొక్క శరీరం నుంచి ఆతడి అంగ ప్రత్యంగాలు, రూపం యొక్క వికాసం జరుగుతుంది. తల్లి యొక్క ఆహారం నుంచి నాభిద్వారా త్రాగుతున్న పీల్చుకున్న రసాదులవల్ల జీవుడి పోషణ జరుగుతున్నది. ఆప్రాణమే (వాయువు) దేహధారులకు ఆధారమవుతుంది.

**నవమాసాత్పరిక్లిష్టః సంవేష్టితశిరోధరః ।**
**వేష్టితః సర్వగాత్రైశ్చ అపర్యాప్తప్రవేశనః ॥57॥**

**నవమాసోషితశ్చాపి యోనిచ్ఛిద్రాదవాఙ్ముఖః ।**
**తతః స్వకర్మభిః పాపైర్నిరయం సంప్రపద్యతే ॥58॥**

**అసిపత్రవనం చైవ శాల్మలిచ్ఛేదనం తథా ।**
**తాడనం భక్షణం చైవ పూయశోణితభక్షణమ్ ॥59॥**

**తథా హ్యాపస్తు సంఛిన్నాః సంశ్లేష్మముపయాంతి వై ।**
**తథా ఛిన్నాశ్చ భిన్నాశ్చ యాతనాస్థానమాగతాః ॥60॥**

**ఏవం జీవాస్తు తైః పాపైస్తప్యమానాః స్వయంకృతైః ।**
**ప్రాప్నుయుః కర్మభిః శేషైర్దుఃఖం వా యది వేతరత్ ॥61॥**

తొమ్మిది మాసాలవరకు శిశువు మిక్కిలి కష్టాల్లో ఉంటున్నాడు. మెడ నాభి నాళం చేత బంధింపబడి ఉంటుంది. ఆతడి సంపూర్ణశరీరం సంకోచించి (ముడుచుకుని) ఉంటుంది. ఆతడు గర్భంలో అతి తక్కువ స్థానంలో పడి ఉంటాడు. తొమ్మిది మాసాలు గర్భంలో ఉన్న తర్వాత ఆ శిశువు ముఖం క్రిందికి ఉంచి యోని మార్గం నుంచి బయటకు వస్తున్నాడు. ఆ తర్వాత తన పాపకర్మానుసారం నరకాలలో తిరుగుతున్నాడు. అసితపత్రవనం, అట్లే శాల్మలిచ్ఛేదనం అనే పేర్లుగల నరకాలలో ఆతడికి దండనం అట్లే భక్షణం జరుగుతున్నది. ఆతడి చీము మరియు రక్తం త్రాగబడుతున్నాయి నరకంలో శిక్షల్ని అనుభవించేటప్పుడు. నీటిని చీల్చినా మళ్ళీ కలుస్తుంది. అలాగే శిక్షాకాలంలో జీవునిశరీరం చీల్చినా కోసినా మళ్ళీ కలుస్తుంది. వెంటనే యాతనాస్థానాన్ని చేరుతుంది. ఈ విధంగా జీవుడు యాతనాస్థానాన్ని పొంది ఛిన్నుడుగా భిన్నుడుగా అవుతున్నాడు. ఈ విధంగా జీవుడు తాను చేసిన పాపాలవల్ల తపిస్తున్నాడు. ఆతడు తన యొక్క అవశేషకర్మల మూలంగా దుఃఖాన్ని అట్లే సుఖాన్ని అనుభవిస్తున్నాడు.

**ఏకేనైవ తు గంతవ్యం సర్వముత్సృజ్య వై జనమ్ ।**
**ఏకేనైవ తు భోక్తవ్యం తస్మాత్సుకృతమాచరేత్ ॥62॥**

**న హ్యేనం ప్రస్థితం కశ్చిద్ గచ్ఛంతమనుగచ్ఛతి ।**
**యదనేన కృతం కర్మ తదేనమనుగచ్ఛతి ॥63॥**

సమస్తజనాన్ని విడిచిపెట్టి జీవుడు ఒక్కడే వెళ్లవలసి ఉంది. ఒక్కడే తన కర్మ ఫలాన్ని అనుభవింపవలసి ఉంది. అందువల్ల సత్కర్మల్ని ఆచరించాలి. మరణం తర్వాత ఊర్ధ్వలోకాలకువెళ్లే ఆజీవుడి వెనుక ఎవ్వరూ వెళ్లకున్నారు. ఆతడు చేసినకర్మలుమాత్రమే ఆతడితో కలిసి వెళుతున్నాయి.

**తే నిత్యం యమవిషయేషు సంప్రవృత్తాః క్రోశంతః సతతమనిష్టసంప్రయోగైః ।**
**శుష్యంతే పరిగతవేదనాశరీరా బహ్వీభిః సుభృశమనంతయాతనాభిః ॥64॥**

ఆ జీవులందరూ నిరంతరం బాధాకరదండనాల ద్వారా కష్టపెట్టబడుతూ నిత్యం యమలోక విషయాలను అనుభవిస్తున్నారు. అనేకవిధాలైన పెద్ద పెద్ద అనంతమైన కష్టాల మూలంగా వేదనల్ని అనుభవిస్తున్న శరీరాలు గల ఆ జీవులు శోకసంతప్తులై ఉన్నారు.

**కర్మణా మనసా వాచా యదభీక్ష్ణం నిషేవతే ।**
**తదభ్యాసో హరత్యేనం తస్మాత్కల్యాణమాచరేత్ ॥65॥**

**అనాదిమాన్ ప్రబంధః స్యాత్పూర్వకర్మణి దేహినః ।**
**సంసారం తామసం ఘోరం షడ్విధం ప్రతిపద్యతే ॥66॥**

**మానుష్యాత్పశుభావశ్చ పశుభావాన్మృగో భవేత్ ।**
**మృగత్వాత్పక్షిభావశ్చ తస్మాచ్చైవ సరీసృపః ॥67॥**

**సరీసృపత్వాద్ గచ్ఛేద్వై స్థావరత్వం న సంశయః ।**
**స్థావరత్వే పునః ప్రాప్తే యావదున్మీలతే జనః ॥68॥**

**కులాలచక్రవద్భ్రాంతస్తత్రైవ పరివర్తతే ।**
**ఇత్యేవం హి మనుష్యాదిః సంసారస్థావరాంతికః ॥69॥**

**విజ్ఞేయస్తామసో నామ తత్రైవ పరివర్తతే ।**
**సాత్త్వికశ్చాపి సంసారో బ్రహ్మాదిః పరికీర్తితః ॥70॥**

**పిశాచాంతః స విజ్ఞేయః స్వర్గస్థానేషు దేహినామ్ ।**
**బ్రాహ్మే తు కేవలం సత్త్వం స్థావరే కేవలం తమః ॥71॥**

**చతుర్దశానాం స్థానానాం మధ్యే విష్టంభకం రజః ।**
**మర్మసు ఛిద్యమానేషు వేదనార్తస్య దేహినః ॥72॥**

**తతస్తత్పరమం బ్రహ్మ కథం విప్రః స్మరిష్యతి ।**
**సంసారః పూర్వధర్మస్య భావనాభిః ప్రణోదితః ॥73॥**

**మానుషం భజతే నిత్యం తస్మాద్ధ్యానం సమాచరేత్ ।**

మానవుడు మనోవాక్కాయకర్మలద్వారా మాటిమాటికి ఇష్టమైన దాన్ని ఆచరిస్తున్నాడు. వీటిని అభ్యసించి హృదయస్థం చేసుకుంటున్నాడు. హృదయంలో సంస్కారరూపంగా ఉండి అదే జీవిని హరించుతున్నది. అందుచేత ఎల్లప్పుడు శుభాన్ని ఆచరించాలి. దేహికి పూర్వకర్మలతో అనాది అయిన దృఢబంధమున్నది. దీనివల్ల జీవుడు ఘోరమైన, తామసికమైన ఆరువిధాలుగాగల సంసారం ప్రాప్తిస్తున్నది. జీవుడు మానుష్యయోని వల్ల పశుభావం

పొందుతున్నాడు. పశుభావం వల్ల మృగం అవుతున్నాడు. మరల ఆతడు మృగజన్మనుంచి పక్షి జన్మకు, పక్షి జన్మ నుంచి సరీసృప (తొండ, బల్లి మొదలైన నేలమీద ప్రాకెడివి) జన్మను పొందుతున్నాడు. తర్వాత సరీసృపం నుంచి స్థావరజన్మను పొందుతున్నాడు. ఇందులో సందేహం లేదు. స్థావరరూపాన్ని పొందిన తర్వాత మానవుడు మరల మనుష్యయోనిని పొందకున్నాడు. కుమ్మరి సారె వలె ఆతడు ఒకే స్థానంలో తిరుగుతు ఉన్నాడు. ఈ విధంగా మనుష్యయోనినుంచి ప్రారంభమై స్థావరయోనికిచేరిన ఈ సంసారం తామసమైనదిగా తెలియాలి. బ్రహ్మ నుంచి ప్రారంభమై పిశాచం వరకు సాగిన సంసారం సాత్త్వికమైనదిగా గుర్తించాలి. ఈ దేహధారులకు స్వర్గమే స్థానంగా తెలియాలి. బ్రహ్మజీవనంలో కేవలం సత్త్వం, స్థావరజీవనంలో కేవలం తమస్సు పధ్నాలుగు స్థానాల మధ్యలో వేదనలవల్ల వ్యాకులప్రాణులయొక్క మర్మస్థానాల భేదనం చేసే రజస్సు ఉంటాయి. ఈ స్థితిలోగల విప్రుడు ఆ పరబ్రహ్మస్వరూపాన్ని ఎలాగుర్తిస్తాడు. పూర్వధర్మభావనల వల్ల సంసారం ప్రేరితమవుతున్నది. ఎల్లప్పుడూ మానుషయోనితో కూడి ఉంటున్నది. అందువల్ల అవశ్యంగా ధ్యానాన్ని ఆచరించాలి.

**చతుర్దశవిధం హ్యేతద్ బుద్ధ్వా సంసారమండలమ్ ॥74॥**

**నిత్యం సమారభేద్ధర్మం సంసారభయపీడితః ।**
**తతస్తరతి సంసారం క్రమేణ పరివర్తితః ॥75॥**

**తస్మాచ్చ సతతం యుక్తో ధ్యానతత్పరయుంజకః ।**
**తథా సమారభేద్యోగం యథాత్మానం స పశ్యతి ॥76॥**

ఈ సంసారమండలం యొక్క పధ్నాలుగు భువనరూపవిధాల్ని తెలిసి సంసారభయం వల్ల పీడితులైన ప్రాణులు ఎల్లప్పుడూ ధర్మాన్ని ఆచరించాలి. వాళ్లు క్రమంగా పరివర్తితులై సంసారాన్ని దాటతారు. అందుచేత నిరంతరం యోగి ధ్యానమగ్నుడు కావాలి. దీనివల్ల ఆత్మసాక్షాత్కారం పొందుతాడు.

**ఏష ఆపః పరం జ్యోతిరేష సేతురనుత్తమః ।**
**వివృత్యా హ్యేష సంభేదాద్భూతానాం చైవ శాశ్వతః ॥77॥**

**తదేనం సేతుమాత్మానమగ్నిం వై విశ్వతోముఖమ్ ।**
**హృదిస్థం సర్వభూతానాముపాసీత మహేశ్వరమ్ ॥78॥**

**తథాంతః సంస్థితం దేవం స్వశక్త్యా పరిమండితమ్ ।**
**అష్టధా చాష్టధా చైవ తథా చాష్టవిధేన చ ॥79॥**

**సృష్ట్యర్థం సంస్థితం వహ్నిం సంక్షిప్య చ హృది స్థితమ్ ।**
**ధ్యాత్వా యథావద్దేవేశం రుద్రం భువననాయకమ్ ॥80॥**

**హుత్వా పంచాహుతీః సమ్యక్ తచ్చింతాగతమానసః ।**
**వైశ్వానరం హృదిస్థం తు యథావదనుపూర్వశః ॥81॥**
**ఆపః పూతాః సకృత్ప్రాశ్య తూష్ణీం హుత్వా హ్యుపావిశన్ ।**
**ప్రాణాయేతి తతస్తస్య ప్రథమా హ్యాహుతిః స్మృతా ॥82॥**

**అపానాయ ద్వితీయా చ వ్యానాయేతి తథా పరా ।**
**ఉదానాయ చతుర్థీ స్యాత్సమానాయేతి పంచమీ ॥83॥**

**స్వాహాకారైః పృథక్ హుత్వా శేషం భుంజీత కామతః ।**
**అపః పునః సకృత్ప్రాశ్య ఆచమ్య హృదయం స్పృశేత్ ॥84॥**

జీవులన్నింటిని సంభేదించడంచేత, విభజించడంచేత ఆతడే (శివుడే) పరంజ్యోతి స్వరూపుడు అయి ఉన్నాడు. ఆతడే సంసారసాగరంలో జలస్వరూపుడు. ఆతడే ఉత్తమమూ, శాశ్వతమూ అయిన సేతువు. అందుచేత ప్రాణులందరి హృదయాలలో స్థితుడైన ఈ ఆత్మస్వరూపుణ్ణి, సేతుస్వరూపుణ్ణి, సర్వతోముఖుడైన అగ్ని స్వరూపుణ్ణి, పరమశివుణ్ణి ఉపాసించాలి. తన శక్తులతో కూడి అంతఃకరణంలో స్థితుడైనవాడు, పృథ్వి మొదలైన ఎనిమిది రూపాలు గలవాడు, భావం మొదలైన ఎనిమిది రూపాలు గలవాడు, అట్లే వామదేవాదులైన ఎనిమిది విగ్రహరూపాలతో ప్రకాశించువాడు, మరియు సృష్టికోసం అగ్నిని సంక్షిప్తంచేసి హృదయంలోనిలిపి ప్రకాశించువాడు, దేవ దేవేశుడు, లోకనాయకుడు, భగవానుడు అయిన రుద్రుణ్ణి ధ్యానించి, ఆయన్ని చిత్తంలోను, మనసులోను నిలిపి, హృదయస్థమైన అగ్నితో మిక్కిలిగా క్రమంగా ఐదు ఆహుతుల్ని ఇవ్వాలి.

ప్రశాంతచిత్తుడై కూర్చుండి ఒకసారి పవిత్రజలంతో ఆచమనం చేసి ఆహుతి ఇవ్వాలి. "ప్రాణాయ స్వాహా" అని మొదటి ఆహుతి ఇవ్వాలి. రెండో ఆహుతి "అపానాయ స్వాహా" అని, మూడో ఆహుతి "వ్యానాయ స్వాహా" అని, నాలుగో ఆహుతి "ఉదానాయ స్వాహా" అని మరియు ఐదో ఆహుతి "సమానాయ స్వాహా" అని పలుకుతూ ఇవ్వాలి. ఈ విధంగా "స్వాహా" అంటూ వేరువేరుగా ఆహుతులిచ్చి మిగిలిన అన్నాన్ని (పురోడాశాన్ని) ఇష్టంగా తినాలి. తర్వాత ఒకసారి నీటిని త్రాగి, మరల ఆచమించి హృదయాన్ని స్పర్శించాలి.

**ప్రాణానాం గ్రంథిరస్యాత్మా రుద్రో హ్యాత్మా విశాంతకః ।**
**రుద్రో వై హ్యాత్మనః ప్రాణ ఏవమాప్యాయయేత్స్వయమ్ ॥85॥**

**ప్రాణే నివిష్టో వై రుద్రస్తస్మాత్ప్రాణమయః స్వయమ్ ।**
**ప్రాణాయ చైవ రుద్రాయ జుహోత్యమృతముత్తమమ్ ॥86॥**

**శివ విశేహ మామీశ స్వాహా బ్రహ్మాత్మనే స్వయమ్ ।**
**ఏవం పంచాహుతీశ్చైవ శ్రాద్ధే కుర్వీత శాసనాత్ ॥87॥**

రుద్రభగవానుడే ప్రాణుల యొక్క గ్రంథిఅయిఉన్నాడు. రుద్రుడే ఆత్మ. దుఃఖవినాశకుడు. రుద్రుడే జీవులకుప్రాణం – అని పలికి స్వయంగా తృప్తి పర్చాలి. రుద్రుడు ప్రాణులందు నిలిచి ఉన్నాడు. అందువల్ల రుద్రుడు స్వయంగా ప్రాణస్వరూపుడు. ప్రాణి కొరకు, రుద్రుడి కొరకు ఉత్తమమైన అమృతాన్ని సమర్పించాలి. ఓ శివా! ఓ ఈశ్వరుడా! నీవు మాయందు ప్రవేశించు. "సాక్షాత్ బ్రహ్మాత్ముడికి స్వాహా" అంటూ శ్రద్ధగా, శాస్త్రానుసారంగా పంచాహుతుల్ని ఇవ్వాలి.

**పురుషోఽసి పురే శేషే త్వమంగుష్ఠప్రమాణతః ।**
**ఆశ్రితశ్చైవ చాంగుష్ఠమీశః పరమకారణమ్ ॥88॥**

**సర్వస్య జగతశ్చైవ ప్రభుః ప్రీణాతు శాశ్వతః ।**
**త్వం దేవానామపి జ్యేష్ఠో రుద్రస్త్వం చ పురో వృషా ॥89॥**

**మృదుస్త్వమన్నమస్మభ్యమేతదస్తు హుతం తవ ।**

నీవు పురుషుడవు. నీవు శరీరంలో అంగుష్ఠమాత్ర పరిమాణంలో నిలిచి ఉన్నావు. అంగుష్ఠంతో సమానంగా ఉన్నా నీవు ఈశ్వరుడవు. పరమకారణస్వరూపుడవు. సంపూర్ణ జగత్తుకు స్వామివి. సనాతనుడవు. ప్రసన్నుడవు కమ్ము! నీవు దేవతలలో శ్రేష్ఠుడవు. నీవురుద్రుడవు. నీవుమొదటిగా ఇంద్రుడవు. నీవు మాకుశుభకారివి కావాలి. మాద్వారా నీకు అందిన అన్నం నీ విషయంలో ఆహుతి అవుతున్నది.

**ఇత్యేవం కథితం సర్వం గుణప్రాప్తివిశేషతః ॥90॥**

**యోగాచారః స్వయం తేన బ్రహ్మణా కథితః పురా ।**
**ఏవం పాశుపతం జ్ఞానం జ్ఞాతవ్యం చ ప్రయత్నతః ॥91॥**

**భస్మస్నాయీ భవేన్నిత్యం భస్మలిప్తః సదా భవేత్ ।**
**యః పఠేత్ శృణుయాద్వాపి శ్రావయేద్వా ద్విజోత్తమాన్ ॥92॥**

**దైవే కర్మణి పిత్ర్యే వా స యాతి పరమాం గతిమ్ ॥93॥**

ఓ ఋషులారా! ఈ విధంగా నేను మీకు విశేషరూపంగా అణిమాదిగుణప్రాప్తిసంబంధమైనది అంతా చెప్పాను. పూర్వం బ్రహ్మ స్వయంగా ఈయోగవిద్యనుగూర్చి చెప్పాడు. ఈ విధంగా ప్రయత్నపూర్వకంగా పాశుపతవిద్యాజ్ఞానాన్ని పొందాలి. నిత్యం భస్మస్నానం చెయ్యాలి. నిత్యం భస్మానులిప్తులు కావాలి. ఎవడు దేవకార్యంలోగాని పితృకార్యంలోగాని దీన్ని పఠిస్తాడో, వింటాడో, విప్రులకు వినిపిస్తాడో ఆతడు పరమగతిని పొందుతాడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే అణిమాద్యష్టసిద్ధి త్రిగుణసంసారప్రాణాగ్నౌ హోమాదివర్ణనం నామ అష్టాశీతితమోఽధ్యాయః ॥ 88 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని అణిమాద్యష్టసిద్ధి త్రిగుణసంసార ప్రాణాగ్నులలో హోమాది వర్ణనమనే ఎనభై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## ఏకోననవతితమోఽధ్యాయః - ఎనబై తొమ్మిదవ అధ్యాయం

## సదాచారకథనమ్ - సదాచారకథనం

**సూత ఉవాచ :-** సూతర్షి పలికాడు.

**అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి శౌచాచారస్య లక్షణమ్ ।**
**యదనుష్ఠాయ శుద్ధాత్మా పరేత్య గతిమాప్నుయాత్ ॥1॥**

**బ్రహ్మణా కథితం పూర్వం సర్వభూతహితాయ వై ।**
**సంక్షేపాత్సర్వవేదార్థం సంచయం బ్రహ్మవాదినామ్ ॥2॥**

**ఉదయార్థం తు శౌచానాం మునీనాముత్తమం పదమ్ ।**
**యస్తత్రాథాప్రమత్తః స్యాత్స మునిర్నావసీదతి ॥3॥**

తర్వాత మీకు శౌచాచారం యొక్క లక్షణాన్ని చెబుతాను. ఈ ఆచారాన్ని నిర్వర్తించి, పరిశుద్ధమైన అంతఃకరణం గల వ్యక్తి పరలోకానికి వెళ్లి, ఉత్తమగతిని పొందుతాడు. పూర్వం బ్రహ్మదేవుడు ప్రాణులందరి హితం కోరి దీన్ని చెప్పాడు. ఇది సంగ్రహంగా సర్వవేదసారమే. బ్రహ్మవాదులైన పండితులకు నిధి. ఆచరణలో ఉన్నతి కోసం ఇది ఉపయోగపడుతుంది. మరియు మునులకు ఉత్తమమార్గమిది. దీన్ని నిర్వహించడంలో సావధానుడైనవాడే ముని. ఆతడు దుఃఖాన్ని పొందకున్నాడు.

**మానావమానౌ ద్వావేతౌ తావేవాహుర్విషామృతే ।**
**అవమానోఽమృతం తత్ర సన్మానో విషముచ్యతే ॥4॥**

**గురోరపి హితే యుక్తః స తు సంవత్సరం వసేత్ ।**
**నియమేష్వప్రమత్తస్తు యమేషు చ సదా భవేత్ ॥5॥**

**ప్రాప్యానుజ్ఞాం తతశ్చైవ జ్ఞానయోగమనుత్తమమ్ ।**
**అవిరోధేన ధర్మస్య చరేత పృథివీమిమామ్ ॥6॥**

మానం, అవమానం ఈ రెండూ విషం మరియు అమృతం అని చెప్పబడ్డాయి. వీటిల్లో అవమానం అమృతం. సన్మానం విషం. శిష్యుడు గురుహితంపై మనస్సుపెట్టి ఒక సంవత్సరకాలం ఆయన వెంట నివసించాలి. యమనియమాల విషయంలో సావధానుడై ఉండాలి. వాటి నుండి ఉన్నతజ్ఞానయోగాన్ని గ్రహించాలి. గురువు ఆజ్ఞానుసారం ధర్మవిరోధం కాకుండా ఈ భూమిపై చరించాలి.

**చక్షుః పూతం చరేన్మార్గం వస్త్రపూతం జలం పిబేత్ ।**
**సత్యపూతం వదేద్వాక్యం మనఃపూతం సమాచరేత్ ॥7॥**

**మత్స్యగృహ్యస్య యత్పాపం షణ్మాసాభ్యంతరే భవేత్ ।**
**ఏకాహం తత్సమం జ్ఞేయమపూతం యజ్జలం భవేత్ ॥8॥**

**అపూతోదకపానే తు జపేచ్చ శతపంచకమ్ ।**
**అఘోరలక్షణం మంత్రం తతః శుద్ధిమవాప్నుయాత్ ॥9॥**

**అథవా పూజయేచ్ఛంభుం ఘృతస్నానాదివిస్తరైః ।**
**త్రిధా ప్రదక్షిణీకృత్య శుధ్యతే నాత్ర సంశయః ॥10॥**

దారిలో చూచి నడవాలి. వస్త్రంతో ఒడకొట్టిన నీటిని త్రాగాలి. సత్యసమ్మతమైన మాటను పలకాలి. మనసు పవిత్రీకరించిన దానినే ఆచరించాలి. చేపల్ని పట్టేవాడికి ఆరుమాసాల పర్యంతం ఆ పాపం ఉంటుంది. ఇది ఒకరోజు అపవిత్ర జలపానం చేసిన దానితో సమానం. అపవిత్ర జలపానం చేసినట్లైతే ఐదు వందలసార్లు అఘోరమంత్రాన్ని జపించాలి. దానితో ఆ వ్యక్తి పరిశుద్ధుడవుతాడు. లేకుంటే నేయి మొదలైనవాటితో శివుణ్ణి అభిషేకించాలి. తర్వాత మూడుసార్లు ప్రదక్షిణ చేయాలి. ఇందులో సందేహం లేదు.

**ఆతిథ్యశ్రాద్ధయజ్ఞేషు న గచ్ఛేద్యోగవిత్క్వచిత్ ।**
**ఏవం హ్యహింసకో యోగీ భవేదితి విచారితమ్ ॥11॥**

**వహ్నౌ విధూమేऽ త్యంగారే సర్వస్మిన్ భుక్తవజ్జనే ।**
**చరేత్తు మతిమాన్ భైక్ష్యం న తు తేష్వేవ నిత్యశః ॥12॥**

**అథైనమవమన్యంతే పరే పరిభవంతి చ ।**
**తథా యుక్తం చరేద్భైక్ష్యం సతాం ధర్మమదూషయన్ ॥13॥**

యోగవేత్త ఆతిథ్యం, శ్రాద్ధం, సోమాది యజ్ఞాలకు ఎప్పుడూ వెళ్ళకూడదు. దీనివల్ల యోగికి హింస చేసిన ఫలితమంటదు. ఇది ఆలోచించి చెప్పినమాట. బుద్ధిమంతుడైన సాధువు పొగ అణిగి, అగ్ని చల్లారిన ఇంటికి, ఇంటి వారందరూ భుజించిన తర్వాత మాత్రమే భిక్షకు వెళ్ళాలి. ప్రతిదినం ఒకే యింటిలో భిక్ష గ్రహించరాదు. అట్లైనచో మిగిలినవాళ్లు అవమానిస్తారు. నిందిస్తారు. అందువల్ల సజ్జనులు ధర్మం దూషితంగాని విధంగా సముచితంగా భిక్షను స్వీకరించాలి.

**భైక్ష్యం చరేద్వనస్థేషు యాయావరగృహేషు చ ।**
**శ్రేష్ఠా తు ప్రథమా హీయం వృత్తిరస్యోపజాయతే ॥14॥**

**అత ఊర్ధ్వం గృహస్థేషు శీలీనేషు చరేద్ ద్విజాః ।**
**శ్రద్దధానేషు దాంతేషు శ్రోత్రియేషు మహాత్మసు ॥15॥**

**అత ఊర్ధ్వం పునశ్చాపి అదుష్టాపతితేషు చ ।**
**భైక్ష్యచర్యా హి వర్ణేషు జఘన్యా వృత్తిరుచ్యతే ॥16॥**

వనంలో గల గృహాలలోను, సంచారశీలుర ఇళ్ళలోనూ భిక్షను గ్రహించాలి. అది యోగికి సర్వశ్రేష్ఠమైన వృత్తి అవుతుంది. ఓ విప్రులారా! దీని తర్వాత శ్రేష్ఠాచారులు, దానశీలురు, శ్రద్ధాళువులు, శ్రోత్రియులు మరియు మహాత్ములు అయిన వారి గృహాల నుంచి భిక్షను గ్రహించాలి. తర్వాత దుష్టరహితులు, అపతితులు అయిన ప్రజల నుంచీ భిక్ష గ్రహించవచ్చు. అయితే అన్ని వర్ణాలవారి నుంచి భిక్ష తీసుకుంటే అది 'జఘన్య' వృత్తి అవుతుంది.

**భైక్ష్యం యవాగూస్తక్రం వా పయో యావకమేవ చ ।**
**ఫలమూలాది పక్వం వా కణపిణ్యాకసక్తవః ॥17॥**

**ఇత్యేతే వై మయా ప్రోక్తా యోగినాం సిద్ధివర్ధనాః ।**
**ఆహారాస్తేషు సిద్ధేషు శ్రేష్ఠం భైక్ష్యమితి స్మృతమ్ ॥18॥**

యవధాన్యం, మజ్జిగ, పాలు, వీటితో చేసిన భోజనం; వండిన కందమూలాలు, పండ్లు, దంచిన ధాన్యాలు, నూవులు మరియు పేలాలు మొదలైన వాటిని భిక్షగా గ్రహించాలి. ఓ ఋషులారా! నేను యోగులకు యోగసిద్ధివృద్ధి కారకాలైన ఆహారపదార్థాలను చెప్పాను. వీటిని పొందడం శ్రేష్ఠమైన భిక్ష అవుతుంది.

**అబ్బిందుం యః కుశాగ్రేణ మాసి మాసి సమశ్నుతే ।**
**న్యాయతో యశ్చరేద్భైక్ష్యం పూర్వోక్తాత్స విశిష్యతే ॥19॥**

**జరామరణగర్భేభ్యో భీతస్య నరకాదిషు ।**
**ఏవం దాయయతే తస్మాత్తద్భైక్ష్యమితి సంస్మృతమ్ ॥20॥**

ఏ వ్యక్తి ప్రతిమాసంలో కుశాగ్రభాగంతో జలబిందువుల్ని గ్రహిస్తాడో, మరియు న్యాయపూర్వకంగా భిక్షాటన చేస్తాడో ఆతడు ఇంతకుముందు చెప్పినట్లు శ్రేష్ఠుడవుతున్నాడు. వార్ధకం, మృత్యువు, గర్భవాసం, నరకం మొదలైన వాటివల్ల భయపడుతున్న వ్యక్తి భిక్షాటనం పిత్రార్జితంతో సమానం. అందువల్లనే దాన్ని భైక్ష్యం అనడం.

**దధిభక్షాః పయోభక్షా యే చాన్యే జీవక్షీణకాః ।**
**సర్వే తే భైక్ష్యభక్షస్య కలాం నార్హంతి షోడశీమ్ ॥21॥**

**భస్మశాయీ భవేన్నిత్యం భిక్షాచారీ జితేంద్రియః ।**
**య ఇచ్ఛేత్పరమం స్థానం వ్రతం పాశుపతం చరేత్ ॥22॥**

పెరుగును తినేవాళ్లు, పాలను త్రాగేవాళ్లు, ఆయుర్దాయనాశకాలైన ఇతర పదార్థభక్షకులు అందరూ భిక్షాన్నాన్ని తినేవారిలోని పదహారవవంతుకు కూడా సమానం కారు. పరమపదాన్ని కోరుకొనేవాడు నిత్యం భస్మం మీద శయనించాలి, భిక్షమెత్తుకోవాలి. ఇంద్రియాలను జయించాలి. పాశుపతవ్రతాన్ని ఆచరించాలి.

**యోగినాం చైవ సర్వేషాం శ్రేష్ఠం చాంద్రాయణం భవేత్ ।**
**ఏకం ద్వే త్రీణి చత్వారి శక్తితో వా సమాచరేత్ ॥23॥**

**అస్తేయం బ్రహ్మచర్యం చ అలోభస్త్యాగ ఏవ చ ।**
**వ్రతాని పంచ భిక్షూణామహింసా పరమా త్విహ ॥24॥**

**అక్రోధో గురుశుశ్రూషా శౌచమాహారలాఘవమ్ ।**
**నిత్యం స్వాధ్యాయ ఇత్యేతే నియమాః పరికీర్తితాః ॥25॥**

చాంద్రాయణవ్రతం యోగులందరికి ఉత్తమమైనది. వాళ్ల శక్తిననుసరించి ఈ వ్రతాన్ని, ఒకటి, రెండు, మూడు, నాల్గుసార్లైనా చేయాలి. 1. అస్తేయం (దొంగతనం చేయకుండడం) 2. బ్రహ్మచర్యం 3. అలోభం. 4.

త్యాగం. 5. అహింస. భిక్షువులకు ఇవి పంచవ్రతాలు. 1. క్రోధం వహించకుండుట. 2. గురువును సేవించుట. 3. పరిశుద్ధత, 4. అల్పాహారస్వీకరణం. 5. స్వాధ్యాయపఠనం – ఇవి ఆచరించాల్సిన నియమాలు.

**బీజయోనిగుణా వస్తుబంధః కర్మభిరేవ చ ।**
**యథా ద్విప ఇవారణ్యే మనుష్యాణాం విధీయతే ॥26॥**

తల్లిదండ్రులవల్ల ప్రాప్తించిన సంస్కారం, వాళ్ల స్వభావం, ధనాదులు, అట్లే సంచిత కర్మలు– వీటి ద్వారా మానవుడు అరణ్యంలో ఏనుగు లాగా బంధనగ్రస్తుడవుతున్నాడు.

**దేవైస్తుల్యాః సర్వయజ్ఞక్రియాస్తు యజ్ఞాజ్జాప్యం జ్ఞానమాహుశ్చ జాప్యాత్ ।**
**జ్ఞానాద్ధ్యానం సంగరాగాదపేతం తస్మిన్ ప్రాప్తే శాశ్వతస్యోపలంభః ॥27॥**

సమస్తయజ్ఞక్రియలు దేవతలతో సమానమైనవి. యజ్ఞం వల్ల శ్రేష్ఠమైన జపం, జపం వల్ల శ్రేష్ఠమైన జ్ఞానం సిద్ధిస్తాయి. కాని, ఆసక్తిరహితం, రాగరహితం అయిన ధ్యానం యజ్ఞం కన్నా శ్రేష్ఠం. దీనివల్ల శాశ్వతమైన పరమపదం ప్రాప్తిస్తుంది.

**దమః శమః సత్యమకల్మషత్వం మౌనం చ భూతేష్వఖిలేషు చార్జవమ్ ।**
**అతీంద్రియం జ్ఞానమిదం తథా శివం ప్రాహుస్తథా జ్ఞానవిశుద్ధబుద్ధయః ॥28॥**

బహిరింద్రియనిగ్రహం (దమం), అంతరింద్రియనిగ్రహం (శమం), సత్యం, పాపరాహిత్యం, మౌనం, సమస్తప్రాణుల విషయంలో ఋజుత్వం మరియు అతీంద్రియజ్ఞానం – ఇవన్నీ శివస్వరూపాలని జ్ఞానంచేత నిర్మలమైన మనస్సుగలవారు చెప్తుంటారు.

**సమాహితో బ్రహ్మపరోఽప్రమాదీ శుచిస్తథైకాంతరతిర్జితేంద్రియః ।**
**సమాప్నుయాద్యోగమిమం మహాత్మా మహర్షయశ్చైవమనిందితామలాః ॥29॥**

ఏకాగ్రచిత్తుడు, బ్రహ్మపరాయణుడు, ప్రమాదరహితుడు, శుద్ధుడు, ఏకాంతాన్ని ఇష్టపడేవాడు జితేంద్రియుడు, మహాత్ముడు ఈ యోగాన్ని (పాశుపతం) పొందుతున్నాడు. మచ్చలేని నిర్మల మహర్షులు ఇలా చెప్పారు.

**ప్రాప్యతేఽభిమతాన్ దేశానంకుశేన నివారితః ।**
**ఏతన్మార్గేణ శుద్ధేన దగ్ధబీజో హ్యకల్మషః ॥30॥**

అంకుశంతో ఏనుగును నియంత్రించినట్టు నిర్మలజ్ఞానమార్గంద్వారా తనను తాను నియంత్రించుకుంటే కర్మలు నశించి, నిష్కల్మషుడౌతాడు. తనకు నచ్చిన తావును పొందగలుగుతాడు.

**సదాచారరతాః శాంతాః స్వధర్మపరిపాలకాః ।**
**సర్వాన్ లోకాన్ వినిర్జిత్య బ్రహ్మలోకం వ్రజంతి తే ॥31॥**

సదాచారపరాయణులు, ప్రశాంతచిత్తులు, స్వధర్మరక్షకులు అయినవాళ్లు సమస్తలోకాలను జయించి (దాటి), బ్రహ్మలోకాన్ని చేరుతున్నారు.

**పితామహేనోపదిష్టో ధర్మః సాక్షాత్సనాతనః ।**
**సర్వలోకోపకారార్థం శృణుధ్వం ప్రవదామి వః ॥32॥**

సాక్షాత్తూ పితామహుడి చేత సమస్తలోకాల ఉపకారం కోసం ఈ సనాతనధర్మం ఉపదేశించబడింది. దాన్ని చెబుతాను. మీరు వినండి.

**గురూపదేశయుక్తానాం వృద్ధానాం క్రమవర్తినామ్ ।**
**అభ్యుత్థానాదికం సర్వం ప్రణామం చైవ కారయేత్ ॥33॥**

**అష్టాంగప్రణిపాతేన త్రిధా న్యస్తేన సువ్రతాః ।**
**త్రిః ప్రదక్షిణయోగేన వంద్యో వై బ్రాహ్మణో గురుః ॥34॥**

**జ్యేష్ఠాన్యేఽపి చ తే సర్వే వందనీయా విజానతా ।**
**ఆజ్ఞాభంగం న కుర్వీత యదీచ్ఛేత్సిద్ధిముత్తమామ్ ॥35॥**

గురూపదేశాన్ని పొంది, నియమాలను పాటించే సాధకుడు వృద్ధజనులను స్వాగతించి, అర్ఘ్యపాద్యాలిచ్చి నమస్కరించాలి. బ్రాహ్మణుడైన గురువుకు మూడుసార్లు ప్రదక్షిణచేసి, ఎనిమిది అంగాలు భూమికి తాకేటట్లు అంటే 'సాష్టాంగపడి' మూడుసార్లు నమస్కరించాలి. బుద్ధిమంతుడైన వాడు తన కంటె పెద్దవాళ్లకు నమస్కరించాలి. ఉన్నతసిద్ధికాముడు గుర్వాజ్ఞను ఉల్లంఘించరాదు.

**ధాతుశూన్యబిలక్షేత్రక్షుద్రమంత్రోపజీవనమ్ ।**
**విషగ్రహవిడంబాదీన్ వర్జయేత్సర్వయత్నతః ॥36॥**

**కైతవం విత్తశాఠ్యం చ పైశున్యం వర్జయేత్సదా ।**
**అతిహాసమవష్టంభం లీలాస్వేచ్ఛాప్రవర్తనమ్ ॥37॥**

**వర్జయేత్సర్వయత్నేన గురూణామపి సన్నిధౌ ।**
**తద్వాక్యప్రతికూలం చ అయుక్తం వై గురోర్వచః ॥38॥**

**న వదేత్సర్వయత్నేన అనిష్టం న స్మరేత్సదా ।**

ధాతువాదం, నాస్తికవాదం, ఊసరక్షేత్రనివాసం, క్షుద్రమంత్రవిద్యలను, పాములు పట్టటం మొదలైన చెడ్డపనులు ప్రయత్నపూర్వకంగా పరిత్యజించాలి. మోసం, ధనమందు కార్పణ్యం, పిసినారితనం ఎల్లప్పుడు విడిచి పెట్టాలి. గురుజనుల సన్నిధిలో పెద్దగా నవ్వడం, శిష్టరాహిత్యం, వినోదస్వేచ్ఛాప్రవర్తనాలు అన్ని విధాల ప్రయత్నించి విడిచి పెట్టాలి. గుర్వాజ్ఞను అతిక్రమించరాదు. ప్రయత్నపూర్వకంగా ఆయనకు అనిష్టాన్ని కలిగించరాదు.

**యతీనామాసనం వస్త్రం దండాద్యం పాదుకే తథా ॥39॥**

**మాల్యం చ శయనస్థానం పాత్రం ఛాయాం చ యత్నతః ।**
**యజ్ఞోపకరణాంగం చ న స్పృశేద్వై పదేన చ ॥40॥**

**దేవద్రోహం గురుద్రోహం న కుర్యాత్సర్వయత్నతః ।**
**కృతా ప్రమాదతో విప్రాః ప్రణవస్యాయుతం జపేత్ ॥41॥**

**దేవద్రోహగురుద్రోహాత్కోటిమాత్రేణ శుధ్యతే ।**
**మహాపాతకశుద్ధ్యర్థం తథైవ చ యథావిధి ॥42॥**

**పాతకీ చ తదర్ధేన శుద్ధ్యతే వృత్తవాన్ యది ।**
**ఉపపాతకినః సర్వే తదర్ధేనైవ సువ్రతాః ॥43॥**

యతీంద్రుల యొక్క ఆసనం, వస్త్రం, దండాదులు, పాదుకలు, మాల, నిద్రించే ప్రదేశం, పాత్ర, ఆయన నీడ, యజ్ఞ సామగ్రిని పాదంతో తన్నరాదు. గురువులకు ద్రోహం చేయరాదు. పొరపాటున చేస్తే ప్రణవాన్ని పదివేలసార్లు జపించాలి. తెలిసి చేస్తే మాత్రం ఒక కోటి సార్లు ప్రణవాన్ని జపించడం మూలాన శుద్ధుడవుతాడు. మహాపాతకాలనుంచి శుద్ధి పొందడానికి ఇదే విధానం. పాతకుడు మంచి నడవడిక గలవాడైతే అందులో సగం అనగా అరకోటి జపంతో శుద్ధుడు అవుతాడు. ఓ సువ్రతులారా! ఉపపాపులందరూ (చిన్న పాపాలు చేసిన వాళ్లు) అందులో సగం అనగా ఇరవై అయిదు లక్షల జపంతో శుద్ధులవుతారు.

**సంధ్యాలోపే కృతే విప్రః త్రిరావృత్త్యైవ శుద్ధ్యతి ।**
**ఆహ్నికచ్ఛేదనే జాతే శతమేకముదాహృతమ్ ॥44॥**

సంధ్యావందనం చేయని విప్రుడు ఆ జప కార్యక్రమాన్ని మూడుసార్లు చేసి శుద్ధుడవుతున్నాడు. దినకృత్యాన్ని ఉల్లంఘిస్తే ఒక వందసార్లు జపం చేయాలని చెప్పబడింది.

**లంఘనే సమయానాం తు అభక్ష్యస్య చ భక్షణే ।**
**అవాచ్యవచనే చైవ సహస్రాచ్ఛుద్ధిరుచ్యతే ॥45॥**

సమయాన్ని ఉల్లంఘించినపుడూ, తినరానిదాన్ని తిన్నప్పుడూ, పలుకరాని దాన్ని పలికినప్పుడూ ఒక వేయి జపంతో శుద్ధి కలుగుతుంది.

**కాకోలూకకపోతానాం పక్షిణామపి ఘాతనే ।**
**శతమష్టోత్తరం జప్త్వా ముచ్యతే నాత్ర సంశయః ॥46॥**

**యః పునస్తత్త్వవేత్తా చ బ్రహ్మవిద్ బ్రాహ్మణోత్తమః ।**
**స్మరణాచ్ఛుద్ధిమాప్నోతి నాత్ర కార్యా విచారణా ॥47॥**

పక్షులైన కాకులు, గుడ్లగూబలు, పావురాలు – వీటిని చంపితే నూట ఎనిమిదిసార్లు జపం చేస్తే పాపముక్తి కలుగుతుంది. ఇందుకు సందేహం లేదు. తత్త్వవేత్త, బ్రహ్మవిదుడు, బ్రాహ్మణోత్తముడు అయితే మాత్రం కేవలం ప్రణవాన్ని స్మరిస్తేనే శుద్ధి పొందుతాడు. ఇందులో ఎంతమాత్రం ఆలోచించవలసింది లేదు.

**నైవమాత్మవిదామస్తి ప్రాయశ్చిత్తాని చోదనా ।**
**విశ్వస్యైవ హి తే శుద్ధా బ్రహ్మవిద్యావిదో జనాః ॥48॥**

**యోగధ్యానైకనిష్ఠాశ్చ నిర్లేపాః కాంచనం యథా ।**
**శుద్ధానాం శోధనం నాస్తి విశుద్ధా బ్రహ్మవిద్యయా ॥49॥**

ఆత్మవిదులైన వాళ్లకు ప్రాయశ్చిత్తం లేదు. బ్రహ్మవిద్యావేత్తలు విశ్వకళ్యాణానికి ప్రేరకులవుతున్నారు. వాళ్లు స్వతహాగా శుద్ధులు. యోగధ్యాననిష్ఠులకు ఏదీ అంటదు. వారు బంగారంవంటివాళ్ళు. శుద్ధులైన వారి విషయంలో శోధన అవసరం లేదు. వీళ్లు బ్రహ్మవిద్యమూలంగా పరిశుద్ధు లవుతున్నారు.

**ఉద్ధృతానుష్ణఫేనాభిః పూతాభిర్వస్త్రచక్షుషా ।**
**అద్భిః సమాచరేత్సర్వం వర్జయేత్కలుషోదకమ్ ॥50॥**

**గంధవర్ణరసైర్దుష్టమశుచిస్థానసంస్థితమ్ ।**
**పంకాశ్మదూషితం చైవ సాముద్రం పల్వలోదకమ్ ॥51॥**

**సశైవాలం తథాన్యైర్వా దోషైర్దుష్టం వివర్జయేత్ ।**

నదులు మొదలైన వాటినుండి నీటిని గ్రహించి, కంటితోనూ, వస్త్రంతోనూ శుభ్రపరచి ఆనీటితో అనుష్ఠానం చేయాలి. నురగ ఉండకూడదు. అపరిశుభ్రజలంతో చేయరాదు. వాసన, రంగు, రసం – వీటితో మలినమైనజలాన్ని, అపవిత్రప్రదేశంలో ఉంచిన జలాన్ని, బురదతోను రాళ్లతోను నిండిన జలాన్ని, సముద్రజలాన్ని, చిన్న గుంటలలోని జలాన్ని, నాచుతో కూడిన జలాన్ని అట్లే ఇతర మలినాలతో కూడిన అపరిశుభ్రజలాన్ని విడిచి పెట్టాలి.

**వస్త్రశౌచాన్వితః కుర్యాత్సర్వకార్యాణి వై ద్విజాః ॥52॥**

**నమస్కారాదికం సర్వం గురుశుశ్రూషణాదికమ్ ।**
**వస్త్రశౌచవిహీనాత్మా హ్యశుచిర్నాత్ర సంశయః ॥53॥**

**దేవకార్యోపయుక్తానాం ప్రత్యహం శౌచమిష్యతే ।**
**ఇతరేషాం హి వస్త్రాణాం శౌచం కార్యం మలాగమే ॥54॥**

**వర్జయేత్సర్వయత్నేన వాసోఽన్యైర్విధృతం ద్విజాః ।**

ఓ ద్విజులారా! వస్త్రాల్ని శుద్ధి పర్చుకుని వాటిని ధరించి నమస్కారం మొదలైన గురుశుశ్రూషకు చెందిన సర్వకార్యాల్ని నిర్వహించాలి. వస్త్రశుద్ధిలేని వ్యక్తి అశుచి అయినవాడే. ఇందులో ఎంతమాత్రం సందేహం లేదు. దేవకార్యాలకై ఉపయోగించే వస్త్రాల్ని ప్రతిరోజూ శుభ్రపర్చాలి. ఇతరాలైన వస్త్రాల్ని మలినమంటగానే శుభ్రపర్చాలి. ఓ ద్విజులారా! ఇతరులు ధరించిన వస్త్రాల్ని ప్రయత్నపూర్వకంగా వదిలివేయాలి.

**కౌశేయావికయో రూక్షైః క్షౌమాణాం గౌరసర్షపైః ॥55॥**

**శ్రీఫలైరంశుపట్టానాం కృతపానామరిష్టకైః ।**
**చర్మణాం విదలానాం చ వేత్రాణాం వస్త్రవన్మతమ్ ॥56॥**

**వల్కలానాం తు సర్వేషాం ఛత్రచామరయోరపి ।**
**చైలవచ్ఛౌచమాఖ్యాతం బ్రహ్మవిద్భిర్మునీశ్వరైః ॥57॥**

**భస్మనా శుద్ధ్యతే కాంస్యం క్షారేణాయసముచ్యతే ।**
**తామ్రమమ్లేన వై విప్రాస్త్రపుసీసకయోరపి ॥58॥**

**హైమమద్భిః శుభం పాత్రం రౌప్యపాత్రం ద్విజోత్తమాః ।**
**మణ్యశ్మశంఖముక్తానాం శౌచం తైజసవత్స్మృతమ్ ॥59॥**

**అగ్నేరపాం చ సంయోగాదత్యంతోపహతస్య చ ।**
**రసానామిహ సర్వేషాం శుద్ధిరుత్ప్లవనం స్మృతమ్ ॥60॥**

పట్టువస్త్రాల్ని, ఉన్ని వస్త్రాల్ని కుంకుడు మొదలైన కఠినద్రవాలతో, దుకూల వస్త్రాన్ని శ్వేతపద్మంగింజల రసంతోను, బంగారం జరీతో కూడిన వస్త్రాల్ని మారేడు పండ్లరసంతోనూ, దర్భలతో నేసిన చాపల్ని, మేక, గొఱ్ఱె కేశాలతో నేసిన కంబళ్లను; చర్మంతో చేసిన వస్తువులు, చెట్ల బెరడు మరియు కొమ్మలు మొదలగు వాటితో చేసిన వస్తువులను, సామాన్య వస్త్రాల్ని శుభ్రపరచినట్లే శుభ్రపరచాలి. బ్రహ్మవేత్తలయిన మునీశ్వరుల యొక్క సమస్తవల్కలాలు, వస్త్రాలు, ఛత్రచామరాలు వస్త్రశుద్ధి మాదిరిగానే శుద్ధి చేయాలి. ఓవిప్రులారా! కంచుపాత్ర శుద్ధి బూడిదతో అవుతుంది. ఇనుపపాత్ర శుద్ధి ఉప్పుతోను, రాగిపాత్ర తగరం, సీసంతో చేసిన పాత్రల శుద్ధి కూడా చింతపండుతో నిర్వహించాలి. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! బంగారం మరియు వెండితో చేసిన పవిత్ర పాత్రల శుద్ధి జలంతోనే అవుతుంది. మణులు, రంగురాళ్లు, శంఖాలు, ముత్యాల శుద్ధి కూడా బంగారు పాత్రల మాదిరిగానే చేయాలి. బాగా మలినమైన పదార్థాల్ని అగ్ని, నీటి యొక్క సంయోగంతో (వేడినీటితో) శుద్ధి చేయాలి. రసాలన్నీ ఉత్ప్లవనక్రియవద్ద శుద్ధి అవుతాయి.

**తృణకాష్ఠాదివస్తూనాం శుభేనాభ్యుక్షణం స్మృతమ్ ।**
**ఉష్ణేణ వారిణా శుద్ధిస్తథా స్రుక్స్రువయోరపి ॥61॥**

**తథైవ యజ్ఞ పాత్రాణాం ముసలోలూఖలస్య చ ।**
**శృంగాస్థిదారుదంతానాం తక్షణేనైవ శోధనమ్ ॥62॥**

**సంహతానాం మహాభాగా ద్రవ్యాణాం ప్రోక్షణం స్మృతమ్ ।**
**అసంహతానాం ద్రవ్యాణాం ప్రత్యేకం శౌచముచ్యతే ॥63॥**

గడ్డి, కట్టెలు మొదలైన వస్తువుల శుద్ధి పవిత్రజలాన్ని చల్లడం వల్ల అవుతుంది. యజ్ఞంలో హవిస్సుల్ని అగ్నిలో ఆహుతి చేయడానికి ఉపయోగించే స్రుక్, స్రువాల్ని వేడినీటితో శుద్ధి చేయాలి. ఈ విధంగానే యజ్ఞపాత్రల్ని, రోకలిని, రోలును. శృంగం, ఎముకలతోను, కఱ్ఱతోను, ఏనుగు దంతంతోనూ తయారుచేసిన వస్తువుల శుద్ధి చిత్రికవల్ల అవుతున్నది. కలిసిఉన్న ద్రవ్యాలను నీటిని చల్లడంవల్ల శుద్ధి చేయాలి. కలవకుండా వేరుగా ఉన్న ద్రవ్యాలను వేరువేరుగా శుద్ధి చేయాలి.

**అభుక్తరాశిధాన్యానామేకదేశస్య దూషణే ।**
**తావన్మాత్రం సముద్ధృత్య ప్రోక్షయేద్వై కుశాంభసా ॥64॥**

**శాకమూలఫలాఫలాదీనాం ధాన్యవచ్ఛుద్ధిరిష్యతే ।**
**మార్జనోన్మార్జనైర్వేశ్మ పునః పాకేన మృన్మయమ్ ॥65॥**

**ఉల్లేఖనేనాంజనేన తథా సమ్మార్జనేన చ ।**
**గోనివాసేన వై శుద్ధా సేచనేన ధరా స్మృతా ॥66॥**

**భూమిస్థముదకం శుద్ధం వైతృష్ణ్యం యత్ర గౌర్వ్రజేత్ ।**
**అవ్యాప్తం యదమేధ్యేన గంధవర్ణరసాన్వితమ్ ॥67॥**

**వత్సః శుచిః ప్రస్రవణే శకునిః ఫలపాతనే ।**
**స్వదారాస్యం గృహస్థానాం రతౌ భార్యాభికాంక్షయా ॥68॥**

**హస్తాభ్యాం క్షాళితం వస్త్రం కారుణా చ యథావిధి ।**
**కుశాంబునా సుసంప్రోక్ష్య గృహ్ణీయాద్ధర్మవిత్తమః ॥69॥**

ధాన్యపురాశిలో ఒక భాగంలో దోషమేర్పడినచో ఆ భాగాన్ని తీసివేసి మిగిలిన భాగం మీద దర్భలతో జలం చల్లి దాన్ని ఉపయోగింపవచ్చు. శాకం, కందమూలం, ఫలం మొదలైన వాటియొక్క శుద్ధి ధాన్యశుద్ధి మాదిరిదే. ఇంటి శుద్ధి నీరు చల్లడం, ఆవుపేడతో అలకటం వల్ల అవుతుంది. మట్టిపాత్రను నిప్పులో వేడిచేయడం వల్ల శుద్ధి అవుతుంది. భూమి శుద్ధి త్రవ్వడం వల్ల, ఆవుపేడతో అలకటం వల్ల, మలాన్ని తొలగించటంతో అవుతుంది. గోశాలశుద్ధి జలసేచనం వల్ల జరుగుతుంది. భూమి మీద నిలిచి ఉన్న నీరు అపవిత్ర పదార్థాలు లేనపుడు, వాసన, రంగు, రసంతో కూడి యున్నపుడు ఆనీటిని దప్పికతో ఉన్న గోవు త్రాగితే శుద్ధి అవుతుంది. ఆవుదూడ పాలుత్రాగే సమయంలో శుద్ధి పొందుతుంది. పక్షి పండ్లను క్రింద పడవేసే సమయంలో శుద్ధి పొందుతుంది. భార్యాకాంక్షితులైన గృహస్థులకు రతికాలంలో భార్య నోరు శుద్ధి పడుతుంది. ధర్మవేత్తలు చాకలి తన చేతులతో ఉతికిన వస్త్రాల మీద విధ్యుక్తంగా దర్భలతో నీటిని చల్లి వాటిని ధరించాలి.

**పణ్యం ప్రసారితం చైవ వర్ణాశ్రమవిభాగశః ।**
**శుచిరాకరజం తేషాం శ్వా మృగగ్రహణే శుచిః ॥70॥**

వర్ణాశ్రమవిభాగానుసారంగా గని నుండి తెచ్చి అమ్మకానికి ఉంచిన వస్తువులన్నీ పరిశుద్ధాలే. వేట సమయంలో హరిణాదుల్ని పట్టుకునే కుక్క పరిశుద్ధమైనదే.

**ఛాయా చ విప్రుషో విప్రా మక్షికాద్యా ద్విజోత్తమాః ।**
**రజోభూర్వాయురగ్నిశ్చ మేధ్యాని స్పర్శనే సదా ॥71॥**

**సుప్త్వా భుక్త్వా చ వై విప్రాః క్షుత్త్వా పీత్వా చ వై తథా ।**
**ష్ఠీవిత్వాధ్యయనాదౌ చ శుచిరప్యాచమేత్పునః ॥72॥**

**పాదౌ స్పృశంతి యే చాపి పరాచమనబిందవః ।**
**తే పార్థివైః సమా జ్ఞేయా న తైరప్రయతో భవేత్ ॥73॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! అనిషిద్ధమైన నీడ, వేదపాఠసమయంలో ముఖం నుంచి స్రవించిన జలబిందువులు, బ్రాహ్మణులు, ఈగలు, ధూళి, నేల, వాయువు, అగ్ని – ఇవి అన్నీ ఎల్లప్పుడూ తాకడానికి పరిశుద్ధాలే. ఓ విప్రులారా! నిద్రించి లేవగానే, భోజనం చేసిన తర్వాత, తుమ్మిన తర్వాత, జలం త్రాగిన తర్వాత, ఉమ్మిన తర్వాత, అధ్యయనానికి ముందు శుభ్రంగా ఉన్నా మరల ఆచమించాలి. ఇతరులు ఆచమించే సమయంలో ఆ జలబిందువులు కాళ్లమీద పడినప్పటికీ, వాటిని ధూళితో సమానంగా భావించాలి. అందులో ఏవిధమైన అశుద్ధి లేదు.

**కృత్వా చ మైథునం స్పృష్ట్వా పతితం కుక్కుటాదికమ్ ।**
**సూకరం చైవ కాకాది శ్వానముష్ట్రం ఖరం తథా ॥74॥**

**యూపం చాండాలకాద్యాంశ్చ స్పృష్ట్వా స్నానేన శుద్ధ్యతి ।**
**రజస్వలాం సూతికాం చ న స్పృశేదంత్యజామపి ॥75॥**

**సూతికాశౌచసంయుక్తః శావాశౌచసమన్వితః ।**
**సంస్పృశేన్న రజస్తాసాం స్పృష్ట్వా స్నాత్వైవ శుద్ధ్యతి ॥76॥**

సంభోగానంతరం, పతితుణ్ణి తాకిన తర్వాత; కోడి, పంది, కాకులు, కుక్క, ఒంటె, గాడిద, యూపాన్ని, చాండాలుణ్ణి తాకిన తర్వాత ఆ వ్యక్తి స్నానం చేసి శుద్ధుడవుతున్నాడు. రజస్వలను, ప్రసవించిన స్త్రీని, శూద్రస్త్రీని తాకరాదు. పురిటి అశౌచంలో ఉన్నవారిని, మరణాశౌచంలో ఉన్నవారిని, అట్లే రజస్వల అయిన స్త్రీని తాకినచో స్నానంతో శుద్ధి పొందుతారు.

**నైవాశౌచం యతీనాం చ వనస్థబ్రహ్మచారిణామ్ ।**
**నైష్ఠికానాం నృపాణాం చ మండలీనాం చ సువ్రతాః ॥77॥**

**తతః కార్యవిరోధాద్ధి నృపాణాం నాన్యథా భవేత్ ।**
**వైఖానసానాం విప్రాణాం పతితానామసంభవాత్ ॥78॥**

**అసంచయద్విజానాం చ స్నానమాత్రేణ నాన్యథా ।**
**తథా సన్నిహితానాం చ యజ్ఞార్థం దీక్షితస్య చ ॥79॥**

**ఏకాహాద్యజ్ఞయాజీనాం శుద్ధిరుక్తా స్వయంభువా ।**
**తతస్త్వధీతశాఖానాం చతుర్భిః సర్వదేహినామ్ ॥80॥**

**సూతకం ప్రేతకం నాస్తి త్ర్యహాదూర్ధ్వమముత్ర వై ।**
**అర్వాగేకాదశాహాంతం బాంధవానాం ద్విజోత్తమాః ॥81॥**

**స్నానమాత్రేణ వై శుద్ధిర్మరణే సముపస్థితే ।**
**తత ఋతుత్రయాదర్వాగేకాహః పరిగీయతే ॥82॥**

**సప్తవర్షాత్తతశ్చార్వాక్ త్రిరాత్రం హి తతః పరమ్ ।**
**దశాహం బ్రాహ్మణానాం వై ప్రథమేఽహని వా పునః ॥83॥**

**దశాహం సూతికాశ్చైవ మాతురప్యేవమవ్యయాః ।**
**అర్వాక్ త్రివర్షాత్స్నానేన బాంధవానాం పితుః సదా ॥84॥**

**అష్టాబ్దాదేకరాత్రేణ శుద్ధిః స్యాద్ బాంధవస్య తు ।**
**ద్వాదశాబ్దాత్తతశ్చార్వాక్ త్రిరాత్రం స్త్రీషు సువ్రతాః ॥85॥**

**సపిండతా చ పురుషే సప్తమే వినివర్తతే ।**
**అతిక్రాంతే దశాహే తు త్రిరాత్రమశుచిర్భవేత్ ॥86॥**

**తతః సన్నిహితో విప్రశ్చార్వాక్ పూర్వం తదేవ వై ।**
**సంవత్సరే వ్యతీతే తు స్నానమాత్రేణ శుద్ధ్యతి ॥87॥**

ఓ సువ్రతులారా! సంన్యాసులకు, వానప్రస్థులకు, నైష్ఠికబ్రహ్మచారులకు, రాజులకు, వాళ్ల మంత్రులకు అశౌచం సంక్రమించకున్నది. కార్యాలలో అవరోధం కలగదు. ఈ విధంగా రాజులకు, భ్రమణశీలురైన సంన్యాసులకు మరియు బ్రాహ్మణులకు పతితజనాలతో సంబంధం ఉండని కారణంగా అశౌచం ఉండదు. కొంచెం కూడా సంపాదించని బ్రాహ్మణులకు, యజ్ఞదీక్షలో ఉన్న యజమానికి అశౌచం ఉండదు. తన వేదశాఖల్ని అధ్యయనం చేసేవాళ్లకు ఒక దినం మాత్రమే అశౌచం ఉంటుందని బ్రహ్మ చెప్పాడు. జనులందరికీ నాల్గుదినాలలో శుద్ధి కలుగుతుంది. ఎవ్వరికీ ఈ విషయంగా ప్రసూతి అశౌచం, మరణ సంబంధి అయిన అశౌచం మూడు దినాల కంటె ఎక్కువ ఉండదు. బంధు జనుల్లో ఎవరైనా చనిపోతే వాళ్లకు పది రోజుల్లో శుద్ధి అవుతుంది. జన్మించిన పది దినాల తర్వాత ఆరు నెలలకు ముందు బిడ్డలు చనిపోతే ఒక దినం మాత్రమే అశౌచం ఉంటున్నది. ఆరు నెలల కన్నా ఎక్కువ ఏడు సంవత్సరాల కన్నా తక్కువ వయసుగల చిన్నబిడ్డలు మృతి చెందితే మూడు రాత్రులే అశౌచం ఉంటుంది. ఏడు సంవత్సరాలకన్నా ఎక్కువ వయసుగల ఉపనీతుడైన బ్రాహ్మణ బాలకుడు మరణిస్తే పది దినాలు అశౌచం ఉంటున్నది. మరో విధంగా తండ్రికి ఒక రోజు మాత్రమే అశౌచం చెప్పబడింది. తల్లికి మాత్రం పది రోజులు ఉంటుంది. మూడు సంవత్సరాల కంటే తక్కువ వయసుగల బిడ్డలు చనిపోతే బంధుగణానికి స్నానమాత్రం చేత శుద్ధి కలుగుతున్నది. తండ్రికి మాత్రం మూడు రాత్రుల తర్వాత శుద్ధి కలుగుతుంది. ఎనిమిది సంవత్సరాల కంటే ఎక్కువ వయసుగల బిడ్డల విషయంలో బంధువులకు ఒక రోజులో శుద్ధి కలుగుతుంది. ఓ సువ్రతులారా! ఎనిమిది సంవత్సరాల కన్నా ఎక్కువ పండ్రెండు సంవత్సరాల కన్నా తక్కువ స్త్రీల విషయంలో మూడు రాత్రులు అశౌచం ఉంటుంది. ఏడు తరాల తర్వాతి వారైతే సపిండంతో పూర్తి అవుతుంది. మరణవార్త పదిరోజుల తర్వాత తెలిస్తే అశౌచ విషయం మూడు రాత్రులు ఉంటుంది. ఓ విప్రులారా! ఆరుమాసాల కన్నా ముందు తెలిస్తే రెండు రాత్రులు, ఒక పగలు (పక్షిణి) అశౌచం ఉంటుంది. ఆరునెలల తర్వాత ఒక సంవత్సరానికన్నా ముందు తెలిస్తే ఒక రోజు అశౌచం ఉంటుంది. సంవత్సరం దాటిన తర్వాత సపిండులకు స్నానమాత్రం వల్ల శుద్ధి అవుతున్నది.

**స్పృష్ట్వా ప్రేతం త్రిరాత్రేణ ధర్మార్థం స్నానముచ్యతే ।**
**దాహకానాం చ నేతౄణాం స్నానమాత్రమబాంధవే ॥88॥**

**అనుగమ్య చ వై స్నాత్వా ఘృతం ప్రాశ్య విశుద్ధ్యతి ।**
**ఆచార్యమరణే చైవ త్రిరాత్రం శ్రోత్రియే మృతే ॥89॥**

**పక్షిణీ మాతులానాం చ సోదరాణాం చ వా ద్విజాః ।**
**భూపానాం మండలీనాం చ సద్యో నీరాష్ట్రవాసినామ్ ॥90॥**

**కేవలం ద్వాదశాహేన క్షత్రియాణాం ద్విజోత్తమాః ।**
**నాభిషిక్తస్య చాశౌచం సంప్రమాదేషు వై రణే ॥91॥**

**వైశ్యః పంచదశాహేన శూద్రో మాసేన శుద్ధ్యతి ।**
**ఇతి సంక్షేపతః ప్రోక్తా ద్రవ్యశుద్ధిరనుత్తమా ॥92॥**

శవాన్ని అంటుకున్నట్లైతే మూడు రాత్రులకు శుద్ధి కలుగుతున్నది. ధర్మం కోసం స్నానం శుద్ధి హేతువని చెప్పబడుతున్నది. బంధువు కానప్పుడు శవాన్ని దహించేవాడు, వెంట వెళ్లినవాళ్లు స్నానమాత్రంతో శుద్ధులవుతారు. శవయాత్రలో పాల్గొన్నవ్యక్తి స్నానం చేసి నేతిని త్రాగినచో శుద్ధుడవుతాడు. ఓ ద్విజులారా! ఆచార్యుడు (గురువు) అట్లే శ్రోత్రియుడు మరణిస్తే మూడు రాత్రులు అశౌచం ఉంటుంది. మేనమామల మరణం వల్ల పక్షం రోజులు అశౌచం ఉంటుంది. ఉపకారి అయిన వ్యక్తి మరణిస్తే మూడు రాత్రులు అశౌచం ఉంటుంది. రాజులు, సామంతులు, దేశాంతరవాసులు మరణిస్తే స్నానం చేయడం వల్ల శుద్ధి లభిస్తుంది. ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! క్షత్రియుల విషయంలో అశౌచం పండ్రెండు రోజులు ఉంటుంది. రాజ్యాభిషిక్తుడైన రాజు యుద్ధంలో మరణిస్తే బంధువులకు అశౌచం ఉండదు. వైశ్యులు పదిహేను రోజుల్లో, శూద్రులు నెల రోజుల్లో శుద్ధులవుతారు. ఈ విధంగా నేను సంగ్రహంగా ద్రవ్యశుద్ధి విషయాన్ని గూర్చి మీకు చెప్పాను.

**అశౌచం చానుపూర్వేణ యతీనాం నైవ విద్యతే ।**
**త్రేతాప్రభృతి నారీణాం మాసి మాస్యార్తవం ద్విజాః ॥93॥**

**కృతే సకృద్యుగవశాజ్జాయంతే వై సహైవ తు ।**
**ప్రయాంతి చ మహాభాగా భార్యాభిః కురవో యథా ॥94॥**

ఇంతకుముందు చెప్పిన విధంగా యతులకు అశౌచముండదు. ఓ ద్విజులారా! త్రేతాదులైన యుగాలలో స్త్రీలకు ప్రతిమాసంలోను రజోధర్మం (రజస్వల) కలుగుతుంది. యుగప్రకృతి ప్రకారం కృతయుగంలో పురుషుడు ఒకసారి మాత్రమే స్త్రీ సంగమం కలిగి యుండి సంతానాన్ని పొందుతున్నాడు. ఈ విధంగా భాగ్యశాలురైన వారు కురువర్ష నివాసానికై (ఆశ్రమవాసానికి) వెళుతున్నారు.

**వర్ణాశ్రమవ్యవస్థా చ త్రేతాప్రభృతి సువ్రతాః ।**
**భారతే దక్షిణే వర్షే వ్యవస్థా నేతరేష్వథ ॥95॥**

**మహావీతే సువీతే చ జంబూద్వీపే తథాష్టసు ।**
**శాకాద్వీపాదిషు ప్రోక్తా ధర్మో వై భారతే యథా ॥96॥**

భారతవర్షం యొక్క దక్షిణభాగంలో వర్ణాశ్రమధర్మవ్యవస్థ త్రేతాయుగం నుంచి ఉంది. ఈ వ్యవస్థ దీనికి భిన్నమైన కింపురుషాదులైన ఎనిమిది వర్షాలలో అట్లే మహావీతంలో, సువీతంలోనూ లేదు. శాకాద్వీపం మొదలైన ద్వీపాలలో భారతవర్షంతో సమానమైన వర్ణాశ్రమధర్మం ఉన్నది.

**రసోల్లాసా కృతే వృత్తిస్త్రేతాయాం గృహవృక్షజా ।**
**సైవార్తవకృతాద్దోషాద్రాగద్వేషాదిభిర్నృణామ్ ॥97॥**

**మైథునాత్కామతో విప్రాస్తథైవ పురుషాదిభిః ।**
**యవాద్యాః సంప్రజాయంతే గ్రామ్యారణ్యాశ్చతుర్దశ ॥98॥**

**ఓషధ్యశ్చ రజోదోషాః స్త్రీణాం రాగాదిభిర్నృణామ్ ।**
**అకాలకృష్టా విధ్వస్తాః పునరుత్పాదితాస్తథా ॥99॥**

**తస్మాత్సర్వప్రయత్నేన న సంభాష్యా రజస్వలా ।**

కృతయుగంలో మానవుల వృత్తి (జీవనం) రససేవనంతో కూడి యున్నది. త్రేతాయుగంలో గృహం, వృక్షం మొదలైనవాటిని ఆధారం చేసుకుని మానవ జీవనం ఉన్నది. అదే వృత్తి (జీవనం) తర్వాత కాలంలో రజోదోషకారణంగా మానవుల రాగద్వేషాల్ని ఆధారం చేసుకున్నది. ఓ విప్రులారా! కాలవశంగా స్త్రీ సంగమం, క్రోధం మొదలైన దోషాల కారణంగా పారుతున్నది. బార్లీ, యవలు మొదలైన వాటితో హవిష్యాన్నం, ఔషధాలు, పధ్నాలుగు రకాలైన గ్రామానికి, అరణ్యానికి చెందిన పదార్థాలు ఉత్పన్నాలు అయ్యాయి. అవి అకాలంలో నశించి మరల పుట్టుతున్నాయి. కావున గట్టి ప్రయత్నంతో రజస్వల అయిన స్త్రీతో మాటలాడరాదు.

**ప్రథమేఽహని చాండాలీ యథా వర్జ్యా తథాంగనా ॥100॥**

**ద్వితీయేఽహని విప్రా హి యథా వై బ్రహ్మఘాతినీ ।**
**తృతీయేఽహ్ని తదర్ధేన చతుర్థేఽహని సువ్రతాః ॥101॥**

**స్నాత్వార్ధమాసాత్సంశుద్ధా తతః శుద్ధిర్భవిష్యతి ।**
**ఆషోడశాత్తతః స్త్రీణాం మూత్రవచ్ఛౌచమిష్యతే ॥102॥**

రజస్వల అయిన స్త్రీని మొదటిరోజున చండాలస్త్రీవలె విడిచి పెట్టాలి. ఓ విప్రులారా! రెండో రోజున బ్రహ్మ హత్యాపాతకికి సమానమైనది అవుతుంది. మూడోరోజు ముందు చెప్పిన పాపంలో సగం పాపం గలది అవుతుంది. ఓ సువ్రతులారా! నాల్గో రోజున స్నానం చేసి నెలలో సగం కాలం వరకు దేవపూజాదుల్ని చేయడానికి శుద్ధి పొందుతుంది. ఐదో రోజు నుంచి పదహారవ రోజువరకూ రజోదోషం ఉండే కారణంగా, స్త్రీ స్పర్శ మొదలైన వాటి శుద్ధి, మూత్రం వదిలిన తర్వాత జననాంగాల్ని ఎలా శుద్ధి పర్చుకుంటారో ఆ విధంగానే చేసుకోవాలి. తర్వాతనే ఆమెకు పూర్ణశుద్ధి జరుగుతుంది.

**పంచరాత్రం తథా స్పృశ్యా రజసా వర్తతే యది ।**
**సా వింశద్దివసాదూర్ధ్వం రజసా పూర్వవత్తథా ॥103॥**

అయిదో రాత్రివరకు రజోదోషంతో ఉన్న స్త్రీని తాకరాదు. ఇరవయ్యో రోజు తర్వాత కూడా రజోదోషంతో కూడి ఉంటే ఆ స్త్రీ తాకరానిదే.

**స్నానం శౌచం తథా గానం రోదనం హసనం తథా ।**
**యానమభ్యంజనం నారీ ద్యూతం చైవానులేపనమ్ ॥104॥**

**దివాస్వప్నం విశేషేణ తథా వై దంతధావనమ్ ।**
**మైథునం మానసం వాపి వాచికం దేవతార్చనమ్ ॥105॥**

**వర్జయేత్సర్వయత్నేన నమస్కారం రజస్వలా ।**
**రజస్వలాంగనా స్పర్శసంభాషే చ రజస్వలా ॥106॥**

**సంత్యాగం చైవ వస్త్రాణాం వర్జయేత్సర్వయత్నతః ।**
**స్నాత్వాన్యపురుషం నారీ న స్పృశేత్తు రజస్వలా ॥107॥**

**ఈక్షయేద్భాస్కరం దేవం బ్రహ్మకూర్చం తతః పిబేత్ ।**
**కేవలం పంచగవ్యం వా క్షీరం వా చాత్మశుద్ధయే ॥108॥**

రజస్వల అయిన స్త్రీ ఈ క్రింది వాటిని గట్టి ప్రయత్నంతో త్యజించాలి. స్నానం, శౌచం, గానం, రోదనం, నవ్వడం, ఎగతాళి చేయడం, ఎక్కడికైనా వెళ్లడం, అభ్యంజనం, జూదం, మైపూత, పగటినిద్ర, పండ్లు తోమడం, మైథునం, మానసికంగాను, వాచికంగాను దేవుణ్ణి పూజించడం, నమస్కరించడం మొదలైనవి. ఒక రజస్వల మరో రజస్వలను తాకరాదు. మాట్లాడరాదు. కట్టిన వస్త్రాన్ని కూడా మార్చరాదు. రజస్వల స్నానం చేసిన తర్వాత పరపురుషుణ్ణి తాకరాదు. తన భర్త దగ్గర లేకుంటే సూర్యుణ్ణి చూడాలి. తర్వాత ఆత్మశుద్ధికోసం బ్రహ్మ కూర్చంగాని, కేవలం పంచగవ్యాన్నిగాని, పాలను గాని త్రాగాలి.

**చతుర్థ్యా స్త్రీ న గమ్యా తు గతోఽల్పాయుః ప్రసూయతే ।**
**విద్యాహీనం వ్రతభ్రష్టం పతితం పారదారికమ్ ॥109॥**

**దారిద్ర్యార్ణవమగ్నం చ తనయం సా ప్రసూయతే ।**
**కన్యార్థినైవ గంతవ్యా పంచమ్యాం విధివత్పునః ॥110॥**

**రక్తాధిక్యాద్భవేన్నారీ శుక్రాధిక్యే భవేత్పుమాన్ ।**
**సమే నాపుంసకం చైవ పంచమ్యాం కన్యకా భవేద్ ॥111॥**

**షష్ఠ్యాం గమ్యా మహాభాగా సత్పుత్రజననీ భవేత్ ।**
**పుత్రత్వం వ్యంజయేత్తస్య జాతపుత్రో మహాద్యుతిః ॥112॥**

**పుమితి నరకస్యాఖ్యా దుఃఖం చ నరకం విదుః ।**
**పుంసస్త్రాణాన్వితం పుత్రం తథాభూతం ప్రసూయతే ॥113॥**

రజస్వల అయిన స్త్రీ నాల్గోరోజు సంగమానికి యోగ్యం కాదు. ఆనాడు సంగమించిన స్త్రీ నష్టుడు, అల్పాయుష్కుడు అయిన పుత్రుణ్ణి కంటున్నది. అంతేకాక అలాంటి స్త్రీ విద్యావిహీనుణ్ణి, వ్రతభ్రష్టుణ్ణి, పతితుణ్ణి, అన్యస్త్రీవిషయంగా దురాచారం చేసేవాణ్ణి, దారిద్ర్యసముద్రంలో మునిగేవాడిని కంటున్నది. పుత్రిక కావాలనుకువే వాళ్లు అయిదో రోజు స్త్రీతో సంగమించాలి. రక్తాధిక్యం (శోణితం) ఉంటే కన్య అవుతుంది. శుక్రాధిక్యం ఉంటే పుత్రుడు అవుతాడు. శుక్రశోణితాలు రెండూ సమానం అయితే నపుంసకులు పుడతారు. ఐదోదినం సంగమంలో స్త్రీ పుడుతుంది. ఆరవరోజున సంగమించిన భాగ్యవతి అయిన స్త్రీ ఉత్తముడైన పుత్రుణ్ణి కంటున్నది. ఆమె పుత్రత్వాన్ని ప్రకటిస్తుంది. ఆమెకు పుట్టిన పుత్తుడు మహాతేజస్వి అవుతున్నాడు. “పుం” అనేది ఒక నరకానికి పేరు. అందులో సంపూర్ణంగా దుఃఖం ఉంటుంది. ఆరవరోజు స్త్రీ ‘పుం’ అనే నరకాన్నించి రక్షించే పుత్రుణ్ణి కంటున్నది.

**సప్తమ్యాం చైవ కన్యార్థీ గచ్ఛేత్సైవ ప్రసూయతే ।**
**అష్టమ్యాం సర్వసంపన్నం తనయం సంప్రసూయతే ॥114॥**

**నవమ్యాం దారికాయార్థీ దశమ్యాం పండితో భవేత్ ।**
**ఏకాదశ్యాం తథా నారీం జనయేత్సైవపూర్వవత్ ॥115॥**

**ద్వాదశ్యాం ధర్మతత్త్వజ్ఞం శ్రౌతస్మార్తప్రవర్తకమ్ ।**
**త్రయోదశ్యాం జడాం నారీం సర్వసంకరకారిణీమ్ ॥116॥**

**జనయత్యంగనా యస్మాన్న గచ్ఛేత్సర్వయత్నతః ।**
**చతుర్దశ్యాం యదా గచ్ఛేత్సా పుత్రజననీ భవేత్ ॥117॥**

**పంచదశ్యాం చ ధర్మిష్ఠాం షోడశ్యాం జ్ఞానపారగమ్ ।**

కన్య కావాలనేవాళ్లు ఏడవరోజు రాత్రి సంగమించాలి. ఎనిమిదో రోజు రాత్రి సంగమిస్తే సర్వగుణసంపన్నుడైన పుత్రుడికి జన్మనిస్తుంది. కన్యార్థి తొమ్మిదోరోజు రాత్రి సంగమించాలి. పదోరోజు అయితే విద్వాంసుడైన పుత్రుడు పుడతాడు. పదకొండో రోజు అయితే స్త్రీ కలుగుతుంది. పండ్రెండో రోజున సంగమిస్తే ధర్మతత్త్వవేత్త, శ్రుతిస్మృతి ధర్మాచరణుడు అయిన పుత్రుడు కలుగుతున్నాడు. పదమూడోరోజు రాత్రి అయితే మూర్ఖురాలు, వర్ణసంకరం కలిగించే కన్య పుట్టుతుంది. అందుచేత గట్టిగా ప్రయత్నించి ఈ దినంలో సంగమాన్ని మానాలి. పధ్నాలుగో రోజు అయితే పుత్రుణ్ణి కంటుంది. పదిహేనో రోజున ధర్మనిష్ఠ అయిన పుత్రిక కలుగుతుంది. పదహారో రోజు రాత్రి కలిస్తే జ్ఞానపారంగతుడైన పుత్రుడు జన్మిస్తాడు.

**స్త్రీణాం వై మైథునే కాలే వామపార్శ్వే ప్రభంజనః ॥118॥**

**చరేద్యది భవేన్నారీ పుమాంసం దక్షిణే లభేత్ ।**
**స్త్రీణాం మైథునకాలే తు పాపగ్రహవివర్జితే ॥119॥**

**ఉక్తకాలే శుచిర్భూత్వా శుద్ధాం గచ్ఛేచ్ఛుచిస్మితామ్ ।**

మైథునసమంలో స్త్రీకి ఎడమభాగంలో వాయువు ప్రవహిస్తే అప్పుడు కన్య పుడుతుంది. కుడి వైపున వాయువు ప్రవహిస్తే పుత్రుడు జన్మిస్తాడు. పాపగ్రహప్రభావం లేని సమయంలో స్త్రీ సంగమం చేయాలి. పుణ్యగ్రహసంచారం ఉన్నప్పుడే పవిత్రుడై శుచిస్మిత అయిన భార్యను పొందాలి.

**ఇత్యేవం సంప్రసంగేన యతీనాం ధర్మసంగ్రహే ॥120॥**

**సర్వేషామేవ భూతానాం సదాచారః ప్రకీర్తితః ।**
**యః పఠేచ్ఛృణుయాద్వాపి సదాచారం శుచిర్నరః ॥121॥**

**శ్రావయేద్వా యథాన్యాయం బ్రాహ్మణాన్ దగ్ధకిల్బిషాన్ ।**
**బ్రహ్మలోకమనుప్రాప్య బ్రహ్మణా సహ మోదతే ॥122॥**

ఈ విధంగా నేను యతులకు ధర్మసంగ్రహంగా, ప్రసంగపూర్వకంగా అన్ని ప్రాణులకు సంబంధించిన సదాచారవర్ణన చేశాను. ఏమానవుడు పవిత్రుడై ఈ సదాచారాన్ని విధిపూర్వకంగా పఠిస్తాడో, వింటాడో, దగ్ధపాపులైన బ్రాహ్మణులకు విన్పిస్తాడో ఆతడు బ్రహ్మలోకానికి చేరి, బ్రహ్మ సమక్షంలో ఆనందిస్తాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే సదాచారకథనం నామైకోననవతితమోఽధ్యాయః ॥ 89 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని సదాచారకథనమనే ఎనబై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## **నవతితమోఽధ్యాయః** - తొంబైయవ అధ్యాయం

## **యతిప్రాయశ్చిత్తమ్** - యతిప్రాయశ్చిత్తం

**సూత ఉవాచ** - సూతర్షి పలికాడు.

**అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి యతీనామిహ నిశ్చితమ్ ।**
**ప్రాయశ్చిత్తం శివప్రోక్తం యతీనాం పాపశోధనమ్ ॥1॥**

తర్వాత నేను యతులకు చెందిన నిర్ణయింపబడిన ప్రాయశ్చిత్త విషయాల్ని చెబుతాను. శివభగవానుడు చెప్పిన ఈ ప్రాయశ్చిత్తవిధి యతుల పాపాల్ని నశింపజేస్తుంది.

**పాపం హి త్రివిధం జ్ఞేయం వాఙ్మనఃకాయసంభవమ్ ।**
**సతతం హి దివా రాత్రౌ యేనేదం వేష్ట్యతే జగత్ ॥2॥**

**తత్కర్మణా వినాప్యేష తిష్ఠతీతి పురా శ్రుతిః ।**
**క్షణమేవ ప్రయోజ్యం తు ఆయుష్యం తు విధారణమ్ ॥3॥**

**భవేద్యోగోఽప్రమత్తస్య యోగో హి పరమం బలమ్ ।**
**న హి యోగాత్పరం కించిన్నరాణాం దృశ్యతే శుభమ్ ॥4॥**

**తస్మాద్యోగం ప్రశంసంతి ధర్మయుక్తా మనీషిణః ।**
**అవిద్యాం విద్యయా జిత్వా ప్రాప్యైశ్వర్యమనుత్తమమ్ ॥5॥**

**దృష్ట్వా పరావరం ధీరాః పరం గచ్ఛంతి తత్పదమ్ ।**

మనస్సు, వాక్కు, శరీరం వీటివల్ల కలిగే పాపాలు మూడు విధాలు. వీటిద్వారా రాత్రింబవళ్లు నిరంతరంగా ఈ జగత్తు వ్యాపించి ఉన్నది. మునుల కర్మ లేకుండా కూడా జగత్తు నిలిచి ఉంటున్నది. ఇది ఉపనిషద్వాక్యం. ప్రతిక్షణం యోగంతో ప్రయుక్త పర్చాలి. ఎందుకంటే ఆయువు మిక్కిలి చంచలం. ప్రమాదరాహిత్యానికై యోగం అవసరం అవుతుంది. యోగమే మహాబలమైనది. యోగాన్ని మించి మానవులకు శుభకరమైనది మరొకటి లేదు. అందుచేతనే ధర్మాత్ములు, విద్వాంసులైన మానవులు యోగాన్ని ప్రశంసిస్తున్నారు. విద్య వల్ల అవిద్యను గెలిచి అత్యుత్తమమైన ఐశ్వర్యాన్ని పొంది, బ్రహ్మమాయావిలాసాన్ని విచారించి ధీరమానవులు పరమపదాన్ని ప్రాప్తించుకుంటున్నారు.

**వ్రతాని యాని భిక్షూణాం తథైవోపవ్రతాని చ ॥6॥**

**ఏకైకాతిక్రమే తేషాం ప్రాయశ్చిత్తం విధీయతే ।**
**ఉపేత్య తు స్త్రియం కామాత్ప్రాయశ్చిత్తం వినిర్దిశేత్ ॥7॥**

**ప్రాణాయామసమాయుక్తం చరేత్సాంతపనం వ్రతమ్ ।**
**తతశ్చరతి నిర్దేశాత్కృచ్ఛ్రం చాంతే సమాహితః ॥8॥**

**పునరాశ్రమమాగత్య చరేద్భిక్షురతంద్రితః ।**

యతులకు నిర్దేశించిన వ్రతాలు, ఉపవ్రతాలు వాటిని ఉల్లంఘిస్తే ప్రత్యేకమైన ప్రాయశ్చిత్తవిధానం ఉన్నది. గృహస్థుడు కూడా కామంతో స్త్రీ సంగమం చేస్తే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. యతులు ప్రాణాయామంతో కూడిన సాంతపన వ్రతాన్ని నిర్వహించాలి. తర్వాత ఏకాగ్రచిత్తంతో నియమానుసారంగా కృచ్ఛ్రవ్రతాన్ని చేయాలి. అనంతరం ఆలసించకుండా ఆశ్రమానికి వచ్చి యతి (భిక్షుక) ఆచారాలను నిర్వహిస్తూ ఉండాలి.

**న ధర్మయుక్తమనృతం హినస్తీతి మనీషిణః ॥9॥**

**తథాపి న చ కర్తవ్యం ప్రసంగో హ్యేష దారుణః ।**
**అహోరాత్రోపవాసశ్చ ప్రాణాయామశతం తథా ॥10॥**

**అసద్వాదో న కర్తవ్యో యతినా ధర్మలిప్సునా ।**
**పరమాపద్గతేనాపి న కార్యం స్తేయమప్యుత ॥11॥**

**స్తేయాదభ్యధికః కశ్చిన్నాస్త్యధర్మ ఇతి శ్రుతిః ।**
**హింసా హ్యేషా పరా సృష్టా స్తైన్యం వై కథితం తథా ॥12॥**

**యదేతద్ద్రవిణం నామ ప్రాణా హ్యేతే బహిశ్చరాః ।**
**స తస్య హరతే ప్రాణాన్ యో యస్య హరతే ధనమ్ ॥13॥**

**ఏవం కృత్వా సుదుష్టాత్మా భిన్నవృత్తో వ్రతాచ్చ్యుతః ।**
**భూయో నిర్వేదాపన్నశ్చరేచ్చాంద్రాయణం వ్రతమ్ ॥14॥**

**విధినా శాస్త్రదృష్టేన సంవత్సరమితి శ్రుతిః ।**
**తతః సంవత్సరస్యాంతే భూయః ప్రక్షీణకల్మషః ।**
**పునర్నిర్వేదమాపన్నశ్చరేద్భిక్షురతంద్రితః ॥15॥**

ధర్మయుక్తమైన అసత్యం చేత ఎవ్వరూ బాధింపబడరని విద్వాంసులు చెప్పుతున్ననూ దాన్ని అనుసరించడం సరి అయినది కాదు. ఈ అసత్యప్రసంగం భయంకరమైనది. అసత్యప్రసంగం జరిగితే మాత్రం ఒక పగలు, ఒక రాత్రి ఉపవాసముండడం, నూరుసార్లు ప్రాణాయామం చేయడం అందుకు ప్రాయశ్చిత్తం. ధర్మేచ్ఛగలిగిన వ్యక్తిని గూర్చి అనుచితమైన మాటలు పలకరాదు. పెద్ద పెద్ద ఆపదలు కలిగినా దాన్ని నివారించుకోవడానికై దొంగతనం చేయరాదు. దొంగతనం కన్నా మించిన అధర్మం వేరొక్కటి లేదని శ్రుతివాక్యం. చోరత్వం ప్రాణవధలో గల హింసతో సమానమైనది. ద్రవ్యమనేది మానవులకు బహిఃప్రాణాలు. ఎవడు పరుల ధనాన్ని హరిస్తాడో ఆతడు వారి ప్రాణాల్ని హరించినవాడే అవుతాడు. దొంగతనం చేసిన వ్యక్తి అత్యంత దుష్టమైన మనసుగలవాడు,

ఆచారరహితుడైనవాడు, వ్రతచ్యుతుడైనవాడు అవుతున్నాడు. ఆతడు మరల వైరాగ్యవంతుడై శాస్త్రోక్తప్రకారం ఒక సంవత్సరం చాంద్రాయణవ్రతం నిర్వహించాలి. ఇది శ్రుతివాక్యం. సంవత్సరాంతానికి ఆతడు పాపరహితుడవుతున్నాడు. తర్వాత ఆతడు వైరాగ్యయుక్తుడై ఆలసించకుండా సదాచారాన్ని నిర్వర్తించాలి.

**అహింసా సర్వభూతానాం కర్మణా మనసా గిరా ।**
**అకామాదపి హింసేత యది భిక్షుః పశూన్ కృమీన్ ॥16॥**

**కృచ్ఛ్రాతికృచ్ఛ్రం కుర్వీత చాంద్రాయణమథాపి వా ।**
**స్కందేదింద్రియదౌర్బల్యాత్ స్త్రియం దృష్ట్వా యతిర్యది ॥17॥**

**తేన ధారయితవ్యా వై ప్రాణాయామాస్తు షోడశ ।**
**దివా స్కన్నస్య విప్రస్య ప్రాయశ్చిత్తం విధీయతే ॥18॥**

**త్రిరాత్రముపవాసాచ్చ ప్రాణాయామశతం తథా ।**
**రాత్రౌ స్కన్నః శుచిః స్నాత్వా ద్వాదశైవ తు ధారణాః ॥19॥**

**ప్రాణాయామేన శుద్ధాత్మా విరజా జాయతే ద్విజాః ।**

సమస్తప్రాణుల విషయంలోనూ మనోవాక్కాయకర్మలతో అహింసాభావాన్ని కలిగి ఉండాలి. అపకారం చేయాలనే కోరిక లేకుండానే పశువులను, క్రిమికీటకాలను హింసించినట్లైతే మిక్కిలి దుఃఖకరమైన స్థితి పొందుతాడు. దాని నివారణకై చాంద్రాయణవ్రతం నిర్వహించాలి. స్త్రీని చూచి యింద్రియ దుర్బలత్వంతో యతికి వీర్యం స్ఖలితమైతే ఆతడు పదహారుసార్లు ప్రాణాయామం చేయాలి. పగటిపూట వీర్యస్ఖలనమైన విప్రుడికి మూడురాత్రుల ఉపవాసం, నూరుసార్లు ప్రాణాయామం చేయడం ప్రాయశ్చత్త విధి. రాత్రి స్ఖలనం అయితే స్నానం చేసి పండ్రెండు సార్లు ప్రాణాయామం చేయాలి. అప్పుడు పరిశుద్ధుడవుతాడు. ఓ ఋషులారా! ప్రాణాయామం ద్వారా విప్రులు శుద్ధ మనస్కులు, పాపరహితులు అవుతున్నారు.

**ఏకాన్నం మధుమాంసం వా అశృతాన్నం తథైవ చ ॥20॥**

**అభోజ్యాని యతీనాం తు ప్రత్యక్షలవణాని చ ।**
**ఏకైకాతిక్రమణాత్తేషాం ప్రాయశ్చిత్తం విధీయతే ॥21॥**

**ప్రాజాపత్యేన కృచ్ఛ్రేణ తతః పాపాత్ప్రముచ్యతే ।**
**వ్యతిక్రమాశ్చ యే కేచిద్వాఙ్మనఃకాయసంభవాః ॥22॥**

**సద్భిః సహ వినిశ్చిత్య యద్ బ్రూయుస్తత్సమాచరేత్ ॥23॥**

ఏకవ్యక్తి వలన లభించిన అన్నం, మధువు, మాంసం, వండని భోజనం, అట్లే ప్రత్యక్ష లవణం – ఇవి అన్నీ యతుల విషయంలో భుజింపరానివి. వీటిల్లో ఏ ఒక్కదాన్ని ఎవడు ఉల్లంఘించినా ఆతడు ప్రాయశ్చిత్తార్హుడు.

కష్టమైన ప్రాజాపత్యవ్రతం ద్వారా ఆతడు (యతి) పాపవిముక్తుడవుతున్నాడు. మనోవాక్కాయకర్మల మూలంగా యతి ఆచారాన్ని అతిక్రమిస్తే, అప్పుడు సత్పురుషుల సమక్షంలో ప్రాయశ్చిత్త నిర్ణయం జరిగి వాళ్లు ఏమి చెబుతారో దాన్ని నిర్వహించాలి.

**చరేద్ధి శుద్ధః సమలోష్ఠకాంచనః సమస్తభూతేషు చ సత్యమాహితః ।**
**స్థానం ధ్రువం శాశ్వతమవ్యయం తు పరం హి గత్వా న పునర్హి జాయతే ॥24॥**

ఎవడు శుద్ధమైన మనసుతో మట్టి పెళ్లను బంగారాన్ని సమానభావంతో చూస్తూ, ప్రాణులందరిలో బ్రహ్మ యొక్క చింతన చేస్తూ ఉన్నాడో ఆతడు స్థిరమైన, శాశ్వతమైన అవినాశి అయిన పరమధామాన్ని చేరి పునర్జన్మ లేకుండా ఉంటున్నాడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే యతిప్రాయశ్చిత్తం నామ నవతితమోఽధ్యాయః ॥ 90 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని యతిప్రాయశ్చిత్తమనే తొంబైయవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **ఏకనవతితమోऽధ్యాయః** - తొంబై ఒకటవ అధ్యాయం

## **అరిష్టకథనమ్** - అరిష్టకథనం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి అరిష్టాని నిబోధత ।**
**యేన జ్ఞానవిశేషేణ మృత్యుం పశ్యంతి యోగినః ॥1॥**

ఓ ఋషులారా! ఇక మీద నేను అరిష్టాల్ని గూర్చి చెబుతాను. ఏ విశేషజ్ఞానంతో యోగులు మృత్యువును చూస్తున్నారో ఆ విషయాల్ని తెలియండి!

**అరుంధతీం ధ్రువం చైవ సోమచ్ఛాయాం మహాపథమ్ ।**
**యో న పశ్యేన్న జీవేత్స నరః సంవత్సరాత్పరమ్ ॥2॥**

**అరశ్మిమంతమాదిత్యం రశ్మిమంతం చ పావకమ్ ।**
**యః పశ్యతి న జీవేద్వై మాసాదేకాదశాత్పరమ్ ॥3॥**

**వమేన్మూత్రం పురీషం చ సువర్ణం రజతం తథా ।**
**ప్రత్యక్షమథవా స్వప్నే దశమాసాన్న జీవతి ॥4॥**

**రుక్మవర్ణం ద్రుమం పశ్యేత్ గంధర్వనగరాణి చ ।**
**పశ్యేత్ప్రేతపిశాచాంశ్చ నవమాసాన్ స జీవతి ॥5॥**

**అకస్మాచ్చ భవేత్స్థూలో హ్యకస్మాచ్చ కృశో భవేత్ ।**
**ప్రకృతేశ్చ నివర్తేత చాష్టౌ మాసాంశ్చ జీవతి ॥6॥**

ఏ మానవుడు అరుంధతీ నక్షత్రాన్ని, ధ్రువనక్షత్రాన్ని, సోమచ్ఛాయను, ఆకాశగంగామార్గాన్ని చూడలేకున్నాడో ఆ మానవుడు ఒక సంవత్సరానికన్నా ఎక్కువ జీవించడు. ఎవడు కిరణరహితుడైన సూర్యుణ్ణి, కిరణసహితుడైన అగ్నిని చూస్తున్నాడో ఆతడు మాసంలో ఏకాదశి కన్నా (11రోజులు) ఎక్కువ బ్రతకడు. ఎవడు ప్రత్యక్షంగాగాని స్వప్నంలోగాని మూత్రాన్ని, మలాన్ని, బంగారాన్ని, వెండిని కక్కుతాడో ఆతడు పది మాసాలకు మించి బ్రతకడు. ఎవడు స్వప్నంలో బంగారువర్ణంగల వృక్షాన్ని, గంధర్వనగరాలను, ప్రేత పిశాచాల్ని చూస్తాడో ఆతడు తొమ్మిది మాసాలే జీవిస్తున్నాడు. ఉన్నట్టుండి లావైనా, చిక్కిపోయినా, తన స్వభావానికి దూరమైనా ఆతడు ఎనిమిది నెలలు మాత్రమే జీవిస్తున్నాడు.

**అగ్రతః పృష్ఠతో వాపి ఖండం యస్య పదం భవేత్ ।**
**పాంశుకే కర్దమే వాపి సప్తమాసాన్ స జీవతి ॥7॥**
**కాకః కపోతో గృధ్రో వా నిలీయేద్యస్య మూర్ధని ।**
**క్రవ్యాదో వా ఖగో యస్య షణ్మాసాన్నాతివర్తతే ॥8॥**

**గచ్ఛేద్వాయసపంక్తీభిః పాంసువర్షేణ వా పునః ।**
**స్వచ్ఛాయాం వికృతాం పశ్యేచ్చతుఃపంచ చ జీవతి ॥9॥**

**అనభ్రే విద్యుతం పశ్యేద్దక్షిణాం దిశమాస్థితామ్ ।**
**ఉదకే ధనురైంద్రం వా త్రీణి ద్వౌ వా స జీవతి ॥10॥**

ఎవడి పాదాల ఆకారం దుమ్ములోగాని, బురదలోగాని, ముందువైపుగాని, వెనుకవైపుగాని ఖండింపబడినట్లు కన్పిస్తే ఆతడు ఏడుమాసాల వరకు జీవిస్తున్నాడు. ఎవడి తలమీద కాకి, కపోతం, గ్రద్ద, అట్లే, మాంసభక్షణం చేయు ఇతర పక్షి కూర్చుంటుందో ఆతడు ఆరుమాసాలకన్నా ఎక్కువ బ్రతకడు. ఎవడు కాకుల వరసను అనుసరించి వెళతాడో, ధూళివర్షంతోపాటు వెళతాడో, తన నీడను వికృతంగా చూస్తాడో ఆతడు నాలుగైదు మాసాలవరకే జీవిస్తున్నాడు. ఎవడు దక్షిణదిక్కులో నిలిచి మేఘరహితమైన ఆకాశంలో మెరుపును చూస్తాడో, అట్లే నీటిలో ఇంద్రధనుస్సును చూస్తాడో ఆతడు రెండు మూడు మాసాల కన్నా ఎక్కువ జీవించకున్నాడు.

**అప్సు వా యది వా దర్శే యో హ్యాత్మానం న పశ్యతి ।**
**అశిరస్కం తథా పశ్యేన్మాసాదూర్ధ్వం న జీవతి ॥11॥**

**శవగంధి భవేద్ గాత్రం వాసాగంధమథాపి వా ।**
**మృత్యుర్హ్యుపాగతస్తస్య అర్ధమాసాన్న జీవతి ॥12॥**

**యస్య వై స్నాతమాత్రస్య హృదయం పరిశుష్యతి ।**
**ధూమం వా మస్తకాత్పశ్యేద్దశాహాన్న స జీవతి ॥13॥**

ఎవడు నీళ్లలోగాని అద్దంలోగాని తన ప్రతిబింబాన్ని దర్శింపకున్నాడో, మరియు తనను శిరసు లేనివాడిగా చూస్తున్నాడో ఒక నెలకన్నా ఎక్కువ జీవించలేడు. ఎవడి శరీరం శవం వాసన వస్తుందో, అట్లే వసవాసన వస్తుందో ఆతడికి మృత్యువు సమీపిస్తున్నది. అట్టివాడు పక్షం కన్నా ఎక్కువ జీవింపలేడు. స్నానం చేసిన వెంటనే ఎవడి హృదయం క్షీణించి పోతుందో, లేక శిరసుమీద ధూమం కన్పిస్తుందో ఆతడు పదిరోజులకన్నా ఎక్కువ జీవించడు.

**సంభిన్నో మారుతో యస్య మర్మస్థానాని కృంతతి ।**
**అద్భిః స్పృష్టో న హృష్యేత తస్య మృత్యురుపస్థితః ॥14॥**

**ఋక్షవానరయుక్తేన రథేనాశాం చ దక్షిణామ్ ।**
**గాయన్నృత్యన్ వ్రజేత్స్వప్నే విద్యాన్మృత్యురుపస్థితః ॥15॥**

**కృష్ణాంబరధరా శ్యామా గాయంతీ వాఽప్యథాంగనా ।**
**యం నయేద్దక్షిణామాశాం స్వప్నే సోఽపి న జీవతి ॥16॥**

వాయుప్రవాహం ఎవడి మర్మస్థానాన్ని భేదిస్తుందో, ఎవడు నీటిని తాకి ఆనందించడో ఆతడికి మృత్యువు సమీపిస్తున్నదని తెలుసుకోవాలి. ఎవడు కలలో ఎలుగుబంటి, కోతులు కూడిన రథంలో దక్షిణదిక్కుకు ఆడుతూ పాడుతూ వెళతాడో ఆతడికి మృత్యువు సమీపంలోనే ఉన్నదని గుర్తించాలి. నల్లని వస్త్రాన్ని ధరించిన నల్లటిస్త్రీ పాడుతూ కలలో ఎవడిని దక్షిణదిక్కుకు తీసుకు పోతుందో ఆతడు జీవింపకున్నాడు.

**ఛిద్రం వా స్వస్య కంఠస్య స్వప్నే యో వీక్షతే నరః ।**
**నగ్నం వా శ్రమణం దృష్ట్వా విద్యాన్మృత్యుముపస్థితమ్ ॥17॥**

**ఆమస్తకతలాద్యస్తు నిమజ్జేత్పంకసాగరే ।**
**దృష్ట్వా తు తాదృశం స్వప్నం సద్య ఏవ న జీవతి ॥18॥**

**భస్మాంగారాంశ్చ కేశాంశ్చ నదీం శుష్కాం భుజంగమాన్ ।**
**పశ్యేద్యో దశరాత్రం తు న స జీవతి తాదృశః ॥19॥**

**కృష్ణైశ్చ వికటైశ్చైవ పురుషైరుద్యతాయుధైః ।**
**పాషాణైస్తాడ్యతే స్వప్నే యః సద్యో న స జీవతి ॥20॥**

ఏ మానవుడు కలలో తన కంఠం తెగినట్లు చూస్తాడో లేక నగ్నయతిని చూస్తాడో ఆతడు మృత్యువుకు సమీపంలో ఉన్నాడని తెలియాలి. ఎవడు కాళ్ల నుంచి శిరసు వరకు పంకసాగరంలో మునిగినట్లు తనను స్వప్నంలో చూచిన వెంటనే ఆతడు మరణిస్తున్నాడు. ఎవడు భస్మాన్ని, అగ్నిని, కేశాలనూ, ఎండిన నదిని, సర్పాలనూ కలలో చూస్తాడో పది రాత్రుల కన్నా ఎక్కువ ఆతడు బ్రతకడు. నల్లగాను, వికటంగాను గల పురుషులు ఎత్తిన ఆయుధాలతో, రాళ్లతో కొట్టినట్లుగా కలగన్న మానవుడు వెంటనే మరణిస్తున్నాడు.

**సూర్యోదయే ప్రత్యుషసి ప్రత్యక్షం యస్య వై శివా ।**
**క్రోశంత్యభిముఖం ప్రేత్య స గతాయుర్భవేన్నరః ॥21॥**

**యస్య వా స్నాతమాత్రస్య హృదయం పీడ్యతే భృశమ్ ।**
**జాయతే దంతహర్షశ్చ తం గతాయుషమాదిశేత్ ॥22॥**

**భూయో భూయస్త్రసేద్యస్తు రాత్రౌ వా యది వా దివా ।**
**దీపగంధం చ నాఘ్రాతి విద్యాన్మృత్యుముపస్థితమ్ ॥23॥**

**రాత్రౌ చేంద్రధనుః పశ్యేద్దివా నక్షత్రమండలమ్ ।**
**పరనేత్రేషు చాత్మానం న పశ్యేన్న స జీవతి ॥24॥**

సూర్యోదయసమయంలో ప్రాతఃకాలంలో ఎవడి ముందర ప్రత్యక్షంగా వచ్చి నక్కలు రోదిస్తాయో ఆతడికి ఆయువు ముగిసినట్లే. స్నానాంతరం వెంటనే ఎవడి హృదయం తీవ్రమైన బాధను పొందుతుందో, దంతాలు కంపిస్తాయో (కొట్టుకుంటాయో) ఆతడు పూర్తి అయిన ఆయువు గల వాడుగా గుర్తించాలి. ఎవడు పగలుగాని, రాత్రిగాని మాటిమాటికి భయపడుతుంటాడో, దీపనిర్వాణ గంధాన్ని ఆఘ్రాణించడో ఆతడు మృత్యువునకు దగ్గరగా ఉన్నాడని తెలియాలి. ఎవడు రాత్రి ఇంద్రచాపాన్ని, పగలు నక్షత్రాల్ని చూస్తాడో, ఇతరుల నేత్రాలలో తన ప్రతిబింబాన్ని చూడడో వాడు జీవించడు.

**నేత్రమేకం స్రవేద్యస్య కర్ణౌ స్థానాచ్చ భ్రశ్యతః ।**
**వక్రా చ నాసా భవతి విజ్ఞేయో గతజీవితః ॥25॥**

**యస్య కృష్ణా ఖరా జిహ్వా పద్మాభాసం చ వై ముఖమ్ ।**
**గండే వా పిండికారక్తే తస్య మృత్యురుపస్థితః ॥26॥**

**ముక్తకేశో హసంశ్చైవ గాయన్నృత్యంశ్చ యో నరః ।**
**యామ్యామభిముఖం గచ్ఛేత్తదంతం తస్య జీవితమ్ ॥27॥**

ఒక నేత్రం నుంచే నీరు స్రవిస్తున్నా, రెండు చెవులు తమ స్థానాలనుంచి జారినట్లూ, నాసిక వంగినట్లూ ఉన్నా ఆతడు మరణించినవాడుగా తెలియాలి. ఎవడి నాలుక నల్లబడిందో, పొడిబారిందో ముఖం పాండురవర్ణంగా మారిందో, చెక్కిళ్లు ఖర్జూరఫలాలుగా ఎఱ్ఱగా మారినాయో ఆతడిని మృత్యువు సమీపించినట్లే. ఏ మానవుడు కలలో విముక్తాలైన కేశాలతో నవ్వుతూ, పాడుతూ, నర్తిస్తూ దక్షిణదిక్కుకు వెళతాడో ఆతడి జీవితం ముగిసినట్లే.

**యస్య శ్వేతఘనాభాసా శ్వేతసర్షపసన్నిభా ।**
**శ్వేతా చ మూర్తిర్వ్యసకృత్తస్య మృత్యురుపస్థితః ॥28॥**

**ఉష్ట్రా వా రాసభా వాభియుక్తాః స్వప్నే రథే శుభాః ।**
**యస్య సోఽపి న జీవేత్తు దక్షిణాభిముఖో గతః ॥29॥**

**ద్వే వాథ పరమేఽరిష్టే ఏకీభూతః పరంభవేత్ ।**
**ఘోషం న శృణుయాత్కర్ణే జ్యోతిర్నేత్రే న పశ్యతి ॥30॥**

**శ్వభ్రే యో నిపతేత్స్వప్నే ద్వారం చాపి పిధీయతే ।**
**న చోత్తిష్ఠతి యః శ్వభ్రాత్తదంతం తస్య జీవితమ్ ॥31॥**

ఎవడి శరీరం తెల్లని మేఘవర్ణంతో సమానమో, మరియు తెల్లని ఆవాలతో సమానమో ఆతడికి మృత్యువు సమీపంలో ఉన్నది. కలలో రథం మీద అశుభాలైన ఒంటె, గాడిద కన్పించి అవి దక్షిణ దిక్కుకు వెళుతుంటే ఆతడు జీవించడని గుర్తించాలి. చెవులకు ధ్వని విన్పించకున్నా, కన్నులకు కాంతి కన్పించకున్నా – ఈ రెండు పెద్ద అరిష్టాలు స్వప్నంలో ఒకేసారి కల్గినా ఆతడు మృత్యువును పొందుతున్నాడు. ఎవడు కలలో గోతిలో పడి దాని నుంచి లేవలేకుండడం, దాని ద్వారం మూసి ఉండడం స్వప్నంలో చూస్తాడో ఆతడి జీవితం సమాప్తమయినట్లే.

**ఊర్ధ్వా చ దృష్టిర్న చ సంప్రతిష్ఠా రక్తా పునః సంపరివర్తమానా ।**
**ముఖస్య శోషః సుషిరా చ నాభిరత్యుష్ణమూత్రో విషమస్థ ఏవ ॥32॥**

ఎవడి దృష్టిపైకి తిరిగి స్థిరమవుతుందో, కన్ను ఎఱ్ఱబారుతుందో, మాటిమాటికి తిరుగుతుందో, ముఖం శుష్కించి పోతుందో, నాభి ఛిద్రమవుతుందో, మూత్రం ఎక్కువ వేడిగా మారుతుందో ఆతడు సంకటంలో ఉన్నట్లే. మృత్యువు దగ్గరబడినట్లే.

**దివా వా యది వా రాత్రౌ ప్రత్యక్షం యో నిహన్యతే ।**
**హంతారం న చ పశ్యేచ్చ స గతాయుర్న జీవతి ॥33॥**

**అగ్నిప్రవేశం కురుతే స్వప్నాంతే యస్తు మానవః ।**
**స్మృతిం నోపలభేచ్చాపి తదంతం తస్య జీవితమ్ ॥34॥**

**యస్తు ప్రావరణం శుక్లం స్వకం పశ్యతి మానవః ।**
**కృష్ణం రక్తమపి స్వప్నే తస్య మృత్యురుపస్థితః ॥35॥**

పగలు కానీ రాత్రి గానీ ఎవరిచేతనో చంపబడుతూ హంతకుని చూడలేనివాని జీవితం ముగిసినట్లే. కలలో అగ్నిలో ప్రవేశించి, కల ముగిసిన తర్వాత అది గుర్తులేని వాడి జీవితం సమాప్తమైనట్లే. ఎవడు తన తెల్లటి వస్త్రాన్ని నల్లనిదిగా, ఎఱ్ఱనిదిగా చూస్తాడో ఆతడికి మృత్యువు దగ్గర పడినట్లే.

**అరిష్టే సూచితే దేహే తస్మిన్ కాల ఉపస్థితే ।**
**త్యక్త్వా ఖేదం విషాదం చ ఉపేక్షేద్ బుద్ధిమాన్నరః ॥36॥**

దేహంలో ఏదైనా అరిష్టం కన్పిస్తే ఆతడికి కాలం సమీపించినట్లే. దుఃఖాన్ని, విషాదాన్ని విడిచిపెట్టి బుద్ధిమంతుడైనవాడు ఉపేక్ష వహిస్తాడు.

**ప్రాచీం వా యది వోదీచీం దిశం నిష్క్రమ్య వై శుచిః ।**
**సమేఽతిస్థావరే దేశే వివిక్తే జంతువర్జితే ॥37॥**

**ఉదఙ్ముఖః ప్రాఙ్ముఖో వా స్వస్థశ్చాచాంత ఏవ చ ।**
**స్వస్తికేనోపవిష్టస్తు నమస్కృత్వా మహేశ్వరమ్ ॥38॥**

**సమకాయశిరోగ్రీవో ధారయన్నావలోకయత్ ।**
**యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా ॥39॥**

పవిత్రుడై తూర్పులేక ఉత్తర దిక్కులకై సాగిపోయి జంతువులు లేని, ఏకాంతమైన సమతల ప్రదేశంలో ఆసీనుడై తూర్పు మరియు ఉత్తరదిక్కులవైపు ముఖాన్ని నిలిపి ఆచమించాలి. స్వస్తికముద్రయందు కూర్చొని మహేశ్వరుడికి నమస్కరించాలి. శరీరం, శిరస్సు, గ్రీవం- వీటిని సమంగా ఉంచాలి. ఎటువంటి చాంచల్యం లేకుండా స్థిరంగా ఉండాలి. ధారణసమయంలో దేనిని చూడరాదు. గాలి లేని స్థలంలో దీపం మాదిరిగా నిశ్చలంగా ఉండాలి.

**ప్రాగుదక్ప్రవణే దేశే తథా యుంజీత శాస్త్రవిత్ ।**
**కామం వితర్కం ప్రీతిం చ సుఖదుఃఖే ఉభే తథా ॥40॥**

**నిగృహ్య మనసా సర్వం శుక్లం ధ్యానమనుస్మరేత్ ।**
**ఘ్రాణే చ రసనే నిత్యం చక్షుషీ స్పర్శనే తథా ॥41॥**

**శ్రోత్రే మనసి బుద్ధౌ చ తత్ర వక్షసి ధారయేత్ ।**
**కాలకర్మాణి విజ్ఞాయ సమూహేష్వేవ నిత్యశః ॥42॥**

**ద్వాదశాధ్యాత్మమిత్యేవం యోగధారణముచ్యతే ।**
**శతమర్ధశతం వాపి ధారణాం మూర్ధ్ని ధారయేత్ ॥43॥**

**ఖిన్నస్య ధారణాయోగాద్వాయురూర్ధ్వం ప్రవర్తతే ।**
**తతశ్చాపూరయేద్దేహమోంకారేణ సమన్వితః ॥44॥**

**తథోంకారమయో యోగీ అక్షరే త్వక్షరీ భవేత్ ।**

శాస్త్రవేత్త అయిన వ్యక్తి పూర్వదిక్కుకుగాని ఉత్తరదిక్కుకుగాని తిరిగి విశాలస్థానంలో ధ్యానపరాయణుడు అవ్వాలి. ఆతడు కోరికలను, ఆలోచనలను, ఆసక్తిని, అట్లే సుఖదుఃఖాలను మనసులో నిగ్రహించుకుని సంపూర్ణమైన విశుద్ధమైన ధ్యానంలో లీనం కావాలి. కాలాన్ని కర్మల్ని ఎల్లప్పుడూ లింగశరీరం యొక్క అంతర్గతాలని తెలుసుకుని నాసిక, నాలుక, కన్ను, చర్మం, చెవి, మనసు, బుద్ధి వీటిని హృదయంలో ధరించాలి. ఈ విధంగా యోగధారణ 'ద్వాదశాధ్యాత్మ' నామకంగా నిలుస్తున్నది. నూరుసార్లుగాని ఏభైసార్లుగాని శిరసులో ధారణ చేయాలి. ధారణాభ్యాసం వల్ల ప్రశాంతుడైన యోగి యొక్క వాయువు పై వైపుకు ప్రసరిస్తుంది. అప్పుడు ఓంకారంతో కూడిన వాయువు శరీరాన్ని పూర్తిగా నింపుతుంది. ఈ విధంగా ఓంకారమయుడైన యోగి తనను బ్రహ్మలో లీనం చేసి బ్రహ్మసాయుజ్యాన్ని పొందుతున్నాడు.

**అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి ఓంకారప్రాప్తి లక్షణమ్ ॥45॥**

**ఏష త్రిమాత్రో విజ్ఞేయో వ్యంజనం చాత్ర చేశ్వరః ।**
**ప్రథమా విద్యుతీ మాత్రా ద్వితీయా తామసీ స్మృతా ॥46॥**

**తృతీయాం నిర్గుణాం చైవ మాత్రామక్షరగామినీమ్ ।**
**గాంధారీ చైవ విజ్ఞేయా గాంధారస్వరసంభవా ॥47॥**

**పిపీలికాగతిస్పర్శా ప్రయుక్తా మూర్ధ్ని లక్ష్యతే ।**
**యథా ప్రయుక్త ఓంకారః ప్రతినిర్యాతి మూర్ధని ॥48॥**

**తథోంకారమయో యోగీ త్వక్షరీ త్వక్షరీ భవేత్ ।**
**ప్రణవో ధనుః శరో హ్యాత్మా బ్రహ్మలక్షణముచ్యతే ॥49॥**

**అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్ ।**

ఓ ఋషులారా! తర్వాత నేను మీకు ఓంకారప్రాప్తిని గూర్చి చెప్పగలను. ఓంకారం మూడు మాత్రలు గలది. దీనిలో వ్యంజనంతో కూడిన 'మ'కారం ఈశ్వరుడు. ఇందులో మొదటిమాత్ర విద్యుతి. అంటే రాజసం. రెండవ మాత్ర తామసి (తామసం) మకారరూపమైన అక్షరగామిని అయిన మూడో మాత్ర సత్త్వగుణ రూపమైనది. ఇది 'గాంధారి' అనే పేరుగలది. ఎందుకంటే ఇది గాంధారస్వరంతో ఉత్పన్నమైనది. మరియు పిపీలికాగతి యొక్క స్పర్శకు సమానమైన సూక్ష్మమైన గతి గలది. కావున ఇది మూర్ధదేశంలో (పైభాగంలో) గుర్తింపబడ్డది. ఈ విధంగా ఉచ్చరించబడిన ఓంకారం మూర్ధదేశంలో తిరుగుతున్నది. ఈ విధంగా ఓంకారమయుడైన యోగి బ్రహ్మలో లీనమై బ్రహ్మసాయుజ్యాన్ని పొందుతున్నాడు. పరమేశ్వరుడిని తెలిపే ప్రణవం (ఓంకారం) ధనువు అవుతున్నది. ఈ జీవాత్మ బాణం. పరబ్రహ్మ పరమేశ్వరుడు ఆతడి లక్ష్యం. తత్పరతతో ఆతణ్ణి ఉపాసించే వ్యక్తి ప్రమాదరహితుడై ఆ లక్ష్యాన్ని తెలుసుకుంటున్నాడు. ఈ విధంగా ఆ లక్ష్యాన్ని తెలుసుకుని బాణం మాదిరి అందులో తన్మయం చెందాలి.

**ఓమిత్యేకాక్షరం హ్యేతద్ గుహాయాం నిహితం పదమ్ ॥50॥**

**ఓమిత్యేతత్ త్రయో లోకాస్త్రయో వేదాస్త్రయోఽగ్నయః ।**
**విష్ణుక్రమాస్త్రయస్త్వేతే ఋక్సామాని యజూంషి చ ॥51॥**

**మాత్రా చార్ధం చ తిస్రస్తు విజ్ఞేయాః పరమార్థతః ।**
**తత్ప్రయుక్తస్తు యో యోగీ తస్య సాలోక్యమాప్నుయాత్ ॥52॥**

'ఓమ్' అనే ఈ ఏకాక్షరపదం బుద్ధిలో (గుహ) నిలిచి ఉన్న పదం. మూడు లోకాలు, మూడు వేదాలు, మూడు అగ్నులు అట్లే విష్ణువు యొక్క మూడు పాదాలు – దీని యొక్క స్వరూపం. నిజానికి ఇది అర్ధమాత్రాత్మకమైనది అయినా మూడు మాత్రలుగలదిగా తెలియాలి. ఈ 'ఓమ్' కారాన్ని పొంది యున్న యోగి బ్రహ్మసాయుజ్యాన్ని పొందగలడు.

**అకారో హ్యక్షరో జ్ఞేయ ఉకారః సహితః స్మృతః ।**
**మకారసహితోంకారస్త్రిమాత్ర ఇతి సంజ్ఞితః ॥53॥**

**అకారస్త్వేష భూర్లోక ఉకారో భువ ఉచ్యతే ।**
**సవ్యంజనో మకారస్తు స్వర్లోక ఇతి గీయతే ॥54॥**

**ఓంకారస్తు త్రయో లోకాః శిరస్తస్య త్రివిష్టపమ్ ।**
**భువనాంగం చ తత్సర్వం బ్రాహ్మం తత్పదముచ్యతే ॥55॥**

**మాత్రాపాదో రుద్రలోకో హ్యమాత్రం తు శివం పదమ్ ।**
**ఏవం జ్ఞానవిశేషేణ తత్పదం సముపాస్యతే ॥56॥**

**తస్మాద్ధ్యానరతిర్నిత్యమమాత్రం హి తదక్షరమ్ ।**
**ఉపాస్యం హి ప్రయత్నేన శాశ్వతం సుఖమిచ్ఛతా ॥57॥**

అకారం అక్షరమైనదిగా తెలియాలి. దీనితో ఉకారం కలిసి ఉన్నది. మరల మకారం (అనుస్వారం) కూడిన 'ఓమ్'కారం త్రిమాత్రాత్మకం. అకారం భూలోకం. ఉకారం భువర్లోకం. వ్యంజనంతో కూడిన మకారం స్వర్గలోకం. "ఓమ్" కారం మూడులోకాల స్వరూపం. దాని శిరస్సు స్వర్గలోకం. అన్ని భువనాలు అంగాలు. బ్రహ్మలోకం దాని యొక్కపాదం. రుద్రలోకం దాని మాత్రాపాదం. శివుడి పదం మాత్రకు అతీతం. ఈ విధమైన జ్ఞానవిశేషంతో ఆయన యొక్క తురీయ (నాల్గో) పదం యొక్క ఉపాసన చేయాలి. కావున ఎల్లప్పుడూ ధ్యానపరాయణత పొంది ఉండాలి. శాశ్వతసుఖాన్ని కాంక్షించేవాడు ఈ మాత్రాతీత అక్షరతత్త్వాన్ని (శివతత్త్వాన్ని) గట్టి ప్రయత్నంతో ఉపాసించాలి.

**హ్రస్వా తు ప్రథమా మాత్రా తతో దీర్ఘాత్వనంతరమ్ ।**
**తతః ప్లుతవతీ చైవ తృతీయా చోపదిశ్యతే ॥58॥**

**ఏతాస్తు మాత్రా విజ్ఞేయా యథావదనుపూర్వశః ।**
**యావదేవ తు శక్యంతే ధార్యంతే తావదేవ హి ॥59॥**

**ఇంద్రియాణి మనో బుద్ధిం ధ్యాయన్నాత్మని యః సదా ।**
**అర్ధం తన్మాత్రమపి చేచ్ఛృణు యత్ఫలమాప్నుయాత్ ॥60॥**

**మాసే మాసేఽశ్వమేధేన యో యజేత శతం సమాః ।**
**తేన యత్ప్రాప్యతే పుణ్యం మాత్రయా తదవాప్నుయాత్ ॥61॥**

"ఓమ్" యొక్క మొదటి మాత్ర హ్రస్వం. రెండోమాత్ర దీర్ఘం. మూడోమాత్ర ప్లుతం. ఈ మాత్రల్ని క్రమంగా యథావిధి తెలుసుకోవాలి. ఇది మన సామర్థ్యాన్ని బట్టి ఉంటుంది. బుద్ధిమంతుడు దాన్ని తెలిసి ధారణ చేస్తాడు. ఇంద్రియాల్ని, మనసును అట్లే బుద్ధిని నియంత్రించుకుని ఎవడు ఆత్మలో ఎల్లప్పుడూ అర్ధమాత్రను ధ్యానిస్తాడో ఆతడు ఈ ఫలాన్ని పొందుతాడు. అది వినండి. ఎవడు వంద సంవత్సరాలు ప్రతిమాసంలో అశ్వమేధయాగం చేసి దానివల్ల ఎంతటి పుణ్యాన్ని పొందుతాడో ఆతడు అట్టిదానిని ఈ మాత్ర వల్ల పొందుతాడు. దీనివల్ల కలిగే పుణ్యం కఠోరతపస్సువల్ల గాని, భూరిదక్షిణలిచ్చి చేసిన యజ్ఞం వల్లగాని సిద్ధించదు. ఆ ఫలం ఈ మాత్రధారణవల్ల బాగా లభిస్తుంది.

**తత్ర చైషా తు యా మాత్రా ప్లుతా నామోపదిశ్యతే ।**
**ఏషా ఏవ భవేత్కార్యా గృహస్థానం తు యోగినామ్ ॥63॥**

**ఏషా చైవ విశేషేణ ఐశ్వర్యే హ్యష్టలక్షణే ।**
**అణిమాద్యే తు విజ్ఞేయా తస్మాద్యుంజీత తాం ద్విజాః ॥64॥**

ఈ ప్రణవంలోని ప్లుతమనేమాత్రను గృహస్థులైన యోగులు అభ్యసించాలి. విశేషరూపంగా ఎనిమిది విధాలైన అణిమాది ఐశ్వర్యం (సిద్ధి) కోసమని ఈ మాత్రను గుర్తించాలి. ఓ ద్విజులారా! అందుచేత ఈ ప్లుతమాత్రను సాధన చేయాలి.

**ఏవం హి యోగసంయుక్తః శుచిర్దాంతో జితేంద్రియః ।**
**ఆత్మానం విద్యతే యస్తు స సర్వం విందతే ద్విజాః ॥65॥**

**తస్మాత్పాశుపతైర్యోగైరాత్మానం చింతయేద్ బుధః ।**
**ఆత్మానం జానతే యే తు శుచయస్తే న సంశయః ॥66॥**

ఓ ద్విజులారా! ఈ విధంగా యోగసంపన్నుడై, విశుద్ధుడై, ఇంద్రియాల్ని జయించి ఎవడు ఆత్మను తెలుసు కుంటాడో ఆతడు సమస్తాన్ని పొందుతున్నాడు. కావున బుద్ధిమంతుడు పాశుపతయోగం ద్వారా ఆత్మపదార్థచింతన చేయాలి. అప్పుడే ఆత్మజ్ఞానాన్ని పొందగలుగుతాడు. ఆతడే విశుద్ధుడు. ఇందుకు సందేహం లేదు.

**ఋచో యజూంషి సామాని వేదోపనిషదస్తథా ।**
**యోగజ్ఞానాదవాప్నోతి బ్రాహ్మణోఽధ్యాత్మచింతకః ॥67॥**

**సర్వదేవమయో భూత్వా అభూతః స తు జాయతే ।**
**యోనిసంక్రమణం త్యక్త్వా యాతి వై శాశ్వతం పదమ్ ॥68॥**

అధ్యాత్మవిషయచింతనగల బ్రాహ్మణుడు యోగజ్ఞానం ద్వారా ఋగ్యజుః సామవేదాల యొక్కయు, ఉపనిషత్తుల యొక్కయు జ్ఞానాన్ని పొందుతున్నాడు. ఆతడు సర్వవేదమయుడై లింగశరీరంతో శూన్యుడవుతున్నాడు. పునర్జన్మను త్యజించి శాశ్వతమైన శివపదాన్ని ప్రాప్తించుకుంటున్నాడు.

**యథా వృక్షాత్ఫలం పక్వం పవనేన సమీరితమ్ ।**
**నమస్కారేణ రుద్రస్య తథా పాపం ప్రణశ్యతి ॥69॥**

**యత్ర రుద్రనమస్కారః సర్వకర్మఫలో ధ్రువః ।**
**అన్యదేవనమస్కారాన్న తత్ఫలమవాప్నుయాత్ ॥70॥**

**తస్మాత్ త్రిః ప్రవణం యోగీ ఉపాసీత మహేశ్వరమ్ ।**
**దశవిస్తారకం బ్రహ్మ తథా చ బ్రహ్మవిస్తరైః ॥71॥**

ఏ విధంగా పండిన పండు వాయువువల్ల కదిలింపబడి వృక్షం నుంచి జారి పడుతుందో ఆ విధంగా భగవంతుడైన సదాశివుడికి నమస్కరించడం వల్ల పాపాలు నశిస్తున్నాయి. రుద్రనమస్కారం నిశ్చయంగా అన్ని కర్మలకు ఫలాన్ని ఇస్తుంది. ఇతరదేవతలకు నమస్కరించడం వల్ల ఆ ఫలితం రాదు. అందుచేత త్రికరణాలతో వినమ్రుడై యోగి మహేశ్వరుణ్ణి ఉపాసించాలి. పది ఇంద్రియాలతో విస్తరించియున్న బ్రహ్మ కూడా దశేంద్రియాలతో ఉపాసించాలి.

**ఏవం ధ్యానసమాయుక్తః స్వదేహం యః పరిత్యజేత్ ।**
**స యాతి శివసాయుజ్యం సముద్ధృత్య కులత్రయమ్ ॥72॥**
**అథవారిష్టమాలోక్య మరణే సముపస్థితే ।**
**అవిముక్తేశ్వరం గత్వా వారాణస్యాం తు శోధనమ్॥73॥**
**యేన కేనాపి వా దేహం సంత్యజేన్ముచ్యతే నరః ।**
**శ్రీపర్వతే వా విప్రేంద్రాః సంత్యజేత్స్వతనుం నరః ॥74॥**
**స యాతి శివసాయుజ్యం నాత్ర కార్యా విచారణా ।**
**అవిముక్తం పరం క్షేత్రం జంతూనాం ముక్తిదం సదా ॥75॥**

**సేవేత సతతం ధీమాన్ విశేషాన్మరణాంతికే ॥76॥**

ఈ విధంగా ధ్యానమగ్నుడై శరీరాన్ని త్యజించినవాడు మూడు లోకాల్ని దాటి శివసాయుజ్యాన్ని పొందుతున్నాడు. అరిష్టాన్ని చూచినవాడు మృత్యువు ఆసన్నమైనదిగా తెలుసుకుని వారణాసిలోని అవిముక్తేశ్వరానికి వెళ్లి శుద్ధిని పొందాలి. ఏదో ఒక విధంగా దేహాన్ని అవిముక్తేశ్వరంలో త్యజించిన నరుడు ముక్తిని పొందుతున్నాడు. ఓ విప్రశ్రేష్ఠులారా! శ్రీపర్వతం మీద తన శరీరాన్ని త్యజించినవాడు శివసాయుజ్యాన్ని పొందుతున్నాడు. ఇందులో విచారణ చేయవలసింది ఏదీ లేదు. అవిముక్తం ఎల్లప్పుడూ ప్రాణులకు ముక్తినిచ్చే ఉత్తమక్షేత్రం. అందుచేత బుద్ధిమంతుడు అవసానకాలంలో అవిముక్తవారణాసి క్షేత్రంలో నివసించాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే అరిష్టకథనం నామైకనవతితమోఽధ్యాయః ॥91॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని అరిష్టకథనమనే తొంబై ఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్వినవతితమోఽధ్యాయః - తొంబై రెండవ అధ్యాయం
## వారణాసీశ్రీశైలమాహాత్మ్యకథనమ్ - వారణాసీశ్రీశైలమాహాత్మ్యకథనం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**ఏవం వారాణసీ పుణ్యా యది సూత మహామతే ।**
**వక్తుమర్హసి చాస్మాకం తత్ప్రభావం హి సాంప్రతమ్ ॥1॥**

**క్షేత్రస్యాస్య చ మాహాత్మ్యమవిముక్తస్య శోభనమ్ ।**
**విస్తరేణ యథాన్యాయం శ్రోతుం కౌతూహలం హి నః ॥2॥**

ఓ మహాధీశాలీ! సూతర్షీ! వారాణసి ఆవిధమైన పుణ్యప్రదాయిని అయి ఉన్నది కావున మాకిప్పుడు నీవు కృపతో దాని ప్రభావాన్ని చెప్పండి! మాకు ఆ అవిముక్త క్షేత్రం యొక్క మాహాత్మ్యాన్ని వివరంగా విధ్యనుసారంగా వినడానికి మిక్కిలి ఉత్సాహంగా ఉంది.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**వక్ష్యే సంక్షేపతః సమ్యక్ వారాణస్యాః సుశోభనమ్ ।**
**అవిముక్తస్య మాహాత్మ్యం యథాహ భగవాన్ భవః ॥3॥**

**విస్తరేణ మయా వక్తుం బ్రహ్మణా చ మహాత్మనా ।**
**శక్యతే నైవ విప్రేంద్రా వర్షకోటిశతైరపి ॥4॥**

వారాణసి అవిముక్తక్షేత్రం యొక్క అత్యుత్తమమాహాత్మ్యం బాగా సంగ్రహంగా శివభగవానుడు చెప్పిన విధంగా చెప్పగలను. ఓ విప్రశ్రేష్ఠులారా! నేనుగాని మహాభాగుడైన బ్రహ్మగాని నూరుకోట్ల సంవత్సరాలకైనా విపులంగా చెప్పడానికి వీలుకానిది దాని మాహాత్మ్యం.

**దేవః పురా కృతోద్వాహః శంకరో నీలలోహితః ।**
**హిమవచ్ఛిఖరాద్దేవ్యా హైమవత్యా గణేశ్వరైః ॥5॥**

**వారాణసీమనుప్రాప్య దర్శయామాస శంకరః ।**
**అవిముక్తేశ్వరం లింగం వాసం తత్ర చకార సః ॥6॥**

**వారాణసీ కురుక్షేత్రశ్రీపర్వతమహాలయే ।**
**తుంగేశ్వరే చ కేదారే తత్స్థానే యో యతిర్భవేత్ ॥7॥**

**యోగే పశుపతే సమ్యక్ దినమేకం యతిర్భవేత్ ।**
**తస్మాత్సర్వం పరిత్యజ్య చరేత్పాశుపతం వ్రతమ్ ॥8॥**

**దేవోద్యానే వసేత్తత్ర శర్వోద్యానమనుత్తమమ్ ।**
**మనసా నిర్మమే రుద్రో విమానం చ సుశోభనమ్ ॥9॥**

**దర్శయామాస చ సదా దేవోద్యానమనుత్తమమ్ ।**
**హైమవత్యాః స్వయం దేవః సనందీ పరమేశ్వరః ॥10॥**

**క్షేత్రస్యాస్య చ మాహాత్మ్యమవిముక్తస్య శంకరః ।**
**ఉక్తవాన్ పరమేశానః పార్వత్యాః ప్రీయతే భవః ॥11॥**

పూర్వం నీలలోహిత శంకర భగవానుడు పార్వతీదేవిని వివాహమాడిన తర్వాత, ఆమెతో, గణేశ్వరులతో కలిసి హిమాలయశిఖరం నుంచి వారణాసికి వచ్చి అచ్చట అవిముక్తేశ్వర లింగాన్ని ప్రదర్శించి అక్కడే నివాసమున్నాడు. వారణాసి, కురుక్షేత్రం, శ్రీపర్వతం, మహాలయం, తుంగేశ్వరం, కేదారం – ఈ స్థానాలలో ఎవడు యతి అవుతాడో ఆతడు మరుజన్మలో పాశుపతయోగసిద్ధిని పొంది ఒక రోజులోనే గొప్ప యోగి అవుతాడు. అందుచేత సర్వసంగపరిత్యాగి అయి పాశుపతవ్రతాన్ని చేపట్టాలి. దేవోద్యానంలో నివసించడానికి ప్రయత్నించాలి. శివుడి ఉద్యానవనం అత్యంతం ఉత్తమమైనది. రుద్రభగవానుడు మనసులో ఒక పరమసుందరమైన భవనాన్ని నిర్మించాడు. అపుడు నందీశ్వరుడితో కూడిన శివుడు స్వయంగా పార్వతీదేవికి అత్యుత్తమమైన ఉద్యానవనాన్ని చూపించాడు. శంకరభగవానుడు పార్వతీదేవి ప్రసన్నురాలు కావడానికి ఈ అవిముక్తక్షేత్రం యొక్క మాహాత్మ్యాన్ని వర్ణించాడు.

**ప్రఫుల్లనానావిధగుల్మశోభితం లతాప్రతానాది మనోహరం బహిః ।**
**విరూఢపుష్పైః పరితః ప్రియంగుభిః సుపుష్పితైః కంటకితైశ్చ కేతకైః ॥12॥**

**తమాలగుల్మైర్నిచితం సుగంధిభిర్నికామపుష్పైర్వకులైశ్చ సర్వతః ।**
**అశోకపున్నాగశతైః సుపుష్పితైర్ద్విరేఫమాలాకులపుష్పసంచయైః ॥13॥**

ఆ ఉద్యానవనం పలువిధాలైన వికసించిన లతల పొదలచేత బాగా శోభిస్తున్నది. వెలుపల లతాసమూహాలతో అత్యంత మనోహరమై ఉన్నది. పుష్పించిన ప్రియంగు వృక్షాలతో, సంపూర్ణంగా విచ్చిన ముళ్లు గలిగిన మొగలి పొదలతోను కూడి ఉన్నది. సుగంధభరితమైన తమాల వృక్షతతులచేత నిండి యున్నది. సుగంధభరితాలైన వకుళవృక్షాలతో అన్ని వైపుల అందగిస్తున్నది. పూలమీద వాలిన తుమ్మెదబారులతో శోభిల్లుతున్నది. వందలకొలది పూచిన అశోకవృక్షాలతో, పున్నాగవృక్షాలతో కూడి యున్నది.

**క్వచిత్ప్రఫుల్లాంబుజరేణుభూషితైర్విహంగమైశ్చానుకలప్రణాదిభిః ।**
**వినాదితం సారసచక్రవాకైః ప్రమత్తదాత్యూహవరైశ్చ సర్వతః ॥14॥**

ఆ ఉద్యానవనం వికసించిన పద్మపరాగభూషితాలైన సారసాలు, చక్రవాకాలు అట్లే ఉన్మత్తాలు మరియు ఉన్నతాలు అయిన వానకోయిలలనే పక్షుల మధురధ్వనులతో దిక్కులన్నీ నిండి యున్నది.

**క్వచిచ్చ కేకారుతనాదితం శుభం క్వచిచ్చ కారండవనాదనాదితమ్ ।**
**క్వచిచ్చ మత్తాళికులాకులీకృతం మదాకులాభిర్భ్రమరాంగనాదిభిః ॥15॥**

ఆ సుందరోద్యానవనం కొన్నిచోట్ల నెమళ్ల ధ్వనులతో నినదింపబడున్నది. కొన్నిచోట్ల కారండ పక్షుల ధ్వనులతో శబ్దింపబడుతున్నది. కొన్ని చోట్ల మత్తిల్లిన భ్రమర భ్రమరీసమూహాలతో వాటి నాదాలతో నిండి ఉన్నది.

**నిషేవితం చారుసుగంధిపుష్పకైః క్వచిత్సుపుష్పైః సహకారవృక్షైః ।**
**లతోపగూఢైస్తిలకైశ్చ గూఢం ప్రగీతవిద్యాధరసిద్ధచారణమ్ ॥16॥**

ఆ ఉద్యానవనం కొన్నిచోట్ల మిక్కిలి సువాసనగల వృక్షాలతో కూడి ఉన్నది. కొన్నిచోట్ల బాగా వికసించిన సుందరమైన సహకారవృక్షాలు గలది. లతలతో చుట్టబడిన తిలకవృక్షాలతో కూడి యున్నది. మరియు విద్యాధరులు, సిద్ధులు, చారణులు - వీరి యొక్క గానాలతో నిండి యున్నది.

**ప్రవృత్తనృత్తానుగతాప్సరోగణం ప్రహృష్టనానావిధపక్షిసేవితమ్ ।**
**ప్రవృత్తహారీతకులోపనాదితం మృగేంద్రనాదాకులమత్తమానసైః ॥17॥**

**క్వచిత్క్వచిద్గంధకదంబకైర్మృగైర్విలూనదర్భాంకురపుష్పసంచయమ్ ।**

**ప్రఫుల్లనానావిధచారుపంకజైః సరస్తడాగైరుపశోభితం క్వచిత్ ॥18॥**

అక్కడ అప్సరసల గణాలు నృత్యంలో లీనమై ఉన్నవి. అనేక విధాలుగా సంతసించిన బహుపక్షిగణం గలది. సంతసించిన హారీతపక్షుల నినాదాలు గలది. సింహాల నాదాలతో ఆకులమైనది. మదించిన మనసులుగల కస్తూరీమృగసముదాయాలు చరిస్తున్నది. అక్కడక్కడా సుగంధకదంబవృక్షాలతో కూడియున్నది. మృగాలవలన త్రుంచబడిన లేతదర్భల, పుష్పాల సమూహం గలది. అక్కడక్కడ వికసించిన అనేక విధాలైన అందమైన పద్మాలతో కూడిన సరోవరాలు, తటాకాలు కలిగి శోభిల్లుతున్నది.

**విటపనిచయలీనం నీలకంఠాభిరామం మదముదితవిహంగం ప్రాప్తనాదాభిరామమ్ ।**
**కుసుమితతరుశాఖాలీనమత్తద్విరేఫం నవకిసలయశోభాశోభితం ప్రాంశుశాఖమ్ ॥19॥**

**క్వచిచ్చ దంతక్షతచారువీరుధం క్వచిల్లతాలింగితచారువృక్షమ్ ।**
**క్వచిద్విలాసాలసగామినీభిర్నిషేవితం కింపురుషాంగనాభిః ॥20॥**

ఆ ఉద్యానవనం వృక్షసమూహాలతో సుసంపన్నమై ఉన్నది. నీలకంఠపక్షులతో సుందరమై ప్రకాశిస్తున్నది. సంతుష్టిగల మనసుగల పక్షులతో కూడి యున్నది. అన్ని దిక్కులా శ్రవణసుభగమైన నాదభరితమై ఒప్పుతున్నది. పుష్పించిన వృక్షశాఖల మీద తిరుగుతున్న మదించిన భ్రమరాలు గలది. క్రొత్తగా చిగురించిన పొడవైన వృక్షశాఖలతో శోభిల్లుతున్నది. ఈ వనం అక్కడక్కడా దంతాలతో కొరకబడిన సుందరలతలతో కూడియున్నది. కొన్ని చోట్ల లతలతో ఆలింగనం చేయబడిన అందమైన వృక్షాలు గలది. కొన్నిచోట్ల విలాసంగా మందగమనలైన కింపురుష స్త్రీలతో సేవించబడియున్నది.

**పారావతధ్వనివికూజితచారుశృంగైరభ్రంకషైః సితమనోహరచారురూపైః ।**
**ఆకీర్ణపుష్పనికరప్రవిభక్తహంసైర్విభ్రాజితం త్రిదశదివ్యకులైరనేకైః ॥21॥**

**ఫుల్లోత్పలాంబుజవితానసహస్రయుక్తం తోయాశయైః సమనుశోభితదేవమార్గమ్ ।**
**మార్గాంతరాకలితపుష్పవిచిత్రపంక్తిసంబుద్ధగుల్మవిటపైర్వివిధైరుపేతమ్ ॥22॥**

ఆకాశాన్ని అంటే అందమైన కొమ్మలతో, పావురాలధ్వనులతో ఆవనంలోని చెట్లు అలరారుతున్నాయి. మనోహరమైన తెల్లనిరూపాల హంసలు వెదజల్లబడిన పూలతో కలవరపడుతున్నాయి ఆవనంలో. అనేకాలైన దేవతాసమూహాలతో ప్రకాశిస్తున్న ఈ వనం వేలకొలది వికసించిన కుముదాల, కమలాల సమూహాలతో కూడిన జలాశయాలతో అనుబంధించిన దేవమార్గం కలది. మార్గమధ్యంలో వికసించిన విచిత్ర పుష్పపంక్తిగల బహులతా గుల్మాలు, వృక్షాలతో కూడినది.

**తుంగాగ్రైర్నీలపుష్పస్తబకభరనతప్రాంశుశాఖైరశోకైః**
**దోలాప్రాంతాంతలీనశ్రుతిసుఖజనకైర్భాసితాంతం మనోజ్ఞైః ।**
**రాత్రౌ చంద్రస్య భాసా కుసుమితతిలకైరేకతాం సంప్రయాతం**
**ఛాయాసుప్తప్రబుద్ధస్థితహరిణకులాలుప్తదూర్వాంకురాగ్రమ్ ॥23॥**

**హంసానాం పక్షవాతప్రచరితకమలస్వచ్ఛవిస్తీర్ణతోయం**
**తోయానాం తీరజాతప్రచకితకదలీచాటునృత్యన్మయూరమ్ ।**

**మాయూరైః పక్షచంద్రైః క్వచిదవనిగతైరంజితక్ష్మాప్రదేశం**
**దేశే దేశే విలీనప్రముదితవిలసన్ మత్తహారీతబృందమ్ ॥24॥**

ఈ వనం యొక్క ప్రాంతభాగం ఎత్తైనకొనభాగాలు గలిగి, నల్లటి పుష్పగుచ్ఛాల బరువుతో వంగిన అశోక వృక్షశాఖలతో కూడియున్నది. వాయువుచేత ఊపబడి, శ్రవణసుభగమైన ధ్వనినిస్తూ ఆశోకాలు సుందరంగా తిలకవృక్షంతో ఐక్యాన్ని పొందుతున్నాయి. చెట్లనీడలో నిద్రించి లేచిన హరిణసముదాయాలు కొరికిన దర్భాంకురాలు గలిగి ఉన్నది. ఆ వనం హంసల యొక్క రెక్కల గాలి వల్ల ఊగుతున్న కమలాలు, స్వచ్ఛమైన విస్తారమైన జలం గలది. సరోవరాల ఒడ్డుల్లో ఆశ్చర్యం గొల్పుతున్న అరటిచెట్ల దగ్గర నర్తిస్తున్న నెమళ్లు గలది. అక్కడక్కడా నెమళ్ల రెక్కల రంగులతో అలంకరింపబడిన భూమి గలది. ప్రతిచోట ఆనందించి, మత్తిల్లి క్రీడిస్తున్న హారీతాల (గువ్వలు)తో శోభిల్లుతున్నది.

**సారంగైః క్వచిదుపశోభితప్రదేశం ప్రచ్ఛన్నం కుసుమచయైః క్వచిద్విచిత్రైః ।**
**హృష్టాభిః క్వచిదపి కిన్నరాంగనాభిర్వీణాభిః సుమధురగీతనృత్తకంఠమ్ ॥25॥**

**సంసృష్టైః క్వచిదుపలిప్తకీర్ణపుష్పైరావాసైః పరివృతపాదపం మునీనామ్ ।**
**ఆమూలాత్ఫలనిచితైః క్వచిద్విశాలైరుత్తుంగైః పనసమహీరుహైరుపేతమ్ ॥26॥**

కొన్నిచోట్ల ఈ వనం హరిణాలతో శోభిల్లుతున్నది. కొన్నిచోట్ల విచిత్రాలైన పుష్పసముదాయంతో కప్పబడి ఉంది. కొన్నిచోట్ల సంతోషించిన కిన్నరస్త్రీలు పలికించిన వీణలయొక్క మధురధ్వనులతో, వారి గానాలతో, నృత్యాలతో శోభిల్లుతున్నది. కొన్నిచోట్ల మిక్కిలి కలిసియున్న, పరస్పరం అంటుకునియున్న, మునికుటీరాలు వికసిస్తున్న

పుష్పాలతో శోభిల్లుతున్న వృక్షాలతో చుట్టబడి ఉన్నవి. కొన్నిచోట్ల మూలం నుంచి ఫలసముదాయాలతో కూడి, ఎత్తైన, విశాలమైన పనసవృక్షాలతో నిండియున్నది.

**ఫుల్లాతిముక్తకలతాగృహానీతసిద్ధసిద్ధాంగనాకనకనూపురరావరమ్యమ్ ।**
**రమ్యం ప్రియంగుతరుమంజరీసక్తభృంగం భృంగావలీకవలితామ్రకదంబపుష్పమ్ ॥27॥**

ఈ ఉద్యానవనం సంపూర్ణంగా విప్పారిన లతాగృహాలలో నర్తించే సిద్ధుల, సిద్ధాంగనల సువర్ణ మయనూపురాల రమ్యధ్వనితో రమణీయమై ఉన్నది. ప్రియంగు వృక్షాల బారుల మీద తిరుగుతున్న భ్రమరాలతో అలరారుతున్నది. భ్రమరాలచే ఆస్వాదింపబడిన ఆమ్రకదంబపుష్పాలతో కూడి యున్నది.

**పుష్పోత్కరానిలవిఘూర్ణితవారిరమ్యం రమ్యద్విరేఫవినిపాతితమంజుగుల్మమ్ ।**
**గుల్మాంతరప్రసభభీతమృగీసమూహం వాతేరితం తనుభృతామపవర్గదాతృ ॥28॥**

ఆ ఉద్యానవనం పుష్పసమూహం వల్ల వాసనాభరితమైన వాయువుచే కదల్చబడిన నీరుగలసరోవరాలతో శోభిల్లుతున్నది. భ్రమరాలతో నిండిన సుందరపుష్పగుచ్ఛాలతో ఒప్పుతున్నది. పొదరిళ్లలో మిక్కిలిగా భయపడిన హరిణ సమూహాలతో కూడినది. గాలి బాగా వీచుచున్నట్టిది. మానవులకు మోక్షమిచ్చునట్టిది.

**చంద్రాంశుజాలశబలైస్తిలకైర్మనోజ్ఞైః సిందూరకుంకుమకుసుంభనిభైరశోకైః ।**
**చామీకరద్యుతిసమైరథ కర్ణికారైః పుష్పోత్కరైరుపచితం సువిశాలశాఖైః ॥29॥**

ఆ వనం చంద్రుడి కిరణాలవల్ల వివిధ వర్ణాలతో నిండిన మనోహరమైన తిలక వృక్షాలతో కూడినది. సిందూరం, కుంకుమం, కుసుంభం – ఈ రంగుల కాంతిగల అశోకవృక్షాలతో నిండినది. బంగారువన్నెగల, విశాలశాఖలుగల, పుష్పాలతో నిండిన కర్ణికారవృక్షాలతో నిండి యున్నది.

**క్వచిదంజనచూర్ణాభైః క్వచిద్విద్రుమసన్నిభైః ।**
**క్వచిత్కాంచనసంకాశైః పుష్పైరాచితభూతలమ్ ॥30॥**

ఆ ఉద్యానవనం యొక్క భూమి కొన్నిచోట్ల కాటుక చూర్ణంతో సమానమైన కాంతితోను, కొన్నిచోట్ల పగడపుకాంతితోను, కొన్నిచోట్ల బంగారంతో సమానమైన కాంతిగల పుష్పాలతో కప్పబడి ఉన్నది.

**పున్నాగేషు ద్విజశతవిరుతం రక్తాశోకస్తబకభరనతమ్ ।**
**రమ్యోపాంతక్లమహరభవనం ఫుల్లాబ్జేషు భ్రమరవిలసితమ్ ॥31॥**

ఆ ఉద్యానవనంలో పున్నాగవృక్షాలమీద వందలకొలది పక్షుల ధ్వనులు ఉండి ఉన్నాయి. పుష్పగుచ్ఛాల భారంతో రక్తాశోకవృక్షాలు వంగి ఉన్నాయి. అందమైన సీమస్థలమందు గ్లానిని హరించే భవనమున్నది. వికసిస్తున్న కమలాల మీద తుమ్మెదలు తిరుగుతున్నాయి.

**సకలభువనభర్తా లోకనాథస్తదానీం తుహినశిఖరపుత్ర్యా సార్ధమిష్టైర్గణేశైః ।**
**వివిధతరువిశాలం మత్తహృష్టాన్యపుష్టైరుపవనమతిరమ్యం దర్శయామాస దేవ్యాః ॥32॥**

ఆ సమయంలో సమస్తభువనాలకు స్వామి, లోకనాథుడు అయిన శివుడు, మత్తులు, ప్రసన్నులు, శారీరకపుష్టి గలవారు, ఇష్టులు అయిన గణనాథులతో నానావిధవిశాలవృక్షాలతో అత్యంతరమ్యంగా ఉన్న ఉపవనాన్ని పార్వతీదేవికి చూపించాడు.

**పుష్పైర్వన్యైః శుభశుభతమైః కల్పితైర్దివ్యభూషై**
**ర్దేవీం దివ్యాముపవనగతాం భూషయామాస శర్వః ।**
**సా చాప్యేనం హిమగిరిసుతా శంకరం దేవదేవం**
**పుష్పైర్దివ్యైః శుభతరతమైర్భూషయామాస భక్త్యా ॥33॥**

శివభగవానుడు అత్యంత శోభనాలైన వన్యపుష్పాలతో కూర్చిన దివ్యమాలలతో ఉపవనంలో ఉన్న దివ్యమైన పార్వతీదేవిని అలంకరించాడు. శైలసుత అయిన ఆమె కూడా అత్యంతసుందరమై దివ్యమైన పుష్పాలతో దేవదేవుడైన శంకరుణ్ణి భక్తితో అలంకరించింది.

**సంపూజ్య పూజ్యం త్రిదశేశ్వరాణాం సంప్రేక్ష్య చోద్యానమతీవ రమ్యమ్ ।**
**గణేశ్వరైర్నందిముఖైశ్చ సార్ధమువాచ దేవం ప్రణిపత్య దేవీ ॥34॥**

తర్వాత ఆవిధంగా మిక్కిలి రమ్యమైన ఉద్యానవనాన్ని చూచి, పార్వతీదేవి నందీశ్వరుడు మొదలైన గణేశ్వరులతో కూడా దేవతలకు కూడా పూజనీయుడైన శంకరభగవానుణ్ణి పూజించి, నమస్కరించి ఇలా పలికింది.

**శ్రీ దేవ్యువాచ –** పార్వతీదేవి పలికింది.

**ఉద్యానం దర్శితం దేవ ప్రభయా పరయా యుతమ్ ।**
**క్షేత్రస్య చ గుణాన్ సర్వాన్ పునర్మే వక్తుమర్హసి ॥35॥**

**అస్య క్షేత్రస్య మాహాత్మ్యమవిముక్తస్య సర్వథా ।**
**వక్తుమర్హసి దేవేశ దేవదేవ వృషధ్వజ ॥36॥**

ఓ ప్రభూ! నీవు పరమశోభాన్వితమైన ఉద్యానవనాన్ని దర్శింపజేశావు. ఇప్పుడు ఈ క్షేత్రం యొక్క సమస్తగుణాలు నాకు చెప్పాలి. ఓ దేవదేవా! ఓ దేవేశ్వరుడా! ఓ వృషభధ్వజా! నీవు ఈ అవిముక్తక్షేత్రం యొక్క సంపూర్ణమాహాత్మ్యాన్ని చెప్పాలి.

**సూత ఉవాచ :–** సూతర్షి పలికాడు.

**దేవ్యాస్తద్వచనం శ్రుత్వా దేవదేవో వరప్రభుః ।**
**ఆఘ్రాయ వదనాంభోజం తదాహ గిరిజాం హసన్ ॥37॥**

ఓ ఋషులారా! పార్వతీదేవి యొక్క ఆ మాట విని దేవదేవుడు, ప్రభుశ్రేష్ఠుడు అయిన శివుడు ఆమె ముఖపద్మాన్ని ఆఘ్రాణించి నవ్వుతూ ఇలా పలికాడు.

**శివభగవాన్ ఉవాచ :–** శివభగవానుడు పలికాడు.

**ఇదం గుహ్యతమం క్షేత్రం సదా వారాణసీ మమ ।**
**సర్వేషామేవ జంతూనాం హేతుర్మోక్షస్య సర్వదా ॥38॥**

**అస్మిన్ సిద్ధాః సదా దేవి మదీయం వ్రతమాస్థితాః ।**
**నానాలింగధరా నిత్యం మమ లోకాభికాంక్షిణః ॥39॥**

**అభ్యస్యంతి పరం యోగం యుక్తాత్మానో జితేంద్రియాః ।**
**నానావృక్షసమాకీర్ణే నానావిహగశోభితే ॥40॥**

**కమలోత్పలపుష్పాఢ్యైః సరోభిః సమలంకృతే ।**
**అప్సరోగణగంధర్వైః సదా సంసేవితే శుభే ॥41॥**

వారణాసి అనే పేరుగల ఇది నాకు నిత్యం నిగూఢతమమైన క్షేత్రం. ఇది ఎల్లప్పుడూ అన్ని ప్రాణులకు మోక్ష హేతువు. ఓ దేవి! ఈ క్షేత్రంలో సిద్ధులయినవారు ఎల్లప్పుడూ నా వ్రతాచరణంలో ఉంటారు. నా శివలోకాన్ని పొందాలనే కోరికగలవారు నిత్యం పలువిధాలైన లింగాల్ని ధరిస్తున్నారు. నానావిధవృక్షాలతో, పలువిధాలైన పక్షులతో పద్మాలు, ఉత్పలాలు గల సరోవరాలతో, మరియు అప్సరసలతో, గంధర్వులతో సేవింపబడుతూ, శోభిల్లుతున్న ఈ క్షేత్రంలో యుక్తాత్ములై, జితేంద్రియులైన మానవులు శ్రేష్ఠమైన యోగాన్ని అభ్యసిస్తున్నారు.

**రోచతే మే సదా వాసో యేన కార్యేణ తచ్ఛృణు ।**
**మన్మనా మమ భక్తశ్చ మయి నిత్యార్పితక్రియః ॥42॥**

**యథా మోక్షమవాప్నోతి అన్యత్ర న తథా క్వచిత్ ।**
**కామం హ్యత్ర మృతో దేవి జంతుర్మోక్షాయ కల్పతే ॥43॥**

**ఏతన్మమ పురం దివ్యం గుహ్యాద్ గుహ్యతమం మహత్ ।**
**బ్రహ్మాదయో విజానంతి యే చ సిద్ధా ముముక్షవః ॥44॥**

**అతః పరమిదం క్షేత్రం పరా చేయం గతిర్మమ ।**
**విముక్తం న మయా యస్మాన్మోక్ష్యతే వా కదాచన ॥45॥**

**మమ క్షేత్రమిదం తస్మాదవిముక్తమితి స్మృతమ్ ।**

ఓ దేవీ! ఏకారణంగా నేను ఇక్కడ నివసించడానికి ఇష్టపడతానో దానిని చెబుతాను విను. నన్ను తమతమ మనసులో స్థిరపర్చుకుని, నాకోసం క్రియలన్నీ సమర్పిస్తున్న భక్తులు ఆ విధమైన మోక్షాన్ని ఇక్కడే పొందుతున్నారు. ఆ విధమైన మోక్షప్రాప్తి మరెక్కడా లేదు. ఓ పార్వతీ! ఇక్కడ మరణించినవాళ్లు మోక్షాన్ని పొందుతున్నారు. నా యీ నగరం దివ్యమైనది. గూఢం కంటే గూఢమైనది. అట్లే గొప్పది. ఈ విషయాన్ని బ్రహ్మాది దేవతలు, సిద్ధగణాలు, మోక్షేచ్ఛగల మానవులు తెలుసుకొంటున్నారు. ఈ పరమక్షేత్రం నా పరమగతి అయి ఉన్నది. నేను దీన్ని ఎప్పుడూ విడిచిపెట్టలేదు. ఇకపై దీన్ని విడిచిపెట్టను. అందువల్లే నా యీ క్షేత్రం 'అవిముక్త"మని చెప్పబడినది.

**నైమిషే చ కురుక్షేత్రే గంగాద్వారే చ పుష్కరే ॥46॥**

**స్నానాత్సంసేవనాద్వాపి న మోక్షః ప్రాప్యతే యతః ।**
**ఇహ సంప్రాప్యతే యేన తత ఏతద్విశిష్యతే ॥47॥**

**ప్రయాగే వా భవేన్మోక్ష ఇహ వా మత్పరిగ్రహాత్ ।**
**ప్రయాగాదపి తీర్థాగ్ర్యాదవిముక్తమిదం శుభమ్ ॥48॥**

నైమిషారణ్యం, కురుక్షేత్రం, హరిద్వారం అట్లే పుష్కరం – వీటిలో స్నానం చేయడంవల్ల, నివసించడం వల్ల మోక్షం రావడం లేదు. అది యిక్కడ ప్రాప్తిస్తున్నది. అందువల్ల ఇది అన్ని తీర్థాలకన్నా విశిష్టమైనది. నా పరిగ్రహం వల్ల ప్రయాగలోను, ఈ అవిముక్తంలోనూ ముక్తి కలుగుతున్నది. తీర్థాలల్లో అగ్రగణ్య అయిన ప్రయాగ కన్నా ఈ అవిముక్తం శుభమైనది.

**ధర్మస్యోపనిషత్సత్యం మోక్షస్యోపనిషచ్ఛమః ।**
**క్షేత్రతీర్థోపనిషదం న విదుర్బుధసత్తమాః ॥49॥**

ధర్మం యొక్క సారం అంటే తత్త్వం సత్యం. మోక్షం యొక్క సారతత్త్వం శమం. అయితే క్షేత్రతీర్థాల సారతత్త్వాన్ని పండితశ్రేష్ఠులు కూడా తెలియలేకున్నారు.

**కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్ హి వివిధాః క్రియాః ।**
**అవిముక్తే త్యజేత్ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥50॥**

ఇచ్ఛానుసారంగా తింటూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, పనిచేస్తూ అట్లే అనేకవిధాలైన పనుల్ని నిర్వహిస్తూ కూడా మానవుడు ఈ అవిముక్తంలో ప్రాణాన్ని త్యజించి మోక్షాన్ని పొందుతున్నాడు.

**కృత్వా పాపసహస్రాణి పిశాచత్వం వరం నృణామ్ ।**
**న తు శక్రసహస్రత్వం స్వర్గే కాశీపురీం వినా ॥51॥**

**తస్మాత్సంసేవనీయం హి అవిముక్తం హి ముక్తయే ।**
**జైగీషవ్యః పరాం సిద్ధిం గతో యత్ర మహాతపాః ॥52॥**

**అస్య క్షేత్రస్య మాహాత్మ్యాద్భక్త్యా చ మమ భావితః ।**
**జైగీషవ్యగుహా శ్రేష్ఠా యోగినాం స్థానమిష్యతే ॥53॥**

**ధ్యాయంతస్తత్ర మాం నిత్యం యోగాగ్నిర్దీప్యతే భృశమ్ ।**
**కైవల్యం పరమం యాతి దేవానామపి దుర్లభమ్ ॥54॥**

ఈ కాశీనగరంలో మానవులు వేయి పాపాలు చేసి పిశాచత్వాన్ని పొందినా మంచిదే. కాశీపురాన్ని వీడి స్వర్గంలో వేయిమార్లు ఇంద్రులైనా మంచిది కాదు. అందుచేత ముక్తికోసం ఈ అవిముక్తక్షేత్రంలో నివసించాలి. మహాతపస్వి మహర్షి అయిన జైగీషవ్యుడు ఈ క్షేత్రమాహాత్మ్యంతో, నా యెడల భక్తితో పరమసిద్ధి పొందాడు.

మహర్షి జైగీషవ్యుడు వసించిన గుహ యోగులకు యోగస్థానమయినది. యోగులు ఎక్కడ ఎల్లప్పుడు నన్ను ధ్యానిస్తున్నారో అక్కడ యోగులకు యోగాగ్ని ప్రజ్వలిస్తున్నది. పరమమైన మోక్షాన్ని మానవుడు (యోగి) పొందుతున్నాడు. అది దేవతలకు కూడా దుర్లభమైనట్టిది.

**అవ్యక్తలింగైర్మునిభిః సర్వసిద్ధాంతవేదిభిః ।**
**ఇహ సంప్రాప్యతే మోక్షో దుర్లభోఽ న్యత్ర కర్హిచిత్ ॥55॥**

**తేభ్యశ్చాహం ప్రవక్ష్యామి యోగైశ్వర్యమనుత్తమమ్ ।**
**ఆత్మనశ్చైవ సాయుజ్యమీప్సితం స్థానమేవ చ ॥56॥**

**కుబేరోఽ త్ర మమ క్షేత్రే మయి సర్వార్పితక్రియః ।**
**క్షేత్రసంసేవనాదేవ గణేశత్వమవాప హ ॥57॥**

**సంవర్తో భవితా యశ్చ సోఽ పి భక్తో మమైవ తు ।**
**ఇహైవారాధ్య మాం దేవి సిద్ధిం యాస్యత్యనుత్తమామ్ ॥58॥**

**పరాశరసుతో యోగీ ఋషిర్వ్యాసో మహాతపాః ।**
**మమ భక్తో భవిష్యశ్చ వేదసంస్థాప్రవర్తకః ॥59॥**

**రంస్యతే సోఽ పి పద్మాక్షి క్షేత్రేఽ స్మిన్ మునిపుంగవః ।**
**బ్రహ్మా దేవర్షిభిః సార్ధం విష్ణుర్వాపి దివాకరః ॥60॥**

**దేవరాజస్తథా శక్రో యేఽ పి చాన్యే దివౌకసః ।**

**ఉపాసతే మహాత్మానః సర్వే మామిహ సువ్రతే ॥61॥**

అవ్యక్తమైన లింగధారులు, సర్వసిద్ధాంతవేత్తలు అయిన మునిగణాలు ఇక్కడే మోక్షాన్ని పొందుతున్నారు. వేరెక్కడా ఇది దుర్లభమే. వాళ్ళకై నేను అత్యుత్తమమైన యోగైశ్వర్యాన్ని అట్లే ఆత్మసాయుజ్యరూపమైన అభీష్టస్థానాన్ని చెబుతున్నాను. నాయీ క్షేత్రంలో తన సమస్తకార్యాలను నాకు సమర్పించిన కుబేరుడికి ఈ క్షేత్రాన్ని సేవించడం వల్లే గణేశత్వం దక్కింది. ఓ దేవీ! సంవర్తుడనే ఋషి నా భక్తుడై పుట్టి, నన్ను ఆరాధించి ఉత్తమసిద్ధిని పొందుతాడు. ఓ కమలనయనా! మహాతపస్వి, పరాశరపుత్రుడు, యోగి, ఋషి అయిన వ్యాసుడు నా భక్తుడు అవుతాడు. వేద సంహితను విభాగించిన ఆ మునిపుంగవుడు ఈ క్షేత్రంలో విహరిస్తాడు. పార్వతీ! దేవర్షులతో కూడా బ్రహ్మదేవుడు, విష్ణువు, సూర్యుడు, దేవరాజు ఇంద్రుడు, ఇతర దేవతలు, మరియు మహాత్ములు - వీళ్ళందరూ ఇక్కడే నన్ను ఉపాసిస్తున్నారు.

**అన్యేఽ పి యోగినో దివ్యాశ్ఛన్నరూపా మహాత్మనః ।**
**అనన్యమనసో భూత్వా మామిహోపాసతే సదా ॥62॥**

**విషయాసక్తచిత్తోఽ పి త్యక్తధర్మరతిర్నరః ।**
**ఇహ క్షేత్రే మృతః సోఽ పి సంసారే న పునర్భవేత్ ॥63॥**

**యే పునర్నిర్మమా ధీరాః సత్త్వస్థా విజితేంద్రియాః ।**
**వ్రతినశ్చ నిరారంభాః సర్వే తే మయి భావితాః ॥64॥**

**దేవదేవం సమాసాద్య ధీమంతః సంగవర్జితాః ।**
**గతా ఇహ పరం మోక్షం ప్రసాదాన్మమ సువ్రతే ॥65॥**

**జన్మాంతరసహస్రేషు యం న యోగీ సమాప్నుయాత్ ।**
**తమిహైవ పరం మోక్షం ప్రసాదాన్మమ సువ్రతే ॥66॥**

ఇతరదివ్యయోగులు, మహాత్ములైన మానవులు కూడా మారురూపాలతో ఏకాగ్రచిత్తులై ఇక్కడే ఎల్లప్పుడూ ఉపాసిస్తున్నారు. విషయాసక్తులైనవారు, ధర్మాన్ని విడిచిపెట్టినవారు కూడా ఈ క్షేత్రంలో మరణిస్తే తిరిగి పుట్టడంలేదు. ఓ పార్వతీ! మమతారహితులు, ధీరులు, సత్త్వగుణసంపన్నులు, జితేంద్రియులు, వ్రతులు, కర్మప్రవృత్తిరహితులు, నాయొక్క ధ్యానరతులు, బుద్ధిమంతులు, సంగరహితులు అయినవారు దేవదేవుడనైన నన్ను పొంది, నా కృపతో ఆ విధమైన శ్రేష్ఠమైన మోక్షాన్ని అవశ్యం పొందుతున్నారు. ఓ సువ్రతీ! పార్వతీ! వేయి జన్మలెత్తి కూడా యోగి ఈ విధమైన మోక్షాన్ని పొందలేడు. ఈ ఉత్తమ మోక్షాన్ని నా అనుగ్రహం వల్ల పొందుతాడు.

**గోప్రేక్షకమిదం క్షేత్రం బ్రహ్మణా స్థాపితం పురా ।**
**కైలాసభవనం చాత్ర పశ్య దివ్యం వరాననే ॥67॥**

**గోప్రేక్షకమథాగమ్య దృష్ట్వా మామత్ర మానవః ।**
**న దుర్గతిమవాప్నోతి కల్మషైశ్చ విముచ్యతే ॥68॥**

**కపిలాహ్రదమిత్యేవం తథా వై బ్రహ్మణా కృతమ్ ।**
**గవాం స్తన్యజతోయేన తీర్థం పుణ్యతమం మహత్ ॥69॥**

**అత్రాపి స్వయమేవాహం వృషధ్వజ ఇతి స్మృతః ।**
**సాన్నిధ్యం కృతవాన్ దేవి సదాహం దృశ్యతే త్వయా ॥70॥**

ఓ వరాననా! పూర్వం బ్రహ్మ ద్వారా స్థాపింపబడిన కైలాసభవనం అనే పేరుగల ఈ గోప్రేక్షకక్షేత్రాన్ని చూడు. ఈ గోప్రేక్షక క్షేత్రానికి వచ్చి నన్ను చూచిన మానవుడు దుర్గతిని పొందకున్నాడు. పాపవిముక్తుడు అవుతున్నాడు. బ్రహ్మ ఇక్కడే గోక్షీరంతో "కపిలాహ్రదం" అనే విశాలమైన, పుణ్యతమమైన గొప్ప తీర్థాన్ని నిర్మించాడు. ఇక్కడ కూడా నేను స్వయంగా "వృషధ్వజుడ"నే పేరుతో ఉన్నాను. ఓ దేవీ! నేనిక్కడ ఎల్లప్పుడూ నివసిస్తాను. నీవు నన్ను ఇక్కడ చూడగలవు.

**భద్రతోయం చ పశ్యేహ బ్రహ్మణా చ కృతం హ్రదమ్ ।**
**సర్వైర్దేవైరహం దేవి అస్మిన్ దేశే ప్రసాదితః ॥71॥**

**గచ్ఛోపశమమీశేతి ఉపశాంతః శివస్తథా ।**
**అత్రాహం బ్రహ్మణానీయ స్థాపితః పరమేష్ఠినా ॥72॥**

**బ్రహ్మణా చాపి సంగృహ్య విష్ణునా స్థాపితః పునః ।**
**బ్రహ్మణాపి తతో విష్ణుః ప్రోక్తః సంవిగ్నచేతసా ॥73॥**

**మయానీతమిదం లింగం కస్మాత్స్థాపితవానసి ।**
**తమువాచ పునర్విష్ణుర్బ్రహ్మాణం కుపితాననమ్ ॥74॥**

**రుద్రే దేవే మమాత్యంతం పరా భక్తిర్మహత్తరా ।**
**మయైవ స్థాపితం లింగం తవ నామ్నా భవిష్యతి ॥75॥**

ఇక్కడ బ్రహ్మదేవుడు నిర్మించిన 'భద్రతోయ'మనే పేరుగల సరోవరాన్ని దర్శించు. ఓ దేవీ! దేవతలందరు ఓ ఈశ్వరా! శాంతించండి! అని పలికి ఈ స్థానంలో నన్ను ప్రసన్నుణ్ణి చేశారు. అప్పుడు నేను శాంతించాను. పరమేష్ఠి అయిన బ్రహ్మదేవుడు నన్ను ఇక్కడకు తెచ్చి స్థాపించాడు. మరల బ్రహ్మచేత తేబడి విష్ణువు చేత స్థాపింపబడ్డాను. అప్పుడు దుఃఖమనస్కుడైన బ్రహ్మ విష్ణువుతో ఇలా పలికాడు. "నేను తెచ్చిన ఈ లింగాన్ని నీవెందుకు ప్రతిష్ఠించావు" అని. తర్వాత విష్ణువు కుపితముఖుడై ఆ బ్రహ్మతో ఇలా పలికాడు. "రుద్రదేవుడి మీద నాకు అత్యధికమైన, శ్రేష్ఠమైన, మహత్తరమైన భక్తి ఉన్నది. నాచేత స్థాపింపబడిన ఈ లింగం నీ పేరుతోనే ప్రసిద్ధి చెందుతుంది" అని.

**హిరణ్యగర్భ ఇత్యేవం తతోఽత్రాహం సమాస్థితః ।**
**దృష్ట్వైనమపి దేవేశం మమ లోకం వ్రజేన్నరః ॥76॥**

**తతః పునరపి బ్రహ్మా మమ లింగమిదం శుభమ్ ।**
**స్థాపయామాస విధివద్భక్త్యా పరమయా యుతః ॥77॥**

**స్వర్లీనేశ్వర ఇత్యేవమత్రాహం స్వయమాగతః ।**
**ప్రాణానిహ నరస్త్యక్త్వా న పునర్జాయతే క్వచిత్ ॥78॥**

**అనన్యా సా గతిస్తస్య యోగినాం చైవ యా స్మృతా ।**

ఓ పార్వతీదేవీ! నేను అప్పటి నుంచి ఇక్కడ 'హిరణ్యగర్భు'డు అనే పేరుతో ఉన్నాను. ఈ దేవేశ్వరలింగదర్శనం చేసిన మానవుడు నా లోకాన్ని పొందుతున్నాడు. అనంతరం బ్రహ్మదేవుడు పరమభక్తికలవాడై నన్ను ఈ పవిత్రలింగంలో విధిపూర్వకంగా మరల ప్రతిష్ఠించాడు. నేను ఇక్కడ 'స్వర్లీనేశ్వరు'డనే పేరుతో స్వయంగా నిలిచి ఉన్నాను. ఇక్కడ ప్రాణాలు వదిలిన మానవుడు మరల ఎక్కడా ఎప్పుడూ పుట్టడు. ఈ గతి యోగులకు చెందినది. ఆ అనన్యమైన గతి ఇచ్చట ప్రాణత్యాగం చేసినవాడికి చెందుతుంది.

**అస్మిన్నపి మయా దేశే దైత్యో దైవతకంటకః ॥79॥**

**వ్యాఘ్రరూపం సమాస్థాయ నిహతో దర్పితో బలీ ।**
**వ్యాఘ్రేశ్వర ఇతి ఖ్యాతో నిత్యమత్రాహమాస్థితః ॥80॥**

**న పునర్దుర్గతిం యాతి దృష్ట్వైనం వ్యాఘ్రమీశ్వరమ్ ।**
**ఉత్పలో విదలశ్చైవ యౌ దైత్యౌ బ్రహ్మణా పురా ॥81॥**

**స్త్రీవధ్యౌ దర్పితౌ దృష్ట్వా త్వయైవ నిహతౌ రణే ।**
**సావజ్ఞం కందుకేనాత్ర తస్యేదం దేహమాస్థితమ్ ॥82॥**

ఈ స్థానంలో నేను వ్యాఘ్రరూపాన్ని ధరించి దేవతలకు కంటకప్రాయుడై గర్వితుడు, బలవంతుడు అయిన ఒక రాక్షసుణ్ణి చంపాను. అప్పటినుంచి వ్యాఘ్రేశ్వరుడనే పేరుతో ప్రసిద్ధుణ్ణై ఎల్లప్పుడూ ఇక్కడే ఉన్నాను. ఈ వ్యాఘ్రేశ్వరుణ్ణి దర్శించిన నరుడు తిరిగి దుర్గతిని పొందలేడు. పూర్వం ఉత్పలుడు, విదలుడు అనే దైత్యులు ఉండేవారు. బ్రహ్మ వారికి స్త్రీ ద్వారా మృతిని విధించాడు. గర్వితులైన వాళ్లను చూచి తిరస్కారపూర్వకంగా ఒక కందుకాన్ని విరిసి నీవే (పార్వతీదేవి) యుద్ధంలో వధించావు. ఆ కందుకమే లింగరూపాన్ని ధరించి స్థాపింపబడినది.

**ఆదావత్రాహమాగమ్య ప్రస్థితో గణపైః సహ ।**
**జ్యేష్ఠస్థానమిదం తస్మాదేతన్మే పుణ్యదర్శనమ్ ॥83॥**

**దేవైః సమంతాదేతాని లింగాని స్థాపితాన్యతః ।**
**దృష్ట్వాపి నియతో మర్త్యో దేహభేదే గణో భవేత్ ॥84॥**

ప్రారంభంలో గణాలతో కలిసి వచ్చిన నేను ఇక్కడ ఉన్నాను. అందుచేత ఇది జ్యేష్ఠస్థానం అయ్యింది. ఇక్కడ నా దర్శనం పుణ్యప్రదం. దేవతలు అన్ని ప్రక్కల లింగాల్ని ప్రతిష్ఠించారు. అందుచేత భక్తియుక్తుడై ఈ లింగాల్ని కేవలం దర్శించిన మానవుడు మరణించి భూతగణాలలో ఒకడు అవుతున్నాడు.

**పిత్రా తే శైలరాజేన పురా హిమవతా స్వయమ్ ।**
**మమ ప్రియహితం స్థానం జ్ఞాత్వా లింగం ప్రతిష్ఠితమ్ ॥85॥**

**శైలేశ్వరమితి ఖ్యాతం దృశ్యతామిహ చాదరాత్ ।**
**దృష్ట్వైతన్మనుజో దేవి న దుర్గతిమతో వ్రజేత్ ॥86॥**

పూర్వం నీ తండ్రి పర్వతరాజు హిమవంతుడు నాకు ప్రియం, మరియు హితం అయిన స్థానాన్ని గుర్తించి లింగాన్ని ప్రతిష్ఠించాడు. అది శైలేశ్వరమనే పేరుతో ప్రసిద్ధియై ఉంది. దీన్ని నీవు ఆదరపూర్వకంగా దర్శించు. ఓ పార్వతీ! దీన్ని దర్శించిన నరుడు దుర్గతి పొందడు.

**నద్యేషా వరుణా దేవి పుణ్యా పాపప్రమోచనీ ।**
**క్షేత్రమేతదలంకృత్య జాహ్నవ్యా సహ సంగతా ॥87॥**

**స్థాపితం బ్రహ్మణా చాపి సంగమే లింగముత్తమమ్ ।**
**సంగమేశ్వరమిత్యేవం ఖ్యాతం జగతి దృశ్యతామ్ ॥88॥**

**సంగమే దేవనద్యా హి యః స్నాత్వా మనుజః శుచిః ।**
**అర్చయేత్సంగమేశానం తస్య జన్మభయం కుతః ॥89॥**

ఓ దేవీ! పార్వతీ! పుణ్యమయి, పాపహారి అయిన ఈ వరుణానది ఈ క్షేత్రాన్ని అలంకరించి గంగానదిలో కలిసింది. ఈ సంగమమందునూ బ్రహ్మ ఉత్తమలింగాన్ని ప్రతిష్ఠించాడు. అది సంగమేశ్వరుడనే పేరుతో ప్రసిద్ధి

పొందింది. నీవు దీనిని దర్శించు. ఈ దేవనదీసంగమస్థానంలో స్నానం చేసి పరిశుద్ధుడై సంగమేశ్వరుణ్ణి పూజించిన మానవుడికి జన్మభయమెక్కడిది?

**ఇదం మన్యే మహాక్షేత్రం నివాసో యోగినాం పరమ్ ।**
**క్షేత్రమధ్యే చ యత్రాహం స్వయం భూత్వాగ్రమాస్థితః ॥90॥**

**మధ్యమేశ్వరమిత్యేవం ఖ్యాతః సర్వసురాసురైః ।**
**సిద్ధానాం స్థానమేతద్ధి మదీయవ్రతధారిణామ్ ॥91॥**

**యోగినాం మోక్షలిప్సూనాం జ్ఞానయోగరతాత్మనామ్ ।**
**దృష్ట్వైనం మధ్యమేశానం జన్మ ప్రతి న శోచతి ॥92॥**

ఓ దేవి! నేను దీన్ని మహాక్షేత్రంగా భావిస్తున్నాను. ఇది యోగులకు పరమమైన నివాసస్థానం. ఈ శ్రేష్ఠక్షేత్రం మధ్యలో స్వయంభువుడనై ఉన్నాను. సురాసురులందరూ నన్ను మధ్యమేశ్వరుడు అన్నారు. నా వ్రతాన్ని ఆచరిస్తున్న సిద్ధులకు, మోక్షేచ్ఛగల జ్ఞానయోగరతాత్ములైన యోగులకు ఇది నివాసస్థానం. ఈ మధ్యమేశ్వరుణ్ణి దర్శించిన మానవుడు జన్మవిషయంలో చింతించడు.

**స్థాపితం లింగమేతత్తు శుక్రేణ భృగుసూనునా ।**
**నామ్నా శుక్రేశ్వరం నామ సర్వసిద్ధామరార్చితమ్ ॥93॥**

**దృష్ట్వైనం నియతః సద్యో ముచ్యతే సర్వకిల్బిషైః ।**
**మృతశ్చ న పునర్జంతుః సంసారీ తు భవేన్నరః ॥94॥**

భృగుమహర్షి కుమారుడు శుక్రాచార్యుడు ఇక్కడ లింగాన్ని స్థాపించాడు. శుక్రేశ్వరుడనే పేరుతో ప్రసిద్ధిపొందిన ఈ లింగాన్ని సిద్ధులు, దేవతలు పూజిస్తారు. నియమవంతుడైన మానవుడు ఈ లింగదర్శనం చేసి అన్ని పాపాలనుంచి విముక్తుడయి మరల జన్మించడు.

**పురా జంబుకరూపేణ అసురో దేవకంటకః ।**
**బ్రహ్మణో హి వరం లబ్ధ్వా గోమాయుర్బంధశంకితః ॥95॥**

**నిహతో హిమవత్పుత్రి జంబుకేశస్తతో హ్యహమ్ ।**
**అద్యాపి జగతి ఖ్యాతం సురాసురనమస్కృతమ్ ॥96॥**

**దృష్ట్వైనమపి దేవేశం సర్వాన్ కామానవాప్నుయాత్ ।**
**గ్రహైః శుక్రపురోగైశ్చ ఏతాని స్థాపితాని చ ॥97॥**

**పశ్య పుణ్యాని లింగాని సర్వకామప్రదాని తు ।**
**ఏవమేతాని పుణ్యాని మన్నివాసాని పార్వతి ॥98॥**

**కథితాని మమక్షేత్రే గుహ్యం చాన్యదిదం శృణు ।**

పూర్వం దేవతలకు కంటకప్రాయుడై జంబుకరూపుడైన ఒక అసురుడున్నాడు. బంధశంకితుడైన ఆతడు బ్రహ్మ వల్ల వరం పొంది ఎవ్వరి చేత బంధింపబడకున్నాడు. ఓ పార్వతీ! నేను ఆతణ్ణి చంపి జంబుకేశ్వరుడుగా ప్రసిద్ధి పొందాను. దేవతలు, దానవులు నమస్కరించే ఈ జంబుకేశ్వరుణ్ణి దర్శించిన మానవుడు అన్ని కోరికలను పొందగలడు. శుక్రుడు మొదలైన ముఖ్యగ్రహాలు ప్రతిష్ఠించిన పుణ్యస్వరూపాలు, సర్వకామనలను తీర్చేవి అయిన లింగాలను దర్శించు. ఓ పార్వతీ! ఇవి పుణ్యదాయకాలైన నా నివాసాలు నా క్షేత్రంలో మరొక గూఢరహస్యముంది. దాన్ని వినవలసింది!

**చతుఃక్రోశం చతుర్దిక్షు క్షేత్రమేతత్ప్రకీర్తితమ్ ॥99॥**

**యోజనం విద్ధి చార్వంగి మృత్యుకాలేఽమృతప్రదమ్ ।**
**మహాలయగిరిస్థం మాం కేదారే చ వ్యవస్థితమ్ ॥100॥**

**గణత్వం లభతే దృష్ట్వా హ్యస్మిన్ మోక్షో హ్యవాప్యతే ।**
**గాణపత్యం లభేద్యస్మాద్యతః సా ముక్తిరుత్తమాః ॥101॥**

**తతో మహాలయాత్తస్మాత్కేదారాన్మధ్యమాదపి ।**

**స్మృతం పుణ్యతమం క్షేత్రం స్థానం చైవ మహాలయమ్ ।**
**మమ పుణ్యాని భూర్లోకే తేభ్యః శ్రేష్ఠతమం త్విదమ్ ॥103॥**

ఈ క్షేత్రం నాలుగువైపుల (దిక్కుల) నాలుగు క్రోసుల విస్తీర్ణం కలది. అందుచేతనే ఒక యోజనంగా తెలియాలి. ఓ సుందరాంగీ! మృత్యుసమయంలో ఇది అమృతత్త్వప్రదాయి. మహాలయపర్వతం మీద, కేదారంలోగల నన్ను దర్శించిన మానవుడు గణత్వాన్ని పొందుతాడు. ఈ స్థానంలో అయితే మోక్షాన్ని కూడా పొందుతాడు. ఆస్థానాలలో గణపతిపదం ప్రాప్తిస్తుంది. ఇక్కడ మాత్రం ఉత్తమమైన ముక్తి కూడా కలుగుతుంది. ఓ వరాననా! పార్వతీ! అందువల్ల ఈ మహాలయం, కేదారం మధ్యమక్షేత్రాలు. వీటి అన్నింటిలో పుణ్యప్రదమైనది అవిముక్తక్షేత్రమే. మధ్యమక్షేత్రాలైన మహాలయకేదారాలు, ఈ అవిముక్తం ఈ మూడు భూలోకాలలో పవిత్రక్షేత్రాలు. కాని ఈ అవిముక్తం వాటికన్నా అధిక శ్రేష్ఠం.

**యతః సృష్టాస్త్విమే లోకాస్తతః క్షేత్రమిదం శుభమ్ ।**
**కదాచిన్న మయా ముక్తమవిముక్తం తతోఽభవత్ ॥104॥**

**అవిముక్తేశ్వరం లింగం మమ దృష్ట్వేహ మానవః ।**
**సద్యః పాపవినిర్ముక్తః పశుపాశైర్విముచ్యతే ॥105॥**

**శైలేశం సంగమేశం చ స్వర్లీనం మధ్యమేశ్వరమ్ ।**
**హిరణ్యగర్భమీశానం గోప్రేక్షం వృషభధ్వజమ్ ॥106॥**

**ఉపశాంతం శివం చైవ జ్యేష్ఠస్థాననివాసినమ్ ।**
**శుక్రేశ్వరం చ విఖ్యాతం వ్యాఘ్రేశం జంబుకేశ్వరమ్ ॥107॥**

**దృష్ట్వా న జాయతే మర్త్యః సంసారే దుఃఖసాగరే ।**

ఈ లోకాలు సృష్టింపబడినప్పటి నుంచి నేను ఈ పవిత్రక్షేత్రాన్ని ఎప్పుడు విడిచి ఉండలేదు. అందుచేత ఇది 'అవిముక్తం' అయ్యింది. ఇక్కడ నా యీ అవిముక్తేశ్వరలింగదర్శనం చేసిన మానవుడు వెంటనే పాపవిముక్తుడై, జీవబంధనాలనుంచి విముక్తుడవుతున్నాడు. శైలేశ్వరం, సంగమేశ్వరం, స్వర్లీనేశ్వరం, మధ్యమేశ్వరం, హిరణ్యగర్భం, ఈశానం, గోప్రేక్షం, వృషభధ్వజం, ఉపశాంతం, జ్యేష్ఠస్థానం, శుక్రేశ్వరం, ప్రసిద్ధమైన వ్యాఘ్రేశ్వరం, అట్లే జంబుకేశ్వరం – ఈ స్థానాల్లో శివుణ్ణి (నన్ను) దర్శించిన మానవుడు దుఃఖభరితమైన సంసార సాగరంలో జన్మించడు.

**సూత ఉవాచ :–** సూతర్షి పలికాడు.

**ఏవముక్త్వా మహాదేవో దిశః సర్వా వ్యలోకయత్ ॥108॥**

**విలోక్య సంస్థితే పశ్చాద్దేవదేవే మహేశ్వరే ।**
**అకస్మాదభవత్సర్వః స దేశోజ్జ్వలితో యథా ॥109॥**

**తతః పాశుపతాః సిద్ధా భస్మాభ్యంగసితప్రభాః ।**
**మహేశ్వరా మహాత్మానస్తథా వై నియతవ్రతాః ॥110॥**

**బహవః శతశోఽభ్యేత్య నమశ్చక్రుర్మహేశ్వరమ్ ।**
**పునర్నిరీక్ష్య యోగేశం ధ్యానయోగం చ కృత్స్నశః ॥111॥**

**తస్థురాత్మానమాస్థాయ లీయమానా ఇవేశ్వరే ।**
**స్థితానాం స తదా తేషాం దేవదేవ ఉమాపతిః ॥112॥**

**స బిభ్రత్పరమాం మూర్తిం బభూవ పురుషః ప్రభుః ।**
**కృత్స్నం జగదిహైకస్థం కర్తుమంత ఇవ స్థితః ॥113॥**

ఓ ఋషులారా! ఈ విధంగా పలికి మహాదేవశివుడు అన్ని దిక్కులవైపు పరికించాడు. అలా దిక్కులవైపు చూచి శివుడు నిలువగా ఆ ప్రదేశమంతా అకస్మాత్తుగా ప్రజ్వలించింది. అనంతరం భస్మధారణచేత శ్వేతాంగులైన వాళ్లు, నియమవ్రతులు, పాశుపతులు, మాహేశ్వరులు, సిద్ధులు, మహాత్ములు వందలకొలది అక్కడకు వచ్చి, శివుడికి నమస్కరించారు. మరల వాళ్లు ధ్యానయోగంలో ఉన్న యోగేశ్వరుడైన శివుణ్ణి మాటిమాటికి చూచి వాళ్ల మనసుల్లో ఆయన్ని స్థిరపర్చుకుని ఆ యీశ్వరుడిలో లీనమవుతున్నట్లు నిలిచారు. వాళ్లు ఆ విధంగా ఉండగా దేవదేవుడు, ఉమాపతి పరమమూర్తిని ధరించి 'విరాట్ పురుషుడి'గా నిలిచాడు. సమస్తజగత్తును అంతంచేసి ఒక స్థానంలో ఒకటిగా చేసినట్లుగా నిలిచాడు.

**తస్య తాం పరమాం మూర్తిమాస్థితస్య జగత్ప్రభోః ।**
**న శశాక పునర్ద్రష్టుం హృష్టరోమా గిరీంద్రజా ॥114॥**

**తతస్త్వదృష్టమాకారం బుద్ధ్వా సా ప్రకృతిస్థితమ్ ।**
**ప్రకృతేర్మూర్తిమాస్థాయ యోగేన పరమేశ్వరీ ॥115॥**

**తం శశాక పునర్ద్రష్టుం హరస్య చ మహాత్మనః ।**

అప్పుడు పులకితరోమావళి అయిన పార్వతీదేవి అక్కడగల జగత్ప్రభువు యొక్క పరమమూర్తిని తిరిగి చూడలేకపోయింది. అంతట ఆమె యిట్టి స్థితిని ఇంతకుముందెన్నడు చూడలేదని తెలిసి, ఇది ప్రకృతియందు కలదని భావించింది. యోగం ద్వారా పరమేశ్వరి అయిన పార్వతి ప్రకృతి రూపాన్ని ధరించి మహాత్ముడైన శివుణ్ణి ఆవిరాట్ రూపంలో తిరిగి చూడగలిగింది.

**తతస్తే లయమాదాయ యోగినః పురుషస్య తు ॥116॥**

**వివిశుర్హృదయం సర్వే దగ్ధసంసారబీజినః ।**
**పంచాక్షరస్య వై బీజం సంస్మరంతః సుశోభనమ్ ॥117॥**

**సర్వపాపహరం దివ్యం పురా చైవ ప్రకాశితమ్ ।**
**నీలలోహితమూర్తిస్థం పునశ్చక్రే వపుః శుభమ్ ॥118॥**

అప్పుడు అత్యంత సుందరమైన పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తూ, దగ్ధమైన లింగరూపంగల ఆ యోగులందరూ శివధ్యానంలో లీనమై ఆ విరాట్పురుషుణ్ణి హృదయంలో నిలుపుకున్నారు. తర్వాత శివుడు సమస్తపాపహరం, దివ్యం, అపూర్వం అయిన 'నీలలోహితమూర్తి'ని తిరిగి ధరించాడు.

**తం దృష్ట్వా శైలజా ప్రాహ హృష్టసర్వతనూరుహా ।**
**స్తువతీ చరణౌ నత్వా క ఇమే భగవానితి ॥119॥**

**తామువాచ సురశ్రేష్ఠస్తదా దేవీం గిరీంద్రజామ్ ।**

ఆ రూపాన్ని దర్శించి పులకిత దేహ అయిన పార్వతి ఆయన్ని స్తుతించి, చరణాలకు నమస్కరించి ఇలా పలికింది. "ఓ భగవానుడా! ఇది ఏమి" అని. అప్పుడు సురశ్రేష్ఠుడు, శివుడు పర్వతరాజపుత్రికతో ఇలా పలికాడు.

**శ్రీ భగవానువాచ –** శివభగవానుడు పలికాడు.

**మదీయం వ్రతమాశ్రిత్య భక్తిమద్భిర్ద్విజోత్తమైః ॥120॥**

**యైర్యైర్యోగా ఇహాభ్యస్తాస్తేషామేకేన జన్మనా ।**
**క్షేత్రస్యాస్య ప్రభావేన భక్త్యా చ మమ భామిని ॥121॥**

**అనుగ్రహో మయా హ్యేవం క్రియతే మూర్తితః స్వయమ్ ।**
**తస్మాదేతన్మహత్ క్షేత్రం బ్రహ్మాద్యైః సేవితం తథా ॥122॥**

**శ్రుతిమద్భిశ్చ విప్రేంద్రైః సంసిద్ధైశ్చ తపస్విభిః ।**
**ప్రతిమాసం తథాష్టభ్యాం ప్రతిమాసం చతుర్దశీమ్ ॥123॥**

**ఉభయోః పక్షయోర్దేవి వారాణస్యాముపాస్యతే ।**
**శశిభానూపరాగే చ కార్తిక్యాం చ విశేషతః ॥124॥**

**సర్వపర్వసు పుణ్యేషు విషువేష్వయనేషు చ ।**
**పృథివ్యాం సర్వతీర్థాని వారాణస్యాం తు జాహ్నవీమ్ ॥125॥**

**ఉత్తరప్రవహాం పుణ్యాం మమ మౌళివినిఃసృతామ్ ।**
**పితుస్తే గిరిరాజస్య శుభాం హిమవతః సుతామ్ ॥126॥**

**పుణ్యస్థానస్థితాం పుణ్యాం పుణ్యదిక్ప్రవహాం సదా ।**
**భజంతే సర్వతోఽభ్యేత్య యే తాన్ శృణు వరాననే ॥127॥**

ఓ భామిని! నా వ్రతాన్ని ఆశ్రయించి భక్తిమంతులైన ఉత్తమద్విజులు ఎవరు ఎవరు ఇక్కడ యోగాభ్యాసం చేస్తారో, వాళ్లు ఒక్క జన్మలోనే ఈ క్షేత్ర ప్రభావంవల్ల, వాళ్ల భక్తివల్ల నేను విగ్రహరూపం నుంచి వాళ్లను అనుగ్రహిస్తాను. అందుచేత ఈ గొప్పక్షేత్రం బ్రహ్మాది దేవతలచేత, వేదవేత్తలయిన బ్రాహ్మణులచేత, సిద్ధులచేత, తాపసుల చేత సేవింపబడుతుంది. ఓ దేవి! ప్రతిమాసంలో రెండు పక్షాలలో అష్టమినాడు, చతుర్దశినాడు వారణాసిలో శివపూజ జరుగుతుంది. సూర్యగ్రహణం మరియు చంద్రగ్రహణం సమయంలో, విశేషమైన కార్తీకమాసంలో, శుభప్రదాలైన పండుగ దినాల్లో, పూర్ణిమ, పాడ్యమి దినాల్లో ఇట్లే ఇతర సంక్రమణ దినాల్లో, గంగ సేవింపబడుతుంది. ఆ గంగ వారణాసిలో ఉత్తరవాహిని, పుణ్యమయి. నా శిరసునుంచి జారినది. నీ తండ్రి గిరిరాజు హిమవంతుడి కుమార్తె. పుణ్యస్థానాల్లో ఎల్లప్పుడూ పుణ్యదిశలో ప్రవహిస్తుంది. ఓ వరాననా! భూమిపైగల అన్ని తీర్థాలనుంచి అన్ని దిక్కులనుంచి వచ్చినవాళ్లు ఈ భాగీరథిని సేవిస్తున్నారు. ఆ విషయాల్ని విను.

**సన్నిహత్య కురుక్షేత్రం సార్ధం తీర్థశతైస్తథా ।**
**పుష్కరం నిమిషం చైవ ప్రయాగం చ పృథూదకమ్ ॥128॥**

**ద్రుమక్షేత్రం కురుక్షేత్రం నైమిషం తీర్థసంయుతమ్ ।**
**క్షేత్రాణి సర్వతో దేవి దేవతాఋషయస్తథా ॥129॥**

**సంధ్యా చ ఋతవశ్చైవ సర్వా నద్యః సరాంసి చ ।**
**సముద్రాః సప్త చైవాత్ర దేవతీర్థాని కృత్స్నశః ॥130॥**

**భాగీరథీం సమేష్యంతి సర్వపర్వసు సువ్రతే ।**
**అవిముక్తేశ్వరం దృష్ట్వా దృష్ట్వా చైవ త్రివిష్టపమ్ ॥131॥**

**కాలభైరవమాసాద్య ధూతపాపాని సర్వశః ।**
**భవంతి హి సురేశాని సర్వపర్వసు పర్వసు ॥132॥**

**పృథివ్యాం యాని పుణ్యాని మహత్యాయతనాని చ ।**

**ప్రవిశంతి సదాభ్యేత్య పుణ్యం పర్వసు పర్వసు ।**
**అవిముక్తం క్షేత్రవరం మహాపాపనిబర్హణమ్ ॥133॥**

ఓ దేవి! ఓ సువ్రతా! కురుక్షేత్రం, పుష్కరం, నిమిషం, ప్రయాగ, పృథూదకం, ద్రుమక్షేత్రం, కురుక్షేత్రం, పుణ్యమయనైమిషం – ఇలాంటి అన్ని క్షేత్రాలు; అందరు దేవతలు, ఋషిగణాలు, సంధ్య, ఋతువులు; అన్ని నదులు, అన్ని సరోవరాలు, సప్తసముద్రాలు, సమస్తదేవతీర్థాలు, ఏకీభూతాలై, వందల తీర్థాలతో కూడి అన్ని పర్వదినాల్లో గంగానదికి వచ్చి కలిసి పోతున్నాయి. ఓ సురేశాని! అన్ని పర్వదినాల్లో అవిముక్తేశ్వరాన్ని, త్రివిష్టపాన్ని దర్శించి, తిరిగి కాలభైరవుణ్ణి చేరి సంపూర్ణంగా పాపవిముక్తులవుతున్నారు. భూమిపైన పవిత్రాలు, గొప్పవి అయిన ఆయతనాలు (దేవాలయాలు) ఉన్నవో అవి అన్నీ అన్ని పర్వాల్లో పాపవినాశనకారకమైన క్షేత్రశ్రేష్ఠం, పుణ్యమయం అయిన అవిముక్తానికి వచ్చి చేరుతున్నాయి.

**కేదారే చైవ యల్లింగం యచ్చ లింగం మహాలయే ॥134॥**

**మధ్యమేశ్వరసంజ్ఞం చ తథా పాశుపతేశ్వరమ్ ।**
**శంకుకర్ణేశ్వరం చైవ గోకర్ణౌ చ తథా హ్యుభౌ ॥135॥**

**ద్రుమచండేశ్వరం నామ భద్రేశ్వరమనుత్తమమ్ ।**
**స్థానేశ్వరం తథైకాగ్రం కాలేశ్వరమజేశ్వరమ్ ॥136॥**

**భైరవేశ్వరమీశానం తథోంకారకసంజ్ఞితమ్ ।**
**అమరేశం మహాకాలం జ్యోతిషం భస్మగాత్రకమ్ ॥137॥**

**యాని చాన్యాని పుణ్యాని స్థానాని మమ భూతలే ।**
**అష్టషష్టిసమాఖ్యాని రూఢాన్యన్యాని కృత్స్నశః ॥138॥**

**తాని సర్వాణ్యశేషాణి వారాణస్యాం విశంతి మామ్ ।**
**సర్వపర్వసు పుణ్యేషు గుహ్యం చైతదుదాహృతమ్ ॥139॥**

**తేనేహ లభతే జంతుర్మృతో దివ్యామృతం పదమ్ ।**

కేదారంలో ఉన్న లింగం, మహాలయంలో ఉన్న లింగం, మధ్యమేశ్వరనామ లింగం, అట్లే పాశుపతేశ్వరం, శంకుకర్ణేశ్వరం, రెండు గోకర్ణేశ్వరాలు, ద్రుమచండేశ్వరం, అత్యుత్తమమైన భద్రేశ్వరం, స్థానేశ్వరం, ఏకాగ్రేశ్వరం, కాలేశ్వరం, అజేశ్వరం, భైరవేశ్వరం, ఈశానం, ఓంకారేశ్వరం, అమరేశ్వరం, మహాకాలేశ్వరం, జ్యోతిషం, భస్మాగ్రం మొదలైన క్షేత్రాలు అందులోని లింగాలు, మరియు ఇతరాలైన పుణ్యస్థానాలు, లింగాలు మొత్తం అరవై ఎనిమిది ప్రవిత్రస్థానాలు ఈ భూమిపై ఉన్నాయి. ఇట్లే ఇంకా కొన్ని లోకప్రసిద్ధస్థానాలు ఉన్నాయి. అశేషాలైనా అవి అన్నీ పుణ్యపర్వదినాలలో వారణాసిలో నా దగ్గరకు వస్తాయి. ఓ దేవీ! ఈ కారణంగా ఇక్కడ మృతి చెందిన ప్రాణి దివ్యమై, అమృతమైన (అమరమైన) పదాన్ని పొందుతున్నది. నేను నీకు ఈ రహస్యాన్ని చెప్పాను.

**స్నాతస్య చైవ గంగాయాం దృష్టేన చ మయా శుభే ॥140॥**

**సర్వయజ్ఞఫలైస్తుల్యమిష్టైః శతసహస్రశః ।**
**సద్య ఏవ సమాప్నోతి కిం తతః పరమాద్భుతమ్ ॥141॥**

**సర్వాయతనముఖ్యాని దివి భూమౌ గిరిష్వపి ।**
**పరాత్పరం దేవి బుధ్యస్వేతి మయోదితమ్ ॥142॥**

**అవిశబ్దేన పాపస్తు వేదోక్తః కథ్యతే ద్విజైః ।**
**తేన ముక్తం మయా జుష్టమవిముక్తమతోచ్యతే ॥143॥**

ఓ దేవీ! వారాణసిలో గంగలో స్నానం చేసి నన్ను దర్శించడం వల్ల మానవులు వందల, వేల సర్వయజ్ఞాల్ని నిర్వహించిన దాని వల్ల కలిగే అభీష్టఫలాలతో సమానమైన ఫలాన్ని వెంటనే పొందుతున్నారు. ఇందులో మిక్కిలి ఆశ్చర్యం ఏమున్నది? ఓ దేవీ! స్వర్గంలో, భూమిమీద, పర్వతాల మీద ఉన్న ప్రధాన దేవస్థానాలు అన్నింటిలో నేను చెప్పిన యీ వారాణసి క్షేత్రం శ్రేష్ఠమైనది. ద్విజులచేత వేదాలలో వర్ణింపబడిన పాపం 'అవి' శబ్దంచేత చెప్పబడింది. ఈ క్షేత్రం ఆ పాపం నుంచి ముక్తం అవడంచేత, నా ద్వారా సేవించబడడం చేత ఇది 'అవిముక్తం' అవుతున్నది.

**ఇత్యుక్త్వా భగవాన్ రుద్రః సర్వలోకమహేశ్వరః ।**
**సుదృష్టం కురు దేవేశి అవిముక్తం గృహం మమ ॥144॥**

**ఇత్యక్త్వా భగవాన్ దేవస్తయా సార్ధముమాపతిః ।**
**దర్శయామాస భగవాన్ శ్రీపర్వతమనుత్తమమ్ ॥145॥**

**అవిముక్తేశ్వరే నిత్యమవసచ్చ సదా తయా ।**
**సర్వగత్వాచ్చ సర్వత్వాత్సర్వాత్మా సదసన్మయః ॥146॥**

**శ్రీ పర్వతమనుప్రాప్య దేవ్యా దేవేశ్వరో హరః ।**
**క్షేత్రాణి దర్శయామాస సర్వభూతపతిర్భవః ॥147॥**

ఈ విధంగా పలికి సర్వలోకనాథుడు, భగవానుడు, రుద్రుడు మరల ఇలా పలికాడు. ఓ దేవేశ్వరి! నాయీ నివాసస్థానమైన అవిముక్తాన్ని బాగా దర్శించు. ఈ విధంగా పలికిన తర్వాత ఆమెను కూడా తీసుకుని అత్యుత్తమమైన శ్రీ పర్వతాన్ని చూపించాడు. అవిముక్తేశ్వరంలో ఆమెతో కూడా కలిసి ఉన్నాడు. సర్వగమనుడు, సర్వవ్యాపకుడు, సర్వాత్ముడు, సదసత్స్వరూపుడు, దేవప్రభువు, పశుపతి అయిన శివుడు పార్వతీదేవితో శ్రీపర్వతాన్ని చేరి అక్కడగల పవిత్రక్షేత్రాల్ని చూపించాడు.

**కుండిప్రభం చ పరమం దివ్యం వైశ్రవణేశ్వరమ్ ।**
**ఆశాలింగం చ దేవేశం దివ్యం యచ్చ బలేశ్వరమ్ ॥148॥**

**రామేశ్వరం చ పరమం విష్ణునా యత్ ప్రతిష్ఠితమ్ ।**
**దక్షిణద్వారపార్శ్వే తు కుండలేశ్వరమీశ్వరమ్ ॥149॥**

**పూర్వద్వారసమీపస్థం త్రిపురాంతకముత్తమమ్ ।**
**వివృద్ధం గిరిణా సార్ధం దేవదేవనమస్కృతమ్ ॥150॥**

**మధ్యమేశ్వరమిత్యుక్తం త్రిషు లోకేషు విశ్రుతమ్ ।**
**అమరేశ్వరం చ వరదం దేవైః పూర్వం ప్రతిష్ఠితమ్ ॥151॥**

**గోచర్మేశ్వరమీశానం తథేంద్రేశ్వరమద్భుతమ్ ।**
**కర్మేశ్వరం చ విపులం కార్యార్థం బ్రహ్మణా కృతమ్ ॥152॥**

**శ్రీమత్సిద్ధవటం చైవ సదా వాసో మమావ్యయే ।**
**అజేన నిర్మితం దివ్యం సాక్షాదజబిలం శుభమ్ ॥153॥**

**తత్రైవ పాదుకే దివ్యే మదీయే చ బిలేశ్వరే ।**
**తత్ర శృంగాటకాకారం శృంగాటాచలమధ్యమే ॥154॥**

**శృంగాటకేశ్వరం నామ శ్రీదేవ్యా తు ప్రతిష్ఠితమ్ ।**
**మల్లికార్జునకం చైవ మమ వాసమిదం శుభమ్ ॥155॥**

**రాజేశ్వరం చ పర్యాయే రజసా సుప్రతిష్ఠితమ్ ।**
**రాజేశ్వరం చ వైశాఖ్యం కపోతేశ్వరమవ్యయమ్ ॥156॥**

**కోటీశ్వరం మహాతీర్థం రుద్రకోటిగణైః పురా ।**
**సేవితం దేవి పశ్యాద్య సర్వస్మాదధికం శుభమ్ ॥157॥**

కుండిప్రభ, పరమదివ్యమైన వైశ్రవణేశ్వరం, ఆశాలింగం, దేవేశ్వరం, దివ్యమైన బలేశ్వరం, విష్ణువు స్థాపించిన రామేశ్వరం, దక్షిణద్వారం యొక్క పార్శ్వభాగంలోగల కుండలేశ్వరం, పూర్వద్వారం యొక్క సమీపంలో పర్వతంతోపాటు వృద్ధి పొంది, సమస్తదేవతలతో నమస్కరింపబడే ఉత్తమమైన త్రిపురాంతకం, మూడు లోకాలలో ప్రసిద్ధమైన మధ్యమేశ్వరం, పూర్వం దేవతాగణంతో స్థాపింపబడి వరప్రదాయి అమరేశ్వరం, గోచర్మేశ్వరం, ఈశానం, అద్భుతమైన రుద్రేశ్వరం, తన కార్యసిద్ధికై బ్రహ్మ ప్రతిష్ఠించిన విశాలమైన కర్మేశ్వరం వీటిలో ఇక్కడ లింగాలు ఉన్నాయి. ఓ అవినాశి! శ్రీమంతమైన సిద్ధవటం ఎల్లప్పుడూ నా నివాస స్థానం. స్వయంగా బ్రహ్మ నిర్మించిన దివ్యమూ, మరియు పవిత్రమూ 'అజబిలం' అనే స్థానం అది. ఆ బిలేశ్వరంలో నా దివ్యమైన పాదుకలు ఉన్నాయి. అక్కడే శృంగాటక పర్వతం యొక్క మధ్యశిఖరం మీద శృంగాటకాకారంగల (త్రికోణం) శృంగాటకేశ్వరం అనే పేరుగల లింగం ఉంది. దాన్ని లక్ష్మీదేవి ప్రతిష్ఠించింది. అక్కడ మల్లికార్జున లింగం నా యొక్క శుభకరమైన నివాసం. యుగాలు మారిపోగా బ్రహ్మ ప్రతిష్ఠించిన రాజేశ్వరం, స్కందుడు ప్రతిష్ఠించిన గజేశ్వరం, అవినాశి అయిన కపోతేశ్వరం, అట్లే అన్నింటికన్నా శుభకరమై కోట్లకొలది రుద్రగణాలతో సేవింపబడిన 'కోటీశ్వర'మనే మహాతీర్థాన్ని ఇప్పుడు దర్శించు.

**ద్విదేవకులసంజ్ఞం చ బ్రహ్మణా దక్షిణే శుభమ్ ।**
**ఉత్తరే స్థాపితం చైవ విష్ణునా చైవ శైలజమ్ ॥ 158॥**

**మహాప్రమాణలింగం చ మయా పూర్వం ప్రతిష్ఠితమ్ ।**
**పశ్చిమే పర్వతే పశ్య బ్రహ్మేశ్వరమలేశ్వరమ్ ॥159॥**

**అలంకృతం త్వయా బ్రహ్మన్ పురస్తాన్మునిభిః సహ ।**
**ఇత్యుక్త్వా తద్గృహేఽ తిష్ఠదలంగృహమితి స్మృతమ్ ॥160॥**

దక్షిణదిక్కులో బ్రహ్మ, ఉత్తరదిక్కులో విష్ణువు ప్రతిష్ఠించిన పాషాణనిర్మితాలై, సుందరమైన 'ద్విజదేవకులం' అనే పేరుగల లింగాలు, పూర్వం నేనే స్థాపించిన మిక్కిలి ఎత్తైన లింగం, అట్లే పశ్చిమదిక్కులో పర్వతం మీద ఉన్న బ్రహ్మేశ్వరం, అలేశ్వరం అనే పేర్లుగల లింగాలను దర్శించు. మహాదేవుడు బ్రహ్మతో పలికాడు. "ఓ బ్రహ్మా! నీవు మునులతో కలిసి దీన్ని అలంకరించావా?" అని. అలా పలికి రుద్రుడు ఆ గృహంలో ఉన్నాడు. దాంతో దాన్ని 'అలంగృహం' అన్నారు.

**తత్రాపి తీర్థం తీర్థజ్ఞే వ్యోమలింగం చ పశ్య మే ।**
**కదంబేశ్వరమేతద్ధి స్కందేనైవ ప్రతిష్ఠితమ్ ॥161॥**

**గోమండలేశ్వరం చైవ నందాద్యైః సుప్రతిష్ఠితమ్ ।**
**దేవైః సర్వైస్తు శక్రాద్యైః స్థాపితాని వరాననే ॥162॥**

**శ్రీమద్దేవహ్రదప్రాంతే స్థానానీమాని పశ్య మే ।**
**తథా హారపురే దేవి తవ హారే నిపాతితే ॥163॥**

**త్వయా హితాయ జగతాం హారకుండమిదం కృతమ్ ।**
**శివరుద్రపురే చైవ తత్కాయోపరి సువ్రతే ॥164॥**

**తత్ర పిత్రా సుశైలేన స్థాపితం త్వచలేశ్వరమ్ ।**
**అలంకృతం మయా బ్రహ్మ పురస్తాన్మునిభిః సహ ॥165॥**

**చండికేశ్వరకం దేవి చండికేశా తవాత్మజా ।**
**చండికానిర్మితం స్థానమంబికాతీర్థముత్తమమ్ ॥166॥**

**రుచికేశ్వరకం చైవ ధారైషా కపిలా శుభా ।**

ఓ తీర్థజ్ఞా! పార్వతీ! ఇక్కడేగల నా యొక్క వ్యోమలింగ తీర్థాన్ని చూడు. 'కదంబేశ్వరం' అనే పేరుగల తీర్థాన్ని స్కందుడు స్థాపించాడు. నందాదుల ద్వారా విధ్యుక్తంగా స్థాపించిన గోమండలేశ్వరుణ్ణి కూడా చూడు. ఓ వరాననా! బహుసుందరమైన దేవహ్రదసరోవరం ఒడ్డున ఇంద్రాదిదేవతలందరి చేత ప్రతిష్ఠింపబడిన నాయీ స్థానాలను అవలోకించు. హారపురంలో నీ హారం క్రింద పడడం చేత నీవు జగత్తు యొక్క హితం కోసం ఈ హారకుండాలను నిర్మించావు. శివరుద్రపురంలో ఆ పర్వతం మీద నీ తండ్రి సుశైలుడు, 'అచలేశ్వరుణ్ణి' స్థాపించాడు. దానిలో నేను బ్రహ్మాదులైన ఋషులతోపాటు సుందరంగా శోభించాను. ఓ దేవి! నీ కుమార్తె చండికేశ చండికేశ్వరుణ్ణి స్థాపించింది. చండిక వల్ల ప్రతిష్ఠితమైన ఆ స్థానం ఉత్తమమైన అంబికా తీర్థం అయ్యింది. ఇది రుచికేశ్వరతీర్థం. ఇక్కడ పవిత్రమైన కపిలధారతీర్థం ఉంది.

**ఏతేషు దేవి స్థానేషు తీర్థేషు వివిధేషు చ ॥167॥**

**పూజయేన్మాం సదా భక్త్యా మయా సార్ధం హి మోదతే ।**
**శ్రీశైలే సంత్యజేద్దేహం బ్రాహ్మణో దగ్ధకిల్బిషః ॥168॥**

**ముచ్యతే నాత్ర సందేహో హ్యవిముక్తే యథా శుభమ్ ।**
**మహాస్నానం చ యః కుర్యాద్ ఘృతేన విధినైవ తు ॥169॥**

**స యాతి మమ సాయుజ్యం స్థానేష్వేతేషు సువ్రతే ।**
**స్నానం పలశతం జ్ఞేయమభ్యంగం పంచవింశతి ॥170॥**

**పలానాం ద్వే సహస్రే తు మహాస్నానం ప్రకీర్తితమ్ ।**

ఓ దేవీ! ఎవడు వివిధ స్థానాలలో అట్లే తీర్థాలలో భక్తిపూర్వకంగా ఎల్లప్పుడూ నన్ను పూజిస్తాడో ఆతడు నాతోపాటు ఆనందిస్తాడు. శ్రీశైలంలో దేహత్యాగం చేసిన బ్రాహ్మణుడు పాపరహితుడై ముక్తుడవుతున్నాడు. అవిముక్తంలో ఎటువంటి శుభం కలుగుతుందో ఇక్కడా అంతే. ఇందుకు ఎటువంటి సందేహం లేదు. ఓ సువ్రతా! ఎవడు ఈ స్థానాలలో విధిపూర్వకంగా నేతితో మహాస్నానం చేస్తాడో ఆతడు నా సాయుజ్యాన్ని పొందుతున్నాడు. ఇరవై ఐదుసార్లు అభ్యంగనస్నానం వందసార్లు చేసిన స్నానంతో సమానం. రెండువేలసార్లు ఘృతస్నానం (నేతితో) 'మహాస్నానం' అవుతుంది.

**స్నాప్య లింగం మదీయం తు గవ్యేనైవ ఘృతేన చ ॥171॥**

**విశోధ్య సర్వద్రవ్యైస్తు వారిభిరభిషించతి ।**
**సంమార్జ్య శతయజ్ఞానాం స్నానేన ప్రయుతం తథా ॥172॥**

**పూజయా శతసాహస్రమనంతం గీతవాదినామ్ ।**
**మహాస్నానే ప్రసక్తే తు స్నానమష్టగుణం స్మృతమ్ ॥173॥**

**జలేన కేవలేనైవ గంధతోయేన భక్తితః ।**
**అనులేపనం తు తత్సర్వం పంచవిశత్పలేన వై ॥174॥**

నా లింగాన్ని ఆవునేతితో స్నానం చేయించి, అన్ని పూజాద్రవ్యాలతో పరిశుభ్రపరచి, జలంతో నన్ను అభిషేకించాలి. ఈ విధంగా సమ్మార్జన చేస్తే నూరు యజ్ఞాలలో స్నానం చేసినంత, లక్షలకొలది యజ్ఞాలలో పూజ చేసినంత, అనంత యజ్ఞాలలో గీతవాద్యాలతో అర్చన చేసినంత ఫలం దక్కుతున్నది. మహాస్నానం చేసిన వ్యక్తి ఇతర భక్తుల యొక్క స్నానఫలానికి ఎనిమిదిరెట్లు ఫలాన్ని పొందుతున్నాడు. కేవలం భక్తిపూర్వకంగా నీటితో లేక సుగంధ జలంతో అభ్యంగన స్నానం ఇరవైఐదుసార్లు నేతితో చేసిన స్నానంతో సమానం.

**శమీపుష్పం చ విధినా బిల్వపత్రం చ పంకజమ్ ।**
**అన్యాన్యపి చ పుష్పాణి బిల్వపత్రం న సంత్యజేత్ ॥175॥**

**చతుర్ద్రోణైర్మహాదేవమష్టద్రోణైరథాపి వా ।**
**దశద్రోణైస్తు నైవేద్యమష్టద్రోణైరథాపి వా ॥176॥**

**శతద్రోణసమం పుణ్యమాఢకేఽపి విధీయతే ।**
**విత్తహీనస్య విప్రస్య నాత్ర కార్యా విచారణా ॥177॥**

విధ్యుక్తంగా శమీపుష్పాన్ని, బిల్వపత్రాన్ని, కమలాన్ని అట్లే ఇతర పుష్పాలను దేవదేవుడికి సమర్పించాలి. బిల్వపత్రం లేకుండా ఎప్పుడూ చేయరాదు. శివుణ్ణి నాలుగు లేక ఎనిమిది ద్రోణపరిమాణ ధాన్యాలతో పూజించాలి. నైవేద్యం పది లేక ఎనిమిది ద్రోణపరిమాణంగా సమర్పించాలి. ధనహీనుడైన బ్రాహ్మణుడు ఒక ఆఢకంతో చేసిన నైవేద్యంతో సంపాదించిన పుణ్యం, ఇతరులు నూరు ద్రోణాలతో సమర్పించిన దానివల్ల కలిగే పుణ్యంతో సమానం. ఇందుకై ఏమాత్రం సందేహించ పనిలేదు.

**భేరీమృదంగమురజతిమిరాపటహాదిభిః ।**
**వాదిత్రైర్వివిధైశ్చాన్యైర్నినాదైర్వివిధైరపి ॥178॥**

**జాగరం కారయేద్యస్తు ప్రార్థయేచ్చ యథాక్రమమ్ ।**
**స భృత్యపుత్రదారైశ్చ తథా సంబంధిబాంధవైః ॥179॥**

**సార్ధం ప్రదక్షిణం కృత్వా ప్రార్థయేల్లింగముత్తమమ్ ।**
**ద్రవ్యహీనం క్రియాహీనం శ్రద్ధాహీనం సురేశ్వర ॥180॥**

**కృతం వా న కృతం వాపి క్షంతుమర్హసి శంకర ।**
**ఇత్యుక్త్వా వై జపేద్రుద్రం త్వరితం శాంతిమేవ చ ॥181॥**

**జపిత్వైవం మహాబీజం తథా పంచాక్షరస్య వై ।**
**స ఏవం సర్వతీర్థేషు సర్వయజ్ఞేషు యత్ఫలమ్ ॥182॥**

**తత్ఫలం సమవాప్నోతి వారాణస్యాం యథా మృతః ।**
**తథైవ మమ సాయుజ్యం లభతే నాత్ర సంశయః ॥183॥**

**మత్ప్రియార్థమిదం కార్యం మద్భక్తైర్విధిపూర్వకమ్ ।**
**యే న కుర్వంతి తే భక్తా న భవంతి న సంశయః ॥184॥**

భేరి, మృదంగం, మురజం, తిమిరం, పటహం మొదలైన వివిధ వాద్యయంత్రాలతో, మరియు ఇతరవిధాలైన నినాదాలద్వారా రాత్రిళ్లు ఎవడు జాగరణ చేసి, తన సేవకులతో, భార్యతో, సంతానంతో, బంధువులతో, సంబంధీకులతో పాటుగా ప్రదక్షిణం చేసి, ఉత్తమలింగాల్ని ఉద్దేశించి, ప్రార్థించాలి. "ఓ సురేశ్వరా! ఓ శంకర! నేను ద్రవ్యహీనుణ్ణి, క్రియాహీనుణ్ణి, అట్లే శ్రద్ధాహీనుణ్ణి అయి పూజించినా, లేక పూజింపకుండినా నాపై నీవు కృప జూపి క్షమించాలి" అని ప్రార్థించి వెంటనే రుద్రమంత్రాన్ని, శాంతిమంత్రాన్ని జపించాలి. పంచాక్షరి యొక్క మహాబీజాన్ని జపించినవాడు సర్వతీర్థాల్ని సేవించగా, సమస్తయజ్ఞాల్ని నిర్వహించగా ఎలాంటి ఫలితం కల్గుతుందో అలాంటి ఫలితాన్ని పొందుతాడు. వారణాసిలో మరణిస్తే సాయుజ్యం దక్కుతుంది. నేను ఆ సాయుజ్యాన్ని ప్రాప్తింపజేస్తున్నాను. ఇందులో సందేహం లేదు. నాయిష్టం కోసం ఈ విధమైన కార్యం నా భక్తులు విధ్యుక్తంగా నిర్వహిస్తారు. ఎవరు చేయరో వాళ్లు నా భక్తులు కారు. ఇందులో సందేహం లేదు.

**సూత ఉవాచ** :- సూతుడు పలికాడు.

**నిశమ్య వచనం దేవీ గత్వా వారాణసీం పురీమ్ ।**
**అవిముక్తేశ్వరం లింగం పయసా చ ఘృతేన చ ॥185॥**

**అర్చయామాస దేవేశం రుద్రం భువననాయకమ్ ।**
**అవిముక్తే చ తపసా మందరస్య మహాత్మనః ॥186॥**

**కల్పయామాస వై క్షేత్రం మందరే చారుకందరే ।**
**తత్రాంధకం మహాదైత్యం హిరణ్యాక్షసుతం ప్రభుః ॥187॥**

**అనుగృహ్య గణత్వం చ ప్రాపయామాస లీలయా ।**
**ఏతద్వః కథితం సర్వం కథాసర్వస్వమాదరాత్ ॥188॥**

**యః పఠేచ్ఛృణుయాద్వాపి క్షేత్రమాహాత్మ్యముత్తమమ్ ।**
**సర్వక్షేత్రేషు యత్పుణ్యం తత్సర్వం సహసా లభేత్ ॥189॥**

**శ్రావయేద్వా ద్విజాన్ సర్వాన్ కృతశౌచాన్ జితేంద్రియాన్ ।**
**స ఏవ సర్వయజ్ఞస్య ఫలం ప్రాప్నోతి మానవః ॥190॥**

ఓ ఋషులారా! శివభగవానుడు చెప్పిన ఆ మాటలు విని పార్వతీదేవి వారణాసికి వెళ్లి పాలతో, నేతితో అవిముక్తేశ్వరలింగాన్ని స్నానం చేయించి భువననాయకుడు, దేవేశ్వరుడు అయిన రుద్రుణ్ణి అర్చించింది. అవిముక్తంలో (కాశి) తపస్సు ద్వారా మందర పర్వతం మీద ఒక సుందరమైన కందరంలో మహాత్ముడైన కందరుడి క్షేత్రం నిర్మించింది. అక్కడ శివుడు హిరణ్యాక్షుడి పుత్రుడైన అంధకుడనే మహాదైత్యుణ్ణి అనుగ్రహించి, లీలాపూర్వకంగా ఆతడికి గణత్వాన్ని ప్రాప్తింపజేశాడు. ఓ ఋషులారా! మీకు నేను ఆదరంగా ఈవిధంగా సంపూర్ణకథాసారం చెప్పాను. ఎవడు ఈ మహాక్షేత్రం యొక్క మాహాత్మ్యాన్ని చదువుతాడో లేక వింటాడో ఆతడు సర్వక్షేత్రాలను సేవించడం వల్ల కలిగే సమస్త పుణ్యాన్ని పొందుతాడు. ఎవడు పవిత్రులూ, జితేంద్రియులు అయిన ద్విజులకు విన్పిస్తాడో ఆతడు కూడా సమస్తయజ్ఞఫలాన్ని పొందుతున్నాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే వారాణసీశ్రీశైలమాహాత్మ్యకథనం నామ ద్వినవతితమోఽధ్యాయః ॥ 92 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగం వారాణసి, శ్రీశైలాలమాహాత్మ్యకథనమనే తొంబై రెండవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## త్రినవతితమోఽధ్యాయః - తొంబై మూడవ అధ్యాయం

## అంధకగాణపత్యాత్మకః - అంధకగాణపత్యాత్మకం

**ఋషయ ఊచుః :-** ఋషులు పలికారు.

**అంధకో నామ దైత్యేంద్రో మందరే చారుకందరే ।**
**దమితస్తు కథం లేభే గాణపత్యం మహేశ్వరాత్ ॥1॥**

**వక్తుమర్హసి చాస్మాకం యథావృత్తం యథాశ్రుతమ్ ।**

ఓ సూతర్షీ! అంధకుడనే దానవరాజు మందరపర్వతం యొక్క సుందరమైన గుహలో బాధింపబడి కూడా ఏ విధంగా ఈశ్వరుడి వల్ల గణాధిపతి అయ్యాడు? ఏ విధంగా అది జరిగిందో, ఏవిధంగా నీవు విన్నావో, దాన్ని కృపతో మాకు చెప్పు.

**సూత ఉవాచ** :- సూతర్షి పలికాడు.

**అంధకానుగ్రహం చైవ మందరే శోషణం తథా ॥2॥**

**వరలాభమశేషం చ ప్రవదామి సమాసతః ।**
**హిరణ్యాక్షస్య తనయో హిరణ్యనయనోపమః ॥3॥**

**పురాంధక ఇతి ఖ్యాతస్తపసా లబ్ధవిక్రమః ।**
**ప్రసాదాద్ బ్రహ్మణః సాక్షాదవధ్యత్వమవాప్య చ ॥4॥**

**త్రైలోక్యమఖిలం భుక్త్వా జిత్వా చేంద్రపురం పురా ।**
**లీలయా నాప్రయత్నేన త్రాసయామాస వాసవమ్ ॥5॥**

ఓ ఋషులారా! నేను మీకు అంధకుని అనుగ్రహం గూర్చి, అట్లే వరప్రాప్తి గూర్చి, (మందరపర్వతంలో అతనిని దహించుటను గూర్చి) సంగ్రహంగా చెబుతున్నాను. పూర్వం హిరణ్యాక్షుడి కుమారుడు ఒకడుండేవాడు. ఆతడు హిరణ్యాక్షుడితో సమానమైన బలవంతుడు. ఆతడి పేరు అంధకుడు. ఆతడు తపస్సుతో మహాపరాక్రమవంతుడయ్యాడు. ఆతడు బ్రహ్మదేవుడి అనుగ్రహం వల్ల ఏ విధంగాను మరణించని వరాన్ని పొంది మూడు లోకాల్ని అనుభవించి (జయించి) స్వర్గాన్ని ప్రయాసపడకుండా లీలగా జయించి ఇంద్రుణ్ణి పీడించాడు.

**బాధితాస్తాడితా బద్ధాః పాతితాస్తేన తే సురాః ।**
**వివిశుర్మందరం భీతా నారాయణపురోగమాః ॥6॥**

అంధకుడి చేత బాధింపబడి, దండింపబడి, బంధింపబడి, భూమిపైబడి, భయపడి నారాయణుడు మొదలైన దేవతలు మందరపర్వతం యొక్క గుహలోనికి ప్రవేశించారు.

**ఏవం సంపీడ్య వై దేవానంధకోఽపి మహాసురః ।**
**యదృచ్ఛయా గిరిం ప్రాప్తో మందరం చారుకందరమ్ ॥7॥**

ఈ విధంగా దేవతల్ని బాగా పీడించి మహాదైత్యుడైన అంధకుడు కూడా స్వేచ్ఛగా సుందరమైన గుహలుగల మందరాన్ని చేరాడు.

**తతస్తే సమస్తాః సురేంద్రాః ససాధ్యాః సురేశం మహేశం పురేత్యాహురేవమ్ ।**
**ద్రుతం చాల్పవీర్యప్రభిన్నాంగభిన్నా వయం దైత్యరాజస్య శస్త్రైర్నికృత్తాః ॥8॥**

అప్పుడు సాధ్యులతో కూడిన దేవగణాలు వెంటనే సురేశ్వరుడైన మహేశ్వరుణ్ణి చేరి ఈ విధంగా పలికాయి. దైత్యరాజు అంధకుడి యొక్క శస్త్రాలతో బాధింపబడిన మేము ఛిన్నమైన భిన్నమైన, అవయవాలు గల వాళ్లమై అల్పవీర్యవంతులమైనామని.

**ఇతీదమఖిలం శ్రుత్వా దైత్యాగమమనౌపమమ్ ।**
**గణేశ్వరైశ్చ భగవానంధకాభిముఖం యయౌ ॥9॥**

అప్పుడు దానవుడి యొక్క సాటిలేని రాకనుగూర్చి విని శివభగవానుడు తన గణనాథులతో కలిసి అంధకుడి సమక్షానికి వెళ్లాడు.

**తత్రేంద్రపద్మోద్భవవిష్ణుముఖ్యాః సురేశ్వరా విప్రవరాశ్చ సర్వే ।**
**జయేతి వాచా భగవంతమూచుః కిరీటబద్ధాంజలయః సమంతాత్ ॥10॥**

అప్పుడు ఇంద్రుడు, బ్రహ్మ, విష్ణువు మొదలైన ముఖ్యదేవతలు, విప్రశ్రేష్ఠులు అందరూ మకుట బద్ధాంజలులై అన్ని వైపులనుంచి శివుడికి జయజయధ్వానాలు పలికారు.

**అథాశేషాసురాంస్తస్య కోటికోటిశతైస్తతః ।**
**భస్మీకృత్య మహాదేవో నిర్బిభేదాంధకం తదా ॥11॥**

అప్పుడు మహాదేవశివుడు వందలకోట్ల సైనికులతో కలిసి, అంధకుడి యొక్క అసంఖ్యాకరాక్షసులను భస్మం చేసి, త్రిశూలంతో అంధకుణ్ణి పొడిచాడు.

**శూలేన శూలినా ప్రోతం దగ్ధకల్మషకంచుకమ్ ।**
**దృష్ట్వాంధకం ననాదేశం ప్రణమ్య చ పితామహః ॥12॥**

శివుడి యొక్క శూలంతో భేదింపబడి, కాలిపోయిన పాపరూపమైన కంచుకంగల అంధకుణ్ణి చూచిన బ్రహ్మదేవుడు శివుడికి నమస్కరించి సంతోషంగా నినదించాడు.

**తన్నాదశ్రవణాన్నేదుర్దేవా దేవం ప్రణమ్య తమ్ ।**
**ననృతుర్మునయః సర్వే ముముదుర్గణపుంగవాః ॥13॥**

**ససృజుః పుష్పవర్షాణి దేవాః శంభోస్తదోపరి ।**
**త్రైలోక్యమఖిలం హర్షాన్ననంద చ ననాద చ ॥14॥**

ఆ ధ్వనిని విన్న దేవతలందరూ, మునులూ, ప్రమథగణ శ్రేష్ఠులు కూడా శివుడికి నమస్కరించి, హర్షధ్వనులు చేశారు. నర్తించారు. ఆనందించారు. దేవతలు ఆ సమయంలో శివుడి మీద పుష్ప వర్షాన్ని కురిపించారు. మూడు లోకాలు మొత్తం ఆనందంతో నినదించాయి.

**దగ్ధోఽగ్నినా చ శూలేన ప్రోతః ప్రేత ఇవాంధకః ।**
**సాత్త్వికం భావమాస్థాయ చింతయామాస చేతసా ॥15॥**

**జన్మాంతరేఽపి దేవేన దగ్ధో యస్మాచ్ఛివేన వై ।**
**ఆరాధితో మయా శంభుః పురా సాక్షాన్మహేశ్వరః ॥16॥**

**తస్మాదేతన్మయా లబ్ధమన్యథా నోపపద్యతే ।**
**యః స్మరేన్మనసా రుద్రం ప్రాణాంతే సకృదేవ వా ॥17॥**

**స యాతి శివసాయుజ్యం కిం పునర్బహుశః స్మరన్ ।**
**బ్రహ్మా చ భగవాన్ విష్ణుః సర్వే దేవాః సవాసవాః ॥18॥**

**శరణం ప్రాప్య తిష్ఠంతి తమేవ శరణం వ్రజేత్ ।**

మండుతున్న అగ్నితోకూడిన త్రిశూలంతో చీల్చబడి శవసమానమైన ఆ అంధకుడు సాత్త్విక భావాన్ని పొంది, మనసులో ఇలా చింతించాడు. పూర్వజన్మలో కూడా నేను శివుడిచేత దహించబడ్డాను. నేను ముందు కూడా సాక్షాత్తూ పరమేశ్వర శివుణ్ణి ఆరాధించాను. ఈ కారణంగానే నాకు ఈ విధమైన గతి కల్గింది. లేకుంటే ఈ విధంగా జరగదు. ఎవడు మరణసమయంలో ఒకసారి శివుణ్ణి స్మరిస్తాడో ఆతడు శివసాయుజ్యాన్ని పొందుతున్నాడు. అనేక పర్యాయాలు స్మరించిన వ్యక్తి విషయం చెప్పపనిలేదు. బ్రహ్మా, విష్ణుభగవానుడు, అట్లే ఇంద్రుడితో కూడిన దేవతలందరూ ఆయన శరణు పొందియున్నారు. కావున నేనూ ఆయన శరణు పొందుతాను.

**ఏవం సంచింత్య తుష్టాత్మా సోఽంధకశ్చాంధకార్దనమ్ ॥19॥**

**సగణం శివమీశానమస్తువత్పుణ్యగౌరవాత్ ।**
**ప్రార్థితస్తేన భగవాన్ పరమార్తిహరో హరః ॥20॥**

**హిరణ్యనేత్రతనయం శూలాగ్రస్థం సురేశ్వరః ।**
**ప్రోవాచ దానవం ప్రేక్ష్య ఘృణయా నీలలోహితః ॥21॥**

**తుష్టోఽస్మి వత్స భద్రం తే కామం కిం కరవాణి తే ।**
**వరాన్ వరయ దైత్యేంద్ర వరదోఽహం తవాంధకః ॥22॥**

ఈ విధంగా ఆలోచించిన ఆ అంధకుడు తన పుణ్యాధిక్యం వల్ల గణసహితుడైన శివుణ్ణి స్తుతించాడు. అప్పుడు పరమదుఃఖహరుడు, నీలలోహితుడైన శివభగవానుడు త్రిశూలం యొక్క అగ్రభాగం మీద ఉన్న హిరణ్యాక్ష పుత్రుడైన అంధకుడిని దయాపూర్వకంగా చూచి, ఆతడితో ఇలా పలికాడు. "ఓ వత్సా! నేను ప్రసన్నుణ్ణి అయ్యాను. నీకు శుభమగుగాక! నీకు నేను ఏవిధమైన కోరికను తీర్చను? ఓ దానవేంద్ర! వరం కోరుకో. ఓ అంధకా! నీకు నేను వరం ఇస్తాను" అని.

**శ్రుత్వా వాక్యం తదా శంభోర్హిరణ్యనయనాత్మజః ।**
**హర్షగద్గదయా వాచా ప్రోవాచేదం మహేశ్వరమ్ ॥23॥**

**భగవన్ దేవదేవేశ భక్తార్తిహర శంకర ।**
**త్వయి భక్తిః ప్రసీదేశ యది దేయో వరశ్చ మే ॥24॥**

అప్పుడు శివుడి వాక్యం విని హిరణ్యాక్షపుత్రుడు, అంధకుడు సంతోషం వల్ల గద్గదమైన వాక్కుతో మహేశ్వరుడితో ఇలా పలికాడు. "ఓ భగవానుడా! ఓ దేవదేవేశ్వరుడా! ఓ భక్తుల కష్టాల్ని హరించే శంకరా! నాయెడల ప్రసన్నుడవు కమ్ము. ఓ ఈశ్వరుడా! నీవు నాకు వరం ఇవ్వగలిగితే ఈ వరాన్ని ఇవ్వు. ఎల్లప్పుడు నీయందు భక్తి కలిగి ఉండే వరాన్ని ప్రసాదించు.

**శ్రుత్వా భవోఽపి వచనమంధకస్య మహాత్మనః ।**
**ప్రదదౌ దుర్లభాం శ్రద్ధాం దైత్యేంద్రాయ మహాద్యుతిః ॥25॥**

**గాణపత్యం చ దైత్యాయ ప్రదదౌ చావరోప్య తమ్ ।**
**ప్రణేముస్తం సురేంద్రాద్యా గాణపత్యే ప్రతిష్ఠితమ్ ॥26॥**

మహాత్ముడైన అంధకుడి వాక్కును విని పరమమైన కాంతిమంతుడైన శివుడు దానవేంద్రుడికి తనయందు దుర్లభమైన భక్తిని ప్రసాదించి, ఆతణ్ణి త్రిశూలం మీద నుంచి దించి ఆతడికి గణాధిపత్యాన్ని ప్రదానం చేశాడు. అప్పుడు ఇంద్రుడు మొదలైన దేవతలు గణాధిపత్యపదవిలో ప్రతిష్ఠితుడైన ఆ అంధకుడికి నమస్కరించారు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే అంధకగాణపత్యాత్మకో నామ త్రినవతితమోఽధ్యాయః ॥ 93 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని అంధకగాణపత్యాత్మకమనే తొంబై మూడవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## **చతుర్నవతితమోఽధ్యాయః** – తొంబై నాల్గవ అధ్యాయం

## **వరాహప్రాదుర్భావః** – వరాహప్రాదుర్భావం

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**కథమస్య పితా దైత్యో హిరణ్యాక్షః సుదారుణః ।**
**విష్ణునా సూదితో విష్ణుర్వారాహత్వం కథం గతః ॥1॥**

**తస్య శృంగం మహేశస్య భూషణత్వం కథం గతమ్ ।**
**ఏతత్సర్వం విశేషేణ సూత వక్తుమిహార్హసి ॥2॥**

ఓ సూతర్షీ! ఈ అంధకుడి తండ్రి మహాభయంకరుడైన హిరణ్యాక్షుడు మహావిష్ణువు చేత ఎలా చంపబడ్డాడు.? విష్ణువు వరాహరూపాన్ని ఎలా పొందాడు? ఆ వరాహస్వామి యొక్క శృంగం ఈశ్వరుడికి భూషణం ఎలా అయ్యింది? ఈ సమస్తవిషయాలు మాకు చెప్పు.

**సూత ఉవాచ** – సూతర్షి పలికాడు.

**హిరణ్యకశిపోర్భ్రాతా హిరణ్యాక్ష ఇతి స్మృతః ।**
**పురాంధకాసురేశస్య పితా కాలాంతకోపమః ॥3॥**

**దేవాన్ జిత్వాథ దైత్యేంద్రో బద్ధ్వా చ ధరణీమిమామ్ ।**
**నీత్వా రసాతలం చక్రే బందీమిందీవరప్రభామ్ ॥4॥**

ఓ ఋషులారా! హిరణ్యాక్షుడు హిరణ్యకశిపుడి సోదరుడు. అంధకాసురుడి తండ్రి. కాలాంతకుడితో సమానుడు. దేవతలను జయించి నల్లకలువతో సమానమైన కాంతిగల ఈ భూమిని పట్టుకుని, పాతాళానికి తీసుకొనిపోయి బంధించాడు.

**తతః సబ్రహ్మకా దేవా పరిమ్లానముఖశ్రియః ।**
**బాధితాస్తాడితా బద్ధా హిరణ్యాక్షేన తేన వై ॥5॥**

**బలినా దైత్యముఖ్యేన క్రూరేణ సుదురాత్మనా ।**
**ప్రణమ్య శిరసా విష్ణుం దైత్యకోటివిమర్దనమ్ ॥6॥**

**సర్వే విజ్ఞాపయామాసుర్ధరణీబంధనం హరేః ।**

అనంతరం బలవంతుడు, దానవముఖ్యుడు, క్రూరుడు, అత్యంతదురాత్ముడు అయిన హిరణ్యాక్షుడి చేత అంతకుముందు బంధింపబడి బాధలకు గురి అయిన బ్రహ్మాదిదేవతలు వాడిన ముఖశోభలతో దానవసమూహసంహారకుడు అయిన విష్ణువునకు శిరసు వంచి, నమస్కరించి, భూమి బందీ అయిన విషయాన్ని సమస్తాన్ని విన్నవించారు.

**శ్రుత్వైతద్భగవాన్ విష్ణుర్ధరణీబంధనం హరిః ॥7॥**

**భూత్వా యజ్ఞవరాహోఽసౌ తథా లింగోద్భవే తథా ।**
**దైత్యైశ్చ సార్ధం దైత్యేంద్రం హిరణ్యాక్షం మహాబలమ్ ॥8॥**

**దంష్ట్రాగ్రకోట్యా హత్వైనం రేజే దైత్యాంతకృత్ప్రభుః ।**
**కల్పాదిషు యథాపూర్వం ప్రవిశ్య చ రసాతలమ్ ॥9॥**

**ఆనీయ వసుధాం దేవీమంకస్థామకరోద్ బహిః ।**

ఆ పృథ్వీబంధనాన్ని విన్న విష్ణుభగవానుడు, శ్రీహరి లింగప్రాదుర్భావసమయంలో ఏ విధమైన రూపాన్ని ధరించాడో అలాంటి యజ్ఞవరాహరూపాన్ని ధరించి, తన దంతాగ్రభాగంతో మహాబలవంతుడై దైత్యరాజైన హిరణ్యాక్షుణ్ణి దైత్యులతో సహా వధించి ప్రకాశించాడు. దానవాంతకుడు, ప్రభువు అయిన శ్రీహరి పూర్వకల్పాలలో ఎలా రసాతలంలోనికి ప్రవేశించాడో అలా ప్రవేశించి భూదేవిని తన అంకస్థలంపై ఉంచుకుని, పాతాళం నుంచి తీసుకు వచ్చి, మరల యథాస్థితిని కల్పించాడు.

**తతస్తుష్టావ దేవేశం దేవదేవః పితామహః ॥10॥**

**శక్రాద్యైః సహితో భూత్వా హర్షగద్గదయా గిరా ।**
**శాశ్వతాయ వరాహాయ దంష్ట్రిణే దండినే నమః ॥11॥**

**నారాయణాయ సర్వాయ బ్రహ్మణే పరమాత్మనే ।**
**కర్త్రే ధర్త్రే ధరాయాస్తు హర్త్రే దేవారిణాం స్వయమ్ ।**
**కర్త్రే నేత్రే సురేంద్రాణాం శాస్త్రే చ సకలస్య చ ॥12॥**

తర్వాత దేవదేవుడైన బ్రహ్మ సంతోషకారణంగా గాద్గద్యంతో కూడిన స్వరంతో ఇంద్రాదిదేవతలతో కలిసి దేవేశ్వరుడైన విష్ణుభగవానుణ్ణి స్తుతించాడు. ఓ శాశ్వతుడా! కోరలు గలవాడా! దండించేవాడా! నారాయణుడా! సర్వమయుడా! బ్రహ్మస్వరూపుడా! పరమాత్ముడా! పృథ్విని సృష్టించువాడా! రక్షించువాడా! దేవతా శత్రు వినాశకరుడా! సురేంద్రుల యొక్క జనకుడా! నాయకుడా! సకలాన్ని శాసించువాడా! వరాహరూపా! నీకు నమస్కారం.

**త్వమష్టమూర్తిస్త్వమనంతమూర్తిస్త్వమాదిదేవస్త్వమనంతవేదితః ।**
**త్వయా కృతం సర్వమిదం ప్రసీద సురేశలోకేశ వరాహ విష్ణో ॥13॥**

**తథైకదంష్ట్రాగ్రముఖాగ్రకోటిభాగైకభాగార్ధతమేన విష్ణో ।**
**హతాః క్షణాత్కామదదైత్యముఖ్యాః స్వదంష్ట్రకోట్యా సహ పుత్రభృత్యైః ॥14॥**

ఓ సురేశ్వరుడా! ఓ లోకేశ్వరుడా! ఓ వరాహమూర్తీ! ఓ విష్ణుదేవా! నీవు అష్టమూర్తివి (పంచభూతాలు, యజమాని, సూర్యచంద్రులు) నీవు అనంతమూర్తివి. నీవు ఆదిదేవుడవు. నీవు సర్వజ్ఞుడవు. నీవే సంపూర్ణజగత్తును

సృష్టించావు. నీవు ప్రసన్నుడవు కమ్ము. ఓ విష్ణుభగవానుడా! నీయొక్క ఒక కోర యొక్క అగ్రభాగం యొక్క కోటి భాగాలలోని ఒక భాగం యొక్క సగభాగంతో కూడిన నీ కోరతో క్షణకాలంలో పుత్రసేవకసమేతంగా కామాదాది ముఖ్యదానవరాజులు వధింపబడ్డారు.

**త్వయోద్ధృతా దేవ ధరాధరేశ ధరాధరాకార ధృతాగ్రదంష్ట్రే ।**
**ధరాధరైః సర్వజనైః సముద్రైః సురాసురైః సేవితచంద్రవక్త్ర ॥15॥**

ఓ దేవా! ఓ ధరాధరా! ప్రభూ! ఓ పర్వతాకారా! ఓ సేవితచంద్రవక్త్రా! నీవు దిగ్గజాలతో, సమస్తప్రాణులతో, సమస్తసముద్రాలతో, దేవతలతో, దానవులతో కూడిన పృథ్విని లేపి ఆమెను నీ దంతం యొక్క అగ్రభాగంపై నిలిపావు.

**త్వయైవ దేవేశ విభో కృతశ్చ జయః సురాణామసురేశ్వరాణామ్ ।**
**అహో ప్రదత్తస్తు వరః ప్రసీద వాగ్దేవతావారిజసంభవాయ ॥16॥**

ఓ దేవేశ్వరుడా! ఓ ప్రభూ! నీవే దానవులపై దేవతలకు విజయాన్ని కల్పించావు. నీవే సరస్వతీ సహిత కమల సంభవుణ్ణి అయిన నాకు వరాన్ని ఇచ్చావు. నీవు ప్రసన్నుడవు కమ్ము!

**తవ రోమ్ణి సకలామరేశ్వరా నయనద్వయే శశిరవీ పదద్వయే ।**
**నిహితా రసాతలగతా వసుంధరా తవ పృష్ఠతః సకలతారకాదయః ॥17॥**

సమస్తదేవతలు నీరోమాలలో ఉన్నారు. సూర్యచంద్రులు నీ నేత్రద్వయమే. రసాతలానికి వెళ్లిన పృథ్వి నీరెండు పాదాలపై నిహితమై ఉన్నది. సమస్తతారలు మొదలైనవి నీయొక్క పీఠం మీద ఉన్నాయి.

**జగతాం హితాయ భవతా వసుంధరా భగవాన్ రసాతలపుటం గత తదా ।**
**అబలోద్ధృతా చ భగవంస్త్వమేవ సకలం త్వయైవ హి ధృతం జగద్గురో ॥18॥**

ఓ భగవానుడా! నీవు పాతాళానికి వెళ్లి అబల అయిన భూదేవిని ఉద్ధరించి, లోకానికి హితం చేకూర్చావు. ఓ భగవానుడా! ఓ జగద్గురూ! నీవే ఈ సమస్తాన్ని ధరించి ఉన్నావు.

**ఇతి వాక్పతిర్బహువిధైస్తవార్చనైః ప్రణిపత్య విష్ణుమమరైః ప్రజాపతిః ।**
**వివిధాన్ వరాన్ హరిముఖాస్తు లబ్ధవాన్ హరినాభివారిజదేహభృత్స్వయమ్ ॥19॥**

ఈ విధంగా శ్రీహరి యొక్క నాభికమలం నుంచి జన్మించిన ప్రజాపతి బ్రహ్మ దేవతలతో కూడి, అనేకవిధాల వరాహరూపుడైన విష్ణువును స్తుతించి, నమస్కరించి, ఆయన నుంచి అనేక వరాల్ని పొందాడు.

**అథ తాముద్ధృతాం తేన ధరాం దేవా మునీశ్వరాః ।**
**మూర్ధ్న్యారోప్య నమశ్చక్రుశ్చక్రిణః సన్నిధౌ తదా ॥20॥**

**అనేనైవ వరాహేణ చోద్ధృతాసి వరప్రదే ।**
**కృష్ణేనాక్లిష్టకార్యేణ శతహస్తేన విష్ణునా ॥21॥**

**ధరణి త్వం మహాభోగే భూమిస్త్వం ధేనురవ్యయే ।**
**లోకానాం ధారణే త్వం హి మృత్తికే హర పాతకమ్ ॥22॥**

**మనసా కర్మణా వాచా వరదే వారిజేక్షణే ।**
**త్వయా హతేన పాపేన జీవామస్త్వత్ప్రసాదతః ॥23॥**

తర్వాత దేవతలందరు, మునీశ్వరులు విష్ణువు చేత తీసుకురాబడిన భూదేవికి వాళ్ల శిరసుల్ని దాకించి, చక్రధరుడైన విష్ణువు సన్నిధిలో నమస్కరించారు. ఓ వరదాయినీ! అనాయాసకార్యకరుడు, సహస్రహస్తుడు, వరాహరూపుడు అయిన విష్ణువు నిన్ను ఉద్ధరించాడు. ఓ ధరణీ! ఓ మహాభాగా! నీవు భూమివి. ఓ శాశ్వతురాలా! నీవు ధేనువవు. ఓ మృత్తికా! నీవు లోకాల్ని ధరించినదానవు. మా పాపాల్ని దూరం చెయ్యి. ఓ వరదా! ఓ కమలనయనా! మేము చేసిన మనోవాక్కాయకర్మల రూపమైన పాపాల్ని నీవు దూరం చేయగా మేము నీ కృపతో జీవిస్తున్నాం.

**ఇత్యుక్తా సా తదా దేవీ ధరా దేవైరథాబ్రవీత్ ।**
**వరాహదంష్ట్రా భిన్నాయాం ధరాయాం మృత్తికాం ద్విజాః ॥24॥**

**మంత్రేణానేన యోఽ బిభ్రత్ మూర్ధ్ని పాపాత్ప్రముచ్యతే ।**
**ఆయుష్మాన్ బలవాన్ ధన్యః పుత్రపౌత్ర సమన్వితః ॥25॥**

**క్రమాద్భువి దివం ప్రాప్య కర్మాంతే మోదతే సురైః ।**

దేవతలు ఆ విధంగా పలుకగా ఆ పృథ్వీదేవి ఇలా పలికింది. ఓ దేవతలారా! ఓ ద్విజులారా! ఈ వారాహదేవుడి కోరలవల్ల ఛేదింపబడిన మట్టిని మీరు ఇంతకుముందు ఉచ్చరించిన మంత్రంతో తన శిరసుపై ధరించినవాడు పాపవిముక్తుడవుతున్నాడు. ఆతడు క్రమంగా ఈ భూలోకంలో దీర్ఘకాలం జీవించి, బలవంతుడు, ధన్యుడు మరియు పుత్రపౌత్రులతో కూడినవాడవుతాడు. తిరిగి ప్రారబ్ధకర్మ పూర్తికాగానే స్వర్గాన్ని పొంది దేవతలతో పాటు ఆనందాన్ని పొందుతాడు.

**అథ దేవే గతే త్యక్త్వా వరాహే క్షీరసాగరమ్ ॥26॥**

**వారాహరూపమనఘం చచాల చ ధరా పునః ।**
**తస్య దంష్ట్రాభరాక్రాంతా దేవదేవస్య ధీమతః ॥27॥**

**యదృచ్ఛయా భవః పశ్యన్ జగామ జగదీశ్వరః ।**
**దంష్ట్రాం జగ్రాహ దృష్ట్వా తాం భూషణార్థమథాత్మనః ॥28॥**

**దధార చ మహాదేవః కూర్చాంతే వై మహోరసి ।**

తర్వాత పాపరహితమైన వరాహరూపాన్ని వదలి, దంష్ట్రలను విసర్జించి, క్షీరసాగరానికి వెళ్లగా, బుద్ధిమంతుడైన విష్ణుదేవుడి యొక్క కోరల భారాన్ని భరించిన భూదేవి మరల ఒక్కమారు చలించింది. సంయోగవశం వల్ల అది అంతా చూస్తున్న జగదధీశ్వరుడు శివుడు అక్కడకు వెళ్లి, అక్కడ దంష్ట్రల్ని చూచి, వాటిని తనకు అలంకారాలుగా స్వీకరించాడు. శివుడు వాటిని గడ్డం యొక్క కేశాల సమీపంలోను, వక్షఃస్థలం మీద ధరించాడు.

**దేవాశ్చ తుష్టువుః సేంద్రా దేవదేవేన వైభవమ్ ॥29॥**

**ధరా ప్రతిష్ఠితా హ్యేవం దేవదేవేన లీలయా ।**
**భూతానాం సంప్లవే చాపి విష్ణోశ్చైవ కలేబరమ్ ॥30॥**

**బ్రహ్మణశ్చ తథాన్యేషాం దేవానామపి లీలయా ।**
**విభురంగవిభాగేన భూషితో న యది ప్రభుః ॥31॥**

**కథం విముక్తిర్విప్రాణాం తస్మాద్దంష్ట్రీ మహేశ్వరః ॥32॥**

ఇంద్రుడితో కూడిన దేవతలందరూ దేవదేవుడైన శివుడి వైభవాన్ని స్తుతించారు. ఈ విధంగా దేవదేవుడైన విష్ణువు లీలాపూర్వకంగా పృథివిని స్థాపింపజేశాడు. మహాప్రళయకాలంలో కూడా శివుడు బ్రహ్మ, విష్ణువు మరియు ఇతర దేవతల యొక్క కళేబరాల్ని చూచి, సర్వవ్యాపకుడు అయిన ఆయన భక్తవత్సలుడైన కారణంగా, అంగాంశలతో అలంకరింపబడకుంటే దానివల్ల విప్రులకు ముక్తి ఎలా కలుగుతుంది? కాగా మహేశ్వరుడు దంష్ట్రి అయినాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే వారాహప్రాదుర్భావో నామ చతుర్నవతితమోఽధ్యాయః ॥ 94 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని వారాహప్రాదుర్భావమనే తొంబై నాల్గవ అధ్యాయం సమాప్తం.

卐 卐 卐

## పంచనవతితమోఽధ్యాయః - తొంబై అయిదవ అధ్యాయం

## నృసింహలీలావర్ణనమ్ - నృసింహలీలావర్ణనం

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**నృసింహేణ హతః పూర్వం హిరణ్యాక్షాగ్రజః శ్రుతమ్ ।**
**కథం నిషూదితస్తేన హిరణ్యకశిపుర్వద ॥1॥**

ఓ సూత మహర్షీ! పూర్వం నృసింహుడిచేత హిరణ్యకశిపుడు చంపబడిన విషయం తెలిసిందే. ఏ విధంగా నారసింహుడు ఆతణ్ణి చంపాడో చెప్పు.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**హిరణ్యకశిపోః పుత్రః ప్రహ్లాద ఇతి విశ్రుతః ।**
**ధర్మజ్ఞః సర్వసంపన్నస్తపస్వీ చాభవత్సుధీః ॥2॥**

**జన్మప్రభృతి దేవేశం పూజయామాస చావ్యయమ్ ।**
**సర్వజ్ఞం సర్వగం విష్ణుం సర్వదేవభవోద్భవమ్ ॥3॥**

**తమాదిపురుషం భక్త్యా పరబ్రహ్మస్వరూపిణమ్ ।**
**బ్రహ్మణోఽధిపతిం సృష్టిస్థితిసంహారకారణమ్ ॥4॥**

హిరణ్యకశిపుడి పుత్రుడు ప్రహ్లాదుడుగా ప్రసిద్ధుడు. ఆతడు ధర్మజ్ఞుడు, సత్యనిష్ఠుడు, తపస్వి మరియు బుద్ధిమంతుడు. ఆతడు పుట్టిన దగ్గరనుంచి అవినాశి, సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సమస్తదేవతల పుట్టుకకు కారకుడు, ఆదిపురుషుడు, పరబ్రహ్మస్వరూపుడు, బ్రహ్మకు అధిపతి మరియు సృష్టిస్థితి లయకారకుడు అయిన విష్ణుదేవుణ్ణి భక్తిపూర్వకంగా పూజించాడు.

**సోఽపి విష్ణోస్తథాభూతం దృష్ట్వా పుత్రం సమాహితమ్ ।**
**నమో నారాయణేతి గోవిందేతి ముహుర్ముహుః ॥5॥**

**స్తువంతం ప్రాహ దేవారిః ప్రదహన్నివ పాపధీః ।**
**న మాం జానాసి దుర్బుద్ధే సర్వదైత్యామరేశ్వరమ్ ॥6॥**

**ప్రహ్లాద వీర దుష్పుత్ర ద్విజదేవార్తికారణమ్ ।**
**కో విష్ణుః పద్మజో వాపి శక్రశ్చ వరుణోఽథ వా ॥7॥**

**వాయుః సోమస్తథేశానః పావకో మమ యః సమః ।**
**మామేవార్చయ భక్త్యా చ స్వల్పం నారాయణం సదా ॥8॥**

**ప్రహ్లాద జీవితే వాంఛా తవైషా శృణుచాస్తి చేత్ ।**

తన కుమారుడు ఏకాగ్రచిత్తుడై విష్ణువును ఆ విధంగా భక్తిపూర్వకంగా మాటిమాటికి 'నారాయణా! నీకు నమస్కారం, గోవిందా! నీకు నమస్కారం' అంటూ స్తుతిస్తున్నవాడు కాగా; పాపబుద్ధి, దేవశత్రువు అయిన ఆతడు మండిపడుతూ ఇలా పలికాడు. 'ఓ దుర్బుద్ధీ! ఓ ప్రహ్లాదా! ఓ వీరుడా! ఓ కుపుత్రుడా! సమస్తదానవులకు, దేవతలకు స్వామిని, బ్రాహ్మణులకు, దేవతలకు దుఃఖకారకుణ్ణి అయిన నన్ను నీవు తెలియకున్నావు. విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుడు, వరుణుడు, వాయువు, చంద్రుడు, ఈశానుడు చివరకు అగ్ని – వీరి అందరిలో నాకు సమానుడెవ్వడు? అందుచేత నీవు స్వల్పుడైన విష్ణువును విడిచి నన్నే భక్తితో అర్చించు. నీకు జీవించాలనే కోరిక ఉంటే నాయీ మాట విను.'

**శ్రుత్వాపి తస్య వచనం హిరణ్యకశిపోః సుధీః ॥9॥**

**ప్రహ్లాదః పూజయామాస నమో నారాయణేతి చ ।**
**నమో నారాయణేతి సర్వదైత్యకుమారకాన్ ॥10॥**

**అధ్యాపయామాస చ తాం బ్రహ్మ విద్యాం సుశోభనామ్ ।**
**దుర్లంఘ్యాం చాత్మనో దృష్ట్వా శక్రాదిభిరపి స్వయమ్ ॥11॥**

**పుత్రేణ లంఘితామాజ్ఞాం హిరణ్యః ప్రాహ దానవాన్ ।**
**ఏతం నానావిధైర్వధ్యం దుష్పుత్రం హంతుమర్హథ ॥12॥**

హిరణ్యకశిపుడి మాటలు విని కూడా బుద్ధిమంతుడైన ప్రహ్లాదుడు విష్ణువును పూజిస్తూ ఉన్నాడు. నారాయణునకు నమస్కారం, నారాయణునకు నమస్కారం అని ఉచ్చరిస్తూ ఉన్నాడు. దానవకుమారులందరికి ఉత్తమమైన బ్రహ్మ విద్యను నారదుడివల్ల విన్నదానిని నేర్పుతూ ఉన్నాడు. ఇంద్రాదులు కూడా దాటరాని తన ఆజ్ఞ పుత్రుడి ద్వారా ఉల్లంఘింపబడడం చూచి హిరణ్యకశిపుడు దానవులతో ఇలా పలికాడు. "వధార్హుడైన దుష్టకుమారుణ్ణి అనేక విధాలైన ఉపాయాలతో చంపండి" అని.

**ఏవముక్తాస్తదా తేన దైత్యేన సుదురాత్మనా ।**
**నిజఘ్నుర్దేవదేవస్య భృత్యం ప్రహ్లాదమవ్యయమ్ ॥13॥**

మిక్కిలి దురాత్ముడైన ఆ దానవుడు ఆజ్ఞాపింపగా ఆ దానవులు విష్ణు భక్తుడు, అవినాశి అయిన ప్రహ్లాదుణ్ణి చంప ప్రయత్నించారు.

**తత్ర తత్రప్రతికృతం తదా సురైర్దైత్యరాజతనయం ద్విజోత్తమాః ।**
**క్షీరవారినిధిశాయినః ప్రభోర్నిష్ఫలం త్వథ బభూవ తేజసా ॥14॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! దానవులు ప్రహ్లాదుడి విషయంలో ప్రయోగించిన అన్ని మారణోపాయాలు క్షీరసాగరశయనుడైన విష్ణువుయొక్క తేజస్సువల్ల నిష్ఫలాలు అయ్యాయి.

**తదాథ గర్వభిన్నస్య హిరణ్యకశిపోః ప్రభుః ।**
**తత్రైవావిరభూద్ధంతుం నృసింహాకృతిమాస్థితః ॥15॥**
**జఘాన చ సుతం ప్రేక్ష్య పితరం దానవాధమమ్ ।**
**బిభేద తత్క్షణాదేవ కరజైర్నిశితైః శతైః ॥16॥**

**తతో నిహత్య తం దైత్యం సబాంధవమఘాపహః ।**
**పీడయామాస దైత్యేంద్రం యుగాంతాగ్నిరివాపరః ॥17॥**

**నాదైస్తస్య నృసింహస్య ఘోరైర్విత్రాసితం జగత్ ।**
**ఆబ్రహ్మభువనాద్విప్రాః ప్రచచాల చ సువ్రతాః ॥18॥**

అనంతరం గర్వితుడైన హిరణ్యకశిపుణ్ణి వధించడం కోసం విష్ణుమూర్తి నరసింహరూపాన్ని ధరించి, అక్కడ ప్రత్యక్షమై; ప్రహ్లాదుడి వైపు చూచి దానవాధముడు అయిన హిరణ్యకశిపుణ్ణి వధించాడు. హిరణ్యకశిపుణ్ణి ఆ క్షణంలోనే నిశితాలు, శతసంఖ్యాలు అయిన నఖాలతో చీల్చి వేశాడు. తర్వాత పాపవినాశకరుడైన విష్ణువు సబాంధవంగా ఆతణ్ణి చంపి, ఆతడి శవాన్ని పిండి వేశాడు. ఆతడప్పుడు ప్రళయకాలాగ్నిలాగా ప్రకాశించాడు. ఓ సువ్రతులారా! ఓ విప్రులారా! ఆ సమయంలో బ్రహ్మలోకపర్యంతం సంపూర్ణవిశ్వం ఆ నృసింహుడి గర్జనవల్ల భయపడింది. కంపించింది.

**దృష్ట్వా సురాసురమహోరగసిద్ధసాధ్యాస్తస్మిన్ క్షణే హరివిరించిముఖా నృసింహమ్ ।**
**ధైర్యం బలం చ సమవాప్య యయుర్విసృజ్య ఆదిఙ్ముఖాంతమసురక్షణ తత్పరాశ్చ ॥19॥**

ఆ సమయంలో నృసింహుడిని చూచి తమ ప్రాణరక్షణతత్పరులైన దేవతలందరూ, దానవులు, నాగులు, సిద్ధులు, సాధ్యులు, బ్రహ్మ మొదలైనవాళ్లు ధైర్యాన్ని, బలాన్ని కూడగట్టుకుని అక్కడ నుంచి అన్నిదిక్కులకు వెళ్లారు.

**తతస్తైర్గతైః సైష దేవో నృసింహః సహస్రాకృతిః సర్వపాత్సర్వబాహుః ।**
**సహస్రేక్షణః సోమసూర్యాగ్నినేత్రస్తదా సంస్థితః సర్వమావృత్య మాయీ ॥20॥**

వాళ్లందరూ దిక్కుల్ని పట్టి వెళ్లిన తర్వాత మాయామయమైన ఆ నృసింహభగవానుడు వేయి రూపాలతో, అన్ని వైపుల పాదాలతో, అన్ని వైపుల భుజాలతో, వేయి కన్నులతో, చంద్రసూర్యాగ్నుల నేత్రాలతో సంపూర్ణ బ్రహ్మాండాన్ని వ్యాపించినాడు.

**తం తుష్టువుః సురశ్రేష్ఠా లోకాలోకాచలే స్థితాః ।**
**సబ్రహ్మకాః ససాధ్యాశ్చ సయమాః సమరుద్గణాః ॥21॥**

**పరాత్పరతరం బ్రహ్మ తత్త్వాతత్త్వతమం భవాన్ ।**
**జ్యోతిషాం తు పరం జ్యోతిః పరమాత్మా జగన్మయః ॥22॥**

**స్థూలం సూక్ష్మం సుసూక్ష్మం చ శబ్దబ్రహ్మమయః శుభః ।**
**వాగతీతో నిరాలంబో నిర్ద్వంద్వో నిరుపప్లవః ॥23॥**

**యజ్ఞభుగ్యజ్ఞమూర్తిస్త్వం యజ్ఞినాం ఫలదః ప్రభుః ।**
**భవాన్ మత్స్యాకృతిః కౌర్మమాస్థాయ జగతి స్థితః ॥24॥**

**వారాహీం చైవ తాం సైంహీమాస్థాయేహ వ్యవస్థితః ।**
**దేవానాం దేవరక్షార్థం నిహత్య దితిజేశ్వరమ్ ॥25॥**

**ద్విజశాపచ్ఛలేనైవమవతీర్ణోఽసి లీలయా ।**
**న దృష్టం యత్త్వదన్యం హి భవాన్ సర్వం చరాచరమ్ ॥26॥**

**భవాన్ విష్ణుర్భవాన్ రుద్రో భవానేవ పితామహః ।**
**భవానాదిర్భవానంతో భవానేవ వయం విభో ॥27॥**

**భవానేవ జగత్సర్వం ప్రలాపేన కిమీశ్వర ।**
**మాయయా బహుధా సంస్థమద్వితీయమయం ప్రభో ॥28॥**

**స్తోష్యామస్త్వాం కథం భాసి దేవదేవ మృగాధిప ।**

అప్పుడు లోకాలోకపర్వతంమీద ఒకచోట నిలచి సురశ్రేష్ఠులు, బ్రహ్మ, సాధ్యగణాలు, యముడు, మరుద్గణాలు కలిసి ఆయన్ని స్తుతించారు. నీవు పరమమైన పరతరబ్రహ్మవు. తత్త్వాలకు తత్త్వతముడవు. నక్షత్రాలకు పరమమైన జ్యోతివి. పరమాత్ముడవు. జగన్మయుడవు. స్థూలుడవు. సూక్ష్ముడవు. అత్యంత సూక్ష్ముడవు. శబ్దబ్రహ్మమయుడవు. పరమపవిత్రుడవు. వాగతీతుడవు. ఆశ్రయరహితుడవు. ద్వంద్వాతీతుడవు. ఉపద్రవశూన్యుడవు. నీవు యజ్ఞభోక్తవు. ప్రభుడవు. నీవు యజ్ఞమూర్తివి. యజ్ఞకర్తలకు ఫలదాతవు. జగత్తులో ప్రతిష్ఠితుడవయ్యావు. దేవతల రక్షణార్థం వరాహం మరియు నృసింహరూపాన్ని ధరించి దానవేంద్రుల్ని వధించి నీవు ఈ లోకంలో ప్రతిష్ఠితుడవు అయ్యావు. ఈ విధంగానే భృగుముని శాపకారణంగా, నీ లీలకారణంగా అవతారాన్ని ధరించావు. నీ కంటే భిన్నుణ్ణి ఎవ్వరిని చూడలేదు. నీవే చరాచరుడవు, మరియు అన్నీ నీవే. ఓ ప్రభూ! నీవే విష్ణుడవు. నీవే రుద్రుడవు. నీవే బ్రహ్మవు. నీవే ఆదివి. నీవే అంతానివి. నీవే మేము. నీవే సంపూర్ణజగత్తువు. ఓ ఈశ్వరుడా! ఎక్కువ చెప్పడం వల్ల ప్రయోజనం ఏముంది? ఓ ప్రభూ! అద్వితీయుడవు అయ్యూ మాయవల్ల అనేక రూపాలలో ఉన్న నిన్ను మేము ఎలా స్తుతించాలి? ఓ దేవదేవుడా? ఓ నృసింహా! నీవు మిక్కిలి కాంతిమంతుడవు.

**స్తుతోఽపి వివిధైః స్తుత్యైర్భావైర్నానావిధైః ప్రభుః ॥29॥**

**న జగామ ద్విజాః శాంతిం మానయన్ యోనిమాత్మనః ।**
**యో నృసింహస్తవం భక్త్యా పఠేద్వార్థం విచారయేత్ ॥30॥**
**శ్రావయేద్వా ద్విజాన్ సర్వాన్ విష్ణులోకే మహీయతే ।**

ఓ ద్విజులారా! పలువిధాలైన భావాలతో కూడిన నానావిధాలైన స్తుతులతో ప్రార్థించినా విష్ణుభగవానుడు తన సింహరూపాన్ని అభిమానిస్తూ శాంతించలేదు. ఈ నృసింహస్తోత్రాన్ని భక్తితో పఠించినా, అర్థవిచారణ చేసినా, ద్విజులందరికి వినిపించినా ఆతడు వైకుంఠాన్ని పొంది ప్రతిష్ఠ చెందుతున్నాడు.

**తదంతరే శివం దేవాః సేంద్రాః సబ్రహ్మకాః ప్రభుమ్ ॥31॥**

**సంప్రాప్యతుష్టువుః సర్వం విజ్ఞాప్య మృగరూపిణః ।**
**తతో బ్రహ్మాదయస్తూర్ణం సంస్తూయ పరమేశ్వరమ్ ॥32॥**

**ఆత్మత్రాణాయ శరణం జగ్ముః పరమకారణమ్ ।**
**మందరస్థం మహాదేవం క్రీడమానం సహోమయా ॥33॥**

**సేవితం గణగంధర్వైః సిద్ధైరప్సరసాం గణైః ।**
**దేవతాభిః సహ బ్రహ్మా భీతభీతః సగద్గదమ్ ।**
**ప్రణమ్య దండవద్భూమౌ తుష్టావ పరమేశ్వరమ్ ॥34॥**

తర్వాత ఇంద్రుడు, బ్రహ్మతో కూడిన దేవతలందరూ శివభగవానుణ్ణి ధ్యానించి, నృసింహరూపధారి అయిన విష్ణువు గూర్చి చెప్పి, ఆయన్ని స్తుతించారు. తర్వాత పరమేశ్వరుణ్ణి స్తుతించి, బ్రహ్మాదిదేవతలు తమ రక్షణార్థం మందరపర్వతంమీద పార్వతీదేవితో కలిసి విహరిస్తూ, గంధర్వులచేత, సిద్ధులచేత, అప్సరసల చేత సేవింపబడుతున్న మహేశ్వరుణ్ణి శరణువేడారు. భయభీతుడైన బ్రహ్మ దేవతలతో కలిసి దండంలాగా భూమిపైపడి గద్గదకంఠంతో శివుణ్ణి స్తుతించాడు.

**బ్రహ్మోవాచ –** బ్రహ్మదేవుడు పలికాడు.

**నమస్తే కాలకాలాయ నమస్తే రుద్ర మన్యవే ।**
**నమఃశివాయ రుద్రాయ శంకరాయ శివాయ చ ॥35॥**

**ఉగ్రోఽసి సర్వభూతానాం నియంతాసి శివోఽసి నః ।**
**నమఃశివాయ శర్వాయ శంకరాయార్తిహారిణే ॥36॥**

కాలాంతకుడికి నమస్కారం. రుద్రుడికి నమస్కారం. క్రోధరూపుడికి నమస్కారం. శివుడికి నమస్కారం. రుద్రుడికి, శంకరుడికి నమస్కారం. నీవు ఉగ్రుడవు. సమస్తప్రాణులకు నియంతవు. భక్తులమైన మాకు కళ్యాణకారకుడవు. దుఃఖాన్ని నశింపజేసే శివుడికి, శర్వుడికి, శంకరుడికి నమస్కారం.

**మయస్కరాయ విశ్వాయ విష్ణవే బ్రహ్మణే నమః ।**
**అంతకాయ నమస్తుభ్యముమాయాః పతయే నమః ॥37॥**

**హిరణ్యబాహవే సాక్షాద్ధిరణ్యపతయే నమః ।**
**అంతకాయ నమస్తుభ్యముమాయాః పతయే నమః ॥37॥**

**హిరణ్యబాహవే సాక్షాద్ధిరణ్యపతయే నమః ।**
**శర్వాయ సర్వరూపాయ పురుషాయ నమోనమః ॥38॥**

**సదసద్వ్యక్తిహీనాయ మహతః కారణాయ తే ।**
**నిత్యాయ విశ్వరూపాయ జాయమానాయ తే నమః ॥39॥**

**జాతాయ బహుధా లోకే ప్రభూతాయ నమో నమః ।**
**రుద్రాయ నీలరుద్రాయ కద్రుద్రాయ ప్రచేతసే ॥40॥**

సుఖకరుడికి, విశ్వరూపుడికి, విష్ణువుకు, బ్రహ్మకు నమస్కారం. అంతకుడికి నమస్కారం. ఉమాపతికి నమస్కారం. సువర్ణమయబాహువుకు నమస్కారం. హిరణ్యపతికి నమస్కారం. శర్వుడికి, సర్వరూపుడికి, పురుషుడికి మాటిమాటికి నమస్కారం. సత్‌అసత్ రూపరహితుడికి నమస్కారం. మహత్తత్త్వాన్ని ఉత్పాదించే నీకు నమస్కారం.

నిత్యుడికి, విశ్వరూపుడికి, ఉత్పన్నమానుడికి నమస్కారం. లోకంలో అనేకరూపాలలో అవతరించేవాడికి నమస్కారం. ప్రభూతుడికి నమస్కారం. నీవు రుద్రుడవు, నీలరుద్రుడవు, కద్రుద్రనామకమంత్రరూపుడవు, ప్రచేతసుడవు అయిన నీకు నమస్కారం.

**కాలాయ కాలరూపాయ నమః కాలాంగహారిణే ।**
**మీఢుష్టమాయ దేవాయ శితికంఠాయ తే నమః ॥41॥**

**మహీయసే నమస్తుభ్యం హంత్రే దేవారిణాం సదా ।**
**తారాయ చ సుతారాయ తారణాయ నమో నమః ॥42॥**

**హరికేశాయ దేవాయ శంభవే పరమాత్మనే ।**
**దేవానాం శంభవే తుభ్యం భూతానాం శంభవే నమః ॥43॥**

నీవు కాలానివి, కాలరూపుడవు. నీకు నమస్కారం. నీవు కాలవినాశకుడివి. మేఘరూపందాల్చి వర్షించేవాడవు. భగవానుడివి. కాలకూటవిషమును త్రాగుటచే నల్లనైన కంఠం కలవాడవయిన నీకు నమస్కారం. నీవు మహాత్ముడవు. ఎల్లప్పుడు దానవవినాశకరుడవు. నీకు నమస్కారం. తారకుడవు. సుతారకుడవు, ఉద్ధారకుడవు. నీకు నమస్కారం. హరితవర్ణకేశుడికి, పరమాత్మస్వరూపుడికి, దేవతలకు కళ్యాణకారకుడికి, సమస్తప్రాణులకు కళ్యాణకారకుడికి నమస్కారం.

**శంభవే హైమవత్యాశ్చ మన్యవే రుద్రరూపిణే ।**
**కపర్దినే నమస్తుభ్యం కాలకంఠాయ తే నమః ॥44॥**

**హిరణ్యాయ మహేశాయ శ్రీకంఠాయ నమో నమః ।**
**భస్మదిగ్ధశరీరాయ దండముండీశ్వరాయ చ ॥45॥**

**నమో హ్రస్వాయ దీర్ఘాయ వామనాయ నమో నమః ।**
**నమ ఉగ్రత్రిశూలాయ ఉగ్రాయ చ నమో నమః ॥46॥**

**భీమాయ భీమరూపాయ భీమకర్మరతాయ తే ।**
**అగ్రేవధాయ వై భూత్వా నమో దూరేవధాయ చ ॥47॥**

నీవు పార్వతీదేవికి కళ్యాణకారకుడివి, యజ్ఞరూపుడివి, రుద్రరూపుడివి, కపర్దివి నీకు నమస్కారం. కాలకంఠుడివి. నీకు నమస్కారం. సువర్ణవర్ణదేహుడవు, మహేశ్వరుడవు, నీలకంఠుడవు. నీకు నమస్కారం. భస్మలిప్తదేహుడవు, దండముండీశ్వరుడవు. నీకు నమస్కారం. హ్రస్వాకారుడవు, దీర్ఘాకారుడవు, వామనుడవు నీకు నమస్కారం. భయంకరమైన త్రిశూలధారివి, ఉగ్రుడవు నీకు నమస్కారం. నమస్కారం. భీముడవు, భీమరూపుడవు, భయంకరమైన కర్మయందు ఆసక్తిగలవాడవు. నీకు నమస్కారం. అందరికన్నా ముందు నిలిచి శత్రువులను వధించేవాడివి, దూరంగా ఉండీ శత్రువులను వధించేవాడివి అయిన నీకు నమస్కారం.

**ధన్వినే శూలినే తుభ్యం గదినే హలినే నమః ।**
**చక్రిణే వర్మిణే నిత్యం దైత్యానాం కర్మభేదినే ॥48॥**

**సద్యాయ సద్యరూపాయ సద్యోజాతాయ తే నమః ।**
**వామాయ వామరూపాయ వామనేత్రాయ తే నమః ॥49॥**

**అఘోరరూపాయ వికటాయ వికటశరీరాయ తే నమః ।**
**పురుషరూపాయ పురుషైకతత్పురుషాయ వై నమః ॥50॥**

**పురుషార్థప్రదానాయ పతయే పరమేష్ఠినే ।**
**ఈశానాయ నమస్తుభ్యమీశ్వరాయ నమో నమః ॥51॥**

**బ్రహ్మణే బ్రహ్మరూపాయ నమః సాక్షాచ్ఛివాయ తే ।**

నీవు ధనుర్ధారివి. శూలధారివి. గదాధారివి. హలధారివి. చక్రధారివి. కవచధారివి. ఎల్లప్పుడూ దైత్యకర్మవినాశకారివి. నీకు నమస్కారం. నీవు సద్యమంత్రరూపుడవు. సద్యరూపుడవు. సద్యోజాతావతార స్వరూపుడవు. నీకు నమస్కారం. వామమంత్ర రూపుడవు. వామసుందర రూపుడవు. వామ నేత్రుడవు. నీకు నమస్కారం. అఘోరమంత్రరూపుడికి నమస్కారం. వికట రూపుడికి, వికటశరీరుడుకి నమస్కారం. పురుషరూపుడికి, పురుషులలో ఉత్తమపురుషుడికి నమస్కారం. పురుషార్థఫలప్రదాయికి, సర్వులకు ప్రభువైనవాడికి, పరమేష్ఠికి, ఈశానమంత్రరూపుడికి నమస్కారం. ఈశ్వరుడవైన నీకు నమస్కారం. నమస్కారం. బ్రహ్మరూపుడికి, సాక్షాత్తూ సుగుణశివస్వరూపుడికి, బ్రహ్మకు నమస్కారం.

**సర్వవిష్ణుర్నృసింహస్య రూపమాస్థాయ విశ్వకృత్ ॥52॥**

**హిరణ్యకశిపుం హత్వా కరజైర్నిశితైః స్వయమ్ ।**
**దైత్యేంద్రైర్బహుభిః సార్ధం హితార్థం జగతాం ప్రభుః ॥53॥**

**సైంహీం సమానయన్ యోనిం బాధతే నిఖిలం జగత్ ।**
**యత్కృత్యమత్ర దేవేశ తత్కురుష్వ భవానిహ ॥54॥**

విశ్వసృష్టికారకుడు, సర్వస్వరూపుడైన విష్ణువు నృసింహరూపాన్ని ధరించి లోకకళ్యాణార్థం అనేక ప్రముఖదానవులతో కూడిన హిరణ్యకశిపుణ్ణి తన నిశితమైన గోళ్లతో చీల్చి, చంపి, సింహరూపాన్ని విడవకుండా సంపూర్ణజగత్తును బాధిస్తున్నాడు. నీవు ఈ విషయంలో చేయదగిన కార్యాన్ని నిర్వర్తించు.

**ఉగ్రోఽసి సర్వదుష్టానాం నియంతాసి శివోఽసి నః ।**
**కాలకూటాదివపుషా త్రాహి నః శరణాగతాన్ ॥55॥**

**శుక్రం తు వృత్తం విశ్వేశ క్రీడా వై కేవలం వయమ్ ।**
**తవోన్మేషనిమేషాభ్యామస్మాకం ప్రళయోదయౌ ॥56॥**

**ఉన్మీలయేత్త్వయి బ్రహ్మన్ వినాశోఽస్తి న తే శివ ।**
**సంతప్తాః స్మో వయం దేవ హరిణామితతేజసా ॥57॥**

**సర్వలోకహితాయైనం తత్త్వం సంహర్తుమిచ్ఛసి ।**

నీవు ఉగ్రుడవు. సమస్తదుష్టుల్ని నియంత్రించేవాడివి. మాకు కళ్యాణ కారకుడివి. కాలకూటాన్ని త్రాగిన శరీరంతో శరణాగతులైన మమ్మల్ని రక్షించు. నీ ఆచరణ శుద్ధమైనది. మేము నీకు క్రీడామాత్రులం. నీ ఉన్మేషనిమేషాలతో మాకు ప్రళయం మరియు ఉదయం జరుగుతున్నాయి. ఓ బ్రహ్మ! ఓ శివా! నీయొక్క ఉన్మీలనంతో కూడా మాకు వినాశం కలుగుటలేదు. అమితమైన తేజస్వంతుడైన నృసింహరూపధారి విష్ణువు వల్ల మాకు బాధ కల్గుతున్నది. సమస్తలోకహితార్థం నీవు ఆ నృసింహరూప నివారణకై విచారించవలసి ఉంది.

**సూత ఉవాచ –** సూతర్షి పలికాడు.

**విజ్ఞాపితస్తథా దేవః ప్రహసన్ ప్రాహ తాన్ సురాన్ ॥58॥**
**అభయం చ దదౌ తేషాం హనిష్యామీతి తం ప్రభుః ।**
**సోఽపి శక్రః సురైః సార్ధం ప్రణిపత్య యథాగతమ్ ॥59॥**
**జగామ భగవాన్ బ్రహ్మా తథాన్యే చ సురోత్తమాః ।**

ఈ విధంగా దేవతలు ప్రార్థించగా మహాదేవుడు ఆ దేవతలకు అభయమిచ్చాడు. నవ్వుతూ ఇలా పలికాడు. "నేను ఆతణ్ణి సంహరిస్తాను" అని తర్వాత శివుడికి నమస్కరించి ఇంద్రుడు సమస్తదేవతలతో కూడి ఏ విధంగా వచ్చాడో ఆ విధంగా వెళ్లాడు. బ్రహ్మదేవుడు మిగిలిన దేవతాశ్రేష్ఠులు కూడా వెళ్లారు.

**అథోత్థాయ మహాదేవః శారభం రూపమాస్థితః ॥60॥**
**యయౌ ప్రాంతే నృసింహస్య గర్వితస్య మృగాశినః ।**
**అపహృత్య తదా ప్రాణాన్ శరభః సురపూజితః ॥61॥**

**సింహోత్తతో నరో భూత్వా జగామ చ యథా క్రమమ్ ।**
**ఏవం స్తుతస్తథా దేవైర్జగామ స యథా క్రమమ్ ॥62॥**

ఆ తర్వాత మహాదేవశివుడు లేచినవాడై శరభరూపాన్ని ధరించి మృగభక్షకుడు, గర్వయుక్తుడు అయిన నృసింహుడి దగ్గరకు వెళ్లాడు. నృసింహుడి ప్రాణాలు హరించి శరభరూపుడైన శివుడు దేవతల చేత పూజింపబడ్డాడు. తర్వాత నృసింహరూపాన్ని విడిచి మానవరూపాన్ని ధరించి విష్ణువు వెళ్లిపోయాడు. దేవతలు స్తుతింపగా శివుడు వెళ్లిపోయాడు.

**యః పఠేచ్ఛృణుయాద్వాపి సంస్తవం శార్వముత్తమమ్ ।**
**రుద్రలోకమనుప్రాప్య రుద్రేణ సహ మోదతే ॥63॥**

ఎవడు శివుడియొక్క ఈ ఉత్తమస్తుతిని పఠిస్తాడో, వింటాడో ఆతడు రుద్రలోకాన్ని పొంది రుద్రుడి సన్నిధిలో ఆనందిస్తూ ఉంటాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే నృసింహలీలావర్ణనం నామ పంచనవతితమోఽధ్యాయః ॥ 95 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని నృసింహలీలావర్ణనమనే తొంభై అయిదవ అధ్యాయం సమాప్తం.

## **షణ్ణవతితమోఽధ్యాయః** - తొంభై ఆరవ అధ్యాయం

## **శరభప్రాదుర్భావః** - శరభప్రాదుర్భావం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**కథం దేవో మహాదేవో విశ్వసంహారకారకః ।**
**శరభాఖ్యం మహాఘోరం వికృతం రూపమాస్థితః ॥1॥**

**కిం కిం ధైర్యం కృతం తేన బ్రూహి సర్వమశేషతః ।**

ఓ సూతమహర్షీ! విశ్వసంహారకుడైన భగవంతుడు, శివుడు అత్యంత భయంకరమైన, వికృతమైన శరభరూపాన్ని ఏ విధంగా ధరించాడు. దాంతో ఏవిధమైన సాహసకృత్యాలు చేశాడో, అవి అన్నీ సంపూర్ణంగా మాకు చెప్పండి!

**సూత ఉవాచ** - సూతర్షి పలికాడు.

**ఏవమభ్యర్థితో దేవైర్మతిం చక్రే కృపాలయః ॥2॥**

**యత్తేజస్తు నృసింహాఖ్యం సంహర్తుం పరమేశ్వరః ।**
**తదర్థం స్మృతవాన్ రుద్రో వీరభద్రం మహాబలమ్ ॥3॥**

**ఆత్మనో భైరవం రూపం మహాప్రళయకారకం ।**

ఈ విధంగా దేవతలు ప్రార్థించగా కృపానిధియైన శివుడు నృసింహనామకమైన తేజస్సును నశింపజేయదానికి నిశ్చయించి, దీనికోసం మహాప్రళయకారకుడు తన భైరవరూపుడూ మహాబలవంతుడూ ఐన వీరభద్రుణ్ణి స్మరించాడు.

**ఆజగామ పురా సద్యో గణానామగ్రతో హసన్ ॥4॥**

**సాట్టహాసైర్గణవరైరుత్పతద్భిరితస్తతః ।**
**నృసింహరూపైరత్యుగ్రైః కోటిభిః పరివారితః ॥5॥**

**తావద్భిరభితో వీరైర్నృత్యద్భిశ్చ ముదాన్వితైః ।**
**క్రీడద్భిశ్చ మహాధీరైర్బ్రహ్మాద్యైః కందుకైరపి ॥6॥**

**అదృష్టపూర్వైరన్యైశ్చ వేష్టితో వీరవందితః ।**
**కల్పాంతజ్వలనజ్వాలో విలసల్లోచనత్రయః ॥7॥**

**ఆత్తశస్త్రో జటాజూటే జ్వలద్బాలేందుమండితః ।**
**బాలేందుద్వితయాకారతీక్ష్ణదంష్ట్రాంకురద్వయః ॥8॥**

**ఆఖండలధనుః ఖండసన్నిభభ్రూలతాయుతః ।**
**మహాప్రచండహుంకార బధిరీకృతదిఙ్ముఖః ॥9॥**

**నీలమేఘాంజనాకారభీషణశ్మశ్రురద్భుతః ।**
**వాదఖండమఖండాభ్యాం భ్రామయంస్త్రిశిఖం ముహుః ॥10॥**

**వీరభద్రోఽపి భగవాన్ వీరశక్తివిజృంభితః ।**
**స్వయం విజ్ఞాపయామాస కిమత్ర స్మృతికారణమ్ ॥11॥**

**ఆజ్ఞాపయ జగత్స్వామిన్ ప్రసాదః క్రియతాం మయి ।**

అప్పుడు ఆ వీరభద్రుడు గణాలకు అగ్రమందు నిలచి నవ్వుతూ వెంటనే అక్కడకు వచ్చాడు. ఆతడు కోట్లకొలది గణశ్రేష్ఠులతో కూడి ఉన్నాడు. గణాలు అట్టహాసం చేస్తున్నాయి. అటూ ఇటూ ఎగురుతున్నాయి. నరసింహరూపులైనవారు అత్యంతమైన ఉగ్రంగా ఉన్నారు. వాళ్లు నృత్యం చేస్తున్నారు. మహాబుద్ధిశాలులైన బ్రహ్మాదులతో పాటు బంతుల మాదిరి ఆడుతూ ప్రసన్నులై ఉన్నారు. వీరభద్రుడు ఇంతకుముందెన్నడూ చూడని వీరులతో చుట్టుకొని ఉన్నాడు. వీరభద్రుడు ప్రళయాగ్నిజ్వాలతో సమానంగా ఉన్నాడు. ఆతడు త్రినేత్రాలతో అలంకృతుడై ఉన్నాడు. ఆతడు శస్త్రాల్ని ధరించి ఉన్నాడు. ఆతడి జటాజూటంలో బాలచంద్రుడు శోభిల్లుతున్నాడు. ఆతడు బాలచంద్రుడితో సమానమైన ఆకారంతో పరిశుభ్రంగా ఉన్నాడు. తీక్ష్ణమైన రెండు కోరలతో బాగా శోభిల్లుతున్నాడు. ఆతడు ఇంద్రధనుస్సుతో సమానమైన కనుబొమ్మలు కలవాడు. ఆతడు తన మహాప్రచండమైన హుంకారధ్వనులతో దిక్కుల్ని చెముడుగలవానిని చేస్తున్నాడు. ఆతడు నీలమేఘం మరియు కాటుకతో సమానమైన నల్లని ఆకారం గల భయంకరమైన గడ్డం గలవాడు. ఆతడు అద్భుతాకారుడు. ఆతడు అపజయమెరుగని భుజాలతో వివాదాన్ని శమింపజేసే త్రిశూలాన్ని మాటిమాటికి త్రిప్పుతున్నాడు. ఈ విధమైన వీరత్వశక్తితో పరిపూర్ణుడైన వీరభద్రభగవానుడు స్వయంగా ఇలా నివేదించాడు: “ఓ జగత్ప్రభూ! ఇప్పుడు నన్ను స్మరించిన కారణమేది? ఆజ్ఞను ప్రదానం చేసి నా మీద కృప చూపండి!” అని.

**శ్రీ భగవాన్ ఉవాచ –** శ్రీ భగవానుడు పలికాడు.

**అకాలే భయముత్పన్నం దేవానామపి భైరవ ॥12॥**

**జ్వలితః స నృసింహాగ్నిః శమయైనం దురాసదమ్ ।**
**సాంత్వయన్ బోధయాదౌ తం తేన కిం నోపశామ్యతి ॥13॥**

**తతో మత్పరం భావం భైరవం సంప్రదర్శయ ।**
**సూక్ష్మం సూక్ష్మేణ సంహృత్య స్థూలం స్థూలేన తేజసా ॥14॥**

**వక్త్రమానయ కృత్తిం చ వీరభద్ర మమాజ్ఞయా ।**

ఓ భైరవా! అసమయంగా దేవతలకు భయం కల్గింది. నృసింహరూపమైన అగ్ని ప్రజ్వలిస్తున్నది. ఆ అతిభయంకరమైన అగ్నిని శాంతి పర్చు. ముందుగా సాంత్వన వాక్యాలతో తెలియజెప్పు. దానితో అది శాంతించకుంటే అప్పుడు మహాభయంకరమైన నా భైరవరూపాన్ని ప్రదర్శించు. ఓ వీరభద్రా! నా ఆజ్ఞతో సూక్ష్మరూపాన్ని సూక్ష్మతేజంతో అట్లే స్థూలరూపాన్ని స్థూలతేజంతో నాశనం చేయి. దాని ముఖాన్ని, చర్మాన్ని నా దగ్గరకు తీసుకురా!

**ఇత్యాదిష్టో గణాధ్యక్షః ప్రశాంతవపురాస్థితః ॥15॥**

**జగామ రంహసా తత్ర యత్రాస్తే నరకేసరీ ।**
**తతస్తం బోధయామాస వీరభద్రో హరో హరిమ్ ॥16॥**

**ఉవాచ వాక్యమీశానః పితాపుత్రమివౌరసమ్ ।**

ఈ విధంగా శివుడిచేత ఆజ్ఞాపింపబడిన వీరభద్రుడు శాంతస్వరూపాన్ని ధరించి వేగంగా ఎక్కడ నృసింహుడున్నాడో అక్కడకు వెళ్లాడు. తర్వాత హరరూపుడైన వీరభద్రుడు నృసింహరూపధారి అయిన విష్ణువు నుద్దేశించి పలికాడు. తండ్రి ఔరసుడైన పుత్రుడికి ఎలా చెబుతాడో అలా.

**శ్రీ వీరభద్ర ఉవాచ –** శ్రీ వీరభద్రుడు పలికాడు.

**జగత్సుఖాయ భగవన్నవతీర్ణోఽపి మాధవ ॥17॥**

**స్థిత్యర్థేన చ యుక్తోఽసి పరేణ పరమేష్ఠినా ।**
**జంతుచక్రం భగవతా రక్షితం మత్స్యరూపిణా ॥18॥**

**పుచ్ఛేనైవ సమాబధ్య భ్రమన్నేకార్ణవే పురా ।**
**బిభర్షి కూర్మరూపేణ వారాహేణోద్ధృతా మహీ ॥19॥**

**అనేన హరిరూపేణ హిరణ్యకశిపుర్హతః ।**
**వామనేన బలిర్బద్ధస్త్వయా విక్రమతా పునః ॥20॥**

ఓ భగవంతుడా! ఓ మాధవా! నీవు లోకసుఖంకోసం అవతరించావు. శ్రేష్ఠుడైన బ్రహ్మ నిన్ను స్థితికోసం నియమించాడు. పూర్వం నీ పుచ్ఛాన్నే నావగా చేసుకుని విశాలసాగరంలో తిరుగుతూ మత్స్యరూపధారివైన నీవు జీవసముదాయాన్ని రక్షించావు. కూర్మరూపంలో లోకాల్ని భరించావు. వరాహరూపంలో భూమిని ఉద్ధరించావు. ఈ సింహరూపంలో హిరణ్యకశిపుణ్ణి అంతం చేశావు. వామనరూపుడవై విక్రమించి బలిని బంధించావు.

**త్వమేవ సర్వభూతానాం ప్రభవః ప్రభురవ్యయః ।**
**యదా యదా హి లోకస్య దుఃఖం కించిత్ప్రజాయతే ॥21॥**

**తదా తదావతీర్ణస్త్వం కరిష్యసి నిరామయమ్ ।**
**నాధికస్త్వత్సమోఽప్యస్తి హరే శివపరాయణ ॥22॥**

**త్వయా ధర్మాశ్చ వేదాశ్చ శుభే మార్గే ప్రతిష్ఠితాః ।**
**యదర్థమవతారోఽయం నిహతః సోఽపి కేశవ ॥23॥**

**అత్యంతఘోరం భగవన్నరసింహవపుస్తవ ।**
**ఉపసంహర విశ్వాత్మంస్త్వమేవ మమ సన్నిధౌ ॥24॥**

నీవే సమస్తప్రాణులకు ఉత్పత్తికారకుడవు. నీవు అందరికి స్వామివి. నీవు శాశ్వతుడవు. ఎప్పుడెప్పుడు లోకానికి కొంచెం దుఃఖం కలుగుతుందో అప్పుడప్పుడు నీవు అవతరించి ఆ దుఃఖాన్ని నశింపజేస్తావు. ఓ శ్రీహరీ! ఓ శివపరాయణా! నీకన్నా అధికుడు లేడు. నీకు సమానుడూ లేడు. నీవు ధర్మాల్ని వేదాల్ని ఉత్తమమార్గంలో ప్రతిష్ఠించావు. ఓ కేశవా! ఎవడికోసం ఈ అవతారం (సింహం) ఎత్తావో ఆతడు నీచేత వధింపబడ్డాడు. ఓ భగవాన్! ఓ విశ్వాత్ముడా! అందుచేత నీవు నా సమక్షంలో ఈ భయంకరమైన రూపాన్ని ఉపసంహరించు.

**సూత ఉవాచ -** సూతర్షి పలికాడు.

**ఇత్యుక్తో వీరభద్రేణ నృసింహః శాంతయా గిరా ।**
**తతోఽధికం మహాఘోరం కోపం ప్రజ్వాలయద్ధరిః ॥25॥**

వీరభద్రుడు శాంతంగా ఈ విధంగా పలికిన తర్వాత నృసింహరూపధారి అయిన విష్ణువు మిక్కిలి మరియు మహాభయానకం అయిన కోపాన్ని ప్రజ్వలింపచేసాడు.

**శ్రీ నృసింహ ఉవాచ -** శ్రీ నృసింహుడు పలికాడు.

**ఆగతోఽసి యతస్తత్ర గచ్ఛ త్వం మా హితం వద ।**
**ఇదానీం సంహరిష్యామి జగదేతచ్చరాచరమ్ ॥26॥**

**సంహర్తుర్న హి సంహారః స్వతో వా పరతోఽపి వా ।**
**శాసితం మమ సర్వత్ర శాస్తా కోఽపి న విద్యతే ॥27॥**

**మత్ప్రసాదేన సకలం సమర్యాదం ప్రవర్తతే ।**
**అహం హి సర్వశక్తీనాం ప్రవర్తకనివర్తకః ॥28॥**

ఓ వీరభద్రా! నీవు ఎక్కడ నుంచి వచ్చావో అక్కడికి వెళ్లు. నాకు హితం చెప్పవద్దు. నేనిప్పుడు ఈ చరాచరజగత్తును నశింపజేస్తాను. సంహారకర్తకు సంహారమనేది నీతోగాని వేరొకడితోగాని జరగదు. అన్నింటిని నేనే శాసించాను. ఇతరుడు ఎవడూ శాసించువాడు లేడు. నాకృపవల్లే సంపూర్ణజగత్తు మర్యాదాయుతమై ప్రవర్తిస్తున్నది. నేనే సర్వశక్తులకు ప్రవర్తకుణ్ణి, నివర్తకుణ్ణి.

**యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।**
**తత్తద్విద్ధి గణాధ్యక్ష మమ తేజోవిజృంభితమ్ ॥29॥**

**దేవతాపరమార్థజ్ఞా మమైవ పరమం విదుః ।**
**మదంశాః శక్తిసంపన్నా బ్రహ్మశక్రాదయః సురాః ॥30॥**

**మన్నాభిపంకజాజ్జాతః పురా బ్రహ్మా చతుర్ముఖః ।**
**తల్లలాటసముత్పన్నో భగవాన్ వృషభధ్వజః ॥31॥**

ఓ గణాధ్యక్షా! ఏది ఏది ఐశ్వర్యసంపన్నమో, సత్త్వమయమో, శ్రీయుతమో, బలంతో పరిపూర్ణమో అవి అన్నీ నా తేజస్సుతో పరివర్ధితమైనవే. దేవతల పరమార్థాన్ని తెలిసినవాళ్లు నన్నే మహాసమర్థుడుగా చెబుతున్నారు.

శక్తిసంపన్నులైన బ్రహ్మ, ఇంద్రాదిదేవతలు నా అంశలే. పూర్వం చతుర్ముఖబ్రహ్మ నా నాభికమలంనుంచి పుట్టాడు. ఆతడి లలాటంనుంచి శివభగవానుడు జన్మించాడు.

**రజసాధిష్ఠితః స్రష్టా రుద్రస్తామస ఉచ్యతే ।**
**అహం నియంతా సర్వస్య మత్పరం నాస్తి దైవతమ్ ॥32॥**

**విశ్వాధికః స్వతంత్రశ్చ కర్తా హర్తాఖిలేశ్వరః ।**
**ఇదం తు మత్పరం తేజః కః పునః శ్రోతుమిచ్ఛతి ॥33॥**

**అతో మాం శరణం ప్రాప్య గచ్ఛ త్వం విగతజ్వరః ।**
**అవేహి పరమం భావమిదం భూతమహేశ్వరః ॥34॥**

బ్రహ్మ రజోగుణాధిష్ఠితుడు, రుద్రుడు తామసగుణుడు. నేను సమస్తానికి నియంతను. నా కన్నా శ్రేష్ఠుడైన దేవత ఎవడూ లేడు. నేను విశ్వాధికుణ్ణి. స్వతంత్రుణ్ణి. సృష్టికర్తను. సంహర్తను. అట్లే సర్వేశ్వరుణ్ణి. నాయీ నృసింహరూపం కంటెమరొక పరమతేజోవిశేషాన్ని ఎవడు వినదలుస్తున్నాడు? అందుచేత నీవు నా శరణుచొచ్చి సంతాపాన్ని విడిచి వెళ్లిపో. భూతనాథా! నీవు నాయీ పరమతత్వాన్ని తెలుసుకో.

**కాలోఽస్మ్యహం కాలవినాశహేతుర్లోకాన్ సమాహర్తుమహం ప్రవృత్తః ।**
**మృత్యోర్మృత్యుం విద్ధి మాం వీరభద్ర జీవంత్యేతే మత్ప్రసాదేన దేవాః ॥35॥**

నేను కాలాన్ని. నేను కాలవినాశకుణ్ణి కూడా. లోకాల్ని సంహరించడానికి నేను అవతరించాను. ఓ వీరభద్రా! నేను మృత్యువుకే మృత్యువునని తెలిసికో. ఈ దేవతలందరూ నా దయతో జీవిస్తున్నారు.

**సూత ఉవాచ –** సూతర్షి పలికాడు.

**సాహంకారమిదం శ్రుత్వా హరేరమితవిక్రమః ।**
**విహస్యోవాచ సావజ్ఞం తతో విస్ఫురితాధరః ॥36॥**

విష్ణువు అహంకారంతో నిండిన వాక్యాల్ని విన్న అత్యంత పరాక్రమవంతుడైన వీరభద్రుడు విశేషంగా అదురుతున్న పెదవులు గలవాడై తిరస్కారభావంతో వికటంగా నవ్వుతూ ఆ నారసింహుడితో ఇలా పలికాడు.

**శ్రీ వీరభద్ర ఉవాచ –** శ్రీ వీరభద్రుడు పలికాడు.

**కిం న జానాసి విశ్వేశం సంహర్తారం పినాకినమ్ ।**
**అసద్వాదో వివాదశ్చ వినాశస్త్వయి కేవలః ॥37॥**

**తవాన్యేన్యావతారాణి కాని శేషాణి సాంప్రతమ్ ।**
**కృతాని యేన కేనాపి కథాశేషో భవిష్యతి ॥38॥**

**దోషం త్వం పశ్య ఏతత్త్వమవస్థామీదృశీం గతః ।**
**తేన సంహారదక్షేణ క్షణాత్సంక్షయమేష్యసి ॥39॥**

నీవు సంహారకర్త, పినాకపాణి, విశ్వేశ్వరుడైన శివుణ్ణి ఎందుకు గుర్తించుటలేదు? మిథ్యావాద వివాదం కేవలం నీ వినాశానికే. నీవు ధరించిన విభిన్నావతారాలు ఎన్ని మిగిలి ఉన్నాయి. ఏదో విధంగా నిర్వహించిన ఆ అవతారాలు చెప్పుకునే కథలు అవుతున్నాయి. నీవు ఈ దోషాన్ని తెలుసుకో. నీవు ఎట్లా ఈ దశను పొందావో, సంహారసమర్థుడైన శివుడివల్ల క్షణకాలంలో నీవు వినాశాన్ని పొందుతావు.

**ప్రకృతిస్త్వం పుమాన్ రుద్రస్త్వయి వీర్యం సమాహితమ్ ।**
**త్వన్నాభిపంకజాజ్జాతః పంచవక్త్రః పితామహః ॥40॥**

**సృష్ట్యర్థేన జగత్పూర్వం శంకరం నీలలోహితమ్ ।**
**లలాటే చింతయామాస తపస్యుగ్రే వ్యవస్థితః ॥41॥**

**తల్లలాటాదభూచ్ఛంభోః సృష్ట్యర్థం తన్న దూషణమ్ ।**
**అంశోఽహం దేవదేవస్య మహాభైరవరూపిణః ॥42॥**

**త్వత్సంహారే నియుక్తోఽస్మి వినయేన బలేన చ ।**
**ఏవం రక్షో విదార్యైవ త్వం శక్తికలయా యుతః ॥43॥**

**అహంకారావలేపేన గర్జసి త్వమతంద్రితః ।**
**ఉపకారో హ్యసాధూనామపకారాయ కేవలమ్ ॥44॥**

**యది సింహ మహేశానం స్వపునర్భూత మన్యసే ।**
**న త్వం స్రష్టా న సంహర్తా న స్వతంత్రో హి కుత్రచిత్ ॥45॥**

**కులాలచక్రవచ్చక్త్యా ప్రేరితోఽసి పినాకినా ।**

నీవు ప్రకృతివి. రుద్రుడు పురుషుడు. నీలో ఆతడి తేజం సమాహితమై ఉంది. పంచముఖబ్రహ్మ నీనాభికమలంనుంచి పుట్టాడు. పూర్వం బ్రహ్మ జగత్తును సృష్టించడానికై ఉగ్రమైన తపస్సు చేస్తూ తన లలాటంలో నీలలోహిత శంకరుణ్ణి చింతించాడు. అప్పుడు బ్రహ్మ లలాటంనుంచి శంభుడు సృష్ట్యర్థమై ఉద్భవించాడు. అందుచేత శివుణ్ణి నిందించరాదు. నేను మహాభైరవరూపమైన దేవదేవశివుడి అంశను. వినయంతో, బలంతో నీ సంహారానికై నియుక్తుణ్ణి అయ్యాను. ఈ విధంగా శక్తి కళతో కూడిన నీవు ఈ రాక్షసుణ్ణి చంపి అహంకార వివశత్వంతో విచిత్రంగా గర్జిస్తున్నావు. దుష్టుడికి చేసిన ఉపకారం కేవలం అపకారానికి కారణం అవుతుంది. ఓ నృసింహా! నీవు మహేశ్వరుణ్ణి నీనుంచి జన్మించినవాడుగా తలస్తున్నావు. అది నీ భ్రమ మాత్రమే. నీవు సృష్టికర్తవు కావు. సంహర్తవు కావు. నీవు ఏవిధంగానూ స్వతంత్రుడవు కావు. నీవు కుమ్మరి చక్రం మాదిరి సర్వశక్తిమంతుడైన పినాకపాణిచేత ప్రేరేపింపబడ్డావు.

**అద్యాపి తవ నిక్షిప్తం కపాలం కూర్మరూపిణః ॥46॥**

**హరహారలతామధ్యే ముగ్ధ కస్మాన్న బుధ్యసే ।**
**విస్మృతం కిం తదంశేన దంష్ట్రోత్పాతనపీడితః ॥47॥**

**వారాహవిగ్రహస్తేఽద్య సాక్రోశం తారకారిణా ।**
**దగ్ధోఽసి యస్య శూలాగ్రే విష్వక్సేనచ్ఛలాద్భవాన్ ॥48॥**

కూర్మరూపధారివైన నీ కపాలం ఇప్పుడు కూడా శివుడి గళమందలి హారాల మధ్య ఉన్నది. ఓ ముగ్ధుడా! దీనిని ఎందుకు నీవు తెలియకున్నావు? శివాంశ కారణంగా కలిగిన, 'తారకుడి శత్రువు' అయిన కుమారస్వామి వరాహరూపంలోగల నీ దంతాన్ని కష్టపూర్వకంగా పీకిన విషయాన్ని నీవు మరచినట్లు ఉన్నావు. విష్వక్సేనరూపంగా రుద్రుడి త్రిశూలం అగ్రభాగంచే దగ్ధం కాబడ్డావు.

**దక్షయజ్ఞే శిరశ్ఛిన్నం మయా తే యజ్ఞరూపిణః ।**
**అద్యాపి తవ పుత్రస్య బ్రహ్మణః పంచమం శిరః ॥49॥**

**ఛిన్నం తమేనాభిసంధం తదంశం తస్య తద్బలమ్ ।**
**నిర్జితస్త్వం దధీచేన సంగ్రామే సమరుద్గణః ॥50॥**

**కండూయమానే శిరసి కథం తద్విస్మృతం త్వయా ।**
**చక్రం విక్రమతో యస్య చక్రపాణే తవ ప్రియమ్ ॥51॥**

**కుతః ప్రాప్తం కృతం కేన త్వయా తదపి విస్మృతమ్ ।**
**తే మయా సకలా లోకా గృహీతాస్త్వం పయోనిధౌ ॥52॥**

**నిద్రాపరవశః శేషే స కథం సాత్త్వికో భవాన్ ।**
**త్వదాదిస్తంబపర్యంతం రుద్రశక్తివిజృంభితమ్ ॥53॥**

నేను దక్షయజ్ఞంలో యజ్ఞరూపధారివైన నీ శిరసు ఖండించాను. నీ పుత్రుడైన బ్రహ్మ అయిదవ శిరస్సు ఖండింపబడింది. దాని అంశ ఇప్పటికి కన్పిస్తూనే ఉంది. నీవు రుద్రుడి ఈ బలాన్ని ఎందుకు గుర్తించకున్నావు? మరుద్గణసహితుడవైన నీవు యుద్ధంలో దధీచి మహర్షిచేత తలను గోకుతుండగా జయింపబడ్డ విషయాన్ని ఎలా మర్చిపోయావు. ఓ చక్రపాణీ! నీకు ఇష్టమైన చక్రం నీ పరాక్రమానికి కారణం. అది నీకెట్లు లభించింది? ఎవరు నిర్మించారు? అది కూడా నీవు మరచావు. నేను నీ సమస్తలోకాన్ని సంహరించాను. నీవు అప్పుడు క్షీరసాగరంలో నిద్రాపరవశుడవై ఆదిశేషుడిపై పడుకున్నావు. అటువంటి నీవు సత్త్వగుణోపేతుడవు (పాలనకర్తవు) ఎలా అవుతావు. నీ నుండి గడ్డిపోచవరకు సమస్తం రుద్రుడి శక్తి వల్ల కలిగినట్టిదే.

**శక్తిమానభితస్త్వం చ హ్యనలస్త్వం చ మోహితః ।**
**తత్తేజసోఽపి మాహాత్మ్యం యువాం ద్రష్టుం న హి క్షమౌ ॥54॥**

**స్థూలా యే హి ప్రపశ్యంతి తద్విష్ణోః పరమం పదమ్ ।**
**ద్యావాపృథివ్యా ఇంద్రాగ్నియమస్య వరుణస్య చ ॥55॥**

**ధ్వాంతోదరే శశాంకస్య జనిత్వా పరమేశ్వరః ।**
**కాలోఽసి త్వం మహాకాలః కాలకాలో మహేశ్వరః ॥56॥**

**అతస్త్వముగ్రకలయా మృత్యోర్మృత్యుర్భవిష్యసి ।**
**స్థిరధన్వా క్షయోఽ వీరో వీరో విశ్వాధికః ప్రభుః ॥57॥**

**ఉపహస్తా జ్వరం భీమో మృగపక్షిహిరణ్మయః ।**
**శాస్తాశేషస్య జగతో న త్వం నైవ చతుర్ముఖః ॥58॥**

**ఇత్థం సర్వం సమాలోక్య సంహరాత్మానమాత్మనా ।**
**నో చేదిదానీం క్రోధస్య మహాభైరవరూపిణః ॥59॥**

**వజ్రాశనిరివ స్థాణోస్త్వేవం మృత్యుః పతిష్యతి ।**

మోహితుడవైన నీవు అట్లే అగ్ని మీ యిద్దరూ రుద్రుడి శక్తి వల్ల సమర్థులయ్యారు. రుద్రుడి తేజఃప్రభావాన్ని చూడడానికి మీయిద్దరూ (విష్ణువు, అగ్ని) సమర్థులు కారు. స్థూలదృష్టి గలవారు. సర్వవ్యాపకమైన ఆ పరమేశ్వర తత్త్వాన్ని విష్ణువు, ఇంద్రుడు, యముడు, వరుణుడు, స్వర్గము, పృథివిగా చూస్తున్నారు. నీవు కళంకితుడైన చంద్రుని వలన బుట్టి కాలరూపుడుగా ఉన్నావు. కాని పరమేశ్వరుడు మహాకాలుడు కాలకాలుడు. కనుక నీవు మరణానికి లోబడినవాడవగుటచే ఉగ్రశివుని వశుడగుచున్నావు. స్థిరధన్వుడు, శాశ్వతుడు అయిన శివుడు అందిరకన్నా పరాక్రముడు. వీరుడు, సర్వశ్రేష్ఠుడు, అందరికీ ప్రభువు. రోగశాంతికారకుడు, భయానకుడు, స్వర్ణమృగం మరియు స్వర్ణపక్షి ఆకారం గలవాడు. సంపూర్ణజగత్తుకి నీవు శాసకుడివి కావు. చతుర్ముఖబ్రహ్మ కూడా కాడు. ఈ విధంగా సమస్తాన్ని సమాలోచించి నీవు నీయీ రూపాన్ని సంపూర్ణంగా ఉపసంహరించుకో. లేకుంటే ఇప్పుడే మహాభైరవరూపుడైన రుద్రుడి క్రోధం వజ్రమనే పిడుగు పర్వతాల్ని ఛేదించినట్లు నిన్ను వధిస్తుంది.

**సూత ఉవాచ :–** సూతుడు పలికాడు.

**ఇత్యుక్తో వీరభద్రేణ నృసింహః క్రోధవిహ్వలః ॥60॥**

**ననాద తనువేగేన తం గృహీతుం ప్రచక్రమే ।**
**అత్రాంతరే మహాఘోరం విపక్షభయకారణమ్ ॥61॥**

**గగనవ్యాపి దుర్ధర్షశైవతేజః సముద్భవమ్ ।**
**వీరభద్రస్య తద్రూపం తత్క్షణాదేవ దృశ్యతే ॥62॥**

**న తద్ధిరణ్మయం సౌమ్యం న సౌరం నాగ్నిసంభవమ్ ।**
**న తడిచ్చంద్రసదృశమనౌపమ్యం మహేశ్వరమ్ ॥63॥**

**తదా తేజాంసి సర్వాణి తస్మిన్ లీనాని శాంకరే ।**
**తతోఽ వ్యక్తో మహాతేజా వ్యక్తే సంభవతస్తతః ॥64॥**

వీరభద్రుడు ఆ విధంగా పలకగా నారసింహుడు క్రోధవ్యాకులుడై గర్జిస్తూ తీవ్రవేగంతో ఆతణ్ణి పట్టుకోవడానికి ప్రయత్నించాడు. ఈలోగా శత్రువులకు భయహేతువు, మహాభయంకరము, ఆకాశమంతటా వ్యాపించినదీ, దుర్ధర్షమూ అయిన శివతేజం నుండి ఉత్పన్నమైనదీ అయిన వీరభద్రుని రూపం ఆ క్షణంలో కన్పించింది. అది

అపూర్వం. సువర్ణమయమైనది కాదు. చంద్రుడి వల్ల కల్గినది కాదు. సూర్యుడి వల్ల కల్గినది కాదు. అగ్ని వల్ల ఉత్పన్నమైనది కాదు. అది మెరుపుతోను చంద్రుడితోను సమానమైన కాంతి గలిగినది కాదు. పోలిక లేనట్టి శివసంబంధమైన రూపం. ఆ సమయంలో కాంతులన్నీ ఆ శివరూపంలో లీనమయ్యాయి. దానితో ఆ మహాతేజస్సు అవ్యక్తరూపంలో నిలిచింది. తరువాత రెండు వ్యక్తరూపాలు ప్రకటమయ్యాడు. (అవి శరభం – నృసింహం)

**రుద్రసాధారణం చైవ చిహ్నితం వికృతాకృతి ।**
**తతః సంహారరూపేణ సువ్యక్తః పరమేశ్వరః ॥65॥**

**పశ్యతాం సర్వదేవానాం జయశబ్దాదిమంగళైః ।**
**సహస్రబాహుర్జటిలశ్చంద్రార్ధకృతశేఖరః ॥66॥**

**స మృగార్ధశరీరేణ పక్షాభ్యాం చంచునా ద్విజాః ।**
**అతితీక్ష్ణమహాదంష్ట్రో వజ్రతుల్యనఖాయుధః ॥67॥**

**కంఠే కాలో మహాబాహుశ్చతుష్పాదహ్నిసంభవః ।**
**యుగాంతోద్యతజీమూతభీమగంభీరనిఃస్వనః ॥68॥**

**సమం కుపితవృత్తాగ్ని వ్యావృత్తనయనత్రయః ।**
**స్పష్టదంష్ట్రోஉధరోష్ఠశ్చ హుంకారేణ యుతో హరః ॥69॥**

ఆ సమయంలో భయంకరాకృతిగల, రుద్రుడి విశేషచిహ్నాలతో కూడిన రూపం ప్రకటితమైంది. తర్వాత పరమేశ్వరుడు మహాప్రళయకాలరూపంతో నిలిచాడు. ఓ ద్విజులారా! సమస్తదేవతలు చూస్తూ జయజయ మంగళ శబ్దాలు విన్పించారు. సహస్రభుజుడై, జటాధారియై, శిరసుమీద అర్ధచంద్రుణ్ణి ధరించినవాడై, సగభాగం పశుశరీరం గలవాడై, రెండు రెక్కలు, ముక్కులు గలవాడై ఉన్నాడు. ఆయన దంతాలు విశాలాలు, అతితీక్ష్ణాలు అయి ఉన్నాయి. ఆయన వజ్రసమానమైన నఖరూపమైన ఆయుధంతో శోభిల్లుతున్నాడు. ఆయన కాలకంఠుడై ఉన్నాడు. ఆతడు నాల్గు భుజాలు, నాల్గు పాదాలు గలవాడు. అగ్నినుంచి పుట్టినవాడు. యుగాంతంలో ఏర్పడిన మేఘసమానమైన భయంకరమైన గంభీరమైన ధ్వని కలిగినవాడు. ఆయన మూడు నేత్రాలు క్రోధం వల్ల విస్తరించి విశాలమైన అగ్నిగోళాలలాగా ఉన్నాయి. ఆయన దంతాలు, రెండు పెదవులు స్పష్టంగా కన్పించాయి. శివుడు హుంకారం చేస్తున్నాడు.

**హరిస్తద్దర్శనాదేవ వినష్టబలవిక్రమః ।**
**బిభ్రద్దౌర్బ్యం సహస్రాంశోరధః ఖద్యోతవిభ్రమమ్ ॥70॥**

**అథ విభ్రమ్య పక్షాభ్యాం నాభిపాదేஉభ్యదారయన్ ।**
**పాదావాబధ్య పుచ్ఛేన బాహుభ్యాం బాహుమండలమ్ ॥71॥**

**భిందన్నురసి బాహుభ్యాం నిజగ్రాహ హరో హరిమ్ ।**
**తతో జగామ గగనం దేవైః సహ మహర్షిభిః ॥72॥**

**సహసైవ భయాద్విష్ణుం విహగశ్చ యథోరగమ్ ।**
**ఉత్క్షిప్యోత్క్షిప్య సంగృహ్య నిపాత్య చ నిపాత్య చ ॥73॥**

**ఉడ్డీయోడ్డీయ భగవాన్ పక్షాఘాతవిమోహితమ్ ।**
**హరిం హరంతం వృషభం విశ్వేశానం తమీశ్వరమ్ ॥74॥**

**అనుయాంతి సురాః సర్వే నమో వాక్యేన తుష్టువుః ।**
**నీయమానః పరవశో దీనవక్త్రః కృతాంజలిః ॥75॥**

**తుష్టావ పరమేశానం హరిస్తం లలితాక్షరైః ।**

ఆయన్ని చూచిన విష్ణువు బలపరాక్రమాలు నష్టపడ్డాయి. విష్ణువు సూర్యుడి సమక్షంలో మిణుగురుతో సమానమైన కాంతిని పొందిన మాదిరి అయ్యాడు. తర్వాత శివరూపుడైన శరభం తన రెక్కలతో ఆతణ్ణి బంధించి నాభిని, కాళ్లను తన్నుతూ, తన తోకతో పాదాల్ని బాధిస్తూ, తన భుజాలతో ఆతడి భుజాల్ని పట్టి ఉంచి, ఆతడి వక్షఃస్థలం మీద దెబ్బలు కొట్టుతూ ఆతణ్ణి బంధించాడు. వెంటనే గరుత్మంతుడు సర్పాన్ని ఆక్రమించినట్లు ఆక్రమించి లేపి లేపి, పడవేసి పడవేసి, బాగా పట్టుకుని ఎగిరి ఎగిరి బాధించాడు. రెక్కల దెబ్బలతో స్పృహ తప్పిన హరిని పట్టుకుని దేవతలతో ఋషులతో కూడి ఆకాశంవైపు వెళ్లాడు. హరిని, హరుణ్ణి, వృషభాన్ని దేవతలందరూ అనుసరించారు. “నమస్కారం, నమస్కారం” అంటూ స్తుతించారు. ఆ విధంగా పట్టుకురాబడిన పరవశుడు, దీనముఖుడు అయిన హరి అంజలిబద్ధుడై ఆ పరమేశ్వరుణ్ణి లలితమైన మాటలతో స్తుతించాడు.

**శ్రీ నృసింహ ఉవాచ** - నృసింహుడు పలికాడు.

**నమో రుద్రాయ శర్వాయ మహాగ్రాసాయ విష్ణవే ॥76॥**

**నమ ఉగ్రాయ భీమాయ నమః క్రోధాయ మన్యవే ।**
**నమో భవాయ శర్వాయ శంకరాయ శివాయ తే ॥77॥**

**కాలకాలాయ కాలాయ మహాకాలాయ మృత్యవే ।**
**వీరాయ వీరభద్రాయ క్షయద్వీరాయ శూలినే ॥78॥**

**మహాదేవాయ మహతే పశూనాం పతయే నమః ।**
**ఏకాయ నీలకంఠాయ శ్రీకంఠాయ పినాకినే ॥79॥**

**నమోఽనంతాయ సూక్ష్మాయ నమస్తే మృత్యుమన్యవే ।**
**పరాయ పరమేశాయ పరాత్పరతరాయ తే ॥80॥**

**పరాత్పరాయ విశ్వాయ నమస్తే విశ్వమూర్తయే ।**
**నమో విష్ణుకళత్రాయ విష్ణుక్షేత్రాయ భానవే ॥81॥**

**కైవర్తాయ కిరాతాయ మహావ్యాధాయ శాశ్వతే ।**
**భైరవాయ శరణ్యాయ మహాభైరవరూపిణే ॥82॥**

నమో నృసింహసంహర్త్రే కామకాలపురారయే ।
మహాపాశౌఘసంహర్త్రే విష్ణుమాయాంతకారిణే ॥83॥

త్ర్యంబకాయ త్ర్యక్షరాయ శిపివిష్టాయ మీఢుషే ।
మృత్యుంజయాయ శర్వాయ సర్వజ్ఞాయ మఖారయే ॥84॥

మఖేశాయ వరేణ్యాయ నమస్తే వహ్నిరూపిణే ।
మహాఘ్రాణాయ జిహ్వాయ ప్రాణాపానప్రవర్తినే ॥85॥

త్రిగుణాయ త్రిశూలాయ గుణాతీతాయ యోగినే ।
సంసారాయ ప్రవాహాయ మహాయంత్రప్రవర్తినే ॥86॥

నమశ్చంద్రాగ్నిసూర్యాయ ముక్తివైచిత్ర్యహేతవే ।
వరదాయావతారాయ సర్వకారణహేతవే ॥87॥

కపాలినే కరాలాయ పతయే పుణ్యకీర్తయే ।
అమోఘాయాగ్నినేత్రాయ లకులీశాయ శంభవే ॥88॥

భిషక్తమాయ ముండాయ దండినే యోగరూపిణే ।
మేఘవాహాయ దేవాయ పార్వతీపతయే నమః ॥89॥

అవ్యక్తాయ విశోకాయ స్థిరాయ స్థిరధన్వినే ।
స్థాణవే కృత్తివాసాయ నమః పంచార్థహేతవే ॥90॥

వరదాయైకపాదాయ నమశ్చంద్రార్ధమౌళినే ।
నమస్తేఽధ్వరరాజాయ వయసాం పతయే నమః ॥91॥

యోగీశ్వరాయ నిత్యాయ సత్యాయ పరమేష్ఠినే ।
సర్వాత్మనే నమస్తుభ్యం నమః సర్వేశ్వరాయ తే ॥92॥

ఏకద్విత్రిచతుఃపంచకృత్వస్తేఽస్తు నమో నమః ।
దశకృత్వస్తు సాహస్రకృత్వస్తే చ నమో నమః ॥93॥

నమోఽపరిమితం కృత్వానంతకృత్వో నమో నమః ।
నమో నమో నమో భూయః పునర్భూయో నమో నమః ॥94॥

రుద్రుడికి నమస్కారం. శర్వుడికి, మహాగ్రాసుడికి (జగత్తే ఆయనకు గ్రాసం) విష్ణువుకు నమస్కారం. ఉగ్రుడికి, భీముడికి నమస్కారం. క్రోధుడికి మన్యువుకు నమస్కారం. భవుడవు, శంకరుడవు, శర్వుడవు, శివుడవు అయిన నీకు నమస్కారం. కాలకాలుడికి, కాలుడికి, మహాకాలుడికి, మృత్యువుకు, వీరుడికి, వీరభద్రుడికి, పాపవినాశకుడికి, శూలికి, మహాదేవుడికి, మహచ్ఛబ్దవాచ్యుడికి, పశుపతికి నమస్కారం. ఏకాకికి, నీలకంఠుడికి,

శ్రీకంఠుడికి, పినాకికి నమస్కారం. అనంతుడవు, సూక్ష్ముడవు, మృత్యురూపుడవు, మన్యురూపుడవు అయిన నీకు వందనం. పరుడవు, పరమేశుడవు, పరాత్పరతరాయుడవు, పరాత్పరుడవు, విశ్వుడవు అయిన నీకు నమస్కారం. విశ్వమూర్తికి నమస్కారం. విష్ణుకళత్రుడికి, విష్ణుక్షేత్రుడికి, భానువుకు నమస్కారం. కైవర్తుడికి (సంసారసాగరాన్ని తరింపజేసేవాడు), కిరాతకుడికి, మహావ్యాధుడికి, శాశ్వతుడికి, భైరవుడికి, శరణ్యుడికి, మహాభైరవరూపికి నమస్కారం. నృసింహహంతకు, కామకాలపురారికి (మన్మథుడు, యముడు, త్రిపురాలు), మహాపాశ సమూహాల్ని సంహరించేవాడికి, విష్ణువు మాయల్ని అంతంచేసేవాడికి, ముక్కంటికి, త్ర్యక్షరుడికి (భూతభవిష్యద్వర్తమానాలలో నశించనివాడు), శిపివిష్టుడికి, మీఢుష్టుడికి, మృత్యుంజయుడికి, శర్వుడికి, సర్వజ్ఞుడికి, మఖారికి, మఖేశ్వరుడికి, వరేణ్యుడికి, అగ్నిరూపికి, మహాఘ్రాణం కలవాడికి (పెద్దముక్కు), జిహ్వుడికి (పెద్దనాలుక), ప్రాణాపానప్రవర్తికి నమస్కారం. త్రిగుణుడికి, త్రిశూలికి, గుణాతీతుడికి, యోగికి, సంసారికి, ప్రవాహికి, మహాయంత్రప్రవర్తకుడికి నమస్కారం. చంద్రాగ్నిసూర్యస్వరూపుడికి, ముక్తివైచిత్ర్యకారకుడికి, వరదుడికి, అవతారుడికి, సర్వకారణ హేతువైన వాడికి, కపాలికి, కరాలుడికి, పతికి, పుణ్యకీర్తికి, అమోఘుడికి, అగ్నినేత్రుడికి, లకులీశుడికి, శుంభుడికి, భిషక్తముడికి, ముండుడికి, దండికి, యోగరూపికి, మేఘవాహనుడికి, దేవుడికి, పార్వతీపతికి నమస్కారం. అవ్యక్తుడికి, విశోకుడికి (శోకరహితుడు), స్థిరుడికి, స్థిరధన్వుడికి, స్థాణురూపుడికి, కృత్తివాసుడికి, పంచార్థహేతువుకు నమస్కారం. వరదుడికి, ఏకపాదుడికి, చంద్రమౌళికి నమస్కారం. యజ్ఞరాజుకు, వయసాంపతికి నమస్కారం. యోగీశ్వరుడవు, నిత్యుడవు, సత్యస్వరూపుడవు, పరమేష్ఠివి, సర్వాత్ముడవు, సర్వేశ్వరుడవు అయిన నీకు నమస్కారం. నీకు ఒకటి, రెండు, మూడు, నాల్గు, ఐదుసార్లు నమస్కారం. నీకు పదిసార్లు, వేయిసార్లు నమస్కారం. నీకు అపరిమితమైన పర్యాయాలు, అనంతమైన పర్యాయాలు నమస్కారం. నీకు మాటిమాటికి నమస్కారం. తిరిగి మాటిమాటికి నమస్కారం.

**సూత ఉవాచ –** సూతర్షి పలికాడు.

**నామ్నాష్టశతేనైవం స్తుత్వామృతమయేన తు ।**
**పునస్తు ప్రార్థయామాస నృసింహః శరభేశ్వరమ్ ॥95॥**

**యదా యదా మమాజ్ఞానమత్యహంకారదూషితమ్ ।**
**తదా తదాపనేతవ్యం త్వయైవ పరమేశ్వర ॥96॥**

**ఏవం విజ్ఞాపయన్ ప్రీతః శంకరం నరకేసరీ ।**
**నన్వశక్తో భవాన్ విష్ణో జీవితాంతం పరాజితః ॥97॥**

**తద్వక్త్రశేషమాత్రాంతం కృత్వా సర్వస్య విగ్రహమ్ ।**
**శుక్తిశిత్యం తదా మంగం వీరభద్రః క్షణాత్తతః ॥98॥**

ఓ ఋషులారా! ఈ విధంగా నృసింహరూపంలోగల విష్ణువు నూట ఎనిమిది అయిన అమృతమయమైన పేర్లతో శరభరూపుడైన శివుణ్ణి స్తుతించి మరల అతణ్ణి ఇలా ప్రార్థించాడు. 'ఓ పరమేశ్వరా! ఎప్పుడెప్పుడు అత్యహంకారంతో నీ ఆజ్ఞ నా వల్ల ఉల్లంఘింపబడుతుందో, అప్పుడల్లా నీవు దాన్ని దూరం చేయి.' ఈ విధంగా ప్రార్థిస్తూ నారసింహుడు సంప్రీతుడయ్యాడు. అప్పుడు వీరభద్రుడు పలికాడు. 'ఓ విష్ణుమూర్తీ! నీవు వాస్తవంగా

అశక్తుడవు. జీవం అంతంలో పరాజితుడవు అయ్యావు.' తర్వాత వీరభద్రుడు క్షణకాలంలో నృసింహరూపధారి విష్ణువు విగ్రహాన్ని ముఖం మాత్రం అట్లే మిగిల్చి తక్కిన దేహం మీది చర్మాన్ని పీకి ఎముకల్ని మాత్రం (అస్థిపంజరం) ఉంచాడు. దీనివల్ల నృసింహుడి దేహం మిక్కిలి తెల్లనిదయింది.

**దేవా ఊచుః –** దేవతలు పలికారు.

**అథ బ్రహ్మాదయః సర్వే వీరభద్ర త్వయా దృశా ।**
**జీవితాః స్మో వయం దేవాః పర్జన్యేనేవ పాదపాః ॥99॥**

ఓ వీరభద్రా! బ్రహ్మ మొదలైన దేవతలైనమేమంతా నీ దృష్టి కారణంగా ఇలా జీవించి ఉన్నాం. వృక్షాలు మేఘుడివల్ల జీవించి ఉన్నట్లు.

**యస్య భీషా దహత్యగ్నిరుదేతి చ రవిః స్వయమ్ ।**
**వాతో వాతి చ సోఽసి త్వం మృత్యుర్ధావతి పంచమః ॥100॥**

ఎవడి భయం వల్ల అగ్ని జ్వలిస్తున్నది. సాక్షాత్తు సూర్యుడు ఉదయిస్తున్నాడు. వాయువు చలిస్తున్నది. పంచతత్త్వాలు గల మృత్యువు పరిగెత్తుతున్నది. ఆతడివి నీవే.

**యదవ్యక్తం పరం వ్యోమ కాలాతీతం సదాశివమ్ ।**
**భగవంస్త్వామేవ భవం వదంతి బ్రహ్మవాదినః ॥101॥**

ఓ భగవాన్! బ్రహ్మవాదులైన జనులు నిన్ను అనిర్వాచ్యుడని, చిదాకాశుడని, కాలాతీతుడని, సదాశివుడని, భవుడని చెబుతున్నారు.

**కే వయమేవ ధాతుక్యే వేదనే పరమేశ్వరః ।**
**న విద్ధి పరమం ధామ రూపలావణ్య వర్ణనే ॥ 102॥**

మేము ఎల్లరం నీవు పరంధాముడవని తెలియుటలో అసమర్థులం అయ్యాం. నీవు మాకు పరమేశ్వరుడవు. నీ రూపాన్ని, లావణ్యాన్ని ఎంత వర్ణించినా తరగదు.

**ఉపసర్గేషు సర్వేషు త్రాయస్వాస్మాన్ గణాధిప ।**
**ఏకాదశాత్మన్ భగవాన్ వర్తతే రూపవాన్ హరః ॥103॥**

ఓ గణాధిప! సర్వాపదలనుంచి మమ్మల్ని రక్షించు. ఓ ఏకాదశరుద్రరూపా! భగవానుడవు, హరుడవైన నీవు సౌందర్యరూపుడవు.

**ఈదృశాన్ తేఽవతారాణి దృష్ట్వా శివ బహూంస్తమః ।**
**కదాచిత్సందిహేన్నాస్మాంస్త్వచ్చింతాస్తమయా తథా ॥104॥**

**గుంజాగిరివరతటామితరూపాణి సర్వశః ।**
**అభ్యసంహర గమ్యం తేన నీతవ్యం పరాపరా ॥105॥**

**ద్వే తనూ తవ రుద్రస్య వేదజ్ఞా బ్రాహ్మణా విదుః ।**
**ఘోరాప్యన్యా శివాప్యన్యా తే ప్రత్యేకమనేకధా ॥106॥**

**ఇహాస్మాన్ పాహి భగవన్నిత్యాహతమహాబలః ।**
**భవతా హి జగత్సర్వం వ్యాప్తం స్వేనైవ తేజసా ॥107॥**

**బ్రహ్మా విష్ణ్వింద్రచంద్రాది వయం చ ప్రముఖాః సురాః ।**
**సురాసురాః సంప్రసూతాస్త్వత్తః సర్వే మహేశ్వర ॥108॥**

ఓ శివా! ఈవిధంగా నీ అనేకమైన అవతారాల్ని చూచినందున మా అజ్ఞానం వల్ల మాలో నీ విషయమై కొంచెం సందేహం కూడా కలగనీయకు. అప్పుడే మా ధ్యానం నష్టపడదు. ఏ విధంగా గొప్పదైన గురిగింజపర్వతం ప్రాంతభాగాలలో గురిగింజలు ఎక్కువ సంఖ్యలో ఉంటాయో, ఆ విధంగానే నీకు అనంతరూపాలు ఉంటాయి. వాటిని నీవు అన్నివైపులనుంచి ఉపసంహరించు. ఈ లోకం నీవు ప్రవేశించదగింది. దీన్ని సంహరించవద్దు. వేదవేత్తలయిన బ్రాహ్మణులు చెబుతున్నారు– రుద్రుడవైన నీకు రెండు దేహాలు ఉన్నాయని. ఒకటి ఘోరమైనది. రెండోది శివమైనది. వీటిల్లో ప్రత్యేకంగా అనేక విధాలున్నాయి. ఓ శివభగవానుడా! ఎప్పుడూ తగ్గని గొప్ప బలం గల నీవు మమ్మల్ని రక్షించు. నీవు నీ తేజస్సుతో సంపూర్ణ జగత్తులో వ్యాపించి ఉన్నావు. ఓ మహేశ్వరా! బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, చంద్రుడు మొదలైన ముఖ్యదేవగణమైన మేము, అట్లే మిగిలిన దేవతలందరూ మరియు దానవులు అందరూ నీనుంచి ఉత్పన్నులం అయినవాళ్లమే.

**బ్రహ్మో చ ఇంద్రో విష్ణుశ్చ యమాద్యానసురా స్సురాన్ ।**
**తతో నిగృహ్య చ హరిం సింహ ఇత్యుపచేతసమ్ ॥109॥**

**యతో బిభర్షి సకలం విభజ్య తనుమష్టధా ।**
**అతోఽస్మాన్ పాహి భగవన్సురాన్ దానైరభీప్సితైః ॥110॥**

బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, యముడు మొదలైన దేవతలనూ, దానవులనూ, భ్రాంతి పొందిన అంతఃకరణ గలవాడైన నృసింహుడైన హరిని నిగ్రహించి, నీ శరీరాన్ని అష్టవిధాలుగా విభాగించుకుని, నీవు అందర్ని ధరించి పోషిస్తున్నావు. ఓ భగవానుడా! అందువల్ల నీవు ఇష్టమైన దానాలతో మాదేవతల్ని రక్షించు.

**ఉవాచ తాన్ సురాన్ దేవో మహర్షీంశ్చ పురాతనాన్ ।**
**యథా జలే జలం క్షిప్తం క్షీరం క్షీరే ఘృతం ఘృతే ॥111॥**

**ఏక ఏవ తదా విష్ణుః శివలీనో న చాన్యథా ।**
**ఏష ఏవ నృసింహాత్మా సదర్పశ్చ మహాబలః ॥112॥**

**జగత్సంహారకారేణ ప్రవృత్తో నరకేసరీ ।**
**యాజనీయో నమస్తస్మై మద్భక్తిసిద్ధికాంక్షిభిః ॥113॥**

తర్వాత వీరభద్రుడు ఆ దేవతలతో, పురాతనులైన మహర్షులతో ఇలా పలికాడు. 'ఏ విధంగా నీటిలో నీరు, పాలలో పాలు, నేతిలో నేయి పోస్తే కలిసిపోయి ఒకటిగానే ఉంటాయో, ఆ విధంగానే విష్ణువు శివుడిలో కలిసిపోయాడు. ఇందుకు భిన్నమేదీ లేదు. గర్వయుక్తుడు, మహాబలవంతుడు అయిన నృసింహుడు లోకసంహారకుడైన రూపంలో కన్పించాడు. నా భక్తిని, సిద్ధిని కోరుకునేవాళ్లు నృసింహుణ్ణి పూజించాలి. నృసింహరూపాధారికి నమస్కారం.'

**ఏతావదుక్త్వా భగవాన్ వీరభద్రో మహాబలః ।**
**అపశ్యన్ సర్వభూతానాం తత్రైవాంతరధీయత ॥114॥**

**నృసింహకృత్తివసనస్తదా ప్రభృతి శంకరః ।**
**వక్త్రం తన్ముండమాలాయాం నాయకత్వేన కల్పితమ్ ॥115॥**

ఈ విధంగా పలికి మహాబలుడు, భగవంతుడు అయిన వీరభద్రుడు అక్కడ గల దేవతల్ని చూస్తూ అక్కడే అంతర్హితుడైనాడు. అప్పటినుంచి శంకరుడు నృసింహుడి చర్మాన్ని వస్త్రంగా ధరించాడు. అట్లే కపాలాన్ని తన కపాలమాలలో నాయకమణిగా అలంకరించుకున్నాడు.

**తతో దేవా నిరాతంకాః కీర్తయంతః కథామిమామ్ ।**
**విస్మయోత్ఫుల్లనయనా జగ్ముః సర్వే యథాగతమ్ ॥116॥**

తర్వాత ఆశ్చర్యం వల్ల విప్పారిన నేత్రాలు గల దేవతలు అందరూ నిరాటంకులై ఈ జరిగిన కథను వర్ణించుకుంటూ ఎలా వచ్చారో అలా వెళ్లారు.

**య ఇదం పరమాఖ్యానం పుణ్యం వేదైః సమన్వితమ్ ।**
**పఠిత్వా శృణుతే చైవ సర్వదుఃఖవినాశనమ్ ॥117॥**

**ధన్యం యశస్యమాయుష్యమారోగ్యం పుష్టివర్ధనమ్ ।**
**సర్వవిఘ్నప్రశమనం సర్వవ్యాధివినాశనమ్ ॥118॥**

**అపమృత్యుప్రశమనం మహాశాంతికరం శుభమ్ ।**
**అరిచక్రప్రశమనం సర్వాధిప్రవినాశనమ్ ॥119॥**

**తతో దుఃస్వప్నశమనం సర్వభూతనివారణమ్ ।**
**విషగ్రహక్షయకరం పుత్రపౌత్రాదివర్ధనమ్ ॥120॥**

**యోగసిద్ధిప్రదం సమ్యక్ శివజ్ఞానప్రకాశకమ్ ।**
**శేషలోకస్య సోపానం వాంఛితార్థైకసాధనమ్ ॥121॥**

**విష్ణుమాయానిరసనం దేవతాపరమార్థదమ్ ।**
**వాంఛాసిద్ధిప్రదం చైవ బుద్ధిప్రజ్ఞాదిసాధనమ్ ॥122॥**

ఓ మానవులారా! ఎవడు ఈ పుణ్యప్రదమైన, వేదమయమైన, శ్రేష్ఠాఖ్యానకాన్ని చదువుతాడో లేక వింటాడో ఆతడి అన్ని దుఃఖాలు నశిస్తాయి. ఈ కథ ధన్యత నిస్తుంది. యశస్సు నిస్తుంది. ఆయుష్షు నిస్తుంది. ఆరోగ్యాన్ని ఇస్తుంది. బలాన్ని యిస్తుంది. సమస్త విఘ్నాల్ని నశింపజేస్తుంది. సమస్త వ్యాధుల్ని నశింపజేస్తుంది. అకాలమరణాన్ని తప్పిస్తుంది. మహాశాంతిదాయకం అవుతుంది. మంగళకరమైనది, శత్రుసమూహవినాశకరం అవుతుంది. సకలమైన ఆధుల్ని (మానసికరోగాల్ని) నశింపజేస్తుంది. దుస్స్వప్నాల్ని నివారిస్తుంది. సమస్తభూతప్రేతాల్ని దూరం చేస్తుంది. దుష్టగ్రహప్రభావాన్ని ఉపశమింపజేస్తుంది. పుత్ర, పౌత్రవృద్ధి కల్గిస్తుంది. యోగసిద్ధిని కలిగిస్తుంది. మిక్కిలిగా శివజ్ఞానాన్ని ప్రకాశింపజేస్తుంది. శేషలోకసోపానం అవుతుంది. కోరిన ఫలితాన్ని ఇస్తుంది. విష్ణుమాయను దూరం చేస్తుంది. దేవతలకు పరమార్థాన్ని ప్రదానం చేస్తుంది. కోరికల్ని సిద్ధింపజేస్తుంది. ఐశ్వర్యం, ప్రజ్ఞ మొదలైన వాటిని ఇస్తుంది.

**ఇదం తు శరభాకారం పరం రూపం పినాకినః ।**
**ప్రకాశితవ్యం భక్తేషు చిరేషూద్యమితేషు చ ॥123॥**

**తైరేవ పఠితవ్యం చ శ్రోతవ్యం చ శివాత్మభిః ।**
**శివోత్సవేషు సర్వేషు చతుర్దశ్యష్టమీషు చ ॥124॥**

**పఠేత్ప్రతిష్ఠాకాలేషు శివసన్నిధికారణమ్ ।**
**చోరవ్యాఘ్రాహిసింహాంతకృతో రాజభయేషు చ ॥125॥**

**అన్యేష్వుత్పాతభూకంపదవాగ్నిపాంసువృష్టిషు ।**
**ఉల్కాపాతే మహావాతే వినా వృష్ట్యాతివృష్టిషు ॥126॥**

**అతస్తత్ర పఠేద్విద్వాన్ శివభక్తో దృఢవ్రతః ।**
**యః పఠేచ్ఛృణుయాద్వాపి స్తవం సర్వమనుత్తమమ్ ॥127॥**

**స రుద్రత్వం సమాసాద్య రుద్రస్యానుచరో భవేత్ ॥128॥**

పినాకపాణి అయిన శివుడి శ్రేష్ఠమైన ఈ శరభాకృతిని స్థిరప్రజ్ఞగల ఔత్సుక్యభక్తులందు ప్రకాశింపజేయాలి. శివుడియందు సమర్పించిన మనసుగల భక్తుల ద్వారా శివుడి అన్ని ఉత్సవాలలో మరియు అష్టమీ, చతుర్దశీ తిథులలో దీన్ని పఠించడం, వినడం నిర్వహించాలి. శివలింగప్రతిష్ఠాసమయంలో శివసన్నిధిని ప్రాప్తింపజేసేవారు ఈ స్తోత్రాన్ని పఠించాలి. చోరులవలన, పులి, పాము, సింహం మొదలైన వాటివలన భయం కలిగినప్పుడు, రాజువలన భయం కలిగినప్పుడు, ఇంకా ఇతరమైన ఉత్పాతాలు, భూకంపం, దావాగ్ని, ధూళివృష్టి మొదలైనవి కలిగినప్పుడు, ఉల్కలు పడినప్పుడు, పెనుగాలి వీచినపుడు, అనావృష్టి, అతివృష్టి ఏర్పడినప్పుడు, దృఢవ్రతుడైన విద్వాంసుడైన శివభక్తుడు ఈ శరభవృత్తాంతాన్ని పఠించాలి. ఎవడు ఈ సర్వోత్తమస్తోత్రాన్ని పఠిస్తాడో, వింటాడో ఆతడు రుద్రత్వాన్ని పొంది రుద్రానుచరుడవుతాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే శరభప్రాదుర్భావోనామ షణ్ణవతితమోఽధ్యాయః ॥ 96 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని శరభప్రాదుర్భావమనే తొంబైఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తనవతితమోఽధ్యాయః - తొంబై ఏడవ అధ్యాయం

## జలంధరవధః - జలంధరవధ

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**జలంధరం జటామౌళిః పురా జంభారివిక్రమమ్ ।**
**కథం జఘాన భగవాన్ భగనేత్రహరో హరః ॥1॥**

**వక్తుమర్హసి చాస్మాకం రోమహర్షణ సువ్రత ।**

ఓ రోమహర్షణా! ఓ సువ్రతుడా! ఓ సూతర్షీ! జటాధారి భగనేత్రహరుడు అయిన శివభగవానుడు ఇంద్రుడి విక్రమంతో సమానమైన విక్రమంగల జలంధరుణ్ణి ఎలా వధించాడు? మాకు ఆ విషయాన్ని కృపతో చెప్పు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**జలంధర ఇతి ఖ్యాతో జలమండలసంభవః ॥2॥**

**ఆసీదంతకసంకాశస్తపసా లబ్ధవిక్రమః ।**
**తేన దేవాః సగంధర్వాః సయక్షోరగరాక్షసాః ॥3॥**

**నిర్జితాః సమరే సర్వే బ్రహ్మా చ భగవానజః ।**

ఓ ఋషులారా! జలమండలంనుంచి జన్మించిన జలంధరుడనే పేరుతో ప్రసిద్ధుడైన యమధర్మరాజుతో సమానుడైన ఒక అసురుడు ఉన్నాడు. ఆతడు తన తపస్సుచేత బహుపరాక్రమవంతుడయ్యాడు. ఆతడు యుద్ధంలో గంధర్వుల్ని, యక్షుల్ని, ఉరగుల్ని, అట్లే రాక్షసుల్ని, దేవతలందర్ని మరియు పుట్టుకలేని బ్రహ్మదేవుణ్ణి కూడా జయించాడు.

**జిత్వైవ దేవసంఘాతం బ్రహ్మాణం వై జలంధరః ॥4॥**

**జగామ దేవదేవేశం విష్ణుం విశ్వహరం గురుమ్ ।**
**తయోః సమభవద్యుద్ధం దివారాత్రమవిశ్రమమ్ ॥5॥**

**జలంధరేశయోస్తేన నిర్జితో మధుసూదనః ।**

దేవతాసమూహాన్ని, బ్రహ్మదేవుణ్ణి జయించిన ఆ జలంధరుడు విశ్వవినాశకరుడు, దేవదేవేశ్వరుడు, గురువు అయిన విష్ణువు దగ్గరకు వెళ్లాడు. ఇద్దరికి రాత్రింబవళ్లు యుద్ధం జరిగింది. మధుసూదనుడైన విష్ణువును కూడా ఆతడు పరాజితుణ్ణి చేశాడు.

**జలంధరోఽపి తం జిత్వా దేవదేవం జనార్దనమ్ ॥6॥**

**ప్రోవాచేదం దితేః పుత్రాన్ న్యాయధీర్జేతుమీశ్వరమ్ ।**
**సర్వే జితా మయా యుద్ధే శంకరో హ్యజితో రణే ॥7॥**

**తం జిత్వా సర్వమీశానం గణపైర్నందినా క్షణాత్ ।**
**అహమేవ భవత్వం చ బ్రహ్మత్వం వైష్ణవం తథా ॥8॥**

**వాసవత్వం చ యుష్మాకం దాస్యే దానవపుంగవాః ।**

దేవదేవుడైన విష్ణువును కూడా జయించిన ఆ జలంధరుడు న్యాయబుద్ధికలవాడై శివుణ్ణి కూడా జయించసమకట్టి దైత్యులతో ఇలా పలికాడు. "నేను యుద్ధంలో అందర్నీ జయించాను. కేవలం ఒక శివుడు మాత్రమే అజితుడై ఉన్నాడు. ఓ దానవోత్తములారా! గణనాథుల్ని, నందీశ్వరుడితో కూడిన ఈశ్వరుణ్ణి క్షణకాలంలో జయించి నేను మీకు శివుడికి, బ్రహ్మకు, విష్ణువుకు, ఇంద్రుడికి చెందిన పదవుల్ని ప్రదానం చేస్తాను."

**జలంధరవచః శ్రుత్వా సర్వే తే దానవాధమాః ॥9॥**

**జగర్జురుచ్చైః పాపిష్ఠా మృత్యుదర్శనతత్పరాః ।**
**దైత్యైరేతైస్తథాఽన్యైశ్చ రథనాగతురంగమైః ॥10॥**

**సన్నద్ధైః సహ సన్నహ్య శర్వం ప్రతి యయౌ బలీ ।**

ఆ జలంధరుడి మాటలు విన్న పాపాత్ములు, అధములు, మృత్యుదర్శనతత్పరులు అయిన దానవులు పెద్దధ్వనితో గర్జించారు. తర్వాత బలశాలి అయిన జలంధరుడు, శస్త్రధారులై, రథాల్ని, ఏనుగుల్ని, గుర్రాల్ని అధిరోహించిన దైత్యులతో కలిసి యుద్ధసన్నద్ధుడై శివుడి దగ్గరకు వెళ్లాడు.

**భవోఽపి దృష్ట్వా దైత్యేంద్రం మేరుకూటమివ స్థితమ్ ॥11॥**

**అవధ్యత్వమపి శ్రుత్వా తథాన్యైర్భగనేత్రహా ।**
**బ్రహ్మణో వచనం రక్షన్ రక్షకో జగతాం ప్రభుః ॥12॥**

**సాంబః సనందీ సగణః ప్రోవాచ ప్రహసన్నివ ।**
**కిం కృత్యమసురేశాన యుద్ధేనానేన సాంప్రతమ్ ॥13॥**

**మద్బాణైర్భిన్నసర్వాంగో మర్తుమభ్యుద్యతే ముదా ।**

మేరుశిఖరసమానుడైయున్న ఆ జలంధరుణ్ణి చూచి, ఆతడిని చంపలేనితనాన్ని ఇతరులచేత విన్నవాడైన భగనేత్రహరుడు, లోకరక్షకుడు అయిన శివుడు పార్వతీదేవి, నందీశ్వరుడు, గణనాథులతో కూడి అక్కడే ఉన్నాడు. బ్రహ్మవచనాన్ని రక్షించేవాడు అయిన శివుడు నవ్వుతూ జలంధరుడితో ఇలా పలికాడు. 'ఓ దానవేంద్రా! ఈ యుద్ధం వల్ల ఏ విధమైన కార్యం సిద్ధిస్తుంది? నా బాణాలవల్ల ఛిన్నమైన భిన్నమైన అంగాలు గలవాడవై సంతోషంగా మరణించడానికై సిద్ధుడవు కాగలవు'.

**జలంధరోఽపి తద్వాక్యం శ్రుత్వా శ్రోత్రవిదారణమ్ ॥14॥**

**సురేశ్వరమువాచేదం సురేతరబలేశ్వరః ।**
**వాక్యేనాలం మహాబాహో దేవదేవ వృషధ్వజ ॥15॥**

**చంద్రాంశుసన్నిభైః శస్త్రైర్హర యోద్ధుమిహాగతః ।**

కర్ణవిదారణాలైన ఆ వాక్యాల్ని విన్న అసుర ప్రభువు జలంధరుడు కూడా సురేశ్వరుడైన శివుణ్ణిగూర్చి యిలా పలికాడు. 'ఓ మహాబాహూ! ఓ దేవదేవా! ఓ వృషభధ్వజా! నీవు ఆ విధంగా పలకవద్దు. నేను చంద్రకిరణాలతో సమానమైన కాంతిగల శస్త్రాలతో యుద్ధం చేయడానికి వచ్చాను'.

**నిశమ్యాస్య వచః శూలీ పాదాంగుష్ఠేన లీలయా ।**
**మహాంభసి చకారాశు రథాంగం రౌద్రమాయుధమ్ ॥16॥**

జలంధరుడి మాటను విన్న శివుడు వెంటనే లీలాపూర్వకంగా కాలి బొటనవ్రేలుతో మహాసముద్రంలో భయంకరమైన చక్రరూపమైన ఆయుధాన్ని నిర్మించాడు.

**కృత్వార్ణవాంభసి సితం భగవాన్ రథాంగం స్మృత్వా జగత్త్రయమనేన హతాః సురాశ్చ ।**
**దక్షాంధకాంతకపురత్రయయజ్ఞహర్తా లోకత్రయాంతకకరః ప్రహసంస్తదాహ ॥17॥**

**పాదేన నిర్మితం దైత్య జలంధర మహార్ణవే ।**
**బలవాన్ యది చోద్ధర్తుం తిష్ఠ యోద్ధుం న చాన్యథా ॥18॥**

అప్పుడు సముద్రజలంలో ఆ తెల్లటి శుద్ధచక్రాన్ని ఉంచి ఇలా భావించాడు. సురలతో కూడా మూడు లోకాలు దీనివలన హతమయినాయి. దక్షుడు, అంధకుడు, అంతకుడు, త్రిపురాలు, యజ్ఞం – వీటిని నష్టపరచినవాడు, మూడు లోకాల్ని సంహరించేవాడు అయిన శివుడు నవ్వుతూ ఇలా పలికాడు. "ఓ దానవా! ఓ జలంధరా! మహాసాగరంలో నా పాదాంగుష్ఠంతో నిర్మించిన అస్త్రాన్ని (చక్రాన్ని) లేపటంలో నీవు సమర్థుడవు అయితే, అప్పుడు యుద్ధం చేయడానికి నిలబడు. లేకుంటే యుద్ధమే లేదు." అని.

**తస్య తద్వచనం శ్రుత్వా క్రోధేనాదీప్తలోచనః ।**
**ప్రదహన్నివ నేత్రాభ్యాం ప్రాహాలోక్య జగత్త్రయమ్ ॥19॥**

శివుడి ఆ వాక్యం విని క్రోధం వల్ల కాంతిమంతమైన కన్నులుగల ఆ జలంధరుడు మూడు లోకాల్ని తన నేత్రాలతో దహించేవాడైనట్లుగా నిలిచి శివుడితో ఇలా పలికాడు.

**జలంధర ఉవాచ –** జలంధరుడు పలికాడు.

**గదాముద్ధృత్య హత్వా చ నందినం త్వాం చ శంకర ।**
**హత్వా లోకాన్ సురైః సార్ధం దుందుభాన్ గరుడో యథా ॥20॥**

**హంతుం చరాచరం సర్వం సమర్థోఽహం సవాసవమ్ ।**
**కో మహేశ్వర మద్బాణైరచ్ఛేద్యో భువనత్రయే ॥21॥**

**బాలభావే చ భగవాన్ తపసైవ వినిర్జితః ।**
**బ్రహ్మా బలీ యౌవనే వై మునయః సురపుంగవైః ॥22॥**

ఓ శంకరా! ఏ విధంగా గరుత్మంతుడు దుండుభసర్పాల్ని చంపుతాడో, ఆ విధంగా నా గదాతాడనంతో నందిని అట్లే నిన్ను చంపి, మరల దేవతలతో కూడిన అన్ని లోకాల్ని నాశనం చేసి, నేను ఇంద్రుడితో కూడిన సంపూర్ణమైన చరాచరజగత్తును సంహరించడంలో సమర్థుణ్ణి అవుతాను. ఓ మహేశ్వరా! మూడు లోకాలలో నా బాణాలతో ఛేదింపబడనివాడెవ్వడు లేడు. నేను బాల్యంలోనే తపస్సుతో విష్ణుభగవానుణ్ణి జయించాను. యౌవనంలో బలశాలి బ్రహ్మను, అట్లే పెద్ద పెద్ద దేవతల్ని, వారితో కూడియున్న మునుల్ని జయించాను.

**దగ్ధం క్షణేన సకలం త్రైలోక్యం సచరాచరమ్ ।**
**తపసా కిం త్వయా రుద్ర నిర్జితో భగవానపి ॥23॥**

**ఇంద్రాగ్నియమవిత్తేశవాయువారీశ్వరాదయః ।**
**న సేహిరే యథా నాగా గంధం పక్షిపతేరివ ॥24॥**

**న లబ్ధ్వా దివి భూమౌ చ బాహవో మమ శంకర ।**
**సమస్తాన్ పర్వతాన్ ప్రాప్య ఘర్షితాశ్చ గణేశ్వర ॥25॥**

**గిరీంద్రో మందరః శ్రీమాన్నీలో మేరుః సుశోభనః ।**
**ఘర్షితో బాహుదండేన కండూనోదార్థమాపతత్ ॥26॥**

నేను చరాచరసహితమైన మూడు లోకాల్ని క్షణకాలంలో దగ్ధం చేయగలను. ఓ రుద్రా! నీవెందుకు తపస్సుచేత విష్ణుభగవానుణ్ణి పరాజితుణ్ణి చేశావు. ఏ విధంగా సర్పాలు గరుత్మంతుడి గంధాన్ని సహింపలేవో అట్లే ఇంద్రాగ్నులు, యమకుబేరులు, వాయువరుణులు మొదలైనవాళ్లు నా గంధాన్ని సహింపలేకున్నారు. ఓ శంకరా! స్వర్గంలో అట్లే భూమిమీద నాకు ప్రతివీరుణ్ణి చూడలేక అన్ని పర్వతాల మీదకు వెళ్లి, నేను నా భుజాల్ని ఘర్షించుకున్నాను. ఓ గణేశ్వరా! నేను నా బాహుదండాల తీటను తీర్చుకోవడానికై గిరిరాజు మందరుడిని, సిరిసంపదలకాలవాలమైన నీలపర్వతాన్ని, అతిసుందరమైన మేరు పర్వతాన్ని ఘర్షించాను. అవి విరిగి, కూలి నేలపడ్డాయి.

**గంగా నిరుద్ధా బాహుభ్యాం లీలార్థం హిమవద్గిరౌ ।**
**నారీణాం మమ భృత్యైశ్చ వజ్రో బద్ధో దివౌకసామ్ ॥27॥**

**బడవాయా ముఖం భగ్నం గృహీత్వా వై కరేణ తు ।**
**తత్ క్షణాదేవ సకలం చైకార్ణవమభూదిదమ్ ॥28॥**

**ఐరావతాదయో నాగాః క్షిప్రాః సింధుజలోపరి ।**
**సరథో భగవానింద్రః క్షిప్తశ్చ శతయోజనమ్ ॥29॥**

**గరుడోఽపి మయా బద్ధో నాగపాశేన విష్ణునా ।**
**ఊర్వశ్యాద్యా మయా నీతా నార్యః కారాగృహాంతరమ్ ॥30॥**

**కథంచిల్లబ్ధవాన్ శక్రః శచీమేకాం ప్రణమ్య మామ్ ।**
**మాం న జానాసి దైత్యేంద్రం జలంధరముమాపతే ॥31॥**

హిమాలయపర్వతం మీద నా బాహువులతో లీలగా గంగాప్రవాహాన్ని నిరోధించాను. నా స్త్రీల సేవకులతో దేవతల వజ్రాన్ని బంధించి తీసుకు వెళ్లాను. నేను బడబాగ్నిని చేతితో పట్టుకుని దాని ముఖాన్ని భగ్నపర్చాను. ఆ సమయంలో ఇదంతా ఏకార్ణవం అయ్యింది. నేను ఐరావతాది గజాల్ని సముద్రజలంలో విసిరివేశాను. ఇంద్రుణ్ణి రథంతో కూడా నూరు యోజనాల దూరం దాకా విసిరివేశాను. నేను విష్ణువుతో కూడా గరుడ పక్షుల్ని అన్నింటిని నాగపాశంతో బంధించాను. నేను ఊర్వశి మొదలైన అప్సరసల్ని కారాగృహంలో బంధించాను. ఇంద్రుడు నాకు నమస్కరించి శచీదేవిని మాత్రం విడిపించుకోగలిగాడు. ఓ పార్వతీపతీ! నీవు ఈ దానవేంద్రుణ్ణి ఎందుకు తెలియకున్నావు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**ఏవముక్తో మహాదేవః ప్రాదహద్వై రథం తదా ।**
**తస్య నేత్రాగ్నిభాగైక కలార్ధార్ధేన చాకులమ్ ॥32॥**

ఓ ఋషులారా! జలంధరుడు ఆ విధంగా పలకగా, మహాదేవుడు అప్పుడు తన నేత్రాగ్ని యొక్క ఒక కళాభాగం సగంలో సగంతో ఆతడి రథాన్ని దహించాడు.

**దైత్యానామతులబలైర్హయైశ్చ నాగైర్దైత్యేంద్రాస్త్రిపురరిపోర్నిరీక్షణేన ।**
**నాగాద్వైశసమనుసంవృతశ్చ నాగైర్దేవేశం వచనమువాచ చాల్పబుద్ధిః ॥33॥**

**కిం కార్యం మమ యుధి దేవదైత్యసంఘైర్హంతుం యత్సకలమిదం క్షణాత్సమర్థః ।**
**యత్తస్మాద్భయమిహ నాస్తి యోద్ధుమీశ వాంఛైషా విపులతరా న సంశయోఽత్ర ॥34॥**

**తస్మాత్త్వం మమ మదనారిదక్షశత్రో యజ్ఞారే త్రిపురరిపో మమైవ వీరైః ।**
**భూతేంద్రైర్హరివదనేన దేవసంఘైర్యోద్ధుం తే బలమిహ చాస్తి చేద్ధి తిష్ఠ ॥35॥**

త్రిపురశత్రువు శివుడు చూచినంతనే దానవుల అనంతసైన్యంలో ఉన్న, ఏనుగులతో, గుర్రాలతోపాటు దానవశ్రేష్ఠులు దగ్ధమైనారు. ఏనుగు మీద అన్ని దిక్కులు తిరిగిన ఆ అల్పబుద్ధి అయిన జలంధరుడు తర్వాత ఏనుగును దిగి వినాశనం దగ్గరబడినవాడై ఈశ్వరుణ్ణి గూర్చి యిలా పలికాడు. నేను యుద్ధం చేయడం వల్ల ఏమి ప్రయోజనం ఉంది. ఎందుకంటే నేను దేవదానవసహితమైన ఈ సమస్త జగత్తును క్షణకాలంలో నశింపజేయడంలో సమర్థుణ్ణి. ఓ ఈశ్వరుడా! అందువల్ల నాకు ఎలాంటి భయం లేదు. అయినా, నీతో యుద్ధం చేయాలని నాకు తీవ్రతరమైన కోరిక ఉంది. ఇందులో సందేహం లేదు. ఓ మదనారీ! ఓ దక్షారీ! ఓ యజ్ఞారీ! ఓ త్రిపురారీ! భూతగణాలకు, నందీశ్వరుడికి, దేవతలకు నా వీరులతో యుద్ధం చేయగల సామర్థ్యం ఉంటే నీ విక్కడ ఉండు.

**ఇత్యుక్త్వాథ మహాదేవం మహాదేవారినందనః ।**
**న చచాల న సస్మార నిహతాన్ బాంధవాన్ యుధి ॥36॥**

**దుర్మదేనావినీతాత్మా దోర్భ్యామాస్ఫోట్య దోర్బలాత్ ।**
**సుదర్శనాఖ్యం యచ్చక్రం తేన హంతుం సముద్యతః ॥37॥**

**దుర్ధరేణ రథాంగేన కృచ్ఛ్రేణాపి ద్విజోత్తమాః ।**
**స్థాపయామాస వై స్కంధే ద్విధాభూతశ్చ తేన వై ॥38॥**

**కులిశేన యథా ఛిన్నో ద్విధా గిరివరో ద్విజాః ।**
**పపాత దైత్యో బలవానంజనాద్రిరివాపరః ॥39॥**

మహాదేవుడితో ఆ విధంగా పలికిన జలంధరుడు చలించలేదు. యుద్ధంలో మృతిచెందిన బంధువుల్ని స్మరించలేదు. దుర్మదంతో, అవినీతితో నిండిన ఆ జలంధరుడు భుజబలంతో భుజాల్ని చఱుస్తూ సుదర్శనం అనే పేరుగల చక్రంతో శివుణ్ణి చంపడానికి ఉద్యుక్తుడయ్యాడు. దాన్ని తన భుజబలంతో పెద్ద కష్టంతో తన భుజంపై ఉంచుకున్నాడు. ఓ ఋషులారా! ఆ సమయంలోనే దానితోనే రెండుగా విభజింపబడ్డాడు. వజ్రాయుధంతో రెండుగా నరకబడిన ఒకానొక పర్వతం మాదిరిగా. ఓ ద్విజులారా! ఆ బలవంతుడైన దైత్యుడు రెండో అంజనాద్రిలాగా పడిపోయాడు.

**తస్య రక్తేన రౌద్రేణ సంపూర్ణమభవత్ క్షణాత్ ।**
**తద్రక్తమఖిలం రుద్రనియోగాన్మాంసమేవ చ ॥40॥**

**మహారౌరవమాసాద్య రక్తకుండమభూదహో ।**
**జలంధరం హతం దృష్ట్వా దేవగంధర్వపార్షదాః ॥41॥**

**సింహనాదం మహత్కృత్వా సాధు దేవేతి చాబ్రువన్ ।**
**యః పఠేత్ శృణుయాద్వాపి జలంధరవిమర్దనమ్ ॥42॥**

**శ్రావయేద్వా యథాన్యాయం గాణపత్యమవాప్నుయాత్ ॥43॥**

భయంకరమైన ఆతడి రక్తంతో ఆ సమయంలో ఆ స్థానం నిండిపోయింది. ఆశ్చర్యకరం. రుద్రభగవానుడి ఆజ్ఞమేరకు ఆతడి మొత్తం రక్తం, మాంసం మహారౌరవ నరకాన్నిచేరి అక్కడ రక్తకుండం అయింది. అప్పుడు జలంధరుడి మరణాన్ని చూచిన దేవతలు, గంధర్వులు, పార్షదులు పెద్ద పెట్టున సింహనాదం చేసి "ఓ దేవా! మిక్కిలి గొప్పగా ఉంది" అని పలికారు. జలంధర వధ అనే ఈ కథను పఠించినవాళ్లు, విన్నవాళ్లు, విన్పించిన వాళ్లు గణపతి పదాన్ని పొందుతున్నారు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే జలంధరవధో నామ సప్తనవతితమోఽధ్యాయః ॥ 97 ॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని జలంధరవధ అనే తొంబై ఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టనవతితమోఽధ్యాయః** – తొంబై ఎనిమిదవ అధ్యాయం

## **పూజనాద్విష్ణుచక్రలాభః** – పూజవలన విష్ణుచక్రలాభం

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**కథం దేవేన వై సూత దేవదేవాన్మహేశ్వరాత్ ।**
**సుదర్శనాఖ్యం వై లబ్ధం వక్తుమర్హసి విష్ణునా ॥1॥**

ఓ సూతర్షీ! విష్ణుభగవానుడు దేవదేవుడైన మహేశ్వరుడినుంచి సుదర్శనమనే పేరుగల చక్రాన్ని ఏ విధంగా పొందాడు. ఇది మాకు నీవు కృపతో చెప్పవలసింది.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**దేవానామసురేంద్రాణామభవచ్చ సుదారుణః ।**
**సర్వేషామేవ భూతానాం వినాశకరణో మహాన్ ॥2॥**

**తే దేవాః శక్తిముసలైః సాయకైర్నతపర్వభిః ।**
**ప్రభిద్యమానాః కుంతైశ్చ దుద్రువుర్భయవిహ్వలాః ॥3॥**

దేవతలకు దానవేంద్రులకు సమస్తప్రాణి వినాశనకరమైన అతిభయంకరమైన పెద్దయుద్ధం జరిగింది. శక్తులచేత, ముసలాలచేత, వంగిన రెక్కలుగల బాణాలతో, కుంతాలతో భేదింపబడినవారై, భయవ్యాకులురై దేవతలు పారిపోయారు.

**పరాజితాస్తదా దేవా దేవదేవేశ్వరం హరిమ్ ।**
**ప్రణేముస్తం సురేశానం శోకసంవిగ్నమానసాః ॥4॥**

అనంతరం పరాజితులైన దేవతలు శోకసంతప్తహృదయులై దేవదేవేశ్వరుడు సురేశానుడు అయిన విష్ణువు దగ్గరకు వెళ్లి ఆయనకు నమస్కరించారు.

**తాన్ సమీక్ష్యాథ భగవాన్ దేవదేవేశ్వరో హరిః ।**
**ప్రణిపత్య స్థితాన్ దేవానిదం వచనమబ్రవీత్ ॥5॥**

**వత్సాః కిమితి వై దేవాశ్చ్యుతాలంకారవిక్రమాః ।**
**సమాగతాః ససంతాపాః వక్తుమర్హథ సువ్రతాః ॥6॥**

నమస్కరించి నిల్చియున్న దేవతల్ని చూచి దేవదేవుడు, భగవానుడు అయిన విష్ణువు ఇలా పలికాడు. ఓ వాత్సల్యయుతులారా! ఓ సువ్రతులారా! దేవతలారా! పరాక్రమం కోల్పోయి అలంకారాలు లేకుండగా మీరు దుఃఖితులై ఇక్కడకు ఎందుకు వచ్చారో చెప్పండి.

**తస్య తద్వచనం శ్రుత్వా తథాభూతాం సురోత్తమాః ।**
**ప్రణమ్యాహుర్యథావృత్తం దేవదేవాయ విష్ణవే ॥7॥**

విష్ణువుయొక్క ఆ వాక్యాల్ని విని ఆ దుర్దశను పొందిన శ్రేష్ఠదేవగణాలు ఆయనకు నమస్కరించి జరిగిన వృత్తాంతాన్ని దేవదేవవిష్ణువుకు విన్నవించారు.

**భగవన్ దేవదేవేశ విష్ణో జిష్ణో జనార్దన ।**
**దానవైః పీడితాః సర్వే వయం శరణమాగతాః ॥8॥**

**త్వమేవ దేవదేవేశ గతిర్నః పురుషోత్తమ ।**
**త్వమేవ పరమాత్మా హి త్వం పితా జగతామపి ॥9॥**

**త్వమేవ భర్తా హర్తా చ భోక్తా దాతా జనార్దన ।**
**హంతుమర్హసి తస్మాత్త్వం దానవాన్ దానవార్దన ॥10॥**

ఓ భగవాన్! ఓ దేవదేవేశ! ఓ విష్ణూ! ఓ జిష్ణూ! ఓ జనార్దనా! దానవులచేత పీడింపబడి మేమందరం నిన్ను శరణుచొచ్చాం. ఓ దేవదేవేశ! ఓ పురుషోత్తమ! నీవే మాకు గతివి. నీవే పరమాత్ముడవు. నీవే సమస్తలోకాలకి తండ్రివి. ఓ జనార్దనా! నీవే భర్తవు. నీవే హర్తవు. నీవే భోక్తవు. నీవే దాతవు. ఓ దైత్యమర్దనా! కావున నీవే కృపతో దానవుల్ని సంహరింపదగియున్నావు.

**దైత్యాశ్చ వైష్ణవైర్బ్రాహ్మై రౌద్రైర్యామ్యైః సుదారుణైః ।**
**కౌబేరైశ్చైవ సౌమ్యైశ్చ నైరృత్యైర్వారుణైర్దృఢైః ॥11॥**

**వాయవ్యైశ్చ తథాగ్నేయైరైశానైర్వార్షికైః శుభైః ।**
**సౌరై రౌద్రైస్తథా భీమైః కంపనైర్జృంభణైర్దృఢైః ॥12॥**

**అవధ్యా వరలాభాత్తే సర్వే వారిజలోచన ।**
**సూర్యమండల సంభూతం త్వదీయం చక్రముద్యతమ్ ॥13॥**

**కుంఠితం హి దధీచేన చ్యావనేన జగద్గురో ।**
**దండం శార్ఙ్గం తవాస్త్రం చ లబ్ధం దైత్యైః ప్రసాదతః ॥14॥**

**పురా జలంధరం హంతుం నిర్మితం త్రిపురారిణా ।**
**రథాంగం సుశితం ఘోరం తేన తాన్ హంతుమర్హసి ॥15॥**

**తస్మాత్తేన నిహంతవ్యా నాన్యైః శస్త్రశతైరపి ।**

ఓ కమలనయనా! ఆ దానవులందరూ వరలాభంవల్ల విష్ణువు, బ్రహ్మ, రుద్రుడు, యముడు, కుబేరుడు, చంద్రుడు, నిరృతి, వరుణుడు, వాయువు, అగ్ని, ఈశానుడు, పర్జన్యుడు, అట్లే సూర్యుడు వీళ్ల అత్యంత దృఢాలు, దారుణాలు, భయానకాలు, కంపనాలు, జృంభకాలు అయిన ఆయుధాలచేత, ఇతరుల శక్తిని హరించే అస్త్రాలతో కూడా అవధ్యులయ్యారు. ఓ జగద్గురూ! సూర్యమండలంనుంచి పుట్టిన, నీ చక్రం చ్యవనపుత్రుడైన దధీచిచేత ఖండింపబడింది. నీ అనుగ్రహం వల్ల దానవులకు దండం, ధనుస్సు, అస్త్రం లభించాయి. పూర్వం త్రిపురారి అయిన శివుడు జలంధరుడిని సంహరించడానికై భయానకమైన తేజస్వంతమైన చక్రాన్ని నిర్మించాడు. దానితో

నీవు ఈ దానవుల్ని చంపవలసింది. ఆ చక్రం ద్వారానే దానవులు చస్తారు. వేరైన నూరు అస్త్రాలతో కూడా వాళ్లు చావరు.

**తతో నిశమ్య తేషాం వై వచనం వారిజేక్షణః ॥16॥**

**వాచస్పతిముఖానాహ స హరిశ్చక్రభృత్స్వయమ్ ।**

తర్వాత కమలనయనుడు, చక్రధారి అయిన విష్ణువు బృహస్పతి మొదలుగాగల ముఖ్యదేవతలతో స్వయంగా ఇలా పలికాడు.

**శ్రీ విష్ణురువాచ –** శ్రీ విష్ణువు పలికాడు.

**భో భో దేవా మహాదేవం సర్వైర్దేవైః సనాతనైః ॥17॥**

**సంప్రాప్య సాంప్రతం సర్వం కరిష్యామి దివౌకసామ్ ।**
**దేవా జలంధరం హంతుం నిర్మితం హి పురారిణా ॥18॥**

**లబ్ధ్వా రథాంగం తేనైవ నిహత్య చ మహాసురాన్ ।**
**సర్వాన్ ధుంధుముఖాన్ దైత్యానష్టషష్టిశతాన్ సురాన్ ॥19॥**

**సబాంధవాన్ క్షణాదేవ యుష్మాన్ సంతారయామ్యహమ్ ।**

ఓ దేవతలారా! నేను ఇపుడు సమస్తసనాతన దేవతలతో కూడి మహాదేవుడి దగ్గరకు వెళ్లి మీ సంపూర్ణమైన కార్యాన్ని నిర్వహిస్తాను. ఓ దేవతలారా! జలంధరవధార్థం శివుడు సృష్టించిన చక్రాన్ని పొంది దాని ద్వారా దానవుల్ని అందర్ని, ధుంధువు మొదలైన దైత్యుల్ని అట్లే ఎనభై ఆరువేల ఇతర రాక్షసుల్ని బాంధవసహితంగా క్షణకాలంలో వధించి మిమ్మల్ని ఉద్ధరిస్తాను.

**సూత ఉవాచ –** సూతర్షి పలికాడు.

**ఏవముక్త్వా సురశ్రేష్ఠాన్ సురశ్రేష్ఠమనుస్మరన్ ॥20॥**

**సురశ్రేష్ఠస్తదా శ్రేష్ఠం పూజయామాస శంకరమ్ ।**
**లింగం స్థాప్య యథాన్యాయం హిమవచ్ఛిఖరే శుభే ॥21॥**

**మేరుపర్వతసంకాశం నిర్మితం విశ్వకర్మణా ।**
**త్వరితాఖ్యేన రుద్రేణ రౌద్రేణ చ జనార్దనః ॥22॥**

**స్నాప్య సంపూజ్య గంధాద్యైర్జ్వాలాకారం మనోహరమ్ ।**
**తుష్టావ చ తదా రుద్రం సంపూజ్యాగ్నౌ ప్రణమ్య చ ॥23॥**

**దేవం నామ్నాం సహస్రేణ భవాద్యేన యథాక్రమమ్ ।**
**పూజయామాస చ శివం ప్రణవాద్యం నమోఽంతకమ్ ॥24॥**

**దేవం నామ్నాం సహస్రేణ భవాద్యేన మహేశ్వరమ్ ।**
**ప్రతినామ సపద్మేన పూజయామాస శంకరమ్ ॥25॥**

**అగ్నౌ చ నామభిర్దేవం భవాద్యైః సమిదాదిభిః ।**
**స్వాహాంతైర్విధివద్ధుత్వా ప్రత్యేకమయుతం ప్రభుమ్ ॥26॥**

**తుష్టావ చ పునః శంభుం భవాద్యైర్భవమీశ్వరమ్ ।**

ఓ ఋషులారా! దేవతాశ్రేష్ఠుల్ని ఉద్దేశించి ఆ విధంగా పలికి దేవశ్రేష్ఠుడైన విష్ణువు సురశ్రేష్ఠుడైన శివుణ్ణి స్మరిస్తూ శ్రేష్ఠశంకరుణ్ణి పూజించాడు. విశ్వకర్మద్వారా నిర్మించిన మేరుపర్వతంతో సమానమైన లింగాన్ని హిమవత్పర్వతం యొక్క ఉన్నతశిఖరంపైన విధ్యుక్తంగా స్థాపించి, త్వరితరుద్రం అయిన రుద్రసూక్తం ద్వారా అభిషేకం చేసి, సుగంధాదులద్వారా పూజించి, జ్యోతిరూపుడు, మనోహరుడు అయిన శివుణ్ణి స్తుతించాడు. మరల అగ్నికార్యంతో రుద్రుణ్ణి పూజించి, నమస్కరించి శివుడి యొక్క "భవ" మున్నగు సహస్రనామాల్ని క్రమంగా ఆదిలో ఓంకారాన్ని, అంతంలో "నమః" చేర్చి పూజించాడు. శివుడి వేయి నామాల్ని ప్రత్యేకంగా ఉచ్చరిస్తూ ప్రతినామానికి ఒక కమలాన్ని అర్పిస్తూ పూజించాడు. తర్వాత ఆ నామాలకు చివరిలో "స్వాహా" శబ్దాన్ని చేర్చి సమిధాదుల్ని అగ్నికి ఆహుతి ఇస్తూ ప్రతి నామానికి పదివేలసార్లు ఆహుతులు ఇచ్చాడు. మరల భవాదినామాలతో ఈశ్వరప్రభువును ఇలా స్తుతించాడు.

**శ్రీ విష్ణురువాచ** – శ్రీ విష్ణువు పలికాడు.

**భవః శివో హరో రుద్రః పురుషః పద్మలోచనః ॥27॥**

**అర్థితవ్యః సదాచారః సర్వశంభుర్మహేశ్వరః ।**
**ఈశ్వరః స్థాణురీశానః సహస్రాక్షః సహస్రపాత్ ॥28॥**

భవుడవు, శివుడవు, హరుడవు, రుద్రుడవు, పురుషుడవు, పద్మలోచనుడవు, అర్థితవ్యుడవు, సదాచారుడవు, సర్వశంభుమహేశ్వరుడవు, ఈశ్వరుడవు, స్థాణువవు, ఈశానుడవు, సహస్రాక్షుడవు, సహస్రపాదుడవు.

**వరీయాన్ వరదో వంద్యః శంకరః పరమేశ్వరః ।**
**గంగాధరః శూలధరః పరార్థైకప్రయోజనః ॥29॥**

వరీయుడవు, వరదుడవు, వంద్యుడవు, శంకరుడవు, పరమేశ్వరుడవు, గంగాధరుడవు, శూలధరుడవు, పరార్థైకప్రయోజనుడవు.

**సర్వజ్ఞః సర్వదేవాదిగిరిధన్వా జటాధరః ।**
**చంద్రాపీడశ్చంద్రమౌళిర్విద్వాన్ విశ్వామరేశ్వరః ॥30॥**

సర్వజ్ఞుడవు, సర్వదేవాదిగిరిధన్వుడవు, జటాధరుడవు, చంద్రాపీడుడవు, చంద్రమౌళివి, విద్వాంసుడవు, విశ్వామరేశ్వరుడవు.

**వేదాంతసారసందోహః కపాలీ నీలలోహితః ।**

**ధ్యానాధారో౽ పరిచ్ఛేద్యో గౌరీభర్తా గణేశ్వరః ॥31॥**

**అష్టమూర్తిర్విశ్వమూర్తిస్త్రివర్గః స్వర్గసాధనః ।**
**జ్ఞానగమ్యో దృఢప్రజ్ఞో దేవదేవస్త్రిలోచనః ॥32॥**

వేదాంతసారసందోహుడవు. కపాలివి. నీలలోహితుడవు. ధ్యానాధారుడవు. అపరిచ్ఛేద్యుడవు. గౌరీభర్తవు. గణేశ్వరుడవు. అష్టమూర్తివి. విశ్వమూర్తివి. త్రివర్గుడవు. స్వర్గసాధనుడవు. జ్ఞానగమ్యుడవు. దృఢప్రజ్ఞుడవు. దేవదేవుడవు. త్రిలోచనుడవు.

**వామదేవో మహాదేవః పాండుః పరిదృఢో౽ దృఢః ।**
**విశ్వరూపో విరూపాక్షో వాగీశః శుచిరంతరః ॥33॥**

వామదేవుడవు. మహాదేవుడవు. పాండుడవు. పరిదృఢుడవు. అదృఢుడవు. విరూపుడవు. విరూపాక్షుడవు. వాగీశుడవు. శుచివి. అంతరుడవు.

**సర్వప్రణయసంవాదీ వృషాంగో వృషవాహనః ।**
**ఈశః పినాకీ ఖట్వాంగీ చిత్రవేషశ్చిరంతనః ॥34॥**

సర్వప్రణయసంవాదివి. వృషాంగుడవు. వృషవాహనుడవు. ఈశుడవు. పినాకివి. ఖట్వాంగుడవు. చిత్రవేషుడవు. చిరంతనుడవు.

**తమోహరో మహాయోగీ గోప్తా బ్రహ్మాంగహృజ్జటీ ।**
**కాలకాలః కృత్తివాసాః సుభగః ప్రణవాత్మకః ॥35॥**

తమోహరుడవు. మహాయోగివి. గోప్తవు. బ్రహ్మాంగహృజ్జటివి. కాలకాలుడవు. కృత్తివాసుడవు. సుభగుడవు. ప్రణవాత్మకుడవు.

**ఉన్మత్తవేషశ్చక్షుష్యో దుర్వాసాః స్మరశాసనః ।**
**దృఢాయుధః స్కందగురుః పరమేష్ఠీ పరాయణః ॥36॥**

ఉన్మత్తవేషుడవు. చక్షుష్యుడవు. దుర్వాసుడవు. స్మరశాసనుడవు. దృఢాయుధుడవు. స్కందగురుడవు. పరమేష్ఠివి. పరాయణుడవు.

**అనాదిమధ్యనిధనో గిరిశో గిరిబాంధవః ।**
**కుబేరబంధుః శ్రీకంఠో లోకవర్ణోత్తమోత్తమః ॥37॥**

అనాదిమధ్యనిధనుడవు. గిరీశుడవు. గిరిబాంధవుడవు. కుబేరబంధుడవు. శ్రీకంఠుడవు. లోకవర్ణోత్తమోత్తముడవు.

**సామాన్యదేవః కోదండీ నీలకంఠః పరశ్వధీ ।**
**విశాలాక్షో మృగవ్యాధః సురేశః సూర్యతాపనః ॥38॥**

సామాన్యదేవుడవు. కోదండివి. నీలకంఠుడవు. పరశ్వధివి. విశాలాక్షుడవు. మృగవ్యాధుడవు. సురేశుడవు. సూర్యతాపనుడవు.

**ధర్మకర్మాక్షమః క్షేత్రం భగవాన్ భగనేత్రభిత్ ।**
**ఉగ్రః పశుపతిస్తార్‌క్ష్యప్రియభక్తః ప్రియంవదః ॥39॥**

ధర్మకర్మాక్షముడవు. క్షేత్రభగవానుడవు. భగనేత్రభిదుడవు. ఉగ్రుడవు. పశుపతివి. తార్‌క్ష్యప్రియభక్తుడవు. ప్రియంవదుడవు.

**దాంతో దయాకరో దక్షః కపర్దీ కామశాసనః ।**
**శ్మశాననిలయః సూక్ష్మః శ్మశానస్థో మహేశ్వరః ॥40॥**

దాంతుడవు. దయాకరుడవు. దక్షుడవు. కపర్దివి. కామశాసనుడవు. శ్మశాననిలయుడవు. సూక్ష్ముడవు. శ్మశానస్థుడవు. మహేశ్వరుడవు.

**లోకకర్తా భూతపతిర్మహాకర్తా మహౌషధీ ।**
**ఉత్తరో గోపతిర్గోప్తా జ్ఞానగమ్యః పురాతనః ॥41॥**

లోకకర్తవు. భూతపతివి. మహాకర్తవు. మహౌషధివి. ఉత్తరుడవు. గోపతివి. గోప్తవు. జ్ఞానగమ్యుడవు. పురాతనుడవు.

**నీతిః సునీతిః శుద్ధాత్మా సోమసోమరతః సుఖీ ।**
**సోమపోఽమృతపః సోమో మహానీతిర్మహామతిః ॥42॥**

నీతివి. సునీతివి. శుద్ధాత్ముడవు. సోమసోమరతుడవు. సుఖివి. సోమపుడవు. అమృతపుడవు. సోముడవు. మహానీతివి. మహామతివి.

**అజాతశత్రురాలోకః సంభావ్యో హవ్యవాహనః ।**
**లోకకారో వేదకారః సూత్రకారః సనాతనః ॥43॥**

అజాతశత్రువవు. ఆలోకుడవు. సంభావ్యుడవు. హవ్యవాహనుడవు. లోకకారుడవు. వేదకారుడవు. సూత్రకారుడవు. సనాతనుడవు.

**మహర్షిః కపిలాచార్యో విశ్వదీప్తిస్త్రిలోచనః ।**
**పినాకపాణిర్భూదేవః స్వస్తిదః స్వస్తికృత్సదా ॥44॥**

మహర్షివి. కపిలాచార్యుడవు. విశ్వదీప్తివి. త్రిలోచనుడవు. పినాకపాణివి. భూదేవుడవు. స్వస్తిదుడవు. సదాస్వస్తికృతుడవు.

**త్రిధామా సౌభగః శర్వః సర్వజ్ఞః సర్వగోచరః ।**
**బ్రహ్మధృగ్విశ్వసృక్ స్వర్గః కర్ణికారః ప్రియః కవిః ॥45॥**

త్రిధాముడవు. సుభగుడవు. శర్వుడవు. సర్వజ్ఞుడవు. సర్వగోచరుడవు. బ్రహ్మధృక్కువు. విశ్వసృక్కువు. స్వర్గుడవు. కర్ణికారుడవు. ప్రియుడవు. కవివి.

**శాఖో విశాఖో గోశాఖః శివో నైకః క్రతుః సమః ।**
**గంగాప్లవోదకో భావః సకలః స్థపతిస్థిరః ॥46॥**

శాఖుడవు. విశాఖుడవు. గోశాఖుడవు. శివుడవు. నైకుడవు. క్రుతువవు. సముడవు. గంగాప్లవోదకుడవు. భావుడవు. సకలుడవు. స్థపతిస్థిరుడవు.

**విజితాత్మా విధేయాత్మా భూతవాహనసారథిః ।**
**సగణో గణకార్యశ్చ సుకీర్తిః ఛిన్నసంశయః ॥47॥**

విజితాత్ముడవు. విధేయాత్ముడవు. భూతవాహనసారథివి. సగణుడవు. గణకార్యుడవు. సుకీర్తివి. ఛిన్నసంశయుడవు.

**కామదేవః కామపాలో భస్మోద్ధూళితవిగ్రహః ।**
**భస్మప్రియో భస్మశాయీ కామీ కాంతః కృతాగమః ॥48॥**

కామదేవుడవు. కామపాలుడవు. భస్మోద్ధూళితవిగ్రహుడవు. భస్మప్రియుడవు. భస్మశాయివి. కామివి. కాంతుడవు. కృతాగముడవు.

**సమాయుక్తో నివృత్తాత్మా ధర్మయుక్తః సదాశివః ।**
**చతుర్ముఖశ్చతుర్బాహుర్దురావాసో దురాసదః ॥49॥**

సమాయుక్తుడవు. నివృత్తాత్ముడవు. ధర్మయుక్తుడవు. సదాశివుడవు. చతుర్ముఖుడవు. చతుర్బాహుడవు. దురావాసుడవు. దురాసదుడవు.

**దుర్గమో దుర్లభో దుర్గః సర్వాయుధవిశారదః ।**
**అధ్యాత్మయోగనిలయః సుతంతుస్తంతువర్ధనః ॥50॥**

దుర్గముడవు. దుర్లభుడవు. దుర్గుడవు. సర్వాయుధవిశారదుడవు. అధ్యాత్మయోగనిలయుడవు. సుతంతువవు. తంతువర్ధనుడవు.

**శుభాంగో లోకసారంగో జగదీశోఽమృతాశనః ।**
**భస్మశుద్ధికరో మేరురోజస్వీ శుద్ధవిగ్రహః ॥51॥**

శుభాంగుడవు. లోకసారంగుడవు. జగదీశుడవు. అమృతాశనుడవు. భస్మశుద్ధికరుడవు. మేరువవు. ఓజస్వుడవు. శుద్ధవిగ్రహుడవు.

**హిరణ్యరేతాస్తరణిర్మరీచిర్మహిమాలయః ।**
**మహాహ్రదో మహాగర్భః సిద్ధబృందారవందితః ॥52॥**

హిరణ్యరేతుడవు. తరణివి. మరీచివి. మహిమాలయుడవు. మహాహ్రదుడవు. మహాగర్భుడవు. సిద్ధబృందారవందితుడవు.

**వ్యాఘ్రచర్మధరో వ్యాలీ మహాభూతో మహానిధిః ।**
**అమృతాంగో ఽ మృతవపుః పంచయజ్ఞః ప్రభంజనః ॥53॥**

వాఘ్రచర్మధరుడవు. వ్యాలివి. మహాభూతుడవు. మహానిధివి. అమృతాంగుడవు. అమృతవపుడవు. పంచయజ్ఞుడవు. ప్రభంజనుడవు.

**పంచవింశతితత్త్వజ్ఞః పారిజాతః పరావరః ।**
**సులభః సువ్రతః శూరో వాఙ్మయైకనిధిర్నిధిః ॥54॥**

పంచవింశతితత్త్వజ్ఞుడవు. పారిజాతుడవు. పరావరుడవు. సులభుడవు. సువ్రతుడవు. శూరుడవు. వాఙ్మయైకనిధివి. విధివి.

**వర్ణాశ్రమగురుర్వర్ణీ శత్రుజిచ్ఛత్రుతాపనః ।**
**ఆశ్రమః క్షపణః క్షామో జ్ఞానవానచలాచలః ॥55॥**

వర్ణాశ్రమగురుడవు. వర్ణివి. శత్రుజితుడవు. శత్రుతాపనుడవు. ఆశ్రముడవు. క్షపణుడవు. క్షాముడవు. జ్ఞానవంతుడవు. అచలాచలుడవు.

**ప్రమాణభూతో దుర్జ్ఞేయః సుపర్ణో వాయువాహనః ।**
**ధనుర్ధరో ధనుర్వేదో గుణరాశిర్గుణాకరః ॥56॥**

**అనంతదృష్టిరానందో దండో దమయితా దమః ।**
**అభివాద్యో మహాచార్యో విశ్వకర్మా విశారదః ॥57॥**

ప్రమాణభూతుడవు. దుర్జ్ఞేయుడవు. సుపర్ణుడవు. వాయువాహనుడవు. ధనుర్ధరుడవు. ధనుర్వేదుడవు. గుణరాశివి. గుణాకరుడవు. అనంతదృష్టివి. ఆనందుడవు. దండుడవు. దమయితుడవు. దముడవు. అభివాద్యుడవు. మహాచార్యుడవు. విశ్వకర్మవు. విశారదుడవు.

**వీతరాగో వినీతాత్మా తపస్వీ భూతవాహనః ।**
**ఉన్మత్తవేషః ప్రచ్ఛన్నో జితకామో ఽ జితప్రియః ॥58॥**

వీతరాగుడవు. వినీతాత్ముడవు. తపస్వివి. భూతవాహనుడవు. ఉన్మత్తవేషుడవు. ప్రచ్ఛనుడవు. జితకాముడవు. అజితప్రియుడవు.

**కళ్యాణప్రకృతిః కల్పః సర్వలోకప్రజాపతిః ।**
**తపస్వీ తారకో ధీమాన్ ప్రధానప్రభురవ్యయః ॥59॥**

కళ్యాణప్రకృతివి. కల్పుడవు. సర్వలోకప్రజాపతివి. తపస్వివి. తారకుడవు. ధీమంతుడవు. ప్రధానప్రభుడవు. అవ్యయుడవు.

**లోకపాలోఽంతర్హితాత్మా కల్పాదిః కమలేక్షణః ।**
**వేదశాస్త్రార్థతత్త్వజ్ఞో నియమో నియమాశ్రయః ॥60॥**

లోకపాలుడవు. అంతర్హితాత్ముడవు. కల్పాదివి. కమలేక్షణుడవు. వేదశాస్త్రార్థతత్త్వజ్ఞుడవు. నియముడవు. నియమాశ్రయుడవు.

**చంద్రః సూర్యః శనిః కేతుర్విరామో విద్రుమచ్ఛవిః ।**
**భక్తిగమ్యః పరంబ్రహ్మ మృగబాణార్పణోఽనఘః ॥61॥**

చంద్రుడవు. సూర్యుడవు. శనివి. కేతువవు. విరాముడవు. విద్రుమచ్ఛవివి. భక్తిగమ్యుడవు. పరంబ్రహ్మవు మృగబాణార్పణుడవు. అనఘుడవు.

**అద్రిరాజాలయః కాంతః పరమాత్మా జగద్గురుః ।**
**సర్వకర్మాచలస్త్వష్టా మంగల్యో మంగళావృతః ॥62॥**

అద్రిరాజాలయుడవు. కాంతుడవు. పరమాత్ముడవు. జగద్గురుడవు. సర్వకర్మాచలుడవు. త్వష్టవు. మంగల్యుడవు. మంగళావృతుడవు.

**మహాతపా దీర్ఘతపా స్థవిష్ఠః స్థవిరో ధ్రువః ।**
**అహః సంవత్సరో వ్యాప్తిః ప్రమాణం పరమం తపః ॥63॥**

మహాతపుడవు. దీర్ఘతపుడవు. స్థవిష్ఠుడవు. స్థవిరుడవు. ధ్రువుడవు. అహస్సువు. సంవత్సరుడవు. వ్యాప్తివి. ప్రమాణుడవు. పరముడవు. తపుడవు.

**సంవత్సరకరో మంత్రః ప్రత్యయః సర్వదర్శనః ।**
**అజః సర్వేశ్వరః స్నిగ్ధో మహారేతా మహాబలః ॥64॥**

సంవత్సరకరుడవు. మంత్రుడవు. ప్రత్యయుడవు. సర్వదర్శనుడవు. అజుడవు. సర్వేశ్వరుడవు. స్నిగ్ధుడవు. మహారేతుడవు. మహాబలుడవు.

**యోగీ యోగ్యో మహారేతాః సిద్ధః సర్వాదిరగ్నిదః ।**
**వసుర్వసుమనాః సత్యః సర్వపాపహరో హరః ॥65॥**

యోగివి. యోగ్యుడవు. మహారేతుడవు. సిద్ధుడవు. సర్వాదివి. అగ్నిదుడవు. వసువవు. వసుమనుడవు. సత్యుడవు. సర్వపాపహరుడవు. హరుడవు.

**అమృతః శాశ్వతః శాంతో బాణహస్తః ప్రతాపవాన్ ।**
**కమండలుధరో ధన్వీ వేదాంగో వేదవిన్మునిః ॥66॥**

అమృతుడవు. శాశ్వతుడవు. శాంతుడవు. బాణహస్తుడవు. ప్రతాపవంతుడవు. కమండలుధరుడవు. ధన్వివి. వేదాంగుడవు. వేదవిదుడవు. మునివి.

**భ్రాజిష్ణుర్భోజనం భోక్తా లోకనేతా దురాధరః ।**
**అతీంద్రియో మహామాయః సర్వావాసశ్చతుష్పథః ॥67॥**

భ్రాజిష్ణువవు. భోజనరూపుడవు. భోక్తవు. లోకనేతవు. దురాధరుడవు. అతీంద్రియుడవు. మహామాయుడవు. సర్వావాసుడవు. చతుష్పథుడవు.

**కాలయోగీ మహానాదో మహోత్సాహో మహాబలః ।**
**మహాబుద్ధిర్మహావీర్యో భూతచారీ పురందరః ॥68॥**

కాలయోగివి. మహానాదుడవు. మహోత్సాహుడవు. మహాబలుడవు. మహాబుద్ధివి. మహావీర్యుడవు. భూతచారివి. పురందరుడవు.

**నిశాచరః ప్రేతచారీమహాశక్తిర్మహాద్యుతిః ।**
**అనిర్దేశ్యవపుః శ్రీమాన్ సర్వహార్యమితో గతిః ॥69॥**

నిశాచరుడవు. ప్రేతచారివి. మహాశక్తివి. మహాద్యుతివి. అనిర్దేశ్యవపువవు. శ్రీమంతుడవు. సర్వహార్యమితుడవు. గతివి.

**బహుశ్రుతో బహుమయో నియతాత్మా భవోద్భవః ।**
**ఓజస్తేజోద్యుతికరో నర్తకః సర్వకామకః ॥70॥**

బహుశ్రుతుడవు. బహుమయుడవు. నియతాత్ముడవు. భవోద్భవుడవు. ఓజస్వివి. తేజస్వివి. ద్యుతికరుడవు. నర్తకుడవు. సర్వకామకుడవు.

**నృత్యప్రియో నృత్యనృత్యః ప్రకాశాత్మా ప్రతాపనః ।**
**బుద్ధస్పష్టాక్షరో మంత్రః సన్మానః సారసంప్లవః ॥71॥**

నృత్యప్రియుడవు. నృత్యనృత్యుడవు. ప్రకాశాత్ముడవు. ప్రతాపనుడవు. బుద్ధస్పష్టాక్షరుడవు. మంత్రుడవు. సన్మానుడవు. సారసంప్లవుడవు.

**యుగాదికృద్యుగావర్తో గంభీరో వృషవాహనః ।**
**ఇష్టో విశిష్టః శిష్టేష్టః శరభః శరభోధనుః ॥72॥**

యుగాదికర్తవు. యుగావర్తవు. గంభీరుడవు. వృషవాహనుడవు. ఇష్టుడవు. విశిష్టుడవు. శిష్టేష్టుడవు. శరభుడవు. శరములను (బాణములను) భరించువాడవు. ధనస్సువు.

**అపాంనిధిరధిష్ఠానవిజయో జయకాలవిత్ ।**
**ప్రతిష్ఠితః ప్రమాణజ్ఞో హిరణ్యకవచో హరిః ॥73॥**

అపాంనిధివి. అధిష్ఠానవిజయుడవు. జయకాలవిదుడవు. ప్రతిష్ఠితుడవు. ప్రమాణజ్ఞుడవు. హిరణ్యకవచుడవు. హరివి.

**విరోచనః సురగణో విద్యేశో విబుధాశ్రయః ।**
**బాలరూపో బలోన్మాథీ వివర్తో గహనో గురుః ॥74॥**

విరోచనుడవు. సురగణుడవు. విద్యేశుడవు. విబుధాశ్రయుడవు. బాలరూపుడవు. బలోన్మాథుడవు. వివర్తుడవు. గహనుడవు. గురుడవు.

**కరణం కారణం కర్తా సర్వబంధవిమోచనః ।**
**విద్వత్తమో వీతభయో విశ్వభర్తా నిశాకరః ॥75॥**

కరణుడవు. కారణుడవు. కర్తవు. సర్వబంధవిమోచనుడవు. విద్వత్తముడవు. వీతభయుడవు. విశ్వభర్తవు. నిశాకరుడవు.

**వ్యవసాయో వ్యవస్థానః స్థానదో జగదాదిజః ।**
**దుందుభో లలితో విశ్వో భవాత్మాత్మని సంస్థితః ॥76॥**

వ్యవసాయుడవు. వ్యవస్థానుడవు. స్థానదుడవు. జగదాదిజుడవు. దుందుభుడవు. లలితుడవు. విశ్వుడవు. భవాత్మాత్మసంస్థితుడవు.

**వీరేశ్వరో వీరభద్రో వీరహా వీరభృద్విరాట్ ।**
**వీరచూడామణిర్వేత్తా తీవ్రనాదో నదీధరః ॥77॥**

వీరేశ్వరుడవు. వీరభద్రుడవు. వీరహంతవు. వీరభృద్విరాటుడవు. వీరచూడామణివి. వేత్తవు. తీవ్రనాదుడవు. నదీధరుడవు.

**ఆజ్ఞాధారస్త్రిశూలీ చ శిపివిష్టః శివాలయః ।**
**వాలఖిల్యో మహాచాపస్తిగ్మాంశుర్నిధిరవ్యయః ॥78॥**

ఆజ్ఞాధరుడవు. త్రిశూలివి. శిపివిష్టుడవు. శివాలయుడవు. వాలఖిల్యుడవు. మహాచాపుడవు. తిగ్మాంశు డవు. నిధివి. అవ్యయుడవు.

**అభిరామః సుశరణః సుబ్రహ్మణ్యః సుధాపతిః ।**
**మఘవాన్ కౌశికో గోమాన్ విశ్రామః సర్వశాసనః ॥79॥**

అభిరాముడవు. సుశరణుడవు. సుబ్రహ్మణ్యుడవు. సుధాపతివి. మఘవానుడవు. కౌశికుడవు. గోమంతుడవు. విశ్రాముడవు. సర్వశాసనుడవు.

**లలాటాక్షో విశ్వదేహః సారః సంసారచక్రభృత్ ।**
**అమోఘదండీ మధ్యస్థో హిరణ్యో బ్రహ్మవర్చసీ ॥80॥**

లలాటాక్షుడవు. విశ్వదేహుడవు. సారుడవు. సంసారచక్రభృత్తువు. అమోఘదండివి. మధ్యస్థుడవు. హిరణ్యుడవు. బ్రహ్మవర్చస్వివి.

**పరమార్థః పరమయః శంబరో వ్యాఘ్రకోఽనలః ।**
**రుచిర్వరరుచిర్వంద్యో వాచస్పతిరహర్పతిః ॥81॥**

పరమార్థుడవు. పరమయుడవు. శంబరుడవు. వ్యాఘ్రకుడవు. అనలుడవు. రుచివి. వరరుచివి. వంద్యుడవు. వాచస్పతివి. అహర్పతివి.

**రవిర్విరోచనః స్కంధః శాస్తా వైవస్తతో౽జనః ।**
**యుక్తిరున్నతకీర్తిశ్చ శాంతరాగః పరాజయః ॥82॥**

రవివి. విరోచనుడవు. స్కంధుడవు. శాస్తవు. వైవస్వతుడవు. అజనుడవు. యుక్తివి. ఉన్నతకీర్తివి. శాంతరాగుడవు. పరాజయుడవు.

**కైలాసపతిః కామారిః సవితా రవిలోచనః ।**
**విద్వత్తమో వీతభయో విశ్వహర్తా నివారితః ॥83॥**

కైలాసపతివి. కామారివి. సవితవు. రవిలోచనుడవు. విద్వత్తముడవు. వీతభయుడవు. విశ్వహర్తవు. నివారితుడవు.

**నిత్యో నియతకల్యాణః పుణ్యశ్రవణకీర్తనః ।**
**దూరశ్రవా విశ్వసహో ధ్యేయో దుఃస్వప్ననాశనః ॥84॥**

నిత్యుడవు. నియతకల్యాణుడవు. పుణ్యశ్రవణకీర్తనుడవు. దూరశ్రవుడవు. విశ్వసహుడవు. ధ్యేయుడవు. దుఃస్వప్ననాశనుడవు.

**ఉత్తాకరో దుష్కృతిహా దుర్ధర్షో దుఃసహో౽భయః ।**
**అనాదిర్భూర్భువో లక్ష్మీః కిరీటిత్రిదశాధిపః ॥85॥**

ఉత్తాకరుడవు. దుష్కృతిహంతవు. దుర్ధర్షుడవు. దుస్సహుడవు. అభయుడవు. అనాదివి. భూమివి. భువర్లోకానివి. లక్ష్మివి. కిరీటివి. త్రిదశాధిపుడవు.

**విశ్వగోప్తా విశ్వభర్తా సుధీరో రుచిరాంగదః ।**
**జననో జనజన్మాదిః ప్రీతిమాన్నీతిమాన్నయః ॥86॥**

విశ్వగోప్తవు. విశ్వభర్తవు. సుధీరుడవు. రుచిరాంగదుడవు. జననుడవు. జనజన్మాదివి. ప్రీతిమంతుడవు. నీతిమంతుడవు. నయుడవు.

**విశిష్టః కాశ్యపో భానుర్భీమో భీమపరాక్రమః ।**
**ప్రణవః సప్తధాచారో మహాకాయో మహాధనుః ॥87॥**

విశిష్టుడవు. కాశ్యపుడవు. భానుడవు. భీముడవు. భీమపరాక్రముడవు. ప్రణవుడవు. సప్తధాచారుడవు. మహాకాయుడవు. మహాధన్వివి.

**జన్మాధిపో మహాదేవః సకలాగమపారగః ।**
**తత్త్వాతత్త్వవివేకాత్మా విభూష్ణుర్భూతిభూషణః ॥88॥**

జన్మాధిపుడవు. మహాదేవుడవు. సకలాగమపారగుడవు. తత్త్వాతత్త్వవివేకాత్ముడవు. విభూష్ణువవు. భూతిభూషణుడవు.

**ఋషిర్బ్రాహ్మణవిజ్జిష్ణుర్జన్మమృత్యుజరాతిగః ।**
**యజ్ఞో యజ్ఞపతిర్యజ్వా యజ్ఞాంతోఽమోఘవిక్రమః ॥89॥**

ఋషివి. బ్రాహ్మణవిదుడవు. జిష్ణువవు. జన్మమృత్యుజరాతిగుడవు. యజ్ఞుడవు. యజ్ఞపతివి. యజ్వవు. యజ్ఞాంతుడవు. అమోఘవిక్రముడవు.

**మహేంద్రో దుర్భరః సేనీ యజ్ఞాంగో యజ్ఞవాహనః ।**
**పంచబ్రహ్మసముత్పత్తిర్విశ్వేశో విమలోదయః ॥90॥**

మహేంద్రుడవు. దుర్భరుడవు. సేనివి. యజ్ఞాంగుడవు. యజ్ఞవాహనుడవు. పంచబ్రహ్మసముత్పత్తివి. విశ్వేశుడవు. విమలోదయుడవు.

**ఆత్మయోనిరనాద్యంతో షడ్వింశత్సప్తలోకధృక్ ।**
**గాయత్రీవల్లభః ప్రాంశుర్విశ్వావాసః ప్రభాకరః ॥91॥**

ఆత్మయోనివి. అనాద్యంతుడవు. షడ్వింశత్సప్తలోకధృక్కువు. గాయత్రీవల్లభుడవు. ప్రాంశువవు. విశ్వావాసుడవు. ప్రభాకరుడవు.

**శిశుర్గిరిరతః సమ్రాట్ సుషేణః సురశత్రుహా ।**
**అమోఘోఽరిష్టమథనో ముకుందో విగతజ్వరః ॥92॥**

శిశువవు. గిరిరతుడవు. సమ్రాట్టువు. సుషేణుడవు. సురశత్రుహంతవు. అమోఘుడవు. అరిష్టమథనుడవు. ముకుందుడవు. విగతజ్వరుడవు.

**స్వయంజ్యోతిరనుజ్యోతిరాత్మజ్యోతిరచంచలః ।**
**పింగళః కపిలశ్మశ్రుః శాస్త్రనేత్రస్త్రయీతనుః ॥93॥**

స్వయంజ్యోతివి. అనుజ్యోతివి. ఆత్మజ్యోతివి. అచంచలుడవు. పింగళుడవు. కపిలశ్మశ్రువవు. శాస్త్రనేత్రుడవు. త్రయీదేహుడవు.

**జ్ఞానస్కంధో మహాజ్ఞానీ నిరుత్పత్తిరుపప్లవః ।**
**భగో వివస్వానాదిత్యో యోగాచార్యో బృహస్పతిః ॥94॥**

జ్ఞానస్కంధుడవు. మహాజ్ఞానివి. నిరుత్పత్తివి. ఉపప్లవుడవు. భగుడవు. వివస్వంతుడవు. ఆదిత్యుడవు. యోగాచార్యుడవు. బృహస్పతివి.

**ఉదారకీర్తిరుద్యోగీ సద్యోగీ సదసన్మయః ।**
**నక్షత్రమాలీ రాకేశః సాధిష్ఠానః షడాశ్రయః ॥95॥**

**పవిత్రపాణిః పాపారిర్మణిపూరో మనోగతిః ।**
**హృత్పుండరీకమాసీనః శుక్లః శాంతో వృషాకపిః ॥96॥**

ఉదారకీర్తివి. ఉద్యోగివి. సద్యోగివి. సదసన్మయుడవు. నక్షత్రమాలివి. రాకేశుడవు. సాధిష్ఠానుడవు. షడాశ్రయుడవు. పవిత్రపాణివి. పాపారివి. మణిపూరుడవు. మనోగతివి. హృత్పుండరీకమాసీనుడవు. శుక్లుడవు. శాంతుడవు. వృషాకపివి.

**విష్ణుర్గ్రహపతిః కృష్ణః సమర్థోఽనర్థనాశనః ।**
**అధర్మశత్రురక్షయ్యః పురుహూతః పురుష్టుతః ॥97॥**

విష్ణుడవు. గ్రహపతివి. కృష్ణుడవు. సమర్థుడవు. అనర్థనాశనుడవు. అధర్మశత్రువవు. అక్షయ్యుడవు. పురుహూతుడవు. పురుష్టుతుడవు.

**బ్రహ్మగర్భో బృహద్గర్భో ధర్మధేనుర్ధనాగమః ।**
**జగద్ధితైషి సుగతః కుమారః కుశలాగమః ॥98॥**

బ్రహ్మగర్భుడవు. బృహద్గర్భుడవు. ధర్మధేనువవు. ధనాగముడవు. జగద్ధితైషివి. సుగతుడవు. కుమారుడవు. కుశలాగముడవు.

**హిరణ్యవర్ణో జ్యోతిష్మాన్నానాభూతధరో ధ్వనిః ।**
**అరోగో నియమాధ్యక్షో విశ్వామిత్రో ద్విజోత్తమః ॥99॥**

హిరణ్యవర్ణుడవు. జ్యోతిష్మంతుడవు. నానాభూతధరుడవు. ధ్వనివి. అరోగుడవు. నియమాధ్యక్షుడవు. విశ్వామిత్రుడవు. ద్విజోత్తముడవు.

**బృహజ్జ్యోతిః సుధామా చ మహాజ్యోతిరనుత్తమః ।**
**మాతామహో మాతరిశ్వా నభస్వాన్నాగహారధృక్ ॥100॥**

బృహజ్జ్యోతివి. సుధాముడవు. మహాజ్యోతివి. అనుత్తముడవు. మాతామహుడవు. మాతరిశ్వుడవు. నభస్వానుడవు. నాగహారధరుడవు.

**పులస్త్యః పులహోఽగస్త్యో జాతూకర్ణః పరాశరః ।**
**నివారణధర్మజ్ఞో విరించో విష్టరశ్రవాః ॥101॥**

**ఆత్మభూరనిరుద్ధోఽత్రిజ్ఞానమూర్తిమహాయశాః ।**
**లోకచూడామణిర్వీరః చండసత్యపరాక్రమః ॥102॥**

పులస్త్యుడవు. పులహుడవు. అగస్త్యుడవు. జాతూకర్ణుడవు. పరాశరుడవు. నివారణధర్మజ్ఞుడవు. విరించివి. విష్టరశ్రవుడవు. ఆత్మభవుడవు. అనిరుద్ధుడవు. అత్రిజ్ఞానమూర్తివి. మహాయశస్వివి. లోకచూడామణివి. వీరుడవు. చండసత్యపరాక్రముడవు.

**వ్యాలకల్పో మహాకల్పో మహావృక్షః కళాధరః ।**
**అలంకరిష్ణుస్త్వచలో రోచిష్ణుర్విక్రమోత్తమః ॥103॥**

వ్యాలకల్పుడవు. మహాకల్పుడవు. మహావృక్షుడవు. కళాధరుడవు. అలంకరిష్ణువవు. అచలుడవు. రోచిష్ణువవు. విక్రమోత్తముడవు.

**ఆశుశబ్దపతిర్వేగీ ప్లవనః శిఖిసారథిః ।**
**అసంసృష్టోఽ తిథిః శక్రః ప్రమాథీ పాపనాశనః ॥104॥**

ఆశుశబ్దపతివి. వేగివి. ప్లవనుడవు. శిఖిసారథివి. అసంసృష్టుడవు. అతిథివి. శక్రప్రమాథివి. పాపనాశనుడవు.

**వసుశ్రవాః కవ్యవాహః ప్రతప్తో విశ్వభోజనః ।**
**జర్యో జరాధిశమనో లోహితశ్చ తనూనపాత్ ॥105॥**

వసుశ్రవుడవు. కవ్యవాహుడవు. ప్రతప్తుడవు. విశ్వభోజనుడవు. జర్యుడవు. జరాధిశమనుడవు. లోహితుడవు. తనూనపాత్తుడవు.

**పృషదశ్వో నభో యోనిః సుప్రతీకస్తమిస్రహా ।**
**నిదాఘస్తపనో మేఘః పక్షః పరపురంజయః ॥106॥**

పృషదశ్వుడవు. నభుడవు. యోనివి. సుప్రతీకుడవు. తమిస్రహంతవు. నిదాఘతపనుడవు. మేఘుడవు. పక్షుడవు. పరపురంజయుడవు.

**ముఖానిలః సునిష్పన్నః సురభిః శిశిరాత్మకః ।**
**వసంతో మాధవో గ్రీష్మో నభస్యో బీజవాహనః ॥107॥**

ముఖానిలుడవు. సునిష్పన్నుడవు. సురభివి. శిశిరాత్మకుడవు. వసంతుడవు. మాధవుడవు. గ్రీష్ముడవు. నభస్యుడవు. బీజవాహనుడవు.

**అంగిరా మునిరాత్రేయో విమలో విశ్వవాహనః ।**
**పావనః పురుజిచ్ఛక్రస్త్రివిద్యో నరవాహనః ॥108॥**

అంగిరసుడవు. ఆత్రేయమునివి. విమలుడవు. విశ్వవాహనుడివి. పావనుడివి. పురుజిత్తువు. శక్రుడవు. త్రివిద్యవు. నరవాహనుడవు.

**మనోబుద్ధిరహంకారః క్షేత్రజ్ఞః క్షేత్రపాలకః ।**
**తేజోనిధిర్జ్ఞానవిధిర్విపాకో విఘ్నకారకః ॥109॥**

మనస్సువి. బుద్ధివి. అహంకారుడవు. క్షేత్రజ్ఞుడవు. క్షేత్రపాలకుడవు. తేజోనిధివి. జ్ఞాననిధివి. విపాకుడవు. విఘ్నకారకుడివి.

**అధరోఽ నుత్తరో జ్ఞేయో జ్యేష్ఠో నిఃశ్రేయసాలయః ।**
**శైలో నగస్తనుర్దోహో దానవారిరరిందమః ॥110॥**

అధరుడవు. అనుత్తరుడవు. జ్ఞేయుడవు. జ్యేష్ఠుడవు. నిఃశ్రేయసాలయుడవు. శైలుడవు. నగుడవు. తనువవు. దోహుడవు. దానవారివి. అరిందముడవు.

**చారుధీర్జనకశ్చారువిశల్యో లోకశల్యకృత్ ।**
**చతుర్వేదశ్చతుర్భావశ్చతురశ్చతురప్రియః ॥111॥**

చారుధీరుడవు. జనకుడవు. చారువిశల్యుడవు. లోకశల్యకృత్తువు. చతుర్వేదుడవు. చతుర్బాహుడవు. చతురుడవు. చతురప్రియుడవు.

**ఆమ్నాయోఽథ సమామ్నాయస్తీర్థదేవశివాలయః ।**
**బహురూపో మహారూపః సర్వరూపశ్చరాచరః ॥112॥**

ఆమ్నాయుడవు. సమామ్నాయుడవు. తీర్థదేవుడవు. శివాలయుడవు. బహురూపుడవు. మహారూపుడవు. సర్వరూపుడవు. చరాచరుడవు.

**న్యాయనిర్వాహకో న్యాయో న్యాయగమ్యో నిరంజనః ।**
**సహస్రమూర్ధా దేవేంద్రః సర్వశస్త్రప్రభంజనః ॥113॥**

న్యాయనిర్వాహకుడవు. న్యాయుడవు. న్యాయగమ్యుడవు. నిరంజనుడవు. సహస్రమూర్ధివి. దేవేంద్రుడవు. సర్వశస్త్రప్రభంజనుడివి.

**ముండో విరూపో వికృతో దండీ దాంతో గుణోత్తమః ।**
**పింగళాక్షోఽథ హర్యక్షో నీలగ్రీవో నిరామయః ॥114॥**

ముండుడవు. విరూపుడవు. వికృతుడవు. దండివి. దాంతుడవు. గుణోత్తముడవు. పింగళాక్షుడవు. హర్యక్షుడవు. నీలగ్రీవుడవు. నిరామయుడవు.

**సహస్రబాహుః సర్వేశః శరణ్యః సర్వలోకభృత్ ।**
**పద్మాసనః పరంజ్యోతిః పరావరపరంఫలః ॥115॥**

సహస్రబాహువవు. సర్వేశుడవు. శరణ్యుడవు. సర్వలోకభృత్తువు. పద్మాసనుడవు. పరంజ్యోతివి. పరావరపరంఫలుడవు.

**పద్మగర్భో మహాగర్భో విశ్వగర్భో విచక్షణః ।**
**పరావరజ్ఞో బీజేశః సుముఖః సుమహాస్వనః ॥116॥**

పద్మగర్భుడవు. మహాగర్భుడవు. విశ్వగర్భుడవు. విచక్షణుడవు. పరావరజ్ఞుడవు. బీజేశుడవు. సుముఖుడవు. సుమహాస్వనుడవు.

**దేవాసురగురుర్దేవో దేవాసురనమస్కృతః ।**
**దేవాసురమహామాత్రో దేవాసురమహాశ్రయః ॥117॥**

దేవాసురగురుడవు. దేవాసురనమస్కృతుడవు. దేవాసురమహామాత్రుడవు. దేవాసురమహాశ్రయుడవు.

**దేవాదిదేవో దేవర్షిర్దేవాసురవరప్రదః ।**
**దేవాసురేశ్వరో దివ్యో దేవాసురమహేశ్వరః ॥118॥**

దేవాదిదేవుడవు. దేవర్షివి. దేవాసురవరప్రదుడవు. దేవాసురేశ్వరుడవు. దివ్యుడవు. దేవాసురమహేశ్వరుడవు.

**సర్వదేవమయోఽచింత్యో దేవతాత్మాత్మసంభవః ।**
**ఈడ్యోఽనీశః సురవ్యాఘ్రో దేవసింహో దివాకరః ॥119॥**

సర్వదేవమయుడవు. అచింత్యుడవు. దేవతాత్ముడవు. ఆత్మసంభవుడవు. ఈడ్యుడవు. అనీశుడవు. సురవ్యాఘ్రుడవు. దేవసింహుడవు. దివాకరుడవు.

**విబుధాగ్రవరశ్రేష్ఠః సర్వదేవోత్తమోత్తమః ।**
**శివజ్ఞానరతః శ్రీమాన్ శిఖిశ్రీపర్వతప్రియః ॥120॥**

విబుధాగ్రుడవు. శ్రేష్ఠవరుడవు. సర్వదేవోత్తమోత్తముడవు. శివజ్ఞానరతుడవు. శ్రీమంతుడవు. శిఖిశ్రీపర్వతప్రియుడవు.

**జయస్తంభో విశిష్టంభో నరసింహనిపాతనః ।**
**బ్రహ్మచారీ లోకచారీ ధర్మచారీ ధనాధిపః ॥121॥**

జయస్తంభుడవు. విశిష్టంభుడవు. నరసింహనిపాతనుడవు. బ్రహ్మచారివి. లోకచారివి. ధర్మచారివి. ధనాధిపుడవు.

**నందీ నందీశ్వరో నగ్నో నగ్నవ్రతధరః శుచిః ।**
**లింగాధ్యక్షః సురాధ్యక్షః యుగాధ్యక్షో యుగావహః ॥122॥**

నందివి. నందీశ్వరుడవు. నగ్నుడవు. నగ్నవ్రతధరుడవు. శుచివి. లింగాధ్యక్షుడవు. సురాధ్యక్షుడవు. యుగాధ్యక్షుడవు. యుగావహుడవు.

**స్వవశః సవశః స్వర్గస్వరః స్వరమయస్వనః ।**
**బీజాధ్యక్షో బీజకర్తా ధనకృద్ధర్మవర్ధనః ॥123॥**

స్వవశుడవు. సవశుడవు. స్వర్గస్వరుడవు. స్వరమయస్వనుడవు. బీజాధ్యక్షుడవు. బీజకర్తవు. ధనకృత్తువు. ధర్మవర్ధనుడవు.

**దంభోఽదంభో మహాదంభః సర్వభూతమహేశ్వరః ।**
**శ్మశాననిలయస్తిష్యః సేతురప్రతిమాకృతిః ॥124॥**

దంభుడవు. అదంభుడవు. మహాదంభుడవు. సర్వభూతమహేశ్వరుడవు. శ్మశాననిలయుడవు. తిష్యుడవు. సేతువవు. అప్రతిమాకృతివి.

**లోకోత్తరస్ఫుటాలోకస్త్ర్యంబకో నాగభూషణః ।**
**అంధకారిర్మఖద్వేషీ విష్ణుకంధరపాతనః ॥125॥**

**వీతదోషోఽక్షయగుణో దక్షారిః పూషదంతహృత్ ।**
**ధూర్జటిః ఖండపరశుః సకలో నిష్కలోఽనఘః ॥126॥**

లోకోత్తరుడవు. స్ఫుటాలోకుడవు. త్ర్యంబకుడవు. నాగభూషణుడవు. అంధకారివి. మఖద్వేషివి. విష్ణుకంధరపాతనుడవు. వీతదోషుడవు. అక్షయగుణుడవు. దక్షారివి. పూషదంతహృత్తువు. ధూర్జటివి. ఖండపరశువవు. సకలుడవు. నిష్కలుడవు. అనఘుడవు.

**ఆధార సకలాధారః పాండురాభో మృడో నటః ।**
**పూర్ణః పూరయితా పుణ్యః సుకుమారః సులోచనః ॥127॥**

ఆధారుడవు. సకలాధారుడవు. పాండురాభుడవు. మృడుడవు. నటుడవు. పూర్ణుడవు. పూరయితవు. పుణ్యుడవు. సుకుమారుడవు. సులోచనుడవు.

**సామగేయః ప్రియకరః పుణ్యకీర్తిరనామయః ।**
**మనోజవస్తీర్థకరో జటిలో జీవితేశ్వరః ॥128॥**

సామగేయుడవు. ప్రియకరుడవు. పుణ్యకీర్తివి. అనామయుడవు. మనోజవుడవు. తీర్థకరుడవు. జటిలుడవు. జీవితేశ్వరుడవు.

**జీవితాంతకరో నిత్యో వసురేతా వసుప్రియః ।**
**సద్గతిః సుకృతిః సక్తః కాలకంఠః కళాధరః ॥129॥**

జీవితాంతకరుడవు. నిత్యుడవు. వసురేతస్కుడవు. వసుప్రియుడవు. సద్గతివి. సుకృతివి. సక్తుడవు. కాలకంఠుడవు. కళాధరుడవు.

**మానీ మాన్యో మహాకాలః సద్భూతిః సత్పరాయణః ।**
**చంద్రసంజీవనః శాస్తా లోకగూఢోఽమరాధిపః ॥130॥**

మానివి. మాన్యుడవు. మహాకాలుడవు. సద్భూతివి. సత్పరాయణుడవు. చంద్రసంజీవనుడవు. శాస్తవు. లోకగూఢుడవు. అమరాధిపుడవు.

**లోకబంధుర్లోకనాథః కృతజ్ఞః కృతిభూషణః ।**
**అనపాయ్యక్షరః కాంతః సర్వశాస్త్రభృతాంవరః ॥131॥**

లోకబంధువవు. లోకనాథుడవు. కృతజ్ఞుడవు. కృతిభూషణుడవు. అనపాయివి. అక్షరుడవు. కాంతుడవు. సర్వశాస్త్రభృతాంవరుడవు.

**తేజోమయో ద్యుతిధరో లోకమాయోఽగ్రణీరణుః ।**
**శుచిస్మితః ప్రసన్నాత్మా దుర్జయో దురతిక్రమః ॥132॥**

తేజోమయుడవు. ద్యుతిధరుడవు. లోకమయుడవు. అగ్రణివి. అణురూపుడవు. శుచిస్మితుడవు. ప్రసన్నాత్ముడవు. దుర్జయుడవు. దురతిక్రముడవు.

**జ్యోతిర్మయో నిరాకారో జగన్నాథో జలేశ్వరః ।**
**తుంబవీణీ మహాకాయో విశోకః శోకనాశనః ॥133॥**

జ్యోతిర్మయుడవు. నిరాకారుడవు. జగన్నాథుడవు. జలేశ్వరుడవు. తుంబవీణివి. మహాకాయుడవు. విశోకుడవు. శోకనాశనుడవు.

**త్రిలోకాత్మా త్రిలోకేశః శుద్ధః శుద్ధీ రథాక్షజః ।**
**అవ్యక్తలక్షణోఽవ్యక్తో వ్యక్తావ్యక్తో విశాంపతిః ॥134॥**

త్రిలోకాత్ముడవు. త్రిలోకేశుడవు. శుద్ధుడవు. శుద్ధివి. రథాక్షజుడవు. అవ్యక్తలక్షణుడవు. అవ్యక్తుడవు. వ్యక్తావ్యక్తుడవు. విశాంపతివి.

**వరశీలీ వరతులో మానో మానధనో మయః ।**
**బ్రహ్మా విష్ణుః ప్రజాపాలో హంసో సింహగతిర్యమః ॥135॥**

వరశీలివి. వరతులుడవు. మానుడవు. మానధనుడవు. మయుడవు. బ్రహ్మవు. విష్ణుడవు. ప్రజాపాలుడవు. హంసుడవు. సింహగతివి. యముడవు.

**వేధా ధాతా విధాతా చ అత్తా హర్తా చతుర్ముఖః ।**
**కైలాసశిఖరావాసీ సర్వావాసీ సతాంగతిః ॥136॥**

వేధవు. ధాతవు. విధాతవు. అత్తవు (జగద్రక్షకుడవు). హర్తవు (జగన్నాశకుడవు) చతుర్ముఖుడవు. కైలాసశిఖరావాసివి. సర్వావాసివి. సతాంగతివి.

**హిరణ్యగర్భో హరిణః పురుషః పూర్వజః పితా ।**
**భూతాలయో భూతపతిర్భూతిదో భువనేశ్వరః ॥137॥**

హిరణ్యగర్భుడవు. హరిణుడవు. పురుషుడవు. పూర్వజుడవు. పితవు. భూతాలయుడవు. భూతపతివి. భూతిదుడవు. భువనేశ్వరుడవు.

**సంయోగీ యోగవిద్బ్రహ్మా బ్రహ్మణ్యో బ్రాహ్మణప్రియః ।**
**దేవప్రియో దేవనాథో దేవజ్ఞో దేవచింతకః ॥138॥**

సంయోగివి. యోగవిదుడవు. బ్రహ్మవు. బ్రహ్మణ్యుడవు. బ్రాహ్మణప్రియుడవు. దేవప్రియుడవు. దేవనాథుడవు. దేవజ్ఞుడవు. దేవచింతకుడవు.

**విషమాక్షః కళాధ్యక్షో వృషాంగో వృషవర్ధనః ।**
**నిర్మదో నిరహంకారో నిర్మోహో నిరుపద్రవః ॥139॥**

విషమాక్షుడవు. కళాధ్యక్షుడవు. వృషాంగుడవు. వృషవర్ధనుడవు. నిర్మదుడవు. నిరహంకారుడవు. నిర్మోహుడవు. నిరుపద్రవుడవు.

**దర్పహా దర్పితో దృప్తః సర్వర్తుపరివర్తకః ।**
**సప్తజిహ్వః సహస్రార్చిః స్నిగ్ధః ప్రకృతిదక్షిణః ॥140॥**

దర్పహానివి. దర్పితుడవు. దృప్తుడవు. సర్వఋతుపరివర్తకుడవు. సప్తజిహ్వుడవు. సహస్రార్చివి. స్నిగ్ధుడవు. ప్రకృతిదక్షిణుడవు.

**భూతభవ్యభవన్నాథః ప్రభవో భ్రాంతినాశనః ।**
**అర్థోఽనర్థో మహాకోశః పరకార్యైకపండితః ॥141॥**

భూతభవ్యభవన్నాథుడవు. ప్రభవుడవు. భ్రాంతినాశనుడవు. అర్థుడవు, అనర్థుడవు. మహాకోశుడవు. పరకార్యైక పండితుడవు.

**నిష్కంటకః కృతానందో నిర్వ్యాజో వ్యాజమర్దనః ।**
**సత్త్వవాన్ సాత్త్వికః సత్యకీర్తిస్తంభకృతాగమః ॥142॥**

నిష్కంటకుడివి. కృతానందుడవు. నిర్వ్యాజుడవు. వ్యాజమర్దనుడవు. సత్త్వవంతుడవు. సాత్త్వికుడివి. సత్యకీర్తివి. స్తంభకృతాగముడవు.

**అకంపితో గుణగ్రాహీ నైకాత్మా నైకకర్మకృత్ ।**
**సుప్రీతః సుముఖః సూక్ష్మః సుకరో దక్షిణోఽనలః ॥143॥**

అకంపితుడవు. గుణగ్రాహివి. నైకాత్ముడవు. నైకకర్మకృత్తువు. సుప్రీతుడవు. సుముఖుడవు. సూక్ష్ముడవు. సుకరుడవు. దక్షిణుడవు. అనలుడవు.

**స్కంధః స్కంధధరః ధుర్యః ప్రకటః ప్రీతివర్ధనః ।**
**అపరాజితః సర్వసహో విదగ్ధః సర్వవాహనః ॥144॥**

స్కంధుడవు. స్కంధధరుడవు. ధుర్యుడవు. ప్రకటుడవు. ప్రీతివర్ధనుడవు. అపరాజితుడవు. సర్వసహుడవు. విదగ్ధుడవు. సర్వవాహనుడవు.

**అధృతః స్వధృతః సాధ్యః పూర్తమూర్తిర్యశోధరః ।**
**వరాహశృంగధృగ్వాయుర్బలవానేకనాయకః ॥145॥**

అధృతుడవు. స్వధృతుడవు. సాధ్యుడవు. పూర్తమూర్తివి. యశోధరుడవు. వరాహశృంగధృక్కువు. వాయువవు. బలవంతుడవు. ఏకనాయకుడవు.

**శ్రుతిప్రకాశః శ్రుతిమానేకబంధురనేకధృక్ ।**
**శ్రీవల్లభశివారంభః శాంతభద్రః సమంజసః ॥146॥**

శ్రుతిప్రకాశుడవు. శ్రుతిమంతుడవు. ఏకబంధువవు. అనేకధృక్కువు. శ్రీవల్లభశివారంభుడవు. శాంతభద్రుడవు. సమంజసుడవు.

**భూశయో భూతికృద్భూతిర్భూషణో భూతవాహనః ।**
**అకాయో భక్తకాయస్థః కాలజ్ఞానీ కళావపుః ॥147॥**

భూశయుడవు. భూతికృత్తువి. భూతివి. భూషణుడవు. భూతవాహనుడవు. అకాయుడవు. భక్తకాయస్థుడవు. కాలజ్ఞానివి. కాలవపువవు.

**సత్యవ్రతమహాత్యాగీ నిష్ఠాశాంతిపరాయణః ।**
**పరార్థవృత్తిర్వరదో వివిక్తః శ్రుతిసాగరః ॥148॥**

సత్యవ్రతుడవు. మహాత్యాగివి. నిష్ఠాశాంతిపరాయణుడవు. పరార్థవృత్తివి. వరదుడవు. వివిక్తుడవు. శ్రుతిసాగరుడవు.

**అగ్నిర్విష్ణో గుణగ్రాహీ కళంకాంకః కళంకహా ।**
**స్వభావరుద్రో మధ్యస్థః శత్రుఘ్నో మధ్యనాశకః ॥149॥**

అగ్నివి. విష్ణుడవు. గుణగ్రాహివి. కళంకాంకుడవు. కళంకములను పోగొట్టువాడవు. స్వభావరుద్రుడవు. మధ్యస్థుడవు. శత్రుఘ్నుడవు. మధ్యనాశకుడవు.

**శిఖండీ కవచీ శూలీ చండీ ముండీ చ కుండలీ ।**
**మేఖలీ కవచీ ఖడ్గీ మాయీ సంసారసారథిః ॥150॥**

శిఖండివి. కవచివి. శూలివి. చండివి. ముండివి. కుండలివి. మేఖలివి. కవచివి. ఖడ్గివి. మాయివి. సంసారసారథివి.

**అమృత్యుః సర్వదృక్ సింహస్తేజోరాశిర్మహామణిః ।**
**అసంఖ్యేయోఽప్రమేయాత్మా వీర్యవాన్ కార్యకోవిదః ॥151॥**

అమృత్యువవు. సర్వదృక్కువు. సింహుడవు. తేజోరాశివి. మహామణివి. అసంఖ్యేయుడవు. అప్రమేయాత్ముడవు. వీర్యవంతుడవు. కార్యకోవిదుడవు.

**వేద్యో వేదార్థవిద్గోప్తా సర్వాచారో మునీశ్వరః ।**
**అనుత్తమో దురాధర్షో మధురః ప్రియదర్శనః ॥152॥**

వేద్యుడవు. వేదార్థవిదుడవు. గోప్తవు. సర్వాచారుడవు. మునీశ్వరుడవు. అనుత్తముడవు. దురాధర్షుడవు. మధురుడవు. ప్రియదర్శనుడవు.

**సురేశః శరణం సర్వః శబ్దబ్రహ్మసతాంగతిః ।**
**కాలభక్షః కలంకారిః కంకణీకృతవాసుకిః ॥153॥**

సురేశ్వరుడవు. శరణుడవు. సర్వుడవు. శబ్దబ్రహ్మవు. సతాంగతివి. కాలభక్షుడవు. కళంకారివి. కంకణీకృతవాసుకివి.

**మహేష్వాసో మహీభర్తా నిష్కళంకో విశృంఖలః ।**
**ద్యుమణిస్తరణిర్ధన్యః సిద్ధిదః సిద్ధిసాధనః ॥154॥**

మహేష్వాసుడవు. మహీభర్తవు. నిష్కళంకుడవు. విశృంఖలుడవు. ద్యుమణివి. తరణివి. ధన్యుడవు. సిద్ధిదుడవు. సిద్ధిసాధనుడవు.

**నివృత్తః సంవృతః శిల్పో వ్యూఢోరస్కో మహాభుజః ।**
**ఏకజ్యోతిర్నిరాతంకో నరో నారాయణప్రియః ॥155॥**

**నిర్లేపో నిష్ప్రపంచాత్మా నిర్వ్యగ్రో వ్యగ్రనాశనః ।**
**స్తవ్యస్తవప్రియః స్తోతా వ్యాసమూర్తి రనాకులః ॥156॥**

నివృత్తుడవు. సంవృతుడవు. శిల్పుడవు. వ్యూఢోరస్కుడవు. మహాభుజుడవు. ఏకజ్యోతివి. నిరాతంకుడవు. నరుడవు. నారాయణప్రియుడవు. నిర్లేపుడవు. నిష్ప్రపంచాత్ముడవు. నిర్వ్యగ్రుడవు. వ్యగ్రనాశనుడవు. స్తవ్యుడవు. స్తవప్రియుడవు. స్తోతవు. వ్యాసమూర్తివి. అనాకులుడవు.

**నిరవద్యపదోపాయో విద్యారాశిరవిక్రమః ।**
**ప్రశాంతబుద్ధిరక్షుద్రః క్షుద్రహా నిత్యసుందరః ॥157॥**

నిరవద్యపదోపాయుడవు. విద్యారాశివి. అవిక్రముడవు. ప్రశాంతబుద్ధివి. అక్షుద్రుడవు. క్షుద్రహంతవు. నిత్యసుందరుడవు.

**ధైర్యాగ్ర్యధుర్యో ధాత్రీశః శాకల్యః శర్వరీపతిః ।**
**పరమార్థగురుర్దృష్టిర్గురురాశ్రితవత్సలః ॥158॥**

**రసో రసజ్ఞః సర్వజ్ఞః సర్వసత్త్వావలంబనః ।**

ధైర్యాగ్ర్యధుర్యుడవు. ధాత్రీశుడవు. శాకల్యుడవు. శర్వరీపతివి. పరమార్థగురుదృష్టివి. గురుడవు. ఆశ్రితవత్సలుడవు. రసుడవు. రసజ్ఞుడవు. సర్వజ్ఞుడవు. సర్వసత్త్వావలంబనుడవు.

**సూత ఉవాచ –** సూతర్షి పలికాడు

**ఏవం నామ్నాం సహస్రేణ తుష్టావ వృషభధ్వజమ్ ॥159॥**

**స్నాపయామాస చ విభుః పూజయామాస పంకజైః ।**
**పరీక్షార్థం హరేః పూజాకమలేషు మహేశ్వరః ॥160॥**

**గోపయామాస కమలం తదైకం భువనేశ్వరః ।**

ఈ విధంగా వేయి నామాలను పఠిస్తూ శివుణ్ణి శ్రీహరి స్తుతించాడు. అభిషేకించాడు. కమలాలతో పూజించాడు. ఆ సమయంలో విష్ణువును పరీక్షించడానికై భువనేశ్వరశివుడు ఒక కమలాన్ని దాచి పెట్టాడు.

**హృతపుష్పో హరిస్తత్ర కిమిదం త్వభ్యచింతయన్ ॥161॥**

**జ్ఞాత్వా స్వనేత్రముద్ధృత్య సర్వసత్త్వావలంబనమ్ ।**
**పూజయామాస భావేన నామ్నా తేన జగద్గురుమ్ ॥162॥**

అపహరింపబడిన పుష్పంగల శ్రీహరి "ఏమిటిది" అని భావించి వాస్తవాన్ని గ్రహించి తన నేత్రాన్ని పీకివేసి చివరి నామమైన "సర్వసత్త్వావలంబను"డనే పేరును ఉచ్చరిస్తూ జగద్గురువు శివుడిని తన నేత్రపుష్పంతో పూజించాడు.

**తతస్తత్ర విభుర్దృష్ట్వా తథాభూతం హరో హరిమ్ ।**
**తస్మాదవతతారాశు మండలాత్పావకస్య చ ॥163॥**

**కోటిభాస్కరసంకాశం జటాముకుటమండితమ్ ।**
**జ్వాలామాలావృతం దివ్యం తీక్ష్ణదంష్ట్రం భయంకరమ్ ॥164॥**

**శూలటంకగదాచక్రకుంతపాశధరం హరమ్ ।**
**వరదాభయహస్తం చ ద్వీపిచర్మోత్తరీయకమ్ ॥165॥**

**ఇత్థంభూతం తదా దృష్ట్వా భవం భస్మవిభూషితమ్ ।**
**హృష్టో నమశ్చకారాశు దేవదేవం జనార్దనః ॥166॥**

అనంతరం నేత్రాన్ని పుష్పంగా సమర్పించిన విష్ణువును చూచి శివుడు ఆ లింగనుంచి అగ్నిమండలం నుంచి వచ్చినట్లు వెంటనే ప్రత్యక్షమయ్యాడు. అపుడు కోటి సూర్యుల కాంతితో సమానమైన కాంతి, జటలు గలిగిన, కిరీటంతో అలంకరింపబడిన, జ్వాలాసమూహంతో చుట్టబడి ఉండిన, దివ్యం మరియు తీక్ష్ణం అయిన కోరలు గలిగిన, భయంకరమైన శూలం, టంకం, గద, చక్రం, కుంతం, పాశం ఆయుధాల్ని ధరించిన, వరదాభయ ముద్రలతో కూడిన హస్తాలు గలిగిన, పులితోలును కప్పుకొనినభస్మంతో అలంకరింపబడిన రూపంతోగల శివుణ్ణి చూచిన విష్ణువు సంతుష్టుడై వెంటనే ఆతడికి నమస్కారం చేశాడు.

**దద్రువుస్తం పరిక్రమ్య సేంద్రా దేవాస్త్రిలోచనమ్ ।**
**చచాల బ్రహ్మభువనం చకంపే చ వసుంధరా ॥167॥**

**దదాహ తేజస్తచ్ఛంభోః ప్రాంతం వై శతయోజనమ్ ।**
**అధస్తాచ్చోర్ధ్వతశ్చైవ హాహేత్యకృత భూతలే ॥168॥**

ఇంద్రసహితదేవతాగణాలు త్రిలోచనుడికి ప్రదక్షిణం చేసి ఆయన్ని స్తుతించాయి. బ్రహ్మలోకం చలించింది. భూమి కంపించింది. శివుడి తేజం శతయోజనాల విస్తీర్ణప్రదేశాన్ని క్రింది భాగంలోనూ, పైభాగంలోనూ కాల్చివేసింది. భూమిపైన హాహాకారాలు మిన్నుముట్టాయి.

**తదా ప్రాహ మహాదేవః ప్రహసన్నివ శంకరః ।**
**సంప్రేక్ష్య ప్రణయాద్విష్ణుం కృతాంజలిపుటం స్థితమ్ ॥169॥**

**జ్ఞాతం మయేదమధునా దేవకార్యం జనార్దన ।**
**సుదర్శనాఖ్యం చక్రం చ దదామి తవ శోభనమ్ ॥170॥**

తర్వాత మహాదేవశంకరుడికి చేతులు జోడించి సమీపంలో నిలిచియున్న విష్ణువును చూచి ప్రేమతో నవ్వుతూ ఇలా పలికాడు. ఓ జనార్దనా! ఇపుడు నేను దేవకార్యాన్ని గుర్తించాను. నేను నీకు ఉత్తమమైన సుదర్శనం అనే పేరుగల చక్రాన్ని ఇస్తున్నాను.

**యద్రూపం భవతా దృష్టం సర్వలోకభయంకరమ్ ।**
**హితాయ తవ యత్నేన తవ భావాయ సువ్రత ॥171॥**

**శాంతం రణాజిరే విష్ణో దేవానాం దుఃఖసాధనమ్ ।**
**శాంతస్య చాస్త్రం శాంతః స్యాచ్ఛాంతేనాస్త్రేణ కిం ఫలమ్ ॥172॥**

**శాంతస్య సమరే చాస్త్రం శాంతిరేవ తపస్వినమ్ ।**
**యోద్ధుః శాంత్యా బలచ్ఛేదః పరస్య బలవృద్ధిదః ॥173॥**

**దేవైరశాంతైర్యద్రూపం మదీయం భావయావ్యయమ్ ।**
**కిమాయుధేన కార్యం వై యోద్ధుం దేవారిసూదన ॥174॥**

**క్షమా యుధి న కార్యావై యోద్ధుం దేవారిసూదన ।**
**అనాగతే వ్యతీతే చ దౌర్బల్యే స్వజనోత్కరే ॥175॥**

**అకాలికే త్వధర్మే చ అనర్థే వారిసూదన ।**

ఓ సువ్రతుడా! నీవు సమస్తలోకభయంకరమైన నాయీ రూపాన్ని చూశావు. ఆ పూర్తిరూపం నీకు హితంకోసం భక్తిభావంకోసం నిలుస్తుంది. ఓ శ్రీహరీ! యుద్ధభూమిలో సౌమ్యరూపాన్ని ధరిస్తే దేవతలకు దుఃఖదాయకం అవుతుంది. శాంతియుతుడైన వ్యక్తి అస్త్రం శాంతరూపమైనది. అవుతుంది. కావున, ఆ శాంతిరూపాస్త్రం వల్ల ఏ విధమైన ప్రయోజనం ఉండదు. తాపసుల విషయమైన యుద్ధంలో శాంతిమంతుడైన వ్యక్తి అస్త్రం శాంతమైనది అవుతుంది. యోధుని శాంతివల్ల ఆతడి బలహీనత బయటబడి శత్రువు బలం అభివృద్ధి చెందుతుంది. ఓ దేవశత్రువినాశకా! అశాంతులైన దేవతలతోపాటు నీవు అవినాశి అయిన నా స్వరూపాన్ని ధ్యానించు. యుద్ధం చేసేటప్పుడు అస్త్రాలతో ప్రయోజనం ఏముంది? ఓ దేవారిసూదనా! యుద్ధంలో క్షమ పనికిరాదు. ఈ చక్రం తన వారిపై ప్రయోగింపరాదు. అనుచిత కాలంలో కూడా ప్రయోగింపరాదు. అధర్మాన్ని, అనర్థాన్ని సమాప్తం చేయడానికే ప్రయోగించాలి.

**ఏవముక్త్వా దదే చక్రం సూర్యాయుతసమప్రభమ్ ॥176॥**

**నేత్రం చ నేతా జగతాం ప్రభుర్వై పద్మసన్నిభమ్ ।**
**తదాప్రభృతి తం ప్రాహుః పద్మాక్షమితి సువ్రతమ్ ॥177॥**

ఈ విధంగా పలికి లోకేశ్వరుడైన శివుడు విష్ణువుకు పదివేల సూర్యుల కాంతితో సమానమైన కాంతిగల చక్రాన్ని, కమలసమానమైన నేత్రాన్ని ప్రదానం చేశాడు. అప్పటినుంచి సువ్రతుడైన ఆ విష్ణువును పద్మాక్షుడంటున్నారు.

**దత్త్వైనం నయనం చక్రం విష్ణవే నీలలోహితః ।**
**పస్పర్శ చ కరాభ్యాం వై సుశుభాభ్యామువాచ హ ॥178॥**

**వరదోఽహం వరశ్రేష్ఠ వరాన్ వరయ చేప్సితమ్ ।**
**భక్త్యా వశీకృతో నూనం త్వయాహం పురుషోత్తమ ॥179॥**

విష్ణువుకు చక్రాన్ని, నేత్రాన్ని ప్రదానం చేసిన తర్వాత నీలలోహిత శివభగవానుడు తన పరమ పవిత్ర హస్తాలతో ఆతణ్ణి స్పృశించి ఇలా పలికాడు.

ఓ శ్రేష్ఠవరుడా! నేను వరదాతను. నీవు ఇష్టమైన వరాల్ని కోరుకో. ఓ పురుషోత్తమా! నిజంగా నీ భక్తితో నన్ను వశీకరించుకున్నావు.

**ఇత్యుక్తో దేవదేవేన దేవదేవం ప్రణమ్య తమ్ ।**
**త్వయి భక్తిర్మహాదేవ ప్రసీద వరముత్తమమ్ ॥180॥**

**నాన్యమిచ్ఛామి భక్తానామార్తయో నాస్తి యత్ప్రభో।**

దేవదేవశివుడు ఆ విధంగా పలకగా, విష్ణువు ఆయనకు నమస్కరించి ఇలా పలికాడు. ఓ మహాదేవా! నీయందు నాకు భక్తి నిలిచే విధంగా ఉత్తమమైన వరాన్ని అనుగ్రహించు. నేను వేరే వరాన్ని కోరను. భక్తులకు ఇంతకన్నా ఏ కోరికా ఉండదు.

**తచ్ఛ్రుత్వా వచనం తస్య దయావాన్ సుతరాం భవః ॥181॥**

**పస్పర్శ చ దదౌ తస్మై శ్రద్ధాం శీతాంశుభూషణః ।**
**ప్రాహ చైవం మహాదేవః పరమాత్మానమచ్యుతమ్ ॥182॥**

**మయి భక్తశ్చ వంద్యశ్చ పూజ్యశ్చైవ సురాసురైః ।**
**భవిష్యసి న సందేహో మత్ప్రసాదాత్సురోత్తమ ॥183॥**

**యదా సతీ దక్షపుత్రీ వినింద్యైవ సులోచనా ।**
**మాతరం పితరం దక్షం భవిష్యతి సురేశ్వరీ ॥184॥**

**దివ్యా హైమవతీ విష్ణో తదా త్వమపి సువ్రత ।**
**భగినీం తవ కళ్యాణీం దేవీం హైమవతీముమామ్ ॥185॥**

**నియోగాద్ బ్రహ్మణః సాధ్వీం ప్రదాస్యసి మమైవ తామ్ ।**
**మత్సంబంధీ చ లోకానాం మధ్యే పూజ్యో భవిష్యసి ॥186॥**

**మాం దివ్యేన చ భావేన తదాప్రభృతి శంకరమ్ ।**
**ద్రక్ష్యసే చ ప్రసన్నేన మిత్రభూతమివాత్మనా ॥187॥**

**ఇత్యుక్త్వాంతర్దధే రుద్రో భగవాన్నీలలోహితః ।**

విష్ణువుయొక్క ఆ వాక్యం విని పరమదయాళువైన శివుడు ఆయన్ని స్పృశించి ఆయనకు తనయందు భక్తిని వరరూపంలో ప్రదానం చేశాడు. తర్వాత చంద్రశేఖరుడు పరమాత్ముడైన అచ్యుతుడిని ఉద్దేశించి పలికాడు. ఓ సురోత్తమా! నా కృపతో నీవు నాయందు భక్తిగలవాడవై దేవదానవులతో వంద్యుడవు, పూజ్యుడవు అవుతావు. ఇందులో సందేహం లేదు. ఓ శ్రీహరీ! ఓ సువ్రతుడా! సులోచన అయిన దక్షపుత్రిక సతీదేవి తన తల్లిదండ్రుల్ని నిందించి సురేశ్వరి రూపంలో హిమవంతుడికి దివ్యమైన కుమార్తెగా జన్మిస్తుంది. అపుడు నీవు బ్రహ్మనియోగంతో

ఆమెను నీ సోదరిగా స్వీకరించి ఆ గిరిజను, కళ్యాణిని, సాధ్విని, ఉమాదేవిని నాకు పత్నిగా ప్రదానం చేయి. దాంతో నీవు లోకంలో నా సంబంధివిగా పూజ్యుడవు అవుతావు. ఆ సమయంలో నీవు దివ్యభావంతో అట్లే ప్రసన్నమనస్సుతో నాకు మిత్రుడి మాదిరిగా చూడబడతావు అని పలికి నీలలోహితశంకరుడు అంతర్ధానం చెందాడు.

**జనార్దనోఽపి భగవాన్ దేవానామపి సన్నిధౌ ॥188॥**

**అయాచత మహాదేవం బ్రహ్మాణం మునిభిః స్వయమ్ ।**
**మయా ప్రోక్తం స్తవం దివ్యం పద్మయోనే సుశోభనమ్ ॥189॥**

**యః పఠేచ్ఛృణుయాద్వాపి శ్రావయేద్వా ద్విజోత్తమాన్ ।**
**ప్రతినామ్ని హిరణ్యస్య దత్తస్య ఫలమాప్నుయాత్ ॥190॥**

**అశ్వమేధసహస్రేణ ఫలం భవతి తస్య వై ।**
**ఘృతాద్యైః స్నాపయేద్ రుద్రం స్థాల్యా వై కుశలైః శుభైః ॥191॥**

**నామ్నాం సహస్రేణానేన శ్రద్ధయా శివమీశ్వరమ్ ।**
**సోఽపి యజ్ఞసహస్రస్య ఫలం లబ్ధ్వా సురేశ్వరైః ॥192॥**

**పూజ్యో భవతి రుద్రస్య ప్రీతిర్భవతి తస్య వై ।**

జనార్దనభగవానుడు దేవతల సన్నిధిలో మునులతో కూడా బ్రహ్మదేవుణ్ణి ప్రార్థించాడు. ఓ పద్మయోనీ! నేను పఠించిన దివ్యం మరియు పరమసుందరం అయిన ఈ సహస్రనామస్తవం ఎవరు పఠిస్తారో, ఎవరు వింటారో, ఎవరు ద్విజశ్రేష్ఠులకు వినిపిస్తారో వాళ్లు ప్రతినామాన్ని పలుకుతూ సువర్ణాన్ని దానమిచ్చిన ఫలితాన్ని పొందుతారు. వేయి అశ్వమేధాలు చేసినవాళ్లు ఎలాంటి ఫలితాన్ని పొందుతారో అలాంటి ఫలితాన్ని పొందుతారు. అట్లే ఘృతాదులతో నిండిన పాత్రలతో లేక కలశాలతో సహస్రనామాల్ని పఠిస్తూ శ్రద్ధతో రుద్రభగవానుడికి స్నానం చేయిస్తారో వాళ్లు కూడా వేయి యజ్ఞాల్ని నిర్వహించిన ఫలాన్ని పొంది దేవతలతో పూజింపబడతారు. వాళ్లు రుద్రుడికి ప్రీతిపాత్రులవుతారు.

**యథాస్త్వితి తథా ప్రాహ పద్మయోనిర్జనార్దనమ్ ॥193॥**

**జగ్మతుః ప్రణిపత్యైనం దేవదేవం జగద్గురుమ్ ।**
**తస్మాన్నామ్నాం సహస్రేణ పూజయేదనఘో ద్విజాః ॥194॥**

**జపేన్నామ్నాం సహస్రం చ స యాతి పరమాం గతిమ్ ॥195॥**

అపుడు బ్రహ్మ విష్ణువుతో ఇలా పలికాడు. "అట్లే అగుగాక" అని. తర్వాత బ్రహ్మవిష్ణువులిద్దరూ జగద్గురుదేవదేవుడి లింగానికి నమస్కరించి వెళ్లారు. ఓ ద్విజులారా! అందుచేత పాపరహితుడైన వ్యక్తి ఈ వేయినామాలతో శివుణ్ణి పూజిస్తాడో మరియు ఈ వేయినామాల్ని జపిస్తాడో ఆతడు పరమగతికి వెళుతున్నాడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే సహస్రనామభిః పూజనాత్ విష్ణుచక్రలాభో నామాష్టనవతితమోఽధ్యాయః॥98॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని సహస్రనామాలతో పూజించడంవల్ల విష్ణువుకు చక్రలాభమనే తొంబై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## **నవనవతితమోఽధ్యాయః** - తొంబై తొమ్మిదవ అధ్యాయం

## **దేవీసంభవః** - దేవీసంభవం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**సంభవః సూచితో దేవ్యాస్త్వయా సూత మహామతే।**
**సవిస్తరం వదస్వాద్య సతీత్వే చ యథాతథమ్ ॥1॥**

**మేనాజత్వం మహాదేవ్యా దక్షయజ్ఞవిమర్దనమ్ ।**
**విష్ణునా చ కథం దత్తా దేవదేవాయ శంభవే ॥2॥**

**కల్యాణం వా కథం తస్య వక్తుమర్హసి సాంప్రతమ్ ।**

ఓ సూతర్షీ! ఓ మహామతీ! నీవు దేవి పుట్టుకను గూర్చి చెప్పావు. ఇపుడు సతీదేవి విషయాన్ని ఉన్నది ఉన్నట్లు విపులంగా చెప్పండి. మహాదేవి మేనకు ఎలా జన్మించిందో, దక్షుడి యజ్ఞవిధ్వంసం ఎలా జరిగిందో, విష్ణువుచేత ఆదేవి శివుడికి ఎలా కన్యాదానం చేయబడిందో, దాంతో విష్ణువుకు శుభం ఎలా ప్రాప్తించిందో ఈ విషయాన్ని మాకు కృపతో ఇప్పుడు చెప్పండి!

**తేషాం తద్వచనం శ్రుత్వా సూతః పౌరాణికోత్తమః ॥3॥**
**సంభవం చ మహాదేవ్యాః ప్రాహ తేషాం మహాత్మనామ్ ।**

వాళ్ల ఆ వచనాలు విని పౌరాణిక శ్రేష్ఠుడైన సూతుడు మహాత్ములైన ఋషులను ఉద్దేశించి దేవీసంభవాన్ని వివరించాడు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**బ్రహ్మణా కథితం పూర్వం దండినే తత్సువిస్తరమ్ ॥4॥**

**యుష్మాభిర్వై కుమారాయ తేన వ్యాసాయ ధీమతే ।**
**తస్మాదహముపశ్రుత్య ప్రవదామి సువిస్తరమ్ ॥5॥**

**వచనాద్వో మహాభాగాః ప్రణమ్యోమాం తథా భవమ్ ।**

ఓ ఋషులారా! మీరు అడుగుతున్న దేవీసంభవవృత్తాంతం మున్ముందుగా దండి అయిన సనత్కుమారుడికి బ్రహ్మ చెప్పినట్టిది మరియు తర్వాత ఆ సనత్కుమారుడు బుద్ధిమంతుడైన వ్యాసుడికి చెప్పినట్టిది. తర్వాత వ్యాసుడి వల్ల నేను విన్నట్టిది. ఓ మహాభాగులారా! ఉమాదేవికి, శివుడికి నమస్కరించి ఆ విషయాలన్నింటిని మీకు విస్తరంగా చెబుతాను.

**సా భగాఖ్యా జగద్ధాత్రీ లింగమూర్తేస్త్రివేదికా ॥6॥**

**లింగస్తు భగవాన్ ద్వాభ్యాం జగత్సృష్టిర్ద్విజోత్తమాః ।**
**లింగమూర్తిః శివో జ్యోతిస్తమసశ్చోపరి స్థితః ॥7॥**

**లింగవేదిసమాయోగాదర్ధనారీశ్వరోఽభవత్ ।**
**బ్రహ్మాణం విదధే దేవమగ్రే పుత్రం చతుర్ముఖమ్ ॥8॥**

ఆ జగన్మాత 'భగ' అనే పేరుగలదియై శివుడి లింగరూపానికి త్రిగుణవేదిక అయిన ప్రకృతిరూప అయినట్టిది. లింగరూపుడైన శివుడు ఎల్లప్పుడూ భగంతో కూడి యుంటాడు. ఓ ద్విజోత్తములారా! లింగభగాలతోనే ఈ జగత్తు సృష్టి జరుగుతుంది. లింగస్వరూపుడైన శివుడు ప్రకాశరూపుడు. మరియు ఎల్లప్పుడూ మాయారూపమైన తమస్సు పైన ప్రకాశిస్తుంటాడు. లింగవేదికల యొక్క యోగంతో శివుడు అర్ధనారీశ్వరుడయ్యాడు. ఆతడు ముందుగా పుత్రరూపంలో చతుర్ముఖబ్రహ్మను సృష్టించాడు.

**ప్రాహిణోతి స్మ తస్యైవ జ్ఞానం జ్ఞానమయో హరః ।**
**విశ్వాధికోఽసౌ భగవానర్ధనారీశ్వరో విభుః ॥9॥**

**హిరణ్యగర్భం తం దేవో జాయమానమపశ్యత ।**
**సోఽపి రుద్రం మహాదేవం బ్రహ్మాపశ్యత శంకరమ్ ॥10॥**

**తం దృష్ట్వా సంస్థితం దేవమర్ధనారీశ్వరం ప్రభుమ్ ।**
**తుష్టావ వాగ్భిరష్టాభిర్వరదం వారిజోద్భవః ॥11॥**

**విభజస్వేతి విశ్వేశం విశ్వాత్మానమజో విభుః ।**
**ససర్జ దేవీం వామాంగాత్పత్నీం చైవాత్మనః సమామ్ ॥12॥**

జ్ఞానమయుడు, విశ్వాధికుడు అయిన అర్ధనారీశ్వరశివుడు బ్రహ్మకు జ్ఞానాన్ని ప్రదానం చేశాడు. శివుడు ఉత్పన్నుడైన బ్రహ్మను చూశాడు. బ్రహ్మ కూడా రుద్రుడు, మహాదేవుడు అయిన శివుణ్ణి చూశాడు. ఆ విధంగా నిలిచియున్న అర్ధనారీశ్వరుడైన శివభగవానుణ్ణి చూచిన బ్రహ్మ అభీష్టవచనాలతో వరదాత అయిన ఆయన్ని స్తుతించాడు. తర్వాత పద్మోద్భవుడైన బ్రహ్మ విశ్వేశ్వరుడు, విశ్వాత్ముడైన శివుణ్ణి ఇలా ప్రార్థించాడు. "నీవు నిన్ను విభజించుకో" అని. అపుడు శివుడు తన వామాంగంనుంచి భార్యారూపంలో తనతో సమానమైన దేవిని సృష్టించాడు.

**శ్రద్ధా హ్యస్య శుభా పత్నీ తతః పుంసః పురాతనీ ।**
**సైవాజ్ఞయా విభోర్దేవీ దక్షపుత్రీ బభూవ హ ॥13॥**

**సతీసంజ్ఞా తదా సా వై రుద్రమేవాశ్రితా పతిమ్ ।**
**దక్షం వినింద్య కాలేన దేవీ మైనా హ్యభూత్పునః ॥14॥**

ఈ ఆత్మస్వరూపుడైన పురుషుడికి (శివుడికి) పురాతనమైన మంగళకరమైన పత్నిగా 'శ్రద్ధ' ఉన్నది. శివుడి ఆజ్ఞ వల్ల ఆ శ్రద్ధాదేవి దక్షుడి కుమార్తెగా జన్మించింది. అప్పుడు ఆమె పేరు సతీదేవి. ఆమె రుద్రభగవానుణ్ణి పతిగా స్వీకరించింది. తర్వాత దక్షుణ్ణి నిందించి ఆ సతీదేవి హిమవంతుడి భార్య అయిన మేనాదేవికి పుత్రిక అయ్యింది.

**నారదస్యైవ దక్షోఽపి శాపాదేవం వినింద్య చ ।**
**అవజ్ఞాదుర్మదో దక్షో దేవదేవముమాపతిమ్ ॥15॥**

**అనాదృత్య కృతిం జ్ఞాత్వా సతీ దక్షేణ తత్క్షణాత్ ।**
**భస్మీకృత్వాత్మనో దేహం యోగమార్గేణ సా పునః ॥16॥**

**బభూవ పార్వతీ దేవీ తపసా చ గిరేః ప్రభోః ।**
**జ్ఞాత్వైతద్భగవాన్ భర్గో దదాహ రుషితః ప్రభుః ॥17॥**

**దక్షస్య విపులం యజ్ఞం చ్యావనేర్వచనాదపి ।**
**చ్యవనస్య సుతో ధీమాన్ దధీచ ఇతి విశ్రుతః ॥18॥**

**విజిత్య విష్ణుం సమరే ప్రసాదాత్ త్ర్యంబకస్య చ ।**
**విష్ణునా లోకపాలాంశ్చ శశాప చ మునీశ్వరః ॥19॥**

**రుద్రస్య క్రోధజేనైవ వహ్నినా హవిషా సురాః ।**
**వినాశో వై క్షణాదేవ మాయయా శంకరస్య వై ॥20॥**

నారదుడి శాపకారణంగా తిరస్కారంతో దుర్మదుడైన దక్షుడు దేవదేవుడైన సతీపతిని నిందించి యజ్ఞాన్ని నిర్వహించాడు. అపుడు దక్షుడు శివుణ్ణి అనాదరించిన విధాన్ని తెలిసి వెంటనే సతీదేవి యోగమార్గంలో తన దేహాన్ని దహించుకుని, తపస్సు చేసి పర్వతరాజు హిమాలయుడికి పుత్రికగా పార్వతీరూపంలో జన్మించింది. దాన్ని తెలిసిన చ్యవనపుత్రుడు చెప్పడం వల్ల శివభగవానుడు కుపితుడై దక్షుడి ఘనయజ్ఞాన్ని దహించాడు. చ్యవనపుత్రుడు దధీచుడనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. శివుడి కృపవల్ల యుద్ధంలో విష్ణువును జయించి ఆ మునీశ్వరుడు విష్ణువుతో కూడిన లోకపాలకులందరికి ఈ విధంగా శాపాన్ని యిచ్చాడు. ఓ దేవతలారా! శంకరుడి మాయ కారణంగా రుద్రుడి క్రోధం వల్ల ఉత్పన్నమైన హవిస్సు అనే అగ్నిద్వారా క్షణకాలంలో మీరందరూ వినాశాన్ని పొందుతారు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే దేవీసంభవో నామ నవనవతితమోఽధ్యాయః ॥ 99 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని దేవీసంభవమనే తొంబై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## శతతమోఽధ్యాయః - నూరవ అధ్యాయం

## శివకృతదక్షయజ్ఞవిధ్వంసనః - శివుడు చేసిన దక్షుడి యజ్ఞవిధ్వంసం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**విజిత్య విష్ణునా సార్ధం భగవాన్ పరమేశ్వరః ।**
**సర్వాన్ దధీచవచనాత్కథం భేజే మహేశ్వరః ॥1॥**

ఓ సూతర్షీ! పరమేశ్వరుడైన భగవాన్ మహేశ్వరుడు దధీచి మాటను అనుసరించి విష్ణువుతోపాటు అందర్ని ఎలా జయించాడు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**దక్షయజ్ఞే సువిపులే దేవాన్ విష్ణుపురోగమాన్ ।**
**దదాహ భగవాన్ రుద్రః సర్వాన్ మునిగణానపి ॥2॥**

ఓ ఋషులారా! రుద్రభగవానుడు మిక్కిలి పెద్దదైన దక్షుడి యజ్ఞంలో విష్ణువు మొదలుగాగల ప్రముఖ దేవతల్ని అట్లే మునులందర్ని దహించి వేశాడు.

**భద్రో నామ గణస్తేన ప్రేషితః పరమేష్ఠినా ।**
**విప్రయోగేన దేవ్యా వై దుఃసహేనైవ సువ్రతాః ॥3॥**

**సోఽసృజద్వీరభద్రశ్చ గణేశాన్ రోమజాన్ శుభాన్ ।**
**గణేశ్వరైః సమారుహ్య రథం భద్రః ప్రతాపవాన్ ॥4॥**

**గంతుం చక్రే మతిం యస్య సారథిర్భగవానజః ।**
**గణేశ్వరాశ్చ తే సర్వే వివిధాయుధపాణయః ॥5॥**

**విమానైర్విశ్వతోభద్రైస్తమన్వయురథో సురాః ।**
**హిమవచ్ఛిఖరే రమ్యే హేమశృంగే సుశోభనే ॥6॥**

**యజ్ఞవాటస్తథా తస్య గంగాద్వారసమీపతః ।**
**తద్దేశే చైవ విఖ్యాతం శుభం కనఖలం ద్విజాః ॥7॥**

ఓ సువ్రతులారా! సతీదేవి యొక్క భరింపరాని వియోగంవల్ల శివుడు భద్రుడు అనే ప్రమథగణుణ్ణి పంపాడు. ఆ వీరభద్రుడు తన కేశపాశాలనుంచి ఉత్తమగణేశ్వరుల్ని సృష్టించాడు. అపుడు గణేశ్వరులతో పాటు రథాన్ని అధిరోహించి ప్రతాపశాలి అయిన వీరభద్రుడు వెళ్లడానికి నిశ్చయించాడు. ఆ రథానికి సారథి బ్రహ్మదేవుడు. వివిధాయుధాల్ని హస్తాలతో ధరించినవాళ్లైన ఆ గణనాథులందరూ, దేవతలు కూడా మంగళకరాలైన విమానాల్ని అధిరోహించి అన్నివైపుల ఆ వీరభద్రుడికి వెనుకగా అనుసరించారు. ఓ ఋషులారా! హిమవంతుడి రమణీయం,

మరియు పరమసుందరం, సువర్ణమయమూ అయిన శిఖరం మీద గంగాద్వారం సమీపంలో 'కనఖలం" అనే శుభకరమైన, సుప్రసిద్ధమైన ప్రదేశమున్నది. ఆ ప్రదేశంలో దక్షుడి యజ్ఞశాల ఉంది.

**దగ్ధుం వై ప్రేషితశ్చాసౌ భగవాన్ పరమేష్ఠినా ।**
**తదోత్పాతో బభూవాథ లోకానాం భయసంశయః ॥8॥**

**పర్వతాశ్చ వ్యశీర్యంత ప్రచకంపే వసుంధరా ।**
**మరుతశ్చాప్యఘూర్ణంత చుక్షుభే మకరాలయః ॥9॥**

**అగ్నయో నైవ దీప్యంతి న చ దీప్యతి భాస్కరః ।**
**గ్రహాశ్చ న ప్రకాశ్యంతే న దేవా న చ దానవాః ॥10॥**

ఎపుడు శివుడు వీరభద్రుడిని యజ్ఞవిధ్వంసానికి పంపాడో అపుడు లోకాలకు భయభీతుల్ని కల్గించే ఉత్పాతాలు కలిగాయి. పర్వతాలు పగిలిపోయాయి. భూమి చలించింది. వాయువు ఉద్ధృతంగా వీచింది. సముద్రం క్షోభిల్లింది. అగ్ని జ్వలించ లేదు. సూర్యుడు ప్రకాశించలేదు. గ్రహాలు కాంతివిహీనాలయ్యాయి. దేవదానవులు ప్రశాంతిని కోల్పోయారు.

**తతః క్షణాత్ ప్రవిశ్యైవ యజ్ఞవాటం మహాత్మనః ।**
**రోమజైః సహితో భద్రః కాలాగ్నిరివ చాపరః ॥11॥**

**ఉవాచ భద్రో భగవాన్ దక్షం చామితతేజసమ్ ।**
**సంపర్కాదేవ దక్షాద్య మునీన్ దేవాన్ పినాకినా ॥12॥**

**దగ్ధుం సంప్రేషితశ్చాహం భవంతం సమునీశ్వరైః ।**
**ఇత్యుక్త్వా యజ్ఞశాలాం తాం దదాహ గణపుంగవః ॥13॥**

ఆ సమయంలో రెండో కాలాగ్నితో సమానుడైన భగవానుడు వీరభద్రుడు తన రోమాలనుంచి పుట్టిన గణేశ్వరులతో కూడా ఆ గొప్పదైన యజ్ఞవాటికలోనికి ప్రవేశించి అమిత కాంతిమంతుడైన దక్షుడితో ఇలా పలికాడు. ఓ దక్షా! ఇపుడు పినాకధారి శివుడు మునులతో, మునీశ్వరులతో దేవతలతో కూడిన నిన్ను స్పర్శమాత్రంతోనే దహించమని నన్ను పంపాడని పలికి ఆ యజ్ఞశాలను దహించాడు.

**గణేశ్వరాశ్చ సంక్రుద్ధా యూపానుత్పాట్య చిక్షిపుః ।**
**ప్రస్తోత్రా సహ హోత్రా చ దగ్ధం చైవ గణేశ్వరైః ॥14॥**

**గృహీత్వా గణపాః సర్వాన్ గంగాస్రోతసి చిక్షిపుః ।**
**వీరభద్రో మహాతేజాః శక్రస్యోద్యచ్ఛతః కరమ్ ॥15॥**

**వ్యష్టంభయదదీనాత్మా తథాన్యేషాం దివౌకసామ్ ।**
**భగస్య నేత్రే చోత్పాట్య కరజాగ్రేణ లీలయా ॥16॥**

**నిహత్య ముష్టినా దంతాన్ పూష్ణశ్చైవ న్యపాతయత్ ।**

మిక్కిలి క్రుద్ధులైన గణేశ్వరులు యూపస్తంభాన్ని పీకి విసిరివేశారు. గణేశ్వరులచేత ప్రస్తోతలు, హోతలు అందరూ దహింపబడ్డారు. గణేశ్వరులు అందర్నీ పట్టుకుని గంగాజలంలో విసిరి వేశారు. మహాతేజస్వి మరియు అదీనాత్ముడూ అయిన వీరభద్రుడు వజ్రాయుధాన్ని ఎత్తి పట్టిన ఇంద్రుడి హస్తాన్ని స్తంభింపజేశాడు. ఇతర దేవతల హస్తాలను స్తంభింపజేశాడు. ఆతడు లీలాపూర్వకంగా తన గోళ్లకొనలతో భగుడి నేత్రాల్ని పీకి వేశాడు. ముష్టితో కొట్టి పూషుడి(సూర్యుని) దంతాల్ని ఊడగొట్టాడు.

**తథా చంద్రమసం దేవం పాదాంగుష్ఠేన లీలయా ॥17॥**

**ఘర్షయామాస భగవాన్ వీరభద్రః ప్రతాపవాన్ ।**
**చిచ్ఛేద చ శిరస్తస్య శక్రస్య భగవాన్ ప్రభో ॥18॥**

**వహ్నేః హస్తద్వయం ఛిత్వా జిహ్వాముత్పాట్య లీలయా ।**
**జఘాన మూర్ధ్ని పాదేన వీరభద్రో మహాబలః ॥19॥**

తర్వాత ప్రతాపవంతుడైన భగవాన్ వీరభద్రుడు తన కాళ్ల బొటని వ్రేళ్లతో అనాయాసంగా చంద్రుడిని పొడిచి వేశాడు. ఇంద్రదేవుడి శిరసును ఖండించాడు. మహాబలి వీరభద్రుడు లీలాపూర్వకంగా అగ్నిదేవుడి రెండు చేతుల్ని ఖండించి, నాలుకను పీకివేసి కాలితో శిరసుపై తన్నాడు.

**యమస్య దండం భగవాన్ ప్రచిచ్ఛేద స్వయం ప్రభుః ।**
**జఘాన దేవం ఈశానం త్రిశూలేన మహాబలమ్ ॥20॥**

**త్రియస్త్రింశత్సురానేవం వినిహత్యాప్రయత్నతః ।**
**త్రయశ్చ త్రిశతం తేషాం త్రిసాహస్రం చ లీలయా ॥21॥**

**త్రయం చైవ సురేంద్రాణాం జఘాన చ మునీశ్వరాన్ ।**
**అన్యాంశ్చ దేవాన్ దేవోఽసౌ సర్వాన్ యుద్ధాయ సంస్థితాన్ ॥22॥**

**జఘాన భగవాన్ రుద్రః ఖడ్గముష్ట్యాదిసాయకైః ।**

తర్వాత భగవాన్ వీరభద్రుడు స్వయంగా యముడి దండాన్ని ఖండించాడు. అట్లే మహాబలి అయిన ఈశానదేవుణ్ణి త్రిశూలంతో పొడిచి చంపాడు. ఆతడు ముప్పై ముగ్గురు దేవతల్ని, మూడువందల ముగ్గురు దేవతల్ని, మూడువేలమంది వివిధ దేవతల్ని లీలాపూర్వకంగా, అనాయాసంగా వధించాడు. అట్లే ప్రధానులైన ముగ్గురు దేవతల్ని (ఇంద్రుడు, అగ్ని, సోములు), మునీశ్వరుల్ని, యుద్ధసన్నద్ధులైన ఇతర దేవతల్ని చంపాడు.

**అథ విష్ణుర్మహాతేజాశ్చక్రముద్యమ్య మూర్ఛితః ॥23॥**

**యుయోధ భగవాంస్తేన రుద్రేణ సహ మాధవః ।**
**తయోః సమభవద్యుద్ధం సుఘోరం రోమహర్షణమ్ ॥24॥**

**విష్ణోర్యోగబలాత్తస్య దివ్యదేహాః సుదారుణాః ॥25॥**

**శంఖచక్రగదాహస్తా అసంఖ్యాతాశ్చ జజ్ఞిరే ।**

అనంతరం మహాతేజస్వి, లక్ష్మీపతి భగవాన్ విష్ణుదేవుడు తన చక్రాన్ని ఎత్తిపట్టి ఆవేశంతో ఆ రుద్రుడితో యుద్ధం చేశాడు. వాళ్ల యిద్దరికి అతిభయంకరమైన అట్లే రోమాంచకారియైన యుద్ధం జరిగింది. విష్ణువు యొక్క యోగబలంవల్ల హస్తాలతో శంఖచక్రగదల్ని ధరించినవాళ్లు, దివ్యదేహాలుగలవాళ్లు, పరమ దారుణమైన వాళ్లు అయిన యుద్ధవీరులు అసంఖ్యాకంగా జన్మించారు.

**తాన్ సర్వానపి దేవోఽసౌ నారాయణసమప్రభాన్ ॥26॥**

**నిహత్య గదయా విష్ణుం తాడయామాస మూర్ధని ।**
**తతోఽస్యోరసి తం దేవం లీలయైవ రణాజిరే ॥27॥**

**పపాత చ తదా భూమౌ విసంజ్ఞః పురుషోత్తమః ।**
**పునరుత్థాయ తం హంతుం చక్రముద్యమ్య స ప్రభుః ॥28॥**

**క్రోధరక్తేక్షణః శ్రీమానతిష్ఠత్పురుషర్షభః ।**

అపుడు వీరభద్రుడు నారాయణుడితో సమానమైన కాంతిమంతులైన వాళ్లందర్నీ వధించి, రణభూమిలో గదతో లీలాపూర్వకంగా విష్ణుదేవుడి శిరసుపై కొట్టాడు. తర్వాత ఆయన వక్షఃస్థలంపై మోదాడు. అపుడు పురుషోత్తముడు అచేతనుడై భూమిపై పడ్డాడు. తర్వాత స్పృహ వచ్చి లేచి శ్రీమంతుడు, పురుషశ్రేష్ఠుడు ప్రభువు అయిన విష్ణుదేవుడు క్రోధియై రక్తనేత్రుడై వీరభద్రుణ్ణి చంపడానికై చక్రాన్ని చేత పట్టాడు.

**తస్య చక్రం చ యద్రౌద్రం కాలాదిత్యసమప్రభమ్ ॥29॥**

**వ్యష్టంభయదదీనాత్మా కరస్థం న చచాల సః ।**
**అతిష్ఠత్స్తంభితస్తేన శృంగవానివ నిశ్చలః ॥30॥**

విష్ణువు యొక్క ఆ చక్రం భయానకమైనది. కాలాదిత్యుడితో సమానమైన కాంతిగలది. అయితే దానిని అదీనాత్ముడైన వీరభద్రుడు స్తంభింపజేశాడు. హస్తమందుండి చలించలేదు. విష్ణువు కూడా పర్వతం లాగా నిశ్చలుడై నిలిచాడు.

**త్రిభిశ్చ ధర్షితం శార్ఙ్గం త్రిధాభూతం ప్రభోస్తదా ।**
**శార్ఙ్గకోటి ప్రసంగాద్వై చిచ్ఛేద చ శిరః ప్రభో ॥31॥**
**ఛిన్నం నిపపాతాశు శిరస్తస్య రసాతలే ।**
**వాయునా ప్రేరితం చైవ ప్రాణజేన పినాకినా ॥32॥**
**ప్రవివేశ తదా చైవ తదీయాహవనీయకమ్ ।**
**తత్రప్రవిధ్వస్తకలశం భగ్నయూపం సతోరణమ్ ॥33॥**
**ప్రదీపితమహాశాలం దృష్ట్వా యజ్ఞోఽపి దుద్రువే ।**
**తే తదా మృగరూపేణ ధావంతం గగనం ప్రతి ॥34॥**
**వీరభద్రః సమాధాయ విశిరస్కమథాకరోత్ ।**
**తతః ప్రజాపతిం ధర్మం కశ్యపం చ జగద్గురుమ్ ॥35॥**

**అరిష్టనేమినం వీరో బహుపుత్రం మునీశ్వరమ్ ।**
**మునిమంగిరసం చైవ కృష్ణాశ్వం చ మహాబలః ॥36॥**

**జఘాన మూర్ధ్ని పాదేన దక్షం చైవ యశస్వినమ్ ।**
**చిచ్ఛేద చ శిరస్తస్య దదాహాగ్నౌ ద్విజోత్తమాః ॥37॥**

**సరస్వత్యాశ్చ నాసాగ్రం దేవమాతుస్తథైవ చ ।**
**నికృత్య కరజాగ్రేణ వీరభద్రః ప్రతాపవాన్ ॥38॥**

**తస్థౌ శ్రియా వృతో మధ్యే ప్రేతస్థానే యథా భవః ।**

తర్వాత వీరభద్రుడు మూడు బాణాలతో విష్ణువు యొక్క శార్ఙ్గధనువును ఖండించాడు. అది మూడు ముక్కలు అయ్యింది. ఆ ధనుస్సు కారణంగానే విష్ణువు శిరస్సు ఖండింపబడింది. ఆతడిచేత ఖండింపబడిన శిరస్సు పినాకి అయిన శివుడి నిఃశ్వాస వాయువు వల్ల ప్రేరేపింపబడి రసాతలానికి వెళ్లింది. అక్కడ ఆహవనీయాగ్నిలో ప్రవేశించింది. ప్రధ్వంసమైన కలశంగల, సతోరణంగా భగ్నమైన యూపంగల, కాలిపోతున్న యజ్ఞవాటికను చూచి యజ్ఞదేవుడును వెడలిపోయాడు. అపుడు మృగరూపంలో ఆకాశంవైపు వెళుతున్న ఆ యజ్ఞదేవుణ్ణి పట్టుకుని శిరసు ఖండించాడు. తర్వాత మహాబలి వీరభద్రుడు ప్రజాపతి, ధర్ముడు, జగద్గురువు కశ్యపుడు, అరిష్టనేమి, మునీశ్వరుడు బహుపుత్రుడు, అంగిరసముని మరియు కృష్ణాశ్వకుడు – వీరి శిరసులమీద కాలితో తన్నాడు. ఓ శ్రేష్ఠద్విజులారా! యశస్వి అయిన దక్షుడి శిరసు మీద కూడా కాలితో తన్నాడు. శిరసు ఖండించాడు. అగ్నిలో దహించాడు. తర్వాత ప్రతాపశాలియైన వీరభద్రుడు తన కొనగోళ్లతో దేవమాత అయిన సరస్వతీదేవి నాసిక అగ్రభాగాన్ని ఖండించి ఐశ్వర్యయుక్తుడై శ్మశానంలో శివుడు ఎలా ఉంటాడో అలా నిలిచి ఉన్నాడు.

**ఏతస్మిన్నేవ కాలే తు భగవాన్ పద్మసంభవః ॥39॥**

**భద్రమాహ మహాతేజాః ప్రార్థయన్ ప్రణతః ప్రభుః ।**
**అలం క్రోధేన వై భద్ర నష్టాశ్చైవ దివౌకసః ॥40॥**

**ప్రసీద క్షమ్యతాం సర్వం రోమజైః సహ సువ్రత ।**

ఆ సమయంలో మహాతేజస్వి, ప్రభువు బ్రహ్మదేవుడు ప్రార్థించి, నమస్కరించి వీరభద్రుడితో ఇలా పలికాడు. ఓ భద్రా! క్రోధాన్ని త్యజించు. దేవగణాలు నశించాయి. ఓ సువ్రతుడా! ప్రసన్నుడవుకా. నీ రోమాలనుంచి పుట్టిన గణేశ్వరుడితో కూడా అందరూ శాంతించండి!

**సోఽపి భద్రః ప్రభావేణ బ్రహ్మణః పరమేష్ఠినః ॥41॥**

**శమం జగామ శనకైః శాంతస్తస్థౌ తదాజ్ఞయా ।**
**దేవోఽపి తత్ర భగవానంతరిక్షే వృషధ్వజః ॥42॥**

**సగణః సర్వదః శర్వః సర్వలోకమహేశ్వరః ।**
**ప్రార్థితశ్చైవ దేవేన బ్రహ్మణా భగవాన్ భవః ॥43॥**

**హతానాం చ తదా తేషాం ప్రదదౌ పూర్వవత్తనుమ్ ।**
**ఇంద్రస్య చ శిరస్తస్య విష్ణోశ్చైవ మహాత్మనః ॥44॥**
**దక్షస్య చ మునీంద్రస్య తథాన్యేషాం మహేశ్వరః ।**
**వాగీశ్యాశ్చైవ నాసాగ్రం దేవమాతుస్తథైవ చ ॥45॥**
**నష్టానాం జీవితం చైవ వరాణి వివిధాని చ ।**
**దక్షస్య ధ్వస్తవక్త్రస్య శిరసా భగవాన్ ప్రభుః ॥46॥**
**కల్పయామాస వై వక్త్రం లీలయా చ మహాన్ భవః ।**

వీరభద్రుడు పరమేష్ఠి అయిన బ్రహ్మ ప్రభావంతో శాంతిని పొందాడు. బ్రహ్మ ఆజ్ఞతో శాంతించి నిలిచాడు. ఆ సమయంలో భగవానుడు, వృషభధ్వజుడు శివుడు ఆకాశంలో నిలిచాడు. బ్రహ్మదేవుడు గణసహితుడై సర్వదుడు, శర్వుడు, సర్వలోకేశ్వరుడు అయిన శివుణ్ణి "ఇపుడు నీవు మరణించిన వాళ్లందరికి యథాపూర్వంగా శరీరాన్ని ప్రసాదించు". అని ప్రార్థించాడు. శివుడు ఇంద్రునికి మహాత్ముడైన విష్ణువుకి, దక్షుడికి మునీంద్రులు అట్లే ఇతరులకు శిరసుల్ని ప్రదానం చేశాడు. దేవమాత అయిన సరస్వతీదేవి నాసిక కూడా సముద్ధరింపబడింది. చనిపోయినవాళ్లకు జీవనదానం చేశాడు. మరియు అనేక వరాల్ని ప్రసాదించాడు. భగవాన్ మహాప్రభువు అయిన భవుడు లీలాపూర్వకంగా ధ్వంసమైన ముఖంగల దక్షుడికి శిరసుతో కూడిన ముఖాన్ని సృష్టించాడు.

**దక్షోఽపి లబ్ధసంజ్ఞశ్చ సముత్థాయ కృతాంజలిః ॥47॥**
**తుష్టావ దేవదేవేశం శంకరం వృషభధ్వజమ్ ।**
**స్తుతస్తేన మహాతేజాః ప్రదాయ వివిధాన్ పరాన్ ॥48॥**
**గాణపత్యం దదౌ తస్మై దక్షాయాక్లిష్టకర్మణే ।**

అపుడు సచేతనుడైన దక్షుడు లేచి చేతులు జోడించి దేవదేవేశుడు వృషభధ్వజుడు అయిన శంకరుణ్ణి స్తుతించాడు. దక్షుడిచేత స్తుతింపబడిన మహాతేజస్వి శంకరుడు ఉత్తమకర్మకరుడైన ఆ దక్షుడికి వివిధమైన వరాల్ని ఇచ్చి మరియు గాణపత్యపదవిని కూడా ప్రదానం చేశాడు.

**దేవాశ్చ సర్వే దేవేశం తుష్టువుః పరమేశ్వరమ్ ॥49॥**
**నారాయణశ్చ భగవాన్ తుష్టావ చ కృతాంజలిః ।**
**బ్రహ్మా చ మునయః సర్వే పృథక్ పృథక్ అజోద్భవమ్ ॥50॥**
**తుష్టువుర్దేవ దేవేశం నీలకంఠం వృషధ్వజమ్ ।**
**తాన్ దేవాననుగృహ్యైవ భవోఽప్యంతరధీయత ॥51॥**

అపుడు దేవతలందరూ దేవేశుడు పరమేశ్వరుడు అయిన శంకరుణ్ణి స్తుతించారు. భగవాన్ నారాయణడు కూడా చేతులు జోడించి ఆయన్ని స్తుతించాడు. బ్రహ్మ మరియు మునులందరూ బ్రహ్మను సృజించినవాడు, దేవదేవేశుడు, నీలకంఠుడు, వృషభధ్వజుడు అయిన శివుణ్ణి వేరు వేరుగా స్తుతించారు. తర్వాత ఆ దేవతల్ని అనుగ్రహించిన శివుడు అంతర్హితుడయ్యాడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే శివకృద్దక్షయజ్ఞ విధ్వంసనో నామ శతతమోఽధ్యాయః ॥100॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని శివుడు చేసిన దక్షయజ్ఞ ధ్వంసనం అనే నూరవ అధ్యాయం సమాప్తం.

## **ఏకాధికశతతమోఽధ్యాయః** – నూట ఒకటవ అధ్యాయం

## **మదనదాహః** – మదనదహనం

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**కథం హిమవతః పుత్రీ బభూవాంబా సతీ శుభా।**
**కథం వా దేవదేవేశమవాప పతిరీశ్వరమ్ ॥1॥**

కళ్యాణమయి, అంబ అయిన సతీదేవి హిమవంతుడికి కుమార్తె ఎలా అయ్యింది? ఆమె దేవదేవుడైన శివుణ్ణి ఏ విధంగా భర్తగా పొందింది?

**సూత ఉవాచ** – సూతర్షి పలికాడు.

**సా మేనాతనుమాశ్రిత్య స్వేచ్ఛయైవ వరాంగనా ।**
**తదా హైమవతీ జజ్ఞే తపసా చ ద్విజోత్తమాః ॥2॥**

**జాతకర్మాదికాః సర్వాశ్చకార చ గిరీశ్వరః ।**
**ద్వాదశే చ తదా వర్షే పూర్ణే హైమవతీ శుభా ॥3॥**

**తపస్తేపే తయా సార్ధమనుజా చ శుభాననా ।**
**అన్యా చ దేవీ హ్యనుజా సర్వలోక నమస్కృతా ॥4॥**

ఓ ద్విజశ్రేష్ఠులారా! శ్రేష్ఠమైన అంగాలుగల ఆ దేవి తపస్సు ద్వారా తన ఇచ్ఛతో మేనాదేవి శరీరాన్ని ఆశ్రయించి హిమవంతుడి పుత్రిక రూపంలో జన్మించింది. పర్వతరాజు హిమవంతుడు ఆమెకు జాతకర్మాదులైన సమస్తసంస్కారాలు నిర్వహించాడు. పండ్రెండు ఏడాదులు నిండగానే హిమవంతుడి ఆ సుందరపుత్రిక తపస్సు చేయప్రారంభించింది. ఆమెతోపాటు సుందరమైన ముఖంగల ఆమె చిన్న సోదరి, సర్వలోకపూజిత అయిన మరొక చెల్లెలూ ఉంది.

**ఋషయశ్చ తదా సర్వే సర్వలోకమహేశ్వరీమ్ ।**
**తుష్టువుస్తపసా దేవీం సమావృత్య సమంతతః ॥5॥**

అపుడు ఋషులందరూ సర్వలోకాలకు మహేశ్వరి అయిన ఆమెకు అన్నివైపుల చేరి ఆమె చేస్తున్న తపస్సును స్తుతించారు.

**జ్యేష్ఠా హ్యపర్ణా హ్యనుజా చైకపర్ణా శుభాననా ।**
**తృతీయా చ వరారోహా తథా చైవైకపాటలా ॥6॥**

**తపసా చ మహాదేవ్యాః పార్వత్యాః పరమేశ్వరః ।**
**వశీకృతో మహాదేవః సర్వభూతపతిర్భవః ॥7॥**

ఆ ముగ్గురిలో పెద్దది 'అపర్ణ' అయినది. అందులో చిన్నదైన సుందరానన 'ఏకపర్ణ' అయినది. పరమసుందరి అయిన మూడోది 'ఏకపాటల' అయినది. మహాదేవి ఐన పార్వతి తపస్సుకు సర్వభూతపతి అయిన పరమేశ్వరుడు, శివుడు వశీకృతుడయ్యాడు.

**ఏతస్మిన్నేవ కాలే తు తారకో నామ దానవః ।**
**తారాత్మజో మహాతేజా బభూవ దితినందనః ॥8॥**

**తస్య పుత్రాస్త్రయశ్చాపి తారకాక్షో మహాసురః ।**
**విద్యున్మాలీ చ భగవాన్ కమలాక్షశ్చ వీర్యవాన్ ॥9॥**

**పితామహస్తథా చైషాం తారో నామ మహాబలః ।**
**తపసా లబ్ధవీర్యశ్చ ప్రసాదాద్ బ్రహ్మణః ప్రభోః ॥10॥**

**సోఽపి తారో మహాతేజా స్త్రైలోక్యం సచరాచరమ్ ।**
**విజిత్య సమరే పూర్వం విష్ణుం చ జితవానసౌ ॥11॥**

ఆ కాలంలో తారకుడనే పేరుగల ఒక దానవుడు ఉన్నాడు. మహాతేజస్వి అయిన ఆతడు తారుడి యొక్క పుత్రుడు. దితి యొక్క కుమారుడు. ఆతడికి ముగ్గురు కుమారులు. ఆ ముగ్గురు మహాసురుడు అయిన తారకాక్షుడు, భాగ్యశాలి అయిన విద్యున్మాలి, మరియు పరాక్రమశాలి అయిన కమలాక్షుడు. మహాబలుడైన తారుడనే వీళ్ల తాత తపస్సు చేసి బ్రహ్మదేవుడి కృపతో పరాక్రమాన్ని పొందాడు. మహాతేజస్వి అయిన ఆ తారుడు చరాచరసహితాలైన ముల్లోకాలను విష్ణువునూ కూడా యుద్ధంలో జయించాడు.

**తయోః సమభవద్యుద్ధం సుఘోరం రోమహర్షణమ్ ।**
**దివ్యం వర్షసహస్రం తు దివారాత్రమవిశ్రమమ్ ॥12॥**

**సరథం విష్ణుమాదాయ చిక్షేప శతయోజనమ్ ।**
**తారేణ విజితః సంఖ్యే దుద్రావ గరుడధ్వజః ॥13॥**

**తారో వరాన్ శతగుణం లబ్ధ్వా శతగుణం బలమ్ ।**
**పితామహాజ్జగత్సర్వమవాప దితినందనః ॥14॥**

**దేవేంద్రప్రముఖాన్ జిత్వా దేవాన్ దేవదేవేశ్వరః ।**
**వారయామాస తైర్దేవాన్ సర్వలోకేషు మాయయా ॥15॥**

ఆ యిద్దరకు రాత్రింబవళ్లు విశ్రాంతి లేకుండా ఒక వేయి దివ్యసంవత్సరాలు అత్యంత భయానకంగా రోమాంచకారకమైన యుద్ధం జరిగింది. తారుడు విష్ణువును రథసహితంగా శతయోజనదూరం విసిరివేశాడు. తారుడి ద్వారా పరాజితుడైన విష్ణువు పారిపోయాడు. బ్రహ్మవల్ల నూరువరాలు, నూరురెట్లు బలం ప్రాప్తించుకున్న

ఆ దితి కుమారుడు తారుడు సంపూర్ణ జగత్తు మీద అధికారాన్ని పొందాడు. దేవేంద్రాది దేవతల్ని జయించి దేవదేవేశ్వరుడి రూపంలో నిలిచి, తన మాయతో దేవతలందర్ని అన్ని లోకాలలో తన కార్యాలతో వంచించాడు.

**దేవతాశ్చ సహేంద్రేణ తారకాద్భయపీడితాః ।**
**న శాంతిం లేభిరే శూరాః శరణం వా భయార్దితాః ॥16॥**

**తదామరపతిః శ్రీమాన్ సన్నిపత్యామరప్రభుః ।**
**ఉవాచాంగిరసం దేవో దేవానామపి సన్నిధౌ ॥17॥**

ఇంద్రుడితో కూడిన దేవతాగణాలు తారకుడి భయంవల్ల పీడింపబడ్డారు. వీరులైన కారణంగా వాళ్లు భయగ్రస్తులయ్యు, శాంతి లేకపోయినా శరణుచొచ్చలేదు. అపుడు దేవతాప్రభువు శ్రీమాన్ ఇంద్రుడు బృహస్పతిని శరణుచొచ్చి దేవతలందరూ అక్కడ ఉండగానే ఇలా పలికాడు.

**భగవంస్తారకో నామ తారజో దానవోత్తమః ।**
**తేన సన్నిహితా యుద్ధే వత్సా గోపతినా యథా ॥18॥**

**భయాత్తస్మాన్మహాభాగ బృహద్యుద్ధే బృహస్పతే ।**
**అనికేతా భ్రమంత్యేతే శకుంతా ఇవ పంజరే ॥19॥**

**అస్మాకం యాన్యమోఘాని ఆయుధాన్యంగిరోవర ।**
**తాని మోఘాని జాయంతే ప్రభావాదమరద్విషః ॥20॥**

**దశవర్షసహస్రాణి ద్విగుణాని బృహస్పతే ।**
**విష్ణునా యోధితో యుద్ధే తేనాపి న చ సూదితః ॥21॥**

**యస్తేనానిర్జితో యుద్ధే విష్ణునా ప్రభవిష్ణునా ।**
**కథమస్మద్విధస్తస్య స్థాస్యతే సమరేఽగ్రతః ॥22॥**

ఓ భగవాన్! తారుడి పుత్రుడైన తారకుడు ఒక మహాదానవుడు. ఆతడు యుద్ధంలో ఆబోతు దూడను పరాజితను చేసినట్లు మమ్మల్ని పరాజితుల్ని చేశాడు. ఓ మహాభాగ! ఓ బృహస్పతీ! భయకారణంగా ఈ పెద్ద యుద్ధంలో దేవతలు ఆశ్రయవిహీనులై పంజరంలో పక్షులలాగా తిరుగుతున్నారు. ఓ అంగిరోవరా! మా దేవతల అస్త్రాలు ఇంతకుముందు అమోఘాలు అయినా ఆ దేవశత్రువు ప్రభావంవల్ల నిష్ఫలం అయ్యాయి. ఓ బృహస్పతీ! విష్ణువు ఆతడితో ఇరవైవేల సంవత్సరాలు యుద్ధం చేశాడు. అయినా ఆతడు మరణించలేదు. మహాశక్తిసంపన్నుడైన విష్ణువు కూడా ఆతడిని జయించలేదు. అందుచేత మేము యుద్ధంలో ఆతడి ముందు ఎలా నిలువగలం?

**ఏవముక్తస్తు శక్రేణ జీవః సార్ధం సురాధిపైః ।**
**సహస్రాక్షేణ చ విభుం సంప్రాహ్యాహ కుశధ్వజమ్ ॥23॥**

ఇంద్రుడు ఆ విధంగా పలకగా దేవతాశ్రేష్ఠులతో, ఇంద్రుడితో కలిసి బృహస్పతి బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్లి ఆ ప్రభువుతో ఇలా పలికాడు.

**సోఽపి తస్య ముఖాచ్ఛ్రుత్వా ప్రణయాత్ప్రణతార్తిహా ।**
**దేవైరశేషైః సేంద్రైస్తు జీవమాహ పితామహః ॥24॥**

**జానే వోఽర్తిం సురేంద్రాణాం తథాపి శృణు సాంప్రతమ్ ।**
**వినింద్య దక్షం యా దేవీ సతీ రుద్రాంగసంభవా ॥25॥**

**ఉమా హైమవతీ జజ్ఞే సర్వలోకనమస్కృతా ।**
**తస్యాశ్చైవేహ రూపేణ యూయం దేవాః సురోత్తమాః ॥26॥**

**విభోర్యతధ్వమాక్రష్టుం రుద్రస్యాస్య మనో మహత్ ।**
**తయోర్యోగేన సంభూతః స్కందః శక్తిధరః ప్రభుః ॥27॥**

**షడాస్యో ద్వాదశభుజః సేనానీః పావకిః ప్రభుః ।**
**స్వాహేయః కార్తికేయశ్చ గాంగేయః శరధామజః ॥28॥**

**దేవః శాఖో విశాఖశ్చ నైగమేశశ్చ వీర్యవాన్ ।**
**సేనాపతిః కుమారాఖ్యః సర్వలోకనమస్కృతః ॥29॥**

**లీలయైవ మహాసేనః ప్రబలం తారకాసురమ్ ।**
**బాలోఽపి వినిహత్యైకో దేవాన్ సంతారయిష్యతి ॥30॥**

బృహస్పతివల్ల సమస్తవిషయాన్ని విని శరణాగతుల కష్టాన్ని దూరం చేసే పితామహుడు ఇంద్రుడితో కూడా సమస్తదేవతలతో కలిసి వచ్చిన బృహస్పతితో ప్రేమపూర్వకంగా పలికాడు. నేను సమస్తదేవతల విపత్తిని తెలుసుకున్నాను. అయినా ఇపుడు ఇది వినండి! రుద్రుడి అంగంనుంచి పుట్టిన దేవి సతి అయ్యింది. ఆమె తన తండ్రి దక్షుణ్ణి నిందించి సమస్తలోకవంద్య అయిన ఉమారూపంలో హిమవంతుడి పుత్రికగా పుట్టింది. ఓ దేవతాశ్రేష్ఠులారా! మీరు ఆమె ద్వారా రుద్రభగవానుడి స్థిరమైన మనస్సును ఆకర్షించే ప్రయత్నం చేయండి. ఆ యిద్దరి సంగమం వల్ల శక్తిధరుడైన స్కందప్రభువు జన్మిస్తాడు. ఆతడు ఆరు ముఖాలవాడు. ద్వాదశ భుజాలవాడు. సేనాని. పావకుడు. ప్రభువు. స్వాహేయుడు. కార్తికేయుడు. గాంగేయుడు. శరధామజుడు. దేవుడు. శాఖుడు. విశాఖుడు. నైగమేశుడు. వీర్యవంతుడు. సేనాపతి మరియు కుమారుడు అనే పేర్లుగలవాడై సమస్తలోకాలచే నమస్కరింపబడతాడు. ఈ మహాసేనుడు బాలకుడయ్యు ప్రయాసలేకుండా ఒక్కడే మహాబలి తారకాసురుణ్ణి వధించి దేవతలైన మిమ్మల్ని ఉద్ధరిస్తాడు.

**ఏవముక్తస్తదా తేన బ్రహ్మణా పరమేష్ఠినా ।**
**బృహస్పతిస్తథా సేంద్రైర్దేవైర్దేవం ప్రణమ్య తమ్ ॥31॥**

**మేరోః శిఖరమాసాద్య స్మరం సస్మార సువ్రతః ।**
**స్మరణాద్దేవదేవస్య స్మరోఽపి సహ భార్యయా ॥32॥**

**రత్యా సమం సమాగమ్య నమస్కృత్య కృతాంజలిః ।**
**సశక్రమాహ తం జీవం జగజ్జీవో ద్విజోత్తమాః ॥33॥**

**స్మృతో యద్భవతా జీవ సంప్రాప్తోఽహం తవాంతికమ్ ।**
**బ్రూహి యన్మే విధాతవ్యం తమాహ సురపూజితః ॥34॥**

**తమాహ భగవాన్ శక్రః సంభావ్య మకరధ్వజమ్ ।**
**శంకరేణాంబికామద్య సంయోజయ యథాసుఖమ్ ॥35॥**

**తయా స రమతే యేన భగవాన్ వృషభధ్వజః ।**
**తేన మార్గేణ మార్గస్వ పత్న్యా రత్యానయా సహ ॥36॥**

**సోఽపి తుష్టో మహాదేవః ప్రదాస్యతి శుభాం గతిమ్ ।**
**విప్రయుక్తస్తయా పూర్వం లబ్ధ్వా తాం గిరిజాముమామ్ ॥37॥**

పరమేష్ఠి బ్రహ్మ ఈ విధంగా పలకగా దేవతలతో సువ్రతుడైన బృహస్పతి దేవుదేవుడైన బ్రహ్మకు నమస్కరించి ఇంద్రుడితో కలిసి మేరుశిఖరానికి వెళ్లి కామదేవుడిని స్మరించాడు. ఓ ద్విజశ్రేష్ఠులారా! దేవుగురువు స్మరించినంతమాత్రంగా జగజ్జీవనస్వరూపుడైన కామదేవుడు కూడా తన భార్య రతిదేవితో కలిసి అక్కడకు వచ్చి చేతులు జోడించి నమస్కరించి ఇంద్రసహితుడైన బృహస్పతితో ఇలా పలికాడు. ఓ బృహస్పతీ! నన్ను మీరు స్మరించారు. అందుకే నేను మీ దగ్గరకు వచ్చాను. నేనేమి చేయాలో చెప్పండి. అపుడు బృహస్పతితో కూడిన ఇంద్రుడు మన్మథుని ప్రశంసిస్తూ ఇలా పలికాడు. ఇపుడు నీవు సుఖపూర్వకంగా శంకరుడితో అంబికకు సంయోగం కలిగించు. భగవానుడు వృషభధ్వజుడు ఏదో ఉపాయంతో ఆమెతో రమించేలాగా చేయి. నీవు నీ పత్ని రతి కలిసి ఉపాయాన్ని రచించండి. ఇతఃపూర్వం సతీదేవితో వియుక్తుడైన మహాదేవుడు నీ ప్రయత్నం వల్ల పార్వతీదేవిని పొంది సంతృప్తుడై మాకు శుభాన్ని ప్రదానం చేస్తాడు.

**ఏవముక్తో నమస్కృత్య దేవదేవం శచీపతిమ్ ।**
**దేవదేవాశ్రమం గంతుం మతిం చక్రే తయా సహ ॥38॥**

**గత్వా తదాశ్రమే శంభోః సహ రత్యా మహాబలః ।**
**వసంతేన సహాయేన దేవం యోక్తుమనాభవత్ ॥39॥**

ఇంద్రుడు ఆ విధంగా పలుకగా మన్మథుడు దేవదేవుడైన ఇంద్రుడికి నమస్కరించి రతిదేవితో కలిసి శివుడి ఆశ్రమానికి వెళ్లడానికి సిద్ధపడ్డాడు. అపుడు రతితో అట్లే సహాయకుడైన వసంతుడితో శివుడి ఆశ్రమానికి వెళ్లి మహాబలుడు అయిన మన్మథుడు పార్వతీదేవితో శివుణ్ణి కలపడానికై నిశ్చయించాడు.

**తతః సంప్రేక్ష్య మదనం హసన్ దేవస్త్రియంబకః ।**
**నయనేన తృతీయేన సావజ్ఞం తమవైక్షత ॥40॥**

**తతోఽస్య నేత్రజో వహ్నిర్మదనం పార్శ్వతః స్థితమ్ ।**
**అదహత్ తత్క్షణాదేవ లలాప కరుణం రతిః ॥41॥**

**రత్యాః ప్రలాపమాకర్ణ్య దేవదేవో వృషధ్వజః ।**
**కృపయా పరయా ప్రాహ కామపత్నీం నిరీక్ష్య చ ॥42॥**

**అమూర్తోఽపి ధ్రువం భద్రే కార్యం సర్వం పతిస్తవ ।**
**రతికాలే ధ్రువం భద్రే కరిష్యతి న సంశయః ॥43॥**

**యదా విష్ణుశ్చ భవితా వాసుదేవో మహాయశాః ।**
**శాపాద్ భృగోర్మహాతేజాః సర్వలోకహితాయ వై ॥ 44॥**

**తదా తస్య సుతో యశ్చ స పతిస్తే భవిష్యతి ।**

అనంతరం కామదేవుణ్ణి చూచి ముక్కంటి శివుడు నవ్వుతూ తిరస్కారపూర్వకంగా ఆతణ్ణి మూడో నేత్రంతో చూశాడు. ఆ మూడో కంటినుంచి పుట్టిన అగ్ని ప్రక్కనే నిలిచి ఉన్న మన్మథుణ్ణి ఆ క్షణంలోనే దహించింది. అపుడు రతి ఎంతో దీనంగా విలపించింది. రతియొక్క ఆ దీన విలాపాన్ని విని దేవదేవవృషధ్వజుడు పరమమైన కృపతో మదనుడి పత్నిని చూచి ఆమెతో ఇలా పలికాడు. ఓ భద్రా! నీ పతి దేహరహితుడయ్యి రతిసమయంలో నిశ్చితరూపంలో సంపూర్ణ కార్యాన్ని నిర్వహించగలుగుతాడు. ఇందులో సందేహం లేదు. విష్ణువు భృగుశాపం వల్ల లోకహితార్థం మహాయశస్వి, మహాతేజస్వి అయిన వాసుదేవుడి రూపంలో అవతరిస్తాడు. అపుడు ఆయనకు కలిగే పుత్రుడు (ప్రద్యుమ్నుడు) నీకు పతి కాగలడు.

**సా ప్రణమ్య తదా రుద్రం కామపత్నీ శుచిస్మితా ॥45॥**
**జగామ మదనం లబ్ధ్వా వసంతేన సమన్వితా ॥46॥**

అపుడు మన్మథుడి భార్య రతి స్వచ్ఛమైన నవ్వుగలదియై రుద్రభగవానుడికి నమస్కరించి అనంగుణ్ణి పొంది వసంతుడితో కలిసి వెళ్లింది.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే మదనదాహో నామైకాధికశతతమోఽధ్యాయః ॥101॥**

శ్రీలింగమహాపురాణం పూర్వభాగంలోని మదనదాహమనే నూట ఒకటవ అధ్యాయం సమాప్తం.

## **ద్వ్యధికశతతమోఽధ్యాయః** - నూట రెండవ అధ్యాయం

## **ఉమాస్వయంవరః** - ఉమాస్వయంవరం

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**తపసా చ మహాదేవ్యాః పార్వత్యా వృషభధ్వజః ।**
**ప్రీతశ్చ భగవాన్ శర్వో వచనాద్ బ్రహ్మణస్తదా ॥1॥**

**హితాయ చాశ్రమాణాం చ క్రీడార్థం భగవాన్ భవః ।**
**తదా హైమవతీం దేవీముపయేమే యథావిధి ॥2॥**

ఓ ఋషులారా! భగవాన్ వృషధ్వజుడు అయిన శర్వుడు పార్వతి తపస్సుచేత ప్రసన్నుడయ్యాడు. తర్వాత బ్రహ్మకు చెప్పి భవుడు ఆశ్రమవాసులందరి హితార్థం మరియు క్రీడార్థంగా విధిపూర్వకంగా పార్వతీదేవిని వివాహమాడాడు.

**జగామ స స్వయం బ్రహ్మా మరీచ్యాద్యైర్మహర్షిభిః ।**
**తపోవనం మహాదేవ్యాః పార్వత్యాః పద్మసంభవః ॥3॥**

**ప్రదక్షిణీకృత్య చ తాం దేవీం స జగతోఽరణీమ్ ।**
**కిమర్థం తపసా లోకాన్ సంతాపయసి శైలజే ॥4॥**

**త్వయా సృష్టం జగత్సర్వం మాతస్త్వం మా వినాశయ ।**
**త్వం హి సంధారయే లోకానిమాన్ సర్వాన్ స్వతేజసా ॥5॥**

**సర్వదేవేశ్వరః శ్రీమాన్ సర్వలోకపతిర్భవః ।**
**యస్య వై దేవదేవస్య వయం కింకరవాదినః ॥6॥**

**స ఏవం పరమేశానః స్వయం చ వరయిష్యతి ।**
**వరదే యేన సృష్టామి న వినా యస్త్వయాంబికే ॥7॥**

**వర్తతే నాత్ర సందేహస్తవ భర్తా భవిష్యతి ।**

అపుడు బ్రహ్మదేవుడు స్వయంగా మరీచి మొదలైన మహర్షులతో కలిసి మహాదేవి పార్వతి తపస్సుచేస్తున్న తపోవనానికి వెళ్లాడు. వాళ్లు జగత్తుకు నిమిత్తకారణస్వరూపమయిన పార్వతీదేవికి ప్రదక్షిణం చేసి ఇలా పలికారు. ఓ శైలజా! నీవు దేనికోసం లోకాల్ని ఈ విధంగా మిక్కిలి తపింపజేస్తున్నావు? ఓ తల్లీ! నీవే సంపూర్ణజగత్తును సృష్టించావు. కావున నీవు దీనికి వినాశనాన్ని కలిగించవద్దు. నీవు నీ తేజస్సుతో ఈ సమస్తలోకాల్ని ధరిస్తున్నావు. శ్రీమంతుడైన శివుడు సమస్తదేవతలకు ఈశ్వరుడు. అట్లే అన్ని లోకాలకు స్వామి. మేము దేవాధిదేవుడైన ఆయనకు సేవకులం. ఆతడే స్వయంగా నిన్ను వరిస్తాడు. ఓ వరదాయినీ! అందుకే నీవు సృష్టింపబడ్డావు. ఓ అంబికా! నీవు లేక ఆయన లేడు. శివుడు నీకు పతి కాగలడు. ఇందులో సందేహం లేదు.

**ఇత్యుక్త్వా తాం నమస్కృత్య ముహుః సంప్రేక్ష్య పార్వతీమ్ ॥8॥**

**గతే పితామహే దేవో భగవాన్ పరమేశ్వరః ।**
**జగామానుగ్రహం కర్తుం ద్విజరూపేణ చాశ్రమమ్ ॥9॥**

ఆ విధంగా పలికి పార్వతికి నమస్కరించి మాటిమాటికి ఆమెను చూచి బ్రహ్మ వెళ్లగా శివుడు ఆమెను అనుగ్రహించడానికి బ్రాహ్మణరూపంలో ఆశ్రమానికి వెళ్లాడు.

**సా చ దృష్ట్వా మహాదేవం ద్విజరూపేణ సంస్థితమ్ ।**
**ప్రతిభాద్యైః ప్రభుం జ్ఞాత్వా ననామ వృషభధ్వజమ్ ॥10॥**

**సంపూజ్య వరదం దేవం బ్రాహ్మణఛద్మనాగతమ్ ।**
**తుష్టావ పరమేశానం పార్వతీ పరమేశ్వరమ్ ॥11॥**

ద్విజరూపంలో వచ్చిన మహాదేవుణ్ణి చూచి పార్వతి ఆతడి కాంతి మొదలైన వాటి ద్వారా వృషభధ్వజుడని గుర్తించి నమస్కరించింది. బ్రాహ్మణవేషంలో వచ్చిన వరదాత అయిన శివుణ్ణి పూజించి పరమేశానుడు అయిన పరమేశ్వరుణ్ణి స్తుతించింది.

**అనుగృహ్య తదా దేవీమువాచ ప్రహసన్నివ ।**
**కులధర్మాశ్రయం రక్షన్ భూధరస్య మహాత్మన ః ॥12॥**

**క్రీడార్థం చ సతాం మధ్యే సర్వదేవపతిర్భవః ।**
**స్వయంవరే మహాదేవి తవ దివ్యసుశోభనే ॥13॥**

**ఆస్థాయ రూపం యత్సౌమ్యం సమేష్యేఽహం సహ త్వయా ।**

అపుడు దేవిని అనుగ్రహించి శివుడు నవ్వుతూ పలికాడు. ఓ మహాదేవి! సమస్తదేవతలందరికి స్వామినైన నేను శివుణ్ణి, మహాత్ముడైన హిమవంతుడి కులధర్మపరంపరను రక్షిస్తూ క్రీడార్థంగా సజ్జనుల మధ్యలో దివ్యమూ మరియు అతిసుందరమూ అయిన నీ స్వయంవరంలో నేను సౌమ్యరూపాన్ని ధరించి నిన్ను పొందుతాను.

**ఇత్యుక్త్వా తాం సమాలోక్య దేవో దివ్యేన చక్షుషా ॥4॥**

**జగామేష్టం తదా దివ్యం స్వపురం ప్రయయౌ చ సా ।**
**దృష్ట్వా హృష్టస్తదా దేవీం మేనయా తుహినాచలః ॥15॥**

**ఆలింగ్యాఘ్రాయ సంపూజ్య పుత్రీం సాక్షాత్తపస్వినీమ్ ।**
**దుహితుర్దేవదేవేన న జానన్నభిమంత్రితమ్ ॥16॥**

**స్వయంవరం తదా దేవ్యాః సర్వలోకేష్వఘోషయత్ ।**

ఆ విధంగా పలికి ఆమెను దివ్యదృష్టితో చూచి శివుడు తన ఇష్టలోకాలకు వెళ్లాడు. తర్వాత ఆమె కూడా తన పురానికి వెళ్లింది. అపుడు పార్వతీదేవిని చూచి మేనాదేవితో కలిసి హిమాలయుడు స్వయంగా తపస్విని

అయిన తన పుత్రికను ఆలింగనం చేసుకుని, ఆమె మస్తకాన్ని ఆఘ్రాణించి మరియు ఆమెను పూజించి మిక్కిలి సంతృప్తుడయ్యాడు. దేవాధిదేవుడు తన కుమార్తెను స్వీకరిస్తాడనే విషయం తెలియక హిమాలయుడు సమస్తలోకాల్లో దేవి పార్వతి స్వయంవరాన్ని ప్రకటించాడు.

**అథ బ్రహ్మా చ భగవాన్ విష్ణుః సాక్షాజ్జనార్దనః ॥17॥**

**శక్రశ్చ భగవాన్ వహ్నిర్భాస్కరో భగ ఏవ చ ।**
**త్వష్టార్యమా వివస్వాంశ్చ యమో వరుణ ఏవ చ ॥18॥**

**వాయుః సోమస్తథేశానో రుద్రాశ్చ మునయస్తథా ।**
**అశ్వినౌ ద్వాదశాదిత్యా గంధర్వా గరుడస్తథా ॥19॥**

**యక్షాః సిద్ధాస్తథా సాధ్యా దైత్యాః కింపురుషోరగాః ।**
**సముద్రాశ్చ నదా వేదా మంత్రాః స్తోత్రాదయః క్షణాః ॥20॥**

**నాగాశ్చ పర్వతాః సర్వే యజ్ఞాః సూర్యాదయో గ్రహాః ।**
**త్రయస్త్రింశశ్చ దేవానాం త్రయశ్చ త్రిశతం తథా ॥21॥**

**త్రయశ్చ త్రిసహస్రం చ తథాన్యే బహవః సురాః ।**

**జగ్ముర్గిరీంద్రపుత్ర్యాస్తు స్వయంవరమనుత్తమమ్ ॥22॥**

స్వయంవరప్రకటనం తర్వాత బ్రహ్మ, సాక్షాత్తు భగవాన్ జనార్దనుడు, ఐశ్వర్యశాలి యింద్రుడు, అగ్నిదేవుడు, సూర్యుడు, భగుడు, త్వష్టడు, అర్యముడు, వివస్వంతుడు, యముడు, వరుణుడు, వాయువు, సోముడు, ఈశానుడు, సమస్తరుద్రులు, మునిగణాలు, ఇద్దరు అశ్వనీదేవతలు, ద్వాదశాదిత్యులు, సమస్తగంధర్వులు, గరుడుడు, యక్షులు, సిద్ధులు, సాధ్యులు, దైత్యులు, కింపురుషులు, ఉరగులు, సముద్రుడు, నదులు, వేదాలు, మంత్రాలు, స్తోత్రాదులు, క్షణాలు, నగాలు,పర్వతాలు,సమస్తయజ్ఞాలు,సూర్యాదిగ్రహాలు,వసువులు,రుద్రులు,ఆదిత్యులు మొదలైనవాళ్లు ముప్పై ముగ్గురు దేవతలు- భేదప్రభేదరూపాలవాళ్లు, బ్రహ్మ విష్ణుమహేశ్వరులు అయిన ముగ్గురు- మూడు వేల మూడు వందల ముగ్గురు దేవతలు అట్లే ఎందరో ఇతర దేవతలు పర్వతరాజపుత్రి అయిన పార్వతీదేవి స్వయంవరానికివచ్చారు.

**అథ శైలసుతా దేవీ హైమమారుహ్య శోభనమ్ ।**
**విమానం సర్వతోభద్రం సర్వరత్నైరలంకృతమ్ ॥23॥**

**అప్సరోభిః ప్రనృత్తాభిః సర్వాభరణభూషితైః ।**
**గంధర్వసిద్ధైర్వివిధైః కిన్నరైశ్చ సుశోభనైః ॥24॥**

**వందిభిః స్తూయమానా చ స్థితా శైలసుతా తదా ।**
**సితాతపత్రం రత్నాంశుమిశ్రితం చావహత్తథా ॥25॥**

**మాలినీ గిరిపుత్ర్యాస్తు సంధ్యా పూర్ణేందుమండలమ్ ।**
**చామరాసక్తహస్తాభిర్దివ్యస్త్రీభిశ్చ సంవృతా ॥26॥**

**మాలాం గృహ్యా జయా తస్థౌ సురద్రుమసముద్భవామ్ ।**
**విజయా వ్యజనం గృహ్యా స్థితా దేవ్యాః సమీపగా ॥27॥**

తర్వాత పార్వతీదేవి సువర్ణనిర్మితమూ, సమస్త రత్నాలంకృతమూ అయిన సర్వతోభద్రం అనే ఉత్తమమైన విమానాన్ని అధిరోహించి, నృత్యం చేస్తున్న అప్సరసలతో, సర్వభూషణాలతో అలంకృతులైన వివిధ గంధర్వులతో, సిద్ధులతో, అట్లే పరమసుందరులైన కిన్నరులతో కూడినదై, వందిమాగధులతో కీర్తింపబడుతున్నది. ఆమె చెలికత్తె మాలిని రత్నకిరణమిశ్రితం, సంధ్యాసమయ చంద్రమండలసంకాశం అయిన శ్వేతచ్ఛత్రాన్ని పార్వతీదేవికి పట్టింది. వింజామరయుక్తహస్తాలుగల స్త్రీలు ఆమెను పరివేష్టించి యున్నారు. కల్పవృక్ష పుష్పాలతో కూర్చిన మాలను హస్త మందు ధరించి జయ అనే సఖి నిలిచి ఉన్నది. విజయ అనే చెలి వింజామరను పట్టుకుని ఆమె చెంతనే ఉన్నది.

**మాలాం ప్రగృహ్యా దేవ్యాం తు స్థితాయాం దేవసంసది ।**
**శిశుర్భూత్వా మహాదేవః క్రీడార్థం వృషభధ్వజః ॥28॥**

**ఉత్సంగతలసంసుప్తో బభూవ భగవాన్ భవః ।**
**అథ దృష్ట్వా శిశుం దేవాస్తస్యా ఉత్సంగవర్జితమ్ ॥29॥**

**కోఽయమత్రేతి సంమంత్ర్య చుక్షుభుశ్చ సమాగతాః ।**

దేవతల సభలో వరమాలను హస్తమందు ధరించి ఉన్న సమయంలో వృషభధ్వజుడు, భవుడు, మహాదేవుడు అయిన శివుడు క్రీడార్థం ఒక శిశురూపంలో పార్వతీదేవి ఉత్సంగంలో నిద్రిస్తున్నట్లున్నాడు. అపుడు ఆమె ఒడిలో నిద్రిస్తున్న శిశువును చూచి "అక్కడున్న ఆతడెవడు" అని ఆలోచించి దేవగణాలు ఎంతో క్షోభపడ్డారు.

**వజ్రమాహారయత్తస్య బాహుముద్యమ్య వృత్రహా ॥30॥**

**స బాహురుద్యమస్తస్య తథైవ సముపస్థితః ।**
**స్తంభితః శిశురూపేణ దేవదేవేన లీలయా ॥31॥**

**వజ్రం క్షేప్తుం న శశాక బాహుం చాలయితుం తథా ।**
**వహ్నిః శక్తిం తథా క్షేప్తుం న శశాక తథాస్థితః ॥32॥**

వృత్రాసురసంహారి అయిన ఇంద్రుడు తన భుజాన్ని ఎత్తి దానిపై వజ్రాయుధాన్ని ధరించాడు. అయితే ఎత్తిన ఆతడి బాహువు స్తంభించింది. శిశురూపంలో ఉన్న దేవదేవశివుడు లీలాపూర్వకంగా స్తంభింపజేసిన ఇంద్రుడి బాహువును వజ్రాన్ని కదల్చడానికి విసరడానికి అసమర్థమైంది. అగ్ని కూడా తన శక్తిని విసరలేకపోయి అట్లే నిలిచిపోయాడు.

**యమోఽపి దండం ఖడ్గం చ నిరృతిర్మునిపుంగవాః ।**
**వరుణో నాగపాశం చ ధ్వజయష్టిం సమీరణః ॥33॥**

**సోమో గదాం ధనేశశ్చ దండం దండభృతాం వరః ।**
**ఈశానశ్చ తథా శూలం తీవ్రముద్యమ్య సంస్థితః ॥34॥**

**రుద్రాశ్చ శూలమాదిత్యా ముసలం వసవస్తథా ।**
**ముద్గరం స్తంభితాః సర్వే దేవేనాశు దివౌకసః ॥35॥**

**స్తంభితా దేవదేవేన తథాన్యే చ దివౌకసః ।**

ఓ శ్రేష్ఠమునులారా! ఈ విధంగా యముడు తన దండాన్ని, నిర్ఋతి తన ఖడ్గాన్ని, వరుణుడు తన నాగపాశాన్ని, వాయువు తన ధ్వజదండాన్ని, సోముడు తన గదని, దండధారుల్లో శ్రేష్ఠుడైన కుబేరుడు తన దండాన్ని, ఈశానుడు తన తీక్ష్ణమైన త్రిశూలాన్ని ప్రయోగింపలేకపోయారు. రుద్రులందరూ తమ శూలాల్ని, ఆదిత్యులందరూ ముసలాల్ని, వాయుగణాలు ముద్గరాల్ని పైకెత్తి కూడా ప్రయోగింపలేక నిలిచిపోయారు. దేవతలందరూ వెంటనే శివుడి వల్ల స్తంభించిపోయారు. ఈ విధంగా అన్యదేవతల్ని కూడా శివుడు స్తంభింపచేశాడు.

**శిరః ప్రకంపయన్ విష్ణుశ్చక్రముద్యమ్య సంస్థితః ॥36॥**

**తస్యాపి శిరసో బాలః స్థిరత్వం ప్రచకార హ ।**
**చక్రం క్షేప్తుం న శశాక బాహూంశ్చాలయితుం న చ ॥37॥**

**పూషా దంతాన్ దశన్ దంతైర్బాలమైక్షత మోహితః ।**
**తస్యాపి దశనాః పేతుఃదృష్టమాత్రస్య శంభునా ॥38॥**

**బలం తేజశ్చ యోగం చ తథైవాస్తంభయద్విభుః ।**

శిరస్సును బాగా కంపింపజేస్తూ చక్రాన్ని చేతియందు ధరించి విష్ణువు నిలిచాడు. ఆ బాలుడు విష్ణువు శిరస్సును స్థిరపర్చాడు. చేతులు కదపలేక విష్ణువు చక్రాన్ని విసరలేకపోయాడు. పూషుడు సమ్మోహితుడై పళ్లను పటపటా కొరుక్కున్నాడు. శివుడు చూడగానే ఆతడి దంతాలు ఊడిపడ్డాయి. ఈ విధంగా శివభగవానుడు అందరి బలాన్ని, తేజస్సును, యోగాన్ని స్తంభింపజేశాడు.

**అథ తేషు స్థితేష్వేవ మన్యుమత్సు సురేష్వపి ॥39॥**

**బ్రహ్మా పరమసంవిగ్నో ధ్యానమాస్థాయ శంకరమ్ ।**
**బుబుధే దేవమీశానముమోత్సంగే తమాస్థితమ్ ॥40॥**

**స బుద్ధ్వా దేవమీశానం శీఘ్రముత్థాయ విస్మితః ।**
**వవందే చరణౌ శంభోరస్తువచ్చ పితామహః ॥41॥**

**పురాణైః సామసంగీతైః పుణ్యాఖ్యైర్గుహ్యనామభిః ।**

క్రోధభరితులైన సమస్తదేవతలు స్తంభింపబడిన తర్వాత అత్యంత వ్యాకులుడైన బ్రహ్మ శంకరుణ్ణి ధ్యానించి పార్వతీదేవి ఉత్సంగంలో గల శిశువు భగవాన్ ఈశ్వరుడేనని తెలుసుకున్నాడు. విస్మితుడై వెంటనే లేచి ఈశ్వరుణ్ణి చేరి ఆయన చరణాలకు నమస్కరించి ప్రాచీన సామగానాలతో పవిత్రనామాలతో అట్లే గూఢనామాలతో ఆయన్ని స్తుతించాడు.

**స్రష్టా త్వం సర్వలోకానాం ప్రకృతేశ్చ ప్రవర్తకః ॥42॥**

**బుద్ధిస్త్వం సర్వలోకానామహంకారస్త్వమీశ్వరః ।**
**భూతానామింద్రియాణాం చ త్వమేవేశ ప్రవర్తకః ॥43॥**

**తవాహం దక్షిణాద్ధస్తాత్సృష్టః పూర్వం పురాతనః ।**
**వామహస్తాన్మహాబాహో దేవో నారాయణః ప్రభుః ॥44॥**

**ఇయం చ ప్రకృతిర్దేవీ సదా తే సృష్టికారణా ।**
**పత్నీరూపం సమాస్థాయ జగత్కారణమాగతా ॥45॥**

**నమస్తుభ్యం మహాదేవ మహాదేవ్యై నమో నమః ।**
**ప్రసాదాత్తవ దేవేశ నియోగాచ్చ మయా ప్రజాః ॥46॥**

**దేవాద్యాస్తు ఇమాః సృష్టా మూఢాస్త్వద్యోగమోహితా ః ।**
**కురు ప్రసాదమేతేషాం యథాపూర్వం భవంత్విమే ॥47॥**

నీవు సమస్తలోకాల్ని సృష్టించావు. అట్లే ప్రకృతి ప్రవర్తకుడవు. నీవు సమస్తలోకాల బుద్ధివి. అట్లే అహంకారానివి. నీవు ఈశ్వరుడవు. ఓ ఈశా! నీవు సమస్తప్రాణుల ఇంద్రియాల ప్రవర్తకుడవు. ఓ మహాబాహూ! అందరికన్నా ముందుగా దక్షిణహస్తంనుంచి పురాతనుడనైన (బ్రహ్మ) నేను పుట్టాను. వామహస్తంనుంచి నారాయణుడు పుట్టాడు. ఓ సృష్టికారకా! ఈ దేవి ప్రకృతి ఎల్లప్పుడూ నీ భార్యారూపిణి అయి జగత్తుకు కారణభూత అవుతున్నది. ఓ మహాదేవా! నీకు నమస్కారం. మహాదేవికి మాటిమాటికి నమస్కారం. ఓ దేవేశా! నేను నీ కృపతోనే, ఆదేశంతోనే ఈ ప్రజలు, దేవతలు మొదలైనవాళ్లని సృజించాను. నీ యోగం వల్ల మోహితులై దేవగణాలు ఇపుడు మూఢత్వాన్ని పొందారు. ఇపుడు నీవు వీరిని అనుగ్రహించు. వీళ్లు పూర్వస్థితిని పొందే విధంగా చేయి.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**విజ్ఞాప్యైవం తదా బ్రహ్మా దేవదేవం మహేశ్వరమ్ ।**
**సంస్తంభితాంస్తదా తేన భగవానాహ పద్మజః ॥48॥**

**మూఢాస్థ దేవతాః సర్వా నైవ బుధ్యత శంకరమ్ ।**
**దేవదేవమిహాయాంతం సర్వదేవనమస్కృతమ్ ॥49॥**

**గచ్ఛధ్వం శరణం శీఘ్రం దేవాః శక్రపురోగమాః ।**
**సనారాయణకాః సర్వే మునిభిః శంకరం ప్రభుమ్ ॥50॥**

**సార్ధం మయైవ దేవేశం పరమాత్మానమీశ్వరమ్ ।**
**అనయా హైమవత్యా చ ప్రకృత్యా సహ సత్తమమ్ ॥51॥**

ఈ విధంగా దేవదేవమహేశ్వరుణ్ణి స్తుతించిన పద్మభవుడైన, బ్రహ్మ ఈశ్వరుడి వల్ల స్తంభితులైన దేవతలతో ఇలా పలికాడు. మూఢత్వం పొందిన మీరు దేవతలందరిచేత, దేవులచేత నమస్కరింపబడే ఇక్కడకు వచ్చిన

శంకరుణ్ణి గుర్తించలేదు. ఓ దేవతలారా! ఇంద్రాదులైన మీ దేవతలందరూ, నారాయణుడు, మునులందరూ, నేనూ ప్రకృతిస్వరూపుడు, పార్వతీదేవితో విరాజమానుడు, సర్వశ్రేష్ఠుడు, ప్రభువు, దేవేశ్వరుడు, పరమాత్మ అయిన శంకరుణ్ణి వెంటనే శరణు వేడుదాం.

**తత్ర తే స్తంభితాస్తేన తథైవ సురసత్తమాః ।**
**ప్రణేముర్మనసా సర్వే సనారాయణకాః ప్రభుమ్ ॥52॥**

అపుడు శివుడి ద్వారా అప్పటి వరకూ స్తంభితులైన శ్రేష్ఠదేవతలందరూ నారాయణుడితో కూడా మనసులో శివుడికి నమస్కరించారు.

**అథ తేషాం ప్రసన్నోఽభూద్దేవదేవస్త్రియంబకః ।**
**యథాపూర్వం చకారాశు వచనాద్ బ్రహ్మణః ప్రభుః ॥53॥**

తర్వాత దేవదేవుడు త్రిలోచనుడు అయిన శంకరుడు వాళ్లకై ప్రసన్నుడై బ్రహ్మ ప్రార్థనానుసారంగా అందర్నీ పూర్వస్థితికి తెచ్చాడు.

**తత ఏవం ప్రసన్నే తు సర్వదేవనివారణమ్ ।**
**వపుశ్చకార దేవేశో దివ్యం పరమమద్భుతమ్ ॥54॥**

ఆ విధంగా ప్రసన్నుడైన తర్వాత దేవదేవుడు ఆ దేవతలందరూ చూడలేని దివ్యమైన పరమమైన దేహాన్ని ధరించాడు.

**తేజసా తస్య దేవాస్తే సేంద్రచంద్రదివాకరాః ।**
**సబ్రహ్మకాః ససాధ్యాశ్చ సనారాయణకాస్తథా ॥55॥**

**సయమాశ్చ సరుద్రాశ్చ చక్షురప్రార్థయన్ విభుమ్ ।**
**తేభ్యశ్చ పరమం చక్షుః సర్వదృష్టౌ చ శక్తిమత్ ॥56॥**

**దదావంబాపతిః శర్వో భవాన్యాశ్చాచలస్య చ ।**

అపుడు ఆ దివ్యతేజస్సును చూచి ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు, బ్రహ్మ, నారాయణుడు, సాధ్యగణాలు, యముడు, రుద్రులందరూ, మిగిలిన దేవతలందరూ ప్రతిహతమైన దృష్టిగలవారు అయ్యారు. వాళ్లు అందరూ దివ్యదృష్టికై శివుణ్ణి ప్రార్థించారు. అపుడు ఉమాపతి శివుడు వాళ్లకు దాన్ని చూడడానికి సమర్థమైన దివ్యదృష్టినిచ్చాడు. వాళ్లతోపాటుగా పార్వతీదేవికి, హిమవంతుడికి కూడా దివ్యదృష్టిని ఇచ్చాడు.

**లబ్ధ్వా చక్షుస్తదా దేవా ఇంద్రవిష్ణుపురోగమాః ॥57॥**

**సబ్రహ్మకాః సశక్రాశ్చ తమపశ్యన్ మహేశ్వరమ్ ।**
**బ్రహ్మాద్యా నేమిరే తూర్ణం భవానీ చ గిరీశ్వరః ॥58॥**

**మునయశ్చ మహాదేవం గణేశాః శివసమ్మతాః ।**
**ససర్జుః పుష్పవృష్టిం చ ఖేచరాః సిద్ధచారణాః ॥59॥**

**దేవదుందుభయో నేదుస్తుష్టువుర్మునయః ప్రభుమ్ ।**
**జగుర్గంధర్వముఖ్యాశ్చ ననృతుశ్చాప్సరోగణాః ॥60॥**

**ముముహుర్గణపాః సర్వే ముమోదాంబా చ పార్వతీ ।**

అపుడు దివ్యదృష్టిని పొందిన బ్రహ్మ, ఇంద్రాది ప్రధాన దేవతలు, విష్ణువు ఆ మహేశ్వరుణ్ణి దర్శించారు. బ్రహ్మాది దేవతలు, భవాని, హిమవంతుడు, మునులు శివుడికి ప్రియమైన గణేశ్వరులు వెంటనే మహాదేవుడికి నమస్కరించారు. ఖేచరులైన సిద్ధులు, చారణులు పుష్పవృష్టి కురిపించారు. దేవదుందుభులు మ్రోగాయి. మునిగణాలు శివుణ్ణి స్తుతించారు. గంధర్వముఖ్యులు గానం చేశారు. అప్సరసలు నర్తించారు. గణనాయకులందరూ ఆనందించారు. పార్వతీదేవి కూడా సంతోషించింది.

**తస్య దేవీ తదా హృష్టా సమక్షం త్రిదివౌకసామ్ ॥61॥**

**పాదయోః స్థాపయామాస మాలాం దివ్యాం సుగంధినీమ్ ।**
**సాధు సాధ్వితి సంప్రోచ్య తయా తత్రైవ చార్చితమ్ ॥62॥**

**సహ దేవ్యా నమశ్చక్రుః శిరోభిర్భూతలాశ్రితైః ।**
**సర్వే సబ్రహ్మకా దేవాః సయక్షోరగరాక్షసాః ॥63॥**

అపుడు ఆనందించిన పార్వతీదేవి స్వర్గవాసుల సమక్షంలో ఆ శివభగవానుడి పాదాల మీద దివ్యం మరియు సుగంధితం అయిన ఆ మాలను సమర్పించింది. బ్రహ్మ, యక్షులు, ఉరగులు, రాక్షసులు మొదలైనవాళ్లతో కూడిన దేవతలందరూ "సాధు సాధు" అని పలికారు. అక్కడ పార్వతిచేత పూజింపబడిన శివుడికి పార్వతీదేవితో సహా వారందరూ సాష్టాంగంగా ప్రణమిల్లారు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే ఉమాస్వయంవరో నామ ద్వ్యధికశతతమోఽధ్యాయః ॥ 102 ॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని ఉమాస్వయంవరమనే నూట రెండవ అధ్యాయం సమాప్తం.

## త్ర్యధికశతతమోఽధ్యాయః - నూట మూడవ అధ్యాయం

## పార్వతీవివాహవర్ణనమ్ - పార్వతీవివాహవర్ణనం

**సూత ఉవాచ** - సూతర్షి పలికాడు.

**అథ బ్రహ్మా మహాదేవమభివంద్య కృతాంజలిః ।**
**ఉద్వాహః క్రియతాం దేవ ఇత్యువాచ మహేశ్వరమ్ ॥1॥**

ఓ ఋషులారా! తర్వాత బ్రహ్మ ముకుళితహస్తుడై మహాదేవుడైన పరమేశ్వరుడికి నమస్కరించి పలికాడు. ఓ దేవా! నీవు ఇపుడు వివాహమాడమని.

**తస్య తద్వచనం శ్రుత్వా బ్రహ్మణః పరమేష్ఠినః ।**
**యథేష్టమితి లోకేశం ప్రాహ భూతపతిః ప్రభుః ॥2॥**

పరమేష్ఠి బ్రహ్మ యొక్క ఆ మాట విని భూతపతి శివుడు లోకేశ్వరుడైన బ్రహ్మతో "నీ యిష్టం వచ్చినట్లే కానిమ్ము"అని పలికాడు.

**ఉద్వాహార్థం మహేశస్య తత్క్షణాదేవ సువ్రతాః ।**
**బ్రహ్మణా కల్పితం దివ్యం పురం రత్నమయం శుభమ్ ॥3॥**

ఓ సువ్రతులారా! బ్రహ్మ వెంటనే మహాదేవుడి వివాహంకోసం రత్నమయం, దివ్యం మరియు సుందరం అయిన నగరాన్ని నిర్మించాడు.

**అథాదితిర్దితిః సాక్షాద్దనుః కద్రుః సుకాలికా ।**
**పులోమా సురసా చైవ సింహికా వినతా తథా ॥4॥**

**సిద్ధిర్మాయా క్రియా దుర్గా దేవీ సాక్షాత్సుధా స్వధా ।**
**సావిత్రీ వేదమాతా చ రజనీ దక్షిణా ద్యుతిః ॥5॥**

**స్వాహా స్వధా మతిర్బుద్ధిరృద్ధిర్వృద్ధిః సరస్వతీ ।**
**రాకా కుహూః సినీవాలీ దేవీ అనుమతీ తథా ॥6॥**

**ధరణీ ధారణీ చేలా శచీ నారాయణీ తథా ।**
**ఏతాశ్చాన్యాశ్చ దేవానాం మాతరః పత్న్యయ స్తథా ॥7॥**

**ఉద్వాహః శంకరస్యేతి జగ్ముః సర్వా ముదాన్వితాః ।**
**ఉరగా గరుడా యక్షా గంధర్వాః కిన్నరా గణాః ॥8॥**

**సాగరా గిరయో మేఘా మాసాః సంవత్సరాస్తథా ।**
**వేదా మంత్రాస్తథా యజ్ఞాః స్తోమా ధర్మాశ్చ సర్వశః ॥9॥**

**హుంకారః ప్రణవశ్చైవ ప్రతిహారాః సహస్రశః ।**
**కోటిరప్సరసో దివ్యాస్తాసాం చ పరిచారికాః ॥10॥**

**యాశ్చ సర్వేషు ద్వీపేషు దేవలోకేషు నిమ్నగాః ।**
**తాశ్చ స్త్రీవిగ్రహాః సర్వాః సంజగ్ముర్హృష్టమానసాః ॥11॥**

**గణపాశ్చ మహాభాగాః సర్వలోకనమస్కృతాః ।**
**ఉద్వాహః శంకరస్యేతి తత్రాజగ్ముర్ముదాన్వితాః ॥12॥**

తర్వాత అదితి, దితి, సాక్షాత్తూ దనువు, కద్రువ, సుకాలిక, పులోమ, సురస, సింహిక, వినత, సిద్ధి, మాయ, క్రియ, సాక్షాత్తూ దుర్గాదేవి, సుధ, స్వధ, వేదమాత సావిత్రి, రజని, దక్షిణ, ద్యుతి, స్వాహ, స్వధ, మతి, బుద్ధి, ఋద్ధి, వృద్ధి, సరస్వతి, రాక, కుహువు, సినీవాలి, అనుమతీదేవి, ధరణి, ధారణి, ఇళ, శచీదేవి, నారాయణి – వీళ్లందరూ, ఇతరులైన దేవమాతలు, దేవపత్నులు శంకరుడి వివాహమని సంతోషంగా వెళ్లారు. నాగులందరూ, గరుడుడు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు, గణాలు, సముద్రాలు, పర్వతాలు, మేఘాలు, మాసాలు, సంవత్సరాలు, వేదాలు, మంత్రాలు, యజ్ఞాలు, స్తోమాలు, ధర్మాలు, హుంకారం, ప్రణవం, వేలమంది ప్రతిహారులు, కోటిమంది దివ్యాప్సరసలు, వారి పరిచారికలు, సమస్త ద్వీపాలలోని, అట్లే దేవలోకంలోని స్త్రీ రూపాల్ని ధరించిన నదులు వాళ్లందరూ ప్రసన్నచిత్తులై వివాహం దగ్గరకు వెళ్లారు. సర్వలోకవందితులు అయిన గణేశ్వరులు శంకరుడి వివాహమని తలచి అక్కడికి వెళ్లారు.

**అభ్యయుః శంఖవర్ణాశ్చ గణకోట్యో గణేశ్వరాః ।**
**దశభిః కేకరాక్షశ్చ విద్యుతోఽష్టాభిరేవ చ ॥13॥**

**చతుఃషష్ట్యా విశాఖాశ్చ నవభిః పారయాత్రికః ।**
**షడ్భిః సర్వాంతకః శ్రీమాన్ తథైవ వికృతాననః ॥14॥**

**జ్వాలాకేశో ద్వాదశభిః కోటిభిర్గణపుంగవః ।**
**సప్తభిః సమదః శ్రీమాన్ దుందుభోఽష్టాభిరేవ చ ॥15॥**

**పంచభిశ్చ కపాలీశః షడ్భిః సందారకః శుభః ।**
**కోటికోటిభిరేవేహ గండకః కుంభక స్తథా ॥16॥**

శంఖసమానవర్ణంగల కోటానుకోట్ల గణాలతో గణాధిపతులు కలిసి వచ్చారు. కేకరాక్షుడు పదికోట్ల గణాలతోను, విద్యుతుడు ఎనిమిదికోట్ల గణాలతోను, విశాఖుడు అరవైనాల్గుకోట్ల గణాలతోను, పారయాత్రికుడు తొమ్మిదికోట్ల గణాలతోను, శ్రీమంతుడైన సర్వాంతకుడు ఆరుకోట్ల గణాలతోను, వికృతాననుడు కూడా ఆరుకోట్ల గణాలతోను, గణశ్రేష్ఠుడైన జ్వాలాకేశుడు పండ్రెండుకోట్ల గణాలతోను, శ్రీమంతుడైన సమదుడు ఏడుకోట్ల గణాలతోను, దుందుభి ఎనిమిది కోట్ల గణాలతోను, కపాలీశుడు ఐదుకోట్ల గణాలతోను, ఉత్తముడైన సందాకరుడు ఆరుకోట్ల గణాలతోను మరియు గండకుడు అట్లే కుంభకుడు కోటి కోటి గణాలతోను వివాహానికి వచ్చారు.

**విష్టంభోఽష్టాభిరేవేహ గణపః సర్వసత్తమః ।**
**పిప్పలశ్చ సహస్రేణ సన్నాదశ్చ తథా ద్విజాః ॥17॥**

**ఆవేష్టనస్తథాష్టాభిః సప్తభిశ్చంద్రతాపనః ।**
**మహాకేశః సహస్రేణ కోటీనాం గణపో వృతః ॥18॥**

ఓ ద్విజులారా! సర్వగణశ్రేష్ఠుడు విష్టంభుడు ఎనిమిదికోట్ల గణాలతో, మరియు పిప్పలుడు అట్లే సన్నాదుడు ఒక్కొక్కడు వేయి కోట్ల గణాలతో వచ్చారు. ఆవేష్టనుడు ఎనిమిదికోట్ల గణాలతోను, చంద్రతాపనుడు ఏడుకోట్ల గణాలతోను మరియు మహాకేశుడు వేయికోట్ల గణాలతోను వివాహానికి వచ్చారు.

**కుండీ ద్వాదశభిర్వీరస్తథా పర్వతకః శుభః ।**
**కాలశ్చ కాలకశ్చైవ మహాకాలః శతేన వై ॥19॥**

**అగ్నికః శతకోట్యా వై కోట్యాగ్నిముఖ ఏవ చ ।**
**ఆదిత్యమూర్ధా కోట్యా చ తథా చైవ ధనావహః ॥20॥**

పరాక్రమశాలి గణేశ్వరుడు కుండి, శుభుడు, పర్వతకుడు, పన్నెండుకోట్లగణాలతోను, కాలుడు, కాలకుడు, అట్లే మహాకాలుడు నూరుకోట్ల గణాలతో; అగ్నిముఖుడు ఒక కోటి గణాలతో వచ్చారు. ఇట్లే ఆదిత్యమూర్ధుడు, ధనావహుడు ఒక్కొక్క కోటి గణాలతో వచ్చారు.

**సన్నామశ్చ శతేనైవ కుముదః కోటిభిస్తథా ।**
**అమోఘః కోకిలశ్చైవ కోటికోట్యా సుమంత్రకః ॥21॥**

**కాకపాదోఽపరః షష్ట్యా షష్ట్యా సంతానకః ప్రభుః ।**
**మహాబలశ్చ నవభిర్మధుపింగశ్చ పింగళః ॥ 22॥**

**నీలో నవత్యా దేవేశః పూర్ణభద్రస్తథైవ చ ।**
**కోటీనాం చైవ సప్తత్యా చతుర్వక్త్రో మహాబలః ॥23॥**

**కోటికోటిసహస్రాణాం శతైర్వింశతిభిర్వృతాః ।**
**తత్రాజగ్ముస్తథా దేవాస్తే సర్వే శంకరం భవమ్ ॥24॥**

సన్నాముడు అట్లే కుముదుడు నూరుకోట్ల గణాలతో వచ్చారు. అమోఘుడు, కోకిలుడు అట్లే సుమంత్రకుడు కోటి కోటి గణాలతో వచ్చారు. రెండోవాడైన కాకపాదుడు అరవై కోట్ల గణాలతో; సంతానకుడు అరవై కోట్ల గణాలతోను; మహాబలుడు మధువు, పింగుడు అట్లే పింగలుడు తొమ్మిదికోట్ల గణాలతో వచ్చారు. నీలుడు, దేవేశుడు, అట్లే పూర్ణభద్రుడు తొంబదికోట్ల గణాలతోను; అట్లే మహాబలశాలి చతుర్వక్త్రుడు డెబ్బైకోట్ల గణాలతోను వచ్చారు. ఈ గణనాథులందరూ లక్షకోట్ల గణాలతో కూడుకొని శంకరభగవానుడి దగ్గరకు వచ్చారు.

**భూతకోటి సహస్రేణ ప్రమథః కోటిభిస్త్రిభిః ।**
**వీరభద్రశ్చతుఃషష్ట్యా రోమజాశ్చైవకోటిభిః ॥25॥**

**కరణశ్చైవ వింశత్యా నవత్యా కేవలః శుభః ।**
**పంచాక్షః శతమన్యుశ్చ మేఘమన్యుస్తథైవ చ ॥26॥**

**కాష్ఠకూటశ్చతుఃషష్ట్యా సుకేశో వృషభస్తథా ।**
**విరూపాక్షశ్చ భగవాన్ చతుఃషష్ట్యా సనాతనః ॥27॥**

**తాలకేతుః షడాస్యశ్చ పంచాస్యశ్చ సనాతనః ।**
**సంవర్తకస్తథా చైత్రో లకులీశః స్వయం ప్రభుః ॥28॥**

**లోకాంతకశ్చ దీప్తాస్యో తథా దైత్యాంతకః ప్రభుః ।**
**మృత్యుహృత్కాలహో కాలో మృత్యుంజయకరస్తథా ॥29॥**

**విషాదో విషదశ్చైవ విద్యుతః కాంతకః ప్రభుః ।**
**దేవో భృంగి రిటిః శ్రీమాన్ దేవదేవప్రియస్తథా ॥30॥**

**అశనిర్భాసకశ్చైవ చతుఃషష్ట్యా సహస్రపాత్ ।**
**ఏతో చాన్యే చ గణపా అసంఖ్యాతా మహాబలాః ॥31॥**

**సర్వే సహస్రహస్తాశ్చ జటాముకుటధారిణః ।**
**చంద్రరేఖావతంసాశ్చ నీలకంఠాస్త్రిలోచనాః ॥32॥**

**హారకుండలకేయూరముకుటాద్యైరలంకృతాః ।**
**బ్రహ్మేంద్రవిష్ణుసంకాశా అణిమాదిగుణైర్వృతాః ॥33॥**

**సూర్యకోటి ప్రతీకాశా స్తత్రాజగ్ముర్గణేశ్వరాః ।**
**పాతాలచారిణశ్చైవ సర్వలోకనివాసినః ॥34॥**

**తుంబరుర్నారదో హాహా హూహూశ్చైవ తు సామగాః ।**
**రత్నాన్యాదాయ వాద్యాంశ్చ తత్రాజగ్ముస్తదా పురమ్ ॥35॥**

ప్రమథుడు వేయికోట్ల భూతాలతోను, అట్లే మూడుకోట్లగణాలతోను వచ్చాడు. వీరభద్రుడు అరవైనాలుగు కోట్లతోను మరియు రోమజుడు కోటిగణాలతోను వచ్చారు. కరణుడు ఇరవై కోట్లగణాలతో మరియు కేవలుడు, శుభుడు, పంచాక్షుడు, శతమన్యువు అట్లే మేఘమన్యువు కూడా తొంబది కోట్ల గణాలతో వచ్చారు. కాష్ఠకూటుడు, సుకేశుడు, అట్లే వృషభుడు అరవైనాలుగు కోట్లగణాలతో మరియు భగవానుడు, సనాతనుడు, విరూపాక్షుడు కూడా అరవైనాలుగుకోట్లగణాలతో వచ్చారు. ఈ విధంగా తాలకేతు, షడాస్యుడు, పంచాస్యుడు, సనాతనుడు, సంవర్తకుడు, చైత్రుడు, సాక్షాత్తు ప్రభువు లకులీశుడు, లోకాంతకుడు, దీప్తాస్యుడు, ప్రభువు దైత్యాంతకుడు, మృత్యుహృత్తు, కాలహుడు, కాలుడు, మృత్యుంజయకరుడు, విషాదుడు, విషదుడు, విద్యుతుడు, ప్రభువైన కాంతకుడు, దేవుడు, భృంగి, రిటి, శ్రీమంతుడైన దేవదేవప్రియుడు, అశని, భాసకుడు అట్లే సహస్రపాదుడు ఆరవైనాలుగుకోట్ల గణాలతో కలిసి వచ్చారు. వీళ్లందరేగాక అసంఖ్యాకులైన బలవంతులైన ఇతర గణనాయకులు కూడా వచ్చారు. వీళ్లందరూ వేయి హస్తాలు గలవాళ్లు, జటాజూటాన్ని మకుటాన్ని ధరించేవాళ్లు, శిరోభూషణంగా చంద్రరేఖగల

వాళ్లు, నీలకంఠులు, ముక్కంటులు, హారాలు, కుండలాలు, కేయూరాలు, కిరీటాలు మొదలైన వీటితో అలంకృతులు, బ్రహ్మేంద్రవిష్ణువులతో సమానమైన ప్రతీతిగలవాళ్లు, అణిమాది అష్టసిద్ధులుగలవాళ్లు, కోటిసూర్యులతో సమానమైన కాంతిమంతులు, పాతాళలోకమందు చరించేవాళ్లు, అన్ని లోకాలలోను నివసించేవాళ్లు, గణేశ్వరులు అక్కడకు వచ్చారు. తుంబురుడు, నారదుడు, హాహా, హూహూ అట్లే సామగానం చేసేవాళ్లు రత్నాలు అట్లే వాద్యయంత్రాలు తీసుకుని ఆ పురానికి వచ్చారు.

**ఋషయః కృత్స్నశస్తస్య దేవగీతాస్తపోధనాః ।**
**పుణ్యాన్ వైవాహికాన్ మంత్రానజపుర్హృష్టమానసాః ॥36॥**

దేవతలద్వారా స్తుతింపబడిన తపోధనులైన సమస్త ఋషులు ప్రసన్నచిత్తులై వివాహసంబంధమైన పవిత్రమైన మంత్రాల్ని పఠించారు.

**తత ఏవం ప్రవృత్తే తు సర్వతశ్చ సమాగమే ।**
**గిరిజాం తామలంకృత్య స్వయమేవ శుచిస్మితామ్ ॥37॥**

**పురం ప్రవేశయామాస స్వయమాదాయ కేశవః ।**
**సదస్యాహ చ దేవేశం నారాయణమజో హరిమ్ ॥38॥**

**భవానగ్రే సముత్పన్నో భవాన్యా సహ దేవతైః ।**
**వామాంగాదస్య రుద్రస్య దక్షిణాంగాదహం ప్రభో ॥39॥**

**మన్మూర్తిస్తుహినాద్రీశో యజ్ఞార్థం సృష్ట ఏవ హి ।**
**ఏషా హైమవతీ జజ్ఞే మాయయా పరమేష్ఠినః ॥40॥**

**శ్రౌతస్మార్త ప్రవృత్యర్థముద్వాహార్థమిహాగతః ।**
**అతోఽసౌ జగతాం ధాత్రీధాతతవ మమాపిచ ॥41॥**

**అస్య దేవస్య రుద్రస్య మూర్తిభిర్విహితం జగత్ ।**
**క్ష్మాంబగ్నిఖేందు సూర్యాత్మపవనాత్మా యతో భవః ॥42॥**

**తథాపి తస్మై దాతవ్యా వచనాచ్చ గిరేర్మమ ।**
**ఏషా హ్యజా శుక్లకృష్ణా లోహితా ప్రకృతిర్భవాన్ ॥43॥**

**శ్రేయోఽపి శైలరాజేన సంబంధోఽయం తవాపి చ ।**
**తవ పాద్మే సముద్భూతః కల్పే నాభ్యంబుజాదహమ్ ॥44॥**

**మదంశస్యాస్య శైలస్య మమాపి చ గురుర్భవాన్ ।**

ఈ విధంగా అందరూ పరిపూర్ణంగా ఉపస్థితులైన తర్వాత విష్ణువు పవిత్రమైన నగుమోముగల పార్వతీదేవిని అలంకరింపజేసి స్వయంగా తానే తీసుకుని నగరంలోనికి ప్రవేశించాడు. తర్వాత బ్రహ్మదేవుడు దేవప్రభువు నారాయణుడైన విష్ణువును గూర్చి సభలో ఇలా పలికాడు. ఓ ప్రభూ! ముందుగా ఈ రుద్రుడి వామాంగం నుంచి

నీవు, ఈ భవాని – దేవతలతో కలిసి జన్మించారు. నేను దక్షిణాంగంనుంచి పుట్టాను. నా అంశ స్వరూపుడైన ఈ పర్వతరాజు హిమవంతుడు వాస్తవానికి ఈ యజ్ఞంకోసమే ఉత్పన్నుడయ్యాడు. ఈ పార్వతీదేవి పరమేష్ఠి శివుడి మాయవల్ల హిమవంతుడి పుత్రికగా జన్మించింది. అందుచేత ఈ లోకాలన్నింటికీ నీకు మాదిరిగా నాకూ ఈమె జనని. శ్రౌతం మరియు స్మార్తరూపమైన ప్రవృత్తికోసం వివాహాన్ని ఉద్దేశించి ఇక్కడకు వచ్చిన ఈ రుద్రుడు మన అందరికి జనకుడు. భూమి, నీరు, అగ్ని, ఆకాశం, వాయువు, సూర్యచంద్రులు అట్లే ఆత్మ శివుడి విగ్రహస్వరూపాలు. అందువల్ల ఈ రుద్రదేవుడి మూర్తులనుంచే జగత్తు ఉత్పన్నమైనది. అయినప్పటికి హిమవంతుడు నా వచనంగా శుక్లం–కృష్ణం–లోహితం వర్ణాలుగల, మాయారూపిణి అయిన ఈ పార్వతిని శివుడి నిమిత్తమై ప్రదానం చేయవలసి ఉన్నది. ఓ విష్ణూ! నీవు కూడా ప్రకృతిస్వరూపుడవే. పర్వతరాజు హిమవంతుడితో ఈ సంబంధం నీకు కూడా శుభకరం. నేను పద్మకల్పంలో నీ నాభికమలంనుంచి జన్మించాను. అందుచేత నీవు నాకు, నా అంశస్వరూపుడైన హిమాలయుడికి జనకుడవు.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**బాఢమిత్యజమాహాసౌ దేవదేవో జనార్దనః ॥45॥**

**దేవాశ్చ మునయః సర్వే దేవదేవశ్చ శంకరః ।**
**తతశ్చోత్థాయ విద్వాన్ సః పద్మనాభః ప్రణమ్య తామ్ ॥46॥**

**పాదౌ ప్రక్షాల్య దేవస్య కరాభ్యాం కమలేక్షణః ।**
**అభ్యుక్షదాత్మనో మూర్ధ్ని బ్రహ్మణశ్చ గిరేస్తథా ॥47॥**

**త్వదీయైషా వివాహార్థం మేనజా హ్యనుజా మమ ।**
**ఇత్యుక్త్వా సోదకం దత్త్వా దేవీం దేవేశ్వరాయ తామ్ ॥48॥**

**స్వాత్మానామపి దేవాయ సోదకం ప్రదదౌ హరిః ।**

ఓ మునులారా! అపుడు దేవదేవుడు జనార్దనుడు బ్రహ్మతో ఇలా పలికాడు. నీవు చెప్పింది నిజమే. అపుడు దేవగణాలు, మునులందరూ అట్లే దేవదేవుడు శివుడు ప్రసన్నులు కాగా కమలనేత్రుడు, పద్మనాభుడు, విద్వాంసుడు అయిన విష్ణువు లేచి ఆ పార్వతికి నమస్కరించి, తన చేతులతో శివుడి పాదద్వయాన్ని కడిగి, తన శిరసపై, బ్రహ్మదేవుడి, హిమవంతుడి శిరస్సులపై ఆ జలాన్ని చల్లి, “ఓ దేవా! నీ నిత్యసంబంధానికై, వివాహవిధిసిద్ధికై ఈ దేవిని మేనాదేవినుంచి జన్మింపజేశావు. ఈమె నా చిన్న చెల్లెలు” అని పలికి పార్వతిని జలసహితంగా శివుడికి సమర్పించాడు. స్వయంగా తనను కూడా జలసహితంగా సమర్పించుకున్నాడు.

**అథ సర్వే మునిశ్రేష్ఠాః సర్వవేదార్థపారగాః ॥49॥**

**ఊచుర్దాతా గృహీతా చ ఫలం ద్రవ్యం విచారతః ।**
**ఏష దేవో హరో నూనం మాయయా హి తతో జగత్ ॥50॥**

**ఇత్యుక్త్వా తం ప్రణేముశ్చ ప్రీతికంటకితత్వచః ।**

తర్వాత సర్వవేదార్థప్రవీణులైన మునిశ్రేష్ఠులు ఇలా పలికారు. "విచారించగా వాస్తవంగా ఈ మహాదేవశివుడే దాత, గ్రహీత. అట్లే ద్రవ్యమూ, ఫలమూ అన్నీ ఆతడే. ఆతడి మాయవల్లే ఈ జగత్తు నిలిచి ఉన్నది" అని పలికి సంతోషకారణంగా రోమాంచితులై అందరూ శివుడికి నమస్కరించారు.

**ససృజుః పుష్పవర్షాణి ఖేచరాః సిద్ధచారణాః ॥51॥**

**దేవదుందుభయో నేదుర్ననృతుశ్చాప్సరోగణాః ।**
**వేదాశ్చ మూర్తిమంతస్తే ప్రణేముస్తం మహేశ్వరమ్ ॥52॥**

**బ్రహ్మణా మునిభిః సార్ధం దేవదేవముమాపతిమ్ ।**

ఆ సమయంలో ఆకాశసంచారులైన సిద్ధులు, చారణులు పుష్పవర్షాన్ని కురిపించారు. దేవతలు దుందుభులు మ్రోగించారు. అప్సరసలు నాట్యం చేశారు. వేదాలన్నీ శరీరధారులై బ్రహ్మ మరియు మునులతోపాటు దేవదేవుడు ఉమాపతికి నమస్కరించాయి.

**దేవోఽపి దేవీమాలోక్య సలజ్జాం హిమశైలజామ్ ॥53॥**

**న తృప్యత్యనవద్యాంగీ సా చ దేవం వృషధ్వజమ్ ।**
**వరదోఽస్మీతి తం ప్రాహ హరిం సోఽప్యాహ శంకరమ్ ॥54॥**

**త్వయి భక్తిః ప్రసీదేతి బ్రహ్మత్వం చ దదౌ తు సః ।**
**తతస్తు పునరేవాహ బ్రహ్మా విజ్ఞాపయన్ ప్రభుమ్ ॥55॥**

**హవిర్జుహోమి వహ్నౌ తు ఉపాధ్యాయపదే స్థితః ।**
**దదాసి మమ యద్యాజ్ఞాం కర్తవ్యో హ్యకృతో విధిః ॥56॥**

లజ్జాభరిత అయిన పార్వతీదేవిని చూచి శివుడు తృప్తి చెందలేదు. కీర్తింపదగిన శరీరంగల పార్వతీదేవియు వృషభధ్వజుడైన శంకరుణ్ణి చూచి తృప్తి చెందలేదు. అపుడు శివుడు విష్ణువుతో అన్నాడు. "నేను వరదాతను". తర్వాత విష్ణువు కూడా శంకరుడితో ఇలా అన్నాడు. నీయందు నాకు భక్తిని కలిగించు. నాకై ప్రసన్నుడవుకా. అపుడు శివుడు ఆతడికి బ్రహ్మత్వాన్ని ప్రదానం చేశాడు. తర్వాత బ్రహ్మదేవుడు శివుడిని ప్రార్థిస్తూ ఇలా పలికాడు. నేను ఉపాధ్యాయపదవిలో ఉండి అగ్నికి హవిస్సులిస్తున్నాను. నీవు ఆజ్ఞ ఇస్తే ఇప్పటివరకు నేను విధ్యుక్తకార్యాల్ని చేయకున్ననూ ఇప్పుడు చేస్తాను.

**తమాహ శంకరో దేవం దేవదేవో జగత్పతిః ।**
**యద్యదిష్టం సురశ్రేష్ఠ తత్కురుష్వ యథేప్సితమ్ ॥57॥**

**కర్తాస్మి వచనం సర్వం దేవదేవ పితామహ ।**

అపుడు జగన్నాథుడు, దేవదేవుడు శంకరుడు ఆ బ్రహ్మదేవుడితో ఇలా పలికాడు. "ఓ సురశ్రేష్ఠా! నీకు ఏదేది యిష్టమో, వాటిని నీ ఇచ్ఛానుసారంగా నిర్వర్తించు. ఓ దేవదేవా! పితామహా! నేను నీ సర్వవచనాల్ని మన్నిస్తాను.

**తతః ప్రణమ్య హృష్టాత్మా బ్రహ్మా లోకపితామహః ॥58॥**

**హస్తం దేవస్య దేవ్యాశ్చ యుయోజ పరమం ప్రభుః ।**
**జ్వలనశ్చ స్వయం తత్ర కృతాంజలిరుపస్థితః ॥59॥**

**శ్రౌతైరేతైర్మహామంత్రైర్మూర్తిమద్భిరుపస్థితైః ।**
**యథోక్తవిధినా హుత్వా లాజానపి యథాక్రమమ్ ॥60॥**

**ఆనీతాన్ విష్ణునా విప్రాన్ సంపూజ్య వివిధైర్వరైః ।**
**త్రిశ్చ తం జ్వలనం దేవం కారయిత్వా ప్రదక్షిణమ్ ॥61॥**

**ముక్త్వా హస్తసమాయోగం సహితైః సర్వదైవతైః ।**
**సురైశ్చ మానవైః సర్వైః ప్రహృష్టేనాంతరాత్మనా ॥62॥**

**ననామ భగవాన్ బ్రహ్మా దేవదేవముమాపతిమ్ ।**

అనంతరం ప్రసన్నచిత్తుడు, పరమప్రభువు, లోకపితామహుడు అయిన బ్రహ్మ శివపార్వతుల హస్తాల్ని కలిపాడు. అగ్నిదేవుడు స్వయంగా చేతులు జోడించి నిలిచాడు. మూర్తిమంతాలైన, వివాహ సంబంధాలైన శ్రుతిమహామంత్రాల ద్వారా విధ్యుక్తంగా ఆహుతులిచ్చి, తర్వాత విష్ణువు తెచ్చిన ధాన్యపు పొడితో యథావిధి ఆహుతులిచ్చి, వివిధాలైన గోదానాలతో విప్రుల్ని పూజించి, మూడుసార్లు అగ్నిదేవుడికి ప్రదక్షిణ చేసి, కలిపి పట్టి ఉంచిన చేతుల్ని విడదీసి, బ్రహ్మదేవుడు ప్రసన్నమనస్కుడై దేవతలందరితోను, ఋషులతోను, మనుష్యులతోను కలిసి దేవదేవుడైన పార్వతీపతికి నమస్కరించాడు.

**తతః పాద్యం తయోర్దత్త్వా శంభోరాచమనం తథా ॥63॥**

**మధుపర్కం తథా గాం చ ప్రణమ్య చ పునః శివమ్ ।**
**అతిష్ఠద్భగవాన్ బ్రహ్మా దేవైరింద్రపురోగమైః ॥64॥**

తర్వాత ఆ దంపతులిద్దరికి పాద్యానికై జలాన్ని యిచ్చి మరియు శివుడికి ఆచమనం, మధుపర్కం, గోవును ప్రదానం చేసి మరల శివుడికి నమస్కరించి బ్రహ్మదేవుడు ఇంద్రాది దేవతలతో కూడి కూర్చున్నాడు.

**భృగ్వాద్యా మునయః సర్వే చాక్షతైస్తిలతండులైః ।**
**సూర్యాదయః సమభ్యర్చ్య తుష్టువుర్వృషభధ్వజమ్ ॥65॥**

భృగ్వాదులైన సమస్తమునులు, సూర్యాదిగ్రహాలు అక్షతలతో అట్లే తిలలతో, తండులాలతో వృషభధ్వజుడైన శివుణ్ణి అర్చించి స్తుతించారు.

**శివః సమాప్య దేవోక్తం వహ్నిమారోప్య చాత్మని ।**
**తయా సమాగతో రుద్రః సర్వలోకహితాయ వై ॥66॥**

అనంతరం రుద్రుడైన శివుడు బ్రహ్మోక్తమైన సమస్తవైవాహిక కృత్యాన్ని పూర్తిచేసి అగ్నిని తనయందు ఆరోపించుకుని సర్వలోకహితార్థం ఆ పార్వతీదేవితో కలిసి అక్కడే ఉన్నాడు.

**యః పఠేచ్ఛృణుయాద్వాపి భవోద్వాహం శుచిస్మితః ।**
**శ్రావయేద్వా ద్విజాన్ శుద్ధాన్ వేదవేదాంగపారగాన్ ॥67॥**

**స లబ్ధ్వా గాణపత్యం చ భవేన సహ మోదతే ।**
**యత్రాయం కీర్త్యతే విప్రైస్తావదాస్తే తదా భవః ॥68॥**

**తస్మాత్సంపూజ్య విధివత్కీర్తయేన్నాన్యథా ద్విజాః ।**
**ఉద్వాహే చ ద్విజేంద్రాణాం క్షత్రియాణాం ద్విజోత్తమాః ॥69॥**

**కీర్తనీయమిదం సర్వం భవోద్వాహమనుత్తమమ్ ।**

ఎవడు పవిత్రుడై ప్రసన్నతాపూర్వకంగా శివుడి ఈ వివాహంయొక్క ఆఖ్యానకాన్ని పఠిస్తాడో లేక వింటాడో లేక వేదవేదాంగపారగులైన శుద్ధవిప్రులకు వినిపిస్తాడో, ఆతడు గణపతి పదవిని పొంది శివుడితో కూడి ఆనందిస్తాడు. ఎక్కడ బ్రాహ్మణులద్వారా ఈ వివాహప్రసంగం చెప్పబడుతుందో, అక్కడ శివభగవానుడు నిలిచి ఉంటాడు. ఇందులో సందేహం లేదు. ఓ ద్విజులారా! అందుచేత విధ్యుక్తంగా శివుణ్ణి పూజించి ఈ కథను అవశ్యం చెప్పవలసి ఉంది. ఓ ద్విజోత్తములారా! ద్విజశ్రేష్ఠుల మరియు క్షత్రియుల వివాహ కాలమందు ఈ అత్యుత్తమమైన సంపూర్ణమైన వివాహ ప్రసంగం కీర్తించవలసి ఉంది.

**కృతోద్వాహ స్తదా దేవ్యా హైమవత్యా వృషధ్వజః ॥70॥**

**సగణో నందినా సార్ధం సర్వదేవగణైర్వృతః ।**
**పురీం వారాణసీం దివ్యామాజగామ మహాద్యుతిః ॥71॥**

వివాహం పూర్తికాగా మహాకాంతిమంతుడైన శివుడు తన గణాలతోను, నందితోను, సర్వదేవగణాలతోను పార్వతీదేవితోను కలిసి దివ్యమైన వారణాసీ నగరానికి వెళ్లాడు.

**అవిముక్తే సుఖాసీనం ప్రణమ్య వృషభధ్వజమ్ ।**
**అపృచ్ఛత్ క్షేత్రమాహాత్మ్యం భవానీ హర్షితాననా ॥72॥**

తర్వాత ఆనందం నిండిన వదనంగల పార్వతీదేవి అవిముక్తంలో (వారణాసిలో) సుఖాసీనుడైన వృషభధ్వజుడైన శంకరుడికి నమస్కరించి క్షేత్రమాహాత్మ్యాన్నిగూర్చి చెప్పమని అడిగింది.

**అథాహార్ధేందుతిలకః క్షేత్రమాహాత్మ్య మనుత్తమమ్ ।**
**అవిముక్తస్య మాహాత్మ్యం విస్తరాచ్ఛక్యతే న హి ॥73॥**

**వక్తుం మయా సురేశాని ఋషిసంఘాభిపూజితమ్ ।**
**కిం మయా వర్ణ్యతే దేవి హ్యవిముక్తఫలోదయః ॥74॥**

**పాపినాం యత్ర ముక్తిః స్యాన్మృతానామేకజన్మనా ।**
**అన్యత్ర తు కృతం పాపం వారాణస్యాం వ్యపోహతి ॥75॥**

**వారాణస్యాం కృతం పాపం పైశాచ్యనరకావహమ్ ।**
**కృత్వా పాపసహస్రాణి పిశాచత్వం వరం నృణామ్ ॥76॥**

**న తు శక్రసహస్రత్వం స్వర్గే కాశీపురీం వినా ।**
**యత్ర త్రివిష్టపో దేవో యత్ర విశ్వేశ్వరో విభుః ॥77॥**

**ఓంకారేశః కృత్తివాసా మృతానాం న పునర్భవః ।**

తర్వాత అర్ధచంద్రతిలకుడైన శివుడు ఉత్తమమైన ఆ క్షేత్రమాహాత్మ్యాన్ని వర్ణించదొడిగాడు. ఓ సురేశ్వరీ! నా ముఖంగా అవిముక్తక్షేత్రమాహాత్మ్యం సవిస్తరంగా చెప్పడంలేదు. సంగ్రహంగా చెబుతాను. ఈ క్షేత్రాన్ని ఋషులు పూజిస్తారు. నేను ఈ అవిముక్తక్షేత్రంలో నివసించేవాళ్ల పుణ్యఫలాన్ని ఎలా వర్ణించను. ఇక్కడ మరణించేవాళ్ల పాపం ఒకే జన్మలో విముక్తమవుతుంది. మానవులు వేరేచోట్ల చేసిన పాపం ఇక్కడ నశిస్తుంది. ఇక్కడ చేసే పాపం మాత్రం పిశాచంగా జన్మించే నరకంగా నిలుస్తుంది. వేల పాపాలు చేసేవాళ్లకు పిశాచత్వమే శ్రేష్ఠం. కాశీపురాన్ని విడిచి స్వర్గంలో వేయిసార్లు ఇంద్ర పదవిని పొందినా, అది శ్రేష్ఠమైనది కాదు. ఇక్కడ త్రివిష్టప భగవానుడు, విభుడు, విశ్వేశ్వరుడు, అట్లే కృత్తివాసుడు, ఓంకారేశుడు ఎల్లప్పుడూ విరాజమానులై ఉంటారు. ఈ కాశిలో మరణించినవాళ్లకు పునర్జన్మ ఉండదు.

**ఉక్త్వా క్షేత్రస్య మాహాత్మ్యం సంక్షేపాచ్ఛశిశేఖరః ॥78॥**

**దర్శయామాస చోద్యానం పరిత్యజ్య గణేశ్వరాన్ ।**
**తత్రైవ భగవాన్ జాతో గజవక్త్రో వినాయకః ॥79॥**

**దైత్యానాం విఘ్నరూపార్థమవిఘ్నాయ దివౌకసామ్ ।**
**ఏతద్వః కథితం సర్వం కథాసర్వస్వముత్తమమ్ ॥80॥**

**యథాశ్రుతం మయా సర్వం ప్రసాదాద్వః సుశోభనమ్ ॥81॥**

శశిధరుడైన శివుడు ఈ విధంగా సంక్షేపంగా క్షేత్రమాహాత్మ్యాన్ని చెప్పి, గణనాథుల్ని వదిలి పార్వతీదేవికి తన ఉద్యానవనాన్ని చూపాడు. భగవాన్ గజాననుడైన వినాయకుడు దానవులకు విఘ్నాల్ని కల్పించడానికి, దేవతల విఘ్నాల్ని తొలగించడానికి అక్కడే జన్మించాడు. ఓ ఋషులారా! నేను వ్యాసుడి దయవల్ల విన్నది, కథలన్నింటిలోను ఉత్తమమైనది, సుందరమూ మరియు సంపూర్ణమూ అయినది అయిన ఈ కథను సంగ్రహంగా మీకు చెప్పాను.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే పార్వతీవివాహవర్ణనం నామ త్ర్యధికశతతమోఽధ్యాయః ॥103॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని పార్వతీవివాహవర్ణనమనే నూట మూడవ అధ్యాయం సమాప్తం.

## చతురధికశతతమోఽధ్యాయః - నూట నాల్గవ అధ్యాయం

## దేవస్తుతిః - దేవస్తుతి

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**కథం వినాయకో జాతో గజవక్త్రో గణేశ్వరః ।**
**కథం ప్రభావస్తస్యైవం సూత వక్తుమిహార్హసి ॥1॥**

గణనాథుడు వినాయకుడు ఎలా జన్మించాడు? ఆతడి ప్రభావ మెట్టిది? ఆ విషయం నీవు చెప్పవలసింది!

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**ఏతస్మిన్నంతరే దేవాః సేంద్రోపేంద్రాః సమేత్య తే ।**
**ధర్మవిఘ్నం తదా కర్తుం దైత్యానామభవన్ ద్విజాః ॥2॥**

**అసురా యాతుధానాశ్చ రాక్షసాః క్రూరకర్మిణః ।**
**తామసాశ్చ తథా చాన్యే రాజసాశ్చ తథా భువి ॥3॥**

**అవిఘ్నం యజ్ఞదానాద్యైః సమభ్యర్చ్య మహేశ్వరమ్ ।**
**బ్రహ్మాణం చ హరిం విప్రా లబ్ధేప్సితవరా యతః ॥4॥**

**తతోఽస్మాకం సురశ్రేష్ఠాః సదా విజయసంభవః ।**
**తేషాం తతస్తు విఘ్నార్థమవిఘ్నాయ దివౌకసామ్ ॥5॥**

**పుత్రార్థం చైవ నారీణాం నరాణాం కర్మసిద్ధయే ।**
**విఘ్నేశం శంకరం స్రష్టుం గణపం స్తోతుమర్హథ ॥6॥**

ఓ ద్విజులారా! ఆ మధ్యకాలంలో ఇంద్రుడు అట్లే ఉపేంద్రుడితో కూడిన దేవగణాలు ఒక చోట చేరి దైత్యుల ధర్మాన్ని విఘ్నపర్చడానికి సమాయత్తులయ్యారు. ఇలా ఆలోచించారు. ఓ విప్రులారా! అసురులు, యాతుధానులు, క్రూరకర్ములైన రాక్షసులు, అట్లే భూమిపై ఇతరులు కొందరు తమోగుణాన్ని మరియు రజోగుణాన్ని కలిగియున్నారు. వాళ్లు వాళ్ల కార్యాల్ని అవిఘ్నంగా నిర్వహించుకోవడానికై యజ్ఞాలు, దానాలు చేయడం ద్వారా బ్రహ్మావిష్ణుమహేశ్వరుల్ని బాగా పూజించి అభీష్టవరాల్ని పొందారు. ఓ శ్రేష్ఠసురలారా! అందుచేత వాళ్లు మనల్ని ఎల్లప్పుడూ పరాభవిస్తున్నారు. ఇందుకై, వాళ్లకు విఘ్నాల్ని కలిగించడానికై, దేవతలమైన మనకు అవిఘ్నంకోసం, స్త్రీలకు పుత్రప్రాప్తికై, పురుషులకు కర్మఫలసిద్ధికై విఘ్నేశ్వరుడు అయిన గణపతిని సృష్టించడానికై మనమందరం శంకరుణ్ణి స్తుతించాలి.

**ఇత్యుక్త్వాన్యోఽన్యమనఘం తుష్టువుః శివమీశ్వరమ్ ।**
**నమః సర్వాత్మనే తుభ్యం సర్వజ్ఞాయ పినాకినే ॥7॥**

**అనఘాయ విరించాయ దేవ్యాః కార్యార్థదాయినే ।**
**అకాయాయార్ధకాయాయ హరేః కాయాపహారిణే ॥8॥**

**కాయాంతస్థామృతాధారమండలావస్థితాయ తే ।**
**కృతాది భేదకాలాయ కాలవేగాయ తే నమః ॥9॥**

వాళ్లందరూ అలా పలికి నిష్పాపుడైన శివుణ్ణి స్తుతించారు. నీవు సర్వాత్ముడవు, సర్వజ్ఞుడవు, పినాకపాణివి, నీకు నమస్కారం. నీవు నిష్పాపుడవు. విశేషరూపంలో ఈ బ్రహ్మాండాన్ని రచించినవాడవు, పార్వతీదేవి తపస్సునకు ఫలాన్ని ప్రదానం చేసినవాడవు. శరీరరహితుడవు. ప్రయోజనార్థం శరీరాన్ని ధరించినవాడవు. విష్ణువు దేహాన్ని హరించినవాడవు. దేహం లోపల అమృతాధారమండలంలో విరాజమానుడవై ఉండేవాడివి – నీకు నమస్కారం. కృతాదియుగకాలభేదాల్ని నిర్మించినవాడవు, నీవు కాలవేగానివి – నీకు నమస్కారం.

**కాలాగ్నిరుద్రరూపాయ ధర్మాద్యష్టపదాయ చ ।**
**కాలీవిశుద్ధదేహాయ కాలికాకారణాయ తే ॥10॥**

ప్రళయకాలాగ్ని సమానమైన భయంకరమైన రూపంగలవాడవు. ధర్మాదులైన ఎనిమిది పదాలు (స్థానాలు) గలవాడవు. మహాకాళిని విశుద్ధదేహగా (తెల్లటివర్ణం) చేసేవాడివి. కాళికాదేవిని సృష్టించినవాడివి. నీకు నమస్కారం.

**కాలకంఠాయ ముఖ్యాయ వాహనాయ వరాయ తే ।**
**అంబికాపతయే తుభ్యం హిరణ్యపతయే నమః ॥11॥**

కాలకంఠుడవు. ప్రధానుడవు. కర్మఫలప్రాపకుడవు. సర్వశ్రేష్ఠుడవు. నీకు నమస్కారం. అంబికాపతివి. హిరణ్యపతివి. నీకు నమస్కారం.

**హిరణ్యరేతసే చైవ నమః శర్వాయ శూలినే ।**
**కపాలదండపాశాసి చర్మాంకుశధరాయ చ ॥12॥**

**పతయే హైమవత్యాశ్చ హేమశుక్లాయ తే నమః ।**
**పీతశుక్లాయ రక్షార్థం సురాణాం కృష్ణవర్త్మనే ॥13॥**

హిరణ్యరేతస్కుడవు. శర్వుడవు. శూలివి. నీకు నమస్కారం. కపాలం, దండం, పాశం, ఖడ్గం, చర్మం, అంకుశం – వీటిని ధరించే నీకు నమస్కారం. పార్వతీపతివి. సువర్ణంతో సమానంగా శుక్లవర్ణం గలవాడవు (శుద్ధమైన) పీతం మరియు శుక్లవర్ణం గలవాడవు. దేవతల రక్షణార్థం అగ్నిరూపధారివి. నీకు నమస్కారం.

**పంచమాయ మహాపంచయజ్ఞినాం ఫలదాయ చ ।**
**పంచాస్యఫణిహారాయ పంచాక్షరమయాయ తే ॥14॥**

**పంచధా పంచకైవల్యదేవైరర్చితమూర్తయే ।**
**పంచాక్షరదృశే తుభ్యం పరాత్పరతరాయ తే ॥15॥**

పంచముఖుడవు. పంచమహాయజ్ఞకర్తలకు ఫలప్రదాతవు. ఐదు ముఖాలుగల సర్పాన్ని హారంగా ధరించువాడవు. పంచాక్షర మంత్రస్వరూపుడవు. నీకు నమస్కారం. ఐదు విధాలుగా, పంచకైవల్య దేవతల ద్వారా పూజింపబడే మూర్తివి. పంచాక్షర మంత్రదృష్టిగలవాడవు. పరాత్పరుడవు. నీకు నమస్కారం.

**షోడశస్వరవజ్రాంగవక్త్రాయాక్షయరూపిణే ।**
**కాదిపంచకహస్తాయ చాదిహస్తాయ తే నమః ॥16॥**

**టాదిపాదాయ రుద్రాయ తాదిపాదాయ తే నమః ।**
**పాదిమేంఢ్రాయ యద్యంగధాతుసప్తకధారిణే ॥17॥**

**శాంతాత్మరూపిణే సాక్షాత్ క్షదంతక్రోధినే నమః ।**
**లవరేఫహళాంగాయ నిరంగాయ చ తే నమః ॥18॥**

అకారాదులైన పదహారు వర్ణమయమైన వజ్రసమానమైన శరీరం మరియు ముఖంగలవాడవు. అక్షయరూపం గలవాడవు. 'క' కారంతో ప్రారంభమయ్యే ఐదు వర్ణాలుగల 'క' వర్గాక్షరరూపమైన హస్తం గలవాడవు. 'చ' కారంతో ప్రారంభమయ్యే ఐదు వర్ణాలుగల 'చ'వర్గాక్షరరూపమైన హస్తం గలవాడవు. 'ట' ఆదిగా ఐదు వర్ణాలు గల 'ట' వర్గాక్షర రూపమైన పాదం గలవాడివి. 'త' ఆదిగా ఐదు వర్ణాలు గల 'త' వర్గాక్షరరూపమైన పాదం గలవాడివి. 'ప' ఆదిగా ఐదు వర్ణాలు గల 'ప' వర్గాక్షర రూపమైన మేఢ్రం (లింగం) గలవాడివి. 'య' కారమయమైన అంగసంబంధమైన సప్తధాతువులు గలవాడివి. నీకు నమస్కారం. 'శ(షస)' వర్ణమయమైన ఆత్మరూపుడవు. 'క్ష' కారమయమైన ప్రళయరూపమైన క్రోధం గలవాడివి. నీకు నమస్కారం. 'ల,వ, రేఫ, హ, ళ' అనే ఈ అయిదు వర్ణరూపమైన హృదయం గలవాడవు. అంగరహితుడవు. నీకు నమస్కారం.

**సర్వేషామేవ భూతానాం హృది నిఃస్వనకారిణే ।**
**భ్రువోరంతే సదా సద్భిర్దృష్టాయాత్యంతభానవే ॥19॥**

**భానుసోమాగ్నినేత్రాయ పరమాత్మస్వరూపిణే ।**
**గుణత్రయోపరిస్థాయ తీర్థపాదాయ తే నమః ॥20॥**

ప్రాణులందరి హృదయంలో అనాహతనాదాన్ని చేయువాడవు, భక్తులకు ఎల్లప్పుడు భ్రూమధ్యంలో దర్శనం ఇచ్చేటివాడవు, మిక్కిలి కాంతిమంతుడవు. సూర్యచంద్రాగ్నిరూపమైన మూడు నేత్రాలుగలవాడవు. పరమాత్మ స్వరూపుడవు. త్రిగుణాలకన్నా పైన నిలిచి ఉన్నవాడవు. తీర్థరూపమైన పాదాలు గలవాడవు – నీకు నమస్కారం.

**తీర్థతత్త్వాయ సారాయ తస్మాదపి పరాయ తే ।**
**ఋగ్యజుఃసామవేదాయ ఓంకారాయ నమో నమః ॥21॥**

తీర్థరూపమైన తత్త్వం గలవాడివి. తీర్థఫలరూప సారస్వరూపుడవు. ఆ తీర్థఫలానికి కూడా పరస్వరూపుడవు (అధిష్ఠాత). నీకు నమస్కారం. ఋగ్యజుస్సామవేదస్వరూపుడవు. ఓంకారస్వరూపుడవు. నీకు మాటిమాటికి నమస్కారం.

**ఓంకారే త్రివిధం రూపమాస్థాయోపరివాసినే ।**
**పీతాయ కృష్ణవర్ణాయ రక్తాయాత్యంతతేజసే ॥22॥**

**స్థానపంచకసంస్థాయ పంచధాండబహిఃక్రమాత్ ।**
**బ్రహ్మణే విష్ణవే తుభ్యం కుమారాయ నమో నమః ॥23॥**

బ్రహ్మవిష్ణు మహేశ్వరులనే మూడు విధాలైన రూపాల్ని ధరించి ప్రణవానంతనాదంతో తురీయరూపంతో (నాల్గవ) స్థితుడవై ఉన్నట్టివాడవు. పీతం, కృష్ణం, రక్తం – ఈ మూడు వర్ణాలు గలవాడవు, అపరిమితమైన కాంతిగలవాడవు, బ్రహ్మాండానికి వెలుపల క్రమంగా పంచ విధాలుగా (జలాదులు) పంచ స్థానాల్లో ఉన్నట్టివాడవు. బ్రహ్మ, విష్ణు, కుమారస్వరూపుడవు – నీకు మాటిమాటికి నమస్కారం.

**అంబాయాః పరమేశాయ సర్వోపరిచరాయ తే ।**
**మూలసూక్ష్మస్వరూపాయ స్థూలసూక్ష్మాయ తే నమః ॥24॥**

పార్వతీశ్వరుడవు. అన్నింటికన్నా పైన విశేషంగా చరించువాడవు. నీకు నమస్కారం. మూలసూక్ష్మ స్వరూపుడవు. అట్లే స్థూలసూక్ష్మస్వరూపుడవు. నీకు నమస్కారం.

**సర్వసంకల్పశూన్యాయ సర్వస్మాద్రక్షితాయ తే ।**
**ఆదిమధ్యాంతశూన్యాయ చిత్సంస్థాయ నమో నమః ॥25॥**

సమస్తసంకల్పరహితుడవు. సర్వరక్షకుడవు. ఆది, మధ్య, అంతాలు లేనివాడవు. జ్ఞానమందు సంస్థితిని పొందినవాడవు. నీకు మాటిమాటికి నమస్కారం.

**యమాగ్నివాయురుద్రాంబుసోమశక్రనిశాచరైః ।**
**దిఙ్ముఖే దిఙ్ముఖే నిత్యం సగణైః పూజితాయ తే ॥26॥**
**సర్వేషు సర్వదా సర్వమార్గే సంపూజితాయ తే ।**
**రుద్రాయ రుద్రనీలాయ కద్రుద్రాయ ప్రచేతసే ॥27॥**

గణాలతో కూడిన యముడు, అగ్ని, వాయువు, రుద్రుడు, వరుణుడు, సోముడు, ఇంద్రుడు మరియు దానవులచే దిక్కులందు, విదిక్కులందు నిత్యం పూజింపబడే నీకు నమస్కారం. అన్ని లోకాలలో, అన్ని మార్గాలలో ఎల్లప్పుడు మిక్కిలి పూజింపబడే నీకు నమస్కారం. రుద్రుడవు. రుద్రనీలుడవు. కద్రుద్రుడవు, ప్రచేతసుడవు, మహేశ్వరుడవు, ధీరుడవు, సాక్షాత్తూ శివుడవు – నీకు నమస్కారం.

**అథ శృణు భగవాన్ స్తవచ్ఛలేన కథితమజేంద్రముఖైః సురాసురేశైః ।**
**మఖమదనయమాగ్నిదక్షయజ్ఞక్షపణవిచిత్రవిచేష్టితం క్షమస్వ ॥28॥**

ఓ భగవంతుడా! వినండి! దేవదానవులకు ప్రభువులు అయిన బ్రహ్మేంద్రాదులు, మఖుడు, మన్మథుడు, యముడు, అగ్ని దక్షయజ్ఞ విధ్వంసకారివి అయిన నీ విచిత్రక్రియాకలాపాల్ని వర్ణించి స్తుతిస్తున్నారు. వాటిని విని క్షమించు.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**యః పఠేత్తు స్తవం భక్త్యా శక్రాగ్నిప్రముఖైః సురైః ।**
**కీర్తితం శ్రావయేద్విద్వాన్ స యాతి పరమాం గతిమ్ ॥29॥**

విద్వాంసుడైనవాడు ఇంద్రుడు, అగ్ని మొదలైన దేవతాప్రముఖులచేత స్తుతింపబడిన ఈ స్తవాన్ని భక్తితో పఠిస్తాడో, ఇతరులకు విన్పిస్తాడో ఆతడు పరమమైన గతిని పొందుతున్నాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే పూర్వభాగే దేవస్తుతిర్నామ చతురధికశతతమోఽధ్యాయః ॥104॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగం దేవస్తుతి అనే నూట నాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచాధికశతతమోఽధ్యాయః - నూట అయిదవ అధ్యాయం

## వినాయకోత్పత్తిః - వినాయకోత్పత్తి

**సూత ఉవాచ :-** సూతుడు పలికాడు.

**యదా స్థితాః సురేశ్వరాః ప్రణమ్య చైవమీశ్వరమ్ ।**
**తదాంబికాపతిర్భవః పినాకధృజ్ మహేశ్వరః ॥1॥**

**దదౌ నిరీక్షణం క్షణాద్భవః స తాన్ సురోత్తమాన్ ।**
**ప్రణేమురాదరాద్ధరం సురా ముదార్ద్రలోచనాః ॥2॥**

ఓ ఋషులారా! శివుడికి నమస్కరించి ఆ సురేశ్వరులందరూ యథాస్థానంలో నిలిచారు. అపుడు అంబికాపతి, పినాకధారి, భవుడు, మహేశ్వరుడు అయిన శివుడు క్షణకాలంలో ఆ దేవతలకు దివ్యదృష్టిని ప్రదానం చేశాడు. అపుడు అశ్రుపూరితనేత్రాలతో ప్రసన్నులై దేవతలు ఆదరపూర్వకంగా శివుడికి నమస్కరించారు.

**భవః సుధామృతోపమైర్నిరీక్షణైర్నిరీక్షణాత్ ।**
**తదాహ భద్రమస్తు వః సురేశ్వరాన్ మహేశ్వరః ॥3॥**

తదుపరి మహేశ్వరుడు భవుడు సుధామృతతుల్యమైన దృష్టితో వారిని చూచి వారితో ఇలా పలికాడు- "మీకు కళ్యాణమగుగాక!".

**వరార్థమీశ వీక్ష్యతే సురా గృహం గతాస్త్విమే ।**
**ప్రణమ్య చాహ వాక్పతిః పతిం నిరీక్ష్య నిర్భయః ॥4॥**

**సురేతరాదిభిః సదా హ్యవిఘ్నమర్థితో భవాన్ ।**
**సమస్తకర్మసిద్ధయే సురాపకారకారిభిః ॥5॥**

**తతః ప్రసీదతాద్భవాన్ సువిఘ్నకర్మకారణమ్ ।**
**సురాపకారకారిణామిహైష ఏవ నో వరః ॥6॥**

తర్వాత శివుణ్ణి చూచి భయరహితుడై బృహస్పతి ఆయనకు నమస్కరించి ఇలా పలికాడు. ఓ ఈశ్వరుడా! ఈ దేవతలు నిన్ను దర్శించి వరాన్ని పొందడానికై నీ గృహాన్ని చేరారు. సురలకు అపకారకారులైన దానవులు నిన్ను సర్వకార్యసిద్ధికోసం అవిఘ్నాన్ని అర్థించారు. ఇపుడు నీవు దానవుల కర్మలకు విఘ్నాల్ని కల్పించు. ప్రసన్నుడవు కమ్ము. ఇది మా దేవతలు కోరే వరం.

**తతస్తదా నిశమ్య వై పినాకధృక్ సురేశ్వరః ।**
**గణేశ్వరం సురేశ్వరం వపుర్దధార సః శివః ॥7॥**

**గణేశ్వరాశ్చ తుష్టువుః సురేశ్వరా మహేశ్వరమ్ ।**
**సమస్తలోకసంభవం భవార్తిహారిణం శుభమ్ ॥8॥**

అపుడు ఆ మాటలు విని పినాకపాణి అయిన సురేశ్వరశివుడు దేవతలకు స్వామి అయిన గణేశ్వరుడి శరీరాన్ని ధరించాడు. తర్వాత గణేశ్వరులు అట్లే సురేశ్వరులు (బ్రహ్మాదులు) సమస్తలోక సృష్టికర్త, సంసారదుఃఖహర్త, శుభకరమైన గజాననరూపుడైన మహేశ్వరుణ్ణి స్తుతించారు.

**ఇభాననాశ్రితం వరం త్రిశూలపాశధారిణమ్ ।**
**సమస్తలోకసంభవం గజాననం తదాంబికా ॥9॥**

తదుపరి అంబిక ఏనుగు ముఖాన్ని ధరించి, హస్తాలతో త్రిశూలాన్ని, పాశాన్ని ధరించి సమస్తలోకాల్ని ఉత్పత్తి చేసిన గజాననుడికి జన్మనిచ్చింది.

**దదుః పుష్పవర్షం హి సిద్ధా మునీంద్రా స్తథా ఖేచరా దేవసంఘాస్తదానీమ్ ।**
**తదా తుష్టువుశ్చైకదంతం సురేశాః ప్రణేముర్గణేశం మహేశం వితంద్రాః ॥10॥**

అపుడు సిద్ధులు, మునులు, ఆకాశచారులు అట్లే దేవతలు పుష్పవృష్టి కురిపించారు. అపుడు సురేశ్వరులు వెంటనే ఉత్సాహంతో ఏకదంతుడు, మహేశ్వరుడు అయిన గణేశ్వరుడికి నమస్కరించి స్తుతించారు.

**తదా తయోర్వినిర్గతః సుభైరవః సమూర్తిమాన్ ।**
**స్థితో ననర్త బాలకః సమస్తమంగళాలయః ॥11॥**

**విచిత్రవస్త్రభూషణైరలంకృతో గజాననః ।**
**మహేశ్వరస్య పుత్రకోఽభివంద్య తాతమంబికామ్ ॥12॥**

ఆ సమయంలో శివాశివులకు పుట్టిన, విచిత్ర వస్త్రాలతో, భూషణాలతో అలంకరింపబడి అట్లే సర్వమంగళాలకు ఆలయుడైన మహేశ్వరుడి పుత్రుడైన ఆ బాలకుడు గజాననుడు మూర్తిమంతుడైన సుందర భైరవుడి మాదిరిగా నిలిచి తల్లిదండ్రులకు నమస్కరించి నృత్యం చేశాడు.

**జాతమాత్రం సుతం దృష్ట్వా చకార భగవాన్ భవః ।**
**గజాననాయ కృత్యాంస్తు సర్వాన్ సర్వేశ్వరః స్వయమ్ ॥13॥**

పుట్టిన పుత్రుణ్ణి చూచి భగవాన్ సర్వేశ్వరుడు గజాననుడికి సమస్తజాతకర్మాదుల్ని స్వయంగా నిర్వహించాడు.

**ఆదాయ చ కరాభ్యాం చ సుసుఖాభ్యాం భవః స్వయమ్ ।**
**ఆలింగ్యాఘ్రాయ మూర్ధానం మహాదేవో జగద్గురుః ॥14॥**

**తవావతారో దైత్యానాం వినాశాయ మమాత్మజ ।**
**దేవానాముపకారార్థం ద్విజానాం బ్రహ్మవాదినామ్ ॥15॥**

యజ్ఞశ్చ దక్షిణాహీనః కృతో యేన మహీతలే ।
తస్య ధర్మస్య విఘ్నం చ కురు స్వర్గపథే స్థితః ॥16॥

అధ్యాపనం చాధ్యయనం వ్యాఖ్యానం కర్మ ఏవ చ ।
యోఽ న్యాయతః కరోత్యస్మిన్ తస్య ప్రాణాన్ సదా హర ॥17॥

వర్ణాచ్చ్యుతానాం నారీణాం నరాణాం నరపుంగవ ।
స్వధర్మరహితానాం చ ప్రాణానపహర ప్రభో ॥18॥

యాః స్త్రియస్త్వాం సదా కాలం పురుషాశ్చ వినాయక ।
యజంతి తాసాం తేషాం చ త్వత్సామ్యం దాతుమర్హసి ॥19॥

తం భక్తాన్ సర్వయత్నేన రక్ష బాలగణేశ్వర ।
యౌవనస్థాంశ్చ వృద్ధాంశ్చ ఇహాముత్ర చ పూజితః ॥20॥

జగత్త్రయేఽ త్ర సర్వత్ర త్వం హి విఘ్నగణేశ్వరః ।
సంపూజ్యో వందనీయశ్చ భవిష్యసి న సంశయః ॥21॥

మాం చ నారాయణం వాపి బ్రహ్మాణమపి పుత్రక ।
యజంతి యజ్ఞైర్వా విప్రైరగ్రే పూజ్యో భవిష్యసి ॥22॥

త్వామనభ్యర్చ్య కల్యాణం శ్రౌతం స్మార్తం చ లౌకికమ్ ।
కురుతే తస్య కల్యాణ మకల్యాణం భవిష్యతి ॥23॥

బ్రాహ్మణైః క్షత్రియైర్వైశ్యైః శూద్రైశ్చైవ గజానన ।
సంపూజ్య సర్వసిద్ధ్యర్థం భక్ష్యభోజ్యాదిభిః శుభైః ॥24॥

త్వాం గంధపుష్పధూపాద్యై రనభ్యర్చ్య జగత్త్రయే ।
దేవైరపి తథాన్యైశ్చ లబ్ధవ్యం నాస్తి కుత్రచిత్ ॥25॥

అభ్యర్చయంతి యే లోకా మానవాస్తు వినాయకమ్ ।
తే చార్చనీయాః శక్రాద్యైర్భవిష్యంతి న సంశయః ॥26॥

అజం హరిం చ మాం వాపి శక్రమన్యాన్ సురానపి ।
విఘ్నైర్బాధయసి త్వాం చేన్నార్చయంతి ఫలార్థినః ॥27॥

తదనంతరం జగద్గురువు మహాదేవుడు స్వయంగా పరమసుఖదాయకమైన తన హస్తాలతో గజాననుణ్ణి లేపి ఆలింగనం చేసుకుని, శిరసును ఆఘ్రాణించి ఇలా పలికాడు. ఓ నా కుమారుడా! నీయీ జన్మ దానవుల వినాశనంకోసం, దేవతలకు బ్రహ్మావాదులైన ద్విజులకు ఉపకారం కోసం కలిగింది. ఇపుడు భూమి మీద

దక్షిణారహితంగా యజ్ఞం నిర్వహింపబడుతున్నది. నీవు స్వర్గమార్గంలో నిలిచి ఆ యజ్ఞధర్మాలకు విఘ్నం కలిగించు. ఈ భూమిమీద అన్యాయపూర్వకమైన అధ్యయనం, అధ్యాపనం మరియు వ్యాఖ్యాన కర్మలు జరుపుతున్నవారి ప్రాణాల్ని నీవు ఎల్లప్పుడూ హరిస్తూ ఉండు. ఓ నరశ్రేష్ఠుడా! ఓ ప్రభూ! వర్ణచ్యుతులై స్వధర్మరహితులైన పురుషుల స్త్రీల ప్రాణాల్ని హరించు. ఓ వినాయకా! ఏ పురుషులు, స్త్రీలు ఎల్లప్పుడూ కాలస్వరూపుడవైన నిన్ను పూజిస్తారో నీవు వాళ్లకు నీ సామ్యాన్ని ప్రదానం చేయి. ఓ బాలగణేశ్వరా! నీవు ఈ లోకంలో, పరలోకంలో కూడా పూజింపబడుతూ యువకులు, వృద్ధులు అయిన భక్తుల్ని గట్టి ప్రయత్నంతో రక్షించు. నీవు ఈ మూడు లోకాలలో అంతటా విఘ్నగణేశ్వర రూపంలో పూజనీయుడవు మరియు వందనీయుడవు. ఇందులో సంశయం లేదు. ఓ పుత్రుడా! ఎవరు నన్ను, విష్ణువును, బ్రహ్మను పూజిస్తున్నారో లేక అగ్నిష్టోమాదియజ్ఞాలు చేస్తున్నారో వాళ్లు బ్రాహ్మణుల ద్వారా అందరూ ముందుగా నిన్ను పూజిస్తారు. నిన్ను పూజింపక ఎవరు కళ్యాణార్థం శ్రౌత స్మార్త లౌకికాలు నిర్వహిస్తారో, వాళ్లకు మంగళం అమంగళంగా పరివర్తితం అవుతుంది. ఓ గజాననా! నీవు సమస్త కార్యసిద్ధికోసం బ్రాహ్మణులచేత, క్షత్రియులచేత, వైశ్యులచేత, శూద్రులచేత శుభకరాలైన భక్ష్యభోజ్యాలు సమర్పింపబడి మిక్కిలి గొప్పగా పూజ్యార్హుడవు అవుతావు. గంధాన్ని, పుష్పాల్ని, ధూపాన్ని మొదలైనవాటితో నిన్ను పూజింపక మూడు లోకాలలో ఏ దేవతలకు అట్లే ఇతరులకు ఏదీ సిద్ధించదు. ఏ మానవుడు వినాయకుణ్ణి పూజిస్తాడో, ఆతడు ఇంద్రాదులకు కూడా పూజనీయుడవుతాడు. ఇందులో సంశయం లేదు. ఫలార్థి అయినవాడు నీ పూజ చేయనివాడు ఆతడు బ్రహ్మ అయినా, విష్ణువు అయినా, స్వయంగా నేనైనా, ఇంద్రుడు, ఇతరదేవతలైనా దేన్ని పొందలేరు. వాళ్లని నీవు విఘ్నాలతో బాధించు.

**ససర్జ చ తదా విఘ్నగణం గణపతిః ప్రభుః ।**
**గణైః సార్ధం నమస్కృత్వాప్యతిష్ఠత్తస్య చాగ్రతః ॥28॥**

అపుడు ప్రభువైన గణపతి విఘ్నగణాల్ని సృష్టించుకుని మరియు ఆ గణాలతో కలిసి శివుడికి నమస్కరించి ఆయన ముందు నిలిచాడు.

**తదా ప్రభృతి లోకేఽస్మిన్ పూజయంతి గణేశ్వరమ్ ।**
**దైత్యానాం ధర్మవిఘ్నం చ చకారాసౌ గణేశ్వరః ॥29॥**

**ఏతద్వః కథితం సర్వం స్కందాగ్రజసముద్భవమ్ ।**
**యః పఠేచ్ఛృణుయాద్వాపి శ్రావయేద్వా సుఖీ భవేత్ ॥30॥**

అప్పటినుంచి మానవులు ఈ లోకంలో గణపతిని పూజిస్తున్నారు. ఆ గణపతి దైత్యుల ధర్మాల విషయంలో విఘ్నాల్ని కలిగిస్తాడు. ఓ ఋషులారా! నేను మీకు కార్తికేయుడికి అగ్రజుడైన గణపతి ఉత్పత్తి కథను చెప్పాను. ఎవరు దీన్ని పఠిస్తారో, వింటారో, లేక వినిపిస్తారో వాళ్లు సుఖాన్ని పొందుతున్నారు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే వినాయకోత్పత్తిర్నామ పంచాధికశతతమోఽధ్యాయః ॥105॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని వినాయకోత్పత్తి అనే నూట అయిదవ అధ్యాయం సమాప్తం.

## షడధికశతతమోఽధ్యాయః - నూట ఆరవ అధ్యాయం

## శివతాండవకథనమ్ - శివతాండవ కథనం

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

> **నృత్యారంభః కథం శంభోః కిమర్థం వా యథాతథమ్ ।**
> **వక్తుమర్హసి చాస్మాకం శ్రుతః స్కందాగ్రజోద్భవః ॥1॥**

ఓ సూతర్షీ! మేము స్కందుడికి అగ్రజుడైన గణపతి ప్రాదుర్భావం విన్నాం. నీవు ఇపుడు మాకు ఉన్నది ఉన్నట్లు శివుడి నృత్యం యొక్క ప్రారంభం ఏ విధంగా, ఎందుకు జరిగిందో చెప్పవలసింది.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

> **దారుకోఽసురసంభూతస్తపసా లబ్ధవిక్రమః ।**
> **సూదయామాస కాలాగ్నిరివ దేవాన్ ద్విజోత్తమాన్ ॥2॥**

దారుకుడనే ఒక అసురుడు దైత్యులలో పుట్టాడు. తపస్సువల్ల పరాక్రమవంతుడై, కాలాగ్నితుల్యుడై, దేవతల్ని, ఉత్తమద్విజుల్ని పీడింపదొడిగాడు.

> **దారుకేణ తదా దేవాస్తాడితాః పీడితా భృశమ్ ।**
> **బ్రహ్మాణం చ తథేశానం కుమారం విష్ణుమేవ చ ॥3॥**

> **యమమింద్రమనుప్రాప్య స్త్రీవధ్య ఇతి చాసురః ।**
> **స్త్రీరూపధారిభిః స్తుత్యైర్బ్రహ్మాద్యైర్యుధి సంస్థితైః ॥4॥**

అపుడు దారుకుడివల్ల మిక్కిలిగా దేవతలు కొట్టబడి పీడితులయ్యారు. ఆ దేవతలు బ్రహ్మ, ఈశానుడు, కుమారుడు,విష్ణువు,యముడు, ఇంద్రుడు మొదలైనవారి దగ్గరకు వెళ్లి వాళ్లను శరణుపొందారు. ఆ అసురుడు స్త్రీ వధ్యుడని తలచి స్త్రీరూపధారులై స్తుత్యులగు బ్రహ్మాదులు యుద్ధం చేయడానికి వచ్చారు. ఆతడు యుద్ధం చేశాడు.

> **బాధితాస్తేన తే సర్వే బ్రహ్మాణం ప్రాప్య వై ద్విజాః ।**
> **విజ్ఞాప్య తస్మై తత్సర్వం తేన సార్ధముమాపతిమ్ ॥5॥**

> **సంప్రాప్య తుష్టువుః సర్వే పితామహపురోగమాః ।**
> **బ్రహ్మా ప్రాప్య చ దేవేశం ప్రణమ్య బహుధా నతః ॥6॥**

> **దారుణో భగవాన్ దారుః పూర్వం తేన వినిర్జితాః ।**
> **నిహత్య దారుకం దైత్యం స్త్రీవధ్యం త్రాతుమర్హసి ॥7॥**

ఓ ద్విజులారా! అపుడు ఆతడివల్ల బాధింపబడిన వాళ్లందరూ బ్రహ్మ దగ్గరకు వెళ్లి ఆతడికి అంతా చెప్పి, మరల బ్రహ్మతో కలిసి దేవతలు ఉమాపతి దగ్గరకు వెళ్లి, పితామహ బ్రహ్మను ముందు నిలుపుకుని శివుణ్ణి

స్తుతించారు. తర్వాత దేవేశ్వరుడి దగ్గరకు వెళ్లి, అత్యంతవినమ్రులై నమస్కరించి బ్రహ్మ పలికాడు. ఓ భగవాన్! దారుకుడు మహాభయంకరుడు. మేము ముందుగానే ఆతడివల్ల పరాజితులం అయ్యాం. స్త్రీవల్ల వధ్యుడయ్యే ఆ దైత్యుణ్ణి వధించి మాకు రక్షణ కల్పించు.

**విజ్ఞప్తిం బ్రహ్మణః శ్రుత్వా భగవాన్ భగనేత్రహా ।**
**దేవీమువాచ దేవేశో గిరిజాం ప్రహసన్నివ ॥8॥**

**భవతీం ప్రార్థయామ్యద్య హితాయ జగతాం శుభే ।**
**వధార్థం దారుకస్యాస్య స్త్రీవధ్యస్య వరాననే ॥9॥**

బ్రహ్మ ప్రార్థనను విని భగనేత్రహంత అయిన భగవాన్ శివుడు పార్వతీదేవితో బాగా నవ్వుతూ పలికాడు. ఓ శుభాంగీ! ఓ వరాననా! నేను లోకహితార్థం స్త్రీవధ్యుడైన ఈ దారుకుణ్ణి వధించేందుకై ఇపుడు నిన్ను ప్రార్థిస్తున్నాను.

**అథ సా తస్య వచనం నిశమ్య జగతోఽరణిః ।**
**వివేశ దేహే దేవస్య దేవేశీ జన్మతత్పరా ॥10॥**

**ఏకేనాంశేన దేవేశం ప్రవిష్టా దేవసత్తమమ్ ।**
**న వివేద తదా బ్రహ్మా దేవాశ్చేంద్రపురోగమాః ॥11॥**

**గిరిజాం పూర్వవచ్ఛంభోర్దృష్ట్వా పార్శ్వస్థితాం శుభామ్ ।**
**మాయయా మోహితస్తస్యాః సర్వజ్ఞోఽపి చతుర్ముఖః ॥12॥**

అపుడు శివుడి మాట విని సంసారాన్ని సృష్టించే ఆ దేవేశ్వరి జన్మకొరకై తత్పర అయి శివుడి శరీరంలోనికి ప్రవేశించింది. పార్వతీదేవి దేవతలలో శ్రేష్ఠుడైన దేవేశ్వరుడిలో తన ఒక అంశతో ప్రవేశించింది. ఆ సమయంలో బ్రహ్మ, ఇంద్రుడు మొదలైన ప్రధాన దేవతలు కూడా ఆ విషయాన్ని తెలియలేకపోయారు. మంగళమయి పార్వతిని పూర్వం మాదిరి శివుడి సమీపంలో నిలిచిన దానిని చూచి సమస్తమూ తెలిసే బ్రహ్మ కూడా శివుడి మాయవల్ల మోహితుడయ్యాడు.

**సా ప్రవిష్టా తనుం తస్య దేవదేవస్య పార్వతీ ।**
**కంఠస్థేన విషేణాస్య తనుం చక్రే తదాత్మనః ॥13॥**

**తాం చ జ్ఞాత్వా తథాభూతాం తృతీయేనేక్షణేన వై ।**
**ససర్జ కాలీం కామారిః కాలకంఠీం కపర్దినీమ్ ॥14॥**

దేవదేవుడైన శివుడి శరీరంలో ప్రవేశించిన ఆ పార్వతి శివుడి కంఠస్థితమైన విషంతో తన శరీరాన్ని నిర్మించుకున్నది. తర్వాత ఆ పార్వతిని విషభూత అయినదిగా తెలిసి కామారి శివుడు తన మూడవ కంటితో కాళకంఠి కపర్దిని అయిన కాళికాదేవిని సృష్టించాడు.

**జాతా యదా కాలిమకాలకంఠీ జాతా తదానీం విపులా జయశ్రీః ।**
**దేవేతరాణామజయస్త్వసిద్ధ్యా తుష్టిర్భవాన్యాః పరమేశ్వరస్య ॥15॥**

ఎపుడు విషకారణంగా కృష్ణవర్ణకంఠంగల కాళీదేవి ప్రాదుర్భవించిందో, అపుడే విపుల జయశ్రీ కూడా ఉత్పన్నమైంది. అపుడు అసిద్ధి కారణంగా దైత్యుల పరాజయం నిశ్చయమైంది. దానివల్ల పార్వతీపరమేశ్వరులు ప్రసన్నులయ్యారు.

**జాతాం తదానీం సురసిద్ధసంఘా దృష్ట్వా భయాద్దుద్రువురగ్నికల్పామ్ ।**
**కాళీం గరాలంకృతకాళకంఠీ ముపేంద్రపద్మోద్భవశక్రముఖ్యాః ॥16॥**

విషంతో అలంకరింపబడి నల్లని కంఠం గలదిగ, అగ్నిసమానమైనదిగ పుట్టిన ఆ కాళీదేవిని చూచి దేవతలందరూ, సిద్ధగణాలు, మరియు విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుడు మొదలైన ముఖ్యదేవతలు కూడా భయపడి పరుగెత్తారు.

**తథైవ జాతం నయనం లలాటే సితాంశులేఖా చ శిరస్యుదగ్రా ।**
**కంఠే కరాలం నిశితం త్రిశూలం కరే కరాలం చ విభూషణాని ॥17॥**

ఆమె లలాటంలో శివుడికి మాదిరిగా మూడో కన్ను ఉన్నది. శిరసుమీద అతితీవ్రమైన చంద్రరేఖ ఉన్నది. కంఠంలో కాలకూటం ఉన్నది. చేతులలో కత్తి మరియు పదునైన త్రిశూలం ఉన్నది. సర్వాభరణాలు కలిగి యున్నది.

**సార్ధం దివ్యాంబరా దేవ్యాః సర్వాభరణభూషితా ।**
**సిద్ధేంద్రసిద్ధాశ్చ తదా పిశాచా జజ్ఞిరే పునః ॥18॥**

కాళికాదేవితో కూడా దివ్యవస్త్రాలు, ఆభరణాలు ధరించిన దేవతలు, సిద్ధులస్వామి, సిద్ధగణాలు, పిశాచాలు కూడా ఉత్పన్నులయ్యారు.

**ఆజ్ఞయా దారుకం తస్యాః పార్వత్యాః పరమేశ్వరీ ।**
**దానవం సూదయామాస సూదయంతం సురాధిపాన్ ॥19॥**

అపుడు పార్వతీదేవి ఆదేశంతో పరమేశ్వరి కాళీదేవి సురశ్రేష్ఠుల్ని వధించే దారుకరాక్షసుణ్ణి వధించింది.

**సంరంభాతిప్రసంగాద్వై తస్యాః సర్వమిదం జగత్ ।**
**క్రోధాగ్నినా చ విప్రేంద్రాః సంబభూవ తదాతురమ్ ॥20॥**

**భవోఽపి బాలరూపేణ శ్మశానే ప్రేతసంకులే ।**
**రురోద మాయయా తస్యాః క్రోధాగ్నిం పాతుమీశ్వరః ॥21॥**

ఓ విప్రశ్రేష్ఠులారా! ఆమె అతిశయవేగం వల్ల, క్రోధాగ్ని వల్ల ఈ సమస్త జగత్తు వ్యాకులమయినది. అపుడు ఈశ్వరుడు కూడా మాయవల్ల బాలుడుగా మారి ఆ కాళి క్రోధాగ్నిని త్రాగడానికై కాశీలో శ్మశానంలో రోదించసాగాడు.

**తం దృష్ట్వా బాలమీశానం మాయయా తస్య మోహితా ।**
**ఉత్థాప్యాఘ్రాయ వక్షోజం స్తనం సా ప్రదదౌ ద్విజాః ॥22॥**

ఓ ద్విజులారా! ఆ బాలరూపుడైన ఈశ్వరుణ్ణి చూచి ఆతడి మాయవల్ల మోహిత అయిన కాళీదేవి ఆ బాలుణ్ణి ఎత్తుకుని శిరసును ఆఘ్రాణించి తన వక్షఃస్థలమందుగల స్తనాన్ని కుడిపింది (పాలు ఇచ్చింది).

**స్తనజేన తదా సార్ధం కోపమస్యాః పపౌ పునః ।**
**క్రోధేనానేన వై బాలః క్షేత్రాణాం రక్షకో౽భవత్ ॥23॥**

**మూర్తయో౽ష్టౌ చ తస్యాపి క్షేత్రపాలస్య ధీమతః ।**
**ఏవం వై తేన బాలేన కృతా సా క్రోధమూర్ఛితా ॥24॥**

అపుడు ఆ బాలరూపుడైన శివుడు పాలతో కూడా కోపాన్ని కూడా త్రాగాడు. ఈ విధంగా ఈ క్రోధ క్షేత్రాన్ని రక్షించినవాడైనాడు. ఆ బుద్ధిమంతుడైన క్షేత్రపాలకుడు (భైరవుడు) కూడా అష్టమూర్తిగలవాడైనాడు. ఈ విధంగా ఆ కాళీదేవి ఆ బాలకుడి ద్వారా క్రోధమూర్ఛిత అయింది.

**కృతమస్యాః ప్రసాదార్థం దేవదేవేన తాండవమ్ ।**
**సంధ్యాయాం సర్వభూతేంద్రైః ప్రీతైః ప్రీతేన శూలినా ॥25॥**

తర్వాత సంప్రీతుడైన దేవదేవుడు కాళీదేవి ప్రసన్నతకై సంధ్యాసమయంలో భూతశ్రేష్ఠులతో అట్లే ప్రేతాలతో కలిసి తాండవ నృత్యం చేశాడు.

**పీత్వా నృత్తామృతం శంభోరాకంఠం పరమేశ్వరీ ।**
**ననర్త సా చ యోగిన్యః ప్రేతస్థానే యథాసుఖమ్ ॥26॥**

శివుడి నృత్యామృతాన్ని కంఠపర్యంతం త్రాగి ఆ పరమేశ్వరి శ్మశానంలో సుఖపూర్వకంగా నర్తించింది. యోగినులు కూడా ఆమెతో కలిసి నర్తించారు.

**తత్ర సబ్రహ్మకా దేవాః సేంద్రోపేంద్రాః సమంతతః ।**
**ప్రణేముస్తుష్టువుః కాళీం పునర్దేవీం చ పార్వతీమ్ ॥27॥**

అక్కడ బ్రహ్మ, విష్ణువు, ఇంద్రసహిత దేవతలందరూ అన్ని దిక్కులనుంచి కాళికాదేవికి అట్లే పార్వతీదేవికి నమస్కరించి వారిని స్తుతించారు.

**ఏవం సంక్షేపతః ప్రోక్తం తాండవం శూలినః ప్రభోః ।**
**యోగానందేన చ విభోః తాండవం చేతి చాపరే ॥28॥**

ఓ ఋషులారా! ఈ విధంగా నేను సంగ్రహంగా శూలధారి శివప్రభువు తాండవాన్ని వర్ణించాను. యోగం యొక్క ఆనందం కూడా విభుడి తాండవానికి కారణం అవుతుందని ఇతరులు చెబుతున్నారు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే శివతాండవ కథనం నామ షడధికశతతమో౽ధ్యాయః ॥106॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని శివతాండవ కథనమనే నూట ఆరవ అధ్యాయం సమాప్తం.

;

## సప్తాధికశతతమోఽధ్యాయః - నూట ఏడవ అధ్యాయం

## ఉపమన్యుచరితమ్ - ఉపమన్యుచరితం

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**పురోపమన్యునా సూత గాణపత్యం మహేశ్వరాత్ ।**
**క్షీరార్ణవః కథం లబ్ధో వక్తుమర్హసి సాంప్రతమ్ ॥1॥**

ఓ సూతర్షీ! పూర్వం ఉపమన్యుడు మహేశ్వరుడిచే గణాధిపపదం పొందిన తర్వాత క్షీరసాగరాన్ని ఎలా ప్రాప్తింపజేసుకున్నాడు. ఇపుడు నీవు ఆ విషయాన్ని చెప్పవలసింది.

**సూత ఉవాచ -** సూతర్షి పలికాడు.

**ఏవం కాళీముపాలభ్య గతే దేవే త్రియంబకే ।**
**ఉపమన్యుః సమభ్యర్చ్య తపసా లబ్ధవాన్ ఫలమ్ ॥2॥**

ఓ ఋషులారా! ఈ విధంగా కాళికాదేవిని సృష్టించి ముక్కంటి శివభగవానుడు అంతర్ధానం చెందిన తర్వాత ఉపమన్యుడు తపస్సు మూలంగా శివుణ్ణి పూజించి ఫలాన్ని పొందాడు.

**ఉపమన్యురితి ఖ్యాతో మునిశ్చ ద్విజసత్తమాః ।**
**కుమార ఇవ తేజస్వీ క్రీడమానో యదృచ్ఛయా ॥3॥**

**కదాచిత్ క్షీరమల్పం చ పీతవాన్ మాతులాశ్రమే ।**
**ఈర్ష్యయా మాతులసుతో హ్యపిబత్ క్షీరముత్తమమ్ ॥4॥**

ఓ ద్విజశ్రేష్ఠులారా! ఉపమున్యుడనే పేరుతో ప్రసిద్ధుడైన ఒక ఋషి కలడు. కుమారస్వామితో సమానమైన తేజస్సుగల ఆతడు ఒకసారి స్వేచ్ఛగా ఆడుకొంటూ తన మేనమామ ఆశ్రమంలో తక్కువ పాలను త్రాగాడు. మేనమామ కుమారుడు ఈర్ష్యతో ఎక్కువ పాలను (ఉత్తమక్షీరం) త్రాగాడు.

**పీత్వా స్థితం యథాకామం దృష్ట్వా ప్రోవాచ మాతరమ్ ।**
**మాతర్మాతర్మహాభాగే మమ దేహి తపస్విని ॥5॥**

**గవ్యం క్షీరమతిస్వాదు నాల్పముష్ణం నమామ్యహమ్ ।**

అపుడు ఇష్టపూర్వకంగా ఎక్కువ పాలను త్రాగిన మేనమామ కుమారుడిని చూచి తల్లితో ఇలా పలికాడు. ఓ జననీ! ఓ మహాభాగా! ఓ తపస్వినీ! నీవు నాకు ఆవు పాలను ఇవ్వు. ఆ పాలు మిక్కిలి రుచిగలవి. గోరువెచ్చనివి కావాలి. నేను నీకు నమస్కరిస్తున్నాను.

**సూత ఉవాచ -** సూతర్షి పలికాడు.

**ఉపలాలితైవం పుత్రేణ పుత్రమాలింగ్య సాదరమ్ ॥6॥**

**దుఃఖితా విలలాపార్తా స్మృత్వా నైర్ధన్యమాత్మనః ।**
**స్మృత్వా స్మృత్వా పునః క్షీరముపమన్యురపి ద్విజాః ।**
**దేహి దేహీతి తామాహ రోదమానో మహాద్యుతిః ॥7॥**

ఈ విధంగా పుత్రుడు స్నేహపూర్వకంగా పలికిన ఆ మాటను విని ఆ తల్లి సాదరంగా పుత్రుణ్ణి ఆలింగనం చేసుకుని దుఃఖించింది. తన ధనరాహిత్యాన్ని స్మరించి స్మరించి వ్యాకులపడి ఏడ్చింది. ఓ ద్విజులారా! మాటిమాటికి పాలను తలచి మహాకాంతిమంతుడు ఉపమన్యుడు కూడ "నాకు పాలనివ్వు, నాకు పాలనివ్వు" అని విలపించాడు.

**ఉంఛవృత్త్యార్జితాన్ బీజాన్ స్వయం పిష్ట్వా చ సా తదా ।**
**బీజపిష్టం తదాలోడ్య తోయేన కలభాషిణీ ॥8॥**

**ఏహ్యేహి మమ పుత్రేతి సామపూర్వం తతః సుతమ్ ।**
**ఆలింగ్యాదాయ దుఃఖార్తా ప్రదదౌ కృత్రిమం పయః ॥9॥**

అనంతరం ఉంఛవృత్తి ద్వారా సంపాదించిన గింజలను దంచి పొడిచేసి దాన్ని నీటితో కలిపి మధురభాషిణి అయిన ఆ తల్లి ఇలా పలికింది. "ఓ కుమారా! రారమ్ము!, రారమ్ము!" అని. తర్వాత సాంత్వనపూర్వకంగా పుత్రుణ్ణి పట్టుకుని ఆలింగనం చేసుకుని దుఃఖం వల్ల వ్యాకులపడిన ఆమె ఆ కృత్రిమ క్షీరాన్ని తన కుమారుడికి ఇచ్చింది.

**పీత్వా చ కృత్రిమం క్షీరం మాత్రా దత్తం ద్విజోత్తమః ।**
**నైతత్ క్షీరమితి ప్రాహ మాతరం చాతివిహ్వలః ॥10॥**

తల్లి యిచ్చిన ఆ కృత్రిమ క్షీరాన్ని త్రాగిన ఆ ఉపమన్యుడు మిక్కిలి విహ్వలుడై తల్లితో ఇలా అన్నాడు– "ఇవి పాలు కావు".

**దుఃఖితా సా తదా ప్రాహ సంప్రేక్ష్యాఘ్రాయ మూర్ధని ।**
**సమ్మార్జ్య నేత్రే పుత్రస్య కరాభ్యాం కమలాయతే ॥11॥**

**తటినీ రత్నపూర్ణాస్తే స్వర్గపాతాళగోచరాః ।**
**భాగ్యహీనా న పశ్యంతి భక్తిహీనాశ్చ యే శివే ॥12॥**

**రాజ్యం స్వర్గం చ మోక్షం చ భోజనం క్షీరసంభవమ్ ।**
**న లభంతే ప్రియాణ్యేషాం నో తుష్యతి సదా భవః ॥13॥**

**భవప్రసాదజం సర్వం నాన్యదేవప్రసాదజమ్ ।**
**అన్యదేవేషు నిరతా దుఃఖార్తా విభ్రమంతి చ ॥14॥**

**క్షీరం తత్ర కుతోఽస్మాకం మహాదేవో న పూజితః ।**
**పూర్వజన్మని యద్దత్తం శివముద్దిశ్య వై సుత ॥15॥**

**తదేవ లభ్యం నాన్యస్తు విష్ణుముద్దిశ్య వా ప్రభుమ్ ।**

దుఃఖభరిత అయిన ఆ తల్లి బాలుడివైపు చూచి, ఆతడి శిరసును వాసన చూచి, హస్తాలతో ఆతడి కమల సమాన విశాలనేత్రాన్ని తుడిచి ఇలా పలికింది. ఓ పుత్రా! శివునియెడల భక్తిలేని భాగ్యహీనులైనవాళ్లు రత్నాలతో నిండియున్న స్వర్గపాతాళాలల్లో కన్పించే నదుల్ని చూడలేరు. శివుడు వాళ్ల విషయంలో ఎల్లప్పుడూ ప్రసన్నుడు కాడు. వాళ్లు స్వర్గాన్ని, రాజ్యాన్ని, మోక్షాన్ని, పాయసాన్ని మిగిలిన ఇతర ప్రియవస్తువుల్ని పొందలేరు. శివుడి కృపవల్లనే సమస్తమూ ప్రాప్తిస్తుంది. ఇతర దేవతల కృపవల్ల కాదు. అన్యదేవపరాయణులైనవాళ్లు దుఃఖాన్ని పొంది సంసార చక్రంలో భ్రమణం చెందుతున్నారు. మనకు పాలు ఎలా లభిస్తాయి? ఎందుకంటే మనం మహాదేవుణ్ణి పూజించలేదు. ఓ కుమారా! శివుడికి పూర్వజన్మలో ఏది సమర్పిస్తారో అదే ఈ జన్మలో లభిస్తుంది. విష్ణువు అట్లే ఇతర దేవతలకు సమర్పించినది ఏదీ ఇపుడు లభించదు.

**నిశమ్య వచనం మాతురుపమన్యుర్మహాద్యుతిః ॥16॥**

**బాలోఽపి మాతరం ప్రాహ ప్రణిపత్య తపస్వినీమ్ ।**
**త్యజ శోకం మహాభాగే మహాదేవోఽస్తి చేత్క్వచిత్ ॥17॥**

**చిరాద్వా హ్యచిరాద్వాపి క్షీరోదం సాధయామ్యహమ్ ।**

అపుడు తల్లి మాటల్ని విని మహాకాంతిమంతుడైన ఆ బాలకుడు ఉపమన్యువు తపస్విని అయిన తల్లికి నమస్కరించి పలికాడు. ఓ మహాభాగా! శోకాన్ని త్యజించు. మహాదేవుడుండగా అన్నీ ఉన్నట్లే. నేను వెంటనేగాని ఆలస్యంగాగాని క్షీరసముద్రాన్ని సాధిస్తాను.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**తాం ప్రణమ్యైవముక్త్వా స తపః కర్తుం ప్రచక్రమే ॥18॥**

**తమాహ మాతా సుశుభం కుర్వీతి సుతరాం సుతమ్ ।**
**అనుజ్ఞాతస్తయా తత్ర తపస్తేపే సుదుస్తరమ్ ॥19॥**

**హిమవత్పర్వతం ప్రాప్య వాయుభక్షః సమాహితః॥**

ఓ మునులారా! ఆ విధంగా పలికి ఆమెకు నమస్కరించి తపస్సు చేయడానికి ఉపక్రమించాడు. అపుడు తల్లి పుత్రుడితో ఇలా పలికింది. "సంపూర్ణంగా అత్యంతమైన మంగళకరమైన తపస్సు నిర్వహించు". ఆమె అనుజ్ఞ పొందిన ఆతడు హిమవత్పర్వతానికి వెళ్లి వాయువునే ఆహారంగా స్వీకరిస్తూ ఏకాగ్రచిత్తుడై అతికఠోరమైన తపస్సు చేయదొడగాడు.

**తపసా తస్య విప్రస్య విధూపితమభూజ్జగత్ ॥20॥**

**ప్రణమ్యాహుస్తు తత్సర్వే హరయే దేవసత్తమాః ।**
**శ్రుత్వా తేషాం తదా వాక్యం భగవాన్ పురుషోత్తమః ॥21॥**

**కిమిదం త్వితి సంచింత్య జ్ఞాత్వా తత్కారణం చ సః ।**
**జగామ మందరం తూర్ణం మహేశ్వర దిదృక్షయా ॥22॥**

ఆ విప్రుడి తపస్సు వల్ల సమస్త జగత్తు తపింపబడ్డది. అపుడు దేవతాశ్రేష్ఠులందరూ విష్ణుదేవుడికి నమస్కరించి ఆ విషయాన్ని చెప్పారు. పురుషోత్తముడు వాళ్ల మాటలు విని "ఏమిటిది?" అని పలికి, తదుపరి బాగా ఆలోచించి ఈ తాపానికి కారణాన్ని తెలిసి వెంటనే మహేశ్వరుణ్ణి దర్శించగోరి మందర పర్వతానికి వెళ్లారు.

**దృష్ట్వా దేవం ప్రణమ్యైవం ప్రోవాచేదం కృతాంజలిః ।**
**భగవన్ బ్రాహ్మణః కశ్చిదుపమన్యురితి శ్రుతః ॥23॥**

**క్షీరార్థమదహత్సర్వం తపసా తం నివారయ ।**

శివుణ్ణి చూచి, నమస్కరించి విష్ణువు చేతులు జోడించి ఇలా పలికాడు. ఓ భగవాన్! ఉపమన్యుడనే ఒక బ్రాహ్మణుడు పాలకోసం తన తపస్సుతో సమస్తాన్ని దహించాడు. నీవు ఆతణ్ణి నివారించు.

**ఏతస్మిన్నంతరే దేవః పినాకీ పరమేశ్వరః ।**
**శక్రరూపం సమాస్థాయ గంతుం చక్రే మతిం తదా ॥24॥**

**అథ జగామ మునేస్తు తపోవనం గజవరేణ సితేన సదాశివః ।**
**సహ సురాసురసిద్ధమహోరగైరమరరాజతనుం స్వయమాస్థితః ॥25॥**

ఆ తర్వాత పినాకధారి, పరమేశ్వర దేవుడు ఇంద్రుడి రూపాన్ని ధరించి అక్కడకు వెళ్లడానికి ఆలోచించాడు. తర్వాత సదాశివుడు దేవరాజు ఇంద్రుడి రూపాన్ని ధరించి ఐరావతాన్ని అధిరోహించి, దేవతలు, దానవులు, సిద్ధులు అట్లే మహానాగులు వెంటరాగా ముని తపోవనానికి వెళ్లాడు.

**సహైవ చారుహ్య తదా ద్విపం తం ప్రగృహ్య బాలవ్యజనం వివస్వాన్ ।**
**వామేన శచ్యా సహితం సురేంద్రం కరేణ చాన్యేన సితాతపత్రమ్ ॥26॥**

ఆయనతోపాటు ఆ ఏనుగుమీదకి ఎక్కి సూర్యదేవుడు వామహస్తంతో వింజామరను, దక్షిణహస్తంతో శ్వేతచ్ఛత్రాన్ని పట్టుకుని శచీసహితుడైన ఇంద్రుడిని సేవించాడు.

**రరాజ భగవాన్ సోమః శక్రరూపీ సదాశివః ।**
**సితాతపత్రేణ యథా చంద్రబింబేన మందరః ॥27॥**

ఆ సమయంలో పార్వతీదేవితోకూడిన ఇంద్రరూపుడైన భగవాన్ సదాశివుడు శ్వేతచ్ఛత్రం వల్ల ఏ విధంగా శోభిల్లుతున్నాడనగా చంద్రబింబంవల్ల మందరపర్వతుడు శోభిల్లుతున్నట్లు.

**ఆస్థాయైనం హి శక్రస్య స్వరూపం పరమేశ్వరః ।**
**జగామానుగ్రహం కర్తుముపమన్యోస్తదాశ్రమమ్ ॥28॥**

ఈ విధంగా ఇంద్రుడిరూపాన్ని ధరించిన పరమేశ్వరుడు ఆ ఉపమన్యుడిని అనుగ్రహించడానికై ఆతడి ఆశ్రమానికి వెళ్లాడు.

**తం దృష్ట్వా పరమేశానం శక్రరూపధరం శివమ్ ।**
**ప్రణమ్య శిరసా ప్రాహ మునిర్మునివరాః స్వయమ్ ॥29॥**

**పావితశ్చాశ్రమశ్చాయం మమ దేవేశ్వరః స్వయమ్ ।**
**ప్రాప్తః శక్రో జగన్నాథో భగవాన్ భానునా ప్రభుః ॥30॥**

మునిశ్రేష్ఠులారా! ఇంద్రరూపధారి అయిన ఆ పరమేశ్వరుడిని చూచిన ఆముని శిరసు వంచి నమస్కరించి ఇలా పలికాడు. "నా యీ ఆశ్రమం పవిత్రమైంది. ఎందుకంటే దేవతలస్వామి, జగత్పతి, ప్రభువు అయిన ఇంద్రభగవానుడు సూర్యుడితో కలిసి స్వయంగా వచ్చాడు కావున.

**ఏవముక్త్వా స్థితం వీక్ష్య కృతాంజలిపుటం ద్విజమ్ ।**
**ప్రాహ గంభీరయా వాచా శక్రరూపధరో హరః ॥31॥**

**తుష్టోఽస్మి తే వరం బ్రూహి తపసానేన సువ్రత ।**
**దదామి చేప్సితాన్ సర్వాన్ ధౌమ్యాగ్రజ మహామతే ॥32॥**

ఈ విధంగా పలికి చేతులు జోడించి నిలిచిన ఆ ద్విజుడిని చూచి ఇంద్రరూపధారి అయిన శివుడు ఇలా గంభీరంగా పలికాడు. ఓ సువ్రతుడా! నేను నీ తపస్సు వల్ల ప్రసన్నుడనయ్యాను. వరాన్ని కోరుకో. ఓ ధౌమ్యఋషికి అగ్రజుడా! ఓ మహాత్మా! నేను నీకు సమస్తమైన అభీష్టాల్ని ప్రదానం చేస్తాను.

**ఏవముక్తస్తదా తేన శక్రేణ మునిసత్తమః ।**
**వరయామి శివే భక్తిమిత్యువాచ కృతాంజలిః ॥33॥**

శక్రరూపి శివుడు పలకగా, 'మునిశ్రేష్ఠుడైన ఉపమన్యుడు అంజలిబద్ధుడై శివుడి విషయమై భక్తిని వరంగా కోరుతున్నాను' అని పలికాడు.

**తతో నిశమ్య వచనం మునేః కుపితవత్ప్రభుః ।**
**ప్రాహ సవ్యగ్రమీశానః శక్రరూపధరః స్వయమ్ ॥34॥**

**మాం న జానాసి దేవర్షే దేవరాజానమీశ్వరమ్ ।**
**త్రైలోక్యాధిపతిం శక్రం సర్వదేవనమస్కృతమ్ ॥35॥**

**మద్భక్తో భవ విప్రర్షే మామేవార్చయ సర్వదా ।**
**దదామి సర్వం భద్రం తే త్యజ రుద్రం చ నిర్గుణమ్ ॥36॥**

తర్వాత ఆ ముని మాటను విన్న శక్రరూపధారి ఈశానుడు శివుడు కుపితుడైనట్లుండి వ్యగ్రతా పూర్వకంగా పలికాడు. ఓ దేవర్షీ! త్రిలోకాధిపతిని, సమస్తదేవవందితుడను, దేవరాజు ఇంద్రుడను నన్ను నీవు ఎందుకు తెలియకున్నావు. ఓ విప్రర్షీ! నీవు నా భక్తుడవు అయి ఎల్లప్పుడూ నన్ను పూజించు. నేను నీకు సమస్తాన్ని ప్రదానం చేస్తాను. నీకు శుభమగుగాక! నీవు నిర్గుణుడైన శివుణ్ణి పరిత్యజించు.

**తతః శక్రస్య వచనం శ్రుత్వా శ్రోత్రవిదారణమ్ ।**
**ఉపమన్యురిదం ప్రాహ జపన్ పంచాక్షరం శుభమ్ ॥37॥**

**మన్యే శక్రస్య రూపేణ నూనమత్రాగతః స్వయమ్ ।**
**కర్తుం దైత్యాధమః కశ్చిద్ధర్మవిఘ్నం చ నాన్యథా ॥38॥**

త్వయైవ కథితం సర్వం భవనిందారతేన వై ।
ప్రసంగాద్దేవదేవస్య నిర్గుణత్వం మహాత్మనః ॥39॥

బహునాత్ర కిముక్తేన మయాద్యానుమితం మహత్ ।
భవాంతరకృతం పాపం శ్రుతా నిందా భవస్య తు ॥40॥

శ్రుత్వా నిందాం భవస్యాథ తత్ క్షణాదేవ సంత్యజేత్ ।
స్వదేహం తం నిహత్యాశు శివలోకం స గచ్ఛతి ॥41॥

యో వాచోత్పాటయేజ్జిహ్వాం శివనిందారతస్య తు ।
త్రిః సప్తకులముద్ధృత్య శివలోకం స గచ్ఛతి ॥42॥

ఆస్తాం తావన్మమేచ్ఛాయాః క్షీరం ప్రతి సురాధమమ్ ।
నిహత్య త్వాం శివాస్త్రేణ త్యజామ్యేతత్కళేబరమ్ ॥43॥

పురా మాత్రా తు కథితం తథ్యమేవ న సంశయః ।
పూర్వజన్మని చాస్మాభిరపూజిత ఇతి ప్రభుః ॥44॥

అపుడు ఇంద్రుడి కర్ణవిదారకమైన ఆ మాటలు విని ఉపమన్యుడు పవిత్రమైన పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తూ ఇలా పలికాడు. ఎవడో ఒక అధమదానవుడు స్వయంగా ఇంద్రస్వరూపంలో నా ధర్మాన్ని విఘ్నపర్చడానికి వచ్చాడని నేనిపుడు తెలుసుకున్నాను. ఇది నిశ్చయం. ఇందులో సంశయం లేదు. శివనిందాపరాయణుడవైన నీవు ప్రసంగవశంగా మహాత్ముడైన దేవదేవుడి నిర్గుణత్వం పలికావు. ఇంకా ఎక్కువ మాట్లాడినందువల్ల లాభమేముంది? నేనిపుడు అనుమానిస్తున్నాను. పూర్వజన్మలో చేసిన మహాపాపం కారణంగా శివనింద విన్నానని. ఎవడు శివుడి నింద విని ఆ క్షణంలోనే ఆ శివనిందకుణ్ణి చంపి, తానూ శరీర త్యాగం చేస్తాడో ఆతడు శివలోకానికి వెళతాడు. ఎవడు మాటలతో శివనింద చేసినవాడి నాలుక కోస్తాడో, ఆతడు తన ఇరవై ఒక్క పీడల్ని దాటినవాడై శివలోకానికి వెళతాడు. పాలకోసమైన నా కోరిక ఇపుడు దూరమైంది. శివుడి అస్త్రంతో సురాధముడివైన నిన్ను వధించి నేనూ ఈ శరీరాన్ని విడుస్తాను. నా తల్లి ఇంతకు ముందు ఏది చెప్పిందో అది సత్యమే. అందులో సంశయం లేదు. మేము పూర్వజన్మలో శివుడిని పూజించలేదు.

ఏవముక్త్వా తు తం దేవముపమన్యురభీతవత్ ।
శక్రం చక్రే మతిం హంతు మథర్వాస్త్రేణ మంత్రవిత్ ॥45॥

భస్మాధారాన్మహాతేజా భస్మముష్టిం ప్రగృహ్య చ ।
అథర్వాస్త్రం తతస్తస్మై ససర్జ చ ననాద చ ॥46॥

దగ్ధుం స్వదేహమాగ్నేయీం ధ్యాత్వా వై ధారణాం తదా ।
అతిష్ఠచ్చ మహాతేజాః శుష్కేంధనమివావ్యయః ॥47॥

ఈ విధంగా పలికి భయరహితుడై మంత్రవిదుడు ఉపమన్యుడు ఇంద్రదేవుణ్ణి అథర్వాస్త్రంతో వధించదలచాడు. మహాతేజస్వి అయిన ఆతడు అగ్నిగుండంనుంచి ఒక పిడికెడు భస్మం తీసుకుని దానినుంచి అథర్వాస్త్రాన్ని సృష్టించాడు.

బిగ్గరగా నినదించాడు. అపుడు తన దేహాన్ని దహించుకోవడానికై అగ్నిని ధరించడానికై ధ్యానించి అవ్యయుడు మహాతేజస్వి అయిన ఆతడు నీరసించిన కట్టెలాగా నిలిచాడు.

**ఏవం వ్యవసితే విప్రే భగవాన్ భగనేత్రహా ।**
**వారయామాస సౌమ్యేన ధారణాం తస్య యోగినః ॥48॥**

**అథర్వాస్త్రం తదా తస్య సంహృతం చంద్రికేణ తు ।**
**కాలాగ్ని సదృశం చేదం నియోగాన్నందినస్తథా ॥49॥**

ఈ విధంగా ఆ విప్రుడు ప్రయత్నించగా, భగనేత్రహంత అయిన శివభగవానుడు సోమధారణాయోగంతో ఆ యోగి ఉపమన్యువు అగ్నిధారణాన్ని నివారించాడు. నందీశ్వరుడి ఆజ్ఞ వల్ల చంద్రికుడనే ప్రథమగణుడు కాలాగ్ని సమానమైన అథర్వాస్త్రాన్ని సంహరించాడు.

**స్వరూపమేవ భగవానాస్థాయ పరమేశ్వరః ।**
**దర్శయామాస విప్రాయ బాలేందుకృతశేఖరమ్ ॥50॥**

తర్వాత బాలచంద్రచూడుడు శివుడు తన స్వరూపాన్ని ధరించి విప్రుడైన ఆ ఉపమన్యుడికి కన్పించాడు.

**క్షీరధారాసహస్రం చ క్షీరోదార్ణవమేవ చ ।**
**దధ్యాదేరర్ణవం చైవ ఘృతోదార్ణవ మేవ చ ॥51॥**
**ఫలార్ణవం చ బాలస్య భక్ష్యభోజ్యార్ణవం తథా ।**
**అపూపగిరయశ్చైవ తథాతిష్ఠన్ సమంతతః ॥52॥**

ఆ సమయంలో ఆ బాలకుడికి అన్నివైపుల వేలకొలది క్షీరధారలు, క్షీరసాగరాలు, మధుసముద్రాలు, దధిసాగరాలు, ఫలసాగరాలు, ఇతరాలైన భక్ష్యభోజ్యపదార్థాల సాగరాలు, అపూపాల పర్వతాలు ఏర్పడ్డాయి.

**ఉపమన్యుమువాచ సస్మితో భగవాన్ బంధుజనైః సమావృతమ్ ।**
**గిరిజామవలోక్య సస్మితాం సఘృణం ప్రేక్ష్య తు తం తదా ఘృణీ ॥53॥**
**భుంక్ష్వ భోగాన్ యథాకామం బాంధవైః పశ్య వత్స మే ।**
**ఉపమన్యో మహాభాగ తవాంబైషా హి పార్వతీ ॥54॥**
**మయా పుత్రీకృతోఽస్యద్య దత్తః క్షీరోదధిస్తథా ।**
**మధునశ్చార్ణవశ్చైవ దధ్నశ్చార్ణవ ఏవ చ ॥55॥**
**ఆజ్యోదనార్ణవశ్చైవ ఫలలేహ్యార్ణవస్తథా ।**
**అపూపగిరయశ్చైవ భక్ష్యభోజ్యార్ణవః పునః ॥56॥**
**పితా తవ మహాదేవః పితా వై జగతాం మునే ।**
**మాతా తవ మహాభాగా జగన్మాతా న సంశయః ॥57॥**
**అమరత్వం మయా దత్తం గాణపత్యం చ శాశ్వతమ్ ।**
**వరాన్ వరయ దాస్యామి నాత్ర కార్యా విచారణా ॥58॥**

అనంతరం దయాళువై నవ్వుతున్న గిరిజను చూచి, బంధుజనపరివృతుడైయున్న ఉపమన్యువును దయతో చూచి నవ్వుతూ ఇలా పలికాడు. ఓ నా కుమారుడా! నీవు నీ బంధువులతో కలిసి ఇష్టపూర్వకంగా భోగాల్ని అనుభవించు. ఓ ఉపమన్యూ! ఓ మహాభాగా! ఇటు చూడు. ఈ పార్వతీదేవి నీ జనని. నేనిప్పుడు నిన్ను నా పుత్రుడిగా చేసుకున్నాను. నీకోసం క్షీరసాగరం, మధుసాగరం, దధిసాగరం, ఘృతం మరియు అన్నసాగరం, ఫలసాగరం, లేహ్యపదార్థసాగరం, అపూపపర్వతం, భక్ష్యభోజ్య పదార్థాల సాగరం ప్రదానం చేశాను. ఓ మునీ! సమస్తలోకాలకు తండ్రి అయిన మహాదేవుడు నీ తండ్రి. జగజ్జనని మహాభాగ పార్వతీదేవి నీ జనని. ఇందులో సందేహం లేదు. నేను నీకు అమరత్వాన్ని, శాశ్వతగాణపత్యాన్ని ప్రదానం చేశాను. ఇపుడు నీవు ఇతరవరాల్ని కూడా కోరుకో. వాటిని ఇస్తాను. ఇందులో నీవు సందేహించ పని లేదు.

**ఏవముక్త్వా మహాదేవః కరాభ్యాముపగృహ్య తమ్ ।**
**ఆఘ్రాయ మూర్ధని విభుర్దదౌ దేవ్యాస్తదా భవః ॥59॥**

ఆ విధంగా పలికి మహాదేవశివుడు, విభుడు తన రెండు చేతులతో ఆతణ్ణి ఎత్తి, శిరసును ఆఘ్రాణించి, ఆతణ్ణి పార్వతీదేవికి ఇచ్చాడు.

**దేవీ తనయమాలోక్య దదౌ తస్మై గిరీంద్రజా ।**
**యోగైశ్వర్యం తదా తుష్టా బ్రహ్మవిద్యాం ద్విజోత్తమాః ॥60॥**

ఓ ద్విజశ్రేష్ఠులారా! అపుడు గిరిరాజపుత్రి పార్వతీదేవి తన పుత్రుణ్ణి చూచి ప్రసన్నురాలై ఆతడికి యోగైశ్వర్యాన్ని అట్లే బ్రహ్మవిద్యను ప్రదానం చేసింది.

**సోఽపి లబ్ధ్వా వరం తస్యాః కుమారత్వం చ సర్వదా ।**
**తుష్టావ చ మహాదేవం హర్షగద్గదయా గిరా ॥61॥**
**వరయామాస చ తదా వరేణ్యం విరజేక్షణమ్ ।**
**కృతాంజలిపుటో భూత్వా ప్రణిపత్య పునః పునః ॥62॥**
**ప్రసీద దేవదేవశ త్వయి చావ్యభిచారిణీ ।**
**శ్రద్ధా చైవ మహాదేవ సాన్నిధ్యం చైవ సర్వదా ॥63॥**

ఆతడు పార్వతీదేవివల్ల వరం మరియు శాశ్వతకౌమార్యం ప్రాప్తించుకుని సంతోషకారణంగా గాద్గదికమైన వాక్కుతో మహాదేవుణ్ణి స్తుతించి, ముకుళితహస్తుడై, విరజేక్షణుడు, వరేణ్యుడు అయిన శివుడికి మాటిమాటికి నమస్కరించి వరాన్ని కోరాడు. ఓ దేవదేవేశా! ప్రసన్నుడవు కమ్ము. ఓ మహాదేవా! నీయందు నాకు ఎప్పుడూ స్థిరమైన శ్రద్ధను కలిగియుండునట్లు, ఎల్లప్పుడూ నీ సాన్నిధ్యం ప్రాప్తించునట్లు వరాన్ని ఇమ్ము.

**ఏవముక్తస్తదా తేన ప్రహసన్నివ శంకరః ।**
**దత్త్వేప్సితం హి విప్రాయ తత్రైవాంతరధీయత ॥64॥**

అపుడు ఉపమన్యుడు ఆ విధంగా పలకగా శంకరభగవానుడు నవ్వుతూ ఆ విప్రుడికి వాంఛితవరాల్ని ప్రదానం చేసి అక్కడే అంతర్ధానం చెందాడు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే ఉపమన్యుచరితం నామ సప్తాధికశతతమోఽధ్యాయః ॥107॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగం ఉపమన్యుచరితమనే నూట ఏడవ అధ్యాయం సమాప్తం

## అష్టోత్తరశతతమోఽధ్యాయః - నూట ఎనిమిదవ అధ్యాయం
## పాశుపతవ్రతమాహాత్మ్యవర్ణనమ్ - పాశుపతవ్రతమాహాత్మ్యవర్ణనం

**ఋషయ ఊచుః -** ఋషులు పలికారు.

**దృష్టోఽసౌ వాసుదేవేన కృష్ణేనాక్లిష్టకర్మణా ।**
**ధౌమ్యాగ్రజస్తతో లబ్ధం దివ్యం పాశుపతం వ్రతమ్ ॥1॥**

**కథం లబ్ధం తదా జ్ఞానం తస్మాత్కృష్ణేన ధీమతా ।**
**వక్తుమర్హసి తాం సూత కథాం పాతకనాశినీమ్ ॥2॥**

సులభకర్మకరణుడైన వాసుదేవ శ్రీకృష్ణుడు ధౌమ్యుడి అన్న అయిన ఉపమన్యుడిని దర్శించి ఆయన నుంచి దివ్యమైన పాశుపతవ్రతాన్ని గ్రహించాడు. ఓ సూతర్షీ! బుద్ధిమంతుడైన శ్రీకృష్ణుడు ఉపమన్యుడి వల్ల ఆ జ్ఞానాన్ని ఏ విధంగా పొందాడు. పాపవినాశిని అయిన ఆ కథను నీవు చెప్ప అర్హుడవు.

**సూత ఉవాచ -** సూతుడు పలికాడు.

**స్వేచ్ఛయా హ్యవతీర్ణోఽపి వాసుదేవః సనాతనః ।**
**నిందయన్నేవ మానుష్యం దేహశుద్ధిం చకార సః ॥3॥**

ఓ ఋషులారా! సనాతనవాసుదేవుడు తన ఇచ్ఛాకారణంగా అవతరించాడు. అయినప్పటికి ఆయనకు మానవుడనే నింద కలగడం వల్ల దేహశుద్ధి చేసుకున్నాడు.

**పుత్రార్థం భగవాంస్తత్ర తపస్తప్తుం జగామ చ ।**
**ఆశ్రమం చోపమన్యోర్వై దృష్టవాంస్తత్ర తం మునిమ్ ॥4॥**

**నమశ్చకార తం దృష్ట్వా ధౌమ్యాగ్రజమహో ద్విజాః ।**
**బహుమానేన వై కృష్ణస్త్రిః కృత్వా వై ప్రదక్షిణమ్ ॥5॥**

భగవాన్ శ్రీకృష్ణుడు పుత్రప్రాప్తికై తపస్సు చేయడానికై ఉపమన్యుడి ఆశ్రమానికి వెళ్లాడు. అక్కడ కృష్ణుడు ఆ మునిని దర్శించాడు. ధౌమ్యాగ్రజుడైన ఆ మునిని చూచి మిక్కిలి గౌరవంతో ఆతడికి మూడుసార్లు ప్రదక్షిణ చేసి నమస్కరించాడు.

**తస్యావలోకనాదేవ మునేః కృష్ణస్య ధీమతః ।**
**నష్టమేవ మలం సర్వం కాయజం కర్మజం తథా ॥6॥**

ఆ మునిని చూడడం వల్లనే బుద్ధిమంతుడు శ్రీకృష్ణుడి దేహజన్యమైన కర్మజన్యమైన మొత్తం మలం నశించింది.

**భస్మనోద్ధూలనం కృత్వా ఉపమన్యుర్మహాద్యుతిః ।**
**తమగ్నిరితి విప్రేంద్రా వాయురిత్యాదిభిః క్రమాత్ ॥7॥**

**దివ్యం పాశుపతం జ్ఞానం ప్రదదౌ ప్రీతమానసః ।**

ఓ విప్రశ్రేష్ఠులారా! మహాతేజస్వి ఉపమన్యుడు భస్మోద్ధూలనం చేసి ప్రసన్నచిత్తుడై క్రమంగా అగ్ని, వాయువు మొదలైన మంత్రాల ద్వారా శ్రీకృష్ణుడికి దివ్యమైన పాశుపతజ్ఞానాన్ని ప్రదానం చేశాడు.

**మునేః ప్రసాదాన్మాన్యోఽసౌ కృష్ణః పాశుపతే ద్విజాః ॥8॥**

**తపసాత్వేకవర్షాంతే దృష్ట్వా దేవం మహేశ్వరమ్ ।**
**సాంబం సగణమవ్యగ్రం లబ్ధవాన్ పుత్రమాత్మనః ॥9॥**

**తదాప్రభృతి తం కృష్ణం మునయః సంశితవ్రతాః ।**
**దివ్యాః పాశుపతాః సర్వే తస్థుః సంవృత్య సర్వదా ॥10॥**

ఓ ద్విజులారా! ముని కృపవల్ల శ్రీకృష్ణుడు పాశుపతవ్రతంతో మాన్యుడయ్యాడు. ప్రారంభించిన తపస్సు ఒక ఏడాది చివర పార్వతీదేవితో గణాలతో కూడిన అవ్యగ్రుడైన మహేశ్వరదేవుడి దర్శనం పొంది ఆయన నుంచి పుత్రప్రాప్తిని పొందాడు. అప్పటినుంచి ప్రశస్తవ్రతులైన దివ్యమునిగణాలు, పశుపతి భక్తులందరూ ఎల్లప్పుడూ కృష్ణుణ్ణి పరివేష్టించి ఉన్నారు.

**అన్యం చ కథయిష్యామి ముక్త్యర్థం ప్రాణినాం సదా ।**
**సౌవర్ణీం మేఖలాం కృత్వా ఆధారం దండధారణమ్ ॥11॥**

**సౌవర్ణం పిండికం చాపి వ్యజనం దండమేవ చ ।**
**నరైః స్త్రియాథ వా కార్యం మషీభాజనలేఖనీమ్ ॥12॥**

**క్షురాకర్తరికా చాపి అథ పాత్రమథాపి వా ।**
**పాశుపతాయ దాతవ్యం భస్మోద్ధూళిత విగ్రహైః ॥13॥**

**సౌవర్ణం రాజతం వాపి తామ్రం వాథ నివేదయేత్ ।**
**ఆత్మవిత్తానుసారేణ యోగినం పూజయేద్ బుధః ॥14॥**

ఓ ఋషులారా! ఎల్లప్పుడూ అన్ని ప్రాణుల ముక్తికై నేను ఇతర వ్రతాన్ని కూడా చెబుతాను. బంగారంతో మొలత్రాడును నిర్మించాలి. దాన్ని ధరించడానికి ఆధారంగా ఒక దండాన్ని ఉంచాలి. బంగారంతో చేయబడిన ఒక కంకణాన్ని, పట్టుకోవడానికి వీలుగా పిడిగల విసనకఱ్ఱను చేయించాలి. తర్వాత పురుషుడైనా, స్త్రీ అయినా ఒక సిరాబుడ్డిని, కలాన్ని చేయించాలి. ఒక పాత్రను, చిన్న కత్తెరను సమకూర్చుకోవాలి. ఈ సామగ్రి మొత్తాన్ని భస్మోద్ధూళితుడైన పురుషుడుగాని స్త్రీగాని పశుపతి భక్తుడికి సమర్పించాలి. బుద్ధిమంతుడైన వ్యక్తి తన ధన శక్తి కొలది, బంగారం, వెండి, రాగి లోహాలతో సామగ్రిని తయారుచేయించి శివయోగికి సమర్పించి పూజించాలి.

**తే సర్వే పాపనిర్ముక్తాః సమస్తకులసంయుతాః ।**
**యాంతి రుద్రపదం దివ్యం నాత్ర కార్యా విచారణా ॥15॥**

**తస్మాదనేన దానేన గృహస్థో ముచ్యతే భవాత్ ।**
**యోగినాం సంప్రదానేన శివః క్షిప్రం ప్రసీదతి ॥16॥**

**రాజ్యం పుత్రం ధనం భవ్యమశ్వం యానమథాపి వా ।**
**సర్వస్వం వాపి దాతవ్యం యదీచ్ఛేన్మోక్షముత్తమమ్ ॥17॥**

**అధ్రువేణ శరీరేణ ధ్రువం సాధ్యం ప్రయత్నతః ।**
**భవ్యం పాశుపతం నిత్యం సంసారార్ణవతారకమ్ ॥18॥**

ఆ విధంగా దానం చేసే మానవులు అందరూ సంపూర్ణంగా తన వంశంతో కూడా పాపరహితులై దివ్యమైన రుద్రపదానికి వెళుతున్నారు. ఇందుకు సందేహించ పనిలేదు. ఈ దానం వల్ల గృహస్థుడు భవవిముక్తుడవుతాడు. యోగులకు ఈ దానం ఇస్తే శివభగవానుడు త్వరగా ప్రసన్నుడవుతాడు. ఎవరు ఉత్తమమైన మోక్షాన్ని కోరతారో వాళ్లు భవ్యమైన రాజ్యాన్ని, పుత్రుల్ని, ధనాన్ని, అశ్వాల్ని,, వాహనాల్ని ఈ అన్నింటిని దానం ఇవ్వాలి. ఈ అనిత్యమైన శరీరంతో సంసారసాగరాన్ని దాటాలని తలచే వ్యక్తి భవ్యం, నిత్యం అయిన పాశుపతవ్రతాన్ని ప్రయత్నపూర్వకంగా అవశ్యం సిద్ధించుకోవాలి.

**ఏతద్వః కథితం సర్వం సంక్షేపాన్న చ సంశయః ।**
**యః పఠేచ్ఛృణుయాద్వాపి విష్ణులోకం స గచ్ఛతి ॥19॥**

ఓ ఋషులారా! నేను సంగ్రహంగా మీకు ఈ వ్రతాన్ని గూర్చి చెప్పాను. ఎవడు దీన్ని పఠిస్తాడో లేక వింటాడో ఆతడు విష్ణులోకానికి వెళుతున్నాడు. ఇందులో సందేహం లేదు.

**ఇతి శ్రీ లింగమహాపురాణే పూర్వభాగే పాశుపతవ్రత మాహాత్మ్యవర్ణనం నామాష్టోత్తరశతతమోఽధ్యాయః ॥108॥**

శ్రీ లింగమహాపురాణం పూర్వభాగంలోని పాశుపతవ్రతమాహాత్మ్యమనే నూట ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

॥ పూర్వభాగం సమాప్తం ॥

**ఉత్తరభాగః** – ఉత్తరభాగం

**ప్రథమోఽధ్యాయః** – మొదటి అధ్యాయం

**కౌశికవృత్తకథనమ్** – కౌశికవృత్తకథనం

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

> **కృష్ణస్తుష్యతి కేనేహ సర్వదేవేశ్వరేశ్వరః ।**
> **వక్తుమర్హసి చాస్మాకం సూత సర్వార్థవిద్భవాన్ ॥1॥**

ఓ సూతమహర్షీ! సమస్తదేవతలకు మరియు ఈశ్వరులకు ఈశ్వరుడైన కృష్ణుడు ఈ లోకంలో ఏ విధంగా సంతుష్టుడు కాగలడు? నీవు మాకు చెప్పవలసింది. నీవు సంపూర్ణతత్త్వాన్ని ఎరిగినవాడవు.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

> **పురా పృష్టో మహాతేజా మార్కండేయో మహామునిః ।**
> **అంబరీషేణ విప్రేంద్రాస్తద్వదామి యథాతథమ్ ॥ 2 ॥**

ఓ విప్రశ్రేష్ఠులారా! పూర్వం అంబరీషుడనే మహారాజుచేత అడగబడి మార్కండేయమహాముని ఈ విషయంలో ఏమి చెప్పాడో అట్టి దానినే ఉన్నది ఉన్నట్లు చెబుతున్నాను.

**అంబరీష ఉవాచ** – అంబరీషుడు పలికాడు.

> **మునే సమస్తధర్మాణాం పారగస్త్వం మహామతే ।**
> **మార్కండేయ పురాణోఽసి పురాణార్థవిశారదః ॥3॥**

ఓ ఋషీ! ఓ మహామతీ! ఓ మార్కండేయా! నీవు సమస్తధర్మాల్ని సంపూర్ణంగా తెలిసినవాడవు. మిక్కిలి పురాతనుడవు. అట్లే పురాణార్థప్రవీణుడవు.

> **నారాయణానాం దివ్యానాం ధర్మాణాం శ్రేష్ఠముత్తమమ్ ।**
> **తత్కిం బ్రూహి మహాప్రాజ్ఞ భక్తానామిహ సువ్రత ॥4॥**

నారాయణుడి దివ్యధర్మాలలో ఏ ధర్మం శ్రేష్ఠమైంది, మరియు ఉత్తమం అయినది ఏది? ఓ సువ్రతుడా! అట్టి దానిని నీవు ఇప్పుడు భక్తుల కొరకై తెలియచెప్పు.

**సూత ఉవాచ** – సూతర్షి పలికాడు.

> **తస్య తద్వచనం శ్రుత్వా సముత్థాయ కృతాంజలిః ।**
> **స్మరన్నారాయణం దేవం కృష్ణమచ్యుతమవ్యయమ్ ॥5॥**

వారియొక్క ఆ మాటలు విని మార్కండేయమహర్షి లేచి నిలిచి చేతులు జోడించి శాశ్వతుడు, అచ్యుతుడు అయిన నారాయణకృష్ణుడిని స్మరిస్తూ,

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు పలికాడు.

**శృణు భూప యథాన్యాయం పుణ్యం నారాయణాత్మకమ్ ।**
**స్మరణం పూజనం చైవ ప్రణామో భక్తిపూర్వకమ్ ॥6॥**

**ప్రత్యేకమశ్వమేధస్య యజ్ఞస్య సమముచ్యతే ।**
**య ఏకః పురుషః శ్రేష్ఠః పరమాత్మా జనార్దనః ॥7॥**

**యస్మాద్ బ్రహ్మా తతః సర్వం సమాశ్రిత్యైవముచ్యతే ।**
**ధర్మమేకం ప్రవక్ష్యామి యద్దృష్టం విదితం మయా ॥8॥**

ఓ రాజా! విను. భక్తిపూర్వకంగా భగవంతుడైన నారాయణుడిని స్మరించినా, పూజించినా, నమస్కరించినా అశ్వమేధయాగాన్ని నిర్వహించిన దానివలన కలిగే ఫలితంతో సమానమైన ఫలితాన్ని పొందవచ్చు. ఎందుకంటే ఆతడొక్కడే పరమాత్ముడు. పురుషశ్రేష్ఠుడు, మహాత్ముడు. జనార్దనుడిని ఆశ్రయించే బ్రహ్మదేవుడు జగత్తుకు సృష్టికర్త అయ్యాడు. నేను చూచిన, నేను తెలిపిన ఆతడియొక్క ఏకమాత్రమైన అనగా ముఖ్యమైన ధర్మాన్ని చెప్పగలను.

**పురా త్రేతాయుగే కశ్చిత్ కౌశికో నామ వై ద్విజః ।**
**వాసుదేవపరో నిత్యం సామగానరతః సదా ॥9॥**

పూర్వం త్రేతాయుగంలో కౌశికుడనే పేరుగల ఒక బ్రాహ్మణుడు ఉన్నాడు. ఆతడు నిత్యం వాసుదేవపరాయణుడై ఎల్లప్పుడూ  సామగాన ప్రీతితో ఉండేవాడు.

**భోజనాసనశయ్యాసు సదా తద్గతమానసః ।**
**ఉదారచరితం విష్ణోర్గాయమానః పునః పునః ॥10॥**

ఆతడు ఎల్లప్పుడూ విష్ణుభగవానుడి యొక్క ఉదారమైన చరిత్రను మాటిమాటికి గానం చేసేవాడు. తింటున్నా, కూర్చున్నా, పడుకున్నా ఎప్పుడూ నారాయణుడినే మనసున నిలుపుకునేవాడు.

**విష్ణోః స్థలం సమాసాద్య హరేః క్షేత్రమనుత్తమమ్ ।**
**అగాయత హరిం తత్ర తాలవర్ణలయాన్వితమ్ ॥11॥**
**మూర్ఛనాస్వరయోగేన శ్రుతిభేదేన భేదితమ్ ।**
**భక్తియోగం సమాపన్నో భిక్షామాత్రం హి తత్ర వై ॥12॥**

పరమపవిత్రమైన వైష్ణవాలయాలలో తాళ, లయ, స్వర సమన్వితాలైన మూర్ఛనలతో, స్వరయోగంతో, బృహద్రథంతరాది శ్రుతిభేదాలతో భగవానుడైన శ్రీహరిని గూర్చి పాడతాడు. ఈ విధంగా ఎల్లప్పుడూ భక్తియోగంలో లగ్నమైనవాడై భిక్షను గ్రహించి జీవిస్తూండేవాడు.

**తత్రైనం గాయమానం చ దృష్ట్వా కశ్చిద్ద్విజస్తదా ।**
**పద్మాఖ్య ఇతి విఖ్యాతస్తస్మై చాన్నం దదౌ తదా ॥13॥**
**సకుటుంబో మహాతేజా హ్యుష్ణమన్నం హి తత్ర వై ।**
**కౌశికో హి తదా హృష్టో గాయన్నాస్తే హరిం ప్రభుమ్ ॥14॥**

అప్పుడు ఆ విధంగా గానం చేస్తూ జీవిస్తున్న ఆతడిని చూచి పద్మాఖ్యుడనే పేరుతో ప్రసిద్ధుడైన ఒకబ్రాహ్మణుడు ఆతడికి అన్నాన్ని ప్రదానం చేసేవాడు. అపుడు మహాకాంతిమంతుడైన ఆ కౌశికుడు తన కుటుంబసహితంగా వేడి భోజనాన్ని గ్రహిస్తూ సంతోషంగా విష్ణుభగవానుడి యొక్క గుణాల్ని గానం చేస్తూ అక్కడే ఉన్నాడు.

**శృణ్వన్నాస్తే స పద్మాఖ్యః కాలే కాలే వినిర్గతః ।**
**కాలయోగేన సంప్రాప్తాః శిష్యా వై కౌశికస్య చ ॥15॥**

**సప్త రాజన్య వైశ్యానాం విప్రాణాం కులసంభవాః ।**
**జ్ఞానవిద్యాధికాః శుద్ధా వాసుదేవపరాయణాః ॥16॥**

పద్మాఖ్యుడు కూడా ఆతడి గానాన్ని వినేవాడు. అప్పుడప్పుడూ బయటకు వెళ్లేవాడు. అప్పుడే కౌశికుడికి కాలనియోగంతో ఏడుగురు శిష్యులు దొరికారు. వాళ్లే బ్రహ్మక్షత్రవైశ్యకుల సంభవులు. పరిశుద్ధులు, జ్ఞాన విద్యాధికులు–వాసుదేవపరాయణులు.

**తేషామపి తథాన్నాద్యం పద్మాక్షః ప్రదదౌ స్వయమ్ ।**
**శిష్యైశ్చ సహితో నిత్యం కౌశికో హృష్టమానసః ॥17॥**

**విష్ణుస్థలే హరిం తత్ర ఆస్తే గాయన్ యథావిధి ।**

పద్మాక్షుడే స్వయంగా వారికి కూడా అన్నాన్ని మరియు అందులో ఉపయోగించే పదార్థాల్ని ఇచ్చేవాడు. కౌశికుడు ప్రసన్నచిత్తుడై, తన శిష్యులతో కూడినవాడై వైష్ణవాలయాలలో ప్రభువైన శ్రీహరియొక్క గుణాల్ని యథావిధిగా గానం చేస్తూ ఉన్నాడు.

**తత్రైవ మాలవో నామ వైశ్యో విష్ణుపరాయణః ॥18॥**
**దీపమాలాం హరేర్నిత్యం కరోతి ప్రీతిమానసః ।**
**మాలవీ నామ భార్యా చ తస్య నిత్యం ప్రతివ్రతా ॥19॥**

**గోమయేన సమాలిప్య హరేః క్షేత్రం సమంతతః ।**
**భర్త్రా సహాస్తే సుప్రీతా శృణ్వతీ గానముత్తమమ్ ॥20॥**

అక్కడే మాలవుడనే పేరుగల వైశ్యుడు, విష్ణుచిత్తుడు సంతోషంగా శ్రీహరికి దీపావళిని సమర్పించేవాడు. ఆ వైశ్యుడియొక్క భార్య మాలవి అనే ఆమె మిక్కిలి పతివ్రత – నిత్యమూ ఆవు పేడతో విష్ణుమందిరాన్ని పూర్తిగా అలుకుతూ, ఆ ఉత్తమగానాన్ని వింటూ సంతోషంగా భర్తతో కలిసి ఉన్నది.

**కుశస్థలాత్సమాపన్నా బ్రాహ్మణాః శంసితవ్రతాః ।**
**పంచాశద్వై సమాపన్నా హరేర్గానార్థముత్తమాః ॥21**

**సాధయంతో హి కార్యాణి కౌశికస్య మహాత్మనః ।**
**గానవిద్యార్థతత్త్వజ్ఞాః శృణ్వంతో హ్యవసంస్తు తే ॥22॥**

అప్పుడే శ్రేష్ఠవ్రతులైన విప్రులు ఏభైమంది కుశస్థలం నుంచి శ్రీహరిగానాన్ని వినడానికై వచ్చారు. గాన విద్యామూలరహస్యాన్ని ఎరిగిన ఆ బ్రాహ్మణులు మహాత్ముడైన కౌశికుడి గానకార్యక్రమాన్ని సంపన్నం చేస్తూ శ్రీహరి కీర్తనాన్ని వింటూ అక్కడే ఉన్నారు.

**ఖ్యాతమాసీత్తదా తస్య గానం వై కౌశికస్య తత్ ।**
**శ్రుత్వా రాజా సమభ్యేత్య కలింగో వాక్యమబ్రవీత్ ॥23॥**

**కౌశికాద్య గణైః సార్ధం గాయస్వేహ చ మాం పునః ।**
**శృణుధ్వం చ తథా యూయం కుశస్థలజనా అపి ॥24॥**

అప్పుడు కౌశికుడి గానవిద్య ప్రసిద్ధి పొందింది. దాంతో ఆ ప్రసిద్ధిని విని కళింగరాజు అక్కడకు వచ్చి ఇలా పలికాడు. ఓ కౌశికుడా! ఇపుడు నీవు నీ గాయక సమూహంతో పాటు నన్ను గూర్చి గానం చెయ్యి. దాంతో నాయీ జనులందరూ అట్లే కుశస్థలంలోని జనులూ వింటారు.

**తచ్ఛ్రుత్వా కౌశికః ప్రాహ రాజానం సాంత్వయా గిరా ।**
**న జిహ్వా మే మహారాజన్ వాణీ చ మమ సర్వదా ॥25॥**

**హరేరన్యమపీంద్రం వా స్తౌతి నైవ చ వక్ష్యతి ।**

రాజుయొక్క ఆ మాటలు విని కౌశికుడు అనునయపూర్వకమైన వాక్కుతో ఆతనితో ఇలా పలికాడు. ఓ మహారాజా! నా నాలుక, అట్లే నా వాణి విష్ణుభగవానుడిని కాక ఇతరుడిని, ఇంద్రుడిని కూడా ఇంతవరకు స్తుతించలేదు. మాట్లాడలేదు.

**ఏవముక్తే తు తచ్ఛిష్యో వాసిష్ఠో గౌతమో హరిః ॥26॥**

**సారస్వతస్తథా చిత్రశ్చిత్రమాల్యస్తథా శిశుః ।**
**ఊచుస్తే పార్థివం తద్వద్యథా ప్రాహ చ కౌశికః ॥27॥**
**శ్రావకాస్తే తథా ప్రోచుః ప్రార్థివం విష్ణుతత్పరాః ।**
**శ్రోత్రాణీమాని శృణ్వంతి హరేరన్యం న పార్థివ ॥28॥**

**గానకీర్తిం వయం తస్య శృణుమోఽన్యాం న చ స్తుతిమ్ ।**

కౌశికుడు ఆ విధంగా చెప్పగా ఆతడి శిష్యులైన వాసిష్ఠుడు, గౌతముడు, హరి, సారస్వతుడు, చిత్రుడు, చిత్రమాల్యుడు శిశువు అనువారు గురువు ఏ విధంగా పలికాడో ఆ విధంగానే పలికారు. విష్ణు పరాయణులైన ఆ శ్రోతలు కూడా ఓ రాజా! మా చెవులు శ్రీహరిని విడిచి ఏ ఇతరునియొక్క గుణగానాన్ని వినవు. మేము శ్రీహరి యశోగానాన్నే వింటున్నాం. ఇతరుల స్తుతిని వినం.

**తచ్ఛ్రుత్వా పార్థివో రుష్టో గాయతామితి అబ్రవీత్ ॥29॥**

**స్వభృత్యాన్ బ్రాహ్మణా హ్యేతే కీర్తిం శృణ్వంతి మే తథా ।**
**న శృణ్వంతి కథం తస్మాత్ గాయమానే సమంతతః ॥30॥**

ఆ మాటలు విన్న రాజు కుపితుడై తన సేవకులతో ఇలా పలికాడు. ఇపుడు మీరు పాడండి! దాంతో ఈ బ్రాహ్మణులు నా కీర్తిని వింటారు. అన్ని దిక్కులలో కీర్తింపబడుతున్న నా కీర్తిని వారు ఏ విధంగా వినరో చూద్దాం.

**ఏవముక్తా స్తదా భృత్యా జగుః పార్థివముత్తమమ్ ।**
**నిరుద్ధమార్గా విప్రాస్తే గానే వృత్తే తు దుఃఖితాః ॥31॥**

**కాష్ఠశంకుభిరన్యోన్యం శ్రోత్రాణి విదధుర్ద్విజాః ।**

రాజు ఆ విధంగా పలకగా ఆ సేవకులు ఉత్తముడైన ఆతడిని స్తుతించారు. గానం ప్రారంభం కాగానే ఆ బ్రాహ్మణులు బలవంతంగా దానిని వినడానికి ఇష్టంలేనివారై మిక్కిలి దుఃఖించారు. చెక్కముక్కలతో పరస్పరం వారి చెవుల్ని నిర్బంధించారు.

**కౌశికాద్యాశ్చ తాం జ్ఞాత్వా మనోవృత్తిం నృపస్య వై ॥32॥**
**ప్రసహ్యాస్మాంస్తు గాయేత స్వగానేఽసౌ నృపః స్థితః ।**
**ఇతి విప్రాః సునియతా జిహ్వాగ్రం చిచ్ఛిదుః కరైః ॥33॥**

కౌశికాదులైన గాయకులు ఆ రాజుయొక్క మానసిక ప్రవృత్తిని గుర్తించిన వారై తమనుకూడా ఒత్తిడి చేసి తన యశోగానాన్ని చేయిస్తాడని భావించి తమ నాలుక యొక్క కొన భాగాల్ని తమ చేతులతో కోసుకున్నారు.

**తతో రాజా సు సంక్రుద్ధః స్వదేశాత్తాన్న్యవాసయత్ ।**
**ఆదాయ సర్వం విత్తం చ తతస్తే జగ్మురుత్తరామ్ ॥34॥**

**దిశమాసాద్య కాలేన కాలధర్మేణ యోజితాః ।**
**తానాగతాన్ యమో దృష్ట్వా కిం కర్తవ్యమితి స్మ హ ॥35॥**

తర్వాత రాజు మిక్కిలి కుపితుడై వారిని తన దేశాన్నుంచి సమస్తమైన ధనాన్ని తీసుకుని బహిష్కరించాడు. వారు ఉత్తరదిక్కుకు వెళ్లారు. తదుపరి కొంత కాలానికి మృతి చెందారు. కాలధర్మం చెంది వచ్చిన వారిని యమధర్మరాజు చూచి చేయదగిన కార్యమేమిటని ఆలోచించాడు.

**చేష్టితం తత్క్షణే రాజన్ బ్రహ్మా ప్రాహ సురాధిపాన్ ।**
**కౌశికాదీన్ ద్విజానద్య వాసయధ్వం యథా సుఖమ్ ॥36॥**

**గానయోగేన యే నిత్యం పూజయంతి జనార్దనమ్ ।**
**తానానయత భద్రం వో యది దేవత్వమిచ్ఛథ ॥37॥**

ఓ రాజా! యమధర్మరాజుయొక్క ఆ చేష్టను చూచిన బ్రహ్మదేవుడు దేవేశ్వరులనుద్దేశించి అపుడే ఇలా పలికాడు. కౌశికుడు మొదలైన ఈ బ్రాహ్మణులకు ఇపుడు సుఖమయమైన నివాసం కల్పించాలి. తమకు దేవత్వాన్ని కోరుతున్న వీరు గానంతో మనోనిగ్రహంతో జనార్దనభగవానుడిని నిత్యం పూజిస్తున్నారు. ఇక్కడకు వచ్చినవారికి క్షేమాన్ని కల్పించండి!

**ఇత్యుక్తా లోకపాలాస్తే కౌశికేతి పునః పునః ।**
**మాలవేతి తథా కేచిత్ పద్మాక్షేతి తథా పరే ॥38॥**

**క్రోశమానాః సమభ్యేత్య తానాదాయ విహాయసా ।**
**బ్రహ్మలోకం గతాః శీఘ్రం ముహూర్తేనైవ తే సురాః ॥39॥**

బ్రహ్మ ఆ విధంగా చెప్పగా లోకపాలకులు ఓ కౌశికా! అని కొందరు, ఓ పద్మాక్షా! అని ఇతరులు మాటిమాటికి పిలుస్తున్నవారై ఆ బ్రాహ్మణుల వెంటబడుతూ వారిని దగ్గరకు తీసుకుని ఆకాశమార్గంలో త్వరగా క్షణకాలంలో బ్రహ్మలోకానికి వెళ్ళారు.

**కౌశికాదీంస్తతో దృష్ట్వా బ్రహ్మా లోకపితామహః ।**
**ప్రత్యుద్గమ్య యథాన్యాయం స్వాగతేనాభ్యపూజయత్ ॥40॥**

**తతః కోలాహలమభూదతిగౌరవముల్బణమ్ ।**
**బ్రహ్మణా చరితం దృష్ట్వా దేవానాం నృపసత్తమ ॥ 41॥**

అపుడు లోక పితామహుడైన బ్రహ్మదేవుడు కౌశికాదుల్ని చూచి ఎదురెల్లి తగిన విధంగా స్వాగతించి పూజించాడు. బ్రహ్మ చేసిన ఆ మహాసన్మానాన్ని చూచిన దేవతలు పరస్పరం కోలాహలం సృష్టించారు.

**హిరణ్యగర్భో భగవాంస్తాన్నివార్య సురోత్తమాన్ ।**
**కౌశికాదీన్ సమాదాయ మునీన్ దేవైః సమావృతః ॥42॥**

**విష్ణులోకం యయౌ శీఘ్రం వాసుదేవపరాయణః ।**

తర్వాత విష్ణుతత్పరుడైన బ్రహ్మదేవుడు సురేశ్వరులను నివారించి, వారితో చుట్టబడియున్న కౌశికాది మునుల్ని ఆదరంతో తీసుకుని త్వరగా విష్ణులోకానికి వెళ్లాడు.

**తత్ర నారాయణో దేవః శ్వేతద్వీపనివాసిభిః ॥43॥**

**జ్ఞానయోగేశ్వరైః సిద్ధైర్విష్ణుభక్తైః సమాహితైః ।**
**నారాయణసమైర్దివ్యైశ్చతుర్బాహుధరైః శుభైః ॥44॥**

**విష్ణుచిహ్నసమాపన్నైర్దీప్యమానైరకల్మషైః ।**
**అష్టాశీతిసహస్రైశ్చ సేవ్యమానో మహాజనైః ॥45॥**

**అస్మాభిర్నారదాద్యైశ్చ సనకాద్యైరకల్మషైః ।**
**భూతైర్నానావిధైశ్చైవ దివ్యస్త్రీభిః సమంతతః ॥46॥**

**సేవ్యమానోఽథ మధ్యే వై సహస్రద్వారసంవృతే ।**
**సహస్రయోజనాయామే దివ్యే మణిమయే శుభే ॥ 47॥**

**విమానే విమలే చిత్రే భద్రపీఠాసనే హరిః ।**
**లోకకార్యే ప్రసక్తానాం దత్తదృష్టిశ్చ మాధవః ॥48॥**

అక్కడ నారాయణదేవుడు శ్వేతదీపనివాసులైన జ్ఞానయోగేశ్వరులతో, సిద్ధులతో, నారాయణసములతో, దివ్యులు, శుభులు అయిన చతుర్భుజులతో, విష్ణుమూర్తియొక్క చిహ్నాలతో ప్రకాశిస్తున్న కల్మషరహితులతో ఎనభై ఎనిమిదివేల విష్ణుభక్తులతో కూడినవాడై మరియు మావారైన నారదుడు, సనకుడు మొదలైన మునులతో, అనేకులైన పాపరహితులైన జనంతో అట్లే దివ్యస్త్రీలతో అన్ని వైపుల పరివేష్టింపబడి సేవింపబడుతున్నాడు. వేయిద్వారాలు గలట్టి, వేయి యోజనాల విస్తారం గలట్టి, అలౌకికాలైన మణులతో నిర్మితమైనట్టి మనోహరమైన విమానంమీద నిర్మలమూ మరియు అద్భుతమైన సింహాసనం మీద ప్రకాశిస్తూ లోకకార్యాల విషయంలో తత్పరులైన ప్రజల్ని చూస్తూ ప్రకాశించాడు.

**తస్మిన్ కాలేఽథ భగవాన్ కౌశికాద్యైశ్చ సంవృతః ।**
**ఆగమ్య ప్రణిపత్యాగ్రే తుష్టావ గరుడధ్వజమ్ ॥49॥**

ఆ సమయంలో కౌశికుడు మొదలైన మునిసమూహంతో కూడిన బ్రహ్మదేవుడు గరుడధ్వజుడైన శ్రీహరిని సమీపించి నమస్కరించి స్తుతించాడు.

**తతో విలోక్య భగవాన్ హరిర్నారాయణః ప్రభుః ।**
**కౌశికేత్యాహ సంప్రీత్యా తాన్ సర్వాంశ్చ యథాక్రమమ్ ॥50॥**

**జయఘోషో మహానాసీన్మహాశ్చర్యే సమాగతే ।**

తర్వాత భగవంతుడు, శ్రీహరి, శ్రీమన్నారాయణుడు, ప్రభువు అయిన ఆయన వారిని పరికించి ప్రేమతో కౌశికా! మాలవా! పద్మాక్షా! అని పేర్లతో పిలిచాడు. ఇది ఎంతో ఆశ్చర్యకరం కావడంతో అక్కడ అపుడు జయజయధ్వానాలు విన్పించాయి.

**బ్రహ్మాణమాహ విశ్వాత్మా శృణు బ్రహ్మన్ మయోదితమ్ ॥51॥**

**కౌశికస్య ఇమే విప్రాః సాధ్యసాధనతత్పరాః ।**
**హితాయ సంప్రవృత్తా వై కుశస్థల నివాసినః ॥52॥**

**ప్రకీర్తిశ్రవణే యుక్తా జ్ఞానతత్త్వార్థకోవిదాః ।**
**అన్యోన్యదేవతాభక్తాః సాధ్యా దేవా భవంత్విమే ॥53॥**

**మత్సమీపే తథాన్యత్ర ప్రవేశం దేహి సర్వదా ।**

విశ్వాత్ముడైన విష్ణువు బ్రహ్మతో పలికాడు. ఓ బ్రహ్మా! నా మాటలువిను. సాధ్యసాధనాలలో తాత్పర్యంగల కుశస్థలనివాసులైన ఈ కౌశికాదులైన విప్రులకు హితం చేకూర్చే విషయమిది. వారు జ్ఞానంలో, తత్త్వార్థంలోను పండితులు. నా కీర్తిని వినడంలో తత్పరత కల్గినవారు. దేవతలలో అనన్యమైన భక్తిగలవారు. వారు సాధ్యదేవులు అవుతారు. వారికి నాదగ్గరకు రావడానికి వెళ్లడానికి అనుమతినివ్వండి!

**ఏవముక్త్వా పునర్దేవః కౌశికం ప్రాహ మాధవః ॥54॥**

**స్వశిష్యైస్త్వం మహాప్రాజ్ఞ దిగ్బంధో భవ మే సదా ।**
**గణాధిపత్యమాపన్నో యత్రాహం త్వం సమాస్వ వై ॥55॥**

ఆ విధంగా బ్రహ్మకు చెప్పిన తర్వాత మాధవుడు కౌశికుడితో ఇలా పలికాడు. ఓ మహామేధావీ! నీవు నీ శిష్యులతో కూడి ఎల్లప్పుడూ నా సమీపంలో ఆవృతుడవై ఉండు. గణాధిపత్యం పొంది ఇక్కడే ఉండండి.

**మాలవం మాలవీం చైవ ప్రాహ దామోదరో హరిః ।**
**మమలోకే యథాకామం భార్యయా సహ మాలవ ॥56॥**

**దివ్యరూపధరః శ్రీమాన్ శృణ్వన్ గానమిహాధిపః ।**
**ఆస్వ నిత్యం యథాకామం యావల్లోకా భవంతి వై ॥57॥**

ఈ విధంగా దామోదరుడైన శ్రీహరి మాలవుడితో, ఆతడి భార్య అయిన మాలవితో పలికాడు. ఓ మాలవా! నీవు నాయీ లోకంలో భార్యతోపాటు దివ్యరూపాన్ని ధరించి స్వేచ్ఛగా నా యశోగానాన్ని వింటూ రాజుగా ప్రతిష్ఠితుడవై నివసించు. ఎప్పుడైనా ఏలోకంలోనైనా ఉండవచ్చు.

**పద్మాక్షమాహ భగవాన్ ధనదో భవ మాధవః ।**
**ధనానామీశ్వరో భూత్వా యథాకాలం హి మాం పునః ॥58॥**

**ఆగమ్య దృష్ట్వా మాం నిత్యం కురు రాజ్యం యథాసుఖమ్ ।**

తర్వాత భగవంతుడైన మాధవుడు పద్మాక్షుడితో పలికాడు. నీవు ధనదుడవు కమ్ము. ధనానికి స్వామివి అయి నీవు నీ యిష్టమైనపుడు నాదగ్గరకు వచ్చి నన్ను దర్శిస్తూ సుఖంగా ఎల్లప్పుడూ రాజ్యపాలన చేయి.

**ఏవముక్త్వా హరిర్విష్ణుర్బ్రహ్మాణమిదమబ్రవీత్ ॥59॥**
**కౌశికస్యాస్య గానేన యోగనిద్రా చ మే గతా ।**
**విష్ణుస్థలే చ మాం స్తౌతి శిష్యైరేష సమంతతః ॥60॥**
**రాజా నిరస్తః క్రూరేణ కలింగేన మహీయసా ।**
**స జిహ్వాచ్ఛేదనం కృత్వా హరేరన్యం కథంచన ॥61॥**
**న స్తోష్యామీతి నియతః ప్రాప్తోఽసౌ మమ లోకతామ్ ।**
**ఏతే చ విప్రా నియతా మమ భక్తా యశస్వినః ॥62॥**
**శ్రోత్రచ్ఛిద్రమథాహత్య శంకుభిర్వై పరస్పరమ్ ।**
**శ్రోష్యామో నైన చాన్యద్వై హరేః కీర్తిమితి స్మ హ ॥63॥**
**ఏతే విప్రాశ్చ దేవత్వం మమ సాన్నిధ్యమేవ చ ।**
**మాలవో భార్యయా సార్ధం మత్క్షేత్రం పరిమృజ్య వై ॥64॥**

**దీపమాలాదిభిర్నిత్యమభ్యర్చ్య సతతం హి మామ్ ।**
**గానం శృణోతి నియతో మత్కీర్తిచరితాన్వితమ్ ॥65॥**

**తేనాసౌ ప్రాప్తవాన్ లోకం మమ బ్రహ్మ సనాతనమ్ ।**
**పద్మాక్షోఽసౌ దదౌ భోజ్యం కౌశికస్య మహాత్మనః ॥66॥**
**ధనేశత్వమవాప్తోఽసౌ మమ సాన్నిధ్యమేవ చ ।**

పద్మాక్షుడితో ఆ విధంగా పలికిన తర్వాత శ్రీహరి బ్రహ్మతో ఇలా పలికాడు. ఈ కౌశికుడి గానంతో నా యోగనిద్ర ముగిసింది. ఈతడు తన శిష్యులతోపాటు వైష్ణవాయాలలో నన్ను బాగా స్తుతించాడు. అధికబలుడు, క్రూరుడు అయిన కళింగరాజు వీళ్లను దేశం నుంచి బహిష్కరించాడు. వీళ్లు వాళ్ల నాలుకల్ని కోసుకుని శ్రీహరికన్నా భిన్నుడైనవాడిని ఏ విధంగానూ స్తుతించలేదు. ఆ విధమైన నిర్ణయాన్ని ఆచరించడంవల్ల వాళ్లు నా లోకాన్ని పొందారు. ఈ విధంగానే ఈ మునులు, నా భక్తులైన కీర్తిమంతులైన ఈ విప్రులు చెవుల్ని పొడుచుకుని, ఒకళ్ల కొకళ్లు చెక్కల్ని దోపుకుని ప్రతిన పూని శ్రీహరి కీర్తిని విడిచి అన్యుడి కీర్తిని వినలేదు. అందుచేత ఈ బ్రాహ్మణులకు

కూడా దేవత్వం మరియు నా సాన్నిధ్యం ప్రాప్తించింది. ఈ మాలవుడు కూడా తన భార్యతోపాటు నా మందిరాన్ని మిక్కిలిగా శుభ్రపరచి, దీపావళిని వెలిగించి, మాలలు సమర్పించి, నిత్యం నన్ను అర్చించి ఏకాగ్రచిత్తంతో నా యశస్సుతో చరిత్రతో కూడిన గానాన్ని నిరంతరం వినేవాడు. ఓ బ్రహ్మా! అందుచేతనే ఆతడికి నాయొక్క సనాతనలోకం ప్రాప్తించింది. ఈ పద్మాక్షుడు కౌశికుడికి భోజనం సమకూర్చాడు. దాంతో అతడికి ధనేశత్వం మరియు నా సాన్నిధ్యం ప్రాప్తించింది.

**ఏవముక్త్వా హరిస్తత్ర సమాజే లోకపూజితః ॥67॥**

**తస్మిన్ క్షణే సమాపన్నా మధురాక్షరపేశలైః ।**
**విపంచీగుణతత్త్వజ్ఞైర్వాద్యవిద్యావిశారదైః ॥68॥**

**మందం మందస్మితా దేవీ విచిత్రాభరణాన్వితా ।**
**గాయమానా సమాయాతా లక్ష్మీర్విష్ణుపరిగ్రహా ॥69॥**

**వృతా సహస్రకోటీభిరంగనాభిః సమంతతః ।**
**తతో గణాధిపా దృష్ట్వా భుశుండీపరిఘాయుధాః ॥70॥**

**బ్రహ్మాదీంస్తర్జయంతస్తే మునీన్ దేవాన్ సమంతతః ।**
**ఉత్సారయంతః సంహృష్టాధిష్ఠితాః పర్వతోపమాః ॥71॥**

**సర్వే వయం హి నిర్యాతాః సార్ధంవై బ్రహ్మణా సురైః ।**

ఆ విధంగా లోకపూజితుడు భగవానుడైన శ్రీహరి పలకగా, ఆక్షణంలోనే మధురస్వరవిశేషవేత్తలు, వీణావాదన గుణతత్త్వవేత్తలు, వాద్యవిద్యలందు పండితులైన వారితోపాటు విచిత్రాభరణభూషిత అయి విష్ణుపత్ని లక్ష్మీదేవి చిరునవ్వుతో గానం చేస్తూ అక్కడకు వచ్చింది. ఆమె వేలకొలది కోట్లకొలది స్త్రీలతో పరివేష్టించి ఉన్నది. అపుడు ఆమెను చూచి భుశుండి మరియు పరిఘ అనే పేర్లుగల పర్వతసమానులు ఆయుధధారులైన గణాధిపులు మునులను, బ్రహ్మాదిదేవతలను అన్నివైపుల నుంచి హెచ్చరిస్తూ తొలగదోస్తూ సంతోషాన్ని పొందుతూ ఉన్నారు. తర్వాత బ్రహ్మదేవుడు, మిగిలిన దేవతలతోపాటు మునులమైన మేము కూడా బయటబడ్డాం.

**తస్మిన్ క్షణే సమాహూతస్తుంబరుర్మునిసత్తమః ॥72॥**

**ప్రవివేశ సమీపం వై దేవ్యా దేవస్య చైవ హి ।**
**తత్రాసీనో యథాయోగం నానామూర్ఛసమన్వితమ్ ॥73॥**

**జగౌ కలపదం హృష్టో విపంచీం చాభ్యవాసయేత్ ।**
**నానారత్నసమాయుక్తై ర్దివ్యైరాభరణోత్తమైః ॥74॥**

**దివ్యమాల్యైస్తథా శుభ్రైః పూజితో మునిసత్తమః ।**
**నిర్గతస్తుంబరర్హృష్టో అన్యే చ ఋషయః సురాః ॥ 75॥**

**దృష్ట్వా సంపూజితం యాంతం యోథాయోగమరిందమ ।**

ఆ సమయంలో మునిశ్రేష్ఠుడైన తుంబురుడు పిలువబడి విష్ణుభగవానుడి మరియు లక్ష్మీదేవియొక్క సమీపానికి వెళ్లాడు. అక్కడ ఆసీనుడై సంతోషంతో పలువిధాలైన మూర్ఛనలతో కూడిన మధురపదజాలంతో నిండిన గీతాల్ని ఆలపించాడు. అట్లే వీణను పలికించాడు. అనంతరం అనేక విధాలైన రత్నాలు తాపించిన దివ్యమైన, శ్రేష్ఠమైన అలంకారాలతో అట్లే దివ్యమూ మనోహరమూ అయిన హారాలతో పూజింపబడి మునివర్యుడు తుంబురుడు ఆనందంగా వెలుపలికి వచ్చాడు. ఓ రాజేంద్రా! శత్రుదమనా! యథోచితంగా పూజింపబడిన ఆ తుంబురుడిని చూచి ఇతరమునులు, దేవతాగణాలు స్తుతించారు.

**నారదోఽథ మునిర్దృష్ట్వా తుంబరోః సత్క్రియాం హరేః ॥76॥**

**శోకావిష్టేన మనసా సంతప్తహృదయేక్షణః ।**
**చింతామాపేదివాంస్తత్ర శోకమూర్ఛాకులాత్మనః ॥ 77॥**

**కేనాహం హి హరేర్యాస్యే యోగం దేవీ సమీపతః ।**
**అహో తుంబరుణా ప్రాప్తం ధిఙ్మాం మూఢం విచేతసమ్ ॥78॥**

**యోఽహం హరేః సన్నికాశం భూతైర్నిర్యాతితః కథమ్ ।**
**జీవన్ యాస్యామి కుత్రాహమహో తుంబరుణా కృతమ్ ॥79॥**

శ్రీహరివల్ల సత్కరింపబడిన తుంబురుడిని చూచి నారదముని దుఃఖంతో నిండిన మనసుతో, బాధింపబడిన హృదయం, చూపులు కలిగి శోకాధిక్యంవల్ల మూర్ఛను పొంది వ్యాకులచిత్తుడైనాడు. ఆతడు శోకావిష్టమైన మనసుతో నేను ఏ విధంగా శ్రీహరియొక్క సన్నిధిని మరియు లక్ష్మీదేవి యొక్క సమీపాన్ని పొందగలనని ఆలోచించాడు. అయ్యో! తుంబురుడు దాన్ని పొందాడు గదా! నేను మూర్ఖుడిని, వివేకహీనుడిని ధిక్కరింపబడ్డాను. నేను గణాధిపులచేత ఏ విధంగా శ్రీహరి సన్నిధినుంచి బయటకు పంపబడ్డాను. నేను ఏ విధంగా బ్రతకాలి. అయ్యో! తుంబురుడు ఎంత పని చేశాడు.

**ఇతి సంచింతయన్ విప్రస్తప ఆస్థితవాన్ మునిః ।**
**దివ్యం వర్షసహస్రం తు నిరుచ్ఛ్వాససమన్వితః ॥80॥**

**ధ్యాయన్ విష్ణుమథాధ్యాస్తే తుంబరోః సత్క్రియాం స్మరన్ ।**
**రోదమానో మునిర్విద్వాన్ ధిఙ్మామితి చ చింతయన్ ॥81॥**

**తత్ర యత్కృతవాన్ విష్ణుస్తచ్ఛృణుస్వ నరాధిప ॥82॥**

ఆ విధంగా దుఃఖిస్తున్న విప్రుడైన నారదుడు తపస్సు చేయసాగాడు. విద్వాంసుడైన నారదముని భగవంతుడైన విష్ణువును ధ్యానిస్తున్నాడు. తుంబురుడికి జరిగిన సత్కారాన్ని స్మరిస్తున్నాడు. మాటిమాటికి విలపిస్తున్నాడు. "అది నాకు ధిక్కారమే" అని దుఃఖిస్తున్నాడు. శ్వాసనుకూడా బంధించి వేయి దివ్యసంవత్సరాలు తపస్సు చేశాడు. ఓ రాజా! తర్వాత విష్ణుభగవానుడు ఏమి చేశాడనేది విను!

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే కౌశికవృత్తకథనంనామ ప్రథమోఽధ్యాయ ॥1॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని కౌశికవృత్తకథనం అనే మొదటి అధ్యాయం సమాప్తం.

## ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయం

## విష్ణుమాహాత్మ్యమ్ - విష్ణుమాహాత్మ్యం

**మార్కండేయ ఉవాచ** - మార్కండేయముని పలికాడు.

**తతో నారాయణో దేవస్తస్మై సర్వం ప్రదాయ వై ।**
**కాలయోగేన విశ్వాత్మా సమం చక్రేఽథ తుంబురోః ॥1**

**నారదం మునిశార్దూలమేవం వృత్తమభూత్పురా ।**
**నారాయణస్య గీతానాం గానం శ్రేష్ఠం పునః పునః ॥2**

**గానేనారాధితో విష్ణుః సత్కీర్తిం జ్ఞానవర్చసీ ।**
**దదాతి తుష్టిం స్థానం చ యథాఽసౌ కౌశికస్య వై ॥3**

**పద్మాక్ష ప్రభృతీనాం చ సంసిద్ధిం ప్రదదౌ హరిః ।**
**తస్మాత్త్వయా మహారాజ విష్ణుక్షేత్రే విశేషతః ॥4॥**

**అర్చనం గాననృత్యాద్యం వాద్యోత్సవసమన్వితమ్ ।**
**కర్తవ్యం విష్ణుభక్తైర్హి పురుషైరనిశం నృప ॥5॥**

**శ్రోతవ్యం చ సదా నిత్యం శ్రోతవ్యోఽసౌ హరిస్తథా ।**

ఓ మహారాజా! అనంతరం పరమాత్ముడైన నారాయణుడు కాలసంబంధంగా నారదుడికి సంపూర్ణజ్ఞానాన్ని ప్రసాదించాడు. నారదుడిని తుంబురుడికి సమానుడిని చేశాడు. పూర్వం ఈ విధంగా నారదుడి విషయం జరిగింది. కావున శ్రీహరి శ్రేష్ఠగీతాల్ని మాటిమాటికి గానం చేయాలి. ఆ గానంతో సంతృప్తి పొందిన శ్రీహరి వారికి సత్కీర్తిని, జ్ఞానాన్ని, తేజస్సును, తృప్తిని మరియు తన లోకాన్ని ప్రదానం చేస్తాడు. ఆ విధంగానే కౌశికుడు, పద్మాక్షుడు మున్నగువారు సంపూర్ణంగా సిద్ధిని పొందారు. అందుచేత ఓ మహారాజా! ఓ నృపేంద్రా! నీవు విష్ణు మందిరాలలో విష్ణుభక్తజనంతో కలిసి గానం, నాట్యం మొదలైనవాటితో కూడిన వాద్యోత్సవంలో చేరి భగవంతుడైన శ్రీహరిని నిత్యం అర్చించాలి. మరియు ఆయన కథల్ని వినాలి. భగవంతుడు శ్రీహరి ఎల్లప్పుడూ శ్రవణయోగ్యుడు.

**విష్ణుక్షేత్రే తు యో విద్వాన్ కారయేద్భక్తిసంయుతః ॥6॥**

**గాననృత్యాదికం చైవ విష్ణ్వాఖ్యానం కథాం తథా ।**
**జాతిస్మృతిం చ మేధాం చ తథైవోపరమే స్మృతమ్ ॥7॥**

**ప్రాప్నోతి విష్ణుసాయుజ్యం సత్యమేతన్నృపాధిప ।**
**ఏతత్తే కథితం రాజన్ యన్మాం త్వం పరిపృచ్ఛసి ॥8॥**

**కిం వదామి చ తే భూయో వద ధర్మభృతాం వర ॥9॥**

ఓ రాజా! ఏ విద్వాంసుడు భక్తి పరాయణుడై విష్ణుమందిరాలలో గానం, నృత్యం మరియు విష్ణువుయొక్క ఆఖ్యానాలు, కథలు నిర్వహిస్తాడో ఆతడు పూర్వజన్మజ్ఞానాన్ని, వైరాగ్యభావాన్ని, మేధను, వైరాగ్యవిషయంలో కోరికను, విష్ణు సాయుజ్యాన్ని పొందుతున్నాడు. ఇది సత్యం. నీకు నేను సాంతం చెప్పాను. నీవు ఏమి అడిగావో అది. ధర్మధారులందు శ్రేష్ఠా! రాజా! ఇప్పుడు నేను ఏమి చెప్పాలో అడుగు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే విష్ణుమాహాత్మ్యం నామ ద్వితీయోఽధ్యాయః ॥2॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని విష్ణుమాహాత్మ్యం అనే రెండవ అధ్యాయం సమాప్తం.



## తృతీయోఽధ్యాయః – మూడవ అధ్యాయం
## వైష్ణవగీతకథనమ్ – వైష్ణవగీతకథనం

**అంబరీష ఉవాచ** – అంబరీషుడు పలికాడు.

**మార్కండేయ మహాప్రాజ్ఞ కేనయోగేన లబ్ధవాన్ ।**
**గానవిద్యాం మహాభాగ నారదో భగవాన్ మునిః ॥1॥**

**తుంబరోశ్చ సమానత్వం కస్మిన్ కాల ఉపేయివాన్ ।**
**ఏతదాచక్ష్వ మే సర్వం సర్వజ్ఞోఽసి మహామతే ॥2॥**

ఓ మార్కండేయా! ఓ మహాజ్ఞానీ! ఓ మహాత్మా! భగవానుడు నారదముని ఏ యోగంతో గానవిద్యను పొందాడు? ఎంత కాలానికి తుంబురుడితో సమానత్వం పొందాడు? ఈ విషయం నాకు చెప్పండి! నీవు బుద్ధిమంతుడవు. సర్వజ్ఞుడవు.

**మార్కండేయ ఉవాచ** – మార్కండేయుడు పలికాడు.

**శ్రుతో మయా యమర్థో వై నారదాద్దేవదర్శనాత్ ।**
**స్వయమాహ మహాతేజా నారదోఽసౌ మహామతిః ॥3॥**

దివ్యదర్శనం చేసిన నారదుడివల్ల నేనీ విషయం విన్నాను. మహామతి, మహాతేజస్వి అయిన నారదుడే స్వయంగా చెప్పాడు.

**సంతప్యమానో భగవాన్ దివ్యం వర్షసహస్రకం ।**
**నిరుచ్ఛ్వాసేన సంయుక్తస్తుంబరోర్గౌరవం స్మరన్ ॥4॥**

**తతాప చ మహాఘోరం తపోరాశిస్తపః పరమ్ ।**
**అథాంతరిక్షే శుశ్రావ నారదోఽసౌ మహామునిః ॥5॥**

**వాణీం దివ్యాం మహాఘోషామద్భుతామశరీరిణీమ్ ।**
**కిమర్థం మునిశార్దూల తపస్తపసి దుశ్చరమ్ ॥6॥**

**ఉలూకం పశ్య గత్వా త్వం యది గానే గతా మతిః ।**
**మానసోత్తరశైలే తు గానబంధురితి స్మృతః ॥7॥**

**గచ్ఛ శీఘ్రం చ పశ్యైనం గానవిత్త్వం భవిష్యసి ।**

తపోనిధి నారదుడు కష్టపడుతూ, ప్రాణాయామంతో శ్వాసను బంధిస్తూ, గంధర్వుడైన తుంబురుడికి జరిగిన గౌరవాన్ని స్మరిస్తూ, వేయి దివ్యసంవత్సరాల కఠినతపస్సు చేశాడు. అనంతరం నారదుడు అంతరిక్షంలో తీవ్రమైన ధ్వని కలిగిన అద్భుతమైన, దివ్యమైన ఆకాశవాణిని విన్నాడు. ఓ మునిశ్రేష్ఠుడా! నీవు ఈ అత్యంతకఠినమైన తపస్సు ఎందుకు చేస్తున్నావు? నీ మనస్సు గానమందు సంలగ్నమైనది అయినచో, నీవు మానసోత్తరపర్వతానికి

వెళ్లి అక్కడ ఉలూకాన్ని చూడు. అది గానబంధువు. త్వరగా వెళ్లు. దానిని దర్శించు. దాంతో నీవు గాన విశారదుడవు అవుతావు.

**ఇత్యుక్తో విస్మయావిష్టో నారదో వాగ్విదాం వరః ॥ 8॥**

**మానసోత్తరశైలే తు గానబంధుం జగామ వై ।**
**గంధర్వాః కిన్నరా యక్షాస్తథా చాప్యప్సరసాం గణాః ॥9॥**

**సమాసీనాస్తు పరితో గానబంధుం తతస్తతః ।**
**గానవిద్యాం సమాపన్నాః శిక్షితాస్తేన పక్షిణా ॥10॥**

**స్నిగ్ధకంఠస్వరాస్తత్ర సమాసీనా ముదాన్వితాః ।**

ఆకాశవాణి ఆ విధంగా పలకగా భాషావేత్త అయిన నారదుడు ఆశ్చర్యచకితుడై మానసోత్తర పర్వతంపైనగల గాన బంధువైన ఉలూకం దగ్గరకు వెళ్లాడు. ఆ గానబంధువుయొక్క అన్ని వైపుల గంధర్వులు, కిన్నరులు, యక్షులు, అప్సరస సమూహాలు కూర్చుని ఉన్నారు. ఆ ఉలూకపక్షి సంతోషపూర్వకంగా తనదగ్గర కూర్చున్న మధురస్వరవంతులైన గంధర్వాదులకు గాన విద్యలో శిక్షణ ఇస్తూన్నది.

**తతో నారదమాలోక్య గానబంధురువాచ హ ॥11॥**

**ప్రణిపత్య యథా న్యాయం స్వాగతేనాభ్యపూజయత్ ।**
**కిమర్థం భగవానత్ర చాగతోఽసి మహామతే ॥12॥**

**కిం కార్యం హి మయా బ్రహ్మన్ బ్రూహి కిం కరవాణి తే ।**

తర్వాత ఆ ఉలూకం నారదుడిని చూచి, నమస్కరించి, స్వాగతం పలికి ఉచితరూపంగా ఇలా పలికింది. ఓ మహామతీ! నీవు ఇక్కడకు ఎందుకు వచ్చావు. నాతో నీకు ఏమి పని ఉన్నది. నేను నీకు ఎటువంటి సేవ చేయాలో చెప్పు.

**నారద ఉవాచ –** నారదుడు పలికాడు.

**ఉలూకేంద్ర మహాప్రాజ్ఞ శృణు సర్వం యథాతథమ్ ॥13॥**

**మమ వృత్తం ప్రవక్ష్యామి పురా భూతం మహాద్భుతమ్ ।**
**అతీతే హి యుగే విద్వాన్నారాయణ సమీపగమ్ ॥14॥**

**మాం వినిర్ధాయ సంహృష్టః సమాహూయ చ తుంబరుమ్ ।**
**లక్ష్మీసమన్వితో విష్ణురశృణోద్గానముత్తమమ్ ॥15॥**

**బ్రహ్మాదయః సురాః సర్వే నిరస్తాః స్థానతోఽచ్యుతాః ।**
**కౌశిక్యాద్యాః సమాసేనా గానయోగేన వై హరిమ్ ॥16॥**

**ఏమమారాధ్య సంప్రాప్తా గాణపత్యం యథాసుఖమ్ ।**
**తేనాహమతిదుఃఖార్తస్తపస్తప్తుమిహాగతః ॥17॥**

ఓ పరమబుద్ధి సంపన్నుడవైన ఉలూకరాజా! పూర్వకాలంలో నాకు జరిగిన ఒకానొక విలక్షణ వృత్తాంతాన్ని జరిగినది జరిగినట్లుగా చెబుతాను విను. ఓ విద్వాంసుడా! గడచిన యుగంలో విష్ణుమూర్తి దగ్గరకు వెళ్ళాను. అయితే విష్ణువు నన్ను తిరస్కరించి తుంబురుడిని ప్రసన్నతాపూర్వకంగా పిలిచి లక్ష్మీదేవితోకూడినవాడై ఆ తుంబురుడి గానాన్ని విన్నాడు. బ్రహ్మ మొదలైన దేవతలందరూ ఆస్థానంనుంచి అనగా ఆసభనుంచి వెలుపలికి పంపబడ్డారు. అయితే కౌశికుడు మున్నగు మునులు బయటకు పంపబడక అక్కడే సుఖాసీనులై గానయోగంతో శ్రీహరిని ఆరాధించి గణపతిత్వాన్ని పొందారు. దాంతో నేను మిక్కిలి దుఃఖార్తుడనై తపస్సు చేయడానికై ఇక్కడకు వచ్చాను.

**యద్దత్తం యద్ధుతం చైవ యథా వా శ్రుతమేవ చ ।**
**యదధీతం మయా సర్వం కలాం నార్హతి షోడశీమ్ ॥18॥**

**విష్ణోర్మాహాత్మ్యయుక్తస్య గానయోగస్య వై తతః ।**
**సంచింత్యాహం తపో ఘోరం తదర్థం తప్తవాన్ ద్విజ ॥19॥**

**దివ్యవర్షసహస్రం వై తతో హ్యాశృణవం పునః ।**
**వాణీమాకాశసంభూతాం త్వాముద్దిశ్య విహంగమ ॥20॥**

**ఉలూకం గచ్ఛ దేవర్షే గానబంధుం మతిర్యది ।**
**గానే చేద్వర్తతే బ్రహ్మన్ తత్ర త్వం వేత్స్యసే చిరాత్ ॥21॥**

**ఇత్యహం ప్రేరితస్తేన త్వత్సమీపమిహాగతః ।**
**కిం కరిష్యామి శిష్యోఽహం తవ మాం పాలయావ్యయ ॥22॥**

నేను చేసిన దానం, నేను చేసిన యాగం, నేను విన్న కథలు మరియు నేను చేసిన అధ్యయనం ఈ మొత్తమూ శ్రీవిష్ణువుయొక్క మాహాత్మ్యయోగాన్ని కలిగిన ఆ గానంలో పదహారోవంతుకు కూడా సరితూగవు. ఓ ద్విజుడా! ఆ విషయాన్ని ఆలోచించి అట్టి స్థితిని పొందడానికై నేను వేయి దివ్య సంవత్సరాలు ఘోరమైన తపస్సు చేశాను. ఓ పక్షిరాజా! వేయి దివ్యవర్షాల తర్వాత ఒక ఆకాశవాణిని నీకు సంబంధించిన దానిని విన్నాను. ఓ దేవర్షీ! నీకు గానవిషయికంగా అభిలాష కలిగియున్నచో 'గానబంధు' అనే పేరుగల ఒక ఉలూకం ఉంది. దాని దగ్గరకు వెళ్లు. అక్కడ త్వరగా నీకు గానజ్ఞానం ప్రాప్తిస్తుంది. ఆ విధంగా ఆకాశవాణిచేత ప్రేరితుడనై నీ దగ్గరకు వచ్చాను. ఓ శాశ్వతుడా! నేనేమి చేయాలి? నేను నీ శిష్యుడను, నన్ను బ్రోచి, శిక్షించి రక్షించు.

**గానబంధురువాచ** – గాన బంధువు పలికాడు.

**శృణు నారద యద్వృత్తం పురా మమ మహామతే ।**
**అత్యాశ్చర్య సమాయుక్తం సర్వపాపహరం శుభమ్ ॥23॥**

ఓ నారదా! మహామతీ! పూర్వం నా దగ్గరే జరిగిన మిక్కిలి ఆశ్చర్యకరమైనది మరియు సమస్త పాపాల్ని దూరం చేసే మంగళకరమైన ఒక ఘటనను విను.

**భువనేశ ఇతి ఖ్యాతో రాజాభూద్ధార్మికః ।**
**అశ్వమేధసహస్రైశ్చ వాజపేయాయుతేన చ ॥24॥**

**గవాం కోట్యర్బుదే చైవ సువర్ణస్య తథైవ చ ।**
**వాససాం రథహస్తీనాం కన్యాశ్వానాం తథైవ చ ॥ 25॥**

**దత్త్వా స రాజా విప్రేభ్యో మేదినీం ప్రతిపాలయన్ ।**
**నివారయన్ స్వకే రాజ్యే గేయయోగేన కేశవమ్ ॥26॥**

**అన్యం వా గేయయోగేన గాయన్ యది సమే భవేత్ ।**
**వధ్యః సర్వాత్మనా తస్మాద్వేదైరీడ్యః పరః పుమాన్ ॥27॥**

**గానయోగేన సర్వత్ర స్త్రియో గాయంతు నిత్యశః ।**
**సూతమాగధసంఘాశ్చ గీతం తే కారయంతు వై ॥28॥**

**ఇత్యాజ్ఞాప్య మహాతేజా రాజ్యం వై పర్యపాలయత్ ।**

పూర్వకాలంలో భువనేశుడనే పేరుతో ప్రసిద్ధుడైన ధర్మపరాయణుడైన రాజున్నాడు. వేయి అశ్వమేధయాగాలు, పదివేల వాజపేయయాగాలు నిర్వహించి బ్రాహ్మణులకు కోట్ల గోవుల్ని, బంగారాన్ని, వస్త్రాల్ని, రథగజాశ్వాల్ని, కన్యల్ని దానం చేశాడు. తన రాజ్యంలో గానయోగంతో విష్ణుభగవానుడిని ఉపాసించే జనుల్ని నిరోధించాడు. గాన యోగంతో ఇతరుల్ని ఉపాసించిన వారు నా చేత వధింపబడతారు. ఆ పరమపురుషుడి స్తుతి వేదమంత్రాల ద్వారానే జరగాలి. గానయోగం ద్వారా నిత్యం శ్రీహరిని ఉపాసించే స్త్రీలను, అట్లే వందిమాగధులను ఆజ్ఞాపించి రాజ్యపాలన చేశాడు.

**తస్య రాజ్ఞః పురాభ్యాశే హరిమిత్ర ఇతి శ్రుతః ॥29॥**
**బ్రాహ్మణో విష్ణుభక్తశ్చ సర్వద్వంద్వవివర్జితః ।**
**నదీపులినమాసాద్య ప్రతిమాం చ హరేః శుభామ్ ॥30॥**
**అభ్యర్చ్య చ యథాన్యాయం ఘృతదధ్యుత్తరం బహు ।**
**మిష్టాన్నం పాయసం దత్త్వా హరేరావేద్య పూపకమ్ ॥31॥**
**ప్రణిపత్య యథాన్యాయం తత్ర విన్యస్తమానసః ।**
**అగాయత హరిం తత్ర తాలవర్ణలయాన్వితమ్ ॥32॥**

**అతీవ స్నేహసంయుక్తస్తద్ గతేనాంతరాత్మనా ।**

ఆ రాజుయొక్క నగరానికి సమీపంలో హరిమిత్రుడనే పేరుగల బ్రాహ్మణుడున్నాడు. అతడు విష్ణుభక్తుడు. రాగద్వేషాదిద్వంద్వరహితుడు. ఆతడు నదియొక్క పులినం మీద సుందరమైన శ్రీహరి ప్రతిమనుంచి అర్చించి, నేయి, పెరుగు, నానావిధాలైన మృష్టాన్నాలు, కీరం, అపూపాలు నైవేద్యంగా అర్పించి, సాష్టాంగపడి నమస్కరించి, మిక్కిలి ఆసక్తితో, ఏకాగ్రచిత్తంతో అత్యంతప్రేమపూర్వకంగా తాళలయస్వరాన్వితంగా శ్రీహరిగానం చేస్తున్నాడు.

**తతో రాజ్ఞః సమాదేశాచ్చారాస్తత్ర సమాగతాః ॥33॥**

**తదర్చనాది సకలం నిర్ధూయ చ సమంతతః ।**
**బ్రాహ్మణం తం గృహీత్వా తే రాజ్ఞే సమ్యక్ న్యవేదయన్ ॥34॥**

అనంతరం రాజాజ్ఞవల్ల ఆతడి అనుచరులు అక్కడకు వచ్చారు. సమస్తమైన ఆ అర్చనను అన్ని వైపుల విసిరివేసి, ఆ విప్రుడిని పట్టుకుని వాళ్లు రాజు దగ్గిరకు తీసుకువెళ్లారు.

**తతో రాజా ద్విజశ్రేష్ఠం పరిభర్త్స్య సుదుర్మతిః ।**
**రాజ్యాన్నిర్యాతయామాస హృత్వా సర్వం ధనాదికమ్ ॥35॥**

**ప్రతిమాంచ హరేశ్చైవ మ్లేచ్ఛా హృత్వా యయుః పునః ।**

తర్వాత మిక్కిలి దుర్మార్గుడైన ఆ రాజు ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడిని దండించి, ధనం మొదలైన వస్తువుల్ని అపహరించి తన రాజ్యం నుంచి బహిష్కరించాడు. ఆ హరిమిత్రుడు పూజించిన ఆ శ్రీహరి ప్రతిమను నీచులైన ఆతడి అనుచరులు అపహరించుకుపోయారు.

**తతః కాలేన మహతా కాలధర్మముపేయివాన్ ॥36॥**

**స రాజా సర్వలోకేషు పూజ్యమానః సమంతతః ।**
**క్షుధార్తశ్చ తథా ఖిన్నో యమమాహ సుదుఃఖితః ॥37॥**

తర్వాత ఆ రాజు చాలా కాలానికి మరణించాడు. అన్ని లోకాలలో పూజింపబడిన ఆతడు యమలోకానికి వెళ్లాడు. ఆకలి బాధతో ఖిన్నమనస్కుడై మిక్కిలి దుఃఖంతో రాజు యముడితో ఇలా పలికాడు.

**క్షుత్తృట్ చ వర్తతే దేవ స్వర్గతస్యాపి మే సదా ।**
**మయా పాపం కృతం కిం వా కిం కరిష్యామి వై యమ ॥ 38॥**

ఓ యమధర్మరాజా! నేను స్వర్గాన్ని పొందికూడా ఎల్లప్పుడూ ఆకలిదప్పికలతో బాధింపబడుతున్నాను. నేనేమి పాపం చేశాను? నేనిపుడు ఏమి చేయాలి?

**యమ ఉవాచ –** యముడు పలికాడు.

**త్వయా హి సుమహత్పాపం కృతమజ్ఞానమోహితః ।**
**హరిమిత్రం ప్రతి తదా వాసుదేవపరాయణమ్ ॥39॥**

**హరిమిత్రే కృతం పాపం వాసుదేవార్చనాదిషు ।**
**తేన పాపేన సంప్రాప్తః క్షుద్రోగస్త్వం సదా నృప ॥40॥**

**దానయజ్ఞాదికం సర్వం ప్రనష్టం తే నరాధిప ।**
**గీతవాద్యసమోపేతం గాయమానం మహామతిమ్ ॥41॥**

**హరిమిత్రం సమాహూయ హృతవానసి తద్ధనమ్ ।**
**ఉపహారాదికం సర్వం వాసుదేవస్య సన్నిధౌ ॥42॥**

**తవ భృత్యైస్తదా లుప్తం పాపం చక్రుస్త్వదాజ్ఞయా ।**
**హరేః కీర్తిం వినా చాన్యద్ బ్రాహ్మణేన నృపోత్తమ ॥43॥**

**న గేయయోగే గాతవ్యం తస్మాత్పాపం కృతం త్వయా ।**
**నష్టస్తే సర్వలోకోఽద్య గచ్ఛ పర్వతకోటరమ్ ॥44॥**

**పూర్వోత్సృష్టం స్వదేహం తం ఖాదన్నిత్యం నికృత్య వై ।**
**తస్మిన్ కోణే త్విమం దేహం ఖాదన్నిత్యం క్షుధాన్వితః ॥45॥**

**మహానిరయసంస్థస్త్వం యావన్మన్వంతరం భవేత్ ।**
**మన్వంతరే తతోఽతీతే భూమ్యాం త్వం చ భవిష్యసి ॥46॥**

**తతః కాలేన సంప్రాప్య మానుష్యమవగచ్ఛసి ।**

అజ్ఞానమోహితుడైన కారణంగా వాసుదేవానురక్తుడైన హరిమిత్రుడి విషయంలో మహాపాపాన్ని చేశావు. నీవు వాసుదేవ పూజాధికవిషయంలో పాపం చేసిన కారణంగా నిన్ను ఆకలిరోగం నిరంతరం బాధిస్తున్నది. నీవు చేసిన దానం, యజ్ఞం సమస్తపుణ్యం నశించిపోయాయి. గీతవాద్యాలు స్వీకరించి శ్రీహరిని గూర్చి గానం చేసే సుమతి హరిమిత్రుడిని పిలిపించి ఆతడి ధనాన్ని హరించావు. నీ భృత్యులుకూడా వాసుదేవ ప్రతిమ దగ్గరగల సమస్తపూజాద్రవ్యాల్ని, నైవేద్యాల్ని నష్టపర్చారు. నీ ఆజ్ఞవల్లనే వారు ఆ విధంగా ప్రవర్తించారు. ఓ రాజేంద్రా! నీ ఆజ్ఞచేతనే ప్రతి ఒక్క బ్రాహ్మణుడు శ్రీహరిని గానంతో కీర్తించకుండానే ఆయన్ని ఉపాసించాడు. గానయోగం ద్వారా శ్రీహరి యశస్సు కీర్తింపబడలేదు. కావున నీవు పాపం ఆచరించావు. ఈ కారణంగా నీకు ఉత్తమలోకాలన్నీ నశించిపోయాయి. కావున నీవిపుడు పర్వతగుహకు వెళ్లు. నీ శరీరాన్ని ఖండించుకుని ఆ మాంసపు ముక్కలు తిని జీవించు. మిక్కిలి ఆకలిగొన్నవాడివై నీ శరీరభాగాల్ని తింటూ పర్వతగుహలో ఒక మన్వంతరకాలం గడుపు. ఈ విధంగా ఘోరనరకాన్ని అనుభవించు. మన్వంతరం తీరిన తర్వాత భూమిపై జన్మించు. అనంతరం కాలక్రమంగా వివిధయోనులలో జన్మించి తుదకు మానవయోనిలో జన్మించు. తద్ద్వారా జ్ఞానివి కమ్ము.

**గానబంధురువాచ** – గానబంధువు పలికాడు

**ఏవముక్త్వా యమో విద్వాంస్తత్రైవాంతరధీయత ॥ 47॥**

**హరిమిత్రో విమానేన స్తూయమానో గణాధిపైః ।**
**విష్ణులోకం గతః శ్రీమాన్ సంగృహ్య గణబాంధవాన్ ॥48॥**

ఈ విధంగా విద్వాంసుడైన యముడు అక్కడే అంతర్హితుడయ్యాడు. ఐశ్వర్యశాలి అయిన హరిమిత్రుడు తన బంధుగణంతో కూడా గణనాయకులు స్తుతిస్తుండగా విమానంలో విష్ణులోకానికి వెళ్లాడు.

**భువనేశో నృపో హ్యస్మిన్ కోటరే పర్వతస్య వై ।**
**ఖాదమానః శవం నిత్యమాస్తే క్షుత్తృట్సమన్వితః ॥49॥**

ఆకలిదప్పికలతో కూడిన భువనేశప్రభువు ఆ పర్వతంయొక్క గుహలోనే తన శరీరఖండాల్ని తింటూ నివసిస్తున్నాడు.

**అద్రాక్షం తం నృపం తత్ర సర్వమేతన్మమోక్తవాన్ ।**
**సమాలోక్యాహమాజ్ఞాయ హరిమిత్రం సమేయివాన్ ॥50॥**

**విమానేనార్కవర్ణేన గచ్ఛంతమమరైర్వృతమ్ ।**
**ఇంద్రద్యుమ్నప్రసాదేన ప్రాప్తం మే హ్యాయురుత్తమమ్ ॥51॥**

**తేనాహం హరిమిత్రం వై దృష్టవానస్మి సువ్రత ।**

నేను ఆ రాజును చూడగా ఆతడు ఆ విషయం సమస్తం నాకు చెప్పాడు. తర్వాత సూర్యసమకాంతిమంతుడై దేవతలతో కూడినవాడై విమానంలో వెళుతున్న హరిమిత్రుడిని సమీపించి చూశాను. ఇంద్రద్యుమ్నుడి అనుగ్రహంతో అధికమైన ఆయుర్దాయాన్ని నేను పొందాను. దీని ప్రభావంతోనే హరిమిత్రదర్శనం లభించింది.

**తదైశ్వర్య ప్రభావేన మనో మే సముపాగతమ్ ॥52॥**

**గానవిద్యాం ప్రతి తదా కిన్నరైః సముపావిశమ్ ।**
**షష్టిం వర్షసహస్రాణాం గానయోగేన మే మునే ॥53॥**

**తతస్తు ద్విగుణేనైవ కాలేనాభూదియం మమ ॥54॥**

**గానయోగసమాయుక్తా గతా మన్వంతరా దశ ।**
**గానాచార్యోఽభవం తత్ర గంధర్వాద్యాః సమాగతాః ॥55॥**

**ఏతే కిన్నరసంఘా వై మమాచార్యముపాగతాః ।**

అటువంటి ఐశ్వర్యప్రభావకారణంగా నా మనసు గానవిద్యకై ఆకర్షించింది. ఆరువేల సంవత్సరాల కాలం నేను కిన్నరులతోపాటు గానాన్ని అభ్యసించాను. గానయోగంతో నా నాలుక పవిత్రపడి స్పష్టపడింది. అనంతరం నేను గానంలో పూర్వం కన్నా రెట్టింపు కాలం శిక్షణ పొందడంవల్ల నా నాలుక గానయోగానికి సంపూర్ణమైన అర్హత పొందింది. ఈ విధంగా నా గానాభ్యాసం పది మన్వంతరాల్ని అతిగమించింది. తుదకు నేను గానవిద్యలో ఆచార్యత్వాన్ని పొందాను. అప్పటి నుండి గంధర్వులు, కిన్నరులు మొదలైన వారి బృందం నన్ను ఆచార్యుడుగా గుర్తించి నన్ను చేరుతున్నారు.

**తపసా నైవ శక్యా వై గానవిద్యా తపోధన ॥56॥**

**తస్మాచ్ఛ్రుతేన సంయుక్తో మత్తస్త్వం గానమాప్నుహి ।**
**ఏవముక్తో మునిస్తం వై ప్రణిపత్య జగౌ తదా ॥57॥**

**తచ్ఛృణుష్వ మునిశ్రేష్ఠ వాసుదేవం నమస్య తు ।**

ఓ తపోధనా! తపస్సువల్ల గానవిద్య ప్రాప్తించదు. కావున శ్రవణం–అభ్యాసం అనే వాటిని సక్రమంగా పాటించి నానుండి గానవిద్యను పొందు. ఓ మునిశ్రేష్ఠా! భగవానుడైన వాసుదేవుడికి నమస్కరించి ఈ గానాన్ని విను. ఆ మాట విన్న నారదుడు ఆతడికి నమస్కరించి గానాన్ని అభ్యసించసాగాడు.

**మార్కండేయ ఉవాచ –** మార్కండేయుడు పలికాడు.

**ఉలూకేనైవముక్తస్తు నారదో మునిసత్తమః ॥58॥**

**శిక్షాక్రమేణ సంయుక్తస్తత్ర గానమశిక్షయత్ ।**
**గానబంధుస్తదాహేదం త్యక్తలజ్జో భవాధునా ॥59॥**

ఉలూకం చేత ఆ విధంగా పలుకబడిన నారదముని శిక్షాక్రమాన్ని నిర్వహిస్తూ ఆతడివల్ల గానాన్ని నేర్చుకుంటున్నాడు.ఆ సమయంలో గానబంధు ఉలూకం నారదుడితో ఇలా పలికాడు. నీవు ఇపుడు సిగ్గును విడిచిపెట్టు.

**ఉలూక ఉవాచ –** ఉలూకుడు పలికాడు.

**స్త్రీసంగమే తథా గీతే దూతే వ్యాఖ్యానసంగమే ।**
**వ్యవహారే తథా హారేత్వర్థానాం చ సమాగమే ॥60॥**

**ఆయే వ్యయే తథా నిత్యం త్యక్తలజ్జస్తు వై భవేత్ ।**
**న కుంచితేన గూఢేన నిత్యం ప్రావరణాదిభిః ॥61॥**

**హస్తవిక్షేపభావేన వ్యాదితాస్యేన చైవ హి ।**
**నిర్యాత జిహ్వాయోగేన న గేయం హి కథంచన ॥62॥**

**న గాయేదూర్ధ్వబాహుశ్చ నోర్ధ్వదృష్టిః కథంచన ।**
**స్వాంగం నిరీక్షమాణేన పరం సంప్రేక్షతా తథా ॥63॥**

**సంఘట్టే చ తథోత్థానే కటిస్థానం న శస్యతే ।**
**హాసో రోషస్తథా కంపస్తథాన్యత్ర స్మృతిః పునః ॥64॥**

**నైతాని శస్తరూపాణి గానయోగే మహామతే ।**
**నైకహస్తేన శక్యం స్యాత్తాలసంఘట్టనం మునే ॥65॥**

**క్షుధార్తేన భయార్తేన తృష్ణార్తేన తథైవ చ ।**
**గానయోగో న కర్తవ్యో నాంధకారే కథంచన ॥66॥**

**ఏవమాదీని చాన్యాని న కర్తవ్యాని గాయతా ।**

మానవుడు స్త్రీసంయోగసమయంలో, పాటపాడేటప్పుడు, జూదం ఆడే సమయంలో, వ్యాఖ్యానించేటప్పుడు, వ్యవహారవిషయంలో, ఆహారవిషయంలో, అర్థాన్ని సంపాదించేటప్పుడు మరియు ఆదాయంలోనూ, వ్యయంలోనూ ఎప్పుడూ సిగ్గుపడరాదు. శరీరాంగాల్ని వంచి, మందమైన వస్త్రాల్ని కప్పుకుని, చేతులతో సూచిస్తూ, పెద్దగా అరుస్తూ, నాలుకను బయటపెట్టుతూ ఎన్నడూ గానం చేయరాదు. చేతులు పైకెత్తి, పైకి చూస్తూ, తన అవయవాల్ని చూస్తూ, ఇతరులను చూస్తూ ఎప్పుడూ గానం చేయరాదు. పైకి లేచునపుడు చేతులతో నడుమును తట్టుకోవడం మంచిదికాదు. ఓ బుద్ధిమంతుడా! నవ్వుతూ, రోషపడుతూ, కంపిస్తూ, అవధానరహితంగా పాడడం గానయోగంలో

ప్రశస్తినీయవు. ఒకే హస్తంతో తాలం వేయటం కుదరదు. ఆకలితో బాధింపబడువాడు, భయంతో బాధింపబడువాడు, దాహంతో పీడింపబడువాడు గానం చేయరాదు. అంధకారంలో ఎప్పుడూ పాడరాదు. గాయకులు ఈ విధమైన పనులు మరియు ఇటువంటివే ఇతరమైన వాటిని కూడా చేయరాదు.

**మార్కండేయ ఉవాచ –** మార్కండేయుడు చెప్పాడు.

**ఏవముక్తః స భగవాన్ తేనోక్తైర్విధిలక్షణైః ।**
**అశిక్షయత్తథా గీతం దివ్యం వర్షసహస్రకమ్ ॥67॥**

**తతః సమస్తసంపన్నో గీతప్రస్తారకాదిషు ।**
**విపంచ్యాదిషు సంపన్నః సర్వస్వరవిభాగవిత్ ॥68॥**

**అయుతాని చ షట్త్రింశత్సహస్రాణి శతానిచ ।**
**స్వరాణాం భేదయోగేన జ్ఞాతవాన్ మునిసత్తమః ॥ 69॥**

**తతో గంధర్వసంఘాశ్చ కిన్నరాణాం తథైవ చ ।**
**మునినా సహ సంయుక్తాః ప్రీతిముక్తా భవంతి తే ॥70॥**

గానబంధు చెప్పిన విధంగా నారదముని వేయి దివ్యవర్షాలకాలం గాన లక్షణాల ద్వారా గాన శిక్షణ పొందాడు. దాంతో ఆ గీతప్రస్తారాదులందు పూర్ణపారంగతుడయ్యాడు. వీణా వాదనం మొదలైన విషయాలలో పరిపూర్ణజ్ఞానం పొందాడు. సమస్తస్వరభేదాల్ని తెలిసికొన్నాడు. ముప్పైఆరువేల ఒక నూరు స్వరభేదాలలోను వాటి ప్రభేదాలలోనూ ప్రవీణుడయ్యాడు. గంధర్వ కిన్నరబృందం సమస్తం నారదముని గానానికి సంతోషిస్తున్నారు.

**గానబంధుం మునిః ప్రాహ ప్రాప్య గానమనుత్తమమ్ ।**
**త్వాం సమాసాద్య సంపన్నస్త్వం హి గీతవిశారదః ॥71॥**

**ధ్వాంక్షశత్రో మహాప్రాజ్ఞ కిమాచార్య కరోమి తే ।**

నారదముని గానబంధుతో ఇలా పలికాడు. నేను నీ సన్నిధిని చేరి నీనుంచి శ్రేష్ఠమైన గానవిద్యను పొంది అందు నిష్ణాతుడిని అయ్యాను. నీవు నిశ్చయంగా గాన విశారదుడవు. ఓ అజ్ఞాననాశకా! ఓ మహాప్రజ్ఞాన్వితుడా! ఓ ఆచార్యవర్యా! నేను నీకు ఏ విధమైన సేవ చేయాలి?

**గానబంధురువాచ –** గాన బంధువు పలికాడు.

**బ్రహ్మణో దివసే బ్రహ్మన్ మనవస్తు చతుర్దశ ॥72॥**

**తతస్త్రైలోక్యసంప్లావో భవిష్యతి మహామునే ।**
**తావన్మే త్వాయుషో భావస్తావన్మే పరమం శుభమ్ ॥73॥**

**మనసాధ్యాహితం మే స్యాద్దక్షిణా మునిసత్తమ ।**

ఓ బ్రాహ్మణుడా! బ్రహ్మయొక్క ఒక రోజు కాలంలో పధ్నాలుగు మన్వంతరాలు గుడుస్తున్నాయి. అనంతరం మూడు లోకాలు జలంలో మునిగిపోతాయి. బ్రహ్మయొక్క రోజు ముగిసేవరకు నేను బ్రతుకుతాను. అది నాకు పరమశుభకరం. ఓ మునిశ్రేష్ఠా! నీ మనసులో ఏమి అనుకుంటున్నావో అదే నాకు గురుదక్షిణ.

**నారద ఉవాచ –** నారదముని పలికాడు.

**అతీతకల్పసంయోగే గరుడస్త్వం భవిష్యసి ॥74॥**

ఈ కల్పం పూర్తికాగానే నీవు గరుడపక్షివి కాగలవు.

**స్వస్తి తేఽస్తు మహాప్రాజ్ఞ గమిష్యామి ప్రసీద మామ్ ।**

ఓ మహాప్రాజ్ఞ! నీకు శుభమగుగాక. నన్ను అనుగ్రహించు! వెళుతున్నాను.

**మార్కండేయ ఉవాచ –** మార్కండేయుడు పలికాడు.

**ఏవముక్త్వా జగామాథ నారదోఽపి జనార్దనమ్ ॥75॥**

ఆ విధంగా ఆ ఉలూకాన్ని ఆశీర్వదించి నారదుడు జనార్దనుడి దగ్గరకు వెళ్లాడు.

**శ్వేతద్వీపే హృషీకేశం గాపయామాస గీతకాన్ ।**
**తత్ర శ్రుత్వా తు భగవాన్నారదం ప్రాహ మాధవః ॥76॥**

**తుంబరోర్న విశిష్టోఽసి గీతైరద్యాపి నారద ।**
**యదా విశిష్టో భవితా తం కాలం ప్రవదామ్యహమ్ ॥77॥**

**గానబంధుం సమాసాద్య గానార్థజ్ఞో భవానసి ।**

శ్వేతద్వీపంలోగల శ్రీహరికి గీతగానాన్ని వినిపించాడు. అది విని విష్ణుభగవానుడు నారదుడితో ఇలా పలికాడు. ఓ నారదా! ఇప్పటికీ నీవు గీత గానంలో తుంబురుడికంటే విశిష్టుడవు కావు. నీవు ఆతడికన్నా విశిష్టుడవు ఎప్పుడు కాగలవో నేను చెబుతాను విను. నీవు గాన బంధువు దగ్గర శిక్షణ పొంది గాన తత్త్వాన్ని గ్రహించావు.

**మనోర్వైవస్వతస్యాహమష్టావింశతి మే యుగే ॥78॥**

**ద్వాపరాంతే భవిష్యామి యదువంశకులోద్భవః ।**
**దేవక్యాం వసుదేవస్య కృష్ణో నామ్నా మహామతే ॥ 79॥**

**తదానీం మాం సమాసాద్య స్మారయేథా యథాతథమ్ ।**
**తత్ర త్వాం గీతసంపన్నం కరిష్యామి మహావ్రతమ్ ॥80॥**

**తుంబరోశ్చ సమం చైవ తథాతిశయం సంయుతమ్ ।**
**తావత్కాలం యథాయోగం దేవగంధర్వయోనిషు ॥81॥**

**శిక్షయస్వ యథాన్యాయమిత్యుక్త్వాంతరధీయత ।**

ఓ మహామతీ! వైవస్వతమనువుయొక్క ఇరవై ఎనిమిదో యుగం అయిన ద్వాపరంయొక్క చివరిలో యదువంశంలో దేవకీవసుదేవులకు కృష్ణుడనే పేరుగలవాడినై జన్మిస్తాను. ఆ సమయంలో నా దగ్గరకు వచ్చి ఉన్నది ఉన్నట్లు నాకు గుర్తుచేయి. అపుడు నేను నిన్ను తుంబురుడితో సమానంగా ఒక్కింత అధికుడుగా

మహామంత్రంతో తీర్చి దిద్దుతాను. అప్పటి వరకూ నీవు దేవతల నుంచి గంధర్వుల నుంచి ఈ గానవిద్యను అభ్యసించు అని పలికి అంతర్ధానం చెందాడు.

**తతో మునిః ప్రణమ్యైనం వీణావాదనతత్పరః ॥82॥**

**దేవర్షిర్దేవసంకాశః సర్వాభరణభూషితః ।**
**తపసాం నిధిరత్యంతం వాసుదేవపరాయణః ॥83॥**

**స్కంధే విపంచీమాసాద్య సర్వలోకాంశ్చచార సః ।**
**వారుణం యామ్య మాగ్నేయమైంద్రం కౌబేరమేవ చ ॥84॥**

**వాయవ్యం చ తథేశానం సంసదం ప్రాప్య ధర్మవిత్ ।**
**గాయమానో హరిం సమ్యగ్వీణావాదవిచక్షణః ॥85॥**

ఆతర్వాత నారదుడు మహావిష్ణువుకు నమస్కరించి వీణావాదనతత్పరుడయ్యాడు. దేవసముడు, తపోనిధి అయిన ఆతడు మిక్కిలి వాసుదేవాసక్తుడై, సర్వాభరణభూషితుడై, తన భుజం మీద వీణను ధరించి అన్ని లోకాలు తిరగజొచ్చాడు. వరుణుడు, యముడు, అగ్ని, ఇంద్రుడు, కుబేరుడు, వాయువు, ఈశానుడు వీరియొక్క సభలలో ధర్మవిదుడు, వీణావాదనకుశలుడు అయిన నారదుడు శ్రీమహావిష్ణుగానాన్ని చేశాడు.

**గంధర్వాప్సరసాం సంఘైః పూజ్యమానస్తతస్తతః ।**
**బ్రహ్మలోకం సమాసాద్య కస్మింశ్చిత్కాలపర్యయే ॥ 86॥**

**హాహా హూహూ శ్చ గంధర్వౌ గీతవాద్యవిశారదౌ ।**
**బ్రహ్మణో గాయకౌ దివ్యౌ నిత్యౌ గంధర్వసత్తమౌ ॥87॥**

**తత్ర తాభ్యాం సమాసాద్య గాయమానో హరిం ప్రభుమ్ ।**
**బ్రహ్మణా చ మహాతేజాః పూజితో మునిసత్తమః ॥ 88॥**

అనంతరం గంధర్వుల చేత, అప్సరసల చేత పూజింపబడుతూ కొంత కాలానికి బ్రహ్మలోకం చేరాడు. అక్కడ గాన విశారదులైన హాహా, హూహూ అనే ఇద్దరు గంధర్వులు బ్రహ్మగాయకులుగా ఎల్లప్పుడూ అక్కడే ఉంటారు. వారితో కలిసి కూర్చుని మునిశ్రేష్ఠుడైన నారదుడు శ్రీహరిని గానంతో కీర్తించి బ్రహ్మచేత పూజింపబడ్డాడు.

**తం ప్రణమ్య మహాత్మానం సర్వలోకపితామహమ్ ।**
**చచార చ యథాకామం సర్వలోకేషు నారదః ॥89॥**

సమస్తలోకాలకు పితామహుడు, మహాత్ముడూ అయిన బ్రహ్మదేవుడికి నమస్కరించి సమస్తలోకాల్లో తన ఇష్టానుసారం నారదుడు సంచరించాడు.

**తతః కాలేన మహతా గృహం ప్రాప్య చ తుంబరోః ।**
**వీణామాదాయ తత్రస్థో హ్యగాయత మహామునిః ॥90॥**

**స్వరకల్పాస్తు తత్రస్థాః షడ్జాద్యాః సప్త వై మతాః ।**
**క్రీడతో భగవాన్ దృష్ట్వా నిర్గతశ్చ సుసత్వరమ్ ॥91॥**

తదనంతరం చాలాకాలానికి మహాముని నారదుడు తుంబురగంధర్వుడి గృహానికి వెళ్లి, వీణను తీసుకుని అక్కడే ఉండి గానం చేశాడు. షడ్జాదులైన సప్తప్రాథమిక స్వరాలు గుర్తింపబడ్డాయి. అవి అక్కడ స్వయంగా నిలిచి ఉన్నాయి. అవి అక్కడ క్రీడించడాన్ని చూచి నారదుడు అక్కడ నుంచి వెను వెంటనే వెలుపలికి వచ్చాడు.

**శిక్షయామాస బహుశస్తత్ర తత్ర మహామతిః ।**
**శ్రమయోగేన సంయుక్తో నారదోఽపి మహామునిః ॥92॥**

**సప్తస్వరాంగనాః పశ్యన్ గానవిద్యావిశారదః ।**
**ఆసీద్వీణాసమాయోగే న తాస్తంత్ర్యః ప్రపేదిరే ॥93॥**

మహామతి నారదుడు అక్కడక్కడా గానశిక్షణ మిక్కిలిగా చేస్తూ ఎంతగానో శ్రమించాడు. గాన విద్వాంసుడైన ఆతడు సప్తస్వరాంగాల్ని పరికిస్తూ ఎల్లప్పుడూ వీణను ధరిస్తూ గాన విద్యాసాధనరతుడై నిలిచాడు. అయినా ఆయన వీణాతంత్రులు స్వరాంగనల ప్రాప్తిని పొందలేదు.

**తతో రైవతకే కృష్ణం ప్రణిపత్య మహామునిః ।**
**విజ్ఞాపయదశేషం తు శ్వేతద్వీపే తు యత్ పురా ॥94॥**

తర్వాత ద్వాపరయుగంలో రైవతకపర్వతానికి వచ్చి శ్రీకృష్ణస్వామిని దర్శించి, నమస్కరించి పూర్వం శ్వేతద్వీపంలో ఆయన తనకు ఏమి చెప్పాడో దానిని నారదముని గుర్తు చేశాడు.

**నారాయణేన కథితం గానయోగమనుత్తమమ్ ।**
**తచ్ఛ్రుత్వా ప్రాహసన్ కృష్ణః ప్రాహ జాంబవతీం ముదా ॥95॥**

విష్ణుభగవానుడిచేత ఉత్తమగానయోగానికి చెందిన ఆమాటల్ని విని శ్రీకృష్ణుడు మిక్కిలిగా నవ్వుతూ జాంబవతీదేవితో సంతోషంతో పలికాడు.

**ఏతం మునివరం భద్రే శిక్షయస్వ యథావిధి ।**
**వీణాగానసమాయోగే తథేత్యుక్త్వా చ సా హరిమ్ ॥96॥**

**ప్రహసంతీ యథాయోగం శిక్షయామాస తం మునిమ్ ।**

ఓ జాంబవతీ! ఈ నారదమునిని వీణాగానవిద్యలో శాస్త్రోక్తప్రకారంగా శిక్షించు. అప్పుడు జాంబవతి ఆ విధంగానే శిక్షిస్తానని నవ్వుతూ కృష్ణుడితో పలికి నారదమునికి యథావిధిగా శిక్షణ ఇచ్చింది.

**తతః సంవత్సరే పూర్ణే పునరాగమ్య మాధవమ్ ॥97॥**

**ప్రణిపత్యాగ్రతస్తస్థౌ పునరాహ స కేశవః ।**
**సత్యాం సమీపమాగచ్ఛ శిక్షయస్వ యథావిధి ॥98॥**

**తథేత్యుక్త్వా సత్యభామాం ప్రణిపత్య జగౌ మునిః ।**
**తయా స శిక్షితో విద్వాన్ పూర్ణే సంవత్సరే పునః ॥99॥**

**వాసుదేవనియుక్తోఽసౌ రుక్మిణీసదనం గతః ।**

అనంతరం నారదుడు జాంబవతీదేవి దగ్గర ఒక సంవత్సరకాలం శిక్షణ ముగించుకుని శ్రీ కృష్ణుడి దగ్గరకు వచ్చి నమస్కరించి ఎదురుగా నిలిచాడు. అపుడు కేశవుడు మరల ఇలా పలికాడు. నీవిపుడు సత్యభామాదేవి దగ్గరకు వచ్చి యథావిధిగా శిక్షితుడవు కమ్ము. ఆ విధంగానేనని పలికి సత్యభామను సమీపించి నమస్కరించి శిక్షణ పొందాడు. అక్కడ సంవత్సరం శిక్షణ పూర్తి కాగానే శ్రీకృష్ణుడి నియోగంతో రుక్మిణీమందిరానికి వెళ్లాడు.

**అంగనాభిస్తతస్తాభిర్దాసీభిర్మునిసత్తమః ॥100॥**

**ఉక్తోఽసౌ గాయమానోఽపి న స్వరం వేత్సి వై మునే ।**
**తతః శ్రమేణ మహతా వత్సరత్రయసంయుతమ్ ॥101॥**

**శిక్షితోఽసౌ తదా దేవ్యా రుక్మిణ్యాపి జగౌ మునిః ।**
**తతః స్వరాంగనాః ప్రాప్య తంత్రీయోగం మహామునేః ॥102॥**

ఓ మహామునీ! నీవు పాడుతున్నావేగాని స్వరజ్ఞానం తెలియడంలేదని అక్కడి స్త్రీలు, దాసీలు పలికారు. మిక్కిలి శ్రమించి మూడు సంవత్సరాలు రుక్మిణీదేవి వలన స్వరశిక్షణ పొందాడు. దాంతో స్వరాంగనలు తంత్రీయోగాన్ని పొందాయి.

**ఆహూయ కృష్ణో భగవాన్ స్వయమేవ మహామునిమ్ ।**
**అశిక్షయదమేయాత్మా గానయోగమనుత్తమమ్ ॥103॥**

**తతోఽతిశయమాపన్నస్తుంబరోర్మునిసత్తమః ।**
**తతో ననర్త దేవర్షిః ప్రణిపత్య జనార్దనమ్ ॥104॥**

అనంతరం అపరిమేయమైన ఆత్మను ధరించే శ్రీకృష్ణుడు స్వయంగా మహామునిని పిలిచి ఆతడికి సర్వశ్రేష్ఠమైన గానవిద్యాశిక్షను ప్రదానం చేశాడు. దానితో మునిశ్రేష్ఠుడైన నారదుడు తుంబరుడికన్నా అధికగానజ్ఞాన సంపన్నుడయ్యాడు. దేవర్షి నారదుడు జనార్దనుడైన శ్రీకృష్ణుడికి నమస్కరించి మహానందంతో నాట్యం చేశాడు.

**ఉవాచ చ హృషీకేశః సర్వజ్ఞస్త్వం మహామునే ।**
**ప్రహస్య జ్ఞానయోగేన గాయస్వ మమ సన్నిధౌ ॥105॥**

**ఏతత్తే ప్రార్థితం ప్రాప్తం మమ లోకే తథైవ చ ।**
**నిత్యం తుంబరుణా సార్ధం గాయస్వ చ యథాతథమ్ ॥106॥**

తర్వాత హృషీకేశుడు నవ్వుతూ ఓ మహామునీ! నీవు ఇపుడు గానవిద్యలో సర్వమూ తెలిసినవాడవు. కావున నీవు నా సన్నిధిలో జ్ఞానగానయోగంతో గానం చేయి. నీవు అభిలషించినదానిని పొందావు. నా లోకంలో నీవు తుంబురుడితో కలిసి నిత్యం యథావిధిగా గానం చేయి.

**ఏవముక్తో మునిస్తత్ర యథాయోగం చచార సః ।**
**యదా సంపూజయన్ కృష్ణో రుద్రం భువననాయకమ్ ॥107॥**

**తదా జగౌ హరేస్తస్య నియోగాచ్ఛంకరాయ వై ।**
**రుక్మిణ్యా సహ సత్యా చ జాంబవత్యా మహామునిః ॥108॥**

**కృష్ణేన చ నృపశ్రేష్ఠ శ్రుతిజాతివిశారదః ।**

శ్రీకృష్ణుడిచేత ఆ విధంగా చెప్పబడిన నారదుడు స్వేచ్ఛగా తిరగదొడగినాడు. శ్రీకృష్ణుడు భువననాయకుడైన శివభగవానుడిని పూజిస్తున్నాడు. అపుడు శ్రీకృష్ణుడి రూపంలోగల శ్రీహరియొక్క ఆదేశంతో మహాస్వరజ్ఞాని నారదుడు, రుక్మిణీదేవి, సత్యాదేవి, జాంబవతీదేవి వీళ్లందరూ శ్రీకృష్ణుడితో కలిసి శంకరభగవానుడి స్తుతిగానం చేశారు.

**ఏష ఏవ మునిశార్దూలాః ప్రోక్తో గీతక్రమో మునే ॥109॥**

**బ్రాహ్మణో వాసుదేవాఖ్యాం గాయమానో భృశం నృప ।**
**హరేః సాలోక్యమాప్నోతి రుద్రగానోఽధికో భవేత్ ॥110॥**

**అన్యథా నరకం గచ్ఛేద్ గాయమానోఽన్యదేవ హి ।**
**కర్మణా మనసా వాచా వాసుదేవపరాయణః ॥111॥**

**గాయన్ శృణ్వంస్తమాప్నోతి తస్మాత్ గేయం పరం విదుః ॥112॥**

ఓ శ్రేష్ఠమునులారా! నేను మీకు నారదుడు పొందిన గానవిద్యాక్రమాన్ని గూర్చి చెప్పాను. మార్కండేయుడు ఇలా అంటున్నాడు. ఓ రాజా! వాసుదేవుడి స్తుతిని అధికంగా గానం చేసే బ్రాహ్మణుడు విష్ణుసాలోక్యం పొందుతున్నాడు. శివస్తుతి చేసేవాడైతే ఇంతకన్నా అధికమైన శ్రేష్ఠమైన భగవత్సారూప్యాన్ని పొందుతున్నాడు. ఇంతకన్నా భిన్నంగా ఇతరుల్ని గానం చేసేవాడు నరకానికి వెళుతున్నాడు. మనోవాక్కాయకర్మలతో వాసుదేవపరాయణుడై ఆయన్నే స్తుతించేవాడు, దాన్ని వినేవాడు ఆయన్ని పొందుతున్నాడు. దాంతో గానవిద్య సర్వశ్రేష్ఠమైనదిగా నిలుస్తున్నది.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే వైష్ణవగీతకథనం నామ తృతీయోఽధ్యాయః ॥3॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని వైష్ణవగీతకథనం అనే పేరుగల మూడవ అధ్యాయం సమాప్తం.



**చతుర్థోఽధ్యాయః** - నాల్గవ అధ్యాయం

**విష్ణుభక్తకథనమ్** - విష్ణుభక్తకథనం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**వైష్ణవా ఇతి యే ప్రోక్తా వాసుదేవపరాయణాః ।**
**కాని చిహ్నాని తేషాం వై తన్నో బ్రూహి మహామతే ॥1॥**

**తేషాం వా కిం కరోత్యేష భగవాన్ భూతభావనః ।**
**ఏతన్మే సర్వమాచక్ష్వ సూత సర్వార్థవిత్తమ ॥2॥**

ఓ మహామతి! సూతర్షీ! ఎవరు వాసుదేవ పరాయణులవుతారో వారే వైష్ణవులవుతారు. వారియొక్క లక్షణాలు ఎలాంటివి? వాటిని మాకు చెప్పండి! ఓ సర్వార్థవిదుడా! భూతభావనభగవానుడైన వాసుదేవుడు వారికి ఎటువంటి గతిని ప్రదానం చేస్తున్నాడు. వాటిని అన్నింటిని మాకు తెలియజేయండి!

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**అంబరీషేణ వై పృష్టో మార్కండేయః పురా మునిః ।**
**యుష్మాభిరద్య యత్ ప్రోక్తం తద్వదామి యథాతథమ్ ॥3॥**

ఈనాడు మీరు నన్నేది అడిగారో, పూర్వం అంబరీష మహారాజు మార్కండేయమునిని అడిగాడు. అపుడు మార్కండేయుడు ఏమి చెప్పాడో అదే మీకు యథాతథంగా చెబుతున్నాను.

**మార్కండేయ ఉవాచ** - మార్కండేయుడు పలికాడు.

**శృణు రాజన్ యథాన్యాయం యన్మాం త్వం పరిపృచ్ఛసి ।**
**యత్రాస్తే విష్ణుభక్తస్తు తత్ర నారాయణః స్థితః ॥4॥**

**విష్ణురేవ హి సర్వత్ర యేషాం వై దేవతా స్మృతా ।**
**కీర్త్యమానే హరౌ నిత్యం రోమాంచో యస్య వర్తతే ॥5॥**

**కంపః స్వేదస్తథాక్షేషు దృశ్యంతే జలబిందవః ।**
**విష్ణుభక్తిసమాయుక్తాన్ శ్రౌతస్మార్తప్రవర్తకాన్ ॥6॥**

**ప్రీతో భవతి యో దృష్ట్వా వైష్ణవోఽసౌ ప్రకీర్తితః ।**
**నాన్యదాచ్ఛాదయేద్వస్త్రం వైష్ణవో జగతోఽరణే ॥7॥**

ఓ రాజా! నేను దేన్ని చెబుతున్నానో దాన్ని సావధానంగా వినండి. ఎక్కడ విష్ణుభక్తులుంటారో అక్కడ నారాయణుడుంటాడు. వారికి విష్ణువే అన్నిచోట్ల దేవుడు. విష్ణుభగవానుడి కీర్తన జరిగే సమయంలో ఎవరి శరీరం

రోమాంచం అవుతుందో, ఎవరికి శరీరకంపం జరుగుతుందో, స్వేదం ఉద్భవిస్తుందో, ఎవరికి నేత్రాలు బాష్ప పూరితాలు అవుతాయో వారే విష్ణుభక్తులు. శ్రుతుల్ని, స్మృతుల్ని యథావిధిగా ఆచరించే విష్ణుభక్తియుతుల్ని చూచి ఎవడు సంతోషపడతాడో ఆతడు వైష్ణవుడుగా కీర్తింపబడతాడు. లోకదర్శనసమయంలో కూడా అవసరానికి మించిన వస్త్రంతో శరీరాన్ని వైష్ణవుడు కప్పుకోడు.

**విష్ణుభక్తమథాయాంతం యో దృష్ట్వా సమ్ముఖస్థితం ।**
**ప్రణామాది కరోత్యేవం వాసుదేవే యథా తథా ॥8॥**

**స వై భక్త ఇతి జ్ఞేయః స జయీ స్యాజ్జగత్త్రయే ।**
**రూక్షాక్షరాణి శృణ్వన్ వై తథా భాగవతేరితః ॥9॥**

**ప్రణామపూర్వం క్షాంత్యా వై యో వదేద్వైష్ణవో హి సః ।**

సమీపానికి వచ్చే విష్ణుభక్తుడిని చూచి ఆతడిని వాసుదేవసమానుడుగా భావించి ఎవడు నమస్కారం మొదలైన వాటిని ఆచరిస్తాడో ఆతడే భక్తుడవుతాడు. ఆతడు ముల్లోకాల్లో విజయుడవుతాడు. కఠోరవాక్యాలు వింటూకూడా భగవద్భావంతో ఓర్పుతో ప్రణామపూర్వకంగా మాట్లాడతాడో ఆతడే వైష్ణవుడు.

**గంధపుష్పాదికం సర్వం శిరసా యో హి ధారయేత్ ॥10॥**

**హరేః సర్వమితీత్యేవం మత్వా సౌ వైష్ణవః స్మృతః ।**
**విష్ణుక్షేత్రే శుభాన్యేవ కరోతి స్నేహసంయుతః ॥11॥**

**ప్రతిమాం చ హరేర్నిత్యం పూజయేత్ప్రయతాత్మవాన్ ।**
**విష్ణుభక్తః స విజ్ఞేయః కర్మణా మనసా గిరా ॥12॥**

**నారాయణపరో నిత్యం మహాభాగవతో హి సః ।**

అంతా శ్రీహరికేనని తలచి ఎవడు గంధపుష్పాదికాలను శిరసున ధరిస్తాడో ఆతడు వైష్ణవుడు అవుతాడు. ఆతడు విష్ణుక్షేత్రాలలో ప్రేమగలిగినవాడై శుభకర్మలు చేస్తూ ఏకాగ్రచిత్తుడై శ్రీహరి ప్రతిమను నిత్యం త్రికరణ శుద్ధిగా పూజిస్తాడు. ఆతడే నారాయణపరుడైన భాగవతోత్తముడు.

**భోజనారాధనం సర్వం యథాశక్త్యా కరోతి యః ॥13॥**

**విష్ణుభక్తస్య చ సదా యథాన్యాయం హి కథ్యతే ।**
**నారాయణపరో విద్వాన్ యస్యాన్నం ప్రీతమానసః ॥14॥**

విష్ణుభక్తుడికి భోజనం అట్లే ఆరాధన శక్తికి తగిన విధంగా ఎల్లప్పుడు యథావిధిగా ఎవడు ఆచరిస్తాడో ఆతడు వాస్తవంగా వైష్ణవుడు అవుతాడు. విద్వాంసుడగు విష్ణుభక్తుడు ప్రసన్నచిత్తుడై భోజనం చేస్తే నిస్సందేహంగా ఆ భోజనం విష్ణువుయొక్క నోటికి చేరగలదు.

**స్వార్చనాదపి విశ్వాత్మా ప్రీతో భవతి మాధవః ॥15॥**

**మహాభాగవతే తచ్చ దృష్ట్వాఽసౌ భక్తవత్సలః ।**
**వాసుదేవపరం దృష్ట్వా వైష్ణవం దగ్ధకిల్బిషమ్ ॥16॥**

**దేవాపి భీతాస్తం యాంతి ప్రణిపత్య యథాగతమ్ ।**

భక్తవత్సలుడు, లక్ష్మీపతి, విశ్వాత్ముడు, విష్ణువు తన పూజలోని అపేక్షతో మహాభక్తుడైన భాగవతుడి పూజను చూచి ప్రసన్నుడవుతాడు. వాసుదేవుడియందు భక్తి గలిగిన, పాపరహితుడైన వైష్ణవుడిని చూచి దేవతలుకూడా భయపడతారు. నమస్కరించి మరలిపోతారు.

**శ్రూయతాం హి పురా వృత్తం విష్ణుభక్తస్య వైభవమ్ ॥17॥**

**దృష్ట్వా యమోఽపి వై భక్తం వైష్ణవం దగ్ధకిల్బిషమ్ ।**
**ఉత్థాయ ప్రాంజలిర్భూత్వా ననామ భృగునందనమ్ ॥18॥**

**తస్మాత్సంపూజయేద్భక్త్యా వైష్ణవాన్ విష్ణువన్నరః ।**
**స యాతి విష్ణుసామీప్యం నాత్ర కార్యా విచారణా ॥19॥**

విష్ణుభక్తుడియొక్క వైభవానికి సంబంధించిన ఒక పూర్వగాథ వినండి. దగ్ధపాపుడైన విష్ణుభక్తుడు భృగుమహర్షి పుత్రుడు అయిన చ్యవనమహర్షిని చూచి యమధర్మరాజుకూడా ఆసనం నుంచి లేచి చేతులు జోడించి నమస్కరించాడు. కావున వైష్ణవుడిని విష్ణువు మాదిరిగానే భక్తితో మిక్కిలిగా పూజించాలి. అట్టి మానవుడు విష్ణుసాన్నిధ్యాన్ని పొందుతాడు. ఇందు విచారించపనిలేదు.

**అన్యభక్త సహస్రేభ్యో విష్ణుభక్తో విశిష్యతే ।**

**విష్ణుభక్త సహస్రేభ్యో రుద్రభక్తో విశిష్యతే ।**
**రుద్రభక్తాత్పరతరో నాస్తి లోకే న సంశయః ॥20॥**

**తస్మాత్తు వైష్ణవం చాపి రుద్రభక్తమథాపి వా ।**
**పూజయేత్సర్వయత్నేన ధర్మకామార్థముక్తయే ॥21॥**

వేల సంఖ్యలోగల ఇతర భక్తులలో విష్ణుభక్తుడు విశిష్టుడు. వేల సంఖ్యలోగల విష్ణుభక్తులలో రుద్రభక్తుడు విశిష్టుడు. రుద్రభక్తుడికన్నా శ్రేష్ఠుడు లోకంలో ఎవ్వడూ ఉండడు. ఇందులో సందేహం లేదు. అందుచేత విష్ణుభక్తుడినిగాని శివభక్తుడినిగాని అన్ని విధాల ప్రయత్నపూర్వకంగా పురుషార్థ సాధనకై పూజించాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే విష్ణుభక్తకథనం నామ చతుర్థోఽధ్యాయః ॥4॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని విష్ణుభక్తకథనం అనే నాల్గవ అధ్యాయం సమాప్తం.

## పంచమోऽధ్యాయః – అయిదవ అధ్యాయం

## శ్రీమత్యాఖానమ్ – శ్రీమత్యాఖ్యానం

**ఋషయ ఊచుః –** ఋషులు పలికారు.

**ఐక్ష్వాకురంబరీషో వై వాసుదేవపరాయణః ।**
**పాలయామాస పృథివీం విష్ణోరాజ్ఞా పురఃసరః ॥1॥**

**శ్రుతమేతన్మహాబుద్ధే తత్సర్వం వక్తుమర్హసి ।**
**నిత్యం తస్య హరేశ్చక్రం శత్రురోగభయాదికమ్ ॥ 2॥**

**హంతీతి శ్రూయతే లోకే ధార్మికస్య మహాత్మనః ।**
**అంబరీషస్య చరితం తత్సర్వం బ్రూహి సత్తమ ॥3॥**

**మాహాత్మ్యమనుభావం చ భక్తియోగమనుత్తమమమ్ ।**
**యథావచ్ఛ్రోతుమిచ్ఛామః సూత వక్తుం త్వమర్హసి ॥4॥**

ఇక్ష్వాకువంశస్థుడు, విష్ణుభక్తుడు అంబరీషుడు విష్ణుభగవానుడి ఆజ్ఞ మేరకు పృథ్విని పరిపాలించాడు. మేం కొంత విన్నాం. మీరు పూర్తిగా చెప్పండి. శ్రీహరియొక్క చక్రం నిత్యం అంబరీషుడియొక్క శత్రువుల్ని, రోగాల్ని మరియు ఇతర భయాల్ని చంపుతుందని లోకంలో విన్పిస్తున్నది. ఓ మునిశ్రేష్ఠుడా! ధార్మికుడు, మహాత్ముడూ అయిన అంబరీషుడి సంపూర్ణచరిత్రను వర్ణించండి! ఓ సూతర్షీ! మేము ఆతడి మాహాత్మ్యాన్ని, అనుభవాన్ని అట్లే శ్రేష్ఠత్వాన్ని, భక్తియోగాన్ని యథార్థంగా వినదలచాం. నీవు చెప్పవలసినది.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**శ్రూయతాం మునిశార్దూలాశ్చరితం తస్య ధీమతః ।**
**అంబరీషస్య మాహాత్మ్యం సర్వపాపహరం పరమ్ ॥5॥**

**త్రిశంకోర్దయితా భార్యా సర్వలక్షణశోభితా ।**
**అంబరీషస్య జననీ నిత్యం శౌచసమన్వితా ॥6॥**

**యోగనిద్రా సమారూఢం శేషపర్యంకశాయినమ్ ।**
**నారాయణం మహాత్మానం బ్రహ్మాండకమలోద్భవమ్ ॥7॥**

**తమసా కాలరుద్రాఖ్యం రజసా కనకాండజమ్ ।**
**సత్త్వేన సర్వగం విష్ణుం సర్వదేవనమస్కృతమ్ ॥8॥**

**అర్చయామాస సతతం వాఙ్మనఃకాయకర్మభిః ।**
**మాల్యదానాదికం సర్వం స్వయమేవమచీకరత్ ॥9॥**

**గంధాదిపేషణం చైవ ధూపద్రవ్యాదికం తథా ।**
**భూమేరాలేపనాదీని హవిషాం పచనం తథా ॥10॥**

**తత్కౌతుకసమావిష్టా స్వయమేవ చకార సా ।**
**శుభా పద్మావతీ నిత్యం వాచా నారాయణేతి వై ॥11॥**

**అనంతేత్యేవ సా నిత్యం భాషమాణా పతివ్రతా ।**
**దశవర్షసహస్రాణి తత్పరేణాంతరాత్మనా ॥12॥**

**అర్చయామాస గోవిందం గంధపుష్పాదిభిః శుచిః ।**
**విష్ణుభక్తాన్ మహాభాగాన్ సర్వపాపవివర్జితాన్ ॥13॥**

**దానమానార్చనైర్నిత్యం ధనరత్నైరతోషయత్ ।**

త్రిశంకుమహారాజుయొక్క ప్రియభార్య, అంబరీషుడికి తల్లి సమస్తశుభలక్షణలక్షిత, నిత్యం స్నానాదికాలతో పరిశుద్ధ అయి, యోగనిద్రలో లీనమై ఉండేవాడిని, శేషశయ్యపై పరుండేవాడిని, బ్రహ్మాండరూపమైన పద్మాన్ని పుట్టించినవాడిని, తమోగుణంతో ఉన్నపుడు కాలరుద్రరూపుడుగాను, రజోగుణాన్ని కలిగియున్నపుడు హిరణ్యగర్భుడైన బ్రహ్మగాను, సత్వగుణోపేతుడైనపుడు సర్వవ్యాపి, సమస్తదేవవందితుడు, మహాత్ముడు, నారాయణుడు అయిన విష్ణువుగాను నిలిచే వాసుదేవుడిని నిరంతరం మనోవాక్కాయ కర్మలతో అర్చిస్తుండేది. మాల్యాదుల్ని తానే స్వయంగా సమర్పిస్తుండేది. చందనాదిద్రవ్యాల ఆలేపనం, ధూపదీపాదుల్ని వెలిగించడం, నేలను అలకడం, హవిస్సును వండడం మొదలైన అన్ని పనుల్ని తానే స్వయంగా నిర్వహిస్తుండేది. కళ్యాణమయి, పతివ్రత మహారాణి అయిన పద్మావతి ప్రతిరోజు "నారాయణ! అనంత!" అంటూ శ్రీహరి నామాల్ని ఉచ్చరిస్తూ, మనసును ఆ పరమాత్ముడి అందు సంలగ్నపర్చి పదివేల సంవత్సరాలు పరిశుద్ధాలైన గంధపుష్పాదులతో గోవిందుడిని పూజించింది. ఆమె అన్నివిధాల పాపరహితులు, మహాభాగులు అయిన విష్ణుభక్తులను దానంతో, గౌరవంతో, పూజతో, ధనంతో మణిమాణిక్యాలతో నిత్యం సంతృప్తి పర్చేది.

**తతః కదాచిత్సా దేవీ ద్వాదశీం సముపోష్య వై ॥14॥**

**హరేరగ్రే మహాభాగా సుష్వాప పతినా సహ ।**
**తత్ర నారాయణో దేవస్తమాహ పురుషోత్తమః ॥15॥**

**కిమిచ్ఛసి వరం భద్రే మత్తస్త్వం బ్రూహి భామిని ।**

అనంతరకాలంలో ఒకానొక సమయంలో మహాభాగ అయిన ఆ పద్మావతి ద్వాదశివ్రతం నిర్వహించి భర్తతో కూడా కలిసి విష్ణుభగవానుడి విగ్రహం ముందు నిద్రించింది. అపుడు స్వప్నంలో పురుషోత్తముడైన నారాయణుడు ఆమెతో ఇలా పలికాడు. ఓ భద్రా! పద్మావతీ! ఏమి కోరుతున్నావు? ఓ భామినీ! నీవు నానుంచి వరం కోరుకో.

**సా దృష్ట్వా తు వరం వవ్రే పుత్రో మే వైష్ణవో భవేత్ ॥16॥**

**సార్వభౌమో మహాతేజాః స్వకర్మనిరతః శుచిః ।**
**తథేత్యుక్త్వా దదౌ తస్మై ఫలమేకం జనార్దనః ॥17॥**

అపుడామె శ్రీహరిని చూచి ఈ వరాన్ని కోరింది. విష్ణుభక్తుడు, చక్రవర్తి, సమ్రాట్టు, మహాతేజస్వి, కార్యతత్పరుడు, పరిశుద్ధమానసుడు అయిన పుత్రుడిని ప్రసాదించు. అపుడు శ్రీహరి ఆ విధంగానేనని పలికి ఒక ఫలాన్ని ఆమెకిచ్చాడు.

**సా ప్రబుద్ధా ఫలం దృష్ట్వా భర్త్రే సర్వం న్యవేదయత్ ।**
**భక్షయామాస సంహృష్టా ఫలం తద్గతమానసా ॥18॥**

తర్వాత ఆమె నిద్రలేచి ఆ పండును చూచి ఆ విషయాన్ని తన భర్తకు అంతా చెప్పింది. భగవంతుడైన శ్రీహరియందు మనసును నిల్పి సంతోషంతో ఆ ఫలాన్ని తిన్నది.

**తతః కాలేన సా దేవీ పుత్రం కులవివర్ధనమ్ ।**
**అసూత సా సదాచారం వాసుదేవ పరాయణమ్ ॥19॥**

**శుభలక్షణసంపన్నం చక్రాంకితతనూరుహం ।**
**జాతం దృష్ట్వా పితా పుత్రం క్రియాః సర్వాశ్చకారవై ॥20॥**

**అంబరీష ఇతి ఖ్యాతో లోకే సమభవత్ప్రభుః ।**
**పితర్యుపరతే శ్రీమానభిషిక్తో మహామునిః ॥21॥**

అనంతరం కాలం నిండగా ఆ పద్మావతీదేవి కులవృద్ధికారుడు, సదాచారుడు, వాసుదేవపరాయణుడు, శుభలక్షణయుతుడు, చక్రాంకిత తనూరుహుడు అయిన పుత్రుడిని ప్రసవించింది. పుట్టిన ఆ పుత్రుడికి తండ్రి త్రిశంకుడు జాతకర్మాది సంస్కారాలు అన్నీ నిర్వహించాడు. ఐశ్వర్యశాలి అయిన ఆ బాలకుడు లోకంలో అంబరీషుడనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. తండ్రి మృతుడైన పిమ్మట శ్రీమంతుడు, మహామతి అయిన ఆతడు అభిషిక్తుడయ్యాడు.

**మంత్రిష్వాధాయ రాజ్యం చ తప ఉగ్రం చకార సః ।**
**సంవత్సరసహస్రం వై జపన్నారాయణం ప్రభుమ్ ॥22॥**

**హృత్పుండరీకమధ్యస్థం సూర్యమండలమధ్యతః ।**
**శంఖచక్రగదాపద్మ ధారయంతం చతుర్భుజమ్ ॥ 23॥**

**శుద్ధజాంబూనదనిభం బ్రహ్మవిష్ణుశివాత్మకమ్ ।**
**సర్వాభరణసంయుక్తం పీతాంబరధరం ప్రభుమ్ ॥24॥**

**శ్రీవత్సవక్షసం దేవం పురుషం పురుషోత్తమమ్ ।**

అనంతరం మంత్రులకు రాజ్యాన్ని అప్పగించి తన హృదయకమలంలో విలసిల్లునట్టివాడు, సూర్యమండలం మధ్యలో వసించువాడును, శంఖం, చక్రం, గద, పద్మం అనే వాటిని ధరించేవాడును, చతుర్భుజుడు, అమలిన సువర్ణచ్ఛాయతో ప్రకాశించువాడును, బ్రహ్మ, విష్ణు, శివరూపాలవాడును, సమస్తాభరణశోభితుడు, పీతాంబరాన్ని

ధరించేవాడును, వక్షఃస్థలమందు శ్రీవత్స చిహ్నాన్ని ధరించినవాడును, పరమపురుషోత్తముడును అయిన భగవంతుడు నారాయణుడిని జపిస్తూ ఒక వేయి సంవత్సరాలు ఉగ్రమైన తపస్సు ఆచరించాడు.

**తతో గరుడమారుహ్య సర్వదేవైరభిష్టుతః ॥25॥**

**ఆజగామ స విశ్వాత్మా సర్వలోకనమస్కృతః ।**
**ఐరావతమివాచింత్యం కృత్వా వై గరుడం హరిః ॥26॥**

**స్వయం శక్ర ఇవాసీనస్తమాహ నృపసత్తమమ్ ।**
**ఇంద్రోఽహమస్మి భద్రం తే కిం దదామి వరం చ తే ॥27॥**

**సర్వలోకేశ్వరోఽహం త్వాం రక్షితుం సముపాగతః ।**

తర్వాత సమస్త దేవతల చేత స్తుతింపబడువాడు, సర్వలోకాలచేత నమస్కరింపబడువాడు విశ్వాత్ముడైన శ్రీహరి గరుత్మంతుణ్ణి అధిరోహించి అక్కడకు వచ్చాడు. శ్రీహరి గరుత్మంతుణ్ణి అద్భుతంగా ఐరావతంగా మార్చి, తాను ఇంద్రుడి రూపాన్ని ధరించి, ఆతడిమీద ఆసీనుడై రాజేంద్రుడైన అంబరీషుడితో ఇలా పలికాడు. నేను ఇంద్రుడిని. నీకు మంగళమగుగాక! నేను నీకు ఎలాంటి వరాన్ని ఇవ్వను? సర్వలోకాలకు ప్రభువునైన నేను నిన్ను రక్షించడానికై నీ దగ్గరకు వచ్చాను.

**అంబరీష ఉవాచ –** అంబరీషుడు పలికాడు.

**నాహం త్వామభిసంధాయ తప ఆస్థితవానిహ ॥28॥**

**త్వయా దత్తం చ నేష్యామి గచ్ఛ శక్ర యథాసుఖమ్ ।**
**మమ నారాయణో నాథస్తన్నమామి జగత్పతిమ్ ॥ 29॥**

**గచ్ఛేంద్ర మా కృథాస్త్వత్ర మమ బుద్ధివిలోపనమ్ ।**

నిన్ను ఉద్దేశించి నేను తపస్సు ఆచరించలేదు. ఓ ఇంద్రుడా! నీవిచ్చే వరం నేను కోరుకోవడం లేదు. కావున నీవు సుఖంగా వెళ్లు. నా స్వామి నారాయణుడు. నేను జగత్పతి అయిన ఆయనకు నమస్కరిస్తున్నాను. ఓ దేవనాథా! నీవు వెళ్లు! . . నా బుద్ధిని భ్రమింపజేయకు.

**తతః ప్రహస్య భగవాన్ స్వరూపమకరోద్ధరిః ॥30॥**

**శార్ఙ్గచక్రగదాపాణిః ఖడ్గహస్తో జనార్దనః ।**
**గరుడోపరి సర్వాత్మా నీలాచల ఇవాపరః ॥31॥**

**దేవగంధర్వసంఘైశ్చ స్తూయమానః సమంతతః ।**

తర్వాత భగవానుడైన శ్రీహరి నవ్వి నిజరూపాన్ని పొందాడు. సర్వాత్ముడైన జనార్దనుడు హస్తాలలో శార్ఙ్గమనే పేరుగల ధనుస్సు, చక్రగదాఖడ్గాల్ని కలిగి గరుడుడిమీద కూర్చుండి రెండో నీలాద్రిమాదిరి శోభించాడు. అపుడు దేవతలు, గంధర్వులు అన్నివైపులనుండి ఆయన్ని స్తుతించారు.

**ప్రణమ్య స చ సంతుష్టస్తుష్టావ గరుడధ్వజమ్ ॥32॥**

**ప్రసీద లోకనాథేశ మమ నాథ జనార్దన ।**
**కృష్ణవర్ణో జగన్నాథ సర్వలోక నమస్కృత ॥33॥**

**త్వమాదిస్త్వమనాదిస్త్వమనంతః పురుషః ప్రభుః ।**
**అప్రమేయో విభుర్విష్ణుర్గోవిందః కమలేక్షణః ॥34॥**

**మహేశ్వరాంగజో మధ్యే పుష్కరః ఖగమః ఖగః ।**
**కవ్యవాహః కపాలీ త్వం హవ్యవాహః ప్రభంజనః ॥35॥**

**ఆదిదేవః క్రియానందః పరమాత్మాత్మని స్థితః ।**
**త్వాం ప్రపన్నోఽస్మి గోవింద జయ దేవకీనందన ।**
**జయదేవ జగన్నాథ పాహి మాం పుష్కరేక్షణ ॥36॥**

**నాన్యాగతిస్త్వదన్యా మే త్వమేవ శరణం మమ ।**

సంతుష్టుడైన అంబరీషుడు శ్రీహరికి నమస్కరించి స్తుతింపదొడగాడు. ఓ లోకనాథా! ఓ ఈశా! ఓ నా నాథుడా! ఓ జనార్దనా! ఓ కృష్ణవర్ణుడా! ఓ విష్ణుమూర్తీ! ఓ జగన్నాథా! ఓ సర్వలోకనమస్కృతుడా! నాకు ప్రసన్నుడవు కమ్ము. నీవు ఆదివి. నీవు అనాదివి. నీవు అంతానివి. పరమ పురుషుడవు.నీవు ప్రభుడవు. అప్రమేయుడవు. విష్ణుడవు, గోవిందుడవు, కమలనేత్రుడవు, మహేశ్వరుడి అంగం నుంచి జన్మించినవాడవు. నాభినుంచి కమలాన్ని ఉత్పన్నం చేసినవాడవు. హృదయాకాశానికి యోగులద్వారా చేరేవాడివి. ఖగరూపుడవు. కవ్యవాహుడవు. భైరవరూపుడవు. హవ్యవాహుడవు. ప్రభంజనుడవు. ఆదిదేవుడవు. క్రియానందుడవు. పరమాత్ముడవు. స్వయంస్థితుడవు. ఓ గోవిందుడా! నేను నిన్ను శరణుజొచ్చాను. ఓ దేవకీనందనా! నీకు జయమగుగాక! ఓ దేవా! ఓ జగన్నాథా! నీకు జయమగుగాక! ఓ కమలనయనా! నన్ను రక్షించు. నిన్ను మించి నాకు వేరేగతి లేదు. నీవే నా శరణదాతవు.

**విష్ణురువాచ** - విష్ణువు పలికాడు.

**తమాహ భగవాన్ విష్ణుః కిం తే హృది చికీర్షితమ్ ॥37॥**

**తత్సర్వం తే ప్రదాస్యామి భక్తోఽసి మమ సువ్రత ।**
**భక్తిప్రియోఽహం సతతం తస్మాద్దాతుమిహాగతః ॥38॥**

విష్ణుభగవానుడు అంబరీషుడితో ఇలా పలికాడు. నీ మనసులో ఏ విధమైన అభిలాష ఉన్నది? దాన్ని నేను నీకు ఇవ్వగలను. ఓ సువ్రతా! నీవు నా భక్తుడవు. నాకు భక్తి ఇష్టమైనది. అందుకే నేను నీకు వరదానం చేయడానికై వచ్చాను.

**అంబరీష ఉవాచ** - అంబరీషుడు పలికాడు

**లోకనాథ పరానంద నిత్యం మే వర్తతే మతిః ।**
**వాసుదేవ పరో నిత్యం వాఙ్మనఃకాయకర్మభిః ॥39॥**

**యథా త్వం దేవదేవస్య భవస్య పరమాత్మనః ।**
**తథా భవామ్యహం విష్ణో తవ దేవ జనార్దన ॥40॥**

**పాలయిష్యామి పృథివీం కృత్వా వై వైష్ణవం జగత్ ।**
**యజ్ఞహోమార్చనైశ్చైవ తర్పయామి సురోత్తమాన్ ॥41॥**

**వైష్ణవాన్ పాలయిష్యామి నిహనిష్యామి శాత్రవాన్ ।**
**లోకతాపభయే భీత ఇతి మే ధీయతే మతిః ॥42॥**

ఓ లోకనాథా! ఓ పరానందా! నాకు ఎల్లపుడూ ఈ కోరిక కలుగుతున్నది. త్రికరణశుద్ధిగా నీయందు నా మనసు లీనమై ఉండాలని; ఓ విష్ణుదేవా! ఓ దేవాధిదేవా! ఓ జనార్దనా! నీవు ఏ విధంగా దేవాధిదేవుడు పరమాత్ముడు శివుడికి భక్తుడవో నేను నీ భక్తుడను. నేను సంపూర్ణ జగత్తును విష్ణుభక్తిమయంగా చేసి ఈ భూమిని పరిపాలిస్తా. యజ్ఞం, హవనం, అర్చనం మొదలైన వాటితో ఉన్నతమైన దేవతలందరినీ తృప్తుల్ని చేస్తా. వైష్ణవజనులయొక్క పాలన, పోషణ నిర్వహిస్తా. శత్రుజనుల్ని సంహరిస్తా. ప్రాణులకు సంతాపం కలిగించే వారిని భయభీతుల్ని చేస్తా. ఈ నా మనసులో ఇలాంటి భావన కలదు.

**శ్రీ భగవాన్ ఉవాచ –** శ్రీ భగవంతుడు పలికాడు.

**ఏవమస్తు యథేచ్ఛం వై చక్రమేతత్సుదర్శనమ్ ।**
**పురా రుద్రప్రసాదేన లబ్ధం వై దుర్లభం మయా ॥43॥**

**ఋషి శాపాదికం దుఃఖం శత్రురోగాదికం తథా ।**
**నిహనిష్యతి తే నిత్యమిత్యుక్త్వాంతరధీయత ॥44॥**

నీకు ఏ విధమైన కోరిక కలదో అది సిద్ధించుగాక! పూర్వం నేను రుద్రభగవానుడి దయవల్ల ఈ దుర్లభమైన 'సుదర్శన' చక్రాన్ని పొందాను. ఇది నిన్ను ఋషుల శాపాలు మొదలైన దుఃఖాన్ని, శత్రువులను, రోగాదులను ఎల్లపుడూ నశింపజేస్తుంది అని పలికి అంతర్ధానం చెందాడు.

**సూత ఉవాచ –** సూత మహర్షి పలికాడు.

**తతః ప్రణమ్య ముదితో రాజా నారాయణం ప్రభుమ్ ।**
**ప్రవిశ్య నగరీం రమ్యామయోధ్యాం పర్యపాలయత్ ॥45॥**

**బ్రాహ్మణాదీంశ్చ వర్ణాశ్చ స్వస్వకర్మణ్యయోజయత్ ।**
**నారాయణపరో నిత్యం విష్ణుభక్తానకల్మషాన్ ॥46॥**

**పాలయామాస హృష్టాత్మా విశేషేణ జనాధిపః ।**
**అశ్వమేధశతైరిష్ట్వా వాజపేయశతేన చ ॥47॥**

**పాలయామాస పృథివీం సాగరావరణామిమామ్ ।**

తర్వాత ప్రభువు నారాయణుడికి నమస్కరించి ఆనందించిన రాజు రమ్యమైన అయోధ్యానగరానికి చేరి ప్రజలను పాలించాడు. నారాయణపరమైన బుద్ధిగల అంబరీషుడు బ్రాహ్మణులు మున్నగు నాల్గు వర్ణాలవారిని వారివారి పనులలో లగ్నపరచాడు. ప్రసన్నచిత్తుడైన రాజు అంబరీషుడు విశేషరూపంగా పాపరహితులైన విష్ణుభక్తుల్ని పరిపాలించాడు. నూరు అశ్వమేధాల్ని, మరో నూరు వాజపేయాల్ని నిర్వహించి సాగరపర్యంతమైన భూమిని పరిపాలించడంలో తత్పరుడైనాడు.

**గృహే గృహే హరిస్తథా వేదఘోషో గృహే గృహే ॥48॥**

**నామఘోషో హరేశ్చైవ యజ్ఞఘోషస్తథైవ చ ।**
**అభవన్నృపశార్దూలే తస్మిన్ రాజ్యం ప్రశామ్యసి ॥49॥**

**నాసస్యా నాతృణా భూమిర్న దుర్భిక్షాదిభిర్యుతా ।**
**రోగహీనాః ప్రజానిత్యం సర్వోపద్రవవర్జితాః ॥50॥**

**అంబరీషో మహాతేజాః పాలయామాస మేదినీమ్ ।**
**తస్యైవం వర్తమానస్య కన్యా కమలలోచనా ॥51॥**

**శ్రీమతీనామ విఖ్యాతా సర్వలక్షణసంయుతా ।**
**ప్రదానసమయం ప్రాప్తా దేవమాయేవ శోభనా॥52॥**

**తస్మిన్ కాలే మునిః శ్రీమన్నారదోఽభ్యాగతశ్చ వై ।**
**అంబరీషస్య రాజ్ఞో వై పర్వతస్య మహామతిః ॥53॥**

నృపశ్రేష్ఠుడు అంబరీషుడు రాజ్యపాలన చేస్తుండగా ప్రతి యింటిలో విష్ణువు విగ్రహం నెలకొల్పబడింది. ప్రతి యింటిలో వేదనాదం, విష్ణునామస్మరణం, యజ్ఞఘోష విన్పించింది. భూమి సస్యలేమిని, తృణహీనతను, దుర్భిక్షాన్ని మొదలైన ఈతి బాధలు లేకుండా ఉన్నది. ప్రజలందరూ రోగ రహితులుగా సమస్తమైన ఉపద్రవాలు లేనివారుగా ఉన్నారు. ఈ విధంగా అంబరీషుడు పృథ్విని పాలించాడు. అపుడాతడికి కమలనేత్ర, శుభాంగి అయిన ఒక కన్య జన్మించింది. ఆమె శ్రీమతి అనే పేరుతో ప్రసిద్ధిపడింది. దేవకన్యతో సమానమైన సౌందర్యంగల ఆమె పెరిగి పెద్దదై కన్యాదానయోగ్య అయ్యింది. ఆ సమయంలో అంబరీషుడి దగ్గరకు దేవముని నారదుడు, మహామతిమంతుడు పర్వతుడు వచ్చారు.

**తావుభావాగతౌ దృష్ట్వా ప్రణిపత్య యథావిధి ।**
**అంబరీషో మహాతేజాః పూజయామాస తావృషీ ॥ 54॥**

వచ్చిన ఆ యిద్దరు ఋషుల్ని చూచి నమస్కరించి మహామతి అంబరీషుడు వారిని పూజించాడు.

**కన్యాం తాం రమమాణాం వై మేఘమధ్యే శతహ్రదామ్ ।**
**ప్రాహ తాం ప్రేక్ష్య భగవాన్నారదః సస్మితస్తదా ॥55॥**

**కేయం రాజన్ మహాభాగా కన్యా సురసుతోపమా ।**
**బ్రూహి ధర్మభృతాం శ్రేష్ఠ సర్వలక్షణశోభితా ॥56॥**

మేఘమధ్యంలో విద్యుల్లతమాదిరిగా ఉండి ఆడుకుంటున్న కన్యకను చూచి నవ్వుతూ నారదుడు రాజుతో ఇలా పలికాడు. ఓ రాజా! మహాభాగ్యశాలిని, దేవకన్యలతో సమానమైన సమస్తశుభలక్షణలక్షిత అయిన ఈ బాలిక ఎవతె? ఓ ధర్మధారులతో శ్రేష్ఠుడా ఆమె ఎవరో చెప్పు.

**రాజోవాచ –** రాజు పలికాడు.

**దుహితేయం మమ విభో శ్రీమతీ నామ నామతః ।**
**ప్రదానసమయం ప్రాప్తా వరమన్వేషతే శుభా ॥57॥**

ఓ నారదవిభో! ఈమె నాకుమార్తె. పేరు శ్రీమతి. ఈమె వివాహకాలానికి చేరింది. అందుచేత సౌభాగ్యవతి అయిన ఈమె వరాన్వేషణ చేస్తున్నది.

**ఇత్యుక్తో మునిశార్దూలస్తామైచ్ఛన్నారదో ద్విజాః ।**
**పర్వతోఽపి మునిస్తాం వై చకమే మునిసత్తమాః ॥58॥**

ఓ మునిశ్రేష్ఠులారా! రాజు ఆ విధంగా చెప్పగా మునిశ్రేష్ఠుడు నారదుడు ఆమెను పొందడానికి ఇష్టపడ్డాడు. ఓ మునివరులారా! ఆ విధంగానే పర్వతమునికూడా ఆమెను పొందడానికి మిక్కిలి ఆశ చెందాడు.

**అనుజ్ఞాప్య చ రాజానం నారదో వాక్యమబ్రవీత్ ।**
**రహస్యాహూయ ధర్మాత్మా మమ దేహి సుతామిమామ్ ॥59॥**

**పర్వతో హి తథా ప్రాహ రాజానం రహసి ప్రభుః ।**

రాజుయొక్క అనుమతి పొంది ఆయనను పిలిచి ధర్మాత్ముడైన నారదుడు ఏకాంతంలో ఈమాట చెప్పాడు. నీ యీ పుత్రికను నాకు భార్యగా ఇవ్వు. పర్వతమునికూడా ఏకాంతంలో రాజుతో ఈ విధంగానే పలికాడు.

**తావుభౌ సహ ధర్మాత్మా ప్రణిపత్య భయార్దితః ॥60॥**

**ఉభౌ భవంతౌ కన్యాం మే ప్రార్థయానౌ కథం త్వహమ్ ।**
**కరిష్యామి మహాప్రాజ్ఞ శృణు నారద మే వచః ॥61॥**

**త్వం చ పర్వత మే వాక్యం శృణు వక్ష్యామి యత్ప్రభో ।**
**కన్యేయం యువయోరేకం వరయిష్యతి చేచ్ఛుభా ॥62॥**

**తస్మై కన్యాం ప్రయచ్ఛామి నాన్యథా శక్తిరస్తి మే ।**

అపుడు భయవిహ్వలుడైన రాజు ఆ యిద్దరికి ఒకేసారి నమస్కరించి ఇలా పలికాడు. మీరిద్దరూ నాయీ కన్యను కోరుతున్నారు. ఇటువంటి పరిస్థితిలో నేనేమి చేయగలను. ఓ మహాప్రాజ్ఞ! నారద! నీవు నా మాట విను. ఓ పర్వతా! ఓ ప్రభూ! నీవుకూడా నామాట విను. ఇట్టి స్థితిలో నేను ఇలా చెబుతున్నాను. నా యీ సౌభాగ్యవతి అయిన కుమార్తె మీ యిద్దరిలో ఒకర్ని వరించగలదు. ఆమె వరించినవానికి నేను కన్యను ఇస్తాను. ఇంతకు మించి నాకు వేరే శక్తి లేదు.

**తథేత్యుక్త్వా తతో భూయః శ్వో యాస్యావ ఇతి స్మ హ ॥63॥**

**ఇత్యుక్త్వా మునిశార్దులే జగ్మతుః ప్రీతిమానసౌ ।**
**వాసుదేవపరౌ నిత్యముభౌ జ్ఞానవిదాం వరౌ ॥64॥**

ఆ విధంగా రాజు పలికిన తర్వాత, మేమిద్దరం రేపు మరల వస్తాం అని చెప్పి నిరంతరం విష్ణుచిత్తులు, జ్ఞానాగ్రగణ్యులు అయిన వారిద్దరూ సంతోషించినవారై అక్కడనుంచి వెళ్లారు.

**విష్ణులోకం తతో గత్వా నారదో మునిసత్తమః ।**
**ప్రణిపత్య హృషీకేశం వాక్యమేతదువాచ హ ॥65॥**

**శ్రోతవ్యమస్తి భగవన్నాథ నారాయణ ప్రభో ।**
**రహసి త్వాం ప్రవక్ష్యామి నమస్తే భువనేశ్వర ॥66॥**

తర్వాత మునిశ్రేష్ఠుడు నారదుడు విష్ణులోకానికి వెళ్లి, శ్రీహరికి నమస్కరించి ఈ వాక్యాన్ని విన్పించాడు. ఓ భగవానుడా! ఓ నాథా! ఓ నారాయణ! ఓ ప్రభూ! నీవు కొంత వినాలి. అది నీకు ఏకాంతంలో చెబుతాను. ఓ భువనేశ్వరా! నీకు నమస్కారం.

**తతః ప్రహస్య గోవిందః సర్వానుత్సార్య తం మునిమ్ ।**
**బ్రూహీత్యాహ చ విశ్వాత్మా మునిరాహ చ కేశవమ్ ॥67॥**

**త్వదీయో నృపతిః శ్రీమానంబరీషో మహీపతిః ।**
**తస్య కన్యా విశాలాక్షీ శ్రీమతీ నామ నామతః ॥68॥**

**పరిణేతుమనాస్తత్ర గతోఽస్మి వచనం శృణు ।**
**పర్వతోఽయం మునిః శ్రీమాంస్తవ భృత్యస్తపోనిధిః ॥69॥**

**తామైచ్ఛత్సోఽపి భగవన్నావామాహ జనాధిపః ।**
**అంబరీషో మహాతేజాః కన్యేయం యువయోర్వరమ్ ॥70॥**

**లావణ్యయుక్తం వృణుయాద్యది తస్మై దదామ్యహమ్ ।**
**ఇత్యాహావాం నృపస్తత్ర తథేత్యుక్త్వాహమాగతః ॥71॥**

**ఆగమిష్యామి తే రాజన్ శ్వః ప్రభాతే గృహం త్వితి ।**
**ఆగతోఽహం జగన్నాథ కర్తుమర్హసి మే ప్రియమ్ ॥72॥**

**వానరాననవద్భాతి పర్వతస్య ముఖం తథా ।**
**తథా కురు జగన్నాథ మమ చేదిచ్ఛసి ప్రియమ్ ॥73॥**

ఆ తర్వాత పరమాత్ముడైన గోవిందుడు అందర్ని అవతలకు పంపి నవ్వుతూ ఆమునితో పలికాడు. నారదా! చెప్పు. అపుడు ముని శ్రీహరికి ఇలా చెప్పాడు. నామాట విను. శ్రీమంతుడు రాజా అంబరీషుడు నీ భక్తుడు. శ్రీమతి

అనే పేరుగల విశాలాక్షి అయిన ఒక కన్య ఆతడి పుత్రి. నేను ఆమెను వివాహమాడ ఉత్సకత చెందాను. నేను అక్కడకు వెళ్లాను. నామాట విను. నీ భక్తుడు తపోనిధి శ్రీమాన్ పర్వతుడుకూడా ఆమెను కోరుతున్నాడు. ఓ భగవాన్! మహాతేజస్వి అయిన రాజా అంబరీషుడు మా యిద్దరికి చెప్పాడు. మీ యిద్దరిలో నా కుమార్తె ఏ సౌందర్యసంపన్నుడిని వరిస్తుందో ఆతడికి నేను ఆమెనిచ్చి వివాహం చేస్తాను. (అర్పిస్తాను) అపుడు రాజుతో మేమిద్దరం ఇలా పలికాం. అది మంచిదే. రేపు ప్రాతఃకాలానికి నీ యింటికి మేం వస్తామన్నాం. అలా పలికి నేను ఇక్కడకు వచ్చాను. ఓ జగన్నాథా! నీవు నాకు ప్రియాన్ని చేయదగినవాడవు. పర్వతుడి ముఖాన్ని వానరముఖం మాదిరిగా మార్చి నాకు ప్రియం చేయి.

**తథేత్యుక్త్వా స గోవిందః ప్రహస్య మధుసూదనః ।**
**త్వయోక్తంచ కరిష్యామి గచ్ఛ సౌమ్య యథాగతమ్ ॥74॥**

అపుడు భగవానుడు మధుసూదనుడు నవ్వి ఆ విధంగానే అని పలికి, ఓ సౌమ్య! నారదా! నీవు చెప్పింది నేను చేస్తాను. ఇపుడు నీవు ఎలా వచ్చావో అలాగే వెళ్లు.

**ఏవముక్త్వా ముని ర్హృష్టః ప్రణిపత్య జనార్దనమ్ ।**
**మన్యమానః కృతాత్మానం తథాయోధ్యాం జగామ సః ॥75॥**

ఆ విధంగా జనార్దనుడు చెప్పగా సంతోషించిన నారదుడు ఆయనకు నమస్కరించి తనను కృతార్థుడుగా భావించుకుని అపుడే అయోధ్యకు వెళ్లాడు.

**గతే మునివరే తస్మిన్ పర్వతోఽపి మహామునిః ।**
**ప్రణమ్య మాధవం హృష్టో రహస్యేనమువాచ హ ॥76॥**
**వృత్తం తస్య నివేద్యాగ్రే నారదస్య జగత్పతేః ।**
**గోలాంగూలముఖం యద్వన్ముఖం భాతి తథా కురు ॥77॥**

నారదముని వెళ్లిన తర్వాత మహాముని పర్వతుడు కూడా అక్కడకు వచ్చి భగవానుడు మాధవుడికి నమస్కరించి ఆయనకు అంబరీషుడి విషయాన్ని సర్వాన్ని ఏకాంతంలో సంతోషంగా చెప్పాడు. ఓ జగత్పతీ! నారదుడి ముఖాన్ని మర్కటముఖంగా కన్పింపజేయి.

**తచ్ఛ్రుత్వా భగవాన్ విష్ణుస్త్వయోక్తం చ కరోమి వై ।**
**గచ్ఛ శీఘ్రమయోధ్యాం వై మా వేదీర్నారదస్య వై ॥78॥**

**త్వయా మే సంవిదం తత్ర తథేత్యుక్త్వా జగామ సః ।**

పర్వతుడి ఆ మాట విని విష్ణువు ఇలా పలికాడు. నీవు చెప్పిన విధంగా చేస్తా. నీవు వెంటనే అయోధ్యకు వెళ్లు. నేను నీకు ఈవిషయం చెప్పినట్లు నారదుడికి చెప్పవద్దు. అది అట్లేనని పలికి ఆతడు వెళ్లాడు.

**తతో రాజా సమాజ్ఞాయ ప్రాప్తౌ మునివరౌ తదా ॥79॥**

**మాంగల్యైర్వివిధైః సర్వామయోధ్యాం ధ్వజమాలినీమ్ ।**
**మండయామాస పుష్పైశ్చ లాజైశ్చైవ సమంతతాం ॥80॥**

**అంబుసిక్తగృహద్వారాం సిక్తాపణమహాపథమ్ ।**
**దివ్యగంధరసోపేతాం ధూపితాం దివ్యధూపకైః ॥81॥**

**కృత్వా చ నారీం రాజా మండయామాస తాం సభామ్ ।**
**దివ్యైర్గంధైస్తథా ధూపైః రత్నైశ్చ వివిధైస్తథా ॥82॥**

**అలంకృతాం మణిస్తంభైర్నానామాల్యోపశోభితామ్ ।**
**పరార్ధ్యాస్తరణోపేతైర్దివ్యైర్భద్రాసనైర్వృతామ్ ॥83॥**

**కృత్వా నృపేంద్రస్తాం కన్యాం హ్యాదాయ ప్రవివేశ హ ।**
**సర్వాభరణ సంపన్నాం శ్రీరివాయతలోచనామ్ ॥84॥**

**కరసమ్మితమధ్యాంగీం పంచస్నిగ్ధాం శుభాననామ్ ।**
**స్త్రీభిః పరివృతాం దివ్యాం శ్రీమతీం సంశ్రితాం తదా ॥85॥**

ఆ తర్వాత మహారాజు అంబరీషుడు ఇద్దరు మునులు వచ్చారని తెలిసి, అనేక విధాలైన మంగళద్రవ్యాలతో, పుష్పాలు, పేలాలు మొదలైన వాటితో ధ్వజాలు, తోరణాలు కట్టించి అన్నివైపుల అయోధ్యను సంపూర్ణంగా అలంకరించాడు. భవనద్వారాల్ని వీథుల్ని, అంగడుల్ని నీటితో తడిపి, నగరాన్ని దివ్యగంధం, రసాదులతో కూడిన ధూపాలతో సుగంధభరితం చేసి అలంకరించాడు. అనంతరం రాజు స్వయంవరమండపాన్ని నానావిధాల దివ్యసుగంధాల ధూపాలతో, రత్నాలతో, మణులతో నిర్మించిన స్తంభాలతో, అనేక విధాలైన మాలలతో, మరియు విలువైన ఆచ్ఛాదనలతో, దివ్యసింహాసనంతో కూడిన దానిగా అలంకరించాడు. తర్వాత అన్నివిధాలైన ఆభరణాలతో అలంకరింపబడిన మహాలక్ష్మిదేవితో సమానమైనది, విశాలనేత్రవతి, కృశోదరి, హస్తాలు మొదలైన పంచ కోమలాంగాలుగలది, మనోహరమైన ముఖమండలం గలది, అనేక స్త్రీజనంతో కూడినట్టిది అయిన శ్రీమతి కన్యను సభలోనికి ప్రవేశింపజేశాడు.

**సభా చ సా భూపపతేః సమృద్ధా మణిప్రవేకోత్తమరత్నచిత్రా ।**
**న్యస్తాసనా మాల్యవతీ సుబుద్ధా తామాయయుస్తే నరరాజవర్గాః ॥86॥**

రాజు అంబరీషుడి ఆ సభామందిరం మిక్కిలి వైభవం కలిగినది. అనేకవిధాలైన శ్రేష్ఠమైన మణులతో, రత్నాలతో చిత్రితమైనది. ఉత్తమాసనాలతో శోభిస్తున్నది. పుష్పమాలలతో అలంకరింపబడినది. ఇలా సువ్యవస్థితమైన ఆ సభలోనికి రాజబృందం విచ్చేశారు.

**అథాపరే బ్రహ్మవరాత్మజో హి త్రైవిద్యవిద్యో భగవాన్ మహాత్మా ।**
**సపర్వతో బ్రహ్మవిదాం వరిష్ఠో మహామునిర్నారద ఆజగామ ॥87॥**

అనంతరం బ్రహ్మమానసపుత్రుడు, వేదత్రయవిద్యాప్రవీణుడు, బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు, మహాత్ముడు, భగవానుడు అయిన నారదమహాముని పర్వతమునితో కలిసి వచ్చాడు.

**తావాగతౌ సమీక్ష్యాథ రాజా సంభ్రాంతమానసః ।**
**దివ్యమాసనమాదాయ పూజయామాస తావుభౌ ॥ 88॥**

వచ్చినవారిని సంభ్రమాశ్చర్యమానసుడై రాజు దర్శించి, దివ్యమైన ఆసనాలలో కూర్చుండజేసి వారిద్దర్ని పూజించాడు.

**ఉభౌ దేవర్షిసిద్ధౌ తావుభౌ జ్ఞానవిదాం వరౌ ।**
**సమాసీనౌ మహాత్మానౌ కన్యార్థం మునిసత్తమౌ ॥89॥**

వారిద్దరూ దేవర్షులలో ప్రసిద్ధులు, జ్ఞానులలో శ్రేష్ఠులు, మహామునులు అయిన నారదపర్వతులు కన్యాప్రాప్తికై బాగుగా ఆసనాలలో ఆసీనులైనారు.

**తావుభౌ ప్రణిపత్యాగ్రే కన్యాం తాం శ్రీమతీం శుభామ్ ।**
**సుతాం కమలపత్రాక్షీం ప్రాహ రాజా యశస్వినీమ్ ॥90॥**

**అనయోర్యం వరం భద్రే మనసా త్వమిహేచ్ఛసి ।**
**తస్మై మాలామిమాం దేహి ప్రణిపత్య యథావిధి ॥91॥**

రాజు వారిద్దరికీ సమ్ముఖంలో నమస్కరించి, కమలదళనేత్ర, యశస్విని, శుభకరమైన సుత శ్రీమతితో ఇలా పలికాడు. ఓ భద్రా! ఈ ఇద్దరి వరులలో నీ మనసు ఎవరిని కోరుతుందో ఆతనికి నమస్కరించి ఈ వరమాలను విధ్యుక్తంగా ఇవ్వవలసింది.

**ఏవముక్తా తు సా కన్యా స్త్రీభిః పరివృతా తదా ।**
**మాలాం హిరణ్యమయీం దివ్యమాదాయ శుభలోచనా ॥92॥**

**యత్రాసీనౌ మహాత్మానౌ తత్రాగమ్య స్థితా తదా ।**
**వీక్ష్యమాణా మునిశ్రేష్ఠౌ నారదం పర్వతం తథా ॥ 93॥**

రాజు ఆ విధంగా చెప్పగా స్త్రీలతోకూడియున్న సుందరాక్షి అయిన ఆ కన్య సువర్ణమయమైన ఆదివ్యమాలను తీసుకుని అక్కడ కూర్చున్న మహాత్ములు, మునిశ్రేష్ఠులు అయిన నారదపర్వతుల్ని చూస్తూ నిలిచింది.

**శాఖామృగాననం దృష్ట్వా నారదం పర్వతం తథా ।**
**గోలాంగూలముఖం కన్యా కించిత్ త్రాససమన్వితా ॥94॥**

**సంభ్రాంతమానసా తత్ర ప్రవాతకదలీ యథా ।**
**తస్థౌ తామాహ రాజాసౌ వత్సే కిం త్వం కరిష్యసి ॥95॥**

**అనయోరేకముద్దిశ్య దేహి మాలామిమాం శుభే ।**

నారదుడిని మర్కటసమానముఖంగలవాడుగా,పర్వతుడిని మరో భేదవానరసమానముఖంగలవాడుగా చూచి ఆ కన్య కొద్దిగా భయపడింది. వ్యాకులచిత్త అయిన ఆమె వాయువువల్ల బాగా ఊగిన అరటిచెట్టువలె అక్కడ నిలిచింది. అపుడారాజు ఆమెతో ఇలా అన్నాడు. ఓ వత్సా! నీవిపుడు ఏమి చేస్తున్నావు? ఓ శుభా! వారిద్దరిలో ఒకరికి ఈ మాలను ఇవ్వు.

**సా ప్రాహ పితరం త్రస్తా ఇమౌ తౌ నరవానరౌ ॥ 96॥**

**మునిశ్రేష్ఠం న పశ్యామి నారదం పర్వతం తథా ।**
**అనయోర్మధ్యతస్త్వేకమూనషోడశవార్షికమ్ ॥97॥**

**సర్వాభరణసంపన్నమతసీపుష్పసన్నిభమ్ ।**
**దీర్ఘబాహుం విశాలాక్షం తుంగోరస్థలముత్తమమ్ ॥98॥**

**రేఖాంకితకటిగ్రీవం రక్తాంతాయతలోచనమ్ ।**
**నమ్రచాపానుకరణపటుభ్రూయుగశోభితమ్ ॥99॥**

**విభక్తత్రివలీవ్యక్తం నాభివ్యక్తశుభోదరమ్ ।**
**హిరణ్యాంబరసంవీతం తుంగరత్ననఖం శుభమ్ ॥100॥**

**సునాసం పద్మహృదయం పద్మనాభం శ్రియా వృతమ్ ।**
**దంతపంక్తిభిరత్యర్థం కుందకుట్మలసన్నిభైః ॥101॥**

**హసంతం మాం సమాలోక్య దక్షిణం చ ప్రసార్య వై ।**
**పాణిం స్థితమముం తత్ర పశ్యామి శుభమూర్ధజమ్ ॥102॥**

భయపడుతూ ఆ కన్య తండ్రితో ఇలా అన్నది. వీరిద్దరూ నరవానరులుగా ఉన్నారు. మునిశ్రేష్ఠులైన నారద పర్వతుల్ని చూడడం లేదు. అయితే వీరిద్దరి మధ్యలో పదహారువర్షాలకు ఒకటి తక్కువ వయసుగలవాడు, సర్వాభరణాలంకృతుడు, నీలకాంతిగలవాడు, ఆజానుబాహుడు, విశాలాక్షుడు, ఉన్నతం మరియు ఉత్తమమైన వక్షఃస్థలం కలవాడు, రేఖాయుక్తమైన కటి భాగం, మరియు గ్రీవం గలవాడు, కొనలందు అరుణిమగల కన్నులవాడు, సంధించిన ధనుస్సులాగా వంగిన దట్టమైన కనుబొమలతో శోభిల్లువాడు, ప్రకటమైన త్రివళులుగలవాడు, స్పష్టమైన నాభితో కూడిన ఉదరం గలవాడు, పీతాంబరధరుడు, రత్నకాంతులీనే ఉన్నత నఖాలు గలవాడు, పద్మహస్తుడు, పద్మాక్షుడు, సుందరనాసిక కలవాడు, పద్మసమానహృదయుడు, పద్మసమానమైన నాభిగలవాడు, కాంతిమంతుడు, మల్లిమొగ్గలవంటి పలువరుసతో శోభిల్లువాడు, సుందర కేశజాలంగలవాడు నన్నుచూచి తన దక్షిణకరాన్ని నాకై చాచి నవ్వుతూ నిలిచిన ఒక వ్యక్తిని చూస్తున్నాను.

**సంభ్రాంతమానసాం తత్ర వేపతీం కదలీమివ ।**
**స్థితాం తామాహ రాజాసౌ వత్సే కిం త్వం కరిష్యసి ॥103॥**

అపుడు కదలీవృక్షంలాగా ఊగుతూ వికలచిత్త అయిన కన్యతో నీవేమి చేస్తున్నావని రాజు పలికాడు.

**ఏవముక్తే మునిః ప్రాహ నారదః సంశయం గతః ।**
**కియంతో బాహవస్తస్య కన్యే బ్రూహి యథాతథమ్ ॥104॥**

**బహుద్వయంచ పశ్యామీత్యాహ కన్యా శుచిస్మితా ।**
**ప్రాహ తాం పర్వతస్తత్ర తస్య వక్షఃస్థలే శుభే ॥105॥**

**కిం పశ్యసి చ మే బ్రూహి కరే కిం వాస్య పశ్యసి ।**
**కన్యా తమాహ మాలాం వై పంచరూపామనుత్తమామ్ ॥106॥**

**వక్షఃస్థలేஉస్య పశ్యామి కరే కార్ముకసాయకాన్ ।**

రాజు తన కుమార్తెతో ఆ విధంగా పలకగా సందేహించిన నారదుడు ఇలా పలికాడు. ఓ శ్రీమతీ! ఆతడికి ఎన్ని బాహువులున్నాయి? ఉన్నది ఉన్నట్లు చెప్పు. ఆమె పవిత్రమైన నవ్వుగలది అయి రెండు బాహువుల్ని చూస్తున్నాను. తర్వాత పర్వతుడు పలికాడు. ఓ శుభా! ఆయన వక్షఃస్థలమందు ఏమి చూస్తున్నావు? ఆయన చేతులలో ఏమి చూస్తున్నావు? ఆయన వక్షఃస్థలయంలో సర్వశ్రేష్ఠమైన పంచరూపమాలను, చేతులలో ధనుర్బాణాలను చూస్తున్నాను.

**ఏవముక్తౌ మునిశ్రేష్ఠౌ పరస్పరమనుత్తమౌ ॥107॥**

**మనసా చింతయంతే తౌ మాయేయం కస్యచిద్భవేత్ ।**
**మాయావీ తస్కరో నూనం స్వయమేవ జనార్దనః ॥108॥**

**ఆగతో న యథా కుర్యాత్కథమస్మన్ముఖం త్విదమ్ ।**
**గోలాంగూలత్వమిత్యేవం చింతయామాస నారదః ॥109॥**

**పర్వతోஉపి యథాన్యాయం వానరత్వం కథం మమ ।**
**ప్రాప్తమిత్యేవ మనసా చింతామాపేదివాంస్తథా ॥110॥**

ఆమె వలన ఆ విధంగా విన్న ఆ యిద్దరు ఉత్తమమునిశ్రేష్ఠులు మనసులో చింతిస్తూ పరస్పరం మాట్లాడు కున్నారు. ఇది ఎలాంటి మాయ? మాయావి, చోరుడు అయిన జనార్దనుడి మాయే యిది. కన్యను పొందడానికై ఇక్కడకు వచ్చాడు. ఇది అలా జరగకుంటే నా యీ ముఖం నరవానరముఖంతో సమానంగా ఎవరు చేస్తారు. ఈ విధంగా నారదుడు ఆలోచించాడు. ఈ విధంగానే పర్వతముని కూడా మనసులో చింతించాడు. నా ముఖం వానరముఖంగా ఎలా మారింది.

**తతో రాజా ప్రణమ్యాసౌ నారదం పర్వతం తథా ।**
**భవద్భ్యాం కిమిదం తత్రకృతం బుద్ధిం విమోహజమ్ ॥111॥**

**స్వస్థౌ భవంతౌ తిష్ఠేతాం యథా కన్యార్థముద్యతౌ ।**

అనంతరం రాజు నారదపర్వతులకు నమస్కరించి పలికాడు. మిక్కిలిగా మీ యిద్దరు ఎందుకు బుద్ధి భ్రాంతిని కల్పించారు. కన్యను మిక్కిలిగా పొందగోరే మీరు ప్రశాంత చిత్తంతో కూర్చోండి.

**ఏవముక్తౌ మునిశ్రేష్ఠౌ నృపమూచతురుల్బణే ॥112॥**

**త్వమేవ మోహం కురుషే నావామిహ కథంచన ।**
**ఆవయోరేకమేషా తే వరయత్వేవ మా చిరమ్ ॥113॥**

రాజు ఆ విధంగా పలకగా ఆ మునులిద్దరూ కుపితులై పలికారు. నీవే మోహాన్ని కల్పిస్తున్నావు. మేము ఏ విధంగాను కాము. నీ యీ కమార్తె మా యిద్దరిలో ఒకరిని వెంటనే వరించాలి.

**తతః సా కన్యకా భూయః ప్రణిపత్యేష్టదేవతామ్ ।**
**మాయామాదాయ తిష్ఠంతం తయోర్మధ్యే సమాహితమ్ ॥114॥**

**సర్వాభరణసంయుక్తమతసీపుష్పసన్నిభమ్ ।**
**దీర్ఘబాహుం సుపుష్టాంగం కర్ణాంతాయతలోచనమ్ ॥115॥**

**పూర్వవత్పురుషం దృష్ట్వా మాలాం తస్మై దదౌ హి సా ।**
**అనంతరం హి సా కన్యా నదృష్టా మనుజైః పునః ॥116॥**

అనంతరం ఆమె తన ఇష్టదేవతల్ని ప్రార్థించి మాలను తీసుకుని అక్కడ నుంచి లేచి వారి ఎదుట సమాహిత చిత్తంతో కూర్చున్నది. సమస్తాభరణాలతో సుశోభితుడు, అతసీపుష్పంతో సమానమైన శ్యామవర్ణం గలవాడు, ఆజానుబాహుడు, పుష్టాంగాలు గలవాడు, కర్ణపర్యంతం వ్యాపించిన నేత్రాలుగలవాడు అయిన పూర్వం చూచినవాడితో సమానమైన పురుషుడిని చూచి ఆతనికై మాలను ఇచ్చింది. తర్వాత అక్కడగల మనుష్యులు ఆమెను చూడలేదు.

**తతో నాదః సమభవత్ కిమేతదితి విస్మితౌ ।**
**తామాదాయ గతో విష్ణుః స్వస్థానం పురుషోత్తమః ॥117॥**

**పురా తదర్థమనిశం తపస్తప్త్వా వరాంగనా ।**
**శ్రీమతీ సా సముత్పన్నా సా గతా చ యథా హరిమ్ ॥118॥**

అనంతరం ధ్వని విన్పించింది. వారు ఆశ్చర్యచకుతులయి ఇదేమిటి అనుకున్నారు. పురుషోత్తముడై శ్రీవిష్ణువు ఆమెనెత్తుకుని వైకుంఠానికి వెళ్లాడు. పూర్వజన్మలో ఈ సుందర యువతి శ్రీహరిని గూర్చి నిరంతరం తపస్సు చేసి ఈ జన్మలో శ్రీమతి అనే పేరుతో కన్యగా పుట్టి శ్రీమహావిష్ణువును పొందింది.

**తావుభౌ మునిశార్దూలౌ ధిక్కృతావతిదుఃఖితౌ ।**
**వాసుదేవం ప్రతి తదా జగ్మతుర్భవనం హరేః ॥119॥**

తర్వాత శ్రీమతి ద్వారా తిరస్కరింపబడిన ఆ ఇద్దరు మునిశ్రేష్ఠులు అత్యంతదుఃఖితులై శ్రీహరిమందిరానికి వెళ్లారు.

**తవాగతౌ సమీక్ష్యాహ శ్రీమతీం భగవాన్ హరిః ।**
**మునిశ్రేష్ఠౌ సమాయాతౌ గూహస్వాత్మానమత్ర వై ॥120॥**

వచ్చిన ఆ యిద్దరిని చూచి భగవానుడు శ్రీహరి శ్రీమతితో పలికాడు. ఆ మునివరులు నారదపర్వతులు ఇక్కడకు వచ్చారు. వారికి కన్పింపక దాగి ఉండు.

**తథేత్యుక్త్వా చ సా దేవీ ప్రహసంతీ చకార హ ।**
**నారదః ప్రణిపత్యాగ్రే ప్రాహ దామోదరం హరిమ్ ॥121॥**

**ప్రియం హి కృతవానద్య మమ త్వం పర్వతస్య హి ।**
**త్వమేవ నూనం గోవింద కన్యాం తాం హృతవానసి ॥122॥**

**విమోహ్యైవాం స్వయం బుధ్యాప్రతార్య సురసత్తమ ।**

అలాగేనని ఆ దేవి శ్రీమతి నవ్వుతూ వారికి కన్పించకుండా దాగింది. నారదుడు శ్రీహరి దామోదరుడిముందు సాష్టాంగపడి నమస్కరించి ఇలా పలికాడు. నాకు, పర్వతుడికి కూడా నీవు ఇపుడు ప్రియం చేశావు. ఓ సురశ్రేష్ఠా! ఓ గోవిందా! నీ బుద్ధితో మమ్మల్ని భ్రమింపజేసి వంచించి నీవే ఆ కన్యను అపహరించావు. ఇది నిశ్చయం.

**ఇత్యుక్తః పురుషో విష్ణుః పిధాయ శ్రోత్రమచ్యుతః ।**
**పాణిభ్యాం ప్రాహ భగవాన్ భవద్భ్యాం కిముదీరితమ్ ॥123॥**

**కామవానపి భావోఽయం మునివృత్తిరహో కిల ।**

నారదుడు ఆ విధంగా పలకగా పరమపురుషుడు. అచ్యుతుడు శ్రీ మహావిష్ణువు రెండు చేతులతో చెవులు మూసుకుని ఇలా పలికాడు. మీరిద్దరూ ఏమని పలికారు? అహో! ఈ కామవాసనారూపభావం మునివృత్తినున్న మీకు తగునా?

**ఏవముక్తో మునిః ప్రాహ వాసుదేవం స నారదః ॥124॥**

**కర్ణమూలే మమ కథం గోలాంగూలముఖం త్వితి ।**
**కర్ణమూలే తమాహేదం వానరత్వం కృతం మయా ॥125॥**

**పర్వతస్య మయా విద్వన్ గోలాంగూలముఖం తవ ।**
**మయా తవ కృతం తత్ర ప్రియార్థం నాన్యథా త్వితి ॥126॥**

భగవాన్ శ్రీహరి ఆ విధంగా పలకగా నారదుడు వాసుదేవుడియొక్క చెవిలో ఇలా పలికాడు. నీవు నా ముఖాన్ని కొండముచ్చు ముఖంతో సమానంగా ఎందుకు చేశావు? అపుడు శ్రీనివాసుడు నారదుడి చెవిలో ఓ విద్వాంసుడా నేను పర్వతుడి ముఖాన్ని కోతి ముఖంగా చేశానో అట్లే నీ ముఖాన్ని కొండముచ్చు ముఖంగా మార్చాను. ఇదంతా నీ హితం కోసం చేశాను. ఇందులో ఏ విపరీతం కూడా లేదు.

**పర్వతోపి తథా ప్రాహ తస్యాప్యేవం జగాద సః ।**
**శృణ్వతోరుభయోస్తత్ర ప్రాహ దామోదరో వచః ॥127॥**

**ప్రియం భవద్భ్యాం కృతవాన్ సత్యేనాత్మానమాలభే ।**

పర్వతుడుకూడా నారదుడు మాదిరిగానే పలికాడు. అపుడు విష్ణువు పర్వతుడికి కూడా నారదుడికి చెప్పినట్లే చెప్పాడు. అనంతరం దామోదరుడు వారిద్దరి సమక్షంలో ఇలా పలికాడు. నేను ప్రతిజ్ఞాపూర్వకంగా నిజం చెబుతున్నాను. నేను మీ యిద్దరికి హితం చేకూర్చాను.

**నారదః ప్రాహ ధర్మాత్మా ఆవయోర్మధ్యతః స్థితః ॥ 128॥**

**ధనుష్మాన్ పురుషః కోऽత్ర తాం హృత్వా గతవాన్ కిల ।**
**తచ్ఛ్రుత్వా వాసుదేవోఽసౌ ప్రాహ తౌ మునిసత్తమౌ ॥129॥**

అనంతరం ధర్మాత్ముడు నారదుడు పలికాడు. మా యిద్దరి మధ్యలో నిలిచిన ధానుష్కుడైన ఆ పురుషుడు ఎవడు? ఆతడే ఆమెను అపహరించుకుని వెళ్లాడు. ఆమాట విని వాసుదేవుడు ఆ ఇద్దరు ముని శ్రేష్ఠులతో ఇలా పలికాడు.

**మాయావినో మహాత్మానో బహవః సంతి సత్తమాః ।**
**తత్ర సా శ్రీమతీ నూనమదృష్ట్వా మునిసత్తమౌ ॥130॥**

**చక్రపాణిరహం నిత్యం చతుర్బాహురితి స్థితః ।**
**తాం తథా నాహమైచ్ఛం వై భవద్భ్యాం విహితం హి తత్ ॥131॥**

శ్రేష్ఠులైన మహాత్ములే పదుగురు మాయావులుగా ఉన్నారు. ఆ శ్రీమతి మీ యిద్దర్ని చూడలేదు. ఇది నిశ్చయం. నేను చక్రపాణిని. పైగా చతుర్భుజుడను. ఇది మీకు తెలుసు. ఆమెను పొందాలన్న కోరిక నాకు లేదు.

**ఇత్యుక్తౌ ప్రణిపత్యైనమూచతుః ప్రీతిమానసౌ ।**
**కోఽత్ర దోషస్తవ విభో నారాయణ జగత్పతే ॥132॥**

**దౌరాత్మ్యం తన్నృపస్యైవ మాయాం హి కృతవానసౌ ।**
**ఇత్యుక్త్వా జగ్మతుస్తస్మాన్మునీ నారదపర్వతౌ ॥133॥**

విష్ణువు ఆ విధంగా వారితో పలకగా వారు ప్రసన్నహృదయులై నమస్కరించి ఓ ప్రభూ! ఓ నారాయణా! ఓ జగత్పతీ! ఇందులో నీ దోషమేమున్నది? ఈ విషయంలో రాజుదే దుష్టత్వం. ఆతడే ఆ మాయను కల్పించాడు. ఈ విధంగా పలికి ఇద్దరు మునులు అయోధ్యకు వెళ్లారు.

**అంబరీషం సమాసాద్య శాపేనైనమయోజయత్ ।**
**నారదః పర్వతశ్చైవ యస్మాదావామిహాగతౌ ॥134॥**

**ఆహూయ పశ్చాదన్యస్మై కన్యాం త్వం దత్తవానసి ।**
**మాయాయోగేన తస్మాత్త్వాం తమో హ్యభిభవిష్యతి ॥135॥**

**తేన చాత్మానమత్యర్థం యథావత్త్వం న వేత్స్యసి ।**

అంబరీషుడి దగ్గరకు వచ్చి వారు ఆయన్ని శపించారు. మమ్మల్ని రమ్మని పిలిచి వేరొకనిని రమ్మని మాయచేసి కన్యను ఇచ్చావు. కావున నిన్ను తమస్సు ఆక్రమించుగాక. నీవు చేసిన మోసానికి పరిణామాన్ని నీవు యథాతథంగా తెలియలేకున్నావు.

**ఏవం శాపే ప్రదత్తే తు తమోరాశిరథోత్థితః ॥136॥**

**నృపం ప్రతి తతశ్చక్రం విష్ణోః ప్రాదురభూత్ క్షణాత్ ।**
**చక్రవిత్రాసితం ఘోరం తావుభౌ తమ అభ్యగాత్ ॥137॥**

మునులు శాపాన్ని ఇవ్వడంవల్ల అంధకారపుంజం ఉత్పన్నం అయ్యింది. రాజును ఆక్రమించింది. వెంటనే విష్ణువుయొక్క చక్రం ప్రకటితం అయ్యింది. చక్రం చేత భయపెట్టబడిన అంధకారం మునులవైపుకు వెళ్లింది.

తతః సంత్రస్త సర్వాంగౌ ధావమానౌ మహామునీ ।
పృష్ఠతశ్చక్రమాలోక్య తమోరాశిం దురాసదమ్ ॥138॥

కన్యాసిద్ధిరహో ప్రాప్తా హ్యావయోరితి వేగితౌ ।
లోకాలోకాంతమనిశం ధావమానౌ భయార్దితౌ ॥139॥

త్రాహి త్రాహీతి గోవిందం భాషమాణే భయార్దితౌ ।
విష్ణులోకం తతో గత్వా నారాయణ జగత్పతే ॥140॥

వాసుదేవ హృషీకేశ పద్మనాభ జనార్దన ।
త్రాహ్యావాం పుండరీకాక్ష నాథోఽసి పురుషోత్తమ ॥141॥

తర్వాత బాధింపబడిన సమస్తమైన అవయవాలుగలవారు, పరుగెత్తుతున్నవారు అయిన ఆ యిద్దరు మహామునులు తమ వెనుక వస్తున్న చక్రాన్ని, భయానకమైన అంధకారపుంజాన్ని చూచి ఇలా పలికారు. అహో! మన యిద్దరికి కన్యాప్రాప్తి సిద్ధించింది అని. భయభీతులై లోకాలోకాంతరాలలో నిరంతరం పరుగెత్తుతూ రక్షించు, రక్షించు అని పలుకుతూ విష్ణులోకానికి వెళ్లి గోవిందుడితో పలికారు. ఓ నారాయణ! ఓ జగత్పతీ! ఓ వాసుదేవా! ఓ హృషీకేశా! ఓ పద్మనాభా! ఓ జనార్దనా! ఓ పుండరీకాక్షా! ఓ పురుషోత్తమా! నీవు అందరికీ స్వామివి. మా యిద్దర్ని రక్షించు.

తతో నారాయణశ్చింత్య శ్రీమాన్ శ్రీవత్సలాంఛనః ।
నివార్య చక్రం ధ్వాంతం చ భక్తానుగ్రహకామ్యయా ॥142॥

అంబరీషశ్చ మద్భక్తస్తథౌ మునిసత్తమౌ ।
అనయోరస్య చ తథా హితం కార్యం మయాధునా ॥143॥

ఆహూయ తత్తమః శ్రీమాన్ గిరా ప్రహ్లాదయన్ హరిః ।
ప్రవోచ భగవాన్ విష్ణుః శృణుతాం మే ఇదం వచః ॥144॥

ఋషి శాపో న చైవాసీదన్యథా చ వరో మమ ।
దత్తో నృపాయ రక్షార్థం నాస్తి తస్యాన్యథా పునః ॥ 145॥

అంబరీషస్య పుత్రస్య నప్తుః పుత్రో మహాయశాః ।
శ్రీమాన్ దశరథో నామ రాజా భవతి ధార్మికః ॥146॥

తస్యాహమగ్రజః పుత్రో రామనామో భవామ్యహమ్ ।
తత్ర మే దక్షిణో బాహుర్భరతో నామ వై భవేత్ ॥147॥

శత్రుఘ్నో నామ సవ్యశ్చ శేషోఽసౌ లక్ష్మణః స్మృతః ।
తత్ర మాం సముపాగచ్ఛ గచ్ఛేదానీం నృపం వినా ॥148॥

మునిశ్రేష్ఠౌ చ హిత్వా త్వం ఇతి స్మాహ చ మాధవః ।
ఏవముక్తం తమో నాశం తత్క్షణాచ్చ జగామ వై ॥149॥

**నివారితం హరేశ్చక్రం యథాపూర్వమతిష్ఠత ।**

శ్రీ వత్సలాంఛనుడు, నారాయణుడు భక్తానుగ్రహకాంక్షతో అంబరీషుడు నాభక్తుడు, మునిశ్రేష్ఠులూ నా భక్తులే వారికి నేను ఇపుడు హితం చేయాలని ఆలోచించి, చక్రాన్ని, అంధకారాన్ని నివారించి, ఆ చీకటిని పిలిచి మాటలతో దానిని ప్రసన్నను చేస్తూ ఇలా పలికాడు. నా యీ మాట విను. ఈ మునుల శాపమే కాదు, నా వరదానమూ ఉంది. రాజు రక్షణకై నేను వరాన్ని ఇచ్చాను. దీనికై విపరీతం ఏమీ ఉండదు. ఈ అంబరీషుడియొక్క మనుమడు, మిక్కిలి కీర్తిమంతుడు, శ్రీమంతుడు, ధార్మికుడు అయిన దశరథుడు రాజు అవుతాడు. నేను ఆయనకు రాముడనే పేరుతో జ్యేష్ఠ పుత్రుడిగా అవతరిస్తాను. అపుడు నా కుడి భుజం భరతుడుగా జన్మిస్తుంది. ఎడమ చేయి శత్రుఘ్నుడుగా పుట్టుతుంది. శేషుడు లక్ష్మణుడువుతాడు. అపుడు నీవు నా దగ్గరకురా. రాజు అంబరీషుడిని విడిచి ఇపుడు వెళ్లు. అట్లే ఈ మునులను కూడా. ఇలా పలకగానే అంధకారం వెంటనే నశించింది. విష్ణుచక్రం కూడా నివారింపబడి యథాస్థితిని పొందింది.

**మునిశ్రేష్ఠౌ భయాన్ముక్తౌ ప్రణిపత్య జనార్దనమ్ ॥150॥**

**నిర్గతౌ శోకసంతప్తౌ ఊచతుస్తౌ పరస్పరమ్ ।**
**అద్యప్రభృతి దేహాంతమావాం కన్యాపరిగ్రహమ్ ॥ 151॥**

**న కరిష్యావ ఇత్యుక్త్వా ప్రతిజ్ఞాయ చ తావృషీ ।**
**యోగధ్యానపరౌ శుద్ధౌ యథాపూర్వం వ్యవస్థితౌ ॥152॥**

ఆ మునిశ్రేష్ఠులు భయరహితులయ్యారు. జనార్దనుడికి నమస్కరించి అక్కడనుంచి వెళ్లారు. శోకసంతప్తులైన ఆ మునులు పరస్పరం పలికారు. ఇప్పటి నుంచి మృత్యుపర్యంతం మేమిద్దరం కన్యాపరిగ్రహం (వివాహం) చెయ్యం. ఆ విధంగా వారు ప్రతిజ్ఞ చేసి పూర్వం మాదిరిగానే యోగపరాయణులై పరిశుద్ధులై నిలిచారు.

**అంబరీషశ్చ రాజాసౌ పరిపాల్య చ మేదినీమ్ ।**
**సభృత్యజ్ఞాతిసంపన్నో విష్ణులోకం జగామవై ॥153॥**

రాజు అంబరీషుడు కూడా భూమిని పరిపాలించి భృత్యులతో, దాయాది బంధువులతో కలిసి విష్ణులోకానికి వెళ్లాడు.

**మానార్థమంబరీషస్య తథైవ ముని సింహయోః ।**
**రామో దాశరథిర్భూత్వా నాత్మవేదీశ్వరోఽభవత్ ॥154॥**

విష్ణుభగవానుడుకూడా అంబరీషుడిని మన్నించడానికై, మునుల శాపాన్ని రక్షించడానికి దశరథుడి పుత్రుడు రాముడుగా పుట్టాడు. అయితే రామచంద్రుడు తన అవతారాన్ని గుర్తించలేదు.

**మునయశ్చ తథా సర్వే భృగ్వాద్యా మునిసత్తమాః ।**
**మాయా న కార్యా విద్వద్భిరిత్యాహుః ప్రేక్ష్య తం హరిమ్ ॥155॥**

భృగువు మొదలైన మునిశ్రేష్ఠులందరూ శ్రీహరిని దర్శించి విద్వాంసుల విషయంలో మాయను రచించవద్దు అని పలికారు.

**నారదః పర్వతశ్చైవ చిరం జ్ఞాత్వా విచేష్టితమ్ ।**
**మాయాం విష్ణోర్వినింద్యైవ రుద్రభక్తౌ బభూవతః ॥156॥**

నారద పర్వతులు తమ వికృతచేష్టను చాలాకాలానికి తెలిసి, అట్లే విష్ణువు చేసిన మాయను నిందించి శివభక్తులయ్యారు.

**ఏతద్ధి కథితం సర్వం మయా యుష్మాకమద్య వై ।**
**అంబరీషస్య మాహాత్మ్యం మాయావిత్వం చ వై హరేః ॥157॥**

**యః పఠేచ్ఛృణుయాద్వాపి శ్రావయేద్వాపి మానవః ।**
**మాయాం విసృజ్య పుణ్యాత్మా రుద్రలోకం స గచ్ఛతి ॥158॥**

**ఇదం పవిత్రం పరమం పుణ్యం వేదైరుదీరితమ్ ।**
**సాయం ప్రాతః పఠేన్నిత్యం విష్ణోః సాయుజ్యమాప్నుయాత్ ॥159॥**

ఓ మునులారా! అంబరీషుడి మాహాత్మ్యం, అట్లే శ్రీహరి మాయావి అయిన విధం నేను మీ అందరికి చెప్పాను. ఏ మానువుడు దీన్ని పఠిస్తాడో, వింటాడో, ఇతరులకు విన్పిస్తాడో వాడు విశుద్ధమానసుడై మాయను త్యజించి రుద్రలోకానికి వెళ్తాడు. వేదాల ద్వారా చెప్పబడిన ఈ పరమపవిత్రమైన, పుణ్యప్రదమైన కథను ప్రతిదినం ఉదయం మరియు సాయంకాలంలో పఠించిన వారు విష్ణుసాయుజ్యాన్ని పొందుతారు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే శ్రీమత్యాఖానం నామ పంచమోఽధ్యాయః ॥5॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని శ్రీమత్యాఖానం అనే అయిదవ అధ్యాయం సమాప్తం.



## షష్ఠోఽధ్యాయః – ఆరవ అధ్యాయం
## అలక్ష్మీవ్రతమ్ – అలక్ష్మీవ్రతం

**ఋషయ ఊచుః –** ఋషులు పలికారు.

**మాయావిత్వం శ్రుతం విష్ణోర్దేవ దేవస్య ధీమతః ।**
**కథం జ్యేష్ఠా సముత్పత్తిర్దేవదేవాజ్జనార్దనాత్ ॥1॥**

**వక్తుమర్హసి చాస్మాకం రోమహర్షణ తత్త్వతః ।**

దేవాధిదేవుడు, ధీమంతుడైన విష్ణువు మాయావి అయిన విషయం మేము విన్నాం. ఓ రోమహర్షణా! ఇపుడు మాకు నీవు యథార్థరూపంగా దేవదేవుడు జనార్దనుడు జ్యేష్ఠాదేవిని (అలక్ష్మి) ఏవిధంగా ఉత్పన్నం చేశాడో చెప్పవలసింది.

**సూత ఉవాచ –** సూతర్షి పలికాడు.

**అనాదినిధనః శ్రీమాన్ ధాతా నారాయణః ప్రభుః ॥2॥**

**జగద్ద్వైధమిదం చక్రే మోహనాయ జగత్పతిః ।**
**విష్ణుర్వై బ్రాహ్మణాన్వేదాన్వేదధర్మాన్ సనాతనాన్ ॥3॥**

**శ్రియం పద్మాం తథా శ్రేష్ఠాం భాగమేకమకారయత్ ।**
**జ్యేష్ఠామలక్ష్మీమశుభాం వేదబాహ్యాన్నరాధమాన్ ॥ 4॥**

**అధర్మం చ మహాతేజా భాగమేకమకల్పయత్ ।**

ఆద్యంతరహితుడు, ఐశ్వర్యశాలి, ప్రభుతాసంపన్నుడు అట్లే జగత్తుకు స్వామి, నారాయణుడైన విష్ణువు ప్రాణుల్ని వ్యామోహంలో ముంచడానికై ఈ జగత్తును రెండు విధాలుగా నిర్మించాడు. మహాతేజస్వి అయిన ఆ విష్ణువు బ్రాహ్మణుల్ని, వేదాల్ని, సనాతనవైదికధర్మాల్ని, శ్రీని, శ్రేష్ఠ అయిన 'పద్మ'ను ఉత్పన్నం చేసి ఒక భాగంగా ఉంచాడు. అశుభం, జ్యేష్ఠ, అలక్ష్మి, వేదవిరోధులైన అధమమానవులు, మరియు అధర్మాన్ని ఉత్పన్నం చేసి రెండో భాగంగా నిలిపాడు.

**అలక్ష్మీమగ్రతః సృష్ట్వా పశ్చాత్పద్మాం జనార్దనః ॥5॥**

**జ్యేష్ఠా తేన సమాఖ్యాతా అలక్ష్మీర్ద్విజసత్తమాః ।**
**అమృతోద్భవవేళాయాం విషానంతరముల్బణామ్ ॥6॥**
**అశుభా సా తథోత్పన్నా జ్యేష్ఠా ఇతి చ వై శ్రుతమ్ ।**
**తతః శ్రీశ్చ సముత్పన్నా పద్మా విష్ణుపరిగ్రహః ॥7॥**

ఓ ద్విజశ్రేష్ఠులారా! జనార్దనభగవానుడు ముందుగా అలక్ష్మిని సృజించి అనంతరం పద్మను, లక్ష్మిని సృజించాడు. ఈ విధంగా అలక్ష్మి జేష్ఠాదేవిగా చెప్పబడింది. అమృతం ఉత్పన్నసమయంలో మహాభయంకరమైన

విషం నివారింపబడిన తర్వాత ముందుగా ఈ జ్యేష్ఠ అశుభమైన అలక్ష్మి ఉత్పన్నం అయ్యిందని విన్నాం. అనంతరం విష్ణుపత్ని లక్ష్మీదేవి పద్మ ఆవిర్భవించింది.

**దుస్సహో నామ విప్రర్షిరుపయేమేఽశుభాం తదా ।**
**జ్యేష్ఠాం తాం పరిపూర్ణోఽసౌ మనసా వీక్ష్య ధిష్ఠితామ్ ॥8॥**
**లోకం చచార హృష్టాత్మా తయా సహ మునిస్తదా ।**
**యస్మిన్ ఘోషో హరేశ్చైవ హరస్య చ మహాత్మనః ॥9॥**
**వేదఘోషస్తథా విప్రా హోమధూమస్తథైవ చ ।**
**భస్మాంగినో వా యత్రా సంస్తత్ర తత్ర భయార్దితా ॥10॥**
**పిధాయ కర్ణౌ సంయాతి ధావమానా ఇతస్తతః ।**
**జ్యేష్ఠామేవంవిధాం దృష్ట్వా దుఃసహో మోహమాగతః ॥11॥**

అపుడు అనగా లక్ష్మీదేవి వివాహానికన్నా ముందు దుస్సహుడనే విప్రఋషి ఈ అశుభ జ్యేష్ఠాదేవిని వివాహమాడినాడు. అతడిచే పరిగృహీత అయి తనకు పూర్ణత్వం సిద్ధించిందని భావించింది. అప్పుడాముని ప్రసన్నచిత్తుడై ఆమెతో కలిసి లోకాలలో విశేషంగా చరించదొడగాడు. ఓ విప్రులారా! ఏ ప్రదేశంలో విష్ణునామం, శివనామం అట్లే వేదధ్వని ఘోషిస్తుందో, హవనంయొక్క పొగ ప్రసరిస్తుందో, భస్మధారుడైన మనుష్యులు ఎక్కడ ఉంటారో, అక్కడ భయాతుర అయి రెండు చెవులు మూసుకుని అలక్ష్మి అటు ఇటూ తిరుగుతుంది. జ్యేష్ఠయొక్క ఈ విధమైన స్వభావాన్ని చూచి దుస్సహముని ఉద్విగ్నుడయ్యాడు.

**తయా సహ వనం గత్వా చచార స మహామునిః ।**
**తపో మహద్వనే ఘోరే యాతి కన్యా ప్రతిగ్రహమ్ ॥12॥**
**న కరిష్యామి చేత్యుక్త్వా ప్రతిజ్ఞాయ చ తామృషిః ।**
**యోగజ్ఞానపరః శుద్ధో యత్ర యోగీశ్వరో మునిః ॥13॥**
**తత్రాయాంతం మహాత్మానం మార్కండేయమపశ్యత ।**
**ప్రణిపత్య మహాత్మానం దుఃసహో మునిమబ్రవీత్ ॥14॥**
**భార్యేయం భగవాన్ మహ్యం న స్థాస్యతి కంథం చ ।**
**కిం కరోమీతి విప్రర్షే హ్యనయా సహ భార్యయా ॥15॥**
**ప్రవిశామి తథా కుత్ర కుతో న ప్రవిశామ్యహమ్ ।**

తర్వాత ఆ మహాముని ఆమెతో కలిసి ఘోరమైన అరణ్యానికి వెళ్లి కఠోరమైన తపస్సు చేశాడు. ఆమె తపస్సు చేయక తిరుగుతున్నది. ఇక ఆమెను స్వీకరించనని పలికి మరియు ప్రతిజ్ఞ చేసి ఆ ఋషి యోగపరాయణుడయ్యాడు. ఆ సమయంలో విశుద్ధాత్ముడు, యోగీశ్వరుడు అయిన ఆ ముని అక్కడకే వస్తున్న మార్కండేయమునిని చూశాడు. మహాత్ముడైన ఆమునికి నమస్కరించి దుస్సహముని ఇలా అన్నాడు. ఓ భగవానుడా! నా యీ భార్య నా దగ్గర ఉండడంలేదు. ఓ విప్రర్షీ! నేను ఏమి చేయాలి? ఈ భార్యతో కలిసి ఎక్కడకు వెళ్లమంటావు. అట్లే ఎక్కడకు వెళ్లకుండా ఉండమంటావు.

**మార్కండేయ ఉవాచ –** మార్కండేయుడు పలికాడు.

**శృణు దుఃసహ సర్వత్ర అకీర్తిరశుభాన్వితా ॥16॥**

**అలక్ష్మీరతులా చేయం జ్యేష్ఠా ఇత్యభిశబ్దితా ।**

ఓ దుస్సహా! విను! అకీర్తి ఎల్లప్పుడూ అశుభంతో కూడి ఉంటున్నది. అక్కడ సాటిలేని ఈ అలక్ష్మి "జ్యేష్ఠ" పేరుతో పిలవబడుతున్నది.

**నారాయణపరా యత్ర వేదమార్గానుసారిణః ॥17॥**

**రుద్రభక్తా మహాత్మానో భస్మోద్ధూళితవిగ్రహాః ।**
**స్థితాః యత్ర జనా నిత్యం మా విశేథాః కథంచన ॥18॥**

**నారాయణహృషీకేశ పుండరీకాక్ష మాధవ ।**
**అత్యుతానంత గోవింద వాసుదేవ జనార్దన ॥19॥**

**రుద్ర రుద్రేతి రుద్రేతి శివాయ చ నమో నమః ।**
**నమః శివాయేతి శంకరాయేతి సర్వదా ॥ 20॥**

**మహాదేవ మహాదేవ మహాదేవేతి కీర్తయేత్ ।**
**ఉమాయాః పతయే చైవ హిరణ్యపతయే సదా ॥21॥**
**హిరణ్యబాహవే తుభ్యం వృషాంకాయ నమో నమః ।**
**నృసింహ వామనాచింత్య మాధవేతి చ యే జనాః ॥22॥**
**వక్ష్యంతి సతతం హృష్టా బ్రాహ్మణాః క్షత్రియాస్తథా ।**
**వైశ్యాః శూద్రాశ్చ యే నిత్యం తేషాం ధనగృహాదిషు ।**
**ఆరామే చైవ గోష్ఠేషు న విశేథాః కథంచన ॥23॥**
**జ్వాలామాలాకరాలం చ సహస్రాదిత్యసన్నిభం ।**
**చక్రం విష్ణోరతీవోగ్రం తేషాం హంతి సదాశుభమ్ ॥24॥**

విష్ణుభక్తులు, వేదమార్గాన్ని అనుసరించేవాళ్లు, శివభక్తులు, మహాత్మగణాలు, భస్మానులిప్తశరీరులు ఎక్కడ నివసిస్తారో అక్కడకు నీవు ఎప్పుడు వెళ్లవద్దు. ఓ నారాయణా! ఓ హృషీకేశా! ఓ పుండరీకాక్షా! ఓ మాధవా! ఓ అచ్యుతానంత! ఓ గోవిందా! ఓ వాసుదేవా! ఓ జనార్ధనా! ఓ రుద్రా! ఓ రుద్రా! ఓ రుద్రా! శివుడికి మాటిమాటికి నమస్కారం, శివతరుడికి నమస్కారం, శంకరుడికి ఎల్లప్పుడూ నమస్కారం, ఓ మహాదేవా! ఓ మహాదేవా! ఓ మహాదేవా! ఈ విధంగా పలుకుతూ ఉంటారో, నీవు ఉమాపతివి హిరణ్యపతివి, హిరణ్యబాహువవు–, వృషాంకుడివి ఎల్లప్పుడు మాటిమాటికి నీకు నమస్కారం, ఓ నృసింహా! ఓ వామన! ఓ అచింత్య! ఓ మాధవా! ఈ విధంగా బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, మరియు శూద్రులు ప్రసన్నులై నిత్యం పిలుస్తూ ఉంటారో అక్కడకు, ధనసంపద గృహాలకు, ఉద్యానవనాలకు, అట్లే గోశాలలకు నీవు వెళ్లరాదు. ఎందుకంటే వికరలాగ్ని జ్వాలలకు, వేయి సూర్యులకు సమానమైన తేజోమయమైన, అత్యంతమూ ఉగ్రమైన విష్ణుచక్రం వారి అందరియొక్క అమంగళాల్ని నశింపజేస్తున్నది.

**స్వాహాకారో వషట్కారో గృహే యస్మిన్ హి వర్తతే ।**
**తద్ధిత్వా చాన్యమాగచ్ఛ సామఘోషోఽథ యత్ర వా ॥25॥**

**వేదాభ్యాసరతా నిత్యం నిత్యకర్మపరాయణాః ।**
**వాసుదేవార్చనరతా దూరతస్తాన్ విసర్జయేత్ ॥26॥**

ఏ యింటిలో స్వాహాకారాలు వషట్కారాలు విన్పిస్తున్నవో, ఎక్కడ సామవేదధ్వని విన్పిస్తున్నదో వాటిని విడిచి వేరే చోటకు వెళ్ళండి. ఏ మానవులు నిత్యం వేదాభ్యాసంలో సంలగ్నులు అయి ఉంటారో, నిత్యకర్మలయందు తత్పరత్వం కలిగి ఉంటారో అట్లే వాసుదేవ పూజారతి కలిగి ఉంటారో వారిని వదలి దూరంగా ఉండాలి.

**అగ్నిహోత్రం గృహే యేషాం లింగార్చా వా గృహేషు చ ।**
**వాసుదేవతనుర్వాపి చండికా యత్ర తిష్ఠతి ॥27॥**

**దూరతో వ్రజ తాన్ హిత్వా సర్వపాపవివర్జితాన్ ।**
**నిత్యనైమిత్తికైర్యజ్ఞైర్యజంతి చ మహేశ్వరమ్ ॥28॥**

**తాన్ హిత్వా వ్రజ చాన్యత్ర దుఃసహ త్వం సహానయా ।**
**శ్రోత్రియా బ్రాహ్మణా గావో గురవోఽతిథయః సదా ॥29॥**

ఎవరి యింటిలో అగ్నిహోత్రం మరియు శివలింగార్చనం జరుగుతున్నదో, ఎవరి యింటిలో వాసుదేవుడి యొక్క, భగవతి చండికయొక్క మూర్తులు విరాజమానాలై ఉంటాయో సమస్తపాపరహితులైన వారిని విడిచి దూరంగా వెళ్ళాలి. ఓ దుస్సహా! ఎవరు నిత్యంగా అట్లే నైమిత్తికంగా చేసే యజ్ఞాలద్వారా మహేశ్వరుడి ఆరాధన చేస్తారో వాళ్లను విడిచి ఆమెతో కలిసి నీవు వేరే చోటుకు వెళ్లాలి. ఎవరు వైదికుల్ని, బ్రాహ్మణుల్ని, గోవుల్ని, గురువుల్ని అతిథుల్ని, అట్లే రుద్రభక్తుల్ని నిత్యం పూజిస్తున్నారో వారి దగ్గరకు వెళ్లవద్దు.

**దుఃసహ ఉవాచ –** దస్సహుడు పలికాడు.

**యస్మిన్ ప్రవేశో యోగ్యో మే తద్బ్రూహి మునిసత్తమ ॥30॥**

**త్వద్వాక్యాద్భయనిర్ముక్తో విశామ్యేషాం గృహే సదా ।**

ఓ మునిశ్రేష్ఠా! ఏయే స్థానాలలో నా ప్రవేశం యోగ్యమో చెప్పు. ఇందుకై మీమాట మీదుగా నిర్భయంగా ఆయా గృహాలకు ఎల్లప్పుడూ వెళతాను.

**మార్కండేయ ఉవాచ –** మార్కండేయుడు పలికాడు.

**నశ్రోత్రియా ద్విజా గావో గురవోఽతిథయః సదా ।**
**యత్ర భర్తాచ భార్యా చ పరస్పరవిరోధినౌ ॥31॥**

**స భార్యస్త్వం గృహం తస్య విశేథా భయవర్జితః ।**
**దేవదేవో మహాదేవో రుద్రస్త్రిభువనేశ్వరః ॥32॥**

**వినింద్యో యత్ర భగవాన్ విశస్వ భయవర్జితః ।**

ఎవరి ఇంటిలో వైదికులు,ద్విజులు,గోవులు,అట్లే అతిథులు పూజింపబడరో, మరియు ఏ యింటిలో భార్యాభర్తలు పరస్పరం విరోధించి ఉంటారో, వారి యిళ్లకు నిర్భయంగా నీ భార్యతో కలిసివెళ్లు. ఎక్కడ దేవాధిదేవుడు, మహాదేవుడు, త్రిభువనాలకు ప్రభువు అయిన శివభగవానుడి నింద జరుగుతున్నదో అక్కడకు నీవు భయరహితుడవై వెళ్లు.

**వాసుదేవరతిర్నాస్తి యత్ర నాస్తి సదాశివః ॥33॥**

**జపహోమాదికం నాస్తి భస్మనాస్తి గృహే నృణామ్ ।**
**పర్వణ్యభ్యర్చనం నాస్తి చతుర్దశ్యాం విశేషతః ॥34॥**

**కృష్ణాష్టమ్యాం చ రుద్రస్య సంధ్యాయాం భస్మవర్జితాః ।**
**చతుర్దశ్యాం మహాదేవం న యజంతి చ యత్ర వై ॥35॥**

**విష్ణోర్నామవిహీనా యే సంగతాశ్చ దురాత్మభిః ।**
**నమః కృష్ణాయ శర్వాయ శివాయ పరమేష్ఠినే ॥36॥**

**బ్రాహ్మణాశ్చ నరా మూఢా న వదంతి దురాత్మకాః ।**
**తత్రైవ సతతం వత్స సభార్యస్త్వం సమావిశ ॥37॥**

ఎవరు భగవానుడు వాసుదేవుడిపై భక్తి కలిగి ఉండరో, సదాశివుడిని ఎవరు స్థాపించరో, ఎవరి గృహాలలో జపం, హోమం మొదలైనవి నిర్వహింపబడవో, భస్మధారణ జరగదో, పర్వదినాలలో విశేషంగా చతుర్దశి అట్లే కృష్ణాష్టమి తిథులలో రుద్రపూజ జరగదో, సంధ్యోపాసనసమయంలో భస్మధారణ జరగదో, ఎక్కడ జనులు చతుర్దశినాడు మహాదేవుడియొక్క యజనం చేయరో, సంకీర్తనంలో విష్ణువు పేరు చేర్చరో, ఎక్కడ జనం దుష్టాత్ములైన పురుషులతో కలిసి ఉంటారో, ఎక్కడ బ్రాహ్మణులు అట్లే వికృతమనస్కులైన మనుష్యులు "కృష్ణుడికి నమస్కారం, పరమేష్ఠి అయిన శర్వుడికి నమస్కారం"-అని పలకరో అక్కడ వారి దగ్గర నీవు నీ భార్యతో కలిసి ఉండు.

**వేదఘోషో న యత్రాస్తి గురు పూజోదయో న చ ।**
**పితృకర్మ విహీనాంస్తు స భార్యస్త్వం సమావిశ ॥38॥**

**రాత్రౌ రాత్రౌ గృహే యస్మిన్ కలహో వర్తతే మిథః ।**
**అనయా సార్ధమనిశం విశ త్వం భయవర్జితః ॥39॥**

ఎక్కడ వేద ఘోష, గురుపూజ మొదలైనవి ఉండవో, ఎక్కడ పితృకార్యాలు శ్రాద్ధకర్మాదులు జరగవో అక్కడ నీ భార్యతో నివసించు.

**లింగార్చనం యస్య నాస్తి యస్య నాస్తి జపాదికమ్ ।**
**రుద్రభక్తిర్వినిందా చ తత్రైవ విశ నిర్భయః ॥40॥**

**అతిథిః శ్రోత్రియో వాపి గురుర్వా వైష్ణవోఽపి వా ।**
**న సంతియద్గృహే గావః స భార్యస్త్వం సమావిశ ॥41**

ఎవడు శివలింగపూజ చేయడో అక్కడ, ఎవడు జపం మున్నగునవి చేయడో అక్కడ, ఎక్కడ రుద్రభక్తి నిందింపబడుతుందో అక్కడ నీవు నిర్భయంగా ప్రవేశించు. ఏ గృహంలో అతిథులు శ్రోత్రియులు, గురువులు, విష్ణుభక్తులు, గోవులు ఉండవో అక్కడ నీవు నీ భార్యతో నివసించు.

**బాలానాం ప్రేక్షమాణానాం యత్రాదత్త్వా త్వభక్షయన్ ।**
**భక్ష్యాణి తత్ర సంహృష్టః సభార్యస్త్వం సమావిశ ॥ 42॥**

**అనభ్యర్చ్య మహాదేవం వాసుదేవమథాపి వా ।**
**అహుత్వా విధివద్యత్ర తత్ర నిత్యం సమావిశ ॥43॥**

**పాపకర్మరతా మూఢా దయాహీనాః పరస్పరమ్ ।**
**గృహే యస్మిన్ సమాసంతే దేశే వా తత్ర సంవిశ ॥44॥**

**ప్రాకారాగారవిధ్వంసా న చైవేద్యా కుటుంబినీ ।**
**తద్గృహం తు సమాసాద్య వస నిత్యం హి హృష్టధీః ॥45॥**

బాలకులు చూస్తుండగా వారికి పెట్టకుండా భక్ష్యపదార్థాల్ని ఎవరు తింటారో అక్కడ నీవు సంతోషంగా నీ భార్యతో ప్రవేశించు. శివభగవానుడియొక్కగాని విష్ణువుయొక్కగాని పూజ చేయకుండా, విధిపూర్వకంగా హవనం చేయకుండా ప్రజలు ఎక్కడ ఉంటారో అక్కడ నీవు ఎల్లప్పుడూ నివసించు. ఏ యింటిలో ఏ దేశంలో పాపకార్యాల విషయంలో సంలగ్నమైన మూర్ఖప్రజలు, దయనీయజనులు ఉంటారో అక్కడ నీవు ప్రవేశించు. కుటుంబిని ప్రాకార, ఆగార విధ్వంస అయితే, మాన మర్యాదల్ని భంగపర్చినది అయితే, దుఃఖశీలతకు కారకురాలు అయి ఏ విధంగాను ప్రసన్నత లేనిదయినచో ఆ గృహంలో నీవు ఎల్లప్పుడూ నివాసముండు.

**యత్ర కంటకినో వృక్షా యత్ర నిష్పావవల్లరీ ।**
**బ్రహ్మవృక్షశ్చ యత్రాస్తి సభార్యస్త్వం సమావిశ ॥46॥**

**అగస్త్యార్కాదయో వాపి బంధుజీవో గృహేషు వై ।**
**కరవీరో విశేషేణ నంద్యావర్తమథాపి వా ॥47॥**

**మల్లికా వా గృహే యేషాం స భార్యస్త్వం సమావిశ ।**
**కన్యా చ యత్ర వై వల్లీ ద్రోహీ వా చ జటీ గృహే ॥48॥**

**బహులా కదలీ యత్ర సభార్యస్త్వం సమావేశ।**
**తాలం తమాలం భల్లాతం తిత్తిడీ ఖండమేవ చ॥ 49**

**కదంబః ఖాదిరం వాపి స భార్యస్త్వం సమావిశ ।**
**న్యగ్రోధం వా గృహే యేషామశ్వత్థం చూతమేవ వా ॥50॥**

**ఉదుంబరం వా పనసం సభార్యస్త్వం సమావిశ ।**
**యస్య కాకగృహం నింబే ఆరామే వా గృహేఽపి వా ॥51॥**

**దండినీ ముండినీ వాపి సభార్యస్త్వం సమావిశ ।**

ముళ్లవృక్షాలు ఉన్నచోట పవట అనే పేరుగల తీగలు ఉన్నచోట, పలాశవృక్షమున్నచోట నీ పత్నితో నివాసముండు. ఏ యింటిలో అగస్త్యవృక్షాలు (వక), జిల్లేడు మొదలైన పాలవృక్షాలు, బంధుజీవవృక్షాలు, కరవీర వృక్షాలు, తగరవృక్షాలు, మల్లికావృక్షాలు– ఉంటాయో ఆ యింటిలోకి నీవు సపత్నీకంగా ప్రవేశించు. కన్య, వల్లి, ద్రోహి, చటి, నల్ల, అరటి వృక్షాలు ఉంటాయో అందులోనికి సపత్నీకంగా ప్రవేశించు. తాళ, తమాల భల్లాతవృక్షాలు, ఇమలి, కదంబాలు, మరియు ఖైరకవృక్షాలు ఉంటాయో అక్కడకు నీవు నీ భార్యతో వెళ్లు. న్యగ్రోధం, అశ్వత్థం, మామిడి, ఉదుంబరం మరియు పనసవృక్షాలు ఏ యింటిలో ఉంటాయో అక్కడ నీ భార్యతో కలిసి నివసించు. గృహంలోగాని, ఆరామంలోగాని ఉన్న వేపచెట్టులో 'కాకి' గూడు పెట్టితే, మరియు ఆ యింటిలో దండధారిణి అట్లే కపాలధారిణి అయిన స్త్రీ ఉంటే అక్కడ నీవు నీ భార్యతో నివసించు.

**ఏకా దాసీ గృహే యత్ర త్రిగవం పంచమాహిషమ్ ॥52॥**

**షడశ్వం సప్తమాతంగం సభార్యస్త్వం సమావిశ ।**
**యస్య కాళీ గృహే దేవీ ప్రేతరూపా చ డాకినీ ॥53॥**

**క్షేత్రపాలోఽథవా యత్ర సభార్యస్త్వం సమావిశ ।**
**భిక్షుబింబం చ వై యస్య గృహే క్షపణకం తథా ॥54॥**

**బౌద్ధం వా బింబమాసాద్య తత్రపూర్ణం సమావిశ ।**
**శయనాసనకాలేషు భోజనాటన వృత్తిషు ॥55॥**

**యేషాం వదతి నో వాణీ నామాని చ హరేః సదా ।**
**తద్గృహం తే సమాఖ్యాతం సభార్యస్య నివేశితుమ్ ॥56॥**

ఏ యింటిలో ఒకే దాసి,మూడు ఆవులు, అయిదు మహిషాలు,ఆరు గుఱ్ఱాలు, ఏడు ఏనుగులుఉంటాయో నీవు ఆ యింటిలోనికి నీ భార్యతో ప్రవేశించు.ఏ యింటిలో ప్రేతరూప,అట్లే డాకిని మరియు కాళికయొక్క ప్రతిమలు స్థాపితమై ఉన్నవో, ఎక్కడ భైరవమూర్తి ఉంటుందో అక్కడకు నీవు నీ పత్నితో వెళ్లు. భిక్షుబింబంగాని, క్షపణకుడు లేక బుద్ధుడి బింబంగాని ఉన్న యింటిలో స్వేచ్ఛగా నివసించు. నిద్రలోను, కూర్చున్నప్పుడు, భోజనం చేసేటప్పుడు అటు ఇటూ తిరిగే సమయంలో ఎవరి నాలుక శ్రీహరిని ఉచ్చరించదో వారి యింటిలో నీవు నివాసం ఉండు.

**పాషండాచారనిరతాః శ్రౌతస్మార్తబహిష్కృతాః ।**
**విష్ణుభక్తివినిర్ముక్తా మహాదేవవినిందకాః ॥57॥**

**నాస్తికాశ్చ శఠా యత్ర సభార్యస్త్వం సమావిశ ।**
**సర్వస్మాదధికత్వం యే న వదంతి పినాకినః ॥58॥**

**సాధారణం స్మరేత్యేనం సభార్యస్త్వం సమావిశ ।**

పాషండాచారనిరతులు, శ్రుతిస్మార్తాల విషయంలో విముఖులు, విష్ణుభక్తివిరహితులు మహాదేవశివుడిని నిందిచేవారు, నాస్తికులు, శఠులు-వీరి ఇళ్లలో సభార్యుడవై నివసించు. పినాకి అయిన శివభగవానుడిని అందరికన్నా అధికుడని ఎవరు చెప్పడంలేదో, ఆయన్ని సాధారణదైవంగా ఎవరు భావిస్తున్నారో వారి గృహాలలో నీవు సపత్నీకంగా నివసించు.

**బ్రహ్మా చ భగవాన్ విష్ణుః శక్రః సర్వసురేశ్వరః ॥59॥**

**రుద్రప్రసాదజాశ్చేతి న వదంతి దురాత్మకాః ।**
**బ్రహ్మాచ భగవాన్ విష్ణుః శక్రః సమ ఏవ చ ॥60॥**

**వదంతి మూఢాః ఖద్యోతం భానుం వా మూఢచేతసః ।**
**తేషాం గృహేఽ తథా క్షేత్రే ఆవాసే వా సదానయా ॥61॥**

**విశ భుంక్ష్వ గృహం తేషాం అపి పూర్ణమనన్యధీః ।**

దురాత్ములైన ప్రజలు ఎవరు, బ్రహ్మ, భగవాన్ విష్ణువు, దేవతలందరికీ స్వామి అయిన ఇంద్రుడు-వీరు రుద్రుడి అనుగ్రహం వల్ల ఆవిర్భవించారు అని చెప్పరో, మరియు బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు - వీరు శివుడితో సమానులని చెబుతున్నారో, ఏ మూఢులు, అట్లే అజ్ఞానులైన ప్రజలు సూర్యుడిని ఖద్యోతంగా చెబుతున్నారో - వారి గృహాలలో, క్షేత్రాలలో, అట్లే ఆవాసాలలో నీవు ఎల్లప్పుడూ నీ భార్యతో కాపురముండు. సంపూర్ణంగా సాటిలేని వృద్ధిని పొంది ఆ గృహాలతో భోగించు.

**యేఽ శ్నంతి కేవలం మూఢాః పక్వమన్నం విచేతసః ॥62॥**

**స్నానమంగళహీనాశ్చ తేషాం త్వం గృహమావిశ ।**
**యా నారీ శౌచవిభ్రష్టా దేహసంస్కారవర్జితా ॥63॥**

**సర్వభక్షరతా నిత్యం తస్యాః స్థానే సమావిశ ।**

వండిన అన్నాన్ని కేవలం వాళ్లే తినే మూర్ఖులు, అజ్ఞానులైన జనులు, స్నానాదులైన మంగళకార్యాల్ని చేయనివారు నివసించే గృహాలలో నీవు ప్రవేశించు. ఏ స్త్రీ శుచి మున్నగు ఆచారాల్ని పాటించదో, దేహశుద్ధి కలిగి యుండదో, తినదగిన తినరాని పదార్థాల్ని తినడంలో తత్పరురాలు అవుతున్నదో ఆ స్త్రీ గృహంలో నీవు నిత్యం నివాసముండు.

**మలినాస్యాః స్వయం మర్త్యా మలినాంబరధారిణః ॥64॥**

**మలదంతా గృహస్థాశ్చ గృహం తేషాం సమావిశ ।**
**పాదశౌచ వినిర్ముక్తాః సంధ్యాకాలే చ శాయినః ॥65॥**

**సంధ్యాయామశ్నుతే యే వై గృహం తేషాం సమావిశ ।**
**అత్యాశనరతా మర్త్యా అతిపానరతా నరాః ॥66॥**

**ద్యూతవాదక్రియా మూఢాః గృహం తేషాం సమావిశ ।**

ఏ గృహస్థులైన మానవులు మలినముఖులో, మలినవస్త్రధారులో, మలినదంతధారులో వారి ఇళ్లలో నీవు ప్రవేశించు. ఎవరు తమ పాదాల్ని పరిశుభ్రంగా ఉంచుకోరో, సంధ్యాకాలంలో పడుకుంటారో, అట్లే సంధ్యా సమయంలో భోజనం తింటారో వారి ఇళ్లలో నీవు నివసించు. ఎవరు తిండిబోతులో, ఎవరు త్రాగుబోతులో, ఎవరు జూదం, వాదులాటక్రియలలో తత్పరతగల మూఢులై ఉంటారో వారి ఇళ్లలో నీవు ప్రవేశించు.

**బ్రహ్మస్వహారిణో యే చాయోగ్యాంశ్చైవ యజంతి వా ॥67॥**

**శూద్రాన్నభోజినో వాసి గృహం తేషాం సమావిశ ।**
**మద్యపానరతాః పాపా మాంసభక్షణతత్పరాః ॥68॥**

**పరదారరతా మర్త్యా గృహం తేషాం సమావిశ ।**

ఎవరు బ్రాహ్మణుల ధనాన్ని అపహరిస్తారో, ఎవరు అయోగ్యుల్ని పూజిస్తారో, ఎవరు శూద్రుల అన్నం తింటారో వారి ఇళ్లకు నీవు వెళ్లు. ఏ జనులు మద్యపానరతులో, పాపపరాయణులో, ప్రియమాంసభక్షణులో, ఇతరుల భార్యల విషయమై ఆసక్తి కలిగి ఉంటారో వారి యిళ్లలో నీవు నివసించు.

**పర్వణ్యనర్చాభిరతా మైథునే వా దివా రతాః ॥69॥**

**సంధ్యాయాం మైథునం యేషాం గృహం తేషాం సమావిశ ।**
**పృష్ఠతో మైథునం యేషాం శ్వానవత్ మృగవచ్చ వా ॥70॥**

**జలే వా మైథునం కుర్యాత్సభార్యస్త్వం సమావిశ ।**
**రజస్వలాం స్త్రియం గచ్ఛేచ్చాండాలీం వా నరాధమః ॥71॥**

**కన్యాం వా గోగృహేవాపి గృహం తేషాం సమావిశ ।**
**బహునా కిం ప్రలాపేన నిత్యకర్మబహిష్కృతాః ॥72॥**

**రుద్రభక్తివిహీనా యే గృహం తేషాం సమావిశ ।**
**శృంగైర్ద్విర్వ్యోషధైః క్షుద్రైః శేఫ ఆలిప్య గచ్ఛతి ॥73॥**

**భగద్రావం కరోత్యస్మాత్సభార్యస్త్వం సమావిశ ।**

ఎవరు పర్వదినాలో భగవంతుడి పూజలో సంలగ్నులు కారో, ఎవరు పగటిపూట అందులోనూ సంధ్యాసమయంలో మిథునక్రీడలో మునుగుతారో వారి ఇళ్లలో నీవు నివసించు, ఎవరు కుక్కమాదిరి, జంతువుమాదిరి వెనుకభాగంలో రతి సలుపుతారో, నీటిలో రతిక్రీడసాగిస్తారో వారి గృహాలలో సపత్నీకుడవై వసించు. రజస్వల అయిన స్త్రీతో, అట్లే కన్యతో (రజస్వలకాని స్త్రీ) గోశాలలో సంభోగించే నరాధముడి ఇంటిలో నివసించు. ఎక్కువగా చెప్పి ప్రయోజనమేముంది? ఎవరు నిత్యకర్మలో వైముఖ్యం కలిగి ఉంటారో, శివభక్తులు కారో వారి ఇళ్లలో

ప్రవేశించు. ఎవడు కృత్రిమసాధానాలు కలిగి (కృత్రిమ లింగం మరియు దానిపై పూసే మందులు) స్త్రీ దగ్గరికి వెళ్లి సంభోగిస్తాడో ఆతడి ఇంటిలో నీవు నివసించు.

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**ఇత్యుక్త్వా స మునిః శ్రీమాన్నిర్మార్జ్య నయనే తదా ॥74॥**

**బ్రహ్మర్షిర్బ్రహ్మ సంకాశస్తత్రైవాంతర్ధిమాతానోత్ ।**
**దుఃసహశ్చ తథోక్తాని స్థానాని చ సమీయివాన్ ॥75॥**

**విశేషాద్దేవదేవస్య విష్ణోర్నిందారతాత్మనామ్ ।**
**సభార్యో మునిశార్దూలః సైషా జ్యేష్ఠా ఇతి స్మృతా ॥76॥**

ఈ విధంగా పలికి ఐశ్వర్యశాలి, బ్రహ్మతుల్యుడు, బ్రహ్మర్షి అయిన మార్కండేయుడు తన నేత్రాల్ని కడిగి, మూసుకుని అక్కడే అంతర్ధానం చెందాడు. తర్వాత ఆ మునిచేత చెప్పబడిన స్థానాల్ని దుస్సహముని గుర్తించి దేవులకే దేవుడైన విష్ణువును నిందించే వారి గృహాలకై తన భార్యతో కదిలాడు. ఆమే జ్యేష్ఠాదేవి.

**దుఃసహస్తామువాచేదం తడాగాశ్రమమంతరే ।**
**ఆస్వ త్వమత్ర చాహం వై ప్రవేశ్యామి రసాతలమ్ ॥77॥**
**ఆవయోః స్థానమాలోక్య నివాసార్థం తపః పునః ।**
**ఆగమిష్యామి తే పార్శ్వమిత్యుక్తా తమువాచ సా ॥ 78॥**

**కిమశ్నాతి మహాభాగ కో మే దాస్యతి వై బలిమ్ ।**

దుస్సహుడు ఆమెతో ఇలా పలికాడు. నీవు ఈ చెరువు ఒడ్డున గల ఈ ఆశ్రమంలో ఉండు. నేను పాతాళానికి వెళతాను. మనమిద్దరం నివసించడానికి యోగ్యమైన స్థానాన్ని చూచి నేను మరల నీ దగ్గరకు వస్తాను. ఈ విధంగా అముని చెప్పగానే ఆమె ఇలా ఆయనతో పలికింది. ఓ మహాభాగ! నేనేమితినను? నాకెవరుబలి (ఆహారం) ప్రదానం చేస్తారు?

**ఇత్యుక్తస్తాం మునిః ప్రాహ యాః స్త్రియాస్త్వాం యజంతి వై ॥79॥**

**బలిభిః పుష్పధూపైశ్చ న తాసాం చ గృహం విశ ।**
**ఇత్యుక్త్వా త్వావిశత్తత్ర పాతాళం బిలయోగతః ॥80॥**

**అద్యాపి చ వినిర్మగ్నో మునిః స జలసంస్తరే ।**
**గ్రామపర్వతబాహ్యేషు నిత్యమాస్తేఽశుభా పునః ॥81॥**

ఆమె ఆ విధంగా పలికింది కాగా ముని ఇలా చెప్పాడు. ఏ స్త్రీలు బలులతో అనగా భోజ్యపదార్థాలతో, పుష్పాలతో, ధూపాలతో నిన్ను పూజిస్తున్నారో వారి గృహాలకు నీవు వెళ్లరాదు అని పలికి ముని బిలమార్గంద్వారా

పాతాళలోకానికి వెళ్లాడు. ఆముని ఇప్పటికీ అక్కడి జలసంస్తరంలో మునిగియున్నాడు. ఇక్కడ ఈ అశుభ, అలక్ష్మి, జ్యేష్ఠాదేవి గ్రామాలకు, పర్వతాలకు  వెలుపల స్థానాలలో ఉంటున్నది.

**ప్రసంగాద్దేవ దేవేశో విష్ణుస్త్రిభువనేశ్వరః ।**
**లక్ష్మ్యా దృష్టస్తయా లక్ష్మీః సా తమాహ జనార్దనమ్ ॥82॥**

**భర్తా గతో మహాబాహో బిలం త్యక్త్వా స మాం ప్రభో ।**
**అనాథాహం జగన్నాథ వృత్తిం దేహి నమోఽస్తుతే ॥83॥**

సంయోగవశమైన సమయంలో దేవదేవుడు, త్రిభువననాథుడు లక్ష్మితో కలిసియున్న విష్ణువు అలక్ష్మికి కన్పించాడు. అపుడు ఆమె జనార్దనుడితో ఇలా అన్నది. ఓ ప్రభూ! ఓ మహాబాహూ! నా పతి నన్ను విడిచి ఈ బిలంలో ప్రవేశించాడు. ఓ జగన్నాథా! నేను అనాథను. నీవు నాకు జీవనవిధానాన్ని అనుగ్రహించు. నీకు నమస్కారం.

**సూత ఉవాచ –** సూతమహర్షి పలికాడు.

**ఇత్యుక్తో భగవాన్ విష్ణుః ప్రహస్యాహ జనార్దనః ।**
**జ్యేష్ఠామలక్ష్మీం దేవేశో మాధవో మధుసూదనః ॥84॥**

ఆమె ఆవిధంగా పలకగా, దేవేశ్వరుడు, మాధవుడు, మధుసూదనుడు, జనార్దనుడు, భగవానుడు అయిన విష్ణువు బాగా నవ్వి అలక్ష్మి అయిన జ్యేష్ఠను గూర్చి పలికాడు.

**శ్రీ విష్ణురువాచ –** శ్రీమహావిష్ణువు పలికాడు.

**యే రుద్రమనఘం శర్వం శంకరం నీలలోహితమ్ ।**
**అంబాం హైమవతీం వాపి జనిత్రీం జగతామపి ॥85॥**

**మద్భక్తాన్నిందయంత్యత్ర తేషాం విత్తం తవైవ హి ।**
**యేఽపి చైవ మహాదేవం వినింద్యైవ యజంతి మామ్ ॥86॥**

**మూఢా హ్యభాగ్యా మద్భక్తా అపి తేషాం ధనం తవ ।**
**యస్యాజ్ఞయా హ్యహం బ్రహ్మా ప్రసాదాద్వర్తతే సదా ॥87॥**

**యే యజంతి వినింద్యైవ మమ విద్వేషకారకాః ।**
**మద్భక్తా నైవ తే భక్తా ఇవ వర్తంతి దుర్మదాః ॥88॥**

**తేషాం గృహం ధనం క్షేత్రమిష్టాపూర్తం తవైవ హి ।**

ఏ జనులు అనఘుడు, శర్వుడు, శంకరుడు, నీలలోహితుడు అయిన శివభగవానుడిని, లోకాల్ని ఉత్పన్నం చేసే మాత అయిన పార్వతీదేవిని, మరియు నాభక్తుల్ని నిందిస్తున్నారో వారి ధనం నీదే. ఏ జనులు మహాదేవుడిని నిందించి నన్ను పూజిస్తున్నారో, ఏ నా భక్తులు మూఢులు, అభాగ్యులో వాళ్ల ధనం నీదే. ఎవరి

ఆజ్ఞతో అట్లే కృపతో నేను, బ్రహ్మ ఎల్లప్పుడూ క్రియాశీలంగా నిలుస్తున్నామో, అట్టి ఆయన్ని, తిరస్కరించి నన్ను పూజిస్తున్నారో, ఎవరు నా విద్వేషులో, ఎవరు నా భక్తులు కారో, నా భక్తులు కాకున్నా నాభక్తులుగా దుర్మదులై ఎవరు ఉంటున్నారో వారి గృహం, ధనం, క్షేత్రం, ఇష్టాపూర్తం (యజ్ఞాదులవల్ల కలిగిన పుణ్యం) అన్నీ నీవే.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు

**ఇత్యుక్త్వా తాం పరిత్యజ్య లక్ష్మ్యాలక్ష్మీం జనార్దనః ॥89॥**

**జజాప భగవాన్ రుద్రమలక్ష్మీక్షయసిద్ధయే ।**
**తస్మాత్ప్రదేయస్తస్మై చ బలిర్నిత్యం మునీశ్వరాః ॥ 90॥**

**విష్ణుభక్తైర్న సందేహః సర్వయత్నేన సర్వదా ।**
**అంగనాభిః సదా పూజ్యా బలిభిర్వివిధైర్ద్విజాః ॥91॥**

ఆ విధంగా పలికి విష్ణువు అలక్ష్మిని విడిచిపెట్టి, అలక్ష్మియొక్క క్షయసిద్ధికోసం లక్ష్మీదేవితోకూడినవాడై రుద్రజపం చేశాడు. ఓ మునీశ్వరులారా! విష్ణుభక్తులందరూ గట్టి ప్రయత్నంతో ఈ అలక్ష్మికి నిత్యం నిరంతరం బలిని ప్రదానం చేయాలి. ఇందులో సందేహం లేదు. స్త్రీలందరూ అనేక విధాల బల్యుపచారాలతో ఎల్లప్పుడు అలక్ష్మి జ్యేష్ఠాదేవిని పూజించాలి.

**యః పఠేచ్ఛృణయాద్వాపి శ్రావయేద్వా ద్విజోత్తమాన్ ।**
**అలక్ష్మీవృత్తమనఘో లక్ష్మీవాన్లభతే గతిమ్ ॥92॥**

ఏ మానవులు ఈ అలక్ష్మీవృత్తాంతాన్ని చదువుతారో లేక వింటారో లేక ద్విజశ్రేష్ఠులకు విన్పిస్తారో వాళ్లు పాపరహితులు. అట్లే లక్ష్మీవంతులు అవుతున్నారు. మరియు శుభగతి పొందుతున్నారు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే అలక్ష్మీవ్రతం నామ షష్ఠోఽధ్యాయః ॥6॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని అలక్ష్మీవ్రతం అనే ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తమోఽధ్యాయః - ఏడవ అధ్యాయం

## ద్వాదశాక్షరప్రశంసా - ద్వాదశాక్షరప్రశంస

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**కిం జపాన్ముచ్యతే జంతుః సర్వలోకభయాదిభిః ।**
**సర్వపాపవినిర్ముక్తం ప్రాప్నోతి పరమాం గతిమ్ ॥1॥**

**అలక్ష్మీం వాథ సంత్యజ్య గమిష్యతి జపేన వై ।**
**లక్ష్మీవాసో భవేన్మర్త్యః సూత వక్తుమిహార్హసి ॥2॥**

ఏ మంత్రజపంవల్ల మానవుడు సంపూర్ణంగా సంసారాదుల భయం నుంచి ముక్తుడు అవుతున్నాడు? సమస్తమైన పాపాల నుంచి విముక్తుడై పరమమైన గతిని పొందుతున్నాడు? ఏ జపంవల్ల మానవుడు దారిద్ర్యాన్ని త్యజించి లక్ష్మీయుక్తుడు అవుతున్నాడు? ఓ సూతర్షీ! నీవు దీన్ని గూర్చి చెప్పు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**పురా పితామహేనోక్తం వసిష్ఠాయ మహాత్మనే ।**
**వక్ష్యే సంక్షేపతః సర్వం సర్వలోకహితాయ వై ॥3॥**

**శృణ్వంతు వచనం సర్వే ప్రణిపత్య జనార్దనమ్ ।**
**దేవదేవమజం విష్ణుం కృష్ణమచ్యుతమవ్యయమ్ ॥ 4॥**

**సర్వపాపహరం శుద్ధం మోక్షదం బ్రహ్మవాదినమ్ ।**

పూర్వం బ్రహ్మదేవుడు మహాత్ముడైన వసిష్ఠుడికి ఈ విషయంలో ఏది చెప్పాడో అదే మీకు నేను మొత్తాన్ని సంగ్రహంగా మానవులందరి కళ్యాణం కొరకు చెబుతాను. మీరందరూ జనార్దనుడు, దేవాధిదేవుడు, జన్మరహితుడు, కృష్ణుడు, అచ్యుతుడు, శాశ్వతుడు, సమస్తపాపాల్ని దూరం చేయువాడు, విశుద్ధుడు, మోక్షాన్ని ఇచ్చేవాడు, బ్రహ్మ పదార్థాన్ని తెలియజెప్పేవాడు అయిన విష్ణుభగవానుడికి నమస్కరించి నామాటలు వినండి.

**మనసా కర్మణా వాచా యో విద్వాన్ పుణ్యకర్మకృత్ ॥5॥**

**నారాయణం జపేన్నిత్యం ప్రణమ్య పురుషోత్తమమ్ ।**
**స్వపన్నారాయణం దేవం గచ్ఛన్నారాయణం తథా ॥6॥**

**భుంజన్నారాయణం విప్రాస్తిష్ఠన్ జాగ్రత్సనాతనమ్ ।**
**ఉన్మిషన్నిమిషన్ వాపి నమో నారాయణేతి వై ॥7॥**

**భోజ్యం పేయం చ లేహ్యం చ నమో నారాయణేతి చ ।**
**అభిమంత్ర్య స్పృశన్భుంక్తే స యాతి పరమాం గతిమ్ ॥8॥**

**సర్వపాపవినిర్ముక్తః ప్రాప్నోతి చ సతాం గతిమ్।**

పుణ్యకర్మను ఆచరించే ఏ పండితుడు, మనోవాక్కాయకర్మలతో పురుషోత్తముడికి నమస్కరించి "నమో నారాయణాయ" అనే మంత్రాన్ని జపిస్తున్నాడో, నిద్రిస్తూ, మేల్కొంటూ, తిరుగుతూ, కూర్చుంటూ, భోజనం చేస్తూ, కన్నులు తెరుస్తూ మూస్తూ నారాయణస్మరణ చేస్తున్నాడో భోజ్యం, పేయం, లేహ్యం అయిన పదార్థాల్ని తాకుతూ 'నమో నారాయణాయ' అనే మంత్రంతో ఆ పదార్థాల్ని అభిమంత్రించి వాటిని తింటున్నాడో అట్టివాడే పరమగతిని పొందుతున్నాడు. మరియు సర్వపాపవిముక్తుడై సద్గతిని పొందుతున్నాడు.

**అలక్ష్మీశ్చ మయాప్రోక్తా పత్నీ యా దుఃసహస్య చ ॥9॥**

**నారాయణపదం శ్రుత్వా గచ్ఛత్యేవ న సంశయః ।**
**యా లక్ష్మీర్దేవదేవస్య హరేః కృష్ణస్య వల్లభా ॥10॥**

**గృహే క్షేత్రే తథావాసే తనౌ వసతి సువ్రతాః ।**

ఇంతకుముందు చెప్పిన దుస్సహముని పత్ని అలక్ష్మికూడా ఈ నారాయణమంత్రం విన్నంతనే నిస్సందేహంగా తొలగిపోతుంది. ఓ సువ్రతులారా! దేవాధిదేవుడైన శ్రీహరియొక్క ప్రియపత్ని. లక్ష్మీదేవి నారాయణమంత్రాన్ని జపించినవాని గృహంలో క్షేత్రంలో, శరీరంలో నివసిస్తున్నది.

**ఆలోడ్య సర్వశాస్త్రాణి విచార్య చ పునః పునః ॥11॥**

**ఇదమేకం సునిష్పన్నం ధ్యేయో నారాయణః సదా ।**
**కిం తస్య బహుభిర్మంత్రైః కిం తస్య బహుభిర్వ్రతైః ॥12॥**

**నమో నారాయణేతి మంత్రః సర్వార్థసాధకః ।**
**తస్మాత్సర్వేషు కాలేషు నమో నారాయణేతి చ ॥13॥**

**జపేత్ స యాతి విప్రేంద్రా విష్ణులోకం సబాంధవః ।**

సమస్తశాస్త్రాల్ని అనుశీలించి మరియు మాటిమాటికి పరిశీలించి ఒక నిర్ణయం చేయబడింది. ఎల్లప్పుడు నారాయణుడిని ధ్యానించాలని. అనేకమంత్రాలవల్ల, వ్రతాలవల్ల, మానవుడికి ఏమి ప్రయోజనం ఉంటుంది? ఎందుకంటే, 'నమోనారాయణ' అనే ఈ మంత్రమే సర్వమైన కోరికల్ని సాధించేది కనుక. ఓ శ్రేష్ఠవిప్రులారా! అందువల్ల ఎల్లప్పుడూ ఎవడు 'నమో నారాయణాయ' అనే మంత్రజపం చేస్తాడో ఆతడు బంధువులతోకూడా కలిసి విష్ణులోకం వెళుతున్నాడు.

**అన్యచ్చ దేవదేవస్య శృణ్వంతు మునిసత్తమాః ॥14॥**

**మంత్రో మయా పురాభ్యస్తః సర్వవేదార్థసాధకః ।**
**ద్వాదశాక్షర సంయుక్తో ద్వాదశాత్మా పురాతనః ॥15॥**

**తస్యైవేహ చ మాహాత్మ్యం సంక్షేపాత్ప్రవదామి వః ।**

ఓ మునిశ్రేష్ఠులారా! మీకు దేవాధిదేవుడు విష్ణుభగవానుడి మరొక మంత్ర ప్రభావాన్ని చెబుతాను వినండి! నేను పూర్వం సమస్తవేదార్థసాధకమైనది పంద్రెండు అక్షరాలు గలది, పంద్రెండు ఆదిత్యుల స్వరూపమైనది అయిన ఒక సనాతన మంత్రాన్ని అభ్యసించాను. అట్టిదాని ప్రభావాన్ని మీ అందరికి సంగ్రహంగా చెబుతున్నాను.

**కశ్చిద్ద్విజో మహాప్రాజ్ఞస్తపస్తప్త్వా కథంచన ॥16॥**

**పుత్రమేకం తయోత్పాద్య సంస్కారైశ్చ యథాక్రమమ్ ।**
**యోజయిత్వా యథాకాలం కృతోపనయనం పునః ॥17॥**

**అధ్యాపయామాస తదా స చ నోవాచ కించన ।**
**న జిహ్వా స్పందతే తస్య దుఃఖితోఽభూత్ ద్విజోత్తమః ॥18॥**

**వాసుదేవేతి నియతమైతరేయో వదత్యసౌ ।**

మహామేధావి అయిన విప్రుడొకడు ఒక విధమైన తపస్సు చేసి ఒక పుత్రుడుని ఉత్పన్నుడిని చేసి యథావిధి ఆతడికి కాలోచితసంస్కారాల్ని నిర్వహించి, అట్లే ఉపనయనంకూడా పూర్తి చేసి విద్యాభ్యాసం చేయించాడు. అప్పుడాతడు ఏ ఒక్కమాటా పలకలేదు. ఆతడి నాలుక స్పందించలేదు. ఆ బాలుడిపేరు ఐతరేయుడు. ఆతడు 'వాసుదేవాయ' అనే మంత్రాన్నే నిరంతరం పలుకుతున్నాడు. దాంతో ఆ బ్రాహ్మణోత్తముడు దుఃఖించాడు.

**పితా తస్య తథా చాన్యాం పరిణీయ యథావిధి ॥19॥**

**పుత్రానుత్పాదయామాస తథైవ విధిపూర్వకమ్ ।**
**వేదానధీత్య సంపన్నా బభూవుః సర్వసమ్మతాః ॥20॥**

ఆ బాలకుడి తండ్రి మరో స్త్రీని విధ్యుక్తంగా వివాహమాడి ఆమెవల్ల యథావిధి పుత్రుల్ని పొందాడు. వాళ్లు వేదాల్ని అధ్యయనం చేసి అందరి మన్ననలు పొంది సంపన్నులయ్యారు.

**ఐతరేయస్య సా మాతా దుఃఖితా శోకమూర్ఛితా ।**
**ఉవాచ పుత్రాః సంపన్నా వేదవేదాంగపారగాః ॥21॥**

**బ్రాహ్మణైః పూజ్యమానా వై మోదయంతి చ మాతరమ్ ।**
**మమ త్వం భాగ్యహీనాయాః పుత్రో జాతో నిరాకృతిః ॥22॥**

**మమాత్ర నిధనం శ్రేయో న కథంచన జీవితమ్ ।**

ఐతరేయుడి తల్లి మిక్కిలి దుఃఖిత అయి మూర్ఛ చెంది, తెలిసి, పుత్రుడితో ఇలా పలికింది. నా సవతి బిడ్డలు సంపన్నులు. వేదవేదాంగప్రవీణులు. వార్ని బ్రాహ్మణులు పూజిస్తున్నారు. తల్లికి సంతోషాన్ని కలిగిస్తున్నారు. అభాగ్యురాలైన నాకు విద్యాశూన్యుడవయి నీవు జన్మించావు. కావున నేను మరణించడమే శ్రేయస్కరం. జీవించడం ఎందుకు?

**ఇత్యుక్తః స చ నిర్గమ్య యజ్ఞవాటం జగామ వై ॥23॥**
**తస్మిన్ యాతో ద్విజానాం తు న మంత్రాః ప్రతిపేదిరే ।**
**ఐతరేయే స్థితే తత్ర బ్రాహ్మణా మోహితాస్తదా ॥24॥**

**తతో వాణీ సముద్భూతా వాసుదేవేతి కీర్తనాత్ ।**
**ఐతరేయస్య తే విప్రాః ప్రణిపత్య యథాతథమ్ ॥25॥**

**పూజాం చక్రుస్తతో యజ్ఞం స్వయమేవ సమాగతమ్ ।**
**తతః సమాప్య తం యజ్ఞమైతరేయో ధనాదిభిః ॥26॥**

**సర్వవేదాన్ సదస్యాహ సషడంగాన్స సమాహితః ।**
**తుష్టువుశ్చ తథా విప్రా బ్రహ్మాద్యాశ్చ తథా ద్విజాః ॥27॥**

**ససర్జుః పుష్పవర్షాణి ఖేచరాః సిద్ధచారణాః ।**

తల్లి ఆవిధంగా పలకగా ఆ ఐతరేయుడు అక్కడ నుండి లేచి యజ్ఞమండపానికి వెళ్లాడు. అక్కడకు వచ్చిన బ్రాహ్మణులకు కూడా మంత్రాలు తెలియవు. ఐతరేయుడు అక్కడ నిలవగానే ఆ బ్రాహ్మణులు మోహితులయ్యారు. అపుడు 'వాసుదేవ' అనే పేరుగల మంత్రాన్ని పలకడంవల్ల ఆయన నోటినుండి మంత్రమయమైన వాక్కు వెలువడింది. అది విన్న ఆ బ్రాహ్మణులు ఆయనకు నమస్కరించి పూజించారు. అనంతరం అక్కడ యజ్ఞదేవుడు స్వయంగా నిలిచియున్నాడు. అపుడు ఆ యజ్ఞాన్ని పూర్తిచేసి ఆ విప్రులచేత ధనాదులతో సన్మానింపబడ్డాడు. షడంగసహితమైన సర్వవేదాల్ని వారికి చెప్పాడు. దాంతో ఋత్విజులందరూ, బ్రాహ్మణులు మొదలన ద్విజులూ ఐతరేయుడిని స్తుతించారు. సిద్ధులు, చారణులు మొదలైన ఆకాశగాములందరూ ఆయనపైన పూలను వర్షించారు.

**ఏవం సమాప్య వై యజ్ఞమైతరేయో ద్విజోత్తమాః ॥28॥**

**మాతరం పూజయిత్వా తు విష్ణోః స్థానం జగామ హ ।**
**ఏతద్వై కథితం సర్వం ద్వాదశాక్షరవైభవమ్ ॥29॥**

**పఠతాం శృణ్వతాం నిత్యం మహాపాతకనాశనమ్ ।**
**జపేద్యః పురుషో నిత్యం ద్వాదశాక్షరమవ్యయమ్ ॥30॥**

**స యాతి దివ్యమతులం విష్ణోస్తత్పరమం పదమ్ ।**
**అపి పాప సమాచారో ద్వాదశాక్షరతత్పరః ॥31॥**

**ప్రాప్నోతి పరమం స్థానం నాత్ర కార్యా విచారణా ।**
**కిం పునర్యే స్వధర్మస్థా వాసుదేవ పరాయణాః ॥32॥**

**దివ్యం స్థానం మహాత్మానః ప్రాప్నువంతీతి సువ్రతాః ॥33॥**

ఓ బ్రాహ్మణోత్తములారా! ఈ విధంగా యజ్ఞాన్ని సుసంపన్నం చేసి ఆ ఐతరేయుడు తన తల్లిని పూజించి విష్ణులోకానికి వెళ్లాడు. నేను మీకు ద్వాదశాక్షరమంత్రమాహాత్మ్యాన్ని చెప్పాను. దీన్ని పఠించినా, విన్నా మహాపాపాలు నశిస్తాయి. ఏ మానవుడు అవినాశి అయిన ఈ ద్వాదశాక్షరమంత్రాన్ని నిత్యం జపిస్తాడో ఆతడు విష్ణుదేవుడియొక్క సాటిలేని దివ్యమైన పరమపదాన్ని పొందుతున్నాడు. పాపకర్ములు కూడా "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే ఈ ద్వాదశాక్షరమంత్రజపతత్పరులవుతారో వారుకూడా ఆ పరమపదాన్ని పొందుతున్నారు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే ద్వాదశాక్షరప్రశంసా నామ సప్తమోఽధ్యాయః ॥7॥**

శ్రీలింగమహాపురాణం, ఉత్తరభాగంలోని ద్వాదశాక్షరప్రశంస అనే ఏడవ అధ్యాయం సమాప్తం.

## అష్టమోఽధ్యాయః - ఎనిమిదవ అధ్యాయం

## అష్టాక్షరప్రశంసా - అష్టాక్షరప్రశంస

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**అష్టాక్షరో ద్విజశ్రేష్ఠా నమో నారాయణేతి చ ।**
**ద్వాదశాక్షరమంత్రశ్చ పరమః పరమాత్మనః ॥1॥**

**మంత్రషడక్షరో విప్రాః సర్వవేదార్థసంచయః ।**
**యశ్చోం నమః శివాయేతి మంత్రః సర్వార్థసాధకః ॥2॥**

**తథా శివతరాయేతి దివ్యః పంచాక్షరః శుభః ।**
**మయస్కారాయ చేత్యేవం నమస్తే శంకరాయ చ ॥3॥**

**సప్తాక్షరోఽయం రుద్రస్య ప్రధానపురుషస్య వై ।**

ఓ విప్రులారా! 'ఓం నమఃశివాయ' ఇది షడక్షరమంత్రం. ఇది సర్వవేదసారభూతమైనది. ఈ విధంగానే 'శివతరాయ' 'మయస్కారాయ' అనే ఈ రెండూ దివ్యాలు, మంగళకరాలు, సర్వమనోరథ సాధకాలు మరియు ప్రధాన పురుషుడైన రుద్రుడియొక్క 'నమస్తే శంకరాయ' అనే సప్తాక్షరమంత్రంకూడా సమస్తమనోరథాల్ని తీర్చుతున్నది.

**బ్రహ్మా చ భగవాన్ విష్ణుః సర్వే దేవాః సవాసవాః ॥4॥**

**మంత్రైరేతైర్ద్విజశ్రేష్ఠా మునయశ్చ యజంతి తమ్ ।**
**శంకరం దేవదేవేశం మయస్కరమజోద్భవమ్ ॥5॥**

**శివం చ శంకరం రుద్రం దేవదేవముమాపతిమ్ ।**
**ప్రాహుర్నమః శివాయేతి నమస్తే శంకరాయ చ ॥6॥**

**జప్త్వా ముచ్యేత వై విప్రో బ్రహ్మహత్యాదిభిః క్షణాత్ ॥7॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! బ్రహ్మదేవుడు, విష్ణుభగవానుడు అట్లే ఇంద్రాది దేవతలు, శ్రేష్ఠులైన ద్విజగణాలు, మునిగణాలు ఈ మంత్రాలతో దేవదేవుడు, మయస్కారుడు, అజోద్భవుడు, శంకరుడు అయిన శివుడిని పూజిస్తున్నారు. మరియు ఆ శివుడిని శంకరా! రుద్రా! దేవదేవా! ఉమాపతీ! అని సంబోధిస్తున్నారు. నమః శివాయ, నమస్తే శంకరాయ, మయస్కారాయ,రుద్రాయ, శివతరాయ, అనే ఈ మంత్రాన్ని జపించిన విప్రులు బ్రహ్మహత్య మొదలైన పాపాలనుంచి క్షణకాలంలో విముక్తి పొందుతున్నారు.

**పురాకచ్చిద్ద్విజః శక్తో ధుంధుమూక ఇతి శ్రుతః ।**
**ఆసీత్తృతీయే త్రేతాయామావర్తే చ మనోః ప్రభోః ॥8॥**

పూర్వకాలంలో మనుమహారాజుయొక్క మూడో ఆవర్తంలో త్రేతాయుగంలో ధుంధుకుడనే పేరుగల శక్తిమంతుడైన బ్రాహ్మణుడు ఉన్నాడు.

**మేఘవాహనకల్పే వై బ్రహ్మణః పరమాత్మనః ।**
**మేఘో భూత్వా మహాదేవం కృత్తివాససమీశ్వరమ్ ॥9॥**

**బహుమానేన వై రుద్రం దేవదేవో జనార్దనః ।**
**ఖిన్నోఽతి భారాద్రుద్రస్య నిఃశ్వాసోచ్ఛ్వాసవర్జితః ॥10॥**

**విజ్ఞాప్య శితికంఠాయ తపశ్చక్రేఽంబుజేక్షణః ।**
**తపసా పరమైశ్వర్యం బలం చైవ తథాద్భుతమ్ ॥11॥**

**లబ్ధవాన్ పరమేశానాచ్ఛంకరాత్పరమాత్మనః ।**
**తస్మాత్కల్పస్తదా చాసీన్మేఘవాహనసంజ్ఞయా ॥12॥**

మేఘవాహనకల్పంలో పరమాత్ముడైన శివుడిని దేవదేవుడు జనార్దనుడు మేఘరూపమైన వాహనంగా మారి మిక్కిలి ఆదరంతో కృత్తివాసుడు మహాదేవుడు అయిన రుద్రుడిని మోశాడు. అపుడు రుద్రుడియొక్క అధికభారంవల్ల పీడింపబడిన కారణంగా ఉచ్ఛ్వాసనిశ్వాసలు నిలిచిపోయాయి. కమలాక్షుడైన విష్ణువు శితికంఠుడైన శివుడిని గూర్చి తపస్సు చేశాడు. పరమాత్ముడు, పరమేశ్వరుడు అయిన శివుడివల్ల పరమమైన ఐశ్వర్యం, అద్భుతమైన బలం పొందాడు. ఈ కారణంగా అది మేఘవాహనకల్పంగా ప్రసిద్ధి చెందింది.

**తస్మిన్ కల్పే మునేః శాపాత్ ధుంధుమూకసముద్భవః ।**
**ధుంధుమూకాత్మజస్తేన దురాత్మా చ బభూవ సః ॥13॥**

**ధుంధుమూకః పురాసక్తో భార్యయా సహమోహితః ।**
**తస్యాం వై స్థాపితో గర్భః కామాసక్తేన చేతసా ॥14॥**

**అమావాస్యామహన్యేవ ముహూర్తే రుద్రదైవతే ।**
**అంతర్వత్నీ తదా భార్యా భుక్తా తేన యథాసుఖమ్ ॥15॥**

**అసూత సా చ తనయం విశల్యాఖ్యా ప్రయత్నతః ।**
**రుద్రే ముహూర్తే మందేన వీక్షితే మునిసత్తమాః ॥16॥**

ఆ కల్పంలో మునిశాపం వల్ల ధుంధుమూకుడికి దుర్మార్గుడైన పుత్రుడు కలిగాడు. ధుంధుమూకుడు ప్రస్తుతం నిరాసక్తుడయ్యూ భార్యతో మోహింపబడ్డాడు. కామాసక్తమైన మనసుతో ఆమెతో సంపర్గసుఖాన్ని పొంది గర్భాన్ని నిలిపాడు. అది అమావాస్యతిథి. పైగా పగలు. రుద్రదైవతముహూర్తం. ఓ ఋషులారా! అనంతరం ఆమె విశల్యుడనే పేరుగల శనిదేవత దృష్టిగల భయంకరముహూర్తంలో అత్యంతకష్టుడైన ఒక పుత్రుడిని కన్నది.

**మాతుః పితుస్తథారిష్టం స సంజాతస్తథాత్మనః ।**
**ఋషీ తమూచతుర్విప్రా ధుంధుమూకం మిథస్తదా ॥17॥**

**మిత్రావరుణనామానౌ దుష్పుత్ర ఇతి సమ్మతౌ ।**
**వసిష్ఠః ప్రాహ నీచోఽపి ప్రభావాద్వై బృహస్పతేః ॥18॥**

**పుత్రస్తవాసౌ దుర్బుద్ధిరపి ముచ్యతి కిల్బిషాత్ ।**

తల్లిదండ్రులు అరిష్టకరమైన పని చేసి ఆతడికి జన్మనిచ్చారు. ఓ విప్రులారా! మిత్రుడు, వరుణుడు అనే ఇద్దరు మునిశ్రేష్ఠులు ఆ ధుంధుమూకుడితో ఇలా చెప్పారు. ఈతడు చెడ్డ కుమారుడు, ఈ నీ పుత్రుడు నీచుడు, దుర్బుద్ధిగలవాడు. అయినా బృహస్పతి ప్రభావంవల్ల పాపం నుంచి విముక్తుడుకాగలడు. ఇది వసిష్ఠుడిమాట అని.

**దుఃఖితో ధుంధుమూకోఽసౌ దృష్ట్వా పుత్రమవస్థితమ్ ॥19॥**

**జాతకర్మాదికం కృత్వా విధివత్స్వయమేవచ ।**
**అధ్యాపయామాస చ తం విధినైవ ద్విజోత్తమాః ॥ 20॥**

**తేనాధీతం తథాన్యాయం ధౌంధుమూకేన సువ్రతాః ।**
**కృతోద్వాహస్తదా గత్వా గురుశుశ్రూషణే రతః ॥21॥**

ఓ మునిశ్రేష్ఠులారా! ఆ విధమైన దశగల కుమారుడిని చూచి ఆ ధుంధుమూకుడు మిక్కిలి దుఃఖించాడు. విధ్యుక్తంగా ఆతడికి జాతకర్మాది సంస్కారాల్ని నిర్వహించి స్వయంగా తానే ఆతడికి అధ్యాపకుడై చదివించాడు. ఆ ధుంధుమూకుడి కుమారుడు మిక్కిలిగా అధ్యయనం చేశాడు. తర్వాత ఆతడికి వివాహం జరిగింది. తర్వాత ఆతడు గురుసేవారతుడయ్యాడు.

**అనేనైవ మునిశ్రేష్ఠా ధౌంధుమూఖేన దుర్మదాత్ ।**
**భుక్త్వాన్యాం వృషలీం దృష్ట్వా స్వభార్యావద్దివానిశమ్ ॥22॥**

**ఏకశయ్యాసనగతో ధౌంధుమూకో ద్విజాధమః ।**
**తథా చచార దుర్బుద్ధిస్త్యక్త్వా ధర్మగతిం పరామ్ ॥ 23॥**

**మాధ్వీ సీతా తయా సార్ధం తేన రాగవివృద్ధయే ।**

ఓ మునిశ్రేష్ఠులారా! ఆదోషకారణంగా ఆ ధుంధుమూకుడి పుత్రుడు ఒక శూద్రస్త్రీని చూచి మదోన్మత్తుడై తన భార్యతో సమానంగా ఆమెతో రేయింబవళ్లు భోగిస్తున్నాడు. దుర్బుద్ధి, ద్విజాధముడూ అయిన ఆతడు పరమమైన ధర్మమార్గాన్ని విడిచి ఆమెతో కలిసి మదిరను కూడా త్రాగుతున్నాడు.

**కేనాపి కారణేనైవ తాముద్దిశ్య ద్విజోత్తమాః ॥24॥**
**నిహతా సా చ పాపేన వృషలీ గతమంగళా ।**
**తతస్తస్యాస్తదా తస్య భ్రాతృభిర్నిహతః పితా ॥25॥**

**మాతా చ తస్య దుర్బుద్ధే ర్ధౌంధుమూకస్య శోభనా ।**
**భార్యా చ తస్య దుర్బుద్ధేః శ్యాలాస్తే చాపి సువ్రతాః ॥26॥**

**రాజ్ఞా క్షణాదహో నష్టం కులం తస్యాశ్చ తస్య చ ।**

ఏదో ఒక కారణంగా ఆశూద్రస్త్రీతో ఆతడికి విరోధం కలిగింది. పాపి అయిన ఆతడిచే రక్షణలేని ఆమె చంపబడింది. తర్వాత ఆమెయొక్క సోదరులు ఈ పాపి తండ్రి ధుంధుమూకుడిని చంపారు. ఇదే విధంగా ఆ దుర్బుద్ధియొక్క తల్లి, సుందరి అయిన భార్య, మరియు భార్యయొక్క సోదరులు చంపబడ్డారు. ఓ సువ్రతులారా! ఈ విధంగా ధౌంధుమూకుడి వంశం క్షణకాలంలో నశించింది. అంతేకాక, ఆ శూద్ర స్త్రీ యొక్క సంపూర్ణ వంశాన్ని రాజు చంపించాడు.

**గత్వాసౌ ధౌంధుమూకశ్చ యేన కేనాపి లీలయా ॥27॥**
**దృష్ట్వా తు తం మునిశ్రేష్ఠం రుద్రజాప్యపరాయణమ్ ।**
**లబ్ధ్వా పాశుపతం తద్వై పురా దేవాన్ మహేశ్వరాత్ ॥28॥**
**లబ్ధ్వా పంచాక్షరం చైవ షడక్షరమనుత్తమమ్ ।**
**పునః పంచాక్షరం చైవ జప్త్వా లక్షం పృథక్ పృథక్ ॥29॥**
**వ్రతం కృత్వా చ విధినా దివ్యం ద్వాదశమాసికమ్ ।**
**కాలధర్మం గతః కల్పే పూజితశ్చ యమేన వై ॥30॥**
**ఉద్ధృతా చ తథా మాతా పితా శ్యాలాశ్చ సువ్రతాః ।**
**పత్నీ చ సుభగా జాతా సుస్మితా చ పతివ్రతా ॥31॥**
**తాభిర్విమానమారుహ్య దేవైః సేంద్రైరభిష్టుతః ।**
**గాణపత్యమనుప్రాప్య రుద్రస్య దీయతోఽభవత్ ॥32॥**

అనంతరం ధౌంధుమూకుడు అక్కడక్కడా తిరుగుతూ మహాదేవమహేశ్వరుడి పాశుపతవ్రతాన్ని, రుద్రజపంలో లీనమైయున్న మునిశ్రేష్ఠుడి వల్ల స్వీకరించి, బృహస్పతిని ప్రారబ్ధపుణ్యంవల్ల కలిసి ఆయననుంచి సర్వశ్రేష్ఠాలైన పంచాక్షర, షడక్షర మంత్రాలను గ్రహించి, ఆ మంత్రాల్ని వేరువేరుగా ఒక లక్షపర్యాయాలు జపించాడు. ఈ విధంగా దివ్యమైన ద్వాదశమాసిక వ్రతాన్ని విధ్యుక్తంగా పూర్తిచేసి చివరకు మృతి చెందాడు. యమలోకంలో యమధర్మరాజు ఆతడిని మిక్కిలిగా సన్మానించాడు. ఓ మునిశ్రేష్ఠులారా! శూద్రులద్వారా చనిపోయిన ఆతడి తండ్రి, తల్లి, భార్య అట్లే భార్యసోదరులు ఉద్ధరింపబడ్డారు. సుస్మిత, పతివ్రత అయిన ఆతడి భార్య సౌభాగ్యవతి అయ్యింది. వారి అందరితో కలిసి ఆతడు విమానాన్ని ఎక్కి రుద్రలోకానికి వెళ్లి ఇంద్రాదిదేవతలతో పొగడబడి గణాధ్యక్షుడై రుద్రభగవానుడికి ప్రేమాస్పదుడయ్యాడు.

**తస్మాదష్టాక్షరాన్మంత్రాత్తథా వై ద్వాదశాక్షరాత్ ।**
**భవేత్కోటి గుణం పుణ్యం నాత్ర కార్యా విచారణా ॥33॥**

**తస్మాజ్జపేద్ధి యో నిత్యం ప్రాగుక్తేన విధానతః ।**
**శక్తిబీజసమాయుక్తం స యాతి పరమాం గతిమ్ ॥34॥**

అందువల్ల అష్టాక్షర, ద్వాదశాక్షర మంత్రాల్ని జపించడంవల్ల కోటిరెట్లుగా అధికపుణ్యం లభిస్తుంది. ఇందుకై సందేహం లేదు. ఏ మానవుడు పూర్వోక్తప్రకారంగా ఆదిలో మయా (శక్తి బీజంతో) బీజంతో కూడిన ఈ మంత్రాన్ని నిత్యం జపిస్తాడో ఆతడు పరమోన్నతమైన గతిని పొందుతున్నాడు.

**ఏతద్వః కథితం సర్వం కథా సర్వస్వమనుత్తమమ్ ।**
**యఃపఠేచ్ఛృణుయాద్వాపి శ్రావయేద్వా ద్విజోత్తమాన్ ॥35॥**

**స యాతి బ్రహ్మలోకం తు రుద్రజాప్యమనుత్తమమ్ ॥36॥**

ఓ మునులారా! నేను మీకు చెప్పిన ఈ సర్వోత్తమకథాసారాన్ని ఎవడు చదువుతాడో, వింటాడో, విన్పిస్తాడో ఆతడు బ్రహ్మలోకప్రాప్తి పొందుతున్నాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగేఽష్టాక్షరప్రశంసా నామాష్టమోఽధ్యాయః ॥8॥**

శ్రీలింగపురాణం, పూర్వభాగంలోని అష్టాక్షరప్రశంస అనే ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



## నవమోఽధ్యాయః - తొమ్మిదవ అధ్యాయం

## పాశుపతవ్రతవర్ణనమ్ - పాశుపతవ్రతవర్ణనం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**దేవైః పురా కృతం దివ్యం వ్రతం పాశుపతం శుభమ్ ।**
**బ్రహ్మణా చ స్వయం సూత కృష్ణేనాక్లిష్ట కర్మణా ॥1॥**

**పతితేన చ విప్రేణ ధౌంధుమూకేన వై తథా ।**
**కృత్వా జప్త్వా గతిః ప్రాప్తా కథం పాశుపతం వ్రతమ్ ॥2॥**

**కథం పశుపతి ర్దేవః శంకరః పరమేశ్వరః ।**
**వక్తుమర్హసి చాస్మాకం పరం కౌతూహలం హి నః ॥3॥**

ఓ సూతర్షీ! దేవతలు, బ్రహ్మదేవుడు, క్రియాశీలుడు అయిన విష్ణుదేవుడు పూర్వం ఈ దివ్యమైన మంగళకరమైన వ్రతం చేశారు. పతిత విప్రుడైన ధుంధుమూకుడి కుమారుడు కూడా ఈ వ్రతాన్ని నిర్వహించి సద్గతిని పొందాడు. అట్టి ఆ పాశుపతవ్రతం ఎట్టిది? భగవానుడు పరమేశ్వరశంకరుడు పశుపతి ఎలా అయ్యాడు. మాకు ఈ విషయంగా మిక్కిలి ఆసక్తి ఉన్నది. నీవు మాకు చెప్పు.

**సూత ఉవాచ** - సూతర్షి పలికాడు.

**పురా శాపాద్విముక్తో బ్రహ్మపుత్రో మహాయశాః ।**
**రుద్రస్య దేవదేవస్య మరుదేశాదిహాగతః ॥4॥**

**త్యక్త్వా ప్రసాదాద్రుద్రస్య ఉష్ట్రదేహమజాజ్ఞయా ।**
**శిలాదపుత్రమాసాద్య నమస్కృత్య విధానతః ॥5॥**

**మేరు పృష్ఠే మునివరః శ్రుత్వా ధర్మమనుత్తమమ్ ।**
**మాహేశ్వరం మునిశ్రేష్ఠా హ్యపృచ్ఛచ్చ పునః పునః ॥6॥**

**నందినం ప్రణిపత్యైనం కథం పశుపతిః ప్రభుః ।**
**వక్తుమర్హసి చాస్మాకం తత్సర్వం చ తదాహ సః ॥ 7॥**

**తత్సర్వం శ్రుతవాన్ వ్యాసః కృష్ణద్వైపాయనః ప్రభుః ।**
**తస్మాదహమనుశ్రుత్య యుష్మాకం ప్రవదామి వై ॥8॥**

**సర్వే శృణ్వంతు వచనం నమస్కృత్వా మహేశ్వరమ్ ।**

పూర్వం బ్రహ్మమానసపుత్రుడైన మహాయశస్వి సనత్కుమారుడు దేవదేవుడైన రుద్రుడి శాపం నుంచి ముక్తుడయ్యాడు. ఆ సనత్కుమారుడు రుద్రుడి అనుగ్రహంవల్ల ఒంటి శరీరాన్ని విడిచి ఈ మరుదేశానికి (భారతవర్షం) వచ్చాడు. తిరిగి బ్రహ్మదేవుడి ఆదేశం మేరకు శిలాదుడి కుమారుడైన నందీశ్వరుడి దగ్గరకు మేరు శిఖరానికి

వెళ్లాడు. విధ్యుక్తంగా నందీశ్వరుడికి నమస్కరించి ఆయనవల్ల సర్వశ్రేష్ఠమైన మోక్షధర్మాన్ని విని పాశుపతవ్రత విషయాన్ని గూర్చి అడిగాడు. ఓ మునిపుంగవులారా! మాటిమాటికి నందికి నమస్కరించి సనత్కుమారుడిలా పలికాడు. ప్రభువైన శివుడు పశుపతి ఎలా అయ్యాడు? నీవు నాకు ఈ విషయం చెప్పు. అప్పుడు నంది ఆతడికి ఆ విషయం అంతా చెప్పాడు. కృష్ణద్వైపాయన వ్యాసప్రభువు సనత్కుమారుడివల్ల అదంతా విన్నాడు. ఆయనవల్ల విన్న నేను మీకు చెబుతున్నాను. అందరూ శంకరభగవానుడికి నమస్కరించి ఈ విషయం వినండి!

**కథం పశుపతిర్దేవః పశ్వః కే ప్రకీర్తితాః ॥9॥**

**కైః పాశైస్తే నిబధ్యంతే విముచ్యంతే చ తే కథమ్ ।**

శివభగవానుడు పశుపతి ఎలా అయ్యాడు? పశువులు ఎవ్వరు? వారు ఏ పాశాలతో బంధింపబడ్డారు? ఏ విధంగా వారు విముక్తులవుతారు?

**శైలాదిరువాచ** – నందీశ్వరుడు పలికాడు.

**నసత్కుమార వక్ష్యామి సర్వమేతద్యథాతథమ్ ॥10॥**

**రుద్రభక్తస్య శాంతస్య తవ కళ్యాణచేతసః ।**
**బ్రహ్మాద్యాః స్థావరాంతాశ్చ దేవదేవస్య ధీమతః ॥11॥**

**పశ్వః పరికీర్త్యంతే సంసారవశవర్తినః ।**
**తేషాం పతిత్వాద్భగవాన్ రుద్రః పశుపతిః స్మృతః ॥12॥**

ఓ సనత్కుమార! రుద్రభక్తుడు, శాంతస్వభావుడు, కళ్యాణ భావనతో కూడిన చిత్తంగల వాడవైన నీకు ఉన్నది ఉన్నట్లుగా చెబుతున్నాను. బ్రహ్మనుంచి స్థావరజంగమాత్మకమైన మాయావశవర్తి అయిన ప్రపంచం మరియు ధీమంతులైన దేవతలుకూడా పశువులే. వారికి స్వామి అయినందున రుద్రభగవానుడు పశుపతి అయ్యాడు.

**అనాదినిధనో ధాతా భగవాన్ విష్ణురవ్యయః ।**
**మాయాపాశేన బధ్నాతి పశువత్పరమేశ్వరః ॥13॥**

**స ఏవ మోచకస్తేషాం జ్ఞానయోగేన సేవితః ।**
**అవిద్యాపాశబద్ధానాం నాన్యో మోచక ఇష్యతే ॥14॥**

**తమృతే పరమాత్మానం శంకరం పరమేశ్వరమ్ ।**

ఆద్యంతరహితుడు, ధరించువాడు, శాశ్వతుడు, షడైశ్వర్యసంపన్నుడు, సర్వవ్యాపకుడు, పరమేశ్వరుడు అయిన మహేశ్వరుడు ఈ జీవుల్ని మోహావిష్టమైన పశువులతో సమాన ంగా మాయాపాశబద్ధుల్ని చేస్తున్నాడు. ఆ విధంగానే జ్ఞానయోగంతో ఆరాధించిన తర్వాత వాటికి ముక్తినిస్తున్నాడు. అవిద్యాపాశబద్ధులైన జీవులకు ముక్తినిచ్చేవాడు పరమాత్ముడు, మహేశ్వరుడు అయిన శంకరుడే. ఈయనకన్నా అన్యుడెవ్వడూ లేడు.

**చతుర్వింశతి తత్త్వాని పాశా హి పరమేష్ఠినః ॥15**

**తైః పాశైర్మోచయత్యేకః శివో జీవైరుపాసితః ।**
**నిబధ్నాతి పశూనేకశ్చతుర్వింశతిపాశకైః ॥16॥**

**స ఏవ భగవాన్ రుద్రో మోచయత్యపి సేవితః ।**
**దశేంద్రియమయైః పాశైరంతః కరణసంభవైః ॥17॥**

**భూతతన్మాత్రపాశైశ్చ పశూన్మోచయతి ప్రభుః ।**
**ఇంద్రియార్థమయైః పాశైర్బద్ధా విషయిణః ప్రభుః ॥18॥**

**ఆశు భక్తా భవంత్యేవ పరమేశ్వరసేవయా ।**

ఇరవైనాల్గు తత్త్వాలు శివభగవానుడి పాశాలు. ఒక్క శివుడే జీవులచేత ఆరాధింపబడి ఆ పాశాలనుంచి ముక్తుల్ని చేస్తున్నాడు. రుద్రభగవానుడు ఏ ఇరవైనాల్గు తత్త్వాలతో పశువుల్ని బంధిస్తున్నాడో, ఆయనే సేవింపబడినవాడై బంధనముక్తుల్ని చేస్తున్నాడు. పది ఇంద్రియాలు (ఐదు జ్ఞానేంద్రియాలు+ఐదు కర్మేంద్రియాలు) అంతఃకరణజన్యమైన భావాలు (మనసు, బుద్ధి, అహంకారం, చిత్తం) పది తన్మాత్రలు అట్లే పృథివ్యాదిపంచభూతాలు ఈ సమస్త విషయరూపపశుభావాల్ని శివుడు ఆ పశువులనుంచి తొలగిస్తున్నాడు. ఇంద్రియ సంబంధి పాశాలతో బంధింపబడి విషయగ్రస్తులైన మానవులు పరమేశ్వరశివుడి సేవవల్ల త్వరగానే ఆయన భక్తులవుతున్నారు.

**భజ ఇత్యేష ధాతుర్వై సేవాయాం పరికీర్తితః ॥19॥**

**తస్మాత్సేవా బుధైః ప్రోక్తా భక్తిశబ్దేన భూయసీ ।**
**బ్రహ్మాదిస్తంబపర్యంతం పశూన్ బద్ధా మహేశ్వరః ॥20॥**

**త్రిభిర్గుణమయైః పాశైః కార్యం కారయతి స్వయం ।**
**దృఢేన భక్తియోగేన పశుభిః సముపాసితః ॥21॥**

**మోచయత్యేవ తాన్ సద్యః శంకరః పరమేశ్వరః ।**

భజధాతువుకు సేవ అని అర్థం. (భజసేవాయాం) అందుకే విద్వాంసులు సేవకు భక్తిశబ్ద సంబంధాన్ని చెప్పారు. బ్రహ్మ నుంచి తృణపర్యంతం అయిన పశువులను సత్త్వాదులైన త్రిగుణరూపాలైన పాశాలతో బంధించి మహేశ్వరుడు స్వయంగా కార్యనిర్వహణ చేస్తున్నాడు. ఆ పశువులద్వారా సుదృఢమైన భక్తియోగంతో మిక్కిలిగా ఆరాధింపబడిన తర్వాత పరమేశ్వరుడైన శంకరుడు ఆ బంధాల నుంచి వెంటనే విడిపిస్తున్నాడు.

**భజనం భక్తిరిత్యుక్తా వాఙ్మనఃకాయకర్మభిః ॥22॥**

**సర్వకార్యేణ హేతుత్వాత్పాశచ్ఛేదపటీయసీ ।**
**సత్యః సర్వగ ఇత్యాది శివస్య గుణచింతనా ॥23॥**

**రూపోపాదాన చింతా చ మానసం భజనం విదుః ।**
**వాచికం భజనం ధీరాః ప్రణవాదిజపం విదుః ॥24॥**

**కాయికం భజనం సద్భిః ప్రాణాయామాది కథ్యతే ।**

మనసు, వాక్కు, కర్మ ఇవి త్రికరణాలు. త్రికరణశుద్ధిగా ప్రభువు శివుడిని భజించడమే భక్తి అవుతుంది. సమస్తప్రపంచం మరియు విష్ణువు కూడా స్థితి చెందడానికి ఈ భక్తి బంధనమే కారణం. ఆయన సత్యం,

సర్వవ్యాపికూడా. శివుడికి గల ఈ గుణాల్ని గుర్తించి ఆయన రూపాన్ని, ఉపాదానాలలో దర్శించి విద్వాంసులు మానసికమైన భజన చేస్తారు. ప్రణవాదుల్ని (ఓం) జపిస్తూ వాచికభజన చేస్తారు. ఇట్లే సత్పురుషులు చేసే ప్రాణామాయాదులు కాయికభజన అవుతుంది.

**ధర్మాధర్మమయైః పాశైర్బంధనం దేహినామిదమ్ ॥25॥**

**మోచకః శివ ఏవైకో భగవాన్ పరమేశ్వరః ।**
**చతుర్వింశతి తత్త్వాని మాయాకర్మగుణా ఇతి ॥26॥**

**కీర్త్యంతే విషయశ్చేతి పాశా జీవనిబంధనాత్ ।**
**తైర్బద్ధాః శివభక్త్యైవ ముచ్యంతే సర్వదర్శినః ॥27॥**

**పంచక్లేశమయైః పాశైః పశూన్ బధ్నాతి శంకరః ।**
**స ఏవ మోచకస్తేషాం భక్త్యా సమ్యగుపాసితః ॥28॥**

ధర్మాధర్మమయమైన పాశాలచేత జీవులకు ఈ బంధనం ఏర్పడుతున్నది. పరమేశ్వర భగవానుడు శివుడు ఒక్కడే ఆ బంధాల్ని తొలగించేవాడు. ఇరవైనాల్గు తత్త్వాలు, మాయాగుణం, మరియు శబ్దాది విషయాలు ఇవి జీవులకు బంధనాలు అవటానికి కారణం పాశాలే. ఈ పాశాలతో బంధింపబడిన అన్ని ప్రాణులు శివభక్తిద్వారా ముక్తమవుతున్నాయి. అవిద్య మొదలైన అయిదు క్లేశరూపాలైన పాశాలతో శివుడు ప్రాణుల్ని బంధిస్తున్నాడు. భక్తితో ఆరాధిస్తే ఆయనే వాటినుంచి విమోచన కల్పిస్తాడు.

**అవిద్యామస్మితాం రాగం ద్వేషం చ ద్విపదాం వరాః ।**
**వదంత్యభినివేశం చ క్లేశాన్ పాశత్వమాగతాన్ ॥29॥**

**తమో మోహో మహామోహస్తామిస్ర ఇతి పండితాః ।**
**అంధతామిస్ర ఇత్యాహురవిద్యాం పంచధా స్థితామ్ ॥30॥**

**తాంజీవాన్ మునిశార్దూలాః సర్వాంశ్చైవాప్యవిద్యయా ।**
**శివో మోచయతి శ్రీమాన్నాన్యః కశ్చిద్విమోచకః ॥ 31॥**

**అవిద్యాం తమ ఇత్యాహురస్మితాం మోహ ఇత్యపి ।**
**మహామోహ ఇతి ప్రాజ్ఞా రాగం యోగపరాయణాః ॥32॥**

**ద్వేషం తామిస్ర ఇత్యాహురంధతామిస్ర ఇత్యపి ।**
**తథైవాభినివేశం చ మిథ్యాజ్ఞానం వివేకినః ॥33॥**

**తమసోఽష్టవిధా భేదా మోహశ్చాష్టవిధః స్మృతః ।**
**మహామోహప్రభేదాశ్చ బుధైర్దశ విచింతితాః ॥34॥**

**అష్టాదశవిధం చాహుస్తామిస్రం చ విచక్షణాః ।**
**అంధతామిస్రభేదాశ్చ తథాష్టాదశధా స్మృతాః ॥35॥**

అవిద్య, అస్మిత, రాగం, ద్వేషం మరియు అభినివేశం పాశత్వాన్ని పొందుతున్నాయి. పండితులు అవిద్యను అయిదు విధాలుగా చెబుతున్నారు. తమం, మోహం, మహామోహం, తమిస్రం, అంధతమిస్రం అనేవి అవి. ఓ మునిశ్రేష్ఠులారా! శివభగవానుడొక్కడే సమస్తజీవుల్ని, అవిద్యనుంచి విముక్తుల్ని చేస్తున్నాడు. వాటినుంచి విముక్తిపర్చే వ్యక్తి మరొక్కడు లేడు. యోగపరాయణులైన మహాజ్ఞానులు అవిద్యను తమస్సని, అస్మితను మోహమని, రాగాన్ని మహామోహమని చెబుతున్నారు. ఈ విధంగానే వివేకులైన జనులు ద్వేషాన్ని తామిస్రమని, మిథ్యాజ్ఞానరూపమైన అభినివేశాన్ని అంధతామిస్రమని అంటున్నారు. తమస్సు ఎనిమిది విధాలు. మోహంకూడా ఎనిమిది విధాలు. పండితులు మహామోహం పదిరకాలుగా చెబుతున్నారు. వివేకులు తామిస్రాన్ని పదునెనిమిది విధాలంటున్నారు. అంధతామిస్రభేదాలు కూడా పదునెనిమిదే.

**అవిద్యయాస్య సంబంధో నాతీతో నాస్త్యనాగతః ।**
**భవేద్రాగేణ దేవస్య శంభోరంగనివాసినః ॥36॥**

**కాలేషు త్రిషు సంబంధస్తస్య ద్వేషేణ నో భవేత్ ।**
**మాయాతీతస్య దేవస్య స్థాణోః పశుపతేర్విభోః ॥37॥**

**తథైవాభినివేశేన సంబంధో న కదాచన ।**
**శంకరస్య శరణ్యస్య శివస్య పరమాత్మనః ॥38॥**

**కుశలాకుశలైస్తస్య సంబంధో నైవ కర్మభిః ।**
**భవేత్కాలత్రయే శంభోరవిద్యామతివర్తినః ॥39॥**

**విపాకైః కర్మణాం వాపి న భవేదేవ సంగమః ।**
**కాలేషు త్రిషు సర్వస్య శివస్య శివదాయినః ॥40॥**

సర్వాంతర్యామి అయిన దేవదేవశివుడికి అవిద్యతోగాని, రాగంతోగాని సంబంధం వర్తమానంలో లేదు. పూర్వకాలంలోనూ లేదు. భవిష్యత్తులోనూ ఉండదు. మాయాతీతుడు, స్థాణుడు, పశుపతి, దేవదేవుడు అయిన శివుడికి మూడు కాలాలలోనూ ద్వేషంతో సంబంధం లేదు. ఆ విధంగానే శరణిచ్చువాడు, కళ్యాణకారకుడు, పరమాత్ముడైన శివుడికి అభినివేశంతోకూడా ఎప్పుడూ సంబంధం లేదు. పుణ్యకర్మలు మరియు పాపకర్మలలో ప్రవర్తించే మూడుకాలలలోనూగల అవిద్యతో శివుడికి సంబంధంలేదు. త్రికాలాలలోను కళ్యాణప్రదాయి, సర్వస్వరూపుడు అయిన శివుడికి శుభాశుభకర్మఫలాలతోను సంబంధం లేదు.

**సుఖదుఃఖైరసంస్పృశ్యః కాలత్రితయవర్తిభిః ।**
**స తైర్వినశ్వరైః శంభుర్బోధానందాత్మకః పరః ॥41॥**

**ఆశయైరపరామృష్టః కాలత్రితయగోచరైః ।**
**ధియాంపతిః స్వభూరేష మహాదేవో మహేశ్వరః ॥42॥**

**అస్పృశ్యః కర్మసంస్కారైః కాలత్రితయవర్తిభిః ।**
**తథైవ భోగసంస్కారైర్భగవానంతకాంతకః ॥43॥**

బోధానందస్వరూపుడై మూడుకాలాలలో నిలిచి యుండేవాడు అయిన పరమశివుడు వినాశశీలంగల సుఖదుఃఖాల స్పర్శ లేనివాడు. పరమమేధావి, స్వయం ప్రకటితుడు అయిన మహాదేవమహేశ్వరుడు త్రికాలాలలో అనుభూతార్థాలైన కోరికల స్పర్శ లేనివాడు. ఈ విధంగానే అంతకుడైన కాలుడికే అంతకుడు అయిన శివభగవానుడు మూడు కాలాలలోని కర్మసంస్కారాలయొక్క భోగసంస్కారాలయొక్క స్పర్శ లేనివాడు.

**పుంవిశేషపరో దేవో భగవాన్ పరమేశ్వరః ।**
**చేతనాచేతనాయుక్త ప్రపంచాదఖిలాత్పరః ॥44॥**

**లోకే సాతిశయత్వేన జ్ఞానైశ్వర్యం విలోక్యతే ।**
**శివేనాతి శయత్వేన శివం ప్రాహుర్మనీషిణః ॥45॥**

పురుషవిశేషపరుడు, పరమేశ్వరుడు, మహాదేవుడు అయిన శివభగవానుడు జీవులందరికన్నా శ్రేష్ఠుడు. జడం మరియు చేతనం అయిన సంపూర్ణసృష్టిప్రపంచంకన్నా పరుడైనవాడు. అందుకే లోకంలో జ్ఞానంలో ఐశ్వర్యంలో మిక్కిలి శ్రేష్ఠుడుగా కన్పిస్తున్నాడు. అందుకే అతిశయించిన కళ్యాణరూపుడు కావున బుద్ధిమంతులు మహాదేవుడిని శివుడు అంటున్నారు.

**ప్రతిసర్గం ప్రసూతానాం బ్రహ్మణాం శాస్త్రవిస్తరమ్ ।**
**ఉపదేష్టా స ఏవాదౌ కాలావచ్ఛేదవర్తినామ్ ॥46॥**

**కాలావచ్ఛేదయుక్తానాం గురూణామప్యసౌ గురుః ।**
**సర్వేషామేవ సర్వేశః కాలావచ్ఛేదవర్జితః ॥47॥**

ప్రత్యేకసృష్టివల్ల ఉత్పన్నులైన కాలసీమలబద్ధులైన బ్రహ్మాదులందరికి సంపూర్ణంగా శాస్త్రాల్ని ప్రారంభంలో ఉపదేశించింది శివభగవానుడే. కాలంయొక్క హద్దులు లేని సర్వేశ్వరశివుడు కాలంయొక్క అవధులుగల గురువులందరికి గురువు.

**అనాదిరేష సంబంధో విజ్ఞానోత్కర్షయోః పరః ।**
**స్థితయోరీదృశః సర్వః పరిశుద్ధః స్వభావతః ॥48॥**

**ఆత్మప్రయోజనాభావే పరానుగ్రహ ఏవ హి ।**
**ప్రయోజనం సమస్తానాం కార్యాణాం పరమేశ్వరః ॥49॥**

ఆత్మ పరమాత్మల సేవకసేవ్యసంబంధం అనాదిది. సహజంగా మిక్కిలి నిర్మలమైనది. విశ్వస్వరూపుడైన శివుడు మాయాసంబంధం లేనివాడు. తనకు ఏ విధమైన ప్రయోజనం లేకున్నా పరమేశ్వర శివుడు జీవులయొక్క సమస్తకార్యాలలోనూ ప్రయోజనరూపమైన అనుగ్రహం కల్గియుంటాడు.

**ప్రణవో వాచకస్తస్య శివస్య పరమాత్మనః ।**
**శివరుద్రాదిశబ్దానాం ప్రణవోఽపి పరః స్మృతః ॥50॥**
**శంభోః ప్రణవవాచ్యస్య భావనా తజ్జపాదపి ।**
**యా సిద్ధిః స్వపరా ప్రాప్యా భవత్యేవ న సంశయః ॥51॥**

ప్రణవం (ఓంకారం) పరమాత్మ శివుడికి వాచకం అయ్యింది. ఆప్రణవమే శివ, రుద్ర మొదలైన శబ్దాలలో శ్రేష్ఠమైనది. శివవాచకమైన ప్రణవం జపంలో ఉండడంవల్ల శివుడి యొక్క భావన కలిగి ఆ మంత్ర సిద్ధి జరుగుతున్నది. అది లేకపోతే ఇతర మంత్రంవల్ల సిద్ధి లభించదు. ఈ విషయంలో సందేహం లేదు. ప్రణవరహితమైన ఏ మంత్రం ఫలితాన్ని ఇవ్వదు.

**జ్ఞానతత్త్వం ప్రయత్నేన యోగః పాశుపతః పరః ।**
**ఉక్తస్తు దేవదేవేన సర్వేషామనుకంపయా ॥52॥**

**స హోవాచైవ యాజ్ఞవల్క్యో యదక్షరం గార్గ్యయోగినః । అభివదంతి స్థూలమనంతం మహాశ్చర్యమ దీర్ఘ మలోహితమ్ అమస్తకమాసాయమత ఏవో పునారసమసంగమగంధమరసమ్ అచక్షుష్కమశ్రోత్రమ వాఙ్మనోతేజస్కమ ప్రమాణమనుసుఖమ్ అనామగోత్రమమరమజరమనామయ మమృతమోంశబ్దమమృతమ్ అసంవృతమపూర్వ మనపరమనంతమబాహ్యం తదశ్నాతి కించన న తదశ్నాతి కించన ॥53॥**

ఆదిత్యరూపుడైన దేవదేవశివుడు యాజ్ఞవల్క్యుడి తపస్సునకు మెచ్చి పూర్తి అనుగ్రహంతో జ్ఞానతత్త్వరూపమైన శ్రేష్ఠ పాశుపతయోగాన్ని ఉపదేశించాడు. అనంతరం ఆయాజ్ఞవల్క్యుడు గార్గితో ఇలా అన్నాడు. ఓ గార్గీ! అయోగులైన జనులు నాశరహితమైన శివతత్త్వమిది అని చెబుతున్నారు. శివుడి విరాట్స్వరూపం అనంతం మరియు అత్యంతం ఆశ్చర్యజనకం అని చెబుతున్నారు. అయితే యోగులైన జనులు ఆయన్ని అదీర్ఘుడు, అలోహితుడు, మస్తకవిహీనుడు, ఎల్లప్పుడూ అంతం లేనివాడు, అందుచేతనే నిత్యానందరసస్వరూపుడు, స్పర్శశూన్యుడు, అగంధుడు, అరసుడు, అచక్షుడు, కర్ణరహితుడు, మనసు వాక్కు లేనివాడు, తేజోవిహీనుడు, అప్రమాణుడు, అసుఖుడు, నామం మరియు గోత్రం లేనివాడు, మృత్యురహితుడు, ముసలితనం లేనివాడు, అనామయుడు, (రోగం లేనివాడు) అమృతుడు (మోక్షరూపుడు) ఓంకార శబ్దంవల్ల ప్రతిపాదింపబడువాడు, సుధాస్వరూపుడు, ఆచ్ఛాదనం లేనివాడు, పూర్వభాగం లేనివాడు, వెనుకభాగం లేనివాడు, అంతరహితుడు ఏదో ఒకటి తింటాడు, ఏదో ఒకటి తినడు అని చెబుతున్నారు.

**ఏతత్కాలవ్యయే జ్ఞాత్వా పరం పాశుపతం ప్రభుమ్ ।**
**యోగే పాశుపతే చాస్మిన్ యస్యార్థః కిల ఉత్తమే ॥54॥**

**కృత్వోంకారం ప్రదీపం మృగయ గృహపతిం సూక్ష్మమాద్యంతరస్థం**
**సంయమ్య ద్వారవాసం పవనపటుతరం నాయకం చేంద్రియాణామ్ ।**
**వాగ్జాలైః కస్య హేతోర్విభటసి తు భయం దృశ్యతే నైవ కించిత్**
**దేహస్థం పశ్య శంభుం భ్రమసి కిము పరే శాస్త్రజాలేఽంధకారే ॥55॥**

**ఏవం సమ్యగ్బుద్ధైఃజ్ఞాత్వా మునీనామథ చోక్తం శివేన ।**
**అసమరసం పంచధా కృత్వాభయం చాత్మని యోజయేత్ ॥56॥**

ఈ ఉత్తమమైన పాశుపత యోగంలో ఏ మానవుడికి అభిరుచి ఉంటుందో ఆతడు ఈ శ్రేష్ఠయోగాన్ని తెలిసి అంతమందు పరమేశ్వరుడిలో విలీనుడవుతున్నాడు. ఓంకార దీపాన్ని వెలిగించుకుని సూక్ష్ముడు, ఆద్యంతరస్థుడు అయిన పరమేశ్వరుడిని వెతుకు ఇంద్రియాలకు స్వామి అయినవాడు. గాలికన్నా గట్టివాడు. అట్టి ఆయన్ని కవాటాన్ని బంధించి వెతుకు. సూక్ష్మమైనవాడు, అన్నింటికి ఆది అయినవాడు అయిన ఆ పరమాత్మను అన్వేషించు. పలు మాటలతో ఏదో ఒక కారణంగా వివాదం సాగిస్తూ ఉంటే భయాన్ని పొందుతావు. దేన్నీ చూడలేవు. కావున నీవు నీ దేహంలోగల శివుడిని దర్శించు. అంధకారమయమైన శాస్త్రాల విషయంలో ఎందుకు భ్రమపడతావు? ఈ విధంగా ముక్తిని పొందాలి. ఈ విధంగా శివుడి ద్వారా మునులకు చెప్పిన ఉపదేశాన్ని విద్వాంసులతో కూడి మిక్కిలి విచారించి ఆనందస్వరూపం ఆత్మస్వరూపం పంచకోశాల కన్నా వేరైన అభయరూపమైన మోక్షాన్ని పొందాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే పాశుపతవ్రతవర్ణనం నామ నవమోఽధ్యాయః ॥9॥**

శ్రీలింగమహాపురాణం, ఉత్తరభాగంలోని పాశుపతవ్రతవర్ణనం అనే తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



## **దశమోఽధ్యాయః** – పదొవ అధ్యాయం

## **ఉమాపతిమహిమవర్ణనమ్** – ఉమాపతిమహిమవర్ణన

**సనత్కుమార ఉవాచ** – సనత్కుమారుడు పలికాడు.

**భూయ ఏవ మమాచక్ష్వ మహిమానముమాపతేః ।**
**భవభక్త మహాప్రాజ్ఞ భగవన్నందికేశ్వర ॥ 1॥**

ఓ శివభక్తుడా! ఓ మహాప్రాజ్ఞుడా! ఓ భగవానుడా! ఓ నందీశ్వరా! నీవు పార్వతీపతి శివభగానుడియొక్క మహిమను మరల చెప్పు.

**శైలాదిరువాచ** – నందీశ్వరుడు పలికాడు.

**సనత్కుమార సంక్షేపాత్తవ వక్ష్యామ్యశేషతః ।**
**మహిమానం మహేశస్య భవస్య పరమేష్ఠినః ॥2॥**

**నాస్య ప్రకృతిబంధోఽభూద్బుద్ధిబంధో న కశ్చన ।**
**న చాహంకారబంధశ్చ మనోబంధశ్చ నోఽభవత్ ॥3॥**

**చిత్తబంధో న తస్యాభూచ్ఛ్రోత్రబంధో న చాభవత్ ।**
**న త్వచాం చక్షుషాం వాపి బంధో జజ్ఞే కదాచన ॥4॥**

**జిహ్వాబంధో న తస్యాభూద్ ఘ్రాణబంధో న కశ్చన ।**
**పాదబంధః పాణిబంధో వాగ్బంధశ్చైవ సువ్రత ॥5॥**

**ఉపస్థేంద్రియబంధశ్చ భూతతన్మాత్రబంధనమ్ ।**
**నిత్యశుద్ధస్వభావేన నిత్యబుద్ధో నిసర్గతః ॥6॥**

**నిత్యముక్త ఇతి ప్రోక్తో మునిభిస్తత్త్వవేదిభిః ।**

ఓ సనత్కుమారా! నేను మీకు పరమేష్ఠి పరమేశ్వరుడూ అయిన శంకరుడియొక్క మహిమను సంక్షిప్తంగా చెప్తాను. శివుడికి ఏ విధమైన ప్రకృతిబంధనం, మరియు బుద్ధిబంధనం లేదు. ఈ విధంగానే అహంకారబంధనం అట్లే మనోబంధనం కూడా లేవు. ఆయనకు చిత్తబంధం లేదు. శ్రోత్రబంధమూలేదు. త్వగ్బంధం, మరియు నేత్రబంధం కూడా లేదు. ఓ సువ్రతులారా! శివుడికి జిహ్వా, ఘ్రాణ, పాద, హస్త, వాక్కులయొక్కయు జననేంద్రియాల యొక్కయు మరియు శబ్దం మొదలైన పంచగుణాల యొక్కయు బంధం లేదు. తత్త్వవేత్తలైన మునులు నిత్యశుద్ధ స్వభావకారణంగా శివుడిని సహజంగా నిత్యబుద్ధుడు, నిత్యముక్తుడని చెబుతున్నారు.

**అనాదిమధ్యనిష్ఠస్య శివస్య పరమేష్ఠినః ॥7॥**

**బుద్ధిం సూతే నియోగేన ప్రకృతిః పురుషస్య చ ।**
**అహంకారం ప్రసూతేఽస్యా బుద్ధిస్తస్య నియోగతః ॥8॥**

**అంతర్యామీతి దేహేషు ప్రసిద్ధస్య స్వయంభువః ।**
**ఇంద్రియాణి దశైకం చ తన్మాత్రాణి చ శాసనాత్ ॥9॥**

**అహంకారోఽతిసంసూతే శివస్య పరమేష్ఠినః ।**
**తన్మాత్రాణి నియోగేన తస్య సంసువతే ప్రభోః ॥10॥**

**మహాభూతాన్యశేషేణ మహాదేవస్య ధీమతః ।**
**బ్రహ్మాదీనాం తృణాంతం హి దేహినాం దేహసంగతామ్ ॥ 11॥**

**మహాభూతాన్యశేషాణి జనయంతి శివాజ్ఞయా ।**
**అధ్యవస్యతి సర్వార్థాన్ బుద్ధిస్తస్యాజ్ఞయా విభోః ॥12॥**

ఆది, మధ్యాంతాలు అనేవి లేని పురుషరూపుడైన పరమేష్ఠి శివుడియొక్క ఆజ్ఞతో ప్రకృతి బుద్ధిని ఉత్పన్నం చేస్తున్నది. మరల శివుడి నియోగంవల్లే ఆ ప్రకృతియొక్క బుద్ధి అహంకారాన్ని ఉత్పన్నం చేస్తున్నది. సర్వాంతర్యామి అయిన కారణంగా దేహులలో ఉండే ప్రసిద్ధుడు, స్వయంభువుడు అయిన పరమేష్ఠి శివుడియొక్క ఆదేశంతో అహంకారం పదిఇంద్రియాల్ని, శబ్దం మొదలైన తన్మాత్రల్ని ఉత్పత్తి చేస్తున్నది. ధీమంతుడు, ప్రభువు అయిన మహాదేవుడి ఆదేశంతో తన్మాత్రలు ఆకాశాదులైన మహాభూతాల్ని ఉత్పత్తి చేస్తున్నాయి. తర్వాత శివుడి ఆజ్ఞతో ఆ మహాభూతాలన్నీ బ్రహ్మనుంచి తృణం వరకు దేహధారుల దేహాల్ని ఉత్పన్నం చేస్తున్నాయి. సర్వవ్యాపి అయిన శివుడి ఆజ్ఞవల్ల బుద్ధి సమస్తమైన అర్థాల్ని నిశ్చయిస్తున్నది.

**అంతర్యామీతి దేహేషు ప్రసిద్ధస్య స్వయం భువః ।**
**స్వభావసిద్ధమైశ్వర్యం స్వభావాదేవ భూతయః ॥13॥**

**తస్యాజ్ఞయా సమస్తార్థానహంకారోఽతిమన్యతే ।**
**చిత్తం చేతయతే చాపి మనః సంకల్పయత్యపి ॥14॥**

**శ్రోత్రం శృణోమి తచ్చక్ష్వా శబ్దస్పర్శాదికం చ యత్ ।**
**శంభోరాజ్ఞాబలేనైవ భవస్య పరమేష్ఠినః ॥ 15॥**

**వచనం కురుతే వాక్యం నాదానాది కదాచన ।**
**శరీరాణామశేషాణాం తస్య దేవస్య శాసనాత్ ॥16॥**

**కరోమి పాణిరాదానం న గత్యాది కదాచన ।**
**సర్వేషామేవ జంతూనాం నియమాదేవ వేధసః ॥17॥**

**విహారం కురుతే పాదో నోత్సర్గాది కదాచన ।**
**సమస్త దేహివృందానాం శివస్యైవ నియోగతః ॥18॥**

**ఉత్సర్గం కురుతే పాయుర్న వదేత కదాచన ।**
**జంతోర్జాతస్య సర్వస్య పరమేశ్వరశాసనాత్ ॥19॥**

**ఆనందం కురుతే శశ్వదుపస్థం వచనాద్విభోః ।**
**సర్వేషామేవ భూతానామీశ్వరస్యైవ శాసనాత్ ॥20॥**

దేహులలో అంతర్యామీస్వరూపమైన స్వయంభూప్రసిద్ధుడైన శివుడి ఐశ్వర్యం స్వభావసిద్ధంగా ఉంది. మరియు శివుడి విభూతికూడా స్వభావసిద్ధంగా ఉంది. శివుడి ఆజ్ఞతో అహంకారం అన్ని అర్థాల్ని తన అధీనంలో ఉంచుకుంటున్నది. చిత్తం స్మరిస్తున్నది. మనసు సంకల్పం చేస్తున్నది. చెవి శివుడి శక్తిని వింటున్నది. పరమేష్ఠి, ప్రభువు అయిన శివుడి ఆజ్ఞతో శబ్ద స్పర్శాదులు కూడా ఉన్నాయి. అవి వాటివాటి విషయాలలో ప్రవర్తిస్తున్నాయి. శివభగవానుడి ఆజ్ఞవల్లనే దేహధారులందరియొక్క వాక్కు వచించే కర్మ చేస్తున్నది. అది గ్రహణాదికర్మల్ని నిర్వహించలేకున్నది. శివుడు పురమాయించే నియమాలవల్లనే ప్రాణులన్నీ తమ హస్తాల్ని గ్రహిస్తున్నాయి. లేకుంటే అవి చలించవు. బహుకార్యాల్ని నిర్వహించవు. శివభగవానుడి ఆదేశం వల్లే ప్రాణి సమూహం యొక్క పాదాలు తిరుగుతున్నాయి. అవి లేకుంటే తిరగలేవు. పరమేశ్వర శివుడియొక్క ఆజ్ఞవల్లే ప్రాణిసమూహం యొక్క గుదస్థలం విసర్జనకార్యాన్ని నిర్వహిస్తున్నది. లేకుంటే అది ఉత్సర్జనం చేయదు. సర్వవ్యాపి ఈశ్వరుడి మాట ప్రకారమే ప్రాణులన్నిటి జననేంద్రియాలు ఆనందాన్ని ఇస్తున్నాయి.

**అవకాశమశేషాణాం భూతానాం సంప్రయచ్ఛతి ।**
**ఆకాశం సర్వదా తస్య పరమస్యైవ శాసనాత్ ॥21॥**

**నిర్దేశేన శివస్యైవ భేదైః ప్రాణాదిభిర్నిజైః ।**
**బిభర్తి సర్వభూతానాం శరీరాణి ప్రభంజనః ॥22॥**

**నిర్దేశాద్దేవదేవస్య సప్తస్కంధగతో మరుత్ ।**
**లోకయాత్రాం వహత్యేవ భేదైః స్వైరావహాదిభిః ॥23॥**

**నాగాద్యైః పంచభిర్భేదైః శరీరేషు ప్రవర్తతే ।**
**అపదేశేన దేవస్య పరమస్య సమీరణః ॥24॥**

శివభగవానుడియొక్క ఆదేశంవల్లే ఆకాశం అన్ని ప్రాణులకు అవకాశం ప్రదానం చేస్తున్నది. శివుడి ఆదేశం చేతనే ప్రాణాదులైన భేదాలతో వాయువు ప్రాణులన్నింటియొక్క శరీరాలలో నిలుస్తున్నది. సప్తస్కంధయుతమైన మరుత్తు దేవదేవ శివుడియొక్క నిర్దేశం వల్లనే ఆవహం మొదలైన భేదాలతో నిలిచి లోకయాత్ర సాగిస్తున్నది. ఆ వాయువే పరమప్రభువైన శివుడియొక్క ఆజ్ఞవల్లే నాగాదులైన ఐదు వాయుభేదాలతో శరీరాలలో స్థితి చెందుతున్నది.

**హవ్యం వహతి దేవానాం కవ్యం కావ్యాశినామపి ।**
**పాకం చ కురుతే వహ్నిః శంకరస్యైవ శాసనాత్ ॥25॥**

**భుక్తమాహారజాతం యత్పచతే దేహినాం తథా ।**
**ఉదరస్థః సదా వహ్నిర్విశ్వేశ్వరనియోగతః ॥26॥**

**సంజీవయత్యశేషాణి భూతాన్యాపస్తదాజ్ఞయా ।**
**అవిలంఘ్యా హి సర్వేషామాజ్ఞా తస్య గరీయసీ ॥27॥**

**చరాచరాణి భూతాని బిభర్త్యేవ తదాజ్ఞయా ।**
**ఆజ్ఞయా తస్య దేవస్య దేవదేవః పురందరః ॥28॥**

**జీవతాం వ్యాధిభిః పీడాం మృతానాం యాతనాశతైః ।**
**విశ్వంభరః సదాకాలం లోకైః సర్వైరలంఘ్యయా ॥29॥**

**దేవాన్ పాత్యసురాన్ హంతి త్రైలోక్యమఖిలం స్థితః ।**
**అధార్మికాణాం వై నాశం కరోతి శివశాసనాత్ ॥30॥**

శంకరభగవానుడి ఆజ్ఞవల్లే అగ్ని దేవతలకు హవ్యాన్ని, పితృదేవతలకు కవ్యాన్ని వహిస్తున్నది. పాకాన్ని (భోజనాన్ని) సిద్ధం చేస్తున్నది. శివభగవానుడి ఆదేశమే ప్రాణులు తిన్న ఆహారాన్ని అరిగిస్తున్నది. జలం ఆయన ఆజ్ఞవల్లే ప్రాణులన్నింటికీ జీవనం ప్రదానం చేస్తున్నది. ఆయన శ్రేష్ఠమైన ఆజ్ఞ ఎవ్వరూ దాటరానిదై ఉన్నది. పృథ్వి ఆయన ఆనతి వల్లే చరాచర జగత్తును ధరిస్తున్నది. శివుడి ఆజ్ఞవల్లే ఇంద్రుడు కూడా ప్రాణులన్నింటిని పాలిస్తున్నాడు. యమధర్మరాజు కూడా ఆయన ఆనతివల్లే జీవప్రాణుల్ని వ్యాధులతో, మృతప్రాణుల్ని నూరురకాల నరకయాతనలతో కష్టపెడుతున్నాడు. పూర్తిగా త్రిలోకాలలో స్థితుడైన శివుడియొక్క ఉల్లంఘింపరాని ఆజ్ఞవల్ల విష్ణుభగవానుడు సమస్త లోకాల్ని, దేవతలను రక్షిస్తున్నాడు. రాక్షసుల్ని సంహరిస్తున్నాడు. అట్లే ఆయన ఆనతితోనే ధర్మేతరుల్ని నశింపజేస్తున్నాడు.

**వరుణః సలిలైర్లోకాన్ సంభావయతి శాసనాత్ ।**
**మజ్జయత్యాజ్ఞయా తస్య పాశైర్బధ్నాతి చాసురాన్ ॥31॥**

**పుణ్యానురూపం సర్వేషాం ప్రాణినాం సంప్రయచ్ఛతి ।**
**విత్తం విత్తేశ్వరస్య శాసనాత్పరమేష్ఠినః ॥32॥**

**ఉదయాస్తమయే కుర్వన్ కురుతే కాలమాజ్ఞయా ।**
**ఆదిత్యస్తస్య నిత్యస్య సత్యస్య పరమాత్మనః ॥33॥**

**పుష్పాణ్యౌషధిజాతాని ప్రహ్లాదయతి చ ప్రజాః ।**
**అమృతాంశుః కలాధారః కాలకాలస్య శాసనాత్ ॥ 34॥**

శివాజ్ఞ చేతనే వరుణదేవుడు తన జలంతో ప్రాణులన్నింటిని సంతుష్ట పరుస్తున్నాడు. ఆట్లే ఆయన ఆజ్ఞతోనే అసురుల్ని తన పాశాలతో బాధిస్తున్నాడు. నీటిలో ముంచుతున్నాడు. శివభగవానుడి ఆనతితోనే ధనాధిపుడు కుబేరుడు సమస్తప్రాణులకు వారి పుణ్యానుసారంగా ధనాన్ని ప్రదానం చేస్తున్నాడు. శాశ్వతుడు, సత్యస్వరూపుడు అయిన పరమాత్మ శివుడి ఆజ్ఞతోనే సూర్య భగవానుడు ఉదయిస్తూ అస్తమిస్తూ కాలనిర్ధారణ చేస్తున్నాడు. కాలానికే కాలుడైన శివుడి ఆదేశం చేతనే కళాధారుడు చంద్రుడు పుష్పాల్ని, ఓషధుల్ని, జీవుల్ని ఆనందింపజేస్తున్నాడు.

**ఆదిత్యా వసవో రుద్రా అశ్వినే మరుతస్తథా ।**
**అన్యాశ్చ దేవతాః సర్వాస్తచ్ఛాసనవినిర్మితాః ॥35॥**

**గంధర్వా దేవసంఘాశ్చ సిద్ధాః సాధ్యాశ్చ చారణాః ।**
**యక్షరక్షః పిశాచశ్చ స్థితాః శాస్త్రేషు వేధసః ॥36॥**

**గ్రహనక్షత్రతారాశ్చ యజ్ఞా వేదాస్తపాంసి చ।**
**ఋషీణాం చ గణాః సర్వే శాసనం తస్య ధిష్ఠితాః॥37**

**కవ్యాశినాం గణాః సప్తసముద్రా గిరిసింధవః ।**
**శాసనే తస్య వర్తితే కాననాని సరాంసి చ ॥38॥**

**యుగమన్వంతరాణ్యస్య శంభోస్తిష్ఠతి శాసనాత్ ।**
**పరాశ్చైవ పారార్ధాశ్చ కాలభేదాస్తథాపరే ॥40॥**

ఆదిత్యులు, వసుగణాలు, రుద్రగణాలు, ఇద్దరు అశ్వనీదేవతలు, మరుద్గణాలు అట్లే ఇతర సమస్తదేవతలు శివభగవానుడి శాసనంవల్లే నిర్మింపబడ్డారు. గంధర్వులు, దేవసముదాయం, సిద్ధులు, సాధ్యులు, చారణులు, యక్షులు, రాక్షసులు అట్లే పిశాచాలు శివుడియొక్క శాసనం చేత స్థితులైయున్నారు. గ్రహసముదాయం, నక్షత్రగణం, తారాసముదాయం, యజ్ఞాలు, వేదాలు, తపస్సు అట్లే ఋషిగణాలు-ఇవి అన్నీ శివుడి శాసనం వల్ల అధిష్ఠించి ఉన్నాయి. పితృగణాలు, సప్తసముద్రాలు, పర్వతాలు, నదులు, వనాలు, సరోవరాలు, ఇవన్నీ ఆయన శాసనంవల్లే నిలుస్తున్నాయి. కళ, కాష్ఠం, నిమేషం, ముహూర్తం, దినం, రాత్రి, పక్షం, మాసం, ఋతువు, వర్షం, -ఈ కాల విభాగాలన్నీ శివుడి అనుశాసనంచేతనే ప్రవర్తిస్తున్నాయి. ఈ విధంగానే యుగం, మన్వంతరం, పరం, పరార్ధం అట్లే మిగిలిన కాలభేదాలుకూడా శివభగవానుడి శాసనానుసారమే ప్రవర్తిస్తున్నాయి.

**దేవానాం జాతయశ్చాష్టౌ తిరశ్చాం పంచజాతయః ।**
**మనుష్యాశ్చ ప్రవర్తంతే దేవదేవస్య ధీమతః ॥41॥**

**జాతాని భూతబృందాని చతుర్దశసు యోనిషు ।**
**సర్వలోకనిషణ్ణాని తిష్ఠంత్యస్యైవ శాసనాత్ ॥42॥**

**చతుర్దశసు లోకేషు స్థితా జాతాః ప్రజాః ప్రభోః ।**
**సర్వేశ్వరస్య తస్యైవ నియోగవశవర్తినః ॥ 43॥**

బుద్ధిసంపన్నుడైన దేవదేవుడైన శివుడు శాసనంతో విద్యాధరాదులైన ఎనిమిదిరకాల దేవతలు, ఐదురకాలైన పశుపక్షులు, అట్లే మానవులు ప్రవర్తిల్లుతున్నారు. సమస్త లోకాలలో నివసిస్తున్న దేవతాదులైన పధ్నాలుగు యోనులందు జన్మించిన అన్ని ప్రాణిసమూహాలు శివుడి శాసనంమీదే ప్రవర్తిల్లుతున్నాయి. పధ్నాలుగు లోకాలలో నివసిస్తున్న ప్రజలందరూ పరమేశ్వర శివుడి అధీనంలోనే మనుగడ సాగిస్తున్నాయి.

**పాతాలాని సమస్తాని భువనాన్యస్య శాసనాత్ ।**
**బ్రహ్మాండాని చ శేషాణి తథా సావరణాని చ ॥44॥**

**వర్తమానాని సర్వాణి బ్రహ్మాండాని తదాజ్ఞయా ।**
**వర్తంతే సర్వభూతాద్యైః సమేతాని సమంతతః ॥45॥**

**అతీతాన్యప్యసంఖ్యాని బ్రహ్మాండాని తదాజ్ఞయా ।**
**ప్రవృత్తాని పదార్థౌఘైః సహితాని సమంతతః ॥46**

**బ్రహ్మాండాని భవిష్యంతి సహ వస్తుభిరాత్మకైః ।**
**కరిష్యంతి శివస్యాజ్ఞాం సర్వైరావరణైః సహ ॥47॥**

పాతాళాదులైన సమస్తభువనాలు జలాదులైన ఆవరణాదులతో కూడిన బ్రహ్మాండం శివుడి శాసనంవల్లే స్థితి చెంది ఉన్నది. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు మొదలైనవారితో కూడిన సమస్తవర్తమానబ్రహ్మాండం సక్రమంగా ఆయన ఆజ్ఞతోనే స్థితి చెంది ఉన్నది. శివుడి ఆజ్ఞవల్లనే అసంఖ్యాక బ్రహ్మాండాలు అనేకపదార్థాలతో ఉత్పన్నమయ్యాయి. మరియు సమాప్తమూ అయ్యాయి. ఈ విధంగా భవిష్యత్తులో రానున్న బ్రహ్మాండాలన్నీ, వాటిమీద ఉండే పదార్థాలన్నీ, ఆవరణాలతోకూడి శివభగవానుడి ఆజ్ఞకారణంగా క్రియాకలాపం నిర్వహిస్తాయి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే ఉమాపతేర్మహిమవర్ణనం నామ దశమోఽధ్యాయః ॥10॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని ఉమాపతిమహిమవర్ణన అనే పదవ అధ్యాయం సమాప్తం.



## ఏకాదశోఽధ్యాయః – పదకొండవ అధ్యాయం

## శివవిభూతిమహిమవర్ణనమ్ – శివవిభూతిమహిమవర్ణన

**సనత్కుమార ఉవాచ** – సనత్కుమారుడు పలికాడు.

**విభూతిః శివయోర్మహ్యామాచక్ష్వ త్వం గణాధిప ।**
**పరాపరవిదాం శ్రేష్ఠ పరమేశ్వర భావితః ॥1॥**

పరాపరవేత్తలందు శ్రేష్ఠుడవు, పరమేశ్వరశివుడిని పొందిన వాడవు అయిన ఓ నందీశ్వరా! నీవిపుడు నాకు శివుడియొక్క పార్వతీదేవియొక్క విభూతిని వర్ణించు.

**నందికేశ్వర ఉవాచ** – నందికేశ్వరుడు పలికాడు.

**హంత తే కథయిష్యామి విభూతీః శివయోరహమ్ ।**
**సనత్కుమార యోగీంద్ర బ్రహ్మణస్తనయోత్తమ ॥2॥**

బ్రహ్మపుత్రులలో శ్రేష్ఠుడవు, యోగీశ్వరుడవు అయిన ఓ సనత్కుమారా! నేను శివుడి మరియు పార్వతీదేవి యొక్క ఐశ్వర్యాన్ని నీకు అవశ్యం  చెబుతాను.

**పరమాత్మా శివః ప్రోక్తః శివా సా చ ప్రకీర్తితా ।**
**శివమేవేశ్వరం ప్రాహుర్మాయాం గౌరీం విదుర్బుధాః ॥3॥**

**పురుషం శంకరం ప్రాహుర్గౌరీంచ ప్రకృతిం ద్విజాః ।**
**అర్థః శంభుః శివా వాణీ దివసోఽజః శివా నిశా ॥4॥**

**సప్తతంతుర్మహాదేవో రుద్రాణీ దక్షిణా స్మృతా ।**
**ఆకాశం శంకరో దేవః పృథివీ శంకరప్రియా ॥5॥**

**సముద్రో భగవాన్ రుద్రో వేలా శైలేంద్ర కన్యకా ।**
**వృక్షః శూలాయుధో దేవః శూలపాణిప్రియా లతా ॥6॥**

పరమాత్మ శివుడని (కళ్యాణరూపుడు) చెప్పబడుతున్నాడు. అట్లే పార్వతీదేవికూడా 'శివా'గా (కళ్యాణరూపిణి) చెప్పబడుతున్నది. విద్వాంసులు శివుడిని ఈశ్వరుడు అంటున్నారు. పార్వతీదేవిని 'మాయ' అంటున్నారు. ద్విజులు శంకరుడిని పురుషుడని పార్వతిని ప్రకృతి అని చెబుతున్నారు. శివుడు అర్థస్వరూపుడు. పార్వతి వాగ్స్వరూపం. శివుడు పగలు. పార్వతి రాత్రి. శివుడు సప్తతంతురూపమైన యజ్ఞం. పార్వతీదేవి దక్షిణ. శంకరభగవానుడు ఆకాశం. శంకర ప్రియపత్ని పార్వతి పృథ్వి. రుద్రభగవానుడు సముద్రం. హైమవతి 'వేల'. శూలాయుధుడు రుద్రభగవానుడు వృక్షం. శూలధరుడు శివుడికి ప్రియురాలైన పార్వతి వృక్షానికి అల్లుకున్న 'లత'.

**బ్రహ్మా హరోఽపి సావిత్రీ శంకరార్ధశరీరిణీ ।**
**విష్ణుర్మహేశ్వరో లక్ష్మీర్భవానీ పరమేశ్వరీ ॥7॥**

**వజ్రపాణిర్మహాదేవః శచీ శైలేంద్రకన్యకా ।**
**జాతవేదా స్వయం రుద్రః స్వాహా శర్వార్ధకాయినీ ॥8॥**

**యమస్త్రియంబకో వేదస్తత్ప్రియా గిరికన్యకా ।**
**వరుణో భగవాన్ రుద్రో గౌరీ సర్వార్థదాయినీ ॥9॥**

**బాలేందుశేఖరో వాయుః శివా శివమనోరమా ।**
**చంద్రార్ధమౌళిర్యక్షేంద్రః స్వయమృద్ధిః శివా స్మృతా ॥10॥**

**చంద్రార్ధశేఖరశ్చంద్రో రోహిణీ రుద్రవల్లభా ।**
**సప్తసప్తిః శివః కాంతా ఉమాదేవీ సువర్చలా ॥11॥**

శివుడు బ్రహ్మదేవుడు. శంకరుడి అర్ధ దేహాన్ని పొందిన పార్వతీదేవి సావిత్రీదేవి అవుతున్నది. మహేశ్వర శివుడు విష్ణువు. పరమేశ్వరి భవానీదేవి లక్ష్మీదేవి. మహాదేవ శివుడు వజ్రధారి ఇంద్రుడు. పర్వతరాజపుత్రిక ఉమాదేవి శచీదేవి. స్వయంగా రుద్రుడే అగ్ని. దాంతో పార్వతి స్వాహాదేవి. త్రినేత్రుడు శివుడు యముడు. గిరిపుత్రి పార్వతి ఆతడి ప్రియపత్ని. రుద్రభగవానుడు వరుణదేవుడు. సమస్తాభీష్ట ప్రదాయిని అయిన పార్వతీదేవి ఆతడి భార్య. బాలచంద్రుడిని మస్తకంపై ధరించు శివుడు వాయుదేవుడు. శివుడివల్లభ అయిన పార్వతి ఆతడి భార్య. చంద్రచూడుడై శోభిల్లు శివుడు కుబేరుడు. సాక్షాత్తు పార్వతీదేవి కుబేరపత్ని బుద్ధి అవుతున్నది. చంద్రశేఖరుడు చంద్రుడు. రుద్రప్రియపార్వతి రోహిణి. రుద్రభగవానుడు సూర్యదేవుడు. పార్వతీదేవి ఆతడి భార్య సువర్చల అవుతున్నది.

**షణ్ముఖస్త్రిపురధ్వంసీ దేవసేనా హరప్రియా! ।**
**ఉమాప్రసూతిర్విజ్ఞేయా దక్షో దేవో మహేశ్వరః ॥ 12॥**

**పురుషాఖ్యో మనుః శంభుః శతరూపా శివప్రియా ।**
**విదుర్భవానీమాకూతిం రుచిం చ పరమేశ్వరం ॥13॥**

**భృగుర్భగాక్షిహా దేవః ఖ్యాతిస్త్రినయనప్రియా ।**
**మరీచిర్భగవాన్ రుద్రః సంభూతిర్వల్లభా విభోః ॥14॥**

**విదుర్భవానీం రుచిరాం కవిం చ పరమేశ్వరమ్ ।**
**గంగాధరోఽంగిరా జ్ఞేయః స్మృతిః సాక్షాదుమా స్మృతా ॥15॥**

**పులస్త్యః శశభృన్మౌళిః ప్రీతిః కాంతా పినాకినః ।**
**పులహస్త్రిపురధ్వంసీ దయా కాలరిపుప్రియా ॥16॥**

**క్రతుర్దక్షక్రతుధ్వంసీ సన్నతిర్దయితా విభోః ।**
**త్రినేత్రోఽత్రిరుమా సాక్షాదనసూయా స్మృతా బుధైః ॥17॥**

**ఊర్జామాహురుమాం వృద్ధాం వసిష్ఠం చ మహేశ్వరమ్ ।**
**శంకరః పురుషాః సర్వే ప్రియః సర్వా మహేశ్వరీ ॥18॥**

త్రిపురారి అయిన శివుడు కార్తికేయుడయ్యాడు. శివప్రియ పార్వతి ఆతడి భార్య దేవసేన అయ్యింది. శివభగవానుడే దక్షప్రజాపతి అయి ఉమాదేవికి జన్మనిచ్చాడు. అపుడు శివుడు ఆమెకు జన్మనిచ్చినవాడు. శివుడు పురుషుడనే పేరుగల మనువు. పార్వతి ఆతడి భార్య శతరూప. పరమేశ్వరశివుడు రుచి అనే ప్రజాపతి. భవాని ఆతడి భార్య ఆకూతి. భగుడి నేత్రాన్ని నష్టపర్చిన శివుడు భృగుడు. త్రినేత్రుడి ప్రియసతి ఉమాదేవి 'ఖ్యాతి' అవుతున్నది. రుద్రభగవానుడు మరీచి మహర్షి. పార్వతీదేవి సంభూతి. పరమేశ్వర శివుడు శుక్రుడు. పార్వతీదేవి 'రుచిర'. గంగాధర శివుడు అంగీరసుడైతే సాక్షాత్ ఉమాదేవి 'స్మృతి' అని తెలియాలి. చంద్రశేఖర శంకరుడు పులస్త్యుడు. పార్వతీదేవి ప్రీతి. త్రిపురవిధ్వంసి అయిన శివుడు పులహఋషి. కాలరిపుడు శివుడి భార్య ఉమాదేవి 'దయ'. దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసిన శివుడు క్రతువు. సర్వవ్యాపి శివుడి భార్య పార్వతి సన్నతి అవుతున్నది. విద్వాంసులు శివుడిని అత్రి మహర్షి అని పార్వతిని అనసూయాదేవి అంటున్నారు. మహేశ్వర శివుడు వసిష్ఠుడు. శ్రేష్ఠ అయిన ఉమాదేవి ఊర్జ. లోకంలో పురుషులందరూ ఒక్క శివుడే. దాంతో స్త్రీలందరూ పార్వతీ స్వరూపులే.

**పుంలింగశబ్దవాచ్యా యే తే చ రుద్రాః ప్రకీర్తితాః ।**
**స్త్రీలింగశబ్దవాచ్యా యాః సర్వా గౌర్యా విభూతయః ॥19॥**

**సర్వే స్త్రీపురుషాః ప్రోక్తాస్తయోరేవ విభూతయః ।**
**పదార్థశక్తయో యా యాస్తా గౌరీతి విదుర్బుధాః ॥20॥**

**సా సా విశ్వేశ్వరీ దేవీ స చ సర్వో మహేశ్వరః ।**
**శక్తిమంతః పదార్థా యే స చ సర్వో మహేశ్వరః ॥21॥**

పుంలింగశబ్దవాచకాలైన పదార్థాలన్నీ రుద్రభగవానుడే. స్త్రీలింగశబ్దవాచకపదార్థాలన్నీ గౌరీదేవియొక్క విభూతులే. స్త్రీపురుషులందరూ ఈ యిద్దరియొక్క ఐశ్వర్యాలే. పదార్థాల శక్తులన్నీ పార్వతీదేవే. విద్వాంసులు ఇలా అన్నారు. పదార్థాలశక్తి విశ్వేశ్వరి అయిన ఉమాదేవిది అయితే ఆ సమస్తపదార్థాలు భగవాన్ మహేశ్వరుడే. శక్తితో కూడిన పదార్థం మొత్తం మహేశ్వరశివరూపమే.

**అష్టౌ ప్రకృతయో దేవ్యా మూర్తయః పరికీర్తితాః ।**
**తథా వికృతయస్తస్యా దేహ బద్ధవిభూతయః ॥22॥**

**విస్ఫులింగా యథా తావదగ్నౌ చ బహుధా స్మృతాః ।**
**జీవాః సర్వే తథా శర్వో ద్వంద్వసత్త్వముపాగతః ॥ 23॥**

**గౌరీ రూపాణి సర్వాణి శరీరాణి శరీరిణమ్ ।**
**శరీరిణస్తథా సర్వే శంకరాంశా వ్యవస్థితాః ॥24॥**

అష్టప్రకృతులు దేవియొక్క మూర్తులు. మరియు వికృతులన్నీ ఆమెయొక్క దేహబద్ధమైన విభూతులే. ఏ విధంగా అగ్నిలో అనేకమైన విస్ఫులింగాలు ఉంటాయో ఆ విధంగానే ద్వంద్వసత్త్వాన్ని పొంది శివుడిలో జీవులన్నీ స్థితి చెంది యున్నాయి. జీవుల సమస్తశరీరాలు గౌరీదేవి రూపాలు. జీవమంతా శంకరుడియొక్క అంశరూపంగా ఆ శరీరాలలో నిల్చి ఉంటున్నది.

**శ్రావ్యం సర్వముమారూపం శ్రోతా దేవో మహేశ్వరః ।**
**విషయిత్వం విభుర్ధత్తే విషయాత్మకతాముమా ॥25॥**

**స్రష్టవ్యం వస్తుజాతం తు ధత్తే శంకరవల్లభా ।**
**స్రష్టా స ఏవ విశ్వాత్మా బాలచంద్రార్ధశేఖరః ॥26॥**

**దృశ్యవస్తు ప్రజారూపం బిభర్తి భువనేశ్వరీ ।**
**ద్రష్టా విశ్వేశ్వరో దేవః శశిఖండశిఖామణిః ॥27॥**

విన్పించేదంతా పార్వతి స్వరూపం. వినేవాడు మహేశ్వర శివుడు. శివుడు విషయాల ఆస్వాదకత్వాన్ని ధరిస్తున్నాడు. పార్వతీదేవి విషయాత్మకతను ధరిస్తున్నది. శంకరప్రియపత్ని పార్వతి సృష్టించడానికి యోగ్యమైన అన్ని వస్తువుల్ని ధరిస్తున్నది. అర్ధబాలచంద్రచూడుడు, విశ్వాత్ముడు శివుడు ఆ వస్తువుల సృష్టికర్త. భువనేశ్వరి ఉమాదేవి సమస్తమైన ప్రజారూపమైన దృశ్యవస్తు జాలాన్ని ధరిస్తున్నది. చంద్రశేఖర శివభగవానుడు వాటియొక్క ద్రష్ట అయ్యాడు.

**రసజాతముమారూపం ఘ్రేయజాతం చ సర్వశః ।**
**దేవో రసయితా శంభుర్ఘ్రాతా చ భువనేశ్వరః ॥28॥**

**మంతవ్యవస్తుతాం ధత్తే మహాదేవీ మహేశ్వరీ ।**
**మంతా స ఏవ విశ్వాత్మా మహాదేవో మహేశ్వరః ॥29॥**

**బోద్ధవ్యం వస్తురూపం చ బిభర్తి భవవల్లభా ।**
**దేవః స ఏవ భగవాన్ బోద్ధా బాలేందుశేఖరః ॥30॥**

సంపూర్ణంగా రసరూపం ఉమాదేవిది. శివుడు రసాన్ని గ్రహించేవాడు. వాసన చూడదగిన వస్తుసమూహం ఉమాదేవి. శివుడు వాటిని వాసన చూసేవాడు. ఘ్రాత అవుతున్నాడు. మహాదేవి పార్వతి మాననీయయోగ్యమైన వస్తుతాభావాన్ని ధరిస్తున్నది. విశ్వాత్మా మహాదేవుడు వాటిని గౌరవిస్తున్నాడు. శివప్రియ పార్వతి బోధ చేయడానికి అర్హమైన వస్తువుల్ని ధరిస్తున్నది. బాలచంద్రచూడుడు వాటికి బోద్ధ అవుతున్నాడు.

**పీఠాకృతిరూపా దేవీ లింగరూపశ్చ శంకరః ।**
**ప్రతిష్ఠాప్య ప్రయత్నేన పూజయంతి సురాసురాః ॥ 31॥**

**యే యే పదార్థా లింగాంగాస్తే తే శర్వవిభూతయః ।**
**అర్థా భగాంకితా యే యే తే తే గౌర్యా విభూతయః ॥32॥**

**స్వర్గపాతాళ లోకాంత బ్రహ్మాండావరణాష్టకమ్ ।**
**జ్ఞేయం సర్వముమారూపం జ్ఞాతా దేవో మహేశ్వరః ॥33॥**

**బిభర్తి క్షేత్రతాం దేవీ త్రిపురాంతకవల్లభా ।**
**క్షేత్రజ్ఞత్వమథో ధత్తే భగవానంధకాంతకః ॥34॥**

ఉమాదేవి పీఠాకార. శివుడు అందు స్థితుడైన లింగరూపుడు. దేవతలు, దానవులు లింగాన్ని వేదికరూపంలో స్థాపించి ప్రయత్నపూర్వకంగా పూజిస్తున్నారు. ఏ ఏ పదార్థాలు పురుషచిహ్నాలు గలవో అవి శివభగవానుడి ఐశ్వర్యాలు. ఏ యే పదార్థాలు స్త్రీ చిహ్నాలుగలవో అవి పార్వతీదేవి ఐశ్వర్యాలు. స్వర్గంనుంచి పాతాళలోకం వరకు

ఎనిమిది ఆవరణలు గలవారు, బ్రహ్మాండంలో వారుకూడా తెలియదగిన యోగ్యతగలవారు. వారందరూ పార్వతీ స్వరూపులు. వారిని ఎరిగినవాడు మహేశ్వరుడే. త్రిపురసంహారి శివుడి ప్రియురాలు పార్వతీదేవి క్షేత్రాన్ని (లింగశరీరరూపమైన) ధరిస్తున్నది. అంధకాసురసంహారి శివభగవానుడు క్షేత్రజ్ఞత్వాన్ని (జీవస్వరూపత్వాన్ని) ధరిస్తున్నాడు.

**శివలింగం సముత్సృజ్య యజంతే చాన్యదేవతాః ।**
**స నృపః సహ దేశేన రౌరవం నరకం వ్రజేత్ ॥35॥**

**శివభక్తో న యో రాజా భక్తోఽన్యేషు సురేషు యః ।**
**స్వపతిం యువతిస్త్యక్త్వా యథా జారేషు రాజతే ॥36॥**

**బ్రహ్మాదయః సురాః సర్వే రాజానశ్చ మహర్ధికాః ।**
**మానవా మునయశ్చైవ సర్వే లింగం యజంతి చ ॥37॥**

**విష్ణునా రావణం హత్వా ససైన్యం బ్రహ్మణః సుతమ్ ।**
**స్థాపితం విధివద్భక్త్యా లింగం తీరే నదీపతేః ॥38॥**

ఏ రాజ్యంలో ప్రజలు శివలింగాల్ని విడిచి ఇతరదేవతల్ని పూజిస్తున్నారో, ఏరాజు శివభక్తుడు కాక ఇతరదేవతల భక్తుడు అవుతాడో, ప్రజలతోపాటు ఆతడుకూడా రౌరవ నరకం పొందుతాడు. ఏ రాజు శివభక్తుడు కాడో, మరియు ఇతర దేవతల భక్తుడో ఆతడు ఒక యువతి తన భర్తను విడిచి పరపురుషుడిలో ఆసక్తి కలిగియున్నట్లు కాగలదు. బ్రహ్మాదిదేవతలందరూ, పెద్దపెద్ద ఐశ్వర్యశాలురైన రాజులు, మానవులు మునిగణాలు శివలింగాన్ని పూజిస్తున్నారు. విష్ణుభగవానుడు కూడా రామావతారంలో సేనాసమేతుడై బ్రహ్మపుత్రుడైన రావణాసురుడిని సంహరించి సముద్రతటంలో విధ్యుక్తంగా శివలింగాన్ని స్థాపించాడు.

**కృత్వా పాపసహస్రాణి హత్వా విప్రశతం తథా ।**
**భావాత్సమాశ్రితో రుద్రం ముచ్యతే నాత్ర సంశయః ॥39॥**

**సర్వే లింగమయా లోకాః సర్వే లింగే ప్రతిష్ఠితాః ।**
**తస్మాదభ్యర్చయేల్లింగం యదీచ్ఛేచ్ఛాశ్వతం పదమ్ ॥40॥**

**సర్వాకారౌ స్థితావేతౌ నరైః శ్రేయోఽర్థిభిః శివౌ ।**
**పూజనీయౌ నమస్కార్యౌ చింతనీయౌ చ సర్వదా ॥41॥**

వేయి పాపాలు చేసి, నూర్గురు విప్రుల్ని చంపి, భక్తి పూర్వకంగా రుద్రభగవానుడిని మిక్కిలిగా ఆశ్రయిస్తే వారు ముక్తులవుతున్నారు. ఇందులో సందేహం లేదు. ఈ సమస్తప్రపంచం లింగమయమే. అంతా లింగమందే ఉన్నది. ఎవడు శాశ్వతమైన పదాన్ని కోరుతున్నాడో ఆతడు శివలింగపూజ అవశ్యంగా చేయాలి. ఏ మానవులు తమకు శుభాలు కలగాలని కోరుకుంటున్నారో సర్వస్వరూపులైన ఆ ఇద్దరిని శివపార్వతుల్ని ఎల్లప్పుడూ పూజిస్తూ నమస్కరిస్తూ, చింతిస్తూ జీవించాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే శివవిభూతిమహిమవర్ణనం నామైకాదశోఽధ్యాయః ॥11॥**

శ్రీలింగమహాపురాణం, ఉత్తరభాగంలోని శివవిభూతిమహిమవర్ణన అనే పదకొండవ అధ్యాయం సమాప్తం

## ద్వాదశోఽధ్యాయః - పన్నెండవ అధ్యాయం
## శివవిశ్వరూపవర్ణనమ్ - శివవిశ్వరూపవర్ణన

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**మూర్తయోఽష్టౌ మమాచక్ష్వ శంకరస్య మహాత్మనః ।**
**విశ్వరూపస్య దేవస్య గణేశ్వర మహామతే ॥1॥**

ఓ గణేశ్వరా! ఓ మహామతీ! విశ్వరూపుడు మహాత్ముడు అయిన శంకరభగవానుడి యొక్క అష్టమూర్తుల్ని నీవు నాకు వివరించు.

**నందికేశ్వర ఉవాచ** - నందికేశ్వరుడు పలికాడు.

**హంత తే కథయిష్యామి మహిమానముమాపతేః ।**
**విశ్వరూపస్య దేవస్య సరోజభవసంభవ ॥ 2॥**

**భూరాపోఽగ్నిర్మరుద్వ్యోమ భాస్కరో దీక్షితః శశీ ।**
**భవస్య మూర్తయః ప్రోక్తాః శివస్య పరమేష్ఠినః ॥3॥**

**ఖాత్మేందువహ్నిసూర్యాంభోధరాః పవన ఇత్యపి ।**
**తస్యాష్టమూర్తయః ప్రోక్తా దేవదేవస్య ధీమతః ॥4॥**

**అగ్నిహోత్రేఽర్పితే తేన సూర్యాత్మని మహాత్మని ।**
**తద్విభూతాస్తథా సర్వే దేవాస్తృప్యంతి సర్వదా ॥5॥**

**వృక్షస్య మూలసేకేన యథా శాఖోపశాఖికాః ।**
**తథా తస్యార్చయా దేవాస్తథా స్యుస్తద్విభూతయః ॥6॥**

ఓ కమలయోని అయిన బ్రహ్మదేవుడికుమారా! ఉమాపతి, విశ్వరూపుడు మహాదేవుడు అయిన శివుడి మహిమ వర్ణన నీకోసం తప్పక చేస్తాను. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, యజమానుడు ఈ ఎనిమిది శివభగవానుడియొక్క మూర్తులుగా చెప్పబడ్డాయి. ఆకాశం, ఆత్మ (జీవం), చంద్రుడు, అగ్ని, సూర్యుడు, జలం, భూమి, వాయువు ఇవి బుద్ధి సంపన్నుడు దేవాధిదేవుని అష్టమూర్తులు. ఈ విధంగా అగ్నిలో విధిపూర్వకంగా సమర్పించిన ఆహుతి, సూర్యుడికి ప్రదత్తమైన అర్ఘ్యం మొదలైనవి అట్లే పరమాత్మకై సమర్పించిన పదార్థాలు వాటి సమస్తఐశ్వర్యాలు - వీటితో ఎల్లప్పుడు సమస్తదేవతలు తృప్తులవుతున్నారు. వృక్షమూలంలో పోసిన నీటిని శాఖలు, ఉపశాఖలు గ్రహించినట్లు.

**తస్య ద్వాదశధా భిన్నం రూపం సూర్యాత్మకం ప్రభోః ।**
**సర్వదేవాత్మకం యాజ్యం యజంతి మునిపుంగవాః ॥7॥**

ఈ శివప్రభువు పండ్రెండు విధాల వేరైన సూర్యాత్మకులరూపమై యున్నాడు. ద్వాదశాదిత్యులు శివుడే. మునిశ్రేష్ఠులు ఈయన్ని సర్వదేవాత్మకుడైన పూజ్యమైన రూపంగలవాడుగా యజిస్తున్నారు.

**అమృతాఖ్యా కలా తస్య సర్వస్యాదిత్యరూపిణః ।**
**భూతసంజీవనీ చేష్టా లోకేఽస్మిన్ పీయతే సదా ॥8॥**

ఆదిత్యస్వరూపుడైన శివభగవానుడియొక్క అమృతనామకమైన కళ ప్రాణులకు జీవనాన్ని ప్రదానం చేస్తున్నది. ఈ లోకంలో అందరూ ఇష్టంగా ఈ కళను ఎల్లప్పుడూ పానం చేస్తున్నారు.

**చంద్రాఖ్యకిరణాస్తస్య ధూర్జటేర్భాస్కరాత్మనః ।**
**ఓషధీనాం వివృద్ధ్యర్థం హిమవృష్టిం వితన్వతే ॥9॥**

సూర్యరూపుడైన శివభగవానుడి చంద్రనామకమైన కిరణం ఓషధుల వృద్ధికోసం హిమవృష్టిని విస్తరింపజేస్తున్నది.

**శుక్లాఖ్యా రశ్మయస్తస్య శంభోర్మార్తండరూపిణః ।**
**ధర్మం వితన్వతే లోకే సస్యపాకాదికారణమ్ ॥10॥**

మార్తాండరూపుడైన శివుడియొక్క శుక్లమనే పేరుగల కిరణం లోకంలో సస్యాల్ని, శాకాల్ని పచించే వేడిని పుట్టిస్తున్నది.

**దివాకరాత్మనస్తస్య హరికేశాహ్వయః కరః ।**
**నక్షత్రపోషకశ్చైవ ప్రసిద్ధః పరమేష్ఠినః ॥11॥**

**విశ్వకర్మాహ్వయస్తస్య కిరణో బుధపోషకః ।**
**సర్వేశ్వరస్య దేవస్య సప్తసప్తిస్వరూపిణః ॥12॥**

**విశ్వవ్యచ ఇతి ఖ్యాతః కిరణస్తస్య శూలినః ।**
**శుక్రపోషకభావేన ప్రతీతః సూర్యరూపిణః ॥13॥**

**సంయద్వసురితి ఖ్యాతో యస్య రశ్మిస్త్రిశూలినః ।**
**లోహితాంగం ప్రపుష్ణాతి సహస్రకిరణాత్మనః ॥14॥**

**అర్వావసురితి ఖ్యాతో రశ్మిస్తస్య పినాకినః ।**
**బృహస్పతిం ప్రపుష్ణాతి సర్వదా తపనాత్మనః ॥15॥**

**స్వరాడితి సమాఖ్యాతః శివస్యాంశుః శనైశ్చరమ్ ।**
**హరిదశ్వాత్మనస్తస్య ప్రపుష్ణాతి దివానిశమ్ ॥16॥**

**సూర్యాత్మకస్య దేవస్య విశ్వయోనేరుమాపతేః ।**
**సుషుమ్ణాఖ్యం సదా రశ్మిః పుష్ణాతి శిశిరద్యుతిమ్ ॥17॥**

సూర్యరూపుడైన పరమేష్ఠి శివుడియొక్క హరికేశమనే పేరుగల ప్రసిద్ధమైన కిరణం నక్షత్రాలకు కాంతిని ప్రదానం చేస్తున్నది. సూర్యస్వరూపుడైన సర్వేశ్వర శివుడియొక్క విశ్వకర్మ అనే పేరుగల కిరణం బుధనక్షత్రాన్ని పోషిస్తున్నది. సూర్యస్వరూపుడైన శూలధారి శివుడియొక్క 'విశ్వవ్యచ' అనేపేరుగల ప్రసిద్ధ కిరణం శుక్రుడిని పోషిస్తున్నది. సూర్యరూపుడైన శూలధారి శివుడియొక్క 'సంయద్వసు' అనే పేరుతో ప్రసిద్ధి పొందిన కిరణం మంగళనక్షత్రాన్ని పోషిస్తున్నది. ఇట్లే సూర్యరూపుడైన పినాకి అయిన శివుడియొక్క అర్వావసు అనే కిరణం ఎల్లప్పుడు బృహస్పతిని పోషిస్తున్నది. సూర్యరూపుడైన శివుడి స్వరాట్ అనే పేరుగల కిరణం సూర్యరూపుడైన శివుడి హరిదశ్వ అనే కిరణం పగటిని రాత్రిని కలిగిస్తున్నది. శనినక్షత్రాన్ని పోషిస్తున్నది. విశ్వాన్ని ఉత్పన్నం చేసే పార్వతీపతి, సూర్యరూపుడైన మహాదేవశివుడి 'సుషుమ్ణ' అనే పేరుగల కిరణం ఎల్లప్పుడు చంద్రుడిని పోషిస్తున్నది.

**సౌమ్యానాం వసుజాతానాం ప్రకృతిత్వముపాగతా ।**
**తస్య సోమాహ్వయా మూర్తిః శంకరస్య జగద్గురోః ॥18॥**

**తస్య సోమాత్మకం రూపం శుక్రత్వేన వ్యవస్థితమ్ ।**
**శరీరభాజాం సర్వేషాం దేవస్యాంతకశాసినః ॥19॥**

**శరీరిణామశేషాణాం మనస్యేవ వ్యవస్థితమ్ ।**
**వపుః సోమాత్మకం శంభోస్తస్య సర్వజగద్గురోః ॥20॥**

జగద్గురువైన శంకరభగవానుడి సోముడనే పేరుగల మూర్తి సమస్తమైన శాంతకిరణాలకు కారణం అవుతున్నది. అంతకుడినే శాసించే శివుడియొక్క సోమాత్మకరూపం సమస్తదేహధారులందు శుక్రరూపంలో (వీర్యం) నిలిచి ఉంటున్నది. సమస్తజగత్తుకు గురువైన శివుడియొక్క చంద్రరూపమైన శరీరం జీవులందరి మనసులో ప్రతిష్ఠితమై ఉన్నది.

**శంభోః షోడశధా భిన్నా స్థితామృతకళాత్మనః ।**
**సర్వభూతశరీరేషు సోమాఖ్యా మూర్తిరుత్తమా ॥21॥**

చంద్రరూపుడైన శివుడియొక్క సోమనామకమైన ఉత్తమమూర్తి ప్రాణులందరి శరీరాలలో పదహారు విధాల విభిన్నరూపాలలో నిలిచి ఉన్నది.

**దేవాన్ పిత్రాంశ్చ పుష్ణాతి సుధయామృతయా సదా ।**
**మూర్తిః సోమాహ్వయా తస్య దేవదేవస్య శాసితుః ॥22॥**

దేవాధిదేవుడైన శివప్రభువుయొక్క చంద్రనామకమైన మూర్తి తనయొక్క శాశ్వతమైన సుధతో దేవతల్ని, పితరుల్ని ఎల్లప్పుడూ సంతృప్తుల్ని చేస్తున్నది.

**పుష్ణాత్యోషధి జాతాని దేహినామాత్మశుద్ధయే ।**
**సోమాహ్వయా తనుస్తస్య భవానీమితి నిర్దిశేత్ ॥23॥**

శివుడియొక్క సోమనామకమైన మూర్తి ప్రాణులయొక్క దేహశుద్ధికై సమస్తమైన ఓషధుల్ని పెంచుతున్నది. ఈ మూర్తి పార్వతీదేవిది అని కూడా తెలియాలి.

**యజ్ఞానాం పతిభావేన జీవానాం తపసామపి ।**
**ప్రసిద్ధరూపమేతద్వై సోమాత్మకముమాపతేః ॥24॥**

**జలానామోషధీనాం చ పతిభావేన విశ్రుతమ్ ।**
**సోమాత్మకం వపుస్తస్య శంభోర్భగవతః ప్రభోః ॥25॥**

పార్వతీపతి శివుడియొక్క చంద్రరూపమైన ఈ మూర్తి యజ్ఞం, జీవం, తపస్సు అనే ఆయన రూపాలుగా ప్రసిద్ధి చెందింది. సర్వశక్తిమంతుడు శంకరభగవానుడి చంద్రరూపమైన విగ్రహం జలం మరియు ఓషధులైన ఆయన రూపాలుగా ప్రసిద్ధి చెందాయి.

**దేవో హిరణ్మయో మృష్టః పరస్పరవివేకినః ।**
**కరణానామశేషాణాం దేవతానాం నిరాకృతిః ॥26॥**

ఆత్మ అనాత్మ సంబంధమైన విచారసంపన్నులైన జనులలో మిక్కిలి విచారసంపన్నుడు సదాశివుడే. వారు సమస్తమైన ఇంద్రియాల యొక్క దేవతలను గ్రహింపకున్నారు. అందుకే వారు విశుద్ధమైన అమృతరూపులు అవుతున్నారు.

**జీవత్వేన స్థితే తస్మిన్ శివే సోమాత్మకే ప్రభౌ ।**
**మధురా విలయం యాతి సర్వలోకైకరక్షిణీ ॥27॥**

చంద్రరూపుడైన శివభగవానుడి జీవరూపాత్మలో నిశ్చలత్వం కలగడంతో సమస్త ప్రజల్ని శాసించే 'మాయ' తిరోహితం అవుతున్నది.

**యజమానాహ్వయా మూర్తిః శైవీ హవ్యైరహర్నిశమ్ ।**
**పుష్ణాతి దేవతాః సర్వాః కవ్యైః పితృగణానపి ॥28॥**

శివుడియొక్క యజమానుడనే పేరుగల మూర్తి హవ్యపదార్థాలతో దేవతలందర్ని అట్లే కవ్యపదార్థాలతో పితృదేవతల్ని నిరంతరం సంతృప్తి చేస్తున్నది.

**యజమానాహ్వయా యా సా తనుశ్చాహుతిజా తయా ।**
**వృష్ట్యా భావయతి స్పష్టం సర్వమేవ పరాపరమ్ ॥ 29॥**

యజమానుడనే పేరుగల శివుడిమూర్తి ఏది ఉన్నదో, అది ఆహుతి జన్యమైన వర్షంతో పరాపరాలైన పదార్థాలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇది ప్రసిద్ధమైన విషయమే.

**అంతఃస్థం చ బహిఃస్థం చ బ్రహ్మాండానాం స్థితం జలమ్ ।**
**భూతానాం చ శరీరస్థం శంభోర్మూర్తిర్గరీయసీ ॥30॥**

బ్రహ్మాండాలలో లోపల అట్లే వెలుపల వ్యాపించి యున్న నీరు అట్లే ప్రాణుల శరీరంలోగల నీరు శివభగవానుడియొక్క శ్రేష్ఠమైన మూర్తే.

**నదీనామమృతం సాక్షాన్నదానమపి సర్వదా ।**
**సముద్రాణాం చ సర్వత్ర వ్యాపీ సర్వముమాపతిః ॥31॥**

**సంజీవినీ సమస్తానాం భూతానామేవ పావినీ ।**
**అంబికా ప్రాణసంస్థా యా మూర్తిరంబుమయీ పరా ॥32॥**

నదులలో, నదాలలో, సముద్రాలలో గల అమృతమయమైన సమస్త జలరూపంలో సర్వవ్యాపితుడైన శివుడే ఎల్లప్పుడూ వ్యాపించియున్నాడు. ఆ మూర్తి సమస్తజీవులకు జీవనాన్ని ప్రదానం చేస్తున్నది. మరియు వాటిని పవిత్రపరుస్తుంది. చంద్రరూపమైన ఏ మూర్తి పార్వతీదేవి హృదయమందుగలదో అదే శివభగవానుడియొక్క జలమయమైన మూర్తి అయి ఉన్నది.

**అంతస్థశ్చ బహిఃస్థశ్చ బ్రహ్మాండానాం విభావసుః ।**
**యజ్ఞానాం చ శరీరస్థః శంభోర్మూర్తిర్గరీయసీ ॥33॥**

**శరీరస్థా చ భూతానాం శ్రేయసీ మూర్తిరైశ్వరీ ।**
**మూర్తిః పావకసంస్థా యా శంభోరత్యంతపూజితా ॥34॥**

**భేదా ఏకోనపంచాశద్వేదవిద్భిరుదాహృతాః ।**
**హవ్యం వహతి దేవానాం శంభోర్యజ్ఞాత్మకం వపుః ॥35॥**

**కవ్యం పిత్రాణాంచ హూయమానం ద్విజాతిభిః ।**
**సర్వదేవమయం శంభోః శ్రేష్ఠమగ్న్యాత్మకం వపుః ॥36॥**

**వదంతి వేదశాస్త్రజ్ఞా యజంతి చ యథావిధి ।**

బ్రహ్మాండాలలో లోపల మరియు వెలుపల వ్యాపించిన మరియు యజ్ఞకుండాలలో నిలిచిన అగ్ని శివభగవానుడియొక్క అగ్నిరూపమైన శ్రేష్ఠమైన మూర్తి. జీవుల శరీరాలలోకూడా జఠరాగ్ని రూపంగా ఈశ్వరుడైన శివుడియొక్క కళ్యాణమయమైనమూర్తే ప్రకాశిస్తున్నది. శివభగవానుడియొక్క అగ్నిరూపమైన మూర్తి అత్యంతం పూజింపబడేది. అది నలభైతొమ్మిది భేదాలుగా ఉన్నది. శివభగవానుడి ఈ అగ్నిరూపవిగ్రహం ద్విజాతులవలన ఆహుతులివ్వబడి దేవతల విషయంలో హవ్యాన్ని, పితరుల విషయంలో కవ్యాన్ని తీసుకువెళుతున్నది. వేదవేత్తలు, శాస్త్రవేత్తలు శివభగవానుడి అగ్నిరూపమూర్తిని సర్వదేవమయంగా, శ్రేష్ఠమైన దానినిగా చెబుతున్నారు. మరియు విధ్యుక్తంగా దానిని పూజిస్తున్నారు.

**అంతఃస్థో జగదండానాం బహిఃస్థశ్చ సమీరిణః ॥37॥**

**శరీరస్థశ్చ భూతానాం శైవీ మూర్తిః పటీయసీ ।**
**ప్రాణాద్యా నాగకూర్మాద్యా ఆవహాద్యాశ్చ వాయవః ॥38॥**

**ఈశానమూర్తేరేకస్య భేదాః సర్వే ప్రకీర్తితాః ।**

బ్రహ్మాండాలలో లోపల అట్లే వెలుపల ఉన్నట్టియు, మరియు జీవుల శరీరంలో ఉన్నట్టియు వాయువు శివుడియొక్క మహిమామయి అయిన మూర్తి. ప్రాణాదులైన, నాగ–కూర్మాదులైన మరియు ఆహవాదులైన వాయువులన్నీ ఏకమాత్రుడైన శివుడియొక్క మూర్తి భేదాలే.

**అంతఃస్థం జగదండానాం బహిఃస్థం చ వియద్విభోః ॥39॥**

**శరీరస్థం చ భూతానాం శంభోర్మూర్తిర్గరీయసీ ।**
**శంభోర్విశ్వంభరా మూర్తిః సర్వబ్రహ్మాధిదేవతా ॥40॥**

**చరాచరాణాం భూతానాం సర్వేషాం ధారణే మతా ।**

బ్రహ్మాండాలలో లోపల మరియు వెలుపల ఉన్నట్టి మరియు ప్రాణులదేహగతమైనట్టి ఆకాశం సర్వవ్యాపి అయిన శంభుని యొక్క మహిమాన్వితమైన మూర్తే. శివభగవానుడియొక్క ధరారూపమైన మూర్తి బ్రాహ్మణులందరికీ ముఖ్యమైన దేవత. అట్లే చరాచరప్రాణుల్ని ధరించునట్టిది.

**చరాచరాణాం భూతానాం శరీరాణి విదుర్బుధాః ॥41॥**

**పంచకేనేశమూర్తీనాం సమారబ్ధాని సర్వథా ।**
**పంచభూతాని చంద్రార్కావాత్మేతి మునిపుంగవాః ॥42॥**

**మూర్తయోఽష్టౌ శివస్యాహుర్దేవదేవస్య ధీమతః ।**
**ఆత్మా తస్యాష్టమీ మూర్తిర్యజమానాహ్వయా పరా ॥43॥**

**చరాచరశరీరేషు సర్వేష్వేవ స్థితా తదా ।**
**దీక్షితం బ్రాహ్మణం ప్రాహురాత్మానం చ మునీశ్వరాః ॥44॥**

**యజమానాహ్వయా మూర్తిః శివస్య శివదాయినః ।**
**మూర్తయోఽష్టౌ శివస్యైతా వందనీయాః ప్రయత్నతః ॥45॥**

**శ్రేయోఽర్థిభిర్నరైర్నిత్యం శ్రేయసామేకహేతవః ॥46॥**

స్థావరజంగమప్రాణుల శరీరం శివభగవానుడియొక్క మూర్తులైన పంచమహాభూత సముదాయం చేత బాగా ఉత్పన్నం అయ్యాయి. ఇది విద్వాంసులమాట. మునిశ్రేష్ఠులు పంచభూతాలు (భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం) చంద్రుడు, సూర్యుడు మరియు ఆత్మా ఈ ఎనిమిది ధీమంతుడైన శివుడి మూర్తులు అంటున్నారు. ఈ ఎనిమిదింటిలో శ్రేష్ఠమైనది ఆత్మ. అదే యజమాని అనే పేరుగలది. అది చరాచరప్రాణుల శరీరాలలో ఎల్లప్పుడూ ఉంటున్నది. మునీశ్వరులు యజ్ఞదీక్షితుడైన బ్రాహ్మణుడిని కూడా ఆత్మగా చెబుతున్నారు. అందుకే కళ్యాణకారుడైన శివుడు యజమానుడనే పేరుగల మూర్తిమంతుడుగా చెప్పబడ్డాడు. తమకు కళ్యాణాన్ని అభిలషించే మానవులు శివభగవానుడియొక్క కళ్యాణసాధన భూతాలైన అష్టమూర్తులకు ప్రయత్నపూర్వకంగా నిత్యం నమస్కరించాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే శివవిశ్వరూపవర్ణనం నామ ద్వాదశోఽధ్యాయః ॥12॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని శివవిశ్వరూపవర్ణన అనే పేరుగల పంద్రెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయోదశోऽధ్యాయః - పదమూడవ అధ్యాయం

## శివాష్టమూర్తివర్ణనమ్ - శివాష్టమూర్తివర్ణన

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**భూయోऽపి వద మే నందిన్ మహిమానముమాపతేః ।**
**అష్టమూర్తేర్మహేశస్య శివస్య పరమేష్ఠినః ॥1॥**

ఓ నందీశ్వరా! పార్వతీపతి, పరమేష్ఠి అయిన శివుడియొక్క అష్టమూర్తుల మహిమను నాకు మరల చెప్పు.

**నందికేశ్వర ఉవాచ** - నందికేశ్వరుడు పలికాడు.

**వక్ష్యామి తే మహేశస్య మహిమానముమాపతేః ।**
**అష్టమూర్తేర్జగద్వ్యాప్య స్థితస్య పరమేష్ఠినః ॥2॥**

**చరాచరాణాం భూతానాం ధాతా విశ్వంభరాత్మకః ।**
**శర్వ ఇత్యుచ్యతే దేవః సర్వశాస్త్రార్థపారగైః ॥3॥**

**విశ్వంభరాత్మనస్తస్య శర్వస్య పరమేష్ఠినః ।**
**వికేశీ కథ్యతే పత్నీ తనయోऽంగారకః స్మృతః ॥4॥**

జగత్తులందు వ్యాపించియున్న పరమేష్ఠి ఉమాపతి మహేశ్వరుడి యొక్క అష్టమూర్తుల మహిమ గూర్చి నేను నీకు చెబుతాను. చరాచరప్రాణుల్ని ధరించేవాడు, పృథ్వీస్వరూపుడు శివుడిని సమస్త శాస్త్రాలలోను పండితులైన వారు 'శర్వు'డని చెబుతున్నారు. పృథ్వీరూపుడు, పరమేష్ఠి అయిన శర్వుడి పత్ని వికేశి. పుత్రుడు అంగారకుడు (మంగళుడు).

**భవ ఇత్యుచ్యతే దేవో భగవాన్ వేదవాదిభిః ।**
**సంజీవనస్య లోకానాం భవస్య పరమాత్మనః ॥5॥**

**ఉమా సంకీర్తితా దేవీ సుతః శుక్రశ్చ సూరిభిః ।**

వేదవేత్తలైనవారు జలమూర్తి అయిన శివుడు 'భవుడని' చెబుతున్నారు. పండితులు, ప్రజలకు జీవన ప్రదానుడైన, పరమాత్మ అయిన భవుడి భార్య ఉమాదేవి అని, పుత్రుడు శుక్రుడని చెబుతున్నారు.

**సప్తలోకాండకవ్యాపీ సర్వలోకైకరక్షితా ॥6॥**

**వహ్న్యాత్మా భగవాన్ దేవః స్మృతః పశుపతిర్బుధైః ।**
**స్వాహా పత్న్యాత్మనస్తస్య ప్రోక్తా పశుపతేః ప్రియా ॥7॥**

**షణ్ముఖో భగవాన్ దేవో బుధైః పుత్ర ఉదాహృతం ।**

ఏడులోకాల ప్రాణులందరియందు వ్యాపించి ఉన్నవాడు, అట్లే సర్వలోకరక్షకుడు అగ్నిరూపుడు అయిన శివభగవానుడిని విద్వాంసులు పశుపతి అంటున్నారు. ఆ పరమాత్మ పశుపతి యొక్క భార్య స్వాహాదేవి. ఆయన పుత్రుడు భగవాన్ కార్తికేయుడు.

**సమస్తభువనవ్యాపీ భర్తా సర్వశరీరిణాం ॥8॥**

**పవనాత్మా బుధైర్దేవ ఈశాన ఇతి కీర్త్యతే ।**
**ఈశానస్య జగత్కర్తుర్దేవస్య పవనాత్మనః ॥9॥**

**శివా దేవీ బుధైరుక్తా పుత్రశ్చాస్య మనోజవః ।**

సర్వభువనాలలోనూ వ్యాపించినవాడు, సమస్త జీవుల్ని భరించి పోషించేడాడు పవనరూపుడైన శివుడిని విద్వాంసులు ఈశానుడని, పత్ని భగవతిని 'శివ' అని పండితులమాట. మరియు మనోజవుడు వారి పుత్రుడు.

**చరాచారాణాం భూతానాం సర్వేషాం సర్వకామదః ॥10॥**
**వ్యోమాత్మా భగవాన్ దేవో భీమ ఇత్యుచ్యతే బుధైః ।**
**మహామహిమ్నో దేవస్య భీమస్య గగనాత్మనః ॥11॥**

**దిశో దశ స్మృతా దేవ్యః సుతః సర్గశ్చ సూరిభిః ।**

సమస్తస్థావరజంగమప్రాణులయొక్క సమస్త కోరికల్ని తీర్చే ఆకాశరూపుడైన శివభగవానుడిని విద్వాంసులు 'భీము'డని చెబుతున్నారు. మహామహిమవ్యోమాత్ముడైన ప్రభువు భీముడికి దశదిక్కులు పత్నులు. సర్గుడు పుత్రుడు.

**సూర్యాత్మా భగవాన్ దేవః సర్వేషాం చ విభూతిదః ॥12॥**

**రుద్ర ఇత్యుచ్యతే దేవైర్భగవాన్ భుక్తిముక్తిదః ।**
**సూర్యాత్మకస్య రుద్రస్య భక్తానాం భక్తిదాయినః ॥13॥**

**సువర్చలా స్మృతా దేవీ సుతశ్చాస్య శనైశ్చరః ।**

అందరికి ఐశ్వర్య ప్రదాయి అయిన సూర్యరూపుడైన శివభగవానుడిని భుక్తిముక్తి ప్రదాత అయిన రుద్రుడు అంటున్నారు దేవతలు. భక్తులకు భుక్తి ముక్తి ప్రదాత అయిన సూర్యాత్ముడైన రుద్రుడి భార్య సువర్చలాదేవి. శని దేవుడు ఆయన కుమారుడు.

**సమస్తసౌమ్యవస్తూనాం ప్రకృతిత్వేన విశ్రుతః ॥14॥**

**సోమాత్మకో బుధైర్దేవో మహాదేవ ఇతి స్మృతః ।**
**సోమాత్మకస్య దేవస్య మహాదేవస్య సూరిభిః ॥15॥**

**దయితా రోహిణీ ప్రోక్తా బుధశ్చైవ శరీరజః ।**

సమస్త సౌమ్య వస్తు ప్రకృతిగా ప్రసిద్ధుడైన సోమరూపశివుడిని పండితులు మహాదేవుడంటున్నారు. సోమాత్మక ప్రభువు మహాదేవుడి భార్య రోహిణి, బుధుడు పుత్రుడు.

**హవ్యకవ్యస్థితిం కుర్వన్ హవ్యకవ్యాశినాం తదా ॥16॥**

**యజమానాత్మకో దేవో మహాదేవో బుధైః ప్రభోః ।**
**ఉగ్ర ఇత్యుచ్యతే సద్భిరీశానశ్చేతి చాపరైః ॥17॥**

**ఉగ్రాహ్వయస్య దేవస్య యజమానాత్మనః ప్రభోః ।**
**దీక్షా పత్నీ బుధైరుక్తా సంతానాఖ్యః సుతస్తథా ॥18॥**

దేవతల కొరకు పితృదేవతల కొరకు హవ్య కవ్యాల్ని గ్రహిస్తూ హవ్యకవ్యవ్యవస్థను నడిపే యజమానరూపుడైన శివప్రభువును విద్వాంసులు ఉగ్రుడు అంటున్నారు. ఇతరులు ఈశానుడనీ అంటున్నారు. పండితులు దీక్షాదేవిని యజమానరూపుడైన ఉగ్రుడనే పేరుగల శివుడి పత్నిగా చెబుతున్నారు. 'సంతానం' అనే పేరుగలవాడు పుత్రుడు.

**శరీరిణాం శరీరేషు కఠినం కొంకణాదివత్ ।**
**పార్థివం తద్వపుర్జ్ఞేయం శర్వతత్త్వం బుభుత్సుభిః ॥19॥**
**దేహే దేహేతు దేవేశో దేహభాజాం యదవ్యయమ్ ।**
**వస్తుద్రవ్యాత్మకం తస్య భవస్య పరమాత్మనః ॥20॥**
**జ్ఞేయంచ తత్త్వవిద్భిర్వై సర్వవేదార్థపారగైః ।**

జీవుల శరీరంలో కొంకణాది స్థలాలలో పృథ్విసంబంధమైన గట్టిదైన భాగమున్నదో దానిని జిజ్ఞాసువులు శర్వతత్త్వంగా తెలియాలి. ప్రాణుల శరీరంలో శాశ్వతమైన ద్రవరూపమైన వస్తువు పరమాత్మ భవుడియొక్క అంశ. ఈ విషయం వేదార్థవిదులు, తత్త్వవేత్తలు తెలియాలి.

**ఆగ్నేయః పరిణామో యః విగ్రహేషు శరీరిణామ్ ॥21॥**

**మూర్తిః పశుపతిర్జ్ఞేయా సా తత్త్వం వేత్తుమిచ్ఛుభిః ।**
**వాయవ్యః పరిణామో యః శరీరేషు శరీరిణామ్ ॥22॥**

**బుధైరీశేతి సా తస్య తనుర్జ్ఞేయా న సంశయః ।**

ప్రాణుల శరీరంలోగల తేజోరూపమైన అగ్నిభాగాన్ని తత్త్వజ్ఞానేచ్ఛగలవారు పశుపతిమూర్తిగా తెలియాలి. ప్రాణుల శరీరంలో ప్రాణాది వాయురూపాన్ని విద్వాంసులు పరమేశ్వరుడియొక్క మూర్తిగా గుర్తించాలి. ఇందులో ఎలాంటి సందేహం లేదు.

**సుషిరం యచ్ఛరీరస్థమశేషాణాం శారీరిణామ్ ॥23॥**

**భీమస్య సా తనుర్జ్ఞేయా తత్త్వవిజ్ఞానకాంక్షిభిః ।**
**చక్షురాదిగతం తేజో యచ్ఛరీరస్థమంగినామ్ ॥24॥**

**రుద్రస్యాపి తనుర్జ్ఞేయా పరమార్థం బుభుత్సుభిః ।**

అన్ని ప్రాణుల శరీరాలలో ఛిద్రరూపమైన ఆకాశభాగం ఉన్నదో, దానిని తత్త్వజ్ఞానాకాంక్షగలవారు భీమమూర్తిగా తెలియాలి. ప్రాణులందరి శరీరాలలో చక్షురాదిగా ఏ సూర్యరూపతేజస్సు ఉన్నదో, దానిని పరమార్థ జిజ్ఞాసువులు రుద్రమూర్తిగా తెలియాలి.

**సర్వభూతశరీరేషు మనశ్చంద్రాత్మకం హి యత్ ॥25॥**

**మహదేవస్య సామూర్తిర్బోద్ధవ్యా తత్త్వచింతకై ।**
**ఆత్మా యో యజమానాఖ్యః సర్వభూతశరీరిణః ॥ 26॥**

**మూర్తిరుద్రస్య సాజ్ఞేయా పరమాత్మబుభుత్సుభిః ।**

అన్ని ప్రాణుల శరీరాలలో చంద్రరూపమైన మనసు గలదో, దానిని తత్త్వచింతనులు మహాదేవుడి మూర్తిగా గుర్తించాలి. సమస్తప్రాణుల దేహాలలో యజమానరూపమైన ఆత్మ ఉన్నదో దానిని పరమాత్మతత్త్వవేత్తలు ఉ గ్రనామకమైన మూర్తిగా తెలియాలి.

**జాతానాం సర్వభూతానాం చతుర్దశసు యోనిషు ॥27॥**

**అష్టమూర్తేరనంతత్వం వదంతి పరమర్షయః ।**
**సప్తమూర్తిమయాన్యాహురీశస్యాంగాని దేహినామ్ ॥28॥**

**ఆత్మా తస్యాష్టమీ మూర్తిః సర్వభూతశరీరగా ।**

పధ్నాలుగు యోనులందు జన్మించిన సమస్తజీవులందు అష్టమూర్తికి అభిన్నత్వం మహర్షిగణాలు చెబుతున్నారు. వారు ప్రాణుల శరీరాలలో ఏడుమూర్తుల సమన్వయమే చెబుతున్నారు. జీవులందరి శరీరాలలో గల ఆత్మ శివుడి యొక్క అష్టమమూర్తి.

**అష్టమూర్తిమముం దేవం సర్వలోకాత్మకం విభుమ్ ॥29॥**

**భజస్వ సర్వభావేన శ్రేయః ప్రాప్తుం యదీచ్ఛసి ।**
**ప్రాణినో యస్య కస్యాపి క్రియతే యద్యనుగ్రహః ॥30॥**

**అష్టమూర్తేర్మహేశస్య కృతమారాధనం భవేత్ ।**
**నిగ్రహశ్చేత్ కృతో లోకే దేహినో యస్య కస్యచిత్ ॥31॥**

**అష్టమూర్తేర్మహేశస్య స ఏవ విహితో భవేత్ ।**
**యద్యవజ్ఞా కృతా లోకే యస్య కస్యచిదంగినః ॥32॥**

**అష్టమూర్తేర్మహేశస్య విహితా సా భవేద్విభోః ।**
**అభయం యత్ ప్రదత్తం స్యాదంగినో యస్య కస్యచిత్ ॥33॥**

**ఆరాధనం కృతం తస్మాదష్టమూర్తేర్న సంశయః ।**

ఓ సనత్కుమార! నీవు కళ్యాణప్రాప్తిని ఆశించినట్లైతే సర్వలోకస్వరూపుడు, సర్వవ్యాపి, అష్టమూర్తి అయిన శివభగవానుడిని అన్ని విధాల ఆరాధించాలి. ప్రాణులగూర్చి చేసిన అనుగ్రహం అష్టమూర్తి మహేశ్వరుడికి చేసిన ఆరాధనే. లోకంలో ఏదో ఒక ప్రాణికి కల్పించిన క్లేశం అది అష్టమూర్తి మహేశ్వరుడికి చేసిన అపకారమే. లోకంలో ఏదో విధంగా ఒక ప్రాణిని అనాదరిస్తే అది అష్టమూర్తి సర్వవ్యాపి మహేశ్వరుడిని అనాదరించినట్లే. ఏదో ఒక ప్రాణికి అభయం ఇస్తే అది అష్టమూర్తి శివుడిని ఆరాధించినట్లే. ఇందులో ఎలాంటి సందేహం లేదు.

**సర్వోపకారకరణం ప్రదానమభయస్య చ ॥34॥**

**ఆరాధనం తు దేవస్య అష్టమూర్తేర్న సంశయః ।**
**సర్వోపకారకారణం సర్వానుగ్రహ ఏవ చ ॥35॥**

**తదర్చనం పరం ప్రాహురష్టమూర్తేర్మునీశ్వరాః ।**
**అనుగ్రహణమన్యేషాం విధాతవ్యం త్వయాంగినామ్ ॥36॥**

**సర్వాభయం ప్రదానం చ శివారాధనమిచ్ఛతా ॥37॥**

అందరికి చేసిన ఉపకారం, అందరికి ఇచ్చిన అభయం అది అష్టమూర్తి శివుడిని ఆరాధించడమే. ఇందులో సందేహం లేదు. అందరికి చేసిన ఉపకారం, అందర్ని కనికరించిన విధం – వీనిని మునీశ్వరులు అష్టమూర్తిని పరమంగా పూజించడమే అంటున్నారు. ఓ సనత్కుమారుడా! శివుడి ప్రసన్నతను ఆశించే మీరు మరియు ఇతరులు ప్రాణులందరి ఎడల అనుకంపను మరియు అన్ని విధాల అభయాన్ని ప్రదానం చేయాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే శివాష్టమూర్తివర్ణనం నామ త్రయోదశోఽధ్యాయః ॥13॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని శివాష్టమూర్తివర్ణన అనే పేరుగల పదమూడవ అధ్యాయం సమాప్తం.



## చతుర్దశోఽధ్యాయః – పద్నాలుగవ అధ్యాయం

## పంచబ్రహ్మకథనమ్ – పంచబ్రహ్మకథనం

**సనత్కుమార ఉవాచ** – సనత్కుమారుడు పలికాడు.

**పంచబ్రహ్మాణి మే నందిన్నాచక్ష్వ గణసత్తమ ।**
**శ్రేయఃకరణభూతాని పవిత్రాణి శరీరిణామ్ ॥1॥**

ఓ గణశ్రేష్ఠుడా! నందీశ్వరా! జీవులకు కళ్యాణకరమైనది పరమపవిత్రమైనది అయిన పంచబ్రహ్మల విషయం నాకు చెప్పవలసింది.

**నందికేశ్వర ఉవాచ** – నందికేశ్వరుడు పలికాడు.

**శివస్యైవ స్వరూపాణి పంచబ్రహ్మాహ్వయాని తే ।**
**కథయామి యథాతత్త్వం పద్మయోనేః సుతోత్తమ ॥2॥**

**సర్వలోకైకసంహర్తా సర్వలోకైకరక్షితా ।**
**సర్వలోకైకనిర్మాతా పంచబ్రహ్మాత్మకః శివః ॥3॥**

ఓ బ్రహ్మదేవుడియొక్క పుత్రశ్రేష్ఠా! నేను నీకు శివుడి పంచబ్రహ్మనామకమైన స్వరూపంయొక్క యథార్థరూపాన్ని చెబుతున్నాను. సమస్తలోకాల్ని నశింపజేసేవాడు, సమస్తలోకాల్ని రక్షించేవాడు సమస్తలోకాల్ని సృష్టించేవాడు పంచబ్రహ్మరూపుడైన శివభగవానుడే.

**సర్వేషామేవ లోకానాం యదుపాదానకారణమ్ ।**
**నిమిత్తకారణం చాహుస్సశివః పంచధా స్మృతః ॥4॥**

**మూర్తయః పంచ విఖ్యాతాః పంచ బ్రహ్మాహ్వయాః పరాః ।**
**సర్వలోకశరణ్యస్య శివస్య పరమాత్మనః ॥5॥**

ఎవడు సమస్తలోకాలకు ఉపాదానకారకుడో, నిమిత్తకారకుడో ఆ శివుడే పంచభేదాలు గలవాడుగా చెప్పబడ్డాడు. సమస్తలోకాలకు శరణాన్ని ప్రదానం చేసే పరమాత్మ శివుడికి పంచబ్రహ్మ అనే పేరుగల అయిదు శ్రేష్ఠమూర్తులు విఖ్యాతి పొందియున్నాయి.

**క్షేత్రజ్ఞః ప్రథమా మూర్తిః శివస్య పరమేష్ఠినః ।**
**భోక్తా ప్రకృతివర్గస్య భోగ్యస్యైశానసంజ్ఞితః ॥6॥**

పరమేష్ఠి శివుడియొక్క మొదటి మూర్తి 'క్షేత్రజ్ఞ' అనేది. భోగయోగ్యమైన సమస్తప్రకృతివర్గానికి భోగాన్ని ఇచ్చే ఆమూర్తి 'ఈశాన' అనే పేరుగలది.

**స్థాణోస్తత్ పురుషాఖ్యా చ ద్వితీయా మూర్తిరుచ్యతే ।**
**ప్రకృతిః సా హి విజ్ఞేయా పరమాత్మగుహాత్మికా ॥7॥**

స్థాణుడియొక్క రెండో మూర్తి 'తత్పురుష' అనే పేరుగలది. పరమాత్మయొక్క గుహాస్వరూపమే ప్రకృతి అని తెలియాలి.

**అఘోరాఖ్యా తృతీయా చ శంభోర్మూర్తిర్గరీయసీ ।**
**బుద్ధేః సా మూర్తిరిత్యుక్తా ధర్మాద్యష్టాంగసంయుతా ॥8॥**

శివుడియొక్క మూడో మూర్తి 'అఘోర' అనే పేరుగలది. మహిమాన్వితమైనది. ధర్మాదులైన ఎనిమిది విధాలైన అంగాలతో కూడిన అది 'బుద్ధి' అనే మూర్తిగా చెప్పబడింది.

**చతుర్థీ వామదేవాఖ్యా మూర్తిః శంభోర్గరీయసీ ।**
**అహంకారాత్మకత్వేన వ్యాప్య సర్వం వ్యవస్థితా ॥9॥**

శివుడికి 'వామదేవ' అనే పేరుగల శ్రేష్ఠమైన నాల్గోమూర్తి ఉన్నది. అది అహంకారరూపంగా సంపూర్ణ జగత్తును వ్యాపించి ఉన్నది.

**సద్యోజాతాహ్వయా శంభోః పంచమీ మూర్తిరుచ్యతే ।**
**మనస్తత్త్వాత్మకత్వేన స్థితా సర్వశరీరిషు ॥10॥**

శివుడి అయిదో మూర్తి 'సద్యోజాత' అనే పేరుగలది. ఇది సర్వప్రాణులందు మనస్తత్త్వరూపంలో నిలిచి ఉన్నది.

**ఈశానః పరమో దేవః పరమేష్ఠీ సనాతనః ।**
**శ్రోత్రేంద్రియాత్మకత్వేన సర్వభూతేష్వవస్థితః ॥11॥**

ఈశానుడు, పరమేష్ఠి, శాశ్వతుడు, పరమప్రభువు అయిన శివుడి 'శ్రోత్ర' ఇంద్రియ రూపంలో ప్రాణులన్నింటి లోపల ఉన్నాడు.

**స్థితస్తత్పురుషో దేవః శరీరేషు శరీరిణామ్ ।**
**త్వగింద్రియాత్మకత్వేన తత్త్వవిద్భిరుదాహృతః ॥12॥**

తత్పురుషరూపుడైన శివభగవానుడు త్వగింద్రియరూపంలో జీవుల దేహాలలో ఉన్నాడు. ఇది తత్త్వవేత్తలమాట.

**అఘోరోఽపి మహాదేవశ్చక్షురాత్మతయా బుధైః ।**
**కీర్తితః సర్వభూతానాం శరీరేషు వ్యవస్థితాః ॥13॥**

మహాదేవుడి అఘోరమూర్తి చక్షురూపంగా ప్రాణులన్నింటిలోనూ వ్యవస్థితమై ఉన్నది.

**జిహ్వేంద్రియాత్మకత్వేన వామదేవోఽపి విశ్రుతః ।**
**అంగభాజామశేషాణామంగేషు పరిధిష్ఠితః ॥14॥**

శివభగవానుడి వామదేవమూర్తి కూడా సమస్తదేహధారుల్లో జిహ్వేంద్రియరూపంలో నిలిచి ఉన్నది.

**ఘ్రాణేంద్రియాత్మకత్వేన సద్యోజాతః స్మృతో బుధైః ।**
**ప్రాణభాజాం సమస్తానాం విగ్రహేషు వ్యవస్థితః ॥ 15॥**

పండితులు సద్యోజాతమూర్తి సమస్తప్రాణుల శరీరాల్లో ఘ్రాణేంద్రియరూపంలో నిలిచి ఉన్నదని చెప్పారు.

**సర్వేష్వేవ శరీరేషు ప్రాణభాజాం ప్రతిష్ఠితః ।**
**వాగింద్రియాత్మకత్వేన బుధైరీశాన ఉచ్యతే ॥16॥**

ప్రాణులందరి శరీరాలలో శివభగవానుడియొక్క 'ఈశాన' మూర్తి వాగింద్రియరూపంలో ఉన్నదని పండితులు చెప్పారు.

**పాణీంద్రియాత్మకత్వేన స్థితస్తత్పురుషో బుధైః ।**
**ఉచ్యతే విగ్రహేష్వేవ సర్వవిగ్రహధారిణామ్ ॥17॥**

శివభగవానుడి తత్పురుషమూర్తి పాణీంద్రియరూపంలో సమస్తజీవుల శరీరాలలో ఉన్నదని పండితులు చెప్పారు.

**సర్వవిగ్రహిణాం దేహే హ్యఘోరోఽపి వ్యవస్థితః ।**
**పాదేంద్రియాత్మకత్వేన కీర్తితస్తత్త్వవేదిభిః ॥18॥**

భగవానుడి అఘోరరూపం కూడా సర్వప్రాణుల దేహాలలో పాదేంద్రియరూపంలో నిలిచి ఉన్నదని తత్త్వవిదులమాట.

**పాయ్వింద్రియాత్మకత్వేన వామదేవో వ్యవస్థితః ।**
**సర్వభూతనికాయానాం కాయేషు మునిభిః స్మృతః ॥19॥**

శివుడి వామదేవమూర్తి సమస్తప్రాణుల శరీరాలలో 'పాయు' (గుదం) ఇంద్రియరూపంలో ఉన్నదని మునులమాట.

**ఉపస్థాత్మతయా దేవః సద్యోజాతః స్థితః ప్రభుః ।**
**ఇష్యతే వేదశాస్త్రజ్ఞైర్దేహేషు ప్రాణధారిణామ్ ॥20॥**

శాస్త్రజ్ఞులు శివభగవానుడియొక్క సద్యోజాతమూర్తి సర్వప్రాణుల దేహాలలో జననేంద్రియరూపంగా స్థితమై ఉన్నదని చెబుతున్నారు.

**ఈశానం ప్రాణినాం దేహం శబ్దతన్మాత్రరూపిణమ్ ।**
**ఆకాశజనకం ప్రాహుర్మునిబృందారకప్రజాః ॥21॥**

శబ్దతన్మాత్రరూపుడైన ఈశానుడిని ప్రాణులందరికి ప్రభువుగా ప్రముఖమునులు చెప్పారు. ఆయనే ఆకాశానికి జనకుడని కూడా చెప్పారు.

**ప్రాహుతత్పురుషం దేవం స్పర్శతన్మాత్రకాత్మకమ్ ।**
**సమీరజనకం పాహుర్భగవంతం మునీశ్వరాః ॥22॥**

మునీశ్వరులు తత్పురుషరూపుడైన శివభగవానుడిని స్పర్శతన్మాత్రరూపుడుగా చెప్పారు. ఆతడే వాయువును ఉత్పన్నం చేస్తాడని చెప్పారు.

**రూపతన్మాత్రకం దేవమఘోరమపి ఘోరకమ్ ।**
**ప్రాహుర్వేదవిదో ముఖ్యా జనకం జాతవేదసః ॥23॥**

ప్రముఖవేదవేత్తలు అఘోరకుడైన శివభగవానుడిని రూపతన్మాత్రరూపుడుగా మరియు అగ్నికి జనకుడుగా చెప్పారు.

**రసతన్మాత్రరూపత్వాత్ ప్రథితం తత్త్వవేదినః ।**
**వామదేవమపాం ప్రాహుర్జనకత్వేన సంస్థితమ్ ॥24॥**

తత్త్వదర్శులైనవారు రసతన్మాత్రరూపంలో ప్రసిద్ధుడైన వామదేవుడిని జలానికి జనకుడిగా నిలిచాడని చెప్పారు.

**సద్యోజాతం మహాదేవం గంధతన్మాత్రరూపిణమ్ ।**
**భూమ్యాత్మానం ప్రశంసంతి సర్వతత్త్వార్థ వేదినః ॥25॥**

సమస్తతత్త్వార్థాల్ని తెలిసినవారు మహాదేవుడు సద్యోజాతుడిని గంధతన్మాత్రరూపుడుగా భూమియొక్క జనకుడుగా చెబుతున్నారు.

**ఆకాశాత్మానమీశానమాదిదేవం మునీశ్వరాః ।**
**పరమేణ మహత్త్వేన సంభూతం ప్రాహురద్భుతమ్ ॥26॥**

పరమమైన మహత్వంతో పుట్టిన కారణంగా అద్భుతమైన ఆకాశరూపుడైన ఆదిదేవశివుడు 'ఈశానుడు' అని మునీశ్వరుల మాట.

**ప్రభుం తత్పురుషం దేవం పవనం పవనాత్మకమ్ ।**
**సమస్తలోకవ్యాపిత్వాత్ప్రథితం సూరయో విదుః ॥27॥**

సమస్తలోకాలలో వ్యాపించి ఉన్న కారణంగా పవనరూపంగా ప్రసిద్ధుడైన శివుడిని విద్వాంసులు తత్పురుషుడంటున్నారు.

**అథార్జితతయా ఖ్యాతమఘోరం దహనాత్మకమ్ ।**
**కథయంతి మహాత్మానం వేదవాక్యార్థవేదినః ॥28॥**

వేదమంత్రవిదులైనవారు జ్యోతిర్మయమైన కారణంగా అగ్నిరూపంలో ప్రసిద్ధుడైన మహాత్ముడైన శివుడిని అఘోరుడంటున్నారు.

**తోయాత్మకం మహాదేవం వామదేవం మనోరమమ్ ।**
**జగత్సంజీవనత్వేన కథితం మునయో విదుః ॥29॥**

జగత్తుకు జీవనాన్ని ప్రదానం చేస్తున్న గుణం కారణంగా జలరూపుడైన మహాదేవశివుడిని మునులు మనోరముడైన వామదేవుడంటున్నారు.

**విశ్వంభరాత్మకం దేవం సద్యోజాతం జగద్గురుమ్ ।**
**చరాచరైకభర్తారం పరం కవివరా విదుః ॥30॥**

చరాచరజగత్తుకు ఏకపాలకుడు, విశ్వంభరరూపుడు, జగద్గురువు శివుడిని కవిశ్రేష్ఠులు సద్యోజాతుడంటున్నారు.

**పంచబ్రహ్మాత్మకం సర్వం జగత్స్థావరజంగమమ్ ।**
**శివానందం తదిత్యాహుర్మునయస్తత్త్వదర్శినః ॥31॥**

ఈశానాదిమూర్తిరూపంగా పంచబ్రహ్మాత్మకం అయిన సంపూర్ణచరాచరజగత్తు శివభగవానుడియొక్క క్రీడావిలాసమే. ఇది తత్త్వదర్శనులైన మునుల వచనం.

**పంచవింశతి తత్త్వాత్మా ప్రపంచే యః ప్రదృశ్యతే ।**
**పంచబ్రహ్మాత్మకత్వేన స శివో నాన్యతాం గతః ॥32॥**

ఇరవై అయిదు తత్త్వాత్మకంగా లోకంలో ఏది కన్పిస్తున్నదో అది ఈశానాదిపంచబ్రహ్మశివరూపమే. దానికన్నా భిన్నమైనది ఏదీ లేదు.

**పంచవింశతితత్త్వాత్మా పంచబ్రహ్మాత్మకః శివః ।**
**శ్రేయోఽర్థిభిరతో నిత్యం చింతనీయః ప్రయత్నతః ॥33॥**

అందుచేత శ్రేయస్కాములైనవారు ఎల్లప్పుడు ప్రయత్నపూర్వకంగా ఇరవై అయిదు తత్త్వాలతో కూడిన విగ్రహంగల పంచబ్రహ్మాత్మకశివుడిని గూర్చి చింతించాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే పంచబ్రహ్మకథనం నామ చతుర్దశోఽధ్యాయః ॥14॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని పంచబ్రహ్మకథనం అనే పేరుగల పద్నాలుగవ అధ్యాయం సమాప్తం

## పంచదశోఽధ్యాయః - పదిహేనవ అధ్యాయం

## శంకరస్య త్రిగుణరూపవర్ణనమ్ - శంకరుడి త్రిగుణరూపవర్ణన

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**భూయోఽపి శివమాహాత్మ్యం సమాచక్ష్వ మహామతే ।**
**సర్వజ్ఞో హ్యసి భూతానామధినాథ మహాగుణ ॥1॥**

ఓ బుద్ధిమంతుడా! నీవు మరలా శివభగవానుడి మాహాత్మ్యాన్ని గూర్చి చెప్పు. ఓ ప్రాణులకు అధినాథుడా! గుణవంతుడా! సర్వజ్ఞుడవు నీవు.

**శైలాదిరువాచ** - శిలాదపుత్రుడు నందీశ్వరుడు పలికాడు.

**శివమాహాత్మ్యమేకాగ్రః శృణు వక్ష్యామి తే మునే ।**
**బహుభిర్బహుధా శబ్దైః కీర్తితం మునిసత్తమైః ॥2॥**

ఓ ఋషీ! శివుడి మాహాత్మ్యాన్ని చెబుతాను, జాగరూకుడవై విను. అది అనేకమునిశ్రేష్ఠులచేత అనేకవిధాల బహుశబ్దజాలంతో కీర్తింపబడింది.

**సదసద్రూపమిత్యాహుః సదసత్పతిరిత్యపి ।**
**తం శివం మునయః కేచిత్ప్రవదంతి చ సూరయః ॥3॥**

కొందరు మునులు శివభగవానుడిని సదసద్రూపుడని చెబుతున్నారు. కొందరు పండితులు సదసద్పతి అని కూడా అంటున్నారు.

**భూతభావవికారేణ ద్వితీయేన స ఉచ్యతే ।**
**వ్యక్తం తేన విహీనత్వాదవ్యక్తమసదిత్యపి ॥4॥**

**ఉభే తే శివరూపే హి శివాదన్యం న విద్యతే ।**
**తయోః పతిత్వాచ్చ శివః సదసద్పతిరుచ్యతే ॥5॥**

ప్రాణుల భావాదుల వలన ముక్తుడైనపుడు శివుడు వ్యక్తుడు, అట్లే 'సత్' అని చెప్పబడ్డాడు. భావాది వికారాలకు విహీనుడయినపుడు అవ్యక్తుడు, అసత్ అవుతున్నాడు. సత్ మరియు అసత్-రెండూ శివుడి రూపాలే. శివుడికన్నా భిన్నమైనది ఏదీ లేదు. రెంటికీ పతి అవడంచేత శివుడు సదసద్పతి అవుతున్నాడు.

**క్షరాక్షరాత్మకం ప్రాహుః క్షరాక్షరపరం తథా ।**
**శివం మహేశ్వరం కేచిన్మునయస్తత్త్వచింతకాః ॥6॥**

**ఉక్తమక్షరమవ్యక్తం వ్యక్తం క్షరముదాహృతం ।**
**రూపే తే శంకరస్యైవ తస్మాన్న పర ఉచ్యతే ॥7॥**

కొందరు తత్త్వచింతనగల మునులు మహేశ్వరశివుడిని క్షర–అక్షరరూపుడని, అట్లే క్షర–అక్షరరూపంకన్నా పరమైనవాడని అంటున్నారు. అవ్యక్తుడైతే అక్షరుడని, వ్యక్తుడైతే క్షరుడని చెబుతున్నారు. రెండు రూపాలు శివుడివే. క్షరాక్షరరూపుడు అవడానికి కారణం ఆయన అపరస్వరూపుడవ్వడమే.

**తయోః పరః శివః శాంతః క్షరాక్షరపరో బుధైః ।**
**ఉచ్యతే పరమార్థేన మహాదేవో మహేశ్వరః ॥8॥**

**సమస్తవ్యక్తరూపం తు తతః స్మృత్వా స ముచ్యతే ।**
**సమష్టివ్యష్టిరూపం తు సమష్టివ్యష్టికారణమ్ ॥9॥**

**వదంతి కేచిదాచార్యాః శివం పరమకారణమ్ ।**
**సమష్టిం విదురవ్యక్తం వ్యష్టిం వ్యక్తం మునీశ్వరాః ॥10॥**

**రూపే తే గదితే శంభోర్నాస్త్యన్యద్వస్తుసంభవమ్ ।**
**తయోః కారణభావేన శివో హి పరమేశ్వరః ॥11॥**

**ఉచ్యతే యోగశాస్త్రజ్ఞైః సమష్టివ్యష్టికారణమ్ ।**

తత్త్వజ్ఞులైన విద్వాంసులు వ్యక్త, అవ్యక్తాలకన్నా పరుడైన కారణంగా శాంతుడు, మహేశ్వరుడు, మహాదేవశివుడిని క్షర, అక్షరపరుడుగా చెబుతున్నారు. జీవులు, సమస్తప్రాణి స్వరూపుడైన శివుడిని స్మరించి ముక్తిని పొందుతున్నాయి. కొందరు ఆచార్యులు పరమకారణరూపుడైన శివుడిని సమష్టి, వ్యష్టి రూపుడుగా సమష్టి, వ్యష్టికి కారణుడుగా చెబుతున్నారు. మునీశ్వరులు అవ్యక్తుడైనపుడు సమష్టిగా, వ్యక్తుడైనపుడు వ్యష్టిగా చెబుతున్నారు. ఆ రెండు రూపాలు శివుడివే. ఇంతకన్నా భిన్నమైన వస్తువు సంభవించదు. యోగశాస్త్రవేత్తలు సమష్టికి, వ్యష్టికి కారకుడైన పరమేశ్వరశివుడిని సమష్టి, వ్యష్టి కారణుడంటున్నారు.

**క్షేత్రక్షేత్రజ్ఞరూపే చ శివః కైశ్చిదుదాహృతః ॥12॥**

**పరమాత్మా పరంజ్యోతిర్భగవాన్ పరమేశ్వరః ।**
**చతుర్వింశతితత్త్వాని క్షేత్రశబ్దేన సూరయః ॥13॥**

**ప్రాహుః క్షేత్రశబ్దేన భోక్తారం పురుషం తథా ।**
**క్షేత్రక్షేత్రవిదావేతే రూపే తస్య స్వయంభువః ॥14॥**

**న కించిచ్చ శివాదన్యదితి ప్రాహుర్మనీషిణః ।**

కొందరు పరమాత్ముడు, పరంజ్యోతిస్వరూపుడు, పరమేశ్వర భగవానుడు శివుడిని క్షేత్రక్షేత్రజ్ఞరూపుడుగా చెబుతున్నారు. విద్వాంసులు ఇరవైనాల్గు తత్త్వాలుగల క్షేత్రశబ్దవాచ్యుడుగా, భోగి అయిన పురుషుడిని క్షేత్రజ్ఞశబ్దవాచ్యుడుగా చెబుతున్నారు. క్షేత్ర–క్షేత్రజ్ఞ అనే ఈ రెండు రూపాలు స్వయంభువుడైన శివుడివే. శివుడికన్నా ఇతరమైనది ఏదీ లేదు. ఇది మనీషుల వచనం.

**అపరబ్రహ్మరూపం తం పరబ్రహ్మాత్మకం శివమ్ ॥15॥**

**కేచిదాహుర్మహాదేవమనాదినిధనం ప్రభుమ్ ।**
**భూతేంద్రియాంతఃకరణప్రధానవిషయాత్మకమ్ ॥16॥**

**అపరం బ్రహ్మ నిర్దిష్టం పరం బ్రహ్మ చిదాత్మకమ్ ।**
**బ్రహ్మణీ తే మహేశస్య శివస్యాస్య స్వయంభువః ॥17॥**

**శంకరస్య పరస్యైవ శివాదన్యన్న విద్యతే ।**

కొందరు ఆద్యంతరహితుడైన మహాదేవ శివభగవానుడిని అపరబ్రహ్మ (శబ్దబ్రహ్మ) స్వరూపుడని, అట్లే పరబ్రహ్మ స్వరూపుడని చెబుతున్నారు. ప్రాణుల ఇంద్రియాంతఃకరణ సంబంధిశబ్దాదిప్రధానవిషయరూపుడుగా అపరబ్రహ్మను మరియు పరబ్రహ్మను చిదానంద స్వరూపనిర్దిష్టుడుగా చెప్పారు. ఈ రెండు బ్రహ్మలు మహేశ్వరుడు పరమాత్ముడు అయిన శంకరుడి రూపాలే. శివుడికన్నా ఇతరం ఏదీ లేదు.

**విద్యావిద్యాస్వరూపీ చ శంకరః కైశ్చిదుచ్యతే ॥18॥**

**ధాతా విధాతా లోకానామాదిదేవో మహేశ్వరః ।**
**విద్యేతి చ తమేవాహురవిద్యేతి మునీశ్వరాః ॥19॥**

**ప్రపంచజాతమఖిలం తే స్వరూపే స్వయంభువః ।**

కొందరు మానవులు లోకాల్ని విధానపర్చి పాలించే ఆదిదేవుడైన మహేశ్వరుడు శివుడిని విద్య మరియు అవిద్య స్వరూపుడుగా చెబుతున్నారు. మునీశ్వరులు ఆయన్ని విద్య అంటున్నారు. సంపూర్ణజగజ్జనులు అవిద్య అంటున్నారు. స్వయంభువుడైన శివుడు రెండూ అవుతాడు.

**భ్రాంతిర్విద్యా పరం చేతి శివరూపమనుత్తమమ్ ॥20॥**

**అవాపుర్మునయో యోగాత్కేచిదాగమవేదినః ।**
**అర్థేషు బహురూపేషు విజ్ఞానం భ్రాంతిరుచ్యతే ॥21॥**

**ఆత్మాకారేణ సంవిత్తిర్బుధైర్విద్యేతి కీర్త్యతే ।**
**వికల్పరహితం తత్త్వం పరమిత్యభిధీయతే ॥22॥**

**తృతీయరూపమీశస్య నాన్యత్కించన సర్వతః ।**

భ్రాంతి, విద్య అట్లే పరత – ఇవి కూడా శివుడి శ్రేష్ఠమైన రూపాలే. కొందరు వేదవేత్తలైన మునులు యోగం ద్వారా వీటిని పొందారు. బహువిధాలైన అర్థాల విజ్ఞానంలో భ్రాంతి కలుగుతుంది. విద్వాంసులైన జనులు అంతటిని ఆత్మస్వరూపంగా తెలియడాన్ని విద్య అంటున్నారు. వికల్పరహితమైన (స్థిర) తత్త్వాన్ని 'పరమం' అంటున్నారు. ఈశ్వరుడైన శివుడికన్నా అన్యమైన మూడో రూపం లేదు.

**వ్యక్తావ్యక్తజ్ఞరూపీతి శివః కైశ్చిన్నిగద్యతే ॥ 23॥**

**విధాతా సర్వలోకానాం ధాతా చ పరమేశ్వరః ।**
**త్రయోవింశతితత్త్వాని వ్యక్తశబ్దేన సూరయః ॥24॥**

**వదంత్యవ్యక్తశబ్దేన ప్రకృతిం చ పరాం తథా ।**
**కథయంతి 'జ్ఞ' శబ్దేన పురుషం గుణభోగినమ్ ॥25॥**

**తత్ర యం శాంకరం రూపం నాన్యత్కించిదశాంకరమ్ ॥26॥**

కొందరు మానవులు లోకాలన్నింటి సృష్టికర్త అట్లే పోషణకర్త అయిన పరమేశ్వర శివుడిని 'వ్యక్త–అవ్యక్త–జ్ఞ' స్వరూపుడని కూడా చెబుతున్నారు. విద్వాంసులు ఇరవైమూడు తత్త్వాలవల్ల వ్యక్తుడని, పరమైన ప్రాకృతికమైన ఇరవైనాలుగో తత్త్వంవల్ల అవ్యక్తుడని, మరియు గుణభోక్త అయిన పురుషుడయినందువల్ల 'జ్ఞ' శబ్దవాచ్యుడని చెబుతున్నారు. ఈ మూడింటి సమాహారమే శంకరభగవానుడు. శివుడికన్నా భిన్నుడు ఇతరుడెవ్వడూ లేడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే శంకరస్య త్రిగుణరూపవర్ణనం నామ పంచదశోఽధ్యాయః ॥15॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగమందలి శంకరుడి త్రిగుణరూపవర్ణన అనే పేరుగల పదిహేనవ అధ్యాయం సమాప్తం.



## షోడశోఽధ్యాయః – పదహారవ అధ్యాయం

## శివతత్త్వమాహాత్మ్యవర్ణనమ్ – శివతత్త్వమాహాత్మ్యవర్ణన

**సనత్కుమార ఉవాచ –** సనత్కుమారుడు పలికాడు.

**పునరేవ మహాబుద్ధే శ్రోతుమిచ్ఛామి తత్త్వతః ।**
**బహుభిర్బహుధా శబ్దైః శబ్దితాని మునీశ్వరైః ॥1॥**

ఓ మహాబుద్ధిశాలీః! మునులు బహునామాలలో అనేకవిధాల చెప్పబడే శివస్వరూపం యథార్థరూపాన్ని మరల నేను వినదలచాను.

**శైలాదిరువాచ –** నందీశ్వరుడు పలికాడు.

**పునః పునః ప్రవక్ష్యామి శివరూపాణి తే మునే ।**
**బహుభిర్బహుధా శబ్దైః శబ్దితాని మునీశ్వరైః ॥2॥**

ఓ మునీ! మునీశ్వరులవల్ల బహునామాలతో నానావిధాల తెలిసే శివభగవానుడి రూపాల వర్ణన నీకోసం మరల మరల చేస్తాను.

**క్షేత్రజ్ఞః ప్రకృతిరవ్యక్తం కాలాత్మేతి మునీశ్వరైః ।**
**ఉచ్యతే కైశ్చిదాచార్యైరాగమార్ణవపారగైః ॥3॥**

వేదరూపసముద్రాన్ని మథించిన ఆచార్యవర్యులు అట్లే మునీశ్వరులు శివభగవానుడిని క్షేత్రజ్ఞుడు, ప్రకృతి, వ్యక్తుడు–అట్లే కాలాత్ముడుగా చెబుతున్నారు. మరియు ప్రకృతి సంపూర్ణ వికృతుల వ్యక్తుడని చెబుతున్నారు. ప్రధానానికి అట్లే వ్యక్తవిస్తారానికి ముఖ్యకారణం కాలమే. ఈ నాలుగు ఈశ్వరుడి రూపచతుష్టయాలే.

**క్షేత్రజ్ఞం పురుషం ప్రాహుః ప్రధానం ప్రకృతిం బుధాః ।**
**వికారజాతం నిఃశేషం ప్రకృతేర్వ్యక్తమిత్యపి ॥4॥**

**ప్రధానవ్యక్తయోః కాలః పరిణామైకకారణమ్ ।**
**తచ్చతుష్టయమీశస్య రూపాణాం హి చతుష్టయమ్ ॥5॥**

**హిరణ్యగర్భం పురుషం ప్రధానం వ్యక్తరూపిణమ్ ।**
**కథయంతి శివం కేచిదాచార్యాః పరమేశ్వరమ్ ॥6॥**

**హిరణ్యగర్భః కర్తాస్య భోక్తా విశ్వస్య పూరుషః ।**
**వికారజాతం వ్యక్తాఖ్యం ప్రధానం కారణం పరమ్ ॥7॥**

**తేషాం చతుష్టయం బుద్ధేః శివరూపచతుష్టయమ్ ।**
**ప్రోచ్యతే శంకరాదన్యదస్తి వస్తు న కించన ॥8॥**

పండితులు శివుడిని పురుషుడని, క్షేత్రజ్ఞుడని ప్రధానుడని, ప్రకృతి అని, ప్రకృతి సంపూర్ణ వికారం వల్ల వ్యక్తమైనవాడని చెబుతున్నారు. ప్రధానం అట్లే వ్యక్తం విస్తారానికి ఒకే కారణం కాలం మాత్రమే. ఆ నాలుగు ఈశ్వరుడి రూపచతుష్టయాలే. కొందరు ఆచార్యులు పరమేశ్వర శివుడిని హిరణ్యగర్భుడు, పురుషుడు, ప్రధానుడు, వ్యక్తరూపుడని కూడా చెబుతున్నారు. ఈ లోకకర్త హిరణ్యగర్భుడు (బ్రహ్మ) భోక్తపురుషుడు (విష్ణువు) సమస్త ప్రపంచం వ్యక్తమనే పేరుగలది. ముఖ్యకారణం ప్రధానమే. హిరణ్యగర్భం మొదలైనవి మరియు బుద్ధి మొదలైనవి ఈ నాలుగు శివభగవానుడి రూపచతుష్టయమే. శంకరుడికన్నా భిన్నమైనది ఏ వస్తువూ లేదు.

**పిండజాతిస్వరూపీ తు కథ్యతే కైశ్చిదీశ్వరః ।**
**చరాచరశరీరాణి పిండాఖ్యాన్యఖిలాన్యపి ॥9॥**

**సామాన్యాని సమస్తాని మహాసామాన్యమేవ చ ।**
**కథ్యంతే జాతిశబ్దేన తాని రూపాణి ధీమతః ॥10॥**

కొందరు మానవులు పిండం మరియు జాతిరూపుడుగా చెబుతున్నారు. సమస్తచరాచరజగత్తు అనే శరీరం పిండపదవాచ్యం అవుతున్నది. బుద్ధిమంతుడైన శివుడి జాతి, వ్యక్తి మరియు ద్రవ్యం సమస్తరూపం జాతి శబ్దవాచ్యం అవుతున్నది.

**విరాట్ హిరణ్యగర్భాత్మా కైశ్చిదీశో నిగద్యతే ।**
**హిరణ్యగర్భో లోకానాం హేతుర్లోకాత్మకో విరాట్ ॥11॥**

**సూత్రావ్యాకృతరూపం తం శివం శంసంతి కేచన ।**
**అవ్యాకృతం ప్రధానం హి తద్రూపం పరమేష్ఠినః ॥12॥**

**లోకా యేనైవ తిష్ఠంతి సూత్రే మణిగణా ఇవ ।**
**తత్సూత్రమితి విజ్ఞేయం రూపమద్భుతవిక్రమమ్ ॥13॥**

కొందరు మానవులు శివుడిని విరాట్స్వరూపుడుగా, హిరణ్యగర్భుడుగా చెబుతున్నారు. హిరణ్యగర్భుడు సమస్తలోకాల కారణుడు. విరాటుడు ఆ లోకాలస్వరూపం. కొందరు శివుణ్ణి సూత్రావ్యాకృతరూపుడు అంటున్నారు. పరమేష్ఠి శివుడి ఆ రూపం అవ్యాకృతం అట్లే ప్రధానం. సూత్రంలో మణుల మాదిరిగా సమస్తలోకాలు శివుడియందు గ్రుచ్చబడి అమరియున్నాయి. అందుచేత అద్భుతపరాక్రమవంతుడైన శివుడిని సూత్రరూపుడుగా తెలియాలి.

**అంతర్యామీ పరః కైశ్చిత్కైశ్చిదీశః ప్రకీర్త్యతే ।**
**స్వయంజ్యోతిః స్వయంవేద్యః శివః శంభుర్మహేశ్వరః ॥14॥**

**సర్వేషామేవ భూతానామంతర్యామీ శివః స్మృతః ।**
**సర్వేషామేవ భూతానాం పరత్వాత్పర ఉచ్యతే ॥15॥**

**పరమాత్మా శివః శంభుః శంకరః పరమేశ్వరః ।**

కొందరు మానవులు స్వయంజ్యోతిరూపుడు అట్లే స్వయంవేద్యుడు అయిన పరమేశ్వర, శంకర, శంభుడిని అంతర్యామి అట్లే పరుడు అంటున్నారు. ఆ శివుడు సమస్త ప్రాణుల్లో ప్రకాశిస్తున్నాడు. అందుచే అంతర్యామి.

ప్రాణులన్నింటికన్నా శ్రేష్ఠుడు అవడంచేత పరమాత్మ, పరమేశ్వరుడు, శంభుడు, శంకరుడు అయిన శివుడు 'పరుడు' అవుతున్నాడు.

**ప్రాజ్ఞతైజస విశ్వాఖ్యం తస్య రూపత్రయం విదుః ॥16॥**

**సుషుప్తిస్వప్నజాగ్రంతమవస్థాత్రయమేవ తత్ ।**
**విరాట్ హిరణ్యగర్భాఖ్యమవ్యాకృతపదాహ్వయమ్ ॥17॥**

**తురీయస్య శివస్యాస్య అవస్థాత్రయగామినః ।**
**హిరణ్యగర్భః పురుషః కాల ఇత్యేవ కీర్తితాః ॥18॥**

**తిస్రోఽవస్థా జగత్సృష్టిస్థితిసంహారహేతవః ।**
**భవవిష్ణువిరించాఖ్యమవస్థాత్రయమీశితుః ॥19॥**

**ఆరాధ్య భక్త్యా ముక్తిం చ ప్రాప్నువంతి శరీరిణః ।**

'ప్రాజ్ఞ, తైజస, విశ్వ' అనే పేర్లుగల మూడు రూపాలు శివుడివే. సుషుప్తి, స్వప్నం అట్లే జాగ్రత్ అనే అవస్థలు కూడా ఆయనే. అవే విరాట్, హిరణ్యగర్భం మరియు అవ్యాకృతంగాను చెప్పబడుతున్నాయి. ఈ మూడు అవస్థల్లో ప్రకాశిస్తూ ఉండే ఆయన రూపం తురీయమైనది (నాల్గోది). హిరణ్యగర్భం, పురుషం మరియు కాలం– అనే మూడు అవస్థల్లోనూ మహేశ్వరుడే ఉన్నాడు. భక్తిపూర్వకంగా ఆ శివభగవానుడిని ఆరాధించి ప్రాణి ముక్తిని పొందుతున్నది.

**కర్తా క్రియా చ కార్యం చ కరణం చేతి సూరిభిః ॥20॥**

**శంభోశ్చత్వారి రూపాణి కీర్త్యంతే పరమేష్ఠినః ।**
**ప్రమాతా చ ప్రమాణం చ ప్రమేయం ప్రమితిస్తథా ॥21॥**

**చత్వార్యేతాని రూపాణి శివస్యైవ న సంశయః ।**
**ఈశ్వరావ్యాకృతప్రాణవిరాట్ భూతేంద్రియాత్మకమ్ ॥22॥**

**శివస్యైవ వికారోఽయం సముద్రస్యేవ వీచయః ।**

కర్త, క్రియ, కార్యం అట్లే కరణం–ఇవి పరమేష్ఠి శివుడి నాలుగు రూపాలని విద్వాంసులంటున్నారు. ప్రమాత, ప్రమాణం, ప్రమేయం, అట్లే ప్రమితి–అనే ఈ నాల్గూ శివుడి రూపాలే. ఇందులో సందేహం లేదు. ఈశ్వరం, అవ్యాకృతం, ప్రాణం, విరాట్ స్వరూపం, భూతతత్త్వం, ఇంద్రియాలు, ఆత్మ–ఇవి అన్నీ సముద్రతరంగాల మాదిరి శివభగవానుడి వికారాలే.

**ఈశ్వరం జగతామాహుర్నిమిత్తం కారణం తథా ॥23॥**

**అవ్యాకృతం ప్రధానం హి తదుక్తం వేదవాదిభిః ।**
**హిరణ్యగర్భః ప్రాణాఖ్యో విరాట్ లోకాత్మకః స్మృతః ॥24॥**

**మహాభూతాని భూతాని కార్యాణి ఇంద్రియాణి చ ।**
**శివస్యైతాని రూపాణి శంసంతి మునిసత్తమాః ॥25॥**

ఈశ్వరుడే జగత్తు నిమిత్తహేతువు. వేదవేత్తలు అవ్యాహృతుడిని ప్రధానుడు అంటున్నారు. హిరణ్యగర్భుడిని ప్రాణుడని, విరాటుడని, లోకరూపుడని చెబుతున్నారు. మహాభూతాలు, భూతాలు, కార్యాలు–అట్లే ఇంద్రియాలు శివుడి రూపాలని మునిశ్రేష్ఠులు చెబుతున్నారు.

**పరమాత్మా శివాదన్యో నాస్తీతి కవయో విదుః ।**
**శివజాతాని తత్త్వాని పంచవింశన్మనీషిభిః ॥26॥**

**ఉక్తాని న తదన్యాని సలిలాదూర్మివృందవత్ ।**
**పంచవింశత్పదార్థేభ్యః శివతత్త్వం పరం విదుః ॥27॥**

**తాని తస్మాదనన్యాని సువర్ణకటకాదివత్ ।**
**సదా శివేశ్వరాద్యాని తత్త్వాని శివతత్త్వతః ॥28॥**

**జాతాని న తదన్యాని మృద్ద్రవ్యం కుంభభేదవత్।**
**మయా విద్యా క్రియా శక్తిర్జ్ఞానశక్తిః క్రియామయీ॥29॥**

**జాతాః శివాన్న సందేహః కిరణా ఇవ సూర్యతః ।**
**సర్వాత్మకం శివం దేవం సర్వాశ్రయవిధాయినమ్ ॥30॥**

**భజస్వ సర్వభావేన శ్రేయశ్చేత్ప్రాప్తుమిచ్ఛసి ॥31॥**

పరమాత్ముడైన శివుడికన్నా భిన్నుడు అన్యుడు ఎవ్వడూ లేడు. ఇది కవుల మాట. విద్వాంసులు ఇరవై అయిదు తత్త్వాలు శివుడి వల్లే ఉత్పన్నమయ్యాయని చెబుతున్నారు. అవి జలతరంగాల మాదిరి శివుడికన్నా భిన్నాలు కావు. కావున శివతత్త్వాన్ని ఆ ఇరవై అయిదు తత్త్వాలకన్నా పరమైనదిగా కూడా చెప్పవచ్చు. ఆ తత్త్వాలన్నీ బంగారంనుండి కుండలాలు మొదలైనవి మాదిరిగా భిన్నాలు కావు. సదాశివాదులైన సగుణతత్త్వాలు కూడా ఆ శివతత్త్వంనుంచే ఉద్భవించాయి. ఇవి అన్నీ మట్టి కుండలు మాదిరిగా ఆయనకన్నా భిన్నాలు కావు. మాయ, విద్య, క్రియ, శక్తి–అట్లే క్రియామయి జ్ఞానశక్తి – ఈ అయిదు రూపాలైన గౌరీదేవికూడా శివుడినుంచే ఆ విధంగానే ఉత్పన్నమయ్యింది. సూర్యుడినుంచి కిరణాల మాదిరిగా. 'ఓ సనత్కుమారా! నీవు కళ్యాణప్రాప్తి పొందదలిస్తే అన్నింటికి ఆశ్రయప్రధానుడైన సర్వాత్ముడు శివభగవానుడిని అన్ని విధాల ఆరాధించు'.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే శివతత్త్వమాహాత్మ్యవర్ణనం నామ షోడశోఽధ్యాయః ॥16॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని శివతత్త్వమాహాత్మ్య వర్ణన అనే పదహారవ అధ్యాయం సమాప్తం.

## సప్తదశోఽధ్యాయః - పదిహేడవ అధ్యాయం

### శివమాహాత్మ్యవర్ణనమ్ - శివమాహాత్మ్యవర్ణన

**సనత్కుమార ఉవాచ -** సనత్కుమారుడు పలికాడు.

**భూయో దేవగణశ్రేష్ఠ శివమాహాత్మ్యముత్తమమ్ ।**
**శృణ్వంతో నాస్తి మే తృప్తిః త్వద్వాక్యామృతపానతః ॥1॥**

**కథం శరీరీ భగవాన్ కస్మాద్రుద్రః ప్రతాపవాన్ ।**
**సర్వాత్మా చ కథం శంభుః కథం పాశుపతం వ్రతమ్ ॥2॥**

**కథం వా దేవముఖ్యైశ్చ శ్రుతో దృష్టశ్చ శంకరః ।**

ఓ దేవగణశ్రేష్ఠుడా! నీ వచనామృతాన్ని మాటిమాటికి పానం చేస్తున్నా నాకు తృప్తి కలగడంలేదు. రుద్రభగవానుడు శరీరం గలవాడుగా ఎలా అయ్యాడు? ఆయన ప్రతాపవంతుడు ఎలా అయ్యాడు? సర్వాత్ముడు ఎలా కాగలిగాడు? పాశుపతవ్రతం ఎటువంటిది? ప్రముఖదేవతలు శంకరభగవానుడిని చూడడం, ఆయన మాటలు వినడం-ఎలా జరిగింది?

**శైలాదిరువాచ -** నందీశ్వరుడు పలికాడు.

**అవ్యక్తాదభవత్స్థాణుః శివః పరమకారణమ్ ॥3॥**

**స సర్వకారణోపేత ఋషిర్విశ్వాధికః ప్రభుః ।**
**దేవానాం ప్రథమం దేవం జాయమానం ముఖాంబుజాత్ ॥4॥**

**దదర్శ చాగ్రే బ్రహ్మాణం చాజ్ఞయా తమవైక్షత ।**

అవ్యక్తపరమాత్మరూపుడు అవడంచేత శివుడు స్థాణువు. జగదుత్పత్తిలో పరమకారణుడు శివుడే. సర్వకారణమయుడు, అందరికన్నా ఉన్నతుడు, ఋషిరూపుడు అయిన శివభగవానుడు తన ముఖకమలంనుంచి, దేవతలకు ఆదిదేవుడు అయిన బ్రహ్మను ఉత్పన్నం చేశాడు. ఆతడిని చూచి సృష్టి చేయడానికి ఆజ్ఞను ఇచ్చాడు.

**దృష్టో రుద్రేణ దేవేశః ససర్జ సకలం చ సః ॥5॥**

**వర్ణాశ్రమవ్యవస్థాశ్చ స్థాపయామాస వై విరాట్ ।**
**సోమం ససర్జ యజ్ఞార్థం సోమాదిదమజాయత ॥6॥**

**చరుశ్చ వహ్నిర్యజ్ఞశ్చ వజ్రపాణిః శచీపతిః ।**
**విష్ణుర్నారాయణః శ్రీమాన్ సర్వం సోమమయం జగత్ ॥7॥**

రుద్రుడివల్ల చూడబడిన బ్రహ్మదేవుడు సంపూర్ణజగత్తును సృష్టించాడు. వర్ణాశ్రమవ్యవస్థను స్థాపించాడు. తర్వాత విరాట్స్వరూపుడు బ్రహ్మ యజ్ఞహేతువైన సోమాన్ని సృష్టించాడు. అనంతరం ఆ సోమంనుంచి చరువు, అగ్ని, యజ్ఞం, వజ్రపాణి ఇంద్రుడు, శ్రీయుతుడు నారాయణుడు విష్ణువు మొదలైనవారిని ఉత్పన్నం చేశాడు. ఈ విధంగా సంపూర్ణ జగత్తు సోమమయం (వికారం) అయ్యింది.

**రుద్రాధ్యాయేన తే దేవా రుద్రం తుష్టువురీశ్వరమ్ ।**
**ప్రసన్నవదనస్తస్థౌ దేవానాం మధ్యతః ప్రభుః ॥8॥**

**అపహృత్య చ విజ్ఞానమేషామేవ మహేశ్వరః ।**
**దేవా హ్యపృచ్ఛంస్తం దేవం కో భవానితి శంకరమ్ ॥9॥**

**అబ్రవీద్భగవాన్ రుద్రో హ్యహమేకః పురాతనః ।**
**ఆసం ప్రథమ ఏవాహం వర్తామి చ సూరోత్తమాః ॥10॥**

**భవిష్యామి చ లోకేఽస్మిన్ మత్తో నాన్యః కుతశ్చన ।**
**వ్యతిరిక్తం న మత్తోఽస్తి నాన్యత్కించిత్సురోత్తమాః ॥11॥**

అపుడు ఆ దేవగణాలన్నీ రుద్రాధ్యాయంతో భగవాన్ రుద్రుడిని స్తుతించారు. ఆ మహేశ్వరప్రభువు ఆ దేవతల జ్ఞానాన్ని అపహరించి ప్రసన్నముఖుడై వారి నడుమ నిలిచాడు. వాళ్లు శంకరుడిని గూర్చి ఇలా పలికారు–నీవు ఎవ్వడవు?' అపుడు శివుడిలా పలికాడు, 'ఓ దేవశ్రేష్ఠులారా! నేను ఒక పురాతనపురుషుడిని. నేనే సర్వప్రథముడిని. ఇపుడు ఉన్నాను. భవిష్యత్తులోనూ ఉంటాను. ఈ లోకంలో నాకన్నా పెద్ద ఇతరుడు ఎవడూ లేదు. ఓ దేవతాశ్రేష్ఠులారా! నాకన్నా ఎవడూ భిన్నుడు లేడు.'

**నిత్యోఽనిత్యోఽహమనఘో బ్రహ్మాహం బ్రహ్మణస్పతిః ।**
**దిశశ్చ విదిశశ్చాహం ప్రకృతిశ్చ పుమానహమ్ ॥12॥**

**త్రిష్టుబ్జగత్యనుష్టుప్ చ ఛందోఽహం తన్మయః శివః ।**
**సత్యోఽహం సర్వగః శాంతస్త్రేతాగ్నిర్గౌరవం గురుః ॥13॥**

**గౌరవం గహ్వరశ్చాహం నిత్యం గహనగోచరః ।**
**జ్యేష్ఠోఽహం సర్వతత్త్వానాం వరిష్ఠోఽహమపాం పతిః ॥14॥**

నేను నిత్యుడను. అనిత్యుడను కూడా. నేను పాపశూన్యుడను. బ్రహ్మను. వేదాలపాలకుడిని. నేను తూర్పు మొదలైన దిక్కుల్ని. ఆగ్నేయం మొదలైన విదిక్కుల్ని. నేను ప్రకృతిని. నేను పురుషుడిని కూడా. నేను త్రిష్టుప్, జగతి మరియు అనుష్టుప్ అనే ఛందస్సును. ఛందాల రాశిని నేను. నేను కల్యాణమయుడిని. నేను సత్యస్వరూపుడిని. సర్వగామిని. శాంతుడిని. మూడు అగ్నులు నేనే. వాటిలాగా గౌరవర్ణుడిని. హితోపదేశకుడిని. నేను పృథ్విని. గహ్వరాన్ని (గుహ) కూడా. ఆనందం మొదలైన వనాదుల్లో ఎల్లప్పుడు కన్పిస్తుంటాను. సమస్తతత్త్వాలలో నేను జ్యేష్ఠుణ్ణి మరియు శ్రేష్ఠుడిని. నేను సముద్రుడిని.

**ఆపోఽహం భగవానీశస్తేజోఽహం వేదిరప్యహమ్ ।**
**ఋగ్వేదోఽహం యజుర్వేదః సామవేదోఽహమాత్మభూః ॥15॥**

**అథర్వణోఽహం మంత్రోఽహం తథా చాంగిరసాం వరః ।**
**ఇతిహాసపురాణాని కల్పోఽహం కల్పనాప్యహమ్ ॥16॥**

**అక్షరం చ క్షరం చాహం క్షాంతిః శాంతిరహం క్షమా ।**

**గుహ్యోఽహం సర్వవేదేషు వరేణ్యోఽహమజోఽప్యహమ్ ॥17॥**

ఈశ్వరభగవానుడు చెబుతున్నాడు. నేను జలాన్ని. నేను తేజస్సును. నేను యజ్ఞవేదికను. నేను ఋగ్వేదాన్ని. యజుర్వేదాన్ని. సామవేదాన్ని,అథర్వవేదాన్ని. స్వయంభువుడను. నేను మహామంత్రాన్ని. అంగిరసులలో శ్రేష్ఠుడను. మహాభారతం మొదలైన ఇతిహాసాల పురాణాల స్వరూపాన్ని, నేను కల్పాన్ని. కర్మప్రయోగరచన కల్పించేవాడిని నేనే. అక్షరుడను. అట్లే క్షరుడను నేనే. నేను క్షాంతిని (ధైర్యం). నేను శాంతిని. క్షమను నేనే. నేను సర్వవేదాలతో సంవృతుడనై ఉన్నాను. నేను సర్వశ్రేష్ఠుడను. అజన్ముడను కూడా.

**పుష్కరం చ పవిత్రం చ మధ్యం చాహం తతః పరమ్ ।**
**బహిశ్చాహం తథా చాంతఃపురస్తాదహమవ్యయః ॥18॥**

**జ్యోతిశ్చాహం తమశ్చాహం బ్రహ్మా విష్ణుర్మహేశ్వరః ।**
**బుద్ధిశ్చాహమహంకారస్తన్మాత్రాణీంద్రియాణి చ ॥19॥**

**ఏవం సర్వం చ మామేవ యో వేద సురసత్తమాః ।**
**స ఏవ సర్వవిత్సర్వం సర్మాత్మా పరమేశ్వరః ॥20॥**

నేను పవిత్రమైన హృదయకమలరూపుడిని. దాని మధ్యభాగంలో నిలిచేవాడిని కూడా. దానికన్నా పరుడను కూడా. నేను వెలుపలివాడను. లోపలివాడిని కూడా. సమక్షమందుండేవాడిని కూడా. శాశ్వతుడిని కూడా. నేను వెలుగును. నేనే చీకటిని కూడా. నేనే బ్రహ్మను, విష్ణువును. మహేశ్వరుడిని. నేను బుద్ధిని. అహంకారాన్ని. తన్మాత్రల్ని, ఇంద్రియాల్ని నేనే. ఓ సురశ్రేష్ఠులారా! ఈ విధంగా సర్వం నేనేనని నన్ను తెలిసినవాడు సర్వజ్ఞుడు, సర్వాత్ముడు మరియు పరమేశ్వరరూపుడు అవుతున్నాడు.

**గాం గోర్భిర్బ్రాహ్మణాన్ సర్వాన్ బ్రాహ్మణ్యేన హవీంషి చ ।**
**ఆయుషాయుస్తథా సత్యం సత్యేన సురసత్తమాః ॥21॥**

**ధర్మం ధర్మేణ సర్వాంశ్చ తర్పయామి స్వతేజసా ।**
**ఇత్యాదౌ భగవానుక్త్వా తత్రైవాంతరధీయత ॥22॥**

**నాపశ్యంత తతో దేవం రుద్రం పరమకారణమ్ ।**
**తే దేవాః పరమాత్మానం రుద్రం ధ్యాయంతి శంకరమ్ ॥23॥**

**సనారాయణకా దేవాః సేంద్రాశ్చ మునయస్తథా ।**
**తథోర్ధ్వబాహవో దేవా రుద్రం స్తున్వంతి శంకరమ్ ॥24॥**

ఓ శ్రేష్ఠదేవతలారా! నేను వాణీరూపంలో వేదాలలో, బ్రాహ్మణుల హవిస్సులరూపంలో బ్రాహ్మణ్యాలలో, ఆయువుగా ఆయుష్షులలో, సత్యంగా సత్యంలో, ధర్మంగా ధర్మంలో మరియు మిగిలిన అన్నింటిలో తేజోరూపంగా సంతృప్తి చేస్తున్నాను. ఆ విధంగా పలికి శివభగవానుడు అక్కడే అంతర్ధానం చెందాడు. తర్వాత వాళ్లందరూ పరమకారణరూపుడైన రుద్రభగవానుడిని చూడలేకపోయారు. అపుడు వాళ్లందరూ పరమాత్మ శంకరుడిని ధ్యానించారు. విష్ణువుతో కూడిన ఇంద్రాదిదేవతలు, మునులు చేతులు పైకెత్తి కళ్యాణకారుడైన రుద్రుడిని స్తుతించారు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే శివమాహాత్మ్యవర్ణనం నామ సప్తదశోఽధ్యాయః ॥17॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని శివమాహాత్మ్య వర్ణన అనే పదిహేడవ అధ్యాయం సమాప్తం.

## **అష్టాదశోఽధ్యాయః** - పద్దెనిమిదవ అధ్యాయం

## **పాశుపతవ్రతమాహాత్మ్యవర్ణనమ్** - పాశుపతవ్రతమాహాత్మ్యవర్ణనం

**దేవా ఊచు** - దేవతలు పలికారు.

**య ఏష భగవాన్ రుద్రో బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ।**
**స్కందశ్చాపి తథా చంద్రో భువనాని చతుర్దశ ॥**
**ఆశ్వినౌ గ్రహతారాశ్చ నక్షత్రాణి చ ఖం దిశః ॥1॥**

**భూతాని చ తథా సూర్యః సోమశ్చాష్టౌ గ్రహాస్తథా ।**
**ప్రాణః కాలో యమో మృత్యురమృతః పరమేశ్వరః ॥2॥**

**భూతం భవ్యం భవిష్యచ్చ వర్తమానం మహేశ్వరః ।**
**విశ్వం కృత్స్నం జగత్సర్వం సత్యం తస్మై నమో నమః ॥3॥**

బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, కార్తికేయుడు, ఇంద్రుడు, పధ్నాలుగు భువనాలు, ఇద్దరు అశ్వనీదేవతలు, అన్ని గ్రహాలు, తారలు, నక్షత్రాలు, ఆకాశం-అట్లే దిక్కులు- అన్నీ ఈ రుద్రభగవానుడే. సమస్తప్రాణులు, సూర్యచంద్రులు, అష్టగ్రహాలు, ప్రాణం, కాలం, యముడు, మృత్యువు-అట్లే మోక్షం కూడా ఈ పరమేశ్వరుడే. పూర్వకాలమందలి విశ్వం, సృష్టించిన సంపూర్ణసంసారం, రానున్న జగత్తు, ప్రస్తుతం నడుస్తున్న లోకం మొత్తం వాస్తవరూపంలో మహేశ్వరుడే. ఆయనకు మాటిమాటికి నమస్కారం.

**త్వమాదౌ చ తథా భూతో భూర్భువః స్వస్తథైవ చ ।**
**అంతే త్వం విశ్వరూపోఽసి శీర్షం తు జగతః సదా ॥4॥**

**బ్రహ్మైకస్త్వం ద్విత్రిధార్థమధశ్చ త్వం సురేశ్వరః ।**
**శాంతిశ్చ త్వం తథా పుష్టిస్తుష్టిశ్చాప్యహుతం హుతమ్ ॥5॥**

**విశ్వం చైవ తథా విశ్వం దత్తం వా దత్తమీశ్వరమ్ ।**
**కృతం చాప్యకృతం దేవం పరమప్యపరం ధ్రువమ్ ।**
**పరాయణం సతాం చైవ హ్యసతామపి శంకరమ్ ॥6॥**

ఆద్యంతాలలో నీవే ప్రాదుర్భావం చెందుతున్నావు. నీవు-'భూః భువః స్వః' - ఈ మూడింటి స్వరూపానివి. నీవు ప్రకృతివి, పురుషుడవు. ద్విధారూపుడవు. బ్రహ్మవిష్ణుమహేశ్వరుడవు - త్రిధామూర్తివైన బ్రహ్మవు. నీవు అన్నింటికి ఆధారానివి. నీవు దేవతలకు ప్రభువవు. శాంతివి, పుష్టివి, తుష్టివి నీవే. హుతానివి, అహుతానివి, విశ్వానివి, అవిశ్వానివి, దత్తుడవు, అదత్తుడవు, కృతానివి, అకృతానివి, పరుడవు, అపరుడవు, ప్రభుడవు, ఈశ్వరుడవు నీవే. శంకరుడవైన నీవు సాధువులకు, అసాధువులకు కూడా ఆశ్రయరూపశుభకరుడవు.

**అపామసోమమమృతా అభూమాగన్మ జ్యోతిరవిదామ దేవాన్ ।**
**కిం నూనమస్మాన్కృణవదరాతిః కిము ధూర్తిరమృతం మర్త్యస్య ॥7॥**

మేము సోమరసాన్ని త్రాగుతాం. దాంతో అమరులం అవుతున్నాం. మేం జ్యోతివరకు చేరుకోగలం. దానివలన నిజానికి కామక్రోధాది శత్రువులు మమ్మల్ని ఏమి చేయగలరు? మరణధర్మం కూడా అమరత్వంగల మమ్మల్ని ఏమి చేయగలదు.

**ఏతజ్జగద్ధితం దివ్యమక్షరం సూక్ష్మమవ్యయమ్ ॥8॥**

**ప్రాజాపత్యం పవిత్రం చ సౌమ్యమగ్రాహ్యమవ్యయమ్ ।**
**అగ్రాహ్యేణాపి వా గ్రాహ్యం వాయవ్యేన సమీరణః ॥9॥**

**సౌమ్యేన సౌమ్యం గ్రసతి తేజసా స్వేన లీలయా ।**
**తస్మై నమోఽపసంహర్త్రే మహాగ్రాసాయ శూలినే ॥10॥**
**హృదిస్థా దేవతాః సర్వా హృది ప్రాణే ప్రతిష్ఠితాః ।**
**హృది త్వమసి యో నిత్యం తిస్రో మాత్రాః పరస్తు సః ॥11॥**

ఈ జగత్తు శివరూపమైంది. ఆయన హితకారకుడు, దివ్యుడు, నాశరహితుడు, సూక్ష్ముడు, అట్లే శాశ్వతుడు. ఆయన ప్రజాపతి, పావనుడు, శాంతుడు, అగ్రాహ్యుడు, అవినాశి, వాయుసంబంధమైన స్పర్శగుణం గలవాడు. కావున వాయురూపుడు. మనసుకు అగ్రాహ్యుడయ్యు గ్రాహ్యుడే. నీవు నీ చంద్రతేజస్సుతో భక్తుల అంతఃకరణాల్ని లీలాపూర్వకంగా నీలో విలీనం చేసుకుంటున్నావు. మహత్తత్త్వాన్ని కూడా గ్రసించు. నీవు అపసంహర్తవు. శూలివైన నీకు నమస్కారం. హృదయదేశంలో ప్రకాశిస్తున్న మూడు మాత్రలలో, దేవతలందరి హృదయాలలో నిలిచియున్న ప్రాణంలో నీవు ప్రతిష్ఠితుడవై ఉన్నావు. ప్రాణరూపంగా నీవు అందరి హృదయాలలో నిలిచి ఉన్నావో, అదే నాదమనే పేరుగల అర్ధమాత్రారూపం.

**శిరశ్చోత్తరతశ్చైవ పాదౌ దక్షిణతస్తథా ।**
**యో వై చోత్తరతః సాక్షాత్స ఓంకారః సనాతనః ॥ 12॥**

ఉత్తరవర్తియు శిరస్థానీయమైన 'అ' కారం, దక్షిణవర్తియు పాదస్థానీయమైన 'మ్' కారం, మధ్యవర్తి అయి మధ్యలోగల 'ఉ' కారం (అ+ఉ+మ్), ఈ ఉకారం (మధ్యవర్తి) ఉత్తరవర్తి అయిన అకారంతో సంశ్లిష్టమయి సాక్షాత్తు ఓంకారమైనది. ఆ ఓంకారమే సనాతనమైన శివుడు.

**ఓంకారో యః స ఏవేహ ప్రణవో వ్యాప్య తిష్ఠతి ।**
**అనంతస్తారసూక్ష్మం చ శుక్లం వైద్యుతమేవ చ ॥ 13॥**
**పరం బ్రహ్మ స ఈశాన ఏకో రుద్రః స ఏవ చ ।**
**భవాన్ మహేశ్వరః సాక్షాన్మహాదేవో న సంశయః ॥14॥**

ఆ ఓంకారమే సర్వవ్యాపి అయిన ప్రణవం అవుతున్నది. ఆ ప్రణవమే అనంతం, తారకం సూక్ష్మం, శుక్లం, జ్యోతిర్మయం, పరబ్రహ్మం, ఈశానం, అద్వితీయం. ఆ ప్రణవమే రుద్రుడు. భగవాన్ మహేశ్వరుడు, మహాదేవ శివుడు. ఇందులో సందేహం లేదు.

**ఊర్ధ్వమున్నామయత్యేవ స ఓంకారః ప్రకీర్తితః ।**
**ప్రాణానవతి యస్తస్మాత్ప్రణవః పరికీర్తితః ॥15॥**

**సర్వం వ్యాప్నోతి యస్తస్మాత్సర్వవ్యాపీ సనాతనః ।**
**బ్రహ్మా హరిశ్చ భగవానాద్యంతం నోపలబ్ధవాన్ ॥16॥**

**తథాన్యే చ తతోఽనంతో రుద్రః పరమకారణమ్ ।**
**యస్తారయతి సంసారాత్తార ఇత్యభిధీయతే ॥17॥**

**సూక్ష్మో భూత్వా శరీరాణి సర్వదా హ్యధితిష్ఠతి ।**
**తస్మాత్సూక్ష్మః సమాఖ్యాతో భగవాన్నీలలోహితః ॥18॥**

**నీలశ్చ లోహితశ్చైవ ప్రధానపురుషాన్వయాత్ ।**
**స్కందతేఽస్య యతః శుక్రం తథా శుక్రమపైతి చ ॥19॥**

ఉచ్చారణలో శరీరం మొత్తంలో పై భాగంలో పలకడంవల్ల 'ఓంకారం' అవుతున్నది. ప్రాణులకు రక్షణ ఇవ్వడంవల్ల 'ప్రణవం'గా పరిగణింపబడుతున్నది. చరాచరజగత్తులో వ్యాపించి ఉండడంవల్ల 'సర్వవ్యాపి' సనాతనుడు అవుతున్నాడు. బ్రహ్మదేవుడు, విష్ణుభగవానుడు శివుడి ఆద్యంతాలు తెలియకున్నారు. అందుకే పరమకారణుడైన రుద్రుడిని 'అనంతుడు' అంటున్నారు. సంసారాన్ని తరింపజేయడంవల్ల 'తారణుడు' అంటున్నారు. ఎల్లప్పుడు అందరి శరీరాలలో సూక్ష్మరూపంలో నిలిచి ఉండడంతో నీలలోహిత శివుడు 'సూక్ష్ముడు' అవుతున్నాడు. నీలం మరియు లోహితరూపమైన ప్రధానపురుషసంయోగవల్ల సదాశివుడికి శుక్రాంశ సంప్రాప్తమవుతున్నది.

**విద్యోతయతి యస్తస్మాద్వైద్యుతః పరిగీయతే ।**
**బృహత్త్వాద్ బృంహణత్వాచ్చ బృహతే చ పరాపరే ॥20॥**

**తస్మాద్ బృంహతి యస్మాద్ధి పరం బ్రహ్మేతి కీర్తితమ్ ।**
**అద్వితీయోఽథ భగవాంస్తురీయః పరమేశ్వరః ॥21॥**

ఎవడు దీప్తికారకుడో ఆతడే వైద్యుతుడు. శివభగవానుడు పరాపర (ఐహికం మరియు ఆముష్మికం) రూపుడై వర్ధన, పోషణాల్ని చేస్తున్నాడు. అందుచేత వర్ధనపోషణకారణం చేతనే పరబ్రహ్మ అవుతున్నాడు. శివభగవానుడు స్వజాతీయ, విజాతీయ, స్వగతభేదశూన్యుడు అవడంచేత అద్వితీయుడు (ఏకైక) అయ్యాడు. అట్లే తురీయుడు (నాల్గో) అయ్యాడు.

**ఈశానమస్య జగతః స్వదృశాం చక్షురీశ్వరమ్ ।**
**ఈశానమింద్రసూరయః సర్వేషామపి సర్వదా ॥22॥**

**ఈశానః సర్వవిద్యానాం యత్తదీశాన ఉచ్యతే ।**
**యదీక్షతే చ భగవాన్నిరీక్ష్యమితి చాజ్ఞయా ॥23॥**

**ఆత్మజ్ఞానం మహాదేవో యోగం గమయతి స్వయమ్ ।**
**భగవాంశ్చోచ్యతే దేవో దేవదేవో మహేశ్వరః ॥24॥**

ఇంద్రాది ప్రముఖదేవతలకు చక్షుః స్వరూపుడు, మరియు ఈ జగత్తుకు స్వామి అయిన శివుడు అన్నింటిని నిత్యం నియమించేవాడు. ఆయన సమస్తవిద్యలకు ప్రభువు. అందుకే ఈశానుడు అంటున్నారు. దేవదేవమహేశ్వర

మహాదేవుడు స్వేచ్ఛగా అన్ని భావనల్ని చూస్తున్నాడు. మనకు బోధిస్తున్నాడు. స్వయంగా యోగప్రాప్తి కల్పిస్తున్నాడు. అందుకే ఆయన 'భగవాన్' అవుతున్నాడు.

**సర్వాంల్లోకాన్ క్రమేణైవ యో గృహ్ణాతి మహేశ్వరః ।**
**విసృజత్యేష దేవేశో వాసయత్యపి లీలయా ॥25॥**

మహేశ్వరుడు తన లీలలతో క్రమంగా అన్ని లోకాల్ని తనలో లీనం చేసుకుంటున్నాడు. ఆ లోకాల్ని సృష్టిస్తున్నాడు. వాటిని పాలిస్తున్నాడు.

**ఏషో హి దేవః ప్రదిశోఽనుసర్వాః పూర్వో హి జాతః స ఉ గర్భే అంతః ।**
**స ఏవ జాతః స జనిష్యమాణః ప్రత్యఙ్ముఖాస్తిష్ఠతి సర్వతోముఖః ॥26॥**

శివుడు విశ్వరూపుడై క్రీడిస్తూ అన్ని దిక్కుల రూపంలో నిలిచి ఉన్నాడు. అనాది సిద్ధదేవుడు బ్రహ్మాండాల్ని ఉదరమందు నిలిపి స్వయంగా ఉత్పన్నుడవుతున్నాడు. అనంతరం కూడా ఉత్పన్నం కాగలడు. శివుడు అన్ని లోకాల్ని వ్యాపించి నిలిచి వున్నాడు.

**ఉపాసితవ్యం యత్నేన తదేతత్సిద్భిరవ్యయమ్ ।**
**యతో వాచో నివర్తంతే హ్యప్రాప్య మనసా సహ ॥27॥**

**తదగ్రహణమేవేహ యద్వాగ్వదతి యత్నతః ।**
**అపరం చ పరం వేతి పరాయణమితి స్వయమ్ ॥28॥**

**వదంతి వాచః సర్వజ్ఞం శంకరం నీలలోహితమ్ ।**

అందుకే సజ్జనులు అవినాశి అయిన ప్రభువును ప్రయత్నపూర్వకంగా ఉపాసించాలి. ఆయన్ని వర్ణించడంలో అసమర్థులు అవడంతో తత్త్వనిరూపణ లేకుండానే మనసుతో కూడిన మాట వెలువడుతున్నది. ప్రయత్నపూర్వకమైన వాణి ఆయన విషయంలో కొంత పరం, మరికొంత అపరం లేకుంటే పరాయణరూపంగా పలుకుతున్నది. అది నిజానికి ఆయన్ని నిర్వచించదు. వాణి ఆయన్ని సర్వజ్ఞుడని, శంకరుడని, నీలలోహితుడని మాత్రమే చెబుతున్నది.

**ఏష సర్వో నమస్తస్మై పురుషః పింగళః శివః ॥29॥**

**స ఏష స మహారుద్రో విశ్వం భూతం భవిష్యతి ।**
**భువనం బహుధా జాతం జాయమానమితస్తతః ॥ 30॥**

ఆయన సర్వస్వరూపుడు, పురుషుడు, పింగళుడు–అట్లే శివుడు అయి ఉన్నాడు. అట్టి ఆయనకు నమస్కారం. అనేకవిధాల ఉత్పన్నం కాగలవాడు, ఉత్పన్నం అవుతున్నవాడు, ఉత్పన్నం అయినవాడు శివుడు. సంపూర్ణ ప్రాణిసముదాయరూపమైన పధ్నాలుగు భువనాల స్వరూపమే శివుడు.

**హిరణ్యబాహుర్భగవాన్ హిరణ్యపతిరీశ్వరః ।**
**అంబికాపతిరీశానో హేమరేతా వృషధ్వజః ॥31॥**

**ఉమాపతిర్విరూపాక్షో విశ్వసృగ్విశ్వవాహనః ।**
**బ్రహ్మాణం విదధే యోఽసౌ పుత్రమగ్రే సనాతనమ్ ॥32॥**

**ప్రహిణోతి స్మ తస్మైవ జ్ఞానమాత్మప్రకాశకమ్ ।**

హిరణ్యబాహుడు, భగవానుడు, హిరణ్యపతి, ఈశ్వరుడు, అంబికాపతి, ఈశానుడు, హేమరేతుడు, వృషధ్వజుడు, ఉమాపతి, విరూపాక్షుడు, విశ్వసృజుడు–అట్లే విశ్వవాహనుడు అనే నామాలుగలవాడు శివుడు. ఆయన అందరికన్నా ముందుగా సనాతనుడైన బ్రహ్మను పుత్రుడుగా ఉత్పన్నం చేశాడు. ఆయనకు ఆత్మప్రకాశరూపమైన జ్ఞానాన్ని ప్రదానం చేశాడు.

**తమేకం పురుషం రుద్రం పురుహూతం పురుష్టుతమ్ ॥33॥**

**బాలాగ్రమాత్రం హృదయస్య మధ్యేఽవిశ్వం దేవం వహ్నిరూపం వరేణ్యమ్ ।**
**తమాత్మస్థం యోఽనుపశ్యంతి ధీరాస్తేషాం శాంతిః శాశ్వతీ నేతరేషామ్ ॥34॥**

ఆతడు ధీరపురుషుడు, ఆతడు అద్వితీయుడు. ఆతడు పురుషుడు. ఆతడు అనేకులచేత ఆవాహన చేయబడి తెలిసేవాడు, అనేకులచేత స్తుతింపబడేవాడు. ఆతడు హృదయమధ్యభాగంలో బాలాగ్రభాగంతో సమానమైన సూక్ష్మరూపంతో ప్రకాశించువాడు. ఆతడు విశ్వేశ్వరదేవుడు, అగ్నిరూపుడు, సర్వశ్రేష్ఠుడు. ఆయన రుద్రుడు. మనలో నిలిచి కన్పిస్తున్నాడు. ఆయననుంచి శాశ్వతశాంతి ప్రాప్తిస్తున్నది. ఇతరులనుంచి ఇది కలుగదు.

**మహతో యో మహీయాంశ్చ హ్యణోరప్యణురవ్యయః ।**
**గుహాయాం నిహితశ్చాత్మా జంతోరస్య మహేశ్వరః ॥35॥**
**వేశ్మభూతోఽస్య విశ్వస్య కమలస్థో హృది స్వయమ్ ।**
**గహ్వరం గహనం తత్థం తస్యాంతశ్చోర్ధ్వతః స్థితః ॥36॥**

**తత్రాపి దహ్రం గగనమోంకారం పరమేశ్వరమ్ ।**
**బాలాగ్రమాత్రం తన్మధ్యే ఋతం పరమకారణమ్ ॥37॥**

**సత్యం బ్రహ్మ మహాదేవం పురుషం కృష్ణపింగళమ్ ।**
**ఊర్ధ్వరేతసమీశానం విరూపాక్షమజోద్భవమ్ ॥38॥**

**అధితిష్ఠతి యోనిం యో యోనిం వాచైక ఈశ్వరః ।**
**దేహం పంచవిధం యేన తమీశానం పురాతనమ్ ॥39॥**

శివుడు మహత్తుకన్నా మహత్తు అయినవాడు. అణువుకన్నా సూక్ష్మమైనవాడు. అట్లే అవ్యయుడు. ప్రాణుల హృదయరూపగుహలలో ఆత్మరూపుడై నిలిచి ఉన్నాడు. కమలాసనుడైన ఆ శివుడు ఈ విశ్వమే ఆలయంగా గలవాడై ఉండే ప్రాణుల హృదయాలలో ప్రకాశిస్తున్నాడు. హృదయకమలాలలో ఉన్నప్పటికీ అయోగులకు తెలియలేని హృదయాకాశం కలిగి ఉంటాడు. వారి లోపల, వెలుపల అగ్నిశిఖ మాదిరిగా ప్రకాశిస్తున్నాడు. ఆ అగ్నిశిఖలో కూడా బాలాగ్రానికి సమానమైన సూక్ష్మమైన దహ్రమనే పేరుగల ఆకాశం ఉంది. దాని మధ్యలో ఋతుడు, పరమకారణరూపుడు, సత్యస్వరూపుడు, బ్రహ్మరూపుడు, మహాదేవుడు, పురుషుడు, అర్ధనారీశ్వరుడు, ఊర్ధ్వరేతసుడు, ఈశానుడు, త్రినేత్రుడు, అజోద్భవుడు, పరమేశ్వరుడు అయిన శివుడు ఓంకార రూపంలో నిలిచియున్నాడు. ఏకరూపుడు లేకుంటే అనేక రూపుడు అయిన ఈశ్వరుడు భిన్న భిన్న యోనుల్లో ప్రవేశిస్తున్నాడు. దాని ఫలితంగా

అన్నమయం మొదలైన ఐదురకాల దేహాన్ని ధరిస్తున్నాడు. పురాతనమైన ఈశానుడిని ధీరపురుషుడు చూస్తున్నాడు. ఆయన వలన శాంతి ప్రాప్తిస్తున్నది.

**ప్రాణేష్వంతర్మనసో లింగమాహుర్యస్మిన్ క్రోధో యా చ తృష్ణార్యక్షమా చ ।**
**తృష్ణాం ఛిత్త్వా హేతుజాలస్య మూలం బుద్ధ్యాచింత్యం స్థాపయిత్వా చ రుద్రే ॥40॥**

శివభగవానుడు ప్రాణులలోపల నిలిచి ఉన్నాడు. మనసు స్వరూపంలో అందులో క్రోధం, తృష్ణ, క్షమ మొదలైనవి నిలిచి ఉన్నాయి. భవబంధాలకు హేతువైన తృష్ణను ఛేదించి, మనసును రుద్రుడిలో నిలిపి బుద్ధిద్వారా ఆయన్ను చింతించాలి.

**ఏకం తమాహుర్వై రుద్రం శాశ్వతం పరమేశ్వరమ్ ।**
**పరాత్పరతరం వాపి పరాత్పరతరం ధ్రువమ్ ॥41॥**

**బ్రహ్మణో జనకం విష్ణోర్వహ్నేర్వాయోః సదాశివమ్ ।**
**ధ్యాత్వాగ్నినా చ శోధ్యాంగం విశోధ్య చ పృథక్ పృథక్ ॥42॥**

**పంచభూతాని సంయమ్య మాత్రావిధిగుణక్రమాత్ ।**
**మాత్రాః పంచ చతస్రశ్చ త్రిమాత్రాదిస్తతః పరమ్ ॥43॥**

**ఏకమాత్రమమాత్రం హి ద్వాదశాంతే వ్యవస్థితమ్ ।**
**స్థిత్వా స్థాప్యామృతో భూత్వా వ్రతం పాశుపతం చరేత్ ॥44॥**

ఏకమాత్రుడైన రుద్రుడు శాశ్వతుడు, పరమేశ్వరుడు, పరాత్పరులకే పరాత్పరుడు. అట్లే ధ్రువుడని చెప్పబడుతున్నాడు. బ్రహ్మ, విష్ణువు, అగ్ని, వాయువుల జనకుడైన సదాశివుడిని, ధ్యానించి, అగ్నిబీజంతో (రం) దేహాన్ని శుద్ధిచేసుకుని, వేరు వేరుగా పంచభూతాల్ని శుద్ధి చేసుకోవాలి. తర్వాత మాత్రావిధి గుణక్రమంగా ఐదు, నాలుగు, మూడు, రెండు, ఒకటి – వీటి తన్మాత్రలతో సంయమనపర్చాలి. ద్వాదశారచక్రం అంతంలో ప్రకాశించే నిర్గుణుడైన శివుడిని స్థాపించి, తానూ అక్కడ స్థితుడై అమృతరూపుడై పాశుపతవ్రతాన్ని నిర్వహించాలి.

**ఏతద్ వ్రతం పాశుపతం చరిష్యామి సమాసతః ।**
**అగ్నిమాధాయ విధివదృగ్యజుఃసామసంభవైః ॥45॥**
**ఉపోషితః శుచిః స్నాతః శుక్లాంబరధరః స్వయమ్ ।**
**శుక్లయజ్ఞోపవీతీ చ శుక్లమాల్యానులేపనః ॥46॥**

**జుహుయాద్విరజో విద్వాన్ విరజాశ్చ భవిష్యతి ।**

నేను ఈ పాశుపతవ్రతాన్ని, సంగ్రహంగా నిర్వహిస్తాను. సంకల్పం చేసుకుని ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం మంత్రాలతో విధ్యుక్తంగా అగ్నిని స్థాపించి, ఉపవాసం ఉండి, స్నానం చేసి శుభ్రపడి, తెల్లటి వస్త్రాల్ని, తెల్లటి జంధ్యాన్ని, తెల్లటి మాలల్ని, తెల్లటి చందనాన్ని ధరించి రజోగుణాన్ని విడిచిపెట్టి విద్వాంసుడు హోమం చేయాలి. ఈ విధంగా ఆతడు రజోగుణరహితుడు అవుతాడు.

**వాయవః పంచ శుధ్యంతాం వాజ్మనశ్చరణాదయః ॥47॥**

**శ్రోత్రం జిహ్వా తతః ప్రాణస్తతో బుద్ధిస్తథైవ చ ।**
**శిరః ప్రాణిస్తథా పార్శ్వం పృష్ఠోదరమనంతరమ్ ॥48॥**

**జంఘే శిశ్నముపస్థం చ పాయుర్మేఢ్రం తథైవ చ ।**
**త్వచా మాంసం చ రుధిరం మేదోఽస్థీని తథైవ చ ॥49॥**

**శబ్దః స్పర్శం చ రూపం చ రసో గంధస్తథైవ చ ।**
**భూతాని చైవ శుద్ధ్యంతాం దేహే మేదాదయస్తథా ॥50॥**

**అన్నం ప్రాణే మనో జ్ఞానం శుద్ధ్యంతాం వై శివేచ్ఛయా ।**
**హుత్వాజ్యేన సమిద్భిశ్చ చరుణా చ యథాక్రమమ్ ॥51॥**

**ఉపసంహృత్య రుద్రాగ్నిం గృహీత్వా భస్మ యత్నతః ।**
**అగ్నిరిత్యాదినా ధీమాన్ విమృజ్యాంగాని సంస్పృశేత్ ॥52॥**

శివభగవానుడి ఇచ్ఛవలన ప్రాణం మొదలైన పంచ వాయువులు శుద్ధి పొందాయి. వాక్కు, మనసు, పాదాలు, కర్ణాలు, జిహ్వ, ప్రాణం, బుద్ధి, శిరస్సు, చేతులు, పార్శ్వభాగం, పృష్ఠభాగం, ఉదరం, రెండు జఘనాలు, శిశ్నం, జననేంద్రియం, గుదం, మేఢ్రం, చర్మం, మాంసం, రక్తం, మేదస్సు, ఎముకలు, శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం, పృథివి మొదలైన మహాభూతాలు; అట్లే దేహమందుగల మేదాదుల్ని శుద్ధి చేయాలి. అన్నం, ప్రాణం, మనసు–అట్లే జ్ఞానం వీటిని శుద్ధి చేయాలి. ఈ విధంగా యథావిధి ఆజ్యాన్ని సమిధల్ని అట్లే చరువుతో హోమం చేసి రుద్రాగ్నిని ఉపసంహరించి ప్రయత్నపూర్వకంగా "అగ్నిరితి" మంత్రంతో భస్మాన్ని గ్రహించి బుద్ధిమంతుడు అంగాలకు అద్దుకోవాలి.

**ఏతత్పాశుపతం దివ్యం వ్రతం పాశవిమోచనమ్ ।**
**బ్రాహ్మణానాం హితం ప్రోక్తం క్షత్రియాణాం తథైవ చ ॥53॥**

**వైశ్యానామపి యోగ్యానాం యతీనాం తు విశేషతః ।**
**వానప్రస్థాశ్రమస్థానాం గృహస్థానాం సతామపి ॥54॥**

**విముక్తిర్విధినానేన దృష్టా వై బ్రహ్మచారిణామ్ ।**
**అగ్నిరిత్యాదినా భస్మ గృహీత్వా హ్యగ్నిహోత్రజమ్ ॥55॥**

**సోఽపి పాశుపతో విప్రో విమృజ్యాంగాని సంస్పృశేత్ ।**
**భస్మచ్ఛన్నో ద్విజో విద్వాన్ మహాపాతకసంభవైః ॥ 56॥**

**పాపైర్విముచ్యతే సద్యో ముచ్యతే చ న సంశయః ।**
**వీర్యమగ్నేర్యతో భస్మ వీర్యవాన్ భస్మసంయుతః ॥57॥**

**భస్మస్నానరతో విప్రో భస్మశాయీ జితేంద్రియః ।**
**సర్వపాపవినిర్ముక్తః శివసాయుజ్యమాప్నుయాత్ ॥58॥**

**తస్మాత్సర్వప్రయత్నేన భూత్యంగం పూజయేద్ బుధః ।**
**రేరేకారో న కర్తవ్యస్తుంతున్కారస్తథైవ చ ॥59॥**

**న తత్క్షమతి దేవేశో బ్రహ్మా వా యది కేశవః ।**
**మమ పుత్రో భస్మధారీ గణేశశ్చ వరాననే ॥60॥**

ఈ దివ్యపాశుపతవ్రతం ముక్తినిస్తుంది. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, విశేషరూపంలో యోగ్యులైన యతులు, వానప్రస్థులు, ఆశ్రమవాసులు, గృహస్థులైన సత్పురుషులు, బ్రహ్మచారులు - వీరి అందరికి హితకారి యీ వ్రతం. ఈ విధంగా విరజాదీక్షను పొంది భస్మధారణ చేస్తే ముక్తి కలుగుతున్నది. ఇది తెలిసి "అగ్నిరితి" మొదలైన మంత్రంతో అగ్నిహోత్రుడినుంచి భస్మాన్ని గ్రహించి అంగాలకు పూసుకోవాలి. ఈ విధంగా చేసిన విప్రుడు పాశుపతుడు అవుతాడు. భస్మానులిప్తుడైన ద్విజవిద్వాంసుడు మహాపాపాలు చేసినవాడూ ఆ దోషాలనుంచి శీఘ్రంగా విముక్తుడు అవుతాడు. ఇందులో సందేహం లేదు. ప్రజ్వలించే అగ్నిభస్మం వీర్యవంతం అవుతుంది. అందుచేత భస్మధారణ చేసేవాడు వీర్యవంతుడు (తేజస్వి) అవుతున్నాడు. భస్మస్నానపరాయణుడు, భస్మశాయి మరియు జితేంద్రియుడు అయిన విప్రుడు పాపాలన్నిటినుంచి విముక్తుడై శివసాయుజ్యాన్ని పొందుతున్నాడు. అందుచే బుద్ధిమంతులు భస్మధారులైనవారిని పూజించాలి. వారిని 'రే' అని గాని, 'నీవు' అని గాని పిలవరాదు. ఓ వరాననా! ఈ దేవేశ్వరుడు శివుడు క్షమించకుంటే బ్రహ్మ, విష్ణువు భస్మధారి అయిన నా పుత్రుడు గణేశుడు కూడా ఉండరు.

**తేషాం విరుద్ధం యత్త్యాజ్యం స యాతి నరకార్ణవమ్ ।**
**గృహస్థో బ్రహ్మహీనోఽపి త్రిపుండ్రం యో న కారయేత్ ॥ 61॥**

**పూజా కర్మ క్రియా తస్య దానం స్నానం తథైవ చ ।**
**నిష్ఫలం జాయతే సర్వం యథా భస్మని వై హుతమ్ ॥62॥**

**తస్మాచ్చ సర్వకార్యేషు త్రిపుండ్రం ధారయేద్ బుధః ।**

పాశుపతులకు విరుద్ధంగా ప్రవర్తించేవాళ్లు త్యజింపదగినవాళ్లు. త్యజించనివాళ్లు నరకసముద్రాన్ని పొందుతున్నారు. తపస్సు ఆచరణ కలిగియుండి కూడా గృహస్థుడు త్రిపుండ్రాల్ని ధరించడో, ఆతడు చేసిన పూజ, సత్కర్మ, సత్క్రియ, దానం, స్నానం అన్నీ నిష్ఫలాలే-బూడిదలో పోసిన ఆహుతి మాదిరిగా. అందుచే బుద్ధిమంతులు సత్కర్మాచరణంలో త్రిపుండ్రధారణ తప్పక చేయాలి.

**ఇత్యుక్త్వా భగవాన్ బ్రహ్మా స్తుత్వా దేవైః సమం ప్రభుః ॥63॥**

**భస్మచ్ఛన్నైః స్వయం ఛన్నో విరరామ విశాంపతే ।**
**అథ తేషాం ప్రసాదార్థం పశూనాం పతిరీశ్వరః ॥ 64॥**

**సగణశ్చాంబయా సార్థం సాన్నిధ్యమకరోత్ప్రభుః ।**
**అథ సన్నిహితం రుద్రం తుష్టువుః సురపుంగవమ్ ॥65॥**

**రుద్రాధ్యాయేన సర్వేశం దేవదేవముమాపతిమ్ ।**
**దేవోఽపి దేవానాలోక్య ఘృణయా వృషభధ్వజః ॥66॥**

**తుష్టోఽస్మీత్యాహ దేవేభ్యో వరం దాతుం సురారిహా ॥67॥**

ఓ విశాంపతే! ఈ విధంగా భస్మమాహాత్మ్యాన్ని చెప్పి, భస్మాన్ని ధరించి ప్రభువైన బ్రహ్మదేవుడు భస్మధారణ చేసిన దేవతలతో కలిసి శివుడిని స్తుతించి ఆనందమగ్నుడై శాంతిని పొందాడు. తర్వాత దేవతల్ని అనుగ్రహించడంకొరకు పశుపతి, ప్రభువు, పరమేశ్వరుడు గణాలతో, పార్వతీదేవితో కలిసి సాక్షాత్కరించాడు. అపుడు దేవతలు సాక్షాత్కరించిన సుశ్రేష్ఠుడు, సర్వేశ్వరుడు, దేవదేవుడు, ఉమాపతి అయిన రుద్రుడిని రుద్రాధ్యాయంతో స్తుతించారు. అపుడు దేవతల శత్రువుల్ని సంహరించే వృషభధ్వజుడు, శివభగవానుడు కృప నిండిన చూపులతో దేవతల్ని చూచి "నేను దేవతలకై వరప్రదానం చేయడానికై సంతుష్టిడిని అయ్యాను" అని పలికాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే పాశుపతవ్రతమాహాత్మ్యవర్ణనం నామాష్టాదశోఽధ్యాయః ॥18॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని పాశుపతవ్రత మాహాత్మ్య వర్ణన అనే పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.



## ఏకోనవింశోఽధ్యాయః - పంతొమ్మిదవ అధ్యాయం

## శివపూజనవర్ణనమ్ - శివపూజనవర్ణనం

**శైలాదిరువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**తం ప్రభుం ప్రీతమనసం ప్రణిపత్య వృషభధ్వజమ్ ।**
**అపృచ్ఛన్మునయో దేవాః ప్రీతికంటకితత్వచః ॥1॥**

ఓ సనత్కుమారా! ప్రసన్నమానసుడైన ప్రభువు వృషభధ్వజుడు శివుడికి నమస్కరించి సంతోషం వల్ల కలిగిన పులకలు నిండిన దేహాలు గల మునులు అట్లే దేవతలు ఆయనతో ఇలా పలికారు.

**దేవా ఊచుః** - దేవతలు పలికారు.

**భగవన్ కేన మార్గేణ పూజనీయో ద్విజాతిభిః ।**
**కుత్ర వా కేన రూపేణ వక్తుమర్హసి శంకర ॥2॥**

**కస్యాధికారః పూజాయాం బ్రాహ్మణస్య కథం ప్రభో ।**
**క్షత్రియాణాం కథం దేవ వైశ్యానాం వృషభధ్వజ ॥3॥**

**స్త్రీశూద్రాణాం కథం వాపి కుండగోలాదినాం తు వా ।**
**హితాయ జగతాం సర్వమస్మాకం వక్తుమర్హసి ॥4॥**

ఓ భగవాన్! ఓ శంకరా! ద్విజాతిగణాలు ఏ విధంగా, ఎక్కడ, ఏ రూపంగా నీ పూజ చేయాలో కృపతో చెప్పవలసింది. ఓ ప్రభూ! బ్రాహ్మణుడికి పూజలో ఏ విధమైన అధికారం ఉంది? ఓ దేవా! ఓ వృషభధ్వజా! క్షత్రియులకు, వైశ్యులకు, స్త్రీలకు, శూద్రులకు, కుండకులు, గోళకులు మొదలైన వర్ణసంకర ప్రజలకు నీ పూజలో ఏ విధమైన అధికారం ఉంది? లోకకళ్యాణంకోసం మాకు సమస్తవిషయం చెప్పదగినవాడవు.

**సూత ఉవాచ** - సూతమహర్షి పలికాడు.

**తేషాం భావం సమాలోక్య మునీనాం నీలలోహితః ।**
**ప్రాహ గంభీరయా వాచా మండలస్థః సదాశివః ॥5॥**

**మండలే చాగ్రతో పశ్యన్ దేవదేవం సహోమయా ।**
**దేవాశ్చ మునయః సర్వే విద్యుత్కోటిసమప్రభమ్ ॥6॥**

**అష్టబాహుం చతుర్వక్త్రం ద్వాదశాక్షం మహాభుజమ్ ।**
**అర్ధనారీశ్వరం దేవం జటాముకుటధారిణమ్ ॥7॥**

**సర్వాభరణసంయుక్తం రక్తమాల్యానులేపనమ్ ।**
**రక్తాంబరధరం సృష్టిస్థితిసంహారకారకమ్ ॥8॥**

ఆ మునుల, దేవతల భక్తిని చూచి సూర్యమండలంలో నిలిచియున్న నీలలోహిత సదాశివుడు గంభీరమైన వాక్కుతో ఇలా పలికాడు. ఆ సమయంలో దేవతలందరికి మునులందరికి దగ్గరగా కన్పించి కూడా సృష్టిస్థితిలయకారకుడైన దేవదేవశివుడు పార్వతీదేవితో కూడి సూర్యమండలంలో ప్రకాశిస్తున్నాడు. కోటివిద్యుల్లతలకు సమానమైన కాంతి ఆయనిది. ఆయన ఎనిమిది భుజాలతో, నాలుగు ముఖాలతో, పండ్రెండు నేత్రాలతో శోభిల్లుతున్నాడు. ఆయన ఘనమైన భుజాలు కలిగి యున్నాడు. ఆయన అర్ధనారీశ్వరరూపంలో ఉన్నాడు. జటాజూటరూపమైన మకుటాన్ని ధరించి ఉన్నాడు. సమస్తమైన ఆభరణాలు ధరించి ఉన్నాడు. రక్తవర్ణమాలను, చందనాన్ని అట్టి వర్ణమేగల వస్త్రాన్ని ధరించి ఉన్నాడు.

**తస్య పూర్వముఖం పీతం ప్రసన్నం పురుషాత్మకమ్ ।**
**అఘోరం దక్షిణం వక్త్రం నీలాంజనచయోపమమ్ ॥9॥**

**దంష్ట్రాకరాలమత్యుగ్రం జ్వాలామాలాసమావృతమ్ ।**
**రక్తశ్మశ్రుం జటాయుక్తం చోత్తరే విద్రుమప్రభమ్ ॥10॥**

**ప్రసన్నం వామదేవాఖ్యం వరదం విశ్వరూపిణమ్ ।**
**పశ్చిమం వదనం తస్య గోక్షీరధవళం శుభమ్ ॥11॥**

**ముక్తాఫలమయైర్హారైర్భూషితం తిలకోజ్జ్వలమ్ ।**
**సద్యోజాతముఖం దివ్యం భాస్కరస్య స్మరారిణః ॥12॥**

శివుడి పూర్వముఖం తత్పురుష సంజ్ఞ కలది. అది పచ్చని వర్ణం కలది. ప్రసన్నత్వంతో కూడినట్టిది. ఆయన దక్షిణముఖం అఘోరమనే పేరుగలది. నల్లగా, కాటుకతో సమానంగా కరాళసదృశదంష్ట్రలు కలిగినట్టిది. మిక్కిలి ఉగ్రమైన జ్వాలా సమూహంతో కూడినట్టిది. ఎరుపు రంగుతోనున్న గడ్డం గలది. జటలతో శోభిల్లుతున్నది. ఉత్తరదిక్కునగల ముఖం వాసుదేవనామకమైనది. ప్రవాళమణులతో సమానమైన కాంతితో కూడినట్టిది. ప్రసన్నమైనది, వరదాయకమైనది, విశ్వరూపమైనది. కామారి, భాస్కరరూపుడు అయిన శివుడి పశ్చిమదిక్కు ముఖం సద్యోజాతమనే పేరు గలది. అది ఆవుపాలతో సమానమైన తెల్లదిగా, సుందరమైనదిగా, మంచి ముత్యాలతో కూడిన హారాలతో శోభిల్లేదిగా, తిలకంతో ప్రకాశిస్తూ అత్యంతదివ్యంగా ఉన్నది.

**ఆదిత్యమగ్రతోఽపశ్యన్పూర్వవచ్చతురాననమ్ ।**
**భాస్కరం పురతో దేవం చతుర్వక్త్రం చ పూర్వవత్ ॥13॥**

**భానుం దక్షిణతో దేవం చతుర్వక్త్రం చ పూర్వవత్ ।**
**రవిముత్తరతోఽపశ్యన్పూర్వవచ్చతురాననమ్ ॥14॥**

**విస్తారాం మండలే పూర్వే ఉత్తరాం దక్షిణే స్థితామ్ ।**
**బోధనీం పశ్చిమే భాగే మండలస్య ప్రజాపతేః ॥15॥**

**అధ్యాయనీం చ కౌబేర్యామేకవక్త్రాం చతుర్భుజామ్ ।**
**సర్వాభరణసంపన్నాః శక్తయః సర్వసమ్మతాః ॥16॥**

శివుడి ముందు దిక్కున శివుడికి సమానమైన నాల్గు ముఖాలుగల ఆదిత్యుడిని, పూర్వదిక్కున శివసదృశుడై చతుర్ముఖుడైన భానుడిని, ఉత్తరం వైపున శివుడితో సమానమైన చతుర్ముఖుడైన సూర్యుడిని చూడడం జరిగింది. ఈ విధంగానే దేవతలు సూర్యమండలం పూర్వదిక్కులో విస్తారాదేవిని, ఉత్తరదిక్కులో ఉత్తరను, పడమటి భాగంలో బోధనిని మరియు ఉత్తరదిక్కులో ఏకముఖం మరియు నాల్గు భుజాలుగల అధ్యాయనిని చూశారు. పూజనీయమైన ఆ శక్తులు సమస్తాభరణసంపన్నలై ఉన్నారు.

**బ్రహ్మాణం దక్షిణే భాగే విష్ణుం వామే జనార్దనమ్ ।**
**ఋగ్యజుః సామమార్గేణ మూర్తిత్రయమయం శివమ్ ॥17॥**

**ఈశానం వరదం దేవమీశానం పరమేశ్వరమ్ ।**
**బ్రహ్మాసనస్థం వరదం ధర్మజ్ఞానాసనోపరి ॥18॥**

**వైరాగ్యైశ్వర్యసంయుక్తో ప్రభూతే విమలే తథా ।**
**సారం సర్వేశ్వరం దేవమారాధ్యం పరమం సుఖమ్ ॥19॥**

**సితపంకజమధ్యస్థం దీప్తాద్యైరభిసంవృతమ్ ।**
**దీప్తాం దీపశిఖాకారాం సూక్ష్మాం విద్యుత్ప్రభాం శుభామ్ ॥20॥**

**జయామగ్నిశిఖాకారాం ప్రభాం కనకసప్రభామ్ ।**
**విభూతిం విద్రుమప్రఖ్యాం విమలాం పద్మసన్నిభమ్ ॥21॥**

**అమోఘాం కర్ణికాకారాం విద్యుతం విశ్వవర్ణినీమ్ ।**
**చతుర్వక్త్రాం చతుర్వర్ణాం దేవీం వై సర్వతోముఖీమ్ ॥22**

**సోమమంగారకం దేవం బుధం బుద్ధిమతాం వరమ్ ।**
**బృహస్పతిం బృహద్బుద్ధిం భార్గవం తేజసాం నిధిమ్ ॥23॥**

**మందం మందగతిం చైవ సమంతాత్తస్య తే సదా ।**
**సూర్యః శివో జగన్నాథః సోమః సాక్షాదుమా స్వయమ్ ॥ 24**

**పంచభూతాని శేషాణి తన్మయం చ చరాచరమ్ ।**
**దృష్ట్వైవ మునయః సర్వే దేవదేవముమాపతిమ్ ॥ 25॥**

**కృతాంజలిపుటాః సర్వే మునయో దేవతాస్తథా ।**
**అస్తువన్ వాగ్భిరిష్టాభిర్వరదం నీలలోహితమ్ ॥26॥**

దేవతలు, మునులు శివుడి కుడివైపున విష్ణువును, ఎడమవైపున బ్రహ్మను దర్శించారు. వాళ్లు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదాన్ని క్రమంగా బ్రహ్మరుద్రవిష్ణుమయమైన రూపంలో ఆ మూడు మూర్తుల్లో శోభిల్లడాన్ని దర్శించారు. సర్వప్రభువు, వరదుడు, ఈశానుడు, వరదాయకుడు, పరమేశ్వరుడైన శివుడిని ధర్మజ్ఞానాసనం మీద, బ్రహ్మాసనం మీద దర్శించారు. వాళ్లు, వైరాగ్యం–,అట్లే ఐశ్వర్యంచేత శోభిల్లువాడు, విశాలమైన, విమలమైన ఆసనంమీద శ్వేతపద్మం మధ్యలో ప్రకాశించువాడు, సర్వులకు స్వామి, దేవతారాధ్యుడు, సర్వోన్నతసుఖదాయి

అయిన శివుడిని దీప్తి మొదలైన తొమ్మిది శక్తులతో కూడినవాడిని దర్శించారు. దేవతలు, మునులు ప్రజ్వలించు అగ్నిశిఖతో సమానమైన కాంతిగలవాడు, విద్యుల్లతికతో సమానమైన శుభసూక్ష్మరూపం గలవాడు, అగ్నిశిఖ ఆకారంగల జయశీలిని, సువర్ణసదృశకాంతిగలవాడు, ప్రవాళసమానవర్ణవైభవంగలవాడు, కమలంతో సమానమైన స్వచ్ఛతగలవాడు, పద్మం కర్ణికరూపంగలవాడు, అమోఘమైనవాడు అయిన శివుడిని, బహువర్ణసమన్విత వైద్యుతద్యుతిగల దేవిని, నాల్గుముఖాలు, నాల్గువర్ణాలుగల సర్వతోముఖి అయిన దేవిని, చంద్రుడిని, మంగళుడిని, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన బుధుడిని, గొప్పధీశాలి బృహస్పతిని, తేజోనిధి శుక్రుడిని, మందగమనం గల శనిని – ఎల్లప్పుడు శివుడి నాల్గువైపులగల పైన చెప్పిన వారినందరిని దర్శించారు. స్వయంగా జగత్స్వామి శివరూపుడు సూర్యుడు, సాక్షాత్తూ ఉమారూపుడైన చంద్రుడు మరియు గగనం మొదలైన పంచమహాభూతరూపాలైన భౌమం మొదలైన పంచగ్రహాలు ఉన్నాయి. వాటివలన చరాచరజగత్తు వ్యాపించి ఉన్నది. ఈ విధంగా దేవదేవుడు ఉమాపతి సదాశివుడిని చూస్తున్న మునులందరూ పూజించాలనే జ్ఞానాన్ని విడిచిపెట్టారు. మునులు, దేవతలు అందరూ చేతులు జోడించి ఇష్టపూర్వకమైన వాక్కులతో వరదాత, నీలలోహితుడైన శివుడిని స్తుతించారు.

**ఋషయ ఊచుః –** ఋషులు పలికారు.

**నమః శివాయ రుద్రాయ కద్రుద్రాయ ప్రచేతసే ।**
**మీఢుష్టమాయ శర్వాయ శిపివిష్టపాయ రంహసే ॥27॥**

**ప్రభూతే విమలే సారే హ్యాధారే పరమే సుఖే ।**
**నవశక్త్యావృతం దేవం పద్మస్థం భాస్కరం ప్రభుమ్ ॥28॥**

**ఆదిత్యం భాస్కరం భానుం రవిం దేవం దివాకరమ్ ।**
**ఉమాం ప్రభాం తథా ప్రజ్ఞాం సంధ్యాం సావిత్రికామపి ॥29॥**

**విస్తారాముత్తరాం దేవీం బోధనీం ప్రణమామ్యహమ్ ।**
**ఆప్యాయనీం చ వరదాం బ్రహ్మాణం కేశవం హరమ్ ॥30॥**

శివుడు, రుద్రుడు, కద్రుద్రుడు, ప్రచేతసుడు, మీఢుష్టముడు, శర్వుడు, శిపివిష్టుడు, రంహసుడు అయిన శివుడికి నమస్కారం. విశాలుడు, విమలుడు, శ్రేష్ఠుడు, పరమసుఖదాయకమైన ఆసనంమీద విరాజమానుడు, నవశక్తులతో ఆవృతుడు, పద్మం మధ్యలో స్థితుడైన భాస్కరభగవానుడు, ఆదిత్యుడు, భాస్కరుడు, భానువు, రవి, దేవుడు–అట్లే దివాకరుడు అయినవాడికి నమస్కారం. ఉమ, ప్రభ, ప్రజ్ఞ, సంధ్య, సావిత్రిక, విస్తార, ఉత్తర, బోధనీదేవి, వరదాత ఆప్యాయని అయినవాడికి నమస్కారం. బ్రహ్మ, కేశవుడు–అట్లే హరుడు అయినవాడికి మేము నమస్కరిస్తున్నాను.

**సోమాదిబృందం చ యథాక్రమేణ సంపూజ్య మంత్రైర్విహితక్రమేణ ।**
**స్మరామి దేవం రవిమండలస్థం సదాశివం శంకరమాదిదేవమ్ ॥31॥**

యథావిధిగా మంత్రాలద్వారా యథాక్రమం సోమాదులను పూజించి సూర్యమండలంలో విరాజమానుడైన భగవానుడు ఆదిదేవుడు సదాశివుడు అయిన శంకరుడిని స్మరిస్తున్నాను.

**ఇంద్రాదిదేవాంశ్చ తథేశ్వరాంశ్చ నారాయణం పద్మజమాదిదేవమ్ ।**
**ప్రాగాద్యధోర్ధ్వం చ యథాక్రమేణ వజ్రాదిపద్మం చ తథా స్మరామి ॥32॥**

ఇంద్రుడు మొదలైన అష్టదిక్పాలకులను, వారి అధిదేవతలను, నారాయణుడిని, ఆదిదేవుడు బ్రహ్మను, అట్లే యథాక్రమంగా తూర్పు మొదలైన ఎనిమిది దిక్కులను, పైనగల దిక్కును, క్రింది దిక్కును మరియు వజ్రం, పద్మం మున్నగువాటిని స్మరిస్తున్నాను.

**సిందూరవర్ణాయ సమండలాయ సువర్ణవజ్రాభరణాయ తుభ్యమ్ ।**
**పద్మాభనేత్రాయ సపంకజాయ బ్రహ్మేంద్రనారాయణకారణాయ ॥33॥**

సిందూరంతో సమానమైన వర్ణంకలవాడు, వజ్రాల్ని పొదిగిన బంగారు ఆభరణాల్ని ధరించినవాడు, పద్మసమాననేత్రాలుగలవాడు, పద్మాన్ని ధరించేవాడు, అట్లే బ్రహ్మకు, ఇంద్రుడికి, నారాయణుడికి కూడా కారణమైనవాడు అయిన శివభగవానుడికి నమస్కారం.

**రథం చ సప్తాశ్వమనూరువీరం గణం తథా సప్తవిధం క్రమేణ ।**
**ఋతుప్రవాహేణ చ వాలఖిల్యాన్ స్మరామి మందేహగణక్షయం చ ॥34॥**

సూర్యుడి రథాన్ని, దాని ఏడు గుఱ్ఱాలను, పరాక్రమశాలి అనూరుడిని, వసంతాదులైన ఋతుక్రమంగా నిలిచి ఉండే సప్తవిధగణాలను, వాలఖిల్యాదులైన ఋషిగణాలను, మందేహుడనే రాక్షసుడని సంహరించినవాడిని స్మరిస్తున్నాను.

**హుత్వా తిలాద్యైర్వివిధైస్తథాగ్నౌ పునః సమాప్యైవ తథైవ సర్వమ్ ।**
**ఉద్వాస్య హృత్పంకజమధ్యసంస్థం స్మరామి బింబం తవ దేవదేవ ॥35॥**

ఓ దేవదేవా! నూవులు మొదలైన వివిధ పదార్థాలతో అగ్నికి ఆహుతులిచ్చి తర్వాత సంపూర్ణంగా ఆ కార్యాన్ని సమాప్తిచేసి, హృదయకమలం మధ్య నిలిచియున్న నీ బింబాన్ని మండలంనుంచి తొలగించి స్మరిస్తున్నాను.

**స్మరామి బింబాని యథాక్రమేణ రక్తాని పద్మామలలోచనాని ।**
**పద్మం చ సవ్యే వరదం చ వామే కరే తథా భూషితభూషణాని ॥36॥**

నీ ఎఱ్ఱటి పెదవుల్ని, పద్మంతో సమానమైన నిర్మల నేత్రాల్ని, కుడిచేతిలోగల పద్మాన్ని, ఎడమ చేతిలోగల వరదముద్రను అట్లే శోభాసంపన్నమైన అలంకారాలను స్మరిస్తున్నాను.

**దంష్ట్రాకరాలం తవ దివ్యవక్త్రం విద్యుత్ప్రభం దైత్యభయంకరమ్ చ ।**
**స్మరామి రక్షాభిరతం ద్విజానాం మందేహరక్షోగణభర్త్సనం చ ॥37॥**

కరాళదంష్ట్రుడిని,విద్యుత్తుతో తుల్యమైన కాంతిగలవాడిని, దైత్యభయంకరుడిని, బ్రాహ్మణుల రక్షణ విషయంలో సంలగ్నుడిని, మందేహుడు, ఆతడి రాక్షససముదాయాన్ని మథించినవాడిని, దివ్యముఖుడిని – స్మరిస్తున్నాను.

**సోమం సితం భూమిజమగ్నివర్ణం చామీకరాభం బుధమిందుసూనుమ్ ।**
**బృహస్పతిం కాంచనసన్నికాశం శుక్రం సితం కృష్ణతరం చ మందమ్ ॥38॥**

**స్మరామి సవ్యమభయం వామమూరుగతం వరమ్ ।**
**సర్వేషాం మందపర్యంతం మహాదేవం చ భాస్కరమ్ ॥39॥**

తెల్లటి రంగుగల చంద్రుడు, అగ్నివర్ణ సమానుడైన మంగళుడు, ధత్తూరవృక్షంవంటి వర్ణంగల చంద్రుడి పుత్రుడు బుధుడు, బంగారు వర్ణంగల బృహస్పతి, శ్వేతవర్ణంగల శుక్రుడు, మిక్కిలి నల్లనివాడైన శనిదేవుడు, ఈ సప్తగ్రహరూపాత్మకుడు మరియు అన్ని గ్రహాలకు పరమకారకుడు, కుడిచేతితో 'అభయముద్ర', ఊరుభాగమందు ఉంచిన ఎడమ చేతితో 'వరదముద్ర' ధరించినవాడు, భాస్కరరూపుడు అయిన మహాదేవుడిని స్మరిస్తున్నాను.

**పూర్ణేందువర్ణేన చ పుష్పగంధ ప్రస్థేన తోయేన శుభేన పూర్ణమ్ ।**
**పాత్రం దృఢం తామ్రమయం ప్రకల్ప్య దాస్యే తవార్ఘ్యం భగవాన్ ప్రసీద ॥ 40॥**

చంద్రుడితో సమానవర్ణంగల పుష్పసుగంధంతో కూడిన పవిత్రజలంగల గట్టి రాగిపాత్రతో నీకు నేను అర్ఘ్యాన్ని ఇస్తున్నాను. ఓ భగవానుడా ప్రసన్నుడవు కమ్ము!

**నమః శివాయ దేవాయ ఈశ్వరాయ కపర్దినే ।**
**రుద్రాయ విష్ణవే తుభ్యం బ్రహ్మణే సూర్యమూర్తయే ॥41॥**

ఈశ్వరా! కపర్దీ! రుద్రా! విష్ణురూపా! బ్రహ్మస్వరూపా! సూర్యమూర్తీ! శివభగవానుడా! నమస్కారం.

**సూత ఉవాచ –** సూతర్షి పలికాడు.

**యః శివం మండలే దేవం సంపూజ్యైవం సమాహితః ।**
**ప్రాతర్మధ్యాహ్నసాయాహ్నే పఠేత్స్తవమనుత్తమమ్ ॥42॥**

**ఇత్థం శివేన సాయుజ్యం లభతే నాత్ర సంశయః ॥43॥**

ఓ మునులారా! ఈ విధంగా ఏ మానవుడు ఏకనిష్ఠుడై సూర్యమండలమధ్యస్థుడైన శివభగవానుడిని విధ్యుక్తంగా పూజించి, ప్రాతఃకాలంలో, మధ్యాహ్నకాలంలో, సాయంకాలంలో ఈ ఉత్తమస్తోత్రాన్ని పఠిస్తున్నాడో, ఆతడు శివసాయుజ్యాన్ని పొందుతున్నాడు. ఇందులో ఎటువంటి సందేహం లేదు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే శివపూజనవర్ణనం నామైకోనవింశోఽధ్యాయః ॥19॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని శివపూజనవర్ణన అనే పంతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



## **వింశోఽధ్యాయః** – ఇరవైయవ అధ్యాయం

## **శివపూజనోపాయవర్ణనమ్** – శివపూజనోపాయవర్ణనం

**సూత ఉవాచ** – సూతర్షి పలికాడు.

**అథ రుద్రో మహాదేవో మండలస్థః పితామహః ।**
**పూజ్యో వై బ్రాహ్మణానాం చ క్షత్రియాణాం విశేషతః ॥1॥**

**వైశ్యానాం నైవ శూద్రాణాం శుశ్రూషాం పూజకస్య చ ।**
**స్త్రీణాం నైవాధికారోఽస్తి పూజాదిషు న సంశయః ॥2॥**

**స్త్రీశూద్రాణాం ద్విజేంద్రైశ్చ పూజయా తత్ఫలం భవేత్ ।**
**నృపాణాముపకారార్థం బ్రాహ్మణాద్యైర్విశేషతః ॥3॥**

**ఏవం సంపూజయేయుర్వై బ్రాహ్మణాద్యాః సదాశివమ్ ।**
**ఇత్యుక్త్వా భగవాన్ రుద్రస్తత్రైవాంతరధాత్స్వయమ్ ॥4॥**

ఓ ఋషి శ్రేష్ఠులారా! సూర్యమండలస్థితుడైన పితామహుడు మహాదేవుడైన రుద్రుడు బ్రాహ్మణులకు, క్షత్రియులకు, వైశ్యులకు విశేషరూపంగా పూజనీయుడు. శూద్రులకు పూజనీయుడు కాదు. శూద్రులు శివుడిని పూజించే బ్రహ్మక్షత్రవైశ్యులను సేవించాలి. స్త్రీలకు కూడా పూజ మున్నగువాటిలో అధికారం లేదు. ఇందులో సందేహం లేదు. ద్విజశ్రేష్ఠులు నిర్వహించే పూజవల్లే స్త్రీలకు, శూద్రులకు మండలపూజాఫలం లభిస్తున్నది. రాజుల క్షేమంకోసం శ్రేష్ఠబ్రాహ్మణులు విశేషపూజ చేయాలి. ఈ విధంగా బ్రాహ్మణాదిప్రజలు విధ్యుక్తంగా సదాశివుడిని పూజించాలని చెప్పి రుద్రభగవానుడు అక్కడికక్కడే అంతర్హితుడయ్యాడు.

**తే దేవా మునయః సర్వే శివముద్దిశ్య శంకరమ్ ।**
**ప్రణేముశ్చ మహాత్మానో రుద్రధ్యానేన విహ్వలాః ॥ 5॥**

**జగ్ముర్యథాగతం దేవా మునయశ్చ తపోధనాః ।**
**తస్మాదభ్యర్చయేన్నిత్యమాదిత్యం శివరూపిణమ్ ॥ 6॥**

**ధర్మకామార్థముక్త్యర్థం మనసా కర్మణా గిరా ।**

అనంతరం సమస్తదేవతలు, మహాత్ములైన మునిగణాలు కళ్యాణకరుడు, శంకరభగవానుడికి నమస్కరించారు. తర్వాత దేవతలు, తపోధనులైన మునులు ప్రసన్నులై రుద్రుడిని ధ్యానిస్తూ వచ్చినట్లే వెళ్లారు. అందుకే ధర్మార్థ కామమోక్షాలకై త్రికరణశుద్ధిగా (మనసు, వాక్కు, కర్మ) శివరూపుడైన ఆదిత్యుడిని నిత్యం పూజించాలి.

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**రోమహర్షణ సర్వజ్ఞ సర్వశాస్త్రభృతాం వర ॥7॥**

**వ్యాసశిష్య మహాభాగ వాహ్నేయం వద సాంప్రతమ్ ।**
**శివేన దేవదేవేన భక్తానాం హితకామ్యయా ॥8॥**

**వేదాత్ షడంగాదుద్ధృత్య సాంఖ్యయోగాచ్చ సర్వతః ।**
**తపశ్చ విపులం తప్త్వా దేవదానవదుశ్చరమ్ ॥9॥**

**అర్థదేశాదిసంయుక్తం గూఢమజ్ఞాననిందితమ్ ।**
**వర్ణాశ్రమకృతైర్ధర్మైర్విపరీతం క్వచిత్సమమ్ ॥10॥**

**శివేన కథితం శాస్త్రం ధర్మకామార్థముక్తయే ।**
**శతకోటిప్రమాణేన తత్ర పూజా కథం విభోః ॥11॥**

**స్నానయోగాదయో వాపి శ్రోతుం కౌతూహలం హి నః ।**

ఓ రోమహర్షణా! ఓ సర్వజ్ఞా! ఓ సర్వశాస్త్రవేత్తలలో శ్రేష్ఠుడా! ఓ వ్యాసశిష్యా! ఓ మహాభాగా! నీవు మాకు అగ్నిపురాణంలో చెప్పబడిన శివపూజావిధిని గూర్చి చెప్పు. భక్తుల కళ్యాణంకోసం దేవాధిదేవుడు శివుడు దేవదానవులకు దుశ్చరమైన కఠోరతపస్సు చేసి, షడంగవేదాలనుంచి, సాంఖ్యయోగంనుంచి మిక్కిలిగా గ్రహించి, అర్థం, దేశం మొదలైనవాటితో కూడిన, గూఢమైన, అవివేకులు నిందించిన, వర్ణాశ్రమ ధర్మాలతో కొంతకు కొంత విపరీతమైన, కొంతకు కొంత అనుకూలమైన ఈ శతకోటిప్రమాణ ప్రాయమైన ధర్మార్థకామమోక్ష హేతువైన శాస్త్రాన్ని చెప్పాడో, అందులో సర్వవ్యాపి శివుడి పూజ, స్నానం, యోగం మొదలైనవాటి గూర్చి విధివిధానం ఏది? దాన్ని వినడానికి మాకు మిక్కిలి ఉత్కంఠగా ఉన్నది.

**సూత ఉవాచ –** సూతర్షి పలికాడు.

**పురా సనత్కుమారేణ మేరుపృష్ఠే సుశోభనే ॥12॥**

**పృష్టో నందీశ్వరో దేవః శైలాదిః శివసమ్మతః ।**
**పృష్టోఽయం ప్రణిపత్యైవం మునిముఖ్యైశ్చ సర్వతః ॥13॥**

**తస్మై సనత్కుమారాయ నందినా కులనందినా ।**
**కథితం యచ్ఛివజ్ఞానం శృణ్వంతు మునిపుంగవాః ॥14॥**

**శైవం సంక్షిప్య వేదోక్తం శివేన పరిభాషితమ్ ।**
**స్తుతినిందాదిరహితం సద్యః ప్రత్యయకారకమ్ ॥15॥**

**గురుప్రసాదజం దివ్యమనాయాసేన ముక్తిదమ్ ।**

పూర్వం సనత్కుమారుడు అత్యంత సుందరమైన మేరుపర్వత పృష్ఠభాగంలో శివభగవానుడికి ఇష్టుడు, శిలాదుని పుత్రుడు అయిన భగవాన్ నందీశ్వరుడితో ఇలా పలికాడు–మునిముఖ్యులు మీరు నమస్కరించి నన్ను ఏదైతే అడిగారో దానినే, 'ఓ మునీశ్వరులారా! ఇపుడు మీరు సనత్కుమారుడికి కులానందకారకుడైన నంది ఉపదేశించిన శివజ్ఞానాన్ని వినండి. ఇది స్వయంగా శివభగవానుడే సంగ్రహంగా పరిభాషించింది. ఈ శివజ్ఞానం

వేదప్రతిపాదితం. ఎటువంటి విపరీతం మరియు నిందలేనిది. శీఘ్రంగా శ్రద్ధను కలిగించేది. గురుకృపవల్ల ప్రాప్తించేది. దివ్యమైంది. అనాయాసంగా ముక్తినిచ్చేది'.

**సనత్కుమార ఉవాచ –** సనత్కుమారుడు అడిగాడు.

**భగవన్ సర్వభూతేశ నందీశ్వర మహేశ్వర ॥16॥**

**కథం పూజాదయః శంభోర్ధర్మకామార్థముక్తయే ।**
**వక్తుమర్హసి శైలాదే వినయేనాగతాయ మే ॥17॥**

ఓ భగవాన్! ఓ సర్వభూతనాథా! ఓ నందీశ్వరా! ఓ మహేశ్వరా! ధర్మార్థకామమోక్షసాధనకై శివుడిని ఏ విధంగా పూజించాలి. వినయపూర్వకంగా నీ దగ్గరకు వచ్చిన నాకు ఆ విషయాన్ని కృపతో చెప్పదగినవాడవు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**సంప్రేక్ష్య భగవాన్నందీ నిశమ్య వచనం పునః ।**
**కాలవేలాధికారాద్యమవదద్వదతాం వరః ॥18॥**

ఓ మునీశ్వరులారా! వక్తలలో శ్రేష్ఠుడైన నందీశ్వరుడు సనత్కుమారుడిని చూచి అట్లే ఆయన మాట విని సముచిత సమయాన్ని గుర్తించి చెప్పాడు.

**శైలాదిరువాచ –** నందీశ్వరుడు పలికాడు.

**గురుతః శాస్త్రతశ్చైవమధికారం బ్రవీమ్యహమ్ ।**
**గౌరవాదేవ సంజ్ఞైషా శివాచార్యస్య నాన్యథా ॥19॥**

**స్వయమాచరతే యస్తు ఆచారే స్థాపయత్యపి ।**

**ఆచినోతి చ శాస్త్రార్థా నాచార్యస్తేన చోచ్యతే ॥20॥**

**తస్మాద్వేదార్థతత్త్వజ్ఞమాచార్యం భస్మశాయినమ్ ।**
**గురుమన్వేషయేద్భక్తః సుభగం ప్రియదర్శనమ్ ॥21॥**

**ప్రతిపన్నం జనానందం శ్రుతిస్మృతిపథానుగమ్ ।**
**విద్యయాభయదాతారం లౌల్యచాపల్యవర్జితమ్ ॥22॥**

**ఆచారపాలకం ధీరం సమయేషు కృతాస్పదమ్ ।**
**తం దృష్ట్వా సర్వభావేన పూజయేచ్ఛివవద్గురుమ్ ॥23॥**

గురువువల్ల, శాస్త్రంవల్ల ప్రాప్తించిన జ్ఞానంపై ఆధారపడి అధికారిత్వాన్ని (పాత్రతను) గూర్చి చెబుతున్నాను. గౌరవకారణంగా శివశాస్త్ర సంబంధమైన ఆచార్యుడికి 'గురు' అనే సంజ్ఞ కలుగుతున్నది. ఇందుకు వ్యతిరేకం ఏదీ లేదు. స్వయంగా తాను ఆచరిస్తూ ఇతరులను ఆచరింపజేసేవాడు, శాస్త్రాల అర్థజ్ఞానాన్ని సంగ్రహించేవాడు 'ఆచార్యుడు' అనబడతాడు. వేదార్థతత్త్వజ్ఞుడు, భస్మధారణచేయువాడు, సుశీలుడు, ప్రియదర్శనుడు, సన్మానించిన

ప్రజల్ని ఆనందింపజేయువాడు, శ్రుతి మరియు స్మృతి నిరూపించిన మార్గాన్ని అనుసరించేవాడు. విద్య విషయంగా అభయాన్ని ఇచ్చేవాడు. లాలస, చపలత లేనివాడు, ఆచారాన్ని పాలించేవాడు, ధైర్యవంతుడు, సంధ్యాదికాలంలో యోగ్యస్థానాలలో స్థితిని పొందేవాడు అయిన ఆచార్యుడైన గురువుకోసం భక్తుడు (శిష్యుడు) అన్వేషించాలి. అట్టి గురువును పొంది అనన్యభావంతో శివుడులాగానే ఆయన్ని పూజించాలి.

**ఆత్మనా చ ధనేనైవ శ్రద్ధావిత్తానుసారతః ।**
**తావదారాధయేచ్ఛిష్యః ప్రసన్నోఽసౌ యథా భవేత్ ॥24॥**

**సుప్రసన్నే మహాభాగే సద్యః పాశక్షయో భవేత్ ।**
**గురుర్మాన్యో గురుః పూజ్యో గురురేవ సదాశివః ॥25॥**

శారీరకంగా, ధనరూపంగా, శ్రద్ధా విశ్వాసాలరూపంగా గురువును సేవించాలి. దాంతో ఆయన ప్రసన్నుడు అవుతాడు. మహాభాగుడు గురువు ప్రసన్నుడైతే వెంటనే భవబంధాలు నశిస్తాయి. గురువు మాన్యుడు. గురువు పూజ్యుడు. గురువు సాక్షాత్తూ సదాశివుడే.

**సంవత్సరత్రయం నాథ శిష్యాన్ విప్రాన్ పరీక్షయేత్ ।**
**ప్రాణద్రవ్యప్రదానేన ఆదేశైశ్చ ఇతస్తతః ॥ 26॥**
**ఉత్తమశ్చాధమే యోజ్యో నీచ ఉత్తమవస్తుషు ।**
**ఆకృష్టాస్తాడితా వాపి యే విషాదం న యాంతి వై ॥27॥**
**తే యోగ్యాః శివధర్మిష్ఠాః శివధర్మపరాయణాః ।**
**సంయతా ధర్మసంపన్నాః శ్రుతిస్మృతిపథానుగాః ॥28॥**

**సర్వద్వంద్వసహా ధీరా నిత్యముద్యుక్తచేతసః ।**
**పరోపకారనిరతా గురుశుశ్రూషణే రతాః ॥29॥**

**ఆర్జవా మార్దవాః స్వస్థా అనుకూలాః ప్రియంవదాః ।**
**అమానినో బుద్ధిమంతస్త్యక్తస్పర్ధా గతస్పృహాః ॥30॥**
**శౌచాచారగుణోపేతా దంభమాత్సర్యవర్జితాః ।**
**యోగ్యా ఏవం ద్విజాః సర్వే శివభక్తిపరాయణాః ॥31॥**
**ఏవం వృత్తసమోపేతా వాఙ్మనఃకాయకర్మభిః ।**
**శోధ్యా ఏవం విధాశ్చైవ తత్త్వానాం చ విశుద్ధయే ॥32॥**
**శుద్ధో వినయసంపన్నో మిథ్యాకటుకవర్జితః ।**
**గుర్వాజ్ఞాపాలకైశ్చ శిష్యోఽనుగ్రహమర్హతి ॥33॥**

ప్రియమైన వస్తువుల్ని ప్రదానం చేస్తూ, అనేక కార్యక్రమాలకై ఆదేశిస్తూ, అటు ఇటు త్రిప్పుతూ బ్రాహ్మణ శిష్యులను గురువు మూడు సంవత్సరాలు పరీక్షించాలి. ఉత్తముడిని అధమకార్యంలో, అధముడిని ఉత్తమకార్యంలో

నియమించాలి. గురువుచే ఆకృష్టులు అట్లే దండితులు అయి కూడా ఎవరు విషాదాన్ని పొందరో వారే శివధర్మానికి అధికారులు అవుతారు. శివధర్మిష్ఠులు, శివధర్మపరాయణులు, జితేంద్రియులు, ధర్మసంపన్నులు, శ్రుతిస్మృతి మార్గానుయాయులు, సుఖదుఃఖాదిద్వంద్వాలను సహించేవారు, ధైర్యవంతులు, ఎల్లప్పుడూ ప్రయత్నపరచిత్తవృత్తి గలవారు, పరోపకారనిరతిగలవారు, గురుసేవానిరతులు, సరళమైన మృదువైన స్వభావంగలవారు, స్వస్థతగల చిత్తంగలవారు, గురువుకు అనుకూలురు, ప్రియాన్ని చెప్పేవారు, దురభిమానం లేనివారు, బుద్ధిసంపన్నులు, స్పర్ధలేని వారు, కోరికలేనివారు, శౌచాచారం మొదలైన గుణాలతో కూడినవారు, దంభరహితులు, మాత్సర్యవిహీనులు,శివభక్తి పరాయణులు అయిన ద్విజులు శిష్యులు కావడానికి అధికారి అవుతున్నారు. ఇంద్రియాదులైన ఇరవై నాలుగుతత్త్వాల్ని శుద్ధిచేసి, త్రికరణశుద్ధితో ఆచారాన్ని అనుసరింపజేసి శిష్యుల్ని పరిశీలించాలి. పరిశుద్ధహృదయులు, వినయసంపన్నులు, అమిథ్యావాదులు, మృదుభాషణలు, గుర్వాజ్ఞను పరిపాలించేవారు అయిన శిష్యులే గురుకృపకు యోగ్యమైనవారు.

**గురుశ్చ శాస్త్రవిత్ప్రాజ్ఞస్తపస్వీ జనవత్సలః ।**
**లోకాచారరతో హ్యేవం తత్త్వవిన్మోక్షదః స్మృతః ॥34॥**

**సర్వలక్షణసంపన్నః సర్వశాస్త్రవిశారదః ।**
**సర్వోపాయవిధానజ్ఞస్తత్త్వహీనస్య నిష్ఫలమ్ ॥35॥**

**స్వసంవేద్యే పరే తత్త్వే నిశ్చయో యస్య నాత్మని ।**
**ఆత్మనోఽనుగ్రహో నాస్తి పరస్యానుగ్రహః కథమ్ ॥36॥**

**ప్రబుద్ధస్తు ద్విజో యస్తు స శుద్ధః సాధయత్యపి ।**
**తత్త్వహీనే కుతో బోధః కుతో హ్యాత్మపరిగ్రహః ॥37॥**

**పరిగ్రహవినిర్ముక్తాస్తే సర్వే పశవోదితాః ।**
**పశుభిః ప్రేరితా యే తు సర్వే తే పశవః స్మృతాః ॥38॥**

**తస్మాత్తత్త్వవిదో యే తు తే ముక్తా మోచయంత్యపి ।**
**సంవిత్తిజననం తత్త్వం పరానందసముద్భవమ్ ॥39॥**

**తత్త్వం తు విదితం యేన స ఏవానందదర్శకః ।**
**న పునర్నామమాత్రేణ సంవిత్తిరహితస్తు యః ॥40॥**

**అన్యోన్యం తారయేన్నైవ కిం శిలా తారయేచ్ఛిలామ్ ।**
**యేషాం తన్నామమాత్రేణ ముక్తిర్వై నామమాత్రికా ॥41॥**

శాస్త్రవేత్త, బుద్ధిమంతుడు, తపస్వి, లోకప్రియుడు, లోకాచారరతుడు అట్లే తత్త్వజ్ఞాని అయిన గురువు మోక్షప్రాప్తి కలిగించడానికి సమర్థుడు. సర్వలక్షణలక్షితుడు, సర్వశాస్త్రనిష్ణాతుడు, అన్ని విధాల సాధనోపాయాల్ని తెలిసినవాడు గురువు అయినా ఆత్మజ్ఞాన రహితుడైతే ఆ లక్షణసంపద అంతా నిష్ఫలమే. తాను అనుభవించిన పరమాత్మతత్త్వంలో నిశ్చయంలేనివానికి కళ్యాణం లభించదు. అపుడాతనివల్ల ఇతరులకు కళ్యాణమెలా లభిస్తుంది.

ఆత్మజ్ఞాని అయిన ద్విజుడు స్వయంశుద్ధుడై ఇతరులను కూడా శుద్ధిపరుస్తాడు. తత్త్వహీనుడైన గురువుకు ఆత్మబోధ ఎలా కలుగుతుంది? ఆతడికి ఆత్మోద్ధరణ ఎలా జరుగుతుంది? ఎవరు ఆత్మజ్ఞానశూన్యులో వారు పశువులే అవుతారు. ఎవడు తత్త్వవేత్తో ఆతడే ముక్తుడవుతాడు. ఇతరుల్ని ముక్తుల్ని చేస్తాడు. ఆత్మబోధను ఉత్పన్నం చేసేవాడు తత్త్వపరానందాన్ని ఉత్పన్నం చేస్తున్నాడు. ఆ తత్త్వంనుంచి తెలిసిన జ్ఞానం పరమానంద దర్శనానికి సమర్థం అవుతుంది. నామమాత్ర గురువు (సామాన్యుడు) ఆ విధమైన ఆనందాన్ని దర్శింపజేయలేడు. ఆత్మజ్ఞానవిహీనుడైన గురువు ఇతరులను తరింపజేయలేడు. ఒక శిల మరియొక శిలను ఏ విధంగా నద్యాదుల్ని దాటించలేదో, సాధారణ (నామమాత్ర) జ్ఞానియొక్క ముక్తికూడా సాధారణమే.

**యోగినాం దర్శనాద్వాపి స్పర్శనాద్భాషణాదపి ।**
**సద్యః సంజాయతే చాజ్ఞా పాశోపక్షయకారిణీ ॥42॥**

**అథవా యోగమార్గేణ శిష్యదేహం ప్రవిశ్య చ ।**
**బోధయేదేవ యోగేన సర్వతత్త్వాని శోధ్య చ ॥43॥**

**షడర్థశుద్ధిర్విహితా జ్ఞానయోగేన యోగినామ్ ।**
**శిష్యం పరీక్ష్య ధర్మజ్ఞం ధార్మికం వేదపారగమ్ ॥44॥**

**బ్రాహ్మణం క్షత్రియం వైశ్యం బహుదోషవివర్జితమ్ ।**
**జ్ఞానేన జ్ఞేయమాలోక్య కర్ణాత్కర్ణాగతేన తు ॥45॥**

**దీపాద్దీపో యథా చాన్యః సంచరేద్విధివద్గురుః ।**

యోగుల్ని చూడడం, తాకడం, అట్లే మాట్లాడడం వల్లనే బంధనాల్ని నశింపజేయగల అనుగ్రహం వెంటనే లభిస్తుంది. గురువు యోగమార్గంవల్ల శిష్యుడి దేహంలోనికి ప్రవేశించి యోగంద్వారా అన్ని తత్త్వాల్ని శోధింపజేసి శిష్యుడికి జ్ఞానాన్ని ఇవ్వాలి. యోగులకు జ్ఞానయోగంతో మూడు గుణాలకు శుద్ధి జరుగుతుంది. ధర్మాన్ని తెలిసినవారు, ధర్మపరాయణులు, వేదపారంగతులు, సమస్త దోషరహితులు అయిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శిష్యుల్ని బాగా పరీక్షించి, జ్ఞానంతో జ్ఞేయాన్ని దర్శించి, గురుపరంపరవల్ల ప్రాప్తించిన మార్గంవల్ల ఒక దీపం మరో దీపాన్ని వెలిగించినట్లు విధ్యుక్తంగా వాళ్లను జ్ఞానుల్ని చేయాలి.

**భౌవనం చ పదం చైవ వర్ణాఖ్యం మాత్రముత్తమమ్ ॥46॥**

**కాలాధ్వరం మహాభాగ తత్త్వాఖ్యం సర్వసమ్మతమ్ ।**
**భిద్యతే యస్య సామర్థ్యాదాజ్ఞామాత్రేణ సర్వతః ॥47॥**

**తస్య సిద్ధిశ్చ ముక్తిశ్చ గురుకారుణ్యసంభవా ।**
**పృథివ్యాదీని భూతాని ఆవిశంతి చ భౌవనే ॥48॥**

**శబ్దః స్పర్శస్తథా రూపం రసో గంధశ్చ భావతః ।**
**పదం వర్ణాఖ్యకం విప్ర బుద్ధీంద్రియవికల్పకమ్ ॥49॥**

**కర్మేంద్రియాణి మాత్రం హి మనో బుద్ధిరతః పరమ్ ।**
**అహంకారమథావ్యక్తం కాలాధ్వరమితి స్మృతమ్ ॥50॥**

**పురుషాదివిరించ్యంతమున్మనత్వం పరాత్పరమ్ ।**
**తథేశత్వమితి ప్రోక్తం సర్వతత్త్వార్థబోధకమ్ ॥51॥**

**అయోగీ నైవ జానాతి తత్త్వశుద్ధిం శివాత్మికామ్ ॥ 52॥**

భౌవనం, పదం, వర్ణం, మాత్ర అనే ఇవి కాలాధ్వర సంజ్ఞలు. సర్వసమ్మతాలైన ఉత్తమతత్త్వాలు ఇవి. ఓ మహాభాగా! ఓ సనత్కుమారా! గురువు ఆజ్ఞామాత్ర ప్రభావంవల్ల ఏ శిష్యుడికి ఈ తత్త్వాలద్వారా సంసారోన్ముఖత్వం నష్టపడుతుందో, ఆ శిష్యుడికి గురుకారుణ్యసముత్పన్నసిద్ధి మరియు ముక్తి కలుగుతున్నది. పృథ్వి, జలం, తేజం, వాయువు, ఆకాశం–ఈ పంచభూతాలు భౌవనపదవాచ్యాలు. వీటి సమావేశం భౌవనంలో జరుగుతున్నది. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు – ఇవి వాటి స్వభావంవల్ల 'పదం' అవుతున్నాయి. ఓ విప్రుడా! క్షేత్రం, చర్మం, నేత్రం, నాలుక, ముక్కు – ఈ పంచేంద్రియాలు వర్ణసంజ్ఞలు. వాక్కు, చేయి, కాలు, గుదం, ఉపస్థ – ఈ అయిదు కర్మేంద్రియమాత్ర సంజ్ఞలు. మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం – ఇవి అంతఃకరణ చతుష్టయాలు. కాలాధ్వరాలుగా చెప్పబడుతున్నాయి. మానవీయమైన ఆనందంనుంచి బ్రహ్మానందపర్యంతం 'ఉన్మనీ' అవస్థ (అమనస్కత్వం) శ్రేష్ఠాలలో శ్రేష్ఠతరం. ఇట్టి కళ్యాణస్వరూపమైన తత్త్వశుద్ధిని యోగజ్ఞానశూన్యమానవుడు తెలియలేకున్నాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే శివపూజనోపాయవర్ణనం నామ వింశోఽధ్యాయః ॥20॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని శివపూజనోపాయవర్ణన అనే ఇరవైయవ అధ్యాయం సమాప్తం.



## ఏకవింశోఽధ్యాయః - ఇరవై ఒకటవ అధ్యాయం

## దీక్షావిధానమ్ - దీక్షావిధానం

**సూత ఉవాచ** - సూతర్షి పలికాడు.

**పరీక్ష్య భూమిం విధివద్గంధవర్ణరసాదిభిః ।**
**అలంకృత్య వితానాద్యైరీశ్వరావాహనక్షమామ్ ॥1॥**

**ఏకహస్తప్రమాణేన మండలం పరికల్పయేత్ ।**
**ఆలిఖేత్కమలం మధ్యే పంచరత్నసమన్వితమ్ ॥2॥**

**చూర్ణైరష్టదళం వృత్తం సితం వా రక్తమేవ చ ।**
**పరివారేణ సంయుక్తం బహుశోభాసమన్వితమ్ ॥3॥**

**ఆవాహ్య కర్ణికాయాం తు శివం పరమకారణమ్ ।**
**అర్చయేత్సర్వయత్నేన యథావిభవవిస్తరమ్ ॥4॥**

విధ్యుక్తంగా గంధ, వర్ణ, రసాదులతో మిక్కిలిగా భూమిని పరీక్షించి ఈశ్వరుడిని ఆవాహనయోగ్యమైన ఆస్థానంలో చాందిని మొదలైనవాటితో అలంకరించి, అందులో ఒక హస్తప్రమాణంలో మండలాన్ని నిర్మించాలి. దాని మధ్యలో పంచరత్న చూర్ణాలతో తెల్లటి లేక ఎఱ్ఱటి అష్టదళపద్మాల్ని రచించాలి. దాని కర్ణికమీద సపరివారుడు, మిక్కిలి శోభామయుడు, పరమకారణుడు అయిన శివభగవానుడిని ఆవాహనచేసి యథాశక్తి గట్టి ప్రయత్నంతో పూజించాలి.

**దళేషు సిద్ధయః ప్రోక్తాః కర్ణికాయాం మహామునే ।**
**వైరాగ్యజ్ఞాననాలం చ ధర్మకందం మనోహరమ్ ॥ 5॥**

**వామా జ్యేష్ఠా చ రౌద్రీ చ కాళీ వికరణీ తథా ।**
**బలవికరణీ చైవ బలప్రమథినీ క్రమాత్ ॥ 6॥**

**సర్వభూతస్య దమనీ కేసరేషు చ శక్తయః ।**
**మనోన్మనీ మహామాయా కర్ణికాయాం శివాసనే ॥ 7॥**

**వామదేవాదిభిః సార్ధం ద్వంద్వన్యాయేన విన్యసేత్ ।**
**మనోన్మనం మహాదేవం మనోన్మన్యాథ మధ్యతః ॥8॥**

ఓ మహామునీ! కర్ణిక కమలదళాలలో అణిమాదులైన అష్టసిద్ధుల్ని నిలపాలి. వైరాగ్యజ్ఞానరూపభావన దాని నాళం. ధర్మస్వరూపం దాని మనోహరమైన మూలం (దుంప). వామ, జ్యేష్ఠ, రౌద్రి, కాళి, వికరణి, బలవికరిణి, బలప్రమథిని, మరియు సర్వభూతదమని - అనే ఇవి క్రమంగా ఎనిమిది శక్తులు కేసరాలలో ఉంటాయి. అట్లే మహామాయరూపమైన మనోన్మని శివాసనరూపమైన కర్ణికలో విరాజిల్లుతున్నది. ఆయా స్థానాలలో ఆమెను ధ్యానించాలి. వామదేవాదులతోపాటు ఈ 'వామ' మొదలైన ఎనిమిది శక్తుల మధ్యలోగల మనోన్మనీదేవితోపాటు మనోన్మనుడు మహాదేవుడి దాంపత్యరూపభావన ప్రతిష్ఠించాలి.

**సూర్యసోమాగ్నిసంబంధాత్ప్రణవాఖ్యం శివాత్మకమ్ ।**
**పురుషం విన్యసేద్వక్త్రం పూర్వే పత్రే రవిప్రభమ్ ॥ 9॥**

**అఘోరం దక్షిణే పత్రే నీలాంజనచయోపమమ్ ।**
**ఉత్తరే వామదేవాఖ్యం జపాకుసుమసన్నిభమ్ ॥10॥**

**సద్యం పశ్చిమపత్రే తు గొక్షీరధవళం న్యసేత్ ।**
**ఈశానం కర్ణికాయాం తు శుద్ధస్ఫటికసన్నిభమ్ ॥ 11॥**

సూర్యచంద్రాగ్నుల సంబంధంతో ప్రణవమనే పేరుగల సూర్యుడితో సమానమైన కాంతిగల శివరూప తత్పురుషుడిని కమలం యొక్క పూర్వపత్రంలో న్యాసం చేయాలి. నల్లని కాటుకతో సమానమైన కాంతిగల వామదేవ నామకుడైన శివుడిని ఉత్తరం వైపుగల ఆకులో, ఆవుపాలవలె తెల్లని కాంతిగల సద్యోజాతుడిని పడమటివైపుగల పత్రంలో, శుద్ధస్ఫటికతో సమానమైన కాంతిగల ఈశానుడిని పద్మం కర్ణికలో న్యాసం చేయాలి.

**చంద్రమండలసంకాశం హృదయాయేతి మంత్రతః ।**
**వాహ్నేయే రుద్రదిగ్భాగే శిరసే ధూమ్రవర్చసే ॥12॥**

**శిఖాయై చ నమశ్చేతి రక్తాభే నైరృతే దళే ।**
**కవచాయాంజనాభాయ ఇతి వాయుదళే న్యసేత్ ॥13॥**

**అస్త్రాయాగ్నిశిఖాభాయ ఇతి దిక్షు ప్రవిన్యసేత్ ।**
**నేత్రేభ్యశ్చేతి చైశాన్యాం పింగళేభ్యః ప్రవిన్యసేత్ ॥14॥**

**శివం సదాశివం దేవం మహేశ్వరమతః పరమ్ ।**
**రుద్రం విష్ణుం విరించిం చ సృష్టిన్యాయేన భావయేత్ ॥15॥**

"చంద్రమండల సంకాశాయ హృదయాయ నమః" అనే ఈ మంత్రంతో ఆగ్నేయమైన విదిక్కులోగల దళంలో, "ధూమ్రవర్చసే శిరసే నమః" అనే మంత్రంతో ఈశాన్య విదిక్కులోగల దళంలో, "రక్తాభాయ శివాఖ్యై నమః" అనే మంత్రంతో నైరృతి విదిక్కులోగల దళంలో మరియు "అంజనాభాయ కవచాయ నమః" అనే మంత్రంతో వాయవ్యవిదిక్కులోగల దళంలో న్యాసం చేయాలి. 'అగ్ని శిఖాభాయ అస్త్రాయ నమః" అనే ఈ మంత్రంతో పై భాగంలో గల దిక్కులో ఉంచాలి. "పింగళేభ్యో నేత్రేభ్యో నమః" అనే మంత్రంతో ఈశానదిశలో న్యాసం చేయాలి. తర్వాత శివ, సదాశివ, దేవ, మహేశ్వర, రుద్ర, విష్ణు, విరించి అని పలుకుతూ ఆయనకుగల సృష్టి సృజనం, పాలనం మరియు సంహారం క్రమమైన భావన కలిగియుండాలి.

**శివాయ రుద్రరూపాయ శాంత్యతీతాయ శంభవే ।**
**శాంతాయ శాంతదైత్యాయ నమశ్చంద్రమసే తథా ॥16॥**
**వేద్యాయ విద్యాధారాయ వహ్నయే వహ్నివర్చసే ।**
**కాలాయై చ ప్రతిష్ఠాయై తారకాయాంతకాయ చ ॥17॥**

**నివృత్త్యై ధనదేవాయ ధారాయై ధారణాయ చ ।**

**మంత్రైరేతైర్మహాభూతవిగ్రహం చ సదాశివమ్ ॥18॥**

**ఈశానముకుటం దేవం పురుషాస్యం పురాతనమ్ ।**
**అఘోరహృదయం హృష్టం వామగుహ్యం మహేశ్వరమ్ ॥ 19॥**

**సద్యమూర్తిం స్మరేద్దేవం సదసద్వ్యక్తికారణమ్ ।**

“శివాయ రుద్రరూపాయ శాంత్యతీతాయ శంభవే, శాంతాయ శాంతదైత్యాయ నమశ్చంద్రమసే తథా, వేద్యాయ విద్యాధారాయ వహ్నయే, వహ్నె వర్చసే, కాలాయై చ ప్రతిష్ఠాయై తారకాయాంతకాయ చ, నివృత్త్యై ధనదేవాయ ధారాయై ధారణాయ చ” అనే అయిదు మంత్రాలతో ఈశానరూపుడు, ముకుటుడు, తత్పురుషరూప ముఖుడు, అఘోరరూపహృదయుడు, వామదేవరూపగుహ్యదేహుడు – అట్లే సద్యోజాతరూప సంపూర్ణ విగ్రహుడు సత్, అసత్‌ల అభివ్యక్తికి కారణభూతుడు, పురాతనుడు, ప్రసన్నుడు – అట్లే ఆకాశాది పంచమహాభూతాత్మకవిగ్రహుడు అయిన మహేశ్వరసదాశివుడిని స్మరించాలి.

**పంచవక్త్రం దశభుజమష్టత్రింశత్కళామయమ్ ॥20॥**

**సద్యమష్టప్రకారేణ ప్రభిద్య చ కళామయమ్ ।**
**వామం త్రయోదశవిధైర్విభిద్య వితతం ప్రభుమ్ ॥21॥**

**అఘోరమష్టధా కృత్వా కళారూపేణ సంస్థితమ్ ।**
**పురుషం చ చతుర్ధా వై విభజ్య చ కళామయమ్ ॥22॥**

**ఈశానం పంచధా కృత్వా పంచమూర్త్యా వ్యవస్థితమ్ ।**

శివభగవానుడు పంచముఖుడు, దశభుజుడు అయి శోభిల్లుతూ ముప్పై ఎనిమిది కళలతో కూడి యున్నాడు. కళామయుడు సద్యోజాతుడిని ఎనిమిది విధాల విభాగించి, మహాప్రభువు వామదేవుడిని పదమూడు భేదాలుగ విభాగించి, కళారూపుడైన అఘోరుడిని ఎనిమిది విధాలుగా విభాగించి, కళామయుడు తత్పురుషుడిని నాల్గు విధాల విభాగించి, పంచమూర్తులందు వ్యవస్థితుడైన ఈశానుడిని ఐదు విధాల విభాగించి ఆయన్ని మిక్కిలిగా ధ్యానించాలి.

**హంసహంసేతి మంత్రేణ శివభక్త్యా సమన్వితమ్ ॥23॥**

**ఓంకారమాత్రమోంకారమకారం సమరూపిణమ్ ।**
**ఆ ఈ ఊ ఏ తథా అంబానుక్రమేణాత్మరూపిణమ్ ॥24॥**

**ప్రధానసహితం దేవం ప్రళయోత్పత్తివర్జితమ్ ।**
**అణోరణీయాంసమజం మహతోఽపి మహత్తమమ్ ॥25॥**

**ఊర్ధ్వరేతసమీశానం విరూపాక్షముమాపతిమ్ ।**
**సహస్రశిరసం దేవం సహస్రాక్షం సనాతనమ్ ॥26॥**

**సహస్రహస్తచరణం నాదాంతం నాదవిగ్రహమ్ ।**

**ఖద్యోతసదృశాకారం చంద్రరేఖాకృతిం ప్రభుమ్ ॥27॥**

**ద్వాదశాంతే భ్రువోర్మధ్యే తాలుమధ్యే గళే క్రమాత్ ।**
**హృద్దేశేఽవస్థితం దేవం స్వానందమమృతం శివమ్ ॥28॥**

**విద్యుద్వలయసంకాశం విద్యుత్కోటిసమప్రభమ్ ।**
**శ్యామం రక్తం కళాకారం శక్తిత్రయకృతాసనమ్ ॥ 29॥**

**సదాశివం స్మరేద్దేవం తత్త్వత్రయసమన్వితమ్ ।**
**విద్యామూర్తిమయం దేవం పూజయేచ్చ యథాక్రమాత్ ॥30॥**

"హంసహంసాయ విద్మహే పరమహంసాయ ధీమహి, తన్నో హంసః ప్రచోదయాత్" అనే ఈ హంసగాయత్రీ మంత్రంతో శివభక్తుడు, ప్రణవరూపుడు, 'అ'కారరూపుడు, బ్రహ్మతుల్యరూపాలైన 'ఆ–ఈ–ఊ–ఏ" అనగా క్రమంగా దేవి, గణేశుడు, సూర్యుడు, విష్ణు స్వరూపుడు, ప్రకృతియుక్తుడు, పుట్టుక, నాశనం లేనివాడు, సూక్ష్మలకెల్ల సూక్ష్ముడు, అజన్ముడు, మహత్తులకెల్లా మహత్తుడు, ఊర్ధ్వరేతుడు, విరూపాక్షుడు, ఉమాపతి, సహస్రశీర్షుడు, సహస్రనేత్రుడు, సహస్రహస్తుడు, సహస్రపాదుడు, సనాతనుడు, నాదాంతుడు, నాదప్రతిపాదిత విగ్రహుడు, సూర్యసమానాకారుడు, చంద్రశేఖరుడు, మూర్ధమందు, భ్రూమధ్యంలో, తాలుమధ్యంలో, కంఠమందు, హృదయంలో క్రమంగా ప్రకాశించువాడు, తనలో తాను ఆనందించువాడు, అమృతస్వరూపుడు, కళ్యాణకరుడు, విద్యుద్వలయసమానుడు, కోటివిద్యుత్తుల సమానమైన ప్రభగలవాడు, శ్యామరక్తవర్ణంగలవాడు, గంభీరాకారుడు, శక్తిత్రయవిరాజితుడు, మూడుతత్త్వాలవాడు, విద్యామూర్తిస్వరూపుడు అని ఈశానుడైన శివభగవానుడిని స్మరించి, విధ్యనుసారంగా పూజించాలి.

**లోకపాలాంస్తథాస్త్రేణ పూర్వాద్యాన్ పూజయేత్ పృథక్ ।**
**చరుం చ విధినాసాద్య శివాయ వినివేదయేత్ ॥31॥**

**అర్ధం శివాయ దత్త్వైవ శేషార్ధేన తు హోమయేత్ ।**
**అఘోరేణాథ శిష్యాయ దాపయేద్భోక్తుముత్తమమ్ ॥32॥**

**ఉపస్పృశ్య శుచిర్భూత్వా పురుషం విధినా యజేత్ ।**
**పంచగవ్యం తతః ప్రాశ్య ఈశానేనాభిమంత్రితమ్ ॥33॥**

అనంతరం తూర్పుదక్షిణం మొదలైన దిక్కులకు సంబంధించిన ఇంద్రాది లోకపాలకుల్ని అస్త్రమంత్రాలతో వేరు వేరుగా పూజించాలి. తర్వాత పురోడాశాన్ని విధ్యుక్తంగా తయారుచేసి అందులో సగభాగం శివుడికి అర్పించాలి. మిగిలిన దానిలో సగాన్ని ఆహుతి ఇవ్వాలి. తర్వాత మిగిలిన ఉత్తమ పురోడాశాన్ని అఘోరమంత్రంతో అభిమంత్రించి తినడానికై శిష్యులకు పెట్టాలి.

**వామదేవేన భస్మాంగీ భస్మేనోద్ధూలయేత్క్రమాత్ ।**
**కర్ణయోశ్చ జపేద్దేవీం గాయత్రీం రుద్రదేవతామ్ ॥34॥**

**ససూత్రం సపిధానం చ వస్త్రయుగ్మేన వేష్టితమ్ ।**
**తత్పూర్వం హేమరత్నైౌఘైర్వాసితం వై హిరణ్మయమ్ ॥35॥**

**కలశాన్ విన్యసేత్పంచపంచభిర్బ్రాహ్మణైస్తతః ।**
**హోమం చ చరుణా కుర్యాద్యథావిభవవిస్తరమ్ ॥36॥**

పురోడాశాన్ని తిన్న తర్వాత ఆచమించి శుభ్రపడి శిష్యులు విధ్యుక్తంగా తత్పురుషరూపుడైన శివభగవానుడిని పూజించాలి. అనంతరం ఈశానమంత్రంతో పంచగవ్యాన్ని అభిమంత్రించి త్రాగి వామదేవమంత్రంతో భస్మాన్ని సర్వాంగాలకు అలముకోవాలి. గురుశిష్యులు రెండు చెవులతో రుద్రదైవతారూపమైన గాయత్రీమంత్రాన్ని జపించాలి. హోమానికి ముందు సూత్రంతో కూడిన ఆచ్ఛాదనగా రెండు వస్త్రాలతో కప్పిన ఐదుకలశాల్ని బంగారంతో రత్నాలతో నిర్మించిన వేదికమీద ఐదు బ్రహ్మమంత్రాలతో స్థాపించాలి. అనంతరం శక్తికొలది పురోడాశంతో హోమం చేయాలి.

**శిష్యం చ వాసయేద్భక్తం దక్షిణే మండలస్య తు ।**
**దర్భశయ్యాసమారూఢం శివధ్యానపరాయణమ్ ॥37॥**

**అఘోరేణ యథాన్యాయమష్టోత్తరశతం పునః ।**
**ఘృతేన హుత్వా దుఃస్వప్నం ప్రభాతే శోధయేన్మలమ్ ॥38॥**

**ఏవం చోపోషితం శిష్యం స్నానం భూషితవిగ్రహమ్ ।**
**నవవస్త్రోత్తరీయం చ సోష్ణీషం కృతమంగలమ్ ॥39॥**

**దుకూలాద్యేన వస్త్రేణ నేత్రం బద్ధ్వా ప్రవేశయేత్ ।**
**సువర్ణపుష్పసమ్మిశ్రం యథావిభవవిస్తరమ్ ॥40॥**

**ఈశానేన చ మంత్రేణ కుర్యాత్పుష్పాంజలిం ప్రభోః ।**
**ప్రదక్షిణాత్రయం కృత్వా రుద్రాధ్యాయేన వా పునః ॥41॥**

**కేవలం ప్రణవేనాథ శివధ్యానపరాయణః ।**
**ధ్యాత్వా దేవదేవేశ మీశానే సంక్షిపేత్స్వయమ్ ॥42॥**

**యస్మిన్ మంత్రే పతేత్పుష్పం తన్మంత్రస్తస్య సిధ్యతి ।**
**శివాంభసా తు సంస్పృశ్య అఘోరేణ చ భస్మనా ॥43॥**

**శిష్యమూర్ధని విన్యస్య గంధాద్యైః శిష్యమర్చయేత్ ।**

తర్వాత శివధ్యానతత్పరుడైన భక్తుడైన శిష్యుడిని మండలంలో (వేదికమీద) దక్షిణభాగంలో దర్భలశయ్యమీద పరుండజేయాలి. తిరిగి ప్రాతఃకాలంలో అఘోరమంత్రంతో విధిపూర్వకంగా నేతితో నూట ఎనిమిదిసార్లు ఆహుతులు ఇచ్చి దుఃస్వప్నరూపమైన మలినాన్ని శుద్ధి చేయాలి. ఈ విధంగా వ్రతి అయిన శిష్యుడికి స్నానం చేయించి, ఆతడి శరీరాన్ని అలంకరించి, నూతనవస్త్రం, మరియు ఉత్తరీయం, షడంగి ధరింపజేసి, సమస్తమంగళకృత్యాల్ని ఆచరింపజేసి, నేత్రపట్టాదులతో ఆతడి నేత్రాల్ని బంధించి ఆతడిని మండలంలోనికి పంపాలి. శిష్యుడు తనకున్న

ధనసంపత్తికి తగిన విధంగా బంగారంతో కూడిన పుష్పాంజలి ఘటించి ఈశానమంత్రంతో ప్రభువుకు పుష్పాంజలి సమర్పించి, రుద్రాధ్యాయాన్నిగాని కేవల ప్రణవాన్నిగాని ఉచ్చరించి, శివధ్యానంలో లీనమై మండలానికి మూడుసార్లు ప్రదక్షిణం చేసి, దేవదేవ శివుడిని ధ్యానించి పుష్పాల్ని ఈశాన్యదిక్కుమీద ప్రక్షిప్తం చేయాలి. పుష్పం ఏ మంత్రంతో కూడి పడుతుందో ఆ మంత్రమే ఆతడికి సిద్ధిస్తున్నది. తర్వాత మంగళజలాన్ని అఘోరమంత్రంతో అభిమంత్రించిన భస్మాన్ని శిష్యుడికి తాకించి, శిష్యుడి శిరసుపై గురువు తన హస్తముంచి గంధపుష్పాదులతో శిష్యుడిని పూజించాలి.

**వారుణం పరం శ్రేష్ఠం ద్వారం వై సర్వవర్ణినామ్ ॥44॥**

**క్షత్రియాణాం విశేషేణ ద్వారం వై పశ్చిమం స్మృతమ్ ।**
**నేత్రావరణమున్ముచ్య మండలం దర్శయేత్తతః ॥45॥**

**కుశాసనే తు సంస్థాప్య దక్షిణామూర్తిమాస్థితః ।**
**తత్త్వశుద్ధిం తతః కుర్యాత్పంచతత్త్వప్రకారతః ॥46॥**

**నివృత్త్యా రుద్రపర్యంతమండమండోద్భవాత్మజ ।**
**ప్రతిష్ఠయా తదూర్ధ్వం చ యావదవ్యక్తగోచరమ్ ॥ 47॥**

**విశ్వేశ్వరాంతం వై విద్యా కళామాత్రేణ సువ్రత ।**
**తదూర్ధ్వమార్గం సంశోధ్య శివభక్త్యా శివం నయేత్ ॥48॥**

**సమర్చనాయ తత్త్వస్య తస్య భోగేశ్వరస్య వై ।**
**తత్త్వత్రయప్రభేదేన చతుర్భిరుత వా తథా ॥49॥**

**హోమయేదంగమంత్రేణ శాంత్యతీతం సదాశివమ్ ।**
**సద్యాదిభిస్తు శాంత్యంతం చతుర్భిః కలయా పృథక్ ॥50॥**
**శాంత్యతీతం మునిశ్రేష్ఠ ఈశానేనాథవా పునః ।**
**ప్రత్యేకమష్టోత్తరశతం దిశాహోమం తు కారయేత్ ॥51॥**

వారుణసంబంధమైన పశ్చిమద్వారప్రవేశం అన్ని వర్ణాలకు శ్రేష్ఠమైనది. అది క్షత్రియులకైతే అత్యత్తుమమైనది. ప్రవేశించిన తర్వాత శిష్యుడి నేత్రపట్టాలను తొలగించి ఆతడికి మండలాన్ని చూపాలి. తర్వాత శిష్యుడిని కుశాసనంపై కూర్చోబెట్టి దక్షిణామూర్తి శివుడి ఆశ్రయాన్ని గ్రహించి పంచతత్త్వప్రకారాలతో తత్త్వశుద్ధి చేయాలి. ఓ సనత్కుమారా! ఓ సువ్రతా! క్రమంగా పృథ్వీమొదలైన పంచమహాభూతాల్ని తీసుకుని అహంకారపర్యంతం అండాన్ని నివృత్తి చేసి, ఆ అహంకారంకన్నా పైనగల అవ్యక్తగోచరం, ప్రకృతి పర్యంతస్థితిద్వారాను, అట్లే జ్ఞానకళద్వారా పురుషపర్యంతజ్ఞానం పొంది, దానికన్నా పైనగల పరమశివప్రాప్తిమార్గంలో శివభక్తిద్వారా ఆవరణాన్ని తొలగించి శిష్యుడికి నాల్గో శివతత్త్వాన్ని కలిగించాలి. తర్వాత యోగేశ్వరుడు తత్త్వరూపుడు అయిన శివుడిని అర్చించేందుకై ప్రకృతి, పురుషుడు, ఈశ్వరుడు ఈ తత్త్వత్రయాలు లేకుంటే అహంకారాదులైన నాల్గు తత్త్వాలకు క్రమంగా శాంత్యతీతకళలో ఉన్న సదాశివుడికి నిమిత్తఈశానమంత్రంతో హోమం చేయాలి. దాంతోపాటు వేరుగా లెక్కించి సద్యోజాతాదులైన నాల్గు మంత్రాల ద్వారా శాంత్యతీతుడైన శివుడికై హోమం చేయాలి. ఓ మునిశ్రేష్ఠా! తర్వాత ఈశానమంత్రంతో పరమశివుడికి నూట ఎనిమిదిసార్లు ఆహుతులిచ్చి, ఋత్విజులచేత నూట ఎనిమిదిసార్లు దిగ్దేవతలకు హోమం చేయించాలి.

**ఈశాన్యాం పంచమేనాథ ప్రధానం పరిగీయతే ।**
**సమిదాజ్యచరూంల్లాజాన్ సర్షపాంశ్చ యవాంస్తిలాన్ ॥52॥**

**ద్రవ్యాణి సప్త హోతవ్యం స్వాహాంతం ప్రణవాదికమ్ ।**
**తేషాం పూర్ణాహుతిర్విప్ర ఈశానేన విధీయతే ॥53॥**

**సహంసేన యథాన్యాయం ప్రణవాద్యేన సువ్రత ।**
**అఘోరేణ చ మంత్రేణ ప్రాయశ్చిత్తం విధీయతే ॥ 54॥**

**జయాదిస్విష్టపర్యంతమగ్నికార్యం క్రమేణ తు ।**
**గుణసంఖ్యాప్రకారేణ ప్రధానేన చ యోజయేత్ ॥55॥**

ఈశాన్యదిక్కులో ఐదు ఈశానమంత్రాలతో నిర్వహించిన యాగం ముఖ్యమైన యాగం అవుతుంది. మంత్రానికి ముందు ఓంకారాన్ని చివరిలో 'స్వాహా'ను చేర్చి, సమిధలు, నెయ్యి, చరువు, లాజలు (పేలాలు), సరసులు, యవలు, తిలలు–ఈ ఏడు ద్రవ్యాలతో హోమం చెయ్యాలి. ఓ విప్రా! ఆ హోమం పూర్ణాహుతి ఈశానమంత్రంతో జరుగుతుంది. ఓ సువ్రతా! ప్రణవంతో కూడిన హంసగాయత్రీమంత్రసహితమైన అఘోరమంత్రంతో విధిపూర్వకంగా ప్రాయశ్చిత్తం జరుగుతున్నది. 'జయ' 'అభ్యాతానం' మొదలైనవాటిని గ్రహించి 'స్విష్టకృత్' హోమపర్యంతమైన అగ్నికార్యాన్ని మూడు రకాల ముందే చెప్పిన ప్రధానహోమంతోపాటు కలిపి నిర్వహించాలి.

**భూతాని బ్రహ్మభిర్వాపి మౌనీ బీజాదిభిస్తథా ।**
**అథ ప్రధానమాత్రేణ ప్రాణాపానౌ నియమ్య చ ॥56॥**

**షష్ఠేన భేదయేదాత్మప్రణవాంతం కులాకులమ్ ।**
**అన్యోఽన్యముపసంహృత్య బ్రహ్మాణం కేశవం హరమ్ ॥57॥**

**రుద్రే రుద్రం తమీశానే శివే దేవం మహేశ్వరమ్ ।**
**తస్మాత్సృష్టిప్రకారేణ భావయేద్భవనాశనమ్ ॥58॥**

అనంతరం గురువు మౌనం వహించి బీజస్వరూపాలైన సద్యోజాతాది వేదమంత్రాలతో పృథ్వి మొదలైన పంచమహాభూతాల్ని, అట్లే కేవలం ఈశానమంత్రంతో ప్రాణ, అపానవాయువుల్ని నిరోధించి ఆరుసార్లు "నమో హిరణ్యబాహవే" అనే మంత్రంతో ఆత్మవాచకమైన ప్రణవం అంతరూపనాదసముదాయంతో వ్యాప్తిచెందిన శబ్దంతో బ్రహ్మరంధ్రాన్ని ఛేదించాలి. తర్వాత బ్రహ్మ, కేశవుడు అట్లే రుద్రుడు అనే అన్యోన్య రూపాల్ని ఉపసంహరించి అనగా బ్రహ్మను కేశవుడిలో, కేశవుడిని హరుడిలో విలీనం చేసి సంహారమూర్తి హరుడుని రుద్రుడిలో, ఆ రుద్రుడిని ఈశానుడిలో మరియు మహేశ్వరుడు ఈశానుడిని శివుడిలో ఉపసంహరించి మరల సృష్టిక్రమానికై భవనాశకుడైన రుద్రుడినిగూర్చి చింతించాలి.

**స్థాప్యాత్మానమముం జీవం తాడనం ద్వారదర్శనమ్ ।**
**దీపనం గ్రహణం చైవ బంధనం పూజయా సహ ॥59॥**

**అమృతీకరణం చైవ కారయేద్విధిపూర్వకమ్ ।**
**షష్ఠాంతం సద్యసంయుక్తం తృతీయేన సమన్వితమ్ ॥60॥**
**ఫడంతం సంహృతిః ప్రోక్తా పంచభూతప్రకారతః ।**
**సద్యాద్యషష్ఠసహితం శిఖాంతం సఫడంతకమ్ ॥61॥**
**తాడనం కథితం ద్వారం తత్త్వానామపి యోగినః ।**
**ప్రధానం సంపుటీకృత్య తృతీయేన చ దీపనమ్ ॥62॥**
**ఆద్యేన సంపుటీకృత్య ప్రధానం గ్రహణం స్మృతమ్ ।**
**ప్రధానం ప్రథమేనైవ సంపుటీకృత్య పూర్వవత్ ॥63॥**

**బంధనం పరిపూర్ణేన ప్లావనం చామృతేన చ ।**

అనంతరం శిష్యుడి జీవాన్ని రుద్రుడియందు స్థాపించి, కొట్టడం, ద్వారాన్ని దర్శింపజేయడం, దీపం వెలిగించడం, గ్రహించడం, పూజతో కూడా బంధించడం మరియు విధిపూర్వకంగా అమృతీకరించడం చేయాలి. అఘోరమంత్రాన్ని ఆదిలో సద్యోజాతమంత్రం చివరలో ఆరు మంత్రాలు "నమో హిరణ్యబాహవే" అని జపిస్తూ అన్ని మంత్రాలకు చివరలో 'ఫట్' శబ్దాన్ని జోడించి పృథ్వి మొదలైన పంచభూతాల్ని క్రమంగా ఉపసంహరింపబడజేయాలి. ముందుగా సద్యోజాతాన్ని, దాని తర్వాత "నమో హిరణ్యబాహవే" మరల అంతంలో 'శిఖా',అట్లే 'ఫట్' అనే వాటిని తగిలించి మంత్రదీక్షాయోగిని తాడిస్తూ తత్త్వాలద్వారా దర్శనం కలిగించడం జరగాలి. అఘోరమంత్రంతో సంపుటీకరించి ప్రధానమైన ఈశానమంత్రాన్ని దీపింపజేయాలి. సద్యోజాతమంత్రంతో సంపుటీకరించి ఈశానమంత్రాన్ని గ్రహించాలి. ఈ గ్రహణం మాదిరిగానే సద్యోజాతమంత్రంతో సంపుటీకరించి ఈశానమంత్రబంధనం కూడా చెప్పబడింది. సమగ్ర త్రియంబక మంత్రప్లావనం అనగా అమృతీకరణం చేయడం జరిగింది.

**శాంత్యతీతా తతః శాంతిర్విద్యా నామ కళామలా ॥64॥**
**ప్రతిష్ఠా చ నివృత్తిశ్చ కళాసంక్రమణం స్మృతా ।**
**తత్త్వవర్ణకళాయుక్తం భువనేన యథాక్రమమ్ ॥65॥**

**మంత్రైః పాదైః స్తవం కుర్యాద్విశోధ్య చ యథావిధి ।**
**ఆద్యేన యోనిబీజేన కల్పయిత్వా చ పూర్వవత్ ॥66॥**

'శాంత్యతీతా', 'ప్రతిష్ఠా', 'అమలా', 'విద్యా', 'శాంతి' అట్లే 'నివృత్తి' ఇవి కళలు. వీటిని యథాక్రమంగా పరస్పరం సంక్రమణం చేసి తత్త్వం, వర్ణం, కళ, భువనం, మంత్రం మరియు పదం అనే వాటిని శోధించాలి. మరల ప్రణవంతో అట్లే యోనిబీజం (హ్రీం)తో సంపుటీకరించి శివప్రతిపాదకమైన మంత్రంతో యథావిధిగా అర్థవిచారణ చేసి స్తుతించాలి.

**పూజాసంప్రేక్షణం విద్ధి తాడనం హరణం తథా ।**
**సంహతస్య చ సంయోగం విక్షేపం చ యథాక్రమమ్ ॥67॥**

**అర్చనా చ తథా గర్భధారణం జననం పునః ।**
**అధికారో భవేద్భానోర్లయశ్చైవ విశేషతః ॥68॥**

పూజా, సంప్రోక్షణం, తాడనం, హరణం అత్యంతశుద్ధమైన మనసు సంయోగం, యథాక్రమవిక్షేపం, అర్చనం, గర్భధారణ, (వాగీశుని గర్భంలో ఉంచడం) పునర్జననం, భానువు అధికారం అనగా అటువంటి జ్ఞానాన్ని నివారించే విధం మరియు విశేషరూపంగా అవిద్య నాశనం జరుగుతున్నదని తెలియాలి.

**ఉత్తమాద్యం తథాంత్యేన యోనిబీజేన సువ్రత ।**
**ఉద్ధారే ప్రోక్షణే చైవ తాడనే చ మహామునే ॥69॥**

**అఘోరేణ ఫడంతేన సంస్కృతిశ్చ న సంశయః ।**
**ప్రతితత్త్వం క్రమో హ్యేష యోగమార్గేణ సువ్రత ॥70॥**

ఓ సువ్రతుడా! ఓ మహామునీ! ఉద్ధారం, ప్రోక్షణం, అట్లే తాడనంలో ప్రారంభంలో ఉత్తమమైన ఈశానమంత్రం అంతంలో యోనిబీజాన్ని కూర్చి మంత్రప్రయోగం చేయాలి. మరియు అంతంలో 'ఫట్' అనే దానితో కూడి అఘోరమంత్రం ద్వారా సంస్కృతి కలుగుతున్నది. ఇందులో సంశయం లేదు. ఓ సువ్రతుడా! ప్రత్యేక తత్త్వానికి యోగమార్గంద్వారా ఈ క్రమవిధి నిర్ధారింపబడింది.

**ముష్టినా చైవ యావచ్చ తావత్కాలం నయేత్క్రమాత్ ।**
**విషువేణ తు యోగేన నివృత్త్యాది శివాంతికమ్ ॥71॥**

**ఏకత్ర సమతాం యాతి నాన్యథా తు పృథక్ పృథక్ ।**
**నాసాగ్రే ద్వాదశాంతేన పృష్ఠేన సహ యోగినామ్ ॥72॥**

**క్షంతవ్యమితి విప్రేంద్ర దేవదేవస్య శాసనమ్ ।**

ముష్టిప్రమాణయావధాన్యంతో (పిడికెడు) స్థితిని సాగించాలి. ఈ కాలంలో విషుయోగంద్వారా క్రమంగా నివృత్తి కళలను గ్రహించి శివాకళాపర్యంతం గడపాలి. సాధకుడు ముక్కు కొన భాగంమీద దృష్టినుంచాలి, యోగులకు చరమావయవభూతమైన మంత్రంవలన ద్వాదశాంతంతో పరమతత్త్వమైన శివుడితో సమత్వం ప్రాప్తిస్తున్నది. వేరు వేరు స్థానాలమీద దృష్టి ఉంచరాదు. ఓ విప్రేంద్రా! దీక్షితుడు సుఖదుఃఖాదిద్వంద్వసముదాయాన్ని సహించాలి. ఇది దేవదేవశివుడి ఆదేశం.

**హేమరాజతతామ్రాద్యైర్విధినా కల్పితేన చ ॥73॥**

**సకూర్చేన సవస్త్రేణ తంతునా వేష్టితేన చ ।**
**తీర్థాంబుపూరితేనైన రత్నగర్భేణ సువ్రత ॥74॥**

**సంహితామంత్రితేనైవ రుద్రాధ్యాయస్తుతేన చ ।**
**సేచయేచ్చ తతః శిష్యం శివభక్తం చ ధార్మికమ్ ॥ 75॥**

ఓ సువ్రతా! బంగారం, వెండి లేక రాగి మొదలైన లోహాలతో నిర్మించినవి మరియు కూర్చయుక్తాలు అయినవి, వస్త్రాలతో దారాలతో చుట్టినవి, తీర్థజలాలతో పూర్తిగా నిండినవి, లోపల రత్నాలు ఉంచినవి, సంహితామంత్రంతో అభిమంత్రింపబడి రుద్రాధ్యాయంతో స్తుతింపబడిన జలంతో నిండినవి అయిన కలశాలతో పవమానాది మంత్రాలద్వారా ధార్మికుడైన శివభక్తుడు శిష్యుడికి అభిషేకం చేయాలి.

**సోఽపి శిష్యః శివస్యాగ్రే గురోరగ్రే చ సాదరమ్ ।**
**వహ్నేశ్చ దీక్షాం కుర్వీత దీక్షితశ్చ తథాచరేత్ ॥76॥**

**వరం ప్రాణపరిత్యాగశ్ఛేదనం శిరసోఽపి వా ।**
**న త్వనభ్యర్చ్య భుంజీయాద్భగవంతం సదాశివమ్ ॥77॥**

**ఏవం దీక్షా ప్రకర్తవ్యా పూజా చైవ యథాక్రమమ్ ।**
**త్రికాలమేకకాలం వా పూజయేత్పరమేశ్వరమ్ ॥78॥**

అభిషేకింపబడిన ఆ శిష్యుడు శివుడు, గురువు, అట్లే అగ్నిసమక్షంలో అభిమానపూర్వకంగా దీక్షాగ్రహణం చేసి, దీక్షితుడై చెబుతున్న నియమాల్ని పాటించాలి. ప్రాణం పోయినా, తల తెగిపడినా శివభగవానుడిని పూజించకుండా భోజనం చేయరాదు అనే విధమైన దీక్షను స్వీకరించాలి. యథావిధిగా శివుడిని పూజించాలి. మూడు కాలాలలో లేకుంటే ఒక సమయంలోనే అయినా తప్పక శివుడిని పూజించాలి.

**అగ్నిహోత్రం చ వేదాశ్చ యజ్ఞాశ్చ బహుదక్షిణాః ।**
**శివలింగార్చనస్యైతే కళాంశేనాపి నో సమాః ॥79॥**

**సదా యజతి యజ్ఞేన సదా దానం ప్రయచ్ఛతి ।**
**సదా చ వాయుభక్షశ్చ సకృద్యోఽభ్యర్చయేచ్ఛివమ్ ॥80॥**

**ఏకకాలం ద్వికాలం వా త్రికాలం నిత్యమేవ వా ।**
**యేఽర్చయంతి మహాదేవం తే రుద్రా నాత్ర సంశయః ॥81॥**

**నారుద్రస్తు స్పృశేద్రుద్రం నారుద్రో రుద్రమర్చయేత్ ।**
**నారుద్రః కీర్తయేద్రుద్రం నారుద్రో రుద్రమాప్నుయాత్ ॥82॥**

**ఏవం సంక్షేపతః ప్రోక్తో హ్యధికారివిధిక్రమః ।**
**శివార్చనార్థం ధర్మార్థకామమోక్షఫలప్రదః ॥83॥**

అగ్నిహోత్రం, సమస్తవేదాలు, ఘనధనదక్షిణలిచ్చిన యజ్ఞాలు – ఇవి ఏవీ శివలింగార్చనకళలో ఒక అంశంతో కూడా సమానం కావు. ఒకసారి శివుడిని అర్చించినవాడు, ఎల్లప్పుడు యజ్ఞం చేస్తున్నవాడితో, ఎల్లప్పుడూ దానం చేస్తున్నవాడితో, ఎల్లప్పుడూ వాయుభక్షణం చేస్తూ తపస్సు చేస్తున్నవాడితో సమానుడు. ఎవరు ప్రతిరోజు ఒకసారిగాని రెండుసార్లుగాని మూడుసార్లుగాని మహాదేవుడిని పూజిస్తున్నారో వారు రుద్రరూపులే. ఇందులో సందేహం లేదు. ఎవరు రుద్రరూపులు కారో వారు రుద్రుడిని తాకరాదు. ఎవరు రుద్రరూపులు కారో వారు రుద్రుడిని పూజించరాదు. ఎవరు రుద్రరూపులు కారో వారు రుద్రుడి నామాన్ని కీర్తించరాదు. ఎవరు రుద్రరూపులు కారో వారు రుద్రుడిని పొందలేరు. ఓ సనత్కుమారా! నేను నీకు సంగ్రహంగా శివపూజాధికారం, దాని విధినిర్వహణక్రమం చెప్పాను. ఇది ధర్మార్థకామమోక్ష ప్రదాయకమైనది.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే దీక్షావిధిర్నామైకవింశతితమోఽధ్యాయః ॥21॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని దీక్షావిధానం అనే పేరు గల ఇరవైఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్వావింశోఽధ్యాయః - ఇరవై రెండవ అధ్యాయం

## తత్త్వశుద్ధివర్ణనమ్ - తత్త్వశుద్ధివర్ణన

**శైలాదిరువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**స్నానయాగాదికర్మాణి కృత్వా వై భాస్కరస్య చ ।**
**శివస్నానం తతః కుర్యాద్ భస్మస్నానం శివార్చనమ్ ॥1॥**

ఓ సనత్కుమారా! సూర్యస్నానం, యాగం మొదలైన కర్మలు నిర్వహించి కూడా శివస్నానం దాని తర్వాత భస్మస్నానం మరియు శివార్చనం చేయాలి.

**షష్ఠేన మృదమాదాయ భక్త్యా భూమౌ న్యసేన్మృదమ్ ।**
**ద్వితీయేన తథాభ్యుక్ష్య తృతీయేన చ శోధయేత్ ॥ 2॥**

**చతుర్థేనైవ విభజేన్మలమేకేన శోధయేత్ ।**
**స్నాత్వా షష్ఠేన తచ్ఛేషాం మృదం హస్తగతాం పునః ॥3॥**

**త్రిధా విభజ్య సర్వం చ చతుర్భిర్మధ్యమం పునః ।**
**షష్ఠేన సప్తవారాణి వామం మూలేన చాలభేత్।**
**దశవారం చ షష్ఠేన దిశో బంధః ప్రకీర్తితః ॥4॥**

ఆరో మంత్రంతో (ఓం తపః) మట్టి తెచ్చి భక్తిపూర్వకంగా భూమిమీద స్థాపించి, రెండో మంత్రంతో (ఓం భువః) నీటితో తడిపి, మూడో మంత్రంతో (ఓం స్వః) దాన్ని పరీక్షించి, తర్వాత నాల్గో మంత్రంతో (ఓం మహః) ఆ మృత్తికను భాగాలు చేసి, ప్రథమమంత్రంతో (ఓంభూః) శరీరంలో గల మలాన్ని తుడిచి, అపుడు ఆరో మంత్రం (ఓం తపః) తో స్నానం చేసి, మరల మిగిలిన మృత్తికను చేతిలో ఉంచుకుని 'ఓం భూః' మొదలైన నాల్గు మంత్రాలతో దాన్ని మూడు భాగాలు చేసి, మధ్యభాగాన్ని ఆరో మంత్రంతో ఏడుసార్లు అభిమంత్రించి, మూలమంత్రంతో వామహస్తస్పర్శ కలిగించాలి. ఆరో మంత్రాన్ని పదిసార్లు ఉచ్చరిస్తూ దిగ్బంధం చేయాలి.

**వామేన తీర్థం సవ్యేన శరీరమనులిప్య చ ।**
**స్నాత్వా సర్వైః స్మరన్ భానుమభిషేకం సమాచరేత్ ॥5॥**

**శృంగేణ పర్ణపుటకైః పాలాశేన దళేన వా ।**
**సౌరైరేభిశ్చ వివిధైః సర్వసిద్ధికరైః శుభైః ॥ 6॥**

**సౌరాణి చ ప్రవక్ష్యామి వాష్కలాద్యాని సువ్రత ।**
**అంగాని సర్వదేవేషు సారభూతాని సర్వతః ॥7॥**

ఎడమచేతితో తీర్థజలాన్ని తాకి, కుడి చేతితో శరీరానికి అలముకుని, అన్ని మంత్రాలతో మరల స్నానం చేసి, తర్వాత సూర్యుడిని స్మరిస్తూ, శృంగంతో (కొమ్మువాద్యం), పత్రాల దోనెలతో, లేకుంటే పలాశ పత్రాలతో

సమస్తసిద్ధిప్రదాత, మంగళకరుడు శివుడిని నానావిధసౌరమంత్రాలతో అభిషేకించాలి. ఓ సువ్రతుడా! ఇపుడు నేను సర్వదేవమంత్రాలలో సారస్వరూపమైన సూర్యసంబంధమైన 'వాష్కల' ఆదులగూర్చి అట్లే అంగమంత్రాలగూర్చి బాగా చెబుతాను.

**ఓం భూః ఓం భువః ఓం స్వః ఓం మహః ఓం జన ః**
**ఓం తపః ఓం సత్యమ్ ఓం ఋతమ్ ఓం బ్రహ్మ ।**
**నవాక్షరమయం మంత్రం వాష్కలం పరికీర్తితమ్ ॥**
**న క్షరతీతి లోకాని ఋతమక్షరముచ్యతే ।**
**సత్యమక్షరమిత్యుక్తం ప్రణవాది నమోంతకమ్ ॥8॥**

ఓం భూః ఓం భువః ఓం స్వః ఓం మహః ఓ జనః ఓం తపః ఓం సత్యమ్ ఓం ఋతమ్ ఓం బ్రహ్మ ఈ నవాక్షరమయమైన మంత్రం, వాష్కల (బాష్కల) మంత్రం. 'భూః" ఆది సప్తలోకాలు ప్రళయపర్యంతం నశించవు. అందుకే వాటిని ఋతాలు (అక్షరాలు) అంటున్నారు. సత్యం అనగా బ్రహ్మ, అక్షరం అంటే నాశశూన్యం. ఈ విధంగా ప్రణవాదుల నుంచి (ఓం) నమః పర్యంతం వాష్కలమంత్రం అయి ఉన్నది.

**ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్ ।**
**ఓం నమః సూర్యాయ ఖఖోల్కాయ నమః ॥9॥**

**మూలమంత్రమిదం ప్రోక్తం భాస్కరస్య మహాత్మనః ।**
**నవాక్షరేణ దీప్తాస్యం మూలమంత్రేణ భాస్కరమ్ ॥10॥**

**పూజయేదంగమంత్రాణి కథయామి యథాక్రమమ్ ।**
**వేదాదిభిః ప్రభూతాద్యం ప్రణవేన చ మధ్యమమ్ ॥11॥**

**ఓం భూః బ్రహ్మహృదయాయ, ఓం భువః విష్ణుశిరసే, ఓం స్వః**
**రుద్రశిఖాయై, ఓం భూర్భువః స్వః జ్వాలామాలినీశిఖాయై,**

**ఓం మహః మహేశ్వరాయ కవచాయ, ఓం జనః శివాయ**
**నేత్రేభ్యః, ఓం తపః తాపకాయ అస్త్రాయ ఫట్ ।**

**మంత్రాణి కథితాన్యేవం సౌరాణి వివిధాని చ ।**
**ఏతైః శృంగాదిభిః పాత్రైః స్వాత్మానమభిషేచయేత్ ॥12॥**

**తామ్రకుంభేన వా విప్రః క్షత్రియో వైశ్య ఏవ చ ।**
**సకుశేన సపుష్పేణ మంత్రైః సర్వైః సమాహితః ॥13॥**

'ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్।, ఓం నమః సూర్యాయ ఖఖోల్కాయ నమః॥' ఈ మంత్రం పరమాత్ముడు సూర్యుడి మూలమంత్రం. నవాక్షరమంత్రంతో అట్లే మూలమంత్రంతో తేజోముఖుడు సూర్యుడిని పూజించాలి. నేను ఇప్పుడు అంగమంత్రాల్నిగూర్చి చెబుతున్నాను. అంగమంత్రం ఆదిలో ప్రణవంతో, మధ్యలో వ్యాహృతులతో కూడియున్నది. ఓం భూః బ్రహ్మహృదయాయ, ఓం

భువః విష్ణుశిరసే, ఓం స్వః రుద్రశిఖాయై, ఓం భూర్భువః స్వః జ్వాలామాలినీశిఖాయై, ఓం మహః మహేశ్వరాయ కవచాయ, ఓం జనః శివాయ నేత్రేభ్యః, ఓం తపః తాపకాయ అస్త్రాయ ఫట్ – ఇవి అనేకాలైన సౌరమంత్రాలు. బ్రాహ్మణుడు, క్షత్రియుడు లేకుంటే వైశ్యుడు సమాహితుడై శృంగం వంటి పాత్రలతో, లేకుంటే దర్భలు, పుష్పాలతో నిండిన రాగికుండలతో ఈ మంత్రాలన్నింటితో తనను తాను అభిషేకించుకోవాలి.

**రక్తవస్త్రపరీధానః స్వాచామేద్విధిపూర్వకమ్ ।**
**సూర్యశ్చేతి దివారాత్రౌ చాగ్నిశ్చేతి ద్విజోత్తమః ॥14॥**

**ఆపః పునంతు మధ్యాహ్నే మంత్రాచమనముచ్యతే ।**
**షష్ఠేన శుద్ధిం కృత్వైవ జపేదాద్యమనుత్తమమ్ ॥15॥**

**వౌషడంతం తథా మూలం నవాక్షరమనుత్తమమ్ ।**

తర్వాత ద్విజశ్రేష్ఠుడు ఇలా చేయాలి. ఎఱ్ఱటి రంగుగల వస్త్రాన్ని ధరించి ప్రాతఃకాలంలో 'సూర్యశ్చ' అనే మంత్రంతో, సాయంకాలంలో 'అగ్నిశ్చ' అనే మంత్రంతో, మధ్యాహ్నంలో "ఆపః పునంతు" అనే ఈ మంత్రాల్ని పఠిస్తూ విధిపూర్వకంగా ఆచమనం చేయాలి. ఇవి ఆచమన మంత్రాలు. ఆరో మంత్రంతో (ఓం తపః) శుద్ధి చేసి అతిశ్రేష్ఠమైన మొదటి 'వౌషడంత' మూలమంత్రాన్ని, అట్లే 'అనుత్తమ' నవాక్షరమంత్రాన్ని జపించాలి.

**కరశాఖాం తథాంగుష్ఠమధ్యమానామికాం న్యసేత్ ॥16॥**

**తలే చ తర్జన్యంగుష్ఠం ముష్టిభాగాని విన్యసేత్ ।**
**నవాక్షరమయం దేహం కృత్వాంగైరపి పావితమ్ ॥17॥**

**సూర్యోఽహమితి సంచింత్య మంత్రైరేతైర్యథాక్రమమ్ ।**
**వామహస్తగతైరద్భిర్గంధసిద్ధార్థకాన్వితైః ॥18॥**

**కుశపుంజేన చాభ్యుక్ష్య మూలాగ్రైరష్టధా స్థితైః ।**
**ఆపో హిష్ఠాదిభిశ్చైవ శేషమాఘ్రాయ వై జలమ్ ॥19॥**

**వామనాసాపుటేనైవ దేహే సంభావయేచ్ఛివమ్ ।**
**అర్ఘ్యమాదాయ దేహస్థం సవ్యనాసాపుటేన చ ॥20॥**

**కృష్ణవర్ణేన బాహ్యస్థం భావయేచ్చ శిలాగతమ్ ।**
**తర్పయేత్సర్వదేవేభ్య ఋషిభ్యశ్చ విశేషతః ॥21॥**

**భూతేభ్యశ్చ పితృభ్యశ్చ విధినార్ఘ్యం దాపయేత్ ।**
**వ్యాపినీం చ పరాం జ్యోత్స్నాం సంధ్యాం సమ్యగుపాసయేత్ ॥22॥**

**ప్రాతర్మధ్యాహ్నసాయాహ్నే అర్ఘ్యం చైవ నివేదయేత్ ।**

అంగుష్ఠం, మధ్యవ్రేలు, అనామిక (ఉంగరం వ్రేలు) అట్లే కనిష్ఠిక (చివరి వ్రేలు) వీటిని న్యాసం చేయాలి. మరియు తర్జనిమీద అంగుష్ఠాన్ని ఉంచాలి. పిమ్మట కరతలాన్ని కరపుష్ఠంమీద ఉంచాలి. ఈ విధంగా పవిత్రమైన

దేహాన్ని అంగమంత్రాలద్వారా నవాక్షరమయం చేసి “నేను సూర్యుడను” అనే భావనతో యథాక్రమంగా ఆ మంత్రాలతో అట్లే “ఆపో హిష్ఠా” మొదలైన మంత్రాలద్వారా ఎడమచేతిలోగల గంధం, చందనం, తెల్ల ఆవాలతో కూడిన జలాన్ని మూలాలు మరియు అగ్రభాగాలుగల దర్భలతో చేయబడిన చిన్న కుచ్చువంటి పరికరంతో తన దేహంమీద చల్లుకోవాలి. మిగిలిన జలాన్ని ఎడమ నాసికాపుటంతో వాసనచూచి తన శరీరంపై శివుడున్న భావన చేయాలి. వాసన చూచిన జలాన్ని లోపలగల నల్లని రంధ్రంనుంచి పాపపురుషుడితోపాటు ఎడమనాసిక రంధ్రం నుంచి వెలుపలికి తెచ్చి శిలాతలంపైపడిన భావన చేయాలి. తర్వాత దేవతలందరికి, ఋషులకు, భూతగణాలకు అట్లే పితృగణాలకు విధిపూర్వకంగా తర్పణ ఇవ్వాలి.

**రక్తచందనతోయేన హస్తమాత్రేణ మండలమ్ ॥23॥**

**సువృత్తం కల్పయేద్భూమౌ ప్రార్థయేత ద్విజోత్తమాః ।**
**ప్రాఙ్ముఖస్తామ్రపాత్రం చ సగంధం ప్రస్థపూరితమ్ ॥24॥**

**పూరయేత్ గంధతోయేన రక్తచందనకేన చ ।**
**రక్తపుష్పైస్తిలైశ్చైవ కుశాక్షత సమన్వితైః ॥25॥**

**దూర్వాపామార్గగవ్యేన కేవలేన ఘృతేన చ ।**
**ఆపూర్య మూలమంత్రేణ నవాక్షరమయేన చ ।**
**జానుభ్యాం ధరణీం గత్వా దేవదేవం నమస్య చ ॥26॥**

**కృత్వా శిరసి తత్పాత్రమర్ఘ్యం మూలేన దాపయేత్ ।**
**అశ్వమేధాయుతం కృత్వా యత్ఫలం పరికీర్తితమ్ ॥27॥**

**తత్ఫలం లభతే దత్త్వా సౌరార్ఘ్యం సర్వసమ్మతమ్ ।**
**దత్త్వైవార్ఘ్యం యజేద్భక్త్యా దేవదేవం త్రియంబకమ్ ॥28॥**

**అథవా భాస్కరం చేష్ట్వా ఆగ్నేయం స్నానమాచరేత్ ।**
**పూర్వవద్వై శివస్నానం మంత్రమాత్రేణ భేదితమ్ ॥29॥**

తర్వాత ప్రాతఃకాలంలో, మధ్యాహ్నంలో, సాయంకాలంలో వ్యాపించే ‘పరా, జ్యోత్స్నా సంధ్యా’–వీటిని ఉపాసించాలి. సూర్యభగవానుడికి అర్ఘ్యం ఇవ్వాలి. ఓ శ్రేష్ఠద్విజులారా! రక్తచందనజలంతో భూమిమీద ఒక హస్తప్రమాణంలో సుందరమైన వృత్తాకారంలో మండలాన్ని (వేదికను) నిర్మించాలి. ప్రార్థించాలి. తూర్పు దిక్కుకు తిరిగి ప్రస్థపరిమాణంలో పరిమళభరితమైన జలంతో నిండా నింపగల రాగిపాత్రను నవాక్షరమయ మూలమంత్రాలతో, సువాసనలు నిండిన జలంతో నింపాలి. మరియు రక్తచందనం, రక్తపుష్పాలు, నూవులు, దర్భలు, అక్షతలు, గరిక, జిల్లేడు, పంచగవ్యం లేకుంటే కేవలం ఆవు నేతితో నింపిన రెండు ఘటాల్ని భూమిమీద పెట్టి దేవదేవ సూర్యుడికి నమస్కరించి ఆ రాగి పాత్రపైభాగంలో ఉంచి మూలమంత్రం ద్వారా అర్ఘ్యాన్ని ఇవ్వాలి. పదివేల అశ్వమేధయాగాలు చేస్తే ఎంతటి ఫలం వస్తుందో అంతటిఫలం ఈ సర్వసమ్మత సూర్యార్ఘ్యం ఇవ్వడంవల్ల లభిస్తున్నది. అర్ఘ్య ప్రదానం చేసి దేవదేవుడు, త్రయంబకుడు శివుడిని భక్తిపూర్వకంగా ఉపాసించాలి. లేకుంటే

సూర్యుడిని పూజించి శివయజనంకోసం భస్మస్నానం చేయాలి. ఈ స్నానం పూర్వం చెప్పిన విధంగా చేయాలి. ఇందులో కేవలం మంత్రంయొక్క భిన్నత్వం మాత్రమే ఉంది.

**దంతధావనపూర్వం చ స్నానం సౌరం చ శాంకరమ్ ।**
**విఘ్నేశం వరుణం చైవ గురుం తీర్థే సమర్చయేత్ ॥30॥**

**బద్ధ్వా పద్మాసనం తీర్థే తథా తీర్థం సమర్చయేత్ ।**
**తీర్థం సంగృహ్య విధినా పూజాస్థానం ప్రవిశ్య చ ॥31॥**

**మార్గేణార్ఘ్యపవిత్రేణ తదాక్రమ్య చ పాదుకమ్ ।**
**పూర్వవత్కరవిన్యాసం దేహవిన్యాసమాచరేత్ ॥32॥**

సూర్యస్నానం అట్లే శివస్నానానికి ముందు పళ్లు తోముకోవాలి. తీర్థంలో (పుణ్యతీర్థంలో) స్నానం చేసి విఘ్నేశ్వరుడైన గణేశ్వరుడిని, వరుణదేవుడిని, గురువును అర్చించాలి. మరల తీర్థంలో పద్మాసనం వేసుకుని తీర్థంతో (జలంతో) విధిపూర్వకంగా పూజచేయాలి. అనంతరం తీర్థజలాన్ని తీసుకుని జలంతో సమ్మార్జనం చేసిన పవిత్రమార్గం ద్వారా పూజాస్థానంలోనికి ప్రవేశించి ఆసనంమీద కూర్చుని పూర్వం చేసినట్లే కరన్యాసం, దేహన్యాసం చేయాలి.

**అర్ఘ్యస్య సాదనం చైవ సమాసాత్పరికీర్తితమ్ ।**
**బద్ధ్వా పద్మాసనం యోగీ ప్రాణాయామం సమభ్యసేత్ ॥33॥**

**రక్తపుష్పాణి సంగృహ్య కమలాద్యాని భావయేత్ ।**
**ఆత్మనో దక్షిణే స్థాప్య జలభాండం చ వామతః ॥34॥**

**తామ్రపాత్రాణి సౌరాణి సర్వకామార్థసిద్ధయే ।**
**అర్ఘ్యపాత్రం సమాదాయ ప్రక్షాల్య చ యథావిధి ॥35॥**

**పూర్వోక్తేనాంబునా సార్ధం జలభాండే తథైవ చ।**
**అస్త్రోదకేన చైవార్ఘ్యమర్ఘ్యద్రవ్యసమన్వితమ్ ॥36॥**

**సంహితామంత్రితం కృత్వా సంపూజ్య ప్రథమేన చ ।**
**తురీయేణావగుంఠ్యైవ స్థాపయేదాత్మనోపరి ॥37॥**

**పాద్యమాచమనీయం చ గంధపుష్పసమన్వితమ్ ।**
**అంభసా శోధితే పాత్రే స్థాపయేత్పూర్వవత్పృథక్ ।**
**సంహితాం చైవ విన్యస్య కవచేనావగుంఠ్య చ ॥38॥**

**అర్ఘ్యాంబునా సమభ్యుక్ష్య ద్రవ్యాణి చ విశేషతః ।**
**ఆదిత్యం చ జపేద్దేవం సర్వదేవనమస్కృతమ్ ॥39॥**

అర్ఘ్యసంస్థాపనవిషయం ముందు చెప్పబడింది. యోగులు పద్మాసనం వేసుకుని ప్రాణాయామం చేయాలి. కమలం మొదలైన ఎట్టిటి పుష్పాల్ని సంగ్రహించి తన కుడివైపున ఉంచి, ఎడమవైపున జలపాత్రను ఉంచుకుని సూర్యుడిని భావించాలి. సమస్తమైన కోరికల్ని సిద్ధింపజేయడానికైన సూర్యార్ఘ్యం మొదలైనవాటితో ఆ రాగిపాత్ర ఉపకరిస్తున్నది. అర్ఘ్య పాత్రను విధిపూర్వకంగా ప్రక్షాళించి పూర్వం చెప్పిన జలంతోపాటు అర్ఘ్యద్రవ్యాలతో నింపి, అర్ఘ్యాన్ని అస్త్రోదకమంత్రంతో వేరే నీటిభాండంలో పోయాలి. సంహితామంత్రంతో అభిమంత్రించి, సద్యోజాత మంత్రంతో పూజించి నాల్గో మంత్రంతో (తత్పురుషమంత్రం) అవగుంఠనం చేసి తనమీద నిలుపుకోవాలి. జలంతో కడిగి శుద్ధి చేసిన పాత్రలో గంధంతో పుష్పాలతో కూడిన పాద్యజలాన్ని అట్లే ఆచమనీయజలాన్ని పూర్వంలాగానే వేరు వేరుగా ఉంచాలి. సంహితామంత్రంతో న్యాసం చేసి, కవచంతో అవకుంఠన పర్చి, అర్ఘ్యజలంతో విశేషరూపంలో అన్ని ద్రవ్యాల్ని చల్లి, సమస్తదేవతలచేత నమస్కరింపబడే ఆదిత్యదేవుడిని జపించాలి.

**ఆదిత్యో వై తేజ ఊర్జో బలం యశో వివర్ధతి ।**
**ఇత్యాదినా నమస్కృత్య కల్పయేదాసనం ప్రభోః ॥40॥**

**ప్రభూతం విమలం సారమారాధ్యం పరమం సుఖమ్ ।**
**ఆగ్నేయ్యాదిషు కోణేషు మధ్యమాంతం హృదా న్యసేత్ ॥41॥**

**అంగం ప్రవిన్యసేచ్చైవ బీజమంకురమేవ చ ।**
**నాలం సుషిరసంయుక్తం సూత్రకటకసంయుతమ్ ॥42॥**

**దళం దళాగ్రం సుశ్వేతం హేమాభం రక్తమేవ చ ।**
**కర్ణికాకేసరోపేతం దీప్తాద్యైః శక్తిభిర్వృతమ్ ॥43॥**

**దీప్తా సూక్ష్మా జయా భద్రా విభూతిర్విమలా క్రమాత్ ।**
**అఘోరా వికృతా చైవ దీప్తాద్యాశ్చాష్టశక్తయః ॥44॥**

**భాస్కరాభిముఖాః సర్వాః కృతాంజలిపుటాః శుభాః ।**
**అథవా పద్మహస్తా వా సర్వాభరణభూషితాః ॥45॥**

**మధ్యతో వరదాం దేవీం స్థాపయేత్సర్వతోముఖీమ్ ।**
**ఆవాహయేత్తతో దేవీం భాస్కరం పరమేశ్వరమ్ ॥46॥**

**నవాక్షరేణ మంత్రేణ వాష్కలోక్తేన భాస్కరమ్ ।**
**ఆవాహనే చ సాన్నిధ్యమనేనైవ విధీయతే ॥47॥**

**ముద్రా చ పద్మముద్రాఖ్యా భాస్కరస్య మహాత్మనః ।**
**మూలేనార్ఘ్యం తతో దద్యాత్పాద్యమాచమనం పృథక్ ॥48॥**

సూర్యభగవానుడు తేజస్సును, ఊర్జస్సును, బలాన్ని, యశస్సును వృద్ధి చేసేవాడు. "ఆదిత్యో వై తేజ ఊర్జో బలం యశో వివర్ధతి" అనే కృష్ణయజుర్వేదశ్రుతిద్వారా సూర్యభగవానుడికి నమస్కరించి, ఆయనకు విశాలం, స్వచ్ఛం, శ్రేష్ఠం, ప్రశస్తం అట్లే అత్యంతసుఖదాయకం అయిన ఆసనాన్ని ఏర్పాటు చేయాలి. ఆగ్నేయాదులైన

నాల్గు దిక్కులందు మధ్యలో, అంతంలో వ్యాహృతులను (మహః,జనః,తపః, సత్యం) హృదయాలతో న్యాసం చేయాలి. ఈ విధంగా పూర్వం అంగన్యాసం కూడా చేయాలి. తర్వాత బీజం, అంకురం, ఛిద్రసహితమైన నాళం, సూత్ర–కంటక మయమైన దళం, శ్వేత–సవర్ణిమం అట్లే రక్తవర్ణదళాగ్రం, కర్ణిక–కేసరాలతో కూడినది, అట్లే దీప్తాదిశక్తులతో కూడినది అయిన కమలాన్ని భావించాలి. కమలం యొక్క ఎనిమిది దళాలలో 'దీప్త, సూక్ష్మ, జయ, భద్ర, విభూషిత, విమల, అఘోర, వికృత – ఈ ఎనిమిది శుభశక్తుల్ని నిలిపి సూర్యుడికి అభిముఖంగా నిలిచి రెండుచేతులు జోడించి లేదా చేతులతో కమలాన్ని ధరించి సర్వాభరణభూషితుడై నిలిచిన భావన కలిగి మధ్యలో వరదాయినిఅయిన భవానీ గాయత్రీదేవిని స్థాపించాలి. తర్వాత దేవిని, పరమేశ్వరుడైన భాస్కరుడిని ఆవాహన చేయాలి. ఆవాహన సమయంలో సాన్నిధ్యం ఈ మంత్రంతోనే చేయడం జరుగుతున్నది. మహాత్ముడు భాస్కరుడికి 'పద్మ' నామకమైన ముద్రను చూపాలి. తర్వాత మూలమంత్రం ద్వారా వేరు వేరుగా అర్ఘ్యం, పాద్యం, ఆచమనం ప్రదానం చేయాలి.

**పునరర్ఘ్యప్రదానేన వాష్కలేన యథావిధి ।**
**రక్తపద్మాని పుష్పాణి రక్తచందనమేవ చ ॥49॥**

**దీపధూపాదినైవేద్యం ముఖవాసాదిరేవ చ ।**
**తాంబూలవర్తిదీపాద్యం వాష్కలేన విధీయతే ॥50॥**

**ఆగ్నేయ్యాం చ తథైశాన్యాం నైరృత్యాం వాయుగోచరే ।**
**పూర్వస్యాం పశ్చిమే చైవ షట్ప్రకారం విధీయతే ॥ 51॥**

**నేత్రాంతం విధినాభ్యర్చ్య ప్రణవాదినమోఽంతకమ్ ।**
**కర్ణికాయాం ప్రవిన్యస్య రూపకధ్యానమాచరేత్ ॥52॥**

అనంతరం మరల వాష్కలమంత్రంతో అర్ఘ్యస్నానాన్ని ప్రదానం చేయడంతోపాటు విధ్యనుసారంగా రక్తకమలాలు, రక్తపుష్పాలు, రక్తచందనం, ధూపం, దీపం, నైవేద్యం సుగంధద్రవ్యాలతో కూడిన తాంబూలం, కర్పూరహారతి మొదలైనవాటిని సమర్పించాలి. తర్వాత ఆగ్నేయం, ఈశాన్యం, నైరృతి, వాయవ్య, విదిక్కులలో, పూర్వపశ్చిమదిక్కులలో ఆరు విధాల యజనం చేయాలి. ఆదిలో ఓంకారాన్ని అంతంలో "నమః" చేర్చి అంగమంత్రాలద్వారా నేత్రం దగ్గరనుంచి ఆయా అంగాలకు పూజ చేసి తన హృదయకమలంలో న్యాసం చేసుకుని ఆ ప్రతిబింబాన్ని ధ్యానించాలి.

**సర్వే విద్యుత్ప్రభాః శాంతా రౌద్రమస్త్రం ప్రకీర్తితమ్ ।**
**దంష్ట్రాకరాళవదనం హ్యష్టమూర్తిం భయంకరమ్ ॥53॥**

**వరదం దక్షిణం హస్తం వామం పద్మవిభూషితమ్ ।**
**సర్వాభరణసంపన్నా రక్తస్రగనులేపనాః ॥ 54॥**

**రక్తాంబరధరాః సర్వా మూర్తయస్తస్య సంస్థితాః ।**
**సమండలో మహాదేవః సిందూరారుణవిగ్రహః ॥55॥**

**పద్మహస్తో ఽమృతాస్యశ్చ ద్విహస్తనయనః ప్రభుః ।**
**రక్తాభరణసంయుక్తో రక్తస్రగనులేపనః ॥56॥**

ఆతడి హృదయం మున్నగు అన్ని అంగాలు విద్యుత్తుతో సమానమైన కాంతిగలవి మరియు శాంతమైనవి కూడా. ఆతడి అస్త్రాలు రౌద్రమైనవి. పెద్ద దంష్ట్రలు ఉండడంవల్ల ఆయన ముఖం వికృతమైనది. ఆతడు భయంకరమైన అష్టమూర్తులను కలిగియున్నాడు. ఆతడి దక్షిణహస్తంలో వరముద్ర, ఎడమచేతిలో పద్మం శోభిల్లుతున్నవి. సమస్తాభరణాలతో శోభిల్లుతూ రక్తవర్ణమాలతో రక్తవర్ణంగల మైపూతతో, రక్తవస్త్రం ధరించియున్నాడు. ఆతడి అన్ని మూర్తులు (శక్తులు) ఆతడితో విరాజిల్లుతున్నాయి. మండలసహితుడైన ఆతడు మహాదేవుడి సిందూరంతో సమానమైన అరుణవర్ణవిగ్రహంగలవాడై ఉన్నాడు. హస్తంలో కమలాన్ని ధరించాడు. అమృతమయమైన ముఖమండలంగలవాడు. రెండు చేతులతో రెండు నేత్రాలతో కూడినవాడు. రక్తాభరణభూషితుడు. రక్తవర్ణంగల మాలతో, రక్తవర్ణానులేపనంతో మిక్కిలి శోభిల్లుతున్నాడు. ఈ విధమైన రూపాన్ని ధారణ చేసి భువనేశ్వరుడైన భాస్కరుడిని ధ్యానించాలి.

**ఇత్థం రూపధరం ధ్యాయేద్ భాస్కరం భువనేశ్వరమ్ ।**

**పద్మబాహ్యే శుభం చాత్ర మండలేషు సమంతతః ॥57॥**

**సోమమంగారకం చైవ బుధం బుద్ధిమతాం వరమ్ ।**
**బృహస్పతిం మహాబుద్ధిం రుద్రపుత్రం చ భార్గవమ్ ॥58॥**

**శనైశ్చరం తథా రాహుం కేతుం ధూమ్రం ప్రకీర్తితమ్ ।**
**సర్వే ద్వినేత్రా ద్విభుజా రాహుశ్చోర్ధ్వశరీరధృక్ ॥59॥**

**వివృత్తాస్యోఽంజలిం కృత్వా భ్రుకుటీకుటిలేక్షణః ।**
**శనైశ్చరశ్చ దంష్ట్రాస్యో వరదాభయహస్తధృక్ ॥60॥**

**స్వైః స్వైర్బీజైః స్వనామ్నా చ ప్రణవాదినమోఽంతకమ్ ।**
**పూజనీయాః ప్రయత్నేన ధర్మకామార్థసిద్ధయే ॥61॥**

కమలం వెలుపలి భాగంలో అన్ని దిక్కుల్లో మండలాలలో శుభంకరులైన చంద్రుడు, మంగళుడు, బుధుడు, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు బృహస్పతి, మహాబుద్ధిమంతుడు రుద్రపుత్రుడు శుక్రుడు, శనిదేవుడు, రాహువు, ధూమ్రవర్ణుడు కేతువు– వీరిని పూజించాలి. అందరూ రెండు నేత్రాలు, రెండు బాహువులు కలవారే. రాహువు కేవలం ఊర్ధ్వశరీరం (శిరసు) కలవాడు మాత్రమే. ఆతడు వివృతమైన ముఖంగలవాడు. నుదురు గుండ్రంగా ఉంటుంది. దోసిలి మూసియుంటుంది. దృష్టి కుటిలంగా ఉంటుంది. శనిదేవుడు భయంకరమైన దంతాలుగల ముఖంగలవాడు. చేతులలో 'వరద' ముద్రను, అభయముద్రను ధరించి ఉంటాడు. వీరి నామాలకు ముందు 'ఓంకారం', అంతంలో 'నమః' చేర్చి ధర్మార్థకామసిద్ధికై ప్రయత్నపూర్వకంగా వీరిని పూజించాలి.

**సప్తసప్తగణాంశ్చైవ బహిర్దేవస్య పూజయేత్ ।**
**ఋషయో దేవగంధర్వాః పన్నగాప్సరసాం గణాః ॥62॥**

**గ్రామణ్యో యాతుధానాశ్చ తథా యక్షాశ్చ ముఖ్యతః ।**
**సప్తాశ్వాన్ పూజయేదగ్రే సప్తచ్ఛందోమయాన్ విభోః ॥63॥**

**వాలఖిల్యగణం చైవ నిర్మాల్యగ్రహణం విభోః ।**
**పూజయేదాసనం మూర్తేర్దేవతామపి పూజయేత్ ॥64॥**

**అర్ఘ్యం చ దాపయేత్తేషాం పృథగేవ విధానతః ।**
**ఆవాహనే చ పూజాంతే తేషాముద్వాసనే తథా ॥65॥**

సూర్యదేవుడి మండలానికి వెలుపల నలభైతొమ్మిది మరుద్గణాలకు కూడా పూజ చేయాలి. వాళ్లు ఋషులు, దేవతలు, గంధర్వులు, నాగులు, అప్సరసలు, గ్రామణులు, రాక్షసులు (యాతుధానులు) అట్లే యక్షులు, వీళ్లని పూజించాలి. సూర్యభగవానుడి వేదమయసప్తాశ్వాల్ని ముందుగా పూజించాలి. ప్రభువు సూర్యుడి నిర్మాల్యాల్ని గ్రహించే వాలఖిల్య మునిగణాల్ని కూడా పూజించాలి. మూర్తికి ఆసనమిచ్చి దేవతలను కూడా పూజించాలి. సూర్యుడు మున్నగు దేవతల్ని ఆవాహనంలో, పూజ అంతంలో, విసర్జనం చివరలో విధిపూర్వకంగా వేరు వేరుగా అర్ఘ్యాన్ని ప్రదానం చేయాలి.

**సహస్రం వా తదర్ధం వా శతమష్టోత్తరం తు వా ।**
**వాష్కలం చ జపేదగ్రే దశాంశేన చ యోజయేత్ ॥66॥**

**కుండం చ పశ్చిమే కుర్యాద్వర్తులం చైవ మేఖలమ్ ।**
**చతురంగులమానేన చోత్సేధాద్విస్తరాదపి ॥ 67॥**

**ఏకహస్తప్రమాణేన నిత్యే నైమిత్తికే తథా ।**
**కృత్వాశ్వత్థదళాకారం నాభిం కుండే దశాంగుళమ్ ॥68॥**
**తదర్ధేన పురస్తాత్తు గజోష్ఠసదృశం స్మృతమ్ ।**
**గళమేకాంగుళం చైవ శేషం ద్విగుణవిస్తరమ్ ॥69॥**
**తత్ప్రమాణేన కుండస్య త్యక్త్వా కుర్వీత మేఖలామ్ ।**
**యత్నేన సాధయిత్వైవ పశ్చాద్ధోమం చ కారయేత్ ॥70॥**

అనంతరం వేయి, ఐదువందలు లేక నూట ఎనిమిది సార్లు వాష్కలమంత్రజపం చేయాలి. తిరిగి జపంలో పదో భాగం హవనం చేయాలి. హవనంకోసం మండలంయొక్క పడమటివైపు వర్తులాకారకుండాన్ని నిర్మించాలి. నాల్గు అంగుళాల ప్రమాణంతో ఉత్సేధాన్ని నిర్మించాలి. నిత్యనైమిత్తిక కర్మలకోసం ఒక హస్తప్రమాణంగల కుండం ఉత్తమమైంది. కుండంలో అశ్వత్థ పత్రాకారంలో పది అంగుళాల ప్రమాణంలో నాభిని నిర్మించాలి. ఐదు అంగుళాల ప్రమాణంలో ఏనుగు పెదవి ఆకారంలో కుండం క్రింది భాగం నిర్మించాలి. ఒక అంగుళ ప్రమాణంలో నాళాన్ని నిర్మించాలి. కుండం వెలుపల రెండు అంగుళాల ప్రదేశాన్ని వదలి మేఖల నిర్మించాలి. ఈ విధంగా ప్రయత్నపూర్వకంగా కుండాన్ని నిర్మించి తర్వాత హోమం చేయాలి.

**షష్ఠేనోల్లేఖనం కుర్యాత్ప్రోక్షయేద్వారిణా పునః ।**
**ఆసనం కల్పయేన్మధ్యే ప్రథమేన సమాహితః ॥71॥**

**ప్రభావతీం తతః శక్తిమాద్యేనైవ తు విన్యసేత్ ।**
**వాష్కలేనైవ సంపూజ్య గంధపుష్పాదిభిః క్రమాత్ ॥72॥**

**వాష్కలేనైవ మంత్రేణ క్రియాం ప్రతి యజేత్పృథక్ ।**
**మూలమంత్రేణ విధినా పశ్చాత్పూర్ణాహుతిర్భవేత్ ॥73॥**

**క్రమాదేవం విధానేన సూర్యాగ్నిర్జనితో భవేత్ ।**
**పూర్వోక్తేన విధానేన ప్రాగుక్తం కమలం న్యసేత్ ॥ 74॥**

**ముఖోపరి సమభ్యర్చ్య పూర్వవద్భాస్కరం ప్రభుమ్ ।**
**దశైవాహుతయో దేయా వాష్కలేన మహామునే ॥75॥**

**అంగానాం చ తథైకైకం సంహితాభిః పృథక్ పునః ।**

అఘోరమంత్రంతో ఉల్లేఖనం చేయాలి. నీటితో కుండాన్ని సంప్రోక్షించాలి. తర్వాత అన్ని విధాల సిద్ధపడి ప్రథమమంత్రంతో కుండం మధ్యలో ఆసనాన్ని కల్పించాలి. ప్రథమమంత్రంతోనే ప్రభావతి అనే పేరుగల శక్తిని స్థాపించాలి. క్రమంగా గంధం, పుష్పం మొదలైనవాటితో వాష్కలమంత్రం ద్వారా విధ్యుక్తంగా పూజ చేసి, వాష్కలమంత్రం ద్వారానే ప్రత్యేకించి వేరుగా యజనం చేయాలి. తర్వాత మూలమంత్రంతో విధిపూర్వకంగా పూర్ణాహుతి చేయాలి. ఈ విధానం ద్వారా క్రమంగా సూర్యరూపమైన అగ్ని ఉత్పన్నం అయ్యింది. ముందు చెప్పిన విధానాన్ని అనుసరించి అగ్నిలో పూర్వోక్తకమలాన్ని న్యాసం చేయాలి. ఓ మహామునీ! ఆ కమలం ముఖం మీద పూర్వం మాదిరిగానే ప్రభువైన భాస్కరుడికి బాగా పూజ చేసి, సంహితామంత్రంతో ఒక్కొక్క అంగానికి వాష్కలమంత్రం ద్వారా వేరువేరుగా పది ఆహుతుల్ని ప్రదానం చేయాలి.

**జయాదిస్విష్టపర్యంతమిధ్మప్రక్షేపమేవ చ ॥76॥**

**సామాన్యం సర్వమార్గేషు పారంపర్యక్రమేణ చ ।**
**నివేద్య దేవదేవాయ భాస్కరాయామితాత్మనే ॥77॥**

**పూజాహోమాదికం సర్వం దత్త్వార్ఘ్యం చ ప్రదక్షిణమ్ ।**
**అంగైః సంపూజ్య సంక్షిప్య హృద్యుద్వాస్య నమస్య చ ॥78॥**

**శివపూజాం తతః కుర్యాద్ధర్మకామార్థసిద్ధయే ।**
**ఏవం సంక్షేపతః ప్రోక్తం యజనం భాస్కరస్య చ ॥79॥**

జయాహోమంనుంచి స్విష్టకృత్ హోమపర్యంతం పారంపర్యక్రమంలో అన్ని మార్గాలలో యజ్ఞకాష్ఠాన్ని ప్రక్షేపించాలి. మహాత్ముడైన దేవదేవభాస్కరుడి సమస్తపూజ, హోమాదుల్ని సమర్పించి, ఆయనకు అర్ఘ్యాన్ని ప్రదానం చేసి, ప్రదక్షిణం చేసి, అంగమంత్రాలతో ఆయన్ని యజించడంతో ముగుస్తుంది. దాంతో తన హృదయ కమలంనుంచి దాన్ని విసర్జించి, నమస్కరించి ధర్మార్థకామసిద్ధికై శివుడిని పూజించాలి. ఈ విధంగా సంగ్రహంగా సూర్యభగవానుడి పూజ చెప్పబడింది.

**యః సకృద్వా యజేద్దేవం దేవదేవం జగద్గురుమ్ ।**
**భాస్కరం పరమాత్మానం స యాతి పరమాం గతిమ్ ॥80॥**
**సర్వపాపవినుర్ముక్తః సర్వపాపవివర్జితః ।**
**సర్వైశ్వర్యసమోపేతస్తేజసా ప్రతిమశ్చ సః ॥81॥**
**పుత్రపౌత్రాదిమిత్రైశ్చ బాంధవైశ్చ సమంతతః ।**
**భుక్త్వైవ విపులాన్ భోగానిహైవ ధనధాన్యవాన్ ॥82॥**
**యానవాహనసంపన్నో భూషణైర్వివిధైరపి ।**
**కాలం గతోఽపి సూర్యేణ మోదతే కాలమక్షయమ్ ॥83॥**
**పునస్తస్మాదిహాగత్య రాజా భవతి ధార్మికః ।**
**వేదవేదాంగసంపన్నో బ్రాహ్మణో వాత్ర జాయతే ॥ 84॥**
**పునః ప్రాగ్వాసనాయోగాద్ధార్మికో వేదపారగః ।**
**సూర్యమేవ సమభ్యర్చ్య సూర్యసాయుజ్యమాప్నుయాత్ ॥85॥**

ఏ మానవుడు దేవదేవుడు, జగద్గురుడు, పరమాత్మ అయిన భాస్కరుడిని ఒకసారి యజిస్తే ఆతడు పరమగతిని పొందుతున్నాడు. ఆతడు పరిపూర్ణంగా పాపాలనుంచి ముక్తుడవుతున్నాడు. సమస్తపాపరహితుడవుతున్నాడు. సమస్తమైన ఐశ్వర్యాల్ని పొందుతున్నాడు. అప్రతిమతేజస్వి అవుతున్నాడు. ఆతడు పుత్రపౌత్రులతో, మిత్రులతో, బంధువులతో, ధనధాన్యాలతో, యానాలతో, వాహనాలతో, సమస్తభూషణాలతో సుసంపన్నుడై ఈ లోకంలో విపులసుఖాల్ని మిక్కిలిగా అనుభవించి, మరణించి సూర్యుడితోపాటు అనంతకాలం ఆనందం పొందుతున్నాడు. తిరిగి ఈ లోకంలో జన్మించి ధార్మికుడైన రాజు అవుతున్నాడు. లేకుంటే వేదవేదాంగవేత్త అయిన బ్రాహ్మణుడవుతున్నాడు. అనంతరం పూర్వజన్మదృఢసంస్కారంవల్ల ధర్మపరాయణుడు, వేదపారంగతుడు అయి సూర్యభగవానుడిని మిక్కిలిగా ఉపాసించి సూర్యసాయుజ్యాన్ని పొందుతున్నాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే తత్త్వశుద్ధివర్ణనం నామ ద్వావింశతితమోఽధ్యాయః ॥22॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని తత్త్వశుద్ధివర్ణన అనే పేరుగల ఇరవై రెండవ అధ్యాయం సమాప్తం



## త్రయోవింశతితమోఽధ్యాయః - ఇరవైమూడవ అధ్యాయం

## శివార్చనవిధివర్ణనమ్ - శివార్చనవిధివర్ణనం

**శైలాదిరువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**అథ తే సంప్రవక్ష్యామి శివార్చనమనుత్తమమ్ ।**
**త్రిసంధ్యమర్చయేదీశమగ్నికార్యం చ శక్తితః ॥1॥**

ఓ సనత్కుమారా! ఇప్పుడు నేను నీకు అత్యుత్తమమైన శివపూజావిధానాన్ని గూర్చి చెబుతాను. మూడు కాలాలల్లో భగవాన్ మహేశ్వరుడి పూజ చేయాలి. యథాశక్తి హోమం కూడా చేయాలి.

**శివస్నానం పురా కృత్వా తత్త్వశుద్ధిం చ పూర్వవత్ ।**
**పుష్పహస్తః ప్రవిశ్యాథ పూజాస్థానం సమాహితః ॥ 2॥**

**ప్రాణాయామత్రయం కృత్వా దాహనాప్లావనాని చ ।**
**గంధాదివాసితకరో మహాముద్రాం ప్రవిన్యసేత్ ॥3॥**

మున్ముందుగా శివస్నానం చేసి పూర్వం మాదిరిగానే తత్త్వశుద్ధి చేసి, చేతులతో పుష్పాలు పుచ్చుకుని పూజాస్థానంవద్దకు ప్రవేశించి ఏకాగ్రచిత్తంతో మూడుసార్లు ప్రాణాయామం చేసి, దాహనం, ఆప్లావనం వాటితో శుద్ధి చేసి గంధాదులతో హస్తాల్ని సుగంధపర్చి యోగశాస్త్రంలో చెప్పిన విధంగా మహాముద్రను రచించాలి.

**విజ్ఞానేన తనుం కృత్వా బ్రహ్మాగ్నేరపి యత్నతః ।**
**అవ్యక్తబుద్ధ్యహంకారతన్మాత్రా సంభవాం తనుమ్ ॥4॥**

**శివామృతేన సంపూతం శివస్య చ యథాతథమ్ ।**
**అధోనిష్ట్యా వితస్త్యాం తు నాభ్యాముపరి తిష్ఠతి ॥5॥**

**హృదయం తద్విజానీయాద్విశ్వస్యాయతనం మహత్ ।**
**హృత్పద్మకర్ణికాయాం తు దేవం సాక్షాత్సదాశివమ్ ॥6॥**

అవ్యక్తం, బుద్ధి, అహంకారం, పంచతన్మాత్రలవల్ల ఉత్పన్నమైన శరీరాన్ని ప్రయత్నపూర్వకంగా శుద్ధజ్ఞానంవల్ల అట్లే జ్ఞానాగ్నివల్ల దగ్ధం చేసి కళ్యాణకారి అయిన అమృతం ద్వారా శివుడికి యోగ్యమైన పవిత్రదేహాన్ని నిర్మించాలి. గ్రీవంలో ఒక వితస్తి, క్రింది భాగంలో అట్లే నాభిలో ఒక వితస్తి, పై భాగంలో హృదయప్రదేశం ప్రకాశిస్తున్నది. అదే విశ్వంయొక్క మహాస్థానంగా తెలుసుకోవాలి. ఆ హృదయకమలం కర్ణికలో సాక్షాత్తు శంకరభగవానుడిని ధ్యానించాలి.

**పంచవక్త్రం దశభుజం సర్వాభరణభూషితమ్ ।**
**ప్రతివక్త్రం త్రినేత్రం చ శశాంకకృతశేఖరమ్ ॥7॥**

**బద్ధపద్మాసనాసీనం శుద్ధస్ఫటికసన్నిభమ్ ।**
**ఊర్ధ్వం వక్త్రం సితం ధ్యాయేత్పూర్వం కుంకుమసన్నిభమ్ ॥8॥**

ఆయన పంచముఖాలతో పది బాహువులతో కూడియున్నాడు. సమస్తఆభరణాలతో శోభిల్లుతుంటాడు. ఆయన ప్రత్యేకముఖంలో మూడుకన్నులున్నాయి. ఆయన శిరస్సుమీద చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. పద్మాసనంపై ఆసీనుడైయున్నాడు. శుద్ధస్ఫటికవర్ణం గలవాడు. ఆయన ఊర్ధ్వముఖం శ్వేతవర్ణం కలది. పూర్వముఖం కుంకుమవర్ణం కలది.

**నీలాభం దక్షిణం వక్త్రమతిరక్తం తథోత్తరమ్ ।**
**గోక్షీరధవలం దివ్యం పశ్చిమం పరమేష్ఠినః ॥9॥**

దక్షిణముఖం నల్లని కాంతిగలది. ఉత్తరముఖం అత్యంతరక్తవర్ణం కలది. పరమేష్ఠి శివుడి పడమటి ముఖం గోవుపాలవలె తెల్లనిది.

**శూలం పరశుఖడ్గం చ వజ్రం శక్తిం చ దక్షిణే ।**
**వామే పాశాంకుశం ఘంటాం నాగం నారాచముత్తమమ్ ॥10॥**

**వరదాభయహస్తం వా శేషం పూర్వవదేవ తు ।**
**సర్వాభరణసంయుక్తం చిత్రాంబరధరం శివమ్ ॥ 11॥**

**బ్రహ్మాంగవిగ్రహం దేవం సర్వదేవోత్తమోత్తమమ్ ।**
**పూజయేత్ సర్వభావేన బ్రహ్మాంగైర్బ్రహ్మణః పతిమ్ ॥12॥**

ఆయన కుడిచేతితో శూలం, పరశువు, ఖడ్గం, వజ్రం, అట్లే శక్తి మరియు ఎడమచేతితో పాశం, అంకుశం, ఘంట, నాగం, అట్లే శ్రేష్ఠమైన బాణం ధరించియున్నాడు. ఆయన సమస్తాభరణాలతో కూడియున్నాడు. అద్భుతవస్త్రాన్ని ధరించియున్నాడు. చేతులందు వరదముద్ర, అభయముద్రలు గలిగియున్నాడు. ఈ విధంగా సద్యోజాతాది అంగవిగ్రహం కలవాడు. దేవతలందరిలోనూ అతిశ్రేష్ఠుడు, బ్రహ్మకు పతి అయిన శివభగవానుడిని ధ్యానించాలి. అట్లే సద్యోజాతాదిబ్రహ్మమంత్రాలతో పూజించాలి.

**ఉక్తాని పంచబ్రహ్మాణి శివాంగాని శృణుష్వ మే ।**
**శక్తి భూతాని చ తథా హృదయాదీని సువ్రత ॥13॥**

సువ్రతుడా! పంచబ్రహ్మలు మరియు శివాంగాల్ని గూర్చి ముందుగా చెబుతాను. ఇపుడు శక్తి భూతం, హృదయం ఆదిగాగల మంత్రాల్ని విను.

**ఓం ఈశానః సర్వవిద్యానాం హృదయాయ శక్తిబీజాయ నమః ।**
**ఓం ఈశ్వరః సర్వభూతానామమృతాయ శిరసే నమః ॥14॥**

**ఓం బ్రహ్మాధిపతయే కాలాగ్నిరూపాయ శిఖాయై నమః ।**
**ఓం బ్రహ్మణోఽధిపతయే కాలచండమారుతాయ కవచాయ నమః ॥15॥**

**ఓం బ్రహ్మణే బృంహణాయ జ్ఞానమూర్తయే నేత్రాయ నమః ।**
**ఓం శివాయ సదాశివాయ పాశుపతాస్త్రాయ అప్రతిహతాయ ఫట్ ఫట్ ॥16॥**

**ఓం సద్యోజాతాయ భవే భవే నాతి భవే భవస్య మాం భవోద్భవాయ శివమూర్తయే నమః ।**
**ఓం హంసశిఖాయ విద్యాదేహాయ ఆత్మస్వరూపాయ పరాపరాయ శివాయ శివతమాయ నమః ॥17॥**

**కథితాని శివాంగాని మూర్తివిద్యా చ తస్య వై ।**
**బ్రహ్మాంగమూర్తిం విద్యాంగసహితాం శివశాసనే ॥18॥**

**సౌరాణి చ ప్రవక్ష్యామి వాష్కలాద్యాని సువ్రత ।**
**అంగాని సర్వదేవేషు సారభూతాని సువ్రత ॥19॥**

ఓం ఈశానః సర్వవిద్యానాం హృదయాయ శక్తి బీజాయ నమః, ఓం ఈశ్వరః సర్వభూతానామమృతాయ శిరసే నమః, ఓం బ్రహ్మాధిపతయే కాలాగ్ని రూపాయ శిఖాయై నమః, ఓం బ్రహ్మణోఽధిపతయే కాలచండ మారుతాయ కవచాయ నమః, ఓం బ్రహ్మణే బృంహణాయ జ్ఞానమూర్తయే నేత్రాయ నమః, ఓం శివాయ సదాశివాయ పాశుపతాస్త్రాయ అప్రతిహతాయ ఫట్, ఫట్, ఓం సద్యోజాతాయ భవే భవే నాతిభవే భావస్య మాం భవేద్భవాయ శివమూర్తయే నమః, ఓం హంస శిఖాయ విద్యాదేహాయ ఆత్మస్వరూపాయ పరంపరాయ శివాయ శివతమాయ నమః ఇవి శివాంగమంత్రాలు. ఈయన మూర్తిమంత్రం అట్లే విద్యామంత్రంగా చెప్పడం జరిగింది. విద్యాంగ సహితమైన బ్రహ్మాంగంయొక్క మూర్తి శివశాస్త్రంలో ఉన్నట్లుగా తెలియాలి. ఓ సువ్రతుడా! సర్వవేదసారం సూర్యసంబంధమైన వాష్కలాదులగూర్చి అంగమంత్రాలగూర్చి నేను చెబుతున్నాను.

**నవాక్షరమయం మంత్రం వాష్కలం పరికీర్తితమ్ ।**
**న క్షరతీతి లోకేఽస్మింస్తతో హ్యక్షరముచ్యతే ।**
**సత్యమక్షరమిత్యుక్తం ప్రణవాదినమోఽంతకమ్ ॥20॥**

**ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ।**
**ధియో యో నః ప్రచోదయాత్ ।**
**నమః సూర్యాయ ఖఖోల్కాయ నమః ॥21॥**

**మూలమంత్రమితి ప్రోక్తం భాస్కరస్య మహాత్మనః ।**
**నవాక్షరేణ దీప్తాద్యా మూలమంత్రేణ భాస్కరమ్ ॥22॥**

**పూజయేదంగమంత్రాణి కథయామి సమాసతః ।**
**వేదాదిభిః ప్రభూతాద్యం ప్రణవేన తు మధ్యమమ్ ॥23॥**

**ఓం భూః బ్రహ్మణే హృదయాయ నమః ఓం భవః విష్ణవే శిరసే నమః । ఓం స్వః రుద్రాయ శిఖాయై నమః ఓం భూర్భువః స్వః జ్వాలామాలిన్యై దేవాయ నమః ఓం మహః మహేశ్వరాయ కవచాయ నమః ఓం జనః శివాయ నేత్రేభ్యో నమః ఓం తపస్తపనాయ అస్త్రాయ నమః । ఏవం ప్రసంగాదేవేహ సౌరాణి కథితాని హ । శైవాని చ సమాసేన న్యాసయోగేన సువ్రత ॥24॥**

"ఓం భూః ఓం భుః ఓం స్వః ఓం మహః ఓం జనః ఓం తపః ఓం సత్యమ్ ఓం ఋతమ్ ఓం బ్రహ్మ' ఇది నవాక్షరవాష్కల మంత్రం. ఇది నశించదు. అందుచే దీనిని లోకంలో అక్షరం అంటున్నారు. ఆదిలో ఓంకారం చివరలో 'నమ' తో కూడిన ఈ మంత్రం సత్యం అట్లే అక్షరం అనబడింది. "ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్ నమః సూర్యాయ ఖఖోల్కాయ నమః" ఇది మహాత్ముడు భాస్కరుడియొక్క మూలమంత్రం. నవాక్షరమంత్రంతో దీప్తా మొదలైన శక్తుల్ని, మూలమంత్రంతో భాస్కరుడిని పూజించాలి. ఇపుడు సంగ్రహంగా అంగమంత్రాన్ని గూర్చి చెబుతున్నాను. అంగమంత్రాలు ఆదిలో ప్రణవంతో,

మధ్యలో వ్యాహృతులతో కూడి ఉంటాయి. ఓం భూః బ్రహ్మణే హృదయాయ నమః, ఓం భువః విష్ణవే శిరసే నమః, ఓం స్వః, ఓం మహః మహేశ్వరాయ కవచాయ నమః ఓం జనః శివాయ నేత్రేభ్యో నమః। ఓం మహః మహేశ్వరాయ కవచాయ నమః, ఓం జనః శివాయ నేత్రేభ్యో నమః, ఓం తపస్తపనాయ అస్త్రాయ నమః, ఓ సువ్రతా! ఈ విధంగా నేను ప్రసంగవశంగా సంక్షిప్తంగా న్యాసయోగంతో సౌర, శివమంత్రాలగూర్చి చెప్పాను.

**ఇత్థం మంత్రమయం దేవం పూజయేద్ హృదయాంబుజే ।**
**నాభౌ హోమం తు కర్తవ్యం జనయిత్వా యథాక్రమమ్ ॥25॥**
**మనసా సర్వకార్యాణి శివాగ్నౌ దేవమీశ్వరమ్ ।**
**పంచబ్రహ్మాంగ సంభూతం శివమూర్తిం సదాశివమ్ ॥26॥**
**రక్తపద్మాసనాసీనం శకలీకృత్య యత్నతః ।**
**మూలేన మూర్తిమంత్రేణ బ్రహ్మాంగాద్యైస్తు సువ్రత ॥27॥**
**సమిదాజ్యాహుతీర్హుత్వా మనసా చంద్రమండలాత్ ।**
**చంద్రస్థానాత్సముత్పన్నాం పూర్ణధారామనుస్మరేత్ ॥28॥**
**పూర్ణాహుతివిధానేన జ్ఞానినాం శివశాసనే ।**

ఈ విధంగా హృదయకమలంలో మంత్రమయుడైన భగవాన్ శివుడికి పూజ చేసి, అట్లే నాభిస్థానంలో యథావిధిగా అగ్నిని ఉత్పన్నం చేసి హోమం చేయాలి. అన్ని కార్యాలు మనసు ద్వారా సంపన్నం చేయాలి. రక్త కమలాసనంపై కూర్చుండి పంచబ్రహ్మాంగసంభూత కళ్యాణమూర్తి అయిన శివభగవానుడిని శకలీకరించి ప్రయత్నపూర్వకంగా మూలమంత్రంతో, మూర్తిమంత్రంతో, బ్రహ్మమంత్రంతో మరియు అంగమంత్రాలతో శివాగ్నిలో మనసుతో సమిధలు మరియు ఘృతంతో ఆహుతి ఇచ్చి జ్ఞానులకోసం శివశాస్త్రంలో ఏమి చెప్పబడిందో అట్లే చంద్రమండలంలో చంద్రస్థానంలో ఉత్పన్నమైన అమృతధారను పూర్ణాహుతి విధానంగా స్మరించాలి.

**శివం వక్త్రగతం ధ్యాయేత్తేజోమాత్రం చ శాంకరమ్ ॥29॥**
**లలాటే దేవదేవేశం భ్రూమధ్యే వా స్మరేత్పునః ।**
**యచ్చ హృత్కమలే సర్వం సమాప్య విధివిస్తరమ్ ॥30॥**
**శుద్ధదీపశిఖాకారం భావయేద్భవనాశనమ్ ।**
**లింగే చ పూజయేద్దేవం స్థండిలే వా సదాశివమ్ ॥31॥**

కళ్యాణకారి, తేజోమయుడు అయిన శివుడు నా ముఖంలో ప్రవేశించాడు అని ధ్యానం చేయాలి. లలాటంలోగాని లేకుంటే భూమధ్యస్థానంలో ఆ దేవదేవేశుడు శివుడిని స్మరించాలి. ఈ విధంగా విధిపూర్వకంగా సమస్తకార్యాలు సంపన్నం చేసుకుని తన హృదయకమలంలో శుద్ధదీపశిఖ ఆకారంగల భవబంధనాశకుడు శివుడిని భావించాలి. శివలింగాన్ని గాని స్థండిలమందు ప్రభువైన సదాశివుడినిగాని పూజించాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే శివార్చనవిధి వర్ణనం నామ త్రయోవింశతితమోఽధ్యాయః ॥23॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని 'శివార్చనవిధి' వర్ణన అనే పేరుగల ఇరవై మూడవ అధ్యాయం సమాప్తం.

## చతుర్వింశోఽధ్యాయః - ఇరవైనాల్గవ అధ్యాయం

## లింగార్చనవిధానమ్ - లింగార్చనవిధానం

**శైలాదిరువాచ** - నందీశ్వరుడు పలికాడు.

**వ్యాఖ్యాం పూజావిధానస్య ప్రవదామి సమాసతః ।**
**శివశాస్త్రోక్తమార్గేణ శివేన కథితం పురా ॥1॥**

ఓ సనత్కుమారా! నేను పూర్వం శివశాస్త్రంలో శివుడు చెప్పిన రీతిలో శివపూజావిధిని సంగ్రహంగా చెబుతున్నాను.

**అథోభౌ చందనచర్చితౌ హస్తౌ వౌషడం తేనాద్యంజలిం కృత్వా, మూర్తి విద్యా శివాదీని జప్త్వా, అంగుష్ఠాది కనిష్ఠికాంత ఈశానాద్యం కనిష్ఠికాది మధ్యమాంతం హృదయాది తృతీయాంతం తురీయమంగుష్ఠేనానామికయా పంచమం తలద్వయేన షష్ఠం తర్జన్యంగుష్ఠాభ్యాం నారాచాస్త్రప్రయోగేణ పునరపి మూలం జప్త్వా తురీయేనావగుంఠ్య శివహస్తమిత్యుచ్యతే ॥2॥**

**శివార్చనా తేన హస్తేన కార్యా ॥3॥**

శివస్నానం మరియు భస్మస్నానం తర్వాత రెండు చేతులకు చందనాన్ని అలముకుని అంతంలో 'వౌషట్'తో కూడిన మూలమంత్రంతో అంజలి ఘటించి మూర్తి, విద్య మరియు అంగమంత్రాల్ని జపించి, అంగుష్ఠంతో కనిష్ఠికాపర్యంతం ఈశానాది అయిదు మంత్రాల్ని న్యాసం చేయాలి. ఆ న్యాసక్రమం ఇది. పూర్వం చెప్పిన అంగమంత్రాలలో సద్యోజాతాన్ని గ్రహించి మూడోది అయిన అఘోరమంత్రాన్ని కనిష్ఠికమీద, తర్జని మరియు మధ్య వ్రేలుపై న్యాసం చేయాలి. నాల్గో మంత్రాన్ని (తత్పురుషమంత్రం) అంగుష్ఠంమీద, ఆరోమంత్రాన్ని అనామిక మీద మరియు ఆరోమంత్రాన్ని రెండు చేతుల్ని రెండు తలాలమీద న్యాసం చేయాలి. తర్వాత తర్జని అంగుష్ఠాల యోగంతో 'నారాచాస్త్ర' ముద్రను నిర్మించాలి. తిరిగి మూలమంత్రాన్ని (తత్పురుషమంత్రం) అంగుష్ఠంమీద, ఆరోమంత్రాన్ని జపించి నాల్గోమంత్రంతో అవగుంఠనం చేయాలి. దీనినే శివహస్తం అంటున్నారు. అటువంటి హస్తంతో శివపూజ చేయాలి.

**తత్త్వగతమాత్మానం వ్యవస్థాప్య తత్త్వశుద్ధిం పూర్వవత్ ॥4॥**
**క్ష్మాంభోగ్నివాయువ్యోమాంతం పంచచతుఃశుద్ధకోట్యంతే ।**
**ధారాసహితేన వ్యవస్థాప్య తత్త్వశుద్ధిం పూర్వం కుర్యాత్ ॥5॥**

తత్త్వాలలో కన్పిస్తున్న ఆత్మను వ్యవస్థిత పర్చుకుని పూర్వం మాదిరిగానే తత్త్వశుద్ధి చేసుకోవాలి. పృథ్వి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం-వీటి పర్యంతం పంచకోశాల్ని అతిక్రమించి అహంకారం, మహత్తత్త్వం, ప్రకృతి, బ్రహ్మ-వీటినికూడా ఉల్లంఘించి శుద్ధికోటికి (బ్రహ్మ) సమీపంలోని అమృతధారాసహితమైన 'సుషుమ్నా' మార్గంలో తన ఆత్మను స్థాపించుకుని సర్వ ప్రథమమైన తత్త్వశుద్ధిని నిర్వహించాలి.

**తత్త్వశుద్ధిః షష్ఠేన సద్యేన తృతీయేన ఫడంతాద్ధరాశుద్ధిః ॥6॥**
**షష్ఠసహితేన సద్యేన తృతీయేన ఫడంతేన వారితత్త్వశుద్ధిః ॥7॥**

**వాహ్నేయ తృతీయేన ఫడంతేనాగ్నిశుద్ధిః ॥8॥**

**వాయవ్యచతుర్థేన షష్ఠసహితేన ఫడంతేన వాయుశుద్ధిః ॥9॥**

**షష్ఠేన ససద్యేన తృతీయేన ఫడంతేనాకాశశుద్ధిః ॥10॥**

తత్త్వశుద్ధి ఈ విధంగా ఉన్నది. అంతంలో 'ఫట్' తో కూడిన ఆరో (నమో హిరణ్యబాహవే) మంత్రంతో, సద్యోజాతమంత్రంతో, మూడోదైన అఘోరమంత్రంతో పృథివీ తత్త్వం శుద్ధి అవుతున్నది. 'ఫట్' అంతమైన ఆరో మంత్రంతో కూడిన సద్యోజాత మంత్రంతో మరియు మూడోదైన అఘోరమంత్రంతో జలతత్త్వం శుద్ధి చెందుతున్నది. 'ఫట్' అంతమైన అగ్ని సంబంధమైన మూడో అఘోరమంత్రంతో అగ్ని తత్త్వం శుద్ధి పొందుతున్నది. 'ఫట్' అంతమైన ఆరో మంత్రంతో కూడిన వాయుసంబంధమైన నాల్గో తత్పురుష మంత్రంతో వాయుతత్త్వం శుద్ధి చెందుతున్నది. 'ఫట్' అంత సద్యోజాతసహితమైన ఆరో మంత్రంతో మరియు మూడోదైన అఘోరమంత్రంతో ఆకాశతత్త్వం శుద్ధి చెందుతున్నది.

**ఉపసంహృత్యైవం సద్యషష్ఠేన తృతీయేన మూలేన ఫడంతే తాడనం ।**
**తృతీయేన సంపుటీకృత్య గ్రహణం మూలమేవ యోనిబీజేన సంపుటీకృత్వా బంధనం బంధః ॥11॥**

ఈ విధంగా పూర్వోక్తమైన తత్త్వశుద్ధిని ఉపసంహరించి సద్యోజాతమంత్రంతో పాటు ఆరోది అయిన "నమో హిరణ్యబాహవే" మరియు మూడోది అయిన "అఘోరేభ్యో" మంత్రంతోపాటు 'ఫట్' అంతమైన మూల మంత్రంతో (పంచాక్షరి) తాడనం చేయాలి. తృతీయమైన (అఘోరేభ్యో) మంత్రంతో సంపుటితమైన మూలమంత్రం ద్వారా గ్రహించాలి. యోని (హీం) బీజంద్వారా సంపుటితమైన మూలమంత్రంతో దిగ్బంధం చేయాలి.

**ఏవం క్షాంతాతీతాదినివృత్తిపర్యంతం పూర్వవత్కృత్వా ప్రణవేన ।**
**తత్త్వత్రయకమనుధ్యాయ ఆత్మానం దీపశిఖాకారం పుర్యష్టకసహితం ।**
**త్రయాతీతం శక్తిక్షోభేణామృతధారాం సుషుమ్ణాయాం ధ్యాత్వా ॥12॥**

**శాంత్యతీతాది నివృత్తి పర్యంతానాం చాంతర్నాదబింద్వాకారో కారమకారాంతం శివం సదాశివం రుద్రవిష్ణు బ్రహ్మాంతం సృష్టిక్రమేణామృతీకరణం బ్రహ్మన్యాసం కృత్వా పంచవక్త్రేషు పంచదశనయనం విన్యస్యమూలేన పాదాదికేశాంతం మహాముద్రామపిబద్ధ్వా శివోఽహమితి ధ్యాత్వా శక్త్యాదీని విన్యస్య హృది శక్త్యా బీజాంకురా నంతరాత్ససుషిరసూత్రకంటకపత్రకేసరధర్మజ్ఞానవైరాగ్యైశ్వర్యసూర్యసోమాగ్నివామాఽజ్యేష్ఠాఽరౌద్రీకాళీఽకలఽ వికరణీబలవికరణీబలప్రథనీసర్వభూతదమనీః కేసరేషు కర్ణికాయాం మనోన్మనీమపి ధ్యాత్వా ॥13॥**

ఇరవై ఒకటవ అధ్యాయంలో చెప్పిన క్షాంతాతీతాదుల నుంచి నివృత్తికళ వరకు గల విధానమంతా పూర్తి చేసి ప్రణవం ద్వారా బ్రహ్మవిష్ణురుద్రరూపమైన దీపశిఖాకారమైన ఆత్మను ధ్యానం చేసి, శుద్ధ చైతన్యరూపమైన మూలాధారాదిపుర్యష్టకంతో త్రయాతీతమైన (విశ్వతైజసం, ప్రజ్ఞ మొదలైన వాటికన్నా పరమైన) స్వయం కుండలినీ ప్రబోధం కలుగగా సుషమ్నలోగల అమృతధారారూపాన్ని ధ్యానం చేయాలి. ఈ విధంగా నాదం, బిందువు, అకారం, ఉకారం అట్లే మకారం అంతం అవుతున్నాయి. రుద్రుడు, విష్ణువు, అట్లే బ్రహ్మకన్నా అతీతులు. కళ్యాణకారుడైన సదాశివుడియొక్క శాంత్యాతీతాదులతో నివృత్తిపర్యంతం పంచకళల్ని ధ్యానించి, సృష్టిక్రమంలో అమృతీకరణం అట్లే బ్రహ్మన్యాసకరణం ఆయనయొక్క ఐదుముఖాలలో పదిహేను నేత్రాల్ని న్యాసం చేసి మూలమంత్రం ద్వారా పాదంనుంచి కేశాల వరకూ న్యాసం చేసి మహాముద్రను నిర్మించి "నేను శివుడిని" అని

ధ్యానం చేయాలి. తిరిగి శక్తి మొదలైన వాటిని న్యాసం చేసి హృదయాకాశంలో శక్తితోపాటు బీజం, అంకురం, వ్యవధానంలేని ఛిద్రం, సూత్రం, కంటకం, పత్రం, కేసరం మరియు కర్ణికాయుక్తమైన కమలాన్ని ధ్యానించి, దానితో ధర్మం, జ్ఞానం, వైరాగ్యం, ఐశ్వర్యం, సూర్యుడు, చంద్రుడు, అగ్ని వీటిని కమలం కేసరాలతో వామ, జ్యేష్ఠ, రౌద్రి, కాళి, కలవికరణి, బలవికరిణి, బలప్రమథని మరియు సర్వభూతదమని వీరిని దాని కర్ణికలో మనోన్మనీశక్తిని ధ్యానం చేయాలి.

**ఆసనం పరికల్ప్యైవం సర్వోపచారసహితం బహిర్యోగాపచారేణాంతఃకరణం కృత్వా నాభౌ వహ్నికుండే పూర్వవదాసనం పరికల్ప్య సదాశిం ధ్యాత్వా బిందుతోஉమృతధారాం శివమండలే నిపతితాం ధ్యాత్వా లలాటే మహేశ్వరం దీపశిఖాకారం ధ్యాత్వా ఆత్మశుద్ధిరిత్థం ప్రాణాపానౌ సంయమ్య సుషుమ్ణయా వాయుం వ్యవస్థాప్య షష్ఠేన తాలుముద్రాం కృత్వా దిగ్బంధం కృత్వా షష్ఠేన స్థానశుద్ధిర్వస్త్రాదిపూతాంతరర్ఘ్యపాత్రాదిషు ప్రణవేన తత్త్వత్రయం విన్యస్య తదుపరి బిందుం ధ్యాత్వా త్వంభసా విపూర్యద్రవ్యాణి చ విధాయ అమృతప్లావనం కృత్వా పాద్యపాత్రాదిషు తేషామర్ఘ్యవదాసనం పరికల్ప్య సంహితయాభిమంత్ర్యాద్యేనాభ్యర్చ్య ద్వితీయేనామృతీకృత్వా తృతీయేన విశోధ్య చతుర్థేనావగుంఠ్య పంచమేనావలోక్య షష్ఠేన రక్షాం విధాయ చతుర్థేన కుశపుంజేనార్ఘ్యాంభసాభ్యుక్ష్య ఆత్మానామపి ద్రవ్యాణి పునరర్ఘ్యాంభసాభ్యుక్ష్య సపుష్పేణ సర్వద్రవ్యాణి పృథక్ పృథక్ శోధయేత్ ॥14॥**

బహిర్యోగం యొక్క ఉపచారాలతో అంతఃకరణసామాగ్రిని ప్రోదికూర్చుకుని పూర్వం చెప్పినట్లుగా సమస్తోపచారాలతో కూడిన ఆసనాన్ని కల్పించి నాభిలో వహ్నికుండం మధ్యలో పూర్వం మాదిరిగానే ఆసనాన్ని పరికల్పించి, దానిమీద సదాశివుడున్నట్లు భావించి, లలాటంతో దీపశిఖ ఆకారంగల మహేశ్వరుడిని ధ్యానించి బుద్ధితో శివమండలంలో తిరుగుతూన్న అమృతధారను ధ్యానించాలి. దాంతో ఆత్మశుద్ధి కలుగుతుంది. ప్రాణవాయువును, అపానవాయువును బాగా నియమించి సుషుమ్నానాడిద్వారా వాయువును వ్యవస్థితపర్చి ఆరో మంత్రంతో ఖేచరీముద్రను ఏర్పరచి, ఆరోమంత్రంతోనే దిగ్బంధం చేయాలి. దీంతో శారీరకశుద్ధి జరుగుతుంది. తర్వాత వస్త్రాదులతో బాగా తుడిచి ప్రవిత్రం చేసిన అర్ఘ్యపాత్రాదులతో ప్రణవం ద్వారా తత్త్వత్రయాన్ని న్యాసం చేసి, దానిపైన బిందువులు ధ్యానించి, జలంతో నింపి, పూజాద్రవ్యాలతో సిద్ధపరిచి, అమృతప్లావనం చేసి, పాద్యమంత్రాలతో తత్త్వాదులకై అర్ఘ్యం మాదిరిగా ఆసనాన్ని ఏర్పరచాలి. అనంతరం సంహితామంత్రంతో అభిమంత్రించి, ప్రథమమంత్రంతో ఆయన్ని అర్చించడం, ద్వితీయమంత్రంతో అమృతీకరణం, తృతీయమంత్రంతో విశోధనం, చతుర్థమంత్రంతో అవగుంఠనం, పంచమమంత్రంతో అవలోకనం మరియు ఆరోమంత్రంతో రక్షావిధి చేయాలి. తర్వాత చతుర్థమంత్రంతో దర్భలకుంచతో తనమీద, అట్లే ద్రవ్యాలపైన అర్ఘ్యజలాన్ని చల్లి, మరల పుష్పయుక్తమైన అర్ఘ్యజలంతో ద్రవ్యాలమీద వేరువేరుగా సంప్రోక్షించాలి.

**సద్యేన గంధం వామేన వస్త్రం అఘోరేణ ఆభరణం పురుషేణ నైవేద్యమ్ ।**
**ఈశానేన పుష్పాణి అథాభిమంత్రయేత్ ॥ 15॥**

**శివగాయత్ర్యా శేషం ప్రోక్షయేత్ ॥16॥**

**పంచామృతపంచగవ్యాదీని బ్రహ్మాంగమూలాద్యైరభిమంత్రయేత్ ॥17॥**

**పృథక్ పృథక్ మూలేనార్ఘ్యం ధూపం దత్త్వాచమనీయం చ తేషామపి ।**
**ధేనుముద్రాం చ దర్శయిత్వా కవచేనావగుంఠ్యాస్త్రేణ రక్షాం చ విధాయ ద్రవ్యశుద్ధిం కుర్యాత్ ॥18॥**

అనంతరం సద్యోజాతమంత్రంతో గంధాన్ని, వామ దేవమంత్రంతో వస్త్రాన్ని, అఘోరమంత్రంతో ఆభరణాల్ని, తత్పురుషమంత్రంతో నైవేద్యాన్ని మరియు ఈశాన్యమంత్రంతో పుష్పాల్ని అభిమంత్రించాలి. శివగాయత్రితో మిగిలిన అన్ని ద్రవ్యాల్ని సంప్రోక్షించాలి. పంచామృతం, పంచగవ్యం మొదలైన పదార్థాల్ని బ్రహ్మమంత్రం, అంగమంత్రం మూలమంత్రం మొదలైన వాటితో అభిమంత్రించాలి. మరల వేరువేరుగా గంధాదిపూజోపచారాల్ని, మూలమంత్రంద్వారా అర్ఘ్యం, ధూపం, ఆచమనీయాదుల్ని అర్పించి, వాటికి ధేనుముద్రను చూపి, కవచంతో అవగుంఠనం చేసి, అస్త్రమంత్రంతో రక్షావిధిని కల్పించి ద్రవ్యశుద్ధి చేయాలి.

**అర్ఘ్యోదకమగ్రే హృదా గంధమాదాయ ద్రవ్యాణి విశోధ్య పూజాప్రభృతికరణం రక్షాంతం కృత్వైవం ద్రవ్యశుద్ధిం పూజాసమర్పణాంతం మౌనమాస్థాయ పుష్పాంజలిం దత్త్వా సర్వమంత్రాణి ప్రణవాది నమోంతాజ్జపిత్వా పుష్పాంజలిం త్యజేన్మంత్రశుద్ధిరిత్థమ్ ॥19॥**

మొట్టమొదటిగా హృదయమంత్రం ద్వారా అర్ఘ్యజలంతో కూడిన గంధం తీసుకుని అస్త్రమంత్రంతో శోధించి పూజోపయోగమైన సాధనాల్ని సంప్రోక్షణవల్ల గ్రహించి (భూతాపసారణం, దిగ్రక్షణాదులు) రక్షణవిధి పూర్తిచేసి ద్రవ్యశుద్ధి చేయాలి. పూజాసమర్పణ పూర్తి అయ్యేవరకు మౌనాన్ని పాటించి చివరకు పుష్పాంజలి పట్టి ఆదిలో ఓంకారం చివరలో నమః తో కూడిన అన్ని పూజామంత్రాలతో జపం చేసి పుష్పాంజలి సమర్పించాలి. ఈ విధంగా మంత్రశుద్ధి జరుగుతున్నది.

**అగ్రే సామాన్యార్ఘ్య పాత్రం పయసాపూర్య గంధపుష్పాదినా సంహితయాభిమంత్ర్య ధేనుముద్రాం దత్త్వా కవచేనావగుంత్యాస్త్రేణ రక్షయేత్। పూజాం పర్యుషితాం గాయత్ర్యా సమభ్యర్చ్య సామాన్యార్ఘ్యం దత్త్వా గంధపుష్పధూపా చమనీయం స్వధాంతం నమోఽంతం వా దత్త్వా బ్రహ్మభిః పృథక్ పృథక్ పుష్పాంజలిం దత్త్వా షడంతాస్త్రేణ నిర్మాల్యం వ్యపోహ్య ఈశాన్యాం చండమర్భ్యాసనమూర్తిం చండం సామాన్యాస్త్రేణ లింగపీఠం శివం పాశుపతాస్త్రేణ విశోధ్య మూర్ధ్ని పుష్పం నిధాయ పూజయేల్లింగశుద్ధిః ॥20॥**

తనముందు సామాన్యమైన అర్ఘ్యపాత్రని జలంతో నింపి దానిలో గంధం పుష్పాదుల్ని వేసి సంహితామంత్రంతో దాన్ని అభిమంత్రించి, ధేనుముద్రను చూపి, కవచంతో అవగుంఠనపర్చి అస్త్రమంత్రంతో రక్షణ కల్పించాలి. ముందురోజు పూజించిన శివలింగాన్ని గాయత్రితో అర్చించి సామాన్యమైన అర్ఘ్యాన్ని ఇచ్చి "స్వధా" లేక "నమః" అంతమందు చేర్చి గంధం, పుష్పం, ధూపం, ఆచమనీయం మొదలైన ఉపచారాల్ని అర్పించి బ్రహ్మమంత్రాలతో వేరువేరుగా తొలగించి ఈశాన్యదిశలో చండకాన్ని అభ్యర్చించి ఆసనమూర్తిం చండకాసామాన్యమైన అస్త్రమంత్రంతో మరియు లింగపీఠాన్ని (యోని) అట్లే శివలింగాన్ని పాశుపతాస్త్రమంత్రంతో శోధించి లింగం పై భాగాన పుష్పాలు ఉంచి పూజించాలి. ఈ విధంగా లింగశుద్ధి అవుతుంది.

**ఆసనం కూర్మశిలాయాం బీజాంకురం తదుపరి బ్రహ్మశిలాయామనంతనాల సుషిరే సూత్రపత్రకంటక కర్ణికాకేసర ధర్మజ్ఞానవైరాగ్యైశ్వర్య సూర్యసోమాగ్నికేసర శక్తిం మనోన్మనీం కర్ణికాయాం మనోన్మనేనానంతాసనాయేతి సమాసేనాసనం పరికల్ప్య తదుపరి నివృత్త్యాది కలామయం షడ్విధసహితం కర్మకలాంగదేహం సదాశివంభావయేత్ ॥21॥**

తర్వాత కూర్మపుష్పాసనం దానిపైన బీజాంకురం, మరల దానిపైన బ్రహ్మశిల, దానిమీద రంధ్రంగల అనంతనాళానికి భీతరసూత్రం, దళం, కంటకం, కర్ణిక, కేసరం, ధర్మం, జ్ఞానం, వైరాగ్యం, ఐశ్వర్యం, సూర్యుడు,

చంద్రుడు, అగ్ని, వామం మొదలైన ఎనిమిది శక్తుల్ని మరియు కర్ణికలో మనోన్మనసహితమైన మనోన్మనిని ధ్యానించాలి. మరల "అనంతాసనాయ నమః"అనే మంత్రంతో చిన్న ఆసనాన్ని కల్పించి, దానిమీద నివృత్తి మొదలైన కళాయుక్తమైన షట్కోశసహితవేదమూర్తి సదాశివుడి చింతన చేయాలి.

**ఉభాభ్యాం సపుష్పాభ్యాం హస్తాభ్యామంగుష్ఠేన పుష్పమాపీడ్య ఆవాహనముద్రయా శనైః శనైః హృదయాది మస్తకాంతమారోప్య హృదా సహ మూలం ప్లుతముచ్చార్య సద్యేన బిందుస్థానాదభ్యధికం దీపశిఖాకారం సర్వతోముఖ హస్తం వ్యాప్యవ్యాపకమావాహ్య స్థాపయేత్ ॥22॥**

అనంతరం రెండు చేతులతో పుష్పాల్ని గ్రహించి, అంగుష్ఠంతో పుష్పాల్ని నొక్కిపట్టి, ఆవాహనముద్ర ద్వారా నెమ్మదిగా నెమ్మదిగా హృదయం నుంచి మస్తకం వరకు ఆరోపణ చేసి, హృదయమంత్రసహితమైన మూలమంత్రాన్ని ఉచ్చస్వరంతో ఉచ్చరించి, బిందుస్థానంలో అధికదీపశిఖాకారాన్ని దర్శించి అన్ని వైపుల ముఖాన్ని, చేతుల్ని సారించి సర్వవ్యాపకుడైన పరమేశ్వరుడిని సద్యోజాతమంత్రంతో ఆహ్వానించి స్థాపించాలి.

**పూర్వహృదా శివశక్తి సమవాయేన పరమీకరణమమృతీకరణం హృదయాదిమూలేన సద్యేనావాహనం హృదా మూలోపరి వామేన స్థాపనం హృదా మూలోపరి అఘోరేణ సన్నిరోధం హృదా మూలోపరి పురుషేణ సాన్నిధ్యం హృదా మూలేన ఈశానేన పూజయేదితి ఉపదేశః ॥23॥**

**పంచమంత్రసహితేన యథాపూర్వమాత్మనో దేహనిర్మాణం తథా దేవస్యాపి వహ్నేశ్చైవముపదేశః ॥24॥**

ముందుగా హృదయమంత్రంతో శివశక్తిని తాదాత్మ్యంతో ఏకీకరణం చేసి అట్లే అమృతీకరణం చేయాలి. మరల హృదయమంత్రపూర్వకంగా మూలమంత్రసహితమైన సద్యోజాతమంత్రంతో ఆవాహనచేసి, హృదయమంత్రం అట్లే మూలమంత్రయుక్తమైన వామదేవమంత్రంతో స్థాపించి, ఈ విధంగా హృదయమంత్రం అలాగే మూలమంత్ర సహితమైన అఘోరమంత్రంతో సన్నిరోధన చేయాలి. తర్వాత హృదయమంత్రం అట్లే మూలమంత్ర సహితతత్పురుషమంత్రం ద్వారా సాన్నిధ్యాన్ని కల్పించాలి. తదనంతరం హృదయమంత్రం మరియు మూలమంత్ర యుక్తమైన ఈశానమంత్రంతో పూజ చేయాలి. ఇది ఉపదేశం. ముందుగా ఈవిధంగా ఐదుమంత్రాలతో భక్తుడు తన దేహనిర్మాణం చేయాలి. ఈ విధంగా దేవతలయొక్క అగ్నియొక్క దేహనిర్మాణం చేయాలి. ఇది ఉపదేశం.

**రూపకధ్యానం కృత్వా మూలేన నమస్కారాంతమాపాద్య స్వధాంతమాచమనీయం సర్వం నమస్కారాంతం వా స్వాహాకారాంతమర్ఘ్యం మూలేన పుష్పాంజలిం వౌషడంతేన సర్వం నమస్కారాంతం హృదా వా ఈశానేన వా రుద్రగాయత్ర్యా "ఓం నమః శివాయేతి" మూలమంత్రేణ వా పూజయేత్ ॥25॥**

మూలమంత్రాన్ని (ఓం నమః శివాయ) నమస్కారాంతం వరకు ఉచ్చరించి సదాశివుడి ప్రతిబింబాన్ని ధ్యానించి, ఆచమనీయం ఇచ్చే సమయంలో మంత్రాన్ని స్వధాంతంగాని, లేకుంటే నమస్కారాంతంగాని ఉచ్చరించాలి. అర్ఘ్యదానంలో మూలమంత్రాన్ని స్వాహాంతం పలకాలి. పుష్పాంజలిని వౌషట్‌యుక్తమూలమంత్రంతో లేకుంటే సర్వత్రనమస్కారాంతహృదయమంత్రంతో, ఈశానమంత్రంతో, రుద్రగాయత్రితో లేకుంటే "ఓం నమః శివాయ" అనే మూలమంత్రంతో పూజ చేయాలి.

**పుష్పాంజలిం దత్త్వా పునరర్ఘ్యాపాచమనీయం షష్ఠేన పుష్పావసరణం విసర్జనం మంత్రోదకేన మూలేన సంస్నాప్య సర్వద్రవ్యాభిషేకమీశానేన ప్రతిద్రవ్యమష్టపుష్పం దత్త్వైవమర్ఘ్యం చ గంధంపుష్పధూపాచమనీయం షడంతాస్త్రేణ పూజాపసరణం శుద్ధోదకేన మూలేన సంస్నాప్య పిష్టామలకాదిభిః ॥26॥**

అనంతరం పుష్పాంజలి సమర్పించి ధూపం అట్లే ఆచమనీయం అర్పించాలి. ఆ తర్వాత ఆరోమంత్రంతో పుష్పాల్ని తొలగించి పూజను విసర్జించి మూలమంత్రం ద్వారా శుద్ధజలంతో పంచామృతం మొదలైన ద్రవ్యాలతో స్నానం చేయించాలి. ప్రత్యేకద్రవ్యంతో స్నానంలో ఈశానమంత్రంతో ఎనిమిది ఎనిమిది సార్లు పుష్పాంజలి సమర్పించి అర్ఘ్యం, గంధం, పుష్పం, ధూపం, ఆచమనీయం మొదలైనవాటిని అర్పణ చేయాలి. మరల 'ఫట్' అంతమైన అస్త్రమంత్రంతో పూజాద్రవ్యాల్ని శివలింగం నుంచి తొలగించి, ఉసిరికపొడి మొదలైనవాటితో కూడిన శుద్ధజలంతో మూలమంత్రంద్వారా స్నానం చేయించాలి.

**ఉష్ణోదకేన హరిద్రాద్యేన లింగమూర్తిం పీఠసహితాం విశోధ్య గంధోదకహిరణ్యోదకమంత్రోదకేన రుద్రాధ్యాయం పఠమానః నీలరుద్రత్వరితరుద్రపంచబ్రహ్మాదిభిః నమః శివాయేతి స్నాపయేత్ ॥27॥**

తరువాత హరిద్రాదిసుగంధద్రవ్య చూర్ణంతో కూడిన వేడినీటితో పీఠసహితమైన శివలింగాన్ని శుద్ధి చేసి, గంధం, బంగారంతో కలిపిన అభిమంత్రించిన జలంద్వారా రుద్రాధ్యాయాన్ని పఠిస్తూ ఇలా "నీలరుద్ర, త్వరితరుద్ర, పంచబ్రహ్మ" అట్లే "నమః శివాయ" ఈ మంత్రాలతో స్నానం చేయించాలి.

**మూర్ధ్ని పుష్పంనిధాయైవం న శూన్యం లింగమస్తకం కుర్యాదత్ర శ్లోకః ॥28॥**

**యస్య రాష్ట్రే తు లింగస్య మస్తకం శూన్యలక్షణమ్ ।**
**తస్యాలక్ష్మీర్మహారోగో దుర్భిక్షం వాహనక్షయః ॥29॥**

**తస్మాత్పరిహరేద్రాజా ధర్మకామార్థముక్తయే ।**
**శూన్యే లింగే స్వయం రాజా రాష్ట్రం చైవ ప్రణశ్యతి ॥30॥**

శివలింగం మస్తకం మీద పుష్పాల్ని ఉంచి మాత్రమే అభిషేకం చేయాలి. లింగం మస్తకం శూన్యంగా ఉండరాదు. ఈ సంబంధంగా ఈ శ్లోకం (మాట) ఉంది. ఏ రాజు యొక్క రాష్ట్రంలో లింగం శిరసు బిల్వపత్ర పుష్పశూన్యంగా ఉంటుందో ఆ రాజు రాష్ట్రంలో అలక్ష్మి, మహారోగాలు, దుర్భిక్షం అట్లే వాహనక్షయం జరుగుతుంది. అందుచేత ధర్మార్థకామమోక్షాలైన చతుర్విధపురుషార్థప్రాప్తికై యత్నించే రాజు శివలింగమస్తకాన్ని శూన్యంగా ఉంచరాదు. లింగం శూన్యంగా ఉంటే స్వయంగా రాజు, అట్లే ఆతడి రాష్ట్రం రెండూ కూడా నష్టాన్ని పొందుతున్నాయి.

**ఏవం సుస్నాప్యార్ఘ్యం చ దత్త్వా సమృజ్య వస్త్రేణ ।**
**గంధపుష్పవస్త్రాలంకారాదీంశ్చ మూలేన దద్యాత్॥31॥**

ఈ విధంగా బాగా స్నానం చేయించి అర్ఘ్యాన్ని ఇచ్చి, వస్త్రంతో మిక్కిలిగా చుట్టి అలంకరించి మూలమంత్రం ద్వారా గంధం, పుష్పం, వస్త్రం, అలంకారం, ధూపం, ఆచమనీయం, దీపం, నైవేద్యం, మొదలైనవి సమర్పించాలి.

**ధూపాచమనీయదీపనైవేద్యాదీంశ్చ మూలేన ప్రధానేనోపరి పూజనం పవిత్రకరణమిత్యుక్తమ్ ॥32॥**

**ఆరార్త్రిదీపాదీంశ్చైవ ధేనుముద్రాముద్రితాని కవచేనావగుంఠితాని షష్ఠేన రక్షితాని లింగోపరి లింగే చ లింగస్యాధః సాధారణం చ దర్శయేత్ ॥33॥**

**మూలేన నమస్కారం విజ్ఞాప్యావాహనస్థాపనసన్నిరోధసాన్నిధ్యపాద్యాచమనీయార్ఘ్యగంధపుష్పధూప నైవేద్యాచమనీయహస్తోద్వర్తనముఖవాసాద్యుపచారయుక్తం బ్రహ్మాంగభోగమార్గేణ పూజయేత్ ॥34॥**

శివలింగంయొక్క మస్తకం మీద కేవలం ఓంకారం ద్వారా పూజించడమే పవిత్రీకరణం అవుతుంది. ఆరతిని అట్లే దీపాన్ని ధేనుముద్రరచించి, కవచంతో అవకుంఠనం కల్పించి అట్లే ఆరోమంత్రంతో రక్షణ కల్పించి లింగంయొక్క మస్తకంమీద, మధ్యభాగంలోనూ, అధోభాగంలోనూ ప్రదర్శించాలి. మూలమంత్రంతో నమస్కరించి ఆవాహనం, స్థాపనం, సన్నిరోధం, సాన్నిధ్యం, పాద్యం, ఆచమనీయం, అర్ఘ్యం, గంధం, పుష్పం, దీపం, ధూపం, నైవేద్యం, ఆచమనీయం, హస్తోద్వర్తనం, ముఖవాసం మొదలైన ఉపచారాలు నివేదించి బ్రహ్మమంత్రస్వరూపుడి పాదం మొదలైన అంగాలకు ఉపచారం చేసి క్రమంగా పూజించాలి.

**సకలధ్యానం నిష్కలస్మరణం పరావరధ్యానం మూలమంత్రజపః। దశాంశం బ్రహ్మాంగజపసమర్పణమాత్మ నివేదనస్తుతినమస్కారాదయశ్చ గురుపూజా చ పూర్వతో దక్షిణే వినాయకస్య ॥35॥**

**ఆదౌ చాంతే చ సంపూజ్యో విఘ్నేశో జగదీశ్వరః। దేవతైశ్చ ద్విజైశ్చైవ సర్వకర్మార్థసిద్ధయే ॥36॥**

పూజించిన తర్వాత సకల (సగుణ) ధ్యానం, నిష్కల (నిర్గుణ) ధ్యానం, పరావరధ్యానం, మూలమంత్రజపం, బ్రహ్మమంత్రంయొక్క, అంగమంత్రంయొక్క దశాంశజపం, సమర్పణం, ఆత్మనివేదనం, స్తుతి, నమస్కారం మొదలైనవి నిర్వహించి పూర్వభాగంలో గురుపూజ, దక్షిణభాగంలో వినాయకగణపతి పూజా నిర్వహించాలి. దేవతల బ్రాహ్మణుల సమస్తమనోరథాల సిద్ధిని గూర్చి ఆదిలో అంతంలో జగన్నాథుడు విఘ్నేశ్వరుడు శ్రీ గణేశుడిని బాగా పూజించాలి.

**యః శివం పూజయేదేవం లింగే వా స్థండిలేఽపి వా।**
**సయాతి శివసాయుజ్యం వర్షమాత్రేణ కర్మణా ॥37॥**

**లింగార్చకశ్చ షణ్మాసాన్నాత్ర కార్యా విచారణా।**
**సప్తప్రదక్షిణాః కృత్వా దండవత్ప్రణమేద్ బుధః ॥38॥**

ఎవరు లింగంమీద లేక స్థండిలంమీద శివపూజ ఒక సంవత్సరం మాత్రమే నిర్వహిస్తారో వారికి దీని ప్రభావంతో శివసాయుజ్యం దొరుకుతున్నది. ఆరుమాసాలు శివపూజ చేసినవారు కూడా శివసాయుజ్యం పొందు తున్నారు. ఇందులో సందేహించ పనిలేదు. బుద్ధిమంతుడైన భక్తుడు ఏడుసార్లు ప్రదక్షిణచేసి సాష్టాంగప్రమాణం చేయాలి.

**పదక్షిణక్రమపాదేన అశ్వమేధఫలం శతమ్।**
**తస్మాత్సంపూజయేన్నిత్యం సర్వకర్మార్థసిద్ధయే ॥39॥**
**భోగార్థీ భోగమాప్నోతి రాజ్యార్థీ రాజ్యమాప్నుయాత్।**
**పుత్రార్థీ తనయం శ్రేష్ఠం రోగీ రోగాత్ప్రముచ్యతే ॥40॥**
**యాన్ యాంశ్చింతయతే కామాంస్తాంస్తాన్ ప్రాప్నోతి మానవః ॥41॥**

ప్రదక్షిణలో ఒక్కొక్క చుట్టు ద్వారా నూరునూరు అశ్వమేధయజ్ఞాల ఫలం లభిస్తున్నది. అందుకే సమస్త మనోరథాల సిద్ధి కోసం చక్కని విధంగా శివభగవానుడి నిత్యపూజ చేయాలి. ఈ పూజవలన భోగార్థికి భోగం, రాజ్యాన్ని అభిలషించేవాడికి రాజ్యం, పుత్రార్థికి ఉత్తమపుత్ర ప్రాప్తి, రోగికి రోగవిముక్తి కలుగుతున్నాయి. మానవుడు ఏయే మనోరథాల్ని కోరుతున్నాడో వాటి నన్నింటిని పొందుతాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే లింగార్చనవిధాననామ చతుర్వింశోఽధ్యాయః ॥24॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని లింగార్చన విధానం అనే పేరు గల ఇరవై నాల్గవ అధ్యాయం సమాప్తం

## పంచవింశతితయోఽధ్యాయః - ఇరవై ఐదవ అధ్యాయం

## శివాగ్నికార్యవర్ణనమ్ - శివాగ్నికార్యవర్ణన

**శైలాదిరువాచ -** నందీశ్వరుడు పలికాడు.

**శివాగ్నికార్యం వక్ష్యామి శివేన పరిభాషితమ్ ।**
**జనయిత్వాగ్రతః ప్రాచీం శుభే దేశే సుసంస్కృతే ॥ 1॥**

**పూర్వాగ్రముత్తరాగ్రం చ కుర్యాత్సూత్రత్రయం శుభమ్ ।**
**చతురస్రీకృతే క్షేత్రే కుర్యాత్కుండాని యత్నతః ॥2॥**

ఓ సనత్కుమారా! నేనిపుడు శివాగ్నికార్యాన్ని గూర్చి వర్ణిస్తాను. ఇది స్వయంగా శివభగవానుడే చెప్పింది. మొట్టమొదటిగా దిక్కుల ఏర్పాటు విధానంలో తూర్పు దిక్కును నిర్ధారించి శుభకరమైన అట్లే పరిష్కృతమైన భూమిమీద పవిత్రమైన మూడు సూత్రాల్ని పూర్వాగ్రం మీద, అట్లే మూడు సూత్రాల్ని ఉత్తరాగ్రం మీద ఉంచి నలుచదరంగా తయారు చేసిన భూమిమీద ప్రయత్నపూర్వకంగా కుండాన్ని నిర్మించాలి.

**నిత్యహోమాగ్నికుండం చ త్రిమేఖలసమాయుతమ్ ।**
**చతుస్త్రీద్వ్యంగులాయామా మేఖలా హస్తమాత్రతః ॥3॥**

**హస్తమాత్రం భవేత్కుండం యోనిః ప్రాదేశమాత్రతః ।**
**అశ్వత్థపత్రవద్యోనిం మేఖలోపరి కల్పయేత్ ॥4॥**

నిత్యహోమం కోసం మూడు మేఖలలతో కూడిన అగ్నికుండం ఉండాలి. మూడు మేఖలలు కూడా ఏకహస్త (రెండు మూరలు) ప్రమాణంలో నాల్గు అంగుళాలు, మూడు అంగుళాలు మరియు రెండు అంగుళాల ఆయంతో నిర్మించాలి. కుండం ఏక హస్తప్రమాణంలోనే ఉండాలి. యోని ప్రదేశమాత్రంగా అనగా అంగుష్ఠం లేక తర్జని ప్రమాణం ఉండాలి. మేఖలపై భాగంలో అశ్వత్థపత్రం ఆకారంలో యోనిని నిర్మించాలి.

**కుండమధ్యే తు నాభిః స్యాదష్టపత్రం సకర్ణికమ్ ।**
**ప్రాదేశమాత్రం విధినా కారయేద్బ్రహ్మణః సుతః ॥ 5॥**

**షష్ఠేన ఉల్లేఖనం ప్రోక్తం ప్రోక్షణం వర్మణా స్మృతమ్ ।**
**నేత్రేణాలోక్య వై కుండం షడ్రేఖాః కారయేద్బుధః ॥6॥**

**ప్రాగాయతేన విప్రేంద్ర బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ।**
**ఉత్తరాగ్రాః శివా రేఖాః ప్రోక్షయేద్వర్మణా పునః ॥7॥**

ఓ బ్రహ్మపుత్రా! సనత్కుమారా! కుండం మధ్యలో నాభి ఉండాలి. దానిని విధిపూర్వకంగా అష్టదళాలుగల, కర్ణికాయుక్తమైన ప్రాదేశమాత్రప్రమాణంతో నిర్మించాలి. అస్త్రమంత్రంతో భూమిని త్రవ్వాలి. కవచమంత్రంతో ప్రోక్షణ జరగాలి. బుద్ధిమంతుడు కుండాన్ని నేత్రమంత్రంతో చూస్తూ ఆరురేఖలు నిర్మించాలి. విప్రశ్రేష్ఠా! పూర్వాగ్రంలోని మూడు రేఖలు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపాలు. ఉత్తరాగ్రరేఖలు శివస్వరూపాలు. తర్వాత కవచమంత్రంతో మరల ప్రోక్షణ చేయాలి.

**శమీపిప్పలసంభూతామరణీం షోడశాంగులామ్ ।**
**మథిత్వా వహ్నిబీజేన శక్తిన్యాసం హృదైవ తు ॥8॥**

**ప్రక్షిపేద్విధినా వహ్నిమన్వాధాయ యథావిధి ।**
**తూష్ణీం ప్రాదేశమాత్రైస్తు యాజ్ఞికైః శకలైః శుభైః ॥9॥**

**పరిసమ్మోహనం కుర్యాజ్జలేనాష్టసు దిక్షు వై ।**
**పరిస్తీర్య విధానేన ప్రాగాద్యేవమనుక్రమాత్ ॥10॥**

**ఉత్తరాగ్రం పురస్తాద్ధి ప్రాగగ్రం దక్షిణే పునః ।**
**పశ్చిమే చోత్తరాగ్రం తు సౌమ్యే పూర్వాగ్రమేవ తు ॥11॥**

శమీగర్భస్థమైన పిప్పలకఱ్ఱతో తయారైన పదహారు అంగుళాల ప్రమాణంగల అరణి ద్వారా వహ్నిబీజం (రం)తో మథనం చేసి మరియు హృదయమంత్రంతో శక్తిన్యాసం చేసి అగ్నిని ఉత్పన్నం చేయాలి. తర్వాత మౌనాన్ని పాటించి విధిపూర్వకంగా ఆ అగ్నికుండంలో అగ్నిని ఉంచాలి. విధిపూర్వకంగా అగ్నిని ఆధానం చేసి శాంతిపూర్వకంగా ప్రాదేశప్రమాణంలో యజ్ఞసంబంధమైన శుభకరాలైన కాష్ఠరూపమైన సమిధల్ని దానిమీద తూర్పుదిక్కునుంచి క్రమంగా విధిపూర్వకంగా నిలుపుతూ నీటిద్వారా అష్టదిక్కులందు పరిసమ్మోహనం చేయాలి. తూర్పులో ఉత్తారాగ్రం, దక్షిణంలో పూర్వాగ్రం పశ్చిమంలో ఉత్తరాగ్రం మరియు ఉత్తరంలో పూర్వాగ్రంగా దర్భల్ని ఉంచాలి.

**ఐంద్రే చైంద్రాగ్నమావాహ్య యామ్య ఏవం విధీయతే ।**
**సౌమ్యస్యోపరి చాంద్రాగ్నం వారుణాగ్రమధస్తతః ॥12॥**

**ద్వంద్వరూపేణ పాత్రాణి బర్హిఃష్వాసాద్య సువ్రత ।**
**అధోముఖాని సర్వాణి ద్రవ్యాణి చ తథోత్తరే ॥13॥**

**తస్యోపరి న్యసేద్దర్భాన్ శివం దక్షిణతో న్యసేత్ ।**
**పూజయేన్మూలమంత్రేణ పశ్చాద్ధోమం సమాచరేత్ ॥14॥**

పూర్వదిగ్భాగంలో ఇంద్రాగ్ని దైవతాన్ని ఆవాహన చేసి, దక్షిణదిగ్భాగంలో యమాగ్నిని, ఉత్తరదిగ్భాగంలో చంద్రాగ్నిని, తర్వాత పశ్చిమదిగ్భాగంలో వరుణాగ్నిని ఆవాహన చేసే క్రియ జరుగుతుంది. ఓ సువ్రతా! పాత్రల్ని ద్వంద్వాకారంగా అధోముఖాలు చేసి కుశలపై పెట్టి, అట్లే అన్ని ద్రవ్యాల్ని ఉత్తరభాగంలో ఉంచి వాటిపైన దర్భల్ని ఉంచాలి. దక్షిణభాగంలో శివుడిని స్థాపించాలని. తర్వాత మూలమంత్రంతో పూజ చేయాలి. అనంతరం విధ్యుక్తంగా హోమం చేయాలి.

**ప్రోక్షణీ పాత్రమాదాయ పూరయేదంబునా పునః ।**
**ప్రాదేశమాత్రౌ తు కుశౌ స్థాపయేదుదకోపరి ॥15॥**

**ప్లావయేచ్చ కుశాగ్రం తు వసోః సూర్యస్య రశ్మిభిః ।**
**వికీర్య సర్వపాత్రాణి సుసమ్ప్రోక్ష్య విధానతః ॥16॥**

**ప్రణీతా పాత్రమాదాయ పూరయేదంబునా పునః ।**
**అన్యోదకకుశాగ్రైస్తు సమ్యగాచ్ఛాద్య సువ్రత ॥17॥**

తర్వాత ప్రోక్షణ పాత్రను తీసుకుని దాన్ని నీటితో నింపాలి. తిరిగి ప్రాదేశమాత్రం వరకు రెండు దర్భల్ని జలంమీద ఉంచాలి. అగ్ని కిరణాలు అట్లే సూర్యకిరణాలు కుశాగ్రాలమీద ప్రసరించాలి. తర్వాత పాత్రలన్నింటిని ముందుగా విధిపూర్వకంగా ప్రోక్షించి ప్రణీతపాత్రను గ్రహించి దాన్ని మరల జలంతో నింపాలి. సువ్రతా! అనంతరం నీటిలో ఉంచిన ఇతరకుశల ద్వారా ఆ పాత్రను మిక్కిలిగా ఆచ్ఛాదించి రెండు చేతులతో నాసిక వరకు ఆ పాత్రను ఎత్తి ఈశాన్యదిక్కున స్థాపించాలి.

**హస్తాభ్యాం నాసికం పాత్రమైశాన్యాం దిశి విన్యసేత్ ।**
**ఆజ్యాధిశ్రయణం కుర్యాత్పశ్చిమోత్తరతః శుభమ్ ॥18॥**

**భస్మమిశ్రాంస్తథాంగారాన్ గ్రాహయేత్సకలేన వై ।**
**పశ్చిమోత్తరతో నీత్వా తత్ర చాజ్యం ప్రతాపయేత్ ॥19॥**

**కుశాగ్నౌ తు ప్రజ్వాల్య పర్యగ్నిం త్రిభిరాచరేత్ ।**
**తాన్ సర్వాంస్తత్ర నిఃక్షిప్య చాగ్రే చాజ్యం నిధాపయేత్ ॥20॥**

**అంగుష్ఠమాత్రౌ తు కుశౌ ప్రక్షాల్య విధినైవ తు ।**
**పర్యగ్నిం చ తతః కుర్యాత్తైరేవ నవభిః పునః ॥21॥**

**పర్యగ్నిం చ పునః కుర్యాత్తదాజ్యమవరోపయేత్ ।**
**అథాపకర్షయేత్పాత్రం క్రమేణోత్తరపశ్చిమే ॥22॥**

అనంతరం వాయవ్యకోణంలో శుభకరమైన ఆజ్యాన్ని స్థాపించాలి. భస్మయుక్తమైన నిప్పు కణికల్ని తీసివేయాలి. వాటిని వాయవ్యదిశలో ఉంచి వాటిమీద నేతిని చల్లాలి. తర్వాత కుశల్ని అగ్నితో బాగా మండించి మూడుకుశలతో పర్యగ్నికరణం చేయాలి. తిరిగి అన్ని కుశల్ని ఆ కుండంలో వేసి నేతిని వాటి దగ్గరగా ఉంచాలి. తర్వాత అంగుష్ఠమాత్ర ప్రమాణంగల రెండు దర్భల్ని విధిపూర్వంగా ప్రక్షాళించి ఆకుశలవల్ల, ఇతరమైన తొమ్మిది కుశలవల్ల పర్యగ్నిని కల్పించాలి. తర్వాత మరలా పర్యగ్నిని కలిగించాలి. తర్వాత నేతిని అగ్నిమీద చల్లాలి. నేతిపాత్రను క్రమంగా ఉత్తర పశ్చిమదిక్కులలో ఉంచాలి.

**సంయుజ్య చాగ్నిం కాష్ఠేన ప్రక్షాల్యారోప్య పశ్చిమే ।**
**ఆజ్యస్యోత్పవనం కుర్యాత్పవిత్రాభ్యాం సహైవ తు ॥23॥**

**పృథగాదాయ హస్తాభ్యాం ప్రవాహేణ యథాక్రమమ్ ।**
**అంగుష్ఠానామికాభ్యాం తు ఉభాభ్యాం మూలవిద్యయా ॥24॥**

**అభ్యుక్ష్య పాపయేదగ్నౌ పవిత్రే ఘృతపంకితే ।**

ఆ తర్వాత ఉపవేషణకాష్ఠాల ద్వారా అగ్నిని సంయోజపర్చి పడమటి దిక్కులో ఉంచి దాన్ని కడుగుతున్న చేతుల అంగుష్ఠం మరియు అనామిక వ్రేళ్లద్వారా యాజ్ఞికులు చెప్పినవిధంగా రెండు పవిత్రాల్ని తీసుకుని మూలమంత్రం ద్వారా ఆజ్యాన్ని చల్లాలి. దాని తర్వాత నేతితో తడిపిన రెండు పవిత్రాల్ని అభ్యుక్షణ చేసి వాటిని అగ్నిలో వేయాలి.

**సౌవర్ణం స్రుక్స్రువం కార్యాద్రత్నిమాత్రేణ సువ్రత॥ 25॥**

**రాజతం వా యథా న్యాయం సర్వలక్షణసంయుతమ్ ।**
**అథవా యాజ్ఞికైర్వృక్షైఃకర్తవ్యౌ స్రుక్స్రువావుభౌ ॥ 26॥**

సువ్రతుడా! బంగారం లేక వెండితో స్రుక్, స్రువాలు నిర్మించాలి. అవి పిడికిలి మూసిన మూర పొడవులో ఉండాలి. అన్ని మంచి లక్షణాలతో సంపన్నమై ఉండాలి. యజ్ఞసంబంధమైన వృక్షపు చెక్కలతోకూడా స్రుక్, స్రువాల్ని నిర్మించుకోవచ్చు.

**అరత్నిమాత్రమాయామం తత్పాత్రే తు బిలం భవేత్ ।**
**షడంగుళపరీణాహం దండమూలం మహామునే ॥27॥**

**తదర్ధం కంఠనాళం స్యాత్పుష్కరం మూలవద్భవేత్ ।**
**గోవాలసదృశం దండం స్రువాగ్రం నాసికాసమమ్ ॥28॥**

**పుటద్వయసమాయుక్తం ముక్తాద్యేన ప్రపూరితమ్ ।**

స్రువం ఏకహస్త (మోచేతి మొదలు చాచిన చిటికిన వ్రేలు వరకు ఉన్న ప్రదేశం అరత్ని) ప్రమాణంతో ఉండాలి. దాని ముఖంలో గుంట ఉండాలి. మహామునీ! స్రువం దండమూలం ఆరుఅంగుళాల వెడల్పు ఉండాలి. కంఠనాళం మూడు అంగుళాల వెడల్పు ఉండాలి. దాని ముఖం కూడా మూలంలాగా తయారు చేయాలి. స్రువం దండం గోవు తోక మాదిరిగా పైభాగం వెడల్పుగా, క్రమంగా క్రింది భాగం సన్నగా ఉండాలి. దాని అగ్రభాగం నాసిక మాదిరిగా రెండు పుటాలు కలిగి ముత్యాలతో పొదగబడి ఉండాలి.

**షట్త్రింశదంగులాయామమష్టాంగులసవిస్తరమ్ ॥29॥**

**ఉత్సేధస్తు తదర్ధం స్యాత్సూత్రేణ సమితం తతః ।**
**సప్తాంగులం భవేదాస్యం విస్తరాయామతః పునః ॥30॥**

**త్రిభాగైకం భవేదగ్రం కృత్వా శేషం పరిత్యజేత్ ।**
**కంఠం చ ద్వ్యంగులాయామం విస్తారం చతురంగుళమ్ ॥31॥**

పూర్ణాహుతిలో వాడే స్రువం ముప్పై ఆరు అంగుళాల పొడవు, ఎనిమిది అంగుళాల వెడల్పు, మరియు నాల్గు అంగుళాల మందంగలదిగా తయారు చేయాలి. దాన్ని సూత్రసమన్వితం చేయాలి. స్రువం ముఖం ఏడు అంగుళాల వెడల్పు ఉండాలి. పంద్రెండు అంగుళాల పొడవు ఉండాలి. దీని కంఠం రెండు అంగుళాల పొడవు మరియు నాల్గు అంగుళాల వెడల్పు ఉండాలి.

**వేదిరష్టాంగుళాయామా విస్తారస్తత్ప్రమాణతః ।**
**తస్య మధ్యే బిలం కుర్యాచ్చతురంగులమానతః ॥32॥**

**బిలం సువర్తితం కుర్యాదష్టపత్రం సువర్ణికమ్ ।**
**పరితో బిలబాహ్యే తు పట్టికార్ధాంగులేన తు ॥33॥**

**తద్బాహ్యే చ వినిద్రం తు పద్మపత్రవిచిత్రితమ్ ।**
**యవద్వయప్రమాణేన తద్బాహ్యే పట్టికా భవేత్ ॥34॥**

వేదిక ఎనిమిది అంగుళాల పొడవు, అంతే ప్రమాణం గల అనగా ఎనిమిది అంగుళాల వెడల్పు ఉండాలి. దాని మధ్యలో నాల్గు అంగుళాల గుంటను చేయాలి. ఆ గుంట సంపూర్ణంగా గోళరూపంగా అష్టదళాలతో కూడిన సుందరమైనకర్ణిక గలదిగా నిర్మించాలి. ఆ గుంట వెలుపల నాల్గు వైపుల క్రింది భాగంలో అంగుళప్రమాణంలో పట్టికను, దాని వెలుపల విప్పారిన సుందరకమలం, తిరిగి దాని వెలుపల రెండు యవగింజల ప్రమాణంలో మరో పట్టిక రచించాలి.

**వేదికామధ్యతో రంధ్రం కనిష్ఠాంగులమానతః ।**
**ఖాతం యావన్ముఖాంతః స్యాద్ బిలమానం తు నిమ్నగమ్ ॥35॥**

**దండం షడంగులం నాలం దండాగ్రే దండికాత్రయమ్ ।**
**అర్ధాంగులవివృద్ధ్యా తు కర్తవ్యం చతురంగులమ్ ॥36॥**

**త్రయోదశాంగులాయామం దండమూలే ఘటం భవేత్ ।**
**ద్వ్యంగులస్తు భవేత్కుంభో నాభిం విద్యాద్దశాంగుళమ్ ॥37॥**

**వేదిమధ్యే తథాకృత్వా పాదం కుర్యాచ్చ ద్వ్యంగులమ్ ।**
**పద్మపృష్ఠసమాకారం పాదం వై కర్ణికాకృతమ్ ॥38॥**

**గజోష్ఠసదృశాకారం తస్య పృష్ఠాకృతిర్భవేత్ ।**
**అభిచారాదికార్యేషు కుర్యాత్కృష్ణాయసేన తు ॥39॥**

**పంచవింశత్కుశేనైవ స్రుక్స్రువౌ మార్జయేత్పునః ।**
**అగ్రమగ్రేణ సంశోధ్య మధ్యం మధ్యేన సువ్రత ॥40॥**

**మూలం మూలేన విధినా అగ్నౌ తాప్య హృదా పునః ।**

వేదికమధ్యలో కనిష్ఠాంగుళి ప్రమాణంలో ముఖపర్యంతం గంభీరంగా ప్రవహింపగల ఒక రంధ్రం ఉండాలి. దండంయొక్క మూలం ఆరు అంగుళాల ప్రమాణం ఉండాలి. దండం అగ్రభాగంలో నాల్గు అంగుళాల దగ్గర సగం అంగుళవృద్ధిలో మూడు చిన్న దండాల్ని ఏర్పాటు చేయాలి. దండం అగ్రభాగం మీద పదమూడు అంగుళాల విస్తారంలో ఘటం ఉండాలి. దాని కంఠం రెండు అంగుళాలు, నాభిమధ్యభాగం పది అంగుళాలు ఉండాలి. వేదికమధ్యలో ఆ విధమైన పది అంగుళాల పద్మపృష్ఠాకారం గల నాభిని తయారు చేసి రెండు అంగుళాల ప్రమాణంలో కర్ణికయొక్క ఆకృతిని పోలిన పాదాన్ని నిర్మించాలి. ఆ స్రువం పృష్ఠాకృతి ఏనుగు పెదవుల ఆకారం మాదిరిగా ఉండాలి. అభిచారాదికర్మల విషయంలో కృష్ణలోహంతో స్రుక్స్రువాల నిర్మాణం జరగాలి. తర్వాత ఇరవై అయిదు దర్భలద్వారా స్రుక్స్రువాల మార్జనం చేయాలి. సువ్రతుడా! వీటి అగ్రభాగాలు కుశల అగ్రభాగాలతో, మధ్యభాగాలు దర్భలమధ్య భాగాలతో, మూలాలు దర్భలమూలాలతో శోధించి మరల మిక్కిలిగా హృదయమంత్రాన్ని ఉచ్చరించి అగ్నిలో వాటిని కాల్చాలి.

**ఆజ్యస్థాలీ ప్రణీతా చ ప్రోక్షణీ తిస్ర ఏవ చ ॥41॥**

**సౌవర్ణీ రాజతీ వాపి తామ్రీ వా మృన్మయీ తు వా ।**
**అన్యథానైవ కర్తవ్యం శాంతికే పౌష్టికే శుభే ॥42॥**

**ఆయసీ త్వభిచారే తు శాంతికే మృన్మయీ తు వా ।**
**షడంగుళం సువిస్తీర్ణం పాత్రాణాం ముఖముచ్యతే ॥43॥**

**ప్రోక్షణీ ద్వ్యంగుళోత్సేధా ప్రణీతా ద్వ్యంగుళాధికా ।**
**ఆజ్యస్థాలీ తతస్తస్యా ఉత్సేధో ద్వ్యంగుళాధికా ॥44॥**

నేతి పాత్ర, ప్రణీత మరియు ప్రోక్షణి పాత్రలు- ఈ మూడు బంగారం, వెండి, రాగివి అయి ఉండాలి. లేకుంటే మట్టివైనా కావాలి. శాంతికర్మలు అట్లే పౌష్టికకర్మలలో ఇతరలోహపాత్రల్ని వాడరాదు. అభిచార (చారణం, మారణం మొదలైన) కర్మలందు ఇతరలోహపాత్రల్ని వాడవచ్చు. శాంతి కర్మల్లో మట్టితో చేసిన నేతిపాత్ర, ప్రణీత, ప్రోక్షణి పాత్రలు వాడవచ్చు. ఈ పాత్రముఖభాగం ఆరు అంగుళాల వెడల్పు ఉండాలని చెబుతున్నారు. ప్రోక్షణి రెండు అంగుళాల మందం, ప్రణీత నాల్గు అంగుళాల మందం, నేతిపాత్ర ప్రణీతకన్నా రెండు అంగుళాలు అధికం అనగా ఆరు అంగుళాల మందం ఉండాలి.

**యైః సమిద్భిర్హుతం ప్రోక్తం తైరేవ పరిధిర్భవేత్ ।**
**మధ్యాంగుళపరీణాహా అవక్రా నిర్వ్రణాః సమాః ॥45॥**

**ద్వాత్రింశదంగుళాయామాస్త్రిస్రః పరిధయఃస్మృతాః ।**
**ద్వాత్రింశదంగుళాయామైస్త్రింశద్దర్భైః పరిస్తరేత్ ॥46॥**

**చతురంగులమధ్యే తు గ్రథితం తు ప్రదక్షిణమ్ ।**
**అభిచారాదికార్యేషు శివాగ్న్యాధానవర్జితమ్ ॥47॥**

**అకోమలాః స్థిరా విప్రసంగ్రాహ్యాస్త్వాభిచారికే ।**
**సమగ్రాః సుసమాః స్థూలాః కనిష్ఠాంగళసమ్మితాః ॥48॥**

**అవక్రా నిర్వ్రణాః స్నిగ్ధా ద్వాదశాంగుళసమ్మితాః ।**
**సమిధస్థం ప్రమాణం హి సర్వకార్యేషు సువ్రత ॥49॥**

ఈ సమిధలతో హోమం చేయాలి. వాటి పరిధిని ఏర్పరచుకోవాలి. మధ్యాంగుళితో సమానమైన లావుగల, వంకరలేని, పుచ్చులు లేని, ముప్పై రెండు అంగుళాల పొడవుగలవి మూడు పరిధులు చెప్పారు. నాలుగు అంగుళాల మధ్య ప్రదక్షిణ క్రమంలో గ్రథిత రూపంగా ముప్పై రెండు ముప్పై రెండు అంగుళాల పొడవుగల మూడు కుశాలతో పరిస్తరణ జరగాలి. అభిచారాదికర్మలలో శివాగ్నిని గ్రహించే విధానం వదలి కర్మను నిర్వహించాలి. విప్రుడా! అభిచారకర్మలందు కఠోరమైన దృఢమైన సమిధల్ని వాడాలి. శుభకర్మలందైతే అన్ని విధాల కనిష్ఠాంగుళంతో సమానమైన లావు గలవి, వంకరలేనివి, పుచ్చులు లేనివి, కోమలమైనవి, పన్నెండు అంగుళాల పొడవు అయిన సమిధల్ని గ్రహించాలి. సువ్రతుడా! అన్ని కార్యాలలో సమిధల విషయంలో ఈ విధమైన ప్రమాణాన్ని నిర్ణయించడం జరిగింది.

**గవ్యం ఘృతం తతః శ్రేష్ఠం కాపిలంతు తతోఽధికమ్ ।**
**ఆహూతీనాం ప్రమాణం తు స్రువం పూర్ణం తథా భవేత్ ॥50॥**

**అన్నమక్షప్రమాణం స్యాచ్ఛుక్తిమాత్రేణ వై తిలః ।**
**యవానాం చ తదర్ధం స్యాత్ఫలానాం స్వప్రమాణతః ॥51॥**
**క్షీరస్య మధునో దధ్నః ప్రమాణం ఘృతవద్భవేత్ ।**
**చతుః స్రువప్రమాణేన స్రువా పూర్ణాహుతిర్భవేత్ ॥52॥**
**తదర్ధం స్విష్టకృత్ప్రోక్తం శేషం సర్వమథాపి వా ।**

హవనం కోసం ఆవు నేయి శ్రేష్ఠమైంది. అందులోనూ కపిల గోవు నేయి మిక్కిలి శ్రేష్ఠం. ఆహుతి ప్రమాణం ఇలా ఉంది. స్రువం పూర్తిగా నిండి ఉండాలి. అన్నం (చరువు) యొక్క ప్రరిమాణం అక్ష మాత్రం (కర్ష). తిలల ప్రమాణం ఒక శుక్తి (సీపం) యవల పమాణం శుక్తిలో సగం. ఫలాదుల ప్రమాణం యాజకుడి ఇచ్ఛానుసారం. పాలు, తేనె, పెరుగు వీటియొక్క పరిమాణం నేతితో సమానంగా ఉండాలి. నాలుగు స్రువాలు స్రుక్కులతో నింపి ఆహుతి ఇవ్వడంతో పూర్ణాహుతి అవుతున్నది. అందులో సగం అనగా రెండు స్రువాలద్వారా లేక మిగిలిన భాగం ద్వారా జరిగే హవనాన్ని 'స్విష్టకృత్తు' అని అంటారు.

**శాంతికం పౌష్టికం చైవ శివాగ్నౌ జుహుయాత్సదా ॥53॥**
**లౌకికాగ్నౌ మహాభాగ మోహనోచ్చాటనాదయః ।**
**శివాగ్నిం జనయిత్వా తు సర్వకర్మణి సువ్రత ॥54॥**
**సప్తజిహ్వాః ప్రకల్ప్యైవ సర్వకార్యాణి కారయేత్ ।**
**అథవా సర్వకార్యాణి జిహ్వామాత్రేణ సిధ్యతి ॥55॥**
**శివాగ్నిరితి విప్రేంద్రా జిహ్వామాత్రేణ సాధకః ॥56॥**

శాంతిక మరియు పౌష్టిక కర్మల్లో ఎల్లప్పుడు శివాగ్నిలోనే ఆహుతులివ్వాలి. భగవానుడా! మోహనం, ఉచ్చాటనం మొదలైన అభిచారకర్మలందు హవనం లౌకికాగ్నిలో జరుగుతున్నది. సువ్రతా! సమస్తకర్మలందు శివాగ్నిని ఉత్పన్నం చేసి ఏడు జిహ్వల్ని కల్పించి అన్ని కార్యాలు నిర్వహించాలి. లేకుంటే శివాగ్ని జిహ్వామాత్రంతోనే సిద్ధిస్తున్నది.

**ఓం బహురూపాయై మధ్యజిహ్వాయై అనేకవర్ణాయై దక్షిణోత్తరమధ్యాయై శాంతికపౌష్టికమోక్షాదిఫలప్రదాయై స్వాహా॥ 57॥**

**ఓం హిరణ్యాయై చామీకరాభాయై ఈశానజిహ్వాయై జ్ఞానప్రదాయై స్వాహా॥ 58॥**
**ఓం కనకాయై కనకనిభాయై రమ్యాయై ఐంద్రాజిహ్వాయై స్వాహా॥ 59॥**
**ఓం రక్తాయై రక్తవర్ణాయై ఆగ్నేయజిహ్వాయై అనేకవర్ణాయై విద్వేషణ మోహనాయై స్వాహా॥60॥**
**ఓం కృష్ణాయై నైరృతజిహ్వాయై మారణాయై స్వాహా॥61॥**
**ఓం సుప్రభాయై పశ్చిమజిహ్వాయై ముక్తాఫలాయై శాంతికాయై పౌష్టికాయై స్వాహా॥62॥**
**ఓం అభివ్యక్తాయై వాయవ్యజిహ్వాయై శత్రూచ్చాటనాయై స్వాహా॥63॥**
**ఓం వహ్నాయే తేజస్వినే స్వాహా॥64॥**

**57 నుండి 64 వరకు ఉన్న మంత్రాలతో హవనం చేయాలి. ఇవి ఏడు జిహ్వా మంత్రాలు. "ఓం వహ్నాయే తేజస్వినో స్వాహా" ఇది ప్రధాన మంత్రం.**

**ఏతావద్వహ్నిసంస్కారమథవా వహ్నికర్మసు ।**
**నైమిత్తికే చ విధినా శివాగ్నిం కారయేత్పునః ॥65॥**

**నిరీక్షణం ప్రోక్షణం తాడనం చ షష్ఠేన ఫడంతేన అభ్యుక్షణం చతుర్థేన ఖననోత్కిరణం షష్ఠేన పూరణం సమీకరణమాద్యేన సేచనం వౌషడంతేన కుట్టనం షష్ఠేన సమ్మార్జనోపలేపనే తురీయేణ కుండపరికల్పనం నివృత్త్యా త్రిభిరేవ కుండపరిధానం చతుర్థేన కుండార్చనమాద్యేన రేఖాచతుష్టయసంపాదనం షష్ఠేన ఫడంతేన వజ్రీకరణం చతుష్పదాపాదనమాద్యేన ఏవం కుండసంస్కారమష్టాదశవిధమ్॥66॥**

ఈ విధంగా కుండవహ్నిసంస్కారం చేయాలి. లేకపోతే వహ్నికార్యాల్లో మరియు నైమిత్తికకర్మల్లో విధి పూర్వకంగా శివాగ్నిని ఉత్పన్నం చేయాలి. (దాని పద్ధతి ఈ విధంగా ఉంది.) ఫట్ అంత షష్ఠమంత్రంతో నిరీక్షణ, ప్రోక్షణ మరియు తాడన, చతుర్థ మంత్రంతో అభ్యుక్షణ, షష్ఠమత్రంతో ఖననం, అట్లే ఉత్కిరణ, ఆద్యమంత్రంతో పూరణ, అట్లే సమీకరణ, వౌషడంతమైన ఆద్యమంత్రంతో సేచన, షష్ఠమంత్రంతో కుట్టిన, నాల్గో మంత్రంతో సమ్మార్జన, అట్లే ఉపలేపన, అఘోర, వామదేవ, సద్యోజాతాదులైన ఈ మూడు మంత్రాలతో కుండపరికల్పన, చతుర్థమంత్రంతో కుండం పరిధానం (మేఖలాంకరణం) ఆద్యమంత్రంతో వజ్రీకరణం మరియు ఇంద్రుడు, అగ్ని మొదలైన నాల్గు దేవతలయొక్క స్థాపన, ప్రథమమంత్రంతో ఈ విధంగా పద్దెనిమిది విధాల కుండసంస్కారాలు నిర్వర్తించాలి.

**కుండసంస్కారానంతరమక్షపాటనం షష్ఠేన విష్టరన్యాసమాద్యేన వజ్రాసనే వాగీశ్వర్యావాహనమ్॥67॥**

**ఓం హ్రీం వాగీశ్వరీం శ్యామవర్ణాం విశాలాక్షీం యౌవనోన్మత్తవిగ్రహామ్ ।**
**ఋతుమతీం వాగీశ్వరశక్తిమావాహయామి ॥68॥**

**ఓం వాగీశ్వరీం పూజయామి ॥69॥**

**ఓం పునర్వాగీశ్వరావాహనమ్ ॥70॥**

**ఏకవక్త్రం చతుర్భుజం శుద్ధస్ఫటికాభం వరదాభయహస్తం పరశుమృగధరం ।**
**జటాముకుటమండితం సర్వాభరణభూషితమవాహయామి ॥71॥**

**ఓం హ్రీం వాగీశ్వరాయ నమః॥ ఆవాహనస్థాపనసన్నిధానసన్నిరోధపూజాంతం వాగీశ్వరీం సంభావ్య గర్భాధానవహ్ని సంస్కారమ్ ॥72॥**

కుండసంస్కారం తర్వాత షష్ఠమంత్రంతో అక్షపాటనం మరియు ప్రథమమంత్రంతో విష్టరన్యాసం చేసి వజ్రాసనం మీద భగవతి వాగీశ్వరిని ఆవాహన చేయాలి. (వాగీశ్వరి ఆవాహన మంత్రం ఈ విధంగా ఉంది). "ఓం హ్రీం వాగీశ్వరీం శ్యామవర్ణాం విశాలక్ష్మీం యౌవనోన్మత్త విగ్రహామ్, ఋతుమతీం వాగీశ్వరశక్తిమావాహయామి, వాగీశ్వరిని ఈ మంత్రంతో దీని తర్వాత వాగీశ్వరుడిని ఆవాహన చేయాలి. మంత్రమిది. "ఏకవక్త్రం చతుర్భుజం శుద్ధస్ఫటికాభం వరదాభయహస్తం పరశుమృగధరం జటాముకుటమండితం సర్వాభరణభూషితమావాహయామి"ఓం వాగీశ్వరాయ నమః" ఈ విధంగా ఆవాహనం, స్థాపనం, సన్నిధానం అట్లే సన్నిరోధం పూజాపర్యంతం చేసి వాగీశ్వరిని సత్కరించి గర్భాధానం, వహ్నిసంసారం నిర్వహించాలి.

**అరణీజనితం కాంతోద్భవం వా అగ్నిహోత్రజం వా తామ్రపాత్రే శరావే వా ఆనీయ నిరీక్షణతాడనాభ్యుక్షణ ప్రక్షాలనమాద్యేన క్రవ్యాదాశివపరిత్యాగోఽపి ప్రథమేన వహ్నేస్త్రైకారణం జఠరభ్రూమధ్యాదావాహ్యాగ్నిం వైకారణమూర్తా**

**వాగ్నేయేన ఉద్దీపనమాద్యేన పురుషేణ సంహితయా ధారణా ధేనుముద్రాం తురీయేణావగుంఠ్య జానుభ్యామవనిం గత్వా శరావోత్థాపనం కుండోపరి నిధాయ ప్రదక్షిణమావర్త్య తురీయేణాత్మసమ్ముఖాం వాగీశ్వరీం గర్భనాద్యాం గర్భాధానాంతరీయేణ కమలప్రదానమాద్యేన వౌషడంతేన కుశార్ఘ్యం దత్త్వా ఇంధనప్రదానమాద్యేన ప్రజ్వాలనం గర్భాధానం చ సద్యేనాద్యేన పూజనం పుంసవనం వామేన పూజనం ద్వితీయేన సీమాంతోన్నయనమఘోరేణ తృతీయేన పూజనమ్॥73॥ (సంస్కారవిధి ఈ ప్రకారంగా ఉంది).**

అరణి నుంచి పుట్టిన, సూర్యకాంతమణినుంచి పుట్టిన, లేకుంటే అగ్నిహోత్రంతో పుట్టిన అగ్నిని రాగిపాత్రలో గాని మట్టిమూకుడులో తీసుకుని ఆద్యమంత్రంతో నిరీక్షణ, తాడన, అభ్యుక్షణ అట్లే ప్రక్షాళన చేసి మరల ఆద్యమంత్రంతోనే క్రవ్యాదం అంశను, అశివాన్ని పరిత్యజించి, జఠరం మరియు భ్రూమధ్యంలోగల వహ్నిని త్రివర్ణసాధనకై ఆవాహన చేసి, ఆవాహన చేసిన మూర్తిని వహ్నిమంత్రంతో ఉద్దీపన చేసి, తత్పురుషమంత్ర సహితమైన ఆద్యమంత్రం ద్వారా ధారణ చేసి సంహితామంత్రంతో ధేనుముద్ర దర్శింపజేయాలి. తర్వాత చతుర్థమంత్రం ద్వారా అవకుంఠనపర్చి రెండు జానువుల్ని భూమిమీద ఉంచి కసోరాన్ని పైకి లేపి కుండంపైన ఉంచి, చతుర్థమంత్రంతో ప్రదక్షిణక్రమంలో నాల్గువైపులకూ తిరిగి తన సన్నిధిలో ప్రకాశిస్తున్న 'వాగీశ్వరిని' ధ్యానించి గర్భనాళంలో గర్భాధానం మాదిరి వౌషడంతాద్య మంత్రంతో కమలాన్ని ప్రదానం చేసి, కుశార్ఘ్యాన్ని ఇచ్చి అట్లే ప్రథమ మంత్రతో ఇంధనాన్ని ఇచ్చి సద్యోజాతమంత్రంతో ప్రజ్వలనం, అట్లే గర్భాధానం చేయాలి. తర్వాత ప్రథమసద్యోజాతమంత్రాలతో పూజ, వామదేవ మంత్రంతో పుంసవనం, ద్వితీయమంత్రంతో మరల పూజ, అఘోర మంత్రంతో సీమాంతోన్నయనం, మరల తృతీయమంత్రంతో పూజ నిర్వహించాలి.

**అవయవవ్యాప్తిర్వక్త్రోద్ఘాటనం వక్త్రనిష్కృతిరితి తృతీయేన గర్భజాతకర్మ పురుణేణ పూజనం తురీయేణ షష్ఠేన ప్రోక్షణం సూతకశుద్ధయే చాగ్నిసూనురక్షాకుశాస్త్రేణ వక్త్రేణాఽగ్నౌ మూలమీశాగ్రం నైరృతిమూలం వాయవ్యాగ్రం వాయవ్యమూలమీశాగ్రమితి కుశాస్తరణమితి పూర్వోక్తమిధ్మమగ్రమూలఘృతాక్తం లాలాపనోదాయ షష్ఠేన జుహుయాత్ ॥74॥**

అంగాల వ్యాప్తి, వక్త్రోద్ఘాటనం మరియు వక్త్రనిష్కృతిని తృతీయమంత్రంతో నిర్వహించాలి. గర్భజాత కర్మను తత్పురుషమంత్రంతో, పూజను చతుర్థమంత్రంతో సూతకశుద్ధికైన ప్రోక్షణను షష్ఠమంత్రంతో మరియు అగ్నిరూపపుత్రుడి రక్షణ కుశాస్త్రమంత్రంతో చేయాలి. తర్వాత వక్త్రమంత్రంతో అగ్నికోణంలో కుశమూలం, ఈశాన్యంలో కుశంయొక్క అగ్రభాగం నైరృతిలో కుశమూలం, వాయవ్యంలో అగ్రభాగం, వాయవ్యంలో కుశమూలం మరియు ఈశాన్యంలో అగ్రభాగం ఈ మాదిరి పూర్వోక్తవిధంగా కుశాస్తరణ చేసి ఘృతంతో నింపి సమిధలయొక్క అగ్ని ఆరిపోకుండా షష్ఠమంత్రంతో హవనం చేయాలి.

**పంచపూర్వాతిక్రమేణ పరిధివిష్టరన్యాసోఽపి ఆద్యేన విష్టరోపరి హిరణ్యగర్భహరనారాయణానపి పూజయేత్॥75॥**

**ఇంద్రాదిలోకపాలాంశ్చ పూజయేత్॥76॥**

**వజ్రావర్తపర్యంతానపి పూజయేత్॥77॥**

**వాగీశ్వరవాగీశ్వరీపూజాద్యేన ముద్వాస్య హుతం విసర్జయేత్॥78॥**

ప్రథమపరిధి ఆసనం ఏర్పాటు చేయాలి. పంచపూర్వాతి క్రమంతో బీజమంత్రాలతో విష్టరాన్ని స్థాపించి బ్రహ్మ, శివుడు, విష్ణువుల పూజ చేయాలి. ఈ విధంగా ఇంద్రాదిలోకపాలకుల యొక్క వజ్రాయుధం దగ్గరనుంచి

త్రిశూలం వరకు గల వారి ఎనిమిది ఆయుధాలకు కూడా పూజ చేయాలి. వాగీశ్వరుడు అట్లే వాగీశ్వరి యొక్క పూజాదికం నిర్వహించి, వాగీశ్వరుడికి ఉద్వాసనం చేసి హోమద్రవ్యాలతో హవనం చేయాలి.

**స్రుక్స్రువసంస్కారమథో నిరీక్షణప్రోక్షణతాడనాభ్యుక్షణాదీని పూర్వవత్ స్రుక్స్రువంచ హస్తద్వయే గృహీత్వా సంస్థాపనమాద్యేన తాడనమపి స్రుక్ స్రువోపరి దర్భానులేఖనమూలమధ్యామాఽగ్రేణ త్రిత్వేన స్రుక్ శక్తిం స్రువమపి శంభుం దక్షిణపార్శ్వకుశోపరి శక్తయే నమః శంభవే నమః ॥79॥**

అనంతరం స్రుక్స్రువాలను సంస్కరించాలి. ఇంతకు ముందు మాదిరిగానే నిరీక్షణ ప్రోక్షణ, తాడన, అభ్యుక్షణ మున్నగువాటిని చేసి రెండు చేతులతో ఆ స్రుక్ స్రువాల్ని గ్రహించి ప్రథమ మంత్రంతో సంస్థాపనం, అట్లే తాడనం చేసి స్రుక్స్రువాలమీద కుశాల మూలాలు, మధ్యభాగాలు, అగ్రభాగాలు– వాటితో మూడు రకాల అనులేఖనం చేసి స్రుక్‌ను శక్తిగా స్రువాన్ని శివుడుగా భావించి వాటికి దక్షిణభాగంలో కుశాలపైన "శక్తయే నమః" "శంభవే నమః" అనే మంత్రాలద్వారా స్థాపించాలి.

**తతో హ్యంతి సూత్రేణ స్రుక్ స్రువౌ తురీయేణ వేష్టయేదర్చయేచ్చ ॥80॥**

**ధేనుముద్రాం దర్శయిత్వా తురీయేణావగుంఠ్య షష్ఠేన రక్షాం విధాయ స్రుక్ స్రువసంస్కారః పూర్వమేవోక్తః ॥81॥**

అనంతరం దగ్గరలోగల సూత్రంతో స్రుక్స్రువాల్ని చతుర్థమంత్రాన్ని ఉచ్చరించి కలిపి కట్టాలి. మరియు తిరిగి అర్చించాలి. తర్వాత ధేనుముద్రను చూపి చతుర్థమంత్రంతో అవకుంఠనం, షష్ఠమంత్రంతో రక్షణ నిర్వహించి స్రుక్ స్రువాలను సంస్కరించాలి.

**పునరాద్యసంస్కారః పూర్వమేవోక్తః నిరీక్షణప్రోక్షణతాడనాభ్యుక్షణాదీని పూర్వవత్ ॥82॥**

**ఆజ్యప్రతాపనమైశాన్యాం వా షష్ఠేన వేద్యుపరి విన్యస్య ఘృతపాత్రం వితస్తిమాత్రం కుశపవిత్రం వామహస్తాంగుష్ఠానామికాగ్రం గృహీత్వా దక్షిణాంగుష్ఠానామికామూలం గృహీత్వాగ్ని జ్వాలోత్పవనం స్వాహాంతేన తురీయేణ పునః షడ్దర్భాన్ గృహీత్వా పూర్వవత్స్వాత్మసంప్లవనం స్వాహాంతేనాద్యేన కుశద్వయపవిత్రబంధనం చాద్యేన ఘృతే న్యసేదితి పవిత్రీకరణమ్ ॥83॥**

ఆజ్యసంసారం పూర్వమే చెప్పబడింది. పూర్వం మాదిరిగానే నిరీక్షణ, ప్రోక్షణ, తాడన, అభ్యుక్షణ మొదలైనవి నిర్వహించాలి. తర్వాత షష్ఠమంత్రంతో ఈశానదిక్కులో ఘృతాన్ని వేడిచేసి, ఆ ఘృతపాత్రను వేదికమీద పెట్టి వితస్తిమాత్ర (12 అంగుళాలు) కుశపవిత్రాల అగ్రభాగాన్ని ఆతడి వామహస్తం అంగుష్ఠం మరియు అనామికలతో పవిత్రకం మూలాన్ని గ్రహించి స్వాహాంత ప్రథమమంత్రంతో పూర్వం మాదిరిగానే తన దేహం మీద బాగా చల్లుకుని రెండు కుశాల్ని పవిత్రంగా నిర్మించి ప్రథమమంత్రంతో ఆనేతిలో వేయాలి. దాన్ని పవిత్రీకరణం అంటారు.

**దర్భద్వయం ప్రగృహ్యాగ్నిప్రజ్వాలనం ఘృతం త్రిధా వర్తయేత్ ।**
**సంప్రోక్ష్యాగ్నౌ నిధాపయేదితి నీరాజనమ్ ॥84॥**

**పునర్దర్భాన్ గృహీత్వా కీటకాది నిరీక్ష్యార్ఘ్యేణ సంప్రోక్ష్య దర్భానగ్నౌ నిధాయ ఇత్యవద్యోతనమ్ ॥85॥**

**దర్భద్వయం గృహీత్వాగ్నిజ్వాలయా ఘృతం నిరీక్షయేత్ ॥86॥**

ఘృతంతో తడిపిన రెండు దర్భల్ని తీసుకుని వాటిని మండించి నేతిమీద మూడుసార్లు త్రిప్పి మరల సంప్రోక్షణ చేసి అగ్నిలో వేయాలి. ఇదే నీరాజనం అవుతుంది. మరల దర్భల్ని గ్రహించి కీటకాదుల్ని లేకుండా అర్ఘ్యజలంతో సంప్రోక్షించి (కడిగి) దర్భల్ని అగ్నిలో వేయాలి. ఇది అవద్యోతనం అవుతుంది. రెండు దర్భల్ని తీసుకుని అగ్నిలో ప్రజ్వలించి ఘృతానికి చూపాలి. ఇది నిరీక్షణం అవుతుంది.

**దర్భేణ గృహీత్వా తేనాగ్రద్వయేన శుక్లపక్షద్వయేనాద్యేనేతి కృష్ణపక్షసంపాతనం ఘృతం త్రిభాగేన విభజ్య స్రువేణైక భాగేనాజ్యేనాగ్నయే స్వాహా ద్వితీయేనాజ్యేన సోమాయ స్వాహా ఆజ్యేన ఓం అగ్నీషోమాభ్యాం స్వాహా ఆజ్యేనాగ్నయే స్విష్టకృతే స్వాహా ॥87॥**

**పునః కుశేన గృహీత్వా సంహితాభిమంత్రేణ నమోఽంతేనాభిమంత్రయేత్ ॥88॥**

**అభిమంత్ర్య ధేనుముద్రాప్రదర్శనకవచావగుంఠనాస్త్రేణరక్షామ్ ।**
**అథ సంస్కృతే నిధాపయేత్ ఆజ్యసంస్కారః ॥89॥**

తర్వాత దర్భలతోపాటు రెండు పవిత్రాల్ని తీసుకుని వాటిలో శుక్లపక్ష ద్వితీయభావన చేసి ఆ రెండు దర్భలతో కూడిన ఘృతాన్ని సద్యోజాతమంత్రంతో వేరు చేయాలి. మిగిలిన దానిని కృష్ణపక్ష భావనతో వేరు చేయాలి. ఈ విధంగా నేతిని మూడు భాగాలు చేసి స్రువంద్వారా నేతి మొదటి భాగాన్ని "అగ్నయే స్వాహా", రెండో భాగాన్ని "సోమాయ స్వాహా", మూడో భాగాన్ని "అగ్నీషోమాభ్యాం స్వాహా", మిగిలిన నేతిని "అగ్నయే విష్టకృతయే స్వాహా" అంటూ హోమం చేయాలి. తర్వాత కుశయుక్తపవిత్రాన్ని తీసుకుని అంతంలో నమః జతచేసి సంహితమంత్రంతో ఘృతాన్ని అభిమంత్రించాలి. అభిమంత్రించి ధేనుముద్ర ప్రదర్శించాలి. కవచంతో అవకుంఠనం, అస్త్రమంత్రంతో రక్షణ కల్పించాలి. తర్వాత సంస్కరింపబడిన పవిత్రకాల్ని అగ్నిలో వేయాలి. ఇది ఆజ్యసంస్కారం అవుతుంది.

**ఆజ్యేన స్రుగ్వదనేన చక్రాభిధారణం శక్తి బీజాదీశానమూర్తయే స్వాహా పూర్వవత్పురుషవక్త్రాయ స్వాహా అఘోరహృదయాయ స్వాహా వామదేవాయ గుహ్యాయ స్వాహా సద్యోజాతమూర్తయే స్వాహా ఇతి వక్త్రోద్ఘాటనమ్॥90॥**

**ఈశానమూర్తయే తత్పురుషవక్త్రాయ స్వాహా తత్పురుషవక్త్రాయ అఘోరహృదయాయ స్వాహా అఘోర హృదయాయ వామగుహ్యాయ సద్యోజాతమూర్తయే స్వాహా ఇతి వక్త్రసంధానమ్ ॥91॥**

**ఈశానమూర్తయే తత్పురుషాయ వక్త్రాయ అఘోరహృదయాయ వామదేవాయ గుహ్యాయ సద్యోజాతాయ స్వాహా ఇతి వక్త్రైక్యకరణమ్ ॥92॥**

స్రువంలో నింపిన నేతితో శక్తిబీజమంత్రంతో (హ్రీం) ఆహుతి ఇవ్వాలి. ఇది చక్రాభిధారణం, తర్వాత "ఈశానమూర్తయే స్వాహా, తత్పురుషవక్త్రాయ స్వాహా, అఘోరహృదయాయ స్వాహా, వామదేవగుహ్యాయ స్వాహా, సద్యోజాతమూర్తయే స్వాహా" అనే ఈ ఐదు మంత్రాలతో ఆహుతి ఇవ్వాలి. ఇది వక్త్రోద్ఘాటనం అవుతుంది. ఈశానమూర్తయే తత్పురుషవక్త్రాయ స్వాహా, తత్పురుష వక్త్రాయ అఘోరహృదయాయ స్వాహా, అఘోరహృదయాయ వామగుహ్యాయ సద్యోజాతమూర్తయే స్వాహా" ఈ మంత్రాలతో ఆహుతులు ఇవ్వాలి. ఇది వక్త్ర సంధానం. ఈశానమూర్తయే తత్పురుషాయ వక్త్రాయ అఘోరహృదయాయ వామదేవాయ గుహ్యాయ సద్యోజాతాయ స్వాహా" ఈ మంత్రంతో ఆహుతి ఇవ్వాలి. ఇది వక్త్రైక్యకరణం అవుతంది.

**శివాగ్నిం జనయిత్వైవం సర్వకర్మాణి కారయేత్ ।**
**కేవలం జిహ్వయా వాపి శాంతికాద్యాని సర్వదా ॥93॥**

**గర్భాధానాదికార్యేషు వహ్నేః ప్రత్యేకమవ్యయ ।**
**దశ ఆహుతయో దేయా యోనిబీజేన పంచధా ॥94॥**

ఈ విధంగా శివాగ్నిని ఉత్పన్నం చేసి సమస్తకార్యసంపన్నం చేయాలి. లేకుంటే కేవలం అగ్నిజిహ్వలతో శాంతి కార్యాల్ని ఎల్లప్పుడూ నిర్వహించాలి. అవ్యయా! గర్భాధానం మొదలైన ప్రత్యేక సంస్కారాలలో యోని బీజంతో అగ్నిలో పదిపది లేక ఐదుఐదు ఆహుతులు ప్రదానం చేయాలి.

**శివాగ్నౌ కల్పయేద్దివ్యం పూర్వవత్పరమాసనమ్ ।**
**ఆవాహనం తథా న్యాసం యథా దేవే తథార్చనమ్ ॥95॥**

**మూలమంత్రం సకృజ్జప్త్వా దేవదేవం ప్రణమ్య చ ।**
**ప్రాణాయామత్రయం కృత్వా సగర్భం సర్వసమ్మతమ్ ॥96॥**

**పరిషేచనపూర్వం చ తదిధ్మమాభిధార్య చ ।**
**జుహుయాదగ్నిమధ్యే తు జ్వలితేఽథ మహామునే ॥97॥**

శివాగ్నిలో పూర్వం మాదిరిగానే పరమదివ్యమైన ఆసనాన్ని కల్పించాలి. దానిమీద దేవుడిని ఆహ్వానించి, స్థాపించి పూజించాలి. మహామునీ! మూలమంత్రాన్ని ఒకమారు జపంచేసి దేవదేవుడికి నమస్కరించి, తిరిగి మూడుసార్లు సర్వసమ్మతమైన సగర్భప్రాణాయామం చేసి, పరిషేచనపూర్వకంగా ఈ సమిధల్ని ఆధారహోమం కోసం ప్రజ్వలితాగ్ని మధ్యలో హవనం చేయాలి.

**ఆధారావపి చాధాయ చాజ్యేనైవ తు షణ్ముఖే ।**
**ఆజ్యభాగౌ తు జుహుయాద్విధినైవ ఘృతేన చ ॥98॥**

**చక్షుషీ చాజ్యభాగౌ తు చాగ్నయే చ తథోత్తరే ।**
**ఆత్మనో దక్షిణే చైవ సోమాయేతి ద్విజోత్తమ ॥99॥**

**ప్రత్యఙ్ముఖస్య దేవస్య శివాగ్నేర్బ్రహ్మణః సుత ।**
**అక్షి వై దక్షిణం చైవ చోత్తరం చోత్తరం తథా ॥100॥**

**దక్షిణం తు మహాభాగ భవత్యేవ న సంశయః ।**

స్రువంలో రెండు రెండు ఆఘారహోమం నిమిత్తకం అట్లే ఆజ్యభాగహోమనిమిత్తకమైన ఆహుతుల్ని గ్రహించి విధిపూర్వకంగా సద్యోజాతాదులైన ఆరు మంత్రరూపముఖం గల అగ్నిలో వాటిని హవనం చేయాలి. ద్విజశ్రేష్ఠా! "అగ్నయే స్వాహా" అని పలికి, తనకు ఉత్తరం వైపున "సోమాయ స్వాహా" అని పలికి తనకు దక్షిణంగా నేత్రస్వరూపాలైన రెండు ఆజ్యభాగాల్ని ఆహుతిగా ఇవ్వాలి. బ్రహ్మపుత్ర! సనత్కుమారా! మహాభాగా! పశ్చిమంవైపు ముఖంగల శివాగ్నిరూపుడైన మహాదేవుడి కుడికన్ను ఉత్తరం వైపుకు అట్లే ఎడమకన్ను దక్షిణంవైపుకు ఉంటాయి. ఇందులో సందేహం లేదు.

**ఆజ్యేనాహుతయస్తత్ర మూలేనైవ దశైవ తు ॥101॥**

**చరుణా చ యథావద్ధి సమిద్భిశ్చ తథా స్మృతమ్ ।**
**పూర్ణాహుతిం తతో దద్యాన్మూలమంత్రేణ సువ్రత ॥102॥**

**సర్వావరణదేవానాం పంచపంచైవ పూర్వవత్ ।**
**ఈశానాదిక్రమేణైవ శక్తిబీజక్రమేణ చ ॥103॥**

**ప్రాయశ్చిత్తమఘోరేణ స్విష్టాంతం పూర్వవత్స్మృతమ్ ।**
**త్రిప్రకారం మయా ప్రోక్తమగ్నికార్యం సుశోభనమ్ ॥104॥**

"నెయ్యి, చరువు అట్లే సమిధలతో మూలమంత్రం ద్వారా యథాక్రమంగా పది ఆహుతుల్ని ఇవ్వాలి" అని చెప్పటం జరిగింది. సువ్రతా! తర్వాత మూలమంత్రంతో పూర్ణాహుతి ప్రదానం చేయాలి. ఈశానాది మంత్రాలతో క్రమంగా శక్తిబీజానికీ (హ్రీం) క్రమంగా ఆవరణ దేవతలందరికి పూర్వం మాదిరిగా ఐదు ఐదు ఆహుతులివ్వాలి. అఘోరమంత్రంతో ప్రాయశ్చిత్తహోమం అట్లే స్విష్టకృత్ వరకు పూర్వం మాదిరిగా హోమం చెయ్యాలి. ఈ విధంగా నేను అత్యంత సుందరమైన మూడు విధాలైన అగ్నికార్యాన్ని వర్ణించాను.

**యథావసరమేవం హి కుర్యాన్నిత్యం మహామునే ।**
**జీవితాంతే లభేత్స్వర్గం లభతే అగ్నిదీపనమ్ ॥105॥**

**నరకం చైవ నాప్నోతి యస్య కస్యాపి కర్మణః ।**
**అహింసకం చరేద్ధోమం సాధకో ముక్తికాంక్షకః ॥106॥**

**హృదిస్థం చింతయేదగ్నిం ధ్యానయజ్ఞేన హోమయేత్ ।**
**దేహస్థం సర్వభూతానాం శివం సర్వజగత్పతిమ్ ॥107॥**

**తంజ్ఞాత్వా హోమయేద్భక్త్యా ప్రాణాయామేన నిత్యశః ।**
**బాహ్యహోమప్రదాతా తు పాషాణే దర్దురో భవేత్ ॥108॥**

మహామునీ! ఎవరు సమయానుసారంగా నిత్యం ఈ హోమం చేస్తున్నారో వాళ్లు మరణానంతరం స్వర్గాన్ని పొందుతారు. అగ్నితో సమానమైన కాంతిని పొందుతారు. ఏ విధమైన కర్మ చేసినా నరకం పొందరు. ధర్మార్థకామాలైన త్రివర్గసాధనేచ్ఛగలవారు ముక్తిని కోరేవాళ్లు అహింసక (పరనాశశూన్యం) హోమం చేయాలి. పై విధంగా హృదయంలో కొలువై ఉన్న అగ్నిదేవుని ధ్యానంలో నిలపాలి. ధ్యానయజ్ఞ హోమములు చేయాలి. సర్వప్రాణులలోను శివుడు ఉన్న విషయాన్ని అనుభవానికి తెచ్చుకోవాలి. విశ్వస్వామిని తెలుసుకొని నిత్యం భక్తియుతంగా ప్రాణాయామం, హోమం చేయాలి. సర్వభూతములకు ప్రత్యగాత్మ స్వరూపుడు పరమాత్మ (లోనున్న ఆత్మ) అని తెలుసుకోకుండా బాహ్యదృష్టితో మాత్రమే హోమం చేయువాడు రాతిలో కప్ప అవుతాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే శివాగ్నికార్యవర్ణనం నామ పంచవింశతితయోఽధ్యాయః ॥25॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని శివాగ్నికార్య వర్ణన అనే పేరు గల ఇరవై ఐదవ అధ్యాయం సమాప్తం.

## షడ్వింశతితమోఽధ్యాయః - ఇరవై ఆరవ అధ్యాయం

## అఘోరార్చనవర్ణనమ్ - అఘోరార్చనవర్ణనం

**శైలాదిరువాచ -** నందీశ్వరుడు పలికాడు.

**అధవా దేవమీశానం లింగే సంపూజయేచ్ఛివమ్ ।**
**బ్రాహ్మణః శివభక్తశ్చ శివధ్యానపరాయణః ॥1॥**

**అగ్నిరిత్యాదినా భస్మ గృహీత్వా హ్యగ్నిహోత్రజమ్ ।**
**ఉద్ధూలయేద్ధి సర్వాంగమాపాదతలమస్తకమ్ ॥2॥**

**ఆచమేద్బ్రహ్మతీర్థేన బ్రహ్మసూత్రీ హ్యుదఙ్ముఖః ।**
**అర్ఘో నమః శివాయేతి తనుం కృత్వాత్మనః పునః ॥3॥**

**దేవంచ తేన మంత్రేణ పూజయేత్ప్రణవేన చ ।**
**సర్వస్మాదధికా పూజా అఘోరేశస్య శూలినః ॥4॥**

ఓ సనత్కుమారా! శివభక్తుడైన బ్రాహ్మణుడు భగవంతుడైన శివుని ధ్యానంలో తత్పరుడై శివలింగంలో పరమేశ్వరుడైన శివుణ్ణి విధిపూర్వకంగా పూజించాలి."అగ్నిరితి"అనే మంత్రం చేత అగ్నిహోత్ర జన్యమైన భస్మాన్ని గ్రహించి పాదతలంనుంచి మస్తకం వరకు అన్నిఅంగాలకు దాన్ని అలముకోవాలి.తర్వాత ఉత్తరాభిముఖుడై బ్రహ్మ సూత్రాన్ని గ్రహించి బ్రహ్మతీర్థంలో ఆచమించాలి."ఓం నమః శివాయ"అనే ఈ మంత్రంతో తన దేహాన్ని శుద్ధ పర్చుకుని మూల మంత్రంతో అట్లే ప్రణవంతో శివుడిని పూజించాలి. అఘోరేశ్వడైన శివుడి పూజ అన్నిటికన్నామిన్న.

**సామాన్యం యజనం సర్వమగ్నికార్యం చ సువ్రత మంత్రభేదః ప్రభోస్తస్య అఘోరధ్యానమేవ చ ॥5॥**

**అఘోరేభ్యోఽథ ఘోరేభ్యో ఘోరఘోరతరేభ్యః ।**
**సర్వేభ్యః సర్వసర్వేభ్యో నమస్తే అస్తు రుద్రరూపేభ్యః ॥6॥**

**అఘోరేభ్యః ప్రశాంతహృదయాయ నమః అథ ఘోరేభ్యః సర్వాత్మ బ్రహ్మ శిరసే స్వాహా। ఘోరఘోరతరేభ్యః జ్వాలామలినీశిఖాయై వషట్। సర్వేభ్యః సర్వశర్వేభ్యః పింగళకవచాయ హుమ్। నమస్తే అస్తు రుద్రరూపేభ్యః నేత్రత్రయాయ వషట్। సహస్రాక్షాయ దుర్భేదాయ పాశుపతాస్త్రాయ హుం ఫట్। స్నాత్వాచమ్య తనుం కృత్వా సమభ్యుక్ష్యాఘమర్షణమ్। తర్పణం విధినా చార్ఘ్యం భావనే భానుపూజనమ్ ॥7॥**

ఓ సువ్రతా! సమస్తపూజ అట్లే అగ్నికార్యం పూర్వం మాదిరిగానే, ప్రభువు మంత్రాలలో భేదం, అట్లే అఘోరభగవానుడి ధ్యానం మాత్రం ఇపుడు చెప్పడం జరిగింది. ఈ మంత్ర విధానమిది. అఘోరేభ్యోఽథ ఘోరేభ్యో ఘోరఘోరతరేభ్యః సర్వేభ్యః సర్వశర్వేభ్యో నమస్తే అస్తు రుద్రరూపేభ్యః, అఘోరేభ్యః ప్రశాంతహృదయాయ నమః, అథ ఘోరేభ్య సర్వాత్మబ్రహ్మశిరసే స్వాహా, ఘోరఘోరతరేభ్యః జ్వాలామాలినీశిఖాయై వషట్, సర్వేభ్యః సర్వశర్వేభ్యః పింగళకవచాయ హుమ్, నమస్తే అస్తు రుద్రరూపేభ్యః నేత్రత్రయాయ వషట్, సహస్రాక్షాయ దుర్భేదాయ పాశు పతాస్త్రాయ హుం ఫట్-ఈ ఆరు మంత్రాలతో అంగన్యాసం చేయాలి. పూజాక్రమం ఈ విధంగా ఉంది. స్నానం

చేసి, ఆచమనం చేసి, శరీరానికి మార్జనం, అఘమర్షణం చేసి తర్పణం మరియు విధ్యుక్తంగా సూర్యార్ఘ్యం, సూర్యపూజనం పూర్వం మాదిరిగానే నిర్వహించాలి. అఘోరపూజలో కేవలం మంత్రం మాత్రమే వేరైనది.

**సమం చాఘోర పూజాయాం మంత్రమాత్రేణ భేదితమ్ ।**
**మార్గశుద్ధిస్తథా ద్వారి పూజా వాస్త్వధిపస్య చ ॥8॥**

**కృత్వా కరం విశోధ్యాగ్రే స శుభాసనమాస్థితః ।**
**నాసాగ్రకమలే స్థాప్య దగ్ధాక్షః క్షుభికాగ్నినా ॥9॥**

**వాయునా ప్రేర్య తద్భస్మ విశోధ్య చ శుభాంభసా ।**
**శక్త్యామృతమయే బ్రహ్మకళాం తత్ర ప్రకల్పయేత్ ॥10॥**

మార్గశుద్ధి, ద్వారపూజ అట్లే వాస్తుపతిపూజ నిర్వహించి పూజకుడు ఇలా చేయాలి. పవిత్రాసనం మీద కూర్చుని ముందుగా చేతుల్ని శుద్ధి చేసుకుని ముక్కుకొన దగ్గర కరకమలంలో భస్మాన్ని ఉంచి క్షుభితాగ్ని (విరక్తిరూపాగ్ని) లో సమస్త విషయాల్ని దగ్ధం చేసి ఆ భస్మాన్ని వాయువుతో విరజిమ్మి, పవిత్రజలంతో ఆ భస్మాన్ని శోధించి బ్రహ్మమయమైన ఆ భస్మంలో శక్తితో కూడిన బ్రహ్మకళను భావన చేయాలి.

**అఘోరం పంచధా కృత్వా పంచాగ్నసహితం పునః ।**
**ఇత్థం జ్ఞానక్రియామేవం విన్యస్య చ విధానతః ॥11॥**

**న్యాసత్రినేత్రసహితో హృది ధ్యాత్వా వరాసనే ।**
**నాభే వహ్నిగతం స్మృత్వా భ్రూమధ్యే దీపవత్ప్రభుమ్ ॥12॥**

అఘోర మంత్రాన్ని ఐదుగా విభాగించి వాటిని పంచాంగభస్మవిలేపనయుక్తం చేయాలి. ఈ విధంగా జ్ఞానయుక్తమైన క్రియను విధానపూర్వకంగా న్యాసం చేసి అఘోరమూర్తి సహితంగా ధ్యానం చేయాలి. హృదయంలో శ్రేష్ఠమైన ఆసనంలో స్వామి ఉన్నట్లు ధ్యానించి, నాభిలో అగ్నిమధ్యలో ఉన్నట్టు స్మరించి, భ్రూమధ్యంలో దీపశిఖ యొక్క ఆకారం గల ప్రభువును చింతించాలి.

**శాంత్యా బీజాంకురానంతధర్మాద్యైరపి సంయుతే ।**
**సోమసూర్యాగ్ని సంపన్నే మూర్తిత్రయసమన్వితే ॥13॥**

**వామాదిభిశ్చ సహితే మనోన్మన్యాప్యధిష్ఠితే ।**
**శివాసనేత్మమూర్తిస్థమక్షయాకారరూపిణమ్ ॥14॥**

**అష్టదశభుజం దేవం గజచర్మోత్తరీయకమ్ ॥15॥**

**సింహాజినాంబరధరమఘోరం పరమేశ్వరమ్ ।**
**ద్వాత్రింశాక్షరరూపేణ ద్వాత్రింశచ్ఛక్తిభిర్వృతమ్ ॥16॥**

**సర్వాభరణసంయుక్తం సర్వదేవనమస్కృతమ్ ।**
**కపాలమాలాభరణం సర్వవృశ్చికభూషణమ్ ॥17॥**

**పూర్ణేందువదనం సౌమ్యం చంద్రకోటిసమప్రభమ్ ।**
**చంద్రరేఖాధరం శక్త్యా సహితం నీలరూపిణమ్ ॥18॥**

**హస్తే ఖడ్గం ఖేటకం పాశమేకే రత్నైశ్చిత్రం చాంకుశం నాగకక్షామ్ ।**
**శరాసనం పాశుపతం తథాస్త్రం దండం చ ఖట్వాంగమథాపరే చ ॥19॥**

**తంత్రీం ఘంటాం విపులంచ శూలం తథాపరే డామరుకం చ దివ్యమ్ ।**
**వజ్రం గదాం టంకమేకం చ దీప్తం సముద్గరం హస్తమథాస్య శంభోః ॥20॥**

**వరదాభయహస్తం చ వరేణ్యం పరమేశ్వరమ్ ।**
**భావయేత్పూజయేచ్చాపి వహ్నౌ హోమంచ కారయేత్ ॥21॥**

శాంతి సహితబీజం, అంకురం, అనంతం అట్లే ధర్మాదులతో కూడిన సోమసూర్యులు అట్లే అగ్నితో సంపన్నమైన మూడు మూర్తులతో కూడిన వామదేవాదులైన అష్టశక్తులతో కూడిన అట్లే మనోన్మనితో కూడా శివాసనం మీద అధిష్ఠించిన పరమేశ్వర శివుడిని ఈ విధంగా ధ్యానించాలి. అమృతమూర్తి అధిష్ఠించి ఉన్నాడు. ఆయన అక్షయాకార స్వరూపుడు. ముప్ఫై ఎనిమిది కళలతో పరిపూర్ణవిగ్రహుడు. త్రితత్త్వయుతుడు, పదునెనిమిది భుజాలు గలవాడు. గజచర్మాన్ని ఉత్తరీయంగా ధరించినవాడు, సింహచర్మాన్ని వస్త్రరూపంలో ధరించినవాడు. ముప్ఫై రెండు అక్షరాల రూపంలో ముప్ఫై రెండు శక్తులతో ఆవృతమైనవాడు. అన్ని విధాల, రకాల అలంకారాలతో అలంకరింపబడినవాడు. దేవతలందరూ ఆయనకు నమస్కరిస్తున్నారు. కపాలాల మాల ఆభరణంగా కలవాడు. సర్పాలు, వృశ్చికాలు భూషణాలుగా కలవాడు. చంద్రబింబముఖుడు, సౌమ్యమైన స్వభావం కలవాడు. కోటి చంద్రుల కాంతికి సమానమైన కాంతి కలవాడు. చంద్రకళాధరుడు, శక్తితో సుశోభితుడైనవాడు. నీలవర్ణుడు, ఆయన కుడి వైపున గల ఎనిమిది భుజాలతో ఖడ్గం, ఖేటకం, పాశం, రత్నమయమైన అంకుశం, నాగకక్ష, ధనుస్సుతో కూడిన పాశుపతాస్త్రం, దండం మరియు ఖట్వాంగం, మరియు ఎడమవైపున గల ఎనిమిది భుజాలలో తంత్రి, ఘంట, విశాల శూలం, దివ్యడమరుకం, వజ్రం, గద, టంకం మరియు కాంతిమంతమైన ముద్గరం ఉన్నాయి. వరేణ్యుడు పరమేశ్వరుడు అయిన ఆయన యొక్క మిగిలిన రెండు హస్తాలు వరదముద్రను కలిగియున్నాయి. ఈ విధమైన భావన చేయాలి. అట్లే ఆయన్ని పూజించాలి. చివరకు అగ్నిలో హవనం చేయాలి.

**హోమశ్చ పూర్వవత్సర్వో మంత్రభేదశ్చ కీర్తితః ।**
**అష్టపుష్పాది గంధాది పూజాస్తుతినివేదనమ్ ॥22॥**

**అంతర్బలిం చ కుండస్య వాహ్న్యేయేన విధానతః ।**
**మండలం విధినా కృత్వా మంత్రైరేతైర్యథాక్రమమ్ ॥23॥**

**రుద్రేభ్యో మాతృగణేభ్యో యక్షేభ్యో నక్షత్రేభ్యో విశ్వగణేభ్యః**
**క్షేత్రపాలేభ్యః అథ వాయువరుణదిగ్భాగే క్షేత్రపాలబలిం క్షిపేత్।**

**అర్ఘ్యం గంధం పుష్పం చ ధూపం దీపం చ సువ్రతాః**
**నైవేద్యం ముఖవాసాది నివేద్యం వై యథావిధి ॥24॥**

**విజ్ఞాప్యైవం విసృజ్యాథ అష్టపుష్పైశ్చ పూజనమ్ ।**
**సర్వసామాన్యమేతద్ధి పూజాయాం మునిపుంగవాః ॥25॥**

**ఏవం సంక్షేపతః ప్రోక్తమఘోరార్చాది సువ్రత ।**
**అఘోరార్చావిధానం చ లింగే వా స్థండిలేఽపి వా ॥26॥**

**స్థండిలాత్కోటిగుణితం లింగార్చనమనుత్తమమ్ ।**
**లింగార్చనరతో విప్రో మహాపాతకసంభవైః ॥27॥**

**పాపైరపి న లిప్యేత పద్మపత్రమివాంభసా ।**
**లింగస్య దర్శనం పుణ్యం దర్శనాత్స్పర్శనం వరమ్ ॥28॥**

**అర్చనాదధికం నాస్తి బ్రహ్మపుత్ర న సంశయః ।**
**ఏవం సంక్షేపతః ప్రోక్తమఘోరార్చనముత్తమమ్ ॥ 29॥**

**వర్షకోటిశతేనాపి విస్తరేణ నశక్యతే ॥30॥**

సంపూర్ణహోమకార్యం పూర్వం మాదిరిగానే ఉంటుంది. కేవలం మంత్రాలందే వేరువిధం. అష్టపుష్పాంజలి, గంధం, పుష్పాలతో పూజ, స్తుతి, నివేదనం అట్లే కుండలో అంతర్బలి అనగా హోమం, అగ్నిని పూర్వం చెప్పిన విధంగా కల్పించాలి. మరల విధిపూర్వకంగా మండలిని రచించి యథాక్రమంగా "రుద్రేభ్యో మాతృగణేభ్యో యక్షేభ్యోఽసురేభ్యో గ్రహేభ్యో రాక్షసేభ్యో నాగేభ్యో నక్షత్రేభ్యో శివగణేభ్యః క్షేత్రపాలేభ్యః నమః" అనే ఈ మంత్రాలను పఠించి వాయవ్యం అట్లే పడమటి దిక్కుల్లో క్షేత్రపాల బిలం ప్రదానం చేయాలి. (సూతుడు చెప్పాడు) ఓ సువ్రతులారా! తర్వాత అర్ఘ్యం గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం. ముఖవాసం మొదలైనవి విధ్యుక్తంగా నివేదించాలి. ఈ సమస్తోపచారాల్ని సమర్పించి అష్టపుష్పాంజలి ద్వారా విసర్జనకర ప్రార్థన నిర్వహించాలి. ఓ మునిశ్రేష్ఠులారా! పూజలో ఇవన్ని సామాన్యంగా చేయదగినవి. నందీశ్వరుడు పలికాడు. ఓ సువ్రతా! ఈ ప్రకారంగా నేను సంగ్రహంగా అఘోరపూజ యొక్క విధానం చెప్పాను. శివలింగమందు అట్లే స్థండిలంలో కూడా ఇది అఘోర శివుడి పూజావిధానం. భూమిపై చేసే అఘోర పూజకన్నా లింగమందు చేసే పూజ కోటిరెట్లు శ్రేష్ఠం. లింగార్చనలో సంలగ్నమైన విప్రుడు మహాపాపాలు చేసిన వాడైనా ఆపాపాలు పద్మపత్రం మీద నిలిచిన నీటి మాదిరిగా అతడికి అంటవు. లింగ దర్శనం పుణ్యప్రదం అవుతున్నది. చూడడం కన్నా తాకడం మిక్కిలి ఉత్తమం. అందుచే లింగార్చన కన్నా గొప్పది ఏదీ లేదు. ఓ బ్రహ్మపుత్రా! ఇందులో సందేహం లేదు. ఈ విధంగా నేను సంగ్రహంగా ఉత్తమమైన అఘోరార్చన యొక్క వర్ణనం చేశాను. నూరుకోట్ల సంవత్సరాలలో కూడా విపులంగా చెప్పశక్యం కాదు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే అఘోరార్చన వర్ణనం నామ షడ్వింశతితమోఽధ్యాయః ॥26॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని అఘోరార్చన వర్ణన అనే ఇరవై ఆరవ అధ్యాయం సమాప్తం.

## సప్తవింశోఽధ్యాయః త్తరభాగం - ఇరవై ఏడవ అధ్యాయం

## అభిషేకవిధివర్ణనమ్ - అభిషేకవిధివర్ణన

**ఋషయ ఊచు** - ఋషులు పలికారు.

**ప్రభావో నందినశ్చైవ లింగపూజాఫలం శ్రుతమ్ ।**
**శ్రుతిభిః సమ్మితం సర్వం రోమహర్షణ సువ్రత ॥1॥**

ఓ రోమహర్షణా! ఓ సువ్రతా ! మాకు భగవాన్ నందీశ్వరుడి ప్రభావం అట్లే వేదప్రతిపాదిత లింగపూజ యొక్క ఫలం సమస్తం నీవు విన్పించావు

**జయాభిషేక ఈశాన కథితో మనవే పురా ।**
**హితాయ మేరుశిఖరే క్షత్రియాణాం త్రిశూలినా ॥2॥**

**తత్కథం షోడశవిధం మహాదానం చ శోభనమ్ ।**
**వక్తుమర్హసి చాస్మాకం సూత బుద్ధిమతాం వర ॥3॥**

త్రిశూలధారి మహేశ్వరశివుడు క్షత్రియలకు కళ్యాణం కోసం పూర్వం మేరుపర్వతశిఖరం మీద స్వాయంభువ మనువుకు జయాభిషేకాన్ని ఉపదేశించాడు. అందులో చెప్పిన ఉత్తమమైన షోడశవిధమహాదానాల విధం ఎట్టిది? అది సమస్తం నీవు మాకు చెప్పు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**జీవచ్ఛ్రాద్ధం పురాకృత్వా మనుః స్వాయంభువః ప్రభుః ।**
**మేరుమాసాద్య దేవేశమస్తవీన్నీలలోహితమ్ ॥4॥**

పూర్వం స్వాయంభువమనువు జీవచ్ఛ్రాద్ధం నిర్వహించి మేరుశిఖరం మీదకు చేరి దేవదేవేశ్వరుడు నీలలోహిత శివుడిని స్తుతించాడు.

**తపసా చ వినీతాయ ప్రహృష్టః ప్రదదౌ భవః ।**
**దివ్యం దర్శనమీశానస్తేనాపశ్యత్తమవ్యయమ్ ॥5॥**

**నత్వా సంపూజ్య విధినా కృతాంజలిపుటః స్థితః ।**
**హర్షగద్గదయా వాచా ప్రోవాచ నమామ చ ॥6॥**

**దేవదేవ జగన్నాథ నమస్తే భువనేశ్వర ।**
**జీవచ్ఛ్రాద్ధం మహాదేవ ప్రసాదేన వినిర్మితమ్ ॥7॥**

**పూజితశ్చ తతో దేవో దృష్టశ్చైవ మయాధునా ।**
**శక్రాయ కథితం పూర్వం ధర్మకామార్థమోక్షదమ్ ॥8॥**

**జయాభిషేకం దేవేశ వక్తుమర్హసి మే ప్రభో ।**

అపుడు మనువు యొక్క తపస్సునకు శివభగవానుడు ప్రసన్నుడయ్యాడు. శివుడు ఆ వినమ్రమైన మనువుకు దివ్యదృష్టి ప్రదానం చేశాడు. దాని వలన అతడు అవ్యయుడైన శివుడిని చూశాడు. నమస్కరించి, విధిపూర్వకంగా పూజించి రెండు చేతులు జోడించి నిలిచాడు. మనువు మరల నమస్కరించి, ఆనందపడిన హృదయం వల్ల గాద్గద్యంతో కూడిన వాక్కుతో ఇలా పలికాడు. ఓ దేవదేవా! ఓ జగన్నాథా! ఓ భువనేశ్వరా! నీకు నమస్కారం. ఓ మహాదేవ! నీ కృపతో నేను జీవితశ్రాద్ధాన్ని నిర్వహించాను. నిన్ను నేను పూజించాను. దాంతో నాకిపుడు ప్రభువైన నీ దర్శనం లభించింది. ఓ దేవేశా! నీవు పూర్వం ధర్మార్థకామమోక్షాల్ని ప్రదానం చేసే జయాభిషేకాన్ని ఇంద్రుడికి ఉపదేశించావు. ఓ ప్రభూ! దానిని నాకు కూడా ఉపదేశింపగలవాడవు.

**సూత ఉవాచ –** సూతుడు పలికాడు.

**తస్మై దేవో మహాదేవో భగవాన్నీలలోహితః ॥9॥**

**జయాభిషేకమఖిలమవదత్పరమేశ్వరః ।**

అనంతరం నీలలోహితుడు శివభగవానుడు ఆ మనువుకు సంపూర్ణంగా జయాభిషేకాన్ని ఉపదేశించాడు.

**శ్రీ భగవానువాచ –** శ్రీ భగవంతుడు పలికాడు.

**జయాభిషేకం వక్ష్యామి నృపాణాం హితకామ్యయా ॥10॥**

**అపమృత్యుజయార్థం చ సర్వశత్రుజయాయ చ ।**
**యుద్ధకాలే తు సంప్రాప్తే కృత్వైవమభిషేచనమ్ ॥11॥**

**స్నపితం చాభిషిచ్యైవ గచ్ఛేద్యోద్ధుం రణాజిరే ।**

రాజుల హితార్థం, అకాలమృత్యుజయార్థం, సమస్తశత్రుజయార్థం నేను జయాభిషేకం గూర్చి చెబుతున్నాను. యుద్ధం సిద్ధమైనపుడు విధ్యుక్తంగా జయాభిషేకాన్ని నిర్వహించి ఆ యజమాని, మరియు సేనాధిపతి అయిన రాజు అభిషేకించబడి యుద్ధానికై రణభూమికి వెళ్లాలి.

**విధినా మండపం కృత్వా ప్రపాం వా కూటమేవ వా ॥12॥**

**నవధా స్థాపయేద్వహ్నిం బ్రాహ్మణో వేదపారగః ।**
**తతః సర్వాభిషేకార్థం సూత్రపాతం చ కారయేత్ ॥13॥**

విధిపూర్వకంగా మండపాన్ని, పానీయశాలను అట్లే నిశ్చలస్థానాన్ని నిర్మించి వేదపారంగతుడైన బ్రాహ్మణుడు తొమ్మిది విధాలుగా అగ్నిని స్థాపించి, తదుపరి సంపూర్ణాభిషేకానికై మండపం మీద రేఖాకరణం చేయాలి.

**ప్రాగాద్యం వర్ణసూత్రం చ దక్షిణాద్యం తథా పునః ।**
**సహస్రాణం ద్వయం తత్ర శతానాం చ చతుష్టయమ్ ॥14॥**

**శేషమేవ శుభం కోష్ఠం తేషు కోష్ఠం తు సంహరేత్ ।**
**బాహ్యే వీథ్యాం పదం చైకం సమంతాదుపసంహరేత్ ॥15॥**

తూర్పు, పడమర, దక్షిణం, ఉత్తరం – ఈ దిక్కులలో ఉండే సూత్రాలతో రేఖల్ని గీయాలి. వాటిలో రెండు వేల నాల్గువందల కోష్ఠాలు ఉంటాయి. అన్ని శుభకోష్ఠాల్ని నిర్మించి, వాటిల్లో మిగిలిన శుభకరకోష్ఠాల్ని తీసుకుని వెలుపల గల పంక్తిలో అన్ని దిక్కులతో ఒక్కొక్క పదాన్ని ఉంచాలి.

**అంగసూత్రాణి సంగృహ్య విధినా పృథగేవ తు ।**
**ప్రాగాద్యం వర్ణసూత్రం చ దక్షిణాద్యం తథా పునః ॥16॥**

**ప్రాగాద్యం దక్షిణాద్యం చ షట్త్రింశత్సంహరేత్క్రమాత్ ।**
**ప్రాగాద్యాః పంక్తయః సప్త దక్షిణాద్యాస్తథా పునః ॥17॥**

**తస్మాదేకోన పంచాశత్పంక్తయః పరికీర్తితాః ।**
**నవ పంక్తీర్హరేన్మధ్యే గంధగోమయవారిణా ॥18॥**

**కమలం చాలిఖేత్తత్ర హస్తమాత్రేణ శోభనమ్ ।**
**అష్టపత్రం సితం వృత్తం కర్ణికాకేసరాన్వితమ్ ॥19॥**

**అష్టాంగుళ ప్రమాణేన కర్ణికా హేమసన్నిభా ।**
**చతురంగులమానేన కేసరస్థానముచ్యతే ॥20॥**

అనంతరం అంగసూత్రాన్ని తీసుకుని విధిపూర్వకంగా వేరుగా ప్రాగాద్య దక్షిణాద్యాలతో అలంకరించిన సూత్రాన్ని వేయాలి. పూర్వాద్యం దక్షిణాద్యాలలో ముప్ఫై రేఖల్ని గీయాలి. మరల ప్రాగాద్యంలో ఏడు పంక్తులు, దక్షిణాద్యంలో ఏడు పంక్తులు నిర్మించాలి. ఈ విధంగా నలభైతొమ్మిది (49) పంక్తులు అవుతున్నాయి. వాటి మధ్యలోని తొమ్మిది పంక్తుల్ని గ్రహించాలి. గంధం అట్లే గోమయయుక్తజలంతో అలకాలి. దానిలో ఏకహస్త ప్రమాణంలో సుందరమైన, అష్టదళాలు గల, తెల్లని, గుండ్రని, కర్ణిక, కేసరాలుగల కమలాన్ని రచించాలి. కర్ణిక ఎనిమిది అంగుళాల ప్రమాణంలో బంగారంతో సమానమైనదిగా ఉండాలి. కేసరాల స్థానం నాల్గు అంగుళాలుగా రచించాలి.

**ధర్మో జ్ఞానం చ వైరాగ్యమైశ్వర్యం చ యథాక్రమమ్ ।**
**ఆగ్నేయాదిషు కోణేషు స్థాపయేత్ప్రణవేన తు ॥21॥**

**అవ్యక్తాదీనివై దిక్షు గాత్రాకారేణ వై న్యసేత్ ।**
**అవ్యక్తం నియతః కాలం కాలీ చేతి చతుష్టయమ్ ॥22॥**

**సితరక్తహిరణ్యాభకృష్ణా ధర్మాదయః క్రమాత్ ।**
**హంసాకారేణ వై గాత్రం హేమాభాసేన సువ్రతాః ॥23॥**

ఆగ్నేయాదికోణాలలో ప్రణవమంత్రం ద్వారా క్రమానుసారంగా ధర్మం, జ్ఞానం, వైరాగ్యం అట్లే ఐశ్వర్యం– వీటిని స్థాపించాలి. నాల్గు దిక్కులలో అవ్యక్తం, నియతం, కాలం మరియు కాలికి వెలుపల పత్రాకార రూపంలో స్థాపించాలి. ఓ సువ్రతుడా! ధర్మం, జ్ఞానం వైరాగ్యం అట్లే ఐశ్వర్యం – ఈ నాల్గింటిని క్రమంగా తెలుపు,ఎరుపు,స్వర్ణం రంగులలో, అట్లే నల్లని రంగుగల వాటినిగా భావించాలి. దేహం హంసాకారంగా సువర్ణసమానంగా ఉండాలి.

**ఆధారశక్తిమధ్యేతు కమలం సృష్టికారణమ్ ।**
**బిందుమాత్రం కలామధ్యే నాదాకారమతః పరమ్ ॥24॥**

**నాదోపరి శివం ధ్యాయేదోంకారాఖ్యం జగద్గురుమ్ ।**
**మనోన్మనీం చ పద్మాభం మహాదేవం చ భావయేత్ ॥25॥**

**వామాదయః క్రమేణైవ ప్రాగాద్యాః కేసరేషువై ।**
**వామా జ్యేష్ఠా తథా రౌద్రీ కాలీ వికరణీ తథా ॥26॥**

**బలా ప్రమథినీ దేవీ దమనీ చ యథాక్రమమ్ ।**
**వామదేవాదిభిః సార్ధం ప్రణవేనైవ విన్యసేత్ ॥27॥**

ఆధారశక్తి యొక్క మధ్యలో సృష్టికారణరూపమైన కమలం అట్లే కలామధ్యంలో బిందుమాత్రమైన నాదాకారాన్ని కల్పనం చేయాలి. తర్వాత ఆనాదం పైన ఓంకారసంజ్ఞకమైన జగద్గురువైన శివుడిని ధ్యానించాలి, మరియు మనోన్మని, పద్మసదృశకాంతిమంతుడు మహాదేవుడిని భావించాలి. తర్వాత వామ, జ్యేష్ఠ, రౌద్రి, కాళి, వికరణి, బలవికరణి, బలప్రమథని మరియు సర్వభూతదమని – ఈ వామాదులైన అష్టశక్తుల్ని, వామదేవాదులైన అష్టశివమూర్తులతో పాటు ఓంకారాన్ని ఉచ్చరిస్తూ పూర్వాదుల్ని క్రమంగా కేసరాలతో న్యాసం చేయాలి.

**నమోస్తు వామదేవాయ నమో జ్యేష్ఠాయ శూలినే ॥28॥**

**రుద్రాయ కాలరూపాయ కలావికరణాయ చ ।**
**బలాయ చ తథా సర్వభూతాయ దమనాయ చ ॥29॥**

**మనోన్మనాయ దేవాయ మనోన్మన్యై నమో నమః ।**
**మంత్రైరేతైర్యథాన్యాయం పూజయేత్పరిమండలమ్ ॥30॥**

నమోస్తు వామదేవాయ నమో జ్యేష్ఠాయ శూలినే, రుద్రాయ కాలరూపాయ కలావికరణాయ చ, బలాయ చ తథా సర్వభూతస్య దమనాయ చ, మనోన్మనాయ దేవాయ మనోన్మన్యై నమో నమః" ఈ మంత్రాలతో విధిపూర్వకంగా పరిమండలం యొక్క పూజ చేయాలి.

**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ।**
**ద్వితీయావరణే చైవ శక్తయః షోడశైవ తు ॥31॥**

**తృతీయావరణే చైవ చతుర్వింశదనుక్రమాత్ ।**
**పిశాచవీథిర్ద్వై మధ్యే నాభివీథిః సమంతతః ॥32॥**

**మంత్రైరేతైర్యథాన్యాయం పిశాచానాం ప్రకీర్తితా ।**

ప్రథమావరణవర్ణనం చేశాను. ఇపుడు రెండో ఆవరణవిషయాన్ని విను. ద్వితీయావరణంలో పదహారు శక్తులున్నాయి. తృతీయావరణంలో క్రమంగా ఇరవైనాల్గు శక్తులున్నాయి. మధ్యలో పిశాచ వీథి మరియు నాల్గువైపుల నాభివీథి ఉన్నది. దాన్నే పిశాచాల వీథి అని అంటారు. చెప్పబోయే మంత్రంతో వాటికి బాగా పూజ చేయాలి.

**అష్టోత్తరసహస్రం తు పదమష్టారసంయుతమ్ ॥33॥**

**తేషు తేషు పృథక్త్వేన పదేషు కమలం క్రమాత్ ।**
**కల్పయేచ్ఛాలినీవారగోధూమైశ్చ యవాదిభిః ॥34॥**

**తండులైశ్చ తిలైర్వాథ గౌరసర్షపసంయుతైః ।**
**అథవా కల్పయేదేతైర్యథాకాలం విధానతః ॥35॥**

**అష్టపత్రం లిఖేత్తేషు కర్ణికాకేసరాన్వితమ్ ।**
**శాలీనామాఢకం ప్రోక్తం కమలానాం పృథక్ పృథక్ ॥36॥**

**తండులానాం తదర్ధం స్యాత్తదర్ధం చ యవాదయః ।**
**ద్రోణం ప్రధానకుంభస్య తదర్ధం తండులాః స్మృతాః ॥37॥**

**తిలానామాఢకం మధ్యే యవానాం చ తదర్ధకమ్ ।**
**(ఇపుడు కులశస్థాపన విధి చెప్పబడుతున్నది.)**

అష్టకోణాలు గల ఒక వేయి ఎనిమిది పదాల్ని ఆ పరిమండలంలో నిర్మించాలి. తర్వాత ఆ యా పదాలతో వేరు వేరుగా క్రమంగా కర్ణిక అట్లే కేసరాలతో కూడిన అష్టదళకమలాన్ని శాలిధాన్యం, నీవారధాన్యం, గోధూమం, యవధాన్యం, బియ్యం, నూవులు, శ్వేతసర్షపాలు – వీటితో నిర్మించాలి. లేకుంటే వీటిలో దొరికిన వాటితోనే విధానపూర్వకంగా కమలాన్ని నిర్మించాలి. ప్రత్యేకంగా కమలం కోసం సోలెడు శాలిధాన్యాన్ని వాడాలి. అందులో సగం పరిమాణం, మిగిలిన వాటి పరిమాణం అందులో సగం ఉండాలి. ప్రధానకుంభం యొక్క ప్రమాణం ఒక ద్రోణం ఉండాలి. దీనియందు ధాన్యపరిమాణం దానిలో సగం మాత్రమే. తిలలు ఒక సోలెడు మాత్రమే. అందులో సగం మిగిలిన ధ్యానాలు.

**అథాంభసా సమభ్యుక్ష్య కమలం ప్రణవేన తు ॥38॥**

**తేషు సర్వేషు విధినా ప్రణవం విన్యసేత్క్రమాత్ ।**
**ఏవం సమాప్య చాభ్యుక్ష్య పదసాహస్రముత్తమమ్ ॥39॥**

**కలశానాం సహస్రాణి హైమాని చ శుభాని చ ।**
**ఉక్తలక్షణయుక్తాని కారయేత్రాజతాని వా ॥40॥**

**తామ్రజాని యథాన్యాయం ప్రణవేనార్ఘ్యవారిణా ।**

ఈ విధంగా కమలాన్ని రచించి ప్రణవం ఉచ్చరిస్తూ జలాన్ని దానిపై జల్లి వాటి అన్నింటిలోను విధిపూర్వకరంగా ప్రణవాన్ని న్యాసం చేయాలి. ఇలా చేసిన తర్వాత పవిత్రమైన ఆ వేయి పదాల్ని ప్రోక్షించాలి. విధిప్రకారంగా నిర్దేశించిన లక్షణాలు గల బంగారం, వెండి, రాగి లోహాలతో తయారు చేసిన వేయికలశాల్ని సిద్ధపర్చాలి. ఓంకారాన్ని పలుకుతూ వాటిని అర్ఘ్యజలంతో ప్రోక్షించాలి.

**ద్వాదశాంగుళవిస్తారముదరే సముదాహృతమ్ ॥41॥**

**వర్తితం తు తదర్ధేన నాభిస్తస్య విధీయతే ।**
**కంఠం తు ద్వ్యంగులోత్సేధం విస్తరం చతురంగుళమ్ ॥42॥**

**ఓష్ఠంచ ద్వ్యంగులోత్సేధం నిర్గమం ద్వ్యంగుళం స్మృతమ్ ।**
**తత్తద్వై ద్విగుణా దివ్యం శివకుంభే ప్రకీర్తితమ్ ॥43॥**

**యవమాత్రాంతరం సమ్యక్తంతునా వేష్టయేద్ధివై ।**
**అవగుంఠ్య తథాభ్యుక్ష్య కుశోపరి యథావిధి ॥44॥**

**పూర్వవత్ప్రణవేనైవ పూరయేద్గంధవారిణా ।**
**స్థాపయేచ్ఛివకుంభాధ్యం వర్ధనీం చ విధానతః ॥45॥**

**మధ్యపద్మస్య మధ్యేతు సకూర్చం సాక్షతం క్రమాత్ ।**
**ఆవేష్ట్య వస్త్రయుగ్మేన ప్రచ్ఛాద్య కమలేన తు ॥46॥**

**హైమేన చిత్రరత్నేన సహస్రకలశం పృథక్ ।**
**శివకుంభే శివం స్థాప్య గాయత్ర్యా ప్రణవేన చ ॥47॥**

**విద్మహే పురుషాయైవ మహాదేవాయ ధీమహి ।**
**తన్నో రుద్రః ప్రచోదయాత్ ॥48॥**

**మంత్రేణానేన రుద్రస్య సాన్నిధ్యం సర్వదా స్మృతమ్ ।**
**వర్ధన్యాం దేవి గాయత్ర్యా దేవీం సంస్థాప్య పూజయేత్ ॥49॥**

**గాణాంబికాయై విద్మహే మహాతపాయై ధీమహి ।**
**తన్నో గౌరీ ప్రచోదయాత్ ॥50॥**

ఇపుడు కలశాల ప్రమాణం నిరూపింపబడుతున్నది. కలశం యొక్క ఉదరం పండ్రెండు అంగుళాల నిడివిలో వృత్తాకారంగా ఉండాలి. దాని నాభి ఆరు అంగుళాల పరిణామంలో ఉండాలి. కలశం యొక్క కంఠం రెండు అంగుళాల పొడవుతో నాల్గు అంగుళాల వెడల్పుతో ఉండాలి. దాని ఓష్ఠం రెండు అంగుళాల వెడల్పుతో ఉండి నీరు వెలువడే మార్గం (రంధ్రం) కూడా రెండు అంగుళాల వెడల్పు ఉండాలి. దివ్యమైన శివకుంభం పై కొలతలకు రెట్టింపు ఉండాలి. అన్ని కలశాల్ని పూర్తిగా గట్టి సూత్రంతో మిక్కిలిగా కట్టాలి. తర్వాత అవకుంఠనాన్ని, అభ్యుక్షణాన్ని నిర్వహించి, కుశాల్ని పైన ఉంచి విధ్యనుసారం పూర్వం మాదిరిగానే ప్రణవాన్ని పలుకుతూ గంధంతో కూడిన జలంతో కలశాన్ని నింపాలి. కూర్చం, అక్షతసహితం అయిన మధ్యపద్మం పైన శివకుంభకాన్ని విధానపూర్వకంగా స్థాపించాలి. అట్లే ఖడ్గాకారం గల ఒక వర్ధనిని కూడా స్థాపించాలి. తర్వాత రెండు వస్త్రాలతో వాటిని చుట్టి బంగారంతో, విచిత్రరత్నాలతో నిర్మించిన కమలం ద్వారా కప్పి, తర్వాత వేయి కలశాల్ని వేరుగా చుట్టడం కప్పటం చేయాలి. శివకుంభం మీద శివగాయత్రిని ప్రణవం ద్వారా శివుడిని స్థాపించాలి. "విద్మహే పురుషాయైవ మహాదేవాయ ధీమహి, తన్నో రుద్రః ప్రచోదయాత్" అనే యీ మంత్రంతో ఎల్లప్పుడు రుద్రుడి యొక్క సాన్నిధ్యం కలిగి ఉండాలి. దేవిరుద్రగాయత్రితో పాటు వర్ధనిలో భగవతి గౌరీదేవి యొక్క స్థాపన చేసి పూజించాలి. "గణాంబికాయై విద్మహే మహాతపాయై ధీమహి, తన్నో గౌరీ ప్రచోదయాత్ " ఇది దేవీ గాయత్రి మంత్రం.

**ప్రథమావరణే చైవ వామాద్యాః పరికీర్తితాః ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 51॥**

**శక్తయః షోడశైవాత్ర పూర్వాద్యంతేషు సువ్రత ।**
**ఐంద్రవ్యూహస్య మధ్యే తు సుభద్రాం స్థాప్య పూజయేత్ ॥52॥**

**భద్రామాగ్నేయచక్రే తు యామ్యేతు కనకాండజామ్ ।**
**అంబికాం నైరృతే వ్యూహే మధ్యకుంభే తు పూజయేత్ ॥53॥**

**శ్రీదేవీం వారుణే భాగే వాగీశాం వాయుగోచరే ।**
**గోముఖీం సౌమ్యభాగే తు మధ్యకుంభే తు పూజయేత్ ॥54॥**

**రుద్రవ్యూహస్య మధ్యేతు భద్రకర్ణాం సమర్చయేత్ ।**
**ఐంద్రాగ్నివిదిశోర్మధ్యే పూజయేదణిమాం శుభామ్ ॥55॥**

**యామ్యపావకయోర్మధ్యే లఘిమాం కమలే న్యసేత్ ।**
**రాక్షసాంతకయోర్మధ్యేమహిమాం మధ్యతో యజేత్ ॥56॥**

**వారుణాసురయోర్మధ్యే ప్రాప్తిం వై మధ్యతో యజేత్ ।**
**వారుణానిలయోర్మధ్యే ప్రాకామ్యం కమలే న్యసేత్ ॥57॥**

**విత్తేశానిలయోర్మధ్యే ఈశిత్వం స్థాప్య పూజయేత్ ।**
**విత్తేశేశానయోర్మధ్యే వశిత్వం స్థాప్య పూజయేత్ ॥58॥**

**ఐంద్రేశేశానయోర్మధ్యే యజేత్కామావసాయకమ్ ।**
**ద్వితీయావరణం ప్రోక్తం తృతీయావరణం శృణు ॥59॥**

ప్రథమావరణంలో 'వామా' మొదలైన శక్తుల గూర్చి ముందే చెప్పాను. ప్రథమావణం చెప్పబడింది. ఇపుడు ద్వితీయావరణ విషయం వినండి. ఓ సువ్రతా! తూర్పు మున్నగు దిశలలో పదహారు శక్తులు ఉన్నాయి. తూర్పు దిక్కులో సుభద్రను స్థాపించి ఆమెను పూజించి, ఆగ్నేయచక్రంలో భద్ర, దక్షిణదిశలో కనకాండజ మరియు నైరృతి దిక్కులో కుంభం మధ్యలో అంబికను పూజించాలి. పడమటి దిక్కులో శ్రీదేవిని, వాయవ్యకోణంలో వాగీశని, ఉత్తర దిక్కులో కుంభం మధ్యలో గోముఖిని పూజించాలి. ఈశాన కోణంలో భద్రకర్ణికను అర్చించాలి. పూర్వదిశకు ఆగ్నేయవిదిక్కుకు మధ్యలో మంగళమయిన అణిమను పూజించాలి. అట్లే దక్షిణ దిక్కుకు ఆగ్నేయకోణానికి మధ్య కమలంలో లఘిమను పూజించాలి. ఈ విధంగానే దక్షిణం మరియు నైఋుతుల మధ్య మహిమను పూజించాలి. నైరృతికి పడమటికి మధ్యలో ప్రాప్తిని పూజించాలి. పశ్చిమవాయవ్యాల మధ్యకమలంలో ప్రకామ్యను న్యాసం చేయాలి. వాయవ్య – ఉత్తరాల మధ్యలో ఈశత్వాన్ని స్థాపించి పూజించాలి. అనంతరం ఉత్తర, ఈశానకోణాల మధ్యలో వశిత్వాన్ని న్యాసం చేసి పూజించాలి. అట్లే ఈశాన – పూర్వదిశల మధ్య వశిత్వాన్ని న్యాసం చేసి పూజించాలి. ఈశానకోణం పూర్వదిక్కుల మధ్యలో కామావసాయిత్వాన్ని పూజించాలి. అట్లే దక్షిణదిక్కుకు ఆగ్నేయకోణానికి మధ్యకమలంలో లఘిమను పూజించాలి. ఇది ద్వితీయావరణ పూజ. ఇపుడు తృతీయావరణ పూజ చెబుతాను వినండి.

**శక్తయస్తు చతుర్వింశత్ప్రధానకలశేషు చ ।**
**పూజయేద్వ్యూహమధ్యేతు పూర్వవద్విధిపూర్వకమ్ ॥60॥**

**దీక్షాం దీక్షాయికాం చైవ చండాం చండాంశునాయికామ్ ।**
**సుమతిం సుమత్యాయీం చ గోపాం గోపాయికాం తథా ॥61॥**

**అథ నందం చ నందాయీం పితామహమతః పరమ్ ।**
**పితామహాయీ పూర్వాద్యం విధినా స్థాప్య పూజయేత్ ॥62॥**

అష్టకలశాలతో అనగా అష్టదిక్పతుల కలశాలలో ఇరవై నాలుగు శక్తులు ప్రతిష్ఠింపబడ్డాయి. వ్యూహం మధ్యలో రెండో వ్యూహం లాగా షోడశశక్తుల పూజ నిర్వహించాలి. దానికి మించినట్టి దీక్ష, దీక్షాయిక, చండ, చండాంశునీయకం, సుమతి, సుమత్యాయి, గోప అట్లే గోపాయిక – ఈ అష్టశక్తుల్ని పూజించాలి. చెప్పిన ఇరవై నాలుగు శక్తుల పూజ అనంతరం 'నంద–నందాయి', పితామహుడు – పితామహి – వీరిని ఆది దిక్కులలో విధిపూర్వకంగా స్థాపించి పూజించాలి.

**ఏవం సంపూజ్య విధినా తృతీయావరణం శుభమ్ ।**
**సౌభద్రం వ్యూహమాసాద్య ప్రథమావరణే క్రమాత్ ॥63॥**

**ప్రాగాద్యం విధినా స్థాప్య శక్త్యష్టకమనుక్రమాత్ ।**
**ద్వితీయావరణే చైవ ప్రాగాద్యం శృణు శక్తయః ॥64॥**

**షోడశైవ తు అభ్యర్చ్య పద్మముద్రాం తు దర్శయేత్ ।**
**బిందుకా బిందుగర్భా చ నాదినీ నాదగర్భజా ॥65॥**

**శక్తికా శక్తిగర్భా చ పరా చైవ పరాపరా ।**
**ప్రథమావరణేఽష్టౌచ శక్తయః పరికీర్తితాః ॥66॥**

**చండా చండముఖీ చైవ చండవేగా మనోజవా ।**
**చండాక్షీ చండనిర్ఘోషా భృగుటీ చండనాయికా ॥67॥**

**మనోత్సేధా మనోధ్యక్షా మానసీ మాననాయికా ।**
**మనోహరీ మనోహ్లాదీ మనః ప్రీతిర్మహేశ్వరీ ॥68॥**

**ద్వితీయావరణే చైవ షోడశైవ ప్రకీర్తితాః ।**
**సౌభద్రః కథితో వ్యూహో భద్రం వ్యూహం శృణుష్వ మే ॥69॥**

ఈ విధంగా శుభకరమైన తృతీయావరణం యొక్క విధిపూర్వకమైన పూజచేసి, ప్రథమావరణంలో సౌభద్రవ్యూహాన్ని ప్రాప్తించుకుని అష్టదిక్కుల్ని క్రమంగా పూర్వాదిదిశల్లో స్థాపించి విధిపూర్వకంగా వాటిని పూజించాలి. ఇపుడు ద్వితీయావరణంలోని ప్రాగాదిశక్తుల గూర్చి వినండి. ఆ పదహారు శక్తుల్ని అర్చించి పద్మముద్ర చూపించాలి. బిందుక, బిందుగర్భ, నాదిని, నాదగర్భజ, శక్తిక, శక్తిగర్భ, పర, పరాపర–ఈ ఎనిమిది శక్తులు ప్రథమావరణంలో

చెప్పబడ్డాయి. చండ, చండముఖి, చండవేగ, మనోజవ, చండాక్షి, చండనిర్ఘోష, భృకుటి, చండనాయిక, మనోత్సేధ, మనోధ్యక్ష, మానసి, మాననాయిక, మనోహరి, మనోహ్లాది, మనఃప్రీతి మరియు మహేశ్వరి–ఈ పదహారు శక్తులు ద్వితీయావరణానికి చెప్పబడ్డాయి. నేను సౌభద్రవ్యూహావర్ణన చేశాను. ఇపుడు భద్రవ్యూహ విషయం వినండి.

**ఐంద్రీ హౌతాశనీ యామ్యా నైరృతీ వారుణీ తథా ।**
**వాయవ్యా చైవ కౌబేరీ ఐశానీ చాష్టశక్తయః ॥70॥**

**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ।**
**హరిణీచ సువర్ణా చ కాంచనీ హాటకీ తథా ॥71॥**

**రుక్మిణీ సత్యభామా చ సుభగా జంబునాయికా ।**
**వాగ్భవా వాక్పథా వాణీ భీమా చిత్రరథా సుధీః ॥72॥**

**వేదమాతా హిరణ్యాక్షీ ద్వితీయావరణే స్మృతా ।**
**భద్రాఖ్యః కథితో వ్యూహః కనకాఖ్యం శృణుష్వ మే ॥73॥**

ఐంద్రి, హౌతాశని, యామ్య, నైరృతి, వారుణి, వాయవ్య, కౌబేరి అట్లే ఐశాని ఇవి ఎనిమిది శక్తులు. ప్రథమావరణం చెప్పబడింది. ఇపుడు ద్వితీయావరణం వినండి. హరిణి, సువర్ణ, కాంచన, హాటకి, రుక్మిణి, సత్యభామ, సుభగ, జంబునాయిక, వాగ్భవ, వాక్యపథ, వాణి, భీమ, చిత్రరథ, సుధి, వేదమాత అట్లే హిరణ్యాక్షి–వీరు ద్వితీయావరణశక్తులు. భద్రాఖ్యవ్యూహావర్ణన చేయబడింది. ఇపుడు కనకనామకమైన వ్యూహవిషయాన్ని వినండి.

**వజ్రం శక్తించ దండంచ ఖడ్గం పాశం ధ్వజం తథా ।**
**గదాం త్రిశూలం క్రమశః ప్రథమావరణే స్మృతాః ॥74॥**

**యుద్ధా ప్రబుద్ధా చండా చ ముండా చైవ కపాలినీ ।**
**మృత్యుహంత్రీ విరూపాక్షీ కపర్దా కమలాసనా ॥75॥**

**దంష్ట్రిణీ రంగిణీ చైవ లంబాక్షీ కంకభూషణీ ।**
**సంభావా భావినీ చైవ షోడశైవ ప్రకీర్తితాః ॥76॥**

**కథితః కనకవ్యూహో హ్యంబికాఖ్యం శృణుష్వ మే ।**
**ఖేచరీ చాత్మనాసా చ భవానీ వహ్నిరూపిణీ ॥77॥**

**వహ్నినీ వహ్నినాభా చ మహిమామృతలాలసా ।**
**ప్రథమావరణే చాష్టౌ శక్తయస్సర్వసమ్మతాః ॥78॥**

**క్షమా చ శిఖరా దేవీ ఋతురత్నా శిలా తథా ।**
**ఛాయా భూతపనీ ధన్యా ఇంద్రమాతా చ వైష్ణవీ ॥79॥**

**తృష్ణా రాగవతీ మోహా కామకోపా మహోత్కటా ।**
**ఇంద్రా చ బధిరా దేవీ షోడశైతాః ప్రకీర్తితాః ॥80॥**

వజ్ర, శక్తి, దండ, ఖడ్గ, పాశ, ధ్వజ, గద మరియు త్రిశూలం – ఇవి క్రమానుసారంగా ప్రథమావరణం యొక్క ఆయుధరూపాలైన శక్తులు. యుద్ధ, ప్రబుద్ధ, చండ, ముండ, కపాలిని, మృత్యుహంత్రి, విరూపాక్షి, కపర్ద, కమల, ఆసన, దంష్ట్రి, రంగిణి, లంబాక్షి, కంకభూషిణి, సంభావ అట్లే భావిని – వీరు ద్వితీయా వరణానికి చెందిన పదహారు శక్తులు. కనకవ్యూహం వర్ణన చేయడం జరిగింది. ఇపుడు అంబికానామకమైన వ్యూహం యొక్క విషయాన్ని వినండి. ఖేచరి, ఆత్మనాస, భవాని, వహ్నిరూపిణి, వహ్నిని, వహ్నినాభ, మహిమ మరియు అమృతలాలస – వీరు ప్రథమావరణం యొక్క సర్వసమ్మతమైన అష్టశక్తులు. ఆ విధంగా క్షమ, శిఖరాదేవి, ఋతురత్న, శిల, ఛాయ, భూతపని, ధన్య, ఇంద్రమాత, వైష్ణవి, తృష్ణ, రాగవతి, మోహ, కామకోప, మహోత్కట, ఇంద్ర మరియు బధిరాదేవి – వీరు ద్వితీయావరణకు చెందిన పదహారు శక్తులు.

**కథితశ్చాంబికా వ్యూహః శ్రీవ్యూహం శృణు సువ్రత ।**
**స్పర్శా స్పర్శవతీ గంధా ప్రాణాపానా సమానికా ॥ 81॥**

**ఉదానా వ్యాననామా చ ప్రథమావరణే స్మృతాః ।**
**తమోహతా ప్రభామోఘా తేజినీ దహినీ తథా ॥82॥**

**భీమాస్యా జాలినీ చోషా శోషిణీ రుద్రనాయికా ।**
**వీరభద్రా గణాధ్యక్షా చంద్రహాసా చ గహ్వరా ॥83॥**

**గణమాతాంబికా చైవ శక్తయః సర్వసమ్మతాః ।**
**ద్వితీయావరణే ప్రోక్తాః షోడశైవ యథాక్రమాత్ ॥ 84॥**

ఓ సుపుత్రా! అంబికావ్యూహం వర్ణన చేయడం జరిగింది. ఇపుడు శ్రీవ్యూహం యొక్క శ్రవణం చేయండి. స్పర్శ, స్పర్శవతి, గంధం, ప్రాణం, అపానం, సమానం, ఉదానం మరియు వ్యానం ఈ ఎనిమిది శక్తులు ప్రథమావరణానికి చెందినవి. వాటి వంటివే తమోహత, ప్రభ, అమోఘ, తేజిని, దహిని, భీమాస్య, జాలిని, ఉష, శోషిణి, రుద్రనాయిక, వీరభద్ర, గణాధ్యక్ష, చంద్రహాస, గహ్వర, గణమాత మరియు అంబిక – క్రమంగా ఈ పదహారు సర్వసమ్మతమైన ద్వితీయావరణానికి సంబంధించిన శక్తులు.

**శ్రీ వ్యూహః కథితో భద్రం వాగీశం శృణు సువ్రత ।**
**ధారా వారిధరా చైవ వహ్నికీ నాశకీ తథా ॥85॥**

**మర్త్యాతీతా మహామాయా వజ్రిణీ కామధేనుకా ।**
**ప్రథమావరణే హ్యేవం శక్తయోఽష్టౌ ప్రకీర్తితాః ॥86॥**

**పయోష్ణీ వారుణీ శాంతా జయంతీ చ వరప్రదా ।**
**ప్లావినీ జలమాతా చ పయోమాతా మహాంబికా ॥87॥**

**రక్తా కరాళీ చండాక్షీ మహోచ్ఛుష్మా పయస్వినీ ।**
**మాయా విద్యేశ్వరీ కాళీ కాళికా చ యథాక్రమమ్ ॥88॥**

**షోడశైవ సమాఖ్యాతాః శక్తయః సర్వసమ్మతాః ।**
**వ్యూహో వాగీశ్వరః ప్రోక్తో గోముఖే వ్యూహ ఉచ్యతే ॥89॥**

**శంకినీ హాలినీ చైవ లంకావర్ణా చ కల్కినీ ।**
**యక్షిణీ మాలినీ చైవ వమనీ చ రసాత్మనీ ॥90॥**

**ప్రథమావరణే చైవ శక్తయోఽష్టౌ ప్రకీర్తితాః ।**
**చండా ఘంటా మహానాదా సుముఖీ దుర్ముఖీ బలా ॥91॥**

**రేవతీ ప్రథమా ఘోరా సైన్యా లీనా మహాబలా ।**
**జయా విజయా చైవ అపరా చాపరాజితా ॥92॥**

**ద్వితీయావరణే చైవ శక్తయః షోడశైవతు ।**
**కథితో గోముఖీవ్యూహో భద్రకర్ణీం శృణుష్వమే ॥93॥**

ఓ సువ్రతా! కళ్యాణకారకమైన శ్రీవ్యూహం యొక్క వర్ణనం జరిగింది. ఇపుడు వాగీశవ్యూహం విషయం వినండి. ధార, వారిధర, వహ్నికి, నాశకి, మర్త్యాతీత, మహామాయ, వజ్రిణి అట్లే కామధేనుక – ఈ అష్టశక్తులు ప్రథమావరణానికి చెందినవి. పయోష్ణి, వారుణి, శాంత, వరప్రదాయిని అయిన జయంతి, ప్లావని, జలమాత, పయోమాత, మహాంబిక, రక్త, కరాళి, చండాక్షి, మహోచ్ఛుష్మా, పయస్విని, మాయ, విద్యేశ్వరి, కాళి, కాళిక – వీరు క్రమంగా సర్వసమ్మతమైన ద్వితీయావరణం యొక్క షోడశశక్తులు. వాగీశనామకమైన వ్యూహవర్ణన జరిగింది. ఇపుడు గోముఖవ్యూహం చెప్పాలి. శంకిని, హాలిని, లంకావర్ణ, కల్కిని, యక్షిణి, మాలిని, వమని, రసాత్మని – ఈ అష్టశక్తులు ప్రథమావరణానికి చెందినవి. చండ, ఘంట, మహానాద, సుముఖి, దుర్ముఖి, బల, రేవతి, ప్రథమ, ఘోర, సైన్య, లీన, మహాబల, జయ, విజయ, అజిత మరియు అపరాజిత – ఈ పదహారు శక్తులు ద్వితీయావరణానికి చెందినవి. గోముఖవ్యూహం యొక్క వర్ణన చేయడం జరిగింది. ఇపుడు భద్రకర్ణీవ్యూహం విషయాన్ని వినండి.

**మహాజయా విరూపాక్షీ శుక్లాభాకాశమాతృకా ।**
**సంహారీ జాతహారీ చ దంష్ట్రాలీ శుష్కరేవతీ ॥94॥**

**ప్రథమావరణే చాష్టౌ శక్తయః పరికీర్తితాః ।**
**పిపీలికా పుణ్యహారీ అశనీ సర్వహారిణీ ॥95॥**

**భద్రహా విశ్వహారీ చ హిమా యోగేశ్వరీ తథా ।**
**ఛిద్రా భానుమతీ ఛిద్రా సైంహికో సురభీసమా ॥96॥**

**సర్వభవ్యా చ వేగాఖ్యా శక్తయః షోడశైవ తు ।**
**మహావ్యూహాష్టకం ప్రోక్తముపవ్యూహాష్టకం శృణు ॥97॥**

మహాజయ, విరూపాక్షి, శుక్లాభ, ఆకాశమాతృక, సంహారి, జాతహారి, దంష్ట్రాలి మరియు శుష్కరేవతి – వీరు ప్రథమావరణానికి చెందిన అష్టశక్తులు. పిపీలిక, పుణ్యహారి, అశని, సర్వహారిణి, భద్రహ, విశ్వహారి, హిమ, యోగేశ్వరి, ఛిద్ర, భానుమతి, ఛిద్ర, సైంహికి, సురభి, సమ, సర్వభవ్య అట్లే వేగ – వీరు ద్వితీయావరణం యొక్క పదహారు శక్తులు. ఈ అష్టశక్తుల యొక్క మహావ్యూహవర్ణనం జరిగింది. ఇపుడు ఎనిమిది ఉపవ్యూహాల్ని గూర్చి వినండి.

**అణిమావ్యూహమావేష్ట్య ప్రథమావరణే క్రమాత్ ।**
**ఐంద్రా తు చిత్రబానుశ్చ వారుణీ దండి రేవచ ॥98॥**

**ప్రాణరూపీ తథా హంసః స్వాత్మశక్తిఃపితామహః ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 99॥**

**కేశవో భగవాన్ రుద్రశ్చంద్రమా భాస్కరస్తథా ।**
**మహాత్మా చ తథా హ్యాత్మా హ్యంతరాత్మా మహేశ్వరః ॥100॥**

అణిమావ్యూహాన్ని ఆవేష్టించి ప్రథమావరణంలో క్రమంగా "ఇంద్ర, చిత్రభాను, వారుణి, దండి, ప్రాణరూపి, హంస, స్వాత్మశక్తి మరియు పితామహ" ఈ శక్తులున్నాయి. ప్రథమావరణం చెప్పబడింది. ఇపుడు ద్వితీయావరణం వినండి, కేశవుడు, భగవాన్ రుద్రుడు, చంద్రుడు, భాస్కరుడు, మహాత్మ, ఆత్మ, అంతరాత్మ, మహేశ్వరుడు, పరమాత్మ, సూక్ష్మజీవం, పింగళం, పురుషుడు, పశువు, భోక్త, భూపతి అట్లే భీముడు ఈ శక్తులు ద్వితీయావరణానికి చెందినవి. అణిమావ్యూహం చెప్పబడింది. ఇపుడు మీకు లఘిమ అనే వ్యూహాన్ని గూర్చి చెబుతున్నాను. శ్రీకంఠం, అంతం, సూక్ష్మం, త్రిమూర్తి, శశకం, అమరేశుడు, స్థితీశుడు మరియు దారతం – ఇవి అష్టశక్తులు. ప్రథామావరణాన్ని గూర్చి చెప్పాను. ఇపుడు ద్వితీయవరణం గూర్చి వినండి. స్థాణువు, హరుడు, దండేశుడు, సురశ్రేష్ఠుడు, భౌక్తీశుడు, సద్యోజాతుడు, అనుగ్రహేశుడు, క్రూరసేనుడు, సురేశ్వరుడు, క్రోధీశుడు, చండుడు, ప్రచండడు, శివుడు, ఏకరుద్రుడు, కూర్ముడు, ఏకనేత్రుడు అట్లే చతుర్ముఖుడు. ద్వితీయావరణంలో వీరు పదహారు రుద్రులు. ఓ సువ్రతా! లఘిమావ్యూహం యొక్క వర్ణనం చేయడం జరిగింది. ఇపుడు మహిమావ్యూహవర్ణనం చేయాలి.

**పరమాత్మా హ్యణుర్జీవః పుంలింగః పురుషః పశః ।**
**భోక్తా భూతపతిర్భీమో ద్వితీయావరణే స్మృతా ॥101॥**

**కథితశ్చాణిమా వ్యూహో లఘిమాఖ్యం వదామి తే ।**
**శ్రీకంఠోఽంతశ్చ సూక్ష్మశ్చ తథాష్టమః ॥102॥**

**అమరేశః స్థితీశశ్చ దారతశ్చ తథాష్టమః ।**
**ప్రథామావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥103॥**

**స్థాణుర్హరశ్చ దండేశో భౌక్తీశః సురపుంగవః ।**
**సద్యోజాతోఽనుగ్రహేశః క్రూరసేనః సురేశ్వరః ॥104॥**

**క్రోధీశశ్చ తథా చాండః ప్రచండః శివ ఏవ చ ।**
**ఏకరుద్రస్తథా కూర్మశ్చైకనేత్రశ్చతుర్ముఖః ॥105॥**

**ద్వితీయావరణే రుద్రాః షోడశైవ ప్రకీర్తితః ।**
**కథితో లఘిమావ్యూహో మహిమాం శృణు సువ్రత ॥106॥**

**అజేశః క్షేమరుద్రశ్చ సోమోంశో లాంగలీ తథా ।**
**దండారుశ్చార్ధనారీ చ ఏకాంతశ్చాంత ఏవచ ॥107॥**

**పాలీ భుజంగ నామా చ పినాకీ ఖడ్గిరేవచ ।**
**కామ ఈశస్తథా శ్వేతో భృగుః షోడశవై స్మృతాః ॥108॥**

**కథితో మహిమావ్యూహః ప్రాప్తివ్యూహం శృణుష్వ మే ।**
**సంవర్తో లకులీశశ్చ వాడవో హస్తిరేవ చ ॥109॥**

**చండయక్షో గణపతిర్మహాత్మా భృగుజోఽష్టమః ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 110॥**

**త్రివిక్రమో మహాజిహ్వో ఋక్షః శ్రీభద్ర ఏవ చ ।**
**మహాదేవో దధీచశ్చ కుమారశ్చ పరావరః ॥111॥**

**మహాదంష్ట్రః కరాలశ్చ సూచకశ్చ సువర్ధనః ।**
**మహాధ్వాంక్షో మహానందో దండీ గోపాలకస్తథా ॥112॥**

అజేశుడు, క్షేమరుద్రుడు, సోముడు, అంశుడు, లాంగలి, దండారుడు, అర్ధనారి, ఏకాంతుడు, అంతుడు, భుజంగుడు అట్లే పాలి, పినాకి, ఖడ్గి, కాముడు, ఈశుడు, శ్వేతుడు అట్లే భృగువు – ఈ పదహారు లఘిమా వ్యూహాలు. ఇపుడు మీరు ప్రతివ్యూహం యొక్క శ్రవణం చేయండి. సంవర్తం, లకులీశం, వాడవం, హస్తి, చండయక్ష, గణపతి, మహాత్మ, భృగుజ అనే ఈ ఎనిమిది ప్రథమావరణానికి చెందిన దేవతలు. ప్రథమావరణం చెప్పబడింది. ఇపుడు ద్వితీయావరణం వినండి. త్రివిక్రమ, మహాజిహ్వ, ఋక్ష, శ్రీభద్ర, మహాదేవుడు, దధీచి, కుమారుడు, పరావరుడు, మహాదంష్ట్రుడు, కరాలుడు, సూచకుడు, సువర్ధనుడు, మహాధ్వాంక్షుడు, మహానందుడు, దండి, అట్లే గోపాలుడు ఈ పదహారుగురు ద్వితీయావరణానికి చెందిన దేవతలు.

**ప్రాప్తివ్యూహః సమాఖ్యాతః ప్రాకామ్యం శృణు సువ్రత ।**
**పుష్పదంతో మహానాగో విపులానందకారకః ॥113॥**

**శుక్లో విశాలః కమలో బిల్వశ్చారుణ ఏవచ ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 114॥**

**రతిప్రియః సురేశానశ్చిత్రాంగశ్చ సుదుర్జయః ।**
**వినాయకః క్షేత్రపాలో మహామోహశ్చ జంగలః ॥115॥**

**వత్సపుత్రో మహాపుత్రో గ్రామదేశాదిపస్తథా ।**
**సర్వావస్థాధిపో దేవో మేఘనాదః ప్రచండకః ॥116॥**

**కాలదూతశ్చ కథితో ద్వితీయావరణం స్మృతమ్ ।**
**ప్రాకమ్యః కథితో వ్యూహః ఐశ్వర్యం కథయామి తే ॥117 ॥**

ఓ సువ్రతా! ప్రాప్తివ్యూహం చెప్పబడింది. ప్రాకామ్యవ్యూహం యొక్క శ్రవణం చేయి. పుష్పదంతం, మహానాగం, విపులానందకారకం, శుక్లం, విశాలం, కమలం, బిల్వం అట్లే అరుణం– ఈ ఎనిమిది ప్రథమావరణ సంబంధిదేవతలు. ప్రథమావరణవర్ణనం పూర్తి అయ్యింది. ఇపుడు ద్వితీయావరణవర్ణనం విను. రతిప్రియ, సరేశాన, చిత్రాంగ, సుదుర్జయ, వినాయక, క్షేత్రపాల, మహామోహ, జంగల, వత్సపుత్ర, మహాపుత్ర, గ్రామదేవాధిప,

సర్వావస్థాధిప, దేవ, మేఘనాథ, ప్రచండక, అట్లే కాలదూతాదులు పదహారు దేవతలు ద్వితీయావరణకు చెందినవారు. ప్రాకామ్యవ్యూహవర్ణన జరిగింది. ఇపుడు నేను ఐశ్వర్యవ్యూహవర్ణన చేస్తున్నాను.

**మంగళా చర్చికా చైవ యోగేశా హరదాయికా ।**
**భాసురా సురమాతా చ సుందరీ మాతృకాష్టమీ ॥118॥**

**ప్రథమావరణే ప్రోక్తా ద్వితీయావరణే శృణు ।**
**గణాధిపశ్చ మంత్రజ్ఞో వరదేవః షడాననః ॥119॥**

**విదిగ్ధశ్చ విచిత్రశ్చ అమోఘో మోఘ ఏవ చ ।**
**అశ్వీరుద్రశ్చ సోమేశశ్చోత్తమోదుంబరస్తథా ॥120॥**

**నారసింహశ్చ విజయస్తథా ఇంద్రగుహః ప్రభుః ।**
**అపాంపతిశ్చ విధినా ద్వితీయావరణం స్మృతమ్ ॥121॥**

**ఐశ్వర్యః కథితో వ్యూహో వశిత్వం పునరుచ్యతే ।**
**గగనో భవనశ్చైవ విజయో హ్యజయస్తథా ॥122॥**

**మహాజయస్తథాంగారో వ్యంగారశ్చ మహాయశాః ।**
**ప్రథమావరణే ప్రోక్తా ద్వితీయావరణే శృణు ॥123॥**

**సుందరశ్చ ప్రచండేశో మహావర్ణో మహాసురః ।**
**మహారోమా మహాగర్భః ప్రథమః కనకస్తథా ॥124॥**

**ఖరజో గరుడశ్చైవ మేఘనాథోఽథ గర్జకః ।**
**గజశ్చ ఛేదకో బాహుస్త్రిశిఖో మారిరేవ చ ॥125॥**

మంగళ, చర్చిక, యోగేశ, హరదాయిక, భాస్కర, సురమాత, సుందరి – వీరందరూ మాతృకలు – అష్టశక్తులు. ప్రథమావరణసంబంధులుగా చెప్పబడ్డారు. ఇపుడు ద్వితీయావరణవర్ణన విను. గణాధిపుడు, మంత్రజ్ఞుడు, వరదేవుడు, షడాననుడు, విదగ్ధుడు, విచిత్రుడు, అమోఘుడు, మోఘుడు, అశ్వీరుద్రుడు, సోమేశుడు, ఉత్తమోదుంబరుడు, నారసింహుడు, విజయుడు, ఇంద్రగుహుడు, ప్రభువు అట్లే అపాంపతి ఈ విధమైన వీరు ద్వితీయావరణ సంబంధులు. ఐశ్వర్యవ్యూహం చెప్పబడింది. ఇపుడు వశిత్వవ్యూహం చెప్పబడుతున్నది. గగనం, భవనం, విజయం, అజయం, మహాజయం, అంగారం, వ్యంగారం, అట్లే మహాయశం – వీరు ప్రథమావరణం యొక్క దేవతలు. ఇపుడు ద్వితీయావరణం విను. సుందర, ప్రచండేశ, మహావర్ణ, మహాసుర, మహారోమ, మహాగర్భ, ప్రథమ, కనక, ఖరజ, గరుడ, మేఘనాథ, గర్జక, గజ, ఛేదక బాహు, త్రిశిఖ, మారులు పదహారుగురు ద్వితీయావరణ దేవతలు.

**వశిత్వం కథితో వ్యూహః శృణు కామావసాయికమ్ ।**
**వినాదో వికటశ్చైవ వసంతోఽభయ ఏవ చ ॥126॥**

**విద్యున్మహాబలశ్చైవ కమలో దమనస్తథా ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 127॥**

**ధర్మశ్చాతిబలః సర్పో మహాకాయో మహాహనుః ।**
**స బలశ్చైవ భస్మాంగీ దుర్జయో దురతిక్రమః ॥128॥**
**బేతాళో రౌరవశ్చైవ దుర్ధరో భోగ ఏవ చ ।**
**వజ్రః కాలాగ్ని రుద్రశ్చ సద్యోనాదో మహాగుహః ॥129॥**

**ద్వితీయావరణం ప్రోక్తం వ్యూహశ్చైవావసాయికః ।**
**కథితః షోడశో వ్యూహో ద్వితీయావరణం శృణు ॥130॥**

వశిత్వ వ్యూహం యొక్క వర్ణనం చేశాను. ఇపుడు కామావసాయిత్వవ్యూహవర్ణనం విను. వినాదం, వికటం, వసంతం, అభయం, విద్యుత్తు, మహాబలం, కమలం, అట్లే దమనం వీరు ప్రథమావరణసంబంధి అష్టదేవతలు. ప్రథమావరణం చెప్పబడింది. ఇపుడు ద్వితీయావరణం గూర్చి విను. ధర్మం, అతిబలం, సర్వం, మహాకాయం, మహాహనువు, సబలం, భస్మాంగి దుర్జయం, దురతిక్రమం, బేతాళం, రౌరవం, దుర్ధరం, భోగం, వజ్రం, కాలాగ్ని రుద్ర, సద్యోనాదుడు అట్లే మహాగుహ – వీళ్లు ద్వితీయావరణం యొక్క దేవతలు. ద్వితీయావరణం చెప్పబడింది. ఆవసాయికవ్యూహవర్ణనం కూడా చెప్పబడింది. ఈ విధంగా పదహారు వ్యూహాల ఆవరణల గూర్చి చెప్పాను. ఇపుడు ఇతరమైన ఆవరణాల శ్రవణం చేయి.

**ద్వితీయావరణే చైవ దక్షవ్యూహే చ శక్తయః ।**
**ప్రథమావరణే చాష్టౌ బాహ్యే షోడశ ఏవ చ ॥131॥**

**మనోహరా మహానాదా చిత్రా చిత్రరథా తథా ।**
**రోహిణీ చైవ చిత్రాంగీ చిత్రరేఖా విచిత్రికా ॥132॥**

**ప్రథమావరణే ప్రోక్తే ద్వితీయావరణం శృణు ।**
**చిత్రా విచిత్ర రూపా చ శుభదా కామదా శుభా ॥ 133॥**

**క్రూరా చ పింగళా దేవీ ఖడ్గికా లంబికా సతీ ।**
**దంష్ట్రాలీ రాక్షసీ ధ్వంసీ లోలుపాలోహితాముఖీ ॥134॥**

**ద్వితీయావరణే ప్రోక్తాః షోడశైవ సమాసతః ।**
**దక్షవ్యూహః సమాఖ్యాతో దాక్షవ్యూహం శృణుష్వ మే ॥135॥**

రెండో ఆవరణలో దక్షవ్యూహం మొదటిది. ఇందులో మొదటి ఆవరణలో ఎనిమిది శక్తులు, మరియు బాహ్యాఆవరణలో పదహారు శక్తులు ఉన్నాయి. మనోహర, మహానాద, చిత్ర, చిత్రరథ, రోమిణి, చిత్రాంగి, చిత్రరేఖ, అట్లే విచిత్రిక ఈ ఎనిమిది శక్తులు ప్రథమావరణంలోనివి. ఇపుడు రెండో ఆవరణం గూర్చి విను. చిత్ర, విచిత్రరూప, శుభద, కామద, శుభ, క్రూర, పింగళ, దేవి, ఖడ్గిక, లంబిక, సతి, దంష్ట్రాలి, సాక్షరి, ధ్వంసి, లోలుప, మరియు లోహితాముఖి – ద్వితీయావరణలో ఈ పదహారు శక్తులున్నాయి. దక్షవ్యూహం సంగ్రహంగా చెప్పబడింది. ఇపుడు నీవు దాక్షవ్యూహాన్ని గూర్చి విను.

**సర్వాసతీ విశ్వరూపా లంపటా చామిషప్రియా ।**
**దీర్ఘ దంష్ట్రా చ వజ్రా చ లంబోష్ఠీ ప్రాణహారిణీ ॥136॥**

**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ।**
**గజకర్ణాశ్వకర్ణా చ మహాకాళీ సుభీషణా ॥137॥**

**వాతవేగరవా ఘోరా ఘనా ఘనరవా తథా ।**
**వరఘోషా మహావర్ణా సుఘంటా ఘంటికా తథా ॥138॥**

**ఘంటేశ్వరీ మహాఘోరా ఘోరా చైవాతిఘోరికా ।**
**ద్వితీయావరణే చైవ షోడశైవ ప్రకీర్తితాః ॥139॥**

**దాక్షవ్యూహఃసమాఖ్యాతశ్చండవ్యూహం శృణుష్వ మే ।**
**అతిఘంటా చాతిఘోరా కరాలా కరభా తథా ॥140॥**

**విభూతిర్భోగదా కాంతిః శంఖినీ చాష్టమా స్మృతా ।**
**ప్రథమావరణే ప్రోక్తా ద్వితీయావరణే శృణు ॥141॥**

**పత్రిణీ చైవ గాంధారీ యోగమాతా సుపీవరా ।**
**రక్తా మాలాంశుకా వీరా సంహారీ మాంసహారిణీ ॥142॥**

**ఫలహారీ జీవహారీ స్వేచ్ఛాహారీ చ తుండికా ।**
**రేవతీ రంగిణీ సంగా ద్వితీయే షోడశైవ తు ॥143॥**

సర్వాసతి, విశ్వరూప, లంపట, ఆమిషప్రియ, దీర్ఘదంష్ట్ర, వజ్ర, లంబోష్ఠి, అట్లే ప్రాణహారిణి – వీరు దాక్షవ్యూహం యొక్క ప్రథమావరణం యొక్క శక్తులు. ప్రథమావరణం చెప్పబడింది. ఇపుడు ద్వితీయావరణం గూర్చి విను. గజకర్ణ, అశ్వకర్ణ, మహాకాళి, సుభీషణ, వాతవేగరవ, ఘోర, ఘన, ఘనరవ, వరఘోష, మహావర్ణ, సుఘంట, ఘంటేశ్వరి, మహాఘోర, ఘోర, అట్లే అతిఘోరిక – ద్వితీయావరణంలో ఈ పదహారుగురు శక్తులు. దాక్షవ్యూహంయొక్క వర్ణనం చేయబడింది. ఇపుడు చండవ్యూహ వర్ణనం విను. అతిఘంట, అతిఘోర, కరాళ, కరభ, విభూతి, భోగద, కాంతి, అట్లే శంఖిణి–ఈ ఎనిమిది ప్రథమావరణంలోని శక్తులు. ఇపుడు ద్వితీయావరణవర్ణనం విను. పత్రిణీ, గాంధారి, యోగమాత, సుపీరవ, రక్త, మాలాంశుక, వీర, సంహారి, మాంసహారిణి, ఫలహారి, జీవహారి, స్వేచ్ఛాహారి, తుండిక, రేవతి, రంగిణి అట్లే సంగ– వీరు ద్వితీయావరణానికి చెందిన పదహారు శక్తులు.

**చండవ్యూహః సమాఖ్యాత శ్చండావ్యూహస్తథోచ్యతే ।**
**చండీ చండముఖీ చండా చండవేగా మహారవా ॥144॥**

**భ్రుకుటీ చండభూశ్చైవ చండరూపాష్టమీ స్మృతా ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 145॥**

**చంద్రఘ్రాణా బలాచైవ బలజిహ్వా బలేశ్వరీ ।**
**బలవేగా మహాకాలా మహాకోపో చ విద్యుతా ॥146॥**

**కంకాళీ  కలశీ చైవ విద్యుతా చండగోషితా ।**
**మహాఘోషా మహారావా చండభానంగచండికా ॥ 147॥**

**చండాయాః కథితో వ్యూహో హరవ్యూహం శృణుష్వ మే ।**
**చండాక్షీ కామదా దేవీ సూకరీ కుక్కటాననా ॥148॥**

**గాంధారీ దుందుభీ దుర్గా సౌమిత్రా చాష్టమీ స్మృతా ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 149॥**

**మృతోద్భవా మహాలక్ష్మీర్వర్ణగా జీవరక్షిణీ ।**
**హరిణీ క్షీణజీవా చ దండవక్త్రా చతుర్భుజా ॥150॥**

**వ్యోమచారీ వ్యోమరూపా వ్యోమవ్యాపీ శుభోదయా ।**
**గృహచారీ సుచారీ చ విషాహారీ విషార్తిహా ॥151॥**

చండవ్యూహం చెప్పబడింది. ఇపుడు చండా వ్యూహం చెబుతున్నాను. చండి, చండముఖి, చండ, చండవేగ, మహారవ, భ్రుకుటి, చండభు, చండరూప ఇవి అష్టవిధశక్తులు. ప్రథమావరణాన్ని గూర్చి చెప్పాను. ఇపుడు ద్వితీయావరణాన్ని చెబుతాను విను. చంద్రఘ్రాణ, బల, బలజిహ్వా, బలేశ్వరి, బలవేగ, మహాకాయ, మహాకోప, విద్యుత, కంకాళి, కలశి, చండఘోషిక, మహాఘోష, మహారావ, చండభ, అనంగ, చండిక ఈ పదహారు శక్తులు ద్వితీయావరణానికి చెందినవి. చండావ్యూహ వర్ణనం చేశాను. ఇపుడు హరవ్యూహ విషయం విను. చండాక్షి, కామద దేవి, సూకరి, కుక్కుటానన, గాంధారి, దుందుభి, దుర్గ, సౌమిత్రిక – వీరు అష్టశక్తులు. ప్రథమావరణం గూర్చి చెప్పాను. ఇపుడు ద్వితీయావరణాన్ని విను. మృతోద్భవ, మహాలక్ష్మి, వర్ణద, జీవరక్షిణి, హరిణి, క్షీణజీవ, దండవక్త్ర, చతుర్భుజ, వ్యోమచారి, వ్యోమరూప, వ్యోమవ్యాపి, శుభోదయ, గృహచారి, సుచారి, విషాహారి, విషార్తిహ – వీళ్లు పదహారుగురు ద్వితీయావరణ శక్తులు.

**హరవ్యూహః సమాఖ్యాతో హరాయా వ్యూహ ఉచ్యతే ।**
**జంభాచ్యుతా చ కంకారీ దేవికా దుర్ధరా వహా ॥152॥**

**చండికా చపలా చేతి ప్రథమావరణే స్మృతాః ।**
**చండికా చామరీ చైవ భండికా చ శుభాననా ॥153॥**

**పిండికా ముండినీ ముండా శాకినీ శాంకరీ తథా ।**
**కర్తరీ భర్తరీ చైవ భాగినీ యజ్ఞదాయినీ ॥154॥**

**యమదంష్ట్రా మహాదంష్ట్రా కరాలా చేతి శక్తయః ।**
**హరాయాః కథితో వ్యూహః శౌండవ్యూహం శృణుష్వ మే ॥155॥**

**వికరాలీ కరాలీ చ కాలజంఘా యశస్వినీ ।**
**వేగా వేగవతీ యజ్ఞా వేదాంగా చాష్టమీ స్మృతా ॥ 156॥**

**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ।**
**వజ్రా శంఖాతిశంఖా వా బలా చైవాబలా తథా ॥ 157॥**

**అంజనీ మోహినీ మాయా వికటాంగీ నలీ తథా ।**
**గండకీ దండకీ ఘోణా శోణా సత్యవతీ తథా ॥158॥**

**కల్లోలా చేతి క్రమశః షోడశైవ యథావిధి ।**
**శౌండవ్యూహః సమాఖ్యాతః శౌండాయా వ్యూహ ఉచ్యతే ॥ 159॥**

హరవ్యూహం యొక్క వర్ణన జరిగింది. ఇపుడు హరావ్యూహ వర్ణన చెబుతున్నాను. జంభ, అచ్యుత, కంకారి, దేవిక, దుర్ధర, వహ, చండిక, అట్లే చపల –ఈ ఎనిమిదిమంది శక్తులు. ప్రథమావరణం చెప్పబడింది. చండిక, చామరి, భండిక, శుభానన, పిండిక, ముండిని, ముండ, శాకిని, శాంకరి, కర్తరి, భర్తరి, భాగిని, యజ్ఞదాయిని, యమదంష్ట్ర, మహాదంష్ట్ర అట్లే కరాల – వీరు ద్వితీయావరణకు చెందిన పదహారు శక్తులు. హరావ్యూహం చెప్పబడింది. ఇప్పుడు శౌండవ్యూహం విను. వికరాలి, కరాలి, కాలజంఘ, యశస్విని, వేగ, వేగవతి, యజ్ఞ, వేదాంగ – వీరు అష్టశక్తులు. ప్రథమావరణ చెప్పబడింది. ఇపుడు ద్వితీయావరణం విను. వజ్ర, శంఖ, అతిశంఖ, బల, అబల, అంజని, మోహిని, మాయ, వికటాంగి, నళి, గండకి, దండకి, ఘోణ, శోణ, సత్యవతి, అట్లే కల్లోల – వీరు క్రమంగా పదహారు శక్తులు. శౌండ వ్యూహం చెప్పబడింది. ఇపుడు శౌండా వ్యూహాన్ని చెబుతా విను.

**దంతురా రౌద్రభాగా చ అమృతా సకులా శుభా ।**
**జలజిహ్వార్యనేత్రా రూపిణీ దారికా తథా ॥160॥**

**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ।**
**ఖాదికా రూపనామా చ సంహారీ చ క్షమాంతకా ॥161॥**

**కండినీ పేషిణీ చైవ మహాత్రాసా కృతాంతికా ।**
**దండినీ కింకరీ బింబా వర్ణినీ చామలాంగినీ ॥162॥**

**ద్రవిణీ ద్రావిణీ చైవ శక్తయః షోడశైవ తు ।**
**కథితో హి మనోరమ్యః శౌండాయా వ్యూహ ఉత్తమః ॥163॥**

దంతుర, రౌద్రభాగ, అమృత, శుభసకుల, చలజిహ్వా, ఆర్యనేత్ర, రూపిణి అట్లే దారిక–వీరు ప్రథమా వతరణానికి చెందిన అష్టశక్తులు. ప్రధామావరణం చెప్పబడింది. ఇపుడు ద్వితీయావరణాన్ని విను. ఖాదిక,రూపనామ, సంహారి, క్షమ, అంతక, కండిని, పేషిణి, మహాత్రాస, కృతాంతిక, దండిని, కింకరి, బింబ, వర్ణిని, అమలాంగిని, ద్రవిణి, అట్లే ద్రావిణి – వీరు పదహారు శక్తులు. మనోరమ, ఉత్తమమయిన శౌండావ్యూహాన్ని గూర్చి చెప్పాను.

**ప్రథమాఖ్యం ప్రవక్ష్యామి వ్యూహం పరమశోభనమ్ ।**
**ప్లవినీ ప్లావనీ శోభా మందా చైవ మదోత్కటా ॥164॥**

**మందాక్షేపా మహాదేవీ ప్రథమావరణే స్మృతాః ।**
**కామసందీపినీ దేవీ అతిరూపా మనోహరా ॥165॥**

**మహావశా మదగ్రాహా విహ్వలా మదవిహ్వలా ।**
**అరుణా శోషణా దివ్యా రేవతీ భాండనాయికా ॥166॥**

**స్తంభినీ ఘోరరక్తాక్షీ స్మరరూపా సుఘోషణా ।**
**వ్యూహః ప్రథమ ఆఖ్యాతః స్వాయంభువ యథా తథా ॥167॥**

**కథితం ప్రథమావ్యూహం ప్రవక్ష్యామి శృణుష్వ మే ।**
**ఘోరా ఘోరతరాఘోరా అతి ఘోరాఘనాయికా ॥ 168॥**

**ధావనీ క్రోష్టుకా ముండా చాష్టమీ పరికీర్తితా ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 169॥**

**భీమా భీమతరాభీమా శస్తా చైవ సువర్తులా ।**
**స్తంభినీ రోదనీ రౌద్రా రుద్రవత్యచలాచలా ॥170॥**

**మహాబలా మహాశాంతిః శాలా శాంతా శివాశివా ।**
**బృహత్కక్షా మహానాసా షోడశైవ ప్రకీర్తితాః ॥171॥**

అనంతరం నేను ప్రథమ అనే పేరుగల పరమసుందరమైన వ్యూహాన్ని వర్ణిస్తున్నా. ప్లవిని, ప్లావని, శోభ, మంద, మదోత్కట, మంద, ఆక్షేప, మహాదేవి - వీరు ప్రథమావరణ దేవతలు. కామసందీపనీ దేవి, అతిరూప, మనోహర, మహావశ, మదగ్రాహా, విహ్వల, మదవిహ్వల, అరుణ, శోషణ, దివ్య, రేవతి, భాండనాయిక, స్తంభిని, ఘోరరక్తాక్షి, స్మరరూప, అట్లే సుఘోషణ-వీరు ద్వితీయావరణశక్తులు. ఓ స్వాయంభువా! ప్రథమవ్యూహం యొక్క వర్ణన చేశాను. ఇపుడు ప్రథమావ్యూహంయొక్క వర్ణన చేస్తాను. విను. ఘోర, ఘోరతర, అఘోర, అతిఘోర, అఘనాయిక, ధావని, క్రోష్టుక, మరియు ముండ వీరు మొదటి ఆవరణయొక్క శక్తులు. మొదటి ఆవరణం చెప్పబడింది. ఇపుడు రెండో ఆవరణం గూర్చి విను. భీమ, భీమతర, అభీమ, శస్త సువర్తుల, స్తంభిని, రోదని, రౌద్ర, రుద్రవతి, అచలాచల, మహాబల, మహాశాంతి, శాల, శాంత, శివాశివ, బృహత్కక్ష, మహానాస వీరు రెండో ఆవరణం యొక్క పదహారు శక్తులు.

**ప్రథమాయాః సమాఖ్యాతో మన్మథవ్యూహ ఉచ్యతే ।**
**తాలకర్ణీచ బిలా చ కళ్యాణీ కపిలా శివా ॥172॥**

**ఇష్టిస్తుష్టిః ప్రతిజ్ఞా చ ప్రథమావరణే స్మృతాః ।**
**ఖ్యాతిఃపుష్టికరీ తుష్టిర్జలా చైవ శ్రుతిర్ధృతిః ॥173॥**

**కామదా శుభదా సౌమ్యా తేజినీ కామతంత్రికా ।**
**ధర్మా ధర్మవశా శీలా పాపహా ధర్మవర్ధినీ ॥174॥**

**మన్మథః కథితో వ్యూహో మన్మథాయాః శృణుష్వ మే ।**
**ధర్మరక్షా విధినా చ ధర్మా ధర్మవతీ తథా ॥175॥**

**సుమతిర్దుర్మతిర్మేధా విమలా చాష్టమీ స్మృతా ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 176॥**

**శుద్ధిర్బుద్ధిర్ద్యుతిః కాంతిర్వర్తులా మోహవర్ధినీ ।**
**బలా చాతిబలా భీమా ప్రాణవృద్ధికరీ తథా ॥177॥**

**నిర్లజ్జా నిర్ఘృణా మందా సర్వపాపక్షయంకరీ ।**
**కపిలా చాతివిధురా షోడశైతాః ప్రకీర్తితాః ॥178॥**

ప్రథమావ్యూహవర్ణన చేయబడింది. ఇపుడు మన్మథవ్యూహం చెబుతున్నాను. తాలకర్ణి, బాల, కల్యాణి, కపిల, శివ, ఇష్టి, తుష్టి, ప్రతిజ్ఞ వీరు మొదటి ఆవరణశక్తులు. ఖ్యాతి, పుషికరి, తుష్టి, జల, శ్రుతి, ధృతి, కామద, శుభద, సౌమ్య, తేజిని, కామతంత్రిక, ధర్మ, ధర్మవశ, శీల, పాపహ, అట్లే ధర్మవర్ధిని – వీరు రెండో ఆవరణంలోని పదహారు శక్తులు. మన్మథవ్యూహం చెప్పబడింది. ఇపుడు మన్మథావ్యూహం విను. ధర్మరక్ష, విధాన, ధర్మ, ధర్మవతి, సుమతి, దుర్మతి, మేధ అట్లే విమల – వీరు అష్టశక్తులు. ప్రథమావరణం చెప్పాను. ఇపుడు రెండో ఆవరణం విను. శుద్ధి, బుద్ధి, ద్యుతి, కాంతి, వర్తుల, మోహవర్ధిని, బల, అతిబల, భీమ, ప్రాణవృద్ధి కరి, నిర్లజ్జ, నిర్ఘృణ, మంద, సర్వపాపక్షయంకరి, కపిల, అట్లే అతి విధుర ఇవి పదహారు శక్తులు.

**మన్మథాయిక ఉక్తస్తే భీమవ్యూహం వదామి చ ।**
**రక్తాచైవ విరక్తా చ ఉద్వేగా శోకవర్ధినీ ॥179॥**

**కామా తృష్ణా క్షుధా మోహా చాష్టమీ పరికీర్తితా ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥180॥**

**జయా నిద్రా భయాలస్యా జలతృష్ణోదరీ దరా ।**
**కృష్ణా కృష్ణాంగినీ వృద్ధా శుద్ధోచ్ఛిష్టాశనీ వృషా ॥181॥**

**కామనా శోభినీ దగ్ధా దుఃఖదా సుఖదావళీ ।**
**భీమవ్యూహః సమాఖ్యాతో భీమాయీవ్యూహ ఉచ్యతే ॥182॥**

**ఆనందా చ సునందా చ మహానందా శుభంకరీ ।**
**వీతరాగా మహెూత్సాహా జితరాగా మనోరథా ॥183॥**

**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ।**
**మనోన్మనీ మనః క్షోభా మదోన్మత్తా మదాకులా ॥184॥**

**మందగర్భా మహాభాసా కామానందా సువిహ్వలా ।**
**మహావేగా సువేగా చ మహాభోగా క్షయావరా ॥185॥**

**క్రమిణీ క్రామణీ వక్రా ద్వితీయావరణే స్మృతాః ।**
**కథితం తవ భీమాయీవ్యూహం పరమశోభనమ్ ॥186॥**

నేనిపుడు మన్మథావ్యూహం యొక్క వర్ణనం చేశాను. నేను ఇపుడు భీమవ్యూహంగూర్చి చెబుతున్నాను. రక్త, విరక్తా, ఉద్వేగ, శోకవర్ధిని, కామ, తృష్ణ, క్షుధ, మోహ అనే ఈ ఎనిమిది శక్తులు. మొదటి ఆవరణం గూర్చి చెప్పాను. ఇపుడు రెండో ఆవరణాన్ని గూర్చి విను. జయ, నిద్ర, భయ, ఆలస్య, జలతృష్ణోదరి, దర, కృష్ణ, కృష్ణాంగిని, వృద్ధ, శుద్ధోచ్ఛిష్టాశని, వృష, కామన, శోభిని, దగ్ధ, దుగ్ధ, దుఃఖద, అట్లే సుఖదావళి–ఇవి పదహారు శక్తులు. భీమ వ్యూహాన్ని చెప్పాను. ఇపుడు భీమా వ్యూహాన్ని గూర్చి చెబుతున్నాను. ఆనంద, సునంద, మహానంద, శుభంకరి,

వీతరాగ, మహోత్సాహ, జితరాగ అట్లే మనోరథ–ఈ అష్టశక్తులు ప్రథమావరణానికి చెందినివి. ప్రథమావరణాన్ని గూర్చి చెప్పాను. ఇప్పుడు రెండో ఆవరణాన్ని విను. మనోన్మని, మనఃక్షోభ, మదోన్మత్త, మదాకుల, మందగర్భ, మహాభాస, కామ, ఆనంద, సువిహ్వల, మహావేగ, సువేగ, మహాభోగ, క్షయావహ, క్రమిణి, క్రామణి అట్లే వక్ర ఇవి రెండో ఆవరణపు శక్తులు అత్యంతసుందరమైన భీమావ్యూహాన్ని గూర్చి చెప్పాను.

**శాకునం కథయామ్యద్య స్వాయంభువ మనోత్సుకమ్ ।**
**యోగా వేగా సువేగా చ అతివేగా సువాసినీ ॥187॥**

**దేవీ మనోరయా వేగా జలావర్తా చ ధీమతీ ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 188॥**

**రోధినీ క్షోభిణీ బాలా విప్రాశేషాసు శోషిణీ ।**
**విద్యుతా భాసినీ దేవీ మనోవేగా చ చాపలా ॥189॥**

**విద్యుజ్జిహ్వా మహాజిహ్వా భృకుటీ కుటిలాననా ।**
**ఫుల్లజ్వాలా మహాజ్వాలా సుజ్వాలా చ క్షయాంతికా ॥190॥**

**శాకునః కథితో వ్యూహః శాకునాయాః శృణుష్వ మే ।**
**జ్వాలినీ చైవ భస్మాంగీ తథా భస్మాంతగా తతా ॥191॥**

**భావినీ చ ప్రజా విద్యా ఖ్యాతిశ్చైవాష్టమీ స్మృతా ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 192॥**

**ఉల్లేఖా చ పతాకా చ భోగా భోగవతీ ఖగా ।**
**భోగభోగవ్రతా యోగా భోగాఖ్యాయోగపరాయణా ॥193॥**

**బుద్ధిర్బుద్ధిర్ధృతిః కాంతిః స్మృతిః సాక్షాచ్ఛ్రుతిర్ధరా ।**
**శాకునాయా మహావ్యూహః కథితః కామదాయకః ॥194॥**

ఓ స్వాయంభువా! ఇపుడు నేను మనోహరమైన శాకునవ్యూహాన్ని గూర్చి చెబుతున్నాను. యోగ, వేగ, సువేగ, అతివేగ, దేవి, సువాసిని, మనోరయావేగ, జలావర్తా మరియు ధీమతి – వీరు ప్రథమావరణానికి చెందిన అష్ట శక్తులు. ప్రథమావరణం చెప్పబడింది. ఇపుడు ద్వితీయావరణం విను, రోధిని, క్షోభిణి, బాల, విప్రాశేష, సుశోషిణి, విద్యుత, దేవి, భాసిని, మనోవేగ, చాపల, విద్యుజ్జిహ్వా, మహాజిహ్వా, భృకుటి, కుటిలానన, ఫుల్లజ్వాల, మహాజ్వాల, సుజ్వాల, మరియు క్షయాంతిక – వీరందరు శకునవ్యూహ సంబంధి శక్తులు, శకున వ్యూహం చెప్పబడింది. ఇపుడు శాకునావ్యూహం విను. జ్వాలిని, భస్మాంగి, భస్మాంగత, తత, భావిని, ప్రజ, విద్య అట్లే ఖ్యాతి ఇవి అష్ట శక్తులు, ప్రథమావరణం చెప్పాను. ఇపుడు రెండో ఆవరణం విను. ఉల్లేఖ, పతాక, భోగ, భోగవతి, ఖగ, భోగ భోగవ్రత, యోగ, భోగాఖ్య, యోగపరాయణ, బుద్ధి, బుద్ధి, ధృతి, కాంతి, స్మృతి, శ్రుతి మరియు ధర– ఇవి పదహారు శక్తులు. కోరికల్ని తీర్చుకునే ప్రయత్నంతో ఉన్నవారికై ఈ గొప్ప శాకునావ్యూహం చెప్పబడింది.

**స్వాయంభువ శృణు వ్యూహం సుమత్యాఖ్యం సుశోభనమ్ ।**
**పరేష్టా చ పరాదృష్టా హ్యమృతా ఫలనాశినీ ॥195॥**

**హిరణ్యాక్షీ సువర్ణాక్షీ దేవీ సాక్షాత్కపింజలా ।**
**కామరేఖా చ కథితం ప్రథమావరణం శృణు ॥196॥**

**రత్నద్వీపా చ సుద్వీపా రత్నదా రత్నమాలినీ ।**
**రత్నశోభా సుశోభా చ మహాశోభా మహాద్యుతిః ॥ 197॥**

**శాంబరీ బంధురాగ్రంథిః పాదకర్ణా కరాననా ।**
**హయగ్రీవా చ జిహ్వా చ సర్వభాసేతి శక్తయః ॥198॥**

**కథితః సుమతివ్యూహః సుమత్యా వ్యూహ ఉచ్యతే ।**
**సర్వాశీ చ మహాభక్షా మహాదంష్ట్రాతిరౌరవా ॥199॥**

**విస్ఫులింగా విలింగా చ కృతాంతా భాస్కరాననా ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 200॥**

**రాగా రంగవతీ శ్రేష్ఠా మహాక్రోధా చ రౌరవా ।**
**క్రోధనీ వసనీ చైవ కలహా చ మహాబలా ॥201॥**

**కలంతికాచతుర్భేదా దుర్గావై దుర్గమానినీ ।**
**నాలీ సునాలీ సౌమ్యా చ ఇత్యేవం కథితం మయా ॥202॥**

ఓ స్వాయంభువా! ఇపుడు అతిసుందరమైన సుమతి వ్యూహాన్ని గూర్చి విను. ఇందులో ప్రథమావరణంలో ఎనిమిది శక్తులున్నాయి. పరేష్ట, పరాదృష్ట, అమృత, ఫలనాశిని, హిరణ్యాక్షి, సువర్ణాక్షి, దేవీకపింజల, అట్లే కామరేఖ. మొదటి ఆవరణం చెప్పాను. ఇపుడు రెండో ఆవరణం విను. రత్నద్వీప, సుదీప, రత్నద, రత్నమాలిని, రత్నశోభ, సుశోభ, మహాశోభ, మహాద్యుతి, శాంబరి, బంధుర, గ్రంథి, పాదకర్ణ, కరానన, హయగ్రీవ, జిహ్వా మరియు సర్వభాస – ఇవి పదహారు శక్తులు. సుమతి వ్యూహం చెప్పాను. ఇపుడు సుమత్యా వ్యూహం చెబుతున్నాను. సర్వాశి, మహాభక్ష, మహాదంష్ట్ర, అతిరౌరవ, విస్ఫులింగ, విలింగ, కృతాంత, అట్లే భాస్కరానన ఇవి మొదటి ఆవరణయొక్క ఎనిమిది శక్తులు. ప్రథమావరణ చెప్పబడింది. ఇపుడు రెండో ఆవరణను గూర్చి విను. రాగా, రంగవతి, శ్రేష్ఠ, మహాక్రోధ, రౌరవ, క్రోధని, వసని, కలహ, మహాబల, కలంతిక, చతుర్భేద, దుర్గ, దుర్గమానిని, నాళి, సునాళి, అట్లే సౌమ్య–ఇవి పదహారు శక్తులు. రెండో ఆవరణ చెప్పబడింది.

**గోపవ్యూహం వదామ్యత్ర శృణు స్వాయంభువాఖిలమ్ ।**
**పాటలీ పాటవీ చైవ పాటీ విటిపిటా తథా ॥203॥**

**కంకటా సుపటా చైవ ప్రఘటా చ ఘటోద్భవా ।**
**ప్రథమావరణం చాత్ర భాషయా కథితం మయా ॥204॥**

**నాదాక్షీ నాదరూపా చ సర్వకారీ గమాగమా ।**
**అనుచారీ సుచారీ చ చండనాడీ సువాహినీ ॥205॥**

**సుయోగా చ వియోగా చ హంసాఖ్యా చ విలాసినీ ।**
**సర్వగా సువిచారా చ వంచనీ చేతి శక్తయః ॥206॥**

**గోపవ్యూహః సమాఖ్యాతో గోపాయీవ్యూహ ఉచ్యతే ।**
**భేదినీ చ్ఛేదినీ చైవ సర్వకారీ క్షుధాశనీ ॥207॥**

**ఉచ్ఛుష్మా చైవ గాంధారీ భస్మాశీ బడబానలా ।**
**ప్రథమావరణం చైవ ద్వితీయావరణం శృణు ॥208॥**

**అంధా బాహ్వాసినీ బాలా దీపాక్షమా తథైవ చ ।**
**అక్షా త్ర్యక్షా చ హృల్లేఖా హృద్గతా మాయికాపరా ॥209॥**

**అమయాసాదినీ భిల్లీ సహ్యాసహ్యా సరస్వతీ ।**
**రుద్రశక్తిర్మమాశక్తిర్మహామోహా చ గోనదీ ॥210॥**

ఓ స్వాయంభువా! నేనిపుడు గోపవ్యూహాన్ని గూర్చి చెబుతున్నాను. నీవు దాన్ని అంతా విను. పాటలి, పాటవి, పాటి, విటిపిట, కంకట, సుపట, ప్రఘుట, అట్లే ఘటోద్భవ – వీరు ప్రథమావరణానికి చెందిన ఎనిమిది శక్తులు. మొదటి ఆవరణాన్ని గూర్చి చెప్పాను. నాదాక్షి, నాదరూప, సర్వకారి, గమ, అగమ, అనుచారి, సుచారి, చండనాడి, సువాహిని, సుయోగ, వియోగ, హంస, విలాసిని, సర్వగ, సువిచార, అట్లే వంచని ఇవి రెండో ఆవరణపు శక్తులు. గోపవ్యూహాన్ని గూర్చి చెప్పాను.ఇపుడు గోపాయీవ్యహంయొక్క వర్ణన చేస్తున్నాను. భేదిని, ఛేదిని, సర్వకారి, క్షుధాశని, ఉచ్ఛుష్మ, గాంధారి, భస్మాశి అట్లే బడబానల – వీరు మొదటి ఆవరణఅష్టశక్తులు. ప్రథమావరణం చెప్పబడింది. ఇపుడు ద్వితీయావరణం విను. అంథ, బాహ్వాసిని, బాల, దీపాక్షమ, అక్ష, త్ర్యక్ష, హృల్లేఖ, హృద్గతామాయికాపర, ఆమయాసాదిని, భిల్లి, సహ్యాసహ్య, సరస్వతి, రుద్రశక్తి, మహాశక్తి, మహామోఘ మరియు గోనది – ఇవి ద్వితీయావరణం యొక్క పదహారు గోపాయీ వ్యూహం శక్తులు.

**గోపాయీ కథితో వ్యూహో నందవ్యూహం వదామి తే ।**
**నందినీ చ నివృత్తిశ్చ ప్రతిష్ఠా చ యథాక్రమమ్ ॥ 211॥**

**విద్యానాసా ఖగ్రసినీ చాముండా ప్రియదర్శినీ ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 212॥**

**గృహ్యా నారాయణీ మోహా ప్రజా దేవీ చ చక్రిణీ ।**
**కంకటా చ తథా కాళీ శివాద్యోషా తతః పరమ్ ॥ 213॥**

**విరామా యా చ వాగీశీ వాహినీ భీషణీ తథా ।**
**సుగమా చైవ నిర్దిష్టా ద్వితీయావరణే స్మృతా ॥214॥**

**నందవ్యూహో మయా ఖ్యాతో నందాయావ్యూహ ఉచ్యతే ।**
**వినాయకీ పూర్ణిమా చ రంకారీ కుండలీ తథా ॥215॥**

**ఇచ్ఛా కపాలినీ చైవ దీపినీ చ జయంతికా ।**
**ప్రథమావరణే చాష్టౌ శక్తయః పరికీర్తితాః ॥216॥**

**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ।**
**పావనీ చాంబికా చైవ సర్వాత్మా పూతనా తథా ॥217॥**

**ఛగలీ మోదినీ సాక్షాద్దేవీ లంబోదరీ తథా ।**
**సంహారీ కాళినీ చైవ కుసుమా చ యథాక్రమమ్ ॥218॥**

**శుక్రా తారా తథా జ్ఞానా క్రియా గాయత్రికా తథా ।**
**సావిత్రీ చేతి విధినా ద్వితీయావరణం స్మృతమ్ ॥219॥**

గోపాయీ వ్యూహాన్ని గూర్చి చెప్పాను. ఇపుడు నందవ్యూహాన్ని గూర్చి చెబుతున్నాను. నందిని, నివృత్తి, ప్రతిష్ఠ, విద్య, నాస, ఖగ్రసిని, చాముండ, అట్లే ప్రియదర్శిని – వీరు మొదటి ఆవరణపు శక్తులు. మొదటి ఆవరణం చెప్పబడింది. ఇపుడు రెండో ఆవరణను గూర్చి విను. గృహ్యా, నారాయణి, మోహా, ప్రజాదేవి, చక్రిణి, కంకట, కాళి, శివ, ఆద్య, ఉష, విరామ, వాగీశి, వాహిని, భీషణి, సుగమ అట్లే నిర్దిష్ట ఈ పదహారు శక్తులు రెండో ఆవరణానికి చెందినవి. నందవ్యూహాన్ని గూర్చి చెప్పాను. ఇపుడు నందావ్యూహాన్ని గూర్చి చెబుతున్నాను విను. వినాయకి, పూర్ణిమ, రంకారి, కుండలి, ఇచ్ఛ, కపాలిని, దీపిని, తథా జయంతిక, ఇవి ప్రథమావరణానికి చెందిన అష్టశక్తులు. ప్రథమావరణం చెప్పబడింది. ఇపుడు ద్వితీయావరణం విను. పావని, అంబిక, సర్వాత్మ, పూతన, ఛగలి, మోదిని, దేవి లంబోదరి, సంహారి, కాళిని, కుసుమ, శుక్ర, తార, జ్ఞాన, క్రియ, గాయత్రి అట్లే సావిత్రి – వీరు క్రమంగా పదహారు దేవతలు. ఇలా నందావ్యూహం ద్వితీయావరణం చెప్పబడింది.

**నందాయాః కథితో వ్యూహః పైతామహమతః పరమ్ ।**
**నందినీ చైవ ఫేత్కారీ క్రోధా హంసా షడంగులా ॥220॥**

**ఆనందా వసుదుర్గా చ సంహారా హ్యమృతాష్టమీ ।**
**ప్రథమావరణం ప్రోక్తం ద్వితీయావరణం శృణు ॥ 221॥**

**కులాంతికానలా చైవ ప్రచండా మర్దినీ తథా ।**
**సర్వభూతాభయా చైవ దయా చ బడబాముఖీ ॥222॥**

**లంపటా పన్నగా దేవీ కుసుమా విపులాంతకా ।**
**కేదారా చ తథా కూర్మా దురితా మందరోదరీ ॥223॥**

**ఖడ్గచక్రేతి విధినా ద్వితీయావరణం స్మృతమ్ ।**
**వ్యూహః పైతామహః ప్రోక్తో ధర్మకామార్థ ముక్తిదః ॥224॥**

**పితామహోయావ్యూహం చ కథయామి శృణుష్వ మే ।**
**వజ్రా చ నందనా శావా రావికా రిపుభేదినీ ॥225॥**

**రూపా చతుర్థా యోగా చ ప్రథమావరణే స్మృతాః ।**
**భూతానాదా మహాబాలా ఖర్పరాచ తథాపరా ॥226॥**

**భస్మా కాంతా తథా వృష్టిర్ద్విభుజా బ్రహ్మరూపిణీ ।**
**సైహ్యా వైకారికా జాతా కర్మమోటీ తథాపరా ॥227॥**
**మహామోహా మహామాయా గాంధారీ పుష్పమాలినీ ।**
**శబ్దాపీ చ మహాఘోషా షోడశైవ తథాంతిమే ॥228॥**

నందా వ్యూహం చెప్పబడింది. అనంతరం పైతామహవ్యూహం చెబుతున్నా. నందిని, ఫేత్కారి, క్రోధ, హంస, షడంగుళ, ఆనంద, వసుదుర్గ, అట్లే సంహారామృత వీరు అష్టశక్తులు. ప్రథమావరణం చెప్పాను. రెండో ఆవరణాన్ని గూర్చి విను. కులాంతిక, అనల, ప్రచండ, మర్దిని, సర్వభూతాభయ, దయ, బడబాముఖి, లంపట, పన్నగాదేవి, కుసుమ, విపులాంతిక, కేదార, కూర్మ, దురిత, మందరోదరి, ఖడ్గచక్ర. ద్వితీయావరణం బాగా చెప్పబడింది. ధర్మార్థకామమోక్షప్రదానకారి అయిన పైతామహ వ్యూహాన్ని గూర్చి వర్ణించాను. ఇపుడు పితామహావ్యూహాన్ని గూర్చి చెబుతున్నాను. విను. వజ్ర, నందన, శావ, రావిక, రిపుభేదిని, రూప, చతుర్థ అట్లే యోగ – ఇవి ప్రథమావరణానికి చెందిన అష్టశక్తులు. భూతానాద, మహాబాల, ఖర్పర, భస్మ, కాంత, వృష్టి, ద్విభుజ బ్రహ్మరూపిణి, సైహ్య, వైకారిక, జాత, కర్మమోటి, మహామోహ, మహామాయ, పుష్పమాలను ధరించే గాంధారి, శబ్దాపి, మహాఘోష – ఈ పదహారు శక్తులు రెండో ఆవరణానికి చెందినవి.

**సర్వాశ్చ ద్విభుజా దేవ్యో బాలభాస్కర సన్నిభాః ।**
**పద్మశంఖధరాః శాంతా రక్తస్రగ్వస్త్రభూషణాః ॥229॥**

**సర్వాభరణసంపూర్ణా ముకుటాద్యైరలంకృతాః ।**
**ముక్తాఫలమయైర్దివ్యై రత్నచిత్రైర్మనోరమైః ॥230॥**

**విభూషితా గౌరవర్ణా ధ్యేయా దేవ్యః పృథక్ పృథక్ ।**

పైన చెప్పిన ఈ దేవులందరూ (శక్తులు) రెండు భుజాలు గలిగినవారే. బాలసూర్యసమానకాంతిమంతులు. చేతులందు పద్మాలు,శంఖాలు ధరించేవారు. శాంతస్వభావలు. ఎఱ్ఱటి మాలలు, వస్త్రాలు ధరించినవారు. సమస్త భూషణాలు ధరించినవారు. మంచిముత్యాలు పొదిగిన దివ్యకిరీటాలతో అలంకరింపబడినవారు, మనోహరమైన చిత్రచిత్రరత్నాలతో అలంకరింపబడినవారు. తెల్లటి దేహచ్ఛాయగలవారు. ఈ దేవులను వేరువేరుగా ధ్యానించాలి.

**ఏవం సహస్రకలశం తామ్రజం మృన్మయం తు వా ॥231॥**

**భావాద్యైర్విష్ణునా ప్రోక్తైర్నామ్నాం చైవ సహస్రకైః ॥232॥**

**సంపూజ్య విన్యసేదగ్రే సేచయేద్బాణవిగ్రహమ్ ।**
**అభిషిచ్య చ విజ్ఞాప్య సేచయేత్పృథివీపతిమ్ ॥233॥**

**ఏవం సహస్రకలశం సర్వసిద్ధిఫలప్రదమ్ ।**
**చత్వారింశన్మహావ్యూహం సర్వలక్షణలక్షితమ్ ॥234॥**

రాగితోగాని, మట్టితోగాని తయారు చేసిన, పూర్వమే చెప్పిన అన్ని లక్షణాలతో కూడిన వేయి కలశాల్ని రుద్ర క్షేత్రంలో స్థాపించాలి. విష్ణువు ద్వారా చెప్పిన 'భవ' మొదలైన వేయి నామాలతో ప్రత్యేకకలశాలలో పూజించి, సమ్ముఖంలో బాణవిగ్రహాన్ని (బాణలింగాన్ని) స్థాపించి అభిషేకించాలి. అభిషేకం – ప్రార్థన చేసి పృథ్వీపతికి

అభిషేచన చేయాలి. ఈ విధంగా నలభై మహావ్యూహాలకు చెందిన వాళ్లను సర్వలక్షణసంపన్నమైన వేయి కలశాలతో సర్వసిద్ధులకోసం అభిషేకించాలి.

**సర్వేషాం కలశం ప్రోక్తం పూర్వవద్ధేమనిర్మితమ్ ।**
**సర్వే గంధాంబుసంపూర్ణపంచరత్నసమన్వితాః ॥235॥**

**తథా కనకసంయుక్తా దేవస్య ఘృతపూరితాః ।**
**క్షీరేణ వాథ దధ్నా వా పంచగవ్యేన వా పునః ॥236॥**

**బ్రహ్మకూర్చేన వా మధ్యమభిషేకో విధీయతే ।**
**రుద్రాధ్యాయేన రుద్రస్య నృపతేః శృణు సత్తమ ॥237॥**

**అఘోరేభ్యోఽథ ఘోరేభ్యో ఘోరఘోరతరేభ్యః ।**
**సర్వేభ్యః సర్వశర్వేభ్యో నమస్తే అస్తు రుద్రరూపేభ్యః ॥238॥**

**మంత్రేణానేన రాజానం సేచయేదభిషేచితమ్ ।**
**హోమం చ మంత్రేణానేన అఘోరేణాఘహారిణా ॥239॥**

ఈ వేయి కలశాలమధ్యలో పూర్వం చెప్పిన ప్రమాణాలతో నిర్మించిన స్వర్ణకలశాలు మరియు అన్ని కలశాలు పరిమళ భరితమైన నీటితో నింపి, అందులో పంచరత్నాల్ని ఉంచాలి. రుద్రదేవుడి కలశం సువర్ణంతో చేసినదై నేతితో నింపబడినదై ఉండాలి. గోవుల పాలు, పెరుగు, పంచగవ్యం లేకుంటే బ్రహ్మకూర్చంతో రుద్రుడి మధ్యభాగాన్ని అభిషేకించాలి. ఓ ఉత్తముడా! రుద్రాభిషేకం రుద్రాధ్యాయంతో చేయాలి. ఇపుడు రాజుయొక్క అభిషేకవిషయాన్ని విను. "అఘోరేభ్యోఽథ ఘోరేభ్యో ఘోరఘోరతరేభ్యః, సర్వేభ్యః సర్వశర్వేభ్యః నమస్తే అస్తు రుద్రరూపేభ్యః" ఈ మంత్రం ద్వారా మూర్ధాభిషిక్తుడైన రాజును అభిషేకించాలి. ఆతడి పాపనాశనానికై అఘోరమంత్రంతో హోమం చేయాలి.

**ప్రాగాద్యం దేవకుండే వా స్థండిలే వా ఘృతాదిభిః ।**
**సమిధాశ్చ చరుం లాజశాలినీవారతండులైః ॥240॥**

**అష్టోత్తరశతం హుత్వా రాజానమధివాసయేత్ ।**
**పుణ్యాహం స్వస్తిరుద్రాయ కౌతుకం హేమనిర్జితమ్ ॥241॥**

**భసితం చ మృణాలేన బంధయేద్దక్షిణే కరే ।**
**త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్ ॥242॥**

**ఉర్వారుకమివ బంధనాన్మృత్యోర్ముక్షీయ మామృతాత్ ।**
**మంత్రేణానేన రాజానం సేచయేద్వాథ హోమయేత్ ॥243॥**

దేవకుండంలో లేకుంటే స్థండిలంలోగాని నేతితోకూడిన లాజలు, శాలిధాన్యం, నీవారధాన్యం అట్లే బియ్యంతో కలిసిన సమిధలు మరియు చరువు – వీటితో నూటఎనిమిది సార్లు హవనం చేసి పూర్వాభిముఖంగా రాజును అధిష్ఠింపజేయాలి. అనంతరం రుద్రుడికి పుణ్యాహవాచనం, అట్లే స్వస్తి వాచనం నిర్వహించి భస్మం మరియు మృణాలంతో కూడిన బంగారంతో నిర్మించిన కంకణాన్ని రాజుయొక్క కుడిచేతికి కట్టాలి. తర్వాత "త్ర్యంబకం

యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్, ఉర్వారుకమివ బంధనాన్మృత్యోర్ముక్షీయ మామృతాత్" ఈ మంత్రంతో రాజును అభిషేకించాలి. తర్వాత హోమం చేయాలి.

**సర్వద్రవ్యాభిషేకం చ హోమద్రవ్యైర్యథాక్రమమ్ ।**
**ప్రాగాద్యం బ్రహ్మభిః ప్రోక్తం సర్వద్రవ్యైర్యథాక్రమమ్ ॥244॥**

**తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి ।**
**తన్నో రుద్రః ప్రచోదయాత్ ॥245॥**

**స్వాహాంతం పురుషేణైవం ప్రాక్కుండం హోమయేద్ద్విజః ।**
**అఘోరేణ చ యామ్యే చ హోమయేత్కృష్ణవాససా ॥246॥**

**వామదేవాయ నమో జ్యేష్ఠాయ నమః శ్రేష్ఠాయ నమో రుద్రాయ నమః ।**
**ఇత్యాద్యుక్తక్రమేణైవ జుహుయాత్పశ్చిమే నరః ॥247॥**

**సద్యేన పశ్చిమే హోమః సర్వద్రవ్యైర్యథాక్రమమ్ ।**
**సద్యోజాతం ప్రపద్యామి సద్యోజాతాయ వై నమః ॥248॥**

**భవే భవేనాతి భవే భవస్య మాం భవోద్భవాయ నమః ।**
**స్వాహాంతం జుహుయాదగ్నౌ మంత్రేణానేన బుద్ధిమాన్ ॥249॥**

క్రమంగా లాజలు మొదలైన హోమద్రవ్యాలతో సర్వద్రవ్యాభిషేకం చేయాలి. ప్రాక్దిక్కునుండి క్రమంగా పంచబ్రహ్మమంత్రాలద్వారా అన్ని ద్రవ్యాలతో హవనం చేయాలి. "తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి తన్నో రుద్రః ప్రచోదయాత్" ఈ తత్పురుషమంత్రం చివరలో "స్వాహా" చేర్చి ద్విజుడు పూర్వదిశలోగల కుండంలో హవనం చేయాలి. కృష్ణవస్త్రధారి అయిన ఆచార్యకుడు అఘోరమంత్రంతో దక్షిణదిశలో హవనం చేయాలి. ఈ విధంగా బుద్ధిమంతుడు ప్రవర్తించాలి." "వామదేవాయ నమో జ్యేష్ఠాయ నమః శ్రేష్ఠాయ నమో రుద్రాయ నమః" ఈ మంత్రంతో చెప్పిన విధంగా పడమటి కుండంలో హవనం చేయాలి. యథాక్రమంగా సద్యోజాతమంత్రంతో అన్ని ద్రవ్యాలతో పడమరకు ప్రక్కనేగల ఉత్తర దిశలోగల కుండంలో హోమం చేయాలి. "సద్యోజాతం ప్రపద్యామి సద్యోజాతాయ వై నమః భవే భవేనాతి భవే భవస్య మాం భవోద్భవాయ నమః స్వాహా" ఈ మంత్రం ద్వారా బుద్ధిమంతుడు అగ్నిలో ఆహుతి ఇవ్వాలి.

**ఆగ్నేయాం చ విధానేన ఋచా రౌద్రేణ హోమయేత్ ।**
**జాతవేదసే సునవామ సోమమిత్యాదినా తతః ।**
**నైరృతే పూర్వవద్ద్రవ్యైః సర్వైర్హోమో విధీయతే ॥250॥**

**మాత్రేణానేన దివ్యేన సర్వసిద్ధికరేణ చ ।**
**నిమి నిశి దిశ స్వాహా ఖంగ రాక్షసభేదన ॥251॥**

**రుధిరాజ్యార్ద్ర నైరృత్యై స్వాహా నమః స్వధా నమః ।**
**యథేష్టం విధినా ద్రవ్యైర్మంత్రేణానేన హోమయేత్ ॥252॥**

**యమ్యాం హి వివిధైర్ద్రవ్యైరీశానేన ద్విజోత్తమాః ।**
**ఈశాన్యామథ పూర్వోక్తైర్ద్రవ్యైర్హోమమథాచరేత్ ॥253॥**

**ఈశానాయ కద్రుద్రాయ ప్రచేతసే త్ర్యంబకాయ ।**
**శర్వాయ తన్నో రుద్రః ప్రచోదయాత్ ॥254॥**

**ప్రధానం పూర్వవద్ద్రవ్యైరీశానేన ద్విజోత్తమాః ।**
**ప్రతిద్రవ్యం సహస్రేణ జుహుయాన్నృపసన్నిధౌ ॥255॥**

**స్వయం వా జుహుయాదగ్నౌ భూపతిః శివవత్సలః ।**
**ఈశానః సర్వవిద్యానామీశ్వరః సర్వభూతానాం ।**
**బ్రహ్మాధిపతిర్బ్రహ్మణోధిపతిర్బ్రహ్మా శివో మే అస్తు సదాశివోమ్ ॥256॥**

అనంతరం "యో రుద్రో యో అగ్నౌ" ఈ మంత్రంతో పాటు "జాతవేదసే సునవామ సోమమ్" మొదలైన మంత్రం ద్వారా విధానపూర్వకంగా అగ్ని కోణంలో కుండంలో హవనం చేయాలి. తర్వాత "నిమి నిశి దిశ స్వాహా ఖంగ రాక్షస భేదన రుధిరాజ్యార్ద్ర నైరృత్యై స్వాహా నమః స్వధా నమః" ఈ సర్వసిద్ధికారకమైన దివ్య మంత్రం ద్వారా నైరృతికోణంలో పూర్వం విధంగానే అన్ని ద్రవ్యాలతో హోమం చేయాలి. ఓ ద్విజశ్రేష్ఠులారా! వాయవ్య కోణంలో గల కుండంలో ఈశానమంత్రం ద్వారా వివిధ ద్రవ్యాలతో హోమం చేయాలి. ఇది హవనం యొక్క మంత్రం "ఈశానాయ కద్రుద్రాయ ప్రచేతసే త్రయంబకాయ శర్వాయ తన్నో రుద్రః ప్రచోదయాత్" ఈ విధంగా ఈశానకోణంలో గల కుండంలో ఈశానమంత్రం ద్వారా పూర్వం చెప్పిన ద్రవ్యాలతో హోమం చేయాలి. ఓ ద్విజశ్రేష్ఠులారా! ప్రధానకుండంలో కూడా ఈశానమంత్రంతో పూర్వంలాగానే అన్ని ద్రవ్యాలతో హోమం చేయాలి. ఆచార్యకుడు ప్రత్యేకకుండంలో ఓ వెయ్యిసార్లు రాజు సన్నిధిలో ఆహుతి ప్రదానం చేయాలి. లేకపోతే "ఈశానః సర్వవిద్యానామీశ్వరః సర్వభూతానాం విద్యాధిపతిర్బ్రహ్మణోఽధిపతిర్బ్రహ్మా శివో మే అస్తు సదాశివోమ్" ఈ మంత్రంతో శివభక్తి పరాయణుడైన రాజు స్వయంగా అగ్నిలో ఆహుతి ప్రదానం చేయాలి.

**ప్రాయశ్చిత్తమఘోరేణ శేషం సామాన్యమాచరేత్ ।**
**కృతాధివాసం రాజానం శంఖభేర్యాదినిస్వనైః ॥257॥**

**జయశబ్దరవైర్దివ్యైర్వేదఘోషైః సుశోభనైః ।**
**సేచయేత్కూర్చతోయేన ప్రోక్షయేద్వా నృపోత్తమమ్ ॥258॥**

**రుద్రాధ్యాయేన విధినా రుద్రభస్మాంగధారిణమ్ ।**
**శంఖచామరభేర్యాద్యం ఛత్రం చంద్రసమప్రభమ్ ॥259॥**

**శిబికాం వైజయంతీం చ సాధయేన్నృపతేః శుభామ్ ।**
**రాజ్యాభిషేకయుక్తాయ క్షత్రియాయేశ్వరాయ వా ॥260॥**

**నృపచిహ్నాని నాన్యేషాం క్షత్రియాణాం విధీయతే ।**
**ప్రమాణం చైవ సర్వేషాం ద్వాదశాంగుళముచ్యతే ॥261॥**

పలాశోదుంబరాశ్వత్థవటాః పూర్వాదితః క్రమాత్ ।
తోరణాద్యాని వై తత్ర పట్టమాత్రేణ పట్టికాః ॥262॥

అష్టమాంగులసంయుక్తదర్భమాలాసమావృతమ్ ।
దిగ్ధ్వజాష్టకసంయుక్తం ద్వారకుంభైః సుశోభనమ్ ॥263॥

హోమతోరణకుంభైశ్చ భూషితం స్నాపయేన్నృపమ్ ।
సర్వోపరి సమాసీనం శివకుంభేన సేచయేత్ ॥264॥

తన్మహేశాయ విద్మహే వాగ్విశుద్ధాయ ధీమహి ।
తన్నః శివః ప్రచోదయాత్ ॥265॥

మంత్రేణానేన విధినా వర్ధన్యా గౌరిగీతయా ।
రుద్రాధ్యాయేన వా సర్వమఘోరాయాథ వా పునః ॥266॥

ప్రాయశ్చిత్తం అఘోరమంత్రంతో చేయాలి. మిగిలిన కార్యక్రమమంతా ఇతరయాగాలతో సమానంగా చేయాలి. శంఖాలు, భేరులు మొదలైనవాటి ధ్వనులు, జయజయధ్వానాలు, మంగళమయాలైన దివ్య వేదమంత్రాల శబ్దాలు – వీటితోపాటు రుద్రాధ్యాయాన్ని పఠించి అధివసించియున్న రాజును కూర్చజలంతో అభిషేకించాలి. లేకుంటే రుద్రాక్షలు అట్లే భస్మం ధరించిన రాజును సంప్రోక్షించాలి. అనంతరం ఆచార్యుడు రాజుకై శంఖం, చామరం, భేరి, చంద్రుడి మాదిరిగా తెల్లనైన ఛత్రం, పల్లకి మంగళకరమైన ధ్వజం మొదలైన సాధనాల్ని సమకూర్చాలి. రాజ్యాభిషిక్తుడైన క్షత్రియుడికి గాని దేవతకుగాని శంఖాదులన్నీ రాజచిహ్నాలు. ఇతర క్షత్రియులకు రాజచిహ్నాలు ఉండవు. పలాశ, ఉదుంబర, అశ్వత్థ, వటవృక్షాల శాఖలతో తూర్పు మొదలైన నాల్గు దిక్కులలో పందిరి వేయాలి. మరియు అభిషేకమండపాన్ని తోరణాదులతో అలంకరించి రేష్మవస్త్రంతో పట్టిక ఏర్పరచాలి. ఇందులో పలాశాదుల శాఖల పరిమాణం పంద్రెండు అంగుళాలు ఉండాలి. అభిషేకమండపానికి ఎనిమిది, ఎనిమిది అంగుళాల పరిమాణంగల దర్భల్ని మాలగా కూర్చి అలంకరించాలి. అష్టదిక్కులందు ధ్వజాలతో అలంకరించాలి. ద్వారకుంభాలతో అందమైన, తోరణంగా నిలిచిన సువర్ణ కలశాలతో అలంకృతం అయినది కావాలి అభిషేక మండపం. అందులో రాజు స్నానం చేయాలి. "తన్మహేశాయ విద్మహే వాగ్విశుద్ధాయ ధీమహి, తన్నః శివః ప్రచోదయాత్" ఈ మంత్రం ద్వారా శివకుంభంలోని జలంతో, గౌరీ గాయత్రీ మంత్రంద్వారా వర్ధని యొక్క జలంతో మరియు రుద్రాధ్యాయం లేక అఘోరమంత్రంద్వారా అన్ని కుంభాలలోని జలంతో ఉన్నతాసనస్థుడైన రాజును అభిషేకించాలి.

దివ్యైరాభరణైః శుక్లైర్ముకుటాద్యైః సుకల్పితైః ।
క్షౌమవస్త్రైశ్చ రాజానం తోషయేన్నియతం శనైః ॥ 267॥

అష్టషష్టిపలేనైవ హేమ్నా కృత్వా సుదర్శనమ్ ।
నవరత్నైరలంకృత్య దద్యాద్వై దక్షిణాం గురోః ॥268॥

దశధేనుసవస్త్రం చ దద్యాత్ క్షేత్రం సుశోభనమ్ ।
శతద్రోణతిలంచైవ శతద్రోణాంశ్చ తండులాన్ ॥269॥

**శయనం వాహనం శయ్యాం సోపధానాం ప్రదాపయేత్ ।**
**యోగినాం చైవ సర్వేషాం త్రింశత్పలముదాహృతమ్ ॥270॥**

**అశేషాంశ్చ తదర్ధేన శివభక్తాంస్తదర్ధతః ।**
**మహాపూజాం తతః కుర్యాన్మహాదేవస్య వై నృపః ॥271॥**

ఆ తర్వాత ఉత్తమవిధంగా నిర్మించిన ఉజ్జ్వలకిరీటం మొదలైన దివ్యాభరణాలతో, నార వస్త్రాలతో రాజును అలంకరించాలి. ఈ సందర్భంగా అరవై ఎనిమిది పలప్రమాణంలో ఒక సుదర్శనచక్రాన్ని నిర్మించి దానిలో తొమ్మిది రత్నాల్ని పొదిగి గురువుకు దక్షిణ ఇవ్వాలి. దానితోపాటు వస్త్రాలతో కూడిన పది ఆవుల్ని, ఉత్తమమైన భూమిని ప్రదానం చేయాలి. నూరు తూముల పరిమాణంగల నూవుల్ని అట్లే నూరు తూముల బియ్యాన్ని, వాహనాన్ని, తల్పాన్ని, తలగడల్ని గురువుకు దానమివ్వాలి. యోగులకు సువర్ణంతో ముప్పై పలాల్ని దానం చేయ్యాలి. ఇతర సామగ్రిలో సగం ఇవ్వాలి. శివ భక్తులకు అందులో సగం ఇవ్వాలి. తర్వాత రాజు మహాదేవుడిని మిక్కిలి గొప్పగా పూజించాలి.

**ఏవం సమాసతః ప్రోక్తం జయసేచనముత్తమమ్ ।**
**ఏవం పురాభిషిక్తస్తు శక్రః శక్రత్వమాగతః ॥272॥**
**బ్రహ్మా బ్రహ్మత్వమాపన్నో విష్ణుర్విష్ణుత్వమాగతః ।**
**అంబికా చాంబికాత్వం చ సౌభాగ్యమతులం తథా ॥273॥**
**సావిత్రీ చ తథా లక్ష్మీర్దేవీ కాత్యాయనీ తథా ।**
**నందినాథ పురా మృత్యూ రుద్రాధ్యాయేన వై జితః ॥274॥**

**అభిషిక్తోఽసురః పూర్వం తారకాఖ్యో మహాబలః ।**
**విద్యున్మాలీ హిరణ్యాక్షో విష్ణునా వినిర్జితః ॥275॥**
**నృసింహేన పురా దైత్యో హిరణ్యకశిపుర్హతః ।**
**స్కందేన తారకాద్యాశ్చ కౌశిక్యా చ పురాంబయా ॥276॥**

**సుందోపసుందతనయౌ జితౌ దైత్యేంద్రపూజితౌ ।**
**వసుదేవసుదేవౌ తు నిహతౌ కృతకృత్యయా ॥277॥**
**స్నాన యోగేన విధినా బ్రహ్మణా నిర్మితేన తు ।**
**దైవాసురే దితిసుతా జితా దేవైరనిందితాః ॥278॥**

**స్నాప్యైవ సర్వభూపైశ్చ తథాన్యైరపి భూసురైః ।**
**ప్రాప్తాశ్చ సిద్ధయో దివ్యా నాత్ర కార్యా విచారణా ॥279॥**

ఈ విధంగా నేను ఉత్తమమైన జయాభిషేక వర్ణన సంగ్రహంగా చేశాను. పూర్వం ఈ విధంగా అభిషిక్తుడైన ఇంద్రుడు ఇంద్రత్వాన్ని పొందాడు. ఇట్లే బ్రహ్మకు బ్రహ్మత్వం, విష్ణువుకు విష్ణుత్వం అట్లే అంబికకు అంబికాత్వం

ప్రాప్తించింది. సావిత్రికి, భగవతి లక్ష్మికి అట్లే కాత్యాయనికి కూడా ఈ అభిషేకప్రభావంతో అతులసౌభాగ్యం ప్రాప్తించింది. పూర్వం రుద్రాధ్యాయంతో అభిషిక్తుడైన నంది మృత్యువును జయించాడు. ఈ అభిషేకప్రభావంతోనే మహాబలవంతులైన అసురులు తారకుడు, విద్యున్మాలి దేవతలకు అజేయులయ్యారు. విష్ణుభగవానుడిచే హిరణ్యాక్షుడు పరాజితుడయ్యాడు. ఈ విధంగా ఈ స్నానయోగంతో పూర్వం నృసింహుడిచేత హిరణ్యకశిపుడు వధింపబడ్డాడు. కార్తికేయుడిచేత తారకాదులు సంహరింపబడ్డారు. కౌశికి అంబచేత దానవశ్రేష్ఠులచేత పూజలందిన సందోపసుందుల పుత్రులు జయింపబడ్డారు. కృతకృత్యచేత వసుదేవుడు అట్లే సుదేవుడు వధింపబడ్డారు. విధిపూర్వకంగా బ్రహ్మద్వారా నిర్వహించిన ఈ స్నానయోగం అనగా జయాభిషేకంతో దేవాసుర సంగ్రామంలో దేవతలు ప్రతాపవంతులైన దైత్యుల్ని జయించారు. రాజులందరూ ఇతర బ్రాహ్మణులచేత అభిషిక్తులై అలౌకికసిద్ధుల్ని ప్రాప్తించుకున్నారు. ఇందులో సందేహం లేదు.

**అహోఽభిషేకమాహాత్మ్యమహో శుద్ధసుభాషితమ్ ।**
**యేనైవాభిషిక్తేన సిద్ధైర్మృత్యుర్జితస్త్వితి ॥280॥**

**కల్పకోటిశతేనాపి యత్పాపం సముపార్జితమ్ ।**
**స్నాత్వైవం ముచ్యతే రాజా సర్వపాపైర్న సంశయః ॥281॥**

**వ్యాధితో ముచ్యతే రాజా క్షయకుష్ఠాదిభిః పునః ।**
**స నిత్యం విజయీ భూత్వా పుత్రపౌత్రాదిభిర్యుతః ॥282॥**

**జనానురాగసంపన్నో దేవరాజ ఇవాపరః ।**
**మోదతే పాపహీనశ్చ ప్రియయా ధర్మనిష్ఠయా ॥283॥**

**ఉద్దేశమాత్రం కథితం ఫలం పరమశోభనమ్ ।**
**నృపానాముపకారాయ స్వాయంభువ మనో మయా ॥284॥**

ఈ అభిషేకానికి అంతటి మాహాత్మ్యం ఉన్నది. దీనితో అభిషిక్తులైన కారణంగా సిద్ధులు మృత్యువును జయించారన్నమాట. సత్యమైనమాట. ఈ విధితో స్నానం చేసిన రాజు శత కోటికల్పాలలో చేసిన పాపాలనుంచి కూడా విముక్తుడవుతున్నాడు. ఇందులో సందేహం లేదు. క్షయ, కుష్ఠ మొదలైన వ్యాధులనుంచి ముక్తుడవుతున్నాడు. ఆతడు విజయుడై పుత్ర, పౌత్రాదులతో సంపన్నుడయి జీవిస్తున్నాడు. ప్రజలయొక్క అనురాగాన్ని పొందుతున్నాడు. రెండో ఇంద్రుడిలాగా శోభిల్లుతున్నాడు. ధర్మనిష్ఠగల భార్యతో పాపరహితుడై ఆనందిస్తున్నాడు. ఓ స్వాయంభువమనువూ! రాజుల ఉపయోగార్థం సంగ్రహంగా నేను జయాభిషేకవర్ణనం చేశాను. దీని ఫలం అనంతకళ్యాణకారకం.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే అభిషేకవిధిర్నామ సప్తవింశోఽధ్యాయః ॥27॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని అభిషేకవిధి అనే పేరు గల ఇరవై ఏడవ అధ్యాయం సమాప్తం.

## అష్టవింశత్తమోఽధ్యాయః - ఇరవై ఎనిమిదవ అధ్యాయం

## తులాపురుషప్రదానవిధిః - తులాపురుషప్రదానవిధి

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

**స్నాత్వా దేవం నమస్కృత్య దేవదేవముమాపతిమ్ ।**
**దివ్యేన చక్షుషా రుద్రం నీలలోహితమీశ్వరమ్ ॥1॥**

**దృష్ట్వా తుష్టావ వరదం రుద్రాధ్యాయేన శంకరమ్ ।**
**దేవోఽపి తుష్ట్యా నిర్వాణం రాజ్యాంతే కర్మణైవ తు ॥2॥**

**తవాస్తీతి సకృచ్చోక్త్వా తత్రైవాంతరధీయత ।**

అనంతరం ఈ విధానంలో స్నానం చేసి, దేవదేవుడు, ఉమాపతి, నీలలోహితుడు అయిన రుద్రభగవానుడికి నమస్కరించి, దివ్యదృష్టితో ఆయన్ని దర్శించి రుద్రాధ్యాయం ద్వారా వరదాత శంకరుడిని స్వాయంభువమనువు స్తుతించాడు. శివభగవానుడు మనువు చేసిన స్తుతికి ప్రసన్నుడై రాజ్యపాలన చేయి, ఆ సత్కర్మవల్ల నీకు మోక్షం కలుగుతుందని ఒకేసారి చెప్పి అక్కడే అంతర్ధానం చెందాడు.

**స్వాయంభువో మనుర్దేవం నమస్కృత్య వృషధ్వజమ్ ॥3॥**
**ఆరురోహ మహామేరుం మహావృషమివేశ్వరః ।**
**తత్ర దేవం హిరణ్యాభం యోగైశ్వర్యసమన్వితమ్ ॥4॥**
**సనత్కుమారం వరదమపశ్యద్బ్రహ్మణః సుతమ్ ।**
**నమశ్చకార వరదం బ్రహ్మణ్యం బ్రహ్మరూపిణమ్ ॥5॥**
**కృతజాంజలిపుటో భూత్వా తుష్టావ చ మహాద్యుతిః ।**
**సోఽపి దృష్ట్వా మనుం దేవో హృష్టరోమాభవన్మునిః ॥6॥**
**సనత్కుమారః ప్రాహేదం ఘృణయా చ ఘృణానిధే ।**

వృషభధ్వజుడు శివభగవానుడికి నమస్కరించి స్వాయంభువమనువు మేరుశృంగాన్ని మహాశివుడు వృషభాన్ని ఎక్కినట్టు ఎక్కాడు. అక్కడ బంగారం వంటి శరీరచ్ఛాయగలవాడు, యోగసంపదతో కూడినవాడు, వరదాత, బ్రహ్మపుత్రుడైన సనత్కుమారుడిని దర్శించాడు. మహాతేజస్వి అయిన మనువు, వరదాయకుడు, బ్రహ్మజ్ఞాని, బ్రహ్మస్వరూపుడు అయిన సనత్కుమారుడిని చూచి, నమస్కరించి, చేతులు జోడించి ఆయన్ని స్తుతించాడు. సనత్కుమారముని మనువును చూచి ఆనందంవల్ల పులకితగాత్రుడై ఓ కృపానిధీ! అని సంబోధించి దయాభరితుడై ఆయనతో మాటలాడాడు.

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**దృష్ట్వా సర్వేశ్వరాచ్ఛాంతాచ్ఛంకరాన్నీలలోహితాత్ ॥7॥**

**లబ్ధ్వాభిషేకం సంప్రాప్తో వివక్షుర్వద యద్యపి ।**
**తస్య తద్వచనం శ్రుత్వా ప్రణిపత్య కృతాంజలిః ॥ 8॥**
**విజ్ఞాపయామాస కథం కర్మణా నిర్వృత్తిర్విభో ।**

శాంతస్వభావుడు, నీలలోహితసర్వేశ్వరుడు అయిన శివుడిని దర్శించి ఆయనవల్ల జయాభిషేకాన్ని ప్రాప్తింపజేసుకుని నీవు ఇక్కడకు వచ్చావు. నీవు ఏమి చెప్పదలచావో చెప్పు. అపుడు సనత్కుమారుడి ఆమాట విని మనువు అంజలి ఘటించి, నమస్కరించి పలికాడు. ఓ విభూ! కర్మద్వారా ముక్తి ఎలా దక్కుతుందో చెప్పవలసింది.

**వక్తుమర్హసి చాస్మాకం కర్మణా కేవలేన చ ॥9॥**

**జ్ఞానేన నిర్వృతిః సిద్ధా విభో మిశ్రేణ వా క్వచిత్ ।**
**అథ తస్యవచః శ్రుత్వా శ్రుతి సారవిదాం నిధిః ॥10॥**

**సనత్కుమారో భగవాన్ కర్మణా నిర్వృతింక్రమాత్ ।**
**మిశ్రేణ చ క్రమాద్వే క్షణాత్ జ్ఞానేన వై మునే ॥11॥**

కేవలకర్మతోనా? లేక జ్ఞానంతోనా? లేక జ్ఞానకర్మల సంయోగంతోనా? ఏ విధంగా ముక్తి లభిస్తున్నది? మనువుయొక్క ఆ మాట విని వేదసారవేత్తలలో శ్రేష్ఠుడైన భగవానుడు సనత్కుమారుడు ఇలా చెప్పాడు. కర్మద్వారా క్రమంగా ముక్తి కలుగుతున్నది. కర్మయుతజ్ఞానంతోకూడా క్రమంగా ముక్తి కలుగుతుంది. ఈ శుద్ధజ్ఞానంతో అయితే క్షణకాలంలోనే మోక్షం లభిస్తుంది.

**పురామానేన చోష్ట్రత్వమగమం నందినః ప్రభోః ।**
**శాపాత్పునః ప్రసాదాద్ధి శివమభ్యర్చ్య శంకరమ్ ॥12॥**
**ప్రసాదాన్నందినస్తస్య కర్మణైవ సుతో హ్యహమ్ ।**
**శ్రుత్వోత్తమాం గతిం దివ్యామవస్థాం ప్రాప్తవానహమ్ ॥13॥**
**శివార్చన ప్రకారేణ శివధర్మేణ నాన్యథా ।**

పూర్వం నందీశ్వరుడిని అవమానించిన కారణంగా ఆయన శపింపగా ఒంటెగా జన్మించాను. తర్వాత నందీశ్వరుడి కృపతో కళ్యాణకారకుడైన శివభగవానుడిని అర్చించి, ఆ శివార్చనకారణంగానే నేను బ్రహ్మదేవుడి పుత్రుడిని అయ్యాను. ఆ నందీశ్వరుడి అనుగ్రహంవల్లే ఉత్తమముక్తి మార్గాన్ని విని, శివధర్మరూపమైన శివార్చనరీతితో ఈ దివ్యావస్థను పొందాను. ఇందులో సందేహంలేదు.

**రాజ్ఞాం షోడశదానాని నందినా కథితాని చ ॥14॥**
**ధర్మకామార్థముక్త్యర్థం కర్మణైవ మహాత్మనా ।**
**తులాదిరోహణాద్యాని శృణు తాని యథాతథమ్ ॥15॥**

మహాత్ముడైన నందికేశ్వరుడు రాజులకు దానరూపకర్మవల్ల ధర్మార్థకామమోక్షాల ప్రాప్తికై తులారోహణం మొదలైన పదహారు దానాల వర్ణన చేశాడు. వాటిని నీవు యథావిధిగా విను.

**గ్రహణాదిషు కాలేషు శుభదేశేషు శోభనమ్ ।**
**వింశద్ధస్తప్రమాణేన మండపం కూటమేవ చ ॥16॥**

**యథాష్టాదశహస్తేన కళాహస్తేన వా పునః ।**
**కృత్వా వేదిం తథా మధ్యే నవహస్తప్రమాణతః ॥17॥**

**అష్టహస్తేన వా కార్యా సప్తహస్తేన వా పునః ।**
**ద్విహస్తా సార్ధహస్తా వా వేదికా చాతిశోభనా ॥18॥**

**ద్వాదశస్తంభసంయుక్తా సాధురమ్యా భ్రమంతికా ।**
**పరితో నవకుండాని చతురస్రాణి కారయేత్ ॥19॥**

**ఐంద్రికేశానయోర్మధ్యే ప్రధానం బ్రహ్మణః సుత ।**
**అథవా చతురస్రం చ యోన్యాకారమతః పరమ్ ॥20॥**

**స్త్రీణాం కుండాని విప్రేంద్రా యోన్యాకారాణి కారయేత్ ।**
**అర్ధచంద్రం త్రికోణం చ వర్తులం కుండమేవ చ ॥21॥**

**షడస్రం సర్వతో వాపి త్రికోణం పద్మసన్నిభమ్ ।**
**అష్టాస్త్రం సర్వమానే తు స్థండిలం కేవలం తు వా ॥22॥**

గ్రహణం మొదలైన కాలాలలో తీర్థాదులైన ఉత్తమస్థానాలలో ఇరవై హస్తాలు పదునెనిమిది హస్తాలు లేక పదహారు హస్తాల ప్రమాణంలో సుందరమైన కూటయుక్తమైన మండపాన్ని నిర్మించి, దాని మధ్యలో తొమ్మిది హస్తాల, ఎనిమిది హస్తాల, ఏడు హస్తాల, రెండు హస్తాల లేక ఒకటిన్నర హస్తాల విస్తారంగల మిక్కిలి సుందరవేదికను నిర్మించాలి. ఆ వేదికయొక్క నాల్గువైపుల పండ్రెండు స్తంభాలతో ఒక సుందరమైన, రమ్యమైన తులను నిర్మించాలి. దానికి నాల్గువైపుల చతురస్రాకారంలో తొమ్మిది కుండాల్ని నిర్మించాలి. ఓ బ్రహ్మపుత్ర! తూర్పు, మరియు ఈశానకోణాలలో మధ్యలో ప్రధానకుండాన్ని నిర్మించాలి. అది చతురస్రాకారంలో గాని యోని ఆకారంలోగాని ఉండాలి. ఓ విప్రేంద్రా! స్త్రీల విషయంలో కుండం యోని ఆకారంలో నిర్మించాలి. కుండం అర్ధచంద్రాకారంలో, త్రికోణంగా, గుండ్రంగా, ఆరు కోణాలుగా, పద్మాకారంగా, ఎనిమిది సమానమైన రేఖలు గలదిగా నిర్మించాలి. లేకుంటే కుండస్థానంలో దర్భలచే పవిత్రం చేసిన ప్రదేశాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

**చతుర్ద్వారసమోపేతం చతుస్తోరణభూషితమ్ ।**
**దిగ్గజాష్టకసంయుక్తం దర్భమాలాసమావృతమ్ ॥23॥**

**అష్టమంగళసంయుక్తం వితానోపరిశోభితమ్ ।**
**తులాస్తంభద్రుమాశ్చాత్ర బిల్వాదీని విశేషతః ॥24॥**

**బిల్వాశ్వత్థపలాశాద్యాః కేవలం ఖాదిరం తు వా ।**
**యేన స్తంభః కృతః పూర్వం తేన సర్వం తు కారయేత్ ॥25॥**

**అథవా మిశ్రమార్గేణ వేణునా వా ప్రకల్పయేత్ ।**
**అష్టహస్తప్రమాణం తు హస్తద్వయసమాయుతమ్ ॥26॥**

**తులాస్తంభస్య విష్కంభోऽనాహతస్త్రిగుణో మతః ।**
**ద్వ్యంగులేన విహీనం తు సువృత్తం నిర్వ్రణం తథా ॥27॥**
**ఉభయోరంతరం చైవ షడ్ఢస్తం నృపతే స్మృతమ్ ।**
**ద్వయోశ్చతుర్హస్తకృతమంతరం స్తంభయోరపి ॥28॥**
**షడ్ఢస్తమంతరం జ్ఞేయం స్తంభయోరుపరి స్థితమ్ ।**
**వితస్తిమాత్రం విస్తారో విష్కంభస్తావదుత్తరమ్ ॥29॥**

నాలుగు ద్వారాలతో కూడినట్టిది, నాలుగు తోరణాలతో శోభిల్లేది, ఎనిమిది దిక్కుల్లో ఎనిమిది ఏనుగులతో కూడినట్టిది, దర్భలమాలలతో అలంకరింపబడ్డది, ఎనిమిది మంగళాలతో కూడినది మరియు పైభాగం వితానంతో శోభించేది అయిన మండపాన్ని నిర్మించాలి. తులాస్తంభం బిల్వవృక్షశాఖది కావాలి. బిల్వం, పిప్పలి, పలాశ,అశ్వత్థం, ఖాదిరం వీటి శాఖలతోనే స్తంభాలు తయారు చేయాలి. ఈ వృక్షాల శాఖలతో ప్రథమస్తంభాన్ని నిర్మించి, మిగిలిన వాటిని కూడా నిర్మించవచ్చు. లేకుంటే వివిధాలైన కఱ్ఱల మిశ్రమంతోగాని, వేణువులతో(వెదురుకఱ్ఱ)గా నినిర్మించాలి. ఎనిమిది హస్తాల ప్రమాణంలో స్తంభాలుండాలి. వాటియొక్క రెండు హస్తాల భాగాన్ని భూమిలో పాతాలి. తులాస్తంభం యొక్క పై భాగంలో ఆచ్ఛాదనలేని భాగం ఆచ్ఛాదనగల భాగం కన్నా మూడు రెట్లు ఎక్కువగా నిర్మించాలి. తులయొక్క రెండో స్తంభం పూర్తి గోళాకారంగా ఏ పుచ్చు లేనిదిగా ఉండాలి. ఓ రాజా! క్రిందగల రెండు స్తంభాలలో పరస్పరం రెండు అంగుళాలు ఖాళీగా ఆరు హస్తాల అంతరం ఉండాలి. రెండు స్తంభాల మధ్య నాలుగు హస్తాల అంతరం ఉండాలి. ఆ రెండు స్తంభాల పైభాగంలో మధ్యలో ఆరు హస్తాల అంతరం ఉండాలి. రెండు స్తంభాల విస్తారం ఒక వితస్తి (పంద్రెండు అంగుళాలు) ఉండాలి. ఈ పరిమాణాలే రెండో విష్కంభంలోనూ ఉండాలి.

**స్తంభయోస్తు ప్రమాణేన ఉత్తరద్వారసమ్మితమ్ ।**
**షట్త్రింశన్మాత్రసంయుక్తం వ్యాయామం తు తులాత్మకమ్ ॥30॥**

**విష్కంభమష్టమాత్రం తు యవపంచకసంయుతమ్ ।**
**షట్త్రింశన్మాత్రనాభం స్యాన్నిర్మాణాద్వర్తులం శుభమ్ ॥31॥**

**అగ్రే మూలే చ మధ్యే చ హేమపట్టేన బంధయేత్ ।**
**పట్టమధ్యే ప్రకర్తవ్యమవలంబనకత్రయమ్ ॥32॥**

**తామ్రేణ చ ప్రకర్తవ్యమవలంబనకత్రయమ్ ।**
**ఆరేణ వా ప్రకర్తవ్యమాయసం నైవ కారయేత్ ॥33॥**

స్తంభాల ప్రమాణం ఉత్తరద్వారంతో సమానంగా ఉండాలి. పై భాగంలో తులకు (త్రాసు) పై భాగంలో రెండు స్తంభాలకు మధ్య అంతరం ఆరుమూరలు ఉండాలి. దాని పై భాగంలోని వెడల్పులో ఒక జాన మాత్రం విస్తారం ఉండాలి. పై భాగంలో త్రాసుయొక్క చువ్వలో రెండు స్తంభాలయొక్క పొడవు అనుకూలంగా ఉండాలి. త్రాచును సంతులనస్థితిలో ఉంచేట్టు చువ్వయొక్క పొడవు ముప్ఫైఆరు అంగుళాలు ఉండాలి. విష్కంభం ఎనిమిది అంగుళాలు మరియు ఐదుయవమాత్రలుగా ఉండాలి. నాభి ముప్ఫైయారు అంగుళాల పొడవులో గుండ్రంగా అందంగా ఉండాలి. బంగారంతో చేయబడిన ఒక రేకును క్రింది భాగంలోనూ, మధ్యభాగంలోను, తలభాగంలోనూ

ఉంచాలి. మధ్యలోగల రేకులో మూడుముళ్లు లేక సూదుల వంటివి ఏర్పాటు (ఆలంబకాలు) చేయాలి. ఆ మూడు సూదులు రాగి లేక ఇత్తడితో  చేయాలి. ఇనుముతో చేయరాదు.

**మధ్యే చోర్ధ్వముఖం కార్యమవలంబః సుశోభనః ।**
**రశ్మిభిస్తోరణాగ్రే వా బంధయోచ్చ విధానతః ॥34॥**

**జిహ్వామేకాం తులామధ్యే తోరణం తు విధీయతే ।**
**ఉత్తరస్య చ మధ్యే చ శంకుం దృఢమనుత్తమమ్ ॥35॥**

**వితానేనోపరి చ్ఛాద్య దృఢం సమ్యక్ప్రయోజయేత్ ।**
**శంకోః సుషిరసంపన్నం వలయం కారయేన్మునే ॥36॥**

**తులామధ్యే వితానేన తులయా లంబకే తథా ।**
**వలయేన ప్రయోక్తవ్యం కుండలం వావలంబనమ్ ॥37॥**

**సుదృఢం చ తులామధ్యే నవమాంగులమానతః ।**
**పట్టస్యైవ తు విస్తారం పంచమాత్ర ప్రమాణతః ॥ 38॥**

రేకుయొక్క మధ్యభాగంలో కట్టియుండే ఆలంబనం మందంగా ఉండాలి. దాని చివరపైకి లేచి ఊర్ధ్వముఖంగా ఉండాలి. దాని త్రాడుతో తోరణంయొక్క పై భాగాన్ని గట్టిగా బిగించాలి. త్రాసు మధ్యభాగంలో తోరణం కట్టి ఉంచాలి. దాని ఆకారం నాలుకలాగా వంగి ఉండాలి. పైనగల స్తంభానికి మధ్యలో శంఖాన్ని కట్టాలి. ఓ మునివర్యా! వితానంతో శిరసుపై కప్పి దృఢంగా చక్కగా ఏర్పాటు చేయాలి. త్రాసుయొక్క మధ్యభాగాన్ని వితానంలోని గుండ్రని ఉంగరం ద్వారా కట్టి ఉంచాలి. త్రాసుయొక్క పీఠం మధ్యలో తొమ్మిది అంగుళాల కొలతలో బిగించాలి. కట్టివేయబడిన ఆ పట్టియొక్క వెడల్పు ఐదు అంగుళాలు ఉండాలి.

**అపరౌ సుదృఢౌ పిండౌ శుభద్రవ్యేణ కారయేత్ ।**
**శిక్యాధస్తాత్ప్రకర్తవ్యౌ పంచప్రాదేశవిస్తరౌ ।**
**సహస్రేణ తు కర్తవ్యౌ పలానాం ధారకావుభౌ ॥39॥**

**శతాష్టకేన వా కుర్యాత్పలైః షట్శతమేవవా ।**
**చతుస్తాలం చ కర్తవ్యో విస్తారో మధ్యమస్తథా ॥40॥**

**సార్ధత్రితాలవిస్తారః కలశస్య విధీయతే ।**
**బధ్నీయాత్పంచపాత్రం తు త్రిమాత్రం షట్కముచ్యతే ॥41॥**

**చతుర్ద్వారసమోపేతం ద్వారమంగుళమాత్రకమ్ ।**
**కుండలశ్చైవ సమోపేతైః శుక్లశుద్ధసమన్వితైః ॥42॥**

**కుండలే కుండలే కార్యం శృంఖలాపరిమండలమ్ ।**
**శృంఖలాధారవలయమవలంబేన యోజయేత్ ॥43॥**

**ప్రాదేశం నా చతుర్మాత్రం భూమేస్త్యక్త్వావలంబయేత్ ।**

కూర్చోవటానికై రెండు పీటలు ఏదైనా వస్తువుతో తయారు చేయాలి. వాటికి ఆధారంగా ఏర్పరచే దొప్పలు క్రిందికి వ్రేలాడుతూ ఉండాలి. ఒక జాన అయిదు జానలు అంతరంలో ఉండాలి. వాటిని వేయి పలాల బంగారంతో నిర్మించాలి. లేకుంటే ఎనిమిది వందలు మరియు కాకుంటే ఆరువందల పలాల బంగారంతోనైనా నిర్మించాలి. త్రాసుయొక్క మధ్యవిస్తారం నాల్గు తాలాల (అంగుష్ఠానికి మధ్యవ్రేలుకు మధ్యగల దూరాన్ని తాలం అంటారు) ప్రమాణంలో నిర్మించాలి. కలశాల విస్తారం మూడున్నర తాలాలు ఉండాలి. వాటిపైన ఒక పెద్ద పాత్రను ఉంచాలి. అవి మూడు లేక ఆరు అవధృతి ప్రమాణం గలవి కావాలి. అవి నాలుగు రంధ్రాలు కలిగి ఉండాలి. ఆ రంధ్రం ఒక అంగుళప్రమాణంలో ఉండాలి. ఆ రంధ్రాలు తెల్లటి, పరిశుభ్రమైన కుండలాలతో కూడి ఉండాలి. ఆ కుండలాల్ని ఒక దానిలో ఒకటి వేసి గొలుసులా చెయ్యాలి. ఆ గొలుసుల్ని పైన ఆధారాలకు కలపాలి. భూమిమీద నాలుగు మాత్రల ప్రాదేశమాత్రదూరాన్ని వదలి వ్రేలాడదీయాలి.

**ఘటౌ పురుషమాత్రౌ తు కర్తవ్యౌ శోభనావుభౌ ॥44॥**

**తౌ వాలుకాభిః సంపూర్య శివం తత్ర వినిఃక్షిపేత్ ।**
**ద్విహస్తమాత్రమవటే స్థాపనీయౌ ప్రయత్నతః ॥45॥**

**నిఃశేషం పూరయేద్విద్వాన్ వాలుకాభిః సమంతతః ।**
**యేన నిశ్చలతాం గచ్ఛేత్తేన మార్గేణ కారయేత్ ॥46॥**

పురుషప్రమాణంలో రెండు సుందరమైన ఘటాల్ని నిర్మించాలి. వాటిని ఇసుకతో నింపాలి. వాటిలో శివుడిని స్థాపించాలి. రెండు మూరల లోతుకి స్థాపించాలి. మిగిలిన ఖాళీమొత్తం విద్వాంసుడైన పురోహితుడు ఇసుకతో నింపాలి. అప్పుడవి స్థిరంగా ఉంటాయి.

**శ్రూయతాం పరమం గుహ్యం వేదికోపరి మండలమ్ ।**
**అష్టమాంగుళసంయుక్తం మంగళాంకురశోభితమ్ ॥47॥**

**ఫలపుష్పసమాకీర్ణం ధూపదీపసమన్వితమ్ ।**
**వేదిమధ్యే ప్రకర్తవ్యం దర్పణోదరసన్నిభమ్ ॥48॥**
**ఆలిఖేత్మండలం పూర్వం చతుర్ద్వారసమన్వితమ్ ।**
**శోభోపశోభాసంపన్నం కర్ణికాకేసరాన్వితమ్ ॥49॥**

**వర్ణజాతిసమోపేతం పంచవర్ణం తు కారయేత్ ।**

ప్రస్తుతం పరమరహస్యమైన మాట విను. వేదిక పై భాగంలో ఎనిమిది అంగుళాల పరిమాణంగల, మాంగళికాంకురాలతో శోభిల్లే, ఫలపుష్పాదులతో పరిపూర్ణమైన, అట్లే ధూపదీపాలతో కూడిన మండలాన్ని నిర్మించాలి. వేదిక మధ్యలో దర్పణంయొక్క ఉదరభాగానికి సమానమైన నిర్మలమైన మండలాన్ని నిర్మించాలి. ముందుగా నాల్గు ద్వారాలతో కూడిన, శోభ మరియు ఉపశోభలతో సంపన్నమైన కర్ణిక, కేసరాలతో కూడిన మండలరచన చేయాలి. అది నానావిధవర్ణాలతో ఉండాలి. కనీసం ఐదు వర్ణాలు ఉండాలి.

**వజ్రం ప్రాగంతరే భాగే ఆగ్నేయ్యాం శక్తిముజ్జ్వలామ్ ॥50॥**

**ఆలిఖేద్దక్షిణే దండం నైరృత్యాం ఖడ్గమాలిఖేత్ ।**
**పాశశ్చ వారుణే లేఖ్యో ధ్వజం వై వాయుగోచరే ॥ 51॥**

**కౌబేర్యాంతు గదా లేఖ్యా ఐశాన్యాం శూలమాలిఖేత్ ।**
**శూలస్య వామదేశేన చక్రం పద్మం తు దక్షిణే ॥52॥**

**ఏవం లిఖిత్వా పశ్చాచ్చ హోమకర్మ సమాచరేత్ ।**

మండలంయొక్క పూర్వదిక్కులో వజ్రాన్ని, ఆగ్నేయదిక్కులో ఉజ్జ్వలశక్తిని, దక్షిణదిక్కులో దండాన్ని, నైరృతి కోణంలో ఖడ్గాన్ని, పడమటి దిక్కులో పాశాన్ని, వాయవ్యకోణంలో ధ్వజాన్ని, ఉత్తర దిక్కులో గదను మరియు ఈశాన కోణంలో శూలాన్ని, అట్లే శూలానికి ఎడమవైపున చక్రాన్ని, కుడివైపున పద్మాన్ని రచించాలి. ఈ విధంగా ఆయుధరచన చేసిన తర్వాత హోమకర్మ నిర్వహించాలి.

**ప్రధానహోమం గాయత్ర్యా స్వాహా శక్రాయ వహ్నయే ॥53॥**

**యమాయ రాక్షసేశాయ వారుణాయ చ వాయవే ।**
**కుబేరాయేశ్వరాయాథ విష్ణవే బ్రహ్మణే పునః ॥54॥**

**స్వాహాంతం ప్రణవేనైవ హోతవ్యం విధిపూర్వకమ్ ।**
**స్వశాఖాగ్ని ముఖేనైవ జయాదిప్రతిసంయుతమ్ ॥ 55॥**

**స్విష్టాంతం సర్వకార్యాణి కారయేద్విధివత్తదా ।**
**సర్వహోమాగ్రహోమే చ సమిత్పలాశముచ్యతే ।**
**ఏకవింశతి సంఖ్యాతం మంత్రేణానేన హోమయేత్ ॥56॥**

**అయంత ఇధ్మ ఆత్మా జాతవేదస్తేనేధ్యస్వ వర్ధస్వ చేద్ధవర్ధయ చాస్మాన్ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేనాన్నాద్యేన సమేధయ స్వాహా భూః స్వాహా, భువః స్వాహా, స్వః స్వాహా భూర్భుః స్వస్తథైవ చ। సమిద్ధోమశ్చ చరుణా ఘృతస్య చ యథాక్రమమ్। శుక్లాన్నపాయసం చైవ ముద్గాన్నం చరవః స్మృతాః ॥57॥**

**సహస్రం వా తదర్ధం వా శతమష్టోత్తరం తు వా ॥58॥**

ప్రధానహోమం గాయత్రీ మంత్రంతో నిర్వహించాలి. తర్వాత "శక్రాయ స్వాహా, ఓం వహ్నయే స్వాహా", ఓం యమాయ స్వాహా, ఓం రాక్షసేశాయ స్వాహా, ఓం వరుణాయ స్వాహా, ఓం వాయవే స్వాహా, ఓం ఈశ్వరాయ స్వాహా, ఓం విష్ణవే స్వాహా అట్లే బ్రహ్మణే స్వాహా" – ఈ మంత్రాన్ని ఉచ్చరిస్తూ విధిపూర్వకంగా హవనం చేయాలి. ఈ సమయంలో మన శాస్త్రాలలో చెప్పిన అగ్ని విధానానుసారం జయాహోమం నుంచి స్విష్టకృత్ హోమం వరకు అన్ని కార్యాలు విధిపూర్వకంగా చేయాలి. అన్ని హోమాలు అట్లే ప్రధానహోమం పలాశసమిధలు వాడాలి. ఈ మంత్రాలతో ఇరవై ఒక్కసార్లు ఆహుతులు ఇవ్వాలి. అయంత ఇధ్మ ఆత్మా జాతవేదస్తేనేధ్యస్వ వర్ధస్వ చేద్ధవర్ధయ చాస్మాన్ప్రజయా పశుభిర్బ్రహ్మ వర్చసేనాన్నాద్యేన సమేధయ స్వాహా భూః స్వాహా భువః స్వాహా స్వః స్వాహా భూర్భువః

స్వః స్వాహా" సమిధాహోమం చరువుతో అట్లే ఘృతంతో యథాక్రమంగా నిర్వహించాలి. శ్వేతాన్నాన్ని పాయసమని, ముద్గాన్నాన్ని చరువు అని చెప్పారు. వేయి లేక ఐదు వందలసార్లు, లేక నూట ఎనిమిది సార్లు ఆహుతులివ్వాలి. **అగ్న ఆయూంషి పవస ఆ సువోర్జమిషం చ నః। ఆరే బాధస్వ దుచ్ఛునామ్। అగ్నిర్‌ఋషిః పవమానః పాంచజన్యః పురోహితః। తమీమహే మహాగయమ్। అగ్నే పవస్వ స్వపా అస్మే వర్చః సువీర్యమ్। దధద్రయిం మయి పోషమ్। ప్రజాపతే న త్వదేతాన్యన్యో విశ్వా జాతాని పరితా బభూవ। యత్కామాస్తే జుహుమస్తన్నో అస్తు వయఃస్యామ పతయో రయీణామ్ ।**

**గాయత్ర్యా చ ప్రధానస్య సమిద్ధోమస్తథైవ చ ।**
**చరుణా చ తథాజ్యస్య శక్రాదీనాం చ హోమయేత్ ॥59॥**

**వజ్రాదీనాం చ హోతవ్యం సహస్రార్ధం తతఃక్రమాత్ ।**
**బ్రహ్మ జజ్ఞేతి మంత్రేణ బ్రహ్మణే విష్ణవే పునః ॥60॥**

**నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి । తన్నో విష్ణుః ప్రచోదయాత్ । అయం విశేషః కథితో హోమమార్గః సుశోభనః । దూర్వయా క్షీరయుక్తేన పంచవింశత్పృథక్ పృథక్ ॥61॥**

**త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్ ।**
**ఉర్వారుకమివ బంధనాన్మృత్యోర్ముక్షీయ మామృతాత్ ॥62॥**

**దూర్వాహోమః ప్రశస్తోఽయం వాస్తుహోమశ్చ సర్వథా ।**
**ప్రాయశ్చిత్తమఘోరేణ సర్పిషా చ శతం శతమ్ ॥63॥**

"అగ్న ఆయూంషి పవస ఆ సువోర్జమిషం చ నః, ఆరే బాధస్వ దుచ్ఛునామ్ (యజుర్వేదం–19/38) అగ్ని ర్‌ఋషిః పవమానః పాంచజన్యః పురోహితః, తమీమహే మహాగయమ్, (యజుర్వేదం–26/9) అగ్నే పవస్వ స్వపా అస్మే వర్చః సువీర్యమ్, దధద్రయిం మయిపోషమ్ (యజుర్వేదం–8/38), ప్రజాపతేన త్వదేతాన్యన్యో విశ్వాజాతాని పరితా బభూవ, యత్కామాస్తే జుహుమస్తన్నో అస్తు వయః స్యామ పతయో రయీణమ్ (కృష్ణయజుర్వేదం–1/8/14) ఈ మంత్రాలతో ఆహుతులు ప్రదానం చేయాలి. రుద్రగాయత్రీ మంత్రంతో సమిధల ద్వారా ప్రధాన దేవతలకు హవనం చేయాలి. చరువు అట్లే నేతితో ఇంద్రాది దేవతలకు హవనం చేయాలి. అనంతరం క్రమంగా వజ్రాది ఆయుధాలకు ఐదువందలసార్లు ఆహుతులివ్వాలి. "బ్రహ్మ జజ్ఞానం ప్రథమం పురస్తాద్వి సీమతః సురుచో వేన ఆవః, సబుధ్న్యా ఉపమా అస్య విష్ఠాః సతశ్చ యోనిమసతశ్చ వివః (యజుర్వేదం–13/3)" ఈ మంత్రంతో బ్రహ్మకు, "నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి తన్నో విష్ణుః ప్రచోదయాత్" ఈ మంత్రంతో విష్ణువుకు హోమం చేయాలి. ఇది పరమసుందరమైన ముఖ్యమైన హోమవిధానం. పాలతో కూడిన దూర్వారంద్వారా వేరువేరుగా ఇరవై అయిదు ఆహుతులు "త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్, ఉర్వారుకమపి బంధనాన్మృత్యోర్ముక్షీయ మామృతాత్" అనే మంత్రంతో ఇవ్వాలి. ఈ దూర్వాహోమం, వాస్తుహోమం ఎల్లప్పుడు ప్రశస్తాలే. నేతితో అఘోరమంత్రంతో పదివేల ఆహుతులిచ్చి ప్రాయశ్చిత్తం నిర్వహించాలి.

**బ్రహ్మాణం దక్షిణే వామే విష్ణుం విశ్వగురుం శివమ్ ।**
**మధ్యే దేవ్యా సమం జ్ఞేయమింద్రాదిగుణసంవృతమ్ ॥64॥**

**ఆదిత్యం భాస్కరం భానుం రవిం దేవం దివాకరమ్ ।**
**ఉషాం ప్రభాసం తథా ప్రజ్ఞాం సంధ్యాం సావిత్రిమేవ చ ॥65॥**

**పంచప్రకారవిధినా ఖఖోల్కాయ మహాత్మనే ।**
**విష్టరాం సుభగాం చైవ వర్ధనీం చ ప్రదక్షిణామ్ ॥ 66॥**

**ఆప్యాయనీం చ సంపూజ్య దేవీం పద్మాసనే రవిమ్ ।**
**ప్రభూతం వాథ కర్తవ్యం విమలం దక్షిణే తథా ॥67॥**

**సారం పశ్చిమభాగే చ ఆరాధ్యం చోత్తరే యజేత్ ।**
**మధ్యే సుఖం విజానీయాత్కేసరేషు యథాక్రమమ్ ॥68॥**

**దీప్తాం సూక్ష్మాం జయాం భద్రాం విభూతిం విమలాం క్రమాత్ ।**
**అమోఘాం విద్యుతాం చైవ మధ్యతః సర్వతోముఖీమ్ ॥69॥**

**సోమమంగారకం చైవ బుధం గురుమనుక్రమాత్ ।**
**భార్గవం చ తథా మందం రాహుం కేతుం తథైవ చ ॥70॥**

**పూజయేద్ధోమయేదేవం దాపయేచ్చ విశేషతః ।**
**యోగినో భోజయేత్తత్ర శివతత్త్వైకపారగాన్ ॥71॥**

**దివ్యాధ్యయనసంపన్నాన్ కృత్వైవం విధివిస్తరమ్ ।**

దేవతామండలం యొక్క కుడివైపున బ్రహ్మ, ఎడమవైపున విష్ణువు, మధ్యలో పార్వతీదేవితో, ఇంద్రాదులతో, ప్రమథగణాలతో కూడియున్న విశ్వగురువు శివుడు ఉన్నాడని తెలియాలి. [64]ఇపుడు గ్రహమండలాల నిరూపణ జరుగుతున్నది. ఆదిత్యుడు, భాస్కరుడు, భానువు, రవి, భగవానుడైన దివాకరుడు, ఉష, ప్రభ ప్రజ్ఞ, సంధ్య అట్లే సావిత్రి – పంచవిధాలైన విధులతో "మహాత్మనే ఖఖోల్కాయ నమః" ఈ విధంగా ఉచ్చరించి వారిని స్థాపించి పూజించాలి. విష్టర, సుభగ, వర్ధిని, ప్రదక్షిణ, అట్లే ఆప్యాయనీదేవి వీరికి పూజ చేసి పద్మాసనంతో రవిని పూజించాలి. తూర్పులో ప్రభూతానికి, దక్షిణంలో విమలకు పడమటిలో సారకు, ఉత్తరంలో ఆరాధ్యకు అట్లే మధ్యలో సుఖకు పూజ చేయాలి. కమలదళాలలో క్రమంగా దీప్త, సూక్ష్మ, జయ, భద్ర, విభూతి, విమల, అమోఘ, విద్యుత మరియు మధ్యలో సర్వతోముఖి – వారిని భావించాలి. అనంతరం చంద్రుడు, మంగళుడు, బుధుడు, బృహస్పతి, శుక్రుడు, శని, రాహు, అట్లే కేతువు వీర్ని స్థాపించి వీరికి పూజ, హవనం, దానం చేయాలి. ఈ విధంగా అన్ని విధాల వైభవపూర్వకంగా క్రతువు నిర్వహించి, శివతత్త్వవేత్తలు, విద్వాంసులు, వేదాధ్యయనసంపన్నులు అయిన యోగులకు భోజనాలు పెట్టాలి.

**హోమే ప్రవర్తమానే చ పూర్వదిక్స్థాపనమధ్యమే ॥72॥**

**ఆరోహయేద్విధానేన రుద్రాధ్యాయేన వై నృపమ్ ।**
**ధారయేత్తత్ర భూపాలం ఘటికైకాం విధానతః ॥73॥**

**యజమానో జపేన్మంత్రం రుద్రగాయత్రిసంజ్ఞకమ్ ।**
**ఘటికార్ధం తదర్ధం వాతత్రైవాసనమారభేత్ ॥74॥**

**ఆలేఖ్య వారుణం ధీమాన్ కూర్చహస్తః సమాహితః ।**
**నృపశ్చ భూషణైర్యుక్తః ఖడ్గఖేటకధారకః ॥75॥**

**స్వస్తిరిత్యాదిభిశ్చాదావంతే చైవ విశేషతః ।**
**పుణ్యాహం బ్రాహ్మణైః కార్యం వేదవేదాంగపారగైః ॥76॥**

**జయమంగళశబ్దాదిబ్రహ్మఘోషైః సుశోభనైః ।**
**నృత్యవాద్యాదిభిర్గీతైః సర్వశోభాసమన్వితైః ॥77॥**

**స్వమేవం చంద్రదిగ్భాగే సువర్ణం తత్ర విక్షిపేత్ ।**
**తులాధారౌ సమౌ వృత్తౌ తులాభారః సదా భవేత్ ॥78॥**

**శతనిష్కాధికం శ్రేష్ఠం తదర్ధం మధ్యమం స్మృతమ్ ।**
**తస్యార్ధం చ కనిష్ఠం స్యాత్త్రివిధం తత్ర కల్పితమ్ ॥79॥**

హవనకార్యక్రమం ప్రారంభంలో తూర్పుదిక్కు మధ్యభాగంలో రుద్రాధ్యాయాన్ని పఠిస్తూ విధిపూర్వకంగా రాజును త్రాసుమీద కూర్చుండజేయాలి. రాజును అక్కడ ఒక ఘడియకాలం కూర్చుండజేయాలి. ఆ సమయంలో యజమానుడైన ఆరాజు రుద్రగాయత్రీమంత్రాన్ని జపించాలి. ఒక ఘడియకాలంగాని లేక అందులో సగంగాని ఆసనంలో కూర్చోవాలి. సూర్యబింబాన్ని చూచి బుద్ధిమంతుడైన బ్రాహ్మణుడు సమాహితచిత్తుడై చేతితో కూర్చాన్ని పట్టుకుని సర్వాభరణసహితమైన రాజుయొక్క చేతిలో ఖడ్గాన్ని, ఖేటకాన్ని ఉంచాలి. ఈ కర్మ చేయడానికి ముందు, చివరలో కూడా వేదవేదాంగ పారంగతులైన బ్రాహ్మణులు స్వస్తివాచకాలు, పుణ్యాహవాచనాలు నిర్వహించాలి. జయ మొదలైన శుభవాచకశబ్దాలు, పరమసుందరమైన వేదధ్వనులు విన్పించాలి. సర్వవిధాల శోభాకరాలైన నృత్యాలు, వాద్యాలు, గీతాలు నిర్వహించాలి. త్రాసులో ఉత్తరభాగంలోగల పళ్లెంలో రాజుయొక్క బరువుతో సమానమైన బరువుగల సువర్ణాన్ని ఉంచాలి. త్రాసు రెండువైపుల సమానం కావాలి. నూరు మాడలకన్నా ఎక్కువగల తులాభారం శ్రేష్ఠమైనది. ఏభైమాడల కన్నా సువర్ణం శ్రేష్ఠం. ఏభైనిష్కాలది మధ్యమం. ఇరవై అయిదు నిష్కాలు గలది కనిష్ఠం. ఈ విధంగా తులాభారం మూడు విధాలు.

**వస్త్రయుగ్మమథోష్ణీషం కుండలం కంఠశోభనమ్ ।**
**అంగులీభూషణం చైవ మణిబంధస్య భూషణమ్ ॥80॥**

**ఏతాని చైవ సర్వాణి ప్రారంభే ధర్మకర్మణి ।**
**పాశుపతవ్రతాయాథ భస్మాంగాయ ప్రదాపయేత్ ॥81॥**

**పూర్వోక్తభూషణం సర్వం సోష్ణీషం వస్త్రసంయుతమ్ ।**
**దద్యాదేతత్త్రయోకృభ్య ఆచ్ఛాదనపటం బుధః ॥82॥**
**దక్షిణాం చ శతం సార్ధం తదర్ధం వా ప్రదాపయేత్ ।**
**యోగినాం చైవ సర్వేషాం పృథక్ నిష్కం ప్రదాపయేత్ ॥83॥**

**యాగోపకరణం దివ్యమాచార్యాయ ప్రదాపయేత్ ।**
**ఇతరేషాం యతీనాం తు పృథక్ నిష్కం ప్రదాపయేత్ ॥84॥**

**తులారోహసువర్ణం చ శివాయ వినివేదయేత్ ।**
**ప్రాసాదం మండపం చైవ ప్రాకారం భూషణం తథా ॥85॥**

**సువర్ణపుష్పం పటహం ఖడ్గం వై కోశమేవ చ ।**
**కృత్వా దత్త్వా శివాయాథ కించిచ్ఛేషం చ బుద్ధిమాన్ ॥86॥**

**ఆచార్యేభ్యః ప్రదాతవ్యం భస్మాంగేభ్యో విశేషతః ।**

అగ్రపూజప్రారంభంలో రెండు వస్త్రాలు, తలపాగ, కుండలం, కంఠహారం, అంగులీయకం అట్లే ముంజేతి కంకణం – ఈ అన్ని వస్తువులు భస్మధారులు, పాశుపతవ్రత నిరతులు అయిన శైవాచార్యులకు ప్రదానం చేయాలి. బుద్ధిమంతుడు పూర్వం చెప్పిన భూషణాలు, వస్త్రాలు, తలపాగలు అట్లే ఉత్తరీయాలు – ఇవి అన్నీ ఋత్విక్కులకు ప్రదానం చేయాలి. నూట ఏభైగాని, అందులో సగంగాని నిష్కాల బంగారాన్ని దక్షిణలివ్వాలి. వారితోపాటు యోగులందరికీ ఎక్కువగా సువర్ణముద్రికల్ని ప్రదానం చేయాలి. ఈ సమయంలో యాగోపకరణాలన్నీ ఆచార్యుడికి ఇవ్వాలి. ఇతర యతులకు వేరే విధంగా సువర్ణముద్రికలు ప్రదానం చేయాలి. బుద్ధిమంతుడైన రాజు త్రాసులో ఉంచిన బంగారం, అట్లే ప్రాసాదం, మండపం, ప్రాకారం, భూషణాలు సువర్ణపుష్పాలు, పటహాలు, ఖడ్గాలు, కోశం – ఇవన్నీ భాగించి కొంత భాగాన్ని శివుడికిచ్చి, మిగిలినదాన్ని విశేషరూపులైన భస్మధారులైన ఆచార్యులకు ప్రదానం చేయాలి.

**బందీకృతాన్ విసృజ్యాథ కారాగృహనివాసినః ॥87॥**
**సహస్రకలశైస్తత్ర సేచయేత్పరమేశ్వరమ్ ।**
**ఘృతేన కేవలేనాపి దేవదేవముమాపతిమ్ ॥88॥**
**పయసా వాథ దధ్నా వా సర్వద్రవ్యైరథాపి వా ।**
**బ్రహ్మకూర్చేన వా దేవం పంచగవ్యేన వా పునః ॥ 89॥**

**గాయత్ర్యా చైవ గోమూత్రం గోమయం ప్రణవేన వా ।**
**ఆప్యాయస్వేతి వై క్షీరం దధిక్రావ్ణోతి వై దధి ॥90॥**

**తేజోఽసీత్యాజ్యమీశానమంత్రేణైవాభిషేచయేత్ ।**
**దేవస్యత్వేతి దేవేశం కుశాంబుకలశేన వై ॥91॥**

**రుద్రాధ్యాయేన వా సర్వం స్నాపయేత్పరమేశ్వరమ్ ।**
**సహస్రకలశం శంభోర్నామ్నాం చైవ సహస్రకైః ॥92॥**

**విష్ణునా కథితైర్వాపి తండినా కథితైస్తు వా ।**
**దక్షేణ మునిముఖ్యేన కీర్తితైరథ వా పునః ॥93॥**

ఈ శుభ సమయంలో కారాగారాల్లోగల బందీలను విడుదల చేయాలి. సహస్రకలశజలంతో, లేక కేవలం నేతితో, పాలతో, పెరుగుతో, లేక నారికేళం మొదలైన కాయల నీటితో దేవదేవుడు, ఉమాపతి, పరమేశ్వరుడిని అభిషేకించాలి. లేకుంటే పంచగవ్యంతో బ్రహ్మకూర్చం ద్వారా అభిషేకించాలి. గాయత్రీమంత్రంతో గోమూత్రాన్ని, ప్రణవమంత్రంతో గోమయం "ఆప్యాయస్వ" - మంత్రంతో పాలును దధిక్రావ్ణో" మంత్రంతో పెరుగును అట్లే "తేజోऽసీతి" మంత్రంతో నేతిని గ్రహించి ఈశానమంత్రంతో అభిషేకించాలి. "దేవస్య త్వాం" ఈ మంత్రంతో కలశాలలో దర్భలతో కూడిన జలంతో దేవదేవుడిని అభిషేకించాలి. లేక రుద్రాధ్యాయం ద్వారా అభిషేకించాలి. భగవానుడైన విష్ణువు ద్వారా పఠింపబడిన శివసహస్రనామంతో (శ్రీలింగమహాపురాణం-పూర్వభాగం-98వ అధ్యాయం) లేక శివభక్తుడైన తండి చేసిన శివసహస్రనామంతో (శ్రీలింగమహాపురాణం-పూర్వభాగం-65వ అధ్యాయం) లేక మునిశ్రేష్ఠుడు దక్షుడు చేసిన శివసహస్రనామంతో (శివరహస్యం అనే గ్రంథం) సహస్ర కలశాల జలంతో శివుడిని అభిషేకించాలి[93].

**మహాపూజా ప్రకర్తవ్యా మహాదేవస్య భక్తితః ।**
**శివార్చకాయ దాతవ్యా దక్షిణా స్వగురోః సదా ॥94॥**

**దేహార్ణవం చ సర్వేషాం దక్షిణా చ యథాక్రమమ్ ।**
**దీనాంధకృపణానాం చ బాలవృద్ధకృశాతురాన్ ॥95॥**

**భోజయేచ్చ విధానేన దక్షిణామపి దాపయేత్ ॥96॥**

భక్తిపూర్వకంగా శివార్చకుడైన తన గురువును ఇతడే మహాదేవ శివుడని ఎల్లప్పుడు మిక్కిలిగా పూజించాలి. శివార్చకుడైన తన గురువుకు, ఇతర శివపూజకులకు దక్షిణలు ఇవ్వాలి. తులాభారద్రవ్యాన్ని దక్షిణల్ని ఋత్విజులకు, దీనులకు, అంధులకు, బీదలకు ఇవ్వాలి. దీంతోపాటు బాలబాలికలకు, వృద్ధులకు, బలహీనులకు, వ్యాధిగ్రస్తులకు విధిపూర్వకంగా భోజనం పెట్టాలి. దక్షిణలివ్వాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే తులాపురుషప్రదానవిధిర్నామాష్టవింశత్తమోऽధ్యాయః ॥28॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని తులాపురుషప్రదానవిధి అనే పేరు గల ఇరవై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనత్రింశోఽధ్యాయః - ఇరవై తొమ్మిదవ అధ్యాయం

## హిరణ్యగర్భదానవిధిః - హిరణ్యగర్భదానవిధి

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**తులా తే కథితా హ్యేషా ఆద్యా సామాన్యరూపిణీ ।**
**హిరణ్యగర్భం వక్ష్యామి ద్వితీయం సర్వసిద్ధిదమ్ ॥1॥**

నేను నీకు సామాన్య రూపంలో ముందుగా తులాదానాన్ని గూర్చి చెప్పాను. ఇపుడు సర్వార్థ సిద్ధిదాయకమైన హిరణ్యగర్భదానాన్ని గూర్చి చెబుతాను.

**అధః పాత్రం సహస్రేణ హిరణ్యేన విధీయతే ।**
**ఊర్ధ్వపాత్రం తదర్ధేన ముఖం సంవేశమాత్రకమ్ ॥2॥**

**హైమమేవం శుభం కుర్యాత్సర్వాలంకారసంయుతమ్ ।**

ఈ దానవిషయానికై వేయి బంగారు ముద్రికలతో ఒక క్రింది పాత్రను తయారు చేయాలి. ఐదువందల బంగారు ముద్రికలతో అందు ప్రవేశించడానికి అనుకూలమైన ముఖంగల పై పాత్రను (మూత) తయారు చేయాలి. ఈ శుభస్వర్ణపాత్రను అన్ని అలంకారాలతో అలంకరించాలి.

**అధః పాత్రే స్మరేద్దేవీం గుణత్రయసమన్వితామ్ ॥3॥**

**చతుర్వింశతికాం దేవీం బ్రహ్మవిష్ణ్వగ్నిరూపిణీమ్ ।**
**ఊర్ధ్వపాత్రే గుణాతీతం షడ్వింశకముమాపతిమ్ ॥4॥**

**ఆత్మానం పురుషం ధ్యాయేత్పంశవింశకమగ్రజమ్ ।**

తర్వాత క్రింది ముఖ్యపాత్రలో ఇరవైనాల్గు తత్త్వాల స్వరూపంగలది. అట్లే బ్రహ్మ, విష్ణు, అగ్నిస్వరూప త్రిగుణాత్మిక అయిన భగవతి యొక్క ధ్యానం చేయాలి. పై పాత్రలో ఇరవై ఆరు తత్త్వాల రూపుడు, గుణాతీతుడు, ఉమాపతి సదాశివుడిని, మరియు ఇరవై అయిదు తత్త్వాల స్వరూపంగల హిరణ్యగర్భపురుషుడిని ధ్యానించాలి.

**పూర్వోక్తస్థానమధ్యేఽథ వేదికోపరి మండలే ॥5॥**

**శాలిమధ్యే క్షిపేన్నీత్వా నవవస్త్రైశ్చ వేష్టయేత్ ।**
**మాషకల్కేన చాలిప్య పంచద్రవ్యేణ పూజయేత్ ॥6॥**

**ఈశానాద్యైర్యథాన్యాయం పంచభిః పరిపూజయేత్ ।**
**పూర్వచ్ఛివపూజా చ హోమశ్చైవ యథాక్రమమ్ ॥7॥**

ఇంతకు ముందు చెప్పిన స్థానంలో మండలాన్ని, వేదికను నిర్మించి పాత్రను తెచ్చి శాలిధాన్యంపైన ఉంచాలి. దాన్ని నూత్నవస్త్రంతో చుట్టాలి. తర్వాత మినపపిండితో లేపనం చేయాలి. పంచోపచారాలతో ఈశానాదులైన

ఐదు మంత్రాలతో విధిపూర్వకంగా ఆ పాత్రను పూజించాలి. శివుడిని పూజించి విధిపూర్వకంగా పూర్వం మాదిరిగానే హోమం చేయాలి.

**దేవీం గాయత్రికాం జప్త్వా ప్రవిశేత్ప్రాఙ్ముఖః స్వయమ్ ।**
**విధినైవ తు సంపాద్య గర్భాధానాదికాం క్రియామ్ ॥8॥**

**కృత్వా షోడశమార్గేణ విధినా బ్రాహ్మణోత్తమః ।**
**దూర్వాంకురైస్తు కర్తవ్యా సేచనా దక్షిణే పుటే ॥9॥**

**ఔదుంబరఫలైః సార్ధమేకవింశత్కుశోదకమ్ ।**
**ఈశాన్యాం తావదేవాత్ర కుర్యాత్ సీమంతకర్మణి ॥10॥**

**ఉద్వహేత్కన్యకాం కృత్వా త్రింశన్నిష్కేణ శోభనామ్ ।**
**అలంకృత్య తథా హుత్వా శివాయ వినివేదయేత్ ॥11॥**

**అన్నప్రాశనకే విద్వాన్ భోజయేత్పాయసాదిభిః ।**
**ఏవం విశ్వజితాంతా వై గర్భాధానాదికాః క్రియాః ॥12॥**

**శక్తిబీజేన కర్తవ్యా బ్రాహ్మణైర్వేదపారగైః ।**
**శేషం సర్వం చ విధివత్తులాహేమవదాచరేత్ ॥13॥**

భగవతి గాయత్రీదేవిని జపించి పూర్వాభిముఖంగా కూర్చుని మరియు స్వయంగా శ్రేష్ఠుడైన ఆచార్యుడు గర్భాధానం మొదలైన పదహారు సంస్కారాల్ని విధిపూర్వకంగా నిర్వహించి గరిక చిగుళ్లతో దక్షిణపుటంలో సేచన చేయాలి. ఉదుంబరఫలాలతో కూడిన ఇరవై ఒక్క దర్భలజలంతో ఈశానదిశలో సీమంత కర్మ చేయాలి. మూడు నిష్కాల పరిమాణం సువర్ణంతో సుందరకన్యకను తయారు చేసి, భూషణాలు, వస్త్రాదులతో అలంకరించి హవనం చేసి శివభగవానుడికి అర్పించాలి. అన్న ప్రాశనసంస్కారంలో భాగంగా విద్వాంసులకు పాయసాదులతో భోజనం పెట్టాలి. ఈ విధంగా వేదపారగులైన బ్రాహ్మణులను గర్భాధానం నుంచి విశ్వజిత్పర్యంతం అన్ని సంస్కారాలలో శక్తిబీజంతో పాటు నిలపాలి. మిగిలిన మొత్తం కార్యక్రమం తులాదానం మాదిరిగానే విధిపూర్వకంగా నిర్వహించాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే హిరణ్యగర్భదానవిధిర్నామైకోనత్రింశోఽధ్యాయః ॥29॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని హిరణ్యగర్భదానవిధి అనే పేరు గల ఇరవై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



## త్రింశోఽధ్యాయః - ముప్పైవ అధ్యాయం

## తిలపర్వతదానవిధిః - తిలపర్వతదానవిధి

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**అధునా సంప్రవక్ష్యామి తిలపర్వతముత్తమమ్ ।**
**పూర్వోక్తస్థానకాలే తు కృత్వా సంపూజ్య యత్నతః ॥1॥**

**సుసమే భూతలే రమ్యే వేదినా చ వివర్జితే ।**
**దశతాలప్రమాణేన దండం సంస్థాప్యవై మునే ॥2॥**

**అద్భిః సంప్రోక్ష్య పశ్చాద్ధి తిలాంస్త్వస్మిన్ వినిక్షిపేత్ ।**
**పంచగవ్యేన తం దేశం ప్రోక్షయేద్ బ్రాహ్మణోత్తమః ॥3॥**

ఇపుడు నేను ఉత్తమ తిలపర్వతదానాన్ని గూర్చి చెబుతాను. ఇంతకుముందే చెప్పిన స్థానంలోనే, కాలంలోనే ప్రయత్నపూర్వకంగా పూజలు చేసి తిలపర్వతదానం చేయాలి. వేదికలేని సమతలమైన సుందరభూమిలో పది తాళప్రమాణంలో (అంగుష్ఠం నుంచి మధ్యవ్రేలు మధ్యలో గల దూరాన్ని ఒక తాళం అంటారు-వాయు పురాణ 8/103) గల దండాన్ని పాతి చుట్టూ జలాన్ని చల్లి దానిమీద తిలల్ని రాశిగా పోయాలి. ఉత్తమబ్రాహ్మణుడు పంచగవ్యంతో ఆస్థానాన్ని సంప్రోక్షించాలి.

**మండలం కల్పయేద్విద్వాన్ పూర్వవత్సుసమంతతః ।**
**నవవస్త్రైశ్చ సంస్థాప్యరమ్యపుష్పైర్వికీర్య చ ॥4॥**

**తస్మిన్ సంచయనం కార్యం తిలభారైర్విశేషతః ।**
**దండప్రాదేశముత్సేధముత్తమం పరికీర్తితమ్ ॥5॥**

**చతురంగులహీనం తు మధ్యమం మునిపుంగవాః ।**
**దండతుల్యం కనిష్ఠం స్యాద్దండహీనం న కారయేత్ ॥6॥**

**వేష్టయిత్వా నవైర్వస్త్రైః పరితః పూజయేత్ క్రమాత్ ।**
**సద్యాదీని ప్రవిన్యస్య పూజయేద్విధిపూర్వకమ్ ॥7॥**

**అష్టదిక్షు చ కర్తవ్యాః పూర్వోక్తా మూర్తయః క్రమాత్ ।**
**త్రినిష్కేన సువర్ణేన ప్రత్యేకం కారయేత్క్రమాత్ ॥8॥**

తర్వాత విద్వాంసుడు పూర్వంలాగానే నాల్గువైపుల మండలం నిర్మించాలి. నూత్నవస్త్రాలు కప్పి, దానిమీద సుందరపుష్పాలు చల్లి, దానిపై తిలబీజాలు చల్లాలి. తిలరాశి స్థాపించిన దండం కన్నా బాగా ఎత్తుగా ఉంటే అది ఉత్తమమని చెప్పబడింది. ఓ శ్రేష్ఠమునులారా! తిలలరాశి దండానికన్నా నాల్గు అంగుళాలు పైన ఎత్తులో ఉంటే అది మధ్యమం. దండంతో సమానంగా ఉంటే కనిష్ఠం. దండంకన్నా తక్కువ ఎత్తుతో రాశి ఎప్పుడూ ఉండరాదు.

ఈ తిలలరాశిని నూతనవస్త్రంతో మొత్తం కప్పి క్రమంగా పూజించాలి. 'సద్యోజాతాదులైన పంచమంత్రాల్ని క్రమంగా స్థాపించి విధిపూర్వకంగా వాటిని పూజించాలి. పూర్వం చెప్పిన మూర్తుల్ని అష్టదిక్కుల్లో క్రమంగా స్థాపించాలి. ప్రతిమూర్తిని మూడు నిష్కాలతో నిర్మించాలి.

**దక్షిణా విధినా కార్యా తులాభారవదేవ తు ।**
**హోమశ్చ పూర్వవత్ప్రోక్తో యథావన్మునిసత్తమాః ॥ 9॥**

**అర్చయేద్దేవదేవవేశం లోకపాలసమావృతమ్ ।**
**తిలపర్వతమధ్యస్థం తిలపర్వతరూపిణమ్ ॥10॥**

**శివార్చనా చ కర్తవ్యా సహస్రకలశాదిభిః ।**
**దర్శయేత్తిలమధ్యస్థం దేవదేవముమాపతిమ్ ॥11॥**

**పూజయిత్వా విధానేన క్రమేణ చ విసర్జయేత్ ।**
**శ్రోత్రియాయ దరిద్రాయ దాపయేత్తిలపర్వతమ్ ॥ 12॥**

**ఏవం తిలనగః ప్రోక్తః సర్వస్మాదధికః పరః ॥13॥**

తులాభారంలో మాదిరిగానే ఇందులో కూడా దక్షిణలు ఇవ్వాలి. ఓ మునిశ్రేష్ఠులారా! ఈ దానంలో పూర్వంలాగానే యథావిధిగా హోమం చేయాలి. లోకపాలకులతో ఆవృతమైన ఆ తిలపర్వతంయొక్క మధ్యభాగంలో విరాజమానుడైన, తిలపర్వతరూపుడైన దేవదేవేశ్వరుడు శివుడిని పూజించాలి. వేయి కలశాలతో శివుడిని అర్చించాలి. యజమాని తనయొక్క ఇష్టజనులకు తిలలరాశి మధ్యలోగల దేవాధిదేవుడు ఉమాపతి యొక్క దర్శనాన్ని కల్గించాలి. ఈ విధంగా విధ్యుక్తంగా ఆయన్ని పూజించి విసర్జించాలి. అనంతరం ఆ తిలపర్వతాన్ని ధనహీనుడైన శ్రోత్రియబ్రాహ్మణుడికి దానం చేయాలి. ఈ విధంగా నేను నీకు తిలపర్వతదానం గూర్చి చెప్పాను. ఇది అన్ని దానాల్లో శ్రేష్ఠమైనది.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే తిలపర్వతదానవిధిః నామ త్రింశోఽధ్యాయః ॥30॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని తిలపర్వతదానవిధి అనే పేరు గల ముప్పైవ అధ్యాయం సమాప్తం.



## **ఏకత్రింశోఽధ్యాయః** - ముప్పై ఒకటవ అధ్యాయం

## **సూక్ష్మతిలపర్వతదానవిధిః** - సూక్ష్మతిలపర్వతదానవిధి

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**అథాన్యం పర్వతం సూక్ష్మమల్పద్రవ్యం మహాఫలమ్ ।**
**ద్రవ్యమాత్రోపసంయుక్తే కాలే మధ్యం విధీయతే ॥1॥**

నేనిపుడు ఇతరమైన ఒక సూక్ష్మతిలపర్వతదానాన్ని గూర్చి చెబుతున్నాను. ఇది వ్యయంలో అల్పద్రవ్యం గలది. అయితే గొప్ప ఫలాన్ని ఇచ్చేది. ద్రవ్యం గలిగిన ఏ వ్యక్తి అయినా ఈ పవిత్రకార్యాన్ని చేయవచ్చు.

**గోమయాలిప్తభూమౌ తు హ్యంబరాణి ప్రకీర్య చ ।**
**తన్మధ్యే నిక్షేపేద్ధీమాన్ తిలభారత్రయం శుభమ్ ॥ 2॥**

బుద్ధిమంతుడైన పురుషుడు గోమయంతో విధిపూర్వకంగా అలికిన భూమిమీద వస్త్రాన్ని పరిచి దాని మధ్యలో మూడు బారువుల శుభ్రమైన తిలల్ని పోయాలి.

**పద్మమష్టదళం కుర్యాత్కర్ణికాకేసరాన్వితమ్ ।**
**దశనిష్కేణ తత్కార్యం తదర్ధార్ధేన వా పునః ॥3॥**

**తిలమధ్యే న్యసేత్పద్మం పద్మమధ్యే మహేశ్వరమ్ ।**
**ఆరాధ్య విధివద్దేవం వామాదీని పూజయేత్ ॥4॥**

**శక్తిరూపం సువర్ణేన త్రినిష్కేణ తు కారయేత్ ।**
**న్యాసం తు పరితః కుర్యాద్విఘ్నేశాన్ పరిభాగతః ॥5॥**

**పూర్వోక్తహేమమానేన విఘ్నేశానపి కారయేత్ ।**
**తానభ్యర్చ్య విధానేన గంధపుష్పాదిభిః క్రమాత్ ॥6॥**

తర్వాత కర్ణిక, కేసరాలుగల అష్టదళపద్మాన్ని బంగారంతో నిర్మించాలి. ఈ పద్మాన్ని పదినిష్కాల, లేక ఐదునిష్కాల లేక రెండున్నర నిష్కాల బంగారంతోనైనా నిర్మించవచ్చు. ఈ పద్మాన్ని తిలలమధ్యలో ఉంచాలి. పద్మం మధ్యలో శివుడిని నిలిపి విధిపూర్వకంగా ఆరాధించాలి. వామదేవాదిమూర్తుల్ని పూజించాలి. మూడు నిష్కాల సువర్ణంతో శక్తియొక్క ప్రతిమ నిర్మించాలి. ఈ విధంగానే అష్టదిక్కుల్లో అష్టవినాయకుల్ని స్థాపించాలి. మూడు నిష్కాల పరిమాణంగల బంగారంతో వినాయకుల ప్రతిమల్ని నిర్మించాలి. విధిపూర్వకంగా గంధపుష్పాదులతో క్రమంగా వారిని పూజించాలి. దానాదులైన మిగిలిన పనులు పూర్వం చెప్పినట్లే క్రమంగా చేయాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే సూక్ష్మతిలపర్వతదానవిధిఃనామైకత్రింశోఽధ్యాయః ॥31॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని సూక్ష్మతిలపర్వతదానవిధి అనే పేరుగల ముప్పైఒకటవ అధ్యాయం సమాప్తం.

## ద్వాత్రింశోఽధ్యాయః - ముప్పై రెండవ అధ్యాయం
## సువర్ణమేదినీదానః - సువర్ణమేదినీదానం

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**జపహోమార్చనాదానాభిషేకాద్యం చ పూర్వవత్ ।**
**సువర్ణమేదినీదానం ప్రవక్ష్యామి సమాసతః ॥1॥**

**పూర్వోక్తదేశకాలే తు కారయేన్మునిభిః సహ ।**
**లక్షణేన యథాపూర్వం కుండే వా మండలేఽథ వా ॥2॥**

నేనిపుడు సువర్ణమేదినీ దానాన్ని గూర్చి సంగ్రహంగా చెబుతాను. జపం, హోమం, పూజ, దానం, అభిషేకం, మొదలైన కృత్యాలు పూర్వం చెప్పిన దేశకాలాలలో పూర్వం మాదిరిగానే మునుల ద్వారా బాగా నిర్వహింపబడాలి. ఈ కార్యం పూర్వం చెప్పిన లక్షణం మాదిరిగానే కుండంలో లేక మండలంలో చేయాలి.

**మేదినీం కారయేద్దివ్యాం సహస్రేణాపి వా పునః ।**
**ఏకహస్తా ప్రకర్తవ్యా చతురస్రా సుశోభనా ॥3॥**

**సప్తద్వీపసముద్రాద్యైః పర్వతైరభిసంవృతా ।**
**సర్వతీర్థసమోపేతా మధ్యే మేరుసమన్వితా ॥4॥**

**అథవా మధ్యతో ద్వీపం నవఖండం ప్రకల్పయేత్ ।**
**పూర్వవన్నిఖిలం కృత్వా మండలే వేదిమధ్యతః ॥5॥**

**సప్తభాగైకభాగేన సహస్రాద్విధిపూర్వకమ్ ।**
**శివభక్తే ప్రదాతవ్యా దక్షిణా పూర్వచోదితా ॥6॥**

**సహస్రకలశాద్యైశ్చ శంకరం పూజయేచ్ఛివమ్ ।**
**సువర్ణమేదినీ ప్రోక్తం లింగేఽస్మిన్ దానముత్తమమ్ ॥7॥**

ఒక వేయి బంగారు ముద్రికలతోగాని, అందులో సగంతోగాని, అందులో సగంతోగాని దివ్యమైన పృథ్వియొక్క రూపాన్ని నిర్మించాలి. చతురస్రంగా, ఒక హస్తం పొడవు వెడల్పులతో అత్యంతసుందరంగా నిర్మించాలి. దానిమీద సప్తద్వీపాలు, సముద్రాలు, అట్లే పర్వతాలు, గిరులు ఉండాలి. సర్వతీర్థాలతో కూడి ఉండాలి. మధ్యలో మేరు పర్వతంతో శోభిల్లాలి. మధ్యభాగంలో నవఖండాలతోపాటు జంబూ ద్వీపాన్ని నిర్మించాలి. మండలంలో వేదిక మధ్యలో పూర్వం మాదిరిగానే పూర్తిగా కార్యక్రమాన్ని నిర్వహించి వేయి స్వర్ణముద్రికలతో ఏడో భాగం శివభక్తులకు విధిపూర్వకంగా ఇవ్వాలి. పూర్వం మాదిరిగానే దక్షిణలివ్వాలి. వేయి కలశాలు మొదలైన వాటితో కళ్యాణకరుడైన శివభగవానుడిని పూజించాలి. ఈ లింగపురాణంలో చెప్పిన సువర్ణమేదినీ దానం అత్యంత శ్రేష్ఠమైనది.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే సువర్ణమేదినీదానం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥32॥**
శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని సువర్ణమేదినీదానం అనే పేరుగల ముప్పైరెండవ అధ్యాయం సమాప్తం.

## త్రయస్త్రింశోఽధ్యాయః - ముప్పై మూడవ అధ్యాయం

## కల్పపాదపదానవిధిః - కల్పపాదపదానవిధి

**సనత్కుమార ఉవాచ -** సనత్కుమారుడు పలికాడు.

**అథాన్యత్సంప్రవక్ష్యామి కల్పపాదపముత్తమమ్ ।**
**శతనిష్కేణ కృత్వైవం సర్వశాఖాసమన్వితమ్ ॥1॥**

**శాఖానాం వివిధం కృత్వా ముక్తాదామాద్యలంబనమ్ ।**
**దివ్యైర్మారకతైశ్చైవ చాంకురాగ్రం ప్రవిన్యసేత్ ॥2॥**

**ప్రవాళం కారయేద్విద్వాన్ ప్రవాళేన ద్రుమస్య తు ।**
**ఫలాని పద్మరాగైశ్చ పరితోఽస్య సుశోభయేత్ ॥3॥**

**మూలంచ నీలరత్నేన వజ్రేణ స్కంధముత్తమమ్ ।**
**వైడూర్యేణ ద్రుమాగ్రం చ పుష్పరాగేణ మస్తకమ్ ॥4॥**

**గోమేదకేన వై కందం సూర్యకాంతేన సువ్రత ।**
**చంద్రకాంతేన వా వేదిం ద్రుమస్య స్ఫటికేన వా ॥5॥**

ఇపుడు నేను ఉత్తమకల్పవృక్షప్రదానం గూర్చి చెబుతాను. నూరు నిష్కాల సువర్ణంతో బహుశాఖలతోకూడిన ఒక కల్పవృక్షాన్ని నిర్మించి, దాని అన్ని శాఖలకు ముత్యాల సరాల్ని తగిలించి, దివ్యమైన మరకతమణులతో అంకురాల అగ్రభాగాల్ని నిర్మించాలి. విద్వాంసుడు పగడాలతో వృక్షానికి చిగురుటాకుల్ని నిర్మించి వాటిలో అన్నివైపుల పద్మరాగపుమణులతో ఫలాల్ని తయారు చేయాలి. నీలరత్నాలతో దాని మూలాన్ని నిర్మించాలి. వజ్రాలతో అందమైన కాండాన్ని, వైడూర్యాలతో వృక్షం అగ్రభాగాన్ని, పుష్పరాగాలతో శిరోభాగాన్ని నిర్మించాలి. గోమేదంతోను, సూర్యకాంతంతోనూ దాని కందభాగాన్ని (ఊడల్ని) చంద్రకాంతమణులతో, లేక స్ఫటికమణులతో దాని వేదిని (పీఠాన్ని) నిర్మించాలి.

**వితస్తిమాత్రమాయామం వృక్షస్య పరికీర్తితమ్ ।**
**శాఖాష్టకస్య మానం చ విస్తారం చోర్ధ్వతస్తథా ॥6॥**

**తన్మూలే స్థాపయేల్లింగం లోకపాలైః సమావృతమ్ ।**
**పూర్వోక్తవేదిమధ్యే తు మండలే స్థాప్య పాదపమ్ ॥7॥**

**పూజయేద్దేవమీశానం లోకపాలాంశ్చ యత్నతః ।**
**పూర్వవజ్జపహోమాద్యం తులాభారవదాచరేత్ ॥8॥**

**నివేదయేద్ద్రుమం శంభోర్యోగినాం వాథ వా నృప ।**
**భస్మాంగిభ్యోఽథ వా రాజా సార్వభౌమో భవిష్యతి ॥9॥**

వృక్షం యొక్క ఎత్తు ఒక వితస్తి (12 అంగుళాలు) ఉండాలి. ఎనిమిది శాఖల విస్తారం కొలతలు సమానంగా ఉండాలి. వృక్షం మూలంలో లోకపాలకులతో కూడిన శివలింగాన్ని స్థాపించాలి. మండలంలో పూర్వం చెప్పిన వేదికమధ్యలో కల్పవృక్షాన్ని స్థాపించి ప్రయత్నపూర్వకంగా శివభగవానుడిని, అట్లే లోకపాలకుల్ని పూజించాలి. జపాలు, హోమాలు తులాభారదానవిషయంలో మాదిరిగా చేయాలి. ఓ రాజా! చివరగా ఈ వృక్షాన్ని శివభగవానుడికి అర్పించాలి. లేకుంటే భస్మధారులైన యోగులకు ప్రదానం చేయాలి. ఈ విధమైన దానం చేసిన రాజు సార్వభౌముడు అవుతాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే కల్పపాదపదానవిధి ర్నామ త్రయస్త్రింశోఽధ్యాయః ॥33॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని కల్పపాదపదానవిధి అనే పేరు గల ముప్పై మూడవ అధ్యాయం సమాప్తం.



## **చతుర్త్రింశోఽధ్యాయః** - ముప్పై నాలుగవ అధ్యాయం

## **గణేశేశదానవిధినిరూపణమ్** - గణేశేశదానవిధినిరూపణ

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**గణేశేశం ప్రవక్ష్యామి దానం పూర్వోక్తమండపే ।**
**సంపూజ్య దేవదేవేశం లోకపాలసమావృతమ్ ॥1॥**

**విశ్వేశ్వరాన్ యథాశాస్త్రం సర్వాభరణసంయుతాన్ ।**
**దశనిష్కేణ వైకృత్వా సంపూజ్య చ విధానతః ॥2॥**

**అష్టదిక్ష్వష్టకుండేషు పూర్వవద్ధోమమాచరేత్ ।**
**పంచావరణమార్గేణ పారంపర్యక్రమేణ చ ॥3॥**

**సప్తవిప్రాన్ సమభ్యర్చ్య కన్యామేకాం తథోత్తరే ।**
**దాపయేత్సర్వమంత్రాణి స్వైఃస్వైర్మంత్రైరనుక్రమాత్ ॥4॥**

**దత్త్వైవం సర్వపాపేభ్యో ముచ్యతే నాత్ర సంశయః ॥5॥**

నేనిపుడు గణేశేశదానాన్ని గూర్చి చెప్తాను. పూర్వం చెప్పిన విధంగానే నిర్మింపబడిన మండపంలో లోకపాలకులతో కూడియున్న దేవాధిదేవుడు సదాశివుడిని పూజించి, పదినిష్కాల బంగారంతో అష్టదిక్పాలకుల ప్రతిమలు నిర్మించి, వాటిని శాస్త్రవిధిప్రకారం ఆభరణాలతో అలంకరించి, విధ్యుక్తంగా పూజించి అష్టదిక్కులలో, అష్టకుండాలలో, పంచావరణమార్గంలో అట్లే పరంపరాక్రమంగా పూర్వం చెప్పిన విధంగా హోమం చెయ్యాలి. అనంతరం ఏడుగురు విప్రుల్ని అట్లే ఉత్తరదిక్కులో ఒక కన్యను విధిపూర్వకంగా పూజించాలి. అనుక్రమంగా ఆ యా దేవతామంత్రాలతో అన్ని దేవప్రతిమల్ని దానం చేయాలి. ఈ విధమైన దానం వల్ల మానవుడు పాపాలన్నింటినుంచి విముక్తుడవుతున్నాడు. ఇందులో సందేహం లేదు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే గణేశేశదానవిధినిరూపణం నామ చతుర్త్రింశోఽధ్యాయః ॥34॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని గణేశేశదానవిధినిరూపణ అనే పేరు గల ముప్పై నాలుగవ అధ్యాయం సమాప్తం.

## పంచత్రింశోఽధ్యాయః - ముప్పై ఐదవ అధ్యాయం
## హేమధేనుదానవిధినిరూపణమ్ - హేమధేనుదానవిధినిరూపణ

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**అథ తే సంప్రవక్ష్యామి హేమధేనువిధిక్రమమ్ ।**
**సర్వపాపప్రశమనం గ్రహదుర్భిక్షనాశనమ్ ॥1॥**

నేనిపుడు నీకు హేమధేనువు యొక్క దానవిధిని గూర్చి చెబుతాను. ఇది సర్వపాపవినాశనం. గ్రహపీడను, దుర్భిక్షపీడను నాశనం చేస్తుంది. ఉపద్రవాలను శాంతింపజేస్తుంది. సమస్తవ్యాధులను దూరం చేస్తుంది.

**నిష్కాణాం చ సహస్రేణ సువర్ణేన తు కారయేత్ ॥2॥**

**తదర్ధేనాపి వా సమ్యక్ తదర్ధార్ధేన వా పునః ।**
**శతేన వా ప్రకర్తవ్యా సర్వరూపగుణాన్వితా ॥3॥**

**గోరూపం సుఖురం దివ్యం సర్వలక్షణసంయుతమ్ ।**

వేయిబంగారు ముద్రికలతో ఒక ఆవును నిర్మించాలి. లేకుంటే ఐదు వందల ముద్రికలతో గాని, అందులో సగంతోగాని, నూరుముద్రికలతో గాని సర్వలక్షణలక్షితమైన గోవును నిర్మించాలి. ఆ గోప్రతిమ అందమైన గిట్టలు, దివ్యమై, అందమైన లక్షణాలు కలిగియుండాలి.

**ఖురాగ్రే విన్యసేత్వజ్రం శృంగే వై పద్మరాగకమ్ ॥ 4॥**

**భ్రువోర్మధ్యే న్యసేద్దివ్యం మౌక్తికం మునిసత్తమాః ।**
**వైడూర్యేణ స్తనాః కార్యా లాంగూలం నీలతః శుభమ్ ॥5॥**

**దంతస్థానే ప్రకర్తవ్యః పుష్పరాగః సుశోభనః ।**
**పశువత్కారయిత్వా తు వత్సం కుర్యాత్సుశోభనమ్ ॥6॥**

**సువర్ణదశనిష్కేణ సర్వరత్నసుశోభితమ్ ।**

ఓ శ్రేష్ఠమునులారా! గిట్టలయొక్క అగ్రభాగంలో రత్నాలను, శృంగాలపైన పద్మరాగాలను పొదగాలి. రెండు కనురెప్పలమధ్య దివ్యమైన ముత్యాలను ఉంచాలి. వైడూర్యాలతో స్తనాలను, నీలాలతో తోకను అలంకరించాలి. దంతస్థానంలో అందమైన పుష్పరాగాలను ఉంచాలి. తల్లి గోవుకు మాదిరిగానే సర్వలక్షణలక్షితంగా మిక్కిలి అందంగా పది నిష్కాల బంగారంతో దూడను నిర్మించాలి. దాన్ని అన్ని విధాల రత్నాలతో అలంకరించాలి.

**పూర్వోక్తవేదికా మధ్యే మండలం పరికల్ప్య తు ॥7॥**

**తన్మధ్యే సురభిం స్థాప్య సవత్సాం సర్వతత్త్వవిత్ ।**
**సవత్సాం సురభిం తత్ర వస్త్రయుగ్మేన వేష్టయేత్ ॥ 8॥**

**సంపూజయేద్గాం గాయత్ర్యా సవత్సాం సురభిం పునః ।**

అనంతరం సర్వతత్త్వవిదుడైన పురుషుడు పూర్వం చెప్పిన విధంగా నిర్మించిన వేదికమధ్యలో మండలాలను నిర్మించి, వాటి మధ్యలో దూడతో కూడిన ధేనువును నిలిపి, దూడతోకూడిన ధేనువును రెండు వస్త్రాలతో చుట్టి, దూడతో కూడిన ఆ ధేనువును గాయత్రి మంత్రంతో పూజించాలి.

**అథైకాగ్ని విధానేన హోమం కుర్యాద్యథావిధి ॥9॥**

**సమిదాజ్యవిధానేన పూర్వవచ్ఛేషమాచరేత్ ।**
**శివపూజా ప్రకర్తవ్యా లింగం స్నాప్య ఘృతాదిభిః ॥10॥**

**దక్షిణా చ ప్రకర్తవ్యా త్రింశన్నిష్కా మహామతే ॥11॥**

అనంతరం అగ్నివిధిని సమిధలతో, నేతితో విధ్యుక్తంగా నిర్వహించాలి. మిగిలిన కార్యమంతా పూర్వం మాదిరిగానే చేయాలి. తర్వాత శివలింగాన్ని నేయి మొదలైన వాటితో స్నానం చేయించి శివపూజ చేయాలి. తర్వాత గోవును తాకి, గాయత్రీమంత్రాన్ని పఠిస్తూ, మంగళమయమైన ఆ ధేనువును శివుడికి అర్పించాలి. ముప్పై నిష్కాల సువర్ణాన్ని దక్షిణ కూడా ఇవ్వాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే హేమధేనుదానవిధినిరూపణం నామ పంచత్రింశోఽధ్యాయః ॥35॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని హేమధేనుదానవిధినిరూపణ అనే పేరు గల ముప్పై ఐదవ అధ్యాయం సమాప్తం.

.



## షట్త్రింశోఽధ్యాయః - ముప్పై ఆరవ అధ్యాయం

## లక్ష్మీదానవిధినిరూపణమ్ - లక్ష్మీదానవిధినిరూపణ

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**లక్ష్మీదానం ప్రవక్ష్యామి మహదైశ్వర్యవర్ధనమ్ ।**
**పూర్వోక్తమండపే కార్యం వేదికోపరి మండలే ॥1॥**

**శ్రీవేదీమతులాం కృత్వా హిరణ్యేన యథావిధి ।**
**సహస్రేణ తదర్ధేన తదర్ధార్ధేన వా పునః ॥2॥**

**అష్టోత్తరశతేనాపి సర్వలక్షణసంయుతామ్ ।**
**మండలే విన్యసేల్లక్ష్మీం సర్వాలంకారసంయుతామ్ ॥3॥**

నేనిపుడు గొప్పదై, ఐశ్వర్యవృద్ధికారణమైన లక్ష్మీదానవర్ణనం చేస్తాను. పూర్వం చెప్పిన విధంగా నిర్మించిన మండపంలో ఏర్పాటు చేసిన వేదికలో ఈ దానకర్మ చేయాలి. వేయి సువర్ణముద్రికలతో గాని, అందులో సగంతో గాని, అందులో సగంతో గాని లేక నూటఎనిమిది ముద్రికలతోగాని విధిపూర్వకంగా అనుపమమైన సర్వలక్షణ శోభితమైన శ్రీదేవియొక్క ప్రతిమను నిర్మించి, ఆమెను సర్వాలంకారశోభితను చేసి మండలంలో స్థాపించాలి.

**తస్యాస్తు దక్షిణే భాగే స్థండిలే విష్ణుమర్చయేత్ ।**
**అర్చయిత్వా విధానేన శ్రీసూక్తేన సురేశ్వరీమ్ ॥4॥**

**అర్చయేద్విష్ణుగాయత్ర్యా విష్ణుం విశ్వగురుం హరిమ్ ।**
**ఆరాధ్య విధినా దేవీం పూర్వవద్ధోమమాచరేత్ ॥5॥**

**సమిద్ధుత్వా విధానేన ఆజ్యాహుతిమథాచరేత్ ।**
**పృథగష్టోత్తరశతం హోమహేద్బ్రాహ్మణోత్తమైః ॥6॥**

అమ్మవారికి దక్షిణభాగంలో స్థండిలం మీద శ్రీమహావిష్ణువును పూజించాలి. శ్రీసూక్తంతో విధిపూర్వకంగా సర్వేశ్వరిని పూజించి, విష్ణుగాయత్రితో విశ్వగురువైన విష్ణుభగవానుడిని పూజించాలి. లక్ష్మీదేవిని విధిపూర్వకంగా ఆరాధించి, పూర్వం మాదిరిగానే హోమం చేయాలి. మొట్టమొదటిగా విధిపూర్వకంగా సమిధలతో హవనం చేసి, తర్వాత శ్రేష్ఠబ్రాహ్మణులు నేతితో నూట ఎనిమిదిసార్లు ఆహుతులివ్వాలి.

**ఆహూయ యజమానం తు తస్యాః పూర్వదిశి స్థలే ।**
**తస్మై తాం దర్శయేద్దేవీం దండవత్ప్రణమేత్ క్షితౌ ॥7॥**

**ప్రణమ్య విష్ణుం తత్రస్థం శివం పూర్వవదర్చయేత్ ।**
**తస్యా వింశతి భాగం తు దక్షిణా పరికీర్తితా ॥8॥**

**తదర్ధాంశం తు దాతవ్యమితరేషాం యథార్హతః ।**
**తతస్తు హోమయేచ్ఛంభుం భక్తో యోగీ విశేషతః ॥9॥**

అనంతరం యజమానిని పిలిచి లక్ష్మీదేవియొక్క పూర్వదిశాభాగంలో కూర్చుండపెట్టి దేవియొక్క దర్శనం చేయించాలి. ఆ యజమాని భూమిపై పడి లక్ష్మీదేవికి సాష్టాంగప్రణామం చేయాలి. తర్వాత అక్కడే ప్రతిష్ఠితుడై ఉన్న విష్ణుమూర్తికి నమస్కరించి, పూర్వం మాదిరిగానే శివభగవానుడిని అర్చించాలి. ఆచార్యుడికి ఆమూర్తి ప్రమాణంలో ఇరవయ్యో వంతుకు సమానమైన దక్షిణ ఇవ్వాలి. అందులో సగభాగం అనగా పదోవంతు ఇతరులైన శివభక్తులకు ఇవ్వాలి. తర్వాత భక్తయోగి అయిన ఆచార్యుడు విశేషరూపంలో శివభగవానుడికి ప్రీతికరంగా హోమం చేయాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే లక్ష్మీదానవిధినిరూపణం నామ షట్త్రింశత్తమోఽధ్యాయః ॥36॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని లక్ష్మీదానవిధినిరూపణ అనే పేరు గల ముప్పై ఆరవ అధ్యాయం సమాప్తం.



## సప్తత్రింశోఽధ్యాయః - ముప్పై ఏడవ అధ్యాయం
## తిలధేనుదానవిధినిరూపణమ్ - తిలధేనుదానవిధినిరూపణం

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**అథాతః సంప్రవక్ష్యామి తిలధేనువిధిక్రమమ్ ।**
**పూర్వోక్తమండపే కుర్యాచ్ఛివపూజాం తు పశ్చిమే ॥1॥**

**తస్యాగ్రే మధ్యతో భూమౌ పద్మమాలిఖ్య శోభనమ్ ।**
**వస్త్రైరాచ్ఛాదితం పద్మం తన్మధ్యే విన్యసేచ్ఛుభమ్ ॥2॥**

**తిలపుష్పం తు కృత్వాథ హేమపద్మం వినిక్షిపేత్ ।**
**త్రింశన్నిష్కేణ కర్తవ్యం తదర్ధార్ధేన వా పునః ॥3॥**

**పంచనిష్కేణ కర్తవ్యం తదర్ధార్ధేన వా పునః ।**
**తమారాధ్య విధానేన గంధపుష్పాదిభిః క్రమాత్ ॥4॥**

ఇపుడు నేను తిలధేను దానంయొక్క విధానక్రమం వర్ణించనున్నాను. పూర్వం చెప్పిన నియమాల ప్రకారం నిర్మించిన మండపంలో పడమటి భాగంలో శివపూజ చేయాలి. దానికి ముందు మధ్యలో భూమిమీద సుందరకమలాన్ని రచించాలి. దాన్ని వస్త్రంతో కప్పాలి. దాని మధ్యలో ఉత్తమమైన తిలపుష్పాన్ని స్థాపించాలి. స్వర్ణకమలాన్ని రచించి దాని మధ్యలో ఉంచాలి. ఆ బంగారు కమలం ముప్పై నిష్కాల బంగారంతో గాని, అందులో సగం బంగారంతోగాని, అందులో సగం బంగారంతోగాని నిర్మించాలి. లేకుంటే అయిదు నిష్కాల బంగారంతోగాని, అందులో సగంతోగాని, అందులో సగంతోగాని నిర్మించాలి. అనంతరం ఆ హేమపద్మంలో విగ్రహం యొక్క భావనను ధ్యానం చేయాలి. గంధపుష్పాదులతో క్రమపూర్వకంగా దానికి విధిపూర్వకంగా పూజ చేయాలి.

**పద్మస్యోత్తరదిగ్భాగే విప్రానేకాదశ న్యసేత్ ।**
**తానభ్యర్చ్య విధానేన గంధపుష్పాదిభిః క్రమాత్ ॥5॥**

**ఆచ్ఛాదనోత్తరాసంగం విప్రేభ్యో దాపయేత్క్రమాత్ ।**
**ఉష్ణీషం చ ప్రదాతవ్యం కుండలే చ విభూషితే ॥6॥**

**హేమాంగులీయకం దత్త్వా బ్రాహ్మణేభ్యో విధానతః ।**
**ఏకం దశ చ వస్త్రాణి తేషామగ్రే ప్రకార్య చ ॥7॥**

**తేషు వస్త్రేషు నిఃక్షిప్య తిలాద్యాని పృథక్ పృథక్ ।**
**కాంస్య పాత్రం శతపలం విభిద్యైకాదశాంశకమ్ ॥8॥**

**ఇక్షుదండం చ దాతవ్యం బ్రాహ్మణేభ్యో విశేషతః ।**

ఆ పద్మంయొక్క ఉత్తరదిక్కులో పదకొండుమంది బ్రాహ్మణులను కూర్చోబెట్టాలి. వార్ని గంధపుష్పాదులతో విధిపూర్వకంగా పూజించి, వస్త్రాలను, ఉత్తరీయాలను దానం చేయాలి. తలపాగ కూడా ఇవ్వాలి. అనంతరం

రెండు రత్న కర్ణ కుండలాలు, సువర్ణాంగుళీయకం బ్రాహ్మణులకు విధానపూర్వకంగా ప్రదానం చేసి, వారి ముందుర పదకొండు వస్త్రాలను పరచి, వాటిమీద వేరు వేరుగా నువ్వులు మొదలైనవాటిని నూరుపలప్రమాణంతో పదకొండు కంచు పాత్రల్లో పోసి, అందులో చెరుకుగడ ఉంచి బ్రాహ్మణులకు ప్రదానం చేయాలి.

**గోశృంగే తు హిరణ్యేన ద్వినిష్కేణ తు కారయేత్ ॥9॥**

**రజతేన తు కర్తవ్యాః ఖురా నిష్కద్వయేన తు ।**
**ఏవం పృథక్ పృథక్ దత్వా తత్తిలేషు వినిక్షిపేత్ ॥ 10॥**

**రుద్రైకాదశమంత్రేషు రుద్రేభ్యో దాపయేత్తదా ।**
**పద్మస్య పూర్వదిగ్భాగే విప్రాన్ ద్వాదశ పూజితాన్ ॥11॥**

**ఏతేనైవ తు మార్గేణ తేషు శ్రద్ధాసమన్వితః ।**
**ద్వాదశాదిత్యమంత్రైశ్చ దాపయేదేవమేవ చ ॥12॥**

**పూర్వవద్దక్షిణే భాగే విప్రాన్ షోడశ సంస్థితాన్ ।**
**మూర్తిం విఘ్నేశమంత్రైశ్చ దాపయేత్పూర్వవత్పునః ॥13॥**

**యజమానేన కర్తవ్యం సర్వమేతద్యథాక్రమమ్ ।**
**కేవలం రుద్రదానం వా ఆదిత్యేభ్యోఽథవా పునః ॥14॥**

**మూర్త్యాదీనాం చ వా దేయం యథావిభవవిస్తరమ్ ।**
**పద్మం విన్యస్య రాజాసౌ శేషం వా కారయేన్నృపః ॥15॥**

**దక్షిణా చ ప్రదాతవ్యా పంచనిష్కేణ భూషణమ్ ॥16॥**

రెండు నిష్కాల బంగారంతో గోవుయొక్క రెండు కొమ్ములు తయారు చేయాలి. అట్లే రెండు నిష్కాల వెండితో దాని గిట్టలు చేయించాలి. అన్నింటిని వేరువేరుగా ఆ తిలలమీద ఉంచాలి. తర్వాత రుద్రుడియొక్క పదకొండు మంత్రాలతో పదకొండు రుద్రులకు తిలధేనువును సమర్పించాలి. ఈ విధంగా ఆ పద్మానికి తూర్పువైపునగల పండ్రెండు విప్రులను పూజించి శ్రద్ధాపూర్వకంగా ద్వాదశాదిత్య మంత్రంతో వారికి తిలధేనువును అర్పించాలి. దక్షిణ దిశలోగల పదహారుమంది విప్రులను పూజించి పూర్వంలాగానే విఘ్నేశమంత్రంతో వారికి తిలధేనువును ప్రదానం చేయాలి. ఈ సమస్తకార్యం యజమానుడి ద్వారా యథావిధిగా నిర్వహించాలి. రుద్రులకు లేక ఆదిత్యులకు దానమిచ్చి, యథాశక్తి మూర్తి మున్నగువాటిని దక్షిణగా ఇవ్వాలి. ఈ ప్రకారం రాజు పద్మస్థాపన చేసి మిగిలిన కార్యక్రమమంతా ఆచార్యుడి ద్వారా చేయించాలి. చివరగా ఐదునిష్కాల సువర్ణాభరణాలను దక్షిణగా ఆచార్యుడికి సమర్పించాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే తిలధేనుదానవిధినిరూపణం నామ సప్తత్రింశోఽధ్యాయః ॥37॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని తిలధేనుదానవిధినిరూపణ అనే పేరు గల ముప్పై యేడవ అధ్యాయం సమాప్తం.

## అష్టత్రింశోఽధ్యాయః - ముప్పై ఎనిమిదవ అధ్యాయం
## గోసహస్రప్రదానమ్ - వేయి గోవులను దానంచేయటం

**సనత్కుమార ఉవాచ -** సనత్కుమారుడు పలికాడు.

**గోసహస్రప్రదానం చ దదామి శృణు సువ్రత ।**
**గవాం సహస్రమాదాయ సవత్సం సగుణం శుభమ్ ॥1॥**

**తాస్త్వభ్యర్చ్య యథాశాస్త్రమష్టౌ సమ్యక్ప్రయత్నతః ।**
**తాసాం శృంగాణి హేమ్నాథ ప్రతినిష్కేణ బంధయేత్ ॥2॥**

**ఖురాంశ్చ రజతేనైవ బంధయేత్కంఠదేశతః ॥3॥**

ఓ సువ్రతుడా! నేనిపుడు గో సహస్రదానవిధిని గూర్చి చెబుతున్నాను. దాన్ని విను. ఉత్తమలక్షణాలతో మంగళకరమైన, దూడలతో కూడిన ఆవులను ఒక వేయింటిని తీసుకువచ్చి వాటిని పూజించాలి. వాటిలో ఎనిమిది గోవులను శాస్త్రానుసారంగా, ప్రయత్నపూర్వకంగా, మిక్కిలిగా పూజించాలి. అనంతరం వాటి శృంగాలను ఒక నిష్క సువర్ణంతో చుట్టాలి. గిట్టలను ఒక్కొక్క రజతనిష్కంతో చుట్టాలి. కంఠాలను ఒక్కొక్క నిష్కసువర్ణంతో గళాభరణంగా అలంకరించాలి. చెవులను సుందరరత్నాలతో అలంకరించాలి.

**శివాయ దద్యాద్విప్రేభ్యో దక్షిణాం చ పృథక్ పృథక్ ।**
**దశనిష్కం తదర్ధం వా తస్యార్ధార్ధమథాపి వా ॥4॥**

**యథా విభవవిస్తారం నిష్కమాత్రమథాపి వా ।**
**వస్త్రయుగ్మం చ దాతవ్యం పృథగ్విప్రేషు శోభనమ్ ॥5॥**

**గావశ్చారాధ్య యత్నేన దాతవ్యాః సుమనోరమాః ।**

అనంతరం వాటిని శివభగవానుడికి అర్పించాలి. బ్రాహ్మణులకు వేరువేరుగా పది నిష్కాలు, లేక అందులో సగం ఐదు నిష్కాలు, లేక అందులో సగం రెండున్నర నిష్కాలు లేక అందులో సగం, లేక ఒక నిష్కమైనా యజమాని శక్తి కొలది బంగారం దక్షిణ ఇవ్వాలి. విశిష్టుడైన విప్రుడికి అందమైన జతవస్త్రాలను ప్రదానం చేయాలి. ఏకాగ్రచిత్తుడై ఆరాధించి ఆ శ్రేష్ఠవిప్రుడికి ఉత్తమమైన గోవులను ప్రదానం చేయాలి.

**ఏవం దత్త్వా విధానేన శివమభ్యర్చ్య శంకరమ్ ॥6॥**

**జపేదగ్రే యథాన్యాయం గవాం స్తవమనుత్తమమ్ ।**
**గావో మమాగ్రతో నిత్యం గావో నః పృష్ఠతస్తథా ॥7॥**

**హృదయే మే సదా గావో గవాం మధ్యే వసామ్యహమ్ ।**
**ఇతి కృత్వా ద్విజాగ్రేభ్యో దత్త్వా గత్వా ప్రదక్షిణమ్ ॥8॥**

**తద్రోమవర్షసంఖ్యాని స్వర్గలోకే మహీయతే ॥9॥**

ఈ విధంగా విధానపూర్వకంగా దానం చేసి, కళ్యాణకారి అయిన శివభగవానుడిని అర్చించి, గోవులముందు ఈ ఉత్తమస్తవాన్ని మిక్కిలిగా పఠించాలి. "గావో మమాగ్రతో నిత్యం గావో నః పృష్ఠతస్తథా, హృదయే మే సదా గావో గవాం మధ్యే వసామ్యహమ్" (అనగా గోవులు నిత్యం నాముందు ఉన్నవి. గోవులు నా వెనుక ఉన్నవి. గోవులు ఎల్లప్పుడు నా హృదయముందున్నవి. నేను గోవులమధ్య నివసిస్తున్నాను.) ఈ విధంగా పఠించి, బ్రాహ్మణ శ్రేష్ఠుడికి గోవులను ప్రదానం చేసి, ఆయనకు ప్రదక్షిణం చేయాలి. ఈ విధంగా గోదానం చేసిన మానవుడు ఆ గోవుల శరీరంలో ఎన్ని రోమాలు ఉన్నాయో అన్ని సంవత్సరాలు స్వర్గలోకంగా నిలిచి ఉంటున్నాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే గోసహస్రప్రదానం నామాష్టత్రింశోఽధ్యాయః ॥38॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని వేయి గోవులను దానం చేయటం అనే పేరు గల ముప్పై యెనిమిదవ అధ్యాయం సమాప్తం.



## ఏకోనచత్వారింశోఽధ్యాయః - ముప్పై తొమ్మిదవ అధ్యాయం

## హిరణ్యాశ్వదానమ్ - బంగారు గుఱ్ఱాన్ని దానం చేయటం

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**హిరణ్యాశ్వప్రదానం చ వదామి విజయావహమ్ ।**
**అశ్వమేధాత్పునః శ్రేష్ఠం వదామి శృణు సువ్రత ॥ 1॥**

ఇపుడు నేను విశ్వజయకారకమైన హిరణ్యాశ్వదానం గూర్చి చెబుతున్నాను. ఓ సువ్రతా! అశ్వమేధ యజ్ఞానికన్నా శ్రేష్ఠమైన ఈ దానాన్ని గూర్చి చెబుతున్నాను విను.

**అష్టోత్తరసహస్రేణ అష్టోత్తరశతేన వా ।**
**కృత్వాశ్వం లక్షణైర్యుక్తం సర్వాలంకారసంయుతమ్ ॥2॥**

**పంచకళ్యాణసంపన్నం దివ్యాకారం తు కారయేత్ ।**
**సర్వలక్షణసంయుక్తం సర్వాంగైశ్చ సమన్వితమ్ ॥3॥**

**సర్వాయుధసమోపేతమింద్రవాహనముత్తమమ్ ।**
**తన్మధ్యదేశే సంస్థాప్య తురంగం స్వగుణాన్వితమ్ ॥4॥**

**ఉచ్చైఃశ్రవసకం మత్వా భక్త్యా చైవ సమర్చయేత్ ।**

ఒక వెయ్యి ఎనిమిది లేక నూట ఎనిమిది నిష్కాల బంగారంతో ఒక గుఱ్ఱాని నిర్మించి, దాన్ని సర్వశుభలక్షణాలతో కూడి సర్వాలంకారాలతో శోభించే పంచకళ్యాణి మాదిరిగా అనగా నాల్గుపాదాలు, ముఖం తెల్లని రంగుగలదిగా దివ్యమైన ఆకృతిగలదిగా తీర్చిదిద్దాలి. సర్వశుభలక్షణాలతో అన్ని అంగాలతో కూడి, అన్ని ఆయుధాలతో శోభిల్లే ఒక ఉత్తమమైన ఇంద్రరథాన్ని నిర్మించి దాని ముందు మధ్యస్థానంలో సుందరగుణభరితమైన ఈ అశ్వాన్ని ఉంచాలి. దాన్ని ఉచ్చైఃశ్రవాశ్వంగా భావించి భక్తితో పూజించాలి.

**తస్య పూర్వదిశాభాగే బ్రాహ్మణం వేదపారగమ్ ॥5॥**
**సురేంద్రబుద్ధ్యా సంపూజ్య పంచనిష్కం ప్రదాపయేత్ ।**
**స చాశ్వః శివభక్తాయ దాతవ్యో విధినైవ తు ॥6॥**
**సువర్ణాశ్వం ప్రదత్త్వా తు ఆచార్యమపి పూజయేత్ ।**
**యథావిభవవిస్తారం పంచనిష్కమథాపి వా ॥7॥**
**దీనాంధకృపణానాథబాలవృద్ధకృశాతురాన్ ।**
**తోషయేదన్నదానేన బ్రాహ్మణాంశ్చ విశేషతః ॥8॥**

దానికి పూర్వదిక్కులో వేదపారంగతుడైన బ్రాహ్మణ విద్వాంసుడిని కూర్చుండబెట్టి, ఆతడిని ఇంద్రునిగా తలచి, పూజించి ఐదు నిష్కాల బంగారం దానం చేయాలి. ఆ సువర్ణాశ్వాన్ని విధి పూర్వకంగా శివభక్తుడికి ఇవ్వాలి. తన శక్త్యనుసారం ఆ బంగారు గుఱ్ఱాన్ని దానం చేసి, ఆచార్యుడిని పూజించి, ఐదునిష్కాల బంగారాన్ని ప్రదానం చేయాలి. తర్వాత దీనులకు, అంధులకు, అసహాయులకు, బాలబాలికలకు, వృద్ధులకు, దుర్బలులకు అట్లే రోగులకు మరియు బ్రాహ్మణులకు అన్నదానం చేసి సంతుష్టులను చేయాలి.

**ఏతద్యః కురుతే భక్త్యా దానమశ్వస్య మానవః ।**
**ఐంద్రాన్ భోగాంశ్చిరం భుక్త్వా రుచిరైశ్వర్యవాన్ భవేత్ ॥9॥**

ఏ మానవుడు భక్తిపూర్వకంగా ఈ సువర్ణాశ్వదానం చేస్తున్నాడో ఆతడు దీర్ఘకాలం ఇంద్రభోగాలను అనుభవించే గొప్ప ఐశ్వర్యవంతుడవుతాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే హిరణ్యాశ్వదానం నామైకోనచత్వారింశోఽధ్యాయః ॥39॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని బంగారు గుఱ్ఱాన్ని దానం చేయటం అనే పేరు గల ముప్పై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



## చత్వారింశోఽధ్యాయః - నలబైయవ అధ్యాయం

## కన్యాదానవిధిః - కన్యాదానవిధి

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**కన్యాదానం ప్రవక్ష్యామి సర్వదానోత్తమోత్తమమ్ ।**
**కన్యాం లక్షణసంపన్నాం సర్వదోషవివర్తితామ్ ॥1॥**
**మాతాపిత్రోస్తు సంవాదం కృత్వా దత్వా ధనం మహత్ ।**
**ఆత్మీకృత్యాథ సంస్నాప్య వస్త్రం దత్వా శుభం నవమ్ ॥2॥**

**భూషణైర్భూషయిత్వాథ గంధమాల్యైరథార్చయేత్ ।**

ఇపుడు నేను అన్ని దానాలలో అతిశ్రేష్ఠమైన కన్యాదానం గూర్చి చెబుతాను. ఏదో ఒక కన్య యొక్క తల్లిదండ్రులతో మాట్లాడి, వాళ్లకు అధికంగా ధనం ఇచ్చి, సమస్తశుభమంగళసంపన్న, సర్వదోషరహిత అయిన ఆ కన్యను తాను కుమార్తెగా చేసుకోవాలి. తర్వాత ఆమెకు స్నానం చేయించి సుందరనూతనవస్త్రాల్ని ధరింపజేసి, భూషణాలతో అలంకరించి గంధపుష్పాదులతో ఆమెను పూజించాలి.

**నిమిత్తాని సమీక్ష్యాథ గోత్రనక్షత్రకాదికాన్ ॥3॥**

**ఉభయోశ్చిత్తమాలోక్య ఉభౌ సంపూజ్య యత్నతః ।**
**దాతవ్యా శ్రోత్రియాయైవ బ్రాహ్మణాయ తపస్వినే ॥4॥**

**సాక్షాదధీతవేదాయ విధినా బ్రహ్మచారిణే ।**
**దాసదాసీధనాఢ్యం చ భూషణాని విశేషతః ॥5॥**

**క్షేత్రాణి చ ఘనం ధాన్యం వాసాంసి చ ప్రదాపయేత్ ।**
**యావంతి దేహే రోమాణి కన్యాయాః సంతతౌ పునః ॥6॥**

**యావద్వర్షే సహస్రాణి రుద్రలోకే మహీయతే ॥7॥**

అనంతరం శకునం, గోత్రం, నక్షత్రం మొదలైనవాటిని మిక్కిలిగా విచారించి, కన్య మరియు వరుని యొక్క అంతఃకరణాల పొంతన చూచి, వాళ్ల యిద్దరిని ప్రయత్నపూర్వకంగా యథావిధిగా పూజించి శ్రోత్రియుడు, తపస్వి, వేదపారంగతుడు అట్లే బ్రహ్మచారి అయిన ఆ వరుడికి యథావిధిగా ఈ కన్యను సమర్పించాలి. ఆమెతోపాటు దాసదాసీజనాలను, నగలను, భూమిని, ధనాన్ని, ధాన్యాన్ని అట్లే వస్త్రాలను ప్రదానం చేయాలి. ఈ దానాన్ని చేసిన మానవుడు ఈ కన్యయొక్క మరియు ఆమె సంతానం యొక్క శరీరంలో ఎన్ని రోమాలు ఉన్నాయో అన్ని వేలసంవత్సరాలు రుద్రలోకంలో నిలిచి ఉంటాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే కన్యాదానవిధిర్నామచత్వారింశోఽధ్యాయః ॥40॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని కన్యాదానవిధి అనే పేరు గల నలభైయవ అధ్యాయం సమాప్తం.

## **ఏకచత్వారింశోఽధ్యాయః** – నలబై యొకటవ అధ్యాయం

## **సువర్ణవృషదానమ్** – బంగారు గోవును దానం చేయటం

**సనత్కుమార ఉవాచ** – సనత్కుమారుడు పలికాడు.

**హిరణ్యవృషదానం చ కథయామి సమాసతః ।**
**వృషరూపం హిరణ్యేన సహస్రేణాథ కారయేత్ ॥1॥**

**అష్టోత్తరశతేనాపి వృషభం ధర్మరూపిణమ్ ॥2॥**

ఇపుడు నేను హిరణ్యవృషదానం గూర్చి సంక్షిప్తంగా చెబుతున్నాను. ధర్మరూపమైన వృషరూపాన్ని వేయి నిష్కాల బంగారంతోగాని అందులో సగంతోగాని, ఆసగంలో సగంతోగాని, మరియు అందులో సగంతోగాని చివరకు నూటఎనిమిది నిష్కాలతోగాని నిర్మించాలి.

**లలాటే కారయేత్పుండ్రమర్ధచంద్రకళాకృతిమ్ ।**
**స్ఫటికేన తు కర్తవ్యం ఖురం తు రజతేన వై ॥3॥**
**గ్రీవాం తు పద్మరాగేణ కకుద్గోమేదకేన చ ।**
**గ్రీవాయాం ఘూంటవలయం రత్నచిత్రం తు కారయేత్ ॥4॥**
**వృషాంగం కారయేత్తత్ర కింకిణీవలయావృతమ్ ।**
**పూర్వోక్తదేశకాలే తు వేదికోపరి మండలే ॥5॥**

**వృషేంద్రం స్థాపయేత్తత్ర పశ్చిమాముఖమగ్రతః ।**

ఆ వృషభం యొక్క లలాటభాగంలో స్ఫటికంతో అర్ధచంద్రాకారంలో పుండ్రాన్ని రచించాలి. గిట్టలను వెండితో, కంఠాన్ని పద్మరాగమణులతో, మోపురాన్ని గోమేదికాలతో నిర్మించాలి. తర్వాత కంఠంలో రత్నాలు పొదిగిన ఘంటలమాలతో అలంకరించాలి. చిరుగజ్జల మాలతో చుట్టబడిన మూర్తిని నిర్మించాలి. అనంతరం పూర్వం చెప్పిన స్థానంలో, కాలంలో వేదికమీద, మండలంలో పశ్చిమాభిముఖంగా ఆ వృషేంద్రాన్ని స్థాపించాలి.

**ఈశ్వరం పూజయేద్భక్త్యా వృషారూఢం వృషధ్వజమ్ ॥6॥**

**వృషేంద్రం పూజ్య గాయత్ర్యా నమస్కృత్య సమాహితః ।**
**తీక్ష్ణశృంగాయ విద్మహే ధర్మపాదాయ ధీమహి ।**
**తన్నో వృషః ప్రచోదయాత్ ॥7॥**

**మంత్రేణానేన సంపూజ్య వృషం ధర్మవివృద్ధయే ।**
**హోమయేచ్చ ఘృతాన్నాద్యైర్యథావిభవవిస్తరమ్ ॥8॥**

**వృషభః పూజ్య దాతవ్యో బ్రాహ్మణేభ్యః శివాయ వా ।**
**దక్షిణా చైవ దాతవ్యా యథా విత్తానుసారతః ॥9॥**

**ఏతద్యః కురుతే భక్త్యా వృషదానమనుత్తమమ్ ।**
**శివస్యానుచరో భూత్వా తేనైవ సహ మోదతే ॥10॥**

అనంతరం వృషభంపై ఆరూఢుడైన ఆ వృషధ్వజుడు శివుడిని భక్తి పూర్వకంగా పూజించాలి. తిరిగి నమస్కరించి, ఏకాగ్ర చిత్తంతో వృషభగాయత్రి మంత్రంతో వృషేంద్రాన్ని పూజించాలి. "తీక్ష్ణ శృంగాయ విద్మహే ధర్మపాదాయ ధీమహి, తన్నో వృషః ప్రచోదయాత్" ఈ మంత్రంతో వృషభాన్ని విధ్యుక్తంగా పూజించి, ధర్మాభివృద్ధికై ఆతడి శక్తి కొలది (దాత) నేయి, అన్నం, మున్నగు వాటితో హవనం చేయాలి. ఈ విధంగా మిక్కిలిగా పూజించి, ఆ వృషభాన్ని శివ భగవానుడికి గాని, బ్రాహ్మణుడికి గాని, సమర్పించాలి. శక్తికొలది అనగా ధనసమర్థతనుబట్టి దక్షిణ కూడా ఇవ్వాలి. ఏ మానవుడు భక్తి పూర్వకంగా ఈ అత్యుత్తమ వృషదానం చేస్తాడో ఆతడు శివుడి అనుచరుడై ఆయనతోపాటుగా ఆనందాన్ని పొందుతున్నాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే సువర్ణవృషదానం నామైకచత్వారింశోఽధ్యాయః ॥41॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని బంగారు గోవును దానం చేయుట అనే పేరు గల నలభై ఒకటవ అధ్యాయం సమాప్తం.



## ద్విచత్వారింశోఽధ్యాయః - నలభై రెండవ అధ్యాయం
## గజదానవిధానవర్ణనమ్ - గజదానవిధానవర్ణన

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**గజదానం ప్రవక్ష్యామి యథావదనుపూర్వశః ।**
**ద్విజాయ వా శివాయాథ దాతవ్యః పూజ్య పూర్వవత్ ॥1॥**

ఇపుడు నేను క్రమానుసారంగా గజదానవర్ణనం ఉన్నది ఉన్నట్లు చెబుతాను. పూర్వం మాదిరిగానే విధిపూర్వకంగా దానిని పూజించి, శివభగవానుడికి గాని, బ్రాహ్మణుడికిగాని సమర్పించాలి.

**గజం సులక్షణోపేతం హైమం వా రాజితం తు వా ।**
**సహస్రనిష్కమాత్రేణ తదర్ధేనాపి కారయేత్ ॥2॥**

**తదర్ధార్ధేన వా కుర్యాత్సర్వలక్షణభూషితమ్ ।**
**పూర్వోక్తదేశకాలే చ దేవాయ వినివేదయేత్ ॥3॥**

**అష్టభ్యాం వా ప్రదాతవ్యం శివాయ పరమేష్ఠినే ।**
**బ్రాహ్మణాయ దరిద్రాయ శ్రోత్రియాయాహితాగ్నినే ॥4॥**

**శివముద్దిశ్య దాతవ్యం శివం సంపూజ్య పూర్వవత్ ।**
**ఏతద్యః కురుతే దానం శివభక్తిసమాహితమ్ ॥5॥**

**స్థిత్వా స్వర్గే చిరం కాలం రాజా గజపతిర్భవేత్ ॥6॥**

ఒక వేయి నిష్కాల బంగారంతోగాని, వెండితోగాని లేక అందులో సగంతో గాని సర్వలక్షణసంపన్నమైన గజాన్ని తయారు చేయాలి. లేకుంటే అందులో సగంలో సగంతోగాని సర్వలక్షణయుక్తమైన ఏనుగును నిర్మించాలి. పూర్వం చెప్పిన దిక్కులో, కాలంలో దాన్ని మహాదేవుడికి అర్పించాలి. పూర్వోక్త దేశకాలాల అభావంలో పరమేష్ఠి శివుడియొక్క అష్టమీతిథిలో అర్పణ చేయాలి. లేకపోతే శివుడిని ఉద్దేశించి ధనహీనుడు, శ్రోత్రియుడు, అగ్నిహోత్రుడు అయిన బ్రాహ్మణుడికి ప్రదానం చేయాలి.

పూర్వం మాదిరిగానే శివభగవానుడిని బాగా పూజించి, దీన్ని దానం చేయాలి. ఏ మానవుడు శివభక్తితో గజదానం చేస్తున్నాడో ఆతడు దీర్ఘకాలం స్వర్గంలో నివాసముండి తర్వాతి జన్మలో గజపతి అనగా సార్వభౌముడైన రాజు అవుతాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే గజదానవిధాననిర్ణయం నామద్విచత్వారింశోఽధ్యాయః ॥42॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని గజదానవిధానవర్ణనం అనే పేరుగల నలభైరెండవ అధ్యాయం సమాప్తం.

## **త్రిచత్వారింశోఽధ్యాయః - నలబై మూడవ అధ్యాయం**

## **అష్టలోకపాలకదానవిధానవర్ణనమ్ - అష్టలోకపాలక దానవిధానవర్ణనం**

సనత్కుమార ఉవాచ - సనత్కుమారుడు పలికాడు.

**లోకపాలాష్టకం దివ్యం సాక్షాత్పరమదుర్లభమ్ ।**
**సర్వసంపత్కరం గుహ్యం పరచక్రవినాశనమ్ ॥1॥**

**స్వదేశరక్షణం దివ్యం గజవాజివివర్ధనమ్ ।**
**పుత్రవృద్ధికరం పుణ్యం గోబ్రాహ్మణహితావహమ్ ॥2॥**

ఇపుడు నేను లోకపాలాష్టకదానవర్ణనం చేస్తున్నాను. అది దివ్యం, పరమదుర్లభం, సమస్త సంపత్ప్రదం, గోపనీయం, శత్రురాజ్యవినాశకారి, స్వదేశరక్షణశాలి, ప్రశస్తమైనది, ఏనుగులను, గుఱ్ఱాలను వృద్ధిపర్చేది, సంతానవృద్ధికారి, పుణ్యదాయకమైనది, గోబ్రాహ్మణకళ్యాణకారి.

**పూర్వోక్తదేశకాలే తు వేదికోపరి మండలే ।**
**మధ్యే శివం సమభ్యర్చ్య యథాన్యాయం యథాక్రమమ్ ॥ 3॥**

**దిగ్విదిక్షు ప్రకర్తవ్యం స్థండిలం వాలుకామయమ్ ।**
**అష్టౌ విప్రాన్ సమభ్యర్చ్య వేదవేదాంగపారగాన్ ॥ 4॥**

**జితేంద్రియాన్ కులోద్భూతాన్ సర్వలక్షణసంయుతాన్ ।**
**శివాభిముఖమాసీనానాహతేష్వంబరేషు చ ॥5॥**

**వస్త్రైరాభరణైర్దివ్యైర్లోకపాలకమంత్రకైః ।**
**గంధపుష్పైః సుధూపైశ్చ బ్రాహ్మణానర్చయేత్క్రమాత్ ॥6॥**

పూర్వం చెప్పిన దేశకాలాలలో వేదికమీద మండలాన్ని నిర్మించి, దాని మధ్యలో శివుడిని స్థాపించి, ఆయనను బాగా పూజించిన తర్వాత అష్టదిక్కులలో వాలుకామయమైన స్థండిలాన్ని ఏర్పరచాలి. తర్వాత ఆ ఎనిమిది వేదికలమీద నూత్నవస్త్రాలను కప్పి, ఆసనాలమీద వేదవేదాంగపారగులు, జితేంద్రియులు, ఉత్తమకులజులు, సర్వలక్షణసంపన్నులు అయిన ఎనిమిది మంది విప్రులను శివుడికి ఎదురుగా కూర్చుండజేసి, వాళ్ళను పూజించాలి. దివ్య వస్త్రాలతో, భూషణాలతో అలంకరించి, గంధపుష్పాలతో అట్లే ఉత్తమధూపంతో వివిధోపచారాలతో లోకపాలకమంత్రాల ద్వారా వారిని క్రమంగా పూజించాలి.

**పూర్వతో హోమయేదగ్నౌ లోకపాలకమంత్రకైః ।**
**సమిద్ఘృతాభ్యాం హోతవ్యమగ్నికార్యం క్రమేణ వా ॥7॥**

**ఏవం హుత్వా విధానేన ఆచార్యః శివవత్సలః ।**
**యజమానం సమాహూయ సర్వాభరణభూషితాన్ ॥8॥**

**తేన తాన్ పూజయిత్వాథ దిజేభ్యో దాపయేద్ధనమ్ ।**
**పృథక్ పృథక్ తన్మంత్రైశ్చ దశనిష్కం చ భూషణమ్ ॥9॥**

**దశనిష్కేణ కర్తవ్యమాసనం కేవలం పృథక్ ।**
**స్నపనం తత్ర కర్తవ్యం శివస్య విధిపూర్వకమ్ ॥10॥**

**దక్షిణా చ ప్రదాతవ్యా యథావిభవవిస్తరమ్ ।**
**ఏవం యః కురుతే దానం లోకేశానాం తు భక్తితః ।**
**లోకేశానాం చిరం స్థిత్వా సార్వభౌమో భవేద్బుధః ॥11॥**

అనంతరం పూర్వం మాదిరిగానే అగ్నిలో హోమం చేయాలి. లోకపాలకులమంత్రాల ద్వారా నేతితో, సమిధలతో క్రమపూర్వకంగా అగ్నికారం (హవనం) చేయాలి. ఈ రకంగా విధానపూర్వకంగా హవనం చేసి శివభక్తుడైన ఆచార్యుడు యజమానిని పిలిచి, ఆయన ద్వారా సర్వాభరణాలతో అలంకృతులైన విప్రులను పూజింపజేసి, ఆ లోకపాలమంత్రాలతో వారిని వేరువేరుగా ద్రవ్యాలతో అట్లే దశనిష్కసువర్ణంతో అలంకారం చేయాలి. దశనిష్కపరిమాణమైన ఆసనంకూడా ఇవ్వాలి. విధి పూర్వకంగా శివభగవానుడికి స్నానం చేయించాలి. తర్వాత యజమాని తన శక్తి కొలది ఆచార్యుడికి దక్షిణ ఇవ్వాలి. ఏ మానవుడు భక్తిపూర్వకంగా ఈలోకపాలకదానం చేస్తాడో ఆతడు దీర్ఘకాలం లోకపాలకుల సమీపంలో నివసించి బుద్ధిమంతుడై చక్రవర్తి కాగలడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే అష్టలోకపాలకదానవిధానవర్ణనం నామ త్రిచత్వారింశోఽధ్యాయః॥43॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని అష్టలోకపాలకదానవిధానవర్ణన అనే పేరు గల నలభై మూడవ అధ్యాయం సమాప్తం.



## చతుశ్చత్వారింశోఽధ్యాయః - నలభైనాల్గవ అధ్యాయం

## విష్ణుదానవిధానవర్ణనమ్ - విష్ణుదానవిధానవర్ణన

**సనత్కుమార ఉవాచ** - సనత్కుమారుడు పలికాడు.

**అథాన్యత్సంప్రవక్ష్యామి సర్వదానోత్తమోత్తమమ్ ।**
**పూర్వోక్తదేశకాలే చ మండపే చ విధానతః ॥1॥**

**ప్రణయాత్కుండమధ్యే చ స్థండిలే శివసన్నిధౌ ।**
**పూర్వం విష్ణుం సమాసాద్య పద్మయోనిమతః పరమ్ ॥2॥**

**మంత్రాభ్యాం విధినోక్తాభ్యాం ప్రణవాదిసమంత్రకమ్ ।**
**నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి తన్నో విష్ణుః ప్రచోదయాత్ ॥3॥**

**బ్రహ్మబ్రాహ్మణవృద్ధాయ బ్రహ్మణే విశ్వవేధసే ।**
**శివాయ హరయే స్వాహా స్వధా వౌషట్ వషట్ తథా ॥4॥**

నేనిపుడు సర్వదానోత్తమైన మరో (త్రిమూర్తి) దానం గూర్చి చెప్తాను. పూర్వం చెప్పిన విధంగా మిక్కిలిగా మండపాన్ని, వేదికను నిర్మించాలి. తర్వాత భక్తి పూర్వకంగా శివకుండం సమీపంలో స్థండిలం మీద శివభగవానుడిని స్థాపించి, ఆయన ప్రక్కగా ముందుగా విష్ణువును, తర్వాత పద్మయోని బ్రహ్మను స్థాపించి, ప్రణవంతో కూడిన శివమంత్రంతో విధి పూర్వకంగా వారిని పూజించాలి. ఆ శివమంత్రం ఇది-నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి, తన్నో విష్ణుః ప్రచోదయాత్, బ్రహ్మ బ్రాహ్మణ వృద్ధాయ బ్రహ్మణే విశ్వవేధసే, శివాయ హరయే స్వాహా స్వధా వౌషట్ వషట్ తథా.

**పూజయిత్వా విధానేన పశ్చాద్ధోమం సమాచారేత్ ।**
**సర్వద్రవ్యం హి హోతవ్యం ద్వాభ్యాం కుండవిధానతః ॥5॥**

**ఋత్విజౌ ద్వౌ ప్రకర్తవ్యౌ గురుణా వేదపారగౌ ।**
**తానుద్దిశ్య యథాన్యాయం విప్రేభ్యో దాపయేద్ధనమ్ ॥6॥**

**శతమష్టోత్తరం తేభ్యః పృథక్ పృథగనుత్తమమ్ ।**
**వస్త్రాభరణసంయుక్తం సర్వాలంకారసంయుతమ్ ॥7॥**

**గురురేకో హి వై శ్రీమాన్ బ్రహ్మా విష్ణుర్మహేశ్వరః ।**
**తేషాం పృథక్పృథగ్దేయం భోజయేద్బ్రాహ్మణానపి ॥8॥**

**శివార్చనా చ కర్తవ్యా స్నపనాది యథాక్రమమ్ ॥9॥**

ఈ విధంగా విధిపూర్వకంగా పూజించి తర్వాత హోమం చేయాలి. బ్రహ్మ విష్ణువులను గూర్చి వేరువేరుగా కుండాల్ని వ్యవస్థీకరించి సంపూర్ణంగా హోమద్రవ్యాలను హవనం చేయాలి. ఆచార్యుడు వేదపారగులైన ఇద్దరు ఋత్విజులను నియమించాలి. వారిని బ్రహ్మవిష్ణుశివులుగా భావించి సముచితంగా దక్షిణాద్రవ్యాలను ఇవ్వాలి. వస్త్రాలు, నగలు, అట్లే అన్ని అలంకారాలు – వీటితోపాటుగా నూట ఎనిమిది సువర్ణముద్రికలను వేరువేరుగా ఆ విప్రులకు ప్రదానం చేయాలి. శ్రీమంతుడైన గురువు (ఆచార్యుడు) ఒక్కడున్నాడు. మరల ఆయనను సాక్షాత్తుగా బ్రహ్మ, విష్ణు, శివుడుగా భావించి మూడు మూర్తులను దానం ఇవ్వాలి. ఇతర బ్రాహ్మణులకు, అట్లే దీనులకు, దుఃఖార్తులకు భోజనం పెట్టాలి. దీని తర్వాత అభిషేకం మొదలైన శివార్చన యథావిధిగా జరపాలి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే విష్ణుదానవిధానవర్ణనం నామ చతుశ్చత్వారింశోఽధ్యాయః ॥44॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని విష్ణుదానవిధానవర్ణనం అనే పేరు గల నలభైనాల్గవ అధ్యాయం సమాప్తం.



## పంచచత్వారింశోఽధ్యాయః - నలబై అయిదవ అధ్యాయం

## జీవచ్ఛ్రాద్ధవిధిః - జీవత్‌శ్రాద్ధవిధానం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**ఏవం షోడశ దానాని కథితాని శుభాని చ ।**
**జీవచ్ఛ్రాద్ధక్రమోఽస్మాకం వక్తుమర్హసి సాంప్రతమ్ ॥1॥**

ఓ సూతమహర్షీ! ఈ విధంగా నీవు పదహారు కళ్యాణకారకాలైన దానాలను గూర్చి చెప్పావు. ఇపుడు నీవు మాకు జీవచ్ఛ్రాద్ధ విధిని గూర్చి కృపతో చెప్పవలసింది.

**సూత ఉవాచ** - సూతర్షి పలికాడు.

**జీవచ్ఛ్రాద్ధవిధిం వక్ష్యే సమాసాత్సర్వసమ్మతమ్ ।**
**మనవే దేవదేవేన కథితం బ్రహ్మణా పురా ॥2॥**

**వసిష్ఠాయ చ శిష్టాయ భృగవే భార్గవాయ చ ।**
**శృణ్వంతు సర్వభావేన సర్వసిద్ధికరం పరమ్ ॥3॥**

**శ్రాద్ధమార్గక్రమం సాక్షాచ్ఛ్రాద్ధార్హాణామపి క్రమమ్ ।**
**విశేషమపి వక్ష్యామి జీవచ్ఛ్రాద్ధస్య సువ్రతాః ॥4॥**

నేను సర్వసమ్మతమైన జీవచ్ఛ్రాద్ధవిధిని సంగ్రహంగా వర్ణిస్తున్నాను. పూర్వం ఈ విషయాన్ని దేవదేవుడైన బ్రహ్మ స్వాయంభువమనువుకు, పూజ్యుడైన వసిష్ఠుడికి, భృగువుకు, భార్గవుడికి చెప్పాడు. మీరు ఏకాగ్రచిత్తులై సమస్తసిద్ధిప్రదాత అయిన ఈ శ్రాద్ధవిషయాన్ని వినండి. ఓ సువ్రతులారా! నేను అతిశ్రేష్ఠమైన శ్రాద్ధమార్గంయొక్క విధానం, శ్రద్ధాయోగ్యతగల పురుషుల క్రమం, మరియు జీవచ్ఛ్రాద్ధ విశేషవిధిని చెప్తాను.

**పర్వతే వా నదీ తీరే వనే వాయతనేఽపి వా ।**
**జీవచ్ఛ్రాద్ధం ప్రకర్తవ్యం మృతకాలే ప్రయత్నతః ॥5॥**

**జీవచ్ఛ్రాద్ధే కృతే జీవో జీవన్నేవ విముచ్యతే ।**
**కర్మ కుర్వన్నకుర్వన్ వా జ్ఞానీ వాజ్ఞానవానపి ॥6॥**
**శ్రోత్రియోఽశ్రోత్రియో వాపి బ్రాహ్మణః క్షత్రియోఽపి వా ।**
**వైశ్యో వా నాత్ర సందేహో యోగమార్గగతో యథా ॥7॥**

మానవుడు వృద్ధావస్థలో పర్వతంమీద, నది ఒడ్డున, అరణ్యంలో లేక దేవాలయంలో ప్రయత్నపూర్వకంగా జీవచ్ఛ్రాద్ధం నిర్వహించాలి. ఈ జీవచ్ఛ్రాద్ధం చేసిన తర్వాత ఆ వృద్ధుడు జీవించి ఉన్నా ముక్తుడు అవుతున్నాడు. కర్మ చేసినా చేయకున్నా, జ్ఞాని అయినా అజ్ఞాని అయినా, శ్రోత్రియుడైనా అశ్రోత్రియుడైనా, బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు-ఎవ్వడైనా ఆ యోగకర్మను పొందిన యోగికి మాదిరి ముక్తుడు అవుతున్నాడు. ఇందులో సందేహంలేదు.

**పరీక్ష్య భూమిం విధివద్గంధవర్ణరసాదిభిః ।**
**శల్యముద్ధృత్య యత్నేన స్థండిలం సైకతం భువి ॥ 8॥**

**మధ్యతో హస్తమాత్రేణ కుండం చైవాయతం శుభమ్ ।**
**స్థండిలం వా ప్రకర్తవ్యమిషుమాత్రం పునః పునః ॥9॥**

**ఉపలిప్య విధానేన చాలిప్యాగ్నిం విధాయ చ ।**
**అన్వాధాయ యథాశాస్త్రం పరిగృహ్యా చ సర్వతః ॥10॥**

**పరిస్తీర్య స్వశాఖోక్తం పారంపర్యక్రమాగతమ్ ।**
**సమాప్యాగ్నిముఖం సర్వం మంత్రైరేతైర్యథాక్రమమ్ ॥11॥**

**సంపూజ్య స్థండిలే వహ్నౌ హోమయేత్సమిధాదిభిః ।**
**ఆదౌ కృత్వా సమిద్ధోమం చరుణా చ పృథక్ పృథక్ ॥12॥**

**ఘృతేన చ పృథక్పాత్రే శోధితేన పృథక్ పృథక్ ।**
**జుహుయాదాత్మనోద్ధృత్య తత్త్వభూతాని సర్వతః ॥13॥**

జీవచ్ఛ్రాద్ధవిధి చెప్పబడుతున్నది. గంధం, వర్ణం, రసం మొదలైన వాటిద్వారా భూమిని విధిపూర్వకంగా పరీక్షించి, ప్రయత్నపూర్వకంగా శల్యాది దోషాలు దొలగించి, అందులో ఇసుకతో వేదికను నిర్మించి, ఆ వేదికమధ్యలో ఒక హస్తపరిమాణంలో పొడవు వెడల్పులతో అందమైన కుండాన్ని లేక బాణప్రమాణంలో స్థండిలాన్ని నిర్మించాలి. వాటిని మాటి మాటికి నీటితో తడిపి గోమయంతో అలికి వారి వారి వేదశాఖలద్వారా పారంపర్యంగా వచ్చిన మంత్రాలతో అగ్నిని స్థాపించి మూడు సమిధలు తీసుకుని ఆహ్వానించిన దేవతలందరిని ఆవాహనచేసి, తిరిగి కుశాస్తరణ చేయాలి. విధిపూర్వకంగా పూజచేసి స్థండిలంమీద అగ్నిలో సమిధాదులద్వారా హోమం చేయాలి. ముందుగా సమిధలతో హవనం చేసి తర్వాత చరువుతో, నేతితో వేరువేరుగా హవనం చేయాలి. ఆజ్యపాత్రలో శుద్ధి చేయబడిన నేతితో తత్త్వభూతాలను మనసులో భావించి నాల్గు దిక్కులలో వేరువేరుగా హవనం చేయాలి.

| | | | |
|---|---|---|---|
| ఓం భూః బ్రహ్మణే నమః॥ | **14** | ఓం భూః బ్రహ్మణే స్వాహా॥ | **15** |
| ఓం భువః విష్ణవే నమః॥ | **16** | ఓం భువః విష్ణవే స్వాహా॥ | **17** |
| ఓం స్వః రుద్రాయ నమః॥ | **18** | ఓం స్వః రుద్రాయ స్వాహా॥ | **19** |
| ఓం మహః ఈశ్వరాయ నమః॥ | **20** | ఓం మహః ఈశ్వరాయ స్వాహా॥ | **21** |
| ఓం జనః ప్రకృతయే నమః॥ | **22** | ఓం జనః ప్రకృత్యై స్వాహా॥ | **23** |
| ఓం తపః ముద్గలాయ నమః॥ | **24** | ఓం తపః ముద్గలాయ స్వాహా॥ | **25** |
| ఓం ఋతం పురుషాయ నమః॥ | **26** | ఓం ఋతం పురుషాయ స్వాహా॥ | **27** |
| ఓం సత్యం శివాయ నమః॥ | **28** | ఓం సత్యం శివాయ స్వాహా॥ | **29** |

ఓం శర్వ ధరాం మే గోపాయ ఘ్రాణే గంధం శర్వాయ దేవాయ భూర్నమః॥ **30**
ఓం శర్వ ధరాం మే గోపాయ ఘ్రాణే గంధం శర్వాయ భూః స్వాహా॥ **31**
ఓం శర్వ ధరాం మే గోపాయ ఘ్రాణే గంధం శర్వస్య దేవస్య పత్న్యై భూర్నమః॥ **32**

ఓం శర్వ ధరాం మే గోపాయ ఘ్రాణే గంధం శర్వపత్న్యై భూః స్వాహా॥ 33
ఓం భవ జలం మే గోపాయ జిహ్వాయాం రసం భవాయ దేవాయ భువో నమః॥ 34
ఓం భవ జలం మే గోపాయ జిహ్వాయాం రసం భవాయ దేవాయ భువః స్వాహా॥ 35
ఓం భవ జలం మే గోపాయ జిహ్వాయాం రసం భవస్య దేవస్య పత్న్యై భువో నమః॥ 36
ఓం భవ జలం మే గోపాయ జిహ్వాయాం రసం భవస్య పత్న్యై భువః స్వాహా॥ 37
ఓం రుద్రాగ్నిం మే గోపాయ నేత్రే రూపం రుద్రాయ దేవాయ స్వర్గో నమః॥ 38
ఓం రుద్రాగ్నిం మే గోపాయ నేత్రే రూపం రుద్రాయ దేవాయ స్వః స్వాహా॥ 39
ఓం రుద్రాగ్నిం మే గోపాయ నేత్రే రూపం రుద్రస్య పత్న్యై స్వరోం నమః॥ 40
ఓం రుద్రాగ్నిం మే గోపాయ నేత్రే రూపం రుద్రస్య దేవస్య పత్న్యై స్వః స్వాహా॥ 41
ఓం ఉగ్ర వాయుం మే గోపాయ త్వచి స్పర్శముగ్రాయ దేవాయ మహర్నమః॥ 42
ఓం ఉగ్ర వాయుం మే గోపాయ త్వచి స్పర్శముగ్రాయ దేవాయ మహః స్వాహా॥ 43
ఓం ఉగ్ర వాయుం మే గోపాయ త్వచి స్పర్శముగ్రస్య దేవస్య పత్న్యై మహరోం నమః॥ 44
ఓం ఉగ్ర వాయుం మే గోపాయ త్వచి స్పర్శముగ్రస్య దేవస్య పత్న్యై మహః స్వాహా॥ 45
ఓం ఉగ్ర వాయుం మే గోపాయ శ్రోత్రే శబ్దం భీమాయ దేవాయ జనో నమః 46
ఓం ఉగ్ర వాయుం మే గోపాయ శ్రోత్రే శబ్దం భీమాయ దేవాయ జనః స్వాహా॥ 47
ఓం భీమ సుషిరం మే గోపాయ శ్రోత్రే శబ్దం భీమస్య పత్న్యై జనో నమః 48
ఓం భీమ సుషిరం మే గోపాయ శ్రోత్రే శబ్దం భీమస్య దేవస్య పత్న్యై జనః స్వాహా॥ 49
ఓం ఈశ రజో మే గోపాయ ద్రవ్యే తృష్ణామీశాయ దేవాయ తపో నమః॥ 50
ఓం ఈశ రజో మే గోపాయ ద్రవ్యే తృష్ణామీశాయ దేవాయ తపః స్వాహా॥ 51
ఓం ఈశ రజో మే గోపాయ ద్రవ్యే తృష్ణామీశస్య పత్న్యై తపో నమః॥ 52
ఓం ఈశ రజో మే గోపాయ ద్రవ్యే తృష్ణామీశస్య పత్న్యై తపః స్వాహా॥ 53
ఓం మహాదేవ సత్యం మే గోపాయ శ్రద్ధాం ధర్మే మహాదేవాయ ఋతం నమః॥ 54
ఓం మహాదేవ సత్యం మే గోపాయ శ్రద్ధాం ధర్మే మహాదేవాయ ఋతం స్వాహా॥ 55
ఓం మహాదేవ సత్యం మే గోపాయ శ్రద్ధాం ధర్మే మహాదేవస్య పత్న్యై ఋతం నమః॥ 56
ఓం మహాదేవ సత్యం మే గోపాయ శ్రద్ధాం ధర్మే మహాదేవస్య పత్న్యై ఋతం స్వాహా॥ 57
ఓం పశుపతే పాశం మే గోపాయ భోక్తృత్వభోగ్యం పశుపతయే దేవాయ సత్యం నమః॥ 58
ఓం పశుపతే పాశం మే గోపాయ భోక్తృత్వభోగ్యం పశుపతయే దేవస్య సత్యం స్వాహా॥ 59
ఓం పశుపతే పాశం మే గోపాయ భోక్తృత్వభోగ్యం పశుపతేర్దేవస్య పత్న్యై సత్యం నమః॥ 60
ఓం పశుపతే పాశం మే గోపాయ భోక్తృత్వభోగ్యం పశుపతయే దేవాయ సత్యం స్వాహా॥ 61
ఓం శివాయ నమః॥62 ఓం శివాయ సత్యం స్వాహా॥ 63

ఏవం శివాయ హోతవ్యం విరించ్యాద్యం చ పూర్వవత్ ।
విరించ్యాద్యం చ పూర్వోక్తం సృష్టిమార్గేషు సువ్రతాః ॥64॥

**పునః పశుపతేః పత్నీం తథా పశుపతిం క్రమాత్ ।**
**సంపూజ్య పూర్వవన్మంత్రైర్హోతవ్యం చ క్రమేణ వై ॥65॥**

**చర్వంతమాజ్యపూర్వం చ సమిదంతం సమాహితః ॥66॥**

ఈ విధంగా మొదటిగా బ్రహ్మదేవుడు మొదలైన ఇరవై అయిదుగురు దేవతలకు పూజ చేసి పూర్వోక్త క్రమంలో మోక్షం కోసం హవనం చేయాలి. ఓ సువ్రతులారా! విరించి మొదలైనవారి పూజ, హవనం సృష్టిక్రమానుసారం చేసిన తర్వాత క్రమంగా పూర్వం మాదిరిగా పశుపతియొక్క పత్నికి, అట్లే పశుపతికి బాగా పూజ చేసి సమాహిత చిత్తుడై మంత్రాల ద్వారా చరువుతో, ఆజ్యంతో, సమిధలతో హవనం చేయాలి.

ఓం శర్వ ధరాం మే ఛింధి ఘ్రాణే గంధం ఛింధి మేఘం జహి భూః స్వాహా॥ 67
భువః స్వాహా॥ 68, స్వః స్వాహా॥ 69 భూర్భువః స్వః స్వాహా॥ 70
భూర్భువః స్వః స్వాహా॥ 71
ఏవం పృథక్పృథగ్హుత్వా కేవలేన ఘృతేన వా।
ప్రాణాదిభిశ్చ జుహుయాద్ ఘృతేనైవ తు కేవలమ్॥ 72
ఓం ప్రాణే నివిష్టోఽమృతం జుహోమి శివో మా విశాప్రదాహాయ ప్రాణాయ స్వాహా॥ 73
ప్రాణాధిపతయే రుద్రాయ వృషాంతకాయ స్వాహా॥ 74
ఓం భూః స్వాహా॥ 75 ఓం భువః స్వాహా॥ 76
ఓం స్వః స్వాహా॥ 77 ఓం భూర్భువః స్వః స్వాహా॥ 78

ఓం శర్వధరాం మే ఛింధి ఘ్రాణే గంధం ఛింధి మేఘంజహి భూః స్వాహా, భువః స్వాహా, స్వః స్వాహా, భూర్భుః స్వః స్వాహా॥ అపన మంత్రాలివి. ఈ మంత్రాలద్వారా సమిధలు మున్నగువానితో లేక కేవలం నేతితో ఒక వెయ్యిసార్లు లేక ఐదు వందలసార్లు, లేక ఎనిమిదిసార్లు వేరువేరుగా ఆహుతులిచ్చి 'విరజానామక'మైన దీక్షా మంత్రంద్వారా నేతితో ఆహుతి ఇవ్వాలి. తర్వాత ప్రాణాదిమంత్రాలద్వారా కేవలఘృతంతో నూట ఎనిమిదిసార్లు ఆహుతులివ్వాలి. ప్రాణాదిమంత్రమిది. ఓం ప్రాణే నివిష్టోఽమృతం జుహోమి శివో మా విశాప్రదాహాయ ప్రాణాయ స్వాహా॥ ప్రాణాధిపతయే రుద్రాయ వృషాంతకాయ స్వాహా, ఓం భూః స్వాహా, ఓం భువః స్వాహా॥ ఓం స్వః స్వాహా, ఓం భూర్భువః స్వః స్వాహా॥

**ఏవం క్రమేణ జుహుయాచ్ఛ్రాద్ధోక్తం చ యథాక్రమమ్ ।**
**సప్తమే అహని యోగీంద్రాన్ శ్రాద్ధార్హానపి భోజయేత్ ॥79॥**

**శర్వాదీనాం చ విప్రాణాం వస్త్రాభరణకంబళాన్ ।**
**వాహనం శయనం యానం కాంస్యతామ్రాదిభాజనమ్ ॥80॥**

**హైమం రాజతం ధేనుం తిలాన్ క్షేత్రం చ వైభవమ్ ।**
**దాసీదాసగణశ్చైవ దాతవ్యో దక్షిణామపి ॥81॥**

**పిండం చ పూర్వవద్దద్యాత్పృథగష్టప్రకారతః ।**
**బ్రాహ్మణానాం సహస్రం చ భోజయేచ్చ సదక్షిణమ్ ॥82॥**

**ఏకం వా యోగనిరతం భస్మనిష్ఠం జితేంద్రియమ్ ।**
**త్ర్యహం చైవ తు రుద్రస్య మహాచరునివేదనమ్ ॥ 83॥**

**విశేష ఏవం కథిత అశేష శ్రాద్ధచోదితః ।**

ఈ విధంగా శ్రాద్ధోక్తరీతిగా యథాక్రమంగా హవనం చేయాలి. తర్వాత ఏడు రోజులు యోగులకు, అట్లే శ్రాద్ధయోగ్య బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. 'శర్వ' మొదలైన ఎనిమిదిమంది దేవతల నామాలతో ఎనిమిది మంది బ్రాహ్మణులను పూజించి, వారికి వస్త్రాలు, భూషణాలు, కంబళ్లు, వాహనాలు, తల్పాలు, యానాలు, కంచు, రాగి పాత్రలు, బంగారం, వెండి, గోవులు, తిలలు, భూములు, ధనం మరియు దాసదాసీ జనాలు – ఇవి అన్నీ ప్రదానం చేయాలి. దక్షిణలివ్వాలి. 'శర్వ' ఆదులైన అష్టమూర్తులకు క్రమంగా ఎనిమిది పిండాలు ప్రదానం చేయాలి. వేయిమంది బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. వాళ్లకు దక్షిణలు ఇవ్వాలి. లేకుంటే యోగపరాయణుడు, భస్మనిష్ఠుడు, జితేంద్రియుడైన. శివభక్తుడికి ఒక్కడికి భోజనం పెట్టాలి. మూడు రోజులు రుద్రభగవానుడికి మహాచరువును నివేదించాలి. జీవచ్ఛ్రాద్ధవిషయంగా శాస్త్రంలో చెప్పిన విశేషాలు నేను మీకు చెప్పాను.

**మృతే కుర్యాన్న కుర్యాద్వా జీవన్ముక్తో యతః స్వయమ్ ॥84॥**

**నిత్యనైమిత్తికాదీని కుర్యాద్వా సంత్యజేత్తు వా ।**
**బాంధవే పి మృతే తస్య శౌచాశౌచం న విద్యతే ॥ 85॥**

**సూతకం చ న సందేహః స్నానమాత్రేణ శుద్ధ్యతి ।**
**పశ్చాజ్జాతే కుమారే చ స్వే క్షేత్రే చాత్మనో యది ॥ 86॥**

**తస్య సర్వం ప్రకర్తవ్యం పుత్రోఽపి బ్రహ్మ విద్భవేత్ ।**
**కన్యకా యది సంజాతా పశ్చాత్తస్య మహాత్మనః ॥87॥**

**ఏక పర్ణా ఇవ జ్ఞేయా అపర్ణా ఇవ సువ్రతా ।**
**భవత్యేవ న సందేహస్తస్యాశ్చాన్వయజా అపి ॥88॥**

**ముచ్యంతే నాత్ర సందేహః పితరో నరకాదపి ।**
**ముచ్యంతే కర్మణానేన మాతృతః పితృతస్తథా ॥89॥**

**కాలం గతే ద్విజే భూమౌ ఖనేచ్చాపి దహేత్తు వా ।**
**పుత్రకృత్యమశేషం చ కృత్వా దోషో నవిద్యతే ॥90॥**

**కర్మణా చోత్తరేణైవ గతిరస్య న విద్యతే ।**

జీవచ్ఛ్రాద్ధం చేసిన వ్యక్తి నిత్యనైమిత్తికకర్మలను చేసినా త్యజించినా, ఆతడు మృతుడయిన తర్వాత ఎవరైనా ఆతడి శ్రాద్ధ కర్మలు చేసినా చేయకపోయినా ఇబ్బంది లేదు. ఎందుకంటే ఆతడు స్వయంగా జీవన్ముక్తుడు. బంధు బాంధవులు మృతులైనా ఆతడికి శుచి, అశుచి (శౌచం, అశౌచం) అట్లే సూతకం ఉండవు. ఆతడు స్నానమాత్రంతో శుద్ధుడవుతాడు. ఇందులో సందేహం లేదు. ఆతడి పత్నివల్ల తర్వాత పుత్రుడు పుట్టితే ఆతడు ఈతడికి సంపూర్ణమైన సంస్కారం చేయాలి. ఆ పుత్రుడు బ్రహ్మవేత్త అవుతున్నాడు. ఓ సువ్రతులారా! అనంతరం ఆ మహాత్ముడికి

కన్యకలిగితే, ఆ కన్య ఏకపర్ణ, లేక అపర్ణ (పార్వతీదేవి)తో సమానమైనదిగా తెలియాలి. ఆ కన్యయొక్క వంశంలో జన్మించేవారూ ముక్తులు కాగలరు. ఇందులో సందేహం లేదు. ఈ వ్యక్తికి ఈ జీవచ్ఛ్రాద్ధ కర్మవలన ఆతడి మాతృపక్షంలోని పితృపక్షంలోని పితరులు కూడా నరకం నుంచి విముక్తులవుతున్నారు. ఈ జీవచ్ఛ్రాద్ధకర్మ నిర్వహించిన ద్విజుడు మరణిస్తే ఆతడిని భూమిలో పాతిపెట్టవచ్చు లేక దహనం చేయవచ్చు. పుత్రుడివల్ల ఆతడికి ఉత్తరక్రియలు జరిగితే ఆతడికి ఎలాంటి దోషం అంటదు. చనిపోయిన తర్వాత ఏ విధమైన పారలౌకిక క్రియల అవసరం ఉండదు.

**బ్రహ్మణా కథితం సర్వం మునీనాం భావితాత్మనామ్ ॥91॥**

**పునః సనత్కుమారాయ కథితం తేన ధీమతా ।**
**కృష్ణద్వైపాయనాయైవ కథితం బ్రహ్మసూనునా ॥92**

**ప్రసాదాత్తస్య దేవస్య వేదవ్యాసస్య ధీమతః ।**
**జ్ఞాతం మయా కృతం చైవ నియోగాదేవ తస్య తు ॥93॥**

**ఏతద్వః కథితం సర్వం రహస్యం బ్రహ్మ సిద్ధిదమ్।**
**మునిపుత్రాయ దాతవ్యం న చాభక్తాయ సువ్రతాః ॥94॥**

ఓ ఋషులారా! బ్రహ్మదేవుడు పుణ్యాత్ములైన మునులకు దీన్ని చెప్పాడు. తిరిగి ఆ ధీశాలి అయిన బ్రహ్మ సనత్కుమారుడికి చెప్పాడు. బ్రహ్మపుత్రుడు సనత్కుమారుడు కృష్ణద్వైపాయన వ్యాసుడికి చెప్పాడు. తర్వాత బుద్ధిసంపన్నుడు వ్యాసభగవానుడు కృపతో నాకు చెప్పాడు. ఆయన ఆదేశంతోనే బ్రహ్మసిద్ధిప్రదాయకమై మిక్కిలి రహస్యమైన దీన్ని మీకు చెప్పాను. ఓ సువ్రతులారా! దీన్ని మునికుమారులకు మాత్రమే ప్రదానం చెయ్యండి. భక్తిహీనులకు చెప్పరాదు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే జీవచ్ఛ్రాద్ధవిధిర్నామ పంచచత్వారింశత్తమోఽధ్యాయః ॥45॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని జీవత్‌శ్రాద్ధవిధానం అనే పేరు గల నలబై అయిదవ అధ్యాయం



## షట్చత్వారింశోఽధ్యాయః - నలభై ఆరవ అధ్యాయం

## లింగపూజావర్ణనమ్ - లింగపూజావర్ణన

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**జీవచ్ఛ్రాద్ధవిధిః ప్రోక్తస్త్వయా సూత మహామతే ।**
**మూర్ఖాణామపి మోక్షార్థమస్మాకం రోమహర్షణ ॥1॥**

**రుద్రాదిత్యవసూనాం చ శక్రాదీనాం చ సువ్రత ।**
**ప్రతిష్ఠా కీదృశీ శంభోర్లింగమూర్తేశ్చ శోభనా ॥2॥**

**విష్ణోః శక్రస్య దేవస్య బ్రహ్మణశ్చ మహాత్మనః ।**
**అగ్నేర్యమస్య నిరృతేర్వరుణస్య మహాద్యుతే ॥3॥**

**వాయోః సోమస్య వక్షస్య కుబేరస్యామితాత్మనః ।**
**ఈశానస్య ధరాయాశ్చ శ్రీప్రతిష్ఠాథవా కథమ్ ॥4॥**

**దుర్గా శివా ప్రతిష్ఠా చ హైమవత్యాశ్చ శోభనా ।**
**స్కందస్య గణరాజస్య నందినశ్చ విశేషతః ॥5॥**

**తథాన్యేషాం దేవానాం గణానామపి వా పునః ।**
**ప్రతిష్ఠాలక్షణం సర్వం విస్తారాద్వక్తుమర్హసి ॥6॥**

ఓ మహామతీ! సూతర్షీ! ఓ రోమహర్షణా! అజ్ఞానులకు కూడా మోక్షం ఇచ్చే జీవచ్ఛ్రాద్ధవిధిని గూర్చి మాకు నీవు చెప్పావు. ఓ సువ్రతుడా! రుద్రుడు, ఆదిత్యుడు, వసువు, ఇంద్రుడు మొదలైన దేవతలయొక్క అట్లే శివభగవానుడియొక్క, లింగమూర్తి యొక్క సుందరప్రతిష్ఠ ఏ విధంగా ఉంటుంది. విష్ణువు, ఇంద్రదేవుడు, బ్రహ్మదేవుడు, అగ్ని, యముడు, నిరృతి, మహాతేజస్వి వరుణ దేవుడు, వాయువు, సోముడు, యక్షుడు, అమితాత్ముడు కుబేరుడు, ఈశానుడు, పృథ్వి-వీరియొక్క ఉత్తమప్రతిష్ఠ ఏ విధంగా చేయాలి. దుర్గాదేవి,శివ,హైమవతి, కార్తికేయుడు, గణనాథుడు నందీశ్వరుడు అట్లే ఇతరదేవతలు, మరియు గణాలు - వారియొక్క సుందరప్రతిష్ఠను గూర్చి విపులంగా వర్ణించు.

**భవాన్ సర్వార్థతత్త్వజ్ఞో రుద్రభక్తశ్చ సువ్రత ।**
**కృష్ణద్వైపాయనస్యాసి సాక్షాత్త్వమపరా తనుః ॥7॥**

**సుమంతజైమినిశ్చైవ పైలశ్చ పరమర్షయః ।**
**గురుభక్తిం తథా కర్తుం సమర్థో రోమహర్షణః ॥8॥**

**ఇతి వ్యాసస్య విపులా గాథా భాగీరథీతటే ।**
**ఏకః సమో వా భిన్నో వా శిష్యస్తస్య మహాద్యుతే ॥9॥**

**వైశంపాయనతుల్యోऽసి వ్యాసశిష్యేషు భూతలే ।**
**తస్మాదస్మాకమఖిలం వక్తుమర్హసి సాంప్రతమ్ ॥10॥**

ఓ సువ్రతుడా! నీవు సమస్తమైన అర్థతత్త్వాలనెరిగినవాడవు. మరియు శివభక్తుడవు. నీవు సాక్షాత్తుగా కృష్ణద్వైపాయన వ్యాసమహర్షికి రెండో రూపానివి. సుమంతుడు, జైమిని, పైలుడు పరమ ఋషులు. ఓ రోమహర్షణా! వాళ్లతో సమానంగా నీవు గురుభక్తిని ప్రదర్శించగల సమర్థుడవు ఈ విధమైన స్పష్టమైన వాక్కు గంగాతీరంలో వ్యాసుడినుంచి ప్రకటితమైనది. ఆ మహాతేజస్వితో సమానుడవు. లేకుంటే ఆయన రూపంలోగల ఆయన శిష్యుడవు. భూలోకంలో వ్యాసశిష్యుల్లో నీవు వైశంపాయనుడితో సమానుడవు. అందుచేత ఇపుడు నీవు మాకు సమస్తం సంపూర్ణంగా కృపతో చెప్పు.

**ఏవముక్త్వా స్థితేష్వేవ తేషు సర్వేషు తత్ర చ ।**
**బభూవ విస్మయోऽతీవ మునీనాం తస్య చాగ్రతః ॥11॥**

**అథాంతరిక్షే విపులా సాక్షాద్దేవీ సరస్వతీ ।**
**అలం మునీనాం ప్రశ్నోऽయమితి వాచా బభూవ హ ॥12॥**

**సర్వం లింగమయం లోకం సర్వం లింగే ప్రతిష్ఠితమ్ ।**
**తస్మాత్సర్వం పరిత్యజ్య స్థాపయేత్పూజయేచ్చ తత్ ॥13॥**

**లింగస్థాపన సన్మార్గ నిహితస్వాయతాసినా ।**
**ఆశు బ్రహ్మాండముద్భిద్య నిర్గచ్ఛేదవిశంకయా ॥14॥**

ఈ విధంగా పలికి అందరూ శాంతచిత్తులైన తర్వాత మునులయొక్క, సూతర్షియొక్క సమక్షంలో విస్మయకరమైన సంఘటన జరిగింది. అంతరిక్షంలో మహాదేవి సరస్వతి ఈ విధంగా పలుకుతూ సాక్షాత్కరించింది. మునులయొక్క ఆ ప్రశ్న సమీచీనమైనది. సమర్థమైనది. సంపూర్ణలోకం లింగమయమే. మరియు ఏదైనా లింగమందే ప్రతిష్ఠితమై ఉంది. అందుచేత అన్నింటిని వదలి లింగ ప్రతిష్ఠ అనే పూజను నిర్వహించాలి. లింగస్థాపనరూపమైన పుణ్యకర్మతో పొందిన మిక్కిలి పొడవైన ఖడ్గంతో శీఘ్రంగా బ్రహ్మాండాన్ని భేదించి, శంకారహితంగా ముక్తుడు అవుతున్నాడు.

**ఉపేంద్రాంభోజగర్భేంద్రయమాంబుధనదేశ్వరాః ।**
**తథాన్యే చ శివం స్థాప్య లింగమూర్తిం మహేశ్వరం ॥15॥**

**స్వేషు స్వేషు చ పక్షేషు ప్రధానాస్తే యథా ద్విజాః ।**
**బ్రహ్మా హరశ్చ భగవాన్ విష్ణుర్దేవీ రమా ధరా ॥16॥**

**లక్ష్మీర్ధృతిః స్మృతిః ప్రజ్ఞా ధరా దుర్గా శచీ తథా ।**
**రుద్రాశ్చ వసవః స్కందో విశాఖః శాఖ ఏవ చ ॥17॥**

**నైగమేశశ్చ భగవాన్ లోకపాలా గ్రహాస్తథా ।**
**సర్వే నందిపురోగాశ్చ గణా గణపతిః ప్రభుః ॥18॥**

**పితరో మునయః సర్వే కుబేరాద్యాశ్చ సుప్రభాః ।**
**ఆదిత్యా వసవః సాంఖ్యా అశ్వినౌ చ భిషగ్వరౌ ॥19॥**

**విశ్వే దేవాశ్చ సాధ్యాశ్చ పశవః పక్షిణో మృగాః ।**
**బ్రహ్మాదిస్థావరాంతం చ సర్వం లింగే ప్రతిష్ఠితమ్ ॥20॥**

**తస్మాత్సర్వం పరిత్యజ్య స్థాపయేల్లింగమవ్యయమ్ ।**
**యత్నేన స్థాపితం సర్వం పూజితం పూజయేద్యది ॥21॥**

ఓ ద్విజులారా! లింగమూర్తి మహేశ్వరశివుడిని స్థాపించుకోవాలి. ఏ విధంగా విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు ఈశ్వరుడు అదే విధంగా ఇతరులుకూడా వారి వారి విషయాల్లో ప్రధానులే. బ్రహ్మ, శంభుడు, విష్ణుభగవానుడు, దేవి, రమ, ధర, లక్ష్మి, ధృతి, స్మృతి, ప్రజ్ఞ, ధర, దుర్గ, శచి, అందరు రుద్రులు, వసువులందరు, కార్తికేయుడు, విశాఖుడు, శాఖుడు, భగవానుడు నైగమేశుడు, సమస్తలోకాలపాలకులు, గ్రహాలు, నంది మున్నగు గణాలు, ప్రభువైన గణపతి, పితరులు, మునిగణాలు, కాంతిమంతుడు కుబేరుడు మొదలైన యక్షులు, ఆదిత్యులందరు, వసువులు, సాంఖ్యులు, వైద్య శ్రేష్ఠులు అశ్వనీదేవతలిద్దరు, విశ్వేదేవుడు, సాధ్యగణాలు, పశువులు, పక్షులు, మరియు మృగాలు–బ్రహ్మ నుంచి స్థావరాల వరకు అన్నీ లింగమందే ప్రతిష్ఠింపబడ్డాయి. అందుచేత అన్నింటిని వదలి ప్రయత్నపూర్వకంగా శాశ్వతమైన లింగాన్ని స్థాపించుకుంటే అన్నింటిని స్థాపించినట్లే, లింగాన్ని పూజిస్తే అందర్నీ పూజించినట్లే అవుతున్నది.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే లింగపూజావర్ణనం నామ షట్చత్వారింశోఽధ్యాయః ॥46॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని లింగపూజావర్ణన అనే పేరు గల నలభై ఆరవ అధ్యాయం సమాప్తం



## సప్తచత్వారింశోఽధ్యాయః - నలభై ఏడవ అధ్యాయం

## లింగస్థాపనమ్ - లింగస్థాపనం

**సనత్కుమార ఉవాచ** - సూతర్షి పలికాడు.

**ఇతి నిశమ్య కృతాంజలయస్తదా దివి మహామునయః కృతనిశ్చయాః ।**
**శివతరం శివమీశ్వరమవ్యయం మనసి లింగమయం ప్రణిపత్య తే ॥1॥**

**సకలదేవపతిర్భగవానజో హరిరశేషపతిర్గురుణా స్వయం ।**
**మునివరాశ్చ గణాశ్చ సురాసురా నరవరాః శివలింగమయాః పునః ॥2॥**

లింగమయుడు అట్లే అవినాశి అయిన శివభగవానుడికి అంజలించి, మనసులో నమస్కరించారు దేవనాథుడైన ఇంద్రుడు, బ్రహ్మ, అందరికి స్వామియైన విష్ణుభగవానుడు, దేవగురువు బృహస్పతి, శ్రేష్ఠమునులందరు, అన్ని గణాలు, దేవతలు, అసురులు, శ్రేష్ఠ మానవులు-వీళ్లంతా వారికి శివలింగమయులుగా అనుభవానికి వచ్చారు.

**శ్రుత్వైవం మునయః సర్వే షట్కులీయాః సమాహితాః ।**
**సంత్యజ్య సర్వం దేవస్య ప్రతిష్ఠాం కర్తుముద్యతాః ॥3॥**

**అపృచ్ఛన్ సూతమనఘం హర్షగద్గదయా గిరా ।**
**లింగప్రతిష్ఠాం విపులాం సర్వే తే శంసితవ్రతాః ॥ 4॥**

ఆ మాటలు విన్న ఆరు కులాలకు చెందిన మునులందరూ అన్నింటిని విడిచి, ఏకాగ్రచిత్తులై లింగప్రతిష్ఠను చేయడానికై ఉద్యమించారు. సంయతవ్రతులైన ఆ మునులందరూ సంతోషంతో గాద్గద్యం చెందిన మాటలతో పుణ్యాత్ముడైన సూతర్షిని గొప్పదైన లింగప్రతిష్ఠను గూర్చి అడిగారు.

**సూత ఉవాచ** - సూతర్షి పలికాడు.

**ప్రతిష్ఠాం లింగమూర్తేర్వో యథావదనుపూర్వశః ।**
**ప్రవక్ష్యామి సమాసేన ధర్మకామార్థముక్తయే ॥5॥**

**కృత్వైవం లింగం విధినా భువి లింగేషు యత్నతః ।**
**లింగమేకతమం శైలం బ్రహ్మవిష్ణుశివాత్మకమ్ ॥6॥**

**హేమరత్నమయం వాపి రాజతం తామ్రజం తు వా ।**
**సవేదికం ససూత్రం చ సమ్యగ్విస్తృతమస్తకమ్ ॥7॥**

**విశోధ్య స్థాపయేద్భక్త్యా సవేదికమనుత్తమమ్ ।**
**లింగవేదీ ఉమా దేవీ లింగం సాక్షాన్మహేశ్వరః ॥8॥**

**తయోః సంపూజనాదేవ దేవీ దేవశ్చ పూజితా ।**
**ప్రతిష్ఠయా చ దేవేశో దేవ్యా సార్ధం ప్రతిష్ఠితః ॥9॥**

**తస్మాత్సవేదికం లింగం స్థాపయేత్థాపకోత్తమః ॥10॥**

ఓ మునులారా! ధర్మార్థకామమోక్షసాధనకై మీకు నేను సంక్షేపంగా లింగమూర్తి ప్రతిష్ఠను గూర్చి విధిపూర్వకంగా అనుక్రమంగా చెబుతాను. భూలోకంలో విధిపూర్వకంగా శిలతో లింగాన్ని నిర్మించాలి. అది బ్రహ్మవిష్ణుశివాత్మకంగా ఉండాలి. రత్నాలు పొదిగిన బంగారంతోగాని, వెండితోగాని, రాగితోగాని తయారు చేయవచ్చును. అది వేదికతో కూడి ఉండాలి. జలం వెలుపలకు పోవడానికై మార్గం ఉండాలి. విశాలమైన మస్తకం ఉండాలి. మిక్కిలిగ పరిశుభ్రపరిచి వేదికతోకూడా (పానవట్టం) సభక్తికంగా ప్రతిష్ఠించాలి. లింగంయొక్క వేదిక పార్వతీదేవి. లింగం సాక్షాత్తూ మహేశ్వరుడే. ఆ రెండూ అనగా వేదిక మరియు లింగం ప్రతిష్ఠించడంవల్ల పార్వతీదేవి మరియు దేవేశ్వరశివుడు ప్రతిష్ఠింపబడుతున్నారు. ఆ రెంటిని పూజిస్తే పార్వతీదేవి మరియు శివభగవానుడు పూజింపబడుతున్నారు. అందుచేత మేలైన స్థాపన వేదికతో కూడిన లింగస్థాపనే.

**మూలే బ్రహ్మ వసతి భగవాన్ మధ్యభాగే చ విష్ణుః సర్వేశానః పశుపతిరజో రుద్రమూర్తిర్వరేణ్యః తస్మాల్లింగం గురుతరతరం పూజయేత్థాపయేద్వా యస్మాత్పూజ్యో గణపతిరసౌ దేవముఖ్యైః సమస్తైః ॥11॥**

**గంధైః స్రగ్ధూపదీపైః స్నపనహుతబలిస్తోత్రమంత్రోపహారైర్నిత్యమ్**
**యేఽభ్యర్చయంతి త్రిదశవరతనుం లింగమూర్తిం మహేశమ్ ।**

**గర్భాధానాదినాశక్షయభయరహితా దేవగంధర్వముఖ్యైః సిద్ధైః**
**వంద్యాశ్చ పూజ్యా గణవరనమితాస్తే భవంత్యప్రమేయాః ॥12॥**

**తస్మాద్భక్త్యోపచారేణ స్థాపయేత్పరమేశ్వరమ్ ।**
**పూజయేచ్చ విశేషేణ లింగం సర్వార్థసిద్ధయే ॥13॥**

శివలింగంయొక్క మూలంలో బ్రహ్మదేవుడు, మధ్య భాగంలో విష్ణు భగవానుడు అగ్రభాగంలో సర్వేశ్వరుడు, రుద్రమూర్తి, వరేణ్యుడు పశుపతి శివుడు వెలసి ఉంటారు. అతిశ్రేష్ఠశివలింగాన్ని స్థాపించి పూజించాలి. అది ప్రధానులైన సమస్త దేవతలచేత పూజించడం అవుతుంది. అపుడు వారు శివుడియొక్క ప్రధానగణాలు అవుతున్నారు. ఎవరు గంధం, మాల్యం, ధూపం, దీపం, స్నానం, హవనం, నైవేద్యం, సమర్పణం, స్తోత్రం, మంత్రం అట్లే అనేకమైన ఉపహారాలతో దేవతలందరిలో శ్రేష్ఠరూపుడు లింగమూర్తి అయిన మహేశ్వరుడిని అర్చిస్తున్నారో, వాళ్లు ప్రధాన దేవతలచేత, గంధర్వులచేత, సిద్ధులచేత, వందనీయులు, పూజనీయులు అవుతున్నారు. శ్రేష్ఠశివగణాలకు నమస్కరిపందగినవారు అవుతున్నారు. అపరిమితప్రభావవంతులు అవుతున్నారు. అందుచేత కోరికలన్నీ తీరడానికై భక్తితో అన్ని ఉపచారాలతో మహేశ్వరుడిని, అట్లే విశేషరూపంగా లింగమూర్తిని స్థాపించి పూజించాలి.

**సమర్చ్య స్థాపయేల్లింగం తీర్థమధ్యే శివాసనే ।**
**కూర్చవస్త్రాదిభిర్లింగమాచ్ఛాద్య కలశైః పునః ॥14॥**

**లోకపాలాదిదైవత్యైః సకూర్చైః సాక్షతైః శుభైః ।**
**ఉత్కూర్చైః స్వస్తికాద్యైశ్చ చిత్రతంతుకవేష్టితైః ॥15॥**

**వజ్రాదికాయుధోపేతైః సవస్త్రైః సపిధానకైః ।**
**లక్షయేత్పరితో లింగమీశానేన ప్రతిష్ఠితమ్ ॥16॥**

అలా పూజించి, తీర్థంలో శివాసనం మీద లింగాన్ని స్థాపించాలి. కూర్చం, వస్త్రం, మున్నగువాటితో లింగాన్ని ఆచ్ఛాదించాలి. ఈశానమంత్రంతో ప్రతిష్ఠించి ఆ లింగం చుట్టూ కలశాలను రక్షణగా అలంకరించాలి. ఆ కలశాలకు అధిదేవతలు లోకపాలురు. శుభాక్షతలతో, స్వస్తికాదులతో, చిత్రవస్త్రాలతో, వజ్రం మొదలయిన ఆయుధాలతో, పై మంత్రాలతో ఆ కలశాలను అలంకరించాలి.

**ధూపదీపసమోపేతం వితానవితతాంబరమ్ ।**
**లోకపాలధ్వజైశ్చైవ గజాదిమహిషాదిభిః ॥17॥**

**చిత్రితైః పూజితైశ్చైవ దర్భమాలా చ శోభనా ।**
**సర్వలక్షణసంపూర్ణా తథా బాహ్యే చ వేష్టయేత్ ॥18॥**

ఒక విశాలమండపాన్ని నిర్మింపజేయాలి. అది ఎల్లప్పుడూ ధూపదీపాలతో వెలగాలి. పూజింపబడిన గజాల, మహిషాల చిత్రాలతో చిత్రింపబడాలి. లోకపాలాదుల ధ్వజాలతో మిక్కిలిగా శోభిల్లాలి. ఈ మండపం వెలుపల నాల్గువైపుల అన్ని సులక్షణాలతో సుసంపన్నమైన సుందరమైన దర్భలమాలను వ్రేలాడదీయాలి.

**తతోఽధివాసయేత్తోయే ధూపదీపసమన్వితే ।**
**పంచాహం వా త్ర్యహం వాథ ఏకరాత్రమథాపి వా ॥19॥**

**వేదాధ్యయనసంపన్నో నృత్యగీతాదిమంగలైః ।**
**కింకిణీరవకోపేతం తాలవీణారవైరపి ॥20॥**

**ఈక్షయేత్కాలమవ్యగ్రో యజమానః సమాహితః ।**
**ఉత్థాప్య స్వస్తికం ధ్యాయేన్మండపే లక్షణాన్వితే ॥21॥**

**సంస్కృతే వేదిసంయుక్తే నవకుండేన సంవృతే ।**
**పూర్వోక్తవిధినా యుక్తే సర్వలక్షణసంయుతే ॥22॥**

**అష్టమండలసంయుక్తే దిగ్ధ్వజాష్టకసంయుతే ।**
**పూర్వోక్తలక్షణోపేతైః కుండైః ప్రాగాదితః క్రమాత్ ॥23॥**

**ప్రధానం కుండమీశాన్యాం చతురస్త్రం విధీయతే ।**
**అథవా పంచకుండైకం స్థండిలం చైకమేవ చ ॥24॥**

తదనంతరం ఆ శివలింగాన్ని అయిదు రాత్రులు, లేక మూడు రాత్రులు, లేక ఒక రాత్రి ధూపదీపాలతోసహా నీటిలో అధివసింజేయాలి. యజమాని వేదాధ్యయన పరాయణుడై, నృత్యగీతమంగళాలతో, కింకిణుల ధ్వనులతో, తాళవీణాస్వరాలతో, మండపాన్ని నింపి, వ్యగ్రతలేని భావంతో కాలాన్ని గడపాలి. ప్రతిష్ఠసమయంలో జలంనుంచి లింగాన్ని బయటకు తీసి సమాయత్తచిత్తంతో పుణ్యాహవాచనంచేసి లింగాన్ని మండపమందుంచాలి. ఉండవలసిన లక్షణాలతో మిక్కిలిగా పరిష్కరించాలి. వేదికమీద ఉంచాలి. తొమ్మిది కుండాలతో చుట్టాలి. పూర్వోక్త విధిగా అన్ని లక్షణాలతో కూడి ఉండాలి. అష్టదిక్పాలకులకై ఎనిమిది మండలాలను నిర్మించాలి. అష్టదిక్కుల్లో నిల్పబడిన ధ్వజాలతో శోభిల్లాలి. పూర్వదిక్కు నుంచి క్రమంగా ప్రారంభించి పూర్వం చెప్పిన లక్షణాలతో కూడిన కుండాలతో ఈ మండపం

ఉండాలి. ఈశాన్యదిశలో ప్రధానకుండాన్ని ఉంచాలి. నిర్మించాలి. అది చతురస్రంగా ఉంటుంది. అయిదు కుండాలు ఒకే దిశ గలిగి ఉండాలి. ఒకటి స్థండిలమై ఉండాలి.

**యజ్ఞోపకరణైః సర్వైః శివార్చాయాం హి భూషణైః ।**
**వేది మధ్యే మహాశయ్యాం పంచతూలీప్రకల్పితామ్ ॥25॥**

**కల్పయేత్కాంచనోపేతాం సితవస్త్రావగుంఠితామ్ ।**
**ప్రకల్ప్యైవం శివం చైవ స్థాపయేత్పరమేశ్వరమ్ ॥26॥**

శివుడి అర్చనలో సమస్తయజ్ఞోపకరణాలు, భూషణాలతో కూడిన శయ్యను వేదికమధ్యలో నిర్మించాలి. దాని దగ్గరగా ఐదువత్తులతో కూడిన శయ్యను వేదికమధ్యలో నిర్మించాలి. దాని దగ్గరగా ఐదువత్తులతో వెలిగే దీపాల్ని ఉంచాలి. బంగారపు జరీపట్టికలుగల తెల్లటి వస్త్రాన్ని కప్పాలి. ఆ విధంగా శయ్యను నిర్మించి శివభగవానుడిని దానిపై ఉంచాలి.

**ప్రాక్శిరస్కం న్యసేల్లింగమీశానేన యథావిధి ।**
**రత్నన్యాసే కృతే పూర్వం కేవలం కలశం న్యసేత్ ॥27॥**

**లింగమాచ్ఛాద్య వస్త్రాభ్యాం కూర్చేన చ సమంతతః ।**
**రత్నన్యాసే ప్రసక్తేఽథ వామాద్యా నవశక్తయః ॥28॥**

**నవరత్నం హిరణ్యాద్యైః పంచగవ్యేన సంయుతైః ।**
**సర్వధాన్యసమోపేతం శిలాయామపి విన్యసేత్ ॥29॥**

లింగంయొక్క శిరోభాగాలను తూర్పుదిక్కులో ఈశానమంత్రం ద్వారా విధిపూర్వకంగా ఉంచాలి. రత్నన్యాసం చేసిన తర్వాత ముఖ్యకలశాన్ని ఉంచాలి. తర్వాత లింగానికి రెండు వస్త్రాలు దర్భలతో కూడినవై నాల్గు వైపుల చుట్టబడినవి కావాలి. రత్నన్యాసం జరిగిన తర్వాత వామాదులైన తొమ్మిది శక్తులను స్థాపించాలి. పంచగవ్యంతో తడిపిన బంగారంలో పొదిగిన తొమ్మిది రత్నాలు, పంచగవ్యం, అన్ని విధాల ధాన్యాలు ఆధారశిలపై ఉంచాలి.

**స్థాపయేద్బ్రహ్మలింగం హి శివగాయత్రి సంయుతమ్ ।**
**కేవలం ప్రణవేనాపి స్థాపయేచ్ఛివమవ్యయమ్ ॥30॥**

**బ్రహ్మజజ్ఞానమంత్రేణ బ్రహ్మభాగం ప్రభోస్తథా ।**
**విష్ణుగాయత్రియా భాగం వైష్ణవం త్వథ విన్యసేత్ ॥31॥**

**సూత్రే తత్త్వత్రయోపేతే ప్రణవేన ప్రవిన్యసేత్ ।**
**సర్వం నమః శివాయేతి నమో హంసః శివాయ చ ॥32॥**

**రుద్రాధ్యాయేన వా సర్వం పరిమృజ్య చ విన్యసేత్ ।**
**స్థాపయేద్బ్రహ్మభిశ్చైవ కలశాన్ వై సమంతతః ॥33॥**

భక్తుడు శివగాయత్రి మంత్రోచ్చారణతో బ్రహ్మలింగాన్ని స్థాపించాలి. లేక కేవలప్రణవం ద్వారానైనా అవినాశియైన శివుడిని స్థాపించాలి. ప్రభువుయొక్క అధోభాగంలో "బ్రహ్మజ జ్ఞానం" (యజుర్వేదం–13/3) మంత్రం

ద్వారా బ్రహ్మను, మధ్యభాగంలో విష్ణుగాయత్రిమంత్రం ద్వారా విష్ణువును స్థాపించాలి. వేదికయొక్క పైభాగం, పూర్వభాగం, పశ్చిమభాగం – వీటి విన్యాసం ప్రణవమంత్రం ద్వారా చేయాలి. "నమః శివాయ" అట్లే "నమో హంసః శివాయ" లేక రుద్రాధ్యాయమంత్రంతో శివలింగాన్ని శోధించి స్థాపించాలి. నాల్గువైపుల కలశాలను పంచబ్రహ్మమంత్రాలతో స్థాపించాలి.

**వేదిమధ్యే న్యసేత్సర్వాన్ పూర్వోక్తవిధి సంయుతాన్ ।**
**మధ్యకుంభే శివం దేవీం దక్షిణే పరమేశ్వరీమ్ ॥34॥**

**స్కందం తయోశ్చ మధ్యే తు స్కందకుంభే సచిత్రితే ।**
**బ్రహ్మాణం స్కందకుంభే వా ఈశ కుంభే హరిం తథా ॥35॥**

**అథవా శివకుంభే చ బ్రహ్మాంగాని చ విన్యసేత్ ।**
**శివో మహేశ్వరశ్చైవ రుద్రో విష్ణుః పితామహః ॥36॥**

**బ్రహ్మణ్యేవం సమాసేన హృదయాదీని చాంబికా ।**
**వేదిమధ్యే న్యసేత్సర్వాన్ పూర్వోక్తవిధిసంయుతాన్ ॥37॥**

ఇపుడు ప్రతిమయొక్క స్థాపనక్రమం చెప్పబడుతోంది. పూర్వం చెప్పిన మాదిరిగా వేదికమధ్యలో అన్నింటిని చేర్చాలి. మధ్యకుంభం మీద శివుడిని, దక్షిణకుంభం మీద పరమేశ్వరిని నిలపాలి. ఈ ఇద్దరి మధ్యలో అతిసుందరమైన స్కందకుంభం మీద స్కందుడిని (కార్తికేయుడిని) నిలపాలి. లేక బ్రహ్మను స్కందకుంభం మీద, లేక విష్ణువును ఈశకుంభం మీద లేక బ్రహ్మాంగాన్ని శివకుంభం మీద నిలపాలి. శివుడు, మహేశ్వరుడు, రుద్రుడు, విష్ణువు, మరియు పితామహుడు – వీరు బ్రహ్మాంగాలు. హృదయాదులు. అంబిక–వీరందర్నీ వేదికమధ్యలో పూర్వోక్తరీతిలో స్థాపించాలి.

**వర్ధన్యాం స్థాపయేద్దేవీం గంధతోయేన పూర్య చ ।**
**హిరణ్యం రజతం రత్నం శివకుంభే ప్రవిన్యసేత్ ॥38॥**

**వర్ధన్యామపి యత్నేన గాయత్ర్యంగైశ్చ సువ్రతాః ।**
**విద్యేశ్వరాన్ దిశాం కుంభే బ్రహ్మకూర్చేన పూరితే ॥39॥**

**అనంతేశాది దేవాంశ్చ ప్రణవాదినమోంతకమ్ ।**
**నవవస్త్రం ప్రతిఘటమష్టకుంభేషు దాపయేత్ ॥40॥**

**విద్యేశ్వరాణాం కుంభేషు హేమరత్నాది విన్యసేత్ ।**
**వక్త్రక్రమేణ హోతవ్యం గాయత్ర్యంగక్రమేణ చ ॥41॥**

**జయాదిస్విష్టపర్యంతం సర్వం పూర్వవదాచరేత్ ।**
**సేచయేచ్ఛివకుంభేన వర్ధన్యా వైష్ణవేన చ ॥42॥**

**పైతామహేన కుంభేన బ్రహ్మభాగం విశేషతః ।**
**విద్యేశ్వరాణాం కుంభైశ్చ సేచయేత్పరమేశ్వరమ్ ॥ 43॥**

సుగంధి జలంతో వర్ధనీకుంభాన్ని నింపి, అందులో దేవిని స్థాపించాలి. శివకుంభంలో బంగారం, వెండి, రత్నాలు వేయాలి. ఓ సువ్రతులారా! వర్ధనీకుంభంలో కూడా యత్నపూర్వకంగా గాయత్రి మరియు అంగమంత్రాలతో విద్యేశ్వరులను, అట్లే అష్టదిక్పాలకులనూ స్థాపించాలి. చివరిలో "నమః" చేర్చి బ్రహ్మకూర్చంతో పూరించి దిశాకుంభంలో స్థాపించాలి. ఎనిమిది కుంభాలలో ప్రత్యేకకుంభాన్ని నూత్నవస్త్రంతో కప్పాలి. విద్యేశ్వరుల కుంభంలో బంగారం, రత్నాలు వేయాలి. గాయత్రిని అంగన్యాసమంత్రం ద్వారా ఈశానాదిముఖ క్రమంగా జయాదుల నుంచి స్విష్టపర్యంతం హవనాది కర్మలను పూర్వం మాదిరిగా చేయాలి. శివకుంభంతో, వర్ధనీకుంభంతో, విష్ణు కుంభంతో, పితామహకుంభంతో అట్లే విద్యేశ్వరకుంభంతో పరమేశ్వర శివుడికి అభిషేకం చేయాలి. బ్రహ్మ కుంభంలో విశేషంగా బ్రహ్మభాగాన్ని అభిషేకించాలి.

**విన్యసేత్సర్వమంత్రాణి పూర్వవత్సుసమాహితః ।**
**పూజయేత్స్నపనం కృత్వా సహస్రాదిషు సంభవైః ॥44॥**

**దక్షిణా చైవ ప్రదాతవ్యా సహస్రపణముత్తమమ్ ।**
**ఇతరేషాం తదర్ధం స్యాత్తదర్ధం వా విధీయతే ॥45॥**

**వస్త్రాణి చ ప్రధానస్య క్షేత్రభూషణగోధనమ్ ।**
**ఉత్సవశ్చ ప్రకర్తవ్యో హోమయాగబలిః క్రమాత్ ॥ 46॥**
**నవాహం వాపి సప్తాహమేకాహం చ త్ర్యహం తథా ।**
**హోమశ్చ పూర్వవత్ప్రోక్తో నిత్యమభ్యర్చ్య శంకరమ్ ॥47॥**
**దేవానాం భాస్కరాదీనాం హోమం పూర్వవదేవ తు ।**
**అభ్యంతరే తథా బ్రాహ్మే వహ్నౌ నిత్యం సమర్చయేత్ ॥48॥**

**య ఏవం స్థాపయేల్లింగం స ఏవ పరమేశ్వరః ।**
**తేన దేవగణా రుద్రా ఋషయోఽప్సరసస్తథా ॥49॥**
**స్థాపితాః పూజితాశ్చైవ త్రైలోక్యం సచరాచరమ్ ॥50॥**

స్వస్థచిత్తులై ఈశాదిమంత్రాలను పూర్వం మాదిరిగా క్రమంగా స్థాపించాలి. వేయి కుంభాలతో స్నానం చేయించి పూజజించాలి. అనంతరం ఆచార్యుడికి ఒక వేయి పణాల ఉత్తమదక్షిణ ఇవ్వాలి. ఇతరులకు అందులో సగం, లేకుంటే ఆ సగంలో సగం దక్షిణ ఇవ్వాలనేది విధానం. శివుడియొక్క ప్రతినిధిత్వం వహించే ప్రధానఋత్విజుడికి వస్త్రాలు, భూమి, నగలు, గోవులు మొదలైనవి ఇవ్వాలి. గొప్ప ఉత్సవం నిర్వహించాలి. హోమం, యాగం, అట్లే బలి క్రమంగా తొమ్మిది దినాలు, లేక ఏడు దినాలు లేక మూడు దినాలు లేక ఒకే రోజు నిర్వహించాలి. ప్రతిదినం శివుడిని పూజించి పూర్వం మాదిరిగా హోమం చేయాలి. సూర్యుడు మున్నగు దేవతలకు నిమిత్తహోమం పూర్వంలాగానే చేయాలి. అట్లే ఆభ్యంతరాగ్నిలో (హృదయాగ్ని), బాహ్యాగ్నిలో నిత్యం శివుడికి హవనం చేయాలి. ఎవడు ఈ విధంగా లింగస్థాపన చేస్తాడో ఆతడు సాక్షాత్తుగా పరమేశ్వరుడే. ఆతడిచే దేవతలందరూ, రుద్రులు, ఋషులు, అప్సరసలు స్థాపింపబడి పూజింపబడతారు. చరాచరసహితమైన మూడు లోకాలు పూజింపబడుతున్నాయి.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే లింగస్థాపనం నామ సప్తచత్వారింశోఽధ్యాయః ॥47॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని లింగస్థాపనం అనే పేరు గల నలభై ఏడవ అధ్యాయం సమాప్తం.

## **అష్ట చత్వారింశత్తమోఽధ్యాయః** – నలభై ఎనిమిదవ అధ్యాయం

## **చలమూర్తిస్థాపనవర్ణనమ్** – చలమూర్తిస్థాపనవర్ణన

**సూత ఉవాచ** – సూతర్షి పలికాడు.

**సర్వేషామపి దేవానాం ప్రతిష్ఠామపి విస్తరాత్ ।**
**స్వైర్మంత్రైర్యాగకుండాని విన్యస్యైకైకమేవ చ ॥1॥**

**స్థాపయేదుత్సవం కృత్వా పూజయేచ్చ విధానతః ।**
**భానోః పంచాగ్నినా కార్యం ద్వాదశాగ్ని క్రమేణ వా ॥2॥**

**స్వర్ణకుండాని వృత్తాని పద్మాకారాణి సువ్రతాః ।**

ఓ ఋషులారా! నేనిప్పుడు ఇతరదేవతల ప్రతిష్ఠలగూర్చికూడా విపులంగా చెబుతున్నాను. దేవతలయొక్క వారి వారి మంత్రాలతో యాగకుండాల నిర్మాణం పూర్తి చేసి, వేరువేరుగా దేవతల స్థాపన చేయాలి. ఉత్సవాన్ని నిర్వహించి విధిపూర్వకంగా వారిని పూజించాలి. సూర్యుడి స్థాపన పంచాగ్నిలేక ద్వాదశాగ్నిక్రమంతో నిర్వహించాలి. ఓ సువ్రతులారా! సూర్యుడి స్థాపనలో అన్ని కుండాలు గోళాకారంలో అట్లే పద్మాకారంలో నిర్మించాలి.

**అంబాయా యోనికుండం స్యాద్వర్ధన్యేకా విధీయతే ॥3॥**

**శక్తీనాం సర్వకార్యేషు యోనికుండం విధీయతే ।**
**గాయత్రీం కల్పయేచ్ఛంభోః సర్వేషామపి యత్నతః ।**
**సర్వే రుద్రాంశజా యస్మాత్ సంక్షేపేణ వదామి వః ॥4॥**

అంబ స్థాపనవిషయంలో యోని కుండాన్ని వాడాలి. ఒక వర్ధనీకుండాన్ని కూడా స్థాపించాలి. దేవులందరి అన్ని కార్యాలకి యోని కుండాలే నిర్మించాలి. శివుడికి అట్లే దేవతలందరికి గాయత్రిని ప్రయత్నపూర్వకంగా కల్పించాలి. దేవతలందరు రుద్రాంశ సంజాతులే. అందువల్ల దేవతలందరికి వేరువేరు గాయత్రులున్నాయి. వాటిని సంక్షేపంగా మీకు చెబుతున్నాను.

**తత్పురుషాయ విద్మహే వాగ్విశుద్ధాయ ధీమహి । తన్నః శివః ప్రచోదయాత్ ॥5॥**
**గణాంబికాయై విద్మహే కర్మసిద్ధ్యై చ ధీమహి । తన్నో గౌరీ ప్రచోదయాత్ ॥6॥**
**తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి । తన్నో రుద్రః ప్రచోదయాత్ ॥7॥**
**తత్పురుషాయ విద్మహే వక్రతుండాయ ధీమహి । తన్నో దంతిః ప్రచోదయాత్ ॥8॥**
**మహాసేనాయ విద్మహే వాగ్విశుద్ధాయ ధీమహి । తన్నః స్కందః ప్రచోదయాత్ ॥9॥**
**తీక్ష్ణశృంగాయ విద్మహే వేదపాదాయ ధీమహి । తన్నో వృషః ప్రచోదయాత్ ॥10॥**
**హరివక్త్రాయ విద్మహే రుద్రవక్త్రాయ ధీమహి । తన్నో నందీ ప్రచోదయాత్ ॥11॥**
**నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి । తన్నో విష్ణుః ప్రచోదయాత్ ॥12॥**
**మహాంబికాయై విద్మహే కర్మసిద్ధ్యైచ ధీమహి । తన్నో ధరా ప్రచోదయాత్ ॥14॥**

సముద్ధృతాయై విద్మహే విష్ణునైకేన ధీమహి । తన్నో ధరా ప్రచోదయాత్ ॥15॥
వైనతేయాయ విద్మహే సువర్ణపక్షాయ ధీమహి । తన్నో గరుడః ప్రచోదయాత్ ॥16॥
పద్మోద్భవాయ విద్మహే వేదవక్త్రాయ ధీమహి । తన్నః స్రష్టా ప్రచోదయాత్ ॥16॥
శివాస్యజాయై విద్మహే దేవరూపాయై ధీమహి । తన్నో వాచా ప్రచోదయాత్ ॥17॥
దేవరాజాయ విద్మహే వజ్రహస్తాయ ధీమహి । తన్నః శుక్రః ప్రచోదయాత్ ॥18॥
రుద్రనేత్రాయ విద్మహే శక్తి హస్తాయ ధీమహి । తన్నో వహ్నిః ప్రచోదయాత్ ॥19॥
వైవస్వతాయ విద్మహే దండహస్తాయ ధీమహి । తన్నో యమః ప్రచోదయాత్ ॥20॥
నిశాచరాయ విద్మహే ఖడ్గహస్తాయ ధీమహి । తన్నో నిరృతిః ప్రచోదయాత్ ॥21॥
శుద్ధహస్తాయ విద్మహే పాశహస్తాయ ధీమహి । తన్నో వరుణః ప్రచోదయాత్ ॥22॥
సర్వప్రాణాయ విద్మహే యష్టిహస్తాయ ధీమహి । తన్నో వాయుః ప్రచోదయాత్ ॥23॥
యక్షేశ్వరాయ విద్మహే గదాహస్తాయ ధీమహి । తన్నో యక్షః ప్రచోదయాత్ ॥24॥
సర్వేశ్వరాయ విద్మహే శూలహస్తాయ ధీమహి । తన్నో రుద్రః ప్రచోదయాత్ ॥25॥
కాత్యాయన్యై విద్మహే కన్యాకుమార్యై ధీమహి । తన్నో దుర్గా ప్రచోదయాత్ ॥26॥

ఏవం ప్రభిద్య గాయత్రీం తత్తద్దేవానురూపతః ।
పూజయేత్స్థాపయేత్తేషామాసనం ప్రణవం స్మృతమ్ ॥27॥

ఈ విధంగా ఆయా దేవతలను అనుసరించి వేరువేరుగా గాయత్రీ మంత్రాన్ని ఉచ్చరించి, వారిని స్థాపించి, పూజించాలి. ప్రణవమే వారికి ఆసనంగా చెప్పబడింది.

అథవా విష్ణుమతులం సూక్తేన పురుషేణ వా ।

విష్ణుం చైవ మహావిష్ణుం సదా విష్ణుమనుక్రమాత్ ॥28॥

స్థాపయేద్దేవగాయత్ర్యా పరికల్ప్య విధానతః ।
వాసుదేవః ప్రధానస్తు తతః సంకర్షణః స్వయమ్ ॥29॥

ప్రద్యుమ్నో హ్యనిరుద్ధశ్చ మూర్తిభేదాస్తు వై ప్రభోః ।
బహూని వివిధానీహ తస్య శాపోద్భవాని చ ॥30॥

సర్వావర్తేషు రూపాణి జగతాం చ హితాయ వై ।
మత్స్యః కూర్మోఽథ వారాహో నారసింహోఽథ వామనః ॥31॥

రామో రామశ్చ కృష్ణశ్చ బౌద్ధః కల్కీ తథైవ చ ।
తథాన్యాని న దేవస్య హరేః శాపోద్భవాని చ ॥32॥

తేషామపి చ గాయత్రీం కృత్వా స్థాప్య చ పూజయేత్ ।
గుహ్యాని దేవదేవస్య హరేర్నారాయణస్య చ ॥33॥

**విజ్ఞానాని చ యంత్రాణి మంత్రోపనిషదాని చ ।**
**పంచబ్రహ్మాంగజానీహ పంచభూతమయాని చ ॥34॥**

ఆ యా దేవతల్ని స్థాపించకపోతే సాటిలేని విష్ణువుయొక్క స్థాపనం పూజనం పురుషసూక్తంతో చేయాలి. విష్ణువు, మహావిష్ణువు, అట్లే సదావిష్ణువు అని కల్పించుకుని క్రమానుసారంగా విష్ణుగాయత్రిద్వారా విధిపూర్వకంగా ఆయన్ని స్థాపించాలి. వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, మరియు అనిరుద్ధుడు – వీరు ఆ ప్రభువుయొక్క వ్యూహమూర్తి భేదాలు.సత్యయుగం మున్నగు యుగాలలో లోకకళ్యాణార్థం శాపకారణాలవల్ల ఆయనకు అనేకమైన అవతారాలు కలిగినాయి. మత్స్య, కూర్మ, వరాహ, నృసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, బుద్ధ, కల్కి – ఇవి, మరియు ఇతరావతరాలు శాపకారణంగా ప్రభువు విష్ణువుకు కలిగాయి. వాటిని కూడా గాయత్రితో కల్పించి వాటిని స్థాపించి, పూజించాలి. శివభగవానుడు మరియు విష్ణుదేవుడియొక్క గుప్తరూపాలు, యంత్రాలు, మంత్రాలు, ఉపనిషత్తులు, పృథివి మొదలైన పంచమయమూర్తులను, సద్యోజాతాది పంచబ్రహ్మలను స్థాపించి, పూజించాలి.

**నమో నారాయణేతి మంత్రం పరమశోభనః ।**
**హరేరష్టాక్షరాణీహ ప్రణవేన సమాసతః ॥ 35॥**

**ఓం నమో వాసుదేవాయ నమః సంకర్షణాయ చ ।**
**ప్రద్యుమ్నాయ ప్రధానాయ అనిరుద్ధాయ వై నమః ॥36॥**

**ఏవమేకేన మంత్రేణ స్థాపయేత్పరమేశ్వరమ్ ।**
**బింబాని యాని దేవస్య శివస్య పరమేష్ఠినః ॥37॥**

**ప్రతిష్ఠా చైవ పూజా చ లింగవన్మునిసత్తమాః ।**
**రత్నవిన్యాససహితం కౌతుకాని హరేరపి ॥38॥**

**అచలే కారయేత్సర్వం చలేఽప్యేవం విధానతః ।**
**తన్నేత్రోన్మీలనం కుర్యాన్నేత్రమంత్రేణ సువ్రతాః ॥39॥**

**క్షేత్రప్రదక్షిణం చైవ ఆరామస్య పురస్య చ ।**
**జలాధివాసనం చైవ పూర్వవత్పరికీర్తితమ్ ॥40॥**

**కుండమండప నిర్మాణం శయనం చ విధీయతే ।**
**హుత్వా నవాగ్నిభాగేన నవకుండే యథావిధి ॥41॥**

**అథవా పంచకుండేషు ప్రధానే కేవలేఽథవా ।**
**ప్రతిష్ఠా కథితా దివ్యా పారంపర్యక్రమాగతా ॥42॥**

**శిలోద్భవానాం బింబానాం చిత్రాభాసస్య వా పునః ।**
**జలాధివాసనం ప్రోక్తం వృషేంద్రస్య ప్రకీర్తితమ్ ॥43॥**

**ప్రాసాదస్య ప్రతిష్ఠాయాం ప్రతిష్ఠా ప్రరికీర్తితా ।**
**ప్రాసాదాంగస్య సర్వస్య యథాంగానాం తనోరివ ॥44॥**

ఓం "నమో నారాయణాయ" అనే ఈ మంత్రం అత్యంతం ఉత్తమమైన అష్టాక్షరీమంత్రం. ఓం నమో వాసుదేవాయ, ఓం నమః సంకర్షణాయ, ఓం నమః ప్రద్యుమ్నాయ, ఓం నమః ప్రధానాయ, ఓం నమః అనిరుద్ధాయ"

ఈ విధంగా ఆ యా మంత్రాలతో ఒకటిగా పరమేశ్వరుడు విష్ణువును స్థాపించాలి. ఓ మునిశ్రేష్ఠులారా! పరమేష్ఠియైన శివుడియొక్క ఏ రూపం పూర్వం చెప్పబడిందో ఆ రూపంలో ప్రతిష్ఠ, పూజ లింగానికి జరిగినట్లే చేయాలి. విష్ణుప్రతిష్ఠలో కూడా శివుడి ప్రతిష్ఠలాగానే రత్నవిన్యాసంతో కూడిన మంగళోత్సవం నిర్వహించాలి. అచలప్రతిష్ఠలో ఏ క్రియాకలాపం ఉంటుందో అది మొత్తం చలమూర్తి ప్రతిష్ఠలో కూడా విధ్యుక్తంగా నిర్వహంచాలి. ఓ సువ్రతులారా! ఈ సావయవమూర్తుల నేత్రోన్మీలనం నేత్రమంత్రంతో చేయాలి. ఉద్యానం, నగరం, క్షేత్రం యొక్క ప్రదక్షిణ, మరియు జలాధివాసం పూర్వం మాదిరిగానే నిర్వహించాలి. కుండాలు, మండపం, శయనం కూడా పూర్వంమాదిరిగానే నిర్మించాలి. నవాగ్నిభాగంగా తొమ్మిది కుండాలలో, లేక పంచకుండాలలో, లేక కేవల ప్రధానమైన కుండంలో ఆహుతులతో హవనం చేయాలి. నేను పరంపరాక్రమంగా ప్రాప్తించిన ఈ దివ్యప్రతిష్ఠను గూర్చి చెప్పాను. పాషాణంతో నిర్మించిన మూర్తులను జలంతో నిమజ్జనం చేయాలి. చిత్రప్రతిమలను నందీశ్వరుడిని జలనిమజ్జనం చేయాలి. దేవాలయ ప్రతిష్ఠలలో, వాటి వాటి భాగాల ప్రతిష్ఠలలో ఈ విధమైన ప్రతిష్ఠావిధానమే చెప్పబడింది – శరీరంలో అంగాల మాదిరిగా

**వృషాగ్నిమాతృవిఘ్నేశకుమారానపి యత్నతః ।**
**శ్రేష్ఠాం దుర్గాం తథా చండీం గాయత్ర్యా వై యథావిధి ॥45॥**
**ప్రాగాద్యం స్థాపయేచ్ఛంభోరష్టావరణముత్తమమ్ ।**
**లోకపాల గణేశాద్యానపి శంభోః ప్రవిన్యసేత్ ॥46॥**
**ఉమా చండీ చ నందీ చ మహాకాలో మహామునిః ।**
**విఘ్నేశ్వరో మహాభృంగీ స్కందః సౌమ్యాదితః క్రమాత్ ॥47॥**
**ఇంద్రాదీన్ స్వేషు స్థానేషు బ్రహ్మాణం చ జనార్దనమ్ ।**
**స్థాపయేచ్చైవ యత్నేన క్షేత్రేశం వేశగోచరే ॥48॥**
**సింహాసనే హ్యనంతాదీన్ విద్యేశామపి చ క్రమాత్ ।**
**స్థాపయేత్ర్పణవేనైవ గుహ్యాంగాదీని పంకజే ॥49॥**
**ఏవం సంక్షేపతః ప్రోక్తం చలస్థాపనముత్తమమ్ ।**
**సర్వేషామపి దేవానాం దేవీనాం చ విశేషతః ॥50॥**

మృష, అగ్ని, మాతృక, విఘ్నేశుడు, కుమారుడు (కార్తికేయుడు) శ్రేష్ఠ, దుర్గ, అట్లే చండి – ఈ ఆరుగురు శివుడి ప్రతిష్ఠకు ఆవరణం ఇస్తున్నారు. వీరినికూడా వారి వారి గాయత్రితో విధి పూర్వకంగా క్రమంగా ప్రతిష్ఠించాలి. శివుడి ప్రాసాదంలో నాల్గువైపుల లోకపాలకులను, గణపతి మున్నగువారిని కూడా ప్రతిష్ఠించాలి. ఉత్తర దిశనుంచి క్రమంగా ఉమ, చండి, నంది, మహాకాలుడు, మహాముని (లకులీశుడు) విఘ్నేశ్వరుడు, మహాభృంగి మరియు స్కందుడు వీర్ని స్థాపించాలి. ఇంద్రాదిలోకపాలకులు, బ్రహ్మ అట్లే జనార్దనుడు వారి స్థాపన వారి వారి దిశలలో మరియు క్షేత్రపాలకుల స్థాపన ఈశానకోణంలో ప్రయత్నపూర్వకంగా నిర్వహించాలి. అనంతాదులనూ, వాగీశ్వరినీ సింహాసనం మీదా, ధర్మాదులను కమలాసనం మీదా ప్రణవంతోపాటు స్థాపించాలి. ఈ విధంగా సంక్షేపంగా సమస్త దేవతలు, విశేషరూపంలో దేవులయొక్క ఉత్తమచలప్రతిష్ఠను మీకు చెప్పాను.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే చలమూర్తిస్థాపనవర్ణనం నామాష్టచత్వారింశోऽధ్యాయః ॥48॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని చలమూర్తిస్థాపనవర్ణనం అనే పేరు గల నలభై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

## ఏకోనపంచాశత్తమోఽధ్యాయః - నలభై తొమ్మిదవ అధ్యాయం

## అఘోరేశప్రతిష్ఠావిధానవర్ణనమ్ - అఘోరేశప్రతిష్ఠ

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**అఘోరేశస్య మాహాత్మ్యం భవతా కథితం పురా ।**
**పూజాం ప్రతిష్ఠాం దేవస్య భగవాన్ వక్తుమర్హసి ॥1॥**

ఓ భగవానుడా! సూతమహర్షీ! ఇంతకుముందు మాకు నీవు అఘోరేశుడి మాహాత్మ్యాన్ని గూర్చి చెప్పావు. ఇపుడు ఆయనయొక్క స్థాపన మరియు పూజలవిధానాన్ని గూర్చి కృపతో చెప్పవలసింది.

**సూత ఉవాచ** - సూతర్షి పలికాడు.

**అఘోరేణాంగయుక్తేన విధివచ్చ విశేషతః ।**
**ప్రతిష్ఠాలింగవిధినా నాన్యథా మునిపుంగవాః ॥2॥**
**తథాగ్నిపూజాం వై కుర్యాద్యథా పూజం తథైవ చ ।**
**సహస్రం వా తదర్ధం వా శతమష్టోత్తరం తు వా ॥3॥**
**తిలైర్హోమః ప్రకర్తవ్యో దధిమధ్వాజ్యసంయుతైః ।**
**ఘృతసక్తుమధూనాం చ సర్వదుఃఖప్రమార్జనమ్ ॥4॥**
**వ్యాధీనాం నాశనం చైవ తిలహోమస్తు భూతిదః ।**
**సహస్రేణ మహాభూతిః శతేన వ్యాధినాశనమ్ ॥5॥**
**సర్వదుఃఖవినిర్ముక్తో జపేన చ న సంశయః ।**
**అష్టోత్తరశతేనైవ త్రికాలేచ యథావిధి ॥6॥**
**అష్టోత్తరసహస్రేణ షణ్మాసాజ్జాయతే ధ్రువమ్ ।**
**సిద్ధయో నైవ సందేహో రాజ్యమండలినామపి ॥7॥**

ఓ మునిశ్రేష్ఠులారా! అంగయుక్తమైన అఘోరమంత్రంతో శివలింగప్రతిష్ఠ విధానంలో యథావిధిగా, విశేషంగా అఘోరేశప్రతిష్ఠ కూడా జరగాలి. వేరే విధంగా కాదు. ఏ విధంగా లింగపూజ జరుగుతుందో అదే విధంగా అగ్నిపూజ జరగాలి. పెరుగు, తేనె, అట్లే నేయి వీటితో కూడిన తిలలతో ఒక వేయిసార్లు గాని, ఐదు నూరుసార్లు గాని, నూటెనిమిదిసార్లుగాని హవనం చేయాలి. నేయి, సక్తువు, మధువులతో చేసిన హోమం సమస్త దుఃఖాలను నశింపజేస్తుంది. దూరం చేస్తుంది. సర్వవ్యాధులను నశింపజేస్తుంది. తిలలతో హోమం ఐశ్వర్య ప్రదాయకం. నూవులతో ఒక వేయిసార్లు చేసిన హవనం మిక్కిలి ఐశ్వర్యాన్ని ఇస్తుంది. నూరుసార్లు చేసింది వ్యాధులను నశింపజేస్తుంది. త్రికాలాలలో విధిపూర్వకంగా అఘోరమంత్రాన్ని నూట ఎనిమిదిసార్లు జపిస్తే మానవుడు అన్ని దుఃఖాలనుంచి విముక్తుడవుతున్నాడు. ఇందులో సందేహం లేదు. ఈ మంత్రాన్ని వేయి ఎనిమిదిసార్లు

జపిస్తే ఆరుమాసాలలో సామంతరాజులందరిలో నిశ్చయరూపంగా ఫలసిద్ధి జరుగుతున్నది. ఇందులో సందేహం లేదు.

**సహస్రేణ జ్వరో యాతి క్షీరేణ చ జుహోతి యమ్ ।**
**త్రికాలం మాసమేకం తు సహస్రం జుహుయాత్పయః ॥8॥**

**మాసేన సిధ్యతే తస్య మహాసౌభాగ్యముత్తమమ్ ।**
**సిధ్యంతే చాబ్ద హోమేన క్షౌద్రాజ్యదధి సంయుతమ్ ॥9॥**
**యవక్షీరాజ్యహోమేన జాతితండులకేన వా ।**
**ప్రీయేత భగవానీశో హ్యఘోరః పరమేశ్వరః ॥10॥**

ఏ వ్యక్తి పాలతో వేయిసార్లు హోమం చేస్తాడో ఆతడు జ్వరం నుంచి విముక్తుడవుతాడు. ఏ మానవుడు మాసం కాలం త్రికాలాలలో పాలతో వేయిసార్లు హోమం చేస్తాడో ఆతడికి ఒక మాసంలోనే అత్యుత్తమ సౌభాగ్యం ప్రాప్తిస్తుంది. మధువు, ఘృతం, పెరుగు మిశ్రంతో ప్రతిరోజూ ఒక సంవత్సరకాలం హవనం చేసిన మనుష్యుడు సిద్ధి పొందుతున్నాడు. పాలు, నేయి శ్రేష్ఠమైన తెల్లటి బియ్యంతో చేసిన హోమంతో భగవానుడు, అఘోరపరమేశ్వరుడు అయిన శివుడు ప్రసన్నుడవుతున్నాడు.

**దధ్నా పుష్టిర్నృపాణాంచ క్షీరహోమేన శాంతికమ్ ।**
**షణ్మాసం తు ఘృతం హుత్వా సర్వవ్యాధివినాశనమ్ ॥11॥**
**రాజయక్ష్మా తిలైర్హోమాన్నశ్యతే వత్సరేణ తు ।**
**యవహోమేన చాయుష్యం ఘృతేన చ జయస్తదా ॥12॥**
**సర్వకుష్ఠక్షయార్థం చ మధునాక్తైశ్చ తండులైః ।**
**జుహుయాదయుతం నిత్యం షణ్మాసాన్నియతః సదా ॥13॥**
**ఆజ్యం క్షీరం మధుశ్చైవ మధురత్రయముచ్యతే ।**
**సమస్తం తుష్యతే తస్య నాశయేద్వై భగంతరమ్ ॥ 14॥**
**కేవలం ఘృతహోమేన సర్వరోగక్షయః స్మృతః ।**
**సర్వవ్యాధిహరం ధ్యానం స్థాపనం విధినార్చనమ్ ॥15॥**
**ఏవం సంక్షేపతః ప్రోక్తమఘోరస్య మహాత్మనః ।**
**ప్రతిష్ఠా యజనం సర్వం నందినా కథితం పురా ॥16॥**
**బ్రహ్మపుత్రాయ శిష్యాయ తేన వ్యాసాయ సువ్రతాః ॥17॥**

ఆరుమాసాల నిత్యదధిహోమంతో రాజులకు పుష్టి (బలం) ప్రాప్తిస్తుంది. పాలహోమంతో శాంతి లభిస్తుంది. నేతి హోమంతో సమస్తరోగాలు నశిస్తున్నాయి. ఒక సంవత్సరకాలం తిలహోమంతో 'రాజయక్ష్మ' నశిస్తుంది.

యవధాన్యహోమంతో ఆయుర్వృద్ధి జరుగుతుంది. నేతితో అయితే విజయం లభిస్తుంది. అన్ని రకాల కుష్ఠువ్యాధి నివారణార్థం నియమనిష్ఠతో ఆరుమాసాలు ప్రతిదినం తేనెతో కూడిన బియ్యంతో పదివేలసార్లు ఆహుతి ప్రదానం చేయాలి. ఘృతం, క్షీరం, మధువు–ఈ మూడు మధురత్రయం వీటి హవనంతో ఆ వ్యక్తికి గల భగంధరవ్యాధి నశిస్తుంది. ఆతడివల్ల అందరూ సంతుష్టులవుతారు. కేవలఘృతహోమంతో రోగాలన్నీ నశిస్తాయి. భగవానుడు అఘోరమంత్రంయొక్క ధ్యానం, స్థాపనం, విధిపూర్వకమైన పూజ సమస్తకష్టాలను దూరం చేస్తుంది. ఓ సుపుత్రులారా! ఈ విధంగా నేను సంక్షేపంగా పరమాత్మ అయిన అఘోరుడియొక్క స్థాపన, పూజను గూర్చి చెప్పాను. దీన్ని పూర్వం బ్రహ్మపుత్రుడూ, తన శిష్యుడు అయిన సనత్కుమారుడికి నందీశ్వరుడు చెప్పాడు. తర్వాత ఆ సనత్కుమారుడు వ్యాసభగవానుడికి చెప్పాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే అఘోరేశప్రతిష్ఠావిధానవర్ణనం నామైకోనపంచాశత్తమోఽధ్యాయః ॥49॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని అఘోరేశప్రతిష్ఠావిధానవర్ణన అనే పేరుగల నలభై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



## పంచశత్తమోఽధ్యాయః - ఏబైయవ అధ్యాయం

## అఘోరమంత్రసాధన శత్రునాశవిధానవర్ణనమ్ - అఘోరమంత్ర సాధన-శత్రునాశవిధానం

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**నిగ్రహః కథితస్తేన శివవక్త్రేణ శూలినా ।**
**కృతాపరాధినాం తం తు వక్తుమర్హసి సువ్రత ॥1॥**

**త్వయా నవిదితం నాస్తి లౌకికం వైదికం తథా ।**
**శ్రౌతం స్మార్తం మహాభాగ రోమహర్షణ సువ్రత ॥2॥**

ఓ సువ్రతా! కళ్యాణస్వరూపముఖుడు శివుడు అపరాధకారులకై ఈ దండవిధానాన్ని వర్ణించాడు. దాన్ని నీవు కృపతో మాకు చెప్పు. ఓ మహాభాగా! ఓ రోమహర్షణా! ఓ సువ్రతా! లౌకిక వైదిక విషయాలలో, శ్రౌతస్మార్త విషయాలలో నీకు తెలియనిది ఏదీ లేదు.

**సూత ఉవాచ -** సూతర్షి పలికాడు.

**పురా భృగుసుతేనోక్తో హిరణ్యాక్షాయ సువ్రతాః ।**
**నిగ్రహోఽఘోరశిష్యేణ శుక్రేణాక్షయతేజసా ॥3॥**

**తస్య ప్రసాదాద్దైత్యేంద్రో హిరణ్యాక్షః ప్రతాపవాన్ ।**
**త్రైలోక్యమఖిలం జిత్వా సదేవాసురమానుషమ్ ॥4॥**

**ఉద్పాద్య పుత్రం గణపం చాంధకం చారువిక్రమమ్ ।**
**రరాజ లోకే దేవేన వరాహేణ నిషూదితః ॥5॥**

పూర్వం అఘోరశిష్యుడు, పరమతేజస్వి, భృగుపుత్రుడు అయిన శుక్రాచార్యుడు హిరణ్యాక్షుడికి ఈ నిగ్రహవిధి (దండ విధానం) ఉపదేశించాడు. దీని ప్రతాపంవల్ల దైత్యరాజు హిరణ్యాక్షుడు ప్రతాపవంతుడయ్యాడు. దేవతలు, రాక్షసులు, మానవులతో నిండిన మూడులోకాలను పూర్తిగా జయించాడు. మహాపరాక్రమశాలి, గణాధిపతి అయిన అంధకుడనే పేరుగల పుత్రుడిని పొంది లోకంలో ప్రకాశించాడు. అనంతరం వరాహరూపధారి అయిన విష్ణుభగవానుడిచే వధింపబడ్డాడు.

**స్త్రీబాధాం బాలబాధాం చ గవామపి విశేషతః ।**
**కుర్వతో నాస్తి విజయో మార్గేణానేన భూతలే ॥6॥**

**తేన దైత్యేన సా దేవీ ధరా నీతా రసాతలమ్ ।**
**తేనాఘోరేణ దేవేన నిష్ఫలో నిగ్రహః కృతః ॥7॥**

**సంవత్సర సహస్రాంతే వరాహేణ చ సూదితః ।**
**తస్మాదఘోరసిద్ధ్యర్థం బ్రాహ్మణాన్నైవ బాధయేత్ ॥ 8॥**

**స్త్రీణామపి విశేషేణ గవామపి న కారయేత్ ।**

భూలోకంలో ఈ అవినీతిమార్గంలో స్త్రీలను, బాలులను, విశేషించి గోవులను పీడించేవారికి విజయం సిద్ధించదు. ఆ దానవుడు భూమిని రసాతలానికి తీసుకుపోయాడు. ఈ కారణంగా అఘోరదేవుడు ఆతడి భూహరణనిగ్రహాన్ని నిష్ఫలం చేశాడు. వేయి సంవత్సరాల తర్వాత విష్ణువు వరాహరూపంలో ఆతడిని చంపాడు. అందుచేత అఘోరసిద్ధి బ్రాహ్మణులను విశేషించి స్త్రీలను పీడించదు. గోవులను కూడా పీడించదు.

**గుహ్యాద్గుహ్యతమం గోప్యమతిగుహ్యం వదామి వః ॥9॥**

**ఆతతాయినముద్దిశ్య కర్తవ్యం నృపసత్తమైః ।**
**బ్రాహ్మణేభ్యో న కర్తవ్యం స్వరాష్ట్రేశస్య వా పునః ॥10॥**

**అతీవ దుర్జయే ప్రాప్తే బలే సర్వే నిషూదితే ।**
**అధర్మయుద్ధే సంప్రాప్తే కుర్యాద్విధిమనుత్తమమ్ ॥ 11॥**

**అఘృణేనైవ కర్తవ్యో హ్యఘృణేనైవ కారయేత్ ।**
**కృతమాత్రే న సందేహో నిగ్రహః సంప్రజాయతే ॥ 12॥**

ఓ మునులారా! గోపనీయాలలో పరమగోపనీయమైన రహస్యాన్ని మీకు చెబుతున్నాను. రాజన్యులు తమను చంపడానికి ఉద్యమించే ఆతతాయుల విషయంలో ఈ నిగ్రహం తగినది. బ్రాహ్మణులనుద్దేశించి, తమ ప్రభువునుద్దేశించి దీనిని ప్రయోగింపరాదు. పెద్ద పరాజయం ఎదురైనపుడు, సంపూర్ణ సైన్యం నశించిపోయినప్పుడు, శత్రువు అధర్మయుద్ధానికి దిగినప్పుడు ఈ అత్యుత్తమవిధి నిర్వహించాలి. ఈ నిగ్రహం క్రూరుడైన వ్యక్తి చేయాలి. లేకుంటే అటువంటి క్రూరస్వభావంగల బ్రాహ్మణుడితో చేయించాలి. దీన్ని నిర్వహించగానే నిగ్రహం సిద్ధిస్తుంది. ఇందులో సందేహం లేదు.

**లక్షమాత్రం పుమాన్ జప్త్వా అఘోరం ఘోరరూపిణమ్ ।**
**దశాంశం విధినా హుత్వా తిలేన ద్విజసత్తమాః ॥13॥**

**సంపూజ్య లక్షపుష్పేణ సితేన విధిపూర్వకమ్ ।**
**బాణలింగేఽథవా దక్షిణామూర్తిమాశ్రితః ॥14॥**

**సిద్ధమంత్రోఽన్యథా నాస్తి ద్రష్టా సిద్ధ్యాదయః పునః ।**
**సిద్ధమంత్రః స్వయం కుర్యాత్ప్రేతస్థానే విశేషతః ॥15॥**

**మాతృస్థానేఽపి వా విద్వాన్ వేదవేదాంగపారగాః ।**
**కేవలం మంత్రసిద్ధో వా బ్రాహ్మణః శివభావితః ॥16॥**

**కుర్యాద్విధిమిమం ధీమానాత్మనోఽర్థం నృపస్య వా ।**

ఓ ద్విజశ్రేష్ఠులారా! భయంకరరూపమైన అఘోరమంత్రాన్ని ఒక లక్షసార్లు జపించి, అట్లే విధ్యుక్తంగా పదివేలసార్లు తిలలతో హవనం చేసి మరియు బాణలింగం, అగ్ని లేక దక్షిణమూర్తి – వీరియొక్క ప్రతిమలకు ఒక

లక్ష శ్వేతపుష్పజాతాన్ని అర్పించి, పూజించిన మానవుడు మంత్రసిద్ధి పొందగలడు. వేరే విధంగా ఆతడికి మంత్రసిద్ధి కలగదు. వేదవేదాంగపారంగతుడైన విద్వాంసుడు సిద్ధమంత్రాన్ని పొందడానికై ప్రేతస్థానంలో గాని, మాతృస్థానంలో గాని స్వయంగా చేయాలి. మంత్రసిద్ధుడు, శివభక్తుడు, విద్వాంసుడైన బ్రాహ్మణుడు తన ఉపకారం కోసంగాని, రాజుయొక్క ఉపకారం కోసం గాని ఈ విధిని నిర్వహించాలి.

**శూలాష్టకం న్యసేద్విద్వాన్ పూర్వాదీశానకాంతకమ్ ॥17॥**

**త్రిశిఖం చ త్రిశూలంచ చతుర్వింశచ్ఛిఖాగ్రతః ।**
**అఘోరవిగ్రహం కృత్వా సంకలీకృతవిగ్రహః ॥18॥**

**సర్వనాశకరం ధ్యాత్వా సర్వకర్మాణి కారయేత్ ।**
**కాలాగ్నికోటిసంకాశం స్వదేహమపి భావయే ॥19॥**

ఇపుడు నిగ్రహవిధానం చెప్పబడుతున్నది. విద్వాంసుడు తూర్పుదిక్కునుంచి ప్రారంభించి, ఈశానకోణం వరకుగల ఎనిమిది దిశలలో ఎనిమిది శూలాల్ని స్థాపించాలి. త్రిశూలలయొక్క ఇరవైనాల్గు శిఖలయొక్క శిరసులమీద మూడు శిఖలుగల త్రిశూలాన్ని నిర్మించాలి. ఈ విధంగా త్రిశూలధారి అయిన అఘోరేశ్వరుడి విగ్రహాన్ని నిర్మించి స్వయంగా సంకుచితదేహుడై అందరిని నాశనం చేసే అఘోరేశ్వరుడిని ధ్యానించి, తర్వాత పూర్తి కార్యక్రమాన్ని నిర్వహించాలి. సాధకుడు కూడా తన శరీరంలో కోటికాలాగ్నితో సమానమైన అనుభవాన్ని పొందుతాడు.

**శూలం కపాలం పాశం చ దండం చైవ శరాసనమ్ ।**
**బాణం డమరుకం ఖడ్గమష్టాయుధమనుక్రమాత్ ॥20॥**

**అష్టహస్తశ్చ వరదో నీలకంఠో దిగంబరః ।**
**పంచతత్త్వసమారూఢో హ్యర్ధచంద్రధరః ప్రభుః ॥21॥**

**దంష్ట్రాకరాలవదనో రౌద్రదృష్టిర్భయంకరః ।**
**హుంఫట్ కార మహాశబ్దశబ్దితాఖిలదిఙ్ముఖః ॥22॥**

**త్రినేత్రం నాగపాశేన సుబద్ధముకుటం స్వయమ్ ।**
**సర్వాభరణసంపన్నం ప్రేతభస్మావగుంఠితమ్ ॥23॥**

**భూతైః ప్రేతైః పిశాచైశ్చ డాకినీభిశ్చ రాక్షసైః ।**
**సంవృతం గజకృత్యా చ సర్పభూషణభూషితమ్ ॥ 24॥**

**వృశ్చికాభరణం దేవం నీలనీరదనిస్వనమ్ ।**
**నీలాంజనాద్రి సంకాశం సింహచర్మోత్తరీయకమ్ ॥25॥**

**ధ్యాయేదేవమఘోరేశం ఘోరఘోరతరం శివమ్ ।**
**షట్త్రింశదుక్తమాత్రాభిః ప్రాణాయామేన సువ్రతాః ॥26॥**

**మహాముద్రాసమాయుక్తః సర్వకర్మాణి కారయేత్ ।**

ఆతడు శూలం, కపాలం, పాశం, దండం, ధనుస్సు, బాణం, డమరుకం, అట్లే ఖడ్గం క్రమంగా ఈ ఎనిమిది ఆయుధాలను ధరించాలి. వరదాయకుడైన ఆ ప్రభువు అష్టభుజుడు. ఆయన కంఠం నీలవర్ణంగలది. ఆయన దిగంబరుడు. ఆయన పృథివి మున్నగు పంచతత్త్వాలను కలిగినవాడై నందీశ్వరుడిని అధిరోహించినవాడు. ఆయన తన మస్తకం మీద అర్ధచంద్రుడిని ధరించినవాడు. ఆయన విశాలదంష్ట్రలతో కూడిన భయంకరమైన ముఖం గలవాడు. ఆయన భయానకమైన చూపులుగలవాడు. ఆయన భయంకరుడు. ఆయన "హుంఫట్" అనే ఈ మహాశబ్దాలతో అన్ని దిక్కులు ముఖరితాలు అవుతున్నాయి. ఆయన ముక్కంటి. ఆయన నాగపాశంతో తన మకుటాన్ని మిక్కిలిగా బంధించుకున్నాడు. ఆయన అనేకమైన ఆభరణాలతో శోభిల్లేవాడు. ఆయన చితాభస్మధారి, అయన భూతాలతో, ప్రేతాలతో, పిశాచాలతో, డాకినులతో, రాక్షసులతో కూడినవాడు. ఆయన గజచర్మధారి. ఆయన సర్వభూషణ భూషితుడు. ఆయన నీటితో నిండిన మేఘాల గర్జనలతో సమానమైన గర్జనలు గలవాడు. ఆయన శరీరం నీలపర్వతం వంటిది. ఆయన సింహచర్మాన్ని ఉత్తరీయగా ధరించేవాడు. ఓ సువ్రతులారా! పూరకం, కుంభకం, రేచకం, భేదాలతో చెప్పబడిన ముప్పై ఆరు మాత్రలతోపాటు ప్రాణాయామం ద్వారా ఈ విధంగా అత్యంతభయంకరమైన రూపంగల అఘోరేశ్వరుడు, భగవానుడు అయిన శివుడిని ధ్యానించాలి. సాధకుడు మహాముద్రయుక్తుడై సమస్తకార్యాలను నిర్వహించి సఫలుడవ్వాలి.

**సిద్ధమంత్రశ్చితాగ్నౌ వా ప్రేతస్థానే యథావిధి ॥27॥**

**స్థాపయేన్మధ్యదేశే తు ఐంద్రే యామ్యే చ వారుణే ।**
**కౌబేర్యాం విధివత్కృత్వా హోమకుండాని శాస్త్రతః ॥28॥**

**ఆచార్యో మధ్యకుండే తు సాధకాశ్చ దిశాసు వై ।**
**పరిస్తీర్య విలోమేన పూర్వవచ్ఛూలసంభృతః ॥29॥**

**కాలాగ్ని పీఠమధ్యస్థః స్వయం శిష్యైశ్చ తాదృశైః ।**
**ధ్యాత్వా ఘోరమఘోరేశం ద్వాత్రింశాక్షరసంయుతమ్ ॥30॥**

**విభీతకేన వై కృత్వా ద్వాదశాంగుళమానతః ।**
**పీఠే న్యస్య నృపేంద్రస్య శత్రుమంగారకేణ తు ॥31॥**

**కుండస్యాధః ఖనేచ్ఛత్రుం బ్రాహ్మణః క్రోధమూర్ఛితః ।**
**అధోముఖోర్ధ్వపాదం తు సర్వకుండేషు యత్నతః ॥32॥**

**శ్మశానాంగారమానీయ తుషేణ సహ దాహయేత్ ।**
**తత్రాగ్నిం స్థాపయేత్తూష్ణీం బ్రహ్మచర్యపరాయణః ॥33॥**

సిద్ధమంత్రసాధకుడు చితాగ్నిలో గాని, ప్రేతస్థానంలోగాని యథావిధిగా మూర్తిస్థాపన చేయాలి. తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరదిశలలో, మరియు మధ్యలో ఐదు హోమకుండాలు విధిపూర్వకంగా శాస్త్రానుసారంగా నిర్మించి వాటిలో అగ్నిని స్థాపించాలి. ఆచార్యుడు మధ్యలోగల కుండం దగ్గరగా ఇతరమైన ఋత్విజులు నాల్గు దిశలలోగల కుండాల దగ్గరగా కూర్చోవాలి. వాళ్లు దర్భలను విలోమక్రమంగా పరిచి శూలాల్ని పట్టుకోవాలి. వాళ్లు స్వయంగా కాలాగ్ని పీఠాల మధ్యలో తమతో సమానమైన శిష్యులతోపాటు కూర్చోవాలి. తర్వాత ముప్పై

రెండు అక్షరాలుగల అఘోరమంత్రంతో అఘోరేశ్వరుడిని ధ్యానించి, పంద్రెండు అంగుళాల ప్రమాణంగల తాంద్రచెట్టు చెక్కతో తమ రాజుయొక్క శత్రువు ప్రతికృతిని తయారుచేసి కుండంతో నిప్పుతో పాటు పీఠంమీద ఉంచి, ఆ బ్రాహ్మణుడు క్రోధమూర్తి అయి, కుండంలోపల ఆ బొమ్మ కాళ్లను పైకి, తలను క్రిందకు ఉంచాలి. ఇట్లే అన్ని కుండాలలో ఆ శత్రువు ప్రతిరూపాన్ని నిలపాలి. తర్వాత శ్మశానం నుంచి అగ్నిని తెచ్చి, ధాన్యంయొక్క ఊకతో దహించాలి. సాధకుడు బ్రహ్మచర్య పరాయణుడై మౌనభావంతో ఆ అగ్నిని స్థాపించాలి.

**మాయూరాస్త్రేణ నాభ్యాం తు జ్వలనం దీపయేత్తతః ।**
**కంచుకం తుష సంయుక్తైః కార్పాసాస్థిసమన్వితైః ॥34॥**

**రక్తవస్త్రసమం మిశ్రైర్హోమద్రవ్యైర్విశేషతః ।**
**హస్తయంత్రోద్భవై స్తైలైః సహ హోమం తు కారయేత్ ॥35॥**

**అష్టోత్తరసహస్రం తు హోమయేదనుపూర్వశః ।**
**కృష్ణపక్షే చతుర్దశ్యాం సమారభ్య యథాక్రమమ్ ॥36॥**

**అష్టమ్యంతం తథాంగారమండలస్థానవర్జితః ।**
**ఏవం కృతే నృపేంద్రస్య శత్రవః కులజైః సహ ॥37॥**

**సర్వదుఃఖసమోపేతాః ప్రయాంతి యమసదనమ్ ।**

తర్వాత రక్తవస్త్రాన్ని ధరించి సాధకుడు కుండంయొక్క నాభిలో మయూరమంత్రంతో, ఊకతో, పత్తిగింజలతో అగ్నిని మండించాలి. తర్వాత హస్తయంత్రాలతో తీసిన తైలంతో రక్తవస్త్రంతో పాటు ఇతర హోమద్రవ్యాలతో మిశ్రితం చేసి, శిష్యులతోపాటు హోమం చేయాలి. కృష్ణపక్షంలో చతుర్దశితో ప్రారంభింపబడి, అష్టమి వరకు క్రమంగా వేయి ఎనిమిదిసార్లు హవనం చేయాలి. అంగారమండలంయొక్క బొగ్గును ముట్టుకోరాదు. ఈ విధమైన కర్మ బాగా నిర్వహిస్తే ఆ రాజుయొక్క శత్రువు సపరివారంతో అన్ని కష్టాలతో పీడింపబడి యమలోకప్రాప్తి పొందుతాడు.

**మంత్రేణానేన చాదాయ నృకపాలే నఖం తథా ॥38॥**

**కేశం నృణాం తథాంగారం తుషం కంచుకమేవ చ ।**
**చీరచ్ఛటాం రాజధూళీం గృహసమ్మార్జనస్య వా ॥39॥**

**విషసర్పస్య దంతాని వృషదంతాని యాని చ ।**
**గవాం చైవ క్రమేణైవ వ్యాఘ్రదంతనఖాని చ ॥40॥**

**తథా కృష్ణమృగాణాం చ బిడాలస్య చ పూర్వవత్ ।**
**నకులస్య చ దంతాని వరాహస్య విశేషతః ॥41॥**

**దంష్ట్రాణి సాధయిత్వా తు మంత్రేణానేన సువ్రతా ।**
**జపేదష్టోత్తర శతం మంత్రం చ ఘోరముత్తమమ్ ॥42॥**

ఈ అఘోరమంత్రంతో జపం చేస్తూ నఖాలను, మానవుని వెంట్రుకలను, బొగ్గులు, ఊక, బూడిదలను, ఇల్లు ఊడ్చిన దుమ్మును, రాజమార్గమందలి ధూళిని, విషసర్పాల కోరలను, గోవుల ఎద్దుల దంతాలను, పెద్దపులి

దంతాలను, గోళ్లను,నల్లజింక ముంగిస పిల్లియొక్క కోరలను, పంది దంతాలను వీటినన్నింటి మానవకపాలంలో వేసి సాధకుడు ఉత్తమమైన ఆ మంత్రాన్ని నూట ఎనిమిదిసార్లు జపం చేయాలి.

**తత్కపాలం నఖం క్షేత్రే గృహే వా నగరేఽపి వా ।**
**ప్రేతస్థానేఽపి వా రాష్ట్రే మృతవస్త్రేణ వేష్టయేత్ ॥43॥**

**శత్రోరష్టమరాశౌ వా పరివిష్టే దివాకరే ।**
**సోమే వా పరివిష్టే తు మంత్రేణానేన సువ్రతాః ॥ 44॥**

**స్థాననాశో భవేత్తస్య శత్రోర్నాశశ్చ జాయతే ।**
**శత్రుం రాజ్ఞః సమాలిఖ్య గమనే సమవస్థితే ॥45॥**

**భూతలే దర్పణప్రఖ్యే వితానోపరి శోభనే ।**
**చతుస్తోరణసంయుక్తే దర్భమాలాసమావృతే ॥46॥**

**వేదాధ్యయనసంపన్నే రాష్ట్రే వృద్ధిప్రకాశకే ।**
**దక్షిణేన తు పాదేన మూర్ధ్ని సంతాడయేత్స్వయమ్ ॥47॥**
**ఏవం కృతే నృపేంద్రస్య శత్రునాశో భవిష్యతి ।**
**స్వరాష్ట్రపతిముద్దిశ్య యః కుర్యాదాభిచారికమ్ ॥48॥**
**స ఆత్మానం నిహత్యైవ స్వకులం నాశయేత్కుధీః ।**
**తస్మాత్స్వరాష్ట్రగోప్తారం నృపతిం పాలయేత్సదా ॥49॥**
**మంత్రౌషధిక్రియాద్యైశ్చ సర్వయత్నేన సర్వదా ।**
**ఏతద్రహస్యం కథితం న దేయం యస్య కస్యచిత్ ॥50॥**

సూర్యగ్రహణం, చంద్రగ్రహణం ఏర్పడినప్పుడు, శత్రువుయొక్క అష్టమరాశిలో సూర్యుడు ఉన్నప్పుడు, ఈ మంత్రంతో ఆ కపాలాన్ని శవం మీద కప్పే వస్త్రంముక్కతో చుట్టి ఆ శత్రువుయొక్క క్షేత్రంలోకాని, ఇంటిలోకాని, శ్మశానంలోకాని, నగరంలోకాని, దేశంలోకాని పాతి పెట్టాలి. ఆ విధంగా చేస్తే ఆ శత్రువు పదవీభ్రష్టుడై నశిస్తాడు. విజయం కోసం వెళ్లే సమయంలో తన రాజుయొక్క శత్రువుయొక్క చిత్రాలను దర్పణం మాదిరిగాగల భూమిమీద చిత్రించి, వస్త్రంతో శోభింపజేసి, నాలుగువైపు తోరణాలుగా దర్భలమాలలతో అలంకరించి, తన రాష్ట్రంయొక్క సమృద్ధిని సూచిస్తూ వేదమంత్రాలను ఉచ్చరించాలి. వ్రాయాలి. ఆచార్యుడు తన కుడికాలుతో శత్రువు శిరసును తన్నాలి. ఈ విధంగా చేయడంవల్ల తన రాజుయొక్క శత్రువు నశిస్తాడు. ఎవడైనా తన దేశం రాజుయొక్క క్షేమం కోసం ఈ అభిచారకర్మ చేయాలి. దుర్బుద్ధితో నిర్వహిస్తే తనకేకాక తన కులానికీ నష్టం. అందుకే ఆచార్యుడు ఎల్లప్పుడు మంత్రాలతో, ఔషధాలతో అట్లే అనుష్ఠానంతో అన్ని ప్రయత్నాలతో తన దేశాన్ని, రాజును రక్షించాలి. ఓ ఋషులారా! నేను మీకు ఈ రహస్యాన్ని చెప్పాను. దీన్ని మీరు మరెవరికి చెప్పరాదు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే అఘోరమంత్రసాధనశత్రునాశవిధానవర్ణనం నామ పంచాశత్తమోఽధ్యాయః॥50॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని అఘోరమంత్రసాధనశత్రునాశవిధానవర్ణన అనే పేరు గల యాబైయవ అధ్యాయం సమాప్తం.

## ఏకపంచాశత్తమోऽధ్యాయః - ఏబైయొకటవ అధ్యాయం

## వజ్రేశ్వరీవిద్యావర్ణనమ్ - వజ్రేశ్వరీవిద్యావర్ణనం

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**నిగ్రహోऽఘోరరూపోऽయం కథితోऽస్మాకముత్తమమ్ ।**
**వజ్రవాహనికాం విద్యాం వక్తుమర్హసి సత్తమ ॥1॥**

ఓ సత్తమా! సూతర్షీ! భయంకరరూపుడు, ఉత్తమనిగ్రహకుడు అయిన అఘోరుడి విషయాన్ని మాకు చెప్పావు. ఇపుడు వజ్రవాహనికావిద్యనుగూర్చి కృపతో చెప్పు.

**సూత ఉవాచ** – సూతుడు పలికాడు.

**వజ్రవాహనికా నామ సర్వశత్రుభయంకరీ ।**
**అనయా సేచయేద్వజ్రం నృపాణాం సాధయేత్తథా ॥2॥**

**వజ్రం కృత్వా విధానేన తద్వజ్రమభిషిచ్య చ ।**
**అనయా విద్యయా తస్మిన్ విన్యసేత్కాంచనేన చ ॥3॥**

**తతశ్చాక్షరలక్షం చ జపేద్విద్వాన్ సమాహితః ।**
**వజ్రీ దశాంశం జుహుయాద్వజ్రకుండే ఘృతాదిభిః ॥4॥**

**తద్వజ్రం గోపయేన్నిత్యం దాపయేన్నృపతేస్తతః ।**
**తేన వజ్రేణ వై గచ్ఛన్ శత్రూన్ జీయాద్రణాజిరే ॥ 5॥**

ఓ మునులారా! వజ్రవాహనిక అనే పేరుగల ఈ విద్య శత్రువులందరికి భయంకరమైనది. ఈ విద్యతో వజ్రాన్ని అభిషేకించి దాన్ని రాజులకు సమర్పించాలి. విధిపూర్వకంగా వజ్రాన్ని నిర్మించి, ఈ విద్యద్వారా జలంతో అభిషేకించి దానిపై బంగారంతో మంత్రాన్ని లిఖించాలి. తర్వాత విద్వాంసులు దత్తావధానులై అక్షరసంఖ్యను సంపూర్ణంగా లక్షసంఖ్యలో జపం చేయాలి. వజ్రియొక్క ఈ జపంలో పదోవంతు ఘృతాదులతో వజ్రాకారకుండంలో హవనం చేయాలి. ఆ వజ్రాన్ని నిత్యం రక్షిస్తూండాలి. తర్వాత దాన్ని రాజుకు ప్రదానం చేయాలి. ఈ వజ్రాన్ని తీసుకుని యుద్ధభూమికి వెళ్లిన రాజు శత్రువులను జయిస్తున్నాడు.

**పురా పితామహేనైవ లబ్ధా విద్యా ప్రయత్నతః ।**
**దేవీ శక్రోపకారార్థం సాక్షాద్వజ్రేశ్వరీ తథా ॥6॥**
**పురా త్వష్టా ప్రజానాథో హతపుత్రః సురేశ్వరాత్ ।**
**విద్యయా హరతః సోమమింద్రవైరేణ సువ్రతాః ॥7॥**

**తస్మిన్ యజ్ఞే యథాప్రాప్తం విధినోపకృతం హవిః ।**

**తద్రైచ్ఛత మహాబాహుర్విశ్వరూపవిమర్దనః ॥8॥**

**మత్పుత్రమవధీః శక్ర న దాస్యే తవ శోభనమ్ ।**
**భాగం భాగార్హతా నైవ విశ్వరూపో హతస్త్వయా ॥ 9॥**

**ఇత్యుక్త్వా చాశ్రమం సర్వం మోహయామాస మాయమా ।**
**తతో మాయాం వినిర్భిద్య విశ్వరూపవిమర్దనః ॥10॥**
**ప్రహస్య సోమమణివత్సగణైశ్చ శచీపతిః ।**
**తతస్తచ్ఛేషమాదాయ క్రోధావిష్టః ప్రజాపతిః ॥11॥**
**ఇంద్రస్య శత్రో వర్ధస్వ స్వాహేత్యగ్నౌ జువాహ హ ।**
**తతః కాలాగ్ని సంకోశో వర్తనాద్వృత్రసంజ్ఞితః ॥12॥**
**ప్రాదురాసీత్సురేశారిర్దుద్రావ చ వృషాంతకః ।**
**తతః కిరీటీ భగవాన్ పరిత్యజ్య దివం క్షణాత్ ॥13॥**
**సహస్రనేత్రః సగణో దుద్రావ భయవిహ్వలః ।**

పూర్వం పితామహుడు బ్రహ్మ ఇంద్రుడికి ఉపకరించేందుకు సాక్షాత్తు శివభగవానుడి నుంచి ఈ దేవీ వజ్రేశ్వరీవిద్యను ప్రయత్నపూర్వకంగా సంపాదించుకున్నాడు. ఓ సువ్రతులారా! త్వష్టప్రజాపతి పుత్రుడిని ఇంద్రుడు వధించాడు. అందుచే ఆతడు ఇంద్రుడికి వ్యతిరేకమైన యజ్ఞం చేశాడు. అందుండి సోమరసం హవిస్సురూపంలో వచ్చింది. విశ్వరూపుడిని వధించిన ఇంద్రుడు ఆ యజ్ఞంలో భాగం అడిగాడు. అపుడు హతపుత్రుడైన ప్రజాపతి త్వష్ట ఇంద్రుడితో ఇలా పలికాడు. ఓ శక్రా! నీవు నా పుత్రుడిని చంపావు. అందుచేత నేను నీ శ్రేష్ఠభాగాన్ని నీకు ఇవ్వను. నీకు నీ భాగాన్ని పొందే అర్హత లేదు. ఎందుకంటే నీవు నా పుత్రుడు విశ్వరూపుడిని చంపిన వాడవు ఇంద్రుడు ఆ మాయను భేదించి బలవంతంగా తన గణాలతోపాటు సోమపానం చేశాడు. తర్వాత మిగిలిన సోమాన్ని తీసుకుని క్రోధావిష్టుడైన త్వష్ట ప్రజాపతి "ఇంద్రస్య శత్రో వర్ధస్వ సాహా" అంంటూ అగ్నిలో ఆ సోమంతో హోమం చేశాడు. ఆ సమయంలో హోమకుండంనుంచి కాలాగ్ని సమానుడైన అసురుడు పుట్టాడు. ఆ విధంగా ఉండడంవల్ల వృత్రుడు అన్నారు. ఇంద్రుడి మీదికి దుమికాడు. అపుడు కిరీటధారి, సహస్రనేత్రుడు, భగవానుడు ఇంద్రుడు స్వర్గాన్ని విడిచి భయంతో వ్యాకులుడై దేవగణాలతోపాటు దాగాడు. మరియు బ్రహ్మ దగ్గరకు వెళ్లారు.

**తదా తమాహ స విభుర్దృష్టో బ్రహ్మా చ విశ్వసృట్ ॥14॥**
**త్యక్త్వా వజ్రం తమేతేన జహీత్యరిమరిందమః ।**
**సోఽపి సన్నహ్యా దేవేంద్రో దేవైః సార్థం మహాభుజః ॥15॥**
**నిహత్య చాప్రయత్నేన గతవాన్ విగతజ్వరః ।**

అపుడు విశ్వసృష్టికర్త, ప్రభువు అయిన బ్రహ్మ ఇంద్రుడితో ఇలా అన్నాడు. ఓ శత్రు సంహారకా! వజ్రాన్ని త్యజించి నీవు ఈ మంత్రంతో అదే వజ్రేశ్వరీ విద్యతో ఆ శత్రువును వధించు. అప్పుడు శత్రు నాశకుడు, మహాభుజుడైన దేవేంద్రుడు కూడా సావధానుడై దేవతలతోపాటు సునాయాసంగా వృత్రుడిని చంపి చింత విడిచి వెళ్లాడు.

**తస్మాద్వజ్రేశ్వరీ విద్యా సర్వశత్రుభయంకరీ ॥16॥**

**మందేహా రాక్షసా నిత్యం విజితా విద్యయైవ తు ।**

**తాం విద్యాం సంప్రవక్ష్యామి సర్వపాపప్రమోచనీమ్ ॥17॥**

**ఓం భూర్భువః స్వః తత్సవిత్వురేణ్యం భర్గో దేవస్య ధీమహి । ధియో యో నః ప్రచోదయాత్ । ఓం ఫట్ జహి హుం ఫట్ ఛింధి ఛింధి జహి హన హన స్వాహా । విద్యా వజ్రేశ్వరీత్యేషా సర్వశత్రుభయంకరీ । అనయా సంహృతిః శంభోర్విద్యయా మునిపుంగవాః ॥18॥**

అందుచేత వజ్రేశ్వరీ విద్య అన్ని విధాల శత్రుభయంకరం. మందేహుడనే రాక్షసుడు ఈ విద్య ద్వారానే ఎల్లప్పుడూ పరాజితుడయ్యాడు. సర్వపాపనాశకారకమైన ఈ విద్యను నేను చెబుతున్నాను. "ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి, ధియో యో నః ప్రచోదయాత్, ఓం ఫట్ జహి హుం ఫట్ ఛింధి ఛింధి జహి హన హన స్వాహా" ఇది వజ్రేశ్వరీ విద్య. సర్వ శత్రుభయంకరమైనది. ఓ మునిశ్రేష్ఠులారా! ఈ విద్యద్వారానే శివభగవానుడు విశ్వాన్ని సంహరిస్తాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే వజ్రేశ్వరీవిద్యావర్ణనం నామైకపంచాశత్తమోఽధ్యాయః ॥51॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని వజ్రేశ్వరీవిద్యావర్ణన అనే పేరు గల యాభై ఒకటవ అధ్యాయం



## **ద్విపంచాశత్తమోఽధ్యాయః** - ఏబై రెండవ అధ్యాయం

## **వశ్యాకర్షణాదిప్రయోగవర్ణనమ్** - వశ్యాఆకర్షణాది ప్రయోగవర్ణన

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**శ్రుతా వజ్రేశ్వరీ విద్యా బ్రాహ్మీ శక్రోపకారిణీ ।**
**అనయా సర్వకార్యాణి నృపాణామితి నః శ్రుతమ్ ॥1॥**

**వినియోగం వదస్వాస్యా విద్యాయా రోమహర్షణ ।**

ఓ రోమహర్షణా! మేము ఇంద్రుడికి ఉపకరించిన బ్రహ్మయొక్క వజ్రేశ్వరీ విద్యను గూర్చి విన్నాం. ఈ విద్య ద్వారా రాజులకు అన్ని కార్యాలు సిద్ధిస్తున్నాయి అని మేము విన్నాం. నీవు ఇపుడు ఆ విద్యను ఎలా వినియోగించాలో చెప్పు.

**సూత ఉవాచ** – సూతమహర్షి పలికాడు.

**వశ్యమాకర్షణం చైవ విద్వేషణమతః పరమ్ ॥2॥**

**ఉచ్చాటనం స్తంభనం చ మోహనం తాడనం తథా ।**
**ఉత్సాదనం తథా ఛేదం మారణం ప్రతిబంధనమ్ ॥3॥**

**సేనాస్తంభనకాదీని సావిత్ర్యా సర్వమాచరేత్ ।**
**ఆగచ్ఛ వరదే దేవి భూమ్యాం పర్వతమూర్ధని ॥4॥**

**బ్రాహ్మణేభ్యో హ్యనుజ్ఞాతా గచ్ఛ దేవి యథాసుఖమ్ ।**
**ఉద్వాస్యానేన మంత్రేణ గంతవ్యం నాన్యథా ద్విజాః ॥5॥**
**ప్రతికార్యం తథా బాహ్యం కృత్వా వశ్యాదికాం క్రియామ్ ।**
**ఉద్వాస్య వహ్నిమాధాయ పునరన్యం యథావిధి ॥6॥**
**దేవీమావాహ్య చ పునర్జపేత్సంపూజయేత్పునః ।**
**హోమం చ విధినా వహ్నౌ పునరేవ సమాచరేత్ ॥7॥**
**సర్వకార్యాణి విధినా సాధయేద్విద్యయా పునః ।**

సావిత్రీమంత్రం ద్వారా వశీకరణాలవల్ల ఆకర్షణం, విద్వేషణం, ఉచ్చాటనం, స్తంభనం, మోహనం, తాడనం, ఉత్సాదనం, ఛేదనం, మారణం, ప్రతిబంధనం, సేనాస్తంభనం మొదలైన కార్యాలు అట్లే ఇతరాలైన అన్నింటిని నిర్వహించవచ్చు. ఆవాహన మంత్రం ఇది–"ఆగచ్ఛ వరదే దేవి భూమ్యాం పర్వతమూర్ధని" విసర్జనమంతమిది– "బ్రాహ్మణేభ్యో హ్యనుజ్ఞాతా గచ్ఛ దేవి యథాసుఖమ్॥. ఓ ద్విజులారా! శత్రువును గూర్చి సమస్తమైన బాహ్యసంబంధి క్రియలు, వశ్యాదులైన క్రియలు నిర్వహించి ఈ మంత్రంతో ఉద్వాసన (విసర్జన) చేసి వెలుపలికి రావాలి. ఇందుకు వ్యతిరేకం చేయరాదు. దేవియొక్క విసర్జనం జరిగిన పిమ్మట మరల విధిపూర్వకంగా రెండో అగ్నిని స్థాపించి దేవిని ఆవాహన చేసి తిరిగి జపం పూజ నిర్వహించాలి. తర్వాత విధి పూర్వకంగా అగ్నిలో హవనం చేయాలి. ఈ విధంగా ఈ విద్యవలన అన్ని కార్యాలు సిద్ధిస్తున్నాయి.

**జాతీపుష్పైశ్చ వశ్యార్థీ జుహుయాదయుతత్రయమ్ ॥8॥**
**ఘృతేన కరవీరేణ కుర్యాదాకర్షణం ద్విజాః ।**
**విద్వేషణం విశేషేణ కుర్యాల్లాంగలకస్య చ ॥9॥**
**తైలేనోచ్చాటనం ప్రోక్తం స్తంభనం మధునా స్మృతమ్ ।**
**తిలేన మోహనం ప్రోక్తం తాడనం రుధిరేణ చ ॥10॥**
**ఖరస్య చ గజస్యాథ ఉష్ట్రస్య చ యథాక్రమమ్ ।**
**స్తంభనం సర్షపేణాపి పాటనం చ కుశేన చ ॥11॥**
**మారణోచ్చాటనే చైవ రోహీబీజేన సువ్రతాః ।**
**బంధనం త్వహిపత్రేణ సేనాస్తంభమతః పరమ్ ॥12॥**
**కునట్యా నియతం విద్యాత్పూజయేత్పరమేశ్వరీమ్ ।**
**ఘృతేన సర్వసిద్ధిః స్యాత్పయసా వా విశుద్ధ్యతే ॥13॥**
**తిలేన రోగనాశశ్చ కమలేన ధనం భవేత్ ।**
**కాంతిర్మధూకపుష్పేణ సావిత్ర్యా హ్యయుతత్రయమ్ ॥14॥**
**జయాదిప్రభృతీన్ సర్వాన్ స్విష్టాంతం పూర్వవత్స్మృతమ్ ।**
**ఏవం సంక్షేపతః ప్రోక్తో వినియోగోఽతి విస్తృతః ॥15॥**
**జపేద్వా కేవలం విద్యాం సంపూజ్యత విధానతః ।**
**సర్వసిద్ధిమవాప్నోతి నాత్ర కార్యా విచారణా ॥16॥**

శత్రువును వశపర్చుకోవాలనే కోరికగలవాడు జాతిపుష్పాలతో మూడువేల ఆహుతులివ్వాలి. ఓ ద్విజులారా! నేయి, కరవీరపుష్పాల ఆహుతితో ఆకర్షకకార్యం నిర్వహించాలి. విద్వేషపూరితకర్మకు లాంగలక పుష్పంతో హవనం చేయాలి. తైలంతో హవనం వల్ల ఉచ్చాటనం, తేనె హవనం వల్ల స్తంభనం సిద్ధిస్తుంది. ఈ విధంగానే నూవులతో హవనం వల్ల స్తంభనం, దర్భలవల్ల పాటనం, రోహీబీజాలవల్ల మారణ-ఉచ్చాటనలు, నాగవల్లీ పత్రాల (అహిపత్రాలు) ద్వారా బంధనం, కునటివల్ల (మనఃశిల) సేనాస్తంభనం సిద్ధిస్తాయి. ఈ విధంగా నియతపూర్వకంగా పరమేశ్వరిని పూజించాలి. ఇపుడు సాత్త్వికమైన కోరికల సిద్ధికై ఈ హవనద్రవ్యాలు చెప్పబడ్డాయి. నేతితో హవనంవల్ల సర్వవిధసిద్ధి జరుగుతుంది. పాలతో హవనం వల్ల సాధకుడు శుద్ధుడు అవుతున్నాడు. నూవుల హోమంవల్ల రోగాలు నశిస్తున్నాయి. కమలపుష్పంతో హవనం వల్ల ధనప్రాప్తి జరుగుతున్నది. మధూకపుష్పంవల్ల కాంతి సిద్ధిస్తున్నది. ప్రత్యేకహవనంలో మూడువేల సార్లు సావిత్రీ మంత్రాన్ని ఉచ్చరించాలి. "జయ, అభ్యాతాన" "రాష్ట్రభూత్" హోమం చేసి అంతంలో స్విష్టకృత్ హోమం పూర్వం మాదిరిగా చేయాలి. ఓ ఋషులారా! ఈ విధంగా నేను సంక్షేపంగా అత్యంతవిస్తృతిగల ఈ వినియోగాన్ని చెప్పాను. హవనం చేయలేని స్థితిలో విధిపూర్వకంగా కేవలం వజ్రేశ్వరీవిద్యను పూజించి జపించాలి. ఆ విధంగా చేసినవాడు కూడా సమస్తసిద్ధుల్ని పొందుతున్నాడు. ఇందుకై సందేహించ పనిలేదు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే వశ్య-ఆకర్షణాది ప్రయోగవర్ణనంనామ ద్విపంచాశత్తమోఽధ్యాయః ॥52॥**
శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని వశ్య-ఆకర్షణాది ప్రయోగవర్ణన అనే పేరు గల ఏబై రెండవ అధ్యాయం సమాప్తం.

## త్రిపంచాశత్తమోఽధ్యాయః - ఏబై మూడవ అధ్యాయం

## మృత్యుంజయవిధివర్ణనమ్ - మృత్యుంజయవిధివర్ణన

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

> **మృత్యుంజయవిధిం సూత బ్రహ్మక్షత్రవిశామపి ।**
> **వక్తుమర్హసి చాస్మాకం సర్వజ్ఞోఽసి మహామతే ॥1॥**

ఓ సూతర్షీ! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల కళ్యాణార్థం నీవు మాకు మృత్యుంజయవిధి నిర్వహణను కృపతో చెప్పు. ఓ మహామతీ! నీవు సర్వజ్ఞుడవు.

**సూత ఉవాచ** - సూతుడు పలికాడు.

> **మృత్యుంజయవిధిం వక్ష్యే బహునా కిం ద్విజోత్తమాః ।**
> **రుద్రాధ్యాయేన విధినా ఘృతేన నియుతం క్రమాత్ ॥2॥**

> **సఘృతేన తిలేనైవ కమలేన ప్రయత్నతః ।**
> **దూర్వయా ఘృతగోక్షీరమిశ్రయా మధునా తథా ॥3॥**

> **చరుణా సఘృతేనైవ కేవలం పయసాపి వా ।**
> **జుహుయాత్కాలమృత్యోర్వా ప్రతీకారః ప్రకీర్తితః ॥ 4॥**

ఓ ఉత్తమద్విజులారా! మీకు నేను మృత్యుంజయవిధివిధానం చెప్తాను. వేరే ఎన్ని ఎక్కువ చెప్పినా ఏమి లాభం? రుద్రాధ్యాయ మంత్రం ద్వారా నేతితో ఒక లక్షసార్లు క్రమంగా హవనం చేయండి. నేతితో కలిపిన నూవులతో, కమలపుష్పాలతో, గోవుపాలతో, నేతితో కలిపిన గరికతో, తేనెతో, నేతితో కలిపిన చరువుతో, లేక కేవలం పాలతో హవనం ప్రయత్నపూర్వకంగా చేయాలి. ఈ విధానం కాలమృత్యువుకు, లేక మహామృత్యువుకు ప్రతీకారంగా చెప్పబడింది.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే మృత్యుంజయవిధివర్ణనం నామ త్రిపంచాశత్తమోఽధ్యాయః ॥53॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని మృత్యుంజయవిధివర్ణన అనే పేరు గల ఏబది మూడవ అధ్యాయం సమాప్తం.



## చతుఃపంచాశత్తమోఽధ్యాయః - ఏబై నాలుగవ అధ్యాయం

## సార్థత్రియంబకమంత్రవర్ణనమ్ - సార్థత్రియంబకమంత్రవర్ణన

**సూత ఉవాచ** – సూతర్షి పలికాడు.

**త్రియంబకేణ మంత్రేణ దేవదేవం త్రియంబకమ్ ।**
**పూజయేద్బాణలింగే వా స్వయంభూతేఽపి వా పునః ॥1॥**

**ఆయుర్వేదవిదైర్వాపి యథావదనుపూర్వశః ।**
**అష్టోత్తరసహస్రేణ పుండరీకేణ శంకరమ్ ॥2॥**

**కమలేన సహస్రేణ తథా నీలోత్పలేన వా ।**
**సంపూజ్యపాయసం దత్వా సఘృతం చౌదనం పునః ॥3॥**

**ముద్గాన్నం మధునాయుక్తం భక్ష్యాణి సురభీణి చ ।**
**అగ్నౌ హోమశ్చ విపులో యథావదనుపూర్వశః ॥4॥**

**పూర్వోక్తైరపి పుష్పైశ్చ చరుణా చ విశేషతః ।**
**జపేద్వై నియుతం సమ్యక్ సమాప్య చ యథాక్రమమ్ ॥5॥**

**బ్రాహ్మణానాం సహస్రం చ భోజయేద్వై సదక్షిణమ్ ।**
**గవాం సహస్రం దత్వా తు హిరణ్యమపి దాపయేత్ ॥6॥**

బాణలింగానికి లేక స్వయంభూలింగానికి త్రియంబకమంత్రం ద్వారా దేవాధిదేవుడు ముక్కంటికి పూజ చేయాలి. ఆయుర్వేదశాస్త్రవిదులు ఇలా అంటున్నారు. వేయి ఎనిమిదిసార్లు తెల్లటి కమలాలతో గాని, ఒక వేయి ఎఱ్ఱటి కమలాలతోగాని, ఒక వేయి నీలకమలాలతో గాని పూర్వోక్తవిధంగా శివభగవానుడిని పూజించి, పాయసం, నేతితో కలిసిన అన్నం, తేనెతో కలిపిన పొంగలి పరిమళభరితాలైన ఇతర భక్ష్యాలు అర్పించి, పూర్వాధ్యాయాలలో చెప్పిన విధంగా నేయి మున్నగు పదార్థాలతో, ఇంతకు ముందు చెప్పిన పుష్పాలతో మరియు విశేషంగా తయారు చేసిన చరువుతో యథావిధిగా అగ్నిలో పదివేలసార్లు హవనం చేయాలి. మరియు ఒక లక్షసార్లు జపం చేయాలి. యోగ్యవిధానంగా, ఔచిత్యభరితంగా, సంపూర్ణంగా కార్యాన్ని నిర్వహించి, వేయి మంది బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. దక్షిణలు ఇవ్వాలి. వేయిగోవులను ప్రదానం చేస్తూ బంగారాన్ని కూడా ఇవ్వాలి.

**ఏతద్వః కథితం సర్వం సరహస్యం సమాసతః ।**
**శివేన దేవదేవేన శర్వేణాత్యుగ్రశూలినా ॥ 7॥**

**కథితం మేరుశిఖరే స్కందాయమితతేజసే ।**
**స్కందేన దేవదేవేన బ్రహ్మపుత్రాయ ధీమతే ॥8॥**

**సాక్షాత్సనత్కుమారేణ సర్వలోకహితైషిణా ।**
**పారాశర్యాయ కథితం పారంపర్యక్రమాగతమ్ ॥9॥**

ఈ విధంగా నేను రహస్యసహితమైన విషయాన్ని సంక్షేపంగా మీకు చెప్పాను. మరీ ఉగ్రమైన శూలాన్నిధరించే దేవదేవుడు. శివుడు మేరు శిఖరం మీద అమితతేజస్వియైన కార్తికేయుడికి దీన్ని చెప్పాడు. తర్వాత దేవతలకేదేవుడు

ఆ కార్తికేయుడు బుద్ధిమంతుడు, బ్రహ్మపుత్రుడు అయిన సనత్కుమారుడికి చెప్పాడు. లోకహితైషి ఆ సనత్కుమారుడు దాన్ని పరాశరపుత్రుడైన వ్యాసుడికి చెప్పాడు. ఈ విధంగా పారంపర్యంగా ఈ రహస్యం ప్రకాశం చెందింది.

**శుకే గతే పరంధామ దృష్ట్వా రుద్రం త్రియంబకమ్ ।**
**గతశోకో మహాభాగో వ్యాసః పరఋషిః ప్రభుః ॥10॥**

**స్కందస్య సంభవం శ్రుత్వా స్థితాయ చ మహాత్మనే ।**
**త్రియంబకస్య మాహాత్మ్యం మంత్రస్య చ విశేషతః ॥11॥**

**కథితం బహుధా తస్మై కృష్ణద్వైపాయనాయ వై ।**
**తత్సర్వం కథయిష్యామి ప్రసాదాదేవ తస్య వై ॥12॥**

త్రియంబకరుద్రుడి దర్శనం చేసి శుకుడు మోక్షపదప్రాప్తి చెందిన తర్వాత మహాభాగుడు, మహర్షి, భగవాన్ వ్యాసుడు శోకాన్ని పొందాడు. ఆ సమయంలో స్కందుడి ప్రాదుర్భావాన్ని విని, అక్కడే నిలిచిన మహాత్ముడైన కృష్ణద్వైపాయనవ్యాసుడికి సనత్కుమారుడు త్రయంబకమంత్రంయొక్క మాహాత్మ్యాన్ని బహువిధాల వివరించాడు. వ్యాసుడికృపతో మీకు నేను అదంతా చెప్పాను.

**దేవం సంపూజ్య విధినా జపేన్మంత్రం త్రియంబకమ్ ।**
**ముచ్యతే సర్వపాపైశ్చ సప్తజన్మకృతైరపి ॥ 13॥**

**సంగ్రామే విజయం లబ్ధ్వా సౌభాగ్యమతులం భవేత్ ।**
**లక్షహోమేన రాజ్యార్థీ రాజ్యం లబ్ధ్వా సుఖీ భవేత్ ॥14॥**

**పుత్రార్థీ పుత్రమాప్నోతి నియుతేన న సంశయః ।**
**ధనార్థీ ప్రయుతేనైవ జపేదేవ న సంశయః ॥15॥**

**ధనధాన్యాదిభిః సర్వైః సంపూర్ణః సర్వమంగళైః ।**
**క్రీడతే పుత్రపౌత్రైశ్చ మృతః స్వర్గే ప్రజాయతే ॥16॥**
**నానేన సదృశో మంత్రో లోకే వేదే చ సువ్రతాః ।**
**తస్మాత్రియంబకం దేవం తేన నిత్యం ప్రపూజయేత్ ॥17॥**

**అగ్నిష్టోమస్య యజ్ఞస్య ఫలమష్టగుణం భవేత్ ।**

మహాదేవుడిని బాగా పూజించి విధిపూర్వకంగా త్రియంబకమంత్రజపం చేయాలి. దీని ప్రభావంతో మానవుడు ఏడు జన్మల్లో చేసిన అన్ని పాపాలనుంచి ముక్తుడవుతున్నాడు. యుద్ధంలో విజయాన్ని పొంది అతడు తులలేని సౌభాగ్యాన్ని పొందుతున్నాడు. రాజ్యాన్ని కోరుకునేవాడు ఒక లక్షసార్లు హవనంతో రాజ్యాన్ని పొంది సుఖిస్తున్నాడు. పుత్రార్థి అయినవాడు ఒక లక్షహోమంతో పుత్రుడిని పొందుతున్నాడు. ఇందులో సందేహం లేదు. ధనార్థి అయినవాడు ఒక కోటి త్రియంబక మంత్రంతో జపం చేయాలి. లేక త్రియంబకుడిని ఎల్లప్పుడూ పూజించాలి. దానితో ఆ మనుష్యుడు అన్ని విధాల మంగళయుతుడై పుత్ర పౌత్రాదులతో సుఖమయ జీవితాన్ని గడుపుతున్నాడు. మరణించిన తర్వాత స్వర్గానికి వెళుతున్నాడు. ఇందులో సందేహం లేదు. ఓ సువ్రతులారా! ఈ త్రయంబక మంత్రంతో సమానమైన మంత్రం ఈ లోకంలోనూ వేదంలోనూ లేదు. అందుచేత ఈ మంత్రంతో త్రియంబక భగవానుడిని నిత్యం పూజించాలి. ఇది చేస్తే అగ్నిష్టోమయజ్ఞానాన్ని చేసిన ఫలంకన్నా ఎనిమిదిరెట్లు అధికఫలం దక్కుతున్నది.

**త్రయాణామపి లోకానాం గుణానామపి యః ప్రభుః ॥18॥**

**వేదానామపి దేవానాం బ్రహ్మక్షత్ర విశామపి ।**
**అకారోకారమకారణాం మాత్రాణామపి వాచకః ॥ 19॥**

**తథా సోమస్య సూర్యస్య వహ్నే రగ్నిత్రయస్య చ ।**
**అంబా ఉమా మహాదేవో హ్యంబకస్తు త్రియంబకః ॥20॥**

త్రియంబక శబ్దంయొక్క వ్యాఖ్య ఈ విధం. మూడులోకాలకు, మూడు గుణాలకు, మూడు వేదాలకు, మూడు దేవతలకు, బ్రాహ్మణక్షత్రియవైశ్యులనే మూడువర్ణాలకు త్రియంబకుడే స్వామి. ఓంకార రూపమైన అకార, ఉకార, మకారాల – మూడు మాత్రలకు వాచకం. చంద్రుడు, సూర్యుడు, అగ్ని. ఈ మూడు అగ్నులకు తల్లి ఉమాదేవి. మహాదేవుడు ఈ అందరికి తండ్రి అందుకే ఇది 'త్రియంబక' మంత్రమయ్యింది.

**సుపుష్పితస్య వృక్షస్య యథా గంధః సుశోభనః ।**
**వాతి దూరాత్తథా తస్య గంధః శంభోర్మహాత్మనః ॥21॥**

**తస్మాత్సుగంధో భగవాన్ గంధారయతి శంకరః ।**
**గాంధారశ్చ మహాదేవో దేవానామపి లీలయా ॥22॥**

**సుగంధస్తస్య లోకేఽస్మిన్ వాయుర్వాతి నభస్తలే ।**
**తస్మాత్సుగంధిస్తం దేవం సుగంధిం పుష్టివర్ధనమ్ ॥23॥**

పుష్పభరితవృక్షం యొక్క మిక్కిలి ప్రభావితమైన గంధం ఎంతో దూరం వ్యాపించినట్లే పరమాత్మయైన శివుడి గంధం లోకంలో అంతటా వ్యాపిస్తున్నది. అందుకే శివభగవానుడు సుగంధి అవుతున్నాడు. ఈ మహాదేవ శంకరుడు తన లీలతో దేవతలను కూడా సుగంధులుగా చేస్తున్నాడు. వాయువు ఆకాశమండలంలో ఏ విధంగా వీస్తున్నదో శివుడి సౌగంధ్యం అదే విధంగా జగత్తులో వ్యాపిస్తున్నది. అందుచేతనే సుగంధిమయుడు అవడంతో ప్రభువు శివుడిని "సుగంధి" అట్లే "పుష్టివర్ధనుడు" అంటున్నారు.

**యస్య రేతః పురా శంభోర్హరేర్యోనౌ ప్రతిష్ఠితమ్ ।**
**తస్య వీర్యాదభూదండం హిరణ్మయమజోద్భవమ్ ॥24॥**

**చంద్రాదిత్యౌ సనక్షత్రౌ భూర్భువః స్వర్మహస్తపః ।**
**సత్యలోకమతిక్రమ్య పుష్టిర్వీర్యస్య తస్య వై ॥25॥**

**పంచభూతాన్యహంకారో బుద్ధిః ప్రకృతిరేవ చ ।**
**పుష్టిర్బీజస్య తస్యైవ తస్మాద్వై పుష్టివర్ధనః ॥26॥**

పూర్వం శివభగవానుడి తేజం (వీర్యం) విష్ణుభగవానుడి యోనిలో స్థాపింపబడింది. ఆ తేజస్సువల్ల సువర్ణమయమైన అండం నిర్మింపబడింది. అది బ్రహ్మయొక్క ఉత్పత్తికి కారణం. శివుడి వీర్యపుష్టి, చంద్రసూర్యులు, సర్వనక్షత్రాలు, భూర్లోకం, భువర్లోకం, స్వర్లోకం, మహర్లోకం, తపోలోకం, మరియు సత్యలోకం దాటి వ్యాపించింది. పంచభూతాలు, అహంకారం, బుద్ధి ప్రకృతి ఇవి అన్ని ఆ శివుని బీజపరిపుష్టియే. అందుచేత శివుడు 'పుష్టివర్ధన' సంజ్ఞగలవాడయ్యాడు.

**తం పుష్టివర్ధనం దేవం ఘృతేన పయసా తథా ।**
**మధునా యవగోధూమమాషబిల్వఫలేన చ ॥27॥**

**కుముదార్కశమీపత్రగౌరసర్షపవాలిభిః ।**
**హుత్వా లింగే యథాన్యాయం భక్త్యా దేవం యజామహే ॥28॥**

**ఋతేనానేన మాం పాశాద్బంధనాత్కర్మయోగతః ।**
**మృత్యోశ్చ బంధనాచ్చైవ ముక్షీయ భవ తేజసా ॥29॥**

**ఉర్వారుకాణాం పక్వానాం యథా కాలాదభూత్పునః ।**
**తథైవ కాలః సంప్రాప్తో మనునా తేన యత్నతః ॥30॥**

నేయి, పాలు, తేనె, యవలు, గోధుమలు, మినుములు, మారేడు పండ్లు, కుముదాలు, జిల్లేడు ఆకులు, జమ్మి ఆకులు, శ్వేతసర్షపాలు, శాలిధాన్యం వీటితో విధిపూర్వకంగా హవనం చేసి పుష్టివర్ధకుడైన శివభగవానుడికి సభక్తికంగా లింగపూజ చేయాలి. ఈ పూజ ప్రభావంతో కర్మజన్యపాశబంధాల నుంచి, మృత్యు బంధాల నుంచి ముక్తికలుగుతుంది. కాలం సమీపించగా ఆ కాలసంబంధమైన బంధాలనుంచి ముక్తి కలుగుతుంది.

**ఏవం మంత్రవిధిం జ్ఞాత్వా శివలింగం సమర్చయేత్ ।**
**తస్య పాశక్షయోఽతీవ యోగినో మృత్యునిగ్రహః ॥31॥**

**త్రియంబకసమో నాస్తి దేవో వా ఘృణయాన్వితః ।**
**ప్రసాదశీలః ప్రీతశ్చ తతా మంత్రోఽపి సువ్రతః ॥32॥**

**తస్మాత్సర్వం పరిత్యజ్య త్రియంబకముమాపతిమ్ ।**
**త్రియంబకేణ మంత్రేణ పూజయేత్సుసమాహితః ॥33॥**

**సర్వావస్థాం గతో వాపి ముక్తోఽయం సర్వపాపకైః ।**
**శివధ్యానాన్న సందేహో యథా రుద్రస్తథా స్వయమ్ ॥34॥**

**హత్వా భిత్త్వా చ భూతాని భుక్త్వా చాన్యాయతోఽపి వా ।**
**శివమేకం సకృత్స్మృత్వా సర్వపాపైః ప్రముచ్యతే ॥35॥**

ఈ విధంగా మంత్రవిధి తెలిసి శివలింగాన్ని పూజించాలి. ఈ విధంగా చేయడంవల్ల ఆ యోగికి భవపాశవినాశం పరిపూర్ణంగా జరిగి మృత్యునిగ్రహం కలుగుతున్నది. ఓ సువ్రతులారా! త్రియంబకుడికి సాటి అయిన దయాళులైన ఇతర దేవుళ్లు లేరు. ఆయన సారళ్య ప్రసన్న స్వరూపుడు, ప్రేమమయుడు. ఆయన మంత్రంకూడా అట్టిదే. అందుకే అన్నింటిని విడిచి ఏకాగ్రచిత్తంతో త్రియంబకమంత్రంతో ఉమాపతి త్రియంబకుడిని పూజించాలి. ఏ దశకు చేరిన మనుష్యుడైనా శివధ్యానంతో అన్ని పాపాలనుంచి ముక్తుడవుతున్నాడు. రుద్రుడెట్టివాడో ఆతడు అట్టివాడే అవుతున్నాడు. ఇందులో సందేహం లేదు. ప్రాణుల్ని ఛేదించి భేదించి అన్యాయంగా సంపాదించిన వస్తువుల్ని అనుభవించినవాడు కూడా ఏకాగ్రచిత్తంతో ఒకే ఒకసారి ధ్యానించికూడా అన్ని పాపాలనుంచి ముక్తుడవుతున్నాడు.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే సార్ధత్రియంబకమంత్రవర్ణనం నామ చతుష్పంచాశత్తమోఽధ్యాయః ॥54॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని సార్ధత్రియంబకమంత్రవర్ణనం అనే పేరు గల ఏబై నాలుగవ అధ్యాయం సమాప్తం.

## పంచపంచాశత్తమోఽధ్యాయః - ఏబై ఐదవ అధ్యాయం

## పాశుపతయోగమార్గవర్ణనమ్ - పాశుపతయోగమార్గవర్ణన

**ఋషయ ఊచుః** - ఋషులు పలికారు.

**కథం త్రియంబకో దేవో దేవదేవో వృషధ్వజః ।**
**ధ్యేయః సర్వార్థసిద్ధ్యర్థం యోగమార్గేణ సువ్రత ॥1॥**

**పూర్వమేవాపి నిఖిలం శ్రుతం శ్రుతిసమం పునః ।**
**విస్తరేణ చ తత్సర్వం సంక్షేపాద్వక్తుమర్హసి ॥2॥**

ఓ సువ్రతా! సర్వమనోరథసిద్ధికై యోగమార్గం ద్వారా ముక్కంటి, దేవాధిదేవుడు, వృషధ్వజుడు అయిన శివభగవానుడి ధ్యానం ఏ విధంగా చేయాలి. ఇంతకుముందు మేము వేదతుల్యమైన సంపూర్ణ ప్రసంగం విస్తృతంగా విన్నాం. ఆ మొత్తం సంక్షేపంగా చెప్పేందుకు దయదలచు.

**సూత ఉవాచ** - సూతర్షి పలికాడు.

**ఏవం పైతామహేనైవ నందీ దినకరప్రభః ।**
**మేరుపృష్ఠే పురా పృష్టో మునిసంఘైః సమావృతః ॥3॥**

**సోఽపి తస్మై కుమారాయ బ్రహ్మపుత్రాయ సువ్రతాః ।**
**మిథః ప్రోవాచ భగవాన్ ప్రణతాయ సమాహితః ॥4॥**

ఓ సువ్రతులారా! పూర్వం మేరు పర్వతశిఖరం మీద బ్రహ్మపుత్రుడు అయిన సనత్కుమారుడు సూర్యసమానతేజస్వియై, మునుల మధ్యనున్న నందీశ్వరుడిని ఇట్లే అడిగాడు. అపుడు నందీశ్వరుడు వినమ్రుడైన బ్రహ్మపుత్రసనత్కుమారుడిని గూర్చి సమాహితచిత్తుడై ఇలా పలికాడు.

**నందికేశ్వర ఉవాచ** - నందీశ్వరుడు పలికాడు.

**ఏవం పురా మహాదేవో భగవాన్నీలలోహితః ।**
**గిరిపుత్ర్యాంబయా దేవ్యా భగవత్యైకశయ్యయా ॥5॥**

**పృష్టః కైలాసశిఖరే హృష్టపుష్టతనూరుహః ।**

ఈ విషయమే పూర్వం కైలాసశిఖరం మీద ఏకశయ్యమీద ఒకరితోపాటు మరొకరు ప్రకాశిస్తున్న హిమశైలపుత్రి, భగవతి, పార్వతీదేవి రోమాంచితగాత్రుడైన నీలలోహితశివభగవానుడిని ప్రశ్నించింది.

**శ్రీ దేవ్యువాచ** - శ్రీదేవి పలికింది.

**యోగః కతివిధః ప్రోక్తస్తత్కథం చైవ కీదృశమ్ ॥6॥**
**జ్ఞానం చ మోక్షదం దివ్యం ముచ్యంతే యేన జంతవః ।**

యోగం ఎన్ని విధాలు? వాటి స్వరూపాలు ఎటువంటివి? వాటి విధానమెట్టిది? దివ్యమూ, మోక్షదాయకమూ అయిన జ్ఞానం ఎలాంటిది? దేని ద్వారా ప్రాణులు బంధాలనుంచి ఎలా ముక్తులవుతున్నారు?

**శ్రీ భగవాన్ ఉవాచ** – శ్రీ భగవంతుడైన శివుడు పలికాడు.

**ప్రథమో మంత్రయోగశ్చ స్పర్శయోగో ద్వితీయకః ॥7॥**

**భావయోగస్తృతీయః స్యాదభావశ్చ చతుర్థకః ।**
**సర్వోత్తమో మహాయోగః పంచమః పరికీర్తితః ॥8॥**

మంత్రయోగం మొదటిది. స్పర్శయోగం రెండోది. మూడోది భావయోగం. అభావయోగం నాల్గోది. ఐదోది మహాయోగం. అదే సర్వోత్తమం.

**ధ్యానయుక్తో జపాభ్యాసో మంత్రయోగః ప్రకీర్తితాః ।**
**నాడీశుద్ధ్యధికో యస్తు రేచకాదిక్రమాన్వితః ॥9॥**

**సమస్తవ్యస్తయోగేన జయో వాయోః ప్రకీర్తితః ।**
**బలస్థిరక్రియాయుక్తో ధారణాద్యైశ్చ శోభనైః ॥10॥**

**ధారణాత్రయ సందీప్తో భేదత్రయ విశోధకః ।**
**కుంభకావస్థితోఽభ్యాసః స్పర్శయోగః ప్రకీర్తితః ॥11॥**

**మంత్రస్పర్శ వినిర్ముక్తో మహాదేవం సమాశ్రితః ।**
**బహిరంతర్విభాగస్థస్ఫురత్సంహరణాత్మకః ॥12॥**

**భావయోగః సమాఖ్యాతశ్చిత్తశుద్ధిప్రదాయకః ।**
**విలీనావయవం సర్వం జగత్స్థావర జంగమమ్ ॥13॥**

**శూన్యం సర్వం నిరాభాసం స్వరూపం యత్ర చింత్యతే ।**
**అభావయోగః సంప్రోక్తశ్చిత్తనిర్వాణకారకః ॥14॥**

**నీరూపః కేవలః శుద్ధః స్వచ్ఛందం చ సుశోభనః ।**
**అనిర్దేశ్యః సదాలోకః స్వయం వేద్యః సమంతతః ॥15॥**

**స్వభావో భాసతే యత్ర మహాయోగః ప్రకీర్తితః ।**
**నిత్యోదితః స్వయం జ్యోతిః సర్వచిత్తసముత్థితః ॥16॥**
**నిర్మలః కేవలో హ్యాత్మా మహాయోగ ఇతి స్మృతః ।**

ధ్యానయుక్తజపం యొక్క అభ్యాసం మంత్రయోగం. రేచకం, కుంభకం మున్నగు ప్రాణాయామాల ద్వారా నాడుల యొక్క శుద్ధి జరిగి సమస్తవ్యస్తమైన యోగంతో ప్రాణంయొక్క విజయం జరుగుతుంది. వాజీకరణక్రియతో అనగా వీర్య స్తంభన రూపంగా శోభనధారణాది అంగాలతో; సంపన్నం సాత్త్వికం మున్నగు త్రివిధాలైన ధారణలతో ప్రకాశిస్తుంది. విశ్వ – ప్రాజ్ఞ–తైజసరూప భేదత్రయంయొక్క శోధనం కుంభకంలో గల స్థితధ్యానాభ్యాసమే స్పర్శయోగం అవుతుంది. మంత్రం అట్లే స్పర్శయోగం కన్నా వేరుగా మహాదేవుడిని ఆశ్రయించి బాహ్యం మరియు ఆంతరదశలలో స్ఫురణ మరియు సంహరణలతో కూడిన మరియు చిత్తానికి శుద్ధి నిచ్చే యోగం భావయోగం అవుతుంది. చరాచరమైన సంపూర్ణజగత్తు ఇందులో విలీనం అవుతుంది. ఇందులో సంపూర్ణ స్వరూపాన్ని శూన్యంగా,

ఆభాసహీనరూపంగా చింతింపబడుతందో చిత్తానికి నిర్వాణం నిర్వహించే ఈ యోగం అభావయోగం. ఏది రూపహీనం, అద్వితీయం, నిర్మలం, స్వతంత్రం, అత్యంతసుందరం, అనిర్దేశ్యం, అంతటా ప్రకాశమానం, స్వయం సవేద్యం అయినట్టిది, దేనిలో మన ఆత్మయొక్క 'సత్తా' భాసిస్తుందో దాన్నే మహాయోగం అంటారు. ఆత్మ ఎల్లప్పుడు ప్రకాశిస్తూ ఉంటుంది. స్వయంగా జ్యోతిర్మయం సంపూర్ణచిత్తాలపైన ఉండేది. విశుద్ధమైంది. అద్వితీయమైంది. ఈ విధమైన అనుభవం కల్గడంవల్లే అది మహాయోగం అయ్యింది.

**అణిమాదిప్రదాః సర్వే సర్వే జ్ఞానస్య దాయకాః ॥17॥**

**ఉత్తరోత్తరవైశిష్ట్యమేషు యోగేష్వనుక్రమాత్ ।**
**అహం సంగవినిర్ముక్తో మహాకాశోపమః పరః ॥18॥**

**సర్వావరణనిర్ముక్తో హ్యచింత్యః స్వరసేన తు ।**
**జ్ఞేయమేతత్సమాఖ్యాతమగ్రాహ్యమపి దైవతైః ॥19॥**

**ప్రవిలీనో మహాన్ సమ్యక్ స్వయం వేద్యః స్వసాక్షికః ।**
**చకాస్త్యానందవపుషా తేన జ్ఞేయమిదం మతమ్ ॥20॥**

**పరీక్షితాయ శిష్యాయ బ్రాహ్మణాయాహితాగ్నయే ।**
**ధార్మికాయాకృతఘ్నాయ దాతవ్యం క్రమపూర్వకమ్ ॥21॥**

**గురుదైవతభక్తాయ అన్యథా నైవ దాపయేత్ ।**
**నిందితో వ్యాధితోఽల్పాయుస్తథా చైవ ప్రజాయతే ॥22॥**

**దాతురస్యేవమనఘే తస్మాత్ జ్ఞాత్వైవ దాపయేత్ ।**
**సర్వసంగవినిర్ముక్తో మద్భక్తో మత్పరాయణః ॥23॥**

**సాధకో జ్ఞానసంయుక్తః శ్రౌతస్మార్తవిశారదః ।**
**గురుభక్తశ్చ పుణ్యాత్మా యోగ్యో యోగరతః సదా ॥24॥**

అన్ని యోగాలు అణిమాద్యష్టసిద్ధులను జ్ఞానాన్ని ప్రదానం చేస్తాయి. ఈ యోగాలలో క్రమంగా ఒకదాని తర్వాత రెండోదానిలో ముందు దానికన్న వైశిష్ట్యం ఉంటుంది. ఈ మహాయోగం అహంకార సంగం లేనిది. మహాకాశంతో సమానమైనది. సర్వోత్కృష్టం, సమస్తావరణాల నుంచి ముక్తమైంది. యథార్థంగా అచింత్యమైంది. దీని జ్ఞానం దేవతలకు కూడా గ్రహింపరానిది. ఇది పరమాత్మలో సాధకుడిని విలీనం చేసేది. గొప్పది. స్వయంగా తెలియదగింది. స్వయంగా తనకు సాక్షి. ఆనందమయమైన శరీరంలో ప్రకాశించేది. ఇది అహంకారరహితపురుషుడి ద్వారా తెలియదగింది. ఈ జ్ఞానం కోసం పరీక్షింపబడే శిష్యుడు అగ్నిహోత్రి అయిన బ్రాహ్మణుడు, ధర్మపరాయణుడు, కృతజ్ఞుడు మరియు గురుభక్తిపరుడు కావాలి. అటువంటి వాడికే ప్రదానం చేయాలి. ఇతరులకివ్వరాదు. అనధికారంగల వ్యక్తి, నిందితుడు, రోగపీడితుడు, అల్పాయుష్కుడు పనికిరాదు. ఒకవేళ ఈతడివలన ప్రదానం పొందినవాడు కూడా ఇటువంటి స్థితినే పొందుతున్నాడు. ఓ అనఘా! ఈ కారణంగా సంపూర్ణంగా పరీక్షించే ఆతడు దీన్ని ఇవ్వాలి. దీన్ని పొందే మానవుడు అన్ని ఆసక్తుల్ని వదలినవాడు, నాభక్తుడు, నాయందు పరాయణుడు, సాధకుడు, జ్ఞానవంతుడు, శ్రుతిస్మార్తకర్మలలో జ్ఞానం గలవాడు, గురుభక్తియుతుడు, పుణ్యాత్ముడు, యోగ్యతాసంపన్నుడు, ఎల్లప్పుడు యోగనిరతుడైనవాడు అయి ఉండాలి.

**ఏవం దేవి సమఖ్యాతో యోగమార్గః సనాతనః ।**
**సర్వవేదాగమాంభోజమకరందః సుమధ్యమే ॥25॥**

**పీత్వా యోగామృతం యోగీ ముచ్యతే బ్రహ్మ విత్తమః ।**
**ఏవం పాశుపతం యోగం యోగైశ్వర్యమనుత్తమమ్ ॥26॥**

**అత్యాశ్రమమిదం జ్ఞేయం ముక్తయే కేన లభ్యతే ।**
**తస్మాదిష్టైః సమాచారైః శివార్చనరతైః ప్రియే ॥27॥**

**ఇత్యుక్త్వా భగవాన్ దేవీమనుజ్ఞాప్య వృషధ్వజః ।**
**శంకుకర్ణం సమాసాద్య యుయోజాత్మానమాత్మని ॥28॥**

ఓ దేవీ! ఓ సుమధ్యమా! ఈ విధంగా ఈ యోగమార్గం సనాతనం. అంతేకాదు వేదాగమరూపమైన కమలం యొక్క మకరందం. దీన్ని నీకు చెప్పాను. ఈ యోగరూపమైన అమృతాన్ని పానం చేసి బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైన యోగి ముక్తుడవుతున్నాడు. ఈ విధంగా ఈ పాశుపతయోగం సమస్తయోగాలకు ఐశ్వర్యాన్ని ప్రదానం చేసే సర్వోత్కృష్టమైన యోగం. ఇందుకై బ్రహ్మచర్య గార్హస్థ్యాదులైన ఆశ్రమాల అపేక్ష అవసరం లేదు. ఓ ప్రియా! అందుకే ఇది ప్రాణులందరికీ హితాన్ని కోరుతూ శివపూజాపరాయణులైన వారికి అనిర్వచనీయమైన సౌభాగ్యాన్నీ మరియు ముక్తినీ ఇస్తుంది. ఈ విధంగా చెప్పిన తర్వాత వృషధ్వజుడైన శివభగవానుడు ఆదేవియొక్క ఆజ్ఞ తీసుకుని ప్రమథగణుడైన శంకుకర్ణుడిని ద్వారమందు నియమించి స్వయంగా సమాధిలో లీనమయ్యాడు.

**శైలాదిరువాచ** – నందీశ్వరుడు పలికాడు.

**తస్మాత్త్వమపి యోగీంద్ర యోగాభ్యాసరతో భవ ।**
**స్వయంభువః పరా మూర్తిర్నూనం బ్రహ్మమయీ వరా ॥29**

**తస్మాత్సర్వప్రయత్నేన మోక్షార్థీ పురుషోత్తమః ।**
**భస్మస్నాయీ భవేన్నిత్యం యోగే పాశుపతే రతః ॥ 30॥**

**ధ్యేయా యథాక్రమేణైవ వైష్ణవీ చ తతః పరా ।**
**మహేశ్వరీ పరా పశ్చాత్సైవ ధేయా యథాక్రమమ్ ॥31॥**

**యోగేశ్వరస్య యా నిష్ఠా సైషా సంహృత్య వర్ణితా ।**

అందుకే నీవూ యోగాభ్యాసంలో సంలగ్నం కమ్ము. స్వయంభవుడైన శివుడిమూర్తి నిశ్చితరూపంలో శ్రేష్ఠం మరియు బ్రహ్మమయం. అందుచే మోక్షార్థి అయిన శ్రేష్ఠపురుషుడు గట్టి ప్రయత్నంలో భస్మస్నానం చేసి పాశుపతయోగంలో నిత్యం లగ్నం కావాలి. మొదటిగా బ్రాహ్మీశక్తిని ధ్యానించాలి. తర్వాత వైష్ణవీశక్తిని, తర్వాత పరామాహేశ్వరీ శక్తిని ధ్యానించాలి. ఈ విధంగా యోగేశ్వరశివుడు పరాకాష్ఠగా నిలిచియున్నాడు. దాన్ని నేను సంక్షేపంగా చెప్పాను.

**సూత ఉవాచ** – సూతమహర్షి పలికాడు

**ఏవం శిలాదపుత్రేణ నందినా కులనందినా ।**
**యోగః పాశుపతః ప్రోక్తో భస్మనిష్ఠేన ధీమతా ॥33॥**

**సనత్కుమారో భగవాన్ వ్యాసాయామితతేజసే ।**
**తస్మాదహమపి శ్రుత్వా నియోగాత్సత్రిణామపి ॥34॥**

**కృతకృత్యోఽస్మి విప్రేభ్యో నమో యజ్ఞేభ్య ఏవ చ ।**
**నమః శివాయ శాంతాయ వ్యాసాయ మునయే నమః ॥35॥**

ఈ విధంగా వంశానికీ ఆనందం ప్రదానం చేసే భస్మధారి, శిలాదపుత్రుడు, బుద్ధిమంతుడు అయిన నంది సనత్కుమారుడికి, పాశుపతయోగాన్ని గూర్చి చెప్పాడు. పూజ్యుడు, అమిత తేజస్వి అయిన సనత్కుమారుడు వ్యాసమహర్షికి దీన్ని చెప్పాడు. ఆయన నుంచి విని, నేను ఆయన ఆజ్ఞతో యజ్ఞసత్రంలోగల మునులకు మీకు చెప్పాను. నేను కృతకృత్యుడను. విప్రులారా! నమస్కారం. యజ్ఞానికి నమస్కారం. శాంతి స్వరూపుడైన శివుడికి నమస్కారం. వ్యాసమహర్షికి నమస్కారం.

**గ్రంథైకాదశసాహస్రం పురాణం లైంగముత్తమమ్ ।**
**అష్టోత్తరశతాధ్యాయమాదిమాంశమతః పరమ్ ॥36॥**

**షట్చత్వారింశదధ్యాయం ధర్మకామార్థ మోక్షదమ్ ।**
**అథ తే మునయః సర్వే నైమిషేయాః సమాహితాః ॥37॥**

**ప్రణేముర్దేవమీశానం ప్రీతికంటకితత్వచః ।**
**శాఖాం పౌరాణికీమేవం కృత్వైకాదశికాం ప్రభుః ॥38॥**

**బ్రహ్మా స్వయంభూర్భగవానిదం వచనమబ్రవీత్ ।**
**లైంగమాద్యంతమఖిలం యః పఠేచ్ఛృణుయాదపి ॥39॥**

**ద్విజేభ్యః శ్రావయేద్వాపి స యాతి పరమాం గతిమ్ ।**
**తపసా చైవ యజ్ఞేన దానేనాధ్యయనేన చ ॥40॥**

**యా గతిస్తస్య విపులా శాస్త్రవిద్యా చ వైదికీ ।**
**కర్మణా చాపి మిశ్రేణ కేవలం విద్యయా పి వా ॥41॥**

**నివృత్తిశ్చాస్య విప్రస్య భవేద్భక్తిశ్చ శాశ్వతీ ।**
**మయి నారాయణే దేవే శ్రద్ధా చాస్తు మహాత్మనః ॥42॥**

**వంశస్య చాక్షయా విద్యా చాప్రమాదశ్చ సర్వతః ।**
**ఇత్యాజ్ఞా బ్రహ్మణస్తస్మాత్తస్య సర్వం మహాత్మనః ॥43॥**

ఉత్తమమైన ఈ లింగమహాపురాణం పదకొండువేల శ్లోకాలతో నిబద్ధమైనట్టిది. దీని ప్రథమభాగంలో నూట ఎనిమిది అధ్యాయాలున్నాయి. ఉత్తరభాగంలో ఏభై అయిదు అధ్యాయాలు ఉన్నాయి. (37వ శ్లోకంలో మొదట పాదంలో "షట్ చత్వారింశదధ్యాయం" అని ఉంది. దానివల్ల ఉత్తరభాగంలో 46 అధ్యాయాలే ఉండాలి. కాని 55 అధ్యాయాలు ఉన్నాయి. అందుచేత ఇక్కడ మధ్యమపదలోపి సమాసాన్ని చెప్పుకోవాలి. షట్ చ నవ చ చత్వారింశత్ చ మధ్యమపదం 'నవ' లోపించి షట్ చత్వారింశత్ అయ్యింది. 6+9+40=55) ఈ పురాణం ధర్మార్థ కామమోక్ష ప్రదాయకమైనది. ఇపుడు ప్రసన్నత హేతువుగా రోమాంచితులైన నైమిషారణ్యవాసులైన

ఈ మునులందరూ ఏకాగ్రచిత్తులై శివభగవానుడికి నమస్కరించారు. పురాణాలలో పదకొండోది సమర్థతతో రచించి, స్వయంభువు అయిన బ్రహ్మదేవుడు ఈ మాట చెప్పాడు. "ఏ మానవుడు ఈ శ్రీలింగమహాపురాణాన్ని మొదటి నుంచి చివరి వరకు చతువుతున్నాడో, వింటున్నాడో, లేక ద్విజులకు వినిపిస్తున్నాడో ఆతడు పరమగతిని పొందుతున్నాడు. తపస్సు, యజ్ఞం, దానం, వేదాధ్యయనం, ఉత్తమకర్మ, కర్మజ్ఞానాల ప్రభావం, లేక కేవలజ్ఞానం, – వీటిని ఆచరించడంవల్ల ఏ సద్గతి లభిస్తున్నదో అది ఈ పురాణాన్ని పఠించడంవల్ల, వినడంవల్ల వస్తున్నది. దీనివల్ల విపులమైన శాస్త్రవిద్య, అట్లే వేదవిద్య ప్రాప్తిస్తున్నది. దీనివల్ల విప్రుడికి శాశ్వతమైన శివభక్తి కల్గుతున్నది. మోక్షం సిద్ధిస్తున్నది. ఆమహాత్ముడికి శ్రద్ధ నామీద, నారాయణుడిమీద అట్లే శివుడిమీద కలుగుతున్నది. ఆతడి వంశంలో అక్షయమైన విద్య సులభమవుతున్నది. ప్రమాదాలు తొలగుతున్నాయి". ఇది బ్రహ్మదేవుడి ఆజ్ఞ. ఇవి అన్నీ ఆ మహాత్ముడి కృపవల్ల సిద్ధిస్తున్నాయి.

**ఋషయ ఊచుః** – ఋషులు పలికారు.

**ఋషేః సూతస్య చాస్మాకమేతేషామపి చాస్య చ ।**
**నారదస్య చ యా సిద్ధిస్తీర్థయాత్రారతస్య చ ॥44॥**

**ప్రీతిశ్చ విపులా యస్మాదస్మాకం రోమహర్షణ ॥45॥**

**సా సదాస్తు విరూపాక్షప్రసాదాత్తు సమంతతః ।**
**ఏవముక్తేషు విప్రేషు నారదో భగవానపి ॥46॥**
**కరభ్యాం సుశుభాగ్రాభ్యాం సూతం పస్పర్శివాంస్త్వచి ।**
**స్వస్త్యస్తు సూత భద్రం తే మహాదేవే వృషధ్వజే ॥47॥**

**శ్రద్ధా తవాస్తు చాస్మాకం నమస్తస్మై శివాయ చ ॥48॥**

ఓ రోమహర్షణా! నీకు, తీర్థయాత్రారతుడైన నారదమహర్షికి, మామునులందరికి గొప్ప సిద్ధి భగవత్ప్రీతి ప్రాప్తించింది. ఇది విరూపాక్షుడి కృపవల్ల అన్ని దిక్కులా ప్రకాశిస్తున్నది. మునులు ఈ విధంగా పలికిన పిమ్మట నారదముని తన హస్తాల కొనభాగంతో సూతర్షి శరీరాన్ని తాకి ఇలా పలికాడు. ఓ సూతర్షీ! నీకు శుభమగుగాక! నీకు కళ్యాణమగుగాక! వృషధ్వజమహాదేవమహేశ్వరుడిమీద మా అందరికి, నీకు శ్రద్ధ నిలుచుగాక! ఆ భగవంతునికి–శివునికి–నమస్కారం.

**ఇతి శ్రీలింగమహాపురాణే ఉత్తరభాగే పాశుపతయోగమార్గవర్ణనే లింగపురాణశ్రవణపఠనమాహాత్మ్యవర్ణనం నామ పంచపంచాశత్తమోఽధ్యాయః ॥55॥**

శ్రీలింగమహాపురాణం ఉత్తరభాగంలోని పాశుపతయోగమార్గవర్ణనలోని లింగపురాణశ్రవణపఠనమాహాత్మ్యవర్ణన అనే పేరు గల ఏబై ఐదవ అధ్యాయం సమాప్తం.

ఉత్తరభాగం సమాప్తం.

సంపూర్ణమిదం శ్రీలింగమహాపురాణమ్ ।

శ్రీలింగమహాపురాణం సంపూర్ణం